సమగ్ర ఆంధ్ర సాహిత్యం

నాల్గవ సంపుటి



ఆరుద్ర

తెలుగు అకాడమి

తెలుగు అకాడమి ప్రచురణ - 33

సంప్రదింపు గ్రంథావళి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

నాల్గవ సంపుటి

రచన

ఆరుద్ర

తెలుగు అకాడమి

హైదరాబాదు

2007

samagra aandhra saahityam; **naalugava sampuTi; Author :** Arudra; Reprint : 2012 pp. xii + 1032 + iv.

First Edition : 2004
Reprint : 2005, 2007, 2012
Copies : 1000

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

Price : Rs. 305=00

Printed in India
Laser Typeset at Sri Maruthy Laser Printers, Chennai - 600 014
Printed at M/s. Sreematha Printers, Hyderabad
Andhra Pradesh.

భూమిక

స్వాతంత్ర్యంవచ్చిన తరవాత మారిన పరిస్థితులదృష్ట్యా తెలుగును ఈనాటి భాషావసరాలకు అనుగుణంగా మలిచి, ఆధునికీకరించడానికిగాను తెలుగు అకాడమిని కేంద్ర ప్రభుత్వ సహాయంతో, రాష్ట్రప్రభుత్వం 1968లో స్థాపించింది. ఆ విధంగా తెలుగు అకాడమి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషాసంస్థగా ఏర్పడింది. స్థాపన కాలం నుంచి తెలుగు అకాడమి ఉన్నత విద్యాస్థాయిలో తెలుగును బోధనమాధ్యమంగా మలచడానికిగాను వివిధ స్థాయిల్లో పాఠ్య పుస్తకాలు, పఠనీయ పుస్తకాలు, తెలుగులో మొదటిసారిగా వివిధ ఆధునిక శాస్త్ర పరిభాషాకోశాలు, శాస్త్ర నిఘంటువులు, వివిధ ఇతర కోశాలు, భాషా నిఘంటువులే కాక అనువాదాలు, మోనోగ్రాఫులు, సంప్రదింపు గ్రంథాల వంటి అనేక గ్రంథాలు ప్రచురించింది. ఇవేకాక, రాష్ట్రంలో ప్రతిజిల్లాలోనూ మాట్లాడే తెలుగును సర్వేచేసి, ఆ భాషారూపం మీద బులెటిన్లు ప్రచురించడం, తెలుగు మాతృభాష కానివారికి తెలుగును ఒక క్రమబద్ధమైన ఆధునిక విధానంలో తెలుగునేర్పడం చేస్తున్నది. వివిధ శాస్త్ర విషయాలలో ఆసక్తిగల వారికి జనరంజక గ్రంథాల పేరుతో అనేక గ్రంథాలు ప్రచురించింది. ఉన్నత విద్యలో వివిధ స్థాయిల్లో సిలబస్ మారినప్పుడల్లా పరిస్థితుల దృష్ట్యా కొత్త పాఠ్య, పఠనీయ పుస్తకాలు, పోటీ ప్రవేశ పరీక్షల పుస్తకాలు తయారు చేయడానికి తెలుగు అకాడమి ఇటీవల ప్రాధాన్యం ఇచ్చినా, తక్కిన కార్యక్రమాలుకూడా నిరంతరంగా జరుగుతున్నాయి. పరిభాషాకల్పన, శాస్త్ర నిఘంటువుల నిర్మాణం, తెలుగు బోధన వాటిలో కొన్ని.

ప్రముఖ సాహితీవేత్త ఆరుద్రగారు రచించిన సమగ్ర ఆంధ్రసాహిత్యం గ్రంథం సర్వహక్కులనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తెలుగు అకాడమికి దత్తం చేసింది. ఇది అశేష పాఠకలోకానికి గతంలోనే చేరువైన గ్రంథం. విద్యార్థులకేకాక, తెలుగు సాహిత్య చరిత్రను గురించి తెలుసుకోవాలనుకొనే జిజ్ఞాసువులైన ఇతరులకు కూడా ఉపయోగించే విధంగా, తెలుగు సాహిత్య చరిత్రపట్ల, తెలుగు వారి సంస్కృతీ చరిత్రపట్ల ఆసక్తి పెంపొందించే విధంగా సులభగ్రాహ్యంగా, సులభశైలిలో,రసవంతంగా ఆరుద్రగారు దీన్ని రచించారు. గంభీరమైన విషయాలను సరళీకరించిన భాషాశైలిలో వ్యక్తపరచడంతో విశేష ఆదరణ పొందిన గ్రంథాలివి.

వీటిని గతంలో ఆరుద్రగారు 13 భాగాలుగా వెలువరించిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే ఆరుద్రగారు జీవించి ఉండగానే, ఈ సంపుటాలలో అనేక మార్పులూ, చేర్పులూ చేసుకొంటూ వచ్చారు. ఈ గ్రంథం ప్రచురణ కోసం విద్యార్థులూ, ఇతరులూ అనేకులు అడుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని, ఆరుద్రగారు చేసిన సవరణలతో మొత్తం సంపుటాలను నాలుగు భాగాలుగా తెలుగుఅకాడమి కొత్త ప్రచురణగా చేపట్టింది. ఈ 4వ భాగంలోకూడా ఆరుద్రగారు చేసిన సవరణలు చేసి ముద్రణ ప్రతి తయారుచేయడంలో ఆయన సతీమణి శ్రీమతి కె. రామలక్ష్మి గారు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు.

తెలుగు అకాడమి వెలువరించిన తక్కిన గ్రంథాలలాగే ఈ సంపుటాలను కూడా పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

విజ్ఞులూ, సహృదయులూ చేసే నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించడానికి, వాటిని చేతనయినంతవరకూ ఆచరణలో పెట్టడానికీ తెలుగు అకాడమి ఎప్పుడూ సన్నద్ధంగానే ఉంటుంది.

ఆచార్య కె. యాదగిరి
సంచాలకులు
తెలుగు అకాడమి

మనవి మాటలు

సాహిత్యాభిలాష గల సాధారణ పాఠకులు ఆంధ్ర సాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలనుకుంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయసూరిదాకా మాత్రమేకాక సాతవాహనుల కాలం నుండీ సాహితీ సమితి దాకా ఆంధ్ర సాహిత్యం అనేక విధాలుగా, బహుముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నీ అచ్చుపడి వెలుగు చూడలేదు. అచ్చయిన పుస్తకాలు కూడా అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణ పాఠకులకు బోధపడే వివరణలతో లేవు. ఈకొరతను తొలగించవలసిన బాధ్యత నేటి సాహితీపరులపై వుంది.

పన్నెండు సంపుటాలలో సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రజానీకానికి పరిచయం చేద్దామనే సంకల్పం కొన్నేళ్ళ కిందట నాకు కలిగింది.

సమగ్రత ఆశయం. దీన్ని సాధించడానికి ఇది ప్రయత్నం. పూజ్యులు కందుకూరి వీరేశలింగంగారు ప్రామాణిక సాహిత్యరచనకు పునాదులు వేశారు. శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మొదలైన మహనీయులు సాహిత్యంతోపాటు దేశ చరిత్రను కూడా విశదం చేశారు. సురవరం ప్రతాపరెడ్డిగారు మన సాంఘిక చరిత్రకు శ్రీకారం చుట్టి కొత్త కోణాలను చూపెట్టారు. వీరి రచనలను ఆధారం చేసుకొని తమ ప్రతిభతో కొత్త ఆకరాలను గుర్తించి, నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించి సాహిత్య చరిత్రను అనేకమంది విద్వాంసులు, విమర్శకులు, విఖ్యాత పత్రికలలో, వివిధ గ్రంథాలలో వివరిస్తున్నారు. ఈ అమూల్య రచనలన్నింటిని నా దృక్పథంతో సమన్వయం చేయడానికి ఈ రచనలో యత్నించాను.

ఒక భాష మాట్లాడే ప్రజల దేశ చరిత్ర, సాంఘిక చరిత్ర, సాహిత్య చరిత్ర ఒకదానితో ఒకటి పెనవేసుకొని వుంటాయి. రాజకీయాలవల్ల వివిధ రంగాలలో పరిణామాలు ఏర్పడుతూ వుంటాయి. విభిన్న సంఘటనలే జరిగినా అవి ఒక చారిత్రక క్రమంలోనే వుంటాయి. రాజకీయ ప్రభావాలకు లోనుకాని యుగం వుండదు. రాజవంశాల పేరుమీదుగా యుగాలను పేర్కొనడం రివాజే.

సాంఘిక చరిత్రకు పనికివచ్చే సాహిత్య గ్రంథాలనే ఎన్నుకొనడంవల్ల సురవరం ప్రతాపరెడ్డిగారి యుగవిభజన వారి ప్రయోజనాలకు అనుకూలమైంది. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో విస్తీర్ణతను దృష్టిలో పెట్టుకొని నేను యుగాల అంకెను, ఆయా రాజవంశాల ప్రాముఖ్యాలను బట్టి పెంచవలసి వచ్చింది. ఆదిలో నేను వేసుకొన్న ప్రణాళికలో యుగవిభజన చేసుకొన్నాను. కాని పుస్తక ప్రచురణను ప్రారంభించడానికి ముందే ప్రతిసంపుటిలో పుటల పరిమితిని, సంపుటాల సంఖ్యను, ఒక్కొక్క సంపుటం వెలనూ, పన్నెండు సంపుటాలకు మొత్తం పూర్తిగా ముందే చెల్లించే పక్షంలో సెట్టువెల, అందువల్ల

లభించే లాభసాటి సదుపాయాలూ ప్రకాశకులు ప్రకటించారు. ఎందరో ఈ ప్రణాళికకు స్వాగతం చెప్పారు. చందాదారులుగా చేరారు.

1965 జనవరి నెలనుండి ఈ సంపుటాల రచనకు ఉపక్రమించాను. ప్రతి సంపుటిలోని పుటల పరిమితి ముందుగానే నిర్ణయం కావడంవల్ల ప్రతి ప్రకరణలో తెలిసిన ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా విరివిగానే రాసినా చివరకు కుదించడం తప్పనిసరి అయింది. సమగ్రత దెబ్బతినకూడదని సంపుటాల సంఖ్యను పెంచి అదనపు యుగాలనూ, ఉపయుగాలను చేర్చవలసి వచ్చింది. ప్రచురణకు ముందే ప్రజలకిచ్చిన వాగ్దానానికి భంగం లేకుండా పన్నెండు సంపుటాలనూ వరుసగా ప్రచురించడం జరిగింది.

1965 ఏప్రియల్ నెల నుండి నవంబరు నెల దాకా ఎనిమిది నెలలు క్రమం తప్పకుండా ఆసాంతం రచనచేసి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సంపుటాలను అచ్చుకివ్వడంలో నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. టెన్షన్‌వల్ల రావలసిన అన్ని రుగ్మతలూ వచ్చాయి. అయినా ప్రజలకు ప్రకాశకులతోపాటు వాగ్దానం చేసినది పన్నెండు సంపుటాలు కనుక ఆ సంఖ్యను పూర్తిచేయాలని నిశ్చయించాను. అది 1968 ఫిబ్రవరి నాటికిగాని పూర్తిచేయలేక పోయాను. ఈ పన్నెండు సంపుటాలు వెలువడుతున్నప్పుడు ఆసక్తితో చదివి, సహృదయంతో విమర్శించి, ప్రోత్సహించిన వాళ్ళెందరో ఉన్నారు. చెల్లాచెదురుగా ఉన్న ఆకారాలను ఒక్కచేత్తో క్రోడీకరించి విశ్లేషణ చేస్తున్నప్పుడు రచనలో తప్పులు దొర్లడం తప్పదు. వీటికి తోడు సాపు వ్రాస్తున్నప్పుడో, ప్రూఫు దిద్దుతున్నప్పుడో మరికొన్ని పొరపాట్లు చేరుకున్నాయి. నా అంతట నేను గుర్తించిన తప్పులతోబాటు విమర్శకులు సూచించే లోపాలూ, కొందరి కోపాలూ రెండవ ముద్రణలో సర్దుకొంటానని అప్పుడే సవినయంగా విన్నవించుకొన్నాను. మొదటి ముద్రణ సంపుటాలన్నీ ఏనాడో చెల్లుబడి అయిపోయాయి. రెండవ ముద్రణకోసం ఎందరో ఎదురుచూస్తున్నారు. కొందరు ఒత్తిడి చేస్తున్నారు. గత సంవత్సరం నా రెండు కళ్ళ కేటరాక్టులకూ ఆపరేషన్ విజయవంతంగా జరగడంవల్ల గ్రంథ-పఠనానికి, రచన కార్యక్రమానికి వీలు కలిగింది.

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కొరతగా మిగిలిపోయిన సంపుటాలను పూర్తిచేయడమేగాక, తొలి పన్నెండు సంపుటాలను కొత్త వైనాలు చేర్చి తిరగరాసి ప్రచురించాలని నిశ్చయించాను. 'ప్రజాశక్తి బుక్ హౌస్' వారు పునర్ముద్రణ ప్రచురణ ప్రారంభిస్తున్నారు. ఒక వ్యక్తి సమాజంలో ఏదైనా సాధించగలిగాడంటే దానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఎందరి సహాయ సహకారాలో ఉంటాయి. నా కృషిలో నాకు తోడ్పడిన వారందరికీ నా కృతజ్ఞతలు. ఈ పరమార్థాన్ని సాధింప చేస్తున్న నా ఉత్తమార్థం రామలక్ష్మికి నా అభినందనలు.

1988 సంక్రాంతి
మదరాసు - 600 017

ఆరుద్ర

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - నా మాట

తెలుగు సాహిత్యం ప్రసక్తి వస్తూన్నన్ని రోజులు ఆరుద్ర జీవించి ఉంటాడు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం అతణ్ణి చిరంజీవిని చేసింది. దీనిలో అసత్యం లేదు. అతిశయోక్తి లేదు. అప్పట్లో "తెలుగు సాహిత్యంపై విస్తృతంగా పరిశోధనచేస్తూన్న మీరు ధన్యజీవులు" అన్నారు వావిళ్ల రామస్వామిశాస్త్రులుగారు 'ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యం ద్వారా చక్కని వాడుక భాష ఎలా రాయాలన్నది జాతికి తెలిపిన మొదటివాడు, సాహిత్య చరిత్ర ఆ భాషలో రాసి మెప్పించినవాడూ ఆరుద్రే' అన్నారు మిత్రులు జి. కృష్ణ. "మీ వ్యవహారిక భాష చాలా ఉత్సాహాన్ని కల్గిస్తూంది సామాన్యులకిది సుబోధకంగా, కుతూహలాన్ని రేకెత్తించేదిగా వుంది' అని మెచ్చారు ఎ.ఎస్.గుప్తగారు. 'మీ రచన విలక్షణంగా వుంది - సాహిత్య నిర్వచనాన్ని లక్ష్యంగా వుంచుకుంటూనే అనేకానేక నూతన అంశాలు సవిస్తరంగా హృద్యమమైన శైలిలో ప్రసక్తం కావడం - యీ రచనలోని విశేషాంశం. ఇంపుసొంపులతో ముద్దులు మూటకడుతూ, ఆంధ్ర ప్రజానీకాన్ని మురిపిస్తున్న మీ కృషి అజరామరమైనది" అని సాహిత్యభూషణ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారు భావించారు. "మీరు అపూర్వమైన ఇన్ఫర్మేషన్ ఆంధ్ర సాహిత్యాన్ని గురించి సంపాదిస్తూ మాకానందం కలుగ చేస్తున్నారు" అని అభిమానం ప్రకటించారు కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. "ఆరుద్రగారి గ్రంథ రచనా పద్ధతి - అతి రుచికరంగా వుండి, అక్కడక్కడి వారి చెణుకులు లెనిన్‌గ్రాడ్ మంచు సోనల్లా చనవులునెరపి చక్కలిగింతలు పెడుతాయి చదువరిని" అని లెనిన్‌గ్రాడ్ నుంచి ఎస్.వి.జోగారావుగారు భావించారు. "అవసరం అయిన చోట వివరణ అనవసరమైన చోట సవరణ సరసమైన తీర్పు, హృద్యమైన మార్పు, పఠితలను ఆసక్తి కల్గిస్తూంది అన్నది సత్యోక్తి" అన్నారు శ్రీ కొమండూరి రామానుజాచార్యులుగారు. "సామాన్య పాఠకులకు మొట్టమొదటిసారిగా సాహిత్య చరిత్రలో పరిచయం ఏర్పరచుకొనే అవకాశం కల్గించింది. ఎప్పుడైనా ఎక్కడైనా చదువుకుపోడానికి వీలైనది - మీ సజీవమైన భాష మీ అద్భుత రచనా చాతుర్యం!' ఎస్.వి.సూర్యనారాయణ అభిప్రాయపడ్డారు. "వజ్రాలు ఏరడం, రాళ్ల ఏరడం కూడా మనకు ఉపయోగమే. ఆ రాలు ఏరినవాడు మనం కోరకుండానే వరాలు ఇచ్చినవారే." వేలూరి వారి ఉవాచ. "ఈ సంపుటాలలో నువ్వు తెలుగు ప్రపంచంలో చిరంజీవివి అవుతున్నావు" అంటూ దీవించారు తాపీవారు.

ఇలా ఎందరెందరో పెద్దలు, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం మెచ్చారు. ఆరుద్ర భుజం తట్టారు. "పూర్తిచేసిగాని ఆగకు" అని హెచ్చరించారు. ఈ హెచ్చరికకు కారణం వుంది. ఇప్పటిదాకా ఎందరెందరో తెలుగు సాహిత్య చరిత్రను ప్రారంభించినా కొనసాగించిన దాఖలాల్లేవు. ఆరుద్ర ఈ సంపుటాలలో పోనుపోను ఆధునిక కాలపు యువతరానికి అందని, తెలియని - ఎన్నో విషయాలను అందించారనీ, ఈ రీత్యా పోనుపోను సంపుటాలు అపారమైన విలువను సంతరించుకున్నాయనీ - పెద్దలు భావించారు, భావిస్తున్నారు.

ఆరుద్ర చాలా పట్టుదల గల వ్యక్తి. కువిమర్శకుల ధోరణికి కృంగిపోయే తత్వంగాని, పొగడ్తలకు పొంగిపోయే బలహీనతగాని లేని వ్యక్తిత్వం అతనిది. తను

వేసుకున్న ప్రణాళిక ప్రకారం - శ్రమించి రాసుకుంటూపోయాడేగాని, ప్రచురణకర్తలు ఏం చేస్తున్నారన్నదాన్ని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. శ్రమదోపిడీని సహించలేని యీ సామ్యవాదిని - ఎలా దోచుకున్నారో, దోచుకోబడ్డాడో పదుగురు చెప్పినా పట్టించుకోలేదు. ఫలితం తొలిముద్రణ మాకే రుణభారాన్ని మిగిల్చింది. రెండవ ముద్రణ అతి నిర్లక్ష్యంగా ప్రచురణ అయి అతని మనసును బాగా కృంగదీసింది.

కవి, భావుకుడు, వ్యాపారం తెలియనివాడు, స్నేహానికి ప్రాణం పెట్టే తత్వమున్నవాడు యింత దారుణంగా కృంగిపోవడం నేను కళ్లారా చూశాను. ఈ దేశంలో సాహిత్యం బువ్వపెట్టదు. ఏదో వృత్తి వుండి పక్కన సాహిత్య వ్యాపారం చేసుకుంటే ఏమోగాని లేకుంటే బ్రతుకు భారమే మిగులుతుంది.

ఆరుద్ర పోయాక నేనో నిర్ణయానికి వచ్చాను. యువకుడు, ఉత్సాహవంతుడు అయిన మన ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని ''ఈ సాహిత్య సంపుటాల సర్వహక్కులు స్వీకరించండి. వాటి విలువ సాటిలేనిది'' అని కోరాను. వారు ప్రభుత్వం తరపున స్వీకరించి ఆ హక్కులు, ప్రచురించే బాధ్యతలను - తెలుగు అకాడమీ వారి చేతుల్లో పెట్టారు. చక్కని అవగాహన, సాహిత్యం పట్ల ఎంతో అభిమానం గల డాక్టర్ ఎ. మంజులతగారు ఈ కార్యక్రమానికి ఎంతో సంతోషంగా శ్రీకారం చుట్టి ''ఇకమీదే ఆలస్యం'' అని అన్నప్పుడు - ఆమె అభిమానాన్ని నేను కొలవలేను. పదమూడు సంపుటాలను - నాల్గు సంపుటాలుగా రూపొందించాలని నిర్ణయించాను. సంస్కరించి ప్రచురణకు తొలి సంపుటానికి నాంది పల్కాను. ఈ విషయంలో నాకు అన్నివిధాలా వెన్నుదన్నుగా డా॥ మేడిపల్లి రవికుమార్ (ఎస్.వి.యూనివర్సిటీ, తెలుగుశాఖ) నిలబడ్డాడు. ఆరుద్ర తను చేద్దామనుకొన్న మార్పులూ, చేర్పులు, తీసేయాలనో, తగ్గించాలనో అనుకున్నవి - అన్నీ అన్ని సంపుటాలలో నోట్ చేసి పెట్టారు. నేను వాటిని అనుసరించి అమల్లో పెడుతూనే, అవసరమైన చోట్ల కుదిస్తూ - తొలి సంపుటి సిద్ధం చేశాను. ఆగస్టు 31, ఆరుద్ర జన్మదినం నాటికి దీనిని వెలువరిస్తానని - బాధ్యత సంతోషంగా డాక్టర్ మంజులత స్వీకరించారు. ఇది నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మళ్లీ ముఖచిత్రం రాసి యిచ్చారు బాపు - ఎప్పటికీ ఆరుద్ర అభిమాని ఆయన; 'నేను వేయడమేమిటి? ఆయన వేయించుకున్నారు'' అన్నారు.

ఉత్సాహంతో ప్రచురణ భారం స్వీకరించిన తెలుగు అకాడమీ డైరక్టర్ డాక్టర్ ఎ. మంజులతకు, హక్కులు స్వీకరించి నాకు మనశ్శాంతిని చేకూర్చిన ప్రియతమ చంద్రబాబుగారికీ నేను శాశ్వతంగా రుణపడి వున్నాను.

నా భావనలో ఆరుద్ర అభిరుచికి దీటైనది - యీ తెలుగు అకాడమీ వారి ప్రచురణే. ఇదే నాకు తొలి ప్రచురణేమో అనిపిస్తుంది.

30-7-2002
చెన్నయ్

కె. రామలక్ష్మి

ఈ సంపుటి గురించి

తెలుగు అకాడమీ వారు, ఒక విశిష్ట ప్రచురణగా తెస్తున్న ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాలలో ఇది నాల్గవది. ఆఖరుది.

ఈ సంపుటిలో, తొలి, మలి జమీందారీ నవ్యసాహిత్య యుగాలు, ఆధునిక అభ్యుదయ యుగం వున్నాయి. వర్తమాన సాహిత్యపు విత్తులు జమీందారీ యుగం నుండీ బలంగా నాటుకోవడం, కొంత విస్తరించడం కూడా కనిపిస్తుంది. సాహిత్యాన్ని కావలసిన చోట కావలసినంత సేపే ఆపి విశ్లేషణ చేయడం సాధ్యం అవుతుందేమోగాని, ఒక అడ్డుకట్ట వేసి, ఇదీ విభజనరేఖ అని చెప్పడం - సాహసమే అవుతుంది. ఈ సంపుటిలో జమీందారీ పోషణలో ఛాందసవాదపు పోకడలూ, పెద్దలు, భాషాభివృద్ధి ఆశించినవారు సజీవభాషకోసం పడినపాట్లు, సాధించిన, సాధించలేకపోయిన వివరాలూ, విశేషాలూ చోటు చేసుకున్నాయి. తొలి నాటకాలూ, నవలలూ, కథలూ వాటి వెనుక వార్తలూ వున్నాయి. ఆధునిక అభ్యుదయ యుగంలో ముఖ్యంగా చదువరులను ఆకట్టుకొనే విశ్లేషణ వుంది. పరిశీలన వుంది. అంచనా వేసే ప్రయత్నం వుంది.

నిరవధికం సాహిత్యప్రవాహం. దానిని కొలవాలని, ఎత్తుపల్లాలను అంచనా వేయాలనీ ప్రయత్నించడం, చిట్టి చెంబును ముంచి సంద్రాన్ని కొలవడానికి ప్రయత్నించడంలాంటిదే. ఎక్కడో ఒకచోట ఆగక తప్పదు కద. అందుకే సాహితీ వ్యవసాయం యింకా ముమ్మరంగా సాగిస్తున్నవారిని ఆరుద్ర తన పరిధిలోకి తీసుకోలేదు.

ఆరుద్ర, తను రచిస్తున్న యీ చరిత్రలో - తన గురించి ఏమీ చెప్పలేదు. అది అతని తత్వం, మూడు దశాబ్దాల ఆధునిక కవిత్వం. సాహిత్య అకాడమీ వారికి సంకలనం చేస్తూ కూడా తన కవితని పొందుపరచుకోవడం మర్యాదకాదనుకున్నాడు. అందుకే - ఈ చివరి సంపుటిలో ఒక అనుబంధం చేర్చాను. ఇది అతని వ్యక్తిగత, కవితా, సాహిత్య ప్రస్థానాన్ని టూకీగా వివరిస్తుంది. ఇది మేధావులకోసం, సాహితీ దిగ్గజాలకోసం కాదు. కేవలం కొత్తతరాలవారికి అవగాహనకోసమే. (ఆరుద్రపై వెలువడిన పలువురి రచనల నుండి ఈ అనుబంధం రూపొందించబడింది.)

ఈ 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' డి.టి.పి.పని, పనిగా కాకుండా ఎంతో ఉత్సాహంగా, కుతూహలంగా ముచ్చటగా చేసిన అనూరాధకు నా ఆశీస్సులు.

ఈ ప్రచురణ అభిమానంతో తలకెత్తుకుని ఒక కొలిక్కి వచ్చేదాకా, అన్నివిధాల సహకరించి ఉత్సాహపరచిన తెలుగు అకాడమీ డైరెక్టర్ శ్రీమతి ఆవుల మంజులతగారికి నేను ఎంతగానో రుణపడివున్నాను. ఆరుద్ర ఈ రచన, అందంగానే కాదు - అందరికీ, ముఖ్యంగా విద్యార్థులకి, సాహిత్యం చదవాలన్న కుతూహలంగల నావంటి సామాన్య పాఠకులకి - అందుబాటులో వుండే ధర వుండాలనీ నా కోరిక. ఆ కోరిక తెలుగు అకాడమీ తీర్చింది.

13 సంపుటాలు 4 సంపుటాలు కావడంలో తగ్గిన విషయం ఏమీ లేదు. ఆరుద్ర గుర్తించిపెట్టిన నలభైపేజీల - సద్దుబాట్లు, చేర్పులు, కూర్పులు, మార్పులు, వీటిలో సవరించడం జరిగింది. అంతే. పైగా ముఖ్యపదానుక్రమణికలు జతచేసి సంపుటాల విలువ పెంచడం జరిగింది. పొరపాట్లు వుంటే, నావే. ఓపిక, అవకాశం కలిసివస్తే - ఎప్పుడేనా, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్య పదసూచి తయారుచేస్తాను.

చదువరులు, భాషాభిమానులు యీ సంపుటాలు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఏప్రెల్ 04, చెన్నయ్

కె. రామలక్ష్మి.

విషయసూచిక

జమీందారీ నవ్యసాహిత్య యుగాలు

అది ఒక దేశపు రాజకీయ చరిత్ర కావచ్చు, సాంఘిక చరిత్ర కావచ్చు, సాహిత్య చరిత్ర కావచ్చు; దానిలోని యుగవిభజనలు అవగాహన నిమిత్తం కేటాయించిన సౌకర్యమైన కాలఖండికలే అన్న సంగతి జ్ఞాపకం పెట్టుకోవాలి. క్రీ.శ. 1757 నుండి 1857 దాకా కుంఫిణీ యుగమని ముందు సంపుటంలో చెప్పుకొన్నాం. 1857 నుంచి జమీందారీ యుగమని చెప్పుకొంటున్నాం. అయితే కుంఫిణీ యుగంలోనే జమీందారీ యుగలక్షణాల ప్రాదుర్భావం లేకపోలేదు. అలాగే ఆధునిక యుగంలో కొంతకాలందాకా జమీందారీ సంస్కృతి సమానాంతరంగా గోచరిస్తుంది. ఈస్టిండియా కుంఫిణీ వారి ప్రభుత్వం రద్దయి భారతదేశం ప్రత్యక్షంగా బ్రిటిష్ సింహాసనానికి లోబడిన రాజ్యంగా ఆవిర్భవించిన నాటినుంచీ జమీందారీ యుగమని చెప్పుకొనడానికి చాలా కారణాలున్నాయి. వాటిని వివరగతిగా తెలుసుకొందాం.

కుంఫిణీ వారి రొట్టె విరిగి నేతిలో పడి భారతదేశంలో విశాల భూభాగాలపై వారికి ఆధిపత్యం దఖలు పడ్డాక మనదేశపు రాజకీయ పరిస్థితులలోనే కాక ఆర్థిక విధానంలోనూ విపరీతమైన మార్పులు వచ్చాయి. ఇంగ్లీషు వారికి ముందు ఇతరులు మనదేశంలోని వివిధ ప్రాంతాలను ఆక్రమించుకోకపోలేదు, కొల్లగొట్టక పోలేదు. అయితే ఆ విజేతలు దేశంలో స్థిరపడి పరిపాలన ప్రారంభించాక జాతి జీవనంలో ఒక భాగంగా కలిసిపోయారు. ఈదేశం వారి ఆవాసమైంది. ఇంగ్లీషు వారి విషయంలో ఇండియా కేవలం దులుపుకోవలసిన వరహాల చెట్టు మాత్రమే. కొల్లగొట్టగలిగినంత దోచుకొని మాతృ దేశానికి ఆ సంపదను తరలించుకుపోవడమే వారి ధ్యేయం. కుంఫిణీవారు బెంగాల్లో కాళ్లు నిలదొక్కుకొని దేశాన్ని ఎండగట్టడం ప్రారంభించిన కొద్దికాలంలో క్రీ.శ. 1770లో వంగ రాష్ట్రంలో దుర్భరమైన క్షామం ఏర్పడింది. లక్షలాది జనులు మరణించారు. నాటినుంచి దేశంలో కరువులు, కాటకము, కలరా, ప్లేగు మొదలైనవి ఋతువులలాగే వరుస తప్పక వచ్చే అనర్థాలయ్యాయి.[1]

వలస రాజ్యాధిపతుల ప్రధానమైన ఆదాయం భూమి శిస్తుల వల్ల వచ్చేదే. వాస్తవానికి ఏ ప్రభుత్వపు ఖజానా అయినా ఆదినుంచీ ప్రజల పన్నుల వల్లనే నిండుతూ వస్తూంది. రాజరికాలు ఏర్పడిన నాటినుంచి ఈ ఆర్థిక విధానం వివిధ రీతులలో ఉంది. దేశాధిపతి బొక్కసానికి చేరవలసిన ద్రవ్యాన్ని గ్రామాలనుండి సేకరించే అధికారులు వివిధ కాలాలలో వివిధ హోదాలలో ఉండేవారు. చాళుక్య, చోళుల కాలంనుంచీ అంటే క్రీ.శ.11వ శతాబ్దం నుంచీ దక్షిణ భారతంలో 'నాయంకర' విధానం అమలులో ఉంది. దీనిని 'అమరనాయంకరం' అని కూడా పిలుస్తారు. అమరం అన్న ద్రావిడ భాషాపదానికి వ్యవహారంలో ఉన్న అర్థం ఏమిటంటే ''రాజుకు అవసరం వచ్చినప్పుడు దండును సమకూర్చడానికిగాని, మరి ఏ ఇతర కార్యాలకైనా సహాయం చేయడానికి నిర్ణయం ప్రకారం సామంతునికి ఇచ్చే భూస్వామ్యం''. ఈ ప్యూడలు విధానాన్ని 'కట్టుబడి' అని

1. Kanatova et al - A History of India - Book-2 page 50

కూడా పిలుస్తారు. ఆదిలో 'అమరకం' అనుభవిస్తున్న భూస్వాములు క్రమేణా బలవంతులై కుంఫిణీ యుగం ప్రారంభదశనాటికి జమీందారులుగా భోగాలు అనుభవిస్తున్నారు.

దక్షిణ భారతంలోలాగే బెంగాలులోనూ, భారతదేశంలోని ఇతర ప్రాంతాల లోనూ జమీందారీ ఫాయీ వ్యక్తుల ప్రాబల్యాన్ని కుంఫిణీ వారు గమనించారు. పరిపాలనా బాధ్యతలను స్వీకరించాక ఈ విశాల భూభాగంలోని ప్రజల నుండి పన్నులు ఎలా వసూలు చేయాలన్న సమస్య ఇంగ్లీషు వాళ్ళను ఎదుర్కొంది. రకరకాల విధానాలను అనుసరించారు. 1793లో కారన్‌వాలీసు గవర్నరు జనరల్‌గా ఉన్నప్పుడు 'శాశ్వత భూమి శిస్తు విధానం' అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీని వల్ల జమీందారులకు వారి వారి భూభాగాలపై వంశపారంపర్యంగా హక్కులున్నాయన్న వాస్తవాన్ని గుర్తిస్తూనే ఈ జమీందారులు పన్నులు వసూలు చేసే దళారులనీ తప్పనిసరి బాదరబందీ అనీ భావించారు. రాజ్యం మొగలు చక్రవర్తులది. జాగీరుదారులుగాని, జమీందారులుగాని చక్రవర్తి దయాధర్మంపైన బతుకుతున్నవాళ్ళే అన్నది సిద్ధాంతరీత్యా వాస్తవమైనా, చక్రవర్తి బలహీనుడైనప్పుడు మండలేశ్వరులు దగ్గర్నుంచి మామూలు దేశముఖుల దాకా అందరూ తమ ఆధిక్యతను ప్రదర్శించుకొనేవారే. కుంఫిణీ వారు జమీందారులను కాదనలేక వారికి భూమి మీద ప్రైవేటు ఆస్తి హక్కును ఇస్తూ ఈ స్వామ్యం వారు పేష్కసు చెల్లిస్తున్నంతవరకే వర్తిస్తుందని విశదం చేశారు.

సిద్ధాంతరీత్యా ఆదిలో అమరనాయకులుగా గాని ఉత్తరోత్తరా జమీందారులుగా గాని తాము వసూలు చేసే రెవిన్యూలో నూటికి తొంభైవంతులు సర్కారు ఖజానాకు జమకట్టాలి. అందుచేత కుంఫిణీవారు ఏ జమీందారయినా తమకు చెల్లించవలసిన పేష్కసు మొత్తం రమారమీ ఈ దామాషాకు దగ్గరగా ఉండేటట్టు చూశారు. ఏ జమీందారైనా పేష్కసు కట్టలేకపోతే అతని జమీని లాక్కొని ఇంకొకరికి వేలంలో అమ్మేసేవారు. పాత జమీందారు భూములను సాగుచేసే రైతుల హక్కులకు ఏవిధమైన రక్షణా లేదు. కొత్త జమీందారులు తమ చిత్తమొచ్చిన రైతులను నియమించుకోవచ్చు. శాశ్వత భూమిశిస్తు విధానం ఒక పక్క జమీందారులకు 'ఆస్తి' హక్కులను ఇస్తూనే వారి రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించే జాగ్రత్తలు తీసుకొంది. జమీందారుల సిబ్బందిని, సాయుధ దళాలను సాధ్యమైనంత తగ్గించడానికే చర్యలు చేపట్టారు.

బెంగాలులోని జమీందారీ విధానం, శాశ్వత భూమిశిస్తు పద్ధతి చెన్నరాజధానిలోని కొందరు కుంఫిణీ ఉద్యోగులకు నచ్చలేదు. రైత్వారీ విధానాన్ని వీరు ఆదరించారు. ఇందువల్ల మధ్య దళారీల ప్రమేయం లేకుండా రైతులకు ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధాలు ఉంటాయి. ఈ విధానాన్ని కొన్ని ప్రాంతాలలోనే అమలుపర్చగలిగారు. 1802 నాటికి దక్షిణభారతంలో సైతం 'శాశ్వత భూమిశిస్తు విధానం' ప్రవేశపెట్టక తప్పలేదు. ఈ పద్ధతికి దారితీసిన చరిత్ర ఆసక్తికరమైనది.

దక్షిణ భారతంలో కొన్ని భూభాగాలు కుంఫిణీ వారికి సంక్రమించడానికి ముందు, అసఫ్ జాహీల పాలనలో రాజ్యాన్ని కొన్ని సర్కారులుగా విభజించేవారు. ఒక్కొక్క

సర్కారుకు ఒక ఫౌజుదారు సర్వాధిపతిగా వుండేవాడు. ఇతని చేతికింద రాణువ వుండేది. ఆ సైన్యం ఖర్చులకు, సిబ్బందిలోని ఇతరుల జీతభత్యాల నిమిత్తం కొన్ని భూములను కేటాయించేవారు. వాటిని హవేలీ భూములనేవారు. వీటిని సాగుచేసే రైతులకు సర్కారువారితో ప్రత్యక్ష సంబంధాలు ఉండేవి. పన్నులు నేరుగా కట్టేవారు. హవేలీ భూములు కాక రాజ్యంలోని ఇతర భూములు జమీందారుల వశంలో ఉండేవి. కుంఫిణీవారికి సర్కారులు దఖలు పడ్డాక హవేలీ భూములు, జమీందారీ భూములు అనే విచక్షణ చూపకుండా సంక్రమించిన అన్నింటిని ఒకరిద్దరికి కౌలుకి ఇచ్చేవారు. (రాజమండ్రి సర్కారును కాండ్రేగుల జోగి పంతులకూ, హుసేనాలీఖానులకు మూడులక్షల ఎనభై మూడువేల వరహాలకు ఉమ్మడిగా కౌలుకిచ్చారు. ఈ సర్కారులోని చిల్లర జమీందారులు అప్పటికే ఉన్నారు. వారందరూ ఈ ఇద్దరు కౌలుదారులకు తమ కప్పాలు కట్టేవారు; ఏలూరు ముస్తఫానగరు సర్కారులను కుంఫిణీవారు నాలుగు లక్షల వరహాలకు హుసేనాలీకి కౌలు ఇచ్చారు.)

ఒకరిద్దరు పెద్ద కౌలుదారులకన్నా పలువురు వుంటేనే లాభసాటిగా ఉంటుందని 1769లో కుంఫిణీవారు జమీందారీ భూములన్నింటినీ వేలంలో ఎక్కువ పాడిన వారికి కౌలుకు ఇచ్చేవారు. మొదట ఒక్క ఏడాదికే ఇచ్చేవారు. తర్వాత రెండేళ్లు, పిమ్మట మూడేళ్ళకు కౌలు పరిమితిని పెంచారు. ఈ వేలం వెర్రిలో పాత జమీందారులు తమ జమీందారీలను ఆనుకొని ఉన్న ఇతర భూములను పాటలో పాడి తమ యెస్టేటులలో కలుపుకొనేవారు. అయితే పేష్కసు చెల్లించడంలో జాప్యాలు, బకాయిలు తప్పేవి కావు. కొత్తవేలం ప్రారంభించవలసిన నాటికి పాత బాకీలు పేరుకొనిపోయేవి. అందుచేత కొన్నేళ్ళకొకసారి వేలం పెట్టడం కన్నా శాశ్వతంగా జమీందారీ శిస్తులను నిర్ణయించడం ఉత్తమం అనుకొన్నారు. మన దక్షిణ భారతంలో ఈవిధంగా 1802 నాటికి శాశ్వత శిస్తు విధానం అమల్లోనికి వచ్చింది. శాశ్వత శిస్తు నిర్ణయం జరిగినా బకాయిపడ్డ జమీందారుల యెస్టేటులను కుంఫిణీవారు వేలం వేసేవారు. వాటిని ధనికులు కొనుక్కొని కొత్త జమీందారులయ్యేవారు. ఉదాహరణకు తెలుగు జిల్లాలలోని కొన్ని జమీందారీల విస్తరణలను పరిశీలిద్దాం.

అన్నదేవరపేట-ప్రక్కిలంక ఎస్టేటులను శాశ్వత శిస్తు విధానపు రోజులలో పిఠాపురం పాలకులైన రావు వెంకట నీలాద్రి రావుగారు (1793-1828) తమ బావమరిది పేర ఖరీదు చేయించి నమోదు చేయించారు. అయితే తర్వాత ఈరెండు జమీలను విక్రయం మూలంగా పైడావారు సంక్రమింపచేసుకొన్నారు. వీటితోపాటు ఆరెంపూడి ముఠా జగన్నాథపురం మొఖాసా గ్రామంలో కొంత కోటపాడు శివారు, రామేశంపేట గోలుకొండ తాలూకాలోని పెద్దపాలెం, కైలాసపట్నం మొదలైనవి కూడా పైడావారు కుంఫిణీవారి వద్ద కొన్నారు. (ఈ జమీందారీ ప్రముఖులు పైడా రామకృష్ణయ్యగారే వీరేశలింగంగారికి వితంతు వివాహోద్యమంలో విరివిగా ధనసహాయం చేసి ఆ సంస్కరణను విజయవంతం చేశారు.)

గోదావరి మండలంలోని గూటాల యెస్టేటు శాశ్వత శిస్తు విధానపు రోజులలో పోలవరం రాజాగారైన మంగపతి దేవుగారి స్వాధీనంలో ఉండేది. 1812లో పోలవరం యెస్టేటు అంతా వేలం వేశారు. అప్పుడు దానిని నూజివీడు జమీందారు రామచంద్ర అప్పారావుగారు ఖరీదు చేశారు. ఆ తర్వాత 1827లో వారి వద్ద నుండి మన్యం సత్యలింగం గారు గూటాల, పాతనగరం ముఠాలోని కొన్ని పల్లెలు రెండు లక్షల ముప్ఫయివేల రూపాయలకు కొనుక్కొని యెస్టేటుదారులయ్యారు. (గూటాల జమీందారులు యానాంలో ఒక పెద్ద భవనం నిర్మించుకొన్నారు. ఫ్రెంచివారికి అప్పులు ఇచ్చారు. గూటాల జమీందారిణి మన్యం మహాలక్ష్మమ్మ 1875లో భర్తపోయిన తర్వాత యెస్టేటు వ్యవహారాలు చూసుకొనేవారు. వేద విద్యలనేకాక ప్రజాకళలైన బొమ్మలాటలు, వీధి నాటకాలు, కూచిపూడి భాగవతాలు, కలాపాలు ప్రోత్సహించేవారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు చిన్నప్పుడు ఇవన్నీ చూసి ఉత్తేజితులయ్యారు.)

నూజివీడు వారి వద్దనుండి పోలవరం జమీలో గూటాల మొదలైన గ్రామాలున్న కొంతభాగాన్ని మన్యం వారు కొనుక్కొన్నట్టే మరికొంత భాగాన్ని ప్రధాన గ్రామమైన పోలవరంతోబాటు కొచ్చెర్లకోటవారు 1814లోనే కొనుక్కొన్నారు. ఈ వంశానికి దత్తుడుగా వచ్చిన కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట రంగారావు (1871-1919) గొప్ప సాంఘిక సాహిత్య సేవలు చేశారు. (ఈయన గురించి ఒక ప్రకరణంలో ప్రత్యేకంగా చెప్పుకొందాం.)

శాశ్వత శిస్తు నిర్ణయం కాలంలోనూ ఆ తరువాతా పాత జమీందారీలు, కొత్త జమీందారీలు ప్రొప్రయిటరీ యెస్టేటులు ఎన్ని ఏర్పడినా కుంఫిణీ వారి అధీనంలో కొన్ని సర్కారీ భూములు ఉండేవి. వీటిని రైతులతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకొని సాగుచేసే వాళ్ళకి కౌలుకి ఇచ్చేవారు. రాజ్యం విస్తరిస్తున్న కొద్దీ కుంఫిణీ వారికి విశాలమైన సర్కారీ భూములు వచ్చి చేరేవి.

కుంఫిణీ వారికి రాజ్యకాంక్ష ఎంత ప్రబలంగా ఉన్నా, పరిపాలనా విధానంలోనూ, అధికార విస్తరణలోనూ కొన్ని 'రూల్సు'ను పాటించక తప్పలేదు. మొగలు చక్రవర్తీ, అతని ప్రతినిధిగా దక్కను సుబేదారు నిజామూ కొందరు జాగీరుదారులను, మహారాజులను స్వతంత్ర పాలకులుగా గుర్తించారు. భారతదేశంలోని వివిధ భూభాగాలలో కుంఫిణీ వారి రాజ్యాల సరిహద్దులలో ఇటువంటి స్వదేశ సంస్థానాధీశ్వరులున్నారు. చెన్న రాజధానిలో తిరువాన్కూరు, కొచ్చిన్, స్వతంత్ర సంస్థానాలు. ఈ ప్రభువులలో బనగానపల్లి సండూరు ఏలికలు తెలుగు జిల్లాలో రాజ్యం చేస్తున్నారు. విశాల భారత భూభాగాలలోని స్వదేశ సంస్థానాధీశ్వరుల పట్ల కుంఫిణీ వారి వైఖరిలో వచ్చిన మార్పులను కాలక్రమ రీతిలో అర్థం చేసుకొనడానికి కర్నూలు జిల్లాలోని బనగానపల్లిని ఉదాహరణగా తీసుకొని అవగాహన చేసుకోవచ్చు. (సండూరు బళ్ళారి జిల్లాలోని స్వతంత్ర రాజ్యమేగాని అది మన విశ్లేషణకు అంతగా తోడ్పడదు. బనగానపల్లి సంస్థానం గురించి ఈ సంపుటిలో ప్రత్యేకంగా ఒక ప్రకరణంలో ఉంది.)

వంశపారంపర్యంగా వచ్చే ఆస్తి హక్కులను సర్వసాధారణంగా అందరూ ఆమోదించవలసిందే. ఏ జాగీరుదారుకైనా, జమీందారుకైనా ఔరసపుత్రుడుంటే తండ్రి తర్వాత అతడే రాజ్యానికి వస్తాడు. పుత్రులు లేకపోతే దత్తత చేసుకొనడమన్నది ప్రాచీన సంప్రదాయం. అయితే సామంతులు దత్తస్వీకారం చేసుకొంటే దానిని అధికారులు ఆమోదించాలి. అప్పుడే అది చెల్లుతుంది. కుంఫిణీవారు రాజ్యాధికారులయ్యాక కొన్ని సందర్భాలలో రాజులూ, జమీందారులూ చేసుకొన్న దత్తతలను ఆమోదించలేదు. ఆ రాజ్యాలను తమ ఏలుబడిలో కలుపుకొన్నారు. భారతదేశ చరిత్రలో ఈ విధమైన సంఘటనలే విపరీత పరిణామాలకు దారి తీశాయి.

క్రీ.శ. 1848-1858 ఈ పదేళ్ళ మధ్య సతారా, నాగపూర్, ఝాన్సి, సంబల్‌పూర్ మొదలైన రాజ్యాలలో దత్తతలను అంగీకరించక వాటిని కుంఫిణీవారు కబళించారు. తంజావూరులో రాజు. ఆర్కాటులో నవాబు మరణించాక ఆ రాజ్యాల గుర్తింపులను అంగీకరించలేదు. బాకీలు చెల్లుబెట్టుకోవాలన్న నెపంమీద హైదరాబాదు నిజాము నుండి కొత్తగా బీరారు రాజ్యాన్ని గుంజుకొన్నారు. ఇది ప్రత్తి పండే సారవంతమైన ప్రదేశం. 1831 నాటి నుంచే మైసూరు కుంఫిణీ వారి ప్రత్యక్ష పాలనలోనికి వచ్చింది. ఆ దేశపు రాజు పింఛనీదారుడయ్యాడు. పీష్వా రెండవ బాజీరావు సంతతికి ఈ పింఛనీ బిచ్చం కూడా దక్కనివ్వలేదు. 1856లో పరిపాలన బాగులేదనే 'సాకు' మీద అయోధ్యను ఆరగించారు.

రాజ్యాలూ, రాజ లాంఛనాలూ, బిరుదులూ పోయిన పాలకులు తమ ఆశ్రితులను పోషించలేకపోయారు. ఎందరికో జీవనోపాధులు పోయాయి. పన్నుల భారం తగ్గకపోగా ఇనుమడించింది. రైతులు నలిగిపోయారు. పరువూ, బతుకుతెరువూ పోయిన ప్యూడలు వర్గాలు ప్రజలలోని అసంతృప్తిని మరింత రాజపెట్టసాగారు. సిపాయిలలో తిరుగుబాటు బీజాలు నాటుకొంటున్నాయి. కుంఫిణీ వారి సైన్యాలు మూడు రాజధానులకు చెందినవి. అవి బెంగాలు, మద్రాసు, బొంబాయి ప్రాంతాలవి. బెంగాలు సైన్యంలో లక్షానలభైవేలమంది భారతీయులు ఉన్నారు. వీరిలో చాలామంది అయోధ్య, బీహారువాసులు. బ్రాహ్మణులు, రాజపుత్రులు, జాటులు, సయ్యదులు, పఠానులు విరివిగా ఉండేవారు. గ్రామీణ వ్యవస్థలోని ప్యూడలు వర్గాలలోని ఉన్నత కుటుంబాలవారితో ఈ సిపాయిలకు సంబంధాలు, బాంధవ్యాలు ఉన్నాయి. కుంఫిణీవారి రాజ్యవిస్తరణ ఒక కొలిక్కి వచ్చాక యుద్ధాల అవసరాలు క్షీణించాయి. సిపాయిలు పోలీసు డ్యూటీల స్థాయికి దిగజారారు.

శతాబ్దాలుగా రాచరికం సేవలకు అలవాటుపడ్డ పాలితులు, అందులోనూ సైనికులు ఒక ప్రభుత్వాన్ని ఎదిరించితే దానికి ప్రత్యామ్నాయంగా మరొక ప్రభుత్వపు కాడికి మెడవంచక తప్పదు. కుంఫిణీవారి దొరతనాన్ని ప్రతిఘటిస్తున్న సైనికులు 1857 మే 11వ తేదీనాడు ఢిల్లీలో ఎర్రకోటను స్వాధీనం చేసుకొని రెండవ బహదూరుషా (1837-1857) అనే మాజీ మొగలు చక్రవర్తిని తీసుకొచ్చి అతనికి పట్టం కట్టారు. ఈ ముసలి పాదుషాను కుంఫిణీవారు అధికారం నుండి తొలగించి పింఛను ఇచ్చి ఎక్కడో పడి ఉండమన్నారు. తిరగబడిన సిపాయిలకు ఒక కేంద్రీకృతమైన ప్రతీకగా ఒక చక్రవర్తి

అవసరమయ్యాడు. అందుచేత బహదూరుషాను భారతదేశానికి పాదుషాగా ప్రకటించి అతని చేత అనుశాసనాన్ని ప్రకటింపచేశారు. ముస్లిం ఉలేమాలు కుంఫిణీవారిపై జిహాదును ప్రారంభిస్తూ ఫట్వాను జారీ చేశారు.

ఈవిధంగా మొదలైన 'భారత స్వాతంత్ర్య యుద్ధం' ఒక పద్ధతి ప్రకారం ఒక వ్యూహారచనతో సంఘటిత శక్తుల సమిష్టి పోరాటంతో సాగిన సమరం కాదు. ఎక్కడికక్కడ, ఎవరికివారు తమ తమ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినడం వల్ల వాటిని మళ్ళా నిలుపుకోడానికి ఒకరకమైన ఆత్మాభిమానంతోనే ఈ పోరు కొనసాగించారు. ఇటు సిపాయిలూ, అటు కుంఫిణీవారూ ఈ యుద్ధంలో చేసిన మారణకాండను చరిత్ర గ్రంథస్థం చేసింది. 1757 ప్లాసీ యుద్ధంలో విజయం పొందిన కుంఫిణీవారికి సరిగ్గా నూరేళ్ళకు 1857లో చుక్కెదురయింది. ఢిల్లీ, కాన్పూరు, లక్నో, ఝూన్సీ, గ్వాలియరు వంటి ప్రదేశాలలో సంకుల సమరాలు జరిగాయి.

అయితే సిపాయిలలో తిరుగుబాటు తత్త్వమూ, సంస్థానాధీశ్వరులలో స్వాతంత్ర్య వాంఛా దేశంలోని కొన్ని భాగాలకే పరిమితమైంది. దక్షిణాదిని ఉన్న స్వదేశ సంస్థానాధిపతులు తెల్లవాళ్ళకు సుముఖులుగానూ విధేయులుగానూ ఉన్నారు. ఉత్తర భారతంలోని తిరుగుబాటును అణచడానికి దక్షిణ భారతం నుండి కుంఫిణీ సైన్యాలు సామంతుల రాణువలూ వెళ్ళాయి. హైదరాబాదు సంస్థానంలో దివానుగా ఉన్న సాలార్జంగు తన పాలనలోని ప్రజలు ఇంగ్లీషు వారి మీద ద్వేషంతో కయ్యానికి కాలుదువ్వుతున్నా, ఆ సమయంలోనే హైదరాబాదు యేలిక మృతుడైనా, ప్రజలు తనను అసహ్యించుకొని తన ప్రాణాలు తీయడానికి ప్రయత్నిస్తున్నా 'భయపడక' ఇంగ్లీషు వారిమీద యుద్ధానికి ఢీకొన్న రోహిలాలను శిక్షించడమేకాక సేనలను ఉత్తర హిందూ దేశానికి పంపి అక్కడ స్వాతంత్ర్య యుద్ధాలను అణచడానికి తోడ్పడ్డాడు. ''ఇట్లు చేయక సాలార్జంగుగారు కొంచెముపేక్ష చేసి యూరకుండిన పక్షమున కలహాలు బొంబాయి, చెన్నపురి రాజధానుల గూడా బయలుదేరి యింగ్లీషు వారి స్వరాజ్య సంరక్షణము దుర్భరమయి యుండును'' అని తెలుగు దేశంలోని రాజభక్తులు రాశారు.[2]

(ఇంగ్లీషు వారికి ఇంత సహాయం చేసిన సాలార్జంగు తన ప్రజల ద్వేషాన్ని తగ్గించడానికి కుంఫిణీవారు తమ రాజ్యంలో కలుపుకొన్న బీరారు ప్రాంతాన్ని తిరిగి రాబట్టుకొనడానికి ప్రయత్నాలు చేశాడు. చేసిన ఉపకారానికి ప్రతిఫలం ఇవ్వకపోగా ఆనాటి గవర్నరు జనరల్ లిట్టన్, సాలార్జంగు పదవికే ఎసరుపెట్టాలని చూశాడు. అయితే తర్వాత వచ్చిన గవర్నర్ జనరల్ రిప్పన్ మాత్రం సాలార్జంగుకు పూర్వగౌరవాన్ని వాపసు చేశారు. సామ్రాజ్యవాదుల కృతజ్ఞతలు ఇలా వుంటాయి.)

కర్ణుని చావుకు ఎన్ని కారణాలున్నాయో, స్వాతంత్ర్య యుద్ధంలో భారతీయులు ఓడిపోడానికి కూడా అంతకు మించిన కారణాలున్నాయి. కుంఫిణీవారు 'సిపాయిల తిరుగుబాటు'ను క్రూరంగా అణచివేసి తమ బలాధిక్యతను రుజువు చేసుకొన్నారు.

2. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి - 8వ సంపుటం - స్వదేశ సంస్థాన చరిత్రములు - పుట.13

మొగలు చక్రవర్తి రెండవ బహదూరుషాను పట్టి బంధించి న్యాయస్థానానికి ఈడ్చి విచారణ జరిపి శిక్షించారు. పూర్వం మొగలు చక్రవర్తి దగ్గరనుంచే ఫర్మానాలు పొంది, జాగీరుదారులై దివానీ హక్కులు పొంది ఈ దేశాన్ని కుంఫిణీవారు హస్తగతం చేసుకొన్నారు. స్వాతంత్ర్య యుద్ధంతర్వాత ఆ చక్రవర్తే 'తిరుగుబాటు'కు కేంద్రీకృత ప్రతీకగా రూపొందడం వల్ల అతణ్ణి 'న్యాయశాస్త్రరీత్యా' చట్టబద్ధంగా తొలగిస్తున్నట్లు తెల్లవాళ్లు నాటకమాడారు. అయితే రాజ్యానికి ఒక ఏలిక అవసరం. భారతదేశంలోని కుంఫిణీ ఉద్యోగులందరూ బ్రిటిష్ పౌరులే. వాళ్ళదేశంలోని పార్లమెంటుకి రాజమకుటానికి లోబడ్డ వాళ్ళేగాని రాజ్యాధికారాన్ని స్వయంగా చేపట్టగలిగిన అధికారాలు చట్టరీత్యా లేనివాళ్ళే. అందుచేత మొగలు చక్రవర్తి నామమాత్రపు పాలనను అంతం చేయడానికి ముందు తమ దేశపు మహారాణినే భారతదేశపు ఏలికగా ప్రకటించారు.

వాస్తవానికి భారతదేశంలో సిపాయిల కలహం యుద్ధం ఇంకా ముగియకముందే ఈస్టిండియా కుంఫిణీ రద్దయింది. ''సిపాయిల తిరుగుబాటు'' ప్రజ్వరిల్లినప్పుడు ఇండియాలో సంస్కరణలు అవసరమనే వివాదం బ్రిటిష్ సమాజంలోని అన్ని తరగతులలోనూ ప్రతిధ్వనించింది. చిత్రహింసల నివేదికల వల్ల ప్రజాభిప్రాయం అట్టుడికినట్టు ఉడికిపోయింది. దేశీయుల మత వ్యవహారాలలో జోక్యం కలుగచేసుకొనడాన్ని తీవ్రంగా ఖండించారు. ''ఫలితంగా భారతదేశపు పరిపాలనకు ప్రత్యక్షంగా బ్రిటిష్ రాజమకుటానికి చెందాలన్న వాదం వచ్చింది. 1857 డిసెంబరులో బ్రిటన్‌లోని లిబరల్ ప్రభుత్వం ఇండియా చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ప్రథమ పఠనం పూర్తి కాకముందే లిబరల్ ప్రభుత్వం పడిపోయి 'టోరీలు' అధికారంలోనికి వచ్చారు. 1858 ఫిబ్రవరి 18వ తేదీన డిజ్రేలి ప్రవేశపెట్టిన 'ఇండియా చట్టం' పార్లమెంటులో వీగిపోయింది. అందుకే ఆ సంవత్సరం ఆగస్టు నెలలో లార్డ్‌స్టాన్లీ ప్రవేశపెట్టిన 'ఇండియా చట్టం' ఎట్టకేలకు నెగ్గింది. దీనితో ఈస్టిండియా కంపెనీకి స్వస్తి ''మహనీయురాలైన'' విక్టోరియా సామ్రాజ్యంలో భారతదేశం ఒక రాష్ట్రమైంది. రెండుసార్లు ఈ చట్టం వీగిపోవడానికి మూడోసారి నెగ్గడానికి గల కారణాలు కారల్‌మార్క్స్ ఇలా చెప్పారు.[3]

''(కుంఫిణీ) వారు వ్యవహారస్తులుగానే, అడుగడుగునా బేరసారాలు చేసుకుంటూనే అధికారానికి ఎలా వచ్చారో, అలాగే అడుగడుగునా లావాదేవీలు సాగించుకుంటూనే తమ అధికారం వదలుకున్నారు. నిజంగా చూస్తే వారి చరిత్ర అంతా కూడా కొనుగోలు చేయడమూ అమ్మకం చేయడమూనూ. సార్వభౌమాధిపత్యాన్ని ఖరీదు చేసి కొనుగోలు చేయడంతో వారు అసలు తమ మనుగడ ప్రారంభించారు. దానిని అమ్ముకోవడంతో తమ మనుగడకు స్వస్తి చెప్పుకున్నారు. వారు నేలకొరిగారు, నిజమే; కాని వారు నేల కొరిగింది రణరంగంలో కాదు; అమీనా ఏలంలో పెద్దపాట పాడినవాడి చేతుల్లో పడి ప్రాణాలనొదులుకున్నారు''.

ఈ చట్టం ప్రకారం కుంఫిణీ వారు తమ ఆస్తులన్నింటినీ బ్రిటిష్ ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. అయితే దయాధర్మ భిక్షగాగానీ, ఉదారబుద్ధితోగానీ కాదు. తమ

3. మార్క్స్ - ఎంగెల్స్ - ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం (1857-1859) - పుట.206

వాటాదార్లందరికీ నష్టపరిహారం కింద బ్రిటిష్ ప్రభుత్వం మూడు మిలియన్ పౌండ్ల రొఖ్ఖాన్ని చెల్లించడానికి వప్పుకొన్న తర్వాతనే ఈ ద్రవ్యమంతా భారతదేశం బడ్జెటులో ఖర్చు రాశారు. భారతీయులు ఈ నష్టాన్ని తమ పన్నుల రూపంలో ఇచ్చుకోవలసి వచ్చింది.

1858వ సంవత్సరం నవంబరు 1వ తేదీనాడు భారతదేశాన్ని ప్రత్యక్షంగా పరిపాలిస్తున్నట్టు విక్టోరియా మహారాణీ ఇండియాలోని ప్రజలనుద్దేశించి ఒక ప్రకటన చేసింది. దాని పాఠం వీరేశలింగంగారి అనువాదంలో కొంత చూడండి.[4]

''క్రైస్తవ మతము యొక్క సత్యమును మేము దృఢముగా నమ్మినవారమయి మతము వలనఁగలిగెడు చిత్తశాంతిని మేము కృతజ్ఞతతో నొప్పుకొనుచున్న వారమయ్యును, మా విశ్వాసములను మా ప్రజలలో నెవరి మీఁదను నిర్బంధించు కోరికగాని స్వాతంత్ర్యము గాని మాకులేదని చెప్పుచున్నాము. తమతమ మత విశ్వాసములను బట్టిగాని యాచారములనుబట్టిగాని యెవ్వరు నేవిధముగాను మా వలన నిగ్రహమునుగాని యనుగ్రహమునుగాని పొందక యందఱును సమానముగా ధర్మశాసనముల వలని సంరక్షణమును నిష్పక్షపాతముగాఁ బొందవలయుట మా యభిమతమును మాకు సంతోషకరమనునది మేము ఘోషించుచున్నాము. మా ప్రజలలో నెవ్వరి యొక్క మత విశ్వాసములతోను పూజా విధానములతోను తా మేవిధమైన సంబంధమును మా క్రింద యధికారులెవ్వరును కలుగఁ చేసికోఁగూడదనియు, గలుగఁజేసికొన్న యెడల మాయాగ్రహమున కట్టివారు పాత్రులగుదురనియు మేము దృఢముగా విధించుచున్నాము.

''మా ప్రజలయినంత వఱకు వారేజాతివారయినను ఏ తెగవారయినను సరే విద్యవలనను సామర్థ్యము వలనను సద్వర్తనము వలనను దాము చక్కఁగా నిర్వహించుట కర్హులయినవారు మా ప్రభుత్వములోని పనులకు యథేచ్ఛముగాను నిష్పాక్షికముగాను చేర్చుకొనఁబడవలయుట మా చిత్తమయియున్నది.

''ఈశ్వరానుగ్రహము వలన దేశములో స్వస్థత మరల కలిగింపఁబడినప్పుడు హిందూ దేశము యొక్క నెమ్మదియైన కర్మలను బ్రోత్సాహపఱచుటయు జనోపయుక్త ములును వృద్ధికరములునైన పనులను పెంపు చెందించుటయు దేశములో నున్న సర్వ ప్రజల యొక్క లాభంకొఱకు పరిపాలనము జరుపుటయు మా యత్యంతాభిలాషయై యున్నది. మా బలము వారి సంపదలోను, మా క్షేమము వారి తృప్తిలోను, మా యుత్తమ ప్రతిఫలము వారి కృతజ్ఞతలోను ఉండును. సర్వశక్తుఁడయిన యీశ్వరుడు మాకును మాక్రింది నధికారములోనుండు వారికిని మా యీ యభీష్టములను ప్రజల మేలు కొఱకు కొనసాగించుటకు శక్తిని బ్రసాదించునుగాక.''

విక్టోరియా రాణీ చేసిన ప్రకటనను 1858 నవంబరు 8వ తేదీనాడు భారతదేశంలోని వివిధ కేంద్రాలలో ప్రజలకు అధికారులు విశదపరిచారు. అప్పటివరకు

వీరేశలింగంగారి సంపూర్ణ గ్రంథావళి - 6వ సంపుటం, 3వ ప్రకరణం, 'శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారి చరిత్రము', పుట.84-85

కుంఫిణీవారి గవర్నరు జనరల్‌గానే ఉంటూ వచ్చిన అత్యున్నత వ్యక్తి ఈ ప్రకటన తర్వాత రాణీగారి వైస్రాయిగా కూడా వ్యవహరించసాగాడు. వైస్రాయి అన్న పదానికి అర్థం రాజుకూ రాజమకుటానికి ప్రత్యామ్నాయంగా ఉంటూ రాజ్యాధికారాన్ని చేసేవాడు. రాచకార్యాల సర్వాధికారిని గవర్నర్ జనరల్ అంటారు. వైస్రాయి-గవర్నర్ జనరల్ అనే జమిలి పదవులను ఒకే వ్యక్తి నిర్వహిస్తూ వుండాలని బ్రిటన్‌లోని ప్రభుత్వ వర్గాలు భావించాయి. గ్రేట్ బ్రిటన్‌లో పార్లమెంటుకు ప్రత్యర్థిగా ఉన్న రాజమకుటానికి వైస్రాయిగానూ, రాజమకుటానికి ప్రత్యర్థిగా ఉన్న పార్లమెంటుకు గవర్నర్ జనరల్‌గానూ ఒకే వ్యక్తి జవాబుదారీ అవుతాడు.

మొట్టమొదటి వైస్రాయిగా లార్డ్ క్యానింగ్ ఉత్తర భారతదేశంలో 1858 నుండి పర్యటించి స్వదేశ సంస్థానాధీశ్వరులను మంచి చేసుకొంటూ రాణిగారి ప్రకటనను విడమర్చి చెప్పాడు. భక్తి విశ్వాసాలతో పరమ విధేయులయిన సంస్థానాధీశ్వరులకు సర్వరక్షణలూ, సకల గౌరవాలూ లభిస్తాయని విశదం చేశారు. ప్యూడలు వర్గాల ఆస్తి హక్కులలో సంక్షోభ సంప్రదాయసిద్ధమైన మర్యాదలలో ఉపేక్ష తమ రాజ్యాధికారానికి భంగకరమని వైస్రాయి తెలుసుకొన్నాడు.

వాస్తవానికి తూర్పు ఇండియా కుంఫిణీవారు భారతదేశంలోని రాజరికపు వ్యవస్థని మొదట సరిగ్గా అవగాహన చేసుకోలేదు. మనుస్మృతి, అర్ధశాస్త్ర మొదలైన ధర్మార్థ శాస్త్రాల ప్రకారం ఈదేశంలో ఒక అవిచ్ఛిన్నమైన రాజ్యాంగ వ్యవస్థ ఉంటూ వచ్చింది. మౌర్యుల కాలం నుంచి మొగలాయీ పరిపాలన దాకా రాజరికపు సంప్రదాయం కొన్ని పద్ధతులను అనుసరిస్తూ వచ్చింది. రాజ్యంలో ఏడు అంగాలు ఉంటాయి. స్వామి (రాజు), అమాత్యుడు (మంత్రి), సుహృదులు (మిత్రులు), కోశము (బొక్కసం), రాష్ట్రము (దేశము), దుర్గము (కోట), బలము (సేన) అనే ఈ ఏడు సప్తాంగాలు. సామ్రాజ్యాధిపతికి సామంతులు, సుహృదులు. రాజు ధర్మ స్వరూపుడు. అతడు యుగధర్మం మూర్తీభవించిన వ్యక్తి. సార్వభౌమునికి సింహాసనాలు, ఢక్క, పింఛ్ఛము, కుంతము మొదలైన సామ్రాజ్య చిహ్నాలు ఉంటాయి. ఈ సార్వభౌముడు తనను కొలుచుకొనే సామంతులకు వివిధ సామంత చిహ్నాలను బహూకరిస్తాడు. పట్టము, భేరీ, శంఖ కాహళాది వాద్యాలు ఆందోళిక ఛత్రచామరాదులు ఈ చిహ్నాలలో ఉంటాయి.

పూర్వపు హిందూ రాజుల సంప్రదాయాన్నే మొగలు చక్రవర్తులు కొత్త పరిభాషతో కొత్త చిహ్నాలతో కొనసాగించారు. సామంతులు పూర్వం సార్వభౌమునికి 'కానిక మాడలు' సమర్పించేవారు. ప్రభువుకు గౌరవార్థంగా చెల్లించే ద్రవ్యాన్ని 'కట్నంగానికలు' అంటారు. మొగలాయి దర్బారులో సామంతులు చక్రవర్తికి 'నజరు' అర్పించేవారు. దీనికి ప్రతిఫలంగా సార్వభౌముడు సామంతునికి 'ఖిలాత్'గా సామంత చిహ్నాలు బహూకరించేవాడు. సామంతుల హోదాలను బట్టి 'ఖిలాత్'లో గౌరవమైన ఉడుపులు, శాలువలు, పగిడీలు, పాగాలో దాల్చే భూషణాలు, ఆయుధాలు, కొన్ని సందర్భాలలో గజతురగాదులు ఉంటాయి. నజరు సమర్పిస్తున్న సామంతుడు రాజ్యంలోని సప్తాంగాలలో తనని ఒకనిగా భావించమని సార్వభౌమునికి విన్నవించుకొంటున్నాడన్న మాట.

ఖిలాత్ ఇస్తున్న చక్రవర్తి ఆ విన్నపాన్ని మన్నించి ఆమోద ముద్రను అందచేస్తున్నాడన్నమాట. ఈ ఆదాన ప్రదానాల వల్ల సార్వభౌమునికి, సామంతునికి మధ్య ఒక మానసికమైన అనుబంధం ఏర్పడుతోంది.

మొగలు చక్రవర్తుల కాలం నుంచీ మన దేశంలో సంబంధాలు పెట్టుకొన్న కుంఫిణీ వారికి నజరులు సమర్పించడం, ఖిలాతులు పుచ్చుకొనడం కొత్తేంకాదు. అయితే ఇవి కేవలం లంచాలు ఇవ్వడం, ప్రతిఫలం పొందడం అనే వర్తక వాణిజ్య వ్యవహారాల కిందేగాని సాంస్కృతిక సంకేతంగా అర్థంచేసుకోలేకపోయారు. మొట్టమొదటి వైస్రాయిగా లార్డ్ క్యానింగ్ భారతదేశంలోని ప్యూడలు మర్యాదలను బాగా అధ్యయనం చేశాడు. తన పర్యటనలో పలుచోట్ల దర్బారులు ఏర్పాటు చేశాడు. ప్యూడలు భూస్వామ్యవర్గంలోని ప్రముఖులను కలుసుకొని వారివారి అర్హతలనుబట్టి వారికి 'రాజా', 'నవాబు', 'రాయ్ సాహెబ్', 'రాయ్ బహదూర్', 'ఖాన్ బహదూరు' మొదలైన బిరుదులు ప్రసాదించాడు. బిరుదులతోపాటు ఖిలాతులుగా లాంఛన చిహ్నావస్త్రాలూ, ప్రత్యేకమైన సదుపాయాలూ బహూకరించాడు. సిపాయిల కలహం రోజుల్లో తెల్లవాళ్ళ మానప్రాణాలను కాపాడిన భారతీయులలో విశ్వాసపాత్రులకు మడులూ మాన్యాలను వైస్రాయి ఇచ్చాడు.

ఉత్తర భారతంలోనేకాక దక్షిణ భారతంలోనూ తెలుగు జిల్లాలలోనూ కొందరు కొందరు ప్రముఖులు కొన్ని వర్గాల ప్రజలూ తెల్లవాళ్ల పట్ల సానుభూతి ప్రకటించక పోలేదు. 1858లో జరిగిన సిపాయిల తిరుగుబాటును ఖండిస్తూ చెన్నరాజధానిలోని కొన్ని పట్టణాలలో ఉండే ప్రజలు ప్రభుత్వానికి అర్జీలు పంపుకొన్నారు. వీరిలో హిందువులూ, మహమ్మదీయులూ, క్రైస్తవులూ ఉన్నారు.[5] ఏయే ఊరి నుంచి ఎందరు మహజర్లు పెట్టుకొన్నదీ కొంతవరకూ చూడండి.

	సంతకాలు
మద్రాసులోని హిందువులు, మహమ్మదీయులు	1,482
రాజమండ్రి పౌరులు - యస్. వెంకటాద్రి, మరికొందరు	
మచిలీపట్నం పౌరులు	474
రాజమండ్రి పౌరులు	140
విశాఖపట్నంలోని మహమ్మదీయులు	116
చిత్తూరు పౌరులు	176
కాకినాడ పౌరులు	287
ధవళేశ్వరం పౌరులు	254
గుంటూరు పౌరులు	60
చుండి జమీందారు	
నెల్లూరు ప్రజలు	632
కడప పౌరులు	216

5. మహజర్లు - Addresses from the Hindus, Mahamedan and Christian Inhabitants of Southern India (Madras-1858)

పై విధంగా సంతకాలు చేసి తమ అభిప్రాయాలను తెలిపిన వాళ్ళలో ధవళేశ్వరం ప్రజలు ఒక సుదీర్ఘమైన మహజరు సమర్పించారు. దాని సారాన్ని చూడండి.

''పూర్వం వుండే హిందూ మహమ్మదీయ రాజ్యాల రెండింటిలోనూ సామంతులు తరచు ఒకరిపై ఒకరు కత్తి దూసుకొనేవారు. తిరుగుబాటు నిత్యం జరిగేది. ప్రజలపై నిరంకుశాధికారం దినదినం వృద్ధి పొందేది. ఈ విషయం నిజాము ప్రభుత్వంలో ఇంకా సాగుతూనే ఉంది.''

''మేము తెల్లవాళ్ల ప్రభుత్వాన్ని నోచుకొనడం వల్ల పైన చెప్పిన నిరంకుశత్వం అంతరించింది. అభిప్రాయభేదాలు, అసంతృప్తి ప్రజలలో మాయమైంది. దేశీయులకు మళ్ళా ఆనందం చేకూరింది. సర్వులకు న్యాయద్వారాలు తెరచుకొన్నాయి. నిష్పక్షపాతం, నిశ్చంచల ధర్మ పరాయణత్వమే ప్రభుత్వాశయాలు. ఈ దృష్టితోనే ప్రజల వారసత్వపు హక్కులను రక్షించేటందుకుగాను ఎన్నో న్యాయస్థానాలను నెలకొల్పారు. ఆ కోర్టులలో పేదవాళ్ళకు న్యాయం కలుగుతుంది. శ్రీమంతులు చెలాయించే అధికారాల నుండి పేదలకు విమోచనం కలిగింది. పాత ప్రభుత్వాల హయాంలో పోయిన శాంతి భద్రతలు మళ్ళా ప్రజలు అనుభవిస్తున్నారు.

''దేశంలోని నదులన్నింటికి ఆనకట్టలు కట్టించారు. వేలాది కాలువలు తవ్వించారు. ఊషరక్షేత్రాలు పండుతున్నాయి. రైళ్లు పడ్డాయి. తపాల సౌకర్యాలు వచ్చాయి.

''చిట్టచివరిలో మేము ఒక్కటే మనవి చేసికోవాలి. మా స్వదేశీయ ప్రభువుల పరిపాలనలో మేము పడ్డ బాధలు చెప్పుకొందికి సిగ్గుపడుతున్నాం. ఆ కష్టాలు మాకు తెలుసు కనుక ఇంక బ్రిటిషు వారి ప్రభుత్వం తప్ప మరేదీ మమ్మల్ని పరిపాలించకూడదని విశ్వసిస్తున్నాం''.

సిపాయిల తిరుగుబాటును ఖండిస్తూ మహజర్లు పెట్టుకొన్న దక్షిణాది రాజభక్తులలో చుండి జమీందారు ఉన్నట్టు పైన గుర్తించాం. చుండి నెల్లూరు జిల్లా, కందుకూరి తాలూకాలోని చాలా చిన్న జమీందారీ. దీని వైశాల్యం 125 చదరపుమైళ్లు. సాలుసరి వరుమానం 1870 నాటికి 52 వేలు. ఈ మహజరు పెట్టుకొన్న కాలంలో చుండిని రాజా కామినేని బంగారు ముత్తరాజు (1842-1870) పరిపాలిస్తూ ఉండేవాడు.[6]

ఇటువంటి రాజభక్తి పరాయణుల భక్తి విశ్వాసాలే సామ్రాజ్యానికి పెట్టని కోటలని బ్రిటీషువారు గుర్తించారు. దేశం మొత్తంమీద ఫ్యూడల్ భూస్వామ్యవర్గాలను పటిష్టం చేస్తూ వారు భక్తి విశ్వాసాలు చూపుతున్నంతకాలం వారితో సత్సంబంధాలు పెంచుకోవాలని వైస్రాయి భావించాడు. స్వదేశ సంస్థానాధీశ్వరులలో తరతమ భేదాలు ఉంటాయి. రాజ్యం, వైశాల్యం, ఆదాయం, వంశచరిత్ర, మొగలు సామ్రాజ్యంలో వారి స్థానం, కుంఫిణీ వారితో వారు నేస్తం కట్టిన తారీఖు వివరాలు మొదలైనవైనాలను దృష్టిలో పెట్టుకొని సంస్థానాధీశ్వరుల తారతమ్యాలను బేరీజు వేసుకొని ఎవరి తర్వాత ఎవరిని ఏస్థానంలో

6. తూమాటి దొణప్ప - ఆంధ్ర సంస్థానములు, సాహిత్యపోషణ, పుటలు.538-9.

నిలుపవలసినదీ ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించుతుంది. దర్బారులలోనికి వచ్చి సంస్థానాధీశ్వరులు వైస్రాయినిగాని, రాజధాని గవర్నరునుగాని సందర్శనం చేసుకొంటు న్నప్పుడు పాటించవలసిన మర్యాదలను క్రోడీకరించారు.

అత్యున్నత స్థాయిలో ఉండే సంస్థానాధీశ్వరులు భారత దేశాన్ని పాలించడానికి చేసే శాసన రచనలో భాగస్వాములుగా ఉన్నారన్న సంగతి లోకం నమ్మడానికి వీలుగా బ్రిటీషు ప్రభుత్వం ఒక నాటకం ఆడింది. 1861లో 'ఇండియన్ కౌన్సిల్' చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. దీనిలోని కొన్ని అంశాల ప్రకారం శాసన నిర్మాణమండలి కేంద్రంలో వైస్రాయికీ, రాజధానులలో గవర్నర్లలకూ సలహాదార్ల హోదాలో ఉంటుంది. వీళ్ళలో సగం మంది సభ్యులు సివిల్ సర్వీసులో లేని వ్యక్తులై ఉండితీరాలి. వీళ్లు భారతదేశపు ప్యూడలు వర్గాలలోని ప్రభువులైతే మంచిది. వీరంతా బ్రిటీషు వారిపట్ల గౌరవాభిమానాలు గలవారైతే మరీ మంచిది. ఈ సంగతినే కామన్స్ సభలో సర్‌ఛార్లెస్ వుడ్ (భారతదేశానికి సెక్రటరీ ఆఫ్ స్టేట్) ఉద్ఘాటించారు.[7]

ఈ చట్టం ప్రకారం వైస్రాయికీ గవర్నర్లకీ సలహాదార్లగా వుండే నేటివు ప్రభువుల ఆర్థిక వ్యవహారాలలో, పన్నుల విషయంలో, సైనిక నిర్ణయాలలో చర్చలు చేయకూడదు. శాసననిర్మాణ మండలిలో సభ్యులన్న గౌరవం మాత్రం వీరికి చాలన్నది బ్రిటీష్‌వారి ఉద్దేశం. ఈ సభ్యులు ఇతర సంస్థానాధీశ్వరులతో ప్రభుత్వం వ్యవహరించే తీరును కూడా ప్రశ్నించరాదు. సంస్థానాల సరిహద్దులను ప్రభుత్వం వారు తమ అవసరాలకు అనుగుణ్యంగా 'విభజించి పాలించు' అన్న సూత్రానికి వీలుగా నిర్ణయించారు.

ఉదాహరణకు తెలుగు జిల్లాలలోని మునగాల జమీందారీనే తీసుకొందాం. ఇది కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో ఉండేది. బందరు-హైదరాబాదు రహదారిలో, బందరుకు నూట ఇరవైమైళ్ళ దూరంలో ఉంది. దీనికి నాలుగు పక్కలా నైజాం సంస్థానం ఉండడం కేవలం యాదృచ్ఛికం కాదు. కుంఫిణీ వారు 1802లో నైజాం సరిహద్దుల నుండి, బందిపోట్ల నుండి రక్షణకు మునగాల అందుబాటుగా ఉందని గుర్తించారు. కస్టమ్సు పన్నులు, ప్యాస్‌కోర్టుల తనిఖీకి ఇది చాలా ఉపయోగం. తక్కువమంది ఇంగ్లీషు సైనికులతో ఈ ప్రాంతాన్ని రక్షించుకోవచ్చు. నైజాం నవాబును కాపాడడానికి ఒకవేళ నైజాం తమకు యెదురుతిరిగితే, మునగాలను వ్యూహాత్మక కీలక ప్రాంతంగా ఉపయోగించుకొని నవాబును అణచి వేయడానికి ఈ ప్రాంతం ఎంతగానో ఉపయోగపడుతుంది. బ్రిటిష్ వారికి భక్తులుగా వున్న ఈ సంస్థానాన్ని చెక్కు చెదరకుండా వుంచి తమకు ఎల్లప్పుడూ అనుచరుడుగా ఉండటానికి తక్కువ పేష్కసు చెల్లించే జమీందారుగా ఈ సంస్థానాధీశ్వరుని మార్చివేశారు.[8] (ఉత్తరోత్తరా ఒక మునగాల జమీందారు బ్రిటీషు వారికి వ్యతిరేకంగా కాంగ్రెసులో చేరాడు. అది వేరే సంగతి).

7. K. Antonova et al-p.86
8. తటపర్తి వెంకటేశ్వరరావు - ''మునగాల పరగణ - ప్రజాఉద్యమచరిత్ర'' పుటలు 5-6

1867లో అత్యున్నత స్థాయి సంస్థానాధీశ్వరులకు గుర్తింపుగా శాసన నిర్మాణ మండలిలో సభ్యత్వం ఇవ్వడంతో బ్రిటీషు వారి రాజకీయ సంస్కరణలు ప్రారంభమైనా యన్నది గమనించదగ్గ విషయం. తెలుగు జిల్లాలలో 'మహారాజా' స్థాయిలో ఉన్న విజయనగరం జమీందారులలో ఒకరైన విజయరామగజపతి (1826-1879)ని మూడు సారులు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా గౌరవించారు. వీరి కుమారుడు ఆనందగజపతి (1850-1897) కూడా శాసన నిర్మాణ సభాగౌరవాన్ని పొందాడు. ఈ రాజులకు ఇతర సామంత చిహ్నాలను కూడా బ్రిటీష్ ప్రభుత్వం వారు ఇచ్చారు.

సామంత చిహ్నాలను, లాంఛనాలను సంస్థానాధీశ్వరులు ప్రాణప్రదంగా చూసుకొంటారు. వైస్రాయిగారి దర్బారులోనికి ఈ ప్యూడలు ప్రముఖులు వెళ్ళేటప్పుడు ఎటువంటి ఉడుపులు ధరించాలో, ఏయే ఆయుధాలు తీసుకొని వెళ్ళవచ్చో, ఎంతమంది పరివారం వెంటనుండాలో నిర్ణయించడం జరిగి ఆ పద్ధతులను పాటించేవారు. సంస్థానాధీశ్వరుల రాకను పురస్కరించుకొని ఫిరంగి పేల్పుల సైనిక వందనాలను చేయడం మర్యాద. ఏ ప్రభువుకు ఎన్ని ఫిరంగిమ్రోతలు గౌరవనీయమైనవో కూడా లెక్కకట్టి ఆ సంఖ్యను విధిగా పాటించేవారు. ఏ ప్రభువును ఎలా సంబోధించాలో, వారికి ఏయే బిరుదులు వాడాలో కూడా నిశ్చయించేవారు.

ఒక్క సంస్థానాధీశ్వరులేకాక బ్రిటీషు వారి పాలనలో ఉండే ఇతర రాజధానులలో బ్రిటిష్ ప్రజానీకం ఉన్నారు. వీరిలో కూడా సంపన్నులూ, విద్యాధికులు, మోతుబరులు, పలుకుబడి, పరువూ ప్రతిష్టా గలవారు వివిధ నగరాలలో, జిల్లాలలో వున్నారు. ఈ పెద్ద మనుష్యులలో కూడా తరతమ భేదాలను జిల్లా అధికారులు గుర్తించి, రికార్డులలోనికి ఎక్కించి, జిల్లా దర్బారులలో వారి వారి స్థానాలను నిశ్చయించారు. జిల్లాలలోని ప్రముఖులకు వారు, వారు కట్టే పన్నుల మొత్తాన్ని బట్టి, వంశప్రాధాన్యమునుబట్టి, రాజభక్తి ప్రకటించే చర్యలనుబట్టి హోదాలను నిర్ణయించేవారు. ప్రభుత్వోద్యోగులలో కూడా వారి వారి సర్వీసు రికార్డును చూసి తరతమ భేదాలను నిర్ణయించేవారు. సాధారణ ప్రజలను వారి వారి జాతులను, కులాలను, మతాలను లెక్కలోనికి తీసుకొని స్థానాలను నిర్ణయించేవారు.[9]

1861లో 'స్టార్ ఆఫ్ ఇండియా' అనే బిరుదాన్ని అత్యంత ప్రముఖులకు ప్రసాదించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఆదిలో ఇది కేవలం 25 మందికే పరిమితం చేసి గొప్ప సంస్థానాధీశ్వరులకూ, పెద్ద ఉద్యోగాలలో ఉన్న సివిలు, మిలటరీ వ్యక్తులయిన బ్రిటీషు వారికీ ఇస్తూ వుండేవారు. 1866లో దీనిని విస్తృతం చేసి మరో రెండు కింది మెట్లలోని ప్రముఖులకు కూడా వర్తింపచేశారు. 1877 నాటికి కొన్ని వందల మందికి ఈ కులీన శూరత్వ మర్యాదను ప్రసాదించారు.

దేశ పర్యటనలలో వైస్రాయి దర్బారులే కాక సీమనుండి ప్రత్యేకంగా భారతీయులకు దర్శనం ఇవ్వడానికే విక్టోరియా రాణీగారి కుటుంబసభ్యులు క్రమంగా

9. Bernard S. Chon - "An Anthropologist among the Historians and other Essays" - pp. 648-9

వచ్చిపోతూ ఉండేవారు. వీరి దర్బారులలో పాల్గొనడం సంస్థానాధీశ్వరులకూ, సంపన్న భారతీయులకూ సంబరమైంది. 1869లో 'డ్యూక్ ఆఫ్ ఎడింబరో' వచ్చి ఇటువంటి పర్యటనలకు ప్రారంభం చేశాడు. 1875-76లో రాణీగారి కుమారుడే 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' భారతదేశంలో ఆర్నెల్లపాటు సంచరించాడు. ఇతని రాకను పురస్కరించుకొని రాజభక్తి పరాయణులు పండుగలు చేసుకొన్నారు. పబ్బం గడుపుకొన్నారు. పద్యాలను అల్లించారు. తెలుగులో పెద్ద పండిత కవిగా పేరు మోసి కొక్కొండ వెంకటరత్నంగారు (1842-1915) 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్ తారావళి' అనే పద్యరచనా 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్ హిందూస్థాన్ సందర్శనం' అనే వచన రచనా చేశారు. మొదటి దానికి లండన్‌లోని సుగంధ తైలాల కంపెనీ బహుమతిని ఇచ్చింది. రెండో రచనను మద్రాసు విద్యాశాఖవారు పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు. దేశంలోని వివిధ భాషల కవులు ఆంగ్లేయుల ధర్మరాజ్యాన్ని కీర్తించడం ప్రారంభించారు. తెలుగువారిలో ఇటువంటి ప్రచార కవులలో తొలితరంలో కొక్కొండవారు మొదట లెక్కకు ఎక్కేవారు.

తన కుమారుడైన యువరాజు భారత దేశ పర్యటనలో ప్రజల భక్తి విశ్వాసాలను, ఆదరాభిమానాలను నోచుకొన్నాడని తెలుసుకొన్నాక విక్టోరియా చాలా సంతోషించింది. తన బిరుదావళిలో మార్పులు అవసరమని భావించింది. తనను ఇప్పుడు కేవలం మహారాణీ అని పిలిస్తే చాలా? విశాల సామ్రాజ్యాన్ని పాలిస్తున్నది కనుక తనకు బ్రిటిష్ దేశపు మహారాణి అన్న బిరుదుతోపాటు 'ఎంప్రెస్ ఆఫ్ ఇండియా' (భారతదేశపు చక్రవర్తిని) అనే మహోన్నతమైన గౌరవసూచక పదం కూడా అవసరమనుకొంది. 1876 ఫిబ్రవరిలో పార్లమెంటు 'రాయల్ టైటిల్స్' చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఏప్రిల్ నెలలో దీనిని ఆమోదించారు. విక్టోరియా భారతదేశపు చక్రవర్తిని అనే సంగతిని ఇండియాలోని సమస్త జనులకూ సంస్థానాధీశ్వరుల సమక్షంలో ప్రకటించాలని నిర్ణయించారు. దీనికి తగ్గ ఏర్పాట్లను కనీవినీ ఎరుగని స్థాయిలో చేయడానికి వైస్రాయి నిర్ణయించాడు. 1877 జనవరి ఒకటవ తేదీనాడు 'ఇంపీరియల్ దర్బారు'ను ఢిల్లీలో జరిపించాలని నిశ్చయించారు. సర్వసన్నాహాలూ చేశారు. భారతదేశంలో ఏమాత్రం హోదా వున్నవాడైనా ఆనాటి ఇంపీరియల్ దర్బారులో పాల్గొన్నారు. ఆ దూబరా దర్బారు ముచ్చట్లు కొన్ని తెలుసుకొందాం.

భారతదేశం నాలుగు చెరగుల నుంచి సంస్థానాధీశ్వరులను ఈ బ్రహ్మాండమైన దర్బారు-మేళాకు ఆహ్వానించదలిచారు. వీరంతా సకుటుంబ సపరివారంగా వస్తారు. మందీ మార్బలం ఏనుగులూ, గుర్రాలు మొదలైన పటాటోపం ఉంటుంది. ఏయే సంస్థానాధీశ్వరుడు ఎంతమంది పరిజనులతో రావాలో ముందుగానే నిర్ణయించారు. ఆ సంగతి ముందుగానే నిర్ణయించారు. ఈ సంగతి ముందుగానే తెలియచేశారు. ప్రతి సంస్థానాధీశ్వరుని గౌరవార్థం సైనిక వందనంగా ఒక నిర్ణీత సంఖ్యలో ఫిరంగి పేల్పుల మర్యాదలు ఉంటాయి. స్థాయి తగ్గుతున్నకొద్దీ సంఖ్య ఈ విషయంలో తగ్గుతుంది. ఈ గౌరవాన్ని ఆధారం చేసుకొని ఆహ్వానితుల పరివారాన్ని ఈ కింది విధంగా నిర్ణయించారు.

వరుస	ఫిరంగి పేల్పుల సంఖ్య	పరివారపరిమితి
1.	17 పేల్పులు	500 మంది
2.	15 పేల్పులు	400 మంది
3.	11 పేల్పులు	300 మంది
4.	9 పేల్పులు	200 మంది
5.	ఈ గౌరవంలేని ఇతరులు	100 మంది

ఈ దర్బారులో 25,100 మంది పాల్గొంటారని ప్రభుత్వం వారు అంచనా వేసుకొన్నారుగానీ, వాస్తవానికి 50,741 మంది భారతీయులు సంస్థానాల నుండి ఢిల్లీకి వచ్చారు. 9,741మంది భారతీయులు ప్రభుత్వ సిబ్బందిలో ఉన్నారు. మరో 6,438 మంది చిల్లర మల్లర సేవకులు, పోలీసు, తపాలా, టెలిగ్రాపు విధులలో ఉన్నారు. 14,000 మంది సైనికులు ఉన్నారు. ఇంతమందికి చోటు చూపించడం కోసం ఢిల్లీ చుట్టుప్రక్కల ఉన్న నూరుగ్రామాలను పీకివేశారు. రైతులను శీతాకాలపు పంటలకు ఆ పొలాలలో నాట్లు వేసుకోనివ్వలేదు. రోడ్లు, నీటి వనరులు, బజారులు, పారిశుధ్యం పనులు సెప్టెంబరు నుంచీ ప్రారంభించారు. నాశనం చేసిన గ్రామాలలోని వాళ్ళను ఈ పనులలో నియోగించారు. దర్బారు మేళా నిమిత్తం ఎనిమిది వేల గుడారాల నగరాన్ని నిర్మించారు. (సంస్థానాధీశ్వరులను వారి గుడారాలను వారినే తెచ్చుకో మన్నారు). ఈ దర్బారుకు వివిధ ప్రాంతాల నుండి నేటివు పెద్ద మనుష్యులను, భూస్వాములను, పత్రికాధిపతులను వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వారిని కూడా ఆహ్వానించారు. రెండువారాలపాటు సాగిన ఈ ఆర్భాటపు ఉత్సావాలలో ఎనభైనాలుగు వేలమంది పాల్గొన్నారు. (వీరిలో 1,169 మంది తెల్లవాళ్లు).

భూనభోంతరాలు దద్దరిల్లేటట్టు నూటొక్క ఫిరంగుల పేల్పులు మారుమ్రోగించి 1877 జనవరి ఒకటవ తేదీనాడు విక్టోరియాను భారతదేశపు చక్రవర్తినిగా ప్రకటించారు. ఈ ఫిరంగి మోతలకు ఏనుగులూ, గుర్రాలు బెదిరిపోయాయి. ప్రేక్షకులలో కొందరు మరణించారు. చాలామంది గాయపడ్డారు. తెల్లవాళ్లు ఇంత ధనవ్యయం చేసి ఈ మహత్తరమైన తమాషాను ఢిల్లీలో చూపిస్తున్నప్పుడు దేశంలో దుర్భరమైన క్షామం ఉంది. విపరీతమైన నష్టాన్ని కలుగజేసింది. 1876-77 సంవత్సరాలలోని కాటకాన్ని 'ధాతకరువు' అంటారు. ఒక్క మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలోనే 50లక్షలమంది ప్రజలు చనిపోయారు.[10]

ఢిల్లీలో ఈ దర్బారు జరుగుతున్నప్పుడే రాజధానులలోని వివిధ కేంద్రాలలో కూడా చిన్నసైజు దర్బారులు జరిగాయి. వాట్లలో పాల్గొన్న కవులు సంస్కృతంలోనూ, ఇతర భాషలలోనూ పద్యాలు అల్లి పఠించారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమయ్యాక వివిధ జమీందారీలలో నున్న కవులు ఇటువంటి 'పద్య రత్నాలు' చెప్పడం పరిపాటి

10. Bernard S. Chon. గ్రంథంలోని చిట్టచివరి ప్రకరణం (నెం.23)లోని వివిధ పుటలలో వున్న సంగతులను ఇక్కడ అవసరమైన క్రమంలో చెప్పాను.

అయింది. పరవస్తు వెంకట రంగాచార్యులుగారు (1822-1900) 'ఆంగ్లాదిరాజ్య స్వా-గతము' అనే పేరుతో చిన్న కావ్యం రచించారు. 1887లో విక్టోరియా పరిపాలనలో యాభైఏళ్లు నిండి స్వర్ణోత్సవం చేసుకొన్నప్పుడు కందుకూరి వీరేశలింగంగారు 'విక్టోరియా జూబిలీ నవరత్నాలు' రచించి ప్రకటించారు. అందులో రెండు పద్యాలు చూడండి.[11]

శ్రీకరుఁడగు పరమేశుఁడు
ప్రాకట కరుణా ప్రపూర్ణ భావము తోడన్
జేకొని ప్రోచుత గుణ ర
త్నాకర విక్టోరియా మహారాజ్ఞి మణిన్

ఈ కుటుంబిని రాజ్యమేలుచునున్నట్టి
పంచాశదుత్త మాబ్దములలోన
భరత ఖండమునకు బహుబాధలు తొలంగి
సకల సౌఖ్యంబులు సంఘటిల్లె
ధూమ నౌకల కల్మిఁదురగ యానసమంబె
యయ్యె ద్వీపాంతర యాన మిపుడు
తంత్రీ ముఖంబున దవ్వుల వార్తలు
క్షణములో శ్రవణ యోగ్యంబులయ్యె
ధూమ శకటంబలంబున దూరదేశ
యాత్రలత్యల్పకాల సాధ్యంబులయ్యె
నహహ! పొగడంగఁదరమె? రాజాధిరాజ్ఞి
యైన విక్టోరియా రాజ్యయాత్ర మహిమ!

కేవలం పద్యాలలోనే కాక ఇతర ప్రక్రియలలో కూడా జమీందారీ యుగంలోని కవులు తమ రాజభక్తిని చాటుకొనక పోలేదు. విక్టోరియా మరణించాక 1902లో ఏడవ ఎడ్వర్డు పట్టాభిషేకం చేసుకొన్నాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పోలవరం జమీందారుగారు తమ ఆస్థానకవులయిన తిరుపతి వెంకటకవులచేత ''శ్రీమదెడ్వర్డు పట్టాభిషేకమ''నే నాటకరాజాన్ని రాయించారు. తెలుగులో మనం ఏరూపకాన్నయినా నాటకం అంటాంగాని సంస్కృత లక్షణాలను బట్టి 'నాటకం' కొన్ని నియమాల్ని పాటించాలి. తిరుపతి కవులు ఈ నాటకాన్ని సలక్షణంగా రాశారు. దీని గురించి చరిత్రకారులు ఇలా చెప్తున్నారు.[12]

''ఈ రచన కాదర్శమైనది విద్యానాథుని ప్రతాప రుద్రీయమందలి ''ప్రతాపరుద్ర కళ్యాణము'' తాను చెప్పిన నాటక లక్షణమునకు లక్ష్యముగా విద్యానాథుడు రచించిన నాటకమిది. అట్లే, తిరుపతి వేంకట కవులును దీనిని నాటక లక్షణమునకు లక్ష్యముగానే రచించి, అధస్సూచికలందు లక్ష్యలక్షణ సమన్వయము చేసియున్నారు. తెలుగున స్వతంత్ర

11. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - 2వ భాగం, 2వ ప్రకరణం, పుటలు 256-7
12. కొండా వెంకటప్పయ్య - 'స్వీయచరిత్ర', 1వ భాగం - పుటలు, 133-7

నాటకముల విషయమున నిట్టి లక్ష్య-లక్షణ సమన్వయ మపూర్వమని చెప్పక తప్పదు. ఇందులో కొన్ని కల్పనలు (విక్టోరియా మహారాజ్ఞి స్వప్న వృత్తాంతము మొ॥) ఉన్నను అవి, మొత్తము మీద, ప్రధాన కథకు భంగము లేకుండగా చేయబడినవే. ప్రధాన పాత్రములకు తప్ప తక్కిన వారికిందు తెలుగు పేర్లే వాడియున్నారు. సమకాలికేతి వృత్తమును స్వీకరించి తెలుగున నాటకీకరించిన వారిలో బహుశః వీరే ప్రథములు కావచ్చును''.

ఏడవ ఎడ్వర్డు పట్టాభిషేకం పురస్కరించుకొని ఢిల్లీలో మళ్ళా ఒక దర్బారు ఏర్పాటు చేశారు. స్వదేశ సంస్థానాధీశ్వరులను, ప్రముఖులను ఆహ్వానించారు. ఆహ్వానాలు లేని సామాన్య ప్రజలూ, జాతీయ కాంగ్రెసు సభలలో పాల్గొనేవారు కూడా అవి చూడడానికి ఢిల్లీ వెళ్ళారు. అలా ఢిల్లీ దర్బారును దర్శించాలని కొండా వెంకటప్పయ్య గారు ఉవ్విళ్లూరి వెళ్ళారు. ఆ చలి దేశంకాని దేశంలో బస దొరకక పోయినా సత్రంలో ఒక గది చూసుకొని పాలు రొట్టె కొని కడుపునింపుకొంటూ దర్బారు జరిగే ఆవరణలో ప్రేక్షకుల స్థానంలో కూడా ప్రవేశం దొరకకపోయినా ఢిల్లీ ఉత్సవాన్ని చూసి తీరాలన్న ఉబలాటంతో ఆయన తమ కోరికను కొంతవరకూ తీర్చుకొన్నారు. ఆ వైనం తమ స్వీయచరిత్రలో విపులంగా వర్ణించారు.[13]

''దర్బారు చూడకున్న మానె, ఊరేగింపు టుత్సవమైన చూతమనుకొంటిమి. దానిని చూచుటకై వీధులలో తగిన ప్రదేశములను ప్రజలు ముందుగా వెదకుకొను చుండిరి. జుమ్మా మసీదు వాకిలిమెట్లు ఒకదానిపై నొకటిగ పొడవున వరుస వరుసగ పైకి బోవుచుండుటచే పెద్ద నాటకశాలలో గాలరీవలె నుండెను. కొన్నివేల జనులు ఆ మెట్లపై కూర్చుండవచ్చును. ఆ మసీదు అధికారులు ఇదే సమయమని మెట్లకు టికెట్ల నేర్పరచి వసూలు చేయనారంభించిరి. టికెట్ల ఖరీదు క్రమమున కొన్ని వందల రూపాయల వరకు బెరిగెను. మసీదు బురుజులమీద సహితము స్థానము లేర్పరచి కొన్ని వందలరూపాయలు వసూలు చేసిరి. ఇక రాజవీధుల ప్రక్క, ఇండ్ల మేడలమీదను, డాబాల మీదను గోడల మీదనుగూడ ప్రేక్షకులు తావులేర్పరచుకొనిరి. నేను మసీదు మెట్లమీద తొమ్మిది రూపాయలకు టికెట్టు కొంటిని. ఉత్సవము మధ్యాహ్నము పండ్రెండు గంటలకు ఆగ్రాద్వారము గుండ బయలుదేరెను. అందుకు సూచనగ పెద్ద ఫిరంగుల మ్రోత వినబడెను. పిమ్మట నశ్వరాజము నెక్కిన భారతీయనాయక ప్రముఖుడొకడు పొడసూపెను. ఈతడు సర్ ప్రతాపసింగు అని కొందరు ప్రేక్షకులు చెప్పుచుండిరి. ఆయన వెంట గుఱ్ఱములపై బ్యాండు వాయిద్యము బయలుదేరెను. వారివెనుక పదాతివర్గము నడువసాగెను. ఆ పదాతుల వెన్నుదన్ని మరియొక బ్యాండు వాయిద్యమును వారి వెన్నంటి అశ్వములపై రాజకుమార దళమును నడువసాగెను. సమానవయస్కులు, సుందరగాత్రులు నగు రాకుమారులు తెల్లనిషేర్వాణీలను, లేతనీలవర్ణపు దలపాగలును, రత్నస్థగితములై మెరయుచున్న కల్కితురాయిలు ధరించి, మణులు చెక్కిన కంఠహారములతో తేజోవంతములగు ముఖారవిందములతో చూచువారల కన్నులకు ఆనందము

13. కొండా వెంకటప్పయ్య - 'స్వీయచరిత్ర', 1వ భాగం - పుటలు.133-7

గొల్పుచుండిరి. నక్షత్రములు ఆకసమునుండి దిగివచ్చి ఈ మహోత్సవమున పాల్గొనుచున్నావాయన్నట్లు ఇరువదియేడుగురు రాకుమారులు ఆ శ్రేణిలో నుండిరి. వీరెక్కిన గుఱ్ఱములును చిరుతపులి చర్మపు జీనులతో నొక్కరూపున నొప్పారు. (pony) పోనీలు. ఈ దళము వెనుక ఆఫ్గన్ పటాను యువకులు వదలుగానుండు తెల్లనిచొక్కాలు తొడిగి, తోకలు విడిచిన ఆకుపచ్చ తలగుడ్డలు పెట్టుకొని పొట్టి టింగణాలపై సాగిపోయిరి. వారివెంట పెద్దగుఱ్ఱములపై నందమగు దుస్తులు ధరించిన బ్యాండు వాయిద్యమువారు హృద్యముగ వాయించుచు వెడలిరి. పిమ్మట నొక వృద్ధగజరాజముపై బంగారు నీరుపోసిన హౌదాయందు కర్జను ప్రభువును ఆయన సతీమణియును వెడలి వచ్చిరి. సరిగపట్టెలుగల చిత్రవస్త్రములతో ఆభరణములతో నలంకరించిన ఈ గజమున కిరుప్రక్కలను వెండికఱ్ఱలు బట్టుకొని నేత్రహస్తులు నడుచుచుండిరి. ఈ ఏనుగు కాశీమహారాజుల వారిది. 1857 సంవత్సరమున విక్టోరియా రాణిగారికి భారత చక్రవర్తిత్వము సిద్ధించినపుడు ఢిల్లీలో గావించబడిన మహోత్సవమునాడు ఊరేగిన మహాగౌరవము గాంచినదిగాన దానిని మరల ఆమె కుమారుని పట్టాభిషేక కాలమున ఊరేగింపులో రాజప్రతినిధిగ తానెక్కవలెనని కర్జనుప్రభువు పట్టుపట్టి రప్పించెనట. ఆ యుత్సవమునకు ఎడ్వర్డురాజుగారి సోదరుడు కానాట్‌డ్యూకు భార్యాసమేతుడై మనదేశమునకు వచ్చెనుగాని రాజప్రతినిధియగు తానే ముందుబోవలెనని కర్జను శాసించెనట. అందువలన కానాట్ సతీమణితో గూడ గజారూఢుడై వెనుక వచ్చుచుండ కర్జను తాను ముందు నడిచెను. కానాటు వెనుక గజములనెక్కిన మహారాజులు ఏబదిమంది జంటజంటలుగ వారి వారి చోప్‌దారీలతో మెలమెల్లగ బోవసాగిరి. వారెక్కిన గజములును చిత్రాలంకృతములు గావింపబడి యుండెను. వారును వంకరతలపాగల రత్నములు పొదిగిన కలికితురాయిల నమర్చి, పట్టుచొక్కాయిలను తొడిగి మణిమయములగు కంఠహారములను, కంకణములను, భుజదండములను ధరించియుండిరి. ఆ దృశ్యము భారతదేశపు రత్నములన్నిటి నొక్కచో రాశిబోసినట్లు చూపట్టెను. కాని ఆ మహారాజులందరు విదేశ రాజ ప్రతినిధి వెంట దాసులై పోవుట భారతదేశపు బానిసత్వము గూడ ఇచట రూపెత్తినట్లే కనుపించెను. ఈ సంస్థానాధిపతులలో ముందు జంటలో నెవ్వరి నేర్పరచవలెనను ప్రశ్న వచ్చినపుడు మైసూరు, ట్రావెన్కూరు ప్రభువులను మొదటి జంటగా నిర్ణయించిరట. ఈ వార్త నైజామునకు తెలిసి తాను మొదటివరుసలోనే ఉండవలెననియు అట్లుగానిచో ఉత్సవమున పాల్గొననని‌యు పంతముబూని స్వంత రైలుమీదనే ఢిల్లీకి వచ్చి రైలుస్టేషనులో తన బండిలోనే యుండి రాజప్రతినిధితో ఉత్తరప్రత్యుత్తరములు నడిపి, తుదకు ట్రావెన్కూరు మహారాజును రెండవవరుసకు దించి, తన్ను మొదటి వరుసలో చేర్చిన పిమ్మట బండి దిగి పట్టణములో తన బసకు చేరెనని చెప్పుకొనుచుండిరి.

దర్బారు సమయమున ఈ మహారాజు లొక్కొక్కరు లేచి మధ్యపీఠాసీనుడైయున్న రాజప్రతినిధియగు-కర్జను ప్రభువు నొద్దకు జని, కానాట్ ప్రభువు పరిచయము నొంది, ఆంగ్ల ప్రభుత్వముపట్ల తమ భక్తిని ప్రకటించు ప్రమాణముసల్పుటకు నిర్ణయమయ్యెనట. అట్లు వారి స్థానముల నుండి లేచి కర్జను ప్రభువు నొద్దకు మరలివచ్చుటలో వీపులు కర్జను

ప్రభువు వైపునకు త్రిప్పకుండ వెనుకవెనుకకు నడచిపోవలెనను నియమము నవలంబింపవలసియుండెనట. మహారాజులందరును ఆ ప్రకారమే వారివారి స్థానములకు మెలమెల్లగ వెనుకవెనుకకే నడిచిరటగాని బరోడా మహారాజుగారు వీపు కర్జను ప్రభువువైపునకు త్రిప్పియే తన స్థానమునకు బోయినందుకు కర్జను ప్రభువు కోపించి మహారాజు మీద కొంత చర్య జరిపి, వారిపై నేదియో అపరాధము విధించినట్లు తెలియవచ్చినది.

ఈ మహోత్సవమున భారత జాతిపతనము నైతికముగ శోచనీయమైనను ఆ దృశ్యము అపూర్వము ననన్యమగు వైభవముతో విలసిల్లినదని చెప్పవచ్చును. ఈ ఊరేగింపు జరిగిన మరునాడు అరువది వేల సేన ఒక్కచో ప్రదర్శింపబడెనుగాని దానిని మేము చాలా దూరము నుండి మాత్రమే చూడగల్గితిమి''.

బడాబడా సంస్థానాధీశ్వరులతోపాటు వివిధ రాష్ట్రాలలోని రాజాలను, ఉద్యోగులను, శాసనసభ్యులను ప్రత్యేక పురుషులను కూడా ఈ దర్బారుకు ఆహ్వానించారు. దీనిని పెద్ద గౌరవంగా భావించి తిరిగి వచ్చాక బ్రిటిష్ ఏలికల పేర కొందరు కొన్ని ప్రజోపయోగకరమైన కార్యాలను చేశారు. తమిళనాడులో కర్ణాటక సంగీతాన్ని, తెలుగు సాహిత్యాన్ని పోషించిన యెట్టయాపురం జమీందారు రాజా జగదీశ్వర రామ వెంకటేశ్వర ఎట్టప్ప మహారాజుకు కూడా ఆహ్వానం వచ్చింది. ఈ విషయం గురించి సుబ్బరాయ దీక్షితులు గారు సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ఇలా రాశారు.[14]

''ఇండ్యా (India) చక్రవర్తి యొక్క ఏడవ ఎడ్వర్డు (Edward VII) పట్టాభిషేకమును కొనియాడవలసి డిల్లి దరుబారునకు రావలెనని గవర్నమెంటు వారివద్దనుండి ఆహ్వానపత్రిక వచ్చినది. తోడనే వెడలి 1903 సంవత్సరము జనవరి నెల 1వ తేది జరిగిన ఉత్సవమునకు మహారాజులు ఢిల్లీకి యేగియున్న సమయమందు, వారి ఆజ్ఞచొప్పున నిచ్చట ఎట్టయపుర మందును రాజవర్గస్థులు చక్రవర్తి పట్టాభిషేక దినమును గొనియాడి ఆ పట్టాభిషేక జ్ఞాపకము శాశ్వతముగా నుండు కొఱకు స్కూలును పూర్తిసేయుటకై మెట్రిక్యులేషన్ క్లాసునేర్పఱిచి అభివృద్ధి జేసిరి. స్కూలు యొక్క సౌధమునకు ముందలి పందిలి యందు గతించిన విక్టోరియా మహారాణి యొక్క పేరిమి యెల్లప్పుడును జ్ఞాపకముండుటయు (Victoria Memorial Athenaeum) అను సభ యేర్పఱుపబడియున్నది. తరువాత చక్రవర్తి యొక్క పట్టాభిషేక దరుబారుకేగి యుండిన జ్ఞాపకముండుట కొఱకు స్కూలు యొక్క పెద్దహాలునకు పట్టాభిషేకహాల్ (Coronation Hall) అని నామకరణ ముంచబడెను. దానియందు చక్రవర్తి, చక్రవర్తిని, ఇతర చక్రవర్తులు వీరి పటములనుంచి అలంకరింపబడినది. ఆ హాలందే చదువువారికి నుపయోగపడునట్లు నొక పుస్తకశాల నుంచబడియున్నది. దానికి ఎడ్వర్డ్‌హాల్ (Edward VII Alexandra Library) అని పేరు. యంత్రములు, పాఠము చెప్పి బెట్టుటకు తగిన సామగ్రులను పూర్తియైన వెనుక మహారాజుల వారి ఉత్తర్వుచొప్పున రికగ్నేషన్ (Recognition) అప్లికేషన్ జేసిన తోడనే గవర్నమెంటువారు

14. సుబ్బరాయదీక్షితులు – సంగీత సంప్రదాయప్రదర్శిని, మొదటి సంపుటం, పుటలు 40–41

సంతోషమొంది మొదటిసారి యందే పర్మనెంటు సెక్షన్‌లో జేర్చుకొని స్కూలు నొప్పుగొనిరి.''

దేశంలో ఒక పక్క రాజభక్తి ఇలా బలీయమవుతున్న కాలంలోనే బూర్జువా జాతీయవాదం కూడా అంకురింపసాగింది. ఆర్థికంగా చాలా అభివృద్ధి చెంది, ఇంకా చెందుతున్న బెంగాలు, బొంబాయి రాష్ట్రాలలో ఈ రాజకీయ చైతన్యం మొలకెత్తింది. 1870లో మహారాష్ట్రంలో 'పూనా సార్వజనక సభ' ఏర్పడింది. 1876లో కలకత్తా నగరంలో ఇండియా అసోసియేషన్ సంస్థాపన జరిగింది. బెంగాలులో సురేంద్రనాథ బెనర్జీ, మహారాష్ట్రంలో దాదాబాయి నౌరోజీ, మహదేవ గోవింద రనడే నాయకత్వం వహించి దేశంలోని నూతన పారిశ్రామిక విధానంలో హామీ ఇచ్చిన సంరక్షణలను అమలు జరపమని ప్రభుత్వాన్ని కోరారు. పన్నులు తగ్గించమని, వలస కప్పం ద్రవ్యం దుబారా చేయవద్దని కోరారు. భూస్వామ్య వర్గాలకు లాభదాయకమైన విషయాలనే అర్థించారు. 1885లో కాంగ్రెసు సంస్థాపన జరిగింది. ఇందులోని వారందరూ మితవాదులే.

1885 నుండి 1905 దాకా కాంగ్రెసు కాని, ఇతర సంఘాలు కాని దేశం నుంచి బ్రిటిష్ అధికారాన్ని తొలగించే స్వాతంత్ర్యం కోసం కృషి చేయలేదు. ఆ రోజుల్లోని వారు బ్రిటన్ భారతదేశాల మధ్య ఏర్పడిన రాజకీయ సంబంధాలు శాశ్వతంగా ఉండడమే లాభదాయకమని భావించేవారు. భగవదేచ్ఛ కూడా ఇదేనన్న అభిప్రాయం కూడా వారికుండేది. 1905 తర్వాత జాతీయ వర్గంలో పరిణమించిన వారు సైతం తమ ప్రబోధ కవిత్వంలో మొదట బ్రిటిష్ వారి పాలనను ప్రశంసించేవారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 1895లో గోదావరి మండల సభల సందర్భంలో కాకినాడలో చదివిన పద్నాలుగు పద్యాలలో తొలి పద్యాన్ని చూడండి.[15]

తుహినాద్రి మొదలు సేతువుదాక రాజ్యంబు
జరిపె నీయాంగ్లేయ దొరతనంబె
జాతి మతాచార సర్వ స్వతంత్రముల్
నెరపె నీ యాంగ్లేయ దొరతనంబె
పిండారి దండుల పీడైన లేకుండ
దోలె నీ యాంగ్లేయ దొరతనంబె
నేర్పుతో చట్టముల్ నిర్మించి క్లేశముల్
తొలచె నీ యాంగ్లేయ దొరతనంబె
ప్రజలు లోపముల్ జూప నాగ్రహము లేక
కరుణ జూపు నీయాంగ్లేయ దొరతనంబె
ఇట్టి యాంగ్లేయ దొరతనంబేలు గాక
ధర్మమతి తోడ నాచంద్ర తారకంబు

ఈ తొలి పద్యంలో ఇలా చెప్పినా చిలకమర్తి వారు మిగతా పదమూడు పద్యాలలో ప్రజల కష్టాలు, పన్నుల బాధలు, రైతుల పాట్లు గురించి రాశారు. ఈ తెలుగు

15. చిలకమర్తి స్వీయచరిత్ర-పుట.115

పద్యాలను గురజాడ అప్పారావుగారు ఇంగ్లీషులోనికి అనువదించారు. మూలాన్ని, ఆంగ్లానువాదాన్ని 'గోదావరీ డిస్ట్రిక్టు కాన్ఫరెన్సు రిపోర్టు'లో ప్రకటించారట.[16] గురజాడ అప్పారావు గారు కూడా రాజభక్తికన్నా దేశభక్తి మిన్న అని భావించిన తర్వాత కూడా ఆంగ్లేయుల పట్ల ఉదారంగా భావాలు ప్రకటించారు. 'దించులంగరు' అనే ముత్యాల సరంలో ఇలా రాశారు.

''వచ్చెనిది బంగారు కాలము
వాంఛలెల్లను తీరు సుజనుల
కాంగిలేయుల ధర్మరాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్యమిచ్చును
సంతతము వర్ధిల్లు గావుత!''

ఈ భావాలను గురజాడ 1910 తర్వాత వెలిబుచ్చడం గమనించదగ్గ సంగతి. లోగడ తిరుపతి వెంకట కవులు 'ఎడ్వర్డు పట్టాభిషేకము' నాటకాన్ని రాసినట్టే ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు అయిదవ జార్జి చక్రవర్తి పట్టాభిషేకం నాడు (22-6-1911) 'రాజ్యాభిషేకం' అని ప్రత్యేక నాటకాన్ని రచించి తమ సామాజికులతో పాటు ప్రదర్శించారు.[17]

లోగడ ఏడవ ఎడ్వర్డు పట్టాభిషేకం పురస్కరించుకొని ఢిల్లీలో జరిపిన దర్బారు చూడడానికి కొండా వెంకటప్పయ్యగారు వెళ్ళినట్లే అయిదవ జార్జి పట్టాభిషేకోత్సవాన్ని చూడడానికి అయ్యదేవర కాళేశ్వరరావుగారు వెళ్ళారు. ఆయన ఇలా రాశారు.[18]

''1911వ సంవత్సరములో నూతనముగా రాజ్యమునకు వచ్చిన పంచమ జార్జి చక్రవర్తి యొక్క పట్టాభిషేక దర్బారు ఢిల్లీలో జరిగినపుడు నేను దానికి వెళ్ళితిని. ఆ దర్బారు ముగిసిన పిమ్మట చక్రవర్తిగారు లేచి బంగాళా విభజనమును రద్దుపరచినా మనియు, బంగాళీ మాటలాడు బంగాళమును, హిందీ మాటలాడు బీహారును, అస్సామీస్ మాటలాడు అస్సామును నిర్మాణము చేయుచున్నామనియు కేంద్ర ప్రభుత్వము యొక్క రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చితిమనియు హర్షధ్వానముల మధ్య ప్రకటించిరి.''

ఢిల్లీ దర్బారులో ప్రత్యక్షంగా కొందరు పాల్గొంటే, తెలుగు జిల్లాలలోని కొందరు జమీందారులూ, వాళ్ళ కవులు స్థానిక సంబరాలు చేసుకొన్నారు.

పోలవరం జమీందారుగారి పత్రిక 'సరస్వతి' పంచరత్నాలు ప్రకటించింది. వారి ఆస్థాన కవులు తిరుపతి వెంకట కవులు ఒక శ్లోకం, దానితోపాటు ఇరవై పద్యాలను రచించి ప్రకటించారు. మచ్చుకు ఒక పద్యం చూడండి.[19]

---

16. చిలకమర్తి స్వీయచరిత్ర-పుట.121
17. పోణంకి శ్రీరామ అప్పారావు - తెలుగు నాటక వికాసము-పుట.237
18. అయ్యదేవర కాళేశ్వరరావు-'నా జీవిత కథ-నవ్యాంధ్రము', పుట-114
19. తిరుపతి వెంకటకవులు - నానారాజ సందర్శనము, పుట.172

ప్రభుభక్తి మాతృ విశ్వాసంబు పితృభక్తి
దైవ భక్తియు పూర్వధనము గాఁగఁ
బితృవైరి మాతృ విద్వేషియు రాజ దూ
షకులును ఘోరపాతకులు గాఁగఁ
బ్రభువు దేవాంశ సంభవుఁడు తల్లియుఁదండ్రి
ప్రజ కను కథలు శాస్త్రములు గాఁగ
ధర్మ విశ్వాస కృతజ్ఞతా విధుల ని
త్యం బొనరించు కృత్యములు గాఁగ
భరతఖండ నివాసులు బ్రతుకు వారు
గానవారి స్వభావంబు గరిమ మెఱిఁగి
పాలనము సేయువయ్య భూపాల మౌళి!
జార్జి రాజేంద్ర! వైభవ నిర్జితేంద్ర!

తెలుగు కవుల పద్యాలకేంగాని, ఉత్తరోత్తరా విశ్వకవిగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించుకొన్న రవీంద్రనాథ టాగోరు 1911లోనే అయిదవ జార్జి చక్రవర్తి మీద 31 చరణాల ప్రస్తుతి గీతాన్ని రచించాడు. బెంగాలు విభజనను రద్దు చేసినందుకు కృతజ్ఞతా సూచకంగా చక్రవర్తికి విధేయతను ప్రకటిస్తూ 1911 డిసెంబరు 28వ తేదీనాడు ఈ గీత రచన జరిగింది. దాని పల్లవి చూడండి.

''జనగణమన అధినాయక జయహే
భారత భాగ్య విధాతా!''

ఈ రాజభక్తి కీర్తనే కాలక్రమాన భారతదేశానికి జాతీయగీతంగా పరిణమించింది. ఇందులోని ఏడు చరణాలే ఇప్పుడు ప్రచారంలో ఉన్నాయి. ఇందులో పంజాబు, సింధు, గుజరాతు, మరాఠా, ద్రావిడ, ఉత్కళ వంగ రాష్ట్రాలకేగాని ఆంధ్రులకు నాటినుండి నేటి దాకా చోటు లేదు.

ఒక్క పద్యాలలో, నాటకాలలోనే కాక వ్యాసాలలో కూడా రాజభక్తి ప్రకటన ఆనాడు కనబడేది. 1913వ సంవత్సరంలో పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు 'సువర్ణ లేఖ' పత్రికలో సాక్షి అనే పేరుతో కొన్ని వ్యాసాలు తొలిసారిగా రాశారు. సాక్షి సంఘం ఒక ఊహా సంస్థ కావచ్చును గాని దాని ఆశయాలు ఆనాటి విద్యాధికుల ఆదర్శాలే. ఈ సంఘం గురించి ఆయన 'సాక్షి సంఘ నిర్మాణం' అనే వ్యాసంలో ఇలా రాశారు.

'నేను, మఱి నలుగురుఁగలసి యొక చిన్న సంఘముగఁ జేరినాము. మీరైదుగురుఁ జేరి యిట్టి మహాకార్యము సేయఁగలరా? యని మీరడుగుదురేమో? ఉడుతలుదధినిఁ బూడ్చినట్లు చేసెదము. తరువాత మాతో నెన్ని కోఁతులు చేరునో, యెన్ని కొండ్రముచ్చులు, నెలుగు బంట్లు కూడునో! ప్రయత్నమే మనుజుని యధీనము. ఫలము దైవాధీనము కాదా?

''మేము ప్రతి రాత్రియు నొకచోఁ జేరుదుము. ఇప్పటి వఱకు మాకు సొంత భవనము లేకుండుటచే నద్దె యింటిలోఁ జేరుదుము. మే మీ దిగువ నుదాహరించిన నిబంధనలను జేసికొంటిమి.

''1. సభ చేరఁగానే మన చక్రవర్తిగారికిఁ జక్రవర్తిని గారికి వారి కుటుంబమునకు దీర్ఘాయురారోగ్యైశ్వర్యముల నిమ్మనియుఁ, బ్రజలకు వారియెడల నిరంతర రాజభక్తిని బ్రసాదింపవలయుననియు, మా సంఘము చిరకాలము జనోపయోగ ప్రదముగా నుండునట్లు కటాక్షింపమనియు దైవమును బ్రార్థింపవలయును.

2. రాజకీయ విషయములను గూర్చి యెన్నఁడును ముచ్చటింపఁ గూడదు. వ్రాయఁగూడదు.

3. తప్పులనేగాని మనుష్యుల నిందింపఁదగదు. తప్పులను విశదీకరించుట యందుఁ బాత్రము లావశ్యకము లగునెడల నట్టివి కల్పితములై యుండవలయును''.

రచయితలు తమ ఊహాజనిత సంఘాల్లో సైతం 'రాజకీయాలు ఎన్నడూ ముచ్చటించకూడదు. రాయకూడదు.'' అని నియమాలు పెట్టుకొన్నా జాతి జీవనంలో రాజకీయాలు ఒక భాగంగా ఉన్నప్పుడు సామాన్య ప్రజలు సైతం వాటికి ప్రతిస్పందిస్తారు. అవసరమైతే పాటలు కట్టుకొంటారు. ఏటేటా జరిగే కోటప్పకొండప్రభలు ఒక రాజకీయ చైతన్య ప్రభగా మారిన ఉదంతం ఒక చక్కని ఉదాహరణ. అయ్యదేవర కాళేశ్వరరావుగారు తమ జీవిత కథలో ఈ విషయం గురించి రాసిన విషయాలు చూడండి.[20]

''1919 సంవత్సరం ఫిబ్రవరిలో నరసరావు పేట తాలూకా కోటప్పకొండ వద్ద జరిగిన శివరాత్రి యుత్సవమునకు అదివరకేటేట జరిగినటులే వేలకువేల ప్రజలు పోగైరి. వారిలో చాలామంది మంచి మంచి ఎద్దులను బాగుగా నలంకరించి ప్రభలు కట్టుకొని వచ్చిరి. అటులనే చిన్నప్పరెడ్డియను రెడ్డినాయకుడు అతని మిత్రులు మంచి ఎద్దులతో గొప్ప ప్రభలను కట్టుకొని వచ్చినారు. పోలీసు హెడ్డుకానిస్టేబులు ఇతర కానిస్టేబులులూ లా-ఆర్డరు అను పేరుతో ప్రభలు కట్టి తెచ్చినవారి మీద అనవసరముగ దౌర్జన్యము చేయుచు త్రోవలు సరిగా నుండవలెనని మనుష్యులను ఎడ్లను బెత్తములతో కొట్టసాగిరి. ఈవిధముగనే చిన్నప్పరెడ్డి మీద దౌర్జన్యము చేసి అతని ఎద్దులను కొట్టగా అవి బెదిరి స్వాధీనము తప్పే స్థితిలోకి రాసాగినవి. అందుమీద పోలీసులు తుపాకులు కాల్చి చిన్నప్పరెడ్డి ఎడ్లను చంపినారు. అపుడు చిన్నప్పరెడ్డి అతని మిత్రులు పోలీసులమీద గొప్ప తిరుగుబాటు చేసినారు. పోలీసులు ప్రజలమీద కాల్చినారు. కొందరు హతులైనారు. ప్రజలందరు చిన్నప్పరెడ్డితో చేరినారు. స్త్రీలుకూడా ఇనుపకడ్డీలతో పోలీసులమీదికి పోయినారు. పోలీసు హెడ్డు కానిస్టేబిలును, ఇంకా కొంతమంది కానిస్టేబిల్సును పట్టుకొని మంటలలో వేసి హత్యా గావించినారు. తక్కిన పోలీసువారు, మేజిస్ట్రేటు, ఉద్యోగస్తులు పారిపోయినారు. ఆ సమయములో 'వందేమాతరం' బ్రిటిషు గవర్నమెంటును

20. అయ్యదేవర కాళేశ్వరరావు 'నా జీవితకథ-నవ్యాంధ్రము' పుటలు-112-113.

పారద్రోలండి, స్వరాజ్యము కావాలి' అనే నినాదాలు నలుదిశల మారుమ్రోగినవి. అల్లర్లు ముదరగానే ఎక్కడివారక్కడ వెళ్ళిపోయినారు. చిన్నప్పరెడ్డి గొప్ప ధీరుడైనాడు. తరువాత ఆయనను, ఇంకా కొంతమందిని అరెస్టుచేసి ఉరితీసినారు. మరికొందరికి దీర్ఘశిక్షలు వేసినారు. అపుడు కెరషాస్పు సబుకలెక్టరుగ నుండెను. రాజీనామా నిచ్చి వెళ్ళిపోయినారు. కొందరు ఉద్యోగస్తులను పిరికితనము క్రింద తమపనిని సకాలములో సక్రమముగా నెరవేర్చనందుకు క్రింది ఉద్యోగములలోనికి వేసినారు. ఇది కూడా స్వరాజ్యోద్యమమునకు తోడ్పడినది. చిన్నప్పరెడ్డిని మహాధీరుడని పొగడుచు ఉద్రేకమైన కీర్తనలు కట్టబడినవి.''

తెలుగు నేలమీద ఇప్పటికీ వినబడే పాట ''సైరా చిన్నపరెడ్డి - నీ పేరే బంగారు కడ్డీ''. ఈ గేయం వెనుక ఇంత కథ ఉంది. జమీందారీ యుగంలోని ప్రజలు కట్టుకొన్న పాటల వెనుక వున్న సామాజిక కారణాల గురించి ఇప్పటిదాకా సరియైన విశ్లేషణ జరగలేదు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ ఇటువంటి సంఘటనలు రచయితలను పురిగొల్పక పోలేదు.

బెంగాలులో నీలిమందు కర్షకులు తెల్లవాళ్ళమీద తిరగబడ్డారు. ఈ పోరాటాన్ని ఆధారం చేసుకొని దీనబంధుమిత్ర అనే రచయిత 'నీల్ దర్పణ్' అనే నాటకాన్ని రచించాడు. ఇది ప్రజలను ప్రభావితులను చేసింది. 1873లో పబ్నా పితూరీని ఆధారం చేసుకొని మీర్ మష్రాఫ్ హుస్సేన్ 'జమీందారీ దర్పణ్' అనే రూపకాన్ని రచించాడు. దీనిని ప్రజా కళాకారులు ప్రదర్శించారు. బెంగాలు రైతులపై దీని ప్రభావం బాగా పడింది.[21]

రాజకీయ చైతన్యం ప్రస్ఫుటంగా ఉన్నప్పుడు అది సృజనాత్మక సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. బెంగాలులో ఇది మొదట జరిగింది. తెలుగు రచయితలు తమ జాతీయ భావాలను పరోక్షంగా పౌరాణిక, చారిత్రక గాథలలో చిత్రిస్తున్నప్పుడు బెంగాలులో వాటిని ప్రత్యక్షంగా ప్రచారం చేసిన నవలాకారుడు బంకించంద్ర చటర్జీ. ఆయన రచనలు దేశాన్ని అట్టుడిగించినట్టు ఉడికించాయి. ఆయన 'ఆనంద మఠం' జాతీయ భావాలను ప్రస్ఫుటంగా వెలువరించిన మొదటి నవల. 'తెలుగు వారి'పై కూడా ఈ నవల ప్రభావం చాలా ఉంది.

ఆనంద మఠం వెలువడిన మరు సంవత్సరమే 1907లో ఆంధ్రానువాదం వెలుగు చూసింది. దీనిని వావిళ్ళ రామస్వామి శాస్త్రులు కొందరి సహాయంతో అనువదించి ప్రకటించారు. అలా సహాయం చేసినవారు ఓ.వై. దొరస్వామయ్యగారు. ఈయన 1899లోనే 'కపాల కుండల'ను అనువదించారు. మరి మూడేళ్ళలో ఆనంద మఠానికి మూడు అనువాదాలు తెలుగులో వెలువడ్డాయి. పాఠకుల మనస్సులను ఈ నవల ఎంతగా ఆకట్టుకొన్నదంటే 1920లోగా ఈ అనువాదాలు ఎనిమిది ముద్రణలను పొందాయి.[22]

---

21. Kantonova et al.p.112
22. మొదలి నాగభూషణశర్మ - తెలుగు నవలా వికాసం.పుట.65

'ఆనంద మఠం'లోని మాతృస్తవమే ప్రఖ్యాతమైన 'వందేమాతరం' గీతం. ఇదే జాతీయ విమోచనానికి నినాదమైంది. ఉద్యమానికి ఊపిరి పోసింది. స్వాతంత్ర్య సమరంలో మూల మంత్రమైంది. వైస్రాయి కర్జన్ బెంగాల్ విభజన చేసినప్పుడు దానికి వ్యతిరేకంగా సాగిన దేశవ్యాప్తమైన ఉద్యమానికి 'వందేమాతరం' పర్యాయపదమైంది. తెలుగువారు 'వందేమాతరం'తోపాటు 'మందేరాజ్యం' అన్న మరో నినాదాన్ని కలిపి ఎలుగెత్తి ఘోషించేవారు.

1906లో జరిగిన కలకత్తా కాంగ్రెసు మహాసభలో స్వరాజ్య తీర్మానాన్ని జాతీయవాదులు గెలిపించారు. స్వరాజ్యమంటే బ్రిటిష్ ప్రభుత్వానికిగాని, చక్రవర్తికిగాని ఎలాంటి సంబంధంలేని సంపూర్ణ స్వతంత్రమే అని నిర్వచనం చేశారు. ఈ తీర్మానోద్దేశాన్ని ప్రచారం చేయడానికి 1907లో బిపిన్ చంద్రపాల్‌గారు బరంపురం నుంచి చెన్నపట్నం దాకా చాలా నగరాలలో పర్యటించి మహోద్రేకంగా ఉపన్యాసాలు చేశారు. రాజమండ్రి సభలో పాల్‌గారి ఉపన్యాసాన్ని చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు తెలుగులోనికి అనువదించారు. చిట్టచివర చిరస్థాయిగా నిలిచిపోయే పద్యాన్ని ఒకటి ఆశువుగా ఇలా చెప్పారు.

''భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుతున్నారు మూతులు బిగియకట్టి''

ఈ పద్యం దేశమంతా వ్యాపించింది. గోదావరి తీరాన చెప్పిన ఈ పద్యం కృష్ణానది వంతెన దాకా పాకి అక్కడ గోడలమీదకు ఎక్కింది. పాల్‌గారు బెజవాడ వచ్చినప్పుడు ఒక పరిణామం జరిగింది. తిరుపతి వాస్తవ్యులు ఒక శ్రీనివాసాచార్యులుగారు 'శ్రీవెంకటేశ' అనే పత్రికను నడుపుతూ ఉండేవారు. ఉద్యమ ప్రభావం వల్ల ఆ వారపత్రిక పేరును 'స్వరాజ్య' అని మార్చారు. అది ఆగిపోతున్నప్పుడు 1907లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు తమ స్నేహితులతో పాటు దానిని తీసుకొని నడపసాగారు. ఈ పత్రికలోనే హరిసర్వోత్తమరావుగారు రాసిన ఒక వ్యాసాన్ని రాజద్రోహం క్రింద బ్రిటిష్ ప్రభుత్వం అభియోగం తెచ్చి కేసు పెట్టింది. హరిసర్వోత్తమరావుగారికి కొన్ని కోర్టులలో విచారణ తతంగం జరిగాక మూడేళ్ల కఠినశిక్ష వేసి జైలుకు పంపారు. రాజకీయ ఖైదీగా ఒక తెలుగు రచయిత శ్రీ కృష్ణ జన్మస్థానానికి వెళ్ళాడు. ఆనాటి జైళ్ళలోని పరిస్థితులను చరిత్రకారులు గ్రంథస్థం చేశారు.[23]

'అపుడు రాజకీయ ఖైదీలకు ప్రత్యేక సౌకర్యాలు లేవు. తక్కిన ఖైదీల వలెనే తలకు మురికి టోపీ, కాళ్ళకు ఇనుప కడియములు తగిలించడం, మట్టలాగులు తొడగడం, గొంగట్లో పడుకోవడము, నెయ్యి, మజ్జిగ లేకుండా పప్పుపులుసుతో మట్టి చిప్పలో అన్నపు ముద్ద తినడము, మట్టి ముంతతో నీరు త్రాగడము, పిండి విసరడము మొదలైన

23. అయ్యదేవర కాళేశ్వరరావు - 'నా జీవితకథ-నవ్యాంధ్రము' పుట.109

జైలుపనులు చేయడము అంతా తక్కిన మామూలు ఖైదీలతో పాటే జరిగినది. కాకినాడ కెంపు అల్లరికేసులో శిక్షితులైన రాజకీయ ఖైదీలు కూడా నిట్టి కష్టములకే లోబర్చబడిరి. హరిసర్వోత్తమరావుగారు విడుదల అయివచ్చిన పిమ్మట ఆయన భార్యకు కొంతకాలము పిచ్చెత్తినది కూడాను''.

ఇటువంటి శిక్షలను స్వాతంత్ర్య యోధులు దేశంకోస రించారు. చిలకమర్తివారు ''ధీరులముగాని మేము ఖైదీలుగాము, గౌరవమెగాని మాకు లాఘవము లేదు'' అని ఆ దేశభక్తులు చెప్పుకొంటారని రాశారు. లాలా లజపతిరాయ్‌గారి ప్రవాసం గురించి ఈ క్రింది పద్యాలు రచించారు.[24]

''చెరశాలలల్ పృధు చంద్రశాలలెయగున్
చేదోయి గీలించు న య్యరదండల్ విరిదండలయ్యెడును
హేయంబైన చోడంబలే పరమాన్నంబగు
మోట కంబళ్లలు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరుడాత్మ దేశమును భక్తిం గొల్చు నవ్వానికిన్

''భరత ఖండంబె యొక గొప్ప బందెఖాన
అందులో నున్న ఖయిదీలు హిందుజనులు
ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని
బెట్టుటేగాక చెరయంచు నేరెగలదె''

భారతదేశంలోని రాష్ట్రాలు నిజంగా ఒక సౌధంలోని వేరువేరు గదులే. అయితే ఒకదానిలోంచి ఇంకొక దానిలోనికి ద్వారాలూ, కిటికీలు ఉంటాయి. దురదృష్టవశాత్తూ కొన్ని స్వదేశ సంస్థానాలు చీకటి కొట్లు. భారతదేశంలో నిజాం రాజ్యం ఎంత పెద్దదో అంత వెనుకబడిన ప్రాంతం. మధ్యయుగాలలోని రాజరికపు సంప్రదాయాలు అక్కడ పేరుకుపోయాయి. బ్రిటిష్ ఇండియాలో కొంతవరకైనా పత్రికా స్వాతంత్ర్యం ఉన్నట్టు కనబడుతుంది. ప్రభుత్వానికి విరుద్ధంగా రాశాక కేసులు బనాయించి కఠినశిక్షలు వేస్తారు. నిజాం రాజ్యంలో వాగ్బంధన శాసనం గట్టిగా ఉంది.

1891కి ముందు నిజాం రాజ్యంలో పత్రికలు పెట్టుకొనడానికి సర్కారు వారి అనుమతిని ముందుగా పొందనక్కరలేదు. ఆ సంవత్సరం నుంచి ఇబ్బందులు వచ్చాయి. అసలు పత్రికల సంఖ్యా పరిమితం. అందులోనూ తెలుగులో మృగ్యం. ఉర్దూ పత్రికలు కొన్ని ఉన్నాయి. 1891లో దక్కన్ టైమ్స్ అనే పత్రికను పెట్టారు. ఈ పత్రికే కాక ఇతర పత్రికలు కూడా ప్రభుత్వానికి ఒక 'ఎకరార్‌నామా'ను రాసి ఇచ్చింది. ఇందులోని షరతులను ఉల్లంఘించకూడదు. ఒకవేళ ఏ మాత్రం ఉల్లంఘన జరిగినా పోలీసుశాఖవారు పత్రికను ఆపుచేయవచ్చును.

---

24. చిలకమర్తివారి స్వీయచరిత్రము. పుట.228

ఆ 'ఎకరారునామా'లోని ఏడు షరతులను చూడండి.[25]

1. బ్రిటిష్ ప్రభుత్వమునకు వ్యతిరేకముగా ఏమియు వ్రాయరాదు.
2. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకముగా అసలే వ్రాయకూడదు.
3. బ్రిటిష్ ఇండియాలోకాని, హైద్రాబాదు నందుకాని ప్రజలలో అభిప్రాయభేదాలు, మత సంఘర్షణలు, వర్గ సంఘర్షణలకు దారితీయు వ్రాతలు వ్రాయరాదు. ఈ వ్రాతల ధోరణిని నిర్ణయించువారు పోలీసు అధికారులే.
4. ఎవరికిని భయము, బెదిరింపు విచారము కలిగించు వ్రాతలు వ్రాయకూడదు.
5. ప్రభుత్వోద్యోగులను బెదిరించు వ్రాతలు వ్రాయకూడదు. వారి నడవడిని గూర్చి వ్యాఖ్యానించు వ్రాతలు వ్రాయరాదు.
6. ఆకాశరామన్న ఉత్తరాలు ప్రకటించగూడదు. విలేకరి పేరులేని వ్రాతలు ప్రకటించకూడదు.
7. ప్రజలకు ప్రభుత్వము మీదగాని, ప్రభుత్వ ఉద్యోగుల మీదగాని చెడ్డ అభిప్రాయము కలిగించు వ్రాతలు వ్రాయగూడదు.

ఈ 'ఎకరార్‌నామా' లోని సంగతులను ఆనాటి హైద్రాబాదులోని ఉర్దూ పత్రిక ''సౌకతుల్ ఇస్లాం'' నిర్భయంగా పత్రికలో ప్రకటించి ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. (ఈ పత్రిక గొంతుకను ప్రభుత్వం నులిపి వేసిందని వేరే చెప్పక్కర్లేదు).

తెలంగాణాలో కోటిమందికి పైగా ఆంధ్రులున్నారు. వీరిలో చదువుకొన్నవారు 'నూటికి మూడింటి వరకు దిగజారెను'. కారణం ఆ రాజ్యంలో అరబ్బీ పారశీకాలదే ఉన్నతస్థానాలు. ఉర్దూ రాజభాష. అక్కడ తెలుగువారిలో రెండు వర్గాలున్నాయి. విద్యాధికులలో ఏర్పడిన ఈ రెండు విభిన్నవర్గాల గురించి దేవులపల్లి రామానుజరావు గారు ఇలా రాశారు.[26]

''సంస్కృతాంధ్రములందు పాండిత్యము కలిగి పల్లెటూళ్ళలో నివసించుచు, అధునాతన ప్రపంచమునకు దూరముగా నుండి రాజాదరణ లేక, గ్రాసవాసోదైన్యమున కృశించుచుండిన పండిత బృందము మొదటి వర్గము. కొలదియో గొప్పయో పరిచయము ఉర్దూ, పార్సీ భాషలలో కలిగి లౌకిక ప్రపంచమున వ్యవహర్తలైన ఆస్తిపరులు రెండవ వర్గము. ఆంగ్లభాషతో యీ రెండు వర్గాలకు కూడా సంబంధము అల్పమే''.

ఒక్క నిజాం రాజ్యంలోనేకాక, బ్రిటిష్ ఇండియాకు చెందిన తెలుగు జిల్లాలలో మొదటి వర్గం వారు ఉన్నారు. సంస్కృత కావ్యాల పరిచయం ప్రగాఢంగా ఉన్నా వీరు తెలుగు రాయడంలో చెయ్యి తిరిగినవారు కారు. ఉదాహరణకు దువ్వూరి వెంకటరమణ శాస్త్రిగారి చినతాతగారికి పంచ కావ్యాలలో మల్లినాథుడు ఏ శ్లోకం దగ్గర ఏ పంక్తి రాశాడో అదంత ఆయనకు గుర్తు. వాల్మీకి రామాయణంలో అయిదు వందల సర్గలలోనూ తీర్థయ వ్యాఖ్యానంలో ఎక్కడ ఏ పంక్తి ఉంది? అంటే టక్కున చెప్పేవారు. ఇంతటి సాహిత్యమున్న తమ చినతాతగారి గురించి దువ్వూరి వారు ఇలా రాశారు.[27]

---

25. దేవులపల్లి రామానుజాచార్య 'తెలంగాణాలో జాతీయోద్యమాలు' పుటలు.38-39
26. దేవులపల్లి రామానుజరావు - తెలంగాణలో జాతీయోద్యమాలు - పుట. 63
27. దువ్వూరి వెంకటరమణశాస్త్రి (1898-1978) - స్వీయచరిత్ర - పుట.46

''తాతగారికి తాటాకుల వ్రాతేగాని కాగితం మీద కలం అట్టే నడిచేది కాదు. ఎవరికేనా కార్డు రాయవలసి వస్తే సంగతులన్నీ చెప్పి వ్రాయించి సంతకం పెట్టేవారు. ''లింగయ శాస్త్రుల్లు వ్రాలు''. ఇలా ఉండేది ఆయన సంతకం. పూర్వపు సంస్కృత పండితులకు తెలుగు భాషమీద దృష్టి ఉండేది కాదు. తెలుగు మాటలో వర్ణక్రమం కూడా సరిగే వ్రాయలేని సంస్కృత పండితులు చాలామంది ఉండేవారు. ఘోరం కాకపోతే ''శాస్త్రులు'' అన్న ఒక్కమాటలో రెండు తప్పులేమిటి చెప్పండి![28]

సనాతనులలో ఇంకోరకం వారు కూడా ఉన్నారు. వీరు తెలుగు గ్రంథాలు చదవడం కూడా నిషేధిస్తారు. శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అలా గ్రంథపఠనం చేయదలచిన రోజుల్లో వారి నాన్నగారు, చిన్నన్నగారు ఒప్పుకోలేదు. కారణాలను శాస్త్రిగారు ఇలా రాశారు.[29]

''మా వాళ్ళ దృష్టిలో - తెనుగు నొక సభ్యభాష కాదు. తెనుగులో సాహిత్య కృషి చెయ్యడం అంటే అకార్య కరణం. తెనుగులో గ్రంథ రచన చెయ్యడం అంటే మరి, భ్రష్టాజే అయిపోడం. ఈ విషయమ్మై మానాయన గారికి గట్టి నమ్మకమే ఉండేది. వారికి మా చిన్నాన్నగారు తోడుపడ్డారు. వారేకాదు, వైదికవిద్యలు నేర్చిన బ్రాహ్మలెవరయినా యిదే మచ్చు, సాధారణంగా, ఇంగ్లీషుకూడా వొక భాషే వారి దృష్టిలో, తెనుగు మాత్రం కాదు. సంస్కృతమే భాష. ముఖ్యంగా అది చదివితేనే గౌరవం. సంస్కృతం అభ్యసించి వుండకపోయినా, కర్మిష్ఠులైన వైదికులు, అయినవాటికీ కాని వాటికి గూడా సంస్కృత శబ్దాలే వాడతారు తరచు. 'ఆజ్యం' అంటారు, గాని నెయ్యి అనరు వారు. పెళ్ళి అంటే నీచకం, వివాహం అనాలి. శోభనం అనరు. గర్భాదానం అనేమాట సకృతుగా వాడతారు. తరచు వారు వాడే శబ్దం పునస్సంధానం. మంచినీళ్ళు అంటే పామరత్వం. మంచితీర్థం అనాలి. వైదిక విద్యలన్నీ సంస్కృతంలో వున్నాయి కనక, అవి నేర్చుకొంటే ప్రాయికంగా సంస్కృతం నేర్చుకోవడమే అవుతుంది, కనక, వారి దృష్టిలో సంస్కృతం వొక్కటే పవిత్రమైన భాష. పవిత్రమైనది మాత్రమే కాదు, దేవతల భాషే అది. తాము భూసురులు కనక, బ్రాహ్మలదే నేర్చుకోవాలి. కనక, పండితుడంటే సంస్కృత పండితుడే పండితుడు. కవి అంటే కూడా సంస్కృతకవే కవి. ఇది వైదికుల సిద్ధాంతం.''

వైదిక విద్యల మార్గాన్ని తప్పనివారూ, సంస్కృత శాస్త్ర సాహిత్యాలనే తప్ప మరేవీ ఒప్పని వారూ, ఇంగ్లీషు చదువునే గొప్పవనుకొనేవారూ, ఉర్దూ భాషా మర్యాదలనే తమవారికి మప్పేవారూ అందరూ కలసి తెలుగులో గ్రంథ పఠనాన్ని సైతం అంగీకరించేవారు కాదు. ఈ తరహా వ్యక్తుల సంఖ్యా జనాభాలో అత్యల్పమేకానీ సమాజపు పైమెట్ల మీద ఉన్న వీరిదే అన్ని రంగాలలో పెత్తనం కనుక వీరి మాటలు సాగేవి. అయితే పుస్తకాలు చదువుకోవాలనే కోరిక ఒక దశలో బలీయం కాక తప్పదు. దీనిని

28. 'శాస్త్రులు' అనే పదంలో క్రావడికి బదులు వట్రసుడి రాయడం బహువచన ప్రత్యయం 'లు'ను ద్విత్వంగా రాయడం దువ్వూరి వారి ఉద్దేశంలో తప్పులు.

29. శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961) ''అనుభవాలు-జ్ఞాపకాలూను'', మొదటి సంపుటం, పుటలు.216-217.

వ్యాపారరీత్యా స్వలాభానికి ఉపయోగించుకొనే వాళ్లూ బయలుదేరుతారు. తమ చిన్న నాట చదువుల గురించి పింగళి లక్ష్మీకాంతం (1894-1972) ఇలా రాశారు.[30]

''ఎంతసేపూ ఇలా ఆనోటా, ఆనోటా నేర్చుకోవడం తప్ప, పుస్తకాలు చూచి చదువుకోవడం చాలా తక్కువగా వుండేది. ఇక, మాకు ఏవైనా పుస్తకాలు కావలసి వస్తే ఏ తిరణాలలోనో దొరుకుతూ వుండేవి.

''ఆరోజుల్లో బుక్కా వర్తకులు పుస్తకాలు పట్టుకొచ్చి తిరుణాళ్ళలో అమ్ముతూ వుండేవారు. శతకాలు, పాటలు, వీధినాటకాలు మొదలైన పుస్తకాలు బేడకు, బేడా అర్థణాకు అమ్ముడూ వుండేవారు. తిరుణాళ్ళలో మిఠాయిలు కొనుక్కోవడానికి మా అమ్మ, నాన్న ఇచ్చిన డబ్బులు మిగుల్చుకొని, పుస్తకాలు కొనుక్కొని తెచ్చుకొనేవాణ్ణి. నామట్టుకు నేను కూచిపూడి వారు ఆడే ప్రహ్లాద నాటకం, రామనాటకం మొదలైనవి ఆ తిరునాళ్ళలోనే కొని చదువుకొన్నాను''.

అందరూ పుస్తకాలు కొనుక్కోలేరు. అన్ని తరహాల పుస్తకాలూ అందుబాటులో ఉండాలంటే అందుకు ప్రత్యేకమైన సదుపాయాలు అవసరం. పుస్తకాలను ఎరువిచ్చే పద్ధతి కావాలి. దీనిని కొందరు గుర్తించారు. ప్రజాశ్రేయస్సు గ్రంథ పఠనం వల్ల అభివృద్ధి అవుతుందని గ్రహించిన ఈ అభ్యుదయకారులు కొందరు ఈ కృషి ప్రారంభించారు. 1901లోనే హైదరాబాదు నగరంలో కొమర్రాజు లక్ష్మణరావుగారు తమ స్నేహితులతో కలసి శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించారు. (వివరాలకు వారి గురించి ఈ సంపుటిలో ఉన్న ప్రకరణం చూడండి). తరువాత ఎన్నో చోట్ల ఎన్నో గ్రంథాలయాలు వెలిశాయి. పుస్తక ప్రచురణలు ప్రారంభించారు. 1914 నుంచి గ్రంథాలయోద్యమం మొదలయ్యింది.

ఆంధ్ర గ్రంథాలయోద్యమ భారమంతా సూరి నరసింహం, అయ్యంకి వెంకటరమణయ్యగార్లు తమమీద పెట్టుకొన్నారు. అనేక వందల గ్రంథాలయాలు, పఠన మందిరాలు స్థాపించడం జరిగింది. ప్రతిచోటా యువకులు ఉత్సాహంతో పనిచేశారు. భారతదేశం అంతటిలోనూ బరోడా గ్రంథాలయోద్యమం ప్రథమ స్థానం వహిస్తుంది. కానీ, అవి సంస్థానాధీశ్వరుల పోషణ కింద, ప్రోత్సాహం వల్లా పూర్తి ధన సహాయం పొందుతూ అభివృద్ధి చెందింది. తెలుగు జిల్లాలలో పరిస్థితిని గురించి అయ్యదేవరవారు ఇలా రాశారు.[31]

''ఆంధ్రదేశములోని గ్రంథాలయోద్యమము ప్రభుత్వము యొక్క కాని, ప్రభువుల యొక్క గాని, జమీందారుల యొక్క గాని ఎట్టి సహాయము లేకుండగనే కేవలము దేశాభిమానములును, విజ్ఞాన వ్యాపకమునందు దీక్షగల వారునునగు నాయకుల చేతను, యువజనుల చేతను నడుపబడుచు భారతదేశములో రెండవస్థానమును వహించినది''.

30. పింగళి లక్ష్మీకాంతం - నా రేడియో ప్రసంగాలు. పుట. 163
31. అయ్యదేవర కాళేశ్వరరావు - ''నా జీవితకథ - నవ్యాంధ్రము', పుట-132

చెన్న రాజధానిలోని జమీందారులకు కొదువులేదు. ఈ ప్రెసిడెన్సీలో ఇరవై రెండు జిల్లాలు ఉన్నాయి. వాటి వివరాలను ఒక కవిగారు ఇలాగ ఒక పద్యంలో 1963లో గణబద్ధం చేశాడు.[32]

కుంభకోణము కల్లికోట కర్నోలు బ
 ళ్లారి చిత్తూరు సేలంబు కడప
కబడాల బందరు కనరా మధుర తిర్న
 వల్లియు తిరిచెనాపల్లి మఱియుఁ
గోయముత్తురు మంజకుప్పంబు నాఁగ చెం
 గల్పట్టు నెల్లూ రనల్ప పటిమ
వఱలు గుంటూరు బందరును రాజమహేంద్ర
 వరమునాఁగ విశాఖ పట్టణంబు
ననఁగ శ్రీకాకుళము గంజమనఁగఁ బరఁగు!
నిరువదియు రెండు జిల్లాల కిరవు మీరు
రాజకార్యంబులకు నెల్ల రాజధాని
యాపుర ప్రాభవము భువినసదృశంబు''

పై ఇరవై రెండు జిల్లాలలో కొన్నింటిలో తెలుగు జమీందారీలు ఉండేవి. వీటిలో కొన్ని చాలా పెద్దవి. చిల్లర జమీందారీలు ఎన్నో ఉండేవి. ముఖ్యమైన బడా జమీందారుల వివరాలు చూడండి.[33]

జిల్లాలు	**జమీందారీ పేరు**	**పేష్కసు రూపాయలలో**
విశాఖపట్నం జిల్లా	విజయనగరం	4,96,580
నెల్లూరు	వెంకటగిరి	3,77,085
గోదావరి	పిఠాపురం	2,50,009
ఉత్తర ఆర్కాటు	కార్వేటి నగరం	1,80,494
	కాళహస్తి	1,76,790
గోదావరి	నిడుదవోలు	1,19,346
కృష్ణ	నూజివీడు	95,443
విశాఖపట్నం	బొబ్బిలి	89,774
గంజాం	పర్లాకిమిడి	87,825
విశాఖపట్నం	జయపురం	16,000

తెలుగు ప్రాంతాలలో ఏయే జిల్లాలలో ఎన్ని జమీందారీలు, ఎన్ని ప్రొప్రయిటరీ ఎస్టేట్లు ఉన్నదీ సవిస్తరంగా తెలుసుకొనడం ముఖ్యం.

32. మతుకుమల్లి నృసింహశాస్త్రి - చెన్నపురీ విలాసము, పుట-11

33. Manual of Administration of the Madras Presidency (M.A.M.P.), Vols.I&II, Madras, 1885

ఉత్తర ఆర్కాటు జిల్లా

1. కాళహస్తి (కొన్ని గ్రామాలు)
2. కార్వేటి నగరం
3. పుంగనూరు
4. కంగుంది
5. పులిచెర్ల
6. బంగారు
7. గుటిపాటి
8. తుంబపాలియం
9. కల్లూరు పాలియం
10. నరగంటి
11. కృష్ణాపురం

దక్షిణ ఆర్కాటు జిల్లా

1. వెంకటగిరి (కొన్ని గ్రామాలు)

బళ్ళారి జిల్లా

1. సుందూరు

(పేష్కసు కట్టనక్కరలేని స్వతంత్ర్య రాజ్యం)

గంజాం జిల్లా (ప్రాచీన జమీందారీలు)

1. సాలూరు
2. గుమ్మ
3. కళ్ళికోట
4. బోడగూడ
5. ధారకోట
6. సెరగడ
7. ప్రతాపగిరి (లేక) చిన్న కిమిడి
8. విజయనగరం (లేక) పెద్దకిమిడి
9. చీకటి
10. శూరంగి
11. జరద
12. జలంత్ర
13. బుడారసింగి
14. ముదసా
15. కట్టింగ్య (మన్యం ముఠా)
16. పర్లాకిమిడి
17. తర్ల

గోదావరి జిల్లా

(ప్రాచీన జమీందారీలు)

1. కోటిపల్లి (విజయనగరం జమీలో)
2. పిఠాపురం
3. నిడదవోలు- బహర్‌జల్లి
4. అంబరపేట
5. కొత్తాం
6. వేగయమ్మపేట
7. తంగెళ్లమూడి
8. శింగనగూడెం
9. విలస
10. జానుపల్లి
11. తెలికె చర్ల
12. గుండేపల్లి
13. పానంగిపల్లి
14. హుండేశ్వరపురం
15. శీరసవిల్లి సావరము
16. బంటుమిల్లి
17. ముక్కామల
18. భద్రాచలం-రేకపల్లి

కృష్ణాజిల్లా

1. చింతలపాటి
2. వెంటప్రగడ - నూజివీడు
3. ఉయ్యూరు
4. మీర్జాపురం
5. కపిలేశ్వరపురం
6. తేలప్రోలు
7. మేడూరు
8. దేవరకోట
9. చే వెంద్ర
10. సనుబండ
11. మైలవరం ముఠా పుల్లూరు
12. మైలవరం ముఠా, 17 గ్రామాలు
13. మైలవరం ముఠా

14. ఊటుకూరు
15. తిరువూరులో సగం
16. గంపలగూడెంలో పడమటి భాగం
17. మునగాల పరగణా
18. వల్లూరు సముతు
19. గూడూరు పరగణా
20. పినగూడూరు లంక
21. కృత్తివెంటి సముతు
22. రాయవరం
23. బల్లిపర్రు
24. కూచిపూడి
25. నరసయ్యగూడెం
26. తిరువూరు ముఠాలో సగం
27. కలగర
28. పుట్రేల
29. కొండూరు-కంబంపాడు
30. కోకిలంపాడు
31. పెంగొలను
32. మునుకుళ్ల
33. కొమిరె
34. లింగగిరి
35. దేవరపల్లి
36. చిన్నగొల్లపాలెం
37. చిట్టిగూడూరు

నెల్లూరు జిల్లా

1. వెంకటగిరి (కొన్ని గ్రామాలు)
2. ముత్యాలపాడు
3. చుండి
4. కాళహస్తి (కొన్ని గ్రామాలు)

విశాఖపట్నం జిల్లా

(ప్రాచీన జమీందారీలు)

1. విజయనగరం
2. బొబ్బిలి
3. సాలూరు
4. మాడుగుల
5. మేరంగి
6. జయపూరు
7. కురసాం
8. బెలగాం
9. సంగమ వలస
10. చెముడు
11. పాదిపెంట
12. ఆంద్ర
13. సరిపల్లి-భీమవరం
14. కాశీపురం

విశాఖపట్నం జిల్లా

(ప్రొప్రయిటరీ ఎస్టేటులు)

1. అనకాపల్లి
2. గుడిచెర్ల
3. కొరుప్రోలు
4. భరణికం
5. ముంగపాక
6. శ్రీరామపురం
7. కశింకోట
8. మేలు పాక
9. ఉరట్ల
10. కొండల అగ్రహారం
11. షేరు మహమ్మదు పురం
12. నక్కపల్లి
13. కుప్పిలి
14. శిరిపురం
15. ఉంగరాడ
16. కిండలి
17. మంథెన
18. చిడివాడ
19. జగన్నాథపురం
20. వాల్తేరు
21. పెదగుమ్ములూరు
22. ఈదులపాక బోనంగి

23. అప్పికొండ	30. తోట వలస
24. సిద్దేశ్వరం	31. పండూరు మల్లవరం
25. రావాడ	32. సాడువాడ
26. కూరాడ కొండయ్యా వలస	33. బయ్యావరం
27. మామిడివాడ	34. తంగేడు గోటివాడ
28. కర్రి వలస	35. పుళ్ళెట-మామిడిపల్లి
29. కొటిక పెంట	36. కొట్టు పరువు

తెలుగు జిల్లాలలో ఇంతమంది చిన్నా పెద్దా జమీందారులున్నట్టే చెన్న రాజధానిలోని ఇతర ప్రాంతాలలో, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో జమీందారులు ఉండేవారు. వీళ్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన పేష్కసును సక్రమంగా కడుతున్నంత కాలం వీళ్ళ హోదాలకు ఏవిధమైన ఢోకా ఉండేదికాదు. బకాయిపడి బాకీలు పేరుకుపోతే పూర్వం ఆ జమీని సివిలు జప్తు చేసి వేలం వేసి ఎక్కువ మొత్తం పాడిన వాళ్ళకి ఇచ్చేసేవారు. సీమ రాణి ప్రత్యక్ష పాలన ప్రారంభమయ్యాక బకాయిపడ్డ జమీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ఆ జమీందారు ఖర్చులకు కొంత పైకమిచ్చి, ఊరికే కూర్చోపెట్టి, సమర్థులైన ఉద్యోగుల ద్వారా శిస్తులు వసూలు చేయించి వ్యవహారాలు పొక్తుపరచి తమ బాకీలు చెల్లుబెట్టించుకొని, ఖజానాలో నిలువ సొమ్మును జమచేసి జమీని మళ్ళా హక్కుదారునికి అప్పచెప్పేవారు.

కొందరు జమీందారులు తమకు ఒకరి కన్నా ఎక్కువ సంఖ్యలో కుమారులుంటే తమ జీవితకాలంలోనే సంస్థానాన్ని ఆ పుత్రుల మధ్య పంపకం చేసేవారు. వారు తమ తమ వంతుకు వచ్చిన భాగాలను ఏలుకొనేవారు. కొందరు మాత్రం పాలక జనకుడు మరణించాక పూర్తి జమీ తమకే రావాలని దావాలు వేసేవారు. ఎన్ని కోర్టులలో పోరాడాలో అన్ని కోర్టులకు ఎక్కి చివరకు సీమలోని ప్రీవీ కౌన్సిల్‌దాకా వెళ్ళేవారు. ఆ కట్ట కడపటి న్యాయస్థానం తీర్పుకు ఇంక తిరుగులేదు. ఇది ఏళ్ళూ పూళ్ళూ గడిచాక లభించేది. ఈలోగా ఇరుపక్షాలు వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు.

కొంతమంది జమీందారులు వారసులు మైనర్లుగా ఉన్నప్పుడు మరణిస్తే ఆ జమీ కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారి అజమాయిషీలోనికి వెళ్ళేది. మైనర్లను చెన్నపట్నంలోని న్యూయింగ్‌టన్ కళాశాలలో పాశ్చాత్య బోధకుల పర్యవేక్షణలో చదివించేవారు. (కొందరు సుప్రసిద్ధ సాహిత్యవేత్తలు ఈ కళాశాలలో అధ్యాపకులుగా కూడ పనిచేశారు. ఉదాహరణకు తాపీ ధర్మారావుగారు. ఈయన 'ఉర్లాం, చుండి, దక్షిణ వల్లూరు, మందస, టెక్కలి మొదలైన జమీందారీ పిల్లలకు ట్యూటరుగా కూడా పదేళ్ళు పనిచేశారు. గిడుగు రామమూర్తిగారు విజయనగరం కోటలో కొన్నాళ్ళు రాచబిడ్డలకు ట్యూటరుగా పనిచేశారు).

కొంతమంది మహిళలలు తమ భర్తల రాజ్యం తరువాత వారే స్వయంగా పాలించారు. అటువంటి సందర్భాలు చాలా ఎక్కువగా కనబడతాయి. తూమాటి దొణప్పగారు ఈ విషయం గురించి చాలా విపులంగా రాశారు.[34]

''ఈ యుగము నందలి చివరి భాగము నందు ఆంధ్ర సంస్థానములను పాలించిన వారిలో చాలామంది స్త్రీలుండుట గమనింపదగిన యంశము. వీరందఱును ఇంచుమించుగా నొక కాలమునకు చెందిన వారగుటయేకాక కవి పండిత పోషణము నందు, సాహితీ సముద్ధరణము నందు విశేషాదరమును బ్రదర్శించుట యాదృచ్ఛిక సంఘటనమయినను వింతలలో వింతగా గోచరింపక పోదు. అనకాపల్లి జమీందారిణి మహారాణి గొడే చిట్టి జానకయ్యమ్మా గజపతిరావు, ఆత్మకూరు సంస్థాన ప్రభ్విణి సవైరాణి భాగ్యలక్ష్మమ్మదేవి, ఉర్లాము సంస్థానాధీశ్వరి శ్రీ కందుకూరు మహాలక్ష్మమ్మ, కోలంక-వీరవరము జమీందారిణి రావు రామాయమ్మా రావు, గద్వాల మహారాణి, ఆదిలక్ష్మి దేవమ్మ, గూటాల జమీందారిణి మన్యం మహాలక్ష్మమ్మ, గొల్లప్రోలు జమీందారిణి రావు రామయమ్మారావు, తుని మహారాణి వత్సవాయ వెంకట సుభద్రయ్యమ్మా జగపతిరావు, పాపన్నపేట సంస్థానాధీశ్వరి రాణీ వెంకట లక్ష్మాయమ్మ సర్దేశాయి, మునగాల జమీందారిణి రాణీ లచ్చమ్మారావు, వనపర్తి సంస్థానాధీశ్వరి రాణీ సరళాదేవి మున్నగువారు తమ పూర్వులు పోయిన త్రోవలో విద్వత్పోషణము గావించిన సాధ్వీమణులు. సరియైన ఆశ్రయము లేని కవి పండితాదుల నాదరించి తన్మూలమున నుభయులును అమరులయిరి''.

సర్వసాధారణంగా పురుషాధిక్యత ప్రబలిన సమాజంలో ఆడపెత్తనం హర్షించడం జరగదు. కానీ, వీరేశలింగంగారు చెప్పినట్టు ''నిజముగా పురుషులు రాజ్యము చేయునప్పటి కంటే స్త్రీల రాజ్య పరిపాలనములోనే ప్రజాస్వామ్యమధికముగా నున్నదని లోకానుభవము సహస్ర ముఖముల ఘోషించుచున్నది - స్త్రీలను సగౌరవముగా జూచెడి యన్యదేశుల మాట యటుండగా స్త్రీలను చిన్న చూపు జూచెడి యీ దేశముయందు సాహిత్యము స్త్రీలు రాజ్యపాలనము చేయదటస్థించిన భాగ్యము పట్టినప్పుడు దేశమధిక సుభిక్షముగా నుండుచు వచ్చెననియు బ్రజలధిక సుఖవంతులై యుండవచ్చుననియు జరిత్రములు మొరపెట్టుచున్నవి.[35]

కొన్ని ప్రత్యేక సందర్భాలలో స్త్రీలు రాజ్యపాలన చేసినా, మాతృస్వామ్య వ్యవస్థ తుడిచిపెట్టుకు పోయిన మన సంఘాలలో వారసత్వం తల్లినుంచి కూతురులకు సంక్రమించదు. ఆస్తిని ఏ మగమహారాజుకో అప్పచెప్పాలి. కొందరు తమ అల్లుళ్ళకు పిల్లతోపాటు రాజ్యాన్ని ఇచ్చారు. కొందరు అపుత్రకులు దత్తులను స్వీకరించారు. పూర్వం కుంఫిణీ వారు కొన్ని దత్తతలు చెల్లవని ఆ జమీలను రాజ్యంలో కలుపుకొనేవారు. తరువాత అడుగడుగునా జోక్యం కలిగించుకొంటున్నా దత్తతకు ప్రభుత్వం వారు

34. తూమాటి దొణప్ప - 'ఆంధ్రసంస్థానములు-సాహిత్య పోషణము' పుటలు 15,16

35. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి - 6వ సంపుటం, శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారి చరిత్రము - పుటలు 1,2

అడ్డుచెప్పడం లేదు. జ్ఞాతులే ఆ పని చేయసాగారు. కొన్ని దత్తతలు చెల్లవని కోర్టులకు ఎక్కేవారు. సుదీర్ఘమైన వివాదాల తర్వాత న్యాయస్థానాలు తీర్పు చెప్పేవి. దత్తులు ఆ తర్వాతనే పట్టాభిషేకాలు చేసుకొనేవారు.

జమీందారీ వ్యవస్థలోనేకాక ఆస్తిహక్కుల ప్రసక్తిగల సంఘంలో అపుత్రకులు దత్తత చేసుకొనడం ఒక అవసరం. మానవ సహజమైన వాత్సల్య ప్రకటనకు ఇది జరూరు. మరణించిన తర్వాత తమ దత్తులు తమకు ఉత్తమగతులు కల్పించే తద్దినాలు మొదలైన వేదోక్తకర్మలు చేస్తారన్న నమ్మకం కూడా ఒక కారణం. కొందరు దత్తులు ఉత్తమ సంస్కారం సంతరించుకొన్నా, తేరగా ఆస్తులు వచ్చిన ఎందరో చెడిపోయే అవకాశాలు ఎక్కువ అయినాయి. కడుపున పుట్టినవాడు యోగ్యుడైనా, అయోగ్యుడైనా కన్నవారు భరించక తప్పదు. దత్తు వచ్చినవాడు ఎలాగో, ఎవరి లోపం వల్లనో చెడవచ్చు. వివాదాలు రావచ్చు. ఇవి ప్లీడర్లకు లాభిస్తాయేతప్ప మరేంకాదు. దత్తుణ్ణి స్వీకరించే ముందర ఒక కుటుంబంలోని ఆలుమగలు ఎంత తర్కించుకొన్నది వివరిస్తూ తిరుపతి వెంకటకవులు ఇలా వ్రాశారు.

''ఎందఱు జమీను దారులు హీనులైరి
యెందఱగ్రహారస్థులు కుందువొంది
రెందఱు ధనాఢ్యులియ్యెడ నింపు చెడిరి
గానద త్తుని గొనుట దుఃఖంపుఁ దెరువు

కులవిభ్రంశకు లెందు, ముండల ముటాకోరుల్, స్వకర్మస్థితుల్
దెలియన్ జాలని మాఱుబాస మొఱకుల్, దీపించుచున్నారు పు
త్రులు కాలస్థితిఁ బట్టి, యిట్టి వెడఁ గుందోకమ్ముతో నేమి? వీ
రలు సేవల్ పొనరింతురో! మఱిగయా శ్రాద్ధమ్ములన్ జేతురో''

(పాణిగృహీత- 1-85,86)

ఏది ఏమైనా ఆస్తిహక్కులు కుటుంబంలోనే దక్కాలంటే దత్తత అనివార్యం. జమీందారీ వ్యవస్థ అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఈ పద్ధతిని నిస్సంతు వంశాలు అవలంభించిన జ్ఞాతులు కోర్టుల కెక్కక తప్పలేదు. కింది కోర్టుల తర్వాత కేసులు రాజధానిలోని హైకోర్టులకు వెళ్ళేవి. చెన్నపట్నంలోని లాయర్లకు చేతినిండా పని. జమీందారులు సపరివారంగా మద్రాసులో కొన్నాళ్లు మకాం పెట్టేవారు. మందీమార్బలం, పటాటోపం, నానులూ, మానులూ, ఆస్థానకవులు ఈ ప్రభువులతో పాటు చెన్నపురికి వెళ్ళేవారు, కొందరు జమీందారులకు ఆ నగరంలో పెద్ద స్వంత బంగళాలు ఉండేవి. లావాదేవీలు, పేచీలు, దావాల నిమిత్తమేకాక రాజధానిలో ఉన్న దొరలను కలుసుకొనడానికి, వారి చేతులలోంచి బిరుదులు పుచ్చుకోడానికీ, హుకుములు అందుకోడానికి కూడా జమీందారులు మద్రాసుకు వచ్చేవారు. వల్లూరు జమీందారు బొమ్మదేవర నాగన్న ఒకసారి అలా రాజ్యం పుచ్చుకోడానికి వచ్చినపుడు అతని వెంట ఆస్థాన కవి మతుకుపల్లి నరసింహశాస్త్రి కూడా వచ్చాడు. 'చెన్నపురి విలాసం' అనే పద్యకావ్యాన్ని చెప్పాడు. అందులో బిరుదు పుచ్చుకొనడాన్ని ఇలా వర్ణించాడు.

''ఘనతఁ గమిస్సెరీ దొరల గౌర్నరుగార్లను సెక్రిటేరులన్
గనగఁగమిస్సెరీజెనలు గారు శిఫారసు సేయమెచ్చినె
మ్మనమున కూర్మినాన్నృపతి మౌళికి గౌర్నమెంటువారు భూ
జనులలరారఁ గా హుకు మొసంగిరి క్రమ్మఱ రాజ్యమియ్యగన్''

(చెన్నపురీ విలాసం - కృతినాయక ప్రకరణం-15)

రాజధానిలో కచేరీలు చాలా ఉంటాయి. ప్రతికార్యాలయంలోనూ జమీందార్లకూ, ఇతరలకూ పనులు ఉంటాయి. కవి కొన్ని ధఫ్తర్లను ఇలా వర్ణించాడు.

''పెనుపొందున్నగరంబు తూర్పునను సుప్రీమ్‌కోర్టునాఁజిన్నికో
ర్టును సీకష్టమునాఁగమిస్సరియునా రూపింప నాఫీసులీ
జనలోకంబున సర్వధర్మములు సంస్థాపిం పనేతెంచిని
ల్పిన పాకారి యమాంబునాథ ధనరాళ్లీలాసభా వైఖరిన్''

(చెన్న-సభాప్రకరణము-2)

ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన పాలకుడు గవర్నరు. అతని కొలువును కవి యిలా వర్ణించాడు.

''వినుత పరార్థ్య వేషులగు వేల కొలంది దొరల్సమున్నతా
సనముల నిల్వ నీలపట సంవృత్తి మత్పల కాళిముందునూ
ల్కొన లిఖియించురైటరులు గొల్వఁగ 'గౌర్నరు గొల్వుసేయునా
ఘనసభ సొంపుగానవలెఁ గాని వచింపవశంబె యేరికిన్

(చెన్న-దుర్గప్రకరణము-6)

గవర్నమెంటు వారి పరిపాలన సొంపును చూడ్డానికే కాక ఇతర కార్యాలమీద కూడా దొరలను కలుసుకొనడానికి ''నానా దేశ భూపాల సంహతి ''సారట్ల''మీద ప్రయాణం చేస్తూ నగరంలో తిరిగేవారు. నల్లవాళ్ల పేటలు ఉత్తరాన ఉంటే తెల్లవాళ్ల బంగళాలు పడమటి దిక్కునా, దక్షిణాన ఉండేవి. కవి వాటిని ఇలా వర్ణించాడు.

'పురికిం దక్షిణ పశ్చిమంబుల వనాభోగంబులం జూడ గౌ
ర్నరులం గర్నలు సెక్రిటేరులు కమాన్డర్లింక జడ్జీల్కల
క్టరులుం బాదరులుం గమీష్నరులు మేస్టర్లింజినీర్లాదిగా
దొరలుండందగుబంగళాలు చెలువొందున్నాఱువేలుందగన్''

(చెన్న-ఉపవన ప్రకరణము-4)

జమీందారులూ, ధనికులూ చెన్నపట్టణానికి కార్యార్థులై వచ్చినా, తీరుబాటు పుష్కలంగా వుంటే ఆరోజుల్లో భోగలాలసతతో తమ సరదాలు ఊరివెలుపల తోటల్లో ఉండే బంగళాలలో తీర్చుకొనేవారు.

'పురివెలిపేటలం దునుపఁ బొల్పగునారికెడంపుతోటలం
దిరవగు బంగళాల కొకరిద్దఱు ముప్వురు లంజయాండ్రతో

వరశకటాప్తి నేగి ధనవంతులు నాగరు లెల్ల రాత్రులం
బరగ సుఖింతురెప్డు మదపానరతోత్సవ విభ్రమోన్నతిన్'

(చెన్న-ఉపవన ప్రకరణం-3)

పందొమ్మిదో శతాబ్దంలోని చెన్నపట్నంలో వేశ్యలకు కరువు లేదు. ఓడకాల్ వీధిలో ''మనోజ్ఞనాట్య భరతాచార్యస్తుత శ్రీ''లైన స్త్రీలు ఉండేవారు. వీళ్లు తమ వాకిళ్ళలో నిలిచి ఆకర్షించేవారు. చెన్నపురీ విలాసంలో ఈ వారకాంతల మేజువాణీలను కవి యిలా వర్ణించాడు.

'కలగానామృత వృష్టిఁగంబములు శాఖా పత్రపుష్పచ్ఛటా
కలన న్మించఁగ లాస్యవిభ్రమ కలాకల్పంబులన్నభ్యులు
జ్వలచిత్రాకృతిఁ బూనఁ జేయుదురుదుం చల్లీల నవ్విట వే
శ్యలు నానాసభలన్మనోభవుని మాయామంత్రశక్తుల్బలెన్'

(చెన్న-వేశ్యాప్రకరణము-4)

జమీందారీ వ్యవస్థలో సానిపాపలు పురుషుల విలాసాలకు తప్పని సరిభోగ చిహ్నాలు. అంతఃపురాలలో ఆడపాపలు అన్ని విధాల ఊడిగాలకు విధిగా ఉండాలి. ఈ ఆడపాపలు బానిసలకన్నా హీనస్థితిలో ఉండేవారు. వీరికి పెళ్ళీ పెటాకులూ ఉండవు. వావివరసులు పట్టింపు లేకుండా హోదాలో ఉన్న ఏ మగవాడైనా వీళ్లను అనుభవించవచ్చు. అందుకు అభ్యంతరం చెప్పకూడదు. ప్యూడలు వ్యవస్థలో స్త్రీల అసహాయస్థితిలో అధమస్థాయికి ఇది నిదర్శనం. ఆడపాపల విధానం జమీందారీల దివాణాలకే పరిమితం కాని వేశ్యా సమస్య సమాజంలోని ఉన్నత మధ్య తరగతి ప్రజలలో ఆర్థికంగానూ, సామాజికంగానూ శోచనీయమైన పరిణామాలకు దారితీసింది. అందుకే పందొమ్మిదో శతాబ్దం చివరి రోజులలో 'యాంటినాచ్చి' ఉద్యమం అవసరమైంది. దేవదాసీ చట్టం తీసుకురావలసి వచ్చింది.

దేవుడి పేరుమీద సమాజంలోని పాలక వర్గాలు బాగుపడడం అన్ని దేశాలలోనూ సహజమే. మన దేశంలో కొంతమంది స్త్రీలను దేవుడికిచ్చి పెళ్ళిచేసి వాళ్ళను వాడవదినలుగా మార్చడం అనాదినుంచీ వస్తున్నదే. ఆయా యుగాలలో పరిపాలనా వ్యవస్థ ఎలా ఉందో ఆ రీతిగానే దేవతల విషయాలలో పదవులు, అధికారాలు మానవులు ఊహించారు. ప్రతిఏడాదీ పంచాంగం ప్రకారం గ్రహాలలో ఒకరాజు, ఒక మంత్రి, ఒక సైన్యాధిపతి వగైరా పదవులు కూడా నిర్ణయిస్తారు. కుంఫిణీ యుగం నుంచి మన దేశ పాలనలో మార్పులు వచ్చాయి. జమీందారీ యుగంలో సరేసరి. ఈ మార్పుకు అనుగుణంగా కవులు మన దేవతల విషయంలో 'సంస్కరణలు' తెచ్చారు. తిరుపతి వెంకటకవులు ఒక కావ్యం అవతారికలో ఇలా రాశారు.

'నలినాక్ష ప్రభృతుల్త్రి మూర్తులు 'గవర్నర్లై' సురల్క్రింద వ
ర్తిలు నుద్యోగిజనంబులై, ఘనమణి ద్వీపంబును 'న్లండనై'

యలరం దానొకరాణియై జగములే యంబామహాదేవి ని
చ్చలుఁబాలించుఁగృపాబ్ధి యాజనని కృష్ణారావు మన్నించుతన్''

(బుద్ధ చరిత్రము-1-8)

పాలకులకూ దైవాంశలు ఆపాదించి వారు చేసే ప్రతి చర్యనూ హర్షించడం, ప్రస్తుతించడం, వారు వేసే పన్నులు కట్టడం, పెట్టే బాధలను తట్టుకోవడం ఫ్యూడలు వ్యవస్థ మనుగడకు అవసరం. అయితే పాలించే హక్కులను పరలోకంలోని దేవతలుకాక నరలోకంలోని న్యాయాధిపతులే నిర్ణయిస్తారు. తెలుగు జిల్లాలలోని జమీందారుల లావాదేవీలు చెన్న రాజధానిలోనే చివరకు తేలేది. ఇక్కడ కోర్టులలో సుదీర్ఘమైన దావాలు సాగుతున్నప్పుడు జమీందారుల తరపు దక్షత గల మేధావులు పనిచేయవలసి వస్తుంది. అలాగా జమీందారీ సేవలో తమ అమూల్యమైన కాలాన్ని కొందరు ప్రఖ్యాత సాహితీపరులు వెచ్చించవలసి వచ్చింది. విజయనగరం వారి పెద్ద దావాలో గురజాడ అప్పారావుగారూ, మునగాల వారి పెద్ద దావాలో కొమర్రాజు లక్ష్మణరావుగారూ తలమునకలయ్యారు.

పెద్ద జమీందార్లకు చెన్నపట్నంలో రాజప్రాసాదలవంటి 'స్వంత బంగళాలు ఉండేవి. విజయనగరం వారికి మందవల్లిలో 'అడ్మిరాలిటీ హౌసు' మునగాలవారికి ఎగ్మూరులో 'వేదవిలాస్, పిఠాపురం వారికి అడయారు సమీపంలో 'గులాబీ' మొదలైన నివాస గృహాలు ఉండేవి. ఇక ఇతర జమీందార్ల బంగళాలకు లెక్కేలేదు. వీళ్ళంతా తమ స్వంత ఊళ్ళలో ఎంత వైభవంగా బతికేవారో అంతకు రెట్టింపు దర్జాతో చెన్న రాజధానిలోనూ, నీలగిరి కొండల మీదా జీవించేవారు. ఈ విలాసాలకూ, వైభోగాలకూ ద్రవ్యం కావాలి. అది ప్రజల మీద పన్నుల రూపంలో రాబట్టేవారు. రైతులపై పడే భారాన్ని ముక్కామల నాగభూషణంగారు ఇలా రికార్డు చేశారు.[36]

''పండినా ఎండినా పంటభూములకే గాక పచ్చిక బీళ్ళకు, పెరటి తోటలకు కూడా రైతులు రొక్కం రూపంలో శిస్తులు చెల్లించవలసి వచ్చింది. ఈ శిస్తులకు తోడు చెట్ల పన్ను, చేపలపన్ను, దేవతల రుసుం, బాజాభజంత్రీల ఖర్చు, వేషగాళ్ళ ఆటగాళ్ళ ఖర్చు, అధికారుల రుసుం, ఉద్యోగుల ఖర్చు, జలాధారాల మరమ్మతు లాంటివన్నీ రైతులే భరించవలసి వుండేది. రోడ్డు సెస్సులాంటి సెస్సులను మోతర్బా పన్నును ప్రభుత్వానికి చెల్లించక తప్పేదికాదు.

''శిస్తులు వసూలు చేసుకునేందుకు తగినంత అధికారం తమకు లేనందున, అనేకమంది రైతులు శిస్తులు చెల్లించకుండా తిరగబడుతున్నారని జమీందార్లు గోల చేశారు. కనుక 1865లో మద్రాస్ ప్రభుత్వం రెంటు రికవరీ చట్టం చేసింది. అందువల్ల పంట పొలాలను వేలం వేయించేందుకు జమీందార్లకు అవకాశం కలిగింది. కాబట్టి సమ్మరీ దావాల ద్వారా రైతులను చెండుకు తినేందుకు జమీందార్లు పూనుకున్నారు. కనుక

36. ముక్కామల నాగభూషణం 'ఆంధ్రలో జమీందారీ పద్ధతి ప్రారంభం రద్దు', కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి 50వ వర్ధంతి సంస్మరణ సంచిక, పుట-42.

అనేకచోట్ల రైతులు తిరగబడ్డారు. గిరిజన పోరాటాలు జరిగాయి. అమ్మవారి రుసుం, బాజా భజంత్రీల ఖర్చు వగైరాలను రైతుల మీద రుద్దడం అక్రమమని 1870లో చల్లపల్లి ఎస్టేటులోని రైతు పెద్దలు జమీందారుమీద దావా వేసి గెలిచారు. అందువల్ల మద్రాసు ప్రభుత్వం 1882లో రైతులకు జమీందారులకుగల హక్కులను స్పష్టంగా వివరిస్తూ ఒక జీవో జారీ చేసింది.''

''అయినా జమీందార్ల ఆశ తగ్గలేదు. కూరగాయల మడులు, తోటలు మున్నగు వాటిమీద విపరీతంగా పన్నులు వేశారు. జలాధారంగల భూములమీద శిస్తులు పెంచారు. అందువల్ల రైతుల ఆందోళన చెలరేగింది''.

ఈ పన్నుల బాధ గురించి జాతీయ కవి చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు ఇలా పద్యాలు చెప్పారు.[37]

''నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరకులమ్ముదమన్నఁ సంతపన్ను
కఱ్ఱలమ్ముదమన్నఁ గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ముకొన్నచో స్టాంపు పన్ను-
ఉన్నమట్టుకు తినకుండ నుప్పుపన్ను
ననెడు పన్నులె దిగదీసె జనులనెల్ల
కటకటా! యెట్టులున్నదో కాపులదశ
సుగుణ ధనులార జనులార చూడరయ్యా

అధికార భూతంబు లడుగు లంచములిచ్చి
పరిపరి విధములౌ పన్నులిచ్చి
మునసబు కరణాల ముడుపులన్నియునిచ్చి
కోసినూర్చినవారి కూలినిచ్చి
కచ్చేరి బంట్రోతు గముల కీనామిచ్చి
పాలేళ్ళకును గొంత పంటనిచ్చి
యజమానునకు బంట నర్ధభాగం బిచ్చి
పైకమిచ్చినవాని వడ్డినిచ్చి
గడ్డి మాత్రమె మిగలించు గాపువాడు
సేద్యమున దాను పశుల భక్షించు కొరకు
కటకటా! యెట్టులున్నదో గాపుల దశ
సుగుణధనులార జనులార చూడరయ్యా''

37. చిలకమర్తి లక్ష్మీనరసింహం - స్వీయచరిత్రము - పుట. 118

పశువుల కోసం గడ్డినైనా దక్కనివ్వని స్థితి వచ్చాక జమీందారుల దోపిడీ విధానాన్ని ఎదుర్కొనడానికి రైతులు సంఘటితం కాజొచ్చారు.

''జమీందార్లకు ఎదురుతిరగలేని ఎస్టేట్లలో రైతులమీద శిస్తుల భారం బాగా పెరిగింది. అమాయక రైతుల చేత ముచ్చెల మీద వేలిముద్రలు వేయించుకోగలిగిన మొఖాసాదార్లకు జమీందార్లకు హద్దూ అదుపు లేకుండా పోయింది. వెంకటగిరి, బొబ్బిలి, పర్లాకిమిడి, మందసా వగైరా ఎస్టేట్లలో రైతుల పరిస్థితి మునగానాం తేలానాంగా తయారైంది. అందువల్ల వారు కూడా కొన్ని పోరాటాలు సాగించారు. ఆ దశలో మద్రాసు రాష్ట్రమంతటా వందేమాతరం నినాదం, స్వదేశీ ఉద్యమం విస్తరించాయి. కాగా ప్రభుత్వం రైతులను సంతృప్తి పరిచేందుకు కొన్ని జి.వోలను జారీ చేసింది. కాని, వాటి వల్ల లాభం లేనందున 1908లో ''ఎస్టేటు ల్యాండు ఆక్టు''ను పాస్ చేసింది.

వకాల్తా పుచ్చుకొనేవారు. తెలుగు లాయర్లకు ఆ చట్టం సరిగా అర్థమయ్యేదికాదు. ఇక రైతుల కెలా తెలుస్తుంది? కాబట్టి జమీందార్లు, రైతుల జాయింటు పట్టాలను విడదీయకుండా శిస్తు బకాయీలను సృష్టించేవారు. వాటి వసూలు కొరకు జాయింటు పట్టాలోని ఒక రైతుకు నోటీసు యిచ్చి, మరొక రైతు మీద దావా వేసి, వేరొక రైతు పొలాన్ని గుట్టుచప్పుడు కాకుండా వేలం వేయించేవారు. అలా వేలం వేసిన పొలాన్ని తమ వారితో పాడించి చల్లగా తమ కమతంలో కలుపుకునేవారు.

''అడవి పుల్లరిని పెంచి వసూలు చేయడం వెట్టి చాకిరి చేయించుకోవడం, శిస్తులు చెల్లించినా రశీదు నివ్వకపోవడం లాంటి దుష్టచర్యలు జరుగుతుండేవి. విజయనగరం, వుయ్యూరులాంటి కొన్ని ఎస్టేట్లలో మాత్రమే అలా జరిగేది కాదు.[38]

ఈ ఎస్టేట్ ల్యాండు ఆక్టు జమీందారీ వర్గాలలో సంక్షోభాన్ని కలిగించింది. వారి ఆస్థానాలలో ఉండే కవులు కలవరం చెందారు. పానుగంటి లక్ష్మి నరసింహారావుగారు పిఠాపురం వారి పోషణలో ఉన్న కవి, రచయిత. ఆయన సాక్షి వ్యాసాలలో ఒక చోట ఊరేగింపులో వెళుతున్న పార్థసారథి స్వామి వారిని ప్రశ్నిస్తూ ఇలా అడిగారు.[39]

''తండ్రీ నీవెందులకు బయలుదేఱితివి? రవంత చెప్పవు? ఒకవేళ యిందు కొఱకై యుండునా? కోడిపందెములని సానిమేళములని యాస్థానవ్యవహారములను స్వయముగఁ జూచుకొనక యన్ని విధములైన యాగడము లాచరించుచున్న కొందఱు జమీందారులకు సంవత్సరమున కొక్కదినమందైనా మీ యెస్టేటు గ్రామములు చూచుకొనుఁడని బోధించుటకిట్లు బయలుదేఱితివా? ఏమో? అందుకొఱకేమో కాని యీ యూహము కూడా సరికానట్లు కనఁబడుచున్నది. ఇందులో నొక్క ప్రత్యవాయమున్నట్లున్నది. సర్వజ్ఞుఁడవు. నీకు దెలియనిదేమున్నది. Estate Land Act మూలమున జమీందారుల కన్నియధికారములు గూడ సంతరించిన వని నీవెఱుగవా నాయనా! జమీందారుల కింక జమాబంది యెందులకు? జమీందారులకు జమీందారీయే లేనప్పుడింకను జమాబంది యేమిటి నాతండ్రీ! Estate Act ప్రకారము నిజమైన జమీందారుడెవరు? రైతేకదా! ఇది

38. ముక్కామల నాగభూషణంగారి వ్యాసం - కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి సంస్మరణ సంచిక - పుటలు 42-43.

39. పానుగంటి లక్ష్మినరసింహం 'సాక్షి' నాలుగవ సంపుటం, మహారాజ బిరుదము - పుటలు 160-162.

వఱకు జమీందారుడని యనుకొనుచున్న వాఁడిప్పుడెవరు? శిస్తుదారుడు మాత్రమే కదా? జమీందారునకు బైసయే కాని జమీనేది? కృష్ణా యదునందనా! ఇచ్చటి ఘృతకోశ న్యాయము చిత్తగించితివా? ఎస్టేటు గ్రామములలోనికి వెళ్ళుమని మీరు బోధించుచున్నారనుకొందము సరే! పెద్దవారు గనుక తాము చెప్పవలసినదే. కాని జమీందారులకు వారి గ్రామములలోఁ బలుకుబడి యుండుట కవకాశమే లేనప్పుడు పనిలేనిదే పోయి పరాభవమొందుట యెందులకు? రమ్మనిన రైతు రాడయ్యెను. కరణము కబురునకే యందఁడయ్యెను. ఇఁక జమాబందిలోఁ జేయవలసిన దేమున్నదయ్యా? ఈ ఆక్టువలన జమీందారులు పొందుచున్న యిబ్బందులున్నవే శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్ చెప్పనలవి కాదు కృష్ణా! నీకైనఁదెలియవేమోయని నా సందేహము. ఇటులంటినని కోపపడకుము. కృష్ణా! నీవు లక్ష్మీ వయస్కుఁడవు. నీకితరుల బాధ చప్పున నాటునా? అదిగాక మఱియొక్క పెద్దకారణమున్నది. దేవాదాయములు Estate Land Act అసలు నుండి సర్కారు వారి ధర్మమాయని మినహాయింపబడుటచే మీరిప్పుడీ షాన్ షోకులతో జమాబంది యనుచు సింగారించుకొని బయలుదేఱితిరి కాని లేకున్న యెడల మా జమీందారుల వంటి స్థితియే మీఁదియునై యుండునే? దేవకీ నందనా! రాజాధిరాజా! నాదొక్క ప్రార్థన యున్నది. విందురా? ఈ యాక్టును శీఘ్రముగా సవరణ చేయించి ప్రభువుల గౌరవమును గాపాడవలయునను సదుద్దేశమును శాసనసభ్యుల హృదయము లందు మీరు ప్రవేశించి కలిగింప వేడుచున్నాను. మీరు తలఁచుకొన్న యెడల నెంత పనియైనను నగును. జమీందారులేమి సామాన్యులా? ఎంత యాదాయములొనర్చినవారు? ఎంతెంత పరోపకార కృత్యము లొనర్చినవారు? పూర్వపు వారి వంశములో నుండి సర్కారునకుఁ బూర్వపు పాదుషాలకు నెన్నెన్ని మెహనతులు చేసినవారు! ఈదినము వఱకు సర్కారు నెలవనఁగ లక్షల కొలది రూపాయలు గ్రిమ్మరించుచున్నారే. అట్టివారికి ఇప్పుడు కొత్త యధికారము లేవియు నీయనక్కఱలేదు. వారి పూర్వాధికారము లిచ్చినఁజాలు. ఆ మాత్రమునకే కొండ యెక్కినట్లు వారు సంతోషింతురు. స్వామీ! మాధవా! ఏమి సెలవు!''

దేవుడు ఏం సెలవిచ్చినా ఇవ్వకపోయినా రైతాంగం నిద్రలేచింది. 1915లో కృష్ణా జిల్లా రైతు సంఘస్థాపన జరిగింది. 1923లో గుంటూరు పశ్చిమ గోదావరి జిల్లాల రైతు సంఘాలు ఏర్పడ్డాయి. 1928 ఆగష్టు 1వ తేదీనాడు ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘ స్థాపన జరిగింది. జాగృతులైన రైతులు కలసికట్టుగా పోరాటాలు సాగించే సమయంలో జమీందారులు, ఈనాందారులు, మొఖాసాదారులు మొదలైన ప్యూడలు వర్గాల వారు కూడా ఏకమై జస్టిస్‌పార్టీ ఛత్రం క్రింద చేరారు. అయితే రైతుల పక్షాన నిలబడినవారు దక్షతతో ఉద్యమాన్ని నడిపారు. నండూరి ప్రసాదరావుగారు ఆ సంగతులను ఇలా తెలియజేశారు.[40]

40. నండూరి ప్రసాదరావుగారి వ్యాసం - కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి సంస్మరణ సంచిక - పుటలు 16-17

''(ఇటువంటి భూమికలో) కమ్యూనిష్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు అభ్యుదయ కాంగ్రెసువాదులు రైతు ఉద్యమాన్ని పోరాటపధాన నడిపించడానికి, రైతు సంఘాన్ని ప్రజాబాహుళ్యపు సంస్థగా చేయడానికి ఉమ్మడిగా నడుములు బిగించారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. స్వామీ సహజానంద సరస్వతి, ఇందులాల్ యాజ్ఞిక్, ఆచార్యరంగా, బంకింముఖర్జీ, నంబూద్రిపాద్ మున్నగువారు దీనికి సారధ్యం వహించారు. ఒక స్పష్టమైన సూటియైన రైతాంగ జన బాహుళ్యపు కోర్కెలను ప్రతిబింబించేటి లక్ష్యం, ఆశయాలతో ప్రారంభమైనదే విప్లవరైతు సంస్థ. ''జమీందారీ విధానం రద్దు కావాలి''. ''రుణ విముక్తి కావాలి''. 'కనీస ఆదాయాన్ని మినహాయించి ఆపై వ్యవసాయాదాయాలపై వృద్ధి క్రమానుసారంగా భూమి శిస్తు విధించాలి.' 'పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి' మున్నగు ఆశయాలు నినదించినది.

''రైతుల ఆశయాలు వెల్లడించబడినాయి. లక్ష్యాలు నిర్వహించబడినాయి. వాటి సాధనకొరకై మార్గం చూపబడింది. వీటిని రైతాంగమంతటా ప్రచారం చేయాలి. వారిని మేల్కొల్పాలి, ఉత్తేజపర్చాలి. పోరాటాలకు సంసిద్ధం చెయ్యాలి. ఇందుకే ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణ యాత్ర తలపెట్టబడింది. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు నాయకుడుగా, చలసాని వాసుదేవరావుగారు ఉపనాయకుడుగా ఈ జైత్రయాత్ర 1937 జూలై 3వ తేదీన ఆంధ్రరాష్ట్రపు ఉత్తర కొస ఇచ్ఛాపురం నుండి ప్రారంభమయ్యింది. ఆచార్యరంగా, పుల్లెల శ్యామ సుందరరావు మున్నగువారి శుభాశీస్సులతో ఆంధ్ర రైతాంగ చరిత్రలోనే అపూర్వకమైన ఈ రైతు యాత్ర సాగింది. 1532మైళ్ళు కాలినడకన, మిగతా ప్రాంతాలలో 542 మైళ్ళు బస్సులలోనూ 130 రోజులు పర్యటించి, ఈ యాత్రాదళం 1938 మార్చి 27న మద్రాసుకు చేరుకుంది. మద్రాసు అసెంబ్లీ స్పీకర్ మహర్షి బులుసు సాంబమూర్తిగార్కి, రాజాజీ మంత్రి వర్గానికి వినతి పత్రాలను వందలాది రైతుల మహజర్లను సమర్పించింది.''

ప్రభుత్వం వ్యవసాయదారుల ఋణ విమోచన చట్టాన్ని పరిమిత ప్రయోజనాలతో తీసుకు వచ్చింది. జమీందారీ విధానం సంస్కరణకు ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ జమీందారీ విధానం రద్దును సిఫార్సు చేయకుండా ఈ క్రింది విషయాలు స్పష్టంగా ప్రకటించింది.

★ భూమికి యజమాని రైతే.
★ జమీందారు శిస్తు వసూలు చేసే ఏజెంటు మాత్రమే.
★ పెర్మనెంటు సెటిల్‌మెంటు పూర్వపు రేట్లే ఖాయం.
★ అడవులు, పోరంబోకులు వగైరాలు ప్రజలవే.

ఈ కమిటీ వారు చెప్పిన విషయాలు రైతాంగానికి సంతృప్తి కలిగించలేదు. మునగాల, ముక్త్యాల, కాళీపట్నం, చల్లపల్లి, మందసా, వెంకటగిరి, కానూరు మొదలైన జమీందారీలలో అనేక రైతు పోరాటాలు జరిగాయి. ఆనాటి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా పి. సుందరయ్యాగారు ఒక సంగతిని పునరుద్ఘాటన చేశారు.[41]

41. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి సంస్మరణ సంచిక - పుట.138

''ఎట్టి పరిహారము యివ్వక జమీందారీ విధానాన్ని రద్దు చేయనంతకాలం జమీన్ రైతులకు సుఖము, శాంతి, రక్షణ ఉండదు. జమీందారీ విధానాన్ని రద్దు చేయక జమీన్ రైతులకు సౌకర్యాలు కల్పించబూనే ఏ చట్టమూ జమీన్ రైతు సమస్యను శాశ్వతముగా పరిష్కరించజాలదు అని సోషలిస్టు రైతు సంఘాలు యిదివరకు ప్రకటించియే వున్నాయి.''

ఆ ఆశయాలు జమీందారీ యుగం అవసానకాలంలో విస్పష్టమైతే ఈ స్వప్నాలు ఆధునికంలో కొంతవరకూ మాత్రమే ఫలించాయి. నిజమైన భూ సంస్కరణలు ఇప్పటికీ పాలక వర్గాలు చిత్తశుద్ధితో చేపట్టలేదు.

బ్రిటిష్ ఇండియాకు చెందిన తెలుగు జిల్లాలలోని రైతుల కష్టాలు దుర్భరంగా ఉన్నప్పుడు నిజాం రాజ్యంలోని ప్రజల పాట్లు దుస్తరంగా ఉండేవి. ఆ ప్రాంతంలో నూటికి ముప్పయి వంతుల వైశాల్యంలో జాగీర్లు, పాయగాలు, సన్ మక్తాలు, ఈనాములు, సంస్థానాలు ఉండేవి. మరో పదోవంతు భూమిలో నైజాం నవాబు స్వంత భూములు (సర్ఫేఖాస్) ఉండేవి. ఆనాటి నిజాం రాజ్యంలో ఈ క్రింది తెలుగు సంస్థానాలు ఉండేవి.

1. వనపర్తి
2. అమరచింత-ఆత్మకూరు
3. గుర్గుంట
4. గద్వాల
5. ధవళగిరి
6. ఆనెగొంది
7. జటప్రోలు
8. గోపాల పేట

ఈ సంస్థానాధిపతులేకాక దేశ్‌ముఖులు, సర్ దేశ్‌ముఖులు, దేశాయిలు, సర్ దేశాయిలు మొదలైన బడా భూస్వాములు ఉండేవారు. బిన్నారెడ్డి ప్రతాపరెడ్డి కుటుంబానికి లక్షాయాభైవేల ఎకరాల భూమి ఉండేదని ప్రతీతి. విసునూరి రామచంద్రారెడ్డికి నలభై గ్రామాలలో నలభైవేల ఎకరాలు ఉండేది. సూర్యాపేట దేశ్‌ముఖ్‌కు ఇరవైవేల ఎకరాలు ఉండేది. ఈ ఫ్యూడల్ వర్గాల పోషణలో చాలామంది కవులూ, పండితులూ తెలుగు జిల్లాలలో ఉన్నట్లే ఉండేవారు. వీరు ప్రభువులను ప్రస్తుతిస్తూ వుంటే ప్రజలు తమకు కావలసిన సాహిత్యాన్ని తాము సృష్టించుకొన్నారు.

పూర్వం చెన్న రాజధానిలో ఉండే కడప, కర్నూలు, అనంతపురం, బళ్ళారి జిల్లాలను దత్త మండలాలు అని పిలిచేవారు. తనకు సైనిక సహాయం చేస్తున్న కుంఫిణీ వారి ఖర్చుల నిమిత్తం ఈ జిల్లాలను నైజాం ఎప్పుడో వీటిని ధారాదత్తం చేశాడు. థామస్ మన్రో దక్షత వల్ల ఈ జిల్లాల సర్వే సెటిల్‌మెంట్ జరిగింది. చిల్లర మల్లర పాలెగాళ్ళు ఎందరో కోటలు కట్టుకొని ప్రజలను హింసిస్తూ వుండేవారు. ఒకనాడు ఈ మండలంలో 16 విభాగాలు ఉండేవి. హర్పనహళ్ళి జాగీరును బసవప్ప నాయకుడు పాలించేవాడు. కూడ్లిగ తాలూకాలో ఒరమల్లిని వీరప్పనాయకుడు, రాయదుర్గాన్ని వెంకటపతి నాయకుడు, నొసం పాలెగాడుగా నరసింహారెడ్డి, కోయిలకుంట్ల అవుకు రామకృష్ణరాజు,

గూళ్యం పరగణాలో అయిదుగురు గుత్తదార్లు, హండే అనంతపురం పాలకునిగా సిద్ధప్ప నాయకుడు మొదలైన ప్రముఖులు పెత్తనం చెలాయించేవారు. అయితే మన్రో ధర్మమా అని రైత్వారీ విధానం దత్త మండలాలలో వేళ్ళూనుకొని రైతు ప్రజలకూ ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. ఫ్యూడలు విలువలు ఇంకో రకంగా ఈ జిల్లాలలో చోటు చేసుకొన్నాయి.

1928లో సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి అధ్యక్షతన నంద్యాలలో జరిగిన సభలో దత్త మండలాలకు రాయలేలిన సీమ కాబట్టి 'రాయలసీమ' అనే పేరు గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ప్రతిపాదించి ఆమోదింప చేశారు.[42] నాటినుండి ఆ పేరే ప్రచారంలోనికి వచ్చింది.

ప్రాంతీయ పేరులు వేరైనా, తెలుగు ప్రజల తీరులు సామన్యమే. 'విభజించు పాలించు' అనే పద్ధతులలో వరవళ్ళు దిద్దుకొన్న రాజకీయవాదులు 'రాయలసీమ, కోస్తాజిల్లాల విభేదాలను తమకు అవసరమొచ్చినప్పుడల్లా తీసుకువస్తూ ఉంటారుగాని, సాహిత్యా రంగంలో భిన్నత్వంకన్నా ఏకత్వమే స్ఫుటంగా ఉండేది. వ్యావసాయకంగా వెనుకపడిన ప్రాంతం కావచ్చునేమోగానీ రాయలసీమ సాహిత్యా విషయాలలో కొన్ని ప్రక్రియల ప్రాచుర్యానికి ప్రసిద్ధమైంది. ఇతర ప్రాంతాలకు మార్గదర్శకమైంది. (ఉదాహర ణకు స్టేజీ నాటకాలు) ఛాందసత్వంలోనూ, గ్రాంథిక భాషను పట్టుకువేళ్ళాడ్డంలోనూ రాయలసీమ కవిపండితులు ఇతర ప్రాంతాల వాళ్ళకేవిధంగానూ తీసిపోయే వారు కాదు.

ప్రజల భాషకు విరుద్ధమైన విలక్షణ భాషను ప్రోత్సహించడం, ఫ్యూడల్ విధానపు శ్రుతిని సరిచేసే జీవకర్ర. భూమి ప్రభువులదే అనే వ్యవస్థలో భాష పండితులదే అన్న సూత్రం అవసరం. అందుకే దేశి పద్ధతిని నిరసించి మార్గపద్ధతిని పండితులు రుద్దుతారు. రామాయణ కాలంలోనే రాముడంతటి వాడి కొలువులో కుశలవులు అంతవరకూ దేశి పద్ధతిలో పాడుతున్న కథను మార్గపద్ధతికి మళ్ళించవలసి వచ్చింది! ప్రజాకళలు ప్రభువుల ప్రాంగణంలోనికి వెళ్ళగానే 'క్లాసికల్' ఆహార్యాన్ని ధరిస్తాయి. ప్రభువులు, పండితులు దేశిని ఈసడించి సాధారణ జనాన్ని వాడుక భాషలో సాహిత్యా సృష్టిని చేసుకోనివ్వరు.

శబ్ద శాస్త్రాన్ని వినేనా ఎరగనివాడికి బాగా మాట్లాడడానికి వీలుకాదని పండితులు శాసిస్తారు. లక్షణ శాస్త్రాల ఇనుప గొలుసులు ఎంతటి సహజ చాతుర్యమున్నా నోరు తెరవడానికే ఆదిమచాళుక్య యుగాల నుండి సామాన్యులు భయపడేవారు. ప్రభువులు పండితులకిచ్చే తామ్ర శాసనాలన్నీ సంస్కృతంలోనే రచింపచేసేవారు. విధిలేక ఎల్లలలో ఉండే ప్రాంతాలను మాత్రం దేశి మాటలలో పేర్కొనేవారు. పద్మనాయక, రెడ్డిరాజుల యుగాలలో ప్రభువులు రాచరికానికి రాగానే తాము ప్రజల నుండి వచ్చామన్న సంగతి పరగడుపై సంస్కృతాన్నే ఆదరించారు. ఆ భాషలో స్వయంగా సంగీత సాహిత్యా గ్రంథాలు రచించారు. పద్మనాయకులలో సర్వజ్ఞసింగ భూపాలుడూ, రెడ్డిరాజులలో

42. కోడి నరసింహం - తెలుగు వైతాళికులు-II ఉపన్యాసాల సంపుటం-పుట.30

పెదకోమటి వేముడు సంస్కృతంలో చెప్పుకోదగ్గ మహావిద్వాంసులు. ఆ యుగం గురించి ఇలా చెప్పుకొన్నాం.

''ప్రభువులందరూ సంస్కృతాన్ని ఆదరించి స్వయంగా ఆ భాషలో గ్రంథాలు వ్రాయడం వల్ల తెలుగు కవిత్వంలో కూడ సమాస భూయిష్టమైన కవిత్వం బాగా వేళ్ళూనింది. డు ము వు లు చేరిస్తే చాలు, అది తెలుగు కవిత్వమనే సంప్రదాయం స్థిరపడింది. కొందరు రాజులు సంస్కృతంలో అలంకార గ్రంథాలు వ్రాయడం వల్ల కొందరు కవులు తెలుగులో కూడా అలంకార గ్రంథాలు వ్రాశారు. లక్షణ సమన్వితంగా కావ్యాలు వ్రాయాలనే తహతహ ఈకాలంనుంచి ఇంకా మొదలవుతుంది.''

విడమరిచి చెప్తేగాని సారస్యం బోధపడని ప్రబంధాలు, ద్వ్యర్థికావ్యాలూ బయలుదేరాక .వాటి గొప్పతనం చాటడానికి వ్యాఖ్యానాలు అవసరమైనాయి. నాయకరాజుల యుగం నుండి వీటిని మాత్రం పండితులు తాము నిత్య జీవితంలో మాట్లాడుకొనే శైలిలోనే రచించసాగారు. రాయవాచకం వంటి గ్రంథాలు చక్కని వ్యావహారిక శైలిలో ఉండేవి. కుంఫిణీ యుగంలోని లేఖలు, యాదస్తులు, అర్జీలు అన్నీ శిష్ట వ్యావహారికంలోనే ఉండేవి. అయితే ఫ్యూడల్ సృష్టించుకొని దానినే విద్యార్థులపై రుద్దారు. ఉద్యోగులకు నిర్దేశించారు. చిన్నయసూరి గారి మాట పెద్దదయింది. వారి బాట దాటరాని గీటైంది.

చిన్నయసూరిగారి తర్వాత వచ్చిన బహుజనపల్లివారూ, కొక్కొండవారూ భాషకు సంకెళ్ళు మరింత బిగించారు. రచనలలోనే కాక నిత్య వ్యవహారంలో కూడా గ్రాంథిక భాషను సర్వకాల సర్వావస్థల యందును వ్యాకృతభాషనే భాషించాలన్న వ్రతం పట్టారు. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు పండితులు రచించే నాటకాలలో అన్ని పాత్రలు ఒకరకమైన లక్షణయుతమైన భాషనే మాట్లాడుతాయి. ఇది సంస్కృత రూపక లక్షణానికి విరుద్ధం. నాట్యం లోకవృత్తాన్ని అనుసరించాలి. సంఘంలో ఆయావర్గాల యాసలను సైతం వాడుకోవాలి.

సంస్కృత నాటక లక్షణాలకు అనుగుణంగా వేదం వెంకటరాయశాస్త్రిగారు తమ నాగానందం అనువాదంలోనూ, ప్రతాపరుద్రీయ స్వతంత్రరచనలోనూ నీచపాత్రలకు గ్రామ్యం ఉపయోగించారు. దీనిని హర్షించిన వారి సంఖ్య పెరుగుతోంది. వేదంవారు రచనలు వెలువడడానికి ముందు నాటకరచనలు చేసిన వారు గ్రామ్యాన్ని వాడలేదు. ముందు ముందు వాడకూడదన్న నియమం తెచ్చిపెట్టదలిచారు.

ప్రతాపరుద్రీయ పద్ధతిని నీచపాత్రలకు గ్రామ్యమే లక్షణ సమ్మతమైతే ధర్మవరం కృష్ణమాచార్యులవారి చిత్రనళీయం, కొక్కొండ వెంకటరత్నంగారి ప్రసన్న రాఘవం, రాయదుర్గం నరసయ్యగారి శాకుంతలం ఇలాంటి అనేక నాటకాలు లక్షణ విరుద్ధాలవుతాయి. కాబట్టి గ్రామ్యమే అవలక్షణమనే సిద్ధాంతాన్ని ధర్మవరంవారూ, వారి మిత్రులూ లేవదీశారు. 1897వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఈస్టరు సెలవుల కాలంలో

బళ్ళారిలో ఆంధ్రకవిపండిత సభను ధర్మవరం వారు ఏర్పాటు చేశారు. ఈ సభలో కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు తమ వాదం నెగ్గించుకోవాలని చూశారు. వేదంవారు అడ్డు తగిలి ఇలా చెప్పారు.[43]

''పంతులుగారు చెప్పినట్లు ఎల్లవారితోనూ సర్వకాల సర్వావస్థలయందును వ్యాకృతభాషనే భాషింప సమకట్టిన వ్యవహార హాని కలుగుననియు గ్రామ్య జనులతో వ్యవహరించునపుడు గ్రామ్యము, పండితులతో భాషించునపుడును, వారికి వ్రాయనప్పుడును వ్యాకృత భాషయునని వ్యవస్థ యేర్పఱచుకొనుట మంచిది''.

1876లో నాటకాలలో పాత్రోచితభాషను వాడాలన్న వేదంవారు నాటకేతర రచనలలో గ్రాంథికమే వాడాలన్న నియమాన్ని 1912 నాటికి చాటి చెప్పారు. విష్ణు పాదాన పుట్టిన గంగ వివేక భ్రష్ట సంపాతం చెంది సముద్రంలో కలిసినట్లు వాగ్దేవి పద్మజాత మనోజాతయై అతని నాలుగు ముఖాలలో విలసిల్లి వాల్మీకి, వ్యాస, కాళిదాసాదుల రచనల్లో పరిఢవిల్లి మన ఆంధ్రదేశానికి దిగి తెలుగై ''కడపటి నిక్కాలంబునం బ్రాయికంబుగా తెగులై సకల కశ్మల సమృద్ధయై గ్రామ్య ప్రాయితం జెంది అనుచ్చరణీయములు, అనాకర్ణనీయమునై రూపహానించెందుచున్నది'' అని చెప్పారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు.[44]

''చిరకాలము ఆంధ్ర వాగ్దేవిని సంస్కృతాంధ్రోభయ భాషా ప్రవీణులైన వాగనుశాసనసోమయాజి పెద్దనార్యప్రభృతులు మహోన్నత దశయందెయుంచి పూజించిరి. ఇటీవల రాఁగారాఁగా ప్రాయికముగా సంస్కృత మెఱుగని కవులు, చదువని కవులు, సమాస మొల్లనివారు, అలంకారము నొప్పనివారు, యతిప్రాసల హిత శత్రువులు, అక్షర ద్వేషులు, ఔచిత్యబాహ్యులు-ఏవమాదులు వాగ్ధేవికి ఈ చరమ దశను సాధించినారు.''

వేదం వారు ఆంధ్రభాషా ప్రవచనంలో ప్రాచీన మార్గం నవీన మార్గం అని రెండు ఉన్నాయని చెప్పి వాటిని ఇలా విశదం చేవారు.[45]

''....... ప్రాచీన మార్గమును, అనులోమ మార్గమనందగును. అమరము, ఆంధ్రనామ సంగ్రహము, సంస్కృత శబ్దమంజరి, సంస్కృత పంచకావ్యములు, నన్నయభట్టీయము, ఆంధ్రపంచకావ్యములు ఈ వరుస ప్రవచనము ప్రాచీనమార్గము. ఇందలి క్రమము - శబ్దము లక్షణము లక్ష్యమునుంగా నుండును. నవీన మార్గము రాజకీయ విద్యాంగ నిర్ణీత మార్గమే; ఇది ప్రతిలోమ మనందగినది; ఇందు వరుస-లక్ష్యము లక్షణము శబ్దమునుగా నుండును. ఈ నవీన మార్గము మన భాషకు పనికి రాదు''.

ఒక్క వేదం వారే కాక దేశంలోని ఫ్యూడల్ వర్గాల పండితులందరూ నవీన మార్గం పనికి రాదన్నవారే. ఈ శిష్ట వ్యావహారికాన్ని ఎదుర్కొనడంలో వీరంతా ఏకం కావడానికి

43. వేదం వెంకటరాయ శాస్త్రుల వారి జీవిత చరిత్ర సంగ్రహము, పుట.76

44. వేదం వారి జీవిత చరిత్ర-పుట.122

45. వేదంవారి జీవిత చరిత్ర-పుట.123 (ఇది నా తెనిగింపు)

స్వలాభప్రలోభాలు ఉన్నాయి. గ్రాంథికం వీరికి తిండి పెడుతుంది. ఆ భాషలో రాసిన గ్రంథాలనే విద్యాశాఖ పాఠ్యగ్రంథాలుగా పెడుతుంది. కందుకూరి వీరేశలింగం గారి దగ్గర్నుంచి ఎంతమంది దాకానో గ్రాంథికాభిమానం వివిధ స్థాయీ భేదాలలో విస్తరించింది. గిడుగు రామమూర్తిగారు, గురజాడ అప్పారావుగారు ప్రజల భాష కోసం పోరాడవలసి వచ్చింది. తెలుగు జిల్లాలలోని మహారాజులు, సంస్థానాధిపతులు, జమీందారులు ప్రతిష్టాపకులుగా, పోషకులుగా, యావజ్జీవ సభ్యులుగా, ఉద్ధారకులుగా 1911లో ఆంధ్ర సారస్వత పరిషత్తును సంస్థాపించారు. కృతక భాషను దేశం మీద రుద్దారు.

కృతక భాష నేర్చుకొంటేనే గాని అలవడదు. అదైనా కేవలం విద్యాధికులకే సాధ్యమౌతుది. వాళ్ళకు కూడా ఈ భాష నిర్దుష్టంగా పట్టుపడదు. ఒక పండితుడు రాసిన దాంట్లో కొన్ని వందల తప్పులను ఇంకో పండితుడు చూపెట్టగలడు. అటువంటి దిగ్గంతులలాంటి విద్వాంసులకే రాని భాష సామాన్య జనులకు అందుబాటులో ఉండదు. ఉండకూడదన్నదే ఫ్యూడల్ వర్గాల ఆశయం. ప్రజలకు భాష ఒక ఆయుధం. ప్రభువులకు అది అపాయం. అయితే ప్రతీ జాతీయోద్యమంలో భాష ఒక్కటే ప్రజలను సంఘటితపరుస్తుంది.

మన భారతదేశంలో వందేమాతరం ఉద్యమం ప్రారంభమయ్యాక జాతీయ బూర్జువా వర్గం పెట్టుబడిదారీ విధానాన్ని చేపట్టింది. స్వదేశీ వస్తునిర్మాణం విదేశీ వస్తు బహిష్కారం దేశానికి ఎంత లాభకరమో జాతీయ బూర్జువాకు అంత అవసరం. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ దశలోనికి దేశం పరిణామం చెందుతున్నప్పుడు కొన్ని అంచెలు తప్పనిసరి. ఈ సంగతి లెనిన్ ఇలా చెప్పాడు.[46]

''ప్రపంచం మొత్తం మీద ఫ్యూడలిజం పై కేపిటలిజం అంతిమ విజయాన్ని సాధిస్తున్న కాలం జాతీయోద్యమాలలో ముడిపడి వుంది. సరుకుల ఉత్పత్తిలో సంపూర్ణ విజయం సాధించాలంటే బూర్జువా వర్గం జాతీయ మార్కెట్టును స్వాధీనం చేసుకోవాలి. దీనితోపాటు ఒకే భాషను మాట్లాడే ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలన్నీ రాజకీయంగా సమైక్యం చెంది ఉండాలి. ఆ భాష అభివృద్ధి వికాసాలకు ఏవిధమైన అడ్డంకులు ఉండకూడదు. దాని సాహిత్యం సంఘటితం కావడానికి ఏమైనా ప్రతిబంధకాలు ఉంటే వాటిని తొలగించాలి. ఇదే జాతీయోద్యమాలకు పునాది. మానవ సంబంధాలలో అత్యంత ముఖ్యమైనది భాష ఒక్కటే. సమైక్యత, భాషలో అంతరాయాలులేని అభివృద్ధీ ఉన్నప్పుడే ఆధునిక కేపిటలిజానికి అనురూపమైన పెద్ద స్థాయిలో విస్తృత స్వేచ్ఛా వాణిజ్య వ్యాపారాలకు, భాషాభివృద్ధి చాలా ముఖ్యమైన షరతులు''.

వివిధ దేశాల ఉద్యమాలను విశ్లేషణ చేసి లెనిన్ చెప్పిన పై వివరణను అవగాహన చేసుకొంటే మన జాతీయోద్యమంలో స్వరాజ్య సాధనకు స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం, విదేశీ వస్తు బహిష్కరణలతోపాటు స్వభాష, స్వవేషం, స్వజాతీయ విద్య మొదలైనవాటిని

46. Lenin - Selected Works Vol-I P.568 (ఇది నా తెనిగింపు)

ఎందుకు ప్రోత్సహించవలసి వచ్చిందో తెలుస్తుంది. ఒకే భాషను మాట్లాడేవారు ఒకే రాష్ట్రంలో ప్రజలుగా ఉండాలనే హక్కును ప్రభుత్వం అంగీకరించడానికి ఎన్నో ఏళ్ళకు ముందుగానే 1917లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు సభలో అంగీకరించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసుకొనే హక్కును జాతీయోద్యమం ఇచ్చింది. ఇది కొన్నేళ్ళ కృషికి ఫలితం.

భాష ద్వారా ప్రజలు సంఘటితం కావడం ఫ్యూడల్ వర్గాలు సహించలేవు. మాండలిక ప్రయోగాలను వెక్కిరించి, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడతారు. అసమానతలు సృష్టిస్తారు. జనులు నిత్య జీవితంలో వ్యవహరించే భాషను గ్రామ్యమంటారు. ఈ గ్రామ్యాలలో తేడాలను చూపిస్తారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు ఒకప్పుడు పాత్రోచిత భాషను నాటకాలలో వాడాలన్నవారు. ఫ్యూడల్ ప్రభువుల ప్రోద్బలంతో 1912లో ఏం చెప్తారో చూడండి.[47]

''ప్రతి గ్రామ్యమును సర్వజనీనమనుట సరిగాదు. గ్రామ్యములు పెక్కు దెఱంగులు. గంజాం జిల్లా యోఢ్ర గ్రామ్యము, విశాఖ పట్టణ రాజమహేంద్రవరాది హిందూస్థానీ గ్రామ్యము, నెల్లూరు కడప జిల్లాల శుద్ధ గ్రామ్యము, మదరాసు చిత్తూరు తంజావూరు సేలము తిరుపత్తూరు మధుర తిరుచనాపల్లుల యఱవ గ్రామ్యములు, బళ్ళారి, బెంగుళూరుల కన్నడ గ్రామ్యము, కర్నూలు హైదరాబాదుల తురక గ్రామ్యము, ఇంక ధార్వాడ బెల్గాముల కన్నడ మరాటి గ్రామ్యము, ఈ తూర్పు నాటి మనకు గోడవలె నుండు హైదరాబాదు పశ్చిమోత్తరపు జిల్లాల గ్రామ్యములు పెక్కులు గలవు. ఒక జిల్లా గ్రామ్యము మఱియొక జిల్లా వారికి తెలియదు సరిగదా అసహ్యముగా కూడా నుండును. ఇవిగాక యిన్ని జిల్లాల నానా జాతుల గ్రామ్యములు కలవు. అందులో మన జిల్లావే అనేకములు మనకే తెలియవు.''

1899లో తమ పాత్రోచిత భాషను వెనకేసుకొచ్చిననాడు చెప్పిన సబువులు వేదం వారికి 1912లో పరగడుపైనాయి. వారి వారి ప్రాంతీయ యాసలతో మాట్లాడే పండితుల భాషను కూడా గ్రామ్యమనుకొన్నా అందువల్ల వ్యవహారానికి హాని లేదు. అముద్రిత గ్రంథ చింతామణిలో ఒకరు ఇలా రాశారు.[48]

''1898 సం॥ డిసెంబరు నెలలో జెన్నపురిలో జరిగిన కవి పండిత సంఘమునకు రాజమహేంద్రవరము నుండి మ॥ వడ్డాది సుబ్బరాయుఁడు గారును, బళ్ళారి నుండి మ॥ ధర్మవరము కృష్ణమాచార్యులవారును, ఆత్మకూరు నుండి మఱియొక యాచార్యుల వారును, చిత్తూరు నుండి మ॥ నాగపూడి కుప్పుస్వామయ్యగారును వచ్చియుండిరి. అచ్చట వీరందఱు నిజదేశీయ పదభూయిష్టంబైన గ్రామ్య భాషతోనేగదా ప్రసంగించిరి. అట్లుండియు నక్కడికి వచ్చియుండిన వారికి వీరి ప్రసంగముల యందలి రసభావములు చక్కగా విశదములుగా లేదా?''

---

47. ''వేదం వెంకటరాయశాస్త్రిగారి జీవిత చరిత్ర సంగ్రహము'' పుట.125-6

48. అముద్రిత గ్రంథ చింతామణి-సంపుటి-12, సంచిక-4 ఏప్రిల్ 1899, పుట-23.

మాండలిక ప్రయోగాల వల్ల వ్యావహారానికి హాని రాదు. సర్వమానవ సమానత్వంలాగే సర్వప్రాంతీయ భాషల సమానత్వాన్ని కూడా ప్రగతి శక్తులు అంగీకరిస్తాయి. సరిహద్దురాజ్యాలలో జీవించే ప్రజలకు సహజంగా వచ్చే సందేహాలను తొలగించి, కలిగే భయాలను నివారణ చేసి హామీ ఇవ్వవలసి వుంటుందని కొందరు గుర్తించారు. ప్యూడలు శక్తుల ఎత్తులను చిత్తు చేస్తూ, వారి పండితుల వితండవాదాన్ని ఖండిస్తూ, నిజమైన సంప్రదాయాన్ని విశదపరుస్తూ పండిత భిషక్కుల భాషా భేషజాన్ని ఎండగడుతూ వాడుక భాషకు గౌరవం కల్పించడానికి రమారమీ ఒంటి చేత్తో సుదీర్ఘ పోరాటాన్ని సాగించిన ఒక మహనీయుడు జమీందారీ యుగంలో చెప్పుకోదగ్గ వ్యక్తి. ఆయన గిడుగు రామమూర్తిగారు. ఒక్క భాషా విషయంలోనేకాక రాజకీయంగా కూడా జమీందారులతో పోరాడారు.

జమీందారులు తమ ఉనికిని భద్రం చేసుకొనడానికి పనికి వచ్చే కార్యక్రమాలను చేపట్టడం సహజం. మొదటికి మోసం రాకుండా వుండేటట్టు కొందరు జమీందారులు రాజకీయ, సాంఘిక రంగాలలో కృషి చేశారు. కొందరు అచ్చుకూటాలు నెలకొల్పారు. గ్రంథాలయాలకు పోషకులయ్యారు. గ్రంథప్రచురణ ప్రోత్సహించారు. వీరిలో చాలామంది కృతి భర్తలున్నా కొందరు కృతికర్తలుగా కూడా పేరు పొందారు. కొందరు జమీందారులు సాహిత్య పత్రికలు స్థాపించి నడిపారు. ప్రాచీన గ్రంథాలను పరిష్కరింపచేసి ప్రచురించారు. ప్యూడలు విలువలను సంరక్షించే ఆర్షవిద్యలను, సనాతన పండితులను సత్కరించారు. విద్యారంగానికి చేయూత నిచ్చారు.

పై పేరాగ్రాఫులో పేర్కొన్న విషయాలకు విపులమైన ఉదాహరణలు సందర్భాన్నిబట్టి వివిధ ప్రకరణాలలో విశదం చేస్తాను.

''ఆంధ్ర సంస్థానాధీశ్వరుల సాహిత్యకృషిని ప్రశంసించుచు పండిత విమర్శకులు చేసిన ప్రసంగములు కొన్ని'' ఉటంకించి తూమాటి దొణప్పగారు చిట్ట చివర ఇలా రాశారు.[49]

''కవులు కడుపు కక్కుఱితిగాళ్లు కావునను, విమర్శకులు ప్రభులోక వైతాళికులు కావునను ఇట్టి సర్టిఫికెట్టుల నిచ్చిరని పూర్వపక్షమువారు దీనిని కొట్టి వేయవచ్చు. కాని జమీందారీ రద్దు చట్టమును సాధించిన కాంగ్రెసు పెద్దలు కూడా ఉద్గ్రంథ ప్రచురణము నందును, విజ్ఞాన విస్తరణము నందును, లలిత కళా పోషణమునందును, రాజకీయ సంస్కరణము నందును, ధర్మసంస్థల నిర్మాణ నిర్వహణములందును, తెలుగు జమీందారులు నిర్వహించిన పాత్రమును హర్షించియుండుట గమనార్హము''.

గమనార్హమైన హర్షింపును పేర్కొంటూ అది మాగంటి బాపినీడుగారు ఆంధ్ర సర్వస్వం (పుట 181)లో 'జమీందారులు ఆంధ్ర దేశమునకు చేసిన మేలు' అనే వ్యాసాన్ని చూపెట్టారు. కాంగ్రెసు పెద్దల కితాబు కోసం చరిత్ర పుటలను తిరగేస్తే చాలా చేదు సత్యాలు బయటపడతాయి.

49. తూమాటి దొణప్ప - ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము'', పుట-18

1937లో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడ్డాక చెన్నరాజధానిలో జమీందారీ విధానాన్ని రద్దు చేసే బిల్లును తయారు చేయడానికి టంగుటూరి ప్రకాశంగారు పూనుకొన్నారు. లోగడ కరాచీ కాంగ్రెసు తీర్మానం ప్రకారం జమీందారీలు పోతాయని రైతులు ఆశపడ్డారు. అప్పుడు ప్యూడలు వర్గాలు వేసుకొన్న వ్యూహాన్ని తెన్నేటి విశ్వనాథంగారు ఇలా వెల్లడించారు.[50]

''అయితే, జమీందారులంతా కలిసి పెద్ద ప్రయత్నం చేయడానికి తలపెట్టి, తమలో తాము చందాలు కూడా వేసికొని శ్రీ కె.ఎమ్.మున్షీగారిని ఒక లక్షరూపాయల ఫీజుమీద తమ సలహాదారుగా నియమించి, వల్లభాయ్ పటేలు గారి దగ్గరకు తమ తరపున విజ్ఞప్తి చేయడానికి పంపించారు. శ్రీ మున్షీ కాంగ్రెసు నీతి ప్రకారం జమీందారీ పద్ధతి రద్దు చేయడానికి వ్యతిరేకంగా వెళ్ళడం సమంజసం కాదని మేమంతా అభిప్రాయపడ్డాము. ఎందుచేతనంటే ఆరోజులలో ఆయన అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో సభ్యుడుగానూ కాంగ్రెసుకు సన్నిహితుడుగాను ఉండేవాడు''.

వాస్తవానికి తొలి తరాలలోని కాంగ్రెస్ పెద్దలలో చాలామందికి జమీందారులతో సత్సంబంధాలు ఉండేవి. వందేమాతరం ఉద్యమకాలం నాటికి ఉడుకు నెత్తురు పొంగే పడుచుదనంలో ఉండే జమీందారులు కొందరు క్రియాశీల రాజకీయాలలో పాల్గొనేవారు. ఉదాహరణకు మునగాల జమీందారు నాయని వెంకట రంగారావు (1875-1958) కలకత్తా కాంగ్రెస్‌కు వెళ్ళి జాతీయవాదుల కేర్పాటు చేసిన బసలోనే దిగారు. బిపిన్ చంద్రపాల్‌గారు ఆంధ్రప్రదేశ్ పర్యటన ప్రారంభించినప్పుడు ఈ రాజాగారే రాజమండ్రికి వెళ్ళి పాల్‌గారిని బెజవాడ తీసుకొని వచ్చారు. చల్లపల్లి రాజాగారి బంగళాలో మునగాల రాజారావు బస చేశారు. 1906-1907 సంవత్సరంలో కృష్ణా జిల్లాలో జరిగిన రాజకీయ సమ్మేళనానికి అనుబంధంగా జరిగిన సంఘ సంస్కరణసభలో మునగాల రాజా ఆహ్వాన సంఘాధ్యక్షులుగా గంభీరోపన్యాసం చేస్తూ స్వభాష, స్వవేషం, స్వదేశీ, స్వరాజ్యం మన నూతన చతుర్వేదాలని చాటి చెప్పారు.[51]

ఇదే మునగాల జమీందారుగారి యెస్టేటులో 1930నుండి 1940 దాకా సాగిన రైతు ఉద్యమంలో జమీందారీ అక్రమాలను గొట్టిపాటి బ్రహ్మయ్యగారు (కాంగ్రెసు పెద్దలలో పెద్ద) తమ రిపోర్టులో వివరించారు. దీనిని బ్రహ్మయ్య అవార్డు అంటారు. దీనిలో ముఖ్యాంశాలు కొన్ని చూడండి.[52]

★ పట్టాలలో సర్వే నెంబర్ల వారీగా హద్దులు చేయాలి.

★ చాకలి, మంగలి, కమ్మరి, వడ్రంగి, పురోహితం మొదలైన చాకిరీ ఇనాముల వారి భూములను జమీందారు దావాలో గెలిచి ఆక్రమించుకొన్నాడు. ఈ వృత్తుల వారిచేత నిర్బంధంగా చాకిరీ చేయించుకొనేవారు.

50. టంగుటూరి ప్రకాశం - నా జీవితయాత్ర, చతుర్థఖండం, అనుబంధ సంపుటి, పుట.598

51. ఆచంట లక్ష్మీపతి స్వీయచరిత్ర-పుట.88

52. కొమ్మారెడ్డి... సంస్మరణ సంచిక - పుటలు - 67, 68

- ★ హక్కుదారులకు తెలియకుండా రెవిన్యూ వేలంలో భూములను జమీందారు విక్రయించేవాడు.
- ★ రాజాగారు దౌర్జన్యంగా భూములు భుక్తపరుచుకొన్నాడు.
- ★ సాముదాయక భూములను ఆక్రమించాడు.
- ★ భూమిలేకుండా శిస్తు వసూలు చేసేవాడు.
- ★ వర్తకులకు సరుకులపై డబ్బు ఇవ్వడం లేదు.
- ★ రైతుల క్రయ దస్తావేజులను, పాత పట్టాలను తీసుకొని ఇవ్వడం లేదు.

బ్రహ్మయ్య అవార్డులో ఒక్క జమీందారీలో జరిగిన కొన్ని దౌర్జన్యాలే నమోదు అయినాయి. ఆంధ్రజిల్లాలలోని వివిధ సంస్థానాలలో దుర్భరమైన దోపిడీ కొనసాగుతూ వచ్చింది. అందుకే రైతు ఉద్యమాలు అవసరమైనాయి. ఆ పోరాటల సాహిత్యంలోనే ప్రజల స్థితిగతులు తెలుస్తాయి. జమీందారుల పోషణలో వచ్చిన సాహిత్యంలో ప్యూడలు విలువల ప్రశంసలే ఎక్కువ. ఇలాంటి సాహిత్యాన్ని ప్రోత్సహించినందుకు సంబరపడ నక్కరలేదు.

కాకులను కొట్టి గెద్దలకు వేయడం పుణ్యాకార్యం కాదు. అలాగే ప్రజలను ఆర్థికంగా దోచుకొనేవాడు చీమలకు పంచదార పెడితే సుకృతాన్ని ఆర్జించుకోలేడు. పేద రైతుల గోళ్యాడకొట్టి సంపాదించిన శిస్తులతో తమ ఇతర విలాసాలతో పాటు సాహిత్య సేవకు అత్యంత స్వల్పకాలాన్ని వెచ్చిస్తే, ఆ గోరంత కార్యాన్ని కొండంతగా పొగడనక్కరలేదు. గురజాడ అప్పారావుగారు చెప్పినట్టు, 'మంచి గతమున కొంచమే'.

కొన్ని దశాబ్దాల దూరం నుంచి గతాన్ని నేడు వీక్షిస్తున్నప్పుడు కొన్ని కొన్ని విషయాలు చాలా అల్ప పరిమాణంలో ఉన్నట్టు తోచవచ్చు. అయితే ఆనాడు అవి ప్రబలమైన పరిణామాలే, గడ్డు సమస్యలే. సంఘ సంస్కారాన్ని సఫలం చేయడంలో దురాచారాలను దూరం చేయడంలో విజ్ఞులు అడుగడుగునా సనాతనులతో పోరాడవలసి వచ్చింది. వితంతు వివాహాలూ, ప్రౌఢ వివాహాలూ చేసుకొన్నవారినీ, చేయించినవారినీ కాక ఆ పెళ్ళిళ్ళకు వెళ్ళి భోజనాలు చేసిన వారినీ, తాంబూలాలు పుచ్చుకొన్నవారినీ కులం నుండి ఒకప్పుడు వెలివేసేవారు. ఆరోజుల్లో కులంపోతే కూడుపోయినట్టే, భవిష్యత్తు కూలిపోయినట్లే. అయినా ఉత్తమ సంస్కారం గల ధైర్యవంతులు వెలికి జంకలేదు. మఠాధిపతుల ఆంక్షలను లక్ష్యపెట్టలేదు. ఈ సాహసాలకు సాంఘిక కారణాలున్నాయి.

ఏ దేశంలోనైనా సాంఘిక రాజకీయ విమోచనోద్యమాలు మూడు దశలలో సాగుతాయని లెనిన్ చెప్పారు. రష్యాలో రాజవంశాలకు సంబంధించిన జమీందారీ ఫాయీ బహద్దరులు నడిపిన దశ మొదటిది. (1825–1861) తర్వాత 1861 నుండి 1895 దాకా బూర్జువా వర్గాలు ప్రధానపాత్ర వహించాయి. పిమ్మట 1895 నుండి తన కాలందాకా శ్రామిక శక్తులు నడిపిన పోరాటాలను లెనిన్ పేర్కొన్నాడు. జమీందారీ ఫాయీ దశలో రాజకీయ నేరాలకు గురియైనవారిలో నూటికి 76మంది నోబులు మోతుబరులే అని లెనిన్

లెక్కలు ఇచ్చారు.[53] ఇటువంటి మూడు దశలలో మన సాంఘిక రాజకీయ విమోచనోద్యమాలు వివిధ కాల పరిమితులలో జరిగాయి. తెలుగు జిల్లాల లోని తొలి సాంఘిక సాహిత్య సమరవీరులు జమీందారీ వర్గాల, సామంతుల, శ్రీమంతుల, ధీమంతుల కోవలోనివాళ్లు. ఉన్నత విద్యలు, ఉత్తమ సంస్కారం, పరువూ మర్యాదలు గల కొత్త వ్యక్తుల వల్ల ఆదాయం, నలుగురులో పలుకుబడి మొదలైన భద్రతలతోపాటు, కులం ఒకవేళ పోయినా మతం పోకుండా బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం (కోస్తాజిల్లాలు), ఆర్య సమాజం (తెలంగాణా), దివ్యజ్ఞాన సమాజం (రాయలసీమ) వంటి కవచాలు ఉండటం వల్ల నూతన నైతిక బలంతో వీరు ఉద్యమించగలిగారు. అందుకే దీనిని నవ్యసాహిత్య యుగం అని కూడ అనవచ్చు. ఈయుగంలో వెలువడిన సాహిత్యంలో జమీందారీ ఫాయీవారి పాత్రయెంతో, నవీనుల కృషి ఎంతో విశ్లేషణ చేయడం అవసరం. కొత్త పాతల మేలు కలయికకు ఎందరు ఎలాగ పాటుపడ్డారో కూడా పరిశీలించాలి. పేరుపేరునా కొందరు దిగ్గంతుల సాహిత్య సేవలను, మూక ఉమ్మడిగా తదితరుల వ్యాసంగాన్ని మనవి చేస్తాను.

కందుకూరి వీరేశలింగం పంతులు

(1848-1919)

''తెలుగు జాతిని తెరలు తెరలుగ
కారు చీకటి కమ్మినప్పుడు
మూఢ ఛాందసగాఢరుగ్మత
మూలుగుల్లో చొచ్చినప్పుడు
కాంతి ఖడ్గం, కరుణ వైద్యం
కార్యవాదిగ కావ్యశీలిగ
జాతి జనుల సముద్ధరించగ
జననమొందెను తెనుగు గడ్డను''

ఆయన సంఘ సంస్కర్త. గద్య తిక్కన కందుకూరి వీరేశలింగంగారు.

వీరేశలింగంగారిలో విప్లవభావాంకురాలు, 1873లో ఆయన స్త్రీ విద్య ఆవశ్యకత, బాలవ్యాకరణం అసమగ్రత గుర్తించినప్పుడే నాటుకొన్నాయి. ఎక్కడ ఏ అక్రమం కనపడ్డా సహించి ఊరుకునే తత్వం కాదు వారిది. ఆయనకు ఒక అభిప్రాయం పుట్టిందంటే ఆ పుట్టడానికి దానిని నెరవేర్చడానికి మధ్య ఆలస్యం విశేషంగా ఉండదు. అందుకే స్త్రీ విద్య అవసరమనే రచనలు వ్రాసి, పురుషార్థ ప్రదాయినికి ప్రచురణార్థం పంపించారు. సంగ్రహ వ్యాకరణం అనే గ్రంథాన్ని రచించి కోరంగిలో తమ శిష్యులకు దాని ప్రకారమే పాఠాలు చెప్పేవారు.

53. Lenin on the Intelligentsia-p.120

అప్పుడు వీరేశలింగంగారి వయస్సు పాతికేళ్ళు. అప్పటికే ఆయనకు 'అభినవ తిక్కన' అన్న బిరుదు సమకాలికులు ఇచ్చారు. తిక్కనగారిలాగే నిర్వచనకావ్యం రచించినందుకే ఈ బిరుదు వచ్చింది. పంతులుగారు ఇరవయ్యోఏట పద్యాలు అల్లటం మొదలుపెట్టారు. అయిదేళ్లలో అగ్రశ్రేణి కవిగా పేరుపడ్డారు.

పంతులుగారు కలం పట్టిన కాలంలో పద్యాలు చేసిన వాళ్ళకేగాని, వచనం వ్రాసిన వాళ్ళకు గౌరవం లేదు. అంచేతనే ''ముద్దియ విద్దె పెద్ద కార్యము'' అంటూ స్త్రీ విద్యను సమర్థించే రచనను పద్యాలలో వ్రాశారు. ఈ పద్యాలలో మత్తేభ విక్రీడిత కంద గర్భ సీసాలు, గోమూత్రికాబంధాలు వగైరాలు ఉన్నాయి. ఇంతటి పాండిత్యం ప్రదర్శించకపోతే వాదానికి నష్టం లేకపోయినా, వ్యక్తిత్వానికి నష్టం.

పాండిత్య ప్రకర్షలో పంతులుగారు అసమానులు. అప్పటిదాకా ఎవరూ తొక్కని కొత్తపుంతలు తొక్కాలని, ఎవరూ చేయని ఫీట్లు చేయాలని వారి సంకల్పం. ఐతే లాక్షణికుల శాసనాలను అతిక్రమించకూడదు. నియమాలు ఎంత కఠినంగా ఉంటే నైపుణ్యం అంత రాణిస్తుందని పంతులుగారు భావించారు. కొన్ని కొన్ని నిషేధాలను పాటిస్తూ రచించిన కావ్యాలు తెలుగులో అప్పటికి కొన్నే ఉన్నాయి. ఒక్క సంస్కృతపు ముక్క వాడకుండా అచ్చ తెనుగులో వ్రాసినవాళ్ళు ఇద్దరే ఉన్నారు. ఒక్క వచనం కూడా రాయకుండా పూర్తిగా పద్యాలలోనే కావ్యం చెప్పినవారు ఒకరే. పెదవుల కదలిక లేని అక్షరాలతోనే గ్రంథమంతా రచించినవాళ్ళు ఇద్దరో ముగ్గురో.

అందుచేత ఈ నియమాలన్నీ ఒకే కావ్యంలో పాటిస్తూ రచన చేస్తే ఎంత యశస్సు? అని పంతులుగారు తమ ఇరవై ఒకటోయేట భావించారు. సంకెళ్ళు వేసుకొని సర్కసుఫీట్లు చేయాలనుకొన్నారు. 'శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య నైషధం' రచించారు. ఇది ప్రౌఢకావ్యం కాదని ఉత్తరోత్తరా పంతులుగారే కొట్టిపారేసినా ఆ గ్రంథాన్ని ప్రచురించీ ప్రచురించగానే ప్రశంసలు కురిసాయి. యూనివర్సిటీవారు ఆమోదించి, దాన్ని పట్టపరీక్షకు పఠనీయ గ్రంథం చేశారు. వారి పంథాను ఇతరులు అనుసరించసాగారు. (శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య కుశచరిత్ర అంటూ ఒక గ్రంథాన్ని మచ్చా వెంకటరావు అనే ఆయన రాశాడు). పంతులుగారిలో కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ వేడిలో 'రసికజన మనోరంజనం' అనే కావ్యం వ్రాశారు. దీనిలో 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధ మహాకావ్య రచనా చాతురీ ధురంధర 'సద్యశోబంధుర' అనే బిరుదులను సగర్వంగా గద్యలో చెప్పుకొన్నా ఈ కావ్యంలో నిర్వచన నిరోష్ఠ్య నియమాలు పెట్టుకోలేదు. ఒక శుద్ధాంధ్ర నియమమే పెట్టుకొన్నారు. దీన్ని పండితులు మెచ్చుకొన్నారు. ప్రభుత్వం వారు ఈ కావ్యాన్ని ఆమోదించారు. ఎఫ్.ఏ. తరగతికి పఠనీయ గ్రంథంగా పెట్టారు. పత్రికలలో ప్రశంసలు కోకొల్లలయ్యాయి. గ్రంథాల అమ్మకం వల్ల రాబడి వస్తోంది.

ఇంకెవరైనా అయితే, అంతటితో ఆగి, ఆ యశస్సును కాపాడుకొనడానికి ఆ తరహా రచనలే చేస్తూ, కాలక్షేపం చేసేవారు. కాని వీరేశలింగంగారు అలాంటివారు కారు. అప్పటికాయన చిన్నయసూరి శైలినీ, చిన్నయసూరి స్థానంలో వచ్చిన కొక్కొండవారి

పత్రికను కొండంత కొనియాడే దశలోనే ఉన్నా, ఆనాటి ఇతర పత్రికా పఠనంవల్ల వారిలో అభ్యుదయభావాలు అంకురించాయి. ఆ రోజుల్లో స్త్రీ విద్య మీదనేకాదు, స్త్రీ పునర్వివాహ సమస్యపై కూడా పురుషార్థప్రదాయినిలోనూ, తత్త్వబోధినిలోనూ వ్యాసాలు వస్తూ ఉండేవి. పంతులుగారు వాటినన్నిటిని ఆకళించుకొన్నారు.

ఆయనలో అభ్యుదయ భావ పరిణామం ఒక క్రమంలో సాగింది. ఆయన పన్నెండో ఏట ఇంగ్లీషు చదువు ప్రారంభించడానికి ముందే ఛాందస ప్రవృత్తి బలపడడం మొదలుపెట్టింది. త్రికాల సంధ్యావందనం, సహస్ర గాయత్రీజపం, సూర్యుడికి అర్ఘ్య ప్రదానం, ఆలయాలల్లో పూజలు, దయ్యాలను చూడాలనే తహతహ, హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసి మహిమలు సంపాదించాలనే ఉబలాటం ఆయన లక్షణాలు. ఇరవయ్యో సంవత్సరందాకా ఇవి ముదురుతూనే ఉన్నాయి. ఆ యేట అభ్యుదయ సాంగత్యం వల్ల పూర్వవిశ్వాసాలు కొన్ని మారడం మొదలెట్టాయి.

పంతులుగారి ఇరవయేట ఆత్మూరి లక్ష్మీనరసింహంగారు బందరునుండి బదిలీఅయి రాజమండ్రి కాలేజీకి వచ్చారు. ఆయన బ్రహ్మసమాజకులు. వీరేశలింగంగారికి వీరి పరిచయం కలిగి సాంగత్యం లభించింది. కేశవచంద్రసేనుని ఉపన్యాసాలు ఉత్సాహంతో పంతులుగారు చదివారు. పూర్వం సత్యాలని నమ్మే కొన్ని విషయాలను గురించి వారికి కొన్ని సందేహాలు కలిగాయి. 'విన్న దానినంతా విశ్వసించకూడదు; విశ్వసించిన దానిని ఆచరించాలి' అనే నమ్మకానికి వచ్చారు.

ఆత్మూరి లక్ష్మీనరసింహంగారి ప్రోత్సహంవల్ల వీరేశలింగంగారూ, వారి స్నేహితులూ ఒక డిబేటింగ్ సొసైటీ వంటిది పెట్టుకొన్నారు. ఆరోజులలో నలుగురు ఒక చోటకూడి సభ చేయడమే ఒక తప్పు! ఊళ్ళోవాళ్ళంతా వీరేశలింగంగారిని, వారి మిత్రులను వేలెత్తి చూపిస్తూ ''మీటింగ్ వాళ్ళు ''వీళ్ళేనర్రో'' అని వెక్కిరించేవాళ్ళు. అందుచేత ఇంట్లో తలుపులు మూసికొని సభ చేసుకొనేవారు. 1868లో ఇలా జరుపుకొన్నది మరో పదేళ్ళకు 1878లో ఇంకో కొత్త విడ్డూరం విషయంలో మళ్ళీ జరుపుకోవలసి వచ్చింది. పంతులుగారు తమ ముప్పయ్యోయేట రాజమండ్రిలో ప్రార్థన సమాజం స్థాపించారు. సమాజం పేరు విని పెద్ద మనుషులు సైతం పరిహసించడం చేత వీరేశలింగంగారు వారి మిత్రులు ప్రతివారం తెల్లవారుఝామున వారి మేడ మీద తలుపులు మూసికొని ప్రార్థనలు చేసుకొనేవారు.

వెక్కిరింతలకు భయపడి తొక్కినతోవను విడిచే స్వభావం పంతులుగారిలో ఏకోశాన లేదు. విశ్వసించిన భావాలను వెల్లడిచేయకపోవడం అన్నది కూడా లేదు. అందుకే స్త్రీ విద్యామండన వాదాన్ని ప్రారంభించిన ఒక ఏడాదిలో తమ ఊహల్ని స్వంత పత్రిక ద్వారా లోకానికి వెల్లడిచేయడం యుక్తమని 1874 అక్టోబరు నెలలో ''వివేకవర్ధిని'' స్థాపించారు. తమ అభిప్రాయాలను నిర్భయంగా ప్రకటించారు. దేశాభివృద్ధికోసం, భాషాభివృద్ధికోసం పాటుపడతామన్నారు. ''సర్వజనోపయుక్తములైన విషయమ్ములను, నీతివిషయమ్ములను సులభశైలినందరకును దెలియునట్లు కఠినసంధులు లోనుగాగలవి

విడిచి వ్రాయుచు నొకప్పుడన్యదేశీయులను లోనుగా గలవానిని పూనికూర్తు''[1] అని భాషా విషయంలో తమ పోలసీని ప్రకటించారు. పండితులకు గంగవెర్రులెత్తాయి.

అప్పటికే పంతులుగారు జటిలమైన భాషలో కఠినమైన సంధులతో చిన్నయసూరి 'నీతిచంద్రిక'కు ఇదే సాటి అనిపించేటట్టు 'విగ్రహతంత్రాన్ని' వ్రాసి ప్రచురించారు. ఉద్దండపండితులు శ్లాఘించారు. ఖర్చులిచ్చి పిలిపించి చెన్నపట్నంలో వీరేశలింగంగారిని బహుజనపల్లి సీతారామాచార్యులుగారు మొదలైనవారు సన్మానించారు. మధ్యన కూర్చోపెట్టుకొని ఫోటో తీయించుకున్నారు. వెండిచెంబు బహూకరించారు. అటువంటి సత్కారాలు పొందిన శైలిని పంతులుగారు సర్వజనోపయోగం కోసం వదులుకొన్నారు.

విగ్రహతంత్రాన్ని పండితులైతే మెచ్చుకున్నారు. కాని సాధారణజనులు అర్థం చేసుకోలేకపోయారు. ''ఎంతయు గడ్డుశైలి రచయింపగ బడ్డదటంచు పల్మరున్ వింతగనాకు లేఖలన పెక్కురు'', వ్రాశారని పంతులుగారే తర్వాత చెప్పుకున్నారు. ఆ పెక్కురు 'మనభాష'కి చాలా ఉపకారం చేశారు. ఆ వింతలేఖలు చదివాక పంతులుగారు తమలో తాము చాలా చర్చించుకున్నారు.

'భాషవల్ల ప్రయోజనమేమిటి? జనులు తమ అభిప్రాయాలను ఒకరికొకరు తెలుపుకొనడం. భాషలోని గ్రంథాలవల్ల ప్రయోజనమేమిటి? తమ భావాలను దూరాన ఉన్నవాళ్ళకి' రాబోయే తరాల వాళ్ళకి సులభంగా తెలపడం. అయితే గ్రంథాలు ఎలా ఉండాలి? అందరికీ తెలిసేటట్టు సులభంగా ఉండాలి' అని పంతులుగారు తమలో తాము ఒక నిర్ణయానికి వచ్చారు.[2] అభిప్రాయాన్ని వెంటనే పత్రికాముఖాన ప్రకటించారు. పండితులంగీకరించక పరిహసించారు. కొక్కొండవారు ఒక గ్రంథాలుమాత్రమే కాదు, పత్రికలు కూడ గ్రాంథికశైలిలోనే ఉండాలన్నారు. వీరేశలింగంగారు ఆ వాదాన్ని 'వివేకవర్ధని'లో ఖండించారు. ''పత్రికలభాష గ్రాంథికఫణితి నున్న పండితులుగాని వారికి బనికిరావు, పత్రికోద్దేశమే కొఱవడునుగాన, దానినెపుడు సర్వజనోపకార మొదవ. బామరులకును తెలియంగ వ్రాయవలయు'' అని ఖచ్చితంగా చెప్పారు. పంతులుగారి ఉద్దేశంలో గ్రంథరచనలో ఆవశ్యకం ''పామరులకు తెలివిపుట్టించి'' వారిని మంచి తోవకు తిప్పడమే.

యుగలక్షణాలను అవగాహన చేసికొని, భాషలో తగు మార్పులు తెచ్చుకోవాలన్న ఇంగితజ్ఞానం మార్గదర్శకులకే తెలుస్తుంది. అందుకే తిరుపతి వేంకటకవులు కూడా వీరేశలింగంగారి నిర్ణయాలకే తామూ వచ్చారు.

''కాలముబట్టి దేశమును గాంచి ప్రభుత్వమునెంచి దేశభా
షాలలితాంగి మారుటది సత్కవి సమ్మతమౌట నన్యదే
శ్యాలను నాంధ్రభాష గలవౌటను నౌచితిబట్టి మేముక
బ్బాలను వాడుచుంటి మని పండితులేగతి నొప్పుకొందురో''

1. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - మొదటి భాగం - 3వ ప్రకరణం - పుట 79లోని సీసపద్యంలోని భావాలకు వచనరూపం.
2. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - రెండవభాగం - పుట.173

అని తమ పాణిగ్రహీతలో తిరుపతి కవులు స్పష్టం చేశారు. ''పామరులుపయోగించే సామాన్యపు మాటనే ఉపయోగిస్తే మా పాండిత్యము, మా ఆధిక్యము ఏమిటండీ?'' అని లులాయశాస్త్రులు వంటివారే భావిస్తారు.[3] యుగకర్తలు క్రాంత దర్శనం చేస్తారు. అందరికీ తెలిసే సులభశైలిని చేపట్టబట్టే పంతులుగారి స్త్రీ విద్యా ప్రచారం ఒక ఏడాదిలో ఫలించింది. ఆయన హెడ్‌మాస్టరుగా ఉంటున్న ధవళేశ్వరంలోని ప్రజలు, చందాలు వేసికొని ఒక బాలికా పాఠశాలను స్థాపించారు. ఆరోజులలో ఆడవాళ్ళ పాఠశాలంటే రాజమండ్రిలో వేశ్యల చదువుకూటమనే అర్థమట.[4] అటువంటి పరిస్థితులలో బాలికా పాఠశాల స్థాపనకు ప్రజలు ముందుకు వచ్చారంటే పంతులుగారి కృషే కారణం. తలుపులు మూసుకొని మీటింగులు జరుపుకొనే అవస్థనుండి ఒక దశాబ్దంలోనే విద్యాధికులను తప్పించారు. పంతులుగారి మిత్రులు బసవరాజు గవర్రాజుగారు 'రాజమహేంద్రవర దేశపాఠశాలా సమాజా'న్ని స్థాపించారు. ప్రతి ఆదివారం ఉపన్యాసాలు ఉండేవి. వీరేశలింగంగారు ప్రతివారం మధ్యాహ్నం 3 గంటలకి ఎండవేళప్పుడు 4 మైళ్ళు నడిచి వెళ్ళి రాజమండ్రిలో ఉపన్యాసం ఇచ్చి మళ్ళీ వస్తూ ఒంటరిగా ధవళేశ్వరానికి నడిచి వెళ్ళేవారు. 'జనోపయుక్తమైన సభలన్న నాకప్పుడంత ఉత్సాహము'' అని పంతులుగారు స్వీయచరిత్రలో చెప్పారు.

మీటింగులలాగే ప్రార్థనలు కూడా తలుపులు మూసికొని చేసే అవస్థకూడ ఏడాదిలోనే పంతులుగారు తప్పించారు. రాజమండ్రిలోనే వున్న విజయనగరం మహారాజా వారి బాలికా పాఠశాలలోనికి ప్రార్థన సమాజాన్ని మార్చారు. బహిరంగంగా ప్రార్థనలు, ఉపన్యాసాలు జరిగేవి. వందలకొద్దీ ప్రజలు వచ్చి ప్రార్థనలు వినేవారు. వర్తకులు తమ అంగళ్ళను కూడా కట్టేసి వచ్చి పాల్గొనేవారు. ప్రార్థన సమాజం సభ్యులు రాత్రి బడులు పెట్టి విద్యాదానం చేసేవారు. పోనుపోను పంతులుగారు సారంగధరమెట్ట మీదనే ప్రార్థనలు చేసేవారు. వారి వెంట సమాజం సభ్యులు, విద్యార్థులు ఊరేగింపులా వెళ్ళేవారు. రాత్రి దారి పొడుగునా పాటలు పాడుకుంటూ ఇళ్ళకు చేరుకొనేవారు. యువకులూ ముందుకు వచ్చారు. ఉద్యోగులు, వృద్ధులు గడగడలాడారు. అధికారంలో ఉన్నవారు ఆగ్రహించారు. కుటిలకార్యాలు చేసేవాళ్ళు కోపం వెళ్ళగక్కారు. పంతులుగారి మాటలలోనే చెప్పాలంటే -

''లంచములు తగవన్న రాజకీయోద్యోగులకు కోపము; వేశ్యాంగన సంగమము నీతి కాదన్న శృంగార నాయకులకు కోపము. పూర్వాచారములు మార్చుకోవలెనన్న పామర జనులకు కోపము. నీతిమాలిన బాహ్యావేషములు మతవిరుద్ధములన్న ఆచార్య పురుషులకు కోపము. మా పత్రికోద్దేశమును నిశ్శంకముగా నిర్వహింపవలసినచోనిన్ని కోపములను సరకు చేయకుండవలెను''.[5] వీరేశలింగంగారు ఆ కోపాలను లక్ష్యపెట్టలేదు. దుర్మార్గులమీద, దురాచారపరులమీద, దుష్టచిత్తులమీద, సంఘ జీవితాన్ని కలుషితం

3. వీరేశలింగంగారి సంపూర్ణ గ్రంథావళి - 1వ సంపుటం. హాస్య సంజీవిని తృతీయభాగం పుట-83
4. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - ప్రథమ భాగం - 3వ ప్రకరణం - పు.91
5. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - ప్రథమ భాగం - 3వ ప్రకరణం - పు.83

చేస్తున్న కపటచిత్తులమీద, ఆషాడభూతులమీద, దొంగవైద్యులమీద, కుహనా స్వాములమీద, భూతవైద్యులమీద, భోగలాలసులమీద, తమ తరక్షురూక్ష లేఖినిని దూశారు.

స్త్రీ విద్యకోసం ప్రచారం చేశాక, పంతులుగారు స్త్రీ పునర్వివాహాల కోసం కృషి చేశారు. 1874లోనే చెన్నపట్నంలో ప్రముఖులు పునర్వివాహ సమాజాన్ని స్థాపించారు. అన్ని మండలాలకు ప్రకటన పత్రికలు పంపారు. పంతులుగారు అప్పటికీ ''అనామకులు'' కనుక వారికి పంపలేదు. ఇంతలో పురుషార్థప్రదాయినిలో ఎవరో ''సౌఖ్యార్థి'' అనే మారు పేరుతో పునర్వివాహ విషయంపై రాశారు. అది పంతులుగారే రాసి ఉంటారని పొరపడి, ధర్మవరం కృష్ణమాచార్యులుగారు ఒక ఉత్తరం రాశారు. ''మీరట్టిపనిగుణవంతమని వాదింప బూనుకొందురేని క్రియాసాధన మేమియు లేకున్నను కొందరచేనేని నిందింపబడుట ప్రాప్తించు'' అని చెప్పారు. ఆ లేఖలోనే ఇంకా ఎత్తిపొడిచారు. ''చెన్నపట్నమున అట్టి సమాజమేర్పడి దాదాపున రెండేండ్లగుచు వచ్చెగదా, ఏదీ ఎందరు బాలవిధవలు వారిచే వివాహితులైరి? ఈ హిందువులెట్టి వారోగాని, ఎట్టి నూతనాచారమునకును నెడమీయరు'' అని ధర్మవరం వారు నొక్కి చెప్పారు. ఆయన స్త్రీ విద్యకు అనుకూలురే, దానికి పూనుకున్నవారే అయినా పునర్వివాహాలకు సుముఖులు కారు. ''స్త్రీ విద్యకును విధవా వివాహమునకును నింతయంతరముండుటయు, అవి రెండింటిని నేయేవిధమున జనసామాన్య మెన్నుటయు నెఱింగిన మీకు విశేషము విన్నవింపలేను'' అని ధర్మవరం వారు వ్రాశారు.[6] విశేషాలు పంతులుగారే చిత్తానికి తెచ్చుకున్నారు.

ఈలోగా విశాఖపట్టణంలో పరవస్తు వెంకటరంగాచార్యులుగారు 1875లోనే స్త్రీ పునర్వివాహాలు శాస్త్ర సమ్మతాలని సమర్థిస్తూ ఒక చిన్న గ్రంథాన్ని ప్రకటించారు. ఉత్తరోత్తరా వీరికి మహామహోపాధ్యాయ అన్న బిరుదు వచ్చింది. ఆయన అంతటి ఉద్దండ పండితులైనా, కొక్కొండ వారి దృష్టిలో మాత్రం నవనాగరికతాధీనులు. పరవస్తు వారి వాదాన్ని ఖండించడానికి కొక్కొండ వారు వీరేశలింగంగారిని కలుపుకోవాలని చూశారు. నవనాగరికులకున్న స్వాతంత్ర్యము మనకును కలదు. జంకనేల? తోచిన ధర్మము నిక్కముగ వక్కాణించుట కెల్లరును స్వతంత్రులు కాబట్టి తాము దురాచారమర్దనమునకు నడుగిడుడు'' అని ఒక జాబు వ్రాశారు.[7] వీరేశలింగంగారు అక్షరాలా అంతే చేశారు. అయితే కొక్కొండవారిలాగా పునర్వివాహం దురాచారమని భావించలేదు. నిషేధమే దురాచారమని భావించారు. అతి బాల్య వివాహాలవల్లనే నిర్బంధ వైధవ్యం ప్రాప్తిస్తున్నదని, శుద్ధ వ్యావహారిక భాషలో ''బ్రాహ్మవివాహం'' అనే నాటకం వ్రాశారు. దానిని జనులు గుంపులు గుంపులుగా కూర్చుని చదువుకొనేవారు. పంతులుగారు ఏ పేరు పెట్టినా లోకులు దాన్ని ''పెద్దయ్యగారి పెళ్ళిపుస్తకం'' అని పేర్కొనేవారు. ఇది తెలుగులో మొట్టమొదటి సాంఘిక నాటకం.

---

6. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - మొదటి భాగం - 4వ ప్రకరణం పుట.147
7. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - మొదటి భాగం - పుట.146

కొందరు పరిశోధకుల దృష్టిలో వావిలాల వాసుదేవశాస్త్రిగారు వ్రాసిన నందక రాజ్యం' మన భాషలో ప్రప్రథమ సాంఘిక నాటకం. అయితే అది 1880లో ప్రచురణ అయ్యింది. వీరేశలింగంగారి బ్రాహ్మవివాహం 1876లోనే హాస్యసంజీవినిలో సీరియల్‌గా ప్రకటన పొందింది. 1878లోనే పుస్తకరూపం పొందింది. 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకా'న్ని విద్యావిహీనులు సైతం విని ఆనందించేవారు. ఈ రోజులలోనే పంతులుగారి దృష్టి పూర్తిగా వచనం వైపు మళ్ళింది. ''పుస్తకములను సంస్కృత భాషలో వ్రాయుటకంటె దేశభాషలలోనే వ్రాయుట మేలైనపని, అట్టి యుపయుక్త గ్రంథములను వచనములుగా వ్రాయుట ముఖ్యకార్యము'' అని 1875లోనే స్థిరమైన అభిప్రాయానికి వచ్చారు. కవితా చమత్కృతులు, వర్ణనలు ఉండి, ఉల్లాసం పుట్టించే కొన్ని గ్రంథాలు సైతం పద్యరూపంలో ఉండవచ్చునన్న అభిప్రాయం కూడ వారి కుంది. శృంగార ప్రబంధాలు చేయు మేలుకంటె కీడెక్కువ అన్న సిద్ధాంతానికి వచ్చి పూర్వ ప్రబంధాలను అవహేళనచేస్తూ 'అభాగ్యోపాఖ్యానం' రచించారు. ఆనాటి కుళ్ళిపోయిన సమాజంలో ఆంధ్రదేశంలోని ఏ ఊరికైనా వర్తించేటట్టు ఒక్క చరణంలో ''పురిని పుట్టిన యుక్కైన పుచ్చిపోవు'' అని మన దౌర్భాగ్యాన్ని వర్ణించారు.

ఈ దౌర్భాగ్యాన్ని రూపుమాపి దేశాభివృద్ధిని సాధించడానికి పంతులుగారు సంఘ సంస్కార సమాజాన్ని స్థాపించారు. పంతులుగారి సహపాఠి, దేశాభిమాని, ప్రియమిత్రుడు చల్లపల్లి బాపయ్యగారు స్త్రీ పునర్వివాహ విషయమై కృషి చేయాలని పంతులుగారితో చెప్పారు. తమకు విశేష పాండిత్యం, విత్తం, లౌకికాధికారం లేకపోగా దుర్బలశరీరం ఉండడం చేత ఆ కార్యభారం వహించలేమని పంతులుగారు భావించారు. అయినా బాపయ్యగారు నిరాశులు కాలేదు. మళ్ళీ మళ్ళీ ఈ ప్రసక్తి తెస్తూనే ఉండేవాడు. ఒకనాడు పంతులుగారు బాపయ్యగారిని చూసి ''నిన్ను మీ అన్నలు విడిచి పెట్టినా, బంధువులు బాధపెట్టినా, నన్ను విడవక, కడవరకు నాతో పనిచేస్తావా?'' అని ప్రశ్నించారు. బాపయ్యగారు అణుమాత్రం సంశయించక ''మీతో ఉంటాను'' అన్నారు. అది ఈశ్వర ప్రేరితమైన ఆజ్ఞగా పంతులుగారు భావించారు. మారుమాటాడక సభాహ్వాన పత్రికను వ్రాసి పట్టుకరమ్మన్నారు. తామే సంతకం పెట్టి ప్రకటిస్తామన్నారు. మహోద్యమానికి నాయకత్వం వహించారు.

చిన్నప్పటినుండి వీరేశలింగంగారిలో నాయకత్వపు లక్షణాలున్నాయి. ఛాందసత్వపు రోజులలో కూడా ఆయన ఉపదేశం విని హిమాలయ పర్వతం మీద తపస్సు చేసుకొనడానికి ముగ్గురిని ప్రయాణం చేయించారు. 18వ ఏట పాఠశాలలో ఉన్న అందరిలోను, ఎవరు మంచి విద్యార్థి అన్న సంగతి తేల్చవలసివస్తే తమ తరగతి వాళ్ళేకాక పై తరగతివాళ్ళు, 'క్రింది తరగతివాళ్ళు' ఏకగ్రీవంగా వీరేశలింగంగారి పేరే చెప్పారు. 19వ ఏట వీరేశలింగంగారు విద్యార్థినాయకులయ్యారు. అట్టే ఇంగ్లీషు సాహిత్యం లేని అసమర్థుడు హెడ్మాష్టరుగా ఉండకూడదని ఆందోళన లేవదీశారు. మహజర్లు పెట్టించారు, సిమ్మెలు చేయించారు. ప్రభుత్వంవారి విద్యాశాఖనే ఒక ఊపు ఊపి, హెడ్మాష్టరును బదిలీ చేయించారు. ఆయన కార్యదీక్ష అటువంటిది.

పంథొమ్మిదవ ఏటనే అంత దక్షులైన పంతులుగారు, ముప్ఫయిఒకటో ఏట పరిపూర్ణ నాయకులయ్యారు. పునర్వివాహ సమస్యను కూలంకషంగా చర్చించుకో దలచారు. ఆరోజులలో ఈ సమస్యపై ఏయే గ్రంథాలున్నాయో వారికి తెలియవు. ఈశ్వరచంద్ర విద్యాసాగరుల గ్రంథమున్నట్లు తెలిసినా, అప్పుడు వారికది లభించలేదు. మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, పరాశర స్మృతి మాత్రమే ఉన్నాయి. తత్త్వబోధినిలో వ్యాసం ఒకటి, పురుషార్థప్రదాయినిలో వ్యాసం ఒకటి వారికి తోడ్పడ్డాయి. ఈ గ్రంథాల సహాయంతో పంతులుగారు తమ తొలివ్యాసం వ్రాశారు. విప్లవ యజ్ఞం మొదలుపెట్టారు. ఈ యజ్ఞానికి పరోక్షంగా సామినేని వారి హితసూచని సామిధేని మంత్రాలు చదివింది.[8] చిన్నయసూరిగారి తీరున కాక జియ్యరు సూరిగారి తెన్నున వెళ్ళడంవల్లనే పంతులుగారు విప్లవోన్ముఖులయ్యారు.[9] సభను ఏర్పాటు చేశారు.

ఆహ్వాన పత్రికలు వెళ్ళగానే వైదికవృత్తిలోని వాళ్ళు ధ్వజమెత్తారు. పూర్వాచారపరాయణులైన లౌకికశిఖామణులు, వైదికోత్తములు కత్తులు నూరారు. 1879 జూలై 7వ తేదీన రాజమండ్రిలోని, విజయనగర మహారాజావారి బాలికా పాఠశాలలో స్త్రీ పునర్వివాహ విషయంపై మొదటి ఉపన్యాసం చేశారు. ఆగస్టు 3వ తారీఖున ప్రప్రథమ విజ్ఞాపన చదివారు. ఆరోజు మొదలుకొని ఊళ్ళో ప్రతిఇంటా మళ్ళీపెళ్ళి చర్చలే జరిగాయి. వీధుల్లో అందరూ ఆ విషయాలే చెప్పుకోసాగారు. పంతులుగారి ఉపన్యాసం అచ్చుపడగానే ఆంధ్రదేశమంతటా దుమారం రేగింది. ప్రతివాదులకు సభలలోనూ, పత్రికా ముఖానా పంతులుగారు సమాధానాలు ఇవ్వసాగారు.

ఈ రచనలు ముఖ్యంగా పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం చదువుకొనేవారి యొక్క వేడుక కోసమే ఉపయోగపడుతున్నాయని, అంతకంటె ఎక్కువ ప్రయోజనం దానివల్ల కలగలేదని పంతులుగారు భావించారు. ఎవరైనా తాను ఉపదేశించేదాన్ని అనుష్ఠించి చూపిస్తేనేగాని కేవల శుష్కోపన్యాసాలవల్ల, పుస్తక ప్రకటనవల్ల కార్యముండదనే నిశ్చయానికి పంతులుగారు వచ్చారు. స్త్రీ పునర్వివాహ సంఘంలో ఒక ఆంతరంగిక వర్గాన్ని ఏర్పరిచారు. రెండేళ్ళపాటు దేశమంతటా వాద ప్రతివాదరూపమైన వాగ్యుద్ధం జరుగుతున్నా, క్రియలేని నిరర్థకవాదం ఎందుకని ఆచరణకు పూనుకొన్నారు.

వివాహం అన్నది జీవితంలో చాలా ముఖ్యమైన సంస్కారాలలో ఒకటి. వివాహమయ్యాక దంపతులు సంఘంలో జీవించాలి. సంఘం వారికి సర్వవిధాల సహాయం చేయాలి. పునర్వివాహం చేసుకున్నవాళ్ళకి ఈ సదుపాయాలు ఉండవు.

8. సామినేని ముద్దునరసింహంగారి వివరాలకోసం కుంఫిణీ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటి చూడండి.

9. జియ్యరుసూరి 1876లో బెంగుళూరునుండి ''స్త్రీకళాకల్లోలిని'' అనే గ్రంథాన్ని ప్రకటించారు. ఈయన ఆ బెంగుళూరులోని 36వ పదాది పటాలపు బాలికా పాఠశాలలో ప్రథమోపాధ్యాయుడు. 275 పుటలలో, 3 విభాగాలలో స్త్రీలకు ఉపయోగించే వ్యాసాలు, ద్విపదలు మధురమైన శైలిలో రాశారు. ఈ పుస్తకం వీరేశలింగంగారిని ప్రభావితులను చేసింది. చూ॥ డాక్టరు అక్కిరాజు రమాపతిరావుగారి ''వీరేశలింగం పంతులు – సమగ్ర పరిశీలన'', పుటలు 218, 219, ఈ పుటలలోని విషయాల గురించి 387వ పుటలోని వివరణ.

అందుచేత వాళ్ళకు సంఘంలోని ఒక వర్గమైనా చేయూత ఇవ్వాలి. వాళ్ళని ఆదుకోవాలి. పునర్వివాహం చేసుకున్నవాళ్ళకి ఆర్థిక రక్షణ ఉండాలి. నెలసరి ఆదాయానికి హామీలు ఉండాలి. పునర్వివాహం చేసుకొనేవాళ్ళ పోషణ భారం తనమీదనే ఉందని పంతులుగారు భావించారు. అభ్యుదయభావాలు గల శ్రీమంతులతో సంప్రదించారు. అన్నదేవరపేట జమీందారులైన పైడా రామకృష్ణయ్యగారు పంతులుగారి ఉద్యమానికి ముప్పయివేల రూపాయలు ఇస్తామన్నారు.

ఆర్థిక సహాయం లభిస్తుందన్న విశ్వాసం కలిగాక పంతులుగారు విజృంభించారు. వితంతు కన్యలు దొరికితే తాము వివాహమాడుతామని కాలేజీలోని విద్యార్థులు అనేకులు ముందుకొచ్చారు. పంతులుగారు, బాపయ్యగారు ఇంటింటికి తిరిగి అడిగితే లౌక్యులయిన బ్రాహ్మణ గృహస్థులు ముప్పయిమందికంటే ఎక్కువమంది వివాహ భోజనానికి వస్తామన్నారు. సబ్‌జడ్జీ , డిస్ట్రిక్టు మునసబులు, న్యాయవాదులు చేయూత ఇచ్చారు.

అంతలో పునర్వివాహ ప్రయత్నాలు ఆపడానికి విరూపాక్ష పీఠాధిపతులు రాజమండ్రిలో దిగారు. వీరేశలింగంగారు ఆ స్వాములవారి అకృత్యాలను వివేకవర్ధినిలో బయటపెట్టారు. అందుచేత స్వాములవారికి రాజమండ్రిలో భిక్షలే కరువయ్యాయి. పీఠం సిబ్బందిలో ఒక కులటాపుత్రుడున్నాడట. అతణ్ణి బయటకు పంపించేదాకా స్వాములవారి ముఖం చూసినవాళ్ళే లేరు. స్త్రీ పునర్వివాహ విషయం మీద శాస్త్ర సిద్ధాంత నిర్ణయం చేయడానికి సభ పెట్టించండని పంతులుగారు స్వాములవారిని సవాలు చేశారు. సభ ముగిసినప్పటికి స్వాముల వారి ప్రతినిధి అద్దేపల్లి కృష్ణశాస్త్రిగారు 'బహుజనులు అభిప్రాయపడితే కొత్త నిబంధనలు చేసుకోవచ్చు. ఆక్షేపం లేదని'' ఒప్పుకొని తప్పుకొన్నారు.

వీరేశలింగంగారి శాస్త్రజ్ఞానం అంతటి నిర్దుష్టమైంది. ఆయన కలకత్తానుంచి, బొంబాయి నుంచి ఎన్నో గ్రంథాలు తెప్పించారు. శాస్త్రవిచార విషయాల్లో అనుమానాలు వచ్చినప్పుడు కలకత్తాలోని ఈశ్వరచంద్రవిద్యాసాగరులతో, బొంబాయిలోని మహాదేవ రానడే గారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి సందేహాలు తీర్చుకొనేవారు. పీఠాధిపతులను ఓడించి, వారి ఆంక్షలను వారి ముఖం మీదనే కొట్టి, పంతులుగారు 1881 డిసెంబరు 11వ తేదీన ఆంధ్రదేశంలో మొదటి పునర్వివాహం జరిపించారు.

పెళ్ళిళ్ళలో కాగడాలు వేసే చాకలివాళ్లనూ, బాజాలు వాయించే మంగలవాళ్ళను ప్రతిపక్షులు బెదిరించారు. పంతులుగారు డబ్బు విచ్చలవిడిగా వెదజల్లి ఊళ్ళో ఉన్న భజంత్రీమేళాలన్నింటినీ ఒక పెళ్ళికి కుదిర్చేశారు. పెళ్ళి చేయించవలసిన పురోహితుని భార్య గోదావరిలో పడతానంది. పురోహితుడికి వంద రూపాయలు ఇచ్చారు. వంట బ్రాహ్మణులకు, నీళ్ళ బ్రాహ్మణులకు నూరేసి రూపాయలిచ్చి నెలకు ఏడేసి రూపాయల జీతం, ఏడాదిపాటు ఉద్యోగానికి గ్యారంటీ, పెళ్ళిరోజుల్లో నాలుగేసి రూపాయల బత్తా చొప్పున ఏర్పాటు చేసి పెట్టుకున్నారు. పెళ్ళి సమయంలో హిందూ రక్షకభటులు

ప్రతిపక్షులతో కలుస్తారేమో అన్న భయంతో పంతులుగారు అధికారులను చూశారు. వాళ్ళు పై స్థలాలనుండి మహమ్మదీయ, క్రైస్తవ రక్షక భటులను రప్పించారు.

పంతులుగారిని ఉద్యమ నాయకత్వాన్ని స్వీకరించమని తాను వెంటనుంటానన్న చల్లపల్లి బాపయ్యగారు పెళ్ళికి రాలేకపోయారు. అన్నలకు భయపడనంటూ చెప్పిన ఆయనను ఆ అన్నలే ఆ రాత్రి గదిలోపెట్టి తాళం వేశారు. న్యాపతి సుబ్బారావుగారు అద్దె ఇంట్లో ఉంటున్నారు. పెళ్ళికి వెళితే మళ్ళీ గుమ్మంలో అడుగుపెట్టకూడదన్నారు ఇంటి యజమానులు. స్వగృహంలో ఉంటే వచ్చేవారే. అయినా చాలామంది ధైర్యవంతులు, దేశాభిమానులు తాంబూలానికే కాక భోజనాలకు కూడా వచ్చారు.

పెళ్ళి ఊరేగింపులో జిల్లాజడ్జీ, జాయింటు మేజిస్ట్రేటు, కాలేజీ ప్రిన్సిపాలు మొదలైన తెల్లదొరలు నడిచారు. పోలీసు సూపర్నెంటు దగ్గరుండి బందోబస్తు చేశారు. 'ఆ రాత్రి జరిగిన ఊరేగింపు మహోన్నతవైభవం సంస్థానాధిపతుల వివాహములందు కూడా జరిగియుండదు' అని పంతులుగారు స్వీయచరిత్రలో వ్రాశారు. తమకు ఇష్టం లేకపోయినా ఊరేగింపులో భోగంమేళం పెట్టారు. ఎంచేతనంటే 'మేళం లేని పెళ్ళి పెళ్ళి కాదంటారేమో?' తాము చేసినది సలక్షణమైన వివాహం అని నిరూపించాలి. అందుకే రాజీపడ్డారు. మెజారిటీ అభిప్రాయాన్ని మన్నించారు. నాలుగు రోజుల్లో ఇంకో వివాహం జరిపించారు.

వితంతు వివాహ ప్రయత్న ప్రారంభదశలో పంతులుగారికి విశిష్టజనులకంటె విద్యార్థిజనులే ఎక్కువ సాయం చేశారు. పంతులుగారు పిన్నవాళ్ళకు, పెద్దవాళ్ళకు సమానంగానే బోధించినా పెద్దవాళ్ళ గుండెలు కాలినకుండలలాగ గట్టిపడి నూతనోపదేశాలు లోతుకు దిగలేదు. విద్యార్థుల గుండెలు పచ్చికుండలు. మెత్తన. నూతనోపదేశాలు సులభంగా నాటుకొన్నాయి. విద్యార్థులు వెన్నంటి అంగరక్షకులుగా ఉండడం వల్ల యువశక్తులు అండదండలు ఇవ్వడం వల్ల పంతులుగారు పాతికేళ్ళలో 55 పునర్వివాహాలు చేయించారు.

ఈ సంఘసంస్కారం ఇలా సాగుతూ ఉండగా పంతులుగారు తమ బహుముఖ ప్రజ్ఞను వివిధ ప్రక్రియలలో చూపించారు.

సంస్కృతం నుంచి ఆంగ్లం నుంచి నాటకాలు తెనిగించారు. స్వతంత్ర నాటకాలు వ్రాశారు. వాటిని ఆడించారు.

నవలలు వ్రాశారు. కావ్యాలు చేశారు. వ్యాసాలు వ్రాశారు. ప్రహసనాలు గుప్పించారు.

స్త్రీలకోసం రచనలు చేశారు. పత్రిక నడిపారు. రెండవ తరగతి వాచకం నుండి పండిత సమ్మతమైన కవుల చరిత్రదాకా ఎన్నో రచనలు చేశారు.

వారి పుస్తకాల జాబితా తయారుచేస్తే, తాపీ ధర్మారావుగారు చెప్పినట్లు ఏదో పుస్తకాల వ్యాపారి కేటలాగు లాగ ఉంటుంది.[10] చూడండి.

---

10. వీరేశలింగంగారి సంపూర్ణ గ్రంథావళి, పరిష్కరించిన గ్రంథాలు.

వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి

మొదటి సంపుటం - ప్రహసనాలు

1. అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం
2. విచిత్ర వివాహ ప్రహసనం
3. మహాబధిర ప్రహసనం
4. పునర్మరణ ప్రహసనం
5. బలాత్కార గాన వినోద ప్రహసనం
6. కలహ ప్రియ ప్రహసనం
7. మహామహోపాధ్యాయ ప్రహసనం
8. యోగనిద్రా ప్రహసనం
9. మహాపంచక ప్రహసనం
10. అసహాయ శూర ప్రహసనం
11. కలిపురుష శనైశ్చర విలాసం
12. వేశ్యాప్రియా ప్రహసనం
13. కౌతుక వర్ధని
14. హాస్య సంజీవని - మొదటి భాగం
15. హాస్య సంజీవిని - రెండవ భాగం
16. హాస్య సంజీవిని - మూడవ భాగం

రెండవ సంపుటం - నాటకాలు

17. బ్రాహ్మ వివాహం
18. వ్యవహార ధర్మబోధిని
19. తిర్యగ్విద్వన్మహాసభ (మూషకాసుర విజయం)
20. మహారణ్యా పురాధిపత్యం
21. ప్రహ్లాద నాటకం
22. సత్యహరిశ్చంద్ర నాటకం
23. వివేక దీపిక

మూడవ సంపుటం - భాషాంతరీకృత నాటకాలు

25. చమత్కార రత్నావళి
26. రాగమంజరి
27. కళ్యాణ కల్పవల్లి
28. అభిజ్ఞాన శాకుంతలం
29. రత్నావళి
30. మాళవికాగ్ని మిత్రం
31. ప్రబోధ చంద్రోదయం
32. వినీసు వర్తక చరిత్రం

నాల్గవ సంపుటం – వచన ప్రబంధాలు, పద్యకావ్యాలు

33. సత్య రాజా పూర్వ దేశ యాత్రలు - మొదటి భాగం
34. సత్య రాజా పూర్వ దేశ యాత్రలు - 2వ భాగం
35. రాజశేఖర చరిత్ర
36. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం
37. రసిక జన మనోరంజనం
38. శుద్ధాంధ్ర భారత సంగ్రహం
39. అభాగ్యోపాఖ్యానం
40. పథిక విలాసం
41. జాన్ గిల్పిన్
42. నీతి దీపిక

అయిదవ సంపుటం – స్త్రీలకుపయోగించు కథలు

43. సత్యవతీ చరిత్ర
44. చంద్రమతీ చరిత్ర
45. సత్య సంజీవిని
46. చమత్కార రత్నావళి
47. సతీమణి విజయం
48. సుమిత్ర చరిత్రం
49. రఘుదేవ రాజీయం
50. కురంగేశ్వర వర్తక చరిత్రం
51. కళావతి పరిణయం
52. గయ్యాళిని సాధు చేయుట
53. చిత్రకేతు చరిత్రం
54. దానకేసరి విలాసం
55. వైదర్భీ విలాసం
56. భానుమతీ కళ్యాణం
57. సరసిజన మనోభిరామం
58. ధర్మకవచోపాఖ్యానం
59. కుమారద్వయ విలాసం
60. పద్మినీ ప్రభాకరం
61. మాలతీ మధుకరం
62. స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసం
63. స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమ విజ్ఞాపనం

64. స్త్రీ పునర్వివాహ విషయక ద్వితీయ విజ్ఞాపనం
65. స్త్రీ పునర్వివాహ శాస్త్ర సంగ్రహం
66. స్త్రీ పునర్వివాహ భూత వర్తమాన స్థితులు

ఆరవ సంపుటం - స్త్రీలకుపయోగించు పుస్తకాలు

67. శ్రీ విక్టోరియా మహారాజ్ఞి చరిత్రం
68. సతీహిత బోధిని
69. పత్నీహిత సూచని
70. స్త్రీ నీతిదీపిక
71. సత్యాద్రౌపదీ సంవాదం : మాతృపూజ-పితృపూజ
72. నీతి కథామంజరి - ప్రథమ భాగం
73. నీతి కథామంజరి - ద్వితీయ భాగం
74. దేహారోగ్య ధర్మబోధిని

ఏడవ సంపుటం - ఉపన్యాసాలు

75. జన్మాంతరము
76. అతిబాల్య వివాహం
77. విగ్రహారాధనం
78. ఈశ్వరదత్త పుస్తకములు
79. ఈశ్వరోపాసనం
80. ప్రార్థన
81. మానుష ధర్మం
82. విద్యాధికుల ధర్మాలు - మనుష్య జీవితముల యొక్క పరమార్థం
83. వైరాగ్యం
84. విద్యాధురీణుల యర్థాకృత్యములు
85. వర్ణము
86. హిందూమతాలు
87. స్వయంకృషి
88. సకాయ కష్టకర్మాలు
89. వేశ్యకాంతల ఉపన్యాసాలు
90. ఐకమత్యం
91. దానములు
92. స్త్రీ పునర్వివాహ చరిత్రం

ఎనిమిదవ సంపుటం – ఉపన్యాసాలు, జీవ చరిత్రలు

93. దేశీయ మహాసభ - దాని వుద్దేశ్యం
94. శంకరాచార్యులు
95. బసవరాజు గవర్రాజుగారి జీవ చరిత్రలు
96. జీసస్ చరిత్రం
97. స్వదేశ సంస్థాన చరిత్రాదులు
98. విగ్రహతంత్ర విమర్శనం
99. ఉపన్యాసమంజరి
100. వివేక వర్ధిని - మొదటి భాగం
101. వివేక వర్ధిని - 2వ భాగం
102. వివేక వర్ధిని - 3వ భాగం

తొమ్మిదవ సంపుటం – సాహిత్య గ్రంథాలు

103. సంగ్రహ వ్యాకరణం
104. కావ్య సంగ్రహం
105. అలంకార సంగ్రహం
106. నీతి చంద్రిక - విగ్రహం
107. నీతి చంద్రిక - సంధి
108. తర్క సంగ్రహం
109. సత్యవాదిని
110. ఉత్తమ స్త్రీ చరిత్రములు

పదవ సంపుటం – పూర్వాంధ్రకవులు

111. ఆధునికాంధ్రకవులు

పదకొండవ సంపుటం

112. స్వీయచరిత్ర-1

పన్నెండవ సంపుటం

113. స్వీయచరిత్ర-2

వీరేశలింగంగారు పరిష్కరించి ప్రకటించిన గ్రంథావళి

1. కవిరాజ మనోరంజనం
   అను పురూరవచ్చరిత్రము - కనపర్తి యబ్బయామాత్యుడు
2. మొల్ల రామాయణము - మొల్ల
3. ప్రభావతీ ప్రద్యుమ్నము - పింగళి సూరన

4.	పాంచాలీ పరిణయము	-	కాకుమాని మూర్తికవి
5.	రామాభ్యుదయము	-	అయ్యలరాజు రామభద్రకవి
6.	విజ్ఞానేశ్వరము	-	కేతన
7.	ఉత్తర హరివంశము	-	నాచన సోమన
8.	చిత్ర భారతము	-	చరిగొండ ధర్మన
9.	పంచతంత్రము	-	నారాయణకవి
10.	రాజశేఖర చరిత్రము	-	మాదయగారి మల్లన
11.	ఆంధ్రభాషా భూషణము	-	కేతన
12.	కవి సంశయ విచ్ఛేదాది గ్రంథములు	-	అడిదము సూరకవి
13.	హరిశ్చంద్రోపాఖ్యానము	-	శంకరకవి
14.	ఆంధ్ర భాషార్ణవము	-	కోట వేంకనార్యుడు
15.	జైమిని భాగతము	-	పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు
16.	చమత్కారమంజరి	-	సింహాద్రి వేంకటాచార్యుడు
17.	ప్రబోధచంద్రోదయ పద్యకావ్యము	-	నందిమల్లయ్య, ఘంటసింగయ్య
18.	దశకుమార చరిత్రము	-	కేతన
19.	సుదక్షిణా పరిణయము	-	తెనాలి యన్నయార్యుడు
20.	భోజరాజీయము	-	అనంతామాత్యుడు
21.	వరాహపురాణము	-	నంది మల్లయ్య, ఘంట సింగయ్య

''తెలుగుభాషను వృద్ధి చేయవలెనన్న అభిలాషము నాకు మొదటి నుండియు విశేషముగా నుండెను. నేను నా కాలమంతయు భాషాభివృద్ధి నిమిత్తమే యుపయోగించి పాటుపడిన పక్షమున గొంతవరకు నా యభిలాషము నెరవేరియుండునేమో'' అని పంతులుగారు స్వీయచరిత్రలో వ్రాసుకొన్నారు.[11] వారికి పన్నెండో యేటినుండి యుద్ధాల గురించి తపస్సుల గురించి చదవడం సరదా. పెద్దయ్యాక తామే ఎన్నో యుద్ధాలు చేశారు. అభ్యుదయం కోసం ఎంతో తపస్సు చేశారు. ఆ యుద్ధాలకోసం, ఆ తపస్సు కోసం తమ చిన్నప్పటి 'అభిలాషములు' ఎన్నో మార్చుకొన్నారు. ఆదిలో భారతంలో ఆయనకు ఉత్తరగోగ్రహణం చాలా ఇష్టం. అయితే పెద్దయ్యాక ఆయన దక్షిణగోగ్రహణాన్నే స్వతంత్ర నాటకంగా వ్రాశారు. తాము చేయవలసిన నీతిబోధకి అదే అనువు.

అలాగే చిన్నప్పుడు ఆయనకు వసుచరిత్ర అంటే ఎంతో మోజు. అయితే వాళ్ళింట్లో ఉన్న తాటాకు కట్టల్లో అది లేదు. బజారులో కొనుక్కోవచ్చు. బళ్ళో జీతం కట్టకుండా ఆ సొమ్ముతో పుస్తకం వాయిదాలమీద కొనుక్కొని చదవాలని ఆయన ఉబలాటపడ్డారు. ఒక నెలజీతం ఎడ్వాన్సుగా ఇచ్చి షాపులోనే కూర్చుని చదువుకొనే ఒప్పందం చేసుకొన్నారు. బడి ఎగవేస్తున్న సంగతి రెండో నెలలో బయటపడింది. పంతులుగారి తల్లిగారు పుస్తకం కొని ఇచ్చింది. వసుచరిత్ర కోసం చిన్నప్పుడు తల్లిగారిని మోసం చేసిన పంతులుగారు పెద్దయ్యాక ''వసుచరిత్రాది గ్రంథములు సహితమంతగా చదువతగినవి

11. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - రెండోభాగం, 2వ ప్రకరణం - పు.263

కావు''. ''అవి సహితము పరిమళయుక్తమై విషస్వభావములు గల పుష్పమాలవలె తమ సౌరభము ననుభవింప బూనువారిని కామోన్మత్తుల జేయకమానవు'' అనే అభిప్రాయానికి వచ్చారు.[12] తారశశాంకవిజయం లాంటివి తగలెట్టమన్నారు.[13]

సంఘసంస్కారాన్ని చేపట్టకముందు పంతులుగారు కావ్యరచన చేస్తూ గర్భ కవిత్వము, బంధకవిత్వమూ వ్రాసినవారే. అయినా 1895లో చిత్రకవిత్వాలకు లక్ష్య గ్రంథమైన ప్రబంధరాజ వెంకటేశ్వర విజయవిలాసాన్ని నిరసించారు. గణపవరపు వెంకటకవి రచించిన ఆ గ్రంథం అముద్రిత గ్రంథ చింతామణిలో నెలనెలా భాగాలుగా అచ్చుపడుతున్నప్పుడు పండితులు వేలంవెర్రిగా మెచ్చుకున్నారు. దానికి విచారించి వీరేశలింగంగారు 'సరస్వతీ నారదవిలాపం' వ్రాశారు. నారదుడు తన తల్లి సరస్వతి ప్రస్తుత రూపాన్ని చూసి ఆనవాలు పట్టలేకపోతాడు. కారణం అడుగుతాడు. ఆమె తన దురవస్థ చెప్పుకొంటుంది.

''తెలియదు సుమ్మిపుడు నా
పలుకుల యర్థంబు నాకె భావము లేమిన్
వెలసొమ్ములు గా కివి సం
కెల లయి కడు నాదు మేనికిన్ వెతనించున్

''దయ మాని తుద ముట్టఁ దలకట్లు నిగిడించి
ధీరుడై నన్ను బాధించు నొకడు
పాదంబులోపలఁ బాదంబు లిమిడించి
వీరుడై నన్ను నొప్పించునొకడు
ప్రాసంబుపైఁ బెక్కు ప్రాసంబు లడరించి
పోటుబంటయి నన్ను బొడుచు నొకడు
బెండుపల్కులు గూర్చి నిండించి నగలంచు
దిట్టయై చెవులు వేధించునొకడు
ఖడ్గ చక్రాది రూపమున్ గానిపించి
వర్ణముల్ మార్చి నను జిక్కు పరచునొకడు
కుమతు లొడలెల్ల విరిచి ప్రాణములు తీయ
నొడలి పసలేక శుష్కించి యున్నదాన''.

భాషా సరస్వతికి మళ్ళీ పంతులుగారు ప్రాణం పోశారు. ఆమెచేత దేశసేవ చేయించారు. 'దేశమంటే మనుషులోయ్' అన్న సత్యం వీరేశలింగం గారికి తెలుసు. దేశాభిమానమనగా దేశములోని జనుల మీద అభిమానమే' అని ఆయన స్పష్టంగా ఒక వ్యాసంలో వ్రాశారు.[14] 'జనసామాన్యము యొక్క స్థితి బాగుపడిననే దేశాభివృద్ధి యనబడునుగాని ఎవ్వరో కొందరు మహోన్నత దశను పొంది, తక్కినవారు హీనదశలో

12. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి - 8వ సంపుటం - పుట.79
13. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి - 8వ సంపుటం - పుట.79
14. వీరేశలింగం సంపూర్ణ గ్రంథావళి - 8వ సంపుటంలో వివేకవర్ధిని, 3వ భాగం, పుట.133 (1893 ఆగస్టు 23)

ఉన్నంతవరకు దేశాభివృద్ధి కలుగుతుందని ఎంతమాత్రము చెప్పడానికి వల్లకాదు, అని వేరొక వ్యాసంలో వ్రాశారు. మనదేశంలో సాంఘిక పతనానికి కారణం చెప్పారు.

'స్త్రీలను' పురుషులను సమానముగా గౌరవించుకున్నంత కాలము మనదేశమెంతో యున్నతస్థితి యందే యుండినది' అని ఇంకొక వ్యాసంలో వ్రాశారు. 'నిజముగా పురుషులు రాజ్యము చేయనప్పటికంటె స్త్రీల రాజ్యపరిపాలనములోనే ప్రజాసౌఖ్య మధికముగానున్నదని లోకానుభవము సహస్రముఖముల ఘోషించుచున్నది..... స్త్రీలను గౌరవముగాఁ జూచెడి యన్యదేశములమాట యటుండగా స్త్రీలను చిన్న చూపున జూచెడి యీ దేశమునందు సహితము స్త్రీలు రాజ్య పాలనము చేయదటస్థించు భాగ్యము పట్టినప్పుడెల్లను దేశమధిక సుభిక్షముంగా నుండుచు వచ్చెననియు, బ్రజలధిక సుఖవంతులై యుండుచు వచ్చిరనియు చరిత్రములు మొరపెట్టుచున్నవి' అని రాణీరుద్రమను, అహల్యాబాయిని, విక్టోరియా మహారాణి చరిత్రలో పేర్కొన్నారు.

స్త్రీలు పూనుకొనకపోతే సంఘ సంస్కారం జయప్రదం కాదని వీరేశలింగంగారి విశ్వాసం. అందుకే స్త్రీలకోసం ప్రత్యేకంగా సత్యవతి చరిత్ర, చంద్రమతీ చరిత్ర, సత్య సంజీవని అనే వచనకావ్యాలు వ్రాశారు. సత్యవతి చరిత్ర చదివాక చాలామంది తమ కుమార్తెలకు 'సత్యవతి' అని పేరు పెట్టుకొన్నారు. 'చంద్రమతి చరిత్రలో 15 ప్రకరణా లున్నాయి. ఇందులో 10 ప్రకరణాలు చంద్రమతి విద్యాభ్యాసానికి సంబంధించినవే. ఇందులో చంద్రమతి ఉశీనర మహారాజు కూతురులాగ కాదు, ఇన్నీసుపేటలో ఎవరో ధనికుని అమ్మాయిలాగే ఉంటుంది. ఆమె వేళ్ళ సందున చిన్నచిన్న గజ్జికురుపులు లేస్తాయి. ఆమె బడికి ఆలస్యంగా వస్తుంది. చివరకు కథ సుఖాంతం అయ్యాక చంద్రమతి తాను చదువుకొన్నదగుటచేత రాజ్యమంతటను బాలికా పాఠశాలలు స్థాపిస్తుంది. పంతులుగారి చేతికి ఏ రాయి దొరికినా చాలు దురాచారం పళ్ళూడకొడతారు!

శాస్త్రజ్ఞానం పెరగకపోతే దురాచారాలు తొలగవన్న విశ్వాసంతో పంతులుగారు చాలా శాస్త్రగ్రంథాలు వ్రాశారు. శరీరశాస్త్ర సంగ్రహం, జంతుజ్యోతి శాస్త్ర సంగ్రహం, జంతు స్వభావ చరిత్రము, గర్భిణీ స్త్రీల ఉపయోగార్థం 'పత్నీ హితసూచని' అనే అనేక గ్రంథ రచనలు చేశారు. ప్రకృతి శాస్త్ర విషయాలలో ఒకటి తెలిసినా జనుల మౌఢ్యంలో కొంత భాగం తగ్గుతుందని పంతులుగారి విశ్వాసం.

రాజశేఖర చరిత్రను, సత్యారాజా పూర్వదేశ యాత్రలను కూడా జనుల మౌఢ్యం తగ్గించడానికే వ్రాశారు. రాజశేఖర చరిత్రలో తెలుగు జీవితాలలో ఉన్న మూఢ విశ్వాసాలు, దురాచారాలు, దురభిమానాలు, ముఖస్తుతులు, మోసాలు, భూతవైద్యాలు, ఎన్నో వర్ణించి తూర్పారపట్టారు. మన సాహిత్య చరిత్రలో రాజశేఖర చరిత్ర ఒక మైలురాయి మాత్రమే కాదు. సరిహద్దుఫలకం. రాజశేఖర చరిత్రను సమీక్షిస్తూ హిందూ పత్రిక విస్తుపోయింది. 'చిన్నయసూరి నీతి చంద్రికకు ఉత్తర భాగంగా ఉద్దేశించిన 'విగ్రహం' గ్రంథకర్త తన పూర్వ సాహచర్యాలను పూర్తిగా విడనాడి తెలుగు సాహిత్యంలో నూతన మార్గం అవలంబిస్తాడని మేము భావించలేదు' అని వ్రాసింది. 'ఆంధ్రసాహిత్య చరిత్ర'లో రాజశేఖర చరిత్ర నూతన శకాన్ని ప్రారంభించిందని స్పష్టం చేసింది.

తెలుగు వాఙ్మయంమీద ఇంగ్లీషు ప్రభావం గురించి పరిశోధించినవారికి రాజశేఖర చరిత్రపై గోల్డుస్మిత్ వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు ముద్ర గట్టిగా పడినట్లు కనబడుతుంది.[15] సామాన్యంగా సమీక్షించే డాక్టరు జి.వి.కృష్ణారావుగారి వంటి విజ్ఞులకు 'ఏవో మూడు పాత్రలకు వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు దోహదమిచ్చింది తప్ప తక్కినదంతా వీరేశలింగంగారి స్వతంత్ర సృష్టే.[16] తెలుగు నవలా పరిణామంపై కృషి చేసిన వాళ్ళకు రాజశేఖర చరిత్ర ద్వితీయ రచనే. ప్రప్రథమ రచనగా నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారి 'రంగరాజచరిత్ర'నే పేర్కొంటారు. వీరేశలింగంగారిపై సమగ్ర పరిశీలన చేసిన వారికి రంగరాజ చరిత్ర అంత ప్రసిద్ధిని పొందలేదుకాబట్టి, రాజశేఖర చరిత్రే ఆద్యమనిపిస్తుంది. ఇందరు ఇన్నిరకాలుగా భావిస్తున్నా, రాజశేఖరచరిత్ర పత్రికాధిపతులచేత తదితరులచేత బహువిధాల పొగడబడ్డా, వీరేశలింగంగారి దృష్టిలో సామాన్యజనులు దానిని గ్రహింపలేకపోయారని పించింది. 'దానివల్ల వట్టి పొగడ్తలేగాని రశ్మి యేమియు నాకు కలుగలేదు' అని స్వీయచరిత్రలో వ్రాశారు.

పంతులుగారి గ్రంథ ప్రయోజనాల గురించి స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. సామాన్యులకు పనికిరానిది వారి ఉద్దేశంలో దండుగే. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తాము 'కాదంబరి' తెనిగిస్తున్నామని పంతులుగారితో ఒకసారి చెప్పారు. అటువంటి పుస్తకాలు లోకులు చదవరని, అంతటి కఠినకావ్యాలను విశ్వవిద్యాలయాలు పాఠ్యపుస్తకాలుగా పెట్టరని చెప్పి ఆ అనువాదాన్ని పంతులుగారు ఆపమన్నారు.[17]

వీరేశలింగంగారు సామాన్యులకోసం ఉద్దేశించినా వారి 'కవుల చరిత్ర' మాత్రం సాహితీపరులకే వినియోగమవుతూంది. తాము చేసిన గ్రంథాలలో కెల్ల 'ఆంధ్ర కవుల చరిత్ర విషయమున నేను పడినపాటు తెలియకపోవచ్చును. గాని యే ఇతర గ్రంథరచనావిషయముననను నేనింత కష్టము పడలేదని నమ్ముచున్నాను' అని పంతులుగారే స్వీయచరిత్రలో వ్రాసుకొన్నారు.[18]

వీరేశలింగంకన్నా ముందుగా గురజాడ శ్రీరామమూర్తిగారు 1876లో కవి జీవితాల రచన ప్రారంభించారు. వాటిలో చాలా పుక్కిటిపురాణాలే కావడం వల్ల వీరేశలింగంగారు సప్రమాణికమైన కవుల చరిత్ర వ్రాయాలని సంకల్పించారు. 1886లో ప్రారంభించారు. మొదట వివేకవర్ధనిలో ప్రకటించి పుస్తకరూపంలో ప్రచురించారు.

15. తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం - కొత్తపల్లి వీరభద్రరావు - పు.316 నుండి
16. రాజశేఖర చరిత్రకు ప్రోద్బలం గురించి వీరేశలింగంగారే తమ స్వీయచరిత్రలో ఇలా రాశారు. ''మొట్టమొదటనొక చిన్న ఇంగ్లీషు ప్రబంధమును దేనినైనను తెలిగించి శైలికుదురు పఱుచుకొని తరువాత స్వకపోల కల్పితమైన వచన ప్రబంధమును వ్రాయబూనుకోవలెనని తలచి గోల్డ్‌స్మితనెడి ఇంగ్లీషుకవి చేసిన 'వికార్ ఆఫ్ వెక్ ఫీల్డ్' అను కథను తెనిగింప నారంభించి రెండు మూడు ప్రకరణములు వ్రాసితిని. విదేశకథయు దాని భాషాంతరమును మనవారి కింపుగా నుండవని తోచి చేసిన భాగము నామనస్సునకే తృప్తికరముగా నుండనందున దానిని మానివేసి రాజశేఖర చరిత్రమును వ్రాయనారంభించితిని. ఇంగ్లీషు కథకును దీనికిని విశేష సంబంధము లేదు. (స్వీయచరిత్ర, రెండో భాగం, రెండో ప్రకరణం - పు. 158)
17. చిలకమర్తి వారి స్వీయచరిత్ర - పు.189
18. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - రెండోభాగం, రెండోప్రకరణం -పు.232

అప్పుడా పుస్తకం డెబ్బయిరెండు పేజీలే. 1895లో రెట్టింపుకన్నా ఎక్కువ పేజీలలో వెలువడింది. 'ఇంతింతై వటుడింతైయ' అన్నట్టు 1917లో ముద్రణలో ప్రథమ భాగమే ఆరువందల ఎనభైనాలుగు పుటల గ్రంథంగా పెరిగింది.

వీరేశలింగంగారి సప్రమాణిక నిర్ణయాలను చూసి గురజాడ శ్రీరామమూర్తిగారు తన పూర్వపు ఉద్దేశాలను మార్చుకొని తమ కవి జీవితాలను సంస్కరిస్తూ వచ్చారు. 1894లో గురజాడ వారి గ్రంథాన్ని సమీక్షిస్తూ పూర్వం ఆంధ్ర శబ్ద చింతామణి నన్నయ కృతమని వ్రాసి ద్వితీయ ముద్రణములో వీరేశలింగంగారి వాదన నమ్మి ఆ ఉద్దేశం మార్చుకొన్నందుకు అముద్రిత గ్రంథచింతామణి చింతించింది.

అదే అముద్రిత గ్రంథ చింతామణి 1895లో వీరేశలింగంగారి కవుల చరిత్ర ప్రథమభాగం నాల్గవ ముద్రణ సమీక్షిస్తూ అప్పటిదాకా వచ్చిన కవి చరిత్రలన్నింటినీ పేర్కొన్నారు. కావలి వెంకటస్వామి ఆంగ్ల గ్రంథాన్ని గురజాడ వారి పుస్తకాన్ని అంచనా కట్టారు. వీరేశలింగంగారి తర్వాత, వారి పుస్తకంలోంచి గ్రంథచౌర్యం చేసిన వాటిని పేర్కొన్నారు. కావలివారి వ్రాతలన్నీ పుక్కిటిపురాణాలే అని కొట్టిపారేశారు. గురజాడవారిది 'ఆంధ్రకవుల చరిత్రమువంటి యుపయోగకారి కాదు' అని కచ్చితంగా చెప్పారు. కూరపాటి వెంకటరంగయ్యగారు ఎక్కడెక్కడ చౌర్యం చేసినదీ చూపించారు. 'ఇట్టి గ్రంథములన్నింటికిని శిరోభూషణమై వీరేశలింగంగారి కవుల చరిత్రము వెలయుచున్న'దని ప్రశంసించారు.

1895లో తమ నలభై ఎనిమిదో యేట కవుల చరిత్ర నూతన ముద్రణ ముగించినా పంతులుగారు విశ్రమించలేదు. గ్రంథ పరిశోధనకోసం తంజావూరు సరస్వతీ మహలుకు వెళ్ళారు. అక్కడ పుస్తకాలు చదివి వాట్లోంచి కావలసిన భాగాలు వ్రాసుకున్నారు. అక్కడ ఉండే చాలా గ్రంథాలకు ప్రతులను వ్రాయించారు. మూడు సంవత్సరాలపాటు వరసగా వేసవి సెలవుల్లో చెన్నపట్నంలో నివసించి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో బ్రౌనుదొరగారు నిక్షిప్తం చేసిన గ్రంథాలు, మెకంజీ కైఫీయతులు, సూయిల్ దొరగారి శాసన సంపుటాలు ఎన్నో సంప్రదించారు. ప్రతిరోజూ పొద్దున్న పది గంటలకు భోజనం చేసి గ్రంథాలయానికి వెళ్ళి సాయంత్రం అయిదుగంటల దాకా పుస్తకాలు చదివి నోట్సు వ్రాసుకొనేవారు. నెలరోజులు కష్టపడి వ్రాసుకొన్న నోట్సు పుస్తకం ఒకనాడు ట్రాములో పోతే చదివిన పుస్తకాలే మళ్ళీ చదివి, తీసుకొన్న నోట్సే మళ్ళీ తీసుకోవలసి వచ్చింది!

ఇంతటి విపుల పరిశోధన చేశారు కనుకనే 1917లో కవుల చరిత్ర ప్రథమ భాగాన్ని సప్రమాణికంగా ప్రకటించగలిగారు. వీరేశలింగంగారి అసాధారణ ప్రజ్ఞను ఒకవంక కొనియాడుతూనే కట్టమంచి రామలింగారెడ్డిగారు కవుల చరిత్రను జాతకాలు వ్రాయడమని ఈసడించారు. రెడ్డిగారి దృష్టిలో సాహిత్యచరిత్ర పరిణామ ధోరణిని కల్గించాలి. అందులోని ముఖ్యస్థితులకుండే పరస్పర సంబంధాలను విశదీకరించాలి. నిజమే, అయితే కాలనిర్ణయం తెలకపోతే ముఖ్యస్థితులలో ఏది ముందో ఏది వెనకో ఎలా తెలుస్తుంది? అముద్రిత గ్రంథ చింతామణి చెప్పినట్టు వీరేశలింగంగారి కవుల చరిత్రవల్లనే ఆంధ్రకవుల స్థితిగతులు హస్తామలకాలు అయ్యాయి.

ఆంధ్రకవుల స్థితిగతులనే కాదు విశ్వవిజ్ఞానాన్ని జాతిజనుల చేతుల్లో ఉంచాలన్నది వీరేశలింగంగారి ఆకాంక్ష. తమ గ్రంథాలన్నీ సంపుటాలుగా అచ్చువేసి అందరికీ అందుబాటులో ఉంచాలని భావించారు. తమ 49వ ఏట 1897లో రాజమండ్రి కాలేజీలో తమ ప్రధానోపాధ్యాయ పదవినుండి రెండేళ్ళు సెలవుమీద చెన్నపట్నానికి వెళ్ళారు. ప్రెస్సు కొన్నారు. పని ప్రారంభించారు. సాహిత్య వ్యాసంగం కోసం సెలవు పెడితే సర్కారువారు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రధాన పండితుణ్ణి చేశారు. ఆ స్థానంలో ఉన్న కొక్కొండ వారిని రాజమండ్రి బదిలీ చేశారు. పంతులుగారు చెన్నపట్నంలో రమారమి ఎనిమిదేళ్ళున్నారు. ఈ దశ పంతులుగారికి హాని చేసిందని చెప్పాలి. 56వ యేట ఆయన పించను తీసుకొని మళ్ళీ రాజమండ్రికి వెళ్ళేసరికి ఆయన మడుగువీడిన మత్స్యమవడం ప్రారంభించారు. రాజమండ్రిలో వారెన్ని ప్రజాహిత కార్యాలను చేసినా విద్యార్థులకు దూరం కాజొచ్చారు. ఏ ఉద్యమానికైనా విశిష్టజనులకన్నా విద్యార్థుల సహాయమే ముఖ్యమని తొలిరోజుల్లో గ్రహించిన పంతులుగారు యువకులకు దూరం కావడం వారి రాజకీయాభిప్రాయాల వల్లనే జరిగింది.

అప్పటికే దేశంలో నేషనల్ కాంగ్రెసు స్వాతంత్ర్య సాధనకై కృషి ప్రారంభించింది. వీరేశలింగంగారికి సంఘ సంస్కారం ముఖ్యం. దాని తరవాతనే స్వాతంత్ర్య సముపార్జన. 'క్రూరములైన కులాచారములకు దాసులమై మన ఇంట నుండు స్త్రీల కష్టములను నివారింపలేనివారము రాజ్యాంగ స్వాతంత్ర్యములను పొంది దేశము యొక్క కష్టములనెట్లు నివారింపగలము?' అని 1885లోనే ప్రశ్నించారు. ఇంగ్లీషు ప్రభుత్వం యొక్క సంవత్సరం రాజ్యభారమంతా భరతఖండవాసుల మీదనే పూర్ణంగా విడిచిపెట్టి పైనుంచి పర్యవేక్షించకపోతే రాజ్యమంతా ఛిన్నాభిన్నమై దేశం అరాచకమైపోతుందని వారి విశ్వాసం.[19]

ఇటువంటి అభిప్రాయాలు 1905లో వందేమాతరం ఉద్యమ సంరంభంలో చెప్తే విద్యార్థులు వింటారా? బిపిన్ చంద్రపాల్ 1906లో ఆంధ్రదేశ పర్యటన చేసి మహోద్రేకంతో ఉపన్యాసాలు ఇచ్చాడు. యువకులు స్వాతంత్ర్యోద్యమంలో దూకారు; కళాశాలలు వదలిపెట్టారు. ఇది పంతులుగారికి రుచించలేదు. ''లోకానుభవము విశేషముగా లేని వారగుటచేత యువజనులు తాత్కాలిక వీరావేశముచేత తలలు విరియ బోసికొని 'వందేమాతరమ'ని కేకలు వేయుచు, చేతులలో ధ్వజములను, మెడలో స్వదేశీ పతకములను ధరించి, విచ్చలవిడిగా తిరగజొచ్చిరి. పాఠశాలలోని బాలురు సైతమీయల్లకల్లోలములో బడి పాఠములనుపేక్షించి, యుపాధ్యాయులను తిరస్కరించి యనేకులు పాఠశాలలనుండి తరిమి వేయబడిరి. మా సమాజములో జేరకపోగా యభినవదేశాభిమానుల వలన నాకు చిక్కులు, మనస్తాపములును కలుగుచువచ్చెను. ఏ యీడువారి కా యీడువారి మాటలు రుచించునుగాని, పెద్దవారి హితవచనములు పథ్యములుగా నుండవు. వృద్ధులు బుద్ధులు లేని శుద్ధావివేక సమృద్ధులని యువజనుల

19. వీరేశలింగంగారి సంపూర్ణ గ్రంథావళి – 8వ సంపుటం ''దేశీయ సభయును–దాని యుద్దేశములును'' పుట–17

యభిప్రాయములు. నా యుపదేశములనుబట్టి వారు నన్ను దేశాభిమాన శూన్యునిగా పరిగణించినారు'' అని పంతులుగారు స్వీయచరిత్రలో వ్రాశారు.[20]

అప్పటిదాకా పంతులుగారి శిష్యులై, భక్తులై వారి పేరిట గ్రంథాలయాన్ని స్థాపించిన నాళం కృష్ణారావుగారి వంటి యువకులు తిరుగుబాటు చేశారు. బెంగాల్ విప్లవవీరుడు కుదిరాంబోసు చిత్రపటాన్ని నాళం కృష్ణారావుగారు పెట్టారు. ఎవరు తీసెయ్యమన్నా తీయలేదు. పంతులుగారి పేరనున్న గ్రంథాలయంలో ఉన్నది. ''విద్రోహిఫొటో'' కనుక తెల్లదొరలు పంతులుగారిని సంజాయిషీ ఇమ్మన్నారు. నాకేం సంబంధం లేదని పంతులుగారు వ్రాశారు. యువకుల దృష్టిలో పతనమయ్యారు. కుముదవల్లిలోనూ భీమవరంలోనూ, జరిగిన సభల్లో యువకులు 'ఇంగ్లీషువాళ్ళ రక్తం ప్రవాహాలు కట్టించాలి' అని బహిరంగసభలో గర్జించినప్పుడు ఆ సభలకు అధ్యక్షత వహించిన పంతులుగారికి ఆ మాటలు కర్ణకఠోరంగా ఉన్నాయి. ముందుగా పుట్టిన గాంధీగారిలాగ ఇంగ్లీషువారిని ద్వేషించకూడదని, స్వాతంత్ర్యం కోసం వినయంతో విన్నవించాలని పంతులుగారు చెప్పారు. యువకులు పంతులుగారికి 'పిరికిపంద' అనే నూతన బిరుదాంకాన్ని ఇచ్చారు.[21]

రాజకీయాల్లో తరాల అంతరాలవల్ల పంతులుగారు యువశక్తికి దూరమైనా నడివయస్సువాళ్ళింకా పంతులుగారి పట్ల విధేయులే. పంతులుగారు ఆస్తికోన్నత పాఠశాలను కట్టించారు. వితంతు శరణాలయాన్ని, పతిత స్త్రీ సముద్ధరణ గృహాన్ని, హితకారిణి సమాజాన్ని స్థాపించారు. తమ సర్వస్వాన్నీ హితకారిణీ సమాజానికే వ్రాసి ఇచ్చేశారు. వారి అరవైరెండో యేట భార్య రాజ్యలక్ష్మమ్మగారు పోయారు. అప్పటినుండి పంతులుగారి 'అసహాయదశ' ఆరంభమైంది. అపనిందలు, చికాకులు వచ్చిపడసాగాయి. 'నా ప్రస్తుతావస్థను తలచుకొనగా పూర్వపు వీరేశలింగము గాక తచ్ఛాయా విగ్రహము మాత్రమే నిలిచియున్నట్లు తోచుచున్నది'' అని పంతులుగారే వ్రాసుకొన్నారు.[22]

రాజకీయాల్లోలాగే భాషా విషయంలో కూడా పంతులుగారు అభ్యుదయ వర్గాలకు దూరం కాజొచ్చారు. పిఠాపురం మహారాజావారిని నొప్పించకూడదని కాబోలు గ్రామ్యభాషా నిరసన సభల్లో పాల్గొన్నారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వేదిక మీద పంతులుగారి పూర్వ శత్రువులు కొక్కొండవారు, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు ఇప్పుడు వీరితో కలసి కొత్త ఉమ్మడి శత్రుసంహారానికి ఏకమయ్యారు.

యువకులు పంతులుగారి జీవితంలో మచ్చలు చూశారు. రచ్చకీడ్చారు. రభస చేశారు - పంతులుగారి మీద ప్రత్యర్థులు - ప్రత్యర్థులమీద పంతులుగారు పరువు నష్టపు దావాలు పరిపాటి అయ్యాయి. వారి 66వ యేట ఆయన ప్రవర్తనపై జాయింట్ మేజిస్ట్రేట్ నిందాగర్భమైన రిమార్కులు వ్రాశాడంటే నమ్మశక్యం కాదు. ''వీరేశలింగం గారి

20. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - రెండోభాగం, 3వ ప్రకరణం, పు.208
21. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - రెండోభాగం, మూడో ప్రకరణం, పు.324
22. వీరేశలింగంగారి స్వీయచరిత్ర - ఒకటో భాగం, 4వ ప్రకరణం పు.410

నిరంకుశత్వం, అవకతవకపనులను అందరికిని తెలియును. అయితేనేమి ఆయన ఒక పెద్దదేవుడు. పెద్దదేవుళ్ళు చేసే అవకతవక పనులు అవకతవక పనులు కావు. పెద్ద దేవుళ్ళ నిరంకుశత్వము నిరంకుశత్వము కాదు!'' అని టంగుటూరి శ్రీరాములుగారు ఆరోపించారు.[23] బ్రహ్మసమాజం సభ్యులలో కూడా అసంతృప్తి వచ్చింది. బ్రహ్మమత వ్యాప్తికోసం కాకినాడ నుండి ప్రచురిస్తున్న ''ధర్మసాధని'' కూడా పంతులుగారిని ప్రజాసేవ నుండి విరమించమని వ్రాసింది.

అన్నిటికన్నా విడ్డూరం-పంతులుగారు తమ స్వంతధనంతో కట్టించి పురజనులకు కానుకగా ఇచ్చిన పురమందిరం సభ్యత్వం నుండి ఆయననే తొలగించాలని తీర్మానం తెచ్చారు యువకులు. ఆ తీర్మానం ఓడిపోయింది. కాని ఆ ఊహ అసలు పుట్టడమే తరాల అంతరాలను సూచిస్తుంది. ''ఈ పట్టణములోని యిప్పటి తరము వారితో నాకు పరిచయము లేదు. నాకు శత్రువులు కూడనున్నారు. ఇచ్చట నాకు నమ్మకమైన స్నేహితులు చాలా తక్కువగా ఉన్నారు'' అని ఒక ఉత్తరంలో పంతులుగారు స్నేహితునికి వ్రాశారు. 69వ యేట ''నాకాలమయిపోయినది, నా పని తీరినది'' అన్న భావానికి వచ్చారు.[24] అయినా తమ రచనలన్నింటిలో ప్రధానమైన కవుల చరిత్ర పరిష్కరించాలన్న ఆశ వారిలో ఉంది. ఆ కార్యంలో నిమగ్నులయ్యారు. పని చేపడితే పంతులుగారు బలవంతులవుతారు. ''కవుల చరిత్రము సరిపరచుట కొరకే యీశ్వరుడు నాకారోగ్యము దయచేయుచున్నాడేమో'' అని పంతులుగారు భావించారు. కవుల చరిత్ర ప్రథమ భాగాన్ని సుపరిష్కృతంగా ప్రచురించారు. ఒకటి రెండు పుస్తకములు వ్రాయుటలో తప్ప నేను తలపెట్టిన కార్యాలన్నీ నెరవేరాయని పూర్వం తృప్తిపడి ఊరుకొన్నారుగాని ఆ ఒకటి రెండు పుస్తకాలు కూడా వ్రాద్దామని నూతనోత్సాహాన్ని పుంజుకొన్నారు.

పంతులుగారు రాద్దామని మానేసిన పుస్తకం ఒక గొప్ప లక్షణ గ్రంథం, దాన్ని ''నవ్యాంధ్ర వ్యాకరణం'' అనే పేర రచించసాగారు. ''తెనుగునకున్న వ్యాకరణదీపము చిన్నది'' అన్న భావం సంస్కృత భాష చదువుకొని తెలుగులో వ్రాసే వాళ్ళలో విపరీతం. పంతులుగారు సంస్కృత ఫక్కీలో కాక తెలుగు వ్యాకరణం ఇంగ్లీషు బాణీలో వ్రాయాలని వారి ఇరవై అయిదో యేటనే భావించారు. ''సంగ్రహ వ్యాకరణం'' వ్రాశారు. దానిని పాఠశాలల్లో పఠనీయ గ్రంథం చేశారు. మొదటి కూర్పు అల్పకాలంలోనే అమ్ముడయిపోయింది. ''ఆ పుస్తకమిప్పుడును మనదేశమునందలి పాఠశాలలో మాత్రమే కాక నైజాము రాష్ట్రమునందును వాడబడుచున్నది'' అని పంతులుగారు తమ స్వీయచరిత్రలో చెప్పారు.

ఆయన కాలేజీలో పాఠాలు చెప్పేటప్పుడు సైతం తెలుగు వ్యాకరణమంతా పది సూత్రాలలో సంక్షిప్తంగా చెప్పేసి, చిన్నయసూరి వ్యాకరణాన్ని నిరసించేవారు. (ఈ మాటలు వారి శిష్యులు ఆచంట లక్ష్మీపతిగారు చెప్పారు). చిన్నయసూరి వ్యాకరణం పేరుకు బాలవ్యాకరణమేగాని నిజానికి కబ్బాల వ్యాకరణం. తెలుగు వ్యాకరణమని

23. వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి షష్టిపూర్తి సంచిక
24. కందుకూరి వీరేశలింగం డైరీలు, లేఖలు - అక్కిరాజు రమాపతిరావు సంకలనం - పు. 124

చెప్పుకొంటున్నా మొదటి సూత్రం ''సంస్కృతంబునకు వర్ణములిన్ని' అని చెప్తుంది. పంతులుగారు పైలాపచ్చీసులో వ్రాసిన వ్యాకరణంలో ఆంధ్రభాషలో అక్షరాలెన్నో చెప్పారేగాని సంస్కృతం ఊసెత్తలేదు. యౌవనంలోనేకాక పండు ముసలితనంలో వ్రాస్తున్న నవ్యాంధ్ర వ్యాకరణంలో నవీనయుగ లక్షణాలను గుర్తించి వాటికి అనువుగా సూత్రాలు రచించారు. నవకవిత్వాన్ని అంగీకరించారు. పద్య కవిత్వం సశృంఖలం, విశృంఖలం అని రెండు విధాలని పేర్కొన్నారు. గణ నియమంలేనిది, యతి ప్రాస సనిబద్ధం కానిది విశృంఖల కవిత్వమన్నారు. అందులో యతికి మారుగా విరతి అపేక్షణీయమన్నారు. విరతి అంటే యతి స్థానంలో అక్షరమైత్రికి మారుగా నూతన పదం ఆరంభం కావడం.

నవకవిత్వాన్ని, ఆధునిక రీతుల్నీ అంగీకరించడంలో పంతులుగారు మళ్ళీ సమాజంలోని 'జీవ చైతన్య స్రవంతి'లో పయనించసాగారు. ఒకసారి గ్రామ్యా భాషా నిరసన సభలో పూర్వం పాల్గొన్నా ఇప్పుడు వ్యావహారిక భాషావాదుల మతం సమంజసంగానే తోచింది. వెంటనే తమ తోటలోనే 'ఆధునిక విద్వత్సభ' ఏర్పాటు చేశారు. వాడుకభాషను ఆమోదించారు. తాము అధ్యక్షులుగా గిడుగు రామమూర్తి పంతులుగారు కార్యదర్శిగా 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తకసమాజాన్ని' స్థాపించారు. గ్రంథరచనలో వ్యవహారంలో ఉన్న రూపాలే ఉంచాలి. లేనివాటిని పట్టుకు పాకులాడకూడదని నిశ్చయించారు. అవసరమైన అన్యదేశ్యాలను చేర్చుకోవాలి అని భావించారు.

ఈ నిర్ణయాలు ఆయన ఎన్నడో తమ రచనలో పాటించినవారే. 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం', 'ప్లీడరు నాటకం' వ్యవహారంలో ఉన్న రూపాలని స్వీకరించాయి. తమ సంఘ సంస్కారానికి ఏ రూపం అవసరమైతే ఆ రూపాన్నే ఆయన స్వీకరించారు. సంఘ సంస్కారం కుంటుపడుతుందనే ఆయన రాజకీయ స్వాతంత్ర్యాన్ని ద్వితీయ స్థానంలో ఉంచారు. ఇంగ్లీషువాళ్ళ పరిపాలన, పర్యవేక్షణ లేకపోతే దేశం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని చెప్పడంలో ఇంకో అంతరార్థం ఉంది. మళ్ళీ మూఢాచారాలు తలెత్తుతాయని వారి భయం, పరిపాలన తొలగిన కొన్ని నెలల్లోనే రాజ్యమంతా ఛిన్నాభిన్నమై ఒక పార్టీవారు, ఇంకో పార్టీతోను, ఒక మతంవారు ఇంకో మతంతోనూ, ఒక రాష్ట్రంవారు ఇంకో రాష్ట్రంతోనూ పోరాడుతారని ఆయన ఆదిలో జోస్యం చెప్పారు.[25] ఆయన భయపడిన విషయం మరొకటి నిజమైంది. స్వాతంత్ర్యం రాగానే అల్ప సంఖ్యాకులైన విద్యాధికుల్ని అధిక సంఖ్యాకులైన మూఢ జనులు అణగతొక్కేస్తారని ఆయన అప్పుడే చెప్పారు. పార్టీల ఆదేశాల చేత దేశం అరాచక మవుతుందన్నారు.

నేటికి రమారమి వంద పైచిలుకు సంవత్సరాల కింద పంతులుగారు వెలిబుచ్చిన భయాలు చాలావరకు నిజమే అయ్యాయి గాని ప్రజలు ఉద్రేకపూరితులై ఒక నూతనోద్యమంలో దూకుతున్నప్పుడు ప్రజానాయకుడు ఎంత పూజనీయుడైనా సరే,

25. సంపూర్ణ గ్రంథావళి - 8వ సంపుటం 'దేశీయ సభలు-దానియుద్దేశములు' - పు.17

చేదుసత్యాలు చెప్పినా సరే, ప్రజల ఆగ్రహానికి గురి అవుతారు. పంతులుగారు కూడా రాజకీయంగా అభివృద్ధి నిరోధకుల కోవలో పడిపోయారు. స్వచ్ఛందవృత్తిలోని గౌరవం పంతులుగారికి తెలియనిది కాదు. సత్య హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుని నోటంట ఆయన తమ ముప్పయ్యోఏట ఇలా అనిపించారు.

''పృథివిలోపల పరతంత్రవృత్తితోడ
బడయునట్టి మహేంద్రవైభవము కంటె
ఉత్తములు తాము స్వచ్ఛందవృత్తితోడ
కొలది విభవంబె గొప్పగా తలతురెపుడు''

అయినా ఆ 'స్వచ్ఛందవృత్తి'కి ఆటంకమైన అభిప్రాయాలు చెప్పబట్టి పంతులుగారిని వారి భక్తుల్లో ప్రముఖులైన చిలకమర్తి వారే 'పూర్వకాలపు వాడి'గా జమకట్టారు.[26] పంతులుగారి వంటి కార్యశూరులు ఎప్పుడూ వెనుకటి సంచికల్లాగ పడి ఉండలేదు. రాజకీయంగా కాకపోయినా సాహిత్యరంగంలో 'ఈ కాలపువాడిగా' సేవచేయాలనే ఆయన నవ్యధోరణులను ఆకళించుకొని వాటికి చేయూతనిచ్చారు. తమ స్వీయచరిత్ర మూడవ భాగాన్ని పూర్తిచేయాలని, కవుల చరిత్ర రెండో భాగాన్ని పరిష్కరించాలని ఆయన తమ 71వ యేట చెన్నపట్నానికి వెళ్ళారు. చురుకుగా పనిచేస్తూ రచనా వ్యాసంగంలోనే కలం చేత్తో పట్టుకొని కన్నుమూశారు.

మహానుభావులు మరణించిన మరుక్షణం నుంచీ మళ్ళీ జాతి చైతన్యంలో జీవిస్తూనే ఉంటారు. వారి ఆశయాలూ, ఆదర్శాలు అసంపూర్ణమైతే వాటిని నెరవేర్చడానికి యువతరం పూనుకుంటుంది. వారు దీవించిన వ్యావహారిక భాషోద్యమం నేటికి ఫలించింది. వారు తెచ్చిన వికాసం వెలుగులు వెదజల్లుతుంది. ఆయన మరణిస్తూ ఇచ్చిన సందేశంలోని చివరి మాటలు ఇంకా మాటలుగానే కొన్ని సందర్భాల్లో మిగిలిపోయాయి. ''అజ్ఞానంతో, అమాయకత్వంతో జీవిత సంస్కారంలేని ప్రజాసామ్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం, సంస్కారం కలిగించడానికి కృషి చేయా''లని ఆయన ఆదేశించారు. తమ జీవితంలో ఆయన చేసింది అదే. చిలకమర్తివారు ఒక పద్యంలో పంతులుగారి జీవిత చరిత్రను చెప్పేశారు.

''తన దేహము తన గేహము
తన కాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘను డీ వీరేశలింగకవి జనులారా!''

ఈ మాటలు అక్షరాలా సత్యాలు. అదేం చిత్రమోగాని తాము శారీరకంగా దుర్బలులైనా జాతిని బలిష్ఠం చేసి దేశాభివృద్ధిని, భాషాభివృద్ధిని సాధించిన మనోబలభీములలో పంతులుగారు ప్రథములు. రెండోవారు గురజాడవారు. పంతులు గారికి 'గద్యతిక్కన', ''దక్షిణభారత విద్యాసాగరుడు'' మొదలైన బిరుదులున్నాయిగాని

26. చిలకమర్తివారి స్వీయచరిత్ర – పు.242

అవి వారి బహుముఖ ప్రజ్ఞలకు చాలా ఇరుకైనవి. విద్యాసాగరులలాగే పంతులుగారు కూడా పునర్వివాహాలు చేయించినా, శరణాలయాలు స్థాపించినా, రచనావ్యాసంగం వల్ల జీవనోపాధి ఏర్పరచుకొన్న గ్రంథకర్తలే అయినా ఆ పోలికలు కొంతవరకే. విద్యాసాగరులు మధ్యలో విసుగెత్తి ఉద్యమం మానుకొన్నవారు. పంతులుగారు చివరిదాకా పోరాడిన వీరులు.

విద్యాసాగరులంటే పంతులుగారికి చాలా గౌరవం. అందుచేత చంద్రమతీచరిత్రలో చంద్రమతికి విద్యాసముద్రునిచేత చదువు చెప్పించారు. ఈశ్వరచంద్ర విద్యాసాగరుల చరిత్ర వ్రాస్తూ వారి సాహిత్య వ్యాసంగాన్ని పంతులుగారు ఇలా అంచనా వేశారు: ''ఈతడు చేసిన గ్రంథములలో విశేషభాగమింగ్లీషునుండియు, సంస్కృతము నుండియు, హిందీ భాషనుండియు చేయబడిన భాషాంతరములే యయినను, మంచి వచన శైలిని వ్రాయబడినవగుటచేత నవి బంగాళభాషలో మంచి వచన కావ్యములకు మారదర్శకములయ్యెను''.

'దక్షిణ భారత విద్యాసాగరు'డన్న బిరుదున్న పాపాన పంతులుగారి సాహిత్య వ్యాసంగానికి కూడా మనం ఇలాగే అంచనా కట్టి వారిని 'గద్యతిక్కన' అన్న ఒక్క బిరుదుతోనే పూజించడం భావ్యంకాదు. పి.టి.రాజుగారు అన్నట్టు పంతులుగారి బహుముఖ ప్రజ్ఞకు గద్యతిక్కన బిరుదున్యాయం చేకూర్చదు.

ఆ బహుముఖ ప్రజ్ఞవల్లనే వారు ఆంధ్రదేశనాయకులలో ఎందరినో ప్రభావితులను చేశారు. 'ఒరులేయవి యొనరించిన' అన్న వివేకవర్ధిని ఆదర్శాన్ని అనుకరింపచేశారు.

బ్రహ్మర్షులు, ఆంధ్రకేసరులు, దేశభక్తులు, విశ్వదాతలు, కాంగ్రెసు చరిత్రకారులు, గ్రంథాలయపితామహులు ఒకరేమిటి గడిచిన రెండు పురుషాంతరాలలోని మహాపురుషులందరూ పంతులుగారి అడుగుజాడలలో నడచినవారే, అభ్యుదయ భావాలను చేపట్టినవారే.

అటువంటి ఉజ్జ్వలచారిత్రుడిని ఏ బిరుదుతో వర్ణించినా అది అసమగ్రమే.

అయినా వైతాళికులనే మేలుకొల్పినవాడు అని గురజాడను ముద్దుకృష్ణ అభినందించినట్టు, నవ్యాంధ్ర నిర్మాతలనే నిర్మించిన వారిగా నేను పంతులుగారిని భావిస్తున్నాను.

అభినవాంధ్రకు ఆయన ఆద్యబ్రహ్మ!

ఈ తెలుగుజంట మన వెలుగుపంట

కొన్ని కొన్ని ఉద్యమాలను కొందరు మహనీయులు జంటగా చేపట్టి నడిపిస్తారు. జయప్రదంగా కొనసాగిస్తారు. పందొమ్మిదో శతాబ్దంలో శాస్త్రీయ సామ్యవాద ప్రతిష్ఠాపనాచార్యులు కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఉమ్మడిగానే గతితార్కిక, చారిత్రక, ఉభయ భౌతిక వాదాలను ప్రతిపాదించి ప్రబోధించి విశ్వవ్యాప్తంగా సామ్యవాదం సంస్థాపనకు మార్గదర్శకులయ్యారు. మన తెలుగు దేశంలో గిడుగు వెంకట రామమూర్తి (1863-1940), గురజాడ వెంకట అప్పారావు (1862-1915) జంటగా భాషా సాహిత్యాలనే ప్రజా ఉద్యమాలను చేపట్టి నడిపి ప్రగతికి దారి తీశారు. ఈ తెలుగు జంట మన వెలుగుపంట.

నిజమైన ప్రగతివాదులు ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటారు. అందులోనూ శ్రామికుల పక్షానే నిలబడి వారి శ్రేయస్సు కోసమే పోరాటాలు సాగించి విజయాలు సాధిస్తారు. పందొమ్మిదో శతాబ్దంలో ఉన్నత విద్యలు అభ్యసించి, ఉత్తమ సంస్కారం అలవర్చుకొన్న ఉదాత్త వర్గాలలోని వ్యక్తులు అడుగువర్గాలవారి అవసరాలను బడుగువర్గాలవారి బాగును కాంక్షించి పాటుపడ్డవారే. చరిత్రనుండి ఎన్ని ఉదాహరణలైనా ఇచ్చి ఈ సంగతి నిరూపించవచ్చు. రష్యాలో జమీందారీ ఫాయీవర్గం నుండి వచ్చిన కౌంట్ లియో టాల్‌స్టాయ్ (1828-1910) తన రచనలలో లక్షలాది రైతాంగం బాధలు, గాధలు, భావాలు, జీవనాలు ప్రతిఫలింపచేశాడు. 'ఆ పేదల పరిస్థితులను చిత్రించి వారి ఆగ్రహాన్నీ ప్రతిఘటననూ చిత్రించాడు. అందుకే టాల్‌స్టాయ్ రచనలను లెనిన్ 'రష్యా విప్లవానికి దర్పణం' అని మెచ్చుకొన్నారు.[1] రష్యన్ శ్రామిక వర్గం టాల్‌స్టాయ్ సందేశాన్ని ప్రభుత్వాన్నీ, చర్చినీ, ప్రైవేట్ ఆస్తినీ విమర్శించిన తీరును ప్రజలకు విశదపరుస్తానని చెప్పారు.

గిడుగూ, గురజాడలు ఉన్నత మధ్య తరగతి నుండి వచ్చినవారే. అయితే ఇద్దరికీ శ్రామికజన పక్షపాతం స్పష్టంగా ఉంది. గిడుగువారు ఒక చోట 1924లో ఇలా రాశారు.[2]

''నేడు బ్రిటీష్ సామ్రాజ్య వ్యవహారమంతా ఎవరు నిర్వహిస్తున్నారో విన్నారు కదా! చిన్నప్పటి నుండిన్నీ కాయకష్టము వల్లనే పొట్ట పోషించుకునే కామాటి వాండ్రు రాజ్యకార్యధురంధులై మన చక్రవర్తికి మంత్రులుగా ఇప్పుడు ఉన్నారు. వీరందరూ ప్రాచీన గ్రాంథికాంగ్లభాషా పాండిత్యము గలవారు కారు. బాల్యమునుండిన్ని నాగళ్ళు, గుద్దళ్ళు, గొడ్డళ్ళు, సమ్మెట్లు, పారలు, బొరిగలు మొదలయిన పనిముట్లు పట్టుకొని, చేతులు కాయలు కాచేటట్టు మోటుపనులు చేసి జీవించినవారు. అయితే, ఈ కార్మికులు చదువురానివాళ్ళు కారు. చదువు రానివాళ్ళు ఆదేశమందు లేనే లేరు; ప్రతి మనిషీ అక్కడ చదువు నేర్చుకోక తప్పదు. అందరికీ సామాన్యముగా ఉన్న వాడుకభాష రెండు

1. Lenin - Collected Works - Vol. 16 P. 323
2. వ్యాసావళి – పుట. 27

మూడేండ్లు అభ్యసించి, ఎవరి పని వారు సాగించుకొంటూ, తీరికయినప్పుడు తమ వృత్తి విద్య వృద్ధి పొందేటందుకు, ఆ విద్యలో ఆరితేరినవారు. ఉపదేశించే విషయములు వింటూ, వారు ప్రకటించే పుస్తకములూ, వ్యాసములూ చదువుతూ, తెలుసుకొన్న విషయములు ఆచరణలో పెట్టి శోధిస్తూ, తమకు కొత్తగా తెలిసిన విషయములు ఇతరులకు తెలిసేటట్టు ప్రకటిస్తూ, ఆ దేశమందు కార్మికులు కూడా లౌకిక విద్యలు దినదిన ప్రవర్ధమానముగా చేస్తున్నారు''.

ఈ వాక్యాలలో పరదేశీయులైనా కార్మికుల ప్రశంస కనబడుతున్నా, వారిలాగే ఆంధ్రులు కూడా బాగుపడాలనే ఆకాంక్షను ఇంకొకసారి గిడుగువారు ఇలా ఉద్ఘోషించారు.[3]

''ఇంగ్లీషు వారికైనట్టే సమస్త దేశముల విజ్ఞానమున్ను, మన తెలుగు వారందరికీ మన తెలుగులోనే సుగమము, సులభము అయి, వారి వలెనే మనమును విజ్ఞాన సంపన్నులయి ఉందుము గదా! ఇతర జాతుల వారితో మన తెలుగువారున్ను సమముగా తులతూగుతూ ఉందురుగదా. ఇప్పుడు ఇంగ్లాండు దేశములో కుండలు చేసే కుమ్మరివాండ్లూ, గనులలో బొగ్గుత్రవ్వే ఉప్పరులూ, పొలములు దున్నే పాలికాపులూ, యంత్రాలు తోమే కూలివాండ్లూ, సామ్రాజ్య వ్యవహార నిర్వాహదక్షులగుటకు చాలినంత యోగ్యత వర్తమాన వ్యవహారాంగ్ల భాష ద్వారా సంపాదించినట్టే, మన దేశములోని కార్మికులు కూడా వర్తమాన వ్యవహారికాంధ్ర భాష ద్వారా మనదేశ వ్యవహార నిర్వాహదక్షులగుటకు తగిన యోగ్యత సంపాదించి ఉందురుగదా! ఇంతకు పూర్వమే స్వరాజ్యము మనకు సిద్ధించి ఉండును గదా!''

గిడుగు వారిలాగే గురజాడ కూడా ఆంగ్లేయుల ప్రగతి నుండి ఉత్తేజితులై సాధారణ ప్రజల కష్టసుఖాలను సాహిత్యం ప్రతిఫలించాలని విశ్వసించారు. 'సామాన్యమగు వస్తువుల గూర్చి వాడుకలో నుండు మాటలలో కవిత్వము చెప్పి కవితా సామర్థ్యము వలన వానికి సొంపు తెచ్చి, చదువరుల మనసులు రంజింపచేయవచ్చుననే' వర్డ్సువర్తు అనే ఆంగ్లకవి గురించి రాస్తూ మన సాహిత్య పరిస్థితులనూ ఆధునిక ఆంగ్లకవుల అభిప్రాయాలను ఇలా ఒకచోట విశదపరిచారు.[4]

''మనదేశపు కవులు కావ్యములలో వర్ణించు పాత్రములు, దేవతలు, దేవతా స్త్రీలు, రాజులు, రాజకుమారికలు, పెద్దయింటి పురుషులు, స్త్రీలు, వీరి చర్యలు, అవస్థలనే వర్ణింతురు. అందులో కథానాయకులకు లోకములో కానరాని గుణసంపత్తి పరాక్రమాదులు, సౌందర్యమును ఆరోపింతురు. తక్కువ జాతివారిని గూర్చి వర్ణించి వ్రాయరు. కవిత్వమున వ్రాయతగిన చర్యలు అట్టి తక్కువ మనుష్యుల బ్రతుకులలో నుండ నేరవని మనదేశపు కవుల అభిప్రాయము. వర్డ్సువర్తునకు పూర్వపు కవుల అభిప్రాయము గూడ కొంతవరకట్టిదియే.

---

3. వ్యాసావళి - పుట. 28
4. వ్యాసచంద్రిక-పుట. 16

''ఆధునిక కవులు అటుగాక మనుష్యుల సుఖదుఃఖములు అన్నియును వొక్కలాటివేయనియు, మనిషి అయివుండుటలో వకని తక్కువ, వకని హెచ్చు లేదనియు, సుగుణములు సత్ప్రవర్తన గొప్ప అవస్థలో నుండు వారికిని తక్కువ అవస్థలో నుండు వారికిని సామాన్యములనియు, కావ్యములను రసమయం చేయుటకు రాజుల రెడ్ల బ్రాహ్మణుల చర్యల వర్ణన యెటుల తగియున్నదో రచయితల తక్కువ జాతుల వారి చర్యలు కూడా నటులనే తగియున్నవనియు నభిప్రాయపడి, ఇంపయిన కావ్యములు తక్కువ స్థితిలో నుండు మనుజుల సుఖదుఃఖముల గూర్చి వ్రాసిరి. వర్డ్సువర్తు అందుచేతనే ఒక గొల్లవాడి బ్రతుకును గూర్చి కావ్యము వ్రాసెను''.

సాహిత్య ప్రయోజనం పట్ల గురజాడ వారికి కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ప్రజానీకంలో అసంఖ్యాకమైన రైతాంగాన్ని జాగృతం చేయగలిగేది సాహిత్యమే అని వారికి తెలుసు. అందుకే కన్యాశుల్కం రెండో కూర్పు పీఠిక 1909లో రాస్తూ ''దేశీయ భాషలలోని సాహిత్యం రైతులను తట్టిలేపక తప్పదు. అది భారతదేశంలో ఇంగ్లీషువారిని కూడా తట్టిలేపక తప్పదు. ఆ వాడుకభాషకు గల శక్తి అపారం' అని ఉద్ఘాటించారు.[5]

గిడుగు గురజాడలిద్దరికీ దేశ స్వాతంత్ర్యం వాంఛనీయమే. అయితే ప్రజలలో అక్షరాస్యత వల్లనే అది సాధ్యమవుతుంది. సామాన్య ప్రజలు చదువుకొనడం ప్యూడలు వర్గాలవారికీ, వారి పండితులకూ వాంఛనీయం కాదు. అందుకే గిడుగువారు ఇలా చెప్పారు.[6]

''ప్రజల వాడుక భాషయొక్క ప్రయోజనములు అంగీకరించని పండితుల చేతిలో నున్న అంకుశము తీసివేస్తేనేకాని, ప్రజల హక్కులను నిరోధిస్తూ వున్న ప్రభుత్వము వారి చేతిలోని అంకుశమును లాగివేసిన ప్రయోజనముండదు. నేడు ఆంధ్ర రాష్ట్రము ఏర్పడవచ్చును, రేపు స్వరాజ్యము రావచ్చును. ప్రభుత్వము ప్రజాస్వామికము కానూ వచ్చును. అయితే ఈరోజులలో మన స్వాములు నిరక్షరకుక్షులయి వుంటే, దేశమునకు ఎంత వుపద్రవము కలుగునో మనదేశనాయకులు, దేశభక్తులు, దేశబంధులు లెస్సగా ఆలోచించవలసి వున్నది. మన తెలుగువారిలో నూటికి 90మందికి ఇంకా ఓనమాలైనా రావు సుమండీ!''

చదువు లేకపోయినా తెలుగువారు సంస్కారం గలవారేనన్న నమ్మకం గిడుగువారికి ఉంది. ''తెలుగువారు నాగరికులు. నూటికి తొంభైమందికి ఓనమాలు రాకపోయినా పెద్దల ధర్మాన పాటలూ పదాలూ విని, పండితులకు తెలిసిన విషయములు అనేకములు నేర్చుకొని తెలివితేటలు గలిగియున్నారు'' అన్న సత్యం వారికి విశదమే.

అయితే బడులలో, కళాశాలలో, చదువుకొనే విద్యార్థుల చేత సహజమైన వాడుకభాషను కాక కృత్రిమమైన గ్రాంథికాన్ని ప్యూడలు వర్గాల బలవంతంమీద విద్యాశాఖవారు చదివిస్తున్నారు.

5. కన్యాశుల్కం రెండవ కూర్పు, గురజాడవారి ఇంగ్లీషు పీఠికకు ఇది నా అనువాదం.
6. వ్యాసావళి-పుట.29

''గ్రాంథికాంధ్రము పెద్ద పెద్ద పండితులకే సరిగా తెలియనప్పుడు, అది చిన్నచిన్న బడిపిల్లలకు విధించడము కార్యమవునా, కాదా - ఆలోచించండి', లోకంలో ఏదైనా ఒక వృత్తి అవలంబించి బతుకుదామని ఆలోచించి కాస్త చదువూ వ్రాతా నేర్చుకొని తమకు కావలసిన విషయము బోధించే పుస్తకాలు చదువుకొందామన్న సామాన్యులచేత దారీ తెన్నూ లేని ఈ గ్రాంథిక భాషలో రచించిన వాచకాలు చదివిస్తే ఏమి ఫలము కలుగగలదు?'' అని గిడుగువారు అడిగారు.[7]

విదేశాలలో ''కూలివాండ్లు, కమ్మర్లు మొదలైనవాండ్లు'' మహాకవుల గ్రంథాలు చదువమంటే చదవరని చెప్తూ వారు అభిలషించేదేదో ఇలా చెప్పారు.[8]

'మాకు కడుపునిండా తిండి దొరికే మార్గం చెప్పండి. మా వృత్తులకు సంబంధించే విద్యలు మాకు నేర్పండి' అంటారు. అందుచేత, వాళ్ళకోసం ఇదివరకున్న విద్యావిధానమంతా మార్చవలసి వస్తున్నది. కర్మాగారాలున్న ప్రదేశాలకు విద్యాధికులు పోయి వాళ్ళకు తెలిసే భాషలో ఉపన్యాసాలిస్తూ, ఉపన్యాస విషయాలు చర్చిస్తూ ప్రజలకు జ్ఞానము, వివేకము కలుగజేస్తున్నారు''.

గురజాడ అప్పారావుగారు కూడా ''తిండి కలిగిన కండగలదోయ్. కండగలవాడేను మనిషోయ్!'' అని ఎలుగెత్తి చాటారు. వాడుకభాషను గ్రామ్యమని నిందించి కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారివంటివారు ''అది అందరి నోటంబడి కులటవలె భ్రష్టత నందియుండును'' అని నిందించినప్పుడు గురజాడ అప్పారావుగారు ''గ్రామ్యభాష దిక్కుమాలిన స్త్రీ. ఆమెను పండితులు నిష్కారణంగా దూషించి అవమానము కలిగించగా కనికరించి ఫీజు లేకుండా వకాల్తా పట్టితిని'' అని చెప్పారు.[9]

గ్రాంథికాంధ్రము ''లెస్సగా సంస్కృతాంధ్రము కావ్యములను చదివి నిరంతర భాషారచనాభ్యాసం'' చేసిన తర్వాతనే రాయగలరు. ''ఇది సంస్కృతము వలెనే బహు కాలాభ్యాసము చేసి నేర్చుకోవలసిన భాష. అన్న వస్త్రముల కోసము పాటుపడనక్కరలేని వారికే సాధ్యము'' అని గిడుగువారు చెప్పారు.[10] దేశంలో అన్నవస్త్రాలకోసం పాటుపడవలసిన వారు కోటాను కోట్లు ఉన్నారు. వారుకూడా చదువుకోవాలి. వారికి ఉపయోగపడే చదువులు చెప్పించాలి. ఇది ధనికుల కర్తవ్యమని గిడుగువారు భావించి ఇలా హితోపదేశం చేశారు.[11]

''ప్రజలలో విద్య వ్యాపింప చేయడమూ, ప్రజల ఆరోగ్యము కాపాడడమూ, ప్రజల సౌఖ్యము పోషించడమూ సంఘంలోని పెద్దలు చేయవలసిన పని అంటే అదేమో ప్రజలనుద్ధరించడానికి చేయవలసిన ధర్మకార్యమని ఆలోచించకూడదు. భాగ్యవంతు లయిన పెద్దలు తమ ఆరోగ్యం కాపాడుకొనవలెనంటే ప్రజల ఆరోగ్యం కాపాడవలెను''.

7. వ్యాసావళి - పుట. 158
8. వ్యాసావళి - పుట. 152
9. వ్యాసచంద్రిక - పుటలు 64, 80
10. వ్యాసావళి - పుట. 10
11. వ్యాసావళి - పుట. 151

గిడుగూ, గురజాడలు ఇద్దరూ ప్యూడలు వ్యవస్థలో జన్మించి పెరిగినవారే. జమీందారీ కొలువులలో కుదురుకొన్నవాళ్ళే. ఇద్దరూ ఒక ఈడువారే. ఒక్క ఏడాది తేడాలో పందొమ్మిదో శతాబ్దం ఆరోదశాబ్దపు తొలి ఏళ్ళలో పుట్టారు. (1862,3) పదమూడేళ్ళ ప్రాయంలో కలుసుకున్నారు. (1875). ఇద్దరూ ఒక్కసారే మెట్రిక్యులేషన్ ప్యాసయ్యారు. (1879). ఇద్దరూ బియ్యే పాసయ్యారు. కాని, ఒక్కసారి కాదు. గిడుగువారు అంచెలంచెలుగా ఉత్తీర్ణులు కావలసి వచ్చింది. ఇద్దరూ చరిత్ర పాఠాలనే విద్యార్థులకు నేర్పి ఉపాధ్యాయులయ్యారు. ఇద్దరూ చరిత్ర పరిశోధనలు చేసినవారే. ఇద్దరూ ఏట్సు దొరతో కలిసి శ్రీనివాసయ్యంగారితోపాటు వాడుక భాషా ప్రయోజనాన్ని ఆలోచించారు. (1906). ఇద్దరూ వ్యావహారిక భాషోద్యమాన్ని ప్రారంభించి నడిపారు. (1910 నుండి 1914దాకా) పిఠాపురం రాజాగారి అర్థబలాన్నీ, అంగబలాన్నీ అధికార ప్రాచుర్యాన్నీ ఎదుర్కొన్నారు. ఇద్దరూ రెండేళ్ళ తేడాలో ఉద్యోగ విరమణ చేశారు (గిడుగు 1911లోనూ, గురజాడ 1913లో).

ఈ ఇద్దరి మిత్రుల ఆశయాలు, ఆదర్శాలు, ఆలోచనలు, ఊహలు, ఉద్యమాలు ఉమ్మడిగానే ఉన్నా, ఇద్దరూ చేసిన ఉద్యోగాల స్వభావాలు ఇతర వ్యాపకాలు వైవిధ్యమున్నవి. కనుక వారి జీవిత చరిత్రలను వేరువేరుగా చెప్పుకొంటున్నా కొన్ని సందర్భాలలో ఒకరి గురించి రాసేటపుడు రెండోవారి ప్రసక్తి వస్తుంది. గురజాడ వాడుక భాషకు సృజనాత్మక సాహిత్యం వల్ల 'లక్ష్యం' ప్రసాదిస్తే, గిడుగువారు తమ పాండిత్యంతో లక్షణాలను సూచించారని సాహితీపరులు భావిస్తారు. అయితే గురజాడకు భాషాతత్వం బాగా తెలుసు. దానిపై ప్రామాణికమైన వ్యాసాలు రాశారు. గిడుగువారికి కావ్య ధర్మాల గురించి స్పష్టమైన అవగాహన ఉంది.

''కావ్యమనగా రసవంతమైన వాక్యము. రసమునకు ప్రధానమైనది శబ్దముకాదు. శబ్దార్థము. మాట అనీ అనడముతోనే రసము స్ఫురించితేనే కాని ఆనందము కలుగదు''.[12] భాష భావమునకు వాహనము వంటిది. ఒకరి హృదయమందున్న భావము మరి ఒకరి హృదయమును చేరవలెను. ఇందుకు భాషారూపమయిన వాహనము భావమునకు ఆవశ్యమయినది. గాలిని పాటించకుండా గాలి మోసుకొని తెచ్చిన పరిమళమును ఆఘ్రాణించి జనులు సంతోషించినట్లు, శబ్దము మీద మనస్సు నుంచనక్కరలేకుండా వాటి అర్థమును గ్రహిస్తారు. రచనా కౌశలముకూడా అట్లే ఉండవలెను. కళాభిజ్ఞుల పనివానితనము అద్దానికి వెనుక తట్టు కళాయి పూసినట్టు కంటికి కనపడకుండా ఉంటేనే ప్రశంసార్హమవుతుంది'' అని గిడుగువారు చెప్పారు.[13]

గిడుగువారి కళా సిద్ధాంతాల నిగ్గు, మనకు గురజాడ వారి సృజనాత్మక రచనలలో ప్రతిఫలిస్తాయి. టాల్‌స్టాయ్ రచనలు 'రష్యాలోని విప్లవానికి దర్పణాల'ని లెనిన్ చెప్పినట్లే జమీందారీ యుగంలోని భాషా సాహిత్యోద్యమాలలో అభ్యుదయాకాంక్షలకు, శ్రామికజన పక్షపాత బీజాలకూ గిడుగూ, గురజాడల జీవితాలు దర్పణాలు.

---

12. వ్యాసావళి - పుట.71
13. వ్యాసావళి - పుట. 125

గురజాడ వెంకట అప్పారావు

(1862-1915)

కవీ, తత్త్వవేత్తా తమ కాలం కంటే ముందు ఉంటారన్నది నిర్వివాదాంశం. ద్రష్ట అయిన వాడే సాహిత్యస్రష్ట కాగలడు. ద్రష్ట అంటే చూసేవాడు, మనస్సుచేత కనుగొనేవాడూ, గుణదోషాలను తెలుసుకొనగలవాడూ, న్యాయాన్యాయాలను పరిశీలించేవాడూ, నిర్ణయకర్తా అనే అర్థాలున్నాయి. కవిలో ఈ లక్షణాలు ఉండాలి. మహాకవి, గొప్ప తత్వవేత్త అయినవాడే క్రాంత దర్శనం చేయగలడు. అతని మాటలు మంత్రాలు అవుతాయి. ఋగ్వేదకాలంలోని కవులను ఋషులనీ, మంత్రద్రష్టలనీ అన్నారు. ప్రకృతి శక్తులను తన వశవర్తులను చేసుకొని భౌతిక ప్రపంచాన్ని తన శ్రేయస్సుకోసం అదుపులో పెట్టుకొనడానికే ఆదిమ మానవులు మంత్రాలను కట్టుకొన్నారు. ప్రతి ఉత్తమ కవిత్వంలోనూ పురాణగాథ, మంత్రచర్య, కళా కలసి ఉంటాయని జార్జి థాంప్సన్ వంటి మార్క్సిస్టు తత్వవేత్తలు సోదాహరణంగా నిరూపించారు.[1] గురజాడ అప్పారావుగారు కూడా ఈ భావాలనే తొలి కవితలలో ముత్యాల సరాలలో ఇలా చెప్పారు.[2]

చూడు మునుమును మేటివారల
మాటలనియెడి మంత్ర మహిమను
జాతి బంధము లన్న గొలుసులు
జారి, సంపద లుబ్బెడున్

యెల్లలోకము వొక్కయిల్లై,
వర్ణభేదము లెల్లకల్లై,
వెలనెరుగని ప్రేమ బంధము
వేడుకలు కురియ

మతములన్నియు మాసిపోవును,
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును.
అంతస్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్

గొప్ప తాత్వికుడైన మహాకవి మాత్రమే అధునాతన సమాజానికి బాటలు వేసే మేటి మాటలకు మంత్రద్రష్ట కాగలడు. 1910 జూలై నెలలో తన 48వ యేట గురజాడ అప్పారావుగారు ఈ ముత్యాలసరాలను ప్రచురించారు. వారి ఇరవయ్యోయేట 1882లోనే మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడే ఆయన ఆంగ్ల కవితలు రాసి ప్రచురించి విద్యాధికుల దృష్టిలో పడ్డారు. అయితే ఆ నవ యౌవనంలో ఆయనలో కవి మాత్రమే కనబడతాడు. నడివయస్సు నలభయ్యోనిమిదో యేట వారిలో మహాకవిగా భాసించే తాత్వికుడు

---

1. George Thomson-Marxism and Poetry, People's Publishing House, New Delhi, 1962.
2. గురజాడ రచనలు - ముత్యాలసరాలు -పుట.4

దర్శనమయ్యాడు. కవీ, తత్వవేత్తా తమ కాలం కంటే ముందు ఉంటారన్న సత్యాన్ని ఆయన గుర్తించి రాసి ప్రకటించని ఒక నవలలోని పాత్రచేత చెప్పించారు.[3] ఈ సంగతి వారికి తమ తల్లి కడుపులో ఉన్నప్పుడే తెలుసేమో అని చమత్కరించవచ్చు.

గురజాడ అప్పారావుగారి తల్లిపేరు కౌసల్యమ్మ. ఆమె గొడవర్తి వారి ఆడపడుచు. అప్పటికామెకు పదిహేనేళ్ళ వయస్సు, ఆరేళ్ళ కిందట పెళ్ళయినా కాపురానికి వెళ్ళినది 1862లోనే. ఆమె భర్త గురజాడ వెంకట రామదాసు. చీపురుపల్లి సమీపంలో ఉన్న కుమురాం ఠాణాలో గుమాస్తా. ఉద్యోగం కుమురాంలో అయినా అక్కడ సదుపాయాలు లేవని సమీపంలో ఉన్న గురువిందాడ అగ్రహారంలో కాపురముండేవారు. కౌసల్యమ్మ కన్నవారు విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం కాపురస్తులు. పదిహేనేళ్ళ వయస్సులో ఆమె నెల తప్పితే తొలి చూలు పురిటికి కన్నవారు ఆమెను రాయవరం తీసుకువెళ్ళారు. నెలలింకా పూర్తిగా నిండలేదు. మరో రెండు నెలలకుగాని బిడ్డకుట్టు కనబడదని అంతా అనుకున్నారు. అయితే కడుపులో ఉన్న బిడ్డ కవీ, తత్వవేత్తా కాబోతూ తన కాలం కన్నా ముందు ఉండడానికా అన్నట్లు ఏడో నెల నిండగానే ప్రసవవేదన ప్రారంభమైంది. 1862 సెప్టెంబరు 21వ తేదీ నాడు ఉదయాన నొప్పులు ప్రారంభమయి పధ్నాలుగు ఘడియలు దాటాక అభిజిత్ ముహూర్తంలో బిడ్డ పుట్టాడు. ''నెల తక్కువైనా మగవాడే మేలు'' అన్న సామెత నిజమైందని అందరూ సంతోషించారు.

అకాల పత్యంగా జన్మించిన నెల తక్కువ బిడ్డలను దుర్బలులుగానే లోకం పరిగణిస్తుంది. పిందెలో పండినదేదైనా విడ్డూరమైందే. ఒళ్ళు చెయ్యకపోయినా బళ్ళో వేయవలసిన అయిదో ఏటనే అప్పారావుగారికి రాయవరంలో అక్షరాభ్యాసమైంది. శైశవం మాతామహుల ఇంట గడిచినా, చదువు తండ్రి ఉద్యోగం చేస్తున్న చీపురుపల్లిలోనే ప్రారంభమైంది. వెలివల రామ్మూర్తి పంతులుగారి దగ్గర సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషలను ఒక పద్ధతిలో నేర్చుకొన్నారు. చీపురుపల్లి గ్రాంటు స్కూల్లో మొదటి మూడు తరగతులూ పదేళ్ళ వయస్సులో 1872లో పాసయ్యారు. తరువాత విజయనగరంలో చదువుకోవలసి వచ్చింది.

వెంకట రామదాసుగారు తమ అబ్బాయి చదువు నిమిత్తం విజయనగరం సంస్థానపు దివాను పెనుమత్స జగన్నాథరావుగారిని సహాయం చేయమని అర్థించారు. ఆయన స్కూలు జీతాలు కట్టవలసిన బరువును తప్పించారు. బంధువుల ఇంట్లో ఉంటూ అప్పారావుగారు మహారాజావారి హైస్కూల్లో లోయర్‌ఫోర్త్, అప్పర్ ఫోర్త్, ఫిఫ్త్, మెట్రిక్యులేషన్ క్లాసులు చదువుకొన్నారు. ఈ దశలోనే తమ పదమూడవ యేట అప్పారావుగారికి తమ సహాధ్యాయి గిడుగు రామమూర్తిగారితో 1875లో స్నేహం కలిసింది. ఇద్దరూ కలిసిమెలిసి చదువుకొన్నారు, ఆడుకొన్నారు. 1879లో ఇద్దరూ ఒక్కసారే మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆర్థికమైన వసతులు లేక గిడుగు

3. గురజాడ రచనలు 4వ సంపుటి - మాటా మంతీ, అవీఇవీ - పుట.219

రామమూర్తిగారు పై చదువులకు తాత్కాలికంగా స్వస్తిచెప్పి ఉద్యోగంలో చేరారు. అప్పారావుగారు ఎఫ్ఫేలో చేరారు. ఇద్దరూ ఈవిధంగా ఎడమైనా వీరి స్నేహం జీవితాంతం కొనసాగింది.

మెట్రిక్యులేషన్ క్లాసు చదువుతున్నప్పుడే అప్పారావుగారు కవితా వ్యాసంగం ప్రారంభించారు. ఇంగ్లీషులో కవితలు అల్లసాగారు. ఆయన రచించిన ''కకూ'' (కోకిల) అనే కవిత విద్యాధికుల దృష్టిలోనికి వచ్చింది. ఆరోజుల్లో డిప్యూటీ స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా వున్న నాగోజీరావుగారు ఈ కవితను చదివి తాను ఆనందించడమేకాక దానిని ఆనందగజపతి మహారాజు (1850-1897) దృష్టికి తీసుకువచ్చారు. అప్పారావుగారి ఆంగ్ల కవితను కాలేజీ ప్రిన్సిపాల్ సి. చంద్రశేఖరశాస్త్రిగారు కూడా చదివి మెచ్చుకొన్నారు. యువకవి బుద్ధికుశలతను చూసి ఉన్నత విద్యలు చదువవలసినవాడని శాస్త్రిగారు భావించారు. అప్పారావుగారిని తమ యింట పెట్టుకొని భాషా సారస్వతాలను బోధిస్తూ గట్టి పాండిత్యం కలిగేటట్లు చేశారు. చంద్రశేఖర శాస్త్రిగారు తమిళులు, రాయవెల్లూరు వాస్తవ్యులు, విజయనగరం మహారాజావారి ఆంగ్ల కళాశాలకు మొదటి ప్రిన్స్‌పాలుగా నియమితులయ్యారు. అప్పారావుగారి వంటి ఎందరో యోగ్యులైన విద్యార్థులకు తమ ఇంటనే భోజన సదుపాయాలు ఏర్పాటుచేసి జీతం లేకుండా చదువు చెప్పించారు. వీరి ఔదార్యం ప్రశంసనీయం.

మెట్రిక్యులేషన్‌లో ప్రారంభించిన ఆంగ్ల కవితల వ్యాసంగాన్ని అప్పారావుగారు ఎఫ్ఫేలో కొనసాగించారు. ''సారంగధర'' అనే కథాకావ్యాన్ని స్థానిక పత్రికలో ప్రచురించారు. ఆరోజుల్లో విజయనగరం నుండి గుండుకుర్తి వెంకట రమణయ్యగారు ''ది యిండియన్ లీజర్ అవర్'' అనే ఆంధ్రాంగ్ల పత్రికకు సంపాదకులుగా, ప్రచురణకర్తగా ఉండేవారు. ఇందులోనే అప్పారావుగారి ''సారంగధర'' వెలుగు చూసింది. ఈ పత్రికకు ఎంతటి ప్రచారం ఉందో తెలియదుగానీ దీని ప్రతులను వెంకట రమణయ్యగారు దేశంలో ఉండే వివిధ ప్రసిద్ధ పత్రికల సంపాదకులకు పంపిస్తూ ఉండేవారు. 1883లో కలకత్తాలో ''రీస్ అండ్ రయ్యత్'' అనే పత్రిక ఉండేది. దీనికి శంభుచంద్ర ముఖర్జీగారు సంపాదకులు. ఈయన కొంతకాలం త్రిపుర సంస్థానానికి దివానుగా పనిచేశారు. ఆంగ్ల భాషా పండితులుగా ప్రసిద్ధికెక్కారు. ఇంగ్లీషువారి రచనల్లోనే తప్పులు పట్టగలిగినంత పాండిత్యం వారిది. దోషాలు మాత్రమేకాక గుణాలను గుర్తించడంలో కూడా ఆయన ఆరితేరినవాడు. గుండుకుర్తి వెంకటరమణయ్యగారు పంపిన పత్రికలోని ఆంగ్ల కవిత సారంగధరను ఆయన ఎంత మెచ్చుకున్నారంటే దానిని తమ పత్రికలో ప్రచురించాలని నిశ్చయించుకొన్నారు.

సర్వసాధారణంగా ఒక పత్రికలో ప్రచురితమైన దానిని మరొక పత్రికలో అచ్చువేస్తున్నప్పుడు మూలాన్ని స్పష్టంగా ప్రకటించాలి. అయితే విస్తృత ప్రచారంలేని ఒక స్థానిక పత్రికలోపడ్డ దానిని పునర్ముద్రణ చేస్తూ ఆ సంగతి మొదటే తెలియచేస్తే పాఠకులలో కౌతుకం తగ్గిపోవచ్చు. పేజీలు నింపడానికి చేర్చిన రచనగా భావించి చదవకపోవచ్చు. అందుచేత తమ పత్రికకోసమే చేసిన రచనగా దానిని ప్రకటించడానికి

అనుమతి కోరుతూ ''ఇండియన్ లీజర్ అవర్'' పత్రికాధిపతికీ, కవికీ ఉత్తరాలు రాశారు. ఆ ఉత్తరంలో ఇలా చెప్పారు.[4]

''....దీనిని మా స్వంత పత్రిక కోసం వ్రాసిన కృతిగా భావించి, అన్ని అవకాశాలను కలిగించి ప్రాధాన్యమిచ్చి మా పత్రికలో ప్రచురించాలనుకుంటున్నాను. ఇలా ప్రకటించడంలో నాకు రెండు ఉద్దేశాలున్నాయి. ఆ యువ రచయితను అందరికీ ఎరుకపరిచి, ప్రోత్సహించాలనుకున్నాను. ఉత్తమశ్రేణికి చెందిన సాహిత్య రాజకీయ పత్రికలో వొక పద్యం ప్రకటించడం సాధారణ విషయం కాదు. అంతేకాక, దీనిని ముద్రించి మన వారికి వున్న సాహిత్య జిజ్ఞాస ఎట్టిదో పరిశీలించదలుచుకున్నాను. వారి సాహిత్య వివేచనాశక్తి ఎలా వుంటుందో పరీక్షించ సంకల్పించుకున్నాను. ఉత్తమ సాహిత్యాన్ని వివేచనగా చదివి గుణదోషాలను చెప్పగలవారు తక్కువ. అందులోను, కవిత్వాన్ని పరిశీలించి గుణ వివేచన చేసేవారు అరుదు. ఒక భారతీయుడు ఇంగిలీషు రచించిన ఈ పద్యాలను లోకం ఎలా స్వీకరించగలదో తెలుసుకుందుకు ఆసక్తిగా వుంటుంది''.

ఈ ఉత్తరాన్ని శంభుచంద్రముఖర్జీగారు 1883 ఆగస్టు 14వ తేదీనాడు రాశారు. దీనితో జతచేసిన లేఖను అప్పారావుగారు అందుకొన్నారు. ముఖర్జీగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. వృద్ధిలోనికి రావలసిన ఒక యువకవి అనుసరించవలసిన విషయాలను ముఖర్జీగారు తమ ఉత్తరాలలో తెలియచేసేవారు. అప్పారావుగారు ఇంగ్లీషు ''బ్లేంక్‌వెర్స్''లో రచనలు చేసేవారు. ''ఇంగ్లీషులో యతిప్రాసలులేని పద్యాలను వ్రాస్తే కవిత్వంకాదనే భావన చాలా తక్కువ. తత్రాపి కవిత్వం విమర్శగా చదివేవారు మరీ తక్కువ. భారతీయులు ఆంగ్లంలో ఏదో వచనం రాయగలమని సాహసించడంతో వూరుకోక పద్యరచనలో కూడా చేయి పెడతామంటే ఇంగ్లీషు వాళ్ళకు మతిపోయి, వివేచనా శక్తి పనిచేయదు'' అని ఒక ఉత్తరంలో ముఖర్జీగారు చెప్పారు.[5]

ఎక్కడో కలకత్తాలో ఉన్న విద్వాంసులేకాక విజయనగరంలో వున్నవారిని కూడా అప్పారావుగారి ఆంగ్ల కవిత ఆకర్షించింది. ఉత్తర సర్కారుల స్కూళ్ళ యిన్స్పెక్టరు మన్రోదొర మెచ్చుకొన్నాడు. నాగోజీరావుగారు సరేసరి, ఇంతకు ముందు కవితలను హర్షించినవారే. ప్రిన్సిపాలు చంద్రశేఖరశాస్త్రిగారు సారంగధర చదివాక ఈ చిన్నవాడు మహారాజావారి దర్శనం చేసుకోవలసిన వారని భావించారు. ఒకనాడు అప్పారావుగారిని వెంటబెట్టుకొని కోటలోనికి వెళ్ళారు. మహారాజా వారి దర్శనం చేయించారు. అప్పారావుగారు యథేచ్ఛగా కోటలోనికి వచ్చిపోతూ ఉండవచ్చునని మహారాజావారు అనుమతి యిచ్చారు.

ఆనంద గజపతి అప్పారావుగారికన్నా పన్నెండేళ్ళు పెద్ద, తండ్రి విజయరామ గజపతి (1826-1879) మరణానంతరం రాజ్యానికి వచ్చారు. 1881లో మహారాజా

4. గురజాడ రచనలు - 4వ సంపుటం - మాటా మంతీ - అవీ ఇవీ - పుట.12
5. మాటా మంతీ - అవీ ఇవీ - పుట.15

బిరుదు వచ్చింది. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులయ్యారు. రాచకార్యాలపట్ల, పురోహిత విషయాలపట్ల విముఖతలేదుగాని జమా వ్యవహారాల బాధ్యతలను ఆనంద గజపతి తమ తల్లి అలక రాజేశ్వరీ దేవిగారికి, దివాను పెనుమత్స జగన్నాథ రాజుగారికి విడిచిపెట్టి తాము సంగీత సాహిత్య భాషా వ్యాసంగాలు చేస్తూ ఉండేవారు. ఆయన సభాభవనం శారదానిలయం. పండిత ప్రకాండులు, విద్వత్కవులూ, కూలంకష శాస్త్రవేత్తలూ, సంగీత విద్వాంసులూ, లౌకిక ప్రజ్ఞా నిపుణులు ఎప్పుడూ ఆయన దర్బారులో ఉండేవారు. వారందరి ప్రజ్ఞాపాటవాలను పరీక్షించగల చదువూ-సంస్కారం ఆనంద గజపతికి ఉండేవి.

. లాటిన్, ఇంగ్లీషు భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించి, కోదుభాషకు వ్యాకరణాన్ని రచించిన లింగం లక్ష్మాజీ పంతులు (1830-1902) గారి దగ్గర ఆనంద గజపతి ఆంగ్లాది భాషలు నేర్చుకొన్నారు. చిన్నప్పుడు తండ్రిగారితోపాటు కాశీలో ఉంటూ సంస్కృతం, పారశీకం, బెంగాలీ భాషలు అభ్యసించారు. భాగవతుల హరిశాస్త్రి (1811-1898), మైసూరు భీమాచార్యులు, ముడుంబై వరాహ నరసింహస్వామి (1841-1927) మొదలైన మహాపండితులు తర్వాత సంస్కృత సాగరాన్ని ఈదడానికి శిక్షణ ఇచ్చారు. భాష్యాంత వ్యాకరణ పండితులు పేరి కాశీనాథశాస్త్రి (1858-1920), ధర్మశాస్త్రాలను మథించిన కొల్లూరు కామశాస్త్రి (1840-1907) మొదలైనవారు సన్నిధానవర్తులు. వీణ వెంకట రమణదాసు (1866-1948) గారితోపాటు ఆనంద గజపతి సాధనం చేస్తూ ఉండేవారు. ఆయన సభా మండపం ఎప్పుడూ శాస్త్ర చర్చలతో, సాహిత్య గోష్ఠులతో సంగీత సదస్సులతో, నాట్య ప్రదర్శనలతో ఉత్తేజకరంగా ఉండేది. ఇటువంటి దర్బారు కార్యక్రమాలలో పాల్గొనడానికి గురజాడ అప్పారావుగారికి ఇరవయ్యోకటో యేట మహారాజా వారి అనుమతి లభించింది.

ఎఫ్ఫే చదువుతున్న విద్యార్థికి దర్బారులో ప్రవేశం దొరకిందంటే అది సంతోషించదగ్గ విషయమే. ఈ శుభవార్తను తన మేలుకోరి సలహాలు ఇస్తూ ఉండే శంభుచంద్ర ముఖర్జీగారికి అప్పారావుగారు 1883లో రాసిన వివిధ లేఖల్లో ఒకదాన్లో తెలియచేసి వుంటారు. ఈ ఉత్తరాలకు వెంటనే సమాధానం రాలేదుగానీ ముఖర్జీగారు 1884 జనవరి 27వ తేదీనాడు రాసిన లేఖలో చిట్టచివర ఈ దర్బారు ప్రవేశం ప్రసక్తిని తెచ్చారు.[6]

''ఈమధ్య విజయనగరం మహారాజావారు కలకత్తాకు విజయం చేశారు. వారి వెంట ఎందరో ఆశ్రితులు వచ్చారు. వారి సభలోని నవరత్నాలతో జాజ్వల్యమానమైన మీరు మట్టుకురాలేదు''.

ఆనంద గజపతి ఆస్థానంలో తమకు ప్రవేశం కలిగిందని 1883లోనే అప్పారావుగారు చెప్పకపోతే ముఖర్జీగారు ఇలాగ రాసి ఉండేవారు కాదు. ఆనంద గజపతి కీర్తి కలకత్తాలో కూడా ప్రకాశమానంగా ఉండేది. లోకం అంతటికీ

6. UNLIT-P.77

మహారాజావారు గొప్పవారైతే అప్పారావుగారికి మాత్రం ప్రిన్సిపాల్‌గారే ఆరాధ్య దైవం. అందుచేత చంద్రశేఖర శాస్త్రిగారినే ఆయన అంటిపెట్టుకొని ఉండేవారు. ఎఫ్ఫే ప్యాసయిన తర్వాత కొన్నాళ్ళు మహారాజావారి హైస్కూల్లో ఉపాధ్యాయునిగా అప్పారావుగారు చేరారు. బాగా వృద్ధిలోనికి రావలసిన యువకుడు బియ్యే చదవకుండా వుండడం మంచిది కాదని హితులు ఆయనను ఉన్నత విద్యకు ప్రోత్సహించారు. ఉద్యోగం మానేసి పట్టపరీక్షకు అధ్యయనం మొదలుపెట్టారు. అప్పారావుగారు బియ్యే చదువుతూ ఏదో అడపాదడపా పున్నానికో, అమావాస్యకో మొక్కుబడి కోసమన్నట్లు కోటకు వెళ్తూ ఉండేవారు. దివాణంలో జరిగే ముచ్చట్లు ( ) ోటా, ఆనోటా వినేవారు. ఒక సంగతి అప్పారావుగారి యువ హృదయాన్ని ఎంతో కలచివేసింది.

ఆనంద గజపతి మహారాజుగారు రామస్వామి అనే వేశ్యను ఉంచుకున్నారు. ఆమెను భోగపత్నిగా వివాహం చేసుకోదలిచారో ఏమో![7] ఆశ్రితులలో కలకలం పుట్టింది. మహారాజుగారు దానిని లక్ష్యపెట్టలేదు. ఇదొక స్కాండలుగా పరిణమించింది. ఈ గొడవతోనే అప్పారావుగారి మనసు విరిగిపోయింది. ఆనంద గజపతి అంటే కలుగుతున్న గర్వమంతా ఈ దెబ్బతో తుడిచిపెట్టుకొని పోయింది. ''మా మహారాజు వారిలాంటి సద్గుణ సంపన్నులూ, ప్రజ్ఞావంతులూ, ఎంతో ఉజ్జ్వల భవిష్యత్తుగల వారూ ఒక పెట్టున అన్నిటికీ స్వస్తి చెబుతారా'' అని అప్పారావుగారు ఖేదపడ్డారు. కోటకు వెళ్ళడం తగ్గించేశారు. మహారాజువారిని చూడకపోవడానికి మరో కారణం కూడా వుంది. అప్పారావుగారు బియ్యే పరీక్ష తప్పారు. తన ఆరాధ్య ప్రభువు వేశ్యనుంచుకొని ఎలాగైతే ఆశ్రితుని మనస్సులో పతనం చెందాడో, అలాగే పోషకుని ఉద్దేశ్యంలో తన అభిమాన యువకుడు పరీక్ష తప్పి పతనం చెందినట్లు కనబడుతోంది. బియ్యే పాసయ్యేదాకా మహారాజావారిని చూడడానికి తమకు ముఖం చెల్లదని అప్పారావుగారు నిర్ణయించుకున్నారు.

స్వతంత్రంగా ఆలోచించి స్వంత అభిప్రాయాలను రాయడమనే అలవాటే అప్పారావుగారిని బియ్యే పరీక్షలో ఫెయిల్ చేయించింది. ఆయన ఫెయిలయిన సబ్జక్టు ఫిలాసఫీ. పాఠ్యగ్రంథాలలోని చిలక పలుకులను అప్పగించక స్వంత అభిప్రాయాలను రాసే స్వతంత్ర యోచనాపరులను ఫెయిల్ చేయక మరేం చేస్తారు. పరీక్ష తప్పినందుకు అప్పారావుగారిలో పంతం ఎక్కువైంది. ఎలాగైనా బియ్యే ప్యాసయి తన మీద ఆశలు పెట్టుకొని అభిమానించే వారికి సంతోషం కలిగించాలనుకున్నారు. శంభుచంద్ర ముఖర్జీగారికి తాము బియ్యే పరీక్షకు మద్రాసు వెళుతున్నామని 1883లోనే తెలియచేశారు. దీనికి ముఖర్జీగారు 1884 జనవరి 27వ తేదీనాడు గాని జవాబు రాయలేదు. అప్పారావుగారు రాసిన బోలెడు ఉత్తరాలు అందినా పని తొందరవల్లా, అప్పారావుగారు

7. His Highness failed to take grasp of the situation in Ramaswami's marriage affairs, it is impossible that he should, seeing how various the interests concerned and how much terminable the moral forces at work. అని అప్పారావుగారు వ్రాసుకున్నారు. మహారాజువారు రామస్వామిని తామే పెళ్ళి చేసుకోదలిస్తే ఈ ఎఫైరు వచ్చిందో లేక యింకొకరితో ఆమె పెళ్ళిని ఆపించి తీసుకొని వచ్చారో?

పరీక్షలపై దృష్టి కేంద్రీకరించుతారన్న ఉద్దేశ్యం వల్లా జవాబులు రాయలేదనీ, మీరు ఉత్తరాలు ఎ్వరికి రాస్తున్నారో ఆయన ఇంకా సజీవుడే అని చెప్పడానికి ఈ సమాధానం రాస్తున్నా''నని చెప్తూ చాలా భోగట్టాలు ఇలా అడిగారు.[8]

''మీరు మద్రాసులో ఎంత కాలం ఉంటారు? మీ పరీక్షల గురించీ, అక్కడి సమాజం గురించి అన్ని వివరాలూ నా చెవిని వేయండి. సాహిత్యరంగంలో అక్కడ సుప్రసిద్ధులు ఎవరు? రాజకీయంలోనూ, ఉన్నతహోదాలలోనూ ఉన్న వ్యక్తులెవరు? బహిరంగ సభలలో ఉత్తమ ఉపన్యాసకులెవరు? అక్కడ సాగుతున్న సాంఘిక రాజకీయోద్యమాల గురించి తెలుసుకోవాలని అభిలషిస్తున్నాను. వితంతు వివాహాలకు అవకాశాలు ఎలా ఉన్నాయి? కార్మయిఖల్ దొరగారికి ''పార్టీ'' ఇచ్చే విషయంపై అక్కడి నేటివ్ పెద్దల మధ్య చీలికలు వచ్చాయని విన్నాను. ఇప్పుడు అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? ఉద్యోగ బాధ్యతల నుండి విశ్రాంతి తీసుకొంటున్న ప్రభుత్వ సభ్యుని సన్మానించిన పలుకుబడి గల పెద్ద మనుషులు తమ చర్యకు సిగ్గుపడుతున్నారా? ప్రజాభిప్రాయాన్ని ఈషణ్మాత్రం లెక్కచేయడం లేదా? ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రతిఘటిస్తున్న వర్గం వారిని వారి ధైర్యానికి లోకులు మెచ్చుకుంటున్నారా? వీరు యూరోపియన్లకు రోతగా ఉన్నారా? పాపం! వేలస్ దొర గురించి వాళ్ళేమంటారు? నెపోలియన్ లాగ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నానని నేను భావిస్తున్నాను. మీరు నిదానంగా తీరికనుబట్టి సమాధానాలు రాయవచ్చు. లేదా మానెయ్యవచ్చు... మద్రాసులో పరీక్షకోసం శ్రమిస్తున్నారని తెల్సుకొన్నాను''.

1883లో ముఖర్జీగారికి రాసిన ఉత్తరంలో తమ రచనా వ్యాసంగం గురించి, తలపెట్టిన కొత్త కావ్యాల గురించి అప్పారావుగారు తెలియజేసి ఉంటారు. 1884 మే నెల 20వ తేదీ నాడు మొదలుపెట్టి జూన్ 22వ తేదీనాడు పూర్తిచేసిన సమాధానంలో ముఖర్జీగారు చిట్టచివర ఇలా ప్రశ్నిస్తూ సలహాలు ఇచ్చారు.[9]

''మీరు రాద్దామనుకొంటున్న రాజకీయ కావ్యాన్ని ప్రారంభించారా? జానపద వీర గాథలు కథనం చేసే ''బెలాడ్సు'' గేయాలలోనూ, వివిధ ఛందస్సులలో ఉన్న పద్యాలలోనూ కావ్యాలు చేయడానికి ప్రయత్నించండి. మీ పద్యరచనా విధానంలో లోపాలు ఉన్నాయి. నిరంతర సాధనం వల్లనే మీలేఖిని మెరుగుపడి శైలి సాఫీగానూ, శ్రావ్యంగానూ ఉంటుంది''.

ముఖర్జీగారి సలహాల ప్రకారం రాజకీయ కావ్యాన్నిగానీ వివిధ ఛందాలలో ప్రయోగాలుకానీ అప్పారావుగారు చేసినట్టు లేదు. దీనికి కారణం ఉంది. బియ్యే చదువుతూ ఉండగానే అప్పారావుగారికి వివాహమైంది. వధువు దేవరాపల్లి వాస్తవ్యులైన ఎల్లాప్రగడ సన్యాసిరాజుగారి కుమార్తె అప్పల నరసమ్మ.

ఎల్లాప్రగడ వారు సంపన్నులు. పెళ్లి కుదిర్చింది ప్రిన్సిపాల్ చంద్రశేఖరశాస్త్రిగారే. అప్పారావుగారు బియ్యే ప్యాసవగానే మహారాజావారి కాలేజీలో ఎనిమిదో అసిస్టెంట్

9. Unilit-pp.23-24

లెక్చరర్‌గా ఉద్యోగం కూడా వేయించారు. జీతం చాలా తక్కువ. నెలకు పాతిక రూపాయలు మాత్రమే. పట్టభద్రులైనవారు ప్రభుత్వోద్యోగులుగా రాణిస్తే గొప్ప హోదాలు బాగా ధనలాభం ఉండేది. అందుచేత అప్పారావుగారు కాలేజీ ఉద్యోగం నుండి ''లీవు'' తీసుకొని 1887 ఏప్రిల్‌లో డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో సబ్రోటం హెడ్‌క్లార్కుగా చేరారు. బహుశా ఇటువంటి ఉద్యోగం లభించడానికే ఉపయోగ పడుతుందని చంద్రశేఖర శాస్త్రిగారు అప్పారావుగారికి పూర్వం ఇలా యోగ్యతాపత్రం ఇచ్చారు.[10]

''అఖండ మేధాసంపత్తిగల కొద్దిమంది విద్యార్థులలో అప్పారావు వొకడు. విద్యార్థిగా వుంటూ, గురువుల మన్ననలను పొందిన యువకుడు. నిరంతరం సాహిత్యా వ్యాసంగము అతని వ్యసనము. సహజ ప్రేరేపణ వలన కలిగిన అతని కవితాశక్తి అపారమైనది. సాధనవల్ల అది ప్రకాశవంతమై, ఎప్పటికిని మనం మరువలేని కవుల స్థానమును అప్పారావుకు ప్రసాదిస్తుంది. ఇందుకు సందేహము లేదు. వినయము, సౌశీల్యము అతని స్వహజ గుణములు. జీవితమున అతను అన్నిటా ఔన్నత్యమును పొందవలెనని నా అభిలాష. అతని ఔన్నత్యమే నా ఔన్నత్యము. అతని ఆనందమే నా ఆనందము''.

కలక్టరాఫీసులోని ఉద్యోగం ఇటు అప్పారావుగారికీ, అటు చంద్రశేఖరశాస్త్రిగారికీ ఆనందం ఇవ్వలేదు. పూర్వం మెట్రిక్యులేషన్ ప్రథమశ్రేణిలో ప్యాసై తర్వాత బియ్యేలో సంస్కృతం రెండవ భాషగా, తత్త్వశాస్త్రం అభిమాన విషయంగా ఆంగ్లంలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయిన ప్రతిభావంతుడు కచ్చేరీ కాగితాల మధ్యకాక కాలేజీ క్లాసుల్లో మెలగాలని చంద్రశేఖర శాస్త్రిగారు భావించారు. ఆర్నెల్లపాటు నౌకరీ చేశాక 1887 అక్టోబరు నెలలో విజయదశమినాడు అప్పారావుగారిని వెంటపెట్టుకొని చంద్రశేఖరశాస్త్రిగారు కోటకు వెళ్ళారు. ఆనంద గజపతి దర్శనం చేసుకొన్నారు. అప్పారావుగారిని కాలేజీలో నాలుగవ లెక్చరరుగా నియమిస్తున్నట్టు ఉత్తరువులు జారీ అయ్యాయి. నెలకు నూరురూపాయలు జీతం. ఈ ఉద్యోగం ఇచ్చి ఆనంద గజపతి ఊరుకోలేదు. తమకు రోజూ వార్తాపత్రికలు చదివి వినిపిస్తూ ఉండమని ఆదేశించారు. ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు నెలకు యాభై రూపాయలు అదనంగా మంజూరు చేశారు.

ఈ నియామకాల వల్ల తమకు ఎంత మనశ్శాంతి లభించిందో మహారాజావారికి బహుశా తెలియదని అప్పారావుగారు ఉత్తరోత్తరా డైరీలో నోటు చేసుకొన్నారు.

తమ ప్రియశిష్యుని జీవితాన్ని చక్కబరిచి, అతనిని రాజమార్గానికి చంద్రశేఖరశాస్త్రిగారు మళ్ళించారు. అదీ మామ్మూలు ఘంటాపథం కాదు. గజపతి త్రోవ. ఈ సంగతిని అప్పారావుగారే ఉత్తరోత్తరా ఒక శతకంలోని పద్యంలో ఇలా చెప్పారు.

---

10. గురజాడ రచనలు – 4వ సంపుటం – 'మాటా మంతీ' పుట.8

ధృతి గురుజాడల నరిగెడు
గతి పెద్దలు జూప జనితి గజపతి త్రోవన్
కృతి కదె గౌరవ మగుటన్
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్

అయితే అప్పారావుగారికి 1887లో జాడలు చూపిన గురువు చంద్రశేఖరశాస్త్రిగారు ఏడాది తిరక్కముందే 1888లో మరణించారు. ప్రిన్సిపాల్‌గారితో సరిపోల్చి చూస్తే మహారాజావారు ఏమంత గొప్పవారు కాదని అప్పారావుగారు భావించేవారు.[11] అంతటి ఆదర్శ పురుషుడైన ఆచార్యుడు పోయాక అప్పారావుగారు ఆనంద గజపతి గొప్ప విమర్శకులనీ, సూక్ష్మాతిసూక్ష్మంగా విశ్లేషించే తత్వాన్ని అలవర్చుకొన్నారని తెలుసు కొన్నారు. ఆయన సుభాషితాలు వినడానికీ, ప్రసంగాలు విని ఆనందించడానికీ తమ ఆలోచనలను ఆరోగ్యవంతం చేసుకొనడానికి అప్పారావుగారు దర్బారుకు హాజరయ్యేవారు.

మహారాజావారి ఆస్థానంలో ఒక డిబేటింగు క్లబ్బు ఉండేది. దానిలో సభ్యులు పాల్గొని వివిధ విషయాలు చర్చించేవారు. ''మానవునిలో గల పశుప్రవృత్తి' వంటి సాంఘిక విషయాలు ఆ గోష్ఠులలో చర్చించేవారు. ఒకసారి 'మహాపురుషుల పతానానికి స్త్రీలే కారణం' అనే అంశం మీద చర్చ జరిగింది. అందులో చివరికి స్త్రీలు పతితలు కావడానికి పురుషులే బాధ్యులని తేల్చారట. ఈ చర్చలలో అప్పారావుగారు పాల్గొంటూ ఉండేవారు. ఆయన ఏ విషయాన్ని అధ్యయనం చేసినా కూలంకషంగా దాన్ని అవగాహన చేసుకొనాలని దానిపై గల పుస్తకాలను సంపాదించి చదివి సముచిత జ్ఞానాన్ని సంపాదించుకొనేవారు. డిబేటింగు క్లబ్బులో చర్చల నిమిత్తం 'ప్రాక్టీస్ ఆఫ్ ఎలక్యూషన్; 'హింట్స్ ఆఫ్ ఎలక్యూషన్' అనే గ్రంథాలను సమగ్రంగా చదివారు. చర్చలలో సమర్థులయ్యారు గనుక అప్పారావుగారు ఆ డిబేటింగు క్లబ్బుకు 1889 ఆగస్టు 10వ తేదీనాడు ఉపాధ్యక్షులయ్యారు.

ఆస్థానంలో డిబేటింగ్ క్లబ్బులో ఆనాడు కన్యాశుల్కం సమస్యపై చర్చలు జరిగి ఉంటాయి. వాటిలో అప్పారావుగారు ప్రముఖులుగా పాల్గొనే ఉంటారు. కన్యాశుల్కం అనే నరమాంసం విక్రయాన్ని ఆనాటి మేధావులందరూ గర్హించేవారు. ఈ దురాచారం విషయమై వీరేశలింగంగారు 1880లో తమ పత్రికలో తీవ్రంగా ఖండించారు. కసాయివాడు ఎక్కడో పుట్టిన పశుమాంసాన్ని విక్రయిస్తాడు. బ్రాహ్మణ వేషధారులైన ఘోరరాక్షసులు తమ కడుపున పుట్టిన శిశుమాంసాన్ని విక్రయిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. సహగమనంలాగే కన్యాశుల్కాలను కూడా నిషేధించాలన్న ప్రగాఢ విశ్వాసం ఆనందగజపతికి కలిగింది. 1887లోనే అప్పటికి మూడేళ్ళలో జరిగిన బ్రాహ్మణ కన్యాశుల్క వివాహాల పట్టీని విశాఖపట్నం జిల్లా సామాన్య ప్రాంతాలలోని భోగట్టాలు సేకరించి తయారుచేయమని ఉద్యోగులను ఆదేశించారు. కన్యాశుల్కాన్ని తీసుకొన్నట్టు ఒప్పుకోవడానికి అందరూ సిద్ధంగా ఉండరు. కనుక భోగట్టాలు అసమగ్రంగానే లభించాయి. అయినా అలా తయారైన పట్టీ సైతం ఎంతో విలువైన మూల్యాపత్రం. ''నమోదయిన ఈ వివాహాల సంఖ్య 1034. అంటే సగటున ఏడాదికి ఇటువంటి

11. ''మాటామంతీ'' పుట.126

వివాహాలు 344 జరిగాయన్నమాట. 99మంది పిల్లలను ఆరేళ్ళ వయసులో, ఆరుగురికి రెండేళ్ళ వయసులో, 36మందికి మూడేళ్ళ వయసులో, ఆరుగురికి రెండేళ్ళ వయసులో, ముగ్గురికి ఏడాది వయసులోనే పెళ్ళి చేశారు. ఏడాది శిశువులు ఒక్కొక్కరికి చెల్లించిన ధర 350-400 రూపాయలు. చిత్రమనిపించవచ్చునుగాని కొన్ని సందర్భాలలో కడుపులో ఉన్న పిల్లలకు కూడా బేరం కుదుర్చుకొన్నారు. ఇంత ఘోరమైన పరిస్థితి సమాజానికి సిగ్గుచేటు''.[12]

ఈ గణాంక వివరాలు చూడగానే ఆనంద గజపతి ఒక నిర్ణయానికి వచ్చారు. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఆయన ఒక చట్టాన్ని ప్రవేశపెట్టి మన స్త్రీజాతిలోని నిస్సహాయమైన ఒక విభాగాన్ని, సామాజిక అవినీతి క్రియలతో నిండి వున్న బాధాకరమైన దాస్యం నుండి రక్షించదలిచారు. 1888 ఫిబ్రవరి నెలలో ఆయన మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో కన్యాశుల్కం బిల్లును ప్రతిపాదించారు. మనుధర్మం అనే సాకుతో బ్రాహ్మణులలో బానిసల్ని అమ్ముకొనే దురాచారాన్ని సాగనివ్వకుండా చేయడం ఈ బిల్లు ఉద్దేశం. అప్పటికి ఉన్న న్యాయచట్టాల ప్రకారం కన్యావిక్రయం నేరం కాదు. ఇవి బానిసత్వపు చట్టాల కింద వస్తాయి కనుక ఈ బిల్లు అవసరమైంది.

ఆనంద గజపతి ప్రవేశపెట్టిన బిల్లులో ఎంత హేతుబద్ధమైన వాదన ఉన్నా ఆనాటి ప్రభుత్వం దానిపై నిపుణుల అభిప్రాయాలను తీసుకోవాలని భావించింది. ఎస్. సుబ్రహ్మణ్యా అయ్యర్, సి. చంచలరావు అన్న ఇద్దరు భారతీయ సభ్యుల అభిప్రాయాన్ని అడిగింది. వారు వ్యతిరేకతను తెలిపారు. దానికి వారొక కారణం చెప్పారు. బాల్య వివాహాల వల్ల కన్యాశుల్క వివాహాలు జరుగుతున్నాయి. కాబట్టి బాల్య వివాహాలను నిషేధిస్తే కన్యాశుల్క వివాహాలు జరగవు అన్నారు. ఈ సభ్యుల వ్యతిరేకతను ఆమోదించి ప్రభుత్వం కన్యాశుల్కం బిల్లును బుట్టదాఖలు చేసింది.[13]

తమ ప్రభువు చట్టరీత్యా చేయవలసిన సంఘ సంస్కార కృషి ఇలాగ నీళ్ళుగారి పోయినందుకు ఆస్థాన మేధావులంతా సహజంగానే కలత చెందారు. అప్పారావుగారు ఈ సమస్యను కూలంకషంగా విశ్లేషించారు. కన్యాశుల్క వివాహాల దుష్ఫలితాల వికృత రూపాలను పరిశీలించారు. అతి బాల్య వివాహాల వల్ల యుక్తవయస్సు రాకముందే బాలికలు వితంతువులు కావడం, పుట్టింట్లో, అత్తింట్లో యావజ్జీవ బానిసలు కావడం, యౌవనంలో శరీర వాంఛలకు తట్టుకోలేక కాలుజారడం, దగాకోరు మగవాళ్ళ వలలో పడడం, లేచి పోవడం, గర్భధారణం, భ్రూణహత్యలు, ఆత్మహత్యలు మొదలైనవెన్నో విషపరిణామాలు కన్యాశుల్క వివాహాల వల్ల సంభవిస్తాయి. ఈ దురాచారాన్ని ఖండించి ఉన్నతమైన నైతిక ప్రమాణాలను వ్యాపింప చేయాలని అప్పారావుగారు కృతనిశ్చయులయ్యారు. ఇది సాహిత్యం వల్లనే సార్థకమౌతుంది. ఈ సమస్య గురించి చక్కని రచన చేయాలనుకొన్నారు.

---

12. కన్యాశుల్కం (మొదటి కూర్పు) పీఠిక నుండి.
13. ఈ వివరాలు సెట్టి ఈశ్వరరావుగారు రాసిన ''కన్యాశుల్కం - ఒక అపూర్వసృష్టి'' అనే వ్యాసం నుండి సేకరించాను. చూ॥ గురజాడ రచనలు - కన్యాశుల్కం (2వ కూర్పు) విశాలాంధ్ర ప్రచురణాలయం, 1986.

అప్పారావుగారు అప్పటికి ఏరకమైన రచనలూ చేయలేదు. కాలేజీలో ఆయన ఎప్ఫే. బియ్యే తరగతుల విద్యార్థులకు తత్వశాస్త్రం, ఆంగ్లం, సంస్కృత సాహిత్యచరిత్ర, అనువాదం, వ్యాకరణం, గ్రీకు రోమను చరిత్రలు ఇంగ్లీషులో బోధించేవారు. ఆయన రచనలన్నీ ఆభాషలోనే అప్పటిదాకా సాగాయి. భారతీయులు విదేశీ భాషలో రచనలు చేయవలసిన అగత్యం గురించి ఆయనకు కొన్ని విశ్వాసాలు ఉన్నాయి. అవి ఇలాగ ఒకచోట చెప్పారు.[14]

''భారతదేశంలో వివిధ రాష్ట్రీయుల భావ ప్రకటనకు ఆంగ్లభాష వొక సాధ ఉపయుక్తమౌతూ సంస్కృత హిందీ భాషలను అవతలకు నెట్టి అధిగమి అంతేకాక ప్రతిసంవత్సరం అధిక సంఖ్యాకులౌతున్న విద్యాధికులలో, నూత్న భారతదేశ స్వరూపాన్ని సాక్షాత్కరింపచేస్తూ నిద్రాణమై వున్న జాతీయ భావాన్ని చైతన్యాన్ని మేలు కొలుపుతోంది. నిరవధికోత్సాహాన్ని కలిగిస్తూ కొత్త కొత్త ఆలోచనలను రేకెత్తిస్తూ కాల్పనికతను పెంపొందిస్తోంది. పురాతన ప్రపంచ భావాలకు నూత్న ప్రపంచపు భావాలకు సంబంధం యేర్పడినపుడు యిటువంటి పరివర్తన కలగడం సహజం.

''సహజంగా భారతదేశం పట్ల ఆసక్తివున్న పాశ్చాత్యులెవరికైనా మనదేశపు భూత వర్తమాన కాలాల జాతీయ జీవితాన్ని తెలుసుకోవాలనే కోరిక వుంటుంది. మనమేధావులు రచించిన కావ్యాలను పరిశీలించి భారతదేశ జాతీయ జీవిత స్వరూపాన్ని అవగతం చేసుకోవాలనే ఆకాంక్ష వుంటుంది. అలాంటప్పుడు మన జీవితంలో ఆకర్షవంతమైన సంఘటలను అన్యదేశీయులకు చూపుతూ ఆంగ్ల భాషలో రచనలు సాగించే భారతీయులు తమ మాతృదేశానికి అపారమైన సేవ చేసినవారౌతారు''.

అయితే అప్పారావుగారు కన్యాశుల్క వివాహాల దుష్ఫలితాల గురించి విశదం చేయవలసినది విదేశీయులకు కాదు, స్వదేశీయులకే. అందులోనూ సామాన్య జనానికి. అక్షరాశ్యుల సంఖ్యే అంతంత మాత్రంగా ఉంది. అందులోనూ పుస్తకాలూ, పత్రికలూ చదివే వారి సంఖ్య అల్పమే. ప్రజాబాహుళ్యానికి పుస్తక పఠనం అలవాటయ్యే దాకా ఆరోగ్యకరమైన సాహిత్య ప్రభావవ్యాప్తికి నాటకరంగాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది. ఆ సదుద్దేశమే అప్పారావుగారిని నాటక రచనకు ప్రేరేపించింది.

అప్పటిదాకా తెలుగులో ఏదీ రచించనట్టే నాటకాలను నిర్మించడానికి కూడా అప్పారావుగారు ప్రయత్నించలేదు. అయితే నాటక రచనా శిల్పం వారికి బాగా తెలిసిన విషయమే. ఆంగ్ల విద్యావేత్తలు కనుక విశ్వసాహిత్యంలో నాటకధోరణులు అధ్యయనం చేశారు. ముఖ్యంగా షేక్స్పియర్, బెన్‌జాన్సన్, మోలియర్ మొదలైన విశిష్ట నాటకకర్తల సాహిత్య సృష్టిని ఔపాసన పట్టారు. ఆ ఇంగ్లీషు నాటకాల సరళినే తెలుగులో అవతరింప చేయాలన్న కుతూహలం వారికి కలిగింది. తాము చేయదలచుకొన్నది ప్రచారమే అయినా, వీరేశలింగంగారిలాగ పాత్రలు నోటంట ప్రయత్నపూర్వకంగా నూతన ధర్మ పన్నాలు చెప్పించడంకన్నా సహజవర్గ స్వభావాలతో నిత్య జీవితంలో వెలిబుచ్చే

14. 'మాటా-మంతీ' హరిశ్చంద్ర పీఠిక - పుటలు 111-113.

అభిప్రాయాలనే ఆపాత్రలు వెల్లడిచేస్తే ఔచిత్యం ఉంటుందని భావించారు. పండిత పామర రంజకంగా నాటక ప్రదర్శన జరగాలంటే అందులో 'విట్' (బుద్ధి జనితమైన హాస్యం) సమపాళ్లల్లో ఉంటేనే ప్రేక్షకులందర్నీ ఉమ్మడిగా ఆకట్టుకొనడం సాధ్యమని ఆయనకు తెలుసు. అప్పారావుగారు ప్రదర్శనకోసమే కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. శ్రవ్య కావ్యంలాగ అచ్చువేయడానికి కాదు. ఆనాడు విజయనగరంలో నాటక ప్రదర్శనకు చక్కని ప్రోత్సాహం ఉండేది. ఆనంద గజపతి తండ్రిగారి కాలంలోనే జగన్నాథ విలాసినీ సభ అనే నాటక సమాజాన్ని 1874లో స్థాపించారు. గంటి బుచ్చిశాస్త్రిగారి నేతృత్వంలో శాకుంతల, ఉత్తర రామచరిత్రా మొదలైన సంస్కృత నాటకాలనే ప్రదర్శించేవారు. అందుకే దీనిని 'సంస్కృత అకాడమీ' అనేవారు. ఆనంద గజపతి హయాంలో ఈ సమాజం చాలా అభివృద్ధి చెందింది. ఒక్క విజయనగరంలోని నాటక రంగాన్నేకాక మద్రాసు మొదలైన నగరాలలో ఉత్తమ నాటక ప్రదర్శనలు చేసే సమాజాలను ఆయన ప్రోత్సహించడమేకాక ఆ వ్యక్తులను తమ ఆస్థానానికి ఆహ్వానించేవారు. విజయనగరం పెద్ద చెరువుగట్టున డాబాతోటలో ఆనంద గజపతి మహారాజావారి నాటకశాల ఉండేది. నటులకు జీతాలిచ్చి పోషించేవారు. ఈ నాటక సమాజం వారి ప్రదర్శనలను అప్పారావుగారు వీక్షించేవారు. 1889 నవంబరు 8వ తేదీనాడు 'శకుంతల' నాటకాన్ని డాబాతోట హాలులో ఆడారు. దానికి 'మహారాజావారు విచ్చేసిరి' అని అప్పారావుగారు తమ డైరీలో నోటు చేసుకొన్నారు. స్థానిక నాటక సమాజంలోని సభ్యులందరిలో అప్పారావుగారు సాయిలాపాయిలాగా ఉండేవారు. మహారాజావారికి అభిమాన విషయమైన కన్యాశుల్క వివాహాల నిషేధంపైన తాము నాటక రచన చేస్తున్నట్టు, దానిని ప్రదర్శించాలనీ చెప్పి ఉంటారు.

ఆనాడు దేశంలో వెలువడుతున్న నాటకాలన్నింటిలో కృతక గ్రాంథిక శైలినే వాడేవారు. ఈ పద్ధతి అప్పారావుగారికి నచ్చలేదు. సహజ సంభాషణా శైలిని వాడదలుచుకొన్నారు. దీనికి ఆమోద ముద్ర లభిస్తుందా అని తటపటాయించక్కర్లేదు. ఆనాడు విజయనగరం సంస్థానంలో మహారాజావారూ, వారి తల్లిగారైన మాతా మహారాణీ, సర్కారువారు సులభశైలిని ప్రోత్సహిస్తున్నారు. ఆనందగజపతికి అభ్యుదయ భావాలు ఉండేవి. శాస్త్రాలన్నీ జన సామాన్యానికి అందుబాటులో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి. ఆ శాస్త్రాలు సంస్కృతంలోనే ఉన్నాయి. పండితులు మాత్రమే వాటిని అర్థం చేసుకోగలరు. స్వార్థ ప్రయోజనాలు గలవారు ఏదైనా శాస్త్రంలో ఉందని చెప్పి బుకాయించవచ్చు. 'విస్సన్న చెప్పిందే వేదం' అవుతోంది. ఈ దుస్సాంప్రదాయాన్ని తొలగించాలంటే శాస్త్ర గ్రంథాలను తెనిగించాలి.

జనాభాలో ఎక్కువమంది శూద్రులు. వారు అనుసరించవలసిన ధర్మాలను తెలుపుతూ కమలాకర భట్టు అనే ధర్మశాస్త్ర పండితుడు 'శూద్ర కమలాకరం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో పూర్వం రచించాడు. దీనిని ఆనంద గజపతి స్వయంగా 'సర్వజనసాధారణమైన స్పష్ట భాష'లో తెనిగించాలని భావించారు. కొంత అనువాదం చేశాక సంస్కృత గ్రంథాలను ఆంధ్రీకరించగల పండితులు తమ ఆస్థానంలో ఉన్నారని

వారిలో ఒకరికి కచ్చితమైన నిర్దేశాలతో ఈ పని అప్పగించి, తాము ఆంగ్లంలో మిల్‌దొర రచించిన తర్కశాస్త్రాన్ని అనువదిస్తే ఉపయోగమని భావించారు. శూద్ర కమలాకరం అనువాదాన్ని కొల్లూరి కామశాస్త్రి గారికి అప్పగించి సర్వజన సాధారణమైన స్పష్ట భాషలోనే తెనిగింపచేశారు. కొల్లూరి కామశాస్త్రిగారు ఈ శైలిలోనే 'ఆంధ్ర ధర్మ సింధుసారం' అనే గ్రంథాన్ని 1888కి కొంత తెనిగించారు. దాని పీఠికలో ఆయన చెప్పిన మాటలు గమనించతగ్గవి.[15]

''... ఈ దేశమునకు సహజమైన యాంధ్ర భాషయందలి గ్రామ్యత్వదోషము నివర్తింపఁజేయుటకు మాత్రము యత్నించి, ప్రాచీన విద్వాంసులగు నన్నయ భట్టారకుఁడు, తిక్కన సోమయాజి, పెద్దనార్యుఁడు మొదలగువారు కట్టుదిట్టములచే నీ భాషకు సంస్కృతమంత ఘనత తెచ్చియు, తమ రసజ్ఞతను, బాండిత్య ప్రకర్షమును వెల్వరించు ప్రౌఢభాషతో మహాప్రబంధములను జేసిరి కాని, యొకరైనను సాక్షాజ్జగదుద్ధారకమైన శాస్త్రములలో నొకటియైన దెనిగించుటకు నుత్సహింపరైరి. ఆధునికులు నట్లె గతానుగతికి మార్గము ననుసరించిరి. కనుక నాంధ్ర భాషయందు శాస్త్రవాణి , యొకింతయు గానరాదయ్యె. ఇట్లనన్య గతికమైన జగమునుద్ధరించుటకు శాస్త్రములలో ముఖ్యమగు ధర్మశాస్త్రమును సర్వసాధారణమైన స్పష్టభాషలో తెనిగించుటకు నుత్సహించితిని.''

శూద్రకమలాకరం 1887లోనూ, ఆంధ్ర ధర్మ సింధుసారం 1888లోనూ ముద్రితాలై ప్రచురణ పొందాయి. రెండూ ఆనంద గజపతి ప్రోద్బలం వల్లనే 'సర్వజన సామాన్యమైన స్పష్ట భాష'లో వెలువడ్డాయి. ఆనంద గజపతి తల్లిగారు అలకరాజేశ్వరీదేవిగారు ఇంతకన్నా తేలికశైలిలో గ్రంథాలు అనువదింపచేసి 1890లో అంకితం పుచ్చుకొన్నారు. మైసూరు ప్రభుత్వంవారు కన్నడంలో ఒక పాకశాస్త్ర గ్రంథాన్ని భావించారు. మద్రాసు ప్రభుత్వం కార్యాలయంలో లైబ్రేరియన్‌గా ఉండే సుబ్బారావుగారి చేత దానిని తెనిగింప చేశారు. భాష విషయంలో అనువాదకర్త 1890లో చెప్పిన విషయాలు, ఆనాటి విజయనగరం సంస్థానంలో ప్రబలిన అభ్యుదయ దృక్పథానికి దాఖలాలు. పీఠికలో ఇలా ఉంది.[16]

''ఒక్క జిల్లా యందలి తెలుగును మాత్ర మనుసరించి వ్రాయబూనిన నందరికి నత్యావశ్యకంబగు నీశాస్త్రంబును బెక్కండ్రు గ్రహింపఁ జాలరను భయంబున సాధ్యమగు నంతవఱకు నన్ని జిల్లాల తెలుఁగు ననుసరించి, ఎల్లరకు సులభముగఁ దెలియు నటుల సాధారణముగ నింటవాడు కొను తేట తెనుఁగు పదముల నుపయోగించుచు, నావశ్యకమైన చోటులఁ బర్యాయపదములఁగూడ వ్రాసినాఁడ. ఇదియునుంగాక యీ శాస్త్రమును బాలికా పాఠశాలలయందు బాలికలకు గరప, వారల కత్యంతోప యుక్తింబగును గాన, పదంబుల వర్ణక్రమమును గాని చదువనేరని బిడ్డలకు సహితము సులభముగాఁ దెలియుటకు, దీర్ఘసమాసంబులను, గూఢములగు పద సంధులను మాని, చూచిన తోడనే యర్థమగు నటులఁగూడ వ్రాసినాఁడను''.

15. బులుసు వెంకటరమణయ్యా - గజపతిరాజుల తెలుగు సాహిత్యా పోషణము - పుటలు 117-118.
16. బులుసు వెంకట రమణయ్యా - 'గజపతిరాజుల తెలుగు సాహిత్యా పోషణము' - పుటలు.162-163

పుస్తకాలలోని మాటలు చూసినతోడనే అర్థం అయేటట్టు, నాటకాలలోని సంభాషణల ద్వారా పాత్రల స్వభావాలు విన్నతోడనే అర్థం కావాలి. అందుకే అప్పారావుగారు సౌలభ్యం కోసం వాడుక భాషనే నాటక రచనకు ఎంచుకొన్నారు. రచన ఎప్పుడు ప్రారంభించారో, ఎప్పుడు పూర్తిచేశారో ప్రస్తుతం లభిస్తున్న ఆకరాలను బట్టి కచ్చితంగా చెప్పలేం. బహుశా 1891లో మొదలుపెట్టి ఉండవచ్చు. 1892 ఆగస్టు నెలలో దీనిని జగన్నాథ విలాసినీ నాటక సమాజంవారు ప్రదర్శించడానికి నిశ్చయించారు. అప్పారావుగారు నాటకాన్నయితే రచించారుగాని, నాంది ప్రస్తావనలు రచించలేదు. సంస్కృత నాటకాలను ఆడే జట్టువారు సలక్షణంగా నాటక ప్రస్తావనలు లేని నాటకాన్ని ఎలా ప్రదర్శించగలరు. అందుచేత ఈ లోటును భర్తీ చేయడానికి సమాజంవారు ముడుంబై వరాహ నరసింహస్వామి వారిచేత సంస్కృతంలోనే వాటిని రచింపచేశారు. నాందీ ప్రస్తావనల రచన 1892 ఆగస్టు 13వ తేదీనాడు రాశారు. ప్రదర్శన బహుశా కొద్దిరోజుల తర్వాత జరిగింది కాబోలు.

విజయనగరం నుండి ఆరోజుల్లో వెలువడుతున్న 'తెలుగు హార్పు' అనే పత్రిక 1892 ఆగస్టు 26వ తారీకున ఆ ప్రదర్శనాన్ని సమీక్షిస్తూ ''మన స్థానిక నాటక సమాజం వారిచే గత శనివారం రాత్రి కన్యాశుల్కమనే స్వతంత్ర నాటకం హృదయంగమంగా ప్రదర్శితమైంది'' అని రాసింది. ఆ యేడు ఆగస్టు 13వ తారీఖు మంగళవారంనాడు పడింది. ఆ నెల్లో 17వ తారీఖూ, 24వ తారీఖు మాత్రమే శనివారంనాడు వచ్చాయి. ఈ రెండింటిలో ఏదో ఒకరోజున బహుశా ఇరవైనాలుగో తారీఖున నాటకాన్ని ఆడి ఉంటారు. 'తెలుగు హార్పు' సమీక్ష ఇలా ఉంది.[17]

''ప్రదర్శనశాల ప్రేక్షకులతో కిటకిటలాడుతూ ఉండెను. డబ్బుకాశపడి తల్లిదండ్రులు తమ కుమార్తెలను ముసలి వాళ్ళకైనాసరే యిచ్చి వివాహం చేసి తమకు కాబోయే అల్లుళ్ళ వద్దనుంచి ధనాన్ని పొందే కన్యాశుల్కమనే దురాచారం ఎట్టి దుష్ఫలితాలకు దారి తీయగలదో చూపడమే ఈ నాటక లక్ష్యం. ఇలాంటి దురాచారాన్ని మాన్పించి సంస్కరించవలెనని మన మహారాజావారు ఎంతకాలం నుంచో హృదయపూర్వకంగా వాంఛిస్తున్నారని సంస్కరణోద్యమనానికి ప్రధాన వ్యక్తులుగా వున్నారని మనకందరికీ తెలిసిన విషయమే.

''నాటకం ఆద్యంతమూ మనోరంజకం. హృదయోల్లాసకరమైన సంభాషణలు ఛలోక్తులు లెక్కకు మించినన్ని. నాటకంలో ఛలోక్తులు చమత్కారాలు మాటిమాటికీ మెరుపులవలె మెరుస్తూ ఆదినుంచి అంతం వరకూ ఉత్తమహాస్యాన్ని కలిగిస్తూ ప్రేక్షకులను విస్మయ చకితులనూ తన్మయులనూ కావించాయి.

''కన్యాశుల్కం రచనతో ఆంధ్రనాటక సాహిత్యంలో వొక సరికొత్త పద్ధతిని వొక నూత్న పంథా ప్రారంభమయింది. దేవుళ్ళనూ దయ్యాలనూ దేవతలను రాక్షసులను కథాపాత్రలుగ స్వీకరించి రచించబడిన పాతనాటకాలవలెకాక తద్భిన్నమైన వర్తమానకాల

---

17. 'మాటా-మంతీ' పుట 95-96. ఈ ఉటంకింపులోని చివరి పేరాను నూతనంగా అనువదించాను.

యితివృత్తంతో మనకళ్ళ ఎదుట మసలే ఆధునిక స్త్రీపురుషుల జీవిత చిత్రీకరణతో ఈ నాటకం అలరారుతోంది. సన్నివేశకల్పన, హాస్యరస పోషణలతోపాటు పాతనాటకాలలో సాధారణంగా మృగ్యమై వుండే పాత్రీకరణమనే ప్రధానలక్షణంతో కన్యాశుల్కం విరాజిల్లుతోంది.

''ఈ నాటకాన్ని రచించినవారు సుపరిచితులూ స్థానికులున్నూ మహారాజా కాలేజికి చెందిన మాస్టర్ జి.వి.అప్పారావు పంతులు బియ్యేగారు, వారు ఇప్పటికే విభిన్న రంగాల ప్రావీణ్యంగలవారని ప్రసిద్ధికెక్కారు. ప్రత్యేకించి ప్రశంసించతగినవిధంగా వారు ఎంతో సాహిత్య రచనా వ్యాసంగం చేశారు. వారు సరళలేఖిని ఆంగ్లంలో అనేక గద్య పద్యాలను రచించి పత్రికలను అలంకరించింది. ఆయన స్థానిక పురావస్తు తత్త్వ రంగంలో పట్టుదలతో చిత్తశుద్ధితోను పాటుపడుతున్నారు. ఇప్పుడు నాటక రచయితగా రంగప్రవేశం చేస్తూనే విజయాన్ని సాధించిన ఆయనను అభినందిస్తూ వారికి ఉజ్వల భవిష్యత్తును చిరకాలం ఆకాంక్షిస్తున్నాం''.

'తెలుగు హార్పు'' సమీక్షవల్ల గురజాడ అప్పారావుగారి గురించి ఒక కొత్త సమాచారం ఆనాటి పాఠకులకు తెలిసింది. ఆయన స్థానిక పురాతత్త్వ పరిశోధనలో 1892 నాటికే పాటుపడుతున్నారన్న సంగతి గమనించదగ్గది. 1889లోనే ఆయన కాలేజీలో చరిత్ర పాఠాలను బోధించసాగారు. తమ డైరీలో అక్టోబరు 7వ తేదీనాడు ఇలా నోటు చేసుకొన్నారు.[18]

''గత నెల మొదటి తేదీనుంచి నాకీ జీతంలో అయిదు రూపాయల యింక్రిమెంటు వచ్చింది. ఆర్డరు నెంబరు 118. కళాశాలలో చరిత్ర పాఠాలను బోధిస్తూ వున్నంత కాలమూ ఇది అమలులో వుంటుంది''.

ఎప్పటినుంచో నికరంగా చెప్పలేం గానీ, ఉత్తరోత్తరా అప్పారావుగారు చరిత్ర పాఠాలనే బోధిస్తూ ఉండేవారు. కాలేజీ క్లాసుల్లో గ్రీకు రోమను చరిత్రలు చెప్తూ ఉంటే స్వదేశీయ సామాజిక స్పృహ ఉన్న తాత్త్వికునిలో స్థానిక చరిత్రల పట్ల జిజ్ఞాస సహజంగా ఉంటుంది. అందుచేత అప్పారావుగారు ఈ పరిశోధనలు ప్రారంభించి ఉంటారు. ఆనంద గజపతి అభినివేశం వల్లనే ఆయన కళింగదేశ చరిత్ర గురించి పాత రికార్డులు పరిశీలించడం ప్రారంభించారని ఊహించవచ్చు.

ఆనందగజపతి తండ్రిగారు విజయరామగజపతి (1826-1879)కి తమ వంశ చరిత్ర పట్ల చాలా ఆసక్తి ఉండేది. తమ పూర్వులకుండే బిరుదుల గురించి ఈస్టిండియా కుంఫిణీ వారితో తమ మునుపటి తరాల రాజులు కుదుర్చుకొన్న ఒడంబడికల గురించి ఆయన ఆనందగజపతికి చెప్తూ వుండేవారు. విజయరామ గజపతి ఇంగ్లీషు చరిత్రకారులు తమ సంస్థానం గురించి వివిధ గ్రంథాలలో రాసిన విషయాలను కూడా పరిశీలించేవారు. సర్‌ఛార్లెస్ అట్చిన్‌సన్ అనే ఆంగ్లేయుడు భారతదేశంలోని వివిధ రాజ్యాలలో వివిధ

18. గురజాడ రచనలు - సంపుటి-3, మహాకవి డైరీలు - పుట 4

కాలాలలో కుంఫిణీవారు రాసుకొన్న ఒప్పందాలను ఒక సంపుటంగా ప్రకటించారు. దీనిని 'అట్చిన్‌సన్ ట్రీటీస్' అని పిలుస్తారు. ఈ గ్రంథంగా 1744 నుండి 1759 దాకా విజయనగరం సంస్థానాలతో కుంఫిణీవారు చేసుకొన్న సంధి పత్రాలు చేర్చలేదు. ఈ లోపాన్ని విజయరామగజపతి తన ఆంతరంగిక కార్యదర్శి ఎ.జె.అండర్‌వుడ్ దొరగారి మూలంగా సర్ ఛార్లెస్ అట్చిన్‌సన్ గారికి ఒక లేఖ మూలంగా తెలియచేశారు. తమ గ్రంథం పునర్ముద్రణ పొందేటప్పుడు ఈ సంధి పత్రాన్ని అందులో తప్పక చేరుస్తామని అట్చిన్‌సన్ దొరగారు హామీ ఇస్తూ ఒక లేఖ రాశారు. ఈ సంగతులను విజయరామగజపతి తమ కుమారునికి చెప్పారు.

'అట్చిన్‌సన్ ట్రీటీస్' రెండో కూర్పు వెలువడిందిగానీ అందులో పూర్వం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకొనక 'విజయనగరం ట్రీటీ'ని ప్రచురణకర్తలు చేర్చలేదు. తమ తండ్రిగారికి ఇచ్చిన మాటను ఆంగ్లేయులు నిలబెట్టుకోలేదని ఆనందగజపతి బాధపడ్డారు. తాము కలకత్తాకు వెళ్ళినప్పుడు ప్రభుత్వం వారి ఫారిన్ సెక్రటరీ డబ్లు.జె. కన్నింగ్ హాం దొరగారిని కలుసుకొని 'అట్చిన్‌సన్ ట్రీటీస్ మూడవ ముద్రణలోనైనా 'విజయనగరం ట్రీటీ'ని చేర్చమని కోరారు. ఆ దొరగారు పాత సంధిపత్రం ఒరిజినల్ కాపీని పంపమని అడిగారు. అయితే దురదృష్టవశాత్తూ ఆ పత్రంగానీ, అట్చిన్‌సన్‌గారు విజయరామగజపతికి రాసిన ఉత్తరాలుగాని లభించలేదు. అయితే ఈ సంధి గురించి వివిధ ప్రామాణిక చారిత్రక గ్రంథాలలో సాక్ష్యాలు ఉన్నాయి. ఆనందగజపతి విస్తృత పరిశోధనలు ప్రారంభించి ఈ సాక్ష్యాలను సేకరించడానికి పూనుకొన్నారు. ఈ కృషిలో చరిత్రోపన్యాసకులైన గురజాడ అప్పారావుగారి సహాయ సహకారాలూ సంసేవలు ఉన్నాయి.

ఆనంద గజపతికి చాలా పెద్ద లైబ్రరీ ఉండేది. అందులో మూడు విస్తృత భాగాలు ఉండేవి. మొదటిది ప్రాచ్య విభాగం. ఇందులో తెలుగు, సంస్కృతం, ప్రాకృతం, గ్రీకు, లాటిన్, జర్మన్ భాషల గ్రంథాలు ఉండేవి.

రెండవది ఆంగ్ల విభాగం. వివిధ ప్రక్రియల్లో విభిన్న శాఖలకు చెందిన ఇంగ్లీషు గ్రంథాలన్నీ ఇందులో ఉండేవి.

మూడవది పెర్షియన్ విభాగం. ఇందులో పర్షియన్ అరబిక్ భాషల గ్రంథాలు ఉండేవి. ఒక్కొక్క విభాగానికో లైబ్రేరియన్ ఉండేవారు. 'ట్రీటీ' సాక్ష్యాలకోసం పరిశోధనలు చేస్తున్నప్పుడు ఆనందగజపతితోపాటు సంస్థానంలోని విద్వాంసులందరూ ఈ గ్రంథాలయాన్ని పూర్తిగా వాడుకొని ఉంటారు. ఓవెన్ కేంబ్రిడ్జి, కర్నల్ మాలెసన్, కెప్టెన్ ఆర్థర్ బ్రూం, రాబర్ట్ ఆర్మ్ మొదలైన కుంఫిణీ ఆంగ్లేయుల గ్రంథాలేకాక, ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్న మెకంజీ కైఫీయత్తుల నుండి సేకరించినవీ, రేగుల వలస కోవలోని పూసపాటి విజయ రామరాజు రచించిన 'విష్ణుభక్తి సుధాకరం'లోని అవతారిక పద్యాలు మొదలైన అనేక సాక్ష్యాలను సేకరించి 1893-1894 సంవత్సరాలలో ఆనందగజపతి

'విజయనగరం ట్రీటీ' అనే గ్రంథాన్ని రాశారు. దీని ప్రసక్తి అప్పారావుగారి డైరీలలో చాలా చోట్ల ఉంది. ఒక ఆరోపంలో ఇలా రాసుకొన్నారు.[19]

''దీని మీదట మహారాజావారు అన్నారు కదా, 'ఇదివరకొకసారి, కొన్నేళ్ళక్రితం యిలాగునే నాకొక సందేహం కలిగింది. అది మా పూర్వీకులకు 'మహామండలేశ్వర' అనే బిరుదు కలదా, లేదా అని. పాపం, సంజీవరావు పంతులుగారు, అంత ముసలివారై వుండి కూడా బహు ఓపికతో ఈ విషయం పరిశీలించి సందేహ నివృత్తి చేశారు. మహామండలేశ్వర అనే బిరుదుకల మా పూర్వీకులలో వొకరు జారీచేసిన ఫర్మానాలను వారు నాకు చూపించారు. నేను రీసెర్చి సలిపి 'ట్రీటీ' వ్రాసితిని. మనము, మన తప్పులను సరిదిద్దుకోగలము. తప్పుల తడకలతో వున్న ప్రకటనలను సరిచేసుకోగలము.

''మా నాయనగారొకసారి మా వంశీయులకు, కుటుంబీకులకు 'మహామండలేశ్వర; సుబదార్' అనే బిరుదులు కలవని క్లెయిము చేసిరి. మా నాయనగారి క్లెయిమునకు ఆధారము లేదని, యివి గాలికబుర్లని నేను సంశయించాను. వివాదగ్రస్తమయిన తన ప్రకటనలను చనిపోయిన ఒక మనిషి ధ్రువపరచుకోజాలడు కదా! ఈ విషయములో మా నాయనగారి మాట నిజము కావచ్చును; వారి మాట గౌరవించవలెను.

''సంజీవరావుగారు దాఖలా చూపించిన పత్రం 'మహామండలేశ్వర' బిరుదును ధ్రువపరుస్తున్నది. కాని సుబదార్ అనే బిరుదు మాట: మొన్న మొన్న అప్పారావు పంతులు 'సుబదార్' బిరుదును ధ్రువపరిచే ఒక గ్రంథమును తెచ్చి నాకు చూపించినారు''.

చరిత్ర పరిశోధనలు అప్పారావుగారు ముమ్మరంగానే సాగించారు. ట్రీటీ రచనలో ఆనందగజపతికి ఆయన ఎంత సాయపడ్డారో తెలుసుకొనడానికి 1893, 94 సంవత్సరాల డైరీలు ఆయన రాసుకోలేదు. ట్రీటీ రచనలో కాకపోయినా దాని ముద్రణలో మాత్రం అప్పారావుగారు ప్రధానపాత్ర వహించారు. 1895 జనవరి 9వ తేదీనాడు ఆయన మహారాజావారితో కలసి మద్రాసు వెళ్ళారు. ఆ సంవత్సరం జూలై 3వ తారీఖునగాని మళ్ళా విజయనగరం చేరుకోలేదు. ఆరునెలలపాటు మద్రాసులో ట్రీటీ ముద్రణ కార్యక్రమంలోనూ, వేరే చారిత్రక పరిశోధనా వ్యాసంగంలోనూ నిమగ్నులయ్యారు. 1895 డైరీ ఎంట్రీవల్ల ట్రీటీ గురించి కొన్ని భోగట్టాలు తెలుస్తున్నాయి.

8, ఫిబ్రవరి శుక్రవారం

> కంపోజిటరుకు ఒక రూపాయి ఇచ్చాను. పనిచూస్తే చాలా వుంది. చేతినిండా పనే. అయితే వున్నది మాత్రం ఒక్కడు. మిగిలిన వాళ్ళంతా ఎవళ్ళ పనుల్లో వాళ్ళు మునిగి వున్నారు.

18, ఫిబ్రవరి సోమవారం

> ట్రీటీ త్వరగా రాధాబాయి సాహెబుకు పంపించమని కలకత్తా నుంచి టెలిగ్రాం.

21, ఫిబ్రవరి లక్ష్మివారం

> ఫైనలు ప్రూఫులు పోస్టు చేశాను

19. గురజాడ రచనలు - 3వ సంపుటం - మహాకవి డైరీలు - పుట. 125-6

14, మార్చి మంగళవారం

ట్రీటీ బుక్కుకు నాలుగు రీముల కాగితం

26, మార్చి మంగళవారం

'వెస్టు' ఫోర్‌మెన్‌కు రెండున్నర షీటుల పేపరు కోసం రెండున్నర రూపాయలు ఇచ్చాను. 'ట్రీటీ' నాలుగున్నర ఫారాలు

14, మే మొదలు 24వ తేదీ వరకు

రోగంతోటే సరిపోయింది. పనేమీ కొనసాగింది కాదు. చేసిన మంచి పని వొకటే. మహారాజావారి పుస్తకాలు తయారుచేసి వెస్ట్ అండ్ కో వారు పంపించేశారు.

5 జూన్ బుధవారం

"వెస్ట్ అండ్ కో"కు వెళ్ళాను. టైప్పు విరగదీసి మీకెప్పుడు కావలెనో తెల్పితే అప్పుడు పంపించి వేస్తాము.

(అప్పారావు గారికి మిస్టర్ బిషప్పుకూ సుదీర్ఘోపన్యాసం జరిగింది. ఫ్రేములో వున్న టైప్పును, మిగతాసామాను, కంపెనీటైప్పు అన్నీ మహారాజావారికి ఖరీదుకు ఇవ్వండి అని అప్పారావుగారు చెప్పారు.)

డైరీలోని ఈ ఎంట్రీల వల్ల ట్రీటీ ముద్రణ బాధ్యతను అప్పారావుగారు 1895 ఫిబ్రవరి-జూన్ మాసాల మధ్య నిర్వహించారని తెలుతోంది. అయితే ట్రీటీ 1894లోనే ముద్రించినట్టు ఆ పుస్తకం ముఖపత్రం మీద ఒక దాఖలా ఇలా ఉంది.

VIJAYANAGARAM TREATY

OF

NOVEMBER 15TH 1758

and

The end of the fifteen years War between the English and

The French for the Sovereignty of India

from 1744 to 1759 AD with

A Sketen Account of THE NOTEWORTHY FACTS

connected with

The

VIZIANAGARAM Family

MADRAS

Printed By VEST & Co Mount Road, MADRAS-1894

(Reprinted by Lodhra Press, Royapettah, Madras) - 1938

పుస్తకం ముఖపత్రం మీద ఉన్న సమాచారానికీ అప్పారావుగారి డైరీల ఎంట్రీలకూ వైరుధ్యం ఉండడానికి ఒకటే కారణం ఊహించవచ్చు. ట్రీటీ అన్న గ్రంథం అచ్చులో 48 పుటల గ్రంథం. ఇందులో 184 పేరాగ్రాఫులు ఉన్నాయి. గవర్నరుగారి ఏజెంటు అయిన ఫ్రాన్సిస్, డి.ఎ.ఓ. వుల్ఫ్ ముర్రేగారికి రాసిన ఒక లేఖా రూపంలో ఆనందగజపతి ఈ గ్రంథాన్ని రచించారు. లేఖ 1894 డిసెంబరు 14వ తేదీనాడు ముగించారు. దానిని పోస్టుచేసిన తర్వాత అచ్చువేయాలని కోరిక కలిగి ఉంటుంది. ఆరోగ్యం బాగా లేని అప్పారావుగారు మద్రాసులో వున్న పెద్ద డాక్టరు బ్రౌనింగ్ దొరకు చూపించాలనీ, ట్రీటీ ముద్రణ ఆయన పర్యవేక్షణలో జరగాలని ఆనందగజపతి భావించి అప్పారావుగారిపై ఆ భారం పెట్టారని చెప్పవచ్చు.[20]

మద్రాసులో వున్న ఆరునెలలో అప్పారావుగారు చరిత్ర పరిశోధనలు కూడా చేశారు. మధ్యలో బెంగుళూరు వెళ్ళి వచ్చారు. బెంగుళూరులో వున్నప్పుడే 1895 ఏప్రెల్‌లోనే శాస్త్రీయ పద్ధతులలో శాసన ప్రతిబింబాలు ఎలా తీయాలన్న సంగతిని ఇలా నోటు చేసుకొన్నారు.[21]

''బ్రష్‌తో రాతిపలకను చక్కగా తుడిచి నీళ్ళలో కడగవలెను. కాగితమును నీటిలో ముంచి, పైకి తీసి, శాసనపు పలకమీద జాగ్రత్తగా నిండుగా పరచి, బ్రష్‌తో నొత్తవలెను. శాసనములోని అక్షరములు కాయితం మీద పడేవరకు బ్రష్‌తో అదమవలెను. నీళ్ళలో కాగితాన్ని ముంచేటప్పుడు దానిని టబ్బులో బాగా ఉంచాలి. నౌకరు మొదట నాసిక పేపరును ఉంచాడు. దానిపై ప్రింటింగ్ పేపరును పరచాడు. రాయి మోటుగా వుండి అక్షరములు స్ఫుటముగా పడనప్పుడు, వొక సీసాలో దీపపు మసీ, యింకు పౌడరూ వేసి సిరావలె తయారయేటట్టు నీళ్ళుపోయాలి. ప్యాడ్‌పై కొద్ది కొద్దిగా ఈ సిరాను చిమ్ముతూ మెల్లగా నొత్తవలెను. అక్షరములు స్పష్టపడేవరకూ అలాగున యింకును పోస్తూనే ఉండవలెను''.

అప్పారావుగారు తమ పరిశోధనల కోసం కొత్తగా శాసనాల ప్రతిబింబాలు నాసిక కాగితం పైనే తీయించాలని నిర్ణయించుకొన్నారు. శాసనపు నకళ్ళను కాపీ చేసుకొనడానికి అవసరమైన వస్తువు లన్నింటినీ సంపాదించారు. మద్రాసులో ఉన్నప్పుడే తమ ఆరోగ్యం గురించి రచనా వ్యాసంగ ప్రణాళికల గురించి ఇలా రాసుకొన్నారు.[22]

''నేను ఇక్కడకు వచ్చి కొన్ని నెలలయింది. కాని ఇంతవరకూ నా ఆరోగ్యం తిన్నబడలేదు. ఇంతకంటె తిన్నబడుతుందన్న ఆశ నాకు లేదు. ఈ అడ్మిరాల్టి హౌసులోనే ఇది బాగుబడనప్పుడు విజయనగరంలో అసలే లాభంలేదు. చుట్టుప్రక్కల వాతావరణం, ఇన్ని మంచి సదుపాయాలు, గొప్ప ధనవంతులకూ, ఉన్నతోద్యోగులకూ తప్పించి అన్యులకు అందుబాటులో వుండవు.

20. నేను 1938లో లోధ్రాప్రెస్‌లో అచ్చయిన ప్రతినే చూశాను. ఇందులో అచ్చుతప్పులు ఉన్నాయి. బహుశా 1894 అని ముఖపత్రంమీద సంవత్సరం కూడా అచ్చు తప్పే.

21. మహాకవి డైరీలు - పుట.42

22. మహాకవి డైరీలు - పుట.82-83

''నిజమే; నాకు ఆలోచనలు రావు; మనసు ప్రశాంతంగా వుండక అనేక విషయాల మీదకు దృష్టి పోతుంది. పురావస్తుతత్వ పరిశోధనలను కావించాలనే పిచ్చి ప్రబలిపోతున్నది. విజయనగరం రాజకుటుంబీకుల చరిత్ర రాయాలనే తలంపు ప్రత్యేకంగా నానాటికీ హెచ్చుతున్నది. ఇందు నిమిత్తమే నేను బెంగుళూరు వెళ్ళాను. ఓరియంటల్ లైబ్రరీలో గంటల తరబడి కూర్చుని, భోగట్టా సేకరించాను. సందేహాస్పదమైన ఆరోగ్యం కల వ్యక్తి సాధ్యమైనంత త్వరలో తాను చేయగల పనిని యేదో వొకటి చేయడం మంచిది. విజయనగర కుటుంబ పూర్వీకుల వంశ చరిత్రను గురించి కొన్ని కొత్త విషయాలను చెప్పగలిగితినేని అది నాకెంత ముదావహము!

''ప్రస్తుతము నా ఆలోచనలో వున్నవి, మూడు విషయాలు; మహారాజా వారి వంశచరిత్ర; ఆంధ్రనాటక రంగం; క్షత్రియుల విద్యాసమస్య. ఈ మూడింటిని గురించి యెంతో కొంత నేను కృషి చేయగలను కదా!''

చెన్నపట్నంలో గడిపిన ఆర్నెల్లలోనే అప్పారావుగారు తమ ఆలోచనలలో వున్న మూడు విషయాలలో మొదటిదైన 'మహారాజావారి వంశ చరిత్ర' విషయమై పరిశోధనలు ప్రారంభించారు. మద్రాసు సెంటు జార్జికోటకు వెళ్ళి 1895 ఏప్రిలు 15వ తారీఖునాడు 'విజయనగర వంశ చరిత్రకు ముఖ్యమైన భోగట్టాలు' సంపాదించారు. విజయనగరానికి తిరిగి వెళుతూ బెజవాడలో ఆగి జూన్ 20వ తేదీనాడు 'ఇక్కడ విజయనగరం రాజకుటుంబానికి చెందిన భోగట్టా కావలసినంత ఉంది. శ్రీకృష్ణవిజయము (కావ్యం) రచించిన రాజకవి అత్యంత ఆత్మీయతతో వర్ణించిన యింద్రకీలాద్రి చేరువనవున్న బెజవాడ ఎంత మనోహరంగా ఉంది'' అని డైరీలో రాసుకొన్నారు. తర్వాత ఇలా నోటు చేశారు.[23]

''బెజవాడ ఒకప్పుడు దేశానికి రాజధానిగా వుండేది. చెప్పుకోతగ్గనగరంగానే వుండేదనుకోవచ్చును. సైనిక ప్రాధాన్యత దృష్ట్యా దీనికి ప్రాముఖ్యత వుండేది. ఇక్కడ చాలా సైనిక బలము వుండేదని కృష్ణామాన్యుయల్‌లో పేర్కొనబడినది. కృష్ణరాయలు పూర్వ దిగ్విజయయాత్రకు విచ్చేస్తూ బెజవాడలో కొన్ని దినములు వున్నాడు. ఆముక్తమాల్యద 'విజయవాటిం' గొన్ని దినంబులుండి. 'వాటి'ని మాధవవర్మ సంస్థాపించాడు. బెజవాడలో 'పూసపాటివారి కోట' అని పిలువబడే ఒక ప్రదేశమున్నది. ఇప్పుడీ జాగాలో యిళ్ళు కట్టబడ్డవి'.

బెజవాడ నుంచి ప్రయాణం చేస్తూ మధ్యలో రాజమండ్రిలో ఒకరోజు ఆగారు. వివిధ ప్రాంగణాలలో వున్న అనేక శాసనపు పలకలను పరిశీలించారు. శాసనపు పలకలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దిక్కూ మొక్కూ లేక పడున్నాయి. 'వీటిని చూసిన వాడు లేడు' అని బాధపడ్డారు. రాజమండ్రి నుంచి పిఠాపురం. అక్కడో రాత్రి వున్నారు. తర్వాత విజయనగరానికి ప్రయాణం.

---

23. మహాకవి డైరీలు – పుట.121

అప్పారావుగారు తమ పర్యటన ముగించుకొని 1895 జూలై 3వ తేదీనాడు ఇంటికి చేరుకొన్నారు. తమ పరిశోధనలను కొనసాగించడానికి తమ నోట్సును పెట్టెలోంచి తీసుకోబోతే పెద్ద షాక్ తగిలింది. మద్రాసులో లోకలు రికార్డులను ఎత్తి వ్రాసుకొన్న వారి బుక్కు తమ వాళ్ళ నిర్లక్ష్యం వల్ల పోయింది. ''నెలల తరబడి చేసిన యింత కృషి బూడిదలో పోసిన పన్నీరు'' అని ఆయన చింతించారు. అయితే మళ్ళా కొత్తగా ఆ పరిశోధనలే చేపట్టారు.

విజయనగరం వచ్చాక అప్పారావుగారు కాలేజీలో మళ్ళా పాఠాలు ప్రారంభించారు. అయితే ఆరోగ్యం దెబ్బతింటోంది. గొంతు కీచుబడిపోయి చెన్నపట్నం లోనూ, బెంగుళూరులోనూ తెల్లదొరలు పాఠాలు ఎలా చెప్పారో అధ్యయనం చేసి కొత్త మెరుగులు ప్రవేశపెడదామనుకొన్న అప్పారావుగారి అధ్యాపకత్వం కూడా అనారోగ్యం వల్ల కుంటుతోంది.

కాలేజీలో కన్నా వీరి ప్రతిభా సంపత్తిని శాసన పరిశోధనా శాఖలో ఉపయోగించుకోవాలన్న అభిలాష ఆనంద గజపతికి కలిగింది. చెన్నపట్నం నుంచి వచ్చిన దగ్గర్నుంచి ఈ రంగంలో అప్పారావుగారు చేస్తున్న కృషిని గమనిస్తూనే ఉన్నారు. 1896 జూన్ 5వ తేదీనాడు 'యెస్టేటు శాసన పరిశోధకుని'గా ఆయనను నియమించారు. ఆనాటినుంచి సంస్థానపు హుజూరు ఆఫీసులో అప్పారావుగారు పనిచేయడం మొదలుపెట్టారు. హమేషా రాజావారి హుజూరున ఉండడం కూడా ప్రారంభమైంది. అప్పారావుగారి వంటి ఆత్మీయులకు సన్నిధిలో ఉండవలసిన అవసరం ఆనందగజపతికి ప్రాప్తించింది. అంతకు ఇరవైరోజుల ముందు మహారాజావారికి భార్యావియోగం సంభవించింది. నా అన్నవారు, ఇంగితం తెలిసినవారు సన్నిధానవర్తిగా ఉండడం మంచిది.

ఏలినవారితో ఇంత సాన్నిహిత్యం లభించాక అప్పారావుగారికి దివాణపు మర్యాదలు అర్థంకాజొచ్చాయి. రాజరికాన్ని ఆశ్రయించుకొన్న సంఘంలోని చేదుసత్యాలు బోధపడ్డాయి. మన స్వదేశ సంస్థానంలో రాజులను, రాజబంధువులను నమ్ముకొని ఎందరో భోగంవాళ్ళు బ్రతికేవాళ్ళు. దివాణం నౌఖరీలోనే ఎందరో ఉండేవాళ్ళు. కోటకు రోజూ వచ్చిపోతూ వుండే సందర్భంలో అప్పారావుగారికి ఎందరో వేశ్యలతో ముఖపరిచయం కలిగింది. శుభకార్యాలకూ పండుగలకూ పబ్బాలకూ పెట్టించే సానిమేళాలను ఆయన తిలకించారు. నేటివు పెద్దమనుష్యులే కాక సీమదొరలు కూడా ఈవినింగు సూట్లతోనే పరుపులమీద చతికిలబడి బాలీసుల నానుకొని మేజువాణిలను హర్షించడం ఆయన గమనించారు. భోగం వాళ్ళ సహవాసం చేస్తున్న యూరోపియను ఉద్యోగుల ప్రగల్భాలు ఆయన గుర్తించారు. చుట్టపుచూపుగా వచ్చే ఇతర సంస్థానాల మహారాజుల సేవలో భోగంవాళ్ళను పురమాయించడం అప్పారావుగారు చూశారు. హొల్కారు మహారాజువారు విజయనగరం వచ్చినప్పుడు వారు ముచ్చటపడి ముగ్గురు సానిపిల్లలను తమతోపాటు కొన్నాళ్ళపాటు అట్టే పెట్టుకొన్నారు. గోదావరిదాకా వాళ్ళను తీసుకెళ్ళి ఆ తరువాత విజయనగరానికి పంపించివేశారని అప్పారావుగారు డైరీలో నోటు చేసుకొన్నారు.

ఆనందగజపతి మహారాజావారి స్వంత నౌఖరీలో ఉండే భోగం పాపలందరినీ అప్పారావుగారు చాలా నిశితంగా పరిశీలించారు. వాళ్ళ కళ్ళలోనే వాళ్ళ శీలాన్ని చదవడానికి ప్రయత్నించారు. కరుణ కళ్ళు, లోతు కళ్ళు. రామస్వామి కనుబొమలు విశాలంగా సోగగా తెలివితేటలు సూచిస్తాయి. భాస్కరం కళ్ళు నిద్రమత్తులో తూగుతూ ఉంటాయి. చంద్రవదనవి ప్రశాంతమైన చూపులు, ఆమె చెల్లెలు కళ్ళలో అన్నీ ఆలోచనలే. ఇలాగ కనబడ్డ ప్రతి సానిపాపనూ అప్పారావుగారు కళ్ళతో చదవడం మొదలుపెట్టేవారు. ఈ సంగతి ఇతరులకు తెలియకూడదని ఆయన తాపత్రయపడేవారు.

అయితే ఆనందగజపతి అసాధ్యులు! ఇది ఇట్టే కనిపెట్టేశారు. ప్రసంగవశాత్తు అందరికీ చెప్పేవారు. 'అప్పారావుకు కన్ను రిట్టగించి చూసీ చూడనట్లు చూడడం ఒక అలవాటు' అని అన్నారు. 'ఆయన మాట నిజమే. నాకు ఏదైనా ఒక వస్తువు కనిపించినప్పుడు దానిని చూసి చూడనట్లు చూడాలని ప్రయత్నించేవాడిని' అది ఒక అలవాటుగా మారిపోయింది కాబోలు' అని అప్పారావుగారు డైరీలో నోటు చేసుకున్నారు. దేనికైనా నిర్భయంగా పరిశీలించమని హెచ్చరించడానికే ఆనందగజపతి అలా అని వుంటారు. అప్పారావుగారు ఆ సలహాని పాటించినట్టున్నారు.

ఒక పిల్ల ఎవరోగాని, ఆమె పేరు అకారంతో మొదలవుతుంది. మహారాజావారిని సంతోషపెట్టలేకపోయిందట. ఆమెలో నారాయణస్వామి అనే భోగంపిల్ల తాలూకు పోలికలున్నాయని మహారాజావారు చేరదీసినట్లున్నారు. నారాయణస్వామి అంటే ఆయనకు ఇష్టం కాబోలు. ఆ పేరు చెప్తూ ఆయన ఏవో మధుర స్మృతులు పొందుతారు. ఈ 'అ' నామకురాలు మంచి 'ఇంటి' నుంచి రాలేదు. యాసచూస్తేనే తెలుస్తోంది. తల్లిగుణాలే అబ్బినట్లున్నాయి. ఒక ఆడపిల్లలో తన భార్య పోలికలు ఉన్నప్పుడూ కొందరికి వాళ్ళంటే మక్కువ. భోగంవాళ్ళతో పైపై సరసానికి ఆడినా మహారాజావారు తమ ధర్మపత్నితో తప్ప ఇతరులతో సంభోగ సంబంధాలు మానివేశారట.[24]

పూర్వం ఏ రామస్వామి అనే వేశ్యను మహారాజావారు చేరదీశారని తెలిసి అప్పారావుగారు ఖేదపడ్డారో ఆ రామస్వామి వచ్చి ఇప్పుడు రాజావారితో జీవించ సాగింది. ఆమె మంచిచెడ్డలను కనుక్కొనే బాధ్యతను మహారాజావారు అప్పారావుగారికే అప్పగించారు. ఎలాగూ ఆ బరువు తనమీద పెడతారని అప్పారావుగారు ముందే గ్రహించి ఆమె గురించి మొదటే పట్టించుకొనడం ప్రారంభించారు.

అప్పారావుగారికి స్వామి భక్తిలోను ఉద్యోగ నిర్వహణలోనూ కొన్ని నమ్మకాలు ఉన్నాయి. ''ఆయన ఆజ్ఞాపించినవన్నీ శాయశక్తులా చేయడానికే ప్రయత్నించాలని నా ఉద్దేశం. మహారాజావారు పూర్తిగా పొరబడుతున్నారనిగానీ, లేక (దేవుడు దయవల్ల అలాంటి పరిస్థితికి రాకూడదుగానీ), వారికి మతిస్థిమితం తప్పిందనిగాని నికరంగా తేలేదాకా వారి ఆజ్ఞలు పాటించడమే విధి'' అని అప్పారావుగారు వ్రాసుకొన్నారు.

24. Coitus Love making (actual connection) - His Highness has long given up with one except his own wedded wife. He has wonderful control over himself, అని అప్పారావుగారు వ్రాసుకొన్నారు.

మహారాజావారి ఆదేశాలను పాటిస్తూ రామస్వామి యోగక్షేమాలు కనుక్కోనడంలో అప్పారావుగారి దృక్పథం క్రమేణా మారసాగింది. రామస్వామి, వెంకటస్వామి అప్పచెల్లెళ్ళు. వాళ్ళకు విద్యాబుద్ధులు బోధించాలని మహారాజావారే స్వయంగా పాఠాలు చెప్తూ వుండేవారు. గాని తొందరలోనే విసిగెత్తిపోయారు. ''నేను చస్తే - ఈ బెడద తప్పిందికదా అని వీళ్ళు పరమాన్నం వొండుకొని తింటారు'' అని మహారాజువారు నిశ్చయించుకొన్నారు. కాని అప్పారావుగారికి సహనం జాస్తి. ఆయన ఈ విషయంలో శ్రద్ధ తీసుకొన్నారు. అందుకు మహారాజావారు మెచ్చుకొన్నారు.

ఆమె యోగక్షేమాల బాధ్యత స్వీకరించాక మహారాజావారు అప్పారావుగారితో ఇలా అన్నారట:

''విద్యావంతులు ఆడవారిపట్ల దయగా ఉంటారు. మీకు అధికంగా ఋణపడ్డాను. చర్మంకోసి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేను. లోకులు ఉదాత్తమైన ఉద్దేశాలను అర్థం చేసుకోలేరు. మిమ్మల్ని చూసి అతగాడు ఆ పిల్లమీద మర్లుకొని ఆమె వద్దకు వెళుతున్నాడేమో, లేదా ఆవిడద్వారా ఏదో లాభం చేసుకొందామనుకొంటున్నాడు కాబోలుననో, కాదంటే రాజావారి ఇచ్చకం కోసం ప్రాకులాడుతున్నాడనో అంటూ అజ్ఞానులూ, అవివేకులూ పరిపరివిధాల లేనిపోని నిందలు వేయడానికి ఆస్కారమున్నా, దేనినీ లక్ష్యపెట్టకుండా మీరు ధైర్యంగా ముందుకొచ్చారు'' అని మహారాజావారు ప్రశంసించారు. అప్పారావుగారంటే జనానా స్త్రీలకు ఎంతో నమ్మకం, గౌరవం. ''మా తల్లిగారికీ, అక్కగారికీ తమరంటే పరిపూర్ణమైన విశ్వాసం వున్నది'' అని మహారాజావారే అప్పారావుగారితో సెలవిచ్చారట.

ఆనందగజపతి చేరదీసినా, అప్పారావుగారు నూరిపోసినా రామస్వామి రణపెంకె. ఎప్పుడూ మహారాజావారి ప్రాణం విసిగిస్తూ కాబోలు. ఒకనాడు ఏదో గొడవ వచ్చింది. ఆ సందర్భంలో అప్పారావుగారు గతాన్నంతా ఒక్కసారి ఇలా సింహావలోకనం చేశారు.

''రామస్వామి యోగక్షేమాలు కనుక్కుంటున్నాను. కొద్ది సంవత్సరాలలోనే నా ఉద్దేశాలలో ఎంతటి మార్పు! ఆదిలో రామస్వామిని మహారాజావారు చేరదీశారన్న వార్తను ప్రగాఢ సంతాపంతో విన్నాను. అంతకు పూర్వం మాహారాజావారితో నాకుగల పరిచయాన్ని బట్టి ఇటువంటిది జరుగుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే వారి పూర్వచరిత్ర గురించి నాకు తెలిసినది స్వల్పమే; ఆ రోజుల్లో తెలిసినది అత్యల్పమే అనాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ వార్త విన్నాక చాలా నొచ్చుకొన్నాను. ఆయనపట్ల నాకు గల గర్వం దెబ్బతిన్నది. మా మహారాజావారి వంటి పరిపూర్ణ సద్గుణ సంపన్నులూ, శక్తిమంతులూ, ఎంతో ఉజ్జ్వల భవిష్యత్తు గలవారు, ఒక్కపెట్టున తమ అవకాశాలకు తిలోదకాలు ఇచ్చుకొంటారా అని నొచ్చుకొన్నాను. (ఆరోజుల్లో మహారాజావారితో నాకు అంతగా సాన్నిహిత్యం లేదు; అంతేకాదు, అడపా దడపా మాత్రమే వారిని దర్శించుకొనేవాడిని. ఎప్పుడు పడితే అప్పుడు వారిని చూడగలిగే అవకాశాలు నాకు ఉండేవి. అయితే చచ్చి స్వర్గాన వున్న మా ప్రిన్సిపాలుగారు చెప్పినట్టు మహారాజావారి

దర్శనం చేసుకోవడానికి నేను ఏమాత్రం ఉబలాటపడేవాడిని కాదు. అప్పటి నా విశ్వాసాల ప్రకారం ప్రిన్సిపాల్‌గారి ముందు మహారాజావారు దిగుదుడుపే. అదీగాక, అప్పుడు నేను బియ్యే తప్పాను. ప్యాసయ్యేదాకా మహారాజావారి ముఖం చూడకూడదని నేను మనస్సులో నిర్ణయించుకొనడం కూడా ఒక కారణమే అని చెప్పాలి). ఉత్తరోత్తరా విన్న వైనాలుసైతం నలుగురూ చెప్పుకొనే ఈ సంఘటన పట్ల నా భావాల తీక్షణతను తగ్గించలేదు. పైగా నా సంతానం ఇనుమడించింది. అయితే ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఆమె ఇక్కడ నివాసం చెయ్యడానికి వచ్చేదాకా రామస్వామిపట్ల నాకు ఏమాత్రం ఏహ్యాభావాలు ఉండేవి కావు. అప్పటిదాకా నా బాధ అంతా మహారాజావారి గురించే! రామస్వామిని నిందించడానికి నాకు ఈషణ్మాత్రం కారణం లేదు. అది ఆమె వృత్తి. అయితే రామస్వామి ఇక్కడకు వచ్చివుంటూ వుండడంతో నా అభిప్రాయాలలో మార్పు వచ్చింది. మహత్తరమైన ఓరిమితో మహారాజావారు ఆమె చాపల్యాలను, ఉత్తపుణ్యానికి, సర్దుకొని పోతూ ఉంటే వారి వ్యక్తిత్వంలోని కొత్త పార్శ్వాలు నాకు కనబడసాగాయి. అయితే అదే సమయంలో నేను శాపనార్థాలు కురిపించసాగాను. లేదు! లేదు! నేను ఒకరిని దూషించడం అసంభవం! రామస్వామి ఇంకెక్కడైనా వుంటే బాగుండునని నేను ఆకాంక్షించాను. నిజానికి రామస్వామి సుఖంగా ఉండాలనే నా అభిలాష. అంతకన్నా ముఖ్యంగాని రామస్వామి సౌఖ్యాన్ని రామస్వామే చేజేతులారా చెడగొట్టుకోరాదని వాంఛించాను. ఆ తర్వాత మహారాజావారితో నాకు ప్రగాఢ సాన్నిహిత్యం లభించింది. రామస్వామిని కూడా బాగా అర్థం చేసుకొన్నాను. ఆమెలో మంచి గుణాలను చూశాను' అయితే ఆమెను నా సంరక్షణలో పెట్టేదాకా, ఎలాగూ పెట్టపోతారని నేను ఆ బాధ్యతను స్వీకరించేదాకా ఆమెలోని చెడుగుణాలవైపే ముల్లు మొగ్గుతూ వుండేది. ఇది నా దృక్పథంలో మరొక టర్నింగ్ పాయింటు.

(గడిచిన ఆరేడు సంవత్సరాలలో నాకు పర్యాలోకన శక్తి, జీవన పరిజ్ఞానమూ అధికమయ్యాయి. నా అయిష్టాలూ, విరోధాలూ, విద్వేషాలూ అదుపులో పెట్టుకొనడం నేర్చుకొన్నాను. అందరినీ సానుభూతితో చూడడానికి ప్రయత్నించాను. సాహితీపరునిగా జీవించదలచినవాడికి సానుభూతే పునాది.)

ఆమె అభిప్రాయాలను, ఆశయాలను అనుభూతులను అర్థం చేసుకొనడం ప్రారంభించాను. ఆమె చిన్నప్పటి శిక్షణా, బాల్యంలోనే ఆమెపై పడిన వివిధ ప్రభావాలనూ పరిగణించసాగాను. గిల్లికజ్జా పెట్టుకొనే కలహేచ్ఛ రామస్వామికి నిజంగా వాళ్ళమ్మనుంచి సంక్రమించింది. ఇది ఇప్పుడు స్పష్టమైంది. మహారాజావారి హృదయాన్ని అర్థం చేసుకొనే ప్రావీణ్యం ఆమెకు పట్టుపడకపోవడానికి ఇదే పెద్ద అవరోధం. (మహా మహావాళ్ళే వారిని బోధపర్చుకోలేకపోతున్నారు. ఈమె అనగా ఎంత?)

ఇప్పుడు మహారాజావారికి కోపం తెప్పించే విధంగా ఆమె సంచరించి వుంటుంది. తన చనువునూ, పలుకుబడినీ నమ్ముకొని ఒకవేళ ఏదైనా విషయంలో మొండికెత్తి, చెప్పినవాటిని అదేపనిగా నిర్లక్ష్యం చేసి వుంటుంది. వీళ్ళిద్దరి మధ్య ఉండే ఈ ఆకర్షణ

బహుశా కొంతవరకూ విభిన్న ప్రవృత్తుల మధ్య వుండేదే కావచ్చును. అమితమైన ప్రీతి సంగతి అలా వుంచి, ఆమె తెలివితేటలవల్లా, నైతిక వర్తనంలోని ఆకర్షణవల్లా ఆమె అంటే మహారాజావారికి ఇంతటి ప్రగాఢమైన వాంఛ కలుగుతున్నది కాబోలు!''

ఈ సింహావలోకనం వల్ల రామస్వామి మూలంగానే అప్పారావుగారిలో వేశ్యాసమస్యపట్ల ఒక జిజ్ఞాస మొదలైందని తెలుసుకోవచ్చు. ఉత్తరోత్తరా 'కొండుభట్టీయం' అనే నాటకంలో 'మంజువాణి' పాత్రనూ, 'సంస్కర్త హృదయం' అనే కథలో 'సరళ' సంక్షోభాన్నీ 'కన్యాశుల్కం' రెండో కూర్పులో 'మధురవాణి' పాత్రలను అప్పారావుగారు సృష్టించడానికి రామస్వామి పరిచయమే అప్పారావుగారికి ప్రోద్బలం అని వూహించవచ్చును.

ఒక పక్క ప్యూడల్ వ్యవస్థలోని నైతిక విలువల గురించి వాటివల్ల ఉద్భవించే సమస్యల గురించీ తమ అవగాహన పెంచుకొంటూనే అప్పారావుగారు తమ ఇతర ఉద్యోగ విధులనూ, సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగించారు. కన్యాశుల్కం రచించాక మళ్ళా ఆయన తెలుగులో రచనలు 1892 నుంచి చేయనేలేదు. చెన్నపట్నంలో ఉన్నప్పుడు వివిధ నాటక సమాజాల ప్రదర్శనలు వీక్షించి, కాళిదాసు నాటకాలను అధ్యయనం చేసి గ్రీకు, ఆంగ్ల, భారతీయ నాటకాల తులనాత్మక పరిశీలన చేశారు. అయితే ఆంగ్లంలో నవలలూ, కథలూ, చరిత్ర గ్రంథాలు రాయాలనే తలపోశారు. 1895 ఆగస్టులో వారు రాద్దామనుకొన్న సాహిత్య ప్రణాళికను ఇలా డైరీలో రాసుకొన్నారు.[25]

- ★ ఒక వ్యాకరణగ్రంథమును వ్రాయుట.
- ★ భారతదేశచరిత్ర, ఆంగ్లదేశ చరిత్ర
- ★ ఇంగ్లండులో ప్రచురించుటకై ఆంగ్లములో కొన్ని కథలు, గ్రీకు రాజ్యాల చరిత్రల తారతమ్యం పరిశీలనను రచించుట.
- ★ ఆధునిక జీవితమును అభివర్ణిస్తూ ఇంగ్లీషులో నవలా రచన.
- ★ తెలుగు సారస్వతంపై వరసవరసగా కొన్ని వుపన్యాసములు.

ఈసారి మద్రాసు వెళ్ళినప్పుడు వచ్చే శీతాకాలంలో అక్కడ అలా వుపన్యాసము చేయవలెను''.

అయితే కొన్ని ప్రత్యేక కారణాల వల్ల అప్పారావుగారు తెలుగులో పద్యరచన చేపట్టవలసి వచ్చింది. సంస్థాన శాసన పరిశోధకునిగా పనిచేస్తూనే ఆయన ఒక పత్రికను ప్రచురించాలని భావించారు. 'ప్రకాశిక' అన్న పేరుతో దానిని వెలువరించడానికి సంపాదకునిగా కూడా 1896లోనే డిక్లరేషన్ తీసుకొన్నారు. పత్రికా నిర్వహణ గురించి ఆయనకు కొన్ని గట్టి విశ్వాసాలు ఉన్నాయి. 1895లోనే మే ఒకటవ తేదీనాడు ఆయన డైరీలో ఇలా రాసుకొన్నారు.[26]

---

25. మహాకవి డైరీలు - పుట.136
26. మహాకవి డైరీలు - పుట.101-2

''పత్రికా రచనలో శైలివిషయమున తగు జాగ్రత్త వహించవలసిన ఆగత్యము వుందా? తప్పక వుంది. మన పత్రికా రచయితలు యే పరిస్థితులలో వుంటూ తమ కృషిని సాగిస్తున్నారో, ఆ పరిస్థితులు దుస్సహమైనవి. అన్ని డిపార్టుమెంటులలో చాలినంతమంది మనుషులు లేరు. వున్నవాళ్ళు బహుకొద్ది. మేనేజరూ, ఎడిటరూ, ప్రొప్రయిటరూ అన్నీ వొకడే. వున్న వుద్యమాలకు సెక్రటరీ, ఉపన్యాసకుడూ వొకడే. స్కూలు మాస్టరూ, వకీలూ, ఇతర ఉద్యోగ విధులు; దీనితో పుస్తక పఠనముకు, పరిశీలనకు తీరిక చిక్కదు. కొంతకాలం వరకూ వార పత్రికలు హెచ్చు ఉపయోగం. దేశములో ఐకమత్యము లేకపోవడం వొక ప్రధాన లోపం''

పత్రిక పెడదామని అప్పారావుగారు చాలాకాలంనుంచి ఆలోచిస్తున్నారన్నమాట. కాలేజీ లెక్చరర్ ఉద్యోగం మానేశాక తీరిక ఉంటుందని డిక్లరేషన్ తీసుకొని ఉంటారు. ఈ ప్రకాశిక పత్రిక ఎన్నాళ్ళు నడిపారో తెలియదు. చాలాకాలమే నడిపి ఉండాలి. అయితే గురజాడపై పరిశోధనలు చేసిన నిపుణులు వేరేవిధంగా భావిస్తున్నారు. 'ఈ పత్రికకు 'పురిటిలోనే సంధి కొట్టింది' అనొకరు రాస్తే,[27] ''ఈ పత్రిక వెలువడినట్టులేదు'' అని ఇంకొకరు చెప్తున్నారు.[28] అయితే అప్పారావుగారి లేఖల సాక్ష్యం వల్ల ఈ పత్రికను వారు నడిపారని చెప్పవచ్చు. ఉత్తరోత్తరా 1911లో తన స్వవిషయం తాము చెప్పుకొనడం బాగుండదని విశదం చేస్తూనే ఎవరికో రాసిన ఒక లేఖలో తమ జీవిత వివరాలను ఇస్తూ ''పాతికేళ్ళ క్రితం విజయనగరంలో నేను ఒక పత్రికను నెలకొల్పాను. దానికి సంపాదకుడను నేనే. పేరు ప్రకాశిక'' అని రెండున్నర దశాబ్దాల తర్వాత తెలియబర్చారు.[29] పత్రిక పురిట్లోనే సంధి కొట్టినా అసలు వెలువడకపోయినా తామొక పత్రికా సంపాదకులమని అప్పారావుగారు అన్నేళ్ళ తర్వాత క్లెయిమ్ చేయవలసిన అవసరం లేదు. ఈ పత్రిక ఎన్నో కొన్ని సంవత్సరాల పాటైనా వెలువడకపోతే దాని గురించి అప్పారావుగారు చెప్పుకోరు.

ఆనాడు విజయనగరంలో ఉండే 'ఇండియన్ లీజర్ అవర్', 'తెలుగు హార్పు' వంటి పత్రికల సమాచారం కొద్దిగానైనా తెలియవస్తోందిగాని అప్పారావుగారి ప్రకాశిక గురించి భోగట్టాలు దొరకలేదు. ఈ పత్రికను ఆనంద గజపతి ప్రోత్సాహం వల్లనే ఆయన ప్రారంభించి ఉంటారు. 1889లోనే ఆనంద గజపతి స్థానిక పత్రికల పట్ల శ్రద్ధ వహించేవారు. 'తెలుగు హార్పులో' ప్రతివారం పద్యాలు రాయకూడదా అని జిడ్డు సుందరావు పంతులుగారిని మహారాజావారు అడిగినట్టు అప్పారావుగారు తమ డైరీలో రాసుకొన్నారు. ప్రకాశిక పత్రిక ప్రతులు ఎన్నటికైనా కాలగర్భంలోంచి పైకి తేలితే ఎన్ని కొత్త విషయాలైనా మనకు లభించే అవకాశం ఉదయిస్తుంది.

ఆనంద గజపతి ఆస్థానంలో చాలామంది సంస్కృతాంగ్ల విద్వాంసులు ఉండేవారు. సంస్కృత పండితులకు ఆంధ్ర భాషా జ్ఞానం మృగ్యం. పైగా తెలుగుమీద చిన్న చూపు. ఇక

27. కె.వి.రమణారెడ్డి, 'మహోదయం' - పుట.131
28. సెట్టి ఈశ్వరరావు - గురజాడ రచనలు - కన్యాశుల్కం (రెండు కూర్పులు) 'జీవిత వివరాలు' - పు.VII
29. గురజాడ రచనలు - 5వ సంపుటి - లేఖలు-పుట.200

ఆంగ్లం నేర్చిన తెలుగువారు సరేసరి. ఒకసారి ఆనంద గజపతి తమ ఆస్థాన విద్వాంసులను చూసి ''మీరు సంస్కృత వాఙ్మయంలో నిధులు కదా! మీరు ఆంధ్ర భాషలో రచనలు సాగించుట అసాధ్యమా'' అని అడిగారు. ఈ ప్రశ్న ఆ విద్వాంసులకు ఒక సవాలు అయింది. తెలుగులోనూ రచనలు చేయగలమని, ఆంధ్రఛ్ఛందో వ్యాకరణ లక్షణాలను తెలుసుకొని చక్కని కవిత్వం చెప్పడానికి పూనుకొన్నారు. ఆనంద గజపతికి క్రికెట్టు, పోలో, వ్యాయామాలలో సహచరుడు కె.ఎన్.జి. రాజా మణిసెట్టివంటివారే తెలుగు పద్య రచన చేపట్టి 'సుగుణ మంజరి' అనే చిన్న పద్యకావ్యాన్ని ఆనంద గజపతి భార్య స్మృతి చిహ్నంగా రాసి 1896లో ప్రచురించారు. ఆయేడే మహారాజావారి భోగపత్ని రామస్వామిపై కూడా ఒక కావ్యం రాజామణి సెట్టి 'గణికామణి విలాసము' అనే పేరుతో ఒక పద్య కృతిని రచించి ప్రచురించారు. కేవలం తన ప్రభువుగారి ధర్మపత్ని, భోగపత్నుల మీదనేకాక రాజామణిసెట్టి తమ తండ్రి గోపాలకృష్ణమ సెట్టి పైన ఒక శతకం చెప్పారు. (ఈ గోపాలకృష్ణమ సెట్టిగారే తెలుగులో రంగరాయ చరిత్ర అనే తొలి కోవలోని నవలను రచించారు). ఈ శతకంలో రాజామణిసెట్టి మంచి సామాజిక స్పృహను వ్యక్తం చేసినట్టుంది. ప్రభుత్వోద్యోగుల గురించి మచ్చుకొక పద్యం.

జీతం బునకు బని సేయుదురేగాని
గౌర్నమెంటుకు మేలుగానబోరు
జీతంబునకు బనిసేయుదురేగాని
జనులకు సౌఖ్యంబుసలుపబోరు
జీతంబునకు బనిసేయుదురేగాని
ధర్మంబు తప్పక దలఁపఁబోరు
జీతంబునకు బనిసేయుదురుగాని
యిహ పరసౌఖ్యంబులెన్నబోరు

నాడు నాటికి జీతంబునకు దినంబు
లెన్నుచుందు రనుచు జనులెన్ను చంద్రు
సకల భూపాల రింఛోళ చక్రవర్తి
క్షీర సత్కీర్తి గోపాలకృష్ణమూర్తి

రాజామణి సెట్టిగారికీ అప్పారావుగారికీ మంచి దోస్తి ఉంది. అయితే అప్పారావుగారు పద్య రచనకు మొదట పూనుకోలేదు. ఒకనాడు ఆస్థానంలోని గోష్ఠిలో ఆనంద గజపతి ఒక సమస్యను ఇచ్చి దాన్ని చివరి పాదంగా పెట్టుకొని ఒక శతకాన్ని రాయమని తమ విద్వాంసులను కోరారు. ఉత్తమమైన శతకాన్ని ఎన్నిక చేసి దాని కర్తను ఘనంగా సత్కరిస్తామని చెప్పారు. ఇచ్చిన సమస్య కందపద్యపాదం. ''సతతము సంతసమొసంగు సత్యవ్రతికిన్'' అన్నదిదే. అయితే ఆస్థాన విద్వాంసులకేకాక ఇతరులు కూడా ఈ శతకం చెప్పవచ్చునని ప్రకటించారు. భాగవతుల లక్ష్మీనారాయణ శాస్త్రి, కొల్లూరి కామశాస్త్రి, పంతుల బ్రహ్మన్న, వరాహ నరసింహస్వామి, రాజామణిసెట్టి, మేడేపల్లి వెంకట రంగాచార్యులు మొదలైనవారంతా శతక రచనకు పూనుకొన్నారు.

వీళ్ళకోవలో గురజాడ అప్పారావుగారు కూడా చేరి 'గజపతి త్రోవ'లో నడిచి శతకం ప్రారంభించారు. పూర్తిచేశారో లేదో తెలియదు. పాతిక పద్యాలు మాత్రమే ప్రస్తుతం తేలాయి. ఇతర కృతిభర్తల లాగా కామోద్రేక రచనలు కాక జ్ఞానాభివృద్ధిని చేసే సత్యాన్ని గజపతి మెచ్చుకుంటారని ఒక పద్యంలో ఇలా చెప్పారు.

''ఇతి హాసానృత కోష్టము
లతికామోద్రేక రచన లందిరినృపతుల్
ఋతకృతు లొందగ ఋపతికి
సతతము సంతసమొసంగు సత్యవ్రతికిన్''

సత్యాలను ఎలాగా వెతకాలో ఒక పద్యంలో ఇలా చెప్పారు.

''ఋతము లతియత్న మృగ్యము
లతిగుప్తము లౌట పండ్లనాకుల లోనన్
వెతుకు గతి వెతుక దగునని
సతతము సంతసమొసంగు సత్యవ్రతికిన్''

ఆకులందున అణిగిమణిగేది సత్యఫలమని ఈ దశలో భావిస్తే ఉత్తరోత్తరా కవిత కోయిల అలా అణగి మణిగి కనిపించకుండా ఉంటుందని అప్పారావుగారు భావించారు. కవిత్వాలలో 'ధ్వని సిద్ధాంతం' పట్ల కూడా అప్పారావుగారికి ఇటువంటి అభిప్రాయాలే ఉన్నాయి. కాళిదాసు తన విక్రమోర్వశీయంలో ఊర్వశి పురూరవుని కళ్ళు మూయడానికి దొంగతనంగా వెనుకపాటున వచ్చినప్పుడు ఆమె అందెల యొక్క అణగీ అణగని సడిని ''గూఢం నూపుర శబ్దమాత్ర మపి యేకాంతం శ్రుతౌపాతయేత్'' అని వర్ణించాడు. కవిత్వంలో ధ్వని అన్నది అందెల చడిలాగా ఉండాలని అప్పారావుగారి ఆదర్శం.[30] ఒక్క రసానంద దాయకమేకాక, కావ్యం సాంఘిక ప్రయోజనకారిగా ఉండాలి. అందుకే కన్యాశుల్కాన్ని ఆయన 1892లో రచించారు.

అయిదేళ్ళ కిందట రచించిన ఆ నాటకాన్ని చక్కగా నాటక సమాజంవారు (ఎన్నిసార్లో తెలియదుగాని) చాలాసార్లు ప్రయోగించాక 1896 సంవత్సరాంతంలో దాన్ని ముద్రించాలన్న సంకల్పం అప్పారావుగారికి కలిగింది. అప్పటికే ఆయన 'ప్రకాశిక' అన్న పత్రికను ప్రచురిస్తున్నారు. విజయనగరంలోనే విజయ రామ విలాస ముద్రాక్షరశాల అనే అచ్చుకూటం ఉంది. అందులోనే కన్యాశుల్కాన్ని ముద్రించడానికి ఇచ్చారు. ఈ నాటకాన్ని ఆనంద గజపతికి వారి అనుమతితో అంకితం ఇవ్వడానికి కృతి సమర్పణ వాక్యాలను రచించారు. గ్రంథంలో నాంది ప్రస్తావలను చేర్చకుండా ఒక పీఠికను మాత్రమే ఉద్దేశ వివరణలకోసం రచించారు. (దీని రచనా కాలం 1893 జనవరి 1వ తేదీ అని గురజాడ రచనలు సంకలనం చేసిన అవసరాల సూర్యారావుగారు ఒకచోట

30. ఈ అభిప్రాయాన్ని ఆయన తమ బిల్హణీయం నాటకంలో నోటంట ఉపదేశం చేయించారు. చూ॥ గురజాడ రచనలు - బిల్హణీయం (కొండుభట్టీయం (1988) పుట.46

నోటు చేశారు.[31] ఈ నాటకం ప్రథమ ప్రదర్శన జరిగిన మరుసటి సంవత్సరమే ఆంగ్ల ఉగాదినాడు పీఠిక రచన జరిగితే 1896 దాకా ఎందుకు అచ్చువేయలేదో?

కన్యాశుల్కం మొదటి ముద్రణలో పీఠిక రచనా కాలం 1897 జనవరి మొదటి తేదీ అని తెలియవస్తోంది.[32] బహుశా ఆనాడే అంకితం ఇవ్వడంగానీ ఆనందగజపతికి ప్రథమ ప్రతిని సమర్పించడంగాని జరిగి ఉండవచ్చు. అంకితోత్సవం గురించి అప్పారావుగారు తమ డైరీలలోగాని మరెక్కడగానీ ఏమీ చెప్పలేదు. అయితే 1897 జనవరి 3వ తేదీనాటికి ఇతరులకు తన అభినందనలతో బహూకరించడానికి నాటకం ప్రతులు చేతికి పుష్కలంగా వచ్చాయి. పత్రికలకు సమీక్షార్థం కొన్ని ప్రతులను పంపించారు. జనవరి 21వ తేదీ నాటికి నెల్లూరు నుండి వెలువడే 'ది పీపుల్స్ ఫ్రెండ్' అనే పత్రికలో దాని సంపాదకుడు దంపూరి నరసయ్యగారు చాలా చక్కని రివ్యూను ఆంగ్లంలో రాశారు. 'తెలుగు హార్పు', 'ది ఈస్ట్ కోస్ట్ న్యూసు', 'ది ఇండియన్ జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్', 'ది ఇండియన్ సోషల్ రిఫార్మర్', 'ధీమణి', 'బాలిక', 'చింతామణి', 'అముద్రిత గ్రంథ చింతామణి' వంటి పత్రికలు నాటకాన్ని, రచయితనూ మెచ్చుకుంటూ మంచి సమీక్షలు రాశాయి. దంపూరి నరసయ్యగారు రాసిన రివ్యూ వల్ల అప్పారావుగారు పీఠికలో చెప్పిన ఒక విషయం వాస్తవమని నిర్ధారణ అయింది. అప్పారావుగారు పీఠికలో ఇలా రాశారు.[33]

''తెలుగుదేశంలోని వివిధ ప్రాంతాల్లో మామూలుగా మాటాడే తెలుగు భాషలో పాతుకుపోయివున్న ప్రజల అలవాట్ల వల్ల మాండలిక భేదాలు పెద్దగాలేవు. సమర్థులైన రచయితలు గట్టిగా పూనుకొంటే ఒక కొత్త ఉమ్మడి సాహిత్య భాషను సులభంగానే రూపొందించవచ్చును''.

ఈ నమ్మకాన్ని దంపూరి నరసయ్యగారు ఇలా దృఢపరిచారు.[34]

"He has wisely and happily discarded for purposes of his comedy the unnatural, stilted, pedantic, literary dialect so much beloved of Telugu Pandits, and so unduly prized by them and employed. Instead the simple, ordinary language of common life now in use among all classes of the population in the Northern districts of this Presidency.... But not only has he thus boldly used a new literary diction which though unsanctifide by existing usage among authors, bears the stamp and seal of popular approval and universal use... (the play) if represented on the stage, will greatly please any Telugu audience'.

సర్కారు జిల్లాలలో మరీ ఉత్తరాన ఉండే భాషను నెల్లూరు ఇంగ్లీషు పత్రిక ఇలా మెచ్చుకుంటే తెలుగు పత్రిక అముద్రిత గ్రంథ చింతామణి కన్యాశుల్కమనే నరమాంస విక్రయ దురాచారం ఇంగ్లీషు వాసన తెలియని వారిలో ఇప్పుడు జరుగుతూందని చెప్పి ''అట్టి వారికి స్పష్టంగా దెలియుటకై గ్రామ్యోక్తులను జేర్చఁబడినందులకై మేమామోదించితిమి. ఇట్టి గ్రంథములకు సలక్షణమైన గ్రాంథిక భాష నిరుపయోగము'' అని 1877 మార్చి

31. మాటా-మంతీ-పు.104 (అధోజ్ఞాపిక)
32. మాటా-మంతీ-పుట.88 (అధోజ్ఞాపిక)
33. గురజాడ రచనలు - కన్యాశుల్కం (1986), విశాలాంధ్ర ప్రచురణ - పుట.VII
34. కన్యాశుల్కం (1986 విశాలాంధ్ర ప్రమరణ), పుట.XVII

సంచికలో ప్రశంసించారు. అయితే అముద్రిత గ్రంథ చింతామణిలో పూండ్ల రామకృష్ణయ్యగారు ఆమోదించని విషయం నాటకంలో అక్కడక్కడ ఆంగ్లపదాల ప్రయోగాన్ని మాత్రమే. ''ఈ కాలమందలి తెలుగు సంభాషణలలో నింగ్లీషు పదములు జేరుచున్నవనుట నిజమే. అయిననవి యందఱకు వాడుకగా నుండు సైడ్డుకాల్డువ, మిటికిలేషన్, బియే పరీక్ష, కోర్టు అనునట్టి సర్వసాధారణ పదముల వలెగాక సింప్లిసిటీ, లవ్ సిగ్నల్సు, ఇన్సిన్సిరిటి, కంపారిజన్, డ్రెడ్ పుల్లీ ఇన్ లవ్, లోనగు నపూర్వపుఁ బదము లింగిలీషురాని వారికెట్లు బోధపడునో తెలియదు'' అని సందేహించారు. అర్థముకాని సంభాషణలు ''బధిర శంఖారావమేగాని వేఱుకాదు'' అని చెప్పారు.

ఈ అముద్రిత గ్రంథ చింతామణిలో సమీక్షాకారుడు ఇంగ్లీషు పదాలను ప్రయోగిస్తే ఆ భాషా జ్ఞానం లేనివారికి తెలీదన్నదే వారి వాదంగాని బొత్తిగా ప్రయోగించకూడదని కాదు అని చెప్తూ ఒక ఉదాహరణ ఇలాఇచ్చారు.

''కడు శ్రద్ధఁ గల్గి యకౌ్యంట్యాంటు లకౌ్ంట్లు
స్టిక్టుగాఁ గంపేరు జేయుచుండు''

నను నదియునూఁ నెసఁగ ఫస్టెగ్జామినేషని నార్ట్సిచ్చియను వాక్యము లింగ్లీషురాని వారికెంత యర్థమగునో ఈ గ్రంథమునందలి కొన్ని ఇంగ్లీషు పదము లంత మాత్రమందఱకు నర్థమగునని యనెదము.

ఈ అముద్రిత గ్రంథ చింతామణిలోని సీస పద్యపాదం ఉత్తరోత్తరా సాహితీపరులలో కొన్ని భ్రమలను, అపోహలను, ఆధారంలేని విశ్వాసాలను సృష్టించింది. వేలూరి శివరామశాస్త్రిగారు భారతి-రజతోత్సవ సభలో 8-1-1949 నాడు ఇలా చెప్పారు.[35]

''వాడుక భాషలో అందెవేసిన శ్రీ గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కంలోని సీసపద్యమొకటి అముద్రిత గ్రంథ చింతామణి పత్రికలో చూచి నేనాశ్చర్యపోయి 1913లోనో, 1914లోనో ప్రెసిడెన్సీ కాలేజీలో జరిగిన సభలో దానిని గూర్చి అప్పారావుగారిని అడిగాను. మొదట ప్రబంధ భాషలోనే కన్యాశుల్కం వ్రాసి అది రుచించక పోవడం చేత గ్రామ్యంలో తిరగ వ్రాశానని వారప్పుడు చెప్పారు''.

రివ్యూలోని సీసపద్యం సమీక్ష చేసిన వారి స్వకపోల కల్పితమో, ఎవరిదో సమకాలిక గ్రంథంలోని రచనో అయి ఉండాలిగాని కన్యాశుల్కంలో అప్పారావుగారు రాసినదికాదు. సమీక్ష చదివిన పదహారేళ్ళ తర్వాత 1913లో అప్పారావుగారిని కలుసుకొని మాట్లాడిన సంగతిని మరో 36 సంవత్సరాల తర్వాత శివరామశాస్త్రిగారు కథనం చేశారు. కన్యాశుల్కం రచనకు ముందు తాము సలక్షణ గ్రాంథిక శైలిలో పద్య రచనలు చేసేవారమనీ, అది నచ్చక ఆధునిక పద్ధతులను అనుసరించామని అప్పారావుగారు చెప్పి ఉంటారు. కన్యాశుల్కాన్ని మొదట గ్రాంథిక భాషలో రాశామని

35. బంగోరె (సం) మొట్టమొదటి కన్యాశుల్కము - ముందు మాటలు, పుట.62-63

చెప్పినట్టు శివరామశాస్త్రిగారు పొరపడ్డారనుకోవాలి. అప్పారావుగారుగానీ, ఆనంద గజపతిగాని 'సర్వజన సామాన్యమైన స్పష్టభాష'నే ప్రయోగిస్తారు, ప్రోత్సహిస్తారు.

కన్యాశుల్కం ప్రథమ ప్రచురణ గురించి మరికొన్ని వివాదాస్పదమైన విషయాలు లేకపోలేదు. బులుసు వెంకట రమణయ్యగారు 'గజపతి రాజుల తెలుగు సాహిత్య పోషణము' అనే గ్రంథంలో కన్యాశుల్కం మొదటి ముద్రణ ప్రతి ముఖపత్రాన్ని పొందుపరిచారు. అది ఇలా వుంది.[36]

> శ్రీరస్తు
> కన్యాశుల్కము
> ఇది విజయనగరం రాజ్యమున ప్రాచీన లిపి పాఠకుఁడగు
> గురజాడ అప్పారావు పంతులు బి.ఏ.చే
> రచియింపఁడినది.
> శ్రీ విజయనగరము
> శ్రీ విజయరామ విలాసముద్రాక్షరశాల యందు
> కొంకిపూడి- భద్రయ్యచే
> ముద్రిపంపబడి, ప్రకటింపబఁడినది.
> 1867, మే, 23
> All rights reserved. దీని వెల 8 అణాలు. అంచెకూలి అణా.

వెంకట రమణయ్యగారు చాలా ఆసక్తికరమైన తారీఖును ఈ ముఖపత్రం వల్ల తెలియచేస్తున్నారు. నిజంగా ఇందులో చెప్పిన మే 23వ తేదీనాడే కన్యాశుల్కం ప్రచురణ జరిగినట్టు కనబడదు. జనవరి 3వ తేదీనాడు జాయింటు మేనేజరగారికి దివాన్ బహదూర్ బిరుదు వచ్చినందుకు జరిగిన విందులో ఆయనకు కన్యాశుల్కం ప్రతినొకదానిని కానుకగా అప్పారావుగారు ఇచ్చారు. జనవరి 30వ తేదీనాడు కన్యాశుల్కం ప్రతులను మద్రాసు పత్రికలకు రివ్యూలకోసం పంపించారు.[37] ఆవిష్కరణకు ముందుగానే అడ్వాన్సు ప్రతులు చేతికి రావడం సర్వసాధారణమేగాని జనవరిలోకాక మే నెలలో ఆవిష్కరణ జరిగిందని, అందులో మే 23వ తేదీనాడు జరిగిందని ఊహించనైనా ఊహించలేదు.

ఆ తారీఖు అప్పారావుగారి జీవితంలో మరచిపోలేని తేదీయే. ఆనాడు వారి జీవితం అనుకోని కొత్త మలుపులకు తిరిగింది. అయితే 1897 మే 23వ తేదీనాడు జరిగినది కన్యాశుల్కం ప్రథమ ముద్రణ ప్రతి ఆవిష్కరణ కాదు. ఆనంద గజపతి నిర్యాణం.

అంతకు ముందు నాలుగు రోజుల నుంచి మహారాజావారికి జ్వరం కాసింది. ఆయాసం ఎక్కువైంది. ఊపిరి సలపని ఎగ ఊపిరి. మాట్లాడడానికి ఆయనకు ఉత్సాహం లేకపోయింది. ఆనంద గజపతి జీవితంలోని ఆఖరి గడియల గురించి అప్పారావుగారు ఇలా రాశారు.[38]

36. బులుసు వెంకట రమణయ్య - పుట.131-2
37. మహాకవి డైరీలు - పుటలు.146, 147
38. మాటా మంతీ - పుటలు 145-6

''ఎనిమిదయింది. మందు తేవడానికి నేను డాక్టరు దగ్గరకు వెళ్ళి వచ్చేటప్పటికి, మహారాజావారి పరిస్థితి ఆందోళనకరముగా పరిణమించింది. దాదాపు తొమ్మిదయింది. ఆయన నరాలు తోడుకుపోతున్నవి. తొందరగా కంటోన్మెంటుకు డాక్టరుకోసం బయలుదేరాను. ఇట్టే తిరిగి వచ్చాను. తిరిగి వచ్చేసరికి ఆయన చెంత జననా స్త్రీలు వున్నారు. గదిలోకి వెళ్ళడానికి అవకాశం లేదు.

''మనస్సు పరిపరివిధాల పోతున్నది. అధైర్యం వచ్చింది. గుండె దడదడ లాడుతోంది. ఏ నిముషంలో ఏ దుర్వార్త చెవిని పడుతుందో కదా! అక్కడే అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాను''.

''మూడు గంటలయింది. మరి అయిదు నిముషాలకు మహారాజావారు పరమపదించారు. పరమేశ్వరుడు వారి ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక. ఆయన నిర్యాణానంతరం ఇరవై అయిదు నిముషములు కోటలో ఉండిపోయాను. మర్నాడు ఉదయం కడసారి ఆయనను దర్శించుటకు వెళ్ళాను. ఆయన వదనం మామూలుగానే ఉంది. ఏమాత్రం కళ తగ్గలేదు. నిశ్చలముగా, ప్రశాంతముగా నిర్మల వదనముతో నిదురపోతున్నట్లు కనిపించారు. ఆ గంభీర విగ్రహము అలాగునే వున్నది''.

''మహారాజావారు మరిలేరు. ఎంత హృదయ విదారకము. నేటినుంచి ఎవరి సుభాషితములు నేను వ్రాయను? ఎవరి ప్రసంగములు విని ఆనందించగలను? ఎవరితో కవితానందము అనుభవించగలను?''.

కవితానందమేకాదు. సాధారణమైన ఆనందం కూడా అప్పారావుగారికి ఆనంద గజపతి మరణం వల్ల కరువైంది. మహారాజాతో అత్యంత సన్నిహితులుగా మెలగిన తోటలో ఇప్పుడు ఆయన కేవలం శాసన పరిశోధకుల హోదాలోనే ఉన్నారు. ఆనంద గజపతి నిస్సంతుగా మరణించారు. ఆయనకు తమ్ములుకూడా లేరు. భార్యముందే చనిపోయింది. ఎవరినైనా దత్తత తీసుకొనే అధికారం మామ్మూలుగా తమ తల్లిగారికి సంక్రమిస్తుంది. అయితే ఆనంద గజపతి ఒక విల్లు రాశారు. దాని ప్రకారం తమ మేనమామ శంభుసింగు రెండో కుమారుడు చిట్టిబాబును మాత్రమే అలక రాజేశ్వరిగారు దత్తునిగా స్వీకరించి అతనికి రాజ్యమివ్వాలి. ఈ ఏర్పాట్లన్నీ ఆనంద గజపతి చనిపోయేముందు తమ తల్లిగారైన అలక రాజేశ్వరిగారికి, అక్కగారు అప్పల కొండమాంబగారికి తెలియచేశారు. ఆనంద గజపతి అభిలాష ఈ ఇద్దరు ఆడవారికీ, ఆదేశాలు అప్పారావుగారికి మాత్రమే క్షుణ్ణంగా తెలుసు. ఇతరులు వాటిని పట్టించుకొన్నట్టు లేదు. అందుకే అప్పారావుగారు ఒకచోట ఇలా రాసుకొన్నారు.[39]

''మహారాజావారు మరణించిన వెంటనే వారి ఆశయాలు వారితోనే నశించిపోయాయి. ఇప్పుడెవరూ వాటి జోలికి పోరు. ఎవరూ స్మరించరు. అంతా విస్మరించినట్టే కనబడుతుంది''.

---

39. మాటా మంతీ – పుట.153

సంస్థానపు ఉద్యోగులు అప్పారావుగారిపట్ల కొంచెం తూష్ణీ భావాన్ని ప్రకటిస్తూ వున్నా ఆనంద గజపతి సోదరి అప్పల కొండమాంబగారు మాత్రం ఇవ్వవలసిన మర్యాద ఇచ్చి చాలా దాక్షిణ్యం ప్రకటిస్తూ వచ్చారు. ఈమె ఆనంద గజపతి అక్కగారు. ఈమెను మధ్యప్రదేశ్‌లోని రీవా రాజ్యంలో మాథోగడ్ సంస్థానాధిపతి రామసింగుగారికిచ్చి పెళ్ళి చేశారు. ఆమె అత్తవారింటికి వెళ్ళాక ఆమెను రీవా సర్కార్, రీవా రాణి అని పిలిచేవారు. దురదృష్టవశాత్తూ ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. ఆమె పుట్టింటికి వచ్చాక తమ్మునికీ, తల్లికీ, చేదోడువాదోడుగా ఉండేవారు. అప్పారావుగారంటే జననా స్త్రీలకెంతో నమ్మకం, గౌరవం. ''మా తల్లిగారికీ, అక్కగారికి తమరంటే పరిపూర్ణమైన విశ్వాసం వున్నది'' అని ఆనంద గజపతి అప్పారావుగారికి చెప్పేవారు. ఈ విషయాలను మరిచిపోకుండా సంస్థానాన్ని నడపవలసిన ఇద్దరు స్త్రీలు చేతనైన సహాయం చేయడానికే విశ్వాసపాత్రులైన అప్పారావుగారు అన్నీ ఓర్చుకొన్నారు.

ఆనంద గజపతి మే 23వ తేదీనాడు పోతే డిసెంబరు 18వ తేదీనాడుగాని చిట్టిబాబుగారి దత్తత స్వీకారం శాస్త్రోక్తంగా జరగలేదు. ఈ మహోత్సవ వార్తలు హిందూ పత్రికలోనూ, ఇతరత్రా ప్రచురితమైనాయి. చిట్టిబాబుగారు విజయరామ గజపతి అనే పేరుతో సంస్థానానికి హక్కుదారుడయ్యాడు. అయితే ఆయనకు మైనారిటీ తీరనందువల్ల ప్రభుత్వం వారు ఒక రీజన్సీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో మాతా మహారాణీ అలక రాజేశ్వరీదేవి, మహారాజ కుమారిక రీవాసర్కార్ అప్పలకొండమాంబ, జిల్లా కలెక్టరు విల్లాక్ ప్రధానసభ్యులు. మైనరు రాజాగారికి కలెక్టరు గార్డియన్, చిట్టిబాబును దత్తునిగా స్వీకరించినది మొదలు దాయాదులు మొదట చిల్లర దావాలు, ఉత్తరోత్తరా చాలా పెద్ద దావా ప్రారంభించారు.

వచ్చిన దావాలన్నింటిలోనూ అప్పారావుగారే ఇవ్వవలసిన సలహా సహకారాలు అందజేయడమే కాక స్వయంగా దక్షతతో నడిపిన వ్యవహారాలు ఉన్నాయి. వెలగాడ దావా, కొండపాలెం దావా, కత్రిమకొండ దావా అనేవి వీటిలో ముఖ్యమైనవి. సంస్థాన వ్యాజ్యాలలో కత్రిమకొండ దావా మరీ ముఖ్యమైనది. ఎందుచేతనంటే సంస్థానానికి వ్యతిరేకంగా హేమాహేమీలు సాక్ష్యమిచ్చారు. ఇది కనుక గెలవకపోయినట్టయితే దీనిని పురస్కరించుకొని అనేక దావాలు మీదపడేవి.[40]

సంస్థానపు వ్యవహారాలలో రీవారాణి స్థిరంగా కాళ్ళు నిలదొక్కుకున్నాక అప్పారావుగారిని ఆమె తన ఆంతరంగిక కార్యదర్శిగా 1898 జూన్‌లో నియమించారు. మైనరు మహారాజాగారికి రాజ్య స్వీకారానికి తగిన వయసు లేకపోయినా పెళ్ళిచేసుకోవడానికి మాత్రం యుక్తవయసు వచ్చిందని పెద్దలు నిశ్చయించారు. 1898లో నవంబరు 4వ తేదీని డవేజరు మహారాణీగారైన అలక రాజేశ్వరిగారు ఒక విల్లు రాశారు. నవంబరు 5వ తేదీనాడు రాజకుటుంబ సభ్యులతో అప్పారావుగారు తగిన వధువును చూడడానికి బెనారస్ ప్రయాణం మొదలుపెట్టారు. జయపూర్ రాజా బంధువులు కస్మండా జమీందారు సూర్య బక్సింగ్ గారి కుమార్తె లలిత కుమారిని వధువుగా

40. లేఖలు - పుట.235

నిర్ణయించారు. లక్షరూపాయలు వరునికి తిలకంగా ఇచ్చారు. ఈ పెళ్ళి కుదిర్చినందుకు కాకపోయినా ఇతర సాదర గౌరవాలకు కృతజ్ఞతగా లలితకుమారి, సూర్య బత్సింగ్ అప్పారావుగారిపట్ల చివరిదాకా చాలా ఔదార్యం చూపించేవారు.

ఒకవంక శుభకార్యాలు యథావిధిగా జరుగుతూ వుంటే ఇంకో వైపు వ్యాజ్యాలు కోర్టుల్లో బిగుస్తున్నాయి. మద్రాసులోని సెక్రటేరియట్ పుస్తక భాండాగారంలో సంస్థానానికి సంబంధించిన రికార్డులు చాలా వున్నాయి. వాటిని పరిశోధించి సాక్ష్యం సంపాదించడానికి అప్పారావుగారు శాసన పరిశోధకులుగా పూనుకొన్నారు. ఇది బహుశా 1899లోనే వారు చేపట్టిన కార్యం కావచ్చును. అయితే 1900 మార్చి నాటికి మదరాసులో వున్న మేనేజరాఫీసుకు ఎవరో మరి ఆకాశరామన్న ఉత్తరం రాశారు. రికార్డులు చూడడానికి ప్రభుత్వం వారి అనుమతి కోరవలసి వచ్చింది. అప్పారావుగారు దరఖాస్తు పెట్టుకొన్నారు.

1900 మార్చి 9వ తేదీనాడు మద్రాసు ప్రభుత్వపు ప్రొసీడింగులు ఉత్తరువులు (నెంబరు 357) అప్పారావుగారికి అందాయి. వాటిలో ఇలా వుంది.[41]

''చీఫ్ సెక్రటేరియటు పుస్తక భాండాగారములో వున్న శ్రీ అప్పారావుగారు పేర్కొన్న రికార్డులను, అవి రహస్యముగా వుంచవలసినవి కానందున వాటిని పరిశీలించటానికి శ్రీ జి.వి. అప్పారావుగారికి అనుమతి ఒసంగడమైనది. ఇందు విషయమై జనరలు రికార్డు డిపార్టుమెంటు సూపరింటెండెంటుతో ఉత్తర ప్రత్యుత్తరాలను జరపవలసినదిగా శ్రీ అప్పారావుగారిని కోరడమైనది''.

అనుమతి లభించాక ప్రభుత్వపు రికార్డుల నుంచి ఏ ఆకరాలను సేకరించారో గాని అప్పారావుగారు 1900 నవంబరు నెలలో కలకత్తాకు వెళ్ళారు. ఆ నగరంలోని పెద్ద లాయర్లను సంప్రదించడానికే వెళ్ళినా పుస్తకాల షాపులూ, మ్యూజియం, నాటక ప్రదర్శనలు, హైకోర్టు భవనాలు చూశారు. డిసెంబరు 5వ తేదీన కలకత్తాలో బయలుదేరి విజయనగరం మీదుగా డిసెంబరు 7వ తేదీనాడు చెన్నపట్నం చేరుకొన్నారు. మద్రాసులో వైస్రాయిని కలుసుకొనడానికి రీవారాణీ వచ్చింది. వైస్రాయికి వంటకాలను పంపించింది. డిసెంబరు 12వ తేదీనాడు రీవా రాణి అంతకు పూర్వం ప్రచురితమైన 'విక్టోరియా ప్రశస్తి' అనే వార్త కాపీలను వైస్రాయికి, ఆయన సతీమణికి పంపించింది. ఇది అప్పారావుగారి అనువాద రచన అని ఒక గ్రంథకర్త భావిస్తూ ఇలా రాశాడు.[42]

''విక్టోరియా రాణి వజ్రోత్సవ సందర్భాన చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగున రాసిన ప్రశంసా పద్యాలను, న్యాపతి సుబ్బారావు అభ్యర్థనపై ఆంగ్లీకరించాడు. వైస్రాయి మదరాసుకు విజయం చేసిన తరుణంలో (1900) రీవారాణి అచ్చువేయించి పంచి పెట్టిందీ పద్యాలనే''.

ఈ సందర్భంలో సదరు గ్రంథకర్త పొరబడ్డారు. చిలకమర్తివారు తెలుగు పద్యాలు రాయడం నిజమే. వాటిని న్యాపతి సుబ్బారావుగారి అభ్యర్థన మీద అప్పారావుగారు ఆంగ్లీకరించి ప్రచురించడమూ నిజమే. అయితే అది వేరే సందర్భంలో. చిలకమర్తివారు

41. మహాకవి డైరీలు - పుటలు 162-3
42. కె.వి. రమణారెడ్డి - మహోదయం - పుట.140

1895లో కాకినాడలో జరిగిన గోదావరి మండల సభలకు వెళ్ళారు. ఆ సందర్భంలో పధ్నాలుగు పద్యాలను రచించి సభలో చదివారు. అందరూ వాటిని మెచ్చుకొన్నారు. చప్పట్లు కొట్టారు. చిలకమర్తివారు తర్వాత ఇలా స్వీయ చరిత్రలో రాశారు.[43]

''ఈ పద్యములు మిక్కిలి మనోహరముగా నున్నవని తోచినందున శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు వీటిని విజయనగరము పంపి నచ్చటి కళాశాలలో నాంగ్లేయ భాషా పండితులయిన, శ్రీ గురజాడ అప్పారావు పంతులుగారి చేత నింగ్లీషు పద్యములుగా వ్రాయించిరి. తెలుగు పద్యములు నింగ్లీషు పద్యములు గూడా, మండల సభా వృత్తాంతముల తెలియజేయు రిపోర్టులో (Godavary District Conference Report) నచ్చు వేయబడినవి.

చిలకమర్తివారు 1897లో విక్టోరియా మహారాణి వజ్రోత్సవ సందర్భంలో పద్యాలు రచించి రాజమండ్రి పురమందిరంలోని సభలో చదివారు. వీటి ముద్రణ గురించి ప్రశంసల గురించి చిలకమర్తివారు ఇలా రాశారు.[44]

''నా పద్యము లా సంవత్సరము జూన్ నెల 22వ తేదీ చింతామణి పత్రికలో ప్రకటింపబడెను. కందుకూరి వీరేశలింగము పంతులుగారు విక్టోరియా రాణి చరిత్రమును వచనముగా వ్రాసి చింతామణి పత్రికలోనే ప్రకటించిరి. నా పద్యములు చూచిన తోడనే నన్ను శ్లాఘించుచు నాంధ్రదేశమున నానా భాగముల నుండి బహూకరణ లేఖలు నాకు వచ్చినవి. అముద్రిత గ్రంథ చింతామణి పత్రికాధిపతులగు పూండ్ల రామకృష్ణయ్యగారు నన్నును, నా కవిత్వమును మెచ్చుకొనుచు నెల్లూరు నుండి యొక లేఖ వ్రాసిరి. అట్లే విజయనగరము నుండి శ్రీ నిడదవోలు సుందరం పంతులుగారు జూబిలీ సందర్భమున మన యాంధ్ర దేశమున రచియింపబడిన పద్యములన్నిటికంటె నా పద్యములు రసవత్తరముగా నున్నవని నాకొక లేఖ వ్రాసిరి. ఈవిధముగానే యనంతపురం జిల్లాలోని పెనుగొండ యాసుపత్రిలో వైద్యులుగా నున్న పార్థసారధి చెట్టిగారు ప్రశంసాపూర్వకముగా నొక జాబు నాకు వ్రాసిరి. ఆనాటి తెనుగు పత్రికలన్నియు నన్నట్లే ప్రశంసించెను''.

ఈ పేరా గ్రాఫును పూర్తిగా ఉదహరించడం వల్ల చిలకమర్తి వారి జూబిలీ పద్యాలను ఎవరెవరు ప్రశంసించారో తెలుస్తుంది. ఈపేర్లలో గురజాడ అప్పారావుగారి పేరు లేదు. అందుచేత ఆయన వీటిని అనువదించారన్న ప్రసక్తికి తావే లేదు. 1897 మే నెలలో ఆనంద గజపతి మరణించారు. విజయనగరం సంస్థానంలోని అందరూ శోకదినాలు పాటింపవలసి వచ్చింది. ఆరోగ్యంగా ఉంటే ఆనంద గజపతి, రీవా సర్కారు, రాజ కుటుంబంలోని వ్యక్తులు ఢిల్లీ దర్బారుకు వెళ్ళి ఉండేవారు. ఆ అవకాశం రాలేదు. చిలకమర్తివారి జూబిలీ పద్యాలను గురజాడ వారు అనువదించారనీ, వాటినే రీవారాణి పంచిపెట్టిందని రాసిన పరిశోధకుడే మరొక సందర్భంలో అప్పారావుగారి గురించీ వారి తమ్ముడు శ్యామలరావు గారి గురించి రాస్తూ ఇలా అన్నారు.[45]

---

43. చిలకమర్తి లక్ష్మీ నరసింహం - స్వీయ చరిత్ర - పుట 121
44. చిలకమర్తి లక్ష్మీ నరసింహం - స్వీయ చరిత్ర - పుట. 139
45. కె.వి.రమణారెడ్డి - మహోదయం - పుట.105

''కాంగ్రెసు కార్యకలాపాలలో తలదూర్చిన ఈ అన్నదమ్ములలో అన్నకు గల స్వదేశాభిమానం 1887లో విక్టోరియా రాణి స్వర్ణోత్సవ సందర్భంలో ప్రశంసా పద్యాలు రాసి 'రీస్ అండ్ రయ్యత్' పత్రికలో అచ్చు వేయించేటందుకు అడ్డురాలేదు''.

'రీస్ అండ్ రయ్యత్' పత్రికలో అచ్చుపడ్డ జూబిలీ పద్యాలను అన్న రచించారా? తమ్ముడు రచించారా? ఆ పత్రికాధిపతి 1889లో శ్యామలరావుగారికి ఒక ఉత్తరం రాస్తూ అప్పారావుగారు తనను పూర్తిగా మరిచిపోయారని ఉత్తరాలే రాయడంలేదని బాధపడ్డారు. అప్పారావుగారిలో 'స్టఫ్' ఉందని శంభుచంద్ర ముఖర్జీ విశ్వాసం. అంత సరుకున్నవాడు పద్యాలు రాస్తున్నాడా అని ఆయన 1889లో శ్యామలరావుని ఒక ఉత్తరంలో అడిగారంటే చాలాకాలంనుంచి అప్పారావుగారికీ, ముఖర్జీగారికి ఉత్తర ప్రత్యుత్తరాలు లేవని భావించవచ్చు. భావి పరిశోధనల వల్ల తప్ప రీవారాణి 1900లో పంచిపెట్టిన జూబ్లీ పద్యాల గురించి నికరంగా ఏమీ చెప్పలేం.

అప్పారావుగారు రీవారాణి మొదలైన వారితో మద్రాసుకు 1900వ సంవత్సరం డిసెంబరులో వెళ్ళినా ఆయనకు మైలాపూరులోని పెద్ద లాయర్‌లను కలుసుకొనడం ముఖ్యమైంది. డిసెంబరు 16వ తేదీనాడు భాష్యం అయ్యంగారిని సంప్రదించారు. డిసెంబరు 17వ తేదీనాడు మైనరు మహారాజాను వైస్రాయి ఆహ్వానించాడు. రాచకార్యాలను ముగించుకొని అప్పారావుగారు విజయనగరానికి తిరుగు ప్రయాణం పెట్టుకొంటున్నప్పుడు చేయవలసిన పనులను డైరీలో నోటు చేసుకొన్నారు.[46]

★ ఓక్స్ వేలం వేసే సెకండు హాండు పుస్తకాలను ఖరీదు చేయడం.

★ మా తమ్మునికి ఒక గడియారము, ఒక పెన్ను

★ అమ్మకు చంద్రహారపు గొలుసు. చక్కని ఒక దుప్పటి.

అప్పారావుగారికి శ్యామలరావు అనే ఒక తమ్ముడున్నాడు. అన్నగారిలాగే ఆంగ్లంలో కవితలల్లడం విద్యార్థి దశలోనే అలవర్చుకొన్నాడు.

అప్పారావుగారు తాము చదువుకొనే రోజుల్లో రాసిన పద్యాలను స్థానిక పత్రికలలో ప్రకటించి శంభుచంద్ర ముఖర్జీగారి వంటి విద్వన్మిత్రులు దృష్టిలో పడ్డట్టే శ్యామలరావుకూడా ఆ ముఖర్జీగారిని ఆకర్షించాడు. నేషనల్ కాంగ్రెస్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడమేకాక వాటిమీద ఆంగ్ల కవితలు రాస్తూ వచ్చారు. 1887లో మద్రాసులో కాంగ్రెస్ సభలు జరుగుతున్న సందర్భంలో 'To the magnificient seditionists' (దివ్యమైన రాజద్రోహులకు) అనే శీర్షికతో ఒక ఆంగ్ల కవితనురాసి హిందూ పత్రికలో ప్రచురించాడు. ఇది శంభుచంద్ర ముఖర్జీగారికి పంపించాడు. ఆయన అభినందిస్తూ ఉత్తరం రాస్తూ సరుకున్న అప్పారావుగారి సంగతులు చెప్పమని ఒక ఉత్తరంలో కోరారు. శ్యామలరావు ముఖర్జీగారితో ఎన్నాళ్ళు ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారో తెలియనట్టే అతని రచనలు కూడా ఏవేవిమిటో తెలియదు.

46. మహాకవి డైరీలు - పుట.170

తమ్ముడంటే అప్పారావుగారికి చాలా ప్రేమ. శ్యామలరావు విజయనగరంలో బియ్యే చదువుతూ ప్రిన్సిపాల్ గారితో పడక మద్రాసుకు మకాం మార్చాడు. అక్కడ పట్టభద్రుడయ్యాక 'లా' చదవసాగాడు. ఇంగ్లీషు బ్లాంక్‌వెర్స్ ఛందంలో హరిశ్చంద్ర కావ్యాన్ని కొంతో, సొంతంగానో రచించాడు. దీనిలోని చివరనొచ్చే నారద హరిశ్చంద్రుల సంభాషణను యథాతథంగా గోమఠం శ్రీనివాసాచార్యులు తమ హరిశ్చంద్ర ఆంగ్ల రూపకంలో శ్యామలరావుకు కృతజ్ఞతలు చెప్తూ వాడుకొన్నారు. శ్రీనివాసాచారిగారు ఈ నాటకంలో ఆనందగజపతి తెలుగు పద్యాలను కూడా ఆంగ్లీకరించి వాడుకొన్నారు. 1893లో తొలిసారి ప్రదర్శితమైన ఈ ఆంగ్ల నాటకానికి 1897 జనవరి నాలుగో తేదీనాడు (అంటే కన్యాశుల్కం అచ్చయి చేతికి వచ్చిన మొదటివారంలో) అప్పారావుగారు ఆంగ్లంలో ఒక పీఠికను రాశారు. ఈ హరిశ్చంద్ర నాటకాన్ని ఎప్పుడు ముద్రించి ప్రకటించారో తేదీ సరిగ్గా తెలియదు. ఆ ప్రకటన సంవత్సరానికి పన్నెండేళ్ళ కిందట శ్యామలరావు తన ఆంగ్ల పద్యాలను రాసినట్లు శ్రీనివాసాచారి గారి మాటల వల్ల తెలుస్తోంది. పుస్తకం బయటకు వచ్చిన తేదీ నాటికి శ్యామలరావు కీర్తిశేషుడు.

శ్యామలరావు 1900 సంవత్సరాంతంలో సజీవుడే అన్న సంగతి అప్పారావుగారి డైరీ ఎంట్రీవల్ల విశదమైంది. అయినా ఒక గ్రంథకర్తగారు ''శ్యామలరావు మరణం 1891-1892'' అని తమ పుస్తకంలోని కాలక్రమణ సూచికలో చెప్పారు.[47] మద్రాసులో 'లా' చదువుతూ విద్యార్థి దశలోనే శ్యామలరావు మరణించాడని ఒక సంకలనకర్త తన గ్రంథంలో విశదం చేశారు.[48] ప్రస్తుతం లభిస్తున్న ఆకరాల వల్ల శ్యామలరావు గురించి అట్టే వివరాలు తెలియవు.

ఆనందగజపతి అస్తమించాక విజయనగరం సంస్థానంలో సాహిత్యపోషణ కొంచెం సన్నగిల్లిన మాట నిజమేగాని పూర్తిగా తుడిచి పెట్టుకొని పోలేదు. రీవారాణి అప్పల కొండమాంబ తమ తండ్రి విజయరామ గజపతిగారినీ, తమ్ముడు ఆనంద గజపతినీ చూసి సాహిత్యాభిరుచిని పెంచుకొన్న వ్యక్తే. ఆస్థాన విద్వాంసులందరినీ ఆదరణతో తృప్తిపరచేది. విద్వద్గోష్ఠులు కూడా అడపాదడపా జరిగేవి. ఆనందగజపతి పోయాక పండిత రక్షణం, విద్యా వినోదాలు లేవని సాధారణంగా భావించేవారికి వాస్తవాలను చెప్తున్నట్టు పేరి కాశీనాథ శాస్త్రిగారి పూర్వ శాకుంతలం నాటకంలోని ప్రస్తావనలో ఇలా నటుని చేత చెప్పించారు.[49]

''ఈ వార్త యింకను మీకు స్పష్టముగ దెలియలేదా? శ్రీ పూసపాడ్వంశమును మరల నంకురింపజేయఁ దలఁచి శ్రీ మద్విజయరామ గజపతి మహారాజనామధేయమున వెలయుచున్న పుత్రరత్నమును సింహాసనాకృతుఁజేసి, శ్రీ మద్విజయరామ గజపతి

47. కె.వి. రమణారెడ్డి - మహోదయం

48. అవసరాల సూర్యారావు - మాటామంతీ - పుట 117

49. నిడుదవోలు వెంకటరావు - 'విజయనగర సంస్థానము ఆంధ్ర వాఙ్మయ పోషణ' - పుట 128లో కోట్ చేశారు.

కుమారికయు, శ్రీమదలకాంబా గర్భశుక్తి ముక్తా ఫలంబును నగు శ్రీ మదప్పల కొండ యాంబామహారాణి యథాపూర్వకముగ పండిత పరిపాలనమును విద్యావినోదమును సేయుచు యుక్తముగ బరిపాలించుచున్నది''.

రీవారాణికి తన తమ్ముని విద్యా వినోదాలన్నీ జ్ఞాపకమే. ఆనంద గజపతి తమ సంస్థానంలోని సంస్కృత పండితులకు తెలుగు ప్రబంధాలలో ఉత్తమ పద్యాలను సూచించి వాటిలోని శ్లేషల చమత్కారం చెడకుండా గీర్వాణంలోనికి అనువదించమనే వారు. ఒకప్పుడు వసుచరిత్రలోని సుప్రసిద్ధమైన పద్యాన్ని సంస్కృతీకరించమని విద్వాంసులను కోరారు.

'ఆతన్వంగి యనంగ ఝూంకరణ వజ్జ్యాముక్త చూతాస్త్రని
ర్ఘాతం బోర్వక తమ్ములంచుఁదటినీ గర్భైక సంజాత కం
జాత వ్రాతముమాటుఁజెంద నది యేచన్ సాగెమున్మున్నుగా
'జ్ఞాతిశ్ఛేదనలేనకి' మ్మనెడి వాచారూఢి సత్యంబుగన్''.

ఈ పద్యంలో 'తమ్ములు' అనే పదప్రయోగంలో కమలములు, సోదరులు అనే రెండర్థాలకు ఆస్కారముండి శ్లేష శోభిస్తుంది. అసారస్యం చెడకుండా సంస్కృత శ్లోకం ఉండాలని ఆనందగజపతి అభిప్రాయం. ముడుంబై వరాహ నరసింహాచార్య స్వామి వారు ఇలా సంస్కృతీకరించారు.[50]

''తన్వంగీ కుసుమాస్త్ర ఝూంకారణ వజ్జ్వాభూత
చూతాశుగత్ భీతా 'కింశరణం భవేదిహమమే' త్యాలోచ్యనద్యాంజనేః,
సాకం జాత మవేత్య పద్మనుభజత్; తద్బాధతేహంత! తాం;
'జ్ఞాతిశ్ఛేదనలేనకిం?' వచ ఇదం స్వాస్థాత్ కథం ప్రస్ఖలేత్''

ఆనంద గజపతి కొన్ని సుప్రసిద్ధ సంస్కృత సుభాషితాలను తెనిగింప చేశారో లేదో తెలియదు గాని గురజాడ అప్పారావు గారు బహుశా ఆనంద గజపతి హయాంలో కొన్ని శ్లోకాలను తెనిగించారు.[51] ఉదాహరణకు

''దాతృత్వం ప్రియ వక్తృత్వం ధీరత్వముచితజ్ఞతా
అభ్యాసేన నలభ్యంతే చత్వార స్సహజాగుణాః''

అన్న శ్లోకానికి

ఈవియు దియ్యాని మాటయు
భావంబున జేయతగిన పని తెలియుటయున్

50. బులుసు వెంకట రమణయ్యగారు తమ పుస్తకం 'గజపతిరాజుల తెలుగు సాహిత్యం పోషణము' అనే గ్రంథంలో చెప్పారు. పుట 95-96

51. కొన్ని మూల శ్లోకాలనూ వాటి అనువాదాలను అవసరాల సూర్యారావు సంకలనం చేసిన గురజాడ రచనలు - 6వ సంపుటం - ముత్యాల సరాలు (1958) అనే పుస్తకంలో 'మెరుపులు' అనే శీర్షిక కింద ప్రచురించారు. చూ॥ పుటలు 89, 90

తీవియగు ధైర్య భావము
రావు సుమీ యొకని వలన రావలె తనతోన్

ఇలాగే

''యథా చతుర్భిః కనకం పరీక్ష్యతె
నికర్షణచ్ఛేదన తాప తాడనైః
తథా చతుర్భిః పురుషః పరీక్ష్యతె
కులేన శీలేన గుణేన కర్మణా''.

అనే నాలుగు పరీక్షలను ఇలా ఒక గీతంలో తెనిగించారు.

'నాల్గు రీతుల గనకంబు నాడెమగును
వేటు గీటుల తునియించి వెచ్చజేసి
నరుడు నట్టుల నాల్గింట నాడెమగును
కులము శీలంబు కర్మంబు గుణము చేత'.

రాచకార్యాలలో 1895 నుండి ముమ్మరంగా పాల్గొనడం వల్ల అప్పారావుగారికి ఆంగ్లంలోగాని తెలుగులోగాని పద్యరచన చేసే సావకాశం 1902దాకా కలగలేదనుకోవాలి. రీవారాణిగారికి కూడా అప్పుడే కొంచెం ఊపిరి తీసుకునే వీలు చిక్కి విద్యా వినోదాలు పునఃప్రారంభం చేశారు. తన తమ్ముడు పూర్వం 'సతతము సంతసమొసంగు సత్యవ్రతికిన్' అనే సమస్యను ఇచ్చి పూరించమన్నారు. ''వెల వాల్గంటి కుమారులౌదురు గదా విప్రోత్తముల్ రావణా'' అన్నది ఆ పద్యం చివరి పాదం. ఈ సమస్యను ఆస్థానంలో ఉన్న ముడుంబై వరాహ నరసింహాచార్యస్వామి, మండ లక్ష్మీ కామశాస్త్రి, పేరి కాశీనాథశాస్త్రి, గురజాడ అప్పారావు, కె.ఎన్.జి. రాజామణి శెట్టి పూరించారు. పూరణలో రెండు పద్యాలను చూడండి.

''కవిచేతన్ విమతత్త్వ మొందిన మహాకామాంధకారంబునన్
కులధర్మంబు పరిత్యజించి తమతో గూడంగా యమ్మానినిన్
బలుమార్వేడెద మంచు బల్కెద రహోపాండిత్యమెపారఁగా
వెలవాల్గంటి కుమారులౌదురు గదా విప్రోత్తముల్ రావణా!''

– గురజాడ వెంకట అప్పారావు

'అల రంభోర్వశిమేనకాది గణికావ్యాసక్తులౌ కౌశికా
దుల బారుల్గద వారి గోత్రముల యందుంబుట్టి విప్రుల్ మదిం
గులమెంతే ఘనమంచు నెంచెదరయో కొంతైన లజ్జింపకే
వెలవాల్గంటి కుమారు లౌదురు గదా విప్రోత్తముల్ రావణా!''

– పేరి కాశీనాథశాస్త్రి

విజయనగర విద్వాంసుల సమస్యాపూరణలను మంజువాణి పత్రిక 1903 మే నెల సంచికలో ప్రచురించింది. ఈ సమస్యాపూరణాన్ని చూశాక ఆదిపూడి ప్రభాకరరావు,

కలువలపల్లి రంగనాథశాస్త్రి, కొత్తపల్లి సుందరరామయ్య, దామరాజు శోభనాచలం, నందిరాజు చలపతిరావు, మల్లంపల్లి మల్లికార్జునశాస్త్రి, దాసు శ్రీరాములు, వారణాశి సదాశివయ్య, ఊటుకూరి కళ్యాణరావు మొదలైన తొమ్మండుగురు కవులు కూడా పూరించి మంజువాణిలో ప్రచురించారు.[52]

రీవారాణి ఇచ్చిన సమస్య ఒక్క విజయనగరంలోని విద్వాంసుల్నేకాక దేశంలో వున్న ఇతర కవులకు కూడా ఉత్సాహకరంగా ఉండడం గమనార్హమైన విషయం. దురదృష్టవశాత్తు రీవారాణిగాని, వారి విద్వాంసులు, వారిలో ముఖ్యంగా అప్పారావుగారు విద్యా వినోదాలలో పాల్గొనే అవకాశం లేకుండా 1903లో విజయనగరం సంస్థానం పెద్ద దావా జిల్లా హైకోర్టులో ప్రారంభమైంది. రీవావాణి, అప్పారావుగారు విజయనగరం నుండి చెన్నపట్నం, కూనూరు, ఊటీ మొదలైన ప్రదేశాలకు ఏటా వెళ్ళి కొన్నినెలలపాటు అక్కడే గడపవలసి వచ్చింది. విజయనగరం 'పెద్ద దావా' బాధ్యతను రీవారాణీ అప్పారావుగారి భుజాలపైనే పెట్టింది.

1903 ఏప్రిల్ 2వ తేదీనాడు అప్పారావుగారు మద్రాసు చేరుకొన్నారు. మర్నాడు సర్ భాష్యం అయ్యంగారితో కేసు గురించి చర్చించారు. తర్వాత ఏప్రిల్ 11వ తేదీనాడు ఊటీ వెళ్ళి అక్కడ జూన్ 14వ తేదీదాకా ఉన్నారు. ఇది విశ్రాంతి కోసంకాక దావా గురించి చేయవలసిన పనుల ఆలోచనకే ఎక్కువగా ఉపయోగపడింది. 1903 జూలై 13వ తేదీనాడు సంస్థానంపై దావా అని అప్పారావుగారు డైరీలో నోటు చేసుకొన్నారు. ప్రతి సంవత్సరం వేసవి ఊటీలో గడపడం ఈ ఏడాది నుంచి ప్రారంభమైంది. రాజ కుటుంబీకులు, తెల్లదొరలు, పెద్ద లాయర్స్ అంతా అక్కడ ఆ రెండు మూడు మాసాలు మకాం చేస్తారు.

పెద్ద దావా గురించి సలహాలు ఇవ్వడమేకాక అందులో స్వయంగా సాక్ష్యం కూడా అప్పారావుగారు ఇవ్వవలసి వచ్చింది. 1905 సెప్టెంబరులో ఉదక మండలం నుంచి ఆయన ఎవరో ముఖ్యమైన కార్యకర్తకు ఇలాగ ఉత్తరం రాశారు.[53]

'ప్రియమిత్రమా!

మీరు 12వ తేదీన వ్రాసిన ఉత్తరం నాకు 16వ తేదీన అందింది. మీరు పంపిన నా రిపోర్టుల ఫైలు అందినట్లు ఇదివరకే మీకు తెలియపరిచాను. మీరు కనుగొన్న విషయం కొలంబస్ కావించిన పరిశోధనను జ్ఞప్తికి తెస్తున్నది. శ్రీ జగన్నాథరావుగారి పిటిషనులకు నా సమాధానాలను నేను ఇవాళ పంపిస్తున్నాను. బెజవాడ శాసనానికి విజయనగరం రాజకుటుంబానికి సంబంధం వున్నదని మీరు కావించిన పరిశోధన బాగున్నది. సంతోషం. దావా వాయిదా పడ్డట్టు పత్రికలో చదివాను. నవంబరులో కాబోలు వాయిదా. ఇందుకు ప్రత్యేకం నేను మదరాసు వచ్చి లాయరుతో చర్చించవలెనా? మీకంటే లాయరు ఎక్కువ సాయపడతాడని నాకు నమ్మకం లేదు.

---

52. ఈ వివరాలు నిడుదవోలు వెంకటరావుగారు తమ 'విజయనగర సంస్థానం' గ్రంథంలో చెప్పారు. పుట - 128

53. లేఖలు - పుటలు 229-230

'ఇంతకీ నా సాక్ష్యం సంగతి? కమీషన్ ముందు నేను సాక్ష్యం చెప్పవలసి వుంటుందనుకుంటాను. డిసెంబరు చివరి వారంలోనో, జనవరి మొదటి వారంలోనో నేను దక్షిణ ప్రాంతాలకు వెళతాను. అందువల్ల నా పరిశోధనకు ఆటంకం కలగకుండా డిసెంబరులోపున నా సాక్ష్యం తీసుకుంటే మంచిది. తిరునల్వేలి నుంచి రావడమంటే కష్టం కదూ! త్వరగా నా సాక్ష్యం తీసుకోమని వకీళ్ళను అడగండి''.

అప్పారావుగారు తమ సాక్ష్యంలో సంస్థానపు పురాతన వంశావళి గురించి సాధికారంగా శాసన ప్రమాణాలతో రుజువు చేయడానికి సంసిద్ధులుగా ఉన్నారు. విజయనగరం సంస్థానపు పూసపాటి క్షత్రియులలో 1. రాచిరాజుకోవ, 2. తాళ్ళపాలెం కోవ, 3. రేగులవలసకోవ అనే మూడు విభిన్న శాఖలున్నాయి. వీరిలో రాచిరాజుకోవ వారు పూర్వ రాజ్యాలు పాలించారు. వీరు బెజవాడను పాలించిన మాధవవర్మ సంతతివారు. ప్రబంధాలు రచించారు. బొబ్బిలియుద్ధంలో చనిపోయిన విజయ రామరాజు (1670-1757) నిస్సంతుగా పోవడంచే తాళ్ళపాలెం కోవలోని మూడవ ఆనందరాజు (1732-1760)ని పెంచుకొని గద్దె ఎక్కించారు. ఇతడే ఫ్రెంచి వారిపై పగబట్టి ఆంగ్లేయులను ఉత్తర సర్కారులకు ఆహ్వానించాడు. ఈ ఆనందరాజు కూడా నిస్సంతుగానేపోయారు. ఇతని తరువాత తాళ్ళపాలెం కోవలోంచే ఒకరిని రెండవ విజయరామరాజు (1749-1794) అనే పేరుతో దత్తునిగా చేసుకొని తఖ్తు ఎక్కించారు. రాజ్యానికి వచ్చినప్పుడు ఇతని వయస్సు పదహారు సంవత్సరాలు. ఇతడు ఆంగ్లేయులతో కత్తి గట్టి 1794లో పద్మనాభ యుద్ధంలో చనిపోయాడు. ఇతని తర్వాత నారాయణ గజపతి 1845 దాకా పాలించాడు. తర్వాత ఔరసుడు విజయరామగజపతి (1826-1879) రాజ్యానికి వచ్చాడు. ఈ మహారాజు సంతతే రీవారాణి అప్పల కొండమాంబ, ఆనంద గజపతి (1856-1897). ఈ ఆనంద గజపతి దాకా ఎందరో తాళ్ళపాలెంకోవ లోని వారే పాలకులు.

రేగులవలసకోవకు సంబంధించినవారు ఆదిలో బొబ్బిలి యుద్ధం విజయరామరాజు మరణానంతరం దత్తుగా వచ్చినవారు. పూసపాటి వంశానికి చెందినవారైనా దూరపు బంధువుగా భావిస్తారు. ఈ జ్ఞాతిత్వం చెప్పవీలులేనంత సత్తా పూరుషాంతరములకు పూర్వపుదని అంటారు. దీనికి చారిత్రక ప్రమాణాలను చూపిస్తారు.[54] ఇప్పుడు ఆనంద గజపతి నిస్సంతుగాపోయాక వారి తల్లిగారు చేసుకొన్న దత్తత చెల్లనే చెల్లదని రేగులవారు వ్యాజ్యం తెచ్చారు. తమ వాదానికి అనుగుణ్యమైన వంశావళిని వారు సాక్ష్యంగా చూపించసాగారు. (ఎలిఫిన్‌స్టన్ హిస్టరీ ఆఫ్ ఇండియా వంటి దేశ చరిత్రలు, విజయనగరం డైరీలు) మెకంజీ సంకలనాలలోని కైఫీయత్తులు, హాకీ ఖత్తులు మొదలైన వాటి నుంచి రేగులవలసకోవ వారి పండితులు సాక్ష్యం సంపాదించారు.

---

54. Pusapati Historical Records - Report dated 1772 to the Governor Fort St. George - P.1346. దీనిని నటశ్రీ జగన్నాథశర్మగారు తెలుగు పారాశరీయ హోరలో ఉటంకించారు. పుట. L1

రేగుల వలస వారి వాదం ప్రకారం ఆనంద గజపతి తమ కాలంలోనే తమ పూర్వుడైన పద్మనాభ యుద్ధం చిన విజయరామరాజు వంశపారంపర్యంగానే పూసపాటి వంశీయుడని నిర్ణయించే వంశావళులను కల్పించారు. బొబ్బిలి యుద్ధం తర్వాత దత్తుడని పెంచిన రాజు తర్వాత, వరసగా పద్మనాభయుద్ధం, విజయరామరాజు, నారాయణ గజపతి, విజయరామ గజపతి, ఆనంద గజపతి రాజ్యాధీశులైన వారే తప్ప వారి పేర్లు తాళ్ళపాలెంకోవ లోనికి అక్రమ ప్రవేశం పొందాయి. వాస్తవానికి రేగులవలస వారే రాజ్యార్హులు. అయితే ఆనంద గజపతి హయాంలో తయారైన వంశవృక్షాలు ఇందుకు విరుద్ధాలు.

మాధవవర్మ అని ప్రసిద్ధుడైన పూసపాటి వారిలో విజయనగరం సంస్థానానికి రఘునాథరాజు (1652-1685) ఆద్యుడు. ఇతని తమ్ముడు తమ్మిరాజు. కవి. శ్రీకృష్ణ విజయం అనే పేరుతో నరకాసుర సంహారం ఒక అయిదాశ్వాసాల ప్రబంధంగా రచించాడు. ఈ కృత్యాదిని 89 పద్యాలలో తమ వంశావళిని విపులంగా వర్ణించాడు.[55] ఈ గ్రంథాన్ని ఆనంద గజపతి 1893లో గురజాడ శ్రీరామమూర్తిగారిచేత పరిష్కరింపచేసి 15 పుటల పీఠికతో ప్రచురింపచేశారు. ఇందులో విశేషాలెన్నో ఉన్నాయి. పూసపాటి రాజుల వంశవృక్షాన్ని వివరించేపట్టికకూడా ఇందులో పొందుపరిచారు. దీనిని ఆధారం చేసుకొనే సంస్థానపు లావాదేవీలలో 1903లో కోర్టు దాఖలు చేసిన వంశవృక్షాన్ని సిద్ధపరిచారు. (ఓ.డి.18/1903) జ్ఞాతులు ఇది సవరణకు పాత్రమైన వంశవృక్షమంటారు.

ఆనంద గజపతి తల్లిగారు చేసుకొన్న దత్తత మాత్రమేకాక ఆదిలో పద్మనాభ యుద్ధం తర్వాత చత్తుఃగా వచ్చిన చిన విజయరామరాజు (1760-1794) దత్తతనే ప్రశ్నించడం ఈ వివాదంలో వినబడుతుంది. 'ఆనంద గజపతి కాలమునందే తమ పూర్వుడైన చిన విజయరామరాజు (పద్మనాభం విజయరామరాజు) వంశపారంపర్యము గానే పూసపాటి వంశీయుడని నిర్ణయించుచు వంశావళులను కల్పించియున్నారు అని సాహిత్య పరిశోధకులు చెప్తున్నారు.[56] ఆనంద గజపతీ, గురజాడ శ్రీరామమూర్తిగార్లు కలసి చేసిన చారిత్రక లేఖలను విశ్వసించి పాశ్చాత్య చరిత్రకారులుకూడా మండల చరిత్రలలో అబద్ధాలనే ఉగ్గడించారని రేగులవలసకోవ వారి ఆశ్రితులు కొందరు ఘోషిస్తున్నారు.[57] ఏనాటినుంచో క్షత్రియ కీర్తినే ఆశ్రయించుకొన్న వీరు సంస్థాన వారసత్వపు వ్యవహారాత్మకమైన వ్యూహరచనా విధానమొకటి యేర్పడి ఉందనియు నిర్ధారణగానే విశ్వసింపవలసి వచ్చును అని భావిస్తున్నారు. తమ వాదానికి భిన్నంగా సిద్ధం చేసిన వంశవృక్ష ప్రబంధాది వ్యూహపు రికార్డులు 'టాటోటింప' బూనుకొన్నా రన్నారు. తమకు విరుద్ధంగా ప్రబంధావళులలో పద్యాలుంటే అవన్నీ ఫోర్జరీలనే చెప్తున్నారు.

55. చూ॥ నాయకరాజుల యుగం 'ఇతర కవులు' శీర్షిక, 236, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2003.

56. నిడుదవోలు వెంకటరావు - తెలుగు పారాశరీయ హోర, పీఠిక - పుట.17

57. దువ్వూరి జగన్నాథశర్మ - తెలుగు పారాశరీయ హోర, పుట.XXXII

ఆనంద గజపతీ అతని ఆశ్రితులు ప్రకటించిన వాటిలో ఫోర్జరీలెన్నో చెప్పలేముగాని విజయనగరం పూసపాటి వారి మూడు కోవలలో ఒకటైన రాచిరాజు కోవ గురించి మాత్రం ఒక ఫోర్జరీ రచన వెలువడింది. దీనిని ఆధారం చేసుకొని నిడుదవోలు వెంకటరావు, చాగంటి శేషయ్యగారి వంటి ప్రసిద్ధ సాహిత్య పరిశోధకులే పొరబడి వేములవాడ భీమకవి కాలాన్ని నిశ్చయించడానికి తప్పుదారి పట్టారు. ఈ రాచరాజు సీసమాలిక గురించి నేను కొన్ని వాస్తవాలు వెల్లడి చేశాను.[58] పెద్ద దావాలో ఒక పక్షంవారేకాక రెండుపక్షాల వాళ్ళూ వంశవృక్షాలను సృష్టించారు. పాత వివరాలను దిద్ది పారేశారు. తమకు ఇబ్బందికరమైన గ్రంథాలను వెలుగుచూడనియ్యలేదు. తమకు అనుకూలమైన వాటిని సేకరించో, పుట్టించో ప్రకటించారు తిలాపాపం - తలా పిడికెడు - తాళ్ళపాలెం కోవవారి తరపున వ్యాజ్యాన్ని నడిపించినవారిలో ప్రముఖులైన గురజాడ అప్పారావుగారికి ఇది వర్తించకపోదు. వారి కుమారులు గురజాడ రామదాసుగారే ఉత్తరోత్తరా ఇలా రాశారు.[59]

''విజయనగర సంస్థానీకుల చరిత్ర నిశ్చయముగా శాపదష్టమే! విజయనగర రాజుల వంశమూ నిరంతర ధారగా సాగినదికాదు! రెండేసి, మూడేసి, తరముల కొక్కక్క విరుపు కలిగి దత్తతానుక్రమణయైన గాకుండా వారి జ్ఞాతి వర్గమున వేరొక శాఖలో మొగ సంతతి వారెవరో రాజ్యానికొచ్చుట తటస్థించుచుండెను. ఈ కారణము చేతనే వారి ఆది కుటుంబమున ఆఖరి పురుషుడగు శ్రీ ఆనంద గజపతి మహారాజావారు గుజరాతు రాజుల చరిత్ర, రాజతరంగిణి వలె తమ వంశ చరిత్ర వ్రాయించనుద్యమించిరి గానీ అదీ సాగలేదు. వారి మరణాంతరము సంస్థానముపై వారసత్వపు వ్యాజ్యము వచ్చినతరి, ధనవంతులు విశాలమైన పలుకుబడిగల మహారాణిల చేతిలో, వారి పూర్వ వంశావళి అన్నిచోట్లా వ్యాజ్యావసరములకు అనువైనట్లు మార్చివేయబడ్డది''.

సాక్ష్యాలను మార్చారో, సమకూర్చారోగాని గురజాడ అప్పారావుగారు ఈ పెద్ద దావాలో ఎంత మునిగిపోయారంటే 1905 ఏప్రిల్ 15వ తేదీనాడు అప్పారావుగారు మద్రాసు చేరుకుంటే 24వ తేదీనాడు అప్పారావుగారి తండ్రిగారు మరణించారు. ఆ వార్త అప్పారావుగారికి తెలిసి వెంటనే విజయనగరానికి బయలుదేరారు. విజయనగరంలో పదమూడు రోజులు మాత్రమే ఉండి, తండ్రికి కొడుకు చేయవలసిన కర్మచేసి మే 7వ తేదీనాడు ఊటీకి విజయనగరం నుంచి బయలుదేరవలసి వచ్చింది. ఊటీలో ఆయన కోసం మిస్టర్ చూ థాంప్సన్, మిస్టర్ గిల్మన్ మొదలైనవారు ఎదురుచూస్తున్నారు. ఇంతకు ముందు దాకా మైనరు మహారాజాగా ఉన్న విజయరామరాజు ఇప్పుడు మహారాజా హోదాకు వచ్చారు. మే 29వ తేదీనాడు ప్రభుత్వ భవనంలో మహారాజావారు గవర్నరును కలిసిరి. జూన్ 5వ తేదీనాడు 'గవర్నరు సతీమణి మహారాజును చూడడానికి వచ్చినది' అని అప్పారావుగారు డైరీలో రాసుకొన్నారు. వేసవి సీజను అయిపోయినా 1905లో సెప్టెంబరు దాకా అప్పారావుగారు ఏ దావా కార్యాలవల్లనో ఊటీలోనే ఉండిపోయారు.

58. నాయకరాజులయుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2003

59. తెలుగు పారాశరీయహోర - పుట.XI

1906లో వారసత్వపు పెద్ద దావా ఏ మలుపులు తిరిగిందో అప్పారావుగారు తొలి సాక్ష్యాన్ని బలపర్చడానికి జనవరి 22వ తేదీనాడు తాళపత్ర గ్రంథాలు సంపాయించారు. జనవరి 26వ తేదీనాడు ''శ్రీరామమూర్తి గ్రంథము రెండవ భాగమును ఫైలు చేయవలెను'' అని డైరీలో రాసుకొన్నారు. గురజాడ శ్రీరామమూర్తిగారు ఆనంద గజపతి పరిపాలనలో తమ 'కవి జీవితములు' అనే గ్రంథాన్ని 1893లోనే ముద్రించారు. గ్రంథమంతా ఒక సంపుటంగా కాక అయిదు చిన్న సంపుటాలుగా ప్రకటించారు. వీటిలో రెండవ భాగం కేసుకు అవసరమైంది కాబోలు. 1906లోనే ఒంగోలు మునిసుబ్రహ్మణ్యం అనే విద్యార్థిని తమ ఇంట్లో పనిచేయమని చెప్పి పరిశోధకులకోసం నియమించారు. ఏయే పనులు తయారుచేశారో ముని సుబ్రహ్మణ్యంగారు ఇలా రాశారు.[60]

''విజయనగరం సంస్థానమునకు చెందిన శాసనములును, విజయనగర రాజుల బంధువుల వంశ వివరములను తెలుపు కొన్ని పద్య కావ్యములు, వచన గ్రంథములు గూడ నుండెడివి. ఈ గ్రంథములన్నియు నేను జదివి అందలి వంశములు వివరముగా వ్రాసి అందలి పద్యములను ఇంగ్లీషు తర్జుమా జేయుటయు అవన్నియు అచ్చొత్తించుటయు నాపనిగా నిర్ణయింపబడెను. ఇదిగాక ఆంధ్రకవులు వ్రాసిన ప్రబంధ కావ్యములలోని ప్రథమాశ్వాసములలో కృతిపతి యొక్కయు కృతికర్తయొక్కయు వంశావళులు దెలుపు పద్యములు దీసి అందుండు చారిత్రక విషయముల విడదీసి శిలాశాసనములలోని రాజుల మంత్రుల జీవిత కాలముల ఆధారమువల్ల ఆంధ్రకవుల, వారి పోషకుల కాల నిర్ణయము జేయవలసియుండెను. అప్పారావు పంతులుగారు నాకు మార్గము జూపి పనులు ప్రారంభింపజేసి వదలి వేసినంతనే నేనీ పనులన్నియు కడు త్వరితముగా పూర్తిచేయుచుంటిని''.

ముని సుబ్రహ్మణ్యంగారు ఆంగ్లంలోనికి అనువదించిన ప్రాచీన పద్య భావాలను సరిచూసి అప్పారావుగారు The Prabandham Pedigrees అనే చిన్న గ్రంథాన్ని ప్రకటించి దానిని పెద్ద దావాలో ఒక ప్రబల సాక్ష్యంగా సమర్పించారు. ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారి చేత రాజుల భోగట్టాలు తయారు చేయిస్తున్నప్పుడే అప్పారావుగారు స్వయంగా అనేక రాజవంశాల బిరుదావళులను నోటు చేసుకొన్నారు. వారు సమకూర్చుకొన్న వైనాలను నేను అకారాదిగా ఇలా జాబితా తయారుచేశాను.[61]

1. అనిపల్లి, 2. అనుగంటి, 3. అయోధ్య, 4. ఆరట్ల, 5. ఆరూళ్ళ, 6. కాశ్యప గోత్రీకుల, 7. కౌండిన్య గోత్రీకుల, 8. గుండిక, 9. గుండేటి, 10. గూడిలి, 11. గూడే, 12. చెర్వునూళ్ళ, 13. జమ్ములూరి, 14. జయపట్ల, 15. జాచ్చరుల, 16. దట్నార్ల, 17. దేసట్ల, 18. ధనంజయ గోత్రీకుల, 19. ధాన్యవోలు, 20. నరకోల, 21. నింగినొల్లి, 22. పట్నూళ్ళ, 23. పల్కునూళ్ళ, 24. పల్లవుల, 25. పల్లివెళ్ళి, 26. పసుపునూళ్ళ, 27. పానెపల్లి, 28. పాయేటి, 29. పాలూరి, 30. పునుగోటి, 31. పూర్వాడి, 32. పూసపాటి, 33. పెనుగొండ, 34. పైడిముక్కుల, 35. మంగిపూడి, 36. మట్నూళ్ళ, 37. మల్లెల, 38. మారుట్ల,

60. గురజాడ రచనలు- లేఖలు, పుట. 71-72 అధోజ్ఞాపిక

61. మాటా-మంతీ-పుటలు 73-77 (ఈ గ్రంథంలో ఈ వైనాలు అకారాదిని లేవు)

39. రుక్మక (చెరుంతు), 40. రేచర్ల, 41. రేపాల, 42. వాలూరి, 43. విప్పర్ల, 44. విరియాల, 45. వేటకూరి, 46. శెలవోలిస, 47. శ్రీమల్లె.

ఈ వంశావళులు, బిరుదులు సంకలనం చేయడానికి అప్పారావుగారు మద్రాసులోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయానికి వెళ్ళి అక్కడి రికార్డులు సంప్రదిస్తూ ఉండేవారు. ఒక పక్క పెద్ద దావా కోసం ఈ సాక్ష్యాలూ, సంపన్నాలు సేకరిస్తూనే అప్పారావుగారు సృజనాత్మక సాహిత్య రచనలను 1903 నుంచే తలపెట్టారు. అయితే వారు తమ కృషిని ఇంగ్లీషులోనే చేయాలని భావించారు. దీనికి కారణం బహుశా అప్పారావుగారి పాశ్చాత్య స్నేహితులై ఉండవచ్చు. ఊటీలో వారిని కలుసుకొన్నప్పుడు ఈ విషయమై చర్చించి ఉంటారు. కొన్ని కథలను ఇంగ్లీషులో రాయడం ప్రారంభించారు. జె.డబ్ల్యు.రీస్ అనే ఆంగ్లేయుడు భారతదేశంలో ఉన్నప్పుడు అప్పారావుగారికి తన సాహిత్య ప్రచురణల కార్యక్రమాన్ని చెప్పి తనతో సహకరించమని కోరాడు. తర్వాత ఇంగ్లాండు వెళ్ళిపోయాడు. 1904లో అప్పారావుగారు ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించారు. రీస్ దొర ఇలా జవాబు రాశాడు.[62]

17 పాల్ మాల్ ఎస్.డబ్ల్యు, లండన్
7 ఫిబ్రవరి 1904

''ప్రియమైన అయ్యా,

మీరు వ్రాసిన లేఖ అందింది. అనేక ధన్యవాదాలు. మిమ్మల్ని నేను మరువలేను. మీరు నాకు బాగా జ్ఞాపకం. నాతో సహకరిస్తానని మీరిచ్చిన వాగ్దానానికి కృతజ్ఞుణ్ణి. మీ కథలు పంప కోరిక. నాకవి నచ్చినట్లయితే ఆంగ్ల పాఠకులకు నచ్చినట్లే. త్వరలో మీ కథలను చదవకోరుతున్నాను.''

అప్పారావుగారు రాయదలచిన ఆంగ్ల కథలను ప్రచురించడానికి ఒక్క రీస్ దొర మాత్రమే కాదు. మార్క్స్ పెంబర్టన్ అనే ఇంకొక లండన్ వాస్తవ్యుడు కూడా ఆసక్తి చూపించాడు. రీస్ దొరతో ఫిబ్రవరిలో ఉత్తరాలు రాయడం జరిగితే ఈ పెంబర్టన్ దొరతో ఆ ఏడాది నవంబరులో లేఖా సంప్రదింపులు చేశారు. ఆ దొర ఇలా ఉత్తరం రాశాడు.[63]

56, ఫిట్జుజాన్స్ ఎవిన్యూ
హేంప్ స్టెడ్
నవంబరు 29, 1904

''ప్రియమైన అయ్యా,

దయతో మీరు రాసిన లేఖలకు ఎంతో సంతోషించాను. దురదృష్టవశాత్తు ప్రస్తుతం అదనంగా ఏ పని చేయాలన్నా అవకాశం లేకుండా వుంది. కొంతకాలం వరకు నేననుకున్నవేవీ నెరవేరవు.

భారతీయ జీవితాన్ని ప్రతిబింబించే కథలు పంపించగలరా? కొన్ని కథలు పంపినట్లయితే కృతజ్ఞుణ్ణి, అయిదువేల మాటలకంటే ఎక్కువ కాకుండా వ్రాయండి. మా

62. లేఖలు - పుట.158
63. లేఖలు - పుట 159.

పద్ధతికి సరిపడకపోయినట్లయితే అక్కడక్కడ కొద్దిగా మార్చవలసి వుంటుంది. ఇందుకు మీరు అనుమతిస్తారనుకుంటాను''.

1904లో ఇద్దరు పాశ్చాత్యుల జాబుల వల్ల అప్పారావుగారి సాహిత్య జీవితంలోని ఒక ఘట్టంపై వెలుగు ప్రసరిస్తుంది. 1895లో మద్రాసులో ఉన్నప్పుడే మే నెలలో ''యూరేషియనులను గురించి నేనొక నాటకము వ్రాసి, వారి యెడల అనుకంపము కలిగేటట్లు చేయవలెను'' అని డైరీలో 4వ తేదీ నాడే రాసుకొన్నారు. తండ్రి తెల్ల దొర, తల్లి భారత మహిళ అయితే వారికి జన్మించిన సంతానాన్ని మనం ఆంగ్లో ఇండియనులని పేర్కొంటున్నాము. ఆరోజుల్లో వీరిని యూరేషియన్లు అనేవారు. ఈ రాయబోయే నాటకం ప్లాటును మే 11వ తేదీనాడు ఆ సంవత్సరమే ఇలా రాసుకొన్నారు.[64]

''ది యూరేషియను డ్రామా. ఒక గొప్ప 'సివిలియను'. ఒక కొండజాతి స్త్రీని వుంచుకొంటాడు. ఇతనికి ఇద్దరు సంతానం. ఈ ఇద్దరూ ఇంగ్లాండులో పెరిగారు. పరిస్థితుల ప్రభావము వలన తల్లీ, పిల్లలూ ఒకరికొకరు దూరమవుతారు. ఇతను ఆమెతో సంబంధాలను తెంచుకొంటాడు. అతను ఎక్కడ వున్నాడో అతని ఆనుపానులేమో ఆమెకు తెలియదు. ఒక ముసల్మాను వర్తకుడు ఆమెకు ధనం ఇస్తూ ఉంటాడు. ఇంటికి కావలసిన వస్తువులు తెచ్చి పడవేస్తూ వుంటాడు. ఇతడు మొదట బట్లరు. తర్వాత వర్తకుడైనాడు. కొంతకాలానికి ఆమె కొడుకూ, కూతురూ తిరిగి వస్తారు. కొడుకుకు తన తల్లికొండజాతి స్త్రీ అని మొదట తెలియదు. తన తండ్రి చనిపోయాడని అనుకొంటాడు. కాని ఇతను ఇండియాకు రాగానే పరిస్థితులన్నీ అవగాహవుతాయి. ఇంటికి వచ్చే సప్లయిలు కొన్నిరోజుల నుంచి ఆగిపోతాయి. కూతురు పనిచేస్తూ వుంటుంది. ఆమెకు చదువు వచ్చును. సప్లయిలు బంద్ అయినప్పుడు అట్టి సన్నివేశంలోనే పిల్లలిద్దరూ ఇండియా చేరినట్లు చిత్రించేదా?

''ఆ యూరేషియను ఒక పిల్లను పెళ్ళాడతాడు. అతనికి పిల్లలు కలుగుతారు. దగుల్బాజీ. ఇంకొక పిల్లను ప్రేమిస్తాడు''.

బహుశా ఈ ప్లాటు గురించే అప్పారావుగారు 1903లోనూ 1904లోనూ రీస్ దొరతో, పెంబర్టన్ దొరతో చర్చించి ఉంటారు. ఈ కాలంలోనే వారు ఇంగ్లీషులో స్టూపింగ్ టు రైజ్ అనే కథను కూడా రచించారు. (దీనిని అవసరాల సూర్యారావు 'సంస్కర్త హృదయం' అనే పేరుతో తెనిగించి గురజాడ కథల సంపుటిలో చేర్చారు). బహుశా ఇదే కాలంలో అప్పారావుగారు ఒక నవలకు కూడా ప్రణాళికను రాసుకొన్నారు. ఇది సుదీర్ఘమైనదే. కొన్ని పాత్రల స్వరూప స్వభావాలు, సంభాషణలు కూడా చాలా విపులంగా నోటు చేసుకొన్నారు. సన్నివేశాలను సవిస్తరంగానే రచించారు. ఈ నవలా ప్రణాళిక అచ్చులో 27 పేజీలు పరిమితిలో ఉందంటే అప్పారావుగారు ఈ రచన ప్రాతిపదికకోసం ఎంత సమయాన్ని సాహిత్య శ్రమను వెచ్చించారో తెలుస్తుంది.[65]

---

64. మహాకవి డైరీలు – పుట.112
65. మాటా మంతీ – పుటలు 199 నుంచి 225 దాకా

ఈ నవలలోనే ఒకరి పాత్రకు అప్పారావుగారు విప్లవాత్మకమైన ప్రాణం పోశారు. ఇరవయ్యో శతాబ్దం ముగియబోతున్న ఈ చివరి దశాబ్దంలోనే పురుషులు ఇంకా పెక్కు దురహంకారంతో ప్రవర్తిస్తూ ఉంటే ఈ శతాబ్దపు తొలి సంవత్సరాలలోనే అప్పారావుగారు అతని చేత ఇలా చెప్పించారు.[66]

''స్త్రీ మేలుకోవాలి. ఎదిరించాలి. తిరగబడాలి. మానవత్వం ఆమెలో అధికం. ఆడది అబలకాదు. మీ వాదన్లో అర్థం లేదు. మనదేశంలో పల్లెపడుచు చూడండి పురుషుని కంటే బలవంతురాలు, ఎక్కువ కష్టపడుతుంది. కష్టానికి ఓరుస్తుంది. పొలంపనంతా ఆమెదే. గొప్పులు తవ్వుతుంది. దుబ్బులు పెరుకుతుంది. ఊడుస్తుంది. ఒడ్లు దంచి బియ్యం విసురుతుంది. మగవాడికంటే ఆడది ఎందులో తక్కువ? వాళ్లేకాదు, మన ఆడవాళ్ళూ అంతే. గాబుల కొద్దీ నీళ్ళు తోడుతారు. కుంచాల కొద్దీ బియ్యం వారుస్తారు. ఇంటిల్లిపాదికీ చాకిరీ చేస్తారు. అయితే గొప్పవాళ్ళ ఆడపిల్లలు వేరు. దుర్భలులు. ఆమాట నేనూ ఒప్పుకుంటాను. పెద్దింటి పిల్లలు మైనపు బొమ్మలు. కష్టపళ్ళేరు. కరిగిపోతారు. సృష్టిలో నాజూకుతనమంతా భగవంతుడు వాళ్ళల్లో పోతపోశాడు. శరీర కష్టం పడలేకపోతేనేం. ఫిడేలో, వీణో వాళ్ళ చేతికిచ్చి వినండి మిమ్మల్ని గంధర్వ లోకాలు తిప్పి తీసుకువస్తారు''.

ఇటువంటి ఆలోచనా సరణిని అలవర్చుకొన్నారు. కాబట్టే అప్పారావుగారు ''కవీ, తత్త్వవేత్త తమ కాలం కంటే ముందు ఉంటారు'' అని ఈ నవలలోనే ఒక పాత్ర చేత చెప్పించారు. ఆంగ్లేయ మిత్రుల కోరిక మీద ఇంగ్లాండులో ప్రచురణార్థం ఆంగ్ల భాషలో అప్పారావుగారు ఎన్ని కథలు రాశారో తెలియనట్టే వాటిని సీమకు పంపితే అవి ఏమైనాయో కూడా ప్రస్తుతం లభిస్తున్న ఆకరాలవల్ల తెలియదు. అప్పారావుగారి వద్ద మిగిలిన ముసాయిదాల వల్లా, చిత్తుప్రతుల వల్లా, లేఖల వల్లా ఈ మాత్రమైనా వారి ఆంగ్ల కథల భోగట్టాలు తెలియవచ్చాయి.

అప్పారావుగారు ఎంతగా సృజనాత్మక సాహిత్య రచనలు కనీసం ఇంగ్లీషులోనైనా చేద్దామనుకొంటూ ఉన్నప్పుడే విజయనగరం రాజవంశం వారే కాక ఇతర సంస్థానాధీశ్వరులు కూడా ఆయన చారిత్రక రంగంలో చేస్తున్న పరిశోధనల కోసం ఎదురుచూడసాగారు. 1905 మే నెలలో జయపూరు మహారాజావారు అప్పారావుగారి పేర ఒక లేఖ రాస్తూ జయపూరు చరిత్రకు సంబంధించిన వివరాలు ఉంటే తెలియజేయమని కోరారు. దీనికి అప్పారావుగారు ఓపికగా తమ ఉద్దేశాలను రాజావారి సోదరునికి తెలియజేశారు. తమ సిద్ధాంతాలను మహారాజా ఆమోదించినట్టయితే ఒక వ్యాసం రాస్తామని అప్పారావుగారు హామీ ఇచ్చారు. ఒరియా భాషలో రాజాగారు రాసిన ఒక చరిత్ర గ్రంథాన్ని తెలుగులోనికి అనువదించి పంపమని కోరారు. (ఇది నాటి విశాఖ, గంజాం మండలాలలోని జయపూర్ సంస్థానం).

1906లో తెలుగు భాషా రంగంలో మౌలికమైన మార్పులు జరగడానికి కారణభూతమైన సంఘటన ఒకటి జరిగింది. ఆ సంవత్సరం గంజాం, విశాఖపట్నం,

---

66. మాటా మంతీ - పుటలు 218-219

గోదావరి జిల్లాల పాఠశాలలపై పరీక్షాధికారిగా జె.ఎ. ఏట్సు అనే ఆంగ్లేయుడు డ్యూటీలో చేరాడు. ఇతని కార్యస్థానం విశాఖపట్నం. ఈయన తెలుగు నేర్చుకొంటున్నప్పుడు మాట్లాడేభాషకూ, రాసే భాషకు ఆమడ దూరం ఉన్న సంగతిని గుర్తించి ఆశ్చర్యపోయారు. ప్రతి భాషలోనూ ఎంతో కొంత తేడా ఈ రెండు శైలులకు ఉంటుంది గాని తెలుగులో ఇవి రెండు విభిన్నమైన భాషలలాగా ఎందుకుంటాయో అతనికి బోధపడలేదు. విద్యాధికారి కనుక ఆయన సహజంగా విశాఖపట్నం కాలేజీ ప్రిన్సిపాలుగారిని ఈ విషయం ప్రశ్నించాడు. ఆరోజుల్లో పి.టి. శ్రీనివాసయ్యగారు మిసెస్ ఏవియన్ కాలేజీ ప్రిన్సిపాలు. ఆయన ఏట్సు ప్రశ్నలకు సమాధానం వెంటనే చెప్పలేక తమ మిత్రుడైన గురజాడ అప్పారావుగారిని విజయనగరంలోనూ, గిడుగు రామమూర్తిగారిని పర్లాకిమిడిలోనూ కలుసుకొని ఈ విషయం చర్చించమన్నారు. అయ్యంగారు కూడా ఈ సమస్య పట్ల ఆలోచనలు ప్రారంభించారు.

అప్పారావుగారిని ఏట్సు దొర కలుసుకొన్నారు. వ్యావహారిక, గ్రాంథిక భాషల విభేదాలను అప్పారావుగారు 1892లోనే గుర్తించారు. సర్వజన సామాన్యమైన స్పష్ట భాషను ఆనందగజపతి ప్రోత్సహిస్తున్న రోజులలోనే అప్పారావుగారు నాటక రచనకు వాడుక భాష అన్నివిధాలా యోగ్యమైనదని విశ్వసించి కన్యాశుల్కాన్ని రచించి దేశమంతటా ప్రశంసలు పొందారు. కావ్యశైలి వాడుక భాషకు దగ్గరగా ఉండాలన్న తమ వాదాన్ని ఏట్సు దొరకు చెప్పారు. ఈ ఇద్దరి సమావేశం అప్పారావుగారికి మరొక రకంగా తమ కర్తవ్యాన్ని ప్రబోధించినట్టుంది. భారతీయ జీవితాన్ని చిత్రిస్తూ ఆంగ్లంలో కథలూ, నవలలూ, నాటకాలు రాయడం కన్నా ఇంకో నాటకాన్ని తెలుగులోనే విరచించితే ఫలంపాటు ఉంటుందని తమ వాడుక భాషా వాదానికి ఇతోధికమైన బలం చేకూరుతుందనీ ఆయన మనస్సులో ఒక భావం నాటుకొన్నట్టుంది. 1906 వేసవిలోనే ఊటీలో 'కొండు భట్టీయం' అనే కొన్ని అంకాల రూపకాన్ని వాస్తవిక జీవితంలోంచి సమకాలిక ఇతివృత్తాలను తీసుకొని రచించడానికి ప్రారంభించారు. ఇది కూడా కన్యాశుల్కంలాగా వాడుకభాషకే ప్రాధాన్యమిస్తుంది.

కొండుభట్టీయం రచించడానికి ముందో, రచిస్తున్నప్పుడో ఊటీలోనే అప్పారావుగారు అడపా దడపా రాగతాళయుక్తంగా కీర్తనలు రచించసాగారు. ఆయనకు సంగీతం ఇష్టం. పూర్వం 1895లో మద్రాసులో కొన్నినెలలపాటు ఉనప్పుడు నాటకాలలోని సంగీతాన్ని భరించలేక శాస్త్రీయ సంగీత కచ్చేరీలకు వెళ్ళేవారు. సుప్రసిద్ధ గాయనీమణి వీణాధనమ్మ పాటను విన్నారు. ఆనాటికీ నేటికీ జావళీల రచనలో మేటి అయిన ధర్మపురి సుబ్బారావుగారు అప్పారావుగారి స్నేహితులు. ఆయన అడ్మిరాలిటీ హౌస్‌లో తరచూ బహుశా తాము తాజాగా రచించిన జావళీలు పాడి వినిపిస్తూ ఉండేవారు. ఈ సుబ్బారావుగారు వీణ ధనమ్మగారి ప్రియులు. ఆమెకోసం ఎన్నో జావళీలు ప్రత్యేకంగా రచించారు. గోమఠం శ్రీనివాసాచారిగారు గొప్ప నటులు, చక్కని పండితులు మాత్రమేకాక మధుర గాయకులు, క్షేత్రయ్య పదాలను పాడేవారు. వాటిని ప్రచారం చేసేవారు. త్యాగరాజ కృతులలో సారస్వాన్ని కృష్ణయ్యగారనే సంగీత విద్వాంసుడు పాడి వినిపిస్తే అప్పారావుగారు ఆనందించేవారు.

ఆనంద గజపతి హయాంలో ఎవరో సంగీత విద్వాంసులు వారి ఆశ్రయంలో ఉండేవారు. మద్రాసులో తచ్చూరి సింగరాచార్యులు సోదరులు ఎన్నో సంగీత గ్రంథాలను ప్రచురించారు. ఆనంద గజపతి స్వరపరిచిన కృతులను అందులో చేర్చారు. ఆనంద గజపతిపై పదవర్ణాలూ 'పదాలూ' జావళీలు ఎందరో రాశారు. అప్పారావుగారు కొన్ని చక్కని క్షేత్రయ్య పదాలు సభాపతియ్య పదాలు, మైసూరు సదాశివరావుగారి పదవర్ణం తమ డైరీలో నాడే నోట్ చేసుకొన్నారు.

ఏతావాతా అప్పారావుగారికి కీర్తనలు రచించాలనే కోరికతోపాటు తీరిక కూడా ఊటీలో లభించింది. నీలగిరి పాటలు అనే పేరుతో అరడజను పద రచనలు చేశారు. వీటిని అచ్చువేయడానికికాక, ఆహ్లాదంగా గానం చేయడానికే రచించి ఉంటారు. ఆదిలో తనకు ఆరాధ్యమూర్తి అయిన ఆనందగజపతిని, ప్రస్తుతం తన పోషకురాలైన అప్పలకొండ మాంబను పాటలోని ముద్రలో పేర్కొంటూ రెండు రచనలు చేశారు. మిగతావి కావ్య శైలిలో అరసున్నలు, ద్రుతంపై సరళాదేశాల సూత్రాలు పాటిస్తూ రచించినవే. ఈ ఆరింటికీ ఆయన ఇంగ్లీషులో భావానువాదం చేశారు. బహుశా నీలగిరికొండల మీద ఆంగ్లమిత్రుల అవగాహనకోసం ఈ పాటలను అప్పారావుగారో రీవారాణీయో ఇద్దరు సంగీత విద్వాంసులచేత స్వరకల్పన చేయించారు.[67]

నీలగిరి పాటలను సస్వరంగా 1907లో రీవారాణీ మద్రాసులో చిన్న పుస్తకంగా చక్కని నునుపైన కాగితాలపైన అచ్చువేయించారు. ఈ పుస్తకాన్ని ఆనంద గజపతి స్మృతి చిహ్నంగా అంకితమిచ్చారు. ఇందులోని పాటలు బాగున్నాయిగాని, ఓహో అనిపించేటట్టులేవు. 1892లోనే వాడుక భాషలో నాటకం రాసిన వ్యక్తి కావ్యశైలిలో ఇలా పాటలు రాయడం వింతగానే ఉంటుంది. మార్గ రీతులలో పద్య రచన చేస్తున్నప్పుడు అనుసరించిన శైలినే పాటకు ఉపయోగించడం నాటి సంప్రదాయబద్ధతను సూచిస్తుందేమో. త్యాగరాజ కీర్తనలలోనూ, పందొమ్మిదో శతాబ్దపు జావళీలలోనూ, పదాలలోనూ ఉన్న వాడుకభాష వీటిలో కనబడదు. అప్పారావుగారు కావాలనే ఒక పథకం వేసుకొని ఈ పాటలను గ్రాంథిక భాషలో రాశారన్న విషయం వారు తమ పూర్వ శిష్యులు ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి ఉత్తరోత్తరా కొన్ని లేఖలలో తెలియ జేశారు. పనిగట్టుకొని పడికట్టు మాటలూ, మడికట్టుకొన్నట్టు కావ్యశైలి వ్యాకరణ సూత్రాలూ ఉపయోగించిన ఈ పాటలను ఆరింటితోనే నిలపడంలోనే వారి ఉద్దేశం స్పష్టమవుతోంది. సంస్థానంకోసం పెద్ద దావా నడిపిస్తున్న మేధావి భాషా వ్యాజ్యాలలో ముందు ముందుగానే ఒక వ్యూహ రచన చేసుకొన్నారు. ఈ ఎత్తుగడ ఏమిటో అవసరం వచ్చినప్పుడే బయట పెట్టారు. కొందరి నోళ్ళు కట్టెయ్యడానికి ఆయన రాసిన నీలగిరి పాటలలో మచ్చుకు ఒకటి చూడండి.

---

67. ఈ స్వరకల్పన చేసినవారు చింతలూరి గణేశ్వరరావు, కలకట్ల కామరాజుగార్లు అని తెలుస్తుంది. చూ॥ కె.వి.రమణారెడ్డిగారి మహోదయం - పుట.147. అధోజ్ఞాపికలో.

పల్లవి : చిత్తరువని చూడఁ జిత్తము గొంటివి
చిత్తజు నపరంజి చిలుక యెవ్వతెవే

అనుపల్లవి : వత్తువో నాప్రోల-వల
రాజు వేఁడిన
మత్తకాశినినీదు-మనమైననీగదె

చరణములు : ఇచ్చిపుచ్చుకొంట-యిలలోని మర్యాద
ముచ్చిలిమౌనము-మెచ్చుదురటవే
వచ్చి చూచినంత-వంచనఁజేయుదె
పచ్చి దొంగతనము-పఁడతి రొ పరువె

మనములేని తనువు - మరి యేలనే నాక
చెనటి దీనిఁగూడ - చేకొనఁదగవె
వానికి బదులొక్క - వాక్కునే వేఁడెద
మానిని యాపాటి - మన్నింపఁజెల్లునె

విలువ చాలదన్న - విరివిల్తుపై నాన
కలుగుజన్మములఁ-గానుక కొనవె
ఎలమి నానందేంద్రు - నేలిన నెన్నుఁడు
పలు తెఱఁగుల మేలు - పడతినీకిచ్చునె

నీలగిరి పాటలను రచిస్తున్న కాలంలో ''తెలుగు రచయితల జాబితాలో తాము చేరాలనే తలంపు తమకు లేదు'' అని స్పష్టం చేశారు. వారి జీవితంలో ఒక్క నీలగిరి పాటలనుగానీ, తత్తుల్యమైన రచనలనుగానీ ఆయన చేసి ఊరుకుంటే ఆయనకు తెలుగు రచయితల జాబితాలో ఎవ్వరూ సగర్వంగా చేర్చరు. అందుకే అప్పారావుగారు అరడజను కీర్తనలతో ''నీలగిరి పాటలు'' ముగించారు. తమ నూతన ఆలోచనా ధోరణులనూ సృజనాత్మక శక్తులనూ ప్రతిఫలించే కొండుభట్టీయాన్ని 1906లోనే రచించడం ప్రారంభించారు.

కన్యాశుల్కం 1892లో రచిస్తున్నప్పుడు అప్పారావుగారు దుయ్యబట్టదలచిన దురాచారాలు అతి బాల్య వివాహాలూ వాటివల్ల కలిగే దుష్ఫలితాలు మాత్రమే. డబ్బుకోసం పిల్లల్ని అమ్ముకోవడం ప్రాతిపదిక అయితే ఆ డబ్బు కోసమే కోర్టులకెక్కడం, అబద్ధపు సాక్ష్యాలు సృష్టించడం మొదలైనవన్నీ ఆ పునాదిపై లేచిన కట్టడాలే. చిన్నప్పుడే ఆడపిల్లలు వితంతువులైతే, ఉప్పూకారం తినే వయస్సు వచ్చాక వారిలో శరీర వాంఛలు ఎలా వుంటాయో, వాటిని బుచ్చెమ్మలాంటి కొందరెలా అణచుకుంటారో, మీనాక్షిలాంటి కొందరెలా తీర్చుకుంటారో తొలినాటి కన్యాశుల్కం చిత్రిస్తుంది. 1897లో ఈ నాటకాన్ని అచ్చువేసి ప్రకటించిన తర్వాత, అప్పారావుగారు స్త్రీపురుష సంబంధాలమీదా, వివాహ వ్యవస్థమీదా, 'సభ్య' సంఘంలో వేశ్యల స్థితిగతుల గురించీ చాలా తాత్త్విక చింతనలు చేశారు. వాటిలో కొన్ని ఆలోచనలకు తమ ఆంగ్ల

కథలలోనూ, నవలలలోనూ ఒక రూపం కొంతవరకు మాత్రమే ఇచ్చారు. పరిణత మేధస్సుతో కొండుభట్టీయం రచనకు ఉపక్రమించారు.

ఈకొత్త వచన నాటకంలో ఆయన రెండు సాంఘిక సమస్యలను తీసుకొని చిత్రించదలచారు. ఒకటి వేశ్యా సమస్య, రెండవది వితంతు వివాహం. ఆనాటి సంఘంలో వేశ్యలను ఉంచుకొనడం సంపన్నుల హోదాకు చిహ్నమైతే, ఆ వేశ్యలను ప్రోత్సహించడం ఇతర ధనిక వర్గాలకు, అధిక వర్ణాల వారికి పరిపాటి అయిన 'ధర్మం'. పుట్టుక వలన ఎవరూ వేశ్యలు కారనీ, వృత్తిచేస్తున్న వేశ్యలలో కూడా నీతీ, నియమం అనేవి ఉంటాయనీ, వారికీ ఒక మనస్సు, అందులో ఆశలూ, ఆశయాలూ ఉంటాయని అప్పారావుగారు నిరూపించదలచారు. విధవావివాహాలు ప్రోత్సహించి అందువల్ల ఒక వంక యశస్సును సంపాదిస్తూ, మరోపక్క కులంనుండి వెలికి లోను కాకుండా ఉండాలని తాపత్రయపడే ఘరానా వ్యక్తులూ, బ్రహ్మసమాజం, దివ్యజ్ఞాన సమాజం వారి నైతిక రాజకీయాలు, సంస్కారం పట్ల యువకుల ఉత్సాహం మొదలైనవి ఈనాటకంలో అప్పారావుగారు చేపట్టిన సాంఘిక విషయాలు.

ఏవ్యక్తి పేరున ఈనాటకానికి నామకరణం చేశారో ఆ కొండుభట్టు పరమ నికృష్టుడు. అతడు ఒక పక్క వైదిక ధర్మోచితమైన పౌరోహిత్యం చేస్తూ నోములూ, వ్రతాలూ జరిపిస్తూనే వేశ్యకు బేరాలు కుదిర్చి ప్రతిఫలంగా రుసుము వసూలు చేసుకునే తార్పుడు గాడు. నాటకంలో ఈ పరమ దగుల్బాజీకి బుద్ధి చెప్పించడానికి ఒక పాత్రచేత తోళ్ళసాయిబుగా మారువేషం వేయించి అప్పారావుగారు కథ నడపాలని ప్రణాళిక వేసుకొని ఉంటారు. 1907లో నీలగిరి పాటలు ప్రెస్సు నుండి బయటకు వచ్చిన నాటికి కొండుభట్టీయం రచన పూర్తయినట్టుంది. ఊటీ నుండి మద్రాసుకు, విజయనగరానికి ప్రయాణం చేస్తున్నప్పుడు అప్పారావుగారి లగేజిని ఎవరో దొంగిలించారు. సంస్థానపు వారసత్వపు దావా కాగితాలున్న పెట్టెను ప్రతిపక్షులు తస్కరించామనుకొని కృతకృత్యులయ్యారు. ఆ కాగితాలతోపాటు కొండుభట్టీయం సాపు ప్రతి కూడా పోయింది. అపహరించిన వారు ఆ కాగితాలను చింపేశారో, తగలపెట్టేశారో మరి. చక్కని నాటకం ఆంధ్రసాహిత్యానికి తన తొలిరూపంలో దక్కలేదు.

దావాకు సంబంధించిన పత్రాలు తమ పెట్టెతోపాటు ఎవరో దొంగిలించారని అప్పారావుగారు మద్రాసులోని లాయర్లకు తెలియచేశారు. దావాని నడిపిస్తున్న భాష్యం అయ్యంగారికి సహాయకుడైన లాయరు ఎస్. శ్రీనివాసయ్యంగారు సాక్షాత్తూ వారి అల్లుడు. చాలా ప్రజ్ఞావంతుడు, మంచి సాహితీపరుడు. షేక్స్పియర్ నాటక వాఙ్మయంపైన పరమ ప్రామాణికుడైన విమర్శకుడు. దావా విషయాలనేకాక, తమ సాహిత్య కృషిని గురించి కూడా అప్పారావుగారు శ్రీనివాసయ్యంగారితో చర్చిస్తూ ఉండేవారు. దొంగలెత్తుకుపోయిన నాటకంలోని సన్నివేశాలను అప్పారావుగారు వీరికి చెప్పారేమో. వీటికీ, కన్యాశుల్కంలోని కొన్ని పాత్రలకూ పోలికలను శ్రీనివాసయ్యంగారు గుర్తించారు కాబోలు. కన్యాశుల్కం ఎప్పుడో 1897లో పదకొండేళ్ళ కిందట ప్రచురితమై కాపీలన్నీ చెల్లుబడి అయిపోయాయి. పునర్ముద్రణ చాలా ఆవశ్యకమైనది. శ్రీనివాసయ్యంగారు ఆ

నాటకం మల్లికార్జునలో చేయవలసిన మార్పులను కొన్ని సూచించారు. ఈ విషయాలు అప్పారావుగారి మనస్సులో మెదులుతూ ఉన్నాయి.

కన్యాశుల్కం మళ్ళీ ప్రచురించాలనే కోరిక అప్పారావుగారికి ఉన్నా దానిని కార్యాచరణలో పెట్టడానికి వెనుకాడసాగారు. అందుకు బలమైన కారణమే ఉంది. ''తెలుగున గ్రంథ ప్రచురణమనేది పీకులాట పంచాంగం. కృత్యాద్యవస్థ. యూరపులోనో లేదా కనీసం బెంగాలులోనో వున్నట్లు తెలుగుదేశంలో పుస్తక వ్యాపారమనేది లేదు. గ్రంథకర్త తన పుస్తకాన్ని తానే అచ్చొత్తించుకోవాలి. ముద్రాపకుడు, ప్రకటన కర్త, ప్రచురణ కర్త అన్నీ అతనే! అచ్చొత్తించిన పుస్తకాన్ని అభివందనలతో బహూకరించమని పరిచయస్థులైన మర్యాదస్థులు గ్రంథకర్తను అర్థిస్తారు; దీనితో గ్రంథకర్త లాభం గూబల్లోకి వస్తుంది. అతని పని కుదేలు..... దేనికైనా మద్రాసు ప్రచురణకర్తలు అచ్చువేసే అవకాశమంటూ వుంటే దిక్కుమాలిన మద్రాసు తెలుగులో రాసిన స్కూలు పుస్తకాలకు మాత్రమే ఆ అదృష్టం పడుతుంది... మొత్తం చెన్నపట్నం పేరు చెప్పి వొక్క మంచి ఆంధ్ర గ్రంథ విక్రయశాల వుంటే వొట్టు!'' అని అప్పారావుగారు 1908లో భావించేవారు.[68]

అయితే అప్పటికి మద్రాసులో ఆనాడు ఒక మంచి ప్రచురణ సంస్థ లేకపోలేదు. అది కొమర్రాజు లక్ష్మణరావుగారు తమ మిత్రులతోపాటు స్థాపించి దేశానికి ఉపయోగపడే గ్రంథాలను వెలువరిస్తున్నారు. లక్ష్మణరావుగారు అప్పారావుగారికి స్నేహితులే. ఇద్దరూ అప్పుడప్పుడు కలుసుకొంటూ వుండేవారు. అప్పారావుగారు దేశ చరిత్రలపై పరిశోధనలు చేసి 'కళింగదేశ చరిత్ర'ను రచించడానికి ఉద్యుక్తులైన సంగతి లక్ష్మణరావుగారికి తెలుసు. ఆ పుస్తకాన్ని తమ విజ్ఞాన చంద్రికా గ్రంథమండలికి ఇవ్వమని, దానిని తాము ప్రచురిస్తామని లక్ష్మణరావుగరా అడిగారు. ఈ గ్రంథమండలి వారికి కొన్ని భాషా నియమాలు ఉన్నాయి. వీరేశలింగంగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాస్తున్న సరళగ్రాంథిక శైలిలోనే ఎవరైనా పుస్తకాలు రాయాలి. అప్పారావుగారు 1892నుండి, సర్వజన సామాన్యమైన స్పష్ట భాషనుండి ఇంకా ముందుకు పురోగమించారు. అయితే విజ్ఞాన చంద్రిక వారి నియమాలు తెలిసినవారు కాబట్టి అప్పారావుగారు ప్రచురణకర్తలు ''కోరకముందే, వారి నిర్ణయములను యెరిగిన వాడనౌటచే, ఇదివరకు నలుగురూ వ్రాస్తూయున్న భాషనే వ్రాతు''నన్నారు.[69] అప్పారావుగారు ఇలా అంగీకరించడానికి విజ్ఞానాన్ని విస్తృతం చేయడమే. ''అట్టి వొప్పుదలకు కారణము దేశమున చరిత్ర జ్ఞానము విరివి కావలెనని మా మిత్రులు చేస్తున్న మహోద్యమమునకు తోడ్పడునను అభిలాష'' అని అప్పారావుగారు చెప్పారు. ఈ అభిలాష వారికి 1908లో కలిగి అంగీకారాన్ని తెలియజేసి ఉంటారు.

అయితే భాషా విషయంలో 1908 నాటికి కొన్ని పరిణామాలు సంభవించాయి. 1906లో ఏట్సు, ప్రిన్సిపాలు శ్రీనివాసయ్యంగారినీ, గురజాడ అప్పారావుగారినీ, గిడుగువారిని కలుసుకొన్న తర్వాత 1907 నుండి ప్రతివేసవిలోను ఫస్టు సర్కిలు

68. లేఖలు - పుట 14
69. వ్యాస చంద్రిక - పుట 65

ఉపాధ్యాయ పరిషత్ సమావేశాలను ఏర్పాటుచేసి భాషాతత్త్వంమీద, బోధనా పద్ధతులమీదా ఉపన్యాసాలిప్పించేవారు. గిడుగు రామ్మూర్తిగారు ఈ విషయాలపై పరిశోధనలు చేసి విద్యావిధానంలో రావలసిన మార్పులను సూత్రప్రాయంగా సూచించారు. శ్రీనివాసయ్యంగారు ''తెలుగు భాష బోధనా సంస్కరణ సమాజాన్ని' స్థాపించారు. దానికి ఏట్సుదొర అధ్యక్షులు ''శ్రీనివాసయ్యంగారు కార్యదర్శి'' సహజంగా అప్పారావుగారు, రామమూర్తిగారు అందులో ముఖ్య కార్యకర్తలు'' వ్యావహారిక తెలుగు భాష పట్ల శ్రద్ధను పెంపొందించడం ఈ సంస్థ లక్ష్యాలలో, వుద్దేశాలలో ప్రముఖస్థానం పొందింది. అప్పారావుగారు 1908లోనే ఈ ఉద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర వహించవలసి వచ్చింది.

కన్యాశుల్కం తొలికూర్పు సవరణతోనే వాడుక భాషకు తొలివిజయం లభించింది. ఆ నాటకాన్ని లాయరు శ్రీనివాసయ్యంగారి సూచనలను మన్నించి తిరగరాసి ప్రచురిస్తే వాడుక భాషను ఇతోధిక విజయం లభిస్తుందని అప్పారావుగారికి తెలుసు. అందుచేత 1907లో నీలగిరి పాటలను అచ్చువేసిన జి. రామస్వామి చెట్టి అండ్ కో వారితో 1908 ఏర్పాట్లను కట్టుదిట్టం చేసుకున్నారు. ఇది 1908 సెప్టెంబరు తర్వాతనే జరగడానికి ఒక కారణం ఉంది. ఆనెల 26వ తేదీనాడు కన్యాశుల్కం (తొలికూర్పు) నాటకాన్ని విజయనగరం జగన్నాథ విలాసినీ డ్రమటిక్ కంపెనీవారు మళ్ళా ఆడాలని నిశ్చయించుకొన్నారు. ఇది మహారాజావారి ప్రోత్సాహం వల్లనే జరుగుతోంది. ఈ ప్రదర్శనకు రావలసిందిగా మహారాజాయే స్వయంగా అప్పారావురిని ఆహ్వానించారు. వేరే జరూరు పనులు ఉండటం వల్ల అప్పారావుగారు హాజరుకాలేమని ఉత్తరం రాశారు. అయితే ఇలాంటి ప్రోత్సాహకర పరిస్థితి కారణంగా తమ నాటకాన్ని రెండోసారి ముద్రించాలని నిశ్చయించుకొన్నట్లు 1908 సెప్టెంబరు 26వ తేదీనాడు విజయనగరం మహారాజాగారికి ఒక లేఖలో తెలియజేశారు.[70] 1907 నవంబరులోనో లేక 1909 జనవరిలోనో అచ్చు పని ప్రారంభమై ఉంటుంది. 1909 సంవత్సరం మార్చి 11వ తేదీనాడు ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి విజయనగరం నుండి ఉత్తరం రాస్తూ ఇలా చెప్పారు.[71]

''కన్యాశుల్కం నాటకాన్ని చాలా మట్టుకు మార్చివేశాను. మూడు అంకాలు ప్రెస్సుకు వెళ్ళిన తరువాత నాటకంలోని వొక పాత్ర పట్ల నాకు గల దృక్పథాన్ని మార్చుకోవలసి వచ్చింది. నువ్వు మళ్ళీ మదరాసు వెళ్ళినపుడు శ్రీ జి. రామస్వామి చెట్టిని కలుసుకొని నా నాటకం త్వరగా అచ్చు అయేటట్టు చూడమని చెప్పు. ఇప్పటికే అనుకోనంత ఆలస్యమయింది. మా మేనల్లుడు శ్రీ పోచిరాజు నరసింహం లేడూ, కాస్త శ్రద్ధ తీసుకోమని అతనికి ఉత్తరం వ్రాశాను. కాని అతను జవాబు వ్రాయలేదు''.

మద్రాసులో ఉన్న అప్పారావుగారి మేనల్లుడు పోచిరాజు నరసింహం విద్యాధికుడు. ఎం.ఏ. పట్టం పొంది ప్రెసిడెన్సీ కాలేజీలో ఫిలాసఫీ ఆచార్యులుగా

70. లేఖలు - పుటలు 12
71. లేఖలు - పుటలు 72-73

ఉండేవారు. ఆయనకు పుస్తకాలంటే శ్రద్ధ లేకపోలేదు. ఎటొచ్చీ అప్పారావుగారి అచ్చుపుస్తకం విషయంలోకాక ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న యోగశాస్త్ర గ్రంథాలపట్ల 'నాడీ' గ్రంథాల పట్ల ఆయనకు శ్రద్ధ పెరిగింది. అడపాదడపా లైబ్రరీకి వెళ్ళి అక్కడ పరిశోధనలు చేస్తున్న వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని ఈపుస్తకాల విషయం అడుగుతూ ఉండేవారు. ప్రభాకరశాస్త్రిగారు 1906లోనే మద్రాసు చేరుకొని కెల్లెట్ హైస్కూల్లో పండితులుగా చేరారు. విశ్రాంతి సమయాలలో మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలో గ్రంథాలు చదువుతూ వుండేవారు. ఈ పోతరాజు నరసింహంగారి సలహా మీదనే వేటూరి ప్రభాకరశాస్త్రిగారు యోగమార్గంలో పడ్డారు. ఈ నరసింహంగారి మూలంగానో లేక ఇతర సాహితీపరుల వల్లనో గురజాడ అప్పారావుగారు వేటూరి వారిని తర్వాత సంవత్సరాలలో కలుసుకొని తమ చరిత్ర పరిశోధనలు కొనసాగించుకొన్నారు.[72]

అప్పారావుగారి మేనల్లుడు వాకబు చేసి హెచ్చరించాడో లేదో గాని కన్యాశుల్కం రెండో కూర్పు 1909 మే నెలారంభంలో ముద్రణ పూర్తయింది. ఆ సంవత్సరం మేడే నాడు అప్పారావుగారు రెండో కూర్పుకు, పీఠిక వ్రాశారు. ఇది నిజంగా 'సాహిత్య మే-డే ప్రకటన' లాంటిది. దీనిని శీతల ప్రదేశమైన నీలగిరి కొండల మీద రాసినా ఇందులో సాహితీపరులకు వేడిపుట్టించేలా మేలు రకం ఆలోచనలున్నాయి. ''మాతృభాషా సాహిత్యం రైతుల్ని తట్టిలేపక తప్పదు. అవి భారతదేశంలోని ఇంగ్లీషు వారిని కూడా తట్టిలేపక తప్పదు. ఆభాషకు గల అవకాశాలు అపారం'' అని స్పష్టపరిచారు. గ్రాంథిక భాషను ''సంకెళ్ళు ప్రియంగా చూసుకునే వారిని పూజించనివ్వండి'' అన్నారు. తమకు సజీవమైన తెలుగు భాషే కావాలన్నారు. ఒక రకంగా వాడుక భాషను వాంఛించే వారంతా ఏకముగండు, మీకు పోయేది 'గ్రాంథిక' సంకెళ్ళే తప్ప మరేంకావు అన్న భావాలనే కన్యాశుల్కం రెండో కూర్పు పీఠిక ఎలుగెత్తి ఘోషిస్తుంది.

1909 మే నెల 7వ తేదీనాటికి కన్యాశుల్కం అచ్చుఫారాలు కొన్ని అప్పారావుగారి చేతికి వచ్చాయి. అప్పటికి నూటయాభైరెండు పేజీలు అచ్చయినాయి. చిన్నక్షరాలతో ముద్రించినా రెండువందల పేజీలు దాటేటట్టువుంది. ఒక సెట్టు ఫారాలను ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికీ, మరో సెట్టు ఫారాలను ఆదిభట్ల నారాయణదాసుగారికీ పంపమని తమ ప్రచురణకర్తలను కోరారు. 1909 మే 7వ తేదీనాడు ఉదక మండలం నుండి నారాయణదాసుగారికి ఉత్తరం రాశారు.[73]

''...దయ వుంచి నాటకముపై ఒక సమీక్షను వ్రాసి ప్రముఖ తెలుగు పత్రికలలో ప్రచురింపించండి. ఇతివృత్త స్వీకరణల, నిర్వహణలో, హాస్యరసపోషణములో, పాత్రోన్మీలములో, తెలుగు సాహిత్యములో ఇది అత్యుత్తమ నాటకమనే విషయాన్ని మరవకండి''.

---

72. వేటూరి ఆనందమూర్తి (సం) - మణిమంజరి - సంపుటి 11 - ఫిబ్రవరి 1986 - ప్రజ్ఞా ప్రభాకరం, పుట 9, 17

73. లేఖలు - పుట.19

తమ నాటకంపైన అప్పారావుగారికి అంతటి అచంచల విశ్వాసం అచ్చు పూర్తికాగానే కలిగింది. (ఆంధ్ర దేశానికి ఈ విశ్వాసం క్రమేణా కలుగుతూ వచ్చింది). నారాయణదాసుగారిని సమీక్ష వ్రాసి 'ఆంధ్రప్రకాశిక' అనే పత్రికకు పంపమని అప్పారావుగారు ఈ ఉత్తరంలోనే రాశారు. లోగడ వారు డిక్లరేషన్ తీసుకొన్న 'ప్రకాశిని' అనే పత్రికకూ ఈ 'ఆంధ్రప్రకాశిక'కూ గల బంధుత్వం పరిశోధించదగ్గ విషయం.

నారాయణదాసుగారికి ఉత్తరం రాసిన రోజునే ఒంగోలు మునిసుబ్రహ్మణ్యం గారికి కూడా లేఖ రాసి ఒక సెట్టు అచ్చు ఫారాలను పంపించారు. అభిప్రాయాలు రాయమన్నారు. మే 17వ తేదీనాడు ఇంకొక ఉత్తరంలోముని సుబ్రహ్మణ్యంగారిని కూడా ఒక సమీక్షరాసి పంపితే మద్రాసు దినపత్రికలో అచ్చుయ్యేటట్టు చూస్తామన్నారు. కన్యాశుల్కంతోపాటు 'నీలగిరి పాటలు' కాపీ కూడా సమీక్షలో ఈ పాటల ప్రసక్తి కూడా తెమ్మని ప్రత్యేకంగా కోరారు. ''ఏమంటావా నాకు గ్రాంథికం వ్రాయడం చేతకాక కన్యాశుల్కం నాటకాన్ని వాడుకభాషలో వ్రాశానని శ్రీకొక్కొండ వెంకటరత్నం పంతులుకోవకు చెందిన పండితులు అంటే అనవచ్చును'' అని స్పష్టపరిచారు.[74] మళ్ళా జూన్ 24వ తేదీనాడు ఇంకో ఉత్తరం రాస్తూ అందులోనూ ఈ సంగతినే మరొకసారి గట్టిగా చెప్పారు. ''అబ్బెబ్బే! ఈ మనిషికి కావ్య భాషంటే కలం క కదు. అందుకే వాడుకభాషలో కన్యాశుల్కం వ్రాశాడు. నోటికందని ద్రాక్షపళ్ళు పులుపురొడ్లు అని ఛాందస గ్రాంథికవాదులు అనకుండా నీలగిరి పాటల్ని నీ సమీక్షలో ప్రస్తావించు. నీ సమీక్ష నాకు పంపు. బహుశా దాన్ని హిందూ సుందరి పత్రికకు పంపిస్తాను అని'' అప్పారావుగారు అన్నారు.[75]

ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి ఒకటికి పదిసార్లు 'నీలగిరి పాటలు' గురించి రాయమని ఈ ఉత్తరాలలో పనిగట్టుకొని చెప్పబట్టి అప్పారావుగారు తీసుకొన్న దీర్ఘకాలిక వ్యూహం తెలియవస్తున్నది. ఏట్సుదొరతోనూ, గిడుగు రామ్మూర్తిగారితోనూ భాషా విషయాలు చర్చించాక వాడుకభాష ప్రచారం కోసం నిర్ణయించుకొన్నారు. అయితే గ్రాంథిక భాష చేతకానందువల్ల కాదని రుజువు చేయడానికే 1907 నాటికే కావ్యశైలిలో ఈ కీర్తనలు రచించి అచ్చువేసి ఆ తర్వాత మరింత సహజమైన వ్యావహారిక భాషలో తమ నాటకాన్ని తిరగరాశారు. ఈ రకమైన ముందు జాగ్రత్తలు, ఆరితేరిన చదరంగం ఛాంపియన్ ఏడెనిమిది ఎత్తులను ముందే అన్ని రకాల కాంబినేషను ఆలోచించి, ప్లాను చేసి ఒక ఎత్తు వేయడాన్ని స్ఫురింప చేస్తుంది. అప్పారావుగారు గొప్ప 'లౌక్యులు'.

ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారు అప్పారావుగారి ఆజ్ఞలు ప్రకారం ఇంగ్లీషులో కన్యాశుల్కంమీదా, నీలగిరి పాటల మీదా ఒక సమీక్ష రాసి మద్రాసులోని హిందూ పత్రికలో వెంటనే ప్రచురించారు. 1909-1910 సంవత్సరాల మధ్య ఈ రివ్యూ ప్రకటితమైంది. దాని కాపీలు మునిసుబ్రహ్మణ్యంగారి దగ్గర లేవని తెలియజేశారు.[76]

74. లేఖలు - పుట 77
75. లేఖలు - పుట 99
76. లేఖలు - పుట 72 (అధోజ్ఞాపిక)

కన్యాశుల్కం సమీక్షార్థం 'రవి', 'సరస్వతి' 'ఆర్యమతబోధిని' అనే తెలుగు పత్రికలకు పంపించారు. మద్రాసులోని హిందూ, మెయిల్ మొదలయిన ఆంగ్ల పత్రికలలో సమీక్షలు అప్పటికే వెలువడ్డాయి.

నారాయణ దాసుగారి సమీక్ష వెలువడిందో లేదోగాని అభిప్రాయాలకోసం అప్పారావుగారు ప్రతులను పంపిస్తే అందుకొన్న విద్యాధికులు, సంస్కారం గలవాళ్ళు ప్రశంసలను పంపించారు. 1909 జూలై నెలలోనే రెంటాల వెంకట సుబ్బారావుగారు కన్యాశుల్కాన్ని చదివి ఇలాగ ఒక ఉత్తరం రాశారు.[77]

రెంటాల హౌసు,
మైలాపూరు, మద్రాసు
7 జూలై 1909

''ప్రియమైన అప్పారావుపంతులుగారు,

మీరు పంపిన కన్యాశుల్కము, నీలగిరి పాటల - ప్రతులు అందాయి. మీరు దయతో వాటిని బహూకరించినందుకు నేను మిక్కిలి కృతజ్ఞుణ్ణి. నాటకమును చదివి పట్టరాని ఆనందమును పొందాను, ఇదివరకే మీ నాటకం పలువురి ప్రశంశలను పొంది ప్రసిద్ధికెక్కింది. ఇంత ఉత్తమ నాటకాన్ని ఆంధ్రులకు ప్రసాదించినందుకు మీకు నా అభినందనాలు. మీరు ఏ భాషను పవిత్రమైనదిగా భావిస్తున్నారో ఆ వాడుకభాష నాటకంలో ముద్దులమూట కడుతున్నది. మొదటినుంచి, చివరివరకు హాస్యరసము పాఠకుణ్ణి పరవశుణ్ణి చేస్తుంది. నాటక ఇతివృత్తం అతి గంభీరం, నిరంతర ఆసక్తి జనకం. కథా సంవిధానం చక్కగా అమరింది. నాటకం పెద్దదయినా సన్నివేశ చమత్కారం వల్ల సంభాషణల మాధుర్యంవల్ల పాత్రల అమోఘ చిత్రణ వల్ల పాఠకుడు రచయితను తప్పుపట్టలేడు. మీ నాటకం జీవితాన్ని అతి సహజంగా చిత్రిస్తున్నది. ఛాందస శ్రోత్రియుడు, సంస్కర్త, దుర్మార్గుడు, మూర్ఖుడు, నేర్పులేని ఆడది, తమ తమ మనః ప్రవృత్తులలో మీ రచనలో పాత్రలుగా మూర్తీభవిస్తున్నారు. నాటకంలోని పాత్రలు సజీవమైనవి. ఇక అవి చెక్కుచెదరవు.

''మీరు ప్రేమికులు, మీరు ప్రేమించడం ఎరుగుదురు. మీ నాటకంలో కొన్నిచోట్ల షాక్‌లు వున్నా అవి చురకలు మాత్రమే. నాటకమంతటా విద్యుచ్ఛక్తి ప్రసరించినా ఎన్నో వింతవింత మెరుపులు మెరిసినా, అందులోని విద్యుత్ప్రవాహం నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. ఎంత వెలుతురు నింపినా అది తరగదు, చెరగదు!''

కన్యాశుల్కం చదివి మెచ్చుకొన్నాక రెంటాల వెంకట సుబ్బారావుగారు వ్యావహారిక భాషావాదం పూర్తిగా ఆమోదించారు. ఉత్తరోత్తరా దానిని సమర్థిస్తూ చాలా రాశారు. కన్యాశుల్కాన్ని చదివినా, చూసినా మెచ్చుకొనక పోవడం అంటూ ఉండదు. సమీక్ష కోసం కాపీని పంపితే కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు అప్పారావుగారంటే

77. లేఖలు - పుట 24-25

మర్యాద చూపుతున్నారు.[78] కన్యాశుల్కం రెండో కూర్పు ప్రదర్శనను చూసి దాని కూర్పును వీరేశలింగంగారు, రెంటాల సుబ్బారావుగారు, న్యాపతి సుబ్బారావుగారు, జయంతి రామయ్యగారు మొదలైనవారు మిగుల సంతోషపడిరి' వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటి మిత్రులు అప్పారావుగారికి తర్వాత తెలియజేశారు.[79] కన్యాశుల్కాన్ని మెచ్చుకొన్న అందరూ అప్పారావుగారి భాషావాదాన్ని ఆమోదించలేదు. కొందరు గట్టిగానే వ్యతిరేకించారు. అందుకే వాడుక వేడుక భాషలకు యుద్ధం జరిగింది!

కన్యాశుల్కం ప్రచురించిన వెంటనే అప్పారావుగారిలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. 1909 ఆగస్టులోనే ఆయన మరొక వచన నాటకాన్ని ప్రారంభించారు. వాడుకభాష కేవలం ప్రహసన ప్రాయమైన హాస్యరస రూపకానికే కాక తదితర ఉద్యమ రచనలకు కూడా యోగ్యమైనదని రుజువు చేయడానికే ఈ రచనను ఉద్దేశించారు. ''ఉదాత్త గంభీర భావాల అనుభూతుల అభివ్యక్తీకరణకు వాడుకభాష అన్నివిధాల యోగ్యమైనదని చూపడానికి బిల్హణుని కథను నాటకంగా రచిస్తున్నాను'' అని ఆయన ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి ఒక లేఖలో తెలియజేశారు.[80] బిల్హణుని గురించి కొత్త ఆధారాలు సేకరించడానికి మిత్రులకు లేఖలు రాశారు. 1910 ఫిబ్రవరిలో ప్రాచీన లిపి పరిశోధకులు హెచ్.కృష్ణశాస్త్రిగారికి ఈ సంగతి తెలిపారు. ఆయన ఇలా రాశారు.[81]

''బిల్హణుని జీవిత కథను నాటకంగా వ్రాస్తున్నారని విని ఆనందించాను. అపూర్వ ప్రతిభావంతమైన మీ లేఖినితో బిల్హణుడు ఆంధ్రసాహిత్యంలో ఆచంద్రతార్కాణం భాసిస్తాడని నా విశ్వాసం. మహా ప్రేమికుడు, లలిత హృదయుడు, మధురకవి అయిన బిల్హణుని భావోద్వేగానికి హేతువు గుజరాతు దేశపు రాజకుమార్తెయేనా? మీరు నాకా విషయం తెలిపినందుకు సంతోషం''.

ఇది ఎన్ని అంకాల రూపకమో, కథ ఎలా మలచదలిచారో తెలియదు. అప్పారావుగారు రెండంకాలను మాత్రం చాలా రసవత్తరంగా మలచి తరువాత అంకాలలో అంశాలను అక్కడక్కడా నోటు చేసుకొన్నారు.

బిల్హణీయం ఉపక్రమించిన రోజులలోనే వారి దృష్టి చిన్న కథలవైపు కూడా పడింది. విశ్వ సాహిత్యంలోని చెఖోవ్ (1860-1904), మొపాసా (1850-1893) వంటి ఉత్తమ కథానిక రచయితల లాగ వాస్తవ జీవితాల నుండి సాధారణ మానవుల గురించి, ఆ స్థాయిలో ఒక చిన్న కథను చేపట్టిన మొట్టమొదటి కథకులు అప్పారావుగారే. ఎప్పుడు రచన చేశారోగాని 'దిద్దుబాటు' అనే కథను ఆయన 1910 ఫిబ్రవరి మాసం 'ఆంధ్ర భారతి' పత్రికలో ప్రచురించి తెలుగులో కథానిక సాహిత్యానికి శ్రీకారం చుట్టారు. ఇది ఈకోవలోని ప్రథమ రచనలలో ఒకటని చెప్పడానికి రాసిన తీరే సాక్ష్యం యిస్తుంది.[82] కథా కథనం గ్రాంథిక భాషలోనూ, కథలోని పాత్రల సంభాషణలు వాడుకభాషలోనూ

78. లేఖలు - పుటలు - 104, 106
79. లేఖలు - పుటలు - 27.
80. లేఖలు - పుట-104
81. లేఖలు - పుటలు - 163-4
82. ఆచంట సాంఖ్యాయన శర్మగారు యిటువంటి ప్రయత్నం - కొంచెం ముందే చేశారు.

వున్నాయి. శిల్పం 'శేఖరంగా' వుంది. కథ ఎత్తుగడ నుంచి ముగింపు దాకా పాఠకునిలో ఉత్కంఠతను కలిగిస్తుంది. ఏ భాషా విమర్శకుడైనా కథానిక లక్షణాన్ని నిర్వచనం చేయగలిగితే దానికి ఈ కథ లక్ష్యంగా నిలబడుతుంది.

'దిద్దుబాటు' ప్రచురించిన తర్వాత అప్పారావుగారు కథానికా రచనలో ముందడుగు వేశారు. సంభాషణలే కాక కథాకథనం కూడా వాడుకభాషలో చేస్తే మనోజ్ఞంగా వుంటుందని 'మీపేరేమిటి?' అనే కథను రాసి 'ఆంధ్ర భారతి'లోనే ఏప్రిల్, మే, జూన్ మాసాలలో వరుసగా ప్రచురించారు. ఇది మూడు వాయిదాలలో ప్రచురించవలసినంత మరీ పెద్దకథ కాదు. బహుశా ఆంధ్ర భారతి పత్రిక పుటల పరిమితి దృష్టిలో పెట్టుకొని ఈవిధమైన 'సీరియల్' కథగా యిది ప్రచురణ పొందింది కాబోలు.

1910లోనే ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో అప్పారావుగారి 'బిల్హణీయం' మొదటి అంకం ప్రచురితమైంది. ఈ ఏడే 'ఆంధ్ర భారతి'లో పూర్వం పుస్తక రూపంలో వచ్చిన నీలగిరి పాటలలో ఒకటి 'ఊటి చోద్యమేమి చెప్పుదు' అనే పంతువరాళి రాగంలోని కీర్తన పునర్ముద్రించారు. ఇందుకు ఒక ప్రత్యేక కారణమేదైనా వారి మనస్సులో వుండే వుంటుంది. తమకు ప్రాచీనుల శైలిలో కావ్య రచన చేయడం సుసాధ్యమేనని పురుద్ఘాటించాక ఛందస్సులలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టాలనుకొన్నట్టుంది.

ఎప్పుడో 1884లో శంభుచంద్ర ముఖర్జీగారు అప్పారావుగారికి ఒక సలహా యిచ్చారు. ఆంగ్లభాషలోని వివిధ ఛందస్సులను ఆకళించుకొని ఈ పద్య రచనలు ముఖ్యంగా 'బాలడ్స్' అనే కథా గేయాలను రచించడం మంచిదని సూచించారు.[83]

అప్పారావుగారు అప్పుడా సలహాను వెంటనే పాటించినట్టు దాఖలాలు లేవుగానీ ఆంగ్ల సాహిత్యంలో వివిధ సాహిత్య ప్రక్రియల గురించి 1895లో అధ్యయనం చేశారు.

ఆ సంవత్సరం ఏప్రిల్ నెలలో 'కారన్ హిల్' మ్యాగజీను సంపుటాలను వరుసగా చదవడం ప్రారంభించారు. కవిత్వానికి సంబంధించిన ఈ క్రింది వ్యాసాలు కూడా వాటిలో వున్నాయి.[84]

''ఇంగ్లీష్ లిరికల్ పొయిట్రీ, పొయిటిక్ ఇమేజ్ అండ్ ప్రిమిటివ్ కన్సెప్షన్, క్రిటిసిజమ్ ఆన్ వర్డ్స్‌వర్త్, పొయిట్రీ ఆఫ్ ఇటాలియన్ డైలక్ట్సు, బాలెడ్, ఛాసర్స్ లవ్ పొయిట్రీ, ఎర్లీ యియర్ ఆఫ్ షెల్లీ, ఎ ప్లీ ఫర్ ఎరోటిక్ ఫారమ్స్ ఆఫ్ వెర్సు''

ఆంగ్ల కవులు భాషలోనూ, భావాలలోనూ, ఛందస్సులలోనూ ఆధునీకరణం ఎలా ప్రవేశపెట్టారో ఆయన అర్థం చేసుకున్నారు.

ఇంగ్లీషు సాహిత్యంలో విలియం వర్డ్స్ వర్త్ (1770-1850), ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్ (1809-92), రాబర్ట్ బర్న్స్ (1759-96) అనే ముగ్గురు కవులరీతులు ముఖ్యంగా అప్పారావుగారిని ఆకట్టుకున్నాయి. వస్తు స్వీకరణలో వర్డ్స్ వర్త్ మార్గాన్నీ, ఛందస్సుల ఎన్నికలో టెన్నిసన్‌నూ, మానవుని ఔన్నత్యం చాటడంలో బర్న్స్‌నూ అప్పారావుగారు

83. Unilit-p.84
84. మహాకవి డైరీలు - పుట.98

మెచ్చుకున్నారు. తెలుగులో కొత్తరకం ఛందోరీతులను ప్రారంభించడానికి ముందు వారు ''కవిత్వము వర్డ్సువర్తు'' అనే వ్యాసం రాశారు. సామాన్యమగు వస్తువులను గూర్చి వాడుకలో నుండు మాటలలో కవిత్వము చెప్పు కవితా సామర్థ్యం వలన వానికి సొంపుతెచ్చి చదువరుల మనసు రంజింప చేయవచ్చునని వర్డ్సువర్తు అభిప్రాయం. ఇతని కాలమునుండి ఇంగ్లీషు కవిత్వము కోవయే మారి మిక్కిలి గొప్ప స్థితికి వచ్చినది అని అప్పారావుగారు విస్పష్టం చేశారు. తెలుగు కవితల త్రోవని మార్చి మిక్కిలి గొప్ప స్థితిని తీసుకురావడానికి కలం పట్టారు.

ఛందస్సు విషయంలో అప్పారావుగారు టెన్నిసన్ తెచ్చిన మార్పులను గమనించి అటువంటి పద్ధతిని తెలుగులో ప్రవేశపెట్టదలిచారు. టెన్నిసన్ తన 'ఇన్ మెమోరియం' అనే కావ్యాన్ని ఒక నూతన ఛందస్సులో రచించారు. ఇది నాలుగు పాదాల పద్యాల గుత్తళం. ఈ ఛందస్సు తానే మొట్టమొదటిసారిగా కనిపెట్టినట్టు టెన్నిసన్ మురిసిపోయాడు. అతనిలాగే అప్పారావుగారు కూడా ఒకానొక పార్సీ గజల్ నడకను దృష్టిలో పెట్టుకొని తెలుగులో ఒక నూతన ఛందస్సును సృష్టించారు. దీనికి 'ముత్యాల సరము' పేరు పెట్టారు. టెన్నిసన్‌కు అప్పారావుగారికి వున్న పోలికల గురించి నేను పూర్వం యిలా విశదం చేశాను.[85]

''...అయితే ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్ తన వినూత్న సృష్టి అనుకొన్న ఛందస్సు అంతకుముందు వాడకంలో వున్నదే. టెన్నిసన్‌కు చాలా ప్రాచీనులు సర్ ఫిలిప్ సిడ్నీ, బెన్ జాన్‌సన్, మరీ ముఖ్యంగా చెర్‌బరీకి చెందిన లార్డ్ హెర్బర్డు అనే కవి ఈ ఛందస్సును ఎన్నడో చేపట్టాడు... మన అప్పారావుగారి విషయంలోనూ అంతే. ఆయన రూపొందించిన ముత్యాలసరం జాతి జీవనంలో వున్న పాత ఛందస్సే. ''గుమ్మడే డే గోపిదేవి'' అనే ఆడవాళ్ళ పాటలోనేకాక కందుకూరి రుద్రకవి రాసిన 'సుగ్రీవ విజయం' అనే యక్షగాన ప్రబంధంలో ఈ ఛందస్సు కనబడుతుంది. రుద్రకవి కృష్ణరాయల కాలంనాటివాడు. ఎంతలేదన్నా గురజాడ అప్పారావుగారికి అయిదువందల సంవత్సరాల పూర్వమే ముత్యాలసరం తెలుగువాళ్ళ దేశి ఛందస్సుగా జాతి జీవనంలో వున్నదే''.

ఏ ఛందస్సులో ఎటువంటి విషయాలపై కవితలు చెప్పాలో మనస్సులో నిర్ణయించుకున్న అప్పారావుగారు రచన చేయడానికి సమకాలికమైన సందర్భాలు 1910లో వచ్చాయి. ఆ సంవత్సరమే తోకచుక్క వచ్చింది. అందరూ అరిష్టమనుకొనే తోక చుక్కను అప్పారావుగారు 'సంఘ సంస్కరణ పతాక'గా భావించారు. ఆ సంవత్సరమే బరంపురంలో సకల కులాలవారితో సహపంక్తి భోజనం అనే సంస్కరణకు మొట్టమొదటి మెట్టు యిదేనని ప్రాజ్ఞులు తలపెట్టారు. ఇందులో అప్పారావుగారు పాల్గొన్నారు.

1895లోనే వివిధ వర్ణాల వారితో 'ఒకరకమైన' విందులో అప్పారావుగారు దాని గురించి యిలా రాశారు.[86]

---

85. ఆరుద్ర - వ్యాస పీఠం - పుట.334
86. డైరీలు - పుటలు 27-28

''అడ్మిరాల్టీ హౌవుసులో విందు జరిగింది. విందు ఏర్పాటు చేసిన వారిలో శ్రీ పరమేశ్వర పిళ్ళేగారొకరు. భోజనం బహు రుచిగా వుంది. వడ్డించిన పదార్థాలన్నీ చవులూరిస్తున్నవి. ముందు బ్రాహ్మణులకు వడ్డన, భోజనం చేసిన తరువాత మిగిలినవారు విందారగిస్తూ వుంటే వారి ప్రక్కన కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పేందుకు మేమంతా వెళ్ళాం. విందు ముగిసేవేళ యింతమందిని ఆహ్వానించి చక్కని ఆతిథ్యమిచ్చిన శ్రీ పరమేశ్వరన్ ప్రభృతుల ఆయురారోగ్యాభివృద్ధిని కోరుతూ క్లుప్తంగా ఉపన్యసించాను. తరువాత అందరమూ సోడాలను తాగాం''.

పదిహేనేళ్ళ కిందట బ్రాహ్మణులు ముందు భోజనాలు చేశాక యితర వర్ణస్థుల పక్కన కూర్చొని కబుర్లు చెప్పడం - చిట్టచివర అందరూ కలసి సహపంక్తి సోడాలు తాగడం జరిగితే, పదిహేనేళ్ళ తర్వాత 1910లో అన్నికులాలవారూ కలిసి ఏకబంతిని కూర్చొని తినడం సాధ్యమైంది. వర్ణభేదాలు పోగొట్టడానికి యిదే సరైన మార్గమని వేమన్నగారు ఏనాడో చెప్పారు.

జాతినీతి వేరు జన్మంబదొక్కటి
అరయతిళ్ళు వేరె ఆకలొకటి
దర్శనములు వేరు దైవంబదొక్కటి
విశ్వదాభిరామ వినురవేమ

ఉర్వివారికెల్ల నొక్క కంచముబెట్టి
పొత్తుగుడిపి కులము పొలయ చేసి
తలను చేయిపెట్టి తగనమ్మ చెప్పరా
విశ్వదాభిరామ వినురవేమ

అప్పారావుగారికి వేమనగారి సిద్ధాంతాలు బాగా తెలుసు. పనిగట్టుకొని వేమన పద్యాలన్నీ అధ్యయనం చేయకపోయినా వాటి సారాంశాన్ని బాగా ఆకళించుకొన్నారు. భావాలలో వేమనగారి ప్రభావం అప్పారావుగారి మీద వున్నట్టే భాష విషయంలో తిక్కనగారి దృక్పథాన్ని అలవర్చుకొన్నారు. నిర్వచనోత్తర రామాయణాన్ని తిక్కనగారు రచిస్తున్న కాలంలో తెలుగు భాషా సాహిత్యాలలో ఒక అవ్యవస్థ వుండేది. అందుకే ఆ కావ్యం కృత్యాదిపద్యాలలో తిక్కనగారు పనిగట్టుకొని కుకవులను వారు అనుసరిస్తున్న నిష్ప్రయోజనమైన భాషా మర్యాదలను దుయ్యబట్టారు. కుకవులను దుర్విటులతో పోలుస్తూ ఒక పద్యంలో దూషించి ఆనాటి భాషా దౌర్భాగ్యాన్ని యిలా విశదం చేశారు.

''పలుకులపొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాఁత వడ్డమా
టలఁ దమనేర్పుచూపి యొకటన్ హృదయం బలరింపలేక యే
పొలమును గాని యట్టె క్రమముం దమ మెచ్చుగ లోకమెల్ల న
వ్వులఁ బొరయం జరించుకుకవుల్ ధర దుర్విటులట్ల చూడఁగాన్''

(నిర్వచనోత్తర-1-6)

తిక్కనగారు తమ కాలంలో భాష ఎటువంటి దుస్థితిలో వుందన్నారో అలాగే అప్పారావుగారి కాలంలో కూడా వుంది. పలుకుల పొందులు, రసవంతమైన భావాలు మృగ్యం, పాతబడిన మాటలే విస్తారం. తిక్కనగారు ఈ ఒక్క పద్యంతో ఊరుకొనలేదు. ఇంకా యిలా చెప్పారు.

''తెలుగు కవిత్వము చెప్పం
దలఁచిన కవి యర్ధమునకుఁ దగియుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బులిమి పుచ్చుట చదురే'' (నిర్వచనోత్తర-1-7)

అప్పారావుగారి కాలంలో కూడా యింకోరకం పులుముడు కవిత్వం కనబడసాగింది. అందుకే తిక్కనగారిలాగే అప్పారావుగారు కూడా సత్కవీంద్రమార్గము ఏదో ఆలోచించుకొని 'మధుర వచోగుంభన'తో తమ ముత్యాలసరాలను యిలా ప్రారంభించారు.

గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల
క్రొత్తపాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా-

ఈ ఎత్తుగడలోనే ఆయన తన కవిత తేటైన మాటలలోనే వుంటుందని స్పష్టం చేశారు. అప్పుడే పలుకుల పొందుకు ఆస్కారం వుంటుంది. సద్యోరస నిష్పత్తికి ఆస్కారం వుంటుంది. తమ ప్రయత్నాన్ని సనాతనులు హర్షించరని ఆయనకు తెలుసు. వాళ్ళు కాదంటే ఏం మునిగిపోదు. ఈసంగతినే అప్పారావుగారు రెండోసరంలో యిలా చెప్పారు.

మెచ్చనంటావీవు; నీవిక
మెచ్చకుంటే మించిపోయెను;
కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు
కోమలుల సౌరెక్కువా?

కొత్తను ఆమోదించే పాఠకులు కొందరైనా ఉంటారని అప్పారావుగారికి బాగా తెలుసు. అందుకే నూతన ఛందస్సులో సంఘ సంస్కారం గురించి గానం చేశారు. లోకాన్ని మరామత్తు చేయదలచిన వాళ్ళ సంఘ సంస్కారాన్ని స్వగృహంలో మొదలు పెట్టడం మంచిది. ఇంట్లో ఉన్న భార్యబిడ్డలను, ఇతర కుటుంబ సభ్యులను వొప్పించి తన మార్గానికి తిప్పుకోలేనివారు లోకంలో నీతులు చెప్పి ఏం లాభం? అందుకే అప్పారావుగారు తమ ముత్యాల సరాలలో సంఘ సంస్కరణ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని ఇంటికి వచ్చిన వ్యక్తి ఆ విషయాలను భార్యకు విశదం చేయడమనే అంశాన్నే తీసుకొన్నారు. ఆమె ఈ ప్రబోధం విని పొంగిపోలేదు. వెంటనే మారిపోలేదు. పైపెచ్చు భర్తను దెప్పుతుంది. 'కోపము నాపజాలక' ఇచ్చిన సరాలను భర్తపై చరచి వెళ్ళిపోయింది.

చెప్పగానే ఏ ప్రబోధాన్నయినా విన్నవారు చప్పున మారిపోవడం సాధారణంగా ఉండదు. అయితే ప్రబోధం వృథా కాదు. ఏనాటికైనా దానిని గుర్తిస్తారు. ఆమార్గంలో వర్తిస్తారు. ఈ సంగతి అప్పారావుగారికి బాగానే తెలుసు. అందుకే తమ రచనలలో సంఘ సంస్కారం వెనువెంటనే విజయవంతమైనట్లు చిత్రించలేదు. కన్యాశుల్కంలో బుచ్చమ్మకు గిరీశానికి పెళ్ళిచేయకపోవడంలోనే విధవా వివాహాలు జరగడం ఆవశ్యకమేగాని, ఎటువంటివాడు వరునిగా ఉంటారో తెలుసుకోవడం ముఖ్యమని హెచ్చరించారు. ఆడవారిని మగవారు మార్చడంకన్నా మగవారిని ఆడవారు మార్చడం సాధ్యమవుతుంది. ఈసంగతినే 'దిద్దుబాటు' కథలో సూచించారు. 'ఆధునిక మహిళలు మానవ చరిత్రను తిరిగి రచిస్తారు' అన్న అచంచల విశ్వాసం వారికుంది.[87] ముత్యాల సరాలను ప్రకటించగానే అప్పారావుగారు ఊహించిన విమర్శనలే ఆనాటి పత్రికలలో వెలువడ్డాయి. ''ఒక కవి ఏమి చెప్పారో దానివల్ల రసస్ఫూర్తి ఎలా కలుగుతుంది? చెప్పింది ఎంత గొప్పగా చెప్పాడు? లేక ఎంత చప్పగా చెప్పాడు మొదలైన విషయాల జోలికి పోకుండా ఆ కవి ఏవిధమైన భాషాశైలిని ఉపయోగించాడు? ఏ సంప్రదాయ సిద్ధమైన ఛందస్సులు వాడుకున్నాడు?'' అని విమర్శించేవారు. ఆగస్టు 17వ తేదీనాడు వెలువడిన ఆంధ్ర పత్రికలో ఒక శతావధాని గారు ముత్యాలసరాలపై విరుచుక పడ్డారు. విజయనగరం నుండి వెలువడే 'భారతమాత' అనే పత్రిక శతావధానిగారిని గర్హిస్తూ రాసింది. అప్పారావుగారు ఈ విమర్శలు చదివి 'ముత్యాల సరాల లక్షణము' అనే వ్యాసం రాశారు.

శతావధానిగారు అప్పారావుగారి పద్యాలలో మూడు పెద్ద తప్పులు పట్టినట్లు కనబడింది. ఒకటి : గ్రాంథిక భాషా వ్యాకరణాలు పాటించకపోవడం, రెండు : ఛందశ్శాస్త్రమును పాటించకపోవడం, మూడు : పద్యాలలో కావ్యగుణాలు లేవు. ఈ మూడింటికీ అప్పారావుగారు సమాధానం చెప్పారు.[88]

(1) శతావధానిగారు ఒక తప్పయినా లేకుండా సంస్కృతం రాయగలరేమోగాని తెలుగు మాత్రం విస్పష్టంగా రాయలేరు. లక్షణ గ్రంథాలనూ ప్రాచీన కావ్యాలనూ అనుసరించి గ్రాంథిక భాషనే రాద్దామని వారు ఎంత ప్రయత్నించినా మాతృభాషా ప్రభావం వల్ల వాడుక భాషలోని ప్రయోగాలు తెలిసో, తెలియకో పంక్తులలో వచ్చి దూరుతాయి. శతావధానిగారి రాతలలోనే విసంధులు కనబడుతున్నాయి. కవిత్రయం వారి గద్యం తోవను తప్పి శతావధానిగారు ఎంత దవ్వు నడిచెదరో కనబడుతూనే వుంది. శతావధానులు వంటి ''వారి తోవనే కదా, మా బోట్లము పోవుట. 'మహాజనో యేన గతస్సపంథా'' అని అప్పారావుగారు ముక్తాయించారు.

(2) కవులు కొత్త వృత్తాలను కల్పించుకోవచ్చు కదా. తప్పేమిటి? ముత్యాలసరములో తాము చేసుకొన్న నిర్ణయాలను అప్పారావుగారు వివరించారు. మొదటి మూడు చరణాలలో సామాన్యంగా పధ్నాలుగు మాత్రలుంటాయి. నాలుగో చరణంలో యేడు మొదలు పధ్నాలుగు వరకు వుంటాయి. అర్థాన్నిబట్టి విరామం చెవికి

87. లేఖలు – పుట.83
88. వ్యాస చంద్రిక – పుటలు 18 నుంచి

ఇంపుగా ఉండేటట్టు మార్చడానికి ప్రయత్నించాలి. నియమం కట్టుదిట్టమైతే యతిప్రాసల కోసం' తెచ్చిపెట్టుకొన్న శబ్దాలు అర్థపటుత్వాన్ని చెడగొట్టి, సందర్భాన్ని తప్పించి ఈడ్చుకుపోతాయి. అందుచేత అవసరమైన చోట నియమభంగం కూడా తప్పు కాదు. ఒక జాతి పార్సీ గజలు నడకను ముత్యాలసరాలలోనికి తేవడానికి ప్రయత్నం జరిగింది.

(3) కావ్య గుణాలు ఒకరి సొమ్ము కావు. చిత్రాలు వ్రాసేటప్పుడూ, జిలుగు చెక్కుతున్నప్పుడూ 'శిల్పకుడు' యెటువంటి పరిశ్రమ చేస్తాడో అలాంటి పరిశ్రమ చేస్తేనేగాని కావ్యగుణాలు అలవడవు. కావ్య గుణాలు ముఖ్యంగా ప్రతిభవల్లా, కొంతవరకూ కావ్య పఠనా కళాజ్ఞానం వల్లా, కొంతవరకు పూర్వకవుల కావ్యరసం మనసుకు పట్టి ప్రవర్తింపచేయడం వల్లా కలుగుతాయి. అయితే గుణగ్రహణం కూడా అలవాటును బట్టే ఉంటుంది. వాడుక భాషలో రసవంతమైన కావ్యాలు పుట్టలేదా? ''బర్న్స్'' అను మహాకవి మాట శతావధానిగారు వినలేదా?''

'ముత్యాలసరాల లక్షణము' అనే వ్యాసాన్ని బర్న్స్ మహాకవి ప్రసక్తితో ముగించడంలో అప్పారావుగారు తమ ఆశయమేమిటో సూచనప్రాయంగా తెలియచేశారు. ఆంగ్ల కవులలో వారికి వర్డ్స్ వర్తు, టెన్నిసన్, బర్న్స్ అభిమాన కవులు. ఈ ముగ్గురూ శిల్పంలోనూ, ఛందస్సులోనూ, భాషలోనూ మార్పు తెచ్చారు. వీరు చేసిన ప్రయోగాలను క్రమేణా లోకం అంగీకరించింది. అవి ప్రసిద్ధాలయ్యాయి.

వర్డ్స్ వర్తు గొప్పతనాన్ని ఆనాటి విమర్శకులు వెంటనే పట్టించుకోలేదు. బైరన్ అప్పుడు యువకుడు. అతడు వర్డ్స్ వర్తు పద్యాలన్నీ చెత్త అన్నాడు. రాబర్ట్ సౌతీ (భావి ఆస్థానకవి) కొన్ని రాజకీయ గీతాలను మెచ్చుకొన్నా చంద్రుణ్ణీ, నక్షత్రాలనూ చూసే దుర్బిణితోనే గడ్డి పువ్వుల్నీ మంచి చెడ్డల్నీ వర్డ్స్ వర్తు చూడ్డాన్ని హర్షించలేదు. సేద్యగాడు, దేశ దిమ్మరి మొదలైన అల్పమైన అలగాజనం జీవితాలలో ఉదాత్త భావాలూ, తాత్త్విక చింతనా చేయదగ్గ విషయాలు వర్డ్స్ వర్తు గమనిస్తున్నందుకు సౌతీ చివాట్లు పెట్టారు. జీవన సత్యాలనూ, ప్రకృతి దృశ్యాలనూ చిత్రించే వర్డ్స్ వర్తు కవిత్వంలోని ప్రగతిశీలతా, క్రాంతి రుగ్మత తర్వాత చాలాకాలం దాకా సాహిత్యం ప్రపంచం గుర్తించలేదు.[89] ఏమైనా ప్రకృతి సత్యాలకు పరమ విధేయంగా వుంటూ సహృదయులలో సానుభూతిని ప్రభావితం చేసే శక్తి కవిత్వానికి ఉందనీ, భావనల రంగులు మారుస్తూ వైచిత్రిని సృష్టించే శక్తి కవిత్వానిదే అని అప్పారావుగారు వర్డ్స్ వర్తు కవితల నుండి గ్రహించారు.

టెన్నిసన్ కొన్ని విషయాలలో తన కాలం వారికన్నా చాలా ముందు ఉంటాడు. ఛందస్సుమీదా, ప్రక్రియ మీదా అతనికున్న ఆధిపత్యం బహు దొడ్డది. అతని ప్రతి కొత్త రచననూ విమర్శకులు 'చీల్చి చెండాడుతున్న' కొలదీ అవి ప్రాచుర్యం పొందడం, ప్రజలు ఆ రచనలకోసం ఎగబడడం జరిగింది. అతనికి నూతన ప్రయోగాలు ఛందో వైవిధ్యాన్నీ,

89. ఉత్తరోత్తరా వర్డ్స్ వర్తు దృక్పథంలో మార్పు వచ్చింది. ఆదిలో ఫ్రెంచి విప్లవం పట్ల సానుభూతి ఉన్నా, రాను రాను హింస పెరిగిపోయాక విముఖత చూపాడు. కట్టుదిట్టమైన వ్యవస్థను అభిమానించి చిట్టచివరకు ఆస్థానకవి స్థానాన్ని అలంకరించాడు.

నడకలలో సంగీత మాధుర్యాన్నీ సంతరించుకొన్నాయి. టెన్నిసన్ రచనలలో నాటి సమాజంలోని విశ్వాసాలకూ, సందేహాలకూ మధ్య గల సంఘర్షణ ప్రతిఫలిస్తుంది. సమకాలిక, వైజ్ఞానిక, తాత్త్విక విషయాలను పరిగణనలోకి తీసుకొన్నాడు. వర్డ్స్‌వర్తు స్వయంగా టెన్నిసన్ కవితలను మెచ్చుకున్నాడు. విక్టోరియా మహారాణి భర్తకు టెన్నిసన్ కవిత్వం చాలా ఇష్టం. వర్డ్స్‌వర్తు తర్వాత టెన్నిసన్‌నే ఆస్థానకవిగా నియమించారు. సమకాలిక కవులందరూ అతని పరిచయస్తులే. రెండు మూడు తరాల పూర్వ కవులలో బర్న్స్ అంటే టెన్నిసన్‌కు మహాప్రీతి. బర్న్స్ సంచరించిన ప్రదేశాలన్నీ వెళ్ళి దర్శించాడు.

రాబర్ట్ బర్న్స్‌ను గురజాడ అప్పారావుగారు 'మహాకవి' అని చాలా కారణాలవల్ల ప్రస్తుతించారు. బర్న్స్ ఆదిలో వ్యవసాయకూలి. తర్వాత స్వంత వ్యవసాయం చేశాడు. చిన్నతనంలోనే మంచి సాహిత్యజ్ఞానాన్ని సంపాదించాడు. తన స్వరాష్ట్రమైన స్కాట్లండులో సంచరించి ఎన్నో జానపద గేయాలను, నీతి గాథలను సంపాదించి ఇతరుల సంకలనాలకు అందచేశాడు. గ్రామీణుల హాస్యాన్ని, వ్యంగ్యాన్ని బర్న్స్ పుణికిపుచ్చుకున్నాడు. పల్లె పట్టులలోనూ, చిట్టడవులలోనూ ప్రకృతినీ జీవితాన్నీ అన్ని కోణాల నుండి దర్శించి వాటి పట్ల అపారమైన ఆదరణ గలవాడు. మానవనైజంలోని స్వాతంత్రేచ్ఛను కీర్తించాడు. సూటిగా, సుందరంగా ప్రజల రాగద్వేషాలనూ, వాటిలోని బలాబలాలనూ హాస్యరసాన్ని మిళితం చేసినా అమోఘంగా గానం చేశాడు. ఒకవిధంగా లోకమందలి మంచి చెడ్డలను లోకులకు వాళ్ళ భాషలోనే విప్పి చెప్పాడు. మానవుడే అతనికి మాననీయుడు.

ఆంగ్ల కవిత్వంలో విభిన్న కవుల సుగుణాలన్నీ అధ్యయనం చేసి తెలుగు సాహిత్యానికి కొత్త నెత్తురు ఎక్కించాలని అప్పారావుగారు మంచి వైద్యం ప్రారంభించారు. కవుల కృపవల్ల వారు నేర్చుకొన్నది ఒక్కటే ఒకటి. అది ప్రేమ. ప్రబంధాలలోని శృంగారానికి ప్రేమకూ సగమెరిక. కాళిదాసు నాయికలు శృంగారానికి ప్రసిద్ధి. అయితే 'నాటకాలలో దాంపత్య శృంగారం సంఘటనలు తక్కువ' అని అప్పారావుగారు ఏనాడో 1895లోనే గుర్తించారు. వారు కీర్తించదలచినది భార్యాభర్తల ప్రేమ. అన్యోన్యత. ముత్యాలసరాలనే పేరుతో తోకచుక్కపైన చెప్పిన కవితను భార్యకు బహూకరించినట్టే అప్పారావుగారు తమ రెండో పద్యరచనకు 'కాసులు' అనే పేరు పెట్టారు. కవితను ఈ కాసుల రూపంలో సమర్పించారు.

అమలిన శృంగారం పేరిట ఉత్తమ ప్రేమకు ఉత్తరోత్తరా ఎవరో ప్రచారం చేశారని సాహిత్యలోకంలో ఒక భ్రమకు ప్రాణం పోశారుగానీ వాస్తవానికి 1910 ఆగస్టు నెలలో అప్పారావుగారు 'ఆంధ్ర భారతి' పత్రికలో ప్రచురించిన 'కాసులు' కవితతోనే ఆంధ్ర సాహిత్యంలో అమలిన దాంపత్య శృంగారం ప్రారంభమైంది. ఇందులో ఆయన ప్రేమ పెన్నిధి అని చాటి చెప్పారు. ఈ కళను ఇంట్లో నేర్పరు. దీనికి ఒజ్జలెవరూ లేరు. శాస్త్రాలు వీటిని గురించి మౌనం వహిస్తాయి. పెంచకపోతే ప్రేమ పెరగదు. ప్రేమను ఇస్తేనే ప్రేమ వస్తుంది. ప్రేమను నిలిపితేనే ప్రేమ నిలుస్తుంది. మాయమర్మంలేని నేస్తం మగవాళ్ళకూ ఆడవాళ్ళకూ ఒకటే జీవన సౌఖ్యమార్గం. మగడు దేవుడన్నది పాత మాట. భర్త భార్యకు

ప్రాణమిత్రుడు. ఆమె ప్రేమను నోచుకొనడం దేవేంద్ర పదవికన్నా గొప్పది. ఈ ఉపదేశాలన్నీ ప్రేమ విద్దెకు ఓనమాలు.

ప్రేమ గురించి ప్రాథమిక పాఠాలను మగవాడు ఎంత చెప్పినా మహిళ మాత్రమే ఆచరణలో దాని ప్రాశస్త్యాన్ని విడమర్చి చెప్పగలదు. ఈ సత్యాన్ని అప్పారావుగారు 'డామన్ పితియస్' అనే కవితలో 1910 సెప్టెంబరులో ప్రచురించి విస్పష్టం చేశారు. ప్రాణ స్నేహితుల పరస్పర మైత్రి ఎంత గొప్పదో, భార్యాభర్తల అన్యోన్యం అంత స్వచ్ఛమైనదే. ఒకరికోసం ఇంకొకరు ప్రాణత్యాగానికైనా సంసిద్ధులవుతారన్న సత్యాన్ని అంత గొప్పగానూ ఈ కథా కథన గేయం నిరూపిస్తుంది. ఇద్దరు విద్యావంతులు తాత్త్విక జ్ఞాన ప్రవీణులై తథ్యము ప్రాణికి మృత్యువని, రేపు రాబోయే చావును ఈనాడే ఆహ్వానించిన చదువుకొన్నవాని మెదడు కెక్కిన వెర్రిభ్రాంతులు, ఆడదే పోగట్టగలదు. బతకవలసిన కాలంలో బతకును ఒల్లననడం ఏమిటి? పండగలదని కాయను తింటారా? రేపటి తిండిని ఇవాళే భుజిస్తారా? గుడ్డులో చిలక ఉందని అదీ ముందే దాన్ని బద్దలు కొడతారా? ఇక మిత్రుని కోసం మరొక మిత్రుడు ప్రాణమిస్తానంటే భర్తకోసం ప్రాణం ఇవ్వడం అంతకన్నా ముఖ్యం కదా. ఈవిధమైన హితబోధను ఒక మగువ ఈ కథలో చిట్టచివర చేస్తుంది.

విద్యలందలి మాయమర్మము
దిద్ది చెప్పిందబల యొక్కతె;
విద్య లెరుగని ప్రేమ భరమును
వింతగా చూపెన్.

వినగ తగినది వింటి నిచ్చట;
కనగ తగినది కాంచినాడను;
మనుజులిద్దరు మగువ యొక్కతె
మాన్యులీ జగతిన్

అప్పారావుగారి రచనలలోని కొన్ని పాత్రలు ముఖ్యంగా స్త్రీలు, మాన్యులే. 1910లో ఆయన ఎనిమిది నెలలలో (ఫిబ్రవరి నుండి సెప్టెంబరు దాకా) అయిదు రచనలు ప్రచురించారు. వీటిలో రెండు కథలు; మిగతా మూడు గేయాలు. ఈ అయిదింటిలోనూ స్త్రీలకు సముచిత స్థానం ఇవ్వడమేకాక మూడు రచనలలో వారిని పరమోత్కృష్టంగా చిత్రించారు. దిద్దుబాటు కథలో 'కమలిని' మీ పేరేమిటిలో 'నాంచారమ్మ' డామన్ పితియస్‌లో 'పితియస్ భార్య' అప్పారావుగారు ఈయదలచిన సందేశాలన్నీ చేతల ద్వారా, సూచించగల సమర్థులు. ''భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నమే!'' అన్నది ఆయన విశ్వాసం. తోకచుక్కమీద గుచ్చిన ముత్యాలసరాలు, కాసులు అనే రచనలలో భార్యకు తన జీవన దృక్పథాన్ని విద్యగా నేర్పడానికి నాయకుడు ప్రయత్నిస్తాడు. తన పాత్రలనేకాక అప్పారావుగారు తెలుగువాళ్ళకే నిజమైన ప్రేమ విద్యలో ఓనమాలు నేర్పడానికి 1910 నుండి ప్రయత్నించారు. ఆ సంవత్సరమే ఆంధ్ర సాహిత్యవనంలో కొత్త చిగుళ్ల గోచరించసాగాయి.

1910లో ప్రారంభించిన సృజనాత్మక సాహిత్య రచనలను 1911లో అప్పారావుగారు పూర్తిగా కొనసాగించలేకపోయారు. ఈ యేడు జనవరి నెలలో 'లవణరాజు కల' అనే గేయరచన చేసి ఆంధ్ర భారతిలో ప్రచురించారు. 'డామన్ పితియస్' కథలో గ్రీకు దార్శనిక సిద్ధాంతాలనూ, మైత్రీ ప్రాశస్త్యాన్నీ గానం చేస్తే 'లవణరాజు కల' లో యోగవాసిష్టంలోని సిద్ధాంతాలకు నూతన వ్యాఖ్యానంచేసి అంటరానితనాన్ని నిరసించారు. స్వప్నదృశ్యం లాంటి క్షణికమైన జీవితానుభవంలో నైనా భార్యాభర్తల 'ప్రణయాతిరేకము కన్నా సద్గతి' ఇంకేది లేదు. 'ఇహమునందు మనెడు మర్మము' తెలుసుకోవాలి. 'జగత్తు మిథ్య' అనడం ఏం సబవు? కలిగినది లేదంటే వెంటనే కష్టాలు తొలగిపోతాయా?

పుస్తకములోని మాటలు
విస్తరించుచు ననుభవమ్ముల
తత్త్వమెరుగక శుకములగుదురు
వొట్టి శాస్త్రజ్ఞుల్

అనుభవాలు ముఖ్యం. వాటిని భార్యాబిడ్డలతో పంచుకొనడమే స్వర్గసౌఖ్యం. ఎప్పటికీ ఏది అనుభూతమో అప్పటికదే సత్యం. కులంకన్నా గుణం ముఖ్యం.

మంచి చెడ్డలు మనుజులందున,
యెంచి చూడగ, రెండె కులములు
మంచి యన్నది, మాలయైతే,
మాలనే అగుదున్!

మంచిని ఎంచడం, దానిని పెంచడం అప్పారావుగారి ఆశయాలు 'లవణరాజుకల' రాశాక 1911లో ఇంకే ఇతర సృజనాత్మక రచనలూ ఆయన చేయలేదు. వారి కాలాన్ని శాసన పరిశోధనలూ, మద్రాసు యూనివర్సిటీ వారి కార్యకలాపాలూ, కొత్తగా నెలకొన్న ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశాలు, ఆంధ్ర పత్రిక కోసం రచనలు చేసి పంపడం మొదలైన వ్యాపకాలతోనే నిండిపోయింది. ఒక పక్క విజయనగర సంస్థానపు పెద్ద దావా అలా రగులుతూనే ఉంది. దాని గురించి ఉద్యోగరీత్యా చేయవలసినవి చేస్తూనే ఇతర వ్యాసంగాలలో పాల్గొనేవారు.

1910కి ముందే అప్పారావుగారికి వేటూరి ప్రభాకరశాస్త్రి (1888-1950) అనే యువపరిశోధకునితో పరిచయమైంది. ప్రభాకరశాస్త్రిగారు 1906లో మద్రాసు చేరుకొని కెలెట్ హైస్కూల్లో పండితులుగా ఉంటూ తీరిక సమయాల్లో ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ ఉండేవారు. 1910 ఆగస్టు నెలలో ఆయన ఆ గ్రంథాలయంలోనే లేఖకోద్యోగంలో చేరారు. బహుశా ఆ దశలో ప్రభాకరశాస్త్రిగారికి అప్పారావుగారికి మైత్రి కలిగి ఉంటుంది. ప్రభాకరశాస్త్రిగారి సోదరులు చంద్రశేఖర శాస్త్రిగారు ఒకచోట ఇలా రాశారు:[90] ''....గురజాడ అప్పారావుగారు మద్రాసుకు అప్పుడప్పుడు వస్తూ మౌంటు రోడ్డులో టాకర్ అండ్ సన్సులో మకాం పెడుతూ

90. ప్రభాకర స్మారక సంపుటి -1, పుటలు 19-20

అప్పుడప్పుడు మా అన్నగారికొరకు మా ఇంటికి వస్తూ ఉండేవారు. మా అన్నగారు కూడ ఆయన మద్రాసులో ఉండే రోజులలో తరుచుగా ఆయనను కలిసికోడానికి వెడుతూ ఉండేవారు. ఇద్దరు కలిసి అప్పుడప్పుడు మౌంటు రోడ్డులో ఉండిన గెయిటీ థియేటరుకు (అప్పుడు సైలెంటు పిక్చర్స్) వెళ్ళి కొన్ని పరిశోధక చిత్రాలను చూస్తూ ఉండేవారు''.

సర్వసాధారణంగా అప్పారావుగారు మద్రాసులో ఉన్నప్పుడు విజయనగరం వారి బంగళా అడ్మిరాలిటీ హౌసులోనే బస చేస్తారు. అయితే ఏకారణం చేతనో 1909 జూన్ నెలలోనూ, జూలై నెలలోనూ మద్రాసు రాయపేటలోని లాయడ్స్ రోడ్డులో ఉండే 'థాకర్స్ గార్డెన్స్'లో బస చేశారు. ఈ చిరునామా నుంచే ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం గారికి లేఖలు రాశారు. బహుశా 1909 జూన్, జూలై నెలలో అప్పారావుగారు ప్రభాకరశాస్త్రిగారిని కలుసుకొనడం విరివిగా జరుగుతుందనుకోవచ్చు.

ఒక పక్క సృజనాత్మక సాహిత్య రచనలు చేస్తున్నా అప్పారావుగారి బహుముఖ ప్రజ్ఞలలో ఒకటైన శాసన పరిశోధనల గురించి కూడా శ్రద్ధ వహించారు. 1911 ఫిబ్రవరి ఒకటవ తేదీనాడు, ఆ నెలలోనే మళ్ళా ఆరవతేదీనాడు హిందూ పత్రికకు 'అపరిశోధిత శాసనం' అనే విషయంపై సంపాదక లేఖలు రాశారు.

నన్నయ కాలం కంటే ప్రాచీనమైన శాసనాలను బట్టర్ వర్త్ నెల్లూరు శాసన సంపుటాలలో ఉన్నవాటిని ప్రస్తావిస్తూ సుదీర్ఘమైన లేఖ రాశారు. ఉత్సాహవంతులైన యువ పరిశోధకులకు ప్రోత్సాహం గురించి రాశారు. ''ప్రాచీన భాషను, మాండలిక భాషను పరిశీలించడం ఎంత ఉపయోగకరమో తెలుగు రచయితలు గుర్తించడం లేదు'' అని చెప్పారు. అలా గుర్తిస్తున్నవారు ఒక్కరే ఒక్కరు అప్పారావుగారి మిత్రులలో ఉన్నారు. ఆయన గిడుగు రామమూర్తిగారు.

గిడుగువారు 1893లోనే శాసన పఠనం, పురాతన క్షేత్రాలలోని ఆలయాల చరిత్రలు - ఆ ప్రదేశాలలోని ప్రజల వైనాలూ మొదలైనవి ప్రారంభించారు. వాటి గురించి 'మద్రాసు జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్'లో 1894 ప్రాంతాలలోనే వ్యాసం రాసి ప్రచురించారు. 1894-95లో హుల్ట్జ్ దొరగారు కొన్ని తామ్ర శాసనాలు పంపించి రామమూర్తిగారిని పరిష్కరించమన్నారు. వాటిని గిడుగువారు 1895-96 'ఎపిగ్రాఫియా ఇండికా' నాలుగవ సంపుటంలో తమ పరిష్కరణతో ప్రకటించారు. సరిగ్గా ఇదేకాలంలో అప్పారావుగారు కూడా హుల్ట్జ్ దొరతో పరిచయం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. హుల్ట్జ్ ఒక లేఖలో ఇలా రాశారు.[91]

ఉదకమండలం
5, జూన్, 1895

''డియర్ మిష్టర్ అప్పారావు,

ఈ నెల 3వ తేదీన మీరు వ్రాసిన ఉత్తరం నిన్ననే నాకు అందింది. వచ్చే నెలలో మీరెక్కడ వుండేదీ, దయ వుంచి మీ చిరునామా తెలపండి. బెంగుళూరుకు తిరిగి వచ్చాక, ఆ మూడు శాసనాలను చూసి (ఉదయగిరివి రెండూ, పాలకొల్లు శాసనము వొకటి) ప్రచురణ నిమిత్తం, మీకు వాటిని తప్పక పంపిస్తాను.

91. డైరీలు - పుట. 117

''మీ లేఖలో పేర్కొన్న కృష్ణరాయ కాలపు రెండు శాసనములను, ప్రచురించడానకి ప్రొఫెసరు కీల్హారన్ తలపెడుతున్నట్లు కనబడదు. ఈ శాసనాలలో ప్రస్తావింపబడిన విషయం గురించి మీరొక మెమోరాండము పంపించినట్లయితే, దానిని నేను సంతోషపూర్వకంగా డాక్టరు కీల్హారన్ ముందు పెడతాను. అపుడు ఆయన శాసనాలను ప్రచురించడానికై ఉద్దేశపడవచ్చును; అలా కాని పక్షంలో, మీరు ఎడిట్ చేసి ప్రచురించడానికై, వాటిని వెంటనే మీకు పంపించి వేయగలను''.

అప్పారావుగారు కీల్హారన్ దొరతో ముందే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్టుంది. 1895 జూన్ మూడవ తేదీనాడు డైరీలో 'డాక్టర్ కీల్హారన్ దొరకు ఉత్తరం రాశాను.' అనే ఎంట్రీ ఉంది. అయితే శాసన పరిశోధనలు సాగినట్టు లేదు. ముందు ఆనంద గజపతి భార్య పోయింది. రామస్వామి వచ్చి మహారాజా వారితో జీవించడం ప్రారంభించింది. ఆమె యోగక్షేమాలు అప్పారావుగారు కనుక్కోవలసి వచ్చింది. 1897లో ఆనందగజపతి పోయారు. చిన్న దావాలలోనూ, వుత్తరోత్తర పెద్ద దావాలోనూ సంస్థానం చిక్కుకుంది. ఆ లావాదేవీల ఊబిలో అప్పారావుగారి పరిశోధనా వ్యాసంగం కూడా చిక్కుకొంది. ఏ శాసనాలు సంపాదించినా, ఏ తాళపత్ర గ్రంథం లభించినా అవి సంస్థానం దావాకి ఎక్కువగా ఉపయోగపడేవే అయినా, కొన్ని ఇతరాలను కూడా వారు సేకరించకపోలేదు. అప్పారావుగారు స్వయంగా సంపాదించిన శాసనాల గురించి మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు చెప్పిన మాటలే ఇప్పటికి ప్రమాణాలు. వారు ఇలా చెప్పారు.[92]

''ఎస్టేటు శాసన పరిశోధకుడిగా, అప్పారావు విజయనగరం ఎస్టేటులోని శాసనాల ప్రతులను సేకరించడానికి ఎస్టేటు అంతటా పర్యటించారు. వైదిక పండితులకు అగ్రహారాలు భూములు దానమిచ్చిన పురాతన తామ్ర శాసనాలను సేకరించడం ఆయనకొక సరదా అయింది. ఆయన దాదాపు ఏడు తామ్ర శాసనాలను సంపాదించారు. అందులో ఒకటి విష్ణుకుండిన వంశానికి చెందిన ఇంద్రవర్మకు సంబంధించినది. మరొకటి తూర్పుగాంగ వంశీకుడైన ముమ్మడి వ్రజ హస్తునికి (967 శకం) చెందినది. మిగిలినవి తూర్పు చాళుక్య వంశీకులయిన రాజులు కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు, మొదటి చాళుక్య భీముడు మున్నగువారికి చెందినది. వీటినన్నిటినీ పురావస్తు శాఖ అసిస్టెంటు సూపరింటిండెంటుకు పంపించారు. ఇంకా మిగిలినవేమైనా ఉన్నవేమో తెలియదు. వారిపై 1908-1909లో వెలువడిన శాసన పరిశోధకుల వార్షిక నివేదికలో శ్రీ హెచ్.కృష్ణశాస్త్రి గమనించారు. ఇవి ఓరియంటల్ జర్నల్స్‌లో గాని ఎపిగ్రాఫికా ఇండియా త్రైమాస పత్రికలలోని కాని ప్రచురించబడలేదు... ఎస్టేటు వ్యవహారాల్లో నిమగ్నమైపోవడం వల్ల ఇది సంభవించి వుండకపోవచ్చు''.

సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులైన సోమశేఖరశర్మగారు ఇంత స్పష్టంగా అప్పారావుగారు సంపాదించిన శాసనాలు నమోదు మాత్రమే అయినాయిగాని వాటిని

92. గురజాడ శతవార్షిక జయంతి సంచికలో శర్మగారు వ్రాసిన - ఒక ఇంగ్లీషు వ్యాసానికి ఘోరమైన ఆంధ్రానువాదాన్ని ఎవరో చేశారు. అందులోని అనువాదదోషాలను పరిహరిస్తూ కొన్ని వాక్యాలకు నేను సాపు రాశాను.

ఆయన ఎక్కడా ప్రచురించలేదని చెప్తూ వుంటే, గిడుగు సీతాపతిగారు ''గురజాడ అప్పారావుగారు రెండు చిన్న శాసనములు మాత్రమే చదివి ఎపిగ్రాఫికా ఇండికాలో వ్యాసము ప్రకటించారు'' అని రాయడం విడ్డూరంగా ఉంది.[93] ఈ విషయంపై కె.వి.రమణారెడ్డిగారు మల్లంపల్లి వారి శ్రద్ధను తక్కువపరచడం మరీ విడ్డూరంగా ఉంది.[94] నమోదయిన శాసనాల పరిష్కరణ చాలా నిదానంగా జరుగుతుంది. దానికి ఒక దృష్టాంతం చాలు చూడండి. వ్యావహారిక భాషావాదం ఉద్యమరూపం సంతరించు కొంటున్న కాలంలో గిడుగు రామ్మూర్తిగారు శాసన సేకరణా, పరిష్కరణా విషయాల్లో ఎక్కువకాలం వినియోగపర్చలేకపోయారనుకోవాలి. ఆ బాధ్యతలన్నీ చిలుకూరి నారాయణరావుగారి మీద పెట్టినట్టున్నారు. తూర్పుగాంగుల ఆరు తామ్ర శాసనాలను సంపాదించి నారాయణరావుగారు ప్రభుత్వానికి పంపారు. వాటిని నమోదు చేసుకొని తిరిగి నారాయణరావుగారికా గుత్తళాలు పంపించేశారు. ఈ శాసనాలను ''మ.రా.రా.శ్రీ గిడుగు వెంకట రామమూర్తిపంతులుగారూ, మ.రా.రా. శ్రీ చిలుకూరి నారాయణరావు గారు పరిష్కరించి ఎపిగ్రాఫికా ఇండికాలో ప్రకటించనున్నారు' అని 1919 ఆగస్టు హెూం (విద్యా) శాఖ గెజిట్ (నెం.1003)లో ప్రకటించారు. అయితే రామమూర్తిగారు తీరికలేక ఆపనికి పూనుకోలేదు. తూర్పు గాంగుల ఆరు కొత్త శాసనాలను 1933లో రాళ్ళబండి సుబ్బరావుగారు పరిష్కరించి గిడుగువారి గౌరవార్థం ప్రచురించిన వ్యాస సంగ్రహంలో ప్రకటించారు.

పై పేరాగ్రాపువల్ల 1919లో నమోదయిన శాసనాలు 1933లో గాని పరిష్కరణా, ప్రచురణా నోచుకోలేదు. అప్పారావుగారు 1908-1909లో పంపిన శాసనాలకు ఎప్పుడు ఎవరివల్ల విముక్తి కలిగిందో ఉత్తరోత్తరా తెలుస్తుంది. ఏది ఏమైనా 1911లో అప్పారావుగారికి కొంచెం ఊపిరి తీసుకొనే అవకాశం వచ్చి శాసన పరిశోధనల పట్ల దృష్టిని మళ్ళించారు. హిందూపత్రికకు సంపాదక లేఖలు రాశారు. ఉత్సాహవంతులైన యువ పరిశోధకులకు అందుబాటులో ఉండేటందుకు డూప్లికేటు కాపీలను, శాసనపు నకళ్ళను మద్రాసు మ్యూజియంలో పదిలపర్చవలెనని సూచించారు.

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారికోసం అప్పారావుగారు కళింగ దేశ చరిత్రను వ్రాస్తామని చెప్పారు. అయితే భాషా విభేదాలవల్ల అందుకు అంతరాయం వచ్చింది. అప్పారావుగారు కళింగదేశ చరిత్ర రాయలేదుగాని, రాస్తే ఏ దృక్పథంలో రాసేవారో తెలిపే నోట్సు మాత్రం మిగిల్చిపోయారు. రాజుల చరిత్ర కన్నా ప్రజల చరిత్రకే ప్రాముఖ్యమిచ్చేవారని ఆ నోట్ ఒక్కదానివల్లనే చెప్పవచ్చు. ''ప్రాచీన శిథిల భవనాలను, శిల్పాలను అవశేషాలను చూసినప్పుడు మనం వ్యాకులపడతాము. వ్యాకులముతోపాటు మనకు ఆసక్తి కలుగుతుంది. ఆ వస్తువుల చుట్టూ, జాలీ, ఆసక్తి గొలిపే వాతావణం అలుముకొని ఉంటుంది.

93. సాహిత్యోపన్యాసములు - సంపుటి 5 - పుట.11

94. కె.వి. రమణారెడ్డి- మహోపదయం - పుట.138లో అధోజ్ఞాపిక

''రూపు చెడని కోట కన్నా, రూపు చెడిన కోట, విశేషించి దానికి చరిత్రతో అనుబంధం వున్నప్పుడు మనకు ఎక్కువ ఆసక్తిని కలిగిస్తుంది. ఊహించుకొందుకు వీలున్నప్పుడు మన ఆసక్తి మరీ ఎక్కువౌతుంది. సహజంగా మనకు కొన్ని ఊహలు పుడతాయి.

''కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ కోటలో కొందరు నివసిస్తూ వుండేవారు. అనేకుల జీవితాలు వింత వింత అభిరుచులతో, అనుభవాలతో, ఆశలతో, నిరాశలతో ఇక్కడ గడచిపోయాయి. వాళ్ళ వాళ్ళు ఒక్కొక్కప్పుడు అత్యంత ధైర్యోత్సాహాలతో, ఇంకొకప్పుడు మహాభయాలతో కాలం గడిపి ఉంటారు. జీవితంలో అనేక జయాపజయాలను చవిచూసి ఉంటారు. వీళ్ళ ఆశలతో, నిరాశలతో, ఆనందంతో, విచారంతో ఈ వాతావరణం ఒకప్పుడు నిండి ఉండేది. ముఖ్యంగా ఇక్కడ నివసించిన చివరితరం మనుషులు ఎక్కువ ఒడిదుడుకులను ఎదుర్కొని వుంటారు. అనేక కష్టాలు పడి వుంటారు.

''చారిత్రకంగా వీటి ఉనికి ఏమిటో?''

అప్పారావుగారు కళింగ దేశ చరిత్ర రాస్తారని దేశం విశ్వసిస్తోంది. 1910లోనే శాసన పరిశోధకులు కృష్ణశాస్త్రిగారు ఒక ఉత్తరంలో ఇలా రాశారు.[95]

''మీ కళింగదేశ చరిత్ర ఎపుడు వెలువడుతుందోనని అందరూ ఎదురూ చూస్తున్నారు. అది ఆంధ్ర పండితులకు, చరిత్రకారులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది''.

ఈ ఉత్తరంలోనే కృష్ణశాస్త్రిగారు ఇంకొక సంగతిని ఇలా చెప్పారు.

''మీకు దొరికిన శాసనాలలో నాలుగు సరియైనవి కావనీ జర్మనీ నుంచి ప్రొఫెసర్ హుల్ష్ శ్రీ వెంకయ్యగారికి[96] ఉత్తరం వ్రాశాడు. అవి సృష్టి కనక తాను వాటిని అచ్చువేయడట. అయితే అవి సృష్టి అని నేననుకోను. అందుకు తగినంత కారణమేమీ నాకు కనుపించలేదు''.

నమోదైన శాసనాల పరిష్కరణా, ప్రచురణా ఎందుకు జాప్యం అవుతుందో ఈ లేఖలోని భాగంవల్ల ఇంకొంత విశదమవుతోంది.

1911 ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో బిల్హణీయం ద్వితీయాంకం ప్రచురితమైంది. మిగతా అంకాలను పూర్తి చేయకపోవడానికి ఏ బలవత్తరమైన కారణాలున్నాయో! ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలోనే ప్రచురణార్థం అప్పారావుగారు ఇంకొక రచన కూడా పంపారు. అది పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయ కథాభాగాన్ని కృతికర్త శైలిలోనే అప్పారావుగారు రచించిన సంక్షిప్త రచన. ఇదీ ఉగాది సంచికలో అచ్చుపడుతుందనీ, దానిని చదవమని అప్పారావుగారు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారికి ఉత్తరం రాశారు

95. లేఖలు – పుట 164

96. వెంకయ్యగారు ప్రభుత్వోద్యోగులు. శాసన పరిశోధనలో – నిపుణులు.

కూడాను. అయితే కాశీనాథుని నాగేశ్వరరావుగారు 1911 ఏప్రిల్ 27వ తేదీనాడు ఒక ఉత్తరం రాస్తూ ''కళాపూర్ణోదయ కావ్య ప్రతి తెలుగు భాషాభిమానులకు లభించును కనుక, అందుండి మీరు కావించిన ఎంచబడి భాగములను ప్రచురింపలేదు'' అని తెలియజేశారు. ఇది అప్పారావుగారికి ఆశాభంగం కలిగించి ఉంటుంది. ఇంకొక విషయం కూడా వారిని బహుశా బాధించి ఉంటుంది. ''మహారాజావారిని గురించి వ్రాసిన పద్యములు అచ్చువేయనందుకు నన్ను మన్నించ కోరిక. మహారాజాగురించి వ్యాసం ముద్రితమైనది కనుక పద్యములను అచ్చు వేయలేదు'' అని నాగేశ్వరరావుగారు సంజాయిషీ చెప్పుకొన్నారు.

ఆంధ్ర పత్రిక ప్రచురించని పద్యాలను మహారాజాపై అప్పారావుగారే రచించారో, లేక ఇతరులవో తెలియదు. 1911లో మాత్రం మహారాజా విజయరామగజపతి విజయనగరానికి సమీపంలో వున్న కోరుకొండలో చక్కని రాజభవనాలను నిర్మించి గృహప్రవేశం చేశారు. ఆ సందర్భంలో

మాట మర్మమెరిగినట్టి మేటి కవుల జాడలరసి
బోటి అప్పకవి యమర్చెమాటల ముత్యాలపేట

ఇది ముత్యాలసరం కాదు. ముత్యాలపేట. ఈ పాటలో లలిత లక్ష్మి అంటే మహారాణి లలిత కుమారీ దేవి. అప్పారావుగారిలో స్వామిభక్తి, రాజభక్తి, ఆశ్రయమిచ్చిన వారిని ఆనందపరిచే ప్రశంసలను రాయడం మొదలైన గుణాలు చాలా వున్నాయి. 1911లో పంచమ జార్జి చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవం పురస్కరించుకొని ఢిల్లీ దర్బారు జరిగింది. స్వదేశ సంస్థానాధిపతులందరూ బ్రిటీషు రాజమకుటానికి తమ అత్యంత విధేయతను స్వయంగానో, తమ ఆస్థాన కవుల పద్యాల ద్వారానో ప్రకటించుకొన్నారు. 'అత్యంత విధేయులకు అత్యంత విధేయుడు'గా ఒకనాడు ఆనంద గజపతికి తమ గ్రంథాన్ని అంకితమిచ్చిన అప్పారావుగారు పంచమ జార్జి చక్రవర్తిపై రీవారాణీ ప్రోద్బలం వల్లనో, లేక తమ మనోధర్మంచేతనో ఆరున్నొక్క ముత్యాలసరాలు అల్లారు. వీటిని 1929లో అప్పారావుగారి పుత్రులు ప్రచురించిన 'ముత్యాలసరములు' ప్రతిలో చేర్చారు.

వెల్లువగ నారోగ్య సంపద
ఉల్లమలరుచునిచ్చుగావుత
తల్లి భారత మాత పంచమ
జార్జికెల్ల పుడున్

జార్జి సమ్రాట్చాసనంబుల
జాజిపూవుల దండ మాడ్కిని
రాజరాజులు శిరములందును
దాల్చిమనవలయున్

మర్మమెరుగని ధర్మమని యెడ
నిర్మలంబగు నీతి పథమున
పేర్మి ప్రజలను మంచునేర్పరి
జార్జి మనవలయున్

భరతఖండం బెన్నడెరుగని
నిరతశాంతి నొసంగి విద్యల
నెరయ నించిన యాంగిలేయుల
రేడు మనవలయున్

కొల్ల బోతగ జంపి శత్రుల
ఢిల్లీ పట్టముగట్టు బలిమిని
తొల్లి నల్లని దేవుడొక్కడ
జాత శత్రువునకున్

తెల్లవారలు నీతినిపుణులు
ఢిల్లీ పట్టము గట్టి రిపుడే
కల్ల యెరుగని జార్జిరేని
కజాత శత్రునకున్

నల్లవాడును తెల్లవాడును
నెల్ల శుభముల గూర్చుగావుత
తల్లి మేరీ మహారాజ్ఞికి
జార్జి నరపతికిన్

పంచమ జార్జి చక్రవర్తి మీద ఈ గేయ రచన చేయడంలో అప్పారావుగారు తమ విశ్వాసాలతో రాజీపడినట్టు లేదు. ఆనాడు వివిధ రంగాలలో సేవలు చేస్తున్న భారతీయులను ఆంగ్ల ప్రభుత్వం సత్కరిస్తూ వుండేది. పంచమ జార్జి పట్టాభిషేక సందర్భంలోనే గిడుగు రామమూర్తిగారికి 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్' యిచ్చారు. అప్పారావుగారికి మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డాఫ్ స్టడీస్‌లో సభ్యత్వం లభించింది. 1911లో రామమూర్తి పంతులుగారు రిటైర్ అయ్యారు. పరీక్షకు చదివినట్టు ఆంధ్రభాషా సాహిత్యంలో ఆయన అధ్యయనం చేసి వ్యావహారిక భాషోద్యమాన్ని సమరశీలం చేయడానికి ఆయత్తపడుతున్నారు. ఏట్సు దొరా, ప్రిన్సిపాల్ శ్రీనివాసయ్యంగారూ, గిడుగూ గురజాడలు ప్రారంభించిన వాడుక భాషకు విశ్వవిద్యాలయం వల్ల చిన్న గుర్తింపు వచ్చింది. ఇది సనాతనులకు సహించరాని చర్యగా తోచింది. సలక్షణ భాషను సంరక్షించడానికి పండితులు సంసిద్ధులయ్యారు.

'ఆంధ్ర భాషా సంఘం' స్థాపించి గ్రాంథిక భాషను కాపాడాలని జయంతి రామయ్యగారు భావించారు. ఈ విషయమై ఆయన ఆంధ్ర పత్రికలో ఒక వ్యాసం రాశారు.

తమ అభిప్రాయాలను బలపరిచే పండితులను కూడగట్టుకున్నారు. ఈ ఉద్యమాన్ని ప్రోత్సహించే జమీందార్లను దర్శించుకున్నారు. అప్పుడు ఆయన ఉన్నత పదవిలో మద్రాసులో ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా వుండేవారు. 1911 మార్చి 26వ తేదీనాడు మద్రాసులోని తేనాంపేటలో ప్రత్యేకంగా వుండే పిఠాపూర్ నగర్‌పేటలోని 'డన్మోర్' ప్రాసాదంలో తెలుగు సాహితీపరులందరూ సమావేశమై 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'ను సంస్థాపించారు. దీనికి శ్రీ వెంకటగిరి మహారాజాగారు, పిఠాపురం మహారాజావారు, బొబ్బిలి మహారాజాగారు, ఉయ్యూరు రాజాగారు మొదలైనవారు ప్రధాన పోషకులు, వేలకొలదీ ధనం విరాళంగా యిచ్చారు. ఆనాటి సాహితీపరులలో చాలామంది ఈ పరిషత్తులో సభ్యులుగా చేరారు. గురజాడ అప్పారావుగారు కూడా సభ్యత్వం స్వీకరించారు. ఆనాడు భాషా విషయం గురించి మంచిచెడ్డలు చర్చించడానికి ఒక వేదిక అవసరమే. తమ వాదంతో విభేదించే వారిని మెల్లగా వొప్పించి తన వైపు తిప్పుకోవాలనే అప్పారావుగారు ప్రయత్నించేవారు.

అప్పారావుగారికి వ్యతిరేకంగా వున్నవారు ఏవేవో ప్లానులు వేసుకొని విజయాలు సాధిద్దామని ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పారావుగారిపైన ఎటువంటి వత్తిడులు వచ్చాయో తెలియదు. అయితే ఎవరిని సంతోషపెట్టడానికైనా ఆయన తన పట్టుదలను సడలించదలుచుకోలేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు స్థాపన జరిగిన వారం పది రోజులకే అప్పారావుగారు తమ దృఢ నిశ్చయాన్ని, తమకు కావలసిన సహాయ సంపత్తుల గురించి తమ ప్రియశిష్యులు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారికి యిలా ఒక లేఖలో రాశారు.[97]

అడ్మిరాల్టీ హౌస్
మైలాపూర్, మద్రాసు
3 ఏప్రియల్ 1911

ప్రియమైన మునిసుబ్రహ్మణ్యం,

నీ ఉత్తరం అందింది. ఎంతో అభిమానంతో నువ్వు వ్రాసిన వాక్యాలకు నా ధన్యవాదాలు. ఆఖరికి నావంటి వృద్ధులకు సైతం కొంచెం ప్రోత్సాహం అవసరం. అందులోనూ ప్రేమాభిమానాలున్న యువకుడివి, మరి నీబోటి మిత్రుల వద్ద నుంచి అలాంటి ప్రోత్సాహం లభిస్తూ వుంటే యిక అడిగేవా!

''నా ఉద్యమం ప్రజల ఉద్యమం. సంస్కృతిపరుల భావసంపద నాకు అండగా వుంది. అసలు విషయాన్ని అర్థం చేసుకోజాలని ఎవరో కొందరు వ్యక్తులు నాకు వ్యతిరేకంగా వ్యూహాలను పన్నితే పన్నుగాక! నేనేమి లక్ష్యపెట్టను. వాళ్ళను మార్చినా భాషకు జరిగే మేలు యేమీలేదు. వాళ్ళు ఘోరమైన ప్రాచీన కృతక గ్రాంథిక భాషను వ్రాయడానికి అదొక వ్యసనంలాగ అలవాటుపడిపోయారు. దానికి కట్టుబడిపోయారు. అది వొదులుకొని వారు నూతన భాషను చక్కగా వ్రాయగలుగుతారని నేను కలలో కూడా ఆశించలేదు. పోనీ, ప్రాచీనమైన గ్రాంథిక భాషనైనా తేటగా సున్నితంగా

97. లేఖలు - పుటలు 105-107

వ్రాయగలరా అంటే అదీ కనిపించలేదు. నిర్దుష్టమైన గ్రాంథికం వ్రాసేవారు బహు అరుదు. లలితమైన సుందరమైన వాడుక భాషలో గ్రంథ రచన కొనసాగించే సంప్రదాయమొకటి తలెత్తాలంటే నీ వంటి యువకులు నాకవసరం.

''నేటికి సైతం నా ఉద్యమానికి కాకినాడ వ్యతిరేకంగా వున్నందుకు విచారిస్తున్నాను. వివాదాలలో నేనవలంభించే పద్ధతి వేరు. ప్రతిపక్షీయులను తమకు తోచిన రీతిని వ్రాసుకుపోనిస్తే పోగాపోగా వాళ్ళే దారి తప్పుతారు. వొక్కొక్క విమర్శకునికీ వరస వరసగా నేను సమాధానాలిస్తున్నాను. బహువింతలు గొలిపే విషయాలను ప్రస్తావిస్తూ విమర్శకులనందరినీ ఎదుర్కొంటున్నాను. ఇన్నాళ్ళకి వాళ్ళు నన్ను గౌరవించడం నేర్చుకున్నారనుకుంటాను. శ్రీ బహ్మయ్యశాస్త్రిగారు మర్యాద చూపుతున్నారు. మదరాసులో వున్న గ్రాంథిక భాషావాద కూటమి నాయకులు నన్ను చూడడానికి వచ్చారు. నాతో కత్తులు దూయడానికి ఎవరూ తొందరపడడం లేదు. సంశయిస్తున్నారు. వ్యావహారిక భాషా ఉద్యమం సాధించిన పురోగతికి నేను పూర్తిగా సంతృప్తిపడుతున్నాను. కాని నాకు కావలసినదల్లా హెచ్చుమంది రచయితలు, మృదు మధురమైన శైలిలో మెలకువతో వాడుకభాషను రాసే యువకులు నాకవసరం. ప్రాచీన గ్రాంథిక భాషను వ్రాస్తామని దర్పానికి పోతూ వాడుక భాషను కృతకం చేసే రచయితలు నాకవసరం లేదు'.

తమ ఉద్యమం ప్రజల ఉద్యమం అని స్పష్టంగా ప్రకటించి దానికోసమే అప్పారావుగారు తమ సమయాన్నీ, శక్తులనూ ఎక్కువగా వినియోగించ నిశ్చయించుకున్నారు. ప్రతిపక్షులు సైతం గౌరవించదగ్గ వ్యక్తిత్వం వారిది. అటువంటి వారిని వెదుక్కొంటూ పదవులూ హోదాలూ పరుగెత్తుకుంటూ వస్తాయి.

1911 నవంబరులో ప్రభుత్వం వారి విద్యాశాఖ అప్పారావుగారిని సముచిత రీతిని సత్కరించి ఒక పదవిని యివ్వాలని నిశ్చయించింది. అప్పారావుగారినే వారి సాహిత్య కృషినీ, జీవిత వివరాలనూ పంపమని కోరుతూ ఒక ఉత్తరం రాశారు. 1911 నవంబరు 22వ తేదీనాడు మద్రాసు నుంచే అప్పారావుగారు ప్రత్యుత్తరం పంపారు. 'ఎవరి కృషిని వారు చెప్పుకొనడం బాగుండదు' అంటూ అప్పారావుగారు స్వవిషయాలను యిలాగ చెప్పుకొంటున్నారు.[98]

''మీరు అడుగుతున్నారు కనక, నేను చెప్పడం తప్పనిసరి. మీరు కోరిన ప్రకారం ఇందుతోపాటు ఒక 'మెమో' పంపుతున్నాను. అయితే మీరు నాకివ్వదలుచుకొన్న దానికి నాకు వున్న అర్హత నా లెక్చరరు పదవి, విజయనగరం మహారాజా వారి కళాశాలలో నేను కొన్ని సంవత్సరాలు లెక్చరరుగా పనిచేశాను. ఇంగ్లీషు, హిస్టరీ, సంస్కృతం విద్యార్థులకు బోధించేవాడిని. పిమ్మట విజయనగరం సంస్థానంలో శాసన పరిశోధకునిగా కొంతకాలం కృషిచేశాను. నా కృషిని ప్రభుత్వ శాసన పరిశోధకులు గుర్తించారు. 1909-10వ సంవత్సరపు రిపోర్టును ప్రత్యేకంగా చూడండి.

98. లేఖలు - పుటలు 199-201

మెమో :

(1) పాతికేళ్ళ క్రితం విజయనగరంలో నేను ఒక పక్ష పత్రికను నెలకొల్పాను. దానికి సంపాదకుడను నేనే. పేరు : 'ప్రకాశిక'

(2) నేను వ్రాసిన తెలుగు నాటకాలు : కన్యాశుల్కము, బిల్హణీయము, బిల్హణీయము ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో ప్రచురితమయింది.

(3) నేను వ్రాసిన గేయములు : నీలగిరి పాటలు, ముత్యాలసరములు, డామన్ పితియస్, లవణరాజు కల, కాసులు - యివి ఆంధ్ర భారతిలో ప్రకటితమయ్యాయి.

(4) ఇవికాక ఆంధ్ర భారతిలో మరికొన్ని కథలు ప్రచురించాను. ఆంధ్ర భాషా సాహిత్యములపై కొన్ని వ్యాసాలు, విమర్శనములు, ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, కేసరి, శశిలేఖ, ఆంధ్ర ప్రకాశిక మొదలై పత్రికలలో ప్రకటించాను. తెలుగు కవితా విర్భావముపై కృష్ణా పత్రికలో కొన్ని వ్యాసాలు అచ్చుపడ్డవి. ఈ మెమోతోపాటు కన్యాశుల్కము నాటకముపై యితరుల అభిప్రాయాలను మీకు పంపిస్తున్నాను''.

1911 నవంబరులో తమ గురించి మొగమాటపడుతూ కొన్ని విషయాలనే చెప్పుకొన్నా 1912 జనవరిలో కలకత్తా నగరానికి వెళ్ళినప్పుడు అక్కడ ఎవరికో రాసిన ఒక ఉత్తరంలో తాము సాధించిన వాటి గురించి యిలా సగర్వంగా చెప్పుకొన్నారు.[99]

''తెలుగులో నవ్య రీతులకు నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటికవిని నేనే. నా కావ్య కళ నవీనం, కావ్య యితివృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను, జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి, కథా, కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను. నాకా కళలపట్ల, జీవితంపట్ల కొన్ని ఆదర్శాలు వున్నాయి. వాటిని సంస్కృతీపరులు మాత్రం అర్థం చేసుకొని హర్షించగలరు; సంస్కృతి శూన్యులు కావ్య కథా సంవిధాన, హాస్య ధోరణులను గమనించి అంతటితో సంతృప్తిపడతారు''.

1912 జనవరి నెలలో అప్పారావుగారు కలకత్తా నగరంలో వుండడానికి ఒక కారణం లేకపోలేదు. 1911 డిసెంబరు 11వ తేదీనాడు ఢిల్లీలో పంచమ జార్జి చక్రవర్తి పట్టాభిషేకోత్సవం జరిగింది. కారొనేషన్ తర్వాత వివిధ నగరాలలో సందర్శక సంచారాలు, స్టేట్ రిసెప్షన్‌లు, తోట విందులు వగైరాలు జరిగాయి.

డిసెంబరు నెలలో విజయనగరం సంస్థానం నుంచి రీవారాణీ, తదితరులూ కలకత్తాకు వెళ్ళారు. వాళ్లలో అప్పారావుగారు కూడా వున్నారు. 'రారాజు దర్శనం' తర్వాత అప్పారావుగారు కలకత్తాలో ఒక రాజులాగా బెంగాలీల చేత మన్ననలను పొందుతున్న రవీంద్రనాథ్ టాగోరును బ్రహ్మ సమాజ మహోత్సవంలో చూశారు. రవీంద్రుడు సామాజికులకు జ్ఞానోపదేశం చేస్తూ వుంటే మధ్య మధ్య గాయకులు భక్తి

99. లేఖలు - పుట.205

పారవశ్యాలతో కీర్తనలు పాడసాగారు. ఉత్సవం ముగిశాక అప్పారావుగారు బయటకు వెళ్ళిపోయారు.

అప్పారావుగారితోపాటు ఎనమండ్ర నారాయణమూర్తిగారు కూడా విజయనగరం వారి బృందంలో వున్నారు. ఈయన విజయనగర వాస్తవ్యులే. పట్టభద్రులు. కొన్నాళ్ళు చెముడు జమీందారుకు ట్యూటరుగా పనిచేశారు. విజయనగరం మహారాజా కళాశాలలో కొంతకాలం లెక్చరరు. ఆ పిమ్మట మహారాజాగారి కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ హోదాలోనే ఆయన కలకత్తాకు వచ్చారు. గ్రాంథిక భాషావాది. గ్రంథకర్త కూడాను. 1912 జనవరి 23వ తారీఖునాడు వంగీయ సారస్వత పరిషత్తు మందిరంలో అప్పారావుగారికీ, నారాయణమూర్తిగారికీ ఆతిథ్యమిచ్చి ఒక తేనీటి విందును హేమచంద్రదాస్ గుప్తగారు ఏర్పాటుచేశారు. అప్పారావుగారు చాలామంది బెంగాలీ సాహితీపరులను ఆ విందులో కలుసుకొని స్నేహం కలుపుకున్నారు.

హేమచంద్ర దాస్ గుప్తగారు వంగీయ సారస్వత పరిషత్తు కార్యదర్శి. వకీలు. బంకించంద్రుని 'ఆనందమఠ్'ను ఆంగ్లంలోనికి పరివర్తనం చేశారు. బెంగాల్‌లో జాతీయాభిమానాన్నీ జాతీయ పద్ధతులతో విద్యా బోధనలనూ పెంపొందింపచేసిన గురుదాస బెనర్జీని కూడా అప్పారావుగారు కలుసుకొని వారితో ఉత్తరోత్తరా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. శారదా చరణ మిత్ర, జ్ఞానేంద్రమోహనదాసు అనే సాహితీపరులను కూడా కలుసుకొని వారితో వివిధ సాహిత్య విషయాలు చర్చించారు. భారతీయ భాషలన్నింటికీ ఒక లిపి అవసరమని, అది దేవనాగరి అయితే మంచిదని భావించారు. గ్రాంథిక, వ్యావహారిక భాషల యుద్ధాలు బెంగాలులో కూడా జరిగాయి. వాటి గురించి మిత్రులు తర్వాత తమ లేఖలలో ఎన్నో విషయాలు విశదం చేవారు.

కలకత్తా పర్యటన తర్వాత ఫిబ్రవరిలోనే అప్పారావుగారు, విజయనగరానికి, తర్వాత మద్రాసుకు వెళ్ళారు. తెలుగు భాషా రంగంలో సంస్కరణవాదులకూ, సనాతన వాదులకూ జరుగుతున్న వాదాన్ని పరిశీలిస్తున్న థామ్సన్ దొరకు తమ కన్యాశుల్కం నాటకాన్ని పంపారు. మార్చి నెలలో కాశీనాథుని నాగేశ్వరరావుగారికి ఒక ఉత్తరం రాసి వాడుకభాషను ప్రోత్సహించమని కోరినట్టున్నారు. ఆంధ్ర పత్రికకు సృజనాత్మక రచనలు కాకపోయినా వెంటనే ప్రచురణార్థం ఒక వ్యాసాన్ని రాసి పంపారు. ఇంకా అనేక వ్యాసాలు రాస్తామని వాగ్దానం చేశారు. తమ కృతజ్ఞతలు చెప్తూ నాగేశ్వరరావుగారు అడగనిదే ఒక హితోపదేశం చేశారు. ''వాడుక భాషపట్ల మీకున్న ఆ పక్షపాత వైఖరిని విడనాడి, మీ సహజ ధారళశైలిలో మీరు వ్రాసినట్లయితే, మీకు మీరు న్యాయము చేసుకున్నట్లవుతుంది. భాషకు సేవచేసినట్లవుతుంది'' అని చెప్పి, కోరనిదే ఈ సలహా యిచ్చినందుకు మన్నించమన్నారు.[100] అప్పారావుగారు తమ వాదాన్ని విసర్జించలేదు.

గ్రాంథికవాదులు వాడుకభాషమీద ఒకటికి రెండు పక్కలనుంచి తమ దాడిని ప్రారంభించారు.

---

100. లేఖలు - పుట 172

1912 ఏప్రిల్ నెల 10వ తేదీనాడు జార్జిటౌనులో దివాన్ బహదూర్ యం. ఆదినారాయణయ్యగారి అధ్యక్షతను ఒక సభ జరిగి వాడుక భాషలో వున్న పాఠ్య గ్రంథాలను వెంటనే తీసివేయమని విద్యాశాఖవారిని కోరుతూ ఒక తీర్మానం చేశారు. ఈ పాఠ్య పుస్తకాల నిర్ణయంలో అప్పారావుగారి సలహాలు వున్నాయి. ఎటువంటి పాఠ్యగ్రంథాలను ఎలాంటి నిపుణులచేత ఎన్నిక చేయించాలని ఈ సభవారు ప్రభుత్వాన్ని అర్థించారు. ఏప్రిల్‌లో ఈ సభ జరిపాక వెనువెంటనే తర్వాత నెలలో మరో రంగంలో యుద్ధభేరీ బజాయించారు.

1912 మే నెల 15, 16 తారీఖులలో మద్రాసులోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశాలు పచ్చయప్ప కాలేజీలో జరిగాయి. మొదటి రోజు సభకు పురాణం నాగభూషణం ఎం.ఎ.బి.ఎల్.గారు అధ్యక్షత వహించారు. రెండోరోజు సభకు చల్లపల్లి జమీందారు అంకినీడు ప్రసాదుగారు అధ్యక్షత వహించారు. ఈ సభల్లో గురజాడ అప్పారావుగారు ఒక్కరే వాడుక భాషను సమర్థించారు. కావ్యాలలో విచ్చలవిడి శృంగారాన్ని ఖండించారు. అందుకే గ్రాంథికవాదులు తమ సిద్ధాంతాలనే తీర్మానాలుగా సభచేత ఆమోదింపచేసి గవర్నరు దగ్గరకు రాయబారపత్రాన్ని కూడా పంపారు.

అప్పారావుగారు 1912 జూన్ నెల నుంచి అక్టోబరు మాసందాకా ఏట్సుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ఈ భాషా యుద్ధంలో అనుసరించవలసిన వ్యూహాలను చర్చించారు. ''ఇది వరకు వీరేకాక కొందరు ఈ ఉద్యమాన్ని అవహేళన చేయక సానుభూతితో దానిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు నా మిత్రులు మచిలీపట్టణం నుంచి నాకు ఉత్తరాలు రాస్తున్నారు. అవహేళన దశనుంచి ఉద్యమం సానుభూతిని పొందే దశకు పరిణితి చెందుతున్నందుకు సంతోషం. మీరు ఎదుర్కొనవలసి వస్తున్న ప్రతిఘటన సామాన్యమైనది కాదు'' అని యేట్సు దొర 1912 జూన్ 6వ తేదీనాడు ఒక లేఖలో చెప్పాడు.[101]

ఏట్సు దొరకు మచిలీపట్నం నుంచి ఉత్తరాలు రాసిన మిత్రులలో వల్లూరి సూర్యనారాయణరావు (1866-1937) ఒకరై వుంటారు. ఈయన బి.ఎ.ఎల్.టి. డిగ్రీని పొందారు. రెంటాల సుబ్బారావుగారితో కలసి మద్రాసులో వర్తక వ్యాపారాలు చేసి ఫోటోగ్రాఫుల కంపెనీ పెట్టారు. అందులో లాభించక వకీలు వృత్తిని స్వీకరించి మచిలీపట్నంలో స్థిరపడ్డారు. ఈ సూర్యనారాయణరావుగారు గురజాడ అప్పారావుగారి పేర ఒక ఉత్తరంలో తాము పెట్టుకొన్న ఆశల గురించి ఉత్తరోత్తరా తెలియచేశారు. దాని సంగతి తర్వాత చెప్పుకొందాం. కాశీ విశ్వవిద్యాలయంలో కొంతకాలం, మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో మరి కొంతకాలం ఆచార్యులుగా పనిచేశాక పి. శేషాద్రిగారు అనంతపురం నుంచి 1912 జూన్ 15వ తేదీనాడు ఉత్తరం రాసి యిలా చెప్పారు.[102]

''నేను తెలుగు సాహిత్యం మీద ఒక వ్యాసం వ్రాయాలనుకుంటున్నాను. ఆంధ్ర సాహిత్యంలో నూతన పోకడలను పరిశీలిస్తున్నాను. ఆంధ్ర కవితలో నూతన ధోరణులను

101. లేఖలు - పుట 133

102. లేఖలు - పుటలు 173-4

గురించి ''న్యూ కరెంట్సు ఇన్ తెలుగు లిటరేచర్'' అనే పేరుతోనో లేక ''ఎక్స్‌పెర్మంట్సు ఇన్ తెలుగు పొయిట్రీ'' అనే శీర్షికతోనో మీ గేయములను గురించి ఒక వ్యాసం వ్రాయవలెనని కుతూహలపడుతున్నాను. మీ నీలగిరి ప్రతి నావద్ద వున్నది. ఇతర రచనలు కొన్నింటిని పంపించకోరుతున్నాను''.

శేషాద్రిగారి వంటి ఉత్సాహవంతులు హర్షిస్తున్నందుకు అప్పారావుగారు మళ్ళా సృజనాత్మక రచనలు ముఖ్యంగా కవితలు రచించాలని భావించినట్టున్నారు. 1912 అక్టోబరులో 'కన్యక' అనే గేయగాథను రాసి ఆంధ్ర భారతిలో ప్రచురించారు. ''రాజు తలంచిందేను ధర్మం, రాజు చెప్పిందెల్ల శాస్త్రము'' అని విర్రవీగే కామాంధునితో ''పట్టమేలే రాజు అయితే, రాజునేలే దైవముండడో?'' అని అడిగి తన మానాన్ని కాచుకోడానికి అగ్నిలో దూకిన కన్యక కథను అప్పారావుగారు గానం చేశారు.

పట్టమేలే రాజుగర్వం
మట్టి గలిసెను, కోటపేటలు
కూలి, నక్కల కాటపట్లై
అమరె.

యెక్కడైతే కన్య, మానం
కాచుకొనుటకు మంట గలిసెనొ,
అక్కడొక్కటి లేచె సౌధము
ఆకసము పొడుగై.

పట్టమేలే రాజుపోయెను,
మట్టి కలిసెను కోటపేటలు,
పదం పద్యం పట్టి నిలిచెను
కీర్తు లపకీర్తుల్

ఈ కన్యక కథను యింతకుముందు ఒక పద్య కావ్యంలో ఆరవీటి రాజు యుగానికి చెందిన భాస్కరాచార్యులు అనే కవి రచించాడు. దానికి 'వాసవీ మాహాత్మ్యం, వైశ్యపురాణం' అనే పేర్లు వున్నాయి. కన్యను చెరపట్టిన రాజు రాజమహేంద్రాన్ని పాలించిన విష్ణువర్ధనుడు అంటూ జనశ్రుతి. ఈ గాథ చారిత్రక సత్యంకాదని చరిత్రకారులు నిరూపించారు.[103] అయితే యిది వైశ్యకులంలోనూ, వారిని అభిమానించే యితర కులాల వారిలోనూ ప్రాచుర్యం పొందిన తరతరాల కథ. దీనిని గురజాడ అప్పారావుగారికి ముందు 'పదం'లాగ విరచించిన కవుల పేర్లు తెలియవుకాని ఆధునిక యుగంలో ప్రజానాట్యమండలి దళాలు బుర్ర కథగా చెప్పేవారు. వారికి అప్పారావుగారి రచనే ఆదర్శం.

కన్యక రచించడానికి ముందో, లేక వెనువెంటనే అప్పారావుగారు 'పూర్ణమ్మ' అనే కరుణ రసాత్మకమైన కవితను చెప్పారు. ముత్యాలసరాలన్నీ 'తకిట-తకతక' అన్న

103. నవాబుల ఆరవీటి రాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి 2003.

మిశ్రగతిలో పాదానికి పధ్నాలుగు మాత్రలు మించకుండా నడుస్తాయి. అప్పారావుగారు 'పూర్ణమ్మ' కథను చతురశ్ర గతిలో నడిచేగేయంగా మలిచారు. వాడుక భాషలో వివిధ మాత్రా ఛందస్సుల రచనలు సాధ్యమేనని నిరూపించడానికి గాని, వైవిధ్యం కోసంగాని ఈ చిన్న కావ్యాన్ని చాలా మిన్నగా వుండేటట్టు చెప్పారు. కాసుకులోనై కన్నెపిల్లలను ముసలి వాళ్ళకు యిచ్చి పెళ్ళిచేసే దురాచారం ఎలాగ ఒక 'పుత్తడి బొమ్మ' నూరేళ్ళ బతుకు కన్నెప్రాయంలో కడతేరిందో అప్పారావుగారు చెప్పారు. పూర్ణమ్మ కథ కాలగర్భంలో కాదు కావ్య గర్భంలో కలిసిపోయింది.

1912వ సంవత్సరం నవంబరు చివరి వారంలోనూ, డిసెంబరు తొలిరోజుల్లోనే అప్పారావుగారు రాచకార్యాలపైన కలకత్తాకు వెళ్ళారు. డిసెంబరు 2వ తేదీనాడు రవీంద్రనాథ్ టాగోరును కలుసుకొని చాలా విషయాలు చర్చించారు. బెంగాలీ భాషలో నాటక రచన నీరసంగా వుందనీ, గేయకవిత్వం ముందడుగు వేసిందనీ, ఆంగ్ల సారస్వత బోధనా పద్ధతులు చాలా లోపభూయిష్టంగా వున్నాయనీ, నేడు మద్రాసు యూనివర్సిటీ గ్రాంథిక భాషను సంరక్షించాలని చేస్తున్న ప్రయత్నాలనే ఒకనాడు కలకత్తా విశ్వవిద్యాలయం చేసినా, అందరూ యిప్పుడు వాడుక భాషలోనే రచనలు చేస్తున్నారనీ రవీంద్రుడు చెప్పాడు. టాగోరు ''మాటలాడేటప్పుడు పురుషత్వం తొణికిసలాడుతుంది. ఒకవిధమైన ప్రశాంత మనో నిశ్చయం ప్రస్ఫుటమవుతుంది. మన వీరేశలింగం పంతులుగారి మనః ప్రవృత్తికిది పూర్తిగా విరుద్ధం. ఆయన వలె రవీంద్రుడు గడబిడగా మాట్లాడరు. సంభాషిస్తున్నప్పుడు సజీవత్వం వెల్లడి అవుతుంది'' అని అప్పారావు పరిశీలించి చెప్పారు.[104]

1912 డిసెంబరు రెండో వారంలోనే అప్పారావుగారు విజయనగరానికి తిరిగి రావలసి వచ్చింది. ఆ నెల 14వ తేదీనాడు రీవారాణి మరణించింది. అప్పారావుగారు ఆమెకు ఆంతరంగిక కార్యదర్శిగా, అత్యంత విశ్వసనీయునిగా 1897 మేలో ఆనంద గజపతిపోయిన దగ్గరనుంచి సేవించారు. ఈ కొలువువల్ల వారి హోదా మెరుగు పడిందేమోగాని సృజనాత్మక శక్తులు చాలాకాలం మరుగుపడ్డాయి. ఒకటిన్నర దశబ్దాలపాటు సంస్థానపు చిన్న దావాలలోనూ, పెద్ద దావాలోనూ ఆయన తెలివితేటలన్నీ వెచ్చించవలసి వచ్చింది. ఆనంద గజపతి పోయినప్పుడు కలిగిన విచారం ఆయనను కుంగదీసింది. కానీ బాధ్యతలు నిటారుగా నించోపెట్టాయి. రీవారాణీ మరణం ఆయనకు సంతాపకరమేగాని ఒక తాత్త్విక ప్రశాంతత ఆయన అలవర్చుకొన్నారు. తమ సాహిత్య కృషి సింహావలోకనంలో స్వయం సానుభూతిని పొందినట్టు వున్నారు.

రీవారాణీ చనిపోయిన మూడో రోజునే డిసెంబరు 16వ తేదీనాడు ఆయన గున్నయ్య శాస్త్రిగారికి ఒక లేఖ వ్రాశారు. అందులో యిలా రాశారు.[105]

104. వ్యాస చంద్రిక - పుట.36

105. లేఖలు - పుట 201 నుంచి

''నా పోషకురాలు, మహారాజ కుమారికావారు 14వ తేదీన దివంగతులైనట్లు యింతకుముందే మీకు తెలిసి వుంటుంది. ఆవిడ ఎన్నో పౌరహిత కార్యాలను చేశారు. ఆవిడ మరణంతో పౌరులకు తీరని లోటు కలిగింది. నాకిది ఎన్నటికీ తొలగని ఆపద. ఇక నేను రిటైరు కావాలనుకుంటున్నాను.

'' మీ ఉత్తరంలో మీరు లేవనెత్తిన చర్చ నాకు ఉత్సాహం కలిగించింది. సాహిత్య మీమాంస నాకెపుడూ సంతృప్తినిస్తుంది. అంతకంటే నాకు కావలసినది ఇంకేముంది!

''తెలుగు కవిత్వంలో నేను కొత్త 'ఎక్స్పెరిమెంటు' ఆరంభించాను. నా ముత్యాలసరాల రీతిని గమనించినట్లయితే మీకీ విషయం బోధపడుతుంది. నేను తలపెట్టిన మార్పు స్పష్టపడుతుంది. ముత్యాలసరాల గేయాలను క్రమానుగతంగా మీరు పరిశీలించినట్లయితే, వాటి శబ్ద విన్యాసంలో భేదం కనబడకపోదు. నేను నా మొదటి గేయాలలో సాధ్యమైనన్ని వాడుక మాటలను, గ్రాంథిక వ్యాకరణ సూత్రాలకు లేదా ప్రాచీన కవుల పద్ధతులకు ఒదగని శబ్దాలను ప్రయోగించాను. పూర్ణమ్మలో వాడుక పదాలకంటే గ్రాంథిక వ్యాకరణ సూత్రాలకు సరిపడని శబ్దాలు ఎక్కువ, అవి 'కన్యక'లో మరీ హెచ్చు''.

ఈ ఉత్తరంలోనే యిక మనం నూతన కావ్యశైలిని అనుసరించాలి అని చెప్పి యింకా యిలా రాశారు:

''ఈ మధ్యనే ఆంధ్ర భారతికి నేనొక మూడు చరణాల గేయాన్ని పంపించాను. అందులో పాత శబ్దాలు లేవు. వ్యవహారిక భాషా పదాలను సులువుగా యథేచ్ఛగా యిముడ్చుకొనే ఛందస్సులను మనం సృష్టించుకోవాలి. నేను అనుసరించిన ఛందోరీతులలో అనుస్వాసాంత నామ పదములు చక్కగా యిముడుతాయి.

''నా ముత్యాలసరముల గేయములను క్రమానుగతంగా మీరు పరిశీలించినట్లయితే, ఒక దానిలోకంటే యింకొక దానిలో నేను సాధించిన అభివృద్ధి మీకు స్పష్టపడుతుంది. మొదటి దానిలో కంటే రెండవ దానిలో వాడుక భాషా పదములు ఎక్కువగా ప్రయుక్తమైనట్లు మీరు గ్రహించగలుగుతారు. ఇదేవిధంగా మిగిలిన గీతాలలో నేను అభివృద్ధిని సాధించాను''.

ఈ ఉత్తరంలో అప్పారావుగారు చెప్పిన మూడు చరణాల గేయం 'మనిషి'. ఇది వారి రచనలలో కల్లా చాలా చిన్న కవిత. ''మీ పేరేమిటి?'' అన్న కథ ప్రారంభంలో

'దేవుడు చేసిన మనుషుల్లారా
మనుషులు చేసిన దేవుళ్ళారా
మీ పేరేమిటి?''

అంటూ మూడు పాదాలలో వేసిన ప్రశ్నకు ఈ 'మనిషి' ఒకరకంగా వ్యాఖ్యానం

మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కలదని సాగిమొక్కుతు

మనుషులంటే రాయిరప్పల
కన్న కనిష్టం!
గాన చూస్తొ వేల బేలా?
దేవుడెకడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడే
వేలా?

కన్ను తెరిచిన కానబడడో?
మనిషి మాత్రుడి యందులేడో
యెరిగి కోరిన కరిగియీడో
ముక్తి!

మానవుడే మహనీయుడని సూటిగాచాటే ఈ తత్త్వం వేమనగారూ పూర్వం చెప్పారు.

దేవుడనగ వేరు దేశమందున్నాడె?
దేహితోడ కలసి దేహమందు
వాహనంబులైదు వడితోలుచున్నాడు
విశ్వదాభిరామ వినురవేమ

ఏ ఉత్తమ దార్శకునికైనా పాంచభౌతికమైన ప్రకృతీ దానిని స్వాధీనపరచుకొనే మానవుడూ నిధిధ్యాదితాలు, మూల నిధులు, బుద్ధికి సంకెళ్ళు విడిపోవడమే ముక్తి. ఆ మార్గాన్ని చూపెట్టేవాడు కవి. కవి అంటే ఎవరు? వస్తు ప్రపంచంలో యితరులు చూడలేని సొగసులు చూసేవాడు. ఇతరులకు అవేద్యమైన రసమును అనుభవించేవాడు.[106] తన జ్ఞానాన్ని యితరులతో పంచుకొంటాడు.

రీవారాణి మరణించిన తర్వాత ఉద్యోగంలోంచి రిటైరవుదామనుకొన్న అప్పారావుగారు మూడు వారాలు పోయాక ఆ నిర్ణయాన్ని కార్యరూపంలో పెట్టారు. 1912 డిసెంబరు చివరి వారంలోనూ, 1913 జనవరి తొలి రోజుల్లోనూ వారు రాచకార్యాలమీద పెద్ద దావా విషయమై మద్రాసుకు వెళ్ళారు. 1913 జనవరి 1వ తేదీనాడు ఆయన మద్రాసులోనే వున్నారు. ఒక శుభవార్తను విన్నారు. గిడుగు రామ్మూర్తిగారికి ప్రభుత్వం ఆ ఏడు 'రావుసాహెబు' బిరుదు యిచ్చి ఆనాడే దానిని ప్రకటించింది. అప్పారావుగారికీ ఆహ్లాదకరమైన వార్తవల్ల అమిత ఆనందం కలిగింది. ఆ సాయంత్రం కాస్మాపాలిటన్ క్లబ్బులో రామచంద్రరావు[107] కనిపించి ఈ విషయం ప్రస్తావించి 'ఇది మన ఉద్యమానికొక గొప్ప విజయం' అన్నారు.

106. బిల్హణీయం' అముద్రిత భాగాలలో అప్పారావుగారు ఈ భాగాలను పొందుపరచారు. చూ॥ బిల్హణీయం, కొండు భట్టీయం (1988), విశాలాంధ్ర ప్రచురణ.

107. ఈయన బహుశా మోచర్ల రామచంద్రరావుగారు (1868-1936) కావచ్చును. అప్పారావుగారు తమ డైరీలో ఇంటిపేరు యివ్వలేదు. చూ. డైరీలు పుట.182

రామమూర్తిగారికి ఈ బిరుదు రావడం వాడుక భాషకు నిజంగా విజయమే. వాస్తవానికి గిడుగువారు 1912 డిసెంబరు నెలలో చెన్నపట్నంలోనే వున్నారు. (అది గురజాడ అప్పారావుగారు కలకత్తాలో రవీంద్రుని కలుసుకొంటున్న కాలం) మద్రాసు యూనివర్సిటీవారు లండన్ యూనివర్సిటీ ఫోనిటిక్స్ ప్రొఫెసరుగా వున్న డేనియల్ జోన్స్‌గారిచే పదహారు ఉపన్యాసాలిప్పించారు. వాటికి రామమూర్తిగారు తమ కుమారుడు సీతాపతిగారితో హాజరయ్యారు. 1911లో రిటైరు అయిన వెంటనే రామమూర్తిగారు తెలుగు భాషా సాహిత్యాలు కూలంకషంగా అధ్యయనం చేశారు. ఇప్పుడు ఆధునిక పద్ధతులలో భాషాశాస్త్రాన్ని మథించి లోతులు తెలుసుకున్నారు. 1912లో గురజాడ అప్పారావుగారు ఏకాకిగా ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ముట్టడికి తట్టుకొన్నారు. 1913 నుంచి ఇక తాము కూడా కార్యరంగంలో కదనవీరునిగా చేరాలని రామమూర్తిగారు నిశ్చయించుకున్నారు.

జనవరి నెల 15వ తేదీనాడు పెద్ద దావా అపీలు విచారణకు వస్తుంది. వకీలు వాయిదా కోరితే, దాన్ని శ్రీనివాసయ్యంగారు అంగీకరిస్తే తప్ప మళ్ళా 'యీరింగు' పడదు. వాయిదాకు అంగీకరించకూడదని అప్పారావుగారు వాదించదలచుకొన్నారు. జస్టిస్ ఆర్. సుందరం అయ్యర్‌గారిని చూశారు. ఆ మర్నాడు లాయరుకిచ్చిన సూచనలను మార్చుకొన్నారు. వెంటనే విజయనగరం బయలుదేరి వెళ్ళారు. 1913 జనవరి 4వ తేదీనాడు ఉద్యోగాన్ని విరమించుకొంటున్నట్టు పించను మంజూరు చేయమని దరఖాస్తు పెట్టుకొన్నారు. దీనిని సంస్థానం ధర్మకర్తృత్వ సంఘానికి సమర్పించారు. ఎస్టేటు ఎవరికి చెందాలన్న విషయం మద్రాసు హైకోర్టు తేల్చవలసి వుంది. దావా నడుస్తున్నప్పుడు సంస్థాన వ్యవహారాలను అజమాయిషీ చేయడానికి ఒక కమిటీని వేశారు. దానికి జిల్లా కలెక్టరు పెద్దగా వ్యవహరించారు. రీవారాణీ, విజయరామగజపతి హైకోర్టు అడ్వకేటు పార్థసారథి అయ్యంగారూ (ఉత్తరోత్తరా ఎస్. శ్రీనివాసయ్యంగారు) ఇందులో సభ్యులు. రీవారాణీ పోయాక ఆమె స్థానంలో అప్పారావుగారి యంత్రాంగం వల్ల విజయరామ గజపతి భార్య లలితకుమారిగారికి సభ్యత్వం సంక్రమించింది.

పించను దరఖాస్తు మంజూరయ్యేలోగా అప్పారావుగారు సంస్థానం పెద్ద దావాను పరిష్కరించడానికి ప్రయత్నాలు చేసినట్టున్నారు. కలెక్టర్ ఫొలరుదొరతోనూ మహారాజా వారితోనూ ఆనంద గజపతి విల్లు గురించి చర్చించి ప్రతిపక్షులతో రాజీపడడం మేలని సూచించినట్టున్నారు. ఇది జనవరి 6వ తారీఖున జరిగింది. మూడోనాడు జనవరి 9న మళ్ళా మద్రాసుకు అప్పారావుగారు యకాయకిని వెళ్ళారు. జనవరి 16వ తారీఖున రాష్ట్ర గవర్నరుగారి విజిటు ముగించుకొన్నాక తిరుగు ప్రయాణం పెట్టుకున్నారు.

అప్పారావుగారు విజయనగరం చేరుకున్నాక రామమూర్తిగారిని ఆ ఊళ్ళోనే కలుసుకొన్నారు. మద్రాసు ఫోనిటిక్స్ ఉపన్యాసాల తర్వాత రామమూర్తిగారు పర్లాకిమిడి వెళ్తూ విజయనగరంలో ఆగారు. గురజాడ అప్పారావుగారిని కలుసుకున్నారు. కోటలో రాచబిడ్డలకు చదువుచెప్పే ట్యూటరుగా చేరమని రామమూర్తిగారిని అప్పారావుగారు కోరారు. అందుకు ఒప్పించారు. రామమూర్తిగారు కొంతకాలం ఆపని చేశారుగాని,

అప్పారావుగారిలాగ 'రాజుల కొలువులో కుమ్మరి పురుగులాగ' వ్యవహరించడం చేతగాక ఆ పని మానుకొన్నారు. ఉద్యోగం విడిచి పెట్టినా రామమూర్తిగారు ఒక సంవత్సరంపాటు విజయనగరంలోనే వుండి వ్యవహారిక భాషా ఉద్యమ వ్యాప్తికి మార్గాలు ఆలోచించసాగారు. అప్పారావుగారు, వజ్ఝల చినసీతారామశాస్త్రి, బుర్రా శేషగిరిరావు గార్లు వ్యూహరచన చేస్తూ వుండేవారు.

1913 జనవరి నెలలో గవర్నరు విజిటు తర్వాత అప్పారావుగారికి ప్రభుత్వ భవనం నుంచి గవర్నరు ఆంతరంగిక కార్యదర్శి ఒక ఉత్తరం రాశారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఫెలోగా నియమించాలని గవర్నరు భావించారు. అంగీకారం తెలుపమంటూ 1913 జనవరి 13వ తేదీనాడు లేఖలో కోరారు. అప్పారావుగారు అంగీకరించారు. గజటులో ఆర్డరు వచ్చింది. అప్పారావుగారి పింఛను దరఖాస్తు మంజూరు కూడా అయింది. సంస్థానానికి కావలసిన ప్రత్యేక సేవల దృష్ట్యా వారికి నెలకు 140 రూపాయలు చొప్పున ప్రత్యేక పింఛను శాంక్షన్ చేశారు.

ఉద్యోగం నుండి రిటైరయ్యారన్న మాటేగాని, అప్పారావుగారు పూర్వంలాగే విజయనగరం చెన్నపట్నాల మధ్య తిరుగుతూనే వున్నారు. ప్రతియేడూ వెళ్లినట్టే వేసవిలో ఊటీ ప్రయాణాలు సరేసరి. దానితోపాటు యిప్పుడు కూనూరు కూడా వెళ్ళవలసి వచ్చింది. విజయనగరం మహారాణీగారు అక్కడ వేసవి విడిదిని ఏర్పాటు చేసుకున్నారు. హైలాండ్స్‌లో వున్న రాజ భవనంలో అప్పారావుగారు ఆమెతో సంప్రదింపులు చేసేవారు. ఆమె ఆయనను తమ ఆంతరంగిక కార్యదర్శిగానే భావిస్తూ వచ్చింది. ఆమెకోసం అప్పారావుగారు షేక్స్‌పియర్ నాటకాన్ని ఒకసారి కొన్నట్టు డైరీలో రాసుకున్నారు.

సంస్థానానికి, రాజకుటుంబీలకూ తమకు చేతనైన సేవలను అప్పారావుగారు కొనసాగిస్తున్నారుగానీ, మహారాజావల్లగానీ, మరెవ్వరి వల్లగానీ తమ భాషా ఉద్యమానికి సహాయ సంపత్తులు లభిస్తాయని ఆయన ఆశించలేదు. పూర్వం ఆనంద గజపతి 'సర్వజన సామాన్యమైన స్పష్ట భాష'ను ప్రోత్సహించినా, యిప్పుడు విజయరామ గజపతి ఆశ్రితుల బోధనల వల్ల గ్రాంథికవాదుల కూటంలో చేరారు. విజయనగరం సంస్థానంలో అప్పారావుగారి మాటకు సాధారణంగా అందరి ఆమోదం లభిస్తుందిగాని ఎనమండ్ర నారాయణ మూర్తివంటి వారు గ్రాంథికవాదులయ్యారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు ప్రారంభించిన సంతకాల ఉద్యమంలో ఈయనా దస్కత్తు చేశారు. అప్పారావుగారు చీవాట్లు పెడితే నారాయణమూర్తి ఎదురు తిరిగి 1912 డిసెంబరులోనే యిలా ఒక ఉత్తరంలో రాశాడు.[108]

"... నేను సంతకం చేసినానన్న మాత్రమునే మీకు గోపము వచ్చినది. ఇంత పరమతా సహనము మీకు గూడదు. మీకు జడిసియే అప్పయ్యా సంతకము చేసినాడు కాదు... మీరు మద్రాసులో బొడిచే పొదుపుకై యెదురు చూచుచున్నాను. రామయ్యను రెండు సంగతులలో గెల్చుకొందురు. కాని మెమోరియల్‌లోని విజ్ఞప్తి న్యాయముకాదని వాదించి రేని యాంధ్ర ప్రపంచమంతయు మీ తోకకు తాటాకులు కట్టక మానదు. ఒక్క శుభ

108. లేఖలు - పుటలు 182-3

(మీకశుభ) వార్త తమకు విన్నవించవలసియున్నది. శ్రీశ్రీశ్రీ విజయనగరం మహారాజా వారు మా పక్షము!!! ఇప్పుడు మా బలమొక్క మారు తలచుకోండి''.

తమ బలం, ఎదుటివారి బలం అప్పారావుగారికి తెలియకపోలేదు. గ్రాంథికవాదులు అప్పారావుగారి తోకకు కట్టగలరో లేదోగాని, అప్పారావుగారూ, రామమూర్తిగారూ గ్రాంథికవాదులను కావ్యశైలితో ఉక్కిరిబిక్కిరి చేసే రచనలతో ఎద్దేవా చేయదలచారు. ఈ వుద్దేశ్యంతోనే రామమూర్తిగారు 'ప్రాదెనుగుకమ్మ' రచనకు ఉపక్రమించారు. గ్రాంథికవాదులలాగ 'మరగాళు లెక్కి చిందులు ద్రొక్కగ' లేనంటూనే పాత తెలుగు మాటలతో పెద్ద కమ్మపెట్టారు.[109] అప్పారావుగారు 'సుభద్ర' అన్న ప్రబంధం ప్రారంభించి కొంత రచించి తమ కాలాన్ని వ్యర్థం చేయకుండా ఆపివేశారు. యుద్ధంలో గెలవడానికి వేరే మార్గాలున్నాయి.

అప్పారావుగారు అప్పటికే ఒక దీర్ఘయుద్ధంలో ధర్మపక్షానికి విజయం చూశారు. సంస్థానపు పెద్ద దావా పరిష్కారమైంది. ఆదిలో పరాసువారితో పెద విజయరామరాజు (1741-1757) ఫ్రెంచివాళ్ళ మీద పగకొద్దీ ఆంగ్లేయులను ఆహ్వానించిన ఆనందరాజు (1757-1760) ఆత్మాభిమానం కోసం ఆంగ్లేయులతో పోరాడి పద్మనాభ యుద్ధంలో చనిపోయిన చినవిజయరామరాజు (1760-1794) పంతాలవల్లా, పట్టింపువల్లా పాత సంధులను పాతిపెట్టక పోవడంవల్లా యుద్ధాలలో మరణించారు. ఇంగ్లీషు ప్రభుత్వం అధికారం చేస్తూ తీర్పులూ, న్యాయ విచారణా మొదలైన ఆస్తి హక్కుల తగాదాలు తీరుస్తూ వుండడంవల్ల సంస్థానంలో సాయుధ వైరాలు తప్పిపోయాయి. అయితే పాత సంధులను ఆనందగజపతి (1879-1897) వంటి ఉత్తమ సంస్కారం గల రాజు పాతిపెట్టకుండా 'విజయనగరం ట్రీటీ' అనే గ్రంథం రాయడానికి పరిశోధనతో తన కాలాన్ని తన ఆస్థాన విద్వాంసుల కాలాన్నీ వ్యయం చేశారు. ఈ పుస్తక ప్రచురణలో అప్పారావుగారు 1895లో సేవలు చేయవలసి వచ్చింది. ఈ విషయాలన్నీ అప్పారావుగారి మనస్సులో మెదులుతున్న కాలంలోనే యుద్ధోన్మాదపు దుష్పరిణామా లను విశ్వజనీనంగా ఆలోచించి సార్వకాలికంగా పనికివచ్చే గీతాన్ని రచించారు. అది 'దించులంగరు' అన్నగీతం. మహాకవి ఎవ్వరైనా ఒక ప్రత్యేక సందర్భంలో రచించిన గీతమైనా అది నిత్యసత్యాన్ని చాటే లక్షణాలను తనలో యిముడ్చుకొంటుంది.

దించులంగరు దీర్ఘయుద్ధం
ధర్మ పక్షము ముల్లు చూపెను
నరుల పీనుగ పెంటపోకల
నాటి వెలయును శాంతి వృక్షము

పాత సంధులు పాతిపెట్టుము
యుద్ధములకవి ఉనికి పట్టులు
లోక మంతయు ఏకమై
యుద్ధమునె మారణము చేయును

---

109. ఇది ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రికలో అచ్చుపడింది. (1914)

వచ్చెనిది బంగారు కాలము
వాంఛలెల్లను తీరు సుజనుల
కాంగిలేయుల ధర్మ రాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్యమిచ్చుచు
సంతతము వర్ధిల్లుగావుత!

తమ కాలంలో ఎక్కువ భాగాన్ని కబళించే దావాలేవీ ఇంక లేనందువల్ల ఆంగ్లేయుల ధర్మరాజ్యంలో విద్యా విధానంపై శ్రద్ధ చూపిస్తున్న ఇ.డబ్ల్యు. మిడిల్ మాస్ట్, హెురాల్డు స్టువర్ట్, మార్కు హంటర్, థామ్సన్, ఫ్రాన్సిస్ వంటి విద్యాశాఖాధికారుల సహకారంతో వాడుక భాష గురించి విశ్వవిద్యాలయం సిండికేటులో, సెనేట్‌లో, బోర్డాఫ్ స్టడీస్లో నిర్మాణాత్మకమైన కృషిని అప్పారావుగారు చేస్తున్నారు. 1912లో మద్రాసు రాష్ట్రానికి తాత్కాలిక గవర్నరుగా పనిచేసిన సర్‌ముర్రే హామిక్ (Sir Murram Hammick) దొరగారికి మద్రాసు విశ్వవిద్యాలయంలో సంస్కృత మాతృభాషల సేవలు చేయవలసి వచ్చింది.

డ్యూరెల్ అనే ఆంగ్లేయుడు అప్పారావుగారికి రాసిన లేఖలో అప్పుడే ప్రారంభమైన ప్రథమ ప్రపంచ మహాసంగ్రామంలో తన అనుభవాల గరించి, భారత సైనికుల, చైనా సాహసాల గురించి విస్తృతంగా రాశారు. ఈ యుద్ధంలో భారతదేశం బ్రిటిష్‌వారికి తోడ్పడాలనీ, పరిపాలనలో ఏమైనా లోటుపాట్లు వుంటే ఆ స్వల్ప విషయాలను ప్రస్తుతానికి మరచిపోవాలనీ రాశారు.[110]

1914 అక్టోబరు 20న డ్యూరెల్ రాసిన ఉత్తరమే అప్పారావుగారికి 'దించులంగరు' అనే గీతం రాయడానికి ఉత్తేజపరిచిందని కె.వి. రమణారెడ్డిగారు రాశారు.[111] వారి రాతను ఆధారం చేసుకొని యితర పరిశోధకులు ఆ పాటనే పాడారు.[112] అక్టోబరు 20 తారీకున సీమనుంచి రాసిన ఉత్తరం భారతదేశానికి నవంబరు మాసాంతానికి గాని చేరదు. 1914 నవంబరు 20వ తేదీ నుండి అప్పారావుగారి ఆరోగ్యం క్షీణించసాగింది. 'దించులంగరు' రచనకు ప్రథమ ప్రపంచ మహా సంగ్రామం ప్రోద్బలం కావడానికి ఆస్కారం తక్కువ. తారీఖులు దస్తావేజులు చరిత్రకు అర్థం కాకపోయినా అపార్థం కాకుండా వుండడానికి పరిశీలించాలి. ప్రథమ ప్రపంచ మహాసంగ్రామం తారీఖులు చూడండి.

జూన్ 28, 1914	-	ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్ హత్య
జూలై 28, 1914	-	ఆస్ట్రియా హంగరీలు సెర్బియాపై యుద్ధాన్ని ప్రకటించాయి
ఆగస్టు 1, 1914	-	రష్యాపై జర్మనీ యుద్ధం ప్రకటన

110. లేఖలు – పుట 159. ఈ లేఖ హెచ్.డి. డరెల్ రాసినట్టు ఇక్కడ పేర్కొన్నారు. డైరీలలో 'డ్యూరెల్' అని స్పెలింగు వుంది. ఒక పేరునే రెండుచోట్ల రెండు రకాలుగా అవసరాల సూర్యారావుగారు రాసినట్టుంది.

111. కె.వి.రమణారెడ్డి – మహోదయం – పుటలు 226, 227, 326, 327

112. నరాల వీరయ్యా – కన్యాశుల్కం – తొలి మలి కూర్పుల తులనాత్మక పరిశీలన – పుట 38

ఆగస్టు 3, 1914	-	ఫ్రాంసుపై జర్మనీ యుద్ధం ప్రకటన
ఆగస్టు 4, 1914	-	జర్మనీపై గ్రీక్, బ్రిటన్ యుద్ధం ప్రకటన
ఆగస్టు 23, 1914	-	జర్మనీపై జపాను యుద్ధ ప్రకటన
సెప్టెంబరు 22, 1914	-	మూడు బ్రిటీషు క్రూయిజర్లను ఒక జర్మన్ యు-బోటు ముంచేసింది.
అక్టోబరు 20, 1914	-	డ్యూరెల్ అప్పారావుగారికి లేఖ రాశారు
నవంబరు 9, 1914	-	జర్మన్ క్రూయిజర్ ఎమ్డన్ దాడులు, దానిని ముంచడం

ఈ తారీఖులలో చిట్టచివర చెప్పిన ఎమ్డన్ దెబ్బ మద్రాసుకు కూడా తగిలింది. డ్యూరెల్ రాసిన ఉత్తరాన్ని అప్పారావుగారు ఈ కాలంలోనే చదువుకొని వుంటారు. దీర్ఘయుద్ధం ప్రారంభమైందిగాని ధర్మపక్షంవైపు ముల్లు చూపడం సుదూర భవిష్యత్తులో వుంది. 1914 జూన్ 28న ప్రారంభమైన ప్రథమ ప్రపంచ మహాసంగ్రామం 1918 నవంబరులోగాని పరిసమాప్తం కాలేదు. అందుచేత 'దించులంగరు' కవితను ఈ యుద్ధాన్నికాక చరిత్రలో సర్వసాధారణమైన అన్ని యుద్ధాలను దృష్టిలో పెట్టుకొనే 1914లో అప్పారావుగారు రచించారని భావిస్తే సమంజసంగా వుంటుంది.

డ్యూరెల్ రాసిన ఉత్తరం అప్పారావుగారిలో ఆలోచనలు రేకెత్తించకపోలేదు. ఆంగ్లేయుల స్వదేశాభిమానం వారిని ముగ్ధుల్నిచేసి వుండవచ్చు. అప్పారావుగారి కోసం సమాచారం యివ్వగల అతని మిత్రుడు అసాధారణ బాధ్యతను నిర్వహిస్తూ యుద్ధరంగంలో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొని సైనిక దళాలకు ఆధ్వర్యం వహిస్తున్నాడు. పర్లాకిమిడిలో గిడుగు రామ్మూర్తిగారి దగ్గర సవర భాష నేర్చుకొన్న ఫారెస్టు ఆఫీసరు వెల్షమన్ యుద్ధం ప్రారంభం కాగానే ఇంగ్లండులో రిక్రూట్ అయి దేశం కోసం పోరాడసాగాడు. (ఈ వెల్షమన్ దొర యుద్ధకాలంలోనే 1917లో చనిపోయాడు. గిడుగువారు సవర ట్రైనింగ్ హైస్కూలుకు యితని పేరే ఉత్తరోత్తరా పెట్టారు). డ్యూరెల్ తన ఉత్తరంలో ''ఆంగ్లేయులు, భారతీయులు స్వల్ప విషయాలను మరిచిపోయి, మొత్తం యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలి. అలా ఆలోచించే గొప్పతనం భారతీయులకు ఎప్పుడూ వుంది. ఈ సమయంలో ఈ రెండు దేశాలవారు ఎవరి లాభాలు వారు చూసుకొంటే సమయం మించిపోతుంది'' అని రాశారు.

ఆనాటి మొత్తం సమరం గురించి మాత్రమేకాక ఏనాటికైనా ఏ దేశంలోనైనా మానవజాతి గురించి అప్పారావుగారు ఆలోచించారు. ఎవరి లాభాలు వారు చూసుకొనడం పరిపాటేగాని సొంతలాభం కొంత మానుకొని పొరుగువారికి తోడుపడాలి. ఎవరి దేశాన్ని వారు ప్రేమించాలి. మంచిని పెంచాలి. అప్పుడే అన్నదమ్ములవలెను జాతులు మతాలన్నీ మెలగగలుగుతాయి. దేశ ప్రగతి ఆదేశపు ఆర్థిక విధానంపై ఆధారపడి వుంటుంది. ఉత్పత్తి పెరిగితేనే 'పాడిపంటలు పొంగి పొరలే' అవకాశం దేశానికి వస్తుంది. దేశమంటే మట్టికాదు, మనుషులు. కండకలవాడే మనిషి (దానితో కాయకష్టం చేయాలి). తిండి కలిగితేనే కండ గలుగుతుంది. మనిషి డబ్బు

తేగలగాలి (డబ్బు లేకపోతే అన్నీ యిబ్బందులే. దారిద్ర్యం మనిషిని కృంగదీస్తుంది. అది పట్టించని మార్గం వుండదు).[113] ఈసురోమని మనుషులుంటే దేశం బాగుపడదు. మందగించకుండా ముందుకు అడుగువేయాలి. మంచిని పెంచాలి. (మంచితనమే దైవము. మంచిని పెరగనివ్వాలి. మంచిని ప్రేమించడమే, దైవమును ప్రేమించడము).[114] మంచిని పెంచి దేశాన్ని ప్రేమిస్తే దైవాన్ని ప్రేమించినట్టే.

ఈ భావాలతోనే అప్పారావుగారు 'దేశభక్తి' గీతాన్ని రచించారు. ఇందులో వారి తాత్త్విక చింతన నిగ్గు గడ్డ కట్టింది. ఇది సర్వదేశ ప్రజలు పాడుకోదగిన జాతీయ గీతమైంది. ఈ గీతంలో సందేశాన్ని కె.వి.రమణారెడ్డిగారు యిలా క్లుప్తంగా చెప్పారు.[115]

''....భౌతిక సంపత్తి, కళావిలసనం, వ్యాపార వాణిజ్యాల ఇతోధికాభివృద్ధి, ప్రగతి దృష్టి, సార్వత్రిక శాంతి, పరస్పర సాహాయ్య సహకార వైఖరి, జాతుల మైత్రి, మతాల ఒద్దిక, సమాజంలోని అడ్డుగోడలను కుప్పకూల్చి ఆటంకాలను రద్దు జేసి దేశమంతటా ఒకే ఆర్థిక విధానాన్ని అమలుపరచి స్వదేశీ పరిశ్రమలు పెంపొందించుకొని ఇతర జాతులతో వర్తక వాణిజ్యాలు సాగిస్తూ దేశాల నడుమగల వైమనస్యాలను తొలగించి ప్రపంచమంతటా ఏకైకమని ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్న మధ్యమ వర్గ భావజాలమే ఈ గీతంలో అడుగడుగునా కనిపిస్తుంది. 'పరుల కలిమికి పొర్లి' ఏడ్వగూడదన్నప్పుడు కలిమిలేముల అసమానతలు ఉన్నవి ఉన్నట్లుగానే కొనసాగడ మటుంచి, వ్యక్తి ఆస్తి భద్రతకు ఆస్కారం ఏర్పడుతుంది. అప్పారావు మానవతావాదం ఆకాలానికి అభ్యుదయకరమే. ఎందుచేతనంటే, అప్పటికప్పుడే ఇతర దేశాలన్నిటా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొన్న మధ్యమవర్గం మనదేశంలో అప్పుడప్పుడే పైకి వస్తున్నది''.

దేశభక్తి గీతాన్ని రచించాక అప్పారావుగారు విద్యలందు స్పర్థను ఇనుమడింపచేశారు. వాడుక భాషను వ్యాపింపచేయడానికి ఆయన విశ్వవిద్యాలయంలోని వివిధ కమిటీలలో చేస్తున్న మంచి పనులను ఆంధ్ర సాహిత్య పరిషత్తు అడ్డుకొంటుంది. ఆ సంస్థ ''దురదృష్టవశాత్తు మద్రాసు పక్షియుల చేతుల్లో చిక్కుకొంది. పరిషత్తును వారు మారుతోవలకు మళ్ళిస్తున్నారు. మార్పుకు వారు బద్ధవిరోధులు. పురోగతికి అవరోధకులు.[116] ఈ సంగతులను పత్రికా సంపాదకులకు వ్యక్తిగతంగా లేఖలలో చెప్పారు. పత్రికలలో వ్యాసాలు రాసి ప్రచురించారు. వాటిని చదువుతున్న పాఠకులు, మిత్రులు అప్పారావుగారికి లేఖలు రాశారు. మచిలీపట్నం నుంచి వల్లూరి సూర్యనారాయణరావుగారు ఇలా ఉత్తరం రాశారు.[117]

---

113. మాటామంతీ - పుట.20
114. మాటామంతీ - పుట.46
115. మహోదయం - పుట.317
116. లేఖలు - పుట.208
117. లేఖలు - పుట. 178-9

మచిలీపట్నం,
20-6-14

''ప్రియమైన అప్పారావుగారూ,

మీ వ్యాసములను పత్రికలలో చదువుతున్నాను. జయంతి రామయ్యగారి వల్ల భాషాభివృద్ధి జరగదు. తెలుగు అకాడమీ స్వరూపం మారి తీరాలి. శబ్దశాస్త్రాన్ని మథించిన గిడుగు రామమూర్తి పంతులుగారి వంటి దిగ్గంతులు మనకు అవసరం. నిఘంటు వ్యవహారం అతి అసహ్యాకరంగా తయారయింది. జరుగుతున్న జాప్యం అంతా యింతా కాదు. నిఘంటు నిర్మాణం గురించి కొవ్వూరు న్యాయవాదులు శ్రీ తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు వ్రాసిన వ్యాసం మీరు చదివి వుంటారు. ఇది మీ స్వంత విషయంగా భావించి మీరు పూర్తి బాధ్యత వహించకపోతే నిఘంటు నిర్మాణం జయప్రదం కాదు. మీరిప్పటికే వృద్ధులయిపోయినారు. వెనకటి ఓపిక లేదు. చరిత్ర రచన అలాగునే వుంచివేసినారు.

ఇతర వ్యాపకాలు తగ్గించుకొని, మీరు తలపెట్టిన చరిత్రను పూర్తిచేయడం మంచిది. దానినీ, నిఘంటువును దేశానికి మీరు సమర్పించాలి. మీరనుకుంటున్న విశాఖ జిల్లా చరిత్ర త్వరలో వెలువడితే, అది ఇతర జిల్లాల వారికి ఆదర్శప్రాయంగా వుంటుంది. మీ ఆరోగ్యం ఎలాగ వుంది? విజయనగరం ఎప్పుడు వెళతారు?''

అప్పారావుగారి ఆరోగ్యం క్షీణించసాగింది. విజయనగరం నుండి వైద్యం కోసం విశాఖపట్నానికి వెళ్ళారు. 1915 ఏప్రిలు 7వ తేదీనాడు మహారాణీ లలితకుమారి విశాఖపట్నం పెద్దాసుపత్రిలోని పెద్ద డాక్టరు ఎల్లింగ్‌టన్ పేర ఒక జాబు రాసి అప్పారావుగారి శరీర స్థితి జాగ్రత్తగా పరీక్షించి, కావలసిన ఔషధాలు ఇచ్చి కంటికి రెప్పలాగ కాపాడమని, బిల్లు ఎంతయినా సరే తాను చెల్లిస్తానని చెప్పారు. అప్పారావుగారు విశాఖపట్నంలో తమ మిత్రులు ప్రిన్సిపాలు పి.టి. శ్రీనివాసయ్యంగారింట్లో దిగారు. డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. మిత్రులు వచ్చి చూస్తున్నారు.

విపరీతమైన బడలిక, ఆయాసం అప్పారావుగారికి బాల్యం నుంచి ఉన్నవే. అయినా వారు కావించే కృషి, మేధో సంబంధమైన కార్యాచరణా అత్యధికం. ''నేనింత కృషి ఎలా చేస్తున్నానా అని నా మిత్రులకే కాదు. నాకే ఆశ్చర్యంగా వుంది'' అని అప్పారావుగారు భావించారు. ''ఎప్పుడూ పక్కమీద అలా వాలి, విశ్రాంతి తీసుకోవాలనిపించేది. ''ఈ జబ్బుకు చికిత్స ఏమిటి?'' అని ప్రశ్నించుకొన్నారు. హాయిగా విశ్రాంతి, కంటినిండా నిద్ర, పనేమీ లేకుండా పూర్తిగా విశ్రాంతిని తీసుకొంటూ కూచోడం తమవల్ల కాని పని అని వారికి తెలుసు. అయినా ''ఇప్పుడు పనీ పాటూ లేదు విశ్రాంతి తీసుకొంటున్నాను'' అని వారు డాక్టర్లకు చెప్పారు. కాని నిద్రలేమి వారికి ఆదినుంచి ఉన్న వ్యాధే.

మిత్రులు వచ్చి చూస్తున్నప్పుడుగాని, బాధ్యతలు తలచుకొంటున్నప్పుడుగాని అప్పారావుగారికి నిద్ర ఎలా పడుతుంది? ఉద్రేకం కలగకుండా ఎలా ఉంటుంది? గిడుగు

రామమూర్తిగారు అప్పారావుగారిని చూడడానికి విశాఖపట్నం వెళ్ళారు. ప్రాణమిత్రుణ్ణి చూశారు, తర్వాత తమ అనుభవాన్ని ఇలా ఒక లేఖలో రాశారు.[118]

''ఎలాగ వున్నదో చూసి వద్దామని విశాఖపట్టణం వెళ్ళాను. అదే ఆఖరుసారి అతన్ని చూడడం. నేనతన్ని చూడ్డానికి వెళ్ళినపుడు డాక్టరు నాకిలా సలహా యిచ్చాడు: ''మీరు యెదుట కనిపించేసరికల్లా ఆయన వుద్రేకం పట్టలేకపోతున్నారు. అదే పనిగా, జబ్బు మాటే మరిచి మీతో సాహిత్యగోష్ఠి చేస్తున్నారు. చారిత్రక విషయాలను గురించీ, సారస్వతాన్ని గురించీ చర్చలు జరుపుతున్నారు. విపరీతమైన అలసట కలుగుతున్నా లెక్క చేయడం లేదు. ఇలా అయితే ఆయన ఆరోగ్యం మరీ పాడవుతుంది కదు!'' డాక్టరు, అతనికి ఉత్తరాలు వ్రాయవద్దని నాకు చెప్పాడు. నాటి నుంచీ, అతనికి ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాను. జబ్బు నిమ్మళిస్తుంది కదా, ఆరోగ్యం తిన్నబడుతుంది కదా అని ఆశిస్తూ వుంటిని''.

ఒక్క రామమూర్తి పంతులుగారికే కాదు, సంస్థానం ధర్మకర్తలలో ప్రథముడు కలక్టరు ఫోలరు దొరకూడా అలాగే భావించాడు. అప్పారావుగారికి ఒక ఉత్తరం రాస్తూ ''..... ఆ చరిత్ర మీదనే కదా మీకున్న బెంగల్లాను! బెంగ పడకండి మీరు తలపెట్టిన చరిత్రను తగిన సమర్థులను నియమించి, మీరు వుంటే ఎంత బాగుండునో, అంత బాగా వారిచేత వ్రాయించి, నేను పూర్తి చేయిస్తాను. అవును; ఇంతకంటే నేను మీకే విధంగా సాయపడగలను!.... చరిత్రను మీరే పూర్తి చేస్తారని నా ఆశ!''[119] అని చెప్పాడు.

అయితే అప్పారావుగారికి తీపి విరిగిన చెరుకులా, ఆనాటి కోర్కెలు బెండైపోయాయి. 'లంగరెత్తుము' అని చరమగీతం రాశారు.

''విరిగి పెరిగితి; పెరిగి విరిగితి,
కష్ట సుఖముల పార మెరిగితి;
పండునన్నవి ఆశలెన్నో
యెండి రాలగ బొగిలితిన్.

అందజాలని పళ్ళకోసము
అఱ్ఱు జాపితి; నేల పాకిన
చెట్టు పళ్ళను విలువ లెరుంగక
పాద రక్షల మట్టితిన్.

తీపి విరిగిన చెరుకువలె ఆ
నాటి కోర్కెలు నేడు బెండౌ
టెంచి నవ్వితి; బుద్ధి చపలత
కొత్త కోర్కెల తగిలితిన్.

118. డైరీలు - పుటలు 228-9
119. లేఖలు - పుట.244

దేవతలతో జోడుకూడితి
రక్కసులతో కూడి ఆడితి
కొత్త మిన్కుల తెలివి పటిమను
మంచి చెడ్డల మార్చితిన్

చూతువా! అని చూపితిని; మరి
చేతునా! అని చేసితిని; ఇక
చూడ చేయగరాని వింతలు
చూసి కన్నులు కట్టితిన్

శత్రు మిత్రుల కిచ్చి నెనరులు
స్నేహవార్థిని కొల్లగొంటిని;
నాటి మిత్రులు తరల శూన్యం
బైన పుడమిని నిలిచితిన్

పంజరంబున నున్న కట్లను
పగలదన్నగ లేక స్రుక్కితి;
నింగి పర్వగ లేని జన్మము
నీరసంబని రోసితిన్.

''ఉసురులకు విసికితివో? యుద్ధము
కలదు; దేశము కొరకు పోరుము''
యుద్ధమా? ఇక నేమి లోకము!
చాలు! చాలును! లంగరెత్తుము.

ఈ కవితలోని ప్రతి చరణానికి వారి జీవితంలోని వివిధ ఘట్టాలు వ్యాఖ్యానాలుగా ఉదహరించవచ్చు. 1915 నవంబరు 25వ తేదీనాడు అప్పారావుగారు లంగరెత్తేసి తన జీవన నౌకను తిరిగిరాని ఏ సుదూరతీరాలకో నడిపించుకొని పోయారు.

జనన మరణాల రెండింటిలోనూ ఆయన తన కాలానికి ముందుండడానికే ప్రయత్నించారు. నెలలు పూర్తిగా నిండకముందే తల్లి కడుపులోంచి భూమి మీద పడడానికి ఎంత తొందరపడ్డారో అలాగే తల్లి కళ్ళముందే ఆమె కన్నా ముందుగా వెళ్ళిపోవడానికి నిశ్చయించుకొన్నారా అన్నట్టు త్వరపడి మరణించారు. ఆయన పోయిన మరుసటి సంవత్సరం జనవరిలో వారి తల్లి కౌసల్యమ్మగారు మరణించారు. తెలుగుతల్లి తన పేరు ప్రతిష్ఠలు పెంచిన ముద్దుబిడ్డల జననానికి ముందూ, నిధనానికి పిదప కూడా జీవిస్తూనే ఉంటుంది.

అప్పారావుగారి భౌతిక మూర్తి పంచభూతాలలో కలిసిపోయాక వారి సాహిత్య కీర్తి ఆంధ్ర సారస్వత లోకమంతా అల్లుకొనసాగింది.

ఆయన స్ఫూర్తి అఖండ వర్తి.

మహాకవుల రచనలకు మరణం లేదు.

గిడుగు వెంకట రామమూర్తి

(1863-1940)

బహుముఖ ప్రజ్ఞావంతుడు విభిన్న రంగాలలో విశిష్ట విజయాలను సాధిస్తాడు. ఇతరులకు అసాధ్యాలుగా తోచే వాటిని తన దీక్షతో, దక్షతతో ప్రజల కోసం పాటుపడి సఫలం చేసినవారు, ఆ కార్యసాధనకోసమే పుట్టారని లోకులు భావించడం మన పూర్వాచారం. అలాంటి ప్రసిద్ధులను 'కారణజన్ములు'ని లోకం కొనియాడుతుంది. గిడుగు వెంకటరామమూర్తిగారు వ్యావహారిక భాషోద్ధరణ కోసమే పుట్టారని కొందరూ; సవర భాషకూ, సవరులకూ అభ్యున్నతి ప్రసాదించడానికే జన్మించారని మరికొందరూ భావిస్తారు. అయితే రామమూర్తిగారు అందరిలాగే ఒక తల్లికీ తండ్రికీ 1863లో పర్వతాలపేట అనే గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు.

పర్వతాలపేట ఒకప్పుడు విజయనగర సంస్థానంలో ఉండేది. రామమూర్తిగారి తండ్రి గిడుగు వీరరాజుగారు ఆ సంస్థానంలో సముద్దారు. అంటే రెవిన్యూ ఇన్స్పెక్టరుగా 1860 నుంచి పనిచేస్తూ ఉండేవారు. పర్వతాలపేట ఒక అగ్రహారం. శ్రీకాకుళానికి ఉత్తరాన ఇరవైమైళ్ల దూరాన వంశధారానదీ తీరాన ఉంది. ఆ నదికి అవతలి వొడ్డున నగరికటకం అనే ప్రాచీనమైన గ్రామం ఉంది. ముఖలింగానికి అనుబంధంగా ఉన్న సైనిక నిలయం. పూర్వం మన దేశాలలోని రాజ్యాలకు రాజధాని ఒకటీ, దానిని ఆనుకొని సైనికులు నివసించే కటకం ఒకటీ ఉండేవి. సిటీ-కంటోన్మెంటులు ఎలాగైనా పరస్పరం ఒకదానిపైన ఒకటి ఆధారపడినా విడివిడిగా ఉంటాయి. గిడుగు వీరరాజుగారికి ఉద్యోగరీత్యా పర్వతాలపేటలోనే పని ఉన్నా నగరికటకంలో జిల్లా కలక్టరుగారి గూఢచారిగా కూడా పనిచేయవలసి వచ్చింది. జయపురం సంస్థానం తగువులలో పడింది. జ్ఞాతుల మధ్య స్పర్థలు రేగాయి. జమీకోసం పోటీపడుతున్న శ్రీకృష్ణచంద్రదేవ్ వర్మగారు తమపై కుట్ర పన్నుతున్నారని అధికారంలో ఉన్న జ్ఞాతి, కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. జయపురంలోకాక, నగరి కటకంలో శ్రీ కృష్ణచంద్రదేవ్‌వర్మ నిర్బంధ ప్రవాసంలో ఉండాలని కలక్టరు ఆదేశించారు. ఈయన మీద ఒక కన్నువేసి ఉంచమని వీరరాజుగారికి రహస్యంగా ఆ కలెక్టర్ ఆజ్ఞలు జారీచేశారు. ఉత్తరోత్తరా వీరరాజుగారి కుమారుడు రామమూర్తి, శ్రీ కృష్ణచంద్రదేవ్‌గారి కుమారుడు విక్రమ్‌దేవ్‌వర్మ (1872–1951) బాల్యస్నేహితులై పర్వతాలపేట లోనూ నగరికటకం లోనూ ఆడుకొనేవారు. కాలక్రమాన ఒకరు ప్రజల వాడుకభాషనూ, ఇంకొకరు పండితుల వేడుక భాషనూ అభిమానించి ఉద్యమాలు నడిపి ప్రత్యర్థులయ్యారు. అయినా బాల్యమైత్రిని మరిచిపోలేదు.

రామమూర్తిగారికి పర్వతాలపేటలోనే అయిదోఏట, అయిదోనెల, అయిదోరోజున 1868లో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం జరిగింది. 1874లో పదకొండు, పన్నెండేళ్ళ వయస్సులో ఉపనయనం జరిగింది. సాధారణంగా బ్రాహ్మణుల ఇళ్ళలోఒక పెళ్ళి జరుగుతున్న సందర్భంలోనే ఒక వడుగుకూడా చేస్తారు. 'సర్రాజు పెళ్ళిలో గుర్రాజుకో

పోచ' అనే సామెత ఇలాగే పుట్టింది. వీరరాజుగారికి రామమూర్తిగారు ఒకటే కుమారుడైనా వారి తర్వాత ఇద్దరు కుమార్తెలు 1866లోనూ, 1872లోనూ జన్మించారు. పెద్దమ్మాయి పెళ్ళి చేస్తున్నప్పుడే అబ్బాయికి వడుగు చేశారు. తండ్రి వీరరాజుగారి కట్టడివల్ల రామమూర్తిగారు వడుగు జరిగాక 15 రోజులపాటు మధుకరం ఎత్తి సంప్రదాయం ప్రకారం భోజనం చేశారు. ఆనాటి నుంచి యథావిధిగా సంధ్యావందనం చేస్తూ ఉండేవారు. 1875లో వీరరాజుగారికి చోడవరం బదిలీ అయిపోయింది. తన కుటుంబాన్ని విజయనగరంలో ఉంచి తామొక్కరే చోడవరం ఉద్యోగానికి వెళ్ళారు. కొన్ని మాసాలే అక్కడ జీవించారు. 1875లో విషజ్వరం వచ్చి చనిపోయారు.

తండ్రిగారు మరణించేనాటికి రామమూర్తి వయస్సు పదమూడు సంవత్సరాలు. కుటుంబం విజయనగరంలో ఉంటూ ఉండేది. తల్లిగారు తన నగలమ్మి కుమారునికి చదువు చెప్పించారు. గురజాడ అప్పారావుగారితో కలసి మహారాజాగారి విద్యా సంస్థలో లోవర్ ఫోర్త్‌లో ప్రవేశించారు. 1879దాకా ఇద్దరూ కలిసే చదువుకొని మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులయ్యారు. గురజాడవారి ఆర్థిక పరిస్థితి మెరుగు కనుక ఆయన పై చదువులు చదివారు. రామమూర్తిగారు చదువు చాలించవలసి వచ్చింది. తల్లిగారి బలవంతం వల్ల పెళ్ళికూడా చేసుకోవలసి వచ్చింది.

రామమూర్తిగారి అత్తవారు కందికొండవారు. భీమునిపట్నం నివాసులు. కందికొండ రామదాసుగారు ఒక ఓడవర్తకుని దగ్గర గుమస్తాగా చేరి పనిచేస్తూ వ్యవసాయంలో వంతుదారుగా చేరి సుమారు ఇరవైవేల రూపాయలు ఆర్జించి మేడలు మిద్దెలు కట్టుకొన్నారు. మంచి హోదాలో ఉండేవారు. ఆయన తన రెండో కుమార్తె అన్నపూర్ణమ్మను రామమూర్తిగారికి ఇచ్చి 1879లో వివాహం చేశారు. ఓడ వ్యాపారంలో ఎలా 'సిరిదావచ్చిన వచ్చునో' అలాగే పోతుంది. రామదాసుగారు దివాళా తీశారు. వారిది బతికి చెడిన కుటుంబం అయింది. ఉత్తరోత్తరా ఈ కుటుంబ పోషణ భారం కూడా రామమూర్తిగారి మీదనే పడింది.

మెట్రిక్యులేషన్ ప్యాసయి, పెళ్ళి చేసుకోగానే రామమూర్తిగారు ఉద్యోగాన్వేషణ ప్రారంభించారు. కచ్చేరి గుమాస్తాగా అయితే చాలా ఎక్కువ జీతం వస్తుంది. బడిపంతులైతే నెలకు ముప్పయి రావచ్చును. దానికోసం ప్రయత్నించారు. రెండు చోట్ల ఖాళీలున్నాయి. ఏది కావాలని అధికారులు అడిగారు. ఒకటి ఆరోగ్యవంతమైన సముద్రప్రాంతంలో మిడిల్ స్కూలులో ఫస్టుఫారం ఉపాధ్యాయుని పని. జీతం పాతిక రూపాయిలు. రెండవది మలేరియా జ్వరాలకు పేరుపడిన కొండల ప్రాంతంలో ఉన్నది. నెలజీతం 30 రూపాయలు. అయిదు రూపాయలు ఎక్కువ వస్తుందని రెండవదే రామమూర్తిగారు కోరుకొని ఆ ఉద్యోగంలో చేరారు. అది పర్లాకిమిడి జిల్లా హైస్కూలు ఉద్యోగం. 1880లో ఇక్కడ ప్రవేశించి 1936 దాకా 56 సంవత్సరాలపాటు అదే ఊళ్ళో ఉపాధ్యాయునిగా పనిచేశారు.

అయిదు రూపాయలు ఎక్కువ జీతం వస్తుందని చేరడంలో రామమూర్తిగారు చాలా ముందు చూపు చూసినట్టున్నారు. ఉద్యోగంలో ప్రవేశించినపుడు వారి భార్య ఇంకా

కాపురానికి రాలేదు. ఆయన పోషించవలసినవారు తమ తల్లి, ఇంకా కాపురానికి వెళ్ళని రెండో చెల్లెలు మాత్రమే. అయితే కొందరు బంధువుల బాధ్యతకూడా రామమూర్తిగారు స్వీకరించక తప్పలేదు. వారి పినతల్లి కుమారుణ్ణి తన దగ్గర పెట్టుకొని చదివించారు. 1894లో రామమూర్తిగారికి జ్యేష్ఠపుత్రుడు (వెంకటసీతాపతి) పుట్టాడు. 1888లో మామగారు పోయారు. 1894 నుండి రామమూర్తిగారే తన భార్యతోపాటు ఇద్దరు బావ మరదులనూ, తమ అత్తగారినీ పర్లాకిమిడిలో తమ ఇంట్లో పెట్టుకొని పోషించవలసి వచ్చింది. తమమీదపడే బరువు బాధ్యతలను ఏనాడైనా రామమూర్తిగారు సంతోషంగా స్వీకరించే స్వభావం గలవారే.

1880లో ఉద్యోగం చూసుకొంటూనే రామమూర్తిగారు ప్రయివేటుగా చదువులు సాగించారు. 1882లో ఎఫ్.ఎ. పరీక్ష ప్యాసయ్యారు. ఆయన పనిలో చేరినప్పుడది మిడిల్ స్కూలు. క్రమేణా అది హైస్కూలుగా, సెకెండ్ గ్రేడ్ కాలేజిగా వృద్ధి పొందింది. రామమూర్తిగారు కూడా ఫస్టుఫారం ఉపాధ్యాయుని హోదా నుండి 4వ, 5వ, 6వ ఫారం మాస్టరుగా ఎదుగుతూనే వచ్చారు. 1884లో ప్రైవేటుగా చదివి బియ్యేలో తొలి రెండు భాగాలైన ఇంగ్లీషు సంస్కృతాలలో ప్యాసయ్యారు. మూడవ భాగమైన చరిత్ర పరీక్షకు కూర్చోలేదు. అయినా కాలేజీలో చరిత్రపాఠాలనే చెప్తూ వచ్చారు. బియ్యే పూర్తి చేయవలసిన అవసరం అప్పటికి కనబడలేదు.

1892లో పర్లాకిమిడి రాజావారి తమ్ముడు పద్మనారాయణ దేవ్‌గారికి ఒక ట్యూటరు కావలసి వచ్చింది. రామమూర్తిగారిని స్కూలు పనుల నుండి తప్పించి రాజభవనంలో చదువుచెప్పమన్నారు.

రామమూర్తిగారి ఉద్యోగంలోని హోదాతోపాటు జీతం, కుటుంబం కూడా పెరగసాగాయి. సీతాపతికాక ఇంకో ఇద్దరు కుమారులు పుట్టారు. నెల జీతం 65 రూపాయలు. బియ్యే చరిత్ర భాగం పూర్తిచేసినా జీతం పెరిగే సూచనలు లేవు. అందుచేత స్కూలు పనులతోపాటు పర్లాకిమిడి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండేవారు. ఒక రీడింగు రూపము పెట్టారు. వీరేశలింగం గారి సంస్కరణలను అభిమానించి వాటిని సమర్థిస్తూ సనాతనులతో వాదాలు పెట్టుకొనేవారు. ప్రామాణిక గ్రంథాలు సంస్కృతం లోనివి చదివి తమ వాదానికి సాక్ష్యాలు చూపెడుతూ ఉండేవారు. రీడింగు రూముకు వారే కార్యదర్శి.

ఒక్క రాజాగారి తమ్మునికి మాత్రమే చదువు చెప్పే ట్యూటరుగా నియమితులైన 1892లోనే రామమూర్తిగారి దృష్టి పర్లాకిమిడి పరిసరాలపై పడింది. చదువులేని వాళ్ళు ఎందరో ఉన్నారు. చదువేకాక ఆధునిక నాగరికతకు దూరంగా ఉన్నవారూ చాలామంది అక్కడ కనబడతారు. పర్లాకిమిడి చుట్టూ ఉన్న కొండలలో నివసించే సవరలు విద్యావాసనలేక పశుప్రాయులుగా ఉన్నారు. వీరికి చదువుసంధ్యలు నేర్పి మానవుల్ని చేయవలసిన బాధ్యత విద్యావంతులపై లేదా? సవరలకు వాళ్ళ భాషలోనే విద్య నేర్పాలంటే ముందు వారి భాషను నేర్చుకోవాలి. అందుచేత సవరలకోసం బడులు

పెట్టడానికి ముందు తామే ఒక సవరదగ్గర ఆ భాష, జీవితము, ఆచార వ్యవహారాలు అన్నీ తెలుసుకోవాలనుకొన్నారు. వారి భాషను అభ్యసించాలని నిశ్చయించుకొన్నారు. అయితే నేర్పేవారెవరు? సవర భాష, ఒరియా, తెలుగు తెలిసిన ఒక పానోను మనిషిని ఇంట్లో పెట్టుకొని అతని దగ్గర సవర భాషను నేర్చుకొనసాగారు. ఇది దీర్ఘకాలం సాగించవలసిన విద్యాభ్యాసం.

రామమూర్తిగారు చరిత్ర పాఠాలను చెప్తూ వుండేవారు. తాము చరిత్రగల సీమలో నివసిస్తున్నారు. పర్లాకిమిడికి దక్షిణాన ఇరవై మైళ్ళ దూరంలో ముఖలింగం అనే ప్రాచీన క్షేత్రం ఉంది. అక్కడి ఆలయాలను, అందులో వున్న శాసనాలను రామమూర్తిగారు చూశారు. వాటిని చదవాలంటే ఎలా అధ్యయనం ప్రారంభించాలో మొదట్లో తెలియ లేదు. వాటి వివరాలన్నీ కూలంకషంగా పరిశోధించాలని నిశ్చయించారు. అప్పటికే ఆయన చరిత్రపైనగల సమకాలిక ప్రచురణలన్నీ చదివారు. ఏదీ వదిలిపెట్టకుండా చదివి నోట్సు రాసుకొనేవారు.

1882 నాటికే రాబర్ట్ సూయల్ దొర చెన్న రాజధానిలోని ప్రాచీన వస్తు విశేషాలపై రెండు సంపుటాల ఉద్గ్రంథాలు రచించాడు. వీటిని సూయల్ దొరగారి లిస్టులు అంటారు. ఇవికాక ఇండియన్ ఏంటిక్వరీ సంపుటాలలో మెడ్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్ సంచికలలోని వివిధ విషయాలను ఆయన చదువుతూనే ఉన్నారు. తాము చదివిన ఏ పుస్తకంలోనూ, ముఖ్యంగా సూయల్ దొరగారి లిస్టులలో ముఖలింగం ప్రసక్తిలేదు. తామే పరిశోధించి ఈ క్షేత్ర విశేషాలు లోకానికి తెలపాలి. అందుకు సాధనాలు సంపాదించాలి.

పర్లాకిమిడి జమీందార్ గారికి మంచి స్వంత గ్రంథాలయం ఉంది. రాజాగారి తమ్ముడు పద్మనారాయణదేవ్ గారికి ట్యూటరుగా కుదిరాక రాజాగారితో దోస్తీ ఎక్కువైంది. రాజాగారి గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ రామమూర్తిగారికి కరతలా మలకాలయ్యాయి. బర్నల్ దొరగారు రాసిన ''సౌత్ ఇండియన్ పాలియోగ్రఫీ'' అనే పుస్తకం హమేషా ఇంట్లో ఉండకపోతే ప్రాచీన శాసనాలు చదవడం సాధ్యపడదు. తమకో ప్రతి కావాలని రామమూర్తిగారు పద్మనారాయణదేవ్‌గారిని అడిగారు. ఆయన వెంటనే ఒక ప్రతిని తెప్పించి బహూకరించారు. అందులో ఇచ్చిన లిపులన్నీ రామమూర్తికి కొట్టిన పిండి అవడానికి ఎంతోకాలం పట్టలేదు.

పర్లాకిమిడి రాజభవనంలో ఒక వింత ఆచారం ఉంది. భోగి సంక్రాంతి పర్వదినాల సందర్భంగా కనుమునాడు పశువుల పండుగ చేస్తూ పశువులకు వాతలు వేసేవారు. తమ కొలువులోని మనుష్యులందరనీ పశువులుగానే భావించేవారు కాబోలు. ఉద్యోగులందరికీ వాతలు వేసేవారు. కనుమునాడు రామమూర్తిగారు ట్యూటరుగా రాజాగారి తమ్మునివద్ద ఉన్నారు. చురకలు వేసే పరికరాలతో సేవకులు నిప్పుకుంపటి పట్టుకొని వచ్చారు. రామమూర్తిగారికి వాతలు వేయబోయారు. ఆయన మండిపడి కోపం పట్టలేక ''ఇతర సంస్థానాలలో పంచెల చాపులో, పట్టుశాలువలో పెడతారు;

ఇక్కడ వాతలు వేస్తారా? సెబాస్ ఈ మర్యాద!'' అని కడిగేశారు. కుమార రాజా సేవకులను మందలించి పంపేశారు.

రామమూర్తిగారు ముఖలింగానికి పరిశోధనల నిమిత్తం వెళ్ళి 1893 జనవరి 15, 16 తారీకులలో అక్కడ పరిశోధనలు చేశారు. రామమూర్తిగారి ఉద్దేశంలో అధికారంలో ఉన్న ఆంగ్లేయ పండితులకంటే చదువుకొన్న హిందువులవల్లనే పురాతత్వ పరిశోధనలు ఫలప్రదంగా జరుగుతాయి. హిందువులైతే ఏ ఆలయంలోనైనా యథేచ్ఛగా వెళ్ళగలరు. గర్భకోవిలలోనికి కూడా వెళ్ళవచ్చు. (గిడుగువారు గర్భగుడి అనే మాటను వాడలేదు. ముఖలింగం మీద రాసిన వ్యాసంలో గర్భకోవిల అన్న పదాన్నే చాలాసార్లు వాడారు). తామ్ర శాసనాలు ఆచూకీ తీయడానికి స్థానికులతో వ్యవహరించడానికి స్వదేశీయ పండితులకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే గిడుగువారు తమ పరిశోధనలు అభినివేశంతో చేయగలిగారు.

ముఖలింగంలో మూడు ఆలయాలు ఉన్నాయి. ఒకటి - మధూకేశ్వరాలయం, రెండు : భీమేశ్వరాలయం, మూడు సోమేశ్వరాలయం. ఈ మూడు గుడుల నుంచీ రామమూర్తిగారు కూలంకషంగా తెలుసుకొన్నారు. ముఖలింగక్షేత్రమహాత్మ్యం ప్రతిని ఒకటి సంపాదించారు. ముఖలింగానికి రావడానికి ముందు ఈ పుస్తకం చదివి ఉంటే బాగుండుననుకొన్నారు. ఈ క్షేత్రంలో చూడవలసినవన్నీ చూశారు. కలుసుకోవలసిన వాళ్ళను కలుసుకొన్నారు. శాసనాలు చదివారు. రాసుకొన్నారు. ఆయన అక్కడ శాసనాలు చదివేదాకా అవి మానవులు చెక్కించినవే అన్న స్ఫృహే ఎవరికీలేదు. ఆ శాసనాలన్నీ దేవతలు లిఖించినవే అని స్థానికులు గట్టిగా నమ్మేవారు. నలుగురికి ఆ సంగతే చెప్తూ వచ్చేవారు. రామమూర్తి పంతులుగారు అనర్గళంగా వాటిని చదివేస్తూ ఉంటే అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.[1]

ముఖలింగేశ్వర ఆలయంలో పదకొండు శిలాశాసనాలున్నాయి. వాటన్నింటినీ రామమూర్తిగారు రాసుకొన్నారు. శక సంవత్సరాలు నోటు చేసుకొన్నారు. భీమేశ్వరాలయంలో కూడా పదకొండు శాసనాలు ఉన్నాయి. వాటిని గూడా రామమూర్తిగారు రాసుకొన్నారు. ఈ రెండు ఆలయాలలో ఇంకా మరెన్నో శాసనాలు ఉన్నాయిగానీ, సున్నంపూతవల్ల అవి మరుగుపడ్డాయి. అందుచేత రామమూర్తిగారు మొత్తం ఇరవై రెండు శాసనాలే ముఖలింగంలో రాసుకోగలిగారు. సోమేశ్వరాలయం ఈ రెండు గుడులకంటే ప్రాచీనమైంది. వెలుతురు చాలక ఈ గుడిలోని శాసనాలు రామమూర్తిగారి దృష్టికి రాలేదు. అయినా మసక వెలుతురులో అక్కడ కూడా శాసనాలు లేకపోలేదని రామమూర్తిగారు గుర్తించారు.

గుళ్ళలోనేకాక ఊళ్ళో కూడా శాసనాలుగల ప్రదేశం ముఖలింగం. ఒక బుగతగారి పొలంలో ఒక శాసనం కనబడింది. దాన్ని చదువుదామంటే చుట్టూ చేను దట్టంగా ఉంది. చేను కోసేదాకా అది చదవడానికి వీలులేదు. అలాగే ఒక మఠాధికారి ఇంట్లో గడపకింద

1. Madras Journal of Literature and Science (1889-1894). గిడుగువారి వ్యాసంలో చెప్పారు.

ఒక రాయి ఉంది. దానిమీద నాగరి అక్షరాలు స్పష్టంగా ఉన్నాయి. ఆ రాయి అడ్డదిడ్డంగా పాతడంవల్ల ఆ శాసనాన్ని కూడా రామమూర్తిగారు చదవలేకపోయారు.

అమరావతిలోలాగే ముఖలింగంలోకూడా ఇటుకలకు కొరతలేదు. ఎవరు ఇల్లు కట్టుకొందామన్నా ఆవం పెట్టించి ఇటుకలు చేయించుకో అక్కర్లేదు. మూడు అడుగులు పొడుగు; రెండు అడుగులు వెడల్పూ ఉన్న ఇటుకలు ఎన్నో దొరుకుతాయి. ఒక బ్రాహ్మణుడు నుయ్యి తవ్వించుకొంటే దాని ఇటుకల పనికి శిథిలాలలో దొరికినవి సరిపోయేవి. రామమూర్తిగారు ముఖలింగం శిథిలాలన్నింటినీ బాగా పరిశీలించారు. ముఖలింగానికి రెండు మైళ్ళ దూరంలో నగరికటకం అనే గ్రామం ఉంది. దానిని కూడా చూసి అక్కడి పురాతత్వాన్ని అవగాహన చేసుకొన్నారు.

ముఖలింగానికి నాలుగు మైళ్ళ దూరంలో ''తెలిగిపెంట'' అనే గ్రామం ఉంది. అక్కడ ఒక శివలింగం ఉందనీ, శాసనాలుకూడా ఉన్నాయనీ విని రామమూర్తిగారు అక్కడకు వెళ్ళారు. శాసనాన్ని చదివారు. అది చోడగంగు ఇచ్చిన దాన శాసనం. శక సంవత్సరాలు 1067. ఇది అనంతవర్మ చోడగంగదేవుని శాసనంకాదని ఎవరో సామంతుని శాసనం అని రామమూర్తిగారు నిశ్చయించుకొన్నారు.

శిలా శాసనాలు చదువుతూ రాసుకొంటూనే తామ్ర శాసనాలకోసం వాకబు చేశారు. పదేళ్ళ కిందట ఒక పొలంలో ఒక రాగిరేకుల గుత్తళం దొరికిందట. దానిని పర్లాకిమిడిలోని డిప్యూటీ తాసిల్దారుగారి దగ్గరకు పంపించారట. అయినా ఈ శాసనం ప్రసక్తి సూయల్ దొరగారి లిస్టులలో కనబడదు. ముఖలింగానికి చేరువలోనున్న అచ్యుతాపురంలోని ఒక బుగతగారింట్లో తామ్ర శాసనపట్టికలున్నాయని తెలిసి వెళ్ళి వాటిని కాపీ చేసుకొన్నారు. మొత్తం మూడు గుత్తళాల ప్రతులు సంపాదించారు. ఇందులో రెండో గుత్తళానికి చాలా కథ ఉంది. చికాకోలులో గ్రహాందొరగారు కొన్ని గుత్తళాలను కొని మద్రాసు తీసుకెళ్ళి మ్యూజియంలో భద్రపర్చారు. ఒక గుత్తళాన్ని ఎడమచేత్తో ఎక్కడో పెట్టేసి మరచిపోయినందువల్ల దానిని మద్రాసుకు పంపలేదు. అది ప్రిన్సిపల్ అసిస్టెంటు కలెక్టరు దొరగారి కచ్చేరిలో ఉండిపోయింది. రాగిరేకుల శాసనాలంటే రామమూర్తిగారు చెవి కోసుకొంటారని ఆ కచ్చేరి హెడ్‌క్లార్క్ ఈ సంగతి ఆయన చెవిని వేశారు. శాసనం కాపీ చేసుకొందికి అవకాశాలు కల్పించారు.

రామమూర్తిగారికి వజ్రహస్తుని హుస్సలి తామ్ర శాసనం గురించి తెలియవచ్చింది. దానిని పర్లాకిమిడి జమీందార్‌గారి తమ్ముడు పద్మనాభ నారాయణదేవ్‌గారిచేత కొనిపించి మద్రాసు మ్యూజియంకు బహూకరింపజేశారు. డాక్టర్ హుల్ష్ దొరగారు రామమూర్తిగారికి ఉత్తరం రాసి ఆయన దగ్గర ఉన్న తామ్ర శాసనాలను ఎరువియ్యమన్నారు. తమ దగ్గర ఉన్నవి ప్రతులే అంటూ మూల పట్టికలు ఎక్కడెక్కడ దొరకుతాయో చెప్తూనూ రామమూర్తిగారు హుల్ష్ దొరగారికి రాశారు.

పురాతత్త్వ పరిశోధనలో ప్రాచీన నాణెముల ప్రాముఖ్యం చాలా ప్రామాణికమైనది. రామమూర్తిగారు కొన్ని నాణాలను సంపాదించారు. గంజాం జిల్లాలో సూపర్నెంటు ఆఫ్

పోలీసుగా పనిచేసిన ఫాసెట్ దొరగారు రామమూర్తిగారికి చాలా నాణాలు బహూకరించారు. ఇలియట్ దొరగారు ప్రచురించిన ''కాయిన్స్ ఆఫ్ సదరన్ ఇండియా'' అనే గ్రంథంలోని వాటితో తమ దగ్గర ఉన్న నాణాలను రామమూర్తిగారు తైపారు వేశారు. ముఖలింగానికి తొమ్మిది మైళ్ళ దూరంలో ఉన్న దంతవక్త్రునిపురం దగ్గర దొరికిన నాణాలను పోలినవి తమ దగ్గరున్నాయని గుర్తించారు. వానాకాలంలో అదృష్టవంతులకు ముఖలింగంలో అప్పుడప్పుడు బంగారు నాణాలు దొరుకుతూ ఉంటాయట.

ముఖలింగ పర్యటన ముగించుకొని వచ్చాక రామమూర్తిగారు క్షేత్రమహాత్మ్యాన్నీ, చరిత్రనూ సమన్వయపర్చసాగారు. హుల్ష్ దొరతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించారు. విజయనగరం వెళ్ళి గురజాడ అప్పారావుగారితో ఈ సంగతులు ముచ్చటించారు. అప్పారావుగారు ఒక సభను పెట్టించారు. అందులో ముఖలింగం గురించి రామమూర్తిగారు ఉపన్యసించారు. ముఖలింగంపై ఒక వ్యాసం రాయాలనుకున్నారు. అచ్చులో ముప్పయి అయిదు పుటలు పట్టే వ్యాసాన్ని అధోజ్ఞాపికలతో ప్రామాణిక సూచనలతో వంశ వృక్షాలతో రాశారు. ''మెడ్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు''కు ప్రచురణార్థం పంపారు. దానిని ఆ పత్రికవారు అచ్చువేశారు. వ్యాసం పేరు "An account of Antiquities of Mukhalingam and its neighbouhrhood"[2]

ఈ వ్యాసంలో రామమూర్తిగారు పది విషయాలను చర్చిస్తారు. ముందే చెప్పి వాటిని ఇలా పేర్కొన్నారు.

1. ముఖలింగేశ్వర ఆలయం
2. భీమేశ్వరాలయం
3. సోమేశ్వరాలయం
4. ప్రాచీనాలయ శిథిలాలు
5. పద్మనాభుని కొండ
6. ప్రాచీన నాణెములు
7. పాడుపడిన పాతకోటలు
8. కాళింగులు
9. తెలిగిపెంటలోని శిలాశాసనం
10. తామ్ర శాసనాలు

ఈ పది విషయాలపైన వివరణాత్మకంగా రాశారు. ముఖలింగ శాసనాలలో అవి కళింగ నగరంనుండి వేసినట్టు చెప్తారు. 'కాళింగవని నగరే శ్రీ మధూకేశ్వరాయశర్యాయ' అనీ, 'కాళింగ దేవపరే శ్రీ మధూకేశ్వరాయదేవాయ' అనీ సంస్కృతంలోనూ 'నగరమున మధూకేశ్వర దేవరకు' అనీ, 'నగరాన వీట్ మధూ కేశ్వర దేవరకు' అని తెలుగులోనూ శాసనాల్లో కనబడుతుంది. ఈ 'కళింగ (దేశ) నగరం' ముఖలింగమే అయివుంటుందని

2. Madras Journal of Literature and Science (1889-94)

చెప్పి సప్రామాణికంగా రుజువు చేశారు. పర్లాకిమిడి జమీందారులు అనంతవర్మ చోడగంగదేవుని వంశంలోని వాళ్ళేనని కూడా క్షేత్రమాహాత్మ్యం సూచనగా శాసన ప్రమాణాలతో రుజువు చేశారు.

ఈ 'ముఖలింగ ప్రాచీనత' వ్యాసంలో ఇంకొక చెప్పుకోదగ్గ విశేషం ఉంది. శాసనాలు పరిశోధించినా చరిత్రను మథించినా అది ప్రజలకోసం చేయాలి. దేశమంటే మనుషులన్న సత్యం తొలినుంచీ గిడుగూ గురజాడలకు తెలుసు. అందుకే ఈ వ్యాసంలో కాళింగులు గురించి మూడున్నర పేజీల సుదీర్ఘచర్చ జరిపారు. సాంఘిక సామాజిక శాస్త్ర పరిశోధనలు కూడా శాసన పరిశోధనలతోపాటు గిడుగువారు ప్రారంభించారు. సవరల గురించీ ఇతర కొండజాతులవారి గురించి రామమూర్తిగారు ఉత్తరోత్తరా రాసిన అనేక వ్యాసాలను థాంప్సన్ తన 'కేస్ట్స్ అండ్ ట్రైబ్సు', సంపుటాలలో అక్కడక్కడ చాలా విరివిగా వాడుకొన్నారు.

పర్లాకిమిడి రాజుగారి తమ్ముని ట్యూటరుగా రామమూర్తిగారు అట్టేకాలం పనిచేయలేదు. ఒక్క ఏడాది కూడా తిరక్కముందే ఈ ట్యూటరు పని శ్యామసుందర రాజగురువులనే ఓఢ్రునికి ఇచ్చారు. ఈయన బియ్యే పూర్తిగా ప్యాసయ్యాడు. రామమూర్తిగారికి పన్నెండేళ్ళ సర్వీసున్నా బియ్యే పూర్తిచేయలేదనే లోటు ఉంది. అందుచేత స్కూలులో కూడా తన పాతస్థానాన్ని పొందలేకపోయారు. వారి స్థానంలో అంతకుముందే ప్రధానోపాధ్యాయుని తమ్ముణ్ణి నియమించారు.

బియ్యే పూర్తి చేయనందువల్లనే గదా ఈ న్యూనత అని రామమూర్తిగారు భావించి వెంటనే జీతం నష్టంమీద ఏడాదిపాటు సెలవుపెట్టి చెన్నపట్నంలో ప్లీడరీ చదువుకొంటానని స్కూలు అధికారులకు చెప్పారు. తమ భార్యనూ, అప్పటికే కలిగిన ముగ్గురు కుమారులను భీమునిపట్నంలో ఉండమన్నారు. రామమూర్తిగారు పర్లాకిమిడి వదలి వెళ్ళడం స్కూలువారికి ఇష్టం లేదు. అందుచేత వారి పూర్వపు హోదాను ఆయనకు తిరిగి ఇస్తామని చెన్నపట్నం ప్రయాణాన్ని ఆపుచేయించారు.

చారిత్రక పరిశోధనలు చేస్తున్న కాలంలో రామమూర్తిగారు సాంఘిక సేవలను, సాంస్కృతిక కార్యక్రమాలను విస్మరించలేదు. 1894లో గవర్నరుగారు పర్లాకిమిడి వచ్చినపుడు సవరల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం వారు సవరల దేశంలో బడులు పెట్టాలన్న వినతిని సమర్పించారు. గవర్నరు సుముఖత చూపించినా, జిల్లా కలక్టరు అడ్డు తగిలాడు. 'కట్టెలు కొట్టుకొని జీవించే కొండవాళ్ళకు చదువెందుకని' చెప్పి, 'రామమూర్తి ప్రశాంతమైన సవరదేశంలో విప్లవం పుట్టించదలచాడు' అని కలక్టరు మెకార్ట్నీ గవర్నరు మనసును విరిచేశాడు. రామమూర్తిగారి ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ఒక్క ఘటనేకాక మరొక విషయం వారి సవరభాషా సేవను వాయిదా వేయించింది. దానిని గిడుగు సీతాపతిగారు ఇలా చెప్పారు.[3]

3. సాహిత్యోపన్యాసములు – 4వ సంపుటం – పుట.9

''1894లో జరిగిన ఒక సంఘటన వల్ల వీరి కృషిలో జరిగిన పెద్ద లోపం మొదట వీరికి గోచరించింది. (శనివారం సంతలో సరుకులు కొనుక్కోవడానికి కావలసిన డబ్బును సంపాదించే నిమిత్తం కొండలమీద నుంచి కట్టెలూ, చీపుర్లూ తెచ్చిన ఇద్దరు సవరలు రామమూర్తిగారి ఇంటికి వచ్చారు). ''అవి మేము కొని, డబ్బులిచ్చిన తర్వాత, మా తండ్రిగారి కోరికను మన్నించి వారు కొంతసేపు వీరి వద్ద కూర్చున్నారు. అప్పుడు వీరు ఆ సవరలతో సవరభాష మాటలాడుటకు సాహసించినప్పుడు వీరి సవర భాషకు ఆ సవరలిద్దరూ మాట మాటకు నవ్వుతూ వచ్చారు. వారిద్దరిలోనూ ఒకడికి కాస్త తెలుగు తెలుసు, కాస్త ఒరియా తెలుసును. ఛీ! ఛీ! ఇవి అసలయిన సవరమాటలు కావు! కాపు సవర (అనగా తెలుగు కలిసిన పదాలు) ఒరియా సవర పదాలు కలిసిన భాష - అని పరిహసించారు. అప్పుడు మా తండ్రిగారికీ భాషల విషయములో నూతన ప్రబోధము కలిగినది. భాషకు సాంకర్యము, మాండలిక భేదాలు తప్పవన్న విషయము తెలిసినది. తాము మూడు సంవత్సరములై (దినమునకొక్క గంట చొప్పున) నేర్చుకొంటూ ఉండిన సవర భాష, సాంకర్యముగల భాష అన్న విషయము తెలియగానే తమ పరిశ్రమ వృథా అయినట్టుగా భావించి చాలా బాధపడ్డారు. ఆ పానో గురువువద్ద చదువు చాలించారు. మరికొన్ని కారణముల వల్ల కూడా ఈ కృషి ఆగిపోయినది''.

1895లో రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు పర్లాకిమిడికి వచ్చారు. విద్యాలయాలలో బ్రహ్మసమాజం గురించి, సంఘ సంస్కారం గురించి ఉపన్యసించారు. నాయుడుగారిని రామమూర్తిగారే మొదట సభికులకు పరిచయం చేశారు. మీటింగ్ చివర వందన సమర్పణ చేశారు. నాయుడుగారు 'యాంటీనాచ్' ఉద్యమం కూడా నడిపినవారే. రామమూర్తిగారు సానిమేళాలను ఏవగించుకొనడం ఇప్పుడే ప్రారంభించారు.

స్వచ్ఛమైన సవర భాషను నేర్చుకోవాలన్న కోరికను రామమూర్తిగారు తీర్చుకోదలిచారు. మామిఉన్నం కుమారస్వామి పంతులు అనే ఆయన అప్పుడు పర్లాకిమిడిలో ఉండేవారు. ఈయనకు అడవి ప్రాంతం దారులన్నీ తెలుసు. కొందరు అసలు సిసలు సవరలతో పరిచయం ఉంది. ఈయన ద్వారా ఆ సవర పెద్దలతో నేస్తం కట్టాలని రామమూర్తిగారు భావించారు. ఆ సవరలను తమ ఇంటికి ఆహ్వానించారు. వారు దానిని మన్నించారు. వస్తామన్నారు. నేస్తం ఎలా కట్టారో పరిశోధకులు ఇలా వివరించారు.[4]

''మంచి రోజు చూసి నేస్తం కట్టదలచిన ఆ సవర కుండెడు తేనె, అరటి పండ్లగెల, పసుపుకొమ్ములు, నాలుగు కొండ చీపుళ్ళ కట్ట, మండిగనిండా జొన్నలు, అల్లము, పొగాకు తీసుకొని రామమూర్తిగారి ఇంటికి వచ్చారు. ఆయన ఆ అతిథిని ఆదరించి కుర్చీలో కూర్చోబెట్టారు. అతడిచ్చిన కానుకలను అందుకున్నారు.

ఒక ఎరుపురంగు తలపాగాను, రెండు కమలాఫలాలను, తవ్వెడు బియ్యాన్ని, పసుపు కొమ్మును, అల్లం ముక్కను, పానకాన్ని, రెండు పొగాకు చుట్టలను కానుకగా

4. అడపా రామకృష్ణారావు గారి వ్యాసం (సంఘ సంస్కర్తగా గిడుగు) - ''మరోసారి గిడుగురామమూర్తి'' - పుటలు 105-6

అతనికిచ్చారు. 'గడీణేన్, గడీనమ్' అని ఉభయులు మూడుసారులు అన్నారు. చీపురుపుల్లలు ఒకరిచేతి నుంచి మరొకరు పుచ్చుకుని రెండేసి ముక్కలు చేసి పారవేశారు. ఆ సవర మాటలకు 'నా స్నేహితుడా, నీ స్నేహితుడను' అని అర్థమట. చీపురుపుల్లలు విరిచిపారవేయడం ప్రమాణం చెయ్యడానికి సూచన. ఆయన ఈవిధంగా ఆ సవరకు సంతృప్తి కలిగేటట్లు నేస్తం కట్టి, అతనితో సవరభాష మాటలాడుతూ, అతడు కుదిర్చిన ఒక సవరపిల్లవాడిని తమ ఇంట్లో ఉంచుకుని వాడిదగ్గర స్వచ్ఛమైన సవర భాష నేర్చుకున్నారు''.

ఇంటిదగ్గర నేర్చుకొనడం కాక సవరల మధ్య వారి దేశంలో తిరిగి సవర భాష, సవర పాటలు, ఆచార వ్యవహారాలు ప్రత్యక్షంగా అధ్యయనం చేయదలిచారు. వేసవి సెలవులలో కొండలమీదనే గడిపారు. ఇంటికి తిరిగి వచ్చాక రామమూర్తిగారికి మలేరియా జ్వరం పట్టుకొని మూడుమాసాలు పీడించింది. అప్పుడు పోస్టాఫీసులో మలేరియాను నయం చేసే క్వినైనుగూడా అమ్ముతూ ఉండేవారు. రామమూర్తిగారు దానిని కొనుక్కొని రోజుకు పదిగ్రాముల చొప్పున నలభైరోజులు పుచ్చుకున్నారు. మలేరియా కుదిరినా కుదరకపోయినా అనిత క్వినైను సేవించడం వల్ల చెవుడు పట్టుకొంది. ఎన్ని మందులు తిన్నా అది ఎక్కువ అవుతూనే వచ్చింది గాని తగ్గలేదు. క్రమేణా రామమూర్తిగారి చెవుడు బ్రహ్మచెవుడుగా మారి జీవితాంతం వారిని వదలలేదు. ఆరోగ్యం చెడినా రామమూర్తిగారు తమ పరిశోధనలు మానలేదు.

అంతవరకూ హైస్కూలుగానే ఉన్న సంస్థ 1895లో సెకండరీగ్రేడ్ కాలేజిగా వృద్ధి చెందింది. ఎఫ్ఫే తరగతులు పెట్టారు. రామమూర్తిగారు బియ్యేలో కొరతను పూర్తిచేయకపోతే మెట్రిక్యులేషన్ క్లాసులకేగాని, కళాశాలలో పాఠాలు చెప్పే అవకాశం ఉండదు. అందుచేత ఆయన పట్టుపట్టి అహోరాత్రులు చదివి 1896లో బియ్యే పూర్తిచేయడానికి పరీక్షకు కూర్చున్నారు. ఆ యేడు చెన్న రాజధానిలో ఆపరీక్షలో నెగ్గినవారిలో రామమూర్తిగారు ఫస్టుక్లాసులో రెండోవారు. ఈ శుభవార్త విని పర్లాకిమిడి పండుగ చేసుకుంది. రాజాగారు సంతోషించి రామమూర్తిగారిని కాలేజిలో చరిత్ర పర్యవేక్షకులుగా నియమించారు. రామమూర్తిగారు చరిత్ర పాఠాలలో అంతకుముందే నిపుణులు కనుక తమ సవరభాషా పరిశోధనలూ, చారిత్రక పరిశోధనలూ కొనసాగించారు. వారి పరిశోధనను ప్రామాణికులు, ప్రభుత్వం వారు గుర్తించారు.

ముఖలింగంపై రామమూర్తిగారు రాసిన వ్యాసం జర్నల్‌లో ప్రచురితం కాగానే అధికారులకు కనువిప్పు కలిగింది. గిడుగువారు భోగట్టా ఇచ్చిన ఇరవై రెండు శాసనాలు నకళ్లు తీయడానికి శ్రీ హెచ్. కృష్ణశాస్త్రిగారిని వెంటనే ముఖలింగం పంపించారు. 1896 సంవత్సరపు సాంవత్సరిక నివేదికలలో శాసన పరిశోధన శాఖవారు ఈ శాసనాలను రిపోర్టు చేశారు. (ఇందులో క్రీస్తుశకం 1100కి పూర్వం ఉన్న పదకొండు శాసనాలను బూదరాజు రాధాకృష్ణగారు తమ 'ప్రాచీనాంధ్ర శాసనములు' గ్రంథంలో చేర్చారు).

ఇంతలో హుల్ష్‌దొర, దేవేంద్రవర్మ చికాకోలు తామ్ర శాసనాన్ని పరిష్కరించి ఎపిగ్రాఫికా ఇండికా మూడవ సంపుటిలో ప్రకటిస్తూ అది గ్రాహందొరగారికి ఇవ్వని

గుత్తశమన్న సంగతి తమకు పర్లాకిమిడి వాస్తవ్యులు మిస్టర్ జి.వి. రామమూర్తిగారు తెలియపర్చారని ప్రకటించారు. ఇది 1894-95లో జరిగిన విషయం. హుల్ష్ దొరగారు రామమూర్తిగారిని కొన్ని తామ్ర శాసనాలను పరిష్కరించి పంపమన్నారు.

1895-96 ఎపిగ్రాఫికా ఇండికా నాలుగవ సంపుటంలో వజ్రహస్తుని నడగాం తామ్రశాసనాన్ని రామమూర్తిగారు పరిష్కరించి ప్రకటించారు. చాలా సుదీర్ఘమైన వ్యాఖ్యానాలు చేశారు. వజ్రహస్తుడు వేల్పురా ప్రాంతంలోని పన్నెండు గ్రామాలను ఫాంగు సామయ్య అవే వ్యక్తికి దానమిచ్చాడు. ఆ సంగతినే ఈ శాసనం చెప్తుంది. ఇది నరసన్నపేట తాలూకాలోని నడగాం గ్రామంలో ఒక రైతుదగ్గర దొరికింది. దీనిని స్వాధీనం చేసుకొని గంజాం కలక్టర్ వియల్ దొరగారి ద్వారా హుల్ష్ దొరగారికి రామమూర్తిగారు పంపించారు. పరిష్కరణ భారాన్ని దొర రామమూర్తిగారి పైనే పెట్టారు.

ఈ శాసనంలోని రెండు తేదీల ప్రాముఖ్యాన్ని రామమూర్తిగారు గుర్తించారు. ఒకటి దానమిచ్చిన రోజు గోవింద ద్వాదశి. ఇది విశిష్టమైన దినం. గోవింద ద్వాదశి అరవై సంవత్సరాలకు ఒకసారి వచ్చే పర్వదినం. ఈ శాసనంలోని మరొక ముఖ్యమైన తేదీ వజ్రహస్తుని పట్టాభిషేక ముహూర్తం. క్రీస్తుశకం 1038 మే నెల మూడవ తారీఖునాడు రాత్రి 8 గంటల 27 నిముషాలకు వజ్రహస్తుడు పట్టాభిషేకం చేసుకొన్నాడని శాసనంలోని 8వ శ్లోకాన్ని బట్టి రామమూర్తిగారు నిర్ణయించారు. తూర్పుగాంగుల వంశవృక్షాన్ని రూపొందించారు.

ఈ శాసన పరిష్కరణను అవకాశంగా తీసుకొని గాంగుల రాజధాని నగరం అందరూ భావించేటట్టు గంజాం జిల్లాలోని కళింగపట్నం అనేది రేవు కాదనీ ముఖలింగమే కళింగ నగరమని మరికొన్ని శాసన ప్రమాణాలతో రామమూర్తిగారు నిరూపించారు. రామమూర్తిగారి ఈ నిర్ణయాన్ని తరవాత పండితులందరూ ఆమోదించారు. స్టెన్‌కోనొగారు ఎపిగ్రాఫికా ఇండికా తొమ్మిదో సంపుటి (పుట.95)లోనూ విన్సంట్ స్మిత్ తన 'ఎర్లీ హిస్టరి ఆఫ్ ఇండియా (పుట.498)లోనూ హుల్ష్ ఎపిగ్రాఫికా ఇండికా పధ్నాలుగో సంపుటి (పుట.332)లోనూ రామమూర్తిగారి నిర్ణయాన్ని అంగీకరిస్తున్నట్టు రాశారు.[5] తన పరిశోధనా ఫలితాన్ని ఇంతమంది చరిత్రకారులు ఆమోదించడం కన్నా ఎక్కువ ఆమోదం ఏ పండితునికీ ఉండదు. ''ఆపరితోషా ద్విదుషాం నసాధు మన్యే''.

1895-96లలోనే రామమూర్తిగారు మరొక శాసనాన్ని చదివి ఎపిగ్రాఫికా ఇండికా నాల్గవ సంపుటిలో ప్రకటించారు.[6] దీన్ని ధీర్ఘాసి శాసనం అంటారు. గంజాం జిల్లా కళింగపట్నం దగ్గర దీర్ఘాసి అనే గ్రామం ఉంది. అక్కడ ఒక శాసనంలో మొదట పదహారు పంక్తులూ సంస్కృతంలో ఉన్నాయి. తరువాత ఏడు పంక్తులూ తెలుగులో ఉన్నాయి. శాసనకాలం క్రీ.శ.1075-6. తెలుగు భాగం సీస పద్యంలో ఉండడం విశేషం. సంస్కృత శాసనాలను ధారాళంగా చదవవచ్చుగానీ తెలుగు శాసనాలు చదవడం చాలా కష్టమని

5. The Temples of Mukhalingam - Mastanaiah, (1977) - p.2

6. Epigraphica India, Vol.IV, pp.314-318.

రామమూర్తిగారు ముఖలింగం వ్యాసంలోనే స్పష్టపరిచారు. ప్రాదెనుగు శాసనాలలోని మాటలన్నీ అర్థమయ్యేయని చెప్పజాలం అన్నారు. ఈ దీర్ఘాసి శాసనాన్ని జయంతి రామయ్యగారు తమ శాసన పద్యమంజరి ప్రథమభాగంలో పాఠభేదాలతో అచ్చువేశారు. బూదరాజు రాధాకృష్ణగారు తమ ప్రాచీనాంధ్ర శాసనములలో గిడుగువారి పాఠాలనే ప్రధాన పాఠాలుగా స్వీకరించారు.

రామమూర్తిగారిలాగే వారి పాతమిత్రులు గురజాడ అప్పారావుగారు కూడా శాసన పరిశోధనలు చేస్తూ ఉండేవారు. చెన్నపట్నం, బెంగుళూరు మొదలైన నగరాలలోని గ్రంథాలయాలలో శాసన పరిశోధనా కార్యాలయంలో ఆకరాలు సేకరించారు. 1895లో అప్పారావుగారు బెంగుళూరు హుల్ష్ దొరగారిని కలుసుకొన్నప్పుడు విన్న ఒక సంగతి రామమూర్తిగారికి చెప్పారో లేదో? పరిశోధనకు తెలుగు అసిస్టెంటును ఒకరిని నియమించాలని, ఆ ఉద్యోగం గిడుగు రామమూర్తిగారికి ఇవ్వాలని హుల్ష్ దొర మొదట భావించాడట. కాని ఆంధ్ర దేశంలో పరిశోధించవలసిన శాసనాలు మిక్కుటంగా లేవనుకొని హెచ్. కృష్ణశాస్త్రిగారిని తర్వాత నియమించారట.[7]

వాడుకభాష అదృష్టం కొద్దీ శాసనపరిశోధకునిగా గవర్నమెంటు ఉద్యోగం రామమూర్తిగారికి తప్పిపోయింది. ఈ అవకాశం రానందుకు రామమూర్తిగారు విచారించి ఉండరు. దాన్ని వారెప్పుడూ ఆశించలేదు. అయితే పరిశోధనలు చేస్తూ ఆ శాఖలో ఉండే ఉన్నతోద్యోగులైన తెల్లదొరలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ఉండేవారు. డాక్టర్ కీల్హారన్ ఆనాటి పురాతత్త్వ శాస్త్రజ్ఞులలో శాసనశాఖలో ప్రముఖుడు. ఇతనితో అప్పారావుగారూ, రామమూర్తిగారూ ఉత్తరాల ద్వారా చర్చలు జరిపేవారు.

ఆరోజుల్లోనే అల్లయ్య దొడ్డారెడ్డి కుంకుదురు శాసనాన్ని పరిష్కరిస్తున్నప్పుడు రామమూర్తిగారికి ఒక సందేహం వచ్చింది. శాసనం అర్ధోదయ పుణ్యకాలంలో ఇచ్చారు. పూర్వం గోవింద ద్వాదశి విశిష్టతను తమంతట తామే విశదపర్చగలిగినా ఈ అర్ధోదయం ఏమిటో రామమూర్తిగారికి పూర్తిగా తెలియలేదు. దానిని వివరించమని కీల్హారన్ దొరగారికి ఉత్తరం రాశారు. ఆయన వివరించారు. ''అమావాస్య, ఆదివారం, వ్యతీపాతం, శ్రవణం కలిసి మాఘ పుష్యమాసాలలో వచ్చే యోగాన్ని అర్ధోదయమంటారు'' ఇది చాలా అరుదుగా వస్తుంది. అల్లయ్య దొడ్డారెడ్డి శాసనాలలో చెప్పిన శకసంవత్సరాలు 1352కు సరైన క్రీ.శ. 1432 జనవరి 14వ తేదీనాడు అర్ధోదయం వచ్చింది. కీల్హారన్ దొరగారి పేరు చెప్పి ఈ సంగతులను రామమూర్తిగారు తమ వ్యాసంలో రాశారు.[8]

ఒక పక్క శాసన పరిశోధనలూ, మరొక పక్క సవర భాషాధ్యయనం చేస్తూనే రామమూర్తిగారు కాలేజిలో పాఠాలు చెప్తూ విద్యార్థులను ఆకర్షిస్తూ ఉండేవారు. 1905 నాటికి ఆయన వైస్ ప్రిన్స్‌పాల్ అయ్యారు. పర్లాకిమిడి కాలేజీలో ఎఫ్ఫే చదువుకొన్న తాపీ ధర్మారావుగారు గిడుగువారి గురించి తమ ఆత్మకథలో ఇలా చెప్పారు.[9]

---

7. గురజాడ రచనలు - మహాకవి డైరీలు. ద్వితీయ ముద్రణ, పుట.125
8. ఎపిగ్రాఫికా ఇండికా - అయిదో సంపుటి.
9. ''రాలు-రప్పలూ'' - పుట.67-8

''చరిత్ర భాగం: దానికి ఆచార్యులు గిడుగు రామమూర్తి పంతులుగారు, వైస్ ప్రిన్సిపాల్ అన్న పేరేగాని ప్రిన్సిపాల్‌గారికంటే పెద్దవారుగానే భావించేవారు. గిడుగువారి సలహాలేనిదే మంగువారే పనీ చేసేవారు కారు. కాలేజీ ఉద్యోగులుగాని, విద్యార్థులుగాని, గిడుగువారికి జడిసినంతగా ప్రిన్సిపాల్‌గారికి జడిసేవారు కారు. గిడుగువారంటే పెద్దపులిలాగే భయపడేవారు. వారి ప్రఖ్యాతి ఆనాటికే చాలా యెక్కువ. గ్రీసు చరిత్రగాని, రోము చరిత్రగాని వారు చెప్పినంత చక్కగా ఆనాటి మెడ్రాసు రాజధానిలో మరెవ్వరూ చెప్పలేరని ప్రతీతి. చరిత్ర చెప్తుతూంటే, ఆయా పాత్రలు ప్రత్యక్షమైనట్టు చెప్పేవారు. వారి లెక్చర్లు వింటే చాలు, పుస్తకాలు చదవనక్కరలేకుండానే పరీక్షలు ప్యాసవుతారని నమ్మకం. అప్పటికే వారికి చెవుడు వచ్చింది. దానికి కారణం గాఢమైన చదువే అంటారు. ప్రయివేటుగా చదివి ఆ రోజులలో యఫ్.ఏ; బి.ఏ. పరీక్షలు ప్రశంసాపాత్రంగా ప్యాసయ్యారు. చరిత్రలను అమోఘంగా చదివారు. ఆ దీక్షలోనే చెవుడు వచ్చిందంటారు. నేను వెళ్ళేసరికి (అంటే 190.. వారు ఛాతిమీద ఒక ట్రంపెట్ చెవిలోనికి ఒక రబ్బరు గొట్టంతో, వాడుక చేస్తూండేవారు. ఆ విశాలమయిన ముఖమూ, కనుల తీక్షణతా, దృఢకాయమూ అంతా పెద్దపులే. అందరికీ భయమే''. గిడుగువారి గురించి ఇంత విపులంగా రాసినట్టే పర్లాకిమిడి కాలేజీ గురించి కూడా తాపీవారు ఇలా విశదం చేశారు.[10]

''అప్పటి రాజావారు... చాలా అందమైన రాజ భవనమూ, చక్కని సత్రమూ కట్టించడంతో తృప్తి పొందలేదు. సింహద్వారానికి ఎదురుగా ఒక చిన్న కొండ - బోయకొండ ఉంది. ఆ కొండమీద నొక కాలేజీ కట్టించారు. సింహద్వారం నుంచి కాలేజీ వరకు విశాలమయిన రాజవీధిని నిర్మించారు. ఆ కాలేజీకి ఎడ్మండ్ కాండ్లెర్ లాంటి ఇంగ్లీషు భాషావేత్తనూ, గిడుగు రామమూర్తిపంతులుగారి వంటి చరిత్రాధ్యాపకులకూ, మంగు శ్రీనివాసరావుగారి వంటి గణితశాస్త్ర గురువులనూ, గొప్ప ఒరియా సంస్కృత పండితులనూ అలంకారులుగా నియమించారు.

''అయినా, పర్లాకిమిడి కొండల ప్రదేశమనీ, మన్యప్రాంతమనీ కాలేజీ చదువుకు - అంటే యఫ్.ఏ. చదువుకు - ఎక్కువగా విద్యార్థులు వచ్చేవారు కారు. కాబట్టి ఇతర స్థలాల నుంచి విద్యార్థులను ఆకర్షించడానికి, కాలేజీలో కొందరికి ఉచితంగా భోజనము పెట్టడమూ, కొందరికి జీతం లేకుండా విద్య చెప్పడమూ, ఇలాంటి ఏర్పాట్లు చేశారు. కాలేజీ ప్రక్కనే చక్కని రెండు భవనాలు 'కాలేజీ హాస్టల్'గా నిర్మించారు. అంతేకాదు. విశాఖపట్నం నుంచి కలకత్తా పోయే రైల్వేలో నౌపడా స్టేషన్‌గూడా నిర్మించడానికి ఏర్పాట్లు చేశారు''.

కనీసపు సౌకర్యాలూ, చక్కగా పాఠాలు చెప్పే అధ్యాపకులూ ఉన్నందువల్ల పర్లాకిమిడి కాలేజీలో చాలా ప్రతిభావంతులైన విద్యార్థులు చేరేవారు. బుర్రా శేషగిరిరావు, చిలుకూరి నారాయణరావు, తాపీ ధర్మారావు, గిడుగు సీతాపతి మొదలైనవారు

10. 'రాలూ-రప్పలూ' - పుట.64

ఉత్తరోత్తరా సాహిత్యంలో ప్రసిద్ధులయ్యారు. సీతాపతిగారు 1905లో బియ్యేలోనూ, 1907లో ఎల్.టి. పరీక్షలోనూ ప్యాసయి పర్లాకిమిడిలో ఉపాధ్యాయునిగా ప్రవేశించారు.

ఈ కాలంలోనే అంటే 1907లోనే రామమూర్తిగారి జీవితంలో ప్రధాన ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. అంతకు ముందు 1906లో గోదావరీ, విశాఖపట్నం, గంజాం జిల్లాల స్కూళ్ళ పరీక్షాధికారిగా జె.ఎ.ఏట్సు అనే దొర నియమితుడయ్యాడు. తెలుగు జిల్లాలలో ఉద్యోగం కాబట్టి ఆ భాషను నేర్చుకోవాలని యేట్సు దొర భావించాడు. మనిషిని పెట్టుకొన్నాడు.

ఈ మున్షీగారు చెప్పే తెలుగుకూ, తాను నిత్యవ్యవహారంలో వింటున్న తెలుగుకూ చాలా వ్యత్యాసాలు ఉన్నట్టు గ్రహించాడు. విశాఖపట్నంలో కాలేజీ ప్రిన్సిపాల్ అయిన పి.టి. శ్రీనివాస అయ్యంగారిని కలుసుకొని ఈ విపరీత పరిస్థితికి కారణాలు చెప్పమన్నారు. ఆయన విజయనగరంలో గురజాడ అప్పారావుగారినీ, పర్లాకిమిడిలో గిడుగు రామమూర్తిగారినీ కలుసుకొమ్మని సలహా ఇచ్చారు. వారే సరైన సమాధానాలు చెప్పగలరని విశదం చేశారు.

ఏట్సు దొర ముందు గురజాడ వారినీ తర్వాత గిడుగువారినీ 1907లో కలుసుకొన్నాడు. రామమూర్తిగారు విద్యాలయాలలో బోధించే తెలుగు, గ్రాంథిక భాషలో ఎందుకు చెప్తారో కారణాలతో సహా వివరించగలిగారుగాని ఈ విషయమై ప్రామాణికంగా ఏదైనా చెప్పడానికి తమకు అర్హతలు లేవని పండితులు వాదిస్తారని ముందే ఇలాగ హెచ్చరించారు.[11]

''పాఠములు చెప్పే ఉపాధ్యాయులు పద్యాలకు అర్థము చెప్తూ ఉన్నప్పుడు వాడుక భాష ఉపయోగించినా విద్యార్థులు మాత్రము పరీక్షలలో కావ్యభాషలోనే అర్థవివరణము చేయవలెను. ఈ విషయమంతా నేను ఇదివరకే తెలిసికొన్నాను. కాని నేనేమి చేయగలను? నేను బడులలోను, పరీక్షలకున్ను చదువుకొన్నది సంస్కృతమే కాని తెలుగుకాదు. కనుక తెలుగు పాండిత్యము నాకు లేదు. నేనేమైనా అంటే 'నీకు తెలుగు సాహిత్యము తెలియదు; కావ్య భాష రాదు; ఊరుకో అంటారు' అన్నారు మా తండ్రిగారు. 'సరే, ఈ విషయము మనము మరియొకసారి కలిసికొని చర్చించి ఏమి చేయవలెనో నిశ్చయించుకొందాము' అని ఏట్సుదొర అన్నాడు.

ఏట్సు దొర తెలుగు నిత్య బోధన విషయమేకాక, ఇంగ్లీషు డైరక్టు మెత్థడ్‌లో నేర్పడం గురించి కూడా రామమూర్తిగారితో చర్చించాడు. గిడుగువారు మొదట వొప్పుకొనలేదు. అప్పటికే సీతాపతిగారు ఈ విషయంలో ప్రవీణులు. ఆయన ఎల్.టి.లో కొత్తరకం విద్యాబోధన పద్ధతులు నేర్చుకొన్నారు. ఈ నూతన విధానం అప్పుడప్పుడే మన దేశానికి వచ్చింది. మామూలుగా ఇంగ్లీషు స్పెల్లింగు కాక ఫొనిటిక్ లిపిలో డైరక్టు మెత్థడ్‌లో ఇంగ్లీషు నేర్పడం దీని ప్రణాళిక. ఈ విషయంపై పాఠ్యగ్రంథాలు కూడా ఉన్నాయి. కొత్త విద్యా విధానాలు నేర్చుకొనడానికి రామమూర్తిగారు ఎప్పుడూ

11. సాహిత్యోపన్యాసములు - 4వ భాగం - పుట.10

సంసిద్ధులే. తమ కుమారుడు తెచ్చిన పుస్తకాలను చదివి అతడు బోధించే విధానాలను ఆమోదించి తాముకూడా ధ్వనిలిపి పద్ధతి అనుసరించారు.

తమకు తెలుగు పాండిత్యం లేదని ఏట్సు దొరకు చెప్పాక అందులో ప్రావీణ్యం సంపాదించాలని రామమూర్తిగారు భావించారు. అవసరమైతే ఏ శాస్త్రమైనా క్షుణ్ణంగా చదివి వానిని బోధించగల శక్తిని సంపాదించడం వారికి అలవాటే. ఒకసారి పర్లాకిమిడి కాలేజీలో ఒక విషమ సమస్య వచ్చింది. గిడుగువారు చక్రం అడ్డువేశారు. తాపీ ధర్మరావుగారు ఆ సంగతిని ఇలా చెప్పారు.[12]

''ఒక సమయంలో మాకు ఫిజియాలజీ (శరీరశాస్త్రం) చెప్పే మేస్టరుగారు పని మానుకొని వెళ్ళిపోయారు. పరీక్షలు మూడు నెలలలో రాబోతున్నాయి. కొత్త మేస్టరింకా దొరకలేదు. మా క్లాసుకి ఆ సబ్జక్టు చెప్పడమెలాగ? గిడుగువారు పట్టుకున్నారు. గ్రంథాలన్నీ తిరగవేశారు. నిద్రాహారాలు గూడా మానుకొని, ఏకాగ్రతతో ఆ శాస్త్రం అంతా అవగాహన చేసుకొన్నారు. ఎప్పుడూ నేర్చిన శాస్త్రం కాదు. అయినా ఒక్క వారం రోజులలో మాకు పాఠాలు చెప్పడానికి పూనుకున్నారు. దివ్యంగా చెప్పారు. నిజంగా, వెళ్ళిపోయిన వారికంటే ఎక్కువగానే చెప్పారు. ఆ సబ్జక్టు నాకే మా అందరికంటే బాగా తెలుసునని విని చాలా సంతోషించారు. నన్నొక అసిస్టెంటులాగా చేసి, కన్ను, గుండెకాయ, ఊపిరితిత్తులు, ఇటువంటి వాటిని తెప్పించి, కోయించి, ఆయా భాగాలు విద్యార్థులకు చూపించడానికి నన్నుపయోగించేవారు. ఈ ఏకాగ్రతను చూచి మేమందరమూ ఆశ్చర్యపోయేవాళ్ళము. కొందరు ఈ ఏకాగ్రతకు ముఖ్యసాధనం వారి చెవుడే అని వాదించేవారు''.

ఏకాగ్రత అన్నది రామమూర్తిగారి ప్రజ్ఞలలో ప్రధానమైనది. ఏ విషయంపై కృషి చేస్తున్నారో అది తప్ప వేరే లోకం లేనట్టే కనబడుతుంది. గాని ఇతర విషయాలను విస్మరించరు. ఏట్సు దొరతో తమకు తెలుగు సాహిత్యం గురించి ప్రామాణికమైన పరిచయం లేదని చెప్పాక దానిని సాధించడానికి అహోరాత్రులు భాషా చరిత్రలు అనే విషయంపై విస్తరమైన పరిశోధనలు చేశారు. 1907 వేసవి సెలవులలో ఏట్సు దొర విశాఖపట్నంలో ఉపాధ్యాయ పరిషత్తు సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. అందులో రామమూర్తిగారు ఒక గంటసేపు భాషా తత్వం గురించి ఇంగ్లీషులో ఉపన్యసించారు. 1908లో కూడా ఇటువంటి సమావేశాన్నే ఏట్సు దొర మళ్ళా జరిపించాడు. అప్పటికి రామమూర్తిగారు ''భాషా చరిత్రలు-తెలుగు భాషా చరిత్ర'' అనే విషయంపై సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చారు. ఈ ఉపన్యాసాలు వ్యావహారిక భాషావాదానికి నాంది ప్రస్తావనల వంటివి.

1908లో వెల్షమన్ అనే ఆంగ్లేయుడు పర్లాకిమిడికి ఫారెస్టు ఆఫీసరుగా వచ్చాడు. అడవుల్లో తిరుగుతూ సవరలతో సంభాషించాలి కనుక వాళ్ళ భాషను నేర్చుకోవాలనుకొన్నాడు. రామమూర్తిగారిని మునిషీగా పెట్టుకొందామని ఆయనను తన

12. ''రాలూ-రప్పలూ'' - పుట.74

ఇంటికి వచ్చి చదువు చెప్పమన్నాడు. రామమూర్తిగారు "నువ్వే నా దగ్గరకు రోజూ మధ్యాహ్నాం ఒంటిగంటకు వస్తే రెండు గంటల దాకా పాఠాలు చెప్తాను. నాకేమీ ఇవ్వక్కర్లేదు" అన్నారు. వెల్ష్‌మన్ అంగీకరించి శ్రద్ధగా సవరభాష నేర్చుకొన్నాడు. ఆ సంవత్సరమే ప్రభుత్వం వారు రామమూర్తిగారి చేత తెలుగు భాషలో సవర వాచకాలు, సవర–తెలుగు; తెలుగు-సవర నిఘంటువులు, కొద్దిగా సవర కథలు, పాటలు మొదలైన గ్రంథాలను రచింపచేశారు. దేహదార్ఢ్యము, ధనబలము, తీరుబడి, పెద్దల ఆచరణ, మిత్రుల తోడ్పాటూ చాలా కలిగి ఉంటేనే ఇట్టి కార్యక్రమాలు చక్కగా కొనసాగుతవి. అవి నాకు లేకపోయినవి" అని చెప్తూనే రామమూర్తిగారు ప్రభుత్వం కోరిన పుస్తకాలన్నీ ప్రారంభించారు.[13]

1909–10లో ప్రభుత్వం వారు విద్యావిధానంలో పెద్దమార్పులు ప్రవేశపెట్ట దలిచారు. ఎటువంటి మార్పులు అవసరమో తెలియచేయమని విద్యాసంస్థలనూ, విద్యాధికులనూ కోరుతూ ఒక ప్రశ్నావళిని పంపారు. ప్రతిమండలంలోని పెద్ద మనుష్యులు తమ అభిప్రాయాలను పంపారు. విద్యార్థులు వ్యాస రచనలోనూ, అనువాదంలోనూ ఎటువంటి భాషను ఉపయోగించాలన్న విషయం చర్చనీయాంశమైంది. 1910లో ఏట్సుదొర మూడవ ఉపాధ్యాయ పరిషత్తు సమావేశం ఏర్పాటు చేశాడు. అందులో రామమూర్తిగారు ప్రసంగించి వ్యావహారిక భాషాప్రయోజనం గురించి స్పష్టం చేశారు.

ప్రభుత్వంవారు తలపెట్టిన విద్యావిధానంలో మార్పులు అమలులోనికి వచ్చాయి. మెట్రిక్యులేషన్ పరీక్షస్థానంలో స్కూలు ఫైనలూ, ఎఫ్పికి బదులు ఇంటరు తరగతీ ప్రవేశించాయి. ఈ రెండు స్థాయిల్లోనూ విద్యార్థులకు మాతృభాషలో వ్యాసరచన, అనువాదం అన్నవి పాఠ్యాంశాలు. ఏ రకమైన భాషలో వీటిని రచించాలన్నది పెద్ద ప్రశ్న. వాడుకభాషనే ఉపయోగించాలని రామమూర్తిగారూ, వారి మిత్రులు సూచించారు. కొన్ని షరతులతో ప్రభుత్వం ఈ వాదాన్ని ఆమోదించింది. ప్యూడలు వర్గాల వారిలో గంగవెర్రులు ప్రారంభమైనాయి. ప్రజల వాడుక భాషను గ్రామ్యమని దూషించి తమ వేడుక భాష అయిన గ్రాంథికాంధ్రమే సలక్షణమని, అందులోనే అనువాదాలు, వ్యాసరచన విద్యార్థులు చేయాలని ఆందోళన లేవదీశారు. ఈ వివాదం 1911 నుండి రెండు దశాబ్దాలపైన కొనసాగింది. ఈ వాడుక భాషల యుద్ధం గురించి సవిస్తరంగా వేరే ప్రకరణంలో చెప్పుకొందాం. ప్రస్తుతం రామమూర్తిగారి జీవితంలోని ఇతర విశేషాలను తెలుసుకొందాం.

1911లోనే రామమూర్తిగారు ఉద్యోగం నుండి రిటైరు అయ్యారు. అప్పటి వారి వయస్సు 48 సంవత్సరాలే అయినా 1880 నుండి 30 సంవత్సరాలు పర్లాకిమిడి విద్యాసంస్థల్లో పనిచేయడం వల్ల రిటైరుమెంటుకు, దానివల్ల కలిగే సౌకర్యాలకు అర్హులయ్యారు. 1910–11లో అప్పటి పర్లాకిమిడి రాజా మరణించాడు. ఎస్టేటు

13. G.V. Ramamurthy - 'Telugu - Savara Dictionary' P.III of the Preface.

అజమాయిషీ కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారి వశమైంది. సరిగ్గా ఇదే కాలంలో చెన్న రాజధాని విద్యావిధానంలో మార్పులు వచ్చాయి. స్కూలు ఫైనల్స్, ఇంటర్‌క్లాసులు ప్రవేశపెట్టి విద్యాసంవత్సరం వేసవి తర్వాత ప్రారంభం చేశారు. ఉపాధ్యాయులకు గ్రాట్యుయిటీ ఇచ్చే పద్ధతి ఏర్పాటు చేశారు. రిటైరయితే రామమూర్తిగారికి ఎనిమిదివేల రూపాయిలు గ్రాట్యుయిటీ వస్తుంది. రాజ్యానికి వారసుడు మేజరై వ్యవహారాలు చూసుకొనేటప్పుడు ఈ గ్రాట్యుయిటీ పద్ధతికి మారుగా పాత పింఛను విధానాన్నే కొనసాగిస్తే రామమూర్తిగారికి చాలా నష్టమొస్తుంది. పెద్ద మొత్తం చేతిలో పడితే భూములు కొనుక్కోవచ్చు. 1911లోనే జార్జి చక్రవర్తి పట్టాభిషేకోత్సవ సందర్భంలో రామమూర్తిగారికి ప్రభుత్వం సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్‌ను ఇచ్చింది.

రిటైరు అయ్యాక రామమూర్తిగారు పరీక్షకు చదవినట్లు తెలుగుభాషా సాహిత్య గ్రంథాలూ, కావ్యాలూ, వ్యాకరణాలు చదవడం ప్రారంభించారు. ఎక్కడ ఏ కొత్తభాషా శాస్త్ర సమావేశాలు జరిగినా అక్కడకు వెళ్ళసాగారు. 1912 డిసెంబరులో మద్రాసు విశ్వవిద్యాలయం వారు లండన్ యూనివర్సిటీలో ఫొనిటిక్స్ శాస్త్రాచార్యుడైన డేవిడ్ జోన్స్ చేత పదహారు ఉపన్యాసాలు ఇప్పించారు. రామమూర్తిగారు సీతాపతిగారితోపాటు చెన్నపట్నం వెళ్ళి ఆ ఉపన్యాసాలన్నీ విన్నారు. ఆ సిద్ధాంతాలను తెలుగు భాషా చరిత్రకు వర్తింపచేశారు. ప్రొఫెసర్ జోన్స్‌తో చర్చలు జరిపారు. జోన్స్ రామమూర్తిగారిని సర్వదా జ్ఞాపకం పెట్టుకొనేటంత ఇష్టులయ్యారు. లోగడ రామమూర్తిగారి దగ్గర సవరభాష నేర్చుకొన్న ఫారెస్టు ఆఫీసరు వెల్ష్‌మన్ పర్లాకిమిడి ప్రాంతాలకు వచ్చే ఆంగ్లేయులకు, కొత్తగా పదవి స్వీకరించే కలక్టర్ మొదలైన సివిల్ సర్వెంట్లకు రామమూర్తిగారి విశిష్టతలు చెప్పేవాడు. రామమూర్తిగారు తమ సొంత డబ్బుతో సవరలకు బడులు పెట్టారు. ప్రభుత్వంవారు రాసి ఇమ్మన్న గ్రంథాలు పూర్తిచేసి ఇస్తున్నందుకు ప్రతిఫలం ఏమికావాలని అధికారులు అడిగితే ''నాకేమీ ఇవ్వక్కర్లేదు, సవరల విద్యాభివృద్ధికి తోడ్పడండి అదే పదివేలు'' అన్నారు. వెల్ష్‌మన్, మ్యాన్‌మైకేల్ అనే కలక్టరు రామమూర్తిగారి సవరపుస్తకాల ప్రచురణకు ప్రయత్నాలు ప్రారంభించారు.

1913 ఇంగ్లీషు సంవత్సరాదినాడు ప్రభుత్వంవారు రామమూర్తిగారికి 'రావుసాహెబ్' బిరుదును ఇచ్చి సత్కరించారు.

ఫొనిటిక్స్ ప్రొఫెసర్ జోన్స్ స్వదేశానికి వెళ్ళిపోయినా రామమూర్తిగారిని మరిచిపోలేదు. 1913లో వారికో లేఖ రాశాడు. ఐరోపావారు బోధపరచుకోగల ఒక తెలుగు రీడర్ ఫొనిటిక్ స్క్రిప్టులో తెలివిడి ఆంగ్లభాషలో తెలియజేస్తూ వ్రాసి పంపించవలసిందిగా కోరాడు.[14] జోన్స్ కోరిన వాచకాన్ని రచించడమే కాదు, టైపు చేసి పంపాలి. అందుచేత ఫొనిటిక్ టైపురైటర్ మిషన్ ఒకటి పంపితే ఆ గ్రంథరచన సాధ్యమౌతుందని రామమూర్తిగారు రాశారు. జోన్స్ దానిని పంపించారు. (1914లో రచించి టైపు చేయించి ప్రొఫెసర్ జోన్స్‌కు పంపించారు. అందినట్టు చెప్తూ జోన్స్ తన కృతజ్ఞతలు తెలియచేస్తూ ఉత్తరం రాశారు. తరువాత ఆ గ్రంథం ఏమైందో చాలాకాలం

14. గిడుగు సీతాపతి - స్వీయచరిత్ర - పుట.44

దాకా తెలియదు.)[15] తెలుగు భాషను గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి'' అని ఈనాటి భాషాశాస్త్ర పీఠాలలోని ఆచార్యులు శ్లాఘిస్తున్నారు.[16]

ఉద్యోగ విరమణ చేశాక ఖాళీగా ఉన్నారని రామమూర్తిగారికి గురజాడ అప్పారావుగారు విజయనగరం కోటలో ఒక ఉద్యోగం వప్పుకోమని కోరారు. సంస్థానం రాచబిడ్డలకు ట్యూటరు కావలసి వచ్చింది. విద్యాబోధనలో ఆరితేరిన రామమూర్తిగారు ఇందుకు తగినవారని అప్పారావుగారి నమ్మకం. రామమూర్తిగారు అంగీకరించారు. అయితే పాతపద్ధతులలో కాక తమ డైరక్టు మెత్థడులో పాఠాలు చెప్పసాగారు. కోటలో ఉద్యోగం అంటే రాజాగారు ఏర్పాటు చేసే పాటకచ్చేరీలకు, ఇతర కార్యక్రమాలకు కూడా హాజరవ్వాలి. రామమూర్తిగారు ఏదో సాకు చెప్పి తప్పించుకొంటూ ఉండేవారు. ఒకసారి వెళ్ళక తప్పిందికాదు. అప్పుడు జరిగిన విషయాన్ని సీతాపతిగారు ఇలా కథనం చేశారు.[17]

''సభా సదులందరును నేలపై పరచిన తివాచీలపై కూర్చున్న తర్వాత రాజావారు వేంచేసి ఒక సోఫాలో కూర్చున్నారు. వారితో వచ్చిన వేశ్య వారి ప్రక్కను సోఫాలో కూర్చున్నది. మా తండ్రిగారు ముప్పదేండ్ల నుంచి సానిమేళాలు చూడరాదన్న దీక్ష వహించినవారు; కనుక ఈ దృశ్యము చూసి అక్కడ కూర్చుండటకు ఇష్టముకాక అప్పారావుగారి వైపు తిరిగి నేను వెడలిపోతానన్నట్లు అభినయించారు. అప్పారావుగారు వారి ఉద్దేశము తెలిసికొని ఒక్కక్షణము ఆగు, నేను కూడా వస్తాను ఇద్దరం కలిసే వెళ్దామన్నట్లు అభినయముతోనే తెలియజేసి, నిలువబడి ''మహారాజా! మొన్న తమరు సెలవిచ్చిన రాచకార్యము ఇప్పుడు చేయవలసి వచ్చినది. ఆ విషయములో గిడుగు రామమూర్తి కూడా తోడ్పడవలసియున్నది. కనుక మా ఇద్దరికి ఏలినవారు అనుజ్ఞ దయచేసిన యెడల మేము వెళ్తున్నాము'' అన్నారు. సరే అన్నారు మహారాజావారు. ఆ మరునాడే నేను విజయనగరము వెళ్ళినపుడు నా తండ్రిగారి ముచ్చట చెపుతూ ''రాజుల తృప్తికోసము ఇటువంటి అబద్ధాలు ఆడవలసి వస్తూందిరా; అదే మనకు కష్టముగా కనబడుతున్నది'' అన్నారు''.

ఈ ఉదంతానికి తోడు ఇంకొకటి జరిగింది. కోటలోని వారు కొందరు రాణీగారితో చాడీలు చెప్పారు. రామమూర్తిగారు సంప్రదాయ సిద్ధమైన పద్ధతులలోకాక

15. ఉత్తరోత్తరా ఆ గ్రంథం వైనాలు తెలిశాయి. 1933 జూలైలో సీతాపతిగారు జోన్స్‌ను ఇంగ్లండులో కలుసుకొన్నప్పుడు ఆయన చెప్పిన విషయాలు ఏమిటంటే ఆ గ్రంథాన్ని తీసుకొని జోన్స్ జర్మనీ వెళ్ళాడు. జర్మనీలో మొదటి ప్రపంచ యుద్ధం వచ్చినప్పుడు తాను బ్రిటీషు దేశీయుడు కనుక జర్మన్లు తనను బంధిస్తారన్న భయంతో ఆ పుస్తకాన్ని అక్కడే వదిలి ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు. యుద్ధం ముగిశాక 1920లోగాని ఆ పుస్తకం జోన్స్ చేతికి రాలేదు. ఈ పుస్తకాన్నే పాఠ్యగ్రంథంగా జోన్స్ ఉపయోగించి ద్రావిడ భాషల ధ్వని లిపి విద్యార్థులకు బోధించడానికి ఫర్త్ అనే లెక్చరర్‌కి యిచ్చారు. గ్రంథం అచ్చుపడలేదు. గిడుగు సీతాపతి స్వీయ చరిత్ర – పుట 44–5

16. చేకూరి రామారావు – మరోసారి గిడుగు రామమూర్తి, పుట.95

17. సాహిత్యోపన్యాసములు – 4వ సంపుటం, పుట.23

కొత్త పద్ధతిలో పాఠాలు చిత్తమొచ్చినట్టు చెప్తున్నారని ఫిర్యాదు చేశారు. రాణీగారు పాతపద్ధతిని చెప్పమన్నారు. రామమూర్తిగారు ఇష్టపడలేదు. అయితే ఈనెలాఖరు నుంచి పని విడిచిపెట్టమని ఉత్తరువు. నెలాఖరెందుకు రేపటినుంచే మానేస్తున్నానన్నారు రామమూర్తిగారు. ''రాజుల కొలువులో కుమ్మరి పురుగువలె వ్యవహరించడమునకు నేనలవాటు పడ్డాను. నీ తండ్రి అలవాటు పడలేదు'' అని గురజాడ అప్పారావుగారు సీతాపతిగారికి చెప్పారు. తాము ఇంకా రాచకొలువునుండి తప్పుకోదలిచారు. 1913 ఫిబ్రవరి 12వ తేదీనాడు సంస్థానం నౌఖరీ నుండి పింఛను పుచ్చుకొన్నారు.

ఉద్యోగం విడిచిపెట్టినా రామమూర్తిగారు విజయనగరం వెంటనే విడిచిపెట్టలేదు. ఒక సంవత్సరంపాటు అక్కడే వున్నారు. ముగ్గురు నలుగురు పిల్లలకు తమ పద్ధతిలో ఇంగ్లీషు నేర్పుతూ గురజాడవారితో వాడుక భాషోద్యమం వ్యూహాలను ఆలోచిస్తూ ఉండేవారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో సంస్కృత మాతృభాషల బోధనపై ఒక నివేదికను గురజాడవారు రాస్తూ తెలుగుభాషకు ఒక ప్రొఫెసర్ని నియమించే ఉద్దేశం విద్యాశాఖవారికి ఉన్నదని తెలుసుకొని ఆ విషయంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలియచేశారు. ఆ నివేదికలో ఇలా రాశారు.[18]

"Telugu studies have made so little progress that it is futile to think of founding a Professorship in Telugu. At present no material exists on which a Professor could work. Except Rao Saheb Mr. G.V. Ramamurthi Panthulu of Parlakimidi there is hardly one scholar, Indian or European, who can claim to have made a scientific study of the language. No living Native or Eurupean Scholar has published works on the Telugu Language or Literature which entitle him to a Professorship. It is absurd to create a Professor that he may acquire proficiency and teach."

ఈ నివేదిక సమర్పించి గురజాడ అప్పారావు రామమూర్తిగారిని తెలుగు పరిశోధకునిగా నియమించమన్నారు. కాని కట్టమంచి రామలింగారెడ్డిగారు అడ్డంగా తగిలారు. ''రామమూర్తిగారు 50 ఏళ్ళు దాటినవారు. ఈ ఉద్యోగానికి 30 ఏళ్ళకు మించని వాళ్ళు కావాలి. ఎందుకంటే పరిశోధన ఎలా చేయాలో శిక్షణ పొందడానికి జర్మనీ మొదలైన దేశాలకు వెళ్ళవలసి వస్తుంది'' అని రెడ్డిగారు కారణాలు చెప్పారు. రామమూర్తిగారిని కాకపోయినా వారి శిష్యుడు బుర్రా శేషగిరిరావుగారికి ఆ ఉద్యోగం లభించింది. రామమూర్తిగారు వాడుక భాషపై పరిశోధనలకీ, సవరభాషపై పుస్తక ప్రచురణకూ అంకితమయ్యారు.

రామమూర్తిగారు నిర్మించిన తెలుగు సవర నిఘంటువు 1914లో ప్రచురితమైంది. దీని ఉపోద్ఘాతంలో వారు ఏ పద్ధతుల ప్రకారం ఈ రచన చేసినదీ ఇలా చెప్పారు :

''ఇది తెనుగు మాటలకు సరి అయిన సవరమాటలు గల నిఘంటువు. చాలాచోట్ల సవరమాటలు వాక్యములలో ప్రయోగించి అవి యేలాగున వాడుక చేయడమో

18. Unilit - Homage ot Gurazada - p.39

కనపర్చడమైనది. కొన్ని క్రియలకు వేరువేరు కాలములలో రూపములు ఎట్లా ఉంటవో కూడా తెలియచేయడమైనది. కొన్ని తెలుగు మాటలకు సరి అయిన సవరమాటలు దొరకనప్పుడు, తెలుగు మాటల అర్థము మాత్రం సవరమాటలలో చెప్పడమైనది.

''దేవత'' అనే మాటకు సవరలు వాడుక చేసే మాటలు వ్రాసి, సవరలు కొల్చే దేవతల పేర్లు 72 చేర్చడమైనది. ఏ దేవత ఎట్టిదో వివరముగా తెలియదు. ఉదయమునుంచి సాయంకాలము వరకు సూర్యుడిగమనము పట్టి వేళ తెలియజేసే మాటలు సవరలు వాడుకొంటారు; అవి అన్నీ ''సూర్యుడు'' అనే మాటకింద చేర్చడమైనది. ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ చేసుకొనే ముస్తాబును గురించిన మాటలు ''శృంగారించుకో'' అనే మాటకింద చూచేది. ఈలాగే ''కూర'', ''బట్ట'', ''కుండ'' మొదలైనమాటల కిందనే వాటి విశేషములు చూచుకొనేది. సమానార్థములు గల తెలుగుమాటలకు సవరమాటలు వ్రాసినప్పుడు ఒక మాట కింద వ్రాసినవే కింద ఇంకొకమాట కింద వ్రాయవలెను. గనుక, ఏదో ఒక దానికింద వ్రాసి అవి చూచుకోవలెను అని తక్కినవాటికింద చెప్పడమైనది.

''కొన్ని సవర వాక్యములకున్ను, సమాసములకున్ను, ముక్కముక్కకు అవయవార్థము చెప్పి, భావముకూడా చెప్పడమైనది.

''సాధ్యమైనంతవరకు సవరమాటలకు వ్యుత్పత్తి కనపర్చడమైనది. ఇది వ్యాకరణములో విపులముగా చెప్పడమవును.

''సవరమాటలకు ఈ కిందను చెప్పిన చొప్పున రూపాంతరములు కలుగుతవి. కొన్నిటికి మాత్రమే రూపాంతరములు ఈ నిఘంటువులో చెప్పివున్నా, తక్కినవి సులభముగా గ్రహించవచ్చును. సవరభాష మాతృభాషగా మాట్లాడేవారు తప్ప ఇతరులు రూపాంతరములు కల్పించి వాడుక చేయలేరు. ఈ కింద కనపర్చిన పట్టీలు వాడుకలో ఉన్న రూపాంతరము గ్రహించడానికి పనికి వస్తవిగాని, వాడుకలో లేనివి కల్పించడానికి పనికిరావు. సవరవాళ్ళ వాడుకే ప్రమాణము. కొన్ని గ్రామములలో ఒక విధమైన రూపమున్నూ మరికొన్ని గ్రామములలో మరి ఒక విధమైన రూపమున్నూ వినబడును. మాటలో ఉన్న వర్ణములలో కొందరు ఒకలాగున, మరికొందరు వేరే ఒకలాగున, ఈది పలకడము చేత ఉచ్చారణలో భేదము కలుగుతుంది.

రూపాంతరములు :

ఇ - ఎ	:	ఇరా - ఎరా
ఉ - ఒ	:	జుమా - జొమా.
ఇర్- ఉర్	:	పిర్తాఇ - పుర్తాఇ.
ఉ- అ	:	ఉరుజ్‌తాఇ - అరుజ్‌తాఇ
కు- తు	:	కుంపెడా - తుంపెడా
గ- డ	:	ఇగ్- గోజ్ - ఇడ్- డోజ్
డ - జ	:	డిమానా - జీమానా

ఇ - జ్	:	బొఇ - బోజఙ్
ఇ - న	:	ఇేఙ్ -న్యేఙ్
జ్ - న్	:	డజిజ్ - డజి
డ - ర	:	బిడా - బిరా; తుడ్రు - తుర్రు
న - ల	:	నేబు - లేబు
	:	తరోజల్ - త్రోజల్
	:	అనిఙ్ - మొనిఙ్
హ్రస్వ, దీర్ఘ	:	గొపారి - గోపారీ

కొందరు పలికినప్పుడు కొన్ని మాటలకు అకారము పూర్వమందున్నట్టు ఉంటుంది. నిఘంటువులో ఒక రూపము కనబడకపోతే రూపాంతరముగల మాట గ్రహించుకొనేది.''

రామమూర్తిగారు విశదం చేసిన విషయాలు తెలుగు నిఘంటు నిర్మాణానికి కూడా పనికి వస్తాయి. ఆయన రూపాంతరాలు అనే అంశం కింద ఇచ్చిన ధ్వని మార్పులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి ఆధ్వర్యాన ఆంధ్ర సాహిత్య అకాడమీ వారు 1958లో మాండలిక వృత్తి పదకోశాలను ప్రారంభించినప్పుడు మొదటి సంపుటం (వ్యవసాయం)లోనే ఉచ్చారణ విధేయంగా పదాలను సేకరించడం వల్ల ఎన్నెన్నో లభించాయి. ఉదాహరణకి 'ఇసక' అన్న మాటకే ఉచ్చారణ భేదాలుగా 'ఇసికె, ఇసెక, ఇస్క, ఉసికె, ఉసెక, ఉస్కె' అనే మాటలు సేకరణలో దొరికాయి.

''ధ్వనులు మార్పు ఫలితంగా ఏర్పడ్డ రూపభేదాలన్నీ - ప్రాచీనాలయినా అర్వాచీనాలయినా, ప్రాంతీయాలయినా భాషా పరిణామాన్ని అర్థం చేసుకోటానికి సమానార్థతగల శాస్త్ర విషయాలు అవుతాయి కాబట్టి వాటిల్లో యే ఒక్క రూపాన్నీ నిరాకరించడానికి వీలు లేదు.''[19] అనే ఉత్తమ దృక్పథంతో శ్రీ కృష్ణమూర్తిగారు ఈ రూపభేదాలలో ఏది ప్రధానమైనదో నిర్ణయించి, దానిని ఆరోప పదంగా ఇచ్చి మిగతావాటిని ఉచ్చారణ భేదాలుగా సూచిస్తూ పట్టికలు తయారుచేశారు. ఇది రామమూర్తిగారు 1914లో ప్రారంభించిన శాస్త్రీయ దృక్పథంలోని ధ్వని మార్పులను బట్టి రూపాంతరాలు చూపెట్టే ప్రామాణిక మార్గంలో ఆధునిక ప్రస్థానమే.

రామమూర్తిగారు తమ సవర నిఘంటువులో సూర్యుడు అన్న ఆరోపం కింద 26 వేళా విశేషాలు చెప్పారు. ''సూర్యుడు రెక్కలు ఆడించడం, ఎర్రబడడం, అంచుకు రావడం మొదలుకొని సాయంకాలం దిగిపోతూ దిగిపోతూ ఉండడం, మునిగిపోవడం, మూతపడడం'' దాకా చెప్పి ''చుట్టాలను పోల్చలేని దృష్టి కలగడం'', 'ఆకులు ముడుచుకొనేవేళ' దాకా వివరాలున్నాయి. మన తెలుగు గ్రామీణులు కూడా పొద్దుగురించి వివిధ పదబంధాలు వాడుతారు. అయితే అవి మనకోశంలో ఎక్కువు. రామమూర్తిగారి

19. మాండలిక వృత్తి పదకోశం - మొదటి సంపుటం (వ్యవసాయం), ప్రథమ ముద్రణ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1962

ఇతర నవర రచనలు లభిస్తే ఎన్నో విశేషాలు దొరకవచ్చు. అవి రమారమి అలభ్యాలు. వారు తెలుగు వ్యావహారిక భాషపై రాసినవే కొన్ని నేడు దొరకవు.

గురజాడ అప్పారావుగారు ఒక్క సృజనాత్మక వాదము చేస్తున్నా మద్రాసు విశ్వవిద్యాలయం కమిటీలో వాడుక భాషకోసం సమరం సాగిస్తున్నా చరిత్ర రచనపట్ల ఆరాటపడుతూ ఉండేవారు. కళింగదేశ చరిత్ర పూర్తికాలేదే అన్న బాధకు తోడు ఆరోగ్యం క్షీణించసాగింది. వైద్యపరీక్షకోసం, చికిత్సకోసం అప్పారావుగారు విశాఖపట్నం వెళ్ళారు. ఈ సంగతి తెలిసి రామమూర్తిగారు ప్రాణమిత్రుణ్ణి చూడడానికి వెళ్ళారు. చూశారు. ఈ అనుభవాన్ని తర్వాత ఒక లేఖలో చెప్పారు.

''ఎలా వున్నదో చూసివద్దామని విశాఖపట్నం వెళ్ళాను. ఆఖరిసారి చూడడం. నేనతన్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు డాక్టరు నాకిలా సలహా యిచ్చాడు. ''మీరు యెదట కనిపించేసరికల్లా ఆయన ఉద్రేకం పట్టలేకపోతున్నారు. అదేపనిగా, జబ్బుమాటే మరచి, మీతో సాహిత్యగోష్ఠి చేస్తున్నారు. చారిత్రక విషయాలను గురించీ, సారస్వతాన్ని గురించి చర్చలు జరుపుతున్నారు. విపరీతమైన అలసట కలుగుతున్నా లెక్కచేయడం లేదు. ఇలా అయితే ఆయన ఆరోగ్యం పాడవుతుంది కదా! డాక్టరు అతనికి ఉత్తరాలు రాయవద్దని నాకు చెప్పాడు. నాటినుంచి అతనికి ఉత్తరాలు రాయడం మానుకొన్నాను''.

జబ్బుపడ్డ దగ్గర్నుంచీ అప్పారావుగారికి ''కళింగదేశ చరిత్ర'' గురించే బెంగ పట్టుకొంది. అన్నేళ్ళుగా చేసిన శాసనపరిశోధనల ఫలితం జాతికి ఇవ్వలేకపోతున్నాననే వ్యధ వ్యాకులపర్చసాగింది. ''మీరే అది రాస్తారు. లేకపోతే మీ అంత సమర్థులచేత అది పూర్తి చేయిస్తాను'' అని సంస్థానం కలెక్టరు ఫౌలరుదొర హామీ ఇచ్చాడు. దొర దృష్టిలో రామమూర్తిగారే వుండి వుంటారు. గిడుగువారు ఈ చరిత్ర రచనను సమకూర్చడానికి ప్రయత్నించారు గాని ఆయనకు అవకాశం చిక్కినట్లు కనిపించదు అని గిడుగు - గురజాడలకు సమీపకాలస్థులయిన కిళాంబి రంగాచార్యులుగారు చెప్పారు.[20]

అప్పారావుగారు 1915లో చనిపోయారు. వారి అస్తమయంతో రామమూర్తిగారు వ్యావహారిక భాషోద్యమంలో రమారమీ ఒంటరివారయ్యారు. పూర్వం ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలలో ఇతరత్రా తమకు చేదోడు వాదోడుగా ఉన్న ప్రాణమిత్రుడు ఇక లేడు. ఈ సమరంలో సారథీ, మహారథీ తామే కావలసి వచ్చింది. అయినా వారు ద్విగుణీకృత బాధ్యతతో ఆ పోరాటాన్ని సాగించారు. సనాతన పండితులతో సంకుల సమరం చేస్తూ తెలుగు జిల్లాల్లో కాలేజీలు ఉన్న ప్రతి ఊరికీ వెళ్ళి తమ వాదాన్ని ప్రజలకు వినిపించి చాలామందిని తమవైపు తిప్పుకోగలిగారు. 1919 నాటికి, వీరేశలింగంగారిచేతనే తమ ఉద్యమాన్ని ఆమోదింపచేశారు. ఆ యేడే 'తెలుగు' అనే పత్రికను నడిపారు. ఇక్కడ టూకీగా చెప్పుకొన్న ఈ సంగతులను 'వాడుక వేడుక భాషల యుద్ధం' అనే ప్రకరణంలో సవిస్తరంగా చెప్పుకొందాం.

వ్యావహారిక భాషావాదం ఉద్యమరూపం సంతరించుకొన్నాక రామమూర్తిగారు శాసనసేకరణా పరిష్కరణా విషయాల్లో ఎక్కువకాలం వినియోగపర్చలేకపోయారను

20. గురజాడ రచనలు - సంపుటి 5 - పుట.245

కోవాలి. ఆ బాధ్యతలన్నీ వారు చిలుకూరి నారాయణరావుగారి మీద పెట్టినట్టున్నారు. తూర్పు గాంగుల ఆరు తామ్ర శాసనాలను సంపాదించి నారాయణరావుగారు ప్రభుత్వానికి పంపారు. వాటిని నమోదు చేసుకొని తిరిగి నారాయణరావుగారికా గుత్తళాలు పంపించేశారు. ఈ శాసనాలను 'మ.రా.రా. శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు, మ.రా.రా.శ్రీ చిలుకూరి నారాయణరావుగారు పరిష్కరించి ఎపిగ్రాఫికా ఇండికాలో ప్రకటించ నున్నారు'' అని 1919 ఆగస్టు హోం (విద్యా) శాఖ గెజిట్ (నె,.1003)లో ప్రకటించారు. అయితే రామమూర్తిగారు తీరికలేక ఆ పనికి పూనుకోలేదు. తూర్పు గాంగుల ఆరు కొత్త శాసనాలను 1933లో రాళ్ళబండ సుబ్బారావుగారు గిడుగువారి గౌరవార్థం ప్రచురించిన వ్యాస సంగ్రహంలో ప్రకటించారు.

1924 అక్టోబరు 13వ తేదీ రామమూర్తిగారికి ఒక రకంగా విజయోత్సవ దినం. ఆనాడు ''ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు వ్యావహారిక భాషా బహిష్కారము రద్దు చేసి మాతృభాషా గౌరవమును, తమ గౌరవమును నిలబెట్టుకొన్నారు''[21] ఇక విద్యాశాఖ వారినీ, విశ్వవిద్యాలయాలనూ మాత్రమే తమవైపుకు తిప్పుకోవాలి. ఇది మెల్లగా చేయవలసిన పని. ఇతర వ్యాపకాలపైన కూడా రామమూర్తిగారు దృష్టిని తిప్పడానికి వీలు చిక్కుతోంది.

1927లో మద్రాసు ప్రభుత్వంవారు రామమూర్తిగారికి ఒక విన్నపం చేశారు. పూర్వం తెలుగులో సవర వాచకాలు, నిఘంటువులు మొదలైనవి రాశారు. అవి తెలుగు లిపి వచ్చిన వారికే అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు విస్తృతమైన పరిధిలో సవరలపైన సమాచారాన్ని వాంఛిస్తోంది. దానిని రామమూర్తిగారే ప్రసాదించగలరు. అందుచేత సవర వ్యాకరణాన్నీ సవర - ఇంగ్లీషు; ఇంగ్లీషు-సవర నిఘంటువులు, సవర మాన్యువల్ ఆంగ్లభాషలో రచించి ఇమ్మన్నారు. ఇది తమ ఒక్కరి వల్ల అయ్యేది కాదు. అందుచేత సీతాపతిగారిని పిలిచి సవర భాషను క్షుణ్ణంగా నేర్చుకొని తమకు తోడ్పడుతానంటే ఈ కార్యాన్ని చేపట్టగలను, లేదా వీలుకాదని ప్రభుత్వానికి చెప్పేస్తామనీ అన్నారు. సీతాపతిగారు అంగీకరించారు. రామమూర్తిగారు తాము 30 సంవత్సరాలు శ్రమపడి నేర్చుకొన్న సవర భాషను తమ కుమారునికి ఆరు మాసాలలోనే అంతా పట్టబడేటట్టు బోధించారు. ఇంగ్లీషులో సవరలపైన పుస్తక రచనలు ప్రారంభమయ్యాయి.

1928లో రామమూర్తిగారు ఒక కన్యాదానం చేశారు. ఆమె తమ కూతురు కాదు. ఇంకొకరి కుమార్తె. వితంతువు. పర్లాకిమిడి కాలేజీలోనే బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారనే గొప్ప పండితులు ఉన్నారు. తెలుగు చెప్పేవారు. మల్లయ్య శాస్త్రిగారు ధర్మశాస్త్రాల ప్రకారం తమ వితంతు పుత్రికకు వివాహం చేయవచ్చునని భావించారు. వారి నిర్ణయాన్ని రామమూర్తిగారు, మరికొందరు మిత్రులు ఆమోదించారు. వరుడు కూడా దొరికాడు. శ్రీపాద కృష్ణమూర్తిగారి శిష్యుడు, శతావధాని, పాత కవిత్వాన్ని విడిచిపెట్టి భావకవిత్వం

21. చలం గారి 'చిత్రాంగి'కి రాసిన ఉపోద్ఘాతంలో గిడుగువారు ఈ సంగతి విశదం చేశారు. వ్యాసావళి - పుట.127

లోనికి అడుగుపెడుతున్న వేదుల సత్యనారాయణశాస్త్రి వివాహానికి అంగీకరించాడు. ఆమె తల్లిదండ్రులు మళ్ళా ఇంకొకరికి దానం చేయడం శాస్త్రం ఒప్పుకోదు. అందుచేత రామమూర్తిగారు ఆమెను తన కుమార్తెగా స్వీకరించి ధర్మపత్నీ సమేతంగా పీటలమీద కూర్చొని కన్యాదానం చేశారు. పర్లాకిమిడిలో కొందరు ఈసడించినా సంస్కరణాభిలాషులు హర్షించారు.

సంస్కరణ పట్ల సుముఖత రామమూర్తిగారికి ఆదినుంచీ ఉంది. లోగడ ఇరవైఏళ్ళ కిందట 1908లోనే ఆయన ఒక వితంతు వివాహం జరిపించాలని భావించారు. పరిస్థితులు కలిసిరాక అది ఆగిపోయింది. అయినా విదేశాలకు సముద్రయానం చేసి వచ్చిన మిత్రులకు తమ ఇంట్లో ఆ తొలి దశాబ్దంలో విందులు చేసి రామమూర్తిగారు వెలికి గురయ్యారు. అయినా దానిని ఆయన లక్ష్యపెట్టలేదు. అంటరానివాళ్ళ స్కూళ్ళకు ఎవరూ వెళ్ళడానికి సిద్ధపడనప్పుడు తాము వెళ్ళి ఆ బాధ్యత నిర్వహించేవారు. సవరలలో అంటరానివాడైన పానోను ఇంట్లో పెట్టుకొని అతని ద్వారా ఆదిలో సవర భాషను కిందటి శతాబ్దంలోనే నేర్చుకొన్నారు. ముప్పయి సంవత్సరాలు నిర్భాగ్యులైన అడవి వారితో కలిసిమెలిసి వారి భాషను ఆచార వ్యవహారాలను ప్రపంచానికి తెలియచేసే పుస్తకాలు ఇంగ్లీషులో రచించారు.

ప్రభుత్వం వారు ఈ పుస్తకాలను రాయమనడంలో కొన్ని ప్రత్యేకమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొన్నారు. ఇంగ్లీషు తప్ప ఇంకేమీ రాని ప్రభుత్వ ఉద్యోగస్థులకూ, కొండలలో సవరదేశంలో పనిచేసే మిషనరీలకూ మాత్రమే కాక, సవరలను అస్సాం తేయాకు తోటలకు కూలీలుగా తీసుకొనిపోతున్న తెల్ల పెట్టుబడిదారులకు ఈ పుస్తకాలు పనికొస్తాయని తెల్లవాళ్ళు భావించారు. ఆ పరిమిత ప్రయోజనాలకే కాక ప్రపంచ భాషాశాస్త్ర విజ్ఞానానికి కూడా ఉపయోగపడుతాయనే దృష్టితో రామమూర్తిగారు ఈ గ్రంథాలను నిర్మించారు.

1931-36లో ఈ గ్రంథాలు పూర్తయి ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయంగా ఈ గ్రంథాలే ముండా భాషా కుటుంబపు పరిశోధనలకు మూలగ్రంథాలయ్యాయి. 1967లో అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో 'ముండా భాషల శాఖ'లో పరిశోధనలు చేసి సిద్ధాంత వ్యాసాన్ని రాసి పట్టాపుచ్చుకొన్న 'స్టాన్లీ స్టారోస్టా' అనే విద్వాంసుడు తన గ్రంథాన్ని రామమూర్తిగారికి యిలా అంకితమిచ్చాడు.[22]

'To the memory of Rao Sahib G.V. Ramamurti, Teacher, humanitarian and Pioneer in Munda Linguistics, this work is respectfully dedicated'

ఉత్తరోత్తరా భాషాశాస్త్ర రంగంలో ఖండాంతర ఖ్యాతిని తెచ్చిపెట్టే గ్రంథాలు రాస్తున్న కాలంలోనే రామమూర్తిగారు స్థానిక రాజకీయాలలో ప్రవేశించి తెలుగువారికి నాయకత్వం వహించవలసి వచ్చింది.

---

22. Stanley Starosta - "Ramamurthi : A Munda Linguist's appeciation మరోసారి గిడుగు రామమూర్తి. పుట.211

1931లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలను ప్రభుత్వం తలపెట్టింది. అందులో తమ జమీందారీని కలిపించాలని పర్లాకిమిడి రాజా వుద్దేశ్యం. వాస్తవానికి పర్లాకిమిడి తాలూకాలో నూటికి అరవైమంది తెలుగువారు. ఓఢ్రుల శాతం 35 మాత్రమే. మిగతావారు సవరలు. అందుచేత పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్చకూడదని ఆంధ్రులు తీర్మానించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడానికి ఆంధ్రులందరి తరపునా రామమూర్తిగారినే నాయకునిగా ఎన్నుకొన్నారు. అప్పటికి వారి వయస్సు 68 సంవత్సరాలు. ఆయన నాయకత్వానికి నడుం కట్టారు.

పర్లాకిమిడి జమీలో ఏయే ప్రాంతాలు ఒరిస్సాలో చేరాలో నిర్ణయించడానికి ఓడోనెల్ అనే సివిలు సర్వెంటు అధ్యక్షుడుగా ముగ్గురు సభ్యులతో బౌండరీ కమీషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కమీషన్ ముందు రామమూర్తిగారు సాక్ష్యాలు, సంపన్నాలు, రికార్డులు చూపిస్తూ పర్లాకిమిడి తాలూకా తెలుగువారికి చెందినదే అని నిరూపించారు. అప్పుడు ఆ కమీషన్ సమక్షంలో పర్లాకిమిడి రాజా వున్నారు. రామమూర్తిగారి వాదం విని ఆగ్రహించి తమ కొలువులో ఒక ఉద్యోగం చేస్తున్న సీతాపతిగారికి ఉద్వాసన చెప్పారు. కమీషన్ సభ్యులలో యిద్దరు రాజాకు అనుకూలంగా రాశారుగాని ఓడోనెల్ మాత్రం ఆంధ్రులకు అనుకూలంగా రాశాడు. పైగా పర్లాకిమిడి తాలూకాను ఒరిస్సాలో చేర్చితే అల్లర్లు రేగవచ్చునని కూడా స్పష్టపర్చారు. కమీషన్ ముందు సాక్ష్యం యిచ్చాక రామమూర్తిగారు ఊరుకోలేదు. వైస్రాయి వద్దకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపదలిచారు. దానికి నాయకునిగా బొబ్బిలిరాజాగారిని ఎన్నుకొన్నారు. వైస్రాయికి వినతిపత్రం యిచ్చారు.

1933 జనవరి ఒకటో తేదీనాడు ప్రభుత్వంవారు రామమూర్తిగారికి మరొక బిరుదును యిచ్చి సత్కరించారు. ఇది ''కైజర్-ఎ-హింద్'' అనే స్వరణపతక ప్రదానం. ఈ ఉత్సవాన్ని పర్లాకిమిడిలోకాక ఛత్రపురంలో జరిపారు. గవర్నరు స్వయంగా హాజరయ్యే ఈ సభకు పర్లాకిమిడి రాజా హాజరుకాలేదు. సర్ ఎ.పి.పాత్రోవంటి ప్రముఖులు పర్లాకిమిడి ఒరిస్సాలో చేరదన్న శుభవార్తను సీతాపతిగారికి వారి ద్వారా అందరికీ తెలియచేశారు, 1933లోనే రామమూర్తిగారికి డెబ్బయి సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారి రచనలన్నీ గ్రంథ రూపంలో ప్రచురించాలనీ, వారి కీర్తి ప్రశంసా వ్యాస సంగ్రహాన్ని తీసుకురావాలనీ అభినవాంధ్ర పండిత సభ ద్వితీయ సమావేశాన్ని జరుపుతూ ఆ బహిరంగ సభలో రామమూర్తిగారి సప్తతితమ జన్మదినోత్సవం చేసుకోవాలని కవులూ, రచయితలూ, పండితులూ, పత్రికా సంపాదకులూ, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు అందరూ పాల్గొనాలని నిర్ణయాలు జరిగాయి. రామమూర్తిగారు ఈ సభకు రావడానికి అంగీకరించారు. వారి రచనలు బాలకవి శరణ్యం, గద్య చింతామణి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, వ్యాసావళి అనే నాలుగు గ్రంథాలేకాక వివిధ ప్రముఖ రచయితల విశిష్ట రచనలున్న వ్యాస సంగ్రహం కూడా 1937 డిసెంబరు క్రిస్మస్ నాటికి తయారుచేశారు. 27వ తేదీనాడు

రాజమహేంద్రవరంలో రమారమీ ఆంధ్ర సాహితీ పరులందరి సమక్షంలో సప్తతితమ జన్మదినోత్సవం జరిగింది. అప్పుడు రామమూర్తిగారు యిలా చెప్పారు :[23]

''20 ఏండ్ల క్రిందట నేను వాడుకభాష గురించి ప్రజలకు నచ్చజెప్పవలెనని ఈ నగరములో ప్రయత్నిస్తే అప్పుడు నాకు ఉపన్యసించే అవకాశమే, అందుకు తగిన స్థలమే దొరకలేదు. అట్టి రాజమహేంద్రవరములో పూర్వము నాకు ప్రతికక్షులుగా వుండే పలువురు కవి పండితుల సమక్షంలో నేడింతటి అపూర్వ సత్కారము జరగడము నా వ్యావహారిక భాషావాదము ప్రజాదరమూ పండితాదరమూ పొందినదనడానికి ప్రబల తార్కాణము. ఈ సంపుటములోని వ్యాసములు వ్రాసిన వారంతా నా వాదము ఆమోదించారని గర్విస్తున్నాను. నా కృషి ఫలించింది'' అని ఆయనకు కలిగిన సంతృప్తి, సంతోషము వర్ణనాతీతములు''.

ఈ సభకు రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. ఈ సభలోనే 'అభినవాంధ్ర కవి పండిత సభ' అనే పేరుకు బదులుగా 'నవ్యసాహిత్య పరిషత్తు' అనే సార్థక నామాన్ని ఎంచుకొని బారసాల జరిపారు. రామమూర్తిగారి డెబ్బయ్యోకటో ఏట నవ్య సాహిత్యం ననలెత్తింది.

పర్లాకిమిడి ఒరిస్సాలో చేర్చరన్న విశ్వాసం భారతదేశంలో కలిగినా సమస్య వేధిస్తూనే వుంది. అందరూ సుముఖులే అయితే పర్లాకిమిడి తాలూకా బోర్డువారిచేత ఒక తీర్మానం ఆమోదింపచేసి ఒరిస్సాలోనే కలపాలనే వాదానికి బలం చేకూర్చాలని రాజా భావించారు. బోర్డు ఎన్నికలు వచ్చాయి. రాజా పార్టీవారికి తెలుగు పార్టీవారు ప్రత్యర్థులను నిలబెట్టారు. తెలుగువారు 9గురు, రాజా పార్టీవారు 7 గురు ఎన్నికల్లో గెలిచారు. సీతాపతిగారు బోర్డు ప్రెసిడెంటు అయ్యారు. తీర్మానం తెలుగువారికి అనుకూలంగానే చేశారు. అయితే ఇది భారతదేశంలో తీరే సమస్యకాదు. లండన్‌లోని జాయింట్ పార్లమెంటరీ కమిటీవారు దీన్ని పరిష్కరించి తీర్పు యివ్వాలి. రాజా ఒరిస్సా ప్రతినిధులను లండన్‌కు పంపిస్తున్నారు. తెలుగువారి ప్రతినిధులు కూడా వెళ్ళి తమ వాదాన్ని అక్కడ చెప్పాలి. సర్ కూర్మారెడ్డి నాయుడుగారి నాయకత్వంలో యింకో ఆరుగురు తెలుగువారు ప్రతినిధులుగా ప్రయాణమయ్యారు. ఈ ప్రతినిధ వర్గంలో సీతాపతిగారు వున్నారు. జాయింట్ పార్లమెంటు కమిటీ ముందు 40 నిముషాలు సాక్ష్యం సమర్పించారు. పర్లాకిమిడి ఒరిస్సాలో చేరదన్న ధీమా కలిగింది. కమిటీవారు ఈ సమస్యను ఒకరకంగా పరిష్కరించినట్టే అయినా యిదేమంత అర్జంటు విషయంకాదని వాయిదా వేశారు.

తెలుగు ప్రతినిధి వర్గం భారతదేశానికి తిరిగి వచ్చింది. పర్లాకిమిడి రాజా లండన్ నగరంలో తిష్టవేసి పార్టీ నాయకుల్ని కలుసుకొని మంచి చేసుకున్నారు. పర్లాకిమిడి తాలూకా అంతా కాకపోయినా కనీసం పర్లాకిమిడి బస్తీని, దానిని అంటి పెట్టుకొని వున్న ఏజెన్సీ ప్రాంతాలనైనా ఒరిస్సాలో చేర్చమని విన్నవించుకున్నారు. తాను బ్రిటిష్ ప్రభుత్వం వారికి సర్వదా తోడ్పడుతూ కాంగ్రెస్ ఉద్యమాన్ని అణచివేయడంలో

23. సాహిత్యోపన్యాసములు – 4వ సంపుటం – పుట.55

ఉపయోగపడతానని హామీ యిచ్చారు. ప్రభుత్వం కొంత మెత్తబడింది. ఒరిస్సాలో పర్లాకిమిడి బస్తీని, 200 గ్రామాలకు కలపడానికి నిశ్చయించారు. చెన్న రాజధానికి 400 గ్రామాలే దక్కాయి.

రాజాకి లభించింది పాక్షిక విజయమే. కాని రామమూర్తిగారికి పూర్తి నిరాశ కలిగింది. 56 సంవత్సరాలు తాము ఏ ఊరిలో ఉద్యోగం చేశారో, ఉత్తమభాషా సాంఘిక సేవలు చేశారో, ఉద్యమాలు నడిపారో ఆ ఊరు పరరాష్ట్రంలో కలిసిపోయింది. రాజా తనమీద కక్షకట్టాడు. ఊరంతా వెలివేసినంత పనిచేసినట్టు రాజా పక్షానికి తిరిగింది. ఎవ్వరూ రామమూర్తిగారి ఇంటికి సరుకులు అమ్మడానికిగానీ, సాధారణపు పనులు చేయడానికిగానీ వెళ్ళకూడదని ఉత్తర్వులు. ఊళ్ళోని పెద్ద మనుష్యులెవ్వరూ ఆయనతో మాట్లాడకూడదని ఆంక్షలు. సీతాపతిగారి ఉద్యోగం మొదటే ఊడిపోయింది. 50వ ఏట ఆయన కొత్త ఉద్యోగం ఎక్కడో చూసుకోవాలి. రామమూర్తిగారితో వారి భార్య అన్నపూర్ణమ్మ చాలా బాధతోనే ''సీతాపతి మీ వల్లనే చెడిపోయాడు'' అని సాధించడం మొదలుపెట్టారు. సీతాపతి తన కుటుంబంతో చెన్న పట్టణానికి వెళ్ళిపోయారు. ఒక కొడుకు రాజమండ్రిలో వున్నాడు. ఉన్న ఊళ్ళోనూ, కట్టుకొన్న ఇంట్లోనూ ఇంత విషాదం అలుముకున్నా, దేశంలో రామమూర్తిగారికి చాలా సన్మానాలు వెతుక్కుంటూ వచ్చాయి. భారతీ తీర్థంవారు 'మహా మహోపాధ్యాయ' బిరుదును యిచ్చారు. ప్రభుత్వంవారు రజతోత్సవ స్వర్ణపతకాన్ని యిచ్చారు. దేశంలోని సాహితీపరులు ఆయనను చూడడానికి పర్లాకిమిడికి వస్తున్నారు. 1935 నవంబరు 25వ తేదీనాడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రామమూర్తిగారితో 36 గంటలసేపు గడిపారు. ఆ అనుభవాన్ని ప్రబుద్ధాంధ్రలో రాసి ప్రచురించారు. అందులో రామమూర్తిగారి వ్యధను యిలా విశదపరిచారు.[24]

''1936 ఏప్రిల్‌లో ఓఢ్ర రాష్ట్రం ఏర్పడుతుందంటున్నారు. కొన్ని గడియలకు ఓఢ్ర రాష్ట్రీయ చ్ఛాయ అలుముకుంటుందనగా నేను పర్లాకిమిడి విడిచిపెట్టి మద్రాసు ప్రెసిడెన్సీలోకి వచ్చేస్తాను. అయితే పర్లాకిమిడి స్టేషన్‌లో రైలెక్కను. పాత పట్నం వెళ్ళి ఏటిలో స్నానంచేసి, పర్లాకిమిడి మళ్ళీ మద్రాసు ప్రెసిడెన్సీలో చేరితే తప్పా, లేకపోతే ఆ వూళ్ళో - బ్రతికి వుండగా నేనా ఊళ్ళో అడుగుపెట్టనని కంకణం కట్టుకుని రైలెక్కుతాను. అయితే రైలెక్కి ఏవూరు వెళ్ళడం? ఈ వృద్ధాప్యంలో నాకెక్కడ సుఖంగా వుంటుంది?''

రాజమండ్రిలో వున్న కొడుకు దగ్గరకు వెళితే సుఖంగా వుంటుందని నిశ్చయించుకొన్నారు. పర్లాకిమిడి బస్తీ ఒరిస్సాలో చేరడానికి ముందుగానే అన్నమాట ప్రకారం ఊరు విడిచిపెట్టారు. రైలెక్కారు. రాజమండ్రి చేరారు. రామమూర్తిగారు ఎక్కడుంటే భాషా పరిశోధకులు అక్కడ వుంటారు. వాడుక భాష అక్కడ ఊపిరి పీలుస్తుంది. కవులు, పండితులు, సాహితీపరులు అందరూ అక్కడ చేరుతారు. రామమూర్తిగారి రాజమండ్రి మకాం భాషకు ఉపకారమే చేసింది.

24. హెచ్.ఎస్. బ్రహ్మానంద - ''గిడుగు వెంకటరామమూర్తి'' - పుట.32

లోగడ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పర్లాకిమిడిలో కలుసుకొన్నప్పుడు రామమూర్తిగారు ఒక శపథం చేశారు. ''నేను యిదివరకు చేసినదలా వుండనియ్యండి. నేనింకో పని చెయ్యవలసి వుంది. అది చెయ్యకుండా ఈ శరీరం విడిచిపెట్టను... సూర్యరాయాంధ్ర నిఘంటువు... దేశం కనిపెట్టుకొని వున్నది దానికోసమే... నేను దానికోసం ఎదురుచూస్తున్నాను. అది రావడంతోనే దాన్ని నేను ముక్క చెక్కకింద చితక్కొట్టేస్తాను... నిఘంటువు రాయడానికెలాంటి వారు పూనుకోవాలో, వారి హృదయం ఎంత విశాలమైనది కావాలో, సంకుచిత భావాలతో పూనుకొంటే అది ఎలా నిరర్థకం అయిపోతుందో, జీవద్భాషను విడిచిపెట్టి నిఘంటువు రాయడం ఎంత శవాలంకరణమో దేశీయులకు బోధపరచడం అవసరం. ఏది జరిగినా ఏది జరగకపోయినా నేనదిమాత్రం చేసి తీరతాను'' అన్నారు.[25]

చేసిన ప్రతిజ్ఞను రామమూర్తిగారు నిలబెట్టుకున్నారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రథమ సంపుటాన్ని నవ్య సాహిత్య పరిషత్తు వారి పత్రిక ప్రతిభ (1938)లో విమర్శించారు. ఇది డెమ్మీసైజు పుస్తకంలో నూరు పుటల గ్రంథం. (పుటకు 34 పంక్తులకు తక్కువ లేవు). ఈ విమర్శను 99 పెద్ద పేరాగ్రాఫులలో రాశారు. చిట్టచివర ''శిష్ట వ్యవహార మందున్న శబ్దములన్నీ చేర్చి తక్కిన సంపుటములు శీఘ్రముగా ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించవలెనని కోరుతున్నాను. లోకము అత్యుత్సాహముతో వాటికోసం నిరీక్షిస్తున్నది'' అని రాశారు.

రామమూర్తిగారు రచనల కోసం కూడా లోకం ఎదురుచూస్తోంది. ఆయన రాద్దామనుకొన్నవి చాలా వున్నాయి. అయితే ఆరోగ్యం క్షీణిస్తోంది. మూత్రకోశాలకు సంబంధించిన వ్యాధి మొదలైంది. ఏదితిన్నా జీర్ణంకాక ఎక్కిళ్ళ రూపంలో అంతా వాంతులవుతోంది. రాజమండ్రిలోని డాక్టర్లు మద్రాసుకు వెళ్ళమన్నారు. అక్కడ పెద్ద డాక్టర్లకు చూపించి పెద్దాసుపత్రులలో చికిత్స చేయించుకోమన్నారు. మద్రాసులో రామమూర్తిగారి పెద్దకుమారుడు సీతాపతిగారు సినిమాల్లో వున్నారు. అయినా మద్రాసులోనే పచ్చయప్ప కళాశాలలో కెమిస్ట్రీ శాఖలో వున్న తన మేనల్లుడు కాళ్ళకూరి సూర్యనారాయణపేర రామమూర్తిగారు ఉత్తరంరాసి తాము మద్రాసు వస్తున్నట్టు తెలియచేశారు. స్టేషన్లో మేనల్లుడితోపాటు పెద్దకుమారుడు కూడా ఆయనకు స్వాగతం చెప్పారు.

మద్రాసులో కస్తూరి నారాయణమూర్తిగారు పేరున్న డాక్టరు. ఆయన చికిత్స ప్రారంభించారు. 1940 సంక్రాంతి రోజులలో రామమూర్తిగారు తమ తుది విన్నపాన్ని దేశానికి తెలియచేయాలనుకొన్నారు. సభ పెట్టించమని సీతాపతిగారికి చెప్పారు. గూడవల్లి రామబ్రహ్మంగారి ప్రజామిత్ర ఆఫీసులో పత్రికా సంపాదకులనూ, రచయితలనూ పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. జనవరి 15వ తేదీనాడు కనుమ పండుగ రోజున రామమూర్తిగారు యిలా తుది విన్నపం చేశారు.

---

25. గిడుగు రామమూర్తి 'శ్రీసూర్య రాయాంధ్ర నిఘంటువు విమర్శనం' గ్రంథంలో పురిపండావారు తమ ముందుమాటలో యిది ఉదాహరించారు.

''మొదట నేనూ, నామిత్రుడు గురజాడ అప్పారావు, మాకు తోడుగా మరి యిద్దరు ముగ్గురు మాత్రమే ఈ ఉద్యమం ప్రారంభించాము. తక్కిన తెలుగు వారందరూ మాకు ప్రతికూలంగా ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారితో కలిసి మా ఉద్యమాన్ని ఎదిరించినవారే... దేశంలో అంతకంతకు వ్యావహారిక భాషావాదము అంగీకరించిన వారి సంఖ్య ఎక్కువగుటచేతను, ఆ పరిషత్తు క్షీణించినది. వందలకొలది కవులూ, పండితులూ తమ వాడుక భాషలో రచన సాగిస్తున్నారు. ఇంతమట్టుకైనా నా కృషి ఫలించినందుకు నేను కృతార్థుడనైనానని సంతోషిస్తున్నాను. కానీ బడులలోను, కాలేజీలలోనూ ప్రభుత్వము వారున్నూ, విశ్వవిద్యాలయము వారున్నూ వ్యావహారిక భాషను అంగీకరించే వరకు నావాదము పూర్తిగా నెగ్గినదని నేను భావించలేను.

''స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం చిక్కుపడుతున్నాము. ప్రజాస్వామిక పరిపాలన కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు సామాన్య జనులకు ఏ భాషద్వారా జ్ఞానం కలుగచేయవలసి వుంటుందో ఏ భాషలో గ్రంథ రచన సాగించవలసి వుంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలున్నవి. పత్రికలద్వారా మీరు ఎంతైనా చేయగలరు''.[26]

రామమూర్తిగారు ఎవరు ఎంతైనా చేయగలరని ఆశలు పెట్టుకొన్నారో ఆ పత్రికలవారు అంతా చేయడానికి ప్రయత్నించారు. ఆధునిక యుగంలో రామమూర్తిగారి ఆశయాలు నెరవేరాయి. నేడు విశ్వవిద్యాలయంలో ఏ ఒకరిద్దరు ఛాందసులు తప్ప నూటికి తొంభైమంది వాడుక భాషనే ఆమోదించారు.

ప్రజామిత్ర ఆఫీసులో రామమూర్తిగారు తుది విన్నపమని చెప్పినది నిజంగా తుది విన్నపమే అయింది. మరో పన్నెండు రోజులలో 1940 జనవరి 22నాడు ఉదయం 7.20కి ఆయన భౌతికకాయాన్ని విడిచిపెట్టారు.

యశఃకాయాన్ని ధరించి వారు నిజంగా కీర్తిశేషులయ్యారు.

వారి కీర్తి జీవద్భాషకు స్ఫూర్తి.

26. వ్యాసావళి - పుట.159

గిడుగువారి మిత్రులు - శిష్యులు - పరివర్తితులు

ఆంధ్ర సాహిత్య చరిత్రలో గిడుగు వెంకట రామమూర్తిగారు అసహాయ శూరులుగానే నిలచి భాషా యుద్ధాలు చేసినవారుగా ప్రసిద్ధులు. అయితే అసహాయ శూరులకు కూడా జీవితంలో అయినవారూ, ఆత్మీయులూ, ఆప్తమిత్రులూ, అనుచరులూ ఉంటారు. ఈ ప్రకరణంలో రామమూర్తిగారికి వివిధ కాలాలలో వివిధ రంగాలలో మిత్రులూ, శిష్యులూ అయిన వారి గురించి చెప్పుకొందాం.

విక్రమదేవవర్మ (1869-1951)

రామమూర్తిగారి బాల్య స్నేహితులలో విక్రమదేవశర్మగారు ఆదిలో చెప్పుకోదగ్గవారు. ఇద్దరూ వంశధారా నదికి ఇద్దరినీ, అద్దరినీ ఉన్న పర్వతాల పేటలోనూ, నగరికటకం లోనూ ఉండేవారు. అప్పుడు వర్మగారు జయపురాధీశుల వంశంలోని వారేగాని పెద్ద హోదాలు లేవు. ఈ ఇద్దరు కుర్రాళ్లు పర్వతాల పేటలోనూ, నగరి కటకంలోనూ కలిసి మెలిసి ఆడుకొనేవారు. నగరి కటకంలో వీధి భాగవతాలు, తోలు బొమ్మలాటలు మొదలైన వేడుకలు జరుగుతూ ఉండేవి. రామమూర్తిగారు అక్కడకు వెళ్ళి చూస్తూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు అక్కడే విక్రమదేవవర్మగారి శయ్యా పక్కనే రాత్రులు పడుకొంటూ ఉండేవారు.

జన్మ వల్ల ఓఢ్రులైన వర్మగారు ఆంధ్రభాషలో మంచి పాండిత్యం సంపాదించారు. ఉత్కళాంధ్రాంగ్ల సంస్కృత భాషలు అభ్యసించారు. విశాఖపట్నంలో స్థిరపడ్డారు. జయపురం మహారాజావారి చిన్నాన్న కుమారులు కనుక వీరికి సంస్థానం నుండి నెలకు ఎనిమిది వందల రూపాయిలు ఖర్చులకు వచ్చేవి. రాని కమతం అనే గ్రామం వలన సాలీనా రెండువేల రూపాయల రాబడి ఉండేది.[1] వర్మగారు 1916 నాటికి విశాఖలో వడిదుడుకులులేని జీవనం గడిపేవారు. ఊళ్ళోని సాహితీపరులందరూ వారి మిత్రులే. సాంస్కృతిక కార్యక్రమాలన్నీ వారికి నచ్చినవే. 1916లో ''విశాఖపట్టణాంధ్ర నాటక పరిషత్తు'' ఏర్పడింది. దానికి వర్మగారే అధ్యక్షులు. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు కార్యదర్శి. 1931లో విశాఖపట్నంలో 1908 నుంచీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు రామలీల ఉత్సవాలను జరిపించేవారు. ఊళ్ళోని ప్రతి పేటలోనూ ఒక పందిరి, ఒక తాత్కాలిక మందిరం వెలిసేవి. రోజుకొక మందిరం వద్ద రామచంద్రశాస్త్రిగారు రామాయణంలో ఒక ఘట్టం కథనం చేసేవారు. పదవనాడు పెద్ద ఊరేగింపు జరిగేది. ప్రతి పందిరివారు తమ మందిరంలోన విగ్రహాలను ఊరేగిస్తూ విక్రమదేవవర్మగారి హవామహలుకు వెళ్ళేవారు. ఊరేగింపులో గరిడిసాములూ, పులివేషాలూ, బళ్ళవేషాలు, బుట్టబొమ్మలు ఉండేవి. విక్రమదేవవర్మగారు ప్రతి మందిరంవారికి ఏదో కొంత విరాళం ఇచ్చేవారు. ఏటా అయిదువందల రూపాయలు ఇందుకోసం ఖర్చు పెట్టేవారు.

---

1. మంత్రి ప్రగడ భుజంగరావు - ఆధునిక కవి జీవితములు - పుట.211

బాల్య మిత్రులైన గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమం ప్రారంభిస్తే విక్రమదేవవర్మగారు గ్రాంథికవాద ప్రచారకులయ్యారు. ''నేఁటి తెలుగు'' అనే శీర్షికతో వర్మగారు రచించిన వ్యాసంలోని భాగాలు చూస్తే వారిమతం బోధపడుతుంది.[2]

''సజీవ నిర్జీవ యుక్తంబగు జగంబు నియమయుతంబయి విలసిల్లుచుండుట వలన నియమ మత్యావశ్యకమనుట యతిశయోక్తి గాదు. అట్లగుట వలన విజ్ఞులు నియమమును విడనాడుట యసమంజసము. ప్రవర్తన నియమమును స్మృతి విధించునట్లే భాషా నియమమును వ్యాకరణము శాసించెడిది. కనుక వ్యాకరణ విరుద్ధ పదములతోడ వెలయుకైత గర్హితమగును. నాణెములగు బాసలందు మిన్నయని యెన్నంబడు తెలుగు బాసకు సమగ్రమగు వ్యాకరణము నేటికిని లేకుండుట మిక్కిలి శోచనీయము. వ్యాకరణమసమగ్రమను నెపము చేతనున్న నియమములను మీరుట యుక్తము గాదు... భాషాభిమానము గల పండితులొక చోటఁ గూడి గ్రహింపదగిన రూపములను నిర్ణయింపవలెను. మఱి యవియే వాడఁబడవలెను. అట్లుకానిచోఁ దెలుఁగు భాస కోదు బాస కంటె నీచతరమగును''.

కోదు భాష నీచమనుకొనడం తప్పు. తెలుగువంటి భాషలపైగల అభిమానాతిరేకం వల్లనే అనాగరిక భాషల పట్ల దురభిమానం వ్యక్తం చేయడం జరుగుతోంది. కోదు భాషకు వ్యాకరణం రాసిన లింగం లక్ష్మాజీ పంతులుగారు (1830-1902) ఇలా చెప్పారు.[3]

''ఈ భాష తొల్లింటె తెలుగు యొక్క అపభ్రంశమో. లేక ఆ తొల్లింటె తెలుగో అయి ఉంటుందని నేనెప్పుడూ భావిస్తున్నాను'' అని వ్రాశారు. కోదు భాషను చాలా కొద్దిమందే నేర్చుకోవడం వల్ల దానియొక్క ప్రాచీనతనూ, సరళత్వాన్నీ, భాషా శాస్త్ర దృష్ట్యా దాని పరిపక్వతనూ అంచనా వేయలేక పోతున్నారని ఆనాడు చెప్పారు. "It contains, of course, words sufficient to express the ideas which mankind have in the infant state of civilization" అన్నారు. శైశవ దశలో ఉన్నప్పుడు ప్రకటించదగిన భావాలకు సరిపోయేటన్ని మాటలు ఆ భాషలో ఉన్నాయన్నారు''.

భాషా శాస్త్రాలను ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసిన వారు అన్నీ సమానమైన భాషలే అని ప్రాథమికంగా అంగీకరిస్తారు. అయితే విక్రమదేవవర్మగారు వీరగ్రాంథికవాదులలాగ వేరే అభిప్రాయాలను ఏర్పరచుకొన్నారు. తాము విశ్వసిస్తున్న మార్గంలో సాహిత్య రచనలు స్వయంగా చేశారు. ఆ పద్ధతి రచనలు చేసిన వారిని ఆదరించారు.

1930లో జయపురం జమీందారు నిస్సంతుగా చనిపోవడం వల్ల వీరికి ఆ సంస్థానం సంక్రమించింది. వర్మగారు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సాలీనా లక్షరూపాయల విరాళం ఇచ్చారు. తమ జీవితకాలంలో ఆ యూనివర్సిటీ ప్రొ చాన్సలర్‌గా ఉన్నారు. వివిధ ప్రఖ్యాత కవుల గ్రంథాలను అంకితం పుచ్చుకొన్నారు. కఠోర గ్రాంథికవాది కొక్కొండ వెంకటరత్నంగారి ''సింహాచల యాత్ర'' వీరికే అంకితం యిచ్చారు. బులుసు

2. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి - ఆంధ్ర రచయితలు - పుట.367
3. ఆదిమయుగం - సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటం, 2002

పాపయ్యశాస్త్రిగారి ''అలంకార సంగ్రహం'', దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి ''మేఘదూత'' వీరికి అంకితమిచ్చారు. త్రిపురాన వెంకట సూర్య ప్రసాదరావుగారు మేఘ సందేశాన్ని ''మొయిలు రాయబారం'' అని రచించారు. దీనికి కూడా వర్మగారే కృతిభర్తలు. సంస్థానాధీశ్వరులయ్యాక పాత స్నేహితులు వీరికి దూరం అవుతున్నట్లు కనబడుతుంది. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి కుమారులు సుబ్బరాయశాస్త్రిగారు తమ తండ్రిగారైన కవిగారి గురించి ఇలా చెప్పారు.[4]

''విక్రమ దేవవర్మగారు కవిగారికి బాల్య స్నేహితులు. చాపమీద కూర్చొని వర్మగారు పద్యాలు రాస్తుంటే కవిగారు సరిదిద్దేవారు. అంతటి స్నేహితులైనా కవిగారు దారిద్ర్యాన్ని అనుభవించారు తప్ప రాజాగారిని ఎప్పుడూ యాచించలేదు. తమ చెయ్యి క్రింద ఉండటం కవిగారు సహించలేరు. విక్రమదేవవర్మగారు రాజాగారు అయిన తర్వాత మా నాన్నగారు ఆయన ఇంటికి వెళ్ళలేదు. పిలిస్తే వెళ్దామని ఈయన పిలవకుండా రావచ్చు గదా అని ఆయన. అంతటి పట్టుదల, ఆత్మాభిమానం గల మనిషి కావడం వల్ల తెలుగు జాతి ఎంతగానో నష్టపోయింది. లేకపోతే పాతూరి నాగభూషణం గారన్నట్టు 'ఈయన వెళ్ళి అడిగితే చాలు' రాజాగారు లక్ష పెట్టించైనా సరే కవిగారి రచనలన్నీ అచ్చువేయించేవారే'', ఆ అదృష్టానికి తెలుగు సరస్వతి నోచుకోలేదు''.

అయితే వర్మగారి రచనలను మాత్రం వారి దివాను తలిసెట్టి రామారావుగారు 1940లో ప్రచురించారు. (ఈ రామారావుగారు మన ప్రథమ కార్టూనిస్టులు). వర్మగారి రచనల వివరాలు ఇవి-

1. శ్రీనివాస కల్యాణము (నాటకము)
2. మానవతీ చరిత్ర
3. నీతి గీతి తతి
4. శృంగార గీత వ్రాతము
5. శ్రీ మహారాజ విక్రమదేవవర్మ రచనలు (1940 ముద్రితము)
6. కృష్ణార్జున చరిత్ర టీక (మంత్రి ప్రగడ సూర్యప్రకాశ కవి రచించిన ద్వ్యర్థి కావ్యమునకు వ్యాఖ్యానము)
7. రాధా మాధవ నాటకము (ఉత్కలము)

విక్రమదేశ వర్మగారి జీవితకాలంలోనే, ఆయన ప్రొ ఛాన్సలర్‌గా ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 1938లో గిడుగు రామమూర్తి గారికి ''కళాప్రపూర్ణ'' బిరుదును ఇచ్చింది. రామమూర్తిగారు ఇలా అన్నారు. ''ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు నాకు కళాప్రపూర్ణ బిరుదును అనుగ్రహించడం నా గ్రాంథిక భాషా పాండిత్యానికి కాదుగదా! నా వ్యావహారిక భాషావాదము ఆమోదించే ఈ గౌరవము నాకు ప్రసాదించారనక తప్పదు''.[5] అయితే విక్రమదేవవర్మగారి జీవిత కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వాడుక భాషను అంగీకరించలేదు.

---

4. ద్వానా శాస్త్రి - ''మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితా సమీక్ష'' - పుటలు.43-44

మామిడన్నం కుమారస్వామి (రామమూర్తిగారి సహచరులు)

తన చుట్టూ ఉన్న సామాన్య జనులతో సంబంధం పెట్టుకొని వారి సంక్షేమం కోసం పాటుపడడం సంస్కారం గల వాళ్ళ లక్షణం. గిడుగు రామమూర్తిగారు తాము నివసిస్తున్న పర్లాకిమిడి పరిసరాలలో వున్న వారలను చూసి వారి భాష, ఆచార వ్యవహారాలు బోధపర్చుకోవాలనుకొన్నారు. అప్పుడు వీరితోపాటే పర్లాకిమిడిలో వున్న మామిడన్నం కుమారస్వామిగారు ముందు ఒక సవర వానితో పరిచయం కలిగించారు. ఆ పిమ్మట స్వచ్ఛమైన సవర భాషను నేర్పే శిష్ట శబరులతో నేస్తం కట్టించారు. కుమారస్వామిగారు పర్లాకిమిడిలో ఏం చేసేవారో ప్రస్తుతం లభిస్తున్న ఆకరాల వల్ల తెలియదు.

అయితే కుమారస్వామిగారు కవి. వీరి సృజనాత్మక రచనల వివరాలు కూడా ఇప్పుడు లభించవు. ఈయనకు జ్యోతిష్యంలో ప్రవేశం ఉంది. గిడుగు సీతాపతిగారికి 1901లో పెళ్ళయింది. ఇది జరిగిన 16 దినాలకి పెళ్ళి కుమార్తె టైఫాయిడ్ విషజ్వరం వల్ల చనిపోయింది. రామమూర్తిగారికి జ్యోతిష్యంలో నమ్మకం లేదు. కనుక ఆమె జాతకాన్ని ముందుగా ఎవరికీ చూపెట్టలేదు. ఆమె చనిపోయాక మామిడన్నం కుమారస్వామిగారు యథాలాపంగా ఆ జాతకాన్ని చూసి ''రామ్మూర్తీ! నాకు ఈ జాతకం ముందే చూపించి ఉంటే ఈ సంబంధం చేయకు - మారకం ఉంది, అని చెప్పి ఉందును'' అన్నారట.[6] తర్వాత రెండు, మూడు జాతకాలు చూసి సంబంధాలు తప్పించారట. కుమారస్వామి గారు గిడుగువారి కుటుంబ స్నేహితులని ఈ విషయాల వల్ల ఊహించుకోవచ్చు.

సవర భాషా గ్రంథాలను రామమూర్తిగారు తెలుగులిపిలో రాసినప్పుడు కుమారస్వామిగారు ప్రతిఫలం లేకుండా వాటిని సాపు రాసేవారు. 1914లో ప్రచురితమైన తెలుగు-సవర నిఘంటువు ఉపోద్ఘాతంలో రామమూర్తిగారు ''ఈ గ్రంథము చిత్తు కాపీలు సవరించి మొదట మహారాజశ్రీ మామిడన్నం కుమారస్వామి కవిగారున్ను తర్వాత బలివాడ నారాయణప్పడు, పట్నాయుడుగారున్ను సాపు రాసినారు. ఏ మాత్రం ప్రతిఫలం కోరకుండా నాకు సహాయం చేసిన ఈ యిద్దరు స్నేహితులున్ను నాకు వందనీయులు'' అని కృతజ్ఞతలు చెప్పారు.

రామమూర్తిగారు రచించిన సవర వాచకాలలో సేకరించి ప్రకటించిన సవర కథలు - పాటల పుస్తకాల సాపు కూడా కుమారస్వామిగారు సవరించి సాపు రాశారో, లేదో ఆ గ్రంథము లభిస్తేగాని చెప్పలేము. రామమూర్తి వంటి వారు రచించిన గ్రంథాల చిత్తును సవరించారంటే కుమారస్వామిగారికి మంచి సవర భాషా పరిచయం ఉండి ఉండాలి.

వెల్షమన్ (?-1914)

పర్లాకిమిడికి ఫారెస్టు ఆఫీసరుగా వచ్చి రామమూర్తిగారి దగ్గర సవర భాష నేర్చుకొన్న ఆంగ్లేయుడు ఈ వెల్షమన్. ఇతడు మొదట ఆఫీసర్ని అన్న దర్పం ప్రకటించినా, రామమూర్తిగారి వైదుష్యాన్నీ, బోధనా ప్రావీణ్యాన్నీ మెచ్చుకొని చక్కని శిష్యుడయ్యాడు.

6. గిడుగు సీతాపతి - స్వీయ చరిత్ర - పుట.12

అంతవరకూ సవరల పట్ల, రామమూర్తిగారి సవరోద్ధరణ ఉద్యమం పట్లా చిన్న చూపు చూసే ఆంగ్లేయులను ఈ వెల్షమన్ పూర్తిగా మార్చాడు. కొత్తగా వచ్చే కలక్టర్లకు చెప్పి మంచి పనులు చేయించాడు.

1894లోనే రామమూర్తిగారు ''ఎ మెమోరాండమ్ ఆఫ్ ది స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ యమాంగ్ ది సవరాస్'' అనే నివేదికను ప్రభుత్వానికి పంపారు. అందులో సూచించిన విషయాలన్నింటినీ వెల్షమన్ అమలు జరిపించడానికి ప్రయత్నాలు చేశాడని భావించవచ్చు. రామమూర్తిగారి సూచనల వివరాలు ఇవి.[7]

1. సవర భాషాధ్యయానికి ఒక ''గైడు''ను ప్రచురించాలి.
2. గిరిజన పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, ఆ ప్రాంతాల్లో పనిచేసే అధికారులు అవశ్యం సవర భాష నేర్చుకోవాల్సిందిగా ప్రోత్సహించాలి.
3. సవరల కోసం ప్రత్యేకంగా సాయంకాలపు తరగతులు తెరచి ప్రభుత్వ పాఠశాలలకు వీటిని అనుబంధం చెయ్యాలి.
4. సవర భాషలో మౌఖికం (Oral)గానే బోధన జరగాలి. బొమ్మలద్వారా పాటల ద్వారా నేర్పాలి. నోటి లెక్కల ద్వారా గణితం నేర్పాలి. ఆ తర్వాత క్రమంగా చదవడం, రాయటం నేర్పించవచ్చు.
5. పరీక్షలలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే బహుమతి గ్రాంట్లలో కొంత వెండి ఆభరణాల రూపంలో ఉండాలి. సవరలు అలాంటి ఆభరణాల్ని గర్వకారణంగా భావిస్తారు.
6. ప్రభుత్వ కార్యాలయాలకు సవర యువకులు వెళ్ళినప్పుడు వారు నేరస్థులు కాకపోతే కూర్చోవడానికి అనుమతించాలి.
7. గ్రామాధినేతలైన గొమాంగ్, బుయాలు సవర సమాజంలో పలుకుబడి ఉన్నవారు. అంచేత వారినే పాఠశాల నిర్వాహకులుగా నియమించాలి.
8. సవరలు, కొండవారిలో కొందరిని ఎంపిక చేసి వారికి ఉపాధ్యాయ శిక్షణ గరపాలి.
9. ప్రభుత్వ కార్యాలయాలకు అనుబంధించబడిన సవర దుబాసీలు (Translators) విద్యావంతులై ఉండాలి. కనీసం వారు తమ మాతృభాషను చదవటం, రాయడం తెలిసి ఉండాలి.
10. సవర దుబాసీ విద్యావంతుడయితే అతణ్ణి సవర ఖైదీలకు బోధన గరపేందుకు వినియోగించవచ్చు. సవరలు తమ స్వభాషలో అర్జీలు పంపుకోవడానికి అనుమతించాలి. దుబాసీ వాటిని అనువాదం చేస్తాడు.
11. సవరల్లో విద్యావ్యాప్తి విషయంలో ప్రభుత్వంతో సహకరించేందుకుగాను బిసోయీ (మధ్యవర్తుల్ని) ప్రోత్సహించాలి. వారయితే సవరలకు షూటింగ్ పోటీలు, గుర్రపు పందాలు నిర్వహించి వారిని సాయంకాలపు తరగతులకు వచ్చేలా ప్రోత్సహించగలరు.

---

7. హెచ్.ఎస్. బ్రహ్మానంద - గిడుగు వేంకట రామమూర్తి - పుట.41-43.

12. అన్ని ఏజెన్సీ ప్రాంతాలలోనూ విద్యాభివృద్ధిని తనిఖీ చేసేందుకుగాను ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి.

ఈ సూచనలను వెల్ష్‌మన్‌లాంటివారు అమలు జరిపించాలన్న ఉత్సాహం చూపడం వల్లనే ప్రభుత్వంవారు రామమూర్తిగారి చేత వాచకాలు, నిఘంటువులు వగైరాలు 1911 నుండి రచింపచేశారు. వెల్ష్‌మన్ మొదటి ప్రపంచ సంగ్రామంలో సాయుధ సైనికాధికారిగా పనిచేయడానికి రిక్రూట్ అయి 1914లో వెళ్ళిపోయాడు. కొద్దిమాసాలకే యుద్ధంలో మరణించాడు.

రామమూర్తిగారు వెల్ష్‌మన్ స్నేహాన్ని సవరల కోసం అతడు చేసిన సేవలను మరచిపోలేదు. 1928-1932 మధ్య పర్లాకిమిడికి ఉత్తరంగా ఉన్న కొండలమీద ఉన్న ''ఫిరంగ్'' అనే గ్రామంలో సవర విద్యాభివృద్ధికి ఒక ట్రైనింగ్ స్కూలు, ప్రాథమిక పాఠశాల స్థాపించినప్పుడు వెల్ష్‌మన్ గౌరవార్థం రామమూర్తిగారు ఒక సూచన చేశారు. దానిని ఆమోదించి ప్రభుత్వంవారు ఉపాధ్యాయ శిక్షణా కేంద్రానికి ''వెల్ష్‌మన్ సవర ట్రైనింగ్ స్కూల్'' అనే పేరు పెట్టారు.

గిడుగు వెంకట సీతాపతి (1885-1969)

సవర భాషా గ్రంథాలను ఇంగ్లీషులో రచించడానికి రామమూర్తిగారికి తోడ్పడిన ముఖ్యులు, వారి కుమారుడు సీతాపతిగారే. వ్యావహారిక భాషోద్యమంలోనూ, పర్లాకిమిడిని తెలుగువారికి దక్కించుకొనే పోరాటంలోనూ రామమూర్తిగారికి అన్ని విధాలా లెఫ్టినెంటుగా ఉన్నవారు సీతాపతిగారే. ఈయన పర్లాకిమిడిలోనే ఎఫ్ఫేదాకా చదివి 1904లో చెన్నపట్నం వెళ్ళి క్రిష్టియన్ కాలేజీలో బియ్యే చదివారు. 1905లో ప్యాసయ్యారు. వీరు రెండవ ఫారం నుండి బియ్యేదాకా సంస్కృతమే చదువుకొన్నారు. బియ్యేలో వీరికి వేదం వెంకటరాయశాస్త్రిగారు గురువులు. వారు తక్కిన పండితుల వంటివారు కారు. ఇంగ్లీషు కూడా బాగా చదువుకొన్నారు. ఇంగ్లీషులో శ్లోకాల అర్థం చక్కగా చెప్పేవారు. సీతాపతిగారు సంస్కృత విద్యార్థులేగాని మూడవ ఫారం చదువుతున్నప్పట్నించి తెలుగులో పద్యరచన చేయాలన్న అభిలాష కలిగి, సాధన చేసేవారు. బియ్యే పూర్తిచేశాక రాజమండ్రి ట్రెయినింగ్ కాలేజీలో ఎల్.టి.లో ఉత్తీర్ణులయ్యారు. 1907లో ఈ డిగ్రీ రావడానికి ముందే పర్లాకిమిడి కాలేజీ హైస్కూల్లో హిస్టరీ మాస్టరుగా నియమితులయ్యారు. తర్వాత ఒక ఏడాది జయపురంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి 1911లో తండ్రిగారు రిటైరయ్యాక వారి స్థానంలో కాలేజీలో చరిత్రోపన్యాసకునిగా నియమితులయ్యారు. అప్పట్నించి 1932లో రాజాతో కక్ష కట్టి ఉద్వాసన చెప్పేదాకా ఈ ఉద్యోగంలోనే రెండు దశాబ్దాల పైచిలుకు పనిచేశారు.

వ్యావహారిక భాషోద్యమ ప్రారంభ దినాలలో సీతాపతిగారు తమ తండ్రిగారికి అట్టే సహాయకులుగా లేరు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి 1924లో రాసిన లేఖలో

''చి॥ సీతాపతిని నా పనికి ఉపయోగించుకోలేదు. నవలో, నాటకమో, పాటో, పదమో వాడికి ఇష్టమయినది వాడు వ్రాయవచ్చును. రచించుటకు పూనుకొమ్మని ఇదివరకే చెప్పినాను. అయితే వాడికి తీరిక తక్కువ. మునిసిపాలిటి పనులు, కో-ఆపరేటివ్ బ్యాంకు పనులు చేసి చదరంగమాడిగాని, వీణ వాయించిగాని విశ్రాంతి పొందుతాడు'' అని చెప్పారు.[8]

అయితే అవసరం వచ్చినపుడు సీతాపతిగారు తండ్రిగారి పనులలో కొద్దిగానో, గొప్పగానో తోడ్పడేవారు. 1912లోనే విశాఖపట్నంలోని పరవస్తువారి అర్ష పుస్తకాలయానికి వెళ్ళి తాళపత్ర గ్రంథాలను పరిశీలించడం, మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలోని ప్రతులను కూడా చూసి పాఠాలు తండ్రిగారి ఆజ్ఞల మేరకే రాసుకొని రావడం సీతాపతిగారు అడపా దడపా చేసే పనులే.[9] 1915లో గురజాడ అప్పారావుగారు మరణించాక రామమూర్తిగారు ఆంధ్రదేశంలోని కాలేజీలు ఉన్న అన్ని ఊళ్ళకూ వెళ్ళి తమ వాదాన్ని ప్రచారం చేశారు. వివిధ పండిత సభల్లో ప్రామాణిక సాక్ష్యాలతో వివిధ ప్రసిద్ధ రచయితల గ్రంథాలలోని దోషాలను ఎత్తి చూపేవారు. ఈ సభలలో సీతాపతిగారు తమ తండ్రిగారికి చేదోడువాదోడుగా ఉండేవారు.

1927లో ప్రభుత్వం వారు రామమూర్తిగారిచేత ఇంగ్లీషులో సవరలమీద పుస్తకాలు రచింపచేయాలనుకొన్నప్పుడు సీతాపతిగారి సంపూర్ణ సహకారం తండ్రిగారికి కావలసి వచ్చింది. సవర భాషను క్షుణ్ణంగా నేర్చుకోవలసిన అవసరమైంది. రామమూర్తిగారు తాము ముప్ఫయి సంవత్సరాలు కష్టపడి నేర్చుకొన్నదంతా ఆరుమాసాలలో సీతాపతి గారికి నేర్పారు. రామమూర్తిగారికి కరువైన ఒక సౌకర్యం సీతాపతిగారికి లభించడం వల్ల చదువు తొందరగా సాగింది. రామమూర్తిగారికి బ్రహ్మచెవుడు. అందుచేత వారు సవరలతో సంభాషించగల అవకాశాలు సన్నగిల్లాయి. సీతాపతిగారు తాము నేర్చుకొన్నవి సవరలతో సంభాషించి పెంపు చేసుకొన్నారు. సవర మాన్యువల్, సవర-ఇంగ్లీషు, ఇంగ్లీషు-సవర నిఘంటువులు తండ్రిగారు రచించడానికి సీతాపతిగారు ఎంతగానో తోడ్పడ్డారు.

1931లో ఆంధ్రోత్కళ సంక్షోభం ప్రారంభమైంది. పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్పించాలని రాజా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. దానిని చెన్న రాజధానిలోనే తెలుగు జిల్లాలలోనే ఉంచాలని గిడుగువారి వాంఛ. పర్లాకిమిడి రాజాకు తెలుగు ప్రజల వల్లనే ఎక్కువ రాబడి వస్తున్నదని, రామమూర్తిగారు ఒడోనెల్ బౌండరీ కమిషన్ ముందు వాదించారు. తాము వృద్ధులైనారు కనుక సీతాపతిగారిని తెలుగు వారి ప్రతినిధిగా పాటుపడమన్నారు. తండ్రి ఆజ్ఞను కొడుకు పాటించారు. రాజా మండిపడి ఉద్యోగం ఊడకొట్టారు.

సీతాపతిగారు పర్లాకిమిడి తెలుగువారి తరపున నిర్విరామంగా పనిచేశారు. ఢిల్లీలోని వైస్రాయి వద్దకు ఒక ప్రతినిధి వర్గం వెళ్ళింది. పర్లాకిమిడి తాలూకా బోర్డు

8. వేటూరి ఆనందమూర్తి (సం) - మణిమంజరి - సంపుటి-2, సంచిక-1, ఫిబ్రవరి 1982 పుట 37
9. గిడుగు సీతాపతిగారి వ్యాసం - పరిశోధన - 3వ సంచిక ఆగస్టు-సెప్టెంబరు, 1954 - పుట.29

ఎన్నికలలో నిలబడి తెలుగువారి పార్టీకి మెజార్టీని సంపాదించి బోర్డు ప్రెసిడెంటయ్యారు. ఈ సంస్థ ద్వారా పర్లాకిమిడి ఒరిస్సా చేరాలన్న తీర్మానం చేయిద్దామనుకొన్న రాజా ఆశని వమ్ము చేశారు. తర్వాత లండన్‌లో జాయింటు పార్లమెంటరీ కమిటీ ముందు 1934లో సాక్ష్యం ఇవ్వవలసి వస్తే సీతాపతిగారినే పంపించారు. సర్ శామ్యూల్ హెూర్ అధ్యక్షుడుగా ఉన్న కమిటీ ముందు 45 నిముషాలు సాక్ష్యం ఇచ్చారు.

లండన్ వెళ్ళినప్పుడే సీతాపతిగారు లండన్ యూనివర్సిటీలో ఫొనిటిక్స్ ప్రొఫెసర్ డేనియల్ జోన్స్‌గారిని కలుసుకొన్నారు. లోగడ తమ తండ్రిగారు రచించి ఇచ్చిన తెలుగు రీడర్ ఆద్యంత పుటలు పోతే వాటిని మళ్ళా రాసి భర్తీ చేశారు. సర్ జార్జి గ్రియర్‌సన్ గారిని కలుసుకొని ఆయన పేరు మీదుగా లోగడ జరిగిన భారతీయ భాషల సర్వే గురించి, అందులోని లోపాల గురించి చర్చించారు. పారిస్‌లో జ్యూల్‌బ్లాక్‌ను కలుసుకొని ఆయనకు సవరల వాద్యాలను బహూకరించారు.

సీతాపతిగారు జాయింట్ పార్లమెంటరీ కమిటీవారిని తమ వాదం వల్ల ఒప్పించినా రాజకీయ కారణాలవల్ల రాజా పెట్టిన ప్రలోభాలకు బ్రిటీష్ ప్రభుత్వం మెత్తపడి పర్లాకిమిడి బస్తీని, 200 గ్రామాలను ఒరిస్సాలో కలిపింది. రామమూర్తిగారు ఒరిస్సా రాష్ట్రంలో ఉండడం ఇష్టంలేక ఆ రాష్ట్రావతరణకు ముందుగానే పర్లాకిమిడి వీడి రాజమండ్రికి 1936లో వెళ్ళిపోయారు. సీతాపతిగారు ఇంతకుముందే రాజాపై తమ ఉద్యోగం విషయంపై దావా వేశారు. అది తేలేదాకా అక్కడ ఉండవలసి వచ్చింది. నెడియన్ బాప్టిస్టు మిషన్‌వారి అభ్యర్థనపై బైబిలులో మూడు సువార్తలను అనువదించడానికి సరంగ్ గ్రామంలో అరణ్యావాసం చేశారు. తర్వాత చెన్నపట్నానికి కుటుంబంతో వెళ్ళిపోయారు.

1938లో సీతాపతిగారు సినిమాలలో ప్రవేశించారు. గూడవల్లి రామబ్రహ్మంగారి రైతు బిడ్డలో జమీందార్ వేషంతో రంగప్రవేశం చేశారు. తర్వాత ఇంకో అరడజన్ చిత్రాలలో వేషాలు వేశారు. 1940లో రామమూర్తిగారు మద్రాసులో తమ తుది విన్నపాన్ని పత్రికా సంపాదకులకు విన్నవించి మరణించారు.

రాజకీయాలలో దీర్ఘవైరాలు ఉండవంటారు. సాహిత్య రాజకీయాలలో కూడా ఇది వర్తిస్తుంది అనుకోవాలి. రామమూర్తిగారు 1910 నుండి ఆంధ్ర సాహిత్య పరిషత్తుతోనూ, దానికి ప్రధాన పోషకులైన పిఠాపురం రాజాతోనూ పోరాడుతూనే వున్నారు. 1942లో రామమూర్తిగారు పోయిన రెండేళ్ళకు పిఠాపురం రాజాగారు, సీతాపతిగారితో ''సంధి'' చేసుకొన్నారు. సింగభూపాలుడు రచించిన రత్న పాంచాలికను అనువదించమని కోరారు. ''గ్రాంథిక భాషలో రాయకూడదన్న నియమం పెట్టుకొన్నారా?'' అని అడిగితే సీతాపతిగారు ''అట్టి నియమాలు నేనేమీ పెట్టుకోలేదు. మా వ్యావహారిక భాషావాదం ముఖ్యముగా గద్య రచన కోసముద్దేశించబడినది. పద్య రచనలో వ్యాకరణ సూత్రాలకు విరుద్ధములయినా కవుల ప్రయోగాలు కూడా గ్రాహ్యాలు'' అన్నారు. సీతాపతిగారి వాదం రాజుగారికి నచ్చింది. ఆ అనువాదం ప్రకటించి వేయి రూపాయిలు ఇచ్చారు.

తర్వాత పిఠాపురం మహారాజాగారితో కలిగిన పరిచయం గాఢమైన మైత్రిగా మారింది. పింగళి సూరన్న ప్రభావతీ పరిణయం, దేవులపల్లి సుబ్బయ్యశాస్త్రిగారి మహేంద్ర విజయం, దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రిగారి రావు వంశముక్తావళి, సింగభూపాలుని రసార్ణవ సుధాకరం, సూర్యరాయ నిఘంటువులు - 5, 6, 7 సంపుటాలు, ముద్రించే పని సీతాపతిగారికి రాజాగారు అప్పగించారు.[10] జమీందారీల రద్దు వల్ల పిఠాపురం వారికి ఆర్థిక లోపం కనబడి ప్రభుత్వం వారి సహాయంతో నిఘంటువు బయటపడింది.

లోగడ మాగంటి బాపినీడుగారి ''ఆంధ్ర సర్వస్వం''లో చాలా వ్యాసాలు రాసినందువల్ల సీతాపతిగారిని తెలుగుభాషా సమితివారు 1948 నుండి 1957 దాకా తమ విజ్ఞాన సర్వస్వ నిర్మాణంలో ప్రధాన సంగ్రాహకునిగా పెట్టుకున్నారు. ''చరిత్ర- రాజకీయం'' అనే మొదటి సంపుటానికి సీతాపతిగారే సంపాదకులు. వృద్ధాప్యం వల్లా, రక్తపు పోటువల్లా ఈ ఉద్యోగాన్ని వదలుకొన్నారు. సీతాపతిగారు కొన్ని సృజనాత్మక రచనలు చేశారు. వాటిలో భారతీశతకం ఒకటి. చాలా తెలుగు రచనలను సంస్కృతం లోనికి అనువదించారు. బాల సాహిత్యం కూడా వృద్ధిపరిచారు. వీరి ''తెలుగులో ఛందోరీతులు'' అనే గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు బహుమతి ఇచ్చారు.

సీతాపతిగారికి సంగీతమంటే ఆసక్తి ఉంది. వీణ సాధన చేశారు. పిఠాపురం రాజాగారి మైత్రి వల్ల నాట్యాలు చూసే అవకాశం ఏర్పడి క్షేత్రయ్య పదాలపై మోజు పెరిగింది. దొరికినన్ని పదాలను సేకరించి ఒక సంపుటంగా ప్రకటించారు. ఇది 1952లో పిఠాపురం వారి సమాదరణ వల్లే వెలుగు చూసింది. రామమూర్తిగారు ఏనాడో పదాలలోనూ, పాటలలోనూ వాడుకభాషనే కవులు ఉపయోగించారని చెప్పారు. 1952లోగాని ఇది కొందరికి అనుభవంలోనికి రాలేదు. 1963లో గిడుగు రామమూర్తిగారి శతవార్షికోత్సవం జరిగింది. దానిని సీతాపతిగారు చూడగలిగారు. నూరేళ్ళలో జరిగిన మార్పులను కూడా లోకం చూసింది.

బుర్రా శేషగిరిరావు (1884-1941)

లోకాన్ని చూడవలసిన పద్ధతులను గిడుగు రామమూర్తిగారు తమ శిష్యులకు బోధించడంలో దిట్ట. వారి తర్ఫీదులో తయారైన చారిత్రక సాహిత్య పరిశోధకులు మౌలికమైన రచనలు చేసినవారున్నారు. వారిలో బుర్రా శేషగిరిరావుగారు ప్రథములు.

చిన్నప్పుడే పర్లాకిమిడిలో శేషగిరిరావుగారు సీతాపతిగారితోపాటు పెరిగారు. ఇద్దరూ కలిసి చదువుకొన్నారు. శేషగిరిరావుగారు విశాఖజిల్లా, భీమునిపట్నం దగ్గిరనున్న తాటికుర్రు అనే గ్రామంలో జన్మించారు. బాల్యంలోనే తండ్రిగారు పోవడం వల్ల పర్లాకిమిడిలో పినతండ్రి దగ్గర పెరిగారు. ఎప్ఫీదాకా అక్కడే చదువుకొన్నారు.

10. గిడుగు సీతాపతి - స్వీయచరిత్ర - పుట.57

రామమూర్తిగారి దగ్గర శాసన పరిశోధనా విశేషాలను అభ్యసించారు. విజయనగరంలో బియ్యే ప్యాసయి 1908లో మహారాజా కళాశాలలో సహాయాధ్యాపకునిగా చేరారు. గురజాడ అప్పారావుగారి సమక్షంలో సాహిత్య సిద్ధాంతాలను అవగాహన చేసుకొన్నారు. గిడుగు, గురజాడల ప్రత్యక్ష శిక్షణ వల్ల వ్యావహారిక భాషావాదం, శాసన పరిశోధనలు, సాహిత్య దృక్పథాలు మొదలైనవి మధించి స్వతంత్ర ప్రతిభను సంతరించుకొన్నారు.

గిడుగువారు ముఖలింగం మీద మౌలికమైన పరిశోధన చేస్తే శేషగిరిరావుగారు దక్షిణ భారతదేశంలో జైన మత ప్రాబల్యంమీద చాలా ఒరిజినల్ పరిశోధనలు చేశారు. వారు ఆంగ్లంలో రాసిన ''స్టడీస్ ఇన్ సౌత్ ఇండియన్ జైనిజం'' అన్న గ్రంథం ఈ కోవ పరిశోధనలలో ప్రథమశ్రేణి రచన. ''పూని ఏదైనాను ఒక మేల్‌కూర్చి జనులకు చూపవోయ్!'' అన్నారు గురజాడ. వారి హితోపదేశానికి ఇది సజీవ సాక్ష్యంగా శేషగిరిరావుగారు చరిత్ర పరిశోధనలను కానుక చేశారు.

మద్రాసు విశ్వవిద్యాలయంవారు 1911లో కాంపోజిషన్ కమిటీ వేసి విద్యార్థులు ఏ శైలిలో వ్యాస రచన అనువాదాలు చేయాలో నిర్ణయించమన్నప్పుడు ఆ కమిటీలో శేషగిరిరావుగారుకూడా సభ్యులు. వాడుక భాషనే విద్యార్థులు ఉపయోగించాలని వాదించిన పక్షంలో శేషగిరిరావుగారు ఉన్నారు. ఈకాలంలోనే తెలుగులో వ్యక్తిదూషణే విమర్శగా చెలామణి అవుతున్నప్పుడు సాహిత్య విమర్శ ఎలా ఉండాలో నిర్ణయిస్తూ ''విమర్శాదర్శ'' అనే గ్రంథం రచించారు. ఆంధ్ర సారస్వతము సగటున చూసి మంచి చెడ్డలు నిర్ణయించాలనీ, కేవలం తప్పులు పట్టడమే విమర్శ అనిపించుకోదనీ, విషయాన్ని బట్టి శైలి మారుతుందనీ ఇందులో రాశారు. ఈ గ్రంథాన్ని విమర్శిస్తూ పానుగంటివారు ''విమర్శాదర్శ విమర్శాదర్శం'' రాశారు. 1915లో మద్రాసు విశ్వవిద్యాలయం వారు ద్రావిడ భాషా పరిశోధకునిగా శేషగిరిరావుగారిని నియమించింది. రెండేళ్ళపాటు ఆ ఉద్యోగంలో ఆయన ఉన్నారు.

విజయనగరం కాలేజీలో ఉపన్యాసకునిగా పనిచేస్తూ ముప్పయి సంవత్సరాలు విద్యారంగానికి సేవచేసి ఆంగ్ల శాఖకు అధ్యక్షునిగా ఎదిగి 1940లో రిటైర్ అయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926లోగాని రూపం దాల్చలేదు. అయితే అంతకు మూడేళ్ళ క్రిందటే 1923లో ''భారతీ తీర్థ'' అనే పేరుతో విజయనగరంలో ఒక తెలుగు విశ్వవిద్యాలయంలాంటి సంస్థను శేషగిరిరావుగారు స్థాపించారు. విజయనగరందాకా అలక నారాయణ గజపతి, జయపురం సంస్థానపు విక్రమదేవవర్మ మొదలైనవారు ఈ సంస్థకు కులపతులుగా వ్యవహరించారు. ఎందరో అర్హులైన పండితులకు బిరుదులు, సత్కారాలు సమర్పించారు. దీనిని ఆంగ్లంలో ''ఆంధ్రా రిసెర్చి యూనివర్సిటీ ఇంటర్‌నేషనల్'' అని వ్యవహరించేవారు.

చరిత్ర పరిశోధనలో సత్యాన్ని నిర్ణయించడం ప్రధానం కనుక బుర్రా శేషగిరిరావుగారు ''బొబ్బిలి ముట్టడి'' అనే నాటకం ఆరేళ్ళు పరిశోధన జరిపిన తర్వాత

చారిత్రక యదార్థాలను నాటకీయతతో మేళవించి విజయనగరంవారి దృక్పథంలో చరిత్రను చిత్రించారు. అప్పటిదాకా బొబ్బిలిపాటవల్లా, శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి, వేదం వెంకటరాయశాస్త్రి మొదలైనవారు బొబ్బిలి వీరులనే ప్రశంసిస్తూ విజయనగరం వారిని విలన్లుగా చిత్రించే నాటకాలు రాశారు. ఇవే ప్రజలలో ప్రచారం పొందాయి. నిజం నిర్ధారణ చేసి చెప్పడానికి శేషగిరిరావుగారు ''బొబ్బిలి ముట్టడి'' ని చక్కని వ్యావహారిక భాషలో రచించారు. దీనిని రాయడానికే బతికున్నానా అన్నట్టు ఇది రచించిన రెండువారాల తర్వాత 1941లో మరణించారు. ఈ నాటకానికి తగిన ప్రచారం రాలేదు.

ఎందరో అర్హులకు తమ ''భారతీతీర్థ'' తరపున బిరుదులు ఇచ్చిన శేషగిరిరావుగారికి ''అమెరికన్ ఇంటర్‌నేషనల్ అకాడమీ''వారు ''డాక్టర్ ఆఫ్ లెటర్స్'' పురస్కారాన్ని చేసింది. గిడుగువారి శిష్యులైనందుకు శేషగిరిరావుగారు ఆది నుంచి వాడుక భాషనే ప్రచారం చేశారు. అందులోనే రచనలు చేశారు.

చిలుకూరి నారాయణరావు (1890–1952)

గిడుగు రామమూర్తిగారి శిష్యులలో ఎన్నదగినవారూ, అన్నింటిలో మిన్న అనిపించే వారు ఇంకొకరున్నారు. ఆయన చిలుకూరి నారాయణరావుగారు. ఆయనలో కవి, పండితుడు, విమర్శకుడు, పరిశోధకుడు కలసి కనబడతారు. ప్రాచీనతను, నవీనతను సమంగా చూడగలరు.

చిలుకూరి నారాయణరావుగారు చిరస్మరణీయులు. బహుముఖ ప్రజ్ఞాశాలి. బహుభాషా దురంధరులు. శతాధిక, అక్షరాలా శతాధిక గ్రంథకర్తలు. ఒక సంచార గ్రంథాలయంగా, సజీవ విజ్ఞాన సర్వస్వంగా ఆయన జీవించారు. ఒక అర్ధ శతాబ్దం నిర్విరామంగా నిరంతర పరిశోధనలు చేసి లక్షా ఇరవై వేల పుటలకు సరిపడ్డ రచనలు చేసిన అద్వితీయులు.

చిలుకూరి నారాయణరావుగారు అలనాటి విశాల విశాఖ జిల్లాలోని పొందూరుకు దగ్గర్లో వున్న ఆనందపురంలో 1890లో జన్మించారు. తాతతండ్రులు మాధ్వులు కనుక చిలుకూరి వారి ఇంట్లో కన్నడంలోనే అందరూ మాట్లాడుకొనడం జరిగేది. అందుచేత పసివయస్సులోనే నారాయణరావుగారికి తెలుగు, కన్నడాలు పట్టుబడ్డాయి. స్వగ్రామమైన ఆనందపురంలోనే ప్రాథమిక విద్య ముగించుకొని శ్రీకాకుళం మునిసిపల్ హైస్కూల్లో మెట్రిక్ చదివారు. ఫస్టుక్లాసు వచ్చింది.

మార్కులు బాగా వచ్చిన ప్రజ్ఞావంతులందరూ పెద్ద చదువులు చదువుకునే అదృష్టానికి నోచుకోరు. హైస్కూలు చదువు పూర్తి చేయడానికే చిలుకూరి వారికి ఒక యజ్ఞం అయింది. పేదవారు కావడంచేత పుస్తకాలకూ, బట్టలకూ గతిలేక చాలా కష్టపడవలసి వచ్చింది. అయితే సహాధ్యాయులూ, సహృదయులూ నారాయణరావుగారికి పుస్తకాలూ, బట్టలూ ఇచ్చి సహాయం చేసేవారు.

ఇక కాలేజీ చదువులు ఎలాగా అని మధనపడుతున్న రోజుల్లో చిలుకూరి నారాయణరావుగారు తలవని తలంపుగా గిడుగు రామమూర్తిగారి దృష్టిలో పడ్డారు. కుర్రాడిలోని చురుకుదనం చూసి ఇంతటి కుశాగ్ర బుద్ధి పై చదువులు చదువుకుంటే ఎంతో రాణిస్తాడని గిడుగువారు నారాయణరావుగారి ఉన్నత విద్యాభారాన్ని తమ మీద వేసుకున్నారు. అప్పుడు గిడుగువారు పర్లాకిమిడి కళాశాలలో హిస్టరీ మాస్టరు. ఆయన నారాయణరావుగారిని తమ ఇంట్లో పెట్టుకొని కళాశాల చదువు చదివించారు. పర్లాకిమిడిలో ఎఫ్ఫే చదివారు. తర్వాత విజయనగరంలో బి.ఎ. పూర్తి చేశారు. తమ గురువుగారిలాగే నారాయణరావుగారు కూడా చరిత్రనే అభిమాన విషయంగా ఎంచుకున్నారు. గిడుగువారికి చేదోడువాదోడుగా వుంటూ చారిత్రక పరిశోధనలు కూడా చేశారు. ఎక్కడలేని తామ్ర శాసనాలు చదివారు. ఎక్కడ కనబడితే అక్కడ శిలాశాసనాలు కాపీ రాసుకొని పరిష్కరించారు.

చదువులంటే చెవికోసుకొంటారు. కనుక నారాయణరావుగారు బి.ఎ.తో తృప్తి చెందలేదు. ఎం.ఎ. పట్టాని ఆంధ్ర, కర్ణాటక భాషలు అభిమాన విషయాలు ఎంచుకొని పొందారు. ఇంట్లో మాట్లాడే కన్నడంతో సంతృప్తిపడక, విజయనగరం కాలేజీలో ఇంగ్లీషు పాఠాలను చెప్తున్న కర్ణాటక భాషలో పండితులైన సుబ్బరాయభట్టుగారి వద్ద క్షుణ్ణంగా చదువుకొన్నారు. అందుకే ఎం.ఎ.లో కన్నడం కూడా కలుపుకొన్నారు. ఉన్నత విద్యాబోధనకు అవసరమైన ఎల్.టి. పట్టాన్ని తెచ్చుకొన్నారు.

నారాయణరావుగారు విశాఖపట్నం సి.బి.యం. హైస్కూల్లో మూడేళ్ళు మాస్టరుగా పనిచేశారు. తర్వాత ఏట్స్ దొరగారి కింద స్కూళ్ళ ఇన్స్పెక్టరుగా కూడా పనిచేశారు. (ఏట్సు దొర అంటే మరెవరో కాదు. గిడుగు, గురజాడ వారిలో వ్యావహారిక భాషావాదపు బీజాలు నాటిన ఆంధ్రభాషాభిమాని) స్కూళ్ళ ఇన్స్పెక్టరుగా రెండేళ్ళు పనిచేశాక నారాయణరావుగారు రాజమహేంద్రిలోని గవర్నమెంటు కాలేజీలో తెలుగు పండితులుగా పనిచేశారు.

గిడుగువారి శిక్షణ వల్ల చిలుకూరి వారిలో భాషా పరిశోధనాసక్తి ఉజ్జ్వలమైంది. నన్నయగారి భారతంపై ఆయన పరమప్రామాణికులయ్యారు. పదకొండో శతాబ్దపు తెలుగుమీద పరిశోధనలు చేసి అంతటితో ఆగక ఆంధ్రభాషా చరిత్రను రచించడానికి పూనుకొన్నారు. రెండు భాగాలలో రాశారు. ప్రథమ భాగంలో 800 పుటలు ఉన్నాయి. ద్వితీయ భాగంలో 950 పుటలు ఉన్నాయి. వెరసి గ్రంథం 1750 పుటలు. ఈ పుస్తకాల సైజు రాయల్ సైజు.

ఇంతటి బృహద్గ్రంథాన్ని రచించినందుకు ఆయనను ఎంత అభినందించినా చాలదు. అయితే ఇందులో ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాల దగ్గరే చాలామంది పేచీ పెడతారు. ''తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును'' అనేది ప్రాచీన సిద్ధాంతం. పాశ్చాత్యులు వచ్చాక ద్రావిడ భాషావాదం వచ్చింది. రాబర్ట్ కాల్డ్వెల్ ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణం రాసి తెలుగు ద్రావిడ భాషలలో ఒకటి అని సంస్కృత భాషా కుటుంబంలోనిది కాదని

సప్రమాణంగా ప్రతిపాదించారు. చిలుకూరివారు ఈ వాదాన్ని ఖండిస్తూ అంతటి పెద్ద గ్రంథాన్ని రచించారు.

నారాయణరావుగారు తమ గ్రంథంలో ''తక్కిన ద్రావిడ భాషలకంటే తెలుగే ప్రాచీన ప్రాకృత భాషలకు దగ్గరగా'' ఉందని ప్రతిపాదించారు. తెనుగు ప్రాకృత భాషా జన్యమన్నారు. తక్కిన ద్రావిడ భాషలు కూడా ప్రకృత భాషా భేదాలే అన్నారు. నారాయణరావుగారి వాదాన్ని భాషా శాస్త్రవేత్తలు ఆమోదించలేదు. మారేపల్లి రామచంద్రశాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య, వజ్ఝల చిన సీతారామశాస్త్రి, గంటి జోగిసోమయాజివంటి తొలితరం ద్రవిడ భాషావాదులు చిలుకూరివారి వాదాన్ని పూర్వపక్షం చేశారు.

మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు చాలా ఘాటుగా రాశారు. ''ద్రావిడ భాషాలనుకొనునవి పైశాచీ ప్రాకృతముల నుండి పుట్టినవేకాని ప్రత్యేక భాషా కుటుంబమునకు చెందినవి కావు అని తలపోయుట పగటికల! ద్రావిడులను ప్రత్యేక జాతివారు లేరు అనుట పచ్చి తెగువ!! వీని ప్రాపున కొత్త సిద్ధాంతమును అల్లజూచుట గాలిలో మేడకట్టుట!!!'' (తెనుగుతోబుట్టువులు - పుట 34) ఇతర భాషావేత్తలు కూడా నారాయణరావుగారి వాదాన్ని అంగీకరించక చాలా విపులమైన ఖండనలు రాశారు.

అసలు చిలుకూరి వారి గురువులు గిడుగు రామమూర్తిగారే ఆ వాదాన్ని ఆశీర్వదించలేదు. గురుశిష్యులకు అభిప్రాయభేదాలు చాలా వున్నాయి. ''నావాదమును వారంగీకరింపరని నాకు తెలియును'' అని నారాయణరావుగారు రాశారు. తమ వాదం నిలవకపోతే వారు బాధపడరు. ''తమ తమ వాదములే గెలువవలెనని పట్టుదల తత్త్వైక దృక్కుల కుండకూడదు'' అని ఆయనే చెప్పారు. ముందు ముందు ఎవరైనా సమగ్రంగా సప్రమాణికంగా ఆంధ్రభాషాశాస్త్ర చరిత్రను రాస్తే సంతోషిస్తామన్నారు.

చిలుకూరి నారాయణరావుగారు పుట్టిందీ, కలం పట్టిందీ విశాఖజిల్లాలో; కాలు పెట్టింది అన్ని జిల్లాలలో. మెట్టిందీ, సాహితీ పట్టం కట్టిందీ అనంతపురంలో.

నారాయణరావుగారు ఒకసారి కాదు, ముమ్మారు ఎమ్.ఎ. పట్టభద్రులయ్యారు. ఎల్.టి. పట్టం పొంది అధ్యాపకునిగా అర్హత పొందారు. పదకొండో శతాబ్దపు తెలుగుభాషమీద సిద్ధాంత వ్యాసం వ్రాసి మద్రాసు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టం పొందారు (తెలుగు భాషలో మొదటి పి.హెచ్.డి. పట్టం పొందినవారు నారాయణరావుగారే). కాశీ సంస్కృత విద్యాపీఠం వారు నారాయణరావుగారికి ''మహోపాధ్యాయ'' బిరుదును ఇచ్చారు. 1947లో బ్రిటిష్ దొరతనం వారు పోతూ పోతూ నారాయణరావుగారికి మరొక ''మహోపాధ్యాయ'' బిరుదు ఇచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ బిరుదును ఇచ్చారు.

నారాయణరావుగారు రాజమహేంద్రిలో దేశీయ ఇతిహాస పరిశోధక మండలి సంస్థాపకులలో ఒకరు. గుంటూరులో నవ్య సాహిత్య పరిషత్తును స్థాపించడంలో చిలుకూరి వారి పాత్ర చాలా ప్రధానమైంది. చాలా సంవత్సరాలు ఆ సంస్థకు ఆయన అధ్యక్షులు. ఆ తర్వాత అనంతపురంలో కృష్ణదేవరాయ పీఠాన్ని ఆయన నెలకొల్పారు.

పైన చెప్పిన వైనాలు చూశాక చిలుకూరి నారాయణరావుగారూ, ఆయన కృషి ఒక్క రాయలసీమకే పరిమితంకాక యావదాంధ్రకూ చెందుతుందని విశదమవుతుంది. అలాగే ఆయన తత్వచింతన ఏ ఒక్క మతానికో మీదు కట్టినది కాదు. వైదిక మతాలూ, అవైదిక మతాలూ, పరమతాలూ కూడా ఆయన తరచి చూశారు. శైవసిద్ధాంతం, బసవేశ్వర చరిత్రా రాసి ఊరుకోక బౌద్ధ, జైన మతాలు సిద్ధాంతాల గూర్చి గ్రంథాలు రాశారు. బైబిల్ పాత, కొత్త నిబంధనలు అనువదించారు. ఖురానే షరీఫ్ అనువదించి ఇస్లాం మత స్వరూపాన్ని సాక్షాత్కరింపచేశారు. ఇకపోతే సాయణ భాష్యంతో ఋగ్వేదాన్ని టీకా తాత్పర్య సహితంగా తెనుగు చేశారు. ఆపస్తంభ, గౌతమ ధర్మ సూత్రాలను ప్రతిపదార్థ సహితంగా అనువదించారు. అద్వైతసిద్ధాంతం, భగవద్గీత వచనంలో విశదపర్చారు.

దేశ చరిత్రలూ, జీవిత చరిత్రలూ రాశారు. గ్రీకు, రోమను, చినీ, జపాను, రష్యా, బర్మా మొదలైన విదేశ చరిత్రలేకాక ఆంధ్ర, భారతదేశ చరిత్రలు రచించారు. శాస్త్ర గ్రంథాలను కూడా ఆయన విడిచిపెట్టలేదు. తర్కశాస్త్రం వంటి ప్రాచీన శాస్త్రాలేకాక, శిశు మనశ్శాస్త్రం, ప్రసవ శాస్త్రం మొదలైనవి కూడా రాశారు. (ఆదిలో వీరేశలింగంగారు స్త్రీలకు ఉపయోగపడే రీతిలో గర్భధారణం, శిశుజననం మొదలైన విషయాలపై పుస్తకం రాశారు. మళ్ళా చిలుకూరి వారు ఆ పని చేశారు.)

నారాయణరావుగారు వాఙ్మయ చరిత్రలూ, భాసా చరిత్రలూ రాశారు. నిఘంటువులూ, పదకోశాలూ, లోకోక్తి సంకలనం చేశారు. లక్షా యాభైవేల తెలుగు సామెతలను ఆయన చేర్చారట. ఇంగ్లీషులో కూడా ఏడు గ్రంథాలను రాశారు. కేవలం శాస్త్రీయ వచనమేకాక సృజనాత్మక సాహిత్యం కూడా రచించారు. నాటకాలూ, పద్య కావ్యాలూ కూడా వారి రచనలలో ఉన్నాయి.

ఆయన పది సంపుటాలలో రాసిన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సొంతం అచ్చులో అలభ్యం కావడం ఆంధ్రుల దురదృష్టం. శాస్త్రీయ సృజనాత్మక గ్రంథాలు వారిని సుమారు 250 దాకా ఉన్నాయి. ఇంతటి బహు సంఖ్యలో రచనలు చేశారు. కాబట్టే చిలుకూరి వారి రచనలు లక్షా పాతికవేల పుటలు పట్టాయి. ఇంతటి ''రాక్షస'' పరిశోధనాసక్తి ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

వజ్ఝల చిన సీతారామశాస్త్రి (1878-1964)

గిడుగు రామమూర్తిగారి శిష్యులలో ఒకరైన బుర్రా శేషగిరిరావుగారు మద్రాసు విశ్వవిద్యాలయంలో రెండేళ్ళపాటు ద్రావిడ భాషా పరిశోధకునిగా పనిచేస్తే, మరొక శిష్యుడైన చిలుకూరి నారాయణరావుగారు ద్రావిడ భాషా వాదానికి విరుద్ధంగా ఆంధ్ర భాషా చరిత్రను వివరించారుగానీ, రామమూర్తిగారి రచనలను ఆది నుండి ఒకే రకంగా బలపరుస్తూ వచ్చిన చిన సీతారామశాస్త్రిగారు మద్రాసు విశ్వవిద్యాలయం ప్రాచ్య భాషా పరిశోధన శాఖలో పనిచేస్తున్న కాలంలో తమిళం, కన్నడం, మళయాళం వ్యాకరణాలను ఆయా భాషాల పండితుల దగ్గర నేర్చుకొని, సూత్రాలు రాసుకొని, ద్రావిడ భాషల

తులనాత్మక వ్యాకరణ విశ్లేషణ చేసి, ''ద్రావిడ భాషా పరిశీలనం'' అన్న మౌలిక గ్రంథాన్ని రచించారు.

వజ్ఝల వారు బొబ్బిలికి దగ్గరలో ఉన్న పాలతేరు గ్రామంలో జన్మించారు. చిన్నతనంలో తన తండ్రిగారైన ముఖ లింగేశ్వరశాస్త్రిగారి దగ్గర సంస్కృత కావ్య నాటక గ్రంథాలను చెప్పుకొన్నారు. ఒక పిన తాతగారి దగ్గర జాతక ముహూర్త సిద్ధాంత భాగాలనూ, లీలావతీ బీజ గణితాన్ని నేర్చుకొన్నారు. మరొక పినతాతగారి వద్ద తెలుగులో ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం మొదలైన శాస్త్రాలతోపాటు ధర్మశాస్త్రాన్ని కూడా చదువుకొన్నారు. ఎవరెవరు ఎంత నేర్పగలరో అంతా నేర్చాక ఇతరుల వద్ద తర్క వేదాంత శాస్త్రాలను అధ్యయనం చేశారు. ఇవన్నీ కిందటి శతాబ్ది చరమపాదంలో జరిగిన సంగతులు.

ఆ రోజుల్లో ఏ మాత్రం ప్రతిభ ఉన్నవాడైనా అష్టావధానం, శతావధానం చేయడం ఒక ఫ్యాషను. చిన సీతారామశాస్త్రిగారు కూడా సంస్కృతంలోనూ, తెలుగులోనూ చిత్రకవిత్వం విచిత్రంగా చెబుతూ అష్టావధానాలు చేసేవారు. బొబ్బిలి ప్రాంతాలకు ఎటువంటి దిగ్గంతులు వచ్చినా వాళ్ళతో శాస్త్ర చర్చ చేయడం వజ్ఝల వారికి ద్వితీయ ప్రకృతి క్రింద పరిణమించింది. శాస్త్రిగారి స్వగ్రామం బొబ్బిలికి దగ్గరలో వున్న పాలతేరుకు ఆరోజుల్లో తిరుపతి కవులు వచ్చినప్పుడు వాళ్ళతో శాస్త్రిగారు వాదోపవాదాలు పెట్టుకొన్నారు. వజ్ఝలవారి ఎడమ కంటిలో పువ్వుంది. దీనిని పురస్కరించుకొని తిరుపతి కవులు శాస్త్రిగారిని అన్న మాటలు ఔదార్యరహితమైనా ఆ రోజుల్లో అందరికీ కంఠోపాఠమే. ఇటువంటి వాటిని శాస్త్రిగారు ఖాతరు చెయ్యక తమ వాదంలోని బలాన్నే ఎప్పుడూ నమ్ముకునేవారు.

1909లో శాస్త్రిగారు పాలతేరు విడిచిపెట్టి విజయనగరం చేరుకొన్నారు. అప్పటికి గురజాడ అప్పారావుగారు సజీవులు. ఇతరుల సుగుణాలను పసికట్టడంలో అప్పారావుగారు అందెవేసిన చెయ్యి. వజ్ఝలవారి విమర్శనా పటిమనూ, ప్రతిభనూ అప్పారావుగారు ఇట్టే గుర్తించారు. పనికట్టుకొని విజయనగరంలో ఉన్న పండితులందరికీ సీతారామశాస్త్రిగారిని పరిచయం చేశారు. ''ఈ యువకుడు సాహిత్య విమర్శలో కొత్త పాతల మేలుకలయిక. చాలా అరుదైన వ్యక్తి!'' అని అప్పారావుగారు అందరికీ చెప్పేవారు.

ఈనాడు వజ్ఝలవారు జటిలమైన విషయాలపైన పటుల పారిభాషిక పదాలతో కఠినమైన శైలిలో వ్రాస్తారు కనుక ఆయన కరుడుకట్టిన గ్రాంథికవాది అని అందరూ పొరబడవచ్చునుగాని, ఆనాడు గురజాడ అప్పారావుగారికి వీరు అండదండగా ఉండేవారు. సనాతన పండితులతో చర్చలు జరిపేటప్పుడు గురజాడ వారి పక్కన వజ్ఝలవారెప్పుడూ వాదోడుగా ఉండేవారు. అప్పారావుగారు పురమాయించిన పరిశోధనలు చేస్తూ ఎంతో సహాయపడేవారు. చివరకు అప్పారావుగారి ప్రోద్బలం వల్లనే వజ్ఝలవారు ''వసుచరిత్ర విమర్శ''కు పూనుకొని ఆంధ్ర సాహిత్యానికి అపూర్వమైన సేవ చేశారు.

ఆంధ్ర కావ్యాలలో అనన్యమైన వసుచరిత్రనూ, అన్యమైన నరసభూపాలీయాన్నీ తైపారువేసి, పరిశోధించి ఈ రెండు కావ్యాలనూ ఒక్కరే వ్రాశారన్న సంగతి ''సాహిత్య పత్తేదారు''లై అంతరంగిక సాక్ష్యాలతో వఝ్ఝలవారు నిరూపించారు. ''రామరాజ భూషణుడు'' అనే పేరు భట్టుమూర్తి బిరుదనామమనే విషయాన్ని సాధికారంగా, సప్రమాణికంగా వఝ్ఝలవారే ప్రతిపాదించారు. ఇది ఈనాడు అందరూ అంగీకరించిన సత్యం.

అయితే వఝ్ఝలవారు సుదీర్ఘకాలం పరిశోధనలు చేసి, ''ఆంధ్ర శబ్దచింతామణి'' నన్నయ్యగారే రచించారని రుజువు చేయడానికి విశ్వప్రయత్నాలు చేశారు. చివరికి నన్నయ్యగారే వచ్చి ''ఇది నేను రాయలేదు'' అని చెప్పినా వఝ్ఝలవారు అంగీకరించరు. వారి నన్నయ కర్తృత్వ వాదాన్ని ఇవాళ సాహిత్య లోకంలో చాలామంది ఆమోదించరు.

దక్షిణాది నాలుగు భాషల వ్యాకరణాలతోపాటు సంస్కృతాన్ని జోడించి వఝ్ఝలవారు ''ద్రావిడ భాషా పరిశీలనం'' అనే ఉద్గ్రంథాన్ని వ్రాశారు. అందులో కాల్డ్వెల్ దొరకు ఎంత గౌరవమివ్వాలో అంతా యిచ్చి, అతని పొరపాట్లను ఖండించారు. ఈ గ్రంథం రెండు భాగాలు. తెలుగు భాషా శాస్త్రంపైన పరిశోధన చేయదలచినవాళ్ళు ఇది చదవక తప్పదు.

తరువాత వఝ్ఝలవారు వ్రాసిన మరొక ఉద్గ్రంథం ''ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము'' అనేది. ఇదీ రెండు భాగాలే. ఒక్కొక్కటి వెయ్యి పేజీలు. ఈ ఉద్గ్రంథాలపై వ్రాస్తూ ''ఈ పుస్తకం చిన్నయసూరిగారి బాలవ్యాకరణానికి సహా పెద్ద భాష్య గ్రంథము'' అని నిడుదవోలు వెంకటరావుగారు పొరపాటున అన్నారు. వెంటనే వఝ్ఝలవారు ''నా గ్రంథానికి మూలం నన్నయాథర్వణీయము'' అని చెప్పి ఈ సంగతి ''నా గ్రంథము నాఘ్రాణించిన వారికెల్ల విదితము కాగలదు'' అని స్పష్టం చేశారు.

పత్రికా ముఖాన మాత్రమే కాక వఝ్ఝలవారు నిడదవోలు, కాకినాడ, గుంటూరు, కడప, మధుర మొదలైన పట్టణాలలో జరిగిన పండిత సభలలో కూడా ఆంధ్ర లక్షణ శాస్త్రాల గురించి ప్రసంగించేవారు. శాస్త్ర పాండిత్యంతో పాటు సమయస్ఫూర్తి, చతురోక్తి, గాంభీర్యం మొదలైన ఆయుధాలతో ఆయన ఎక్కడకు వెళ్ళినా నెగ్గుకొచ్చేవారు. తాము పాల్గొన్న సభలలో తమ వ్యక్తిత్వం తప్ప యింకొకరిది కనబడేది కాదు. అందుకే జయంతి రామయ్య పంతులుగారు ఒకసారి ''సీతారామశాస్త్రిగారు ఏదైనా సభలో పాల్గొంటే అది ఏకపాత్రా నాటకమే!'' అని ఛలోక్తి విసిరారు.

ధర్మశాస్త్రాలను క్షుణ్ణంగా చదివి మథించారు గనుక స్త్రీ పునర్వివాహం శాస్త్రీయం కాదనే రోజుల్లో వఝ్ఝలవారు బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారితో, తాతా సుబ్బారాయుడు శాస్త్రిగారితో కలసి మళ్ళీ పెళ్ళి వైదిక సంప్రదాయాలకు విరుద్ధంకాదనే ధర్మశాస్త్ర నిర్ణయాన్ని చేశారు. అక్కడితో ఆగలేదు. ''స్త్రీ వివాహ వయో నియమము'' అనే గ్రంథం రాసి ప్రౌఢ వివాహాలను సమర్థించారు. ''రజస్వలానంతర వివాహమే ధర్మశాస్త్రముచేతనుత్తమ కోటిని నధిరోహించుచున్నది. ప్రకృతమున్న ఋతుమతీ వివాహమంతరించిన మాత్రమున

యాపత్కాల్పమనుట యసంగతము. శారదాబిల్లు క్షేమకరము'' అని స్పష్టంగా సంస్కరణను బలపర్చారు.

''వ్యావహారిక భాష ఎట్లు ఎంతవరకు సులభ రచనకు గ్రాహ్యామో'' చెప్పగలిగిన వఝలవారే గిడుగు రామమూర్తిగారు ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి పత్రికలో ''ప్రాదెనుగుకమ్మ''ను ప్రచురిస్తే దానిమీద ''అంపగమి''ని సంధించారు. ప్రాచీనాంధ్రంపై ఇద్దరికి ఇద్దరే సమర్థులు. వ్యవహారిక భాషపై ఎవరైనా కత్తి నూరితే వారిని వఝలవారు ఒక పట్టు పట్టేవారు. నిజమైన వ్యాకరణవేత్త వ్యవహారాలలో దృష్టం గ్రాహ్యమని అంగీకరించక తప్పదు.

మల్లాది సూర్యనారాయణశాస్త్రి (1880-1962)

ప్రతి వైయాకరణి ''ప్రయోగ శరణం - వ్యాకరణం'' అని ఒప్పుకొంటూనే ఏవో కొన్ని ప్రయోగాలనే పట్టుకొని వేళ్ళాడే లక్షణ గ్రంథాలను ప్రామాణికాలుగా భావించి వాటిలో కనబడని ప్రయోగాలను తప్పులనడం పరిపాటి. అయితే వందలాది పూర్వకవులు రచించిన అసంఖ్యాకమైన ప్రౌఢ కావ్యాల నుండి ప్రయోగాలను సేకరించి తైపారు వేస్తే భాషా రహస్యాలు బోధపడి నిజమైన అనుశాసనానికి అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి పని చేయాలన్నదే గిడుగు రామమూర్తిగారి ఆశయం. దాన్ని కొంతవరకు సఫలం చేసిన వైయాకరణి మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.

మల్లాదివారు 1914-15 సంవత్సరాల మధ్య ఆంధ్ర సాహిత్య పరిషత్తులో పూర్వ గ్రంథ ప్రకాశకులై సాహిత్య పరిషత్పత్రిక నడుపుతున్నప్పుడు గిడుగువారితో పరిచయమైంది. మల్లాది వారు గ్రాంథికవాదులే అయినా భాషా విషయాలు వారితో ప్రసంగించడానికి రామమూర్తిగారు విముఖులు కారు. మతభేదాలు మైత్రికి అడ్డురాకూడదనే గిడుగువారి నియమం. మల్లాదివారు రామమూర్తిగారి వాదాన్ని బాగా ఎరిగినవారు. ఎన్ని పూర్వకవి ప్రయోగాలను గిడుగువారు చూపించగలరో తెలుసుకొన్న పండితులు.

1923 నుండి మూడు సంవత్సరాలు దీక్షగా మల్లాదివారు ''ఆంధ్ర భాషాశాసనం'' అనే నూతన వ్యాకరణ గ్రంథాన్ని రచించసాగారు. తమ దగ్గర ఉన్న ప్రయోగాలకు తోడుగా మరికొన్ని ప్రయోగాలు లభిస్తే మేలని తలచి గిడుగువారికి ఒక లేఖలో విన్నవించారు. దానికి బదులు రాస్తూ తాము ఎన్నాళ్ళనుంచో రాసిపెట్టుకొన్న ప్రయోగాల పుస్తకాన్ని రామమూర్తిగారు పంపించారు. వాటిలోంచి తమ అభిప్రాయాలకు అనుకరణమైన వాటిని స్వీకరించి మల్లాదివారు 1926లో ఆంధ్రభాషానుశాసనాన్ని రచించారు. దాని విజ్ఞప్తిలో గిడుగువారికి కృతజ్ఞతలు కూడా చెప్పారు.

మల్లాదివారి పుస్తకం అచ్చుపడడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఒకసారి రామమూర్తిగారు రాజమండ్రికి వచ్చారు. మల్లాదివారి ఇంటికి వెళ్ళి ఆగ్రంథాన్ని రెండురోజులపాటు నిశితంగా పరిశీలించారు. ''మీరు వ్రాసినది నా వాదము

నూటికరవైపాళ్ళు అంగీకరించినట్లున్నది. ఆ శేషమంగీకరించుట మీకిష్టము కాదు కాబోలు. అయితేనేమి మీరింత వరకంగీకరించడమే నాకు సంతోషం'' అని చెప్పారట. ఈ సంగతులు గ్రంథస్థం చేస్తూ మల్లాదివారు ఇలా అన్నారు. ''ఈ సత్య విషయ మిసుమంతయైన తెలియని వారొకరు సర్వము తెలిసినట్లుగా నేను కృతజ్ఞతలు చూపనట్లుగా ఈ నడుమ భారతిలో వ్రాసినదెంతయు విచారకరమైనది'' అని బాధపడ్డారు.[11]

1940 మార్చి భారతిలో శ్రీనివాస శిరోమణిగారు ''గిడుగు రామమూర్తి పంతులుగారు - నా అనుభవాలు'' అన్న శీర్షికతో వ్రాసిన వ్యాసాల భాగాలనే మల్లాదివారు ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నారు కాబోలు. శిరోమణిగారి వ్యాసంలో భాగం ఇది.[12]

''అట్లా 15 సం॥లు కష్టపడి తయారుచేసుకొన్న గ్రంథము - ఆ గ్రంథము పుచ్చుకొని 5 సం॥లు దేశమంతటా తిరిగినారు. తాము తెలుసుకొన్న దానికంటే మరొకరికి ఏమీ తెలియదు అని తేలిపోయింది. ఆ గ్రంథాన్ని అచ్చువేయించమని మేమంతా వేధించినాము. ఇంతలో ఒకానొక శాస్త్రులుగారు పంతులుగారి దగ్గరకు వచ్చి సమగ్రమయిన వ్యాకరణము తెలుగులో వ్రాయవలెనని అనుకుంటున్నాము. మీ గ్రంథము అంతా నాకు ఇప్పించండి. నా పుస్తకానికి ఉపయోగించుకొంటాను అన్నారు. అంతే అడిగిందే ఆత్రముగా పంతులుగారు తమ గ్రంథాన్ని ఆ శాస్త్రులుగారి చేతికి ఇచ్చినారు. ఆ శాస్త్రులుగారు పంతులుగారు వ్రాసుకున్న ఉదాహరణలన్నిటికీ సూత్రాలు గ్రాంథికములో తయారుచేయించి అచ్చువేయించినారు. ఆ పుస్తకములో పంతులవారి పేరయినా ఆ బ్రాహ్మణుడు చెప్పలేదు!

''రాజమహేంద్ర వరము పంతులవారితో నేను వెళ్ళినాను. అక్కడ భావరాజు వెంకట కృష్ణరావుగారు పంతులుగారి దగ్గరికి వచ్చి ఆ వ్యాకరణములో పంతులువారి పేరయినా ఆ శాస్త్రులవారు వేయలేదని భగ్గున మండిపడిపోయినాడు. పంతులుగారు పకపకనవ్వినారు. కృష్ణారావుగారి వీపు తట్టి ''నా పేరెందుకు? నాకు పేరు అక్కరలేదు. నా వాదాన్ని ఆ శాస్త్రులవారు లోకములో పారవేసినారు. నాకదే తృప్తి'' అన్నారు. అంతటితో కృష్ణారావుగారు ఊరుకోలేదు. ఏదేదో మాట్లాడినారు. పంతులుగారు గంభీరముగా ''అక్షరాలు కనిపెట్టినవాడి పేరెవరికైనా తెలుసునా? అట్లాగే నా పేరు లోకానికి తెలిస్తే ఏం, తెలియకపోతే ఏం?'' అని మందలించారు.''

పైన ఉదాహరించిన పేరాగ్రాఫులు రామమూర్తిగారి ఔదార్యానికి నిదర్శనమైతే మల్లాదివారి వైదుష్యానికి చాలా గ్రంథాలు సాక్ష్యాలిస్తాయి. ఆయన నలభై సంవత్సరాలపాటు వివిధ పాఠశాలలలో, చివరకు విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులుగా విద్యాదానం చేసినవారు. చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి దగ్గర వ్యాకరణ శాస్త్రాన్ని అధ్యయనం చేసి స్వయంకృషి వల్ల ఉభయభాషా విశారదులయ్యారు. తర్వాత నాలుగు దశాబ్దాలు పఠన పాఠనాలలో ఆరితేరారు. వివిధ సంస్థానాలలో సత్కారాలు పొందారు.

11. ప్రతిభ - సంపుటి-4, 1940

12. ''మరోసారి గిడుగు రామమూర్తి'' - పుట. 177

1909-1919 వెంకటగిరి సంస్థానంలో

1910-1913 జటప్రోలు సంస్థానంలో

1919-1926 నూజివీడు నారయప్పారావుగారి వద్ద

జమీందారుల ఆదరంతోపాటు విశ్వవిద్యాలయం వారి ప్రోత్సాహం వల్ల మల్లాదివారు సంస్కృత వాఙ్మయ చరిత్రను రెండు భాగాలలో రచించి ప్రచురించారు. వైదిక వాఙ్మయ సంపుటం 1933లోనూ, లౌకిక వాఙ్మయ సంపుటం 1936లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. పూర్వం ఇంగ్లీషులో ఆంగ్లేయులు రచించిన సంస్కృత వాఙ్మయ చరిత్రలో దొర్లిన పొరపాట్లను మల్లాదివారు ఈ సంపుటాలలో సవరించారు.

కేవలం భాషా సాహిత్య చరిత్రలనూ వ్యాకరణాన్ని రచించడమేకాక మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు అనువాదాలనూ, సృజనాత్మక రచనలనూ కూడా చేశారు. వాటి వివరాలు ఇవి -

1. సంస్కృత వాఙ్మయ చరిత్ర (2 భాగాలు)
2. ఆంధ్ర భాషానుశాసనం (2 భాగాలు)
3. ఆంధ్ర దశ రూపకం (తెలుగు సేత)
4. భావనాటక కథలు (2 భాగాలు - వచనం)
5. ప్రేమతత్వం (పద్యకావ్యం)
6. ఉత్తర రామచరిత్ర (ఆంధ్రీకృతి)
7. భీష్మ ప్రతిజ్ఞ (నాటకం)
8. ఆంధ్ర భవిష్య పర్వం (పద్యప్రబంధం)
9. భవభూతి నాటక వచనం
10. విదుర నీతి
11. స్త్రీ ధర్మబోధిని
12. సత్యకీర్తి నాటిక
13. కవి విడంబనం
14. మహాభారత విమర్శనం

సంస్కృత రచనలు

15. బ్రహ్మసూత్రార్థ దీపిక
16. రజోఽనన్తర వివాహము
17. సంస్కృత భాషా - ఇవికాక అనేక పత్రికలలో వ్యాసరచనలు

పై రచనలు మాత్రమే కాక మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయం 14 వ్రాతప్రతులు పరిశోధించి, పరిష్కరించి, పాఠాంతరాలతో ప్రచురించారు. ఇది ''పిఠాపురం మహారాజా సమాదరణకు పాత్రమైనది''. 1938లో తొలి ముద్రణ - 1957లో మలి ముద్రణ పొందిన ఈ కావ్యానికి

మల్లాదివారు భావప్రకాశిక టీకను సమకూర్చారు. 1963లో ఇది మూడవ ముద్రణ పొందింది. సూరపరాజుగారి రెండు కావ్యాలను పేర్కొని మల్లాదివారు ఒక జ్ఞాపకం పెట్టుకోదగ్గ సంగతి చెప్పారు. ''ఇట్టివాడు కవి అని నిర్ణయించడానికి కళాపూర్ణోదయం. ఇట్టిది కవిత్వ కళ అని నిర్ణయించడానికి ప్రభావతీ ప్రద్యుమ్నం సమర్థా''లని వారి సత్యభాషణం. మల్లాదివారు కేవలం వైయాకరణులు మాత్రమేకాదు, రసజ్ఞులు.

బంకుపల్లి మల్లయ్యశాస్త్రి (1876–1946)

గతంలో ఉన్న మంచినంతా అవగతం చేసుకొని దానిని పండిత పామరులకు సరిసమానంగా అందచేయగలవాడే నిజమైన విజ్ఞానవేత్త. గిడుగు రామమూర్తిగారి స్నేహితులలో అటువంటివారు కొందరున్నారు. ప్రజల కోసం తమ ప్రజ్ఞలను వినియోగించారు. రామమూర్తిగారితోపాటు పర్లాకిమిడి కాలేజీలో సంస్కృతాంధ్ర పండితులైన బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు ప్రశంసనీయులైన ప్రజాశ్రేయోభిలాషులు.

బంకుపల్లివారు చదువుకొన్న శాస్త్రాలు ఇన్నీ, అన్నీ కావు. ఉర్లాం సంస్థానంలో బాల్యమంతా గడిపారు. కావ్య నాటకాలంకార సాహిత్యాలూ, వ్యాకరణం చదివి ఉర్లాం శ్రావణి సభలో పరీక్ష ఇచ్చి ఉత్తీర్ణులయ్యారు. తర్క వేదాంత శాస్త్రాలూ, భాష్యాంతం వ్యాకరణం నేర్పగల సామర్థ్యం, జ్యోతిష్యం, వేదాంత మీమాంస శాస్త్రాలు ఉద్దండ పండితుల దగ్గర నేర్చుకొన్నారు. గిడుగు రామమూర్తిగారి వద్ద సంగీతం నేర్చుకొన్నారు. ఇన్ని విద్యలు నేర్చుకొని పర్లాకిమిడి కాలేజీలో పనిచేస్తూ ఆయన ఊరుకోలేదు. తమకు వచ్చిన విద్యలు సామాన్య ప్రజలకు చెప్పడానికి భారత భాగవత రామాయణాల కథలలో వాటిని జోడించి, తెలుగు సాహిత్యంలోని వసుచరిత్రాది ప్రబంధాల కథలను కూడా తీసుకొని ''పురాణ హరికథ'' అనే పేరుతో నృత్య గీత తాళయుతంగా పాడి, ఆడి ఆంధ్ర దేశంలోని ఎన్నో పల్లెల్లోనూ, పట్టణాలలోనూ ప్రజలను ఉత్తేజితులను చేశారు. (ఆదిపూడి సోమనాథరావుగారు కూడా ఇలాగే హరికథలు చెప్పేవారన్నది ఇక్కడ గుర్తుంచుకోదగ్గ సామ్యం). మల్లయ్యశాస్త్రిగారు ఛాందస పండితులు కారు. సంఘ సంస్కర్త. ధర్మశాస్త్రాలను మథించారు కనుకనే రజస్వలానంతర వివాహాలను, హరిజనోద్యమాన్ని, స్త్రీ పునర్వివాహాలనూ అంగీకరిస్తూ అవి శాస్త్ర సమ్మతాలని పండిత సభలలో వాదిస్తూ దక్షిణ దేశం అంతటా సంచారం చేసి ప్రచారం చేశారు. కేవలం ప్రచారంతో ఆగకుండా తమ విశ్వాసాలను ఆచరణలో పెట్టి తమ వితంతు కుమార్తెకు పునర్వివాహం చేశారు. (ధర్మశాస్త్రం ప్రకారం ఒకసారి కన్యాదానం చేసినవారు మళ్ళా ఆ పిల్లను ఇంకొకరికి దానం చేయడానికి వీలులేదు. కనుక మల్లయ్యశాస్త్రిగారి కుమార్తెను గిడుగు రామమూర్తిగారు తమ బిడ్డగా స్వీకరించి వేదుల సత్యనారాయణశాస్త్రిగారికిచ్చి పెళ్ళి చేశారు.)

వేదాలలో ఏముందో సాధారణ జనానికి తెలిస్తే సనాతనుల బుకాయింపులు చెల్లవు. అందుచేత నిజమైన సంఘ సంస్కర్తలు వేదాన్ని ప్రజలకు విశదపర్చాలి. కావూరి వినయాశ్రమం వారి ప్రేరణచేత మల్లయ్య శాస్త్రిగారు సాయణ భాష్యానుసారంగా నాలుగు

వేదాలనూ ఆంధ్రీకరించారు. ఇందులో ఒక్క ఋగ్వేదాన్ని మాత్రమే ఆశ్రమం వారు ప్రకటించారు. మల్లయ్యశాస్త్రిగారు తెనిగించిన మిగతా మూడు వేదాలు, రచించిన ఎన్నో యక్షగానాలూ అచ్చుపడలేదు. ఉర్లాం పర్లాకిమిడి చీకటి సంస్థానాధిపతుల సత్కారాలను పొందారుగాని ఆ జమీందారులు మల్లయ్యశాస్త్రిగారి రచనలను అచ్చువేసి ఉంటే ''పురాణ వాచస్పతి'' అని వారికున్న బిరుదుకు తగ్గ రచనలు వెలుగుచూసి ఉండేవి. ఆయన అనర్గళ ధారాళ వాగ్ధోరణిలో చెప్పిన హరికథలూ, జనసామాన్యానికి సుబోధకాలను చేసిన ధర్మ రహస్యాలు గాలిలో కలిసిపోయి ఉండేవి కావు.

యల్లాపంతుల జగన్నాథం (?-1924?)

తమ రచనలను పత్రికలలోగాని, పుస్తకరూపంలోగాని ప్రచురిస్తే అవి కలకాలం ప్రాచుర్యం పొందకపోయినా కాలగర్భంలో కలసిపోవు. పరిశోధకుల దృష్టిలో ఎప్పుడో ఒకప్పుడు పడి, ప్రసిద్ధుల జీవిత చరిత్రల సమగ్ర స్వరూపాన్ని అర్థం చేసుకోడానికి పనికివస్తాయి. యల్లాపంతుల జగన్నాథం అనే రచయిత ''గాదెల గుండడు-కొండల మిండడు'' అనే రచనను బొబ్బిలి పాట వరుసలో వ్యావహారిక భాషను ఉపయోగించి రాశారు. ఇది అచ్చుపడ్డాక వేలూరి ప్రభాకరశాస్త్రిగారి దృష్టిలో పడింది. ఈ రచయితను అభినందిస్తూ ఒక లేఖను రాసి దానిని గిడుగు రామమూర్తిగారి పేర రాసిన ఇంకో ఉత్తరంలో జతచేసి 1924 మార్చి నెలలో పంపించదలిచారు. (ఆ సంగతి గిడుగువారికి రాసిన లేఖలో చెప్పారుగాని జగన్నాథం గారికి రాసిన కాగితాన్ని పెట్టడం మరిచిపోయారు).

''ఈ జగన్నాథం పంతులు మొన్న మొన్నటివరకు గ్రాంథికవాదిగా నుండి మన మతమునకు మారారు. ఇక్కడ కొంతకాలము నాతో కలిసి ఉండుటచేత భాషా తత్త్వము బోధపరచుకోగలిగారు'' అని గిడుగువారు వేలూరివారికి రాసిన సమాధానంలో చెప్పారు.[13]

ఈ జగన్నాథం గారి గురించి వివరాలు కొంతవరకు తెలియవస్తున్నాయి. రచయిత స్వయంగా తన సంగతి ఇలా చెప్పుకొన్నారు.[14]

''1916 సెప్టెంబరు నెలలో వారి స్వస్థానమునకు పర్లాకిమిడికే నాకు మార్పు కలిగినది. అప్పుడు వారి సహవాసం ఏడు సంవత్సరములు అవిచ్ఛిన్నంగా లభించినది.... శ్రీ పంతులుగారు అప్పుడు నాయందు అవ్యాజమైన ప్రేమ చూపించినారు. ''వ్యావహారిక భాషలో వ్రాసినప్పుడు కావ్యమెంత రసవత్తరంగా ఉంటుందో నీకు అనుభవంమీద కాని తెలియదు. ఏదీ నీ కలాన్ని ఒకసారి అటువైపు త్రిప్పు'' అని సెలవిచ్చినారు. నాకు గుండె ఝల్లుమన్నది. వారి ఆజ్ఞ నెరవేర్చవలెననే అభిలాష ఒకవైపూ, పండిత రచనలకు అలవాటు పడియున్న నా కలము వ్యవహారిక భాషా రచనల నంగీకరించదేమో అనే భయం ఒకవైపూ

13. మణిమంజరి - సంపుటి-2, సంచిక 1, ఫిబ్రవరి 1982, పుట.37
14. ప్రతిభ-సంపుటి-4, ''గిడుగు రామమూర్తి స్మారక సంపుటి'', పుట.219

నన్ను పట్టి కొన్నాళ్ళు బాధించినా కాస్త ధైర్యము తెచ్చుకొని హెూమరు కవి రచితమైన, చిన్న హాస్య ప్రబంధమును మాతృకగా పెట్టుకొని ''గాదెల గుండడు'' అనే పేరుతో బొబ్బిలిపాట వరుసను ఒక చిన్న గేయ ప్రబంధమును వ్రాసి వారికిచ్చినాను. అది చదివి ఆనంద భాష్పములు రాల్చినారు. ధన్యోస్మి అన్నారు. ఇదంతా చూచి నాకే ఆశ్చర్యం కలిగింది.... ఈ చిన్న ప్రబంధానికి అచ్చులో 12 పేజీలు ఉపోద్ఘాతము అతి సమర్థతతో వ్రాసినారు....''

జగన్నాథంగారు రచించిన ''గాదెల గండడు'' అన్న వీరగాథకు హెూమరు రాసిన ఒక హాస్య ప్రబంధం మాతృక. ఇదికాక వ్యావహారిక భాషతో చక్కని గేయ ప్రబంధాలు రాశారు. విశ్వాసి, శ్రీ చైతన్య శిక్షామృతం, ప్రేమదర్శిని, గీతా సరళార్ధ దర్శిని, నామసిద్ధాంతదర్శిని, తరుణోపాయం అన్నవి వీరి ఇతర కృతులు. ''విశ్వాసం'' అన్న రచనను గిడుగువారికే అంకితమిచ్చారు. ''తరుణోపాయం'' అన్న కృతికి గిడుగువారు ఉపోద్ఘాతం రాశారు. యల్లాపంతుల జగన్నాథంగారి తండ్రిగారూ, గిడుగువారూ సహపాఠులు. జగన్నాథంగారి గురించి గిడుగువారు వేలూరి వారికి రాసిన లేఖలో ఇలా తెలియజేశారు. ''ఇతని వంటి వారనేకులున్నారు. దేశ భాష దేశస్థుల వర్తమాన వ్యావహారిక భాష అని తెలియని వారింకా ఉన్నారు. గనుక మనముపేక్షించి ఊరుకోరాదు''.

తాపీ ధర్మారావు (1887-1973)

గిడుగువారి దగ్గర కొంతకాలం కలిసి ఉండి భాషాతత్వం నేర్చుకోకపోవడం వల్ల వారి కాలేజీ శిష్యులలో కొందరు గ్రాంథిక వాదులుగానే వుండిపోయారు. రామమూర్తిగారే భాషాతత్వం గురించి బాగా ఆలోచించని కాలంలో 1905 ప్రాంతాలలో వారి వద్ద తాపీ ధర్మారావుగారు ఎఫ్ఫే చదువుకొన్నారు. క్లాసులో అడుగుపెట్టిన తొలినాడే గురుశిష్యులు ఎడమొఖం-పెడమొఖం పెట్టుకొన్నారు. ధర్మారావుగారిని చూడగానే గిడుగువారు మొఖాన బొట్టులేదేం అని అడిగారు. ఆరోజుల్లో అందరూ బొట్టుపెట్టుకొనేవారు. ధర్మారావుగారు ''మేం నాన్ బ్రాహ్మిన్సుమండీ'' అని చెప్పి తప్పించుకోచూశారు. ఆనాటినుండి కొన్నాళ్ళపాటు గిడుగువారు ధర్మారావుగారి ముఖం చూడకుండానే వారివైపు వీపు పెట్టుకొని పాఠాలు చెప్పారు. (ఉత్తరోత్తరా ధర్మారావుగారు చాలాకాలం తమ జీవితంలో మొఖాన ఒక నిలువు గీత బొట్టును తిలకంలాగ పెట్టుకొనేవారు). ధర్మారావుగారు కుశాగ్రబుద్ధి కనుక గిడుగువారిని తర్వాత కొన్ని నెలలకు తన ఆన్సర్సుతో మెప్పించి ప్రియశిష్యులయ్యారు. అయినా ఎఫ్ఫే పరీక్షలు ఇంకా రెండు నెలలలో వస్తాయనగా ఒకనాడు గిడుగువారు అడిగిన ప్రశ్నకు క్లాసులో ధర్మారావుగారితో సహా ఎవరూ జవాబు చెప్పలేకపోవడం వల్ల ఇంక పాఠాలు చెప్పను అని గిడుగువారు క్లాసులు తీసుకోలేదు. ధర్మారావుగారు గిడుగువారి వద్ద సెలవు తీసుకోకుండానే పరీక్షల కోసం సెలవులు ఇవ్వగానే పర్లాకిమిడి వదలి పరీక్షలు అక్కడే కనుక విజయనగరం వెళ్ళిపోయారు.

పర్లాకిమిడిలో చదువుకొన్న కాలంలో ధర్మారావుగారికిగానీ అసలు గిడుగువారికిగానీ భాషావాదాలపై పట్టు లేనేలేదు. ఏట్సు దొర వల్ల ఈ సమస్య గురించి ఆలోచించి రామమూర్తిగారు వాడుకభాషా వాదాన్ని ప్రారంభించే నాటికి ధర్మారావు గారు 1908లో మద్రాసు పచ్చయప్ప కాలేజీ విద్యార్థిగా బియ్యే చదువుకొన్నారు.

భాషా తత్త్వం గురించి సరైన అవగాహన లేక తతిమ్మా గ్రాంథికవాదుల ధోరణి అలవర్చుకొని ధర్మారావుగారు 1910లో ''గ్రాంథికభాషావాదం'' అనే శీర్షికతో ఒక చంపకమాలికను రచించారు. అందులో-

స్థలమున కొక్క గ్రామ్యమయి తానతిచంచలయౌటఁగృష్ణలో
పల రచియించు పొత్తములు వట్టి యనర్థములౌను మాకు; మా
వలనఁ గవుల్ర చించునవి వారలకేని విశాఖ వారికేన్
దెలియుట కష్టసాధ్యమగు; దేశమునందలి బుద్ధియెల్ల లో
భుల కడనున్న సొమ్ముగతిఁ బొందు వినాశము.....

అని వాదించి,

.....లయము జెంద గ్రామ్యమను నిక్కపు పాదరసంబు గూర్చి వ
న్నెల కనకంబు మా తెలుఁగు నీరసమౌనటు జేయకుండ....

ఉండమని దేశీయులను కోరారు. బరంపురంలో ధర్మారావుగారు స్నేహితులతో స్థాపించిన వేగుజుక్క గ్రంథమాల పుస్తకాలలోనూ, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలలో ప్రచురించిన రచనలలో గ్రాంథికమే రాసేవారు. ధర్మారావుగారు గ్రాంథిక వాదులవడానికి గల కారణాలను పరిశోధకులు ఇలా చెప్తున్నారు.[15]

''ధర్మారావులో అందరూ ఔనన్నది కాదనాలన్న అంశ ఒకటుండేది. దీనికితోడు ఈ గ్రాంథికభాషను ఆనాడు బలపరుస్తున్న వారందరూ బ్రాహ్మణులు కావటం, ధర్మారావు మనస్సులో ఏదో మూల ఎప్పుడూ తాను బ్రాహ్మణులకన్నా తక్కువ కాదన్న అభిమానం గూడు కట్టుకోనుండటం తెలిసిందే. దీనితో తానూ ఆ భాషా వివాదంలో గ్రాంథికభాషనే సమర్థిస్తూ వారి ప్రక్కనే ఉండి వారిని మించవచ్చున్న అభిప్రాయం కూడా ఉండి ఉంటుంది.''

ప్యూడలు వర్గాల కొలువులో మైనరు జమీందారుల ట్యూటరు - గార్డియన్‌గా ఎన్నో జమీందారీ కేంద్రాలలో పనిచేయడం వల్లా బ్రాహ్మణేతర ఉద్యమ భావాలలో ఈదులాడడం వల్లా ధర్మారావుగారు రెండున్నర దశాబ్దాలు గ్రాంథికాన్ని అభిమానించి వాడుకభాషను ఎదిరించారు. భావకవిత్వాన్ని ఎద్దేవా చేశారు. తర్వాత తర్వాత వర్గ స్వభావాలూ, ప్రపంచ సాహిత్య పరిణామాలూ అవగాహన కావడం వల్ల భాషాతత్త్వం బోధపరచుకొని వ్యావహారిక భాషావాదపు ఉప్పెనలో తడిసి 1936లో ధర్మారావుగారు ఎట్టకేలకు తమ కలానికున్న పాతపాళీని తీసిపారేసి కొత్త పాళీ పెట్టుకొన్నారు. అందరికన్నా మిన్నగా వాడుక భాషను ప్రచారం చేశారు.

15. ఏటుకూరి ప్రసాద్ - ''తాపీ ధర్మారావు జీవితం-రచనలు'' పుట.107

1936లో జనవాణి దినపత్రికకు సంపాదకత్వం వహించిన ధర్మారావుగారు మొట్టమొదటిసారిగా వ్యావహారికాన్ని పత్రికాభాషగా చేశారు. ''ధర్మారావు తాను నమ్మిన విషయంలో తీవ్రవాదులు. అందువల్లనే వీరగ్రాంథికవాదిగా ఉన్నవారు తమ మనస్సులో పరివర్తన రాగానే ఆ విషయం మనస్ఫూర్తిగా వ్యావహారికోద్యమ స్థాపకులైన గిడుగు రామమూర్తికి లేఖ ద్వారా తెలియపర్చుకొన్నారని సీతాపతి అన్నారు'' అంటూ పరిశోధకులు చెప్తున్నారు.[16]

ఈ లేఖ ఎప్పటికైనా బయటపడుతుందేమో, దొరికితే అది చక్కని డాక్యుమెంటు కాగలదు. (పరివర్తన చెందిన ధర్మారావుగారు అభ్యుదయోద్యమానికి, ఆంధ్ర సాహిత్యానికి చేసిన విశిష్ట సేవల గురించి ఆధునిక యుగంలో చెప్పుకొందాం.) భాషావాదంలో గిడుగువారికి ప్రథమ ప్రత్యర్థిగా వున్న పిఠాపురం మహారాజా పెట్టిన జనవాణి పత్రికలోనే వాడుక భాష తిష్ట వేసుకొనడం గిడుగువారికి గొప్ప విజయమే.

టేకుమళ్ళ అచ్యుతరావు (1880–1947)

గిడుగు రామమూర్తిగారు వాడుకభాషావాదం ప్రారంభించకముందు పర్లాకిమిడి కాలేజీలో చదువుకొన్నవారు కొందరు సాహిత్యలోకంలో తమ స్వతంత్ర ప్రతిభను ప్రదర్శించి ఒక స్థానాన్ని ఏర్పరచుకొని గిడుగువారి ప్రశంశలకు కూడా నోచుకొన్నారు. అలాంటి వారిలో టేకుమళ్ళ అచ్యుతరావుగారు ప్రసిద్ధులు. విశాఖజిల్లా, పోతరవరస గ్రామంలో జన్మించిన అచ్యుతరావుగారు 1898లో ఎఫ్ఫే పర్లాకిమిడిలోనూ, బియ్యే విజయనగరంలోనూ పూర్తిచేశారు. తర్వాత రాజమండ్రి ట్రైనింగ్ కాలేజీలో ఎల్.టి.డిగ్రీని పొందారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరి తర్వాత స్కూళ్ళ సబ్ అసిస్టెంట్ ఇన్స్పెక్టరుగా ఉంటూ కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ.పట్టా పుచ్చుకొన్నారు.

అచ్యుతరావుగారు ఆంగ్ల భాషలో కాకలు తీరిన వారయ్యారు. చదువుకొనే రోజుల్లోనే ఉత్తర సర్కారులలోని ఇంగ్లీషు విద్యార్థులలో ప్రథములుగా వచ్చి మెక్డనాల్డ్ ప్రైయిజును పొందారు. ఆంగ్ల సాహిత్య విమర్శనా పద్ధతులు అధ్యయనం చేసి ఆ ప్రణాళికలతో ఆంధ్ర సాహిత్య విమర్శకు పూనుకొన్నారు. మునుపు తెలుగులో సాహిత్య విమర్శ అన్నా, ఒక గ్రంథానికి వ్యాఖ్యానమన్నా అలంకారాలను విశదీకరించడం, ఛందస్సును విశ్లేషించడం, వ్యాకరణ దోషాలను వివరించడం మాత్రమే. కథాకల్పన, పాత్రపోషణ, శైలి ఎలా వున్నాయి? సమకాలిక కృతులతో తులనాత్మకంగా పరిశీలిస్తే ఆ కవికి, ఆ కృతికి స్థానమేమిటి? ఏ చారిత్రక దశలో ఆ రచన ఉద్భవించింది? మొదలైన ప్రశ్నలకు సమాధానంగా సాహిత్య విమర్శ ఉండాలని అచ్యుతరావుగారు భావించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఒక యుగాన్ని తీసుకొని విశ్లేషించారు. విజయనగరాంధ్ర వాఙ్మయ చరిత్రను తెలుగులో రచించారు.

టేకుమళ్ళ అచ్యుతరావుగారి రచనలలో చాలా వైవిధ్యముంది. ఆంధ్ర పదములు – పాటలు (1924), ఆంధ్ర నాటకములు – రంగస్థలములు (1926),

16. ఏటుకూరి ప్రసాద్ - ''తాపీ ధర్మారావు జీవితం-రచనలు'' పుట.295

విజయనగర సామ్రాజ్యమందలి వాఙ్మయ చరిత్ర మొదటి సంపుటం (1933), రెండవ సంపుటం (1939) దీని మూడో భాగం రచించారుగాని అచ్చుపడలేదు. అలాగే వీరి ఆంధ్ర ప్రబంధముల చరిత్ర పత్రికలో ప్రచురితమైన గ్రంథరూపంలో అముద్రితమే.

అచ్యుతరావుగారు ఆంగ్ల భాషా విశారదులు కనుక ఇంగ్లీషులో పింగళి సూరపరాజుగారి జీవితాన్ని, కృతులనూ విశదపరుస్తూ విపుల విమర్శలు రాశారు. కళాపూర్ణోదయ ప్రబంధాన్ని సూక్ష్మంగా పరిశీలించి అందులో ఒకటికాదు, రెండు కాదు మూడు అంతరార్థ కథలు ఉన్నాయనీ అవి ప్రేమకు, చరిత్రకు, వేదాంతానికి సంబంధించినవనీ చెప్పారు. ఈ విశ్లేషణ వల్ల వారికి మంచి పేరు సాహిత్య లోకంలో లభించింది. అచ్యుతరావుగారి పుస్తకాన్ని చదివి గిడుగు రామ్మూర్తిగారు మెచ్చుకొన్నారు. ''పింగళి సూరన్న కల్పనా ఘనత బైటపడడానికి ఇన్ని శతాబ్దాలు వేచి ఉండవలసి వచ్చింది''[17] అన్నారు. మహాకవికి మహావిమర్శకుడు లభించాడు. ఈ పుస్తకం 1941లో అచ్చుపడింది.

టేకుమళ్ళ అచ్యుతరావుగారు తెలుగులో రాసినవన్నీ గ్రాంథికంలోనే రాశారు. పిఠాపురం మహారాజాకు రెండు పుస్తకాలు అంకితమిచ్చారు. అయితే వారి ఇంగ్లీషు రచనను మెచ్చుకొనడానికి ఈ మత భేదం రామమూర్తిగారికి అడ్డురాలేదు. ''శత్రు శిబిరంలో ఉన్న యోధుల ప్రావీణ్యాన్ని కూడా నిజమైన ఉదార చరితులు శ్లాఘించగలరు.''

సెట్టి లక్ష్మీనరసింహం (1879 (?) - 1938)

సమరంలోనూ, జీవన సమరంలోనూ ఒక శిబిరం వారు ఇంకో శిబిరంలోనికి మారడం విడ్డూరమైన విషయం కాదు. గిడుగు రామమూర్తిగారు ఆదిలో వాడుక భాషోద్యమం ప్రారంభించినప్పుడు వీరవ్యావహారిక వాదిగా ముద్రపడిన సెట్టి లక్ష్మీనరసింహంగారు ఉత్తరోత్తరా విక్రమదేవవర్మగారి ఆంతరంగిక కార్యదర్శిగా మారారు. సాహిత్యంలో కొన్ని వైకల్య రచనలనూ, వ్యలీకాలనూ సృష్టించారు.

సెట్టి లక్ష్మీనరసింహంగారు విశాఖపట్నం ఏ.వి.యన్.కాలేజీ హైస్కూలులో ఉపాధ్యాయులు, లోకులు వీరిని ''సెట్టి మాస్టారు'' అని పిలిచేవారు. ఆనాటి యువకులలాగే వీరు విశాఖపట్నంలో కవిగారని ప్రసిద్ధులైన మారేపల్లి రామచంద్రశాస్త్రి (1874-1951) గారితో కలిసి 1895లో కళాభిలాషక నాటక సమాజాన్ని స్థాపించారు. ఆ సమాజంవారు కవిగారూ, సెట్టి మాస్టారూ, ఆకెళ్ళ సత్యనారాయణగారు రచించిన నాటకాలే ప్రదర్శించేవారు. సెట్టి మాస్టారి నాటకాలలో ప్రభాస శాప విమోచనం, మాలినీ విజయం, చిత్ర హరిశ్చంద్రీయం, లుబ్ధాగ్రేసర చక్రవర్తి అనేవి ప్రసిద్ధాలు. మాలినీ విజయంలో కీచకవధ కథను చిత్రించారు. ఇది పండితుల ప్రశంసల నందుకొంది. చిత్ర హరిశ్చంద్రీయం వీరేశలింగంగారికి అంకితం. లుబ్ధాగ్రేసర చక్రవర్తి మోలియర్ ప్రహసనం మైజర్‌కి అనుసరణ.

17. టేకుమళ్ళ కామేశ్వరరావు - నా వాఙ్మయమిత్రులు - పుట.155

సెట్టి లక్ష్మీనరసింహంగారు 1900వ సంవత్సరం జనవరి నెలలో చెన్నపట్నంలో బియ్యే పరీక్ష ప్యాసయ్యారు. తరువాత విశాఖపట్నంలోని ఎ.వి.యన్.కాలేజీ హైస్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఎల్.టి. పరీక్ష ప్యాసై ఇరవై సంవత్సరాలు అక్కడే మాస్టరుగా పనిచేసిన తరువాత ఫస్ట్ గ్రేడ్ లాయరు పరీక్షలో ప్రథములుగా ఉత్తీర్ణులై పదేళ్ళు ఆ ఊళ్ళోనే న్యాయవాదిగా పనిచేశారు. ''పూర్వ సత్కవులు త్రొక్కిన త్రోవ కవిత్వఫక్కి నేర్పరచుకొని పద్దెముల్ వచనములున్న గ్రంథములు వ్రాసి సుధీతతి వల్ల మెప్పునొందుచు గవి భూషణాఖ్యముతో'' ఉండేవారు.

''సెట్టి లక్ష్మీనరసింహంగారు పట్టపరీక్షా సిద్ధులు. తెలుగులో మంచి పాండిత్యము గలవారు. సరసమైన కవిత్వము చెప్పగలవారు'', అని ఆనాటి సారస్వత లోకం విశ్వసించేది.[18] 1893లో సెట్టి మాష్టారి సహపాఠి అయిన మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు)గారు రవివర్మ చిత్రాలను చూసి ఉత్తేజితులై వాటిని వర్ణిస్తూ వృత్తాలూ, వృత్తమాలికలూ రచించారు. కవిగారి వల్ల ఉత్తేజితులై సెట్టి మాష్టారు రవివర్మ చిత్రాలలో చాలా వాటిని వర్ణిస్తూ వృత్తమాలికలు రచించడం ప్రారంభించారు. అప్పటికి వీరి వయస్సు 18 ఏళ్ళు. ఎప్ఫే చదువుతూ ఉండేవారు. తరువాత బియ్యే నిమిత్తం చెన్నపట్నం వెళ్ళారు. ఆయన చెన్నపట్టణం వెళ్ళినసరికి రవివర్మ చిత్రముల మీద జనాదరము ముమ్మరమై యుండెను. అవి యమ్మకమును జూపని యంగడి లేదు; అలంకరింపని గృహము లేదు; అభినందింపని జనులు లేరు; ఇరువది ముప్పది చిత్రములు సెట్టి మాష్టారు కూడా కొన్నారు. కొన్ని వృత్తమాలికలు రచించారు.

ఇవి 1915 సంవత్సరంలో వేగుజుక్క గ్రంథమాల దేవళరాజు వెంకటసుబ్బారావు గారు వీటిలో కొన్నింటిని వేగుజుక్క కథావళిలో ప్రచురించారు. తరువాత కృష్ణా పత్రికలో ఇవి వారం వారం ప్రచురితమయ్యాయి. తరువాత 54 వృత్తమాలికలు పూర్తి చేశాక 1932లో చిత్రమాలికలు అనే పేరుతో గ్రంథరూపంలో వెలువడ్డాయి. ఈ పుస్తకం విక్రమదేవవర్మగారికి అంకితం.

చక్కని కవిత్వం చెప్పగల సెట్టి మాష్టారు కొంటె కొక్కిరాయి పనులు కూడా చేయగలరు. ఆరోజుల్లో పండితులు విస్మృత కవుల గ్రంథాలను సంపాదించి ప్రకటిస్తూ ఉండేవారు. సెట్టి మాష్టారు శ్రీనాథుని ''రసికాభిలాషం'' అనే గ్రంథాన్ని ''సంపాదించి'' ప్రకటించడమే కాక సమీక్షల కోసం వివిధ పత్రికలకు పంపారు. 1908లో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ ''మనోరమ'' పత్రికలో దీనిని విమర్శించారు. ''శైలినిబట్టియు, శబ్ద ప్రయోగముల బట్టియు, వర్ణనలంబట్టియు నది ప్రాచీన గ్రంథము గాదనియు శృంగార ప్రియుడైన యధునాతన రసికుడెవరో దానిని రచియించి జనాదరణము బడయుటకై శ్రీనాథుని పేరు పెట్టెననియు'' చిలకమర్తివారు ఖచ్చితంగా అభిప్రాయం ప్రకటించారు.[19]

18. చిలకమర్తి - స్వీయచరిత్ర - పుట.240
19. చిలకమర్తి - స్వీయచరిత్ర - పుట.240

తప్పుచేసి దొరికిపోయిన దొంగ బుకాయిస్తాడు. సెట్టి మాష్టారు చిలకమర్తివారు రివ్యూపై ప్రతివిమర్శను రాశారు. అయితే నిజం నిలకడమీద తేలకపోదు. 1908 గోదావరి పుష్కరాలకు రాజమండ్రికి వచ్చిన విక్రమదేవవర్మగారు చిలకమర్తివారిని కలుసుకొని రసికాభిలాషం నిజంగా నవీనులు రాసిందేనని చెప్పారు. విశాఖపట్నం వాస్తవ్యులు బొడ్డు రామయ్యగారు కూడా చిలకమర్తివారిని కలుసుకొని ''రసికాభిలాషం'' సెట్టి మాష్టారు తమ యెదుట రాసిన సత్యాన్ని చెప్పారు. సెట్టి మాష్టారి సాహిత్యా కూటకరణాన్ని మనస్తత్వ శాస్త్రజ్ఞులు విశ్లేషించాలి.

సెట్టి మాష్టారు ఒక పక్క సాహిత్యా వ్యళీకాలు సృష్టిస్తున్నా సరసమైన వచన రచనలు కూడా చేసేవారు. శూద్రకుడు రచించిన మృచ్ఛకటికను ఆధారంగా చేసుకొని, ''వసంతసేన'' అనే నవలను ఆసక్తికరంగా రచించి ''సురగురుజాడ నొప్పు శ్రీ గురుజాడ వెంకటప్పారావు'' గారికి అంకితమిచ్చారు.

సెట్టి మాష్టారు ఏవియన్ కాలేజీ హైస్కూలు హెడ్మాస్టరుగానే కాక కాలేజి వైస్ ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. ఆ సెకండరీ గ్రేడు కాలేజీ ప్రిన్సిపాలుగా పి.టి. శ్రీనివాసయ్యంగారు ఉండేవారు. వీరు ఏట్సు దొరగారితో, గిడుగు రామమూర్తిగారితో, గురజాడవారితో కలసి వాడుక భాషా వాదాన్ని ప్రారంభించారు. అయ్యంగారి సహచర్యంవల్ల సెట్టి మాష్టారు కూడా వాడుకభాషావాదులయ్యారు. అమెరికన్ రచయిత నెతానియల్ హాథార్న్ (1804-64) రచించిన గ్రంథం ఆధారంగా ''గ్రీకు పురాణ కథలు'' అనే గ్రంథాన్ని ''సంధులు మొత్తంగా విసర్జించిన శైలి''లో రచించారు.[20] దీనికి శ్రీనివాసయ్యంగారు ఇంగ్లీషులో పీఠిక రాశారు. దానిలో సంధుల గురించి, శకటరేఫల అర్థానుస్వారాల అనావశ్యకత గురించి రాశారు. సెట్టి మాష్టారి పుస్తకాన్ని 1911లో స్కూలు ఫైనల్ తరగతికి పఠనీయ గ్రంథంగా విద్యాశాఖవారు నిర్ణయించారు. ఈ పుస్తకంమీదా, ముఖ్యంగా శ్రీనివాసయ్యంగారి పీఠిక మీదా గ్రాంథికవాదులు విరుచుకుపడ్డారు. (వివరాలకు ''వాడుక వేడుక భాషల యుద్ధం'' అనే ప్రకరణం వున్నాయి.)

వాడుక భాషాభిమానులయ్యాక సెట్టి మాష్టారు వాదవివాదాలతో రచనలు చేసేవారు. తాపీ ధర్మారావుగారు ఒక చంపకమాలికలో గ్రాంథిక భాషావాదాన్ని సమర్థిస్తే, సెట్టి మాష్టారు దానికి జవాబు అన్నట్టు శార్దూల మాలికను నూట పదహారు పాదాలలో రచించి దానికి ''నూటపదార్లు'' అనే పేరు పెట్టారు. జ్ఞాపకం వున్నంత మట్టుకు దీనిలో పాదాలను శ్రీశ్రీ ఒకచోట ఉదాహరించారు.[21] ''విస్తారంబగు ప్రజ్ఞ గల్గన మహావిద్వాంసులారా!'' అనే ''స్త'' ప్రాసతో చెప్పిన ఈ మాలికలో శ్రీశ్రీ ఉదాహరించిన పాదాలను మచ్చుకు చూడండి.

---

20. హాథార్న్ 'The snow image and other twice told tales' అనే గ్రంథాన్నీ 'Tangle Wood Tales' అనే గ్రంథాన్ని కూడా బాలబాలికల కోసమే రచించాడు.

21. మరోసారి గిడుగు రామమూర్తి - పుట.6

"......................కే
వాస్తే యిస్తరఫ్ ఇస్లియే మగరుమా
ఫక్ భేష్ చమక్కుంచు హిం
దూస్తానీ పదసంచయంబె కృతులన్
దూరుస్తురో లేక "నో
యెస్తేంక్స్, మిస్టరు, మై డియర్, మొదలుగా
ఇంగ్లీషు శబ్దాలనే
వేస్తారో తమ చిత్తమండి......
....
బస్తీ మీద సవాల్.........."

సెట్టి మాష్టారు పూర్వం శ్రీనాథుని పేర "రసికాభిలాషం" రచించి ప్రకటించినట్టే ఉత్తరోత్తరా మోహనాంగి రచించినట్టు "మరీచి పరిణయం" అనే కృతిని సృష్టించి కృష్ణదేవరాయలకే అంకితమిచ్చినట్టు పద్యాలు కల్పించి 'సమదర్శిని' ప్రత్యేక సంచికలో ప్రకటించారు. సెట్టి మాస్టారి గ్రంథ సంపాదన గురించి పూర్వ వైనాలు తెలిసిన సాహిత్య లోకం దీనిని పట్టించుకోలేదు. అయితే ఇటీవల నెల్లూరు కాలేజీలో చరిత్ర విభాగంలో ఉండే ఒక ఉపన్యాసకులు[22] కృష్ణదేవరాయల కుమార్తె రచించిన ఈ మరీచి పరిణయాన్ని గ్రంథరూపంలో ప్రచురించారు. దీని బండారాన్ని నేనూ, నిడుదవోలు వెంకటరావుగారూ జమీన్ రైతు పత్రికలో బైటపెట్టాము.

సెట్టి మాష్టారు కొన్ని పోకిరీ సాహిత్య రచనలు కూడా చేశారు. "సరసోక్తి కృష్ణ శతకం" అనే పేరుతో ఒక బూతు శతకాన్ని రచించారు. ప్రతి పద్యంలోనూ కృష్ణుని చరిత్రకు ఒక బూతు సామెతను ముడిపెట్టడం ఇందులోని "ఘనకార్యం". కామగ్రంథమాల వారు తమ నాలుగవ గ్రంథంగా సెట్టి మాష్టారి ఇతర "శృంగార" రచనలతోపాటు ఈ శతకాన్ని పాండిచ్చేరి నుండి 1922లో ప్రకటించారు. ఆ సంపుటంలో "జాబులు" అనే రెండు భాగాలలో వృత్తాలూ, సరసోక్తి కృష్ణ శతకం, శ్రీనాథుని రసికాభిలాషము, సరస చాటువులు, పూర్వకవుల చాటువులు ఉన్నాయి.

సెట్టి మాష్టారి వల్ల వాడుక భాషకు కలిగిన లాభనష్టాల ఆడిటింగు ఇంకా జరగలేదు. విక్రమదేవవర్మగారితో అనుబంధం పెరిగాక సెట్టి మాష్టారు మళ్ళా గ్రాంథిక శైలిలోనే రాసేవారు. (చూ॥ చిత్రమాలికల పీఠిక - 1935) ఒక విశ్వాసానికి కట్టుబడని రచయితలే శిబిరాలు మారుతారు.

టేకుమళ్ళ కామేశ్వరరావు (1907-..........)

ఏ భాషకైనా కొన్ని వ్యాకరణ నియమాలు మాట్లాడుకొంటున్నప్పుడు కూడా ఉంటాయి. వీటిని ఎవరూ పాఠం చెప్పి బోధించకుండానే ఆయా భాషలు మాట్లాడేవారు చిన్నప్పటినుంచీ సహజంగా నేర్చుకొంటారు. ఎటొచ్చీ రాసేటప్పుడు మనం ఉచ్చరించే ధ్వనులన్నింటికి సంకేతాలు లేకపోవడం చేత నోటిమాటకు, రాతకూ కొంత తేడా

22. డా॥ సి.వి.రామచంద్రారావు - మరీచి పరిణయము - మానస గ్రంథమాల, నెల్లూరు, 1973

కనబడుతుంది. అందుకే 'వ్యావహారిక రచనకు కూడా కొన్ని నియమాలు' కావాలని 1933 భారతిలో ఒక రచయిత భావించాడు. ఆయన టేకుమళ్ళ కామేశ్వరరావు. గిడుగువారి ప్రశిష్యులు.

గిడుగు రామ్మూర్తిగారి దగ్గర 1898లో పర్లాకిమిడి కాలేజిలో ఎఫ్ఫే చదువుకొన్న టేకుమళ్ళ అచ్యుతరావుగారి కుమారులే కామేశ్వరరావుగారు. 1924లో విజయనగరం కాలేజీలో చదువుకొన్నారు. గిడుగు రామ్మూర్తిగారి శిష్యులైన బుర్రా శేషగిరిరావు గారి దగ్గర ఈయన చదువుకొన్నారు.

కామేశ్వరరావుగారు తమ తండ్రిగారిలాగే గ్రాంథికంలో రాసేవారు ''మొదట సులభ గ్రాంథికంలో వ్రాస్తూ అది సహజంగా కనబడకపోగా వ్యావహారిక భాషలో వ్రాయడం మొదలు'' పెట్టారు. దీనికంతకు రామమూర్తిగారు దేశంలో నాటిన వ్యావహారిక భాషా విత్తనమే కారణం అని కామేశ్వరరావుగారు ఇలా చెప్తారు. ''నేను ఊరుకోక మరొక మెట్టు పైకి వెళ్ళాను. వ్యావహారిక భాషా రచనకు కొన్ని నియమాలు ఒక పెద్ద వ్యాసాన్ని రాసి'' అచ్చువేశారు. దాన్ని పెంచి పుస్తకరూపంలో తెస్తూ గిడుగు వారిని దానికి పీఠిక వ్రాయమని కోరారు. ''అందుకు ఆయన 'వ్యావహారిక భాషకు నియమాలు అక్కర్లేదని, ప్రమాణ భాష అనేది లేదనీ రాస్తాను' అన్నారు... కాని వారు చెప్పినంత తీవ్రంగా రాసినట్లు కనబడదు'' అని కామేశ్వరరావుగారు భావించారు.[23]

రామమూర్తిగారు రాసిన పీఠిక కామేశ్వరరావుగారి భావాలను మాత్రమే కాక మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి వాదాన్ని కూడా కలిపి రెండింటినీ సాకల్యంగా పరిశీలించి చక్కని విశ్లేషణ చేశారు. వాడుక భాషలో ఏకత లేదని గ్రాంథికవాదులు అంటారు. నియమాలు కావాలనుకొనే టేకుమళ్ళ కామేశ్వరరావుగారూ మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారూ ఆ ఏకతనే కావాలంటున్నారు. ''ఏకత ఉన్నా జీవం ఉండదు. ఏకత కల్పితము. వాస్తవం కాదు'' అని గిడుగువారు కావ్యభాష గురించి చెప్తూ 'వ్యాకరణాలు వల్లించి మాతృభాష నేర్చుకోవడము ఎప్పుడూ ఏ దేశములోనూ జరుగలేదు' అని స్పష్టపరిచారు.

1933 నాటికి గ్రాంథికభాష పట్టు దేశంమీద సడలినా కట్టుబాటులేని రచన కూడదనే అభిప్రాయం వ్యాకరణాల శృంఖలాల బరువుకు అలవాటుపడిపోయిన వాళ్ళకి కలగడం సహజం. అయితే పందొమ్మిదో శతాబ్దపు తెలుగును ఈ కొత్త నియమాల వాళ్ళు అంగీకరించలేదు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు గిడుగువారి తెలుగే పందొమ్మిదో శతాబ్దిదని చెప్పి అది అనుసరణయోగ్యం కాదని తమ పుస్తకంలో రాశారు. దీనిని రామమూర్తిగారు అంగీకరించారు. ''నేను ఆ శతాబ్దంలో పుట్టి పెరిగినవాడను గనుక అప్పటి భాష నాకు అలవాటయినది. వారి భాష వారి మనుమలకు పాత భాష అవుతుంది. అందులో వైపరీత్యమేమీ లేదు. హాని లేదు. ఒకరి మాట ఒకరికి తెలియకపోదు కదా! స్వస్తి'' అని రాశారు.[24]

23. టేకుమళ్ళ కామేశ్వరరావు - నా వాఙ్మయమిత్రులు - పుట.33
24. వ్యాసావళి - పుట.150

కామేశ్వరరావుగారు తమ కాలం నాటి వాడుక భాషలో చాలా గ్రంథాలు రచించారు. వాటిలో ముఖ్యమైన వాటి వివరాలు ఇవి.

1. కలువలు (ఖండ కావ్యాలు)
2. జానకి ప్రేమ (చిన్న కథలు)
3. వాడుక భాష - రచనకు కొన్ని నియమాలు
4. పాలపిట్ట (పిల్లల గేయాలు)
5. మిణుగురు పురుగులు (పిల్లల గేయాలు)
6. వెలుగు (గేయ సంపుటి)
7. రోజా (చిన్నకథలు)
8. నా వాఙ్మయమిత్రులు (సాహితీపరుల వివరాలు)

ఈ పుస్తకాలలో 'జానకి ప్రేమ' అనే పుస్తకాన్ని కామేశ్వరరావుగారు గిడుగు రామమూర్తి గారికి అంకితమిచ్చారు. ఏ పుస్తకాన్ని చదువుతున్నా దానిలో ప్రతిపుటలో ప్రయోగాల కింద గీట్లు పెట్టడం రామమూర్తిగారికి అలవాటు. కామేశ్వరరావుగారి కథ ఒకటి చదువుతూ పెన్సిల్‌తో గీట్లు పెట్టడం మాటే మరిచిపోయాడట. ''నేను భాషలో ఇంత కృషి చేశాను. ఎందుకు? ఇటువంటి కథ ఒకటి రాసి వుంటే ఎంత బాగుండును'' అని రామమూర్తిగారు అన్నారట.[25]

టేకుమళ్ళ కామేశ్వరరావుగారి రచనలు ఇవాళ ప్రాచుర్యంలో లేవు. అయినా వారు రచించిన 'నా వాఙ్మయ మిత్రులు' అనే గ్రంథం సాహిత్య పరిశోధకులకు చాలా ఉపయోగకారి. ఇందులో నూట రెండుమంది సాహితీపరులతో కామేశ్వరరావుగారికి గల పరిచయాలనే కాక కొందరి సంగ్రహ జీవిత చరిత్రలు కూడా ఉన్నాయి. తెలుగు భాషా సమితి, తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం - తెలుగు సంస్కృతి రెండవ భాగంలో దొరకని ఎన్నో జీవిత చరిత్రలు ఈ చిన్న పుస్తకంలో లభిస్తున్నాయి. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు ఇందుకు వందనీయులు.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి (1885-1940)

విజ్ఞాన సర్వస్వంలో లభించని ఈ రచయిత జీవిత విశేషాలు టేకుమళ్ళ కామేశ్వరరావుగారి 'నా వాఙ్మయ మిత్రులు' అనే గ్రంథంలో కొంత లభిస్తోంది. తమ తండ్రిగారు గ్రాంథికవాదులైతే కామేశ్వరరావుగారు వాడుక భాషావాదులయ్యారు. అలాగే తమ తాతముత్తాతలు గ్రాంథికవాదులైతే మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు గిడుగువారి ప్రభావం వల్ల వాడుక భాషావాదులయ్యారు.

ఈయన తాతగారి పేరింటివాడు. తాతగారిలాగే మొదట ప్రాచీన రీతుల్లో కవితలు చెప్పారు. వాస్తవానికి మండపాక వారి వంశంలో అందరూ కవులే.

25. 'నా వాఙ్మయ మిత్రులు' - పుట.34

పెద పార్వతీశ్వర శాస్త్రి (1833-1897) గారి తాతగారు, తండ్రిగారు, అన్నగారు, కొడుకూ, మనుమడూ అందరూ ప్రబంధాలూ, శతకాలు, దండకాలు మొదలైన కృతులు రచించారు.

పెద పార్వతీశ్వర శాస్త్రిగారు బొబ్బిలి ఆస్థాన కవులు. వీరు రచించిన గ్రంథాల జాబితాను అముద్రిత గ్రంథ చింతామణిలో 'శ్రీ మండపాక పార్వతీశ్వర కృతి కృత కృతితతి' అనే పేరుతో 1894 జూలై నెలలో ప్రకటించారు. (సంపుటి-7; సంచిక-7) వాటిలో 16 ఏకప్రాస శతకాలూ, ఇంకో 23 ఇతర శతకాలూ, 6 మాలికా కావ్యాలూ, కొన్ని అష్టకాలూ, కొన్ని దండకాలూ, కొన్ని ఉపన్యాసాలూ, వచన గ్రంథాలూ ఉన్నాయి. అముద్రిత గ్రంథ చింతామణిలో ఈ పార్వతీశ్వర శాస్త్రిగారూ, కొక్కొండ వారూ వాగ్యుద్ధాలు చేసుకొన్నారు. మండపాకవారు అముద్రిత గ్రంథ చింతామణి (1895 జనవరి) సంచికలో 147 పాదాల 'ఏకప్రాసశార్దూల మాలిక'లో కొక్కొండవారిని విమర్శించారు.

పద్యాలలో స్వీయ చరిత్రను రాసుకొనడం కూడా పెద పార్వతీశ్వర శాస్త్రిగారు చేపట్టిన ప్రక్రియలో ఒకటి. 'ఆత్మచర్య' అనే పేరుతో 'హరి హరేశ్వరదేవ' అనే మకుటంతో సీసపద్యాలను చాలా వ్రాశారు. ఈయన ఎనభై రెండేళ్ళు జీవించారు. వీరి కృతుల సంఖ్య కూడా ఎనభై రెండే. ఈయన సనాతనుడు. వచనంలో రాయవలసినది పద్యాలలో రాయడం వల్ల మాలికా కవిత్వం ఎక్కువగా చెప్పినా కొన్ని వచన గ్రంథాలు రాశారు. 'స్త్రీ పునర్వివాహాధి క్ర్కియోపన్యాసం' వీరు రచించినా మళ్ళీ పెళ్ళిళ్ళను లోకం ఉత్తరోత్తరా ఆచరించకపోలేదు. పెద పార్వతీశ్వరశాస్త్రి గారి కవిత్వం 'మ్యూజియం' వస్తు సంచయాలలో చేర్చదగ్గదే అయింది.

మనుమడు పార్వతీశ్వరశాస్త్రిగారు తమ కవిత్వాన్ని రెండు దశలుగా విభజించారు. 1906కి పూర్వం రాసిన దానికి పూర్వ కవిత్వమనీ, తర్వాత రాసిన దానిని ఉత్తర కవిత్వమనీ పేర్కొన్నారు. పూర్వ కవిత్వంలో శ్లేష, బంధ, గర్భిత, చిత్ర కవిత్వాలు (తాతగారిలాగే), శతకాలు రచించారు. ఉత్తర కవిత్వంలో ఖండకావ్యాలూ, నాటకాలూ, నవలలూ, మార్మిక కవిత్వం ఉన్నాయి. వేగుజుక్క గ్రంథమాల వలన అపరాధ పరిశోధక నవలల విలువను గ్రహించారు.

పార్వతీశ్వర శాస్త్రిగారు విజయనగరంలో ఎఫ్ఫే చదివారు. తరువాత బొబ్బిలిలో కొన్నాళ్ళు ఉపాధ్యాయుడుగా పనిచేశారు. తర్వాత సాల్టు డిపార్టుమెంటులో పనిచేశారు. ప్రైవేటుగా బియ్యే పరీక్షకు చదివి చెన్నపట్నంలో డిగ్రీ పుచ్చుకొన్నారు. ఆంగ్ల వాఙ్మయం రీతులు కూడా అధ్యయనం చేశారు. పాలవెల్లి (1932), తేనెపట్టు (1933), విరిసెజ్జ (1935) అనే గ్రంథాలు రచించారు. సారంగపాణి పదాలపైన చక్కని విశ్లేషణ వ్యాసాన్ని రాసి ప్రతిభ (జూలై 1940)లో ప్రచురించారు. అందులోనే తాము గిడుగువారి వల్ల ఎలా మారినదీ వివరించారు. ఈ వ్యాసాన్నే పురిపండా అప్పలస్వామిగారి సంపాదకత్వాన ప్రచురించిన 'సారంగపాణి పదములు' అనే గ్రంథానికి పీఠికగా పొందుపరిచారు. ఇందులోని కొన్ని భాగాలు పార్వతీశ్వరశాస్త్రిగారిలోని పరిణామాల్ని ఇలా తెలియచేస్తాయి.[26]

---

26. 'సారంగపాణి పదములు' - పుట 7-8

''.....వసుచరిత్రాది ప్రబంధముల పఠన పాఠనములు చిన్నప్పుడే అభ్యాసం కావడం చేతనూ, చిన్నయసూరిగారి డబ్బా భాషలో ఏదో మాధుర్యం ఉందని నలుగురితో పాటు నేనూ అనుకోవడం చేతనూ మధురమైన భాషగల ఈ పాటలపైని న జరు తగ్గిపోయింది. ''కబ్బంబులయందు బోలె నపశబ్దోచ్చారణం బెన్నఁడున్ లేకుండన్'' నియమముతో సంభాషించడానికి అలవాటుపడ్డ కొక్కొండ వేంకటరత్నశర్మగారు అవతార పురుషుడు వలె కనబడుతూ ఉండేవారు. మా తాతగారు పార్వతీశ్వరగవిగారు తాము రచించిన పద్యాలలో ''బుధు లక్షుల్ ముసుకోలేదు'' అన్నప్పుడు, ''కుదరకనా, ఇముడకనా'' అన్నప్పుడు, నాకు అసహ్యంగా ఉండేది. బాల్యంలో పద్య రచనకు మాత్రమే అలవాటుపడ్డవాణ్ణి గనుక, చిన్నప్పటి పద్యాలలోనూ, కొద్దిగా తరువాత వ్రాసిన నవలలోనూ ''డబ్బా భాష'' చాలా ప్రీతిలో వ్రాసేవాణ్ణి. ఆరోజులలో పదకవిత్వమంటే చేతకాని పామరులు వ్రాసేదని నాకు ఉద్దేశంగా ఉండేది. తరువాత తరువాత రావు సాహెబ్ గిడుగు రామమూర్తి పంతులుగారి దయవల్ల, వాడుకభాషలోకి దిగి, గ్రంథాలు తిరిగి తాళపత్ర ప్రతుల సహాయంతో చదవడం ఆరంభించిన తరువాత, చిన్నయసూరి ఆంధ్రదేశానికి చేసిన గొప్ప ద్రోహము హృదయములలో గట్టిగా నాటుకొనిపోయింది. అప్పుడు తిరిగి చాలా వెనుకకు వెళ్ళవలసి వచ్చింది. శ్రీరామమూర్తి పంతులుగారు నాకు తిరిగి ఓనమాలు చెప్పి, అక్షరాభ్యాసం చేయించినారు. క్రొత్త దృష్టితో తిరిగి గ్రంథాలన్నీ చదువుకొన్నాను. ఆ చదవడంలో పూర్వం నాకు అసహ్యములుగా ఉండిన కొన్ని గ్రంథాలు యిప్పుడు సహ్యములుగా ఉండడమే కాకుండా, గౌరవించదగినవిగా కూడా ఉండసాగినవి. అందులో పదకవిత్వాలు, ద్విపద కవిత్వాలు ముఖ్యమైనవి. ఇప్పుడు ప్రబంధాలకన్నా వీటిపైన నాకు ఎక్కువ గౌరవం. నిజమైన తెలుగు కవుల నిజమైన కవితాశక్తి అంతా ఈ రెండు రకాల కవిత్వాలలోనే ఉంది.''

గిడుగు రామమూర్తిగారి వల్ల మారిన తర్వాత పార్వతీశ్వరశాస్త్రిగారు ''ప్రబంధాలు తెలుగును విశ్వసాహిత్యం నుండి తప్పించినవి'' అని కచ్చితంగా చెప్పారు. 'శతకాలలో వాడుకమాటలు నూటికి 50 వంతులు, పాటలలో వాడుక మాటలు నూటికి 75 వంతునన్నూ ఉంటవి'' అన్నారు.

వాడుక భాష రాస్తున్నా అందులో ''ప్రమాణము'' (Standard) నియమించవలసి ఉంటుందని పార్వతీశ్వరశాస్త్రిగారు భావించారు. ఈ విషయమై భారతి (11వ సంపుటం)లో రెండువ్యాసాలు వ్రాశారు. 'ఆధునిక భాషలో మాధుర్యం ఉందిగానీ ఏకత లేదు. ఏకత కలిగించినచో వ్యావహారిక భాష రాజ భాష (King's Telugu) కాగలదు. ఈ ఉద్దేశముతో భాషను పరిశీలించగా అవి నాలుగు విధములుగా కనబడినవి.[27]

(I) 1. Archaic - ఉ. నేను చేయవలతును. నాకు చేయవలయును.
2. Classical - ఉ. నేను చేయవలయును
3. Standard - ఉ. నేను చేయవలెను.
4. Dialectal - ఉ. నేను చేయాలి - చేయాలె - చేయాల మొ.

27. వ్యాసావళి - పుట. 142-143

(II) 1. Archaic - వలవదు
2. Classical - వలదు
3. Standard - వద్దు
4. Dialectal - ఒద్దు

Archaic, Classical ప్రాచీనాంధ్రము, Standard వర్తమానాంధ్రము; Dialect అభినవాంధ్రము, కడపటిది వ్యాపిస్తున్నది. కొంత గట్టు కట్టుట అవసరము అని శాస్త్రులుగారికి తోచినది. ఈ గట్టు నన్ను కట్టమన్నారు. అది నాకే కాదు ఎవరికైనా అసాధ్యమే'' అని గిడుగు రామ్మూర్తిగారు విస్పష్టంగా ప్రకటించారు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారి పుస్తకానికి రాసిన పీఠికలోనే పార్వతీశ్వర శాస్త్రిగారి వాదనను కూడా పరిశీలించి ''జీవద్భాషను మారకుండా బంధించడం అసాధ్యమని'' రుజువు చేశారు. పార్వతీశ్వరశాస్త్రిగారు నియమాల గురించి తమ అభిప్రాయాలు మార్చుకొన్నారు. అందుకే ఇలా రాశారు.[28]

''మ.రా.రా. గిడుగు రామమూర్తి పంతులుగారు భాషకు క్రొత్తగా శాసనముగాని, అనుశాసనముగాని చేసినవారు కారు. సనాతనమైన సత్సంప్రదాయము కృత్రిమ పండితుల హస్తాలలో పడి మాటుపడిపోయిన ఆ సనాతన సంప్రదాయాన్ని తిరిగి వెలుగులోనికి తీసుకొని వచ్చినారు. గీతామతమును కృష్ణుడు క్రొత్తగా సృష్టి చేసి అర్జునుడికి చెప్పలేదు. సనాతనమైన ఒక సత్సంప్రదాయమునే, ధర్మ సమ్మూఢ చేతస్కుడైన అర్జునుడికి ఉపదేశం చేసి, అతనిని కార్యశూరుణ్ణిగా చేసినాడు. ఆ విధముగానే రామమూర్తి పంతులుగారున్నూ, సనాతనమైన ఒక సత్సంప్రదాయమును ధర్మ సమ్మూఢ చేతస్కులైన గ్రంథకర్తలకు ఉపదేశము చేసి వారిని కార్యశూరులనుగా చేసినారు. కాబట్టి గీతా విషయమున శ్రీకృష్ణునికి ఈయవలసిన స్థానము భాషా విషయమున శ్రీరామమూర్తి పంతులుగారికి ఈయవలసి ఉన్నది.''

తెలుగు సాహిత్యలోకంలో గిడుగు రామమూర్తిగారు తెచ్చిన పరివర్తనకు ఈ మాటలు చెరగని దాఖలాలు.

---

28. 'సారంగపాణి పదములు' - పుట 27-28

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

(1876-1923)

తెలుగు జిల్లాలోని విద్యావంతులు బెంగాలులో ప్రాచుర్యం పొందిన భావ చైతన్యం వల్ల ప్రభావితులవుతున్న కాలంలో ఒక ఆంధ్రయువకుడు నాగపూర్‌లో మరాఠీ భాషా సాహిత్యాలవల్ల, అక్కడ విస్తరిస్తున్న విజ్ఞాన వికాసాల వల్ల ఉత్తేజితుడై మరాఠీ భాషలో వివిధ సాహిత్య ప్రక్రియలలో రచయితగా రాణించి విద్యార్థి దశలోనే విద్వాంసునిగా పేరు పొందాడు. మరాఠీలో జరుగుతున్న విజ్ఞాన కృషిని తన మాతృభాషలో తోటి వారికోసం ప్రారంభించాలని సంకల్పించాడు. అనుకొన్నది సాధించడానికి దారులు వేసుకొన్నాడు. ఆ వ్యక్తి కొమర్రాజు వెంకట లక్ష్మణరావు.

నాగపూరులో చదువుకొన్న లక్ష్మణరావు గారు తెలుగు గడ్డమీదనే జన్మించారు. కొమర్రాజు వంశంవారు కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలు వాస్తవ్యులు. లక్ష్మణరావుగారి తాతముత్తాతలకు గ్రామ కరణీకం, దేశ పాండ్యపట్టం, మునగాల సంస్థానపు దివాన్‌గిరీ మొదలైన అధికారాలూ, హోదాలూ ఉండేవి. లక్ష్మణరావుగారి తండ్రి వెంకటప్పగారికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య కుమారుడు శంకర్రావు. రెండో భార్య గంగమ్మ బండారు వారి ఆడపడుచు. ఈమె తొలిచూలు సంతానం అచ్చమాంబ అనే కుమార్తె. తర్వాత లక్ష్మణరావుగారు పుట్టారు. 1879లో లక్ష్మణరావుగారికి మూడేళ్ళ వయస్సులో తండ్రి మరణించారు. శంకరరావు భువనగిరిలో ఉంటున్నారు. సవతితల్లినీ, ఆమె సంతానాన్నీ తన దగ్గర పెట్టుకొని సంరక్షించారు. లక్ష్మణరావుగారికి భువనగిరిలోనే అక్షరాభ్యాసం జరిగింది. తెలుగు సంస్కృతాలు అక్కడే ప్రారంభించారు.

గంగమ్మగారి సోదరుడు బండారుమాధవరావు నాగపూరులోని పి.డబ్ల్యు.డి. శాఖలో డివిజనల్ ఆఫీసరు. ఆయనకు భార్యావియోగం కలిగింది. రెండవ భార్యగా తన మేనగోడలు అచ్చమాంబనే చేసుకొన్నాడు. ఈ పెళ్ళయ్యాక అక్కగారితోపాటు లక్ష్మణరావుగారు కూడా నాగపూరుకు వెళ్ళారు. చదువంతా మరాఠీ భాషలోనే సాగింది. పదార్థవిజ్ఞాన శాస్త్రాన్ని ఆయన మరాఠీ భాషలోనే చదువుకొన్నారు. ఎఫ్.ఎ. పరీక్షకు చదివే విద్యార్థులకు బీజగణితం ఆ భాషలోనే ఇంగ్లీషు రానివారు బోధించేవారు.[1] దేశ భాషలలో శాస్త్రగ్రంథాల పఠనం ఎంత లాభదాయకమో లక్ష్మణరావుగారు స్వానుభవం వల్ల తెలుసుకున్నారు.

పాఠశాల, కళాశాలలోని పాఠ్యగ్రంథాలకే లక్ష్మణరావుగారు తమ మరాఠీ భాషాభ్యాసాన్ని, వ్యాసంగాన్ని పరిమితం చేసుకోలేదు. ఆ భాషలో ఆనాడు వెలువడుతున్న 'కేసరి', 'మహారాష్ట్ర' అనే పత్రికలలోని వ్యాసాలు చదువుతూ ఉండేవారు. వివిధ సాహిత్య ప్రక్రియలను అధ్యయనం చేసి మరాఠీలో స్వయంగా రచనలు

---

1. లక్ష్మణరాయ వ్యాసావళి - ప్రథమ సంపుటం - పుట. 164

చేయసాగారు. బహుశా ఆ రచనలు ఆయన చేయడానికి ఆనాటి తెలుగు పత్రికలూ, గ్రంథాలూ కూడా పరోక్షకారణాలు కావచ్చు.

బండారు మాధవరావుగారు తమ భార్యకోసం దేశంనుండి తెలుగు పత్రికలను, పుస్తకాలనూ తెప్పించేవారు. వీటిని అక్క, తమ్ముడు కలిసి చదివేవారు. కందుకూరి వీరేశలింగంగారి రచనలు ఇద్దరికీ ఆదర్శాలు. ఏయే గ్రంథాలు చదివారో ఇప్పుడు చెప్పలేంగానీ వీరేశలింగంగారి 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం'. ఇతర ప్రహసనాలు లక్ష్మణరావుగారు తెగ చదివి వుంటారు. వాటి ప్రభావం వల్లనో కాదో తెలియదుగాని లక్ష్మణరావుగారు మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడు మరాఠీలో ఒక ప్రహసనం రాశారు. మాధవరావుగారికి తెలిసిన ఒక పండుముసలి డాక్టరు ఒక చిన్నపిల్లను పెళ్ళి చేసుకొన్నాడు. ఈ సంఘటనపై లక్ష్మణరావుగారు రచించి ప్రచురించిన ప్రహసనం మహారాష్ట్ర దేశంలో గొప్ప సంచలనాన్ని సృష్టించిందట.

లక్ష్మణరావుగారు విద్యార్థి దశలో చదివిన తెలుగు పుస్తకాలలో వడ్డాది సుబ్బారాయుడిగారి 'సతీస్మృతి' అనే పద్యకావ్యం ఒకటి కాబోలు. సుబ్బారాయుడిగారి వైవాహిక జీవితం చాలా పరితాపకరమైనది. వారికి కళత్రవియోగం అలా వాటిల్లుతూనే వచ్చింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు, అయిదుగురు భార్యలు వరుసగా పోయినారు. మొదటి భార్య పోయినప్పుడు 1881లో సుబ్బారాయుడుగారు తమ దుఃఖాన్ని 'సతీస్మృతి' అనే కావ్యంగా వెళ్ళబోసుకున్నారు. ఈ రచనను ఆనాటి పత్రికలు అచ్చువేయడానికి నిరాకరించాయి. అయితే కొక్కొండ వెంకటరత్నంగారు తమ ఆంధ్ర భాషా సంజీవనిలో ప్రకటించారు. ఉత్తరోత్తరా ఈ రచన గ్రంథరూపంలో వెలువడింది. దీనిని చదివి లక్ష్మణరావుగారు ఉత్తేజితులై 'వియోగగీతి' అనే మరాఠీ కవితను రచించి ప్రచురించారు. అది పాఠకుల హృదయాలను కదిలించివేసింది. ఇంత చిన్నతనంలో కవికి భార్యా వియోగం కలిగినందుకు ఎందరో వచ్చి పరామర్శించారు. ఊరడింపు ఉత్తరాలు ఎన్నో వచ్చాయి. అయితే అప్పటికి లక్ష్మణరావుగారికి పెళ్ళి కానేలేదు. ఈ ఉదంతం తర్వాత ఆయన మళ్ళా కవిత్వం రాసిన దాఖలాలు కనపడవు.

సృజనాత్మక సాహిత్య రచనలు కాకపోయినా ఇతరములను లక్ష్మణరావుగారు మరాఠీ భాషలో కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే కొనసాగించారు. 'కేసరి', 'మహారాష్ట్ర' వంటి పత్రికలలో వ్యాసాలు రాయడమే కాక వివిధ వాదోపవాదాలలో పాల్గొనేవారు, రామాయణంలో పర్ణశాల ఎక్కడ వుంది? నాసికా త్ర్యంబకం వద్దనని బాలగంగాధర తిలక్ అంతటివారు వాదిస్తే, కాదు ఆంధ్రదేశంలో భద్రాచలం దగ్గర ఉందని లక్ష్మణరావుగారు ధైర్యంగా తర్కబద్ధంగా రాయగలిగారు. 'సమాచార్', 'వివిధ-విజ్ఞాన విస్తార్' అనే పత్రికలకు ఆయన సంపాదకత్వం వహించారు. మరాఠీ భాషలో గ్రంథ పరిష్కరణ కూడా ఆయన చేపట్టారు. మోరోపంత్ రచించిన భారతంలోని కర్ణపర్వాన్ని పరిశోధించి, పరిష్కరించి ప్రకటించారు.

ఒకపక్క మరాఠీలో సాహిత్య వ్యాసంగం చేస్తూనే లక్ష్మణరావుగారు తెలుగులో కూడా రచనలు చేసి పత్రికలకు పంపేవారు. 1898లో ఆయన వ్యాసాలు తెలుగులో

అచ్చుపడ్డాయి. అప్పుడు రాయసం వెంకట శివుడుగారు స్త్రీ విద్యావ్యాప్తికి 'తెలుగు జనానా' అనే పత్రికను నడుపుతూ ఉండేవారు. దానిలో 'విశ్వంయొక్క విరాట్‌స్వరూపం' అన్న రచనను లక్ష్మణరావుగారు రాసి పంపారు. మరాఠీ భాషవల్ల విజ్ఞాన విషయాల పట్ల ఆసక్తి పెరిగి ఆ కోవలోని రచనలను తెలుగులో కూడా రాయాలని ఆశించడం సంతోషించదగ్గ విషయం. విషయం చాలా జటిలమైనది గనుక విశ్వం యొక్క విరాట్ స్వరూపం గురించి తండ్రీకూతుళ్ళు సంభాషించుకొనడం అనే సులభరీతిలో విశదపరిచారు. ఈ చిన్న వ్యాసం తర్వాత 'విశ్వంయొక్క బాల్యం' అనే సంభాషణా రూపవ్యాసాన్ని రాసి అదే పత్రికలో ప్రచురించారు.

లక్ష్మణరావుగారే కాక వారి అక్కగారు కూడా 'తెలుగు జనానా' పత్రికకు రాస్తూ వుండేవారు. తమ్మునితో కలిసి పుస్తకాలు చదవడం ప్రారంభించిన అచ్చమాంబగారు ఉత్తరోత్తరా తెలుగులో స్త్రీల చరిత్రలను రచించిన మొట్టమొదటి మహిళగా చరిత్రలో చోటు చేసుకొన్నారు. దానికి లక్ష్మణరావుగారి ప్రోత్సాహం చాలా వుంది.

నాగపూర్‌లోని లక్ష్మణరావుగారు 1900 సంవత్సరం నాటికి ఎఫ్.ఏ. బి.య్యే పరీక్షలను చదివారు. తత్త్వశాస్త్రం, సంస్కృతం ప్రధాన విషయాలుగా మారిస్ కాలేజి నుండి బియ్యే ఆనర్సు పరీక్షలో నెగ్గారు. పలువురి ప్రశంసలు పొందారు. 1901లో ప్రైవేటుగా చదివి కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. డిగ్రీని పొందారు. నాగపూరులో ఉన్నప్పుడు తెలుగు, ఇంగ్లీషు, మరాఠీ, సంస్కృత భాషలలో పాండిత్యం సంపాదిస్తే ఆ తర్వాత బెంగాలీ, గుజరాతీ, కన్నడ, తమిళ భాషల పరిచయాన్ని కూడా పొందగలిగారు. (ఎం.ఏ. డిగ్రీ తీసుకొన్నాక లాయరుగా కావాలని కాబోలు మద్రాసులో ఎఫ్.ఎల్.లో పాసయ్యారు. బి.ఎల్.మాత్రం చదవలేదు.)

లక్ష్మణరావుగారు బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులు కాగానే తల్లి గంగమ్మగారు సంతోషించింది. కొడుకు ఎదిగి చేతికి అందివస్తున్నాడన్న ధైర్యంతో తాము ఇంక స్వగ్రామానికి వెళ్ళడం మంచిదని భావించింది. తరతరాలుగా కొమర్రాజుగారు మునగాల సంస్థానపు దివానులు. అందుచేత స్వదేశానికి వెళ్ళి ఆ ఉద్యోగాన్ని చేపట్టమని ఆమె కుమారునికి బోధించింది. ఇంతకీ మునగాల జమీందారుగారు లక్ష్మణరావుగారికి అపరిచితులు కారు. నాగపూర్‌లో చదువుకుంటున్నా అప్పుడప్పుడూ స్వదేశానికి చుట్టపుచూపుగా వెళ్ళినపుడు లక్ష్మణరావుగారు బందరులో జమీందార్‌గారితోనే గడిపేవారు. జమీందారు నాయని రంగారావు (1875-1958) ఈడులో ఒక్క ఏడాదే లక్ష్మణరావుగారికి సీనియరు. మిగతా విషయాలలో ఇద్దరూ ఒకే రకం అభిరుచులు గలవారు. మునగాల జమీందారీ దావాలలో చిక్కుకున్నా రాజాకి 1900లో మైనారిటీ తీరినందున ఎస్టేటు చేతికొచ్చింది. 1900 సంవత్సరంలోనే లక్ష్మణరావుగారు దివాన్‌గిరీని చేపట్టారు. ఆరోజుల్లోనే ఆయనకు వివాహం జరిగింది. భార్య పేరు కోటమ్మ. ఈమె కంకిపాడు కరణం కానూరు మల్లికార్జునరావుగారి కుమార్తె. అయ్యదేవర కాళేశ్వరరావుగారికి సమీప బంధువులు.

మునగాల జమీందారుకు సంస్థానపు లావాదేవీలవల్ల ఇటు హైదరాబాదుతోనూ, అటు బందరు, చెన్నపట్నాలతోనూ సంబంధాలు ఉండేవి. బంధుత్వాలు కూడా ఉండేది. రాజా, దివానులిద్దరూ ఈ నగరాలకు తరచుగా వెళ్ళి కొన్నాళ్ళపాటు అక్కడ ఉండవలసి వచ్చేది. హైదరాబాద్‌లో రంగారావుగారికి, లక్ష్మణరావుగారికి చక్కని సంస్కారం గల మిత్రులు ఉండేవారు. రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రి ఈ మిత్రులలో ముఖ్యులు. వీరందరికి ఆరోజుల్లో ఒక్కటే చింత ఉమ్మడిగా ఉండేది. హైదరాబాద్‌లోనూ, తెలంగాణలోనూ జనాభా లెక్కల రీత్యా తెలుగువారి సంఖ్య ఎక్కువేగాని తెలుగు భాషకు అక్కడ అతీగతీ లేదు. ఈ దౌర్భాగ్యాన్ని పోగొట్టాలంటే ప్రజలచేత చదివించాలి. తెలుగు భాషాస్థితిని మెరుగుపరచాలి. ఆ ఉద్దేశ్యంతో లక్ష్మణరావుగా ఈ సహచరులతో కలిసి 1901 సెప్టెంబరు ఒకటవ తేదీనాడు హైదరాబాద్‌లో ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. దానికి ''శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం'' అని పేరు పెట్టారు. ఆంధ్రదేశం మొత్తంమీద ఇదే ఆధునిక పద్ధతులపై స్థాపించిన మొదటి గ్రంథాలయం. ఇది ఇప్పటికి పనిచేస్తూ ఉండటం సంతోషించదగ్గ విషయం. కొన్ని వటవృక్షాలు వందలాది సంవత్సరాలు సజీవంగా ఉండి ఊడలు దించుతాయి.

1904లో మునగాల జమీందారీ కేసులో ఓడిపోయినవారు మద్రాసు హైకోర్టులో అప్పీలు చేశారు. వీటిని పెద్ద దావాలంటారు. మునగాల రాజాగారి పక్షాన హమేషా మద్రాసులో దక్షత గలవారు ఉండవలసిన అవసరం వచ్చింది. దివానుగా లక్ష్మణరావుగారే ఈ బాధ్యతను స్వీకరించారు. కుటుంబంతో సహితం మద్రాసువెళ్ళి కాపురం పెట్టారు. ఈ కేసులు ఒక దశాబ్దంపాటు సాగాయి. అన్నాళ్ళూ లక్ష్మణరావుగారు మద్రాసులోనే ఎక్కువకాలం గడిపేవారు.

ఆరోజుల్లో తెలుగు జిల్లాలకు రాజకీయంగానే కాక సాంస్కృతికంగా కూడా చెన్నపట్నం రాజధానే. ఎందరో తెలుగు యువకులు మద్రాసులో చదువుకొంటూ వుండేవారు. 1897లోనే కందుకూరి వీరేశలింగంగారు రెండేళ్ళు సెలవుమీద చెన్నపట్నానికి వచ్చి తమ పుస్తక ప్రచురణలు ప్రారంభించారు. గవర్నమెంటువారు ఆయనను ప్రెసిడెన్సీ కాలేజీలో నియమించారు. 1904లో రిటైరైనారు. చెన్నపట్నంలోనే నివసించాలని మొదట అనుకున్నారు గాని స్వగ్రామం మీద అభిమానంతో రాజమండ్రికి వెళ్ళిపోయారు. వీరేశలింగంగారు ఉన్నంతకాలం అదొక సందడి. వారు పూర్తిచేసిన ఖాళీని లక్ష్మణరావుగారు మద్రాసులో కొంత భర్తీ చేశారు. అయ్యదేవర కాళేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఆచంట లక్ష్మీపతి మొదలైన వారందరూ అప్పుడు మద్రాసులోని విద్యార్థులే. మునగాల దివానుగా ఉన్నా లక్ష్మణరావుగారు లా కాలేజిలో చదువుతున్నారు.

1906 వేసవిలో చెన్నపట్నంలోని మునగాల రాజాగారి బంగళాలో రాజా, దివాను, రావిచెట్టు రంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు,

అయ్యదేవర కాళేశ్వరరావు. ఈ అయిదుగురు కలసి చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. దేశంలో గ్రంథాలయాలు స్థాపించి ఊరుకొంటే చాలదు. వాటికి పుస్తకాలు అందించే సంస్థలు కావాలి. విజ్ఞాన విషయాలు బోధపరిచే సాహిత్యం కావాలి. పత్రికలు పెట్టి లాభంలేదు. అప్పటికి దేశంలో లక్కవరం జమీందారు మంత్రిప్రగడ భుజంగరావుగారి మంజువాణి, పోలవరం జమీందారు కొచ్చర్లకోట కృష్ణారావుగారి సరస్వతి వంటి సాహిత్య పత్రికలు, బందరులో కృష్ణాపత్రిక, చిలకమర్తి వారి మనోరమ వంటివి ఉండనే ఉన్నాయి. మరొక పత్రిక వల్ల సంఖ్య పెరగడం కాక ప్రయోజనం ఉండదు. పుస్తకాలు ప్రచురించారు. అప్పటికే మహారాష్ట్ర, బంగాళా, హిందీ భాషలలో నవీన వాఙ్మయ సృష్టి జరుగుతోంది. నవీన ప్రపంచంలో భారతదేశాన్ని ఒక స్వతంత్ర ప్రజారాజ్యంగా నిర్మించాలంటే ప్రపంచం మొత్తంమీద అప్పటికే అత్యంతంగా వృద్ధి అవుతున్న ప్రకృతి శాస్త్ర, చారిత్రక, ఆర్థిక, రాజకీయ విజ్ఞానాన్ని పంచి పెట్టాలి. అందుకే ఇలా తీర్మానించుకున్నారు.[2]

''ఆంధ్రభాషలో కవిత్వ వాఙ్మయము, ప్రబంధ సముదాయము గొప్పగా నున్నవి. అవి ఆధ్యాత్మిక, నైతిక విషయములకు ఉపయోగమేకాని, ఆంధ్ర జాతిని నవీన పద్ధతులమీద ఐహికముగ నడిపించుట కుపయుక్తము కావు. పురాణయుగము నుంచి ప్రకృతి శాస్త్ర, రాజకీయ ఆర్థిక యుగమునకు మన ప్రజలను తీసుకొని పోవలసియున్నది.''

కవిత్వాన్ని విడిచిపెట్టి వీరేశలింగంగారు సృష్టించి దారితీసిన తేలిక తెలుగు పద్యంలో రాజకీయ ఆర్థిక శాస్త్రాలు, ప్రకృతి శాస్త్రాలు వ్యవసాయక, పారిశ్రామిక విషయాలు, దేశ చరిత్రలు మహాపురుషుల జీవితాలు, చారిత్రాత్మక నవలలు మన భాషలలోని ఉద్గ్రంథాల అనువాదాలు ప్రచురించాలని నిర్ణయించారు. తమ ప్రచురణ సంస్థకు 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' అనే పేరు పెట్టారు.

ఈ నిర్ణయాన్ని తీసుకొన్న అయిదుగురు మేనేజింగు కమిటీ, లక్ష్మణరావుగారు సంపాదకులుగా కాళేశ్వరరావూ, హరిసర్వోత్తమరావుగార్లు కార్యదర్శులుగా ఉన్నారు. మునగాల జమీందారు రెండువేల రూపాయలు మదుపుపెట్టారు. రావిచెట్టు రంగారావు గారు పుస్తకాలను హైదరాబాదునుంచి చందాదారులకు చేర్చాలి. ఏడాదికి నాలుగు గ్రంథాలను ప్రచురించాలి. పుస్తకం కనీసం నూరుపేజీలు ఉండాలి. ఏదీ మూడువందల పుటలు మించకూడదు. వెల ప్రతి ఒక్కింటికి నాలుగణాలు. పుస్తక ముద్రణ మద్రాసులోనే ఉన్నా గ్రంథమండలి కార్యాలయం హైదరాబాద్‌లో మొదట ఉండేది.

విజ్ఞాన చంద్రిక తరపున మొదటి గ్రంథంగా గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు రచించిన 'అబ్రహాం లింకన్ జీవిత చరిత్ర'ను ప్రకటించారు. ఆ పుస్తకం తొలి పలుకులలో అయిదుగురి సంతకాలతో ఒక సుదీర్ఘ ప్రకటన చేశారు. తమ ఆశయాలను తెలియజేశారు. రెండవ పుస్తకంగా లక్ష్మణరావుగారు వ్రాసిన భారతదేశ చరిత్ర 'హిందూ మహాయుగం' వెలువడింది. మూడవది డాక్టర్ ఆచంట లక్ష్మీపతిగారు రచించిన జీవశాస్త్రం (బయాలజీ). నాలుగవ పుస్తకం వేలాల సుబ్బారావుగారు విరచించిన 'రాణీ సంయుక్త' అనే

2. అయ్యదేవర కాళేశ్వరరావు - 'నా జీవిత కథ నవ్యాంధ్రము' పుట.139

చారిత్రాత్మక నవల. ఈ గ్రంథాలను మద్రాసులో ముద్రించి హైదరాబాద్‌కు పంపితే అక్కడ నుండి చందాదారులకు రావిచెట్టు రంగారావుగారు రవాణా చేసేవారు. వీరి దూరపు బంధువులలో ఒకరైన ఆదిరాజు వీరభద్రరావుగారు అప్పుడు యువకులు. ఈయన లేఖకునిగా చేరారు. చందాదారుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తెలుగు జిల్లాలలోని జమీందారులు పోషకులయ్యారు.

1906లో విజ్ఞాన చంద్రికలు వెలువడసాగాయి. 1907లో మండలి కార్యదర్శులలో ఒకరైన హరిసర్వోత్తమరావుగారు తమ స్వరాజ్య పత్రికలో రాసిన వ్యాసం రాజద్రోహమని బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి కేసుపెట్టి కోర్టులకు తిప్పి శిక్షవేసింది. హరిసర్వోత్తమరావుగారి చోటులో ఆచంట లక్ష్మీపతిగారిని ఇంకో కార్యదర్శిగా నియమించారు. పోలీసు నిఘా ఎక్కువ కావడం చేత ముద్రిత గ్రంథాలను హైదరాబాదుకు పంపించడం, అక్కడ నుంచి బట్వాడా చేయడం అనే కార్యక్రమాన్ని ఆపి, మద్రాసునే కార్యస్థానంగా స్థిరపరిచారు. ఆదిరాజు వీరభద్రరావుగారిని మద్రాసులో పనిచేయడానికి రావిచెట్టు రంగారావుగారు పంపారు. 1906 నుండి 1916 దాకా పదేళ్ళు గ్రంథ ప్రచురణ చురుకుగా కొనసాగింది.

విజ్ఞాన చంద్రిక గ్రంథాలలో భాషను గురించి ఒక విషయం గమనించాలి. మండలి కార్యదర్శులలో ఒకరైన అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఇలాగ స్పష్టం చేశారు.[3]

''వీరేశలింగం పంతులుగారి, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి, లక్ష్మణరావుగారి తెలుగు శైలియే మాకు ఆదర్శవంతమైనది. ఎవరైనను దానికంటే కొంచెము భేదముగా వ్రాసినను మాకు అభ్యంతరము లేదు. గ్రామ్యమను పేర ప్రజల కర్థముకాకుండా వ్రాయుట మాత్రము మేము ఒప్పుకొనము. పూర్తి గ్రాంథికమే కావలయునని మాకు పట్టుదల లేదు. తెలుగు ప్రజలకు హృద్యముగా నుండునట్లు వ్రాయుటయే మాకు కావలసినది.''

అయితే 1910నాటికి గ్రంథమండలి వారు ప్రామాణిక భాష అనే పేరుతో గ్రాంథికాన్నే ప్రోత్సహించారు. గురజాడ అప్పారావుగారు అప్పటికి 'కళింగ దేశ చరిత్ర' రచన తలపెట్టారు. ఈ గ్రంథాన్ని తమ గ్రంథమండలికి ప్రచురణార్థం ఇమ్మన్నారు. గురజాడ ఇస్తానన్నారు. 1911నాటికే తయారగుచున్న గ్రంథాలలో కళింగదేశ చరిత్ర ఉందని గ్రంథమండలి వారు తమ పుస్తకాల గురించి తెలిపే ప్రకటనలో తెలియజేశారు. అయితే 1910 నవంబరు నాటికి ఆంధ్ర సాహితీపరులు శిష్టవ్యావహారికవాదులుగా, గ్రాంథికవాదులుగా రెండువర్గాలుగా చీలిపోయారు. గురజాడ తొలివర్గంవారు. లక్ష్మణరావుగారు రెండోవర్గంవారు. కళింగదేశ చరిత్రను గురజాడ వ్యావహారిక భాషలోనే ప్రచురించాలన్నారు. కొమర్రాజు వారు అంగీకరించలేదు. ఇద్దరూ పత్రిక మూలాన లేఖలు సైతం వ్రాసుకొన్నారు. ఇద్దరూ పట్టుదల వదలని వారే, 'కళింగ దేశ చరిత్ర' కాలగర్భంలో కలిసిపోయింది.[4]

3. అయ్యదేవర కాళేశ్వరరావు - 'నా జీవిత కథ నవ్యాంధ్రము' పుట-140
4. ఆరుద్ర - 'గురజాడ గురుపీఠం'లో గురజాడ కళింగదేశ చరిత్ర ఏమైంది?' వ్యాసం - పుట.108 నుండి

లక్ష్మణరావుగారికి అచంచలమైన విశ్వాసాలు ఉన్నాయి. హెర్బర్టు స్పెన్సరులాగ ఆయన అజేయవాది. ''దేవుడున్నాడో లేడో తెలుసుకొనడం ఎవరికైనా దుస్సాధ్యం కనుక ఆ విషయం ఆలోచించవలసిన పనిలేదు. ఆధ్యాత్మిక విశ్వాసాలు అనవసరం.'' అన్న సిద్ధాంతం వారిది. ఇంద్రియాలకు గోచరం కాని ఆధ్యాత్మిక విషయాలకన్నా, భౌతిక ప్రపంచాన్ని బోధించే శాస్త్రాలనే ఆయన వాంఛిస్తారు. మత విషయాల్లో కాదు గాని సంఘ సంస్కారంలోనూ భాషా రీతిలోనూ లక్ష్మణరావుగారు పూర్తిగా వీరేశలింగంగారి అనుయాయి. ఎవరిని సంతోషపెట్టడానికైనా ఈ విశ్వాసాలతో ఆయన రాజీపడలేదు.

లక్ష్మణరావుగారికి ఒక కుమార్తె ఉంది. ఆమెకు తమ అక్కగారి పేరే అచ్చమాంబ అని పెట్టుకొన్నారు. ఈ పసిపిల్లను పెద్దమనిషి కాకముందే ఒక అయ్యచేతిలో పెట్టించాలని లక్ష్మణరావుగారి తల్లి గంగమ్మగారి కోరిక. లక్ష్మణరావుగారు రజస్వలానంతర వివాహమే చేస్తానన్నారు. 'వీల్లేదు - నేను చెప్పినట్లు చేయకపోతే నేను నీయింట్లో ఉండను. కాశీకి వెళ్ళిపోతాను'' అని తల్లిగారు బెదిరించారు. లక్ష్మణరావుగారు చలించలేదు. ఆమె అన్నట్లుగానే కాశీ వెళ్ళిపోయారు. అక్కడే జీవితాంతం ఉన్నారు. లక్ష్మణరావుగారు తమ తల్లిగారు కాశీలో నివసించడానికి తగిన ఏర్పాట్లను చేశారుగాని ప్రౌఢవివాహాలపట్ల విశ్వాసాన్ని మార్చుకోలేదు.[5] అప్రియమైనా తాను సత్యమని నమ్మినదాన్ని దాచిపెట్టలేదు.

మన పూర్వులు 'సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్' అని శాసించిన నోటితోనే అప్రియమైన సత్యాలను చెప్పవద్దని కూడా ఆదేశించారు. అయితే చరిత్రకారులు కొన్ని సందర్భాలలో అప్రియమైన వాస్తవాలను కథనం చేయకతప్పదు. అలాంటి సందర్భాలలో చాకచక్యం కావాలి. ఎవరినీ నొప్పించకుండా నిజం చెప్పడం ఒక శిల్పం, లక్ష్మణరావుగారు తమ రచనలలో ఈవిద్యను సాధించారు. తమ సంపాదకత్వాన వెలువడే విజ్ఞాన చంద్రికాగ్రంథాలలో సాధారణంగా ఎవరూ నొచ్చుకొనేటట్టు రచనలు లేకుండా చూసేవారు. ఇతరుల గ్రంథాలను ఎడిట్ చేయడంలో నేర్పు అవసరం. చిలుకూరి వీరభద్రరావుగారు విజ్ఞానచంద్రిక వారి కోసం ఆంధ్రుల చరిత్ర మూడు భాగాలుగా రచించపూనుకొన్నారు. తొలి భాగం లక్ష్మణరావుగారి పర్యవేక్షణలోనే అచ్చుపడింది. ఏకారణంచేతనో రెండో భాగం అచ్చుకు వెళ్ళేటప్పుడు లక్ష్మణరావుగారు దానిని పరిశీలించడం జరుగలేదు. గాడిచర్లవారు సాపుప్రతిని చూసి ఉపోద్ఘాతం రాశారు. ఈ రెండోభాగం కొన్ని చిక్కులు తెచ్చిపెట్టింది.

ఆంధ్రుల చరిత్ర రెండోభాగంలో చిలుకూరి వీరభద్రరావుగారు ఒక ప్రకరణంలో ''వెలమదొరలు చాపకూడు తిన్నా''రన్న సంగతిని చెప్పారు. ఈ సంగతి కొందరు జమీందార్లకు కోపం తెప్పించింది. తాము పోషకులుగా ఉంటున్న గ్రంథమండలి వారి ప్రచురణలో ఇలాంటి వాక్యాలు వారు సహించలేకపోయారు. వెంటనే పిఠాపురం, బొబ్బిలి రాజాలు పోషకుల జాబితాలో తమ పేర్లను తొలగించమని లక్ష్మణరావుగారికి తెలియజేశారు. పోషకులు పోయినా ఆయన చెక్కు చెదరలేదు. గాడిచర్లవారినీ,

5. G. Krishna - Komarraju Venkata Lakshman Rao - pp.75-76

చిలుకూరివారినీ పల్లెత్తుమాట అనలేదు. చిలుకూరి వారే ఉత్తరోత్తరావు లక్ష్మణరావు గారికీ, గ్రంథమండలికీ దూరమయ్యారు.

1912లో విజ్ఞాన చంద్రికా మండలిని రిజిస్టరు చేశారు. మొదటి అయిదుగురు సభ్యులలో ముగ్గురు వేరు వేరు కారణాల వల్ల సభ్యులుగా లేరు. రావిచెట్టు రంగారావుగారు అప్పటికే కీర్తిశేషులయ్యారు. మునగాల రాజా ఏ కారణాలవల్లనో దూరంగా ఉండి సాయం చేయసాగారు. హరిసర్వోత్తమరావుగారు వేరే వ్యాపకాలకు అంకితమయ్యారు. లక్ష్మణరావుగారూ, కాళేశ్వరరావుగారు మిగిలారు. బయ్యా నరసింహేశ్వర శర్మగారిని అధ్యక్షులుగా పెట్టుకొన్నారు. ఆచంట లక్ష్మీపతిగారిని ఒక కార్యదర్శిగా తీసుకొన్నారు. గూడూరు రామచంద్రరావు, వేమూరి విశ్వనాథశర్మ తాడినాడ వెంకటరామయ్యగారు కొత్త సభ్యులు. 1916 దాకా అంటే ఒక నాలుగేళ్ళు గ్రంథాలు వెలువడ్డయి. ఆ తర్వాత మండలి గ్రంథ ప్రచురణ చేయలేదు. ప్రారంభం నుండి 1916 దాకా ముప్పయి పుస్తకాలను వెలువరించారు. ప్రకటితమైనవి మాత్రం ప్రసిద్ధి చెందాయి. వాటి వివరాలు చూడండి.

1. అబ్రహాం లింకన్ - గాడిచర్ల హరిసర్వోత్తమరావు
2. హిందూ మహాయుగము - కొమర్రాజు లక్ష్మణరావు
3. జీవశాస్త్రము (Biology) ఆచంట లక్ష్మీపతి
4. రాణీ సంయుక్త (చారిత్రక నవల) వేలాల సుబ్బారావు
5. మహమ్మదీయ మహాయుగము - కొమర్రాజు లక్ష్మణరావు
6. పదార్థవిజ్ఞాన శాస్త్రము (Physics) మంత్రిప్రగడ సాంబశివరావు
7. రసాయన శాస్త్రము (Chemistry) వేమూరి విశ్వనాథశర్మ
8. ఆంధ్రుల చరిత్ర-1-చిలుకూరి వీరభద్రరావు
9. విమలాదేవి (చారిత్రక నవల) - భోగరాజు నారాయణమూర్తి
10. ప్రకృతి శాస్త్రము
11. ప్రకృతి శాస్త్రము
12. ప్రకృతి శాస్త్రము
13. ప్రకృతి శాస్త్రము
14. ప్రకృతి శాస్త్రము
15. కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర 1వ భాగం
16. ప్రకృతి శాస్త్రము
17. ఢిల్లీ దర్బారు - గాడిచర్ల హరిసర్వోత్తమరావు
18. ఆంధ్రుల చరిత్ర 2 - చిలుకూరి వీరభద్రరావు
19. జీవిత చరితావళి (మహాపురుషుల జీవితము) - ఆదిరాజు వీరభద్రరావు
20. ప్రకృతి శాస్త్రము
21. అర్థశాస్త్రము-1 కట్టమంచి రామలింగారెడ్డి
22. మహాపురుషుల జీవితము

23. ప్రకృతి శాస్త్రము
24. ప్రకృతి శాస్త్రము
25. రాయచూరు యుద్ధము (చారిత్రక నవల) కేతవరపు వెంకటశాస్త్రి
26. అర్థశాస్త్రము -2 - కట్టమంచి రామలింగారెడ్డి
27. విజయనగర సామ్రాజ్యము (చారిత్రక నవల) - దుగ్గిరాల రాఘవచంద్రయ్య
28. పాతాళభైరవి (చారిత్రక నవల) - ఏ.వి. నరసింహం పంతులు
29. కందుకూరి వీరేశలింగం స్వీయ చరిత్ర - 2వ భాగం
30. ప్రకృతిశాస్త్రము

విజ్ఞాన చంద్రిక వారి పై గ్రంథాల ప్రచురణ దేశంలో మరికొందరు ప్రకాశకులకు దారి చూపించింది. ఆంధ్ర భాషాభివర్థినీ సమాజంవారూ, ఆంధ్ర ప్రచారణీ సభవారూ కూడా పుస్తకాలను ప్రచురించారు. ఇవన్నీ ఉత్తమ గ్రంథాలనీ, ఇటువంటి వాటిని పాఠ్యగ్రంథాలుగా పెట్టాలని కట్టమంచి రామలింగారెడ్డిగారు సిఫార్సు చేస్తూ మద్రాసు విశ్వవిద్యాలయం వారికి సూచనలు చేస్తూ ఒక గ్రంథాల జాబితాను ఇచ్చారు. వీటిలో కొన్ని పుస్తకాలు ఆయన మాట ప్రకారం ''స్వకీయ ప్రతిభకు ఉపజ్ఞకు పరిశోధనకు మహత్తరమైన దృష్టాంతాలు; దుష్టమైన, పాండిత్య ప్రకర్షను చాటే భాష వీటిల్లో మృగ్యం.'' మధురమైన సరళ రీతిని సొగసైన శైలిలో యీ గ్రంథాలు రచింపబడ్డాయి.''

రామలింగారెడ్డిగారి పైమాటలను ఉదాహరిస్తూ వాటిలో ఎంత సత్యముందో గురజాడ అప్పారావుగారు విశ్లేషణ చేశారు. అప్పారావుగారు విశ్వవిద్యాలయం సెనేటు సభ్యునిగా ఈ పనిచేయవలసి వచ్చింది. రెడ్డిగారి జాబితాలో మూడురకాల పుస్తకాలున్నాయి. ఒకటి సైన్సుకు సంబంధించినవి; రెండు చారిత్రక గ్రంథాలు; మూడు : కల్పనా గ్రంథాలు. ఒక్కొక్క విభాగంలోని రచనలను సవిస్తరంగా అప్పారావుగారు విమర్శించారు.[6]

''సైన్సుకు సంబంధించిన గ్రంథాలపై శ్రీ రెడ్డిగారు వొత్తివొత్తి చెప్పడము వలన ముందుగా వాటిని గురించే తెలియజేస్తాను. విజ్ఞాన చంద్రికా మండలి వారి 3,6,7,11,12,14,18,22,23,25,26,27 నంబరుగల ప్రచురణలు ఎలిమెంటరీ సైన్సుకు చెందిన టెక్స్ట్ పుస్తకాలు. ఇందులో రెండు వైద్య గ్రంథాలు, వొకటి కలరామీదను, మరొకటి మలేరియా మీదను వ్రాయబడ్డాయి. ఆంధ్ర భాషాభివర్దనీ సమాజం వారచ్చొత్తించి ప్రచురించిన గ్రంథాలలో ఒకటి ఆరోగ్య శాస్త్రానికి సంబందించినదీ, మరొకటి పశువైద్యానికి సంబంధించినదీ. ఆంధ్ర ప్రచారణీ సభ సిరీసులో సైన్సు గ్రంథాలు లేవు. కేవలం అవన్నీ నవలలే. కొవ్వొత్తులను తయారుచేయడము గురించి వొక గ్రంథరాజమూ, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీల గురించి యింకొక పుస్తకమూ మానవసేవా సమాజంవారు ప్రచురించారు.

''.....ఈ సైన్సు పుస్తకాలన్నీ స్వీయప్రతిభతో కూడివున్నవీ కావు. స్వతంత్రమైనవీ కావు. అక్కడవీ ఇక్కడివీ తెచ్చి ఏర్చికూర్చిన గ్రంథాలు ఇవి. ఇస్కూలు పిల్లలకు జనులకు సైన్సును గురించిన కొన్ని ప్రాథమిక విషయాలను తెల్పేటందుకుగాను వీటిని

6. గురజాడ అప్పారావు - 'వ్యాసచంద్రిక'లో 'ఆధునిక ఆంధ్ర వచన రచన' - పుట.129 నుండి

ప్రచురించారు. అదే ప్రచురణకర్తల ఉద్దేశ్యం. ఈ ప్రచురణలను సాహిత్యగ్రంథాలుగా ప్రచురణ కర్తలుగాని లేదా రచయితలుగాని చెప్పుకోవడం లేదు.

''....విజ్ఞాన చంద్రికా మండలి సంపాదకులు తమ ప్రచురణాలయపు ప్రకటన లోనూ, సాధారణ పీఠికలోనూ ఈ విధంగా తెలవిస్తున్నారు: 'మా గ్రంథాలన్నీ జనోపయోగమునకై వ్రాయబడినవి. ఇంగ్లీషు భాష తెలియనివారికి ఇంగ్లీషున వ్రాయబడిన విషయాలను తెలియజెప్పి జ్ఞానమును కలిగించు ఆశయముతో ఈ ప్రచురణములను ప్రారంభించితిమి.

''....ఈరకమైన గ్రంథాలను 'నిర్దుష్టమైనవిగానూ, అనవసర పాండిత్య ప్రకర్షను చూపే భాషలో కాకుండా నాజూకైన మధుర భాషలో రాయబడినవిగానూ' శ్రీరామలింగారెడ్డిగారు ఉదాహరిస్తున్నారు. ఈ గ్రంథాలకు కలవని శ్రీ రెడ్డిగారు చేస్తున్న క్లెయిమ్సును వాటి ప్రచురణకర్తలే చేయడము లేదు.''

సైన్సు గ్రంథాలను విమర్శించాక అప్పారావుగారు చారిత్రక నవలలను పరిశీలించారు. నిశితంగా పరోక్షంగాను 'విజయనగర సామ్రాజ్యం' 'మహమ్మదీయ మహాయుగం' అనే పుస్తకంలోని పన్నెండు పేజీలు ఆధారమని నవలా రచయిత చెప్పారు. లక్ష్మణరావుగారు సీవెల్స్ రచించిన 'ది ఫర్‌గాటెన్ ఎంపైర్'ను మాత్రమే చూశారుగాని ఫెరిస్తా రచనలను చూడకుండానే తమ రచన చేశారని అప్పారావుగారు నిరూపించారు. విజయనగర మహారాజా వారి కాలేజీలో అప్పారావుగారు చరిత్ర బోధించే లెక్చరరుగా పనిచేసినవారు. ప్రామాణికులు. విజ్ఞాన చంద్రికవారి ఆంధ్రుల చరిత్రను తప్ప మరి దేనినీ ఆయన హర్షించలేదు. విజ్ఞానచంద్రిక వారివి కాక ఇతర చారిత్రక నవలలను ఆయన మెచ్చుకోలేదు. ''బంకించంద్రుణ్ణి అనుకరించడం తెలుగునవలా రచయితలకొక అంటువ్యాధి అయింది'' అని అప్పారావుగారు రోగ నిదానం చేశారు.

''లేని బావకన్నా గుడ్డిబావే నయం'' అని గురజాడ అప్పారావుగారు సరిపెట్టుకోలేదు. అందుకే విజ్ఞాన చంద్రిక మండలివారి పుస్తకాల మీదనే ఎక్కువగా విమర్శ సాగించిన తమ 'ఆధునిక ఆంధ్ర వచన రచన' అనే యాదస్తును ఇలా ముగించారు.[7]

''తెలుగులో సొగసైన ఉత్తమ వచన రచనలు వెలువడే వరకూ అప్పటి వచన గ్రంథాలను చదవమని బి.ఏ.తరగతుల వారిని ఇబ్బంది పెట్టకపోవడమే మంచిది. మంచి వచన పుస్తకాలు వచ్చేవరకూ కాస్త ఆగితే మన కొంపేమీ మునిగిపోదు''.

అయితే లక్ష్మణరావుగారుగానీ, మద్రాసు ప్రభుత్వపు విద్యాశాఖవారుగాని అలా భావించలేదు. ఉన్నదానినే ఉపయోగించుకొంటారు. విద్యార్థులకు చదవవలసినవి రాయవలసినవి నిర్దేశిస్తారు. స్కూలు ఫైనలు క్లాసులలోనూ, ఇంటర్‌లోనూ విద్యార్థులు వ్యాసరచనలోనూ, అనువాదంలోనూ ఉపయోగించవలసిన భాషను నిర్ణయించడానికి 1911లో ఒక కమిటీ వేశారు. అన్ని కమిటీలలో కొమర్రాజు లక్ష్మణరావుగారు సభ్యులుగా వున్నారు. ఆదినుండీ ఆయన తమ గ్రంథమండలిలో ఉపయోగించే భాషనే వెనకేసుకొని వచ్చారు. గ్రాంథికవాదులు 1914లో ఈ కృతక భాషను నెగ్గించుకొన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం సిండికేటు వాడుకభాషను గుర్తించలేదు.

7. వ్యాస చంద్రిక - పుట. 153

1912వ సంవత్సరంలోనే లక్ష్మణరావుగారు తమ సహచరులతో కలసి 'విజ్ఞాన చంద్రికా పరిషత్తు' అనే సంస్థను స్థాపించారు. వైజ్ఞానిక, చారిత్రక, శాస్త్రీయ గ్రంథాలలో పరీక్షలను ఏర్పాటు చేశారు. వారి మండలి వెలువరించే గ్రంథాలనూ, ఇతరుల గ్రంథాలలో కొన్నింటినీ పఠనీయాలుగా నిర్ణయించి వాటిలో పరీక్షలు జరిపేవారు. గుంటూరు, బందరు, బెజవాడ, నరసాపురం, రాజమండ్రి, కాకినాడ, హైదరాబాద్ మొదలైన కేంద్రాలలో పరీక్షలు జరిగేవి. గెలిచినవారికి నూటపదహార్లు నగదు, బంగారు, వెండి పతకాలు ఇచ్చేవారు. పోటీలకు వీరేశలింగంగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, పనప్పాకం శ్రీనివాసాచార్యులుగారు మొదలైనవారు న్యాయనిర్ణేతలు. ఒక సంవత్సరం శ్రీమతి కాంచనపల్లి కనకమ్మగారు ప్రథమశ్రేణిలో కృతార్థులయ్యారు. ఈ పోటీలు కొన్నాళ్ళపాటు నడిపారు.

1914లో మొదటి ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. 1916దాకా మండలి గ్రంథాలను ఎలాగో ప్రచురించారుగాని తరువాత కాగితం ధర పదింతలు పెరిగి చాలా ప్రియమైపోయింది. దీనికి ఇంకొక కారణం కూడా లేకపోలేదు. 1915వ సంవత్సరం నుంచీ లక్ష్మణరావుగారికి ఆంధ్రభాషలో విజ్ఞాన సర్వస్వాన్ని అకారాది క్రమంలో రచించాలన్న కోరిక కలిగింది. దీనికి ప్రోద్బలం మహారాష్ట్ర భాషలో డాక్టర్ ఖేట్కర్‌గారి విజ్ఞాన సర్వస్వం. ఆ మహాపండితుడు చెన్నపట్నం వచ్చి కొన్నాళ్ళు లక్ష్మణరావుగారితో గడిపారు. ఆంధ్రవిజ్ఞానసర్వస్వాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకొన్నారు. విజ్ఞానచంద్రికా మండలి ప్రచురణలలో సాయపడిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఆచంట లక్ష్మీపతిగారలు సహాయ రచయితలు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు సహాయకులు. ఆయన పరిశోధనలో శిక్షణ ఇక్కడే సంపాదించుకొన్నారు. రాయప్రోలు సుబ్బారావుగారు కూడా గ్రంథమండలిలోనూ, విజ్ఞాన సర్వస్వం కార్యాలయంలోనూ పనిచేశారు.

పనిచురుకుగానే సాగింది. విభిన్న విషయాలపై ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత వ్యాసాలు రాయించి, తాము కొన్ని స్వయంగా రాసి 'ఆ' అన్న అక్షరంతో మొదలయ్యే ఆరోపాలను సంకలనం చేసి మూడు సంపుటాలుగా లక్ష్మణరావుగారు ప్రచురించారు. ఇందులో ఆయన స్వయంగా వ్రాసిన విషయాల గురించి అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఇలా వివరాలు ఇచ్చారు.

భాషావిషయ వ్యాసములు	-	11
ధర్మశాస్త్ర విషయకములు	-	9
చారిత్రక విషయకములు	-	7
ప్రకృతి శాస్త్ర విషయకములు	-	2
గణితశాస్త్ర విషయకములు	-	2

లక్ష్మణరావు స్వయంగా రాసిన పై విషయాలలో అథర్వవేదం, అద్వైతం, అభిజ్ఞాన శాకుంతలం, అలంకారాలు, అష్టాదశ మహాపురాణాలు, అష్టాధ్యాయి మొదలైనవి.

ఉన్నాయి. ఆయన రచనలే పదకొండు వందల పుటలు పరిమితిని పొందాయి. ఆచంట లక్ష్మీపతిగారు అడవులు, అతిసారము, అతిమూత్రము, అంటువ్యాధులు, అస్థిపంజరం మొదలైన ఆరోపాల వ్యాసాలు రాశారు.

'అకార ఆరోపాలన్నీ పూర్తి చేశాక 'ఆ' అన్న అక్షరంతో మొదలయ్యే విషయాలపై రచనకు ఉపక్రమించారు. 'ఆంధ్ర' అన్న ఆరోపం కోసం ఎన్నో పరిశోధనలు చేశారు. శాసనాలను చదివారు. ఆకరాలను వెదికారు. ఇటువంటి పరిశోధన చేస్తున్నప్పుడే దేశంలో ఒక పరిశోధక మండలి అవసరమని గుర్తించారు. ఏ హైదరాబాదులో మొట్టమొదటి గ్రంథాలయాన్ని 1901లో స్థాపించారో ఆ హైదరాబాద్‌లో లక్ష్మణరావుగారు 1922లో కొందరు సహచరులతో 'పరిశోధక మండలి'ని స్థాపించారు. తెలంగాణాలో అపారంగా ఉన్న తామ్ర శిలా శాసనాలనూ, కాగితాలనూ, తాళపత్ర గ్రంథాలనూ సేకరించి ప్రచురించడానికి ఈ సంస్థ స్థాపన జరిగింది.

ఆంధ్ర చరిత్ర గురించి పరిశోధనలు సమగ్రంగా జరగాలన్న సంకల్పంతోనే లక్ష్మణరావుగారు 1919లో కందుకూరి వీరేశలింగంగారిని మద్రాసుకు ఆహ్వానించి తమ స్వగృహం 'వేదవిలాస్'లోనే బస, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేసి వీరేశలింగంగారి కవుల చరిత్రను తిరగరాసే కృషిని పురిగొల్పారు. వీరేశలింగంగారు ఆ పనిలో నిమగ్నులై ఉండగా లక్ష్మణరావుగారు మునగాల సంస్థానం పనులుమీద నడిగూడెం వెళ్ళవలసి వచ్చింది. ఆయన మద్రాసులో లేనపుడే వీరేశలింగంగారు వేదవిలాస్‌లో మరణించారు. ఆఖరిక్షణాలలో దగ్గర లేకపోయాననే విచారం లక్ష్మణరావుగారికి కలిగింది. నాగపూర్‌లో చదువు ముగించుకొని వచ్చిన నాటి నుంచి వీరేశలింగంగారితో ప్రత్యక్ష పరిచయంతో పాటు శిష్య భావం లక్ష్మణరావుగారికి దృఢమైంది. వారితోవలోనే వారి శైలినే పట్టుకొనిసాగారు.

లక్ష్మణరావుగారు తమ ఆరోగ్యాన్ని సరిగా చూసుకొనకుండా భారమైన పనులన్నీ తనమీద వేసుకొనేవారు. అసలే ఉబ్బసం. పైగా విశ్రాంతిరాహిత్యం, డాక్టర్లు పరీక్షచేసి హార్స్‌లీ కొండలలో రెస్టు తీసుకోమన్నారు. 1923 మేలో కొన్నాళ్ళు అక్కడుండి తోచక మద్రాసుకు తిరిగివచ్చారు. రెండునెలలపాటు 'ఆంధ్ర' అనే విషయంపై విజ్ఞాన సర్వస్వానికి వ్యాసం కొనసాగిస్తూ, ఆ సంవత్సరం జూలై 12వ తేదీ రాత్రి వీరేశలింగంగారు మరణించిన గదిలోనే తామూ శాశ్వతంగా కన్నుమూశారు.

లక్ష్మణరావుగారు ఒక అర్ధశతాబ్దంపాటు కూడా జీవించలేదు. ఆయన మనుగడ నలభై ఆరేళ్ళకే అయిపోయింది. ఈ కొద్దికాలంలో ఆయన రెండు జీవితకాలాలకు సరిపోయే కార్యభారాన్ని తమమీద పెట్టుకొన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికతో నిర్దోషమైన పద్ధతిలో ఆంధ్రవిజ్ఞాన సర్వస్వ రచనకు ఉపక్రమించారు. ఆయన అకాల మృత్యువు అక్షరాలా తెలుగు జాతికి తీరనిలోటే, ఆంధ్రభాషలో ఉన్న యాభై పై చిలుకు అక్షరాలలో ఒకే ఒక అక్షరంతో మొదలయ్యే ఆరోపాలను మాత్రమే ఆయన మూడు సంపుటాలలో రచించగలిగారు. ఆయన ఈ యుగంలో తలపెట్టిన విజ్ఞాన సర్వస్వం రచన ఆధునిక యుగంలో ఇతరులు ఇంకొక ప్రణాళికతో ఇంకొక సంస్థ తరఫున పూర్తిచేయగలిగారు.

లక్ష్మణరావుగారి అకాల మృత్యువు వారి సహచరులకు పెద్ద దెబ్బ; అయితే ఆయన తలపెట్టిన ప్రచురణలను కొన్నింటినైనా ఆ మిత్రులు కొనసాగించగలిగారు. 1924లో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి కార్యలయాన్ని అయ్యదేవర కాళేశ్వరరావుగారు బెజవాడకు మార్చారు. కమిటీని పునర్నిర్మాణం చేశారు. ఆచంట లక్ష్మీపతిగారు అధ్యక్షులు అయ్యంకి వెంకట రమణయ్యగారు కార్యదర్శి కాళేశ్వరరావుగారు మానేజరు. గూడూరు రామచంద్రరావు, దిగవల్లి వెంకటశివరావు, వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాదు (జయంతిపురం రాజా) మొదలైనవారు సభ్యులు. లక్ష్మణరావుగారు, ప్రసాదుగారు సజీవులుగానే ఉన్నప్పుడు అచ్చువేద్దామనుకొన్న కాళేశ్వరరావుగారి రచన 'ఫ్రెంచి స్వాతంత్ర్య విజయం' గ్రంథమండలి తరపున ప్రకటించి లక్ష్మణరావుగారికే అంకితమిచ్చారు. ఆచంట లక్ష్మీపతిగారు సంకలనం చేసిన లక్ష్మణరావుగారి వివిధ వ్యాసాలను 'లక్ష్మణరాయ వ్యాసావళి' అనే పేరిట మండలి తరపునే ప్రకటించారు. 1924 నుండి 1934దాకా ఉన్న పదేళ్ళలో విజ్ఞాన చంద్రిక పక్షాన ప్రచురణలను వెలువరించారు. దానికి అనుబంధంగా అయిదు రాజకీయ విజ్ఞాన ప్రచురణలను ప్రకటించారు. వాటి వివరాలను చూడండి.

31. లక్ష్మణరాయ వ్యాసావళి - లక్ష్మణరావు
32. ఫ్రెంచి స్వాతంత్ర్య విజయము - అయ్యదేవర కాళేశ్వరరావు
33. అమెరికా సంయుక్త రాష్ట్రములు - అయ్యదేవర కాళేశ్వరరావు
34. బౌద్ధమహాయుగము - వేలూరి సత్యనారాయణ
35. ఫాహియాను భారత వర్షయాత్ర - వేలూరి సత్యనారాయణ
36. దక్షిణాఫ్రికా చరిత్ర- దిగవల్లి వెంకటశివరావు
37. అల్లాహూ అక్బర్ (చారిత్రాత్మక నవల) - భోగరాజు నారాయణమూర్తి
38. వైదిక నిలయము - బాలగంగాధర్ తిలక్ రచనకు
    మానికొండ సత్యనారాయణశాస్త్రి అనువాదం
39. అధినివేశస్వరాజ్యం - దిగవల్లి వెంకట శివరావు
40. తురుష్క ప్రజాస్వామిక - అయ్యదేవర కాళేశ్వరరావు
41. అధినివేశస్వరాజ్యం - దిగవల్లి వెంకట శివరావు
42. భారతదేశము - ఆర్థిక చరిత్ర - 1 ఆత్మకూరి గోవిందాచార్యులు
43. భారతదేశము ఆర్థిక చరిత్ర - 2 ఆత్మకూరి గోవిందాచార్యులు

రాజకీయ విజ్ఞాన ప్రచురణలు

1. ఆంగ్ల రాజ్యాంగము - దిగవల్లి వెంకట శివరావు
2. భారతదేశ స్థితిగతులు - దిగవల్లి వెంకట శివరావు
3. చైనా యువజనోద్యమము - అయ్యదేవర కాళేశ్వరరావు
4. భారతదేశపు రైళ్ళు - వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాదు
5. రాష్ట్రీయ స్వపరిపాలనము - దిగవల్లి వెంకట శివరావు

హైదరాబాదులో లక్ష్మణరావుగారు స్థాపించిన పరిశోధన మండలిని ఆయన పేరు మీదగానే 'లక్ష్మణరాయపరిశోధక మండలి' అనే సముచితనామంతో సహచరులు కొనసాగించారు. 'తెలంగాణా శాసనములు' అనే రెండు సంపుటాలను ప్రచురించారు.

లక్ష్మణరావుగారి స్మృతి చిహ్నంగా మునగాల రాజాగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక ధర్మనిధిని ఏర్పాటు చేశారు. ఈ ఎండోమెంటు చరిత్ర పరిశోధన నిమిత్తం ఏర్పాటు చేయడంలో ఔచిత్యముంది.

మన గతచరిత్రలో మనం ఎలుగెత్తి సగర్వంగా చాటుకొనే గొప్పలతో పాటు ఈనాడు 'సిగ్గుపడే' ఆచారాలు కొన్ని ఉంటాయి. అటువంటి వాటిని దాచిపెట్టడం సాధారణ పరిశోధకులు చేసే పని. అయితే నిజమైన విజ్ఞానవేత్త అప్రియమైన సత్యాన్ని కూడా విశదం చేస్తాడు. లక్ష్మణరావుగారు అదే చేశారు. ఉదాహరణకు ఒక ఉదంతం.

''అశ్వమేధం గురించి వివరాలను ఇచ్చే విజ్ఞాన సర్వస్వాన్నీ ఈ విషయాలను దాటవేస్తాయి. కొమర్రాజు లక్ష్మణరావుగారు ముఖ్యసంపాదకులుగా సంకలనం చేసిన 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం' రెండవ భాగంలో కనుపర్తి మార్కండేయ శర్మగారు ''ప్రధాన ఋత్విక్కులు రాజపత్నులతోడ ప్రశ్న ప్రతివచన సంభాషణ మొనర్తురు. తరువాత అశ్వావయవ హోమాదికము సలుపబడును'' అని ముక్తసరిగా రాశారు. ముఖ్య సంపాదకులు ఇక్కడ ఒక అధోజ్ఞాపికలో ఇలా రాశారు.

> ''వాజసనేయ సంహితము దానిపై మహీధరాదులు వ్రాసిన భాష్యమును, తైత్తిరీయమును దానిపై సాయణాచార్యులు వ్రాసిన భాష్యమునుబట్టి చూడగా గుఱ్ఱము చంపబడిన తరువాత, సార్వభౌముని పట్టమహిషి ఈ గుఱ్ఱమువద్ద శయనించి క్రీడ సల్పవలెను. ప్రధాన ఋత్విజులు యజమానుని పత్నులతో బూతు ప్రసంగములు చేయవలెను. (వాజసనేయ సంహిత 23వ అధ్యాయముమీద మహీధర భాష్యము చూడనగును). కాని వేదము యొక్క ఈ భాగమునకు ఈ యశ్లీలార్థము చేయుట తప్పనియు, దానికి మంచి యర్థము వేరొకటి యున్నదనియు దయానంద సరస్వతి భావము. (చూడు ఋగ్వేద భాష్య భూమిక)''

వేరొక సందర్భంలో లక్ష్మణరావుగారు ఇలా రాశారు.[8]

''కొత్త విషయమును చెప్పిన దానిని కొందరు నిందించుట సహజము కావున నన్ను కొందరు ప్రస్తుత విషయమును గురించి దూషింతురని, నేనెఱుంగుదును. కాని వారి దూషణ భూషణములతో నాకు ప్రయోజనము లేదు. సత్యాన్వేషణమే నా పని. కావున నెవరైన ఈ విషయమును ఖండింపదలచిరేని సప్రమాణముగ వ్రాయప్రార్థితులు''.

ప్రామాణికత పరిశోధనకు ప్రాణం.

నిర్భీతి నిజాయితీకి నికష-శాసనం.

---

8. లక్ష్మణరాయ వ్యాసావళి - పుట.126

కొమర్రాజు వారి సహచరులు

మానవులు సంఘజీవులు. జీవితంలో ఎవరైనా ఏదైనా సాధించగలిగారంటే ఎందరెందరో ప్రత్యక్షంగానో పరోక్షంగానో అందుకు తోడ్పడి వుండాలి. ఒక ప్రతిభావంతుడు పదిమందిని ప్రభావితుణ్ణి చేయగలడు. నలుగుర్ని కూడగట్టుకొని రావడంలోనే ప్రయోజకత్వం కనబడుతుంది. కొమర్రాజు లక్ష్మణరావుగారు తాము మహారాష్ట్రులలో లోకమాన్య బాలగంగాధర తిలక్, డాక్టర్ ఖేట్కర్ వంటి వారి వల్లా; తెలుగువారిలో మరీ ముఖ్యంగా కందుకూరి వీరేశలింగంవారి వల్లా ఉత్తేజితులై విజ్ఞాన వికాసాలకోసం ఉద్యమిస్తూ ఎందరినో ఆ కృషిలో వారివారి స్థాయికి తగినట్టు భాగస్వాములను చేశారు. కొమర్రాజు వారి సహచరుల గురించి ఈ విభాగంలో చెప్పుకొందాం.

బండారు అచ్చమాంబ (1874–1905)

ఈమె లక్ష్మణరావుగారి అక్కగారు. ఆయనకన్నా రెండేళ్ళు పెద్ద. తమ మేనమావ బండారు మాధవరావుగారి రెండో భార్య. లక్ష్మణరావుగారు అక్కగారి వద్దనే ఉండి మేనమామగారి సహాయంతో నాగపూర్‌లో చదువుకొన్నారు. ఆయన విద్యాభ్యాసం మరాఠీ భాషలోనే సాగినా ఇంటివద్ద అక్కగారితోపాటు ఎన్నో తెలుగు పత్రికలు, పుస్తకాలు కలిసి చదువుకొన్నారు. ఆమెకు పుత్రవియోగం కలిగినప్పుడు ఆమెను ఓదార్చి ఆ దుఃఖం పోగొట్టడానికి గ్రంథపఠనంతోనేకాక రచనా వ్యాసంగంలోనికి కూడా ఆమెను దింపారు.

అచ్చమాంబగారికి ఎన్నో చరిత్రగ్రంథాలను చదివి వినిపించేవారు. ఆమె స్వయం కృషితో శాస్త్రాలను సంస్కృత కావ్యాలను, శ్రుతి స్మృతులను కూడా అర్థం చేసుకొనే శక్తిని అలవర్చుకొన్నారు. నాగోజిభట్టు చెప్పిన ''శబ్దేందుశేఖరో మమపుత్ర, మంజూషా మమ పుత్రికా'' అన్న శ్లోకాన్ని స్వానుభవం చేసుకొన్నారు. తెలుగులో రచనలు చేస్తూ 'తెలుగు జనాన' వంటి పత్రికలకు పంపేవారు. లక్ష్మణరావుగారు కూడా ఆమెలాగే తెలుగు రచనలు చేసేవారు.

అచ్చమాంబగారు గ్రంథాలను పరిశోధించి వేయి సంవత్సరాల స్త్రీల చరిత్రలను కథనం చేయ ప్రారంభించారు. 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కందుకూరి వీరేశలింగంగారు తమ చింతామణి ముద్రణాలయంలో ప్రచురించారు. ఈ గ్రంథాన్ని అచ్చమాంబగారు తమ భర్త మాధవరావుగారికే అంకితమిచ్చారు. తెలుగులో మొట్టమొదటి స్త్రీల చరిత్రను రచించిన మహిళగా ఈమె చరితార్థులయ్యారు. ఈ పుస్తకం గురించి పరిశోధకులు ఇలా రాస్తున్నారు.[1]

''అబలా సచ్చరిత్ర రత్నమాల మూడు భాగములు. పౌరాణిక స్త్రీ చరిత్రము, చారిత్రక స్త్రీ చరిత్రము, ఆంగ్లేయాది విదేశరమణీ చరిత్రము... ఏ చరిత్రము వ్రాసినను,

---

1. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ – ఆంధ్రకవయిత్రులు – పుట.93–94

నద్దాని సమర్థించు శ్రుతిస్మృతి వాక్యములు, శ్లోకములునెన్నో ఈ గ్రంథమున నగపడును. ఏ వాక్యము నుద్ధరించినను ప్రత్యక్షముగ పరిశీలించికాని, సమగ్రముగా పరిశోధన చేసికాని యుల్లేఖించెడిది కాదు''.

కేవలం గంభీరమైన రచనలనేకాక స్త్రీలకు ఉపయోగపడే అల్లిక, కుట్టు మొదలైన విషయాలపై కూడా అచ్చమాంబగారు రచనలు చేయగలరు. 'క్రోషా' అనే అల్లిక గురించి వ్యాసం రాసి 'హిందూ సుందరి' అనే పత్రికలో ప్రచురించారు. మహారాష్ట్రంలోనూ, మధ్యప్రదేశ్‌లోనూ భర్తగారు ఉద్యోగరీత్యా ఉండడంవల్ల అక్కడ కూడా స్త్రీ జనాభ్యుదయానికి పాటుపడ్డారు. ఆంధ్రదేశానికి వచ్చినప్పుడు మహిళా కార్యక్రమాలలో పాల్గొనేవారు.

1902లో అచ్చమాంబగారు తమ భర్తగారితో కలిసి ఒకసారి బందరు వచ్చారు. అయ్యదేవర కాళేశ్వరరావుగారి ఇంట్లో నాలుగైదు రోజులు ఉన్నారు. ఆమె రాకను పురస్కరించుకొని పురజనులు చేసిన సభల గురించి కాళేశ్వరరావుగారు ఇలా రాశారు.[2]

''అప్పటికి బందరులో కృష్ణాజిల్లా మహాసభ పక్షమున కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావుగారలు కృష్ణాపత్రికను స్థాపించినారు. ఆ పత్రికలో అవుటపల్లి నారాయణరావుగారు ఉపసంపాదకులుగా నుండిరి. ఆయన నాకు గొప్ప స్నేహితులు. ఆయనతో సంప్రదించి బందరుకు అచ్చమాంబగారు వచ్చిన అవకాశమును తీసుకొని యొక స్త్రీ సమాజమును స్థాపించవలయునని తలచి ఒక ఆహ్వానమును పంపగా బందరులోని లాయర్లు, ఉపాధ్యాయులు మొదలైనవారంతా తమ తమ స్త్రీలను ఆ సభకు పంపినారు. అప్పటికే అచ్చమాంబగారు 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అను గ్రంథమును రచించి ఆంధ్రదేశములో ఖ్యాతిని పొందియుండెను. సభ బుట్టయ్యపేట ఆడపిల్లల పాఠశాలలో బహుజయప్రదముగా జరిగినది. శివరామకృష్ణయ్యగారి రెండవ కూతురగు శ్రీమతి రత్నం ఎం.ఏ. ప్యాసైయున్నది. ఆమె దీనికి అధ్యక్షత వహించినది. అచ్చమాంబగారు స్త్రీల అభివృద్ధి, స్వాతంత్ర్యము, విద్య మొదలగు విషయములను గురించి చక్కని ఉపన్యాసమునిచ్చినది. బృందావన స్త్రీ సమాజమును పేరనొక స్త్రీ సమాజము స్థాపించబడినది. అదియే ఆంధ్రదేశములో ప్రథమముగా స్థాపించబడిన స్త్రీ సమాజము. దానికి అనేక సంవత్సరములు శ్రీమతి మోటుపల్లి రాజా బాయమ్మగారు కార్యదర్శినిగా పనిచేసినది. నేటికిని ఆ సమాజము నిలిచియున్నదనియే నా విశ్వాసము. దాని యాజమాన్యమున నొక బాలికా పాఠశాలను స్థాపించినారు. కొంతకాలమునకు అది స్త్రీల హైస్కూలు అయినది. దానిని ఇటీవల ప్రభుత్వము తీసుకొన్నది. అచ్చమాంబగారితో పాటు మరికొందరు నారీమణులు కూడా గ్రంథకర్త్రిణులుగా అప్పటికి ప్రఖ్యాతిని పొందియున్నారు. వీరేశలింగం పంతులుగారి శిష్యురాలైన కొటికలపూడి సీతమ్మగారు, గుండు అచ్చమాంబగారు, పలుగుర్తి లక్ష్మీనరసమాంబగారు, ఆమె భర్త బందరు నుండి పోయి ఆంధ్రదేశములోని కొన్ని ముఖ్య పట్టణములను దర్శించి, యక్కడ స్త్రీ

2. అయ్యదేవర కాళేశ్వరరావు - 'నా జీవితకథ నవ్యాంధ్రము', పుట.70-71

సమాజములను స్థాపించిరి. కాకినాడలో విద్యార్థినీ సమాజము స్థాపింపబడినది. రాజమహేంద్రవరములోను, బెజవాడలోను, గుంటూరులోను, విశాఖపట్టణములోను, అనంతపురములోను గూడ స్త్రీ సమాజములను స్థాపించిరి. అవి స్త్రీ సమాజపు రోజులు అందువలన స్త్రీలలో జాలచైతన్యము, విద్యాభిలాష, వ్యక్తిత్వములు కలిగినవి.''

భావచైతన్యం పొందిన ఒక వనిత ఎందరిని ప్రభావితులను చేయగలదో పై వాక్యాలు తెలియచేస్తాయి. అచ్చమాంబగారు ఒక మొలకను నాటితే అది ఎంతటి వృక్షంగా మారిందో విశదమవుతుంది. ఆమె మళ్ళా మధ్యప్రదేశ్‌కి వెళ్ళిపోయారు. అక్కడ సంఘసేవలో రోగులకు సపర్యలు చేయడానికి కూడా ముందుకు వచ్చారు. 1905లో బిలాస్‌పూర్‌లో ప్లేగు వ్యాధి వచ్చింది. అచ్చమాంబగారు నర్సుగా ఎందరికో ఉపచరించారు. ఒక అనాధబాలుణ్ణి రక్షించి క్రైస్తవ మతంలో చేరకుండా ఆపి ధన సహాయం చేసి రోగవిముక్తుణ్ణి కూడా చేశారు.[3]

ఈ ప్లేగు వ్యాధి నివారణ ఉపశమన కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొని అచ్చమాంబగారు తామే ఆ వ్యాధికి బలి అయ్యారు. 1905లో ఆమె మరణించారు.

అక్కగారి వియోగం లక్ష్మణరావుగారికి తీరని గాయమైంది. ఆమె జ్ఞాపకార్థం ఆయన తమ కుమార్తెకు ఆమె పేరునే పెట్టుకున్నారు. మూడు దశాబ్దాలు నిండగానే అచ్చమాంబగారికి నూరేళ్ళూ నిండిపోయాయి. అయినా సంఘసేవలో అసువులు బాసిన ఆమె ధన్యురాలు.

నాయని వెంకటరంగారావు (1875-1958)

తాము ఏ సంఘంలో జీవిస్తున్నారో ఆ సంఘానికి ఉపయోగపడాలనే కోరిక పడుచుదనంలో మానవులకు సర్వసాధారణంగా ఉంటుంది. జమీందారీ కుటుంబాలలో జన్మించినా అభ్యుదయ వాతావరణంలో పెరిగితే ఆ కోరిక కుసుమిస్తుంది. నాయని వెంకట రంగారావుగారు మునగాల రాజాగారు, ఆయన తన యౌవనంలో జాతీయవాది. కాంగ్రెసు కార్యక్రమాలలో పాల్గొన్నవారు. ఉత్తరోత్తరా ఆయన జీవితం ఎలా మారినా పడుచుదనంలోనూ, కొమర్రాజు లక్ష్మణరావుగారి సహచర్యంలోనూ రంగారావుగారు కొన్ని మంచిపనులే చేశారు.

ఈయన పుట్టుకవల్ల వరంగల్లు జిల్లా మానుకోట తాలూకాలోని నెల్లికుదురు దేశముఖులు రాఘవరెడ్డిగారి మూడవ కుమారులు. పేరు రంగారెడ్డి. అయితే మునగాల జమీందారిణి నాయని లచ్చమ్మారావుగారికి దత్తపుత్రులై వెంకటరంగారావు అనే పేర సంస్థానానికి వారసులయ్యారు. వారసుడు మైనరు. అందుచేత సంస్థానం కోర్ట్ ఆఫ్ వార్డ్సు వారికి స్వాధీనమైంది. వెంకటరంగారావుగారిని కలెక్టరు బందరు నోబులు కాలేజిలో చదివించారు. బందరులో మునగాలవారికి బంగళా ఉండేది.

3. G.Krishna - Komarraju Venkata Lakshmana Rao - p.74

రంగారావుగారి దత్తత చెల్లదని జ్ఞాతులు ఏలూరు సబ్‌కోర్టులో సివిలు దావాలు వేశారు. అవి 1894లో బందరు జిల్లా కోర్టుకు బదిలీ అయినాయి. 1914 దాకా ఈ కేసులు నడుస్తూనే ఉన్నాయి. అయితే 1900వ సంవత్సరంలో రంగారావుగారికి యుక్తవయసు వచ్చిందని సంస్థానాన్ని స్వాధీనం చేశారు. ఆ యేడే కొమఱ్రాజు లక్ష్మణరావుగారు నాగపూర్‌లో విద్య ముగించుకొని వచ్చి మునగాల దివాన్‌గిరీని చేపట్టారు.

వందేమాతరం ఉద్యమం రోజుల్లో రంగారావుగారు చాలా చురుకుగా అందులో పాల్గొన్నారు. బిపిన్ చంద్రపాల్‌గారికి ఆతిథ్యమిచ్చారు. స్వదేశీ వస్తుభాండాగారాన్ని స్థాపించారు. లక్ష్మణరావుగారితో, వారి ఇతర సహచరులతో గ్రంథాలయాలు, గ్రంథమండలి మొదలైనవి నెలకొల్పారు. చాలామంది గ్రంథకర్తలను పోషించారు. కృతులు అంకితం పుచ్చుకున్నారు. గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణగారు నిర్వహించిన శారదానికేతనం స్థాపక అధ్యక్షులు రంగారావుగారే. బందరు ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపకులలో వీరొకరు. బందరులోని 'ఆంధ్రసరస్వతీ గ్రంథమండలి'కి వెంకట పార్వతీశ్వర కవుల ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలకు మహారాజపోషకులు. తెలంగాణాలో ఎన్నో గ్రంథలయాల స్థాపకులు. రంగారావుగారి గురించి కేశవపంతుల నరసింహశాస్త్రిగారు ఇలా రాశారు.[4]

''శ్రీమునగాల రాజాగారు ఆంధ్ర తెలంగాణముల సమైక్యమునకు సేతువు వంటివారై యుండిరనవచ్చును. వారు జన్మించినది వరంగల్లు మండలము. దత్తపుత్రుడుగా వెళ్ళి జమీందారుగా ప్రసిద్ధి చెందినది కృష్ణామండలము. తన కుమార్తెలలో ఇద్దరిని నల్లగొండ జిల్లాలోని బాబాసాహెబ్‌పేట దేశముఖులైన బారిష్టర్ రాజగోపాల్‌రెడ్డిగారికిని, శ్రీ ఎస్.ఎన్.రెడ్డిగారికిని యిచ్చి వివాహము చేసిరి. ఒకరిని మహబూబ్‌నగర్ జిల్లా, వనపర్తి సంస్థానాధీశ్వరుడై యుండిన శ్రీజనుంపల్లి కృష్ణదేవరాయ బహిరీ బల్వంత్ మహాభూపాలుగారికిని ఒసగిరి''.

ఆదిలో వందేమాతరం రోజుల్లో క్రియాశీల ఉద్యమాలలో పాల్గొన్న రంగారావుగారు క్రమంగా అన్నింటికీ దూరంగా ఉండి జమీందారీ ఫాయిలోనే జీవించారు. ఈయనను గూర్చి అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఇలా రాశారు.[5]

''మునగాల రాజా నాయని వేంకటరంగారావుగారు మిక్కిలి సత్ప్రవర్తన గలవారు. గొప్ప దేశాభిమాని. ఆంధ్ర భాషాభిమాని. సర్వసత్కార్యములకు సహాయము చేయుచుండెడివారు. బందరు జాతీయ కళాశాలకు ఎనిమిదివేల రూప్యములు విరాళముగా నిచ్చిరి. ఇంగ్లీషు ప్రభుత్వమనగా భయపడు జమీందారు కాడు. గుంటూరులోని శారదా నికేతనమునకు ఎనుబదివేల రూప్యముల విలువ గల స్థలమునిచ్చెను. విజ్ఞాన చంద్రికా మండలి స్థాపకులలో నొకరు. కాని లక్ష్మణరావుగారు చెన్నపట్టణములో నున్న కాలములోను, వారు మరణించిన పిమ్మటను నితర సలహాదార్ల సహాయముతో ఎస్టేటు

4. తెలుగు వైతాళికులు – 1వ సంపుటం, పుట.45
5. 'నా జీవితకథ – నవ్యాంధ్రము' పుటలు 53–54

రైతుల విషయములో కాఠిన్యముతో నిరంకుశముగా ప్రవర్తించెను. రైతులందరు తిరుగబడినారు. తుదకత్యధిక సంఖ్యాకులు కమ్యూనిస్టు పార్టీలో జేరినారు. మునగాల పరగణా ఆంధ్రప్రదేశమునకెల్ల కమ్యూనిస్టు ప్రాంతమని పేరు తెచ్చుకొన్నది. లక్ష్మణరావుగారికి రాజాగారి నిరంకుశత్వ మేమాత్రము గిట్టక బాధపడుచుండువారు.''

కాళేశ్వరరావుగారి తండ్రిగారు మునగాల యెస్టేటు మేనేజరుగా పనిచేశారు. చిన్నప్పట్నించి రంగారావుగారితో కాళేశ్వరరావుగారికి పరిచయం, ప్రగాఢమైత్రి ఉన్నాయి. అలాంటివారే జమీందారీ కర్కోటకత్వాన్ని అంగీకరించవలసి వచ్చిది. ఎన్ని మంచిపనులు చేస్తేనేం - ప్రజలను వేధించాక. మునగాల జమీందారు మంచిని సాహిత్య అకాడమీ వంటి సంస్థలు ఆకాశానికి ఎత్తాయి. చెడ్డను ప్రజలు ఇప్పటికి చెప్పుకొంటున్నారు.

రావిచెట్టు రంగారావు (1877-1910)

మనిషిపోయినా మంచి అన్నది ఉంటే మిగులుతుంది. దానిన సందర్భం వచ్చినప్పుడు సహృదయులు తలచుకుంటూ ఉంటారు. రావిచెట్టు రంగారావుగారి గురించి చెప్పుకోదగిన సంగతులు చాలా ఉన్నాయి. ఆయన నల్లగొండ జిల్లా దండం పల్లికి చెందినవారు. మున్సబుదారులు. మున్సబు అన్నది మొగలు సామ్రాజ్య వ్యవస్థలో సామంత-సర్దారు పట్టం. ప్రతి మన్సబుగారూ తనకు నిర్ణయించిన సంఖ్యలో అశ్వకదళాన్ని కూర్చుకొని అవసరమైనప్పుడు సామ్రాజ్యానికి సేవ చేయాలి. అందుకుగాను అతనికి జాగీరు ఉంటుంది.

రావిచెట్టు రంగారావుగారు హైదరాబాదులో పేరు మోసిన శ్రీమంతులు. సరసులు, విద్యాధికులు, సాహిత్యాభిమానులు, సంస్కృత భాషపై ఎనలేని గౌరవమున్నవారు. అందుకే ఆయన ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి దాని అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. ఈ సంస్కృత గ్రంథాలయం పేరు ''శ్రీశంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష'' రంగారావుగారికి మునగాల రాజాతోనూ, వారి దివాను కొమర్రాజు లక్ష్మణరావుగారితోనూ ప్రగాఢ పరిచయం ఏర్పడింది. ఇతర మిత్రులతో కలసి ఆంధ్ర భాషాభివృద్ధికి కృషి చేయాలని నిశ్చయించారు. 1901లో హైదరాబాదు రెసిడెన్సీలో రంగారావుగారి ఇంట్లోనే 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' అనే గ్రంథాలయాన్ని స్థాపించారు. కొన్నాళ్ళ తరవాత బడేచావిడి దగ్గరనున్న ఒక అద్దె ఇంట్లోనికి దానిని మార్చారు. చాలాకాలం రావిచెట్టు రంగారావుగారే దానికి లైబ్రేరియన్‌గా పనిచేశారు. తర్వాత ఇతర వ్యాపకాలవల్ల ఆపనిని తమ దూరపు బంధువులలో ఒకరైన ఆదిరాజు వీరభద్రరావు పంతులు అనే ఒక యువకునికి అప్పచెప్పారు. హైదరాబాదులో కృష్ణదేవరాయలపేరిట గ్రంథాలయం స్థాపించినట్టే రావిచెట్టు రంగారావుగారు హనుమకొండలో 'రాజరాజనరేంద్ర గ్రంథాలయాన్ని' 1904లో సంస్థాపించారు,

మునగాల రాజుతోనూ కొమర్రాజు లక్ష్మణరావుగారితోనూ సహచర్యం దృఢమైన తర్వాత రావిచెట్టు రంగారావుగారు మద్రాసుకు తరచు వెళ్ళేవారు. అక్కడ 1905లో

'విజ్ఞానచంద్రికా గ్రంథమండలి'ని స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర్ణయించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావుగారి పర్యవేక్షణలో నుండినా పుస్తకాలను చందాదారులకు చేర్చడం ఇతర వ్యాపార సంబంధమైన రవాణా కార్యక్రమాలను రావిచెట్టు రంగారావుగారు హైదరాబాదు నుండే స్వయంగా చేపట్టారు. రాజకీయ కారణాలవల్ల పోలీసుల నిఘా ఎక్కువయ్యాక పుస్తక ప్రచురణా, బట్వాడా పనులు మద్రాసుకే పరిమితం చేశారు. తాము సకుటుంబంగా మద్రాసుకు తరలి వెళ్ళి ఆర్నెల్లపాటు అక్కడే కాపురం పెట్టి గ్రంథమండలిని ఒక దారిలో పెట్టారు.

రావిచెట్టు రంగారావుగారి భార్య లక్ష్మీనరసమ్మగారు కూడా సాంఘిక విద్యా కార్యక్రమాలలో భర్తతోపాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించిన లక్ష్మీనరసమ్మగారే దాని మొదటి అధ్యక్షురాలు.

అనాథలకు విద్యాదానం చేయడం, ఆపన్నులను ఆదుకొనడం ఈ భార్యాభర్తలకు సహజ లక్షణాలు. దేశానికి ఎంతో సేవ చేయవలసిన రావిచెట్టు రంగారావుగారు తమ ముప్పయి రెండో యేటనే అకాల మృత్యువు వాతపడ్డారు. దేశం ఒక మంచివాడిని కోల్పోయింది. రావిచెట్టు రంగారావుగారి జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావుగారు 1910లో 'జీవిత చరితావళి'అనే గ్రంథంలో కథనం చేశారు. ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి తరపున 1911లో ప్రచురితమైంది.

ఆదిపూడి సోమనాథరావు (1867-1941)

రావిచెట్టు రంగారావుగారితోనూ వారి మిత్రులతోనూ కలిసి హైదరాబాదులో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' అనే గ్రంథాలయాన్ని 1901లో స్థాపించిన వారిలో ఆదిపూడి సోమనాథరావుగారు ఒకరు. ఈయన 'సత్కవి, సంస్కారప్రియుడు, 'ఆర్యసమాజానికి జీవగర్ర' అని పేరు పొందినవారు. మునగాల రాజా నాయని రంగారావుగారి పోషణలోనికి వచ్చారు. వారితోనే బహుశా హమేషా ఉండడంవల్ల రాజాగారి కార్యక్రమాలన్నింటిలోనూ సోమనాథరావుగారు కూడా పాల్గొనేవారు. జాతీయోద్యమంలోనూ సాంఘిక చైతన్యోద్యమాలలోనూ మరుకుగా పనిచేసేవారు.

సోమనాథరావుగారి తండ్రి ఆదిపూడి బుచ్చివెంకయ్యగారు బెంగుళూరులో శిరస్తాదారుగా 1877 నుండి పనిచేశారు. వారి నలుగురి కుమారులలో సోమనాథరావుగారు రెండవవారు. బుచ్చి వెంకయ్యగారికి వసుచరిత్ర అభిమానకావ్యం. దానికి 'విద్వన్మనో రంజని' అనే పేరుతో వ్యాఖ్యానాన్ని రచించిన సోమనాథుని గ్రంథం కూడా మరింత అభిమాన గ్రంథం. అందుకే తమ రెండవ కుమారునికి సోమనాథుని పేరు పెట్టుకొన్నారు. బుచ్చి వెంకయ్యారి కుమారులు చాలావరకు బెంగుళూరులోనే ఆంగ్ల, కర్ణాటాంధ్ర భాషలు చదువుకొన్నారు. అయితే తండ్రిగారు వారి 45వ యేట చనిపోతే వేరే ఆధారం లేక హైదరాబాదులో వున్న వారి పినతండ్రి ఆదిపూడి సుబ్బారావుగారి వద్దకు అన్నదమ్ములు చేరారు. హైదరాబాదులోని విద్యావంతులతోనూ, సంస్కార

ప్రియులతోనూ సోమనాథరావుగారు పరిచయం ఏర్పరచుకొన్నారు. ఆవిధంగానే రావిచెట్టు రంగారావుగారిని వారి ద్వారా మునగాల రాజునీ దివాను కొమర్రాజు లక్ష్మణరావుగారిని కలుసుకొని మిత్రులయ్యారని చెప్పవచ్చు.

ఆరోజుల్లో జాతీయోద్యమంతో పాటు రష్యాపై జపాను విజయం కూడా ఉడుకునెత్తురు పొంగే యువకులను ఉత్తేజపరిచేది. మునగాల రాజా సోమనాథరావు గారిచేత 1906లో 'జపాను చరిత్రము' అనే వచన గ్రంథాన్ని రాయించి కృతిపొందారు. ఈ పుస్తకం గురించి పరిశోధకులు ఇలా చెప్తున్నారు.[6]

''సరళమైన శైలిలో వచన రూపంలో నిర్మితమైన ఈ గ్రంథం ఇతిహాసము, వివిధ విషయములు, యుద్ధము, కథామంజరి అన్న నాల్గుభాగాలుగా విభజించబడ్డది. జపాన్ దేశానికి సంబంధించిన చిల్లర మల్లర విశేషాలు రెండో భాగంలో వివరించబడ్డాయి. మూడో భాగంలో యుద్ధవర్ణనం కళ్ళకు గట్టినట్టు చిత్రించబడ్డది. పోరాటపు సమయంలో జపానీయులు ప్రదర్శించిన వీరోచిత సంఘటనలు నాల్గో భాగానికి కావ్యవస్తువు.''

'జపాను చరిత్రము'ను వచనంలో రాసినా సోమనాథరావుగారు సహజంగా కవి. చక్కని ధారాశుద్ధి భావనా పటిమ ఉన్నవారు. మునగాల రాజా 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' స్థాపకులలో ఒకరైనా ఆ సార్వభౌముని పట్ల అమిత గౌరవమున్నవారు. అందుచేత సోమనాథరావుగారి చేత 'శ్రీకృష్ణదేవరాయ చరిత్రము' అనే ఆరాశ్వాసాల వీరరస ప్రధానమైన కావ్యాన్ని చెప్పించి అంకితం పుచ్చుకున్నారు. ఇది 1907లో అచ్చుపడింది. మచ్చుకు ఇందులో పరిశోధకులు ఉదాహరించిన పద్యం ఒకటి చూడండి.[7]

''దేవాధీశునిఁ గ్రొల్చి దీనతతులన్ ధీవర్యులం బ్రోచి స
ద్భావం బొప్పఁగ దండనాథులను సత్కారంబులం దన్పిభు
దేవేంద్రుండు జయోత్సవంబు సలిపెన్ దేదీప్యమానోద్ధతిన్
గైవారంబులు గన్నడంబునకుఁ గల్గన్ నల్గడన్ భూవరా'' (497)

కావ్యాలను అంకితం పుచ్చుకొన్న మునగాల రాజా వాటిని రచించిన కవిగారికి చేసిన సహాయాలలో ఒకటి చాలా విచిత్రమైనది. ఆదిపూడి సోమనాథరావుగారిని బహుళముగా సత్కరించడమేకాక వారి జీవితమును భీమా చేయించి ప్రీమియములు చెల్లించి భీమా ధనము వారికి చెల్లునట్లు చేసిరి'' అని పరిశోధకులు చెప్తున్నారు.[8]

మునగాల రాజా దగ్గర ఉంటున్నప్పుడే సోమనాథరావుగారికి పిఠాపురం రాజుగారితో కూడా ఒక గ్రంథరచన వల్ల పరిచయం ఏర్పడి ఆశ్రయం కుదిరినట్టుంది. 1893లో న్యాపతి సుబ్బారావుగారు చింతామణి పత్రిక తరపున నవలల పోటీ పెట్టినట్టు, 1912లో విజ్ఞానచంద్రికా పరిషత్తువారు శాస్త్రీయ గ్రంథ పఠనంలో పోటీలు పెట్టినట్టు పిఠాపురం రాజాగారు నూతన ప్రబంధాల పోటీని ఒక దానిని ప్రారంభించారు.

6. తూమాటి దొణప్ప - తెలుగు వైతాళికులు - సంపుటి-1, పుట.63
7. తూమాటి దొణప్ప - తెలుగు వైతాళికులు - సంపుటి-1, పుట.65
8. కేశవ పంతుల నరసింహశాస్త్రి - తెలుగు వైతాళికులు - 1వ సంపుటం, పుట.42

ఆ పోటీకోసం సోమనాథరావుగారు 'విజయేంద్ర విజయం' అనే నాలుగాశ్వాసాల కావ్యాన్ని ''సంఘదురాచారాలను నిర్మూలించే ధ్యేయంతో'' 383 పద్యాలలో రచించారు. అయితే ఈ కావ్యాన్ని ఆయన పోటీ గడువు లోపల పంపలేదు. కాని దీనిని పిఠాపురం రాజాకి అంకితమిచ్చారు. ఇది 1911లో అచ్చుపడింది.

'విజయేంద్ర విజయం' పద్యకావ్యమన్న మాటే గాని కథ ఆనాటి చారిత్రక నవలలాంటిదే. రాజపుత్ర స్థానంలోనూ, పాటలీపుత్రంలోనూ, మాళవదేశంలోనూ జరిగినట్టు కల్పించుకొన్న గాథ.[9] ఈ కావ్య రచనలవల్ల సోమనాథరావుగారికి పిఠాపురం సంస్థానంలో ఉద్యోగం కుదిరినట్టు ఉంది. అక్కడ రికార్డు కీపరుగా 1916 దాకా పనిచేస్తున్నట్టు దాఖలాలు ఉన్నాయి.[10] అయితే పిఠాపురంలో సోమనాథరావుగారు హరికథలు చెప్పేవారనే సమాచారం కూడా తెలుస్తుంది. సోమనాథరావుగారి కుమార్తె శ్రీమతి తెలికిచర్ల వసుంధరాదేవిగారు రాసిన ఒక లేఖవల్ల ఈవైనాలు తెలుస్తున్నాయని డాక్టరు సి. కమలా అనార్కలిగారు ఇలా రాశారు.[11]

''పిఠాపురము ఆస్థానములో మా నాయనగారు హరికథలు చెప్పేవారు. వారు హరికథల ద్వారా ప్రజలలో చైతన్యము కలిగించి శిశుపోషణ, మాతృసంరక్షణ, స్త్రీ విద్య మొదలగు వాటి గురించి హరికథలో మాట్లాడేవారు. సంఘములోని దురాచారములు నిర్మూలించుటకు హరికథలుపయోగించేవారు. సత్యహరిశ్చంద్ర, సావిత్రీ సత్యవంతము, రామాయణము, రామమోహనరాయచరిత్ర హరికథలుగా చెప్పేవారు. దయాకర విజయమను పేరిట తాము కల్పించిన కథను హరికథగా చెప్పేవారు. వారి కాలములో ఆంధ్ర దేశములో వారి నెరుగనివారు లేరు.''

పిఠాపురం కొలువులో చేరకముందే 1899లో అయ్యదేవర కాళేశ్వరరావుగారు బందరు నోబులు కళాశాలలో చదువుకొంటూ హావలాక్ హాస్టలులో ఉన్న రోజుల్లో ఆదిపూడి సోమనాథరావుగారు హరికథలు చెప్పారని తెలుస్తోంది. కాళేశ్వరరావుగారు ఇలా రాశారు.[12]

''నేను విద్యార్థిగా నున్నప్పుడు ఆదిపూడి సోమనాథరావుగారు బందరు వచ్చి ఆర్యసమాజమును గూర్చి యుపన్యాసముల నిచ్చుచుండిరి. ఆయన వితంతూద్వాహమును చేసికొనెను. కులభేదములను పాటించలేదు. హృద్యముగా రామమోహనరాయ్, శ్రీరామ, దయాకర విజయము, హరిశ్చంద్ర మొదలైన హరికథలను జెప్పుచుండెను. మాతో హావలాక్ హాస్టలులో నివసించి భోజనము చేయుచుండెను. మేము వారి యుపన్యాసములకు, హరికథలకు కూడా వెళ్ళెడువారము.''

---

9. ఈ కవుల గురించి సంక్షిప్త విశ్లేషణ డాక్టరు సి. కమలా అనార్కలిగారి ''పిఠాపుర సంస్థానముల కవి పండిత పోషణ'' అనే గ్రంథంలో ఉంది. పుట.370 నుండి 376 దాకా.
10. మంత్రిప్రెగడ భుజంగరావుగారు - ఆధునిక కవి జీవితములు, పుట.328
11. 'పిఠాపుర సంస్థానము కవి పండిత పోషణ' పుట.369
12. నా జీవితకథ - నవ్యాంధ్రము, పుట.49

కాళేశ్వరరావుగారి మాటలవల్ల సోమనాథరావుగారు ఆర్యసమాజం ప్రచారకులు గానే ఉండేవారని తెలుస్తుంది. వసుంధరాదేవిగారి లేఖవల్ల వారు పిఠాపురం కొలువులో చేరాక బ్రహ్మసమాజం ప్రచారం కూడా చేసేవారని ఊహించవచ్చు. ఆ మతం రాజుగారి అభిమతంకదా మరి.

వసుంధరాదేవిగారేకాక సోమనాథరావుగారికి శకుంతలాదేవి అనే ఇంకో కుమార్తె కూడా ఉంది. ఈమెను తమ పోషకులైన పిఠాపుర, మునగాల భూపతుల సహాయమున మండువ వెంకటరావుగారికి యిచ్చి పెళ్ళిచేసి కాపురానికి పిల్లను బొంబాయికి తీసుకువెళ్ళి విడిచిపెట్టారు. ఆమె అగ్నిప్రమాదం వల్ల 1912లో బొంబాయిలో మరణించింది. సోమనాథరావుగారు, వారి భార్య అపారమైన దుఃఖంలో మునిగిపోయారు. వారిని ఓదార్చడానికి వచ్చిన పురాణపండ మల్లయ్య శాస్త్రిగారు ఆప్తవాక్యాలు చెప్పారు. సోమనాథరావుగారి అమ్మాయి పైనున్న దీపం యొక్క గాజు కుప్పె పగిలి తలమీద పడి ఒళ్ళు అంటుకొని మరణించింది. కాళిదాసు రఘువంశంలో ఇందుమతీ దేవి పూలహారం పైనుండి పడి మరణించిందన్న సంగతి చెప్పారు. సోమనాథరావుగారు రఘువంశం అనువదించి తమ అమ్మాయి స్మృతి చిహ్నంగా అంకితం ఇవ్వాలనుకున్నారు. సంపూర్ణంగా తెనిగించి ప్రచురించారు. ఎడమచేతి పక్క పుటలో మూలం, కుడిచేత పక్క పుటలో అనువాదం పొందుపరిచారు. ఒక శ్లోకం, ఒక గీతపద్యం చొప్పున పందొమ్మిది ఆశ్వాసాలలో రచన పూర్తిచేశారు. 1913లో ప్రకటితమైన ఈ ఆంధ్ర రఘువంశానికి కొమర్రాజు లక్ష్మణరావుగారు పీఠిక రాశారు.

రఘువంశాన్ని ఇంతకు ముందు అవుడూరి కిచ్చయ్య అనే కవి అనువదించాడు. ఆ గ్రంథాన్నీ, సోమనాథరావుగారి తెనిగింపునీ తులనాత్మకంగా సమీక్షించి లక్ష్మణరావుగారు కొన్ని ఉదాహరణలు చూపారు. మచ్చుకు ఒకటి పరికిద్దాం -

మూలము. సర్గ-1, శ్లో-3

''మందః కవియశః ప్రార్థీగమిష్యామ్యుపహాస్యతాం
ప్రాంశులభ్యే ఫలేలోభా దుద్బాహురిన వామనః

కిచ్చయ్య

''ఉన్నత మర్త్యలభ్యపద మొందెదన న్మతినూర్ధ్వబాహుఁడై
యున్న సగర్వఖర్వమను జోత్తముకైవడి మందబుద్ధిగై
కొన్ననరుండు సాధుకవి కుంజరకీర్తి వహింపనెంచినన్
సన్నుతి చేయఁబోవుదురొ సత్కవులైన సమస్తభూజనుల్''

సోమనాథరావుగారు

''మందుఁడను నేను గవియశ మందఁగోరి
పరమపరిహాసమున కిలఁబాత్రుఁడగుదుఁ
బొడుగువానికి నందంగఁబోలుఫలముఁ
బడయఁగేలెత్తు నప్పొట్టివాని కరణి''

కొమర్రాజు లక్ష్మణరావుగారు ఈ అనువాదం గురించి చెప్తూ ''మూలమందులేని పదముగాని భావముగాని వీరి భాషాంతరమున నుండదు'' అని యదార్థాన్ని చెప్పారు.

సోమనాథరావుగారి 'ఆంధ్ర రఘువంశం' సమకాలికులను బాగా ప్రభావితులను చేసింది. ముఖ్యంగా చిలకమర్తి వారిని రచనకు ఉత్తేజితులను చేసింది. వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి రాసిన ఒక ఉత్తరంలో గిడుగు రామమూర్తిగారు ఇలా రాశారు.[13]

''ఇప్పుడు ఇచ్చిన పుస్తకములలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచించిన 'రఘుకులచరిత్రము' ఒకటి. దీని ముఖపత్ర మందు ఇంగ్లీషున "Novel" (నావెల్) అని దీనికి పేరుపెట్టి ప్రకటించినారు; మోసము. కాళిదాసకృత రఘువంశమునకు శ్రీఆదిపూడి సోమనాథరావుగారు (తెలుగు పద్యాలుగా) చేసిన అనువాదమును అనువదించి వీరు వచనముగా రచించినారు. గ్రంథ చౌర్యము!''

సోమనాథరావుగారి ఇతర రచనలు ఎవరిని ఎలా ప్రభావితులను చేశాయో చెప్పలేము. వారి రచనల గురించి వివరాలు ఇలా తెలుస్తున్నాయి.[14]

''వీరు చేసిన పుస్తకములు, వచన గ్రంథములు : 1. జపాను చరిత్ర, 2. దయానందుల చరిత్ర, పద్యకావ్యములు : 1. కృష్ణదేవరాయచరిత్ర, 2. విజయేంద్ర విజయము, 3. ఆంధ్ర రఘువంశము, 4. సర్వమాన్య శతకము, 5. లోకపావన శతకము, 6. గీతాంజలి, 7. రామమోహన నాటకము.

నాకు ఈ గ్రంథాలలో ఒక్క ఆంధ్ర రఘువంశము తప్ప ఇంకేమీ లభించలేదు.

మైలవరం నరసింహశాస్త్రి (1901 ప్రాంతాలు)

ఆదిపూడి సోమనాథరావుగారి ఇతర గ్రంథాలు లభ్యం కానందుకు ఎంత విచారించామో అంతకు కొన్నింతలు విచారించదగ్గ విషయం - మైలవరం నరసింహశాస్త్రిగారి జీవిత వివరాలేమీ ప్రస్తుతం లభించకపోవడం. ఈయన - కొమర్రాజు లక్ష్మణరావు, మునగాల రాజా, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావుగార్లతో పాటు 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' స్థాపకులలో ఒకరు. వీరు పద్యరచన చేసేవారని ఊహించవచ్చు. రావిచెట్టు రంగారావుగారు అకాలమరణం చెందినప్పుడు సంతాపకవితను రాశారు అని ఆదిరాజు వీరభద్రరాజుగారు రచించిన 'జీవితచరితావళి' గ్రంథంలో అనుబంధంగా ఇతరుల రచనలతోపాటు అచ్చుపడిందన్న సమాచారం మాత్రమే తెలుస్తుంది.[15] భావి పరిశోధన వల్ల వీరి గురించి ఎక్కువ వివరాలు తెలియవచ్చునని ఆశించుదాం.

---

13. మరోసారి గిడుగు రామమూర్తి - పుట.46
14. మంత్రిప్రెగడ భుజంగరావు - ఆధునికకవి జీవితములు - పుట.328
15. బిరుదురాజు రామరాజు - తెలుగు వైతాళికులు - సంపుటి-1, పుట.94

అయ్యదేవర కాళేశ్వరరావు (1882=1962)

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి సంస్థాపకులలో ఒకరైన అయ్యదేవర కాళేశ్వరరావుగారు జగమెరిగిన రాజకీయ నాయకుడు. 1905లో లాయరు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. జమీందారీలు చట్టం గురించి పరిపూర్ణమైన పరిచయం ఉండడం వల్ల ఆయన అనేకమంది జమీందారుల లాయరుగా పనిచేశారు. వీరి తండ్రిగారు మునగాల ఎస్టేటు మేనేజరు కావడం వల్ల మునగాల రాజాతోనూ తద్వారా కొమర్రాజు లక్ష్మణరావుగారితోనూ గాఢపరిచయం ఏర్పడింది. సృజనాత్మక రచనలు చేయకపోయినా కాళేశ్వరరావుగారు చరిత్ర గ్రంథాలు చాలా రాశారు. వాటిలో ఫ్రెంచి విప్లవచరిత్ర, అమెరికా సంయుక్త రాజ్యాల చరిత్ర, తురుష్క ప్రజాస్వామ్యం, చీనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్టు చరిత్ర అనేవి ఉన్నాయి.

లక్ష్మణరావుగారు సజీవులుగా ఉన్నప్పుడు వారికి చేదోడు వాదోడుగా కాళేశ్వరరావుగారు ఉండేవారు. గ్రంథమండలి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. లక్ష్మణరావుగారు పోయాక మండలిని బెజవాడకు మార్చి ఒక పదేళ్ళపాటు ప్రచురణలు కొనసాగించారు. ఈయన రచించిన 'నా జీవితకథ - నవ్యాంధ్రము' అనే ఆత్మకథలో చాలా విషయాలు విపులంగా కథనం చేశారు. చరిత్రకారులకు ఉపయోగపడే గ్రంథంగా ఇది నిలుస్తుంది. కాళేశ్వరరావుగారి రాజకీయ జీవితం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ వేరే విషయం.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు (1883-1960)

వందేమాతరం ఉద్యమం వల్ల ప్రభావితులై జాతీయ విమోచనం కోసం పాటుపడి జీవితమంతా రాజకీయ, సాంఘిక విద్యారంగాలకే అంకితం చేసిన ప్రముఖులలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు స్మరణీయులు. ఈయన కర్నూలులో జన్మించారు. గుత్తిలోని లండన్ మిషన్ స్కూలులోను, మద్రాసు క్రిష్టియన్ కాలేజిలోనూ చదువుకొన్నారు. కళాశాలలో తెలుగు, కన్నడం, భాషాశాస్త్రం అభిమాన విషయాలుగా అభ్యసించి ఎం.ఏ. పట్టం పొందారు. తెలుగు సాహిత్యంలో మంచి అభిరుచి ఉండడం వల్ల ఆ విషయంపై విద్యార్థి దశలోనే ఇంగ్లీషులోనే గ్రంథరచన చేశారు. శ్రీకృష్ణదేవరాయల వారే ఆముక్తమాల్యదను విరచించారన్న సత్యాన్ని ఆనాడే 1906లో నిరూపిస్తూ ''ది నెగ్‌లెక్టెడ్ ఎంపరర్ పొయెట్'' అనే పుస్తకాన్ని రాసి తమ చిన్ననాటి గురువులు గని శేషశాస్త్రుల వారికి అంకితమిచ్చారు.

మద్రాసులో చదువుకొంటున్నప్పుడే కొమర్రాజు లక్ష్మణరావుగారితో పరిచయం ఏర్పడింది. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపనలో లక్ష్మణరావుగారికి తోడుగా ఉండడమేకాక ఆ ప్రచురణ సంస్థ తరఫున మొదటి కుసుమంగా అబ్రహాం లింకన్ చరిత్రను తెలుగులో రచించడానికి హరిసర్వోత్తమరావుగారే ఎన్నిక అయ్యారు. ఎం.ఏ. పూర్తి చేశాక అధ్యాపక వృత్తిలో చేరాలని ఆయన రాజమండ్రి ట్రెయినింగ్ కాలేజిలో ప్రవేశించారు.

అప్పుడే ఆయన వందేమాతరం ఉద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. కాలేజి ప్రిన్స్‌పాల్ ఆగ్రహానికి గురై కళాశాల నుండేకాక ఉత్తరోత్తరా ప్రభుత్వోద్యోగాల అవకాశాలకు కూడా బహిష్కృతులయ్యారు. చదువుమానేసి పత్రికా రంగంలో ప్రవేశించారు. స్వరాజ్య పత్రికకు సంపాదకులయ్యారు. (ఎడిటర్ అనే మాటను అంతదాకా పత్రికాధిపతి అని వ్యవహరించే వారుగాని సంపాదకుడనే పేరును కొమర్రాజువారు ప్రచారంలోనికి తెచ్చారు. ఇది హరిసర్వోత్తమరావుగారే చేశారని రాళ్ళపల్లివారు చెప్పేవారట.)

1908లో స్వరాజ్యపత్రికలో హరిసర్వోత్తమరావుగారు వ్రాసిన ఒక సంపాదకీయాన్ని బ్రిటీషు ప్రభుత్వం రాజద్రోహనేరంగా భావించి ఆయనను కోర్టుకు ఈడ్చి మూడేళ్ళు కఠిన శిక్ష విధించింది. తన రచనకు జైలుశిక్షను అనుభవించిన తెలుగు పాత్రికేయులలో హరిసర్వోత్తమరావుగారే ప్రథములు. కోర్టులవెంట తిరుగుతూ, తర్వాత జైల్లో ఉండడంవల్ల హరిసర్వోత్తమరావుగారు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలికి దూరమయ్యారు. 1912లో మండలిని రిజిష్టరు చేయించినప్పుడు ఆయన సభ్యులుకారుగాని లక్ష్మణరావుగారి ఆంతరంగికులలో ఒకరుగానే ఉండేవారు.

రాజకీయాలవల్లా, జైలు జీవితం వల్లా హరిసర్వోత్తమరావుగారు సాహిత్యానికి, సృజనాత్మక రచనలకు కూడా దూరమయ్యారు. అయితే ఆయనకు పద్య రచనలో అనుభవం ఉంది. వారి కవితలలో ఒకదానిని మచ్చుకు సాహితీపరులు ఉదాహరిస్తూ ఉంటారు.[16] దేవుని గురించి ఆయన చెప్పిన పద్యాన్ని చూడండి.

పువ్వులగొనితెచ్చి పూజింపనేలకో
    విరులగుంపున నిన్ను నరయువాడు
పుణ్యవాహినులలో బోయి క్రుంకగనేల
    హృదయగీతముల నిన్ను వెదకువాడు
వర్ణాశ్రమములంచు పరితపింపగనేల
    బుధులందు నినుజూచి పొంగువాడు
కల్ల విగ్రహముల కరుణ వేడుటయేల
    ఘనకార్యముల నిన్ను గనెడువాడు
సృష్టి యెల్లను నీవయై చెలగుచుంట
గాంచి యుప్పొంగి కార్యంబు కడక
దీర్చి తనదు మనమున నినుగొల్చి
కొనెడుగాని మాయలో బడి సత్యంబు మరచునొక్కొ

కేవలం పద్య రచనలేకాక హరిసర్వోత్తమరావుగారు నాటక రచనలు కూడా చేసేవారు. ఎప్పుడు రచించారో తెలియదుగాని 'ప్రచ్ఛన్న పాండవం' అన్న పేరుతో ద్రౌపది గురించి ఒక అయిదంకాల రూపకాన్ని కూడా రాశారు. 1914 నుండి 1916దాకా ఆయన

16. 'జానుమద్ది హనుమచ్ఛాస్త్రి- మాసీమకవులు - పుట.43

ఆంధ్ర పత్రిక సంపాదకులుగా పనిచేశారు. ఈ దశలోనే వారు కొమర్రాజు లక్ష్మణరావుగారి విజ్ఞాన సర్వస్వంలో ప్రచురణకు 'అచ్చు' అనే అంశంపై ముద్రణ కళ చరిత్రను, విధానాన్ని విపులంగా విశదపరిచే రచన చేశారు. చాలా పత్రికలలో పనిచేశాక 1922లో స్వతంత్రంగా ఒక ముద్రణాలయాన్ని పెట్టుకొని 'మాతృసేవ' అనే పత్రికను రెండేళ్ళపాటు నడిపారు.

1923 సంవత్సరం నుంచి హరిసర్వోత్తమరావుగారు నంద్యాలలో నివసించసాగారు. ఆ నియోజకవర్గం నుండి చాలాసార్లు ఎన్నిక అయ్యారు. అయినా వారి సేవా కార్యక్రమాలు ఆంధ్రదేశమంతటా విస్తరించాయి. గ్రంథలయోద్యమానికి, వయోజన విద్యకూ వారు అంకితమయ్యారు. 1928 దాకా దత్తమండలం అనే పేరుతో చెలామణి అయ్యే కడప, కర్నూలు, అనంతపురం, బళ్ళారి జిల్లాలను ఉమ్మడిగా రాయలసీమ అని పిలవాలనే ప్రతిపాదనను హరిసర్వోత్తమరావుగారే ప్రతిపాదించారు. 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్రమహాసభలో ఈ నామకరణాన్ని ఆమోదింపచేశారు.

గ్రంథాలయోద్యమానికి ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతా సూచకంగా బెజవాడలో వారి సహచరులు నిర్మించిన గ్రంథాలయోద్యమ సదనానికి 'శ్రీసర్వోత్తమ భవనము' అనే పేరును పెట్టారు. ఆ ఉద్యమం తరపున ప్రచురితమయ్యే 'గ్రంథాలయ సర్వస్వం' అనే పత్రికలో హరిసర్వోత్తమరావుగారు పద్య రచనలు కూడా చేసేవారు. 1937 నాటి ఈశ్వర సంవత్సరంలో బహుశా ఉగాది కవితగా ఈక్రింది దేశి రచనను ఆయన చేశారు.[17]

''పండు నీలిమ ఆకసంబది పెండ్లి పందిరి యౌచువెలయగ
అరుణ తరుణిమ నమరు చివురులు నలరు తోరణ పంక్తి పన్నగ
వెండి వెలుగులు తారసంహతి దండి దీపావళులుకాగా
మావిపండులు మధువు నమరిచి మన్ననంబును జూపగా
క్రొత్త బెల్లము క్రొత్త బియ్యము కూర్మిసేనలు గూర్చగా
పూతవేములు సౌరభంబులు పొదవి జల్లులు జల్లగా
కుహూకుహూ యనికూడి పాట కొమ్మ కోయిల దండు పిలువగ
కమ్మతెమ్మెర నీకుతోడై నెమ్మినీతో క్రుమ్మరన్
రమ్ము ఈశ్వర! రమ్ము రమ్మిక చిమ్ము శుభముల భూస్థలిన్''

(గ్రంథాలయ సర్వస్వము 10వ సంపుటము నుండి)

ఇటువంటి రచనలు వెదికితే పాత పత్రికలలో దొరకవచ్చు. అయితే హరిసర్వోత్తమరావుగారు కవిగా రచయితగా కన్నా పత్రికా సంపాదకునిగా, రాజకీయవేత్తగా చరిత్రకెక్కారు. కొందరు ప్రముఖులను కొన్ని రంగాలకే సంబంధించిన వారిగా జనం జ్ఞాపకం పెట్టుకొంటారు.

17. జానమద్ది హనుమచ్ఛాస్త్రి - మాసీమకవులు-పుట.38

ఆచంట లక్ష్మీపతి (1880-1962)

ఇవాళ ఆయన పేరు చెప్తే కొంతమంది ఆయనను ఆయుర్వేద వైద్యునిగానే జ్ఞాపకం తెచ్చుకొంటారు. (ఉదాహరణకు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన 'తెలుగు సంస్కృతి' రెండవ భాగం ఆయనను ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యునిగానే పరిచయం చేస్తుంది') అయితే వాస్తవానికి ఆయన పాశ్చాత్య, ఆయుర్వేద వైద్యాలను సమన్వయం చేసిన వ్యక్తి, మద్రాసు మెడికల్ కాలేజిలో యం.బి.సి.యం. పట్టాను 1909లోనే పొందారు.

మద్రాసులో చదువుకొనే రోజులలోనే ఆయనకు కొమర్రాజు లక్ష్మణరావుగారితో పరిచయం ఏర్పడింది. చింతాద్రిపేటలోని సుంకువారి అగ్రహారంలోని ఒకటవ నెంబరు ఇంట్లో కొమర్రాజువారు ఉండేవారు. ఆరోనెంబరు ఇంట్లో లక్ష్మీపతిగారు ఉండేవారు. ఇద్దరికీ కందుకూరి వీరేశలింగంగారు గురువులే. లక్ష్మీపతిగారు రాజమండ్రిలో చదువుకొనేటప్పుడు వీరేశలింగంగారికి ప్రత్యక్షశిష్యులు. వారి ప్రభావంలో సంఘ సంస్కరణ, సాహిత్యాభిరుచి పెంపొందించుకొన్నారు. లక్ష్మణరావుగారి సహచర్యంలో విజ్ఞానచంద్రిక గ్రంథమండలి కోసం ప్రకృతి శాస్త్ర గ్రంథ రచనలకు పూనుకొన్నారు.

వాస్తవానికి ఆంధ్రభాషలో ఇటువంటి గ్రంథరచనలు కందుకూరి వీరేశలింగంగారే ఆరంభించారు. ''జనులలో గల మూఢ విశ్వాసములు పోవుటకు బ్రకృత శాస్త్రజ్ఞాన మావశ్యకమని తలచి'' 1878లోనే 'పదార్థ వివేచన శాస్త్రము'ను ప్రశ్నోత్తరరూపంలో రచించి ప్రకటించారు. 1888లో 'శరీరశాస్త్రము'ను రచించి ప్రచురించారు. పుస్తకాలు చదివి అందులోని విషయాలను అనువాదం చేయడంకన్నా ప్రత్యక్షజ్ఞానం కలవారు రాస్తేనే ఇటువంటి పుస్తకాలు ప్రామాణికంగా ఉంటాయి. అందుకే వీరేశలింగంగారు 'ప్రాక్టికల్స్' ప్రారంభించారు. ఆ సంగతి ఇలా చెప్పారు.[18]

''కొంత ధన వ్యయము చేసి సంపూర్ణమయిన మనుష్యకంకాళము నొకదానిని సంపాదించితిని. మేఁకల యొక్క హృదయశ్వాసాశయాదులకంటె మనుషుల యొక్క హృదయ శ్వాసకోశాదులను బరీక్షించి చూచుట యెక్కువ యుపయోగకరమని భావించి శవపరీక్ష నిమిత్తమయి క్రొత్త శవము వచ్చినప్పుడు నాకు వర్తమానము చేసి నాయెదుట కోసిచూపించునట్లు వైద్యశాలాధికారులతో నేర్పాటు చేసితిని. వారొకసారి నన్ను పిలిపించి శవమును నాయెదుట కోయనారంభింపగా నేను చూడలేక కన్నులు దిరిగి లోపల నుండి వికారము వచ్చి మూర్ఛపోయితిని. వారప్పుడు నామొగము మీఁద చల్లనీళ్ళు కొట్టి నన్నీవలకుఁగొనివచ్చి తెలివి వచ్చిన తరువాత నింటికి బంపివేసిరి. నేనటు తరువాత మనుష్య హృదయాది శోధనమున కయి మరలఁబ్రయత్నింపలేదు.''

అయితే యీ కోవలోని విజ్ఞాన గ్రంథ రచన మానలేదు. 'జ్యోతిశ్శాస్త్ర సంగ్రహం' అనే పేర ఖగోళ విషయాలూ, భౌతిక భూగోళశాస్త్రం వీరేశలింగంగారు రచించారు. ఈ వాఙ్మయాన్ని వృద్ధి చేయవలసిన వారెవరో ఆయనకు బాగా తెలుసు. అందుకే ''ఇకనైన సర్వకళాశాలల యందు పట్ట పరీక్షల నిచ్చి మెప్పొందినవారు' దేశాభివృద్ధికి తోడుపడి

18. కందుకూరి వీరేశలింగం - స్వీయచరిత్ర - రెండవభాగం, పుట.215

సద్గ్రంథాభరణములు 'దేశభాషావధూటికి' చేకూర్చాలని కోరారు. ఆచంట లక్ష్మీపతిగారు తమ గురువుగారి మాటను, లక్ష్మణరావుగారి కోరికను పాటించి మెడిసిన్ విద్యార్థిగా ఉన్నప్పుడే 'జీవశాస్త్రం' రచించారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి తరపున వారి పుస్తకాలు 'జీవశాస్త్రం', 'విషూచి', 'చలిజ్వరం' మొదలైనవి పలుముద్రణలు పొందాయి. లక్ష్మణరావుగారి విజ్ఞాన సర్వస్వంలో కొన్ని ఆరోపాలమీద లక్ష్మీపతిగారు వ్యాసాలు రాశారు.

లక్ష్మణరావుగారి మరణం తర్వాత ఆచంట లక్ష్మీపతిగారు 1924లో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి అధ్యక్షులయ్యారు. అప్పటికే ఆయన పండిత దివి గోపాలాచార్యులగారి ప్రభావంతో ఆయుర్వేద వైద్యాన్ని అధ్యయనం చేసి పాశ్చాత్యపద్ధతికి సమన్వయం చేశారు. దాని ప్రాచుర్యానికి కృషి చేశారు. తెలుగులో 33 శాస్త్ర, వైద్యశాస్త్ర గ్రంథాలు రచించారు. ఇటువంటి వాఙ్మయం సమకాలికులకు ఎక్కువగా ఉపకరించి భావితరాలకు రికార్డులుగా మిగులుతాయి.

ఆదిరాజు వీరభద్రరావు (1890-1973)

కొమర్రాజు లక్ష్మణరావుగారి సహచర్యం వల్ల బహు గ్రంథకర్తలుగా రాణించినవారు మరికొందరు ఉన్నారు. వారిలో ఆదిరాజు వీరభద్రరావుగారు ప్రథములు. ప్రముఖులు. వీరభద్రరావుగారు ఖమ్మం మెట్టు జిల్లా, మధిర తాలూకా, దెందులూరు గ్రామంలో జన్మించారు. చిన్నప్పుడే తండ్రి చనిపోయారు. ప్రాథమిక విద్య అభ్యసించాక హైదరాబాదులో తమ దూరపు బంధువులయిన రావిచెట్టు రంగారావుగారి ఆశ్రయంలో మెట్రిక్ వరకూ చదువుకొన్నారు.

పడుచుదనంలోనే వీరభద్రరావుగారు ఉద్యోగాలు చేపట్టారు. రావిచెట్టు రంగారావుగారు స్థాపించిన 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' లైబ్రేరియన్‌గానూ తర్వాత విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిలో లేఖకునిగాను వీరభద్రరావుగారు పనిచేశారు. రావిచెట్టు రంగారావుగారు మద్రాసులో కాపురం పెట్టినప్పుడు వారితోపాటు వీరభద్రరావుగారు వెళ్ళి అక్కడ కార్యాలయంలో లక్ష్మణరావుగారి వద్ద శిక్షణ పొందారు. 1908 నుండి 1914 దాకా మద్రాసులోనే వీరభద్రరావుగారు అన్నివిధాలా లక్ష్మణరావుగారికి రాత్రింపగళ్లు శ్రమ లెక్కచేయక పనిచేశారు. తర్వాత కొందరితో సరిపడక హైదరాబాదుకు వెళ్ళిపోయారు.

1914లో సికిందరాబాదులోని మహబూబు కాలేజి ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా చేరారు. తర్వాత ఎన్నో విద్యా సంస్థలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ప్రజాహిత సంస్థలతో సంబంధం పెట్టుకొన్నారు. ఆంధ్ర జనసంఘం (తర్వాత ఆంధ్ర మహాసభగా మారింది) పరిశోధకమండలి, విజ్ఞానవర్ధినీ పరిషత్తు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ సమితి మొదలైన సంస్థలలో వీరభద్రరావుగారిది చాలా ప్రముఖపాత్ర. పరిశోధనాత్మకాలు, పరిశీలనాత్మకాలు, సమాచారదాయకాలు, జీవిత చరిత్రాత్మకాలు, సంపాదక

బాధ్యతాయుతాలు అయిన అనేక రచనలు చేశారు. దాదాపు నూటయాభై రేడియో ప్రసంగాలు చేశారు. వీరభద్రరావుగారి సారస్వత కృషి వివరాలన్నింటినీ బిరుదురాజు రామరాజుగారు ఒకచోట క్రోడీకరించారు.[19] వీటిలో చెప్పుకోదగ్గవి చాలా ఉన్నాయి.

తెలుగువారికి విజ్ఞాన సర్వస్వాన్ని అందచేయాలన్నది కొమర్రాజు లక్ష్మణరావుగారి సుందర స్వప్నాలలో ముఖ్యమైనది. దీనిని నిజంచేసే ప్రయత్నం ప్రారంభించి ఆయన కన్నుమూశారు. అయితే లక్ష్మణరావుగారి సహచరులు కొందరు ఈ స్వప్నాన్ని యథాతథంగా కాకపోయినా కొంతవరకైనా ఫలింపచేయగలిగారు. ఆదిరాజు వీరభద్ర రావుగారు ఈసాధనలో ప్రముఖులు. లక్ష్మణరావుగారు సవిస్తరంగా విజ్ఞాన సర్వస్వాన్ని ఇవ్వదలచారుగాని వీరభద్రరావుగారు తమ మిత్రులతో (ముఖ్యంగా ఖండవల్లి లక్ష్మీరంజనంగారితో) కలసి కనీసం సంగ్రహంగానైనా ఈ కార్యాన్ని నెరవేర్చాలని తలపోశారు. కృతకృత్యులయ్యారు. ఫలితంగా ఎనిమిది సంపుటాలలో 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం' తయారైంది. వివిధ సంపుటాలు 'ఆంధ్రదేశము-వివిధ శీర్షికలు' అనే భాగానికి వీరభద్రరావుగారు సంపాదకులై స్వయంగా 45 వ్యాసాలను రచించారు.

ఆదిలో లక్ష్మణరావుగారి సహచరులైనందుకు ఆదిరాజు వీరభద్రరావుగారు ఆ వారసత్వాన్ని సంపన్నం చేసి నలుగురికీ పంచియిచ్చారు.

చిలుకూరి వీరభద్రరావు (1873–1939)

కొమర్రాజు లక్ష్మణరావుగారి సహచర్యం పడుచుదనంలో ఏర్పడినా, నడివయస్సులో ప్రాప్తించినా ఆ విశిష్టతకు నోచుకొన్నవారు దానిని కలకాలం జ్ఞాపకం పెట్టుకొంటారు. అభిప్రాయభేదాలు వచ్చి లక్ష్మణరావుగారికి దూరమైనా చేరువలో ఉన్నప్పుడు కలిగిన అనుభవాలనూ, జ్ఞాపకాలనూ భద్రంగా దాచుకొని ఎన్నేళ్ళ తర్వాతనైనా లక్ష్మణరావుగారికి తమ కృతజ్ఞతలను ఏదోవిధంగా చెప్పుకొంటారు. అలాగ చేసిన వారిలో చిలుకూరి వీరభద్రరావుగారు ప్రసిద్ధులు. చిలుకూరివారు తమ 37వ యేట 1909లో మద్రాసులో కొమర్రాజు లక్ష్మణరావుగారిని కలుసుకొన్నారు. అప్పటికే ఇద్దరూ లబ్ధప్రతిష్ఠులు. చిలుకూరి వారి రచనలను కొమర్రాజువారు 1910లోనూ 1912లోనూ విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి తరఫున ప్రచురించారు. తర్వాత ఇద్దరికీ అభిప్రాయభేదాలు వచ్చి విడిపోయారు. 19123లో కొమర్రాజువారు చనిపోయారు. తర్వాత పద్నాలుగేళ్ళకు 1936లో చిలుకూరివారు ఒక చారిత్రకగ్రంథం రాసి కొమర్రాజు లక్ష్మణరావుగారికి కృతజ్ఞతాసూచకంగా అంకితమిచ్చారు. ఇది వారి వ్యక్తిత్వంలోని విశిష్టతనూ, చెదరని స్నేహ ధర్మాన్నీ సూచిస్తుంది.

లక్ష్మణరావుగారిని కలుసుకొనే నాటికే చిలుకూరి వీరభద్రరావుగారు పత్రికా సంపాదకునిగా, ముద్రణాలయ నిర్వాహకునిగా రచయితగా, చరిత్రకారునిగా, సంఘ సంస్కారంలోనూ, జాతీయోద్యమంలోనూ చురుకుగా పాల్గొనే సమరశీల స్వభావ

19. తెలుగు వైతాళికులు - 1వ సంపుటం - పుట.90 నుండి 118 దాకా

ప్రత్యేక వ్యక్తిత్వం కలవారు. 1886లో విద్యాభ్యాసం ముగించుకొని సంస్కృతాంధ్ర భాషలలో ప్రావీణ్యం సంపాదించక వీరేశలింగంగారి ప్రభావంలో పడ్డారు. వారి రచనలన్నింటినీ చదివి జీర్ణించుకొని 1892లో 'వీరేశలింగ కవి సంగ్రహ జీవితము' అనే రచనలో తన అభిమాన వీరుని రచనలు విశ్లేషణ చేస్తూ 'ఆంధ్రప్రకాశిక'లో ప్రచురించారు. 1895లో ఏలూరులో ఉంటూ 'దేశోపకారి' పత్రికకు సహాయ సంపాదకులయ్యారు. 1896లో 'విబుధరంజని' అనే పత్రికకు సంపాదకులయ్యారు. 1897లో స్వంత ముద్రణాలయాన్ని కొని దానికి 'విద్యాసాగరమ'నే పేరు పెట్టి దేశోపకారిని స్వయంగా నడిపారు.

1905 నాటికి పరిస్థితులు మారాయి. మకాం మార్చవలసి వచ్చింది. రాజమండ్రి చేరి వీరేశలింగం గారి 'చింతామణి' ప్రెస్సుకు మేనేజరుగా పనిచేశారు. 'సత్యవాదిని' అనే పత్రికను నడిపారు. వీరేశలింగంగారికి సంఘసంస్కారం తప్ప ఇంకో ఉద్యమం అక్కరలేదు. 1905లో జాతీయోద్యమం ముమ్మరంగా ఉంది. చిలుకూరి వీరభద్రరావుగారు దానివల్ల ప్రభావితులయ్యారు. వీరేశలింగంగారితో అభిప్రాయభేదాలు వచ్చాయి. ఉద్యోగం మానివేసినా రాజమండ్రిలోనే జీవించసాగాయి. వీరేశలింగంగారు చింతామణి ప్రెస్సును సత్యవోలు గున్నేశ్వరరావుగారికి అమ్మేశారు. ఆయన చిలుకూరి వారిని ఆహ్వానించి కార్యనిర్వాహకుల్ని చేశారు. 'ఆంధ్రకేసరి' అనే పత్రికకు సంపాదకత్వం వహించి రెట్టించిన ఉత్సాహంతో చిలుకూరి వీరభద్రరావుగారు రాజకీయోద్యమాభివృద్ధికి పాటుపడ్డారు.

ఉద్యోగాలు చేస్తున్నా, పత్రికలు నడుపుతున్నా దేశచరిత్రపట్ల చిలుకూరి వారి ఆసక్తి ఇనుమడింపసాగింది. స్యూయల్ రచించిన 'ఫర్గాటెన్ ఎంపైర్' అనే పుస్తకాన్ని చదివి ప్రభావితులై 'జీర్ణకర్ణాట రాజ్య చరిత్ర' అనే గ్రంథాన్ని ఆయన 1904లో మొట్టమొదట రచించారు. తర్వాత ఆంధ్రుల సమగ్ర చరిత్రను రచించాలనే అభిలాష కలిగింది. అదే తమ జీవితాదర్శంగా భావించి ఆయన రాజమండ్రికి వీడ్కోలు చెప్పి 1909లో చెన్నపట్నం చేరుకొన్నారు. అక్కడే తమ చరిత్ర రచనకు ఆకారాలు సేకరించుకొన్నారు.

అప్పటికే కొమర్రాజు లక్ష్మణరావుగారు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. పుస్తక ప్రచురణలు సాగిస్తున్నారు. చిలుకూరి వీరభద్రరావుగారి పుస్తకాలను తామే ప్రచురిస్తామని ఆయన చెప్పారు. 1910లో 'ఆంధ్రుల చరిత్ర' మొదటి భాగాన్ని రచించి వీరభద్రరావుగారు ఇచ్చారు. అది వెంటనే అచ్చు అయింది. 1912లో రెండవ భాగం కూడా విజ్ఞాన చంద్రికవారే ప్రచురించారు. ఇందులో కొన్ని చేదు సత్యాలను వీరభద్రరావుగారు చెప్పడంచేత గ్రంథమండలి పోషకులలోని జమీందారులు ఆగ్రహించి తమ సహాయసంపత్తులను గ్రంథమండలికి దూరం చేశారు. చిలుకూరి వారికి, ప్రచురణ సంస్థకూ అభిప్రాయభేదాలు వచ్చాయి. ఆంధ్రుల చరిత్ర మూడవ భాగాన్ని చిలుకూరివారు ఇంకొక సంస్థకు ఇచ్చారు. దాని అవతారికలో ఇలా రాశారు.[20]

''ఆంధ్రుల చరిత్ర యొక్క మొదటి రెండు భాగములు విజ్ఞాన చంద్రికా మండలి వారి వలనఁ బ్రకటింపబడినవి. రెండవ భాగము బ్రకటింపఁబడినప్పుడు మూఁడవ భాగము

20. చిలుకూరి వీరభద్రరావు - ఆంధ్రుల చరిత్ర - మూడవ భాగం, అవతారిక, పుటలు 8,9

నాలుగునెలలలోఁ బ్రచురింతునని చేసిన వాగ్దత్తము నెఱవేర్చుకొనుటకుఁ దగిన కారణములు గలవు. కాని యాచరణము వాగ్దత్తమంత సులభసాధ్యమైనది కాదని యెల్లవారు నెఱుంగునదియె. తుదకు విజ్ఞాన చంద్రికా మండలి కాశాభంగమును గలిగింపవలసి వచ్చినది. విజ్ఞాన చంద్రికా మండలి వారీ మూఁడవ భాగమును గూడఁ బ్రచురించెదమని ప్రకటించి యున్నను నేనీగ్రంథమును వారికీయక వేఱుగా బ్రకటింప జేసినందులకు నేదియో గొప్ప కారణముండునని పలువురూహింపనవకాశము గలదు. కాని నాకును విజ్ఞాన చంద్రికా మండలికిని గల వ్యవహారమునంతయు లోకమునకుఁ దెలుపుకొన్నందువలనఁ బ్రయోజనము లేశమాత్రమును లేదు. విజ్ఞాన చంద్రికా మండలికి నేనెంతయుఁగృతజ్ఞుఁడనై యున్నను, ఆత్మీయగౌరవమును గాపాడుకొనుటకును, మనస్సంక్షోభము నుండి తప్పించు కొనుటకును, స్వలాభము కొఱకునై నేనీ మూడవ భాగమును విజ్ఞాన చంద్రికా మండలి కిచ్చి యుండలేదని మాత్రము విశదపఱచుకొనుచున్నాఁడను.''

ఇందులకు విజ్ఞాన చంద్రికా మండలియూ, మహాజనులు నన్ను క్షమింతురుగాక! గ్రంథము వెల్వడుటయే ప్రధానముగాని ప్రకాశకులెవ్వరైననేమి?''

ఆంధ్రుల చరిత్ర రెండో భాగం పూర్తి చేశాక చిలుకూరి వారు కొన్ని సాహిత్య రాజకీయాలలో చిక్కుకొన్నారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఏర్పడి తన లక్ష్యాలను ప్రకటించింది.

''ఆంధ్రదేశ చరిత్రాంశ పరిశీలనకుఁ బ్రోత్సాహమొసంగుటయు, లభ్యములైన వానిలో మిక్కిలి విశ్వసనీయులైన యాధారముల సాహాయ్యమును సవిస్తరముగాఁ దెలుఁగు దేశము యొక్కయుఁ బ్రజల యొక్కయు, చరిత్ర యొకటి రచించి ప్రచురించుట పరిషత్తు యొక్క ప్రధానోద్దేశములలో నొకటిగాఁదెలపఁబడియెను. ఇదియొక శుభసూచకమని తలంచితిని గాని నా ప్రతిపక్షుల ప్రయత్నముల మూలమున నేనా పరిషత్తును సమీపించుటకే సాధ్యపడినది కాదు. తరువాత 'తెలుగు ఎకాడమీ'కి మేనేజరు కావలయునని పత్రికలలోఁ బ్రకటింపఁబడియెను. కొందఱు విద్యాధికులైన మిత్రుల ప్రోత్సాహము వలన నేనా యుద్యోగమునకు దరఖాస్తు పెట్టినప్పుడు జరిగిన చర్య వైపరీత్యముగాఁ గన్పట్టకమానదు. అదియొక్క పెద్దచరిత్ర యగును. పరిషత్కార్యదర్శ లకును తత్సభాధ్యక్షులకును చర్చ ప్రారంభమై కొంతకాలము నడిచినది. అటు పిమ్మట కార్యదర్శులైన బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారునూ; మ.రా.రా. శ్రీ హైకోర్టు వకీలు పురాణము నాగభూషణము ఎమ్.ఏ; బి.ఎల్.గారున్నూ, డాక్టరు ఆచంట లక్ష్మీపతి బి.ఏ.ఎమ్; బి.సి.యమ్.గారు మేనేజరుగా నన్ను నియమించి యంగీకారమునకై అధ్యక్షులుగా రామయ్యగారికిఁ బంపఁగా వారు 'మేనేజరు' లేకుండ సంవత్సరకాలము గడపుటకైన నొప్పుకొనిరికాని నాకుఁ బ్రవేశము గలిగింపనిష్టపడరైరి. అంతట నదియునా మేలునకేయని భావించి పరిషత్తునకొక్క నమస్కారమిడి చెన్నపురి విడిచి వచ్చితిని'' అని చిలుకూరి వారు చెప్పారు.[21]

21. ఆంధ్రులచరిత్ర - 3వ భాగము, అవతారిక పుటలు 10-11

రాజమంగ్రిలో 'ఇతిహాసతరంగిణీ గ్రంథమాలను మిత్రుల సాయంతో స్థాపించి దాని తరపున ఆంధ్రుల చరిత్ర మూడవ భాగాన్ని ప్రచురించారు.

ఆంధ్రుల చరిత్రనే కాక ఇతర రచనలను కూడా చిలుకూరి వీరభద్రరావుగారు చేశారు. భారతవీరుల చరిత్ర (1913), కర్ణసామ్రాజ్యము (1916) నాయకురాలి దర్పము (1916), తిమ్మరుసు, తిక్కన సోమయాజి, అనే గ్రంథాలను 1917-18లలో రచించారు. వీరి చరిత్ర రచనాపాటవాన్ని జాతి గుర్తించింది. 1928లో సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి అధ్యక్షత కింద నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో చిలుకూరి వీరభద్రరావుగారికి 'చరిత్ర చతురానన' అనే సముచిత బిరుదును ఇచ్చారు.

జీవితమంతా చరిత్ర పరిశోధనా రచనకు అంకితం చేసిన చిలుకూరి వారు 1936లో 'కాకతీయ ఆంధ్ర రాజయుగ చరిత్ర'ను రచించారు. దీనినే కొమర్రాజు లక్ష్మణరావుగారికి అంకితమిచ్చారు. లక్ష్మణరావుగారు కూడా తమకు అభిప్రాయభేదాలు వచ్చిన 1912లో సైతం చిలుకూరి వారి పట్ల అమితమైన గౌరవభాం గలవారే. "I think Telugu Academy is the proper place for such an enlightened and a wellknown Telugu author" అని తమ అభిప్రాయం చెప్పి ఆంధ్ర సాహిత్య పరిషత్తులో చిలుకూరి వారికి స్థానం కల్పించదలిచారు. అయితే సాహిత్య రాజకీయాలు అలా జరగనివ్వలేదు. జరిగ ఉంటే పరిషత్తు చరిత్ర ఇంకొకలాగ ఉండేది. దానిని చిలుకూరి వారి వద్ద తర్ఫీదు పొందిన చరిత్రకారులు గ్రంథస్థం చేసి ఉండేవారు.

మల్లంపల్లి సోమశేఖరశర్మ (1891-1963)

చరిత్రవేత్తలు, నిపుణులు ఓరుగంటి రామచంద్రయ్యగారు ఒక సందర్భంలో చిలుకూరి వీరభద్రరావుగారు సాధించిన మహత్కార్యాన్ని ప్రశంసిస్తూ ''ఈ మహత్కార్యమున కెంతయు తోడు సూపినవారు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు. వారు వారికి సఖులో, శిష్యులో, సహచరులో, సహాధ్యాయులో తెలియుట కష్టము - 'తేజస్వి నావధీతమస్తు' వారి విషయమున అక్షరశః నిజము'' అని చెప్పారు.[22] నిజానికి శర్మగారు వీరభద్రరావుగారికి చేదోడు వాదోడుగా రాజమంద్రిలోనూ, తర్వాత చెన్నపట్నంలోనూ వ్యవహరించారు.

సోమశేఖరశర్మగారు పుట్టింది పశ్చిమగోదావరిజిల్లా మినుమించిలిపాడు అగ్రహారంలో, చదివింది రాజమంద్రిలో మెట్రిక్‌దాకానే. వారి మేనమామ అయ్యగారి ఉమామహేశ్వరరావుగారు అంతకన్నా ఎక్కువగా చదువు చెప్పించలేకపోయారు. శర్మగారు నిరుద్యోగిగా కొన్నాళ్ళుండి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'దేశమాత' (1900లో స్థాపితం) పత్రికలో నెలకు 12 రూపాయల జీతం మీద సహాయ సంపాదకునిగా చేరారు. ఆ పత్రికలో చాలా రచనలు వివిధ ప్రక్రియలలో ప్రచురించారు. ఈ దశలోనే చిలుకూరి వీరభద్రరావుగారితో శర్మగారికి పరిచయమైంది. చిలుకూరి వారు చరిత్ర రచన

22. తెలుగు వైతాళికులు, 3వ సంపుటం - పుట.249

చేస్తున్నారు. దానికి అవసరమైన ఆకరాల సేకరణలో శర్మగారు తోడ్పడ్డారు. ఇది వారికి కళాశాలలో చదువుకొనని లోటును భర్తీ చేసింది.

చిలుకూరి వీరభద్రరావుగారు రాజమండ్రి వదలి చెన్నపట్నం చేరారు. అక్కడ వారి ఆంధ్రుల చరిత్ర మొదటి భాగాన్ని విజ్ఞాన చంద్రిక గ్రంథమండలివారు ప్రచురించదలిచారు. అందుకోసం శర్మగారు కూడా మద్రాసుకు మకాం మార్చారు. కన్నెమెరా గ్రంథాలయంలో ఆకరాలను సేకరించేవారు. చిలుకూరి వారికి సహాయకులుగా చిత్తుప్రతులకు సాపు వ్రాయడం, శాసనాలు మొదలైన వాటినుండి సమాచారం క్రోడీకరించడం మొదలైనవి చేశారు. చిలుకూరివారు స్వయంగా స్వతంత్ర ప్రతిభగల వ్యక్తులు. వారికి శర్మగారి వంటి ప్రజ్ఞావంతులు తోడ్పడం వల్ల ఆంధ్రుల చరిత్ర చాలా ప్రామాణికంగా రూపొందింది. ప్రచురితమైన రెండు భాగాలను లోకం మెచ్చుకొంది. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారి ఇతర గ్రంథాలను నిశితంగా విమర్శించిన గురజాడ అప్పారావుగారు ఆంధ్రుల చరిత్ర గురించి మాత్రం ఇలా రాశారు.

''... 'ఆంధ్రుల చరిత్ర' కొంత మెరుగైనది. స్వతంత్రమైన పరిశోధనలను చేసి దీనిని వ్రాశారు. అయితే యిది వొట్టి రాజవంశావళిని యేకరువు పెట్టి ఆసక్తిని కలిగించదు. రాజులు మత సంస్థలకు ఎంతెంత ధనమిచ్చిందీ, యే యే దానధర్మాలను చేసిందీ, యీ పుస్తకమంతా వర్ణింపబడింది. కులాలను గురించి స్పష్టంగా ఎటూ తేలని వివాదగ్రస్త విషయాలను ఈ గ్రంథం వివరిస్తుంది.''

గురజాడ వారి మెచ్చుకోలు కొంత శాతం మల్లంపల్లి సోమశేఖరశర్మగారికి కూడా పరోక్షంగా చెందుతుంది. ఆయన చిలుకూరి వారికి చేసిన సహాయ సహకారాలను ప్రత్యక్షంగా చూసిన కొమర్రాజు లక్ష్మణరావుగారు, శర్మగారిని 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' కార్యాలయానికి ఆహ్వానించి సహాయకునిగా నియమించుకొన్నారు. శర్మగారు సంతోషంగా వెళ్ళారు. చిలుకూరి వారి వద్ద కళాశాల పట్టం పొందినంత శిక్షణ పొందితే కొమర్రాజు వారి వద్ద విశ్వవిద్యాలయములో ఉన్నత సిద్ధాంత రచనా పట్టం (పి.హెచ్.డి.) యోగ్యతకన్నా విలువైన అనుభవాన్ని పొందారు. శాస్త్రీయ పద్ధతులలో పరిశోధన చేయగల ప్రావీణ్యానికి యిక్కడ మెరుగులు దిద్దుకున్నారు. 1923లో లక్ష్మణరావుగారు చనిపోయేదాకా శర్మగారు వారి వద్దనే పనిచేశారు.

కాశీనాథుని నాగేశ్వరరావుగారు శర్మగారి ప్రావీణ్యాన్ని ఎరిగినవారు కాబట్టి వెంటనే తమ భారతి పత్రికలో సంపాదకీయ బాధ్యతలను అప్పచెప్పారు. అవి భావకవిత్వపు ముమ్మరపు రోజులు. మద్రాసులో శర్మగారి నివాసగృహం ఒక అకాడమీలాగ ఉండేది. అడవి బాపిరాజు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వేలాల సుబ్బారావు, కొంపెల్ల జనార్ధనరావు, చావలి బంగారమ్మ, ప్రతివాద భయంకర రంగాచార్యులు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, ఖాసా సుబ్బారావు, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, టి.యస్. రామచంద్రన్ వంటి కవులూ, చారిత్రక పరిశోధకులూ అక్కడ సమావేశమయ్యేవారు. శర్మగారు కూడా భావకవిత్వ రచనలు చేశారు. మచ్చుకు ఒకటి చూడండి. ప్రణయశీల అనే ఈ కవిత 1924 భారతిలో ప్రకటితమైంది.

''నిండుజాబిల్లి వెలుగులో గ్రాలు మురువు
పాల మున్నీటి నురువులో గ్రాలు హరువు
పుట్టతేనియ తేటలో బొదలు తీపు
సంజ పయ్యెర కమ్మవాసనల వోపు

భాగ్యరేఖలై తొలఁకాడుఁ బ్రణయలీల
మత్తకోకిల రవళిలో మలయు పాట
కారుతుమ్మెద పాటలో దేరుతేట
ప్రేమమయ మానసము నుండి వెడలు మాట

పలుకునవి ముక్తముగ్ధ సంభాషణముల
బరమ కల్యాణ గుణలీల ప్రణయలీల
సంజ పాటూరు తరి బ్రాహ్మికుంజ మెడలి
వచ్చి గిలిగింత చనవుల వలపుగూర్చి''

అడపాదడపా కవితలను సరదాకు అల్లినా శర్మగారు వచన రచనలోనూ అందులోనూ చరిత్రకు సంబంధించిన వాటి ప్రచురణలోనూ నిమగ్నులయ్యేవారు. తొలిరోజుల్లో 'పాదుకా పట్టాభిషేకం' నాటకం, 'రోహిణీ చంద్రగుప్త', 'అరణ్యా రోదనము', 'వివేకముగల మంత్రి' అనే నవలలూ రచించి ప్రచురించినా పిమ్మట 'ఆంధ్రవీరులు', 'ప్రాచీన విద్యాపీఠాలు', 'ప్రాచీన ఆంధ్ర నౌకా జీవనం' వంటి ఉన్నతస్థాయి చారిత్రక వ్యాసాల రచనలో తమ శక్తిని కేంద్రీకరించి ప్రామాణిక చరిత్రకారులన్న పేరును సంపాదించారు.

కొమర్రాజువారి మరణంతో ఆగిపోయిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం కృషిని కాశీనాథుని నాగేశ్వరరావుగారు పునరుద్ధరించి శర్మగారిపైనే ఆ బాధ్యత పెట్టారు. కాశీనాథునివారు ''అదివరకు ప్రకటితములయిన సంపుటముల పరిమాణము మార్చి అందలి వ్యాసములను కొన్నింటినున్నవి యున్నట్లుంచి, మరికొన్నింటిని నూతనాంశములను చేర్చి విపులీకరించి, వేరొక కొన్నింటిని క్రొత్తగా తెలిసిన విషయముల దృష్టితో సంస్కరించి అనేకములైన చక్కని దేశపటములతో, సామాన్య చిత్రములతో, వర్ణచిత్రములతో ఆంధ్రదేశము గర్వింపదగిన రీతిని డబుల్‌డెమ్మీ పరిమాణమున రెండు సంపుటములు ప్రకటించిరి.'' కాశీనాథుని వారు 1938లో మరణించారు. అంతటితో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ప్రకటన కార్యం ఆగిపోయింది. మూడవ సంపుటంలో అకారాది పదశేషమేకాక 'ఆంధ్ర' పదం కూడా కొంత అచ్చయి పని చురుకుగా సాగుతూ ఉండగా ఈ విఘ్నం ఏర్పడింది.

ఆంధ్ర చరిత్రలో ఉత్తేజకరమైన ఘట్టాలను శర్మగారు రచించినా పఠనం చేసినా విన్నవారు ప్రభావితులయ్యేవారు. కవులు ఉద్రేకపూరితమైన రచనలు చేసేవారు. విశ్వనాథ సత్యనారాయణగారు 'ఆంధ్ర ప్రశస్తి'ని రచించి శర్మగారికి ఇలా అంకితమిచ్చారు.

''డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు
రాని యీ పాడుకాలాన బుట్టి
నీ చరిత్ర జ్ఞాన నిర్మలాంభఃపూర
మూషరక్షేత్ర పదోదకమయి

చాడీలకు ముఖప్రశంసల కీర్ష్యకు
స్థానమైనట్టి లోకాన నుండి
నీయచ్ఛతర కమనీయ లీలా జ్యోత్స్న
అడవిగాసిన వెన్నెలగుచు చెలగి

తంతెకాని గౌరీశంకరాచ్ఛ శృంగ
తుంగము త్వదీయము మనస్సు పొంగి తెలుగు
నాటి పూర్వ చరిత్ర కాణాచి యెల్ల
త్రవ్వి తలకెత్తలేదె యాంధ్ర జనములకును'

అయితే డిగ్రీలు లేని పాండిత్యమైనా శర్మగారి వంటి పరమ ప్రామాణికులు ఉన్నప్పుడు విశ్వవిద్యాలయాలు చూస్తూ ఊరుకోవు. వారి వైదుష్యాన్ని వాడుకొంటాయి. అందుకే 1940 నుండి 1946 దాకా ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు శర్మగారిని ఆహ్వానించి చరిత్ర శాఖలో ఆచార్యునిగా చేశారు. శర్మగారు చాలా విలువైన పరిశోధనలు చేసి కాకతీయుల తర్వాత ముసునూరి నాయకులు సాగించిన స్వాతంత్ర సమర విశేషాలను తెలియచేస్తూ 'ఎ ఫర్‌గాటెన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్ర హిస్టరీ' అనే గ్రంథాన్ని ఇంగ్లీషులో రచించి 1945లో ప్రచురించారు. 1948లో 'హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్' అనే ఇంకొక ప్రామాణిక గ్రంథాన్ని ప్రచురించారు. తెలుగువారి చరిత్రను ఇంగ్లీషులో రాస్తేనే విశ్వవిఖ్యాతి వస్తుంది.

వ్యక్తులు చేపట్టిన విజ్ఞానసర్వస్వ కార్యక్రమాలు వారి మరణంతోనే ఆగిపోతున్నాయని ఈ కార్యాన్ని ఒక సంస్థ చేపట్టాలని విజ్ఞులు భావించారు. 1947లో తెలుగు భాషా సమితి ఏర్పాటు చేశారు. ''లోగడ తలపెట్టిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ రచనా విధానము అకారాది పదక్రమమును అనుసరించినది; అనగా సకల శాస్త్రములకును, సకల కళలకును సంబంధించిన విషయములన్నింటిని చేర్చి అందుగల అంశములను అన్నిటిని అకారాది క్రమముగా వివరించినది. ఇది సంప్రదాయ సిద్ధమైన రచనా విధానమే అయినా, దీని ననుసరించి పని సాగించిన యెడల విషయసంగ్రహణమంతా పూర్తి అయితేనే కాని ఏ యొక్క అక్షర సంపుటమైనా ప్రకటించుట సాధ్యముకాదు.''[23]

అందుచేత విషయప్రధానముగానూ, అకారాదిగానూ కలగలుపు పద్ధతిలో సంపుటాలను ప్రచురించదలిచారు. మూడవ సంపుటాన్ని ఆంధ్ర సంపుటంగా నిర్ణయించి ఈ ప్రత్యేక సంపుట ప్రకటన కార్యక్రమము నిర్వహించుటకు శ్రీలక్ష్మణరావుగారి వద్దను శ్రీనాగేశ్వరరావుగారి వద్దను పనిచేసిన శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారిని అభ్యర్థించారు. 1950లో పని ప్రారంభమై 1959కి పూర్తయింది. శర్మగారి సంపాదకత్వంలో ప్రామాణికంగా

23. తెలుగు విజ్ఞాన సర్వస్వము - 3వ సంపుటం 'తెలుగు సంస్కృతి' - పుట.హి-హిళీ

సంపుటి వెలువడింది. తరువాత ఒక అనుబంధ సంపుటం కూడా ప్రకటితమైంది. కొమర్రాజు వారి సుందరస్వప్నము కొంత సఫలం చేయటంలో శర్మగారు కృతకృత్యు లయ్యారు. భాషా సమితి మిగతా 15 సంపుటాలను ప్రచురించింది. (భాషాసమితి ఉత్తరోత్తరా తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమైంది.)

విజ్ఞాన సర్వస్వ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నాక శర్మగారు మళ్ళా ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి ఆహ్వానంపైన 1957లో చరిత్ర విభాగంలో ఆచార్యులుగా వెళ్ళారు. ఎందరో పరిశోధక విద్యార్థులను చరిత్ర నిపుణులుగా తీర్చిదిద్దారు. ఆంధ్రుల చరిత్ర సజీవంగా ఉండేటట్టు మహత్తర కృషి చేశారు.

రాయప్రోలు సుబ్బారావు (1892-1984)

చిలుకూరి వీరభద్రరావుగారూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ మొదలైన చరిత్రకారులు పుస్తకాల పుటలు తిరగేసి సజీవచరిత్రలు చదువుకోమంటున్న కాలంలో ఒక కవిగారు ఇలా ఎలుగెత్తారు.

''............ చావలేదు
చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులారా!''

గుండెలు చీల్చుకొని చదవమన్న ఈ కవి రాయప్రోలు సుబ్బారావుగారు. ఈయన కూడా మల్లంపల్లి సోమశేఖరశర్మగారి లాగానే మెట్రిక్యులేషన్ దాకా చదివి ఉన్నతవిద్యలు కొనసాగించలేక రాజమండ్రిలో చిలుకూరి వీరభద్రరావుగారి సంపాదకత్వాన వెలువడే ఆంధ్రకేసరి పత్రికలో రచనలు చేస్తూ, ఆ పత్రికలో అజ్ఞాత సంపాదకత్వపు పనులు చేసేవారు. సుబ్బారావుగారి మేనమామ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (1883-1935) 'ఆశుకవి తిలక' బిరుదాంకితులు. చెళ్లపిళ్ల వారి శిష్యులు. తమ గురువుగారిలాగే అవ్వారివారు సంస్థానాధీశ్వరులు సభలో కవితలు చెప్పేవారు. తన మేనల్లుణ్ణి వెంటపెట్టుకొని 1909-1911 మధ్యకాలంలో కొన్ని సభలలో జంట కవిత్వాలు చెప్పారు. మామా అల్లుళ్ళు కాలస్వభావం వల్ల ఆశుకవితా విన్యాసాలు రచించినా స్వతహాగా రసదృష్టి కలవారు. 1911లో బుచ్చిరెడ్డిపాలెంలో ఆశుకవితలు చెప్పాక సుబ్బారావుగారికి ఆ 'వేగ ప్రక్రియాధోరణి' మీద వెగటు కలిగింది. ఆశుకవితా సన్యాసం ఇప్పించమని ఇష్టదేవతను ఈ విధంగా ప్రార్థించారు.

''తెనుఁగే తీయని దందు పద్యపద రీతిక్రీడలత్యంత మో
హనముల్ శోభనముల్ తదీయ రసరక్తాలాపనంబుల్ లభిం
చిన వాగర్థ కలాకలాప జయలక్ష్మిన్ గాలికింబుత్తునే
జననీ, యేమిటికింక, ఆశుకవితా సన్యాస మిప్పింపవే!''

''రసమో, భావమో, జీవదర్థ సుకుమార వ్యంజనా మంజు శ
బ్ద సమాసారచనంబొ, సాదుహృదయ స్పంద ప్రతిష్టా కథా

విసరంబో సకలార్థశూన్యమగు నీవేగాతి వేగోక్తి దు
ర్వ్యసనం బేటికి త్రిప్పుమింక జననీ, రమ్యాక్షరక్షోణికిన్''

ఆశుకవిత్వంపైన మోజుపోవడానికి కారణం, కొంతకాలం ముందుగానే అంటే 1909లోనే బీజంగా నాటుకొంది. ఆ ఏడు సుబ్బారావుగారు గంటి లక్ష్మన్న పంతులుగారనే న్యాయవాది ప్రోద్బలం వల్ల ఆంగ్లకవి గోల్డ్‌స్మిత్ రచించిన 'హెర్మిట్' అనే కృతిని 'లలిత' అనే పేరుతో తెనుగు చేశారు. 1910లో టెన్నిసన్ రచించిన 'డోరా' అనే లఘు కావ్యాన్ని 'అనుమతి' అనే పేరుతో ఆంధ్రీకరించారు. 1912లో 'తృణ కంకణం' అనే కావ్యాన్ని సృష్టించారు. ఇటువంటి 'నూతన రచనలు' చేయాలన్న ఆకాంక్ష గల వారికి ఆశుకవిత్వం పట్ల మోజు ఉండకపోవడం సహజమే. అందుకే ఆశుకవితా సన్యాసం చేశాక సుబ్బారావుగారు మద్రాసు చేరుకున్నారు. అప్పటికే చిలుకూరి వీరభద్రరావుగారూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారూ చెన్నపట్నంలో కొమర్రాజువారి ప్రోత్సాహంతో చరిత్ర తవ్వి తెలుగువారి తలకెత్తుతున్నారు. రాయప్రోలు సుబ్బారావుగారు కూడా కొమర్రాజువారి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిలోనూ ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం కార్యాలయంలోనూ లేఖకునిగా ప్రవేశించారు.

ఆధునిక కవిత్వ రచనలు చేస్తున్నా సుబ్బారావుగారి 'కొత్తపోకడలు' లోకం గుర్తించలేదు. వీరి కావ్యాలు మొదట ఎవరి దృష్టినీ ఆకర్షించినట్టు లేదు.[24] కొమర్రాజు వారి దగ్గర 'విజ్ఞానసర్వస్వం' పనులలో అప్పచెప్పిన విధులు సుబ్బారావుగారు నిర్వర్తించేవారు. 'ప్రథమసంపుటమునకు విలేఖకులు' అనే జాబితాలో రాయప్రోలు సుబ్బారావుగారి పేరు పదిహేనుమందిలో ఒకరిదిగా కనబడుతుంది. ఈ విజ్ఞాన సర్వస్వం రచన 1912 నుండి ప్రారంభమైంది. విలేఖకునిగా పనిచేస్తున్న సుబ్బారావుగారు కవితలు రచిస్తూ వుండేవారు. సమకాలీన పత్రికలలోని వార్తలు చదివి ఉత్తేజితులై కావ్యరచన చేసేవారు. ఒక ఉదంతాన్ని ఆచంట లక్ష్మీపతిగారు ఇలా కథనం చేశారు.[25]

''ఆంధ్రదేశములో కంటె అరవదేశములోనూ, బంగాళాదేశములోనూ ఈ వరకట్నముల బాధ భరింపజాలనిది అయినది. బంగాళా దేశమున ఒకచోట 'స్నేహలత' యని సర్వాంగ సుందరియైన యొక యువతి మిక్కిలి గౌరవనీయమగు బ్రాహ్మణ కుటుంబములో పుట్టి తల్లిదండ్రులు పడెడు బాధ భరింపలేక, యొకనాడు ఏకాంతముగా ఒక గదిలో ప్రవేశించి, తలుపులు మూసుకొని చీరనిండా కిరసనాయిలు పోసుకొని అగ్నిజ్వాలలకు ఆహుతి అయినది. ఈ వృత్తాంతము పత్రికలలో బహుళముగా ప్రకటింపబడెను. అనేకులు కవులు, పద్యములు, పాటలు వ్రాసి ప్రకటించిరి.

''శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు ఈ విషయమును గూర్చి నవీనశైలిని ఒక పద్య కావ్యమున రచియించి ప్రకటించి ప్రసిద్ధిగాంచిరి. అప్పుడు ఆయన విజ్ఞాన చంద్రిక ఆఫీస్‌లో పనిచేయుచుండిరి''.

24. సి. నారాయణరెడ్డి – ''ఆధునికాంధ్ర కవిత్వము'' (సంప్రదాయములు – ప్రయోగములు) పుట.261
25. ఆచంట లక్ష్మీపతి – స్వీయచరిత్ర – పుటలు.143–4

'స్నేహలత' రచించాక రాయప్రోలు సుబ్బారావుగారి దృష్టి మాత్రమే కాక మకాం కూడా వంగదేశానికి మారింది. రవీంద్రనాథ టాగోరు గారి 'శాంతినికేతనం'లో అంతేవాసిగా చేరారు. కొన్నాళ్ళపాటు అక్కడ గడిపి చక్కని సాహిత్య సౌందర్యాలను తెలుసుకొన్నారు. తిరిగి స్వదేశానికి తిరిగి వచ్చారు. కాల్పనిక కవితలు మాత్రమేకాక దేశాన్ని ఉర్రూతలూగిస్తున్న జాతీయోద్యమంతోపాటు ఆంధ్రోద్యమం వల్ల కూడా ప్రభావితులై 'ఆంధ్రావళి' పద్యాలను రచించసాగారు.

1916వ సంవత్సరం భోగి పండుగనాడు బెజవాడలో రామమోహన గ్రంథాలయ నూతన గృహ ప్రవేశం ఒక పెద్ద పండుగలాగ జరిగింది. ''ఆ మహోత్సవ సందర్భంలోనే రాయప్రోలు సుబ్బారావుగారు తాము రచించిన ఆంధ్రాభిమాన పూరితమైన పద్యములను శ్రావ్యముగా పాడి సభికులనందరినీ ఆనందింపచేశారు'' అని సమకాలికులు గ్రంథస్థం చేశారు.[26] అలా ఆనందింపచేసిన పద్యం ఒకటి చూడండి.

''తనగీతి యఖిల జాతిని పాటకులనుగా
దిద్ది వర్ధిల్లిన తెనుఁగు వాణి
తనపోటులు విరోధి తండంబులకు సహిం
పనివిగా మెరసిన తెనుఁగు కత్తి
తన యందములు ప్రాంతజనుల కభిరుచి వా
సన నేర్పనలరిన తెనుఁగు రేఖ
తన వేణికలు వసుంధరను సస్యశ్యామ
లను జేయఁజెలఁగిన తెనుఁగు భూమి
అస్మదార్ద్ర మనోవీధి నావహింప
జ్ఞప్తి కెలయించు చున్నాఁడ; చావలేదు,
చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర!
హృదయములు చీల్చి చదువుఁడో సదయులార!''

రాయప్రోలు సుబ్బారావుగారి దేశభక్తిలో రెండు విభాగాలున్నాయి. ఒకటి భారతదేశాభిమానం, రెండోది ఆంధ్రాభిమానం. భారతదేశ ప్రశస్తిలో సుబ్బారావుగారి రచనలలో ఏయే చరణాలు సుప్రసిద్ధ ఆంగ్లకవులైన వాల్టర్‌స్కాటు, టెన్నిసన్, వర్డ్స్‌వర్త్ మొదలైన కవుల పద్యాలకు భావానువాదాలో విశ్లేషణానిపుణులు సోదాహరణంగా నిరూపించారు.[27] ఇక ఆంధ్రాభిమానాన్ని ''సహేతుకమైన రీతిలో రసవన్మార్గంలో ప్రవేశపెట్టిన రాయప్రోలు వారే అభిమానాతి రేకమునకు దారి తీసిరి'' అని చెప్తూ సి. నారాయణరెడ్డిగారు ఇలా రాశారు.[28]

''అభిమానమన్నది అహంకారలక్షణమంటిని. ఆయభిమానము హద్దులో నున్నప్పుడే ఎల్లరికి ధ్యేయమగును. కాని కుండపోతగా వాన కురిసిన తరువాత

---

26. అయ్యదేవరకాళేశ్వరరావు - నా జీవితకథ నవ్యాంధ్రము - పుట.126
27. సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము - పుట.383-4
28. సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము - పుట.411

నదీనదములు, ఏర్లు, కాల్వలు, పిల్లకాల్వలు, స్వచ్ఛమైన వాననీటితో పాటు 'తుక్కుదూగర' ఆకులలములు, చెట్టు చేమలు, ఒకటేమిటి - ఎదురైన ప్రతి వస్తువును వెంట తీసికొని ఉరకలు తీసినట్లుగా; ఒక మహా ఝంఝూప్రభంజనము వీచినప్పుడు మన్నుమిన్నేకమై ధూళి గ్రమ్మునట్లుగా, ఒక ఆవేశము కట్టలు త్రెంచుకొని వచ్చినప్పుడు అది ముందు వెనుకలు పరికించదు. హేతువు దాని ధాటికాగదు. ఆంధ్ర రాష్ట్రోద్యమముతో ఒక్కుమ్మడిగా చెలరేగిన రాష్ట్రాభిమాన కవిత్వములో గూడ అనేక సందర్భములో అభిమానము 'దురభిమానము'గా పరిణమించినది. 'దురభిమాన'మను పదము వాడుట సమంజసముకాదేమోయని నేను 'అభిమానాతిరేక' మనుచుంటిని.''

రాయప్రోలు సుబ్బారావుగారిని ఒక రకం కవిత్వానికి యుగకర్తగా భావించేవారున్నారు. 'భావకవిత్వం'పైన ఒక ప్రత్యేక ప్రకరణంలో వారిది ఏరకం కవిత్వమో చూద్దాం. కొమఱ్ఱాజువారి విజ్ఞాన సర్వస్వంలో పనిచేసిన ప్రభావం రాయప్రోలు వారి మీద అట్టే లేదనుకోవాలి. రాయప్రోలు వారి గురించి ఇప్పుడు చెప్పుకోవలసినది వారు కొమఱ్ఱాజు వారి సహచరులలో ఒకరన్న సత్యాన్నే.

కందుకూరు బాలసూర్య ప్రసాదరావు (20వ శతాబ్దం)

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వ ప్రచురణ వల్ల కొమఱ్ఱాజువారి ప్రత్యక్ష సహచర్య ప్రభావంకాక పరోక్ష ప్రేరణలో ఆదారిలోనే మరో పదహారేళ్ళ తర్వాత పయనించినవారు కొందరున్నారు. లక్ష్మణరావుగారు 'దేశభాషలలో శాస్త్ర పఠనం' అనే విషయంపై ఒకసారి ఇలా రాశారు.[29]

''ఒక వేళఁ గొన్ని గ్రంథములకు లోకాశ్రయము లేకపోయినను, నాంధ్రదేశమందలి రాజులు, మహారాజులు మొదలయినవారును, శ్రీమంతులను విద్యాసంఘములు నిట్టి గ్రంథకర్తలకు సాయము చేసి వివిధ శాస్త్రములను గుఱించిన గ్రంథములను వ్రాయింపవలెను. భాషయందు ప్రబంధములు, నాటకములు, నవలలు మొదలయిన లలిత వాఙ్మయ మభివృద్ధిఁ జెందుట యొక యెత్తు; శాస్త్ర జ్ఞానాభివృద్ధి కనుకూలములైన గ్రంథములు నిర్మాణమగుట యొకయెత్తు. ఇట్టి గ్రంథములు దేశదారిద్ర వినాశకములు.''

లక్ష్మణరావుగారి హితోపదేశాన్ని ఆంధ్ర దేశములోని ఒక జమీందారు అక్షరాలా ఆచరణలో పెట్టారు. ఆయన ''శ్రీఇజ్జత్ అసార్ కందుకూరి బాలసూర్యప్రసాదరావు బహద్దర్''. ఉరఫ్ ప్రసాద భూపాలుడు జమీందార్ ఆఫ్ దేవిడి. ఇది ఉర్లాం ప్రొప్రయిటరీ ఎస్టేటును అన్నదమ్ములు పంచుకొనగా పెద్దవాడైన ప్రసాద భూపాలుని వాటాకు వచ్చింది గంజాం జిల్లాలోని సంస్థానం.

బాలసూర్యప్రసాదరావుగారు సీమంతినీ పరిణయం, వీధినాటకం, మాతుల సుతోద్వాహము, ప్రబోధ మొదలైన కావ్యరచనలు చేసినా విజ్ఞానం వైపు ఎక్కువ మొగ్గారు. సర్వతోముఖమైన జ్ఞానాన్ని, అసాధారణమైన సంపూర్ణత్వాన్ని తెలుగు రచనా

29. లక్ష్మణరాయ వ్యాసావళి - పుట.166

కౌశలాన్ని సమీకరించి ఒక్క చేతిమీదుగా 'ఆంధ్ర విజ్ఞానం' అనే పేరుతో గ్రంథ ప్రచురణ 1939లో ప్రారంభించారు. తొలి సంపుటానికి కట్టమంచి రామలింగారెడ్డిగారు పీఠిక వ్రాస్తూ ''ఈ ఆంధ్ర విజ్ఞానమునకు కర్తలు ఈ జమీందారువారని యిదివరకే నేను వ్రాసియున్న సంగతిని గమనింపవలెను. ఇట్టి విజ్ఞాన సర్వస్వములు ఇంత వఱకును పలువురు మేధావులచే రచింపబడి, ఒక వ్యక్తిచే క్రోడీకరింపబడుచున్నవి. ఇపుడీ గ్రంథమట్లుగాక, మేధానిధియౌ శ్రీజమీందారువారిచే స్వయముగా ఆదినుండి అంతము వరకును వ్రాయబడి సంపుటీకరింపబడినది. ఈ శక్తి మానవాతీతము'' అని మెచ్చుకొన్నారు.

ఈ పీఠికలోనే కట్టమంచివారు తెలుగు వాఙ్మయములో మొట్టమొదటి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం ప్రారంభించిన కొమర్రాజువారినీ, తర్వాత వారి ఉద్యమాన్ని కొనసాగించ ప్రయత్నించిన కాశీనాథుని వారిని స్మరించి ''వారే మాత్రమును ఇందులో జయముగాంచక పూర్వమే వీరును మృతులైరి'' అని విచారించి ''ఇట్లగుట ఆయాంధ్ర విజ్ఞాన సర్వస్వము యొక్క భవిష్యత్తు ఏమికానున్నదో తెలియకున్నది. ఇంతకును ఆ గ్రంథమునకు భవిష్యత్తు అని ఒకటి కలదో లేదో అనుమానమే'' అన్నారు. తర్వాత ఇలా రాశారు.[30]

''శ్రీ బాలసూర్య ప్రసాదరావు బహద్దరువారి ఆంధ్ర విజ్ఞానము ఇంతవరకును ప్రయత్నింపబడిన యితర విజ్ఞానములవలెగాక, జయప్రదముగా ప్రచురింపబడునని అందఱి ఆశయము. ముద్రణకు పెట్టెలతో సిద్ధపరుపబడిన వ్రాతప్రతులు తయారుగా నున్నవని నాకు తెలియును. గ్రంథము దాదాపుగా పూర్తియైనది. ఇక 'ఆలస్యమమృతం విషం' అనునట్లు కాలహరణము కాకుండ త్వరగా ముద్రణ మొనర్చుటే మిగిలియున్నది.''

ఈ ఆంధ్రవిజ్ఞాన సర్వస్వాన్ని రెడ్డిగారు 'బాలసూర్యప్రసాద విజ్ఞాన సంహిత' అని పిలిస్తే బాగుంటుందన్నారు. ఇది ఏడు సంపుటాల గ్రంథం. అన్నీ అచ్చుపడ్డాయి. వాటి వివరాలు ఇవి :

మొదటి సంపుటం	- 1938 -	కాకినాడ ఎస్.ఆర్.పి. వర్క్సులో ముద్రణ
రెండవ సంపుటం	- 1938 -	కాకినాడలో పై ముద్రణాలయంలోనే
మూడవ సంపుటం	- 1940 -	రాజమండ్రిలో రంజన్ ఎలక్ట్రిక్ ప్రెస్
నాలుగవ సంపుటం	- 1941 -	పై ప్రెస్‌లోనే
అయిదవ సంపుటం	- 1941 -	రాజమండ్రి బాక్స్ ప్రెస్‌లో
ఆరవ సంపుటం	- 1941 -	పై ప్రెస్‌లోనే
ఏడవ సంపుటం	- 1941 -	పై ప్రెస్‌లోనే

ఏడవ సంపుటంలో 'ఆంధ్రవిజ్ఞానానుబంధం' అనే పేరుతో తొలి సంపుటాలలో విడిచిపెట్టిన విషయాలను విశదం చేశారు. ఈ ఏడు సంపుటాలలో సామెతలు దగ్గర్నుంచి అనేక విషయాలు ఉన్నాయి. కొన్ని ఆరోపాలలో సంక్షిప్త సమాచారాన్నే ఇచ్చారు. అయితే ఇతర గ్రంథాలలో దొరకని అనేక విషయాలను కూడా చెప్పారు. నా సమగ్రాంధ్ర సాహిత్య రచనలో ఈ విజ్ఞాన సర్వస్వాన్ని చాలాసార్లు నేను ఉపయోగించుకొన్నాను. ఏ విషయం పైననైనా, ఎంత కొద్దిపాటి సమాచారం దొరికినా మంచిది.

మాగంటి బాపినీడు (1895-1969)

దేవిడి జమీందారుగారిలాగే కొమర్రాజు వారు తీసిన బాటలో పయనించి విజ్ఞాన సర్వస్వాన్ని రచించి ప్రచురించిన మరొక ప్రశంసనీయుడు మాగంటి బాపినీడు. 1942లో ఆంధ్ర సర్వస్వమనే సంగ్రహ విజ్ఞానకోశాన్ని జాతీయ జ్ఞానమందిర్ అనే తన ప్రచురణాలయం తరపున వెలువరించారు. 'తెలుగు తల్లి' అనే బాలల విజ్ఞాన సర్వస్వాన్ని కూడా ఆయన ప్రచురించారు. రాజకీయరంగంలో ఉంటూ ఇటువంటి విజ్ఞాన గ్రంథరచన ప్రచురణ చేయడం శ్లాఘనీయమే.

కొమర్రాజు లక్ష్మణరావుగారు ఉత్తమ మార్గదర్శకులు. ఈ దారిలో గ్రాంథిక కంటకాలూ, కృతకశైలి గులకరాళ్లూ ఉంటేనేంగాక తర్వాత వచ్చేవాళ్లు బాటను బాగు చేసుకోగలరు.

వాడుక - వేడుక భాషల యుద్ధం

ప్రజలు తమ నిత్యజీవితంలో మాట్లాడుకొనేదీ, రాతకోతలకు ఉపయోగించేదీ వాడుకభాష.

పండితులు తమ గ్రంథాలలోనూ, పఠన పాఠనాలలోనూ ముచ్చటపడి ప్రయోగించేది వారి వేడుకభాష.

విద్యార్థులు తమ నిజజీవితంలో వాడుకభాషనే ఉపయోగిస్తున్నా, పరీక్షలలో నెగ్గడానికి పండితుల వేడుక భాషను విధిగా నేర్చుకొనితీరాలి. అది వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు. మొక్కుబడి మార్కులు దక్కించుకొని పరీక్షల నుండి 'గట్టెక్కితే' చాలని భావిస్తారు.

పండితుల వేడుక భాష వారికి మాత్రమే జీవనోపాధి. దీనిని చదువులపేరిట సర్వుల మీదా రుద్దడానికే ప్రయత్నిస్తున్నారు. ఇది కొన్ని తరాలనుంచీ సాగుతున్న భాషా దురాచారం. ఆదిలో కుంఫిణీ యుగం ప్రారంభదినాలలో శిష్టులందరూ సర్వజన సామాన్యమైన స్పష్టభాషనే రాతకోతల్లో ఉపయోగించేవారు. తెలుగు నేర్చుకొని మనలను పాలించదలచిన తెల్లదొరలందరూ ఈ శిష్టభాషనే ప్రోత్సహించారు. ఆధునిక శాస్త్రీయ పద్ధతులు తెలియక పాత రొడ్డకొట్టు విధానంలో సూత్రాల్నీ భట్టీవేయించే విద్యాబోధన మార్గాన్ని సంస్కరించడానికీ, మన లోపాలు సరిదిద్దడానికీ ప్రయత్నించారు.

ఇతరులకు తెలిసినట్టు మన లోపాలు మనకు తెలియవు. విదేశీయులు గుర్తించినట్టు మన చారిత్రక, సారస్వత సంపదను మనం ఆదిలో గుర్తించలేదు. వాటి గురించి పట్టించుకొన్నవారు మృగ్యులు. కర్నల్ కాలిన్ మెకంజీ (1754-1821) మన స్థానిక చరిత్రలు రాయించాడు. ప్రాచీన శాసనాలు కాపీ చేయించాడు. గ్రంథ సేకరణ చేశాడు.

ఎ.డి.కాంబెల్ (1760-1840) తెలుగు వ్యాకరణాన్ని ఇంగ్లీషులో రచించాడు. మంచి నిఘంటువు నిర్మించాడు. సి.పి.బ్రౌను (1798-1884) చెల్లాచెదురుగా వున్న సాహిత్య గ్రంథాలన్నింటినీ ఒక చోట సమీకరించాడు. అస్తవ్యస్తంగా వున్న వ్రాతప్రతులను పరిష్కరింపచేసి, తీర్పు ప్రతులు వ్రాయించి, టీకలు చెప్పించి, వ్యాఖ్యానాలు పుట్టించి కొన్ని పుస్తకాలను ముద్రించాడు; ముద్రింప చేశాడు.

హైస్కూళ్ళలో తెలుగు నేర్పే పద్ధతులు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని బ్రౌను దొరగారు గుర్తించారు. 1850 డిసెంబరు మాసంలో ఆయన తెలుగు ట్రాన్స్‌లేటర్ హోదాలో మద్రాసు హైస్కూలు క్లాసులో నలభైయేడుమంది విద్యార్థులను పరీక్షించి తమ నివేదికను ప్రభుత్వానికి పంపారు. "ఈ పరీక్షలో తొమ్మండుగురు మాత్రమే ఎన్నికకు అర్హులు. మిగతావారు ఎందుకూ పొందరు. ఆ తొమ్మిదిమందిలోనూ ముగ్గురంటే ముగ్గురే తెలుగునుండి ఇంగ్లీషులోనికి చేసిన అనువాదం చెప్పుకోదగ్గవి. వ్యవహారచ్యుతిని పొందినా పండితులైన నేటివులు ప్రశంసించే నిరుపయోగమైన శుష్కగ్రాంథికశైలిని వర్ణక్రమ దోషాలతో ఉపయోగించారు. కుర్రవాళ్లు శ్రద్ధగా చదువుకొనేవాళ్ళే. అయినా వాళ్ళచేత ఎందుకూ కొరగాని వ్యాకరణ సూత్రాలను వల్లెవేయించి, అయ్యవార్లు మోయలేని భారాన్ని పిల్లనెత్తిమీద పెడతారు. ఈ తెలుగు విద్యార్థులలో చాలామంది ధారాళంగా ఇంగ్లీషులో సంభాషించగలరు. అయితే ముగ్గురు మాత్రమే ఇంగ్లీషు నుంచి తమ మాతృ భాషలోనికి చక్కగా అనువాదం చేయగలిగారు. ఇంగ్లీషులోనికి అనువదించడం మెరుగుగాలేదు. ఇప్పుడు వాడుకలో ఉన్న పాఠ్యాపుస్తకాలన్నీ నిరుపయోగమైనవి. వాటిని బహిష్కరించడం మంచిది."[1]

1850లో బ్రౌను దొరగారు గమనించిన పరిస్థితులు ఇంకో అయిదున్నర దశాబ్దాలు గడిచాక మరింత విషమించాయి. చిన్నయసూరి రచించిన నీతిచంద్రిక, బాలవ్యాకరణాలు పాఠ్యగ్రంథమై, చెన్న రాష్ట్రంలోని తెలుగు విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆ భాషలోనే విద్యాబోధన జరుగుతూ వచ్చింది. సూరిగారి తర్వాత బహుజనపల్లి సీతారామాచార్యులు, కొక్కొండ వెంకటరత్నం, కందుకూరి వీరేశలింగం, వావిలకొలను సుబ్బారావు, వేదం వెంకటరాయశాస్త్రి మొదలైన పండితులు కృతకశైలిని మరింత జటిలం చేశారు. అముద్రిత గ్రంథ చింతామణి వంటి సాహిత్య పత్రికలు పండిత ప్రకాండుల సాముగరిడీలకు తాలింఖానాలయ్యాయి. పరస్పర దూషణ సాహిత్య విమర్శగా చెలామణి కాజొచ్చింది. వీరేశలింగంగారు సంఘ సంస్కారాన్ని చేపట్టడం వల్ల భావ ప్రచారానికి సులభశైలి ప్రయోజనాన్ని గుర్తించి కొన్ని కొన్ని రచనలలో దానిని వాడుతున్నా పాఠ్యగ్రంథాలు కాదగిన పుస్తకాలనూ, నాటకాలనూ తదితరాల పూర్వపుశైలికి దగ్గరగా వాడుతూ వచ్చారు. వీరేశలింగంగారి దారిలోనే రచయితలందరూ పయనించి రచనలు చేశారు. విద్యాశాఖలో బోధనా పద్ధతులు కాలానుగుణంగా మారలేదు.

1906లో జె.ఏ.ఏట్సు దొర గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల విద్యాశాఖాధికారిగా నియమితుడయ్యాడు. ఈయన అంతకుపూర్వం మద్రాసు

1. C.P. Brown - Literary Auto Biography of C.P.Brown - p.133

పచ్చయప్ప కళాశాలలో పనిచేశాడు. భారతదేశంలోనూ, అందులోనూ దక్షిణాదిని విద్యాబోధనా పద్ధతులు ప్రత్యక్షంగా చూసినవాడు. ఈయన కార్యస్థానం విశాఖపట్నం. తెలుగు జిల్లాల్లో ఉద్యోగం కనుక తెలుగు నేర్చుకొనడం మంచిదని ఒక 'మునిషీ' గారిని పెట్టుకొన్నాడు. ఆయన నేర్పిన తెలుగును వీధిలో కనబడ్డవాళ్ళ దగ్గర మాట్లాడి అభాసుపాలయ్యాడు. ఆయనకు అయ్యవారు నేర్పినది కావ్యభాష. ప్రజలు మాట్లాడేది వాడుకభాష. ఏట్సుదొర ఈ భేదాలను గుర్తించాడు. ఇస్కూళ్ళల్లో చెప్పే చదువే తమకు తన అయ్యవారు చెప్పాడని గుర్తించారు. పాఠశాలల తనిఖీకి వెళ్ళారు.

విశాఖపట్నం కాలేజీకి వెళ్ళి మెట్రిక్యులేషన్ తరగతి విద్యార్థుల చదువును పరిశీలిస్తామన్నారు. ప్రిన్సిపాల్ పి.టి.శ్రీనివాసయ్యంగారు తీసుకువెళ్ళారు. విద్యార్థులకు పండితులు తెలుగు పాఠ్యగ్రంథం బోధిస్తున్నాడు. స్కూలు తెరచి రెండు మాసాలైనా ఆ గ్రంథం మొదటి పుటలోని కడపటి పద్యం దాకానే చెప్పడం జరిగింది. ఎందుకింత సమయం వెచ్చించవలసి వచ్చిందని ఏట్సుదొర అడిగాడు. గ్రంథం కావ్యభాషలో సంస్కృత సమాసాలతో ఉందనీ, పదవిభాగం, దండాన్వయం, ప్రతిపదార్థం, తాత్పర్యం చెప్పి పద్యంలో ఉన్న శబ్దాలంకారాలు మొదలైనవి విశదం చేయాలంటే ఎంతలేదన్నా పద్యానికి సుమారు మూడుగంటలు పడుతుందని పండితుడు చెప్పాడు. ఇదే క్లాసు విద్యార్థులకు ఇంగ్లీషు పద్యభాగం గంటకు సుమారు ముప్పై నలభై పంక్తులు సునాయాసంగా బోధించవచ్చునట. పరభాష సుఖంగానూ, మాతృభాష మహాజటిలంగానూ ఉంటుందన్నమాట.[2]

శ్రీనివాసయ్యంగారితో ఏట్సుదొర ఈ వైపరీత్యం గురించి చర్చించాడు. అయ్యంగారు ఎం.ఎల్.టి. మద్రాసు విశ్వవిద్యాలయంలో సభ్యులు. తమిళులైనా విశాఖపట్నంలో స్థిరపడి ఆ మాండలిక భాషను బాగా అలవరుచుకొన్నారు. కేవలం విద్యారంగంలోనే కాక సాంఘిక కార్యక్రమాలలోనూ, సంస్కారోద్యమాలలోనూ ప్రముఖపాత్ర వహించేవారు. 1907లో విశాఖపట్నంలో జరిగిన చెన్నరాష్ట్ర రాజకీయ సభలను పురస్కరించుకొని నాలుగవ రోజున ఏర్పాటుచేసిన సంఘ సంస్కరణ మహాసభకు అయ్యంగారే ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వ్యవహరించి సభను జయప్రదం చేశారు. రాజకీయ సభలకు న్యాపతి సుబ్బారావుగారు, సంస్కరణల సభకు వారణాసి సుబ్రమణ్యంగారు అధ్యక్షత వహించారు. శ్రీనివాసయ్యంగారికి తెలుగు భాషాబోధనపట్ల కొన్ని విశ్వాసాలు ఉన్నాయి. అయినా తాను తమిళుడు కనుక ఈ విషయమై మిత్రులైన గురజాడ అప్పారావుగారిని విజయనగరంలోనూ, గిడుగు రామమూర్తిగారిని పర్లాకిమిడిలోనూ కలుసుకొని వారితో ఈ సమస్యను చర్చించమని అయ్యంగారు ఏట్సుదొరకు సలహా ఇచ్చారు.

గురజాడ అప్పారావుగారు చాలాకాలం కాలేజీలో పాఠాలు చెప్పిన ఆచార్యులే. అయితే ప్రస్తుతం ఆపనిలో లేరు. రామమూర్తిగారు ఇంకా పర్లాకిమిడి కాలేజీలో చరిత్ర

2. ఈ వివరాలు గిడుగు సీతాపతిగారి వ్యాసంనుండి సేకరించినవి - సాహిత్యోపన్యాసములు, 4వ సంపుటం, పుట-14

పాఠాలు బోధిస్తున్నారు. అప్పారావుగారూ, రామమూర్తిగారూ తమ పరిశోధనల గురించి విరివిగా ఇంగ్లీషులోనే వ్యాసాలు రాస్తున్నారుకాని తెలుగులో కాదు. అప్పారావుగారు పదేళ్ళ కిందట 1897లో కన్యాశుల్కం ప్రకటించినా అది స్టేజి మీద ఆడడానికీ, ఇంట్లో చదువుకొనడానికి పనికి వచ్చే పుస్తకమే. విద్యాబోధన విషయమై ఈ ఇద్దరూ ఏది చెప్పినా దానిని ప్రామాణికంగా దేశం స్వీకరించకపోవచ్చు. అందుచేత ఇద్దరూ ఈ సమస్యను అన్ని కోణాల నుంచి అధ్యయనం చేయదలిచారు. ఏట్సుదొర ఓపిక పట్టాలని, ముందు పాఠశాలల, కాలేజీలలోని ఉపాధ్యాయులను నూతన విద్యావిధానం పట్ల సుముఖులను చేయాలని నిశ్చయించారు.

1907 నుంచి గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పరిషత్తు సమావేశాలను సంవత్సరానికి రెండురోజులపాటు ఏట్సుదొర వేసవి సెలవులలో నిర్వహించాడు; వాటిలో 'భాషా చరిత్రలు-తెలుగుభాషా చరిత్ర' అనే విషయంపై రామమూర్తిగారు ప్రసంగించారు. ఇందులో ఎక్కడా తెలుగు వ్యావహారిక భాషావాద ప్రసక్తి లేదు. కాని, అంతరార్థం మాత్రం అదే. ఇంగ్లీషు మొదలైన ఐరోపా భాషల చరిత్రలను విశదపరచి వాటిలాగ తెలుగును ఎలా ఆధునికం చేసుకోవచ్చునో సూచించారు. రామమూర్తిగారి ఉపన్యాసాలు ఏ ప్రయోజనాన్ని సాధించడం కోసం ఉద్దిష్టమైనాయో కొందరు గ్రహించకపోలేదు.

భాషాధ్యయన పద్ధతుల్లో కొత్త మార్గాలను అవలంభించడానికి విశాఖపట్నంలో ఒక సమాజం ఏర్పడింది. దానికి ఏట్సుదొర అధ్యక్షుడు. శ్రీనివాసయ్యంగారు కార్యదర్శి. ఇటువంటి సమాజమే విజయనగరంలో ఒకటి ఏర్పాటయింది. దానికి విజయనగరం కాలేజి ప్రిన్సిపాల్ కిళాంబి రామానుజాచార్యులుగారు అధ్యక్షులు. గిడుగు రామమూర్తిగారు ఉపాధ్యక్షులు. బుర్రా శేషగిరిరావుగారు కార్యదర్శి.[3] ఈ సమాజాలలోని వేత్తల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకొని సముచిత చర్యలకు ప్రయత్నాలు ప్రారంభించింది.

శ్రీనివాసయ్యంగారు "Life or Death: A plea for vernaculars" అనే చిరుగ్రంథాన్ని రచించి ప్రకటించారు. దీనికొక ప్రబలకారణముంది. రానున్న మార్పుల ప్రకారం ఇంటర్‌మీడియేట్, బియ్యే క్లాసులలో దేశభాషలను 'అనివార్యములగు పఠనీయములు'గ చేయడానికి అంగీకరించలేదు. కొంతకాలందాకా అన్ని పరీక్షలకు దేశభాషలు నిర్బంధపఠనీయాలుగా ఉండేవి. ఆ పరిస్థితి సంతుష్టికర అభివృద్ధిని ఇవ్వలేదు. ఇది అనివార్య పఠన పద్ధతివల్ల వచ్చిన అనర్థం కనుక పై పరీక్షలలో దేశభాషలను స్వేచ్ఛాపఠన యోగ్యాలుగా చేశారు. దేశభాషలను నిర్లక్ష్యం చేయకూడదని పై తరగతులలోని విద్యార్థులు పరీక్షలకు కూర్చున్నప్పుడు, దేశభాషలను కూడా కొన్ని విషయాలపై అనువాదములో వ్యాసరచన చేయాలి. శ్రీనివాసయ్యంగారి వంటి వారు విద్యార్థులు తమ అభిరుచిగల విషయాలలో స్వేచ్ఛానుసారంగా చదువుకొనే పద్ధతి కల్పించమని అభ్యర్థించారు.[4]

---

3. కె.వి. రమణారెడ్డి - మహోదయం - పుట.175లో ఈ వివరాలు ఇచ్చారు.
4. పానుగంటి లక్ష్మీనరసింహంగారి 'సాక్షి' సంపుటం-1, 'గ్రామ్యభాషా గ్రంథపఠనం' అనే వ్యాసంలోని సారాంశం బహుశా ఇదే అయి ఉంటుంది.

1909-1910లో ప్రభుత్వ విద్యావిధానంలో పండితుల సలహాల మేరకు పెద్ద మార్పులు తీసుకువచ్చారు. 1910 మే నెలలో మూడవసారి ఉపాధ్యాయ పరిషత్తు సమావేశమైంది. అందులో విద్యార్థులు అనువాద పరీక్షకు, వ్యాసరచన పరీక్షకు హాజరై వాటిలో ఉత్తీర్ణులవ్వాలని నిర్ణయించారు. సంస్కృతం రెండవ భాషగా అభ్యసిస్తున్న వారు కూడా ఈ తెలుగు పరీక్షలలో పాల్గొనాలి. అనువాద విషయం, వ్యాస విషయం ఆధునిక శాస్త్రానికి సంబంధించినదై ఉండాలని కొందరు చెప్పారు. గిడుగు రామమూర్తిగారు ''అనువాదంలోగాని, వ్యాసంలోగాని ఉండవలసిన భాష కావ్యాలలోని గ్రాంథికభాష అయితే అది విద్యార్థులకు అనవసరంగా కష్టం కలిగించడమే కాక ఏ ప్రయోజనం సాధించదని, వాడుక భాషే ఉండాలని'' నొక్కి చెప్పారు. చాలామంది వ్యావహారిక భాషవైపు మొగ్గారు.

1910 నాటికి విద్యా ప్రణాళికలో మార్పు ప్రకటితమైంది. అప్పటిదాకా ఉన్న మెట్రిక్యులేషన్ పరీక్షకు బదులు స్కూలు ఫైనల్ పరీక్ష ఎప్పే తరగతుల స్థానంలో రెండేళ్ళ పరిమితిగల ఇంటర్ తరగతులు వచ్చాయి. విద్యా సంవత్సరం పూర్వంలాగ జనవరి నుంచి జనవరి దాకా కాక వేసవి పిదప మళ్ళా వేసవి ప్రారంభం నెలలలోపున ఉండాలని నిశ్చయించారు. స్కూల్ ఫైనల్ పరీక్ష ద్వితీయ విభాగంలో అనువాద రచన విధిగా ఉంటుంది. దీనిని నవీనాంధ్ర భాష అని పేర్కొంటున్న వ్యావహారిక శైలిలోగాని, ప్రాచీనమైన గ్రాంథికశైలిలోగాని విద్యార్థులు రాయవచ్చును.

విద్యార్థులకు ఏ శైలి నచ్చితే అందులో అనువాద రచన చేయవచ్చుననే అనుజ్ఞ లభించగానే సహజంగా వ్యావహారిక శైలినే ఎక్కువమంది అభిమానించారు. ఇవి పండితులకు గంగవెర్రులు పుట్టించాయి. వాడుక భాషను గ్రామ్యమని దూషిస్తూ శశిలేఖ, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, ఆర్యమహాబోధిని మొదలైన పత్రికలలో వ్యాసాలు వెలువడసాగాయి. చినపురుషోత్తం, కొమర్రాజు లక్ష్మణరావు, రాయప్రోలు సుబ్బారావు, బాలకవి భోగరాజు నారాయణమూర్తి, వావిలకొలను సుబ్బారావు, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగార్ల వంటి వారు గ్రామ్యాన్ని నిరసిస్తూ రాసిన వ్రాతలకు గురజాడ అప్పారావుగారు 1910 నవంబరులో ప్రత్యుత్తరమిచ్చారు. 'గ్రామ్యశబ్ద విచారం' అనే వ్యాసంలో ఒక్క కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు తప్ప మిగిలినవారు వ్యావహారికవాదుల అభిప్రాయాలను ప్రమాణాలతో విమర్శించలేదని అప్పారావుగారు నొక్కి చెప్పారు. సారాంశం ఇలా విశదం చేశారు.[5]

''పరిశీలించి చూడగా, శాస్త్రులుగారికిని, నాకును అభిప్రాయభేదము చాలా తక్కువ, గ్రాంథికభాష వాడుక చేసేవారు, దాని నియమములను పూర్తిగా మన్నించవలసిందనే నా యభిప్రాయము. ఆ భాషను సాధించలేనివారు, అనగా లోకానికల్లా, బ్రహ్మయ్యశాస్త్రులుగారి వంటి పదిమంది తప్ప కడమందరూ, వాడుకభాషలో నుంచి సులభసాధ్యమైన వొక కొత్త గ్రాంథిక భాషను కల్పించుకుంటే, శాస్త్రులుగారికి యేమికొరత?''

5. గురజాడ రచనలు - సంపుటం-1, వ్యాసచంద్రిక, పుట.65

ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వావిలకొలను సుబ్బారావుగారు రాసిన దానినుంచి ఒక పేరాను అప్పారావుగారు 'కోట్' చేశారు. అది ఇలా ఉంది.[6]

''కులటయగుమాతకన్న బతివ్రతయగు మాత యెక్కువ పూజ్యురాలైనట్లు, గ్రామ్యభాషకన్న లాక్షణిక భాషయే ప్రశస్తమని బుద్ధిమంతులెల్ల నంగీకరింతురు. అట్టి సలక్షణ భాష నుపేక్షించినచో గలుగుననర్థములు పెక్కులు గలవు. గ్రంథ విస్తరభీతి సంక్షేపించెదగాని తుదకాంధ్ర పదము నామావశిష్టమగు.''

''వాడుకభాషను 'కులట' అని మర్యాదచేసే పండితులు దానిని దూరముగా విసర్జించక యేల వాడుక చేతురు? వారు యాంటీనాచ్ కాదు కాబోలు'' అంటూ ఒక చురక తగిలించి ఆ పండితులు చేసే తప్పులను గురజాడ ఎత్తి చూపించారు. శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు కృష్ణాపత్రికలో ''గ్రామ్యావలంబకమైన కూళలపై'' ఆరుపద్యాలను మహాస్త్రాల్లాగా ప్రయోగించారు. ఈయన ఆ ఆరుపద్యాలలో ఎక్కడెక్కడ నియమాలు తెంచారో అప్పారావుగారు చూపెట్టి జాబితా వేశారు. 1. అరసున్న ఉండవలసిన చోట లేకపోవడం, 2. అరసున్న ఉండకూడని చోట ఉండడం, 3. సరళాదేశం చేయవలసిన చోట మానడం, 4. సరళాదేశం చేయకూడని చోట చేయడం, 5. ద్రుతంపై గసడదవాదేశం, 6. కళలను ద్రుతాంతాలుగా వాడడం, 7. కర్మణి ప్రయోగాలు, 8. అపశబ్దాలు. ఈ తప్పులన్నీ 'వాడుకభాషలు-గ్రామ్యము' అనే వ్యాసంలో అప్పారావుగారు చూపించారు.[7]

పండితులమనుకొనే వాళ్ళ రచనలలోనే శబ్ద తప్పులూ, అర్థతప్పులూ విరివిగా దొర్లుతున్నప్పుడు విద్యార్థుల వ్యాసరచనల్లో, అనువాదాలలో కనబడకుండా ఉంటాయా? వచ్చీ రాని గ్రాంథికంలో కన్నా అలవాటైన వాడుక భాషలో రచనలు చేయవచ్చుననే అభ్యనుజ్ఞ ఇచ్చాక వ్యావహారిక భాషలోనే గ్రంథాలు రాయించి వాటిని పాఠ్యగ్రంథాలుగా పెట్టడానికి అవకాశం లేదా అని ఏట్సుదొర ప్రశ్నించాడు. ప్రభుత్వ విద్యాశాఖవారు పూనుకొంటే అసాధ్యమైనది ఏదీలేదని వ్యావహారికవాదులు చెప్తారు. అప్పటికే పి.టి. శ్రీనివాసయ్యంగారు మద్రాసు విశ్వవిద్యాలయంలో సభ్యులు. వారు పూనుకొని విశాఖపట్నం ఏవియన్ కళాశాల హైస్కూల్లో హెడ్మాస్టరుగా ఉంటున్న సెట్టి లక్ష్మీనరసింహంగారి చేత 'గ్రీకుపురాణకథలు' అనే పుస్తకాన్ని రాయించి పాఠ్యగ్రంథంగా పెట్టించారు. ఈ పుస్తకం గురించి గురజాడ అప్పారావుగారు అంచనా ఇలా ఉంది.[8]

''గ్రీకుపురాణ కథలు మొదటి భాగం. దీన్ని సెట్టి లక్ష్మీనరసింహంగారు వ్రాశారు. హాల్కారు వండర్‌వుడ్, టేంగిల్‌వుడ్ కథలకిది అనువాదం. కథలలో గొప్పలక్షణాలు, సాహిత్య మెలకువలు వున్నాయి. తెలుగు సారస్వతంలో నూతన పోకడలను యివి ప్రవేశపెడుతున్నాయి. వీరేశలింగంగారి అనుసరణమువలె ఈయన అనువాదం చక్కగా వుంది. అనువాదకుడు మెలకువలు తెలిసిన రచయిత. సంధిని పరిత్యజించడంలో వొక నియమాన్ననుసరించారు. ఇది గ్రాంథికంలో వ్రాసిన గ్రంథమే.''

6. వ్యాసచంద్రిక - పుట.61
7. వ్యాసచంద్రిక - పుట.56
8. గురజాడ రచనలు - డైరీలు - పుట.194

సెట్టి లక్ష్మీనరసింహంగారు రమారమీ గ్రాంథికంలో ఈ గ్రీకు పురాణ కథలు రచించినా దీనికి శ్రీనివాసయ్యంగారు ఇంగ్లీషులో రాసిన ఉపోద్ఘాతం పట్ల పండితులు మండిపడ్డారు. అయ్యంగారు చేసిన మరొక 'మంచిపని'కి కూడా విమర్శలు వచ్చాయి. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు క్లాసులో అర్థాలను వాడుకభాషలోనే చెప్తారు. అందుచేత వాడుకభాషలోనే గణితశాస్త్రం మొదలైన గ్రంథాలు రాస్తే మంచిదని అయ్యంగారు భావించి లాంగ్‌మెన్స్ అండ్ కంపెనీవారికి 'ప్రాక్టికల్ అర్థమెటిక్' అనే పుస్తకం రాసి ఇచ్చారు. అందులో ఈ కింది చూపిన శైలి ఉంది.[9]

''6వ పుట. 'మొదటి జ్యామెట్రీలో డిఫినిషన్లు చెప్పవద్దు', 'కుట్టువాళ్ల బొమ్మలను ప్లానులను తనిఖీ చేసి రూళ్ళు కనుక్కోవడము అలవాటు చేయించు...'

''25వ పుట. 'ఒక బల్లమీద 2 నాట్లు కొట్టి వాటి మధ్య ఒక దారము వదులుగా పట్టుకో'. 'ట్రేసు కాగితము తోటి ఇది సమరేఖ అవునోకాదో చూడు'. 'బోర్డుమీద దారమునకు సుద్ద వ్రాసి 2 పాయింట్లను కలిపి', 'దారమునకు జేగురు వ్రాసి'......

''93వ పుట. 'మిగిలిన లెక్కలు 3-వ స్టెప్పులో చేయుటకు తగినవి'. 'లోని లెక్కలు చివర స్టెప్పులో చేయుటకు పనికి వచ్చేవి.' 'మొదట వచ్చిన ఆన్సరు యొక్క 'ఇంప్రాపర్ ఫ్రాక్షను అయినప్పుడు ఆన్సురును ఆ మోస్తరుగా వ్రాయవలెను'. 'మిక్సెడ్ నంబరుగాని అయినప్పుడు ఆ సంఖ్యను ఇంప్రాపర్ ఫ్రాక్షనుగా మార్చడము అగత్యము'....''

వ్యావహారిక భాషావాదులు సులభశైలిలోనూ, వాడుకభాషలోనూ పాఠ్యగ్రంథాలను రాయించి వాటిని ప్రభుత్వం చేత ఆమోదింపచేస్తే సనాతన పండితులు చూస్తూ ఊరుకోలేదు. 'ఆంధ్రభాషా మహాసంఘం' ఒకటి చాలా అత్యవసరమని జయంతి రామయ్యగారు ఆంధ్రపత్రికలో వ్యాసం రాసి గ్రాంథికవాదులను సంఘటితం చేయడానికి ప్రయత్నించారు. అప్పుడు ఆయన మద్రాసులో ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా పెద్ద హోదాలో ఉన్నవారు. జమీందారుల అండదండలు లభించాయి. పండితులు ముందుకు వచ్చారు.

1911 మార్చి 26వ తేదీనాడు మద్రాసు తేనాంపేటలో పిఠాపురం సంస్థానానికి చెందిన 'డెన్మోరు' మందిరంలో సభ జరిగింది. కందుకూరి వీరేశలింగం, వేదం వెంకటరాయశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు, కొమర్రాజు లక్ష్మణరావు, చెన్నాప్రగడ భానుమూర్తి, గోటేటి కనకరాజు, పిఠాపురం దివాను మొక్కపాటి సుబ్బారాయుడు మొదలైనవారు సభలో పాల్గొన్నారు. సమగ్రమైన ఒక తెలుగు నిఘంటు నిర్మాణం గురించి ఈ సభలో వీరేశలింగంగారు ప్రతిపాదించారు. దానిని సభవారు ఆమోదించారు. పిఠాపురం రాజా ధనసహాయం చేస్తానన్నారు. విస్తృతమౌతున్న తెలుగు భాషా సాహిత్యాలకు ఉపయోగపడేటట్టు నూతనంగా ఎన్నో ప్రక్రియలలో వచ్చి చేరుతున్న పారిభాషిక పదాలను ఇముడ్చుకొన్న సరికొత్త నిఘంటువు దేశానికి చాలా అవసరమైంది. 1885లో బహుజనపల్లి సీతారామచార్యులవారు ప్రచురించిన శబ్దరత్నాకరం తప్ప ప్రామాణికమైన నిఘంటువు పరిమితపరిధిలోనైనా లేదు. 1903లో ఎం.వెంకటరత్నం, డబ్ల్యు.హెచ్.కాంబెల్, కందుకూరి వీరేశలింగంగారు 'బ్రౌణ్యం' రివైజు చేసి ప్రచురించారు

9. ఈ ఉదాహరణలను వేదం వేంకటరాయశాస్త్రిగారు తమ 'గ్రామ్యాదేశనిరసనం' అనే గ్రంథంలో పొందుపరిచారు. పుట. 8,9

గాని ఇంకో కోశం నిర్మించాలని సాహితీపరులు భావించారు. ఈ సభలో వ్యావహారిక భాషావాదాన్ని అడ్డుకోవాలన్న ప్రయత్నాలేం జరగలేదు. నిర్మాణాత్మకమైన కార్యక్రమాన్ని చేపట్టదలిచారు.

ఆ సంవత్సరమే ఇంకో నెలా పదిహేను రోజుల తర్వాత మే 12వ తేదీనాడు 'ట్రిప్లికేను హిందూ హైస్కూలు భవనంలో 'భాషా సంఘ నిర్మాణం' నిమిత్తం మరోసభ జరిగింది. దీనికి పిఠాపురం రాజావారు అధ్యక్షత వహించారు. వెంకటగిరి రాజాగారు ధనసహాయం చేస్తామని లిఖితపూర్వకంగా తెలియచేశారు. బొబ్బిలిరాజా సుముఖులు. చల్లపల్లి కుమారరాజా, నడిమి తిరువూరు, మునగాల, పోలవరం, భీమవరం, మైలవరం, జమీందార్లు, విక్రమదేవవర్మ, వాడ్రేవు వెంకటకృష్ణారావు బహద్దరు, పానుగంటి రామారాయణింగారు, ప్రథమసభ్యులుగా చేరడానికి అంగీకరించారు.

ఈ జమీందార్ల తర్వాత శాసనమండలి సభ్యులైన ఆనరబుల్ పిట్టి త్యాగరాయసెట్టి, జె. రాఘవరావు, మోచర్ల రామచంద్రరావు భాషా సంఘ సభ్యులయ్యారు.

అయ్యదేవర కాళేశ్వరరావు
ఆచంట లక్ష్మీపతి
దివాన్ బహదూర్ కంచికృష్ణస్వామిరావు
రావుబహదూర్ కందుకూరి వీరేశలింగం
కొక్కొండ వెంకటరత్నం
కొమర్రాజు లక్ష్మణరావు
గురజాడ అప్పారావు
గోటేటి కనకరాజు
చిలకమర్తి లక్ష్మీనరసింహం
జయంతి రామయ్య
జి.వి. రంగారావు
రావు సాహెబ్ టి. రాఘవయ్య
పండిత డి. గోపాలాచార్యులు
నెమలి పట్టాభిరామారావు
రావుబహదూర్ బయ్యా నరసింహేశ్వరశర్మ
దివాన్ బహదూర్ ముట్నూరి ఆదినారాయణయ్య
మొక్కపాటి సుబ్బారాయుడు
దివాన్ బహదూర్ యు.వి.రామదాసునాయుడు
రెంటాల వెంకటసుబ్బారావు
వరాహగిరి జోగయ్య
వేదం వెంకటరాయశాస్త్రి
వేపా రామేశంగార్లు ఇతర సభ్యులు.[10]

10. ఆంధ్రసాహిత్య పరిషత్ ప్రథమ సాంవత్సరిక సభావృత్తాంతం - ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపుటి-1, సంచిక-1, ఈ పేర్ల వివరాలు కె.వి.రమణారెడ్డిగారి 'మహోదయం' పుటలు 194, 195లలో ఇచ్చారు.

విభిన్న దృక్పథాలు గలవారైనా ఇంతమంది సాహితీపరులు ఒకచోట సమావేశమై భాషా సంఘ నిర్మాణానికి ప్రయత్నించడం ప్రశంసనీయమైనదే. చర్చలు జరిపి ఒకరి వాదాన్ని ఇంకొకరికి నచ్చ చెప్పాలనీ, ప్రతిపక్షులను తమ వైపు తిప్పుకోవాలనీ ఉవ్విళ్ళూరుతున్న రోజులు. ఎవరి వాదాలను వారు వదులుకోకపోయినా రెండు విరుద్ధ శాఖలుగా ఇంకా చీలిపోలేదు. అయితే ఆ సూచనలు మాత్రం కనబడసాగాయి. భాషా విషయంలో అభిప్రాయభేదాలున్నా సంఘ నిర్మాణ విషయంలో అందరూ ఏకాభిప్రాయం గలవారే.

1911 మే 12వ తేదీ నాటి సభ తరువాత మళ్ళా ఆ సంవత్సరం 20వ తేదీనాడు పచ్చయప్ప కళాశాల భవనంలో 2వ సమావేశం జరిగింది. భాషా సంఘానికి తెలుగులో 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' అనీ, ఇంగ్లీషులో 'తెలుగు అకాడమీ' అనే పేరును పెట్టారు. పిఠాపురం, వెంకటగిరి రాజాలు పదివేల రూపాయల మూలధనం ఇచ్చి ప్రతిష్ఠాపకులు అయ్యారు. వెయ్యి రూపాయల చొప్పున ఇచ్చినవారిని పోషకులుగానూ, నూటికి తక్కువ కాకుండా ఇచ్చిన వాళ్ళను యావజ్జీవ సభ్యులుగా చేర్చుకొన్నారు. సాధారణ సభ్యులు సంవత్సర చందాలు ఇస్తే చాలు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు. జయంతి రామయ్యగారు అధ్యక్షులు, పురాణం నాగభూషణం, వేదం వెంకటరాయశాస్త్రి, ఆచంట లక్ష్మీపతి ముగ్గురూ కార్యదర్శులు, కంచి కృష్ణస్వామిరావు, పిట్టి త్యాగరాయసెట్టి పరిషత్తుకు ట్రస్టీలు.

పరిషత్తు ఏర్పడి ఒక రూపాన్ని సంపాదించుకొన్నాక అందులోని గ్రాంథికవాదులకు కొంత వేడి పుట్టింది. వాడుకభాషావాదులు ''ఇప్పుడు భాషలో గల గాంభీర్యమూ, బిగువూ, సాదుశబ్ద ప్రయోగం, జాతీయాలు, వాక్యరమ్యత చెడగొట్టే గ్రంథాలు ప్రవేశపెడుతున్నారు కాబట్టి వాటిని అరికట్టాలి. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ తెలుగు పండిత పదవిలో ఉన్న వావిలకొలను సుబ్బారావుగారు కలం పట్టుకొన్నారు. ఆంధ్ర భాషాభివర్ధని సమాజం వారి అభ్యర్థనను అనుసరించి "The Modern Telugu Prose - A Review" అనే గ్రంథాన్ని రచించారు. ఇటీవల వాడుక భాషావాదులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఖండించారు. ఇది 1911లోనే జరిగింది.

సెట్టి లక్ష్మీనరసింహంగారి పుస్తకానికి ఉపోద్ఘాతం, లాంగ్మెన్స్‌వారికి లెక్కల పుస్తకం రాసి వాడుకభాషను ప్రచారం చేసిన శ్రీనివాసయ్యంగారు ఇంతకు పూర్వమే "Life or Death; A Plea for vernaculars" అనే చిరుగ్రంథాన్ని కూడా రచించారు. ఇందులో వాడుకభాష జీవద్భాష అనీ, కావ్యభాష మాతృభాష అనీ పేర్కొనడం పండితుల ఆగ్రహానికి ప్రబల కారణమైంది. ఒక తమిళుడు ఒక తెల్లదొరతో కలసి తమ భాషను పాడుచేస్తున్నాడని పండితులు భావించారు. పాఠ్యపుస్తకాలుగా ఎన్నికైన గ్రీకు పురాణ కథలనూ, ప్రాక్టికల్ అర్థమెటిక్ గ్రంథాలను నిషేధింపచేయడానికి సభలు జరిపారు.

1912 ఏప్రిల్ 12వ తేదీనాడు మద్రాసు జార్జిటౌనులో పండితుల సభ జరిగింది. సభకు దివాన్ బహదూర్ యం. ఆదినారాయణయ్యగారు అధ్యక్షత వహించారు.

పిఠాపురం రాజాగారూ, పండిత డి. గోపాలాచార్యులు, సి. రాజరత్నం మొదలియారు, పురాణం నాగభూషణం, వేదం వెంకటరాయశాస్త్రి, జయంతి రామయ్య ప్రభృతులు సభలో పాల్గొన్నారు. సభలో వేదం వెంకటరాయశాస్త్రిగారు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. దానిని పురాణం నాగభూషణంగారు బలపర్చారు. ఆ తీర్మానపాఠం ఇలా ఉంది:

''....గ్రాంథిక భాషను నాశనం చేస్తూ దానికి మారుగా వ్యావహారిక భాషను నెలకొల్పాలని తెలుగుదేశంలో కొన్ని ప్రాంతాలలో తల ఎత్తుతున్న ఉద్యమమును మద్రాసు పౌరులమైన మేము తీవ్రంగా నిరసిస్తున్నాం. ఈవిధంగా ప్రారంభమైన ఈ ఉద్యమము ఆంధ్ర భాషా మాధుర్యమును, పావిత్ర్యమును, సమైక్యమును ధ్వంసము చేయడమేగాక, ఆంధ్రుల మత విజ్ఞానము, ప్రాచీన నాగరికత యే గ్రంథములలో నిక్షిప్తమై వున్నవో, ఆ గ్రంథములలోని భాషను తెలుగు ప్రజలకు అందకుండునట్లు చేయవలెనని ప్రయత్నిస్తున్నది. ఈ విషయమును గ్రహించి, యిట్టి ప్రమాదము సంభవించకుండా దీనిని నిరాకరించవలసినదిగా మేము ప్రభుత్వము వారిని, డైరక్టరాఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్సనూ, మద్రాసు విశ్వవిద్యాలయపు సిండికేటు వారినీ ప్రార్థిస్తున్నాం.''

ఈ ప్రధాన తీర్మానానికి అనుబంధంగా మానవల్లి రామకృష్ణ కవిగారు ఇంకొక తీర్మానాన్ని ప్రతిపాదిస్తే; భీమ శంకరంగారు, గురుస్వామిచెట్టిగారు బలపరిచారు. దాని పాఠం ఇది:

''.... ఈ తీర్మానములో పేర్కొనబడిన ఉద్యమమునకు విద్యాధికారులొసంగిన ప్రోత్సాహమును గమనించి, యీ సభ వారు ఎంతో భయవిహ్వలులౌతున్నారు. తెలుగు ప్రజల ఆమోదము పొందని ఎవరో కొందరు వ్యక్తులు ప్రారంభించిన నామమాత్రమై వున్న భాషా సంస్కరణోద్యమమును విద్యాధికారులు ఈవిధంగా ప్రోత్సహించడము వల్ల ఎంతో ఉపద్రవము వాటిల్లగలదన్న విషయమును విద్యాశాఖ వారికి ప్రభుత్వమునకు ఈ సభవారు తెలియచేస్తున్నారు.''

తరవాత (మల్లాది) సూర్యనారాణశాస్త్రిగారు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. సభ వారు దానిని ఏకగ్రీవంగా ఆమోదించారు. దాని పాఠం ఇది :

''గ్రీకు పురాణ కథలు, లాంగ్మన్సు ప్రాక్టికల్ అర్థమెటిక్స్ మొదలైన వాటిని పాఠ్యగ్రంథాలుగా వేయడాన్ని దృష్టిలో వుంచుకొని, డైరక్టరు ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్, మద్రాసు విశ్వవిద్యాలయ సిండికేటువారినీ, ప్రభుత్వము వారినీ సభవారు ఈ దిగువ సూచనలను ఆమోదించవలసిందిగా అభ్యర్థిస్తున్నారు.

1. పాఠశాలలోను, కళాశాలలోను వేసే పాఠ్యగ్రంథాలను ఎన్నిక చేయడానికి విద్యారంగంలో అనుభవజ్ఞులను, అందరి ఆమోదము పొందిన పండితులను సభ్యులుగా ఒక కమిటీని నెలకొల్పాలనీ,

2. ఆంధ్రభాషా వ్యాకరణములలోని సూత్రములకు బద్ధమయే భాషలో రచించిన పుస్తకములనే పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించాలనీ యీ సభవారు కోరుతున్నారు.''

ఈ తీర్మానాల గురించి, సభలోని విశేషాల గురించి 1912 ఏప్రిల్ 12వ తేదీనాడి హిందూ పత్రిక విపులమైన రిపోర్టు ప్రచురించింది.[11] పరిషత్తువారు విద్యాశాఖవారి తెలుగు బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ను పూర్తిగా స్వాధీనపరుచుకోవాలనే ఈ తీర్మానం చేయించారు. జయంతి రామయ్యగారు, వావిలకొలను సుబ్బారావుగారు నిజానికి అప్పుడే దానిని ఆక్రమించుకొనే ప్రమాదం సంభవించిందని ఏట్సుదొర గురజాడ అప్పారావుగారికి 1912 జూన్ మూడవతేదీనాడు ఒక ఉత్తరంలో తెలియచేశారు.[12]

విద్యావిధానంలో వాడుకభాషను ప్రవేశపెట్టడానికి ఎంత దృఢ నిశ్చయాన్ని ప్రదర్శించారో, అంతటి గట్టి సంకల్పంతోనో గురజాడ అప్పారావుగారూ, వారి సహచరులు పాఠ్యపుస్తకాలలో ప్రబంధకవుల శృంగార విశృంఖలత్వాన్ని అరికట్టాలని ప్రయత్నించారు. 'కావ్యాలలో శృంగారం' అనే శీర్షికతో అప్పారావుగారు ఒక వ్యాసం రాసి వేదం వెంకటరాయశాస్త్రిగారు 'ఉష' నాటకంలోనూ, వీరేశలింగంగారూ వివిధ ప్రహసనాల్లోనూ, ప్రబంధాలలోనూ పచ్చి శృంగారాన్ని ఎలా వర్ణించారో పుటల సంఖ్యలతో సైతం తెలియచేసి ''ఇట్టి గ్రంథరచన లోకమునకు హానిచేయును, దీనిని నిలుపవలయునని మా మతము'' అని స్పష్టం చేశారు.[13]

గ్రాంథికవాదులకు వ్యావహారిక వాదాన్ని ప్రతిఘటించడం ఎంత ముఖ్యమైనదో, కావ్యాలలో శృంగారాన్ని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమైన సమస్యగా తోచింది. అందుకే 1912 మే నెల 15, 16 ఏదీలలో మద్రాసు పచ్చయప్ప కాలేజీలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశం తొలిరోజునే శృంగార రసవిషయమై చర్చలు జరిగాయి. 15వ తేదీ నాటి సభకు పురాణం నాగభూషణంగారు అధ్యక్షత వహించారు. ఇరుపక్షాలవారూ తమ తమ వాదాలు ప్రకటించారు.

కొన్ని ప్రాచీన కావ్యాలలో ఔచిత్యశోభితం కాని హద్దుమీరిన అసహ్యాశృంగార పద్యాలు వున్నాయనీ, వాటిని విద్యార్థులకు పఠనీయభాగాలుగా వేయకూడదనీ గ్రంథ నిర్ణాయక సంఘంలో సభ్యులైన గురజాడ అప్పారావు ప్రభృతుల మతం.

ఆధునికుల మతాన్ని అంగీకరించకూడదనీ, ప్రాచీన కావ్యాలలో హద్దుమీరిన అసహ్యా శృంగార వర్ణనలు లేవనీ; అవి ఔచిత్య శోభితాల అనీ వాటిని పఠించడం వల్ల అపకారమేమీలేదనీ, అందుచేత అవి విద్యార్థులకు పఠనీయాలుగా ఉండవచ్చునని గ్రాంథికవాదులైన జయంతి రామయ్య ప్రభృతుల మతం.

చర్చలు జరిగిన తరువాత గ్రాంథికవాదుల మతాన్ని అనుసరించి ఒక తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. దాని సారాంశం ఇది.

''తెలుగు కావ్యములలో శృంగార వర్ణనము, లేదా శృంగార రస పోషణము ప్రధానము. నవరసములలోను శృంగారము ప్రధామని సంస్కృతమున అలంకార శాస్త్రము

11. గురజాడ రచనలు - లేఖలు - పుటలు 133, 4
12. గురజాడ రచనలు - లేఖలు - పుట.134
13. గురజాడ రచనలు - వ్యాసచంద్రిక - పుట.14

గుర్తించింది. ఆ అలంకార శాస్త్రములను అనుసరించి, తెలుగు కావ్యములలో శృంగార రసము పరిపోషితమవుతూ వచ్చింది. ఆధునికుల అభిరుచులకు అనుగుణముగా కావ్యములలోని శృంగార వర్ణనములు గల భాగములను పరిహరించుట ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ప్రాచీన కావ్యాలలో అనుచిత అశ్లీలార్థక అసహ్య శృంగార వర్ణనలు లేవని, అవి అవినీతి స్ఫోరకములు కావని, వాటిని చదవడం వల్ల జాతికి ఎలాంటి హాని కలుగనేరదని ఈసభవారు విశ్వసిస్తున్నారు.''

సభ వారు ఆమోదించిన తీర్మానం పాఠాన్నీ, సభావిశేషాలనూ 1912 మే 20వ తేదీనాడు హిందూ పత్రిక ప్రచురించింది.

రెండవరోజు సభలకు చల్లపల్లి జమీందారు వై.అంకినీడు ప్రసాదు అధ్యక్షత వహించారు. ఆనాడు సభలో ఈ క్రింది అయిదు విషయాలు చర్చించదలిచారు.

1. కొత్తగా వ్రాస్తున్న తెలుగు కావ్యాలను ఇప్పుడు అనుసరిస్తున్న గ్రాంథికంలో కాక వ్యావహారిక భాషలో వ్రాయవలసిన అగత్యం ఉన్నదా?
2. అర్థానుస్వార ప్రయోగం ఉండవచ్చునా? అక్కరలేదా?
3. లఘు, అలఘురేఫల భేదమును పాటించాలా? అక్కరలేదా?
4. తెలుగు భాషలో అన్యభాషాపదాల చేరిక
5. సంధిసూత్రాలను పాటించడం

సభలో గురజాడ అప్పారావుగారు మొదటి విషయంపై విపులంగా ఉపన్యసించి తమ వాదాన్ని తెలియచేశారు. గ్రాంథికవాదులు తమ సంఖ్యాబలం వల్ల తమకు ఆమోదయోగ్యమైన తీర్మానాలను ప్రతిపాదించి నెగ్గించుకొన్నారు. ఈ సభ వివరాలను 1912 మే 20వ తేదీ హిందూ పత్రిక ఇలా రిపోర్టు చేసింది :

''శ్రీ జి.వి. అప్పారావుపంతులు ప్రసంగిస్తూ వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని విపులీకరించారు. చర్చలు ఎంతో ఆసక్తిని కలిగించాయి. సభకు హాజరైన వారిలో శ్రీ అప్పారావు పంతులుగారొక్కరే వ్యావహారిక భాషావాదమును సమర్థిస్తూ ప్రసంగించినవారు. గ్రాంథికభాషకు బదులుగా వాడుకభాషలోనే రచన కొనసాగవలెనని ఆయన ఉపన్యసిస్తున్నప్పుడు తాము చెబుతున్న ప్రకారం 'వాడుకభాషలోనే' రచన సాగించవలసిన అవసరమేమొచ్చిందనీ, యిందుకు గల కారణాలేమిటనీ, తెలుగు దేశములో పలు మాండలికాలుండగా, తమ వాదం ఎలా ఆచరణ యోగ్యమవుతుందనీ సభలో అనేకులు ఆయనను ప్రశ్నించారు. భాషా సంస్కరణ ఆవశ్యకత ఎంత మాత్రం లేదని పేర్కొంటూ వ్యాసరచనలో గ్రామ్యము లేదా వాడుక భాషను ప్రయోగించనక్కర లేదని వ్యావహారిక గ్రాంథిక భాషలకు ప్రధానముగా భేదమేమీలేదని, తెలుగున పాఠకుల సంఖ్యాభివృద్ధికి, వ్యాకరణ సూత్రములను ఉల్లంఘించకుండానే సులభగ్రాంథిక శైలిని అనుసరించవచ్చునని సభవారొక తీర్మానం కావించారు. ఇప్పటివలె ఎప్పుడు లఘు అలఘు రేఫల భేదాన్ని పాటిస్తూ ఉండాలని పద్య రచనలో విధిగా సంధి సూత్రములను

పాటించాలని, అర్ధానుస్వార ప్రయోగమును పరిత్యజించరాదని పరిషత్తువారు మరికొన్ని తీర్మానాలను ఆమోదించారు.''

తమ వాదాన్ని సభలో నెగ్గించుకొన్నాక పరిషత్తువారు తదనంతర కార్యాచరణకు పూనుకొన్నారు. సమావేశం తొలిరోజున శృంగార రస కావ్యాల గురించి, రెండోరోజున గ్రామ్యభాష నిషేధం గురించి ఆమోదించిన తీర్మానాలను గవర్నరుగారికి నచ్చచెప్పి అవి అమలు జరిపే ప్రయత్నాలు చేయడానికి సభ వారు ఒక ప్రతినిధి వర్గాన్ని ఎన్నుకొన్నారు. ఈ రాయబారవర్గంలో మోచర్ల రామచంద్రరావు, బయ్యాన నరసింహేశ్వరశర్మ, పండిత డి. గోపాలాచార్యులు, పట్టాభి రామారావు, సూర్యనారాయణరావు, యానాదిరెడ్డి, వేమవరపు రామదాసు సభ్యులుగా ఉన్నారు. వీరందరూ 1912 ఆగస్టు 7వ తేదీనాడు గవర్నరును కలుసుకొని గ్రాంథిక భాషా ప్రాశస్త్యాన్ని ఉగ్గడించడమేకాక, వ్యావహారిక భాషా గ్రంథాలను పాఠ్యపుస్తకాలుగా నిర్దేశించడం వల్ల భాషాభివృద్ధికి ఆటంకం కలుగుతుంది కాబట్టి దానిని అరికట్టాలని ఒక విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.

రాయబార వర్గం వారి ప్రయత్నాలు కొంతవరకూ ఫలించాయి. పూర్వం స్కూలు ఫైనలు విద్యార్థులకు అపరిమిత భాషా స్వేచ్ఛను ఇవ్వడం వల్లనే విభేదాలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వ విద్యాశాఖవారు 1912 సెప్టెంబరు నెలలో ఒక తాఖీదును ఇచ్చింది. దీని ప్రకారం స్కూలు అధికారులు తమ విద్యార్థులు ఏ శైలిలో అనువాదం చేయవలసిందీ ముందుగానే వెల్లడిచేయాలి.

ఇంకొక నెలలో ఈ తాఖీదులో సవరణ తీసుకువచ్చారు. 1912 అక్టోబరు 29వ తేదీనాటి తాఖీదు ప్రకారం ఒక స్కూలుకు సంబంధించిన విద్యార్థులందరూ ప్రాచీన శైలిలోగాని, నవీనశైలిలోగాని అనువాదం చేయాలేగాని రెండింటిలోనూ కూడదని చెప్పారు.

విద్యాశాఖవారు ఇక్కడితో ఊరుకోలేదు. 1913 జనవరి 10వ తారీఖున అంటే రెండవ సవరణ చేసిన మూడు నెలలలోపున ఇంకొక సరికొత్త సవరణనను తెచ్చింది. స్కూలు ఫైనలు విద్యార్థులు అనువాద రచనను వేర్వేరు శైలులలో రాయవచ్చును. ఒకే స్కూలుకు చెందిన విద్యార్థులు ఒక్క శైలికే కట్టుబడి ఉండాలన్న నిర్బంధం లేదు.[14]

స్కూలు ఫైనలు విద్యార్థుల విషయంలో ఈవిధంగా విభిన్న సమయాలలో విభిన్న నియమాలను ప్రకటించిన విద్యాశాఖవారు ఇంటరు పరీక్షలో విద్యార్థులు వ్యాసరచనకు అనుసరించవలసిన శైలి గురించి ఒక నిర్ణయం తీసుకోలేదు. లోగడ 1910లోనే ఈ తరగతి విద్యార్థులకు ప్రామాణిక శైలిని నిర్ధారణ చేయడానికి దక్షిణాది నున్న వివిధ భాషలలో భాషకొక కమిటీ చొప్పున నియమించారు. అప్పుడు తెలుగుభాష కమిటీకి రావు బహదూర్ యం.రంగాచారియార్‌గారిని సమావేశకర్తగా చేసి కందుకూరు వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, పి.టి.శ్రీనివాసయ్యంగారు, పి. రామాయణింగారు, రివరెండు జె.ఆర్.సిట్వెల్‌గార్లను సభ్యులుగా నియమించారు. 1912 నాటికి ఈ కమిటీని పునర్నిర్మించవలసి వచ్చింది.

14. కె.వి. రమణారెడ్డి - మహోదయం, పుట.186లో ఈ తారీఖుల భోగట్టాలు ఇచ్చారు.

ఇంతకీ 1912-13 విద్యా సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఇంటర్‌మీడియట్‌కు 5,823గురు, బి.ఏ.కు 1012 గురు విద్యార్థులే ఉన్నారు. ''భాషా పాండిత్యము సంపాదించుకొనదలచి చదువుకొనువారు'' 71 మంది తెలుగువారు మాత్రమే ఉన్నారు.[15] విద్యార్థుల సంఖ్య ఎంత తక్కువైనా, ఎక్కువైనా వారు అనుసరించవలసిన శైలిని నిర్ణయించడం విద్యాశాఖవారి ధర్మం.

మద్రాసు విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు 1911 జూలై 18వ తేదీనాడు రాసిన లేఖలో ఇలా తెలియపరిచాడు. సిండికేటు దేశీయ భాషలలో ఇంటర్‌మీడియట్ సమాధానపత్రాలను ఏ ప్రామాణిక భాషలో వ్రాయాలన్న విషయాన్ని నిర్ణయించేందుకు ఒక కమిటీని నియమించింది. తెలుగు కమిటీలో సభ్యులు ఈ క్రిందివారు :

ప్రొఫెసర్ ఎం. రంగాచారి (సమావేశకర్త)

కందుకూరు వీరేశలింగం

కొమర్రాజు లక్ష్మణరావు

పి.టి. శ్రీనివాసయ్యంగారు

పి. రామాయణింగారు

జె.ఆర్. సెట్విల్

పై కమిటీని నియమించిన మూడునెలల తర్వాత 1911 అక్టోబరులో గుమ్మడూరి వెంకటరంగారావుగారిని, మరుసటి సంవత్సరం 1912లో గురజాడ అప్పారావుగారిని పై ఇంటర్‌మీడియట్ కాంపోజిషన్ కమిటీలో సభ్యులుగా చేర్చారు. ఈ కమిటీవారు ఏయే సూచనలు చేశారోగాని ఇంతకు పూర్వం తమిళ భాషకు కూడా ఇటువంటి కమిటీని ఒకదానిని నియమించడం, దాని సభ్యులు తమ సూచనలను సిండికేటుకు అందచేయడం జరిగింది. తమిళ కమిటీవారి నివేదిక ప్రతిని ఒకదానిని తెలుగు సభ్యులకు అందచేసి, ఇష్టమైతే వాటిని అనుసరించవచ్చని చెప్పారు.

సమాలోచనం ప్రారంభంలో సమావేశకర్త ప్రొఫెసర్ రంగాచారి ప్రధాన ద్రావిడ భాషలు ప్రతి ఒక్క దానిలోనూ గ్రాంథిక భాష వ్యావహారిక భాషకు బాగా దూరమైపోయిందని, సిండికేటు అభిప్రాయపడిందనీ, తమ సమాధాన పత్రాలలో విద్యార్థులు ఉపయోగించదగ్గ వ్యావహారిక భాషకు ఒక ప్రమాణం నిర్ణయించాలనీ, ఆవిధంగా ఈ రెండు శైలులు చేరువకు తీసుకురావాలని చెప్పారు. ఇందుకు తొలి చర్యగా, వర్తమాన పదరూపాల పట్టికలు నిర్ణయించడానికి ఒక ఉపసంఘాన్ని చర్చల తర్వాత నియమించాలని చెప్పారు. పని త్వరిత గతిని సాగేందుకు 1913 మార్చి నెలలో కాంపోజిషన్ కమిటీని పునర్నిర్మించాలని అనారోగ్య కారణాలవల్ల తాము సమావేశకర్తగా ఉండలేమని ప్రొఫసర్ రంగాచారిగారు చెప్పారు. కానీ కమిటీ సభత్వత్వం మాత్రం వారిది తర్వాత కొనసాగింది. ఇప్పుడు కమిటీ సభ్యులపేర్లు ఇవి.

15. ఈ లెక్కలు పానుగంటి లక్ష్మీనరసింహంగారి 'సాక్షి' వ్యాసంలో ఉన్నాయి. సాక్షి సంపుటి-1, పుట.17

1. గుమ్మడూరి వెంకటరంగరావు (సమావేశకర్త)
2. కొమర్రాజు లక్ష్మణరావు
3. జయంతి రామయ్య
4. వేదం వెంకటరాయశాస్త్రి
5. పి.టి. శ్రీనివాసయ్యంగారు
6. గురజాడ అప్పారావు
7. గిడుగు రామమూర్తి
8. బుర్రా శేషగిరి రావు
9. ఆర్.డబ్ల్యు. రాస్
10. ప్రొఫెసర్ ఎం. రంగాచారి

ఉపసంఘాన్ని నియమించడానికి ముందు అది నిర్వహించవలసిన సభ్యులను నిర్దేశించే సూత్రాన్ని గురజాడ అప్పారావుగారు ఒక తీర్మానరూపంలో ప్రవేశపెట్టారు. దాని పాఠం ఇలా ఉంది:

''నామవాచక సర్వనామ క్రియాపద రూపాలను సాధ్యమైనంతవరకు పురాతన, వర్తమాన రూపాల కింద వర్గీకరించాలి. ఆధునిక వచన రచనలో వర్తమాన రూపాలను మాత్రమే వాడేందుకు అనుమతించాలి.''

ఈ తీర్మానాన్ని బుర్రా శేషగిరిరావు బలపర్చగా జయంతిరామయ్యగారు, కొమర్రాజు లక్ష్మణరావుగార్లు ఒక సవరణను తెచ్చారు. తీర్మానపాఠంలోని 'నామవాచక, సర్వనామ, క్రియాపద స్వరూపాల' అన్న మాటలకు ముందు ''ప్రామాణిక తెలుగు సాహిత్య భాషలో ఉన్న'' అనే షరతును విధించాలన్నారు. తరువాత ప్రొఫెసర్ రంగాచారిగారు మరో సవరణను ప్రతిపాదించారు. ఆర్.డబ్ల్యు.రాస్ దానిని బలపరిచారు. రంగాచారిగారు సూచించిన సవరణను అప్పారావుగారు ఆమోదించారు. అప్పుడు తీర్మానపాఠం ఇలా ఉంది:

''సాహిత్యంలో ప్రయోగాన్ని బట్టి, చదువుకొన్న తెలుగు ప్రజలు శిష్టవ్యావహారిక భాషనుబట్టి కూడా వర్తమాన పదరూపాలు నిర్ణయించాలి.''

ప్రొఫెసర్ రంగాచారిగారి సవరణలోని మాటలు స్పష్టంగా ఉన్నాయి. శిష్టవ్యావహారిక భాషనుబట్టి కూడా వర్తమాన పదరూపాలు నిర్ణయించాలి.''

ప్రొఫెసర్ రంగాచారిగారి సవరణలోని మాటలు స్పష్టంగా ఉన్నాయి. సవరణను ప్రవేశపెడుతూ ఆయన చేసిన ప్రసంగం ఎటువంటి సందేహానికి ఆధారం ఇవ్వదు. చదువుకొన్న తెలుగువారి శిష్టవ్యావహారిక భాషకు ఉదాహరణగా 'వస్తాడు' అన్న పదాన్ని ఆయన పేర్కొన్నారు. గ్రాంథిక భాషా వ్యాకరణానికిగాని, కవుల ప్రయోగానికిగాని అనుగుణంగా లేని శిష్ట వ్యావహారిక రూపాలకు తావులేకుండా చేయడానికే జయంతి రామయ్య, కొమర్రాజు లక్ష్మణరావుగార్లు 'ప్రామాణిక తెలుగు', 'సాహిత్యభాషలో' అన్న సవరణను తెచ్చారని, దానిని అంగీకరించకూడదనీ చెప్పడానికి

రంగాచారిగారి వివరణ ప్రయత్నించింది. ఈ కొత్తపాఠాన్ని కమిటీ మెజారిటీ సభ్యులు ఆమోదించారు.

మెజారిటీ సభ్యులు	మైనారిటీ సభ్యులు
1. గురజాడ అప్పారావు	1. జయంతి రామయ్య
2. ఎం. రంగాచారి	2. వేదం వెంకటరాయశాస్త్రి
3. గిడుగు రామమూర్తి	3. కొమర్రాజు లక్ష్మణరావు
4. బుర్రా శేషగిరిరావు	4. జి. వెంకటరంగారావు
5. ఆర్.డబ్ల్యు.రాస్	

ఈ ఇంటర్ మీడియేట్ కాంపోజిషన్ కమిటీలో వ్యావహారిక వాదుల సంఖ్యాబలం అధికం ఉన్నదని గ్రాంథికవాదులు ఆందోళన చెందారు. తమ పక్షాన్ని పటిష్ఠం చేసుకొనడానికి ఒక రాజకీయపు ఎత్తు ఎత్తారు. కమిటీలో అందరూ ఉత్తర జిల్లాల సాహితీపరులే ఉన్నారు. దత్త మండలానికి ప్రాతినిధ్యం లేదు. అందుచేత ఆ ప్రాంతం నుండి కనీసం నలుగురు సభ్యులను అదనంగా చేర్చాలని చెప్పారు. తమకు అనుకూలంగా ఉండే ఈ క్రింది వారిని చేర్పించారు.

1. బారిష్టరు కె. సుబ్బారెడ్డి
2. కోలాచలం శ్రీనివాసరావు
3. నాడపూడి కుప్పుసామయ్య
4. టి. శంకరలింగం పిళ్లె

కాంపోజిషన్ కమిటీలో అదనపు సభ్యులు వచ్చి చేరినా 'పురాతన, వర్తమాన పదరూపాల పట్టికను తయారుచేయడానికి ఉద్దేశించే ఉపసంఘాన్ని ఆదిలో అనుకొన్నట్టే ముగ్గురు సభ్యులతో నియమించారు. ఇందులో వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, గురజాడ అప్పారావుగార్లు సభ్యులు. వీరు తమ అభిప్రాయాలను చర్చించి వేర్వేరు పట్టికలు తయారుచేశారు.

మొత్తానికి ఇంటర్ మీడియేట్ కాంపోజిషన్ కమిటీ 1911 అక్టోబరు 7వ తేదీన స్థాపన దగ్గర్నుంచి 1914 జనవరి 31వ తేదీనాడు జరిపిన చిట్టచివరి సమావేశంతో కలుపుకొని నాలుగేళ్ళలో ఏడుసార్లు కలుసుకొని మంతనాలు చేసింది.

ఉపసంఘంలో వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావుగార్లు మెజారిటీ సభ్యులుగా ఒక నివేదికను తయారుచేశారు. ఆదిలో తాము సూచించిన సవరణ వీగిపోయినా దానిలోని దృక్పథానికే వారు అంటిపెట్టుకొని తమ రిపోర్టును రచించారు. దీనికి గురజాడ అప్పారావుగారు విభేదించి తమ అసమ్మతిని ఒక పత్రం ద్వారా తెలియచేశారు. కాంపోజిషన్ కమిటీలోని సభ్యులందరూ వీటిని చర్చించి తమ అభిప్రాయాలను స్పష్టం చేశారు. కాంపోజిషన్ కమిటీ కార్యకలాపాలన్నిటినీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు 1914 ఆగస్టు 11వ తేదీనాడు ప్రకటించారు. ఇందులో రెండు

వాదాలకు చెందిన నివేదికలూ, సమావేశాల సమాచారం, ఇతర వివరాలు, విశేషాలు ఉన్నాయి. నివేదికలు ఇచ్చిన వారిలో శ్రీనివాసయ్యంగారు, గిడుగు రామమూర్తి, బుర్రా శేషగిరిరావు, జయంతి రామయ్య, కొమర్రాజు లక్ష్మణరావుగార్లు ఉన్నారు. ఉపసంఘ నివేదికను వేదంవారు, కొమర్రాజువారు ఉమ్మడిగా సమర్పించారు. దీనికి తన అసమ్మతిని గురజాడ మొదట 1913 డిసెంబరు 13న సమర్పించారు. తర్వాత ఈ వాదాన్ని సవరించి మరింత సమగ్ర రూపంలో రెండో అసమ్మతి పత్రాన్ని ఇచ్చారు. రాయలసీమ సభ్యులు అనుకూలత ప్రకటించాక గ్రాంథికవాదం బలపడింది. దానికి అసమ్మతి సూచకంగా 1914 జనవరి 17వ తేదీనాడు గిడుగు రామమూర్తి, బుర్రా శేషగిరిరావు, పి.టి.శ్రీనివాసయ్యం గార్లు కూడా తమ అసమ్మతిని తెలియచేశారు.

ఇంటర్‌మీడియేట్ కాంపోజిషన్ నిర్ణయంపై సిండికేటు ఒక నిర్ణయాన్ని తీసుకొనేలాగా దేశంలో పెద్ద దుమారం రేగింది. కరపత్రాల యుద్ధాలు, పత్రికలలో సంపాదక లేఖలు, నిపుణుల వ్యాసాలు మొదలైనవి ముమ్మరంగా వెలువడ్డాయి. వివిధ పండితులు తమ తమ అభిప్రాయాలను సభలలోనూ, వినతి పత్రాలద్వారా లోకానికి తెలియచేశారు.

1912లో నిడుదవోలులో గ్రామ్యవాదాన్ని ఖండించడానికి విద్యాశాఖవారు ప్రవేశపెట్టిన నిర్బంధ గ్రామ్యాన్ని తొలిగింప చేయడానికి ఒక విన్నపం పంపడం కోసం ఒక సభ జరిగింది. దానిలో సాహిత్య పరిషత్తు కార్యదర్శి వేదం వెంకటరాయశాస్త్రి ఒక ఉపన్యాసం చదివారు. ఇదే 'గ్రామ్యాదేశ నిరసనము' అనే కరపత్రంగా వెలువడింది. కొన్ని కొన్ని యుక్తులు, ఛలోక్తులూ దొర్లిన ఈ ఉపన్యాసం చిట్టచివర శాస్త్రిగారు గ్రామ్యవాదం భాషమీదకాక మతంమీద దాడి అనే ముక్తాయింపుతో మత వైషమ్యాలు రెచ్చగొట్టారు. వారి వాదన ఇలా ఉంది.[16]

''ఇది భాష మీఁదికి మాత్రమే వచ్చిన దాడియని పలువురు భ్రమించుచున్నారు. ఇది అట్టిది కాదు. ఇది హిందూమతము మీఁదికి ఎత్తివచ్చిన దాఁడి. ఇటిక యిటికగా లాగి కన్నము చేసి, ఇల్లు కొల్లఁబెట్టినట్లుగా, భాష భాషగా దేశభాషల నన్నిటిని ఇట్లు చెఱిచి మన మతమును సమూలఘాతముగా తెగటార్చునట్టి యుద్యమమిది. అది యెట్లన నిర్బంధ గ్రామ్యప్రాబల్యముచే అగ్రామ్య గ్రంథములు మూలఁబడును. మన పూర్వుల మహిమ, వారు మనకై గ్రంథ రూపమున నిక్షేపించి పెట్టిపోయిన ధర్మ నీతి జ్ఞాన విజ్ఞానములు, వారి కవనముల సొంపు, రామకృష్ణాద్యవతార మూర్తుల దివ్యచరిత్రములు, కృష్ణరాయాది మహాపురుషుల వైదుష్యాది విశేషములు, సర్వమును ఆంధ్రులకు ఇఁకను అబ్బనిలిబ్బి యగును. ఆ పారంపరిచే ఆంధ్రులకు, గీర్వాణ గ్రంథములు కూడా మూలఁబడును. ఇక అపూర్వ గ్రంథములను చదువు దిక్కెవ్వరు? వాని ఫలమును పొందు పుణ్యాత్ములెవ్వరు?''

పరిషత్తు కార్యదర్శిగా వెంకటరాయశాస్త్రిగారు ఇలా వితండవాదం మొదలుపెడితే జయంతి రామయ్యగారు 1913లో "A defence of Literary Telugu" అనే పేరుతో

16. గ్రామ్యాదేశ నిరసనము - పుట.46

'గ్రాంథిక తెలుగు భాషా సమర్థన' అనే కరపత్రం ప్రచురించారు. ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా ఉన్న తాను పదవిలో ఉండే పెద్దమనిషిగా మాత్రమేగాక, ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధ్యక్షునిగా, ఇంటర్ మీడియేట్ కాంపోజిషన్ కమిటీ సభ్యునిగా జయంతి రామయ్యగారు వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలి. ఈ కరపత్రాన్ని విశ్వవిద్యాలయం వారు పునర్ముద్రించి వ్యాసరచన కమిటీ సభ్యులకు పంపించారు.[17] అందుచేత ఇందులోని వాదాలన్నింటిని వ్యావహారిక వాదులు పరిశీలించి ఖండించవలసి వచ్చింది.

గిడుగు రామమూర్తిగారు 1913 దాకా తెలుగుభాష, తెలుగు వాఙ్మయం, తెలుగు భాషా బోధనలపై కూలంకషమైన అధ్యయనం చేసి, వ్యాకరణాలన్నీ మథించి, ప్రతిపక్షుల వాదాలను ఆకళించుకొని రచనా రంగంలోనికి దూకి వ్యావహారిక భాషను మొట్టమొదటిసారిగా ఆంధ్రపత్రిక 1913 ప్రమాదీచ సంవత్సరాది సంచికలో 'నేటి తేట తెలుగు' అనే వ్యాసం రాశారు. ''అన్ని జిల్లాల తెలుగు మాటలు, అన్ని జాతుల తెలుగు మాటలు కలసి సాపెక్కుతున్నవి. ఉత్తమ జాతుల వాడుక భాషకు గౌరవము సహజము గనుక అది వ్యాపిస్తున్నది. భేదాలుంటేనేమి? రైలుబండిలో అరిగిపోతున్నవి ఎగుడుదిగుళ్ళు అన్నీ, ఇదే కొత్త తెలుగు. నేటి తేట తెలుగు; వ్రాస్తూ ఉన్న నా తెలుగు; చదువుతూ ఉన్న మీ తెలుగు'' అని ప్రకటించారు.[18]

తెలుగు కాంపోజిషన్ కమిటీ సభ్యులుగా కూడా గిడుగు రామమూర్తిగారు "A Memorandum on Modern Telugu" 'ఆధునిక తెలుగుభాషపై ఒక వినతిపత్రం' అనే కరపత్రం 1913లో ప్రచురించారు. ఇది రచించడములో తమ ఉద్దేశాన్ని వారు మొట్టమొదటే స్పష్టపరిచారు.

మాతృభాషలో బోధించవలసివున్న బడిపిల్లల పుస్తకాల్లోనే కాకుండా, ప్రభుత్వంకాని, ప్రభుత్వాధికారులుగాని తెలుగు ప్రజలకు రాసే ఉత్తరాల్లో, పంపే వర్తమానాల్లో, ప్రచురించే పుస్తకాల్లో, కరపత్రాల్లో, వ్యవసాయ, వాణిజ్యం, పారిశుద్ధ్యం మొదలైన విషయాలు జనసామాన్యానికి తెలియడానికి ప్రచురించే వాటన్నింటిలోనూ వాడుకభాష వాడడానికి అనుమతించాలని చెప్పారు. ఈ పుస్తకానికి రెండు అనుబంధాలు చేర్చారు. తెలుగువారి ఉచ్చారణలో వచ్చిన ధ్వని పరిణామాల తీరుతెన్నులు పదస్వరూప నిర్ణయంలో భాషావాదుల్లో కనిపిస్తున్న గందరగోళం, కాలగతిలో ప్రాచీన ఆధునిక రూపాల మధ్యా, అర్థాలమధ్యా ఏర్పడ్డ అంతరం ఉదాహరణలతో వివరించారు. రెండో అనుబంధంలో మద్రాసులోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశంలో పండితులు చేసిన తీర్మానాలు (1912 కృష్ణాపత్రికలో అచ్చయినవి). తీసుకొని ఒక్కొక్క తీర్మానాన్ని సహేతుకంగా రామమూర్తిగారు ఖండించారు. ముఖ్యంగా విద్యార్థుల వాచక పుస్తకాలలో శృంగారరస ప్రధానమైన కావ్య భాగాల ఎంపిక చేసే విషయమై పండితులు వెల్లడించిన అభిప్రాయాన్ని గట్టిగా విమర్శించారు.[19] ఇది లోగడ గురజాడ అప్పారావుగారు ఏకాకిగా చేసిన పోరాటాన్ని ప్రశంసించి కొనసాగించడమే.

---

17. అసమ్మతి పత్రం - గురజాడ - పుట.40
18. సారస్వత వ్యాసములు - తృతీయ సంపుటం - పుట.449
19. పోరంకటి దక్షిణామూర్తి - 'మరోసారి గిడుగు రామమూర్తి' అనే సంకలనంలో - పుట.119 నుంచి

''వ్యావహారిక భాషావాదులు జీవద్భాషకూ, కృతక భాషకూ గల తేడాలను చూపించగానే పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు వంటి వారు ''హరిహరీ! మన గ్రాంథికాంధ్ర భాష మరణించినదా? ఎప్పుడు? ఎవ్వరును వినలేదే?.... పేరులేని సామాన్య జనుని యదార్థ మృతి వార్తనే జనులు వెల్లడిచేయుట కిష్టపడరు కదా! మన జాతిలోని భూత భవిష్యద్వర్తమాన ప్రాణముల కన్నిటికి బ్రాణమైన మన తెనుఁగు బాస చచ్చినదను నసత్య వార్త వీరెట్లు నోటఁ బలుకుటకు సాహసించిరో! అంతటితో నూరకుండక యీ వార్తను గ్రంథస్థము చేయుటకు వీరిగుండె లెట్లు తాళెనో? గ్రామ్యవాదులు విద్యావంతులు బుద్ధిమంతులు గాని వేఱుకారు. వారు బుద్ధిపూర్వకముగ నసత్యమాడువారు కారు. అందులో నిట్టి లోకోపద్రవకరమైన యసత్యమాడుదురా? ఈ మాయ యేమో బోధపడకున్నది'' అని వాపోయారు.[20]

గురజాడ అప్పారావుగారు ఈ విషయమ్మై తమ అసమ్మతి పత్రంలో విపులంగా వివరించారు. ఇలా రాశారు.[21]

''పేరా 69. కవిత్వభాషను మృతభాషగా పేర్కొనడం ప్రాచీన భాషావాదులైన కొందరికి కోపకారణమైంది. కాని మృతభాష అనే పదం భాషాశాస్త్రానికి చెందిన ఒక పారిభాషిక పదమే తప్ప, కించపరిచే పదం కాదు. పైపెచ్చు అది ఓజస్సు, సౌందర్యం, పవిత్రతా గుణాలను స్ఫురించేసే పదం. సంస్కృతం, పాళి, పారసీకం, హీబ్రూ, అరబ్బీ, గ్రీక్, లాటిన్ భాషలను మనం పేర్కొన్నప్పుడు, ప్రాచీన ప్రపంచం సాధించిన అభివృద్ధిని సమాహరించి చెప్పినట్లు లెక్క. ఈ భాషల్లో కొన్నిటికి నేటికీ సజీవ ప్రభావమున్నట్లు చెబుతారు. సజీవ ప్రభావం అనేది అలంకారిక పదబంధం; నేటికి వాటి ప్రభావం అనుభూతమవుతూందని అర్థం. కాని, అటువంటి ప్రభావం వాటిని జీవద్భాషలుగా చేయవు.''

గ్రాంథికవాదులలో వివిధ బృందాలలో సిద్ధాంతరీత్యా, ఆచరణరీత్యా ఉన్న మౌలిక భేదాలను అప్పారావుగారు తమ అసమ్మతిపత్రంలో పేర్కొన్నారు. జయంతి రామయ్యగారు రెండువాదాలు మాత్రమే అంగీకరిస్తున్నారు. కొమర్రాజు లక్ష్మణరావు గారు మూడువాదాలున్నాయని వాటిని ఇలా వివరంచారు.

1. ''పూర్వాచార వాదం - దీనికి ప్రతినిధులు ఛాందసులైన కొందరు పాతకాలపు పండితులు'', ''సాంప్రదాయక వ్యాకరణ నియమాలనుంచి ఏ మాత్రం వైదొలగినా సహజంగా, అసమ్మతి తెలిపే'' రకం.
2. ఆధునిక వచన భాషావాదం - ఈకోవకు చెందినవారు పురాతన రూపాల జోలికి పోకుండా వ్యాకరణ రీత్యా నిర్దుష్టమైన, సులభమైన శైలిలో, మామూలు పాఠకునిగా అర్థమయ్యే విధంగా రాస్తుంటారు. వీరికి రావుబహద్దూర్ కె. వీరేశలింగం పంతులుగారు నాయకుడు.

---

20. 'గ్రామ్యవాదుల భాషాపవాదము' - ఆంధ్రసాహిత్య పరిషత్తు - ప్రమాదీచ ఆశ్వయుజం - సంపుటి 2, సంచిక-3, సారస్వత వ్యాసములు - తృతీయ సంపుటంలో పునర్ముద్రితం - పుట.423 నుంచి
21. అసమ్మతి పత్రం - పుట.37

3. ''వాడుకభాషావాదం'' - అంటే ఆధునిక భాషావాదం. లక్ష్మణరావుగారి దృష్టిలో ఇది ''సాహిత్య సాంప్రదాయాన్ని, వ్యాకరణాన్ని పూర్తిగా విసర్జిస్తూంది; గుర్తింపు పొంది, ప్రాచుర్యానికి వచ్చిన కొత్త వచన శైలిని తోసివేసి, జనం మాట్లాడే వివిధ మాండలికాలకు ప్రామాణిక సాహిత్య భాషా గౌరవాన్ని, స్థానాన్నీ కట్టబెట్టాలని చూస్తూంది.''

మొదటి రెండు వాదాలూ సాంప్రదాయ వ్యాకరణాన్ని అనుసరిస్తున్నాయంటూనే పరస్పరం ఎంత విభేదిస్తున్నాయో అప్పారావుగారు వివరించారు. జయంతి రామయ్యగారు తమ కరపత్రంలో అప్పారావుగారిమీద ఒక అభియోగం మోపారు.

''పరీక్షాధికారిగా, పాఠ్యపుస్తక సంఘ సభ్యుడుగా తాను 'అంగీకృత ప్రయోగ, వ్యాకరణ నియమాలకు అనుగుణమైన పుస్తకాలనూ, ఈ నియమాలను ఉల్లంఘిస్తున్న పుస్తకాలను కూడ ఆమోదిస్తున్నా'ననీ; 'వ్యాకరణ నియమాలను అనుసరించడమా, లేక ఉల్లంఘించడమా' అనేది విద్యార్థి ఇష్టానిష్టాలకు వదలి వేయనున్నాననీ రామయ్యగారి ఆరోపణ. రామయ్యగారి, ఆయన కోవకు చెందినవారి ఇంగ్లీషు భాషే వేరు. ఇంగ్లీషు భాషలో రామయ్యగారి వ్యాఖ్యకు అర్థం కావ్యభాషలోగాని, ఆధునిక శిష్ట వ్యవహార భాషలోగాని రాసే స్వేచ్ఛను నేను రచయితలకు విద్యార్థులకు ఇస్తున్నానని... ఏ భాషలో రాసేవారు ఆ భాషకు ప్రత్యేకమైన వ్యాకరణ సూత్రాలను పాటించాలని నా పట్టుదలకాని, రామయ్యగారికి తెలిసింది ఒకే ఒక వ్యాకరణం, విద్యార్థుల సంగతి అందామా, వారు మామూలుగ దురదృష్టవశాత్తు ఈ రెండూ కాని సంకరభాష రాస్తున్నారు.''

పాఠ్యపుస్తకాలు ఎన్నిక చేసే విషయంలో అప్పారావుగారు ఈ క్రింది పుస్తకాలు సిఫార్సు చేశారు.

1. పువ్వాడ వెంకటరావుగారు ముద్రించిన ఏనుగుల వీరాస్వామయ్య 'కాశీయాత్ర చరిత్ర' అలహాబాదు, కాశీ, పాట్నా, పాట్నా నుంచి కలకత్తా వరకు ఆయన చేసిన యాత్ర.
2. బంకిమచంద్రుని 'కమలాకాంతుడు' లేక ప్రఫుల్లసేన, 'కామధేనువు'
3. కేతన దశకుమారచరిత్ర
4. రంగనాథరామాయణం - ఉత్తరకాండం (సరస్వతీ ప్రెస్)
5. బ్రౌను పరిష్కరించిన 'వార్స్ ఆఫ్ ది రాజాస్'

1913 నవంబరు 13వ తేదీ జరిగిన లెజిస్లేటివ్ కౌన్సిల్ సభలో బయ్యా నరసింహేశ్వరశర్మగారు 'పాఠ్యగ్రంథంగా ఉన్న ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్రలో భాష ఒక శైలిననుసరించి లేదనీ, వాడుకభాషలో గ్రంథరచన మంచిదికాదనీ, దీనికి నెల్లూరు రెడ్లు, తెలుగు జమీందార్లు వ్యతిరేకులని చెప్పారు. విద్యాశాఖవారు వాడుకభాషను ఆమోదిస్తూ స్కూలు ఫైనలు విద్యార్థులకు శైలుల విషయాలలో స్వాతంత్ర్యాన్ని ఇస్తూ జారీచేసిన సర్క్యులర్లను ఉపసంహరించుకొనేటట్లు గవర్నరుగారు ఆదేశించాలని ఒక తీర్మానంలో అర్థించారు. దీనిని మోచర్ల రామచంద్రరావుగారు

బలపర్చారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో గ్రాంథికభాషను సమర్ధిస్తూ, వ్యావహారిక భాషను దుయ్యబడుతూ కేశవపిళ్ళై, శేషగిరి అయ్యర్, కృష్ణారావు, వి.యస్.శ్రీనివాసశాస్త్రి మొదలైనవారు మాట్లాడారు. కొంతసేపు చర్చ జరిగిన తర్వాత విద్యాశాఖ డైరెక్టర్ ఆల్‌ఫ్రెడ్ బర్న్ స్కూలు ఫైనలు విద్యార్థులకిచ్చిన స్వాతంత్ర్యం తాత్కాలికమనీ, ఇంటర్‌మీడియేట్ కాంపోజిషన్ కమిటీ వారి నివేదికపై ఒక నిర్ణయం తీసుకొన్న తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని హామీ ఇచ్చిన తరువాత బయ్యా నరసింహేశ్వర శర్మగారు తీర్మానాన్ని ఉపసంహరించుకొన్నారు. ఈ విషయమై 1913 హిందూ దినపత్రిక ఇలా సంపాదకీయం రాసింది.

''విద్యాశాఖ డైరెక్టర్‌గారి సమాధానం అవమానకరమైనది... పాఠశాలల్లో రెండువిధాలైన శైలులను గుర్తించడం అర్థహితం. శ్రీ శ్రీనివాసశాస్త్రిగారు చెప్పినట్టు పాఠశాలలు అనవసరమైన వివాదాలలోనికి దిగాయి. ఇప్పుడు విద్యాశాఖ ఉచితమైన వైఖరిని అవలంబించి యిలాగ చెప్పవలసి వుంటుంది: 'ఆధునిక భాషావాదం ముందు తన ఉనికిని తాను స్థిరపరచుకుని, అటు పిమ్మట తనను గుర్తించవలసినదిగా, అడగమనండి, అలాంటి స్థితిని గ్రామ్యభాష యింతవరకూ సాధించుకోలేదు.''

గ్రాంథికవాదులూ, వ్యావహారిక వాదులూ రెండు శిబిరాలుగా చీలిపోయారన్నది నికరమైంది. అందుకే అప్పారావుగారు తమ అసమ్మతి పత్రంలో ఇలా రాశారు.

''మన తోవలు వేరయ్యే స్థితిలో వున్నాము. మనం చేయబోయే నిర్ణయం తెలుగు ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. తెలుగు సాహిత్యానికి సంకెళ్ళువేసి కడుపు మాడ్చడమా, లేక దానికి స్వేచ్ఛ, జవసత్వాలనిచ్చి, దాన్ని ఒక గొప్ప నాగరక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడివుంది. మొత్తం ఒక జాతి భవిష్యత్తును నేడు - బహుశా ఆ చంద్రార్కంగానేమో! ఎవరు చెప్పగలరు?''

ఇంటర్‌మీడియెట్ కాంపోజిషన్ కమిటీవారు చర్చలు జరుపుతూ ఒక అంతిమ నిర్ణయం తీసుకొనడానికి ముందుగానే ఒక లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోనే కాక దేశంలో ఊరూరా, పల్లెపల్లెలా సాహితీపరులమనుకొనేవారూ, నిజమైన పండితులూ గ్రాంథికవాద విజయంకోసం సభలు జరిపారు. తీర్మానాలు చేశారు. మహజరునామాలపై పదివేలమంది చేత సంతకాలు చేయించి గ్రామ్యభాషకు ఇచ్చిన అనుమతిని రద్దుచేయాలని ఆందోళన లేవతీశారు. ఇది 1912 సంవత్సరాంతంలోనే ప్రారంభమైంది. 1914లో తారాస్థాయిని చేరుకొంది. ఆ సంవత్సరం జూన్ 28వ తారీఖు మొదలు ఆగస్టు 23 వరకు అంటే సుమారు రెండునెలలపాటు గ్రాంథికవాదులు 24 ఊళ్ళలో సభలు జరిపారు. వీటికి సుప్రసిద్ధ స్థానిక ప్రముఖులు అధ్యక్షత వహించారు. ఏయే ఊళ్ళలో ఏయే తేదీలలో సభలు జరిగాయో ఎవరెవరు ప్రముఖ పాత్ర వహించారో ఇక్కడ పొందుపర్చడం జరిగింది.[22]

22. ఈ వివరాలు అక్కిరాజు రమాపతిరావుగారు తమ 'వ్యావహారిక భాషా వికాస చరిత్ర' అనే గ్రంథంలో అనుబంధంలో ఉదాహరించారు. వారికి కృతజ్ఞతలతో ఆ వివరాలనే యథాతథంగా చేర్చుకొన్నాను.

ఆంధ్రదేశంలోని ముఖ్యపట్టణాల్లోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోను వ్యావహారిక భాషా బహిష్కారోద్యమ సందర్భంగా జరిగిన సభలూ సమావేశాలు

వరుస సంఖ్య	తేదీ	పట్టణం పేరు	జిల్లా	వివరాలు
1.	28-6-14	కాకినాడ	గోదావరి	అధ్యక్షుడు - మ.రా.రా.శ్రీ అర్ని రఘునాధరావు పంతులుగారు, ఫస్ట్‌గ్రేడ్ సబార్డినేట్ జడ్జి ప్రతిపాదకులు - సి.వి.పేరయ్యాశాస్త్రిగారు, బి.ఏ. గవర్నమెంటు ప్లీడర్. అనుమోదకులు - రావుబహదూర్ కె. సూర్యనారాయణమూర్తి నాయుడుగారు, మునిసిపల్ ఛైర్మన్, ఇన్నీస్ అండ్ కో యజమానులు బలపరచినవారు - మ.రా.రా.శ్రీ పి. నాగేశ్వరరావు పంతులుగారు, బి.ఏ., బి.ఎల్. ట్రెజరీ డిప్యూటీ కలెక్టర్
2.	14-7-14	బెజవాడ	కృష్ణా	అధ్యక్షుడు - దివాన్ బహదూర్ వై. జానకిరామయ్యా పంతులుగారు, రిటైర్డ్ జిల్లా జడ్జి. ప్రతిపాదకులు - మ.రా.రా. శ్రీ వి.జి.కె. అయ్యంగార్, ఎం.ఏ., ఎల్.ఎల్.బి. బార్ ఎట్ లా. అనుమోదకులు - డి. మాధవరావు పంతులుగారు, బి.ఏ., బి.ఎల్. హైకోర్టు వకీలు
3.	6-7-14	నూజివీడు	కృష్ణా	అధ్యక్షులు - శ్రీ రాజా వేంకటరంగయ్యాప్పారావు బహదూర్ కపిలేశ్వరం సంస్థానం జమీందారు. ప్రతిపాదకులు - నడిమి తిరువూరు జమీందారు, వినగడప సంస్థానం. అనుమోదకులు - ఉయ్యూరు జమీందారు. బలపరచినవారు - మ.రా.రా.శ్రీ ఎస్. వెంకోబారావుగారు, బి.ఏ., బి.ఎల్.

వరుస సంఖ్య	తేదీ	పట్టణం పేరు	జిల్లా	వివరాలు
4.	7-7-14	గుంటూరు	గుంటూరు	అధ్యక్షులు - మ.రా.రా.శ్రీ కాశీకృష్ణాచార్యులుగారు, శతావధాని
5.	8-7-14	పిఠాపురం	గోదావరి	అధ్యక్షులు - పి.నాగేశ్వరరావు పంతులుగారు, బి.ఏ., బి.ఎల్ (ట్రెజరీ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ/ ప్రతిపాదకులు - వి. కోనేటిరావునాయుడుగారు, డిప్యూటీ తహసిల్దార్
6.	10-7-14	కడప	కడప	అధ్యక్షులు - వి. రామానుజరావుగారు, బి.ఏ.
7.	12-7-14	పెద్దాపురం	గోదావరి	అధ్యక్షులు - డబ్ల్యు. నాగభూషణంగారు, బి.ఏ. హుజూర్ సిరస్తాదార్, గోదావరి కలెక్టర్‌గారి కార్యాలయం
8.	13-7-14	తుని	గోదావరి	అధ్యక్షులు - ఎన్. రామమూర్తి నాయుడుగారు, బి.ఏ., హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ ప్రతిపాదకులు - డి. కృష్ణారావు పంతులుగారు, బి.ఏ., కొట్టాం సంస్థానం దివాన్. అనుమోదకులు - కె. లక్ష్మీనరసింహం నాయుడుగారు, డిప్యూటీ తాసిల్దార్
9.	15-7-14	తిరుపతి	ఉత్తరార్కాడు	అధ్యక్షులు - వి. సుబ్రహ్మణ్యయ్య, బి.ఏ., ఎల్.టి. ప్రధానోపాధ్యాయుడు, హెచ్.ఇ.ఎల్.ఎం.హైస్కూలు
10.	18-7-14	ప్రొద్దుటూరు	కడప	అధ్యక్షులు - వి. వసంతరావుగారు, బి.ఏ., ఫస్ట్‌గ్రేడ్ ప్లీడర్
11.	18-7-14	అమలాపురం	గోదావరి	అధ్యక్షులు - పాలెపు వెంకటగోపాలంగారు, రిటైర్డ్ ప్లీడర్
12.	18-7-14	ఎలమంచిలి	విశాఖపట్నం	అధ్యక్షులు - కె. లక్ష్మీనారాయణరావు పంతులుగారు, హెడ్ అకౌంటెంట్ ప్రతిపాదకులు - మ.రా.రా.శ్రీ ఎం. సుబ్బారావు పంతులుగారు, ప్లీడరు

వరుస సంఖ్య	తేదీ	పట్టణం పేరు	జిల్లా	వివరాలు
13.	24-7-14	తణుకు	కృష్ణా	అధ్యక్షుడు - కె. కళ్యాణస్వామినాయుడుగారు, బి.ఏ.బి.ఎల్. డిస్ట్రిక్టుమున్సిఫ్,తణుకు. ప్రతిపాదకులు - పి. సీతారామారావుగారు, ప్లీడరు అనుమోదకులు - జె. సుందరరామయ్యగారు, బి.ఎ. ప్లీడరు బలపరచినవారు - పి. రామచంద్ర రావుగారు, బి.ఏ. టీచర్
14.	24-7-14	రాజమండ్రి	గోదావరి	అధ్యక్షులు - రావుబహదూర్ కం. వీరేశలింగం పంతులుగారు, విఖ్యాత గ్రంథరచయిత, ప్రెసిడెన్సీ కాలేజి, పూర్వోపాధ్యాయుడు, ప్రతిపాదకులు-సి.హెచ్.వెంకటాచలం పంతులు, గవర్నమెంటు ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్
15.	14-7-14	అనంతపురం	అనంతపురం	అధ్యక్షులు - మ.రా.రా.శ్రీ వెంకటసుబ్బారావు పంతులుగారు, హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ కలెక్టర్
16.	14-7-14	మసూలా	కృష్ణాజిల్లా	అధ్యక్షులు - మొదటిరోజు వి. వెంకటసుబ్బారావు పంతులుగారు, రెండోరోజు - రావుబహదూర్ పురాణం వెంకటప్పయ్యగారు ప్రతిపాదకులు - శతావధాని వెంకటశాస్త్రిగారు
17.	27-7-14	బళ్ళారి	బళ్ళారి	అధ్యక్షులు - మ.రా.రా.శ్రీ కోలాచలం శ్రీనివాసరావుగారు, కవి, నాటక రచయిత. ప్రతిపాదకులు - టి. రాఘవాచార్యులుగారు, బి.ఏ., బి.ఎల్. అనుమోదకులు - బి. భీమారావుగారు, బి.ఏ., బి.ఎల్. బలపరచినవారు - పండిత నరసింహశాస్త్రిగారు, హిందూ హైస్కూలు తెలుగు పండితుడు

వరుస సంఖ్య	తేదీ	పట్టణం పేరు	జిల్లా	వివరాలు
18.	28-7-14 2-8-14	కర్నూలు కర్నూలు	కర్నూలు కర్నూలు	ఆంధ్రభాషాభివర్ధినీ సమాజంవారి ఆధ్వర్యంలో సభ జరిగింది.
19.	30-7-14	పెనుగొండ	అనంతపురం	ప్రతిపాదకులు - మ.రా.రా.శ్రీ ఆర్. వెంకోబారావుగారు అనుమోదకులు - ఎమ్. నరసింహాచార్యులుగారు
20.	31-7-14	నెల్లూరు	నెల్లూరు	అధ్యక్షులు - హానరబుల్ ఏ.ఎస్.కృష్ణారావుగారు
21.	31-7-14	బరంపురం	గంజాం	అధ్యక్షులు - మ.రా.రా. న్యాయపతి రామానుజస్వామి పంతులుగారు, బి.ఏ., బి.ఎల్. ప్రతిపాదకులు - ఊటుకూరి వెంకటగోపాలరావుపంతులుగారు అనుమోదకులు - వి. వెంకటజోగయ్యాపంతులుగారు. డి. దక్షిణామూర్తిశాస్త్రిగారు
22.	14-8-14	హర్పన హాళ్ళి	బళ్ళారి	అధ్యక్షులు - కె. గురురాజారావుగారు, బి.ఏ. బి.ఎల్.
23.	12-8-14	బారువ	గంజాం	అధ్యక్షులు - సోంభట్ల వెంకయ్యాగారు
24.	23-8-14	అన్నవరం	గోదావరి	అధ్యక్షులు - కాశీభట్ల బ్రహ్మయ్యాశాస్త్రిగారు

ఆంధ్రభాషా సంరక్షక సమాజం, కాకినాడవారు వ్యావహారిక భాషను నిరసిస్తూ పలుప్రాంతాల్లో చేసిన తీర్మానాలను, హిందూ, ఆంధ్రపత్రిక మొదలైన దినపత్రిల్లో, వ్యావహారిక భాషను సమర్థిస్తూను, విమర్శిస్తూను, వచ్చిన సంపాదకీయ లేఖలను, పుస్తక రూపంలో ప్రకటించారు. ఆ పుస్తకం నుంచే ఈ వివరాలు ఇక్కడ పొందుపరిచాను. మద్రాసు మెయిల్ పత్రికలో కూడా ఈ వివాదానికి సంబంధించిన ఖండన మండనలు ఆరోజుల్లో వెలువడ్డాయి.

ప్రగతికి ఎంత విరుద్ధమైనా ప్రజాభిప్రాయం అలాగ ఉన్నప్పుడు, శాసనసభలో ప్రతిఘటన ఏర్పడ్డప్పుడు ప్రభుత్వం పూర్వపు నిర్ణయాలను మార్చుకొనక తప్పలేదు. స్కూల్‌ఫైనల్ విద్యార్థులకు ఇచ్చిన శైలుల అనుమతి రద్దు చేశారు. 1914 ఆగస్టు 11వ తేదీ ప్రకటనలో విశ్వవిద్యాలయం రిజిస్టార్ 2వ ప్రకటన చేశారు. ''విశ్వవిద్యాలయం ప్రయోజనాల నిమిత్తం 'ఆధునిక తెలుగు' అనే దానిని గుర్తించడానికి సిండికేటు సిద్ధంగా

లేదన్న సమాచారంతో సిండికేటు ఆజ్ఞానుసారం ప్రచురించడమైంది.'' ఈ ప్రకటన వల్ల వ్యావహారిక భాషకు విశ్వవిద్యాలయంలో దేవిడీమన్నా జరిగింది. గ్రాంథికవాదులు సంబరపడ్డారు. పత్రికలు వ్యాఖ్యానించాయి. ఇది గ్రాంథికవాదానికి సంపూర్ణ విజయం కాదు. కాంపోజిషన్ కమిటీ వారు తెలుగు వ్యాస రచనలో కొన్ని సంకెళ్ళను సడలించకపోలేదు. త్రిలింగ పత్రిక చేసిన విమర్శ గమనించదగ్గది.[23]

''..... దూరదృష్టితో ఆలోచించిన వారెవరును ఈ వాదముల జీవ మరణములకు విశ్వవిద్యాలయము కర్తయని యెప్పుడును తలఁపరు. దానినిగాని, దీనినిగాని విద్యాధికులైన గ్రంథకర్తలు పరిత్యజించినప్పుడే అదిగాని, ఇదిగాని ఓడినదని చెప్పవలసియున్నది... గ్రంథకర్తలకు తీర్పు చెప్పెడి అధికారము విశ్వవిద్యాలయమునకు లేదు....''

''విశ్వవిద్యాలయం ఏర్పరచిన తెలుగు వ్యాస రచనా సంఘు తీర్మానాలను బట్టి అర్ధానుస్వార శకట రేఫల రచయితల యిష్టానికి లోబడ్డాయి; వ్యాకరణ సూత్రాలు కొన్ని సడలేందుకు వీలు కలిగింది; సంధి కొన్ని విషయాలలో ఐచ్ఛికమైంది; సంభాషణ ధోరణి ననుసరించి వీలైనంత వరకు రచనలు చేయడం మంచిదేనని తేలింది. కాబట్టి -

''దీనివలన ఏమి తేలుచున్నది? గ్రాంథిక భాషకు కట్టుబాటులు కొన్ని పోయినవి. వ్యావహారిక భాషకు లేని అంగీకారము కొంత వచ్చినది. ఇది గ్రాంథిక భాషకు విజయమా? వ్యావహారిక భాషకు విజయమా?....''

వాడుకభాషవల్ల దేశానికేదో అపకారం జరగబోతుందని అపోహలు సృష్టించి, ఆవేశాలు రెచ్చగొట్టి విశ్వవిద్యాలయం పరిధి నుండి వ్యావహారిక భాషను వెళ్ళగొట్టి విద్యార్థులకు మరికొన్ని తరాలపాటు నిర్బంధ గ్రాంథిక శైలిని రుద్ది, గ్రాంథికవాదులు ఒక తాత్కాలిక విజయాన్ని పొందినా, 1914లోనే వాడుకభాష తన సముచితస్థానాన్ని గ్రంథ ప్రచురణల మూలంగా సంపాదించుకొనసాగింది. తరతరాలుగా మెకంజీ రికార్డులూ, బ్రౌను వ్రాతప్రతులూ నిజమైన సంప్రదాయం ఏమిటో ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో నిక్షిప్తం చేయడం వల్ల ఆ నిధులను పరికించిన విద్వాంసులు, విజ్ఞులు తమ కర్తవ్యాన్ని గుర్తించారు. ప్రొఫెసర్ యం. రంగాచార్యులుగారూ, రెంటాల వెంకటసుబ్బారావుగారూ, వేపా రామేశంగారూ ప్రోత్సహించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చేత పద్మ పురాణంలోని పులికి ఇచ్చిన మాట నిలుపుకొన్న ఆవు కథను 'కామధేనువు కథ' అనే పేరుతో వాడుక భాషలో రాయించి ప్రకటించారు. ఈ చిన్ని పుస్తకం వాడుకభాష ప్రయోజనాలను చాటే పెద్ద తూర్యం. ఈ ప్రచురణకు 'హెచ్చరిక'గా రెంటాల సుబ్బారావుగారు కుండబద్దలు కొట్టినట్టు చాలా విషయాలు చెప్పారు.

''తెలుగు భాష మాట్లాడే రెండుకోట్లమంది జనులలో గ్రాంథికభాషను మాట్లాడేవారు ఒక్కరు కూడా లేరని చెప్పవచ్చును. ఈ చెప్పిన రెండుకోట్లమందిలో భారతాది గ్రంథాల భాషలో ఉత్తర ప్రత్యుత్తరములున్నూ జరుపుకొనే మహానుభావు

23. కె.వి.రమణారెడ్డి - మహోదయం - పుట.217లో దీనిని ఉపయోగించారు.

లెందరున్నారు?.... కొత్త కొత్త చరిత్రలు, శాస్త్రములు, కథలు, హాస్యములు, పాటలు, పదములు ఇవన్నీ ప్రజలకు, బిడ్డలకు బోధపడవలెనంటే సంకరము చేసి పాడుచేసిన గ్రాంథిక భాషలోగాక నిజమైన, పరిశుద్ధమైన మనోహరమైన వాడుక భాషలోనే ఉండవలెను... జ్ఞానమును, ఆనందమును పెంచే సర్వజనోపయోగములైన గ్రంథములు వ్రాయండి, ముద్రించండి, ప్రచురించండి. చిన్నిబిడ్డలు 199 లక్షలమందికి అభివృద్ధి మార్గము ఏర్పరచండి''. రెంటాలవారి ఈ 'హెచ్చరిక'[24] ఈ వివాదంలో ముచ్చిలిక.

1914లోనే కాకినాడలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు నాల్గవ సాంవత్సరిక సమావేశాలు జరిగాయి. విశ్వవిద్యాలయంలో వీగిపోతే వీగిపోయింది. వ్యావహారిక భాషావాదాన్ని పరిషత్తు వేదిక మీద నుంచి ప్రచారం చేయాలని గిడుగు రామమూర్తిగారు, గురజాడ అప్పారావుగారు పనికట్టుకొని కాకినాడకు వెళ్ళారు. వారితో వజ్ఝల చినసీతారామ స్వామిశాస్త్రి, బుర్రా శేషగిరిరావు, గిడుగు సీతాపతిగార్లు కూడా వెళ్ళారు. ఆ సాహిత్య పరిషత్తు సమావేశంలో గ్రాంథికవాదులు అప్పారావుగారినిగానీ, గిడుగు రామమూర్తి గారిని గానీ, వజ్ఝలవారినిగానీ మాట్లాడనియ్యలేదు. గ్రామ్యవాదులు ఇందులో పాల్గొనడానికి వీల్లేదని జయంతి రామయ్యగారు కచ్చితంగా చెప్పారు. వ్యావహారిక వాదులకు ఆతిథ్యం ఇచ్చిన పోలవరం జమీందారుగారు చేసిన ఏర్పాట్ల గురించి, పెట్టించదలచిన సభల గురించి సీతాపతిగారు ఇలా రాశారు.[25]

''.... ఈ పరిషత్తు సమావేశములు ఈ మూడు దినములున్ను జరుగనీయండి. ఆ మరుసటి దినము టౌను హాలులో నేనొకసభ ఏర్పాటు చేస్తాను. అది కూడా మూడు దినములు సాగిస్తాను. మొదటి దినమున అప్పారావుగారు, రామమూర్తిగారు ప్రసంగిస్తారు. రెండవ దినము వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రి గారొక్కరే తెలుగు వ్యాకరణములను గూర్చి సవిస్తరముగా ప్రసంగించి వ్యావహారిక భాష ఎట్లు ఎంతవరకు గ్రంథ రచనకు గ్రాహ్యామో పండిత దృష్టితో నచ్చజెప్తారు. మూడవ దినము బుర్రా శేషగిరిరావున్ను, సీతాపతిగారున్ను యువక గచయితల ప్రతినిధులుగా ప్రసంగిస్తారు, అని పోలవరము జమీందారుగారు తెలియజేశారు. అందుచేత మేము వారము దినములు జమీందారుగారి భవనములో ఉంటిమి. ప్రతిదినము అప్పారావుగారితోనో మాతండ్రిగారి తోనో వజ్ఝల వారితోనో ఈ భాషావాదమునకు సంబంధించిన చర్చలు జరుపుటకు చాలామంది పండితులు, వచన రచయితలు వస్తూ ఉండేవారు. వారి ప్రసంగములు బహువిధములుగా ఉండేవి. మా తండ్రిగారే ఎక్కువగా ప్రసంగిస్తూ ఉండేవారు. ఎవరూ రాని సమయంలో తిరుపతి శాస్త్రిగారితో మా తండ్రిగారు ప్రసంగిస్తూ ఉండేవారు. ఆ యేడు దినములున్ను ఆ మందిరము సందడిగా ఉండేదని చాలాకాలము చెప్పుకొంటూ ఉండేవారు.''

ఆంధ్ర సాహిత్య పరిషత్తు నుండి వ్యావహారిక భాషావాదులకు సాధ్యమైనంత దూరంగా ఉండడానికి దాని కార్యకర్తలు ప్రయత్నించసాగారు. 1915లో మొదట

24. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'కామధేనువు కథ - భాషాప్రసక్తి', ద్వితీయముద్రణ, 1984

25. సాహిత్యోపన్యాసములు, 4వ భాగము, పుట.27

చెన్నపట్నంలో జరపాలనుకొన్న కార్యనిర్వాహక సభలను ఫిబ్రవరి 20వ తేదీ శనివారం నాటికి బెజవాడలో జరపడానికి నిశ్చయించారు. దీనికి వ్యావహారిక భాషావాదులు హాజరుకాకుండా చేయాలనే ఈ వ్యూహం పన్నారు. ఆంధ్రమహాజన సభకు అంటకుండా సాహిత్య పరిషత్తును కార్యకర్తలు కాపాడుకొంటూ వస్తున్నారని గురజాడ అప్పారావుగారు భావించారు. ఆ తొలి సంవత్సరం ఆంధ్రసాహిత్య పరిషత్తుయొక్క సాంవత్సరిక సభ ఆంధ్రమహాజన సభతోపాటు బాపట్లలో జరపవలసిందని నొక్కి చెప్పాను. నామాటగా నా మిత్రులు విని అలా చేసి వుంటే ఆంధ్రమహాజన సభలో వుండే నవదేశాభిమానుల ధోకాకు సాహిత్య పరిషత్తు మూడు ముక్కలయిపోయి వుండదా?'' అని గురజాడవారు రాశారు.[26] పరిషత్తు పనులన్నవి ఒకరిద్దరిమీదనే జరగవలసినదని జయంతి రామయ్యగారూ, వారి పోషకులు పిఠాపురం మహారాజావారూ భావించినట్టున్నారు.

అప్పారావుగారు పేర్లు ప్రత్యేకంగా చెప్పలేదు కాని జయంతి రామయ్యగారే ఆంధ్ర సాహిత్య పరిషత్తును గుత్త తీసుకోదలిచారని చిలుకూరి వీరభద్రరావుగారి రాతల వల్ల తెలుస్తోంది. ఆంధ్రుల చరిత్ర మూడవభాగం అవతారికలో ఈ సంగతి ఆయన స్పష్టపరిచారు. ఆయన సాహసించి చరిత్ర ప్రచురణ ఆరంభించిన తోడనే దేశంలో కొంత కదలిక జనించడం మొదలైంది. సహాయం చేయగలరనుకొన్న వారు శత్రుత్వాన్ని వహించారు. వీరభద్రరావుగారి మాటలు ఇలా ఉన్నాయి.[27]

''నాకీ మహత్కార్యమున దోడ్పడదగిన విద్యాధికులలో నొక్కరగు శ్రీయుత జయంతి రామయ్యగారు బి.ఏ., బి.ఎల్.గారు ప్రతిపక్షకోటిలో జేరినవారైరి. సమగ్రము సప్రమాణమగు జరిత్రము కావలయుననియు నందుకొక పరిషత్తేర్పడవలయుననియు నుద్ఘోషించిరి. అటు వెనుక వారు చేసిన ప్రయత్నములు ఫలించి కొందఱు మహారాజుల ద్రవ్య సహాయమునను విద్యాధికుల ప్రోత్సాహము వలనను ఆంధ్ర భాషా సాహిత్య పరిషత్తు (Telugu Academy) ఏర్పడినది. ఆంధ్రదేశ చరిత్రాంశ పరిశీలనకు బ్రోత్సాహమొసంగుటయు, లభ్యములైన వానిలో మిక్కిలి విశ్వసనీయములైన యాధారముల సాహాయ్యమున సవిస్తరముగాఁ దెలుగుదేశము యొక్కయుఁ బ్రజల యొక్కయు, చరిత్ర మొకటి రచించి ప్రచురించుట పరిషత్తు యొక్క ప్రధానోద్దేశములలో నొకటిగాఁ దెలుపఁబడియెను. ఇదియొక శుభసూచకమని తలంచితినిగాని నా ప్రతిపక్షుల ప్రయత్నముల మూలమున నేనా పరిషత్తును సమీపించుటకే సాధ్యపడినది కాదు. తరువాత 'తెలుగు ఎకాడెమీ' కి మేనేజరు కావలయునని పత్రికలలోఁ బ్రకటింపఁబడియెను. కొందఱు విద్యాధికులైన మిత్రుల ప్రోత్సాహము వలన నేనాయుద్యోగమునకు దరఖాస్తు పెట్టినప్పుడు జరిగిన చర్య వైపరీత్యముగాఁ గన్పట్టక మానదు. అదియొక్క పెద్ద చరిత్ర మగును. పరిషత్కార్యదర్శులకును తత్సభాధ్యక్షులకును చర్చ ప్రారంభమై కొంతకాలము నడచినది. అటు పిమ్మట కార్యదర్శులైన బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారును,

26. లేఖలు - పుట.191

27. ఆంధ్రుల చరిత్రము, మూడవ భాగము, అవతారిక, పుట.9-11

మ.రా.రా.శ్రీ హైకోర్టు వకీలు పురాణము వేంకటరాయశాస్త్రులవారును, మ.రా.రా.శ్రీ హైకోర్టు వకీలు పురాణము నాగభూషణము ఎమ్.ఏ., బి.ఎల్.గారును, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి బి.ఏ.ఎమ్., బి.సి.యమ్.గారు 'మేనేజరు'గా నన్ను నియమించి యంగీకారమునకై అధ్యక్షులగు రామయ్య గారికిఁ బంపఁగా వారు 'మేనేజరు' లేకుండా సంవత్సర కాలము గడుపుటకైన నొప్పుకొనిరి కాని నాకుఁ బ్రవేశము గలిగింప నిష్టపడరైరి. అంతట నదియు నామేలునకేయని భావించి పరిషత్తున కొక్క నమస్కారమిడి చెన్నపురి విడిచి వచ్చితిని.''

1915లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు రాజకీయాలు దుర్గంధభూయిష్ఠంగా ఉన్నాయని గురజాడ అప్పారావుగారు భావించి ''ఫర్వాలేదు, కృష్ణవరదలకి దాని యావత్తు కొట్టుకుపోయింది'' అని తృప్తిపడదామనుకొన్నారు. అయితే వాస్తవానికి ఆంధ్రదేశంలోని అన్ని నదుల వరదలూ ఒక్కుమ్మడిగా వచ్చినా సాహిత్య రాజకీయాల వాసన ఇబ్బడి ముబ్బడిగా ఉండక తప్పదు. ఆంధ్ర సారస్వత పరిషత్తును సంస్థాపించినప్పుడే కందుకూరి వీరేశలింగంగారి సూచనల ప్రకారం ఒక సమగ్రమైన నిఘంటువును నిర్మించుదామనుకొన్నారు. దానికి ప్రధాన సంపాదకునిగా వేదం వెంకటరాయశాస్త్రిగారిని నెలకు 250 రూపాయల జీతం మీద నియమించారు. వారికో ఇద్దరు సహాయకుల్ని నెలకు నూరేసి రూపాయల జీతం మీద నియమిస్తామని మాట ఇచ్చారు కాని, అలాంటి సహాయకుల్ని నియమించనే లేదు. ప్రధాన సంపాదకుడు 'ఏకకుడు'గానే ఎటువంటి దుర్భర పరిస్థితుల్లో పనిచేయవలసిందీ వేదం వెంకటరాయశాస్త్రిగారు తమ మాటల్లో ఇలా తెలియచేశారు.[28]

''కార్యస్థానము పుదుపేటలో నున్నంత కాలము, దానికి దాపున ప్రాగ్దక్షిణ దిశలయందు మునిసిపాలిటీ వారి నగర జన పురీష నిర్హరణ శకటవ్రాతముల నిలువరపుఠావుల గుటం బట్టి, ప్రధాన సంపాదకుడును ఆ లేఖకులును మఱి యొక లేఖకుడును - మఱుఁగుఁబెరటిలో కట్టి వైవంబడిన జనుల యొక్క దుర్దశను అనుభవించు చుండిరి. మఱియు కార్యస్థానమైన గృహమందు మఱుఁగుఁ బెరడు లేనందున ప్రధాన సంపాదకుడు బహిశ్శంకకు పోవలసివచ్చిన సమయముల యందు మునిసిపాలిటి వారి సార్వజనిక పురీషాలయములకు పోవుటయు, అందు వర్ణనకు మనస్సొప్పని దుఃఖకర ఘోరానుభవములకు పాలగుటయు సంభవించుచుండెను. కార్యస్థానమును వాయు మార్గములను మూసినచో ఊపిరి సలుపదు. తెఱచినచో పూర్వోక్తములైన మునిసిపాలిటి బండ్ల దుర్గంధము అలుగులు తెంచుకొని వెల్లువపాఱి ప్రధాన సంపాదకుని ప్రాణవాయువును ముంచి కొట్టుకొనిపోవును, ఇప్పుడు సయితము చింతాద్రి పేటలోని కార్యస్థానాలయమునందు అన్ని గదులలోను మేలయిన ప్రధాన సంపాదకుని గదియు ఇంచుక తక్కువగా ఉక్తదుర్గంధ దశకే లోనయియున్నది.''

చేపట్టిన కార్యము మీద శ్రద్ధాసక్తులున్నవారు ఎన్ని కష్టాలైనా ఓర్చుకొని పనిచేయగలరు. సంస్థకోసం వ్యక్తులు పనిచేసినప్పుడే ఏదయినా కాళ్ళు నిలదొక్కుకోగలదు. కాని, ఒక వ్యక్తికోసం సంస్థ మీదు కట్టదలుచుకొంటే పనులు స్థంభిస్తాయి.

28. వేదము వేంకటరాయశాస్త్రుల వారి జీవిత చరిత్ర సంగ్రహము – పుట 151

ఆంధ్రసాహిత్య పరిషత్తును దాని నిఘంటు నిర్మాణాన్ని జయంతి రామయ్యగారి కోసమే ప్రత్యేకించారని వేదం వెంకటరాయశాస్త్రిగారి మాటల వల్ల తెలుస్తుంది. పైన ఉదహరించిన నివేదికను వారు పంపుకొంటే ఏం జరిగిందో వారి మాటల్లోనే చూడండి.[29]

''ఈ నివేదికను నేను విశదీకరణార్థమై మొక్కపాటి సుబ్బారాయుడుగారికి పంపితిని. ఆంధ్ర సాహిత్య పరిషన్మంత్రి సభలో తామొక సభ్యులైన సుబ్బారాయుడుగారు, 3-11-1917 తేదీలో ఆ సభలో దీనిని మదనుమతింజెంది పఠించి యిందుల విషయములకు తమ యంగీకారము దెలిపిరి. అందఱు నంగీకరించిరి. అగ్రాసనాసీనులైన శ్రీయుత జయంతి రామయ్య పంతులుగారు మాత్రము ఇందు పన్యస్తములయిన కాయిక క్లేశములు నాకొక్కనికే చెందినట్టివని వక్కాణించిరి. అందులకు నేను ''నేనిపుడు పనిచేయఁ గూర్చుండుచోట ఇంచుకసేపు కూర్చుండు వారికెల్ల ఆ బాధ లెల్లసంభవించును'' అని వచించితిని.

''శ్రీ పిఠాపురము రాజాగారు తమ కోరిక ప్రకారము నిఘంటు నిర్మాణ కార్యమును మదరాసు నుండి కాకినాడకేని పిఠాపురమునకేని కొనిపోయి తమ సమీపముననే, తమయాధ్యక్షముననే, అట్లయినను, ఆంధ్రసాహిత్య పరిత్తు వారి పరామరిక క్రింద జరుపుకొనవచ్చుననియు, మదీయ సంపాదకత్వము 4-11-17 తేదీనుండి మూడునెలలకు మదరాసులోనే నివర్తిల్లుననియును ఆ సభలో నిర్ణయములు సేయఁబడినవి. పరిషత్తువారి పరామరికం గూర్చి నాతోఁగూడ శ్రీయుతులు వేమవరపు రామదాసు పంతులు బి.ఏ., బి.ఎల్.గారును, నాగపూడి కుప్పుస్వామయ్య బి.ఏ.గారును ''ఈ నిఘంటు కార్యము మనచేతినుండి తొలగి దూరదేశమునకు పోయిన పిమ్మట దీనిపై మన పరామరిక యేల'' అని యాక్షేపించిరి, ఆ యాక్షేపము రామయ్యగారికి అసమ్మతముగా నుండినది. సభలో అది నెఱవేఱలేదు.

''నిఘంటు సభా సమ్మేళకులయినా శ్రీయుత గుమ్ముడూరి వేంకటరంగారావు ఎమ్.ఏ.గారు, 1914 సంవత్సరంలో మదరాసులోను, 1915 సంవత్సరంలో నెల్లూరిలోను, నాతో ''మీరు ఏతన్నిఘంటు సంపాదనాధికారమును వహింపవలయునని పరిషత్తువారి యభిమతము; దానిని మీరు నెఱవేర్చిన ఆంధ్రలోకమునకు ఉపకారమును మీకు కీర్తియును గలుగును; కావున మీరీ యధికారము నంగీకరింపదగును'' అని బోధించిరి. వెంటనే నెల్లూరిలో మదరాసులోని యొకానొక పరిషత్సభ్యుని బంధుమిత్రుల వలన నుండి పారుపరీణముగా ''ఈ యధికారమున ఈయనను రెండు సంవత్సరములే యుంతురు. అప్పటికి ఫలాని వారలు రాజకీయోద్యోగ విరతులై స్వయముగానే దీనింబూనుదురు'' అని యొక కింవదంతి కలిగినది. అనంతరము నేను మదరాసులో వేంకటరంగారావుగారిని దర్శించి ఆ కింవదంతిని నివేదించి ''ఏమట్లు జరుగునా? అట్లే జరుగునేని, ఈ యుద్యోగంపు జీతము పాటి యాయతిని నాకొసంగ దగిన ముద్రాశాలా వ్యాపారమును దీనికై మానుకొని ఇది విరమించి నంతట నిరాధారుఁడనగుదునే!'' అని యడుగఁగా, వారు ''నేను సమ్మేళకుఁడనుగా నుండఁగా అట్లు జరుగనేరదు'', అని వ్రాక్రుచ్చిరి. ఆ మాటపై ఈపనిని

29. వేదం వెంకటరాయశాస్త్రులవారి జీవిత చరిత్ర సంగ్రహము - పుటలు 157-8

5 ఏండ్ల నియోజనమున, 2 ఏండ్ల కనంతరము ఇరుపక్షములను 3 నెలల హెచ్చరికచే విరామ నియమమును గైకొంటిని. ఆ రెండేండ్లునయినవి, కింవదంతియు నొక విధముగా నెఱవేఱినది.''

కార్యకర్తలలో ఉన్న చేవను పట్టి సంస్థలలో జీవం ఉంటుంది. స్థాపించిన నాటి దగ్గర నుంచి ఒక పదకొండేళ్ళు దాకా ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యకలాపాలెలా జరిగాయో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు తమ అధ్యక్షోపన్యాసంలో ఇలా చెప్పారు.[30]

''పరిషత్తును బ్రతి సంవత్సరమెవ్వరో యొక రేదో యూరి కాహ్వానించుచున్నారు. మనమెవ్వరినో యధ్యక్షు నేర్పఱచుకొనుచున్నాము. ఏదో కార్యక్రమము ననుసరించి యెట్టులో జరుపుకొనుచున్నాము. పై సంవత్సరమునకు మఱేదో యూరుపోవుచున్నాము. అంతే. జరుగుచున్నదంతే, ఇన్ని సంవత్సరముల నుండి భాషాభివృద్ధికై ప్రయత్నించు చుంటిమి కదా? అది యేతీరునన్నైనది? ఎంతవఱకైనది? వేనివలన నైనది? అని మనము మనలను గఠినముగా బరిక్షించుకొనఁదగదా? ఇతరులు మనలఁబరీక్షింపకుండ మనమె యట్లొనర్చుకొనుట మంచిది కదా? పదునైదు పదునాఱు పూర్వప్రబంధములచ్చు వేయించితిమి. పారిభాషిక పదముల పట్టికలు గొన్ని రచియించితిమి. ప్రశస్తములైన యుపన్యాసములనేకములు పరిషత్పత్రికలూ నచ్చువేయించితిమి. A Defence of literary Telugu అను గ్రామ్యవాద ఖండన గ్రంథము ప్రకటించితిమి. కాని మనము చేసిన యీసేవ చాలకపోవుటచేఁ గాబోలు బరిషత్కన్యక యుండవలసినట్లు లేదు. పంద్రెండవ యేడు జరుగుచున్న పడు చెట్లుండవలసినది? ఓ నన్నుఁ జూడు నన్నుఁ జూడు మన్నట్లుండ వలసినదే - అట్లున్నదా - అయ్యయ్యో! 58 సంవత్సరములున్న నావలెనే చప్పిదౌడలతో శల్యావశిష్టయై యున్నట్టున్నదే! బంగారమువంటి ప్రాయమంకురించిన పడుచు పట్టఁబగ్గములు లేకుండ నుండవలసినదే. అయ్యో! కాలానుసార గ్రంథ పోషణమునఁగాని కావ్య కన్యక యొడల చేయదు, ఱేకెత్తదు, జబ్బపై జబ్బవేయదు, జగన్మోహకముగాఁ గనఁబడదు.''

చివికి జీర్ణించిపోతున్న ప్యూడలు విలువలని సంరక్షించడం కోసం తాపత్రతపడే ఏ సంస్థ అయినా ఎలా జగన్మోహంగా ఉంటుంది? ఆనాడు ఆంధ్రదేశానికి ఉన్న ఒకే ఒక సాహిత్య సంస్థగా పనిచేస్తుందనుకొని సాహిత్య పరిషత్తులో 'నవదేశాభిమానులు' చేరి దానికి కొత్త నెత్తురు ఇచ్చి నూతనోత్సాహాన్ని కలిగిస్తే వారి ఢోకాకు సాహిత్య పరిషత్తు మూడు ముక్కలౌతుందని, గురజాడ అప్పారావుగారు ఆనాడు రాశారు గాని ఆ 'నవదేశాభిమానులు' ఆంధ్రసాహిత్యలోకంలో తీసుకువచ్చిన మార్పులను అప్పారావుగారు చూడకుండానే 1915లో అస్తమించారు. అయితే ఆయన ప్రారంభించిన ప్రజల ఉద్యమాన్ని వారి ప్రాణమిత్రులు గిడుగు రామమూర్తిగారు అందుకొని ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమిస్తూ కొనసాగించారు. 1915లోనే రాజమండ్రిలో ఒక పెద్ద బహిరంగ సభ జరిగింది. అక్కడ గిడుగువారు వ్యావహారిక భాషావాదం గురించి

30. సాక్షి - 6వ సంపుటం - పుట.132-3

ఉపన్యసిస్తూ ఉండగా గ్రాంథికవాదులైన స్థానికులలో పెద్దలే 'దుష్టులైనవారిని కొందరిని ప్రోత్సహించి' కేకలు పెట్టించి సభను పాడు చేయించారు. అయితే రామమూర్తిగారు వాటిని వినిపించుకోలేదు.

దేశ సంచారం చేస్తూ ప్రబోధం కలిగిస్తేనేగాని గ్రాంథిక భాషావాదుల దుష్ప్రచారాన్ని ఖండించడానికి అవకాశం ఉండదని రామమూర్తిగారు గ్రహించారు. మిత్రుల తోడ్పాటుతో వివిధ స్థలాలలో సభలు చేసి ఉపన్యాసాలివ్వడానికి ప్రారంభించారు. ఆ రోజుల్లో పర్లాకిమిడి, బరంపురం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, మచిలీపట్నం, నెల్లూరు, మద్రాసు, అనంతపురం పట్టణాలలో మాత్రమే కాలేజీలు ఉండేవి. ఇవన్నీ మద్రాసు విశ్వవిద్యాలయం లోని అనుబంధ సంస్థలే. ఆ కాలేజీలన్నింటికీ వెళ్ళి అక్కడ ప్రిన్సిపాలుగా ఉన్నవారిని కలుసుకొని వారి యజమాన్యంలో కవులు, పండితులు, విద్యాధికులు ఉన్న సభలలో వ్యావహారిక భాషావాదాన్ని విశదం చేసి సభ్యులందరి చేత తమ వాదాన్ని ఒప్పించుకొనేవారు. అలా ఒప్పుకొన్నవారి దగ్గర్నుంచి సర్టిఫికేట్లను పుచ్చుకొనేవారు. అలా సంపాదించిన కొన్ని ప్రమాణ పత్రాల వివరాలు చూడండి.

1915 మార్చి 20వ తేదీనాడు గొడవర్తి జగన్నాథరావు, కొమ్మూరి లక్ష్మీనరసింహశాస్త్రి.

మార్చి 22వ తేదీనాడు తునగా శ్రీరామమూర్తి, దుగ్గిరాల వెంకటసూర్యప్రకాశరావు.

మార్చి 23వ తేదీనాడు ప్రయాగ వెంకటరామశాస్త్రి, ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి.

మార్చి 24వ తేదీనాడు శతావధాని దివాకర్ల తిరుపతిశాస్త్రి.

సంతకాలు చేసి సర్టిఫికేట్లు ఇచ్చిన పై పండితులు అంగీకరించిన అభిప్రాయం ఇది:

''కావ్యేతరముల విషయమై ప్రాచీన సంప్రదాయమును దెలిపిన తరువాత నట్టి సంప్రదాయము ననుసరించి బ్రయత్నము చేయుటలో నేమియు తప్పులేదు... ఇట్టి స్వాతంత్ర్యమును కాలేజీ విద్యార్థులలో వలయు వారికిచ్చుట వలన నేమియు లోపము సంభవింపకుండుటయేగాక, సాంప్రదాయ ప్రవాహము ననుసరింపనిచ్చుటయని దృఢముగ నమ్ముచున్నము.''[31]

1916లో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో ఆంధ్ర మహాపరిషత్తు వారి తృతీయ వార్షికోత్సవ సభలు జరిగాయి. ఆ పరిషత్తు ప్రధాన కార్యదర్శి కోన వెంకటరామశర్మగారు గ్రాంథిక భాషలో రచనలు చేసిన వారేగాని వ్యావహారిక భాషకు విముఖులుకారు. ఆయన గిడుగురామమూర్తిగారి పాండిత్య పటుత్వం పట్ల ఆదరాభిమానాలు చాలా ఉన్నవారు. ఆ మహాసభలో గిడుగువారి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఎందరో కవులూ, పండితులు తమ తమ ప్రత్యేకలున్నవారు ఆ సభలో పాల్గొన్నారు. అందరినీ ఉత్తేజితులను చేస్తూ, తమ

31. అక్కిరాజు రమాపతిరావుగారి 'వ్యావహారిక భాషా వికాసం చరిత్ర' - పుట.128

వాదాన్ని రామమూర్తిగారు విశదపరిచారు. వ్యావహారిక భాషా సంప్రదాయాన్ని ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఆ సభలోనే పోలవరం జమీందారు వారి ఆస్థానకవులు తిరుపతి వెంకటకవులు ఉన్నారు. అందరూ గిడుగువారిని శ్లాఘించారు. ఆ పిమ్మటనే తిరుపతి కవులు పండితలోకాన్ని ఇలా సవాలు చేశారు.

'కాలముఁబట్టి దేశమునుగాంచి ప్రభుత్వము నెంచి దేశభా
షాలలితాంగి మారుటది సత్కవి సమ్మత మౌట, నన్యదే
శ్యాలును నాంధ్ర భాష గల వౌటను నౌచితి బట్టి మేము క
బ్బాలను వాడుచుంటిమని పండితులేగతి నొప్పుకుందురో''

కవికి లోకాలే ప్రమాణమనీ తమ అంతఃకరణ ప్రవృత్తే తమ కత్యంత ప్రమాణమని తెలుగులో వ్యాకరణాలు, పరస్పర విరుద్ధాలై కనబడుతున్నందువల్ల కవుల ప్రమాణములే రామమూర్తిగారు చెప్పినట్టు పరమప్రయోజనాలని తిరుపతి కవులు చెప్పారు. (1914లోనే తిరుపతి శాస్త్రిగారు రామమూర్తిగారికి సర్టిఫికేటు సంతకం పెట్టి యిచ్చారు. ఇప్పుడు వెంకటశాస్త్రిగారు కూడా కలిశారు.)

1916లో కొవ్వూరులో జరిగిన ఆ సభ మరోరకంగా కూడా చాలా ప్రముఖమైనది. రామమూర్తిగారి ఉపన్యాసం జరుగుతూ ఉండగా ఆప్రాంతాలకు వేరే తమ సొంతపనిమీద వచ్చిన వీరేశలింగంగారు కొంచెం దూరంలో ఆగి దానిని వింటూ నిలబడిపోయారు. వీరేశలింగంగారు వచ్చినట్టు రామమూర్తిగారికి తెలియదు. సభలో కొందరు చూసి వీరేశలింగంగారిని లోపలకు వచ్చి కూర్చోమని ఆహ్వానించారు. రామమూర్తిపంతులు వేయిమందికైనా చక్కగా వినబడేటట్టు మాటలాడగల సమర్థుడు. 'అతని మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి' అని, అరగంటసేపు ఉపన్యాసం ఇచ్చాక ''రామమూర్తి చెప్పిన దానిలో మనము ఒప్పుకోక తప్పని అంశాలున్నవి. అతని వాదము నేడు కాకపోతే కొలది కాలములోనైనా జనసమ్మతము కాగలదు'' అని వెళ్ళిపోయారట. సభ ముగిశాక ఈ సంగతి రామమూర్తిగారికి తెలిసింది. ఆ సందర్భంలో కాకపోయినా తరువాత కొంతకాలానికి వీరేశలింగంగారిని కలుసుకొని అన్ని వివరాలూ చర్చించి ఒక కార్యాచరణకు పూనుకొన్నారు.[32] అయితే 1919దాకా సాధ్యపడలేదు.

1917లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వాడుక భాషను రాసే విధానంలో కొత్తదారులు తొక్కారు. ఆ సంవత్సరం మార్చి 31వ తేదీనాటి కృష్ణాపత్రికలో 'గ్రామ్యమీమాంస' అనే వ్యాసంలో ఇలా రాశారు:

''మండలాల్లో మాటలు మాటినయ్యాని భాష చెడ్డ భాషవుతుందా? అలా అయితే ఈ పైమాటలన్నీ పాడైపోయేవే. ఇవన్నీ గ్రాంథిక భాష కావలయువానికి కావాలా? అఖ్ఖర్లేదా? ఇల్లాగే ఇంకో మండలంలో మాట్లాడే కొత్త మాటలు రాకపోతే భాషాపారగుడెట్లా అవుతాడు? అన్య మండలాల్లో కొత్త మాటలన్నీ రావాలిశిందే. కొత్త గ్రంథాలు చదువుకొని, కొత్తమాటలు నేర్చుకొన్నట్లు అన్యమాండలిక గ్రంథాలు

32. సాహిత్యోపన్యాసములు - 4వ భాగం, పుట.29

చదువుకొని ఆ పదాలు నేర్చుకోవాలి. ఆ మాటలు తెలియవని ఆ భాష చెడ్డదని అనటం మంచిదికాదు. మనకు అరవం రాదని ఆ భాష చెడ్డది అని అంటే అపహాస్యమవుతుంది. మనకు తెలియని భాషల్లా చెడ్డదని అనాలిశొస్తుంది. ఇంతకంటే వేఱే నవ్వు బాటేమ్మిలేదు. మాఱడం భాషకు సహజం.''

ఈ పేరా గ్రాఫులో స్పెల్లింగులు చాలా విలక్షణంగా ఉన్నాయి. 'అక్కరలేదా' అనడానికి 'అఖ్ఖర్లేదా' అని మహాప్రాణం ద్విత్వం రాయడం. 'రావాలిసిందే' అనే చోట 'రావాలిశిందే' అనే 'శ'కారం వాడడం 'ఏమీ' అనడానికి 'ఏమ్మీ' అని రాయడం గమనించదగ్గ విషయం. ఎలా ఉచ్చరిస్తే అలా రాయడానికి ధ్వనులన్నీ లేనప్పుడు భావ ప్రకటనకు స్పెల్లింగు మార్పులు అవసరమయ్యాయి. ఈ వ్యాసంలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వావిలకొలను సుబ్బారావు, తాపీ ధర్మారావుగార్ల వాదాలను ఖండించారు. ''గ్రామ్యము గ్రాంథికము కలుస్తే పేడా బెల్లము పిసికినట్లుంద''ని సుబ్బారావుగారు అంటే దానికి వేటూరి వారు ఇలా జవాబు చెప్పారు.[33]

''సంస్కృతము - ప్రాకృతము - శూరసేని - మాగధి - చూళిక - పైశాచి - అరేబియా - ఆఫ్గనిస్థానము - పర్షియా - మలయ - ఇంగ్లీషు - ఓఢ్రము - దక్షణీ - బంగాళము - బటేవియా - చీనా - తుర్కీ - తురేనియా - తార్తారము - మహారాష్ట్రము - పరాసు - లాటిన్ - పోర్చుగల్ - ఇటలీ - గ్రీసు - స్పెయిన్ - ద్రావిడము - కర్ణాటకము - తుళు ఈ భాషలన్నీ కలిస్తే పేడా-బెల్లము కలిసినట్లుండదా?''

1915లో గురజాడ అప్పారావుగారు ఆశించిన 'నవదేశాభిమానులు' 1917 నాటికి నవభాషాభిమానులుగా పత్రికలలో రాతలు రాయసాగారు. వాడుక భాషకు ఘంటాపథం ఏర్పడుతోంది. 1919లో చెప్పుకోదగ్గ పరిణామము ఏర్పడింది. ఆ సంవత్సరము ఫిబ్రవరి రెండవతేదీనాడు రాజమండ్రిలో వీరేశలింగంగారి ఆనందాశ్రమంలో ఒక విద్వత్సభ జరిగింది. దానికి ఆనాడే 'వర్తమానాంధ్రభాషా ప్రవర్తన సమాజము' అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. దానికి వీరేశలింగంగారే అధ్యక్షులు. గిడుగు రామమూర్తిగారు, జయంతి గంగన్నగారు కార్యదర్శులు. ఈ సమాజం కార్యక్రమాన్ని ఇలా రూపొందించారు.[34]

1. వ్యవహార భాషకున్ను గ్రాంథిక భాషకున్ను ఇప్పుడున్న వ్యత్యాసము సాధ్యమైనంత వరకు తగ్గించి, భాష సులభము చేయుట.
2. జ్ఞానాభివృద్ధికై వ్రాయు గ్రంథములో సాధ్యమైనంత వరకు వ్యవహారములోనున్న రూపములే ఉపయోగించి వ్యవహారములో లేనివి విడిచిపెట్టుట.
3. వ్యవహారములో ఆవశ్యకము కాకుండా ఉపయోగించుచున్న అన్యదేశ్యపదములను విడిచిపెట్టి ఆవశ్యకములైన పదములనే చేర్చుకొనుట.
4. పై ఉద్దేశములను అనుసరించి గ్రంథములను వ్రాయుట.

---

33. కామధేనువు - పుట.26
34. సాహిత్యోపన్యాసములు - 4వ భాగం, పుట.29

వీరేశలింగంగారు వ్యావహారిక భాషకొక వ్యాకరణం రచించదలుచుకొన్నారు. అయితే దురదృష్టవశాత్తూ, ఆ సమాజాన్ని స్థాపించిన మూడు మాసాలకే మరణించారు. రామమూర్తిగారు మళ్ళా ఒంటరిగానే ఉద్యమ సారథ్యం వహించవలసి వచ్చింది. అయితే సమాజం ఏర్పరుస్తున్న సమయంలోనే 54మంది సభ్యులు అందులో చేరారు. శీఘ్ర కాలంలో ఈ సంఖ్య రెండు వందలకు పెరిగింది. సమాజం పక్షాన రామమూర్తిగారు 'తెలుగు' అనే మాసపత్రికను ఏడాదిపాటు నడిపి అందులో ఎన్నో పరమప్రామాణికాలైన వ్యాసాలు తెలుగులోనూ ఇంగ్లీషులోనూ రచించారు.

1. లిఖితవ్యవహృతాంధ్రాలను సన్నిహితం చేయాలి.
2. జీవద్భాషను వాడడానికి స్వాతంత్ర్యం
3. భాషను స్థిరీకరించేవారెవ్వరు?
4. ప్రజాసాహిత్యం - (1)
5. ప్రజాసాహిత్యం - (2)
6. ప్రజాసాహిత్యం - (3)

మొదలైనవి ఇందులోని కొన్ని వ్యాసాల పేర్లు. ఇవి ఇంగ్లీషులోనే రాశారు. రాంబోయే సంచికలలో ప్రచురించదలచిన విషయాలను ఇలా పట్టికగా ఇచ్చారు.

1. తెలుగు మాటల సాధుత్వాసాధుత్వముల నిర్ణయము. అసాధువులను కొన్న అనేక శబ్దములను కొనుటకు ప్రమాణములు.
2. నన్నయ భారతములోని పదముల పట్టిక.
3. తెలుగు పదముల రూపాంతరములు.
4. సంస్కృతపదముల రూపాంతరములు.
5. అంత్యవర్ణములను బట్టి (అకారాంతాదిగా) ఏర్పరచిన తెలుగు మాటల పట్టిక.
6. గ్రంథములో పాదాంతరములు.
7. తెలుగు భాషా చరిత్రమునకు కావలసిన సామాగ్రి
8. నేటి తెలుగు భాషకు లక్షణము ఏర్పరచుటకు కావలసిన సామగ్రి
9. మనపూర్వులు వ్రాసిన వచన రచనకు ఉదాహరణములు
10. తెలుగులో చేరిన అన్యదేశ్యములు
11. తెలుగు మాటల వ్యుత్పత్తి
12. తెలుగు నిఘంటువులలోని లోపములు
13. తెలుగు వ్యాకరణములలోని లోపములు
14. తెలుగు ఛందస్సు
15. దేశము, జాతి, వృత్తి మొదలయిన భేదమును బట్టి తెలుగు భాషలో కలిగిన భేదములు

16. సర్వజన సామాన్యమైన విషయములు బోధించే పుస్తకములు.
17. నేడు తెలుగు గ్రంథములలో వాడుతూ ఉన్న భాష
18. సారస్వత విమర్శ
19. భాషా తత్వము
20. అన్యదేశముల సారస్వతము
21. విద్యాభివృద్ధి

రామమూర్తిగారు తమ 'తెలుగు' పత్రికను ఒక్క ఏడాది పాటే నడపగలిగారుగాని, మరికొన్నేళ్ళు ప్రచురణ సాగితే భాషా శాస్త్రం పై ఇతోధికమైన ప్రామాణిక వ్యాస పరంపర వెలువడి ఉండేది. రామమూర్తిగారి ఇంగ్లీషు వ్యాసాలను యథాతథంగా ఆ భాషలోనే ముద్రించి ఒక గ్రంథంగా తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగులో మొట్టమొదటి సారిగా శాస్త్రీయ పద్ధతులలో భాషాశాస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రొఫెసరు''.

వ్యావహారిక భాషావాదోద్యమంలోనూ, రామమూర్తిగారి జీవితంలోనూ మరచిపోలేని సంఘటన 1924 అక్టోబరులో జరిగింది. ఆ సంవత్సరం ఆంధ్ర సాహిత్య పరిషత్తు 13వ వార్షికోత్సవాలు తణుకులో 9వ తేదీ మొదలు 13వ తేదీ దాకా నాలుగు రోజులు జరిగాయి. రామభద్ర చయనులు గారి ప్రోత్సాహం వల్ల రామమూర్తిగారు ఆ సభలో పాల్గొన్నారు. ఆచంట సాంఖ్యాయన శర్మగారు దానికి అధ్యక్షత వహించారు. రెండవరోజు మధ్యాహ్నం కేవలం రామమూర్తిగారి ఉపన్యాసం కోసమే రోజంతా కేటాయించారు. ఈ సభగురించి గిడుగు సీతాపతిగారు ఇలా రాశారు.[35]

''ఆ ఉపన్యాసము వినడానికి అనేకులు ఎక్కువగా వచ్చారు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు, శ్రీపాద కృష్ణమూర్తిగారు ఇంకా ఇతర మహాపండితులు, త్రిపురాన సూర్యప్రసాదరావు దొరగారు, కవులు, వచన రచయితలు సభలో ఉన్నారు. వేదిక పైని తెలుగు ప్రబంధాలు, చిన్నయసూరికి ముందు ప్రకటితములైన వచన గ్రంథాలు, పత్రికలలోని కాగితాలు మొదలయినవి మా తండ్రిగారి ఆసన్యము వెనుకను వరుసగా పేర్చి పెట్టినాము. వీరు ఉపన్యసిస్తూ ఉన్నప్పుడు ఏ సమయమున ఏ గ్రంథభాగము ప్రమాణముగానో నిదర్శనముగానో ప్రదర్శించుటకు వీరికి కావలెనో ముందుగానే గ్రహిస్తూ కావలసినది చేత నుంచుకొని అందిస్తూ ఉండేవాడను. వీరి ఉపన్యాసము మధ్యాహ్నము రెండున్నర గంటలనుండి సుమారు ఆరు గంటల వరకు సాగినది. సభాసదులు నిశ్శబ్దముగా వింటూ ఉండిరి. ఒకసారి పూర్వలక్షణమునకు విరుద్ధముగాను, వ్యవహారమునకు అనుకూలముగాను ఉండే ప్రయోగములు దుష్ట ప్రయోగములని ఆక్షేపిస్తూ ఉన్న కవి సమ్రాట్టుల కావ్యములందే ఉన్నవి చూపిస్తానని నావైపు మాతండ్రిగారు తిరుగగానే శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు గ్రంథమొకటి ఆ పుట వద్ద మడిచి అందించాను. ఆ ప్రయోగము గల పద్యము వీరు చదివినారు. అప్పుడు కృష్ణమూర్తి శాస్త్రిగారు 'అది మొదటి ముద్రణము. రెండవ ముద్రణము చూడుడు' అన్నారు.

35. సాహిత్యోపన్యాసములు - 4వ భాగం - పుటలు 31-32

'ఊరుకోవయ్యా! అది కాకపోతే ఇదిగో! అని మరి నాలుగిటువంటి ప్రయోగములు చూపి మన బండారము బయటపెడతాడీ పిడుగు' అన్నారు చెళ్ళపిళ్ళవారు. ఆ విషయము చిన్న కాగితము మీద వ్రాసి మా తండ్రిగారి యెదుట పెట్టినాను. అలాగునా? వారిని గూర్చి నేను వ్రాసిన వ్యాసాంశాలు ఇమ్మన్నారు. ఆ వెంటనే ఆ కాగితాలు మా తండ్రిగారి కందించాను. ''నేను చూపించిన ప్రయోగము అచ్చుతప్పయితే, ఇటీవల ప్రకటితములయిన ఈ పూర్వలక్షణ విరుద్ధ ప్రయోగాలకేమంటారు? ఇవి మీ పండితులు దుష్టప్రయోగాలంటారు; పొరపాట్లంటారు. ప్రమాదోధీమతామపి అంటారు. నేనలాగనను సాధువులే అంటాను. ఎట్లు అంటారా? నేటి జీవద్భాషలో ఉన్నవి కనుక. ఇవి లక్ష్యములుగా పెట్టుకొని ఇకముందు లక్షణము రచించేవారు, ఈ ప్రయోగములను ఆధారముగా పెట్టుకొని లక్షణము సరిదిద్దుకోవాలంటాను. ఇవి పొరపాట్లనుకోవడము పొరపాటు అంటాను. జీవద్భాషా ప్రభావమునకు కవి సమ్రాట్టులయినా లోబడక నేటి వాడుకలోను లేక చేసే ప్రయోగాలే 'మీరు వచ్చిరి; చేసితివి కాదు, ఏమి చెప్పము! నేను వెళ్ళెదనా' మొదలయినవి తప్పులంటాను' అని ఆవేశముతో నొక్కి చెప్పారు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు 'నిజము నిజమ'ని చిరునవ్వు నవ్వుతూ మా తండ్రిగారివైపు తిరిగి నమస్కరించారు. 'నా ఆగ్రహము విమర్శించే విషయముమీదనే కాని వ్యక్తిమీదనుకాదు' అన్నారు.

''5 గంటలసేపు ఏకబిగిని గంభీరోపన్యాసము చేసి తమ వాదాన్ని సమగ్రంగా వినిపించారు''. వారి ఉదారాశయము, సంస్కరణాభిలాష, సాహిత్యపురోగమన కాంక్ష, దేశ భాషాభ్యుదయ వాంఛ ఎల్లవారినీ ముగ్ధులను చేశాయి. వారి పాండిత్య ప్రదర్శనము ఒక జడివానవలె ఎల్లరినీ ముంచెత్తింది. ప్రతిపక్షులు ఆ వాదబలిమికి లోబడి ఎదురాడలేక ఆయన ప్రవేశపెట్టిన తీర్మానము 'గ్రామ్యము కాదని వ్యావహారికాంధ్ర భాషలో పూర్వ సంప్రదాయము ననుసరించి గ్రంథములు రచింపవచ్చును' అనేది హర్షధ్వానాలతో ఆమోదించారు. దిగ్విజయము సాధించినంత సంతోషముతో ఉప్పొంగిపోయారు రామమూర్తి పంతులుగారు. ఆంధ్రసాహిత్య పరిషత్తు నాడు తనవాదము ఆమోదించిరి. అప్పుడన్నారు; మాలో అప్పారావు (అంటే గురజాడ) లేడు. వాడుంటే ఇప్పుడు సంతోషము పట్టలేక గంతులు వేసేవాడు' అని. ఈ విజయము తనది మాత్రమే కాదు. వ్యావహారిక భాషావాదులందరిదీ అని ఆయన అభిప్రాయము.''[36]

పండితుల చేతే ఔననిపించుకొన్నాక రామమూర్తిగారు 'బాలకవిశరణ్యాం', 'నిజమైన వచన రచనా సంప్రదాయం', 'కృతకగ్రాంథికాంధ్ర విజృంభణ' అనే గ్రంథాలు రచించాలని ప్రణాళిక వేసుకొన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సహాయాన్ని కోరుతూ ఒక ఉత్తరంలో ఇలా రాశారు.[37]

''నూగుగురు కృతక గ్రాంథికాంధ్ర రచయితల భాష విమర్శించి వారు పట్టించిన కృతక భాష ప్రకటీకరిస్తాను. చిన్నయసూరి మొదలుకొని చిలకమర్తి లక్ష్మీనరసింహం

36. తెలికచర్ల వెంకటరత్నం - 'ఆధునికాంధ్ర సాహిత్యము'పై గిడుగురామమూర్తి పంతులుగారి ప్రభావము' - సాహిత్యోపన్యాసములు - 4 పుట.53

37. మరోసారి గిడుగు రామమూర్తి - పుట.44

వరకున్నూ, వేదము వెంకటరాయశాస్త్రి, పురాణపండ మల్లయ్యశాస్త్రి, నేతి సుబ్బరాయశాస్త్రి, మల్లాది సూర్యనారాయణశాస్త్రి - ఇట్టి పండిత నామధారులు; ఆంధ్ర వాల్మీకులు, వడ్డాది సుబ్బరాయకవివంటి కవులు; కొమర్రాజు లక్ష్మణరావు, వంగూరి సుబ్బారావు, చెలికాని లచ్చారావు, జయంతి రామయ్య, చిలుకూరి వీరభద్రరావు వంటి విమర్శకులు, నవలాకర్తలు, బడిపుస్తకములు రచించినవారు, పానుగంటి లక్ష్మీనరసింహ రావువంటి నాటక నిర్మాతలు - వీరందరి గ్రంథములు చూచినాను. అపశబ్దాల క్రింద గీట్లు గీసి ఉన్నాను. అవి అన్ని ఎత్తి వ్యాసరూపమున ప్రకటించవలెను. వాడుకభాషను దూషించి అపరిచితమయిన ప్రాచీనాంధ్రములో రచించేవారికందరికీ ప్రమాదము తప్పనిది. మీకయినా అంతే, నాకయినా అంతే, మీకన్నా ఎక్కువగా ప్రాచీనాంధ్రమును శోధించి తెలుసుకొన్న 'పండితుల'ను నేను ఎరుగను. ఇచ్చకానికి చెప్పినమాట కాదు, నమ్మండి. అయినా, మీ వ్రాతలో కూడా కృతకభాష ఉన్నది గాని లేకపోలేదు. అందుకు తక్కినవారితోపాటు మీరూ నిందార్హులు.''

ఆంధ్రసాహిత్య పరిషత్తు గిడుగు రామమూర్తి గారిని దూరం చేసుకొంటే తనకే నష్టమని గుర్తించింది. నిఘంటు నిర్మాణంలో జాప్యం జరుగుతూనే ఉంది. వేదం వెంకటరాయశాస్త్రిగారు తమ పని మానుకొన్నారు. జయంతి రామయ్యగారు సారథ్యం వహిస్తున్నా రథం మెల్లగా కుంటుతోంది. రామమూర్తిగారి సహాయాన్ని అర్థించారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి 1924 మార్చి 7వ తేదీనాడు రాసిన ఉత్తరంలో గిడుగు రామమూర్తిగారు ఇలా రాశారు.[38]

''మ॥ జయంతి రామయ్య శ్రీ సూర్యరాయబృహదాంధ్ర నిఘంటువులో చేరవలసిన తత్సమ శబ్దాల విచారణ పూర్తి అయినదట. దేశ్యాల విచారణ మొదలుపెట్టినారట; చాలా చిక్కులు కనబడుతున్నవట; నా సాయము కావలెనట. నేను దానికి ఏమి జవాబు చెప్పనానంటే - 'అయ్యా! మన మతాలు వేరు, నేను అవునన్నది మీరు కాదంటారు. మీకు అచ్చుప్రతులలోని శబ్దాలు సాధువులు; నాకు వ్రాతప్రతులలోనివి సాధువులు. శబ్దాలవలెనే శబ్దార్థాలు కూడా శబ్దరత్నాకరమందు దోషయుక్తమై ఉన్నవి. వ్యుత్పత్తులు కూడా శ॥రలో తప్పులున్నవి. ఇంతేకాక ప్రాచీనాంధ్ర శబ్దములకు వర్తమాన వ్యావహారికాంధ్రములో అర్థము చెప్పడము పూర్వ పండితుల సంప్రదాయము. నాగదేవ భట్టోపాధ్యాయుడున్నూ, తాళ్ళపాక వారున్నూ, నామలింగాను శాసనమునకు, తెలుగు టీకలు అట్లే వ్రాసినారు. పరవస్తు శ్రీనివాసాచార్యులుగారు సర్వశబ్ద సంబోధినిలో సంస్కృతాలకు తెలుగున వాడుక మాటలతో అర్థము చెప్పినారు. మామిడి వెంకయ్య ఆంధ్రదీపిక అట్లే రచించినాడు. సంస్కృతాంధ్ర కావ్యాలకు టీకలు రచించిన పండితులందరూ వ్యావహారికమే వాడినారు. బ్రౌణ్యా నిఘంటువు కూడా ఆ సంప్రదాయము ననుసరించే గొప్ప పండితుల రచించినారు. ఆ శిష్టాచారము మీరు కూడా అవలంభించే యెడల కూలి ఏమీ కోరకుండా సేవ చేస్తాను. లేదా మీరు గ్రంథమంతా సిద్ధము చేసిన తర్వాత నేనువచ్చి చూచి, దానిలో చేర్చవలసినవీ, తొలగించవలసినవీ,

38. మరోసారి గిడుగురామమూర్తి - పుట.45

మార్చవలసినవీ సప్రమాణముగా తెలియజేస్తాను. నా ఉపదేశము మీరు అంగీకరించి నప్పుడు ఒక్కొక్క అంశమునకు ఒక్కొక్క రూపాయి చొప్పున ఈనాము దయచేయవలెను'' ఇట్లు నేను జవాబు ఇచ్చినాను. అందుకు బదులు జాబు రాలేదు; రాదు.''

ఆంధ్రభాషా సాహిత్యాలను ఆధునిక రీతుల్లో అభివృద్ధి చేయడానికి ఆంధ్రసాహిత్య పరిషత్తు కలసిరాదని తేలుతున్న రోజుల్లో 1919 నుంచి 1924 దాకా మధ్యనున్న అయిదేళ్ళలో నూతనోత్సాహంతో రచనలు చేద్దామనుకొంటున్న సాహితీపరులందరు ఒక కూటమిగా ఏర్పడ్డారు. వీళ్ళలో తల్లావఝల శివశంకరశాస్త్రి, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య, నోరి నరసింహశాస్త్రి మొదలైనవారు వున్నారు. ఆదిలో ఈ మిత్రమండలి వారంతా గ్రాంథిక భాషావాదులే, వారికి వ్యావహారిక భాష పనికిరాదు. దానికి తోడు ఆరోజుల్లో వ్యావహారిక భాషలో సరియైన సాహిత్య రచనలు లేవు. అట్టి సమయంలో శివశంకరశాస్త్రి వ్యావహారిక భాషలో రచన చేయడం రసవంతంగా ఉంటుందనే నిశ్చయానికి వచ్చారు. మిత్ర బృందంతో చర్చించి, వారిని ఒప్పించి వాడుకభాషవైపు వారిని తిప్పారు.[39] చింతాదీక్షితులుగారు ఈ బృందానికి మిత్రులే. ఆయనా బసవరాజు అప్పారావుగారూ, గురజాడ అప్పారావుగారి దారిలోన నడుస్తున్నవారు. ఈ మిత్రబృందమంతా 1919లో 'సాహితీ సమితి' అనే సంస్థగా ఏర్పడ్డారు. దానికో నియమావళి, ఎన్నికల తతంగం లేవు. ఈ సమితి వారి 'సాహితి' అనే ఒక పత్రిక 1920లో వెలువడింది.

సాహితి పుట్టిన తర్వాత వేదుల సత్యనారాయణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు మొదలైన వారందరూ సాహితి సమితిలో సభ్యులైనారు. దేశంలోని కవులందరూ సాహితీ సమితిలో చేరాలని ఉవ్విళ్ళూరారు. 'సాహితి' పత్రికలాగే 'సఖి', 'శారద' మొదలైన పత్రికలు వెలువడసాగాయి. ఈ యువకులందరూ గిడుగు రామమూర్తిగారి వాదాన్ని బలపరుస్తూ వారి చెంత చేరారు. సాహితి సమితికి పేరు ప్రతిష్ఠలు స్థిరపడ్డాక గిడుగు రామమూర్తిగారిని అందులో గౌరవసభ్యునిగా చేర్చుకొని తమ ప్రత్యేకాభిమానాన్ని ప్రకటించారు. (సాహితి సమితి కృషి గురించి, నవ్యసాహిత్యం గురించిన ప్రసక్తి వివిధ ప్రకరణాల్లో ఉంటుంది.) 1924లో కాశీనాథుని నాగేశ్వరరావుగారు 'భారతి' పత్రికను స్థాపించారు. ఇందులో ప్రాచీనాంధ్ర సాహిత్యంతోపాటు నవ్య సాహిత్యానికీ, వ్యావహారిక భాషకు గౌరవస్థానమిచ్చి ఆదరించారు.

గిడుగు రామమూర్తిగారు యువ రచయితలందరితో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తూ ఉండేవారు. వారికి దినదినం గ్రంథకర్తల దగ్గర నుంచి కొత్త కొత్త పుస్తకాలు అందుతూ ఉండేవి. అవన్నీ ఆమూలాగ్రం చదివి రచయితలకు సూచనలు చేస్తూ, అభినందిస్తూ, కొందరి గ్రంథాలకు పీఠికలు రాస్తూ ఉద్యమాన్ని రామమూర్తిగారు సజీవంగా నిలిపారు.

---

39. నోరి నరసింహశాస్త్రి వ్యాసములు - సారస్వత వ్యాసములు - 5వ సంపుటం - పుట.578

దేశం అంతా మారుతూంది కనుక ఆంధ్రసాహిత్య పరిషత్తుకూడా మారవచ్చుననే ఆశ ఆధునికులకు పూర్తిగా పోలేదు. ఆదిలో గురజాడ అప్పారావుగారు మొదలైనవారు ఏ సదుద్దేశంతో సాహిత్య పరిషత్తు సభ్యులుగా చేరారో, ఆ ఉద్దేశ్యంతోనే 1933లో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు వార్షిక సభలలో పాల్గొనడానికి రాజమహేంద్రవరానికి సాహితీ సమితి సభ్యులు హాజరయ్యారు. చింతా దీక్షితులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, పిలకాగణపతిశాస్త్రి, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, తెలికిచర్ల వెంకటరత్నం, సామినేని ముద్దుకృష్ణ ఈ సభ్యులలో ముఖ్యులు. తెలికచర్ల వెంకటరత్నం (ఎం.ఏ.)గారు 'మాతృ భాష-పరభాష' అనే వ్యాసాన్ని చదివారు. 'జ్వాల' పత్రిక సంపాదకులు ముద్దుకృష్ణగారు భావకవుల యతిప్రాసల గురించి తెలిపారు.[40] ఇందరు సాహితీ సమితి సభ్యులు 'ఆంధ్రసాహిత్య పరిషత్తు' సభలలో పాల్గొనడం అపురూపమే. అయితే ఇది ఆఖరిసారి అనుకోవాలి.

1937 సంవత్సరంలో రాజమండ్రిలో గిడుగు రామమూర్తిగారి సప్తతితమ జన్మదినోత్సవాన్ని వైభవోపేతంగా దేశం జరుపుకొంది. ఆ సంవత్సరంలో అభినవాంధ్ర కవి పండిత సభ ద్వితీయ సమావేశం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి అధ్యక్షత కింద జరిగింది. దేశం నలుమూలల నుండి కవులు, పండితులు, రచయితలు, పత్రికా సంపాదకులు, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు రెండువందలమంది సమావిష్టులై రామమూర్తిగారిని అభినందించి వారి కృషి పట్ల తమ కృతజ్ఞతలనూ, గౌరవాన్ని ప్రకటించారు. రామమూర్తిగారి గ్రంథాలను ప్రచురించి ఆ సభలో వారికి బహూకరించారు. 'వ్యాస సంగ్రహం' అనే ప్రత్యేక సంచికను ప్రచురించారు. (ఇందులో ఇంగ్లీషు భాషలో 13 వ్యాసాలూ, తెలుగులో 37 వ్యాసాలూ పరమప్రామాణికమైనవి ఉన్నాయి.) ఆ అపూర్వ గ్రంథాన్ని అందుకొని సభ్యులందరినీ చూసి రామమూర్తిగారు ఉత్తేజితులై ఇలా అన్నారు.[41] ''20 ఏండ్ల క్రిందట నేను వాడుక భాష గురించి ప్రజలకు నచ్చజెప్పవలెనని ఈ నగరములో ప్రయత్నిస్తే అప్పుడు నాకు ఉపన్యసించే అవకాశమే, అందుకు తగిన స్థలమే దొరకలేదు. అట్టి రాజమహేంద్రవరంలో పూర్వము నాకు ప్రతిపక్షులుగా ఉండే పలువురు కవి పండితుల సమక్షములో నేడింతటి అపూర్వ సత్కారము జరగడము నా వ్యావహారిక భాషావాదము, ప్రజాదరమూ పండితాదరమూ పొందినదనడానికి ప్రబల తార్కాణము. ఈ సంపుటములోని వ్యాసములు వ్రాసినవారంతా నా వాదము ఆమోదించారని గర్విస్తున్నాను. నాకృషి ఫలించింది అని ఆయనకు కలిగిన సంతృప్తి, సంతోషము వర్ణనాతీతములు.'' ఆనాటి సభలో 'అభినవాంధ్ర కవి పండిత సభ' పేరును 'నవ్యసాహిత్య పరిషత్తు' మార్చారు. రామమూర్తిగారినే గౌరవాధ్యక్షులుగా, ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారిని అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. తెలికచర్ల వెంకటరత్నంగారు కార్యదర్శి. పలువురు ప్రముఖ కవి పండితులు కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికైనారు.

40. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక - సంపుటి-22, సంచిక-1, పుట.36 (1933 వార్షికసభ)

41. సాహిత్యోపన్యాసములు - 4వ భాగం, పుట.55

పిమ్మట 'ప్రతిభ' అనే పత్రికను ఈ సంస్థ కొంతకాలం ప్రచురించింది. రామమూర్తిగారి సప్తతితమ జన్మదినోత్సవం నవ్యసాహిత్యానికి ఒక మాదిరి జన్మదినమైంది. నవ్యసాహిత్య పరిషత్తు ఆవిర్భవించాక ఆధునికులలో పరిశోధకులు తప్ప మరెవరూ ఆంధ్ర సాహిత్య పరిషత్తు జోలికి పోలేదు. ప్రజల వాడుక భాష గెలిచింది. పండితుల వేడుక భాషగా గ్రాంథికం కాగితాలలో నిలిచింది.

అంతవారూ - ఇంతవారూ

త్యాగస్వామి ''ఎందరో మహానుభావులు - అందరికీ వందనములు'' అని కీర్తించాడు. జమీందారీ యుగంలో ఏదో ఒక ప్రత్యేకత గల కవి పండితులు చాలామంది ఉన్నారు. వీరందరి గురించి తెలుసుకోవాలి గాని కొందరి గురించే చెప్పుకొనడానికి అందులోనూ టూకీగానే ముచ్చటించుకొనడానికి ఉపక్రమించినా చాలా వ్యవధి కావాలి. తెలియవచ్చినంత మట్టుకే విశదం చేస్తాను. వీరిలో కొందరు 'ఒంటి' చేతిమీదుగా పదిమంది చేయవలసిన సాహిత్య రచనలు చేశారు. నాలుగు జీవిత కాలాలకి సరిపోయేది ఒక జీవితకాలంలో చేశారు.

పరవస్తు వెంకట రంగాచార్యులు (1822-1900)

ఒక వ్యక్తి నలభై సంవత్సరాలు శ్రమించి ఒక నిఘంటువును, అందులోనూ ''ఎన్‌సైక్లోపీడియా'' లాంటిది రచించి పూర్తి చేయడం సామాన్యమైన సంగతి కాదు. విశాఖపట్టణంలో పరవస్తు వెంకట రంగాచార్యులుగారు ఈ బృహత్కార్యాన్ని చేశారు. వారి ''శబ్దార్థ సర్వస్వం'' అకార, అకారాది పదాలున్న గ్రంథం. రెండు సంపుటాలుగా వెలువడింది. రంగాచార్యులుగారే విశాఖపట్టణం ఆర్ష విజ్ఞాన ప్రచారం కోసం ఒక ముద్రణాలయాన్ని స్థాపించ అచ్చువేశారు.

ధనాభావంచేత ఈ గ్రంథం సాంతం అచ్చుకాకపోవడం దురదృష్టం. వెంకట రంగాచార్యులుగారు శాకుంతలాన్ని తెలుగులో అనువదించిన వారిలో ప్రథములు. ఉభయభాషా పండితులు. షడ్దర్శన పారంగతులు. బహుగ్రంథకర్తలు.

1887లో ''మహామహోపాధ్యాయ'' బిరుదు పొందారు. అందుకు తగినవారు. ఉపనిషత్తులలోని శాంతిశ్లోకం ఒకటి ఇలా ఉంది.

''పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే!
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే!!

దీనిని ఆచార్యులుగారు ఇలా అనువదించారు.

పూర్ణమదిపూర్ణమిదియుం
బూర్ణంబగు దాని వలనఁ బూర్ణము పొడమున్
బూర్ణమగు దానిదేయగు
పూర్ణముఁగొని మిగులు చుండు పూర్ణమెయెందున్.

పరవస్తు వెంకట రంగాచార్యులుగారు పరిపూర్ణులనిపిస్తుంది.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి (1833-1897)

ఒక కవి తన జీవితకాలంలో 13 ఏకప్రాస శతకాలు, 23 వివిధ ప్రాసల శతకాలు, 4 పద్యకావ్యాలు, 4 గద్య కావ్యాలు తెలుగులో రాసి, కొసరుగా కొన్ని సంస్కృత రచనలు కూడా చేస్తే అతడు చెప్పుకోదగ్గ వ్యక్తే. మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు విశాఖపట్నం జిల్లా బొబ్బిలి దగ్గర పాలతేరు గ్రామంలో జన్మించి పెరిగినా వివిధ సంస్థానాలలో సన్మానాలు పొందే పాండిత్యాన్ని సంపాదించారు. తన డైరీని ఒక శతక రూపంలో చెప్పారు. అందులో ఆత్మచర్యను, సాధించిన వాటిని వివరించారు. అముద్రిత గ్రంథ చింతామణిలో 1892 డిసెంబరు మాసం పత్రికలో పార్వతీశ్వర శాస్త్రిగారి ''ప్రబంధ నిబంధ బంధ నిబంధన గ్రంథం'' అనే వ్యాసం పద్యరూపంలో అచ్చుపడింది. 1894 జూలై నెల పత్రికలో ''మండపాక పార్వతీశ్వర కృతి కృత కృతతతి'' అనే పేరున వారి రచనల వివరాలు, వారి వంశంలోని ఇతరుల రచనల వివరాలు అచ్చుపడ్డాయి. అముద్రిత గ్రంథ చింతామణి పుటలలో తరుచు కనబడే పేరు వీరిది.

1897 సెప్టెంబరు నెల అముద్రిత గ్రంథచింతామణిలో పార్వతీశ్వరశాస్త్రిగారి మరణాన్ని ''విచారకరమైన వృత్తాంతములు''లో మొదట ప్రచురించారు. జూన్ 30వ తేదీన వారు పోయాక చాలాకాలం అముద్రిత గ్రంథ చింతామణిలో వారి రచనలు అచ్చుపడుతూ వచ్చాయి. పార్వతీశ్వరశాస్త్రిగారి మనుమడు తాతగారి పేరిటవారే. తాతగారి రచనలకు ప్రాచుర్యం తెచ్చారు.

కొక్కొండ వెంకటరత్నం (1842-1915)

అభ్యుదయ భావాలు గల సంస్కర్తలు సామాన్య ప్రజలకు సాధ్యమైనంత చేరువగా సాహిత్యాన్నీ, సంఘ జీవితాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సరసనే అభివృద్ధి నిరోధకులు వీలైనంత వెనక్కి సమాజాన్ని తీసుకుపోవడానికి ప్రయత్నిస్తారు. ఇది సాధ్యం కానప్పుడు ''యథాస్థితి''లో సమాజాన్ని మేకుబందీ చేసి ''సంరక్షించ''డానికి పూనుకొంటారు. జమీందారీ యుగంలో సంఘ సంస్కారాన్ని ప్రతిఘటిస్తూ, సనాతన భావాలను సంరక్షిస్తూ సజీవ భాషలో కాక కృతకశైలిలో సాహిత్య రచననేకాక, సంభాషణలు కూడా చేస్తూ తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్న అచ్చాణీ కొక్కొండ వెంకటరత్నశర్మగారు. ఈయన పేరులోని ''శర్మ'' అన్న పదం మరుగునపడి అందరూ వీరిని ''పంతులు'' అని పిలిచేవారు. ఈయనకు చాలా బిరుదులు ఉన్నాయి. ''కవిబ్రహ్మ'', ''అక్షర సంఖ్యాచార్యులు'', ''ఆంధ్రాజాన్సన్'' అన్నవి మిత్రులు ఇచ్చిన బిరుదులు.

1907లో ''భారతవర్ష మహామహోపాధ్యాయ'' అనేది సగౌరవంగా సంపాదించుకొన్న బిరుదు. ఈ యుగంలో ఈ విశిష్టమైన బిరుదును తెచ్చుకొన్న ఆంధ్రులలో ఈయన రెండోవాడు. (మొదటివారు పరవస్తు వెంకట రంగాచార్యులు (1822-1900)గారు. వీరు 1887లోనే మహామహోపాధ్యాయులైనారు.)

''మహామహోపాధ్యాయ'' బిరుదాన్ని సర్కారువారు సత్కరించి ఇవ్వాలి. ''నేటి బిరుదుల పరమ రహస్యం'' అనే వ్యాసంలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు ఇలా చెప్పారు: ''మన బిరుదుల విషయంలో ప్రభుత్వం జోక్యం కలిగించుకోదు. మహామహోపాధ్యాయ బిరుదు మాత్రమే వారి అధికారానికి లోబడేది. ఆ బిరుదాన్ని వారు (అయాచితంగానే అందాం) యిచ్చినా తన పాండిత్యం యెంతో తెలిసిన వెం.శా. దానికి వొక దండం పెడతాడు... నానాటికి ''మహామహోపాధ్యాయ'' బిరుదం గతి ఈ రీతికి వచ్చివుందని కృష్ణ వ్యాకరించిందని జ్ఞాపకం. పట్టవలసిన వాళ్ళని పట్టి చేతిలో కవిత్వమంటూ వొకటి వుంది గనుక.... కొంత కృషి చేస్తే వారు వారు లోగి శిఫారసు చేస్తే ప్రభుత్వం విదేశీయం కనుక ఆయా బిరుదున్నూ సంపాదించవచ్చు.[1]

కొక్కొండ వెంకటరత్నంగారు విదేశీయ ప్రభుత్వానికి విధేయులే. రాజభక్తి పరాయణులే. 1876లోనే ప్రిన్స్ ఆఫ్ వేల్సు (ఏడవ ఎడ్వర్డ్) భారతదేశానికి విచ్చేసినప్పుడు ఈయన ''ప్రిన్సాపువేల్సు తారావళి'' అనే రచన చేశారు. ఇది లండన్‌లోని క్రౌన్‌పెర్‌ఫ్యూమరీ కంపెనీ వారు నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతిని పొందింది. (ఈ సువాసన తైలాల కంపెనీవారు పెట్టిన పోటీలో దేశం మొత్తంమీద వివిధ భాషలలోని 108మంది కవులు తమ రచనలు పంపించారట. ఇంగ్లీషు అనువాదాలను పరిశీలించిన న్యాయనిర్ణేతలు కొక్కొండ వారికి తొలి బహుమతి, ఆదిభట్ల నారాయణదాసుగారి ''తారకం'' అనే రచనకు రెండో బహుమతి ఇచ్చారు.) కొక్కొండవారు సంస్కృతాంధ్రాలలో సమానంగా కవిత్వం చెప్పగలరు. ఆయనకు చిన్నప్పుడే కవిత్వమబ్బింది.

కొక్కొండ వెంకటరత్నంగారు 1842లో వినుకొండలో జన్మించారు. గుంటూరులో చదువుకొన్నారు. పది పన్నెండేళ్ళ వయసులో పద్యాలు అల్లడం పట్టుబడింది. 15వ యేటనే కలక్టరాఫీసులో గుమాస్తాగా చేరారు. (మూడవయేటనే తండ్రి మరణించడం చేత ఉద్యోగంలో చేరవలసిన అవసరం బాలప్రాయంలోనే వెంకటరత్నంగారికి కలిగి ఉంటుంది.) తర్వాత సర్వే పనిలో ఉండేవారు. 1856-63 సంవత్సరాల మధ్య వీరు కోయంబత్తూరు జిల్లాలో ఉపాధ్యాయవృత్తిలో ఉండేవారు. 1864లో మద్రాసు వచ్చారు. నాటి నుంచి మూడున్నర దశాబ్దాలపాటు 1899దాకా చెన్నపట్నంలోనే ఉన్నారు. పరవస్తు చిన్నయసూరిగారి తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీలో ఆంధ్ర పండిత పదవిని కొక్కొండ వారే అధిష్ఠించి చిన్నయసూరి వారసత్వాన్ని దఖలు పుచ్చుకొన్నారు.

''అతనికంటే ఘనుడు ఆచంట మల్లన'' అన్నట్టు సూరిగారికన్నా తన గొప్పతనాన్ని వింతగా చాటుకొన్నారు. సూరిగారు సలక్షణమైన భాషలోనే రాయాలన్న నియమంతో కృతకభాషను దేశంమీద రుద్దితే కొక్కొండవారు సలక్షణమైన భాషలోనే

1. కథలు-గాథలు (తృతీయ భాగం) - పుటలు.539, 540

మాట్లాడితీరుతారు. ఇంట్లో భార్య దగ్గరా, బజారులో దుకాణాల వద్దా, వాకిట్లోకి వచ్చిన బిచ్చగాళ్ళతోనూ గ్రాంథికమే మాట్లాడేవారు. కొన్ని మచ్చుతునకలు చూడండి. ''మచ్చెకంటీ! బిచ్చగాడు వచ్చియున్నాడు. బిచ్చము వైచి పంపుము'' లేక ''తండులములు నిండుకొన్నవి. పొండు! పొండు. ''కొమ్మా! పానీయమ్ములు తెమ్మా!'' ఇంత విడ్డూరంగా మాట్లాడితే వినేవాళ్ళకు నవ్వులుగానే ఉంటుంది. ఎందరు నవ్వినా కొక్కొండవారి నాపచేను పండలేదు.

కొక్కొండ వారి సలక్షణ భాషాభిమానం ఇక్కడితో ఆగలేదు. ఆయన తమ రచనలలో ఎక్కడా ఆంగ్ల భాషా పదాలు వాడకూడదనుకొన్నారు. నిత్య వ్యవహారంలో ఎన్నో ఇంగ్లీషు మాటలు విధిగా వాడకతప్పదు. అటువంటి వాటికన్నింటికి తెలుగులో కొత్త పారిభాషిక పదాలను పట్టించి వాడసాగారు. ప్రభుత్వం వారి ఉత్తరువుల మీద అనువదిస్తున్న గ్రంథాలలో సైతం ఈ విశ్వామిత్ర సృష్టిని చొప్పించారు. ఉదాహరణకు ''రెవెన్యూ బోర్డు''కు కొక్కొండవారు ''రైవిన్యాసక సభ'' అనే పదాన్ని సృష్టించారు. వీరి బాటలోనే ఆదిలో వీరిని అభిమానించే కందుకూరి వీరేశలింగంగారి వంటి రచయితలు ''జిల్లా కలక్టరు'' అనే పదానికి ''మండల రక్షణ భట శాఖాధ్యక్షుడు'' అనీ, ''జాయింటు మేజిస్ట్రేటు'' అనే శబ్దానికి ''సంయుక్త దండ విధాయకుడు'' అని పారిభాషిక పదాలను వాడడం మొదలుపెట్టారు. ఉత్తరోత్తరా వీరేశలింగంగారు భాషా విషయంలో కొన్ని సడలింపులు ఒప్పుకొన్నారుగాని కొక్కొండవారు ఒక్కింత కూడా మార్పుకు సుముఖులు కాలేదు. సలక్షణభాష అంటూ విలక్షణ భాషను పట్టుకు వేళ్ళాడుతూనే ఉన్నారు.

సలక్షణమైన భాషను నిర్దేశించడానికి చిన్నయసూరిగారు ప్రయత్నాలు ప్రారంభించినారు గానీ పూర్తి చేయలేదు. ''వచన రచన సేయు కౌశలము చిరకాలము బహు లక్ష్యములందు బరిశ్రమము చేయక రానేరాదు. భాషా సమిష్టికి లక్షణ గ్రంథము కుదిరిన పక్షమందంత శ్రమపడ బనిలేదు'' అని సూరిగారు బాల వ్యాకరణం పీఠికలో చెప్పారు. ఆయన నీతిచంద్రికను 1853లో తొలిసారి ప్రకటించారు. అది వారు లక్ష్యగ్రంథంగా భావించారు. బాల వ్యాకరణం మరొక అయిదేళ్ళ తర్వాత 1858లో వెలువడింది. సూరిగారు నీతిచంద్రిక పూర్వార్థాన్నే రచించారుగాని అది వెలుగుచూసి ఒక దశాబ్దం దాటినా ఉత్తరార్థాన్ని రచించలేదు. 1862లో ఆయన కాలం చేశారు. అయితే ఆయన పాఠ్యగ్రంథాలుగా నిర్దేశించిన నీతిచంద్రికా, బాలవ్యాకరణం రాజధాని అంతటా బోధించవలసిన అవసరం తెలుగు ఉపాధ్యాయులకు తప్పనిసరి అయింది. ముఖ్యంగా ప్రెసిడెన్సీ కాలేజీలో సూరిగారి స్థానంలో పండితులుగా నియమితులయిన కొక్కొండ వారికి ఇది ఉద్యోగ విధిగానేకాక అభిమాన వ్యాసంగంగా కూడా అలవడింది.

చిన్నయసూరిగారు అధిష్టించిన పీఠాన్నెక్కినా సాహిత్యంలో వారి స్థానాన్ని మాత్రం ఎవరూ ఆక్రమించలేదు. అయితే సూరిగారు అసమగ్రంగా వదిలిపెట్టిపోయిన లక్ష్యగ్రంథాన్ని కొక్కొండవారు పూర్తి చేయదలిచారు. నీతిచంద్రికలోని మిత్రలాభం, మిత్రభేదం అనే భాగాలను మాత్రమే సూరిగారు రచించి ప్రకటించారు. సూరిగారు పోయిన

నాలుగేళ్ళకు 1866లోనే కొక్కొండవారు నీతిచంద్రికలోని విగ్రహతంత్రాన్నీ, సంధినీ రచించారట. అయితే 1872 దాకా ప్రకటించలేదు. అద్దైనా ఒక విగ్రహతంత్రాన్నే ముద్రించారు. దీనిని పత్రికలు ప్రశంసించాయి. విద్యాధికారులు పాఠ్యగ్రంథంగా పెట్టారు. విమర్శగా పరికించిన వారు మాత్రం మెచ్చుకోలేకపోయారు.

కందుకూరు వీరేశలింగంగారికి చిన్నయసూరిగారి మీద ఆదిలో వల్లమాలిన భక్తి. కొక్కొండవారిమీద వారు 1871లో ఆంధ్ర భాషా సంజీవని అనే పత్రికను పెట్టగానే అభిమానం కలిగాయి. వీరేశలింగంగారు తాము రచిస్తున్న పద్యకావ్యాలలో ఒకటైన శుద్ధాంధ్ర భారత సంగ్రహంలోని సభాపర్వాన్ని కొక్కొండ వారి పత్రికకే ప్రచురణార్థం పంపారు. అది అచ్చుపడింది. లోకం మెచ్చుకొన్నది. వీరేశలింగంగారు పద్యకావ్యాలకన్నా వచన కావ్యాలు ఉపయోగకారులని భావించి చిన్నయసూరి నీతిచంద్రికలోని ఉత్తరార్థాన్ని పూరించదలిచారు. విగ్రహతంత్రాన్ని పూర్తి చేశారు. అది ముగించగానే కొక్కొండవారి గ్రంథం గురించి పత్రికలవల్ల తెలుసుకున్నారు. తాము పడిన ప్రయాస అంతా వ్యర్థమైపోయిందని బాధపడ్డారుగానీ కొక్కొండ వారి పుస్తకాన్ని చదివాక తమ విగ్రహ తంత్రమే మేలురకం రచన అన్న ధైర్యంతో 1874లో దానిని ముద్రించారు. వెంటనే ప్రశంసలు వచ్చాయి. దీనిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు.

కొక్కొండవారికి కోపం వచ్చింది. వారి శిష్యులు శివశంకరపాండ్యగారు తమ గురువుగారి విగ్రహ తంత్ర టిప్పణికి ఇంగ్లీషులో పీఠిక రాస్తూ వీరేశలింగంగారి విగ్రహ తంత్రం కొక్కొండ వారి పుస్తకానికి ''పుర్రచెయ్యివాటపు అనుకరణ'' అని దూషించారు. వీరేశలింగంగారికి వళ్ళుమండింది. కొక్కొండవారి పుస్తకాన్ని నిశితంగా విమర్శించారు. కొక్కొండవారి సంస్కృత జ్ఞాన శూన్యతకు ఈ ఒక్క గ్రంథమే కాక వారి పత్రిక కూడా తార్కాణమని చెప్పారు.[2] కొక్కొండ వారి విగ్రహ తంత్రాన్ని ఇలా సమీక్షించారు.

''చిన్నయసూరిగారి పూర్వార్థమునకును, పంతులవారి యుత్తరార్థమునకు హస్తిమశకాంతరము కలదని ఈ ప్రాంతముల పండిత పామర సామాన్యముగా నందఱి అభిప్రాయమునయి వున్నది. ఏనుంగుకన్న దోమయే పెద్దనుకొనువారికి మాత్రమొక వేళ నీ యుత్తరార్థమే మేలైనదిగాఁ గానిపించవచ్చును. వారికట్లే కనిపించనిండు. పూర్వార్థము యొక్క రచనా చమత్కృతియు, పదలాలిత్యమును, వాక్య మార్దవమును, శైలి మాధుర్యమును, నీతి గౌరవమును, కనియానందించు వారెవ్వరుగాని పంతులుగారి యుత్తరార్థముం జూచినచో, దీనదానిలో సహస్రాంశమయిన గుణములఁగానమని ఘోషింప వెనుకదీయరు. వేయేల? పూర్వార్థముంజూచిన కన్నుల దీనిఁ జూచినచో నెవ్వరేని ఈ యుత్తరార్థమును నొకవచన కావ్యమని, నోరు తెఱచి చెప్పుటకు సిగ్గుపడుదురనుట స్వభావోక్తియేకాని యతిశయోక్తి కాదు....''

కొక్కొండ వారి విగ్రహతంత్రాన్ని ఇంత నిర్దాక్షిణ్యంగా దుయ్యబట్టినా, వీరేశలింగంగారు కొంత దయదలచారు. ''పంతులవారి వచన గ్రంథములలో నిది

2. వీరేశలింగం స్వీయచరిత్ర - 2వ భాగం, పుట.186

మొదటిది కాబట్టియే దీనియందిట్టి పొరపాటులు మెండుగాబడియుండును. తరువాత వీరు వ్రాయుచు వచ్చు సంజీవనీ శైలి ఈ పుస్తకము శైలికంటే బెక్కు మడుంగుల మిన్నగా నున్నది'' అని మెచ్చుకొన్నారు.[3]

వాస్తవానికి ఆనాటి పండితులలో చాలామందికి కొక్కొండవారి భావాలతోనేగాని భాషతోఅట్టే పేచీ లేదు. ఇతరులంతా ఎంతో కొంత సంస్కారాన్ని ఏదో ఒక విభాగంలో కోరుకొంటే, కొక్కొండవారు ససేమిరా సనాతన ధర్మం మార్చడానికి వీలులేదంటారు. 1864లోనే వేద సమాజం వారు ప్రారంభించిన ''తత్త్వబోధిని'' అనే పత్రిక సంఘ సంస్కార విషయాలను ప్రచురిస్తూ ఉండేది. ఈ పత్రికలోనే స్త్రీ పునర్వివాహ విషయకములైన వ్యాసాలు చదివి వీరేశలింగంగారు ఉత్తేజితులయ్యారు. కొక్కొండ వారు ఆగ్రహించారు. వీరేశలింగంగారు మొదట స్త్రీ విద్య ఆవశ్యకము అంగీకరిస్తూ పత్రికలలో రాసేవారు. 1875లో స్త్రీ పునర్వివాహ శాస్త్ర సమ్మతమని వాదించే గ్రంథాలు వెలువడ్డాయి. కొక్కొండవారు దానిని వ్యతిరేకించాలనీ తమతో వీరేశలింగం గారిని కలుపుకోవాలనీ ఒక ఉత్తరం రాశారు.[4]

''విశాఖపట్టణంలో నుండెడు శ్రీ పరవస్తు వెంకట రంగాచార్యులయ్యం వారలుంగారు నవనాగరికాధీనులై వితంతు వివాహము కర్తవ్యమని యొక చిన్నపొత్తముం బ్రకటించిరి గదా. తద్విషయమున మనము మిన్నకుండ వచ్చునా? తమకుఁ దోఁచినట్లు ఖండన వ్రాసి పంపుడి. నేను నిందస్మత్సభాసదులలోఁ తత్ఖండన పరాయణుండనై యున్నాఁడను. నాస్తికతా హర్మ్యసోపాన నివిష్టపరులైనవారు దుష్టులుగాక శిష్టులగుదురా. మనవారి స్వాచారానాదరమును దురాచార నిషేధ కరణోపేక్షయునిట్టి దశకుఁదెచ్చె. మనమునిట్టి యెడ మౌనమూనుట మానుగాదు. నవనాగరికులకున్న స్వాతంత్ర్యము మనకును గలదు. జంకనేల; తోఁచిన ధర్మము నిక్కముగా వక్కాణించుట కెల్లరును స్వతంత్రులు కాఁబట్టి తాము దురాచార మర్దనమునకు నడుగిడుఁడు. దైవము మనకుఁ దోడ్పడుఁగాక. మనము కించిద్జ్ఞులమని శంకింపంబని లేదు. సర్వజ్ఞుఁడు భగవంతుఁడొక్కడే. కానఁ బ్రాచీనాచార దూషకులగు నవనాగరికులు మనకు జయ్యులు గాఁదగుదురు. ఎందువల్లననఁగా వారు స్వోక్తియుక్తి ప్రమాణవాదులు. మనమో ప్రాచీన మహానుభావనివిష్ట కార్యభారులము. కావున మన మన్యులచేతను జయ్యులమైనను, పరాజయము మనకేనాఁడును గలుగనేరదు. ఒకవేళ మనకంటే విధవా వివాహవాదులు బలవంతులైనను మనము భీష్మానుయాయుల మగుదముగాక. మన ప్రతిపక్షులు భార్గవ ప్రతిభులగుదురు గాక. ధర్మమే జయము. చింతయేల? మనమందఱము గూడుకొన్నఁ బ్రతివాదులు విత్తమత్తులైనను మత్తగజంబులు శృంఖలాబద్ధంబులై కందికుందు చందంబున నగుట సిద్ధము. ''శ్లో. బహూనా మల్పసారాణాం సమవాయోదు రత్యః । తృణైర్విరచ్యతే రజ్జుర్బంధ్యంతే తేన దంతినః'' అని యుండుట జగత్ప్రసిద్ధము గద. తమ సదుత్తరము ప్రతిక్షణము ప్రతీక్ష్యమాణంబు.''

3. వీరేశలింగంగ స్వీయచరిత్ర - 2వ భాగం - పుట.186
4. వీరేశలింగం స్వీయ చరిత్ర - ప్రథమ భాగం - పు. 146, 147

ఈ ఉత్తరంలో కొక్కొండవారు కోరినట్టే వీరేశలింగంగారు తాము దురాచారమనుకొనే దాని మర్దనమునకే అడుగుపెట్టారు. అయితే సంస్కారానికి అడ్డుపడడమే దురాచారమని భావించడం వల్ల దేశానికి మేలు కలిగింది.

కొక్కొండవారికి క్షోభం తెచ్చిపెట్టింది. వీరేశలింగంగారిని విమర్శించడానికి తమ ఆంధ్రభాషా సంజీవనికి అనుబంధంగా ''హాస్యవర్ధని'' అనే పత్రికను ప్రకటించసాగారు. అవతల వాళ్ళను తిట్టడమే ఆనాటి హాస్యం. అందుచేత ''వివేకవర్ధని'' అనే పదంలోని ''వే'' అనే అక్షరాన్ని దూరం చేసి మిగతా అక్షరాలను కలగలుపు చేసి ''నర్ధవ కవి'' అనే మాటను పుట్టించారు. తమ హాస్య సంజీవని ముఖచిత్రంగా దండ ముఖుడైన విఘ్నేశ్వరుడు తనకు ఇరుప్రక్కలా సేవించుకొంటున్న ఎలుకలతో తాండవమాడుతున్నట్టు ఒక బొమ్మను వేసేవారు.

వీరేశలింగంగారు తక్కువ తిన్నారా? కొక్కొండ వారిని వెక్కిరించడానికి తమ వివేకవర్ధినికి అనుబంధంగా ''హాస్య సంజీవని'' అనే వ్యంగ్య పత్రికను ప్రచురించసాగారు. దీని ముఖచిత్రంగా సింహముఖుడైన వినాయకుడు తనను ఇరుప్రక్కలా సేవించుకుంటున్న మార్జాలతో నాట్యమాడుతున్న బొమ్మను వేశారు. కొక్కొండవారు తమ పత్రికలో వీరేశలింగంగారిని ''వీరిగాడ''నే పాత్రను చేసి ఎద్దేవా చేసేవారు. వీరేశలింగంగారు తమ పత్రికలో నత్తి పాత్రను ప్రవేశపెట్టి తన పేరు ''క్కొ-క్కొ-క్కొ-కొండ''డని వెటకారం చేశారు. గజసింహాలకు మూషిక మార్జాలాలకు వైరం స్వాభావికమే. ఆంధ్రభాషా సంజీవనిలో ''స్త్రీలకు విద్యకూడదు'' అనే వాస్యం వెలువడగానే హాస్య సంజీవని ''పురుషులకు విద్యకూడదు'' అనే వ్యంగ్య రచనను ప్రచురించింది. పరస్పర దూషణలతోపాటు చాలా విషయాలు చర్చించేవారు. (హాస్యవర్ధని 1875 అక్టోబరు నెలలో ప్రారంభమైంది. ''హాస్య సంజీవని'' 1876 జూలై నుండి వచ్చేది. ఈ అనుబంధ పత్రికలు ఎక్కువకాలం వెలువడలేదు.)

సంఘ సంస్కార విషయాలపై కొక్కొండవారు ఒక్క వీరేశలింగంగారి వివేకవర్ధనితో మాత్రమేకాక పురుషార్థ ప్రదాయిని, హిందూ జన సంస్కారిణి మొదలైన పత్రికలతో వివాదాలు పెట్టుకొనేవారు. ఇక సాహిత్య విషయాలలో ఆయన పేచీలకు దిగని సమకాలీన పత్రికలంటూ లేవు. ముఖ్యంగా 'అముద్రిత గ్రంథ చింతామణి' అనే మాసపత్రికలో వాదోపవాదాలు ఎక్కువగా సాగేవి. కొక్కొండవారి గ్రంథాలను మొదట కొంచెం ఉదారంగానూ, తరువాత నిర్దాక్షిణ్యంగానూ అముద్రిత గ్రంథ చింతామణీ, ఆ పత్రికాధిపతి మాత్రమేకాక పలువురు సాహితీపరులు దుయ్యబట్టారు.

కొక్కొండవారు 1893 ఉత్తరార్థంలో ''బిలేశ్వరీయం'' అనే పద్యకావ్యం వ్రాశారు. 1858లోనే ఈయన ఉత్తర ఆర్కాటు జిల్లాలో ఉన్న ''తిరువళ్ళ'' అనే క్షేత్రంలో ఉన్న దేవుణ్ణి దర్శించుకొని ఆ స్వామికి శాశ్వతభక్తులయ్యారు. ఈ ఊరును బిల్వారణ్యక్షేత్రమనీ, ఈ దైవాన్ని ''తనుమధ్యా బిలేశ్వరుడనీ'' అంటారు. కొక్కొండవారు సంస్కృతంలోనూ,

తెలుగులోనూ ఈదేవుడిమీద పద్యకావ్యాలూ, గీతగ్రంథాలూ రచించారు. బిల్వనాథ శతకం తను మధ్వార్యా శతకం అనే గీర్వాణ రచనలతోపాటు ''తనుమధ్యాగీతరత్నం'' అనే గాన ప్రబంధ ఆలపించారు. తన ఇష్టదైవం మీద ఇన్నిరకాల రచనలు చేసినా ఒక మహాకావ్యం రాయాలన్న కోరిక వారికి కలిగింది. దాని ఫలితమే బిల్వేరీయమనే నిర్వచన కావ్యం. ఇందులో 3442 పద్యాలు ఉన్నాయి.

సాధారణంగా కవులు తమ కావ్యాలను ఆశ్వాసాలుగా ఉల్లాసాలుగా విభజిస్తూ ఉంటారు. కొక్కొండవారు తమ కృతి విభాగాలను ''బింబాలు'' అని పేర్కొన్నారు. విషయసూచిక దగ్గర్నుంచీ నూతన ప్రయోగాలు చేశారు. ఒక సీసమాలికలో కృతిలోని విషయాలను సూచిస్తూ సుదీర్ఘంగా వివరించారు. ఇటువంటి విషయసూచిక అప్పటిదాకా ఏ గ్రంథంలోనూ లేదు. కొక్కొండవారు ఈ కావ్యంలో బంధ గర్భ చిత్ర కవిత్వాలు కూడా విరివిగా రచించారు. షష్ఠ్యంతాలలో ప్రథమాక్షరాలు కలిపి చదివితే ''ఓం నమశివాయ'' అని యేర్పడుతుంది. ఈ ఫీటునే ఇంకా చాలా పద్య ప్రథమాక్షరాలు రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు అక్షరాలు కలిపి చదివితే ఇదే మాట సాక్షాత్కరిస్తుంది.

కొక్కొండవారు ఎంతటి సనాతనులైనా ఉచ్ఛృంతలోనే మార్పును కాలోచితంగా అభిలషించేవారు. పంజరంలో పక్షి కూడా ఆ పరిమితమైన ఆవరణంలో ఎగరడానికి ప్రయత్నించినట్టు కొక్కొండవారు కోరి తగిలించుకొన్న సంకెళ్ళతోనే కొన్ని సర్కసు ఫీట్లు చేశారు. తెలుగు సాహిత్యంలో ఏ కవులూ రచించని పద్యాలు సృష్టించారు. కంద పద్యం అందరికీ పరిచితమైనదే. వీరు మాకందం, రమాకందం, మహాకందం అనే ఛందస్సులు పుట్టించారు. సీసం కొంచెం తక్కువ తరగతి లోహం కాబట్టి వెండి, బంగారం అనే పద్యాలను సృష్టించారు. తేటి, తేటిబోటి, ఆటబోటి అనే కొత్తవాటిని కల్పించారు. వీటన్నింటికీ లక్షణాలు రాశారు.

1894 మార్చి నెల అముద్రిత గ్రంథ చింతామణిలో బిల్వేశ్వరీయం కృతి విమర్శ కొంచెం మృదువుగానే చేశారు. (సంపుటి-7, సంచిక-3) ఎక్కడెక్కడ యతిభంగాలున్నాయో, ఎక్కడ తప్పుడు ప్రాసలు పడ్డాయో మర్యాదగానే చూపెట్టారు. ఈ తప్పులను సవరించుకోమన్నారు. విమర్శనార్థం గ్రంథకర్త తన కృతిని పంపిన ఆర్నెల్లకు ఆసాంతం దీనిని చదివి మరీ సమీక్షించారు. ఇది అపూర్వ గ్రంథం కనుక ఇంత ఆలస్యమైనదని వివరించారు. ఈ పుస్తకంలో ఒకచోట పెళ్ళిపాట, లాలిపాట, పూలబంతులపాట, మంగళగీతాలు ఉన్నాయి. పద్య కావ్యాలలో ఇటువంటి గేయ రచనలు భావ్యమా అని అడిగారు. ఈ గ్రంథం రత్నాకరతుల్యంగా ఉందని శ్లేషించారు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన పనప్పాకం అనంతాచార్యుల వారిని శ్లాఘించారు.

అముద్రిత గ్రంథ చింతామణిలోని విమర్శను చూశాక కొక్కొండవారు కొంచెం బాధపడి ఉంటారు. మృదువుగానైనా తిట్టినది తిట్టే. పూర్వకవులు వాడని ఛందస్సులను వాడినందుకు తప్పుపట్టారని దానికి సమాధానంగా ఒక పాఠకుని పద్యాలను ఆంధ్రభాషా సంజీవనిలో ప్రచురించారు. (జయచైత్రం). అందులోని తొలిపద్యం చూడండి.

''పాడినదెపాడెరా యెప్పుఁబ్రాఁచి పండ్ల
దాసరి యనెడు లోకోక్తిరా సరిగను
గవిత సేయంగ వలయునే నవవిధమునఁ
జేయఁదప్పేమిగుణమున్నఁజేయదెసిరి!''

ఈ పద్యాన్నీ, దీని తరువాత వాటినీ తమ అముద్రిత గ్రంథ చింతామణి (ఆగస్టు 1894)లో ప్రచురిస్తూ ఇలా సమాధానంగా కొన్ని పద్యాలు ప్రచురించారు. దానిలో తొలి పద్యాలు చూడండి.

ఊరికంతయు నొకత్రోవ యులిపికట్టె
కొక్క త్రోవయనెడు మాట నెక్కొసంగఁ
గైతసేయంగ వలయునే, ప్రాఁతరీతి
వ్రాఁత చేతను జాలఁబ్రఖ్యాతిరాదె

అందఱుఁబూర్వులు వాడిన
కందాదులు తనదు పొత్తకమున నిలుపుటన్
బొందగు రత్నం బీవసు
ధం దానొక ప్రాఁచి పండ్ల దాసరియెగదా!!

ఆనాటి వాదోపవాదాలు కేవలం గద్యంలోనే కాక పద్యాలలో కూడా సాగేవి. కొక్కొండ వారు బంగారం, వెండి మొదలైన ఛందాలను పుట్టిస్తే పూండ్ల రామకృష్ణయ్యగారు తమ అముద్రిత చింతామణిలో సింగారము, గిండి అనే ఛందాలను సృష్టించి వాటిలో వెటకారం చేసేవారు. (ఈ కొత్త ఛందాలకు ఆయన లక్షణాలు కూడా ఇచ్చేవారు). ''నటి'' అనే కొత్త ఛందస్సులో ఇలా రాశారు.[5]

చెట్టుచెడెడికాల మట్టెరాఁగనుగుక్క-మూతి
పిందెలుద్భవించెఁ బొందుగనన-బాస
చెడెడి కాలమునకుఁ జెలరేగి పండితుల్-క్రొత్త
పద్యములను వ్రాయఁబరఁగినారు-నిజము

వానిఁజూచి మేము వ్రాసితిమీ పద్య-వితతి
నెన్నఁడైన మీర లిట్టి పద్య-ములను
చిత్తగించినారె? యుత్తమ బుధులార? గాంచి
చింతసేయుఁడిరుస్వాంతములను-మిగుల

అముద్రిత గ్రంథ చింతామణిలోని వ్రాతలకు ఆంధ్రభాషా సంజీవని జవాబులు చెప్తూ ఉండేది. ''పూండ్ల రామకృష్ణయ్య పంతులవారు చిన్ననాటి యోనమాల యాచారమునువదలి కాలోచితమైన నవీనాచారమునే యథోచితముగ నవలంబించిన

5. ఆటవెలది పాదకూటముపై ఒక సూర్యగణం చేర్చితే అది ''నటి'' అనే ఛందం అవుతుందని పూండ్ల వారి వివరణ. (అముద్రిత గ్రంథ చింతామణి-1894 డిసెంబరు)

మేలని మఱియొక పరి విన్నవించుచున్నారము'' అని కొక్కొండ వారు శ్రావణమాసం సంజీవనిలో రాశారు. దీనికి సమాధానంగా రామకృష్ణయ్యగారు 1894 నవంబరు అముద్రిత గ్రంథ చింతామణి (సంపుటి-7, సంచిక-11)లో ఘాటుగా ''ఇది యొజ్జల పుచ్చకాయవితముగ నున్నయది. కాలోచితమైనదని కొందఱనుచున్న విధవావివాహము శాస్త్ర సమ్మతముగాదనియు నాచార విరుద్ధమనియుఁ బంతులవారు వ్రాయుచు నీపట్టునఁదమ పట్టు తుద ముట్టవలయునను తలంపుతో నీ నూతన పద్యములఁ గాలోచితముగఁ గైకొమ్మనుట వింతగనున్నయది. ఈ వాదము -

''ప్రోచు సలక్షణ భాషన్
బ్రాచీ నాచారమూను పత్రిక యిది''

అని, సంజీవనీ ముఖమునఁ బ్రకటింపబడుచున్న పద్యమునకు భంగదశఁ గలిగించునని తోఁచుచున్నది'' అని కచ్చితంగా చెప్పారు. నూతన పద్యములను భాషయును గలుపుట మా మతముకాదని చెప్పారు. ఈ మతాన్ని చాలామంది ఆనాడు ఆమోదించారు.

ఆనాటి పండితులందరూ బిల్వేశ్వరీయంపైన విమర్శలు చేశారు. 1895 జనవరి అముద్రిత గ్రంథ చింతామణిలో (సంపుటి-8, సంచిక-1) పెనుగొండలో ఉండే రొద్దం హనుమంతరావుగారు సుదీర్ఘమైన విమర్శ రాశారు. ఈ కృతిలో గాంభీర్య మాధుర్య, సౌకుమార్యాదులు శశవిషాణప్రాయములని చెప్పారు. అలా చెప్తూనే పుట సంఖ్యలను పేర్కొని పద్య సంఖ్యలను ఇస్తూ ఒక డజను మంచి పద్యాలను కూడా పేర్కొన్నారు. వ్యర్థ పద ప్రయోగాలను చూపించారు. నూతన ఛందస్సును గురించి ప్రత్యేకంగా ఇలా రాశారు.

''నూతనకల్పనాచమత్కృతి - శ్రావ్యతననుసరించి''

యాశ్రావ్యలాలిత్యముగల పద్యముల నేర్పఱచుకొని పూర్వ కవులు గ్రంథములు రచించియున్నారు. క్రొత్త పద్యములు కొఱవడియుండలేదు. ఇట్టి గణనియమము గలది, యిట్టి వృత్తమని యందఱకుఁ దెలిసి యుండవలెను. సమయానుసారముగ గణముల నేర్పఱచుకుని యిష్టానుసారము దానికిఁ బేర్లు పెట్టి పద్యములు రచించిన నెవరికిఁ తెలియును. ఇందువలనఁ బ్రయోజనమేమి. ఈ కవి తన యిచ్ఛానుసారమనేక పద్యములను బంగార మనియు, వెండియనియు నామకరణముఁ జేసియున్నాడు. వీనియందు లేశమాత్రము శ్రావ్యత్వముగాని - లాలిత్యముగాని గనంబడదు. ఇందుచే నీకవికి విశేష గౌరవము కలుగను గారణమేమియు నగపడలేదు.''

నూతన ఛందస్సులను సృష్టించాలన్న కోరికలో నిజానికి తప్పులేదు. కొక్కొండ వారికి సంగీతంపై మొగ్గు ఉంది. అందుకే తమ కావ్యంలో పాటలు రాశారు. జయదేవుని గీతగోవిందంలాగ ''గీత మహానటనం'' అనే సంగీత గ్రంథాన్ని సంస్కృతం రాశారు. అలాగే తనూమధ్యగీత రత్నమేన గానప్రబంధాన్ని రచించారు. కాలోచితమైన మార్పులను సర్వతోముఖంగా వాంఛించి, వాటిని అన్ని రంగాలలోనూ ప్రవేశపెడితే శోభనిస్తుందిగాని కొన్ని విషయాలలో సనాతనత్వం, కొన్ని విషయాలలో నూతనత్వం ప్రయత్నిస్తే లోకులు

అంగీకరించరు. కృతకభాషను ప్రచారం చేసేవాళ్ళు, కృతక ఛందస్సులను సృష్టిస్తే రెండూ జనులకు ఆమోదం కావు. మాత్రా ఛందస్సులలో రచనలకోసం ఆంధ్రసాహిత్యం ఒక రెండు తరాలు ఆగవలసి వచ్చింది. సజీవ భాషలో, సజీవ ఛందస్సులు గురజాడవారు ప్రవేశపెట్టారు. సజీవభాషలో జాతి జీవనంలో ప్రజలకు చేరువగాకున్న మాత్రాచ్ఛందస్సులలో వెలువడే గేయాలనే ఉత్తరోత్తరా ఆధునిక ఆంధ్ర సాహిత్యం ఆదరించింది.

కొక్కొండవారు పద్యరచనలు చేస్తున్న రోజులలోనే ఆంధ్రసాహిత్యం నాటకాలవైపు మొగ్గింది. సంస్కృత నాటకాలనూ, ఆంగ్ల నాటకాలనూ అనుదించడం ప్రారంభమైంది. 1872లోనే కొక్కొండవారు ''నరకాసుర విజయవ్యాయోగము'' అనే సంస్కృత రూపకాన్ని తెనిగించారు. దీనిని వారణాసి ధర్మసూరి రచించాడు. రూపకాలు పదిరకాలు. ఒక్కొక్క దానికో పేరూ, ప్రత్యేక లక్షణాలూ ఉన్నాయి. వ్యాయోగంలో కథ ఒక్కరోజు ఇతివృత్తమై ఉండాలి. నాయకుడు ధీరోదాత్తుడు. రసము వీరము. వృత్తిసాత్త్వికం ; గర్భ విమర్శ సంధులు ఉండకూడదు. ఇది సేవా సంబంధమైనది కనుక స్త్రీలు ఉండకూడదు. ఉంటే శృంగార హాస్యరసాలు లేని ఒకరిద్దరు స్త్రీ పాత్రలు ఫరవాలేదు.

కొక్కొండ వారి ఈ వ్యాయోగానువాదం తరువాత సంస్కృత రూపకాల అనువాదాలూ, ఇంగ్లీషు కథల అనుసరణలు వెలువడసాగాయి. 1880లో వీరేశలింగంగారి ప్రహసన ప్రాయమైన బ్రహ్మ వివాహం (పెద్దయ్యగారి పెళ్ళిపుస్తకం) వాడుకభాషలో వెలువడింది. దీని రచనా కాలం 1878. దీని తర్వాత ఆ యేడే వ్యవహార ధర్మబోధిని (ప్లీడరు నాటకం) అన్నదానిని కూడా జీవద్భాషకు సమీపశైలిలోనే వీరేశలింగంగారు ప్రహసన రూపంలోనే రాశారు. మరొక పదేళ్ళకుగాని పాత్రోచిత ప్రసంగ సమన్వితమైన నాటక రచనలు వెలువడలేదు. 1890లో నాదెండ్ల పురుషోత్తంగారి హరిశ్చంద్ర నాటకంలో ఈ ఆరోగ్యకరమైన ధోరణి ప్రారంభమైంది. 1891లో వేదం వెంకటరాయశాస్త్రిగారు నాగానందం అనువదించారు. ఇందులో పాత్రోచిత భాషా ప్రయోగం చేశారు. సమకాలము వారలు మెచ్చుకొన్నారు. ఒక్క కొక్కొండవారూ, వారి అభిమానులూ విముఖులయి వివాదం పెట్టుకొన్నారు.

నిత్య జీవితంలో ఇంటా, బయటా, బళ్ళో సలక్షణమైన భాష అంటూ కృతకాంధ్రాన్ని వాడే కొక్కొండవారు నాటకాలలోనైనా జీవద్భాష దరిదాపుల్లో ఉన్న ప్రయోగాలను ఆమోదిస్తారా? సంస్కృత రూపక లక్షణాలలో కొన్నిరకాల పాత్రలకు ప్రాకృతం వాడాలన్న నియమం ఉంటే ఉండనివ్వండి. కొక్కొండ వారికి దానితో నిమిత్తం లేదు. అటువంటి పాత్రలకు ఒకరకమైన సలక్షణంగా అచ్చ తెనుగు వాడాలని ఉత్తరోత్తరా అంగీకరించారుగాని ఆదిలో గ్రామ్య ద్వేషులందరూ వేదం వెంకటరాయశాస్త్రిగారి మీద దండెత్తారు. ఈ ముట్టడిదారులకు కొక్కొండవారు కన్నాకుగా ఉండి వేదంవారితో ఘోర యుద్ధం చేశారు. వేదం వారు వివాదంలో మునిగి తేలుతూ కొక్కొండ వారిపై దెబ్బతీయడానికి సమయంకోసం కాచుకొని ఉన్నారు.

జయదేవుడు సంస్కృతంలో ''ప్రసన్న రాఘవ నాటకం'' రచించారు. దీనిని కొక్కొండవారు ''ఆంధ్రప్రసన్న రాఘవ నాటకము'' అని తెనిగించారు. ఇది వైజయంతి పత్రికలో మొదట వెలువడింది. తర్వాత గ్రంథరూపంలో వచ్చింది. పుస్తకమంతా కలిపి 106పుటలు మాత్రమే. ఈగ్రంథాన్ని వేదం వెంకటరాయశాస్త్రిగారు ''ఆంధ్రప్రసన్న రాఘవ విమర్శ గ్రంథము'' అని సమీక్షించి ప్రకటించారు. వేదం వారి విమర్శ 300 పుటలకు మించిపోయింది. ఇందులో కొక్కొండ వారు చేసిన 2568 తప్పులను వేదం వారు ఎత్తిచూపెట్టారు. వేదం వారి పుస్తకాన్ని మెచ్చుకొంటూ 1899 ఫిబ్రవరి మాసంలో అముద్రిత గ్రంథ చింతామణి సుదీర్ఘమైన వ్యాసాన్ని ప్రచురించింది. (సంపుటి 12, సంచిక 2) వేదం వారి విమర్శలోని ముఖ్యాంశాలను యథాతథంగా ఉద్ధరించి ప్రచురించింది. మచ్చుకు ఒక పేరా చూడండి.

''ఈ గ్రంథమందు భాషాంతరీకము ప్రాయికముగాఁ దప్పుగా నుండును. ఛందోవ్యాకరణాదులకిది వేరుపురువు. పాదపూరణ ప్రయోగమందును అదియేనియుఁ జక్కఁగఁ జేతఁగామి యందును ఇంతటి కవి మఱిలేడు. అనన్వయ సందిగ్ధాశ్లీల మంగళానౌచిత్యాది దోషములకు నీ యాంధ్రీకరణము పుట్టినిల్లు. తప్పుప్రాసములు, తప్పుయతులు, తప్పుగణములు, తప్పుసంధులు, ఆద్యంత సమాసములు, సరసవస్తు త్యాగము, కొసవిసరులు, అంతాశ్చర్యములు, సముచ్చయములు, పౌనరుక్త్యము, ఉక్తానుక్త కావ్యదోషములు, ఇత్యాద్యుపాయము లెన్నియేని యుండియు వీరు పద్యము కుదురక పడినపాట్లు అనుశోచనీయముగా నున్నవి. గద్యమందు కూడ ఆంధ్ర భాషా స్వభావోల్లంఘనములు తెనుఁగుఁన బనికిరాని సంస్కృత ఫక్కికలు గ్రంథమును చెఱిచినవి. వీరికి సంస్కృతము నందుఁగల లఘు పరిచయముతో నిట్టి ప్రబంధముం దెనిగింప సాహసించుట గొప్ప పొరఁబాటు. తెనిఁగింపులో వీరికి అర్థము చెడినను దెలిసినది గాదు, రసము చెడినను తెలియలేదు, కథ చెడినను తెలియలేదు. లోక స్వభావ విరోధము వచ్చినను తెలియలేదు. విభక్తి జ్ఞానము కూడ చాలక పెక్కు తావుల గ్రంథము చెడినది. అనౌచిత్య జ్ఞానముగాని తద్భయముగాని లేనేలేదు. మూలమెఱుఁగక ఈ గ్రంథముంజదువువారు జయదేవ కవియన నెవఁడో రాక్షసుఁడనియు మనుష్యులం జంపుటకై యీ నాటకముం జేసెననియు దలంతురు.''

ఈ విమర్శనం వెలువడ్డాక హోరాహూరీ పోరు సాగింది. వ్యక్తిగత దూషణలు పెచ్చుపెరిగాయి. వేదం వారిని సమర్థిస్తూ చాలామంది చింతామణికి లేఖలు రాశారు. కొక్కొండవారు ప్రెసిడెన్సీ కాలేజీలో తెలుగు పండితులు, వేదంవారు క్రిష్టియన్ కాలేజీలో తెలుగు పండితులు. సలక్షణమైన భాషను విద్యార్థులకు బోధించవలసిన వారు పరస్పర దూషణలకు దిగి నీది తప్పంటే నీది తప్పని దెప్పుకొన్నారు. కొక్కొండ వారి గ్రంథంలో తప్పులని వేదం వారు చూపించినవన్నీ వేదంవారు కూడా తమ గ్రంథాలలో చేశారని ఒక రెండు దశాబ్దాల తర్వాత గిడుగు రామమూర్తిగారు తమ ''ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం'' అనే గ్రంథంలో సవిస్తరంగా నిరూపించారు. ఇద్దరు కాలేజీ పండితులకు రాని

గ్రాంథికాంధ్రం సాధారణ విద్యార్థులమీదా, ప్రజల మీదా ఎందుకు రుద్దుతారని ప్రశ్నించారు.

సమకాలీనులు కొక్కొండ వారిలో ఉన్నవనుకొన్న లోపాలను ఎలుగెత్తి ఘోషిస్తూ ఉంటే వారికి లేని ఘనతలను ఆపాదిస్తూ, కొన్ని రంగాలలో ప్రథమస్థానాన్ని వారికే కట్టబెట్టడానికి ఇటీవలి పరిశోధకులు తాపత్రయపడ్డారు. కొక్కొండవారు 1867లోనే మహాశ్వేత అనే నవలను రచించారనీ, తెలుగు సాహిత్యంలో ఇదే ప్రప్రథమ నవలా రచన అని నిడుదవోలు వెంకటరావుగారు ప్రతిపాదించారు.[6] వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రకన్నా ఇది ఇరవై సంవత్సరాలు ముందుగా వెలువడిందని మళ్ళా మళ్ళా చాటసాగారు.[7] ''పరిశోధనా పరమేశ్వర'', ''విద్యారత్న'' బిరుదులు గల నిడుదవోలు వారు చెప్పిన మాటలు కనుక ఈ సంగతిని చాలామంది నమ్మేసి కొక్కొండవారి గురించి రాసిన వ్యాసాలలో పేర్కొనసాగారు.[8] నిడుదవోలు వారు తమ వాదానికి ఆధారంగా 1872లో శివశంకర పాండ్యగారు రాసిన వ్రాతను చూపెడుతున్నారు.

శివశంకర పాండ్యగారు కొక్కొండ వారు విగ్రహతంత్రానికి చేసిన టిప్పణికి ఇంగ్లీషులో పీఠిక రాస్తూ చాలా విషయాలు అందులో చెప్పారు. వీరేశలింగంగారి పుస్తకం కొక్కొండ వారికి పుత్రచెయ్యి వాటపు అనుకరణ అని ఆరోపించారు. వీరేశలింగంగారు తమ పత్రికలో కొక్కొండ వారిని విమర్శిస్తూ వ్రాశారు. దాని ''మొదటి యెనిమిది పుటలను జదువఁగానే తమ యెఱుక లేకయే పాండ్యాగారి మాటలను వ్రాసిరిగాన క్షమించి విమర్శనమును మానవలసినదని'' కొక్కొండవారు వీరేశలింగంగారి పేర సుహృద్భావంతో లేఖ వ్రాశారు.[9] పాండ్యాగారి మాటలను కొక్కొండ వారే లెక్కచేయవద్దని 1876లో చెప్పారు. తరువాత ఎన్నో లెక్కచేయవద్దని 1876లో చెప్పారు. తరువాత ఎన్నో ఏళ్ళకు పరిశోధకులు ఆ మాటలను పట్టుకొని లేని ఘనతను కొక్కొండవారికి ఆపాదించడం అప్రస్తుతం.

ఇంతకీ మహాశ్వేత నవలేనా? దానిని కొక్కొండవారు 1867లోనే రచించారా? ఈ ప్రశ్నలకు విపులమైన సమాధానాలు అక్కిరాజు రమాపతిరావుగారు తమ గ్రంథంలో వ్రాశారు.[10] ఆయన చెప్పని సబువులు కొన్ని చూద్దాం. 1871లో కొక్కొండ వారు ఆంధ్ర భాషా సంజీవని స్థాపించారు. మహాశ్వేతను నాలుగైదేళ్ళకు ముందే రచిస్తే దానిని ఎందుకీ పత్రికలో ప్రచురించలేదు? తమ చేతిలో ఒక ప్రెస్సూ, ఒక పత్రికా ఉంటే రాసిపెట్టిన మొట్టమొదటి గద్య ప్రబంధాన్ని ఊరవెయ్యడం జరుగుతుందా? ''మహాశ్వేత''ను 1895లో పనప్పాకం అనంతాచార్యుల వారి వైజయంతి పత్రికలో సీరియల్‌గా ప్రచురించారు. అది కూడా సంపూర్ణంగా లేదు. అసమగ్రంగానే ఉంది. అందుచేత 1895 నాటికైనా ''మహాశ్వేత'' రచన పూర్తికాలేదు.

6. భారతి, సంపుటి-28, సంచిక-4
7. ఆంధ్రవచన వాఙ్మయం (1977) పుట.114
8. కల్లూరు వెంకట నారాయణరావు - వీరేశలింగయుగం -పుట. 150
9. వీరేశలింగం - స్వీయచరిత్ర - 2వ భాగం, పుట 182
10. ''వీరేశలింగం పంతులు - సమగ్ర పరిశీలన'' పుటలు.130 నుండి

మరొక ముఖ్యమైన పాయింటు కూడా ఉంది. మంత్రి ప్రెగడ భుజంగరావుగారు 1912లో తమ పెద్ద కూతురి పెళ్ళి చేశారు. ఆ సందర్భంలో ఆశీర్వచన పద్యాలు రాసిన వారి దీవనలు సేకరించి ''హైమావతీ పరిణయం'' లేక ''ఆధునిక కవి జీవితములు'' అనే సంకలనం ప్రచురించారు. అందులో వివిధ కవుల ముద్రితాముద్రిత రచనల భోగట్టాలు ఆ కవులే స్వయంగా పంపినవి ప్రకటించారు. ఇందులో కొక్కొండ వారు తమ రచనల భోగట్టాలు పొందుపర్చారు. 72వ యేట ఆయన ప్రకటించుకొన్న తమ గ్రంథాల జాబితాలో ''మహాశ్వేత'' పేరే కనబడదు.[11] అసంపూర్ణ రచన కాబట్టి తొలి నవల కాదు కాబట్టి రచయితే దాని పేరు చేర్చడానికి విముఖులయ్యారని భావించవచ్చు.

కొక్కొండవారు నిజంగా దేనిలో ప్రథములు అంటే మొట్టమొదటిసారిగా ఒక పత్రిక పేరులో ''ఆంధ్ర'' అన్న పదాన్ని చేర్చినవారు ఈయనే. 1871లో ఈయన ''ఆంధ్రభాషా సంజీవని'' అనే మాస పత్రికను స్థాపించారు. ఇది ప్రతి పున్నమినాడు వెలువడుతుందని చెప్పారు. 1871 నుండి 1883 దాకా పదమూడు సంవత్సరాలు నడిపారు. మధ్యలో ఆగిపోయినా 1892లో మళ్ళా ప్రారంభించి 1900 దాకా అంటే తొమ్మిదేళ్ళు నడిపారు. రెండు దశాబ్దాల పైచిలుకు ఒక పత్రికను నిర్వహించడం ఒక ఘనతే. వీరికన్నా ముందుగా తెలుగులో పత్రికను నడిపినవారు లేకపోలేదు. అయితే ఆ పత్రికల పేరులో ఆంధ్ర అనే పదం లేదు.

కొక్కొండ వారి ''ఆంధ్రభాషా సంజీవని'' పాత సంపుటాలు ఎవ్వరూ జాగ్రత్త చేసినట్టు కనబడదు. ఈపత్రికలో కేవలం సాహిత్య యుద్ధాలు మాత్రమేకాక ప్రజలకు ఉపయోగపడేవి కూడా ఆయన ప్రచురించేవారని చెప్పవచ్చు. ఉదాహరణకు శ్రీమతి పొత్తం జానకమ్మ అనే హిందూ మహిళ తన భర్త రాఘవయ్యగారితో కలిసి 1873లో ఇంగ్లండు, యూరోపు పర్యటనం చేసింది. తిరిగి వచ్చాక తన అనుభవాలను ఒక లేఖలో పొందుపరచి పత్రికకు పంపించింది. దీనిని కొక్కొండ వారు తమ ఆంధ్ర భాషా సంజీవనిలో 1874 ఏప్రిల్ 15వ తేదీనాడు ప్రచురించారు. ఈ చక్కని పనిచేసినందుకు సమకాలిక పత్రిక ''ఎథీనియం అండ్ డైలీన్యూస్'' జానకమ్మగారిని అభినందిస్తూ ఒక సమీక్ష ప్రచురించింది. తర్వాత జానకమ్మగారు తమ పర్యటన అనుభవాలను గ్రంథరూపంలో రాశారు. తెలుగు గ్రంథం ఉనికి గురించి నాకు తెలియదుగాని దీనిని "Pictures of England" అనే పేరుతో ఆంగ్లంలో అనువదించి 1876లోనే పుస్తకరూపంలో ప్రచురించారు. దీని ప్రతి బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో ఉంది. దీని జిరాక్సు ప్రతిని నేను పుట్టించి మనదేశానికి తీసుకువచ్చాను. ఆంధ్రజ్యోతి దైనిక పత్రికలో నేను రాసిన వ్యాసపీఠంలో ఈ పుస్తకం గురించి విపులంగా వివరించాను.[12] కొక్కొండవారు ఎంత సనాతనులైనా సీమకు వెళ్ళిన హిందూ మహిళ అనుభవాలను తమ పత్రికలో ప్రచురించడం గమనించదగ్గ విషయం. వారి పత్రిక సంపుటాలు దొరికితే ఇలాటి విషయాలు ఎన్ని వెలుగు చూస్తాయో.

---

11. హైమవతీ పరిణయం - పుట.18
12. ఆరుద్ర వ్యాసపీఠం - ఆంధ్రజ్యోతి దినపత్రిక

1899లో ప్రభుత్వం వారు కొక్కొండ వారిని మద్రాసు నుండి రాజమండ్రికి, వీరేశలింగంగారిని రాజమండ్రి నుండి మద్రాసుకు బదిలీ చేశారు. ఇద్దరూ ప్రభుత్వ కళాశాలల్లో పండితులే. 1915 దాకా కొక్కొండ వారు రాజమండ్రిలోనే ఉన్నారు. గోదావరీ వర్ణనం మొదలైన కావ్యాలను రచించారు. పరిశోధకులు పేర్కొనవలసిన రచనలు ఈయన ఎన్ని చేసినా ప్రజలలో ప్రచారం పొందినవి ఎన్నో లేవు. ఈయన రచనల వివరాలు -

అక్షరసాంఖ్య శాస్త్రము, మార్గదాయిని, సంస్కృతము

(ఆర్యమత దర్శనాలనుండి, భాష్యాల నుండి సాంఖ్యాశాస్త్రాన్ని అధ్యయనం చేసి ఈ గ్రంథాన్ని రచించారు. ఈయనకు అక్షర సంఖ్యాచార్యులు అనే బిరుదు కూడా ఉంది. బిల్వేశ్వరీయంలో సాంఖ్యానికి సంబంధించిన పద్యాలు చాలా ఉన్నాయి. వాటి వివరణలు కొక్కొండ వారే రాస్తే బాగుంటుందని అముద్రిత గ్రంథ చింతామణి అభిప్రాయపడింది.)

ఆంధ్ర భగవద్గీత

కొక్కొండ మాహాత్మ్యము - కేవలాంధ్ర పద్యాత్మకము

గీత మహానటము - సంగీత గ్రంథము

గోదావరి వర్ణన

ఘటికాచల క్షేత్రమాహాత్మ్యము - ఆంధ్ర పద్య గద్యాత్మక ప్రబంధము

తనుమధ్యాగీతరత్నము - గాన ప్రబంధము

తనుమధ్వార్యా శతకము

ధనంజయ విజయ వ్యాయోగము

నరకాసుర విజయ వ్యాయోగము

పానకము, మంగళగిరి క్షేత్ర మాహాత్మ్యము - పద్య గద్యమయము

పాయసము, సత్యనారాయణీయము - అముద్రితం

ప్రసన్నరాఘవ నాటకము

ప్రిన్సాపువేల్సు తారావళి - ఇది లండన్ క్రౌన్ పెర్ఫ్యూమెరీ కంపెనీ సభ వారిచే సముచిత సంభావనతో సమ్మానింపబడింది.

ప్రిన్సపువేల్సు, హిందూస్థాన్ సందర్శనమనే ఆంధ్ర గద్యకావ్యము

బిల్వనాథ శతకము - సంస్కృతము

బిల్వనాథేశ్వరశతకము - తెలుగు

బిల్వేశ్వరీయం - కేవలం ఆంధ్ర పద్యాత్మకము

మోదకము,

నియోగి విజయము

నందరాజు లక్ష్మీనారాయణ దీక్షిత చరిత్ర

(కొక్కొండ వారు జన్మతః నియోగులు, బహుశా అందుకే ఈ రచనకు నియోగ విజయము అనే వివరణ ఇచ్చారు.)

(1910 ప్రాంతాల నుండి ఆంధ్ర సాహిత్యంలో నియోగి, వైదిక విభేదాలు ముమ్మరంగా ఉండేవి. నియోగులు తమ శాఖ వారి గొప్పలు చెప్పుకొనేవారు. మంత్రిప్రెగడ భుజంగరావుగారు రచించిన ఆధునిక కవి జీవితములు అనే పుస్తకములో కొక్కొండ వారికి భారత వర్ష మహామహోపాధ్యాయ బిరుద పట్టం వచ్చినందుకు పొంగిపోతూ "ఇట్టి మహాబిరుదాంకముం జెందిన యాంధ్రులలో మొట్టమొదటివారు వీరే. వీరు నియోగులు. కాబట్టి వీరి వలన నియోగులకెల్ల గౌరవాధిక్యము కలిగెనని చెప్పనొప్పగద" అని వివరించారు.)

శంకరమతత్త్వ ప్రకాశిక - ఆంధ్ర గద్య కావ్యము
శంకరవిజయధ్వజము - ఆంధ్ర గద్యకావ్యము

(కొక్కొండవారు పుట్టుకచేత మాధ్వులు. ద్వైత మతానుయాయి అయినా శాస్త్రీయ పద్ధతినీ, శంకరాద్వైతాన్నీ స్వీకరించి ఈ గ్రంథాలు రచించారు.)

శ్రీమతీ మాధవ నాటకము
సింహాచల యాత్ర (తెలుగు)

కొక్కొండవారు విలక్షణమైన వ్యక్తిత్వం గలవారేగాని ఆయనను బొత్తిగా కొట్టిపారెయ్యకూడదు. ఈయన సైతం సనాతనుల తానులోని ముక్కే. వీరి అభివృద్ధి నిరోధకత్వం ఇతరులలో కూడా కొద్ది మోతాదులో ఉంది. నలభై సంవత్సరాలు ప్రభుత్వ కళాశాలలో తెలుగు పండితులుగా ఉండి చాలా గ్రంథాలు రాసి ఎన్నో సాహిత్య యుద్ధాలలో ఆరితేరిన కొక్కొండవారు ఆంధ్రసాహిత్య చరిత్రలో నిజంగా ఒక కొండగుర్తు.

దాసు శ్రీరాములు (1846-1908)

సంఘ సంస్కారానికి సుతరామూ ఒప్పుకొనని ఛాందసులున్న కాలంలోనే స్త్రీ విద్యకు ప్రోత్సాహమిచ్చి తన కుమార్తెకు సాధారణ విద్యనేకాక సంగీతం కూడ చెప్పించే సాహసం చూపిన వ్యక్తి దాసు శ్రీరాములుగారు, వితంతువులకు పునర్వివాహం కూడదనే రోజులలో, బాల్యంలోనే జుత్తు తీయించి, ముసుగు వేయించే మౌఢ్యం ముదిరిన రోజులలో "రండాముండన ఖండన"మనే వ్యాసం రాసి విధవల ముండనం ధర్మశాస్త్ర విరుద్ధమని వాదించిన వారు కూడా దాసు శ్రీరాములుగారే. ఆయనకు సంగీత సాహిత్యాలేకాక భరతశాస్త్రం కూడా తెలుసు. అభినయ విద్యలో ఆరితేరినవారు. యక్షగానాలు మొదలుకొని దేవీ భాగవతం దాకా వివిధ ప్రక్రియలలో గ్రంథ రచన చేసినవారు.

దాసు శ్రీరాములుగారు చిన్నప్పుడు బందరులో దొరగారి పాఠశాలలో 1843లో చదువుకొన్నారు. కుమారుడు క్రైస్తవులలో చేరుతాడేమో అని భయపడి ఆ చదువు మానిపిస్తే, పెళ్ళి చేసుకున్నాక 1865లో ఆకిరిపల్లికి పారిపోయి సంస్కృత వ్యాకరణం చదువుకొన్నారు. తరువాత గుడివాడలో 1872-74 సంవత్సరాల మధ్య తెలుగు మాష్టారిగా చదువు చెప్తూ తన విద్యార్థి రెంటాల సుబ్బారావు దగ్గర ఇంగ్లీషు నేర్చుకొన్నారు. తరువాత కవుతరము, డోకిపర్రు గ్రామాలలో స్కూలు మాస్టరీ చేశారు.

అయ్యవారు ఉద్యోగం చేస్తూనే ప్లీడరీ పరీక్షకు చదివి ప్యాసయ్యారు. 1878లో బందరులో బోర్డు కట్టారు. క్రమంగా ఫస్టు గ్రేడు ప్లీడరై ఏలూరు సబ్‌కోర్టులో ప్రాక్టీసు పెట్టారు. వృత్తిలో రాణించారు. జమీందారుల కేసుల దావా వీరే నిర్వహించారు.

శ్రీరాములుగారు ఏలూరులో ఉన్నంతకాలం సాహిత్యగోష్ఠులు, సంగీత సభలు వారింట్లో జరిగేవి. ఆయన యక్షగానాలూ, పద్యకావ్యాలూ, శతకం మాత్రమే కాక సంగీత విద్యను సార్థకం చేసుకొంటూ కృతులు, జావళీలు, పదాలు, స్వరజతులు రచించారు. కొన్ని సంవత్సరాల కిందటి దాకా దాసు శ్రీరాములుగారి పాటలను భోగంవారు మేళాలలో పాడేవారు. కొన్ని పుస్తకరూపంలో వచ్చాయి. కల్యాణిరాగం, ఆటతాళంలో ఈ పదం చాలా ప్రసిద్ధం.

తత్తర పడనేల తాళుతాళురసామి ||త||
అత్తింటి కోడల రా కొత్తగానే వచ్చి కొన్నాళ్ళాయెరా
పొత్తు గడియ మరచి పోరు మానరా
చిత్తమునసేర మెంచకురా చీకటి వేళ కాదురా
అత్తగారింట లేకున్నప్పుడైన రావైతివిర సామి ||త||

శ్రీరాములుగారి ఇతర పదాల్లో ప్రసిద్ధమైనది ఇంకోటి చూడండి.

ఎరుకల కాంభోజిరాగం - త్రిపుట

ముక్కుపచ్చలారని చిన్నదాన నన్నెక్కడ కంపెదరే
సిగ్గాయె నన్నెక్కడ కంపెదరే
నిక్కము రేయెల్ల నిదుర రా బోయెదనమ్మ
తక్కిన పనులేమి నేనెరుగనోయమ్మ
వంచిన నా చేయి మంచి గంధములోన
ముంచి యెత్తెద రేలనే
ముంచుటయే కాదమ్మ మొగవారి పైబట్టు
మంచు దెల్పెదరు నాకలవాటు లేదమ్మ ||ముక్కు||

అందముగా సున్న మాకీనె తీసినే
నంటరాయనేరనే
అందగాని నోటికందియ్య మని యెదరూ
అందరిలోన మనసెట్లొప్పునోయమ్మ
యీ పనులాపను లేల చెప్పెదరు నే
నేపని కోపలేనే
ప్రాపై దాసు శ్రీరామునేలిన వేణు
గోపాల దేవుని గుడి యుండెదనమ్మ ||ముక్కు||

శ్రీరాములుగారు కళాప్రియులు, సంగీతశాస్త్రము నందభిరుచియేగాక భరతశాస్త్రము నందు వీరికి ప్రవీణత కలదు. ''అభినయదర్పణ''మను నొక గ్రంథమును రచించిరి. స్వయముగ అభినయము పట్టనేర్చి యుండిరి. అభినయము చూపించెడువారు. వేశ్యా మేళములలోనికి వీరు వెళ్ళుట తటస్థించిన యెడల వేశ్యలు ఆడుటకు భయపడుచుండిరి. భరతశాస్త్ర ప్రవీణురాంండ్రయిన చదలవాడ పిచ్చాయి, చక్రధరరావు తల్లి పినపాల భవాని - గుంటూరులోని వేశ్య, చెదలవాడ రాజరత్నము మున్నగు ప్రవీణులయిన భరతశాస్త్ర జ్ఞానులు శ్రీరాములగారి యెదుట నభినయించి పేరొందినవారే.''[13]

శ్రీరాములుగారు అపర శ్రీనాథుడని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అన్నారు. శ్రీనాథుడు వీధి నాటకం రాసినట్టే ఈయనా ''ఆంధ్ర'' వీధిలో ''బ్రాహ్మణ ప్రశంస'' అనే పేరుతో ''తెలుగునాడు'' అనే పద్యకావ్యం రాశారు. ఆంధ్రదేశంలోని వివిధ కులాలవారి వర్తనలు, తీరుతెన్నులు వర్ణించదలిచారు. వైదికులు, నియోగులు, మాధ్వులు, వైష్ణవులు, శైవులు, కర్ణాటకలు మొదలైన బ్రాహ్మణులలో ఉన్న వివిధ శాఖల వారిని వర్ణించడంతోనే గ్రంథం ఆగిపోయింది. చెప్పినంత వరకు పద్యాలు హృద్యంగా ఉంటాయి. ఎలాంటి పద్యం చెప్తే సంతోషం కలుగుతుందో ఇలా చెప్పారు.

''భాషీయ పద్ధతి పట్టుదప్పఁగ నీక
దీర్ఘ సమాసంబు తెరువుపోక
గూడార్థ సమితి దిక్కును దేఱిచూడక
స్పష్టార్థముల జాడ జాఱనీక
మఱుఁగు పదంబుల మార్గంబు ద్రొక్కక
తేటమాటల రాచబాట విడక
దూరాన్వయంబుల దారి మూచూడక
సంకరాలంకార సరణి గనక
ఉన్నయది ఉన్నయట్టులు గన్నయదియుఁ
గన్నయట్టులు విన్నది విన్నయటులు
నన్నయది యన్నయట్టులు వన్నెవెట్టి
కవితఁజెప్పిన సంతోషవు జగాన''.

వైదికులు సదస్యం సంభావనకు వెళ్ళినప్పుడు జరిగేవి ఇలా వర్ణించాడు.

''లేవరు లెండు లెండనిని, లేచిన వారయినందటాలునం
బోవరు, పోవుచున్ నిలిచి పోదుము పోదుము త్రోయకుండటం
చీవరు సందు గేస్తునలయింతురు పెండిలిలో సదస్య సం
భావననాఁడు చూడవలె బాపన సాములసాములన్నియున్''.

శ్రోత్రియ స్త్రీల భాషను ఇలా చెప్పాడు.

13. మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక - పుట.8

''ఆస్సే; చూస్సివషే; వొషే; చెవుడషే అష్లాగషే; యేమిషే;
విస్సావర్ఘులవారి బుజ్జీనష యానిస్సాయ కిస్సారుషే
విస్సండెంతటి వాఁడె యేళ్ళు పదిషే; వెయ్యేళ్ళ కిడేషుమా;
ఓస్సే బుజ్జికి యీడషే; వొయిషు కేముంచుందిలే మంచివో
ర్చెస్సే; యందురు శ్రోత్రియోత్తమ పద స్త్రీలాంధ్ర దేశంబునన్.''

పండిన పంటలో సగపాలు పాలేరు తినేస్తాడని భూస్వామ్య వర్గపు మనస్తత్వాన్ని ఇలా చెప్పారు.

''తిండికి బత్తెమిండు నెలదీరిన దింకొకయిద్దు మప్పుగా
నిండది తీరులోన జమయిత్తు నటంచును గంపదుల్పఁగాఁ
బండిన పంటలోన సగబాలు హరించును పాలివాఁడు బా
పండొనరించు సేద్యమున బాగొక జుట్టునతండు నిల్చుటే''.

శ్రీరాములుగారు ''తెలుగునాడు''కు వేసుకొన్న ప్రణాళిక ప్రకారం పూర్తిగా రచిస్తే చాలా సాంఘిక జీవన విషయాలు గ్రంథస్థమయి ఉండేవి. ఆయన ''ఊరిమీద ఊరుపడ్డా కరణము మీద కాసుపడదని'' ఇలా చెప్పారు.

''కరణము మంత్రసాని; సరకారు ప్రసూతిక; రైతుబిడ్డ ని
బ్బరమగు వ్రాఁతకోత జవాబు సవాళ్ళను దంత్రయుక్తి బం
ధురముగ నూరిమీఁద నొక నూరయినంబడుఁగాక యెన్నఁడుం
గరణము మీఁద నొక్కయణ కాసయినంబడదంద్రు మానవుల్''

శ్రీరాములుగారి ఇతర రచనలన్నీ ఒక ఎత్తు. వారి దేవీ భాగవతం అనువాదం పది ఎత్తుల గ్రంథం. ఈ పురాణాన్ని పన్నెండు స్కంధాలను సుమారు 7500 గద్య పద్యాలలో 1900 నుంచి రచించడం ప్రారంభించారు. దానిని తమ స్వగ్రామంలో అల్లూరులోనే రాశారు. గ్రంథాదిని ఆ సీసపద్యాలలో ఆ గ్రామాన్ని చాలా చక్కగా వర్ణించారు. ఆయన ''తెలుగునాడు''లో అనుబంధంగా చేర్చదగ్గంత సహజసుందరంగా ఉన్నాయి. ఒక మూడు, నాలుగు పద్యాలు చూడండి.

ఎలయెండ చెట్ల సందుల నుండి గోడల
　　దవిలి తా నిలువు టద్దములుగాఁగ
గొనగొన జను నింద్ర గోప సంఘాతంబు
　　పందిళ్ళలోఁ జిన్ని పగడములుగ
చూరు పట్టియలఁ బిచ్చుక దంపతుల చాలు
　　చెక్కి తీర్చిన యట్టి చిత్రములుగ
దూలాల గూళ్ళ సందుల నుండి వెడలి మ్రో
　　గెడి తుమ్మెదల మ్రోఁత గీతములుగ

కెరలి వాకిళ్ళ తూనీగ తెరలు మూగి
నెర బుటేదారు గెంబట్టు పొరపసందు

సన్నయుల్లడగాగ నాషాఢలక్ష్మి
పగిదిఁదనరారు నల్లూరు పల్లెటూరు

ప్రాత గొంగడి వీపుపైఁగప్పి బుజమున
గొంకి క్రరను మోచి కొంకి నడచు
మచ్చుఁ బ్రాతల పింజగ్రుచ్చి మున్కొలగట్టి
మ ఱ్ఱాకు పొత్తివేమారు మడచు
కదలిపారెడి గొఱ్ఱె గమి చేలఁబడకుండ
తాసేత సేయంచు దగిలి పఱచు
తోడేలు బొడఁగాంచి జాడనే చేయెత్తి
నిక్కిట్రూహాయని కుక్కఁబిలచు
ఆలుతలనిడికొని వచ్చు నట్టియటిక
నున్న చల్లయుఁ దమిద కూడుప్పుగల్లు
మెల్లఁగా మ్రింగు గొల్లని బెంచుతల్లి
పగిది దనరారు నల్లూరు పల్లెటూరు

చెలగి కళ్ళముల గింజలు మేసి ప్రాఁజింత
తొరడుల గుబగుబల్ నెఱపు గువ్వ
కట్టాసఁజని గంటె కంకి నోటను బెట్టి
వినువీధిఁ గిలకిల యనెడు చిలుక
చెంగావి పెనురావి చివురు నిండుగమెక్కి
కూకూయనెడి మదకోకిలంబు
పొదలలో మెదలు లేఁబురువుల సొపడి
చెట్టెక్కి గుమ్మను జెముడుకాకి
కదసి వరిచేలలో గూళ్ళు గట్టిపెలుచ
బలిసి నటనంబు గావించు బరతపిట్ట
గలిగి జనులకు శ్రవణ సౌఖ్యప్రదంబు
పగిది దనరాదు నల్లూరు పల్లెటూరు

పొదలపై నీలాలు బోలు పరింగ పం
డ్లకు జేయిసొన్పు బిడ్డలునుగల్గి
పొలములో గొంతెత్తి పొలిపొలి యోయంచు
వరికుప్పనూర్చు పాలెరులు గల్గి
అరవు బేరముల గుజ్జరినేసి సన్నంబు
ముతకంచు నొదుగు మాలెతలు గల్గి
కోడిపందెములకై గుమిగూడి గొల్లున
సడిజేయు చిల్లర జనముగల్గి

దేశవాళి తుపాకితో దెబ్బలోనఁ
బిట్టలను గొట్టు ముతరాచపిండుగల్గి
శిశిర ఋతునామ్నియైన లక్ష్మికిని దొడవు
పగిది నలరారు నల్లూరు పల్లెటూరు

తమ ఉద్గ్రంథంలో తమ స్వగ్రామ చిత్రాన్ని శాశ్వతంగా నిలిపిన దాసు శ్రీరాములుగారు తెలుగు సాహిత్యంలో తమదీ అనే స్థానాన్ని రిజర్వు చేసుకొన్నారు.

వేదం వెంకటరాయశాస్త్రి (1853-1929)

వివిధ సాహిత్య వివాదాలలో, విద్వత్తులో నిలువెత్తు మనీషిలాగ నిలబడే కవి, పండితుడు, వ్యాఖ్యాత, నాటకకర్త ఎవరంటే చప్పున వేదం వెంకటరాయశాస్త్రిగారి పేరే చెప్పుకోవాలి. పుట్టింది మద్రాసులో అయినా శాస్త్రిగారు తమ తండ్రిగారు ఆంధ్రదేశంలోని చాలాచోట్ల నివాసం వల్ల ఆయా ప్రాంతీయ యాసలన్నీ ఆకళించుకొని తెలుగు భాష వైవిధ్యాన్ని తెలుసుకొన్నవారు. పుస్తకాలలో రాసేది గ్రాంథిక భాషే అయినా లోకవృత్తాన్ని అనుసరించే నాటకాలలో పాత్రోచిత భాష ఉండి తీరాలని గుర్తించిన విజ్ఞులు. మూడు స్వతంత్ర నాటకాలు, ఆరు సంస్కృత రూపకానువాదాలు రచించినవారు. శృంగార నైషధానికి, ఆముక్తమాల్యదకు వ్యాఖ్యానాలు రచించారు. ఛందస్సు, అలంకారం వంటి లక్షణ గ్రంథాలు విరచించారు. స్వంత ప్రెస్సు పెట్టుకొని గ్రంథాలూ, పత్రిక ప్రచురించారు. కొక్కొండ వారితో ఎంత హోరాహోరా పోరు సలిపారో అలాగే వ్యావహారిక వాదులపైన కూడా విరుచుకుపడ్డారు. ''సూర్యరాయాంధ్ర నిఘంటువు'' వీరి సంపాదకీయంలో వెలువడడానికి నోచుకోలేదు. కాంపోజిషన్ కమిటీలో కొమర్రాజు లక్ష్మణరావుగారితో కలసి గురజాడ వారిని మైనారిటీ సభ్యుని చేశారు. వెంకటరాయశాస్త్రిగారి సంఘ సంస్కార వ్యతిరేకత, గ్రాంథిక పక్షపాతం మొదలైనవి వారిని అభివృద్ధి అవరోధక మార్గంలో నిలిపినా, వారి ప్రతాపరుద్రీయం (1897), బొబ్బిలి (1916) నాటకాలలోని ప్రతిభ వారి సృజనాత్మక శక్తికి నిదర్శనం. ఇతరుల గురించి ఈ సంపుటంలో చెప్పుకొన్న అనేక ప్రకరణాలలో వెంకటరాయశాస్త్రిగారి ప్రసక్తి పలుమార్లు వచ్చింది. ఆయనకు ఆయనే సాటి. ఆయన రచనలే ఆయనకు పోటీ.

వడ్డాది సుబ్బారాయుడు (1854-1938)

కాటన్ దొర, గోదావరికి ఆనకట్ట కట్టిన సంవత్సరంలోనే తూర్పు గోదావరి జిల్లా, నగరం తాలూకా పాసెర్లపూడి గ్రామంలో ఒక బాలుడు జన్మించాడు. అతడు తన తల్లికి ఆమె పదమూడవ యేట పుట్టాడు. ఆమెకు స్తన్యం అన్యమైంది. పుట్టిన బిడ్డకు పాలు కరువయ్యాయి. మట్టిని మోసే ఉప్పరమ్మలు దయతలచి ఆ పసిపాపకు చన్ను గుడిపి సంరక్షించారు. ఏడోయేట తండ్రి, పదకొండో యేట తల్లి ఈ బిడ్డకు దూరమయ్యారు. దొడ్డమ్మపేట జమీందారిణి వాడరేవు రంగనాయకమ్మగారి దివాణంలో ఆమె పోషణలో అన్నవస్త్రాలూ, విద్యాభ్యాసం లభించాయి. చిన్నప్పుడే కవిత్వమల్లడం ప్రారంభించిన ఈ

బాలుడు సాహిత్యంలో ఎంత విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్నాడో జీవితంలో అంతకు రెట్టింపు కష్టాలు రుచి చూశాడు. శ్రామిక స్త్రీల చనుబాలూ, జమిందారిణి అన్నదానం నోచుకొన్న ఇతని కవితలో ఇటు అడుగు వర్గాల పట్ల పక్షపాతం, అధికార వ్యవస్థల విలువల సంరక్షకత్వమూ సమానంగా చోటు చేసుకొన్నాయి. ఈ వైరుధ్యాలు గల కవిపేరు వడ్డాది సుబ్బారాయుడు. లోకులు ఈయనను వసురాయలు, వసురాయకవి అని పిలుస్తారు. ఇతడు తన స్వవిషయం ఇలా చెప్పుకొన్నాడు.

''గౌతమిగట్టి కాలువలు కాటను త్రవ్విన కాలమందె సం
భూతుడనైనవాడఁ బదమూడగు నేడుల యీడు తల్లికిన్;
మాతకు లేమి బా లచట మట్టిని మోసెడి యుప్పరమ్మలే
ప్రీతిని నన్ను జన్గుడిపి పెంచిరదేమి ఋణానుబంధమో''

దారిద్ర్యం, బడుగువర్గాల బాధలు తెలిసినవాడు కనుకనే ఈ కవి కింది వర్గాల పట్ల సానునయదృక్కులు చూడగలిగాడు. ఒక పద్యంలో ఇలా చెప్పాడు.

'అడగంద్రొక్కుచు గడ్డిపువ్వులను గుందాదుల్ తలకదల్చుగ్రై
పడి దీనాళిని ధిక్కరించి ఘనుల బూజించు లోకంబు; గ
న్వడునే ప్రేముడి యందు? నీకు నిజమౌభక్తుండు, నీవారిలో
గడవాడన్ గడుగారవించు మునిపక్షా! భక్తిచింతామణి!

వడ్డాది సుబ్బారాయుడుగారు ఎన్ని రచనలు చేసినా వారికి ఈ ''భక్త చింతామణి'' అనే మకుటం గల శతకం వల్లనే పేరు బాగా వచ్చింది. ఆయన 1877లోనే ''నందనందనా!'' అనే మకుటంతో ఒక శతకం చెప్పాడు. అప్పుడతనికి ఇరవై మూడు సంవత్సరాల వయస్సు. రాజమండ్రిలో వార్నరు దొరసాని ఆస్పత్రి నడుపుతున్న చిత్రపువారి ఇంట్లో ఒక పాఠశాల ఉంది. దానిలో ఈయన తెలుగు మాష్టరు. తర్వాత రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఆంధ్ర పండితుడయ్యాడు.

అవి ఆంధ్ర సాహిత్యలోకం, ముఖ్యంగా రాజమండ్రి సాహితీపరులు నాటకాల కోసం ఎగబడుతున్నరోజులు. 1823లో వడ్డాది సుబ్బారాయుడుగారు భట్ట నారాయణుడు సంస్కృతంలో రచించిన వేణీసంహారం అనే నాటకాన్ని తెనిగించారు. దానిని వేగాయమ్మపేటలో జమీందారిణి వాడరేవు రంగనాయకమ్మగారి ఆస్థానంలో ప్రప్రథమంగా ప్రదర్శించారు. సుబ్బారాయుడుగారు చక్కని కవులేగాక మంచి నటులు. ''వేణీ సంహారం'' ప్రజాదరణ నోచుకుంది. 1886లో అచ్చుపడింది. తర్వాత ఎన్నో ప్రదర్శనలు, ఎన్నో ముద్రణలు, చాలా ప్రశంసలు పొందింది.

1893లో సుబ్బారాయుడుగారు భక్త చింతామణి శతకాన్ని ప్రచురించారు. పేరుకు ఇది శతకమైనా పుస్తకంలో దాదాపు 270 పద్యాలున్నాయి. పూర్వ శతకాల ప్రౌఢి, ధార ప్రతిపద్యంలోనూ ఉండడం చేత అందరికి ఈ శతకం ఆనందదాయకమైంది. చాలామందికి ఇందులోని పద్యాలు ఒకనాడు కంఠతా వచ్చేవి. తెలుగు సాహిత్యంలోని శతకాలలోని

భావాలు ఆత్మాశ్రయ కవిత్వానికి అనువుగా చెప్పవచ్చు. అందుచేత కావ్యాలలో కన్నా వీటిలోనే కవుల భోగట్టాలు పూర్వం తెలుసుకొనేవాళ్ళు.

వడ్డాది సుబ్బారాయుడుగారు శతకాలలో కాక ప్రత్యేకంగా కొన్ని స్వీయదుఃఖాలను కావ్యాలుగా చెప్పారు. సాంసారిక జీవనంలో మానసికంగా చాలా బాధలు పడ్డారు. వీరికి వరుసగా అయిదుగురు భార్యలు పోయారు. ఒక భార్య పోయినప్పుడు ''సతిస్మృతి'' అనే పద్య రచన చేశారు. ''ఎలిజీలు'' రచించడం తెలుగు సాహిత్యంలో అరుదు. సుబ్బారాయుడుగారి రచనను కొక్కొండ వెంకటరత్నంగారు తమ ఆంధ్రభాషా సంజీవనిలో ప్రచురించారు. మూడవ భార్యకు పుట్టిన కొడుకు పద్దెనిమిది సంవత్సరాల వయస్సు దాకా పెరిగి తండ్రి కళ్ళముందు పోయాడు. అప్పుడు సుబ్బారాయుడుగారు ''సుతస్మృతి'' అనే రచన చేశారు.

కొక్కొండ వారిలాగే వడ్డాదివారు కూడా సలక్షణ భాషావాదులు, సంప్రదాయ సంరక్షకులు. సుబ్బారాయుడుగారి సమకాలికులుగా రాజమండ్రిలోనే ఇద్దరు మహానుభావులు సంఘంలోనూ, భాషలోనూ సంస్కారం కోసం ఉద్యమాలు నడిపారు. ఆ యిద్దరిపైనా సుబ్బారాయుడు గారు ఇలా పద్యం చెప్పారు.

''విధవ సధవ జేయు వీరేశలింగంబు
గ్రామ్యరమ్య జేయు రామమూర్తి
కందుకూరు గిడుగు కలశాబ్ధులను గల్గి
రగ్గ వర్ణులిర్వురాంధ్ర భూమి''

ఈ పద్యంలో నిందలేదుగాని వసురాయలు తిట్టు కవితను చెప్పగలరు, దానిని సమర్థించగలరు.

''దుర్జనాగ్రహంబు తూలు మాటలగాని
శాంతవచనములకు జక్కబడదు
బగ్గుమనెడు నూనెపై జల్లుదురెనీరు?
దోసెడుల కొలదిగ దుమ్మెగాక''

వ్యావహారిక వాదుల మీద దోసిళ్ళకొలదీ దుమ్మును పండితులు చల్లేకాలంలో వడ్డాది సుబ్బారాయుడుగారు ఆ సనాతనుల పక్షానే నిలబడ్డారు. అయితే తమ మిత్రుల మీద ఇతరులు దూషణలు జరుపుతున్నప్పుడు ''పండితులను పండితులే మన్నింప వలయునుగాని యపండితులు మన్నింపగలరా? ఈర్ష్యాప్రాబల్యమునంజేసి వాదము మార్దవమునకు దూరమగుచున్నట్టు బొడగట్టుచున్నది. వాద ప్రతివాదులకు నెట్లున్నను వారి హితులకు మాత్రమే చిత్త సంతాపము గావించుచున్నది'' అని రాశారు.[14] ఎన్నో రచనలు చేసినా, చాలా నాటకాలు అనువదించినా, చాటు సంకలనాలు సమకూర్చినా ఆయనను భక్త చింతామణి శతకానికి, వేణి సంహారం నాటకానికీ దేశం జ్ఞాపకం పెట్టుకొంటుంది .

---

14. అముద్రిత గ్రంథ చింతామణి - సంపుటి -7, సంచిక-10 (1894 అక్టోబరు)

వసురాయకవి రచనలు -

అభిజ్ఞాన శాకుంతలము
ఆంధ్రవేణీ సంహారము
ఆర్తరక్షామణి
గౌతమీ జలమహిమాను వర్ణనము
చండకౌశిక నాటకము
నందనందన శతకము
నృసింహ విశ్వరూపము
ప్రబోధ చంద్రోదయము
భక్త చింతామణి
మల్లికామారుతము
మేఘ సందేశము
వసురాయచాటూక్తి ముక్తావళి
విక్రమోర్వశీయము
శ్రీసూక్తి వసుప్రకాశిక
సతీస్మృతి
సుగుణ ప్రదర్శనము
సుతస్మృతి

జీవనదులకు ఆనకట్టలు కట్టడంలో ఉద్దేశం ఆ జలాలను పంట కాలువలకు మళ్ళించడమే. అలాగే జీవద్భాషలోని నుడికారాలూ, జాతీయాలు వ్యావహారిక రూపాలతో కావ్యాలలోనికి మళ్ళించినప్పుడే రసం పండుతుంది. కొన్ని పొలాలనే తడపాలి, అన్నింటినీ కాదని అడ్డువస్తేనే తగాదా.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి (1866-1961)

దాసు శ్రీరాములుగారు అపర శ్రీనాథుడో, కాదోగాని శ్రీనాథునిలాగ కవిరాజు, కవిసార్వభౌముడు అనే బిరుదులు ధరించినవారు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు. ఈయన తల్లిదండ్రుల పదిమంది సంతానం నష్టమయ్యాక పుట్టిన బిడ్డ. రెండవయేట చచ్చి బ్రతికిన విడ్డూరపు గడ్డ. విషూచి వచ్చి చనిపోయాడనుకొని శ్మశానంలోనికి తీసుకువెళ్ళి గోతిలో పాతిపెడుతున్నప్పుడు ఆ శిశువులో చలనం ఏర్పడి జీవం కనపడింది. ఈ పునర్జన్మ తర్వాత ఆయన మరో తొంభయి నాలుగేళ్ళు జీవించారు. కొన్ని జీవించే సాహిత్య జ్ఞాపకాలను వదిలిపెట్టి పోయారు. తమ సుదీర్ఘ జీవితంలో ఆయన లక్షలకొద్దీ పద్యాలు రచించారు. 1916-1926 మధ్య పదేళ్ళలో భారతం పద్దెనిమిది పర్వాలూ, తర్వాత 1947లో అంకితమిచ్చిన రామాయణం ఏడుకాండాలూ, 1948లో భాగవతం పన్నెండు స్కంధాలు ఒక్క చేతిమీదుగా సంస్కృతం నుండి మళ్ళా తెనిగించారు. ప్రచురించారు. ప్రశంసలకు పాత్రులయ్యారు. ఈ రచనలు చాలనట్టు 200 దాకా లెక్క వేసేటట్టు కావ్యాలు, వచన గ్రంథాలు, నాటకాలు రచించారు. సంస్కృతాంధ్రాలు రెండింటిలో కవులు, అవధానులు,

ఆశు కవితలు చెప్పారు. సమస్యాపూరణలు చేసారు. ఒకటేమిటి, అన్నింటిలోనూ ఉన్నామని కనబడతారు.

కానక కన్న సంతానం కనుక గారాబుగా పెరుగుతున్న చిన్నతనంలో వీధి నాటకాలూ, తోలు బొమ్మలాటలు చూడడం, పురాణ శ్రవణం చేయడం ఈయన విద్యలో ఓనమాలు. కాటవరం కంబైండు స్కూల్లో చదివినా వీరికి ఇంగ్లీషు విద్య అబ్బలేదు. కావ్య నాటకాలంకారం, సాహిత్యగ్రంథాలు, వైయాకరణ సిద్ధాంత కౌముది చదివారు. షోడశ కర్మాంతస్మార్తం నేర్చుకొన్నారు. చయనాంతం శ్రౌతం అభ్యసించారు. తమ తండ్రిగారు యజ్ఞం చేస్తున్నప్పుడు 18వ యేట ఈయన ఆధ్వర్యం వహించారు. వైదిక విద్యలతోబాటు కవిత్వ రచన కూడా నేర్చుకొని శ్రీనాథుని గ్రంథాలన్నీ అధ్యయనం చేశారు.

శ్రీనాథుడు ''చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు'' మరుత్తరాట్చరిత్ర రచిస్తే, శాస్త్రిగారు ప్రౌఢ వయస్సులో రాసి కవిసార్వభౌమునితో పోలికలు సంతరించుకొనడం ప్రారంభించారు. శ్రీనాథుడు రాజాశ్రయం కోసం ప్రాకులాడితే శాస్త్రిగారు జమీందారులనే ఇంటపెట్టుకొని పోషించారు. ఉర్లాం ఎస్టేటు 1878లో కోర్ట్ ఆఫ్ వార్డ్స్ పర్యవేక్షణకు వచ్చింది. జమీందారు సన్యాసిరాజుగారి కుమారులు సంస్థానం స్వాధీనం కాకముందు ఇబ్బందుల పాలయ్యారు. సన్యాసిరాజుగారి కుటుంబాన్ని శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు ఆదరించి రాజమండ్రిలో కాపురం చేయడానికి ఆస్కారం కలిగించారు.[15]

శ్రీనాథునితో శాస్త్రిగారికి మరికొన్ని పోలికలు కొద్దిగా తిరగేసి తొడుక్కున్నట్టు ఉన్నాయి. శ్రీనాథుడు అవసానదశలో సాహిత్య వ్యవసాయం కన్నా నిజమైన వ్యవసాయం సాయం అవుతుందని తలచి ''బొడ్డుపల్లిని గొడ్డేరి'' మోసపోయి అప్పులపాలయ్యాడు. శాస్త్రిగారు యౌవనంలోనే ఇనుగంటివారి పేటలంకలు పదిహేనువేల రూపాయలకు పాటపాడి ఖరారు పర్చుకొని కృషిని ప్రారంభించారు. అప్పు పెరిగింది. అకాలపు వరదలు వచ్చి వేసిన పొగాకు తోటలు కొట్టుకుపోయాయి. అప్పు ముప్ఫయివేలకు డేకింది. అప్పుడు శ్రీనాథుడు చెప్పినట్టే ఈయనా ఒక పద్యం చెప్పారు.

గౌతమీ మాహాత్మ్యకర్త కంఠముఁజుట్టు
　　　కొని యుండెనే గదా ఋణము చిలువ
కవి మిత్త్రు మేనెల్లఁ జివికించెనే గదా
　　　యప్పుల వారి వాక్యాయుధములు
శ్రౌతి మాన్యక్షేత్ర సమితి కొదువఁబెట్టఁ
　　　బడెఁగదా వృషల సంభవుని యొద్ద
అష్టశతావధా నాఢ్యునకిప్పుడు
　　　చేరి యున్నదిగదా నీరసంబు
పేటలంకల పాట లీపాటు దెచ్చె
మాల పురువుల పాలయ్యె మఱిపొగాకు
అప్పు ముప్పది వేల రూప్యంబు లింక
నెట్లు దీర్చెడు శ్రీపాదకృష్ణమూర్తి

---

15. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి 'స్వీయచరిత్ర' పుటలు 70-75 ఈ విషయాన్ని తూమాటి దొణప్పగారు తమ ఆంధ్ర సంస్థానముల సాహిత్య పోషణం' అనే పుస్తకంలో చెప్పారు. పుట.69

అప్పులు తీర్చడానికి కృష్ణమూర్తిగారు చేతిలో వున్న అవధాన విద్యను ప్రదర్శిస్తూ విజయనగరం, బొబ్బిలి, పర్లాకిమిడి మొదలైన సంస్థానాలు దర్శించి సత్కారాలు పొందారు. 1895లో కళ్ళికోట వెళ్ళి అష్టావధాన, శతావధానాలు చేసి ''కవిరాజు'' బిరుదాన్ని పొందారు. హనుమకొండ, పెద్దపల్లి, జగ్గయ్యపేట, వెంకటగిరి, జటప్రోలు మొదలైన ఎన్నో జమీందారీ కేంద్రాలలో అవధానాలు చేశారు. ఆ డబ్బుతో అప్పు చెల్లబెడుతూ వచ్చారు.

1899లో మద్రాసులో ''కళావతి'' అనే పత్రిక ఏడాది నడిపి దానిని రాజమండ్రికి తీసుకువచ్చి పదేళ్ళు నడిపారు. ఉత్తరోత్తరా వజ్రాయుధం అనే మాసపత్రికనే కాక ''గౌతమి'' అనే దినపత్రికను కూడా ప్రచురించారు. సాహిత్యవివాదాలు, కోర్టులో కేసులు కృష్ణమూర్తిశాస్త్రిగారికి సర్వసాధారణమై పోయాయి. పొందిన సత్కారాలకు లెక్కలేదు. పాలకొల్లులో ''కవిసార్వభౌమ'' బిరుదును ఇస్తే దానిని 1929లో విజయవాడలో కడప కోట్టిరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలో లోకం ఆమోదించింది. 1937లో ఇండియా గవర్నమెంటు వారు ''మహామహోపాధ్యాయ'' బిరుదును ఇచ్చింది. శాస్త్రిగారు రచించిన 97 పద్యకావ్యాలూ, 32 నాటకాలూ, 5 శతకాలూ, 35 వచన కావ్యాలూ చదవాలంటే చాలా ఓపిక కావాలి. వీరి శ్రీకృష్ణభారతం, శ్రీకృష్ణ రామాయణం, శ్రీకృష్ణ భాగవతాలను పండితులే చక్కగా పరిశీలించి మెచ్చుకోవలసిన చోట మెచ్చుకొన్నారు. భారతం యథామూలంగా తెనిగించినా, రామాయణంలో తమకు తెలిసిన రామకథలన్నీ చొప్పించారు. (ఉదా: కౌసల్యా పరిణయం) రామాయణంలో సీతను అక్షరబ్రహ్మంగా ఇలా వర్ణించారు.

''జానుగుల 'శ్రీ'ల్, పిరుదుల 'దా' నడుమున
ళా-నుదుటఁ గ్రార-ప్రాక్కిటిలోన బొట్టు
ఘ్రాణమున నొత్తు-కేల దీర్ఘమును-దోఁడు
రమణి బుధులెంతు రక్షర బ్రహ్మముగను.'' (బాల 4-74)

ఆమె అందాన్ని పుణ్యక్షేత్ర చయంగా ఇలా వర్ణించాడు.

''నడుము 'మాయ' - 'కేదారము' నాభి-కుచయు
గంబు శ్రీగిరి-కూర్మము కాళ్ళ మీఁదు
మోవి మధురాంక-మని గాంచి పువ్వుఁబోఁడి
దైర్థికులు తలంచెదరు క్షేత్రచయమనుచు'' (బాల - 4-75)

శ్రీకృష్ణ భాగవతంలో కొన్ని పద్యాలను మూలంతోనూ, పోతరాజుగారి పద్యాలతోనూ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు తులనాత్మకంగా పరిశీలించారు.[16] మచ్చుకు ఒకటి చూడండి.

శ్లో॥ త్రిభువన కమనం తమాలవర్ణం రవికర గౌరవరాంబరందధానే
వపు రలక కులావృతాననాబ్జే విజయసఖే రతిరస్తు మేనవద్యా''

16. సాహిత్యోపన్యాసములు - సంపుటం-7; పుట.56

అనే మూలానికి శ్రీకృష్ణ భాగవతంలో -

''నల్లని మేనికాంతులు ఘనాఘన సంపద సొంపుడింప, సం
పల్లవితోత్తరీయము సువర్ణ సువర్ణముతో మేలమాడ, న
ల్లల్లనఁ గుంతలంబులు ముఖాబ్జమునం దుళులట్లు వ్రేల, వ్రే
పల్లె విహారమున్ సలుపు బాలునిఁ కృష్ణుని నేఁదలంచెదన్.''

పోతరాజుగారి భాగవతంలో -

''త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింపఁబ్రాభాతనీ
రజ బంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింపమా
విజయుం **జేరెడు** వన్నెకాఁడు మదినావేశించు నెల్లప్పుడున్''

కృష్ణమూర్తిశాస్త్రిగారు 1902 నుంచి నాటక రచన కూడా ప్రారంభించారు. 1908లో బొబ్బిలియుద్ధం నాటకాన్ని రచించారు. (దీన్ని తర్వాత పోటీ నాటకంగా 1916లో ఎంచి వివిధ సమాజాలచేత ఆడించి, బహుమతులు శాస్త్రిగారే ఇచ్చారు.) 1921 నుండి జాతీయోద్యమం ప్రచారం చేయడానికి నాటకాలు రాశారు. తిలక్ మహారాజ నాటకం, గాంధీ విజయధ్వజ నాటకం ఆ సంవత్సరమే ప్రచురించారు. 1911 నుండి ప్రహసనాలు కూడా కొన్ని రచించారు. శాస్త్రిగారు గ్రాంథికవాదులేకాని నాటకాలలో పాత్రోచిత భాషను అంగీకరిస్తారు. శాస్త్రిగారు పాఠకునికి ఒకటే సలహా ఇచ్చారు. ''నీవేరసము త్రావెదవో త్రావుము. నీ నీరసము వదలిపోవును'' అన్నారు. నీ రసాన్ని పొగొట్టడం ఎంత మంచి పని?

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి (1863-1940)

వీరేశలింగంగారు దేశాన్ని ఎంత ముందుకు తీసుకు వెళ్ళాలనుకొన్నారో అంత వెనక్కు దానిని నడిపించడానికి, అది వీలుకానప్పుడు యథాస్థితిలోనైనా కట్టిపడెయ్యడానికే ప్రయత్నించిన ''మహానుభావులు'' సమకాలీనులలో చాలామంది ఉన్నారు. కొక్కొండ వెంకటరత్నం, వేదం వెంకటరాయశాస్త్రి చేసిన వ్యర్థ ప్రయత్నాలు ఇంతకు ముందు తెలుసుకొన్నాం. వీరి కోవలోని వారే కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు. ఆయన అడుగడుగునా వీరేశలింగం గారిని విమర్శించడంతో తమ వ్యాసంగం ప్రారంభించారు.

బ్రహ్మయ్యశాస్త్రిగారు మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులై ఎఫ్.ఎ. చదువును కొనసాగించలేక కాకినాడ, డిప్యూటీ ట్రెజరీలో గుమాస్తాగా చేరారు. నిజజీవితంలో ఇలా ఉంటే సాహిత్యరంగంలో ఆయన ఆంధ్రవాఙ్మయ ఖజానాలో పెద్ద షరాబుగా తమ్ము తాము నియమించుకొన్నారు. గురజాడ శ్రీరామమూర్తిగారు కాకినాడ నుండి 1886 నుండి నడుపుతున్న ''రాజయోగి'' పత్రికలో వీరేశలింగంగారి బ్రహ్మమత విశ్వాసాలను, మానుష ధర్మాలను, మూఢాచార ఖండనలను శాస్త్రిగారు తీవ్రంగా ఖండించారు. హిందూ

మతంలోని ధర్మాలను బట్టి ఆర్య మత ధర్మ సంస్థాపనార్థం ''ఆర్య మత బోధిని'' అనే పత్రికను బ్రహ్మయ్యశాస్త్రిగారు స్వయంగా 1905లో ప్రారంభించి 15 సంవత్సరాలు నిరాఘాటంగా ప్రచురించారు.

వీరేశలింగంగారు వివిధ సందర్భాలలో ధర్మార్థ, నీతి, సత్యం, అహింస, ఆత్మ మొదలైన వివిధ విషయాలపై వ్రాసిన వ్యాసాలను ఒకచోట చేర్చి ''ఉపన్యాసమంజరి'' అనే గ్రంథరూపంలో ప్రచురించారు. ఈ పుస్తకాన్ని బ్రహ్మయ్యశాస్త్రిగారు ''ఉపన్యాస మంజరి విమర్శనం'' అనే పేరుతో దుయ్యబట్టారు. పూర్వం రాజయోగిలో ప్రచురించిన తమ వ్యాసాలను బ్రహ్మయ్యశాస్త్రిగారు 1911లో ఒక సంకలనంగా సమీకరించి ''ఉపన్యాస పయోనిధి'' అనే పేరుతో ప్రచురించారు.

సాంఘిక దురాచారాలను, మూఢ విశ్వాసాలను తూర్పారపట్టే రాజశేఖర చరిత్రను వీరేశలింగంగారు రచిస్తే 1896లో ''వివేకచంద్రికా విమర్శనం'' అనే పేరుతో బ్రహ్మయ్యశాస్త్రిగారు ఏడు వ్యాసాలలో ఆ నవలను నిశితంగా విమర్శించారు. ''వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్''లో గోల్డుస్మిత్తు పాలలో చక్కెర కలిపినట్టు కరుణ శాంత రసాలను మేళవిస్తే ఆ నవలను అనుసరించిన వీరేశలింగంగారు పాలలో ఉప్పు జల్లినట్లు హాస్య కరుణ రసాలను కలగలుపు చేశారని బ్రహ్మయ్యశాస్త్రిగారి ఆరోపణ.

బ్రహ్మయ్యశాస్త్రిగారి ఉద్దేశ్యంలో నన్నయ్యగారికి ముందు తెలుగు భాషలో కవిత్వం అన్నదే లేదు. శాసన పరిశోధకులు యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని గుర్తించి, అది క్రీ.శ.927 నుండి 934 దాకా బెజవాడ పాలించిన రాజా అని గురజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తిగారు మొదలైనవారు సప్రమాణికంగా వాదిస్తే, బ్రహ్మయ్యశాస్త్రిగారు ఈ మల్లుడు క్రీ.శ.1202లో ఉండే మల్లపదేవుడని పట్టుపట్టారు. ''అందున్నవి సౌష్టవములేని వచనములు'' అని కొట్టిపారేశారు. బ్రహ్మయ్యశాస్త్రిగారిది ''చుట్టు చూపులేని విద్య'' అని గురజాడ అప్పారావుగారు తీర్పు చెప్పారు.[17]

భాస్కర రామాయణ కర్తృత్వం గురించి ''భాస్కరోదంతం'' అని అముద్రిత గ్రంథ చింతామణిలో 1898లోనే బ్రహ్మయ్యశాస్త్రిగారు రాశారు. భాషాశాస్త్ర విషయాలను చర్చిస్తూ 'ఆరవములోని వింత అక్కరము'' అని 1904లోనే వివాదం ప్రారంభించారు. ''నన్నయ్యకు పూర్వం కవిత్వమున్నదా?'' అనీ, ''తిక్కన తిక్కలు'' అనే 1923లో రెండు వ్యాసాలు రాశారు.

బ్రహ్మయ్యశాస్త్రిగారి ఉద్దేశంలో మనుచరిత్ర అధమ గ్రంథం. ఇది దుర్నీతిని నేర్పుతోంది. శృంగార శాంత రసాలు పాడైపోయాయి. ''అల్లసాని పెద్దనార్య కవిత్వ తత్త్వము'' అనే పేరుతో సుదీర్ఘ విమర్శ రాశారు. దీని సారాంశం వారే ఇలా పొందుపరిచారు.[18]

---

17. గురజాడ రచనలు - వ్యాసచంద్రిక - పుట.82
18. ఆంధ్ర సారస్వత పరిషత్పత్రిక - 10వ సంపుటం, సంచికలు 5,6

''మనుచరిత్రము భాషా విషయములో ఉత్తమ గ్రంథము. ఇందు సలక్షణమగు భాష కలదు. కూర్పు విషయములో మధ్యస్థానములో నుండదగినది. రసానుగుణమగు రీతులు వృత్తులు అంతగా లేవు. నీతి విషయములో నిది యధమ గ్రంథము. దుర్నీతి గరపుచున్నది. కాని గృహస్థ ధర్మ వివరణాధికములిందు బాగుగా నున్నవి. వర్ణన విషయములో మనోహర గ్రంథము. చక్కని వర్ణనలు కలవు. రస విషయములో నడిమి తరములో జేరదగిన దనుటయు నతిశయోక్తి యగునని తోచెడిని, శృంగార శాంతములు పాడు చేయబడినవి. వీరమొకింత కలదు. ఉత్తమ గ్రంథము కాదు.''

సనాతన సంప్రదాయాన్ని బతికించాలని తంటాలు పడిన బ్రహ్మయ్యశాస్త్రిగారు 1930 సెప్టెంబరు నెలలో మరణించినట్టు హిందూ పత్రిక విలేఖరి రిపోర్టు పంపాడు. దానిని చూసి ఆంధ్ర పత్రిక కూడా ఆ సంతాపవార్తను ప్రచురించింది. దేశంలో ఈ సంగతి వ్యాపించింది. సంపాదకీయాలు, సంతాపసభలు, సానుభూతి తీర్మానాలు, సంపాదక లేఖలు వెలువడ్డాయి. తాను చనిపోయిన తర్వాత లోకం ఏమనుకొంటుందో బ్రహ్మయ్య శాస్త్రిగారికి తెలిసి వచ్చింది. ఎందుకంటే ఆయన నిజానికి హాయిగా బ్రతికే ఉన్నారు! (మరో పదేళ్ళు జీవించారు.) తన పరలోక యాత్రను పురస్కరించుకొని ''నా విబుధలోక సందర్శనము'' అనే గ్రంథాన్ని రాశారు. తర్వాత తుని సంస్థానాధీశ్వరులు ఈయన చేత పెద్దాపురం సంస్థాన చరిత్ర రాయించారు. ఒకరకంగా బ్రహ్మయ్యశాస్త్రిగారు తాము ''చచ్చిబ్రతికి''నా 'చావుముఖం పట్టి' కన్నునమూస్తున్న సనాతన ధర్మాన్ని బతికించలేకపోయారు.

అది ఎవరూ చేయలేని పని.

పానుగంటి లక్ష్మీనరసింహారావు (1865-1940)

''రాజ్యాంతంలో నరకం ధ్రువం'' అని చెప్పారు. రాజాశ్రయంలో కూడా చివరి రోజులు నరకప్రాయం అయితే ఆశ్చర్యం లేదు. వేమన్నగారు ఏనాడో చెప్పారు.

''ఎంతసేవజేసి యేపాటు పడినను
రాచమూక నమ్మరాదు రన్న
పాముతోడ పొందు పదివేలకైనను
విశ్వదాభిరామ వినురవేమ''

ఈ సూక్తిలోని సత్యం పానుగంటి లక్ష్మీనరసింహరావుగారికి అవసాన కాలంలో తెలిసి వచ్చింది. ఆయన జీవితమంతా రమారమి జమీందారుల సేవలోనే గడిచింది. ఆయన విద్యాభ్యాసం రాజమండ్రిలో జరిగింది. 1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటరు, 1888లో బి.యే. ప్యాసయ్యారు. పెద్దాపురం హైస్కూల్లో మొదటి అసిస్టెంటుగా కొంతకాలం పనిచేశాక జమీందారీ కొలువులో దిగారు.

1. కొత్తపల్లి జగ్గారాయనింగారి పిల్లలకు ట్యూటరు.
2. లక్ష్మీనరసాపురం ఎస్టేటు జమీందారు రావు చెల్లయమ్మారావుగారి దివానుగ ఆరేళ్ళు

పనిచేశారు. ఈమె పిఠాపురం రాజాగారి పినతల్లి, పిఠాపురంలోనే కార్యాలయం ఉండేది (1902లో ఈ ఎస్టేటు దివానుగా ఉన్నా దాఖలాలు ఉన్నాయి.)

3. 1920 సంవత్సరారంభంలో ఆనెగొంది సంస్థానపు దివానుగా సంవత్సరానికి పైగా పనిచేశారు.

4. తర్వాత ఉర్లాం జమీందారు కందుకూరు లక్ష్మీ ప్రసాదరావుగారి దగ్గర దివానుగా కొంతకాలం ఉన్నారు.

5. 1912 నుంచి పిఠాపురం ఆస్థాన కవులు. నెలకు నూటయాభై జీతం.

6. 1918లో పిఠాపురం దివాను మొక్కపాటి సుబ్బారాయుడుగారు చనిపోయాక ఆ ఉద్యోగం చేయమని రాజాగారు కోరితే లక్ష్మీనరసింహారావుగారు నిరాకరించారు.

7. రాజాగారికీ, వీరికీ వైషమ్యాలు ఏర్పడ్డాయి. జీతం కోత.

8. 1933లో శారీరకంగా, మానసికంగా అనారోగ్యం.

9. 1[illegible] పానుగంటివారి సప్తతి ఉత్సవాలకు రాజాగారుగాని, వారి ప్రతినిధులుగాని, రాజోద్యోగులుగాని రాలేదు.

పానుగంటి వారి సాహిత్య దృష్టిని సవిమర్శ పరిశీలన చేసినవారు తమ గ్రంథంలో ''జీవిత చరిత్రము'' అనే అధ్యాయంలో లక్ష్మీనరసింహారావు పంతులుగారి గురించి ఇలా చెప్పారు.[19]

''పంతులుగారు శ్రీనాథునివలె ఆర్జించి, అనుభవించి, తుదకు అగచాట్లు పడిరని ఈ వరకే వ్రాయుటయైనది. పీఠికాపురాధీశులుగా నుండిన సూర్యారాయ బహద్దరువారే పంతులుగారిని అధికకాలము పోషించిరి. అభినవాంధ్ర భోజులు, అద్యక్షతన కృష్ణరాయలు అను ప్రశస్తిగాంచిన సూర్యరాయప్రభువుల విద్యాపోషణము ఆంధ్రలోకము బాగుగా నెఱుగును. అట్టి మహారాజు ఇచ్చినన్నాళ్ళును మెండుగా దండిగానిచ్చెను. తుదియందు పంతులుగారికిని, వారికిని వైషమ్యములేర్పడినవి. మహారాజావారు సహృదయతతో ఇచ్చినప్పుడు ఎంత కోమలముగా నుండెడివారో, పట్టుదల వచ్చినప్పుడు అంత కఠినముగా నుండెడివారు అని వినికిడి. తమ వద్ద ఎన్నడో చేసిన ఋణము నిమిత్తమై పంతులుగారి వేతనములో కొంతభాగము కోయించుటకు మహారాజావారు ఉత్తర్వులు చేసిరట.

''పంతులుగారు తమ రచనలలో, ఇంకననేక సందర్భములలో సూర్యారావుగారి వదాన్యతను గూర్చి కృతజ్ఞతాపూర్వకముగా, అభిమాన పురస్సరముగ చిత్రించి యున్నారు. అట్టిది వారి మనస్సు విఱిగినది. పెట్టినప్పుడు పొగిడి, పెట్టనప్పుడు తెగడు అల్ప స్వభావులను అనేక పర్యాయములు తీక్షణముగా మందలించిన పంతులుగారు చివరిదశయందు నిష్కారణముగా ప్రభువును నిందించిరని భావింపలేము. ఏమయినను దైనందిన సంభాషణమున పానుగంటివారు తమ ఆవేదనను వెడలగ్రక్కుచు, రాజాశ్రయ దుష్పరిణామమును గూర్చి, మిక్కిలి వగచినట్లు చెప్పుదురు.''

19. డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి - పానుగంటివారి సాహిత్య సృష్టి - పుట.13

చేతులు కాలాక ఆకులు పట్టుకొనడం వల్ల ఏం లాభం? తనమీద కోపం లోకంమీద తీర్చుకోవడం పిచ్చి. లక్ష్మీనరసింహారావుగారి సాక్షి వ్యాసాలలో ఏడు ఉన్మత్తుని ఉపన్యాసాలు ఉన్నాయి. వీటి కిటుకును విమర్శకులు ఇలా చెప్పారు.[20]

''ఇది ఇట్లుండగా దీనిలో మఱియొక విశేషము ఉన్నది. పంతులుగారికి చివఱి దినములలో మతి భ్రమణము కలిగినది. ఇందులకు కారణములు వారి ఆర్థిక పరిస్థితులు తారుమారగుట, నమ్మినవారు నమ్మరానివారగుట, తమకు రాదగిన గుర్తింపు రాలేదనుట - ఇవి అన్నియును, వారి సాక్షి వ్యాసములు ఆమూలాగ్రముగా చదివినచో, వారి మనస్సు ఎంత తీవ్రముగా పనిచేసినదో గమనింపవచ్చును. చివఱ చివఱకు వారు ప్రపంచముపై కొంత ఏవగింపు కూడా పెంచుకొనిరి. తాత్కాలికముగా కలిగిన రోత ఏ కొంతయో ద్వేషముగా మారినను, వారు నిగ్రహించుకొనగలిగిరి. ఉన్మత్తుని ఉపన్యాసములలో అయిదవ సంపుటిలోని నాల్గవది ఈ ఘర్షణను వ్యక్తం చేయును.

''దీనిలో పిచ్చివాడు కాని పిచ్చివాడు ఈ సృష్టినంత నాశనమొనర్చుటయే మంచిది అని మనుష్య జాతిపై అసహ్యముతో వాదించును. తొమ్మిదవ వ్యాసములో ఈతని వాదము మఱికొంత ఉన్నది. జంఘాలశాస్త్రి ఈతని ఉపన్యాసములను వినిపించి తుదకు ఇట్లనును.

''ఈ మాటలు మీకెట్లున్నవోగాని నాకు సమంజసముగా గనబడుటలేదు. ఈ యుపన్యాసమును కఠినముగా విమర్శింపవలసియున్నది.'' కాని జంఘాలశాస్త్రిచేత ఇంత ప్రధానమైన విమర్శనమును పంతులుగారు చేయించనేలేదు. ఇది ఉద్దేశపూర్వకమైన చర్య అనియే అనిపించును.''

పానుగంటివారి జీవితం చదువుతూ వుంటే చివరకు ఎంత జాలి కలుగుతుందో, వారి రచనలు చదువుతూ ఉంటే కొసదాకా నవ్వు మిగులుతుంది. అంతేమరి - విదూషకుడు తాను ఏడుస్తూ ఇతరులను నవ్విస్తాడు. పానుగంటి వారిలో విదూషకుని లక్షణాలు ఎక్కువ. దురాచారాలను, దురన్యాయాలను దుయ్యబడుతూనే సనాతనధర్మాలనూ, పూర్వుల విలువలనూ సంరక్షించే పానుగంటి వారి రచనలలో ఆకురాయిలాంటి హాస్యం, చెకుముకిరాయి లాంటి చెణకులు, విసురురాయిలాంటి విమర్శా ఉంటాయి. ఈయన తన ఇరవైమూడో యేట బియ్యే చదువుతున్నప్పుడు తొలి రచన చేశారు. నాటి నుండి జీవితాంతం వరకు 30 నాటకాలనూ, ఆరు సాక్షి సంపుటాలలో వెరశి 14 వ్యాసాలూ, రెండు కథా సంపుటాలలో 22 కథలూ, తర్వాత భారతిలో ఆంధ్ర పత్రికలో కలిపి తొమ్మిది కథలూ రాశారు.

పానుగంటి వారి అల్లుడు 1905లో సువర్ణలేఖ అనే వారపత్రికను తణుకులో ప్రారంభించారు. ఇందులో ఏదో రాయాలన్నట్టు పానుగంటివారు కథలు రాశారు. 1913లో సాక్షి వ్యాసాలు ప్రారంభించారు. దానితో వారికి కీర్తి, పాఠకులకు స్ఫూర్తి వచ్చాయి. చెప్పిందే చెప్పిందే చెప్పిందే చెప్పినట్టు భావాలు గుప్పించి వ్యాసం రాస్తున్నా చదువుతున్నంతసేపు విసుగు పుట్టించదుకాని గడుసుదనం ఒక్కొక్కప్పుడు బెడిసి

20. డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి - పానుగంటి వారి సాహిత్య సృష్టి - పుటలు 332-3

కొడుతుంది. లోకంవారి సాక్షి వ్యాసాలను పెద్ద చేస్తే ఆయన తన నాటకాలు గొప్పవనుకొంటారు. వారి నాటకాలలో ''రాధాకృష్ణ'', ''విప్రనారాయణ'', ''పాదుక'' ప్రసిద్ధమైన పౌరాణికాలు. అన్నీ 1909లోనే రచించారు. కంఠాభరణం (1917) హాస్యానికి అవతలిగట్టు.

కొచ్చెర్లకోట రామచంద్ర వెంకటకృష్ణారావు (1871-1919)

జమీందారీ కొలువులో ఉన్న కొందరు సాహితీపరులు సనాతన ధర్మాలను కాపాడుతూ ''స్వామికన్నా ఎక్కువ స్వామిభక్తి'' ప్రకటిస్తున్న రోజుల్లో కొందరు జమీందారులు తమ జమీలు నిలబెట్టుకొందికి తగినంత రాజభక్తి బ్రిటీషు ప్రభుత్వం పట్ల ప్రకటిస్తున్నా దేశభక్తినీ, సంఘ సంస్కారాన్నీ వ్యక్తంచేస్తూ సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనడం ముదావహం. ఈ యుగంలోని జమీందారులలో చెప్పుకోదగ్గ వ్యక్తి కొచ్చెర్లకోట రామచంద్ర వెంకటకృష్ణారావు. ఈయన పోలవరం జమీందారు. పుట్టుక వల్ల కాకపోయినా దత్తత వల్ల జమీందారు అయ్యారు. సంస్కృతాంధ్రాలు ఇంటివద్దనే చదివి 1884లో రాజమండ్రిలో ఇంగ్లీషు చదువులు ప్రారంభించారు. 1887దాకా రాజమండ్రిలో మెట్రిక్యులేషన్, 1888లో ఎఫ్ఫేలో చేరారు. అయితే ఈయన దత్తత చెల్లదని దాయాదులు కేసు పెట్టడం వల్ల మూడేళ్ళు చదువుకు అంతరాయం కలిగిందికాని, తర్వాత చెన్నపట్నం వెళ్ళి చదువు సాగించారు.

1893లో మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో ఎఫ్ఫే పూర్తిచేసి 1896లో పట్టభద్రులయ్యారు. హిష్టరీ అభిమాన విషయంగా తీసుకొని 1900 నాటికి అందులో ఉత్తీర్ణులయ్యారు. చెన్నపట్నంలో ఉన్నప్పుడు ఆయన పరశువాకంలో బంగళా తీసుకొని ఉండేవారు. 1894లో చెన్నపట్నం కాంగ్రెసుకు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వెళ్ళారు. పోలవరం జమీందారుగారు ఆయనకు ఆతిథ్యమిచ్చి తమ ఇంట్లోనే పెట్టుకొని కంటి వైద్యం చేయించారు. చిలకమర్తివారిలానే తామూ కాంగ్రెస్ కార్యక్రమాలలో ఆసక్తి చూపారు. సాహిత్య రంగంలోనికి ప్రవేశించారు.

వెంకటు కృష్ణారావుగారికి 1896లో జబ్బు చేసింది. సీమలో వైద్యం చేయించుకొందామనుకొన్నారుగాని, దానిని శ్రేయోభిలాషులు పడనియ్యలేదు. అందుచేత ఏలూరులో కాపురం పెట్టి వైద్యం చేయించుకొన్నారు. చిలకమర్తి వారు ప్రతివారం రాజమండ్రి నుండి వెళ్ళి చూసేవారు. సాహిత్యగోష్ఠులు జరిగేవి. విద్యాసంస్కారం ఉన్నా వెంకటు కృష్ణారావుగారు ఇతర జమీందార్లలాగే ప్రవర్తించేవారు. ఈ విషయాలన్నీ చిలకమర్తివారు ఇలా కథనం చేశారు.[21]

''.... నేను యేలూరు బోయెడి దినములలో నొకనాటి సాయంకాలమున జమీందారుగారు గుర్రపుబండిమీద షికారు బయలుదేరి, నన్నుగూడ వారి ప్రక్కను గూర్చుండబెట్టుకొనిరి. బండికి వెనుక ప్రక్కను వారి మిత్రులైన బ్రాహ్మణులిద్దరు

21. చిలకమర్తి లక్ష్మీనరసింహం - స్వీయచరిత్ర - పుట.143-4

తుపాకులను చేత ధరించి గూర్చుండి మాతో షికారు వచ్చిరి. అట్లు తుపాకులు ధరించి మా వెంట వచ్చుట నాకిష్టము లేకపోయెను. ఏలూరులో నదివరకే జమీందారుగారిమీదను, వారి మిత్రులమీదను జెడ్డవాడుకలెన్నో యుండెను. కారణమేమన జమీందారుగారి భార్య యుండగనే, యొక దాసీ కన్యను పిలిపించి, వారిని వేరే యింట గాపురముంచి, ప్రతిదినము మధ్యాహ్నము మూడునాలుగు గంటల నడుమ నామె యింటికిబోయి, యయిదారు గంటలకు వచ్చెడివారు. అదిగాక వారి యాప్తమిత్రులలో కొందరు మద్యపాన లోలులుండిరి. అందుచే వారి కప్రతిష్ఠ యెక్కువయ్యెను. ఆనాడు మేము షికారు నుండి మరలి యింటికి వచ్చిన తరువాత, భోజనములు చేసిన పిదప, వారిని నేనీవిధముగ మందలించితిని ''అయ్యా! జమీందారుగారూ, మీరు గొప్ప గృహస్థులు, ప్రభువులు, బి.యే. వరకు జదువుకున్నవారు. ఇవి మీకు సుప్రతిష్ఠ రావలసిన దినములు. అదిలేదు సరిగదా, మీకప్రతిష్ఠ లోకములో నెక్కువగా నున్నది. దీనికి కారణము మీ యాప్తులలో కొందరు విద్యావిహీనులు, మద్యపాన ప్రియులు, సత్ప్రవర్తనము లేనివారు. గ్రామము లోనికి నేను వెళ్ళినప్పుడు కొందరు పెద్దమనుషులు మిమ్మును గురించి యనేక చిత్ర విచిత్ర ప్రశ్నలు నన్నడుగుచుందురు. వాటికి నేను సమాధానం చెప్పలేకపోవుచున్నాను. ఈ మిత్రులను మీరు విడిచినగాని మీకు సుప్రతిష్ఠ రాదు. నేటి సాయంకాలము మనము షికారు వెళ్ళినప్పుడు మీ మిత్రులిరువురు తుపాకులను పుచ్చుకొని బండి వెనుక గూర్చుండి యుండిరి కదా. మీరది గనిపెట్టిరిగదా. మనమందరము బ్రాహ్మణులముగదా. చేతులలో మనకు తుపాకులెందుకు? మనము వేటగాండ్రమా! ఇటువంటి పనులను బట్టియే లోకములో నెన్నియో యపవాదములు మీపైబడుచున్నవి. మీరెన్నో విషయములలో లోకమునకెంతో మేలు చేయవలసియున్నారు. నేడు నేనిట్లు మీతో చెప్పినందుకు నాపై నాగ్రహింపక మీ మిత్రులను పరిత్యజించి మంచి త్రోవకు రండు'' ఇట్లు నేను మనవి జేసిన తరువాత వారు గొంత పశ్చాత్తాపము నొంది నాతో నిట్లనిరి. ''లక్ష్మీనరసింహముగారు! నేనీ నిర్భాగ్యులను చేరదీయుట తప్పు. వీరి వల్లనే నాకు మిక్కిలి యప్రతిష్ఠ వచ్చుచున్నది. ఈ నిర్భాగ్యుల సహవాసము మానివేసి, యే మంచిపని మీరు చేయమన్నను చేసెదను''. ఈ సంభాషణము మీకిరువురకు జరుగునపుడు మిత్రులెవ్వరును మాచెంత లేరు. ఇది మిక్కిలి రహస్యముగ జరిగినది.''

తర్వాత వెంకటకృష్ణారావుగారు చిలకమర్తి వారితో కలసి ''సరస్వతి'' అనే పత్రికను 1898లో నెలకొల్పారు. ఇది రాజమండ్రి నుండి వెలువడేది. 1899లో వెంకట కృష్ణారావుగారు తమ నివాసం కాకినాడ మార్చుకొన్నారు. తమతోపాటు పత్రికను తీసుకువెళ్ళారు. సుమారు ఇరవై అయిదు సంవత్సరాలు దానిని నడిపారు. తిరుపతి వెంకటకవులను ఆస్థానకవులుగా పెట్టుకొన్నారు. తిరుపతి శాస్త్రిగారిని కాకినాడలోనే ఉండమన్నారు. ''సరస్వతి''లో తిరుపతి శాస్త్రిగారు పరిష్కరించిన ప్రాచీన గ్రంథాలను ప్రచురించారు. తమకు అభిమాన గ్రంథమైన బుద్ధచరిత్రను వారిచేత కావ్యంగా చెప్పించారు. తాము స్వయంగా కల్హణుని ''రాజతరంగిణి''ని సంస్కృతం నుండి వచనంలో అనువాదం చేశారు.

సాహిత్య వ్యాసంగం చేస్తూ సంఘ సంస్కారంలో పాల్గొన్నారు. వీరేశలింగంగారికి విరాళం ఇచ్చారు. గిడుగు, గురజాడలకు ఆతిథ్యమిచ్చారు. ఇరవై సంవత్సరాలు కాంగ్రెసులో సభ్యులు, హోంరూలు ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. వెంకట కృష్ణారావుగారి జీవితంలో ఎంత వైవిధ్యముందో వారు నడిపిన సరస్వతి పత్రికలో ప్రచురించిన వాటిలో కూడా ఉండేది. ప్రాచీన కావ్యాలు, చరిత్రలు, జీవిత చరిత్రలు, నాటకాలు, వ్యాసాలు, కథలు ప్రచురితమయ్యేవి. ఇవి గ్రంథరూపంలో కూడా వచ్చేవి. ఇవి ఆనాటి గ్రంథాలయాలకు కొత్త చేర్పులు.

నాళం కృష్ణారావు (1881-1961)

పాఠశాల చదువులకన్నా గ్రంథాలయంలో చదివిన చదువులు ముఖ్యం అని భావించి విద్యావంతులైన వ్యక్తి నాళం కృష్ణారావుగారు. ఆయన మండపేటలో పుట్టి, కాకినాడలో పెరిగి, రాజమండ్రి చేరారు. వీరేశలింగంగారి వల్ల ప్రభావితులయి వారి శిష్యుడై, కుడిభుజమై సంఘ సంస్కారోద్యమంలో పాల్గొన్నారు. ఆయనకు గ్రంథాలు చేర్చడం సరదా. చదవడం ఆసక్తి.

''మంచి గ్రంథముల్ లేని యా మందిరంబు
మందిరంబదిగాదొక్క బందిగాని''

అన్నది ఆయన ఉద్దేశ్యం. అందుకే ఇంకా ఇలా చెప్పారు.

''పుస్తకంబులు గలిగిన పూరిగుడిసె
యందు నిరుపేద కాపునై యుందుగాని
పుస్తకంబులు లేనట్టి భూరి సౌధ
మందు చక్రవర్తిగ నుండ నభిలషింప''

నాళం కృష్ణారావుగారు చాలా పుస్తకాలు చేర్చి రాజమండ్రిలో వీరేశలింగంగారు కట్టించిన పుర మందిరంలో ''వీరేశలింగ గ్రంథ భాండాగారము'' అనే లైబ్రరీని స్థాపించారు. సంఘ సంస్కారంతోపాటు రాజకీయాలు కూడా కృష్ణారావుగారికి అభిమాన వ్యాపకం. బెంగాలు విప్లవవీరుడు కుదీరాంబోసు చిత్రపటాన్ని తెచ్చి లైబ్రరీలో పెట్టారు. వీరేశలింగంగారి ఉద్దేశంలో కుదీరాం ఒక నరహంతకుడు. రాజద్రోహి. ఇతని పటాన్ని తన పేరుమీదుగా ఉన్న గ్రంథాలయంలో ఉంచడానికి వీల్లేదన్నారు. జిల్లా కలెక్టరుకు క్షమాపణలు చెప్పమన్నారు. నాళం కృష్ణారావుగారు వీరేశలింగంగారి మాట వినలేదు.[22] పటం తీయడానికి బదులు గ్రంథాలయాన్నే అక్కడ నుండి తీసేస్తానని చెప్పి గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు.

గ్రంథాలయోద్యమంలోనేకాక గ్రంథ రచనలో కూడా నాళం కృష్ణారావుగారు రాణించారు. ఏడెనిమిది పుస్తకాలు రాసి బాల సాహిత్యాన్ని సృష్టించారు. ఈయనకు ''మధురకవి'' అన్నది బిరుదు. 1911 నుండి రాజమండ్రి నుండి ''మానవసేవ'' అనే సచిత్ర మాస పత్రికను నడిపారు.

---

22. వీరేశలింగం- స్వీయచరిత్ర - ద్వితీయభాగం - పుట.321

త్రిపురనేని రామస్వామిచౌదరి (1887–1943)

వందేమాతరం ఉద్యమం రోజుల నుంచి మనదేశంలో వీరపూజ ప్రారంభమైంది. బెంగాలు విప్లవవీరులను అభిమానించి ఆరాధించడం పరిపాటే. ఆంధ్రోద్యమం ప్రారంభమయ్యాక తెలుగు వీరులను కూడా ప్రస్తుతించడం జరిగింది. జమీందారీ యుగం చివరి రోజులలో ఆంధ్రదేశంలో ఒక పాట మారుమ్రోగుతూ ఉండేది.

వీరగంధముఁ దెచ్చినారము
వీరుడెవ్వడో తెల్పుడీ!
పూసిపోదుము, మెడనువైతుము
పూలదండలు భక్తితో!!

తెలుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరినప్పుడు
తెలుగువారల కత్తిదెబ్బలు
గండికోటను కాచినపుడు

తెలుగు వారల వేఁడి నెత్తురు
తుంగభద్రను గలసినప్పుడు
దూరమందున నున్న సహ్యజ
కత్తినెత్తురు కడిగినప్పుడు

ఇట్టి సందియ మెన్నఁడేనియు
బుట్టలేదు రవంతయున్;
ఇట్టి ప్రశ్నల నడుగు వారలు
లేకపోయిరి సుంతయున్

నడుముగట్టిన తెలుఁగు బాలుఁడు
వెనుక తిరుగండెన్నఁడున్,
బాసయిచ్చిన తెలుఁగు, బాలుఁడు
పాఱిపోవం డెన్నడున్

ఇదిగో! యున్నది వీరగంధము
మైనలందుము మైనలందుము;
శాంతిపర్వముఁజదువవచ్చును
శాంతి సమరంబైన పిమ్మట

తెలుఁగు నాటిని వీరమాతను
జేసి మాత్రము తిరిగి రమ్మిఁక
పలు తుపాకులు పలు ఫిరంగులు
దారికడము రాకతప్పవు

వీరగంధముఁ దెచ్చినారము
వీరుడెవ్వడో దెల్పుడీ!
పూసిపోదుము, మెడనువైతుము
పూలదండలు భక్తితో!

ఈ ముత్యాలసరాల పాటను రచించినది త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. ఆయనకు ''కవిరాజు'' అనే బిరుదు ఉంది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి శిష్యులు, ఛందోబద్ధమైన కవితను సలక్షణంగా సంప్రదాయసిద్ధంగా రాసినా వారి భావాలు మాత్రం భావవిప్లవం కలిగించేవి. స్వాభిమానాన్ని పుట్టించేవి.

రామస్వామిగారు 1904 దాకా గుడివాడ మిడిల్ స్కూల్లో చదివారు. తరువాత బందరు హిందూ హైస్కూలులో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి నోబుల్ కళాశాలలో చదువుకొన్నారు. చెళ్ళపిళ్ళవారి శిష్యులైనారు. 1911లో ఒక అష్టావధానం, 1912లో ఒక శతావధానం చేశారు. 1913లో కొప్పరపు కవులతో తమ గురువుల తరపున ఛాలెంజి చేశారు. 1914లో సీమకు వెళ్ళి ''బారెట్‌లా'' చదవదలచారు. ఐర్లాండులోని డబ్లిన్ నగరంలో ఆ విద్య పూర్తి చేశారు. 1917లో స్వదేశానికి తిరిగి వచ్చారు. ఆయన తొలినుండి జాతీయాభిమాని, వారు సీమనుండి వచ్చేనాటికి జస్టిస్ పార్టీవారు బ్రాహ్మణేతర సంఘాన్ని స్థాపించి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారిని అందులోనిగా లాగారు. రామస్వామిగారు కాంగ్రెసువారు స్థాపించిన జాతీయ బ్రాహ్మణేతర సంఘం సభలకు మొదటి అధ్యక్షులుగా నాయకత్వం వహించారు.

రామస్వామిగారు ఆంధ్రదేశంలోని కమ్మవారు, క్షత్రియులనే ఒక ఉద్యమం సాగించి, వారికి యజ్ఞోపవీత ధారణం చేయించి, స్వసంఘ పౌరోహిత్యం పాదుకొల్పారు. ఆర్య కుతంత్రాలన్నీ బట్టబయలు చేస్తూ పురాణ ఇతిహాసాలలో ఆర్యేతరులకు జరిగిన అన్యాయాలను వెల్లడిచేస్తూ సనాతన సమాజ చక్రాలను బద్దలు చేయడానికి రచనలు చేశారు. 1927లో సూతాశ్రమాన్ని స్థాపించారు. వారు రాసిన గ్రంథాలు శంబుక వధ (1920), సూతపురాణం (1925), ఖూనీ (1935) సాహిత్యలోకంలో సంచలనం లేపాయి. వాదోపవాదాలకు ఆస్కారమైనాయి. రామస్వామిగారు సాంఘిక సమానత్వాన్ని సాధించాలన్న ప్రయత్నం గొప్పది. ఈ సత్యాన్వేషిని బ్రాహ్మణ ద్వేషిగా భావించి లోకం పొరబడింది. నిజం చెప్తే నిష్ఠూరమే మరి. శ్రీరాముడు చంద్రుడే అయితే శంభుక వధ అతని జీవితంలో మాయని మచ్చ. ఆ మచ్చను రామదాసులు చూడరుగానీ అట్టివారిని రామస్వామిగారు కడుగక మానరు. శంభుకుని చంపినట్టే వేనుణ్ణి చంపినవారిని రామస్వామిగారు బోనులో నిలబెట్టారు. ఆయన పట్టిన కేసులు గట్టివే.

మొక్కపాటి నరసింహశాస్త్రి (1892-1972)

విదేశాలకు వెళ్ళి చదువుకొన్న ఆంధ్ర యువకులు చాలామంది జమీందారీ యుగంలో ఉన్నారు. అటువంటి వారిలో మొక్కపాటి నరసింహశాస్త్రి ఒకరు. ఆయన ఎవరని ప్రశ్నిస్తే తలొకరు తలో రకంగా చెప్తారట. ''పెద్దవాళ్ళంతా నన్ను

సుబ్బారాయుడిగారి తమ్ముడు అంటారు. మా ఊరివాళ్ళంతా నన్ను కామమ్మగారి తమ్ముడు అంటారు. మరోచోట శివశంకరశాస్త్రిగారి వియ్యంకులనీ, తీర్థులవారి మామగారనీ అనిపించుకోవడం నాకు బాగా అలవాటయింది'' అని శాస్త్రిగారే చెప్పుకొన్నారు. నిజానికి ఈయన ''బారిష్టర్ పార్వతీశం'' అనే గ్రంథానికి రచయిత. ఈ సంగతి చెప్పాక ఇంకేం చెప్పకపోయినా ''అలా చెప్పండి'' అని లోకం అంటుందట.

నరసింహశాస్త్రి గారు సాంప్రదాయక రీతిలో సంస్కృత కావ్యాలు చెప్పుకొన్నారు. పిఠాపురంలోనూ, బందరులోనూ చదువుకొన్నారు. 1913లో స్కాట్‌లాండ్‌కు వెళ్ళి అక్కడ ఎడింబరో విశ్వవిద్యాలయంలో 1917 దాకా చదువుకొన్నారు. కాని, డిగ్రీ పుచ్చుకోలేదు. 1920 నుండి జాతీయోద్యమంలోనూ, సాహితీ సమితి కార్యక్రమాలలోనూ సరిసమానంగా పాల్గొనేవారు. ఆదిలో చాలా రచనలు ''సాహితి''లోనూ, ''భారతి''లోనూ అచ్చుపడ్డాయి. 1924లో ఊసుపోకకు బంధువుల పిల్లలకు సీమ కబుర్లు చెబుతూ ''పార్వతీశం'' పాత్రను సృష్టించారు. 1924లోనే అది అచ్చుపడింది. బారిష్టరు చదువులకు సీమ పంపించారు. ఈ గ్రంథం చాలాకాలందాకా ప్రథమ భాగంలోనే ఒక పక్కే మనకు కనబడే చంద్రబింబంలాగ ప్రకాశిస్తుంది. తర్వాత భాగాలు వస్తాయన్న ఆశ చాలాకాలందాకా మృగ్యాలు. శాస్త్రిగారు ఉత్తరోత్తరా మిగతా భాగాలను పూర్తి చేశారు. చేయనంత కాలం చేస్తే బాగుండుననిపించే పనులు చేశాక ఇవ్వవలసిన తృప్తిని ఇవ్వవు. అయితే మొదటిభాగంలోని పార్వతీశం నిండుతనం గలవాడే. ఆంధ్ర సాహిత్యంలో సజీవుడయ్యాడు.

చాలామంది గురజాడ వారి గిరీశాన్నీ, చిలకమర్తివారి గణపతినీ, మొక్కపాటివారి పార్వతీశాన్ని ఒకేరకమైన హాస్యపాత్రలుగా భావిస్తారు. ఈ పాత్రల తేడాలను నరసింహశాస్త్రిగారే ఇలా చెప్పారు.[23]

''.... గిరీశం నాటకంలో విలన్‌కానీ, అనగా దుర్మార్గుడుకాని సన్మార్గుడుకాదు. జీవితంలోని ఈలాంటి కొద్దిమందికి ఇతను ప్రతినిధి. హాస్యమునకు మానవ సామాన్యత్వం ప్రధాన లక్షణం, గిరీశం లక్షణాలు సర్వమానవ సమాజములనీ, సామన్యములనీ, నేను ఒప్పుకోలేను. అందుచేతను గిరీశం లాంటివాళ్ళు ఎప్పుడూ సంఘంలో బహు కొద్దిమందే ఉంటారు. అయినా అతను సజీవుడనీ చిరంజీవనీ అన్ని కాలములలోనూ, మారువేషంలో ఉన్నా, మనలో ఉంటాడనీ ఒప్పుకోక తప్పదు.

''ఇక గణపతి మరోరకమైన వ్యక్తి. ఇతను ప్రత్యేకం ఒక శాఖకు సంబంధించినవాడు. విద్యావిహీనుడు, దరిద్రుడు, జీవనోపాధి సంపాదించుకొనుటకు ఏవిధమైన అర్హతా లేనివాడు. అంతకన్నా దౌర్భాగ్యము కూలీనాలీ చేసుకోడం కూడా చేతకాని బ్రాహ్మణ జన్మ ఎత్తినవాడు. అయినా బ్రతక్క తప్పదు కదా! అలాగా నానాతంటాలు పడి, బడి పంతులుగా కొన్నాళ్ళూ, వీధి భాగవతాలలో కృష్ణుడుగానూ, విదూషకుడుగానూ కొన్నాళ్ళు గ్రామ పాచకుడుగా కొన్నాళ్ళూ, శవవాహకుడుగా కొన్నాళ్ళూ ఈలా అనేక

23. బారిష్టర్ పార్వతీశం - ''తుదిపలుకు'', పుట.171-2

అవతారాలలో ప్రత్యక్షమై జీవయాత్ర సాగించుకున్న నిర్భాగ్యుడు. ఇతనే నాటికీ హాస్య నిలయుడని నేనొప్పుకోను. అందరి దయకూ, ధర్మానికీ, కరుణకూ పాత్రుడు కావలసిన మనిషికి, శ్రీ లక్ష్మీనరసింహంగారు, ఆనాడు ప్రజలలో చెప్పుకొనే కొన్ని హాస్యోక్తులనూ, సంఘటనలనూ ఇతని జీవితంలో చొప్పించి, గణపతి నొక హాస్యపాత్రగా సృష్టించారు. ఇతరుల కష్టములు మన కరుణకే గాని హాస్యమునకు స్థాయి కాకూడదు అని నా నమ్మకం – ఇది పెద్దల మాట కూడాను.''

పార్వతీశం నాగరికతా మయసభ అద్దాలలో చిక్కుకొన్న అమాయకుడు, మానవునిలోని అల్పత్వానికి గుణకారం, హాస్యానికి ఆకారం, రచయితకన్నా అతడు సృష్టించిన పాత్ర గొప్పదైతే అది ప్రస్తుతించవలసిన సంగతే.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి (1890–1951)

జమీందారీ యుగంలోని చివరి దశాబ్దంలో నవ సాహిత్య యుగం వేకువ రేకలు సంతరించుకొంటున్న కాలంలో యువ రచయితలు వాడుకభాషను సంఘ సంస్కారాన్ని సమాజంలో ''ఒకరకమైన'' సమానత్వాన్ని సాధించాలని చూస్తున్నప్పుడు, ఎందరు సనాతనులు వారిని తిట్టి పోస్తున్నా యువశక్తికి బాసటగా నిలచిన ఉత్తమ పండితుడు ఒకడున్నా చాలుననుకున్నప్పుడు, ఆ భరోసా ఇచ్చిన మహనీయుడు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు. సంస్కృతాంధ్ర ప్రాకృత భాషలను కూలంకషంగా ఔపోసన పట్టారు. 1908లో మద్రాసుకు వెళ్ళారు. మొదట ఆంధ్ర పత్రిక కార్యాలయంలో ఉద్యోగిగా చేరి ఎన్నో ఉగాది సంచికలకు పర్యవేక్షకులుగా పనిచేశారు. మదరాసులో ఉన్నప్పుడే నవ్యసాహిత్యాన్ని సృష్టిస్తున్న యువకులందరినీ వెన్నుతట్టి ముందుకు సాగమన్నారు. నండూరి సుబ్బారావుగారి ఎంకిపాటలకు చక్కని ఉపోద్ఘాతం రాసి తెలుగు సాహిత్యంలో ఒకరకమైన కొత్త కవిత్వానికి సంరక్షకులయ్యారు.

సనాతనులు అన్నీ వేదాలలోనే ఉన్నాయని చెప్తూ బుకాయించే రోజులలో మన ధర్మశాస్త్రాలలో, ఇతర శాస్త్రగ్రంథాలలో ఏముందో సామాన్యులందరి తేటతెల్లం కావడానికి గౌతముని ధర్మసూత్రాలు, వాత్స్యాయన కామసూత్రాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం వ్యాఖ్యానాలతో అనువదించారు. ప్రాకృత సాహిత్యాన్ని మధించడంచేత జైనుల మత కథలను తెలుగువారికి తెలియచేశారు. (ఆదిలో తెలుగువారికి జైనులే అక్షరాభ్యాసం చేశారు.)

1930 ప్రాంతాల్లో శాస్త్రిగారు స్థాపించిన ఆంధ్ర భారతి గ్రంథమాలలోని వారి పుస్తకాలు మొదట ప్రచురణ పొందాయి. తర్వాత కొంతకాలానికి ఆయన మకాం మార్చి బరంపురం కళ్ళికోట మహారాజావారి కాలేజీలో ఆంధ్ర పండితులయ్యారు. బరంపురంలోనే మొట్టమొదట అఖిలాంధ్ర కవి పండిత సభ జరిగింది. దానికి పంచాగ్నులవారే ఆధ్వర్యం వహించారు. ఇదే ఉత్తరోత్తరా నవ్య సాహిత్య పరిషత్తుగా మారింది. బరంపురం సభ నాటి నుంచే నవ్యసాహిత్య నౌకకు శాస్త్రిగారు మాలీంగా

ఉన్నారు. నేటికాలపు కవిత్వం అని అక్కిరాజు ఉమాకాంతంగారు భావకవిత్వం మీద విరుచుకుపడితే నవీన చావ కవిత్వం పంచాగ్నుల వారి ఆశీర్వచనాలతో దినదిన ప్రవర్థమానమైంది. ఆయన నవ్యసాహిత్య పత్రికలలో చేసిన కృషి అపారం. ఆధునిక యుగం ఆకారరేఖలు దాల్చుకొంటున్నప్పుడు అందుకు పాటుపడ్డ ప్రప్రథముల కోవలో ఆదినారాయణశాస్త్రిగారు చిరస్మరణీయులు. ఆధునిక యుగ ఆరంభానికి స్వాగతం చెప్పిన వీరి గురించి ఆ యుగ సాహిత్య చరిత్రలోనే చెప్పుకొందాం.

ఆదిలో నవీన భావాలను ఎదుర్కొని, ఫ్యూడలు విలువలు నిలబెట్టడానికి అంతవారు ప్రయత్నించినా, రానురాను అభ్యుదయ మార్గాన్ని చేపట్టి భావచైతన్యం కలిగించిన వారికి ఇంతవారు తోడ్పడటం వల్ల సాహిత్యకేదారం పచ్చగా పండుతోంది.

నవ్యసాహిత్య యుగం

ఫ్యూడల్ వ్యవస్థ ఒక పక్క పుచ్చిపోతూ ఉంటే, ప్రజాస్వామ్య భావాలు ప్రబలి నూతన చైతన్యం ప్రకాశించినప్పుడు నవ్యసాహిత్యం ననలెత్తక తప్పదు. అందుకే జమీందారీ యుగంలోనే సమానాంతరంగా నవ్యసాహిత్యయుగం కూడా ద్యోతకమవుతుంది. ఇందులో కొత్తపాతల మేలు కలయిక ప్రారంభమవుతుంది. నిస్సందేహంగా తెలుగు సాహిత్యంలో నవ్యబీజాలను నాటినవారు గురజాడ అప్పారావుగారే. తేటైన మాటలలో, సూటైన భావాలతో, దేశీయ ఛందంలో ఆయన దేశానికి కొత్త మెరుగులు పెట్టారు. యువత తన మార్గంలో పయనిస్తుందని ఆయన ఆశించారు. అయితే దురదృష్టవశాత్తు వారి వారసత్వాన్ని వెనువెంటనే అందుకొన్నవారు లేరు.

చింతా దీక్షితులుగారు ఒకచోట ఇలా 1932లోనే చెప్పారు.[1] ''అప్పారావుగారిని మెచ్చుకోని వారు అభినవాంధ్ర కవులలో నేనెరిగినంత మట్టుకు ఎవ్వరూ లేరు. నేడు కావ్యములు వ్రాసే యువకులందరూ ఆయనను మార్గదర్శిగా అంగీకరించినవారే. కాని, ఏ కారణము చేతనో వారు భాషా విషయమున నైతేనేమి, రచన విషయమున నైతేనేమి అప్పారావుగారికి భిన్నముగా నడుస్తున్నారనే అనక తప్పదు.''

అప్పారావుగారు చేసిన రచనలు సంఖ్యలో తక్కువైనా, ప్రయోగాలలో ప్రయోజన సాధన, విషయాలలో వైవిధ్యం గలవి. ఒక్కొక్క తరహాకు ఒక్కొక్క వరవడి పెట్టారా అనిపిస్తుంది. అప్పారావుగారి తర్వాత వచ్చిన కవులలో రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ ప్రముఖులు. వీరి గురించి దీక్షితులుగారు ఇంతకు ముందు చెప్పిన వ్యాసంలోనే ఇలా తీర్పు చెప్పారు.

''దేశభక్తి విషయమై రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ మున్నగువారు ఉద్రేకము పుట్టించే పద్యములు వ్రాశారు కాని వారి భాష వేరు.

1. భారతీ - డిసెంబరు 1932 (పు.903-907)

అప్పారావుగారి పద్యములలో బిగువు వున్నది. వీరి దేశభక్తి ఆంధ్రదేశమును దాటి హిందూ దేశముకంతకూ చెందివున్నది''.

హిందూదేశానికి కాదు. ఏ దేశానికైనా చెందే జాతీయగీతంగా గురజాడ దానిని తీర్చిదిద్దారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అప్పారావుగారిని అనుకరిస్తూ ఒక ఖండికనూ, అప్పారావుగారిని కీర్తిస్తూ కొన్ని ముత్యాల సరాలనూ రాశారుగాని 1925లో ప్రచురించిన కృష్ణపక్షం అనే భావకవిత్వం ధోరణి దేశంలో మారుమ్రోగి గురజాడ వాణి వినిపించడం అరుదైంది. కృష్ణశాస్త్రిగారిని అనుసరించేవారు బయలుదేరారు. చింతా దీక్షితులుగారు ఆ విషయాలపై ఇలా రాశారు.

''కృష్ణశాస్త్రిగారూ వారిని అనుకరించేవారూ, శుద్ధ గ్రాంథికమునే వాడుతున్నారు. కృతకభాష కూడా కొంత వాడుతున్నారు. ఉన్నతమైన వారి భావములు మృదువైన శబ్దజాలములో మరుగుపడిపోతున్నవి. అప్పారావుగారు భాషను ఒక వాహనముగా గ్రహించారేగాని భాషే పరమార్థమనుకోలేదు.''

కృష్ణశాస్త్రిగారూ, ఆనాటి వారి అనుయాయులేకాక తర్వాత తరంలో వచ్చిన శ్రీరంగం శ్రీనివాసరావూ అతని మిత్రులూ కూడా అప్పారావుగారిని అనుసరించలేదు. కొన్ని మినహాయింపులతోనే అప్పారావుగారి ఆధిక్యతను అంగీకరించలేదు. 1935లో శ్రీశ్రీ ఇలా రాశారు.[2]

''ఆధునికాంధ్ర కవిత్వానికి గురుపాదులు శ్రీ గురజాడ అప్పారావుగారని అందరి సమ్మతిమీద తేలిన విషయం. ముత్యాలసరం వారి కానుక. తార్కికులూ, వైయాకరణులూ, కళ్ళుమూసుకున్నవాళ్ళూ, మడికట్టుకున్న వాళ్ళూ మొదలైన పరిమిత క్షేత్ర సంచారాలను ధిక్కరించి గురజాడ అప్పారావుగారు మొట్టమొదట నవ్య కవితను ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టారు. ఈ యాథార్థ్యాలన్నింటినీ ఒప్పుకొన్న పిమ్మట వారి ముత్యాలసరము ఛందస్సు అపరిపక్వమనీ వారి కవిత్వం అనగాధమనీ విధిలేక చెప్పవలసి వస్తుంది.''

అగాధం[3] అన్నమాటకు 'మిక్కిలి లోతుగలది', 'అతి గంభీరమైనది', 'తెలియ రానిది', 'దురవగాహము' అనే అర్థాలున్నాయి. అప్పారావుగారి కవిత్వము ఒకనాటి భావకవులకు అనగాధము అనిపించడంలో వింతలేదు. వారికి శైలిలో సార్థకత కంటె సమాసతత్పరత ఎక్కువ ఇష్టం. భావసౌకుమార్యం కన్నా పదార్థగౌరవమే ముఖ్యం. అప్పారావుగారిలో కన్నా తర్వాత కవులలోనే, అంటే భావకవులలోనే శ్రీశ్రీ వంటివారికి

2. ఉదయిని - సంపుటి-1, సంచిక-2, 1935

3. ఉదయినిలో అచ్చయిన ఈ వ్యాసం ప్రస్తుతం నాకు లభించలేదు. రమణారెడ్డిగారు కూర్పుచేసిన శ్రీశ్రీ సాహిత్యం-2 (వచనవిభాగం పు.446)లోనూ, సారస్వత వ్యాసములు 4వ సంపుటం (పు.336)లోనూ, ఉద్ధరించిన ఈ వ్యాసంలో 'అనగాధం' అని ఉంది. శ్రీశ్రీ రచించిన గురజాడ 'ముత్యాలసరాలు' (1959)లో మాత్రం 'అగాధం' (పు.24) అని ఉంది. ఏది సాధువో, ఏది అసాధువో తెలియదు.

ఆనాడు తీవ్రత, జాగరూకత కనబడేవి. అప్పారావుగారిలో ప్రౌఢకవిత్వద్యోతకాలు లేవంటారు. శిల్పంలో అలక్ష్య ఫలితాలూ, ప్రమాద ఫలితాలూ ఉన్నాయంటారు. గురజాడ వారి ఛందస్సులలో బలహీనత ఉందని ఈవాదం.

ప్రబంధకవి పూర్వ బాణీల నుండి వచ్చిన కవిత్వానికి పయనిస్తున్నప్పుడు శబ్దంమీద మక్కువ ఎక్కువ చూపడం సహజమే. భావానికే పట్టం కట్టినా, దాని చుట్టూ ప్రౌఢిమ పట్టు పరదాలు చుట్టబెడతారు. అయితే గురజాడ అప్పారావుగారి తక్కిన వారసులు ఓ నలుగురు లేకపోలేదు. వీరు మాత్రము సారళ్యానికే ప్రయత్నించారు. అప్పారావుగారి ఆశయాలలో ఒక్కొక్క అందానికి ఈ నలుగురలో ఒక్కొక్కరు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ కవులెవరంటే –

1. నండూరి వెంకట సుబ్బారావు (1884–1957)
2. గరిమెళ్ళ సత్యనారాయణ (1893–1952)
3. బసవరాజు అప్పారావు (1894–1937)
4. కవికొండల వెంకటరావు (1898–1964)

ఈ నలుగురిలో అందరికన్నా ముందుగా గురజాడ వల్ల ప్రభావితులయినవారు బసవరాజు అప్పారావుగారు. సూటిగా, తీక్షణంగా తమ భావాలను, కష్టసుఖాలను కావ్యంలో వెళ్ళబోసుకొనేవారు. నాజూకు మాటలూ, నగిషీలు చెక్కడాలు అక్కరలేదు. సహజ సౌందర్యమే వారి మాటలలో సాక్షాత్కరించేది. గురజాడ అప్పారావుగారు ప్రవేశపెట్టిన సామాన్యుల భావాలు సామాన్యులకు హత్తుకొనేటట్టు చెప్పడమనే లక్షణం బసవరాజు అప్పారావుగారే పుణికిపుచ్చుకొన్నారు. ఈయనే ఇతరులలో కొందరిని గురజాడ మార్గానికి తిప్పారు.

గురజాడ అప్పారావుగారు ఆంగ్ల కవులలో వర్డ్స్ వర్తును ఆదర్శంగా చూసి ఆధునిక కవులు మనుష్యుల సుఖదుఃఖాలన్నీ ఒక్కలాంటివే అనీ, మానవులలో ఒకరి ఎక్కువా, ఇంకొకరి తక్కువా లేదనీ, గొప్ప అవస్థలో ఉన్నవారికి భార్యలూ, జీవితాలూ ఎలాగైతే వర్ణనకు తగినవో అలాగే తక్కువ స్థితిలో ఉన్నవారి సుఖదుఃఖాలను కూడా కావ్యాలుగా చెప్పవచ్చునని చెప్పారు. సర్వసామాన్యులైన పాటకపుజనుల అనురాగాలూ, అభిలాషలూ, అభిమానాలూ, అందాలూ ఎంకిపాటల పేరుతో రచించి నండూరి సుబ్బారావుగారు గురజాడ వారి ఆశయాలలో ఒకటి ఆచరణలోనికి తెచ్చారు. దీనివలన ఆనాడు గాలిదుమారం రేగినా ఆ గొడవలు చల్లారి చక్కని పాటలు నేటికి మిగిలి ఉన్నాయి.

గురజాడ వారిలో మరొక ముఖ్యాదర్శం దేశభక్తి. ఈ అంశాన్ని ఆనాటి కవులు అందరూ కొద్దిగానో గొప్పగానో తమ కవితలలో స్పృశించారు గానీ రమారమి టోకున దీనిని గుత్తకు తీసుకొన్నది గరిమెళ్ళ సత్యనారాయణగారే అనిపించేటంత తీక్షణతో ఆయన దేశభక్తిని గానం చేశారు. 1920లో చదువుతున్న ట్రెయినింగు కాలేజీ విద్యమానేసి, జాతీయోద్యమంలో దిగిన నాటినుంచి ఆయన దేశభక్తి గీతాలు రాస్తూనే ఉన్నారు.

1921లో కవిత్వం రాసి కారాగార శిక్ష పొందిన మొదటి దేశభక్తుడు గరిమెళ్ళ సత్యనారాయణగారే. ఆనాడు ''మాకొద్దీ తెల్లదొరతనము'' అనే గేయాన్ని రచించి, పాడి ప్రజలను ఉత్తేజితులను చేసినందుకు జైలు శిక్ష పడింది. జైలు నుంచి వచ్చిన వెంటనే మళ్ళా పాట ఎత్తుకొనే సరికి తిరిగి అరెస్టు అయ్యారు. రాజద్రోహం నేరం కింద ఇంకో రెండున్నర సంవత్సరాలు శిక్ష పడింది. ఆయన జైలులో ఉన్నప్పుడు తండ్రిగారు మరణించారు. సత్యనారాయణగారు క్షమాపణ చెప్పుకొని బయటకు రాలేదు. తర్వాత తాతగారు పోయారు. అంతతో కష్టాలు పోలేదు. భార్య కూడా మరణించింది. అయినా ఆయన జాతీయ గీతాలు రాస్తూ ఉన్నారు. పాడుతూ ప్రజలను ఉత్తేజితులను చేస్తూనే వచ్చారు.

గరిమెళ్ళ సత్యనారాయణగారికి దేశభక్తి గురజాడ అప్పారావుగారి వల్లనే కలిగిందని చెప్పవచ్చు. 1915లో గురజాడ మరణించినప్పుడు గరిమెళ్ళవారు 1915 డిసెంబరు 4వ తేదీ 'కృష్ణాపత్రిక'లో 80 చరణాల గీతాన్ని 'వాడుక తెనుగు' అనే శీర్షికతో రాసి గురజాడ ఉద్యమాన్ని ప్రశంసించారు.

''స్వర్గలోకము పోయినావా
సరగునను కన్నీళ్ల దొరలుచు
నాదు చిత్తము కలియబెట్టగ
నాయనా! ఓ అప్పారావు''

ఇలా ప్రారంభమయ్యే పాటలో ''సహజమున సౌందర్యముందని చాటిచెపితివి లోకమందున'' అని అప్పారావుగారి కవిత్వ సుగుణాన్ని ప్రేమించి, ఆ సహజ మార్గంలోనే గరిమెళ్ళ దేశాన్ని ప్రేమించాడు. మంచిని పెంచాడు. ఆనాటి ఆంధ్ర ప్రబోధాలలోలాగా గతంలోకి పరిగెత్తకుండా వర్తమాన సమాజంలోని బాధలు, గాథలు, కష్టాలూ, కన్నీళ్లూ, నష్టాలు, దుష్టపాలకుల దుష్కృత్యాలు జాతి జనులకు చాటి, ఉజ్జ్వల భవిష్యత్తుకోసం కలలు కన్నారు. ఆనాటి ఇతర కవులలాగ రాజకీయాలకు, రమణీయతకూ దూరం ఉందని ఆయన అనుకోలేదు. ''రాజకీయాల నుంచి కవిత్వ విషయాలు ఎంచుకోవాలి కవులు'' అన్నది గరిమెళ్ళ సత్యనారాయణగారి విశ్వాసం. 1927లో వెలిబుచ్చిన ఈ అభిప్రాయానికి ఆయన జీవితాంతం కట్టుబడి ఉన్నారు.

దేశభక్తితోపాటు గురజాడ అప్పారావుగారు ప్రచారం చేసినది ప్రకృతి అనే పుస్తకాన్ని చదవడం. ప్రకృతి సౌందర్యంవల్ల చేతనా చేతన వస్తు సముదాయములో మానవునిలో మనోహరకమైన కాల్పనికత గోచరిస్తుందని చెప్పారు. వర్డ్సువర్తు వల్ల గురజాడ ప్రభావితులయ్యారు. రాజకీయ గీతాలనూ, రామణీయకరమైన ప్రకృతి గీతాలనూ వర్డ్సువర్తు ఆలపించాడు. చంద్రుణ్ణి నక్షత్రాలనూ చూసే దుర్భిణితోనే వర్డ్సువర్తు గడ్డిపూలను కూడా చూడ్డం ఆనాటి ఆంగ్ల విమర్శకులు హర్షించలేదు. అయితే వాటిని చూస్తూ ఆ విమర్శను లక్ష్యపెట్టలేదు. గురజాడ ప్రభావం వల్ల వర్డ్సువర్తు దారిలో పడ్డ విలక్షణమైన తెలుగుకవి కవికొండల వెంకటరావుగారు. నిజంగా దుర్భిణీల్లాంటి తమ కవిత్వ నేత్రాలలో పడ్డ పువ్వులను చూసి ఇలా పాడుతాడు.

దాక్కొని వుంటాయి
దారంట - గడ్డి - నిరుక్కుని వుంటాయి
తలపగ రాని పూలు
పిలువగబోని పూలు
నిలుపగలేని పూలు
దాక్కొని వుంటాయి
దారటం-గడ్డి-నిరుక్కుని వుంటాయి

గ్రుక్కెడు వాననీళ్ళకు
పక్కున నవుతాయి
ఉక్కగగా సంతుంటే
త్రోక్కట పడతాయి
దాక్కొని వుంటాయి
దారంట-గడ్డి-నిరుక్కుని వుంటాయి

లెక్కకురా, వోలక్ష!
చిక్కవు మాలనుగ్రుచ్చ,
ఇక్కడ నక్కడ బచ్చ
జక్కన బూస్తాయి
దాక్కొని వుంటాయి
దారంట-గడ్డి-నిరుక్కుని పూస్తాయి

శ్రద్ధ తీసుకొన్నట్టు పైకి కనబడకపోయినా కవి కొండల వెంకటరావుగారి రచనలలో మంచి శిల్పం దాక్కొని ఉంటుంది. ఇరుక్కొని ఉంటుంది. ఎటొచ్చీ ఆయన -

''నామంచి పాట నాలోనేనే పాడుకొంటా
నే పైకి పాడ
నేపైకి పాడేపాట యల్లా రెండోరకమే''

అని స్పష్టం చేస్తారు. ఆయన తనలోనే పాడుకొనే పాటలు వినదలుచుకొంటే మనలోపల వినబడతాయి. కవికొండలలో కొంత నండూరి సుబ్బారావు, కొంత బసవరాజు అప్పారావు, కొంత గరిమెళ్ళ సత్యనారాయణ మనకు సాక్షాత్కరిస్తారు. దేశభక్తి గీతం పాడుతున్నా మంచి కవిత్వపు విలువలు చూపగలరు. జలియన్ వాలాబాగ్ ఉదంతం తర్వాత రాసిన ఈ పాట చూడండి.

ఉయ్యాలా! జంబాలా! భారత నవజీవన బాలా!
పూరిత సత్యాగ్రహశీలా! పరభవ దుఃఖిత పాంచాలా!
నీ పురుడు ఏ నెలలో... వెన్నెలల క్రొన్నెలలో
నీపుట్టు నెచ్చోట-మిన్నేట-మున్నీట ||ఉయ్యాల||

తొలినాటి వేదాలు-పులివోని చనుబాలు
మఱునాటి కావ్యాలు-కమ్మగుజ్జనగూళ్ళు ||ఉయ్యాల||

శ్రీరామాయణకథలు-ఊకొన్న వాక్సుధలు
భారతగీతారుతుము-చిందాయి యమృతము| ||ఉయ్యాల||

బుద్ధుడు నీసంబుద్ధి-యవజనులొకోనీకుద్దిమొగల్
మరాటుల్ చేబంతుల్-రసపుత్రుల్ చేమంతుల్ ||ఉయ్యాల||

పాశ్చాత్యం మోహాంధం - ప్రాచీనం ప్రియబంధం
అధ్యాత్మం కళ్యాణం-స్వాతంత్ర్యం శతమానం ||ఉయ్యాల||

నీమెట్టు నీలాలు-నీ చుట్టు నీరాలు
జడదొట్టు తలబ్రాలు-ఒడిగుట్ట మగరాలు ||ఉయ్యాల||

ముజ్జగపు దీవెనలు-ముప్పదికోటుల జనులు
జయజయ వాద్యోన్నతులు-జేజేల హారతులు ||ఉయ్యాల||

వాడుక భాష రైతును తట్టిలేపుతుందన్న అచంచల విశ్వాసం గురజాడకు ఉంది. సాహిత్యం ద్వారా ఉత్తమ సంస్కారాన్ని సమాజంలో నెలకొల్పడం వారి ఆశయం. దానికోసమే గద్యయుగం ఆవిర్భవిస్తున్న కాలంలో పద్యాన్ని పాటగా మలచారు. గురజాడ వారసులైన గేయకవులు చక్కని సాహిత్యాన్ని సృష్టిస్తున్నా, పాతకాలపు అలంకార శాస్త్ర సూత్రాలను పట్టుకొని వేళ్ళాడే ఛాందసులకు ఈ సాహిత్యం రసోత్పత్తి కలిగించిందని నిరసించే తిట్లకు దిగారు. యెంకి పాటలను తూర్పారపడుతూ చెళ్లపిళ్ళవారు 1926లో ఇలా అన్నారు.[4]

''ఈ యెంకి పాటలను చదివి యానందింపఁ దగినవారెవరు? పడవలు లాగుకొనువారు. ఏతముతోడనుకొనువారు. నాటు నాటుకొనువారు లోనగువారు. వీరు తఱచు నికృష్టజాతులకుఁ జేరినవారే. వీరు గ్రంథములలో నాయకత్వమును గైకొనఁదగినంత కాదుగదా కొంతయేని నాగరికత కలవారుగాఁ జూపట్టుట యరుదు. అట్టి నాగరికత యెట్టకేలకు లభించు నెడల నిట్టి భాషను మాట్లాడరు. వేయేల? ''నీ భార్యపేరెవరనిన-యెంకి'' అనియే కాని వెంకియని కూడాఁ బ్రత్యుత్తరమిచ్చుటకు నోరు తిరుగని నాయుఁడు బావ నాయకుడా? ఔచిత్య పోషణమునకుఁ గవిత్వమెల్లఁ దజ్జాతీయ మగునపభ్రంశ వాఙ్మయమా?''

పామరులు నీచాతి నీచపాత్రలని, వారికి శృంగారం లేదని, తాతలనాటి తరతమ భేదాలు శాశ్వతంగా వుంటే బాగుండుననుకొనేవాళ్ళు భావించవచ్చునుగాని సామాన్యుల అందుబాటులోనికి సాహిత్యాన్ని తీసుకురావడమే నవ్యసాహితీపరుల ఆశయం. దీనికి ఒక్కపక్క నుంచి మంచి కృషి జరుగుతూ ఉంటే మధ్యతరగతి నుంచి వచ్చినా ప్యూడలు దర్జాలనే భాషలో ప్రదర్శించే సాహితీపరులలోని సాహిత్య మోతుబరులు మామ్మూలు

4. కథలు-గాథలు-ప్రథమ భాగం - పుట.326-7

సేద్యంకాక మేలురకం పళ్ళకోసం కావ్యాల తోటలలో నూతన ప్రయోగాలు చేసి పాశ్చాత్య కవిత్వ రీతులకూ, ప్రాచ్య గీతులకూ అంటుగట్టసాగారు.

మామిడి విత్తులు నాటితే మొలకెత్తి చెట్టయి అయిదారేళ్ళకు కాయలు కాస్తుంది. ఈ కాయలు విత్తులు యొక్క తల్లి చెట్టు కాయలు మాదిరిగా ఉండవు. అందుకే విత్తువేయకుండా అంటుకట్టే విధానం అవలంబిస్తారు. విత్తులనుండి ఏవేవో నూతనరకాలు వస్తాయి. నూటికి తొంభై తొమ్మిది నిష్ప్రయోజనాలు - మామిడిపళ్ళ సాముద్రిక లక్షణాలు ఇవి: మంచిరంగు, పలుచని నున్నని తోలు, నారలేకుండుట, చిన్నముట్టె, ఘనంగా బిగువైన కండ, మంచివాసన, మంచిరుచి, ఆలస్యంగా కాయపక్వానికి రావడం అప్పుడే దానికి మంచివెల. అయితే ప్రకృతి సిద్ధంగా సహజమైన విత్తులలోంచి మొలచే చెట్టులో ఏదైనా కొత్త పండు రావచ్చును. అదృష్టముంటే కొత్త జాతి పుట్టవచ్చు. అందుకే తోటలు పెంచేవారు విత్తులు నాటి చెట్టు ఫలించే దాకా ఆగి ఆ పళ్ళను పసందు చేసి మంచిదని నిర్ణయించాక దానికి కొత్తపేరు పెట్టి, దానికి అంటుకట్టి కొత్తజాతిని నిలుపుతారు. వ్యాప్తిలోనికి తెస్తారు. తక్కిన వాటిని నిర్మూలనం చేస్తారు. ఈ ప్రోసెస్‌ను కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ వ్యాసమంజరిలో విశదం చేశారు.[5]

కట్టమంచివారు ఇంత విపులంగా వివరించిన అంటు మామిడి తోటల పెంపకం సంవిధానం కావ్యనిర్మాణ కృషిలో కూడా వర్తిస్తుంది. నవ్య సాహిత్య యుగంలో కవితతోపాటు ఇతర ప్రక్రియలలో అంటుమామిడి రకాలుగా పూత పూయడం విరివిగా సాగుతుంది.

కవితలలో రాయప్రోలు, అబ్బూరి, కృష్ణశాస్త్రి, నాయని, విశ్వనాథ మేలురకం పళ్ళను ఉత్పత్తి చేశారు.

కథ, నవల, నాటికలలో చలం కొత్తరకం అంట్లు కట్టారు.

చింతా దీక్షితులుగారి ప్రోద్బలం ఇతోధిక ఉత్సాహం ఇస్తే,

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి (1890–1951) వంటి తోటమాలీలు కంటికి రెప్పలా కాచుతూ ఉంటే నవ్యసాహిత్య వనం ఆరు ఋతువులలోనూ తీరుతీరులుగా కొత్తరకం పళ్ళను జాతికి ఇచ్చింది.

---

5. వ్యాసమంజరి - పుట. 108

ఆశుకవితలు - అవధానాలు

బందరు పేటలో తిరుగుతూ కవితా సామగ్రిని అమ్ముతున్న బేహారి ఒకడు ఇలా అన్నాడట:

''నికరమ్మై యకలంకమైన సరకుల్, నిర్దుష్టముల్ మీ పరీ
క్షకుఁడాళంగల మేలి క్రొందినుసు, మీ కన్గప్పు మోసంపు వ
ర్తకుఁడన్గాను, కులక్రమాగతము బేరమ్మిద్ది భాషా కుమా
రకులారా! కొనరండు మీరు కవితారంభ ప్రియంభావుకుల్''.

''నమ్మకంమ్మైన యీ సరకమ్ముచుందు
నాంధ్రదేశమ్ము నలుదిక్కులందుఁ దిరిగి
వతనుగా వత్తు నే నను వత్సరమ్ము
నొకపరిఁ గొనుండు మాటనమ్మకము తెలిం ''

– ఇవి పింగళి లక్ష్మీకాంతం (1894–1971) గారూ, కాటూరి వెంకటేశ్వరరావు (1890–1962) గారూ కలిసి 1923లో రచించిన 'తొలకరి' అనే సంకలనంలో 'కవితా సామగ్రి' అనే ఖండ కావ్యంలోనివి. బందరు పేటలలో నిజంగా ఒక కవి ఇలా సుకవి భోగ్యమ్ములయిన వస్తువులు అమ్మాడో లేదో గాని ఈ జంట కవుల గురువులు తిరుపతి వెంకటకవులు మాత్రం ఆంధ్రదేశం నలుమూలలా తిరిగి కవిత్వపు సరుకు అమ్మిన బేహారులే. ఉత్పత్తి చేసిన వస్తువులు ఉన్న ఊళ్ళోవాళ్ళకు కాక ఇతరత్రా విక్రయించవలసి వస్తే పెరికలలో సరుకులు నింపుకొని 'దేశి, పరదేశి నానాదేశి చాలుమూల సమస్త పెక్కంద్రు' వ్యాపారానికి వెళ్ళేవారు. ప్రాంతీయ అవసరాలకు సరిపోయే దినుసులు చుట్టుపక్కల సంతలలో అమ్ముడుపోయేవి. డిమాండును మించిన ఉత్పత్తి ఉంటే మార్కెట్టును విస్తృతం చేసుకోవాలి. జమీందారీ యుగంలో కవిత్వాన్ని వ్యాపారపు సరుకుగా మా శ్చర్యం లేదు.

భూస్వామ్య వ్యవస్థ చితికి పోతున్నప్పుడు ప్యూడల్ సంస్కృతిలోనే బూర్జువా లక్షణాలకు అంకురార్పణ జరుగుతుంది. కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్ ఇలా చెప్పారు:

"The need of a constantly expanding market for its products chases the bourgeoisie over the whole surface of the globe. It must nestle everywhere, settle everywhere, establish connexions everywhere."

''బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే సరుకులకు నిత్యం విస్తరించే మార్కెట్ కావాలి గనుక, ఆ అవసరం ఆ వర్గాన్ని ప్రపంచపు నలుమూలలకూ తరుముతుంది. ఆ వర్గం అన్నిచోట్లా గూడు కట్టుకోవాలి. అన్నిచోట్లా స్థిరనివాసం యేర్పరచుకోవాలి. అన్నిచోట్లా సంబంధాలు నెలకొల్పుకోవాలి.''[1]

1. రాచమల్లు రామచంద్రారెడ్డి (అనువాదం) – 'కమ్యూనిస్టు ప్రణాళిక' పుట.57

ఆశుకవులు, జంటకవులు, అవధానాలు చేసేవారు పూర్తిగా భూస్వామ్య సంస్కృతి నుండి విడిపోయారని చెప్పలేంగాని, బూర్జువా లక్షణాలలో ముఖ్యమైన స్వేచ్ఛా వ్యాపారం, మార్కెట్టు విస్తరణ కవిత్వానికి కూడా వర్తించాయి. ఆర్థిక కారణాల వల్ల సాహిత్య భావాలలో కూడా మార్పులు వస్తాయి. ఒక ఆస్థానాన్ని అంటిపెట్టుకొనడం కాక నానారాజ సందర్శనం అవసరమవుతుంది. ఇతరుల 'ఆర్డర్లు' మేరకు సరకు ఉత్పత్తి చేయాలి.

ఒకనాటి వ్యవస్థలో కవి కూడా గ్రామశిల్పి లాంటి వాడే. ఉమ్మడి ఉత్పత్తులకు అవసరమైన యంత్రచర్యలో కైగట్టేవాడు. రాను రాను కవికి సమిష్టి శ్రమలో చోటులేదుగాని, ఫలితం పంచుకొనడంలో పాలు ఉండేది. కమ్మరి, కుమ్మరి, అగసాలి వంటి గ్రామశిల్పులు అవసరాలకు తగ్గ వస్తుసంచయాన్ని తయారుచేసి ప్రజలకు ఇవ్వడం పరిపాటి. అదనపు సరుకులు సంతలో అమ్ముకొనేవారు. కలవారు కొత్త డిజైన్లు చేయించుకోవాలంటే అగసాలెను ఇంటికి పిలిపించి, బంగారం తమ కళ్ళముందు కరిగింపచేసి సరుకులు తాము చూస్తూ ఉండగా బెత్తాయించి చేయించుకొనేవారు. అవధానాలు చేసే ఆశుకవులు ఇలాంటి కవిత్వపు అగసాలెలు అయ్యారు. పృచ్ఛకులు బెత్తాయించిన విషయాలమీద అప్పటికప్పుడు నించున్న పాళాన కోరిన డిజైన్ల పద్యాలు చెప్పడం కవిత్వ వ్యాపారం.

మార్క్స్, ఏంగిల్స్ ఒకటి స్పష్టం చేశారు.[2] "గతంలో ప్రజల భక్తి గౌరవాలకు పాత్రమైన వృత్తులనన్నిటినీ బూర్జువా వర్గం నీచస్థాయికి తీసుకువచ్చింది. వైద్యులనూ, న్యాయవాదులనూ, కవులనూ, శాస్త్రవేత్తలనూ అది తన కింద కూలికి పనిచేసే నౌకర్లుగా మార్చివేసింది."

కమ్యూనిస్టు ప్రణాళికలో బూర్జువా వర్గం అన్నమాట బదులు జమీందారీ వర్గం అనే మాటను చేర్చుకొని చదివితే ఇది అచ్చంగా అవధానాల కాలంలోని ఆంధ్రదేశానికి కూడా వర్తిస్తుంది. ఉన్న ఊళ్ళో కాకుండా కవులు దేశాలుపట్టి ప్రఖ్యాటనం చేయడం అవసరమైంది.

"పాతకాలపు అవసరాలు స్వదేశపు ఉత్పత్తులలోనే తీరేవి; వాటి స్థానంలో కొత్త అవసరాలు వచ్చి, దేశాంతర, ఖండాంతర వస్తువులు అవసరమైనాయి. గతంలో వివిధ ప్రాంతాలూ, వివిధ జాతులూ దేనిపాటికది ఏకాంతంగా, స్వయం సమృద్ధంగా బతికేవి; యిప్పుడాపరిస్థితి పోయి, నలువైపులా యిచ్చి పుచ్చుకోవడమూ, సర్వత్రా వివిధ జాతులు ఒకదానిపై ఒకటి ఆధారపడడమూ జరుగుతున్నది. భౌతిక వస్తువుల ఉత్పత్తిలో వున్న పరిస్థితి బౌద్ధిక ఉత్పత్తికి కూడా వర్తిస్తుంది. వివిధ దేశాల బౌద్ధిక ఉత్పత్తులు యావత్ ప్రపంచపు సమిష్టి ఆస్తి అవుతున్నాయి. జాతీయ ఏకపక్ష వికాసమూ, సంకుచిత మనస్తత్వమూ అంతకంతకూ అసంభవమౌతున్నాయి. వివిధ జాతీయ, ప్రాంతీయ సాహిత్యాల నుండి విశ్వసాహిత్యం ఉద్భవిస్తున్నది."[3]

---

2. కమ్యూనిస్టు ప్రణాళిక-పుట.55
3. కమ్యూనిస్టు ప్రణాళిక - పుటలు 58-59

జమీందారీ యుగంలో ఆశుకవితల వల్ల, అవధానాలవల్ల కవుల దేశాటనం వల్ల తెలుగు కవిత్వంలో ఒకరకమైన ఏకత మొలకెత్తడానికి గొప్పులు తవ్వడం జరిగింది. ఒక జమీందారు గారి ఆస్థానంలోని విద్యావినోదాలు చూసి ముచ్చటపడి మరో జమీందారు అటువంటి కవితా కాలక్షేపం అభిలషించడం అవధానాలకు ప్రోత్సాహమిచ్చింది. సాహిత్య పత్రికలలో రిపోర్టయిన అవధానాల గురించి చదివి ఒక ఊరివాళ్ళు మరొక ఊళ్ళో అవధానాలు ఏర్పాటు చేసేవారు.

1864-1870 సంవత్సరాల మధ్య వెలువడిన 'పురుషార్థప్రదాయిని' అనే పత్రిక ఒక సంచికలో మండ్యం కృష్ణమాచార్యులు అనే వారు చేసిన శతావధానం వివరాలు తొలిసారిగా ప్రచురితమైనాయి. జమీందారీ యుగంలో రిపోర్టయిన తొలి అవధానం ఇదే.

1872 జూలై 21వ తేగీనాడు నూజివీడు నారయప్పారావుగారి సభలో మాడభూషి వెంకటాచార్యులు (1835-1895) ఒక శతావధానం చేశారు. ఈ సభలో పిఠాపురం రాజా గంగాధర రామారావుగారు కూడా ఉన్నారు. (నూజివీడువారూ, పిఠాపురంవారూ బంధువులు) అవధానం చూశాక పిఠాపురం వెళ్ళాక గంగాధరరామారావుగారు మన ఆస్థానంలో ఎవరూ అవధానం చేయలేరా? అని కవులను ప్రశ్నించారు. దేవులపల్లి సోదర కవులు అప్పుడు వారి ఆస్థానంలో ఉండేవారు.[4] ప్రభువుల వారి చిత్తానుసారం దేవులపల్లి సోదర కవులు 1879లో పిఠాపురంలో శతావధానం చేశారు. రాజాగారు ఈ విద్యావినోదాన్ని మద్రాసులోనూ, తెల్లదొరలు తమ ఊరికి విచ్చేసినప్పుడు సోదర కవుల చేత ఏర్పాటు చేయించారు. వీరి అవధానాలు ఒక అరడజను రిపోర్టు అయినాయి. 1895, 1896, 1903, 1904 సంవత్సరాలలో ఇవి జరిగాయి.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు కిర్లంపూడి జమీందారీ యిలాకా భూములు ఇజారాకు పాడి అప్పులపాలై ఋణవిమోచనకోసం అవధానాలు చేసి ధనార్జన ప్రారంభించారు. విజయనగరం, బొబ్బిలి, పర్లాకిమిడి సంస్థానాలను సందర్శించి అవధానాలు చేశారు. 1895లో కళ్ళికోట ప్రభువుల వద్ద అష్టావధాన, శతావధానాలు చేశారు.

దాసు శ్రీరాములు (1846-1908) గారు 'ఆశుకవి సింహులు'గా పేరు పొందినవారు. ఈయన 1865లో ఇంట్లోంచి పారిపోయి ఆకిరిపల్లి చేరి చదువుకొంటున్నప్పుడు అష్టావధాన వ్యస్తాక్షరి ప్రజ్ఞలు అలవర్చుకొని నూజివీడు సంస్థానంలోనూ, వల్లూరు సంస్థానంలోనూ ఆ విద్యలు ప్రదర్శించి జయప్రదంగా పరీక్షలు ఇవ్వగలిగారు. ఆరోజుల్లోనే నూజివీటిలో మాడభూషి వెంకటాచార్యులగారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ స్నేహితులు.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి (1870-1950)

వీరు సుమారు పన్నెండేళ్ళ వయస్సులో 1882లో యానాముకు రెండుమైళ్ళ దూరంలో ఉండే కావులపాలెంలో కానుకుర్తి భుజంగరావుగారి దగ్గర రఘువంశం

4. ఈ సోదరకవులు - దేవులపల్లి సుబ్బరామశాస్త్రి (1853-1909), దేవులపల్లి తమ్మన్నశాస్త్రి (1956-1912)

చదవడానికి ప్రారంభించారు. భుజంగరావుగారు గ్రంథాలేవీ రాయలేదుగాని అవధానాదికం కూడా అవలీలగా చేసే శక్తి కలవారనీ, ఆశుకవిత్వ రచనలో కూడా నిరాతంకులనీ చెళ్ళపిళ్ళవారు విన్నారు. భుజంగరావుగారి ప్రభావం పరోక్షంగా చెళ్ళపిళ్ళ వారిపై ఆ చిన్నప్పుడే పడిందేమో.

చెళ్ళపిళ్ళవారు చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి దగ్గర చదువుకొనడానికి 1889లో చేరారు. అప్పటికి వారి వయసు 19 సంవత్సరాలలోపు. తెలుగులో కవిత్వం అల్లడం చిన్నప్పుడే అలవడిందిగాని కొద్దిరోజుల్లోనే తెలుగంటే అనాదరణ, సంస్కృతమంటే అత్యాదరం కలిగి క్రమంగా సంస్కృతంలో మాత్రమే కవిత్వం చెప్పడం తటస్థించింది.

1889లో చెళ్ళపిళ్ళవారికి అనుకోకుండా పెళ్ళి అయింది. ఆయన కాశీలో చదువుకొందికి ప్రయాణానికి పెట్టుకొన్న ముహూర్తం వివాహ ముహూర్తంగా మారింది. పెళ్ళంటే అయిందిగాని కాశీవెళ్ళాలనే కోరిక తీరలేదు. పెళ్ళికూతురు వయస్సు అయిదు సంవత్సరాల రెండు మాసాలు. మరో పదేళ్ళయినా దాటితేగాని కాపురానికి రాదు.

కాశీ వెళ్ళాలంటే డబ్బో? చేతిలో ఉన్న విద్య కవిత్వం చెప్పడం ఒకటే. అందుచేత దానితోనే దారి ఖర్చులు సంపాదించి నిడమర్రు అనే గ్రామంలోని కచ్చేరి ఉద్యోగస్తుడు రామదాసు అనే ఆయన వద్దకు వెళ్ళి, 'శతఘంటకథనం, అష్టావధానం నేను చేయగలన'ని పద్యపూర్వకంగా చెప్పారు. 'పిట్టకొంచెం, కూతఘనం' సరే ఏం ఊడబొడుస్తాడో చూద్దామని ఆయన సభ పెట్టించాడు. ఊళ్ళోని ధనికులందర్నీ పిలిపించాడు. అవదానం బాగా జరిగింది. అప్పుడు చెళ్ళపిళ్ళవారు నిజం చెప్పారు. ''నేను ఇప్పటిదాకా ఏ అవధానాలూ చేయలేదు. ఇదే తొలిసారి. ఊరికే డబ్బు ఇమ్మంటే బాగుండదని దారి ఖర్చులకోసం ధనార్జన చేయాలని ఈ ఉపాయం ఆలోచించాను. తప్పయితే క్షమించండి'' అంటే, రామదాసుగారూ, సభ్యులూ 'తప్పులేం లేవు. బాగా చేశారు. ఎక్కడిదాకా ప్రయాణం?'' అని అడిగారు. కాశీకి అనీ, అది కూడా విద్యకోసమనీ విన్నాక తాంబూలంలో పెట్టి ముప్ఫై రూపాయలు ఇచ్చారు. చెళ్ళపిళ్ళ వారి జీవితంలో నిడమర్రు తొలి అష్టావధానం. తర్వాత కాశీకి వెళ్ళే దోవలో 'గుండుగొలను'లో ఇంకో అవధానం చేసి బెజవాడలో రైలెక్కి కాశీ చేరుకొన్నారు.

చెళ్ళపిళ్ళవారు కాశీలో అట్టేకాలం ఉండలేదు. ఇంటికి రమ్మని తల్లిదండ్రులు బ్రహ్మయశాస్త్రిగారిచేత ఉత్తరం రాయించారు. 'నీవు రాకపోతే వీళ్ళే కాశీ వస్తారని' బెదిరించారు. తిరుగు ప్రయాణం ఖర్చులకు చెళ్ళపిళ్ళవారి తండ్రి డబ్బు అప్పుచేసి పంపారు. ఇక తప్పదని కాశీ వెళ్ళిన అయిదారు మాసాలకే కాశీ కావడితో ఇంటిముఖం పట్టారు. సురక్షితంగా ఇల్లు చేరారు.

కాశీకి వెళ్ళివచ్చినవారు గంగా సంతర్పణ చేయడం ఆనాటి ఆచారం. అది చేసి తీరాలి. దానికి డబ్బు కావాలి. కాశీకి తీసుకువెళ్ళిన అవధానవిద్యనే మళ్ళా వాడుకొని ధనార్జన చేయాలి. అందుచేత కోనసీమకు వెళ్ళి ముమ్మిడివరం, ఐనావరం, కేసనగుర్తి గ్రామాలలో అవధానాలు చేశారు. వచ్చిన డబ్బుతో గంగా సంతర్పణ ఘనంగా చేశారు.

మళ్ళా చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి దగ్గర చదువుకొనసాగించారు. తనతోపాటు చదువుకొంటున్న దివాకర్ల తిరుపతి శాస్త్రి (1872–1920)తో కలిసి సంస్కృతంలో సహరచన చేయడం ప్రారంభించారు. అప్పటికి తిరుపతి శాస్త్రిగారికి అట్టే వయస్సు లేదు. పద్దెనిమిదో ఏడు వచ్చేదాకా తెలుగు కవిత్వమంటే ఏమిటో తిరుపతి శాస్త్రిగారికి తెలియదు. చెళ్ళపిళ్ళవారి దగ్గర రహస్యాలు నేర్చుకొన్నారు. ఇద్దరికీ సంస్కృత కవిత్వ రచనపై మోజు ఉన్నా, తెలుగు కవిత్వం చెప్తేనేగాని కొన్ని అవసరాలు గడిచేవికావు. చెళ్ళపిళ్ళవారు ఇలా ఒక అనుభవం చెప్పారు.[5]

''అప్పుడప్పుడు అనాధ్యాయాలలో పుస్తకాల సంపాదనకుగా యేలూరు వగయిరా పట్నాలకు యాచనకు వెళ్ళినపుడు తెలుగు కవిత్వం చెపితే తప్ప ఆయా సంపన్న గృహస్థులు ఆదరించరు గనుక అది కూడా అప్పుడప్పుడు చెప్పడం వుండేది. ఆ చెప్పడంలో తఱచు బంధకవిత్వం చెప్పేవాళ్ళం. దానికి కారణం శ్రీ పన్నాల బ్రహ్మయ్యా శాస్త్రులగారి శిష్యులిద్దరు మా కంటె కొంచెం వయోధికులు యాచనకు బయలుదేరి యీ బంధకవిత్వం వల్ల సంపాదించడాన్ని చూడడమే. ఆ బంధ కవిత్వమేనా అంత చిక్కుగా వుండే బంధాలయితే యితరులను సంతోషపెట్టజాలవు. రథబంధమంటూ ఒకటి ఆ కవులు వ్రాసింది చూచి అదే మాదిరిని మేమున్నూ మొదలెట్టాము. రథం మాదిరిగా గీట్లతో గళ్ళు కొన్ని గీసి ఆ గీట్లు సీసపద్యం తాలూకు అక్షరాలతో నింపడమున్నూ మధ్యగదిలో ఆవతలి గృహస్థును మేమే పుస్తకం కోరుతామో ఆ పుస్తకం పేరుతో సహా మా కోరికను తెల్పే వాక్యం వచ్చేటట్టు వ్రాయడమున్నూ మొత్తం పద్యంలో దేవుని వర్ణనతో ఆ గృహస్థుకు ఆశీర్వచనం వుండడమున్నూ ఆ బంధకవిత్వంలో ఉండే విశేషం. మొత్తం కొంత చిక్కుతో చేరిన కవిత్వమవడం చేత రచనకైతే యేమి, ఆ బంధాన్ని ఆయా రంగుల పెన్సిళ్ళతో చక్కగా వ్రాసి తయారుచేయడానికైతే యేమి, స్నానసంధ్యాద్యనుష్ఠానాలు ముగించుకొని కూర్చుంటే మధ్యాహ్న భోజనం వేళదాకా దానికి సరిపోయేది. మధ్యాహ్నం ఆ గృహస్థుని చూడడం, వినిపించడమూ ఆయనచే సత్కరింపబడడమూ జరిగేది. ఆ అట్టహాసం అంతా చూచిన గృహస్థు అధమం నాలుగింటికి తక్కువ యివ్వడం వుండేది కాదు. ఆ కాలం కూడా యీ కాలం వంటిది కాదు. కొందరు గృహస్థులు యే పుస్తకం కావాలని ఆ బంధంలో సూచించామో ఆ పుస్తకం యెంత ఖరీదో అంతా యివ్వడంగాని లేదా తెప్పించి ఆ పుస్తకంతో సహా నూతన వస్త్రాదికం సమ్మానించడం కూడా వుండేది.''

చిత్రబంధ కవిత్వాలతో ధనార్జన చేయవచ్చుననే నమ్మకం వచ్చాక చెళ్ళపిళ్ళవారు వాటుగా అవధాన కవితను అభ్యసించేవారు. ఈ దాపరికం ఎందుకంటే గురువుగారికి తెలిస్తే కవిత్వం వల్ల చదువు చెడుతూందన్న చీవాట్లు తినకుండా ఉండడానికి. చెళ్ళపిళ్ళవారు గురువుగారికి తెలియకుండా కొంతరాత్రిదాకా శాస్త్ర వ్యాసంగం జరిగినా తరువాయి అర్ధరాత్రిదాకా కవితార్థులను కూచోబెట్టి ఒకటి రెండుసార్లు వాళ్ళు వాళ్ళు కోరిన విషయాలమీద పద్యాలూ, శ్లోకాలూ చెప్పడం ప్రారంభించారు.

---

5. కథలు గాథలు. ద్వితీయ భాగం. పుటలు.494-5

మొదట పుస్తకాల కోసం బంధకవిత్వం చెప్పి, ఇప్పుడు కవిత్వంకోసం, కీర్తికోసం కవిత్వం ప్రారంభించారు. ఇద్దరి పేర్లూ కలుపుకొని తిరుపతి వెంకటకవుల మని ఏక పేరు పెట్టుకొన్నాక కాకినాడ వెళ్ళి దురిసేటి శేషగిరిరావు అనే సంపన్న గృహస్థుని అష్టావధానం పెట్టించమన్నారు. అది విజయవంతంగా చేశారు. ఈ వార్త ఊళ్ళో పాకింది. బాదం వెంకటరత్నంగారనే వారు కవులను పిలిచి ''అష్టావధానం ఏం కష్టం కాదని, ఎందరో ఇప్పటికి చేశారు. శతావధానం చేస్తారా? చూడాలని ఉంది'' అన్నారు. తిరుపతి కవులు అదేం కష్టంకాదుగాని కొంచెం వ్యవధి కావాలన్నారు. ఒక గడువు పెట్టి ఆలోగా ప్రాక్టీసు చేశారు.

ఆ ఊళ్ళో ఒక కొబ్బరితోటకు వెళ్ళి నూరు చెట్లను ఎంచుకొని అవే పృచ్ఛకులనుకుని శతావధానం ఆ చెట్లకింద చేశారు. అందులోని మెలకువలెన్నో తెలుసుకొన్నారు. బాదం వెంకటరత్నంగారి దగ్గరకు వెళ్ళి 'శతావధానమేం భాగ్యం సహస్రావధానమే చేయగలం' అని చెప్పారు. ఆ పెద్దమనిషి సభ పెట్టించారు. ఊళ్ళో పండితులందరినీ ఆహ్వానించారు. పృచ్ఛకులంతా గట్టివాళ్ళు, అవధానులాకుర్రవాళ్ళు. వెంకటశాస్త్రిగారికి ఇరవయ్యేళ్ళు, తిరుపతిశాస్త్రిగారికి పందొమ్మిదేళ్ళు. అది 1891వ సంవత్సరం. కవులు ఇంకా బ్రహ్మయ్యశాస్త్రిగారి దగ్గర విద్యార్థులే. అయినా తెలుగులో సంస్కృతంలో అడిగిన విషయాలపైన అడిగిన వృత్తాలలో నూరు పద్యాలు చెప్పడం ప్రారంభించారు. మొదటిరోజు నూరు పద్యాలు చెప్పడం ప్రారంభించారు. మొదటిరోజు నూరు మొదటి చరణాలు అయ్యాయి. రెండవరోజున తర్వాత చరణాలు చెప్పాలి. అయితే సభ్యులు అవధానులను పరీక్షించడానికిగాను ఆరోజే కొన్ని పద్యాలను పూర్తి చేయగలరా? అని అడిగారు. ఒక వరుసలో కాక ఒక పంక్తిలో కూర్చున్నవారు మరో పంక్తిలో కూర్చొని క్రమం లేకుండా తాము కోరినదేదో పూరించమన్నారు. కవులు పూరించారు. సభ్యులు ఆశ్చర్య సంభ్రమాలు చెందారు. కొందరు మరీ విషమ పరీక్ష పెట్టారు. కవులు నెగ్గారు. ఘనంగా సత్కారం చేశారు.

ఈ కాకినాడ శతావధానంతో తిరుపతి వెంకటకవుల అవధాన ప్రస్థానం ప్రారంభమైంది. కోనసీమలో ఆయేడే అవధానం చేశారు. తమకు రాని ఇంగ్లీషులో ఇచ్చినదానిని వ్యస్తాక్షరిలో కరెక్టుగా చెప్పారు. 1892లో ఏలూరులో, బందరులోనూ అవధానాలు చేశారు. అక్కడి సిడ్నీ.వి.ఎడ్జ్ అనే తెల్లదొర వీళ్ళని చూసి మెచ్చుకొని చెన్నపట్నంలో అవధానం చేయమని అడయారుకు పిలిచారు. 1893లో మద్రాసులో అవధానం చేశారు. సంపన్న గృహస్థులు, సాహితీపరులు, సర్కారు ఉద్యోగులు పెట్టించిన సభలలోకాక సంస్థానాధీశ్వరుల సన్నిధిలో అవధానం చేయాలని తిరుపతి కవులు ఆశించి వెంకటగిరికి వెళ్ళారు. సభ పెట్టించమని సంస్కృతాంధ్ర పద్యాలలో అర్జీ రాసుకొని పడిగాపులు పడ్డారు. ఒకనాడు సత్రంలో భోజనం, ఒకనాడు స్వహస్తపాకం, విసిగి వేసారిపోయారు. అప్పుడు ఈ పద్యం చెప్పారు.

''సభ చేయించునొ లేదొ'' యంచు మొదలన్ సందేహ మామీఁద ''నీ
సభలో నేమిట లోపమౌనొ'' యనుచున్ సందేహ, మామీఁద ''నీ
సభలో నింతకు లాభమేమొ?'' యనుచున్ సందేహ, మూహింప నీ
సభలం జేసెడివారెపో! జగతిలో సందేహ సంరక్షకుల్.

వెంకటగిరిలో దర్శనం దొరకక వేసారి తిరుపతి కవులు నెల్లూరు వెళ్ళారు. అక్కడ జిల్లా జడ్జిగారి ప్రాపకం లభించింది. అవధానం చేశారు. అభినందనలు పొందారు. ఈ వార్త వెంకటగిరి ప్రభువుకు తెలిసింది. ''మనకు అర్జీ పెట్టుకొని మన అనుమతి లేకుండానే ఊరు వదలి ఎలా వెళ్ళారు?'' అని ఆగ్రహించారు. సన్నిధానవర్తులు సర్ది చెప్పారు. ఆయన మెత్తబడి కవులను రమ్మని కబురు చేశారు. అయితే ఆయన స్వార్థానికే కావచ్చు, తెలుగు సాహిత్యానికి కూడా ఉపకారం చేశారు. తిరుపతి వెంకటకవులకో విషయం స్పష్టం చేశారు. ఆ కవులు సంస్కృతంలో కవిత్వం చెప్పాలనుకొనేవారు. వారిని తెలుగులోనికి దింపింది ఈ రాజాగారే. వెంకటశాస్త్రిగారు ఇలా రాశారు.[6]

''....వేంకటగిరి రాజాగారు మాకు తెలుఁగైతే కాని బాగా బోధపడదని అనడం కూడా తెలుఁగులోకి దిగడానిక్కారణం. తరువాత యే సంస్థానానికి వెళ్ళినా తెలుగు పనిచేసినంత సంస్కృతం పనిచేసినట్టు కనఁబడలేదు. కాని సంస్కృతంలో తగినంత ప్రవేశం లేని పక్షంలో ఆయా పండితుల ముందఱ నోరు మెదల్చడమే తటస్థింపదు. శ్రవణానంద రచన నాటికే మాకు చక్కగా రచించడానికి తెలుగులో శక్తి వున్నట్టు లోకమైతే అంగీకరిస్తుందిగాని ఆ రచనను సమర్థించడానికి తగ్గంత తెలుగు పాండిత్యం వున్నట్టు మామట్టుకు బొత్తిగా నమ్మకం లేదు. దానిక్కారణం ''తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది'' కావడమే. ఆ దీపం మా కోసం పెద్దదిగా యెలా మాఱుతుంది? లక్ష్యముల మీదనే ఆధారపడడం తప్ప తెలుగు భాషకు గత్యంతరం కనబడదు.''

భాష ఎందుకో, అది ఎలా మారుతుందో దాన్ని కవిత్వంలో ఎలా వాడాలో తిరుపతి వెంకటకవులు స్వానుభవం వల్ల తెలుసుకొన్నారు. అందుకే ఈ పద్యం ఇలా చెప్పారు :

''కాలముఁబట్టి దేశమునుగాంచి ప్రభుత్వమునెంచి దేశభా
షాలలితాంగి మాఱుటది సత్కవి సమ్మత మౌట నన్యదే
శ్యాలును నాంధ్ర భాషఁ గలవౌటను నౌచితిఁబట్టి మేము క
బ్బాలను వాడుచుంటి మని పండితు లేగతి నొప్పుకుందురో''.

అప్పటిదాకా తెలుగు కవిత్వం చెప్పేవారికి ఎదురయ్యే అదృష్టాలు, దురదృష్టాలు ఇలా స్పష్టం చేశారు.

ఏదేనా పద్యం చెప్తే కొందరు రాజులే అర్థం చేసుకొనేవారు. నిజంగా అంతరార్థం తెలుసుకొని ఆనందించేవారు ఉంటే కవికి కావలసినదేమిటి?''

''ఏ భూమీంద్రునిఁ జూడ బోయినను నీవే పద్యమున్జెప్పి నీ
వే భావమ్మును చెప్పికోవలయునింకీ భూవిభుండన్నఁదా

6. 'కథలు-గాథలు' - ద్వితీయభాగం - పుట 519-520

నే భావమ్ము గ్రహించు వాఁడగుట నీకీ కష్టమీడేటెనా
హా, భో! సత్కవి పూర్వ జన్మసుకృతంబా! నీకు దీర్ఘాయువౌ''

ఇలాంటి అదృష్టం ప్రతిచోటా దొరకదు. వెళ్ళిన ప్రతి సంస్థానంలోనూ వెంటనే సత్కారాలు జరగలేదు. ఇస్తే పొగడడం, ఇవ్వకపోతే తమ్ము తామే తిట్టుకొన్నట్టు ఇవ్వని వాళ్ళను ఎత్తి పొడవడం ప్రారంభమైంది. విశాఖపట్నంలో గొడే గజపతిరావుగారికి ఇలా అర్జీ పెట్టుకొన్నారు.

''సంగరశక్తి లేదు, వ్యవసాయము సేయుటసున్న, సంతలో
నంగడి వేసి యమ్ముటది యంతకు మున్నె హుళక్కి, ముష్టికిన్
బొంగు బుజాన వైచుకొని పోయెద మెక్కడికేని, ముష్టి చెం
బుంగొని పెట్టు మొక్కటి యమోఘ మిదే కద! దంతి రాణ్మాన్యపా!

ఒక రకంగా చూస్తే ఈ అవధానాలన్నీ యాచన కింద లెక్క పెట్టుకోవాలి. చిన్న ముష్టి పెద్ద ముష్టి తేడాలు ఆట్టే ఉండవు. లోకోత్తరులైన కవులందరూ ధనికుల నాశ్రయించవలసినట్లే కనబడుతుంది. కవులకన్న గాయకులకు ఇంకో చిక్కు. కవి యెక్కడికో కట్టుగుడ్డలతో 'లేడికి లేచిందే ప్రయాణం' అన్నవిధంగా వెళ్ళి యాచించవచ్చు. ''కవులూ, గాయకులూ ఐశ్వర్యానికి వొక విధమైన నోమే నోచినా చిల్లర దుకాణం పెట్టడానికి సంశయించకపోతే గాయకులకు పట్నవాసాలు కొంచెం జీవనాన్ని (శిక్షల ద్వారా) కలిగిస్తాయి'' అని చెళ్లపిళ్లవారు స్వానుభవం వల్ల తెలుసుకొన్నారు.''[7] తిరుపతి వెంకటకవులు 1891లో తొలి సంపూర్ణ శతావధానం కాకినాడలో చేసింది లగాయతు తిరుపతిశాస్త్రిగారు పోలవరం జమీందారుగారి ఆస్థానకవులుగా 1900 సంవత్సరంలో కుదురుకొన్నాక, వెంకటశాస్త్రిగారు బందరులో ఉపాధ్యాయవృత్తిని 1902లో స్వీకరించేదాక నానారాజ సందర్శనం చేస్తూనే ఉన్నారు. ఆ తర్వాత కూడా కొన్నిచోట్లకు కలసి వెళ్ళి అవధానాలు చేశారు. ఏ ఒక్క పద్యం చెప్పినా అది ఇద్దరి రచనగానే చలామణి అయింది. ఈ కవులు సందర్శించిన నానారాజులు, నానాప్రదేశాల పేర్లు చూడండి.

వెంకటగిరి, విజయనగరం, గద్వాల, మొగలతుర్తి, ఆత్మకూరు, కిర్లంపూడి, కోటరామచంద్రపురం, పాలతేరు, పోలవరం, కాకినాడ, ఉర్లాం, వనపర్తి, గంపలగూడెం, నూజివీడు, తోట్లవల్లూరు, పోలవరం, కశింకోట, బందరు, శనివారప్పేట, తంగెళ్ళమూడి, ఏలూరు, రాజమంద్రి, చిత్రాడ, మురుమండ, ముక్త్యాల, నరసాపురం, లక్ష్మీనరసాపురం, విశాఖపట్నం, చల్లపల్లి, పిఠాపురం, దొడ్డంపేట, చామర్లకోట, బొబ్బిలి, కోలంక, ధవళేశ్వరం, రామచంద్రపురం, జయపురం.

ఈ సంస్థానాలూ, ప్రదేశాలూ మాత్రమే కాక ఎన్నో ఊళ్ళోలో ఈ కవులు పెళ్ళిళ్ళకూ, సభలకూ వెళ్ళారు. వెళ్ళిన ప్రతిచోటా స్థానిక కవులను సాహిత్య పిపాసులను చేశారు. తిరుపతి వెంకటకవులు తొలి జంట కవిత్వం మొదలుపెట్టాక తెలుగుదేశంలో ఆశుకవితలు, అవధానాలు, జంట కవిత్వాలు కోకొల్లలుగా పుట్టుకొచ్చాయి. కొందరు

7. ''కథలు-గాథలు'' - ప్రథమ భాగం - పుట.329

వెంకటపార్వతీశ్వర కవులు, వెంకటరామకృష్ణ కవులు, రామకృష్ణకవులు, కొప్పరపు సోదరకవులు, రాజశేఖర వెంకటశేష కవులు, శేషాద్రి రమణ కవులు, సత్యాంజనేయ కవులు మొదలైనవారు ఉమ్మడి పేరుతో జంటకవిత్వం చెప్పారు. పేర్లు కలయక ''పింగళి-కాటూరి'', 'అవ్వారి-రాయప్రోలు' ఇలాగ ఇంటి పేర్ల జంటగానే కలిసి కవితలు చెప్పారు.

తిరుపతి వెంకటకవులు నానారాజ సందర్శం చేస్తూ అష్టావధానాలు, శతావధానాలు ముమ్మరంగా చేస్తున్న కాలంలో ప్రతిస్థానిక కవీ అవధానం చేయాలనే కుతూహలపడేవాడు. ఎందరెందరో తిరుపతి వెంకటకవులకు శిష్యులయ్యారు, ఏకలవ్య శిష్యులయ్యారు. వెంకటశాస్త్రిగారు బందరులో ఉపాధ్యాయవృత్తి స్వీకరించాక స్కూలు శిష్యులు కూడా కవిత్వం శిష్యులయ్యారు. సంప్రదాయం ప్రకారం సంస్కృత కావ్యాలు చెళ్లపిళ్ళవారి దగ్గిర చదివినవారు ఉన్నారు. తిరుపతి వెంకటకవుల శిష్యుల జాబితాలో అతి కొద్దిపేర్లు చూడండి.

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి	(1883-1935)
వేటూరి ప్రభాకరశాస్త్రి	(1883-1950)
వేలూరి శివరామశాస్త్రి	(1892-1967)
మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి	(1892-1950)
త్రిపురనేని రామస్వామిచౌదరి	(1887-1943)
విశ్వనాథ సత్యనారాయణ	(1895-1876)
పింగళి లక్ష్మీకాంతం	(1894-1971)
కాటూరి వెంకటేశ్వరరావు	(1895-1962)
దీపాల పిచ్చయ్యశాస్త్రి	(1894-1983)

ఇంతమంది దిగ్గంతుల లాంటి శిష్యులున్నా తిరుపతి వెంకటకవులకు, ముఖ్యంగా వెంకటశాస్త్రిగారికి తృప్తిలేదు. 1909లో అవధానాలు మొదలుపెట్టిన పిఠాపురం ఆస్థానకవులు, ప్రఖ్యాతులైన వెంకటరామకృష్ణకవులలో వెంకటరామశాస్త్రిగారు కూడా కొన్నాళ్ళు తమ దగ్గర పాఠం చెప్పించుకొన్నారు గనుక గురుత్వాన్ని అంగీకరించాలని అభిలషించారు. ఎందరెందరి దగ్గరో ఎన్నో నేర్చుకొంటాం. అందరూ పరమ గురువు లవ్వరు. కనుకే చెళ్లపిళ్లవారిని గుర్వులుగా వెంకట రామకృష్ణకవులు అంగీకరించలేదు. ఈ చిన్న విషయం మీద 1910లో చాలా పెద్ద తగాదా యేర్పడింది. ఇరుపక్షాలవారూ పద్యాల్లో తిట్టుకొన్నారు. గ్రంథాల కెక్కించారు. వెంకట రామకృష్ణకవుల గురించి విపులంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

వెంకట రామకృష్ణకవులు మేనత్త మేనమామ బిడ్డలు. వీరి పూర్తిపేర్లు ఓలేటి వెంకటరామశాస్త్రి (1883-1939); వేదుల రామకృష్ణశాస్త్రి (1882-1918) వీరిలో పెద్దవారు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారికన్నా పన్నెండేళ్ళు చిన్న. పిఠాపురం సంస్థానంలో ప్రవేశించేటప్పటికి ఈ రామకృష్ణకవుల వయసు పందొమ్మిదేళ్ళు. అయితే భాష్యాంతరం వ్యాకరణం చదివినవారు. తర్కం, కావ్యాలంకారాలు చదువుకొన్నారు. అవధానాలు

చేశారు. శతావధానమేకాక, శతవిధానం (గంటకు నూరు పద్యాలు చెప్పడం), శతప్రాసం (గంటలో ఒకే ప్రాసలో నూరు పద్యాలు చెప్పడం) మొదలైన ఫీట్లు చేశారు. అనేకమైన శేముషీ దౌరంధర్యం ప్రదర్శించి ధారా, ధారణాశక్తి, రసస్ఫూర్తి గల కవితలు రాణిస్తాయి. పిఠాపురం ఆస్థానంలో చేరాక కావ్యాలు రచించారు. 'కవిత' అనే పత్రికను నడిపారు.

వెంకటరామకృష్ణ కవులతో లాగా కొప్పరపు సోదర కవులతో కూడా తిరుపతి వెంకటకవులకు విరోధం ఏర్పడింది. ఈ సోదర కవుల పేర్లు : కొప్పరపు సుబ్బరాయకవి (1885-1932); కొప్పరపు వెంకటరమణ కవి (1887-1942). వీరు గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకా కొప్పరపుగ్రామ వాస్తవ్యులు. ఊరిపేరే ఇంటిపేరు. పదహారేళ్ళు రాకముందే కవితలు చెప్పసాగారు. అంటే 1902-1903 ప్రాంతాలలో నన్నమాట. అప్పటికి తిరుపతి వెంకటకవులు కాకినాడలో, బందరులో స్థిరపడ్డారు. ఈ కొత్త కవుల జంట దేశ సంచారం చేస్తూ ఆశుకవితా ప్రదర్శనలు చేస్తూ అందరినీ ఆకట్టుకొన్నారు. ఒకసారి వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటివారు ఈ సోదరుల ప్రజ్ఞ చూసి అబ్బురపడి ఇలాగ ప్రశంసించారు.

''ఆలోచించుటలేదు కల్పనకుఁ బద్యారంభ యత్నంబు ము
న్నే లేదించుక ప్రాసకేని యతికేనిన్ గొంకుగన్పట్టదే
యాలస్యంబును గల్గఁబోదు బళిరాయయ్యారెయివ్వారికిన్
బాలే యొౘజమి యాశుధార కవితా ప్రారంభనిర్వాహముల్''

ఈ కవుల గురించి తమ గురువులైన చెళ్ళపిళ్ళవారికి వేటూరివారు తెలియచేశారు. కొప్పరపు కవులను బందరుకు వచ్చి సభ చేయమని చెళ్ళపిళ్ళవారు హృదయపూర్వకంగా కోరారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సాదరంగానే నడిచాయి. ఒకనాడు తిరుపతి కవులు గుంటూరు ఫస్టు కంపెనీ హాలులో అవధాన సభ చేస్తున్నారు. ఒక పృచ్ఛకుని ప్రశ్నకు వారు సమాధానం చెప్పడంలో జాప్యం కలిగితే కొప్పరపు కవి దానిని పూరించారు. ఈ చిన్న విషయం చిలికి చిలికి పెద్ద గాలివాన అయింది. ఒకరినొకరు ఛాలెంజి చేసుకొన్నారు. కొప్పరపు కవులకు శాస్త్రజ్ఞానముంటే గొప్ప కవులయ్యేవారిని తిరుపతిశాస్త్రిగారు అన్నారు. మధ్యలో ఉన్నవారు శాఖాభేదాలు రెచ్చగొట్టారు. తిరుపతి కవుల సభలో కొప్పరపు వారికి వేదిక మీద ఆసనం వెయ్యాలన్నారు. సహజంగా తిరుపతి కవులు అభ్యంతరం చెప్పారు. రగడ జగడం దేశాన్ని అట్టుడికించింది. వేలూరి శివరామశాస్త్రిగారు, త్రిపురనేని రామస్వామిచౌదరిగారు. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ గురువుల తరపున కొప్పరపు కవులకు సవాలు చేశారు. సభ పెట్టిస్తాం రమ్మంటే కొప్పరపువారు రాలేదు. శివరామశాస్త్రిగారు గుంటూరులో సంపూర్ణ శతావధానాన్ని 1911లో చేసి గురువులకు పరువు నిలబెట్టారు. కొప్పరపు వారితో పోట్లాట తిరుపతి కవులచేత ''గుంటూరు సీమ'' అనే గ్రంథాన్ని రాయించింది.

1916 నాటికి అన్నీ సర్దుకున్నాయి. ఆ సంవత్సరం మంత్రి ప్రగడ భుజంగరావుగారు ప్రచురించిన ''ఆధునిక కవి జీవితములు''లో కొప్పరపు కవుల భోగట్టాలు ఇలా ఉన్నాయి:

''వీరు అష్టావధాన శతావధానాశు కవిత్వ సభలిప్పటికి దాదాపు 150 కన్నా నెక్కుటుగా జరిగించి, అచ్చటచ్చట నర్హులచే బిరుద మండనములఁ బెక్కు వడసిరి''.

1. ఆలవాలలష్కరులో బ్ర॥ ఆదిరాజు తిరుమల రావుగారి మహాసభలో ''ముంగాలి బిరుదు అందెయును'';
2. మణి కొండాస్థానమున మ॥ శ్రీ తాటిరెడ్డి గోపాలరెడ్డి జమీందారు వారిచే ''బాలసరస్వతీ'' బిరుదమును;
3. నెల్లూరులో మహాసభాజనులచే ''ఆశుకవీంద్ర సింహ'' బిరుదమును;
4. బుచ్చిరెడ్డిపాలెములో మ॥ బెజవాడ పట్టాభిరామరెడ్డిగారిచే ''విజయఘంటికా'' బిరుదమును;
5. మదరాసు మహాజనసభలో మ॥ విజ్ఞాన చంద్రికా మండలి వారిచే ''ఆశుకవి చక్రవర్తి'' బిరుదును;
6. మఱియొక సభలో ''విజయఘంటికా'' బిరుదమును;
7. గుంటూరులో మహాసభాజనులచే ''కుండిన కవిహంస'' బిరుదమును;
8. అందే సోమసుందరేశ్వరాలయ సభలో ''కవిరత్న'' బిరుదమును;
9. బాపట్లలో మహాసభా జనులచే ''అవధాని పంచానన'' బిరుదమును;
10. మార్టేరులో మహాసభా జనులచే ''కథా శుకవీశ్వర'' బిరుదమును;
11. ప్రకృతము మాచే మహాసభలో ''ఆశుకవి శిఖామణి'' బిరుదమును బొందిరి.

వీరింత కాలమును, అవధానాశు కవిత్వ సభలఁ గడిపి యిప్పుడిపుడే గ్రంథ రచన కారంభించిరి. కాని, ఇంతకుమున్ను కొన్ని శతకములను దత్తుల్యములగు కొన్ని చిన్న పొత్తములను రచించియున్నారు. వీరు ఆశువున నానావిధవృత్తములతో నెట్టి కథనైనఁ బ్రబంధశైలిగ గంటకు 500 పద్యములు రచించు సామర్థ్యము గలవారు. వీరొక పర్యాయము పన్నిదమునకై మార్టేరు సభలో గంటకు 720 చొప్పుననొక యరగంట కాలము మనుచరిత్ర మశువుగ'' రచించిరట. వీరిపై నితరులగు మహాకవులు రచించిన ప్రశంసాపద్యములొక సహస్రము కెక్కువయుండును. వీరింతవఱకు రచించిన పద్యములన్నియు, వ్రాసి యుంచినచో సుమారు మూఁడు లక్షలకెచ్చుగాఁ గలవని సహృదయుల యభిప్రాయము. వీరిరువురును సోదరులు. వీరికింక నిరువురు సోదరులు కలరు. గవిత్వము చెప్పఁగలరట. వీరి గృహమును జూచిన యొక కవి ''కవిత పుట్టిల్లు సోదర కవుల ఇల్లు'' అని చెప్పిన గీత పద్యపాదమును బట్టియే సర్వమును గ్రహింపఁదగియున్నది. జగద్విక్రాంత కీర్తులగు వీరి విషయమింతకన్న వ్రాయుట పునరుక్తి.

ఇందులో పునరుక్తి ప్రసక్తి ఎలా ఉన్నా ఈ భోగట్టాలలో అతిశయోక్తులు ఉన్నాయని ఆనాటి పండిత లోకం భావించింది. ధార ఉందిగాని, ధారణాశక్తి అవసరం లేని ఆశుకవిత సాధారణ జనాన్ని అదరగొట్టడంలో ఆశ్చర్యం ఉండదు. కొప్పరపు కవుల వల్ల దేశానికి ఎంత ఉపకారం జరిగిందో అంచనా వేయడం కన్నా ఈకవులు శేషాద్రి రమణ కవులను జంట కవులను చేసినందుకు విధిగా సంతోషించాలి. కొప్పరపు కవుల

పద్యాలకోసం గాలించాలి. శేషాద్రి రమణ కవులు దేశాన్ని పుస్తకాల కోసం గాలించి గ్రంథాలయాలు సంపన్నం చేశారు.

ఆశుకవితలు చెప్పి, అవధానాలు చేసిన సుప్రసిద్ధుల శిష్యులూ, ప్రశిష్యులూ కూడా అష్టావధానాలూ, శతావధానాలూ జంట కవితలు చెప్పినవారే. అయితే కొత్త మోజు వేడి తగ్గాక అవధానాలవల్ల పరిమిత ప్రయోజనాలే ఉన్నాయని, ఇవి ఉత్త ప్రగల్భ ప్రదర్శనమని గుర్తించి సృజనాత్మక సాహిత్యంవైపు మళ్ళారు. తిరుపతి వెంకటకవులే అవధానం అంటే ఏమిటో ఉత్తరోత్తరా ఇలా చెప్పారు.[8]

''దొమ్మరిసాని యెంతయును దుడ్కుమెయిన్ గడనెక్కి యాడుపో
ల్కిమ్మతి బల్మికల్మి గడుగీరితికై యవధానముంబొన
ర్చుమ్మను జుండు దీని నొక చోద్యముగా గణింపబోక స
త్సమ్మతిగా నెసంగు కవితా రసమున్ జవిజూడు భూవరా''.

చిరకాలంనాడే ఈ విద్యయందు తిరుపతి కవులకే అనాదరం కలిగి క్రమేణా దాన్ని వదులుకొన్నారు. తిరుపతిశాస్త్రిగారు ఇది సర్కస్ అన్నారు.[9]

''తిరుపతి వ్యాఘ్రమై బయలుదేఱిన శిష్యులు గున్నయేన్గులై
వఱలఁగఁ దగిన బెబ్బులి పిల్లలెల్ల మా
ర్తురు కవి కుక్కురమ్ములయి తోఁపఁగ వేంకటశాస్త్రి వీరగే
సరిగ శతావధానమను ''సర్కసు'' చూపితివమ్మ! శాంకరీ!

ఉత్తరోత్తరా గురువులు ఇలా భావించినా వారి శిష్యులు తొలుత జంట కవితలు చెప్తూ అవధానాలు చేశారు. ఏయే కవులు ఏ జంటగా ఏ ప్రక్రియలో ''సర్కసు'' చేశారో చూడండి.

కాశీ కృష్ణాచార్య (1872-1963)

పదోయేటనే పద్య రచన ప్రారంభించిన కృష్ణాచార్యులుగారు 19వ యేట గుంటూరులో అవధానం ప్రారంభించారు. జైత్రయాత్ర చేశారు. 1911 డిసెంబరు 1వ తేదీనాడు బందరులో శతావధానం చేశారు. వినుకొండ, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, వెంకటగిరి, నూజివీడు, పిఠాపురం, విజయనగరం మొదలైన సంస్థానాలలో ఆశుకవితను ప్రదర్శించారు. అఖండ సన్మానాలు పొందారు. ''అవధాన శిరోమణి'' అను బిరుదును పొందారు. విడిగా అవధానాలు చేసి కాశీ కృష్ణాచార్యులుగారు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారితో కలసి ఒక సభలో పదో పన్నెండో పద్యాలు చెరొక చరణం చొప్పున చెప్పారు. తనకు గురుస్థానంలో ఉన్న చెళ్ళపిళ్ళ వారితో ఈ మాత్రం జంట కవిత్వం చెప్పిన కృష్ణాచార్యులుగారు చెళ్ళపిళ్ళవారి శిష్యులైన అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారితో కలసి తెనాలి సమీపాన ఉన్న నందివెలుగు గ్రామంలో అవధాన ఆశుకవితా ప్రదర్శన చేశారు.

8. ''కథలు-గాథలు'' - ద్వితీయ భాగం - పుట.32
9. ''కథలు-గాథలు'' - ప్రథమ భాగం - పుట.438

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి (1883-1935)

కొప్పరపు కవులతో తిరుపతి కవులకు హోరాహోరీ యుద్ధం జరుగుతున్నప్పుడు గురువుల తరపున కొప్పరపు వారితో ఢీకొన్న తిరుపతి కవుల శిష్యులలో అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఒకరు. వీరు సవాలు చేసి వేమపర అగ్రహారంలో తమ ప్రజ్ఞను చూపి కొప్పరపు వారిని ఓడించారు. గురువుల ప్రశంసలు పొందారు. అవ్వారివారు సికిందరాబాదు మొదలైన చోట్లలో కూడా అష్టావధాన-శతావధానాలు, ఆశుకవితా ప్రదర్శనలు చేశారు. వీరికి ''ఆశుకవితా తిలక'' అనేది బిరుదు. వీరు కాశీ కృష్ణాచార్యులవద్ద తర్కం చదువుకొనడమేకాక వారితో కలసి నందివెలుగు గ్రామంలో అవధానం చేశారు. తమ మేనల్లుడు రాయప్రోలు సుబ్బారావుగారితో కలసి 1909-1911 సంవత్సరాల మధ్య అవధానాలు చేశారు. పిశుపాటి చిదంబరశాస్త్రిగారితో కలసి 1914లో యాదగిరి నరసింహస్వామి వారి దేవాలయంలో అష్టావధానం చేశారు. సమాన ప్రతిభ గల ఎవరితోనైనా కలసి అవధానం చేయవచ్చునని అవ్వారి వారు రుజువు చేశారు. తెనాలి, బాపట్ల, కొవ్వూరు పాఠశాలలో, విద్యాలయాలలో, కళాశాలల్లో సంస్కృతాంధ్రోపాధ్యాయులయ్యాక అలంకార శాస్త్రాలు తెలుగు చేయడం ప్రారంభించారు. వారి ధ్వన్యాలోకం అనువాదం ''ఆంధ్రధ్వని'' పేరుతో విశిష్టమైనది.

దుర్భాక రాజశేఖరం (1888-1957)

రాణా ప్రతాపచరిత్రను అయిదాశ్వాసాల పద్యకావ్యంగా రచించి రాయలసీమకే కాక రాష్ట్రానికే వన్నె తెచ్చిన దుర్భాక రాజశేఖరంగారు శతావధానులు. ఈయన 1908లో ''ఆంగ్లవిద్య మానేసి పదమూడేళ్ళు జిల్లా మునసబు కోర్టులో పనిచేశారు. జాతీయోద్యమంలో చేరి అది కూడా మానేసి చారిత్రక కావ్యాలు రచించడం మొదలు పెట్టారు. 1920 నుంచి ఏడేళ్ల 1927 దాకా గడియారం శేషశాస్త్రిగారితో కలసి ఎన్నో అవధానాలు చేశారు. ఇద్దరి పేర్లూ కలుపుకొని ''రాజశేఖర-వెంకట శేషకవులు'' అనే జంట పేరుతో దత్తమండలం పర్యటించారు. అవధానాల మోజు తగ్గాక ఇద్దరూ విడివిడిగా స్వతంత్ర కావ్యాలు రాశారు. వాటి వల్లనే ఎక్కువ పేరు సంపాదించారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961)

తిరుపతి వెంకటకవుల శిష్యులేకాక వెంకటరామకృష్ణ కవుల శిష్యులలో కూడా అష్టావధానాలు చేసిన వారున్నారు. ఉత్తరోత్తరా జీవితమంతా వచన రచనలే, అందులోనూ వ్యావహారిక భాషకే అంకితం చేసిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఒకప్పుడు అష్టావధానం మాత్రమేకాక దానిలో భాగంగా నేత్రావధానం కూడా చేసేవారు. దివాకర్ల తిరుపతి శాస్త్రిగారి శిష్యులు, మల్లాది సత్యనారాయణశాస్త్రి ప్రోద్బలంమీద ఆయన వద్దే నేత్రావధానం మెలకువలు నేర్చుకొని అష్టావధానంలో కలిపి చేసేవారు.

పిశుపాటి చిదంబరశాస్త్రి (1892–1951)

అష్టావధానాలు, శతావధానాలు చేస్తూ తిరుపతి కవులు నానారాజ సందర్శనం తెలుగు జిల్లాలకు పరిమితం చేసుకొంటే పిశుపాటి చిదంబర శాస్త్రిగారు మైసూరు మహారాజావారి ఆస్థానంలో 1920 నుంచి ఆస్థాన మహావిద్వత్పదవిలో ఉన్నారు. తిరువాన్కూరు మహారాజావారిచే ''నరసింహ కంకణం'' పొందారు. గద్వాలలో సన్మానాలు పొందారు. సంస్కృతాంధ్రాలలో ఆశుకవితా ప్రదర్శనలు చేస్తూ శతావధానాలు చేసి చివరకు సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయంలో 1926 నుంచి 15 సంవత్సరాలు పండితులుగా పనిచేశారు. విడిగానేగాక అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి గారితోపాటు కొన్నాళ్ళు అవధానాలు చేశారు.

రాయప్రోలు సుబ్బారావు (1892–1984)

తన మేనమామ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారితో కలసి అవధానాలు చేసిన రాయప్రోలు సుబ్బారావుగారికి ఆశుకవిత పిలపిండి. వావిలకొలను సుబ్బారావుగారు అధ్యక్షత వహించిన సభలో ఆశువుగా ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని మామగారితో కలసి చెప్పారు. 1911లో బుచ్చిరెడ్డిపాలెంలో సుబ్బారావుగారికి ఆశుకవిత్వంపై మోహం మొత్తింది. ఇష్టదేవతను ఇలా ప్రార్థించారు.

''తెనుగే తీయని, దందు పద్య పద రీతి క్రీడలత్యంత మో
హానముల్ శోభనముల్ తదీయరస రక్తాలాపనంబుల్ లభిం
చిన వాగర్థకలాకలాప జయ లక్ష్మిన్ గాలికింబుత్తునే
జననీ! యేమిటి కింక ఆశుకవితా సన్యాస మిప్పించవే''.

''రసమో, భావమొ, జీవదర్థసుకుమార వ్యంజనామంజు శ
బ్ద సమాసారచనంబొ, సాధు హృదయస్పంద ప్రతిష్ఠా కథా
విసరంబో, సకలార్థ శూన్యమగు నీవేగాతి వేగోక్తి దు
ర్వ్యసనం బేటికి త్రిప్పుమింక జననీ! రమ్యాక్షర క్షోణికిన్''.

రమ్యాక్షర క్షోణికి మరలిన తర్వాత రాయప్రోలు వారు నవ్య కవిత్వం రూపురేఖలు దిద్దినవారిలో ప్రముఖులయ్యారు. భావకవిత్వం పట్టుకొమ్మలలో గట్టి కొమ్మగా పేరుపొందారు.

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి (1892–1950)

తిరుపతి వెంకటకవుల శిష్యులలో చాలామంది అష్టావధానులుగా, శతావధానులుగా, ఆశుకవులుగా ప్రసిద్ధులయ్యారు. అయితే చాటుకవిగా పేరెక్కిన వారిలో మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రిగారు ప్రథములు అని చెప్పవచ్చు. వీరి శృంగార చాటువులు సాహిత్యలోకంలో బాగా ప్రచారంలో ఉన్నాయి. చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రిగారు

ఈయనను ''స్వయంశక్తుడ''ని బిరుదు ఇచ్చి శాలువ కప్పారు. హాస్య చతురుడైన ఈ కవి సీరియస్ కావ్యాలు కూడా రచించారు. కొన్ని చాటుధారలు ఘాటుధారలైనా అవి మసాలా ఉన్న పద్యాలు.

గడియారం వెంకటశేషశాస్త్రి (1894-1980)

దుర్భాక రాజశేఖరంగారు ''రాణాప్రతాప'' రచించి కీర్తి గడిస్తే; వారితో జోడు కలసి ఒకనాడు అవధానాలు చేసిన గడియారం వెంకట శేషశాస్త్రిగారు ''శివభారతం'' అనే పేరుతో శివాజీ చరిత్రను ఎనిమిది ఆశ్వాసాలలో రచించి పేరుకెక్కారు. వీరికి ''అవధాన పంచానన'' అనే బిరుదును ఉయ్యాలవాడలో ఇచ్చారు. అవధానిగా కాక శివభారత కవిగానే వారికి చిరకీర్తి లభించింది.

పింగళి లక్ష్మీకాంతం (1894-1971)

తిరుపతి వెంకట కవుల శిష్యులు తమ గురువులలాగే అవధానాలు చేయడానికి పింగళి లక్ష్మీకాంతంగా కాటూరి వెంకటేశ్వరరావుగారితో కలసి మొదట అవధానం మోజు తీర్చుకొన్నారు. తర్వాత ఇద్దరూ కలసి సృజనాత్మక సాహిత్యంవైపు చూపు మరల్చారు. ''తొలకరి'', ''సౌందరనందం'' అనే కావ్యాలు రచించారు. పింగళివారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖాధ్యక్షులయ్యారు. కాటూరి వెంకటేశ్వరరావుగారు బందరు జాతీయ కళాశాలలో పనిచేశారు.

కాటూరి వెంకటేశ్వరరావు (1895-1962)

విద్యార్థి దశలోనే పింగళి లక్ష్మీకాంతంగారితో కలసి మునునూరు, నెల్లూరు, తోట్లవల్లూరు మొదలగు చోట్ల కాటూరి వెంకటేశ్వరరావుగారు శతావధానాలు చేశారు. అవధానాలు మానేశాక పింగళి లక్ష్మీకాంతంగారితో కలసి కాటూరి వెంకటేశ్వరరావుగారు 1923లో రచించిన ''తొలకరి'' అనే ఖండకావ్య సంపుటి భావకవిత్వంలో నిజంగా తొలకరి. ''సౌందరనందం'' రసవత్కావ్యం గుడిగంటలు, పౌలస్త్య హృదయం అనేవి వీరి విడి రచనలు. ''కృష్ణాపత్రిక''లో ''దర్బారు శాయరు'' వ్యాసాలు రాసిన కాటూరి వారికి సాహిత్య గోష్ఠి ఉంటే ఇంకేం అక్కర్లేదు.

విశ్వనాథ సత్యనారాయణ (1895-1976)

ఇవాళ దేశంలో ఎవరూ తన ప్రక్కన నిలబడలేనంత ఎదిగిపోయిన విశ్వనాథ సత్యనారాయణగారు తొలిరోజులలో స్కూల్ ఫైనల్ ఇంటర్ చదువుకొనేటప్పుడు కొడాలి ఆంజనేయులుగారితో కలసి సత్యాంజనేయ కవులని జంట కవిత్వం చెప్పారు. అంతకు ముందు అద్రి తనయులు అనే పేరుతో రాసేవారు. గిరి కుమారుని ప్రేమగీతాలు తొలి ముద్రణలో ఇద్దరిపేర్లూ ఉన్నాయి. జాతీయోద్యమం మోజులో సత్యాంజనేయ కవులు ''అవతార పరివర్తన'' మనే నాటకం రాశారు. కొన్ని ప్రదర్శనల తర్వాత ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది.[10] తర్వాత ఎవరి దారిలో వారు రచనలు చేశారు.

10. డా॥ జంధ్యాల సుమన్‌బాబు - ఆంధ్ర సాహిత్యములో జంట కవులు - పుట.345

వేదుల సత్యానారాయణశాస్త్రి (1900–1970)

భావ కవిత్వంలో రాణించిన కవులలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పేరు తర్వాత వేదుల సత్యానారాయణశాస్త్రి గారి పేరు చెప్పడం ఒకనాడు పరిపాటి. ''దీపావళి'' వంటి ఖండకావ్య సంపుటి రచించి పద్యరచనా ప్రతిభ ప్రదర్శించిన వేదుల సత్యానారాయణ శాస్త్రిగారు ఆదిలో శతావధానులు. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి శిష్యులు. అవధానాలు మానేశాక సావధానంగా కవితలు చెప్పి ''గౌతమీ కోకిల'' అనే బిరుదును పొందారు.

తిరుపతికవుల శిష్యులు త్రిపురనేని రామస్వామిచౌదరిగారు 1911లో అంగలూరులో అష్టావధానం చేశారు. 1912లో శతావధానం చేశారు.

తిరుపతి కవుల శిష్యులేకాక ప్రశిష్యులు కూడా జంట రచనలు చేశారు. పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యులు పువ్వాడ శేషగిరిరావుగారు చోడవరపు జానకి రామయ్యగారితో కలసి సహరచన చేశారు.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి కుమారుడు దుర్గేశ్వరశాస్త్రి పదిహేను వెళ్ళి పదహారోయేడు వస్తున్నప్పుడు వెంకటశాస్త్రిగారి మేనకోడలి కొడుకు ద్వివేది సత్యనారాయణశాస్త్రితో (ఒక ఏడాది) కలసి ''సత్యదుర్గేశ కవులు'' అనే పేరుతో అష్టావధానం చేశారు. పూర్వం అష్టావధానంలో చదరంగం ఉండేది. చెళ్ళపిళ్ళ వారి అబ్బాయి దానికి బదులు కేరమ్స్ ఆటను ప్రవేశపెట్టారు. మారుతున్న కాలానికి తగ్గట్టు ఆటలూ మారుతాయి. అసలు అవధానమన్నదే ఒక ఆట.

ఇంతకీ 1874లోనే వీరేశలింగంగారు ధవళేశ్వరంలో రెండుసార్లు అష్టావధానం చేశారు. అష్టావధానం ముగిసిన తర్వాత తలనొప్పి వచ్చి ఆ రాత్రి ఎంతో బాధపడ్డారు. ''ఊరక పామరుల వేడుక కొఱకుఁ దక్క దీని వలన లోకమునకుగాని నాకుఁగాని నిజమైన ప్రయోజనము లేదని భావించి, తరువాత నెందఱెన్ని విధములఁ బ్రార్థించినను మేధస్సునకు వేదనాకరమైన యష్టావధానమును జేయమానితిని'' అని వీరేశలింగంగారు రాశారు.[11]

ఒక తరంలో ఆంధ్రదేశంలో అవధానాలు చేసిన వారిని లెక్కపెట్టడం కన్నా చేయని వాళ్ళని ఎంచడమే సులభం. ఇప్పటికీ అవధానాలు చేసేవాళ్ళు వేళ్ళమీద లెక్కపెట్టడానికి ఆ విద్య మిగిలి ఉంది.

చింత చావదు - పులుపు విరగదు.

---

11. స్వీయ చరిత్ర - మొదట భాగం - పుటలు 85-87

వీధి నాటకాలూ - స్టేజి నాటకాలూ

ఆంధ్ర సాహిత్యం జమీందారీ యుగంలో సంతరించుకొన్న వినూత్న ప్రక్రియ స్టేజి నాటకం. సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధమైన పదిరకాల రూపకాల వంటివి ఆ పేర్లతో కాకపోతే ఆ తీర్లు తగు మాత్రమైనా ఉన్నవి పూర్వం తెలుగులో కనబడవు. శిష్టసాహిత్యాన్ని అభిమానించేవారు ఇదొక లోపంగా భావిస్తారుగాని తెలుగు ప్రజలు తమకు కావలసిన విధంగా అనాదినుంచి ప్రదర్శన కళలను ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ప్రతి కులానికీ ఒక పురాతన గాథ ఉంటుంది. దాన్ని గానం చేసే అనుబంధ కులాలవారూ ఉంటారు. సంపన్న వంశాల చరిత్రలనూ, గోత్రాలనూ పదాలుగా, పద్యాలుగా, ప్రస్తుతులుగా కీర్తించే భట్టులూ, బ్రాహ్మణులూ ఒకరకమైన చరిత్రకారులు. నృత్య గీతాభినయాలతో పురాతన గాథలు 'వినికి' చేయడం అన్ని కులాలలోనూ ఉంది. ఈ దృశ్య కళలను ప్రదర్శించేవారు ఉపయోగించే సంగీత వాద్యాలను బట్టి ఆ కథలను చెప్పేవాళ్ళ కులాలకు పేర్లు ఏర్పడ్డాయి. ఉదాహరణకు - కొమ్ములవారు, పంబలవారు, రుంజలవారు, శారదకాండ్రు వగైరాలు. ఒక కులంవారి పురాతన గాథల కథనంవల్ల, గానం వల్ల ఇతర కులాల అభ్యుదయాలకు ఆస్కారముంటే అది ఉమ్మడి ప్రదర్శన కళగా రూపం సంతరించుకొని, పరిణామక్రమంలో 'నాటకం'గా అవతరిస్తుంది. దీనినే 'వీధి నాటకం' అని కూడా వ్యవహరిస్తారు. తెలుగు వీధి నాటకానికీ, సంస్కృత రూపక భేదాలలో ఉండే 'వీధి', 'నాటకం' అనే రెండు పారిభాషిక పదాలకు చాలా తేడాలు ఉన్నాయి.

నూటికి నూరుపాళ్లు తెలుగుదనం ఉట్టిపడే దృశ్యకావ్య ప్రక్రియలలో ఒకటైన వీధినాటకానికి యక్షగానం అనే పర్యాయ పదనామం కూడా చలామణిలో ఉండేది. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా శ్రీనాథుడు (1370-1450) యక్షగానం అనే మాటను గ్రంథస్థం చేశాడు. అతనికి నూరేళ్ల ముందున్న పాల్కురికి సోమనాథుని రచనల వల్లపాత్రలను ఆడిస్తూ యక్షవిద్యాధరులై ఆడేవారూ పాడేవారూ ఉండేవారని, గొండ్లి అనే బొమ్మలాట ఉండేదని తెలుస్తోంది. పిల్లలమర్రి పినవీరభద్రుడు చెప్పిన ఒక పద్యంలో ఆటకాడు తెరబొమ్మలను వీధిలో గొండ్లి ఆడిస్తున్నాడని తెలుస్తోంది. (శకుంతలా పరిణయం. 3-128). గొండ్లి తెరనాటకమని నాచన సోముని వర్ణన వల్ల విశదమవుతోంది. (ఉత్తర హరివంశం.4-216). శ్రీనాథుని కాశీఖండం (3-23)లో గొండ్లిని వర్ణిస్తూ అందులో తెరలు, పుష్పాంజలి, మద్దెల చప్పుళ్ళు, రంగస్థలం పేర్కొన్నాడు. బమ్మెర పోతరాజుగారు 'జవనిక మరుగున నాట్యంబు సల్పు నటుని' (భాగవతం. 1-181) పేర్కొన్నారు.

ఇందరు ఇన్నిరకాలు చెప్పిన తెలుగు నాటకాన్ని ఎవరూ కాగితం మీద ఎక్కించనట్టు కనబడుతుంది. వీధి నాటకాలకు కూడా రచయితలు ఉంటారు. గజపతుల, తొలిరాయల యుగాలలోని ప్రోలుగంటి చెన్నయ జక్కుల కథగా 'సౌభరి చరిత్ర'ను రచించాడు.[1] జక్కుల కథకే యక్షగానమన్నది ఇంకో పేరు. ఈ రచన ప్రతి దొరకదు. అయినా

---

1. గజపతి తొలిరాయల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి 2002

యక్షగానాల గ్రంథం, దాన్ని ఆడేవాళ్లకు కంఠోపాఠంగా ఉండి వాచోవిధేయంగా ఉంటుంది. తాటాకులపైన ఎక్కించవలసిన అవసరం మన యక్షగానాలలో చాలావాటికి పూర్వం ఉండేది కాదు. ఒక తరంవారి నుంచి ఇంకో తరంవారు నేర్చుకొనేవారు. చిన్నప్పట్నించి శిక్షణ ఉండేది. ఇవి కులవిద్యలు కనుక కొంత రహస్యంగా కూడా ఉంచేవారేమో. నాయకరాజుల యుగంలో యక్షగానాలను గ్రంథస్తం చేసేవారు. అయితే వీటిలో ఉండే ద్విపదలూ, దరువులూ, పదాలు, సంవాదాలు వగైరా గేయభాగాన్ని పుస్తకాలకు ఎక్కించేవారు. సంభాషణలను నటుల చిత్తానికి వదిలేసేవారు. విదూషకుడు, ఇతరులు సందర్భోచితంగా హాస్యం చెప్పేవారు. విజయరాఘవ నాయకుడు తన నాటకాలలో 'యిక్కడ విదూషకుడు హాస్యపు మాటలాడేది' అని నిర్దేశించేవాడు.[2]

నాయకరాజుల యుగంలోనే ఆంధ్రదేశంలో ఉన్న పద్దెనిమిది కులాల భాగవతులు ప్రదర్శించే ఆట భాగవతులను, వేషకథలను, వాటిలో ఉండే విశేషాలను తెలుసుకొన్నాం.[3] కుంఫిణీయుగంలో తెలుగుదేశంలో వెలువడిన పారిజాతాలూ, భామాకలాపాలు, గొల్లవేషాలు 18కి తక్కువలేవని; అన్ని యుగాలలో కలుపుకొని 19 పారిజాతాలూ, 28 భామాకలాపాలూ, 14 గొల్లకలాపాలూ ఉన్నాయని తెలుసుకొన్నాం.[4] వీటిలో చాలా మట్టుకు పుస్తకాలలో జాగ్రత్త చేశారు. అయినా ఆయా మేళాలవారికి ఇవి కంఠోపాఠం. జమీందారీ యుగంలో తెలుగుదేశంలో ఈ క్రింది మేళాలు సంచారం చేస్తూ ఆటలు ఆడేవారు.

ఘుట్టుదేశపువారిమేళం
లేపాక్షివారి మేళం
వేములపల్లి వారి మేళం
ధర్మపురివారి మేళం
తాడిపత్రి వారి మేళం
పడకండ్లస్వామి రాయని మేళం
త్వరకవి రామకృష్ణయ్యగారి మేళం
చుక్కలూరి వారి మేళం
ధేనువుకొండ వారి మేళం
సంత వేలూరి వారి మేళం
తత్రికంటి వారి మేళం
భాగవతుల రంగయ్యగారి మేళం
నరసింగపల్లి మేళం
కళేపల్లి కందాళ చిదంబర కవి మేళం
కూచిపూడి మేళం

2. యశ్వీ జోగారావు - ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర - పుట.152
3. కడపటిరాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి 2002
4. కుంఫిణీ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటి 2004

ఈ మేళాలలో ఒకదాని గురించి తెలుసుకొంటే తక్కినవాటి గురించి ఊహించుకొనవచ్చు. కురుగంటి సీతారామయ్యగారు ఇలా రాశారు.[5]

''ధేనువుకొండ, తమ్మవరం అని ఒంగోలు తాలూకాలో రెండు గ్రామాలున్నవి. ధేనువకొండలో ఆ యింటి పేరాయనే వెంకయ్యగారని ఉండేవాడు. ఆయనది మంచి విద్వత్కుటుంబము. ఆయన భారతకథలో ఉత్తర గోగ్రహణము మొదలైనవి కొన్ని ఘట్టాలూ, భాగవతములో 'వామన చరిత్ర' మొదలైనవి కొన్ని తీసుకొని గేయాలు కలిపి చక్కని రసవచ్ఛైలిలో, హరికథారూపముగా చెప్పటానికీ, నాటకరూపముగా ప్రదర్శించడానికీ కొన్ని గ్రంథాలు రచించాడు. ఇవి ఆ కాలములో చాలా ఆకర్షించినవి. తమ్మవరం కాపురస్తుడు వెంకటస్వామి అనే ఆయన కొందరు స్త్రీలను కూడా తయారుచేసి, వారితో కలసి నాటకాలాడేవాడు. ప్రజలు సహస్రాలుగా వెళ్ళి ఆహ్లాదించేవారు. స్త్రీలు స్త్రీ పాత్రలు ధరించడము ఈ వెంకటస్వామి, సురభి కంపెనీవారూ ప్రచారములోనికి తెచ్చినారు. ఈ వాదము రాఘవచార్లుగారితోనే పుట్టినదని భ్రమపడవద్దు.

''ధేనువకొండ వెంకయ్యగారి తమ్ముడు చిన్నయ్యగారు గొప్ప సంగీత విద్వాంసుడు. ఆయన కొడుకు ధేనువకొండ సుబ్బారావు. యిదివరలో నాటకాలలో అర్జునాది పాత్రలు ధరించడములో ప్రవీణుడై కొంతకాలము సినిమా రంగమెక్కినాడు. చక్కగా పాడి శ్రోతల నానందింప జేయగల సమర్థుడు. శాస్త్రీయ నాటకాలు వచ్చి పై వాటిని ముంచివేసినవి! సినిమాలు వచ్చి నాటకాలను ముంచివేసినవి! నరసింహశాస్త్రి గారు లిఖించిన దొడ్డవరపు వెంకటస్వామి యిలాగా జానపదుల నాకర్షించిన 'బుర్రకథకుడు''.

ఈ మేళాలవారు వివిధ ప్రాంతాల సంచారంచేస్తూ ప్రదర్శనలు ఇచ్చేవారు. పింగళి సూరపరాజుగారు ప్రభావతీ ప్రద్యుమ్నంలో భద్రుడనే నటప్రముఖుడు 'నాట్యముల యందు నెవ్వరి రూపు వహించే వారలయట్లు తాను భేదము లేక' తనరుతూ నాట్య గరిమచే మెప్పించి, ఏడు దీవుల ఆట పసను నెరపుచు తిరుగుతున్నాడ'ని చెప్పారు. (ప్రభా. 2-27). ఇతని మేళంలో ఇతడుకాక ఒక పారిపార్శ్వికుడూ, ఒక విదూషకుడు కూడా ఉన్నారు. (4-90). వీరికి తగినట్టు వార సీమంతినీ వ్రాతం కొలుచుకొనేవారు. వీణా, వేణు, మురజ వంటి వాద్యాలు ఉండేవి. (4-92). వీరి ప్రదర్శనలో పూర్వరంగం, నాంది, ప్రరోచన, ఆముఖం, ప్రస్తావన మొదలైనవి ఉండేవి. ఆట ఆడుతూ ఉంటే 'సామాజికులు తమ సొమ్ములెల్ల' మెచ్చుకొని యిచ్చేవారు. (4-101)

అయితే మేళం వారు విడిచిన ఇంట్లో వారి వాలకపు సొమ్ములను పోకిరీ కుర్రవాళ్ళు ఎత్తుకుపోవడానికి కాచుకొని ఉంటారని పింగళి సూరపరాజుగారు ప్రభావతీ ప్రద్యుమ్నంలోనే చెప్పారు. (1-107).

ఊరివాళ్లు మేం దొంగిలిస్తామా? మీరే దొంగలని ఇలా చెప్పారట.

''ఏముమ్రుచ్చులమె యూహింపమ్రుచ్చుఁదనాల
పుట్టిన యిండ్లు మీ బోంట్లెగాక

5. నవ్యాంధ్రసాహిత్య వీథులు, ప్రథమ భాగము - పుట.44

యాట వాం(డని నమ్మి యనుమతింపఁగ నెట్టి
పురమైన నశ్రమంబునను జొచ్చి
పగలెల్ల నాటల భ్రమయించుచును సందు
గొందులెల్ల నెఱింగికొనుచు రేలు
కన్నగాండ్రగుచు నగళ్ళ ప్రవేశించి
యందు నెంతటి వారలడ్డమైనఁ
జక్కడఁచుచుఁబేను గ్రుక్కిన పాటిగా
నిష్టమైన యర్థమెల్లఁబడసి బ్రతుకు
చునికి మీ స్వభావమింతయును ద
ప్పదు యథార్థమనుచుఁ బలుకుటయును'' (ప్రభావతి - 1-108)

లోకులకు మేళాలవారి సంగతి విశదమవుతుంది. మేళాల పేరు చెప్పుకొని కొందరు కన్నపు దొంగలు సంచరించేవారు. నటవిటగాయక గణికాది జనులకు అంత గౌరవస్థానం సంఘంలో ఉండేదికాదు. ఎంత ఆర్జించినా వారికి తిండి గగనమే. వేమనగారు ఇలా చెప్పారు :

పరగ భాగవతులు ప్రజలు సంతోషించు
నాట పాట నేర్చి నీటుగాను
కోట్ల కొలది తెచ్చి కూటికి లేకుంద్రు
విశ్వదాభిరామ వినురవేమ. (నేదునూరి - 3027)

క్రీ.శ. 1558 ప్రాంతాలలో పింగళి సూరపరాజుగారి కాలంలో ఒక మేళంలో ఎందరుండేవారో పైన గుర్తించాం. కుంఫిణీ యుగంలో వీధి నాటకాలలోనూ, కూచిపూడి వారి నాటకాలలోనూ ఒక విదూషకుడు, వంతపాటగాడు, మాధవి పాత్రధారి, ఇతర వేషగాళ్లు ఉంటారు. తోలుబొమ్మలాటలోనైనా, భాగవతాలలోనైనా జనం హాస్యం కోసం ఎదురుచూస్తారు. ఒక కూచిపూడి ప్రహ్లాద నాటకంలో ప్రారంభాన్ని ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఇలా వర్ణించారు.[6]

''ఆటల సంగతి యెట్లావున్నా పల్లెటూళ్లలో చాలామంది బంగారక్కను చూడడానికి వస్తారు. అందుకనే మాధవి ప్రతి నాటకానికి ప్రథమపాత్ర, ప్రధాన వేషం కూడాను. అదే హాస్యగత్తె స్త్రీ వేషాలకు చెలికత్తె. విళాయి వేశే చాకలి దీనికి మగనివరస. ఆట పూర్తి అయ్యేవరకు వాడిని వొళ్ళు వాచేటట్టు కొడుతుంది. మాధవి తెరలోకి వచ్చింది. చక్కగా నొక కృతి పాడింది. వచ్చేది యే వేషమో కొత్తవాండ్లకు దెలియలేదు. రభసంతో రెండు విళాయీలు మోటించి గుగ్గిలం వేశారు. ధగధగ మెరిసింది. కాటి పాపవలె మాధవి చిందులు దొక్కుతూ బయటకి వచ్చింది. చాకలి మగడితో తానాడిన సరసాలు వర్ణిస్తూ -

6. ఉన్నవ లక్ష్మీనారాయణ - మాలపల్లి, ద్వితీయ భాగం, 17వ అధ్యాయం, పుట.208

''వినరండో చెప్తాను - వీనూల విందుగ - విన.

1. తమలపాకుతో తానిట్లంటే - తలుపు చెక్కతో నేనట్లంటి - విన.

2. విసనకర్రతో తానొకటంటే - విసురురాయితో నేరెండంటి - విన.

వెం-మాధవీ! ఇదేమి సరసమే?

మా-పఁ విటె సవరించుకుంటూ గూడలెగరవేసి

మా యిది మోటసరసం బావా.

వెం-పరాయి మగవాణ్ణి. అందులో పడుచువాణ్ణి

గూడా గదా? బావా అంటే నీ మగడూరకుంటాడూ?

మా-నా మొగుడూరకోక పోవడం గూడానా?

యిటువంటి వన్నీ వాడికి నేర్పబోకు, ఏమిరా!

వూరుకోవురా? -

అని ఫెడేలున నొక్కు పెట్టుపెట్టి,

3. చిగురుటాకుతో తానొకటంటే - చీపురుకట్టతో నేమూడంటి - విన.

వెం-మరదలు పిల్లా! ఈ తడవ సరసం యింకో పాలెక్కువ గలిపావూ?

మా-మరదలు పిల్లా - ఎంత బాగుంది బావా యీ

మాట. అంతా నన్నిట్లా పిలిస్తే బాగుండును. ఈ

వెధవ నాకిష్టం లేందీ తేపా నాతో సరసమాడడ

మేమిటీ. బుద్ధిరావడం కోసం మూడో మాటు యింకొక దెబ్బ యెక్కువ చదివించా.

వెం-వాడు నిన్ను పెళ్ళిచేసుకున్న దెందుకోసం?

మా-నాకు అన్నం పెట్టడానికీ, చాకిరీ చేయడానికీ, నాకు పుట్టిన పిల్లల్ని మోయడానికీ, వాడితో వుండటానికి నాకిష్టం లేకపోతే మాకు భరణం యివ్వడానికీ, జర్మనీ దేశంలో వొకడు తన భార్యకు యిష్టం లేనిదే అదనంగా సరసం ఆడితే యాభైరూపాయలు జుల్మానా వేశారట. యీతడు జర్మనీ వాడికంటే మొనగాడా?''

మాధవి నిష్క్రమించింది. -

వంతపాటగాడు జనసమ్మోహనంగా పాడుతూ వుంటే చూడడానికి వచ్చిన అమ్మలక్కల్లో ఒకామె 'నే కాసేపు నిద్రపోతాను. మళ్ళా మాధవి రాగానే లేపు' అని నిద్రపోయిందట. తెల్లవార్లూ నాటకం ఆడవలసిందే. ఆఖర్న కప్పుర చీకటిపోయేవరకు కాలం గడపడానికి మాధవి మళ్ళా వస్తుంది. జనులకు ఉత్సాహం కలిగి చదివింపులు చదివించడానికి నవ్వు పుట్టించే పాటలు పాడుతుంది. యథాశక్తిగా జనం చొక్కాలూ, ఉత్తరీయాలూ పోటీలు పడి చదివిస్తారు. భాగవతులు ఊళ్ళో పెద్దలిండ్లకు పోయి ఆటలు వొప్పించుకోవడానికి వేళంతో బయలుదేరుతారు. ఇది ఉన్నవవారు చెప్పిన సంగతి.

పింగళి సూరపరాజుగారి కాలం నుంచి, ఉన్నవ లక్ష్మీనారాయణగారి కథాకాలందాకా తెలుగుదేశంలోని మేళాలవారి నాటకాలు ఒక్కరీతిలోనే ఉన్నాయని ఇందువల్ల విశదమవుతుంది. కొండా వెంకటప్పయ్యగారూ ఇదే చెప్పుతూ మరికొన్ని తెలియచేశారు.[7]

''..... అదివరకు దేశంలో వీధి నాటకములు సామాన్యముగ నాడుచుండిరి. చాలావరకు ఈ నాటకములలో దరువులు పాడుచు నృత్యము చేయుచుండుట చేత సంగీతము ప్రధానముగ నుండెను. ఈ నాటక బృందములలో చాలావరకు నుండెను. ఈ నాటక బృందములలో చాలావరకు బ్రాహ్మణులే చేరియుండిరి. వీరిలో కొందరి నడవడి చెడ్డదిగనుండెను. అందువలన భాగవతులు అంతగా గౌరవపాత్రులుగ నెంచబడకుండిరి. వీరిలో భరతనాట్యము, అభినయశాస్త్రములందు ప్రవీణులై పేరెక్కిన వారుండిరి.''

జమీందారీ యుగంలోని ఇతర ప్రముఖులు కూడా తమ స్వీయచరిత్రలలో కూచిపూడి వారి గురించి, ఇతర ప్రదర్శన కళారూపాల గురించి చాలా సంగతులు చెప్పారు. అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఇలా రాశారు.[8]

''మా యూరి కప్పుడప్పుడు కూచిపూడి భాగవతులు వచ్చి, మాయింటి ప్రక్కనే యున్న పెద్ద బజారులో ప్రహ్లాద, హరిశ్చంద్ర, ఉషాపరిణయము, భామా కలాపము మొదలైన వీధి నాటకములాడుచుండిరి. వేషగాండ్రు మొగముల కరదళము పూసుకొని గిలేటి నగలు ధరించి వచ్చేవారు. కాగడాలమీద గుగ్గిలము వేసేవారు. తోలుబొమ్మల వాళ్లు కూడా వచ్చి రామాయణము, ఉత్తర గోగ్రహణము, మొదలైనవానిని ప్రదర్శించుచుండిరి. కేతిగాడు, జట్టు పోలిగాడు, బంగారక్కల హాస్యము పిల్లలకెంతో ఆనందమును కల్గించెడిది... మా యూరిలోని చెన్నకేశవ స్వామి వారికి నేటేట ముక్కోటి యేకాదశికి పెద్ద కొఠారు కట్టి హరికథలు చెప్పించుటయేగాక, కూచిపూడి వారిని కూడా బిలిపించి దశావతారములు మొదలగు నృత్యములు చేయించువారు. ఆ కాలములో కూచిపూడి వారి ప్రతిభ చాలా హెచ్చుగా నుండెను''. అయ్యదేవర కాళేశ్వరరావుగారు 1889లో పుట్టారు. వారు చెప్పిన ఈ సంగతులు 1891 ప్రాంతాలవి.

ఆ రోజులలో కూచిపూడి వారేకాక భోగం భాగవతులు కూడా భామాకలాపాలు ఆడేవారు. 1937లో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు 'కవిత్వంలో నా యెదుగుబొదుగులు' అనే వ్యాసంలో ఇలా రాశారు.[9]

''మండపేటలో దుగ్గిరాల మాణిక్యం అనే వొక వేశ్య (యీమె యిప్పుడున్ను జీవించి వుంది). తొంబది సంవత్సరములను మించిన వయస్సులో దారుఢ్యం లోపం కూడా లేదు. యిప్పుడు కూడా భామావేషం కట్టవలసి వస్తే కట్టి వినికిడి చేస్తుందని వినడం''.

---

7. కొండా వెంకటప్పయ్య - స్వీయచరిత్ర, ప్రథమ భాగం, పుట. 22
8. అయ్యదేవర కాళేశ్వరరావు - నా జీవితకథ నవ్యాంధ్రము, పుటలు 21-22
9. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి - కథలు గాథలు - 2వ సంపుటం, పుట. 409

కూచిపూడివారు, భోగంవారు మాత్రమేకాక యానాదులు, మాలలు మొదలైన జాతులలో కొందరు వంశపారంపర్యంగా నాటకాలాడడమే వృత్తిగా పెట్టుకొన్నారు. జమీందారీ యుగంలో జానపదుల కోసం ఆడే నాటకాలలో ఈక్రిందివి ఉండేవి.

గరుడాచల నాటకం
గయోపాఖ్యాన నాటకం
చుక్కలూరు రామనాటకం
చుక్కలూరు సావిత్రీ నాటకం
తారాచంద్ర విలాస నాటకం
దూపాటిసావిత్రి నాటకం
ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకం
ధర్మపురి రామాయణము
నల నాటకము
పూసపాటి శశిరేఖ నాటకం
ప్రహ్లాద చరిత్రము - యక్షగానము
బెడుదూరు హరిశ్చంద్ర నాటకం
మన్నెంకొండ విజయవిలాసం - యక్షగానం
మాయలపల్లి నాటకం
లేపాక్షి రామాయణం
వల్లాయపురి ఉషాపరిణయ నాటకం
వెలిదండ్ల వీర విజయ విలాస నాటకం
వేములపల్లి ద్రౌపదీ కల్యాణ నాటకం
వేములపల్లి విరాటపర్వ నాటకం
శ్రీయాళ నాటకం
సంతవేలూరు కుశలవ నాటకం
సారంగధర నాటకం (చిత్రాంగి నాటకం)
సీతా కల్యాణము - యక్షగానం
సుబ్బకవి ప్రహ్లాద నాటకం
సూక్ష్మ రామాయణ నాటకం

నాటకాలలో సంతవేలూరు కుశలవ నాటకం మూడు రాత్రుల కథ. కూచిపూడివారు ప్రహ్లాద నాటకాన్ని రెండు రాత్రులు ఆడేవారు. పడకండ్లవారి మేళంలో స్త్రీలు కూడా పాల్గొంటారు. 19వ శతాబ్దపు నాటకాలు అంతో ఇంతో పండితోపజ్ఞంగా ఉండేవి. ఉత్తర భాగంలో పండితులూ, సామాన్యులు కూడా రచనలు చేసేవారు. అందుచేత వాటిలో లక్షణచ్యుతి బహుళంగా కనబడుతుంది. కొన్నింటిలో కేవలం వ్యావహారిక భాషయే ఉపయోగించేవారు. ఉత్తరభాగపు యక్షగానాలలో పరిణామం

పరిణాహం అధికం అనీ నాటకీయత ఆంధ్రజాతీయ జీవన ప్రతిబింబం అధికమనీ పరిశోధకులు చెప్తున్నారు.[10]

నాటకాలలో మొదటిసగం పద్యం, పిదపసగం దరువు పోకడగల అర్థపద్యాలు ఉండేవి. ఉదాహరణకు కంద, గీత, సీస, ద్విపద, వృత్తార్థాలు, దరువులలో హిందూస్థానీ పోకడలు వచ్చాయి. పచ్చి వ్యావహారిక మోటు హాస్యం ఉన్న ఈ నాటకాలు పామరులకు ఆనందదాయకమైనా ఇంగ్లీషు చదువు చదువుతున్న పట్టణాల మధ్య తరగతి మర్యాదస్తులకు రుచించకపోవడంలో ఆశ్చర్యం లేదు.

కుంఫిణీ యుగంలో తెల్లదొరల దగ్గర పనిచేసిన తెలుగువారు ఆంగ్లనాటక ప్రదర్శనలు చూసే అవకాశాలు కలిగాయి. కుంఫిణీ సివిలు సర్వెంట్ల కచేరీలు చాలా పట్టణాలలో ఉండేవి. కలకత్తా, మద్రాసు, బొంబాయి వంటి నగరాలలో తెల్లవాళ్ళకోసం, తెల్లవాళ్ళే వేసిన నాటకాలను చూసిన దేశీయులు ఉత్తేజితులయ్యారు. మొదట బెంగాలులోనూ, తర్వాత బొంబాయి పార్శీలు ఈ ఆంగ్ల రూపక పద్ధతులను అనుసరించి, నాటక సమాజాలను స్థాపించి ఔత్సాహిక ప్రదర్శనలు ప్రారంభించారు. 1875లో మద్రాసులో 'ది మద్రాస్ డ్రెమిటిక్ సొసైటీ'ని స్థాపించారు. ఇందులో ఇంగ్లీషువారు ఇంగ్లీషు నాటకాలే ఆడేవారు.

ఈ తెల్లవాళ్ళను చూసి మద్రాసులోని భారతీయులు 'ది మద్రాస్ ఓరియంటల్ డ్రమటిక్ కంపెనీ'ని 1879-80 ప్రాంతాలలో గోమఠం శ్రీనివాసాచారి సంస్థాపించారు. ఆయన స్వయంగా ప్రధాన భూమికలు ధరించేవారు. సంస్కృత నాటకాలను ప్రదర్శించేవారు. 1880లో ఈ నాటకాలను మద్రాసు గవర్నరూ, విజయనగరం మహారాజా శ్రీ ఆనంద గజపతి వీక్షించి ప్రశంసించారు. శ్రీనివాసాచారిగారికి 'ఇండియన్ గారిక్' అనే బిరుదు ఇచ్చారు. (గారిక్ గొప్ప ఆంగ్ల నాటకరంగ నటుడు).

భారతీయులు సంస్కృత నాటకాలను ప్రదర్శించడం రివాజుగా ఉన్న విషయమే. 1874లోనే విజయనగరంలో విజయరామ గజపతి కాలంలో 'జగన్నాథ విలాసినీ సభ' అనే నాటక సమాజం శకుంతలం, ఉత్తరరామచరిత్ర మొదలైన రూపకాలను ప్రదర్శించేవారు. వీరు సంస్కృత నాటకాలనే ఆడేవారు కనుక ఈ కంపెనీకి 'సంస్కృత అకాడెమీ' అనే నామాంతరం కూడా ఉంది. ఈ సమాజానికి బుచ్చిశాస్త్రి నాయకుడు. అందుచేత దీనిని 'బుచ్చిశాస్త్రి కంపెనీ' అని కూడా పిలిచేవారు.

విద్యాధికులూ, సంస్కృత జ్ఞానం ఉన్నవాళ్ళూ ఇలాగ రూపకాలను గీర్వాణ భాషలో ప్రదర్శించి సంతోషిస్తూ, తమ పోషకులు కొద్దిమందిని సంతోషపెడుతూ ఉండేవారు. వివిధ యుగాలలో హిందూ ప్రభువుల పాలనలో శకుంతలాది నాటకాలు రాజాస్థానాలలో ప్రదర్శించినప్పుడు పెద్దలను ఆహ్వానించి వుంటారుగాని పామరులను పిలిచి చూపేవారనిగాని, వారికివి బోధపడ్డాయనిగానీ చెప్పడానికి వీలులేదు. ప్రచారబోధనకై వీధి నాటకాలూ, బొమ్మలాటలూ, బుర్రకథలు అనాదిగా మనదేశంలో

10. యస్వీ జోగారావు - ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర, ప్రథమ భాగం, పుట.143

ఉన్నాయిగాని ఇంగ్లీషు చదువులపట్ల మొగ్గిన విద్యార్థులకూ, మధ్యతరగతి పట్టణవాసులకూ వేరే వినోదం అవసరమైంది. విద్యార్థి దశలో ఇది ఒక రకంగా సమకూర్చుకోగలిగారు.

ముఖ్యమైన జిల్లా కేంద్రాలన్నింటిలో కాకపోయినా కొన్నింటిలో కళాశాలలు ఉండేవి. వీటికి చాలా మట్టుకు తెల్లదొరలే ప్రిన్సిపాల్స్‌గా ఉండేవారు. ఆంగ్ల సాహిత్యంలో రూపకాలనూ, ముఖ్యంగా షేక్స్‌పియరు నాటకాలను పాఠాలుగా చెప్పేవారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న మాసుదొర పాఠం చెప్పడమేకాక తన విద్యార్థులచేత ఆంగ్ల నాటకాలను వేయించేవారు. 'మర్చెంట్ ఆఫ్ వెనీసు' ప్రదర్శించడానికి దొరగారు తర్ఫీదు ఇచ్చారు. నాటకం ఆడించారు. ఈ సంగతులు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఇలా కథనం చేశారు.[11]

''మాసుదొరగారు ప్రథమశాస్త్ర పరీక్షకు చదువు విద్యార్థులచే నా సంవత్సరము పాఠ్యపుస్తకమయిన 'వెనీసు వర్తకుడు' (Merchant of Venice) అను నింగ్లీషు నాటకము నాడించిరి. అది షేక్సుపియరు మహాకవి చేసిన నాటకము. దొరగారు విద్యార్థులకు రెండు మూడు మాసములుచ్చారణయు, నభినయనమును నేర్పి యాడించిరి. నాటక పాత్రధారులలో నా ప్రియమిత్రులయిన పారుపల్లి యచ్యుతరామయ్య, చిలకలపూడి సీతారామయ్య, తల్లాప్రగడ చలపతిరావు, సత్యరాజు మృత్యుంజయరావు మొదలగు వారుండుటచే, నేనా నాటకమునకు పోయి చూచి మహానందమును పొందితిని. అందు షయిలాకు వేషము వేసిన వానిని సభాసదులు మెచ్చుకొనిరి. ఆనాడు నాటకశాలలు గాని, పురమందిరములుగాని లేకపోవుటచే నాటకము నవాబు దేవిడీలో నాడబడెను. ఇది సెప్టెంబరులో జరిగెను. రాజమహేంద్రవరములో నింగ్లీషు నాటకమాడుట కదియే మొదలు.''

ఇది 1887లో జరిగింది. తెలుగు జిల్లాలలోని ఇతర పట్టణాలలో కొంచెం ముందూ వెనుకా ఆంగ్ల నాటకాలు అందులోనూ షేక్స్పియరు నాటకాలు మాత్రమే విద్యాశాఖలో **ఆడేవారు. 1879లోనే** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు మిత్రులతో ఆంగ్ల నాటకాలు ఆడారట. విశాఖపట్నంలోని జగన్మిత్ర నాటక సమాజంవారు కేవలం షేక్స్పియరు నాటకాలనే మొదట్లో వేసేవారు. నెల్లూరులో నెల్లూరి అమెచ్యూర్ నాటక సమాజం వారు కూడా డిటో. ఇతర ప్రాంతాల వివరాలు చరిత్రకెక్కలేదు. విద్యార్థులు ఇంగ్లీషు నాటకాలను ఆడుతూ ఉంటే, ఉపాధ్యాయులు వాటిని అనుదించాలనే అభిలాషను చూపటం అబ్బురం కాదు. రాజమండ్రి కళాశాలను గణితం, భూగోళశాస్త్రం బోధించే వావిలాల వాసుదేవశాస్త్రిగారు 1875లోనే షేక్స్పియరు రచించిన జూలియస్ అనే నాటకాన్ని అనువదించారు. అయితే ఇంగ్లీషు పద్యనాటకాన్ని ఎలా తెనిగించటం అనే సమస్య వచ్చి మొత్తం నాటకాన్ని తేటగీతి ఛందస్సులోనే రచించారు. ఈ సీజరు చరిత్ర పీఠికలో శాస్త్రిగారు ఇలా చెప్పారు.[12]

---

11. చిలకమర్తి లక్ష్మీనరసింహరావు – స్వీయచరిత్ర, పుట.54
12. కొత్తపల్లి వీరభద్రరావుగారు – 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము' లో ఉదాహరించారు. పుటలు.293–4

''ఆదిని లాఁతి తెలుంగుఁ బొత్తంబుల వలె దీని నానావిధ వృత్తములతోఁ బ్రబంధాకృతిని రచియింపం దలంపు గలిగె, కాని, యిప్పటివారికి నాటక రీతియందే యభిరుచి యెక్కువయని కొందఱు నా స్నేహితులు సలహా యిచ్చిన కతనఁ దొంటి యభిప్రాయము మాయించి నాటక వైఖరిని మొదటి నుండి తుదివఱకుం దేటగీతినే వ్రాయుట తగునని యెంచి యీ తీరున వ్రాసినాఁడ... ఇందుఁజాల భాగమాంగ్ల భాషా గ్రథితమగు విలియము షేక్స్పియరు ప్రణీత గ్రంథము ననుసరించియే వ్రాయంబడియెను. గాని, ప్రకరణానుకూలముగా నచ్చటచ్చటఁ గొంత చేర్పఁబడె. ఆంగ్లేయ సంజ్ఞాపదంబులకుగా నిందు వాడంబడ్డ వివిధ రూపములతో నొక్క పట్టిక దీని చిట్టచివరనను బంధింపఁబడెను. దుర్జ్ఞేయాభిప్రాయముల పట్ల రివరెండు-జే-హంటరుగారి టిప్పణములు చూచినాడు. ..... సెప్టెంబరు 12వ తేదీ, ఆన 1875 సం. - వావిలాల వాసుదేవశాస్త్రి.

ఈ అనువాదం గురించి కొత్తపల్లి వీరభద్రరావుగారు ఇలా విశదం చేశారు.[13]

''ఈ నాటకము ననువదించుటలో తెలుగుకవి కొంత స్వతంత్రత చూపెనని పీఠికలను బట్టి తెలియుచున్నది. ఆంగ్ల భాషలో నుండి యనువదింపబడిన ప్రథమ నాటకమగుటచే కవికి కొన్ని చిక్కులు వచ్చినవి. ఆ చిక్కులను చక్కగానే ఎదుర్కొనినాడు కవి. వానిని కథకు సంబంధించినవి, భాషకు సంబంధించినవియని రెండుగా విభజింపవచ్చును. ఈ రెండింటియందును కవి కొంత జయమును, కొంత పరాజయమును కూడా పొందెను. ఆంగ్ల సాహిత్య ప్రభావమువలననే ఈ యనువాద ప్రయత్నము జరిగెను. కాని, పాశ్చాత్య సంస్కృతితో పరిచయము అంతగాలేని దేశీయులకై యిది వ్రాయదగినదగుటచే, కొన్ని మార్పులను కవి-ఉపమాదుల విషయమున చేసెను. అవి అంత రమ్యముగ లేవు. కొన్ని స్థలములందవి దేశకాల పాత్రములను బట్టి పరిహాసాస్పదములగునట్లున్నవి.''

1880లో తెలుగుదేశంలో నాటక ప్రదర్శనల పట్ల విప్లవం ప్రారంభమైంది. ఆ సంవత్సరమే ధార్వాడ నాటక సమాజము అనే పేర ప్రసిద్ధమైన 'ఆల్టేకర్ కంపెనీ' అనే పార్టీ నాటక సమాజంవారు ఆంధ్రదేశ సంచారం చేశారు. వెళ్లిన ప్రతిచోట తమ ప్రదర్శనా నైపుణ్యంతో ప్రజలను ఆకట్టుకొన్నారు. అప్పటిదాకా తెలుగు వీధి నాటకాలలో కాగడాలు, అర్ధళాలు, బాడిదచెక్క నగలూ ఉండేవి. ధార్వాడ కంపెనీవారు గాజుదీపాలు, నాజూకు వర్ణాలు, గాజుపూసల హారాలు, చెమికీ దుస్తులు ప్రవేశపెట్టారు. ఆరు బయట నాటకం ఆడక, ఒక పాక వేసి అందులో ఆడేవారు. పక్కతెరలు, పై తెరలు, ఎక్కేతెరలు, దిగే తెరలు తీసుకొచ్చారు. దృశ్యాలకు సీనరీ తెరలు ఉండేవి. ఈ విధమైన నాటక ప్రదర్శనలు ఎవరిని ఆకట్టుకొనదు? ధార్వాడ నాటకాలలో దుస్తులు ఎంత సహజంగా ఉండేవో పాత్రల సంభాషణలు కూడా వచన శైలిలో సామాన్యంగా ఒకరితో ఒకరు ఎలా మాట్లాడుకొంటారో ఆ బాణీలు వివిధ సందర్భోచితమై రసయుక్తంగా ఉండేవి. ఈ నాటకాలలోని సహజత్వం ప్రజలను ఆకర్షించి తెలుగు నాటకాలను ఆవిధంగా ప్రదర్శించాలనే అభిలాషను కలిగించింది.

---

13. తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము, పుట.294

1880లో ధార్వాడ వారు వచ్చి ప్రదర్శన ఇవ్వగానే ఆ సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలలో వీరేశలింగం గారు కళాశాల విద్యార్థులతో ఒక సమాజం ఏర్పాటుచేసి, ధార్వాడవారు ప్రదర్శించిన పాకలోనే తొలి తెలుగు నవ్యనాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దీనికి ఏమిటి ప్రోద్బలమో వీరేశలింగంగారు చెప్పారు. తమ 'హాస్య సంజీవని'తో ప్రకటించిన 'వ్యవహారధర్మబోధిని' అనే ప్లీడరు నాటకం విద్యార్థులచేత 1880లో ఆడించారు. దాని గురించి స్వీయచరిత్రలో ఇలా రాశారు.[14]

''కులాచార విషయములలోను రాజకీయ వ్యవహారములలోను గల యనేక దురాచారములను వినోదకరముగా సంభాషణ రూపమున వెల్లడిచేసి తన్మూలమున దురాచారములను మాన్పుటకయి వివేకవర్ధని కంతర్భాగముగా హాస్య సంజీవని ప్రకటింపఁబడుచుండెను. ఇందుఁ బ్రకటింపఁబడిన వానిలో నొకటియగు వ్యవహార ధర్మబోధినిని నా మిత్రులు కొందఱును విద్యార్థులు కొందఱును జేరి 1880వ సంవత్సరమున శ్రీ విజయనగరము మహారాజాగారి బాలికా పాఠశాలలో మొదటఁ బ్రయోగించిరి. అందు న్యాయాధికారుల యొక్కయు న్యాయవాదుల యొక్కయు దుశ్చర్యలు పరిహాసరూపమునఁ బ్రకటింపఁ బడినవి. వానిని బ్రదర్శించుట వలన నందభివర్ణింపఁబడిన దోషములు గలవారి మనస్సులకుఁ గొంత నొప్పి గలిగినను నిటువంటి రూపకములను బ్రదర్శించుట కదియే మొదలయినందున నూఱుల కొలఁది జనులు వచ్చి చూచి యానందించిరి. ఇట్టి నాటక ప్రదర్శనముల వలన జనులకు వినోదము కలుగుటయేగాక యక్రమములు చేయువారు సిగ్గుపడి తమ ప్రవర్తనమును దిద్దుకొనుటయు నందువలన నీతి వర్ధిల్లుటయుఁ గలుగును గానఁ గ్రొత్త నాటకములను జేసి నాటక సమాజము నొకదానిని స్థాపింపవలసినదని నా మిత్రులనేకులు నన్నుఁ గోరిరి.''

ఈ మాటల వల్ల ధార్వాడ వారి ప్రభావం వల్ల రాజమండ్రిలో స్వతంత్ర్య నవ్య తెలుగు నాటకం సహజ సంభాషణ శైలిలో 1880లో ప్రదర్శన జరిగినట్లు స్పష్టంగా చెప్పవచ్చు. వ్యవహార ధర్మబోధిని నాటకం కాదని, ప్రహసన ప్రాయమని చరిత్రకారులు చిన్నచూపు చూస్తున్నారుగాని శిష్ట సాహిత్య దృక్పథాలు మారవలసి అవసరం ఉంది. అయితే ధార్వాడ వారిలాగ అట్టహాసనపు నాటకం అవసరమైనట్టు భావించి వీరేశలింగంగారు 1881లో షేక్స్‌పియర్ రచించిన 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' అనే నాటకాన్ని చమత్కార రత్నావళి అనే పేరుతో అనుసరణ రచనగా మలచి తమ విద్యార్థులచేత ధార్వాడవారు వేసిన పాకలోనే ఆడించారు. దీని గురించి ఇలా రాశారు.[15]

''....అట్టి నాటకములాడుట కదియే ప్రథమ ప్రయత్నమైనను, మొత్తము మీఁదన విజయప్రదముగానే జరిగినవని యెల్లవారు నభిప్రాయపడిరి. ఈ నాటక ప్రయోగము వలన సహితము పట్టణములో సంక్షోభము కలుగకపోలేదు. ఆ నాటకముల యందలి పాత్రములు విస్తారముగా పాఠశాలలోని విద్యార్థులు నాటకములలో వేషములు వేయుట గౌరవ హానికరమని యనేకుల అభిప్రాయమగుటచేత విద్యార్థుల సంరక్షకులు తమ బాలురచేత వేషములు వేయించి నందునకయి నామీఁద నభియోగము తెచ్చెదమని నన్ను

14. స్వీయచరిత్ర - ప్రథమ భాగం - పుట.169
15. కందుకూరి వీరేశలింగం - స్వీయచరిత్ర, మొదటి భాగం - పుట.169-170

బెదరించిరి. నాటక ప్రదర్శనము వలన విశేషలాభము కలుగుననియు, నీతివృద్ధి యగుననియు నేను దలచి(యుండినను, విద్యార్థులు నాటకములాడుట యందలి యుత్సాహము చేత(దమ పాఠములయందశ్రద్ధను జూపునట్లు కన(బడి నందున నాటక సమాజముల యందట్లు తరువాత నేనంతగా నాదరము చూపుచురాలేదు.''

వీరేశలింగంగారు ఉత్తరోత్తరా అనాదరం చూపించారేమోగాని 1880లో ఆయన 'మర్చెంట్ ఆఫ్ వెనిస్'' అనే షేక్సిపియరు నాటకాన్ని 'వెనీసు వర్తక చరిత్రము' అని అనువదించారు. ఇది ద్విపదలో రచించారు. వావిలాల వాసుదేవశాస్త్రిగారు సీజరు చరిత్రను పూర్వం తేటగీతిలో తెనిగించారు. ఇంగ్లీషు బ్లాంక్‌వర్స్ నాటకాలను ఏ ఛందస్సులలో ఆంధ్రీకరించడమన్నది ఒక సమస్యే. వీరేశలింగంగారి ఈ అనువాదం ప్రాచుర్యం పొందలేదు. గురజాడ శ్రీరామమూర్తిగారు కూడా 1880లో ఒక 'వినీసు వర్తక నాటకము' అనువదించారు. ఇది కూడా ప్రాచుర్యం పొందినట్టు లేదు. ఆనాడు కళాశాలలో పాఠ్యగ్రంథంగా ఉన్న ఆంగ్లనాటకం అశేషనాటకాన్ని అనువాదంలోనైనా ఆకర్షించడం అరుదు.

వీరేశలింగంగారూ, గురజాడ శ్రీరామమూర్తిగారు ఇలాగ అనువాద నాటకాలు రాస్తున్నప్పుడు నాలుగేళ్ళ కిందట ఎప్పుడో సీజరు చరిత్రను తెనిగించిన వావిలాల వాసుదేవశాస్త్రిగారు తెలుగులో ఒక స్వతంత్ర నాటకాన్ని రచించాలనుకొన్నారు. 1880లో 'నందక సామ్రాజ్యం' అనే అయిదు అంకాల రూపకాన్ని రాశారు. పేరు చారిత్రక నాటకాన్ని సూచించినా ఇది సాంఘికం. అందులో ఏమిటి సాధించదలచారో పీఠికలో ఇలా చెప్పారు.[16]

''.....ఇది నేను వ్రాయుటకు గల్గిన ముఖ్యోద్దేశము, మనవారిలో - అందులో బ్రాహ్మణులలో - బహుతరముగా(గానిపింపనట్టి యైకమత్యమును సర్వవిధంబుల స్వీకరించి, దాని వల్ల మేలు వడయ(గోర వలయునని యెఱింగించుటేగాని మరియొకటి కాదని స్పష్టముగా(జెప్పుచున్నాడను. ఈ సంగతినే పొడి మాటలతో(దెలియజేయక, కథ యొకటి కల్పించి, యందులో(బరస్పర వైరములు పెంచినవారు శిక్షింప(బడినట్లు కూర్చుట మంచిదని యెంచి, ఇట్టి నాయభిప్రాయంబునె మనవారెల్లరు(గైకొందురని తలంచి, నాటక ధోరణి వ్రాసితిని... పుస్తకము పూర్తిగా(జదివిన(దాక నాయీ యభిప్రాయమింత స్పష్టముగా(దేలకపోవచ్చును. మరియు నీదినములలో జరుగుచున్న యధికార దౌర్జన్యములు కూడ నిందక్కడక్కడ సందర్భవశమున(గాను పింప(గలవు.... నాటక ధోరణిని నేనిది వ్రాసితినని వినగానే నాటకాలంకార వేత్తలయిన మనవారులికిపడిలేచి చూచి దీనను శల్యపరీక్ష కారంభింపకపోరు. అట్టివారికి నేనొక్క విన్నవింపవలసి యున్నది. సంస్కృత నాటకములలో నధమ పాత్రములు ప్రాకృతమున మాటలాడుటయు, ఉత్తమ పాత్రములు సంస్కృతముననే గద్యపద్యములలో మాటలాడుటయు(గలదు. (గొప్ప యింటి స్త్రీలు గూడ నీచపాత్రములె). ఇందులో(గూడ నా ఫక్కి యవలంభించిన యెడల(బ్రాకృతమునకు బదులుగా గొల్లమాటలో, కోయమాటలో లేక గ్రామ్య భాషయైన

16. డాక్టరు పి.యస్.ఆర్. అప్పారావుగారు 'తెలుగు నాటక వికాసము'లో ఉదాహరించారు. పుట.226

వాడుక చేయవలసి యుండెను. ఇట్టిపనిని నేను చేయుటకు మన సొప్పక వదలినాఁడను. ఇప్పటికి వచనము లేకుండగనే వ్రాయబడినది. కాని నేను వ్రాయఁదలచుకొన్న నాటకములలో వాఁడుక మాటలు చేర్చుటయేకాక, సహజరీతిని వచనమే కూర్చువాఁడను....''

- నందక రాజ్యపీఠిక - 1-4-1880

ఈ పీఠిక వల్ల ఒకటి స్పష్టం అవుతోంది. ఆనాటి రచయితలకు చిన్నయసూరి పెట్టిన ఒరవడి తప్ప ఇంకొకటి నచ్చదు. పాత్రోచితభాష పనికిరాదు గాని సాంఘికాలు రాయాలన్న తపన ఉంది. వాసుదేవశాస్త్రిగారు 1880లో ఒక స్వతంత్ర రూపకాన్ని తెలుగులో రాయాలనుకొన్నా వారి గురువుగారు కోరాడ రామచంద్రశాస్త్రి (1816-1900) గారు 1860లోనే 'మంజరీ మధుకరీయము' అనే నాల్గంకాల నాటకాన్ని సంస్కృత నాటక మర్యాదలు పాటిస్తూ రచించారు. (ఇది 1908లోగాని అచ్చుపడలేదు.) దానిని వాసుదేవశాస్త్రిగారు చూసి గురువుగారి దగ్గర మార్గనాటక విధానాలు నేర్చుకొని ఉంటారు. మంజరీ మధుకరీయంలో మాలతీ మాధవం పోకడలున్నాయి. కథానిర్మాణం అలాగే ఉంటుంది. సంభాషణలు కొన్నిచోట్ల సరళంగా, కొన్నిచోట్ల జటిలంగా ఉంటాయి. మచ్చుకు ఒక సంభాషణా శకలాన్ని 'మంజరీ మధుకరీయం' నుండి చూద్దాం -

ప్రథమాంకం -

(అనంతరంబున మంజరియు నామోదరేఖయుం బ్రవేశించుచున్నారు)

ఆమో : హళా! మంజరి! సుమాళంబుగ నుంటివిగదా.

మంజ : అత్తిక! నీవు వచ్చుట నింక యద్దికలుగునని నెమ్మనంబున నే నమ్మెదనే.

ఆమో : హలా! యిట్లుంటి వేమే?

మంజ : అత్తికా! నీవు నాచెంగట నుంటివే?

ఆమో : హలా!నీకురంగట నవ్వమొదలగు వారందరున్నారుగదా?

మంజ : అత్తిక! యీ యవ్వతొల్లింటి యవ్వయనుకొంటివే.

ఆమో : ఇప్పుడు క్రొత్తగ మఱియొకతె యేతెంచెనే?

మంజ : కాదే. యవ్వయయిన యద్దియేకాని, దాని యాత్మ మారినదే.

ఆమో : ఓసీ చెలియా! కాదే, తొల్లింటికంటె నీయాత్మ మారినదే. దాని నెఱుంగక యమ్మను ఏంతగ దూరుచున్నావు.

మంజ : అత్తికా! కొన్ని నాడులు దడవున నుండుట నీ యాత్మయుం దాఱుమా అయ్యెనని దలంపదగునే.

ఈ దృశ్య శకలంలో ''హళా! అత్తికా!'' అనే సంబోధనలు కనబడతాయి. ఇవి సంస్కృత రూపక మర్యాదలు. భరతుడు నాట్యశాస్త్రంలో రూపకంలోని పాత్రలు ఒకరినొకరు సంబోధించుకొనేటప్పుడు ఏయే పదాలు ఉపయోగించాలో నిర్దేశించాడు.

నాట్యశాస్త్రం 17వ అధ్యాయం 'భాషా-సంబుద్ధి' నామ-కాకుస్వర విధానాలను సూచిస్తుంది.

నిర్దేశకులు (పిలుచువారు) పురుషులను సంబోధించు విధములు	**నిర్దిష్టులు (పిలువబడువారు)**	**నిర్దేశవచనము (పిలువవలసినమాట)**
స్త్రీ పురుషులందరును	మహర్షులను	భగవానుడు (భగవాన్!)
,,	మహర్షిపత్నులను	భగవతి!
,,	బ్రాహ్మణుని	ఆర్య!
	ఉపాధ్యాయుని	ఆచార్య!
ఇది ఉత్తముల విషయము	సములను	పేరుపెట్టి పిలవాలి
	సములు	ఉత్తముని
హీనజనులు		సంతోష సమయాలలో ఉపయోగించే చాటు పద్యాల్లో పేరు పెట్టి పిలవచ్చు
అందరు	మాన్యులను	భావ!
,,	కొంచెం తక్కువవారిని	మార్షక! (లేదా మారిష!)
,,		సములను వయస్య!
,,	అధములను	హంహో!
,,	యువరాజును	స్వామి!
,,	ఇతర రాజకుమారులను	భర్తృదారక!
తండ్రి లేదా గురువు	సుతుని లేదా శిష్యుని	వత్స! పుత్రక! తాత! లేదా పేరు పెట్టి లేదా గోత్రము పేరుతో -
భృత్యులు, ప్రజలు	నృపతిని	దేవ!
రాజు	విదూషకుని	వయస్య! లేదా పేరు పెట్టి
యౌవనవతులైన స్త్రీలంతా	పతిని	ఆర్యపుత్ర
తక్కిన వయస్సులలో	పతిని	ఆర్య!
,,	పతి రాజైనప్పుడు	మహారాజ!
తమ్ముడు	అన్నను	ఆర్య!
అన్న	తమ్ముని	పుత్రునివలె (వత్స! తాత!)

స్త్రీలను సంబోధించే విధం

అందరూ	తపస్వినులను, దేవతలను	భగవతి
,,	గమ్యను	భద్ర
సర్వపరిజనులు	రాజపత్నిని	భట్టివి! స్వామిని! దేవి!
ప్రేష్యలు	రాకుమారిని	భర్తృదారిక!
సమానులు	సఖులను	పరస్పరము హాళా!
స్త్రీలు	ఉత్తమప్రేష్యను	హంజా!
పరిజనులు	వేశ్యను	అజ్జుక

పై నిర్దేశాల ప్రకారం 'మంజరీ మధుకరీయం'లో స్త్రీలు సములను సంబోధించేటప్పుడు సఖులను 'హాళా!' అని పిలవాలి. మంజరీ మధుకరీయంలో దీనిని పాటిస్తూనే సమానులైన ఒకరు 'హాళా' అన్నప్పుడు ఇంకొకరు 'అత్తిక' (అన్న) అనే పదం హోదాల తేడాని చూపెట్టడానికే కావచ్చు.

ఈ నాటక కథలన్నీ ప్రదర్శన నోచుకోలేదు. ధార్వాడ కంపెనీ వారు వచ్చి నాటకాలు ఆడిన తర్వాతనే ప్రతి ఊళ్ళోనూ నాటక సమాజాలు ఏర్పడ్డాయి. స్థానిక రచయితలు, నటులు అవసరాల కోసం వచన నాటకాలు రచించి ఇచ్చేవారు. గుంటూరులో కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, దొడ్డమ్మపేట దివానంలో ఉన్న వడ్డాది సుబ్బారాయుడుగారు, బందరునుండి హైదరాబాదు వెళ్ళిన నాదెళ్ళ పురుషోత్తం గారు మొదలైనవారు ప్రదర్శన నిమిత్తము నాటకాలు రచించారు. అందరికన్నా ముందుగా కొక్కొండ వెంకటరత్నంగారు సంస్కృత రూపకాలలో 'వ్యాయోగం' అనే దాన్ని అభిమానించి 1872లో 'నరకాసుర విజయ వ్యాయోగా'న్ని 1894లో 'ధనుంజయ విజయ వ్యాయోగా'న్ని ఆంధ్రీకరించారు. సంస్కృత నాటక మర్యాదలను పాటించి పాత్రోచిత భాషను ఉపయోగించలేదు. నాదెండ్ల పురుషోత్తంగారు వేదం వెంకటరాయశాస్త్రిగారు కొంతవరకూ ప్రయత్నించారుగాని నాటకాన్ని నాటకంలాగ రచించడం 1892లో గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కంతోనే మొదలైంది. అప్పారావుగారి రచనకు ముందు తెలుగు నాటక సాహిత్యంలో వెలువడిన గ్రంథాల పేర్లూ, తీర్లూ చూడండి.

ముద్రితాలు

1872	నరకాసుర విజయవ్యాయోగం	కొక్కొండవారి అనువాదం
1875	కందుకూరి వారి 'శాకుంతలం'	వివేకవర్ధనిలో రెండంకాలు అచ్చుపడింది.
	పరవస్తువారి 'శాకుంతలం'	సకల విద్యాభివర్ధనిలో రెండంకాలు అచ్చు పడింది.
1876	సీజరు చరిత్ర	వావిలాల వాసుదేవశాస్త్రిగారి అనువాదం. సొంతం తేటగీతుల్లో.

1880	చమత్కార రత్నావళి	షేక్స్పియర్ కామెడీ ఆఫ్ ఎర్రర్స్‌కు వీరేశలింగంగారి అనువాదం
	నందక రాజ్యం	వావిలాల వాసుదేవశాస్త్రిగారి స్వతంత్ర సాంఘిక నాటకం. ఇది కూడా తేటగీతులలోనే ఉంది.
1880	బ్రహ్మ వివాహం	కందుకూరి వీరేశలింగంగారి స్వతంత్ర రచన. ప్రహసన ప్రాయం. (1878లోనే రచన)
	రత్నావళి	వీరేశలింగంగారి అనువాదం (సంస్కృతం నుండి)
	వెనీసు వణిజ నాటకం	గురజాడ శ్రీరామమూర్తిగారి అనువాదం
	వెనీసు వర్తక చరిత్రం	వీరేశలింగంగారి అనువాదం
	వివేకదీపిక	వీరేశలింగంగారి స్వతంత్ర రచన. ప్రచార రూపకం. స్త్రీ పునర్వివాహ సమస్య.
	వ్యవహార ధర్మబోధిని	వీరేశలింగంగారి ప్రహసనం. ప్లీడర్ల పితలాటకాలను చిత్రించేది.
1881	ఉత్తరరామచరిత్ర	వావిలాల వాసుదేవశాస్త్రిగారి అనువాదం
1883	అభిజ్ఞాన శాకుంతలం	వీరేశలింగంగారి అనువాదం సమగ్ర ప్రకటన.
1885	దక్షిణ గోగ్రహణం	వీరేశలింగంగారి స్వతంత్ర పౌరాణిక నాటకం.
	ప్రబోధ చంద్రోదయం	వీరేశలింగంగారి అనువాదం
	ప్రహ్లాద	వీరేశలింగంగారి స్వతంత్ర పౌరాణిక నాటకం
	మాళవికాగ్నిమిత్రం	వీరేశలింగంగారి అనువాదం
1886	రాగమంజరి	షెరిడన్- దిడ్యూయెన్నాకు వీరేశలింగంగారి అనువాదం
	వేణీసంహారం	వడ్డాది సుబ్బారాయుడిగారి అనువాదం
	సత్యహరిశ్చంద్ర	వీరేశలింగంగారి పౌరాణిక నాటకం
1887	తిర్యగ్విద్వన్మహాసభ	వీరేశలింగంగారి ప్రహసనం (1889)?
1888	హాస్య సంజీవని (ప్రథమభాగం)	వీరేశలింగంగారి 19 ప్రహసనాల సంకలనం

1889	మహారణ్యపురాధిపత్యం	వీరేశలింగంగారి ప్రహసనం
	విక్రమోర్వశీయం	వడ్డాది సుబ్బారాయుడిగారి అనువాదం
1890	హరిశ్చంద్ర నాటకం	నాదెండ్ల పురుషోత్తంగారి రచన. 'పాత్రోచిత ప్రసంగవచన సమన్వితం!
1891	నాగానందం	వేదం వెంకటరాయశాస్త్రిగారి అనువాదం! 'పాత్రోచితభాషా ప్రయోగం' గల రచన.
	మృచ్ఛకటిక	వావిలాల వాసుదేవశాస్త్రిగారి అనువాదం.
	హాస్య సంజీవని (ద్వితీయ భాగం)	వీరేశలింగంగారి 17 ప్రహసనాల సంకలనం

పుస్తక రూపంలో అచ్చుపడలేదుగాని బళ్ళారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారు 1887లోనే 'చిత్రనళీయం' అనే తెలుగు నాటకాన్ని రచించి, నటించి ఇతరులను నటింపచేసి ప్రదర్శించారు. ఆయన అంతకు ముందే కన్నడ నాటకాలచేత ప్రభావితులై 1886లో స్వప్నానిరుద్ధం అనే కన్నడ నాటకాన్ని రాసి ప్రదర్శించారు. ఆచార్యులుగారు మిత్రులతో కలసి 1879లో ఇంగ్లీషు నాటకాలు ఆడేవారు. ఆయనకు తెలుగులో నాటక రచన చేయాలన్న అభిలాష లేకపోలేదుగాని తెలుగు నాటక రచనకు అనువైనది కాదని ఆచార్యులుగారు మొదట కన్నడంలో రచనచేసి నాటకం ఆడినా తెలుగులో నాటకం రాసి తీరాలనీ, వేసి తీరాలని నిశ్చయించారు. 1886లో ఆచార్యులుగారు బళ్ళారిలో మిత్రులతో కలసి స్థాపించిన సరసవినోదినిసభ తరపున ఈ నాటక ప్రదర్శన చేయాలని తీర్మానించారు.

సరసవినోదిని సభలోని సభ్యులంతా గౌరవ కుటుంబం నుండి వచ్చిన కులీనులే. కొందరు న్యాయవాదులు, మరికొందరు ఆఫీసుల్లో ఉద్యోగస్తులు, కొందరు వర్తకులు, మరికొందరు భూస్వాములు, ముప్ఫయిమంది సభ్యులున్న ఈ సభవారు 1887 జనవరి, 29వ తారీఖునాడు ఆచార్యులవారి 'చిత్ర నళీయాన్ని' ఆడారు. ఇది తెలుగు నాటకరంగ చరిత్రలో చాలా ముఖ్యమైన తేది. ఆనాడే తెలుగు నాటకం స్టేజి నాటకంగా రూపొందే పరిస్థితులు ఆవిర్భవించాయి. ఆచార్యులుగారు మార్గరూపక మర్యాదలు తెలిసిన వారు ఆంగ్ల నాటక సంవిధానాలు విశ్లేషించి చూసినవారు. కన్నడ యక్షగానాల ప్రదర్శనలు విజయవంతం కావడం చూసినవారు. తెలుగు నాటక రంగం ఎలాంటి స్థితిలో ఉన్నది గమనించినవారు. చిత్రనళీయం నాటకం ప్రస్తావనలో విజయుడు, జయంతుడు అనే ఇద్దరు పౌరుల సంభాషణలో తమ అవగాహనంతా పొందుపరిచారు. ఆ ప్రస్తావనలో కొంత ఇలా ఉంది.[17]

''విజయ - ఈ బళ్ళారి పురమున నేఁడు చిత్రనళీయమను నాటకము జరుగఁగలదఁట, తిలకించి వత్తము రమ్ము.

జయం - ఏ భాషయందు?

విజయ - ఆంధ్రము నందు.

17. ధర్మవరం రామకృష్ణమాచార్యులు - చిత్రనళీయ నాటకము ప్రస్తావన, పుటలు 1-3

జయం – ఐన నింక వెనుకకుఁ దిరుగుదము.

విజయ – అదేల?

జయం – ఆంధ్రభాషయందైన దాని సారస్యము తెలిసియేయున్నదిగదా!

విజయ – అయ్యో! ఇటు తగునా? చూసిన పిదపఁ గదా గుణదోషము లెంచవలయు?

జయం – అటుకాదు, ఆంధ్రభాష నాటకమున కెత్తిన భాషకాదనియే నా తాత్పర్యము. కాకున్న నెందఱెందరో పూర్వకవిపుంగవులుండినను, ఒక్కరైన నాటకము నేల నాంధ్రమున రచియింపరైరి?

విజయ – జయంతా! ఇది యెట్టి భ్రాంతి! నాటకములకుఁ దగిన భాషయొకటియుఁ దగని భాషయొకటియు నుండునా? అందునను దేశభాషలనెల్ల మణిప్రాయమై యున్న తెనుఁగున కిట్టి కళంకమా? పూర్వకవులు నాటకములు రచియింపరైరన్న నందునకుఁ గారణము లెన్నియో యుండవచ్చును. ఆ కారణముల నెల్ల నిపుడూహించి వాదింపఁబని లేదు. ఆధునిక కవిశ్రేష్ఠులు కొందఱు మాతృభాష నుండియు, నాంగ్లేయ భాష నుండియు నాటకములఁ దెనుఁగున భాషాంతరీకరించి యున్నారు కదా! వానివలన నానందము గలుగుఁగదా? ఒక భాషనుండి మఱియొక భాషను వ్రాయుచోఁ గల పారతంత్ర్యములకుఁ బద పదార్థ నిర్బంధములకు నెల్ల నోర్చిన యానాటకములే యానంద జనకములై యుండ నూతన పథకమునఁ గల్పించిన స్వతంత్ర నాటకము లానంద జనకములే కావు. అందునను, ఈ నాటకములఁ గ్రీడించువారు సార్థక విద్యావంతులును, మనీషా విశేషులును నగు నగ్రజన్ములు. సరసవినోదినీసభకుఁ జేరినవారు. అదికాక నాటకకర్తయే తానొక పాత్రగా ఖేలన మొనర్చువాఁడు. చూడనైనఁ జూచి మఱి గుణాగుణముల బ్రశంసింతము.''

తర్వాత జయంతుడు ''ఎలాంటివారైన నాటకాలాడ వచ్చునా? అలా ఆడడం జనసమ్మతమవుతుందా?'' అని ప్రశ్నిస్తాడు. దానికి విజయుడు సుదీర్ఘంగా ఇలా సమాధానం చెప్తాడు.

విజయ – ''అందువలన బాధక మేమియుఁగానఁబడదు. మన ధర్మశాస్త్రములఁ గొన్నింటియందు నాటకుల యింటి యన్నము భుజింపఁగూడదని చెప్పఁబడి యున్నందున నాటక క్రీడనము పరిగ్రహణీయము కాదని గొందఱందురు. అయినఁ దాని తాత్పర్యము నారయ నాటకముల వలన జీవించువారి యన్నము పరిగ్రహింపఁగూడదని యేర్పడుఁగాని వేడుక కొఱకు జనుల నీతి బోధకొఱకును నాటక ఖేలన మొనరించువారి విషయము చెప్పబడినట్టు తోఁపదు. ఒకవేళ నట్లేయున్నట్టెంచి దూష్యమని తలంచిన, అదే ధర్మశాస్త్రముల వైద్యుల యింటి యన్నమును జ్యోతిష్కుల యింటి యన్నము నభోజ్యములని చెప్పఁబడదా? ఎవరు విడిచినారు? గాఁబట్టి యందువలన నంత దోషము లేదని చెప్పవలసి వచ్చుట యట్లుండఁగా నుద్దేశము మంచిదై జనులకు సుబోధ కలిగిన యెడల నున్న స్వల్పదోషము నడఁగిపోవుఁగదా?

అయినఁ బ్రాచీనులగు మనవారెవ్వరుగాని యట్లు నాటకములనాడిరా' అని మాత్రమడుగవచ్చును. మనప్రాచీనుల చరిత్రలే మనకుఁ దెలియఁదగిన సాధనములు కలుగవు. కావున నాడిరని కాని యాడలేదని కాని చెప్పను దృష్టాంతములు లేవు. అయిన సంస్కృత భాషలో ఘనపద్ధతిగల నాటకములఁ జూడగాఁ జక్కని జ్ఞానముగల మనపూర్వీకులు వాని నాడియే యుండ వలయునని తోఁపజేయుచున్నది. కాకున్న నంతపూర్ణదశకా నాటకములు రాఁజాలవు. తెనుఁగున నన్న నట్టి నాటకములు గానరావు. నీచనాటకము లకు యోగ్యములై కేవల భారతాభినయ విశేషముల కాస్పదములైన యక్షగానములు నాటలు గొన్ని మాత్రమే కానఁబడుచున్నవి. అవి తక్కువ వారి కొఱకే చేయఁబడినవి. అవి వారి వలన రసహీనముగా నాడఁబడి యమూలముగ వారకృత్యములు జరపుచు వచ్చినందున నాటకమన్న నసహ్యముగా నెంచునట్టి దుష్ప్రాప్తి లభించెనని తోఁచుచున్నది. సదుద్దేశము కలదియై హానిలేక యే విధమునగాని జనోపయోగకరమైన యేకార్యము నందును దోషము గలుగదు. అయినను, నూతనముగా జరుపఁబూనిన యే కార్యమునుగాని దూషించువారు పెక్కండ్రు. అట్టి దూషణమునకు భయపడిన నొక్క కార్యమును గాఁజాలదు.''

ఈ సంజాయిషీ వల్ల ఆనాటి మధ్య తరగతి విద్యావంతుల మనస్తత్వం బాగా విశదమవుతోంది. యక్షగానాలు, వీధి నాటకాలు తక్కువ వారికొరకే నిర్దేశించినవి. ఇవి మర్యాదస్తులు ఆడకూడదు. కాని, సంస్కారవంతులకోసం నాటకాలు రాసి ఆడవచ్చు. ఆడించవచ్చు. అయితే మార్గరూపకాలులాగ గద్యపద్యాత్మకమైన నాటకాలు జనం చూడరు. తన నాటకాలు జనం చూడాలి. దానికే సాధనం? జనానికి ఇష్టమైన మాటలను నాటకంలో ప్రవేశపెట్టాలి. అందుకు తగిన సబబులు ఈవిధంగా చెప్పారు.

''విజయ - సాధారణముగా సంస్కృత నాటకములేమి, యాంగిలేయ నాటకము లేమి వృత్తములును, వాక్యములును గలయవి. ఈ నాటకకర్తయు నట్లే వృత్త వాక్యరూపకముగ దీని రచియింపనుద్యమించె. తన కాలముననే తానొర్చిన నాటకముల జనుల సుబోధకై క్రీడింప వలయునని నభిలాష మీ కవికిఁ జనించె. ఈ ప్రాంతముల వారదేమి కారణమో నాటకములఁ జూచునప్పు డందలి సంవిధాన చమత్కారమును, అర్థ వైశద్యమునుఁ గవితా చమత్కృతి యునంత సరకు సేయక సంగీతమున మాత్రమెక్కువగా నభిలాష గలవారుగా నుండుటచే వారి సంతోషమున్నకై సంవిధాన సందర్భము ననుసరించి వచన సరణికిని, పద్య సరణికిని గొఱత లేకుండఁ జేసియున్నను, అందందుఁ బాటలు సయితము నెలకొలుపవలసి వచ్చె. ధీరనాటకములకుఁ బాటలు ముఖ్యములు కావనియు, మీఁదు మిక్కిలి పాటలవలన నెప్పటికిని భావ ప్రకటనము సురుచిరముగాఁ గలుగ జాలదనియు జనులందఱు తెలియువఱకు వారి మార్గమే యవలంబింపవలయుఁగదా!''

జనులందరికీ పాటలు భావప్రకటనకు తగినవి కావని తెలిసే రచననే వాడాలని 1882 జనవరిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు భావించారు. పాటలను ప్రవేశపెట్టారు. అయితే 1882 దాటి నూరేళ్ళు పైబడినా తెలుగు జనులకు నాటకంలో సంగీతం బాగుండదనే అభిప్రాయం కలగలేదు. స్టేజి నాటకమంటే పాటలూ, పద్యాలు నటులు పాడేదే అన్న అభిప్రాయం ఇంకా దేశంలో ఉంది. ఇది ప్రజల తప్పుకాదు. శతాబ్దాల తరబడి నాటకం అంటే ఇలా ఉండాలన్న భావం ప్రజలలో నాటుకుపోయింది. సంగీతం నాటకంలో ఒక భాగం. నృత్తం, గీతం, వాద్యం ఈ మూడు ఉన్నదే సంగీతమని నిర్వచనం. (నృత్తం గీతంచ వాద్యంచత్రయం సంగీతముచ్యతే.) చేదు మందుకు అనుపానం లాగ ధర్మపన్నాలకు రాగవరుసలు అవసరమే. ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు ఆనాడు మార్గరూపకానికీ, వీధి నాటకానికీ అంటుగట్టి ఆంగ్ల నాటక సంవిధానం ఎరువుగా వాడి తెలుగుతోటలో నాటారు. ఆ మొక్క నేటికి మానై, ఊడలు దించింది.

నాటకాలలో పాటలు ప్రవేశపెట్టినందుకు ధర్మవరం వారిని చాలామంది తప్పుపట్టారు. 1894లో చిత్రనళీయం ప్రథమ ముద్రణ ప్రతిలో ఆచార్యులుగా పీఠిక రాస్తూ అందులో ఇలా చెప్పారు.

''ఈ నాటకమును, మరి యితరములగు నాటకములను, ఆడఁబడిన కాలమునఁ బాటలు కొన్ని రచియింపఁబడియుండె. ఈ పాటలు విషయమై యొక్కింత వక్కాణింపఁదగి యున్నది. నాటకములు సామాన్యముగాఁ బద్య గద్యాత్మకములై కానంబడియెడి. పాటలు గలది యక్షగానమను పేరుఁన బరఁగుచున్నది. ఈ నాటకములు సర్వవిషయముల నింగ్లీషు భాషయందును సంస్కృత భాష యందునుగల నాటక లక్షణముల ననుసరించియే రచియింపఁబడినవి కాని యక్షగానములవలె రచియింపఁబడినవి కావు. అయిన నీ నాటకములు తాత్కాలమునఁగ్రీడించి చూడవచ్చిన వారికి సుబోధ గలిగించు తలంపు కలిమి వలనను, జనసామాన్యమునకుఁ బద్యముల యందు విశేషాభిలాషము కలుగకుండుటం జేసియు; అట్టివారు గానమును బాటలను నాదరించుటఁజేసియు, వారి యాదరణ ముఖ్యముగాఁ గలుగ వలయుటం జేసియు, నాటకముల యందందుఁ బద్యములుండినను బహుతరముగఁ బాటలు నెలకొలుపఁబడియె.

''ధీర పద్ధతిగల నాటకమునఁ బాటలుండుట యంత సురుచిరము కాదనియే నా తాత్పర్యము. మాతృభాషయందు నిండు సాహితి కలవారి 'నాటకాంత సాహితి' కలవారిని యాఖ్యగలిగింపఁజాలు నాటకములున్నయట్లు, ఆంధ్రభాష యందట్టివి, లేవుగా యనులోపమును నా యావచ్ఛక్తి సవరించుతలంపే పట్టువడి యుండుటచే సాహితిని వృద్ధిచేయఁ జాలు శక్తి చాలని పాటల నందుఁబొందింప వలయునని నా యుద్దేశముగాదు. కాఁబట్టి పాటలున్న చోట్ల నెల్లఁదగిన భంగిఁ బద్యములఁ బొందు పఱిచి యున్నాఁడ. పాటలయందును నభిలాషము గలవారి కోరికఁ దీఱుప నా పాటల నొక ప్రక్కనఁ బ్రచురించినాఁడ. ఈ మాటల వలనఁ బాటలు గర్హనీయములని చెప్పనెంచిన వాఁడఁగాను.

''వ్యాకరణ దుష్టములగు పదముల మాని ప్రాసాది నియమములఁ దప్పక రచియింపఁబడిన పాటలు తఱుచుగా నుండమిచే సాహితీ నైపుణిగల వారికి

వానియందుపేక్ష పొడమి యుండు(గాక. పాటలేమి పాప మొనర్చినవి? వానియందు రసమొదవదా? పాకములలభింపదా? భావము గలుగదా? ఛందోనియమము చాలదా? అయిన నాటక కుర్దన మొనరించు వారికి రాగము నందును దాళము నందును ధ్యానము మానకుండవలయుటం జేసి పద్యముల యందు(బోలె(బాటలయందు భావ ప్రకటనము గలిగింప నిర్బంధము గలుగుననుట మాత్రమొప్పుకొన(దగియున్నది. ఈ కారణము వలననే మానవలసి వచ్చె(గాని వేరొండు కారణము వలన(గాదు. అరసి చూడ(గొన్ని సందర్భముల యందు పద్యములకంటెను, వచనములకంటెను బాటలే రసజనకములగునవి నాకు(దప్పనియభిప్రాయము''.

బళ్ళారిలో ధర్మవరం వారు నూతన ప్రయోగాలు చేసి తెలుగు స్టేజి నాటకాన్ని రూపొందిస్తున్నప్పుడు, రాజమండ్రిలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఇమ్మానేని హనుమంతరావుగారి 'రాజమహేంద్రవర హిందూనాటక సమాజం' కోసం నాటకాలు రాశారు. వీటన్నింటినీ ఆ సమాజం వారు వేశారు. వాటి వివరాలు ఇవి :

1889 - 1. కీచక వధ
2. ద్రౌపదీ పరిణయం
3. గయోపాఖ్యానం
4. శ్రీరామజననం

1890 - 1. పారిజాతాపహరణం
2. నల
3. సీతాకల్యాణం

ఈ నాటకాలలో ముఖ్యపాత్రలను ధరించే హనుమంతరావుగారుగానీ, టంగుటూరి ప్రకాశంగారుగానీ పద్యాలు చదువలేదు. పద్యాలు చదువగలిగేవారి కోసం అక్కడక్కడా పద్యాలు పెట్టినా చిలకమర్తివారు మొదట ఇంచుమించు వచన నాటకాలే రాశారు. గయోపాఖ్యానం రచించేనాటికి చిలకమర్తి వారికి ఇరవైరెండు సంవత్సరాల వయసు. శ్రీకృష్ణుని పాత్ర ధరించే నటునికి పద్యాలు చదవడం వచ్చుగనుక నాటకాలలో కొన్ని పద్యాలు పెట్టారు. తర్వాత కొత్త పద్యాలను చేరుస్తూ వచ్చారు. నాటక రచన ప్రదర్శన కోసం కనుక నటుల అవసరాలను రచయిత దృష్టిలో పెట్టుకోవలసి వచ్చింది.

1887లో ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు నాటక రంగంలో విప్లవాన్ని తీసుకువచ్చారు. భారతీయ రూపకాలు మంగళాంతాలుగానే ఉండాలన్నది లాక్షణికుల నిర్దేశం. నిజానికి కావ్యం ఆది మధ్యాంతరాలలో మంగళాన్ని కాంక్షిస్తున్నట్టు రచించాలి. అయితే పాశ్చాత్య రూపకాలలో ట్రాజడీలు ఉన్నాయి. ఆంగ్ల నాటక రీతులను ఆకళించుకొన్న ఆచార్యులుగారు విషాదాంత నాటకం రాసి ప్రదర్శిస్తే తప్పేమిటని 'సారంగధర'ను తమ సమాజం తరపున ప్రదర్శించారు. లోకంలో చాలామంది చాలా విషయాలను ఈ నాటకం పట్ల అభ్యంతరాలను, అసమ్మతిని ప్రకటించారు. వాటికి ఆచార్యులుగారు సమాధానాలు చెప్పారు. ఆయన వృత్తిరీత్యా న్యాయవాదులు. పట్టిన కేసును నచ్చచెప్పేటట్టు సమర్థించడం వారికి తెలుసు.

సవతి తల్లి కుమారుని మోహించడం దుర్నీతి కాదా అన్న ప్రశ్నకు జవాబు : ''నీతి దుర్నీతి పరస్పర భావాలు కలిగినవి. దుర్నీతి కొంచెమైన ప్రకటించకపోతే నీతికి కాంతి కలగదు. రావణుని దుర్నీతి లేకపోతే రాముడికింత కీర్తి వస్తుందా? దుర్యోధనుని దుర్నీతి లేకపోతే పాండవులకు అంతటి ఖ్యాతి వస్తుందా? కావున నీతి కుదర్చవలెనన్న దుర్నీతి నించుక ప్రకటించియే తీరవలెనని నా సవినయ విజ్ఞాపనం. రుచి భేదములు, అభిప్రాయభేదములున్న నుండుగాక!'' అని ఆచార్యులుగారు స్పష్టం చేశారు.

నాటకం ఎలా నడిపించినా చిట్టచివర నీతిపరులకు సుఖము, దుర్నీతిపరులకు దుఃఖము కలుగుటయే ఫలశ్రుతిలో చెప్పాలని పూర్వ లాక్షణిక మతము. అయితే ఆచార్యులుగారు ఇందుకు ఒప్పుకొనరు. లోకంలో అలా జరగదు. ''సుత్పరుషుల కెందుఁగాని ప్రాయకముగా బాధలు వచ్చుటయే మనము కనుచున్నారము. అదిగాక లోకమున జరుగు విషయములనెన్నియో పొరపాటులు కలవుగదా! సద్గుణము కలవారలెందఱికో చెప్పరాని దుఃఖములు కలుగుట చూడమా? వాటి కన్నిటికి కారణములు చెప్పుటకు సాధ్యమా? అట్లే యియ్యెడను నూహింపవలయు'' అన్నారు. విషాద సారంగధర నాటకం ఉపోద్ఘాతంలో.

ధర్మవరం వారు తెచ్చిన మార్పుల వల్ల మన నాటకాల పేర్లలో 'సంగీత' అని గాని, 'విషాద' అనిగాని విశేషణాలు తర్వాత అవసరమయ్యాయి. గద్య నాటకాలలో పద్యాలు ఎక్కువయ్యాక వాటితోపాటు పార్సీ వరసలకు ప్రతిగా ఠుమ్రీ, టప్పా, దరువు, గజల్ వంటి పాటలు తయారుచేస్తూ వాటిని నాటకాలలో ప్రవేశపెట్టారు. మొత్తంమీద తెలుగులో నాటకం అంటే సం[illegible] నాటమనిన్నీ, నాటకం ఆడడం అంటే నాటకం పాడడం అనిన్నీ అర్థాలు వచ్చాయి. అయితే ఒక సంగతి మరిచిపోగూడదు. పార్సీ నాటకాల ప్రభావం వల్ల మన నాటకాలలోని సంగీతం ప్రవేశించిందనుకొంటారుగాని ఆదిలో పార్శీ నాటకాలు కర్ణాటక యక్షగానాలవల్ల ప్రభావితమై ఆ సంగీత బాణీలోను తమ నాటకాలను మలుచుకొన్నారు. 1842లో మహారాష్ట్రలోని సాంగ్లీ ప్రభువు అప్పా సాహిబ్ ఒక కన్నడ యక్షగాన ప్రదర్శనను చూసి, మరాఠీ భాషలో విష్ణుదాస్ భావే చేత నాటకం రాయించారు. ఆ ప్రదర్శన విజయవంతం కావడంతో పార్శీలు దానిని అనుసరించారు. 1880లో దేశంలో సంచారం చేసిన ఆ కంపెనీలు సంగీతం వల్లనే జనాకర్షణ పొందాయి. యక్షగానం వల్ల ప్రభావితులయినవారు మళ్ళా యక్షగానాలు మరచిపోయిన మధ్య తరగతి పట్టణవాసులకు కొత్త రుచులను పుట్టించారు. ఇంగ్లీషు చదువుల వల్ల సంప్రదాయానికి దూరంగా వెళుతున్నవారు ఈ సంగీత నాటకాలవల్ల మళ్ళా ప్రధాన వాహినిలో చేరి కలువవలసి వచ్చింది.

వీధి నాటకాలు, తోలుబొమ్మలు ఆడించేవాళ్ళ బతుకులు ఈ స్టేజి నాటకాలవల్ల మార్పు చెందాయి. ప్రదర్శన రంగంలో కొత్తరీతులు వచ్చినప్పుడు పాత కళలకు కాలదోషం పట్టడం సహజం. అయితే కాలానికి తగ్గ మార్పులు అమలుపర్చాలి. కడపమండలంలో వనారస సంజీవరావు కుటుంబంలో అతని పెద్దభార్య, అయిదుగురు కొడుకులు, కూతురు తోలుబొమ్మలాటవల్ల 1877నుంచి జీవించేవారు. అన్నదమ్ములలో ఒకరు మృదంగం, ఒకరు ఫిడేలు, మరొకరు తాళం వాయించేవారు. అందరూ పాడేవారు. అందరూ బొమ్మలాడించేవారు. తోలుబొమ్మలు చేయడం, వాటికి రంగులు వేయడం

మొదలైన విద్యలలో ఆరితేరి, తమదీ అనే ఒక బాణి సృష్టించుకొన్నారు. ఈ కుటుంబంలో పకీరయ్య అనే అనాథ బాలుడు వచ్చి చేరాడు. అతనికి గోవిందప్ప, లేక గోవిందరావు అనే పేరుపెట్టి ఇవ్వవలసిన శిక్షణ ఇచ్చి ఆటలో పెట్టారు. గోవిందరావు తమ పెద్దలతో ధార్వాడ కంపెనీ వారి నాటకాలను చూసి ఆకర్షితుడై తాముకూడా తోలుబొమ్మలకు బదులు నాటకాలాడడం మంచిదని భావించాడు. కుటుంబసభ్యులు అంగీకరించారు. 1895లో 'కీచకవధ' అనే తొలినాటకాన్ని వనారస కుటుంబం వారు ప్రదర్శించారు. తమ కంపెనీకి 'శారదా వినోదినీ నాటక సభ' అని పేరు పెట్టుకొన్నారు. అయితే కడప జిల్లా రాయచోటి తాలూకాలోని 'సురభి' గ్రామంలో తొలినాటకం ఆడడం వల్ల వనారస కుటుంబానికి 'సురభి' వారనే యింటిపేరు లాంటి విశేషణం ఉత్తరోత్తరా సంక్రమించింది.

ఆదిలో సురభి కుటుంబంలో ఆడామగా అందరూ ముప్ఫయిమంది సభ్యులు ఉండేవారు. అందరూ నాటకాలలో ఏదో ఒక పనిచేసేవారు. తమ నాటకాలను పాకల్లో టిక్కెట్లు పెట్టి ఆడేవారు. అందరూ కలసిమెలసి ఆర్జించింది సమంగా పంచుకొంటూ జీవించేవారు. సంచార జీవనం చేస్తూ వెళ్ళిన ప్రతిచోట కొత్తపాటలూ, కొత్త నాటకాలు తమ విద్యలలో చేర్చుకొనేవారు. ఆదిభట్ల నారాయణదాసుగారు రాయలసీమలో వీరి నాటకాలు చూసి, మెచ్చుకొని కొన్ని పాటలు రాసి ఇవ్వడమేకాక అవి నేర్పించారు.

1887లో ధర్మవరం కృష్ణమాచార్యులుగారు విషాద నాటకాలు రాయడం ప్రారంభించి ఒక విప్లవాన్ని తీసుకువస్తే 1897లో వేదం వెంకటరాయశాస్త్రిగారు పాత్రోచిత భాషను నాటకాలలో వాడాలన్న వాదానికి బలంగా ప్రతాపరుద్రీయం అనే నాటకాన్ని రచించారు. భరతుడు తన నాట్యశాస్త్రము 17వ అధ్యాయంలో భాషాభేదాల గురించి చెప్పాడు (1) అతిభాష, (2) ఆర్యభాష (3) జాతిభాష (4) యోన్యంతరీ భాష అని భాష నాలుగు రకాలు అని చెప్పాడు.

వైదిక శబ్దాలు బహుళంగా ఉండే అతిభాష దేవతలకు వాడాలి.
వైదిక శబ్దాలు విరళంగా ఉండే ఆర్యభాషను రాజులకు వాడాలి.

జాతి భాష రెండురకాలుగా ఉంటుంది. ఒకటి ప్రాకృతం. (ఇది మ్లేచ్ఛభాష) రెండోది సంస్కృతం. పశుపక్ష్యాదుల భాషలను కూడా నాట్య ధర్మప్రకారం సూచించాలి. దీనిని యోన్యంతర భాష అంటారు.

నాటకాలలో నలుగురు నాయకులకూ (ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీర ప్రశాంతులు) సంస్కృతాన్నే వాడాలి. మారువేషంలో ఉన్నప్పుడు వీరికి ప్రాకృతం వాడాలి. అర్చకులు, పూజారులు, స్త్రీలు, నీచులు, నపుంసకులు మొదలైనవారు ప్రాకృతమే వాడాలి. బర్బర, కిరాత, ఆంధ్ర, ద్రవిడ ప్రభృతి జాతులకు శుద్ధభాషలైన మాగధి, శౌరసేని వాడకూడదు. చెప్పవలసిన నియమాలు అన్నీ చెప్పి భరతుడు తాను ఏమైనా చెప్పకుండా వదలివేస్తే ఆ విషయాలను లోకంనుంచి గ్రహించాలని చెప్పాడు. నాటకం లోకవృత్తాను సరణం కనుక ఎవరెవరు ఎలా మాట్లాడుతారో ఆవిధంగా నాటకంలోని పాత్రలకు వేరువేరు డిగ్రీలలో భాష ఉండాలి. ఈ సంగతి 1892లో గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కంలో ప్రవేశపెట్టారు. 1887లో వేదం వారు ప్రతాప రుద్రీయంలో ఇది ప్రచారం చేశారు.

లక్షణ గ్రంథాల జోలికి పోకుండా, లోకాన్ని అనుసరించి వీరేశలింగంగారు ఆదిలోనే తమ బ్రహ్మావివాహం (పెద్దయ్యగారి పెళ్లి పుస్తకం), వ్యవహార ధర్మబోధిని (ప్లీడరు నాటకం) రచనలలో ఒక రకం పాత్రోచితభాషను ఉపయోగించారు. ఈ వాడుకభాష రాణించింది. అయితే ఆ రచనలు నాటకాలు కావని ప్రహసన తుల్యాలనీ అనడంచేత వీరేశలింగంగారు, శిష్టభాషలో నాటక రచన చేయక తప్పింది కాదు. 1892లో గురజాడ అప్పారావుగారు లోకాన్నే ప్రమాణంగా ఎంచి రచన చేశారు. 1897లో వేదంవారు లక్షణ గ్రంథాలు ఆశ్రయంవల్ల పాత్రోచిత భాషను సంరక్షించుకొన్నారు. వీరేశలింగంగారు తమ రచనల సంకలనంలో ఒకటవ రెండవ సంపుటాలలో వున్న ప్రెంచి, ఇంగ్లీషు నాటకాల అనుసరణలలోనూ, ఆయన సొంత నాటకాలలోనూ ఉన్నత పాత్రలు వాడే ఆధునిక తెలుగు రూపాలను గురజాడ అప్పారావుగారు ప్రస్తావించి 'తన పాత్రల సామాజిక స్థానాన్ని బట్టి భాషను మామూలుగా వీరేశలింగంగారు మార్చారు'' అని చెప్పారు.[18] అలా మార్చినప్పుడే రసోత్పత్తి ఉంటుంది. ఇది వేదం వారూ గుర్తించారు.

దశవిధ రూపకాలు నాట్యంలో ఉన్నవే. నాట్యాన్ని పూర్వం కీర్తన, కేళిక అని పిలిచేవారు. (వీర నరసింహరాయలు కూచిపూడి వారికి కీర్తనకు, కేళికకు సెలవు ఇచ్చి ఆడించాడు) కీర్తనకు పాత్రోచిత భాష అవసరం. అందుకే అన్నమాచార్యుల వారు సంకీర్తన లక్షణాలలో నిర్దేశించిన విషయాలు ఇలా ఉన్నాయి.[19]

1. పదములు శృంగార వధూ
   మృదు మధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
   విది తాథన్ గ్రామ్యోక్తులు
   పదిలముగా బొంక మెఱిఁగి పలుకఁగజెల్లున్
2. పురుషోక్తి సంస్కృతంబును
   దరుణీ వాక్యమునఁ బ్రాకృతము నీచవధూ
   పరిభాష నితర భాషలు
   పరగిన క్రియనుచిత భాష పదములఁజెల్లున్
3. వల్లవనారీ మ్లేచ్ఛా
   ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై
   చెల్లును గ్రామ్యములైనను
   హల్లీసక ముఖ్య నాటకాధిక పణితిన్
4. జగతిఁగల జెల్లుబళ్లై
   నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్
   తగదనరహి చెడుఁబువ్వల
   సొగసుడుగం బిసికి కంపు చూసిన భంగిన్

---

18. గురజాడ రచనలు - అసమ్మతి పత్రం - పుట.87
19. తాళ్ళపాకవారి లఘుకృతులు - మొదటి సంపుటం (తిరుపతి దేవస్థానం వారిది) - (1935) పుట.147-148

అన్నమయ్య తన శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలో వాడిన పాత్రోచిత భాషవల్లనే రసోత్పత్తి జరిగేది. క్షేత్రయ్య అదే అనుసరించాడు. తంజావూరు యక్షగానాలలో తర్వాత వీధినాటకాలలో పాత్రోచిత భాషే ఉండేది. మధ్యలో కృతక భాష వచ్చింది. వేదంవారు ఏ స్థాయిలో పాత్రలకు ఆ భాష వాడడం వల్ల జీవం వచ్చింది. తెలుగుదేశంలో చాలా ఊళ్లు చూడడం వల్ల వేదం వెంకటరాయశాస్త్రిగారికి సాయిబులు, చాకళ్లు, మంగళ్లు, పామరులు, విద్యావంతులు, బాలురు, స్త్రీలు, నానా ప్రదేశాలవారు వాడే గ్రామ్యభేదాలను మెలకువతో కనిపెట్టడం సాధ్యమైంది. ఆ భాషాభేదాలను ప్రతిభావంతంగా ప్రతాపరుద్రీయంలో ప్రవేశపెట్టారు. వేదంవారు ఒక్క నాటక రచనలోనే గ్రామ్యాన్ని అవసరమైన చోట అంగీకరించారుగాని వారు పూర్తిగా గ్రాంథికవాదులే. ఉత్తరోత్తరా కొన్ని నాటకాలలో వారే విదేశ, విజాతీయ పాత్రల చేతకూడా గ్రాంథికం మాట్లాడించారు.

నాటకాలలో పాత్రోచిత భాషను ఉపయోగించాలనే వేదం వారి వాదాన్ని కొక్కొండ వెంకటరత్నంగారు ఎదిరించారు. బళ్ళారిలోని ధర్మవరం రామకృష్ణమా చార్యులుగారు తోడయ్యారు. 1897లో బళ్ళారిలో 'కవిపండిత సభ'ను స్థాపించారు. ఇందులో వావిలకొలను సుబ్బారావుగారు, కోలాచలం శ్రీనివాసరావుగారు మొదలైనవారు చేరారు. వాదోపవాదాలు జరిగాయి. కోలాచలం శ్రీనివాసరావుగారు న్యాయవాదులు. నాటకకర్తలు. 1892 నుండే నాటకాలు రచించి ఆడించేవారు. బళ్ళారిలో ధర్మవరంవారి 'సరసవినోదిని సభ'కు పోటీగా 'సుమనోరమాసభ'ను కోలాచలంవారు స్థాపించి తమ నాటకాలు ఆడించేవారు. ఆయన 'సునందనీ పరిణయం' (1892), సుఖమంజరీ పరిణయం (1895), మదాలసా నాటకం (1895-96), సీమంతినీ నాటకం (1897) రచించారు. కోలాచలంవారి ఈ నాటకాలు పత్రికలలో విద్యార్థుల దృష్టిలో పడి వాదోపవాదాలకు గురి అయినాయి. కోలాచలంవారు గ్రాంథికవాదులు. జాతీయోద్యమం లోనూ, సంఘసంస్కరణలోనూ అభినివేశం ఉన్నవారు. ప్రపంచ నాటక చరిత్రను అధ్యయనం చేసి దానిమీద ఇంగ్లీషులో ఒక గ్రంథం రచించారు. ఈయన 1907లో ప్రకటించిన 'రామరాజచరిత్ర' (కర్ణాటక రాజ్య నాశనం) అన్న నాటకంలో చారిత్రక ఇతివృత్తాలను చేపట్టారు. అదే సంవత్సరంలో ప్రచురించిన 'సుల్తాన చాందబీ' కూడా ఆ కోవ నాటకమే. కోలాచలం శ్రీనివాసరావుగారు రచించిన నాటకాలలో ఈ రెండే ప్రసిద్ధమై వీరికి 'ఆంధ్రచారిత్రక నాటక పితామహ' అనే బిరుదును తెచ్చిపెట్టాయి. మిగతావన్నీ పౌరాణికాలూ, కల్పితగాథలే. కోలాచలంవారు కూడా ధర్మవరం వారిలాగ పాటలు, పద్యాలు ప్రోత్సహించినవారే.

ఒక ఊళ్ళో ఉన్న నాటక సమాజంవారు ఆ ఊళ్ళోనేకాక పర్యటనలు చేస్తూ వివిధ ప్రదేశాలలో వీలునుబట్టి ప్రదర్శన ఇచ్చేవారు. ధర్మవరంవారు అలాగ 1891లో మద్రాసులోను, 1905లో హైదరాబాదును 45 రోజులుండి వారానికి రెండు ప్రదర్శనలు ఇచ్చారు. 1910లో మళ్ళా హైదరాబాదులో ప్రదర్శన ఇచ్చినప్పుడు గద్వాల రాజాగారు మెచ్చుకొని 'ఆంధ్ర నాటక పితామహ' బిరుదుతో సత్కరించారు. రాజమంద్రిలోని ఇమ్మానేని హనుమంతరావుగారి సమాజంవారు అమలాపురం, కాకినాడ మొదలైన ఇతర

ప్రదేశాలలో నాటకాలు ఆడేవారు. 1901లో సురభివారు నరసారావుపేట, గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, బరంపురం వెళ్లి నాటకాలు ఆడారు. ఈ కంపెనీవారు రాజమండ్రి వచ్చినప్పటి వైనాలు చిలకమర్తివారు ఇలా గ్రంథస్థం చేశారు.[20]

''ఆ సంవత్సరమున వర్షాకాలములో సురభి నాటక సమాజము వారు రాజమహేంద్రవరము వచ్చి మెరకవీధిలో నొకదొడ్డిలో డేరావేసి, కొన్ని నాటకములాడిరి. ఆ సమాజములో స్త్రీలు స్త్రీపాత్రలను, నొకప్పుడు పురుష పాత్రములను గూడ ధరించి, రూపకములను ప్రదర్శించుటచే వారి నాటకములు జనుల నాకర్షించెను. మాపై గిట్టనివారు కొందరు సురభి నాటకములను, మా నాటకములను పోల్చి పత్రికలలో మాపై దూషణ పూర్వకములైన విమర్శలను చేయజొచ్చిరి. వాటిని మేము సరకు జేయక మా దారిని మేము నాటకములాడుచుంటిమి.''

సురభి నాటకాలలో జోడు వత్తుల గ్లాసు లైట్లు, హార్మోనియం మొదలైనవి ఉండేవి. కాంతామతి, భళ్లాణ చరిత్ర మొదలైన నాటకాలు ఆడేవారు. విశాఖపట్నంలో మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు సురభి వారికోసం పారిజాతాపహరణం, బిల్హణీయం 1902లో రచించి ఇచ్చారు. బరంపురం నుండి తిరిగి వస్తూ శ్రీకాకుళం, పాల్కొండ, విశాఖపట్నం, బందరు, బెజవాడ, వరంగల్లు, సికిందరాబాదులలో ప్రదర్శనాలు ఇచ్చారు. బందరులో సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు గరికిపర్తి కోటయ్యా దేవర సురభివారి పిల్లలను శిష్యులుగా చేర్చుకొనడానికి అంగీకరించారు. (కొందరికి అయిదేళ్లు శిక్షణ ఇచ్చారు).

కులవృత్తిగా నాటక ప్రదర్శనను చేపట్టి దానిపైనే ఆధారపడిన కుటుంబం సురభివారిదే. వనారస గోవిందరావు ఏడుగురు సంతానం, వీరి పిల్లలూ, ఆ పిల్లల పిల్లలు అందరూ నాటకంలో సభ్యులే. సురభివారి ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకొన్నాక ఇల్లు వదలి వెళ్ళరు. అల్లుళ్లు కూడా నాటకాలలో ప్రవేశించి తీరాలి. నేటికీ ప్రతిరాత్రీ తొమ్మిది గంటలకు ఏదో ఒక తెలుగు ఊళ్ళో సురభివారి తెర పైకి లేవాలన్నది వారి నియమం. ఆదిలోని ఒక కుటుంబం నుండి పది పన్నెండు కంపెనీలు నూరేళ్ళలో విస్తరించాయిగాని ఆదరణ సన్నగిల్లినా, ఆశయం చల్లారలేదు.

ఆదినుండి నేటిదాకా వివిధ పట్టణాలలో ఔత్సాహిక నాటక సమాజాలు వెలిశాయి. స్థానిక రచయితలు వాళ్ళకోసం నాటకాలు రాసేవారు. ఉత్తేజితులై వాటిని ఆడేవారు. ఏయే ఊళ్ళలో ఎప్పటినుంచి ఏయే సమాజాలు వెలిశాయో తెలుసుకొనడం మంచిదే.

గుంటూరు	1880 నుండి	హిందూనాటక సమాజం (ఫస్టు కంపెనీ)
	1895 నుండి	విబుధరంజనీ శృంగార నాటక సమాజం (సెకండు కంపెనీ)

20. చిలకమర్తి - స్వీయచరిత్ర - పుట.172

విశాఖపట్నం	1895	కలాభిలాషక నాటక సమాజం
పర్లాకిమిడి	1897	అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్
రాజమండ్రి	1898	మానేపల్లి కంపెనీ
నెల్లూరు	1899	ఆంధ్రభాషాభిమాని సమాజం
బళ్ళారి	1900	సుమనోరమ సభ (కోలాచలం వారిది)
పిఠాపురం	1900	హిందూ థియేట్రికల్ నాటక సమాజం. (రావుచెల్లాయమ్మ రావుగారి పోషణలో)
విశాఖపట్నం	1902	పండిత మానినీ సమాజం (కళావంతుల స్త్రీల కంపెనీ)
శ్రీకాకుళం	1906-7	రమావిలాసినీ సమాజం
రాజమండ్రి	1907-12	నుండి హిందూ నాటక సమాజం (పునరుద్ధరణ) దాకా
హైదరాబాదు	1910	హైదరాబాద్ అమెచ్యూర్
విజయనగరం	1910	విజయరామ డ్రమెటిక్ అకాడమీ
రాజమండ్రి	1912	చింతామణి నాటక సమాజం (గున్నేశ్వరరావుగారిది)
సికిందరాబాదు	1912-13	వాణినివాస సభ
బెజవాడ	1913	మైలవరం కంపెనీ
సికిందరాబాదు	1919	శ్రీకృష్ణమనోల్లాసినీ సభ (1912-13లోని వాణీవిలాససభా, ఇదీ తర్వాత విలీనమయ్యాయి)
చిత్తూరు	1920	రామవిలాస సభ
తెనాలి	1920	రామవిలాస సభ
బరంపురం	1920	జగన్నాథ విలాసినీ నాటకసమాజం
ఏలూరు	1920-21	శ్రీ సీతారామంజనేయ నాటక సమాజం (మోతేవారి కంపెనీ)
గుంటూరు	1925-30	బాలమిత్ర సమాజం

ఈ ఊళ్ళలో ఈ సమాజాలే కాక మరికొన్ని వెలసి కొన్నాళ్ళు నాటకాలు ఆడేవారు. టెక్కలి, ఛత్రపురి, నరసాపురం, నర్సరావుపేట, అల్లూరు మొదలైన పట్టణాలలో వివిధ కాలాలలో సమాజాలు ఏర్పడ్డాయి. సమాజాలు ఎన్ని ఏర్పడ్డా ఆడే నాటకాల స్వభావంలో మార్పు ఉండేదికాదు. కొన్ని కంపెనీలు సంచారం చేస్తూ ప్రదర్శనలు ఇచ్చేవి. రాజమండ్రి నాటకాల కంపెనీవారు మండపేటలో ఆడిన నాటకాల గురించి శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి ఇలా రాశారు.[21]

---

21. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - 'అనుభవాలూ-జ్ఞాపకాలూను', పుటలు 12, 414, 415

అంతక్రితం యేడెనిమిది సంవత్సరాలనాడు కోలంక వీరవరం వగైరా యెస్టేట్ల జమీందారు శ్రీరావు చెల్లాయమ్మగారు గారి ఆదరాభిమానాలతో, కొందరు నటులు శ్రీసత్యనారాయణ నాటక కంపెనీ అన్న పేరుతో వచ్చి వారానికి రెండు చొప్పున ఆరుమాసాలపాటు ఏమిటేమిటో నాటకాలాడి వెళ్ళిపోయారు మండపేటలో.

''వీధి భాగవతాలూ, తోలుబొమ్మలాటలూ, గొల్లభామ కలాపాలూ మాత్రమే యెరిగి వుండిన ఆ చుట్టుపట్ల యేబై అరవై గ్రామాలవారికీ, ఆ ఆరుమాసాలూ ఆ నాటకాల విషయమే శ్రీరామమయం అయిపోయింది. దేవతలే దిగి వచ్చి మండపేటలో నాటకాలాడి పోతున్నారన్నట్టు చెప్పుకొనేవారు లోకులప్పుడు. పండితులూ, వేదం చదువుకొన్నవారూ కూడా వెళ్ళిచూశారు చాలామంది ఆ నాటకాలు, నాకు బాగా తెలుసు. అందుకు పర్యవసానంగా లక్ష రూపాయలకు పైగా కొల్లగొట్టుకు పోయారక్కణ్ణుంచి, ఖర్చులుపోను ఆ కంపెనీవారు. అయితే డబ్బెంత పట్టుకుపోయినా, ఆ గ్రామాలవారికి మంచి నాటకాభిరుచిని కలిగించే పట్టుకుపోయారు పాపం వారు. అతిశయోక్తికాదు, ఆ నాటకాలు చూడ్డంతో, ఆ గ్రామాలవారిలో చాలామంది సాహిత్యప్రియులయినారు. నాటకాల ఆంతర్యమే కాదు, స్థాయీ తెలుసుకున్నారు. వారిలో చాలామంది మంచి విమర్శకులయినారు. తరువాత కొంతకాలం దాకా మండపేట గ్రామం నాటకాల పీఠంగా చెలామణీ అయిపోయింది. జిల్లాలో యెక్కడనయినా నాటక సమాజం వెలిసిందా, అది ఆ నాటకాల ప్రసాదమే. ఇంతేకాదు ఆ కొత్త కంపెనీలవారు, మొట్టమొదట మండపేటలో నాటకాలాడవలసిందే, లేకపోతే వుప్పు పుట్టేది కాదు.''

అన్ని నాటక సమాజాలవారు వివిధ నాటకాలు రాయించి ఆడినా ఇతివృత్తాలు పన్నెండు విభాగాలకే పరిమితమైనాయి. 1901 నుండి 1915దాకా ఆంగ్ల నాటకాలనూ, సంస్కృత రూపకాలనూ ఇతర భాషలనుండి ప్రసిద్ధ నాటకాలనూ అనువదించినా అన్నీ ఒక మూసల్లో పోసిన వాటిలాగే ఉండేవి. 1901 నుండి పదిహేను సంవత్సరాలలో మొత్తం 149 నాటకాలు తెలుగులో వెలువడ్డాయి. వాటి విషయాల వర్గీకరణ ఇలా ఉంది.[22]

1.	భారత కథలు	-	29
2.	కృష్ణగాథలు; పురాణములు	-	58
3.	రామాయణ కథలు	-	26
4.	సంస్కృతానుకరణములు	-	44
5.	పార్శీనాటకానుకరణములు	-	7
6.	ఇంగ్లీషు నాటకానుకరణములు	-	17
7.	తెలుగు ప్రబంధములననుసరించినవి	-	10
8.	జనరంజకములు	-	72
9.	సంఘావస్థానుకరణములు	-	53
10.	ప్రహసనములు	-	16

22. పురాణం సూరిశాస్త్రి - ఆంధ్ర నాటక నామావళి

11. చరిత్రల, నవలల అనుసరణలు - 38
12. వీధి నాటకములు; యక్షగానములు - 78

పై వర్గీకరణ చూస్తే తెలుగు నాటకాల పరిమితులు బోధపడతాయి. 1872 నుండి 1928 దాకా వచ్చిన నాటకాల లెక్క కూడా తేలుతుంది. ఇప్పటికి లభించిన ఆకరాలను బట్టి ఏయే సంవత్సరాలలో ఎన్ని వచ్చాయో సుమారుగా చూడండి.

సంవత్సరం	-	సంఖ్య	సంవత్సరం	-	సంఖ్య
1872	-	1	1905	-	8
1875	-	3	1906	-	5
1876	-	1	1907	-	27
1880	-	8	1908	-	29
1881	-	1	1909	-	49
1883	-	3	1910	-	59
1885	-	2	1911	-	38
1886	-	2	1912	-	41
1887	-	2	1913	-	50
1889	-	4	1914	-	34
1890	-	4	1915	-	33
1891	-	5	1916	-	35
1892	-	5	1917	-	24
1893	-	3	1918	-	19
1894	-	6	1919	-	22
1895	-	7	1920	-	28
1896	-	8	1921	-	159
1897	-	7	1922	-	16
1898	-	10	1923	-	18
1899	-	7	1924	-	26
1900	-	12	1925	-	29
1901	-	6	1926	-	102
1902	-	10	1927	-	28
1903	-	5	1928	-	24
1904	-	9			

ఈ యుగంలో మొత్తం 1047 నాటకాలు వెలువడ్డట్టు లెక్క తేలుతున్నా ఒకరు రాసిన ఇతివృత్తంలోనే మరొకరు, ఇంకొకరు, వేరొకరు ఇలా నాటకాలు రచించారు. అనువాదాలు చేశారు. ఉదాహరణకు 1875 నుండి 1933 దాకా 16మంది అభిజ్ఞాన శాకుంతలాన్ని తెనిగించారు. వాటి వివరాలు ఇవి.

1875	-	పరవస్తు వెంకటరంగాచార్యులు
1883	-	కందుకూరి వీరేశలింగం
1894	-	రాయదుర్గం నరసయ్యశాస్త్రి
1896	-	వేదం వెంకటరాయశాస్త్రి
1898	-	దాసు శ్రీరాములు (అచ్చతెలుగులో)
1906	-	వడ్డాది సుబ్బారాయుడు
1908	-	ముదిగొండ మల్లికార్జునకవి
1912	-	గూడకృష్ణయ్య
1913	-	అంబడిపూడి రామబ్రహ్మం
1919	-	మంత్రిప్రెగడ భుజంగరావు
1921	-	సోమరాజు రామానుజరావు
1929	-	కాంచనపల్లి కనకాంబ
1930	-	కాకర్ల కొండలరావు
1931	-	జె. గంగన్న
1931	-	వెంకట పార్వతీశ్వర కవులు
1933	-	వత్సవాయి వెంకట నీలాద్రిరాజు

ఉత్తర రామచరిత్రను 8మంది, ఊరుభంగం 4గురు, నాగానందం 4గురు, ప్రతిమా నాటకాన్ని 6గురు, ప్రియదర్శికను నలుగురు, మధ్యామవ్యాయోగాన్ని 4గురు, మాలతీ మాధవాన్ని 6గురు, రత్నావళిని 5గురు, వసంతసేనను 4గురు, వేణీ సంహారాన్ని 5గురు అనువాదాలు చేశారు. పౌరాణిక నాటకాలలో ఒకే ఇతివృత్తాన్ని ఎందరు తీసుకొన్నారో చూడండి.

అహల్యా	-	5 గురు
కృష్ణలీలలు	-	4గురు
గయోపాఖ్యానం	-	4గురు
తారాశశాంకం	-	5గురు
తులాభారం	-	5గురు
ద్రౌపదీవస్త్రాపహరణం	-	5గురు
పద్మవ్యూహం	-	6గురు
పాండవాజ్ఞాతవాసం	-	5గురు
పాదుకాపట్టాభిషేకం	-	9మంది
ప్రమీలార్జునీయం	-	4గురు
ప్రహ్లాద	-	19మంది

రామదాసు	-	4గురు
రుక్మాంగద	-	7గురు
రుక్మిణీ కల్యాణం (పరిణయం)	-	14మంది
లంకాదహనం	-	9మంది
లవకుశ	-	5గురు
శశిరేఖాపరిణయం	-	8మంది
సారంగధర	-	18మంది
సావిత్రి	-	29మంది
సీతాకల్యాణం	-	3గురు
హరిశ్చంద్ర	-	27మంది

ఈ పట్టిక చూస్తే తెలుగు ప్రేక్షకులకు సావిత్రి, హరిశ్చంద్ర, ప్రహ్లాద, రుక్మిణీ కల్యాణం చాలా ఇష్టమైన నాటకాలు అని తేలుతున్నాయి. ఇన్ని పౌరాణిక గాథలు ప్రచారంలో ఉన్నా కొన్ని చారిత్రక ఇతివృత్తాలు కూడా ప్రసిద్ధాలే. అనార్కలి, చంద్రగుప్త, దుర్గాదాసు, మీరాబాయి, రసపుత్ర విజయం, పెనుగొండ దుర్గం, ప్రతాపరుద్రీయం, శివాజి, రంగరాయకదన సమవాకారం, రామరాజు చరిత, సుల్తానాచాందబీ, బొబ్బిలియుద్ధం, సంయుక్త, చినరంగరాయ నాటకం. పీష్వా నారాయణ రావుకథ, పృథ్వీరాజు, వేనరాజు, మహారాష్ట్ర విజయం, పీష్వా నారాయణరావుకథ, పృథ్వీరాజు, రాణాప్రతాప, రోషనార, బెబ్బులి, మైసూరు రాజ్యం, మేవారు పతనం, గోల్కొండ సామ్రాజ్యం, షాజహాను, పలనాటి పౌరుషం వంటి నాటకాలు చారిత్రక ఇతివృత్తాలు కలవి.

ఒకప్పుడు రాజభక్తిని వెల్లడిస్తూ తెల్లదొరల పట్ల విశ్వాసాన్ని, విధేయతనూ సూచించే నాటకాలు రెండు, మూడు వచ్చాయి.

1898 - విక్టోరియా విలాసం - కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రి
1904 - శ్రీమదెడ్వర్డు పట్టాభిషేకము - తిరుపతి వెంకటకవులు
1914 - జార్జి పట్టాభిషేకం - ఆచంట సూర్యనారాయణ

అయితే జాతీయోద్యమం పుంజుకొనే రోజుల్లో చాలా ఎక్కువగా దేశభక్తి ప్రబోధకాలైన రాజకీయ నాటకాలు వెలువడ్డాయి.

1921 - తిలకు మహారాజ నాటకం - శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి
1921 - తిలకు రాయబారము - సోమరాజు రామనుజరావు
1921 - స్వరాజ్యధ్వజం - డి. సీతారాములు
1921 - ఆలీప్రభువు నిర్బంధం - జంధ్యాల అయ్యవారిశాస్త్రి
1921 - గాంధీ మహోదయం - దామరాజు పుండరీకాక్షుడు
1921 - గాంధీ విజయం - దామరాజు పుండరీకాక్షుడు
1922 - పాంచాల పరాభవం (డయరాసుర) - దామరాజు పుండరీకాక్షుడు

1924 - గాంధీ విజయధ్వజనాటకం - శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి
1924 - మాతృదాస్యవిమోచనం - బుద్ధవరపు పట్టాభిరామయ్య
1929 - చిచ్చులపిడుగు (మంగళపాండ్యాకథ) - మద్దూరి అన్నపూర్ణయ్య
(?) - స్వరాజ్యోదయం - శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి

జాతీయోద్యమంతోపాటు ఆంధ్రోద్యమం కూడా పక్కపక్కన సాగుతూ వుంది. తెలుగు నాటకాలంటే పాటలు, పద్యాలు కనుక ఇతర నాటకాల మధ్య మధ్య దేశభక్తి, ప్రబోధకాలు, ఆంధ్రకీర్తిని చాటే పద్యాలు పాడేవారు. స్వరాజ్య గీతాల గానం విరివిగా సాగేది. పాటలు, పద్యాలు ముఖ్యం కావడం వల్ల గాయకులకూ, నటులకూ గిరాకి పెరిగింది. పోటీలు పెట్టి ఉత్తమ నటులను నిర్ణయించేవారు. తెలుగు నాటక రంగంలో నాటకపోటీలు ఒక కొత్తబాటను ప్రవేశపెట్టాయి. ఒక కొత్త దిశకు దేశాన్ని నడిపించాయి.

1913లో 'ది నార్తన్ సర్కార్స్ మెడల్ అవార్డింగ్ సొసైటీ' ఏర్పడి బెజవాడలో గయోపాఖ్యానం నాటకంలో అర్జున పాత్రకు పోటీ జరిగింది. ఇందులో బెజవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం సమాజాలవారు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు గట్టివారు. పాపట్ల కాంతయ్య, పామూరి కామయ్య, దొరసామి అయ్యంగారు, వడ్డాది సుబ్బారాయుడు, వేలూరి శివరామశాస్త్రి, హరిప్రసాదరావు, హరినాగభూషణం, ములుకుట్ల లక్ష్మీనారాయణ శాస్త్రివంటి నాటక రచయితలు, కథకులు, గాయకులు, నటులు ఈ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నమాట. గుంటూరు వాస్తవ్యులైన పత్తి వెంకటరమణరావుగారికి ప్రథమ బహుమతి, యడవల్లి సూర్యనారాయణకు రెండవ బహుమతి ఇచ్చారు.

తర్వాత రెండేళ్లకు 1915లో బందరులో ఆంధ్రనాటక ప్రోత్సాహసంఘంవారు 'చిత్రనళీయం' పోటీలు ఏర్పాటు చేశారు.

1916లో గుంటూరులో సంగీత శాస్త్రవేత్త ఏకా సుబ్బారావుగారు 'ప్రసన్నయాదవ నాటక' పోటీలు ఏర్పాటు చేశారు.

1916లోనే శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు 'బొబ్బిలియుద్ధం' నాటక పోటీలు స్వయంగా నడిపారు.

1917లో ఆంధ్రనాటక పరిషత్తువారూ, 1918లో బెజవాడలో గుండిమెడ సోదరులు నాటక పోటీలు నిర్వహించారు. ఏలూరులో మోతేవారు 1919లో 'ప్రసన్నయాదవం' పోటీలు, 1921లో 'చింతామణి' నాటకపోటీలు నడిపారు.

ఈ పోటీల మూలంగా నటుల ఖ్యాతి పెరగసాగింది. పూర్వం నాటక సమాజాలలో కవి నిర్దేశకుడూ, ప్రయోక్త. తర్వాత కండక్టరూ, స్టేజి మేనేజరు ముఖ్యులయ్యారు. ఆ పిమ్మట నటులది రాజ్యం. నాటకరంగంలోని అరాచకాన్ని అరికట్టడానికి 'అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తు' ఒకటి అవసరమైందిగాని అది 1929లోగాని రూపు ఏర్పాటు చేసుకోలేదు. ఈలోగా జమీందారీ యుగం అవసానదశ ప్రారంభమైంది. నాటకాలలో పెట్టుబడిదారీ

యుగం ప్రారంభమై కాంట్రాక్టు నాటకాలు రావడం ప్రారంభమయ్యాయి. వీటి గురించి పోణంకి శ్రీరామ అప్పారావుగారు విపులంగా ఇలా రాశారు.[23]

''...ఈ పద్ధతి 'కాంటాక్టు'లో 'కాంట్రాక్టర్' ఏదో ప్రసిద్ధి నాటకమును ఎన్నుకొని, తేదీ నిర్ణయించి, ఎక్కడో ఒక ఊరిలో ఒక హాలును నిశ్చయించుకొని, ఆ నాటకములోని ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క ప్రసిద్ధ నటుని ఆహ్వానించును. ఆ ఒక్కరాత్రికి ఒక్కొక్కరికి ఇంత అని 'కిరాయి' నిర్ణయించును. పెద్ద నటులైనచో కొంతగాని, అంతయుగాని ముందుగానే పంపివేయును; తక్కినవారికి నాటక ప్రదర్శనమైనంతనే ఇచ్చును. నిర్ణీతమైన తేదీనాటికి కొంత ముందుగానే నలుమూలల నుండి నటులు ఆయూరువత్తురు; ఎవరి ఆహార్యమును వారే తెచ్చుకొనవలయును. ఎవరి పోర్షనులు వారికి ఇంతకు ముందే క్షుణ్ణముగా వచ్చునుకాన రిహార్సల్సు ఆవశ్యకము లేదు. నాటకము పూర్తి అయిన వెంటనే మరల ఎవరిత్రోవ వారిదే. ఇది 'కాంట్రాక్టు నాటకముల' ప్రథమ దశ''.

ఆధునిక యుగంలో ఈ కాంట్రాక్టు నాటకాలు మరీ వెర్రితలలు వేశాయి. స్టేజినాటకం భమిడిపాటి కామేశ్వరరావుగారు చెప్పినట్టు 'వేషరాగాల మేజువాణి' అయింది. పి.యస్.ఆర్.అప్పారావుగారు ఇంకా ఇలా స్పష్టం చేశారు.

''మరి కొంతకాలమునకు 'కాంట్రాక్టరులు' నటులు కూడా తెనుగు మీరినారు. 'కాంట్రాక్టరు'కు ఆదాయము మీదనే దృష్టి ఎక్కువైనది. నటులకు తమ 'కిరాయి' మీద మమత ఎక్కువైనది. నటులు పలు సమాజములకు చెందిన వారగుటచేతను, రిహార్సల్సుకు అవకాశము లేని కారణము చేతను ఫలాని 'హరిశ్చంద్ర' నాటకమని 'కాంట్రాక్టరు' ప్రకటించినప్పటికిని - హరిశ్చంద్రుడు బలిజేపల్లి వారి పాఠమును, చంద్రమతి పానుగంటివారి పాఠమును, విశ్వామిత్రుడు కందుకూరి వారి పాఠమును తక్కినవారు తక్కిన కవుల పాఠములను చదువుట సంభవించెడిది. నటులు పలుతావులకు చెందిన వారగుటచేతను దురాశతో ఒకేరోజున రెండు నాటకములలో కాంట్రాక్టుకు అంగీకరించుట చేతను సకాలమునకు రాలేకపోయెడివారు. వచ్చినను కొందరు 'మత్తు'లో వచ్చెడివారు. అట్లు వచ్చినవారు అసలు కవులు. వ్రాసిన వాక్యములను విడిచిపెట్టి స్వీయకవితా విన్యాస చమత్కారములకు, సహనటులను అణగద్రొక్కుటకు ప్రయత్నించెడివారు. నటులరాక ఆలస్యమయినచో ప్రదర్శన ప్రారంభము చాలా ఆలస్యముగా జరిగెడిది. అనుకొన్న నటుడు అసలు రానిచో ఎవరినో ఒకరిని బతిమాలి బలవంతముగా ఆపాత్ర వేయించెడివారు; ఎవరును లభింపనిచో ప్రధానమైన రంగములను కూడా కొన్నింటిని తగ్గించివేసి, నాటకమైనదనిపించెడివారు. నాటకశాలలన్నియును 'సినిమాహాల్సు'గా మారిపోవుటచేత ఆ లొడితెడు రంగస్థలముమీద రంగాలంకరణము నకు అవకాశమే ఉండెడిదికాదు. వీటి అన్నింటి ఫలము - రసాభాసము; ప్రేక్షకుల అల్లరి.''

కాంట్రాక్టు నాటకాల రసాభాసకన్నా ఆదినుండి స్టేజి నాటకాలలో మోతాదుకు మించిన హాస్యం ఒకవేళ ఉంటే అది వెగటుగానే ఉండేది. వీరి భాగవతాలలో కేతిగాడు,

---

23. తెలుగు నాటక వికాసము - పుట.553-4

బంగారక్కల హాస్యం, కూచిపూడి ప్రదర్శనలలో మాధవుని హాస్యం జనాకర్షణకు కారణాలని ఇంతకుముందు గమనించాం. నాటకం ఉత్తమాదర్శాలను ప్రబోధించేదయినా మధ్య మధ్య హాస్యం లేకపోతే చూడడం కష్టం. అందుకే పూర్వపు నాటక సమాజాలలో సూత్రధారులు హాస్యం చెప్పేవాళ్ళూ ప్రత్యేకంగా ఉండేవారు. హాస్యరస ప్రధానమైన నాటకాలు మనకు చాలా అరుదు. నవ్వించడానికి ప్రహసనాలే అవసరం. 'నవ్వించడం' అంటే ఏమని ఒకనాడు తెలుగువారు అర్థం చేసుకొనేవారో భమిడిపాటి కామేశ్వరరావుగారు ఇలా చెప్పారు.[24]

''నవ్వించడం అంటే మొత్తం మీద తిట్టడం, ఏకడం, దెబ్బలు తియ్యడం అనే ఉద్దేశం ఉంటూనే ఉంటుంది. కాని, అది హృదయం లేని ఉద్దేశం. నవ్వించడం అంటే కొన్ని లోట్లు కనపరచడం అని కొంతమంది ఉద్దేశం. కాని, అది వివక్షత లేని వెర్రి ఉద్దేశం. నవ్వించడం అంటే ఒకర్ని బాధించడం అని కొందరి ఉద్దేశం కాని, అది సానుభూతీ, సరసం లేని ఉద్దేశం. కొన్ని నిముషాలపాటు అందరూ, ఒకే విషయం, సరదాగా ఆలోచించుకోవాలనే ఉద్దేశం తప్ప, ఇతరమేమీ నా హృదయంలో లేదు.''

ఏకడం, తిట్టడం మొదలైన లక్షణాలకే పరిమితమైన ప్రహసనాలకు తెలుగునాటక రంగంలో స్థానం విరివిగా ఉండేది. అసలు మన మార్గరూపకాలలో ప్రహసనాలు పరిమిత దూషణకు నిలయాలుగా ఉండాలి. క్రీ.శ.600 నాటి పల్లవ మహేంద్ర విక్రమవర్మ చెక్కించిన శాసనంలో 'భవగదజ్జుకం', 'మత్తవిలాసం' అనే రెండు ప్రహసనాల ప్రసక్తి ఉంది. మొదటి దాన్లో బౌద్ధమత ఖండనం చాలా వెటకారంగానూ, రెండో దాంట్లో బౌద్ధ, కాపాలిక, పాశుపత మతాల వారిని నీచంగానూ తిట్టడం కనబడుతుంది. (ఈ రెండు ప్రహసనాలను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అనువదించారు. మొదటిది 1913లో అనువదించినా 1924లో అచ్చువేశారు. రెండోది 1935లో) మార్గ ప్రహసనాలు ఎలా ఉన్నా తెలుగులో ప్రహసనాలకు మార్గం చూపిన వీరేశలింగంగారు 'ఆక్షేపణ గర్భ నాటకం' అనే నిర్వచనంతో కొన్ని ప్రహసనాలు రాశారు.

భరతుడు తన నాట్యశాస్త్రం 18వ అధ్యాయంలో దశరూపక భేదాలను చెప్తూ ప్రహసన లక్షణం వివరించాడు. ప్రఖ్యాతమైన వస్తువుకు ఉదాత్తుడైన నాయకుడు, ఉత్తమవంశంలో జన్మించినవారి చరిత్రలు మార్గ నాటకంలో ఉండే ప్రహసనంలో మాత్రం వేశ్య, చేటి, నపుంసక, విట, ధూర్త, బంధకి సంకులమైనది; కుచ్చిత పురుషులతో కూడిన కథలు, వాళ్ళ భాషా ఆచారాలు యథాతథంగా ప్రదర్శించాలని చెప్పాడు. లోకంలోని మోసగాళ్ళు, దగుల్బాజీలు, నయవంచకులు మొదలైనవాళ్ళ బండారం బయటపెట్టడం ప్రహసన ప్రయోజనం.

వీరేశలింగంగారి ప్రహసనాలు సంఘంలోని పెద్ద మనుషులుగా చెలామణి అయేవాళ్ళ మోసాలు, స్వార్థాలు, దుయ్యబట్టేవి. (కొన్ని ప్రహసనాలు రాసినందుకు ఆయనమీద కొందరు పెక్కులు కోర్టులో కేసులు కూడా పెట్టారు). వీరేశలింగంగారు

24. భమిడిపాటి కామేశ్వరరావు 'అవును'లో 'ఆంధ్రాయూనివర్సిటీ పట్టుదలలు' అనే వ్యాసం – పుట.32

పన్నెండు ప్రహసనాలు మూడు భాగాలలో 'హాస్య సంజీవని' రచించారు. ఆ ప్రహసనాల పేర్లు చూడండి.

1. అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం
2. విచిత్ర వివాహ ప్రహసనం
3. మహా బధిర ప్రహసనం
4. పునర్మరణ ప్రహసనం
5. బలాత్కార గాన వినోద ప్రహసనం
6. కలహప్రియా ప్రహసనం
7. మహామహోపాధ్యాయ ప్రహసనం
8. యోగనిద్రా ప్రహసనం
9. మహావంచక ప్రహసనం
10. అసహాయశూర ప్రహసనం
11. కలిపురుషశనైశ్చర విలాసం
12. వేశ్యాప్రియా ప్రహసనం
13. కౌతుక వర్ధిని
14. హాస్య సంజీవని - మొదటి భాగం
15. హాస్య సంజీవని - రెండవ భాగం
16. హాస్య సంజీవని - మూడవ భాగం

కొన్ని ప్రహసనాలలో వీరేశలింగంగారి హాస్యం శ్రుతిమించినట్లు కనబడుతుంది. వీటిలోని అసభ్య చిత్రీకరణలకు గురజాడ అప్పారావుగారే నొచ్చుకొని విమర్శించారు. (చూ॥ గురజాడ - వ్యాసచంద్రిక) వీరేశలింగంగారి ప్రహసనాలు ఒక ప్రయోజనంతో రాసినవి. ఆయనకు దురాచారాలను ఖండిస్తున్నప్పుడు సంకోచం ఉండదు.

వీరేశలింగంగారి తర్వాత ప్రహసనాలను విరివిగా రచించినవారు చిలకమర్తివారు. ఇవి సాంఘిక దురాచారాలను, వ్యక్తుల దుష్ట ప్రవర్తనలను, మూఢత్వాన్ని ఎండగడతాయి. చిలకమర్తి వారు పత్రిక నిర్వాహణలో చిన్న చిన్న హాస్య ఖండాలు సమితి ప్రచురించలసివచ్చింది. ఇది 'నవ్వుల గని' అనే పేరుతో రెండు సంపుటాలలోనూ 'వినోదము' అనే పేరుతో రెండు సంపుటాలను ప్రచురించారు. వీటిలో కొన్ని హాస్య సంభాషణలు ఉంటాయి. ప్రహసనం అన్న దానికి వచ్చిన చెడ్డపేరును పోగొట్టడానికి, వ్యంగ్య నాటిక, హాస్యనాటిక అనే పేర్లను ఉత్తరోత్తర కవులు వాడుకొన్నారు. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి తిరుపతి వెంకటకవులు కూడ కొన్ని ప్రహసనాలు రాశారు.

భమిడిపాటి కామేశ్వరరావుగారు చిన్న చిన్న హాస్య సంభాషణలూ, ఛలోక్తులు, చమత్కారాలు 1926 నుండి 'భారతి' కోసం సేకరించారు. 1828లోనే 'కాలక్షేపం' అనే పేరుతో రెండు సంపుటాలలో ప్రచురించారు. మోలియర్ రచనలను కొన్ని అనువదించినా తెలుగుతనం ఉట్టిపడే హాస్య రచనలు చేసి నిజంగా నవ్వించడం భమిడిపాటి

కామేశ్వరరావుగారి సొంత పరగణా అయింది. ఆయన తన కొన్ని హాస్య రచనలలో సమకాలిక స్టేజి నాటకాల విపరీతాలను ఎంతగా మెత్తని చీవాట్లతో తిట్టాలో అంతగా తిట్టారు.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు కూడా తమదీ అనే ప్రత్యేక హాస్య ధోరణిని ప్రవేశపెట్టారు.

కొందరు నాటకకర్తలు - వారి రచనలు (నాటకాలు)

అచ్యుతరామశాస్త్రి, మల్లాది

1. రామరాజ్య వియోగము (1907)
2. చంద్రకాంత (1909)
3. రత్నమాలానాటకము (1909)
4. సత్యామోద చంద్రోదయము (1909)
5. రామదూత (లేదా) లంకా విజయం 91914)
6. ద్రౌపదీ వస్త్రాపహరణం (1927)

అప్పారావు, గురజాడ వెంకట (1886-1915)

1. కన్యాశుల్కము 91897-1909)
2. కొండు భట్టీయం (1915)
3. బిల్హణీయం (అసమగ్రం)

కామేశ్వరరావు, భమిడిపాటి (1897-1958)

1. ఎప్పుడూ ఇంతే (1926)
2. కచటపతలు (వ్యంగ్య నాటిక) 91927)

కామేశ్వరరావు, శ్రీపాద

1. గడుసు గంగయ్య (1925)
2. సొరాబరుస్తుము (అనువాదం -1925)
3. చంద్రగుప్త (అనువాదం - 1926)
4. భారతమణి (అనువాదం - 1926)
5. రాణాప్రతాపసింహ (అనువాదం - 1926)
6. లీలావతి సులోచనము (అనువాదం - 1926)
7. సీత (అనువాదం - 1926)
8. బిల్వమంగళ (అనువాదం - 1927)
9. పునర్వివాహం (అనువాదం - 1928)
10. తగినశాస్తి (అనువాదం - 1929)

కృష్ణమాచార్యులు, ధర్మవరంరామ (1853-1912)

1. విషాద సారంగధర (1887)
2. చిత్రనళీయము (1895)
3. వరూధిని (1912)
4. పాదుకా పట్టాభిషేకము (1914)
5. ప్రమీలార్జునీయము (1914)
6. ప్రహ్లాద (1914)
7. బృహన్నల (లేదా) ఉత్తర గోగ్రహణము (1915)
8. ముక్తావళి (1915)
9. అభిజ్ఞాన మణిమంతము (1916)
10. పాంచాలీ స్వయంవరం (1918)
11. చిరకారి నాటకం (1919)
12. మోహినీ రుక్మాంగద (1920)
13. రోషనారా శివాజి (1921)

కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీపాద (1866-1961)

1. కలభాషిణి (1902)
2. వేణీ సంహారము (అనువాదం - 1907)
3. బొబ్బిలియుద్ధం (1908)
4. రాజభక్తి (1911)
5. మోహినీ మనోహరం (అనుసరణ - 1914)
6. గాంధీ విజయధ్వజం (1921)
7. తిలకు మహారాజ నాటకం (1921)
8. మహాభారతయుద్ధం (1927)
9. శ్రీనాథ కవిరాజీయం (1927)
10. ప్రద్యుమ్నోపాఖ్యానం

కృష్ణయ్య, హూతా వెంకట

1. రోహిణీ సుధాకర విజయం (1902)
2. ద్రౌపదీ స్వయంవరం (1904)
3. శశికళా సుదర్శనం (1905)
4. ప్రభావతీ ప్రద్యుమ్నము (1911)
5. శ్రీరామాభ్యుదయం (1915)
6. సుభద్రార్జునీయం (1916)

కృష్ణారావు, కోటగిరి వెంకట (1891-1984?)

1. అభినవ పాండవీయము (1915)
2. పాదుషా పరాభవము (1916)
3. బెబ్బులి (1925)

గోపాలాచార్యులు, ధర్మవరం (1840-1912)

1. భక్తరామదాసు (1920)
2. మాయాశక్తి (లేదా) రుక్మిణీ కృష్ణీయం (1926)
3. రాం కబీర్ (1926)

చలం, గుడిపాటి వెంకట (1894-1979)

1. చిత్రాంగి (19121)
2. పద్మరాణి (1921)
3. సత్యం (1921)
4. శివం (నాటిక - 1923)
5. హరిశ్చంద్ర (19124)
6. శావలిని (నాటిక - 1926)
7. సావిత్రి (1927)
8. రంగదాసు (నాటిక - 1930)
9. పురూరవ

తిరుపతి (1871-1919) వెంకట (1870-1950) కవులు

1. బాలరామాయణం (అనువాదం-1902)
2. శ్రీమదెడ్వర్డు పట్టాభిషేకము 91904)
3. పాండవ విజయము (1907)
4. పాండవాశ్వమేధము (1907)
5. మృచ్ఛకటికము (అనువాదం-1907)
6. పాండవ ప్రవాసము (1908)
7. ముద్రారాక్షసము (అనువాదం-1908)
8. సుకన్య (1908)
9. అనర్ఘ రాఘవము (1909)
10. దంభవామనము (1909)
11. పండితరాజము (1909)
12. పాండవ జననము (1909)
13. పాండవ రాజసూయము (1921)
14. ప్రభావతీ ప్రద్యుమ్నము

నాగేంద్రరావు, పింగళి (1901–1971)

1. జేబున్నీసా (1923)
2. వింధ్యరాణి (అనువాదం-1928)
3. నారాజు (1929)

నారాయణరావు, కాళ్ళకూరి (1871–1927)

1. చిత్రాభ్యుదయము (1908)
2. సారంగధర (1909)
3. పద్మవ్యూహము (1919)
4. చింతామణి (1921)
5. వరవిక్రయము (1921)
6. మధుసేవ (1926)

పుండరీకాక్షుడు, దామరాజు (1898–1970?)

1. నవయుగారంభము (1921)
2. పాంచాల పరాభవము (1921)
3. సంఘ సమస్య (లేదా) సంస్కారిణి (1921)

పురుషోత్తమకవి, నాదెళ్ళ (1863–1938)

1. అహల్యా సంక్రందనము (1883)
2. హరిశ్చంద్ర (1890)
3. చంద్రహాస (1916)
4. రామదాసు

ప్రభాకరశాస్త్రి, వేటూరి (1888–1950)

1. కర్ణభారము (అనువాదము - 1913)
2. మధ్యమ వ్యాయోగము (నాటికి - అనువాదం - 1913)
3. భగవదజ్జుకము (అనువాదము - 1924)
4. ప్రతిమ (అనువాదము - 1927)

యజ్ఞనారాయణ, ఇచ్ఛాపురపు

1. రసపుత్ర విజయము (1910)
2. అపూర్వ నాగరకత (1912)
3. భారతమాత (1913)
4. రాజపుత్ర తేజః పుంజం (లేదా) రాణా ప్రతాప (1920)

రామస్వామిచౌదరి, త్రిపురనేని (1887–1943)

1. కురుక్షేత్ర సంగ్రామము (1912)
2. శంభుక వధ (1922)

రామానుజరావు, సోమరాజు

1. ప్రచండ బొబ్బిలి యుద్ధ నాటకము (1918)
2. తిలకు రాయబారము (1921)
3. ద్రౌపదీ వస్త్రాపహరణము (1921)
4. లక్ష్మణ మూర్ఛ (1921)
5. స్వరాజ్య రథము (1921)
6. తాజమహాలు (1921/1925)
7. శ్రీరామ జననము (1925)
8. అదృష్ట విజయము (1926)
9. పద్మవ్యూహము (1926)
10. ప్రతాపరుద్రీయము (లేదా) యుగంధర విజయము (1926)
11. ప్రహ్లాద (1926)
12. సంగీత సావిత్రి (1926)
13. సుగ్రీవ పట్టాభిషేకము (1926)
14. సతీ అనసూయ (1928)
15. గంగావతరణము (లేదా) పార్వతీ గర్వభంగము (1929)
16. రంగూన్‌రౌడీ (1929)
17. ధరణికోట (1931)
18. కాళిదాసు
19. సక్కుబాయి
20. దానవీరకర్ణ

లక్ష్మీకాంతం, బలిజేపల్లి (1881–1953)

1. బుద్ధిమతీ విలాసము (1905)
2. ఉత్తరరాఘవము (అనుసరణ - 1910)
3. సత్యహరిశ్చంద్రీయము (1912)
4. విజ్జిక (1914)
5. సాత్రాజితీయము (1914)

లక్ష్మీనరసింహం, చిలకమర్తి (1867–1946)

1. పారిజాతాపహరణము (1906)
2. ప్రసన్న యాదవము (1906)
3. గయోపాఖ్యానము (1909)
4. స్వప్నవాసవదత్త (అనువాదం - 1913)
5. మధ్యమ వ్యాయోగము (అనువాదనాటిక-1915)
6. ప్రచ్ఛన్న పాండవము (1916)

7. పార్వతీ పరిణయము (1919)
8. చతుర చంద్రహాస (1922)
9. ఆత్మగౌరవము (హాస్యనాటిక-1927)
10. కైలాస దూత ప్రహసము (1927)
11. గయ్యాళి గంగమ్మ ప్రహసనము (1927)
12. బధిర చతుష్టయము (నాటిక-1927)
13. మహారసిక ప్రహసనము (1927)
14. అవిమారకము (అనువాదము-1928)
15. ఊరుభంగం (అనువాదము-1928)
16. దూత ఘటోత్కచము (అనువాదము-1928)
17. దూతవాక్యము (అనువాదము-1928)
18. పంచరాత్రము (అనువాదము-1928)
19. ప్రతిజ్ఞాయౌగంధరాయణము (1928)
20. ప్రతిమా నాటకము (1928)
21. బాల చరితము (అనువాదము-1928)
22. ద్రౌపదీ వస్త్రాపహరణము (1932)
23. ప్రహ్లాద

లక్ష్మీనరసింహం, సెట్టి (1879(?)-1938)

1. రుక్మిణీ కల్యాణము (1905)
2. మాలినీ విజయము (1907)
3. చిత్రహరిశ్చంద్రీయము (1913)
4. లుబ్ధాగ్రేసర చక్రవర్తి (1914)
5. రామచంద్ర దేవ పట్టాభిషేకము (1921)

లక్ష్మీనరసింహారావు, పానుగంటి (1865-1940)

1. నర్మదా పురుకుత్సీయము (1900)
2. సారంగధర (1905)
3. కోకిల (1907)
4. పాదుకా పట్టాభిషేకము (లేదా) పట్టభంగ రాఘవము (1909)
5. ప్రచండ చాణక్యము (1909)
6. రాధాకృష్ణ నాటకము (1909)
7. విజయ రాఘవము (1909)
8. విప్రనారాయణ చరిత్రము (1909)
9. బుద్ధ బోధ సుధ (1910)
10. వనవాస రాఘవము (1910)
11. వృద్ధ వివాహము (1910)

12. మనో మహిమము (1911)
13. కల్యాణ రాఘవము (1915)
14. కంఠాభరణము (1917)
15. పూర్ణిమ (1919)
16. సరస్వతి (1920)
17. ముద్రిక (1921)
18. వీరమతి (1921)
19. చూడామణి (1929)
20. పద్మిని (1929)
21. మాలతీమాల (1929)
22. విచిత్ర వివాహము (1930)
23. సరోజిని (అనువాదం-1930)

వీరేశలింగం, కందుకూరి (1848-1919)

1. చమత్కార రత్నావళి (అనువాదం-1880)
2. మర్చెంట్ ఆఫ్ వెనిస్ (లేదా) వెనీస్ వర్తకుడు (1880)
3. రత్నావళి (1880)
4. రాగమంజరి (అనుసరణ-1880)
5. అభిజ్ఞాన శాకుంతలము (అనువాదం-1883)
6. ప్రహ్లాద (1885)
7. మాళవికాగ్నిమిత్రము (అనువాదం-1885)
8. హరిశ్చంద్ర (1889)
9. ప్రబోధ చంద్రోదయము (అనువాదం-1892)
10. కల్యాణ కల్పవల్లి (అనువాదం-1894)
11. దక్షిణ గోగ్రహణము (1897)
12. వినోద తరంగిణి (1898)
13. అపూర్వబ్రహ్మచర్యము (ప్రహసనం-1910)
14. అసహాయసూర (ప్రహసనం-1910)
15. కలహప్రియ (ప్రహసనం-1910)
16. పునర్మరణ ప్రహసనం - (1910)
17. బలాత్కారగాన వినోదము (1910)
18. మహాబధిర ప్రహసనం (1910)
19. మహామహోపాధ్యాయ ప్రహసనం (1910)
20. యోగనిద్ర (ప్రహసనం-1910)
21. విచిత్ర వివాహము (ప్రహసనం-1910)
22. వినాయక చతుర్థి (ప్రహసనం-1910)

వెంకటరాయశాస్త్రి, వేదం (1853-1929)

1. నాగానందము (అనువాదం-1891)
2. అభిజ్ఞాన శాకుంతలము (అనువాదం-1896)
3. ప్రతాపరుద్రీయము (1897)
4. ఉషానాటకము (1909)
5. ప్రియదర్శిక (అనువాదం-1910)
6. బొబ్బిలియుద్ధం (1916)
7. మాళవికాగ్నిమిత్రము (అనువాదం-1919)
8. ఉత్తరరామచరిత (అనువాదం-1920)
9. రత్నావళి (అనువాదం-1921)
10. విక్రమోర్వశీయం (అనువాదం-1921)

శ్రీనివాసరావు, కోలాచలం (1854-1919)

1. సునందినీ పరిణయం (1895)
2. మదాలసా నాటకం (1896)
3. సీమంతినీ నాటకం (1896)
4. సుఖమంజరీ పరిణయం (1896)
5. రామరాజుచరిత్ర (1907)
6. సుల్తానా చాంద్ బీ (1907)
7. సత్యహరిశ్చంద్రీయము (1908)
8. రుక్మాంగద చరిత్రము (1914)
9. కుశలవ (1920)
10. పాదుకా పట్టాభిషేకము (1920)
11. ప్రహ్లాద (1920)
12. ద్రౌపదీ వస్త్రాపహరణము (1921)
13. బభ్రువాహన (1921)
14. సీతాకల్యాణం (1921)
15. కీచకవధ (1924)
16. గిరిజా కల్యాణము (1924)
17. లంకా దహనము (1924)
18. శిరోమణి (1924)
19. శ్రీరామ జననము (1924)
20. కాళిదాసు (1925)
21. చంద్రగిర్యభ్యుదయము (1925)
22. ప్రతాపాగ్నదీయము (1925)
23. మానాపమాన (అనుసరణ-1925)

24. మైసూరు రాజ్యము (1925)
25. లవకుశ

సచ్చిదానందశాస్త్రి, శ్రీరాములు (1888-1954)

1. సావిత్రి (1921)

సీతారామారావు, ద్రోణంరాజు

1. సుశీల (1910)
2. అభినవ రాఘవము (1911)
3. ఉషాపరిణయము (1911)
4. హస్తినాపురణము (1911)
5. చతుర చంద్రహాస (1912)
6. జయంత జయపాలము (1912)
7. పీష్వా నారాయణరావు వధ (1912)
8. విజయ బొబ్బిలి (1912)
9. గయోపాఖ్యానం (1913)
10. పాండవాజ్ఞాతవాసము (1913)
11. రామాశ్వమేధము (1913)
12. శ్రీరామ విజయము (1913)
13. స్త్రీసాహసము (1913)
14. ప్రసన్న యాదవము (లేదా) నరకాసుర సంహారము (1914)
15. శ్రీరామ జననము (1914)
16. సారంగధర (1914)
17. పల్నాటి వీరచరిత్రము (1915)
18. వేశ్యా మధురము (3 భాగాలు - 1915)
19. హనుమద్రామ సంగ్రామము (1915)
20. ద్రౌపదీ పరిణయము (1916)
21. వైదర్భీ విలాసము (1916)
22. శ్రీనివాస కల్యాణము (1916)
23. సామ్రాజ్యోద్యమము (1916)
24. కృష్ణలీలలు (1917)
25. గరుడ గర్వభంగము (1917)
26. రసపుత్ర విజయము (లేదా) విమల (1917)
27. లంకా దహనము (1917)
28. కనకతార (1918)
29. రుక్మిణీ పరిణయము (1918)
30. సావిత్రి (1919)

31. ఆంధ్ర పతాకము (1921)
32. ప్రమీలార్జునీయము (1921)
33. సంపూర్ణ రామాయణము (1921)
34. సతీ తులసి (1921)
35. రామోద్యోగము (1924)
36. శత కంఠరామాయణము (లేదా) సీతా విజయము (1926)
37. శ్రీరామ పాదుక (1926)
38. పురూరవ (1927)
39. వీరబ్రహ్మయోగి
40. శ్రీకృష్ణ తులాభారము
41. శ్రీరామ ప్రవాసము

సుబ్బారాయుడు, వడ్డాది (1854-1938)

1. వేణీ సంహారము (అనువాదం-1886)
2. విక్రమోర్వశీయము (అనువాదం-1889)
3. ప్రబోధ చంద్రోదయము (అనువాదం-1893)
4. చండ కౌశిక నాటకము (1900)
5. మల్లికా మారుతము (1903)
6. అభిజ్ఞాన శాకుంతలము (అనువాదం-1906)

సుబ్బారావు, ముత్తరాజు (-1922)

1. శ్రీకృష్ణ తులాభారము (1922)

సుబ్రహ్మణ్యశాస్త్రి, కొండుభట్ల (1852-1897)

1. ద్రౌపదీ వస్త్రాపహరణం (1896)

ఆటభాగవతాలు, కూచిపూడి వారి ప్రదర్శనలు మొదలైనవి కూడా కాలానుగుణంగా మార్పులు చెందాయి. కూచిపూడి మేళం నాయకులు హరిమాధవయ్యగారు 1840-50 మధ్య తంజావూరు వెళ్లి అక్కడి నాట్య, నాటక సంప్రదాయాన్ని తీసుకొని వీరు రంగప్రవేశం చేయడంతో కూచిపూడి ప్రదర్శనలకు కొత్తదనం వచ్చింది. అంతదాకా ఏక, ద్విపాత్రలతో కూడిన కూచిపూడి కలాపాలు క్రమంగా నాటకాలయ్యాయి. హరిమాధవయ్య (19శ. ప్రథమ భాగం) గారు చిరుపాత్రలుండే యక్షగానాలు చేపట్టారు. తర్వాత చింతా వెంకటరామయ్య (1860-1947) గారు మేళనాయకులై ఎందరినో శిష్యులను తయారుచేశారు. ఈనాటి కూచిపూడి నాట్యాచార్యులలో వీరి శిక్షణ పొందనివారు లేరు. కూచిపూడి నాట్యాచార్యులయిన తాడేపల్లి పేరయ్య (1886-1942) గారు దేవదాసీలకు భామాకలాపం, గొల్లకలాపం శిక్షణ ఇచ్చారు. వారి ప్రదర్శనలలో సూత్రధారులుగానూ, విదూషకులుగానూ ఉంటూ

నట్టువాంగం చేసేవారు. కూచిపూడి నాట్య సరిహద్దులను వీరు విస్తరింపచేశారు. వెంపటి వెంకట నారాయణ (1877-78 ఈశ్వర?) గారు భామవేషంలో రాణించివారు 'దాదినమ్మ వేషం' వీరి ప్రత్యేకత. ఈయనకు సాహిత్య రచనా వ్యాసంగం ఉంది. నాటకాలు రాశారు. కవిత్వం చెబుతారు. వీరి గురించి ఆధునిక కవి జీవితాలలో ఇలా ఉంది.[25]

''వీరి జన్మస్థానం భాగవతుల కూచిపూడి. వెలనాటి వైదికులు. హరితర్షిగోత్రము. ఆపస్తంబసూత్రము. తండ్రి నాగేశ్వరముగారు. తల్లి గంగమాంబ. ఈశ్వరనామ సంవత్సరమున జన్మము నందిరి. నరసాపురము డిస్ట్రిక్టు మున్సబుగారి వలనను, కాకినాడ జంట్రీ పాలకొల్లు వర్తకుల వలనను మచిలీబందరు కలెక్టరు కోర్టువారి వలనను దృశ్యప్రబంధ ప్రదర్శనమున నెన్నికం గాంచి బంగారు పతకములం బొందియున్నవారు. వీరు రచించిన గ్రంథములు 1. చంద్రకాంత నాటకము, 2. గోపీచందన నాటకము, 3. జయంత జయపాలీయ నాటకము, 4. హరిశ్చంద్రీయ నాటకము, 5. సుగ్రీవ పట్టాభిషేక నాటకము, 6. లంకా దహనము మొదలైనవి.''

వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రిగారు కూచిపూడి నాట్యాలకు నూతనజీవాన్ని సంప్రదాయపు పరిమితులలో కలిగించారు. కాగడాల వెలుతురుకు బదులు వేరే వెలుతురు వచ్చింది.

స్టేజి నాటకాన్ని చిన్నతరహా పెట్టుబడిదారులకు వదిలేసి నాటకరంగాన్ని సంస్కరించడానికి ఆధునిక యుగంలో ప్రయత్నాలు జరిగాయి. మరికొన్ని పరిణామాలు ఏర్పడ్డాయి. వాటి గురించి తర్వాత యుగంలో చెప్పుకొనవచ్చు, స్టేజి నాటకాలు పట్టణాలలో పెద్ద గ్రామాలలో 'వెలుగు' వెలుగుతున్నా గ్రామీణ కళలు, వీధినాటకాలు మరీ పూర్తిగా అంతరించలేదు. అయితే స్టేజి నాటక ప్రభావం వాటి మీద కొంత పడకపోలేదు. కేశిరాజు వెంకట సూర్యరాయకవి 1888లో 'రామదాసు' యక్షగానంగా మొదట రచించి, మరి పదేళ్ళలో 1899లో దానిని 'ఇప్పటి నాటకములవలె' అంటే ధార్వాడ కంపెనీ నాటకంగా మార్చారు. అయినా యక్షగానంలోని ప్రవేశ దరువులు, వగైరాలు ఉన్నాయి.[26] కాకరపర్తి నరసింహకవి సంగీత సారంగధరను 'నాటకము యక్షగాన శృంగాటకం' అన్నాడు. దీని మీద స్టేజి నాటక ప్రభావం ఉంది. 1907 ప్రాంతాలలో మండూరి సుబ్బారాయుడు 'సత్యభామా కల్యాణం' యక్షగానం రచించాడు. ఈ వీధినాటకాన్ని ప్రచురణకర్తలు 'యక్షగాన కంపెనీ డ్రామా' అని ప్రకటించారు. వచన సంవాదాలలో స్టేజి నాటక ప్రభావం ఉంది.

ప్రదర్శన కళలలో పరస్పర ఆదాన ప్రదానాలు ఉంటాయి. స్టేజినాటకాలు ఎలా ఉన్నా వీధినాటకాలు పల్లెటూళ్ళలో ఇంకా బతికే ఉన్నాయి.

---

25. మంత్రి ప్రెగడ భుజంగరావు - ఆధునిక కవి జీవితములు, పుట.232
26. యస్వీజోగారావు - ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర, ప్రథమభాగం, పుట.133

కథాసాహిత్యం - ప్రజాబాహుళ్యం

ఒక తరం చెప్పుకొనే కథలను ఇంకొకతరంవాళ్ళు ఆసక్తితో వింటారు. పేదరాశి పెద్దమ్మ కథలు, పిట్టకథలు, కట్టుకథలు పెద్దకథల్లో చోటుచేసుకొని పరిమాణాల్ని పెంచుకొంటాయి. ఊకుడు కథలంటే లోకులు సంబరపడతారు. నోటితో చెప్పే కథలను కాగితం మీదకు ఎక్కించడం కుంఫిణీ యుగంలో ప్రారంభమైనా జమీందారీ యుగంలో యివి సంపుటాలుగా పాఠకులముందు సాక్షాత్కరించాయి. పూర్వం అచ్చుపడి అశేషంగా సామాన్య పాఠకులను ఆకర్షించిన హంసవింశతి (1842), దిలారామకథ (1843), బత్తీసుపుత్రి కథలు (1847), బేతాళ పంచవింశతి కథలు (1848), కాంభోజరాజ కథలు (1849), తాతాచార్యుల కథలు (1855), చారుదర్వీషు కథలు మొదలైనవి మళ్ళామళ్ళా పుర్ముద్రణలను పొందాయి.

ఆసక్తిగల వాళ్ళందరూ ఈ కథలను చదువుకోవాలన్న ఉద్దేశంతోనే రచయితలు వాటిని రాశారు. వారిని పోషించినవారూ, వారిచేత ఈ గ్రంథాలు రాయించినవారూ జమీందారీ ఫాయీ వారే అయినా సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొన్నారు. 1811లో విశాఖపట్నంలో ఉన్న గొడే నారాయణ గజపతిరాయనిగారు ఎర్రమిల్లి మల్లికార్జునుడు అనే రచయిత చేత చారుగర్వీషు కథలను రాయించారు. దాని పీఠికలో ఇలా స్పష్టంగా రాశారు. ''వ్యాకరణ పద్ధతిగా గ్రంథము చేసే యడల సర్వజన సాధారణంగా కాకపోవడమేకాక, దేశీయ భాషా చమత్కారము బోధపడక, విరసమౌనని తోచి స్త్రీ పురుషులు ఒకనితో వొకరు మాటలాడునట్లు సులభంగా అర్థమయ్యేలాగున సంక్షేపముగా జాతీయ రసంతో ఈగ్రంథము సేయ నిశ్చయించడమైనది.''

అక్షర జ్ఞానం లేని ఆడవారు సైతం ఈ కథలు చదివించుకొని వినడానికి ఉవ్విళ్లూరేవారు. తమ విద్యాభ్యాసం రోజుల్లో ఒక ముచ్చట గురించి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చెప్పారు.[1] ఆయన వల్లూరులో చదువుకొనేరోజులలో, అరవైయేళ్ల దాటిన ఒక బ్రాహ్మణ వితంతువు ఆయనను తన యింటికి పిలిపించుకొని ఎవరికీ చెప్పవద్దని హెచ్చరిస్తూ రహస్యంగా 'మదన కామరాజు కథలు' అనే పుస్తకాన్ని పైటకొంగులో దాచిన దాన్ని తీసి చదివి పెట్టమంది. రోజూ వాటిని ఈయన చదివి పెట్టేవారు. పుస్తకం అయిపోయిన తర్వాత మళ్ళా మొదటినుంచీ చదవమనేది. అలాగ ఆయన దానిని ఎన్నిసార్లో చదివి పెట్టారు. ''రోజూ రోజూ చదివానది. వయస్సు వచ్చిన కొద్దీ అర్థమయింది నాకది. అర్థమైనకొద్దీ ప్రీతిపాత్రమున్నూ అయింది నాకది. కథల మాధుర్యం ముందు పటికబెల్లం తీపి ఏమూల?'' అని సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చెప్పారు.

జనరంజకమైన ఇటువంటి కథలనూ, రమారమి ఒక నవల అనిపించేటంత పెద్ద కథలనూ జమీందారీ యుగంలో ఎందరో రచించారు. చిన్నయసూరి ప్రభావం పడ్డాక గ్రాంథికంలో కొందరు రచనలు చేసినా చాలా గ్రంథాలు చెన్నపట్నం బజారు భాషలో వుండేవి. అందుకే జనసామాన్యానికి అందుబాటులో కూడా ఉండేవి. ఈ యుగంలో

---

1. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - ''అనుభవాలూ - జ్ఞాపకాలూను'' మొదటి సంపుటం, పుటలు 133 నుండి.

ప్రజా బాహుళ్యం ఆదరించి అనందించిన గ్రంథాలనూ వాటి రచయితల వివరాలనూ తెలుసుకొందాం.

గురజాడ శ్రీరామమూర్తి (1851-1899)

ప్రజా బాహుళ్యం విని, చెప్పుకొని, చదువుకొని ఆనందించే కథలలో తెనాలి రామలింగని కథలు చాలా ప్రసిద్ధమైనవి. ఆంధ్ర సాహిత్యంలో పదగుంభనానికీ, ప్రౌఢికీ పేరుపొందిన పాండురంగమహాత్మ్యం మొదలైన కావ్యాలు నిర్మించిన తెనాలి రామకృష్ణునికీ, ఈ రామలింగని కథలకూ పూర్వులు ఒక జారుముడి వేశారు. కృష్ణదేవరాయలు, తాతాచార్యులు, తిమ్మరుసు మొదలైన మలిరాయల యుగంలోని వ్యక్తులతోనూ, కొందరు కల్పిత వ్యక్తులతోనూ రామలింగనికి సంబంధించిన కథలను కలిపి చెప్పుకొనడం పరిపాటి. లోకంలో హాస్యరస ప్రధానుడగు రామలింగని చుట్టూ చాలా కట్టుకథల పుట్టలు వున్నాయి. వాటి నన్నింటినీ జనం చెప్పుకొంటున్నారు. వాటిలో కొన్నింటికి తెనాలి రామకృష్ణుని కథలు అనే పేరుతో తొలిసారి 1860లో గ్రంథస్థం చేసినవారు గురజాడ శ్రీరామమూర్తిగారు.

శ్రీరామమూర్తిగారి ఈ గ్రంథం ప్రచారంలోనికి వచ్చాక చాలామంది రచయితలూ, ఎందరో ప్రచురణకర్తలూ, వీరిని అనుసరిస్తూ రామలింగనిపై పుస్తకాలు రాసి ప్రచురించారు. వాటి వివరాలు ఇవి.

1882 - వెంకట్రావు పంతులు - తెనాలి రామకృష్ణుని కథలు
1907 - టేకుమళ్ళ రాజగోపాలరావు - తెనాలి రామలింగని హాస్యకథలు
1908 - గరికపాటి సూర్యనారాయణ - తెనాలి రామకృష్ణుని చరిత్ర
1911 - ఈదర వెంకటరావు - తెనాలి రామలింగని వింత కథలు
1912 - కాశీనాథుని వీరమల్లయ్య - తెనాలి రామలింగని వికృత కథలు
1917 - మంగు వెంకట రంగారావు - తెనాలి రామకృష్ణుని చరిత్ర

సుప్రసిద్ధ ప్రచురణకర్తలు వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు వారూ, వెస్ట్ వార్డ్ అండ్ కో వారూ, ఎన్.వి.గోపాల్ అండ్ కో వారు మొదలైన వారందరూ ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒక రచయిత, ఏదో ఒక పేరుతో రచించిన తెనాలి రాముని కథలను ప్రచురించి, ఆ పుస్తకాన్ని పునర్ముద్రిస్తూ వుండడం పరిపాటే. ఒక్క తెలుగుదేశంలోనేకాక, కర్ణాటకలోనూ, తమిళనాడులోనూ కూడా తెనాలి రాముని కథలు జనరంజకంగా ఉంటాయి. ఇటీవల దూరదర్శన్‌లో టి.వి.సీరియల్‌లో ఈ కథలు ప్రసారమయ్యాయి. ఇంత ప్రాచుర్యం పొందిన కథాసాహిత్యాన్ని ప్రారంభించిన గురజాడ శ్రీరామమూర్తి గారు చరిత్రకెక్కవలసిన చరిత్రకారులు.

1860లో శ్రీరామమూర్తిగారు రచించిన 'తెనాలి రామకృష్ణుని కథలు' ఏయే సంఘటనలను కథనం చేశాయో తెలియవు కాని వారు ఉత్తరోత్తరా రచించిన 'కవిజీవితములు' అనే గ్రంథంలో ఈ వ్యక్తి గురించి చెప్పిన ఈక్రింది విషయాలన్నీ చోటు చేసుకొనే ఉంటాయి.

1. రామకృష్ణుని జన్మదినము
2. సిద్ధుడుపదేశించుట
3. కాళికాదేవి ప్రత్యక్షమగుట
4. తాతాచర్యుని చూచుట
5. తాతాచార్యుని మోసపుచ్చుట
6. రాజు కింకరులంబంపుట
7. కింకరులాచార్యుని దండించుట
8. రాముడు పరితాపమునందుట
9. రామలింగని శిరస్సు నఱకుమనుట
10. రామకృష్ణుడు పిశాచవేషమును ధరించుట
11. రామకృష్ణుడు రాజదర్శనము సేయుట
12. రామకృష్ణుడు పండితునిగా రాజును దర్శించుట
13. రామకృష్ణుడు జ్యోతిషములో పరీక్షనిచ్చుట
14. రామకృష్ణుడు వరాల పళ్లెరమునందుట
15. రామకృష్ణుడు కవి ధూర్జటి రహస్యముంబ్రకటించుట
16. రామకృష్ణుడు సహస్ర ఘంటకవినోడించుట
17. రామకృష్ణుడు వసుచరిత్ర కృతినాక్షేపించుట
18. వసుచరిత్రమును బిండములపై ధారపోయించుట
19. పయిని చెప్పియున్న కథకు విమర్శనము
20. రామకృష్ణుడు రామభూషణకవి శయ్యాదుల దెల్పుట
21. రామకృష్ణుని విద్యావినోదములు
22. సప్తాంగ రాజ్యముంగోరిన పండితునోడించుట
23. ముక్కు తిమ్మన నలయించుట
24. వేశ్యకు స్వర్ణయోగం బుపదేశించుట
25. పాతివ్రత్య ప్రదర్శినీ తిరస్కారము
26. పంచతంత్ర పద్యకావ్య విషయము
27. రామకృష్ణుని చాటుధారా పద్యములు
28. దశావతార పద్యములు

గురజాడ శ్రీరామమూర్తిగారు పైవిధంగా తమ కాలంనాటికి ప్రచారంలో ఉన్న పుక్కిటి పురాణాలన్నీ సేకరించి ఒకచోట చేర్చారు. చాలా విషయాలు నమ్మదగవని వారికి తెలుసు. అయితే వాటిలో కొన్ని విపరీత సంప్రదాయాలు ఉండుటచేత వాటిని సంకలనం చేశారు. దొరికినన్ని ఆకరాలు అందుబాటులోనికి తీసుకొనివస్తే సత్యాసత్యాలను గుర్తించగలిగిన వారు చారిత్రక ఆధారాలతో తులనాత్మక పరిశీలన చేసి చరిత్రను నిర్ణయించవచ్చు. శ్రీరామమూర్తిగారి ప్రాథమిక కృషిని ఆధారంగా చేసికొని వారి అనంతరం ఎందరో రచయితలు ముందుకు సాగారు. వాస్తవానికి శ్రీరామమూర్తిగారే తమ కవిజీవితాలను పునఃపరిశీలనతో తిరిగి రాస్తూ వచ్చారు.

స్కూలులో విద్యాభ్యాసం చేస్తున్న రోజులలోనే 'కవిజీవితములు' రచించాలనే తలంపు శ్రీరామమూర్తిగారికి కలిగింది. ఆయన చదువుకొన్న పుస్తకాలలో మెకాలే ఇంగ్లీషులో చరించిన 'క్లాసికల్ అండ్ బైయోగ్రాఫికల్ ఎస్సేస్ ఆఫ్ పోయెట్స్' అనే గ్రంథం వారిని ప్రభావితులను చేసింది. 1876 నుండి, అంటే వారి ఇరవై రెండో ఏట కొంత గ్రంథం సంపాదించి, దేశస్థుల అభిప్రాయాలు తెలుసుకొనడానికి మొదటి భాగాన్ని ప్రకటించారు. 1882 నాటికి రెండో భాగం ప్రచురిస్తే దానిని వెంటనే ఆ సంవత్సరం బి.ఎ. పరీక్షకు పాఠ్యగ్రంథంగా విద్యాశాఖవారు నిర్ణయించారు. ఈ ప్రోత్సాహం వల్ల మూడవభాగాన్ని ప్రబంధ కల్పవల్లి అనే పత్రికలో ప్రచురించారు. ఈ భాగాలన్నీ ఒకే సంపుటంగా తొలుత వెలువడలేదు. రెండవ కూర్పు వేయడానికి అవకాశం చిక్కలేదు. శ్రీరామమూర్తిగారి 'కవిజీవితములు' ఇతరులను అటువంటి రచనలు చేయడానికి ప్రేరేపించాయి. కందుకూరి వీరేశలింగంగారు 1887లో తమ 'ఆంధ్రకవుల చరిత్రము' ప్రథమ భాగం ప్రకటించారు. 'అందె బెక్కండ్ర కవుల పేర్లను, వారి చరిత్రములను వ్రాసినట్లున్నను చాలా భాగమిదివరలో నాచే బ్రకటింపబడిన కవి జీవితముల సంగ్రహమే కాని వేరు కాదు' అని శ్రీ రామమూర్తిగారు భావించారు. అయితే సాహిత్యలోకంలో వీరేశలింగంగారి పుస్తకం ఉత్తరోత్తరా ప్రామాణిక గ్రంథంగా స్థిరపడింది. శ్రీరామమూర్తిగారి రచన పుక్కిటి పురాణాల కట్టగా పేరు తెచ్చుకొంది. వాస్తవానికి శ్రీరామమూర్తిగారు కూడా చారిత్రక విషయాలను చర్చించకపోలేదు.

బతుకుతెరువు కోసం గురజాడ శ్రీరామమూర్తిగారు కాకినాడ సబ్‌కోర్టులో ఉద్యోగం చేసేవారు. వారు చదువుకొన్నది మెట్రిక్యులేషన్‌దాకానే. అయితే స్వయంకృషితో ఆంధ్రభాషా వాఙ్మయాన్నీ, చరిత్రనూ అధ్యయనం చేశారు. 'రాజయోగి' అనే పత్రికను ప్రచురించసాగారు. వీరి ప్రతిభను గుర్తించి విజయనగరం సంస్థానాధిపతి ఆనందగజపతి (1850-1897) తమ ఆస్థాన విద్వాంసునిగా ఉండమని ఆహ్వానించారు. శ్రీరామమూర్తిగారు విజయనగరానికి వెళ్ళి అక్కడ స్థిరపడ్డారు. వీరు కాకినాడ నుండి వచ్చినందువల్ల ఈయనను 'కాకినాడ పంతులు' అని పిలిచేవారు.

శ్రీరామమూర్తిగారు ఇతర రచనలను కూడా చేశారు. వాటిలో 1880లో షేక్సిపియర్ నాటకం 'మర్చంట్ ఆఫ్ వెనీస్' అనే కృతిని 'వెనీసు వణిజనాటకము' అనే పేరున అనువదించి ప్రకటించారు. గద్యపద్యాలు రెండూ రంగస్థలాన రక్తికట్టాలనే ఊహతో అనువాదంలో చాలా ఛందస్సులను ఉపయోగించారు. ఈ సంగతి పీఠికలో చెప్పుకొన్నారుకాని ఇన్ని ఛందస్సులు వాడటం చేతనే సౌరళ్యం చెడి రచనలో ఎగుడు దిగుడులు ఏర్పడ్డాయని విమర్శకులు భావిస్తున్నారు.[2] శ్రీరామమూర్తిగారు చేసిన ఇతర అనువాద రచనలలో 'చిత్రరత్నాకరం' చెప్పుకోతగ్గది. యవనయామినీ వినోదములు అనే అరేబియన్ నైట్స్ కథలనుండి ఒకటి తీసుకొని రసవంతంగా రచించారు. ''ఇందులో హాస్యరసావహమైన అభినవ కథా సుధా ప్రతిభ వుందని'' సమకాలపు పండితులు భావించారు. ఈ 'చిత్రరత్నాకరము' చాలాకాలం మెట్రిక్యులేషన్ విద్యార్థులకు పఠనీయ గ్రంథంగా ఉండేది.

2. పోణంకి అప్పారావు - తెలుగు నాటక వికాసం, పుట.210

కేవలం ఇతర భాషలనుండి అనువాద రచనలను చేయడమే కాక తెలుగు కావ్యాలనుండి ప్రేరణ పొంది శ్రీరామమూర్తిగారు గ్రంథాలు రాశారు. పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయంలోని కథా సంగ్రహాన్ని వచనరూపంలో 'కలభాషిణి' అనే పేరుతో రచించారు. తెనాలి రామలింగని గురించే కాక తిమ్మరుసు చరిత్ర, బెండపూడి అన్నమంత్రి చరిత్ర, అప్పయ్య దీక్షిత చరిత్రము అనే గ్రంథాలను రాశారు.

1893లో ఆనందగజపతి సజీవులుగా ఉన్నప్పుడు శ్రీరామమూర్తిగారి 'కవి జీవితములు' ఆరు విభాగాలు (24మంది కవులు) ఒకే సంపుటంగా వెలువడింది. తర్వాత రెండు దశాబ్దాలపాటు ఈ గ్రంథం ప్రతులు దొరకనందువల్ల గురజాడ అప్పారావుగారు 1915లో వావిళ్ళ వారిచేత పునర్ముద్రణ చేయించారు. తర్వాత అయిదుసార్లు ఇది తిరిగి ముద్రిస్తూ వచ్చారు. తెనాలి రామలింగని కథలు ఎన్నిసార్లు పునర్ముద్రణ పొందిందో లెక్కలేదు. ఆ కట్టుకథలు దేశమంతా అల్లుకుపోయాయి.

కొమండూరు అనంతాచార్యులు (1870 ప్రాంతాలు)

తెలుగు పాఠకలోకంలో తెనాలి రామలింగనితో సరిసమానమైన పేరు ప్రఖ్యాతులున్న ఇంకొక వ్యక్తి 'పరమానందయ్య' ఈ గురువుగారికన్నా వీరి శిష్యుల తెలివి తక్కువ పనులే చాలా ఎక్కువగా శ్రోతలను ఆనందింపచేస్తాయి. ఈ కథలను పుస్తకరూపంలో రచించినవారూ, వాటిని ప్రచురించిన ప్రకాశకులూ చాలామంది వున్నారుగాని వీరిలో ప్రప్రథములుగా తెలియవచ్చే రచయిత కొమండూరు అనంతాచార్యులు. ఈయన జీవిత వివరాలు తగుమాత్రం కూడా లభించలేదు. ఆంధ్ర, తమిళ భాషలలో పండితుడని చెప్పవచ్చు. తమిళంలో 'పలుకని పద్మావతి కథ' ఒకటి ప్రచారంలో ఉంది. మాట్లాడనని భీష్మించుకొని కూర్చున్న ఒక చిన్నదానిని విక్రమార్కుడు బేతాళుని సహాయం వల్ల మాట్లాడింపచేస్తాడు. ఈ పలుకని పద్మావతి కథనే కొమండూరు అనంతాచార్యులు 'మౌనధారిణి కథ' అనే పేరున 1867లో ప్రచురించారు. ఈ గ్రంథాదిని ఇలా ఒక పద్యంలో చెప్పారు.[3]

'ఇది మును ద్రవిడంబునను
న్నది యే యద్దానిఁ దెనుఁగునను నే విరజిం
చెద దీని జదువు వారల కొదవుఁదెనగు బాస దెలివి యోలినటంచున్'

ఇందులో అయిదు ఘట్టాల కథలున్నాయి. వారి వివరాలు ఇవి :

మౌనధారిణిం బలికించుటకు విక్రమార్కమహారాజు తెరయందు బేతాళు నావహింపచేసి దాని కథ చెప్పమనును.

1. తెర చీర చెప్పిన కథ - దీనిని విని మౌనధారిణి పలుకకుంటే ఆమె ధరించిన రవిక, పావడ, చీరల చేత, ఆమె కూర్చున్న మంచంకోళ్ళతోను, పక్కనున్న చిలక చేతా భేతాళుడు కథ చెప్పించాడు.

---

3. దీనిని నిడుదవోలు వెంకటరావుగారు 'ఆంధ్రవచన వాఙ్మయం' అనే పుస్తకంలో ఉదాహరించారు. పుట. 128

2. రవిక చెప్పిన కథ
3. పావడ చెప్పిన కథ
4. చీర చెప్పిన కథ (సముద్రవల్లీవ్రత మాహాత్మ్యం)
5. మంచపుకోళ్ల చెప్పెడి కథలు
6. చిలుక చెప్పిన కథ

జనరంజకమైన ఈ పలుకని పద్మావతి అనే మౌనధారణి కథనే కాక అనంతాచార్యులుగారు చాలా ప్రాచుర్యం పొందిన మరికొన్ని పుస్తకాలను రచించారు. వాటి క్రమం ఇది.

1868	-	మౌనధారిణి కథ
1870	-	మదనకామరాజు కథలు
1880	-	కుశలవ కథ
1883	-	నలుగురు మంత్రుల కథలు
1899	-	పరమానంద గురువుల కథలు
1897	-	సత్యసేన విజయం
1918	-	పరమానంద శిష్యుల కథలు (పునర్ముద్రణ)
	-	అయిదుగురు దొంగల చరిత్ర
	-	పలుకని పద్మావతి కథ

(ఈ 'పలుకని పద్మావతి కథ'ను వై. సంజీవయ్య అనే మరో రచయిత కూడా రాశాడు. ఇది కూడా 1899లో అచ్చయింది.)

పై తొమ్మిది పుస్తకాలే అనంతామాత్యుడు నిశ్చయంగా రచించిన గ్రంథాలని చెప్పవచ్చు. ఇవి కాక మర్యాద రామన్న కథలు (1870) బహుశా ఇతని రచనే కావచ్చును. మదన కామరాజు కథలు, మర్యాద రామన్న కథలు మొదట ఎవరు అచ్చువేశారో తెలియదు. మదన కామరాజు కథలనే శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ విద్యాభ్యాసం రోజులలో ఒక వృద్ధ బ్రాహ్మణ వితంతువుకు చదివి వినిపించేవారు. తర్వాత వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు వాటిని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచేత సులభ గ్రాంథికంలోనికి పరివర్తనం చేయించారు. అంతకుముందు ప్రచురణలలో గ్రంథం ''చెన్నపట్టణం బజారు భాష''లో ఉందట. మర్యాదరామన్న కథలు, మదనకామరాజు కథలు వావిళ్ళవారు మళ్ళా గ్రాంథికంలోనికి మార్పిడి చేయించారు.[4] ఎందరు ప్రచురణకర్తలు ఎన్నిరకాలుగా అనువదింపచేసినా, తస్కరింపచేసినా కొమాండూరి అనంతాచార్యులవారి మూలధనం మాత్రం తరగలేదు. ఆయన వగవడిలో ఇతరులు ఏయే రచనలు చేశారో చూడండి.

1. పంచరాజుల కథలు (1898) - మందలపు సూర్యాచార్యులు
2. పండ్రెండు మంత్రుల చరిత్ర - (1870) -

4. ''అనుభవాలూ-జ్ఞాపకాలూను'', మొదటి సంపుటం, పుట.143

3. పదునారు రాజుల కథలు - చీమకుర్తి వీరరాఘువదాసు
4. పరమానందయ్యా కథలు - రాపాక కౌస్తుభ
5. పరమానంద శిష్యులకథలు (1875) - పరవస్తు వెంకటరంగాచార్యులు
6. మర్యాద రామన్న కతలు - ఎన్. రామయ్యసెట్టి
7. ముగ్గురు రాజుల కథలు (1914) - ఎస్.వి.నరసింహమూర్తి
8. ముప్పై రెండు మంత్రుల కథలు - పెద్దాడచిట్టి కామయ్యా

పై పట్టికవల్ల ఒక పరవస్తు వెంకటరంగాచార్యులుగారు కూడా పరమానందయ్యా శిష్యుల కథలు అనే పుస్తకం రాసినట్టు తెలుస్తుంది. అయితే విశాఖపట్నంలో మహామహోపాధ్యాయ పరవస్తు వెంకటరంగాచార్యులు (1822-1900) గారూ ఈ గ్రంథకర్తా అభిన్నులో, విభిన్నులో ప్రస్తుతపు ఆకరాల వల్ల తెలియదు. పరమానందయ్యా శిష్యుల కథలనే కాక పంచమహాపాతకపుర కథను కూడా ఈ గ్రంథకర్త 1879లో రాసి ప్రచురించారు. ఇంకెవరో రంగావధూతగారు 'అన్యాయపట్టణ కథలు' అనే గ్రంథం రచించారు. సామాన్య పాఠకలోకానికి సంతోషాన్నిచ్చే ఈ తరహా కథలు నాటినుంచి నేటిదాకా పునర్ముద్రణలు పొందుతున్నాయి.

తడకమళ్ల వెంకటకృష్ణారావు (1825-1890)

కొందరు రచించిన కథా సాహిత్యం ఇప్పటికీ అముద్రితంగానే కొంతభాగం ఉండిపోయింది. ముద్రితమైన పుస్తకం కూడా ప్రస్తుతం అలభ్యం. అటువంటి రచయిత తడకమళ్ల వెంకటకృష్ణారావు. ఈయన మద్రాసు వాస్తవ్యుడు. గొప్ప గణితశాస్త్రజ్ఞుడు. పారశీకాది భాషలు తెలిసినవాడు. ఈయన రచించిన కంబుకంధర చరిత్ర, కామరూప చరిత్ర వ్రాతప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. గ్రంథాలయాధికారులు కామరూప కథ (డి.1401) గురించి రాస్తూ "మిక్కిలి పెద్దదియగు కల్పితగాధ గాన, లిపి కష్టముమీద జదువఁదగినదిగా నున్నదిగాన, యిందలి కథా సంగ్రహముఁ జెప్పఁ గుదరలేదు" అని చెప్పారు. 'కంబుకంధరకథ' కూడా ఇటువంటిదే. వీటిని 1864-1866 సంవత్సరాలలో రచించారు. తడకమళ్ల వెంకటకృష్ణారావుగారు రచించిన 'తెలుగు వెలుగు ముగుదకథ' ఒకసారి ముద్రించారు. దాని వివరాలు తెలుస్తున్నాయి.[5]

1879లో ప్రచరించిన తెలుగువెలుగు ముగుదకథకు శ్రీ మదాంధ్ర కవితావేదినీ విలాసముగా ప్రౌఢ భాషలో రాశారు. ఇది తెలుగు కవిత్వం గురించి చెప్పే నవలలాంటి రచన. ఇందులో కథ కేవలం కల్పితం. శృంగార లలిత అనే రాజకన్య తుందుడు అనే రాజకుమారుని మోహిస్తుంది. ఇద్దరికీ సమాగమం లేనందువల్ల వారు మరణించి పిశాచరూపాలు ధరిస్తారు. ఒక యోగిని వాళ్ళ పూర్వ వృత్తాంతాన్ని తెలుసుకొంటుంది. కిమిడి అనే పట్టణం ఏలే కళాదురంధరుడనే రాజుకు చంపకామోద అనే కుమార్తె పుడుతుంది. ఆమెకు తెలుగువెలుగు ముగుద అనే పేరు పెడతారు. ఆమె, కవితా

5. యండమూరి సత్యనారాయణరావు - ఉషఃకిరణాలు, పుట.283

చమత్కృతులతో అందరినీ మెప్పిస్తుంది. చీనారాజు, కుంబి అనే వాని కథ ఇందులో వస్తుంది. ఈ గ్రంథంలో అక్కడక్కడ పద్యాలు కూడా ఉన్నాయి. ఈ 'తెలుగు వెలుగు ముగుద' వెలుగులు ఇవాళ ప్రసరించకపోవడం దురదృష్టమే.

వేదం వెంకటరాయశాస్త్రి (1853-1929)

కొన్నాళ్లు ఒక వెలుగు వెలిగిన కొంతమంది రచయితల కొన్ని గ్రంథాలు క్రమంగా ప్రభ తగ్గిపోయి వెలవెలపోతే ఆశ్చర్యంలేదు. తెచ్చిపెట్టుకొన్న శైలిని మెచ్చుకొనేవాళ్లు ఎప్పుడూ వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉంటారు. ఈ అభిమానాల 'భజన' తగ్గగానే ఒకనాటి పండిత రచనలలోని భాగం మ్యూజియములో భద్రపరిచే అపురూపపు సరుకుగా మిగిలిపోతుంది. ఈ తప్పనిసరి పరిస్థితి వేదం వెంకటరాయశాస్త్రిగారు రచించిన కథా వాఙ్మయంలో కొన్ని రచనలకు పట్టింది. జమీందారీ యుగం మూడు పువ్వులూ, ఆరుకాయలుగా ఉన్నప్పుడు ఆయన జంకు కళంకం లేని కవి చంద్రులుగా ప్రసిద్ధులయ్యారు. ఆయనకున్న సంస్కృత లక్ష్య లక్షణ జ్ఞానం అపారం. తెలుగు సాహిత్యంలో కొరుకుడుపడని కావ్యాలుగా చెప్పుకొనే శృంగార నైషధం, ఆముక్తమాల్యద వంటి వాటికి ఆయన చేసిన వ్యాఖ్యానాలు మంచి సాహిత్య ప్రవేశమున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. వెంకటరాయశాస్త్రిగారు సంస్కృత రూపాలను అనువదించారు. తెలుగులో స్వతంత్ర నాటకాలు మూడు రచించారు. తెలుగు సాహిత్యానికి వారు చేర్చిన కూర్పులు వారి నేర్పును ఎంతగా చాటుతాయో చదువరుల ఓర్పును అంతగా పరీక్షిస్తాయి. సాధారణ పాఠకులకోసం వారు 'సులభవచన గ్రంథములు' రచించడం సంతోషించదగ్గదే. ఆ పుస్తకాల గురించి ఇక్కడ చెప్పుకొందాం.

1891లో వెంకటరాయశాస్త్రి గారు 'కథా సరిత్సాగరం' ప్రప్రథమంగా ప్రచురించారు. ఇది ఆరుభాగాలుగా విభజించారు. ఇది సంస్కృతంలో సోమదేవభట్టు పద్యరూపంలో రచించిన 'కథా సరిత్సాగరం' అనే మహాగ్రంథానికి అనువాదం. క్రీ.శ.1063-81 దాకా కాశ్మీరం పరిపాలించిన ఆనంద భూపతి ఆస్థానంలో సోమదేవభట్టు ఉండేవాడు. మూలంలో 18 లంబకాలు, 124 తరంగాలు, 22,000 శ్లోకాలు ఉన్నాయి. ఇది కథలు సరితలు కలిసే సాగరము. దీనికి పైశాచీ భాషలో గుణాఢ్యుడు రచించిన 'బృహత్కథ' మూలమంటారు. గుణాఢ్యుడు సాతవాహక ప్రభువుల రాజధాని అయిన ప్రతిష్ఠాన పురంలో వుండే ఆంధ్రుడు. క్రీ.పూ.200 నుండి 150 మధ్యలో గుణాఢ్యుడు ఉండేవాడని చరిత్రకారులు నిర్ణయించారు. క్రీ.శ.875 సంవత్సరంలో కంబోడియా దేశంలోని ఒక శాసనంలో గుణాఢ్యుని పేరూ, ఆయనకు ప్రాకృతభాషమీద కలిగిన విరక్తి గురించి దాఖలాలు కనబడతాయి. దండి, గుణాఢ్యుడు, భట్టభాణుడు, భాసుడు, కాళిదాసు మొదలైన సంస్కృత మహాకవులందరూ బృహత్కథ నుండి ఉత్తేజితులైనవారే. సోమదేవుని సంస్కృత రచన భారతదేశ సాహిత్యంలో ఎందరికో ముడిసరుకు సప్లయి చేసింది. ఇటువంటి ఉద్గ్రంథం తెలుగువారికోసం వచనంలో వెంకటరాయశాస్త్రిగారు రచించారని తెలిసిన దేశం కొండంత ఆశలు పెట్టుకొంది.

1886లో 'ప్రక్రియాఛందస్సు' అనే గ్రంథం రచించాక శాస్త్రిగారు కథా సరిత్సాగరం అనువాదం ప్రారంభించారు. తన మిత్రులలో ఎవరినైనా మూలం బయటకు చదువుతూ ఉండమని నియోగించి, వారు చదువుతూ ఉండగా తాము తెలుగువచనం చాలా వడిగా రాసుకొంటూ పోయేవారట. 1890లో ఒక సొంత ప్రెస్సాఫీసు పెట్టుకొని 1891లో ప్రచురణ ప్రారంభించారు. వెంకటగిరి రాజా ధన సహాయం చేసి, ఆరు సంపుటాలూ వెలుగు చూసేటట్టు చేశాడు. వెంకటరాయశాస్త్రిగారి జీవిత చరిత్రను రచించిన వారి మనుమడు కథా సరిత్సాగరం గురించి ఇలా ప్రశంసించాడు.[6]

''నానా నఖ్యానమనోహరం'మైన ప్రబంధ మొకయపూర్వ శైలిలో రచియింపఁబడినది. కఠిన పదాడంబరము లేక సులువైన పదజాలముతో నిండి కథా భాగములకు ఆయా చోట్ల అనువైన శైలితో ఎల్లవారికిని సులభగ్రాహ్యామైయున్నది. కొందరు ప్రబంధములలోని వచనముల శైలిని వ్రాయుచుండిరి. మరికొందరు వీరేశలింగము పంతులు ప్రభృతులు ఆంగ్ల గ్రంథముల సాంప్రదాయములను తెనుగులోనికి తెచ్చుచుండిరి. శాస్త్రులవారు తెలుగువారి జాతీయతను లోపింపజేయు తిక్కనాదుల సాంప్రదాయము ననుసరించి ఆంధ్ర దేశమందు జనసామాన్యము యొక్క వాడుక భాషకు చేరువయైన భాషలో కథలను వ్రాసిరి. ఈ వచనమున పటిమయు గాంభీర్యమును చక్కగా నున్నవి. శైలి ఏమాత్రము హెచ్చుతక్కువలు లేక సాపుగా నడచినది. శాస్త్రులవారి శైలి ననుకరించి పలువురు వ్రాసియున్నారు; ఇంకను వ్రాయుచున్నారు.''

లోకుల రుచులు భిన్నంగా ఉంటాయి. గిడుగు రామమూర్తిగారు కథా సరిత్సాగరంలోని భాషపై చాలా విమర్శలు చేశారు. మచ్చుకు ఆంధ్రభాషా స్వభావానికి అనుగుణంగా లేని వాటిని ఎత్తి చూపించారు. ఒకచోట ఇలా రాశారు.[7]

''చూడండి. మచ్చుకు రెండు మూడు వాక్యాలు కథా సరిత్సాగరములోనివి. 'ఆ మూఢుడు.... క్రోధవర్మ భార్యతో సంగమించి అతని చేత చూడఁబడి సముద్రములో వేయబడి చచ్చెను' (3,8), 'మనము... యీ లోతు సుడిలో... జలము చేత విసరిపారవేయబడినారము' (21), 'ఇదిగో ఆసనమలంకరింపబడును గాక' (405), 'ఈ సరస్సులో వేయబడిన వెదుళ్ళు' (4.8).''

ఒక్క గిడుగు రామమూర్తిగారే కాదు, చాలామంది 'కథాసరిత్సాగరం'లోని భాషను గాని, రచనా విధానాన్ని గాని మెచ్చుకోలేదు. గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు 'ఈ కథా సరిత్సాగరము నాధారము చేసికొని ప్రాచీనాంధ్రుల చరిత్రను, ప్రాచీన భారత చరిత్రను స్వతంత్రముగా' రచించాలి అని చెప్పి శాస్త్రిగారి అనువాదం గురించి ఇలా రాశారు.[8]

''....సంస్కృతములో పుట్టిపెరిగి, సంస్కృతముతో దేహమును పెంచి, ఎక్కడ జూచిన సంస్కృత రక్త, సంస్కృత మాంస, సంస్కృత కండరములే గల వేదము

6. వేదం వెంకటరాయశాస్త్రులువారి జీవిత చరిత్ర సంగ్రహము, పుట.55-6
7. ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం - పుట.160
8. ఆంధ్ర వచన రచనా పరిణామము - పుట.135

వెంకటరాయశాస్త్రి వంటి సంస్కృత పండితులుగాక తెనుగు భాషా జాతీయ జీవనములకు భంగములేని తేట తెనుగు జీవద్భాషలో ధారాళముగా, తెనుగు ప్రజల కింపగు రీతిని ఈ కథా సరిత్సాగర కథలను తెనిగించి వ్రాయుట అత్యావశ్యకము. వెంకటరాయశాస్త్రిగారు ఈ గ్రంథ రాజమును తెనిగింపబూని ఎంత భ్రష్టు చేసిరో, ఏవిధముగా భగ్నము పాడుపాడు గావించిరో స్పష్టముగా చూపుటకు వారి కథా సరిత్సాగరము 'తెనుగు' నుండి ఒక్క వాక్యము మాత్రము ఎత్తి వ్రాసెదను.

''క్షామ పాండుధూసర యా బ్రాహ్మణి మానము చేతనుంబలె శిథిలమైన వస్త్రముచేత చాలావరకు వదలబడినదై''

''కర్మార్థక రచనలు సంస్కృతములోను, ఇంగ్లీషులోను రాణింపగలవుకాని తెనుగులో అట్లు రాణింపవు. ఇట్టి దుర్గతిలో నున్న స్త్రీని గూర్చి ప్రసంగించవలసినప్పుడు తెనుగు ప్రజలు 'ఆవిడకు కట్టుకొనుటకు బట్టలులేవు, చింకిగుడ్డలు జీర్ణవస్త్రములతో కుచేలునట్లున్నది' అందురుగాని మరొకలాగున అనరు. పై వాక్యము తెనుగన జనదు.''

వేదం వెంకటరాయశాస్త్రిగారి ఆరు సంపుటాల 'కథా సరిత్సాగరం' పుర్ముద్రణలు కూడా జరిగాయి. అయితే ఈ కథలను హాయిగా చదువుకొనే అదృష్టం 1950లో తల్లావఝల శివశంకరశాస్త్రిగారూ, వారి కుమారులు కృత్తివాసతీర్థులూ ఆరు సంపుటాలలో నవీన సరళానువాదం చేశాక, వాటిని అద్దేపల్లి అండ్ కో వారు ప్రచురించాక జనసామాన్యానికి సులభ సాధ్యమైన రచన లభించింది. తిరుపతి తిరుమల దేవస్థానం వారి ఆధ్వర్యంలో విద్వాన్ విశ్వం ఇటీవల కథా సరిత్సాగరాన్ని పదకొండు సంపుటాలలో 'మూలానురోధంగా తెనుగు నుడికారం చెడకుండా' అనువదించి ప్రకటించారు. ప్రజా బాహుళ్యానికి ప్రాణం లేచి వచ్చింది. వెంకటరాయశాస్త్రిగారి కథా సరిత్సాగరం చరిత్రలో భాగమైంది.

పూర్వం పండితులు కథా సాహిత్యాన్ని సామాన్య పాఠకలోకం కోసంకాక, పాఠ్యగ్రంథాల ప్రయోజనాల కోసం రాసేవారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు కూడా అదే చేశారు. వారు రాసినవి సులభ వచన గ్రంథాలను ('నాండీటెయిల్డ్'గా) ప్రచురణకర్తలు ఇలా ప్రకటించారు.

భోజకాళిదాసకథలు అప్రూవుడు - 3, 4 ఫారములకు
విక్రమార్కుని అద్భుత కథలు. అప్రూవుడు - 4, 5 ఫారములకు
ఉదయిని చరిత్రము, అప్రూవుడు - 4, 5 ఫారములకు
భేతాళ పంచవింశతి కథలు.

ఇటువంటి పండిత ప్రకాండుల రచనలను కాక జనసామాన్యానికి అందుబాటులో వున్న భాషలో ఇతరుల రచనలను వివిధ ప్రచురణ కర్తలు ముద్రిస్తూ వచ్చారు. కొన్ని గ్రంథాలపేర్లూ, వాటి రచయితల పేర్లూ చూడండి.

భేతాళుని కథలు	- రచయిత పేరు తెలియదు	- 1870
విక్రమార్కుని కథలు	- రావిపాటి గురుమూర్తి శాస్త్రి	- 1819

విక్రమార్క చరిత్రము	- భాగవతుల రామమూర్తిశాస్త్రి	- 1901
భోజకాళిదాస కథలు	- ఉ. వెంకటనరసింహాచార్యులు	- 1917
భట్టి విక్రమార్కుని కథలు	- యం. సుబ్బారాయలు నాయుడు	- 1918
విక్రమార్కుని కథలు	- బి. సీతారామశాస్త్రి	- 1919

మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ''బత్తీసుపుత్రి కథలు'' అనే పేరుతో 1837 నాటి వ్రాతప్రతి ఒకటి చక్కటి వ్యావహారిక భాషలో ఉంది. విక్రమార్కుని సింహాసనాన్ని భోజుడు ఎక్కుదామనుకొన్నప్పుడు 32 బొమ్మలు చెప్పిన కథలను ఇందులో ఎవరో పేరు తెలియని రచయిత రచించారు. ఈ లైబ్రరీలోని పుస్తకాల వివరాలు ఇవి.

D.1424 - బత్తీసు పుత్రి కథలు (1837)
D. 1425 - భేతాళ పంచవింశతి
D.1428 - భేతాళ పంచవింశతి (కాసు వెంకట్రాయులు ప్రతి)
D. 1429 - భేతాళ పంచవింశతి

ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి గ్రంథాలయంలో ఈ క్రింది పుస్తకాలు వాడుక భాషలో రచించినవి ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు.[9]

విక్రమార్క చరిత్ర - బాపయ్యగారి యాదవాచార్య
భట్టి విక్రమార్క కథలు - కర్తపేరు తెలియదు
సాలభంజికల కథలు - కర్త పేరు తెలియదు.

ఈ వ్రాతప్రతుల పుత్రికలు దేశంలో ప్రచారంలో ఉండే ఉంటాయి. వాటిని ఆధారం చేసుకొని పుట్టిన గ్రంథాలను వివిధ ప్రచురణ కర్తలు ప్రకటిస్తూ ఉన్నారు. 1873 శ్రీముఖ నామ సంవత్సరంలో గాని అంతకు అరవై సంవత్సరాల ముందున్న 1813 శ్రీముఖలోగాని ఎవరో లిఖించుకొన్న భేతాళ పంచవింశతిలోని కథ ఎత్తుగడను చూడండి.

'పార్వతి పరమేశ్వరుడున్ను, కైలాసమందును తూంగుటుయ్యాల మీదను వూంగుతువుండగాను, పార్వతి అనెను. ఎవ్వరు యెక్కడ వినని కథలు నాకు చెప్పమనెను. ఈశ్వరుడు మా భాగని నీవు వినుమనెను. అని కథలు చెప్పుచూ వుండెను. కైలాసమందు శివునికి పువ్వులతోట చేసేవాడు పుష్పదంతుండన్నవాడు ఈశ్వరునికి పువ్వులు పట్టుకువచ్చి ఈశ్వరునికి యిచ్చి ఆ సమీపాన వుండి కథలు వినవలసివాండు బంగారాన బల్లి అయి గోడను అంటిపట్టుక వుండి కథలన్ని వినెను, విని తన యింటికి వచ్చి శివుడు ఎలాగు చెప్పినాడో ఆలాగు తన భార్యకు ఆ కథలన్ని చెప్పెను. అది ఆ కథలన్ని విని మర్నాడు పార్వతికి పారిజాత పుష్పాలు యిచ్చి పొడగని ఆ తర్వాత దాన్ని కూర్చుండుమని పార్వతి శలవుయిస్తే ఆ సైరంధ్రి కూర్చుండెను. అమ్మా కథ చెప్పుతాను వినుమని పార్వతీదేవితో ఆ సైరంధ్రి అనెను. పార్వతి మా భాగుచెప్పుమనెను. సైరంధ్రి తన మొగుడు చెప్పినట్టి కథలన్నీ చెప్పెను. పార్వతి మహాశ్చర్యపడి చూడు మా ఈశ్వరుడు

9. గొబ్బూరి వెంకటానందరాఘవరావు - ఆంధ్రవచన రచనా పరిణామము - పుట.137

యెంత కపటం చేసి చెప్పెను. అందరూ విన్న కథలు యెవ్వరూ యెరగరని నాకు చెప్పెను. ఈశ్వరుని మాయ తెలియనాయెనని పార్వతి అనెను. ఆ మాట ఈశ్వరుడు దివ్యజ్ఞానమందు చూచి పుష్పదంతుని పిలిపించి అవురా వోరి దురాత్మ! నీవు కపటవేషం చేత మేము చెప్పుకున్న కథలన్నీ విని మా యిద్దరినందున కలహం పెట్టితివి. కనుక భేతాళుండన్న భూతమైవుండుమని శాపం బెట్టెను. అందుకువాడు భయపడి గడగడ వణికి సాష్టాంగ నమస్కారం చేసి నాకు శాపవిమోచనం యెన్నటికి అని అడిగెను. అడిగితే నీ భార్య నిన్ను యెప్పుడు చూస్తుందో ఆ నాటికి శాపవిమోచనం అనెను. వాడు యింటికి వచ్చి తన భార్యతో ఈశ్వరుడు శాపం పెట్టింది చెప్పి అదృశ్యమైపోయి నర్మదా తీరాన ఒక మర్రివృక్షం వుండగాను అందున కాళ్లు రెండు కలయబెట్టుకొని, తల్లక్రిందుగా వేలబడి వుండెను.'' (D.1428)

ఇంత చక్కని వాడుకభాషలోని కథలను మన ఉద్దండ పండితులు గడ్డు గ్రాంథికంలోనికి మార్చేసి పాఠ్యపుస్తకాలుగా జమీందారీ యుగంలో పెట్టించుకొన్నారు. ఇవి క్రమేణా సరళం కాజొచ్చాయి. ఉదాహరణకి వేదం వెంకటరాయశాస్త్రిగారి కథా సరిత్సాగరం నుండి, తల్లావఝుల శివశంకరశాస్త్రిగారి కథా సరిత్సాగరంనుండి 'కథావతరణము'ను తులనాత్మకంగా కొన్ని వాక్యాలు పరిశీలించటం అవసరం.

వెంకటరాయశాస్త్రిగారి ప్రతి[10] నుండి - ''కలదు గదా కిన్నర గంధర్వ విద్యాధర నివాసము పర్వత చక్రవర్తి హిమవత్పర్వతము. ఆ హిమవంతుని మహిమను వేరే పొగడవలయునా? అన్ని పర్వతములుండగా త్రిలోకమాత అతనికే కూఁతురై పుట్టుట చేతనే తెలియలేదా? ఆ హిమాలయము యొక్క యుత్తర శిఖరమయిన మహాగిరికి కైలాసమని పేరు. అది అనేక సహస్ర యోజనములు ఆక్రమించియుండును. 'సముద్రమును మథించిన దయ్యును మందగిరి అమృతము చేతనైనను తెల్లఁబడదాయెను. నేను అప్రయత్నముగానే తెల్లగా నున్నాను' అని నవ్వుచున్నదో యనునట్లు ఆ కైలాసము తెల్లని వెలుగుచే దేదీప్యమానముగా నుండును. అందు సిద్ధ విద్యాధరాదులును ప్రమథ గణములును కొలుచుచుండ చరాచర గురువు పరమేశ్వరుడు పార్వతితో గూడ నివసించుచుండును. ఏ దేవుని యెఱ్ఱని జటాజూటమందు బాలచంద్రుడు సంధ్యారాగముచే వెలుంగు నుదయగిరి శృంగమందలి విహారసుఖమును పొందుచున్నాడో, ఏ భగవంతుడు అంధకాసురుని హృదయమును త్రిశూలమున గ్రుచ్చి ముల్లోకముల హృదయ శూలమును వెలువరించినాడో, ఏ దేవదేవునికి దండ ప్రమాణములు చేసి సురాసురులు తమ చూడామణులయందు అతని పాద నఖ ప్రతిబింబములచేత ప్రసాదప్రాప్తార్థ చంద్రులచేత నుంబలె ప్రకాశించుచుందురో, ఆ పరమశ్వరునిం బ్రాణనాయిక పార్వతి ఒకనాడు ఏకాంతంబున చనవు మెఱసి సన్నుతులచేత సంతోషపెట్టెను. ఆ పొగడ్తలకు సంతసలిల్లి చంద్రశేఖరుడు ఆమెను తొడమీద కూర్చుండఁ బెట్టుకొని, 'ప్రాణనాయికా! నీకేమి ప్రియము చేయుదును' అని యడిగెను. అంతట గిరిపుత్రి 'నా యేలినవాడా, దేవా, నాకు

10. ఇది 1891 నాటి తొలిముద్రణలోంచికాదు. 1948నాటి ప్రతినుండి. తొలి ముద్రణ అలభ్యం.

ప్రసన్నుడవేని మనోహరమయిన యొక యపూర్వకథను చెప్పుము' అనెను. అందునకు పరమేశ్వరుడు 'ఓ సఖీ, లోకములో భూతముగాని వర్తమానముగాని భవిష్యత్తుగాని నీవెఱుగనిదేమున్నది? అనెను. అట్లన్నను పార్వతి ఆయనను నిర్బంధపెట్టెను, మానినుల చిత్తు, ప్రియానురాగ పరీక్షా పరాయణము గదా! అంతట ఆమెను రంజింప వేఁడి మహేశ్వరుఁడు తన మహిమను ప్రకటించునదైన యీ చిన్ని కథను వక్కాణించెను.''

తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారి ప్రతి[11] నుండి - ''కిన్నర గంధర్వ విద్యాధరులకు నివాసనమైన హిమవత్పర్వతానికి ఉత్తర శిఖరము కైలాసగిరి. ప్రమథగణాలు, సిద్ధ విద్యాధరులూ సేవలు చేస్తూ ఉండగా, సమస్త చరాచర ప్రపంచాలకు ప్రభువైన మహేశ్వరుడు అంబికాదేవితో ఆ శిఖరము మీద నివాసము చేస్తూ ఉంటాడు. ప్రాణ ప్రియ అయిన శ్రీ భవానీదేవి ఒకనాడు ఏకాంత ప్రదేశాన ఈశ్వరుణ్ణి స్తుతి వాక్యాలతో ప్రసన్నుని చేసుకున్నది. శశిశేఖరుడు ఆమెను అంకతలమున కూర్చోబెట్టుకొని ''కింతే ప్రియం కరోమి? నీకు ఇష్టమైనది ఏది చెయ్యను?'' అన్నాడు. అప్పుడు పార్వతి, ''నాథా, నాకు మనోహరమైన అద్భుతకథ చెప్పండి.'' అన్నది. అందుకు పరమేశ్వరుడు ''ప్రేయసీ, నీకు తెలియని భూత భవిష్యద్వర్తమానములు ఏమున్నవి?'' అన్నాడు. అలా అన్నప్పటికీ పార్వతి పరమశివుని నిర్బంధపెట్టింది. మానవతుల మనస్సు ప్రియానురాగాన్ని పరీక్ష చెయ్యవలెననే కోరికతో ఉండడము సహజమే. మహేశ్వరుడు ఆమె హృదయనాకి ఉల్లాసము కలిగించి, తన ప్రభావాన్ని ప్రకటించే ఈ చిన్న కథ చెప్పినాడు.''

ప్రజాబాహుళ్యం మాత్రం ఎప్పుడూ సరళ భాషలోని రచనలనే ఆదరించసాగారు. గుజిలీ పుస్తకాలను కథలకోసమే ఒకనాడు కొనుక్కొని చదివారు. ప్రజల ఆనందం కోసమే ఇటువంటి కథా సాహిత్యాన్ని సృష్టించిన రచయితలూ ఉన్నారు.

మధిర సుబ్బన్నదీక్షితులు (1868-1928)

కేవలం వినోదం కోసమే కథలు రాస్తున్నానని స్పష్టంగా ప్రకటించి ఎన్నోతరాల తెలుగు పాఠకులకు ఆనందాన్ని ఇచ్చిన కథకుడు మధిర సుబ్బన్నదీక్షితులు. తూర్పుగోదావరి జిల్లాలోని తాళ్ళపూడి గ్రామంలో జన్మించిన ఈయన కాటవరం గ్రామంలో శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారితో కలిసి ఇవటూరి నాగలింగశాస్త్రిగారి దగ్గర కావ్యాలంకార నాటక సాహిత్యాలు చదువుకొన్నారు. ఇరవయ్యో ఏట 1888లో అష్టావధానాలు చేశారు. ఉభయభాషలలోనూ కవిత్వం చెప్పగలిగిన సుబ్బన్నదీక్షితులు గారి దృష్టి కథలమీద ముఖ్యంగా వచనంలో జనం చెప్పుకొనే కథలమీదా మళ్ళింది. దేశంలో బహుళ ప్రచారం పొందిన జానపదగాథల నన్నింటిని సేకరించి ఒక చిన్న కథాసూత్రంలో పూసలుగా గుచ్చి 'కాశీమజిలీలు' అనే గ్రంథాన్ని చాలా సంపుటాలలో రచించారు.

అన్నీ తెలిసిన ఒక గురువుగారు కాశీ క్షేత్రానికి వెళ్ళదలిచారు. ఏమీ తెలియని ఒక శిష్యుణ్ణి యాత్రలో తోడుకోసం వెంటరమ్మన్నారు. ఆ శిష్యుడు ఒక షరతు పెట్టాడు.

11. కథా సరిత్సాగరము, సంపుటం-1, అద్దేపల్లి అండ్ కో, సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం, 1950

అదేమిటంటే వెళ్ళిన ప్రతిచోటా కనబడే వింతలు విశేషాలను గురువుగారు తనకు విశదం చేయాలి. ప్రతి ఒక్క స్థలంలో ఎదురొచ్చే విచిత్రాల కథలలోని చిక్కుముళ్ళన్నీ విప్పి తనకు స్పష్టం చేయాలి. ప్రతి మజిలీలోనూ ఏదో ఒక విశేషం ఉండకపోదు. కాశీ చేరుకొనేదాకా శిష్యుడు అడుగుతూనే ఉన్నాడు. గురువుగారు కథలు చెప్తూనే ఉన్నాడు. 'కాశీమజిలీలు' సంపుటాలలోని అన్నికథలలో అడగడుగు అద్భుతాలు, లెక్కలేని చిక్కులు, కొరతలేని కుతూహలాలతో నిండి ఉంటాయి. ఉదాహరణకు ఒక కథ చాలు వినండి.

ఒక ఊళ్ళో శిష్యుడు ఒక గోడమీద రాత చూశాడు. దానిమీద ఈ క్రింది పద్యం ఉంది.

''భూపతిఁజంపితిన్, మగఁడు భూరి భుజంగము చేతఁ జచ్చె, నే
నాపదఁజెంది చెంది యుదయార్కుని పట్టముఁజేరి వేశ్యనై
పాపము గట్టుకొంటి, తన పట్టి విటుండయి కౌఁగిలింప, సం
తాపముఁబొంది, యగ్గిఁబడి, దగ్ధనుగా, కిటు గొల్లభామనై
యీ పని కొప్పుకొంటి, నృపతీ! వగ పేటికిఁజల్ల చిందినన్''

శిష్యునిలో కుతూహలం కొండెత్తు పెరిగింది. ఈ బొమ్మ ఏమిటి? ఈ పద్యమేమిటి? ఇందులో ఎన్నో సన్నివేశాల ప్రసక్తి ఉంది. వాటి పూర్వాపరాలేమిటి? ఈ గొల్లభామ ఏ భూపతిని ఎందుకు చంపింది? ఆమె మగడు ఎందువల్ల సర్పదష్టుడై మరణించాడు? వారికి పుట్టిన కుమారుడు ఎక్కడ పెరిగాడు? ఆమె వేశ్యగా ఎందుకు మారింది? ఆమె దగ్గరకే ఆమె కొడుకు విటుడుగా ఎందుకొచ్చాడు? ఇవన్నీ ఆమెకు తెలిసి తెలిసి అగ్నిప్రవేశం చేయకుండా ఎందుకు చల్ల కడవ నెత్తిని పెట్టుకొంది? అందులోంచి చల్ల చిందితే ఏ నృపతి ప్రశ్నించాడు? శిష్యుడు వేసిన ఈ ప్రశ్నలన్నింటినీ గురువు పూసగుచ్చినట్టు జవాబులు చెప్పాడు. సుబ్బన్నదీక్షితులుగారు వాటిని గొల్లభామ కథలో రాశారు.

ఈ పద్యంలోని సంఘటనలుగానీ, ఇందులోని కల్పనలుగానీ సుబ్బన్నదీక్షితులు గారి స్వకపోల కల్పితాలు కావు. కథా కథనమే వారు కల్పించుకొన్న విధానం. ఈ పద్యానికి 'రసిక జీవనం' అనే సంస్కృత ప్రబంధంలో మూల శ్లోకం ఉంది.

''హత్వా నృపంపతి మవేక్ష్య భుజంగదష్టం
దేశాంతరే విధివశాద్ గణికాస్మితాజాతా;
పుత్రం భుజంగ మధిగమ్యచితాం ప్రవిష్టా;
శోచామి గోపగృహిణీ కథ మద్యతక్రమ్.'' (9వ ప్రబంధం, 36వ ప్రబంధం)

'రసిక జీవనం' కంటే ప్రాచీనమైన ఇంకొక సంస్కృత సంకలన గ్రంథం ఒకటి ఉంది. దానిపేరు 'ప్రబంధ చింతామణి' దాన్లో రెండవ ప్రకరణంలోని, 12వ శ్లోకంలో ఉన్న 'గోపగృహిణీ ప్రబంధం' ఈ కథకు మూలమట. ఈ వివరాలను దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు తమ చాటుపద్య రత్నాకరంలో పొందుపరిచారు. ఈయుణ్ణి వెంకట వీర రాఘవాచార్యులుగా మూలశ్లోక వివరాలు ఇచ్చారు. పిచ్చయ్యశాస్త్రిగారు చాటుపద్య

రత్నాకరాన్ని తొలిసారి 1917లో ప్రచురించారు. అయితే కాశీ మజిలీలను మధిర సుబ్బన్న దీక్షితులు,గారు అప్పటికి రెండు దశాబ్దాలకి పూర్వం 1898లో రచించారు. సుబ్బన్నదీక్షితులుగారు 'రసికజీవనం' గానీ, 'ప్రబంధ చింతామణి'గానీ చూసి, అందులో మూలశ్లోకాలలోని వింత కథా సన్నివేశాలను తెలుసుకొని కథను అల్లారు. (ఈ కథనే ఆధారం చేసుకొని 1945-50ల మధ్య 'గొల్లభామ' అనే జానపద చలనచిత్రం రూపొంది ప్రజారంజకమైంది.)

'భూపతి చంపితిన్' అనే పద్యాన్ని వాడిన కథ చాలా పెద్దది. 7వ భాగంలో 123వ మజిలీ నుండి 131 మజలీ దాకా తొమ్మిది మజిలీలలో పది గొలుసుకథలతో దీనిని కథనం చేశారు.

'కాశీ మజిలీలు' సంపుటాలు రచించడంలో సుబ్బన్న దీక్షితులుగారికి స్పష్టమైన ఆదర్శం ఒకటి ఉంది. దానిని ఆయన పీఠికలో ఇలా వివరించారు.

''మనము ఐహికాముష్మికముల విషయమై ప్రతిదినము కృషి చేయవలసి యున్నది. అందుకు జ్ఞాన బోధకములగు గ్రంథములే సాధనములు. అట్టి గ్రంథములు చదువుటకు పెక్కండ్ర కుత్సాహము కలిగియుండదు. వినోదములగు కథలు చదువుకొనుటకు ఎట్టివారికి నభిలాషయుండక మానదు. ఈ కాశీ మజిలీలు కేవలము వినోదార్థముగా కాలక్షేపము చేయువారికే ఇందలి నీతులు. జ్ఞానబోధయు విమర్శించిన పరమార్థ బోధకములై యున్నవని చదువరులకు తెల్లము కాకమానదు. కావున యోగులకు, జోగులకు కూడ నీ కథలు శ్రోతవ్యములు.

> పండితులైన మెచ్చవలె, పామరకోటికినైన నింపుగా
> నుండవలెన్, ప్రబంధమునయోక్తుల నిర్వరకున్ హితంబుగా
> కుండిన తత్ప్రబంధమది యెక్క ప్రబంధమె? సాధుపాఠకా
> ఖండ సుఖ ప్రదం బగుటగా ఫలమా! కవితా ప్రసక్తిన్''

పామరకోటికి ఇంపుగా ఉండడానికే 'కాశీమజిలీలు' ఉపయోగపడడం మెచ్చుకోదగ్గ విషయం. ఆదిలో వీటిని సుబ్బన్నదీక్షితులుగారు వాడుకభాషలోనే రచించారట. అది తర్వాత గ్రాంథిక భాషలోనికి మార్చడం జరిగింది. గిడుగు రామమూర్తిగారు ఇలా రాశారు.[12]

''...కాశీ మజిలీలు మొదట ఏలూరిలో గ్రామ్య భాషలోనే అచ్చువేయించినా, ఇప్పుడు అవి గ్రాంథిక భాషలోనే అచ్చుపడుతున్నవి. కథలు నోటను చెప్పినప్పుడు గ్రామ్యభాష వినడానికి ఇంపుగానే ఉంటుందట! గ్రాంథిక భాషలో ఉంటేనేగాని గ్రంథము కాదని చాలామంది అనుకొంటారు. స్త్రీలకు కూడా గ్రాంథిక భాషమీదనే ఎక్కువ మక్కువ సుమండీ. పల్లెటూళ్ళలో కూడా తెలిసినా తెలియకపోయినా గ్రాంథికభాషలో ఉన్న పుస్తకాలే అందరూ కొని కూడబలుకుతూ చదువుతారట!''

12. ఆంధ్రపండిత భిషక్కుల భాషా భేషజం - పుట.25

కాశీమజిలీలలో మొదట వాడుకభాష ఉండేదని చాలా నిదర్శనాలు మిగిలాయి. గోపుడు (శిష్యుడు) మణిసిద్ధునితో మొదట మాట్లాడేటప్పుడు మొదటిభాగంలోనే -

''నీవు భేమ్మడవైతే బోడిగుండేమి? మా భేమ్మడు లాగున లేవేమి? మా భేమ్మని గురువులోడికి యీత రుప్పలా జుట్టు, పొలిమేర రాతిమీద వేసిన కొంగరెట్టలాంటి బొట్టు, మెడమీద చేపమీసాలవంటి దారాలు వేసుకొని వొంకర బూరాలతో యేటికొక మాటు వచ్చి యెవరినో యొకరిని తెగకాల్చి మరీ వెడతాఁడు, వాఁడిలాగున నీవు లేవేమి?'' అనే పాత్రోచిత భాషను వాడుతారు.

మణిసిద్ధుణ్ని తనకు ''నాకు కథలంటే మహాఇష్టము. తెలిసేలాగున చెప్పితే జ్ఞాపకముంచుకోగలనుగాని గొడవగాను పెద్దమాటలుగాను చెప్పకుము'' అంటాడు. సుబ్బన్నదీక్షితులుగారు గొడవగాను, పెద్దమాటలతోను చెప్పారు. ఇలా గ్రామ్యభాషను మాట్లాడిన పాత్రే వెంటనే అరసున్నల తోటి, బండిరాలతోనూ మాట్లాడటం ప్రారంభిస్తుంది. ఎందుకంటే గురువుగారు శిష్యుని నెత్తిమీద చేయిపెట్టి గ్రహణశక్తి పూర్తిగా కలిగించేటట్టు చేశాడు. అందుకే చెళ్ళపిళ్లవారు ఈ కథల గురించి అభిప్రాయం ఇస్తూ ''ఇవి కేవలము కథల వంటివి కాక వ్యాకరణాదిశాస్త్ర సాంప్రదాయము నందేమి యలంకారాదుల యందేమి మన ప్రాచీన కావ్యముల కించుకయుఁ దీసిపోవని మెచ్చుకొన్నారు. వీటిలో ఎవరి మొహం వాళ్ళకు కనబడుతుంది.

ఎంత కృతకభాషలోనికి మార్చినా ఈ కథలలో వ్యావహారిక భాషా ప్రయోగాలు కనబడతాయని గురజాడ అప్పారావుగారు గుర్తించారు. ''శస్తిని; తేలుస్తాడు; చేస్తాము; చేస్తే; యిస్తారు; యిస్తాను'' అనే ఉదాహరణలను చూపించారు.[13]

కాశీమజిలీలు పది సంపుటాలుగానే ఆదిలో 1916 నాటికి సుబ్బన్న దీక్షితులుగారు రచించారట. తర్వాత రెండు సంపుటాలకు ప్రణాళికను ఆయన సిద్ధంచేస్తే ఎవరో పూరించారట. ఇప్పుడు పన్నెండు సంపుటాలలో ఆ కథలు లభిస్తాయి. ఎవరు పూరించినా వారి పేరు ప్రచారంలోనికి రాలేదు. వాటి వివరాలు -

భాగం	మజిలీసంఖ్య	ఉపకథల సంఖ్య	రిమార్కులు
1.	1వ మజిలీ నుండి 2దాకా	21	
2.	13 నుండి 18 దాకా	28	
3.	19 నుండి 32 దాకా	26	మధ్యలో 31, 32, 33 నెంబర్లు లేవు
4.	34 నుండి 47 దాకా	47	
5.	48 నుండి 56 దాకా	41	శంకరాచార్య చరిత్ర (కాదంబరి మహాశ్వేత కథలు అనుబంధం)

13. అసమ్మతి పత్రం - పుట.14

6.	57 నుండి 98 దాకా	49	తర్వాత 99 లేదు
7.	100 నుండి 141దాకా	43	ఇందులో సర్కసు కథ ఉంది
8.	142 నుండి 170 దాకా	38	
9.	171 నుండి 209 దాకా	51	
10.	210 నుండి 249 దాకా	44	
11.	250 నుండి 300 దాకా	58	
12.	301 నుండి చివరి 359 దాకా	50	
12	**359**	**496**	

కాశీమజిలీలు మాత్రమేకాక సుబ్బన్నదీక్షితులుగారు ఇతర గద్య పద్య కావ్యాలను రచించారు. వాటి వివరాలు ఇవి :

సప్తసాగర సంగమాహాత్మ్యం (1895) - పద్యకావ్యం
భద్రాద్రి రామచరిత్రము (1900) - పద్యకావ్యం
గౌతమీపుష్కరమాహాత్మ్యం (1908) - శ్లోకములు, వచనము
గౌతమీ మాహాత్మ్యం - ఉత్తరభాగం (1908) - పద్యకావ్యం
తెనాలి రామలింగ విజయం (1908) - వచనం
శంకరవిజయము (శంకరాచార్య చరిత్రము) (1918) - వచనం
కన్యావరశుల్క నిరసనము
కాదంబరి - (తెలుగు వచనం)
నారద చరిత్రము
రసికానందము (నాటకం)

సుబ్బన్న దీక్షితులుగారు ఎన్ని ఇతర రచనలు చేసినా వారు కాశీమజిలీల కర్తగానే కీర్తి పొందారు. ఆ సంపుటాలు ఇప్పటికీ ప్రచురణకర్తలు ప్రచురిస్తూనే ఉన్నారు.

నందిరాజు చలపతిరావు (1873-1960)

ఒక పుస్తకం ప్రజాదరణ నోచుకొని, పలు ముద్రణలు పొంది, అవి ప్రచురణ కర్తలకు లాభాలు గడిస్తూ ఉంటే దాని 'ఇమిటేషన్' రచనలు బయలుదేరుతాయి. నకిలీ సరుకులే అసలు సరుకులుగా 'నిజమైన' అనే విశేషణంతో చెలామణీలోకి వస్తాయి. మధిర సుబ్బన్న దీక్షితులుగారి 'కాశీమజిలీలు' పుస్తక ప్రపంచాన్ని ఏలడం చూశాక 'నిజమైన కాశీమజిలీలు' అనే మూడు సంపుటాలు బయటకు వచ్చాయి. వీటి కర్త నందిరాజు చలపతిరావుగారు. ఏలూరులో ప్రచురణకర్తలు.

చలపతిరావుగారు గుంటూరు జిల్లా మంగళగిరి దగ్గరనున్న ఆత్మకూరు అనే గ్రామంలో ఆలూరి వారి ఇంట పుట్టారు. ఏలూరులోని నందిరాజువారికి దత్తులయ్యారు. గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివి మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో ఎప్ఫే చదివారు. (అప్పుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు వీరి సహాధ్యాయి.) చదువు పూర్తి

చేయకుండానే ఏలూరు వెళ్ళి అక్కడ 'మంజువాణి' ముద్రాక్షరశాలను 1898లో స్థాపించారు. మంజువాణి అనే మాసపత్రికను కూడా 1910 దాకా మిత్రులతో నడిపారు. 1914లో 'ఇండస్ట్రీ' అనే పత్రికను స్థాపించి నాలుగేళ్లు నడిపారు. 1914 నుండి ఒక నాలుగేళ్ళ పాటు 'గృహలక్ష్మి' అనే స్త్రీల పత్రికను కూడా నడిపారు. స్వతహాగా రచయిత అయిన ముద్రాపకుడి చేతిలో ఒక పత్రికా, ఖరీదైన ప్రెస్సూ ఉన్నాయి కనుక లాభసాటి వ్యాపారమైన పుస్తకాలను రచించడం, ప్రచురించడం అవసరం. ప్రచురణ వివరాలను వారి వాఙ్మయమిత్రులు ఇలా రాశారు.[14] పశువైద్య శాస్త్రం, అగ్నిక్రీడ ఇత్యాదులను వేశారు. స్వప్నఫల దర్పణం, సంక్రాంతి ముగ్గులు, బాలసాహిత్యం ఇత్యాది చిల్లరమల్లర గ్రంథాలను కూడా ప్రకటించేరు. మంగళగిరి మాహాత్మ్యాన్ని 1947లో అచ్చువేశారు. ఆయన పద్యాలలో పెద్ద స్వీయచరిత్రను 1950లో వ్రాసుకొన్నారు. అది అముద్రితం. అట్లే పద్యానువాదమైన శివపురాణం అముద్రితం.''

కాశీయాత్ర చేసినవారు రామేశ్వరయాత్ర కూడా చేయాలన్నది మనవారి ఆచారం. కాశీనీళ్ళు రామేశ్వరంలో చాలా నియమనిష్టలతో కలపడం ఒకప్పుడు జరిగేది. కాశీ మజిలీ కథలు వచ్చాక రామేశ్వరపు మజిలీ కథలు విడిగానూ, కాశీ రామేశ్వర మజిలీలు జంటగానూ పుస్తకరూపంలో వెలువడితే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. మధిర సుబ్బన్న దీక్షితులుగారు వేసిన మార్గంతోనే నందిరాజు చలపతి రావుగారే కాక ఇంకా కొందరు మజిలీలు చేశారు. వాటి వివరాలు ఇవి:

1. కాశీమజిలీలు - మధిర సుబ్బన్నదీక్షితులు (1898)
2. నిజమైన కాశీ మజిలీలు - నందిరాజు చలపతిరావు (1903)
3. శ్రీరంగమజిలీలు - బత్తుల లక్ష్మయ్య (1911)
4. కాశీరామేశ్వర మజిలీలు - గుడిపాటి శేషగిరిరావు (1915)
5. రామేశ్వరపు మజిలీలు - కె. వెంకటరంగనాయకమ్మ (1919)
6. కాశీ మజిలీలు - నందిరాజు చలపతిరావు (?)

ఈ కథా సంపుటాలను ఇప్పటికీ ప్రజాబాహుళ్యం చదివి ఆనందిస్తుంది. ఎన్.వి.గోపాల్ అండ్ కో వారు తమ పుస్తకాల జాబితాలో 'నిజమైన కాశీరామేశ్వర మజిలీలు' అనే గ్రంథాన్ని ఇంకా ప్రకటిస్తున్నారు. దాని గురించి వివరణ ఇలా ఉంది:

''నిజమైన కాశీ రామేశ్వర మజిలీ కథలు - ఇందు నీతి, ధర్మ, వేదాంత, మత, సాంఘిక, నియమాఖ్యాయికములు కలిగి యొక్కక్క కథయు నొక్కక్క క్రొత్త వింతను వెలయించుచుండును. ఇది స్త్రీ పురుషులందరు చదువుటకు తేట తెనుగును బోధపడునట్లు సులభశైలిని 27 కథలను కాంచీపురం నుండి బయలుదేరి కాశీకి బోయి కాశీ నుండి రామేశ్వరమునకు 27 మజిలీలుగా ముద్రించియున్నది.''

---

14. టేకుమళ్ల కామేశ్వరరావు - నా వాఙ్మయమిత్రులు - పుట.109

ఈ వ్యాపార ప్రకటనలో ఎక్కడా రచయిత పేరు కనపడదు. ఒక తరహా పాఠకులకు రచనే కాని, రచయిత కాదు ముఖ్యం.

మంత్రిప్రగడ భుజంగరావు (1876-1940)

నందిరాజు చలపతిరావుగారు ఏలూరులో నడిపిన మంజువాణీ ముద్రాక్షరశాలలో నిర్వహించిన 'మంజువాణి' మాసపత్రికను సంస్థాపించిన వారు మంత్రిప్రగడ భుజంగరావుగారు. ఈయన లక్కవరం జమీందారుగారు. లక్కవరం గోదావరి జిల్లాలో పోలవరం తాలూకాలో ఉంది. నవీన ప్రొప్రయిటరీ ఎస్టేట్ రాబడి పాతికవేల రూపాయలకు లోపునే అయినా 'రాజాబహద్దర్' అనే బిరుదు ఈ జమీందారుకు ఉంది. భుజంగరావుగారు ఏలూరులో పుట్టి పెరిగారు. ఆంధ్రాంగ్ల భాషలలో ప్రవీణులు. ఈయన కవులలో కవులు, పండితులలో పండితులు, విమర్శకులలో విమర్శకులు. ఆశుకవిత్వం చెప్పారు, అవధానాలు చేశారు. జన్మతః హిందువులైనా క్రైస్తవ మతం లోతులు మథించారు. ఆ మతగ్రంథాలెన్నో తెలుగులోనికి అనువదించారు. ద్వైత, అద్వైత, ద్వైతాద్వైత, బౌద్ధ, చైతన్య దర్శనాలను అధ్యయనం చేసి తత్త్వమీమాంస అనే గ్రంథాన్ని ఎనిమిది వందల పద్యాలలో రచించారు. కేవలం తత్త్వ విషయాలనేకాక సాహిత్య రచన కూడా చేశారు. ఈయన రచించిన పుస్తకాలలో 27 పద్యకావ్యాలు, 9 నాటకాలు, 14 వచన కావ్యాలు, 3 ఇంగ్లీషు గ్రంథాలూ 1916 నాటికి ఉన్నాయి. ఆ తరువాత ఎన్నో రచించారు. ఒక పది కృతులు అంకితం పుచ్చుకొన్నారు. మంజువాణి మాసపత్రికలో 15 ప్రాచీన ప్రబంధాలను పరిష్కరించి ప్రకటించారు. ఈ ప్రాచీన కావ్యాల పరిష్కరణలలో నందిరాజు చలపతిరావుగారు భాగస్వాములు. కొన్నింటికి చలపతిరావుగారే పీఠిక రచించారు.

ఆనాడు ఆంధ్రదేశంలో ఉన్న కవి పండితులందరూ భుజంగరావుగారికి తెలిసినవారే. వారిచేత సన్మానాలు పొందినవారే. 1916లో భుజంగరావుగారు తమ పెద్ద కుమార్తె హైమావతి వివాహం జరిపించారు. కవి పండితులను ఆహ్వానించారు. 232మంది ఆశీర్వచనం పద్యాలను రచించారు. వీటన్నింటినీ కలిపి భుజంగరావుగారు 'హైమవతీ పరిణయం' అనే గ్రంథంగా ప్రకటించారు. అయితే సర్వసాధారణంగా సదస్యం పద్యాలతో వెలువడే ఇతర పుస్తకాలకూ దీనికీ చాలా తేడా ఉంది. భుజంగరావుగారే కవుల జీవిత వివరాలు, వారు రచించిన గ్రంథాల పేర్లూ, వాటి ప్రక్రియా రీతులూ చాలా సంక్షిప్తంగానైతేనేం చేర్చి ఈ పుస్తకానికీ 'ఆధునిక కవి జీవితములు' అనే ఉపనామకరణం చేశారు. ఈ గ్రంథం పరిశోధకులకు పనికి వచ్చేది. ఇందులోని 232 కవులలో అందరి పేర్లూ కాకపోయినా కొందరి పేర్లు చూడండి.

అడిదం రామారావు	కొత్తపల్లి సూర్యారావు
అల్లమరాజు రంగశాయి	కొప్పరపు కవులు
ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రి	గబ్బిట యజ్ఞనారాయణశాస్త్రి

ఆదిపూడి సోమనాథరావు	తిరుపతి వెంకటకవులు
ఇమ్మానేని వెంకట గోవిందరావునాయుడు	ద్విభాష్యం పుల్లకవి
ఉమర్ ఆలీషా	నందిరాజు చలపతిరావు
కస్తూరి శివశంకరకవి	నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రి
కాశీ కృష్ణమాచార్యులు	నిడుదవోలు సుందరం
కాళ్ళకూరి నారాయణరావు	పారనంది రామమూర్తి
కొక్కొండ వెంకటరత్నం	బాబు జాన్ చౌదరి
మేడేపల్లి వెంకట రమణాచార్యులు	మధిర సుబ్బన్న దీక్షితులు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ	మల్లెద దావీదు
రెంటాల వెంకటసుబ్బారావు	వెంపటి వెంకటనారాయణ
వడ్డాది సుబ్బారాయుడు	వేటూరి ప్రభాకరశాస్త్రి
విక్రమదేవవర్మ	వేదం వెంకటరాయశాస్త్రి
శొంఠి భద్రాద్రి రామశాస్త్రి	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

జాబితా పెద్దదవుతుందన్న భయంచేత 232 మందిలో 32 పేర్లనే ఇక్కడ చూపెట్టాను. ఈ 'ఆధునిక కవి జీవితాలు' గ్రంథాని కెక్కినవారు ఒకనాడు వివిధ పత్రికలలోన, సభలలోనూ పద్యాలు ప్రకటించిన వారే. కొందరి పేర్లు, రచనలూ ప్రసిద్ధాలయ్యాయి. కొందరి పేర్లు మాత్రమే ప్రచారంలోనికి వచ్చాయి. వారు రచించిన పుస్తకాలు కనుచాటు అవుతూ వచ్చాయి. భుజంగరావుగారు రచించిన శతాధిక గ్రంథాలలో కొన్నయినా నేడు పాఠకలోకానికి అందుబాటులోగాని, అవసరంలోగాని లేవు. భుజంగరావుగారి పద్య కావ్యాల గురించి విమర్శకులు ఇలా అభిప్రాయపడుతున్నారు.[15]

''.....వీరి శతాధిక గ్రంథములలోఁ గల కవితా ధార యెల్ల యతిప్రాసలకుఁ దడవుకోకుండ నడచి పోవుచున్నట్లుండును. రసభావ దృష్టితో విమర్శించినచో నిలఁబడు పద్యములు మిక్కిలి తక్కువగా నుండును. చ్యుత సంస్కారములు దొరలు చుండుటయుఁ గలదు. కాని ధోరణి యెత్తుపల్లములు లేక యొకేతీరున సాగుట మెచ్చుకోదగిన ముఖ్య విషయము. బహుగ్రంథ రచనము నందే వీరికి వేడుక కలిగియుండిన కారణమున, శాశ్వతస్థాయిగా నుండగల గ్రంథమొకటియు వ్రాయలేకపోయినారు.''

అయితే ఏమాటకామాట చెప్పుకోవాలి. నేటి దాకా నిలిచే గ్రంథాలు కాకపోయినా సమకాలపు వారిని ప్రభావితులను చేసిన రచనలు కొన్ని భుజంగరావుగారు చేయకపోలేదు. ఆయన రచించిన 'వారకాంత' అనే చాటు ప్రబంధంలోని కథను ఆధారం చేసుకొని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 'వారకాంత' అనే నాటకాన్ని రచించి 1908లోనే ప్రకటించారు. ''ఇతివృత్తం మంచిది. అచ్చు బాగుంది. సంఘ సంస్కర్తలాచరించదగ్గ గ్రంథం'' అనే ధోరణిలో శ్రీపాదవారి పుస్తకంపై ఆంధ్ర పత్రిక రివ్యూ రాసింది.

15. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి - ఆంధ్ర రచయితలు, పుట.373

భుజంగరావుగారి చాటు కావ్యాన్నే నాటకంగా మలచినట్టు శ్రీపాదవారు చెప్పారు. ఇవాళ తెలుగు కథా సాహిత్యంలో సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది తొలివరుస. అటువంటి రచయితకు ప్రప్రథమంగా ఇతివృత్తాన్ని నిర్దేశం చేసిన రచన భుజంగరావుగారిది కావడం గుర్తించదగ్గ విషయం.

భుజంగరావుగారు స్వయంగా వచన రచనలు చాలా చేశారు; ఇతరులవి ప్రచురించారు. వీటిలో కొన్ని పేర్లు చూడండి:

అగ్గిరాముని మరణావేదనము
ఆంధ్ర కథాసరిత్సాగరము
గలివర్సుట్రావెల్సు - ఆంధ్రీకరణము
చమత్కార స్నేహ ప్రహసనము
నిరపవాద ప్రహసనము
పరమానందయ్య శిష్యుల కథ
మనోరమ (నవల)
మోహలేఖావళి
రాజహంస (నవల)
వచన నైషధం
వాసంతిక (నవల)
విజయాంక సాహసము (నవల)
విధవావిహీన ప్రహసనము

ఆనాటి తెలుగు సాహిత్యంలో డిటెక్టివ్ రచనలు ప్రవేశిస్తున్నాయి. 'సాహసాంకుని విజయగాథలు' అనే పుస్తకాన్ని రచించి భుజంగరావుగారు దాని గురించి ఇలా ప్రకటించారు.

''మనదేశమందు చోరుల బాధ అనుదినము హెచ్చుచున్నదను విషయము పత్రికలు చదువువారి కెల్లరకు విశదమే. అట్టి బాధను కొంతవరకైన తగ్గించుకొనవలయుననిన గూఢచారుల చరిత్రములను మనము చదువవలసియున్నది. అత్యద్భుతములగు చర్యల నొనర్చి నిపుణతతో నేరస్థులను గుర్తించిన మహామహులు పాశ్చాత్య దేశములయందు విశేషముగా గలరు. అట్టివారి చరిత్రములను చిత్ర విచిత్రములగు కథలుగా బాశ్చాత్య భాషలయందు వ్రాయబడి యుండుటచే నచ్చటి ప్రజలు జ్ఞానాభివృద్ధి గలిగి దొంగలవలని బాధలన తప్పించుకొనుటను, వారిని పట్టుకొన బ్రయత్నించు గూఢచారులకు దోడ్పడుటకును సావకాశము గలుగుచున్నది. అట్టి చారిత్రములు మన యాంధ్రభాష యందు లేని కొఱతను దీర్చుటకై సాహసాంకుని విజయగాథలను పేరుతో మూడు మాసముల కొక గ్రంథము చొప్పున ప్రచురింపనేర్పరు పఁబడినది. ఇందు దొంగల మాయోపాయములు, క్రూరకృత్యములు, గూఢచారులు దొంగలను పట్టుకొనుటకై పడు శ్రమలు, దొంగల చేతులలో జిక్కి తప్పించుకొనుటకై చేయునుపాయములు, యుక్తులు, మల్లయుద్ధములు, పాతాళగుహానుభవములు, నవనాగరికాగ్ర గణ్యులగు చోరశిఖామణుల

రహస్యములు మొదలగు ననేకోపయోగ విషయములత్యద్భుత కథారూపమున ప్రచరింపఁబడుచున్నవి. ఇందు ప్రచురింపబడిన గ్రంథములు:

1. అగ్గిరాముని మరణవేదన
2. మైరావణుడు (జూలై నెలలో వెలువడును) చందాదారులుగాఁ జేరువారు, అన్ని ఖర్చులు సహా సంవత్సర చందా రు.0-13
3. విడిప్రతులు కోరువారికి ప్రతి 1కి రూ.0-2-6 పోస్టేజి 0-1-6 భారతీ వేర్‌హౌస్, ఏలూరు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961)

ఆధునిక యుగంలోని తెలుగు సాహిత్యంలో చిన్న కథకు చాలా పెద్ద పీటను వేయించిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు జమీందారీ యుగంలో రచనలు ప్రారంభించిన రోజుల్లో స్టేజి నాటకాలు, చారిత్రక నవలలు, నవలలు ప్రజాబాహుళ్యం కోసం రాసిన వివిధ రకాల కథాసాహిత్యం ఉన్నాయి. తెలుగు కవిత్వమంటే ఏమాత్రం సహించని వైదికుల కుటుంబంలో ఆయన పుట్టారు. శ్రౌత స్మార్తాలు, జ్యోతిష్యం వారి కులవిద్యలు. పంచాంగ రచన, ప్రశ్నలు చెప్పడం కుటుంబంలో అందరికీ విధి. శాస్త్రిగారు సంస్కృత పంచ కావ్యాలలో రఘువంశం, కుమారసంభవం, మేఘసందేశం, భారవిలో కొంతభాగం, మాఘంలో కొంతా గురువుల వద్ద చదువుకొన్నారు. (''నేనే కాదు, ఎవరూ కూడా పంచకావ్యాలలో నొక్కటిన్నీ పూర్తిగా చదవరు. అప్పటికీ, ఇప్పటికీ'' అని శాస్త్రిగారు రాశారు).[16]

తెలుగు సాహిత్యం చదువుకోవాలని శాస్త్రిగారికి అభిలాష. అయితే కులవిద్యలకు ఆటంకమని ఇంట్లో తండ్రిగారు, చిన్నన్నగారు నిషేధించారు. పెద్దన్నగారు నన్నయ్య భారతం చదవమన్నారు. గురువుల కంటపడకుండా, పెద్దల కంటపడకుండా తెలుగు సాహిత్యం కొంత చదివారు. వీరేశలింగంగారి కవుల చరిత్ర మూడోభాగం, పోతా వెంకటకృష్ణయ్యగారి రోహిణీ సుధాకరం అనే నాటకం వారికి మొదట లభించిన పుస్తకాలు. అవి చదివారు. శాస్త్రిగారి పెద్దన్న గారి పుస్తకాలలో మంత్రిప్రెగడ భుజంగరావుగారు రచించిన 'వారకాంత' అనే చాటు ప్రబంధం కూడా ఒకటి ఉంది. దాన్ని చదివాక ఆ కథను వచన నాటకంగా రాయాలని శాస్త్రిగారికి అనిపించింది. వీరేశలింగంగారి ఉపన్యాసాలలో కులటలు - వేశ్యలు అనే వాటిని కూడా చదివి ఉండడం వల్ల సంఘ సంస్కారానికి అనువుగా వారకాంత నాటకాన్ని శాస్త్రిగారు 1909లో ప్రచురించారు. ఈముద్రణ ముచ్చటకో కథ ఉంది.

శ్రీపాదవారు పంచాంగం రచిస్తారు. దాన్ని అచ్చు వేయడం అన్న అవసరం 1908లో వచ్చింది. శాస్త్రిగారు ప్రెస్సాఫీసుకు రాయవరంలోని మల్లిడి సత్తిరెడ్డిగారి భారతీ తిలక ముద్రాక్షర శాలకు వెళ్ళారు. రెడ్డిగారితో పరిచయం కలిగింది. రెడ్డిగారు పుస్తకప్రియులు. బీరువాలో ఉన్న తమ పుస్తక సేకరణను చూపారు. నవలలు, నాటకాలు, శృంగార

16. అనుభవాలూ - జ్ఞాపకాలూను - మొదటి భాగం, పుట.195

కావ్యాలు, మదన కామరాజు కథలు, యవన యామినీవినోద కథలు, భోజకాళిదాస కథలు, భట్టి విక్రమార్కుని కథలు, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారి చారిత్రక నవలలు, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికలు అందులో ఉన్నాయి. పంచాంగం అచ్చుపని మిషమీద స్వగ్రామం నుంచి రోజూ రాయవరం వెళ్ళి ఈపుస్తకాలలో చాలా మట్టుకు శాస్త్రిగారు చదివి తెలుగు భాషను నేర్చుకొన్నారు. ఇవి చదవకముందే 'వారకాంత' నాటకం రాసిన వైనం రెడ్డిగారు విని దాని ముద్రణకు సహాయం చేశారు.

గజమెత్తు పుస్తకాల దొంతర రాయాలన్నది సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ఆశయం. ఇంట్లో పెద్దల ఆంక్షలను లక్ష్యపెట్టకుండా మెల్లమెల్లగా ఎదురు తిరిగి చాటుమాటుగా పూర్వం చేసే రచనా వ్యాసంగాన్ని బహిరంగంగా చేయసాగారు. స్థానిక నాటక సమాజం కోసం నాటకాలు రచించారు. మిధునానురాగం అనే నవల, వీరపూజలనే చరిత్ర గ్రంథం రాశారు. ''వీరపూజ''ను కాశీనాథుని నాగేశ్వరరావుగారు ముందు ప్రెస్సుబిల్లూ, కాగితం ఖర్చులూ అడగకుండా అచ్చువేసి పెడతామంటే శాస్త్రిగారు ఆ పనిమీద మద్రాసుకు వెళ్ళారు. ఆ పుస్తకం ముద్రణలో ఉన్నప్పుడే వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారిని సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కలుసుకున్నారు. ''చెన్నపట్నం బజారుభాష''లో ఉన్న మర్యాదరామన్న కథల పుస్తకాన్ని వావిళ్ల వారు శ్రీపాదవారికి ఇచ్చి దానిని సులభ గ్రాంథిక భాషలోనికి మార్చి పెట్టి ఇమ్మన్నారు. ఒక పూర్వ పుస్తకాన్ని భాష మార్చి ఇచ్చాక చాలా గ్రంథాలు ఆ పద్ధతిలో వావిళ్ళవారు శాస్త్రిగారిచేత రాయించారు. ఇతర ప్రచురణకర్తలు కూడా ఆపద్ధతిలోనే సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చేత ఈ రకం కథా వాఙ్మయాన్ని తిరగ రాయించారు. వీటినన్నింటినీ ఆయన గ్రాంథికంలోనే రాశారు. 1923 దాకా ఆయన గ్రాంథికవాదులే.

1921లో శాస్త్రిగారు తమ ప్రత్యేక సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి ''ప్రబుద్ధాంధ్ర'' అనే పత్రికను ప్రారంభించారు. తొలి సంవత్సరం పక్షపత్రికగానూ, రెండవ యేటు నుంచీ మాసపత్రికగానూ దాన్ని నడిపారు. ఆదిలో ప్రబుద్ధాంధ్ర సగం సంస్కృత భాషా రచనలతోనూ, సగము తెలుగు రచనలతోనూ ఉండేది. శాస్త్రిగారివి అన్నీ విలక్షణమైన విపరీత విశ్వాసాలు. ఆయన ''హిందీ, గాంధీ, ఖద్దరు'' అనే మూడింటికీ వ్యతిరేకి. దేశం అంతా గాంధీగారి ఉద్యమంలో తలమునకలైనప్పుడు శాస్త్రిగారు ఏటికి ఎదురీదారు. గాంధీజీని తీవ్రంగా ద్వేషించడానికి వారికి కారణాలు ఉన్నాయి. ''నాది వైదిక సంస్కారము. దానిమీదే ఎంతో నమ్మకం నాకు. గాంధీగారిది జైన సంస్కారం. దానిమీదే తమ నమ్మకం అన్నట్టు మాత్రం కనపడరు వారు. కాని నిశితంగా పరిశీలించినవారికి, వారి దండయాత్ర అటు బ్రిటీష్‌వారిమీదకంటే, యిటు వైదిక సంస్కారంమీద చాలా యెక్కువ అన్నట్టు స్పష్టం అవుతుంది. జైన బౌద్ధమతాలకు, వైదిక మతానికి వెనకటి శతాబ్దుల్లో జరిగిన దారుణ సంఘర్షణ తెలిసివున్నవారికేగాని సమన్వయం కాదిది.[17] ఈ విశ్వాసంమీద తమ విలక్షణ విశ్వాసం వల్ల శాస్త్రిగారు ఎవరూ తొక్కని దారిని ఎన్నుకొన్నారు. దాన్ని తీవ్రంగానే ప్రచారం చేశారు.

17. అనుభవాలు - జ్ఞాపకాలు - మూడవభాగం, పుట.164

1923 తర్వాత వాడుక భాషనంగీకరించాక అందులో కూడా ఈ సిద్ధాంతాలనే వ్యాపింపచేశారు. అందుకే రచనలు చేశారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి దృష్టిలో మతంవేరు, సంఘం వేరు, సంఘ సంస్కారం కావాలి. మతధర్మాలు మారకూడదు. అందుకే రచనలు చేశారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తొలినుంచి 1923 దాకా చేసిన వచన రచనల వివరాలు ఇవి :

ఉత్తరకుమార ప్రజ్ఞ (1915) - కలాభివర్ధినీ పరిషత్తు
మర్యాద రామన్న కథలు (1916) - వావిళ్ళ, మద్రాసు
విజయనగర రాజుల కథలు (1916) - హరి అండ్ కో, రాయవరం
బేతాళుని కథలు (1917) - వావిళ్ల, మద్రాసు
భారత రమణీమణులు - మొదటిభాగం (1917) - వావిళ్ళ, మద్రాసు
మహాభక్త విజయం (1918) - వావిళ్ల, మద్రాసు
ఓరుగంటి రాజుల కథలు
గోల్కొండ నవాబుల కథలు
చిత్తూరు రాజుల కథలు
ఢిల్లీ చక్రవర్తుల కథలు
మదన కామరాజు కథలు
విక్రమార్కుని కథలు
వీరాంగనలు

ప్రజాబాహుళ్యం కోసం ఇటువంటి రచనలు చేస్తున్న రోజులలోనే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చిన్న కథలు కూడా గ్రాంథికంలో రచిస్తూ పాత్రల సంభాషణలు వాడుకభాషలోనే పొందుపరిచేవారు. 1923 తర్వాత వాడుకభాషనే తప్ప మరొకటి రాయనన్న నిశ్చయానికి వచ్చాక వారి చిన్నకథలకో ప్రత్యేకత వచ్చింది. ఆయన మన కథకులలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకొన్నారు. ఆ విషయాలు ఆధునిక యుగంలో ముచ్చటించుకొందాం.

చదలువాడ సీతారామశాస్త్రి (1885 ప్రాంతాలు)

కుంఫిణీ యుగంలో రచనలు ప్రారంభించిన కొందరు పండితులు జమీందారీ యుగంలో కూడా రచనా వ్యాసంగాన్ని కొనసాగించి కథా సాహిత్యం పెంపొందించారు. 1885లో పెద్దబాలశిక్షను పుదూరు ద్రావిడులైన చదలువాడ సీతారామశాస్త్రి రచించారు. అంతకు ముందు దేశంలో ''బాలశిక్ష''లే ఉండేవి. ప్రత్యేకంగా ''పెద్దబాలశిక్ష'' అనే పేరుతో గ్రంథం 1885లోనే వెలుగు చూసింది. మునుపు ఉండే బాలశిక్షలకూ, దీనికీ చాలా తేడా ఉంది. పాతవాటిని పెంచి ఒక ప్రణాళిక ప్రకారం అక్షరాలు, గుణింతం, రెండక్షరాల మాటలు, మూడక్షరాల మాటలు, నీతివాక్యాలు, సద్బుద్ధి వాక్యాలు, నీతికథలు, ఇంగ్లీషు తెలుగు సంఖ్యలు, ఎక్కాలూ, అంశ సంఖ్యలు (పాతిక, అర, ముప్పాతిక వగైరాలు), సంకలన వ్యవకలనాలు, ఉత్తరాలు రాసే పద్ధతులు ఒకటేమిటి, బాలురు నేర్చుకోవలసిన

వన్నీ ఒక క్రమంలో పూసగుచ్చినట్టు రాశారు. బాలశిక్షలు, చిన్న బాలశిక్ష, పెద్దబాలశిక్ష అనే మూడురకాల గ్రంథాలు ఎన్ని ముద్రణలు పొందాయో లెక్కలేదు.[18]

పెద్దబాలశిక్షతో, చిన్న నీతికథలు రాయడంతో తృప్తిపడక సీతారామశాస్త్రిగారు కథా సాహిత్యంలో కూడా కృషిచేశారు. ఆరోజుల్లో సంస్కృత నాటకాలను చాలామంది అనువదింప చేశారు. ఒక్క అభిజ్ఞానశాకుంతలానికే నాకు తెలిసినంత మట్టుకు 1875 నుండి 1933 దాకా పదహారు తెనిగింపులు ఉన్నాయి. సంస్కృతంలోని ప్రఖ్యాతమైన నాటకాలలో ముఖ్యమైన వాటి కథలను మననరూపంలో కథనం చేస్తే పాఠకులకు సౌకర్యంగా ఉంటుందని సీతారామశాస్త్రిగారు భావించారు. 'సంస్కృతనాటక కథలు' అనే గ్రంథాన్ని రెండుభాగాలలో రచించారు. వావిళ్లవారు ప్రచురించారు. ప్రచురణ తేదీ తెలియదుగానీ ఇది చాలాసార్లు పునర్ముద్రణలు పొందింది.

సీతారామశాస్త్రిగారు మద్రాసులోని ముత్యాలపేట హైస్కూలులో సంస్కృతాంధ్ర పండితులుగా 1847లో పనిచేశారు. అప్పుడు వేదం వెంకటరమణశాస్త్రిగారు సంస్కృతో పాధ్యాయులుగా ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. తర్వాత మద్రాసు నార్మన్ స్కూలులోనికి మారారు. బహుజనపల్లి సీతారామాచార్యులుగారు ఆకాలంలో నార్మన్ స్కూలులో ఉపాధ్యాయులు. ఇక్కడే సీతారామశాస్త్రిగారి దగ్గర వేదం వెంకటరాయశాస్త్రి (1853-1929) గారు చదువుకొన్నారు. తర్వాత సీతారామశాస్త్రిగారు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ ప్రధానాంధ్ర పండితులయ్యారు.[19] వీరు రచించిన గ్రంథాలు అనేకం అని, వాటిని వావిళ్లవారు ప్రకటించారని చరిత్రకారులు చెబుతున్నారు. అయితే వాటి వివరాలు తెలియవు.

అక్కిరాజు ఉమాకాంతం (1889-1932)

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో పనిచేసిన పండితులకూ, ఆంధ్ర సాహిత్యంలోని గ్రంథరచనలకూ ప్రగాఢ సంబంధాలు ఉన్నట్టు స్పష్టమవుతుంది. చదలువాడ సీతారామ శాస్త్రి, పరవస్తు చిన్నయసూరి, కొక్కొండ వెంకటరత్నం, కందుకూరి వీరేశలింగం, వావిలకొలను సుబ్బారావు, అక్కిరాజు ఉమాకాంతంగారలు ఈపదవిలో ఉండేవారు. వీరందరిలో ఒక్క చివరివారు తప్ప మిగతావారందరూ గ్రాంథికవాదులు. ఉమాకాంతంగారు తొలిరోజుల్లో అరసున్నలు, బండిరాలు భాషా ప్రవాహంలో లేని అనావశ్యక గజడదబ సవలు లేకపోతే తెలుగు గ్రంథం కాదని భావించే దశలో అటువంటి రచనలు చేశారు గాని ఉత్తరోత్తరా వ్యావహారిక వాదులయ్యారు. చక్కని శిష్టభాషలో పరిశోధన గ్రంథాలూ, కవిత్వ విమర్శనలు చేశారు. ఆదిలో కథాసాహిత్యం కూడా రచించారు.

అక్కిరాజు ఉమాకాంతంగారు వంగదేశంలోని నవద్వీపంలో తర్కశాస్త్రం చదువుకొని 'విద్యాశేఖర' పట్టాన్ని పొందారు. ఆంధ్రాంగ్ల వంగభాషలలో సాహిత్యాన్ని

18. వివరాలకు చూడుము ''ఆరుద్ర రచనలు - వ్యాసపీఠం'' (1985) పుట.193

19. వేదం వెంకటరాయశాస్త్రి (మనమడు) - పుదూరు ద్రావిడుల చరిత్ర - విక్రమ సింహపురి మండల సర్వస్వం, పుట.509

పరిశీలించారు. మద్రాసులో వావిలకొలను సుబ్బారావుగారి తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకులుగా చేరారు. వావిళ్లవారు నడిపే 'త్రిలిఙ్గ'' పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. ఉమాకాంతంగారు సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించి తెలుగు స్పెల్లింగులలో అనునాసికంగల సంయుక్తాక్షరాలను వర్గపంచమ సంజ్ఞలతోనే రాసేవారు. (ఉదా. తమ పేరును 'ఉమాకాన్తుడు' అనీ; నేటి సాధారణ స్పెల్లింగు అయిన పంక్తి అనే పదాన్ని 'పఙ్క్తి' అనే లిఖించేవారు). కాలమానాన్ని క్రీస్తుశకంలో కొలవకుండా కలిశకంలో చెప్తారు. ఉదాహరణకు 10-7-1958 అని రాయడానికి బదులు క॥ 5038 వైశాఖ బ॥ సం॥ ఆదివారం అని రాస్తారు. ఎవరి వెర్రి వాళ్ళకు ఆనందం.

ఎపుడు రచించారో సంవత్సరాల భోగట్టాలు తెలియవుగాని ఉమాకాంతంగారు కథలు, చరిత్రలు, నవలలు కొన్ని రాశారు. వాటి వివరాలు ఇవి :

టిప్పుసుల్తాన్ (నవల)
త్రిలిఙ్గ చిన్న కథలు
పల్నాటి వీరుల కథలు
షేక్స్పియరు నాటక కథలు
శ్రుతి రంజని

ఈ పుస్తకాలలో బహుశా షేక్స్పియరు నాటక కథలనే వారు మొదట రచించి ఉంటారు. చదలువాడ సీతారామశాస్త్రిగారు పూర్వం సంస్కృత నాటక కథలను చేసినట్టు ఉమాకాంతంగారు ఆంగ్ల నాటక సాహిత్యంలో ఉత్కృష్టస్థానాన్ని ఆక్రమించిన షేక్సిపియరు కథారచనా నైపుణ్యాన్ని తెలుగు పాఠకులకు చిన్నకథల రూపంలో చెప్పదలిచారు. దీనికి బహుశా ఛార్లెస్ లాంబ్ (1775-1834) ఆంగ్లంలో రచించిన 'టేల్స్ ఫ్రం షేక్స్పియర్'' (1807) అనే గ్రంథం ఆధారం కావచ్చును. ఛార్లెస్ లాంబ్ ఆంగ్లకవి, రచయిత, నాటక సాహిత్య విమర్శకులు. ఆయన తూర్పు ఇండియా కంపెనీవారి లండన్ ఆఫీసులో 1789 నుంచి 33 సంవత్సరాలు క్లార్కుగా పనిచేస్తూ తన అక్కగారైన మేరీలాంబ్తో కలసి ఈ నాటక కథలు రచించాడు. భారతదేశంలో కూడా లాంబ్రచన, షేక్స్పియరు నాటక కథలు బహుళ ప్రచారం పొందాయి. ఉమాకాంతంగారు ఎన్ని నాటకాల కథలను కథనం చేశారో తెలియదు. ఆ పుస్తక ప్రతులు నేడు పరిశోధకులకు అందుబాటులో లేవు. ఉమాకాంతంగారి ఇతర కథాసాహిత్యం కూడా అలభ్యమే.

ఉమాకాంతంగారికి పేరు తెచ్చిన గ్రంథాలు ఆయన 1911లో పరిష్కరించి విపులమైన పీఠికతో ప్రకటించిన శ్రీనాథుని 'పల్నాటి వీరచరిత్ర'లో బాలచంద్ర యుద్ధం అనే సుదీర్ఘభాగం. 1906లో వారు జానపద గాయకులు పాడే ఈ పాటవిని వ్రాతప్రతులను సంపాదించారు. 1910 నాటికి లభించిన గ్రంథాన్ని పరిష్కరించి గ్రాంథిక భాషలో విపులమైన ఉపోద్ఘాతం రాసి ప్రకటించారు. పల్నాటి వీరచరిత్రంలో కొంతభాగాన్ని 1911లో (120 పుటలు డబుల్కాలమ్స్) ప్రకటించారు. కనుక పూర్తిభాగాన్ని ప్రచురించమనీ, దానికి ధన సహాయం చేస్తామని పిఠాపురం రాజావారు కబురుపెట్టారు.

మిగతా భాగంలో శ్రీనాథుని రచన లేదనీ, తప్పుల తడకలుగా ఉన్న పాతదానిని ప్రచరించడం కన్నా ''క్రొత్తది వచనముగా వ్రాసి ప్రకటించుట మేలు'' అని ఉమాకాంతంగారు స్పష్టపరిచారు. ఇంకా ఇలా అన్నారు.[20]

''రాయవాచకము వలె దీని నున్నదున్నట్లు ముద్రించినను ఒక విధమున మేలె. పల్నాటి సీమ మాటల వ్యవహారము కొంతవఱకు దెలియును. కథ కొఱకైన యెడల దీనిని బట్టి వచనము వ్రాసి ప్రకటించుట మంచిది. ఇది వఱకెందరో వ్రాసి, వ్రాయమన్న భారత రామాయణ వచనములకంటె నిది యెక్కువయుపయోగకరమైనది.''

1938లో ఈ పల్నాటి వీరచరిత్ర పునర్ముద్రణ పొందింది. అప్పటికే ఉమాకాంతం గారు శిష్ట వ్యావహారిక భాషావాదులు. అందుచేత ద్వితీయ భూమికలో మొదటే ఒక హెచ్చరిక చేశారు.

''మార్పులు : మొదటిసారి ముద్రితమైన పల్నాటి వీరచరిత్రలో వున్న అరసున్నాలు, బండిరాలు, భాషా ప్రవాహంలో లేని అనావశ్యక గజడదబసవలు మొదలైనవి, నేను చేర్చిన వేను. ఇవి మూలగ్రంథంలో లేవు. ఇవి లేకుంటే తెలుగు గ్రంథం కాదనుకొనే దశలో ఛాందసమార్గాన్ని అనుసరించి వాటిని చేర్చాను. ఈ అకార్యానికి ప్రాయశ్చిత్త రూపంగా వాటినిప్పుడు తొలగించాను. మొదటి పీఠికలోను, వ్యాఖ్యలోను, పూర్తిచేసిన పజుల్లోను, అప్పటి అరసున్నాలు మొదలైనవి నావిగనుక వాటిని అట్లానే వుంచాను.''

ఉమాకాంతంగారికి ప్రత్యేకమైన విశ్వాసాలు కొన్ని ఉన్నాయి. నన్నయగారూ, శ్రీనాథుడూ అనాంధ్రులని వారి నమ్మకం, నన్నయ్యగారు తమిళుడు; శ్రీనాథుడు కర్ణాటకుడు. ఈ సిద్ధాంతాలను వారు తమ పీఠికలో చర్చించారు. దేశంలో వాదోపవాదాలు రేగాయి. శ్రీనాథుని మీద మంచి పరిశోధనలు తర్వాత జరిగాయి.[21] పల్నాటి వీరచరిత్ర ప్రచారంలోనికి వచ్చింది. అది వ్యాపించడానికే ఉమాకాంతంగారు 'పల్నాటి వీరుల కథలు' అనే పుస్తకాన్ని కూడా రచించారు.

శిష్ట వ్యావహారికాన్ని అంగీకరించగానే ఉమాకాంతంగారు నవ్యసాహిత్యంలో అప్పుడే పొడచూపుతున్న భావకవిత్వాన్ని ఆహ్వానించినట్లు కాదు. పైపెచ్చు దానిపై విరుచుకుపడ్డారు. 'నేటికాలపు కవిత్వం' అనే విమర్శ గ్రంథాన్ని 1926లో రచించి 1928లో ప్రచురించారు. ఈ గ్రంథంలో ఉమాకాంతంగారు విమర్శించని కవి ఎవరైనా ఉంటే ఆనాడు నవ్యకవి కాడని భావించవచ్చు. భావకవులు ఈ విమర్శకు తమ కవితలను ఇతోధికంగా చేయడమే సమాధానమని భావించారు. (భావ కవిత్వం పట్ల ఉమాకాంతంగారి అభ్యంతరాలేమిటో ఇంకో ప్రకరణంలో చెప్పుకొందాం.) ప్రస్తుతానికి ఆయన కథా వాఙ్మయానికి చేసిన సేవను గమనించడమే ముఖ్యం. ప్రెసిడెన్సీ కాలేజీలో పండితుడు కనుక ఆయా వృత్తిసహితంగా తెలుగు భాషా వ్యాకరణం రచించడానికి ప్రారంభించారు. అది పూర్తికాలేదు. ఉమాకాంతంగారు నలభైమూడేళ్లు నిండి నిండకముందే చనిపోవడం దురదృష్టకరం.

---

20. అక్కిరాజు ఉమాకాంతం - పల్నాటి వీరచరిత్ర, ద్వితీయ భూమిక, పుట.72
21. కాకతీయయుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి 2002

వంగూరి సుబ్బారావు (1888-1923)

ఆంధ్ర సాహిత్యానికి ఎంతో సేవచేశారనీ, ఇంకా చాలా చేయుచున్నారనీ దేశం ఎన్నో ఆశలు పెట్టుకొంటే అకాల మరణం ప్రాప్తించిన మరొక తెలుగు రచయిత వంగూరి సుబ్బారావుగారు. ఈయన తమ ముప్పై ఏడవ యేటనే చనిపోయారు. అయితే జీవించిన మూడున్నర పై చిలుకు దశాబ్దాలలో అరడజనుపైగా చెప్పుకోదగ్గ రచనలు చేశారు.

వంగూరి సుబ్బారావుగారు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలోని సిద్ధాంతం గ్రామంలో జన్మించారు. తణుకు హైస్కూల్లో చదువుకొన్నప్పుడే స్వదేశీ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. ఇరవై సంవత్సరాలు నిండకముందే కలకత్తాకు వెళ్ళి సబ్బులు, కొవ్వొత్తులు మొదలైన కుటీర పరిశ్రమలు నిర్వహించడం నేర్చుకుని వచ్చారు. ''ది గోదావరీ సోప్స్ అండ్ క్యాండిల్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ''ని స్థాపించి వ్యాపారం చేస్తూ తర్వాత బందరులో ''నౌరోజీ కంపెనీ'' అనే ఇంకొక వ్యాపార సంస్థను స్థాపించి తలనూనెలు, పెంకులు, టూత్ పౌడర్లు మొదలైనవి తయారుచేయించేవారు. ఈ వ్యాపారాలతోపాటు ''కమల కుటీరం'' అనే పుస్తక ప్రచురణ శాఖను నెలకొల్పి ''వసుంధర'' అనే పత్రికను కూడా కొంతకాలం నడిపారు. 1911 నుంచే గ్రంథ రచనలు చేసేవారు. 1912 నాటికే ఈ కంపెనీలన్నీ మూలపడ్డాయి.

1913 ప్రాంతాలలో సుబ్బారావుగారు రాజమండ్రిలో కొన్నాళ్ళుపాటు ఉన్నారు. ఇక్కడ లలితకుమారి, ఈసబునీతి కథలు, అరేబియన్ నైట్సు కథలు రచించారు. తర్వాత 1914లో ఎర్నగూడెం జమీందారు చెలికాని లచ్చారావు (1885-1923) గారి ఆహ్వానంపైన పిఠాపురానికి వెళ్ళి ఒక ఆరేళ్ళపాటు అక్కడ ప్రాచీన తాళపత్ర గ్రంథాల పరిశోధనలో పాటుపడ్డారు. లచ్చారావుగారు కృతికర్తలు, కృతిభర్తలు, ప్రాచీన గ్రంథ ప్రచురణకర్తలు. రామవిలాస గ్రంథమాలను నడిపారు. ''ఆంధ్ర భాషా విలాసిని'' అనే మాసపత్రికను నడిపారు. ఈ పత్రికలో వంగూరి సుబ్బారావుగారు తమ రచనలు ప్రకటిస్తూ ఉండేవారు. తిరుపతి వెంకటకవులు, సత్యవోలు సోమసుందరం, కూచి నరసింహం, పురాణపండ మల్లయ్యశాస్త్రి మొదలైన ఇతర విద్వాంసులు ఆ ''ఆంధ్ర భాషా విలాసిని''లో తమ రచనలు చేస్తూ ఉండేవారు.

పిఠాపురంలో ఉన్నప్పుడు వంగూరి సుబ్బారావుగారు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి శిష్యులయ్యారు. తాము రచించేవాటిని అచ్చువేసే ముందు పానుగంటి వారికి వినిపించి వారి ఆదేశాలను తీసుకొంటూ ఉండేవారని ఒక పుస్తకంలో సుబ్బారావుగారు రాసిన వాక్యం వల్ల ఊహించవచ్చు. చెలికాని లచ్చారావుగారు ''ఆధునికాంధ్ర కవి చరిత్రము'' అనే రచన చేశారు. వీరి నిరంతర పోషణలో ఉన్న వంగూరి సుబ్బారావుగారు మొత్తంగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రనే రచించాలని తలంచారు. దానిని రెండు భాగాలలో రచించారు. అది కట్టమంచి రామలింగారెడ్డిగారి పీఠికతో వెలువడింది. ''ఈ వాఙ్మయ చరిత్ర సంఘ శాస్త్ర సంబంధిగా వ్రాయపడియుండుట శ్లాఘనీయమైన విషయము'' అని రెడ్డిగారు మెచ్చుకొన్నారు.

1920లో వంగూరి సుబ్బారావుగారికి సతీ వియోగం కలిగింది. పిఠాపురం వదిలిపెట్టి చెన్నపట్టణానికి వెళ్ళి అక్కడ మూడేళ్లపాటు ఉన్నారు. శతక కవుల చరిత్రను

రచించాలని దానికి కృషి చేశారు. 'మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో శ్రీ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారి అధ్యక్షత క్రింద ఒక సభ జరిగింది. అందులో సుబ్బారావుగారు ''వేమన'' మీద ప్రసంగించారు. 1921లో కొండవీటిలో వేమన జయంతి జరిగింది. అందులో కూడా ప్రసంగించారు. అప్పుడు వేమన మీద ఒక గ్రంథం రాయాలనుకొనలేదుగాని 1922 ఏప్రిల్ 6వ తేదీ నాటికి వేమనపై ఒక విపులమైన గ్రంథాన్ని రచించారు. పీఠికలో తమకు తోడ్పడిన పండితులకు ఇలా కృతజ్ఞతలు చెప్పుకొన్నారు.

''భాషా విషయికముగ నాకుఁబ్రోత్సాహ మొదవించి ఈ గ్రంథ విషయమున సాయపడిన శ్రీ కొ॥ లక్ష్మణరావు పంతులుగారు, శ్రీ వేలూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు మొదలగు విద్యాధికులకును, గ్రంథము ప్రకటనకు, బూర్వము విని ప్రకటనకు ముదలయిచ్చిన యస్మద్గురువర్యులగు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారికిని, నేనఁడుఁగగనే పద్యములు వ్రాసి యిచ్చిన శ్రీ వడ్డాది సుబ్బరాయకవి, శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు, శ్రీ తల్లావఝ్ఝల సూర్యనారాయణ రావుగారు, మొదలగు కవులకును నా హృదయపూర్వక నమస్కారములర్పించు చున్నాను. నాకు వేమన్న కృతగ్రంథములిచ్చి సాయపడిన వావిళ్ల వెంకటేశ్వరులు గారిని కూడ నిచ్చటఁ బ్రశంసింపవలసియున్నది. నా గ్రంథము త్వరలోఁ జక్కగ ముద్రించి యిచ్చిన సముద్రాలంగూధికార్లకును, కొన్ని ద్రావిడ వాఙ్మయ వివరములు తెలిపిన సి.ఎం. నటేశ మొదలియారు గారికినిఁ గృతజ్ఞుడను.''

పీఠికలో కృతజ్ఞతలు చెప్పుకొన్నా కవులు రాసిన పద్యాలను వివిధ ప్రకరణాలలో మొదట సుబ్బారావుగారు చేర్చారు. ఎంతమంది సమకాలిక సాహితీపరులతో వారికి సన్నిహిత సంబంధముందో ఇందు తెలుస్తుంది. ''వేమన'' చరిత్ర రాయడానికి ముందే సుబ్బారావుగారు ''శతక కవుల చరిత్ర''కు సాధనాలన్నీ సమకూర్చుకొన్నారు. అంతవరకు మన సాహిత్య చరిత్రకారులు అట్టే పట్టించుకొనని శతక కవుల గురించి ప్రత్యేకంగా ఒక గ్రంథం రాయాలన్న సంకల్పం వారికి కలిగింది. నాలుగు భాగాలలో 200మంది కవుల గురించి రాశారు. అది అచ్చు వేయిద్దామని, పీఠిక రాసి పెట్టమని వేదం వెంకటరాయశాస్త్రిగారిని అర్థించారు. ఆయన రాస్తామన్నారుగాని పదిమాసాలు అయినా రాసి పంపలేదు. కాశీనాథుని నాగేశ్వరరావుగారు తటపటాయించారు. సుబ్బారావుగారు అకాలమరణం చెందడం వల్ల వారి కడసారి కోరికను చెల్లించినట్టు మంచి పీఠికను రాశారు. గ్రంథం 1924లో ప్రచురితమైంది.

వంగూరి సుబ్బారావుగారు తమ జీవితకాలంలో ఇరవై పుస్తకాలను రచించారు. వాటిలో చాలావరకు నేడు అలభ్యాలు. అయినా ఈ క్రిందివాటి గురించి కనీసం పేర్లూ, కొన్ని తారీఖులూ, ప్రక్రియా భేదాలు తెలియవస్తున్నాయి.

అరేబియన్ నైట్సు కథలు
ఆంధ్ర క్షత్రియులు
ఆంధ్ర వాఙ్మయ చరిత్ర (1920)
ఇందిర - నవల - వచనం
ఈసబునీతికథలు

చంద్రవదన - నవల - వచనం (1915)
తారా శశాంకం
తిరుమల - నవల (1915)
పరిశ్రమ స్మరణలు
ప్రభాతము - కల్పన - వచనం (1915)
బసివిరెడ్డి - చరిత్ర (1915)
మాయ - నవల (1916)
యతికి బ్రతి
రత్నపురి - నవల
రాయల రాజనీతి
రాయలవారి జననం
రోహిణి (1916)
లలితకుమారి
వ్యవహారచంద్రిక - నీతి రచనలు (1911)
శతక కవుల చరిత్ర (1924)
సుభాషిణి - కల్పన - వచనం (1915)

వంగూరి సుబ్బారావుగారు రచించిన ఈ ఇరవై గ్రంథాలలో కథల గురించి ముందు చెప్పుకొనడం భావ్యం. బహుశా వారు కథలే ముందు రచించారేమో.

అరేబియన్ నైట్సుకు అనువాదాలు మన భాషలో కుంఫిణీ యుగంనుండి ఎందరో చేస్తూ ఉన్నారు. 1842 అక్టోబరు 13వ తేదీ వర్తమాన తరంగిణిలో ''వుస్టలర్ దొరగారు చేసిన తెనుగు అరేబియన్ నైట్సు'' అనే పుస్తకం 13 రూపాయిలకు కాలేజీలో లభిస్తుందనే ప్రకటన ఉంది. యవనయామినీ వినోద కథలనే ఈ అరేబియన్ నైట్సు నుండే గురజాడ శ్రీరామమూర్తిగారొక కథ తీసుకొని 'చిత్ర రత్నాకరం' 1889లోనే రచించారు. 1893లో ఎస్.ఎ. మూర్తినాయుడు ''అరేబియన్ నైట్సు కథలు'' అనే పేరుతోనే ఈ కథలను రచించి ప్రచురించారు. వంగూరి సుబ్బారావుగారు బహుశా తమ 'వసుంధర' పత్రికలో ప్రచురణకు అరేబియన్ నైట్సు కథల అనువాదాలు ముందు రచించి తరువాత పుస్తకరూపంలో తెచ్చి ఉంటారు.

అరేబియన్ నైట్సు కథలను అనువదించినట్టే కొందరు పూర్వులు వంగూరి సుబ్బారావుగారు సంకల్పించడానికి రెండు దశాబ్దాలకు ముందే ఈసబు నీతి కథలను తెనిగించి ప్రకటించారు. 1883లో వీరేశలింగంగారు వీటిని ప్రారంభించి 1893, 94 సంవత్సరాలలో చింతామణి పత్రికలో ప్రచురించారు. మొత్తం మీద వీరేశలింగంగారు 158 కథలను అనుదించారు. రెండు భాగాలలో ''నీతి కథామంజరి'' అనే పేరుతో ప్రచురించారు. ఆదిభట్ల నారాయణదాసుగారు కూడా ఈసబు కథలు నూరింటిని తెలుగుసేత చేసి ''నూరుగంటి'' అనే పేరుతో ప్రకటించారు. వీరేశలింగంగారూ, నారాయణదాసుగారూ మొదట వచనంలో కథ చెప్పినా చివర ఒక నీతి పద్యం చేర్చారు. దాసుగారి పుస్తకం 1899లో ప్రచురితమైందని కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్ర

వాఙ్మయ సూచిక వల్ల విశదమవుతున్నది. వీరేశలింగంగారిది 1893 నాటికే వెలుగు చూసింది. ఒకే కథను ఈ ఇద్దరూ ఎలా తెలుగులో చెప్పారో చూస్తే పద్ధతి బోధపడుతుంది.

వీరేశలింగంగారి ''కాకికుండ'' కథ ఇలా ఉంది. ''కాకి దాహము చేత బాధపడుచు నీటి నిమిత్తమయి వెదకుచుండఁగా నొకచోట దానికొక కుండ కనఁబడెను. అప్పుడది సంతోషించి కుండ వద్దకు బోయి చూచునప్పటికి దానిలో నీరట్టడుగున నుండును. అందుచేత నా కాకి మెడ చాచియు తలక్రిందుగా వ్రేలియు నీరందుకొనఁజూచెను. గాని యెన్ని విధముల కృషి చేసినను దాని యభీప్సితము ఫలించినది కాదు. తరువాత కాకి యాకుండను తలక్రిందు చేసి క్రింద కారిన నీరు త్రాగవలెనని ప్రయత్నం చేసినను కుండ మిక్కిలి బరువయినదగుటచేత దానిని కదిలించుటయే సాధ్యమయినది కాదు. అటు పిమ్మట నేమి చేయుటకును తోఁచక కాకి కొంచెముసేపాలోచించి యాచేరువను గులకరాళ్లుండట చూచి యారాళ్లొకొక్కటే ముక్కునఁ గఱచుకొని వచ్చి యాకుండలోఁ బడవైచి నీరు పయికి వచ్చిన తరువాత మెడవంచి కావలసిన నీరు త్రాగి దాహము తీర్చుకొని తన దారిని పోయెను.

''పనికి మంచి యాలోచన వలయు మొదల;
నిష్ఫలంబగు బలమెల్ల నేర్పులేక
బలము యోచన రెండును గలియునేని
సర్వకార్యంబులను గృషి సఫలమగును''

ఇదే కథను ఆదిభట్ల నారాయణదాసుగారు ఇలా చెప్పారు - ''కాకి చెంబు'' కథ.

''ఒక కాకి మిగుల దప్పితో నీటికై నలువైపులు కనిపెట్టుచు వొక చోటఁ జెంబులో నీరుండఁజూచి త్రాగుటకు తొందఱతోఁ జెంబు యొద్దకు వచ్చి దాని యంచుపై నిలఁబడెను. అది మెడ యెంత వంచినను దాని ముక్కునకు నీరందీయందనట్లుండెను గాని పీల్చుటకు వీలుకాలేదు. పిమ్మటఁగాకి చెంబు నొత్తిగిలఁ జేయఁబోయియట్లు చేయఁజాలక యా దగ్గరనేయున్న కొన్ని చిరురాళ్ల నొక్కక్కటిఁగా దెచ్చి యా చెంబులోఁ బడవేయఁ జొచ్చెను. అంతటఁ గొంతసేపటికి చెంబులోని నీరంచుల యొద్దకు వచ్చెను. అప్పుడు దప్పి తీర్చుకొని యా కాకి యెగిరిపోయెను.

''నేర్పుగలుగువాఁడు నెరవేరునందాకఁ
బనికిఁ జొచ్చి కోర్కిఁబడయుచుండు
మూతి కందనట్టి ముంతనీటను రాలు
గూర్చికాకి దప్పి తీర్చుకొనదె''

తులనాత్మకంగా పరిశీలించడానికి వంగూరి సుబ్బారావుగారు ''ఈసబు కథలు'' ప్రతి నేడు అలభ్యం. ఏనాటికైనా దానిని సంపాదించగలిగితే తైపారు వేయవచ్చు.

సుబ్బారావుగారి శతక కవుల చరిత్ర, వేమన మొదలైనవి పరిశోధకులకేగాని నేడు సాధారణ పాఠకులను ఆకట్టుకోలేవు. వారి కథా వాఙ్మయం మరుగునపడింది.

ఆదిభట్ల నారాయణదాసు (1864-1945)

సాధారణంగా వాగ్రూపంలో కథనం చేసే విధాన నైపుణ్యమే పూర్వం కథకునితోపాటు అంతరించేదిగాని కాగితంమీద ఎక్కించినది కొంతకాలమైనా భద్రంగా ఉండేది. ఆదిలో అన్ని మానవ సంఘాలలో కథాకథనం నృత్యగీత వాద్యాలతో ముప్పేట ముచ్చట. 'నాగరికత' వర్గ సమాజంలో విభేదాలను పెంచుతూ వచ్చాక నృత్య వాద్యాల జట్టునుంచి గీతం దూరంగా వెళ్ళింది. పౌరాణికుల పురాణ పఠనం ప్రాచుర్యం పొందాక నృత్యం వాద్యం అక్కర లేకుండానే గీతాల, వ్యాఖ్యానాల సాయంతో బోధచేసే స్థితి వచ్చింది. జక్కుల కథలు, జంగం కథలు, చరిత్ర కథలు చేయవలసిన పనులను స్టేజి నాటకాలు చేపట్టినా యక్షగానాలలో ఉండవలసిన పాటలు, పద్యాలు చేర్చనిదే రంగస్థల నాటకాలు ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకొనడం ప్రారంభించలేదు. ప్రబంధ కవిత్వంలోని రుచి వాగ్గేయకారుల వడ్డనతో హరికథతో విందులు చేయడం మొదలైంది. తెలుగుదేశంలో హరికథకు ప్రాచుర్యం తెచ్చినవారు ఆదిభట్ల నారాయణదాసుగారు. వారికి ముందుకాలంలో కూడా హరికథ ఉందా? అన్న ప్రశ్నకు ఆయన ఇలా సమాధానం చెప్పారు.[22] ''...లేకేమి, చూడు. ఎండవేళ పొలము పనులేమియు లేక తీరుబాటుగా నున్న సమయమందు పల్లెటూరిలో రావిచెట్టు నీడను జనులందరు కడియము కట్టి చూచుచు వినుచు నానందించుచుండగా నొక మాలదాసరి వేపచెక్క గంధము పూసికొని కాళ్లకు గజ్జలు కట్టుకొని వెనుక నొకడు ఆఁయని నోటితో, శ్రుతి వేయుచుండగా, పాడి, యాడి యేదో యొక కథ విన్పించుట చూడలేదా? వాని వేప గంధమునకు మారు మంచి గంధము పూత, నోటి శ్రుతికి తంబురా శ్రుతి మొదలగు మార్పులు చేసినానే కాని వేరుగాదు.'' దాసుగారి ఈ మాటలను ఉటంకించిన వారు ''ఈ సమాధానము చమత్కారముగా చెప్పినదేగాని వాస్తవము కాదు'' అని రాశారుగాని సామాజిక మానవశాస్త్ర దృష్ట్యా చూస్తే ఈ సమాధానమే సత్యం. తరతరాలుగా తన తాత ముత్తాతలు చెప్పిన పురాణగాథలన్నీ తన జాతి విజ్ఞానం అని భావించడాన్ని ఆ మాలదాసరి చెప్పారు. నానాశాస్త్రాలూ, సకల కళలు నేర్చిన పండితుడు వర్గసమాజంలోని అసమానతలు శాశ్వతం చేస్తూ ఆస్తిక్య ప్రబోధం కోసం కథలు చెప్తే అది ఆదిమ కథాకథన ప్రక్రియలోని అంతరార్థానికి దూరం కాదు.

హరికథ మనకు మహారాష్ట్రుల నుండి దిగుమతి అయింది. తమిళులకూ, కర్ణాటకులకూ, తెలుగువారికీ ఈ ప్రక్రియ సరిసమానమే. ఆదిభట్ల నారాయణదాసుగారు తమ 19వ యేట మెట్రిక్యులేషన్ చదువుతూ ఉండగా 1883లో తొలిసారిగా విజయనగరంలో ఒక హరికథ విన్నారు. దానిని మద్రాసునుంచి వచ్చిన కుప్పుస్వామి భాగవతార్ అనే ఆయన చెప్పారు. సంగీత నృత్య సాహిత్యాలు ఒకచోట అనుసంధించే ఈ ప్రదర్శన కళ వల్ల నారాయణదాసుగారు ఆకర్షితులయ్యారు. నాయుడుగారు చెప్పిన ''ధ్రువచరిత్ర''నే తామూ చెప్పడానికి ప్రయత్నాలు చేశారు. కొన్ని సొంత గీతాలు రాసుకొని విశాఖపట్నవాసుడైన ధూళిపాళ కృష్ణయ్య పద్యాలనూ, ఆంధ్ర భాగవతంలోని పద్యాలనూ, పంచతంత్రంలోని కొన్ని పిట్ట కథలూ చేర్చి కథను తయారుచేసుకొన్నారు.

22. గుండవరపు లక్ష్మీనారాయణ - నారాయణ దర్శనము, పుట.514

ఒక సోదరుడైన పేరన్న పక్షపాతతో, ఇంకో సోదరుడైన సీతారామయ్యగారి ముందు ఈ కథను చెప్పారు. సీతారామయ్యగారు మెచ్చుకొని తమ్ముని కాళ్ళకు గజ్జెలు కట్టారు. ఆ తర్వాత వేణుగోపాలస్వామి మఠములో నారాయణదాసుగారు మొదటి హరికథ చెప్పారు. నాటినుంచీ ఆయన హరిదాసే.

పుట్టుకతో వారి పేరు సూర్యనారాయణ. ఇంట్లో అందరూ ఆయనను సూరన్న అనీ, చిన్న సూరి అనీ పిలిచేవారు. వీరి తండ్రి వెంకటచయనులు. సంస్కృతాంధ్ర విద్వాంసులు; పౌరాణికులు. తల్లి నరసమ్మగారు కూడా పురాణేతిహాసాలు తెలిసినవారు. ఆమెను ''పురాణాల నరసమ్మ'' అని పిలిచేవారు. తండ్రిగారి పురాణ పఠనం, తల్లిగారి పురాణ పరిచయం ఈయనను చిన్నప్పుడే మానసికంగా తీర్చిదిద్దాయి. బొబ్బిలి సంస్థాన వైణికులైన వాసా సాంబయ్యగారి దగ్గర పదేళ్ల వయస్సులో వీణ కొద్దిగా మీటడం నేర్చుకొన్నారు. తర్వాత విజయనగరంలో వీణా వెంకటరమణదాసుగారి దగ్గరా, కలిగొట్ల కామరాజుగారి దగ్గరా సంగీతం నేర్చుకొన్నారు. ఆరోజుల్లో విజయనగరంలో మహభత్‌ఖాన్ వంటి హిందూస్థానీ సంగీత విద్వాంసులుండేవారు. వారి గానాన్ని కూడా ఈయన ఆస్వాదించారు.

1883లో 19వ యేట మొదటి హరికథ చెప్పాక దేశ సంచారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమకు సొంతంగా హరికథలు రాసుకొనడం వచ్చిందని రుజువు చేయడానికి అంబరీషోపాఖ్యానం రాత్రికి రాత్రి రచించి మర్నాడు దానిని కథగా చెప్పారు. ముప్పయ్యోయేడు వచ్చేదాకా విశాఖపట్నం, కసింకోట, పిఠాపురం, రాజమండ్రి, ఏలూరు, బందరు మొదలైన ఆంధ్రదేశంలోని అన్ని ఊళ్ళలో హరికథలు చెప్పారు. 1894లో మద్రాసులో హరికథ చెప్తే హిందూ పత్రికలో అత్యుత్తమ ప్రశంసలు ఆయేడు జూన్ 30వ తేదీ పత్రికలో అచ్చుపడ్డాయి. బెంగుళూరు, మైసూరు వెళ్ళి రాజసన్మానాలు పొందారు. టిక్కెట్టు పెట్టి హరికథలు చెప్పిన ప్రఖ్యాతి కూడా గడించారు. తర్వాత విజయనగరం చేరుకొన్నారు.

రచ్చగెలిచి ఇంటికొచ్చిన నారాయణదాసుగారి సంగతి ఆనంద గజపతికి లింగం లక్ష్మాజీగారు చెప్పారు. 1895లో దాసుగారికి ఆనంద గజపతి దర్శనం, ఆస్థాన ప్రవేశం జరిగాయి. అయితే 1897లో ఆనంద గజపతి చనిపోయారు. కానీ, ఈ రెండేళ్లలోనే మహారాజాతో ''దోస్తీ'' కూడా ఏర్పడింది. దాసుగారికి సంస్కృతాంధ్ర ఆంగ్లాలు బాగా వచ్చు. ఒక మౌల్వీ దగ్గర ఉర్దూ, అరబ్బీ, పారశీకాలు నేర్చుకొన్నారు. (ఉమర్‌ఖాయం రుబాయత్ మూలం నుండి అనువదించేటంత జ్ఞానం సంపాదించారు.) దాసుగారు తమ జీవితకాలంలో చాలా గ్రంథాలను రచించారు. వివిధ పరిశోధకులు వాటిని వర్గీకరించారు. వాటి వివరాలు ఇవి : [23]

హరికథలు	-	14
శతకాలు	-	7
అచ్చ తెలుగు కృతులు	-	13
ప్రబంధములు	-	3

23. యస్వీ జోగారావు (సంపా) - కచ్చపీశ్రుతులు (అనుబంధం 3)

రూపకములు	-	2
గద్యకృతులు	-	4
అనువాద గ్రంథములు	-	7
సంస్కృతకృతులు	-	8

దాసుగారు చేసిన అనువాదాలలో ''నూరుగంటి'' అనేది నూరు ఈసబుకు కథలకు దాసుగారు చేసిన సరళానువాదం. ఇందులో ఒక కథ మచ్చుకు ఇంతకు ముందే గమనించాం. ''నారాయణదర్శనం'' అనే గ్రంథంలో ఈసబు కథల గురించి రాసిన గుండవరపు లక్ష్మీనారాయణగారు - ''ఈ కథలను తెనుగునకు అనువదించినవారు ముగ్గురు. 158 కథలతో ''నీతి కథామంజరి'' అను పేర శ్రీ కందుకూరి వీరేశలింగంగారు, నూరు కథలతో ''నూరుగంటి'' అను పేర శ్రీ నారాయణదాసుగారు, 316 కథలతో, ''ఈసప్ కథలు'' అనుపేర శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు'' అని చెప్పారు.[24] వీరు వంగూరి సుబ్బారావుగారిని, పురాణం సూర్యనారాయణ తీర్థులుగారిని చేర్చలేదు. దాసుగారి హరికథలు పుస్తకరూపంలో ప్రచురితమయ్యాయిగాని సినిమా స్క్రిప్టు చదువుకొంటే సినిమా చూసినట్టు ఎలాగ ఉండదో హరికథ గ్రంథాన్ని చదువుకొన్నా అంతే. హరికథలలో సందర్భోచితంగా పిట్టకథలూ, ప్రస్తావిక శ్లోకాలు, హాస్య ప్రసంగాలు మొదలైనవన్నీ ఉంటాయి. అప్పుడే పండిత పామర రంజకంగా ఉంటుంది. ఇవి తంజావూరు యక్షగానాలలో సంభాషణలు రాయకుండా సందర్భాన్ననుసరించి ఆయా వేషధారులు చెప్పడానికి స్వాతంత్ర్యం ఇచ్చినట్టే హరిదాసు తాను చెప్పబోయే కథలలో సూత్రధారీ, పాత్రధారీ తానే కనుక సమయస్ఫూర్తితో కథ చెప్పాలి. దాసుగారు తమ సుదీర్ఘ హరికథా జీవనంలో ఇదే చేశారు. వారు తమ స్వీయచరిత్రను కూడా తమకు ముప్పయ్యొయేడు వచ్చేదాకానే కథనం చేశారు. అందరూ రిటైరు అయ్యే వయస్సులో సంగీత కళాశాల ప్రిన్సిపాలుగా పనిచేపట్టారు. 81వ యేట మరణించారు.

దాసుగారు తొలిరోజులలో తత్సమతద్భవములతో కూడిన మిశ్రభాషలో రచనలు చేశారు. మధ్యవయసులో గీర్వాణంపైనా, చివరిరోజులలో తద్భవముల వాసన కూడా లేని నాటు తెలుగులో రచనలు చేశారు. దేశ్యాన్ని ఆయన నాటు తెలుగు, సీమ పలుకలు అంటారు. ఈ తెలుగుమీద అభిమానం ఎంతదాకా వెళ్ళిందంటే మనం ఆంధ్రులమనీ, మనదేశం ఆంధ్రరాష్ట్రం అని చెప్పుకొనడం వారికి ఇష్టం లేదు.

''తెలుగు మాటాడువారలు తెలుగువారు
కాన చెడుగులౌ యాంధ్రులుకారు కనుక
ఆంధ్ర రాష్ట్రము మాది - మేమాంధ్రులమని
చెప్పుకొనరాదిక దెల్గుసీమవారు''

ఆంధ్రులు ''చెడుగులు'' అంటే మ్లేచ్ఛులు అని ఐతరేయ బ్రాహ్మణంలో ఉంది. కనుక ఆ మాట పనికిరాదు. దాసుగారు ఈకింది తొమ్మిది తెలుగు పుస్తకాలు రాశారు.

24. నారాయణదర్శనము - పుటలు. 309-310

వాటి పేర్లను వింటే అవేమిటో తెలియవు. కుండలీకరణాలలో ఉన్న తత్సమతద్భవాలు చదివితేనేగాని మనకు అవగాహన కావు. చూడండి ఆ పేర్లు :

1. అచ్చ తెలుగు పల్కుబడి
2. గౌరమ్మ పెండ్లి (గౌరీ కళ్యాణము)
3. నూఱుగంటి (నూరుకథల సంపుటము)
4. మన్కిమిన్కు (ఆయుర్వేదము, మన్కి - ఆయువు, మిన్కు - వేదము)
5. మొక్కుబడి (ఋక్సంగ్రహము, దేవతా ప్రార్థనము)
6. వెన్నుని వేయిపేర్ల వినకరి (విష్ణుసహస్రనామ సంకీర్తనము)
7. వేల్పుమాట (భగవద్గీత)
8. వేల్పునంద (స్వామి శతకము)
9. సీమ పలుకు వహి (అచ్చు తెనుగు నిఘంటువు. వహి - పుస్తకము)

''నాటు తెలుగు చాదస్తానికి గీటురాయి. రసాస్వాదన తత్పరునకు పంటిరాయి'' అని దాసుగారి జీవితాన్ని, సాహిత్యాన్ని పరిశీలించిన వారు కూడా చెప్పారు.[25]

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు ''ఈయన సంస్కృతంలో కూడా కవి. ఆంధ్రం చెప్పనే అక్కఱలేదు. ''తొండ ముదిరితే వూసరవెల్లి'' అవుతుందన్నట్లు యిటీవల యీయన కవిత్వం పేర్ల దగ్గఱ నుంచిన్నీ (వెన్నుని వెయిపేర్ల వినికిడి అని కాఁబోలును వొక పుస్తకం పేరు). అచ్చ తెలుఁగులోకి మాఱి కొంత రసాన్ని గోలుపోతూ వుంది కాని హరికథా రచనాకాలం నాఁటికి ఈ చేదస్తం యీయనకు పుట్టలేదు. అది అదృష్టమనుకోవాలి. లేకపోతే యీయన రచనలు యీయనతోటే అంతరించిపోయేవి. సంశయం లేదు. యీయనకు యెన్ని విద్యలేనా వచ్చును. అన్నిటిలోనూ కూడా ప్రత్యేకించి కృషి చేసినవారితో పోట్లాడి నిగ్రహించగల శక్తి కూడా వుంటే వుంటుంది. గాని లోకం యీయన్ని హరికథకుడుగానే కాని అన్యథా వాడుకోదు'' అన్నారు.[26]

కథన చాతుర్యం కథకుని ప్రతిభా వ్యుత్పత్తులను బట్టి రాణిస్తుంది. కథకుడు పోయినా కథ బతకాలి. ప్రజా బాహుళ్యానికి కావలసినది అదే.

తేకుమళ్ల రాజగోపాలరావు (1876-1938)

ఆదిభట్ల నారాయణదాసుగారి వంటి వారికి ''ఆంధ్ర'' అన్న మాటంటే కిట్టకపోవచ్చునుగాని ఈ పదాన్ని ఉచ్చరించగానే పరవశించి ప్రస్తుతించేవారు లేకపోలేదు. అలాంటివారిలో తేకుమళ్ళ రాజగోపాలరావుగారు ఒకరు. ఆయన తమ ''కనకవల్లి'' అనే నవలలో ఆంధ్ర నామం గురించి ఇలా రాశారు.

''ఆహా! ఈ యాంధ్రనామమెంత గౌరవనీయమైంది. అమోఘ దీక్షా ధురంధరుఁడై పట్టిన పట్టును విడువక సాధించిన యుద్దండ తపఃప్రభావుఁడగు విశ్వామిత్రుని యంశమున

---

25. గుండవరపు లక్ష్మీనారాయణ - నారాయణ దర్శనం - పుట.316
26. ''కథలు-గాథలు'', 2వ భాగం, పుట.665

క్షాత్రవీర్యము నపహసించు బ్రహ్మతేజో బలంబున నుద్భవించి సమస్త శుభకర్మలకును స్థానభూతమగు పవిత్రైతరేయ మహాబ్రాహ్మణ విధానమున వైదిక మార్గానుసారముగా నామకరణ మహోత్సవమును జరిపించుకొని, అటు వెనుక ఏ వేద విద్యావిశారదుడు బోధాయ నాశ్వలాయన కాత్యాయనాదుల కన్న మిన్నయై, అలభ్యములగు గంకటి కల బావిపైంగయాని సత్యయాని శైలాని మున్నగు బ్రాహ్మణములందుఁగూడ నాఱితేఱెనో, ఏ ప్రఖ్యాత గుణోత్తరుఁడు విపులములై విద్యుక్తములై విమలములై విశ్వవిశ్వంభరా విధాయకములైన శ్రౌతసూత్ర రాజములను దనపేర లోకమున నాచంద్రార్కస్థాయిగా వెలయించెనో.....''

ఇలాగ సుదీర్ఘ వచనంలో ఆపస్తంబుని ప్రస్తుతించారు. రాజగోపాలరావుగారు కథకులు, నవలా రచయితలు (1902లో చింతామణి కథల పోటీలో ''త్రివిక్రమ విలాసం'' అనే నవలకు ప్రథమ బహుమతి పొందారు.) సాంఘిక పరిశోధనలేకాక ఛందశ్శాస్త్ర పరిశోధకులు కూడా చేశారు. ద్రావిడ భాషల తులనాత్మక ఛందస్సు రచించారు. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో మధ్యాక్కరలు ఉన్నాయని మొట్టమొదట వీరే కనిపెట్టారు.

తేకుమళ్ల రాజగోపాలరావు పెద్దాపురం, కాకినాడ, బెజవాడ, బందరు మొదలైన ఊళ్ళలో విద్యాభ్యాసం చేశారు. నోబులు కాలేజీలో ఎఫ్ఫే, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో బియ్యే, సైదాపేట టీచర్స్ కాలేజీలో ఎల్.టి. చదివారు. వీరేశలింగంగారి శిష్యులు. ఎఫ్ఫే చదువుతున్నప్పుడు రఘుపతి వెంకటరత్నంకి ప్రియమిత్రులు. ఆదిలో బ్రహ్మసమాజంలో చేరారు. తర్వాత 1916లో ఆర్షసమాజాన్ని సంస్థాపించారు. తెలుగులోనూ ఇంగ్లీషులోనూ గ్రంథ రచనలు చేశారు. ఇంగ్లీషులో తెలుగువారి గురించి రాశారు. ద్రావిడ భాషల తులనాత్మక ఛందస్సు ఆంగ్లంలోనే రాశారు. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. తెలుగు పుస్తకాల వివరాలు :

ఆంధ్ర దేశీయ కథావళి - పద్యాలు, వచనంలో
ఈశ్వర తత్త్వము - వచనం (1900)
కనకవల్లి - నవల (1919)
కొబ్బరిచెట్టు - పారిశ్రామిక సంబంధం - వచనం (1909)
క్రతురంభా సంవాదము - ప్రహసనం - వచనం (1911)
ఛందశ్శాస్త్రము - లక్షణగ్రంథము - వచనం
జన్మాంతరము
తెనాలి రామలింగని హాస్య కథలు - వచనం (1907)
త్రివిక్రమ విలాసము - నాటకం - పద్యాలు, వచనం (1895)
పశుశాస్త్రము - ప్రకృతి సంబంధం - వచనం (1912)
బాల్య వివాహము - ప్రహసనం - వచనం (1898)
భోజనప్రతి భోజనములు - వచనం

రామమోహన తారావళి - కావ్యం - పద్యాలు (1915)
లలిత - నవల (1909)
వికట కవిత్వ చింతామణి (టీక) - పద్యాలు (1911)
విగ్రహారాధనమును నిషేధించు శాస్త్రము - మతం (1907)
వివేకదీపిక - వ్యాకరణం - వచనం (1912)
విహంగయానము - నవల (1934)
వ్యవసాయశాస్త్రము - వచనం (1911)
స్త్రీ చరిత కదంబము - కథలు
హిందువుల పూర్వస్థితి
హిందూ సంఘ సంస్కారచరిత్ర - చరిత్ర - వచనం (1900)

ఆంధ్రదేశీయ కథావళిలో 61 కథలున్నాయి. ఇవి వివిధ స్థలాల కులాల కథలు. సామాజిక మానవ శాస్త్ర పరిశోధనలకు అత్యంత ప్రాథమికదశలోని సమాచారాన్ని అందించేవి. వీటిలోని కథలపేర్లు చూసినా ఆసక్తికరంగా ఉంటాయి.

1. మత్స్యగుండము కథ
2. బలిజెల యుత్పత్తి
3. బోయల యుత్పత్తి
4. మంగలులు
5. బేరులు
6. కమ్మరుల యుత్పత్తి
7. భట్రాజులు
8. గండకి
9. వేయి కన్నుల తల్లి
10. వెలికొలము
11. అంబా భవాని వరము
12. దేవాంగులు
13. దూదేకుల కులోత్పత్తి
14. భూశయనము
15. నారచీరలు
16. గొడుగుల వాండ్రశాపము
17. కాళింగులు
18. కమ్మవారి యుత్పత్తి
19. ప్రతాపరుద్రుని కమ్మలజోడు
20. కమ్మ వెలమల భేదము
21. విశ్వబ్రాహ్మణులు
22. పంట కాపులు
23. వైశ్యులు
24. గ్రుడ్డి కోమటి - మహావిష్ణువు
25. మహామూఢుడు - కోమటి
26. ఎఱుకలమ్మ
27. భీమన్నపురము
28. కోయవాండ్రు
29. కమ్మరులు
30. కురుబవాండ్రు
31. లింగబలిజలు
32. జాంబవకులము
33. మాతంగి
34. మైలబట్టలు
35. ఎన్నెమ్మ
36. గౌరమ్మ
37. ఎడమ పైట
38. దాయిండ్ల వాండ్రు
39. లక్ష్మి
40. గొంతియాలమ్మ
41. మేదరుల యుత్పత్తి
42. మేదరుల విశేషము
43. అరసులు
44. ముత్రాసులు

45. బడ్డీలు
46. బడ్డీల పేదరికము
47. ముక్తికాగుండము
48. ఒడ్డెవాండ్ర వివాహము
49. పద్మసాలీలు
50. పల్లెవాండ్రు లేక పల్లవులు
51. ద్రౌపది
52. పల్లవులు శాలివాహనుడు
53. వానదేవుడు
54. మాలలు
55. మాలవాడు, శివుడు
56. పట్టునూలువాండ్రు
57. పెరికీలు
58. పిచ్చిగుంటవాండ్రు
59. ఉప్పరులు
60. మరులపోలేరమ్మ
61. వీరముష్టివాండ్రు

తన దేశంలోని వివిధ స్థలాల, కులాల చరిత్రలు తెలుసుకోవాలనే అభిలాష జిజ్ఞాసువులకు ఉంటుంది. వారికే ఇటువంటి కథలు తెలుసుకొనడం అవసరం. స్వరాష్ట్రం నుంచి, స్వదేశం గురించి తెలుసుకొన్నాక ఇతర దేశాల కథలు కూడా తెలుసుకోవాలనిపిస్తుంది. ఈ అవసరాన్ని జమీందారీ యుగంలోని ఇతర రచయితలు తీర్చారు. వాటి వివరాలు ఇవి :

అమీరే హంజా - కొత్తపల్లి సూర్యారావు (1910)
ఆంధ్రరాజుల కథలు (1, 2 భాగాలు) - టి. కేశవరావు (1919)
ఉపనిషత్కథలు - పురాణపండ మల్లయ్యశాస్త్రి (1918)
ఎడమకాలి తన్ను కుడిచెంప ముద్దు - ఏ సుందరరామయ్య (1920)
ఎద్దు మొగము వాని కథ - ఎం. శివరామయ్య (1912)
ఎలుకల పిటీషనులు - గుండు రాఘవరావు (1920)
కాళిదాస కథామంజరి - సి. లక్ష్మీనరసింహశాస్త్రి (1918)
క్రిమినలు కేసు - దే. పెరుమాళ్లయ్య (1915)
క్రూరుడగు వేటకాడు దయగలయోగియైన కథ - సి. నంజుండప్ప 91917)
గమ్మత్తులు - రాఘవదీక్షితులు (1913)
గులేబకావళి కథ - (జి. ఇమాంసాహెబు) (1895)
గుల్బారు ఇడబిస్తాన్ కథలు - జె.సి. నెస్ఫీల్డు (1919)
గ్రీకు పురాణకథలు - చిలకమర్తి లక్ష్మీనరసింహం (1911)
గ్రీకు పురాణకథలు - సెట్టి లక్ష్మీనరసింహం (1910)
చక్కని కథలు - యం.ఎస్.బి.వి. సొసైటీ
చదువుకొనిన వానికంటే చాకలి మేలు - పి. చిట్టిరామయ్య (1921)
చమత్కార కథాకల్లోలిని - చిలకపాటి వెంకట రామానుజశర్మ (1897)
చలి, ముసలివాడు - క్రొత్తపల్లి సుందరరామయ్య (1899)
చార్దర్వీషు కథలు - ఇ. మల్లికార్జునుడు (1876)
చిత్రకథ - మంగిపూడి వెంకటశర్మ (1921)

చిత్రకథలు - ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణశాస్త్రి (1911)
చిత్రకథా మంజరి - రాయసం వెంకటశివుడు (1902)
చిన్నకథలు - మల్లంపల్లి సోమశేఖరశర్మ (1917)
చీనా దేశపు కథలు - పి.యస్. కాకుళాచార్యులు (1879)
చుట్టపొడుము కథ - కొత్తపల్లి సూర్యారావు (1899)
ఛాందస బ్రాహ్మణ ప్రయాణము - కె. సుబ్బారావు (1901)
జననావారి కుపయుక్తమగు కథలు - సి.వి.ఇ. సొసైటీ (1870)
ట్రాయి పట్టణ కథలు - మాక్మిలన్ అండ్ కో (1917)
ఢిల్లీ పాదుషా కథలు - ఒ.వై. దొరసామయ్య (1900)
తారుమారు కథల గంప - మ. సుబ్బరాయలు
దక్షిణదేశపు కథలు - డి.సి. ఆలన్ (1905)
పతివ్రతయగు బ్రాహ్మణ చిన్నదానిని తురక వారికి అమ్మిన కథ - చ. చిన్నయ్య (1912)
పరిషియా పగటి వినోద కథలు - ఎన్. ఎంబారయ్య (1903)
పాముల కథలు
పారశీక కథలు
ముగ్గురు రాజుల కథలు - ఎస్.వి. నరసింహమూర్తి (1914)
ముద్దకూటి మొద్దురామన్న - చిన్నయ్యనాయుడు (1912)
రత్నావళి చరిత్ర - పోకల శేషాచలం నాయుడు (1898)
రాళ్లే శనగలు - మంగు వెంకటరంగనాథరావు (1917)
విచిత్ర కథామంజరి - ఎం.ఎల్.సుబ్బారాయుడు (1890)
విచిత్ర వినోద కథలు - జి. శేషగిరిరావు (1898)
రా. వెంకట నరసింహరాజగపతిరాజు (1900)
వేగుచుక్క కథావళి - డి.వి. కృష్ణావళి (1915)
వైద్యుల కథలు (1918)
శుకసప్తతి కథలు - ఎస్. వీరరాఘవయ్య
వెంకట సుబ్బాశాస్త్రి శృంగార శోకవింశతి కథలు - ఎ.వి.సి. దొరసామయ్య (1897)
హాస్యకథలు (1913)
హాస్య ప్రకాశిని - టి.కె. పురాణం కేశవాచారి (1893)

కాశీనాథుని నాగేశ్వరరావుగారి "ఆంధ్ర వాఙ్మయ సూచిక"లో నమోదు అయిన కథల పుస్తకాల భోగట్టాల నుండి ఈ పేర్లని సేకరించడం జరిగింది. నమోదుకానివి ఎన్నున్నాయో, జమీందారీ యుగంలో కథా సాహిత్యంలో ఇంత వైవిధ్యమున్న నవ్య సాహిత్య ప్రక్రియలుగా నవలా, చిన్నకథా కొందరి చేతుల్లోనే సానలు తీరింది.

చింతా శంకర దీక్షితులు (1914-1919)

అయిదంటే అయిదే సంవత్సరాలు రచనా జీవితకాలంలో ఈ కుండలీకరణాలలో నేను సూచించిన రచయిత నిజానికి ఒకరు కాదు, ఇద్దరు. సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన నూతన ధోరణుల సమాజాలలో అందరికీ తలలో నాలుకగా వుంటూ కథక చక్రవర్తి అనే పేరు తెచ్చుకొన్న చింతా దీక్షితులు (1891-1960), తమ ఇంటిపేరున్న వారే అయిన దగ్గర బంధువు చింతా భీమశంకరం (1891-1941) గారితో కలసి జంట కవులై కవిత్వాన్ని ప్రారంభించారు. జంటకవులు తమ పేర్లలో కొన్ని పదాలను కలిపి ఒకటే పేరు మీద చెలామణి కావడం ఆరోజుల్లో ఫేషన్ కనుక ''చింతా శంకర దీక్షితులు'' అనే పేరును పెట్టుకొని రచనలు చేశారు. వచన రచనలు కూడా కొత్త ఫేషను కనుక దాన్ని కూడా చేపట్టారు. నవలకాని కథ ఉండవచ్చుకాని, కథకాని నవల ఉండదు. శంకర దీక్షితులు ఏది రాసినా, కథమీదా, అందులోనూ కొత్తదనంమీదా మొగ్గు చూపించారు. ఇద్దరూ కలసి ప్రచురించిన రచనల వివరాలు ఇవి :

అగ్గిరాముడు - కథ - వచనం (1919)
ఎడమ చేతి దెబ్బ - కథ - వచనం (1917)
కడసారి మాట - కథలు - వచనం (1917)
చంద్రహారము - కథ - వచనం (1915)
చిత్రలేఖ - అపరాధ పరిశోధన కథ - వచనం (1914)
తుదిమ్రొక్కు - కథ - వచనం
దురాశ - నవల - వచనం (1898)
దొంగా? - కథ - వచనం (1917)
ప్రేమానుబంధం - నవల - వచనం (1917)
సాంఘిక దౌర్జన్యం

చింతా భీమశంకరంగారి ద్వారా దీక్షితులుగారికి తల్లావఝల శివశంకరశాస్త్రిగారితో పరిచయమైంది. అప్పటికి సాహితి సమితి పుట్టలేదు. శివశంకరశాస్త్రిగారు ఈ జంట రచనలు మానెయ్యమని, విడివిడిగా రాయమనీ సలహా ఇచ్చారు. జంట విడిపోని పక్షంలో తాను కూడా వారితో కలసి ''శివశంకర దీక్షితులు'' అనే పేరుతో రాస్తానని తల్లావఝలవారు బెదిరించారు. దీక్షితులుగారు ఈ సలహాని పాటించి స్వయంగా తమ ఒక్కరి పేరుమీదగానే కథలూ, ప్రక్రియలూ రచించడం ప్రారంభించారు.[27]

చింతా భీమశంకరంగారు అప్పుడప్పుడు ఖండకావ్యాలు భారతిలో రాస్తూ ఉండేవారు. రఘుపతి శతకం అనే అధిక్షేప కావ్యాన్ని రచించారు. అపరాధ పరిశోధక నవలను తెలుగులో వ్రాసినది మొదట ఈయనే అనవచ్చు అని కురుగంటి సీతారామయ్యగారు చెప్పారు. చింతా దీక్షితులుగారి గురించి కురుగంటి వారు ఇలా రాశారు.[28]

27. నోరి నరసింహశాస్త్రి - సారస్వత వ్యాసములు, 5వ సంపుటం - పుట.586
28. నవ్యాంధ్ర సాహిత్య వీధులు - పుట.370

''ఈనాఁడు ప్రసిద్ధి పొందిన కథా రచయితలలో ఒకడు. ఈయన చిన్ననాటినుంచీ పాటలూ, ఖండకావ్యాలూ సాధన చేస్తూ వచ్చినాడు. ''రాజగిరిరాజ'' అనే పేరుతో 1913 నాటికే ''కౌంటు ఆఫ్ మాంటెక్రిస్టో'' అనే డ్యూమస్ నవలను అనసరించి వ్రాసినాడు. ''పరిణామవాద'' మనే పేరుతో 1920లో సాహితీ సమితి గ్రంథ పరంపరలో మొదటి గ్రంథాన్ని ప్రచురించినాడు. ఈయనపైన గురజాడ కవి ప్రభావము ఉన్నదని వింటాము.''

వాస్తవానికి గురజాడ వారసత్వాన్ని అందుకొన్న ప్రసిద్ధులలో చింతాదీక్షితులుగారు ప్రథములని చెప్పాలి. దీక్షితులుగారితో, వారి సాహితీ సమతి మిత్రులతో కథాసాహిత్యం ఆధునికతను సంతరించుకొంది. అయితే ప్రజాబాహుళ్యానికి కాక ప్రజలలో ఒక వర్గానికే అది ఎక్కువగా నచ్చడం గమనించదగ్గ విషయం.

నవలలు - నానా రకాలు

నవల అనే మూడక్షరాల మాటలో చూస్తే ఒక వల కనబడుతుంది. వాస్తవానికి సామాన్య పాఠకలోకాన్ని ఆకట్టుకొనే ప్రతి నవలలోనూ ఒక కనపడని వలను రచయిత అల్లుతాడు. అందులో చిక్కడం కూడ ఒక చక్కని అనుభూతి. తక్కిన సాహిత్య ప్రక్రియలకన్నా ఎక్కువగా నవలలే ఇవాళ ప్రపంచంలోని అన్నిదేశాల సారస్వతాలలో ప్రాచుర్యం పొందాయి. నవలలు నానారకాలు. అభిరుచులకు తగిన నవలలను వివిధ శాఖలలో వివిధ రీతులలో వేరువేరు వన్నెలతో కొన్ని కొన్ని చిన్నెలతో నవలాకారులు పూయింప చేస్తున్నారు. నవల ఒకరకంగా నాగరికతను చిహ్నామైపోయింది. తెలుగు సాహిత్యం జమీందారీ యుగంలో నాగరికత అలవరచ్చుకొంది.

ఒకదేశపు ఆచార వ్యవహారాలను ఆ దేశపు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే తెలుసుకోవచ్చునని విద్యాధికులు భావిస్తారు. ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు ఆదేశపు గతచరిత్రలోని విషయాలను బోధిస్తాయిగాని సమాజంలోని మానవుల తీరుతెన్నులు తెలుసుకోవాలంటే వారి మానసిక భావాలను అర్థం చేసుకోవాలంటే ఆ దేశపు సాహిత్య పఠనం ఒక రకమైన మార్గాన్ని చూపెడుతుంది. సమకాలిక సమాజాన్ని పరిశీలించడానికి సమకాలిక సాహిత్య కృషి అవసరం. కుంఫిణీ యుగంలోని తెల్లదొరలు భారతీయుల ప్రాచీన సాహిత్యాన్నీ, కథలనూ, కైఫీయత్తులలనూ సేకరిస్తే జమీందారీ యుగంలోని ఉన్నతాధికారులు సృజనాత్మక సాహిత్యాన్ని ప్రోత్సహించారు. 1869 జనవరి నుండి 1872 జనవరి దాకా భారతదేశానికి గవర్నర్ జనరల్‌గానూ వైస్రాయిగానూ ఉన్న లార్డ్ మేయో 1871లో కలకత్తాలో ఒక ప్రకటన చేశాడు. ''బంగాళుల యాచారంబులు తెలుపు ప్రబంధము గావించువానికి బహుమానము చేయబడున''ని ఆ ప్రకటన చెప్తోంది. ఈ ప్రకటనకు బెంగాలులోని రచయితలు ఎలా స్పందించారోగాని చెన్నరాష్ట్రంలోని కర్నూలులో పెద్ద ప్రభుత్వోద్యోగిగా ఉంటున్న గోపాలకృష్ణమ్మ (1833-1885)గారు అనే విద్యాధికుడు మాత్రం ఉత్తేజితుడై ''తెలుగుదేశము వారి యాచారములు తెలుపునట్టి

ప్రబంధమొకటి రచియించుట తెలుగు చదువు వారి కుపయుక్తం బగున''ని తలంచారు. తన నేర్పు కొలది 1872లో ఒక గ్రంథం రాశారు. అదే తెలుగులోని మొట్టమొదటి నవల.

గోపాలకృష్ణమ్మగారు చెన్నపట్నం వాస్తవ్యులు. ఇంటిపేరు నరహరివారు. తండ్రిపేరు తెన్న రంగయ్య, తల్లి పేరు వెంకటలక్ష్మమ్మ. గోపాలకృష్ణమ్మగారికి గోపాల కృష్ణమూర్తి, గోపాలకృష్ణమ చెట్టి అనే వ్యవహారనామాలు కూడ ఉన్నాయి. ఈయన 1888 నాటికి ఏభై అయిదు సంవత్సరాలవారు కాబట్టి 1833లో జన్మించారని భావించవచ్చు. వీరు 'ఆంధ్ర నిలింప భాషానురక్తుడు', అఖిల పురాణేతిహాస ప్రమోదుడు. చెన్నపట్నం లోనే చదువుకొని కుంఫిణీ కొలువులో చేరాడు. 1858లో పరవస్తు చిన్నయసూరిగారికి ఒక ఆంగ్ల గ్రంథం అనువాదం చేయడంలో సహాయం చేశాడు. థామస్ లండన్ స్ట్రేంజ్ అనే కుంఫిణీ ఉద్యోగి 'ఎలిమెంట్స్ ఆఫ్ హిందూ లా'' అనే పుస్తకాన్ని రచించాడు. దానిని చిన్నయసూరిగారు ''హిందూ ధర్మశాస్త్ర సంగ్రహం'' అనే పేరుతో గోపాలకృష్ణమ్మగారి సహాయంతో తెలుగు చేసి 1858లో ప్రచురించారు.

చెన్నపట్నం నుండి ఎప్పుడు బదిలీ అయిందోగాని గోపాలకృష్ణమ్మగారు తుంగభద్రా తీరంలోని కర్నూలులో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. ఆంగ్ల గ్రంథాలను తెనిగించడం ఆంధ్ర గ్రంథాలను ఇంగ్లీషులోకి పరివర్తించడం ఆయనకు ఉద్యోగ ధర్మాలే కావచ్చు. ''కర్నూలు భూగోళం'' అనే గ్రంథాన్ని ఇంగ్లీషు నుండి ఆంధ్రీకరించారు. ఇది 1871లో అచ్చుపడింది. కర్నూలుజిల్లా మాన్యువల్‌ను అధికారులు మెచ్చుకొనేటట్టు ఆంగ్లభాషలో రచించారు. చిన్నయసూరి సహవాసం వల్లనే కావచ్చు గోపాలకృష్ణమ్మగారు ఆంధ్ర వ్యాకరణం తెలుగులోనే రచించారు.

గోపాలకృష్ణమ్మగారి జీవిత వివరాలను ఈవిధంగా ఇప్పటిదాకా ఎవ్వరూ క్రోడీకరించలేదు. అయితే వీటిని ఇలాగ ఇప్పుడు ఒక క్రమంలో చెప్పుకొనడానికి ఆధారాలు లేకపోలేదు. గోపాలకృష్ణమ్మకు రాజామణి (1859-1910) అనే కుమారుడు ఉన్నాడు. ఇతడు కర్నూలు నరహరి రాజామణి సెట్టి అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. కవి, రచయిత, పోలో, క్రికెట్ ఆటగాడు. ఆనందగజపతి ఆస్థానంలో ఉండేవాడు. ఈ రాజామణి తన తండ్రిపేర కృష్ణమూర్తి శతకం అనే సీసపద్య శతకం చెప్పాడు. అందులో గోపాలకృష్ణమ్మగారి వివరాలు పద్యాలలో ఉన్నాయి. వీటిని పరిశోధకులు ఉదాహరించారు. అయితే ఇవి చెల్లాచెదురుగా ఈ పుస్తకంలో కొన్ని, ఆ పుస్తకంలో కొన్ని ఉన్నాయి. వాటిని ఒక క్రమంలో కావలసినవన్ని కింద పొందుపరుస్తున్నాను.

1. 'శ్రీ లఁజెలంగెడు చెన్న పురంబున
భాసిల్లు నరహరి వంశమందు
ధీరుఁడై తనరిన తెన్న రంగయ్యకు
వేంకట లక్షుమాంబకును బుట్టి
యేఁబదియై దేండ్లునింపుగానలరుచు
తనపేరు నిల శాశ్వతముగఁజేసి

వర సర్వధారి సంవత్సరమునను వై
శాఖము శుక్లపక్షంబునందు
షష్ఠి సౌమ్య వాసరమున సారసాప్తుఁ
డపరగిరి కేగినపుడు నీవరిగి తౌర
సకల భూపాల రింఛోళి చక్రవర్తి
క్షీర సత్కీర్తి గోపాలకృష్ణమూర్తి'[1]

2. 'అర్థ గౌరవమొప్ప నాంధ్ర భాషను రంగ
రాజ చరిత్రంబు రచనచేసి
కందనోలి భూగోళముందెనుంగించి యాం
ధ్రంబున వ్యాకరణంబు చేసి
హూణ భాషను కందనోలిమాన్యాలును
ప్రభువులు మెచ్చంగఁ బరఁగజేసి
శేష కవీంద్ర రచిత రంగరాజ చ
రిత్రమునకు నీవు గృతి పతిత్వ
మొంది కాదంబరి తెలుంగునందు జేయు
తలఁపుగొని తివి లేదయ్యో దైవబలము
సకల భూపాల రింఛోళ చక్రవర్తి
క్షీర సత్కీర్తి గోపాలకృష్ణమూర్తి'[2]

ఈ రెండు పద్యాలవల్ల గోపాలకృష్ణమ్మగారు ఒక్క కృతికర్తగా మాత్రమే కాక కృతిభర్తగా కూడా తెలియవస్తున్నారు. తానొక శ్రీరంగరాజు చరిత్రను రచించడమేకాక ఎవరో శేషకవీంద్రుడు రచించిన 'రంగరాజు చరిత్రకు' కృతిపతిత్వం కూడా తన తీరిక కాలంలో వహించారు. ఏది ఏమైనా కొడుకు రచించిన పద్యాలవల్ల తండ్రికి గ్రంథ రచన అలవాటే అన్న సంగతి స్పష్టమవుతోంది.

ఇంత రచనా వ్యాసంగం ఉండడం వల్లనే 1871లో లార్డ్ మేయోగారి ప్రకటన చదువుకొన్నాక 'శ్రీరంగరాజ చరిత్ర' అనే నవీన ప్రబంధం రచించారు. దీనిని 1872 జనవరి తరువాత పూర్తిచేసినట్టుంది. ఈ గ్రంథాన్ని లార్డ్ మేయోగారికి స్వయంగా అంకితమివ్వాలని గోపాలకృష్ణమ్మగారు భావించారు. అయతే దురదృష్టవశాత్తూ 1872 జనవరి 24వ తేదీనాడు లార్డ్ మేయో అండమాను ద్వీపాలలో కారాగారాల పరిపాలనను తనిఖీ చేయడానికి వెళ్ళినప్పుడు ద్వీపాంతరవాస శిక్షను అనుభవిస్తున్న ఒక సరిహద్దు రాష్ట్రాల ఆఫ్ఘన్ హంతకుడు వెనుక నుంచి కత్తితో పొడిచి చంపేశాడు. లార్డ్ మేయో గతించినా ఆతని ప్రేరేపణ వల్ల రచించిన గ్రంథాన్ని ఆయనకే మరణానంతరమైన అంకితమివ్వడం తమ ధర్మమని గోపాలకృష్ణమ్మగారు భావించారు. గ్రంథాదిని ఇలా ఇంగ్లీష్ ''ప్రీఫేస్'లో రాశారు.

1. వంగూరి సుబ్బారావు - శతక కవుల చరిత్రము - పుట.344
2. 'విజయనగర సంస్థానము - ఆంధ్ర వాఙ్మయ పోషణము' - నిడుదవోలు వెంకటరావు - పుట.105

"This attempt to delineate the manners and customs of Telugus, in the form of a Novel owes its origin to the announcement by the late lamented Viceroy of the offer of a reward for the best story in Bengali illustrative of native life and manners in lower Bengal and the author therefore deems it a previlege (deeply regrets that he cannot do so in person) to inscribe to Lord Mayo in token of respectable and grateful appreciation of his Lordship's endeavours to promote the literary culture of the vernaculars of India. This slight effort to further, in however small a degree, the same-cause."

N. GOPALAKRISHNAMAH.

ఇంగ్లీషులో 'నోవెల్' అనే పేరుతో పిలిచే ప్రక్రియనే తాము తెలుగులో మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నట్టు గోపాలకృష్ణమ్మగారికి స్పష్టంగా తెలుసు. అయినా ఈ ప్రక్రియకు సరిపోయే పారిభాషిక పదం తెలుగులో లేదు కాబట్టి ఆయన దీనికి 'నవీన ప్రబంధం' అని నామకరణం చేశారు. ఈగ్రంథం ముఖపత్రం ఇలా ఉంది.

> శ్రీరస్తు
> శ్రీ రంగరాజు చరిత్ర
> సోనాబాయి పరిణయము
> హిందువుల యాచారములు తెలుపునట్టి నవీన ప్రబంధము
> నరహరి గోపాలకృష్ణమ సెట్టిచే ప్రణీతము
> Madras
> Printed at the vyavahara Tarangini Press
> 1872
> Registered Copyright

గోపాలకృష్ణమ్మగారు తమ గ్రంథం 'ప్రీఫేసు'లో చెప్పిన విషయాలను తెలుగుపీఠికలో మరింత విపులీకరించారు. పద్యకావ్యాలలోని ప్రబంధ నాయిక లక్షణాలు ఆయనకు తెలుసు. అందుచేత లాక్షణిక సమ్మతమైన నాయక చరిత్రను చెప్పాలని భావించారు. తాము రచించదలచినది సోనాబాయి పరిణయమే. కాని గ్రంథానికి నాయకుని పేరు పెట్టడం వల్ల ఉదాత్తత చేకూరుతుందని భావించారు. 'నోవెల్'లో కల్పిత కథ ఉండాలి. అయితే అది సంప్రదాయవిరుద్ధంగా ఉండకూడదు. గోపాలకృష్ణమ్మగారు పీఠికలో ఇలా చెప్పారు.

''పదినెలలనాడు లార్డు మేయోగారు బంగాళుల యాచారంబులు దెలుపు ప్రబంధంబుగావించు వానికి బహుమానంబు చేయబడునని ప్రచారము చేసిరి. అది నేను జదివినపుడు తెలుఁగు దేశము వారి యాచారములు తెలుపునట్టి ప్రబంధం బొకటి రచియించుట తెలుఁగు చదువు వారి కుపయుక్తంబగునని తలంచి నా నేర్పు కొలఁదిని ప్రబంధంబు చెప్పఁబూనితి, ఇది కేవలము కల్పితంబు. కథానాయకుడు మహాకులీనుడై యుండవలయునని ఈదేశమున మున్ను దొరతనము చేసిన విద్యానగర రాజవంశము

వారిలో శ్రీ రంగరాజను వారి పేరుఁ గైకొంటిగాని యిందు చెప్పిన చరితము యథార్థముగా జరిగిన కథయని యెంచఁగూడదు, ఇందుఁ చెప్పిన యాచారములు మాత్రము యథార్థముగా నాచరింపఁబడునవి.

''ఈ కథ 400 సంవత్సరములనాడు జరిగినట్లు చెప్పఁబడియెగాని యప్పటి యాచారములకును నిప్పటి యాచారములకును లేశంబుగాని భేదంబులేమింజేసి యిందుదాహరింపఁబడిన యాచారమ్ములన్నీ యిపుడాచరింపఁబడుచున్నవని యెఱుంగునది. కేవల గద్యాత్మకములయిన తెనుఁగు ప్రబంధములు విశేషము లేమింజేసి యిది తెనుఁగు విద్యార్థులకు సహిత నుపయోగించునని తలఁచెద.

కర్నూలు నరహరి గోపాలకృష్ణమ సెట్టి''

శ్రీరంగరాజు చరిత్రను రచయిత అయిదు ప్రకరణాలలో రాశారు. ఆశ్వాసం అనాలో, ప్రకరణం అనాలో, అధ్యాయం అనాలో తేల్చుకోక కాబోలు 'ఉల్లాసము' అనే పేరును ఈ నవీన ప్రబంధ భాగానికి పెట్టారు. కథ ఇవాళ వైశిష్ట్యం లేని సాధారణ కథలాగ తోచవచ్చు. మొట్టమొదటి తెలుగు నవలలోని కథను టూకీగా తెలుసుకొందాం.

విద్యానగరం ఏలుతున్న ఒక రాజుగారికి ఒక భార్య, ఒక వేశ్య ఉన్నారు. వేశ్య పేరు శారద. రాజుగారి భార్యకొక కుమారుడు, వేశ్యకొక కుమారుడు పుట్టారు, పెరిగారు, పెద్దవాళ్ళవుతున్నారు. రాజుగారి ధర్మపత్నికి పుట్టిన కుమారుని పేరు శ్రీరంగరాజు. భోగపత్ని కుమారుని పేరు కృష్ణుడు. రాజుగారు ఇద్దరు యువకులను సరిసమానంగా చూసుకునేవాడు. వేశ్యపుత్రుని తనతోపాటుగా సమానంగా తండ్రి ఆదరించడం శ్రీరంగరాజు ఆధిక్యతను దెబ్బతీసింది. తండ్రి చూసీ చూడనట్టు ఊరుకున్నాడు. శ్రీరంగరాజు కోపమొచ్చి ఊరువిడిచి దేశాలు పట్టాడు. రాజపుత్రుడు తోడులేకుండా వెళ్ళకూడదు కనుక రామయ్యా అనే స్నేహితుడు వెంట కలసి వెళ్ళాడు.

శ్రీశైలం సమీపంలో చంద్రగుప్తి అనే ప్రదేశముంది. అక్కడ ఒక లంబాడీ తండా ఉంది. అందులో ఒక చూడచక్కని చిన్నది ఉన్నది. ఆమె పేరు సోనాబాయి. శ్రీరంగరాజు ఆ పిల్లను ప్రేమించాడు. అయితే ఆమెమీద భీమానాయకుడనే వాడికి మనసై పెళ్ళాడుదామనుకొన్నాడు. సోనాబాయిగానీ ఆమె తల్లికిగానీ భీమానాయకుడంటే సద్భావం లేదు. పెళ్ళికి ఇష్టపడలేదు. సోనాబాయిని బలవంతంగా ఎత్తుకుపోవడమేగాక భీమానాయకుడు ఆ చిన్నదానిని కొండవీటి రాజుకు అప్పచెప్పాడు. ఈ సంగతి తెలుసుకున్న శ్రీరంగరాజు కొండవీటికి వెళ్ళాడు. ఆ దుర్గం రాజమాత సహాయంతో సోనాబాయిని రక్షించి ఆమెతో కలసి విద్యానగరానికి వెళ్ళాడు.

కులీనుడైన రాజపుత్రుడు లంబాడీ పిల్లను ప్రేమిస్తే ప్రేమించవచ్చుగాని పెళ్ళిచేసుకొనడం ఎలాగ? అందుచేత నవలా రచయిత ఒక పూర్వకథను వెల్లడి చేస్తాడు. సోనాబాయి తల్లి సరిగ్గా చెప్పవలసిన వేళలో ఆ పిల్ల తన కన్నకూతురు కాదనీ, ఒక రాజకన్య అనీ, అసలు పేరు రంగనాయిక అనీ ఇన్నాళ్ళూ దాచిపెట్టిన వాస్తవాన్ని బయటపెడుతుంది. ఇంకా ఆరాలు తీయగా రంగనాయిక కొండవీటి రాజు పినతండ్రి

కూతురు. కులీనుల పిల్ల. పైపెచ్చు శ్రీరంగరాజుకు మేనత్తకూతురు కూడాను. కథాంతంలో శ్రీరంగరాజు మేనరికమే చేసుకుంటాడు. హిందువుల ఆచారాలను తొలి తెలుగు నవల యథాశక్తి తెలియచేసింది.

ఇది నవీన ప్రబంధం కాబట్టి ప్రబంధ లక్షణాలలో మరికొన్నింటిని కూడా పాటించి పద్యకావ్యాలలో వుండే వర్ణనాత్మక శైలినే పాటించవలసి వచ్చింది. చిన్నయసూరిగారి సహాయకులు కనుక గోపాలకృష్ణమగారు కూడా గ్రాంథికభాషనే ఆశ్రయించవలసి వచ్చింది. ఉదాహరణకు ఒక ఘట్టం చూడండి. శ్రీరంగరాజు మార్గాయాసంచేత డస్సి ఒక చోట దప్పిక చేత తపిస్తున్నాడు. దగ్గరలో చేను కోత కోస్తున్న మాలవాళ్ళు వచ్చి చూసి త్రాగడానికి నీళ్ళిద్దామనుకొన్నారుగానీ అతడు క్షత్రియుడని తెలుసుకొని నీళ్ళు ఇవ్వకుండా వెళ్ళిపోయారు. ఈ సందర్భంగా రచయిత ఇలా చెప్పాడు.[3]

''.... ఆ జలము జూచి పుచ్చుకొందమాయని యాతనికి యాసక్తి యుండియు, పాడు వర్ణాచారపు బంధములంజేసి ముట్ట చేతులాడక యతండు మనోవేదనయేమని చెప్పుదు...''

''హా! ఏ పుణ్యాత్ముడు గల్పించెనో యీ వర్ణాశ్రమ ధర్మంబులు. ప్రాణంబులు పోవుచున్నను వాని బంధములు పోకపోయె. అత్తరిని రాకొమరుని చిత్తంబేమిగా తల్లడిల్లుచుండెనో యా పరమాత్మునకె కాని యొరుల కెఱుకయె? ఆ బంధంబులు తెంపవలెనని యుద్యుక్తుండయినఁగాని వాని ద్రెంచుట దుస్సాధ్యం బయ్యెగా! వానిఁ గల్పించిన వారి మహిమ యేమని చెప్పవచ్చు.''

గోపాలకృష్ణమగారు పాడు వర్ణాచారాలను చూపెడుతూనే సదాచారాన్ని పాటిస్తూ రచన చేశారు. ఈ రాకుమారుని దప్పికకు సమయానికతని స్నేహితుడొచ్చి నీళ్ళిచ్చి ప్రాణాలు దక్కిస్తాడు. గోపాలకృష్ణమగారు ఈ నవలలో శ్రామికుల పక్షపాతం, గ్రామీణుల కష్టాలపట్ల సానుభూతిని కూడా వీలైనచోట్ల ఇలా ప్రకటించారు.

''....ఆరసి చూచిన నగరమువారి సుఖంబులన్నింటికి బల్లెలవారి కష్టంబులె కారణంబుగఁ గానం బడుచున్నయవి. వీరు పండింపని పక్షమందు నగరము వారేమి చేయఁగలరు? రాజులైన నేమి యనుభవింతురు? వీరు కష్టపడవలె, వారికిఁగరము చెందవలె. వీరు పాటుపడవలె, వారి పరివారమునకు జీతము ముట్టవలె, వీరు పైరు పెట్టవలె, వారి వర్తకంబులు చెలఁగవలె, ఏమి చిత్రము! ఫలింపఁజేయు వాడొకడు, ఫలమనుభవించు వాఁడొకఁడు.''

101 పుటల ఈ నవీన ప్రబంధాన్ని గోపాలకృష్ణమగారు శ్రమపడి రచించినా దీని ఫలాలను తెలుగు సాహిత్యంలోని తరువాత తరాలవారు అనుభవించారు. ఈ పుస్తకం తెలుగు విద్యార్థులకు సహితము ఉపయోగపడుతుందని గ్రంథకర్త భావించారుగాని పాఠ్యగ్రంథంగా నిర్ణయించి బలవంతంగా చదివిస్తేగాని ఆరోజుల్లో ఏ పుస్తకాన్నయినా

3. 'కొత్తపల్లి వీరభద్రరావు - 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము' అనే గ్రంథంలో ఉదహరించిన భాగం నుండి పుటలు - 319, 320

విద్యార్థులు చదివేవారు కాదు. విద్యార్థులు కాకపోయినా ఉపాధ్యాయులు చదివే ఉంటారు. అలాంటి వారిలో సమర్థి రంగయ్యచెట్టిగారు బహుశా ఒకరు. మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో రంగయ్యచెట్టిగారు గణితశాస్త్రోపాధ్యాయులు. తెలుగు భాషా సాహిత్యాలపై మంచి ఆదరాభిమానాలు ఉన్నవారు. మద్రాసు యూనివర్సిటీలో తెలుగు పరీక్షల బోర్డుకు ఆయన చాలాకాలంగా అధ్యక్షులుగా ఉన్నారు. పాఠ్యగ్రంథ నిర్ణయంలో ఆయనకు తమ కాలేజీలో అధికారాలతోపాటు ఇతర విద్యాసంస్థలతో పలుకుబడి కూడా ఉంది.

'శ్రీరంగరాజు చరిత్ర' 1872లో చదివితే సమర్థి రంగయ్య చెట్టిగారికి దానిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించాలనే ఉద్దేశం కలిగినట్టు లేదు. అయితే 1874లో వీరేశలింగంగారు రచించిన 'విగ్రహతంత్రం' చదివాక చిన్నయసూరిగారికి సరియైన వారసుడు వచన రచనలు చేపట్టి 'మాస్టర్‌పీస్' రచించాడని పొంగిపోయారు. క్రిష్టియన్ కాలేజీలో దానిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు. ప్రెసిడెన్సీ కాలేజీలోకూడా శేషయ్యగారికి చెప్పి పెట్టిస్తామన్నారు. 1875 ఫిబ్రవరి 8వ తేదీనాడు ఒక లేఖను రాస్తూ "Can you not under take the writing of an original Novel in Telugu?"[4]

సమర్థి రంగయ్య చెట్టిగారిలాంటి వారికి తెలుగులో స్వయంకల్పిత వచన ప్రబంధాలను సమర్థులు రాస్తే బాగుంటుందని తోచింది. విగ్రహతంత్రం రచించి చిన్నయసూరి పక్కన నిలబడడమేకాక తలదన్నే శైలిలో రాసిన వీరేశలింగంగారికన్న సమర్థులు ఇంకెవరుంటారు? అందుకే ఆయనను ఒరిజినల్ నవలను తెలుగులో రాయమని పురిగొల్పే ప్రశ్న వేశారు. వీరేశలింగంగారు ఆ పనిచేయాలని నిశ్చయించుకొన్నారు.

మొట్టమొదట ఏదైనా ఒక ఇంగ్లీషు నవలను తెనిగించి శైలి కుదురుపరచుకోవాలనీ, తరువాతనే స్వకపోల కల్పితమైన వచన ప్రబంధమును రాయాలనీ ఆయన భావించారు. గోల్డుస్మిత్తు రచించిన 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు' అనే కథను తీసుకొని ఆంధ్రీకరించసాగారు. రెండు మూడు ప్రకరణాలు రాశాక వారికే సంతృప్తికరంగా లేదు. విదేశ కథ, భాషాంతరీకరణము మనవారికి ఇంపుగా ఉండదని రాసిన దానిని పక్కను పెట్టి 'రాజశేఖర చరిత్రము' రాయడం ప్రారంభించారు.

సమర్థి రంగయ్య చెట్టిగారు 1875లో ప్రేరేపించినా వీరేశలింగంగారు తమ 'ఒరిజినల్ నవల'ను 1878కి గాని ప్రకటించడానికి సిద్ధం చేసుకోలేదు. 1878లోనే 'వివేకవర్ధని' అనే తమ పత్రికలో భాగభాగాలుగా ప్రచురించారు. 1880లో పుస్తకరూపంలో ప్రకటించారు. ఈవిధంగా తెలుగు సాహిత్యంలోని రెండవ నవల రంగప్రవేశం చేసింది. కాలక్రమాన్నిబట్టి రాజశేఖరచరిత్ర రెండవ నవలగా చెప్పాలిగాని దానికి వచ్చిన పొగడ్తలు అనుకరణలు మొదలైనవాటిని బట్టి చూస్తే ఇదే తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రప్రథమ నవల అనే భ్రమ కలుగుతుంది.

4. కందుకూరి వీరేశలింగం – స్వీయచరిత్ర – రెండవ భాగం, రెండవ ప్రకరణం – పుట.154

1880 జూలై 20వ తేదీనాడు 'రాజశేఖర' లేక 'వివేకచంద్రిక'ను[5] పుస్తకరూపంలో మొదటిసారిగా ప్రచురిస్తున్నప్పుడు ఆ కూర్పు పీఠికలో వీరేశలింగంగారు ''ఈవరకు మనయాంధ్ర భాషలో జనుల యాచార వ్యవహారాలను దెలుపుచు నీతి బోధకములుగా నుండు వచన ప్రబంధము లేవియు లేకపోవుట యెల్లవారికిని విశదమయియే యున్నదిగదా!'' అని రాయడం వల్ల వారు అంతకుముందే ఎనిమిదేళ్ళ క్రిందట 1872లో ప్రచురితమైన 'శ్రీరంగరాజ చరిత్ర' ఉనికిని గుర్తించనట్టు భావించాలి. ఇది ఆశ్చర్యకరమైన విషయమే. నరహరి గోపాలకృష్ణమ్మగారు తమ పుస్తకాన్ని రిజిష్టరు చేశారు. గవర్నమెంటు గెజిట్‌లో పుస్తకం పేరు, భాష, ప్రక్రియ, ప్రచురణకర్త చిరునామా, పుస్తకంలో పుటల సంఖ్య, అచ్చువేసిన ప్రతుల సంఖ్య, ధర మొదలైన వివరాలన్నీ ఇవ్వడమేకాక చిన్న సమీక్ష కూడా ఇంగ్లీషులో రాశారు. ఈ గెజిట్ ప్రకటనలో శ్రీరంగరాజు చరిత్ర 'నవల' అని మూడుసార్లు పేర్కొనడమేకాక తెలుగులో నవలా రచనా ప్రయత్నంలో ఇదే ప్రప్రథమని అభిప్రాయపడ్డారు. తరువాత రాబోయే నవలకు ఇది నమూనా కాగలదని భావించారు.[6]

వీరేశలింగంగారు గెజిట్ ప్రకటన చూడలేదనే అనుకోవాలి. చూస్తే గ్రంథాన్ని చదవలేదనుకోవాలి. చదివితే అది నవలన్న భావం వారికి కలగలేదనుకోవాలి. గోపాల కృష్ణమ్మగారు తమ గ్రంథాన్ని వెయ్యి ప్రతులు ముద్రించారు. (వీరేశలింగంగారు కూడా రాజశేఖరచరిత్ర వెయ్యి ప్రతులు ముద్రించారు.) గోపాలకృష్ణమ్మగారి గ్రంథాన్ని చదివినవారెవ్వరైనా ఆ సంగతి వీరేశలింగంగారి దృష్టికి ఆ నవల ఉనికిని తెలియపరచకపోవడం కూడా అబ్బురమైన సంగతే. రాజశేఖరచరిత్రను పత్రికాధిపతులూ, తదితరులూ బహువిధముల పొగిడినట్లు వీరేశలింగంగారు రాసుకొన్నారు.

1878లో మద్రాసులోని హిందూపత్రిక ఆంగ్లంలో రాజశేఖర చరిత్రను విపులంగా సమీక్షించింది. అందులో ఈగ్రంథాన్ని "It is the first Telugu Novel that was yet appeared" అని చెప్పింది. వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్‌ను తన ఆదర్శంగా పెట్టుకొన్నానని గ్రంథకర్త ప్రకటించినా తన చుట్టునుగల సాధన సామగ్రి గైకొని వానికి పొందికను, రూపమును కలిగించినట్టు భావించారు. వీరేశలింగంగారి ఆశయం రాజశేఖర చరిత్రను విద్యాశాఖవారు ఆదరించాలనే. అయితే దీనిని పాఠ్యగ్రంథంగా నిర్ణయించలేరు. వీరేశలింగంగారి పుస్తకాలలో ఈక్రిందివన్నీ వచన గ్రంథాలు.

1. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం (రచన 1870, ప్రచురణ 1875)	సర్వకళాశాల పట్టపరీక్ష పఠనీయ గ్రంథం
2. రసికజన మనోరంజనం (రచన 1870, 1874 ప్రచురణ)	సర్వకళాశాల ప్రథమశాస్త్ర పరీక్షకు పఠనీయ గ్రంథం

5. రాజశేఖర చరిత్ర అనే పేరు రెండో కూర్పు నుంచి కనబడుతుంది. చూ॥ A.B. Sai Prasad - "Early Novels in Hindi and Telugu, A Compartive Study' University of Madras, 1987 (Unpublished (Ph.D) Thesis)

6. Fort St. Geroge Supliment 3rd Quarter 1872 (July, August and September) ఈ సమాచారం కొత్తపల్లి వీరభద్రరావుగారు తమ గ్రంథంలో పొందుపరిచారు. పుట.286

3. సంగ్రహ వ్యాకరణం (1872-74 మధ్యరచన)	ఉత్తర మండలంలోని అన్ని పాఠశాలలకూ పఠనీయ గ్రంథం
4. నీతి దీపిక (1875)	పాఠశాలలో బహుకాలం ఉపయోగింపబడినది
5. విగ్రహతంత్రం (1874)	క్రిష్టియన్ కాలేజీలోనూ, ఇతర విద్యాసంస్థలలోనూ, సర్వకళాశాలలో పఠనీయ గ్రంథం
6. నీతిచంద్రిక - సంధితంత్రం (1878)	సర్వకళాశాలలో పలుమార్లు పఠనీయగ్రంథం
7. శుద్ధాంధ్ర భారత సంగ్రహం (1879)	సర్వకళాశాల ప్రథమశాస్త్ర పరీక్ష గ్రంథం
8. రాజశేఖర చరిత్ర (1880)	
9. సత్యవతి చరిత్ర (1883)	- ఉత్తరోత్తరా పాఠ్యగ్రంథం
10. చంద్రమతీ చరిత్రము (1884)	-
11. కవలుచరిత్ర (1887)	
12. సత్యరాజా పూర్వదేశయాత్రలు (1891)	

గ్రంథ ప్రచురణ ప్రారంభించిన నాటినుంచి రమారమి రెండు దశాబ్దాల కాలంలో వీరేశలింగంగారు తమ పుస్తకాల్లో వేటిని పాఠశాలలలో, సర్వకళాశాలల్లో పాఠ్య పుస్తకాలుగా అధికారులు ఎన్నుకొన్నదీ దొరికినన్ని వివరాలతో పైపట్టికలో పొందుపరచాను. ఆరోజుల్లో పాఠ్యగ్రంథంగా దేన్నయినా పెట్టడానికి విద్యావిచారణాధి కారి పుస్తకాలను అంగీకరించవలసిన పనిలేదు. పాఠశాల అధికారులు స్వతంత్రించి పెట్టుకోవచ్చు. కాని, విద్యాశాఖ అధికారులు సూచించిన వాటినే సాధారణంగా పెట్టుకొంటారు. వీరేశలింగంగారి 'నీతిచంద్రిక-విగ్రహతంత్రం' వెలువడీ వెలువడగానే యూనివర్సిటీలో ప్రవేశపరీక్షకు పఠనీయగ్రంథంగా పెడితే అందుమూలంగా వీరేశలింగం గారికి ఒక పుస్తకం మీద వెయ్యిరూపాయలు చేతిలో పడ్డాయి. అన్ని రూపాయిలొక్క సారిగా కన్నుల చూడగానే ఉద్యోగం కన్నా గ్రంథ కర్తృత్వం వల్లనే ఎక్కువ సంపాదించుకోవచ్చునని ఆయన భావించారు.[7] అయితే రాజశేఖరచరిత్ర ఆశాభంగం కలిగించింది. ''దానివలన వట్టి పొగడ్తలే కాని రశ్మియేమియూ నాకు కలుగలేదు. వేయి ప్రతులు గల మొదటి కూర్పమ్ముడు పోవుటకే బహు సంవత్సరములు పట్టినది. అందుచేత నిప్పుడు నవలనబడు వచన ప్రబంధములను వ్రాయు ప్రయత్నమును మానివేసితిని'' అని స్వీయచరిత్రలో ఆయన కారణాలు చెప్పారు.

రాజశేఖర చరిత్ర వల్ల వీరేశలింగంగారికి రశ్మి కలుగకపోవచ్చుగాని దేశంలో మెల్లగా ఆ స్ఫూర్తి పనిచేయడం ప్రారంభించింది. 1887లో దానిని 'ఫార్చ్యూన్స్‌వీల్' అనే పేరుతో

7. స్వీయ చరిత్ర - 2వ భాగం, 2వ ప్రకరణం - పుట.148

రివరెండు హట్చిన్‌సన్ ఆంగ్లీకరించి చిత్రపటాలతో ఇంగ్లండులో ముద్రించాడు. లండన్ టైమ్సు పత్రిక దీనిని సమీక్షించింది.

''...హిందూ గృహజీవనము యొక్కయు, సుతాభిప్రాయముల యొక్కయు, ఉపాసనా పద్ధతుల యొక్కయు, మూఢ విశ్వాసముల యొక్కయు, వివాహములో వరించు స్వాతంత్ర్యములన్నియు తొలఁగింపఁబడియున్న స్త్రీల యవస్థల యొక్కయు వర్ణనలు మిక్కిలి చక్కఁగాను నిదర్శన పూర్వకముగాను చేయఁబడినందును, సామాన్యముగా స్వీయజాతివారి యొక్క సాంఘిక స్థితిని బాగుచేయుటకయి గ్రంథకర్తయొక్క యభిలాషముతో నేకీభవించు చదువరుల కందఱికి నీ పుస్తకము చిత్తాకర్షముగా నుండును.''[8]

రాజశేఖర చరిత్రను ఇంగ్లీషులోనికి అనువదించి పంపిస్తే దానిని ఇంగ్లండులోని ఒక పత్రికలో ప్రచురించి పుస్తకరూపంలో వెలువరించవచ్చునని ఆర్.ఎం.మెక్డొనాల్డ్ అనే దొరగారు వీరేశలింగంగారికి ఇంగ్లండునుంచి 1881 డిసెంబర్‌లో ఉత్తరం రాశారు. ఈ దొరగారు పూర్వం డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌గా పనిచేశారు. ఈయనకే వీరేశలింగంగారు రాజశేఖర చరిత్రను అంకితమిచ్చారు. తాను కృతి పుచ్చుకొన్న పుస్తకం ఆంగ్లంలో వెలువడితే బాగుంటుందని ఆయన భావించి ఉత్తరం రాశారు గాని 1880 నుండి వీరేశలింగంగారు స్త్రీ పునర్వివాహ సమాజ స్థాపనలోనూ, దాని వ్యవహారాలలోనూ తలమునకలుగా ఉండి రాజశేఖర చరిత్ర ఇంగ్లీషు అనువాదం గురించి పట్టించుకోలేదు. అప్పుడే ధార్వాడ నాటక సమాజంవారు వచ్చి ప్రదర్శనలిచ్చి వెళ్ళారు. ఆ వేడిలో 'చమత్కార రత్నావళి' నాటకాన్ని రచించి విద్యార్థులచేత ఆడించే సంరంభంలో ఉన్నారు. 1881 డిసెంబరు నెలలో మొదటి స్త్రీ పునర్వివాహాన్ని జరిపించారు. అందుచేత నవల ఆంగ్లానువాదం జోలికి పోలేదు.

ఒక్క ఇంగ్లీషులోనికే కాక కన్నడ భాషలోనికి కూడా రాజశేఖర చరిత్ర అనువాదితమైంది. నవలల ప్రయోజనాన్ని దేశం గురించి కొత్త రచయితలు బయల్దేరసాగారు. 1888లో వి. రామానుజులు నాయుడు అనే ఆయన 'అధిక ఆపేక్ష మిక్కిలి నష్టము' అనే ఒక నవలను రచించి ప్రకటించాడు. పనప్పాకం అనంతాచార్యులు (1843-1909)గారు మంజువాణీ విజయం అనే ఒక ప్రేమ కథను నవలగా రచించి 1892లో ప్రచురించారు. ఇందులో నాయిక ఒక వణిజపుత్రిక. నాయకుడు రాజకుమారుడు. ఆమె అతన్ని ప్రేమించి చాలా కష్టాలు పడి చివరికి పెళ్ళి చేసుకొంటుంది. అనంతాచార్యులు గారికే ఆనందాచార్యులుగారనే వ్యవహారనామం ఉంది. ఈయన సుప్రసిద్ధులు. మద్రాసులో న్యాయవాదులు. 1887లో రాజబహదూర్ బిరుదును పొందారు. నేషనల్ కాంగ్రెసులో ప్రముఖులు. 1891లో నాగపూర్ కాంగ్రెస్ సభకు అధ్యక్షులు. రాజకీయాల మాటకేంగాని అనంతాచార్యులుగారు సంస్కృతాంధ్రాలు చక్కగా అధ్యయనం చేసినవారు. ఆంధ్ర భాషా సారస్వత పోషణ చేశారు. మద్రాసులో 'విద్యావినోద' అనే

8. ఇది లండన్ టైమ్స్ సమీక్షకు వీరేశలింగంగారి తెలుగుసేత, స్వీయచరిత్ర - 2వ భాగం, 2వ ప్రకరణం - పుట.163

బిరుదుతో చాలా సాహిత్య సేవ చేశారు. 1894లో వైజయంతి అనే పత్రికను పెట్టారు. అందులో కొక్కొండవారి మహాశ్వేత అనే అసంపూర్ణ రచన అచ్చుపడింది. ఇది కాదంబరికి తెలుగుసేత. దీనిని తెలుగులో తొలినవల అని పేర్కొనే పరిశోధకులు కొందరున్నారు. దీని రచన 1867లో జరిగిందని వారి విశ్వాసం. ఇది పుస్తకరూపంలో రాలేదు. అనంతాచార్యులుగారు 1892లో 'చమత్కార తరంగిణి' అనే నవలను రచించి ప్రచురించారు.

మద్రాసులో అనంతాచార్యులుగారు చేస్తున్న కృషి దేశంలో ఇతర ప్రాంతాలవారిని ఉత్సాహపరిచింది. 1891లో రాజమండ్రిలో వీరేశలింగంగారి ప్రోత్సాహ సహకారాలతో న్యాపతి సుబ్బారావుగారు 'చింతామణి' అనే పత్రికను ప్రచురించసాగారు. ప్రాచీన గ్రంథాలను పరిష్కరించి ఇందులో ముద్రించుతున్న సమకాలిక సృజనాత్మక రచనలు కూడా ప్రోత్సహించాలన్న సంకల్పం వారికి కలిగింది. 1893లో పాశ్చాత్య పద్ధతిని ఆఖ్యాయికలు వ్రాయించాలనుకొన్నారు. (నవలకు నరహరి గోపాలకృష్ణమగారు 'నవీన ప్రబంధం' అనే పేరు పెడితే, వీరేశలింగంగారు 'వచన ప్రబంధం' అన్నారు. ఇప్పుడు నవలనే ఆఖ్యాయిక అని పిలువసాగారు.) చింతామణి పత్రిక నవలల పోటీలను ప్రకటించింది. మొదటి ప్రెయిజు 75 రూపాయలు, రెండవ ప్రెయిజు యాభై రూపాయలు ఇస్తామని చెప్పారు. 1893లో ముగ్గురంటే ముగ్గురే పోటీకి తమ నవలలు పంపించారు. వీరేశలింగంగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు, న్యాపతి సుబ్బారావుగారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలో రచయితలు పాటించవలసిన వాటికి సూచనలను చింతామణి పత్రిక తొమ్మిదవ సంపుటంలో ఇలా ప్రచురించింది :

''ప్రబంధమనగా కల్పితమయిన కథ. ఆ కథను పురాణేతిహాసాదుల నుండిగాని గైకొని కథాసారస్యమున కనుకూలముగ నుండులాగున దానికి నూతనాంశములను చేర్చి పెంచి వ్రాయవచ్చును, లేదా కవి మొదటినుండి కడవరకును స్వబుద్ధిచేతనే నూతన కథను కల్పించియైనను వ్రాయవచ్చును. కథాంశము వ్రాయువారికి బుద్ధి విశేషము ననుసరించి యుండునుగాన దానిని గురించి విధులు చెప్పుట యనావశ్యకమేయైనను, కథ పూర్ణముగా కల్పితమైనను కొంతవరకితర గ్రంథముల నుండి గ్రహింపబడినదైనను చమత్కారముగ నుండి చదువువారికి హృద్యముగా నుండవలెనని చెప్పుట యనావశ్యకముకాదు. శృంగారమో, వీరమో, యేదో యొక రసమును ప్రధానముగా జేసికొని వివిధ రససంయుతముగ నుండునట్లుగాని యాయా రసమును పోషించుటకయి వివిధ కష్ట సుఖములను ప్రయత్నములను కార్య విఘాతములను కార్యసాఫల్యములను మధ్య మధ్య సందర్భోచితముగా తీసికొనవచ్చు.''

నవలలో ఎటువంటి పాత్రలను తీసుకోవాలో, వాటిని ఎలా చిత్రించాలో కూడా పోటీదారులు ఇలా వివరించారు :

''కథ యంతయు నొక్కని చరిత్రమువలె నుండునట్లు వ్రాయవలెను. కథయందు వచ్చు పాత్రములలో నొక పురుషుని సన్మార్గునిగా జెప్పెడు పక్షమున వాని నర్తనమును తదనుగుణముగానే యంతకంతకు వికసింపజేసి ధర్మమార్గానుసరణము నిమిత్తమయి

కష్టముల కోర్చుట ధర్మమార్గము తొలగవలసి వచ్చునని పరితాపపడుట మొదలైన సంగతులను బలపరచి వ్రాయవలెను. కథలోని యింకొక పాత్రను దుష్టునిగా చెప్పెడు పక్షమున వాని దుష్ప్రవర్తనమును సహితము క్రమక్రమంగా విస్తరింపజేసి మొట్టమొదట మనస్సులో దుశ్చింత పుట్టినప్పుడు పాపమునకు భయపడి వెనుదీసి రాగద్వేషాదుల ప్రేరణముచేత కార్యమునకు లోబడుట, తరువాత గొంత పశ్చాత్తాపపడినను దినదినక్రమమును కఠినుడయి యకార్యకరణమునకు సందేహింపకుండుట మోసము మొదలయిన దుష్కార్యముల వలన మొదట కొంతకాలము కార్యసిద్ధి యగునట్లు కనబడినను కడపట కృషియంతయు విఫలమయి ధర్మమునకే విజయము కలుగుట మొదలైన సంగతులను బలపరచి వ్రాయవలెను. ఈ ప్రకారముగనే యొక పాత్రమును శూరునిగానో భీరునిగానో కామునిగానో విరాగినిగానో యెట్లు చెప్పినను తత్తద్రసోచితముగ వాని వాని గుణముల నంతకంతకూ విస్తరింపజేసి స్వభావము ననుసరించి వర్ణించవలెను. మధ్య మధ్య నెన్ని పాత్రములు వచ్చుచున్నను కథకంతకును ముఖ్య నాయకుడొకడుండవలెను. నాయకుని తోడిపాటుగా కథానాయికయు వుండవచ్చును.''

ప్రబంధం అనగానే వర్ణనలు ఉండాలన్న సంప్రదాయం చంపూ కావ్య రచయితలు చిరకాలం నుంచి ఫ్యాషన్ చేశారు. మన శృంగార ప్రబంధాలలో అన్నంకన్నా ఆదరువు ఎక్కువ అన్న సామెతలాగ కథ కన్నా వర్ణనలే విస్తారంగా ఉండేవి. అందుకే చింతామణి పత్రికాధిపతులు నవలల పోటీలో వర్ణనల విషయమై నిబంధనలు ఇలా పెట్టారు.

''కథలో సందర్భోచితముగా జనుల యాచార వ్యవహారములను కార్యములు జరిగిన స్థలములు మొదలయిన వానిని వర్ణింపవలసి వచ్చినప్పుడా వర్ణనలను అసంభావ్య ములుగా నుండునట్లు చేయక నైసర్గికముగాను, వినోదకరముగాను జేయవలెను. కథయందు రసోచితముగా శృంగార వర్ణనము చేయవలసి వచ్చినను మన కావ్యముల యందున్న రీతిగా కుచకచ సంభోగాది వర్ణనలు చేయకూడదు. మొత్తముమీద కథయొక్క ఫలితార్థమంతయు నేదోయొక నీతిని బోధించునదిగా యుండవలెను.''

కథా కథనంలోనూ, సంభాషణలోనూ వాడవలసిన భాష గురించి కూడా చింతామణి కొన్ని నియమాలు పెట్టింది.

''కవి హాస్య వచనములు మొదలయిన వానిచేత వాక్చమత్కృతిని జూపవలసినను స్త్రీలు చదువకూడని మృదుత్వము తప్పిన మోటుమాటలుగాని, యంశములుగాని ఉపయోగింపకూడదు. కథనంతయు ప్రథమ పురుషమునందే వ్రాయక నాటకములయందు పాత్రము లొండొరులతో మాటాడుకొనునట్లు నడుమ నడుమ సంభాషణలములను బెట్టుచు వచ్చిన బాగుగ నుండును. సంభాషణములను చేయువారియొక్క కులాదులను బట్టి జాతీయముగా వారి సంభాషణములను గ్రామ్య పదములలో నుంచవచ్చును.''

సంభాషణలలో గ్రామ్యానికి అనుమతిచ్చినా మిగిలిన భాగాలలో విధిగా పాటించవలసిన భాషా నియమాలను ఈవిధంగా చెప్పారు:

''సంభాషణములుగాక మిగిలిన కథాంశమునందు సహితము సాధ్యమయినంత వరకు కేవల గ్రాంథిక పదములను దీర్ఘసమాసములను విడిచి మృదు మధుర పదములతో సులభశైలినే ఉపయోగించవలెను. చదువువారికి హృదయ రంజకముగా నుండుటకయి తగిన స్థలములయందర్థాలంకారములను శబ్దాలంకారములను గూర్చుట యావశ్యకమే అయినను, అలంకారముల నిమిత్తము రసమునకుగాని పదలాలిత్యమునకుగాని భావగౌరవమునకుగాని యెంత మాత్రమును భంగం కలుగనీయకూడదు.''

నవలా రచన మన దేశానికీ, మన భాషకూ కొత్త ప్రక్రియ కనుక పోటీలో పాల్గొనేవారు ఏయే గ్రంథాలను ముందు మార్గదర్శకంగా పెట్టుకోవాలో కూడా చింతామణి ఇలా సూచించింది :

'ఇంగ్లీషువారు వ్రాసిన గ్రంథములను చూచి ఇప్పటివారు వచన ప్రబంధములను వ్రాయనారంభించినారుగాని ఇంకను మన భాషలో నుండవలసినన్ని పుస్తకములు పుట్టలేదు. రాజశేఖరచరిత్రము, సత్యారాజాపూర్వదేశ యాత్రలు, సత్యవతీ చరిత్రము, సత్యా సంజీవని మొదలయిన పుస్తకములీ తరగతిలో చేరినవి. ఇంగ్లీషు భాషా పరిశ్రమను లేక ఇటువంటి వచన ప్రబంధములను రచింపదలచుకొన్నవారు కొంతవరకు పై పుస్తకములను తమకు మార్గదర్శకములుగా జేసికొనవచ్చును.''

ఫలానా పుస్తకాలను మార్గదర్శకంగా పెట్టుకోమని చింతామణి పత్రికాధిపతులు పైవిధంగా సూచించినా కొందరు నరహరి గోపాలకృష్ణమగారి రంగరాజ చరిత్రను కూడా కరదీపికగా వాడుకొన్నారు. తొలి సంవత్సరం ముగ్గురే పోటీకి రావడం జూచి బహుమానపు మొత్తాలు చాలా తక్కువ అని భావించి పత్రికాధిపతుల రెండో సంవత్సరం నుంచి ఫస్టు ప్రయిజుకు 125 రూపాయలు ఇస్తామన్నారు. అందువల్ల 1894 నవలల పోటీకి 14 నవలలు వచ్చాయి. ఈ ఏడు వావిలాల వాసుదేవశాస్త్రిగారు, కందుకూరు వీరేశలింగం గారు, జిల్లా కోర్టు న్యాయవాది ఆచంట సుందరరామయ్యగారు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. యిద్దరు ఒక నవలకు, ఒకరు మరొక నవలకు మొదటి బహుమతి సూచించారు. తుని తగవుగా రెండు నవలలకు చెరో నూరేసి రూపాయలు బహుమానం ఇచ్చారు.

మొత్తంమీద చింతామణి నవలల పోటీ వలన దేశంలో నవలా రచయితలు బయలుదేరారు. 1895 దాకా సాంఘిక నవలలకే పోటీ పెట్టినా 1896లో చారిత్రక నవలలకు కూడా బహుమానం ఇస్తామని ప్రకటించారు. పూర్వం సాంఘిక నవలలకు మార్గదర్శక గ్రంథాలను సూచించినట్టే ఈ శాఖలో నవలలకు కూడా కొన్ని నియమాలు ముందుగా నిర్దేశించి ఉపయుక్తగ్రంథాలను సూచించారు.

''కేవల చరిత్రము వ్రాయకూడదు. చరిత్రాంశములను, కాలములను, సరియైనవిగా నుండవలెను. చరిత్రలో వచ్చినవారు కాక కల్పిత పురుషులను, స్త్రీలును వుండవచ్చును. చరిత్రాంశములీయైదు కాలములలోను నొకదానితో సంబంధించినవిగా నుండవలెను. 1. కృష్ణదేవరాయల కాలము, 2. అక్బరులోనుగాగల చక్రవర్తులలో నొకనికాలము,

3. శివాజి మొదలగు మహారాష్ట్ర ప్రభువులలో నొకని కాలము, 4. ప్రతాపసింగు మొదలగు రాజపుత్ర సంస్థాన ప్రభువులలో నొకని కాలము, 5. హైదరాలీ టిప్పుసుల్తానుల కాలము.''

చిట్టచివర సూచన ఇలా వుంది!

''గ్రంథములను వ్రాయ బ్రయత్నించువారు ముందుగా నింగ్లీషు భాషలో నున్న తార, సీత, అక్బర్, చాంద్‌బీబీ, టిప్పుసుల్తాన్ మొదలైన హిందూదేశముతో సంబంధించిన ప్రబంధములను కొన్నిటిని జదువుట మంచిదని తలంచుచున్నాము.''

చింతామణి పత్రికాధిపతులు నవలలో రెండురకాలనే గుర్తించినట్టు కనబడుతుంది గాని వాస్తవానికి 1872లో మొట్టమొదటి నవల తెలుగులో వెలుగు చూసిన దగ్గరనుంచి పందొమ్మిదో శతాబ్దం 1899లో అంతమయ్యే వరకు 28 సంవత్సరాలలో నవలలు నానారకాలుగా కథలను కథనం చేశాయి. ఈ నవలలను పరిశీలించినవారు స్థూలంగా మన నవలా వాఙ్మయాన్ని అయిదురకాలుగా విభజించారు.[9] ఆ వర్గీకరణ ఇలా వుంది.

1. కేవల ప్రణయ నవల
2. చారిత్రక నవల
3. సాంఘిక నవల
4. అపరాధ పరిశోధక నవల
5. శాస్త్ర విషయ ప్రబోధక నవల

అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. సాహిత్యం ఎన్నడూ గదుల పెట్టెలాగ ఉండలేదు. ఒక వర్గంలోని లక్షణాలు అంతో ఇంతో రెండో వర్గంలో కూడా సమ్మిళితం పొందుతుంది. ప్రణయ నవలలో సాహసకృత్యాలు ఉండవచ్చు. సాంఘిక నవలలో హత్యలూ, అపరాధాలూ వగైరా ఉండవచ్చు.

నవలలో వైవిధ్యం రావడానికికూడా కారణాలున్నాయి. వీరేశలింగంగారు 1897లో రాజమండ్రి విడిచిపెట్టి మద్రాసు వెళ్ళారు. రెండేళ్ళు సెలవుపెట్టి తమ పుస్తకాలు అచ్చువేసుకొనడానికిగాను చెన్నపట్నం వెళుతున్నప్పుడు వారు తమతోపాటు చింతామణి పత్రికను కూడా మద్రాసుకు తీసుకువెళ్ళారు. రాజమండ్రిలో ఒక పత్రిక అవసరమని స్థానికులు భావించారు. పోలవరం జమీందారుగారి పేరుమీద వారి ధన సహాయంతో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 'సరస్వతి' అనే పత్రికను 1898లో స్థాపించారు. ఇతర సాహిత్య పత్రికలలాగే ఇందులో ప్రాచీన కావ్య పరిష్కరణా, ప్రచురణా జరుగుతున్నా నవలలుకూడా వెలువడేవి. 1898లోనే ఏలూరునుండి మంత్రి ప్రగడ భుజంగరావు లక్కవరం జమీందారు) 'మంజువాణి' అనే పత్రికను ప్రారంభించారు. 1899లో ..వై. దొరసామయ్య మద్రాసు (?) నుండి 'సత్యసాధని' అనే పత్రికను స్థాపించారు.

నవలల పోటీలను ప్రారంభించిన చింతామణి పత్రికాధిపతులు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఇవ్వడమేగాక నెగ్గిన నవలలను తమ పత్రికలలో సీరియల్‌గా మొదట

---

9. కురుగంటి సీతారామయ్య - 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' పుట.133

ప్రకటించి, ముద్రణ పూర్తయ్యాక పుస్తకాన్ని అచ్చువేసి 500 ప్రతులను గ్రంథకర్తకు ఉచితంగా ఇచ్చేవారు. ఈవిధంగా బహుమతి పొందిన నవలలు పుస్తకరూపంలో దేశంలోకి వచ్చేవి. 1894వ సంవత్సరంలో పోటీలో 14 నవలలు పాల్గొన్నా రెండింటికే బహుమతులు వచ్చాయి. మిగతా 12 నవలలను ఎవరెవరు రాశారో, వాటిని గ్రంథకర్తలు సొంతంగా ప్రచురించుకొన్నారో లేదో కూడా తెలియదు.

ప్రతిశాఖ నవలలోనూ ప్రణయగాథ అంతర్లీనంగా ఉండవచ్చు. 19వ శతాబ్దంలో వెలువడ్డ నవలల పేర్లూ, వాటి రచయితల పేర్లూ కాలక్రమంలో చూసి వాటి గురించి సాధ్యమైనంత భోగట్టా తెలుసుకొంటే ఈ సంగతి స్పష్టమవుతుంది.

సం	రచయిత	నవల
1872	నరహరి గోపాలకృష్ణమ్మ	శ్రీరంగరాజు చరిత్ర
1878	కందుకూరి వీరేశలింగం	రాజశేఖర చరిత్ర (వివేకవర్ధనిలో భాగాలుగా ప్రచురణ)
1880	కందుకూరి వీరేశలింగం	రాజశేఖర చరిత్ర (పుస్తకరూపంలో ప్రచురణ)
1882	గురుమూర్తి పంతులు	రేచుక్క పగటి చుక్క కథలు (ఇది నవలగా ఆంధ్రవాఙ్మయ సూచికలో నమోదైంది)
1885	పి. సీతారామశాస్త్రి	వేణీ సంహారనాటకం (ఇది నవలగా ఆంధ్ర వాఙ్మయ సూచికలో ఆరోపణ)
1891	కందుకూరి వీరేశలింగం	సత్యారాజా పూర్వదేశ యాత్రలు
1892	పనప్పాకం అనంతాచార్యులు	1. చమత్కార తరంగిణి 2. మంజువాణీ విజయము
1893	ఖండవల్లి రామచంద్రుడు	ధర్మవతీ విలాసం (చింతామణి ప్రథమ బహుమతి)
1893	తల్లాప్రగడ సూర్యనారాయణ	సంజీవరాయ చరిత్ర (చింతామణి ద్వితీయ బహుమతి)
1894	గోటేటి కనకరాజు	వివేక విజయం (చింతామణి బహుమతి)
1894	చిలకమర్తి లక్ష్మీనరసింహం	రామచంద్ర విజయం (చింతామణి బహుమతి)
1894	నంబూరు తిరునారాయణ	సుబ్బారావు (లేక) ప్రణయమహిమ
1895	టేకుమళ్ళ రాజగోపాలరావు	త్రివిక్రమ విలాసం (చింతామణి ప్రథమ బహుమతి)

1895	ఖండవల్లి రామచంద్రుడు	మాలతీ రాఘవం (చింతామణి ద్వితీయ బహుమతి)
1895	రెంటాల వెంకట సుబ్బారావు	కేసరీ విలాసం
1895	బులుసు పాపయ్యశాస్త్రి	భాస్కర విలాసం
1896	చిలకమర్తి లక్ష్మీనరసింహం	హేమలత (చింతామణి ప్రథమ బహుమతి)
1896	ఖండవల్లి రామచంద్రుడు	లక్ష్మీసుందర విజయం
1897	చిలకమర్తి లక్ష్మీనరసింహం	అహల్యాబాయి
1898	చిలకమర్తి లక్ష్మీనరసింహం	కర్పూరమంజరి
1899	మంత్రిప్రగడ భుజంగరావు	మనోరమ
1899	కోనపులి నరసయ్య	బక్షీ
1899	ఓ.వై. దొరసామయ్య	కపాల కుండల
1899	చిలకమర్తి లక్ష్మీనరసింహం	సౌందర్య తిలక (ప్రథమ భాగం) (సరస్వతి పత్రికలో భాగాలుగా)

పందొమ్మిదో శతాబ్దంలో వెలువడిన తెలుగు నవలల పరిశీలనలో కొన్ని విషయాలు వెల్లడవుతాయి. మొదటి సంవత్సరం చింతామణి బహుమతి అందుకొన్న శ్రీ ఖండవల్లి రామచంద్రుడుగారు తమ ధర్మవతీ విలాసంలో నరహరి గోపాలకృష్ణమ్మ సెట్టిగారి 'శ్రీరంగరాజు చరిత్ర'ను అనుసరించినట్లు పరిశోధకులకు తోస్తుంది.[10] చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మాత్రం కందుకూరి వీరేశలింగంగారినే అనుసరించారు. 'నవలలు వ్రాయుటకు మాకప్పుడు వీరేశలింగంగారు వ్రాసిన రాజశేఖర చరిత్రమను నవలయే యాదర్శము. ఆ నవలను నేనామూలాగ్రముగా జదివి నవలలు రచియించు పద్ధతి తెలుసుకొని 'రామచంద్ర విజయము'ను వ్రాసితిని' అని చిలకమర్తి వారు చెప్పారు.[11] అయితే రాజశేఖర చరిత్రలో ఆర్థికంగా బతికి చెడ్డవాడి కథను వీరేశలింగంగారు చెప్తే రామచంద్ర విజయంలో నిరుపేద స్వయంకృషి వల్ల ధనవంతుడు కావడం చిలకమర్తివారు రచించారు.

సాంఘిక నవల నిర్మాణ విధానానికి ఒక వరవడి పెట్టుకొన్నట్టుగానే చారిత్రక నవలా రచన చేపట్టడానికి ముందుకూడా మన వచన కావ్య నిపుణులు కొంత అధ్యయనంతో సాధన చేశారు. 1896లో తమ తొలి చారిత్రాత్మక నవల వ్రాయడానికి ముందు చిలకమర్తి వారు పూర్వం ఇంగ్లీషులో మెడోసు టైయిలర్ అనే దొరగారు వ్రాసిన టిప్పుసుల్తాన్, తార, చాంద్‌బీబీ అనే నవలలను మిత్రులచేత చదివి వినిపించుకొని హేమలత అనే నవలను వ్రాశారు.

10. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణశర్మ - పు.51
11. స్వీయ చరిత్ర - పుట.103

మన సాహిత్యంలోలేని ప్రక్రియను మనం ప్రవేశపెడుతున్నప్పుడు ఆ ప్రక్రియ ప్రాచుర్యం పొందిన విదేశీ సాహిత్యాన్ని చదివి అనుసరించితే తప్పులేదు. బులుసు పాపయ్యశాస్త్రిగారు 1895లోనే ఒక ఐరిష్ నవలా రచయిత్రి పుస్తకాన్ని చదివి 'భాస్కరవిలాసం' అనే గ్రంథాన్ని రాశారు. ఆ రచయిత్రి మారియా ఎడ్జివర్త్ (1767-1849). ఐర్లాండులోని సాంఘిక జీవనాన్ని సంభాషణా విలక్షణత్వాన్ని ఆమె రచనలు ప్రతిఫలిస్తాయి. 1807 నుంచి 1834 దాకా ఆమె రాసిన నవలలో వైవిధ్యముంది. మారియా ఎడ్జివర్త్ తన ఐరిష్ ప్రాంతీయ నవలల వల్ల సర్ వాల్టర్ స్కాట్‌నూ, రష్యను రచయిత టర్జినోవ్‌ను సైతం ప్రభావితం చేసిందంటే తెలుగు రచయితలలో ఒకరు ఉత్తేజితులై ఆమె రచనలలో ఒకటి అనుసరించడంలో ఆశ్చర్యం లేదు. తమ భాస్కర విలాసంలో ''ఎడ్జివర్త్ తమారా'' అనుసరించి వ్రాసిన చిన్న వచన ప్రబంధము'' అని పాపయ్యశాస్త్రిగారు ప్రకటించడం వారి సౌజన్యాన్ని చాటుతుంది.[12]

చింతామణిలాగ నవలలను ప్రోత్సహించే పత్రికలు పందొమ్మిదో శతాబ్దంలోనూ, ఇరవై శతాబ్దపు తొలి పుష్కరంలోనూ ఎన్ని ఉన్నాయో ప్రస్తుతం లభించే ఆకరాలను బట్టి చెప్పడం కష్టం. అయితే ఆరోజులలో ఉన్న కొన్ని పత్రికలలో నవలలు ప్రకటనలు మాత్రమేకాక ప్రచురణలు కూడా ఉండవచ్చు. దేశోపకారి, కృష్ణాపత్రిక, సరస్వతి, మంజువాణి, కళావతి, హిందూసుందరి, జననా పత్రిక, కృషి, కల్పలత, సావిత్రి అనే పత్రికలు 1904 నాటికి వున్నాయి. వీటిలో 'సావిత్రి' కొత్తగా స్త్రీల కొరకే వెలువడుతున్న పత్రిక. పులుగుర్తి లక్ష్మీనరసయ్యగారు దీనిని నడుపుతూ ఉండేవారు. 'హిందూ సుందరి' కూడా స్త్రీల పత్రికే. 'జనానాపత్రిక' పేరే, అది ఎవరికోసం ఉద్దేశించినదో చెపుతుంది. 'కల్పలత' పత్రికలో ఇతరుల రచనలు ప్రత్యేకించి ప్రచురించకపోయినా ఆ సంపాదకులు నిర్వహించిన పారితోషిక ప్రశ్నల పోటీలో పందొమ్మిదో శతాబ్దంలోనో, ఇరవయ్యో శతాబ్దం తొలి సంవత్సరాలలోనూ నవలా రచయితలుగా పేరొందినవారిలో కొందరు పాల్గొన్నారు. ఉదాహరణకు -

1. ఓలేటి పార్వతీశం
2. బాలాంత్రపు వెంకటరావు
3. కూనపులి లక్ష్మీనరసయ్య
4. అత్తిలి సూర్యనారాయణ

తర్వాత పోటీలో పాల్గొన్న 540 పాఠకులలో బహుమానాలు పొందినవారు పాతికమంది. వీరిలో దాసు శ్రీరాములు, నడకుదుటి వీరరాజు, అడిదం రామారావుగార్లవంటి కవులు, పండితులు చాలామంది ఉన్నారు. నవలా రచయితల పేర్లు పైన పొందుపరిచాను. పోటీ నడిపిన ఆచంట సాంఖ్యాయన శర్మగారు మౌలిక రచనలు చేసినవారే. వీరు చిన్న చిన్న కథలు, సీరియల్ కథలు చాలా రచించారు. కల్పలత 12 సంపుటాల నుండి పునర్ముద్రించిన వీటిని సాంఖ్యాయన శర్మగారు Novellettes, నవలికలు

12. ఆధునిక కవి జీవితములు - మంత్రి ప్రెగడ భుజంగరావు - పుట.326

అని పేర్కొంటూ ఒక పుస్తకరూపంలో తెచ్చారు.[13] 1903-04 సంవత్సరాలలోనే తెలుగు సాహిత్యంలో నవలికలు కూడా ప్రవేశించాయన్న అంశం గమనార్హమైంది.

పత్రికలు భాగభాగాలుగా నవలను మొదట ప్రచురించి, తరువాత వాటిని పుస్తకరూపంలో తెస్తున్నా కేవలం పుస్తకరూపంలోనే నవలలను మొదట ప్రచురించే ప్రకాశిక సంస్థలు అరుదు. రచయితలు తమ వ్యక్తిగత కృషితో స్వయం పుస్తక ప్రచురణలు చేయవచ్చు. ఒక ప్రచురణాలయం ఆ పనిని ప్రణాళిక ప్రకారం చేపట్టడం విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపనవల్లనే సాధ్యమైంది. 1906లో కొమర్రాజు లక్ష్మణరావుగారూ, వారి మిత్రులూ ఈ ప్రచురణ సంస్థను స్థాపించి సంవత్సరానికి నాలుగేసి గ్రంథాలను ప్రచురిస్తూ వాటిలో ఒకటి నవలగా కేటాయించారు. విజ్ఞాన చంద్రికావారు ప్రచురించిన నవలల వివరాలు చూడండి :

4వ కుసుమం - వేలాల సుబ్బారావు - రాణీ సంయుక్త

9వ కుసుమం - భోగరాజు నారాయణమూర్తి - విమలాదేవి

25వ కుసుమం - కేతవరపు వెంకటశాస్త్రి - రాయచూరు యుద్ధము

27వ కుసుమం - దుగ్గిరాల రాఘవచంద్రయ్య - విజయనగర సామ్రాజ్యం

28వ కుసుమం - ఎ.వి.నరసింహం - పాతాళభైరవి

37వ కుసుమం - భోగరాజు నారాయణమూర్తి - అల్లాహో అక్బర్

పైన చెప్పినవాటినే కాక ఈ క్రింది నవలలను కూడా విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారు ప్రచురించారని పరిశోధకులు చెప్తున్నారు.[14]

భోగరాజు నారాయణమూర్తి	1. చంద్రగుప్త (1914)
	2. అస్తమయము (1916)
	3. ఆంధ్రరాష్ట్రము (1918)
కేతవరపు వెంకటశాస్త్రి	1. ఇచ్ఛినీకుమారి (?)
	2. పూర్ణానంద
	3. అగ్రహారం

వీటిలో నేను ఇప్పుడు కుండలీకరణాలలో సంవత్సరాలు పొందుపరచిన వాటి భోగట్టాలే కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ఆంధ్రవాఙ్మయ సూచిక'లో ఉన్నాయి. వేరే ఆకరాలవల్ల 'అగ్రహారం' అనే నవలను ఇతర ప్రచురణకర్తలు ముద్రించినట్టు తెలుస్తుంది. 'ఇచ్ఛినీకుమారి' 1923 నాటికి స్కూలు ఫైనల్‌కు ఉపపాఠ్యగ్రంథం.

ఇవన్నీ స్వతంత్రంగా రచించిన తెలుగు చారిత్రక నవలలే. ఇతర భాషలలోంచి అనువాదం చేయించడానికి విజ్ఞానచంద్రికవారు తలపెట్టలేదు. ఆ విధమైన నవలలను ప్రత్యేకంగా ప్రచురించే సంస్థలు తర్వాత వెలిశాయి. విజ్ఞానచంద్రిక గ్రంథాలు చాలా

13. చూ॥ కల్పలత - సంపుటి.3, సంచిక.4 (1921) చివరి అట్టమీద ప్రకటన

14. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు - తెలుగు నవలా సాహిత్య వికాసము - పుట.130

ఉత్తేజకరంగా ఉండేవి. వాటిని తొలిసారి చదివిన ఆ మాత్రం ఈ మాత్రం రచనా వ్యాసంగం చేస్తున్న యువకులు నవలా రచయితలుగా తయారయ్యారు. ''ఆ గ్రంథాలు వేలూ, లక్షలూ కేండిల్ పవరుగల బల్బులు. అయితే, ఆయన పీఠికలు వాటికి విద్యుత్ప్రవాహం'' అని కొమర్రాజు వారి సంపాదకత్వంలో వెలువడిన నవలల గురించి ఉత్తమాభిప్రాయాలు నాటివారికి ఉండేవి.[15]

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలికి పూర్వమూ, తరువాత దేశంలో నవలలు ప్రచురించిన సంస్థాపన పొందిన సంస్థలూ, వాటి ప్రచురణ వివరాలూ చూడండి.

1. సరస్వతీ గ్రంథమాల (1898-1912)

కందుకూరి వీరేశలింగంగారు చెన్నపట్నానికి వెళ్ళిపోయి, తమతోపాటు 'చింతామణి' పత్రికను తీసుకొని వెళ్ళిపోయాక, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు పోలవరపు జమీందారు కొచ్చెర్లకోట వెంకటకృష్ణారావుగారి పేరుమీద వారి ధనసహాయంతో రాజమండ్రిలో 'సరస్వతి' అనే పత్రికను ప్రారంభించారని ఇంతకుముందు గమనించాం. చిలకమర్తివారు దృష్టిదోషం చేత చక్కగా చేతివ్రాత వ్రాయలేరు. కనుక వారికి ఇష్టం వచ్చిన గుమాస్తాను వేసుకోమని జమీందారు చెప్పారు. కొత్తపల్లి సూర్యారావు (1871-1940) గారిని ఆ పనిలో చిలకమర్తివారు నియమించారు. సూర్యారావుగారు వట్టి గుమాస్తాకారు. ఆంధ్రభాషా పరిచయం ఉంది. గద్య, పద్యకావ్యాలు వ్రాయగలరు. 1899 జూలైలో సరస్వతి పత్రికను పోలవరం జమీందారుగారు కాకినాడ తీసుకొని వెళ్ళిపోయారు. పత్రికతోపాటు కొత్తపల్లి సూర్యారావుగారు వెళ్ళారు. ఈ పత్రికలో ప్రాచీన కావ్యప్రచురణలతోపాటు, నవీనమైన నవలలను కూడా సరస్వతి ప్రచురించింది. వాటి వివరాలు :

సౌందర్య తిలక	-	చిలకమర్తి లక్ష్మీనరసింహం
భువనమోహన	-	ధరణి ప్రగడ శివరావు
కాంచనమాల	-	ఎన్. మూర్తిరాజు
ఫసానే అజాయబు	-	కొత్తపల్లి సూర్యారావు
ఆతింతాయి	-	కొత్తపల్లి సూర్యారావు
బీరబల్ వినోదాలు	-	కొత్తపల్లి సూర్యారావు

2. ఆంధ్రభాషాభివర్ధని

ఇది బందరులో వెలసిన ప్రచురణ సంస్థ. ఆరు స్వతంత్ర గ్రంథాలనూ, ఆరు బెంగాలీ నవలల తర్జుమాలను ప్రచురించింది.

3. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల (1911నుండి)

మన గ్రంథ ప్రచురణల చరిత్రలో 'ఆంధ్ర ప్రచారిణి'కి ప్రత్యేకమైన స్థానముంది. ఆ సంస్థ చేసిన సేవ ప్రశంసనీయము. ఒక సంస్థ రూపొందాలంటే వివిధ వ్యక్తులు సంఘటితం

15. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - అనుభవాలూ జ్ఞాపకాలూను; మొదటి సంపుటం - పుట.334

కావాలి. ఏయే వ్యక్తుల కృషివల్ల ఈ సంస్థ ఆకారం దాల్చుకొందో సవిస్తరంగా తెలుసుకొనడం మన కర్తవ్యం.

1893లో సంజీవరాయ చరిత్ర రచించి, చింతామణి పత్రికవారు నడిపిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు గోదావరి జిల్లావారు. ఆయనకు కొవ్వూరు చంద్రారెడ్డిగారనే స్నేహితులున్నారు. రెడ్డిగారు ఆగర్భ శ్రీమంతులు. ఇద్దరికీ సాహిత్యాభిమానం ఉంది. సూర్యనారాయణరావుగారు బి.ఏ., బి.ఎల్. చదివి న్యాయవాదిగా తణుకులో ఉండేవారు. వారి దగ్గర బాలాంత్రపు వెంకటరావు (1881-1972) అనే సాహిత్యాభిమాని ప్లీడరు గుమాస్తాగా ఉండేవారు. ఈయనకూ రచనాసక్తి ఉంది. కొవ్వూరి చంద్రారెడ్డిగారి దగ్గర చాగంటి శేషయ్య (1881-1950) అనే యువకుడు ఆంతరంగిక కార్యదర్శిగా ఉండేవారు. ఈయనకూ సాహిత్యాభిలాష ఉంది. సూర్యనారాయణరావుగారికి చింతామణి బహుమానం వచ్చాక తణుకులో గ్రంథ రచనాభిలాష యువకులలో ప్రజ్వరిల్లింది.

తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు 'సువర్ణలేఖ' అనే మాసపత్రికను నడిపేవారు. దాని అచ్చుపనుల బాధ్యత కూడా బాలాంత్రపు వెంకటరావుగారు చూసేవారు. ఈ ముద్రణాలయంలో తల్లాప్రగడ వారి రచనలు అచ్చుపడుతూ ఉండేవి.

ఆంగ్లేయుల మతము (1910)
శైవలినీ చంద్రశేఖరము - నవల (1910)
హిందువుల పూర్వస్థితి (1910)
జార్జి పట్టాభిషేక చరిత్రము (1911)
దుర్ణయ దురోదరము - నాటకం (1913)
వినోదిని (1916)

తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు వెయ్యిళ్ళ పూజారిలాగ వున్నారు. 1909లో ఆయన వంగూరి సుబ్బారావు, కురుగంటి సీతారామయ్యా, భాగవతుల లక్ష్మీపతిశాస్త్రిగార్లతో కలసి పూనాలోని ప్రథమ ఓరియంటల్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళారు. ఆరోజుల్లో దక్షిణాది నుండి వచ్చిన వారందర్నీ మద్రాసీలనే పిలిచేవారు. వంగూరివారూ, తల్లాప్రగడవారూ కార్యకర్తలతో వాదించి తమ బసకు ఇచ్చిన గదిపై 'ఆంధ్ర ప్రతినిధులు' అనే బోర్డు పెట్టేదాకా లోపలకు వెళ్ళలేదు. ఇటువంటి సభలూ, సమావేశాలూ ఒక ప్రక్క ఉండగా ఈయన ప్రాక్టీసు పనుల వల్ల సాహిత్య రచన అట్టే జరుగలేదు. రెండే నవలలు రచించారు.

ప్లీడరుగారు ఇలా అడపాదడపా రచనలు చేస్తూ వుంటే వారి గుమస్తా బాలాంత్రపు వెంకటరావుగారు తమకు తోచిన సాహిత్య వ్యాసంగం చేస్తూ వచ్చారు. ఆరోజుల్లో విశాఖపట్నం నుండి 'కల్పలత' అనే మాసపత్రిక వస్తూ వుండేది. అందులో దాని సంపాదకులు ఆచంట సాంఖ్యాయన శర్మగారే అన్ని రచనలూ చేస్తూ ఉండేవారుగాని పాఠకులు కూడా పాల్గొనే ఒక చిత్రమైన శీర్షికను మొదటి సంవత్సరం చివరి మూడు

మాసాలలో ప్రవేశపెట్టారు. అవి కల్పలత పారితోషికములు అన్నారు. 150 రూపాయల రొక్కం 25 బహుమతులుగా విభాగించారు. కల్పలత ఒకటవ సంపుటి 1, 2, 3 సంచికలలో నెలకు ఇరవై ప్రశ్నల చొప్పున మొత్తం అరవై ప్రశ్నలను ప్రచురించారు. వీటికి నెంబర్ల వారీగా జవాబులు రాసి పంపించాలి. మొత్తం 230 మార్కులు, ప్రశ్నలకు సదుత్తరాలను ఇచ్చినవారికి తారతమ్యానుసారంగా ఈ క్రింది విధంగా 1904 జనవరిలో బహుమతులు ఇస్తామన్నారు.

1 మొదటి పారితోషికము రు. 50	రూ. 50
1 రెండవ పారితోషితకము రు. 20	రూ. 20
1 మూడవ పారితోషికము రు. 10	రూ. 10
2 పారితోషికములు. అయిదేసి రూపాయలవి	రూ. 10
20 పారితోషికములు. మూడేసి రూపాయలవి	రూ. 60
25 పారితోషికములు	రొక్కం రూ. 150

ఇందులో చందాదారులుగాని యితరులుగాని పాల్గొనవచ్చు. బాలాంత్రపు వెంకటరావుగారు చందాదారులో కాదో తెలియదుగాని పాల్గొన్నారు. 1904 సంవత్సరం ఫిబ్రవరి మాసం (సంపుటి-1, సంచిక-6)లో ఫలితాలు ప్రచురించారు. 25మందికి జవాబుల తారతమ్యానుసారం బహుమతులు ఇచ్చారు. వీటిలో మొదటి పదిపేర్లనే ఇక్కడ పొందుపరుస్తున్నాను.

	మొత్తం మార్కులు-230 వచ్చిన మార్కులు
మొదటి పారితోషికం రూ. 50	
1. మ.రా.రా. నడకుదిటి వీరరాజు, పిఠాపురం	150
రెండవ పారితోషికం రూ. 20	
2. ఓలేటి పార్వతీశం, కొమరగిరి, గోరస	145
మూడవ పారితోషికం రూ.10	
3. మ.రా.రా. నేతి సుబ్బారాయుడు, రావులపాలెం	124
4, 5 పారితోషికములు, 5 రూపాయలు చొ॥	
4. బాలాంత్రపు వెంకటరావు, తణుకు	97
5. అల్లమరాజు రంగశాయి కవి చేబ్రోలు, పిఠాపురం	94.5
రూ. 3 పారితోషికములు 20	
6. దాసు శ్రీరాములు, ఏలూరు	89
7. వెల్లటూరు లక్ష్మాజీ, విజయనగరం	74
8. కూనపులి లక్ష్మీనరసయ్యా, రంగరాయపురం	70
9. శృంగారకవి సర్వారాయుడు, కాకినాడ	66.5
10. ఆచంట సూర్యనారాయణరాజు, అత్తిలి	61

కల్పలత పత్రికలో వేసిన ప్రశ్నలు చమత్కారమైనవి, యుక్తితో కూడుకొన్నవి, సాహిత్యపరమైనవి; సమస్యాపూరణలు చేయవలసినవి. క్షేత్రగణితం సంబంధమైనవి. పొడుపు కథ కాకపోయినా అంత చిక్కుగా ఉండేవి. ఇలాగ వివిధ సాహిత్య క్రీడలకు సంబంధించినవి. ఈ పోటీలో పాల్గొని అయిదు రూపాయల బహుమతిని పొందగలగడం ఒక విశేషమే. 1904లో ఈ ప్రైయిజు పొందాక వెంకటరావుగారు స్త్రీల వ్రతకథలు అనే ప్రయోజనకరమైన పుస్తకం రాశారు. (ఇది ఉత్తరోత్తరా మూడుభాగాలుగా ప్రచురించారు. మొదటిభాగంలో 30 కథలు, ద్వితీయ భాగంలో 32 కథలు, తృతీయ భాగంలో 33 కథలు వెరసి 95 కథలు ఉన్నాయి.) మోచేటి పద్మం (మూగనోము) దగ్గర్నుంచి కళ్యాణ గౌరీనోము దాకా ఉన్న ఈ కథలలో ఒకనాటి మన తెలుగు స్త్రీలు పట్టే నోములు అన్నీ ఉన్నాయి. సామాజిక మానవశాస్త్ర పరిశోధనలకు పనికివచ్చే ఈ పుస్తకం కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్‌వారు ప్రచురించారు. ఎందరు పెద్ద ముత్తయిదువుల దగ్గర విని దీనిని రాశారోగాని వెంకటరావుగారు జాతికి మంచి ఉపకారం చేశారు. హంసవింశతి, శుకసప్తతి మొదలైన మన కావ్యాలలో కొన్ని నోముల పేర్లు ఉన్నాయి గాని ఇది నోముల ఛోటా సర్వస్వం. చిట్టిబొట్టుకథ, మొగదోసిళ్ళ కథ, చిత్రగుప్తుని నోము కథ, అన్నం ముట్టని ఆదివారాల కథ, అనర్ఘకోటి మంగళవారాల కథ, ములగ గౌరికథ, అమావాస్య సోమవారాల కథ - ఒకటేమిటి స్త్రీలు పట్టే నోములు, వాటి ఉద్యాపనలు ఇందులో వివరించారు.

బాలాంత్రపు వెంకటరావుగారు స్త్రీల వ్రతకథలు రచించాక నవలలూ, నాటకాలూ రాయసాగారు. ఆరోజుల్లో ఎవరైనా ముందు ఒక పద్యకావ్యం రాస్తే దానిని నాటకంగా ఇంకొకరెవరో ఉత్తేజంతో పరివర్తన చేయడం, ఎవరైనా నాటకం రాస్తే దానినికొందరు నవలగా కూర్చడం జరుగుతూండేది. ఉదాహరణకు మంత్రిప్రగడ భుజంగరావుగారు 'వారకాంత' అనే చాటు ప్రబంధం చెప్తే దానిని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నాటకంగా పరివర్తన చేసి ప్రచురించారు. అలాగే బాలాంత్రపు వెంకటరావుగారు కూడా పూర్వం 1889లో పాలెపు వెంకటసూర్యగోపాల ప్రధానిగారు, 1900లో పులుగుర్తి నరసింహాచార్యులుగారు వేరువేరుగా అనువదించిన కమలినీ కలహంస నాటకాన్ని నవలగా రూపొందించారు. దేనికైనా పరివర్తనోకాదో తెలియదుకాని 'సురస' అనే నవల కూడా రచించారు. 1906లో తామే నాటక రచన ప్రారంభించారు. ఆ ఏడు 'ధనాభిరామం' అనే నాటకం, శ్రీరంగరాయ పట్టాభిషేకం అను నామాంతరంగల 'యాచశూరేంద్ర విజయం' అనే నాటకాలు రాశారు.

తణుకులోనే కొవ్వూరు చంద్రారెడ్డిగారి అంతరంగిక కార్యదర్శిగా ఉంటున్న చాగంటి శేషయ్యగారికి కూడా సాహిత్య రచనా వ్యాసంగం ఇష్టం, ఆయన వెంకటరావుగారితో స్నేహమేకాక సహరచన చేసేటంత సన్నిహితం కూడా ఏర్పరచుకొన్నారు. 1908లో వేలాల సుబ్బారావుగారి రాణీ సంయుక్త నవల వెలువడ్డాక, బహుశా అది చదివి ఉత్తేజితులై వెంకటరావుగారూ, శేషయ్యగారూ కలసి 'సతీసంయుక్త' అనే నాటకాన్ని రాశారు. విజ్ఞానచంద్రిక గ్రంథమండలి వారు శాస్త్రీయ గ్రంథాలూ,

చారిత్రక నవలలూ ప్రోత్సహిస్తున్నా దేశంలో ఆనాటి నాటకాలమీదనే మోజు ఎక్కువ. 1907లో 27, 1908లో 29 స్టేజీ నాటకాలు వెలువడ్డాయి. అందుచేత వెంకటరావుగారూ, శేషయ్యగారూ చేపట్టిన ఉమ్మడి రచన నాటకమే.

వెంకటరావుగారిలాగే కల్పలత పారితోషికాల పోటీలో పాల్గొని ద్వితీయ బహుమానాన్ని పొందిన ఓలేటి పార్వతీశం (1889-1956) గారు పిఠాపురం పరిసర గ్రామం అయిన కొమరగిరివాసులు. ఆయన తన పద్దెనిమిదో ఏట 1907లో సువర్ణమాల అనే నాటకాన్ని, 1908లో తారాశశాంక నాటకాన్ని రచించారు. బాలాంత్రపు వెంకటరావు గారు ఉద్యోగరీత్యా తణుకులో ఉన్నా వారి స్వగ్రామం పిఠాపురం పరిసర గ్రామమైన మల్లాము. చుట్టుప్రక్కల గ్రామాలవారే అయినా బాలాంత్రపు వెంకటరావుగారూ, ఓలేటి పార్వతీశంగారూ ఒకరినొకరు 1908 దాకా ఎరుగరు. అయితే వీరిద్దరిలాగే కల్పలత పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన నడకుదుటి వీరరాజు (1871-1937) గారు వీరిద్దరికీ పరస్పర పరిచయం కలిగించారు. వెంకటరావుగారు, పార్వతీశంగారూ ఉమ్మడి రచనలు చేద్దామనుకొన్నారు. చేతులు కలిపిన వెంటనే బావ అంటే బావ అని వరసలు కలుపుకొని పేరు కూడా కలుపుకొందామనుకొన్నారు. వెంకట పార్వతీశకవులు అనే పేరును పెట్టుకొన్నారు. ఈ జంటకవులు తిరుపతి వెంకట కవులలాగా ఒకే గురువు దగ్గిర చదువుకొన్నవారు కాదు. వెంకట రామకృష్ణ కవులలాగ మేనత్త మేనమామ బిడ్డలు కాదు. కొప్పరపు కవులలాగ సోదరులు కాదు. అయితే ఆ సుప్రసిద్ధులలాగే ఈ కొత్త జంటకు పద్యరచన అంటే అభిమానం. అందుకే ఉమ్మడి రచనగా పద్యకావ్యాలు రచించారు. అనురూప (1909), చందమామ (1911) వీరి తొలినాటి కావ్యాలు.

ఓలేటి పార్వతీశంగారు చెలికాని లచ్చారావు (1885-1923) గారి దగ్గర ఉంటూ అచ్చుపనులు చూస్తూ ఉండేవారు. లచ్చారావుగారు ఎర్నగూడెం జమీందారులు. చిత్రాడలో ఉండేవారు. వీరు కోలంక వీరవరం జమీందారు రామాయమ్మారావుగారికి అన్నగారు. చక్కని సాహిత్యాభిమానం కలవారు. ఈయనకు 'కావ్య కళానిధి', 'తత్త్వ విశారద' అనే బిరుదులు ఉన్నాయి. స్వయంగా రచయితలు. ఎందరో రచయితలను ప్రోత్సహించారు. రామవిలాస గ్రంథమాల అనే సంస్థను పిఠాపురంలో స్థాపించి ఎన్నో ప్రాచీన గ్రంథాలను ప్రచురించారు. ఆ ప్రచురణ కార్యక్రమంలో పార్వతీశంగారు ఉండేవారు. బాలాంత్రపు వెంకటరావుగారితో కలిశాక గ్రంథ రచనలు, ప్రచురణలు విరివిగా చేస్తున్నప్పుడు ఈ ముద్రాక్షర శాలలో గడిపిన అనుభవం బాగా పనికి వచ్చింది.

1909లో వెంకట పార్వతీశ్వర కవుల జంట ఏర్పడ్డాక తణుకులోని సాహిత్య వర్గాలలో ఒక కొత్త ఉత్సాహం వచ్చింది. కొవ్వూరి చంద్రారెడ్డిగారికి పుస్తక ప్రచురణ ఇష్టమే. వారి సన్నిహితులలో అయ్యగారి నారాయణమూర్తిగారు ఈ అభిప్రాయాన్ని ప్రోత్సహించారు. చంద్రారెడ్డిగారి ఆంతరంగిక కార్యదర్శి చాగంటి శేషయ్యగారు బాలాంత్రపు వారితో సహరచన చేసినవారే. వెంకట పార్వతీశ్వర కవులు రచనలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ వ్యక్తులందరూ కలసి తమ సమిష్టి కృషితో

'ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలిక' అనే ప్రచురణ సంస్థను స్థాపించారు. అది నాలుగు దశాబ్దాల పైచిలుకు కాలం పుస్తక ప్రచురణను ఒక విజయవంతమైన వ్యాపారంగా కొనసాగించింది.

మొదట అయ్యగారి నారాయణమూర్తిగారు ఈ గ్రంథమాలకు సంపాదకులుగా ఉండేవారు. 1911లో తొలి ప్రచురణ వెంకటపార్వతీశ్వర కవుల 'వసుమతీ వసంతం' అనే నవల. ఇది స్వతంత్ర రచన. దీనితోపాటు అనువాద రచనలు కూడా ప్రచురించాలనుకొన్నారు. సీతారామ (1911) తొలి అనువాదం. తర్వాత పుంఖానుపుంఖాలుగా సాంఘిక నవలలూ, చారిత్రక నవలలూ, అపరాధ పరిశోధక నవలలు ఈ గ్రంథమాల నుండి వెలువడ్డాయి. వెంకట పార్వతీశ్వర కవుల ముఖ్య రచనల పేర్లు కొన్ని మాత్రమే ఉదహరిస్తున్నాము.

అనురూప (1909)	భావసంకీర్తనము (1943)
చందమామ (1911)	గోరా (2 భాగాలు)
వసుమతీ వసంతం (1911)	నౌకా భంగం
సీతారామ (1911)	సీమంతిని
రాజసింహ (1912)	నీరద
ప్రమదావనం (1913)	కృష్ణకాంతుని మరణ శాసనం
ఇందిర (1913)	మాయావి
ఆరణ్యక (1914)	మాయావిని
ఉన్మాదిని (1914)	మనోరమ
శ్యామల (1920)	నీలాంబరి
మాతృమందిరం (1920)	రహస్య విప్లవం
హారావళి (2 భాగాలు - 1924)	గోపికలు
బృందావనము (1935)	లక్ష్మీ విలాసము

బాలాంత్రపు వెంకటరావుగారి ఒక్కరి పేరు మీదనే ప్రచురితమైనవి ఒక పది నవలలు ఉన్నాయి.

అనుమాన పురుషులు	(1915)	మరకత మంజూష	(1916)
కపోతము	(1915)	సమస్యలు	(1916)
ఇదియొక చిత్రము	(1916)	దురదృష్టవంతులు	(1921)
కాకము	(1916)	అనాథప్రేతము	(?)
ప్రేమాంజలి	(1919)	సురస	(?)

ఆదిలో ఆంధ్ర ప్రచారిణి సంస్థాపనలో ఎందరు ప్రముఖ పాత్ర వహించినా కొన్నాళ్లకు ఆంధ్ర ప్రచారిణి అంటే వెంకట పార్వతీశ్వర కవులు, వెంకట పార్వతీశ్వర కవులు అంటే ఆంధ్ర ప్రచారిణి అనే అవినాభావం దేశంలో వ్యాపించింది. ఈ గ్రంథమాలకు పిఠాపురం, ఉయ్యూరు, మునగాల, కపిలేశ్వరపురం, తుని, ఉర్లాము, విజయనగరం, జటప్రోలు, వెంకటగిరి మొదలైన సంస్థానాధిపతులు ఉదారంగా

రాజపోషకులయ్యారు. తణుకు, నిడదవోలు, పిఠాపురం, కాకినాడ, రాజమండ్రి బస్తీలలో ఈగ్రంథమాల కార్యాలయం వివిధ కాలాలలో బదిలీ అవుతూ వచ్చింది. ఆదిలో సంవత్సరానికి ఆరు పుస్తకాలను చందాదారులకు ఇచ్చేవారు. ఇవి డెమ్మీ సైజ్ రఫ్ పేపరు మీద అచ్చువేసేవారు. 1935లో రజతోత్సవానికి ఆయత్తపడుతూ కొన్ని మార్పులు చేశారు. ఏడాదికి పన్నెండు పుస్తకాలు ప్రచురించాలన్న సంకల్పాన్ని తెలియజేశారు. తమ ప్రచురణ సంస్థ గురించి ఇలా చెప్పారు:

''ప్రప్రథమమున వసుమతీ వసంతము నందు విలాస వికాసామోదముల వెల్లివిరియఁ జేసిన ఈ ప్రసవమాలిక యిట్లిరువది అయిదు వసంతముల యామోద విహార లీలానుభవముంగాంచి యేకాంత సేవనమునఁ గావ్య కుసుమావళిం గూర్చుకొనుచు నిప్పటికిఁ బ్రవిమల ప్రణయ ప్రమదావనమైన బృందావనమున కానంద కళావిరాజితమగు కల్యాణ తోరణము గాఁగలిగినది.''

1943 నాటికి ఆంధ్ర ప్రచారిణి ఒక రిజిష్టర్ సంస్థగా రాజమండ్రిలో తన కార్యకలాపాలు కొనసాగించింది. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు. జనమంచి కామేశ్వరరావుగారు గౌరవ సలహా సంపాదకులుగా వ్యవహరించారు. బాలాంత్రపు సత్యనారాయణరావు గారు సంపాదకులు. ఇద్దరూ రెండు చేతులా నవలా సాహిత్యాన్ని సృష్టించినా, వెంకట పార్వతీశ్వర కవులు భావకవులుగా కూడా పేరు పొందారు. వారి కవితల గురించి భావ కవిత్వం మీద రాసిన ప్రత్యేక ప్రకరణంలో ముచ్చటించుకొందాం. ఈ జంట కవులు గ్రంథ ప్రచురణలోనూ, భావి కవిత్వంలోనూ తొలి బాటలు తీసినవారు.

4. వేగుచుక్క గ్రంథమాల (స్థాపన : 1911)

తణుకులో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల వెలసినప్పుడే బరంపురంలో వేగుచుక్క గ్రంథమాల 1911లో ఉదయించింది. దేవరాజు వెంకటకృష్ణారావు (1886-1963)గారు, తాపీ ధర్మారావు (1887-1973)గారు, భాగవతుల నృసింహశర్మ (?)గారు కలసి ఈ గ్రంథమాలను స్థాపించారు. ఆనాడు బరంపురంలోని తెలుగు ప్రముఖులు దీనిని దీవించారు. న్యాపతి రామానుజస్వామిగారు దీనికి అధ్యక్షులు. దేవరాజు వెంకట కృష్ణారావుగారు కార్యదర్శి. తాపీ ధర్మారావుగారు సంపాదకులు. ఈ గ్రంథమాల ప్రచురణలను మరీచికలు అనేవారు. ఏడాదికి నాలుగు మరీచికలు వెలువరించారు. శాశ్వత చందాలు, చందాదారులు ఉండేవారు. వీరు ప్రచురించిన గ్రంథాల వివరాలు ఇవి:

ఉషఃకాలము - రచన : కలభాషిణి	సుహృల్లత
వాడేవీడు	విలాసార్జునం - రచన : నేను
నేనే	మిస్టర్ సేన్
కాలూరాయి	ఆనందబాబు
ప్రేమము	కోటీసుతనయ

వెంకటరావు	క్రొవ్వురాళ్ళు - రచన : ఉపాధ్యాయుడు
లోక భయంకరుడు	భూపేంద్రుడు
నరాధమ	గోవిందబాబు
ఉగ్రభైరవుడు	జూలియా (మిస్టరీస్ ఆఫ్ లండన్)
పద్మినీ పరిణయం	మిస్. మినీ లీలాకుమారి (2 భాగాలు)
సుగుణ (3 భాగాలు)	చపల

ఈ నవలలల్లో దేవరాజు వెంకట కృష్ణారావుగారు రచించిన వాడేవీడు, నేనే, కాలూరాయి ఒక పెద్ద ప్లాటులోని మూడు భాగాలు. ఇవి చాలా ప్రజాదరణ పొందాయి. ఉషఃకాలం, విలాసార్జునం, క్రొవ్వురాళ్ళు తాపీ ధర్మారావుగారు రచించినా గ్రంథంమీద తమ పేరు ప్రకటించుకోకుండా కలభాషిణి, నేను, ఉపాధ్యాయుడు అనే గుప్తనామాలను అట్టమీద వేసుకొన్నారు. తాపీవారు అట్టేకాలం బరంపురంలో ఉండలేదు. చీకటి సంస్థానంలోనూ, విశాఖపట్నంలోనూ తర్వాత చాలా బస్తీలలో, నగరాలలో ఉద్యోగాలు చేశారు. వేగుజుక్క గ్రంథమాలతో దీర్ఘ సంబంధం దేవరాజు వెంకట కృష్ణారావుగారికి, భాగవతుల నృసింహశర్మగారికి కొనసాగింది.

దేవరాజు వెంకట కృష్ణారావుగారు శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం సమీపంలో ఉన్న మృత్యుంజయ నగరంలో జన్మించారు. 1905 నుండి బరంపురంలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నారు. వేగుజుక్క గ్రంథమాలలో అపరాధ పరిశోధక నవలల అనువాదాలే కాక ఉదాత్త సాహిత్య రచనలు కూడా చేశారు. రామాయణాన్ని 'విభ్రమ రాఘువం' అనే పేరుతో అయిదు సంపుటాల గ్రంథంగా రచించారు. మహాభారతంలోని కొన్ని కథలను తీసుకొని వీటిని కూడా నవలలుగానే రచించారు. వీరి సంజయ రాయబారం విశ్వవిద్యాలయంలో పాఠ్యగ్రంథంగా నిర్ణయించారట. మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారితో కలిసి 'కళా ప్రచారక సమితి' అనే సంస్థను నెలకొల్పి వాడుకభాషలో పుస్తకాలు అచ్చువేశారు. 1942లో 'విశాలాంధ్ర వాణి' అనే పత్రికను తెలుగు, ఆంగ్ల, ఓఢ్ర భాషలలో కొన్నాళ్ళు నడిపారు. వేగుజుక్క గ్రంథమాల మరీచికలు చాలా పునర్ముద్రణలు పొందినా దేవరాజు వెంకటకృష్ణారావుగారికి వృద్ధాప్యంలో ఆర్థిక స్థితి దిట్టంగా వుండక 1965లో 69వ ఏట తమ ప్రచురణ కాపీ రైటును గ్రంథానికి నూరేసి రూపాయల చొప్పున అమ్మివేశారు. కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్‌వారు కొనుక్కొన్నారు. 1960లో కేంద్ర ప్రభుత్వం వారు వీరికి నెలకు నూరురూపాయల చొప్పున సహాయం చేస్తూ వచ్చారు.

5. సత్యవోలు గున్నేశ్వరరావు అండ్ బ్రదర్స్

''తెలుగుదేశంలో రచయిత తన పుస్తకాలను తానే ప్రచురించడం, అమ్ముకొనడం ముఖ్యము. ఇక్కడ పుస్తక వ్యాపారమనేది లేదు'' అని గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కం రెండో కూర్పు పీఠికలో వాస్తవం చెప్పారు. అయితే పుస్తక ప్రచురణా, ఇతరుల గ్రంథాలను కమిషన్‌కు తీసుకొని విక్రయించే వ్యాపారం చేపట్టిన వారు కొందరు

లేకపోలేదు. వారిలో సత్యవోలు గున్నేశ్వరరావు (1860-1925) గారు ఒకరు. ఈయన రాజమంద్రి వాస్తవ్యులు. ఒక నాటక సమాజంలో చాలా ప్రముఖ కార్యకర్తగా వ్యవహరించారు. ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారు తమ నాటక సమాజాన్ని పునరుద్ధరించినప్పుడు దానికి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ప్రెసిడెంటుగానూ, గున్నేశ్వరరావుగారు వైస్ ప్రెసిడెంటుగానూ ఉన్నారు. వెయ్యి రూపాయలు ముందుగా పెట్టుబడి పెట్టి గున్నేశ్వరరావుగారు తెరలు నేయించారు. దుస్తులు, సామానులు తయారుచేయించారు. నాటకాలపై వారి మోజు అలాంటిది.

గున్నేశ్వరరావుగారు పుస్తక విక్రేతగా కూడా ఉన్నారు. వీరేశలింగంగారు తమ పుస్తకాలను తామే ప్రసరించుకొన్నా గున్నేశ్వరరావుగారు ఒక వ్యాపార సంబంధాన్ని సూచించారు. ఒక పది సంవత్సరాలపాటు వీరేశలింగంగారి పుస్తకాలన్నింటికీ గున్నేశ్వరరావుగారే సోల్ ఏజెంటుగా ఉంటారు. ఇందుకు నూటికి 15 రూపాయలు కమిషన్ తీసుకొంటారు. ఇదీ ఒడంబడిక. వీరేశలింగంగారు దీనికి 1905 డిసెంబరు 26వతేదీ నాడు ఇందుకు అంగీకరించినట్టు తమ డైరీలో రాసుకొన్నారు. 1906 నుంచి పదేళ్ళు గున్నేశ్వరరావుగారే సోల్ ఏజెంటు. ధనలాభానికి పుస్తక వ్యాపారం చేయడమే కాదు, దేశాభివృద్ధికి, స్వాతంత్ర్యోద్యమం విస్తరించడానికి పుస్తకాలు ఉచితంగా పంచిపెట్టడంలో కూడా గున్నేశ్వరరావుగారు ఘటికులు. వందేమాతరం నిషేధితమైనప్పుడు అయిదువేల రూపాయలు ఖర్చు పెట్టి దాని ప్రతులు ఉచితంగా పంచిపెట్టారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 1889 నుండి ఎన్నో నాటకాలను రచించారు. 1889లోనే 'గయోపాఖ్యానం' రచించినా దానినీ, ఇతర నాటకాలను అచ్చు వేయించుకొనడానికి వారి దగ్గర డబ్బు లేదు. అప్పుడు సత్యవోలు గున్నేశ్వరరావుగారు ఒక ఉపాయం చెప్పారు. చిలకమర్తి వారి నాలుగు నాటకాలను తమకు అయిదు సంవత్సరాలు గుత్తకు ఇస్తే వాటి మింజువలె తాము వేయి రూపాయలు ఒక్కసారి ఇస్తామన్నారు. ఇది 1905లో జరిగింది. ఆ యేడే చిలకమర్తివారు 'ప్రసన్నయాదవం' రచిస్తున్నారు. దానిని కూడా గున్నేశ్వరరావుగారికి ఇచ్చారు. మొదట వచన నాటకాలనే రాసినా వాటిలో పద్యాలను చేర్చడం అవసరమైంది. 1909లో చిలకమర్తివారు గయోపాఖ్యానాన్ని సవరించి పాత ఒప్పందం ప్రకారమే గున్నేశ్వరరావుగారికి ఇచ్చారు. ఒక్కొక్క కూర్పులో అయిదువేల ప్రతులకు తక్కువ కాకుండా దీనిని ప్రచురించారు. ఒక్క గయోపాఖ్యానమేకాక ప్రసన్నయాదవం, పారిజాతాపహరణం నాటకాలు కూడా బాగా అమ్ముడుపోయాయి. చిలకమర్తి వారు ఇలా ఒకచోట రాశారు.[16]

'నా నాటకములన్నింటిలో గయోపాఖ్యానమే జనాకర్షమైనది. ఆ గ్రంథము శనగపప్పువలె ఖర్చుపడినదనుట యతిశయోక్తి కాదు. ఇప్పటికి లక్షప్రతులకంటే నధికముగా ఖర్చుపడినవి.'

గున్నేశ్వరరావుగారికి చింతామణి ముద్రాక్షరశాల అనే ప్రెస్సు ఉండేది.. ఆయన ఆంధ్రకేసరి అనే పత్రికను స్థాపించి ఇందులో ప్రచురించేవారు. దీనికి చిలుకూరి

16. స్వీయచరిత్ర - పుట.256

వీరభద్రరావుగారు సంపాదకులు. ప్రసిద్ధ రచయితల గ్రంథాలను కొన్నేళ్ళపాటు గుత్తకు తీసుకొని ప్రచురణ, విక్రయ వ్యాపారాలతోపాటు తాము స్వయంగా ఎందరి గ్రంథాలు తొలిసారి ప్రచురించారో వాటిలో ఎన్ని నవలలు ఉన్నాయో తెలియదు. నవలలు ఉధృతంగా వచ్చే రోజుల్లో కూడా వీరి సంస్థ పనిచేస్తూనే ఉంది. గున్నేశ్వరరావుగారి గ్రంథ ప్రచురణ పుస్తక విక్రయ వ్యాపారాలను గురించి ఇంకా ఇతోధికమైన పరిశోధనలు అవసరం. ఈ బ్రదర్స్ కొన్నాళ్ళ తర్వాత విడిపోయారు. గున్నేశ్వరరావుగారు 1925లో మరణించారు.

6. కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్

రాజమండ్రిలో పుస్తక విక్రయ వ్యాపారం చేసే ఇంకొక సంస్థ 19వ శతాబ్దపు చివర దశమ ద్వయంలో వెలసింది. కాళహస్తి తమ్మారావు (జ.1875?) గారు సంస్కృతాంధ్ర బుక్ డిపోను 1882లో సంస్థాపించారు. కథలు, చరిత్రలు మొదలైనవి ఎన్నో ప్రచురించారు. బాలాంత్రపు వెంకటరావుగారి స్త్రీల వ్రత కథలు మూడు భాగాలకు వీరే ప్రచురణకర్తలు. వీరి గురించిన కొన్ని ఇతర వివరాలు వారి కరపత్రంలో దొరుకుతున్నాయి.

1920లో ''అప్పటికే గ్రంథ ప్రచురణలో యావదాంధ్రదేశంలో లబ్ధప్రతిష్టుడైన శ్రీ తమ్మారావు జాతీయోద్యమంలో తన వంతు పాత్రను నిర్వహించడానికి సంసిద్ధుడైనాడు. అఖిలాంధ్ర ప్రజల్లో జాతీయ భావాల్ని, దేశభక్తిని ప్రదీప్తం చేసే గ్రంథాలు జంకు, గొంకు లేకుండా ప్రచురించాడు. బ్రిటీషు ప్రభుత్వం నిషేధాన్ని ధిక్కరించి యువకుల్లో స్వాతంత్ర్య పిపాసను రెచ్చగొట్టే అనేక రాజకీయ విప్లవ సాహిత్యాన్ని సాహసవంతంగా వెలువరించాడు. నెపోలియన్ బోనాపార్ట్. వీర వినాయక దామోదర సావార్కార్, ఝాన్సీరాణి లక్ష్మీబాయి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ప్రపంచ వ్యాప్తంగా వర్ధిల్లిన విప్లవ చరిత్రలు ప్రచురించి విక్రయించి బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురై 1930వ సంవత్సరంలో కారాగారానికి పంపబడ్డాడు.

అయినా అది అంతమాత్రంతో ఆగలేదు. కుమారులు శ్రీ లచ్చయ్య, సూర్యప్రకాశం, పాపయ్యా లింగం, వేంకటరమణులు రంగంలో నిలచి తండ్రి అడుగుజాడల్లో ఇతోధికోత్సాహంతో ప్రచురణోద్యమం కొనసాగించారు.''

స్త్రీలకోసం, పెద్దలకోసం మాత్రమేకాక పిల్లలకోసం 'బాలసాహిత్య నికేతనం' అనే ప్రత్యేక విభాగాన్ని కూడా వీరు నడిపారు. అందులో పిల్లల బొమ్మల రామయణం, పిల్లల బొమ్మల భారతం, పిల్లల బొమ్మల భాగవతం మొదలైన గ్రంథాలు వీరివద్ద దొరుకుతాయి.

వీరు టాల్‌స్టాయి కథలు, గోర్కీ కథలు మొదలైనవాటిని విక్రయించడం గమనించదగ్గ విషయమే.

ప్రస్తుతం లభించే ఆకరాలవల్ల వీరి వద్ద 382 పుస్తకాలు లభిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో ఇంచుమించు అన్నీ ప్రసిద్ధమైనవే.

వీరు నవలలు ఎన్ని ప్రచురించారో, కమీషన్ తీసుకొని తమ వ్యాపార ప్రకటనలలో చేర్చారో తెలియదు.

7. కొండపల్లి వీర వెంకయ్య అండ్ సన్స్

రాజమంద్రిలోనే మరొక పుస్తక విక్రయ సంస్థ వుంది. శ్రీ సత్యనారాయణ బుక్ డిపోను కొండపల్లి వీరవెంకయ్యగారు నెలకొల్పారు. సుప్రసిద్ధ రచయితల గ్రంథాలు ప్రాచుర్యం పొంది ద్వితీయ ముద్రణ పొందేకాలంలోనూ, తర్వాతనో దాని కాపీ రైటును ఈ సంస్థవారు కొని పుస్తకాలు ప్రచురించేవారు. గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం కాపీ రైటు వీరు ఎప్పుడుకొన్నారో తెలియదుగా. ఈ క్రింది ప్రకటన ఒక కూర్పు (1944)లో కనబడుతుంది.

హెచ్చరిక

ఈ 'కన్యాశుల్కము' అను నాటకము శాశ్వత కాపీరైటు హక్కు, స్టేజి హక్కు పూర్తిగా మాకు చెందియున్నది. కాబట్టి మా లిఖిత రూపకమైన అనుమతిని పొందనివారు ఈ నాటకము ప్రదర్శించకూడదు.

ఇట్లు
కాపీరైటు హక్కుదారులు
కొండపల్లి వీర వెంకయ్య అండ్ సన్స్
శ్రీ సత్యనారాయణ బుక్‌డిపో
రాజమంద్రి

కొండపల్లివారు పాఠకలోకానికి అందించిన పుస్తకాలలో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమండలి వారివీ, చిలకమర్తివారివీ, భమిడిపాటి కామేశ్వరరావుగారివీ, మునిమాణిక్యం నరసింహారావుగారివీ నవలలూ, కథలూ, హాస్య రచనలూ మొదలైనవి మాత్రమేకాక జాషువాగారి ఖండకావ్యాలూ, మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రిగారి ఖండకావ్యాలూ కూడా వున్నాయి. ఇందులో ఎన్ని కమీషన్‌మీద తీసుకొన్నవో, ఎన్నింటికి కాపీ రైట్లు కొన్నారో తెలియదు. వేగుజుక్క గ్రంథమండలివారి దగ్గర హోలు మొత్తంమీద వారి పాత పుస్తకాల కాపీ రైట్లను 1955లో కొనడం యింతకుముందు గమనించాం. పుస్తకాల వ్యాప్తికి అన్నివిధాలా యిటువంటి సంస్థలు వ్యాపార దృష్టితోనైనా చాలా మేలు చేశాయి.

8. సరస్వతీ గ్రంథ మండలి

వీరేశలింగంగారు రాజమంద్రిలో సంఘ సంస్కారంతోపాటు పత్రికా ప్రచురణ, పుస్తక ప్రచురణ ప్రారంభించాక వారి రచనలు జనాదరణ పొందాక చాలామంది ముద్రాక్షర శాఖాధిపతులు పుస్తక ప్రచురణలవైపు మొగ్గారు. అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు ఈ శతాబ్దం ప్రథమపాదంలోనే 'సరస్వతీ గ్రంథమాల'ను సంస్థాపించారు. జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి (1906-1965) గారి వంటి నవలా, నాటక రచయితలకు ఈ సంస్థతో సంబంధం వుండేది. జొన్నలగడ్డవారు ఎం.ఎ. పట్టభద్రులు. న్యాయవాదులు. చాలా నవలలు రచించారు. వాటిలో కొన్ని సుప్రసిద్ధాలు.

ఆరీన్ మణేలా (1920)	కాలసర్పం (1922)
దుర్గాదాసు (1920)	మీవారు పతనం (1924-నాటకం)

భిన్నహస్తము (1920)	నూర్జహాన్ (1925)
శ్యామల (1920)	చంద్రగుప్త (నాటకం)

సరస్వతీ గ్రంథమండలి కోసమే వీటిలో కొన్నింటిని జొన్నలగడ్డవారు రచించారు, అనువదించారు. 'మీవారు పతనం' విజయేంద్రలాల్ రాయ్‌గారి సుప్రసిద్ధ బెంగాలీ నాటకానికి అనువాదం. అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు ఆనాటి సాహితీపరులతో వ్యాపార సంబంధాలు పెంచుకున్నారు. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి (1892-1970)గారు ఈ గ్రంథమండలి సంపాదకులుగా కొన్నాళ్ళు వున్నారు. శివశంకరశాస్త్రిగారు స్వయంగా నవలా రచనలు చేశారు. రఘునాథరాజు (1914), తేజసింగు (1914) అనేవి టి. శంకరశాస్త్రి అనే పేరుతో ప్రచురితమైనాయి.

శాస్త్రిగారు బెంగాలీ వంటి భాషలనుండి ఎన్నో నవలలు అనువదించారు. వాటిలో కొన్ని పేర్లు చూడండి.

అవక్షణీయ
కాంచనమాల
కపాలకుండల
రాజపుత్ర జీవనసంధ్య
మాధవీ కంకణం
రమాసుందరి
నీరగ
రఘునాథజీ
కుంకుమభరణి
జీవన సంధ్య
మహారాష్ట్ర జీవన ప్రభాతం

శివశంకరశాస్త్రిగారు 'అవక్షణీయ'ను తెనిగించాకనే బెంగాలీ నుండి శరత్‌చంద్ర ఛటర్జీ రచనలకు తెలుగులో గిరాకీ హెచ్చిందని చెప్పుకొంటారు.

నవలా రచయితగా, గ్రంథ ప్రకాశకుల సంస్థలకు సంపాదకులుగా శివశంకరశాస్త్రిగారి సేవలు విశిష్టమైనా ఆయన సాహితీసమితి సభాపతిగా, నవ్యసాహిత్య నిర్మాతలను ప్రోత్సహించిన వారిగా సుప్రసిద్ధులు. సరస్వతీ గ్రంథమండలితో అనుబంధం వల్లనే ఆ ప్రచురణల వారసులకు కథా సరిత్సాగరాన్ని వీరే సంస్కృతం నుండి తెనిగించారు. అద్దేపల్లి లక్ష్మణస్వామిగారికే అంకితమిచ్చారు.

సరస్వతీ గ్రంథమండలివారు నవలలు, నాటకాలు, కథలు, చరిత్రలు, ప్రబంధాలు, పౌరాణికాలు, వైజ్ఞానికాలు, వైద్యగ్రంథాలు మొదలైన వివిధ శాఖోపశాఖలుగా గ్రంథాలు ప్రచురించారు.

భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, పురిపండా అప్పలస్వామి వంటి వారికీ, సరస్వతీ గ్రంథమండలికీ, అద్దేపల్లి వారికీ అనుబంధాలు ఉండేవి.

9. కలాభివర్ధినీ (పరిషత్తు) గ్రంథమాల :

కొందరు రచయితలు తమ సొంత గ్రంథాలను సొంత ప్రచురణ సంస్థ పేరుమీద ప్రచురించుకోవడం మన సాహిత్య లోకంలో పరిపాటే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961) గారు తమ గ్రంథాలు కొన్ని ఈ స్వకీయ సంస్థ తరపున ప్రచురించారు. వారి తొలి నవల మిథునానురాగం 91914) ఎస్.పి.సి.ఎల్. ప్రచురణగా వెలువడినా మిగతా ఈ క్రింది నవలలు చాలాకాలం ఒకే బేనర్ కింద వెలువడ్డాయి.

శ్మశాన వాటిక (1917)
విష భుజంగం (పై నవలే - 1952)
అనాథ బాలిక (1924)
రక్షాబంధనం (1925)
ఆత్మబలి (1942)
నీలాసుందరి (1959)

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ రచనలు తామే అచ్చువేసుకొని విక్రయిస్తూ, ఆ ఆదాయంపైనే ఆధారపడేవారు. 72 చిన్నకథలు రచించారు. ఇవి వివిధ సంపుటాలుగా వెలువడ్డాయి. వారి చిన్న కథలు పేరుకు చిన్నవైనా సైజులో 'నవలికలు' అని చెప్పదగ్గవే. 'వడ్లగింజలు', 'మార్గదర్శి', 'కన్యాకాలేయత్వాద్వరితా' అనే మూడు నవలికలు అనే వర్గీకరించాలి. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చిన్న కథలన్నీ 12 సంపుటాలలో ఉత్తరోత్తరా అద్దేపల్లి అండ్ కో వారు ప్రచురించారు. ఎంత సుప్రసిద్ధ రచయితలయినా, ఎన్నాళ్ళు పుస్తక ప్రచురణ వ్యాపారాన్ని స్వయంగా నిర్వహించినా ఒక దశలో దక్షతగల వ్యాపార సంస్థకు తన గ్రంథాలు ఇవ్వక తప్పదు.

జమీందారీ యుగంలో చాలామంది రచయితలు కేవలం ఒక్క నవలా రచనలు మాత్రమే చేయలేదు. వివిధ ప్రక్రియలలో అభిమానం చూపారు. కొందరికి ఆ ఇతర ప్రక్రియలలోనే ప్రఖ్యాతి వచ్చింది. ఉదాహరణకు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (1893-1979) గారు తారాదేవి (1911), మీరాబాయి (1913) అనే రెండు నవలలు రాశారు. లీలాదేవి అనే బెంగాలీ నవలను కన్నడం నుంచి 1913లో తెలిగించారు. అయితే శర్మగారు విమర్శకులుగా, సాహిత్య నాటకోపన్యాసాల కర్తగా ప్రసిద్ధులు.

ఉమ్రాలీషా (1896-1945) గారు కవులుగానే సాహితీలోకంలో ప్రసిద్ధులు.

అయితే ఆయన నవలలు, నాటకాలు రచించారు. మదాలస (?), శాంత (1918).

వీరి నవలలలో కొన్ని చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు గార్లు నవలలూ, నాటకాలూ రచించారు.

జమీందారీ యుగంలో అందరు నవలా రచయితల గురించి భోగట్టాలు తెలియవు. తెలియవచ్చినంత మట్టుకు పొందుపరుస్తున్నాను.

గోటేటి కనకరాజు

1894లో చింతామణి నవలల పోటీలో 'వివేక విజయం' అనే నవలకు ద్వితీయ బహుమతి పొంది గోటేటి కనకరాజుగారు మరికొన్ని రచనలు చేశారు. అవి నవలలు కావు.

వివేక విద్యాచింతామణి (1894)
వివేక విజయం (?)
ఆంగ్లేయ రాజ్యాంగ నిర్మాణ చరిత్ర (వచనం 1910)
భక్తి ప్రధానమైన మతం (వచనం)
భగవద్ధర్మ జిజ్ఞాస (స్తుతి - వచనం)

కనకరాజుగారికి మద్రాసు ప్రభుత్వం వారి ఉద్యోగం లభించి, 1910 ప్రాంతంలో వారు ''ట్రాన్స్‌లేటర్ టుది గవర్నమెంటు ఆఫ్ మద్రాసు'' అనే హోదాలో ఉండేవారు. జాతీయోద్యమపు రోజులలో ఈయన దొరతనం వారికి అనుకూలంగా రాసే పత్రికలకు ధనలాభం కలిగించే స్కీములను ప్రభుత్వం వేసినప్పుడు తమ మిత్రులకు దానివల్ల ఉపకారం చేద్దామనుకొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమాత్రం రాయని పత్రికలకు తామే చందాదారులను కొన్ని వందలమందిని చేర్పించి పత్రికలకు కొన్ని వేల రూపాయలు ఆదాయం వచ్చేటట్టు చేశారు. గోటేటి కనకరాజుగారు తమ మిత్రులైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'దేశమాత' పత్రికకు ఇటువంటి సహాయం చేస్తామని చెప్పారు. చిలకమర్తివారు నిరాకరించారు.[17] గోటేటివారు ఇంకే పత్రికల వారికైనా ఇలాంటి సహాయం చేశారో లేదో తెలీదు.

బులుసు పాపయ్యశాస్త్రి (1863-?)

చింతామణి పోటీలో 1895లో సంవత్సరం 'భాస్కర విలాసం' అనే నవల రచించిన బులుసు పాపయ్య శాస్త్రిగారు విశాఖపట్నం జిల్లా ఉపమాక సమీపంలోని వేముపాడు వాస్తవ్యులు. అనకాపల్లి మునిసిపల్ మిడిల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. సంస్కృతాంగ్ల భాషలనుండి కొన్ని తెనిగించారు. వీరు రచించిన గ్రంథాల వివరాలు :

వ్యాకరణ ప్రవేశం (1879)
భాస్కర విలాసం (కథ - 1894)
ప్రియదర్శిక (నాటకం - 1903)
పిల్లల కొరకు పద్యములు (1906)
కర్మఫలము (మతం 1908)
వసంత యామినీస్వప్నం (నాటకం-1912)
భామినీ విలాసం (పద్యకావ్యం - 1903)
అజ్ఞాతవాసం (కథ - 1904)
తెలుగు వ్యాకరణం (?)
తెలుగు రఘువంశ టిప్పణం (?)

17. చిలకమర్తి స్వీయచరిత్ర - పుట.270

వీటిలో 'భాస్కర విలాసం' మారియా ఎడ్జివర్తు నవలకు అనుకరణ అని ఇంతకు పూర్వమే గుర్తించాం. 'వసంతయామినీ స్వప్నం' షేక్స్పియర్ 'మిడ్ సమ్మర్ నైట్ డ్రీం'కు అనుసరణ-నాటకం. 'అజ్ఞాతవాసం', 'విరాటపర్వం' వచనం. ప్రియదర్శిక సంస్కృత నాటకానికి అనువాదం.

ఓ.వై. దొరసామయ్య

బంకించంద్ర ఛటర్జీగారి ఆనందమఠం తెనిగించి పేరు తెచ్చుకొన్న రచయిత ఓ.వై. దొరసామయ్య. ఈయన బహుగ్రంథ రచయిత. పత్రికా సంపాదకుడు. 1899-1905 సంవత్సరాల మధ్య వీరి సత్త్వసాధని అనే పత్రిక మద్రాసు నుండి వెలువడేది. వీరు తమిళంలో విద్వాంసులు కనుక తమిళ నాయనారుల కథలను, వేదాంత విషయాలను ఆ పత్రికలో రచించేవారు. వీరికి కన్నడభాష కూడా బాగా తెలుసు. బంకించంద్రుని ఆనందమఠాన్ని తెనిగించేటప్పుడు కన్నడంలో బి. వెంకటాచార్యులు ప్రతిని కూడా చూసి దాని సహాయంతో అనువాదం చేశారు. ఆనందమఠాన్ని వావిళ్ళవారు ప్రచురించారు. ఇది చాలా ముద్రణలు పొందింది.

దొరసామయ్యగారి పేరుమీద ఓ.వై. అనే పొడి అక్షరాలు కాక 'ఓ.వి.' అనీ, 'ఓ.వి.సి' అనేవి కూడా ఉన్నట్టు కనపడుతుంది. ఇవన్నీ అభిన్నులనో, విభిన్నులనో తెలియదు. వీరి రచనల పూర్తి పట్టిక ఇది:

కపాల కుండల (?) నవల (1900)
ఢిల్లీ పాదుషాకథలు (1900)
భక్తలీలామృతము (1900)
బుద్ధచరిత్రము (1902)
బోయరుయుద్ధము (1903)
వినోద కథామంజరి (1903)
ఆనందమఠం (1907)
కమలాకోమల - నవల (1908)
పాతంజలియోగశాస్త్రము (టీక 1911)
నీతిగోపురం కథ (1912)
విక్టోరియా జీవితము (1912)
హరిశ్చంద్ర చరిత్ర (1920)
అభిమన్యు వివాహము - కథ
కాశీయాత్రా ప్రకాశిక
జగన్నాథమాహాత్మ్యము
నానాదేశపు సామెతలు
రాజయోగరత్నాకరము
విచార సాగరము
సకలార్థ సాగరము

కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్రవాఙ్మయ సూచికలో -

1. డి.వి.ఎస్. దొరసామయ్యా - కపాలకుండల (1900) నవల.
2. సి. దొరస్వామయ్యా - ఉన్మాదిని. (1914) నవల
3. ఒ.వి. దొరసామయ్యా హిరాన్ - మాయచరిత (1900) నవల

అనే ఆరోపాలు కూడా నమోదు అయి ఉన్నాయి. వీరి గురించి వివరాలు తెలియవు.

భోగరాజు నారాయణమూర్తి (1891-1940)

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారు ప్రచురించిన 'విమలాదేవి' రచయితగా భోగరాజు నారాయణమూర్తిగారికి మంచి ప్రఖ్యాతి వచ్చింది. అది చేతపట్టుకొంటే చదివి పూర్తిచేసే దాకా కిందపెట్టడం ఉండని రచనగా పేరు పడింది. నారాయణమూర్తిగారు విజయనగరం వాస్తవ్యులు. బరంపురంలో పినతాతగారి ఇంట్లో వుండి చదువుకొన్నారు. 'బాలకవి' అనే బిరుదుకు తగ్గట్టు 15వ ఏటనే 'ప్రభావతీ పరిణయం' అనే పద్యకావ్యాన్ని రచించారు. వేగుచుక్క గ్రంథమాల సంస్థాపకులు దేవరాజు వెంకటకృష్ణారావుగారికీ, భోగరాజువారికీ స్నేహం. నారాయణమూర్తిగారి లతాంగి అనే చరిత్రాత్మక నాటకాన్ని దేవరాజు వారు ముద్రించారు. ఆదిలో వీరు గ్రాంథికవాదిగా ఉంటూ గురజాడ అప్పారావుగారిచేత చీవాట్లు తిన్నారు. తరువాత ధోరణి మారింది. నారాయణ మూర్తిగారు రచించిన గ్రంథాలు ఇవి:

ఉషాపరిణయం (1909) - నాటకం
కృష్ణకుమారి (1912) - పద్యకావ్యం
లతాంగి (1913) - చారిత్రక నాటకం
చంద్రగుప్త (1914) - నవల
లక్ష్మణ (1914) - సాంఘిక నవల
విమలాదేవి (1915) - నవల
అస్తమయము (1916) - నవల
ఆంగ్లరాజ్య స్థాపనము (1917) - నవల
ధరణికోట (1917) - నవల
ఆంధ్రరాష్ట్రము (1918) - నవల
కోకిలా వసంతం (1918) - ప్రబంధం
అభిమన్యుడు (1919) - కథ
మీర్జాదివ్య దర్శనము (1920) - నవల
హనుమంతుని జీవితము (1920) - కథ
కన్యకావిజయం (1925) - పద్యకావ్యం
కంకణం (1930) - పద్యకావ్యం
అన్నవరస్వామి వారిపై పద్యాలు (1938)

ఆంగ్ల కళాశాల చరిత్ర (1939) - పద్యగ్రంథం
అల్లా హో అక్బరు - చారిత్రక నవల
అస్తమయము - చారిత్రక నవల
ఆంధ్ర కవిత్వతత్త్వం - పరిశోధన గ్రంథము
ఇన్‌స్పెక్షన్ హడావిడి - ప్రహసనం
కాలచక్రం - సాంఘిక నవల
జాతీయ పద్యములు
నౌరోజి - చారిత్రక నాటకం
పండుగ కట్నం - ప్రబంధం
పదివేలు - విషాదాంతం (అముద్రితం)
పార్థివలింగ శతకం
ప్రచండ పాండవం - నాటకం
ప్రత్యక్ష రాఘవం - పద్యగ్రంథం
మణిమాల - పాఠ్యగ్రంథం
మహిష శతకం - అనువాదం (అముద్రితం)
మాలపల్లె - పాఠ్యగ్రంథం
సప్తవ్యసనం - పాఠ్యగ్రంథం
సహకార విజయం - నాటకం (అముద్రితం)
హైస్కూలు పండితుడు - పద్యగ్రంథము

పండుగ కట్నం అనే పద్యకావ్యంలో ఆంగ్ల పదాలు చొప్పించి వృత్తాలు రచించారు. నవలలేకాక చిన్న కథలు కూడా భోగరాజు నారాయణమూర్తిగారు రాసేవారు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారి పేర కొడవటిగంటి కుటుంబరావుగారు 9-11-1935 నాడు ఒక ఉత్తరం రాస్తూ ''కొంతకాలం క్రితం భోగరాజు నారాయణమూర్తిగారు భారతిలో ప్రకటించిన నల్లబిందె - కుక్కచెంబు చదివారా'. అది నిర్మాణంలో ఏ ఇంగ్లీషు కథకూ తీసిపోదని నా నమ్మకం. వారు కథా రచన ఎందుకు మానేశారో నాకు అర్థం కాలేదు.'' అని రాశారు.[18] కుటుంబరావుగారే మెచ్చుకొన్న చిన్న కథ అంటే సామాన్యమైన విషయం కాదు. భోగరాజు నారాయణమూర్తిగారు విజయనగరం కాలేజీ హైస్కూల్లో 1916నుండి 1935 దాకా పండితులుగా పనిచేశారు.

కేతవరపు వెంకటశాస్త్రి (1879-1934)

తెలుగులో స్వతంత్ర సాంఘిక నవలలు రాసిన వారిలో కేతవరపు వెంకటశాస్త్రిగారు ప్రసిద్ధులు. విజ్ఞానచంద్రిక గ్రంథమండలి వారు ప్రచురించిన వీరి 'రాయచూరు యుద్ధము' వీరిని సాహిత్యలోకంలో సుస్థిరులను చేసింది. వెంకటశాస్త్రిగారు విశాఖజిల్లా నర్సీపట్నం తాలూకా పోచనపెద్ది అగ్రహారంలో జన్మించారు. కావ్యాలంకార నాటకాలు

18. టేకుమళ్ళ కామేశ్వరరావు - నా వాఙ్మయమిత్రులు - పుట. 282

చదువుకొన్నారు. బొబ్బిలిలో తెలుగు పండితులుగా విజయనగరం మహారాజా వారి కాలేజీలోనూ, విశాఖపట్నం ఏ.వి.ఎన్.కాలేజీలోనూ, ఆంధ్రా యూనివర్సిటీలోనూ అధ్యాపకులుగా పనిచేశారు. సంఘ సంస్కారం హర్షించరు. గ్రాంథికశైలి, వారి నవలలు ఇవి :

తారాబాయి (1911)
రాయచూరు యుద్ధము (1914)
దిలారాము (1915)
యశోలక్ష్మి (1915)
అగ్రహారం
ఆనందబాబు
ఇచ్చినీకుమారి
ఐవన్హో (వావిళ్ళ ప్రచురణ)
పూర్ణానందం
బొబ్బిలి ముట్టడి
రహస్య ఛేదనం
రాజసుందరి
రాజ్యలక్ష్మి

సోమరాజు రామానుజరావు(?)

కనీసం అరడజను నవలలకు తక్కువ కాకుండా రచించినవారిలో సోమరాజు రామానుజరావుగారు ఒకరు. వీరి గ్రంథాలు 1916-17 మధ్య చాలా వచ్చాయి. కొన్ని పునర్ముద్రణలు పొందాయి. వీరి 'జపమాలిక' కొన్ని భాగాల పెద్ద నవల. దానిని కురుకూరి సుబ్బారావు సన్స్ (సరస్వతీ బుక్ డిపో, బెజవాడ) వారు 1955లో మళ్ళా ప్రచురించారు. అప్పటికి రచయిత కీర్తిశేషులు. వీరి గ్రంథాల పేర్లు కొన్ని

ఇందిరా వసుంధరము	(1915)
పాణిగ్రహణం	(1916)
పుత్రహంత	(1916)
విషరోహిణి	(1916)
కరుణ	(1917)
చింతామణి	(1917)
వకుళ	(1917)
జపమాలిక	(?)

సోమరాజు రామానుజరావుగారు భద్రాచల ప్రాంతాల దేశముఖులు. దేశపాండ్యాలు. నవలలేకాక చాలా నాటకాలు కూడా రచించారు. వాటిలో సుమారు 25 నాటకాల పేర్లు ప్రచురిత సంవత్సరాల వివరాలతో తెలుస్తున్నాయి. 1918లో ప్రచురించిన

'బొబ్బిలి నాటకం' నుండి 1931లో రచించిన 'ధరణికోట' దాకా వీరి రూపకాలలో పతిభక్తి అనే నామాంతరం గల వీరి 'రంగూన్‌రౌడి' నాటకం బహుళ ప్రాచుర్యం పొందిన స్టేజి నాటకం.

చాగంటి శేషయ్య (1881-1950)

తణుకులో ఆంధ్రప్రచారిణి గ్రంథమాల సంస్థాపకులలో ప్రధానపాత్ర వహించిన కొవ్వూరి చంద్రారెడ్డిగారి ఆంతరంగిక కార్యదర్శిగా ఉంటూ చాగంటి శేషయ్యగారు బాలాంత్రపు వెంకటరావుగారితో కలసి నాటక రచన చేయడం ఇంతకుముందు గమనించాం. 'ఆంధ్రప్రచారిణి' నవలలు ప్రచురిస్తున్న రోజుల్లో చాగంటి శేషయ్యగారు కూడా స్వయంగా నవలా ప్రక్రియను చేపట్టారు. 1910లో ఆయన రాధారాణి అనే నవల రచించారు. ఇది ఒక ప్రణయగాథ. రాధారాణి నిరుపేద బాలిక. ఆమెను గొప్ప ధనవంతుడు దేవేంద్రనారాయణరాయ్ ఆదుకొంటాడు. ఆమె ఎవరు? ఏమిటి? అనే ప్రశ్నలు వేసుకోకుండా చేయవలసిన సహాయం చేస్తారు. నిజానికి రాధారాణి నిరుపేద బాలిక కాదు. ఒక ఎస్టేటు వారసురాలు. ఆమె కేసు ప్రీవీకౌన్సిల్‌లో ఉంది. ఆమె దారిద్ర్యంలో ఉంది. దేవేంద్ర నారాయణుడు ఆమెను ప్రేమిస్తాడుగాని తన సంగతి ఏమీ చెప్పడు. పరిస్థితుల వల్ల దూరమవుతాడు. రాధారాణికి ఆమె ఎస్టేటు దఖలు పడుతుంది. ఆమె ఒక తోటలో తనకు సహాయం చేసిన మహనీయుడెవరోగాని ఆయన గౌరవార్థం ఒక విశ్రాంతి భవనాన్ని కట్టిస్తుంది. చిట్టచివర దేవేంద్ర నారాయణరాయ్ అక్కడకు చేరుకొంటాడు. తన జీవిత వివరాలు చెప్తాడు. రాధారాణి ఆనందిస్తుంది. ఇద్దరూ పెళ్ళి చేసుకొంటారు. ఈ కథని బాగా కథనం చేశారని 'హిందూ' పత్రిక రివ్యూ రాసింది.

రాధారాణి తర్వాత 'కాబూలు సాహెబు' (1914), 'చంద్రసేనుడు (1914) అనే నవలలను శేషయ్యగారు రాసి ప్రచురించారు. ఇవి వేటికైనా అనువాదమో, కాదో తెలియదుగాని చాగంటి శేషయ్యగారు బంకించంద్ర ఛటర్జీగారి 'దుర్గేశనందిని' అనే ప్రసిద్ధ నవలను అనువదించారు. దీనిని విద్యాశాఖవారు పాఠ్యగ్రంథంగా కూడా ఎన్నిక చేశారు. 'దుర్గేశనందిని' తరువాత ఆ నవలలోని మిగిలిన కథా విశేషాలను 'నవాబు నందిని' అనే పేరుతో 1915లో శేషయ్యగారు రచించారు. ఈ రెండు 'నందిని' గ్రంథాలు చాలా పునర్ముద్రణలు పొందాయి. వీటి తర్వాత 'విశ్వ ప్రయత్నం' అనే నవల రాశారు. ఇది సాంఘిక నవల అయినా అపరాధ పరిశోధన నవలా లక్షణాలచేత అతి మనోహరంగా అలరారుతూ ఉందని వ్యాపార ప్రకటన చేశారు. ఇవన్నీ మొదట ఆంధ్ర ప్రచారిణీ ప్రచురణలే.

ఈ రచనా వ్యాసంగం తరువాత కొన్నాళ్ళు ఆగిపోయింది. శేషయ్యగారు కొవ్వూరి చంద్రారెడ్డిగారి దగ్గర ఉద్యోగం మానుకొని కపిలేశ్వరపురం జమీందారుగారి దివానుగా చేరారు. ఆ పనినే జీవితాంతం నిర్వహించారు. కపిలేశ్వర పురంలో ఆయన నవలా రచన కట్టిపెట్టి వాఙ్మయపరిశోధనలు ప్రారంభించారు. 'ఆంధ్రకవి తరంగిణి' అనే పేరుతో తెలుగు కవుల చరిత్రలను రచించి ప్రకటించడం 1946లో ప్రారంభించారు. ఇది 25 సంపుటాల

గ్రంథంగా ఆయన ప్రణాళిక వేసుకొన్నారు. 1953 నాటికి పదవ సంపుటం వెలువడింది. అప్పటికి పదమూడువందలమంది తెలుగు కవుల చరిత్రలు విశేషంగా పరిశోధించి రాశారు. తర్వాత పదకొండు, పన్నెండు సంపుటాలు వెలువడ్డాయి. ఈ గ్రంథాలు పరిశోధకులకు ఎక్కువగా ఉపయోగపడతాయి.

నవలా రచయితగా ప్రారంభించి కవి, చరిత్రకారునిగానే శేషయ్యగారు చేసిన సాహిత్య పయనం సుదీర్ఘమైనది. ఈ సంపుటాలలో వారి చిత్తశుద్ధి ప్రతిఫలిస్తూ ఉంటుంది.

కొత్తపల్లి సూర్యారావు (1873–1938)

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాజమండ్రిలో పోలవరపు జమీందారుగారి తరపున సరస్వతి పత్రికను స్థాపించినప్పుడు అందులో 'గుమస్తా'గా చేరిన కొత్తపల్లి సూర్యారావుగారు ఆ పత్రిక కాకినాడకు వెళ్ళిపోయినప్పుడు దానితో పాటు తామూ వెళ్ళారుగాని ఇంతకుముందు చెప్పుకొన్నాం. అయితే సూర్యరావుగారు మొదట కాకినాడలో గురజాడ శ్రీరామమూర్తిగారి 'రాజయోగి' పత్రికలో పదహారో యేటనే ప్రవేశించారు. పత్రికలో పనిచేస్తూ శ్రీ రామమూర్తిగారి దగ్గర సాహిత్యజ్ఞానం పెంపొందించుకొన్నారు. 1895లో 'రాజయోగి' ఆగిపోయింది. సూర్యారావుగారు రాజమండ్రి వెళ్ళి 'సరస్వతి'లో చేరి మళ్ళా కాకినాడకు వచ్చారు. పోలవరం జమీందారుగారి ప్రెస్సులోనూ, పత్రికా నిర్వహణలోనూ ప్రావీణ్యం సంపాదించారు. భాషాజ్ఞానం అపారంగా వృద్ధి చేసుకొన్నారు.

సూర్యారావుగారు బహుభాషావేత్తలయ్యారు. సంస్కృతాంధ్రాలతోపాటు ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మహారాష్ట్రం, ఉర్దూ, హిందీ భాషలు నేర్చుకొన్నారు. 1907 నుంచి గ్రంథరచన ప్రచురణ చేశారు. అందులో ఈ కింది నవలలున్నాయి.

ఫసానే అజాయబు	(1906)
ఆనందసాగరం	(1907)
గుణమంజరి	(1907)
త్రిలోకసుందరి	(1908)
అమీరే హంజా	(1910)
కపిలగోవు	(1912)
కమలపాలిక	(1912)
సువర్ణ శృంఖల	(1912)
ఉదయలక్ష్మి	(1913)
దొంగరంగడు	(1915)
రాజలక్ష్మి	(1916)
వాసవదత్త జననం	(1921)

సరస్వతి పత్రికలో పనిచేశాక ఆయన చెన్నపట్నం వెళ్ళి ఆంధ్రసాహిత్య పరిషత్తు కార్యాలయంలో చేరారు. జీవితాంతం ఆపనినే అంటిపెట్టుకొని పరిషత్తు ప్రచురణల

కెన్నింటికో పరిష్కర్తగా వ్యవహరించారు. పీఠికలు రాశారు. జయంతి రామయ్యగారి కుడిభుజంలాగ ఉండేవారు.

పులుగుర్తి లక్ష్మీనరసమ్మ (1878-?)

విశ్వసాహిత్యంలో నవలా సామ్రాజ్యాన్ని ఏలినవారిలో ఎందరో మహిళలు సుప్రసిద్ధులు. ఇంగ్లీషు పదమైన 'నోవల్' అనే ప్రక్రియను మనం 'నవల' అని అకారాంత రూపంలో వాడుతున్నాంగాని 'నవలా' అనే ఆకారాంత స్త్రీలింగ పదం అసలు సిసలు తెలుగుదేశ్యం. దీనికి స్త్రీ అని అర్థం అల్లసాని పెద్దిరాజుగారు మనుచరిత్రలో వరూధిని ప్రవరుడు చూశాడని చెప్పే తొలి పద్యంలోనే ఈ శబ్దాన్ని వాడారు.

అతఁడావాత పరంపరా పరిమళ వ్యాపార లీలన్ జనా
న్వీత మిచ్చోటని చేరఁబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్
శత పత్రేక్షణ జంచరీక చికురం జంద్రాస్యఁజక్రస్తనిన్
నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్ (మను. 2-25)

పెద్దిరాజుగారి ప్రయోగంతో పాటు భట్టుమూర్తి వసుచరిత్ర (1-130)లో ''అరిగాఁబంచమ మేవగించి నవలాలవ్వేళ హిందోళవైఖరి...'' చూపారన్న పద్యంలో నవలాల్ అనే బహువచనం కూడా ప్రసిద్ధమే.

'నోవల్' అన్న పదానికి ఆదిలో తెలుగులో సరైన మాట దొరక్క 'వచన ప్రబంధం', 'ఆఖ్యాయిక' అని వ్యవహరించినా 'నవల' అనే సమంజసనామాన్ని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి (1863-1940) గారు సూచించారు. వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రను సమీక్షిస్తూ 1896లో బ్రహ్మయ్యశాస్త్రిగారు రాసిన ఏడధ్యాయాల 'వివేక చంద్రికా విమర్శనం'లో వచన ప్రబంధాన్ని 'నవల' అనవచ్చునని, 'నవం లాతీతి నవలా' అనే వ్యుత్పత్తి అర్థాన్ని ఇచ్చారు. నవ్యమైనదీ, లాలిత్యాత్మకమైనదీ నవల అనడం సార్థకమే.

పులుగుర్తి లక్ష్మీనరసమ్మగారు బ్రహ్మయ్యశాస్త్రిగారి శిష్యురాలు, నడకుదుటి వీరరాజుగారి మేనకోడలు. చింతలపూడి వ్యతిరేకమైనట్లే శిష్యురాలు కూడా ఒక్క విషయంలో తప్ప వ్యతిరేకులే. ఆమె అంగీకరించిన సంస్కారం స్త్రీ విద్య. దీని ప్రచారానికి ఆమె తోడ్పడ్డారు. ఈమె భర్త పులుగుర్తి వెంకటరత్నంగారు స్త్రీ విద్యాభిమానులు కావడం కూడా దానికి ప్రోద్బలమే. లక్ష్మీనరసమ్మగారికి బడిచదువులు లేకపోయినా తల్లివంకవారూ, తండ్రివంకవారూ కవి పండిత వంశంవారూ కావడంచేత చిన్నప్పటినుంచే సాహిత్యాభిరుచీ, రచనావ్యాసంగం అలవడ్డాయి. జనానా పత్రికలలోనూ, హిందూసుందరి పత్రికలోనూ వ్యాసాలు రాసేవారు. తామే స్వయంగా 1904 నుండి 'సావిత్రి' అనే పత్రికను నడిపారు. ఇది ఏడెనిమిదేళ్ళు సాగింది. గద్యపద్యరచనలు రెండూ ఈమె విడివిడిగా చేసేవారు.

లక్ష్మీనరసమ్మగారి గ్రంథాలలో కొన్ని ముద్రితాలు వాటిలో (1) సుభద్ర (1912) (2) అమర విజయము (3) కమలాకుమారి (4) లోకబాంధవి (5) కామమంజరి అనేవి

నవల రచించినట్టు కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్ర వాఙ్మయ సూచికవల్ల తెలుస్తూంది. మాగంటి అన్నపూర్ణాదేవి పుట్టింటి ఇంటిపేరుతోనే ఈ నవల రచించారేమో భావి పరిశోధనవల్లగాని తేలదు. 1919లో అత్తవారి ఇంటి పేరుతో గ్రంథరచన చేసిన మహిళ 1921లో కన్నవారి ఇంటిపేరుతో రచన చేస్తుందా? ఇద్దరూ ఒకరే కాదేమో?

పులవర్తి కమలావతి (1936 నాటికి ప్రసిద్ధులు)

ఎన్నో గ్రంథాలు రచించి 1936 నాటికి కేసరివారి గృహలక్ష్మి స్వర్ణకంకణం పొందేటంత ప్రసిద్ధురాలైన పులవర్తి కమలావతిగారు రాజమండ్రి పురవాసిని. కంచర్లవారి ఆడపడుచు. నవలలూ, నాటకాలు వీరు రాసినవి సుమారు 14 లెక్కకు తేలుతున్నాయి. వాటి వివరాలు ఇవి :

కుముద్వతి	పుళింద కన్య
రాధికాచంద్రావళులు	క్రీస్తు చరిత్ర
విజయభాస్కర విజయము	మొండి శిఖండి
మీరేజుమ్లా	అబిసీనియా యుద్ధము
విక్టోరియా క్రాసు	వాసవీ విజయము
తిలోత్తమ-పాపయ్యశర్మ	రాణీ ప్రమీల
వీరభారత కథామంజరి	విద్యుత్ప్రభ

'విక్టోరియా క్రాసు యుద్ధ సంబంధమైన ఇతివృత్తంగల నవల. కుముద్వతి నవల కొన్నాళ్లు స్కూలుఫైనలు విద్యార్థులకు పాఠ్యగ్రంథం. ప్రస్తుతం వీరి గ్రంథాలలో ఏ ఒక్కటీ దొరకడం లేదని పరిశోధకులు చెప్తున్నారు.

సీరము సుభద్రమ్మ (1876-1947)

జమీందారీ యుగంలోని తొలితరం రచయిత్రులు పద్య కావ్యాలూ నవలలూ కూడా రాయడంలో అందె వేసిన చేతులు. 'ఉత్తరరామచరిత్ర'ను నిర్వచన కావ్యంగానూ, 'సుభద్రా రామాయణాన్ని' రెండువేల పైచిలుకు పద్యాలు గల బృహత్కావ్యంగానూ రచించిన సీరము సుభద్రమ్మగారు 1918 నాటికే నవలలు కూడా రచించారు. ఈమె విశాఖపట్నం ఎవియన్ కాలేజి హైస్కూలు హెడ్మాస్టరుగానూ, తర్వాత విక్రమదేవవర్మగారి ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసిన సాహిత్య చరిత్రుడు సెట్టి లక్ష్మి నరసింహంగారి అక్కగారు.

తెలుగు నవలా రచయితలు వంగ భాషనుండి అపరాధ పరిశోధక నవలలు తెనిగిస్తున్న కాలంలో సుభద్రమ్మగారు ఆంగ్ల కథను అనుసరిస్తూ 'జాగిలం' అనే గ్రంథం రాశారు. విశ్వసాహిత్యంలో ఇప్పటికీ డిటెక్టివ్ అంటే ఇతడే అనిపించుకొన్న షెర్లాక్ హోమ్స్ సృష్టించిన సర్ ఆర్థర్ కానన్ డాయల్ (1859-1930) రచించిన 'ది హౌండ్ ఆఫ్ బాస్కర్ విలీస్' (1902) అనే సుప్రసిద్ధ గ్రంథానికి జాగిలం చక్కని అనుసరణ. ఈ తెలుగు

నవలలు. ఇవి మిగతా పద్యకావ్యాలలాగే ప్రస్తుతం అలభ్యాలు. ''....చాలామంది గ్రంథములు ఒక ఏబది వర్షముల పిమ్మట ఇపుడే కండ్లబడకుండుట శోచనీయాంశము. అది ముద్రణాసౌకర్యము గలుగుట వలని అపచారమో, స్త్రీల కవిత్వములగుట ఉపేక్షయో?'' అని ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు రాశారు.[19]

కాంచనపల్లి కనకమ్మ (1893-?)

రచయిత్రిగా వివిధ ప్రక్రియలలో రాణించిన ఇంకొక మహిళ కాంచనపల్లి కనకమ్మగారు. ఈమె బాల వితంతువు. అత్తింట అడుగుపెట్టలేదు గనుక పుట్టింటి వారి ఇంటిపేరునే పేరు ముందు పెట్టుకొని జీవించిన విశిష్టవ్యక్తి. చిన్నతనంలోనే తండ్రిగారు కూడా మరణించడం వల్ల ఆప్తబంధువుల ఆదరణలో పెరిగి పాఠశాల విద్యలతో ఆగక మద్రాసులో విద్వాన్, బియ్యేపట్టాలు పుచ్చుకొని క్వీన్‌మేరీస్ కళాశాలలో ఆంధ్రోపాధ్యాయునిగా పనిచేశారు.

కనకమ్మగారు ఆంధ్రాంగ్ల సంస్కృతాలలో రచనలు చేయగలరు. మాక్మిలన్ కంపెనీ వారికి ఎన్నో తెలుగు పుస్తకాలు రాసి ఇచ్చారు. విద్యాశాఖ వారి పాఠ్య గ్రంథ నిర్ణాయక సంఘంలో సభ్యురాలుగా, యూనివర్సిటీ పరీక్షాధికారిణిగా పనిచేశారు. నారాయణ కథా సంగ్రహం అనే సంస్కృత గద్యకావ్యం రచించారు. శాకుంతలాన్ని తెనిగించారు. కనకమ్మగారికి మద్రాసు నివాసం వల్ల తమిళం చిన్నప్పుడే అలవడింది. పండిత నటేశన్ శాస్త్రిగారు తమిళంలో రచించిన 'దిక్కట్ర ఇరు కొళైందగళ్' (దిక్కులేని ఇరువురుబిడ్డలు) అనే నవలను 'అమృతవల్లి' (1917) అనే పేరుతో అనువదించారు. వీరి పద్యగద్య కృతులు సుమారు 16 ఉన్నాయి. ఈమె కేసరిగారి గృహలక్ష్మి స్వర్ణకంకణాన్ని అందుకొన్నారు.

మాగంటి అన్నపూర్ణాదేవి (1895-1927)

స్వాతంత్రోద్యమంలో పాల్గొని గాంధీజీ 'ఈమె నా అభిమాన పుత్రిక' అని మెచ్చుకొనేటట్టు దేశ సేవ చేసిన మహిళలలో అన్నపూర్ణాదేవి ప్రసిద్ధురాలు. ఈమె ఏలూరు తాలూకా చాటపర్రు గ్రామంలోని కలగరవారి ఆడబడుచు. ఈమె తల్లితండ్రులు రామస్వామి, రంగ పిచ్చమ్మగార్లు కూడా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అన్నపూర్ణమ్మగారి భర్త మాగంటి బాపినీడుగారు అమెరికాలో వ్యవసాయశాస్త్రంలో పట్టా పొంది బొంబాయి రేవులో ఓడ దిగుతూనే జాతీయోద్యమంలో చేరారు. భార్యాభర్తలిద్దరూ విదేశ వస్త్ర దహనం చేశారు. అన్నపూర్ణమ్మ తన నగలన్నీ గాంధీజీకి సమర్పించింది. భర్తతోపాటు విదేశాలకు వెళ్ళాలనుకొన్న ఆలోచన మానుకొని దేశసేవలో దిగిన ఈమె గ్రంథరచన కూడా చేశారు. 1919లో 'సీతారామము' అనే నవలను రచించారు. ఇతర రచనల వివరాలు తెలియవు.

కలగరవారనే ఇంటిపేరుకాక అన్నపూర్ణాదేవి అన్న పూర్తిపేరు కూడాగల ఇంకొక మహిళ కూడా నవలలు రచించారు. 1921లో కలగర అన్నపూర్ణాదేవి 'నవవర్ణస్వప్నం' అనే

19. ఆంధ్ర కవయిత్రులు - పుట.135

నవలను కొన్నాళ్ళు విశ్వవిద్యాలయంవారు ఉన్నత తరగతులకు పాఠ్యగ్రంథంగా పెట్టారు. సుభద్రమ్మగారు రచించిన ఇంకో నవల పేరు 'శిరోమణి' (1918). ఈమెకు ఈమె జీవిత కాలంలో రావలసిన పేరు రాలేదని ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు అంటున్నారు.[20]

చిల్కపాటి సీతమ్మ (1900-?)

నవలలూ, నాటకాలూ, ఏకాంకితలు రచించిన మహిళలలో చిల్కపాటి సీతమ్మగారు ఒకరు. ఈమె నెల్లూరు జిల్లా కలికివాయి గ్రామంలో పర్ణశాల రాఘవాచార్యులగారి కుమార్తె. ఆశుకవిత్వం కూడా చెప్పగల ఈమెకు కవిరాణి అనే బిరుదు ఉంది. యుగధర్మాన్ని అనుసరించి గద్యరచన కొంత చేపట్టి అరవింద అనే నవల రచించారు. పద్మినీ పరిణయం, క్షీరసాగరమథనం, దిలీప, శూర్పణఖ వీరి ఇతర రచనలు. ప్రబంధ ధోరణి రచనలలో ఈమె గణిక, పుష్పలావిక, జలక్రీడల వర్ణనలలో పూర్వ కవులకూ, పురుషులకూ ఏమాత్రం తీసిపోక కొంచెం పచ్చిగా కూడా వర్ణనలు చేశారు. నాయికా నాయకుల సమాగమ దృశ్యములు తెరచాటు లేకుండా చేయుటయుచితమా? అని మహిళా విమర్శకులే ప్రశ్నిస్తున్నారు.[20]

జమీందారీ యుగంలో ఇంకొందరు స్త్రీల నవలలు రచించినట్టు తెలుస్తున్నా వారి గురించి ఇతర వివరాలు లభించలేదు. వారి పేర్లు, నవలల పేర్లూ ఇవి :

1.	వేమూరు ఆండాళమ్మ	కమలిని (1916)
2.	జూలూరి తులశమ్మ	రాణిభవాని (2 భాగాలు)
3.	అ. రాజాంబ	చంపకమవుని
4.	రుక్మిణమ్మ	జయపాలుడు
5.	గోపిసెట్టి లక్ష్మీనరసమ్మ	సుకేశి (1916)
6.	జి. లక్ష్మీనరసమ్మ	సుగుణావళి (1917)
7.	వి. శ్రీనివాసమ్మ	1. సీతుపిండారి (1917)
		2. ప్రియాన్వేషణము
8.	సత్యనాధమ్మ కృపాబాయి	సుగుణమ్మ
9.	ఆచంట సత్యవతమ్మ	సునందిని
10.	మల్లవరపు సుబ్బమ్మ	కళావతి చరిత్ర
11.	జయంతి సూరమ్మ	సుదక్షిణా చరిత్రము
12.	ఎస్. స్వర్ణమ్మ	ఇందిర (1915)

ఈ మహిళలలో అ. రాజాంబగారికి కన్నడభాష కూడా తెలుసు. సత్యనాధమ్మ కృపాబాయిగారు విద్యావతి అనే పత్రికను కూడా నడిపారు. వీరేశలింగంగారి ఉద్యమం వల్ల స్త్రీ విద్య వ్యాపించి కులస్త్రీలు గ్రంథ రచనలు చేయడం ప్రత్యేకంగా నవలలు రచించడం సంతోషించదగ్గ విషయం.

ఇతర ప్రక్రియలతోపాటు నవలలను కూడా రచించినవారు కొందరు జమీందారీ యుగంలో ఉన్నారు. వారి నవలలపేర్లూ, అవి రచించిన సంవత్సరాలూ తెలుస్తున్నాయి.

20. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ - ఆంధ్ర కవయిత్రులు. పుట.168

గాని చాలామంది జీవిత వివరాలు లభించడం లేదు. సేకరించిన మట్టుకు అకారాదిగా నవలల పేర్లు ఇస్తున్నాను.

మరికొన్ని నవలలు - వివరాలు

అణానవలలు - కె.ఎల్.ఎన్. సోమయాజులు (1916)
అనురాగము జయించును - ఎం. సోమశేఖరము (1915)
అపరాజిత - పి. కామేశ్వరరావు (1921)
అపరూపపు చంద్రకాంత - ఎం. ఆదికేశవులు నాయుడు (1907)
అపూర్వ ప్రతిభ - కొచ్చెర్లకోట వెంకట కృష్ణారావు (1919)
అమృతపులిన - కె.పి.వాసుదేవరావు (1913)
అమృతము - సింగరాచార్యులు, ఎస్.ఎస్. (1917)
అయిదువందల రూపాయల బహుమానము - పి.వి.రామమూర్తి (1915)
అరవింద - వి. వేల నరసింహారావు (1917)
అశోకుడు - ఎ. సుందరరామయ్య (1920)
అసూయ - పామర్తి బుచ్చిరాజు (1921)
అళహసింగరి - సి.హెచ్.వి. కృష్ణమాచారి (1913)
ఆత్మసామ్రాజ్యము - కొండపర్తి వీరభద్రాచార్యులు (?)
ఆదివారము అందలము సోమవారము జోలె - హెచ్. గోపాలరావు (1917)
ఇందిరాదేవి - రామకృష్ణకవులు (1914)
ఇందుమణి - హెచ్. రామారావు (1914)
ఇప్పటి ముచ్చటలు, ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ (1914)
ఈతడు నా మగడు - ఎ. సుందరరామయ్య (1920)
ఉన్మత్త - ఎస్. గంగాధరరామమూర్తి (1914)
ఉమాపతి విజయం - ఏటుకూరి సీతారామాంబ (1914)
కనకం - మారేపల్లి రామచంద్రశాస్త్రి (1914)
కనకవల్లి - సి. యోగానందయ్య (1914)
కమల - టి. కేశవరావు (1915)
కమల - కె. సత్యానందము (1909)
కమలకుమారి - పారనంది వెంకటరమణమూర్తి (1914)
కమలమంజరి - ముట్నూరి సుబ్బారావు (?)
కమలాకాంతుడు - బాలాంతరపు నీలాచలం (1913)
కమలాకుమారి - కె.వై. సదానందరావు (1917)
కళ్యాణి - వెన్నెలకంటి సుందరరామశర్మ (1916)
కళాపూర్ణ - పి. శ్రీనివాసరావు (1921)
కళావతి - దొడ్ల వెంకటరామిరెడ్డి (1909)

కళావతి కళ్యాణము - కనకవల్లి భాస్కరరావు (1911)
కాంచనమాల - ధరణిప్రెగడ వెంకట శివరావు (1908)
కాంచనమాల - ము. సుబ్బారావు (1915)
కృష్ణకాంతుని మరణశాసనము - చిల్లరిగె శ్రీనివాసరావు (1910)
కృష్ణమూర్తి విజయము - ము.నూ. వెంకట నారాయణశర్మ (1915)
గంగాబాయి - పి. సుబ్బారావు (1905)
గజదొంగ - కె. నరసింహారావు (1917)
గిరిబాల - రాళ్లపల్లిగోపాలకృష్ణశర్మ (1920)
గుల్బహార్ - వి. సుబ్బారావు (1914)
గోదావరి - యాతగిరి లక్ష్మీకాంతరావు (1910)
ఘోరకలి - మల్లంపల్లి సోమశేఖరశర్మ (1919)
చందన తిలక - గుట్టుపల్లి శ్రీరాములు (1917)
చంద్రకళ - వేదుల సూర్యనారాయణశాస్త్రి (1915)
చంద్రగుప్త - టి.ఎస్. రామశాస్త్రి (1913)
చంద్రవదన - వంగూరి సుబ్బారావు (1915)
చోరచరిత్రము - టి. అప్పలకొండయ్య (1989)
జూలియా బీబీక్ష కె.ఆర్.శర్మ (1918)
తారాబాయి - బాలాంతరపు నీలాచలం (1915)
తారామతి - నాశికర్ల రంగయ్య (?)
తిలోత్తమ (లేక) దుర్గేశ నందిని - ఉల్లిగుండం రంగారావు (1912)
దుర్గావతి - గోడేటి జగన్నాధరావు (1908)
దుర్జన భర్జనము - సూరి పూర్ణానందము (1907)
దృఢప్రతిజ్ఞ వాసుదేవరావు (1915)
నవీనవాణి - సత్యసుబ్రహ్మణ్యేశ్వరకవులు (1915)
పగటిచుక్క - అనంతగిరి పేరయ్య (?)
పద్మావతి - రొద్దము రంగారావు (1917)
పద్మిని - అయినాపురపు సుందరరామయ్య (1916)
పద్మిని - చివుకల పిచ్చయ్య(?)
పరమరహస్యము - వసుదేవరావు (?)
పరమానంద చరిత్రము - మొచర్ల హనుమంతరావు (1911)
పరిణయ కథామంజిరి - ఆర్. నారాయణరావు (1916)
పరిమళ - వెంకట పార్వతీశ్వరకవులు (1913)
పరుసవేది - ఆచంట సూర్యనారాయణ (1918)
పుష్పవేణిచరిత్ర - మంగిపూడి వెంకటశర్మ (1910)
పుష్పావతి - టి.యస్. రామశాస్త్రి (1907)
పూర్ణానందము - కేతవరపు వెంకటశాస్త్రి (?)

పెసరట్టు - క్రొత్తపల్లి సుందరరామయ్య (1916)
ప్రణయప్రతిమ - జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి (1920)
ప్రణయస్మరణి - రాళ్లపల్లి గోపాలకృష్ణశర్మ (1916)
ప్రభావతి - యస్. సూర్యనారాయణ (1903)
ప్రేమసాగరము - నాళము కృష్ణారావు (?)
బగళాముఖి - రాళ్లపల్లి గోపాలకృష్ణశర్మ (1917)
భువన మోహిని - ధరణిప్రెగడ శివరావు (1910)
మధురవాణి - జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (1912)
మనోరంజని - జనమంచి శేషాద్రిశర్మ (1904)
మనోహరము - తం. వెంకట సుబ్బారావు (1919)
మనోహర విజయము - ఎన్. వాసుదేవరావు (?)
మనోమరి - టి.పి. రామశాస్త్రి (1902)
మయసభ - పిల్లలమఱ్ఱి గోపాలకృష్ణయ్య (1918)
మరకతవల్లి - ఎమ్. మంగయ్య (1904)
మలయవతి - చింతలపల్లి నరసింహశాస్త్రి (1915)
మాధవీలత - బాలాంత్రపు నీలాచలం (1912)
ముద్రారాక్షసము - సీతారామశాస్త్రి (1885)
మృణాళిని - బా. సూర్యానారాయణ (1913)
మోహినీ విలాసము - బలిరమణయ్య (1915)
యుగంధర విజయము - దొడ్లవెంకట రామిరెడ్డి (1919)
రంగరాజు - ముత్తరాజు సుందరరామయ్య (1916)
రంగరాయ విలాసము - ఎస్.వి. రంగాచార్యులు (1914)
రత్నమాల - తురగా వెంకటాచలము (1906)
రాజహంస - సి. కామేశ్వరరావు (1917)
రాధారాణి - బాలాంత్రపు సూర్యనారాయణ (1910)
రాధారాణి - తల్లాప్రగడ సూర్యనారాయణ (?)
రామలక్ష్మణ దేశయాత్ర - క్రొత్తపల్లి సుందరరామయ్య (1913)
రుద్రదేవి - బి. సీతారామచంద్రరాయశర్మ (1919)
రోషనార - వి. వెంకటేశ్వర్లు (1912)
వసంతసేన - ఎ.వి. నరసింహంపంతులు (1912)
వసుమతీ వసంతము - వెంకట పార్వతీశ్వరకవులు 91913)
విక్రమసింహ - సి.వి. కృష్ణమాచారి (1917)
విక్రమసింహ విజయము - కె. వెంకటరమణకవి (1920)
విక్రమసేన విజయము - దిగవల్లి సూర్యనారాయణ (1913)
విచిత్రచరిత్ర - వి. కృష్ణశర్మ (1911)
విద్యుత్ప్రభ - భాగవతుల చెన్నకృష్ణయ్య (1920)

వీరబాల - జి. సత్యగోదావరి శర్మ (1907)
వేదవతి - నిడమర్తి వెంకటకృష్ణారావు (1920)
శకుంతల - పి. అంజయ్య (1918)
శాంత - పూమూరి శ్రీనివాసరావు (1917)
శాంత - ఉమ్రాలీషా (1918)
శుక్తిమతి - నండూరిమూర్తిరాజు (?)
శృంగారవల్లి - సి.హెచ్. కృష్ణమాచారి (1903)
సత్యాబాయి - తుమ్మలగుంట కేశవరావు (1913)
సమస్యలు - బి. వెంకట్రావు (1916)
సరస్వతి - మంగిపూడి వెంకటశర్మ (1921)
సాధన - వెంకట పార్వతీశ్వర కవులు (1913)
సుందరి - బారు రామారావు (1902)
సుగుణమణి - ఎ. సూర్యనారాయణ (1918)
సుగుణవతీ పరిణయము - నెండునూరి గణేశ్వరరావు (1908)
సుమతి - కె. వరదాచార్లు (?)
సువర్ణలేఖాకథావళి - డి.వి. రమణారావు (1913)
సుశీల - వెన్నెలకంటి సుందరరామశర్మ (1916)
సుహృల్లత - వడ్రంగి రామారావు (1913)
సోమశర్మాభ్యుదయము - పి. శ్రీనివాసాచార్యులు (1894)
హంసయాన - అయనవరపు సుందరరామయ్య (1916)
హెలెన - యెల్లాపంతుల జగన్నాథం (1917)
హైమవతి - ఎస్. రామానుజరావు (1919)

ఇన్ని నవలలు ఈ యుగంలో ఇందరు రచించారంటే ఈ ప్రక్రియపై ఆనాటి వారికి ఎంతమోజు వుందో తెలుస్తుంది. ఈ రచయితలలో నాళం కృష్ణారావు (1881-1961) వీరేశలింగంగారి కుడిభుజంగా ఉండి వారినే ఎదిరించిన ధీరుడు. గౌతమీ గ్రంథాలయం స్థాపించారు. మధురకవి. బాలవాఙ్మయం పెంపొందించారు. రాళ్ళపల్లి గోపాలకృష్ణమా చార్యులు (1886-1963) జ్యోతిశ్శాస్త్రవేత్త. ప్రభుత్వోద్యోగాలలో హుజూరు శిరస్తాదారుగా పెరిగారు. రావు సాహెబ్ బిరుదాంకితులు. పాటలు రాసేవారు. వీరు ప్రసిద్ధులైన రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి అన్నగారు. ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ (?) మారేపల్లి రామచంద్రశాస్త్రి (1874-1951) నాటకకర్తలు. జనమంచి శేషాద్రి శర్మ (1882-1950) బహుగ్రంథకర్త. ఉపన్యాసకులు. తొలిరోజుల్లో కళాప్రపూర్ణ బిరుదు పొందినవారు మల్లంపల్లి సోమశేఖరశర్మ (1891-1963) సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు.

ఇందరు ఇన్నిరకాల నవలా రచనలు చేయబట్టే దేశంలోని అక్షరాస్యులలో పఠనాసక్తి పెరిగింది. అది మెచ్చుకోదగ్గ విషయం.

చిన్నకథ - పెద్ద కథకులు

మొహంజొదారొ హరప్పా క్షేత్రాలలోని తవ్వకాల వల్ల దొరికిన సాక్ష్యాలచేత మనదేశ ప్రాచీన చరిత్ర మరికొన్ని శతాబ్దాలు ప్రాచీనతరమైనది. పురాతత్త్వ శాస్త్రజ్ఞుల పరిశోధనలు దేశచరిత్ర తారీఖుల సవరణకు తోడ్పడినట్లే, సాహిత్య పరిశోధకులు ఎప్పటికప్పుడు కొత్తగా పైకి తీసే పాత విషయాలవల్ల మన వాఙ్మయంలో కూడా కొన్ని విషయాల పూర్వాపరాలు సర్దుబాటులకు లోనవుతాయి. ఇప్పటిదాకా మన కథానికా సాహిత్యంలో గురజాడ అప్పారావుగారు రాసిన దిద్దుబాటు అన్నదే మొట్టమొదటి కథ అన్నది నిర్వివాదాంశం కాకపోయినా దేశంలోని మూడొంతుల ముప్పాతికమంది విశ్వసిస్తూ వచ్చిన విషయం. అయితే 1978లో ఈ అభిప్రాయాన్ని తోసిరాజంటూ ఆచంట వెంకట సాంఖ్యాయనశర్మగారు 1902లో కల్పలత అనే పత్రికలో ప్రచురించిన 'లలిత' అన్న రచనే మొట్టమొదటి తెలుగు కథ అనే ప్రతిపాదన వెలువడ్డది.[1] దీనిని కొందరు సరియైన పరిశోధన చేయక ఖండించారు.

'గురజాడ రచనలు - కథానికలు' అనే సంకలనం (1984)లో 'మొట్టమొదటి ఆధునిక కథలు' అనే శీర్షికతో రాసిన ముందు ప్రకరణంలో సెట్టి ఈశ్వరరావుగారు ఇలా రాశారు.

''కాని 'లలిత' ఆధునిక తెలుగు కథ కాదని దాని ప్రారంభం చెపుతుంది. దాని స్వరూప స్వభావాలు పూర్వపు ఫక్కీవి. 'లలిత' యిలా మొదలవుతుంది.

''లలిత ముద్దుగులుకు రాచకన్నెక. లోకమును జక్కఁగా నెఱుఁగనే యెఱుఁగదు. విశాలములగు సోగకన్నులును జవితి చందురునివంటి నెన్నెదురును, ముత్తెములవంటి పల్వరుసయు, నప్పుడే కోసిన దంతపు ముక్కలవంటి చెక్కిళ్ళును లలిత చక్కదనము కన్నుల పండువుగా నుండక మానదు. ఎన్నఁడును గలలోనయిన గంటెఱుఁగని సరిక్రొత్త కెమ్మోవిగల లలిత కేవల మప్సరసగాకపోయినను బాల్యము విడిచి జవ్వనము నివ్వటిల్లుచున్న సొగసుకత్తెయగు లేజవరాలు.''

'లలిత' కథ, దాని కథనం, భాషాశైలి అన్నీ పూర్వఫక్కీవే. అవి ఆధునికమైనవి కానేకావు.''

సెట్టి ఈశ్వరరావుగారు 'లలిత' విషయంలో చెప్పిన ఈ సంగతులు సమంజసాలే. అయినా సాంఖ్యాయన శర్మగారు అదే కల్పలత పత్రికలో రచించిన ఇతర కథలు మాత్రం ఆధునిక కథలకు కావలసిన ఎత్తుగడ, కొనసాగింపు మొదలైన విషయాలలో లక్షణాలకు సరిపోతాయి.... శర్మగారు కల్పలతలో రాసిన ఇతర కథా రచనల వివరాలు నాదగ్గర ఉన్న కల్పలత పత్రికలలో లభించిన రచనలు మట్టుకు ఇవి.

1903 నవంబరు - లలిత - కథ

1903 డిసెంబరు - సారసిక, కథ

---

1. అభ్యుదయ-1978, మార్చి నెల సంచిక

1904 జనవరి - స్వప్నముక్తావళి - (సీరియల్)
ఫిబ్రవరి - స్వప్నముక్తావళి (కొనసాగింపు)
మార్చి - స్వప్నముక్తావళి (ముగించబడును)
ఏప్రిల్ - స్వప్నముక్తావళి (ముగించబడును)
(తదుపరి సంచికలు లభించలేదు)
1904 నవంబరు - విశాఖ - కథ
1905 మే - స్వప్నముక్తావళి (ముగించబడును)

'లలిత' ప్రారంభం ఆధునిక కథానిక శిల్పం లేదని కొట్టిపారేసేవారు. గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' ప్రారంభంలోని పేరాగ్రాఫులను కోట్‌చేసి దాని ప్రప్రథమ స్థానాన్ని నిర్దేశిస్తారు. 'దిద్దుబాటు' ఇలా మొదలవుతుంది.

''తలుపు! తలుపు!!

తలుపు తెరువఁబడలేదు. ఒక నిముషమతఁడూరు కొనెను.

గదిలోని గడియారము టింగుమని ఒంటిగంట కొట్టినది.

ఇలా ఆసక్తికరమైన ప్రారంభంతో చెప్పిన కథ. ఉత్కంఠతను కలిగిస్తుంది అని అందరూ ఒప్పుకొంటారు. కథ ప్రారంభమే దాని మొట్టమొదటి రచనకి గీటురాయి. అయితే ఆచంట సాంఖ్యాయన శర్మగారు 1904 నవంబరు నెల కల్పలతలో రాసిన 'విశాఖ' అనే కథ ప్రథమ స్థానానికి పోటీ చేస్తుంది. కథ పూర్తిపాఠం చూడండి.

విశాఖ

- ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మ

ఘణిల్లున నినుప గొలుపు చప్పుడై చప్పున జెఱసాల తలుపు తెరవబడగానే కళానిధి కట్టెదుట గుమ్మములో నల్లని మేలి ముసుంగున నిండార మఱుంగుపడియున్న స్త్రీ విగ్రహము గనంబడి మెల్లని కంఠస్వరముతో నా వెంబడినే రమ్మని పలికి ముందు నడువసాగెను.

చెఱసాల కాపరి పొరుగూరి నుండి రాలేదు. చుట్టుపట్ల నెకడను దీపమన్నది లేదు. కటికచీకటిలో స్త్రీ పురుషులిద్దఱును గిమ్మనకుండ వేవేగ నడచి కొంతసేపటికి దోటలు దొడ్లు దాటి నాఁటు దారిని బోయి యూరి పొలిమేర నతిక్రమించి వెలుపలబడిరి.

''ఆహా! ఇన్నాళ్ళకు బ్రజలలోఁ బడఁగలిగినది! నడక మరిచిపోయి రెండేండ్లయినది. కమ్మని గాలి కఱవుదీర నేటికి లభించినది. ఇదిగో నేను నేలమీద నడుగుమోపి నడుచుచున్నాను. అదిగో మీద నాకాశము! అవిగో చుక్కలు! చెట్లు, పుట్టలు, చెరువులు, క్షేత్రములు నన్నియునవిగో! ఆహా! నేను ధన్యుడను! మరల వీనినన్నింటిని జూచి ఆనందించుచున్నాను. ఆయ్యో! ఏమిది? నాకాళ్ళు తడబడుచున్నవి! నడక యెఱుగని

వానివలె దప్పటడుగులు పడుచున్నవి. లేదు లేదు, రేపటికన్నియు నలవాటు పడఁగలవు. స్వాతంత్ర్యమలవడి నేను ధన్యుఁడనైతిననుకొనుచున్నానా? ఛీ! ఏమి ధన్యత? స్వాతంత్ర్యమున కాసపడి తుచ్ఛములైన ప్రాణము మీది తీపిచేత లోభించి కక్కుర్తిపడి సరళను బెండ్లియాడెదనని వాగ్దానము చేసి చెఱ వెడలి బయటపడితిని, నా ప్రాణేశ్వరి, నా బంగారు కీలుబొమ్మ, నాముద్దుగుమ్మ, నా దంత పాంచాలిక - నా విశాఖ - అయ్యో! ఏమివెట్టి? ఇంకెక్కడి నా విశాఖ? హా! ఈశ్వరా! ఎంత పనిచేసితివి? నాకీ స్వాతంత్ర్యమేల? ఈ సరళయేల; ఈ బ్రతుకేల? అయినను - పోనీ ఎట్లో కక్కుర్తిపడి స్వతంత్రుడనయితి ననుకొందము - ఏదీ స్వాతంత్ర్యము? ఒక యాడుదాని యాజ్ఞను మీరజాలక దాని వెంబడిని దాసుడనై నడుచుచున్నాను. ఇంతకన్న నికృష్టమైనపని, ఇంతకన్న నీచమైన బ్రతుకు, ఇంతకన్న సిగ్గుమాలిన నడువడి, ఇంతకన్న జేతకాని మగతనము లోకమునందుండునా? ఇది యెవ్వతె? నేనెవ్వఁడను? నేనా? దీని చెప్పు సేతలలోనా? లొంగి తిరుగుట! ఛీ! పో; నీ వెంబడి రానని మరలి పోదునా? పోవుట యెక్కడికి? ఇంకొకచోఁటికిఁబోవుటకు నాకెవ్వరు స్వాతంత్ర్యమిచ్చినారు? సరళ యిచ్చిన స్వాతంత్ర్యమును దుర్వినియోగము చేసినచో నాది మీసమా? నాది మగతనమా? మరలఁ జెఱసాలలోనికే పోదునా? అక్కడికి మాత్రమెట్లు పోఁగలను? సరళకుఁ జేసిన వాగ్దానమును మాత్ర మతిక్రమింపవచ్చునా? కూడదు. కాఁబట్టి యిప్పట్టునఁ బ్రాణ త్యాగము సేయుట సర్వోత్తమము. నా మాట మీఁది నమ్మికచేత నేనొక పెద్ద మానిసినే యనుకొని - పాపము - రామ రామ - సరళ - నన్ను బెండ్లియాడి సుఖపడవలెనని పుట్టెడాసతో నున్నది గదా! ఆడిన మాటను దప్పిపోవుటకన్న నీచమైనపని మఱిలేదు. ముందేమికానున్నదో కానీ; విశాఖపట్ల నేను ద్రోహిని గానుగదా? సరళపట్ల మాత్రమేల ద్రోహిని గావలయును? నాలుక జారినది; ఆఱు నూఱయినను నూఱాఱయినను సరళను బెండ్లియాడక తప్పదు. సరళ మాత్రము నాకుదగినది కాదా?'' అని ముందు నడుచుచున్న విగ్రహాము వంకఁ జూచి ''సరళయుఁ గన్యారత్నమే. మున్ను చెఱసాలలో దినదినమును జూచుచుండియు నేనప్పుడేమో యనుకొంటిని గాని యిప్పుడు నాకు మనోరంజన మొనరించుచున్నది. ఆహా! ఏమి సొంపయిన నడక! ఏమి ధైర్యము! తన కోరిక యీడేరునను సంతోషముతో నిర్భయముగా నన్ను వెంటఁబెట్టుకొని పోవుచు మాటిమాటికి మొగము వెనుకకుఁ ద్రిప్పి నావంక జూచుచు వేవేగ నడచిపోవుచున్న యీ నా సరళయొక్క సొరును తీవియు నేనెంతని కొనియాడుదును? నాలుగు దినములు నేర్పున దిద్దుబడి చేసితినా సరళ పట్టుపుదావి వంటి సౌకుమార్య సౌందర్య లక్ష్మీ విలాసములతోఁ బ్రకాశించును. మున్ను నా యెదుట బెదరుచు బెదరుకుఁ బులుకు పులుక్కునఁ జూచుచు నిలువంబడుట వలనఁ దెలిసినదిగాదు గాని యిప్పుడదిగో తీవితో నడచుచు నెంత సొగగానున్నదో! పొట్టిదనుకొన్నాను; కాదు పొడవరియే'' అని కళానిధి పరిపరివిధములఁ దలపోయు చుండఁగా వారు సింహాచల సమీపము నందున్న యడవివరమను గ్రామమును సమీపించిరి.

''మఱి రెండు మూఁడు గడియలలో మేమిద్దఱమును భార్యాభర్తలము గావలసియున్నదని దైవము వ్రాసియుండఁగా దానిని దప్పింప నెవ్వరితరము? ఆహా!

ఈశ్వర విలాసము! తానొకటి దలంచిన దైవమొకటి తలంచును గదా! విశాఖను బెండ్లియాడఁ దలంచుకొన్న నేను సరళను బెండ్లియాడఁ బోవుచున్నాను. కాని సత్యముగా విశాఖ నన్ను నిరాకరించి యింకొక్కని బెండ్లియాడినదా? ఇది నమ్మఁదగిన మాట గాదు. కాకేమి? నోరెఱుఁగని సరళ చెప్పినది; సత్యమే - సరళ స్వలాభమును గోరి బొంకినది గాదు గద - బొంకెననుకొందము; అయిననేమి ప్రయోజనము? ఈ రాత్రి సరళను బెండ్లియాడెదనని చేసిన వాగ్దానమో? మాట యిచ్చితిని; మఱి నా జిహ్వా తిరుగనేరదు. కాని విశాఖ యీ నిముషము నందిచ్చటికి వచ్చి నాయెదుట నిల్చి యిదిగో నేను నీ యెడల విశ్వాసము గలిగియున్నాను; రా; నన్ను బెండ్లియాడుమని పలికిన యెడల నేనేమి సేయవలసియుండును? బొంకులాడియని సరళను విడిచి సత్యవతియగు విశాఖను బెండ్లి యాడుదునా? సత్యవతియగు విశాఖను విడిచి నేను సత్యవ్రతుడనని బొంకులాడియగు సరళను బెండ్లియాడుదునా?'' అని కొంచెము సంశయించి ''లేదు; సరళనే పెండ్లియాడెదను'' అని నిశ్చయించుకొనునంతలోఁదన వెనుక నెవ్వరో నడచి వచ్చుచున్నట్లు చెట్ల క్రింది యెండుటాకుల మీఁది యడుగుల చప్పుడు వినంబడఁగా జప్పున వెనుక దిరిగి తమ వెనువెంట వచ్చుచున్న యొక స్త్రీ విగ్రహమును జూచి యిట్లనియె.

''సరళా యెవ్వతెయో మన వెంట నంటి వచ్చుచున్నది''

''రానీ నా పరిచారిక''

ఈ మాటలు చెవి బడఁగానే కళానిధి యొడలు పులకరించెను. ఆహా! సమయానుకూలముగా సరళ కంఠ స్వరమును మారినది! ముందింత మధురముగా సరళ మాటలు వినంబడలేదని తనలోననుకొనెను.

★★★

ఆకసము మబ్బులు లేక నిర్మలముగా నుండుట వలన స్వచ్ఛముగా బ్రకాశించు నక్షత్రముల వెలుఁగును వారు ముఫ్వురును గొండ మీఁదికి మెట్టదారిని గొంత దూరమెక్కిరి. ఇరుప్రక్కల యందును దలక్రిందుగా నీటి కాలువలు జలజలమని ప్రవహింప నిశ్చల గంభీరములగు పర్వత పార్శ్వములు కటిక చీఁకటులు గ్రమ్మి భయము నుత్పాదించుచుండెను. ఒక్కొక్కమాటు దవ్వు దవ్వుల ఘూత్కారమొనరించు గ్రుడ్లగూబల కంఠధ్వని మాత్రము నిశ్శబ్దతకు భంగము గలిగించుచుండెను. వారు మఱికొంత మీఁది కెక్కునప్పటికి బొదబొదమని రొద సేయుచు నెంతోమీఁది నుండి క్రిందనున్న బండఱాళ్ల పయింబడు ధారా పాత ధ్వని కర్ణ రంధ్రములలో నిండార నిండసాగింది. మఱికొంతసేపటికి దేవాలయ ద్వారము చెంత నర్చకుని కట్టెదుట నమ్ముఫ్వురును నిలువంబడి యుండిరి.

అర్చకుఁడును గుడి తలుపు దీసి దేవుని సన్నిధినున్న యఖండజ్యోతిని గొంచె మెగఁ ద్రోసి, వధూవరులు లోపలికి రావచ్చునని చెప్పఁగా ముందఱి వారిద్దఱును లోనికిఁ జనిరి; వెంట నంటి వచ్చిన స్త్రీ గుమ్మములో నిలువఁబడెను.

అంతట వధూవరులు సన్నపు టీ రెలుంగున నొండొరులకు వినంబడు నట్టు నిట్లనుకొనిరి.

''దైవ సాక్షికముగా నన్ను వరింపుడు''

''దైవ సాక్షికముగా నిన్ను వరించుచున్నాను''

అని కళానిధి తన వ్రేలి యుంగరమును దీసి నిండారంగ గప్పిన మేలి ముసుంగున నుండి దీపపుం గ్రీనీడ వంకకుఁజాచిన కాంతాహస్తకమలాంగులీ దళమునఁదగల్చి స్పర్శ సుఖమున బరవశుఁడయ్యెను.

మఱి రెండు గడియల కానూతన దంపతులను వెంట వచ్చిన కాంతయు నెప్పటి చొప్పుననే కొండమెట్లను దిగుచుండిరి.

ఆ దంపతుల హృదయములలో నదివఱకెన్నెన్నో సంశయములు బాధించుచున్నను గాంధర్వ వివాహమయిన యుత్తరక్షణము మొదలుకొని వారి హృదయములు నిర్మలములై శాంతి వహించినవి. ఎవ్వరి కంటనుబడకుండ వారు కొండ దిగిపోవలయునని యతి వేగముగా నడచి చిట్టచివర మెట్ల వరుసఁ జేరు సంతలో నలుగురు బంట్లు ఖడ్గపాణులై వారి కట్టెదుట నాలుగు బారల దూరమునఁ గనంబడి నిలువుఁడని భీకరముగా నదలించిరి. వారు తన్నుబట్టుకొనవచ్చిన రుద్రదేవుని భటులని నిశ్చయించుకొని స్త్రీలనిద్దఱిని దన వెనుక ప్రక్కను నిలిపి తాను ముందర నిలువంబడి నేను గళానిధిని; చెఱసాలలో నుండి తప్పించుకొని వచ్చితినని కదా మీరు నన్ను వెదకి పట్టుకొనవచ్చినారు. మీరిఁక నదలింపనక్కరలేదు; నేను మీతోడఁ జెఱసాలకు వచ్చెదను; నాతో గూడ నాభార్యయుఁ బరిచారికయునున్నారు; వారబలలు; వేవేగ నడువఁజాలరు; మెలమెల్లలనఁ బోవుదమని కళానిధి పలికెను.

నాధా వీరు నిన్ను బట్టుకొనరాలేదు; వధింపవచ్చినారు; అందుకని చేతిఖడ్గమును బెరికి పుచ్చుకొని వారిని వధింపుమని తన ప్రాణేశ్వరి రహస్యముగాఁ దన చెవిలోఁ జెప్పి చెప్పఁగానే చప్పునఁ గలియఁబడి కళానిధి వారిలో నొకనిని నేలం బడఁద్రోసి ఖడ్గమును జేతఁ జిక్కించుకొనఁబోఁగా వాఁడతని నొక నరుకు నరికెను. అంతటఁ దక్కిన ముగ్గురు భటులును దలపడిరిగాని తమ వాఁడెవడో కళానిధి యెవ్వఁడో చీఁకటిలో సరిగాఁ బోల్చఁ జాలక నరుక సంశయించి త్రోపులాడుచుండఁగా నేలంబడిన భటుని చేతి ఖడ్గమును గళానిధి భార్య పెరికి పుచ్చుకొని తన భర్తకందిచ్చి తానెడగలుగఁ దొలంగిపోవు నంతలోఁ గళానిధి ఖడ్గముతో నొకని తల నరికెను. నేలంబడియున్న భటుడంతటఁ బట్టు తప్పించుకొని లేచి చచ్చిన వానిచేతి ఖడ్గము నందుకొని తన చేతి ఖడ్గమును బెరికినదను కోపము చేతఁ బ్రక్కను నిలువంబడియున్న కాంతను నరుకబోవఁగా బరిచారిక యడ్డుపడి స్త్రీ హత్యసేయరాదని మొఱవెట్టుచున్నను వాఁడు తన కత్తితో నరికెను. ఆనరుకు గురిదప్పి పరిచారిక భుజమునఁదగిలి పరిచారిక నేలంబడెను. అంతటఁ గళానిధి తనకుఁ దగిలిన నరుకును లక్ష్యపెట్టక భటులు ముగ్గురితోను హోరా హోరీగాఁ బోరాడఁ దొడంగెను. నేలంబడిన పరిచారికను గళానిధి భార్య తన చేతులతో లేవనెత్తి నిలువఁబెట్టి జూచెను గాని నరుకు బలముగాఁ దగిలి రక్తము జొటజొటఁగారుట వలన స్పృహ దప్పి యున్నదని

గ్రహించి తాను జేరువఁ గూర్చుండి మెల్ల మెల్లనఁదన యొడిలోఁ జేరఁదీసి కూర్చుండఁ బెట్టుకొనెను. కళానిధి యింతలో నిద్దఱిని వధింపఁగా మూఁడవవాఁడు వెనుకపాటున నతని వెన్నున నొక నరుకు నరికి పారిపోసాగెను. కళానిధి కదివఱకే మూఁడు నరుకులు దగిలి యుండుట వలన నీ నాలుగవ నరుకునకు నేలంబడెను. తన భర్త నేలఁబడుట జూచి యాతని భార్య తన యొడిలోని పరిచారికను మెల్లఁగా నేల దించి చప్పున డాసి స్పృహ దప్పి పడియున్న భర్తను నేవదీయునంతలో బారిపోయిన భటుఁడు తన కెదురుగా వచ్చు గుఱ్ఱములను బూన్చిన బండి దీపములను జూచి మరల వెనుకఁ దిరిగి కళానిధి పడియున్నచోఁటికిఁ బరుగెత్తికొని వచ్చుచుండెను. అంతట నామె తన భర్త చేతిలోని ఖడ్గమును దీసి చేతఁ బట్టుకొని వాని నెదుర్కొని నరికి చంపెను.

* * *

''ఇది చెఱసాల వలెఁ గనఁబడదు, కాఁబట్టి యిది స్వప్నమే'' అని కళవళపడుచుఁగళానిధి లేచి కూర్చుండఁ బోయెను గాని గాయముల బాధచేత లేవలేక మరలఁ బాన్పునఁబడెను. తన చెంత నొక కాంతామణి నిలిచి తన మోమున మోముఁ జేర్చియుండుటను గన్నులారఁ జూచెను.

''స్వప్నము గాదు; మీరు మేల్కొనియే యున్నారు''

''ఏమీ? సత్యమేనా?''

''సత్యమే''

''అసంభవము''

''ఎందుచేత?''

''నాతో విశాఖ మాటలాడుచున్నట్లున్నది''

''విశాఖ మీతో మాటలాడఁగూడదా?''

''పెండ్లియాడినది గనుక--''

''అవును; పెండ్లియాడినది''

''ఇది విశాలమొక్కమందరిమైన ఎడల''

''ఇది విశాఖ యొక్క భర్త మందిరమే యగును''

''అట్లయిన నేనిక్కడ నేమి సేయుచున్నాను?''

''నిన్నటి రాత్రి కథ మీకు జ్ఞాపకమున్నదా? సింహాచలము - అక్కడి-''

''ఆ కథా! జ్ఞాపకమున్నది; కత్తులతోఁ బోరాడుట! ఆహా! ఎంత భయంకరమయిన-''

''వద్దు; దానియూ సెత్తకండి. మీ దేహమున నాలుగు నరుకులున్నవి.''

''ఇంతేనా? ఉండు - నాకింకొకటి జ్ఞప్తికి వచ్చుచున్నది - స్త్రీహత్య - ఘోరము-''

''లేదు లేదు; సరళ బ్రతికియున్నది. మా తండ్రి మిమ్ము వధింపఁబంపిన భటులలో నొకఁడు సరళను నరికెను గాని సరళ ప్రాణమున కపాయము రాలేదు.''

''సంతోషమే; కాని సరళ యెక్కడనున్నది?''

''ఆవలి గదిలో క్షేమముగా నున్నది''

'రుద్రదేవుడు నన్నేల చంపఁబంపినాడు?''

''మీరెఱుగరా?''

''అవును నేను నిన్ను వలచియుంటినని నామీఁదఁ గోపము.''

''ఇప్పుడు నామీఁద మీకు వలపు లేదా? అయ్యో యిట్టి మాటలను భార్య విని సహించఁగలదా?''

''నీవు నా భార్యవైయున్న యెడల సహింపఁజాలవు; కాని-''

''నాథా నేను నీ ధర్మపత్నిని. నిన్న రాత్రి మీరు నన్ను సింహాచలమునఁ గోవెలలోఁ బెండ్లియాడినారు.''

''ఇఁక నిస్సందేహముగా నిది స్వప్నమే. ముందెట్లు మేలుకొనఁగలనో కాని-''

''మీరు నిన్న రాత్రి సరళను బెండ్లియాడితిమనుకొనుచున్నారు. ఇప్పుడు మీరు కలగనుచుండుట లేదు; నిన్నరాత్రి మీరు కలగన్నారు. నిండారఁగప్పిన మేలి ముసుంగు వలన నన్ను మీరు చూడలేదు. సన్నపు టెలుంగున మాటలాడుట వలన నన్ను మీరు పోల్చుకోలేదు. దేవాలయమున మనమై దైవసాక్షికముగా గాంధర్వ వివాహమును జేసికొన్నాము. ఇదిగో మీరిచ్చిన యుంగరము. సరళ మిమ్ము వలచి నేను బెండ్లియాడితినని మీతో బొంకినదిగాని తుదకుఁదన తప్పును దానొప్పుకొన్నది. సరళకు మారుగా నేనుండ నిశ్చయించుకొన్నాము. మీ చెఱసాల తలుపును నేనే తీసితిని. మన వెంట వచ్చిన పరిచారిక సరళ. నన్నే మీరు పెండ్లియాడితిరి. రాత్రి మనము కొండ దిగినప్పటికి నా బండివచ్చి యుండెనేని మీకును సరళకును గాయములు దగులకపోను. మించినపనికిఁ జేయవలసినదేమున్నది? ఇది నా మందిరము గాఁబట్టి మీదే. మీరును సరళయు స్మృహ దప్పి యుండఁగా నాబండిలో నెక్కించి మిమ్మిచ్చటికిఁ దెచ్చితిని. నాథా నా మనవి నాలించి మనకొఱకుఁ బ్రాణహానికి సిద్ధపడిన సరళను గూడ మీరు వివాహమాడి మీ సత్యవ్రతమును రక్షింపవలయును.''

అని విశాఖ విన్నవించగానే నా ప్రాణేశ్వరీ నిన్ను గవుఁగిలించికొని ప్రత్యుత్తరమియ్యఁదలంచుచున్నాను గాని గాయములు బాధించుచున్నవి; లేవలేనేమి సేయుదునని కళానిధి వచింప - విశాఖ నాథా వద్దు వద్దు లేవకండి; నేనే మీ చెంతఁ బరుండి నా బాహువు నొకదానిని మీకుఁదలగడగానుంచి రెండవ బాహువునఁ గవుఁగలించుకొని మీ ప్రత్యుత్తరమును విని శిరసావహించుకొందునని యా తీరున నొనరింపఁగాఁ గళానిధి కన్నుల బాష్పములొలుక ''మంచిది'' అని ప్రత్యుత్తరమిచ్చెను.

★★★

విశాఖయు సరళయు దమ భర్తయగు కళానిధితోఁ జిరకాలము సకల సౌఖ్యముల ననుభవించి కాంతా తిలకములని ఖ్యాతి వహించిరి.

(కల్పలత - సంపుటం 2; సంచిక 2; 1904)

'విశాఖ' చిన్న కథ అని అన్నిరకాలా చెప్పవచ్చు. ఇది 1904లో అనగా దిద్దుబాటును గురజాడ రాయడానికి ఆరేళ్ళముందు ఆచంట సాంఖ్యాయన శర్మగారు రచించారు. ఆయన తన పత్రికలో చిన్న కథలకు కావలసిన లక్షణాలను పాటిస్తూ ఒకటికాక, పెక్కు కథలు ఆ రెండేళ్ళలో రాశారు. ఆయన పూర్వపక్కీలోనే రాయవచ్చుగాక. గురజాడ కూడా దిద్దుబాటు కథను మొదట గ్రాంథిక వాసనలతో అరసున్నాలు పాటిస్తూ రాసి 1910 ఫిబ్రవరి నెల 'ఆంధ్ర భారతి'లో ప్రచురించారు. తరువాత దానిలోని గ్రాంథిక ఛాయలు తొలగించి చిన్నమార్పులతో తిరగరాశారు.

సాంఖ్యాయన శర్మగారి ప్రభావం గురజాడ పైన ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉంటే తప్పులేదు. తమ సమకాలపు పత్రికలలో వెలువడేవాటికి స్పందించడం సాహితీపరుని సద్గుణం. గురజాడ సద్గుణాలు ఎక్కువగా ఉన్న రచయిత. సాంఖ్యాయన శర్మగారి 'విశాఖ' మొట్టమొదటి తెలుగు కథానిక అయినంత మాత్రాన గురజాడ గురుపీఠానికి చలనం లేదు. ఆయన ఇంకెన్ని విషయాలలోనో ఆద్యుడు. ఆయన ప్రభావం గొప్పది. చింతాదీక్షితులుగారు గురజాడ అడుగుజాడలలో నడచి తెలుగుకథకు గొడుగు నీడ పట్టిన తొలితరం సిద్ధహస్తులు. గురజాడ గురించి ఇలారాశారు.[2]

''చిన్న కథలు వ్రాస్తున్నవారు. ఈ కాలమున చాలామంది ఉన్నారు. ఆంధ్ర జీవితమును ఉన్నదున్నట్లుగా చెప్పినవారు అప్పారావుగారు కదా! వారివలెనే ఆంధ్ర జీవితమును చిన్నకథల ద్వారా వెల్లడి చేసేవారు కొద్దిమందే కలరు. అప్పారావుగారు ఇంకా కొన్ని చిన్నకథలు వ్రాసి ఉన్నట్టయితే సరియైన ఆదర్శము నేటి కథకులకు దొరికి ఉండేది. బెంగాలీ జీవితమునూ, ఆంగ్ల జీవితమునూ, తెలుగుపేర్లు పెట్టుకొన్న పాత్రల సహాయముతో కథలలో వెల్లడి చేసేవారు ఆంధ్రసారస్వతానికి ఉపకారము చేయడము లేదు.''

అయితే గురజాడ అప్పారావుగారు రాసిన కొద్దికథలే మార్గదర్శకాలై సత్ఫలితాలను సాధించాయి. తెలంగాణాలోనూ, కోస్తా జిల్లాలలోనూ యువకులు కథానికా ప్రక్రియను చేపట్టారు. ఆంధ్ర భారతి, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు, సాహితి, సుజాత, శారద, భారతి మొదలైన పత్రికలలో వివిధ రీతులలో కథలు ప్రచురితం కాజొచ్చాయి. తొలినాళ్ళలో ఆనాటి రచనా పద్ధతి అయిన సరళగ్రాంథికమే ఫ్యాషను కనుక ఈ కథకులు ఆ శైలిలోనే రాశారు. 'సాహితి' ఆవిర్భవించాక చాలామంది వాడుకభాషను చేపట్టారు. జమీందారీ యుగంలో చిన్న కథలను రచించిన కథకుల గురించి తెలియవచ్చినన్ని వివరాలతో చెప్పుకొందాం.

ఆచంట వెంకటరాయ సాంఖ్యాయనశర్మ (1864-1933)

శర్మగారిది శ్రీకాకుళం జిల్లాలో నాగావళీ నదీ తీరాన ఉన్న మేరంగగ్రామం స్వస్థలం. 1878లో మిడిల్ స్కూల్ పరీక్షలో చెన్నరాజధాని అంతటికీ ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. సంస్కృతాంధ్రాలనే కాక వేదశాస్త్రాలను కూడా స్వయంకృషితో

2. 'శ్రీగురజాడ అప్పారాయకవి' - చింతా దీక్షితులుగారి వ్యాసం. భారతి - డిసెంబరు, 1932

నేర్చుకొన్నారు. 1884లోనే శతావధానాలు చేశారు. నాటకాలను రచించి, నాటకాలు ఆడించేవారు. మొదట ప్రమోదిని అనే పత్రికను నడిపారు. తరువాత 'కల్పలత'ను స్థాపించారు. ఇది 1903 నుండి మూడేళ్ళు నడిచింది. మళ్ళా 1921లో ప్రారంభమైంది. శర్మగారి పత్రికలలో వారి రచనలే తప్ప మరెవరి రచనలూ ఉండేవికావు. శర్మగారు గొప్ప వక్తకూడా. భరతనాట్య శాస్త్రాన్ని అనుసరించి నాటక సర్వస్వం అనే గ్రంథాన్ని రచించారు. రహస్య దర్పణం అనే పేరుతో విజ్ఞాన విషయిక వ్యాస సంపుటాన్ని కూడా వెలువరించారు. 1923లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సాంవత్సరిక సభకు అధ్యక్షులు. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. శర్మగారు సంస్కృత నాటకాలను అనువదించడమేకాక స్వతంత్ర నాటకాలు కొన్ని రచించారు. వీరి కథలు ఏవీ గ్రంథరూపంలో రాలేదు.

మాడపాటి హనుమంతరావు (1885-1970)

గురజాడ తన కథలను ప్రచురించిన ఆంధ్ర భారతిలో 1910లోనే రచనలు చేసిన తొలి కథకులలో 'ఆంధ్రపితామహ' మాడపాటి హనుమంతరావుగారు ప్రముఖులు. కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోని కొక్కునూరు గ్రామంలో జన్మించిన హనుమంతరావుగారు మెట్రిక్యులేషన్ ప్యాసయ్యాక హనుమకొండలో విద్యాశాఖలో ఉద్యోగం చేస్తూ చివరకు న్యాయవాద వృత్తిలో చేరారు. హనుమకొండలో రాజరాజనరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం, హైదరాబాదులో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' స్థాపకులో, అభివృద్ధికి పాటుపడినవారిలో హనుమంతరావుగారు ప్రముఖులు. తెలంగాణాను జాగృతం చేశారు. సాంఘిక రాజకీయ విషయాలపై రచనలతోపాటు సృజనాత్మక సాహిత్యాన్ని కూడా రాశారు. 1910 నుంచి వారు రచించిన ఏడు కథలు 1915లో 'మల్లికాగుచ్ఛము' అనే సంకలనంగా గ్రంథరూపంలో వచ్చాయి. దీనిని మచిలీపట్నంలోని సరస్వతీ నికేతనం వారు ప్రచురించారు. 'హృదయశల్యము' అనే చారిత్రకకథను 'నేనే' అనే సాంఘిక కథను ఆయన స్వతంత్రంగా రాశారు. వీటిలో నాలుగు కథలు 'ఆంధ్రభారతి'లో, ఒకటి కృష్ణాపత్రికలో ప్రచురణ పొందాయి. మిగతా అయిదు కథలూ ప్రేమ్‌చంద్ కథలకు ఉర్దూనుండి చేసిన అనువాదాలు. ఆ కథలపేర్లు చూడండి.

1. హృదయశల్యము - స్వతంత్ర కథానిక
2. నేనే - స్వతంత్ర కథానిక
3. రాణీ - సారంధా - అనువాదం
4. ముసలిదానియుసురు - అనువాదం
5. అగ్నికుండలు - అనువాదం
6. నాడు నీ పంతము - నేడు నా పంతము - అనువాదం
7. ఆత్మార్పణము

ఈ ఏడు కథలు మాత్రమేకాక మరికొన్ని కథలు కొత్తగా రాసి అన్నీ తర్వాత సంకలనంలో చేర్చారు. వాటి వివరాలు ఇవి.

8. దధిప్రేరణము – హైదరాబాదు అణా గ్రంథమాల ప్రచురణ
9. న్యాయమా – సుజాత, శారద, భారతి పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తారీఖులు తెలియవు.
10. ఎవరి తప్పు?
11. ఇక కావలసినది ఏమి?

మాడపాటి హనుమంతరావుగారికి కథానిక రచనా చాతుర్యం ఉంది. 'నేనే' అనే కథలో గణపతిరావు అనే న్యాయవాది నాయకుడు. బాగా ఆర్జిస్తాడు. భార్య ఉంది. యోగ్యురాలు. గణపతిరావు 'నేను లోభినా?'' అని వితర్కించుకొని ఇలా సమాధానం చెప్పుకొన్నాడు:

''వందల కొలది రూప్యములు పాడుచేసి నేను పెద్ద ఇల్లు బాడుగకు తీసికొనలేదఁట నా ఇంటిలో వ్యర్థముగ సోఫాలును, కురిచీలును, మూల మూలలఁబడి మూల్గుచుండ లేదఁట! నేను రెండు గుఱ్ఱముల 'బ్రూహాము' బండిని నుంచుకొనలేదఁట! పనిపాటలులేక కునికిపాట్లు పడుచుండు నౌకరులు నాఇంటిలోఁ బదిమంది లేరఁట! కనుక నేను లోభినఁట! దక్షిణాఫ్రికా భారతీయుల నిధికి నేను ధన సాహాయ్యము చేయకపోవుటకుఁ గారణములు గలవు. గాంధీ యవలంభించిన మార్గము జయప్రదమగునది కాఁజాలదని నేనియ్యలేదు. బందరు జాతీయ కళాశాలలోఁ జెప్పువిద్య దొరతనము వారి నిబంధనల ననుసరించినది కాదు. కనుక దానిలోఁ జదువు వారికి ముందు మంచి యాశలు లేవని తలంచి నేనా విద్యాలయమునకు సాహాయ్యము చేయలేదు. ఆంధ్ర రాష్ట్రోద్యమము మనదేశీయులలో నంతః కలహమును బుట్టించునది కావున నది నాయామోదమును బొందలేదు. కాకున్నచో నేను వీనికిని ద్రవ్య సహాయము చేసి యుండనా? యని కొన్ని వేళలను, 'లోభిలోభి' యని యోర్వలేని వారు కొందఱు నన్ను నిందించుచుందురే! తత్త్వము విచారించినచో లోభి యేకారణము వలన దూష్యుడో తెలియరాకున్నది.''

ఇటువంటి గణపతిరావు ఒకనాడు శ్రావణమాసంలో తన యొంటి గుర్రపు బండెక్కి పురోద్యానమునకు వెళ్ళి ఒకచోట కూర్చున్నాడు. తోటలో పనిచేసే తోటమాలి వచ్చి అతనికో ఉత్తరం ఇచ్చింది. గణపతిరావు సుగుణాలను మెచ్చుకొన్న ఒక జవ్వని అతనికి ప్రేమలేఖ రాసింది. మర్నాడు రాత్రి కృష్ణా థియేటరులో తనను కలుసుకోమంది. గణపతిరావు ఆనందం చెందాడు. మర్నాడు షాపుకు వెళ్ళి ''సిల్కు కమ్సాటు, ఇమ్రూ బట్టలు, అత్తరుబుడ్లు, సెంట్లు' కొని ఇంటికి వచ్చాడు. భార్య దుకాణంలో ఇంకేమైనా మిగిలి ఉన్నాయా? అని పరిహాసం చేసింది. ఆరాత్రి గణపతిరావు థియేటరుకు వెళ్ళాడు. నాటకం అయిపోయాక, అంతా వెళ్ళిపోయాక ఆవరణలో ఒక మూల ముసుగు కప్పుకొని చెట్టుకింద తనకోసం కాచుకొని ఉన్న స్త్రీ మూర్తి దగ్గరకు వెళ్ళాడు. తన ప్రేమ ఒలకపోశాడు.

''అంతనామె మెల్లగాఁ దనముసుగును దొలగించెను. కొంతదూరమున నుండిన దీపకాంతి యామె ముఖమునఁ బ్రసరించెను. గణపతిరావు మోము వెలవెలఁబాఱెను.

కాళ్ళు వడఁక సాగెను. కొంతసేపటికి ధైర్యము తెచ్చుకొని యెండిన పెదవులను గొంతకష్టముతోఁ దెఱచి యనెను. 'ఈ కొంటెతనము చేసినది నీవేనా?'' ముసిముసి నవ్వుతో గడుసుదనము దోప హైమవతి యనెను,'' నేనే''.

ఈ కథను హనుమంతరావుగారు రచించిన తేదీ లభ్యం కాలేదుగాని గురజాడ సజీవులుగా ఉన్నప్పుడే ఆయన కథలు పడిన ఆంధ్రభారతిలోనే రచనలు ప్రకటిస్తున్నప్పుడే రాశారు. గురజాడ దిద్దుబాటుకు, హనుమంతరావుగారి 'నేనే'కు పోలికలు ఉన్నాయి. అపమార్గాలలో పడ్డ భర్తను భార్యలే సంస్కరించుకోవాలన్నది ఇద్దరి ఉద్దేశం. అయితే గురజాడది ఒక సాంఘిక దురాచారానికి లోనవుతున్న భర్తను సంస్కరించే కథ. హనుమంతరావుగారిది ఒక వ్యక్తిగత లోపాన్ని దిద్దే ప్రయత్నం. గురజాడ సీరియస్ విషయాన్ని హాస్యంతో మిళితం చేశారు. హనుమంతరావుగారు భార్యచేత కొంటెపని చేయించి బుద్ధి చెప్పించారు. ఏది ఏమైనా గురజాడ 'దిద్దుబాటు' వెలుగుచూసిన కొన్ని రోజులలోనే 'నేనే' వంటి కథకు ప్రేరణ కలిగిందంటే ఆ ప్రభావం తక్కువదేమీ కాదు.

మాడపాటి హనుమంతరావుగారు రాజకీయ, సాంఘిక ఆంధ్రోద్యమాలకు ఎక్కువకాలం వెచ్చించి సృజనాత్మక రచనలు తక్కువగా చేశారు.

చింతా దీక్షితులు (1891-1960)

విద్యాశాఖలో ఉద్యోగాలు చేస్తున్నా జీవితమంతా రచనా వ్యాసంగానికీ, అందులోనూ సృజనాత్మక రచనలకు అంకితం చేసిన వ్యక్తి దీక్షితులుగారు. 1919లో 'సాహితి' అనే పత్రిక మొదటి సంచిక వెలువడిన నాటినుంచి దీక్షితులుగారు సాహితి సమితి సభ్యులకు అన్నగారు. ఆ మొదటి సంచికలో 'నాకొడుకు' అనే చిన్నకథను వారు రచించారు. నాటినుంచి ఆయన వ్యావహారిక భాషలో ఎన్నో కథలు రాశారు. ఎందరి చేతనో రాయించారు. (ఉదాహరణకు చలం కథలను దీక్షితులుగారే మొదట సాహితిలో వేయించారు) జమీందారీ యుగంలో ఎన్నో కథలు రచించి దీక్షితులుగారు 'కథక చక్రవర్తి' అనే బిరుదును సహచరుల వల్ల పొందారు. వారి కథలు వివరాలు కొన్ని చూడండి.

నా కొడుకు - 1919 - సాహితి
స్వకీయ చరిత్ర - 1920 - సాహితి
గ్రహపాటు - 1920 - సాహితి
సుగాలీ కుటుంబం - 1920 - సాహితి
చెంచు దంపతులు - 1922 - సాహితి
అగ్రాసనాధిపత్యం - 1924 - సాహితి
ఊరిపేరు - 1924 - సాహితి
చదువుసంధ్యలు - 1924 - భారతి, జూలై
తాటివనంలో - 1925 - సఖి
చెంచురాణి - 1925 - సఖి

అభిప్రాయభేదము - 1925 - సఖి
మనిషికోతి - 1925 - భారతి, జనవరి
కనరాని కష్టాలు - 1925 - భారతి, ఫిబ్రవరి
దేశభక్తి - 1928 - భారతి, సెప్టెంబరు

జమీందారీ యుగంలో దీక్షితులుగారు రచించిన కథల పట్టిక మాత్రమే ఇది. ఈ కాలంలో స్కెచ్, వ్యాసం, గేయం మొదలైన ప్రక్రియల్లో కూడా ఆయన రచనలు చేశారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు తెలుగు హరిజనులమీద నవలరాస్తే చింతా దీక్షితులుగారు తెలుగు గిరిజన, వనజనులపై కథలు రాశారు. వారి చెంచు దంపతులు, సుగాలి కుటుంబం, చెంచురాణి మొదలైన కథలు గిరిజనుల పట్ల వారికున్న అభిమానాన్ని తెలియచేస్తుంది. ''అడవిజాతి వాళ్ళను అడవిని అనుభవించవద్దనడం పిల్లను తల్లి ''నీవు పాలు తాగరాదనడమే' అని 'సుగాలి కుటుంబం' అనే కథలో చెప్పారు. ఫారెస్టు ఆఫీసర్ల దారుణాలు, గిరిజనుల సాయుధ పోరాటాలు 'చెంచురాణి'లో సూచనప్రాయంగా ధ్వనించారు.

1925లో 'ఏకాదశి' అనే పేరుతో దీక్షితులుగారి పదకొండు కథల సంపుటం ఒకటి వెలువడింది. సాహితీ సమితి సభాపతి శివశంకరశాస్త్రిగారు దీనికి పీఠిక రాశారు. దీక్షితులుగారు ఇతర ప్రక్రియలలో చేసిన కృషి గురించి, మిగతా కథల గురించీ, ముఖ్యంగా బాల వాఙ్మయానికి వారు చేర్చిన కొన్ని సొగసుల గురించి ఆధునిక యుగంలో చెప్పుకొందాం.

వేలూరి శివరామశాస్త్రి (1892-1967)

తిరుపతి వెంకట కవుల ప్రియశిష్యునిగా, ఇరవై సంవత్సరాల వయస్సు కూడా నిండీ నిండని వయస్సులో గుంటూరులో ఛాలెంజిగా సంపూర్ణ శతావధానాన్ని 1911లో దిగ్విజయంగా చేసి గురువుల పేరు నిలబెట్టి, పండితుల, సహృదయుల ప్రశంలందుకొన్న వేలూరి శివరామశాస్త్రిగారు 1925 నుండి చిన్నకథలు మొదలుపెట్టారు. నూరుమంది అడిగిన విషయాలపై అప్పటికప్పుడు కల్పనలు చేసి కోరిన ఛందంలో పద్యాలు చెప్పగల నిపుణునికి ఏ ప్రక్రియ అయినా సులభసాధ్యమే. ఆనాటి చాలామంది సాహితీపరులలాగ శివరామశాస్త్రిగారు కూడా కథ, కవిత, పరిశోధన, వ్యాసరచన, విమర్శ, ప్రాచీన గ్రంథ పరిష్కరణ మొదలైన ఎన్నో విధాల రచనా వ్యాసంగం చేశారు. అయితే చేపట్టిన ప్రక్రియలో శిల్ప నైపుణ్యం కరతలామలకం చేసుకొనడం వారికి చేతనైన చర్య.

భారతి మొదటి సంచికలో 1924లో టాల్‌స్టాయి నాటక రచన అనువాదంతో ఆయన నవ్యసారసత్వత ధోరణి ప్రారంభించారు. జమీందారీ యుగంలో వారు రచించిన కథల వివరాలు ఇవి.

కృతి	1925	భారతి, మార్చి
జన్మాంతర సంబంధం	1926	భారతి, సెప్టెంబరు

సౌందర్యోపాసకుడు	1926	భారతి, అక్టోబరు
చంద్రిక	1927	భారతి, జనవరి
అతిథి దేవుడు	1927	భారతి, మార్చి
కామకవి	1927	ఆంధ్రపత్రిక, ప్రభ ఉగాది సంచిక
పద్మాక్షి	1927	భారతి, జూన్
వావి	1928	భారతి, మార్చి
ప్రౌఢా పరివ్రాజక విలాసము	1928	ఆంధ్రపత్రిక విభవ - ఉగాది సంచిక
దత్తు	1928	భారతి, ఏప్రిల్
సదాచారము	1928	భారతి, జూన్
దర్జా	1928	భారతి, జూలై
క్షమాపణ	1928	భారతి, అక్టోబరు
పెంపుడు చిలక	1928	భారతి, నవంబరు
వ్యత్యయము	1929	భారతి, జనవరి
మూడు తమాషాలు	1929	భారతి, మార్చి
వెలి	1929	భారతి, ఏప్రిల్

శివరామశాస్త్రిగారి కథలు చాలా మట్టుకు భారతిలోనే ప్రచురణ పొందాయి. కొన్ని ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో వెలువడ్డాయి. వారి కథలలో వైవిధ్యముంది. భాష సరళగ్రాంథికం అయినా వ్యావహారిక భాష ఛాయలు కనబడతాయి. సమకాలిక విషయాలపైన రాస్తున్నా, ఎన్నెన్నో తాత్విక విషయాలు కూడా ప్రసంగవశాత్తూ చర్చిస్తారు. జమీందారీ యుగంలో ఈ రచనలేకాక ఆధునిక యుగంలో చాలా కథలు రాశారు. వారి కథలన్నీ గ్రంథరూపంలో రాలేదు. 'కథాషట్కము', 'కథాసప్తకము' అనే రెండు సంకలనాలు మాత్రం వెలువడ్డాయి. వాటిలోని కథలన్నీ మణిపూసలు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961)

చిన్న కథకు పెద్దపీట వేసిన వాళ్ళలో శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారు మొదట లెక్కకు వస్తారు. తమ రచనా వ్యాసంగం ఇతర ప్రక్రియలతో ప్రారంభించినా 1915 నుండి శాస్త్రిగారు చిన్నకథ తమ భావాల వ్యక్తీకరణకు అనువైన ప్రక్రియ అని గుర్తించారు. గోదావరి జిల్లాలోని బ్రాహ్మణ కుటుంబాలలోని సమస్యలు ఎక్కువగా చిత్రించే కథలు రాసినా గ్రామీణ జీవితంలో ఇతర కులాలతో ఉన్న సంబంధాలను బాగా విశదం చేయగలిగారు. వారి మొదటి కథ 'ఇరువురమొక్క చోటికే పోదము' ఇందులో పల్లెటూరిలో రెడ్ల కుటుంబ సంప్రదాయాలు చిత్రించారు. మంచి కథకుడు సమాజంలో చూడవలసినవన్నీ చూసి, చెప్పవలసినంతే చెప్తాడు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథల్లో ఆ సుగుణముంది. జమీందారీ యుగంలో వారు ప్రచురించిన చిన్న కథల వివరాలు చూడండి :

ఇరువురమొక్క చోటికే పోదము	1915
అన్నపూర్ణ	1920

సుభద్రమ్మ	1922–23
రామలక్ష్మి	1923
వెలిపెడితే అల్లుడైనాడు	1923
జన్మానికల్లా వకటేముద్దు	1923
పోలీసు	1924
మేనరికము తప్పలేదు	1924
జూనియరూ కాదు - అల్లుడు	1924
క్రిందికా? పైకా?	1924
రావులయ్య	1924
ఆడాళ్ళని పెంచకూడదు	1924
పూర్ణిమ - అమావాస్య	1924
ముందు హాలాహలము - පిదప అమృతము	1924
నా నీడ చూసుకునే నేను జంకేను	1924
చీకటి వెలుగు	1924
నలుగుర్ని పోషిస్తున్నానిప్పుడు	1924
పుల్లంరాజు - (1)	1924
తాహతుమాలిన పరుగు	1924
ప్రణయతపస్సు	1924
రాచదంపతులు	1924
కన్యాశుల్కము - వరశుల్కము	1925
వయస్సూ బుద్ధీకూడా పెరుగుతాయి	1925
బుచ్చి వెంకయ్యమ్మ	1925
పుల్లంరాజు (2)	1925
ఆశాభంగము	1925
నిలువుచెంబు	1925
ఏ-క్క-డా లంగరందలేదు	1925
తులసి మొక్కలు	1926
తనదాకా వచ్చింది	1927
గూడుమారిన కొత్తరికం	1927
సముద్రమునందలి మంచుకొండలు	1927
వట్టిపట్టుదల తప్పయేమీలేదు	1927
మార్గదర్శి	1928 (1947లో పెంపు)
యావజ్జీవం హెూష్యామి	1928
కచ్చితమైన జవాబు	1928
సాగరసంగం	1931

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథలు 1920 నుండి ప్రబుద్ధాంధ్ర, రెడ్డిరాణి, భారతి, ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలు, అభ్యుదయ, సుభాషి మొదలైన జమీందారీ యుగంలోని పత్రికలలో ప్రచురితమవుతూ ఉండేవి. 'పూలదండ' అనే పేరిట శాస్త్రిగారి కథలు సంకలన రూపంలో వెలువడ్డప్పుడు పందిరి మల్లికార్జునరావుగారి పత్రిక 'సుభాషి'లోనూ, ఇతర పత్రికలలోనూ విమర్శలు, సద్విమర్శలు కూడా వెలువడ్డాయి. ఈయుగంలో శాస్త్రిగారు రచించిన అన్ని కథలూ ఇప్పటికీ పుస్తకరూపంలో రాలేదని, ఏయే కథలు అలా పత్రికలలో మాత్రమే మిగిలిపోయాయో డాక్టరు చామర్తి కనకయ్యగారు తమ సిద్ధాంత వ్యాసంలో తెలియచేశారు.[3]

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఆధునిక యుగంలో కూడా రచనలు చేశారు. వాటి గురించి తర్వాత చెప్పుకొందాం.

అడవి బాపిరాజు (1895-1952)

అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేసి గాయకుడు, చిత్రకారుడు అని కూడా పేరు తెచ్చుకొన్న అడవి బాపిరాజుగారు రాజమండ్రిలో ఆస్వాల్డుకూల్డ్ శిష్యునిగా సాహిత్యంలోనూ, చిత్రకళలోనూ ప్రావీణ్యం సంపాదించారు. బి.యే., బి.యల్. చదివారు. 1920 సత్యాగ్రహంలో జైలుకు వెళ్ళారు. అక్కడే సాతవాహనుల కాలం నాటి కథలు తీసుకొని తమ సుప్రసిద్ధ ఆంధ్ర చారిత్రక నవలను 'హిమబిందు' రచన ప్రారంభించారు. 'హిమబిందు' 1924 నుండి 1925 దాకా 'శారదా' పత్రికలో వెలువడసాగింది. నూరు అధ్యాయాల ఈ బృహన్నవల ఉత్తరోత్తరా పూర్తయి పుస్తకరూపంలో వచ్చింది. నవలాకారునిగా బాపిరాజుగారు ఆధునికయుగంలో పేరు తెచ్చుకొన్నారుగాని; కవిగా, చిత్రకారునిగా, కథారచయితగా ఆయన జమీందారీయుగంలో లబ్ధప్రతిష్ఠులయ్యారు. వారి కథల వివరాలు ఇవి :

పేరులేని పాప	1924	భారతి, ఆగస్టు
యుగముల నుండి నీకొరకు కనిపెట్టుకొని యుంటిని	1925	ఆంధ్రపత్రిక క్రోధన ఉగాది సంచిక
నాగరాజు	1927	భారతి, జనవరి
నరపతి	1927	ఆంధ్రపత్రిక, ప్రభ - ఉగాది సంచిక
గుడ్డిపిల్ల	1929	భారతి, నవంబరు

'అంజలి', 'రాగమాలిక', 'తరంగిణి' అనే పేర్లతో బాపిరాజుగారి కథల సంపుటాలు వెలువడ్డాయి. విశ్వనాథ కిన్నెరసాని పాటలకు, నండూరి ఎంకి పాటలకు చిత్రాలు వేశారు. అవి ఆ గ్రంథాలలో అచ్చుపడ్డాయి. బాపిరాజుగారి సాహిత్యాన్ని ఆధునిక యుగంలో అంచనా వేసుకోవాలి.

---

3. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు - సమగ్ర సమీక్ష

మునిమాణిక్యం నరసింహారావు (1898–1975)

కథారచయితగా జమీందారీ యుగంలో పేరు తెచ్చుకొన్న మునిమాణిక్యం నరసింహారావుగారు ఉత్తరోత్తరా హాస్య రచయితల కోవలోనికి చేరారు. విజయనగరం కళాశాలలో బి.యే. పూర్తిచేసి 1923 నాటికి ఎల్.టి. కూడా చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, బచ్చన్నపేట (వరంగల్లు), వేటపాలెం మొదలైన చోట్ల ఉపాధ్యాయునిగా పనిచేశారు. బి.యే. చదువుకొంటున్నప్పుడే సాహితీ సమితి ప్రోత్సాహంతో రచనలు చేయడం ప్రారంభించారు. 'సాహితి' తొలి సంచికలో 'ఉఫ్' అనే స్కెచ్ రాశారు. తర్వాత కథలు రాయసాగారు.

మునిమాణిక్యం వారి కథలలో దాంపత్య ప్రణయం ప్రధాన స్థానాన్ని వహిస్తుంది. ఆయన సృష్టించిన ఉత్తమ స్త్రీ పాత్ర కాంతం. 'కాంతం కథలు' అనే పేరుతో 1927 నాటికే ఆయన ఒక కథా సంకలనాన్ని ప్రచురించారు. అందులో పన్నెండు కథలున్నాయి.

కోటు	సప్తాహం
తేనీరు	ఒకరోజు
ఊదాచీర	మరియొకరోజు
మా కాంతం	కొత్తయెత్తు
నేనూ మా కాంతం	ప్రయాణం
తేనీటి గిన్నెలో తుపాను	ఎందుకు?

ఈ కథల సంపుటిని 1928 జూలై నెల భారతి పత్రికలో సమీక్షిస్తూ ఇలా రాశారు :

''ఈ కథలు చాలావరకిదివరకు ఆంధ్రదేశపు పత్రికలలో ప్రచురించబడినవే. వీనిలో నుత్కృష్ట భావములుగాని, ఉన్నత భాషాశైలిగాని లేకపోయినను చదువుట కింపుగ చమత్కారముగ సంసార పక్షముగ నుండును'' కాంతం కథలు ప్రజాదరణ పొంది కాంతంతో బాటు ఆమె భర్త వెంకట్రావు కూడా ఆంధ్ర సారస్వతంలో ఒకనాడు జ్ఞాపకం పెట్టుకొనే పాత్రలయ్యారు. 1928లో మునిమాణిక్యం నరసింహారావుగారి జీవితంలో రెండు విషాద సంఘటనలు ఒకదానివెంట ఒకటి జరిగాయి. వారి భార్య శేషగిరమ్మ, పెద్దకూతురు రుక్మిణి హఠాత్తుగా మరణించారు. హాస్య చతురుడైన నరసింహారావుగారు ఈ షాకునుండి తేరుకోడానికి కొంత టైము పట్టింది.

మునిమాణిక్యం నరసింహారావుగారు ఆధునికయుగంలో కూడా విరివిగా రచనలు చేశారు.

విశ్వనాథ సత్యనారాయణ (1895–1976)

ఆధునిక యుగంలో కవిసామ్రాట్ బిరుదు వహించి అనేక ప్రక్రియలలో నైపుణ్యం చూపించిన విశ్వనాథ సత్యనారాయణగారు జమీందారీ యుగంలోనే గేయాలు, పద్యాలు, కథలు, నాటికలు రాసి దేశం పట్టనంత కవిగా పెరగడం ప్రారంభించారు. ఆయన రచించిన కథల వివరాలు చూడండి.

1. జమీందారు కొడుకు	1923	శారద, ఏప్రిల్
2. భావనాసిద్ధి	1923-24	సాహితి
3. రోధము	1923-24	సాహితి
4. తిరోదానము	1925	భారతి, జనవరి
5. నీరుణం తీర్చుకున్నా	1926	భారతి, అక్టోబరు
6. కలాలీలు	1926(?)	మద్రాసు లా కాలేజీ సంచిక
7. వియోగిని	(?)	శారద
8. కవి సంభవం		

విశ్వనాథ తొలిరోజుల్లో వాడుకభాషలోనే కథలు రాశారు. 'విశ్వనాథ సత్యనారాయణ కథలు' అనే సంపుటం ఒకటి వెలువడింది. చిన్న కథల పట్ల ఈయనకు చిన్నచూపు లేదని ఈ కథలు ప్రకటిస్తాయి.

శ్రీనివాస శిరోమణి (?)

కథకునిగా ఉత్తరోత్తరా పేరు పడిన శ్రీనివాస శిరోమణి అసలు పేరు కరణం శ్రీనివాసరావు. తొలిరోజుల నుండి సాహితీ సమితి సభ్యులు. ఆంధ్రపత్రిక కార్యాలయంలో చాలాకాలం పనిచేశారు. వ్యాసాలు కూడా రాశారు. 1926లో 'పరివర్తన' అనే రూపకం రాశారు. 1928లో 'ఏకాకి' అనే కథ భారతి, ఫిబ్రవరి సంచికలో పడింది. వీరి కథల సంపుటి ఒకటి 'పంచవటి' అనే పేరుతో వెలువడింది. శ్రీనివాసశిరోమణిగారు తామెన్నడూ పద్యాలు చెప్పలేదో, చెప్పారోగాని వారు రచించిన పద్యకావ్యమొకటి ఉందని నోరి నరసింహశాస్త్రిగారు చెప్పారు.[4] శిరోమణిగారు వచన రచయితగానే ప్రసిద్ధులు.

సాహితీసమితిలోని ఇతర సభ్యుల కథల వివరాలు కొన్ని చూడండి.

సాహితి తొలి సంచికలో 1919లో త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి 'అలెగ్జాండరుయతి' అనే కథ పద్యాలలో రాశారు. వచన రచన చేసినట్టులేదు. వజ్ఝబాబూరావు 'మల్లుపంచె' (1925) అనే కథ భారతి, నవంబరు సంచికలో పడింది. సాహితీ సమితి సభ్యులలో కవులు సైతం అడపా దడపా కథలు రాస్తూ వచ్చారు. వేదుల సత్యనారాయణశాస్త్రి 'అనితమ్మ' (1928) భారతిలో ప్రచురించారు.

జమీందారీ యుగంలో చిన్న కథ పెద్ద అడుగులే వేయడం ప్రారంభించింది.

4. నోరినరసింహశాస్త్రి - సారస్వత వ్యాసములు - 5, పుట.598

తెలుగు నవల - కొత్త మలుపులు

తెలుగు నవల పుట్టిన యాభై ఏళ్ళకి దాని బాటలో మలుపులు కనబడ్డాయి. ఒకరకంగా ఇవి చీలుదారులు. కొందరు పాత పద్ధతిలో సీదారాస్తాపై వెళ్ళితే కొందరు ఎడమవైపూ కొందరు కుడివైపు మళ్ళారు. 1872లో నరహరి గోపాలకృష్ణమ్మ సెట్టిగారు 'తెలుగుదేశము వారి యాచారములను దెలుపునట్టి' ప్రబంధం రచిస్తూ ప్రజలు ఎటున్నా వర్ణాశ్రమ బంధాలు పోకపోవడం, పైగా బిగుసుకుపోవడం వర్ణించిన ఆరంభకాలంనుండి 1922 దాకా వచ్చిన నవలలో తెలుగు సామాజిక జీవనాన్ని యథాశక్తి వాస్తవంగా చిత్రించడానికి ప్రయత్నాలు చేసి తమకున్న పరిమితులలో కృతకృత్యులయ్యారు. అయితే సమాజంలోని వర్ణాశ్రమ ధర్మాలను మాత్రమేకాక వర్గాల పరస్పర సంఘర్షణను, వృత్తుల ప్రాముఖ్యాన్ని, శ్రామిక, పంచమోద్యమాలను, స్త్రీ పురుష సంబంధాలను, మగవాళ్ళకో నీతీ ఆడవాళ్ళకో నీతీ పాటించే వ్యవస్థనూ నిలదీసి ప్రశ్నించే నవలలు 1922 తర్వాతనే వచ్చాయి.

కుంఫిణీ యుగంలో ఉదయించిన భావ చైతన్యం, జమీందారీ యుగంలోని పూర్వార్థంలో సంఘ సంస్కారం, భాషా సారళ్యం మొదలైన అభ్యుదయ మార్గాలకు ఆస్కారమైంది. వందేమాతరం రోజుల్లో వచ్చిన రాజకీయ కార్యదీక్షా సంకల్పం కొన్ని వర్గాల వారు మందగించక ముందు అడుగు వేసేటట్టు చేసింది. రాజకీయంగా మండల సభలు జరుపుతున్నప్పుడే వాటికి అనుబంధంగా సాంఘిక మహాసభలు కూడా జరిపి కార్యాచరణకు అనువైన మార్గాలను ఆలోచించేవారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ ఆంధ్రోద్యమానికి నాంది. స్వరాజ్యం కోసం ఒక ప్రక్కా, స్వరాష్ట్రం కోసం మరోపక్క ఆంధ్రులు పోరాడవలసి వచ్చింది. 'స్వరాజ్యం నా జన్మహక్కు'ని చాటిన బాలగంగాధర్ తిలక్‌గారు అస్వస్థులు కావడంతో మహాత్మాగాంధీ రంగప్రవేశం చేశారు. దక్షిణాఫ్రికాలో పూర్వం తాను పరిపుష్టం చేసి సత్యాగ్రహమనే ఆయుధాన్ని భారతీయులకు ప్రసాదించి మొదట కైరాన్‌లోనూ, చాంపరనులోనూ ఆ అస్త్రాన్ని ఎలాగ ప్రయోగించాలో దేశీయులకు నేర్పారు. తర్వాత దేశవ్యాప్తంగా దానినే స్వరాజ్య సాధనకు ప్రయోజనకారిని చేయడానికి పర్యటనలు ప్రారంభించారు.

1919లో వీరేశలింగంగారు మరణించారు. 1920లో లోకమాన్య తిలక్ చనిపోయారు. సాహిత్య సాంఘిక రంగంలో ఆంధ్రులూ, స్వరాజ్య సమరంలో భారతీయులందరూ కొత్త నాయకుల కోసం, కొత్త పోరాటమార్గాల కోసం అన్వేషణ ప్రారంభించారు. గాంధీగారు కాంగ్రెస్-లీగు సఖ్యతకోసం పాటుపడుతూ ఉన్నప్పుడు బ్రిటీషు వారు హిందూ ముస్లిముల మధ్య విభేదాలను రెచ్చకొట్టడానికేకాక, హిందూ సంఘంలో 'బ్రాహ్మణ, బ్రాహ్మణేతర' స్పర్థలకు బీజాలు నాటారు. ఆంధ్ర ప్రాంతాలలోని కోస్తా జిల్లాల ఆరింటిలోని బ్రాహ్మణేతరులు 1917లో 'షణ్మండలాంధ్ర బ్రాహ్మణేతర మహాసభలు' జరిపారు. ఇది జస్టిసు పార్టీవారిది. పిట్టి త్యాగరాజసెట్టి, డాక్టరు నాయరు, సుబ్బరాయరెడ్డియార్, లక్ష్మణస్వామి మొదలియార్ జస్టిసు పార్టీ ముఖ్య నాయకులు. ఆంధ్రాలో ఎ.పి.పాత్రో, పానగల్లు రాజా రామారాయణింగారు,

కూర్మా వెంకటరెడ్డినాయుడు, కోవెలమూడి గోపాలకృష్ణయ్య, బొబ్బిలి మునుస్వామి నాయుడు, బెజవాడ రామచంద్రారెడ్డి, బొబ్బిలి, చల్లపల్లి రాజాలు ప్రముఖపాత్ర వహించారు. ప్యూడలు వర్గాలు ఈవిధంగా సంఘీభావం సంతరించుకొంటున్నప్పుడు కాంగ్రెస్‌వారు తమ పక్షాన్ని బలపరిచే జాతీయ బ్రాహ్మణేతర మహాసభలను పోటీగా 1917 సెప్టెంబరు ఆఖరివారంలో జరిపారు. త్రిపురనేని రామస్వామిచౌదరి ఈ జాతీయ బ్రాహ్మణేతర సభలకు అధ్యక్షులు. రంగనాథ మొదలియారు, గుత్త కేశవపిళ్ళె, గద్దె రంగయ్యనాయుడు, కోడి రామమూర్తి మొదలైనవారెందరో ఇందులో పాల్గొన్నారు. ఈ సభకు వేలాది రైతులను తీసుకువచ్చారు. ముప్ఫయిమంది రైతు నాయకులు ఈ సమీకరణకు పాటుపడ్డారు.

జాతీయ బ్రాహ్మణేతర సభలు జరిపిన వారం రోజులకే బెజవాడలో 'ఆంధ్రదేశ ఆది ఆంధ్ర మహాసభలు' జరిగాయి. పంచముల అస్పృశ్యతా నివారణకు ఆంధ్రదేశంలోని వివిధ పట్టణాలలో అభ్యుదయవాదులు వ్యక్తిగతంగా కృషి చేస్తున్నా, పంచములను ఒక సంఘశక్తిగా మార్చడానికి 1917లోనే ప్రయత్నాలు ఈ సభల వల్ల జరిగాయి. శాసనసభలో పంచములకు ప్రత్యేక ప్రాతినిధ్యం కోసం పోరాటం సాగించడం నాటి కర్తవ్యం. బెజవాడలోని ఈ తొలి సభకు హైదరాబాదులోని సుప్రసిద్ధ ఆదియాంధ్ర పంచములను ఆదియాంధ్రులని పిలవాలనే తీర్మానం ఈసభలోనే ప్రవేశపెట్టి ఆమోదించారు.

గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణగారూ, నల్లపాటి హనుమంతరావుగారూ, బెజవాడలో అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, రాజమహేంద్రవరంలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మొదలైనవారు పంచమోద్ధరణకు పని చేస్తున్నా ఆదియాంధ్రులు ఒక సంఘంగా ఏర్పడి సంఘటిత కార్యాచరణకు పూనుకొనడం ఇదే ప్రథమం. రైతులుగానూ, వ్యవసాయదారులుగానూ జనాభాలో అత్యధిక సంఖ్యలో వున్న ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని గుర్తించారు. స్వరాజ్య సాధనకు ఇతర మార్గాలు నిరుపయోగమనే విశ్వాసం నాటుకొనజొచ్చింది. దేశం మొత్తం మీద చెల్లాచెదురుగా వున్న సాయుధ పోరాట వాంఛ ఆంధ్రదేశంలో కూడా కొన్నాళ్ల కొంతమంది వ్యక్తులలో ప్రస్ఫుటం కాకపోలేదు. టెర్రరిస్టు చర్యలు, గదర్ పార్టీతో విప్లవ సంబంధాలు లోగడ ఉన్నవారు తమ అభిప్రాయాలున్న వారికోసం గాలించసాగారు. పొణకా కనకమ్మగారు (1896-1963?) తమ యువక బృందంతో పుదుచ్చేరి నుంచి 1914-18 సంవత్సరాల మధ్య యుద్ధకాలంలో ఆయుధాలు సేకరిస్తూ ఉండేవారనే వదంతి ఉండేది. దర్శి చెంచయ్య (1890-1964) గదర్‌పార్టీ సాయుధ పోరాట సన్నాహాలలో పాల్గొని జైలులో పడి బయటకొచ్చాక కనకమ్మగారిని కలుసుకొని పనిచేయడానికి ప్రయత్నించారు గాని ఆమె శిష్యులు ఒక్కొక్కరే గాంధీ శిష్యకోటిలో చేరిపోయారు. చివరకు ఆమె కూడా అహింసాతత్త్వం పూర్తిగా నమ్మి అందులో మనస్ఫూర్తిగా పనిచేశారు.[1]

1919లో మహాత్ముడు రౌలత్ బిల్లుకు వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రారంభించే ముందు దేశ సంచారం చేశారు. 1919 ఏప్రిల్ 19వ తేదీనాడు పంజాబులోని

1. దర్శి చెంచయ్య - 'నేనూ - నా దేశం' - పుట.257

జలియన్‌వాలాబాగ్‌లో నిరాయుధులపైన కాల్పులు జరిపి బ్రిటీష్‌వారు 1600 మందిని పొట్టన పెట్టుకొన్నారు. దేశం అట్టుడికిపోయింది. దేశమంతటా రోషం, ఆగ్రహం, ఆవేశం, దేశాభిమానం కట్టలు తెంచుకొంది. విద్యార్థులు కాలేజీ చదువులు విడిచిపెట్టి ఉద్యమంలో చేరారు. లాయర్లు వృత్తులు వదులుకొని నాయకత్వానికి సంసిద్ధులయ్యారు. ప్లీడర్లందరూ తమ వృత్తిని వదిలేసి స్వతంత్రం కొరకు పనిచేస్తే, జనులలో అధిక సంఖ్యాకులు ఖద్దరు వస్త్రధారణ చేస్తే, అంటరానితనాన్ని రూపుమాపితే, హిందూ ముస్లింలు ఒక్క తాటిమీద నడిస్తే ఒక్క సంవత్సరంలో 1921 డిసెంబరు 31వ తేదీనాటికి, స్వరాజ్యాన్ని తీసుకొని వద్దామని మహాత్ముడు ప్రకటించారు. స్త్రీలూ, పురుషులూ ఎందరో తమ ఉద్యోగాలు మానేసి, చదువులు చాలించుకొని ఉద్యమంలో దూకారు.

1921లో బెజవాడలో కాంగ్రెస్ కమిటీ సమావేశం ఆనందోత్సాహంతో జరిగింది. దేశంలోని నాయకులందరూ ఆంధ్రదేశానికొచ్చారు. ఆంధ్ర ప్రముఖులు సరేసరి. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు చీరాల-పేరాల నుండి అయిదువందలమంది ఎర్రచొక్కాల వారి దండును తీసుకొని వచ్చారు. స్త్రీలూ, పురుషులూ తండోపతండాలుగా వచ్చారు. రెండులక్షలమంది బెజవాడ చేరారు. కాంగ్రెసు కమిటీవారు 'తిలకు స్వరాజ్య నిధి' పేర మూడునెలల్లో కోటిరూపాయలు సేకరించాలనీ, మూడునెలలలోపల కోటిమంది సభ్యులను కాంగ్రెసులో చేర్చాలనీ, ఖద్దరును పునరుద్ధరించాలనీ, విదేశీ వస్త్రాలను దగ్ధం చేయాలనీ తీర్మానించారు. సాయంకాలం బహిరంగసభలో గాంధీజీ ప్రవేశించగానే మాగంటి అన్నపూర్ణ ఎంతో విలువైన తన పట్టుచీరలను వారి ముందు కుప్పపోసి తగలపెట్టి, తన ఆభరణాలన్నీ, 'తిలకు స్వరాజ్య నిధి'కి ఇచ్చి వేసింది. ఇది మొదలు ఆంధ్రాలో చాలామంది తమ నగలను ఆ నిధికి ఇచ్చేశారు.

కొండా వెంకటప్పయ్యగారితో కలసి మహాత్ముడు ఆంధ్రదేశంలో పర్యటన చేసి కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, బందరు, గుంటూరు, చేబ్రోలు, బాపట్ల, చీరాల, రామనగరు, వేటపాలెం, నెల్లూరు పట్టణాలు దర్శించారు. వెళ్ళినచోట ప్రజలు విరివిగా విరాళాలిచ్చారు. స్త్రీలు ఆభరణాలిచ్చారు. అందరూ చేతితో వడికిన నూలుతో మగ్గాలపైన నేసిన ఖద్దరే ధరించసాగారు. చీరాల-పేరాల ప్రజలు మ్యునిసిపల్ పన్నులు కట్ట నిరాకరించి, ఊరు విడిచి బయటకు వెళ్ళి కొత్త ఊరే కట్టుకొన్నారు. పల్నాడులో ఫారెస్టు శాఖవారు పుల్లరి నిర్బంధంగా వసూలు చేస్తూ, పశువులను బందెలదొడ్డిలో పెడుతూ, ప్రజలను నానా బాధలూ పెడుతూ వుంటే, ప్రజలే తమంతట తాము పోరాటం ప్రారంభించారు. ఫారెస్టు శాఖ ఉద్యోగులకు జీవితావసర వస్తువులు అందకుండా ప్రజలు తమ పోరాటం నడిపారు. ఈ ఉద్యమాన్ని పరిశీలించడానికి వెళ్ళిన కాంగ్రెస్ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసి సత్ప్రవర్తనకు జామీను ఇవ్వమని కోరితే ఆ దేశభక్తులు నిరాకరించారు. వారికి ప్రభుత్వం జైలు శిక్షలు వేసింది. కన్నెగంటి హనుమంతును కాల్చి చంపింది.

1921లో కాంగ్రెసు పన్నుల నిరాకరణ ఉద్యమం ప్రారంభించింది. నాయకులందర్నీ పర ప్రభుత్వం చెరలో పెట్టింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో జైళ్ళకు వెళ్ళిన

నాయకులందర్నీ గ్రంథ పఠనంలోనూ, అధ్యయనంలోనూ, గ్రంథ రచనలోనూ శిక్షాకాలాన్ని గడిపారు. కడలూరు జైలులో అయ్యదేవర కాళేశ్వరరావుగారు 'ఫ్రెంచి స్వాతంత్ర్య విజయం' అనే గ్రంథం రాశారు. కొండా వెంకటప్పయ్యగారు డచ్చి స్వాతంత్ర్యం గురించి జైలులోనే రచన కొంత సాగించారు. గాంధీవాదులు ఇతర దేశాల రాజకీయ చరిత్రలు, వాటివల్ల గుణపాఠాలు నేర్చుకొనడానికి ప్రయత్నించారు. మార్క్సిజం గురించి కూడా చదివినవారు లేకపోలేదు. అయితే అధ్యయనం లోతుగా లేక దానివల్ల ప్రభావితులు కాలేకపోయారు. అయ్యదేవర కాళేశ్వరరావుగారు కడలూరు జైలులో ఉన్నప్పుడు తమ అనుభవాలు ఇలా రాశారు.[2]

''కారల్ మార్క్సు జీవితమును, బోధలను గూర్చి యొక పుస్తకము చదివినాను. కారలుమార్క్సు త్యాగము అఖండమయినది. పేదవారికొరకే తన జీవితము నర్పించెను. కార్మికుల నుద్ధరించ సమకట్టెను. వారి జీవితము మిగుల ఆకర్షణీయంగా నున్నది. దానిని తెనుగులోకి వ్రాసితిని. నేను దానిని ప్రకటించెదనని విజ్ఞాన చంద్రికా మండలి పక్షమున ప్రకటింపబడినది కూడా. కాని ఆస్తి, వారసత్వము, మతము, వివాహము, కుటుంబములను గూర్చి ఆయన యొక్క, ఆయన మిత్రుడు ఎంగెల్సు యొక్క బోధలు భారత జాతీయ నాగరికతకు కేవలము విరుద్ధముగా నున్నందున ఆ పుస్తక ప్రచురణను మానివేసినాను. నేను ఏ సత్యములను నమ్మెదనో వాటినే ఆంధ్ర ప్రజలకిచ్చుటకు నా గ్రంథములు వ్రాసినాను. నాకు కమ్యూనిజం నచ్చలేదు. పిమ్మట కూడా కాపిటల్, కమ్యూనిస్టు మానిఫెస్టో, వెబ్సు, డాబు, ట్రాట్స్కి, స్టాలిన్, లెనిన్ వ్రాసిన సుమారు పదిహేను పదహారు గ్రంథములు శ్రద్ధగానే చదివినాను గాని కమ్యూనిజం యందు, దాని క్రూరహింసా పద్ధతుల యందు, నిరంతర వర్గ పోరాటమునందు, నియంతృత్వమునందు, నాస్తికత్వమునందు వ్యతిరేకుడనై తెలుగులో దానిని గూర్చి గ్రంథమును వ్రాయలేదు. నేను జాతీయవాదిని. కమ్యూనిజం కేవలం అంతర్జాతీయ తత్త్వముగా నుండి ప్రపంచములోని అందరు కార్మికుల నొక జాతిగను బూర్జువా (పనిచేయించు కామందులు)ను మరియొక జాతిగను విభజించినారు. ఇందువల్ల కూడా నాకది రుచించలేదు''.

కమ్యూనిజమన్నా, సామ్యవాద సిద్ధాంతాలన్నా కొందరికి ఇలాంటి అభిప్రాయం ఉన్నా, మరికొందరు ఆ సిద్ధాంతాలను అధ్యయనం చేశారు. పూర్తిగా దానితో ఏకీభవించకపోయినా ఆ సిద్ధాంతాలేమిటో వాటిని రష్యాలో ఎలా అమలుపరిచారో వివరిస్తూ సృజనాత్మక రచనలైన నవలలలో కూడా విపులంగా వర్ణించారు. ఒక నవలా రచయిత ఇలా రాశారు.

''ఫ్రాన్సు, అమెరికా దేశములలో క్షత్రియ వర్గమూ మతపీఠములూ పూర్తిగా నశింపచేసి ప్రజా ప్రభుత్వం స్థాపించుటకు ప్రయత్నాలు చాలాకాలం క్రిందనే జరిగినవిగాని ప్రజా ప్రభుత్వానికి బదులుగా ధనిక ప్రభుత్వమేర్పడి దిగువ జాతులకు మునుపటికంటే యెక్కువ బాధాకరమైంది. ప్రజలలో బహుమంది యొక్క అభిప్రాయం ప్రకారం గాకుండా ధనికులలో బహుమందియొక్క అభిప్రాయం ప్రకారం అమలు

2. అయ్యదేవర కాళేశ్వరరావు - 'నా జీవిత కథ నవ్యాంధ్రము' పుట - 359

జరుగుతున్నది. యీస్థితిని మార్చడానికి అలగాలు ప్రయత్నిస్తున్నారు. ఇటలీ దేశములో ధనికుల యంత్రాగారాలు కూలీలు స్వాధీనపర్చుకొని చివరకు వుభయులూ రాజీపడ్డారు. రష్యాదేశంలో పంచాయతీ (సోవియట్) ప్రభుత్వం స్థాపించబడ్డది. వీరి ఉద్యమానికి బోల్షివిజమని పేరు. బోల్షివిజమనగా విశేషజనుల యొక్క అభిప్రాయమని అర్థం. దాని ప్రకారంగా ప్రభుత్వం జరుగవలయునని వారి ఆదర్శం.

రష్యా దేశంలో జనులకు వ్యవసాయమే జీవనం. భూములు చాలాభాగం వ్యవసాయం చేయని జమీందారుల చేతులలోనూ భూస్వాముల చేతులలోనూ పడ్డవి. ప్రభుత్వంలో ప్రజలు యేవిధమైన పలుకుబడీ లేదు. జారుచక్రవర్తి నౌకర్ల యొక్కయూ జమీందారుల యొక్కయూ ధనికుల యొక్కయూ చేతులలో కీలుబొమ్మయి వారి కోరికల ప్రకారం మహాజనులను బాధించాడు. ఈ దుష్ప్రభుత్వం వంద సంవత్సరాలకుపైగా సాగింది. జనులు దుర్భరమైన దరిద్రంలో మునిగారు. తుదకు మొన్నటి ఐరోపా యుద్ధ సమయంలో నౌకరు వర్గం, ధనికవర్గం సజారంగా కొల్లేరు కుంగినట్లు కుంగింది. పంచాయితీ ప్రభుత్వమేర్పడి గ్రామ ప్రభుత్వానికీ, జిల్లా ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వానికీ, దేశ ప్రభుత్వానికీ పంచాయితీ వర్గాలేర్పడ్డవి. ఈ పంచాయితీలలో సభికులు అయిదుగురే వుండవలసిన అవసరం లేదు. అదివరకు భూములు ఆసామీలకూ, జమీందారులకూ స్వంత హక్కు కలిగి వుండేది. సోవియటు వర్గంవారు భూములలో ప్రత్యేక వ్యక్తుల హక్కును తొలగించి మంది హక్కుగా మార్చి మంది తరఫున భూములన్నీ స్వాధీనపరచుకొని కేవలం స్వంత చేతితో వ్యవసాయం చేయువారికే వారు చేయగలంత వరకు విడదీసి జనులలో పంచిపెట్టారు. కోటీశ్వరుల భవనాలూ, ధనమూ, యంత్రాగారములు మంది తరఫున సోవియటు సర్కారువారు స్వాధీనపరచుకొని పని జరిపిస్తున్నారు.''

''దేశంలో భాగ్యవంతులకుగాని బీదలకుగాని స్వంత హక్కులుండకూడదు. దేశంలో వుండే యావత్తు ధనం మంది సొమ్మే. మంది పంచాయతీ సర్కారుద్వారా యంత్రములనూ వ్యవసాయమునూ అజమాయిషీ చేసి వచ్చే ఆదాయములో నుంచి దేశ జనులెవ్వరికీ అన్న లోపం లేకుండా పంచిపెడుతుంది. పనిచేసేవాండ్లకే గ్రామ సోవియట్ వారు మోయిను చీట్లిస్తారు. యెవరు యేమిపని చేయవలసిందీ పంచాయతీ సర్కారే నిర్ణయిస్తారు. భోజన సామగ్రులూ, వస్త్రాలూ, చెప్పులూ మొదలైన యావత్తు అవసర వస్తువులూ టిక్కెట్లు పొందిన కుటుంబులకే గ్రామ సోవియటు భాండారములో యిస్తారు. సోమరులకు పస్తే. వ్యాధిగ్రస్తులకూ, వృద్ధాప్యం చేతగాని, అంగవైకల్యం చేతగాని బొత్తిగా పనిచేయలేని వారికి పని నిర్బంధం లేకనే చీట్లస్తారు. యిది మహా ప్రయత్నం. యేసుక్రీస్తు యొక్క బోధలు దీనికి అనుగుణ్యంగానే వుంటవి. పూర్వం మునిపల్లెలలో యీ పద్ధతే జరిగేదనుకుంటాను. పూర్వపు గ్రామ పద్ధతీ యిదే. యీ ప్రభుత్వ పద్ధతి యెంతవరకు నిలుస్తుందో చెప్పలేము. యీ ప్రకరణ యొక్క నిర్మాతలు మాత్రం అత్యుత్సాహంగా పనిచేస్తున్నారు. ఈ నూతన ధర్మకర్త పేరు లెనిన్ మహాశయుడు. వీరి బావమరిది ట్రాట్స్కీ అను ఆయన వీనికి చేదోడు. వీరుభయులూ యూదులు, సృష్టిలో వున్న వస్తుభాండాగారం అనుభవించడానికి అందరికీ సమాన హక్కు వున్నదనీ అందరూ పనిచేసి

అనుభవించవలసినదనీ కొందరు అన్నవస్త్రాలు లేక మలమల మాడుతుంటే మరికొందరు భోగములతోనూ, దుర్వ్యసనములతోనూ మునిగి తేలడం న్యాయంగాదనీ వీరి ముఖ్య సిద్ధాంతాలు. వీరి సిద్ధాంతాలు తప్పనడానికి యెవరికీ సాధ్యం గాదుగాని ఆచరణలో బెట్టడం అసాధ్యమని కొందరికి సందేహం''.

ఇప్పుడు ఉదాహరించిన వాక్యాలు ఉన్నవ లక్ష్మీనారాయణ (1874–1958) గారు రచించిన 'మాలపల్లి' అనే నవలలోనివి. ఈ మాటలు ఆయన ఒక పాత్ర ద్వారా నవలలో వర్ణించినా 'ఆది ఆంధ్రమహాసభ'లో ఉపన్యాసంగా చెప్పించారు. ఆ సభ అధ్యక్షులు చేసిన గంభీరోపన్యాసంలో ఇంకా ఇలా ఉంది.

''రష్యాలో ధనికుల భూములూ, యంత్రాలూ పంచాయతీ సర్కారు మంది తరపున జమ కట్టుకొని బీదజనులకు పనిచేసే నిమిత్తమిచ్చినప్పుడు వారు సంతోషపడ్డారుగాని యంత్రాలవల్లా వ్యవసాయం వల్లా వచ్చే ఆదాయం పనిచేసే వాండ్ల కుటుంబాల అనుభవానికి సరిపోగా మిగిలేది యావత్తూ సోవియటు సర్కారుకు స్వాధీనపర్చమంటే వెనుదీస్తున్నారు. యిప్పటివరకు బలాత్కారంగానో బుద్ధిపూర్వకంగానో సోవియటు సర్కారుకు దేశాదాయం యావత్తూ జమవస్తూనే వున్నది. జనులీ పద్ధతికి అలవాటుపడి జరుపుకుంటారో తిరిగి విప్లవం వచ్చి పాత పద్ధతులే అమల్లోకి వస్తవో లేక యే కొత్తరూపంగా మారునో చెప్పలేము. ఈ బోల్షెవిక్ సిద్ధాంతాలు ప్రస్తుతం అమలులో వున్న సామ్య సిద్ధాంతాల కన్నిటికి వ్యతిరేకం. లెనిన్ ప్రభృతులు ఈ సిద్ధాంతాలను తమ దేశంలో స్థాపించడమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపింపజేస్తామని ఢంకా బజాయిస్తున్నారు. అందుకొరకై కోట్ల ద్రవ్యం ఖర్చు పెడుతున్నారు. పూర్వపు రష్యా చక్రవర్తులు జయించిన పర రాష్ట్రాలకు పంచాయతీ సర్కారు స్వాతంత్ర్య ప్రదానం జేసి మా రాజుల పాపమును క్షమింపుడని కోరుతున్నారు. ఈ రాష్ట్రాలలో సోవియటు ప్రభుత్వాలు స్థాపించబడు తున్నవి. బోల్షెవిక్ భావాలు చెదపురుగులవలె తమ కందిన పాత ప్రతిష్ఠాపనలన్నింటిని భగ్నం చేస్తున్నవి. జర్మను ఆస్ట్రియా దేశములకిదివరకే వ్యాపించినవి. అమెరికా, ఫ్రాన్స్ దేశాలలోని ధనిక వర్గాలు కంపం బొందుతున్నవి.''

''బోల్షెవిక్కులు ఇంగ్లండు దేశం మీద తమ దృష్టి సారించారు. బోల్షెవిక్కు భావతరంగాలు ఆంగ్ల మానస కాసారములను చలింపజేస్తున్నవి. ఆంగ్ల ధనిక వర్గం ఈ భావాలను రాకుండా కొట్టవలసిందని ఉద్ఘోషిస్తున్నది. భావాలను ఫిరంగులు యెట్లా గొట్టగలవని ప్రభుత్వం వారంటున్నారు. ఆంగ్ల రాజ్య ప్రకృతి మిక్కిలి పురాతనమైన వాటిల్లో నొకటి. ప్రభుత్వం వారు యీ పాత కట్టడాన్ని బూజు దులిపి మరమ్మతు వొకటి. ప్రభుత్వంవారు యీ పాత కట్టడాన్ని బూజు దులిపి మరమ్మతు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. స్త్రీలకు యెన్నిక అధికారమియ్యబడ్డది. ప్రభుత్వ సంఘాన్ని యెన్నిక పద్ధతుల ప్రకారం యేర్పర్చవలెనని ప్రయత్నిస్తున్నారు. ప్రజా సంఘంలో కొత్త యెన్నికలు జరిగితే కూలీ సభికుల సంఖ్య యెక్కువ కావడం నిశ్చయం''.

''కూలీ ప్రభుత్వం యేర్పడి ఆంగ్ల దేశంలో యే మార్పులు వస్తవో, ఇండియా ప్రభుత్వాన్ని యెట్లా మారుస్తారో చెప్పలేము. బీదలకు ప్రభుత్వం వారు ఇండ్లు కట్టించి

యిస్తున్నారు. గని కూలీలు యీమధ్య గట్టిన సమ్మె దేశమంతటా పరవింది. గనులను నీళ్ళలోనూ, దేశాన్ని విప్లవంలోనూ ముంచివేస్తుందని భయపడ్డారు. తక్కిన కూలీ సంఘాలు కూడా వొక్క మదుపున గని కూలీలతో చేరినట్లయితే అయిదు నిముషాలలో ఆంగ్లదేశం రెండవ రష్యా*అయిపోయేది. అటువంటి స్థితి రాకుండా యజమానులూ, కూలీలూ రాజీపడుతున్నారు. తెగినదాకా బిగించే పద్ధతి ఆంగ్లేయుల దగ్గర లేదు. గట్టిగా లాగితేనేగాని వారు వంగరు.''[3]

ఉన్నవ లక్ష్మీనారాయణగారికి ఆంగ్లేయుల మనస్తత్వాలూ, వర్గ సంబంధాలూ, ఇతర పాశ్చాత్యులకూ వీరికీ గల తారతమ్య సాదృశ్యాలు ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశాలు కలిగాయి. ఆయన తన 36వ యేట చాలా పరిణితి చెందిన తర్వాత బారిష్టరు పరీక్ష చదవడానికి ఐర్లాండు వెళ్ళారు. వారికి చిన్నప్పట్నుంచీ జాతీయోద్యమంతో సంబంధం ఉండటం వల్ల తాము ఏ ఆంగ్ల ప్రభుత్వంతో పోరాడుతున్నారో ఆదేశంలోకాక పక్కనున్న ఐర్లాండులో బారిష్టరు చదువులు చదివారు. మూడేళ్ళ పై చిలుకు ఆ దేశంలో ఉంటూ ఐరిష్ జాతీయ రాజకీయాలన్నీ అవగాహన చేసుకొన్నారు. శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంతాలు వాటిని ఏయే దేశాలలో ఎలా పోరాట రూపాలను ప్రయోగిస్తున్నదీ గుర్తించారు. పరదేశంలో పరిశీలించిన పరిస్థితులలో స్వదేశ వ్యవస్థల తులనాత్మక పరిశీలన కూడా చేశారు. మనదేశంలోని గ్రామీణ జీవనం, ఉత్పత్తి సంబంధాలు, వ్యక్తుల పరస్పర సహకార, వైషమ్యాలూ చిన్నప్పట్నించీ అవగాహన చేసుకొన్నారు.

ఉన్నవ లక్ష్మీనారాయణగారు 1877లో గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలోని వేములూరుపాడు గ్రామంలో జన్మించారు.* ఇరవయ్యో యేట 1897లో గుంటూరు క్రిష్టియన్ కాలేజీలో ఎప్ఫే పాసయ్యారు. వారి ఇరవయ్యొకటో యేట భార్య లక్ష్మీబాయమ్మ కాపురానికి వచ్చింది. ఆమె నడింపల్లివారి ఆడపడుచు. పాఠశాల చదువు చదువుతున్న వారు. సంస్కారం గల కుటుంబం నుంచి వచ్చారు. కాపురం పెట్టాక లక్ష్మీనారాయణగారు భార్యకు తెలుగు సాహిత్యం నేర్పారు. ఆమె భర్త అభిప్రాయాలూ, ఆశయాలు అర్థం చేసుకొని జీవితాంతం ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ ఉద్యమాలన్నింటిలో పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణగారు ఎప్ఫే పాసయ్యాక కొన్నాళ్ళు చిల్లర ఉద్యోగాలు చేశారుగాని ఆ ఉద్యోగాలకు స్వస్తి చెప్పి స్వతంత్రంగా జీవించడానికి ప్లీడరు వృత్తిని చేపట్టారు. ఆయన తమ ఇరవయ్యయిదవ ఏటనే 1902లో సంఘ సంస్కరణపట్ల ముఖ్యంగా వితంతు వివాహం పట్ల తమ దృష్టిని కేంద్రీకరించారు. 1902 అక్టోబరు 4వ తేదీనాడు మొదటి వితంతు వివాహాన్ని జరిపించడానికి ఉత్సాహవంతులు ప్రయత్నాలు చేసి రాజమంద్రి నుంచి వీరేశలింగం గారిని భార్యాసహితంగా ఆహ్వానించారు. ఆ వివాహంలో భోజనానికి వెళ్ళిన

3. ఈ ఉద్ధరణలన్నీ మాలపల్లి నవలలో 'సంఘ నిర్మాణం' అనే 23వ అధ్యాయంలోనివి. పుటలు 109, 110

* తెలుగు విశ్వవిద్యాలయం వారి విజ్ఞాన సర్వస్వం - తెలుగు సంస్కృతి, 2వ సంపుటంలో ఉన్నవ వారి జనన కాల సంవత్సరాని 1873 అని చెప్పారు. పుట.566. అయితే 1887 అని గూడూరు నమశ్శివాయగారు రాశారు. చూ. సాహిత్యోపన్యాసములు-17, తొలి సంపుటి.

ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఈ సంస్కారం ఆవశ్యకతను గుర్తించి తామే కార్యభారం నిర్వహిస్తూ ఆ తర్వాత గుంటూరులో జరిగిన స్త్రీ పునర్వివాహాలన్నీ స్వయంగా తమ భార్యతో కలసి జరిపించారు. (తాము కన్యాదాతలుగా ఉంటూ పది వితంతు వివాహాలు చేయించారు.)

ఉన్నవ వారి కార్యదీక్షను చూసి వీరేశలింగం గారు మెచ్చుకొన్నారు. రాజమండ్రిలో ఉన్న వితంతు శరణాలయాన్ని నిర్వహించుటకు ఆహ్వానించారు. 1906-1907 సంవత్సరాలలో ఉన్నవవారు రాజమండ్రిలో ఆ బాధ్యతలు స్వీకరించారు. అయితే అవి వందేమాతరం రోజులు. ఉన్నవవారు 29 సంవత్సరాల యువకులు. సంఘ సంస్కారంతో పాటు రాజకీయాలలో కూడా పనిచేయదలచినవారు. వీరేశలింగంగారికి సంఘ సంస్కారమే ముఖ్యం. రాజకీయాలంటే విముఖత. అందుచేత ఉన్నవవారు వీరేశలింగం గారు ఇమడలేక గుంటూరు వచ్చేశారు.

కాంగ్రెసు నాయకుల్లో లోకమాన్య బాలగంగాధర తిలక్ గారి ఆదర్శాలు ఉన్నవవారికి ఆచరణ సూత్రాలయ్యాయి. బ్రిటిష్ వారితో పోరాటంలో అతివాద ఉగ్రవాద రాజకీయ ధోరణులను అభిమానించారు. తమిళదేశంలోని సుబ్రహ్మణ్యభారతి గారు ఏవిధమైన అతివాదులో ఉన్నవవారు కూడా అటువంటి అతివాదులే. 1906లో ఉన్నవవారు బెంగాలు విప్లవోద్యమ శాఖగా ఆంధ్రదేశంలో రహస్య సంఘాన్ని స్థాపించి పుదుచ్చేరి, హైదరాబాద్‌ల నుంచి రివాల్వర్లు, తూటాలు మొదలైన ఆయుధాలను తెప్పించారు. సాయుధ విప్లవవాదిగా పోరాటం సాగించాలనే ఉత్సాహం వారిలో రేకెత్తింది. ఈ భావాలు ఎంతవరకూ కార్యరూపం దాల్చాయో తెలియదు.

విప్లవోద్యమం కన్నా సంఘ సంస్కారమే అప్పట్లో ఉన్నవవారికి మరీ ముఖ్యమైన కార్యక్రమంగా తోచి ఉంటుంది. వివాహాలు కావలసిన వితంతువులు విద్యావంతులు కావడం కూడా ముఖ్యమని గుర్తించారు. వివాహం కాకపోయినా జీవనోపాధికి తోడ్పడే వృత్తి విద్య అవసరమని గుర్తించారు. 1916లో దేశభక్త కొండావెంకటప్పయ్యగారితోకలసి పూనా పట్టణానికి వెళ్ళి అక్కడ కార్వే పండితుడు నడుపుతున్న మహిళా విద్యాలయం పనిపాట్లు పరిశీలించి వచ్చారు. వాటిని ఆంధ్రలో అమలుపరిచారు.

సంఘ సంస్కారం పనులతోపాటు స్థానిక రాజకీయాలలోనూ, మండల మహాసభలలోనూ పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం ప్రారంభకుల్లో ఈయన కూడా ప్రముఖులు. 1913లో ప్రథమాంధ్ర మహాసభలు బాపట్లలో జరిగినప్పుడు వీరి పాత్ర చాలా ముఖ్యమైంది. ఆహ్వాన సంఘం కార్యదర్శిగా పనిచేశారు. వృత్తిలో సెకండుగ్రేడు ప్లీడరుగా ఉండటం వల్ల తలపెట్టిన కార్యక్రమాలకు ఉపయోగం తక్కువని తెలుసుకున్నారు. బారిష్టరు పరీక్ష చదివి వచ్చి ప్రాక్టీసు పెడితే అన్నివిధాలా లాభసాటిగా ఉంటుందని భావించారు. పదేళ్ళు ప్రాక్టీసు చేశారు. 1913లో తమ 36వ యేట ఐర్లాండుకు వెళ్ళి డబ్లిన్ నగరంలో కింగ్స్ ఇన్ కాలేజీలో చేరారు.

అప్పుడు మరికొందరు ఆంధ్రులు ఐర్లాండులో బారిష్టరు పరీక్షకు చదువుతున్నారు. తుర్లపాటి వెంకటేశ్వరరావు, వంగులూరి శేషతల్పశాయి, నడింపల్లి దశరథరామయ్య,

పోలిశెట్టి హనుమయ్యగుప్త, బాచిన రామయ్యా చౌదరి, త్రిపురనేని రామస్వామిచౌదరి ఉన్నవ వారితో కలసి చదివినవారే. రామస్వామి చౌదరిగారికీ, ఉన్నవ వారికీ ప్రాణస్నేహం. ఇద్దరూ ఐరిష్ సాహిత్యాన్ని అక్కడి సిన్‌ఫిన్ ప్రజాసైన్యాలకూ, బ్రిటిష్ సేనలకూ జరిగిన సంకులసమరాలను ఈ భారతీయులు గమనించి ఉత్తేజితులయ్యారు. ఐర్లాండులో ప్రతిపల్లె, తాలూకా, జిల్లా సభలన్నీ సిన్‌ఫిన్ సంఘం సేవలకు వశపడ్డాయి. సాయుధ పోరాటాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన వారికి స్వాతంత్ర్య సమరంలో విభిన్న మార్గాలుంటాయన్న అవగాహన స్పష్టంగా ఏర్పడుతోంది. విదేశాలలో కార్మిక ఉద్యమాలు, వర్గ సంబంధాలు అధ్యయనం చేయడానికి వీలుగా ఎన్నో సభలు జరుగుతూ ఉండేవి. ఇవి ఉన్నవ వారికి ఉత్సాహం కలిగించాయి.

అక్కడ ఆయన హాజరుకాని రాజకీయ సభలంటూ లేవు. ఐరిష్ నాయకుడు డీవెలరాతో పరిచయం ఏర్పరచుకొన్నారు. సామ్యవాద సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. సామాజిక సూత్రాలను ఆకళింపు చేసుకొన్నారు. మూడు నాలుగేళ్ళు పరదేశాలలో శ్రామిక రాజకీయాలను పరిశీలన చేశాక స్వదేశానికి 1916లో తిరిగి వచ్చారు. వచ్చిన వెంటనే మద్రాసులో ప్రాక్టీసు పెట్టినా భార్య లక్ష్మీబాయమ్మగారి అనారోగ్య కారణం వల్ల మద్రాసులో ఉండలేక గుంటూరుకు తిరిగి వచ్చేశారు. 1917లో నల్లపాటి హనుమంతరావు, పుతుంబాక లక్ష్మీనరసయ్య, వాసిరెడ్డి సీతారామయ్యగార్లతో కలసి పెదపాలెంలో 'కృష్ణాశ్రమం' స్థాపించి, దాని అధ్యక్షులయ్యారు. ఇది నిమ్నజాతుల ఉద్ధరణకై స్థాపించిన సంస్థ. ఐర్లాండులో చేసిన అధ్యయనాన్ని ఆచరణలో పెట్టసాగారు.

గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకా పొన్నూరు ఫిర్కాలో ఆరెమండ అనే గ్రామం ఉంది. దీనికి శివారు గ్రామంగా తాళ్ళపాలెం అనే హరిజనవాడ ఉంది. ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఈ గ్రామాన్ని, దానికి చేరిన మాలపల్లిని క్షేత్ర పరిశోధనాకేంద్రంగా మనసులో నిలుపుకొని, సాహుకార్లకూ, పంచమ వ్యవసాయకూలీలకూ గల ఉత్పత్తి సంబంధాలను అధ్యయనం చేశారు. ఒక అయిదారేళ్ళపాటు వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులను జాగ్రత్తగా గమనించి వారి మనస్తత్వాలనూ, ప్రవర్తనలనూ విశ్లేషించి గుర్తుపెట్టుకొన్నారు.

1917లో బెజవాడలో జరిగిన ప్రప్రథమ ఆదియాంధ్ర మహాసభల వైనాలను ఉన్నవవారు తెలుసుకొన్నారు. అక్కడ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలను గుర్తించారు. ఆంధ్రదేశంలోని పంచములందరినీ అప్పట్నించీ ఆదియాంధ్రులనే పిలవాలన్నది మొదటి తీర్మానం. పంచములను రామిగాడు, సుబ్బిగాడు అని నీచంగా పిలవకూడదనీ, మర్యాదగా రామయ్యా, సుబ్బయ్యా అనే పిలవాలనేది రెండో తీర్మానం. ఆదియాంధ్రుల విద్య, ఆర్థిక విషయాలలో ప్రభుత్వం కూడా శ్రద్ధ తీసుకోవాలి అనేది తదుపరి తీర్మానం. శాసనసభలలో వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండాలని పోరాటం ప్రారంభమైంది. ఉన్నవవారు పంచమోద్ధరణకు ఇంతకన్నా విస్తృతమైన ప్రణాళికను మనస్సులో ఊహించుకొన్నారు.

1922లో బెజవాడ కాంగ్రెసు కమిటీ సమావేశాలు చాలా పెద్దపెట్టున జరిగాయి. వాటిలో ఉన్నవవారు ఇతర ఆంధ్ర ప్రముఖులతో కలసి పాల్గొన్నారు. గాంధీగారు ఏడాదిలో స్వరాజ్యం తేవడానికి కొన్ని షరతులు పెట్టారు. విద్యార్థులు కళాశాలలనూ, ప్లీడర్లు తమ వృత్తినీ, ఉద్యోగులు తమ పదవులనూ, పెద్దలు తమ బిరుదులనూ త్యజించి ఉద్యమంలో చేరాలి. గుంటూరులో మొదట కొండా వెంకటప్పయ్యగారూ, తర్వాత ఉన్నవ లక్ష్మీనారాయణ, పోలిశెట్టి హనుమయ్యా గుప్త, నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, మాడభూషి నరసింహాచార్యులు మొదలైనవారు ప్రాక్టీసు విడిచిపెట్టి కాంగ్రెసు ఉద్యమంలో చేరారు.

1921లోనే పల్నాడులో ప్రజలు తమంతట తాము పుల్లరి సత్యాగ్రహం ప్రారంభించారు. ఆ అడవి ప్రదేశాలలో చిరకాలం నుంచీ బీదా బిక్కీ కట్టెలు, పుల్లలు ఏరుకొని, ఆకులు కోసుకొని, పశు పిడకలు తెచ్చుకొంటూ స్వేచ్ఛగా జీవిస్తూ ఉండేవారు. గొడ్డూ గోదా ఉన్నవారు ఆ అడవుల్లో తమ పశువుల్ని స్వేచ్ఛగా మేపుకొనేవారు. ఈ స్థితిని తారుమారు చేస్తూ ఆంగ్లేయులు ప్రజలమీద పుల్లరి అనే పన్ను విధించారు. ఎవరినీ అడవిలోనికి పోనీయక, పన్నులు కట్టని వారిమీదా, ప్రతిఘటించిన వారిమీదా తప్పుడు కేసులు పెట్టి, పశువులను బందెలదొడ్డిలోకి తోలించి ప్రజలను నానాహింసలపాలు చేయించారు. ప్రజాపీడన విపరీతమైపోగానే ప్రజలు ఎదురు తిరిగారు. పుల్లరి చెల్లించకూడదనీ, నిర్బంధించే ఉద్యోగులకు ఏ జీవనావసర వస్తువులూ అందనీయకుండా చేయాలని సత్యాగ్రహం ప్రారంభించారు. సాంఘిక బహిష్కారం వల్ల ఉద్యోగులకు పాలు, బియ్యం, పంచదార, కోడిగుడ్లు ఏవీ దొరకలేదు. తమ సిబ్బంది స్థితిగతులను స్వయంగా విచారణ చేయడానికి కలక్టరు షీల్డుదొర వస్తే అతనికి కూడా గురజాల, మాచెర్ల గ్రామాలలో ఏమీ లభించలేదు. ప్రజలను కఠినంగా శిక్షిస్తామని దండోరా వేయంచాలని కలెక్టరు చూస్తే, తప్పిట వాయించేవాళ్ళుగాని, వారి తప్పెట్లుగాని లభించలేదు.

1921 జూలైలో ఆంధ్ర కాంగ్రెసు సంస్థవారు పుల్లరి సత్యాగ్రహాన్ని సమగ్రంగా విచారించి, ఒక నివేదిక సమర్పించడానికి ఉన్నవ లక్ష్మీనారాయణగారిని, మాడభూషి వేదాంతం నరసింహాచార్యులుగారిని సభ్యులుగా నియమించి పంపించారు. ప్రజాందోళన ముమ్మరంగా సాగి పతాకస్థాయి చేరుకొంటుంది. ఉన్నవవారు, మాడభూషివారు పర్యటన ప్రారంభించి ప్రజలను కలుసుకొంటున్నారు. ప్రభుత్వోద్యోగులు మండిపడ్డారు. ఉన్నవవారిని తీసుకొని జిల్లా మేజిస్ట్రేటు వద్ద హాజరుపెట్టారు. పల్నాటి ప్రజలను, అటవీశాఖ చట్టాలను అతిక్రమించేటట్టు మీరు ప్రేరేపిస్తున్నారనీ, ఫారెస్టుశాఖ ఉద్యోగులపై సాంఘిక బహిష్కారాన్ని చేయిస్తున్నారనీ, పల్నాడు శాంతికి భంగం కలిగిస్తున్నారనీ నేరారోపణ చేసి ఒక ఏడాదిపాటు సత్ప్రవర్తనకు పూచీకత్తు ఇవ్వమని శాసించారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు తాము శాంతి నెలకొల్పడానికే వచ్చామని చెప్పి, జామీను ఇవ్వవలసిన అవసరం లేదని వాదించారు. అయితే తప్పుడు కేసులో వారికి సంవత్సరం జైలు శిక్ష విధించి రాయవెల్లూరు జైలుకు పంపించారు. రైలులో గుంటూరుకు తీసుకువెళుతున్న సమాచారం అంది వేలకు వేలు జనం జయజయ ధ్వానాలతో ఆయనకు 1921లో వీడ్కోలు ఇచ్చారు.

రాయవెల్లూరు జైలులో ఉన్నప్పుడు, అంతకు ముందు మానసికంగా ప్లాను వేసుకొన్న నవలను ప్రారంభించాలని ఆయన అనుకొన్నారు. అయితే జైలు అధికారులు దీనికి ఉత్తరువు ఇవ్వాలి. ఒకనాడు జైలు సూపర్నెంటు ఆండర్‌సన్ కలసినప్పుడు తాము నవల రాయదలచుకొన్నట్టు దానికి కావలసిన ఎక్సర్‌సైజు పుస్తకాలు ఇప్పించమని కోరారు. జైలు నిబంధనల ప్రకారం ఏనాడు రాసింది ఆనాడు చూపాలనీ, పుస్తకాలు పూర్తి అయిన వెంటనే అధికారులకు స్వాధీనం చేయాలని, ప్రభుత్వం వారు అంగీకరిస్తే శిక్ష పూర్తయిన తర్వాత గ్రంథాన్ని కర్తకు ఇవ్వగలమని ఆండర్‌సన్ చెప్పాడు. ఉన్నవవారు అంగీకరించారు. దొర పుస్తకాలూ, పెన్సిల్ పంపారు. రచన ప్రారంభమైంది.

ఉన్నవవారు ఏరోజు రాసినది ఆరోజు జైలులోని మిత్రులకు వినిపిస్తూ ఉండేవారు. ఆ మిత్రులలో గంపలగూడెం కుమారరాజా కోటగిరి వెంకట కృష్ణారావు ఒకరు. ఈయన సోషలిస్టు భావాలు గలవాడు. ఉన్నవవారి అభిప్రాయాలతో ఏకీభవించే వ్యక్తి. (ఈ నవలను పూర్తి చేశాక ఉన్నవవారు ఇతనికే అంకితమిచ్చారు.) ఏరోజు రాస్తున్న కాగితాలను ఆరోజు జైల్లో ప్రతాపగిరి రామమూర్తిగారు సాపురాసి రెండో ప్రతిని తయారు చేసేవారు. ఒక ప్రతి జైలు అధికారులకు అప్పచెప్పినా, రెండో ప్రతి రహస్యంగా జైలు బయటకు వెళ్ళిపోయేది.

నవల సమకాలిక సమాజంలోని సజీవ సమస్యలను చిత్రించేది కనుక జీవద్భాషనే వాడాలని ఉన్నవవారు నిశ్చయించుకొన్నారు. అప్పటిదాకా తెలుగులో నవలలన్నీ కృతక సరళ గ్రాంథికంలోనే హెచ్చుగా ఉండేవి. భాషా విషయంలో నూటికి నూరుపాళ్ళు వాడుకభాషలో రచన చేపట్టిన ఉన్నవవారు తమ నవలకు 'మాలపల్లి' అనే పేరు పెట్టారు. దీనికి 'సంగవిజయం' అనే నామాంతరం కూడా ఉంది. ఈ నవలకు వారు ముందు మాటలు రాస్తూ భాష గురించి ఇలా చెప్పారు.[4]

''వాడుక భాషలో పుస్తకం వ్రాయడానికి నాకిదే మొదటి ప్రయత్నం. మాదిరికి తగిన గ్రంథములు కూడా లేవు. సంస్కృత భాషా పాండిత్యంగాని, తెలుగు ప్రబంధముల పరిచయంగాని వాడుకభాషలో గ్రంథములు వ్రాయడానికి విశేషంగా తోడ్పడవు. శుద్ధమయిన తెలుగు భాష రావడానికి సంస్కృత భాషతో సంబంధంలేని పల్లెటూరు వారితో పరిచయముండాలె. మొదట సంస్కృత పండితులూ ఇప్పుడాంగ్ల భాషా పండితులూ తెలుగు భాషా స్వభావాన్ని మార్చారు. అనేక భావాలను తెలియజేసే అచ్చ తెనుగు మాటలున్నా సంస్కృతం నుంచో యింగ్లీషు నుంచో మాటలరువు దీసుకోవడం మామూలైంది. అందువల్ల చక్కని తెలుగు మాటలన్నీ మూలబడి భాషలో సాంకర్యమెక్కువయింది. వీలయినంత వరకు తెలుగు భాష యొక్క నడక కనుకూలంగా యీ గ్రంథం వ్రాయడానికి ప్రయత్నం జేశాను.''

''విభక్తులూ సంధులూ క్రియా రూపములూ మనం మాట్లాడే భాషలోనూ వ్రాసే భాషలోనూ ఒక మోస్తరుగా లేవు. కృత్రిమ రూపాలను కల్పించుకొని వ్రాయడం,

4. ఈ భాగాలను పోరంకి దక్షిణామూర్తిగారు ఉదాహరించారు. చూ॥ తెలుగు నవల నూరు సంవత్సరాలు - పుటలు 99-100.

చదవడం అలవాటు కావడంచేత కృత్రిమ రూపాల కలవాటుపడ్డ నోటితో వాడుకభాష చదవబోతే కొందరి కెబ్బెట్టుగా కనబడడం నేనెరుగుదును.... మాట్లాడే మోస్తరుగానే చదువడం ప్రారంభిస్తే వాడుకభాషలో రుచి కనబడుతుందిగాని లేకపోతే తెలియదు. ఈ మొదటి గ్రంథం జనులకెట్లా రుచిస్తుందో చూసి మరికొన్ని గ్రంథాలు వ్రాయవలెనని కోరిక....''

''భాష యొక్క ప్రస్తుత పరిస్థితిలో వాడుకభాషలో వ్రాయడంకంటె గ్రాంథిక భాషలోనే వ్రాయడం సులభంగా కనపడ్డది కాని అలవాటే దీనికి కారణం. జాతీయ తెలుగుభాషతో పూర్ణమైన పరిచయం లేకపోవడం రెండవ కారణం. నాకంటే పల్లెటూరిలో నివసించడమెక్కువ అలవాటు గలిగి తెలుగు భాషయొక్క నిజస్వరూపం బాగా గుర్తెరిగిన తెలుగు భాషా పండితులు వాడుకభాషలో వ్రాయడానికర్హులు. అయినా దారిచెడితే బాగుంటుందని నా అభిప్రాయం. వాడుకభాషావాదులలో కూడా అభిప్రాయభేదా లుంటవని నాకు తెలుసు... అన్నివైపులనుండీ తీవ్రమయిన చర్చలు జరుగకమానవు. అయినా చర్చ జరిగిన తరువాత అవసరముంటే ప్రయోగములు సవరించుకోవచ్చునని నాకు దోచిన విధంగా అచ్చువేయించాను...''

ఉన్నవవారు గుంటూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలోని ప్రజలు వాడుకొనే భాషను నవలలో ఉపయోగించారు. ఈ ప్రాంతంలో చాలామంది గ్రామీణులు, రైతులు, కూలీలు, పంచములు. అందుచేత చైతన్యవంతులైన పామరజనుల ఆచార వ్యవహారాల్ని ఆయన చక్కని నుడికారపు మెలకువలతో వాడారు. సామెతలు సైతం పాత్రోచితంగా మాండలికాలే. ఉన్నవవారు మాలపల్లిని నాలుగు భాగాలుగా రాశారు.

1వ భాగం - ఇరవై నాలుగు అధ్యాయాలు

2వ భాగం - ఇరవై రెండు అధ్యాయాలు

3వ భాగం - ఇరవై మూడు అధ్యాయాలు

4వ భాగం - ఇరవై రెండు అధ్యాయాలు

నాలుగుభాగాలలోనూ కలసి తొంభై యొక్క అధ్యాయాలు ఉన్నాయి. ఈ గ్రంథాన్ని ఉన్నవవారు జైలులోనే రచించారు. మూడవ అధ్యాయం చివర నవలలోని ఒక పాత్ర చేసిన దస్కత్తులో 1922 ఫిబ్రవరి 8వ తేదీ రాత్రి తొమ్మిది గంటలు అని ఉంది. బహుశా మూడవ భాగం పూర్తిచేసిన తారీఖు అదే కావచ్చును. నాలుగవ భాగం 1922 ఏప్రిల్‌లో పూర్తిచేశారు. ఆ సంవత్సరం జూలై 27వ తేదీనాడు ఆయనను ప్రభుత్వం విడుదల చేసింది. నవల అచ్చువేసుకోనిచ్చింది. మాలపల్లి ప్రచురణ కూడా అంచలమీదగానే జరిగింది.

1వ భాగం 1922లో పమిడిపాటి అగ్రహారీకులు బెల్లంకొండ రాఘవరావుగారి ధన సహాయంతో అయ్యంకి వెంకట రమణయ్యగారు ఆంధ్ర పరిషత్ ఆధ్వర్యాన ఎ.జి.ప్రెస్‌లో ముద్రించారు.

2వ భాగం 1923 ఫిబ్రవరిలో అచ్చుపడింది.

3వ భాగం 1923 మార్చిలో (?) అచ్చుపడింది.

మాలపల్లి మూడు భాగాలూ వెలుగు చూసిన వెంటనే ఈ నవల సాహిత్యంలో బోల్షెవిజాన్ని ప్రచారం చేసే ప్రబలమైన భావాలు ఉన్నాయని ప్రభుత్వం భావించి ప్రచురణ పొందిన భాగాలను వెంటనే నిషేధించింది. ప్రజాప్రతినిధులూ, పత్రికలూ ప్రభుత్వ చర్యను ఖండించారు. ఇది అత్యుత్తమ నవల అని ప్రశంసిస్తూ దీనిపై నిషేధం ఎంతమాత్రం తగదని సి.ఆర్.రెడ్డి గారు ప్రభుత్వ న్యాయశాఖ సభ్యునికి ఉత్తరం రాశారు. కన్యాశుల్కం తర్వాత మాలపల్లే అన్నివిధాలా ఎన్నిక చేయదగ్గ రచనగా ఆయన భావించారు. ఇంతకూ మాలపల్లి నవలలో ప్రభుత్వం అభ్యంతరకరమైన వాక్యాలు 20 కూడా చూపలేకపోయినప్పటికీ 600 పేజీలున్న నవలను నిషేధానికి గురి చేసింది. తొలగించవలసిన భాగాలను సవరించవలసిన వాక్యాలను సూచించింది.[5]

''పచ్చి కమ్యూనిజాన్ని ప్రబోధించే భాగాలను పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కూలీల సంఘీభావాన్ని శక్తులనూ ప్రోత్సహించే భాగాలనూ'' ఈ నవలనుండి తొలగించాలని 1923లో ప్రభుత్వం ఆదేశించినప్పుడు ''కమ్యూనిజాన్ని ప్రచారం చేయడం తప్పేమీకాదని పెట్టుబడికి వ్యతిరేకంగా శ్రామికుల ఐక్యతను ప్రోత్సహించడం దోషం కాదని ఉన్నవవారు ధైర్యంగా ప్రభుత్వం వారికి రాసిన లేఖలో చెప్పారు. అయితే చాలా చిన్న సవరణలు చేస్తే నవలపై నిషేధం తొలగిపోతుందని, రచనలోని మూడొంతుల ముప్పాతిక మూడు వీసాలకు నష్టం లేదని హితైషులు చెప్పడం వల్ల తమ సిద్ధాంతాలకు ప్రచారం కలగడం ముఖ్యం కనుక ఉన్నవవారు కొంత రాజీపడక తప్పలేదు. 1928 మార్చి నెలలో ప్రభుత్వం నిషేధాన్ని తొలగించక తప్పలేదు.

1935-36లో కాశీనాథుని నాగేశ్వరరావుగారు మాలపల్లి నాలుగు భాగాలను కలిపి ప్రచురించేదాకా నాలుగవ భాగం వెలుగు చూడలేదు. ఈ భాగం రచన తర్వాత దశాబ్దిన్నర కాలం అముద్రితంగా, ఎవరి చేతిలోనూ పడకుండా ఉండిపోయింది. ఈ భాగాన్ని 'తెలుగు నవలా వికాసం' అనే పరిశోధన గ్రంథం రాసినవారు కూడా సరిగ్గా చదవలేదనుకోవాలి. ఈ విభాగంలోనే గాంధీజీ పేరు చాలాసార్లు కనబడుతోంది. పరిశీలకులు ఇలాగ రాశారు.[6]

''......పాత్రలను చిత్రించడంలోను, హరిజనోద్యమ విజయాన్ని చూపడంలోను ఉన్నవవారు జాతీయోద్యమ సిద్ధాంతాలనే స్వీకరించినా ఈ నవల ఆద్యంతమూ ఎక్కడా మనకు ఆ ఉద్యమనేత అయిన గాంధీజీ పేరుగాని, ఆయన సారథ్యం వహించిన కాంగ్రెసు పేరుకాని, ఆ కాంగ్రెసు నడిపిన జాతీయోద్యమం పేరుకాని కానరావు....''

అయితే వాస్తవానికి 3వ భాగంలో వృత్తి మానుకొనబోతున్న ఒక ప్లీడరు ఇలా అంటాడు.

5. వివరాలకు బంగోరె - మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు - పుట.65-67.
6. మొదలి నాగభూషణశర్మ - 'తెలుగు నవలా వికాసం - పుట.209

''స్వరాజ్యం వచ్చే ప్రయత్నం అంతా చేద్దాం. గాంధీగారి ఉద్యమంలో నాకు బాగా నమ్మకం కుదరక అజ్ఝాయిస్తున్నా. యింతవరకూ 'యీ తొట్టిస్నానపు చికిత్స వల్ల యీ దీర్ఘరోగం కుదరవచ్చిందా?'' అనుకున్నాను గాని మన తత్త్వానికి యీ మందు బాగా పట్టింది''. (పుట. 343) కొంతకాలం పోయాక ఈ పాత్రే 'మహాత్మాగాంధీ చెప్పిన ప్రకారం స్వరాజ్యం రాక తప్పదు' అంటాడు. (పుట.360). తొలి భాగాలలో ఒక మగనాలిని లేవదీసుకుపోయిన ఒక పాత్ర చివరిలో పశ్చాత్తాపం చెంది మహాత్ముని సబర్మతీ ఆశ్రమంలో చేరుతాడు. (పుట.454). జమీందారీ యుగంలో తెలుగుదేశం మీద గాంధీజీ ప్రభావం లేటుగా పడ్డట్టే మాలపల్లి నవల తొలి పాత్రల మీద కూడా మహాత్ముని ప్రభావం ఆలస్యంగానే పడటం ఉన్నవవారు చిత్రించారు.

'మాలపల్లి' రెండు విభిన్న మార్గాలకు చెందిన రెండు కుటుంబాల చరిత్ర. ఈ కుటుంబాలకు ఉత్పత్తి సంబంధాలూ, ఇతర సాదృశ్య వైరుధ్యాలు ఉన్నాయి. మంగళాపురం అనే గ్రామం. దాని శివారు మాలపల్లె ఈ కుటుంబాల నివాస ప్రదేశాలు. రామదాసు మాలదాసరి కులస్తుడు. అతని పూర్వులు వైష్ణవ మత బోధకులు. మూడుతరాల నుండీ వీరు జ్ఞానమార్గంలో ప్రవేశించి అచల బోధనలు స్వీకరించారు. అప్పటినుండి తర్వాత మతాభిప్రాయాలూ, స్వతంత్ర బుద్ధి, సంఘసేవాదీక్ష, శౌచమూ, పారమార్థిక చింతా వారి కుటుంబాలలో తలయెత్తాయి. రామదాసుకు ఐహిక భావాలపట్ల విముఖత ఏర్పడ్డా సంసారం దిద్దుకునే దక్షత కలిగి, చేతికక్కర వచ్చిన కొడుకులు మొదట లేక సంసారం ఈదడం ప్రయాసగా ఉండేదిగాని నాలుగు సంవత్సరాల నుంచి పెద్దకొడుకు వెంకటదాసు వ్యవసాయ పనులలో ఆరితేరి పనులు చూసుకొంటున్నాడు. రామదాసుకు తూర్పున ఆరెకరాల మాగాణి, దక్షిణ పొలిమేర దగ్గర ఆరెకరాల సావరమూ, మిద్దె ఇల్లూ ఉన్నాయి. కొంత భూమి ఆ వూరి సావుకారు నల్లమోతు చౌదరమ్మకు విక్రయించి పదిహేను ఎకరాల రేగటిచేను సంపాదించాడు.

రామదాసు రెండో కొడుకు సంగదాసు. చౌదరయ్యగారి ఇంట్లో పెద్ద జీతగాడు. మేనేజరుగా ఉంటూ అన్ని పనులూ చక్కగా చేస్తూ చేయించుకొంటూ ఉంటాడు. వ్యవసాయపు అజమాయిషీ, ఐవేజు అమ్మడం, నిలువ చేయడం అన్నీ సంగదాసు పనులే. భోజనమూ నెలకు 15 రూపాయల జీతమూ అతనికిచ్చే ఏర్పాటు. పనివాళ్ళందరిమీదా పెత్తనం ఇతనిదే. ఆధ్యాత్మిక విషయాలూ, వేదాంత ఆర్థిక సూత్రాలూ బాగా విశ్లేషణ చేసినవాడు. కూలీలకోసం పాటుపడేవాడు. చౌదరయ్యకి రామానాయుడనే కుమారుడున్నాడు. వెంకటయ్య అనే పేరుగల అన్న కొడుకు కూడా ఆ కుటుంబంలోనే ఉన్నాడు. ఉమ్మడి కుటుంబం. రామానాయుడికి పెళ్ళి అయింది. భార్య కమల. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. పేరు సహదేవరావు. 'సాహూ' అని ముద్దుపేరు. రామానాయుడు సంగదాసు ప్రభావంలో, ప్రబోధంలో పడి ఆముష్మిక చింతన నుండి ఆర్థిక విషయాలపైనా, కూలీల సమస్యలపైనా శ్రద్ధ చూపిస్తున్నాడు.

రామదాసుకు జ్యోతి అనే కుమార్తె, ఇంకో చిన్నకొడుకు ఉన్నారు. రామదాసు చేను, దొడ్డి, ఇల్లు, కుటుంబం, బర్రె చూసుకొంటూ సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు.

అతనికి అప్పాదాసు అనే మేనల్లుడు ఉన్నాడు. గొడ్ల కాపరిలాగా పనులు చేస్తున్నా విద్యాగంధం కలవాడు. ఉత్తరోత్తరా బడిపంతులుగా పనిచేసినవాడు. జ్యోతికి పంచకావ్యాలూ, చదువు చెప్పినవాడు.

చౌదరయ్యా సిగయెగగట్టి పెత్తనానికొచ్చిన దగ్గర్నుంచీ తండ్రి ఇచ్చిన రెండువందల ఎకరాల పల్లం, మూడు ఎకరాల మెట్టా అయిదువందల ఎకరాల పల్లంగా, మూడువందల ఎకరాల మెట్టగా పెంచాడు. మూడులక్షలదాకా కవిలె పెంచాడు. ఇంకా ఆస్తి పెంచుదామని కోరిక, కూలీలకు తిండి గింజలు, గడ్డి జీతంగా ఇవ్వక డబ్బులిచ్చి పనులు చేయించుకొందామని భూస్వామ్యవర్గాలు ఆలోచిస్తున్నాయి. డబ్బులు ఇస్తే కూలీలకు గిట్టుబాటు కాదు. ధరలు పెరిగిపోయాయి. ఆ దామాషాకు కూలిడబ్బులు సావుకార్లు పెంచడం లేదు. కూలీలు తమ పరిస్థితి సంగదాసుతో చెప్పుకొన్నారు.

సంగదాసు కూలీల విషయమై చౌదరయ్యకు చెప్పాడు. ''కూలివాండ్ల విషయమై బాధ్యత మనకేమున్నదని రయితులు అనడానికి వీలులేదు. వ్యవసాయం ఆసాములమీద కంటే యెక్కువ కూలీలమీదనే ఆధారపడి వున్నది. వారి పోషణ విషయమై మీరు యోచించక తప్పద''ని కచ్చితంగా చెప్పాడు. కూలివాడికి కడుపునిండా అన్నం ఉంటే కూలికి రాడని చౌదరయ్యా విశ్వాసం. అతను మొండికెత్తాడు. కూలీలు సమ్మె కడతామన్నారు. సంగదాసు సర్దిచెప్పి కూలిగింజలు కొలిపించాడు. సమస్య ప్రస్తుతానికి సర్దుకొంది. సంగదాసూ, రామానాయుడూ బెజవాడలో జరిగిన ఆదియాంధ్ర మహాసభలకు వెళ్ళారు. సంగదాసే ఆ సభలో ప్రవేశపెట్టే చిత్తు తీర్మానాలు రాశాడు. వారి వివరాలు ఇవి :

1. మన సంఘము వారు నీచమైన పేర్లు పెట్టుకోకూడదనీ తమ పేర్లకు అన్నా, అప్పా, అయ్యా, అక్కా మొదలైన మర్యాద వాచకాలను చేర్చుకోవలసిందనీ, వొకరి నొకరు మర్యాదగా పిలుచుకోవలసిందనీ, అట్లు చేయకపోవడం మన ఆత్మగౌరవానికి భంగమని యీ సభవారు తీర్మానిస్తున్నారు.

2. మన పిల్లలందరికీ సామాన్య విద్యా, వృత్తి విద్యా విధిగా నేర్పించవలసిందనీ యీ సభ వారు కోరుతున్నారు.

3. మన సంఘీయులు వృత్తి గౌరవం గలిగి, నేతా, చర్మకార వృత్తి వృద్ధిచేసి మన సంఘం యొక్క అర్థస్థితి బాగు చేయవలసిందని యీ సభవారు సిఫార్సు చేస్తున్నారు.

4. సంఘ గౌరవానికి లోపంగానూ, అర్థాభివృద్ధికి భంగకరంగానూ వున్నటువంటి మద్యపానాది దుర్వృత్తులను మానివేయవలసిందని యీ సభ వారు తమ దృఢాభిప్రాయమును నొక్కి వక్కాణిస్తున్నారు.

5. ఆరోగ్యాభివృద్ధికిగాను స్నానం మొదలైన శౌచ పద్ధతులను విధిగా అవలంబించవలసిందని సంఘంవారిని యీ సభవారు మరీ మరీ హెచ్చరిస్తున్నారు.

6. జీతగాండ్లకూ యితర కూలీలకూ వోట్లిచ్చు అధికారం యియ్యవలసిందని యీ సభవారు కోరుతున్నారు.

7. అడవులలో వ్యవసాయ పనికి వచ్చే భూములను దిగువ జాతులకు మాత్రమే దరఖాస్తుల కిప్పించవలసిందని యీ సభవారు కోరుతున్నారు.

8. యిదివరకు పంచములకని దరఖాస్తులకిస్తున్న భూములు చాలావరకు పంచమ క్రైస్తవులకే చెందుతున్నందువల్ల హిందూ పంచముల సంఖ్యానుబట్టి వారి భాగానికి రాదగిన భూములను వారికే యిప్పించవలసిందని యీ సభవారు ప్రార్థిస్తున్నారు.

9. యిండ్ల నిమిత్తం స్థలములూ యిండ్లు కట్టుకొనుటకు ద్రవ్య సహాయం యిప్పించవలసిందని యీ సభవారు కోరుతున్నారు.

10. పై తరగతుల వారు విద్యాధికులై వున్నతోద్యోగాలను ఆక్రమించుకొని వున్నందువల్లనూ దిగువ తెగల కింతలో ఆ స్థితి లభించే ఆశలేనందువల్లనూ పోలీసూ, రెవిన్యూ, సివిలూ, ఫారెస్టూ, మిలిటరీ మొదలగు శాఖలలో స్వల్ప ఉద్యోగాలను దిగువ జాతులకు ఆపుదల చేయించవలసిందని యీ సభవారు ప్రార్థిస్తున్నారు.

11. మంది సొమ్ము వుపయోగించి యేర్పరచిన విద్యాలయాలు, బావులు, చెరువులు, సత్రాలు, దేవాలయాలు మొదలైనవాటిలో దిగువ తరగతుల హక్కుల అంగీకరించవలసిందనీ, వాటిలో కొన్నిటిని ప్రస్తుతం వారికై ప్రత్యేకించవలసిందనీ యీ సభవారు కోరుతున్నారు.

12. బహిరంగ స్థలాలలో గూడా పంచములను దూరస్తుల చేసే ఆచారం ఆత్మ గౌరవం గల పంచములకు దుస్సహంగా వున్నదని తదితర సంఘాలకు తెలియ పరుస్తున్నారు.

13. వ్యవసాయపు పనులలో పనివాండ్లకిచ్చు కూలి స్వల్పంగా వున్నందువల్ల తగురీతిని హెచ్చించవలసిందని రైతులకు యీ సభవారు విన్నవించుకొనుచున్నారు.

14. ప్రధాన స్థలములలో పంచముల ఉపయోగం నిమిత్తం వృత్తి విద్యా, సామాన్య విద్యా నేర్చే పెద్ద విద్యాలయం స్థాపించి వసతి గృహం యేర్పరచడం అత్యవసరమని యీ సభ వారు తీర్మానిస్తున్నారు. ఈ తీర్మానాలన్నింటినీ సభవారు ఆమోదించారు. మరొకరు కొత్త తీర్మానాన్ని ప్రతిపాదించారు. దాని పాఠం ఇది.

15. కూలీలకు సక్రమమైన కూలి యియ్యక వారి శ్రమ వలన వచ్చే ఆదాయంలో విశేష భాగం భూస్వాములే అనుభవిస్తున్నందువల్ల నేతల కోతల కాలాలలో కూలీలు సమ్మెకట్టి సహాయ నిరాకరణ మవలంబంచవలసిందని ఈ సభ వారు తీర్మానిస్తున్నారు.

దీనికి కొందరు విముఖత చూపారు. దాన్ని ఉపసంహరించుకొన్నారు. మహాసభలలో సంఘానికి కార్యదర్శిగా సంగదాసు ఎన్నికయ్యాడు. రామానాయుడు

అతని ప్రభావంలో పూర్తిగా పడ్డాడు. అత్తవారింటికి వెళ్ళి భార్యను, బిడ్డను వెంట బెట్టుకొని రావడానికి రామానాయుడు వెళ్ళాడు. సంగదాసు మంగళాపురం వెళ్ళాడు. తన కొడుకుచేత చేనులో కోతలు కోయిస్తున్నాడనీ, మాలకూలీలతో తిప్పుతున్నాడనీ, మాదిగన్నం తినిపిస్తున్నాడనీ చౌదరయ్య సంగదాసుపై కోపగిస్తున్నాడు. సంగదాసు తనను నిలువ నిచ్చేటట్టు లేడని మండిపడి అక్కడ ఉన్న రాగోల భుజాన వేసుకొని వెళ్ళి, రాగోల బిగపట్టి సంగదాసు తలమీద కొట్టాడు. సంగదాసు తల దానిమ్మపండువలె బద్దలయింది. ''లోకంలోని అక్రమాలను జూచి ఆక్రోశించిన రక్తం, ఉన్నత భావాలకు ఉద్రేకించిన రక్తం, పరుల సేవలలో పాకిపోయిన రక్తం, పవిత్ర భావాలచేత పావనమైన రక్తం గొట్టాన జిమ్మున ప్రవహిస్తున్నది. భూమి పావనమైంది.'' సంగదాసు అమరుడయ్యాడు. అతని చివరి మాటలు 'మనం గెలుస్తాం' అన్నవే. చౌదరయ్య మీద కేసు పెట్టకుండా మాలలు ఔదార్యం చూపారు. సంగదాసు శవరత్నాన్ని భూస్థాపితం చేసి అందరూ ధర్మమట్టి జల్లి వెళ్ళిపోయారు. మాలపల్లి మొదటి భాగంలోని ఇరవై అయిదు అధ్యాయాలూ ఇంతటితో ముగిశాయి.

తరువాత మూడు భాగాలూ సంగ విజయంగానే పరిగణించాలి. సంగదాసు లేకపోయినా అతడు ప్రబోధించిన విషయాలు అతని అన్న వెంకటయ్యలో ఒక రకం పరిణామాన్నీ, రామానాయుడులో ఒక రకం పరివర్తననూ తెచ్చాయి. సంగదాసులో అతివాదీ ఉన్నాడూ, కార్యాచరణదక్షుడూ ఉన్నాడు. ఒకసారి రామానాయుడుతో సంగదాసు మాట్లాడుతూ పేదల స్థితిని తొలగించడానికి ఒక్కటే మార్గం కనబడుతున్నదని చెప్పాడు. ''యీ దేవుణ్ణి పదభ్రష్టుని జేసి ఒక సైతానునైనా దెచ్చి కూర్చోబెట్టాల''న్నాడు. 'మళ్ళీ సైతానెందుకు?' అని రామానాయుడు అడిగాడు. 'ఎవరూ లేకపోతే మంచిది' అని సంగదాసు చెప్పాడు. రామానాయుడు పంచమ కార్మికోద్యమాల పట్ల తన దృష్టిని కేంద్రీకరించాడు.

మాలపల్లి మిగతా మూడుభాగాలలో రామదాసు కుటుంబం చౌదరయ్య కుటుంబం చితికిపోవడం చిత్రించారు. 'రామదాసు కష్టాలకూ నష్టాలకూ చౌదరయ్య కారణం. ఒక కొడుకు దుర్మరణం పొందాడు. ఒక కొడుకు అన్యాయాలు సహించలేక దేశాలు పట్టిపోయాడు. మేనల్లుడికి ఉద్యోగం పోయింది. కూలినాలి దొరకదు. నేరాలు చేసే జాతుల వాళ్ళతో పంచములను కొందరిని జమకట్టి రామదాసు కుటుంబాన్ని క్రిమినల్ సెటిల్‌మెంట్‌కు పంపారు. అక్కడ అతని కూతురు మానభంగం తప్పించుకొనడానికి కృష్ణలో దూకింది. ఆమెను ప్రేమించే అప్పాదాసు ఆమె శవంతో కృష్ణలో కొట్టుకుపోయాడు. రామదాసు మీద కేసులు పెట్టి క్రిమినల్ సెటిల్‌మెంట్ నుంచి సెంట్రల్ జైలుకు పంపించారు. వారి భార్య ఆడవాళ్ళ జైల్లో వుంది.

రామదాసు సంసారాన్ని చిన్నాభిన్నం చేసి చౌదరయ్య ఏమీ బావుకోలేదు. హత్యా కేసు తప్పించుకోడానికి నానాయాతనలు పడి అయిదు సంచులు వదిలించుకొన్నాడు. అతని కోడలు లేచిపోయింది. కొడుకు ఇల్లు పట్టించుకోలేదు. మనుమడు చనిపోయాడు. అంత ఆస్తికి వారసులు లేరు. భార్య మరణించింది. చౌదరయ్య మనసు సంచలనం చెంది

పశ్చాత్తాపంతో మరణించాడు. వెంకటయ్య, రామానాయుడు ఉద్యమాలకు ఆస్తి ఇచ్చేశారు. రామదాసు కుటుంబంలో చిట్టచివరకు అతడు కూడా ఏకాకిగా, సర్వసంగ పరిత్యాగిలా ఉన్నా సమాజంలో ఒకడిగా మిగిలాడు.

అన్యాయాలు సహించలేక దేశాలు పట్టిపోయిన రామదాసు పెద్దకొడుకు వెంకటదాసే తక్కెళ్ళ జగ్గడనే పేరుతో ధర్మకన్నాలు వేసి ధనికుల సొమ్ము పేదలకు పంచిపెట్టసాగాడు. నల్లమల అడవులలో అతని వల్ల ధర్మశిక్షణ పొందిన సంతానుల దళాలు ఉన్నాయి. విశాఖ ఏజెన్సీ తాలూకాల వాళ్ళందరూ అతనికి అనుచరులై నైజాంలో కొన్ని తాలూకాలు స్వాధీనం చేసుకొన్నారు. ప్రతి జిల్లాలోనూ జిల్లా నాయకులు ఉన్నారు. మద్రాసు, హైదరాబాద్, మైసూరు రాజ్యాలలోని సి.ఐ.డి.లకు అతని అంతు చిక్కలేదు. అతని అనుచరులు కొందరు దొరికిపోయారు. రహస్యాలు బయటపెట్టడం లేదు. జగ్గడు కరపత్రాలు అచ్చువేసి ఇలా ప్రకటించాడు.

''మా అనుచరులను శత్రువులు పట్టుకున్నప్పుడు న్యాయశాస్త్ర ప్రకారం శిక్షించకుండా మీ నాయకుల పేర్లు చెప్పవలసిందనీ, మీ సంఘంయొక్క యేర్పాటు బయట పెట్టవలసిందనీ' నిర్బంధపెట్టి అంగీకరించని వాండ్లను హింసించి ఇనుపకడ్డీలతో కాల్చి చిత్రవధలు చేస్తున్నట్టూ, మా సైనికుల తాలూకు స్త్రీలను తమ భర్తల జాడలను జెప్పవలసిందని బాధించి అవమానపరుస్తున్నట్టూ మాకు తెలియవచ్చింది. యికముందు యిట్టి ఆక్రమచర్యలు పోలీసులుగాని, వారి యిలాకావారుగాని జరిగించే యెడల అట్టి వాండ్లకు మా చట్టాల ప్రకారం కఠినశిక్షలు విధించుతామని తెలుసుకొనేది. మా స్త్రీలను దుర్మార్గులు అక్రమంగా అవమానపరిస్తే దానికి ప్రతిక్రియగా శత్రు స్త్రీలను అవమానపరచడానికి మా ధర్మాలు అంగీకరించవు గనుక యితర శిక్షలు మాత్రమే విధించబడుతవి. సనాతనులైన మా అనుచరులు మా ధర్మానికి వ్యతిరేకంగా స్త్రీలను అగౌరపరిస్తే మాకు వెంటనే తెలుపగోరుతాము.

- తక్కెళ్ళ జగన్నాథం

జగ్గడి ఉద్దేశంలో ధనికులే కలియుగ రాక్షసులు, భాగ్యవంతులు తమ ప్రవర్తనను మానుకొనకపోతే, బీదలే చట్టాలు మార్చి లోకములో భూతల స్వర్గం స్థాపిస్తారు. అతనిది హృదయరాజ్యం. అది నశించదు. అతడు తెస్తున్నది విప్లవం. ''కొత్తా పాతా యావత్తూ ఒక మూసనబడి కరిగి సమ్మిళితమై వొక నూతనశక్తిగా విజృంభించి జగన్నాథుని రథంవలె పరిభ్రమిస్తున్నది. యిది నిజంగా జగన్నాథుని రథమే. యీ త్వరను యీ మహాశక్తిని యెదిరించడానికి యెవరికి సాధ్యమవుతుంది?'' (పుట.377) మాలపల్లిలో మొట్టమొదటిసారిగా ఉన్నవవారు విప్లవాన్ని జగన్నాథుని రథంతో సరిపోల్చారు. సామ్యవాదాన్ని వివిధ ఛాయలతో వన్నెలతో చిత్రించారు.

తక్కెళ్ళ జగ్గడి ఉగ్రవాదం ఆదర్శవంతంగా ఆకర్షణీయంగా కనబడవచ్చుగాని దీనివల్ల హాని ఎక్కువ. ఈ ఉద్యమాన్ని వంకపెట్టుకొని ప్రభుత్వం వారు కార్మిక సంఘాలను నిర్మూలనం చేయవలెనని చూస్తున్నారని నవలలో ఒక పాత్ర స్పష్టంగా

చెప్తుంది. ''కార్మిక పంచమోద్యమాలు రెండూ వృద్ధి పొందినప్పుడే దేశంలో నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది. దిగువ జాతులలో ప్రబోధం కలుగందే ధనిక ప్రభుత్వం వుంటుందిగాని ప్రజాప్రభుత్వం వుండదు''. (పుట.361) అని ఉన్నవవారు చెప్పారు. 1922లో చెప్పిన ఈ మాటలు నేటికీ నిజం.

ఎన్నాళ్ళు ప్లాను చేశారో తెలియదుగాని ఉన్నవ వారు తమ నవలలోని ప్లాటు చాలా పకడ్బందీగా నిర్మించుకొన్నారు. మూడవ భాగంలో క్రిమినల్ సెటిల్‌మెంటులో జీవితాన్ని నాలుగోభాగంలో జైలు జీవితాన్ని విపులంగా వర్ణించడంలో పాఠకులకు విసుగు పుట్టిస్తుందని కొందరు విమర్శించడాన్ని అది కథాగమనానికి అడ్డు తగిలిస్తుందనే మరొకవాదాన్ని డాక్టర్ ఎస్. గంగప్పగారు ఉదాహరించి ''ఈ విపుల వర్ణన లేకపోతే రామదాసు పాత్రోన్మీలన సార్థక్యం పొంది ఉండేది కాదు' అని సరిగ్గానే చెప్పారు. అయితే ఈ విపుల వర్ణన ఆ పాత్ర క్రమ పరిణితి సూచించడానికి మాత్రమే కాదు. క్రిమినల్ సెటిల్‌మెంటూ, సెంట్రలు జైలు ప్రభుత్వం వారు నిర్మిస్తున్న కొత్త మాలపల్లెలని చెప్పకుండా చెప్పడమే ఉన్నవవారి ధ్యేయంగా కనబడుతోంది. రెండు చోట్లా మానవులను పశుప్రాయునిగా చేయడమే అధికారుల లక్ష్యం. అయినా ఒక రామదాసులాంటివాడే అన్నింటిని ఓర్చుకొని తన మానవత్వాన్ని నిలబెట్టుకోగలుగుతాడు.

నాలుగవ భాగంలో 15, 16, 17, 20 అధ్యాయాలు అయిదూ హడావిడిగా రాశారో, రాయాలనో అలా రాశారో తెలియదుగాని అప్పటిదాకా ఎంతో శిల్పనైపుణ్యం చూపిన ఉన్నవవారు ఈ అయిదు అధ్యాయాలలో దబదబా కథ చెప్పేశారు. 'అసహాయోద్యమం యొక్క విచిత్ర చరిత్రతో మనకవసరం లేదు' అంటూనే దాని విజయాన్ని చెప్పి కాంగ్రెసు కోరినట్టు స్వరాజ్యం వచ్చిందని 1922లోనే రాసేశారు. ''భారతీయులు దౌర్జన్యరహితమైన సత్యమార్గమున స్వరాజ్యము సంపాదించి లోకానికి మార్గదర్శకులయినారు' అని సంబరపడ్డారు. ఈ భాగాలలో ఉన్నవవారిలో ఉన్న సాహిత్య శిల్పం పక్కకు తోసేసి వారిలోనే ఉన్న ఆదర్శవాది కలం పట్టుకొని రచన సాగించారా అనిపిస్తుంది. ఈ అయిదు అధ్యాయాలను యింకోలాగా రాసి వుంటే మాలపల్లి కన్యాశుల్కమంత ఉత్తమోత్తమ సాహిత్య రచనగా ఉండేది. అయినా 11 ఏళ్ళ తర్వాత నాలుగో భాగం వెలుగు చూస్తున్నప్పుడు ఏ మార్పులు చేయకుండా ఆదిలో రాసింది యథాతథంగా అచ్చువెయ్యడంలో ఉన్నవవారి చిత్తశుద్ధిని ప్రశంసించాలి. ఏడాదిలో గాంధీజీ స్వరాజ్యం తెస్తానన్న ప్రకటనను నమ్మబట్టే అందరు ఆనాడు ఉద్యమంలోనికి వచ్చారు. ఆ మాటలు నిజమైనట్లు ఉన్నవవారు భావించి రచన చేయడంలో ఆశ్చర్యం లేదు.

ఏది ఏమయినా ఆయన మాలపల్లితో తెలుగు నవలను కొత్తమలుపు తిప్పారు. ఉన్నవవారిలాగే కృషి చేసినవారు తెలుగు సామాజిక నవలల్లో వర్గ సంబంధాల విషయంపై కాక కేవలం స్త్రీ పురుష సమస్యలపై ప్రత్యేకంగా రచనలు చేసినవారున్నారు. జమీందారీ యుగం చివరి దశాబ్దంలో ఈ ధోరణులు కనబడ్డాయి. 1921 నుండి తెలుగు సాహిత్య ఖగోళంలో జాజ్వల్యమానమైన కొత్తతార ఒక వెలుగు వెలగడం అందరికీ గోచరమైంది.

గుడిపాటి వెంకటాచలం (1894-1979)

జి. వెంకటచలం, వెంకటచలం, చలం, చెలం అనే పేర్లతో వివిధ కాలాలలో విభిన్న ప్రక్రియలలో రచనలు చేశారు. జమీందారీ నవ్య సాహిత్య యుగాలలో ఆయన చేసిన రచనల వివరాలు చూడండి.

నవలలు :

1. శశిరేఖ (1921)
2. దైవమిచ్చిన భార్య (1923)
3. అమీనా (మొదటిభాగం) - 1926
4. మైదానం (1927)
5. వివాహం (1928)

నాటకాలు :

1. చిత్రాంగి (1922)
2. పద్మరాణి (1923)
3. హరిశ్చంద్ర (1924)
4. జానకి ఆవేదన (1926)
5. వెలయాలి అబద్ధాలు (1926)
6. సావిత్రి (1927)
7. శశాంక (1927)?

నాటికలు :

1. సత్యం (1922)
2. శివం (1923)
3. సుందరం (1923)
4. శావలిని (1926)

చిన్నకథలు :

1. సుశీల (1924)
2. కన్నీటి కాలువ (1924)
3. కర్మమిట్లా కాలింది (1925)
4. మధురమీనాక్షి (1925)
5. మాదిగ అమ్మాయి (1925)
6. అప్పుడూ ఇప్పుడూ (1926)

సాంఘిక సమస్యలు :

1. బిడ్డల శిక్షణ (1924)
2. స్త్రీ (1925)

ఇన్ని విభిన్న రచనలతో జమీందారీ యుగంలో చివరి దశాబ్దంలో నవ్యసాహిత్య యుగం ప్రారంభంలో చలం తెలుగు సాహిత్య లోకంలో సంచలనం కలిగించాడు. ఆయన జీవితమే ఒక నూతన పోకడలు గల కథలాగ ఉంటుంది. అతడు జమీందారీ ఫాయీలో పెరిగినవాడు. అతని తండ్రి కొమ్మూరి సాంబశివరావు రెవిన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం దొరికినా దాన్ని చేయలేదు. కారణం అతని అత్తగారు గుడిపాటివారు సంపన్నుల హోదాలో ఉన్నవారు. గుడిపాటి వెంకటరామయ్యగారు ప్రభుత్వపు రెవిన్యూ శాఖలో సెటిల్‌మెంటు ఆఫీసరుగారు పనిచేసి రిటైరు య్యారు. క్రీ.శ. 1900లో రిటైరుమెంటు తర్వాత తోట్లవల్లూరు జమీందారీకి రిసీవరుగా ప్రభుత్వం చేత నియమితులయ్యారు. ఆ జమీందారీ అప్పుడు దావాల్లో ఉంది. రిసీవరుదే అధికారం. గుడిపాటి వెంకటరామయ్యగారికి పుత్ర సంతానం లేదు. పెద్దకుమార్తె వెంకటసుబ్బమ్మను కొమ్మూరి సాంబశివరావుకిచ్చి పెళ్ళిచేసి అల్లుణ్ణి కూతుర్నీ ఇంట్లో పెట్టుకొన్నారు. వెంకటసుబ్బమ్మకు వరుస కాన్పులలో తొమ్మండుగురు సంతానం. ఇందులో అయిదుగురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. వీళ్ళలో పెద్దబ్బాయి పేరు వెంకటచలం. 1894లో జన్మించాడు. గుడిపాటి వెంకటరామయ్య శాస్త్రోక్తంగా దౌహిత్రుణ్ణి దత్తపుత్రుని చేసుకొన్నారు. వెంకటచలం ఇంటిపేరు గుడిపాటివారుగా మారింది. ఇంటిపేరు మారిందిగాని ఇంటితీరు మారలేదు.

చలానికి తల్లంటే అమితమైన ప్రేమ, జాలి, అనుకంపం. తండ్రిమీద తగని ద్వేషం. తన ఆత్మకథ రాసుకుంటూ ఉత్తరోత్తరా చలం చెప్పిన మాటలు ఉత్తరోత్తర జీవిత ప్రవర్తన అర్థం చేసుకొందికి పనికి వస్తాయి. ''నా మొట్టమొదటి జ్ఞాపకం, అయిదేళ్ళప్పుడు మా నాన్న నన్నుకొట్టడం. రెండో జ్ఞాపకం ఆయన నన్ను కొట్టడం. మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం''. కొమ్మూరి సాంబశివరావు కొడుకు బడి చదువు మాన్పించి చదువు చెప్తానని హింసించేవాడు. తండ్రిమీద చలానికి జన్మ విరోధం ఏర్పడింది. చలం తన తల్లి గురించి ఇలా రాశాడు.[7]

''మా తల్లి వరుసగా పిల్లల్ని కని అర్భకురాలై పక్క మీదనే పడుకుని వుండేది. ఒకటి రెండుసార్లు చావుకి సిద్ధమయింది. ఐనా వొదిలేవాడు కాదు ఆ దయగల భర్త. అర్థరాత్రులు నా పసి తమ్ములు, చెల్లెళ్ళు ఏడ్చేవారు. ప్రతిరాత్రి తప్పకుండా, అంత బలహీనంలోను, అలసిన నిద్రకళ్ళతో మా అమ్మ జోలపాటలు పాడేది వుయ్యాలలూపుతూ.

'ఏడవకు అబ్బాయి ఏడవకు తండ్రి
నెల్లూరు పంపేరు నల్ల చెరకులకు'

మాకా తెనాలిలో అప్పుడు చెరుకులేమిటో తెలీదు. ఆ నల్ల చెరకులంటే, శ్రేష్టమైన బెత్తాలుగావును, వాటితో పిల్లల్ని కొట్టడానికి అనుకునేవాణ్ణి, పాడి పాడి పాపం! ఇంకా పిల్ల ఏడుస్తోవుంటే, 'ఏం చెయ్యనురా? ఇంకా పడుకోవు' అని దయగా అంటే, ఆ కంఠం విని సైలెంటుగా ఏడ్చేవాణ్ణి. కాని ఈనాటి తల్లులమల్లె ఆ పసిపిల్లల్ని కొట్టేదికాదు మా అమ్మ''.

---

7. చలం (ఆత్మకథ) - పుట 14

అయితే చలాన్ని వాళ్ళమ్మ ఎప్పుడూ ముద్దు చేయలేదు. అమ్మ ప్రేమన్నా, నాన్న ప్రేమన్నా అతనికేం తెలియదు గాని తల్లిమీద తనకున్న జాలిని చలం మొత్తం స్త్రీజాతిమీద అభిమానంగా తన తదుపరి జీవితంలో అనువదించుకొన్నాడు. అతని బాల్య స్నేహితులలో ఎక్కువమంది ఆడపిల్లలే. చలం మాతామహుని ఇల్లు చాలా పెద్దది. పెద్ద డాబా, పెద్ద కోట. ఊరి ఆడపిల్లలంతా చలం చెల్లెళ్ళతో ఆడుకోడానికి వచ్చేవారు. చలం ఆడపిల్లలతో ఆటలతో, పాటలతో, సరసాలతో, నాటకాలతో కాలం గడిపేవాడు. తండ్రి కొడతాడని భయం వేసినప్పుడల్లా అమ్మమ్మ వద్ద వెనుక చేరేవాడు.

చలం అమ్మమ్మకు బంధుప్రీతి ఎక్కువ. చుట్టుప్రక్కల ఇళ్ళలోని ఆడవాళ్ళందరూ మధ్యాహ్నం ఆమె చుట్టూ చేరేవారు. ఆమె వాళ్ళకు భారతం చదివి వినిపించేది. చలం బడెగగొట్టి అమ్మమ్మ చెప్పే కథలు ఆసక్తితో వినేవాడు. ఈరకం పురాణ గోష్ఠి మాత్రమేకాక ఒక పండితశాస్త్రిగారు కూడా మధ్యాహ్నం పురాణాన్ని, వేదాంత గ్రంథాలను సంస్కృత మూలం నుంచి చదివి తెలుగులోనికి అనువాదం చేసేవాడు. చలం ఇవన్నీ విని దైవభక్తిని పెంచుకొన్నాడు. పూజలు చేసేవాడు. చలానికి చిన్నప్పుడే ఉపనయనం చేశారు. అతడు శ్రద్ధగా సంధ్యావందనం నేర్చుకొని మూడుపూటలా సంధ్య వార్చేవాడు. గాయత్రీ జపం చేసేవాడు. తన దత్తపుత్రుని నియమనిష్ఠల్ని చూసి తాతగారు సగం ఆస్తిని అతనిపేర రాసేరు.

తోట్లవల్లూరులోనూ, తెనాలిలోనూ చలం హైస్కూలు చదువులు చదువుతున్నప్పుడే చలం రకరకాల గ్రంథాలు చదవసాగాడు. ఆ సంగతి ఇలా రాశాడు.[8]

''చిన్నతనం నుంచి నాకు పుస్తకాలన్నా, కథలన్నా ఆసక్తి ఎక్కువ. పురాణం పైనేగాక, ఎన్నెన్నో కావ్యాల్ని సగం అర్థమయి, అర్థంకాక చదివేశాను. వాటిల్లో ముఖ్యంగా శృంగార ఘట్టాల్ని వెతుకుతో, ఆ కాలంలో పురుషులకి స్త్రీలు కూడా సంస్కారవంతులైన గృహిణిలుగా వుండటం ముఖ్యం. ఇళ్ళల్లో కూచునే ధర్మాధర్మాలు నీతి అవినీతులు చర్చించుకునేవారు. ఏ కొత్త పుస్తకం అచ్చయినా తెప్పించుకునేవారు మా ఇంట్లోవాళ్ళు. వాటిల్లో వెంకటరాయశాస్త్రిగారి ప్రతాపరుద్రీయం, అప్పారావుగారి కన్యాశుల్కం నన్ను ఆకర్షించాయి. కన్యాశుల్కం నాకెంతో సహజమనిపించింది. ఆవిధమైన రచన, దాని భాషతోసహా Sub-Conscious mindలో నిలిచిపోయింది.''

పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, రచనలు చేయడం కూడా చలానికి చిన్నప్పట్నించీ అలవాటే. ''రాత అనేది నారాత ఏమో. 14వ ఏట నుంచి ఏదో ఒకటి రాస్తానే ఉన్నాను'' అని చలం ఒక ఇంటర్వ్యూలో తర్వాత చెప్పాడు.[9] ఇంగ్లీషు నవలలు చదివి వాటిని అనువదించడానికి పూనుకొన్నాడు. 1909లోనే అంటే 4వ ఫారం చదువుతున్నప్పుడు పదిహేనో యేట ఒక నవల అనువాదం చేశాడు. అది మిసెస్ హెన్రీవుడ్ (1814-87) రచించినది. ఆమె రచనలలో 'ఈస్టలీన్' అన్నది సుప్రసిద్ధమైనది. ఇది 1861లో అచ్చుపడింది. భారతదేశంలోనే, ఆంధ్రులలోనూ కూడా దానిని చదివి మెచ్చుకొన్నవారు ఉన్నారు. ఈ నవలను అనుసరించి ఆంగ్లంలో ఒక నాటకాన్ని కూడా

8. చలం (ఆత్మకథ) - పుట 123-4
9. సృజన - మే, 1968, పుట.9

రూపొందించారు. అది చాలా విజయవంతమైంది. ఈ నవలలో కథానాయిక 'ఇజబెన్' సంపన్న కుటుంబంలోని మహిళ. మగనాలు. భర్తను, బిడ్డను వదిలేసి ఎవరితోనో లేచిపోయింది. కొన్నేళ్ళు పోయాక తాను చేసిన దానికి పశ్చాత్తాపం చెంది భర్త ఇంటికి తిరిగి వస్తుంది. ఆమెను ఎవరూ గుర్తుపట్టలేనంత మారిపోయింది. బిడ్డలకు దాదిగా సేవలు చేసింది. ఎన్నో సంఘటనల తర్వాత భార్యాభర్తలు మళ్ళా ఒకరినొకరు అర్థం చేసుకొని ఒకటయ్యారు. ఈ కథ చిన్నప్పుడు చలాన్నేకాక తెలుగు రచయితలు మరికొందరిని ఆకట్టుకొంది. ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'ఈస్ట్‌లీన్' నవలలోని కథాసూత్రాన్నే తమ మాలపల్లిలో ఒక పాత్ర లేచిపోయి, చివరకు తన బిడ్డకే దాదిగా పనిచేయడం మొదలైన ఘట్టాలను అనుకరించారు. శుద్ధ గ్రాంథికంలో చలం చేసిన ఈ అనువాద ప్రయత్నం ప్రాథమిక దశను దాటలేదు. ఆ రచన తర్వాత మరుగున పడింది.

1910లో చలం స్కూలు ఫైనల్ చదువుతున్నప్పుడు అతని 16వ యేట పెద్దలు అతనికి పెళ్ళి చేశారు. చలం ఒకంతట ఈ పెళ్ళికి వప్పుకోలేదు.

పెళ్ళి వద్దని గోలపెట్టాడు. పారిపోదామనుకున్నాడు. కారణం లేకుండానే అతనికి పెళ్ళంటే అయిష్టత ఏర్పడింది. ఆడవాళ్ళంటే విముఖత్వం లేదు. అప్పటికే ముగ్గురు ఆడపిల్లల మీద ప్రేమ ఏర్పరచుకొన్నాడు. వాళ్ళు వేరే కులం వాళ్ళు కనుక వాళ్ళలో ఎవరినీ పెళ్ళి చేసుకొనే అవకాశం లేదు. చలానికి బాగా నచ్చిన దగ్గర బంధువు రమణ. ఈ పిల్లను చేసుకోవాలని చలానికి ఆశ. అయితే ఈ పెళ్ళి జరిగేది కాదు. వావివరసలు అడ్డువస్తాయి. రమణ చలం పెదనాన్నగారి కూతురు. సోదరి వరుస. ఎలాగైనా రమణను చేసుకోవాలని, అందుకు అనుమతి ప్రసాదించమని శృంగేరి పీఠాధిపతులకు చలం ఒక విజ్ఞాపన కూడా రాసుకొన్నాడు.[10] మతం మీదా, శాస్త్రాలమీదా, వావివరసల మీదా చలానికి ఏవగింపు కలిగింది. అయితే అతని తిరుగుబాటు ఫలించలేదు. పెద్దలు నిశ్చయించిన పెళ్ళి 16వ యేట జరిగింది.

స్కూలు ఫైనలు ప్యాసు కాగానే చలం ఎఫ్ఫే చదవడానికి కాకినాడ వెళ్ళాడు. బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఆ కళాశాల ప్రిన్సిపాలు. బ్రహ్మ సమాజానికి ఆయన పట్టుకొమ్మ. ఆయన నైతిక ప్రవర్తనా విధానం, సంఘసేవానిరతి, మతబోధ ఎందరినో ప్రభావితం చేసినట్టు చలాన్ని కూడా చేశాయి. బ్రహ్మ సమాజం ప్రార్థనలలో చలం పాల్గొనేవాడు. వాళ్ళ స్నేహం పెరిగింది. ఆ సమాజపు గ్రంథాలే చదవసాగాడు. హిందూ మతాచారాలు, కులభేదాలు నిర్మూలం చేయాలనే గట్టి నిశ్చయం కలిగింది. విగ్రహారాధనలు చేయకూడదనీ, ఆలయంలోనికి వెళ్ళకూడదనీ, కులభేదాలు పాటించకూడదనీ నిర్ణయం చేసుకొన్నారు. నాయుడిగారిలాగ స్త్రీ జనోద్ధరణకు అంకితం అవ్వాలనుకొన్నాడు.

చలం పెళ్ళికి ముందే అతని చెల్లెలు అమ్మణ్ణికి వివాహమైంది. ఇప్పుడామె ఈడేరి కార్యానికి తగిన వయస్సుకు వచ్చింది. శోభనానికి ముహూర్తం పెట్టారు. చలం వేసవి

---

10. చలం (ఆత్మకథ) - పుట.24

సెలవులకు ఇంటికి వెళ్ళాడు. తనకి కార్యం వద్దని అమ్మణ్ణి ఏడవసాగింది. చలం గుండె కరిగింది. వెంటనే వాళ్ళ బావకి ఉత్తరం రాశాడు. 'శోభనం అన్నది భార్యభర్తల ఇద్దరికే కదా! నీ భార్యకు అది ఇష్టమో లేదో కనుక్కున్నావా' అని ఆ ఉత్తరం సారాంశం. ఆ బావగారు 'ఇలాంటి అభిప్రాయాలు నీ చెల్లెలు తలకెక్కుతున్నాయి కనుక తీసుకుపోవడానికి వస్తున్నాను' అని అతడు జవాబు రాశాడు.

సారె గదిలోనికి చెల్లెల్ని పంపకూడదని చలం గొడవ చేశాడు. అతణ్ణి బయటకు గెంటారు. అమ్మణ్ణి గదిలోకి పంపారు. ఆ మర్నాడు పొద్దుట అమ్మణ్ణి గదిలోంచి వచ్చి చలాన్ని చూసి అతణ్ణి ఎరగనట్టే వెళ్ళిపోయింది. ఆ తర్వాత అన్నాచెల్లెళ్ళు మాట్లాడుకోలేదు. గర్భాదానం గదిలో ఆడపిల్లలు ఎట్లా మారిపోయినారో మొదట చలానికి ఆశ్చర్యం కలిగించినా చివరకు అర్థమైంది.[11]

బావగారిమీద కోపం చలం చేత రచన చేయించింది. ఆ సంగతి చలం ఇలా తన ఆత్మకథలో చెప్పుకున్నాడు.[12]

''నాకో బావ వుండేవాడు. అతనికి కాకినాడ. చూసుకోగానే ఒకర్ని ఒకరం కొట్టుకొన్నాం. నాకన్న పెద్దవాడు బలం కలవాడు. మా వూరు వొచ్చేసినా ఆ అపజయం నా మనసులో రగులుతూనే వుంది. అతన్నేం చెయ్యలేక అతన్ని ఒక కథలో ఎక్కిద్దామనుకున్నాను. అదే నా రచనలకు ప్రారంభం. నేను చదివిన ఒక ఇంగ్లీషు నవలని తెలుగు చేసి దాంట్లో విలన్‌కి అతని పేరు పెట్టాను. అప్పటికి నేను కొంత పెద్దవాణ్ణి అయ్యాను. కొంత రాసి, ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాల వారిని 'నా నవలని ప్రచురించమని' అడిగాను. ఎట్లావుందో చూస్తాం కొన్ని పేజీలు పంపమన్నారు. ఎవరో పెద్ద రచయిత పంపారనుకొని చాలా బావుంది. ఆ పుస్తకమంతా పంపమన్నారు. ఆడుకునే వయస్సులో ఆ పుస్తకం ఎక్కడ పూర్తి చెయ్యగలను? వూరుకున్నాను. నేనేమి చెయ్యలేని నా బావమీది కోపమే అంతర్భూతంగా నా కథల్లో పలికిందేమో! సంఘాన్ని, ఏం చెయ్యలేక నాలోని కోపాన్నంతా ఆ కథల్లో వొలకపోసినట్టున్నాను''.

ఈ రచన తర్వాత చలం సృజనాత్మక సాహిత్యమేదీ తలపెట్టినట్టు లేదు. ఎఫ్ఫే ప్యాస్ కాగానే అతని భార్య కాపురానికి వచ్చింది. ఆమె ఉప్పులూరి రామశేషయ్యగారి రెండో భార్య రెండో కూతురు రంగనాయకమ్మ. రామశేషయ్యగారికి మొదటి భార్యకు ఒక కూతురు పుట్టింది. ఆమె పేరు కూడా రంగనాయకమ్మే. మొదటి భార్యపోయాక రామశేషయ్య ఇంకో పెళ్ళి చేసుకొన్నాడు. ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. ఇద్దరికీ రంగనాయకమ్మ పేరే పెట్టారు. ఆయనకు మగ సంతానం లేదు. తొలి ఇద్దరు కూతుళ్ళూ బాల వితంతువులయ్యారు. మూడో అమ్మాయిని చలానికిచ్చారు. చలం పెళ్ళయిన కొద్దికాలానికి రామశేషయ్య రెండో భార్య కూడా మరణించింది.

---

11. చలం (ఆత్మకథ) - పుటలు 24-26
12. చలం (ఆత్మకథ) - పుటలు 18-19

కాపురానికి వచ్చిన తన భార్యచేత ఇంట్లో నౌకర్లు చేయవలసిన పనులు చేయిస్తే చలం అడ్డుచెప్పాడు. తాను బియ్యే చదవడానికి మద్రాసు వెళుతున్నప్పుడు తనతో ఆమెను తీసుకొని వెళ్ళి చదివిస్తానన్నాడు. పెద్దలు అభ్యంతరం చెప్పారు. చలం తన పట్టుదల వీడలేదు. మీరు డబ్బిచ్చినా మానినా నా భార్యను నాతో తీసుకువెళ్ళి తీరుతాను. చదివించక మానను అని చెప్పాడు. అర్ధరాత్రి ప్రయాణం అవుతున్నప్పుడు తాతగారి దగ్గరకు వెళ్ళి శలవు తీసుకొన్నాడు. ఆయన ఏమీ మాట్లాడకుండా కన్నీళ్ళు కారుస్తూ చలం చేతిలో ఒక నోట్లకట్ట పెట్టాడు. చలం భార్యతో మద్రాసుకు వెళ్ళిపోయాడు. ఆమెను హాస్టల్లో పెట్టి చదివించాలనుకొన్నాడు గాని పెద్దలు ఒప్పుకోలేదు. అందుచేత రాజీగా ఇంట్లోనే తనతో కాపురం చేస్తున్న ఆమెను సెయింట్ థామస్ కాన్వెంటులో రెండేళ్ళు చదివించగలిగాడు. చలం మద్రాసులో బియే మొదటి సంవత్సరం పూర్తి చేసేసరికి అతనికి ఒక కొడుకు పుట్టాడు. పేరు రవి.

చలం భార్యతో మద్రాసులో కాపురం ఉంటున్నప్పుడే అతని వదినగారు రంగనాయకమ్మ (వొయ్యి) వాళ్ళను చూడడానికి వచ్చింది. చెల్లెలు చదువుకొనడం చూసి ఆమెకు కూడా విద్య మీద ఆసక్తి కలిగింది. చదివించే వాడుంటే డాక్టరు పరీక్ష దాకా చదివి తర్వాత ప్రాక్టీసు పెట్టాలని ఆ బాలవితంతువు ఆశించింది. ''వెంకటచలం నేను వచ్చేస్తాను. నన్ను చదివిస్తావా?'' అని అడిగింది. తప్పకుండా చదివిస్తానని అతను మాట యిచ్చాడు.

1913లో చలాన్ని దత్తునిగా స్వీకరించిన తాతగారు చనిపోయారు. చలం ఆయనకు పూర్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం శాస్త్రోక్తంగా చేయవలసిన విధులూ, కార్యాలూ అన్నీ చేశాడు. ఈ చివరి కర్తవ్య నిర్వహణ తర్వాత చలం తమ మతాన్ని విస్మరించాడు. పూర్తిగా బ్రహ్మయోధుడయ్యాడు. చలం తల్లిదండ్రులు అతనికి తన ఆస్తి దక్కనివ్వలేదు. బియ్యే పూర్తికాగానే చలం ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. వెంకటరత్నం నాయుడుగారు కాకినాడకు రమ్మని టెలిగ్రాం ఇచ్చారు. అక్కడ కాలేజీలో చలాన్ని ట్యూటరుగా చేర్చుకొన్నారు. చలం ఉద్యోగంలోనే కాదు, బ్రహ్మ సమాజంలో కూడా పూర్తిగా చేరాడు. జందెం తీసివేశాడు. అతని భార్య భర్తకే మాత్రం తీసిపోకుండా మంగళసూత్రాలు తీసేసింది. తన పేరును మాలతీబాయిగా మార్చుకొంది. ఇద్దరూ బ్రహ్మప్రచారకులయ్యారు. 1915 నుండి కాకినాడలో బ్రహ్మ సమాజానికి నాయుడుగారు అధ్యక్షులు. చలం కార్యదర్శి. దేవులపల్లి కృష్ణశాస్త్రి, గరిమెళ్ళ వీరభద్రరావు, గాడేపల్లి సూర్యప్రకాశరావు, మొక్కపాటి రామమూర్తి చలం స్నేహితులు.

చలానికి వెంకటరత్నం నాయుడుగారు ఆధ్యాత్మిక గురువులే కాక ఒకరకంగా మానసిక పితృస్థానంలో నిలుపుకొన్న ఆరాధ్య వ్యక్తి. ఆయన బోధనలు ప్రచారం చేయడం, ఈశ్వర చింతన, అన్వేషణ, మతవ్యాప్తి చలం కార్యక్రమాలు. ఆరోజుల్లో చలం ఏది చూసినా, ఏది విన్నా బ్రహ్మ సమాజానికి ఇది ఎంతవరకు ఉపయోగం అని ఆలోచించేవాడు. 'ధర్మసాధని', 'బ్రహ్మ మెసెంజర్' అన్నవి సమాజం పత్రికలు. అందులో చలం వ్యాసాలు రాసేవాడు. కృష్ణశాస్త్రి పాటలు రచించేవాడు. ఆ పాటలను పాడుతూ స్త్రీ పురుషులు నగర సంకీర్తనలు చేసేవారు. ఆనాడు బ్రహ్మ సమాజంలో రెండువర్గాలు

ఉండేవి. ఒకటి సానుభూతిపరులు, రెండు అనుష్ఠానపరులు. చలం అనుష్ఠానపరులలో కూడా తీవ్రవాది. ఇతని పోకడలు మితవాదులకు నచ్చలేదు.

చలం బ్రహ్మ సమాజంలో చురుకుగా పనిచేస్తున్న కాలంలోనే 1918లో కాకినాడ సభ్యుల మధ్య బయలుదేరిన కలహాలను పురస్కరించుకొని కృష్ణాపత్రికలో 'బ్రహ్మ మత ఖండనం' అనే సంపాదకీయ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వీరబ్రహ్మయోధుడైన చలం దీనికి సమాధానం రాశాడు. ''మతము మనసులోనుండు కర్మముకన్నా ఆచరణమునందే యెక్కువగా నుండును'' అని చలం వాదించాడు. ఆచరణ అతనికి ముఖ్యం. అందుకే బ్రహ్మ సమాజం నాయకులైన వెంకటరత్నం నాయుడుగారికి మనసులో నమ్మకం ముఖ్యం. ఆయన చలానికి మొదటి ఆధ్యాత్మిక గురువు. ''ఎట్లా పట్టిందో ఆయనకి పిఠాపురం మహారాజాగారిపై ప్రేమ. అదొక్కటి తప్ప ఆయన జీవితంలో ఎన్నతగిన లోపమేదీ కనిపించదు. ఆ ప్రేమ ఆయన్ని లోపభూయిష్టం చేసింది'' అని చలం భావించాడు.[13]

పిఠాపురం రాజా రావుసూర్యారావు (1885-1965) గారికి మొక్కపాటి సుబ్బారాయుడుగారు మొదట మద్రాసులో ఉపాధ్యాయుడు. తర్వాత పిఠాపురం దివాను అయ్యారు. సుబ్బారాయుడుగారు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి శిష్యుడు. రాజాగారికి నాయుడుగారికి ఆయన పరిచయం కలిగించారు. రాజాగారు నాయుడుగారిని ఆధ్యాత్మిక పితృస్థానంలో నిలుపుకొన్నారు. బ్రహ్మ సమాజ వ్యాప్తికి రాజా చాలా పాటుపడ్డారు. ఆయన చేసిన సేవల గురించి చరిత్రకారులు ఇలా రాశారు.[14]

''కాకినాడ సమాజం చేపట్టిన పనులకు రాజావారు ఉదారంగా విరాళాలు యిచ్చారు. రాజమండ్రిలోని వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలకూ, కాకినాడలోని ఉన్నత పాఠశాలకూ, కళాశాలకూ, పలు సత్రాలకూ, స్త్రీల ఆస్పత్రులకూ విరాళాలు యివ్వడమే కాక ఆయన పిఠాపురం హరిజన విద్యార్థులకూ విద్యార్థినులకూ రెండు వసతి గృహాలను ప్రారంభించి, వాళ్ళకు తిండీ, బట్టా సమకూర్చాడు. ఆంధ్రదేశంలో యిలాంటి వసతి గృహాలలో యివే మొదటివి. యీ గృహాలను నడిపినవాళ్ళు బ్రహ్మ సమాజికులు. యీ గృహాలలో చదువుకున్న విద్యార్థులే ఆంధ్రదేశంలో మొదటితరం హరిజన నాయకులైనారు. రాజావారు 1909లో కాకినాడలో ఒక అనాథ శిశు శరణాలయం కూడా నెలకొల్పారు. దానిపేరు 'కరుణాలయం' కులమత వివక్ష లేకుండా అనాథ పిల్లలందరినీ దానిలో చేర్చుకునేవాళ్ళు.

''బ్రహ్మ సమాజానికి కార్యకర్తలను తర్ఫీదు చేయడానికీ, బెంగాలీ భాషలోని బ్రహ్మ సమాజ గ్రంథాలను తెలుగులోకి అనువదించడానికీ లక్షరూపాయాలతో బ్రహ్మ ప్రచారకులకు నిధిని కూడా పిఠాపురం రాజా కల్పించాడు. కొన్ని లక్షల రూపాయల ఖర్చుతో పిఠాపురంలో బ్రహ్మ మందిరాన్ని నిర్మించడానికి ఆయనే కారకుడు''.

---

13. చలం (ఆత్మకథ) - పుట.46
14. వి. రామకృష్ణ - 'ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు', పుట.109

రాజాపట్ల నాయుడుగారికి సహజంగా ప్రేమాభిమానాలు అధికమై రాజా ఏమి అడిగితే అది చేసేటట్టు మారారు. 1917లో ఆంధ్రదేశంలో బ్రాహ్మణేతర పార్టీ ఏర్పడింది. ప్యూడలు వర్గాలన్నీ అందులో చేరాయి. ఆ జస్టిస్ పార్టీకి పిఠాపురం రాజా కూడా పట్టుకొమ్మ. నాయుడుగారు జస్టిస్ పార్టీలో చేరాలని రాజా కోరితే ఆయన అంగీకరించారు. ఈ చర్య బ్రహ్మసమాజ సభ్యులకు తీవ్రమైన దిమ్మెరపాటును కలిగించింది.

ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవాలని చలంతోపాటు అందరూ విజ్ఞప్తి చేశారు. కాని లాభం లేకపోయింది. కులమత భేదాలకు అతీతమైన బ్రహ్మ సమాజానికీ, కులభేదం మీద ఆధారపడి నిర్మించిన జస్టిస్ పార్టీకి పొత్తు ఎక్కడని నాయుడుగారు తాము బ్రాహ్మణేతర ఉద్యమంలో చేరడం వెనుకబడిన వాళ్ళను ఉద్ధరించడానికని చెప్పారు. చలం మొదలైనవాళ్ళు తాము చేరుదామనుకున్నారు. అయితే మీరు బ్రాహ్మణులు కనుక చేరకూడదు అన్నారు. నాయుడుగారి మాటలూ, చర్యలూ, చలంమీద పిడుగుపాటు అయ్యాయి. పితృస్థానంలో నిలుపుకొన్న మహావ్యక్తికి ఎంత పతనం. చలం మనస్సు సగం విరిగిపోయింది.

పిఠాపురం రాజాను సంతోషపెట్టడానికి జస్టిస్ పార్టీలో చేరిన నాయుడుగారు ఆ జమీందారుల దివానైన మొక్కపాటి సుబ్బారాయుడుగారిని సంతోషపెట్టడానికి మరొక విచిత్ర నిర్ణయం తీసుకొన్నారు. సుబ్బారాయుడుగారికి 'తారకం' అనే మేనల్లుడున్నాడు. చాలా చురుకైనవాడు. సుబ్బారాయుడుగారి కూతుర్ని తారకానికి ఇవ్వాలనుకొన్నారు. ఉత్తరోత్తరా తారకమే దివానుగా కాబోతున్నాడనుకొన్నారు. ఈ తారకం తన మేనమామ కూతుర్ని కాక నాయుడుగారు పెంచిన హరిజన బాలికలలో ఒకరైన సుగుణమ్మను చేసుకోదలిచాడు. నాయుడుగారు ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. ఇది చలానికి ఆశ్చర్యం కలిగించింది. అయినా తారకం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. సుగుణమ్మను స్నేహితుల సహాయంతో పెళ్ళి చేసుకొన్నాడు. మొక్కపాటి సుబ్బారాయుడుగారి తమ్ముడు రామ్మూర్తి గట్టిగా పట్టుపట్టి ఈ పెళ్ళి తర్వాత చేయించాడు. కొన్ని విపరీత పరిస్థితుల వల్ల చలం ఈ పెళ్ళినాడు అక్కడలేడు.

మొక్కపాటి రామ్మూర్తి చాలా విచిత్రమైన వ్యక్తి. స్నేహశీలి. చలానికి ఆప్తుడు. రామ్మూర్తి భార్య చంద్రమతి. వీళ్ళకి ఒక చంటిపాప ఉంది. చంద్రమతికి రత్నమ్మ అనే పెళ్ళికాని చెల్లెలు ఉంది. కాలేజీలో చదువుకొంటూ ఉంది. ఒకసారి రామ్మూర్తీ, చంద్రమతీ తమ పాపను రత్నమ్మ దగ్గర వదిలిపెట్టి కలకత్తా వెళ్ళారు. రత్నమ్మ చలం దగ్గర పాఠాలు చెప్పించుకొనేది. క్లాసు పాఠాలు ప్రేమపాఠాలుగా మారాయి. చలం సహజంగా స్త్రీలోలుడు. అందానికి ఆకర్షితుడవుతాడు. దాన్ని ఆరాధిస్తాడు. ప్రతిరాత్రి చలం పాఠాలు చెప్పేవాడు. చలం భార్యకు ఇది తెలిసి బాధపడింది. చలాన్ని మారమంది. అతడు రత్నాన్ని వదలుకోలేను అన్నాడు. చలం భార్య విసుగెత్తి తన కొడుకును భర్తదగ్గర వదలి పుట్టింటికి వెళ్ళిపోయింది.

ఒకనాడు రత్నమ్మ విషం తాగి పడి ఉంది. చలం ప్రాథమిక చికిత్స చేసి ఆస్పత్రిలో చేర్పించి రామమూర్తికి ఉత్తరం రాశాడు. కలకత్తా నుంచి రామమూర్తి వచ్చి చలాన్ని పట్టుకొని దులిపేశాడు. ఉపన్యాసాలిచ్చాడు. ఏమీ ఎరగని కన్నెపిల్లను కలుషితం చేశావు అన్నాడు. అది క్షమించరాని పాపమన్నాడు. రామమూర్తి పనిగట్టుకొని బ్రహ్మ మిత్రులందరి ఇంటికి వెళ్ళి చలంమీద ఆగ్రహం తెప్పించాడు. హిందూ సమాజంలో కన్నా ఎక్కువ బిగువుగా నీతి పట్టింపులు బ్రహ్మ సమాజంలో ఉంటాయి. చలాన్ని సమాజంవారు బహిష్కరించారు. రత్నాన్ని చూడనివ్వలేదు. నాయుడుగారు అలా అయ్యాడు. తాను ఇలా అయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. చలం కాకినాడ వదలి ఎల్.టి. చదవడానికని రాజమండ్రి ట్రెయినింగు కాలేజీకి 1919లో తన ఇరవై అయిదో ఏట వెళ్ళాడు.

కాకినాడ బ్రహ్మ సమాజం వారు చలాన్ని వెలివేశారని తెలిశాక చలానికి రాజమండ్రిలో ఆశ్రయమే దొరకలేదు. ఒక పాడుపడ్డ పశువులశాలలో మేనత్త ఉంటుంది. ఆమె ఆదరించింది. చలం రాజమండ్రి చేరగానే, అతని వదిన రంగనాయకమ్మ వచ్చి అతని పంచన చేరింది. ఇప్పుడామెకు ఏదీ ఆధారం లేదు. ఆమె తండ్రి రామశేషయ్య మూడోపెళ్ళికి సిద్ధమయ్యాడు. కూతుళ్ళు అడ్డుచెప్తే వినలేదు. వాళ్ళకు ఆస్తి ఇవ్వలేదు. సవతితల్లి రాబోతున్నదని వొయ్యి యిల్లు వదలి చలం దగ్గరకు చేరింది. ఇప్పుడు అతడు తప్ప ఆమెకు దిక్కులేదు. చదివిస్తానని తనకు చేసిన వాగ్దానాన్ని జ్ఞాపకం చేసింది. చలం ఆమెను స్కూలులో చేర్చి క్రమంగా మెడిసిన్ చెప్పించాడు. ఆమె అతనికి జీవిత సహచరిణి అయింది. ఈలోగా భార్య వచ్చి రాజీపడింది. ఆమెను కూడా 'చలం చదివించి ఎల్.టి.పూర్తయ్యాక చలం ఒక కుటుంబంతో తెనాలి వెళ్ళాడు. హిందువులూ, బ్రహ్మ సమాజం వారు సమానంగా ఆయనను వెలివేశారు.

చేతిలో డిగ్రీ ఉంది కనుక చలానికి ఉద్యోగం దొరికింది. హొస్పేట్ మున్సిపల్ స్కూల్లో హెడ్మాస్టరుగా నియమితుడయ్యాడు. వొయ్యిని మద్రాసులో క్రిష్టియన్ హాస్టల్లో పెట్టి రాయపురం హైస్కూల్లో చేర్పించాడు. భార్యతో హొస్పేటలో ఉన్నాడు. అప్పుడే అక్కడకు ప్రకాశం అనే స్నేహితుడు వచ్చి రత్నమ్మ-రామ్మూర్తి మధ్య పూర్వం జరిగిన ప్రేమగాథను చెప్పాడు. కలకత్తా వెళ్ళిపోడానికి ముందే రామ్మూర్తికి రత్నమ్మతో సంబంధముంది. అది చలానికి తెలియదు. చలంతో రత్నమ్మకు సంబంధముందని కలకత్తాలో ఉన్న రామ్మూర్తికి తెలియదు. ఆమె విషం తాగిందని చలం ఉత్తరం రాస్తే భయపడి వచ్చాడు. తన అక్రమ సంబంధం వల్లనే రత్నమ్మ ఆత్మహత్యకు ప్రయత్నించిందని భావించి తనమీద నింద రాకుండా చలంమీద అందరికీ ఆగ్రహం తెప్పించాడు. చలం బ్రహ్మ సమాజాన్నీ, కాకినాడనూ వద్దని రత్నమ్మన్నీ రామ్మూర్తినీ వదలి వెళ్ళిపోయాడు. రత్నమ్మకూ, రామ్మూర్తికి మళ్ళా సంబంధం గట్టిపడింది. భర్త ప్రవర్తన సహించలేక చంద్రమతి ఇంటింటికి వెళ్ళి చెప్పుకొని ఏడ్చింది. రత్నమ్మ కోనేట్లోపడి మళ్ళా చావబోయింది. ఎవరో చూసి బైటికి లాగారు. చంద్రమతి భర్తతో దెబ్బలాడి పుట్టింటికి వెళ్ళిపోయింది. రామ్మూర్తీ, రత్నమ్మల రంకు పాకి బ్రహ్మ సమాజం ప్రతిష్ఠ బాగా

దెబ్బతింది. చంద్రమతి తల్లిదండ్రులు వచ్చి రామ్మూర్తితో తగాదా పెట్టుకొన్నారు. మైనరుపిల్లను చెరిచాడని రామ్మూర్తిమీద పోలీసు రిపోర్టు ఇచ్చారు. కేసు పెట్టారు. రత్నమ్మ మేజరే అని కేసు కొట్టేశారు. రామ్మూర్తిని కాకినాడ వెలివేసింది. రామ్మూర్తికీ, రత్నమ్మకీ యిల్లులేదు. అండలేదు, తిండిలేదు. ప్రకాశం ఈ కథ చెప్పాక చలం గుండె కరిగింది. రామ్మూర్తినీ, రత్నమ్మనీ రమ్మని టెలిగ్రాం ఇచ్చాడు. వాళ్లు వచ్చారు. చలం భార్య వాళ్ళని ఆదరించింది. ప్రకాశం, అతని భార్య సత్యవతీ, రత్నమ్మా, రామ్మూర్తీ, చలం, అతని భార్య కలిసి మెలిసి ఉన్నారు. అప్పుడు చలం భార్య గర్భవతి. చలానికీ రత్నమ్మకీ మళ్ళా సంబంధం ఏర్పడింది. చలం భార్య ఊరుకుంది.

హాస్పేటలో 1921లో చలం జీవితంలో రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. ఒకటి అతడు 'శశిరేఖ' అనే తన మొదటి నవల రచించడం, రెండు అతనికి సౌరిస్ అనే కుమార్తె ఏప్రిల్ 13వ తేదీన జన్మించడం.

రత్నమ్మతో సంబంధం ఏర్పడుతున్న తొలిరోజులలోనే చలం ఆలోచనా విధానాలలో మార్పు రావడం మొదలైంది. బ్రహ్మ సమాజం సూత్రాల ప్రకారం పరస్త్రీలతో సంగమమే కాదు ఆవిధమైన వాంఛలు కూడా పాపం. శృంగార వాంఛ నుంచి తప్పుకోవాలి అనుకున్నాడు. అయితే దానిని జయించలేకపోయాడు. రత్నమ్మను అనుభవించాక ఇలా మధనపడ్డాడు.[15]

''ఇది పాపమా? ఇంత ఆనందకరమైనది పాపమా? ఎందుకు పాపం? భార్యతో లేని పాపం ఇంకో స్త్రీతో పాపమెట్లా అయింది? ఈ శృంగారం పాపమని నిజంగా ఈశ్వరుడు చెప్పాడా? అసలీ శృంగారమంటే తెలీని జడులు, ఇట్లాంటి అబద్ధపు నిబంధనలు ఏర్పరిచారా ఇదంతా ఒక భార్యని కట్టుకోవడం వల్లనే గదా స్త్రీని తలుచుకుంటే పాపం. ఆమెనే పెళ్ళిచేసుకొంటే, ఆ నిముషం నుంచి ఆలోచనతోనే కాదు, ఆమె దేహాన్ని ఏమి చేసుకొన్నా పవిత్రమయింది. దీన్నే పెళ్ళి అంటున్నారు. ఇట్లా గట్టి సందేహాలు రేగాయి. క్రమంగా ఈ సందేహాల వల్ల మనసు బ్రహ్మ నిబంధనల నుంచి ఎదురుతిరిగింది''.

ఇటువంటి భావాలు స్త్రీకి వస్తే ఆమె ఎలా ఆలోచిస్తుంది? ఎలా ప్రవర్తిస్తుంది? భర్తతో లేనిది ఇంకొకరితో అయితే పాపమెట్లా అవుతుంది? అసలు ఇష్టంలేని భర్తతో ఎందుకు కాపురం చేయాలి? మనసైన వాడితో ఎక్కడికేనా ఎగిరిపోతే? ఒక శృంగార భావం పాతబడి కొత్త శృంగార సంబంధాన్ని కోరుకొంటే? ఆడది పెళ్ళి చేసుకొని ఒకరి అధీనంలో ఉండితీరాలా? ఈ ప్రశ్నలకు ఒక రకం సమాధానాలుగా శశిరేఖ నవలను 1921లో ఊహించి కాగితం మీద పెట్టాడు. కథా కథనం గ్రాంథికంలోనూ, సంభాషణలు వాడుకభాషలోనూ రాశాడు. సంభాషణలలో మొదట కనిపించే నైపుణ్యం కథాకథనంలో కానరాదు. లుప్తమైంది. ఉత్త కొత్త ఆదర్శాలు లోక విరుద్ధమైనవి యేకరువు పెట్టాడు. కథకుడు చాలాచోట్ల 'ఆహా'! అంటూ కొన్ని అభిభాషణలు, ఉద్ఘాటనలు, వర్ణనలు చేస్తాడు. పాఠకులు 'ఆహా!' అని ఆనాడు అనుకొన్నారో లేదోగాని ఇవాళ అనుకోరు. ''కొంత బుక్స్ నుండి కొంత లైఫ్ నుంచి యేర్చి కూర్చిన ఎమెచ్యూరిష్ నవల శశిరేఖ. ఎలా

15. చలం (ఆత్మకథ) - పుట.49

రాయాలో ఏమీ తెలీదు. అందుకే అంత చప్పగా వుంది'' అని చలమే ఉత్తరోత్తరా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు.[16]

ఏ బుక్కునుంచి ఎంత తీసుకొన్నాడో చలం చెప్పలేదుగాని శశిరేఖ నవల థామస్ హార్డీ (1840–1928) రచించిన ''టెస్ ఆఫ్ డూబర్ విల్లీస్' (1841) అనే నవల ప్రభావంతో రాసిందని పరిశోధకులు భావించారు.[17] టెస్‌కూ శశిరేఖకూ భావసామ్యం అత్యల్పమని, టెస్ ఒకరిని ప్రేమిస్తూ, ఇంకొకరితో శరీర సంబంధం పెట్టుకొన్నట్టే శశిరేఖ ఏకకాలంలో పలువురిపై అనురాగం చూపిందని మరొక పరిశోధకుకుడు చెప్పి టెస్‌కు పెళ్ళి ముఖ్యమని శశిరేఖకు పెళ్ళికాక ప్రేమ ముఖ్యమని స్పష్టం చేశారు.[18] చలం తనకు తెలిసిన వాళ్ళ జీవితాలలోంచే సన్నివేశాలను తీసుకొని తన కల్పనకు అనువుగా రూపాంతరం చెందవేశాడు. చలం జీవితంలో అమ్మణ్ణి సారె గదిలోనికి వెళ్ళనని ఏడవడం, తాను ఆమెకు గట్టి మద్దతుగా పెద్దలతో దెబ్బలాట పెట్టుకొనడం చాలా గట్టి ముద్ర వేసింది. అమ్మణ్ణి భర్తతో ఆ రాత్రి గడిపింది గానీ ఒకవేళ అలా కాక పారిపోతే ఈ ఊహ మీద చలం కథ విచిత్రంగా ఊహించి అల్లుకొన్నాడని భావించవచ్చు.

కథ ప్రారంభం అవుతున్నప్పుడు శశిరేఖ పదహారేళ్ళ 'బాలిక' పెళ్ళయి పునస్సంధానానికి తగిన వయస్సులో ఉంది. ఆమెకు పదోయేట ఇష్టంగాని పెళ్ళయింది. ఆమె రామారావు అనే కుర్రాడితోనే తన పెళ్ళి జరగాలని కోరింది. అతడు పై చదువులకు సీమకు వెళ్ళాడు. ఆమె చిన్నపిల్ల అని తల్లిదండ్రులు వేరే పెళ్ళి చేశారు. రేపు కార్యము అన్నారు. శశిరేఖకు ఇష్టం లేదు. ముక్కు మొహం ఎరుగని భర్త రావడానికి ముందే ఆమె కృష్ణుడనే బాలుణ్ణి లాకుల వద్ద ప్రేమించింది. ఆమె 'ఏమియు తెలియని ముగ్ధ' అయినా నీళ్ళలో తేలి ఆడుతున్న బాతులను చూసి 'ఆహా! పక్షులలో ప్రేమ యెంత సరళము. యెంత సులభము. మానవులకేనా యిన్ని ఆటంకములు?'' అనుకొంది. కృష్ణుడితో లేచిపోయింది.

కృష్ణుడు డాక్టర్ డిగ్రీ చదువుతూ మానేశాడు. ఇంకొక ఏడాది చదివితే ప్రాక్టీస్ పెట్టవచ్చు. కృష్ణుడు శశిరేఖా సుందర్రావు అనే ఒక డాక్టర్ స్నేహితుని తోటే ఉంటూ ఉన్నారు. కృష్ణుడు శశిరేఖతో ''నిన్నుంచుటకు చోటు లేదు సొమ్ము లేదు'', కనుక ఆమెను వదలి చదువుకు వెళ్ళదలచలేదు. వాళ్ళిద్దరూ స్వగ్రామానికే తిరిగి వెళ్ళారు. కృష్ణుడు తల్లిదండ్రులు సర్దుకుపోయారు. శశిరేఖ బంధువులు ఆమె చచ్చిపోయినట్టే భావించారు. మూడేళ్ళు శశిరేఖ కృష్ణునితో కలసి జీవించింది. ఇంతలో సుందరరావు ఆ వూరికి బదిలీ అయి వచ్చాడు. శశిరేఖ ప్రౌఢ అవుతోంది. ''ఇంత అందముగా ఎట్లా పుట్టినావు మీ వాళ్ళకి?'' అని కృష్ణుడు ఆశ్చర్యపోయాడు. కథకుడు ఇక్కడ శశిరేఖ జన్మరహస్యం ఇలా చెప్పాడు.

''శశిరేఖ తల్లి బాల్యంలో అత్తవారి ఇంటికి వెళ్ళబోయే ముందు ఆమె ఇంట్లో వుండి ఎవరికీ తెలియక ఆమె ప్రేమను పొందిన పంజాబు కుర్రవాని సంగతి తెలిసి యుండుట

16. డా॥ ఎన్. రామచంద్ర – 'చలం సాహిత్యం సామాజిక దృక్పథం'లో ఉటంకించబడింది. పుట.56
17. బి.వి. కుటుంబరావు – ఆంధ్ర నవలా పరిణామం – పుట.319 (అధస్సూచిక)
18. డా॥ ఎన్. రామచంద్ర – 'చలం సాహిత్యం సామాజిక దృక్పథం' పుట.61

సాధ్యమయినచో శశిరేఖకు ఎందుకంత అందమో ఆ చెప్పరాని ఆవేశములేమిటో పల్లెటూరి సాధారణపు బాలికకు, తల్లిదండ్రులకు లేని ఆ గుణములెట్లు వచ్చెనో తెలిసేయుండును.''

శశిరేఖకు తల్లి గుణం, ఎవరో తెలియని తండ్రి ఆవేశం పట్టుపడిందని ఈ ఒక్క పేరాగ్రాపులో చలం ధ్వనించి ఆమె ప్రవర్తనకు సంజాయిషీ ఇస్తున్నట్టు కనబడుతోంది. శశిరేఖా, కృష్ణుడూ, సుందరరావూ పడవ షికార్లు చేసేవారు. సుందరరావు ఫిడేలు వాయిస్తాడు. ఆ సంగీతాన్ని వింటున్న శశిరేఖ సుందరరావుపట్ల ఆకర్షితురాలయింది. కృష్ణుని ప్రేమించి యితడిని కూడ యెట్లు ప్రేమించుట? తాను వీరిద్దరినీ ఒక్కసారే ప్రేమించుచుండెనా? మానవ హృదయమెంత నిగూఢమో; ప్రమాదవశాత్తు ఆమె పడవలోంచి తూలి నీట్లో పడింది. మంచానపడి, సుందరరావు ఆస్పత్రిలో చేరింది. కృష్ణుని తల్లికి విషజ్వరమొచ్చింది. శశిరేఖ ఇంటికి రావడం మంచిది కాదు. సుందరరావుతో అనుభవం పెరిగింది. మానసిక సంఘర్షణ చెంది చెంది ఆఖరికి సుందరరావుకు లోబడింది. కృష్ణుణ్ణి విడిచిపెట్టి సుందరరావుతో లేచిపోయింది. అతనితో అంతా బాగానే ఉందిగాని అతను శాడిస్టు. ఆమెను క్రూరంగా చూసేవాడు. ''శశిరేఖకు ప్రేమయే ఆహారం. అది లేకపోతే ఆమెకు శాంతిలేదు'' 'సుందరరావు, పో! నాకసహ్యామేస్తోంది' అన్నాడు. శశిరేఖకు సౌందర్యం ఆహారం. ప్రేమలేనిది సమస్తం ఆమెకు శూన్యం. సుందరరావును వదలిపెట్టి వెళ్ళిపోదలచుకొంది. ''కాని యెట్లు? ఎక్కడికి? ఎట్లు బ్రతుకుట? స్వతంత్రముగా జీవించుటకు ఆధారము లేదుకదా. తన పుట్టినింటి నుండి తనకు రావలసిన ఆస్తి కలదు. అది తన స్వతంత్ర జీవనమునకు తోడ్పడవచ్చును''. అయితే సుందరరావును వెంటనే వదలి వెళ్ళలేకపోయింది.

సుందరరావు ప్రయాణం చేస్తున్న బండి బోల్తాపడి అతడు అపాయస్థితిలో ఉన్నాడు. అతనికి వైద్యం చేయడానికి సీమలో చదివిన డాక్టరు వచ్చాడు. అతడు శశిరేఖ చిన్నప్పుడు ప్రేమించిన రామారావే. అతడు బ్రహ్మసమాజంలో చేరినవాడు. నీతికి కట్టుబడ్డవాడు. ఆమె కథ విని 'ఇట్లా బతకడం పాపం కదూ?' అని అడిగాడు. ''అది ఎందుకు పాపమో ఎవరూ చెప్పరు. నాకు తప్పని తోచిందాక నేనెందుకు నా ఆనందం వృధా చేసుకోవాలి?'' అని శశిరేఖ వాదించింది.

''ఒక్క పాతివ్రత్యమనే అసహజమగు గుణముకోసం అనేక సహజమైన సద్గుణాల్ని చంపారు. ధైర్యము, స్వేచ్ఛ, సూనృతము, ధీరత్వము, ఉదారము, లోకజ్ఞానము, విద్య, ఆరోగ్యము, చాతుర్యము మొదయిలన గుణాలన్నీ పోయినాయి స్త్రీ నుండి. పురుషుడికి దాస్యము చేసే బొమ్మలు గాకింకేమిటి?'' అని తెలుసుకొంది. రామారావు 'మనుష్య స్వభావం చంచలం. పెళ్ళి చంచలత్వాన్ని కొంతవరకు కుదుటపరుస్తుంద'ని చెప్పాడు. శశిరేఖ సుందరరావును విడిచిపెట్టి రామారావు దగ్గరకు చేరింది. పెళ్ళి చేసుకొనేదాకా ఆమెను అతడు తాకడు. బ్రహ్మ సమాజంలో ఈశ్వర భక్తులు ప్రేమను అనుభవించరా? అని శశిరేఖ ప్రశ్నించింది. వాళ్ళకు ఈశ్వరప్రేమ చాలునన్నాడు రామారావు. శశిరేఖ ఇటు సుందరరావువైపూ, అటు రామారావు వైపూ ఆకర్షితురాలై మధ్యలో నలిగిపోయింది. ఇక్కడ ఇల్లు వదలి వెళ్ళిపోయింది. ఎంతదూరం నడిచిందో తెలియదు. తిండి లేదు. అండ

లేదు. చలిలో ముడుచుకుంది. జ్వరము, చలీ ఎక్కువైంది. దాహం. ఒక పాకీ మనిషి కుళాయి దగ్గర నీళ్ళు పట్టి ఇచ్చింది. 'ఆ నీళ్ళు తాగుటకు' శశిరేఖ ఇష్టపడలేదు. రౌడీలు ఆమె వెంట పడ్డారు. హేళన చేశారు. నవజీవనదాసు అనే బ్రహ్మ సమాజ ప్రచారకుడు ఆమెను రక్షించాడు. తన ఇంట్లో పెట్టుకున్నాడు. ఆమె బ్రహ్మ సమాజం పుస్తకాలు చదివింది. నవజీవనదాసు ఆమెకు ఒక కుట్టు యంత్రాన్ని కొని ఇచ్చాడు. ఆమెకు పొద్దుపోతోంది. ఆమెను పెళ్ళి చేసుకోవాలని ధర్మారావు అనే అతడు ఆసక్తి చూపాడు. ఆమెకు పెళ్ళి ఇష్టం లేదు.

ఆమెకు కావలసినది శాంతి కాదు సౌందర్యము. కృష్ణుని నుండి శరీర సౌందర్యము పొందింది. సుందరరావు నుండి ప్రేమ సౌందర్యాన్ని పొందింది. ఇప్పుడు రామారావు నుండి ఆత్మీయ సౌందర్యాన్ని పొందుతోంది. అతడు పెళ్ళి ముఖ్యమన్నాడు. అదే నీతి అన్నాడు. శశిరేఖకు సౌందర్యమే నీతి. వేరు నీతి లేదు. రామారావుకు నీతియే ప్రధానం. తన ప్రేమకన్నా నీతి నియమాలు అతనికి కావలసినవి. ప్రేమాగ్నిలో జీవనం దగ్ధం చేయాలని శశిరేఖ అనుకొంది. ఎంత ప్రియమైన వాడికైనా తన స్వేచ్ఛను యిచ్చేసి బతకలేదు. శశిరేఖ ఆత్మహత్యా చేసుకొంది. ''ప్రేమించిన వారికి పాపం లేదు. ప్రేమమూర్తి ప్రేమాగ్నిలో తప్తమై పరిశుద్ధమైనదీమె ఆత్మ, ధన్యురాలు'' అని దేవదూతలు నవజీవనదాసు కలలో కనపడి చెప్పారని కథకుడు చిట్టచివర చెప్పాడు.

1921లో చలం రచించిన శశిరేఖ 1926లో వెలుగు చూసినట్టుంది. ఆ సంవత్సరం తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు ఈ నవలకు ప్రకాశిక రాశారు. ''సాంఘిక ధర్మములకంటె మానవ ధర్మములు ఉన్నతమైనవి. స్వధర్మము ప్రకారము ఈమె నిస్సంశయముగా పతివ్రత'' అని శాస్త్రిగారు చెప్పారు. పెళ్ళి లేదు, పతీ లేడు. ఇంక పతివ్రత యేమిటని విమర్శకులు రాశారు.[19] కొందరు సమర్థించారు.[20] దేశంలో ఈ నవల సంచలనం రేపింది.

శశిరేఖ గ్రంథరూపంలో ప్రచురితమైనప్పుడు కథకుడు బాధపడ్డట్టు కనబడుతుంది. ''శశిరేఖ అది 1921లో రాశాను. నా వయసు 27. ఆ నవల పబ్లిషర్లకి ఓ సుప్రసిద్ధ రచయిత ఎడిటర్‌గా ఉండేవాడు. నవలను చిత్రవధ చేశాడు. ఈనాడు నా అభిప్రాయం ఏమని చెప్పను?'' అని చలం ఓ ఇంటర్వ్యూలో చాలాకాలం తర్వాత చెప్పాడు.[21] శశిరేఖకు ప్రవేశిక రాసిన శివశంకరశాస్త్రిగారే ఆ పబ్లిషర్ల ఎడిటరు. ఆయన ఏం చిత్రవధ చేశారో తెలియదు. ''ప్రకృత గ్రంథము సామాన్యులకు కొంత ఆందోళన కలిగిస్తుంది. ఎప్పుడైతే పుస్తకము మనస్సులో ఆందోళన కలిగిస్తుందో అప్పుడే దానిలో జీవము ఉన్నదని చెప్పవచ్చు. త్రాణ గల పుస్తకాలు చాలా కదలిక పుట్టిస్తవి''. అని శాస్త్రిగారు ప్రకాశికలో చెప్పారు.

శశిరేఖ రచన తరువాత చలం జమీందారీ నవ్యసాహిత్య యుగంలో మరో నాలుగు నవలలు రచించాడు. రెండో నవల 'దైవమిచ్చిన భార్య'లో సహజమైన తన జీవద్భాష

19. 'గుడిపూడి వెంకట చలంగారి శశిరేఖ' అనే వ్యాసంలో ఎ. లక్ష్మీనరసింహారెడ్డిగారు ఈ విమర్శ చేశారు.

20. 'శశిరేఖ' - ఎ.వి.రత్నం, భారతి - నవంబరు 1928

21. సృజన - మే, 1968

వాడాడు. రచన సంభాషణ శైలిలో సాఫీగా ఉంది. కథలోని విషయం 'శశిరేఖ'లోని స్త్రీ సమస్యే. ఆడదాని విషయమై మగవాడికి 'యిది నా వస్తువూ, హక్కూ' అనే మాటలు పోవు. చట్టబద్ధంగా పెళ్ళిచేసుకొన్నవాడికా, మనస్ఫూర్తిగా ప్రేమించినవాడికా, ఎవరికి ఒక స్త్రీదక్కాలి? ''నేను నాదాన్నే అయివుంటా ఒకరిదాన్ని కావడం నాకిష్టం లేదు. ఎందుకు కావాలి? ఎవరి సొమ్మును అయిపోను. ఎవరి వస్తువు కాను'' అని నిశ్చయించుకొన్న స్త్రీ ప్రస్తుత సమాజంలో బతకలేదు. అందుకే 'దైవమిచ్చిన భార్య'లో కథానాయిక శశిరేఖలాగే చచ్చిపోతుంది. 'అమీనా' అనే నవలలో అమల కూడా ఆత్మహత్య చేసుకొంటుంది. అమీనాలో చలం తన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాలకు రూపం కల్పించాడు. అసలు ఆనాడు 'శశిరేఖ' రాసిన నాటి నుంచి ఆ నవజీవితాన్ని తన అభిప్రాయాలను పంచుకొన్న వాళ్ళతో గడిపాడు.

హొస్పేటలో ఉద్యోగం పూర్తయ్యాక చలానికి రాజమండ్రి ట్రెయినింగు కాలేజీలో 1922లో ఉద్యోగం అయింది. రామ్మూర్తికి రాజమండ్రి సెంట్రల్ రైల్వే ఉద్యోగం దొరికింది. ఇద్దరూ కుటుంబాలతో రాజమండ్రి చేరారు. స్వేచ్ఛా ప్రణయజీవిత సిద్ధాంతాలను ఆచరణలో పెట్టారు. చలానికి 1922 నుంచి రాజమండ్రిలో చింతా దీక్షితులుగారు సహోద్యోగి, అప్పటికే దీక్షితులుగారు చెయ్యి తిరిగిన రచయిత. సాహితీ సమితి సభ్యులు. దీక్షితులుగారి మూలంగా చలానికి వ్యావహారిక భాషా ఉద్యమం తెలిసింది. చలాన్ని వివిధ ప్రక్రియలలో రచనలు చేయమని దీక్షితులుగారు ప్రోత్సహించారు. ఒక ప్రేమలేఖలో చలం తన రచనా వ్యాసంగం గురించి ఇలా రాశాడు.[22]

''నువ్వు వెళ్ళిన తరువాత, యీసారి అంత ఒంటరిగా లేను. కథలూ, నాటకాలూ రాస్తున్నాను. నాకేం తోస్తుందంటే, నేను గొప్ప 'ఆథర్' కాబోతున్నానని. కారణం కనపడదు. నవ్వకు. నేను రాసిన కథల్ని, నేను చదివిన కథలతో పోల్చి చూసుకుంటే నావి కూడా గొప్పవిగా తోస్తున్నాయి. ఇతర కథల్లో మంచివేవో చెడ్డవేవో తెలుసుకోగలను, కనుక నేను రాసినవి కూడా మంచివో చెడ్డవో తెలుసుకోగలనని నా నమ్మకం. రాసేటప్పుడు నా హృదయంలో గొప్ప ఉత్సాహం, ఉద్రేకం మండుతూ ఉంటుంది. అది యితరుల హృదయాల్లో పలకదా? నేను రాసిన ఈ కథల్ని చింతా దీక్షితులుగారికి చదివి వినిపించాలి. ఏమంటారో? ఆయన యిదివరకే చాలా కథలు ప్రచురించారు. ఆయనకి తెలుస్తుంది వీటి విలువ.''

విలువ తెలిసిన దీక్షితులుగారికి చలం తాను రాసిన 'చిత్రాంగి' అనే నాటకం పూర్తి చేసీ చేయగానే వినిపించారు. ఆయన మెచ్చుకొన్నారు. ఈ నాటకం గ్రంథరూపంలో వచ్చినప్పుడు గిడుగు రామమూర్తిగారు ఉపోద్ఘాతం 1924-25లో రాశారు. దీనిని చదివిన తన మిత్రులలో కొందరు ఇది హేయంగా ఉందని అన్నారట. ''ఉంటే ఉండవచ్చును, అది నాకు వింతకాదు. చిన్నప్పటి నుండిన్నీ వింటూ వున్న పాత ధర్మాలు ఎవరూ ఆచరించకపోయినా, కొత్త పుస్తకములో, వచ్చీరాని పాత మాటలతో, తెలిసీ తెలియనట్లు,

22. ప్రేమలేఖలు – పుట.92

సనాతన ధర్మాలని నూరోమారు ఉపన్యసిస్తే, అక్షరాలు కూడబలికి చదువుకొంటూ కాలక్షేపము చేసి పుణ్యాము సంపాదించేవారికి ఈ నాటకము హేయముగానే ఉంటుంది అన్నారు మరి ఒకరు'' అని రామ్మూర్తిగారు చెప్పారు. తరువాత ఈ నాటకాన్ని ఈ విధంగా విశ్లేషణ చేశారు.[23]

''సారంగధరుడు రాజభక్తి పితృభక్తి గలవాడు. పరువు ప్రతిష్ఠలు కావలసినవాడు. లోలోపల దుఃఖపడేవాఁడుగాని, తండ్రిని ఎదిరించేవాడుకాడు. తనకోసమని తెప్పించిన గుర్రాన్నిగానీ, చీనాంబరముగానీ తండ్రి వాడుకొంటే పోనీ అని ఊరుకొన్నట్టు తాను ప్రేమించిన చిత్రాంగిని పెళ్లాడితే ఊరుకోవలసిందేనా? చిత్రాంగి ఆలాగున ఊరుకోలేదు. సావిత్రి కోరికకు అశ్వపతి ప్రతిఘటించి ఉంటే ఆమెకు కర్తవ్యమేమిటి? యథావిధిగా తండ్రి కన్యాదానము చేయలేదు. గనుక పెండ్లి చేసుకోనని సత్యవంతుడు నిరాకరిస్తే, సత్యవతి ఏమి చేయవలెను? సంఘము చేసిన వ్యవస్థ చొప్పున వీరు చేయవలసినదేమిటి? ఇట్టి ప్రశ్నలకు మా శాస్త్రులుగారు శాశ్వత బ్రహ్మచర్యమో అది చేతకాకపోతే ఆత్మహత్యో ఉపదేశించినారు. అంబ అవలంబించిన ప్రతిక్రియ ఒకరు ఉద్ఘాటించినారు. తార చెప్పిన భర్తృ నిర్వచనము మరి ఒకరికి జ్ఞప్తికి వచ్చినది. గురుచంద్రులు తారకోసము కయ్యామాడినప్పుడు దేవతలు చేసిన రాజీనామా ఒకరుదహరించినారు. ఇవి విన్నప్పుడు మన పూర్వులు ధర్మశాస్త్రములలోను, పురాణములలోను, దాంపత్యా ధర్మమును గురించి చర్చించినప్పుడు మనకంటె ఎక్కువగా భూతదయ, ఉదారబుద్ధి గలిగి ఉండినట్టు నాకు తోచినది. ఇప్పటి మన సంఘములోని చిత్రాంగులున్ను సారంగధరులున్ను దాంపత్యా ధర్మమును గురించి వేసే ప్రశ్నలకు తగిన సమాధానము చెప్పుటకు ఇప్పటి పెద్దలు ప్రయత్నిస్తేనేగాని ఇప్పటి రాజరాజుల నిరంకుశాధికారము వల్ల హిందూ సంఘమునకు గొప్ప విపత్తు కలుగుతుందని హెచ్చరించుటకు కవిగారు ఈ నాటకము రచించినట్టు నాకు తోస్తున్నది. వారి సద్భావము మెచ్చుకోదగినది కాదా?''

చలం రచనలలోని స్త్రీలు ఒక ప్రత్యేకత నిరూపించుకోవచ్చు. తమ ప్రేమను పలువురికి పంచవచ్చు. ఎవరినీ పెళ్ళిచేసుకోనని అనవచ్చు. కానీ నిజజీవితంలో స్త్రీలు అలా ఉండగలరా? రత్నమ్మ తన ప్రేమను చలానికీ, రామమూర్తికీ సమంగా పంచి ఇచ్చింది. చలం భార్యా, రామ్మూర్తి భార్య భర్తలకు అడ్డు చెప్పలేక సర్దుకుపోయారు. చలం ఇంట్లో చలం, రామ్మూర్తి, ప్రకాశం, కృష్ణశాస్త్రి, ముద్దుకృష్ణ సమావేశమవుతూ ఉండేవారు. రత్నమ్మకు ప్రేమ ఒక్కటే కాదు కావలసింది. భర్త వల్ల భద్రత కావాలి. అయితే రత్నమ్మ పెళ్ళి కావాలి. చలంగానీ, రామ్మూర్తిగానీ ఇది ఇవ్వలేదు. ఆమె 1927లో జయంతి సుబ్రహ్మణ్యం అనే డాక్టర్ని పెళ్లి చేసుకొంది. ఇది రామ్మూర్తి భరించలేకపోయాడు. ఆ దంపతుల కళ్ళముందు విషం తాగి ఆత్మహత్యా చేసుకొన్నాడు. చలం రామ్మూర్తిని కలుసుకొని ఇలా బాధపడ్డాడు.

''రామ్మూర్తి!

23. గిడుగు వెంకట రామమూర్తి పంతులు - వ్యాసావళి - పుటలు 122-5

నాకు వొకటే బెంగ. మనం దేవుడిమీదా, నీతిమీదా, అధికారులమీదా తిరగబడ్డవాళ్ళం. ఎంత అసహ్యంగా వున్నా భూమిని (సంఘాన్ని) వొదిలి ఎగురుదామంటే వినాశం తప్పదని నమ్మి హేళనగా చూసే ప్రజలు - 'చూడండి రామ్మూర్తి, అన్నిటినీ ధిక్కరించి, ఏమైనాడు?' అనడానికి వీలునిచ్చావు. మన స్వేచ్ఛని భరించలేనివాళ్ళు, మన పేరు విని గొణిగే సంఘాధికారులు, వీళ్ళ చేతుల్లో అపజయం పొందావని నీవంక చూపుతున్నారు అందరూ. దిక్కుమాలిన స్త్రీలని యినుప ముక్కులతో పొడిచి చంపడానికి జంకిన రాబందులన్నీ నీ శవం చుట్టూ పోగై వుత్సవాలు చేసుకుంటున్నాయి రామ్మూర్తి! తిరగబడ్డ వుత్సహిస్తున్న యువకుల్నీ, అధికారాల్నీ, ఎదిరించే వీరుల్నీ, సంఘానికి బలి అయ్యే నిర్భాగ్యుల్నీ, అందరినీ హేళనగా నవ్వి నీవంక చూపుతున్నారు.

''క్రూరుడైన రాజు వేళ్ళాడే అస్థిపంజరాల్ని జాగ్రత్త అని చూపుతున్నట్లు, సంఘ కాళి తెల్లబడ్డ నీ యెముకల్ని చూపుతోంది''.

''నీ మరణం అపజయం కాదని - సంఘం మీదనే కాదు, మనుష్య స్వభావం మీద మరణం మీద జయధ్వానమని చెప్పడానికి మిగిలాను నేను''!

రామ్మూర్తిది అపజయం కాదని ఒక్క చలం మాత్రమే కాదు కృష్ణశాస్త్రి, ముద్దుకృష్ణా కూడా కీర్తించారు. 'ఓ మానవోత్తమా, ఓ వీర మూర్ధన్య' అంటూ కృష్ణశాస్త్రి 'ప్రవాసం' అనే తన కావ్యాన్ని రామ్మూర్తికి అంకితమిచ్చాడు. ముద్దుకృష్ణ వైతాళికులు అంకితమిచ్చాడు.

చలానికి జీవితంలో ఆశించిన జయాలు ఏమీ లభించలేదు. అతడు సఖులవలన పరిచ్యుతుడు. సంఘానికి బహిష్కృతుడు. అతనికి ఏ వూళ్ళోనూ ఎవరూ ఇల్లు వాళ్ళ నడుమ అద్దెకిచ్చేవారు కాదు. హరిజనవాడల్లో, వలుకుల్లో, బీద ముస్లింవాడలలో, తక్కువజాతి కిరస్తానీ పేటల్లో కాపురం పెట్టేవారు. అక్కడ అడుగు పెట్టడానికే 'లోకులకు' భయం. చలానికి లోకంలో ఎవరితోనూ సంబంధం లేదు. ఎవరింటికి పోడు. ఏ మీటింగుకూ వెళ్ళడు. ఏదో తనను బలవంతం పెట్టి ఎవరో తనచేత రాయిస్తున్నట్టు కథలు, నవలలు, నాటుకాలు రాసేవాడు. అవి రాస్తూ వుంటే అన్నీ మరిచిపోతాడు. తన బాధ, వంటరితనం, భయం, చివరికి ప్రియురాలిని కూడా. చలానికి వాస్తవ జీవితంలోని వ్యక్తులతో సంబంధం లేదు. 'నేను కల్పిస్తున్న ప్రజలతో సుఖదుఃఖాలు పంచుకొంటాను. నావేళ్ళకింద తయారవుతున్న వ్యక్తులతో సంభాషిస్తాను. ఆడుకుంటాను' అని ఒక ప్రేమలేఖలో రాశాడు.[24] ఎవరూ ఇష్టపడక వెలివేసి వదలివేసినవాడు. స్వేచ్ఛాజీవి. అతనికి ఏమి వ్రాస్తున్నాను, ఏమి చేస్తున్నాను అనే సంకోచం ఉండదు. ఈ సంగతి చెప్పి చలం ఇలా రాశాడు.[25]

''ఆ కాలంలో నేను, నేను బతకడం ఇష్టంలేని ప్రజల మీద దండెత్తి 'సెల్ఫ్ ఎసెర్ట్' చేసుకోవడమే ప్రధానంగా వుండేది. ప్రజలకి ఎంత కోపం తెప్పిస్తే నాకు అంత సంతోషం. నన్నెదరించే వాళ్ళని అదరకొట్టడానికి ఎంత తీవ్రమైన మాటలూ శక్తిహీనంగా తోచేవి.

24. ప్రేమలేఖలు - పుట.93
25. స్త్రీ - మళ్ళీ ఈనాడు అనే ఉపోద్ఘాతంలో, పుట.3

అందువల్లనే ఆనాటి పుస్తకాలనిండా అతిశయోక్తులూ వన్‌సైడ్ స్టేట్‌మెంట్స్, ద్వేషంతో కూడిన తిట్లూ, అనవసర శృంగారమూ వుండేవి''.

చలం ఏది రాసినా దీక్షితులుగారు అంగీకరించేవారు. నిజానికి ఆయనే చలం మొదటి కథను 'సాహితి' పత్రికకు పంపారు. దాంతో కొత్త కథకుడు బయలుదేరాడని సంతోషించినా, ఇదేమిటి ఇట్లా రాస్తున్నాడన్న సంశయంతోనే కొందరు ఆనాటి రచయితలు చలానికి స్నేహితులయ్యారు. 'రెండో కథతో దిక్కులేకుండా పారిపోయారు. మూడో కథతో జన్మ విరోధులయ్యారు' అంటాడు చలం. ఒక్క దీక్షితులుగారే స్థిరంగా చలం పక్షాన నిలబడ్డారు. ఈ కథల సందర్భంగానే కాకుండా ఆయనకీ చలానికీ గట్టి స్నేహం ఏర్పడింది. చలం ధోరణిని చూసి తెలుగువాళ్ళంతా జంకారు. కాని దీక్షితులుగారు జంకలేదు. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటూ వేరే ఊళ్ళోకి బదిలీ అయి వెళ్ళినా ఉత్తరాలు ఎప్పుడూ రాసుకొనేవారు. 'ఈ మైత్రిలో వెలుగులేకాని నీడలు తక్కువ' అని దీక్షితులుగారు అన్నారు.[26]

దీక్షితులుగారి మూలంగా చలం జీవితపథంలోనూ, ఆధ్యాత్మిక దృక్పథంలోనూ చాలా విపరీతమైన మార్పులు వచ్చాయి. జాతకాలు, నమ్మకాలు, గ్రహశాంతులు, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, కార్తీక సోమవారవ్రతాలూ, తీర్థయాత్రలు ప్రారంభ మయ్యాయి. చలంతోపాటు బ్రహ్మ సమాజంలో చేరి, మంగళసూత్రాలు తీసిపారేసిన అతని భార్య పూజలూ, వ్రతాలూ, శాంతులు ప్రారంభించాక 'పవిత్రులైన బ్రాహ్మలు' భోజనానికి కూడా చలం ఇంటికి వచ్చేవారు. నిరీశ్వరవాదినని చెప్పుకొంటూనే చలం ఈశ్వరుని కోసం అన్వేషించాడు. పదిహేనేళ్ళలో చాలాదూరం, (లోపల, బయటకాదు) ప్రయాణం చేశానని చలం భావించాడు. అయితే అడుగడుగునా బయలుదేరిన చోటుకే వచ్చి చేరుకొంటున్నాడేమో!

సాహిత్యపరంగా చలం 1921 నుంచి 1928 దాకా ఎనిమిదేళ్ళలో పాతిక పైచిలుకు రచనలు చేశాడు. 1929 జనవరి 20వ తారీఖున దీక్షితులుగారికి రాసిన ఒక ఉత్తరంలో చలం తన సాహిత్య సమీక్షను చేసుకొని అంచనా వేశాడు.[27]

''మన సారస్వతంలో new channels of thought, and path of art అభిప్రాయాలలో కొత్త కాలవలూ, కళలో కొత్త మార్గాలూ ప్రారంభించిన వాళ్ళు కొద్దిమంది వున్నారు. వాళ్ళల్లో నేనొక్కణ్ణి. ఈకాలపు రష్యన్, ఫ్రెంచి కథలూ నాటకాలలో ప్రశస్తమైన వాటి రకాల్ని తెలుగులోకి ప్రవేశపెట్టాను. పశ్చిమ సారస్వతంలోంచి స్కాట్ తరవాతి ఉద్దేశ్యాలేమీ తెలుగులోకి రానేలేదు ఇంతవరకు. నేను కొన్ని చాలా మంచివి వ్రాశాను. కాని నా టెక్నిక్ అండ్ ఐడియాస్, చాలా పాశ్చాత్య వాతావరణాన్ని సూచిస్తాయి. కనక మన నేల మీద ఆరోగ్యంగా అభివృద్ధి చెందవు.

''రాజకీయంగా సాంఘికంగా ముందు దేశం ఏ విధంగా మారబోతుందో, దాన్ని పట్టి వుంటుంది నా పుస్తకాల విలువ. టర్కీ మల్లే చేతల్లోను, ఆలోచనల్లోను, యూరప్‌ని

26. చలం ఉత్తరాలు మొదటి భాగం - పుట.2
27. చలం ఉత్తరాలు - మొదటి భాగం - పుటలు 7-8

అనుకరించబోతే, నేను గొప్ప పూజల్ని పొందుతాను. అట్లా కాకపోతే, నాకు స్థానమే వుండదు. కాని ఈనాడు వాస్తవ జీవితంలో, మాటల్లో చాలామంది చూపుతున్న పోకడలనే నేను కళారూపంలో వ్యక్తం చేశాను.

''ఇంక నా భాష ఒక ఆటకం. Force of sincerity సూనృత శక్తి, weight of passion నా ఉద్రేకపు ఉద్ధుతము - తప్ప నాకు శైలి లేదు. కాని 'వైను'ను జాగ్రత్తపరిచే పాత్రశైలి. ఈ పగులు జాడీలో యీ వైను చాలా ఏళ్లు నిలవదు''.

''నా పుస్తకాల్లో ఏదీ కూడా నిజమైన గొప్పదనం కలదికావు. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో అమలులో వున్న కళా విజృంభణకన్న గొప్పతనం నా పుస్తకాల్లో లేదు - చలం సంగతే వ్రాస్తున్నాను ఇంతసేపూ - ఎందుకంటే నేను బాగా ఎరిగిన అతను అతనొక్కడే''.

ఇది నిజాయితీ కూడుకొన్న అంచనా. చలం గురించి ఎవరెవరు ఎన్నిరకాలుగా ఉత్తరోత్తరా విశ్లేషణలు చేసినా ఇంతకు మంచి చెప్పడానికి ఏదీ మిగలదేమో. చలం తన రచనలలో పాశ్చాత్య వాతావరణం సూచించే విధంగా రాయడానికి కారణం అతని రచనలు చాలావరకు ఆ పాశ్చాత్య రచన ప్రభావంలో అనువాదాలు, అనుసరణలు, అనుకరణలు చేయడమే. తెలయవచ్చినంత వరకు వాటి వివరాలు ఇవి.

1. శశిరేఖ (1921) - థామస్ హార్డీ టెస్స్ ప్రభావం ఉండే ఉంటుంది.
2. దైవమిచ్చిన భార్య (1923) - హెచ్.జి. వెల్సు - పాషనేట్ ఫ్రెండ్స్ నుండి అనువాదం సర్ హార్‌కెయిన్ 'వుమన్ దౌ గేవెస్ట్ మి' కూడా కొంత కారణం కావచ్చు.
3. సావిత్రి (నాటకం) - మేటర్ లింక్ జాయజెల్లికి అనుసరణ
4. జానకి ఆవేదన - రష్యన్ నుంచి అనువాదం
5. వెలయాలి అబద్ధం - రష్యన్ నుంచి అనువాదం
6. శావలిని - రష్యన్ నుంచి అనువాదం
7. సత్యం (1922) నాటిక - మెపాసాకు అనుసరణ
8. చుక్కమ్మ (కథ) - నార్వేజియన్ భాష నుండి
9. మనోహర ప్రజ్ఞ - ఆనటోల్ ఫ్రాంసుకు అనుసరణ

అనువాదాలని చలం చెప్పకపోతే చాలా రచనలు అతని స్వతంత్ర కల్పనలే అన్నంత సహజంగా సాఫీగా ఉంటాయి. ''నేను కనే కలలన్నింటిని సాధ్యమైనంత వరకు నా కథల్లో నాటకాల్లో ప్రతిఫలింప చేశాను'' అని చలం చెప్పుకొన్నాడు. జీవితంలోంచి తీసుకొన్న సన్నివేశాలను కొద్దిగా రచనలలో కూర్చడం అవసరం. మానవులు తీరని కోర్కెలు కలలో తీర్చుకొన్నట్టు రచయితలు ఫలించని ఆశయాలు కొన్ని కలలో తీర్చుకొంటారు. చలం ఇదే తన కొన్ని రచనలలో చేశాడు. ఉదాహరణకు 'సుందరం' అనే నాటికలో అతని చిన్నతనంలోని రెండు సంఘటనలకు కళానువాదం కనబడుతోంది.

చలం చెల్లెలు అమ్మణ్ణి సారె గదిలోనికి భర్త దగ్గరకు వెళ్ళాక ఏడిచింది. అయినా తప్పలేదు. 'సుందరం' నాటికలో కథానాయిక సుందరం శోభనం నాడు రాత్రి భర్తకు తన అయిష్టాన్ని నిర్భయంగా చెప్తుంది. ఆ మొగుడు ఆమెను వదిలి వెళ్ళిపోతాడు. సుందరం చిత్రకారిణిగా స్వతంత్ర జీవనం గడుపుతోంది. చిన్నప్పుడు చలానికి తన పెదనాన్న కూతురు రమణను పెళ్ళిచేసుకోవాలని ఉండేది. శృంగేరి పీఠాధిపతుల అనుజ్ఞ ఈ పెళ్ళికి అర్థించాడు. ఫలించలేదు. సుందరం నాటికలో ఆ 'కోరిక' తీరింది. సుందరం తన చిన్నాన్ననే మనసుపడి జతగాణ్ణి చేసుకొంటుంది. చలం అనుభవాలేకాక ఆశయాలు అతని రచనలలో ప్రతిఫలించాయి. అయితే చలం కన్న కలలు పగటి కలలు కావు. పీడకలలు.

సమాజాన్ని సంస్కరించడానికి కాక తనను తాను సంస్కరించుకొందికి చలం రచనలను చేశానన్నాడు. అయితే కుటుంబరావుగారు చెప్పినట్లు సమాజాన్ని నిజంగా సంస్కరించే ఉద్దేశం చలానికి లేకపోయినా ఆయనది ఆ కాలపు సంస్కరణల ధోరణే. ''సంస్కర్తల ప్రచారాలలో ఉండే లోపాలు చలం రచనలలో కూడా ఉన్నాయి. ఆయనచేత తిట్లు తిన్న సామాజిక మాయరోగాలన్నీ సుఖంగా ఉన్నాయి. కొన్ని చిలవలూ, పలువలూ కూడా లేచాయి'' అని చెప్పి, ''చలం ఎంత ఒంటరివాడో చలం రచనలు అంతగా జనాదరణ పొందాయి! చిత్రం!'' అని కుటుంబరావుగారు ఆశ్చర్యం చెందారు.[28]

''చలం ఏకాకి మాత్రమే కాదు, ఏకాక్షి. ఆ ఉన్న కన్ను కూడా మెల్లది'' అని నండూరి ప్రసాదరావుగారు సరిగ్గా అంచనా వేశారు.[29]

తెలుగు సాహిత్యాన్ని కొత్త మలుపులు తిప్పిన చలం నాకు మాత్రం అన్ని పాటలూ ఒకే రాగంలో పాడే పాటగాడిలా కనిపిస్తాడు.

జమీందారీ యుగంలో చివరి దశాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని ఉన్నవ లక్ష్మీనారాయణగారు కొద్దిగా వామపక్షంవైపు, చలం బొత్తిగా కామపక్షం వైపు మళ్ళిస్తున్నప్పుడు మధ్యేమార్గంలో కాక పూర్తిగా బండి వెనక్కి తిప్పే ప్రయత్నం చేసిన రచయిత, కవి ఒకాయన లేకపోలేదు. ఆయన **విశ్వనాథ సత్యనారాయణ (1895-1976).** ఈయన 1921లోనే 'అంతరాత్మ' అనే నవల రాశారు. ఇది మరీ ప్రాథమికంగా ఉంది. బాగా చెయ్యి తిరగని రచన. 15 రేకుల నవల. ఇందులో కొంతభాగం 1923లో శారద పత్రికలో ప్రచురితమైంది. మొదటి నవలా రచన 1921లో ప్రారంభించినా తరువాత కొన్నేళ్ళు ఈ ప్రక్రియను ముట్టుకోలేదు. ఆయన బాగా శిల్ప నైపుణ్యం చూపెట్టిన ఏకవీర 1930లోగాని రచించలేదు. ఆధునిక యుగంలో విశ్వనాథ రచించిన చెలియలి కట్ట, వేయిపడగలు నవలలలోని పాత్రలు 'అంతరాత్మ'లో వేషాలు లేని రిహార్సల్సు చేసుకొంటున్నట్లు కనబడతాయి.

ఈ యుగంలో కొత్త మలుపులు తిరిగిన తెలుగు నవల ఆధునిక యుగంలోనే కొత్తపుంతలు తొక్కింది.

---

28. ఆంధ్రజ్యోతి దినపత్రిక - 13.5.1979

29. ప్రజాశక్తి దినపత్రిక - 1.10.1978

భావకవిత్వం - స్వభావ ప్రభావాలు

క్రీస్తుశకం ఇరవయ్యో శతాబ్దంలో జమీందారీ యుగపు చివరి దశాబ్దాలలో ఆధునికాంధ్ర సాహిత్యానికి మైనారిటీ వెళుతున్నప్పుడు భావ కవిత్వం గజ్జెకట్టి రంగ ప్రవేశం చేసింది. ఈ అలరింపు నృత్యాన్ని తిలకించినవారు, పులకించిన వారూ యుగధర్మానికి అనువైన కవిత్వం వచ్చిందని మెచ్చుకొన్నారు.

''ఈ కృతులనేకములు భావగీతములని ఇప్పుడు ప్రచారమునకు వచ్చిన క్రొత్త కవితా ప్రపంచమునకు చేరినవి. సంస్కృత దాస్యము నుంచి విముక్తులమగుచున్నామని నా నమ్మకం''.

ఇవి కట్టమంచి రామలింగారెడ్డి గారి మాటలు. పింగళి - కాటూరి వారి 'తొలకరి' పీఠికలో వీటిని 1923లో చెప్పారు. కట్టమంచి వారు కవిత్వతత్త్వ విచారం చేసిన విజ్ఞులు. ఆంధ్రాంగ్ల సాహిత్య నిష్ణాతులు. తెలుగులో 'ముసలమ్మ మరణం' అనే కావ్యాన్ని 1900లోనే రచించినవారు. కవిత్వమంటే ఏమిటో సంస్కృత దాస్యమంటే ఏమిటో తెలిసినవారు. ప్రబంధ ధోరణి నుండి తాము ఒకనాడు విముక్తులు కాలేకపోయారు గానీ సమకాలికులు ఒక రెండు దశాబ్దాలలో విమోచనం చెందుతున్నారని గుర్తించి హర్షిస్తున్నారు.

ఆధునిక కవిత్వానికి ముఖ్యంగా భావకవిత్వానికి ఆంగ్ల సాహిత్య పరిచయం వల్లనే ప్రోద్బలం వచ్చిందని నిస్సందేహంగా ఆనాటి కవులూ, విమర్శకులూ భావించారు. ఆ సంగతిని స్పష్టంగా ప్రకటించారు. భావకవిత్వం రావడానికి కారకులలో ఒకరైన రాయప్రోలు సుబ్బారావుగారి 'తృణ కంకణం' ప్రకాశకులు 1913లో ఏమన్నారంటే ''పాశ్చాత్యాదర్శముల ప్రోద్బలము దొరకునంత వరకు మన కవులు పాడినదే పాడవలసిన వారైరి. నవీనమార్గం రచనలలో ముఖ్యమైనది 'లిరిక్' అను ఆంగ్లేయ రచన.''[1]

ఆధునిక కాలానికీ అవసరమైన 'లిరిక్కులకు' ఆంధ్ర సాహితీపరులు స్వాగతం చెప్పారు. భారతి, ఆంధ్రా హెరాల్డు మొదలైన పత్రికలలో తమ ఆమోదాన్ని పాఠకులూ, విమర్శకులూ తెలియచేశారు.

''ఇంతవరకును మన కవులు సంస్కృతమునందు వివరించబడిన సంప్రదాయ ములను శిరసావహించి పనిచేసిరి. మార్పులు రాక తప్పదు. ప్రాచీన సంప్రదాయముల యెడల గౌరవం తగ్గెను. ఆంధ్ర భాషా చరిత్రమున నేడొక నూతనాధ్యాయము ఆరంభమగు చున్నది.''[2] ''నవ్యాంధ్ర కావ్యరీతులు కడచిన పదియేండ్లలో పొందియున్నవి.''[3] ''ఆ యుగము ఆ నూతన వికాస స్వర్ణయుగపు వాఙ్మయ చిహ్నాలు''[4] ఇవి సమకాలిక అభిప్రాయాలు.

---

1. అక్కిరాజు ఉమాకాంతం గారు 'నేటి కాలపు కవిత్వం'లో ఉదాహరించారు. -పుట.156
2. నిడమర్తి సత్యనారాయణమూర్తి - భారతి 1926, మార్చి.
3. ఆంధ్రా హెరాల్డులో పురాణం సూరిశాస్త్రి - 'నేటికాలపు కవిత్వం'లో ఉదాహృతం.
4. దశిక సూర్యప్రకాశరావు - భారతి 1925, నవంబరు

సాహిత్య లోకంలో చాలామంది ఈవిధంగా సంతోషాన్ని ఆమోదాన్ని తెలియచేశారు. ''ఈకాలపు కవులు నిక్కముగ స్వతంత్రులు'' అని చెప్పిన కట్టమంచి వారి మాటలతో ఏకీభవిస్తూ పోకడలు స్వతంత్రాలనీ, భావాలు స్వతంత్రాలనీ పలువురు మెచ్చుకొన్నారు. భావకవులే ''సంకెలలో సంగీతమా? కట్టుబాటులో కవిత్వమా'' అని తమ స్వాతంత్ర్యాన్ని 1922లోనే ప్రకటించుకొన్నారు.[5]

ఇది వయసుకు తగ్గ వైఖరని ఎవరికైనా తోచవచ్చు. అలా స్ఫురించితే అందులో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే భావకవులలో ప్రముఖులైన వారంతా 1891 తర్వాత 1900 సంవత్సరం లోపున ఉన్న పదేళ్ళలో జన్మించినవాళ్ళే. భావకవిత్వం నలుగురి నోళ్ళలో పడ్డ 1919 నాటికి వీరంతా పైలాపచ్చీసు దశలో ఉన్నవాళ్ళే. చింతా దీక్షితులు (1891), కవికొండల వెంకటరావు, రాయప్రోలు సుబ్బారావు, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి (1892), పింగళి లక్ష్మీకాంతం, బసవరాజు అప్పారావు (1894), నండూరి సుబ్బారావు, కాటూరి వెంకటేశ్వరరావు, అడవి బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి (1895); అబ్బూరి రామకృష్ణారావు (1896); దేవులపల్లి కృష్ణశాస్త్రి, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య (1897); కొడాలి ఆంజనేయులు, విశ్వనాథ సత్యనారాయణ (1898), నాయని సుబ్బారావు (1899), నోరి నరసింహశాస్త్రి, వేదుల సత్యనారాయణ (1900). ఈ పద్దెనిమిది మంది కవులే భావకవిత్వపు ప్రథమశ్రేణిలోని ప్రతిభావంతులు. వీళ్ళమీదనే సనాతనుల తిట్లూ, సమకాలిక సహృదయుల దీవనలూ ఎక్కువగా వర్షించాయి. వీరందరి కవితల సమగ్ర దర్శనం వల్లనే భావకవిత్వ స్వభావ ప్రభావాలు అంచనా వేయడం సాధ్యమవుతుంది.

ఈ అష్టాదశ యువకుల 'ఈడుగుంపు'కి ముందో ముగ్గుర్నీ, తర్వాత మరో నలుగుర్నీ కలుపుకొని 1935లో ముద్దుకృష్ణ భావకవిత్వానికి ప్రాతినిధ్యం వహించే 'వైతాళికులు' అనే ఖండకావ్యాల సంకలనాన్ని ప్రచురించాడు. ముందున్న ముగ్గుర్లో గురజాడ (1865), వెంకట పార్వతీశకవులు (1891-1892) ఉన్నారు. తర్వాత నలుగురిలో మల్లవరపు విశ్వేశ్వరరావు (1904), పెనుమర్తి వెంకటరత్నం (1907), రామచంద్ర అప్పారావు (1909), శ్రీరంగం శ్రీనివాసరావు లేక శ్రీశ్రీ (1910) ఉన్నారు. వీరిలో గురజాడ ప్రాచీన సరణికి భరతవాక్యం పాడారు. శ్రీశ్రీ నవీన సరణికి నాందీగీతం పాడారు.

గురజాడ నిజానికి ప్రాచీన సరణికి భరతవాక్యం పాడడమే కాదు, అభ్యుదయమార్గానికి 'ప్రావేశిక' గీతాన్ని ఆలపించారు. శ్రీశ్రీ విప్లవభావాలకు 'ప్రాసాదకీ' గానాన్ని మ్రోగించారు. రంగంమీదకు ప్రవేశించే పాత్రల భావాలనూ, ప్రకృతినీ, అవస్థానాన్నీ సూచించే గానాన్ని ప్రావేశిక గానం అంటారు. ప్రవేశించిన పాత్ర చిత్తవృత్తిని సామాజికులకు తెలియచేసే గానాన్ని ప్రాసాదకీ గానం అంటారు.[6]

భావకవులలో ఒకరైన పింగళి లక్ష్మీకాంతంగారు మాత్రం తిరుపతి వెంకటకవులను ఆద్యులుగా చేస్తూ 'ఈ మహాకవుల వాక్కు ప్రాచీన సరణికి భరతవాక్యము, నవీన సరణికి నాంది వాక్యము' అని అభిప్రాయపడ్డారు.[7]

---

5. ఏకాంతసేవ పీఠికలో దేవులపల్లి కృష్ణశాస్త్రి
6. నాట్యశాస్త్రం - 32వ అధ్యాయం
7. గౌతమ వ్యాసాలు - పుట.59

ఈ అభిప్రాయానికి విస్తృతమైన ప్రచారం లభించింది. దీనిని విశ్వసించేవారు కూడా ఉన్నారు. తిరుపతి కవులు నవీన సరణికి నాంది పలికారన్న భావానికి దాఖలాగ కొన్ని పద్యపాదాల ఉదాహరణలు కూడా లభిస్తాయి. తిరుపతి కవులు మార్పును గుర్తించినవారే. ''కాలముబట్టి, దేశమును గాంచి ప్రభుత్వము నెంచి'' భాష మారుతుందని తెలిసినవారు. పైగా అన్యదేశాలు కూడా ప్రతిభాషలోనూ ఉంటాయనీ వాటిని కృతులలో వాడితే ఎవరూ అడ్డు చెప్పకూడదనీ చాటినవారే. ''కవుల మిప్పటి రూల్సుకు కట్టుబడము'' అని తిరగబడినవారే. అయితే తిరుపతి వెంకటకవుల నవీన సరణి కేవలం భాషకు మాత్రమే పరిమితమైనది. భావాల విషయంలో వారిది సనాతన మార్గమే. భావకవిత్వమంటే ఏమాత్రం సదభిప్రాయం ఉన్నట్లు కనబడదు. ఒక యువకునికి సలహాయిస్తూ చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రిగారు ఇలా హెచ్చరించారు.

> ''ఈ.... కాలమునన్ గవిత్వమనగా బెడద్రోవల ద్రొక్కుచున్న గ
> య్యాళికి దుల్యమై చెడుట యారయుచుంటిమి వారి త్రోవలన్
> కాలిడ బోకుమయ్యయది గాలికి ధూళికి బోవు....''

నిజానికి భావ కవిత్వంలో నిగ్గుగా నిలచిన కావ్యాలు గాలికీ ధూళికీ పోంయనవి కావు. ఆ త్రోవలన్నీ పెడత్రోవలు కావు. ఆ కవితా కన్య కూడా గయ్యాళి కాదు. నిజమైన కవిత్వమెన్నడూ తాను చెడదు. ఇతరులను చెడగొట్టదు. విశ్వాన్ని మార్చడానికి ప్రయత్నిస్తుంది. ఇది అనాదిగా కవిత్వ స్వభావం. భావకవిత్వ స్వభావం కూడా ఇదేనా కాదా అన్నది తేల్చుకోవలసిన విషయం.

భావ కవిత్వం గణనకు వస్తున్న రోజులలో దాన్ని ఆక్షేపించిన వాళ్ళూ ఉన్నారు. సమర్థించిన వాళ్ళూ ఉన్నారు. 'భావకవిత్వం అనే మాటకి లెక్కలేనన్ని నిర్వచనాలూ, ఎన్నోదిక్కుల నుండి వివరణలూ వచ్చాయి. అతివ్యాప్తి, అవ్యాప్తిగల నిర్వచనాలను చర్చించితే కాలహరణమేగాని ప్రయోజనం ఉండదు. నిర్వచనం సూత్రమంత క్లుప్తంగా ఉండాలి. వార్తికం, వ్యాఖ్యానం, కారిక తార్వత వచ్చేవి.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు చక్కని నిర్వచనం ఇచ్చారు. ''కవేర్భావః కవిత్వం - భావ ప్రధానం కవిత్వం భావ కవిత్వం'' అని చెప్పారు. కవి' అంటే ఎవరు? భావం అంటే ఏమిటి? అన్న ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరికినప్పుడే ఈ నిర్వచనం బోధపడుతుంది. 'కవిర్భాంః కవిత్వం' కవిత్వానికే కావ్యం అన్నది ఇంకోపేరు. ''నాఽనృషిః కురుతే కావ్యం'' అన్నారు. 'ఋషి కానివాడు కావ్యం చేయడు'. ఇవాళ మనం కావ్యాలను రాస్తున్నాము, రచిస్తున్నాము గాని పూర్వం చెప్పేవారు, చేసేవారు. కావ్యాన్ని చేసే ఆదిమ యుగాల నాటి కావ్యాన్ని ఈ 'నాఽనృషిః కురుతే కావ్యం' అన్న సూత్రం చాటుతుంది.

ఋషులు ఆదిలో చేసేదేమిటి? 'కవయః క్రాంత దర్శనః' అని లోకోక్తి. ఋషి ద్రష్ట. దర్శనశక్తి కలవాడు, ఏమిటి దర్శించగలడు? దేన్ని దర్శించిన తర్వాత ఏం చేస్తాడు? తనకు కావలసిన రీతిలో విశ్వాన్ని చూస్తాడు. దాన్ని అలా పరివర్తన చెందేటట్లు మాజిక్ చేస్తాడు. ''యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే'' (కవికి విశ్వమెట్లా ఇష్టమైతే అట్లా పరివర్తన

పొందుతుంది.) ఇది వేదకాలంలోనే కాదు, ఒక్క భారతదేశంలోనే కాదు 'సింపథిటిక్ మాజిక్కు' మంత్రచర్య జరిగే అన్ని కాలాలలో, అన్ని సమాజాలలో ఉమ్మడి మంచికోసం తంతును జరిపే ఋత్విక్కులూ, తెలుగు గ్రామీణుల జాతరలలోనూ వరసలోనూ ముఖ్యులైన అసాదులు, పంబలవారు, మాతంగ కన్యలూ మొదలైనవారంతా ఋషులే. ఒకరకమైన కవులే.

గణ జీవితంలో సామూహికంగా, కలసికట్టుగా ఉత్పత్తి చేస్తున్నప్పుడు కట్టుకొనేపాట, దానికి అనుగుణ్యంగా ఆడే ఆటా బీజరూపంలో కవిత్వలక్షణాలు కలిగినవని సోషల్ ఆంత్రోపాలజిస్టులు చెప్పారు. వీటికి దాఖాలలు ఏ అనాగరిక దేశాలలోంచో తీసుకొచ్చి చూపెట్టక్కర్లేదు. మనదేశంలోనే కోకొల్లలుగా కొట్టవచ్చినట్లు దొరుకుతాయి.

ఛోటానాగపూర్, సింగ్భూం మొదలైన మధ్య భారతసీమలలో 'కోయ'లనే ద్రావిడ జాతుల వరికోతల నృత్యం ఒక చక్కని ఉదాహరణ. 'మద్దెలలు మోగుతూ ఉంటాయి. ఆ తాళాన్ని అనుసరించి వేణునాదం వినబడుతూ ఉంటుంది. స్త్రీలందరూ వరుసగా నిలబడి ఉంటారు. ఏదో గీతాన్ని కలసి పాడుతూ ఉంటారు. తాళ లయలను అనుసరించి అడుగులు వేస్తూ ఉంటారు. అందరూ ఒక్కసారిగా వంగి చేతులతో కొన్ని ముద్రలను చూపిస్తారు. అది అచ్చంగా పొలాలలో వరినాటినట్లనిపిస్తుంది. తరువాత కోతలు కోసిన పైరును కట్టకట్టి, కొట్టి దులిపి కుప్పలు వేయడం మొదలైనవి. తాళలయలు తప్పకుండా మధురంగా పాడుతూ అభినయిస్తారు. కుప్పలుగా వేసిన ధాన్యాన్ని వేర్పరచి చేటలతో చెరగడం, శుభ్రపరచిపోయడం అభినయిస్తారు. ఏడాది పొడుగునా చెమటోడ్చి కష్టపడిన శ్రమ ఫలితాన్ని చూసిపొందే ఆనందాన్ని అభినయిస్తారు. వర్ష ఋతు ప్రారంభంలో పొలము దున్నడం మొదలుకొని కొత్త వడ్ల బియ్యం విందారగించే దాకా అంతా ఊహాదృశ్యాలుగా, వివిధ ఘట్టాలుగా నృత్యం చేస్తారు. ఇది మాజిక్ చర్య.

వాంఛించే వాస్తవికతను ఊహతో సృష్టించుకొని ప్రకృతి శక్తులను స్వాధీనంలో ఉంచుకొన్నామన్న సఫలతను పొందడం మాజిక్‌లోని మూలసూత్రం. 'యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే' అన్న దానికి అదే అర్థం. ప్రజకు విశ్వమెట్లా ఇష్టమైతే అది ఊహలో అట్లా పరివర్తన చెందుతుంది. నాటి ఆదిమకాలం నుంచీ నేటి ఆధునిక కాలం దాకా ప్రతి మంచి కవితలో ఇది జరుగుతూనే ఉంది. భావ కవిత్వంలో కూడా మానసికంగా ఇది జరిగింది. అందుకే మంచి కవితలలో ఈ మ్యాజిక్ అనే స్వభావం గుప్తమై ఉంది. అయితే దశల వారీగా మ్యాజిక్ నుండి మిత్తు (Myth), దానినుంచి ఆర్టు (Art) వచ్చాయి. ఈ పరిణామక్రమం కొన్ని కవితలలో సాక్షాత్కరిస్తుంది. ఇది వాటిలోని భావాల వల్ల రుజువు చేయవచ్చు.

భావకవిత్వం ప్రాచుర్యం పొందుతున్నరోజుల్లో ఆక్షేపించినవాళ్ళు 'అసలు భావ కవిత్వమనడమే అసంగతం' అన్నారు. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు 'భావం లేనిదే కవిత్వమే లేదు' అన్నారు.[8] కవిత్వమెక్కడ ఉంటుందో భావమక్కడ ఉండనే

8. నేటి కాలపు కవిత్వంలో ఉదాహృతం - పుట.145

ఉంటుందన్నారు. నిజమే. ఒప్పుకోవచ్చు. అయితే ఆక్షేపించినవాళ్ళు రెండు కళ్ళూ మూసుకొని భావకవిత్వంలోని భావాన్ని ఒక కంటితో, కవిత్వాన్ని రెండో కంటితో చూడకూడదనుకొన్నారు. భావకవిత్వమన్నది కొత్తదేం కాదు. మన పూర్వ సాహిత్యంలో రసధ్వని, భావధ్వని ఉందన్నారు. ఖండకావ్యాలు నవీన ప్రక్రియ కాదు పొమ్మన్నారు. ఈ ఆక్షేపకులు సర్గ బంధ కావ్యాలనూ అనిబద్ధ కావ్యాలను పేర్కొన్నారే గాని అభినేయార్థా లయిన కావ్యాల ఊసు అట్టే ఎత్తలేదు. నిజానికి భావకవిత్వంలో అభినేయార్థతత్త్వం అంతర్లీనంగా ఉంటుంది.

నృత్యం, గీతం, వాద్యం అనే మూడింటినీ తౌర్యత్రికం అంటారు. ఈ మూడింటినీ ఆదిలో విడదీయలేదు. ఇప్పటికీ అవి విడదీయరానివే. ఆడకపోయినా ఆధునిక కవితలో ఆడి చూపదగ్గ మాటలు ఉంటాయి. అవి శ్రోత మనః ఫలకంపై ఆడుతాయి. పాడకపోయినా పాటలో ఉండవలసిన లక్షణాలూ, వాద్యానికి అనువైన తాళలయ ప్రతి కవితలో తప్పనిసరిగా ఉండాలి. కవితను కన్యకతో పోలుస్తారు గాని నేను ప్రతి మంచి కవితను అందె వేసిన నర్తకి లాగా భావిస్తాను. నర్తకి చేసే పనినే ఆ కవిత చేసి రసానందాన్ని కలిగిస్తుంది. సామాజికునితో రసనిష్పత్తి అవసరమైన క్రియలను నందికేశ్వరుని అభినయదర్పణం ఇలాగ చెప్తూంది.

కంఠేనాఽఽలంబయేత్ గీతం
హస్తేనార్థం ప్రదర్శయేత్
చక్షుర్భ్యాం దర్శయేత్ భావం
పాదాభ్యాం కాలమాచరేత్ - (56)

గొంతూ, చెయ్యి, కళ్ళు, కాళ్ళూ నాలుగు అంగాలూ కలసి ఉద్దేశాన్ని వ్యక్తీకరించాలి. కాగితం మీద అచ్చువేసిన కవిత సైతం ఈ కార్యాలు చేస్తేనే అంతరార్థం అవగతమవుతుంది. రసోత్పత్తి జరుగుతుంది. అభినయ దర్పణమే ఇంకొక శ్లోకంలో రసం ఎలా పుడుతుందో చెప్తోంది.

యతో హస్త స్తతో దృష్టిః
యతో దృష్ట స్తతో మనః
యతో మనః తతో భావో
యతో భావః తతో రసః

హస్తమున్న చోట దృష్టి ఉండాలి. దృష్టి ఉన్నచోట మనస్సు లగ్నమవాలి. మనస్సు ఉన్నచోట భావం, భావమున్నచోట రసం తప్పక ఉంటాయి. ప్రదర్శన కళలో ఇవి వర్తించినట్టే పాఠ్య కావ్యానికీ వర్తిస్తాయి. హస్తం అన్నది కొన్ని సంకేతాల సంపుటిని వ్యక్తం చేసే చిహ్నం. చదువుకొనే కవితలో ఈ సంకేతాలను పదచిత్రాలు తెలియచేస్తాయి. ఒకరకంగా ఇవి కవిసమయాలు. పాత కవి సమయాల స్థానంలో కొత్తవాటిని ఆధునికులు సృష్టిస్తే ఏ సంజ్ఞని దృష్టిలోకి తెచ్చుకోవాలన్నది ముఖ్యం. అప్పుడు మనస్సు దానిమీదే లగ్నమవుతుంది. భావరసాలు రెండూ ఒకదాని తర్వాత ఒకటి నిష్పన్నమై ఆనందం కలుగుతుంది. నిజమైన కవిత్వాన్ని చదువుకొన్నా, విన్నా ఇది సిద్ధిస్తుంది. భావహీనమైన

రసమూ ఉండదు. అలాగే రసహీనమైన భావమూ ఉండదు. అని నాట్యశాస్త్రం చెప్తూ రసభావాలు పరస్పర కృతాలని విశదం చేస్తోంది. (6-36)

ఆధునిక కవిత్వం నుంచి ఒక ఉదాహరణను చూపిస్తే అభినయ దర్పణంలోని ఈ నిర్దేశాల తత్త్వం బోధపడుతోంది. కృష్ణశాస్త్రిగారు 'అన్వేషణం' అనే ఒక ఖండ కావ్యం రాశారు.[9] ఇందులోని ఒక పద్యాన్ని చప్పగా వచనంలాగ చదువుకొన్నా చిత్రాలు కనబడతాయి.

సన్నని యెల్గెత్తి జాలిగా నెవరినో
　　అరయుమా! పిలుచుచున్నదియె యమున!
ప్రక్క నిర్జీవ ధావళ్యమ్ముతో నున్న
　　సికతా తలమ్ము గాంచితివె, దాని?
తుది మొదల్ లేదిదే త్రోవరుల్ త్రొక్కని
　　యీ దారినే పరువెత్తినాను!
ఈ మొండి చేతులనెత్తి యీవనతరుల్
　　శూన్య దృక్కుల దిశల్ చూచునయ్యో!
ఇచటనె యిచటనే యతడిచట నేను -
ఇచట నీ జాపూ బొదరింట నేను -
ఈ కడిమి చెట్టు క్రింద సుమ్మీ యతండు -
సరిగ కన్నుల గట్టిన సరణి దోచు

ఈ పద్యంలోని కవితానర్తకి మొదటి సన్నని గొంతుకతో జాలిగా పిలుస్తున్న యమునను కంఠంతో అనుకరిస్తున్నట్టనిపిస్తుంది. ఇసుక తిన్నెలను కళ్ళతో చూపెడుతుంది. చెట్లు మొండి చేతులెత్తాయన్నప్పుడు తన చేతులు ఎత్తినట్టే కనబడుతుంది. అవి శూన్య దృక్కులతో దిశలో చూస్తున్నావని ఖాళీ చూపులతో ఇటూ, అటూ; అటూ ఇటూ చూస్తున్నట్టు కనబడుతుంది. ఇదుగో తానక్కడ, నేనిక్కడ అని చోట్లు మార్చి మార్చి చూపెట్టడం అలా చూపిస్తూ పాతదృశ్యాలు తన కన్నులకు కట్టినట్టుందని చెప్తుంది. నాయిక కన్నులకే కాదు, పఠిత కన్నులకు కూడా కట్టినట్లు చెప్పగలగడమే అభినేయార్థ ఖండకావ్యం. ప్రదర్శన కళలలోని రహస్యాలను పుణికి పుచ్చుకొంటే రసభావాలు నిష్పన్నం అవుతాయి.

కాంక్షించినది కన్నులకు కట్టినట్టు చిత్రించగలగడం, ఊహించగలగడం అన్ని కళలకూ సర్వసామాన్య లక్షణం. ఆయా కళలన్నీ నాట్యంలోనే పుట్టాయి కాబట్టి విడిపోయినప్పటికీ ప్రతి కళలోనూ నాట్యాంశం అంతర్గతంగా ఉంటుంది. నాట్యోత్పత్తిలో అభినయం యజుర్వేదం నుండి గ్రహించినట్టు చెప్పుకొంటారు.[10] యజ్ఞ కార్యంలో

9. కృష్ణపక్షము (1975 ముద్రణలో - పుటలు 20-21)

10. ''సర్వశాస్త్రార్థ సంపన్నం సర్వశిల్ప ప్రవర్తకమ్!
నాట్యాఖ్యం పంచమం వేదం సేతిహాసం కరోమ్యహం!
జగ్రాహ పాఠ్యమృగ్వేదా త్సామభ్యోగీతమేవ చ!
యజుర్వేదా దభినయన్ రసానాథర్వణా దపి!!

అభినయం చాలా అవసరం. యజ్ఞ కార్యం అన్నది సమాజానికి కావలసిన ఉత్పత్తి క్రియ అన్న ఆదిమ ఆర్థిక మర్మాన్ని విస్మరించకూడదు. యజ్ఞంలో అత్యంత పురాగాథల గానానికీ అభినయానికీ స్థానం ఉంది. ఋగ్వేదంలోని చాలా ఋక్కులు అభినేయార్థాలైనవే. వాటిని అభినయిస్తూ పాడాలి. ఉదాహరణకు పదవమండలంలోని ఇంద్ర ఇంద్రాణి, వృషాకపుల సంవాదం, ఊర్వశీ పురూరవుల సంభాషణ ఆదిమదృశ్య కావ్యాలే. అశ్వమేధంలోని అంబా, అంబిక, అంబాలికలు ఋత్విక్కులతో కలసి పాడే పాటలూ, చేసే చేతలూ ఆదిమ దృశ్య కావ్యాల ప్రాథమిక రూపాలే. ఉత్పత్తి కార్యకలాపాలలో మంత్రచర్యా, పురాగాథ మిళితమైపోతాయి. వీటిలోంచే రసం జనిస్తుంది. అందుకే భరతుడు రసాలను అథర్వవేదం నుండి తీసుకొన్నాడన్న కారణాన్ని నొక్కి చెప్పవలసి వచ్చింది. అభినయం భావాన్ని వ్యక్తం చేస్తుంది. భావం పండితే రసం ఊరుతుంది.

అత్యంత ఆధునిక కవితలలో కూడా పరమ ప్రాచీన ఇతిహాసాల ప్రసక్తి కనపడితే రసోత్పత్తి కావలసినంత కలగడానికి ఆస్కారం ఉంది. మంత్రచర్య, పురాగాథా మిళితమైనదే ఇతిహాసం. ఈ పదానికి రెండు రకాల వ్యుత్పత్తులను చెప్తారు. కర్మఫలంతో సంబంధించి అర్థాలను ప్రత్యక్షంగా దేనిలో చూపెడతారో దాన్ని ఇతిహాసమంటారు. గణ జీవితంలోని సభ్యుల ఉమ్మడి కాయకష్టమే కర్మ. దాని ఫలం సుఖమయ జీవితం. పూర్వం ఎవరెవరు ఏయే కార్యాలు చేసి ఏయే ఫలాలను పొందగలిగారో ఇతిహాసం చెప్తుంది. సమాజ పరిణామక్రమంలో అందరూ కష్టజీవులే అయినప్పుడు తీరిక వర్గాలు ఏర్పడి అవి తేరతిండి తినే రోజులు రాకముందూ ఈ అర్థమే అన్వయించుకోడానికి ఆస్కారం ఉంటుంది. వర్గ విభజన వచ్చాక ఉన్నత వర్గాలు ఏర్పడ్డాక ఇతిహాసానికి వ్యుత్పత్తి అర్థం మారింది. హర్ష పూర్వకమైన జ్ఞాన వికాసాన్ని కలిగించే దానినే ఇతిహాసమన్నారు. హర్షం రకరకాలుగా రకరకాల వర్గాల వారికి కలుగుతుంది. తీరిక వర్గాల వారి శృంగారం వేరు, కాయకష్టం చేసేవారి శృంగారం వేరు. మండుటెండలో బండపనులు చేస్తూ కండలు కరిగించే 'కర్మజీవులు పనిచేస్తూ పాడుకొనే పాటల్లో కనపడే శృంగారం, కలిగించే ఆనందం వేరు. ఇది వెంటనే చప్పున ఇతర వర్గాల వారికి అర్థం కాకపోవచ్చు. కవికొండల వెంకటరావుగారి కవితను చూడండి.

మొగములను ముచ్చెమట లూడ్చుచు
మూపులను పెనుమోకు లీడ్చుచు
మడమలెత్తున మన్ను రేఁ చుచు,
గుండ్ల పేరూ కులుకు పాటేమో!
ఏమో!
పాలిండ్లఁ బగడపు గుండ్ల పేరేమో

ఇనుప బరువులఁ 'నిస్సి' యనుచును
వెచ్చ నన్నపు వేళఁ గనుచును
మెట్ట నడకుట్టుసుఱు గొనుచును,

కాళ్ళ కడియాల్ కలికి నుడి యేమో!
ఏమో!
కడియములసడి బిడియపడుటేమో!

సడలు నడికట్టొడియ నెట్టుచు
వీడు సిగముడి వ్రేళ్ళఁ బెనచుచు
అలసటులు వో నడుగు నాపుచు,
వలపుఁజిమ్మెడుపదముగలుపేమో!
ఏమో!
పదము కడ పొదరింటి పిలుపేమో!

ఎదుట కుఱ్ఱది యేది లేదు
మోహపడుటకు ప్రొద్దుకాదు,
మఱుఁగు వెట్టగ మఱపురాదు
కూలియన్నల కుతుకమది యేమో!
ఏమో!
బాళి తలపని పెరి మయది యేమో!

(కూలి యన్నల కుతుకము)

పరిశ్రమిస్తూ పాటలు పాడుకొనే కష్టజీవుల గేయాల్లో 'కంటెంటు' పనికి సంబంధించినదే కావాలనే రూలు ఏదీ లేదు. కానీ, ఈ పాట ఛందస్సు మాత్రం చేసే పనికి తగిన నడకా, విరుపూ, తూగు మొదలైనవాటికి లోబడినదే. ఇప్పుడు ఉదాహరించిన కవికొండల వారి గేయంలో కూలి అన్నల శరీరం, కష్టం చేస్తున్న ఊహ మాత్రం కర్మవల్ల కలగబోయే ఫలితాలను ప్రత్యక్షంగా సాక్షాత్కారించుకొంటుంది. అందుకే ఇనుప బరువుల్ని 'ఇస్సి' అని దేహం నిట్టూరుస్తున్న వెచ్చనన్నపు వేళని ఊహ తలచుకొంటుంది. వైయుక్తికంగా కాకుండా సామూహికంగా శ్రమపడుతున్నారు. చక్కని భ్రమపడుతున్నారు. పదము కలుపుతున్నారు. పదము కడ పొదరింటి పిలుపు వింటున్నారు. శ్రామిక గేయాలన్నింటిలో ఈ గుణము అంతో ఇంతో ఎంతో కొంత ఉంటుంది.

కవిత్వంలోని ఛందస్సు సమాజంలోని సహజమైన సామూహిక జీవన స్వభావాన్ని చూపెడుతుంది. ఉత్పత్తి విధానాలు మారుతున్నప్పుడు దానికి అనువుగా ఛందో భేదాలు వస్తాయి. తరగతులను బట్టి, వర్గాలను బట్టి ఛందస్సులు మారుతాయి. వివిధ వృత్తుత్తుల వాళ్ళు వాళ్ళ వాళ్ళ వృత్తుల తాళలయలను బట్టి పాడుకొంటారు. ఏ వృత్తీ చేయని వాళ్ళే ప్రజలకూ పనులకూ అనుబంధం గాని ఛందోబంధాలను రూపొందించుకొంటారు. కొన్ని కొన్ని సాంఘిక బాధ్యతలను పాటిస్తున్నంత కాలం ఏ కవీ ఛందస్సును పూర్తిగా విడిచి పెట్టడు. సమాజంలోని సాంఘిక బంధాల్లో మార్పులు వచ్చినప్పుడు ఛందస్సులో కూడా మార్పులు వస్తాయి. ఇంగ్లీషు బూర్జువా కవిత్వంలో సామాజిక సంబంధాలను పూర్తిగా తెంచుకొన్నవాళ్ళే 'ఫ్రీవెర్సు'ను ప్రోత్సహించారు. క్రిష్టఫర్ కాడ్ వెల్ దీనిని Blind Negation of Social Relations అన్నాడు. సాంఘిక సంబంధాలు తన అదుపులో లేనప్పుడు

మానవుడు అదుపులేని భాషలో భావాలను పేర్చుకొంటాడు. జీవితంలో గమనం లేని వాళ్లకి కవిత్వంలో గమనం లేకపోవచ్చు, గమ్యం వేరు, గమనం వేరు.

గమ్యాన్ని విస్మరించని గణ జీవితంలో వర్గాలు ఏర్పడి శ్రమ విభజన జరిగాక కవి ఉత్పత్తి కార్యక్రమంలో సాక్షాత్తు ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా తనవాళ్ళకి తాను పరాయివాడు కాదు. కనికట్టూ, కట్టుకథా, కళా అనే త్రికంలో చివరిదైన కళ పూర్తిగా ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొని ఎత్తులకు ఎదిగి 'దిగిరాను దిగిరాను' అన్నట్లు కనబడుతుంది. కాని ఇది పూర్తిగా వాస్తవం కాదు. శ్రమ నుండి వేరు పడినా కమనీయమైన భ్రమ నుండి ఆదిలో దూరం కాలేదు. కాయకష్టం చెయ్యడం న్యూనత అనుకొన్న భావం ఏర్పడ్డాకనే, ఉన్నతవర్గాలు వచ్చాకనే, వాళ్ళకి ఓపినంత తీరిక లభించాకనే కళ వేరింటి కాపురం పెట్టుకొంది. జనకళ శ్రీమంతుల రంజన కళగా మారింది. ఇతిహాసం ప్రబంధంగా మారి అవగాహనకు ప్రతిబంధమైంది. అయతే తీరిక వల్ల శిల్పంలో నైపుణ్యం పరిపక్వత చెందే అవకాశాలు వచ్చినా అవి సమాజమంతటికీ పనికొచ్చే సందర్భాలు ఏర్పడలేదు.

శిల్ప నైపుణ్యం భావకవుల వారసత్వాలలో ప్రముఖమైంది. తెలుగువాళ్ళ సామాజిక జీవితంలో ఉమ్మడి కుటుంబాలూ, మేనరికాలూ, కులకట్టుబాట్లూ, వర్గ సంబంధాలూ, ఆచార వ్యవహారాలూ రమారమి పూర్వ పద్ధతులను అనుసరించి అమలులో ఉన్న కాలంలో భావకవులందరూ పుట్టి పెరిగినవాళ్ళు. కాంగ్రెసు పుట్టడం, జాతీయ భావం మొలకెత్తడం; పెళ్ళాన్ని కూడా ప్రేమించవచ్చనే మంచి భావాలు కలగడం, వందేమాతరం ఉద్యమం కొత్తచూపును ఇవ్వడం, స్వరాజ్యం నా జన్మహక్కనే నినాదం మార్మోగడం, బ్రహ్మసమాజం ఒకరకమైన ధార్మిక సమానత్వాన్ని ప్రతిపాదించడం, విగ్రహారాధన పట్ల వైముఖ్యం మొదలైనవన్నీ భావకవులతో పాటు పెరుగుతూ వస్తున్నవే. కొత్త కవిత్వాన్ని చెప్పాలనుకొంటున్న ఈ యువకులు పాత అనుబంధాలను పూర్తిగా తెంచుకోనూ లేదు, వాటికి కట్టుబడి ఉండాలనే దృఢ సంకల్పం పెంచుకోనూ లేదు. అందుకే ఛందస్సును పూర్తిగా విసర్జించలేదు.

భావకవులందరికన్నా చాలా ముందుగా గురజాడ అప్పారావుగారు పద్యాన్ని గద్దె దింపి పాటకు పీటవెయ్యకపోతే ప్రజల దగ్గరకు కవిత్వాన్ని తిరిగి తీసుకువెళ్ళలేమని గుర్తించారు. అందుకే మాత్రా ఛందస్సులను ఆశ్రయించారు. భావకవులు గురజాడ విప్లవాన్ని అందుకోకపోయినా ఆయన గొప్పతనాన్ని కొద్దిగానో గొప్పగానో గుర్తించినవాళ్ళే. ఆయన తెచ్చిన ముత్యాలసరాలను తామూ గుచ్చినవాళ్ళే. అప్పుడప్పుడూ వృత్తాలను అభిమానించినా మొత్తంమీద జాతి, ఉపజాతి ఛందాలలోనే పాటకు దగ్గరగా కవితలు చెప్పారు. పాటలో పల్లవి, వంత, ఊత పదాల దొంతర ముఖ్యమైనవి. ఈ సంగతిని భావకవులు బాగా తెలుసుకొన్నవాళ్లే. అందుకే కొన్ని భావాలు పల్లవిలాగ పునరావృతం చేశారు. కొన్ని కొన్ని పద్యపాదాలను మళ్ళా మళ్ళా చెప్పసాగారు. ఉదాహరణకు నాయని సుబ్బారావుగారు 'మాతృగీతాల'లో ఒక చోట ఈ టెక్నిక్‌ను వాడుకొని మళ్ళా మళ్ళా కలిగే విచార భావాన్నీ, వదలని సందేహాన్ని మళ్ళా మళ్ళా అదే మాటల్లో చెప్పారు. ఉదాహరణ చూడండి.

అచట నీవేమి చేయుదు వచట యెచట
నేనటకు వత్తు నీవును నేను మరల
తల్లి బిడ్డాటలాడుకొొందమమృతాభి
షిక్త పదములనే చీకు చింత లేక

నేనలుగు చుందు నన్నమ్మ నీవు కలిపి
తెచ్చి నా నోటిలో కూరి తినకయున్న
నెత్తిపై మొట్టి తినిపింతు నిలువ కుబుకు
చీర చెఱగున నాదు కన్నీరు తుడిచి

అచట నీవేమి చేయుదువచట యెచట
నాకు చెప్పవటే తల్లి! నాకు గడుప
రానిదైనది యీ నీవు లేని బ్రదుకు
నేను నీ పూజ కడ్డమ్మ రాను చెప్పు

ఇవి మూడూ గీత పద్యాలే. వీటిలో తొలిదాంట్లోనూ, మూడోదాంట్లోనూ 'అచట నీవేమి చేయుదువచట యెచట' అనే పాదం పునరావృతమైంది. ఇది పల్లవిప్రాయం. అమ్మపోయింది. ఎక్కడకెళ్ళిందో తెలియదు. పోయిన తల్లికి తప్పకుండా తెలిసి ఉండాలి. ఆ చిరునామా తెలుసుకోడం వియోగభారాన్ని మోయలేని బిడ్డకు ముఖ్యం. తెలిస్తే అక్కడకు వెళ్ళి బరువు దింపుకోవాలన్న కాంక్ష ప్రబలంగా ఉంది. అందుకే ఆ భావానికి పల్లవితనాన్ని ఆపాదించడం జరిగింది.

కృష్ణశాస్త్రిగారు 'తేటి వలపు' అనే ఖండకావ్యంలో ఏడు చంపకమాలలు రచించారు. అన్నింటిలోనూ చివరి పాదం ఒకటే. ''కోమల జల జాత పత్రముల మాటున నేటికి దాగినాడవో'' అన్న ప్రశ్న ఏడుసార్లు పల్లవిలాగ మాటి మాటికి వేయడం కనపడుతుంది. ఇది శతకంలోని మకుటంలాంటిది కాదు. పాటలోని పల్లవే. శతకంలోని మకుటం. సర్వసామాన్యంగా సంబుద్ధితోనే ఉంటుంది. పల్లవికి ఆ పట్టింపు లేదు. స్వేచ్ఛాగానం రెండో ఖండికలో కూడా కృష్ణశాస్త్రిగారు 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అనే పాదాన్ని 39 ద్విపద పాదాలలో ఎనిమిదిసార్లు పల్లవిలాగ మళ్ళా మళ్ళా గానం చేశారు. 'మాయమయ్యేదను' అనే భావాన్ని రెండుసార్లు ఒకమారు ఆదిలో, రెండోమారు చివరా చెప్పారు. ఈ మాటే పాటకు ప్రాణం. దీని సంగతి తర్వాత చర్చించుకుందాం. ప్రస్తుతానికి భావకవిత్వం శిల్పనైపుణ్యంతో పాటకు దగ్గరకు వెళ్ళడం గమనించదగ్గ విషయం. ఇది పంజరంలో విహారం, బోనులో షికారులాంటి చిన్న స్వేచ్ఛా ప్రకటన. పూర్తిగా పాటల బాటను పట్టినవాళ్ళు బసవరాజు అప్పారావూ, నండూరి సుబ్బారావులే. కిన్నెరసానిని వెళ్ళి చూసినప్పుడు, కోయిలమ్మకు పెళ్ళి చేసినప్పుడు విశ్వనాథ విరివిగా పాటల బాట తొక్కారు.

బసవరాజు అప్పారావుకు పాట ప్రాశస్త్యమే కాక భాషా ప్రయోజనం కూడా బాగా తెలుసు. అందుకే నండూరి సుబ్బారావు గ్రామీణుల పామర భాషలో పాటలు

రాస్తున్నప్పుడు 'నీవు నిత్యం వాడే భాష కాదిది. ఈ భాష సాయంతో సత్యాన్వేషణ చేయలేవని' బసవరాజు నిర్మొహమాటంగా మొదట్లో చెప్పాడు.[11] నిత్యం వాడుకొనే భాషలో తప్ప సత్యాన్వేషణ సాధ్యం కాదు. కళ శాస్త్రం కాదు గాని, శాస్త్రం అన్వేషిస్తున్నా సత్యాన్ని కళ అప్రయత్నంగా సునాయాసంగా దొరకబుచ్చుకోగలదు. శాస్త్రానికి తర్కం ముఖ్యం. వ్యాకరణవేత్త తండ్రిలాంటివాడనీ, తార్కికుడు సోదరునిలాంటి వాడనీ వాళ్ళిద్దరకూ కళ - ముఖ్యంగా కవితా కళ - దూరంగా ఉంటుందంటారు. కొత్త భావాలను అర్థం చేసుకొనడానికి పాత కొలమానాలు పనికి రావు.

ఛందస్సు విషయంలో కొన్ని సడలింపులకు భావకవులు సుముఖులు కావడం కొత్తపట్ల వారికున్న ఆకర్షణే. కొత్తపట్ల మొగ్గు, పాతపట్ల మొగ్గు తగ్గుముఖం ప్రస్ఫుటంగా ఉన్నా, కొత్తపాతల మేలు కలయిక పరిపూర్ణంగా భావ కవిత్వంలో ప్రతిఫలించక పోవడానికి కారణం వారి వర్గ స్వభావాలే. కుటుంబ నియమాలు, అనుబంధాలు, ఆప్యాయతా కొందరిలో కొన్ని పరిమితులను విధిస్తాయి. ఈ లక్ష్మణ రేఖలను సర్వసామాన్యంగా ఎవరూ అతిక్రమించరు. భావకవులలో చాలామంది మధ్యతరగతివారే. చదువూ సంస్కారం ఉన్నవాళ్ళే. పూర్వ సాహిత్యాలతో పరిచయమున్నవాళ్ళే. సంఘ సంస్కారం పట్ల ఉత్సాహమున్నా అయినవాళ్ళ హృదయాలు గాయపరచేటంత తిరుగుబాటు చేయడానికి ఇష్టపడని వాళ్ళు. జమీందారీ సంస్కృతికి పూర్తిగా బద్ధులయినవాళ్ళు.

గురజాడ అప్పారావుగారు ఫ్యూడల్ కొలువులో ఉంటూనే రాజభక్తికన్నా దేశభక్తి దొడ్డదని భావించి దేశమును ప్రేమించమన్నారు. అయితే ఆయన 'ఆంగ్లేయుల ధర్మరాజ్యము సతతము వర్ధిల్లుగావుత' అని ఇంకో నెల్లాళ్ళలో చనిపోతారనగా దీవించారు. (1915 అక్టోబరు 30లో ప్రచురణ 1915 నవంబరు 30 మరణం) దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు 'జగమునిండ స్వేచ్ఛాగాన ఝురుల నింతు' అని ఒకటికి ఇంకో నాలుగుసార్లు చాటిన తమ 'కృష్ణపక్షం' తొలిపాటల పూలమాలను 'శ్రీశ్రీశ్రీ మహారాజా రావు వెంకటకుమార మహీపతి సూర్యరావు బహద్దరు వారికి' సమర్పిస్తూ 'పిక కుమారక నన్ను పాడు కొననిమ్ము' అని అభ్యనుజ్ఞ వేడుకొన్నారు. నండూరి సుబ్బారావుగారు ఎంకి పాటల ప్రథమ ముద్రణ పీఠికలో తమ స్వామి భక్తిని వెల్లడించారు. 'ప్రభువులలో మా ప్రభువులును, కవులూ అయిన శ్రీశ్రీశ్రీ రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దరుగారు యీ పాటలు విని ఆనందించేవారు. ఆ మహారాజు నాకెన్నో విధాల మేలు చేసినారు. వారి వంశమాచంద్రార్కముగా నిలుచుగాతయని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను. పాటలో సగంపైగా నూజివీటిలో శ్రీవారి సన్నిధినే వ్రాశాను' అని నండూరి వారు చెప్పుకొన్నారు.

రాజాశ్రయం బెడద నుండి కవిత్వం విడుదల పొందని రోజులవి. నానారాజ సందర్శనం చేస్తూ అవధాన కవిత్వాలు చెప్తూ అడిగిన అడ్డమైన విషయాలపైన అడిగిన ఛందస్సులో ఆశువుగా పద్యాలు అల్లుతూ తిరిగే రోజులు పోయినా భావకవులలో

11. ఎంకి పాటల గాలి దుమారం - బసవరాజు అప్పారావుగారు వ్యాసం - సారస్వత వ్యాసములు - ప్రథమ సంపుటం, పుట.418 నుండి

ఎక్కువమందికి తిరుపతి కవులంటే భక్తి. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారికి కొందరు ప్రత్యక్ష శిష్యులు. ఎందరో ఏకలవ్య శిష్యులు. తొలి రోజులలో భావకవులలో చాలామంది అవధానాలు చేస్తూ వేగాతి వేగోక్తుల ఆశుకవితలు చెప్పినవారే. ఇది దుర్వ్యసనమనీ ఇందులో రసమూ, భావమూ, జీవదర్థసుకుమార వ్యంజనా మంజ శబ్ద సమాస రచన మొదలైనవి ఉండవనీ ఆశుకవితా సన్యాసం పుచ్చుకొని రమ్యాక్షర క్షోణికి మళ్ళినవారే. అయితే ప్యూడలు వ్యవస్థ పొలిమేరలను దాటలేదు. దాటలేకపోయారు. ఆనాటి చారిత్రక పరిస్థితులు అటువంటివి.

జలియన్ వాలాబాగ్‌లో ఊచకోత జరిగిన 1919లోనే తెలుగు జిల్లాలలో సాహితీ సమితి ఏర్పడింది. అప్పుడప్పుడే పైలాపచ్చీసులోనికి వచ్చిన యువకులు ఇప్పుడిప్పుడే మైనారిటీ వెళ్ళిన కవికుమారులూ మూతి మీద నూనూగు పద్యాలు మొలుస్తున్న నూత్న యౌవనులూ ఒక సంఘంగా ఏర్పడదలచుకొన్నారు. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు వీరందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చారు. పిఠాపురంలోని దేవులపల్లి కృష్ణశాస్త్రి; నూజివీడులోని నండూరి సుబ్బారావు; తెనాలిలో వఝ్ఝ బాబూరావు, వీరరాఘవస్వామి గుంటూరులో నోరి నరసింహశాస్త్రి; బెజవాడలో కొడాలి ఆంజనేయులు; బందరులో విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు మొదలైనవారిని కలుపుకొని సాహితీ సమితిని స్థాపించారు. వ్యవస్థాపక సభ్యులు కాకపోయినా అబ్బూరి రామకృష్ణారావు, నాయని సుబ్బారావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి మొదలైన మంచి కవులు సాహితీ సమితి కోవలోని వారే. ఒక్క ఈడువారు కావడం వల్ల సాహితీ సమితి బృందమంతా ఒక సంస్కృతికి వారసులు. తెలుగు జాతి సంప్రదాయాలు వీరిని, వీరి భావాలను తీర్చిదిద్దాయి. ఇంగ్లీషు చదువులు, ఆంగ్లకవుల ధోరణులు వీరిని మార్చసాగాయి. ఈ రెండుమార్గాల సాజాత్య వైజాత్యాలు వీరిలో సంఘర్షణకు భావ సమన్వయతకు దారితీశాయి.

తెలుగువారిలో మేనరికం వాంఛించదగ్గ సంబంధం. పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళే. అందులోనూ పిల్ల పెద్దమనిషి కాక ముందూ వేయవలసిన మూడు ముళ్ళే కాంక్షణీయాలు. వావి వరసలు తప్పితే రౌరవాది నరకాలే. అందుకే భావకవుల తొలి కావ్యాలలో మేనరికాలు, ఊహించుకొన్న వావి వరుసలు మొదలైనవి చోటు చేసుకొన్నాయి. వెంకట పార్వతీశ కవుల 'జలజమాలిక' అనే కథాకావ్యంలో మేనరికం తప్పడం, కథానాయిక పెళ్లి కాకముందే పెద్దమనిషి కావడం వల్ల కుటుంబం వెలికి లోనుకావడం, బావతో పెళ్ళి కానందుకు కథానాయిక ఆత్మహత్య చేసుకొనడం కథాసంగ్రహంలో ఉంది. రాయప్రోలు వారి 'కష్ట కమల' కావ్యంలో పుట్టుకవల్ల ఏ వావి వరసలు లేకపోయినా, నాయికా నాయకులలో ఒకరు సోదర భావాన్నీ, ఇంకొకరు ప్రేయసీ భావాన్ని పొందడం వల్ల నాయిక చచ్చిపోదామనుకొంటుంది. చచ్చిపోతుంది. నాయని సుబ్బారావుగారి నిజజీవితంలోనూ, సౌభద్రుని ప్రణయయాత్ర లోనూ మేనరికమే కావ్య బీజం. 'ఫలశ్రుతి'లో మనము మేనత్త మేనమామల బలమ్ము' అని నాయికా నాయకులు చెపుకొంటాగు

ప్రేమలేఖలూ, స్వప్న ప్రణయలూ, ఊహా సుందరులూ భావ కవిత్వంలో విరివిగా కనబడతాయి. చదువుకున్న తరంవారు కాబట్టి నిజ జీవితంలోనూ కావ్యాలలోనూ భావకవులు ప్రేమలేఖలు రాసినవారే. అబ్బూరి రామకృష్ణాగారి 'మల్లికాంబ'లో ప్రేమలేఖలు నాయిక ఆత్మహత్యకు కారణమవుతాయి. నాయకుడు నిజం తెలుసుకొని పశ్చాత్తాప్తుడై ఒక లేఖ రాసి దేశాలు పట్టి పోతాడు. వెంకట పార్వతీశ కవుల 'జలజమాలిక'లో నాయిక చనిపోయే ముందు ఒక రేఖ రాసి తన ప్రియుని కందించమని పట్నమేలే రాజుకు పంపిస్తుంది. నాయని సుబ్బారావుగారు నిజజీవితంలో మేనరికం కావలసిన మరదలు దూరమవుతుందేమో అన్నరోజుల్లో ప్రేమలేఖలు రాశారు. అవి పడకూడని చేతుల్లో పడ్డాయి. ఈ సంగతి తెలిశాక ఆయన 'అసురకృత్యం' రాశారు.

ఎవ్వడే నీ గళమ్మునం దిరవుకొనగ
నేను విసరిన ప్రేమ ప్రసూన మాల
నడుమ నీవు చూడగ బట్టి నలిపివైచి
నీ కనుల యందు నెత్తురుల్ నింపినాడు?

నిజజీవితంలో రాసిన ప్రేమలేఖ కవిత్వంలో ప్రేమ ప్రసూనమాల అయింది. నాయికా నాయకులు చేరువలో లేరు. అందుచేత దండను దూరం నుంచి విసరవలసి వచ్చింది. అసుర కృత్యం చేసినా వాడు దాన్ని నలిపి వేయడమే కాక చివరకి నాయకుడు ముగ్ధ హృదయాన్ని 'ఎడతెగని సంశయముల బంధించినాడు' వాస్తవిక జగత్తులోని మనుష్యులూ, వస్తువులూ కలలో రూపాంతరం చెందినట్లు కళలో కూడా చెందుతాయి.

కళ ఆవిర్భవించడానికి గల అంచెలుగా కనికట్టు (మ్యాజిక్కు), కట్టుకథ (మిత్తు) అనే వాటిని ఇంతకుముందు గుర్తించాము. పురాగాథలనేవి అన్ని దేశాల జానపద గేయగాథలలో ఉంటాయి. ఈ కథలను కట్టడంలో జానపదుని మనస్సు ఆలోచించే తీరునుబట్టి ఈ కథల నమూనాలను (Motifs) ఒక నిర్ణీత సంఖ్యకు కుదించవచ్చని డాక్టరు కృష్ణకుమారిగారు తమ 'తెలుగు జానపద గేయగాథలు' అనే పుస్తకంలో బేరీజు వేశారు. (పుట.263) అవి -

1. వాంఛిత కార్యసిద్ధికై కంకణము కట్టుకొని యెన్ని యొడుదుడుకులనేని సహించి నాయకుడు చివరకు విజయం నందుట.

2. నాయకుడు తానన్నమాట నిలుపుకొనుటకై పరీక్షల కాగి కష్టములకోర్చి చివరకు బుధజన ప్రశంసాపాత్రుడగుట.

3. నాయకుడు ప్రతినాయకునిపై స్పర్ధ వహించి పగ తీర్చుకొనుటయే పరమ లక్ష్యంగా భావించి పలు కష్టములకు లోనై చివరకు విజయం పొందుట.

4. అవివాహితుడగు నాయకుడు తాను ప్రేమించిన పడుచును పొందుటకై బహుశ్రమలకోర్చి ప్రతిఘటిత శక్తులను లొంగదీసుకొని వాంఛిత ఫలమును పొందుట.

వీరరస ప్రధానములైన యే జానపద గాథలోని కథాకథన పద్ధతిని పరిశీలించినా ఇప్పుడు చెప్పిన నాలుగు విభాగాలలో ఏదో ఒకదానికి చెందక తప్పదని డాక్టరు కృష్ణకుమారిగారే కాక శాస్త్రజ్ఞులందరూ చెప్పారు. అన్నిదేశాలలోనూ ఆధునిక కవిత్వాలు ఇతిహాసాలలోంచే వచ్చాయి. అందుచేత ప్రతి మంచి కవితలోనూ ఈ నాలుగు అంశాలలో ఏదో ఒకటి ఉంటుందని చెప్పక తప్పదు. 'హ్యూమన్ ఎసెన్స్' అనే గ్రంథంలో జార్జి థాంప్సన్ ఈ కనికట్టు, కట్టుకథ కళలనే అంచెలను మంచి కవితలలో చూపెట్టడానికి ఒక శాఫోగీతాన్ని, ఒక కీట్సు సానెట్‌ని, ఒక మావో-సె-టుంగ్ పద్యాన్నీ తీసుకుని విశ్లేషించి చెప్పాడు.[12] మన ప్రముఖ భావకవుల గీతాలలో ఏ మంచి రచననైనా తీసుకొని ఇటువంటి విశ్లేషణ చేయడానికి అవకాశాలు చాలా వున్నాయి. ముందు శాఫోగీతంలోని అంశాలను థాంప్సన్ విశ్లేషించిన తీరు చూస్తే అది అన్ని కవితలకూ ఎలా అన్వయించుకోవాలో తెలుస్తుంది.

తాను ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను నిరాకరించింది కాబట్టి 'అఫ్రోడయట్' అనే కామ దేవతను శాఫో ఆరాధించి ఆవాహన చేసి దివి నుండి దిగి వచ్చి తన కోర్కెలు తీర్చమనడం కవితలోని ప్రధానాంశం. పురాగాథలలో దేవత ఏయే సందర్భాలలో దిగివచ్చి ఎలా బ్రోచినది జ్ఞాపకం చేస్తుంది. ఇది మంత్రచర్య. మన త్యాగరాజు కీర్తనలలో ఇటువంటివి కోకొల్లలుగా కనబడతాయి. ''ఖగరాజు నీ యానతి విని వేగ చనలేదో, గగనానికి ఇలకూ బహుదూరం బనినాడో? నగుమోము కనలేని నాజాలి దలచి'' రమ్మనడం దేవుడు దిగిరాక తప్పకపోవడం సర్వసామాన్యమే. ''బ్రోచేవారెవరురా? నిను వినా రఘువరా! వాసితముగ కరిరాజున బ్రోచిన వాసుదేవుడవు నీవు కదా''[13] వంటివి ఉదాహరణలు. వీటికన్నా పురాణాలను కలగలిపి కూడా వాడుకొనడం త్యాగరాజస్వామి దేవగాంధారి కీర్తనలో కనబడుతుంది. చూడండి.

క్షీరసాగరశయన నన్ను – చింతలఁ బెట్టవలెనా రామ ॥క్షీర॥
వారణ రాజును బ్రోవను వేగమె –
వచ్చినది విన్నానురా రామ ॥క్షీర॥

నారీమణికిఁ జీరలిచ్చినది నాఁడ నే విన్నానురా
ధీరుఁడౌ రామదాసుని బంధము – దీర్చినది విన్నానురా
నీరజాక్షికై నీరధి దాటిన – నీ కీర్తిని విన్నానురా
తారక నామ త్యాగరాజనుత –
దయతో నేలుకోరా రామా ॥క్షీర॥

ఇందులో గజేంద్ర మోక్షం, ద్రౌపదీ మాన సంరక్షణం, సేతుబంధనం మధ్య రామదాసు బందిఖానా గాథను భక్తుడు మొరలో చెప్పుకొన్నాడు. ఇటువంటి కవితలలో మంత్రచర్య, పురాగాథ, కళా ఎలా పరివర్తన చెందుతాయో ఊహించుకొంటే భావ కవితలలో కొంచెం సంక్లిష్టంగా ఇది ఎలా అన్వయించుకోవాలో ఊహించవచ్చు.

---

12. Geroge Thomson - The Human Essence Pp.70, 71, 72
13. మైసూరు వాసుదేవాచార్యుల కీర్తన.

భక్తులు దేవుణ్ణి దిగివచ్చి తమ కష్టాలను తీర్చమంటారు. వీరగాథలలో నాయకుడు ప్రతి నాయకునిపై జయించడానికి పలు కష్టాలకు ఓర్చి నిబ్బరించుకొని గెలుస్తాడు. ఖండ కావ్యంలో కవికూడా చేసేది అదే. ప్రతికూల పరిస్థితులే ప్రతి నాయకుని స్థానంలో ఉంటాయి. వాటిని అధిగమించి వాంఛితార్థాన్ని పొందడం కలలోనూ, కళలోనూ, కవితలోనూ జరుగుతుంది. వాస్తవిక జగత్తులోని విషయాలు రూపాంతరం చెందినట్టు కళలో కొన్ని కొన్ని సందర్భాలు పురాగాథలలోని సన్నివేశాలుగా మారితే మారవచ్చు. అటువంటి మార్పు కవి ఊహాశక్తికి నిదర్శనం. విశ్లేషణకు విశ్వనాథ సత్యనారాయణగారి 'గిరి కుమారుని ప్రేమగీతాల'లో ఒక ఖండికను తీసుకొందాం.

ఈ మహాప్రణయ పయోరాశి మధించి నాను
ఆశ కవ్వపుగిరి మనస్సహిపతిగను
తరచి తరచి జలమ్మెల్ల తరిగిపోయె
తరచి తరచి భుజమ్ములు విరిగిపోయె

ఆ పయోరాశిలో త్రిలోకాతి భీక
రముగ విషవహ్ని హాలాహలము సముద్భ
వించె నది యోర్పు గలిగి దేవీ! గళమ్ము
నందు నిలిపితి నేను జ్ఞానాకృతి నయి

అది గళమ్మున నిలిపిన యపుడె నీవు
నేను నొకటై తిమే పురంధ్రీ శశికళ
సాంద్ర శిశిర ముగ్ధ సుధారస స్రవంతి
మన శిరస్సుల తాండవించెనె లతాంగి.

మూడే మూడు పద్యాలున్న ఈ ఖండికలో కవి మొదట కష్టాల మధ్య ప్రణయ సముద్ర మధనం ప్రారంభించసాగాడు. అలనాటి క్షీరసాగర మధనంలో మందరగిరి వాసుకి గుర్తుకు వచ్చారు. తన ఆశ తరిగొండ. మనస్సు కవ్వపుతాడు. చిలగ్గా చిలగ్గా తరిగిపోయింది. బలమూ తరిగిపోయింది. ఆనాడు పుట్టినట్లే ఈనాడూ హాలాహలం పుట్టింది. దాన్ని కవి ఎంతో ఓర్పుతో మింగి అంగుట్లో పెట్టుకొన్నాడు. ఇది ఎలా సాధ్యమైంది? తాను జ్ఞానాకృతి అయ్యాడు కనుక. మనిషి మూర్తీభవించిన జ్ఞానమైతే ఇంక బాధలెక్కడ? ఏ దేవికోసం తాను మధనపడుతున్నాడో ఆమె తనతో ఒకటైంది. తమ శిరస్సులపై అమృతరసం తాండవించింది. సాగర మధనం, హాలాహల జననం అమృత ప్రాప్తి అనే పురాగాథలు ముమ్మూర్తులా ఈ కవితా మంత్రచర్యలో రూపాంతరం చెందాయి. వియోగంలో ప్రారంభమైన ఖండిక మానసిక సంయోగంలో వాంఛితార్థ సిద్ధిని పొందుతోంది. నాయకుడు ప్రతికూల శక్తుల ప్రతి నాయకుణ్ణి నిర్జించాడు.

ఈ ఉదాహరణలో పురాగాథ రూపాంతరం చెంది వాంఛిత మీడేరి భావనా బలంతో సుఖాంతమయింది. ఇదే పురాగాథను తీసుకొని తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు ఒక ఖండికను సరిగ్గా అదేకాలంలో రాశారు. చూడండి...

ప్రేయసీ, యేలవింటి నీపేరు నేను
ఆలకించిన దాది నామాక్షరముల
నేమి వింతయొ కాని మదీయ హృదయ
దుగ్ధ వార్ధిని మథన ముద్భుత మయ్యె,

అధికమైన కొలందిని మథన మకట
ఉద్గమించెను కాలకూటోగ్ర విషము
ప్రేయసీ, నిల్పితిని దాని బిగియ బట్టి
కంఠ కుహరమ్మునందు శంకరునిభాతి!

ఉత్సుకతతో నిరీక్షించు చున్నవాడ
భవ్య లక్ష్మీ సమాగమ ప్రాప్తి కొరకు
పూర్ణ నిరతావ్యయ సుధాను భూతి కొరకు,
ఎన్నటికి నాకు లభియించునివి యెరుంగ!

ఇందులో కూడా మూడు పద్యాలున్నాయి. ప్రేయసి పేరు వినడం, హృదయంలో మథనం మొదటి పద్యంలో ఉన్నాయి. హాలాహలం పుట్టడం, అంగిట పట్టడం రెండో పద్యంలో ఉన్నాయి. అమృతసిద్ధి కోసం ఎదురుచూస్తూ ఎప్పుడా, ఎప్పుడా అని తెలియకపోవడం మూడో పద్యంలో ఉన్నాయి. కవిత కథాకథనం చేస్తున్నప్పుడు వాంఛితార్థ సిద్ధిని సూచించడం జానపద కళలలోని మంచి లక్షణం. క్లుప్తిలో తృప్తి ఒకరకమైన సంపూర్తిని సూచిస్తుంది. నాయకునికి ఇష్ట సిద్ధి కలుగకపోతే పఠితకు కూడా కలుగదు. కథ సుఖాంతమవుతుందన్న సూచన సాధారణ పాఠకుడు అభిలషిస్తాడు.

కొన్ని కొన్ని కవితలలో మంత్ర చర్య లేనట్టనిపించవచ్చు. పురాగాథలు స్పష్టంగా ఉండకపోవచ్చు. అయితే వాటి ప్రత్యామ్నాయాలు మాత్రం ప్రచ్ఛన్నంగా ఉండి తీరుతాయి. లేకపోతే అవి కళారూపాన్ని సంతరించుకోలేవు. ఉదాహరణకు కృష్ణశాస్త్రిగారి ఖండిక నొకదానిని తీసుకొందాం. ఇది చాలా ప్రసిద్ధమైనదే. భావకవిత్వానికి ప్రాతినిధ్యం వహించేదే.

నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు?
నాయిచ్ఛయేగాక నాకేటి వెరపు?
కలవిహంగమ పక్షముల దేలియాడి
తారకా మణులలో తారనై మెరసి
మాయ మయ్యెదను నా మధుర గానమున
నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు?

కవిని చూసి లోకం నవ్వుతోంది. నాకు సిగ్గెందుకు అని అడుగుతున్నాడు. నవ్వుతున్న లోకం నుంచి వెళ్ళిపోతానంటాడు. పక్షిరెక్కల మీద తేలుతూ, చుక్కల్లో చుక్కనవుతుంటాడు. మధుర గానంలో మాయమవుతానంటున్నాడు.

మొయిలు దోనెలలోన పయనం బొనర్చి
మిన్నెల్ల విహరించి మెరుపునై మెరసి
పాడుచు చిన్కునై పడిపోదు నిలకు
నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు?

ఎగరేసిన దేదైనా నేలకు రాలుతుందన్న జ్ఞానం కవికి లేకపోలేదు. మబ్బుల పడవల్లో నింగినిండా విహరించి, మెరుపై వానచినుకుగా మారి నేలమీద పడిపోతాను. మీరు నవ్వినా నాకు సిగ్గు అనవసరం అంటున్నాడు.

తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ
జతగూడి దోబూచి సరసాల నాడి
దిగిరాను దిగిరాను దివినుండి భువికి
నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు?

ఇక్కడ నేల కూలడం అనే కర్మని మంత్రశక్తిలాంటి మనోబలంతో వారిస్తున్నాడు. 'దిగిరాను దిగిరాను' అంటున్నాడు. అయితే అది సాధ్యమయ్యే పనికాదని తెలుసు. అందుకే కిందపడ్డా భూమిమీద కాక నీటిలో పడతానని నిశ్చయించుకొన్నాడు.

శీకరంబుల తోడ చిరుమీల తోడ
నవమౌక్తికములతో నాట్యమ్ము లాడి
జలధి గర్భమ్ములోపల మున్గిపోదు
నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు?

లేత గాలితో కలసి చెట్ల కొమ్మల్లో దూరి ఆకుల్లో చేరి ప్రణయ రహస్యాలు పలుకుతానంటాడు. పూవు పూవునకు పోతానంటాడు.

పక్షినయ్యెద చిన్ని ఋక్ష మయ్యెదను
మధుప మయ్యెద చందమామ నయ్యెదను
మేఘమయ్యెద వింత మెరపు నయ్యెదను
అలరు నయ్యెద చిగురాకు నయ్యెదను

పాటనయ్యెద కొండవాగు నయ్యెదను
పవన మయ్యెద వార్ధిభంగ మయ్యెదను
ఏలొకో యెప్పుడో యెటులనో గాని
మాయ మయ్యెద నేను మారిపోయెదను.

తొలిపాదాలలో చందమామతో జతకూడుతానన్న వాడు ఇప్పుడు తానే చందమామ నవుతానంటున్నాడు. తొలిపాదాలలో జలధి గర్భంలో మునిగిపోతానన్న వాడు ఇప్పుడు వార్ధి భంగాన్ని అవుతానంటున్నాడు. ముందు పవనుడితో పరుగెత్తుతా నన్నవాడు ఇప్పుడు తానే పవనున్నవుతానంటున్నాడు. చివరకు మారిపోయి

మాయమవుతానంటున్నాడు. తొలిపాదాలలో మధుర గానంలో మాయమవుతానన్నాడు గాని ఇప్పుడు మాయమై మారిపోతానన్నాడు. మారిపోతే గుర్తుపట్టలేరు. పలాయనం పూర్తవుతుంది. సిగ్గుపడవలసిన అవసరం గాని, భయపడవలసిన సందర్భంగాని చిట్టచివరకు రాదు. నవ్వుకోండి, నవ్వుకోండి అంటాడు. పాఠకుడు కవిని నమ్ముతాడు.

ఈ ఖండికలో 'యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే' అన్నది నిజమవుతుంది. కవికి విశ్వమెట్లా ఇష్టమైతే అట్లా పరివర్తన పొందుతుంది. లోకాన్ని మార్చడం కన్నా తనే రకరకాలుగా మారిపోతానంటున్నాడు. మారిపోగల శక్తిని కవిత నుండి పొందుతున్నాడు. 'మాయమయ్యెదన'ని ఒకటికి రెండుసార్లు చెప్పడం ఈ ఖండికలోని రహస్యం. అది ముఖ్యమైన హస్తాభినయం, చూపు అక్కడ పడాలి. మనస్సు అక్కడ లగ్నమవుతుంది. దానితో భావమూ రసమూ కలుగుతాయి.

ఏ భాషలోనైనా కవిత చెప్పదలచుకొన్నారంటే మాటలతోనే చెప్పాలి. భావం కొత్తదైనప్పుడు భాషలో ఉన్న పదాలు దాన్ని చెప్పడానికి చాలనప్పుడు ఉన్న మాటలతోనే కొత్త పదచిత్రాలు కట్టుకోవాలి. అయినా చెప్పలేకపోతున్నామన్న బాధ కవికి కలుగుతుంది. అందుకే విశ్వనాథ సత్యనారాయణగారు ఇలా అన్నారు.

అస్మదీయ కంఠము నందాడు చుండె
నొక యెదోగీతి బయటకు నుబికి రాదు
చొచ్చుకొని లోనికిని బోదు ద్రచ్చిపోయె
నాహృదయమీ మహా ప్రయత్నమందు.

వివిధ విఫలయత్నాలలోనే హృదంతరంలో నవజపాశోణ సంధ్య తోచిందని కవి రెండో పద్యంలో చెప్తాడు. మూడో పద్యంలో వాంఛా సిద్ధి ఇలా చెప్తాడు.

ఈ మహాసంధ్యలో శారదా మయూరి
రమ్య కింకిణి కిణి రభస పాద
మంజుల విలాస నృత్య సామ్రాజ్య లక్ష్మి
యగుచు కచ్ఛపీ మృదు గీతులనుసరించు.

ఈ రెండు పద్యాలకు నడుమనున్న పద్యంలో తెలుగులో చెప్పలేని భావాన్ని కవి రమారమి మూడు పాదాల సంస్కృత పదాల సమాసం కట్టి తెలియచేస్తేనే గాని చెప్పదలచుకొన్నది చెప్పినట్టు అనిపించలేదు. చూడండి ఆ పద్యం -

విఫలిత పునః పునః కృత వివిధయత్న
భావిత ప్రచండ బాధా కథా విధారి
తాస్మదీయ హృదయంతరం బందు దోచె
స్ఫురిత సంపుల్ల నవజ పాశోణ సంధ్య

ఇటువంటి పద్యాలను చదువుకొన్నప్పుడు కృష్ణశాస్త్రిగారు చెప్పినట్టు 'ఎదియొ అపూర్వ మధుర రక్తి స్ఫురియించుగాని అర్థమ్ముగాని భావగీతమ్ములవి' అని

సరిపెట్టుకోవాలి. 'Poetry should communicate before it is understood' అన్న ఇలియట్ సూక్తి కూడా ఇదే. భావానికి తగిన భాష ఒక్కరివల్ల తయారయ్యేది కాదు. పదిమంది పదే పదే వాడిన కొత్త మాటల సమాసాల వల్ల, పదబంధాల వల్ల భావ వ్యక్తీకరణ సాధ్యమవుతుంది. భావ కవులు ప్రబంధాలలోని కావ్య భాషకి వారసులు. శ్రీనాథుడికిలాగ ప్రౌఢికి సంస్కృతం, పలుకు నుడికారానికి తెలుగు వాడడం నేర్చుకొన్నారు. అల్లసాని పెద్దన అచ్చ తెనుగు ఏ రీతిగ వాడాలో అలా వాడి ఏయే భావాలు కలిగించాలో చెప్పినట్టే 'సంస్కృతంబు పచరించిన పట్టున' ఎంత ఆరభటీ వృత్తిని కలిగించాలో చెప్పాడు. కొందరు భావకవులు పద్యవిద్యలో నిష్ణాతులు.

వేదుల సత్యనారాయణశాస్త్రిగారి 'దీపావళి' కావ్యం తొలికూర్పు మనవిలో కవి గారి కవిత్వంమీద తమకు గౌరవముందని చెప్తూ ప్రకాశకులు ఇలా అన్నారు.

''వారి భావనాశక్తి బలమైనది. వారు కవి సమయములను విడువలేదు. తెలుగు గడ్డను బుట్టిన యుత్తమ సంప్రదాయముల నుల్లంఘింపలేదు. వారి భాషకు ప్రాచీనుల పటిమయున్నది. జీవిత కల్లోలము నుండి యుబికినదగుటచే వారి కవిత్వమునకు నిండు జీవమున్నది.''

ఈ మాటలు ఒక్క వేదుల వారికే కాక భావకవుల బృందంలో ప్రతి ఒక్క మంచి కవికీ వర్తిస్తాయి. అయితే ఈ కవులు ప్రణయ కవిత్వాన్నే చెప్తారని లోకం అనుకోవడం వల్ల ప్రేమగురించి చెప్పినవి చప్పున అవగాహనకు రాలేదు. మన ప్రబంధ సాహిత్యంలో కామాన్ని వర్ణించడానికి, కాంక్షిత సుఖాలను అభివర్ణించడానికి కొల్లలుగా మాటలుంటే ఉండవచ్చు గాని నూతన ప్రేమతత్వాన్ని అందులోనూ ఆత్మాశ్రయ ప్రణయాన్ని ప్రకటించడానికి ఆనాడు తగిన భాషా సామగ్రి లేదు. అసలు ప్రేమించిన వారిని పెళ్ళి చేసుకొనడం, పెళ్ళిచేసుకొన్న దానిని ప్రేమించడం అన్న భావాలే ఫ్యూడల్ వ్యవస్థలో విడ్డూరం. ఆ వ్యవస్థలోనే ఉంటూ ప్రేమ గురించి ఆదిలో చెప్పినది గురజాడ అప్పారావుగారే.

ప్రేమ -
పెన్నిధిగాని, యింటను నేర్ప
రీకళ, ఒజ్జ లెవ్వరు లేరు.
శాస్త్రము లిందుగూరిచి తాల్చె
మౌనము - నేను నేర్చితి భాగ్య
వశమున, కవుల కృపగని.

- కాసులు - ముత్యాలసరాలు

జమీందారీ నవ్యసాహిత్య యుగంలోని కవులూ ప్రజలూ నిజంగా కవుల కృపగని ప్రేమగురించి నేర్చుకొన్నారు. అయితే ఆ కవులు ఇంగ్లీషు కవులు కావడం వల్లా, ఇతర భావములైనా రవీంద్రుడు, సరోజినీ నాయుడు మొదలైనవారు ఇంగ్లీషులో రాసినవి చదవడం వల్ల ప్రేమగురించి తెలుగులో చెప్పిన భావాలయినా మొదట

అనువాదప్రాయంగానే స్ఫురించడం, వాటిని నిత్య జీవిత భాషలోనికి అనువదించుకొనే అవకాశం లేకపోవడం జరిగింది. అందుకే బసవరాజు అప్పారావువంటి వాళ్ళు మాత్రం నిత్యం వాడుకొనే భాషలో తప్ప సత్యాన్వేషణ సాధ్యం కాదన్నారు. బసవరాజు అప్పారావు -

ఎదమెత్త నౌటకై
సొదగుందరా, ఎల్ల
కామ్య పదవుల కన్న
ప్రేమ యెక్కువురా

అని హితబోధ నిత్యం వాడుకొనే మాటలలో చెప్పాడు. ప్రేమించడం ఎందుకంటే 'ప్రేమించు ప్రేమకై' అన్నాడు. ఇది కళ కళ కోసమే అన్న వాదం కాదు. గురజాడ చెప్పినట్లు ''ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును'', అందుకు ''ప్రేమించు ప్రేమకై'' అన్నాడు. ఇందులో సిద్ధి పారస్పర్యం నిజంలో ప్రేమలో పడ్డ వాడికి ప్రేయసి తప్ప ఇంకోలోకం ఉండదు. ఆమెలో ఐక్యమవుతామన్న తహతహ తప్ప ఇంకోటి ఉండదు.

అది నడుచు వేళ నేల జీరాడు కుచ్చె
రేపు దుమ్మున నొక త్రసరేణువు నయి
దాని తనువున బుట్టు స్వేదమున గలసి
కరిగి పోదును రూప మేర్పఱుపరాక
అది యుషస్స్నాన మొనరించి యంత గట్టు
కొనిన పచ్చని పట్టుదుకూల మందు
నార్ద్రమగు లే జరీ యంచునై తదీయ
దేహమున గగుర్పాటులు దిద్దుకొందు.

- సౌభద్రుని ప్రణయయాత్ర

ఇటువంటి భావాలు 'ప్రణయంపు వింత పిచ్చికే' వస్తాయి. ఎంతో సంతోషాన్ని ఇస్తాయి. ఆమె పెట్టిన సంక్రాంతి ముగ్గులలో గొబ్బెమ్మలపై పడగలెత్తే గుమ్మడులలో ఆమెను చూస్తాడు. ఆమె లావణ్య రేఖ లవము చూపెట్టిన కిటికీ కూడా దయామయురాలనుకొంటాడు. ప్రేయసికై అంతులేని ప్రణయయాత్రను సాగించే వాడి భావాలన్నీ ముగ్ధ మోహనాలే.

ప్రేమికుడు దీనుడై ఏ నీడనైనా ఒదిగి నిల్చొనే అవకాశం లేకపోతే వియోగమే నిత్యమైతే అతనికి అమూల్యం, అపూర్వం అయిన ఆనందాన్నిచ్చే దుఃఖపు నిధులు ఉంటాయి. ఆ ప్రేయసే నిట్టూర్పు. ఆమెయే కన్నీరు. తాను పాడుకొనే శోకగీతాలలో ఆమెయే శోకగీతి. తనకు తన దుఃఖమే తోడు, నీడ. దాన్నే ప్రేమిస్తాడు. జీవితాన్ని ప్రేమించడం సాధ్యం కాకపోతే మృత్యువును ప్రేమించిన భావకవులు కూడా ఉన్నారు. ఆమె సుఖతర నిశ్శబ్ద చుంబనాన్ని ఆశించేవాళ్ళు ఉన్నారు.

నీజడ కట్టులో నిద్దుర వాడి
నలిగిన చంపక దళముల మాల
బిచ్చంబు పెట్టుమీ పిచ్చి బికారి
సంతృప్తినొందును చాలించు యాత్ర

అనగలరు.

తన మరణానికి తాను భయపడక తనకు తానే వీడ్కోలు ఇచ్చుకోగలడు. తనకొరకు చెమ్మగిలే నయనం లేదని తనకు తెలుసు. అయితే భావకవి తన వారి మృత్యువుకు తల్లడిల్లిపోతాడు. తపించిపోతాడు. నిలువునా దహించి వేసే దుఃఖంతో ఆర్తగీతాలు ఆలపిస్తాడు. నట్టింటి దీపాన్ని ఆర్పివేసిన క్రూరకర్ముడ్ని తిట్టిపోస్తాడు. కన్నతల్లి కాలం చేసినా, కట్టుకొన్న ఇల్లాలు కడతేరినా కడుపున పుట్టినవాళ్ళు కనుమరుగైనా కడివెడు దుఃఖం కావ్యాన్ని ద్రవిస్తుంది. బాధ బాష్పతర్పణాన్ని చేయిస్తుంది. అయినవారు పోయాక అడుగడుగునా జ్ఞాపకాల గాయాలు, గేయాలు పాడిస్తాయి. ఏ కన్నీటి పాటలోనైనా మున్నీటి లోతులలోని బడబాగ్ని పైకెగసి భగ్గుమని ఎదను కాలుస్తుంది. 'నాటి మిత్రులు తరల పుడమి శూన్యం' అనిపిస్తుంది.

ఆప్తులు, ఆత్మీయులు పోయినప్పుడు చెప్పే ఎలిజీ ఆత్మాశ్రయమైన శోకమేగాని సమాజానికి కొందరకు కావలసిన వారు పోయినప్పుడు వారిని తలచుకొనడం వారి ఆశయాలకు పునరంకితం కావడం పరిపాటి. వీరగాథలు, పేరంటాళ్ళ కథలు, మాత్రారాధన మొదలైనవి తరతరాల నుండి వస్తున్న కవితా సంపుటులే. ఇవే పురాగాథలవుతాయి. పదం పద్యం పట్టి కీర్తులపకీర్తులు నిలుస్తాయి. పోయిన వారందరూ కీర్తిశేషులు కాలేరు. కవితలలో నిలిచినవారే కలకాలం బతుకుతారు. అమరత్వం వాంఛనీయమే గాని చావనిది ప్రకృతి ఒక్కటే. మారుతున్నా మారనిది మానవత్వం. ప్రకృతిలో మానవుని పోరాటం నిరంతరం. నేచురల్ మానవుడు స్వతంత్రునిగా జన్మించినా సర్వత్రా శృంఖలాలలో ఉన్నాడని రూసో చెప్పింది కొంత సత్యమే.

మానవ సంఘంలో కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. కొన్ని లెక్కల ప్రకారమే జగత్తు నడుస్తుంది. గుండె కొట్టుకొనడానికి, నాడి ఆడడానికి, ఊపిరి ఆడడానికి ఒకరకమైన లెక్క కావాలి. అలాగే సమాజంలో సబ్జెక్టు-ఆబ్జెక్టుల మధ్య సంఘర్షణ సమన్వయాలు ఉంటాయి. ఆచరణలోంచి సిద్ధాంతం, సిద్ధాంతంలోంచి ఆచరణా పుట్టుకురావడం నిరంతరం జరిగేదే. మేటర్ మీద మైండ్ ఆధిపత్యాన్ని వహిస్తుందన్న భావవాదం లోంచే ఆత్మాశ్రయతత్వం పుట్టుకొస్తుంది. భావకవిత్వం మూడొంతుల ముప్పాతికపాళ్ళు భావవాదాన్నే ప్రతిధ్వనిస్తుంది. భావవాదం నుండి భౌతికవాదానికి పయనమే భావకవిత్వం నుండి అభ్యుదయ కవిత్వానికి సాగిన యాత్ర.

ప్రతి పాత సంప్రదాయంలోనూ కొత్త విధానాల బీజాలుంటాయి. ప్రబంధ ధోరణుల మీద భావకవిత్వం విప్లవమైనా కావ్యభాష భావకవిత్వాన్ని కొంత శాసించక పోలేదు. అలాగే భావకవిత్వపు ప్రభావం తర్వాత తరంవారిమీద ప్రస్ఫుటంగా లేకపోలేదు.

శిష్టా ఉమామహేశ్వరరావు రచించిన 'విష్ణుధనువు' నిండా భావకవిత్వపు పోకడలు ఉన్నాయి. ఈ కావ్య సంకలనాన్ని అందులోనే విశ్వనాథ సత్యనారాయణగారు రివ్యూ చేశారు. ముందు భావకవిత్వం అంత ఉధృతంగా ఉండకపోతే శిష్టా ఊహలు, ఉద్రేకాలు, పదచిత్రాలు అలాగ ఉండడానికి ఆస్కారం కలిగేది కాదు. శ్రీశ్రీ తొలికావ్యం 'ప్రభవ' నిండా భావకవిత్వం ప్రభావం కొట్టవచ్చినట్టు కనబడుతుంది. మహాప్రస్థానం నాటి శ్రీశ్రీలోనూ భావకవిత్వ పదజాలం మరో ప్రపంచాన్ని చూసింది. చూపెట్టగలిగింది. శాస్త్రంలోని సత్యం కవిత్వంలోని సందేశమైనప్పుడు అది సుందరంగానే ఉంటుంది. హృద్యంగా ఉండి అపూర్వమనిపిస్తుంది. అయితే ఏ కవిత్వ స్వభావమైనా ఎరుకను సమగ్రం చేయడమే.

యుగధర్మాన్ని పాటించకపోవడం అఘం. దానికి అడ్డుతగలడం అఘం. రావలసిన నూతనత్వాన్ని ప్రతిఘటించడం అఘం. ఈ పాపాల ప్రక్షాళనమే ఏయుగంలోని కవిత్వమైనా తనకు తాను విధించుకొంటుంది. అది ఇతిహాసనమై ప్రత్యక్ష నిర్దేశాలను ద్యోతకం చేస్తుంది. కవిత్వంలో ఒకచోట ధర్మం, ఒకచోట ప్రేమ, ఒకచోట ఆర్థికం, ఒకచోట శమం, ఒకచోట హాస్యం, ఒకచోట కామం, ఒకచోట యుద్ధం, ఒకచోట బాధ ఎప్పుడూ ఉంటాయి. అధర్మమనుకొన్న దానితో యుద్ధం, అమానుషాన్ని వధించడం కొన్నివేల తరాల కవిత్వ స్వభావాలు.

దుఃఖార్తులకూ, శ్రమార్తులకూ, శోకార్తులకూ కవిత్వం వాళ్ళ క్లేశాలను పోగొట్టి ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. అయితే అది ఒక్కొక్క యుగంలో ఒక్కొక్కలాగ జరుగుతుంది. భావకవిత్వం 'మీరు మనసారగా యేడ్వనీరు నన్ను' అంటుంది. నన్ను విడవండి, విసుగు లేకుండా వెక్కి వెక్కి ఏడ్చి గుండె బరువు తగ్గించుకుంటానని వైయక్తికంగా అంటుంది. భావకవిత్వం ప్రభావంలోంచే వచ్చినా దానికి ప్రతిగా సాగిన అభ్యుదయ కవిత్వం సామూహికంగా 'ఏడవ కండేడవకండి!'' అని చెప్పవలసి వచ్చింది.

ఏ కవిత్వమైనా ఆషాడమేఘంలాంటిదే అని అంటాడు భావకవి. దాని మధురగీతాలను విని నేలలో పులకలులా పచ్చని మొలకలెత్తుతాయి. తన మధురగీతాలు విన్నట్టి ముగ్ధ హృదయాలలో క్రొంగొత్త మోసులెత్తుతాయంటాడు. ఆషాడమేఘపు ఉరుము విప్రలబ్ధలను కళవరింప చేస్తుంది. కవి కద్రుగీతం అసధర్ములకు బాధ కలిగిస్తుందని భావకవి చాటుతాడు.

అసధర్ములను బాధపెట్టడం కన్నా సధర్ములను, సహధర్ములను సంఘటిత పర్చడం ముఖ్యం, అతుకులబొంత సంసారాలకన్నా ఆసాంతమైన పరిష్కారం ముఖ్యం.

అందుకే అభ్యుదయ కవిత విప్లవాన్ని కోరుతుంది, దానికి స్వాగతం పలుకుతుంది.

భావకవులలో కూడా కొందరు ఆద్యులు, ఆఢ్యులు, మానవుని స్వాతంత్ర్యం మంట కలిసినప్పుడు ఒకరకమైన విప్లవాన్ని ఆకాంక్షించక పోలేదు.

ఒక ప్రళయము బంధన భం
జకమై భావి ప్రపంచ సౌఖ్యప్రతి పా
దకమై స్వేచ్ఛాత్మకమై
కకావికలు సేయదో జగమ్ముల కెల్లన్

విప్లవానికి స్వాగతం చెప్పడం నిజమైన కవిత్వ స్వభావం.

విప్లవ ఆగమనాన్ని త్వరపర్చడం ప్రతిభకల కవితకున్న ప్రభావం.

రావలసిన విప్లవాన్ని గురజాడ ఊహించారు. అభ్యుదయ కవిత్వం ఆనాడే గజ్జకట్టింది. ప్రవేశగానం గురజాడ కవితలే పాడాయి. శ్రీశ్రీ ప్రసాద గానాన్ని పాడాడు. అభ్యుదయం కేవలం గజ్జె కట్టడమే కాక కత్తి పట్టింది. పాటగా మళ్ళా ప్రజలలోనికి వెళుతున్నది.

ఛాందసులు - పాట పాడడం కవితకు ముఖ్యం కాదంటారు. అది పఠన మాత్రాననే రసాస్వాద జనకమవుతుందంటారు. గతి విశేషాదుల చేత లక్షితమైన పద్యంకానీ, గద్యంకానీ కవితకు ముఖ్యం కాదంటారు. ప్రజల నుండి దూరమైన, కేవలం పండిత జనైకవేద్యమైన సాహిత్యాన్ని చదివి మెచ్చుకొన్నవాళ్ళు మెచ్చుకోవచ్చు. కవిత్వపు ఆదిమ లక్షణాలలో ఒకటైన పాట మళ్ళా జోడైతేనే ఏయుగంలోని కవిత్వమైనా రాణిస్తుంది. తన ప్రయోజనాన్ని ప్రజలలో నెరవేరుస్తుంది.

భావకవిత్వం ప్రాచుర్యం పొందడానికి అచ్చుయంత్రంకాక శ్రోతల ముందు పఠనం ముఖ్య కారణం.

వచన పద్యాలు రాసినా శిష్టా, నారాయణ బాబులు వాటిని పాడేవారు.

పాడబట్టే గురజాడ తెచ్చిన విప్లవం ప్రజలలో వ్యాప్తి చెందింది.

పాడబట్టే శ్రీశ్రీ కవిత్వానికి ఇష్టసిద్ధి కలిగింది.

తెలుగు కవిత పాటవైపు మళ్ళా పయనిస్తే అది శుభసూచకం.

మైలురాళ్ళూ - దారిదీపాలు

దారులు వేసుకొంటూ వెళ్ళేవారు కొందరుంటే, వాటిమీద అక్కడక్కడ దీపాలను పెట్టేవాళ్ళు కొందరుంటారు. కొందరు ఆదారిలో మైలురాళ్ళలాగ చరిత్రలో నిలబడిపోతారు. ప్రతియుగంలోనూ చెప్పుకోదగ్గ సాహిత్యసేవలు చేసిన వ్యక్తులుంటారు గాని తమ కాలంలో సాహిత్యానికి కొత్తరూపు, తమ తరంవారికి కొత్త చూపు ఇవ్వగలిగినవారు వేళ్ళమీద లెక్కపెట్టదగ్గ సంఖ్యలోనే ఉంటారు. అంతా ఇంతా కాని పరిమాణంలోనూ ఎంతో కొంత అనిపించేవిధంగానూ విమర్శశాఖను, ఆకరాల సేకరణ విధులను, కవి కాలనిర్ణయాల వివరణలలోనూ పాటుపడినవారి గురించి తెలుసుకొనడం ముఖ్యం.

కట్టమంచి రామలింగారెడ్డి (1880-1951)

తెలుగు నాటకానికి గురజాడ అప్పారావుగారు, తెలుగు నవలకు ఉన్నవ లక్ష్మీనారాయణగారు చేర్చిన చేవలాంటిది, తెలుగు విమర్శకు కట్టమంచి రామలింగారెడ్డి గారు సంతరింపచేశారు. ఈ ఇద్దరు వాడుక భాషావాదుల మధ్యకాలంలో రెడ్డిగారు కవిత్వతత్త్వ విచారం (1914) అనే గ్రంథం సాహిత్య విమర్శను ఆధునీకరణగీతులకు మళ్లించారు. కావ్యాలలో గద్యపద్యాల తారతమ్యం, భావనాశక్తి, రచనా కౌశల్యం, వస్తు స్వరూపం, భావప్రకటనల పరస్పర సంబంధాలు, విషయం-శైలి ఈ రెండింటిలో ఏది ముఖ్యమనే చర్చ, జీవకళలక్షణం మొదలైన విషయాలను కూలంకషంగా చర్చిస్తూ రెండు ప్రబంధాలను విశ్లేషణ చేసి తమ నూతన దృక్పథాన్ని లోకానికి చాటారు. తెలుగు విమర్శలో కొత్త ద్వారాలు తెరిచారు.

కట్టమంచి రామలింగారెడ్డిగారు చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించారు. వీరికి ముత్తాతగారి పేరు పెట్టారు. ఆ పెద్దరామలింగారెడ్డిగారు దొడ్డ విద్వాంసులు. సంస్కృతాంధ్రాలు రెండింటా ప్రగల్భులు. భాస్కర శతకం రచించారు. కుప్పనయ్యంగారు (1804-1894) అనే వైష్ణవ బ్రాహ్మణులకు ఈ పెద్దరెడ్డిగారే సంస్కృత గురువులు. ఈ అయ్యంగారి దగ్గరే 1890 నుండి హైస్కూల్లో ఒకటవ ఫారం నుండి చిన్నరామలింగారెడ్డి గారు చదువుకొన్నారు. అయ్యంగారు సర్వలక్షణ సారసంగ్రహం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించారు. అది ఈ రామలింగారెడ్డిగారు పుట్టకముందే అచ్చుపడింది. వానిలోంచే పాఠాలు చెప్పేవారు.

రామలింగారెడ్డిగారు కుప్పనయ్యంగారి దగ్గర నలోపాఖ్యానం, వ్యుత్పత్తి అర్థాలు, నానార్థాలు, సంధులు, సమాసాలు, వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు మొదలైన విషయాలన్నీ సర్వంకషంగా నేర్చుకొన్నారు. రామలింగారెడ్డిగారి తండ్రిగారు సుబ్రహ్మణ్యారెడ్డి (వ్యవహారనామం సుబ్బారెడ్డి) వృత్తిచేత ప్లీడరు. ప్రాక్టీసు బాగా ఉండేది. కవులు కారుగానీ ఆయన భారత భాగవతాలు క్షుణ్ణంగా చదివారు. కుమారుని చేత చదివించారు. 'భారతసార రత్నావళి', 'భాగవతసారముక్తావళి' అనే రెండు సంకలన

గ్రంథాలను సుబ్బారెడ్డిగారు రచించారు. రామలింగారెడ్డిగారు పన్నెండేళ్ళ వయస్సు వచ్చేసరికి భారత భాగవతాలను ఎక్కువ గజిబిజి లేకుండా చదవగలిగేవారు. అందుచేత సుబ్బారెడ్డిగారు స్నేహితులతో కూర్చొని పురాణ పఠనం, వ్యాఖ్యానం చేసేటప్పుడు పదాది విభాగాలకు అన్వయ సౌలభ్యం కలిగేటట్టు చదివేవారు. ఈ గ్రంథపఠనమేకాక రామలింగారెడ్డిగారు తమకు అక్కవరస అయిన నరసమ్మగారి దగ్గర చేరి ఊకుడు కథలు వినేవారు. చిన్నప్పుడు పదిపన్నెండేళ్ళ వయస్సులో ఆయనకు నూరు ఊకుడు కథలు వచ్చునట. నరసమ్మగారి వల్ల రామలింగారెడ్డిగారు ఛందో రహస్యాలను తెలుసుకోగలిగినట్టు ఉత్తరోత్తరా ఇలా రాశారు.[1]

''ఆ వయస్సుననే ఆమె యందున్న గొప్ప శక్తి యొకటి నాకు గోచరమయ్యెను. కవిత్వమునకుఁ బ్రధాన బీజములలోఁ జెవియొక్కటి. కంటితోఁ జూచి, చూచి, గణములను, యతులను, బ్రాసములను బరీక్షించుకొనుచుఁ, బద్యములను వ్రాయునట్టి మూఢలు తఱుచుగా లేరుకాఁబోలు. పద్యమును జదువునప్పుడును, భావములోఁ దీర్చునప్పుడును శబ్దమును బట్టియే యదిసరిగా నున్నదా లేదా యనుట, కవిత్వ శక్తిగల వారికెల్లను నప్రయత్నముగ నిర్ణయమగును. ఆకర్ణప్రభావము మా నరసమ్మగారికి వెన్నతో వచ్చిన గుణము, అట్లగుట పద్యముల ధోరణి, శయ్య, గణ యతి, ప్రాససరణి మొదలగు పద్య లక్షణములను జెవిచేతనే గ్రహించినది. నాకుఁ దెలిసి యామె ఛందశ్శాస్త్రము చదువలేదు. వ్యాకరణమును జదువలేదు. ఆ శుష్కపఠనము నేను గొంతవఱకు చేసియున్నాను. మాయక్కకా దౌర్భాగ్యము సంభవించినట్లు కానము. శ్రుతి ప్రమాణముతో సాహిత్యమును సాధించెను. కవిత్వమునకు జీవకళ భావము. పద్యము శరీర మాత్రము.''

హైస్కూలు చదువు ముగించాక రామలింగారెడ్డిగారు మద్రాసులో క్రిష్టియన్ కాలేజీలో పై చదువులకు చేరారు. 1895లో చెన్నపట్నంలో ఉంటున్నప్పుడు రామలింగారెడ్డిగారికి పితృవియోగం కలిగింది. చిన్నప్పట్నించి తనచేత భారతాన్ని పునః పునః పారాయణం చేయించి తనలో సాహిత్య రసజ్ఞతను కలిగించిన తండ్రిగారంటే రామలింగారెడ్డిగారికి భక్తి శాశ్వతమైంది. క్రిష్టియన్ కాలేజీలో చదువుకొంటున్నప్పుడు 'ఆంధ్రభాషాభిరంజని' సమాజంతో సంబంధం ఏర్పడింది. విద్యార్థిగా ఆయన పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయం చదువుకొన్నారు. అందులో సొగసులు గ్రహించారు. ఆరోజుల్లో ఇంగ్లీషు చదువులు చదివేవారు. షేక్స్పియర్ నాటకాలను నూతన విమర్శరీతులతో వ్యాఖ్యానించడం తెలిసినవారికి ఆంధ్రసాహిత్యానికి ఆ పద్ధతులు వర్తింపచేయాలనే కుతూహలం కలగడం సహజమే. షేక్స్పియర్‌కు సమకాలికుడు, ప్రతిభలో తత్తుల్యుడు అయిన కవి పింగళి సూరపరాజుగారు ఒక్కరే అని రామలింగారెడ్డిగారు గుర్తించారు. అందుకే కళాపూర్ణోదయం నుండి తమ కవిత్వతత్త్వ సిద్ధాంతాలను క్రోడీకరించుకొన్నారు.

1899లో కళాపూర్ణోదయంపైన ఒక ఉపన్యాసాన్ని రాశారు. దానిని క్రిష్టియన్ కాలేజి ఆంధ్ర భాషాభిరంజనీ సమాజంలో చదివారు. ప్రశంసలను పొందారు. రెడ్డిగారి

1. కట్టమంచి రామలింగారెడ్డి - వ్యాసమంజరి, పుటలు 125-6

మిత్రులు మొండ్రేటి బాపనయ్యగారు ఎంతగా మెచ్చుకొన్నారంటే ఈ వ్యాసాన్ని రాజమండ్రిలో చదవాలని పట్టుపట్టేనంత. రెడ్డిగారు రాజమండ్రి వెళ్ళి అక్కడి విద్యాభివర్ధనీ సమాజంలో తమ ఉపన్యాసం చదివారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మెచ్చుకొని ప్రోత్సహించారు. ఈ ఉపన్యాసాన్నే మరో రెండుచోట్ల చదివారు. ఒక సభకు వేదం వెంకటరాయశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. రెడ్డిగారు అత్యుక్తి దోషానికి పాల్పడ్డారని శాస్త్రిగారు మృదువుగా స్ఖలిత్యాలను చూపెట్టారు. మరికొందరు రెడ్డిగారిని పద్యరూపంలో ప్రశంసించారు. 1900 సంవత్సరంలో ఆంధ్రభాషాభిరంజనీ సమాజంవారు నూతన కావ్య రచనకు పోటీ పెట్టారు. రామలింగారెడ్డిగారు ముసలమ్మ అనే యువతి ఊరి మంచికోసం ఆత్మబలి చేసుకొనే అనంతసాగరం చెరువు కథను సంప్రదాయబద్ధంగా పద్యకావ్యరూపంలో చెప్పి ప్రథమ బహుమానం పొందారు. ఈ గ్రంథం ఆనాడే అచ్చుపడింది.

1901లో రామలింగారెడ్డిగారు ఇరవై ఒకటో యేట బియ్యే డిగ్రీ పొందారు. రాజకీయార్థ శాస్త్రం, తత్త్వశాస్త్రం చదివారు. పతకాలు పొందారు. ప్రభుత్వం స్కాలరుషిప్పు దొరికింది. దానితో సీమకు వెళ్ళి అక్కడ కేంబ్రిడ్జిలో చదువుకొన్నారు. ఆ యూనివర్సిటీ యూనియన్‌లో వైస్-ప్రెసిడెంటుగా ఎన్నికైన తొలి భారతీయ విద్యార్థి ఈయనే. ఇంగ్లండులో చదువు ముగించుకొనే లోపున అక్కడ చేయవలసిన అధ్యయనంతోబాటు మళ్ళా మళ్ళా కళాపూర్ణోదయం వదలకుండా చదువుతూనే ఉండేవారు. సీమలో అయిదేళ్ళపాటు ఉండి స్వదేశానికి వచ్చారు. 1902లో బరోడా మహారాజు గైక్వాడు వీరికి సహాయం చేసి అమెరికా పంపించి ఉన్నతోన్నత విద్యలను చదివించారు. విద్యా పద్ధతులను అక్కడ అధ్యయనం చేశారు. తిరిగి వచ్చాక బరోడా కాలేజీలో వైస్-ప్రిన్సిపాల్‌గా చేరారు. ఇంతలో మైసూరు మహారాజావారు ఆహ్వానించి తమ ప్రభుత్వపు విద్యాశాఖలో రెడ్డిగారిని అసిస్టెంటు ఇన్‌స్పెక్టరు జనరల్‌గా నియమించారు.

మైసూరు యువరాజా యూరోపు పర్యటన చేస్తున్నప్పుడు తనతోబాటు రెడ్డిగారిని తీసుకొని వెళ్ళారు. కెనడా, ఫిలిప్పైన్స్, జపాను మొదలైన దేశాలలో కూడా పర్యటన చేసి విద్యావిధానాలను ఆకళించుకొన్నారు. 1913లో స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇన్‌స్పెక్టరు జనరల్‌గా విద్యాశాఖలో ఉంటూ మైసూరు మహారాజా కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు.

1910లో మైసూరు మొదట వచ్చినప్పుడు రామలింగారెడ్డిగారికి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పరిచయమైంది. అప్పుడు శర్మగారు 1906 నుంచి చామరాజేంద్ర సంస్కృత మహాపాఠశాలలో విద్యార్థి. పరకాల యతీంద్రులు కోరిన పుస్తకాలు చదివి వినిపిస్తూ రసానుభావశక్తి, విమర్శనాదృష్టి అలవర్చుకొన్న కుశాగ్రబుద్ధి. రామలింగారెడ్డిగారి ఇంగ్లీషు సాహిత్య మర్యాదలు శర్మగారికి నేర్పితే; శర్మగారు రెడ్డిగారికి సంస్కృత సాహిత్యశాస్త్ర విషయాలు బోధించేవారు. ఇద్దరికీ మైత్రి కుదిరింది. ఇది ఉత్తరోత్తరా ఉభయత్రా ఫలించింది.

మైసూరు విద్యాశాఖలో ఉంటున్నప్పుడే రామలింగారెడ్డిగారు మద్రాసు విశ్వవిద్యాలయం 'బోర్డ్ ఆఫ్ స్టడీస్'కు సలహాలు ఇస్తూ ఉండేవారు. 1913 నుంచి గురజాడ అప్పారావుగారు మద్రాసు యూనివర్సిటీ ఫెలోగా ఉంటూ విశ్వవిద్యాలయంలో సంస్కృత మాతృభాషల బోధన గురించి ఆధునిక ఆంధ్ర వచన రచన గురించి తమ అభిప్రాయాలు చెప్పేవారు. అప్పారావుగారు రామలింగారెడ్డిగారితో చాలా విభేదించారు. రెడ్డిగారి సూచనల ప్రకారం ఇంటర్‌మీడియట్, బియ్యే పరీక్షలకు ఈ విధమైన పుస్తకాలు పెట్టాలి.[2]

''(అ) ఆధునిక విషయాలపై ఆసక్తిని కలిగించే వచన గ్రంథాలు మొత్తం పాఠ్యభాగంలో సగానికి సగం ఉండవలె.

(ఆ) పుస్తకాలలో కొన్ని భాగాలను గాక పూర్తిగ్రంథాలనే నిర్ణయించాలి. ఆరువందల పేజీల వచనం విద్యార్థులు చదవడానికి భారమైనట్టిదని అనుకోరాదు.

(ఇ) ఒక సంవత్సరానికి వేసిన టెక్స్టుబుక్కులు తిరిగి వేయగూడదు.

బి.ఏ. పరీక్షలకు వెళ్ళే విద్యార్థులమీద ఉదాహరించిన వచన గ్రంథముల వంటివి మూడింటినైనా చదువవలసి వుంటుంది. ఇంటర్మీడియట్ నందువలెనే ఆరువందల పేజీల వచనమును పాఠ్యభాగముగా నిర్ణయిస్తూ, ఒకసారి వేసిన పుస్తకమును మళ్ళీ టెక్స్టు బుక్కుగా నియమించరాదు. ఇవీ శ్రీ రామలింగారెడ్డిగారు చేసిన ప్రతిపాదనలు.''

రామలింగారెడ్డిగారు సిఫార్సు చేసిన పుస్తకాలను అప్పారావుగారు ఆమోదించలేదు. విజ్ఞానచంద్రిక వారి గ్రంథాలను ఎన్నిక చేయలేదు. రామలింగారెడ్డిగారు రచించిన అర్థశాస్త్రమనే గ్రంథం తప్ప మిగతావి స్వకీయ ప్రతిభతో కూడినవి కావని చెప్పారు. అప్పారావుగారు మరొక సంగతి ఇలా చెప్పారు.[3]

''మనదేశంలో దురదృష్టవశాత్తూ సాహిత్యంపై విమర్శనము కొనసాగడమే లేదు. సారస్వత విమర్శనా సహాయం పొందకుండానే, దాని అజమాయిషీ లేకుండానే, సాహిత్యం మనదేశంలో ఎదుగుతూ వున్నది. గ్రంథకర్త తనకు తాను అభివృద్ధి పొందనిదే విశ్వవిద్యాలయం అతనికి ప్రోత్సహమీయలేదేమోనని నా అభిప్రాయం''.

గురజాడ అప్పారావుగారికి వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు స్నేహితులు. తెలుగులో సాహిత్య విమర్శల భావం పట్ల ఆయన శాస్త్రిగారితో చెప్పే ఉంటారు. వెంకటేశ్వరశాస్త్రిగారు రామలింగారెడ్డిగారి తండ్రిగారి స్నేహితుని కుమారులు. అందుచేత వావిళ్ళవారు రామలింగారెడ్డిగారిని పూర్వం క్రిష్టియన్ కాలేజీలో ఉన్నప్పుడు కళాపూర్ణోదయం మీద రాసిన వ్యాసం ఇస్తే అచ్చువేస్తామన్నారు. ఆ వ్యాసం కనబడక రెడ్డిగారు అందులోని భావాలను ప్రస్తుతం తమకు కలిగిన నూతన అభిప్రాయాలతో కలిపి కవిత్వతత్త్వ విచారం అనే గ్రంథాన్ని రచించారు. ఇది 1914లో అచ్చుపడింది.

---

2. గురజాడ అప్పారావు - వ్యాసచంద్రిక - పుటలు 127-8
3. వ్యాసచంద్రిక - పుట.134

కవిత్వ తత్త్వ విచారం సాహిత్య లోకంలో సంచలనం కలిగించింది. పాత ప్రతిపాదనలను కొట్టిపారేసే ఈ నూతన సిద్ధాంతాలను చూసి సనాతనులు మండిపడ్డారు. రెడ్డిగారు గ్రంథాదిని దీని విజయానికి కారణం ఇలా రాశారు.

''ఒంటిగానే సమర్థించి యుండఁజాలను. నాకుందోడుగ మైసూరు మహారాజుగారి కాలేజియం దాంధ్ర పండితులగు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారునిలిచి నందునఁ గార్యము నెఱవేఱెఁగాని లేకున్ననై యుండుట సందిగ్ధము. ఇంత త్వరలోనై యుండుట యసంభవము''.

లోకులు చాలామంది ఈ గ్రంథాన్ని అనంతకృష్ణశర్మగారే రాసి రెడ్డిగారు పేరు పెట్టారని అపవాదు చేశారుగాని శర్మగారు కవిత్వతత్త్వ విచారానికి వచ్చిన కీర్తిని పొందడానికి తమకు అర్హత లేదని సవినయంగా దేశానికి చెప్పుకొన్నారు.[4]

కవిత్వతత్త్వ విచారం ఒక వినూతన సిద్ధాంత క్రమాన్ని ప్రతిపాదిస్తుంది. పాత్రోచితమైన మాటలు ప్రయోగిస్తూ విషయానికి తగిన రీతిని సొగసైన వర్ణన చేస్తూ దృశ్యాన్ని సాక్షాత్తూ మన ఎదుట కన్నులకు కట్టినట్టు చేయడమే అన్నింటికినీ మించి కవితా లక్షణం. ఈ మహేంద్రజాల కౌశల్యానికి ఆధారగుణం భావనాశక్తి. భావనాశక్తి అంటే విషయాలను మనస్సులో ప్రత్యక్షంగా అవతారమెత్తేటట్టు చేయడం. భావనాశక్తి లేకపోతే వట్టి పాండిత్యం జీవం లేని ఆకారమే. జన్మంచేత కవిగా, అనాదిగా పఠనం, అభ్యాసం ఉంటే మాత్రం కవి కాలేడు. తోడబుట్టిన చాతుర్యముంటే ఇవి సహాయభూతాలై వృద్ధి వికాసాలను కల్పిస్తాయి. స్వాధీనమైన మనోగాంభీర్యం లేకుండా కృషి చేయడం విత్తునాటకే ఎరువు జల్లినట్టుంటుంది.

కవిత్వతత్త్వానికి ప్రమాణమైన వారు వేమన. కుటిల మతాచారాలను, మూఢభక్తి, వేషధారితనము మొదలైన వాటిని తూలనాడటంలో అద్వితీయుడు. గొప్ప రహస్యాలు చెప్పినా తనకుగల నైజమగు బుద్ధిబలాన్నేగాని శాస్త్రాలను ఆశ్రయించలేదు. ప్రకృతి స్వరూపాలను చక్కగా తన దృష్టిలో భావనలతో చూసి ఒకటి రెండు మాటలతోనే అక్కడికక్కడ సాక్షాత్కరింపచేయగల మహాకవి. వేమనతో సర్వవిధాల సమానమైన కవి పల్నాటి వీరచరిత్ర రచించిన కవి. ప్రజా సమ్మతాలైన జానపద గాథలు రామణీయతకు తార్కాణాలు. భావనాశక్తి సంఘటనోత్సాహం ఇవి పరస్పర మిత్రాలు. ఇవి విమర్శన శాస్త్రం ఆదిమ తత్త్వాలు.

యుద్ధాలవంటి వీరకృత్యాలకు ప్రజలు సంసిద్ధులైన కాలంలోనే కవిత్వం విజృంభిస్తుంది. భాషా చరిత్ర, దేశ చరిత్ర నిత్యసంయోగాలు. ఆంధ్రదేశంలో వీర్యశౌర్యాది గుణాల విరాజిల్లుతున్న కాలంలోనే నన్నెచోడుడు, నన్నయ, తిక్కన మొదలైన కవుల ప్రాబల్యం ఉంది. విషయమూ, శైలీ రెండూ ముఖ్యాలే. భారత కవుల భావనా శక్తి గంభీరం. సమయోచిత వర్ణనా ప్రావీణ్యంలో తిక్కనను మించినవారు లేరు. భారతంలో పాత్రలు ఎవరి ప్రత్యేకత వారికి ఉన్నవారిగా కవులు చిత్రించారు. ప్రబంధాలలో అలా కాదు. అన్నీ

4. రాళ్ళపల్లి - వేమన - (1945) - పుట.16

ఒకే అచ్చున కొట్టిన బొమ్మలు. ప్రబంధాలకూ దేశక్షయానికీ సంబంధం ఉంది. ఒక్క కళా పూర్ణోదయం తప్ప మిగతా ప్రబంధాలలో నాటక సరణి మృగ్యం.

విమర్శనం చేయడంలో కథ, పాత్రలు; ప్రకృతి విశేషాలు, వర్ణనలు ఇవన్నీ పరస్పర మైత్రి కలిగి విరుపులు లేని యేకాకృతిగా ఉన్నాయా అన్న విచారణ ప్రధాన తమమని రెడ్డిగారి మతం. ఈ దృష్టితోనే పింగళి సూరపరాజుగారి ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని, కళాపూర్ణోదయాన్ని విశ్లేషణ చేసి తమ సిద్ధాంతాలను రుజవు చేయడానికి ఈ గ్రంథంలో ప్రయత్నించి కృతకృత్యులయ్యారు.

కవిత్వ తత్త్వ విచారం వెలువడిన వెంటనే సహజంగా సాంప్రదాయక పండితుల నుండి వ్యతిరేకత వచ్చింది. కురుగంటి సీతారామయ్యగారు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో 'అలంకార తత్త్వ విచారం' అన్న వ్యాసం ప్రకటించారు. కాళూరి వ్యాసమూర్తిగారు 'కవిత్వతత్త్వ విచారఖండన' అన్న పుస్తకం రాశారు. విమర్శలో కొత్తదారులు తొక్కుతూ బుర్రా శేషగిరిరావుగారు 1914లో 'విమర్శాదర్శ' అనే గ్రంథం రాశారు. దీన్ని ఖండిస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు 'విమర్శాదర్శ విమర్శనం' అనే గ్రంథం రాశారు. కట్టమంచి వారి గ్రంథం ఒక చెయిన్ రియాక్షన్‌కు కారణమైంది. ఇంకా సంప్రదాయవాదులూ, విశ్వవిద్యాలయంలోని సనాత దృక్పథం కలవాళ్ళూ రామలింగారెడ్డిగారి సిద్ధాంతాలను తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

రామలింగారెడ్డిగారు 1926లో ఆంధ్రవిశ్వవిద్యాలయం స్థాపన జరిగాక దాని మొదటి వైస్-ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవిలోనికి రాబట్టి వారి గ్రంథాలకు ప్రాచుర్యం వచ్చిందని కొందరు అంటారుగాని కవిత్వ తత్త్వ విచారంలో సరుకు ఉంది. అది విమర్శనా సాహిత్యంలో ఒక మైలురాయి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (1893-1979)

కట్టమంచి రామలింగారెడ్డి గారి పేరు చెప్పేటప్పుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పేరు కూడా తప్పక చెప్పుకొనేటంత సఖ్యం వారిద్దరికీ ఉంది. 1910 నుండి వీరికి పరిచయం ఏర్పడింది. 1912లో శర్మగారిని రెడ్డిగారు మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా ఏ డిగ్రీలు లేకపోయినా ప్రతిభ ఉన్నందున చేర్పించారు; శర్మగారు చదువుకొన్నది సంస్కృతమైనా తెలుగులో కావ్యాలు పాత పద్ధతిలో రాస్తూ ఉండేవారు. 1911లో 'తారాదేవి' అనే ఖండ కావ్యాన్ని రచించి రెడ్డిగారికి వినిపించారు. దాన్ని ఆయన పోలవరం జమీందారు కొచ్చెర్లకోట కృష్ణారావుగారికి పంపించి 'సరస్వతి' పత్రికలో అచ్చువేయించారు. 1912లో 'మీరాబాయి' అనే ఖండకావ్యం రాసి, దానిని నాళం కృష్ణారావు గారి పత్రిక 'మానవసేవ'లో అచ్చువేయించారు.

శర్మగారు రెడ్డిగారి స్నేహం వల్ల నూతన దృక్పథాన్ని అలవర్చుకొన్నారు. ''పాత ప్రపంచముననే ప్రాకులాడుతున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించినది'' అని శర్మగారు 'నా గురువులు' అనే వ్యాసంలో

రాశారు. శర్మగారు ఎటువంటి పాత ప్రపంచంలో ప్రాకులాడుతున్నదీ తెలుసుకోవాలంటే 1916లో మంత్రిప్రెగడ భుజంగరావుగారి కుమార్తె వివాహ సందర్భంలో రాసి పంపించిన పద్యాలలోని ఈ కింది చంపకమాలికచూస్తే తెలుస్తుంది.

పొరపడియైన నాల్క తుదఁబుట్టిన యొక్క తెనుంగు ముక్కకై
బిరబిర నాంగ్ల మంత్రము జపించియఘుంబులు నీఁగు బుద్ధియం
దఱకును గల్గిన నట్టి వితథంబగు నీ సమయంబునందు, సుం
దరమయి పొల్చు చెల్వ వదనంబునకున్ మసి పూయునట్లు సం
స్కరణము పేర దిక్కు గతిగానని పామరభాషఁ దూర్చితే
నెరుచుల నెల్లెడం జిలుకు నిద్దపుఁదెన్గును రూపుమాపఁగా
దొరకొను పుణ్యపూరుష తతుల్సొలరేగుచుఁ గ్రేళ్ళువారు-నీ
తరుణము నందు, వేసఁగిని దాపము సైఁపక వాడివత్తలై
సురిగెడు మల్లి తీవియకుఁ జొక్కముగా నొకలీల మేఘమం
బరమున లేచి తిన్నఁగ హిమాంబుల దానమొసంగినట్లు తె
మ్మెర నెఱబల్మిచే సడలి మిక్కుటమౌవడి ముండ్ల కంచెపైఁ
బొరిఁబడఁ బోవుచున్నకవిపోవని క్రొన్నవకంపుఁ బూవునం
తరమునఁ గందకుండఁగొని తద్దయుఁగూర్మి యొసంగ నొక్కసుం
దరపురుషుండు దాఁగురులఁ దాల్చిన రీతిని, నిప్పుడేదియో
వెఱపునఁ బెండ్లియంచు నొక పేరిడి సత్కవి సూరివర్యులిం
దఱనొక చోటఁజేరిచి యుదారత సత్కృతిఁ జేసి యాంధ్రవా
క్తరుణికి నెప్డులేకిపుడు దాఁపురమైన యభాగ్యమంతయున్
నిరతముఁ బాపఁబూనితివి! నీసరివచ్చెడు వారినింకఁగొం
దఱస్ఫృజియించుఁగాత! సతతంబును సౌఖ్య చిరాయువుల్ మహో
దరమున నీకు నీయుత! విధాత భుజంగధరాధి రాణ్మణీ!

1916లో పామర భాష గురించి రాళ్ళపల్లి వారి అభిప్రాయాలు పై పద్యంలో విశదమవుతున్నాయి. అయితే 1917లో వావిళ్ళవారు ప్రచురించిన ''వేమన పద్యాలు'' అనే గ్రంథానికి పీఠిక రాశారు. బహుశా కట్టమంచి రామలింగారెడ్డిగారే తమ పూర్వ ప్రచురణకర్తలైన వావిళ్ళవారికి ఈ పీఠిక రాసి పెట్టమని శర్మగారిని కోరి ఉంటారు. వేమనగారన్నా, రాళ్ళపల్లి వారన్నా రెడ్డిగారికి గౌరవం. రెడ్డిగారి సాహచర్యంలో శర్మగారు చాలా కొత్త విషయాలు నేర్చుకొన్నారు. 1914 సంవత్సరాంతంలో శర్మగారికి రెడ్డిగారు ఇచ్చిన ఒక యోగ్యతాపత్రంలో ఇలా రాశారు.[5]

"...... he has received from me some insight into western modes of thought feeling and expression which has done much to liberalise his culture which to commence with, was some what severely oriental in character' (15-12-1914)

5. 'అనంతరాగం' అనే రాళ్ళపల్లి వారి అభినందన గ్రంథంలో 'రాళ్ళపల్లి వారి జీవిత చరిత్ర సంగ్రహము' అనే వ్యాసంలో శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణగారు ఈ యోగ్యతా పత్రాన్ని ప్రస్తావించారు.

1915 నాటికి రెడ్డిగారు బోధించినవి ఆకళింపు చేసుకొనడానికి శర్మగారికి కొన్నాళ్ళు పట్టింది. ఆ అవగాహనతోనే వేమన గురించి 1917లో వావిళ్ళ వారికి రాసిన పీఠికలో వేమన భాష గురించి ఇలా చెప్పారు.[6]

''....ఇతని ప్రతి పద్యమునందును 'నవ్యత' యనుగుణము తాండవ మాడుచుండును... ఇఁక రెండవ గుణమితనికి నాంధ్ర భాష పూర్ణముగా స్వాధీనపడి యుండుట. తక్కిన కవుల కందరకించుమించు చదివిన చదువంతయు, నేటి చదువాంగ్ల వాఙ్మయమునకువలె, సంస్కృత వాఙ్మయమునకుఁ జేరియుండుటచే, వారి కవిత్వము, శిఖాయజ్ఞోపవీతాదులు ధరించిన యాంగ్లేయునివలె తెనుగు వేషము ధరించియున్నను నిజమునకు సంస్కృతమేయగుచున్నది. వేమన పాపము జన్మమందైన నాగంథమెఱుగని వాఁడు గావున నితని పద్యములలో నిజమైన తెనుఁగు జీవితము ప్రతిబింబించుచుండును. తెనుఁగు వారి మనోధర్మముల కితని కవిత్వ మొక సాటిలేని దృష్టాంతము. కావుననే పండిత పామర భేదములేక యవి హృదయముల నంటుచున్నవి. అనగా సంస్కృత పదముల నితఁడు వాఁడఁడని కాదు. వాడినను ఆపదములన్నియు విన్నవేకాని నేర్చినవి కావు. కావుననే భాషకు సంబంధించిన లోపములతనియందేవైనఁ గలవేని యవి చాలావరకును సంస్కృత పదములకు సంబంధించినవేయై యుండును.''

ఆంధ్ర విశ్వవిద్యాలయం సంస్థాపించాక 1928లో రామలింగారెడ్డిగారు వేమనగారిపై ఉపన్యాసాలను ఏర్పాటు చేశారు. ఏరికోరి రాళ్ళపల్లి వారితోనే ఇవి ఇప్పించారు. రాళ్ళపల్లివారు వేమనపై చేసిన ఏడు ఉపన్యాసాలు పరిశోధనకు తగినంత వైశాల్యం కలవే. శర్మగారు ఒక్కొక్క విషయంపై చాలా విపులంగానే చర్చించారు. అయితే ఇంతటి కూలంకష విమర్శ చేసి శర్మగారు తేల్చిన విషయాలు మూడే మూడు. అవి -

1. వేమన కాలదేశములు నిశ్చయముగా చెప్ప వీలులేదు.
2. అతని సిద్ధాంతములు నికరముగా ఏర్పరుప వీలుకాదు.
3. (వేమన పద్యాల) అచ్చుప్రతులందలి పాఠములు గూడ నింకను విమర్శింపవలసియున్నది.

''వేమన కవిత్వము గాలివంటిది, అది చూడని చోటులేదు, దొరకని తావు లేదు. కావుననే యందరును నుపయోగింపక తీరదైనను అతనిని పిలిచి మహాకవియని మర్యాద చేయుట కెవరికిని కాబట్టక పోయినది'', అని శర్మగారు రమారమి యాభైఏళ్ళకిందట ఆక్రోశించారు. వేమనగారికి పిలిచి పీట వేసినది కట్టమంచివారు. మహాకవి అని మర్యాద చేసినది శర్మగారే. వీరేశలింగము పంతులుగారి వంటి 'నవ్యభావ ధురంధురలకు'' వేమనగారు కవిగా తోపలేదని చెప్తూనే శర్మగారు 'బ్రౌనుదొరకూడ ఇతనిని కవి యనలేడయ్యెను' అని ఆరోపించారు. ఇది పొరపాటు.

బ్రౌను దొరగారు ఎక్కడా స్పష్టంగా poet అనే పదంతో వేమనగారిని పేర్కొనలేదు. నిజమే. అయితే వేమనగారిని దొరగారు authorఅనీ, Epigrammalist అని

6. వేమన పద్యములు - వావిళ్ళ (1955) పీఠిక - పుటలు 40-42

పేర్కొన్నారు. దొరగారి నిఘంటువు ప్రకారం author అంటే గ్రంథకర్త. Epigram అంటే చాటుపద్యం. దొరగారు ''Vemana was an epigrammalist'' అని 'వేమన చాటుపద్యములు చెప్పేవాడు' అని అర్థం చెప్పారు. బ్రౌను దొరగారు వేమనగారిని 'కవియనలేడయ్యెను' అనడం భావ్యం కాదు.

ఏది ఏమైనా ఆంధ్రసాహిత్యంలో స్వతంత్ర ప్రతిభగల ఇద్దరు కవులలో ఒకరైన పింగళి సూరపరాజుగారి మీద కట్టమంచివారూ, వేమనగారి మీద రాళ్ళపల్లివారూ మౌలికమైన విశ్లేషణలు వ్రాసి తెలుగు విమర్శ సరిహద్దును విస్తృతం చేశారు. రాళ్ళపల్లివారు జమీందారీ యుగంలో కంటే ఆధునిక యుగంలో సారస్వతోపన్యాసాలు (1931), శాలివాహన గాథాసప్తశతి సారము (1932), నాటకోపన్యాసములు (1935) మొదలైన రచనలు చేశారు. సంగీతంపైనా, నాట్యంపైనా వ్యాసాలు రాశారు. జాయపసేనాని నృత్యరత్నావళిని వచనంలో అనువదించారు.

మొత్తంమీద 1906లో సంస్కృత విద్యాభ్యాసానికి మైసూరు వెళ్ళి చామరాజేంద్ర సంస్కృత పాఠశాలలో చదువుకొంటూ, పరకాల మఠంలో నివసిస్తూ 'మహిశూర రాజ్యాభ్యుదయము', 'యాదర్శః' వంటి సంస్కృతకావ్యాలు రచిస్తూ వచ్చిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తెలుగు సాహిత్యంపై దృష్టి మళ్ళించడం, తెలుగు విమర్శ దారి మళ్ళించడం చెప్పుకోదగ్గ విశేషం.

పురాణం సూరిశాస్త్రి (1888-1941)

జమీందారీ యుగంలో తెలుగు సాహిత్యం సంతరించుకొన్న నూతన ప్రక్రియ నాటకం. 1901 నుండి 1916 దాకా తెలుగులో 440 నాటకాలను వివిధ రచయితలు రచించారు. ఈ నాటక వాఙ్మయాన్ని కూలంకషంగా పరిశీలించి, విశ్లేషణ చేసి తెలుగులో నాటకరంగ విమర్శకు నాంది పూజ చేసి సమీక్షా విధానాలకు దారులు తీయడమేకాక ఆదారులలో దీపాలు పెట్టిన కోవిదులు పురాణం సూరిశాస్త్రిగారు. ఆయన రచించిన ఆంధ్రనాటక నామావళి (1916), నాట్యాంబుజం (1923), నాట్యోత్పలము (1924), నాట్యాశోకం (1927), విమర్శకపారిజాతం వెలుగులు విరజిమ్మే పువ్వుల దివ్వెలు.

సూరిశాస్త్రిగారు బందరులో ప్రముఖ న్యాయవాదులైన రావుబహదూర్ పురాణం వెంకటప్పయ్యగారి కుమారులు. సంప్రదాయ వైదిక కుటుంబంలో పుట్టిన ఈ ఆగర్భ శ్రీమంతులు తొలిరోజుల్లో కృష్ణాజిల్లా అంతటికి పట్టభద్రులు. ఆరోజుల్లో నేటి కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని ప్రాంతాలు కృష్ణామండలంగా ఉండేవి. వారు రసాయన శాస్త్రంలో డిగ్రీ పుచ్చుకొన్నా లలితకళలు, సాహిత్యం అభిమానించారు. బందరులో తమ స్వగృహం చాలా గొప్ప గ్రంథాలయాన్ని చేర్చి దానికి 'విద్యానిలయం' అని పేరు పెట్టారు.

1911-1915 మధ్య చెన్నపట్నంలో చదువుకొనే రోజులనుండి నాటకాలను చూసేవారు. అచ్చుపడిన పుస్తకాలను కొని చదివేవారు. తమిళ, కర్ణాటక, పారశీక

నాటకాలను బళ్ళారి, రాజమండ్రి మొదలైన ఊళ్ళలోని ప్రసిద్ధ నాటక సమాజాల వారి ప్రదర్శనలను వీక్షించేవారు. బయస్కోపు ద్వారా ప్రసిద్ధ ఆంగ్ల నాటకాలను తిలకించి అధ్యయనం చేసేవారు. స్వతహాగా నటులు, గాయకులు, కవులు కాకపోయినా నాటకానికీ, ఈ కళలకు గల సంబంధాలను ఆకళించుకొన్నారు. అన్ని శాఖల సంగీత రీతులను ఆస్వాదించగలరు. ముఖ్యంగా రసాస్వాదనకు అవసరమైన రసస్వరూపాన్ని, దాని రహస్యాలను గ్రహించారు. బియ్యే చదువుతున్న రోజులలోనే "The real and ideal in sanskrit drama' (సంస్కృత రూపకాలలోని యథార్థ్యం, ఆదర్శం) అనే అంశంపై వ్యాసం రాసి విజ్ఞుల ప్రశంసలను పొందారు.

1916లో ఆనాటికి వెలువడిన నాటకాలన్నింటిని పరిశీలించి వాటిని పదకొండు శీర్షికలలో వర్గీకరించి ఏవర్గంలో ఎన్ని నాటకాలు వెలువడ్డాయో లెక్కపెట్టారు. ఆంధ్రదేశాన్ని ప్రధానంగా నాలుగు ప్రాంతీయ విభాగాలుగా విభజించి, ఏ ప్రాంతంలో ప్రజలు ఎటువంటి నాటకాలను అభిమానించారన్న గణాంక సంఖ్యలు తయారుచేశారు. బళ్ళారి సీమలో భక్తి, శృంగారాలు; విశాఖసీమలో సాంఘిక, చారిత్రకాలు; కృష్ణా, గోదావరి మండలాలలో అన్నివర్గాల నాటకాలు; మద్రాసులో వీధినాటకమే, యక్షగానాలు ప్రజాదరణకు నోచుకొన్నాయని చెప్పారు.

ఇటువంటి ప్రాథమిక పరిశోధన చేసి 'ఆంధ్ర నాటకనామావళి'ని రచించబట్టే సూరిశాస్త్రిగారు సాధికారంగా నాటక విమర్శను చేయగలిగారు. 'కావ్యమీమాంస' అనే పేరుతో 1920లో కృష్ణాపత్రికలో ధారావాహికంగా విమర్శక వ్యాసాలు ప్రారంభించి ఒక ఏడాదిపాటు రాశారు.

సూరిశాస్త్రిగారు తమ చిరకాల నాట్య వ్యాసంగాన్ని ఆధారం చేసుకొని 1923లో ప్రచురించిన 'నాట్యాంబుజం' ఎనిమిది దళాలలో ఎనిమిది అంశాలపై విశదీకరించారు.

1. నాటకానుభవములు
2. ఆంధ్ర నాటకములు
3. నాటక సమాజములు
4. ప్రసిద్ధ నటులు
5. ప్రదర్శన విమర్శనలు
6. ఆంధ్రనాటక విమర్శనం
7. నాటక సమస్యలు
8. నాటక విమర్శనం

నాటకాన్ని సద్విమర్శకుడు వీక్షించే విధానాన్ని నాట్యాశోకంలో ఇలా సూరిశాస్త్రిగారు వివరించారు.[7]

---

7. డా॥ పి.యస్.ఆర్. అప్పారావుగారు 'తెలుగు నాటక వికాసం'లో ఈ భాగాన్ని ఉదాహరించారు. పుటలు 580-1.

''ఆట చూచేటప్పుడు నాచిత్తము మూడు ప్రత్యేక వ్యాపారములతో మూడు కోశములుగా విభక్తమై వుంటుంది. ఒకటి కథా మొత్తమును, రామణీయకమును, అందున జనించు రసమును అనుభవించుచూ, విమూఢతదేక చింతతో, నిస్తబ్ధమై యుండును. నటవర్తనమందలి రసభావ తరంగములన్నీ యీ కోశమును గదలించుచు, అనురూప వికాసమును నా ముఖ నేత్రములందు పుట్టించుచుండును. ఏ నటుడైనా నావంక చూచిన యెడల నప్పట్టున నతనియభినయ విశేషము నా విశుద్ధ నిశ్చంచల రసగ్రహణ పారవశ్యములో ప్రతిబింబితమై కన్పడుచుండును. రెండవకోశము, నా సంకల్పము లేకుండానే, జరుగుతున్న నటనను చూస్తూ మాటలు వింటూ అందులో వెలుగొందు వానిని ధారణ చేయుచుండును. దాని వ్యాపారము స్వతంత్రము. నాకు తెలిసి జరిగేది కాదు. నా సంకల్పము వల్ల నడిచేది కాదు. ఎందుచేతనంటే నేను రసానుభవ పారవశ్యముతో మైమరచి యున్నాను. అట్టి మైమరపు లేకుంటే రససమాధి లేదన్నమాట; రమ్య వస్తువునందు ఏకాగ్రత కుదరలేదన్నమాట. వ్యభిచరించి, బహిర్గతమయ్యే బుద్ధికి అఖండ రసానుభవము లేదన్నమాటే. అందుకోసము నాకు తెలియకుండా ధారణ చేసే కోశము వేరేయున్నదని నిశ్చయము. కాని, ఈ కోశము రికార్డు చేసిన విషయాలు ఆవల సంకల్ప ప్రభావమున నా యుల్లమునకు దట్టి కట్టెదుట వచ్చి నిలచును. విమర్శన రచించెడి వేళ నే నొందెడి రసానుభవము తొల్లి నేను నాటకశాలలో పొందిన దాని శేషము కాదు. అది అప్పటితోనే సరి. అప్పటి రసానుభవము, నాకు తెలియకుండ యేదోయొక విధముగ స్మృతి స్థిత భావములకు వన్నె కలిగించి, యంతటితో పోవును. నాటకశాల వెడలి రాగానే మామూలు మనిషి నగుదును. కాని, మళ్ళా వ్రాయవచ్చుసరికి ధారణగ్రస్తములైన దృశ్య శ్రావ్య విషయములు సాక్షాత్కరించినప్పుడు వాని మూలమున గ్రమ్మర రసావేశమేర్పడును. ఈ రెండు కోశాలూ కళావిమర్శకు సంబంధించినవి. ఇవికాక, మూడవకోశము ఇటూ అటూ చూచుచు, ప్రక్కవారితో మాట్లాడుచు, లౌకిక వ్యాపారముల జరుపుచుండును. ఇదే నా అనుభవం. నాటకం చూచేటప్పుడు మాత్రము నా బుద్ధిలో రెండు భాగములు - ఒకటి తెలిసియు, ఒకటి తెలియకనూ, కథా వ్యవహారముతో నైక్యమై యుండును. ఏకాగ్రత వల్ల వ్యక్తి చాంచల్యము నశించును. తన్మయత్వమేర్పడును. చూస్తున్నాను, వింటున్నాను అనే కర్తృత్వ మస్తమించును. ఆనందమనుభవించుటయే మన పని. కాని అది ఎందువల్ల కలుగుతుందో అప్పుడు ఆలోచించము''.

ఏ దృష్టితో నాటకాన్ని చూడాలని చెప్పారో అలాగే ఆయన వీక్షించి, సమీక్షించిన ఒక నాటకం కన్యాశుల్కం. నాట్యశోకంలో ఈ సమీక్షను పూర్తిగా చేర్చారు. అందులో భాగాలు చూడండి.[8]

''పట్నాల్లోను, పల్లెల్లోను వుండే విపరీత స్త్రీ - పురుష స్వభావాలను రెండు మూడు కథా వ్యూహములను వొక్క కుదురున జేర్చి, దేనికది చక్కగా విప్పారి, నిజప్రవృత్తి నగుపరచి రసపుష్టితో రాజిల్లునట్లుగా, నతికించగల శక్తి అప్పారావుకే చెల్లినది.

8. గురజాడ అప్పారావు - లేఖలు (గురజాడ రచనలు 5వ సంపుటం) పుటలు 32-33 (ఈ సమీక్ష ఇందులో పూర్తిగా ఉంది).

మరియొకరైతే కథాంతానికి యేదో భక్తిజ్ఞాన వైరాగ్యమేర్పరచి నీతి బోధకుగడంగి యుందురు. గిరీశం చేత డామిట్ అనిపించుటలోనే యప్పరాయని యసాధారణ ప్రతిభా సామ్రాజ్యమగుపడుచున్నది''.

నాటక రచన గురించి ఇలా సమీక్షించిన సూరిశాస్త్రిగారు ఆ ప్రదర్శన గురించి ఇలా రాశారు:

''తెనాలి రామవిలాస సభ వారు బందరులో యీ నాటకాన్ని ముచ్చటమీర నాడి చూపారు. ప్రదర్శనంలో కన్యాశుల్కపు యసామాన్య ప్రదర్శనౌచిత్యము బయటపడినది. ఇందులో నామద్దింపు మీద రామప్పపంతులై అభినయించిన తంగిరాల ఆంజనేయులు గారికి ఫస్టుమార్కులు చేరుచున్నవి. తరువాత స్థానం నరసింహారావుగారి మధురవాణిన్ని, కరటకశాస్త్రుర్లయిన పులిపాక వెంకటేశ్వర్లుగారున్నూ మన్నింపదగిరి. బుచ్చమ్మ, మీనాక్షి వేసిన జక్కుల కుర్రవాడు, అగ్నిహోత్రావధానులు, వెంకటేశం కూడా మొదటి తరగతిలో ప్యాసు అయినవారే. డాక్టరు గోవిందరాజుల సుబ్బారావుగారి నటన విషయమై చెప్పవలసిన ముచ్చట కాదు. గిరీశపు వ్యవహారాలన్నిటిని మిక్కిలి చక్కగా నిర్వర్తించారు. కాని వేషంలో బిడ్డల తండ్రివలె గృహస్థోద్యోగివలె కనుపించెను. గాని గిరీశము యొక్క యిర్రెస్పాన్సిబిలిటీ, పలుగాకితనము, షోకు డంబములు చూపించే ఇరువది రెండు, యిరువది మూడేండ్లు ప్రాయాన్ని సుబ్బారావుగారు చూపలేకపోయిరి. అనగా వేష సౌష్టవము, పాత్రౌచిత్యము కొరవడినవి''.

ఇదీ నిష్పక్షపాత విమర్శకు చూపవలసిన దృక్పథం. సూరిశాస్త్రిగారు విశాల హృదయులు. విద్యారంగంలో సమత వారికి కావాలి. అందుకే శ్రీమత్తిరుమల గుదిమెళ్ళ వరదాచారిగారిని ప్రోత్సహించి కులమత లింగ భేదాలు లేకుండా అన్ని వర్గాల వారికీ సంస్కృతం నేర్పడానికి చిట్టి గూడూరులో సంస్కృత కళాశాలను నెలకొల్పారు. ఆదిలో సూరిశాస్త్రిగారి 'పర్ణశాల' అనే భవనంలోనే ఈ విద్యాలయం ఉండేది. ఈ విద్యా కేంద్రంలో ఒక తటాకం, దాని చెంత ఒక నాట్యశాల నిర్మించారు. ఈ నాట్యశాల గ్రీకు నాట్యశాలను పోలి ఉంటుంది. ఎందరో అధ్యాపకులూ, విద్యార్థులూ ఈ వసతి విద్యాలయం వల్ల విజ్ఞానవంతులయ్యారు. సూరిశాస్త్రిగారు వేదాలమీద ఉప్పులూరి గణపతి శాస్త్రిగారిచేత తెలుగులో సామాన్య జనులకోసం మూడునెలలు ఉపన్యాసాలు ఇప్పించారు. ఉప్పుసత్యాగ్రహంలో జైలుకెళ్ళారు.

సూరిశాస్త్రిగారి విద్యానిలయంలో రోజూ సమావేశమయ్యే వ్యక్తుల పేర్లు వింటేనే వారి గోష్ఠి ఎలా వుండేదో తెలుస్తుంది.

కవులు	:	పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, అబ్బూరి రామకృష్ణారావు
రచయితలు	:	పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి
ఆంగ్లకవులు	:	వెంపటి నాగభూషణం, సోమనాథవెల్లటూరి

చిత్రకారులు : బ్రహ్మ, వేణుగోపాల్

నటులు : నెల్లూరి నాగరాజారావు, ముంజలూరి కృష్ణారావు, పారుపల్లి సుబ్బారావు

సంగీత విద్వాంసులు : హరినాషభూషణం, గరికపాటి పాపయ్య దేవర, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు (సూరిశాస్త్రిగారి అల్లుడు)

ఈ ప్రసిద్ధులు వారి వారి రంగాలలో దారి దీపాలవంటి వారే.

కాశీనాథుని నాగేశ్వరరావు

(1862-1938)

ఆంధ్ర సారస్వతలోకం శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారికి ఏమీ ఋణపడలేదు - అనే వాక్యంతో ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తే ఇది అవిధేయతగా మాత్రం భావించవద్దని ప్రార్థన. పంతులుగారి పట్ల నాకున్న భక్తిశ్రద్ధలు ఇతరులకన్నా ఒక డిగ్రీ ఎక్కువేగాని అరవీసమైనా తక్కువకాదు. అయినా ఆయనకు ఆంధ్ర సాహిత్యలోకం ఋణపడలేదనే నా నమ్మకం. దాతకు ఎవరూ ఋణపడరు. కృతజ్ఞులై ఉంటారు. దానంగా ఇచ్చినవారికి ఋణపడ్డా మనుకోడం గొడ్రాలి కడుపున పుట్టామనుకోవడమే. పంతులుగారు సాహిత్యంలో కూడా నెరదాతలు. ఆయన ఇచ్చినంత సాహిత్య సంపద ఇంకెవరూ అయాచితంగా ఇవ్వలేదు.

పంతులుగారి సాహిత్య దానాలు అరవైఏళ్ళ కిందట మొదలైనాయి. ఏ శుభముహూర్తంలో[1] ఆయన ఆంధ్రవార పత్రికను బొంబాయిలో ప్రారంభించారో గాని నాటినుండి ముప్ఫయి సంవత్సరాలపాటు ఎడతెగకుండా పంతులుగారు ఆంధ్ర వాఙ్మయాన్ని శ్రీమంతం చేశారు. కొన్నివందలమంది ప్రముఖుల రచనలు ఆంధ్రదేశానికి ఆయన తమ పత్రికల ద్వారా సమర్పించారు. గురజాడ, గిడుగు, కొమర్రాజు, చిలకమర్తి, పానుగంటి మొదలైన కాకలు తీరిన జ్ఞానవృద్ధుల రచనలు మొదలుకొని శ్రీశ్రీ, కొడవటిగంటి లాంటి కొమ్ములు తిరుగుతున్న కోడె రచయితల చెంగనాల దాకా మూడుతరాల సృజనాత్మక నిర్మాణాలు పంతులుగారు స్థాపించిన పత్రికల వల్లనే అశేష ప్రజానీకానికి అందుబాటులోనికి వచ్చాయి. మధ్యంతరంలోని మహాకవులు ఇప్పటికీ సజీవులు చాలామంది ఉన్నారు. ఎప్పటికీ సజీవంగా ఉండే కావ్యాలు కొందరు వ్రాశారు. పంతులుగారు పెట్టిన పత్రికలలో వ్రాసిన వాళ్ళపేర్లు బేరీజు వేసినా అది ఆధునిక ఆంధ్ర వాఙ్మయ సూచిక అవుతుంది. ఆధునిక వాఙ్మయ చరిత్ర వ్రాసేవాళ్ళు పంతులుగారి పత్రికలను చూడకపోతే వాఙ్మయాన్నే చూడలేదు అనాలి. నండూరి, బసవరాజు, బాపిరాజు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, కొడాలి, రాయప్రోలు, జాషువా, నోరి, వేదుల, వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, భమిడిపాటి,

1. 1908 సెప్టెంబరు 9వ తేదీ ఆంధ్ర వారపత్రిక ప్రారంభించారు.

మొక్కపాటి, మునిమాణిక్యం ఒకరేమిటి చేవగల రచయితలందరూ పంతులుగారు నెలకొలిపిన ఏదో ఒక ద్వారం గుండా సాహిత్య భవనంలోనికి ప్రవేశించినవారే.

శంఖంలో పోస్తే తీర్థం అవుతుందో లేదోగాని ఒకనాడు భారతిలో రచన అచ్చుపడడం నిజంగా పట్టాభిషేకమే. తెలుగునాడులో చెళ్ళపిళ్ళ శిష్యుణ్ణని చెప్పుకొనడం సాహిత్య ఫేషన్ అయితే, భారతిలో వ్రాశారని రొమ్ము విరుచుకొని విర్రవీగడం కొండెక్కినంత గొప్ప. భారతి సాహిత్య శిఖరం. చాలాకాలం దాకా తంబుచెట్టి వీధిలోని ఏడోనెంబరు ఇల్లు ఆంధ్ర సాహిత్యానికి రాజధాని, పెట్టనికోట. పంతులుగారు మకుటంలేని మహారాజు. మరో రాజరాజు, ఇంకో కృష్ణరాయలు. రాజరాజు నన్నయగారితో 'ఇవి యేనున్ సతతంబు నాయెడకరం బిష్టంబులై యుండు' అంటూ అయిదు విషయాలు చెప్పుకొన్నాడు. పంతులుగారికీ సంతత దానశీలత, శశ్వత్సాధు సాంగత్యమూ లోకం చెప్పుకొనేటంత కరంబిష్టాలు.

కృష్ణరాయలవారు 'దేశభాషలందు తెలుగు లెస్స' అనే శ్రీనాథుని నినాదం ప్రచారం చేశారు. పంతులుగారు ఈ సంగతిని ముప్ఫయి సంవత్సరాలపాటు నిరూపిస్తూ వచ్చారు. ఒకరకంగా చూస్తే రాజరాజుకన్నా రాయలవారికన్నా కొన్నింతల సాహిత్యసేవ పంతులుగారే చేశారనిపిస్తుంది. వాళ్ళిద్దరూ స్వాంతకీర్తి కోసం వాఙ్మయ పోషణ చేస్తే పంతులుగారు ప్రజలకోసం, దేశంకోసం, విజ్ఞానాన్ని వ్యాపింపజేశారు. కర్మాచరణంలో ఉన్న అధికారంపై నమ్మకమేగాని ఆయనకు ఫలాపేక్ష ఏనాడూ లేదు.

పంతులుగారు ప్రజలకోసమే పత్రికలు పెట్టారు. ప్రజల కోసమే నడిపారు. 1908లో ఆంధ్ర వారపత్రికను ప్రారంభిస్తూ సంపాదకీయంలో ఆయన చేసిన మొట్టమొదటి ప్రకటన చూస్తే ఈ సంగతి తేటతెల్లమవుతుంది. ''ప్రజలకు విద్యాభివృద్ధియు, ప్రపంచ జ్ఞానాభివృద్ధియు గావించుటయే మా ముఖ్యాభిప్రాయము. ప్రజల యోగక్షేమాభివృద్ధికి దేశాభిమానమును స్వామి భక్తియును మిగుల సహకారులని మేముద్ఘోషించు చెందుము'' అని ఆయన ఎలుగెత్తారు.[2] ప్రజాశక్తిని గుర్తించిన మొదటి జర్నలిస్టు ఆయనే! ఆ పదాన్ని సృష్టించి విరివిగా వాడిన మొదటి రచయిత వారేనేమో! 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే అభ్యుదయ నినాదం పంతులుగారి రచనలో స్పష్టంగా మారుమోగుతూ వుంటుంది. వర్తమాన యుగమునందు ప్రజలు వాఙ్మయ పోషకులు.[3] 'శ్రీమంతుల సహాయముకంటెను వర్తమాన యుగమునందు ప్రజాదరణము వాఙ్మయాభివృద్ధికి సాధనముగ నున్నది' అని పంతులుగారు మొదటనే చాటి చెప్పారు.[4]

ఆయన ఉద్దేశంలో తెలుగు ప్రజలంటే పత్రికలు చదివే ఏ కొద్దిపాటి అక్షరాస్యులో మాత్రమేకాదు. 'రామేశ్వరమునకును కాశీపురమునకును రంగూనాకును క్వెట్టాకును నడుమనున్న 'ముఖ్యపట్టణాలలో వుండే తెలుగు వాళ్ళందరినీ ఆయన దృష్టిలో పెట్టుకొన్నారు. ''వీరల నందర నేకీభావులుగ జేయుటకాంధ్రభాషకు శక్తి సామర్థ్యములు

2. 9-9-1908 ఆంధ్ర వారపత్రిక
3. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర (ప్లవంగ సంవత్సరాది సంచికలో పునర్ముద్రితం. పుట.76)
4. అదే గ్రంథంలో అదే పుట.

గలవు. భిన్న దేశములందుండు తెలుగువారి నేక జాతీయులనుగ జేయుటకు మాతృ భాషయే తగిన బంధన సాధనము'' అని పంతులుగారు తలపెట్టారు.[5] తెలుగువాళ్ళనందరినీ ఒక్క తాటిమీద నిలబెట్టారు.

వాఙ్మయ వికాసానికి ప్రజా హృదయమే సుక్షేత్రమని వారికి తెలుసు. ప్రజలకు అందని విజ్ఞానం ఎంత గొప్పదైనా అడవి కాచిన వెన్నెలే. ప్రజల వృద్ధిక్షయాలలో వాఙ్మయసిద్ధి క్షయాలు ప్రతిబింబిస్తాయి. 'ప్రజల విజయములు, ప్రజాభివృద్ధి, ప్రజా వ్యాపనము, వాఙ్మయాభివృద్ధికిని; ప్రజాక్షయము, ప్రజా దౌర్బల్యాము వాఙ్మయ స్తంభనమునకును గారణము లగుచుండును' అని ఆయన ఎప్పుడో గుర్తించారు.[6] ఆదిమ యుగాలలో 'బ్రాహ్మణాధీనంబైన నిత్య కర్మానుష్ఠానము ప్రాణకళ గోల్పోయి ప్రజల నిత్య జీవన యాత్రకు నిరర్థకమైందని' ఆయన స్పష్టపరిచారు.[7] ప్రజలకు వారికి పరిచితమైన భాషలందు ధర్మోపదేశాలు చేసిన బౌద్ధ, జైన మతాల విలువను ఆయన అంచనా కట్టారు. శంకరాచార్యులు జైన బౌద్ధ మతాలను నిర్మూలం చేసినా ప్రజా సామాన్యంలో ఆ మతాలు వ్యాప్తిని పొందినవనీ, శైవము బౌద్ధంలోని మంచి గుణాలు తనలో జీర్ణించుకొని ప్రజలను ఆకట్టుకొందని పంతులుగారు స్పష్టపరిచారు.[8] పురాణయుగంలో పండితులు ''సహజమైన సచేతనమైన దేశీయభాషా సంప్రదాయములను ప్రజావాంఛలను ననుసరించుటకు బదులు పురాతనమైన చిరకాల ప్రతిష్ఠితమైన సంస్కృత వాఙ్మయము ననుసరించుచు నిర్మాణ కౌశలమునకు భంగము గలుగజేసిరి'' అని పంతులుగారు నేరారోపణ చేశారు.[9] నన్నయగారి కాలం వచ్చేసరికి పండితులకును ప్రభువులకును ప్రజా సంకల్పమును ఆపుట దుష్కరమైనదని గుర్తించారు. ''ప్రజాహితార్థము కాకపోయినను తమ కీర్తికొరకైనను దేశీయ వాఙ్మయ నిర్మాణమునకు బూనుకొనవలసిన యవసరము కలిగినది'' అని పంతులుగారు తీర్పు చెప్పారు.[10]

పండితాశ్రయమైన వాఙ్మయం ప్రజాపరమైనప్పుడు పంతులుగారు పరవశిస్తారు. ''ప్రజా హృదయమునందు విజ్ఞానము లేక వికాసము సాధ్యముకాదని'' ఆయనకు తెలుసు.[11] ప్రజాశక్తిని సకల రంగాలలో వికసింప చేసే ఆంధ్ర సాహిత్య మహోదయం ఆయన కాంక్షించారు. ప్రజల హృదయాన్ని గ్రహించడంలో ఆయన ప్రతిభావంతులు. ''ఆంధ్ర హృదయ శీలమధివ్యాప్తకముగాని వ్యావర్తకము కాదు. ఉదారముగాని

5. సాధారణ సంవత్సరాది సంచిక (1910) ప్రస్తావన
6. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర (ప్లవంగ సంవత్సరాది సంచిక (1967-68) లో పునర్ముద్రితం. అందులో 70వ పుట)
7. బసవ పురాణం పీఠిక
8. అందులోనే
9. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర (సంస్కృత వాఙ్మయ విభాగంలో) ప్లవంగ సంవత్సరాది సంచిక (1967-68) పుట.8)
10. అదే సంవత్సరాది సంచిక - అదే పుటలో.
11. విభవ సంవత్సరాది సంచిక (1928) ప్రస్తావనలో.

సంకుచితము కాదు. సరళముగాని వక్రముకాదు'' అని ఉద్బోధించారు.[12] ''దేశము విశాలము, భాష మధురము, జనులుత్సాహ సంపన్నులు, ఆంధ్ర భాషయందు పత్రికా పాఠకులు (ఇరవైఆరు) వేలమంది గలరు. వ్యాసలేఖకు లనేకులు గలరు. విచారణీయంబులైన విషయంబు లనేకములు గలవు. జనాభిప్రాయముల కనుకూలంగా విషయ విమర్శనము'' చేసే పత్రికలు కావాలని ఆయన సంకల్పించారు.[13] అందుకే ఒకటి కాదు నాలుగు పత్రికలు క్రమేణా పెట్టారు. జర్నలిజానికి జనకులయ్యారు. స్వర్ణయుగానికి నాంది పలికారు.

జర్నలిజం హడావిడిలో వ్రాసిన సాహిత్యం అని ఒక నిర్వచనముంది. పంతులుగారు జర్నలిస్టులేగాని తొందరపాటు తొట్రుపాటులేని సాహిత్యవేత్తలు కూడా. నిశ్చలమైన విశ్వాసాలు, నిర్దుష్టమైన తాత్త్వికచింతనా వున్నవారు. ప్రత్యేక దార్శనిక దృక్పథం లేనివాళ్ళు యుగపురుషులు కాలేరు. కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు ఎప్పుడో చెప్పినట్లు ఆంధ్రదేశ చరిత్రలో వీరేశలింగంగారికి తరువాతది నాగేశ్వరరావు యుగమే.[14] సంకల్ప బలము, కార్యదీక్షా, త్యాగమూ యుగపురుషులిద్దరికీ సమానమే అని కోలవెన్నువారు అన్నారు. వీరేశలింగంగారిదీ నాగేశలింగంగారిదీ విద్యా కుటుంబాలే (పంతులుగారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు నాగలింగం) కందుకూరి వారిలోనూ కాశీనాథునివారిలోనూ కృతిభర్తలూ, కృతికర్తలూ వున్నారు. అయితే ఈ యిద్దరూ పాతకీర్తిని చాటుకోలేదు. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకొనే గతివాళ్ళకు పట్టలేదు. వాళ్ళే మహావృక్షాలు కదా!

వీరేశలింగంగారి ఉద్యమాల సత్ఫలంలోని బీజమే నాగేశ్వరరావుగారిలో మొలకెత్తి వేళ్ళూని విస్తరించింది. వీరేశలింగంగారిలో మూడు సుగుణాలను పంతులుగారు చూశారు.[15] స్వయం సహాయం, సత్యప్రియత్వం, నిరంతర వ్యవసాయ పరాయణత్వం అనే ఆ మూడింటినీ తమ స్వంతం చేసుకున్నారు. జీవితంలో సాధించవలసినవి ఎన్నో ఉన్నాయని గ్రహించారు. పైకి రావాలనే అంతులేని అపారమైన ఆశ, ఆకాంక్ష ఆయనకు తొలినుంచీ వుండేవి.[16] అక్షరజ్ఞానంలేని సంకుచితబుద్ధులైన జనుల మధ్య అభివృద్ధి చెందడం కష్టం అని ఆయన పరసీమలకు వెళ్ళిపోయారు.[17] వ్యక్తి సేవ చేయడం ఇష్టం లేదు.[18]

పంతులుగారు 1862లో పుట్టింది కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా ఎలమర్రు గ్రామంలో. బందరు హిందూ హైస్కూలులోనూ, గుంటూరు ఎ.ఇ.ఎల్.ఎం.

12. భారతి - జనవరి 1924. తొలి స్వవిషయంలో.
13. ఆంధ్ర దినపత్రిక తొలి సంపాదకీయంలో (1-4-1914)
14. భారతి, మే 1938
15. విరోధికృత్తు సంవత్సరాది సంచిక (1911) ప్రస్తావనలో
16. పంతులుగారు తమ బావగారికి వ్రాసిన ఉత్తరం (గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి దేశోద్ధారక చరిత్ర, పుట.42)
17. పంతులుగారు తమ బావగారికి వ్రాసిన ఉత్తరంలోనే.
18. పంతులుగారు తమ బావగారికి వ్రాసిన ఉత్తరంలోనే.

కాలేజీలోనూ, మద్రాసు క్రిష్టియన్ కాలేజీలోనూ చదువుకొన్నారు. వీరేశలింగంగారి ప్రభావంలో పడి సంఘ సంస్కారాభిలాషులయ్యారు. మద్రాసులో చదువు కొంటున్నప్పుడే రెంటాల వెంకట సుబ్బారావుగారి దృష్టిలో పడ్డారు. వెంకట సుబ్బారావుగారు హైకోర్టు వకీలేగాని 'వెంకట సుబ్బారావు మేడీజీ' అనే పేర విద్యార్థుల పుస్తకాలకు గైడ్లు రాసి కీర్తిని, ధనాన్ని ఆర్జించారు. మందుల వ్యాపారం కూడా వుండేది. వెంకట సుబ్బారావుగారు నాగేశ్వరరావుగారి గుణగణాలను మెచ్చుకొని తమ మేనగోడలుఁ మాయమ్మను యిచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు.

తమ తల్లిగారికి ఇష్టం లేకపోయినా నాగేశ్వరరావుగారు పెళ్ళికి ఒప్పుకొన్నారు. ఇది శాఖాంతర వివాహం. కాశీనాథుని వారు ఆరాధ్య బ్రాహ్మణులు. రెంటాలవారు నియోగులు. నాగేశ్వరరావుగారి తల్లిగారు పెళ్ళికి రాలేదు. 1890లో పంతులుగారి స్నేహితులే మగపెళ్ళివారైనారు. వారిలో కొండా వెంకటప్పయ్యగారు ప్రముఖులు. వివాహమైనాక పంతులుగారు రెంటాల వారింట్లోనే వుండేవారు. బి.ఎ. పూర్తి చేయకుండానో రెంటాల వారిలాగ పుస్తక ప్రచురణ, మందుల వ్యాపారం చేయాలను కున్నారు. రెంటాలవారు మైలాపూరులో విక్టోరియా డిపోను నడుపుతూ వుండేవారు. దాని అభివృద్ధికి కావలసిన ప్రకటన పద్ధతులను రెంటాలవారు కొత్త పద్ధతులలో అమలు చేశారు. నాగేశ్వరరావుగారు రెంటాల వారి వద్ద వ్యాపారంలో బాగా శిక్షణపొంది అన్నీ ఆకళింపు చేసుకున్నారు. అయితే అభిప్రాయభేదాలు వచ్చి రెంటాలవారితో వుండలేకపోయారు. ముందు కలకత్తా వెళ్ళి వ్యాపారం చేసి దెబ్బతిని, నాగేశ్వరరావుగారు బొంబాయి చేరుకున్నారు.

బొంబాయిలో విలియం అండ్ కో అనే మందుల కంపెనీ వుండేది. దాని యజమాని ఒక పాశ్చాత్యుడు. పంతులుగారు అక్కడ ఉద్యోగానికి చేరారు. కార్యదక్షత, సత్ప్రవర్తనతో యజమానిని మెప్పించారు. ఆ దొర స్వదేశానికి వెళ్ళిపోతూ కంపెనీని నాగేశ్వరరావుగారికి యిచ్చివేశారు. ఆ మందుల కంపెనీలోనే పంతులుగారు 1893లో 'అమృతాంజనం' అన్న పేరుతో ఒక ఔషధాన్ని తయారుచేసి, వ్యాపార ప్రకటనా పద్ధతులు అమలుచేసి దానికి ప్రాచుర్యం తెచ్చారు. భార్యతో కలిసి పంతులుగారు స్వయంగా అమృతాంజనం సీసాలకు కాగితాలు చుట్టేవారట. స్వయం సహాయంతో నిరంతర వ్యవసాయ పరాయణత్వంలో ఆయన అమృతాంజనం పేరిట కల్పవృక్షాన్ని భూమికి దింపారు. దాన్ని ఆంధ్రుల పేరిట కల్పకాన్ని చేయడంలోనే ఆయన ఔదార్యం కనబడుతుంది. అమృతాంజనం అమ్మకాలవల్ల ఆర్జించిన అనేక లక్షల రూపాయల నుండి పెద్ద పెద్ద మొత్తాలను వివిధ సాంఘిక సారస్వత ధర్మకార్యాలకు వెచ్చిస్తూనే వచ్చారు.

రెండు చేతులా ఆర్జిస్తున్న కొద్దీ పంతులుగారిలోని మహాపురుష లక్షణాలు మొగ్గ తొడగడం ప్రారంభించాయి. స్వార్థం పోయి పరమార్థం పెరిగింది. అక్షరజ్ఞానంలేని సంకుచిత బుద్ధులైన జనుల మధ్య అభివృద్ధి చెందడం కష్టమని ఆదిలో అనుకున్నారు. తాము అభివృద్ధి చెందడం మొదలుపెట్టాక ఆ అక్షరజ్ఞానం లేనివాళ్ళూ, ఆ సంకుచిత బుద్ధులూ

కూడా అభివృద్ధి చెందాలనే తహతహ పంతులుగారిలో ఇనుమడించింది. విజ్ఞానవ్యాప్తిని ఉద్యమంగా చేపట్టారు. వాఙ్మయ విస్తరణ చేశారు. సాహిత్యాభ్యుదయం చూశారు. సారస్వత పతాకం ఎగరవేశారు.

ఇవాళ వాఙ్మయం, సాహిత్యం, సారస్వతం అనే మాటల్ని పర్యాయపదాలుగా మనం వాడుతున్నాం. అయితే పంతులుగారి వుద్దేశంలో సాహిత్యం, సారస్వతం అనేవి రెండు విభిన్న పదాలు. ఇవాళ మనం సంస్కృతి అనే మాటను ఏ అర్థంలో వాడుతున్నామో ఆ అర్థంలో సాహిత్యం అనే పదాన్ని పంతులుగారు వాడేవారనిపిస్తుంది. ఒక పీఠికలో ఆయన 'సాహిత్యమునకు సారస్వతము మకుటము' అన్నారు.[19] లలితకళలు, నృత్య గీత వాద్యాదులు సాహిత్యాంగాలని చెప్పారు. ఇవి సాహిత్య నిర్మాణ వికాసాలకు సాధనాలైనా భావ ప్రకాశానికి భాషే మూలాధారమని చెప్పారు. సాహిత్యతత్త్వానికి తత్త్వ విచారానికి యిదే సాధనమని చెప్పారు. మరొక వ్యాసంలో చిత్రకళను సాహిత్యంలో చేర్చారు. భావ ప్రదర్శనంలోనూ రూప నిర్మాణంలోనూ భారతీయ సంస్కారంలేని చిత్ర రచనలు సాహిత్యాభ్యుదయమునకు నిరుపయోగం అన్నారు.[20] ఈ మాటలవల్ల సంస్కృతిని పంతులుగారు సాహిత్య పదంలో నిర్దేశించారని వూహిస్తున్నాను.

పంతులుగారు తమ రచనలో ఎక్కడా సంస్కృతి అనే మాటను వాడినట్టు కనబడదు. సంస్కారం అనే పదం ఆ ఉద్దేశంలో వాడేవారు. ప్రాచ్య పాశ్చాత్య సంస్కారాలు రెండింటినీ ఆయన ఆకళింపు చేసుకొన్నారు. ఆర్షవిజ్ఞానాన్నీ, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్నీ ఆయన సమన్వయం చేశారు. ఒక ప్రత్యేక దర్శనాన్ని ఆయన ప్రతిపాదించకుండానే ప్రచారం చేశారు. పంతులుగారి విశ్వాసాలనీ, ప్రవచనాలనీ క్రోడీకరించి, నాగేశ్వర దర్శనం ఏమిటో పరిశీలించకపోతే వారి సాహిత్య దృక్పథం అర్థంకాదు.

ప్రపంచంలోని ప్రతి తత్త్వవేత్తా సాహిత్య నిర్వచనాలు చేశారు. దార్శనిక పరిజ్ఞానంతోనే అలంకారికులు, రస స్వరూపాన్నీ కావ్య ప్రయోజనాన్నీ నిర్దేశిస్తారు. కాశ్మీర శైవం వల్ల ప్రభావితులైన ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడూ, భారతీయ లక్షణ గ్రంథాలను పరిపుష్టం చేశారు. ఆ ధ్వని సిద్ధాంతాలనే సర్వులూ ఆమోదించారు. నాగేశ్వరరావు పంతులుగారు ఈ దృక్పథంతోకాక స్వయంగా ఒక సాహిత్య దర్శనం రూపొందించుకొన్నారు.

ఆయన పుట్టింది శైవుల ఇంట. పారాయణ చేసినది భగవద్గీత. దీక్ష పుచ్చుకొన్నది శ్రీవిద్య. పరిశీలించినవి అనేక తత్త్వాలు. వీటన్నిటినీ మేళవించారు. ఈ సమన్వయం వల్ల ఒక నూతన సిద్ధాంతం ఏర్పడుతుంది. ఇది పంతులుగారి ప్రతి చర్యలోనూ ప్రతి రచనలోనూ కనబడుతుంది. ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకొంటేగాని పంతులుగారి వ్యక్తిత్వం మనకు బోధపడదు. నాగేశ్వర దర్శనాన్ని సంగ్రహంగా వివరిస్తాను.

---

19. సాహిత్యతత్త్వ విచారము - సమీక్ష - జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి రచన (ప్లవంగ ఉగాది సంచిక - పుట.209)

20. అజంతా విహారములు వ్యాసం (ప్లవంగ ఉగాది సంచిక పుట.133)

జగత్తు శక్తిమయం. శక్తి మూడురకాలు. అవి ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు. ఈ శక్తి రూపం వల్లనే జగత్తు ఏర్పడుతూంది.[21] చిచ్ఛక్తి సర్వ వ్యాపకం. భారతీయ తత్త్వ పరిభాషలో చిచ్ఛక్తికి ఆధునికంగా రేడియో యాక్టివిటీ అనే అర్థాన్ని పంతులుగారు చెప్పారు.[22] ఆహతశబ్ద రూపమైన జగత్తు అనాహత శబ్దరూపమైన శక్తి మూలంగా వశమగుతుంది.[23] పరిమితమైన శక్తిని అపరిమితంచేసి, సర్వాత్మత్వమును పరిస్ఫుటం చేయడమే సకల యోగాలకు పరమార్థం.[24] ఆత్మను బాహ్య విషయారాధనం నుండి అంతర్ముఖం చేయడమే యోగం.[25] యమనియమత్యాగాది యోగాంగాలు పదిహేను వున్నాయి. ఈ అంగాలతో కూడిన రాజయోగమే పూర్ణయోగం. అదే మోక్షానికి సాధనం.[26]

మానవులు కర్మలను పరహితార్థం చేస్తేనే మోక్షం. స్వకామ్యార్థం చేస్తే బంధమే లభిస్తుంది.[27] మోక్షం పురుషార్థాలలో ప్రధానమైంది.[28] చతుర్విధ పురుషార్థాలకూ ధర్మం కీలకం. అర్థకామాలు ధర్మాధీనాలు, ధర్మం అర్థాకామాలకు అతీతం.[29] ధర్మానికి అర్థం నీతి. ఆత్మదృష్టితో ఏ నీతి పాలింపదగినదో అదే ధర్మం.[30] నీతే జ్ఞాన యాత్రకు సాధనం. పురుషార్థానికి ఫలం.[31]

జీవయాత్రకు పరమార్థం సుఖప్రాప్తి. దుఃఖనివృత్తి.[32] జీవయాత్రలో వ్యక్తావ్యక్తాల పరిజ్ఞానమే మతాలకూ, ధర్మాలకూ, కర్మలకూ సాహిత్యానికి, కళలకు, శాస్త్రాలకూ పరమఫలం. అవ్యక్తమైన పరమాత్మకూ వ్యక్తమైన విశ్వానికి వ్యక్తావ్యక్తమైన జీవుడిలోనే ధర్మప్రతిష్ఠ కలుగుతోంది.[33] సర్వవ్యాపకమైన చిచ్ఛక్తి బ్రహ్మాండంలో వున్నట్లే పిండాండంలో కూడా వుంటుంది.[34] దానిని అనుభవవేద్యం చేయడమే యోగశాస్త్రాలకు మంత్ర తంత్రాలకూ కావ్యకళలకు ప్రయోజనం.[35]

విశ్వవ్యాప్తమైన రేడియోశక్తిని యంత్ర సాధనాలతో శబ్దరూపాన ప్రత్యక్షం చేసుకునేటట్లు బ్రహ్మాండ వ్యాప్తమైన చైతన్యశక్తిని మంత్రరూపంతో దేహంలో ప్రత్యక్షం

21. ఈ దర్శనం పంతులుగారి వివిధ రచనలు నుండి క్రోడీకరించాను. అవి ప్లవంగ సంవత్సరాది సంచిక (1967-68)లో సంకలనమయ్యాయి. అన్యథా పేర్కొనకపోతే ఈ అధోజ్ఞాపికలలోని పుటల సంఖ్య ఆ సంచిక పేజీలలో సూచిస్తాయి.

22. పుట.135

23. పుట.40

24. పుట.52

25. పుట.16

26. పుట.219

27. పుట.62

28. పుట.43

29. పుట.27

30. పుట.230

31. పుట.192

32. పుట.4

33. పుట.60

34. పుట.40

35. పుట.42

చేసుకోవాలి.[36] సాధనలకు సకల సాధనాలు ధర్మక్షేత్రమైన శరీరంలోనే ప్రత్యక్షంగా వున్నాయి.[37] **అఖండమైన విశ్వవ్యాప్తమైన చైతన్యశక్తిని ఆత్మయందు ఆవాహనచేసి శక్తి** నేకముఖం చేయడమే యోగం.[38] కుండలినీ యోగమే ఆనందరసాన్ని కలుగచేస్తుంది.[39]

మంత్రతంత్ర యోగశాస్త్రాలు శ్రీవిద్యారూపంలో ఈ పరమార్థాన్ని సాధించుటకు వినియోగపడుతున్నాయి.[40] జలయంత్రాలు, వాయుయంత్రాలు, ఆవిరియంత్రాలు, విద్యుద్యంత్రాలు మొదలైనవి లలితాస్తోత్ర ప్రతిపాదితమైన మహాశక్తి మానవ ధర్మాభ్యు దయానికి వినియోగపడే విధాన్ని విశదం చేస్తున్నాయి.[41] ఆదికాలంలో భయభ్రాంతులకు మూలమైన ప్రకృతిశక్తులు కాలక్రమాన వశవర్తినులై మానవ ధర్మాభ్యుదయానికి వినియోగపడుతున్నాయి.[42]

మానవాభ్యుదయానికి మానవ విజ్ఞానం మూలధనం, సకల శాస్త్రాల విజ్ఞానమూ మానవాభ్యుదయానికీ విశ్వ కల్యాణానికీ వినియోగించుటే విజ్ఞానానికి పరమార్థం.[43] విజ్ఞానం పశుప్రవృత్తిని మానవ ప్రవృత్తికిని, దైవ ప్రవృత్తిని బ్రహ్మ ప్రవృత్తికిని మరల్చడానికి వినియోగపడుతుంది.[44] దుర్లభమైన బ్రహ్మాధికారం విజ్ఞాన సంపన్నులకు సాధ్యము.[45]

బ్రహ్మ విద్యకు సాహిత్యాలూ, కళలూ కూడా సాధనాలు.[46] చిరకాలానుగతాలైన కావ్య సంప్రదాయ సంకేతాలు విశ్వ సాహిత్య రచనకూ సందర్శనానికి రసానందానికి ప్రతిబంధకాలైనాయి.[47] కావ్యాలు కవుల సంకల్ప సంస్కారానురూపాలు.[48] విశ్వ నిర్మాణంలో లాగే కావ్యరచనకు కూడా ఇచ్ఛాశక్తి బీజం. జ్ఞానశక్తి, క్రియాశక్తి కీలకం.[49] సాహిత్యం అవ్యక్తానికి సువ్యక్తమైన పురుషార్థం[50] సాపేక్షమైన సాహిత్య రసానందానుభవం నిరపేక్షమైన ఆత్మానందానుభవంలో ఐక్యం పొందుతూంది.[51] భావశబ్దార్థ కళల యోగానుభవమే సాహిత్యం.[52]

---

36. పుట.42
37. పుట.62
38. పుట.30
39. అదే పుటలో
40. పుట.42
41. పుట.138
42. పుట.42
43. పుట.4
44. పుట.138
45. పుట.140
46. పుట.6
47. పుట.28
48. పుట.27
49. పుట.28
50. పుట.207
51. పుట.208
52. అదే పుటలో

సారస్వతాభ్యుదయానికి సహజమైన భావాలలాగే సహజమైన భాష మూలాధారం.[53] అవ్యక్తమైన శక్తికి నాదము ప్రథమవ్యక్తి స్వరూపం. నాదం శబ్దరూపంలో బ్రహ్మాండావృతమైన భాషాధారంతో బ్రహ్మాండాన్ని గ్రాహ్యం చేస్తున్నది.[54] జీవజాలం ఆత్మోపలబ్ధికి అణువు మొదలు మహత్తు వరకు వ్యాప్తమైన ప్రకృతి అంతా సాధన భూతముగా వుంది.[55] విశ్వసాహిత్యమంతా ఈ పరమ ప్రయోజనాన్ని విజ్ఞాన రూపంలో సమకూర్చుతోంది.[56]

అనంతమైన విశ్వ విజ్ఞాన సామ్రాజ్యానుభవం సకల మానవులకును సాధ్యము. సకల జనులూ సాధకులే, అర్హులే. అధికారులే.[57] జాతిమతాది భేదాలు, వర్ణాశ్రమ భేదాలు, అనిత్యాలూ, సాపాక్షాలేగాని శాశ్వతాలు నిరపేక్షాలు కావు. ఆత్మోన్నతికి సకల మానవుల సమానాధికారులు.[58] అవయవాభివృద్ధిలో తప్ప స్త్రీలు పురుషుల కేగుణమునందూ తీసిపోరు.[59]

స్త్రీ పుంసంయోగం విశ్వ ప్రవృత్తికి విశ్వ కల్యాణానికి మూలం.[60] శృంగారము సృష్టి స్థితుల కాధారము. ప్రేమమూలము. హృదయావిర్భూతం. విశ్వాత్మకం, ఆనందకరం, కార్య సాధనం రసరాజం. వీరంలేని శృంగారం జడప్రాయం. శాంతములేని శృంగారం కామపరాయణం. శాంత శృంగారము రసానంద పరాయణం.[61]

రసానందం విషయాసక్తంకాక విషయాతీతంగా వుండడమే విశ్వశ్రేయస్సుకు సాధనం.[62] ప్రపంచంలో శుద్ధసత్త్వము కానీ శుద్ధ చెడుగానీ లేదు. వాటి మిశ్రమాన్నే మనం చూస్తాం. ప్రపంచమే మిశ్రమం. శ్రేయస్సు కవి సంకల్పంలో వుంది.[63]

ఇదీ పంతులుగారి ఫిలాసఫీ. దీన్నే ఆయన ముప్ఫయి సంవత్సరాలపాటు ఆచరణలో పెట్టారు. చెయ్యకుండా ప్రచారం చేశారు. ఈ దృష్టితోనే పాత సాహిత్యాన్ని పరిశీలించారు. కొత్త సాహిత్యాన్ని ప్రోత్సహించారు. రేపుకోసం ఎదురుచూడ్డం మంచిదేగాని నిన్నలో బతకక్కూడదు. అందుకే పంతులుగారు ఎప్పుడూ వర్తమానం సంగతి తెలుగువాళ్ళకు జ్ఞాపకం చేస్తూ వుంటారు. ప్రాచీనతను అర్థం చేసుకొని ఆధునికంగా జీవించాలని ఆయన ఆశయం. ఆ ఆశయసిద్ధి కోసమే ఆయన భారతిని 1924లో స్థాపించారు.[64] అప్పటికి మూడు పత్రికలు వారికున్నాయి. వారపత్రిక, ఉగాది సంచిక,

53. పుట.200
54. పుట.40
55. పుట.37
56. అదే పుటలో
57. ఉట.140
58. పుట.238
59. పుట.220
60. పుట.114
61. పుట.34
62. పుట.91
63. పుట.220
64. సంపుటి 1 - సంచిక 1 - జనవరి 1924

దినపత్రికా వున్నా మాసపత్రికను స్థాపించడంలో ఒక కారణం వుంది. ''ప్రజాదృష్టిని నవ జీవన ప్రవృత్తియందు లగ్నము చేయవలసిన యవసరము గలిగినది. ఆ యవసరము సఫలము చేయుట కాంధ్ర ప్రపంచము పూర్వాపర సంస్కారములను సమన్వయము చేయుటకు పూనుకొనుచున్నది'' అని పంతులుగారు భారతి మొట్టమొదటి సంచికలోని స్వవిషయంలో చెప్పారు.

నవజీవన ప్రవృత్తిని మనసారా ఆశించడంవల్లనే పంతులుగారు యువజనులను ఉత్తేజపరిచారు. ఒక ప్రస్తావనలో యిలా వ్రాశారు. ''నిరంకుశాధికారులకు రాజకీయ స్వాతంత్ర్యము గిట్టదు. సనాతనులకు సాంఘిక సంస్కరణము పనికిరాదు. మతాచార్యులకు మత సంస్కారము పాపభూయిష్టము. ధనస్వాములకు ప్రజా స్వాతంత్రము భయంకరము. సాహిత్య కళాభిమానులకు నవీన మార్గము లుపద్రవకరములు. స్వాతంత్ర్య ప్రియులైన వీరులు, ధీరులు, కవులు, గాయకులు, కళాభిజ్ఞులు స్వాతంత్ర్య యుగస్థాపనమునకు వారి శక్తి సామర్థ్యములను వినియోగించవలసిన యవసరము గలిగినది. ఆంధ్రదేశ భాగ్యోదయము స్వాతంత్ర్య ప్రియులైన యువజనుల మీద యాధారపడియున్నది.[65]

పంతులుగారు తమ ముప్ఫయి సంవత్సరాల సాహిత్యసేవలో ఎప్పటికప్పుడు ఆయాతరాలలో యువకులను ప్రోత్సహిస్తూనే వచ్చారు. రాయప్రోలు సుబ్బారావుగారు కొత్తరీతులలో కవిత్వం వ్రాస్తున్నప్పుడు 1914లో ఆనంద ఉగాది సంచిక ప్రస్తావనలో పంతులుగారు యిలా వ్రాశారు.

''నూతన భావములు వికసించుచున్నవి. నూతన భావపూరితములైన గీతములను కథలును రచింపబడుచున్నవి. నూతన శైలి సంక్షిప్తము. నూతన భావములు గంభీరములు. నూతన సంప్రదాయములపరిచితములు. నూతనాదర్శములు సదాశాభరితములు. శైలియు భావములను సంప్రదాయమును విపరీతాభిప్రాయమును గలిగించుట సహజము. కాలక్రమమున నివి పరిపాటియై భాషకు నూతనాలంకారముల సమకూర్చగలవు. రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన తృణ కంకణము, కష్టకమల మొదలగు రాగ గీతములు రసభరితములు''.

ఇరవై సంవత్సరాల తరువాత శ్రీశ్రీ క్రొత్త క్రొత్త ప్రయోగాలు ప్రారంభిస్తున్నప్పుడు భావకవులను అందరూ ఎత్తి పొడుస్తున్నప్పుడు, అక్కిరాజు ఉమాకాంతంగారు నవ్య సాహిత్యంపై విరుచుకుపడ్డప్పుడు పంతులుగారు ఒక ఉగాది సంచిక ప్రస్తావనలో యిలా వ్రాశారు.

''గతించిన పదేండ్ల యందును సారస్వతమునందు వెలసిన నవీన సాహిత్య నిర్మాణములు ఖండన మండనములకు పాత్రమైనను క్రమ వికాసమును పొందుచు విద్యావంతుల హృదయముల నాకర్షించుచున్నవి. దేశమంతయు రాజకీయ సాంఘిక మతాధి విషయములందు స్వాతంత్ర్య ప్రాప్తికై పరితపించుచున్నప్పుడు సారస్వతమునందీ

65. శ్రీముఖ సంవత్సరాది సంచిక (1933-34) ప్రస్తావన

పరితాపము ప్రతిబింబించుచుండును. యువజనులు నవజీవన నిర్మాణమునకై మహోత్యాగము చేయునప్పుడు సాహిత్య రచనలందు వారి త్యాగము సహజముగ ప్రతిబింబించుచుండును. సకల నిర్మాణములకును స్వాతంత్ర్యము మూలాంకురము. స్వాతంత్ర్య విలసితమైన రచనలు ప్రాచీన నవీన భేదమును సంస్కృతాంధ్ర భేదమును లేక ప్రజాదరమును బడయుచున్నవి.''[66]

ఒక ప్రముఖ సాహిత్య పత్రికా, దాని అధిపతీ సాహిత్యంలో స్వాతంత్ర్యాన్ని యింతగా ప్రోత్సహించబట్టే మన ఆధునిక సాహిత్యం చైతన్యవంతమైంది. పంతులుగారి స్వాతంత్ర్యాభిమానం యతిప్రాసలు అక్కర్లేదని అంగీకరించేటంతవరకు వెళ్ళింది. ప్రమోదూత ఉగాది సంచికలో సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు యతిప్రాసల విషయమై ఒక వ్యాసం వ్రాశారు. దానిని తమ ప్రస్తావనలో పేర్కొంటూ పంతులుగారు యిలా అన్నారు. ''కవిత్వమునకు హృదయము భావమైనప్పుడు మాటల ప్రతిబంధకమును తొలగించుట వలనను కావ్యములందు రసానందమును కభ్యంతరములు గలుగజాలవు.''[67] ఆధునికులను పంతులుగారు యిలా వెనకేసుకు రావడం కొండంత బలాన్ని యిచ్చింది. ఎంకిపాటల గాలిదుమారంలో 'ఆ పాటలలో భావ సంపద యుండుట వలననే భారతిలో వానిని ప్రకటించితిమి... శ్రీ సుబ్బారావుగారి ప్రయత్నము శ్లాఘ్యము... విమర్శనా పాత్రమైన పాటలో అసభ్యతగాని యనౌచిత్యముగాని లేదని మా విశ్వాసము... పాఠకులయొక్క రుచి భేదములను ప్రదర్శించునను నూహతో మాత్రమే అనుకూల ప్రతికూల విమర్శనలు రెండింటిని బ్రకటించితిమి'' అని పంతులుగారు భారతిలో ప్రకటించారు.[68]

పాఠకుల రుచినీ జనాభిప్రాయాన్నీ పంతులుగారు ఎప్పుడూ కనిపెడుతూనే వుంటారు. సాధారణంగా పత్రికలు తమ సిద్ధాంతాలను ప్రజలమీద రుద్దడానికి ప్రయత్నిస్తాయి. పంతులుగారు దానికి వ్యతిరేకులు. పెట్టుబడిదారీ సమాజంలోని పత్రికల స్వభావాన్ని ఆయన యిలా ఖండించారు. ''సర్వత్ర ధనము రాజ్యము చేయుచున్నది. శ్రీమంతులు ముద్రణాలయములను బెట్టి వారి వాదములను విశ్వవ్యాప్తము చేయుట సులభసాధ్యమైయున్నది. డైలీ మెయిల్, లండన్‌టైమ్స్ మొదలగు పత్రికలు స్వపక్ష వాదమును దినదినము లక్షలకొలది ప్రజల చిత్తములందు ప్రతిబింబింపచేయుచున్నవి. పండితులు పామరులు పత్రికాభిప్రాయములను విమర్శలేకయే తమ అభిప్రాయములను గ్రహించుచున్నారు. శ్రీమంతులు పూనిన మార్గమును సామాన్యులను నవలంభించు చున్నారు. ముద్రణాలయమును స్థాపించుట పత్రికలను ప్రచురించుట స్వాభిప్రాయములను వ్యాపింపచేయుట సులభమైనది. అన్నశాలలందు సిద్ధాన్నము వలె పత్రికలందు సిద్ధభావములు సులభగ్రాహ్యములైనవి. ఏ విషయముగాని శ్రద్ధతో చదువుటకును చదివిన

66. శ్రీముఖ సంవత్సరాది సంచిక (1933-34)
67. ప్రమోదూత సంవత్సరాది సంచిక (1930)
68. భారతి సంపుటి 1 - సంచిక 6, (జూన్ 1924), పుట.138

దానిని ధ్యాన మననాదులు చేసి విజ్ఞానమును బడయుటకును అవకాశములు చాలకున్నవి''.[69]

పంతులుగారు 1927లో వ్రాసిన ఈ మాటలు ఇన్ని సంవత్సరాల తరువాత కూడా ఈనాటి స్థితిని వర్ణిస్తున్నాయి. ఆయన సిద్ధభావాలను సులభంగా గ్రహించేవారు కారు. ఏ విషయాన్నయినా శ్రద్ధగా చదివేవారు. చదివిన దానిని ధ్యాన మననాదులు చేసేవారు. ఈ సంగతి ఆయన రచించిన ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో స్ఫుటంగా కనబడుతుంది.

ఆ గ్రంథంలో చివర ఆయన ''ఇందు గ్రొత్త విషయములు లేవు. ఇంతవరకు నితర పరిశోధకులు వ్యాఖ్యాతలు తెలిపిన భావములే మరల తెలుపబడినవి'' అని వినయానికి వ్రాసినా అంతవరకులేని క్రొత్త దృక్పథంతో ఆయన ఆంధ్ర వాఙ్మయానికి భాష్యం వ్రాశారు.[70] లేకపోతే పింగళి సూరపరాజుగారి కళాపూర్ణోదయాన్ని శ్రీవిద్యా పరంగా వ్యాఖ్యానం చేయడం ఎలా సంభవిస్తుంది?

పంతులుగారికి ఆంధ్ర సాహిత్యంలో యిద్దరే ప్రాచీన కవులు సదారాధ్యులు. వాళ్ళు తిక్కనగారూ, పింగళి సూరపరాజుగారూను. ''తిక్కనకు మించిన కవి సార్వభౌముడు ఆంధ్ర దేశంబున బుట్టంబోడు'' అని 1911 ఉగాది సంచికలోనే స్పష్టంగా చెప్పారు. ''ఆంధ్ర సాహిత్యమును పరిస్ఫుటము చేసిన కవులందు సూరనార్యుడు పరంజ్యోతివలె ప్రకాశించుచున్నాడు'' అని ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో చాటి చెప్పారు.[71] గ్రామ్య గ్రాంథిక భాషా నినాదాలలో ఈ ఇద్దరి కవుల నుంచే గుణపాఠం నేర్చుకోవాలని పంతులుగారు సూచించారు. ''తిక్కయజ్వ సూరనార్యుల రచనలందు దేశీయ పదములు కుప్పలు తెప్పలుగ వాడబడినవి. విద్వజ్జనాదరణీయము గాంచినవి. ఆ దేశీయభాష యిప్పుడు గ్రాంథిక భాషగా నెంచబడుతున్నది'' అని జ్ఞాపకం చేశారు.[72] కల్పనాదక్షులకు భాషా ప్రతిబంధకమసంభవం అని వారి నమ్మకం.

అందుకే ఏ భాషలో వ్రాసినదైనా ఆయన తొలినుంచీ భావసంపద వుంటే ప్రచురించేవారు. మొదటి కొద్దిరోజులలో ''ఎప్పటికైనను గ్రంథ రచనలకు గ్రాంథిక భాషయే శరణ్యము''[73] అని భావించేటప్పుడు కూడా గిడుగువారి వ్యాసాలు, గురజాడ రచనలు పంతులుగారు సగౌరవంగా ప్రచురించారు. గురజాడ అప్పారావుగారికి సలహాలు యిచ్చారు. ఆయన వద్దనుండి సూచనలు వాంఛించారు. గురజాడ వారికి తోచిన అభిరుచి వున్న ఆసక్తి వున్న విషయం మీద గ్రంథం వ్రాసి పంపితే కృతజ్ఞుడనని ఉత్తరం వ్రాశారు.[74] గిడుగువారు మద్రాసు వచ్చినప్పుడల్లా సభ పెట్టించడం జరిగేదట. పండితారాధ్య చరిత్రను పరిష్కరించమని పంతులుగారు గిడుగు రామమూర్తి పంతులుగారిని ప్రార్థించారు. భాషాయుద్ధాలతోనే రామమూర్తి పంతులుగారికి సరిపోయేది. గ్రంథ పరిష్కరణమునకు

69. సాభిప్రాయ విశేషములు - భారతి ఆగస్టు 1927
70. ప్లవంగ సంవత్సరాది సంచిక - పుట.115
71. అదే సంచిక పుట.102
72. విరోధికృతి సంవత్సరాది సంచిక (1911) ప్రస్తావన
73. విరోధికృత సంవత్సరాది సంచిక (1911) ప్రస్తావనలో
74. గురజాడ రచనలు, సంపుటి 5 - లేఖలు - పుట.172

తీరిక లేకపోయింది. భారాన్ని శిష్యులమీద పెట్టారు. పండితారాధ్య చరిత్ర పూర్తిగా అచ్చుపడలేదన్న విచారం పంతులుగారికి మిగిలిపోయింది. దానిని చూడకుండానే వారు పోయారు.

పండితారాధ్య చరిత్ర ఆంధ్ర గ్రంథమాలలో 30వ కుసుమం. ఈ ప్రచురణశాఖను పంతులుగారు అన్నిటికన్నా ఆలస్యంగా స్థాపించారు. అయితే గ్రంథ ప్రచురణ చేయాలన్న సంకల్పం వారికి సంవత్సరాది సంచికలు తెస్తున్నప్పటి నుంచీ వుంది. ప్రజలకు అందుబాటులో వుండాలని అర్థణాకో పుస్తకం అమ్మాలని ప్రణాళిక వేసుకున్నారు. పెద్దదయితే బేడ. అంతకుమించిన ధర వుండకూడదనుకున్నారు.[75] ఇతర వ్యాపకాల వల్ల ఈ గ్రంథ ప్రచురణ ఉద్యమం సాగలేదు కాబోలు. సాగితే ఎన్ని గ్రంథాలు వచ్చి వుండేవో.

పంతులుగారికి ఇతరుల గ్రంథాలు ప్రచురించే శ్రద్ధేగాని స్వంతంగా రచనలు చేద్దామనే ఉబలాటం ఎప్పుడూ లేదు. చేతకాక కాదు. అవసరమైతే ఎన్నయినా వ్రాయగలరు. 1912వ సంవత్సరంలో, పరీధావి ఉగాది సంచికలో 40 వ్యాసాలు అచ్చుబడ్డాయి. రాజ్యాంగ వ్యవహారాల గురించి ఎవ్వరూ వ్యాసాలు వ్రాసి పంపలేదు. పంతులుగారు కలం పట్టుకుని 5 వ్యాసాలు వ్రాశారు. 66 పేజీల మేటరు తయారుచేశారు. ఇంపీరియల్ గెజిటీరు, ఢిల్లీ చరిత్ర మొదలైన ఇంగ్లీషు చరిత్ర గ్రంథాల ఆధారంతో వ్రాసిన ప్రమాణిక వ్యాసాలవి. అవి పంతులుగారి పేరుమీదగానే అచ్చుపడ్డాయి.

సాధారణంగా ఉగాది సంచికలలోనూ, భారతి సంపుటాలలోనూ వ్యాసకర్త పేర్లలో 'కా. నాగేశ్వరరావు' అనే పేరు కనబడదు. ఉగాది సంచికల్లో ప్రస్తావన, భారతిలో ఏడాది మొదట స్వవిషయం. ప్రతినెలా సాభిప్రాయ విశేషాలు ఆయన వ్రాసేవారు. వీటిలో ఆయనకున్న బహుముఖ ప్రజ్ఞ కనబడుతుంది. సాహిత్యం గురించి అప్పుడప్పుడు వ్రాసేవారు. ఆయన తన సేవను కేవలం సృజనాత్మక సాహిత్యానికే మీదు కట్టలేదు. వారికి కావలసింది సర్వతోముఖ వికాసం. అందుకే ఉగాది సంచికలలో పన్నెండు విభాగాలు వుండేవి. రాజకీయం, సారస్వతం, కథలు, చరిత్ర, చిత్రకళ, సాంఘికం, వైద్యం, జ్యోతిషం, వేదాంతం, సంగీతం, ప్రకీర్ణం అనే ఈ పదకొండూకాక రసతరంగాలనే పద్య వ్యాసాలు కూడా వుండేవి. ఈ రచనలన్నింటినీ పంతులుగారు అచ్చుపడకముందు చదివేవారు. అవసరమైతే తమ ప్రస్తావనలో పేర్కొనేవారు. పని పడితే మెత్తగా విమర్శించేవారు.

'కాకిపిల్ల కాకికి ముద్దు' అనే సామెత పంతులుగారిపట్ల వర్తించదు. తన సంపాదకత్వంలో వచ్చిన ప్రతి సంచికా గొప్పగా వుందని సాధారణ వ్యక్తులైతే మురిసిపోవచ్చును. పంతులుగారు అలాకాదు. ''సంచికయందు ప్రచురించిన వ్యాసములు సంఖ్యయందును విషయ విభాగమునందును బహుళముగా నున్నను విషయ గ్రహణముందు సామాన్యముగా నున్నవి'' అని ప్రస్తావనలో చెప్పడం పంతులుగారికే చెల్లింది.[76] ఒక ఉగాది సంచికలో ఆయన ఒక ఆవేదన వ్యక్తం చేశారు. ''ప్రజా హృదయమునందు వ్యాసరచనాభిలాష వృద్ధిపొందినట్టు జిజ్ఞాసాభిలాష వృద్ధిని

75. గురజాడ రచనలు, సంపుటి 5, లేఖలు పుట.172

76. శుక్ల సంవత్సరాది సంచిక (1929-30) ప్రస్తావన

పొందకుండుట శోచనీయము. ప్రజల చిత్తవృత్తి స్వల్ప విషయములందు లగ్నమగు చున్నటుల మహద్విషయములందు లగ్నము కాకున్నది'' అని పంతులుగారు బాధపడ్డారు.[77] బహుశా మన వాఙ్మయంలో ఈలోటు తీర్చడానికే ఆయన జిజ్ఞాసాభిలాషతో కూడిన వ్యాసాల పీఠికలు స్వయంగా వ్రాసి అటుమొగ్గారు. భావ వికాసానికి తోడ్పడే రచనలు ప్రోత్సహించేవారు.

భారతి నెలకొల్పడంలో కూడా ఈ ఆశయం కనబడుతుంది. మానవులకు భావదాస్య విమోచనం కలగందే విమోచనం కలగదని వారి విశ్వాసం. అందుకే భావదాస్య విమోచనానికి భారతిని స్థాపించారు. భాష, వాఙ్మయం, శాస్త్రాలు, కళలు మొదలైనవి సాదరభావంతో చర్చించడానికి అవకాశాలు కల్పిస్తామని తొలి సంచికలో ప్రకటించారు. వాఙ్మయ నిర్మాణానికి అప్పుడు చేస్తున్న ప్రయత్నాలను పరిస్ఫుటం చేస్తామన్నారు. శిల్పమునకు చిత్రలేఖనానికి శాసనాలకు సంబంధించిన విషయాలను చిత్రాలతో ప్రచురిస్తామన్నారు. అన్నీ అన్నట్టే పదిహేనేళ్ళపాటు చేశారు. నెలకో విజ్ఞాన సర్వస్వం ప్రచురించినట్టే ఆ సంపుటాలు కనబడతాయి.

కొమర్రాజు వారు తలపెట్టిన విజ్ఞాన సర్వస్వాన్ని కూడా పంతులుగారే చూడముచ్చటగా అందంగా అచ్చువేశారు. కొమర్రాజు వారి సాహచర్యం పంతులుగారిని ఎంతో ఉత్తేజపరిచింది. మొదటి ఉగాది సంచికనుండి వ్యాసాలు వ్రాయడం, ఛాయాచిత్రాలు అందజేయడం మాత్రమేకాక కార్యోపక్రమణాన్ని కూడా కొమర్రాజువారు నిరూపించేరట. భారతి నెలకొల్పాలనే సంకల్పం కలగ్గానే పంతులుగారు కొమర్రాజు వారితో సంప్రదించారు. ప్రయత్నాలు చేశారు. కొమర్రాజువారు ఆ భారాన్ని పూనుకొనడానికి అంగీకరించారు. అయితే ఆ విజ్ఞాన సంపన్నుడికి నూరేళ్ళు నిండాయి. రెండేళ్ళపాటు పంతులుగారు తమ సంకల్పాన్ని రిక్త మనోరథంగానే వుంచుకోవలసి వచ్చింది. ఈ విషయాలను భారతి తొలి సంచికలోనే ఎంతో కృతజ్ఞతా సూచకంగా పంతులుగారు చెప్పారు.

తమకుగాని సాహిత్యానికిగాని ఎవ్వరైనా మేలుచేస్తే అది పంతులుగారు మరచిపోరు. పేరుపేరునా ప్రశంసిస్తారు. ఆదిలో అందరూ 'ఎద్దేవా చేసినా' దేనిలోనైనా చేవవుంటే పంతులుగారు దానిని ప్రోత్సహిస్తారు. ప్రతి కొత్త ప్రయత్నాన్నీ ప్రజలు వింతగా చూస్తారు. ఒకప్పుడు భయపడతారు. పరిహసిస్తారు. పద్దెనిమిది సంవత్సరాలపాటు ఉగాది సంచికలు నడిపి 'ఆరంభమునందు వింతగా దోచిన యత్నమిప్పుడు సర్వసాధారణముగా నున్నది. పేరుగల పత్రికలన్నియును సంవత్సరాది సంచికలను ప్రచురించుచు, కాల స్వభావమును ప్రతిబింబిస్తున్నాయి'' అని పంతులుగారు వ్రాశారు.[78] అలాగనే మరోసారి 'పరిహాస పాత్రమైన స్వరాజ్యాదర్శమును రాజనీతిజ్ఞులంగీకరించిరి' అని చెప్పారు.[79] ఇంకోసారి 'ముప్పదేండ్లకు పూర్వము పరిహాస పాత్రములైన అప్పారావుగారి ముత్యాలసరములు నేడు ప్రజాదరణమునకు పాత్రములగుచున్నవి' అని చాటిచెప్పారు.[80]

---

77. శుక్ల సంవత్సరాది సంచిక (1929-30) ప్రస్తావన
78. ప్రభవ సంవత్సరాది సంచిక (1927) ప్రస్తావన
79, 80. బహుధాన్య సంవత్సరాది సంచిక (1938) ప్రస్తావన

ఆదిలో పరిహాస పాత్రలైనవి క్రమేణా పరిపాటి కావచ్చును. అలాగే ప్రారంభంలో ప్రశంసలను అందుకొన్నవి ఉత్తరోత్తరా నవ్వులపాలు కావచ్చును. అటువంటి సందర్భాలు వచ్చినప్పుడు పంతులుగారు విమర్శించక మానలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తు 1912లో స్థాపించినప్పుడు పంతులుగారు గొప్ప కొరత తీరిందని సంతోషించారు. 'భాషాభ్యుదయ మునకై ఈ పరిషత్తు మహోపకారము చేయగలదు' అని విశ్వసించారు.[81] ఒక పుష్కరం గడిచాక ప్రజలకూ పరిషత్తుకూ దూరం పెరిగిందని పంతులుగారు గుర్తించారు. నిఘంటు నిర్మాణ భారాన్ని పిఠాపురం మహారాజువారు వహిస్తున్నా ''మహాజనుల తోడ్పాటు లేకను పని నెమ్మదిగా జరుగుతున్నది'' అని సున్నితంగా మందలించారు.[82] నిఘంటు నిర్మాణము అస్థిసంచయ సమీకరణమని కొందరు ఆక్షేపించారట. ''శూన్యావస్థయందు అస్థి సమీకరణము సయితము కార్యసిద్ధికి ప్రయోజనకరమగు చున్నది'' అని పంతులుగారు మెత్తగా చీవాట్లు పెట్టారు.[83] 'నిఘంటు నిర్మాణమును త్వరితగతిని జేయించుటకు మహాజనులు తోడ్పడా'లని పంతులుగారు 1924లో ఆశించారు. పరమేశ్వరుణ్ణి ప్రార్థించారు. ప్రజలను దూరం చేసుకున్న పరిషత్తుకు నిఘంటు నిర్మాణం నలభైనాలుగు సంవత్సరాలు పట్టింది. ఇంతకూ ఆఖరి సంపుటం బయటపడనేలేదు. పంతులుగారి సూచన పాటించితే బాగుండేది.

పంతులుగారిలాంటి వ్యక్తులు తమ సంపూర్ణ శక్తులు సాహిత్యానికే వినియోగిస్తే ఆంధ్రభాషకు ఏనాడో నిర్దుష్టమైన నిఘంటువూ, సమగ్రమైన వ్యాకరణం లభించేవి. ''ప్రజానాయకులు వారి లక్ష్యాలను తాత్కాలికమైన రాజ్యాంగ వ్యవస్థలందు మాత్రమే లగ్నంచేయక నిత్యమైన సాహిత్య కళాంగములందు సయితము లగ్నము చేయుట ప్రయోజనకరముగ నున్నది''. అని ఒకసారి సాభిప్రాయ విశేషాలతో వారు వ్రాశారు.[84] అయితే దీనిని ఆయనే పాటించలేకపోయారు. రాజకీయాలు వారి కాలాన్ని ఆక్రమించాయి. ఆయన రాజకీయ సభలకు వెళ్ళినంతగా సాహిత్య సభలకు వెళ్ళినట్టు కనబడదు.

ఆంధ్రపత్రిక తొలిసంచికలోనే పంతులుగారు హిందీ ప్రచారోద్యమం సాగించారు. 1907 సూరత్ కాంగ్రెస్ ప్రభావం మిత్రుల ద్వారా వారిపై పడింది 1908లో ఆంధ్ర పత్రికను వారపత్రికగా బొంబాయిలో ప్రారంభించారు. 1914లో దీనిని దినపత్రికను చేసి మద్రాసుకు మార్చారు. నాటినుంచి మద్రాసులోనే నివాసం. 1919లో జరిగిన ప్రత్యేకాంధ్ర మహాసభకూ, రాష్ట్రీయ గ్రంథాలయోద్యమానికీ అధ్యక్షత వహించారు. 1920 సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1924, 29, 30, 34 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్నారు. 1924లోనే కట్టమంచి రామలింగారెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలో 'దేశోద్ధారక' బిరుదు లభించింది. 1929 బెజవాడ ఆంధ్ర మహాసభలో 'విశ్వదాత' బిరుదును పొందారు. 1930 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1932 శాసనోల్లంఘనంలో కారాగార శిక్షపడింది. 1933లో గాంధీ మహాత్ముడు ఆంధ్ర

---

81. పరీధాని సంవత్సరాది సంచిక (1912) ప్రస్తావన
82. సాభిప్రాయ విశేషములు - భారతి - జూన్ 1924
83. భారతి, జూన్ 1924
84. భారతి, ఏప్రిల్ 1927

మహాసభ హాలులో నాగేశ్వరరావుగారి చిత్రపటాన్ని పంతులుగారి సమక్షంలో ఆవిష్కరించి ప్రశంసించారు. హరిజన సేవ తొలినుంచి చేసేవారు. ఇన్నివిధాలుగా ఇతర వ్యాపకాలలో నిత్యం పాల్గొనడం వల్ల పంతులుగారు సాహిత్యసభలకు చుట్టుపుచూపుగానే వెళ్ళేవారు.

అయినా సాహిత్యసభలు సాధించినదేమిటుంది కనుక? 1924 నాటికే సాహిత్యసభలంటే ఆయనకు మొఖం మొత్తింది. ఆ సంవత్సరం భారతిలో సాభిప్రాయ విశేషాలు వ్రాస్తూ ఆయన యిలా చెప్పారు. ''ఏడవ యాంధ్ర సారస్వత మహాసభ వైశాఖ బహుళమునందు కోవూరునందు గూడినది. మూడునాళ్ళ ముచ్చట ముగిసింది. జ్యేష్ఠ బహుళమునందు తణుకునందు సాహిత్య పరిషత్తు మహాసభ గూడనున్నది. మూడునాళ్ళ ముచ్చట తీరగలదు. సన్మాన సంఘాధ్యక్షులు, సభాధ్యక్షులు మహాసభల యందు గంభీరోపన్యాసములను చదువగలరు. పండితులు, పరిశోధకులు, కవీశ్వరులు భావభరితములైన వ్యాసములను చదువుదురు. మహాసభ తీర్మానములను జేయును. ఉపసంఘము లేర్పడును. ఈ భాగవత మేటేటను జరుగుచుండును. ఈ మహాసభలయందు జరిగిన భాగవతమే యితర సభలయందును ఏదో విధానమును నడుచుచుండును. పని మాత్రం గనబడదు.[85]

అన్ని దశాబ్దాల క్రిందట పంతులుగారు వ్రాసిన ఈ మాటలు నేటికీ మన సాహిత్య సభలపట్ల వర్తిస్తాయి. ఆయన క్రియాశూన్యమైన ఉద్ఘోషలను హర్షించలేదు. మన సాహిత్యాభివృద్ధికి నిర్దుష్టమైన నిఘంటువు. సమగ్రమైన వ్యాకరణం అవసరమని ఆయన గుర్తించారు. పరిషత్తువారు నిఘంటువు నిర్మిస్తామన్నారు. సారస్వత మహాసభవారు సమగ్రమైన వ్యాకరణాన్ని నిర్మించాలని ఆరేళ్ళకు పూర్వమే - అంటే 1918లోనే - తీర్మానించారట. అది ఆచరణలో పెట్టడానికి పని జరగలేదు. నిఘంటు నిర్మాణానికయ్యే వ్యయభారాన్ని ఒక మహారాజు భరిస్తానన్నాడు. వ్యాకరణ రచనకు ఎవరూ కనబడలేదు. ఈ సంగతులు చెప్తూ పంతులుగారు ''ప్రజలీ భారమును నిర్వహించుటకు దగిన ప్రయత్నములను జేసి సారస్వతాభిమానమును సార్థకము చేయుదురుగాక'' అని ఆశించారు.[86] నిఘంటు వ్యాకరణముల నిర్మాణముల వలెను ఆంధ్ర వాఙ్మయమంతయును సహాయము నపేక్షించుచున్నది'' అని పంతులుగారు ఆనాడే గుర్తించారు.

అలాగ గుర్తించాక అయిదేళ్ళపాటు కష్టపడి ఆంధ్ర వాఙ్మయ సూచికను తయారుచేయించారు. విపులమైన పీఠికను వ్రాశారు. ఈ గ్రంథంలో కవిత్వతత్త్వ విచారణకు అవకాశం లేదంటూనే గొప్పతత్త్వ విచారం చేశారు. ఆంధ్ర సాహిత్యంలో ఇక్ష్వాకుల కాలం నుంచి ఇప్పటిదాకా వచ్చిన పరిణామాలను మౌలికంగా గుర్తించారు. పండితాధీనమునందున్న సాహిత్యం ఎలా ప్రజాధీనం కావాలో సూచించారు. 'ప్రజా సామాన్యమునకు బరిచితమైన సాహిత్యమునకు పండితులు చూపిన నిరాదరణ, నిరసన భావాలు ఆంధ్ర వాఙ్మయ వికాసమున కభ్యంతరములుగా' ఏర్పడిన విధాలు ఆంధ్ర చరిత్ర

85, 86. భారతి - జూన్ 1924, సంపుటి-1, సంచిక-6

ఎలా విశదం చేస్తుందో వివరించారు. సాధారణ వాఙ్మయ చరిత్రకారులు మనుచరిత్ర చూసి మనసు పడతారు. వసుచరిత్ర మోజులో పడిపోతారు. పంతులుగారు రొటీను సిద్ధాంతాలను ఆమోదించలేదు. వసుచరిత్ర కావ్యము పరమార్థమైన ఆత్మానందాన్ని సంకుచితం చేసిందని నిర్భయంగా చెప్పారు.[87] తిక్కన పోతనాదులలాగ పెద్ద కావ్య నిర్మాణానికి పరమార్థాన్ని సంకల్పించలేదని చెప్పారు.[88] భట్టుమూర్తి మీద ఒకటింపావు పేజీ మాత్రమే వ్రాశారు. పెద్దన్నగారి మీద మరొక పేజీ అదనంగా వ్రాశారు. పింగళి సూరపరాజుగారిమీద మాత్రం అయిదున్నర పేజీలు వ్రాశారంటే పంతులుగారి రసైకదృష్టి వ్యక్తమవుతుంది.

పంతులుగారి దృష్టి ఎప్పుడూ అభ్యుదయంపైనే వుంటుంది. ఆయనకు పాత వాసనలు గిట్టవు. తమ పత్రికలలో ఛాందసులు వ్రాసే వ్యాసాలను ఆయన వాళ్ళపై గౌరవం కొద్దీ ప్రకటించినా విమర్శించక మానలేదు. ''వ్యాసములు పాత వాసనలను వ్యక్తము చేయునటుల నవీనాశయములను వ్యక్తం చేయుటలేదు. స్వాతంత్ర్య జవసత్వములేని ప్రజలు కైలాస శిఖర సందర్శనమునుగాని, పాతాళలోక సందర్శనమునుగాని చేయజాలరు'' అని నిక్కచ్చిగా చెప్పారు.[89] స్వేచ్ఛలేని వాడు అధః పతనానికి కూడా నోచుకోడు.

పంతులుగారు ఆంధ్ర సాహిత్యాన్ని కైలాసగిరి సానువులంత ఉన్నత ప్రదేశాలకు తీసుకెళ్ళడానికి ఎంతగా కృషి చేశారో చెప్పాలంటే ఒక చిన్న ప్రకరణం చాలదు. చెరువుని చేదపెట్టి తోడలేం. ఏటి కేతా మెత్తలేం. ఆయన తలపెట్టిన కృషి ఫలించిందా లేదా అని రేఖామాత్రంగా సమీక్షించాలి.

పంతులుగారు అడపాదడపా ఆత్మ విమర్శనం చేసుకుంటూ వుంటారు. నిరాశాజనకంగా వుంటే అది బయట పెట్టకుండా ఊరుకోరు. భారతి పెట్టిన పదేళ్ళకు ఆయన ఏం సాధించాం అని వెనుక తిరిగి చూసుకున్నారు. ''భారతికి పదవయేడు ప్రారంభమైనను ప్రత్యభిజ్ఞానము దుర్లభమైనది'' అని బాధపడ్డారు.[90] ''సాహిత్యోపన్యాస కులకు కళారాధకులకు ప్రాణరహితమైన సనాతన సంస్కారము, స్వానుభవరహితమైన పరసంస్కారము ఆత్మయోగానుభవసిద్ధమైన పరసంస్కారము ఆత్మయోగానుభవ సిద్ధమైన నిర్మాణశక్తిని దుర్ఘటము చేసినవి. నిర్మాణము దుర్ఘటమై అనుకరణము శరణ్యామైనది. ప్రథమ సంచికయందలి సంకల్పము వర్తమాన సమయమునందు ప్రపంచావృతమైన మహాప్రబోధ సమయమునందు క్రియారూపమును బడయక సంకల్ప మాత్రముగనే యున్నది'' అని విచారించారు.[91]

ఈ స్వవిషయం వ్రాస్తూ మొదట ఆయన భర్తృహరి సుభాషితాన్ని ''తెలివి యొకింత లేనియెడ దృప్తుడనై కరిభంగి'' అనేది ఉదాహరించారు. పంతులుగారు తమ సాభిప్రాయ విశేషాల ప్రారంభంలోనూ స్వవిషయాల మొదటా కొన్ని పద్యాలను సమయోచితంగా కోట్ చేస్తారు. అందులోనే వారి విశాలానుభవం ద్యోతకమవుతుంది.

87, 88. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర (ప్లవంగ సంవత్సరాది సంచిక), పుట.102, 103

89. ప్రమోదూత సంవత్సరాది సంచిక (1930-31) ప్రస్తావన

90, 91 భారతి జనవరి 1933 స్వవిషయంలో.

నిరాశాపూరితమైన పదో స్వవిషయంలో అంత నీరసంగా ఆయన వ్రాయడానికి నిజంగా భారతి ఏమీ సాధించలేదని అర్థం చెప్పుకోకూడదు. ఆంధ్రులేం సాధించలేకపోయారనే వ్యాఖ్యానించుకోవాలి. ''ఆంధ్ర హృదయము నధిష్టించిన ఇచ్ఛాశక్తి జ్ఞానయోగ విలసితమైన క్రియా రూపమును బడయవలసిన యవసరమును సాహిత్య కళారచనలు విశదము చేయుచున్నవి'' అని అదే స్వవిషయంలో ఆయన చెప్పారు. ఆంధ్రదేశానికి పండుగైతే ఆయన పండుగ చేసుకొంటారు. పొంగిపోతారు. ఆంధ్రదేశం కుంగిపోతే ఆయన కుంగిపోతారు.

ఆంధ్ర సాహిత్యానికి అనుకొన్నంత సేవ చేయలేదనే చింత ఆయనకు లేకపోలేదు. మరణించడానికి ముందు ఆయన విచారంగా వుంటే డాక్టర్లు హితబోధ చేశారు. ''ఇటీవల నేను జబ్బుతో నుండగా డాక్టరు నంజప్పగారు నన్ను చూచి ఇట్లనిరి. 'నీవు విచారగ్రస్తుడవుగా కనబడుచున్నావు. నీవును ఇతరులును ఏ స్వరాజ్యసంపాదమునకై శ్రమపడితిరో ఆ సుదినము సంప్రాప్తమైనది. సత్యాగ్రహము ధర్మ విజయమును బడిసినది. ఖద్దరు టోపి, త్రివర్ణ పతాకము, వందేమాతరం గీతం విజయమును పొందినవి. ఇది నీవు ఆనందింపవలసిన సమయం''. నంజప్పగారి గంభీర భావములు స్వధర్మ నిర్మాణము నందరి పరమార్థమును విశదము చేసినవి. విశ్వ పరిణామమునందు వ్యక్తుల ప్రాజాపత్యము నిమిత్త మాత్రము'' అని సహజ ధోరణిలో పంతులుగారు ఏ మాత్రం ఘనతా అంగీకరించలేదు.[92]

అయితే అయిదేళ్ళకు ముందు ప్రకటించిన నిరాశ మాత్రం పోయింది. ''ప్రథమ సంచికయందు సంకల్పించిన సంకల్పములు సకల రంగములందును సఫలమగుచున్నవి'' అనే తృప్తిని ప్రకటించారు.[93] రాజకీయ, సాంఘిక, సాహిత్య, కళా వైజ్ఞానికాది విషయములందు కలిగిన స్వాతంత్ర్య భావ ప్రవర్తనతో మానవ స్వాతంత్ర్యప్రియులకు పరమానందమును కలుగచేయగలదు'' అని పొంగిపోయారు. ''ఈ మహోదయమునకు భారతియును యథాశక్తి జ్ఞానాంజలులను సమర్పించినది'' అని కైమోడ్చారు.[94]

ఆంధ్ర జాతీయ మహోదయానికి వీరేశలింగంగారు వేగుచుక్క అయితే నాగేశ్వరరావు పంతులుగారు బాల భాస్కరుని వెలుగురేఖలు. ఆ తేజః పుంజాలు ఉగాది సంచికలలోనూ, భారతి సంపుటాలలోనూ, ప్రకీర్ణక రచనలలోనూ నిత్యం ప్రకాశిస్తూ వుంటాయి.

నట్టింట చిన్నదీపం పెట్టినవాడి పేరే నిత్యం చెప్పుకొనే జాతి, చిమ్మచీకట్లో యింత వెలుగు తెచ్చిపెట్టిన వారికి యిచ్చిపోయే వారికి జ్ఞానాంజలి ఘటించడం తప్ప ఇంకేం చేయగలదు.

92, 93, 94. భారతి, జనవరి 1938 స్వవిషయంలో

కొందరు పత్రికా సంపాదకులు - గ్రంథ సంచాలకులు

ఇంతకు ముందు కుంఫిణీ యుగంలో అచ్చు కూటాలు, గ్రంథ ప్రచురణలు ప్రారంభమైనాయి. సమగ్ర ఆంధ్ర సాహిత్యం కుంఫిణీయుగం షూల్జి నుంచి సూరిదాకా సాగిన మన గ్రంథ ప్రచురణలు, తొలినాటి కవులు సవివరంగా చెప్పుకొందాం. కుంఫిణీ యుగంలో సంపాదించడం, పరిష్కరించడం ఒక యెత్తు. వాటిని ప్రచురించడం ఇంకొక ఎత్తు. కుంఫిణీ యుగంలోని సాహిత్య పత్రికలు తమ పుటలలో ప్రాచీన గ్రంథాలను తడవకు ఇన్నేసి పేజీల చొప్పున ముందు ప్రకటించి తరువాత ఆ పారాలను పుస్తకరూపంలో తీసుకువచ్చేవి. కొన్ని తొలి పత్రికల వివరాలు చూడండి.

1. సుజన రంజని (1862–1867)

ఇది వింజమూరి కృష్ణమాచార్యులుగారి సంపాదకత్వాన వెలువడే సారస్వత మాసపత్రిక. దీనిని ''యూనివర్సిటీ పరీక్షా విద్యార్థుల కుపకారకము'' అని ప్రచురించేవారు. బహుజనపల్లి సీతారామాచార్యులుగారు, కారుమంచి సుబ్బారాయుడు గారు కూడా సంపాదకత్వంలో ఉండే ఈ మాసపత్రికలో చిన్నయసూరి గారి రచనల టిప్పణులు, భాస్కర రామాయణ, మనుచరిత్రల టిప్పణులు ప్రచురిస్తూ ఉండేవారు.

శ్రీ యక్షిణి (1863–1865)

ఇది బళ్ళారి నుండి త్యాగరాజ మొదలియారు, వెంకటరమణ కవిగారి ప్రోత్సాహంతో నడిపారు.

తత్త్వబోధిని (1864–1870)

మద్రాసు వేద సమాజం వారు ప్రచురించిన పత్రిక. బ్రహ్మ సమాజానికి ఇది ఆదిమరూపం. ఇందులో స్త్రీ పునర్వివాహ విషయాలపై వ్యాసాలు ఉండేవి. ఋగ్వేద సంహిత సస్వరంగా అచ్చువేశారు. ఇందులోని వ్యాసాలు సంపుటాలుగా తరువాత వెలువడ్డాయి.

గోదావరి విద్యా ప్రబోధిని (1870కి పూర్వం)

ఈ మాసపత్రికలోనే వీరేశలింగంగారి 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం' కొంతభాగం ప్రకటితమైంది. దీనిని బారో దొరగారు నడిపేవారు. బారో దొరగారికి, మరో దొరగారికి వీరేశలింగంగారు తెలుగు నేర్పేవారు. ఈ పత్రికలో తెలుగు భాగాలలో వీరేశలింగంగారికి రచనలు ఉండేవి.

ఆంధ్ర భాషా సంజీవని (1871–83; 1892–1900)

ఇది కొక్కొండ వెంకటరత్నం గారి పత్రిక. కొన్నేళ్ళు ముందు నడిచి ఆగిపోయింది. మళ్ళా కొన్నేళ్ళు నిర్వహించారు. కొక్కొండ వారిపై ఈ సంపుటంలో రాసిన ప్రకరణంలో ఈ పత్రిక గురించి వివరాలు ఉన్నాయి.

పురుషార్థప్రదాయిని (1872-1878)

ఇది బందరు నుండి ఉమా రంగనాయకులుగారి సంపాదకత్వంలో వెలువడిన మాసపత్రిక. దీనికి ఆంగ్ల విభాగం కూడా ఉండేది. వావిలాల వాసుదేవశాస్త్రిగారు కూపర్ ఆంగ్ల కవితను మాతృపటం అనే పేరున ఇందులోనే ప్రచురించారు. ఈ పత్రికలో సాహిత్య విషయాలూ ఉండేవి.

సకల విద్యాభివర్ధిని (1873-1879)

ఇది విశాఖపట్నం నుండి పరవస్తు రంగాచార్యులగారి సంపాదకత్వంలో వెలువడిన పత్రిక. దీనిలో కవిచరిత్రలు, వైద్యం, జ్యోతిష్యం, ప్రశ్నోత్తర రూపంలో వెలువడేవి. ఇందులోని వ్యాసాలను సంగ్రహాలు అనేవారు. కొన్నింటిని ఎఱ్ఱమిల్లి మల్లికార్జునుడుగారు వ్రాసేవారు. ఆచార్యులవారి రూపకానువాదంలో ఒకటైన **శాకుంతలం కొంత** ప్రచురితమైంది.

సుధీరంజని (1873-1880)

ఇది కాకినాడ నుండి ఓగిరాల జగన్నాథం గారనే కవి సంపాదకత్వంలో వెలువడేది. సాహిత్య విషయాలు ఉండేవి.

స్వధర్మ ప్రకాశిని (1873-76; 1924-32)

ఇది బందరు నుండి వెలువడుతూ ఉండే పత్రిక. ద్వైతం కోటేశ్వరశాస్త్రిగారు తొలి సంపాదకులు. తర్వాత వారి శిష్యులు కనుపర్తి మార్కండేయశర్మగారు నడిపారు. శంకరాచార్య చరిత్ర, 32 మంత్రుల కథలు ఇందులో అచ్చువేశారు.

బ్రహ్మాండరంజని (1874)

ఈ పత్రిక గురించిన వివరాలు తెలియవు. ఆంధ్ర భాషా సంజీవని వల్ల దీని పేరు తెలుస్తుంది.

లోకరంజని (1874)

ఈ పత్రిక చెన్నపట్నం నుండి వెలువడేదని ఆంధ్ర భాషా సంజీవని పేర్కొన్న సమకాలిక పత్రికల పట్టికలో ఉంది.

విద్వజ్జన మనోహారిణి (1874)

ఇది నరసాపురం నుండి వెలువడే పత్రిక. ఈ భోగట్టా కూడా ఆంధ్ర భాషా సంజీవని వల్ల తెలియవచ్చింది.

వివేకవర్ధిని (1874-1885)

ఇది వీరేశలింగంగారి పత్రిక. ఈ భోగట్టా కూడా ఆంధ్ర భాషా సంజీవని వల్ల తెలియవచ్చింది.

వివేకవర్ధిని (1874-1885)

ఇది వీరేశలింగంగారి పత్రిక. దీని గురించి వారిపైన వ్రాసిన ప్రకరణంలో కొంత విపులంగానే చెప్పుకొన్నాం. పైన పేర్కొన్న సమకాలిక పత్రికల అభిప్రాయాలను ఇందులో ప్రకటించేవారు.

సుధీరంజని (1874)

నిడుదవోలు వెంకటరావుగారిచ్చిన భోగట్టా ప్రకారం ఈ పత్రిక కాకినాడ నుండి వెలువడేది. 'ధీరంజని' అనే మరో పత్రిక 1890 ప్రాంతాల్లో ఉన్నట్లు అది వివేక వర్ధనికి సమకాలిక పత్రిక అని కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు 1920-21 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో చెప్పారు.

జనవినోదని (1875-1885)

ఈ మాసపత్రికను ముఖ్యంగా బాలురకోసం మద్రాసు స్కూల్ బుక్ వెర్నాక్యులర్ లిటరేచర్ సొసైటీ వారి పక్షాన వి. కృష్ణమ్మ కవిగారు ప్రచురించేవారు. వివిధ విషయాలపై వ్యాసాలు ఉండేవి. చదలవాడ సీతారామశాస్త్రిగారి 'దక్కను పూర్వకథలు' ఇందులో ప్రచురితమయ్యాయి. ఇది సంపూర్ణంగా వచన పత్రిక.

భారతి (1875)

ఈ పత్రిక బళ్లారి నుండి వెలువడేదని కొక్కొండ వారి ఆంధ్ర భాషా సంజీవనిలో చెప్పారు. ఈ విషయం నిడుదవోలు వారు రచించిన ప్రాచీనాంధ్ర వార్తాపత్రికలు (1849-1875) అనే వ్యాసం వల్ల తెలుస్తోంది. (భారతి, మే, 1929)

స్వదేశి (1875)

ఇది బరంపురం నుండి వెలువడిన పత్రిక. దీని గురించి కూడా ఆంధ్ర భాషా సంజీవని వల్లనే తెలియవచ్చింది.

ప్రబంధకల్పవల్లి (1880-1882)

పెద్దాపురంనుండి గురజాడ శ్రీరామమూర్తిగారు ప్రచురించిన పత్రిక ఇందులో వారి 'కవిజీవితాలు' ప్రప్రథమంగా ప్రారంభించారు. పూసపాటి కమ్మరాజు రాసిన కృష్ణ విజయం అనే ప్రబంధాన్ని అచ్చువేశారు. ఇతర ప్రబంధాలను ప్రచురించడమే ఉద్దేశం.

యదార్థవాది (1881-1885)

ఇది విశాఖపట్నం నుంచి గరుడా కూర్మయ సంపాదకత్వాన వెలువడేది. ఇందులో ప్రభులింగలీల మొదలైన వీరశైవ ద్విపద కావ్యాలు ప్రచురించారు.

సతీహితబోధిని (1883–1889)

ఇది స్త్రీలకోసం వీరేశలింగంగారు స్థాపించిన పత్రిక. అప్పుడప్పుడూ ఆగిపోతూ ఉండేది. ఈ పత్రికలో షేక్స్‌పియర్ నాటిక కథలు (ల్యాంబ్‌కు అనువాదాలు) సరళమైన శైలిలో పెద్దక్షరాలలో అచ్చువేశారు.

అముద్రిత గ్రంథ చింతామణి (1885–1904)

నెల్లూరునుండి ఒడయరు వీరరాఘవయ్యగారితో కలిసి పూండ్లరామకృష్ణయ్యగారి సంపాదకత్వం కింద వెలువడిన మాసపత్రిక. పూర్తిగా సాహిత్య విషయాలు ఉండేవి. ప్రాచీన కావ్యాలు, సమకాలికుల కావ్యాలు, పుస్తక విమర్శలు ప్రకటించేవారు. ఈ పత్రికలో ప్రచురితమైన ప్రాచీన కావ్యాల వివరాలు ఇవి:

1. యాదవ రాఘవ పాండవీయం - నెల్లూరి వీరరాఘవకవి
2. మిత్రవిందా పరిణయం - కుందుర్తి వెంకటాచలం
3. ప్రబంధరాజ వెంకటేశ్వర విజయ విలాసం - గణపవరపు వెంకటకవి
4. హరిశ్చంద్ర నలోపాఖ్యానం - రామరాజ భూషణుడు
5. చంద్రాంగద చరిత్ర - పైడిమర్రి వెంకటపతి
6. వసుంధరా పరిణయం - నెల్లూరి వీరరాఘవయ్య
7. భర్తృహరి నీతిశతకం - పుష్పగిరి తిమ్మన అనువాదం

మచ్చా వెంకటకవి, మండపాక పార్వతీశ్వరశాస్త్రి, ఓగిరాల రంగారావు మొదలైన సమకాలిక కవుల కావ్యాలూ, మాలికా వృత్తాలు ప్రచురణ అయ్యేవి. కొక్కొండ వారి గ్రంథాలపట్ల విమర్శలు సూటిగా ఉండేవి. (ఈ సంపుటం ఇతర ప్రకరణాలలో ఈ పత్రిక ప్రసక్తి వచ్చింది.)

నీతిదర్పణం (1885–1887)

ఈ మాసపత్రికను భుక్తి జమ్మయ్య శాస్త్రి శ్రీకాకుళం - జలుమూరు నుండి ప్రచురించేవారు. ఇందులో కె. శఠగోపాలాచార్యులు రచించిన 'చంద్రరేఖానునయం' అనే కావ్యం అచ్చుపడింది. సంపాదకుడు రచించిన నృసింహాశతకం కూడా అచ్చుపడింది.

సుజన మనోల్లాసిని (1885)

మద్రాసు నుండి వెలువడే ఈ మాసపత్రికను ఏడునూతుల ముత్తయ్య ప్రచురించేవారు. శైవ కావ్యాలు అచ్చువేసేవారు.

హిందూ జన సంస్కారిణి (1885–1897)

ఇది మన్నవ బుచ్చయ్య పంతులు ప్రచురించిన పత్రిక. సంఘ సంస్కారానికి దోహదం చేస్తూ శ్రుతి స్మృతి పురాణాలతోపాటు వార్తలు ప్రచురించేవారు.

వీరేశలింగంగారు వీరి ఇంటు బస చేసేవారు. బుచ్చయ్యగారు చాలా స్త్రీ పునర్వికాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుచ్చయ్యగారి మరణంతో ఈ పత్రిక ఆగిపోయింది.

ఆంధ్రప్రకాశిక (1888-1928)

ఎ.పార్థసారథి నాయుడిగారి సంపాదకత్వాన మద్రాసునుండి వెలువడేది. ఈ వారపత్రిక నాలుగు దశాబ్దాలపాటు వెలువడింది. గురజాడ లేఖలలో దీని విషయం ఉంది.

రాజయోగి (1888-1891)

గురజాడ శ్రీరామమూర్తిగారు దీనిని కాకినాడ నుండి వెలువరించారు. ఇందులో ఆధ్యాత్మిక రచనలు ఎక్కువగా ఉండేవి. ప్రబోధ చంద్రోదయం (నందిఘంట రచన) మొదలైనవేకాక అడిదం సూరకవి, కూచిమంచి తిమ్మన్న, ఏనుగు లచ్చన్న మొదలైనవారి కావ్యాలను ప్రకటించారు.

కళానిధి (1890 ప్రాంతాలు)

వివేకవర్ధినికి సమకాలిక పత్రికని కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు 1920-21 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో చెప్పారు.

చిత్తూరు వర్తమాని (1890)

అముద్రిత గ్రంథ చింతామణి (1891 అక్టోబరు) పత్రికలో ఈ పత్రిక ద్వితీయ సంపుటం, ద్వితీయ సంచికను ప్రస్తావించారు.

ధీరంజని (1890 ప్రాంతాలు)

ఇది వివేకవర్ధినికి సమకాలిక పత్రిక అని కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు 1920-21 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో చెప్పారు. (నిడుదవోలు వెంకటరావుగారిచ్చిన భోగట్టా ప్రకారం 1874లో సుధీరంజని అనే పత్రిక కాకినాడ నుండి వెలువడేది).

మందార మంజరి (1890 ప్రాంతాలు)

ఇది కూడా వివేకవర్ధిని సమకాలిక పత్రికే. ఈ విషయం కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు 1920-21 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ఇచ్చిన వివరణవల్ల తెలుస్తోంది.

చింతామణి (1891-1898)

వివేకవర్ధినికి అనుబంధ పత్రికగా దీనిని వీరేశలింగంగారు స్థాపించారు. ఇది న్యాపతి సుబ్బారావుగారి యాజమాన్యంలో ఉండేది. ఇది వచ్చాక వీరేశలింగంగారు 'వివేకవర్ధిని' ఆపేశారు. చింతామణిలో కథలు, నవలలు అచ్చువేసేవారు. ఇందులోనే వీరేశలింగంగారి సత్యారాజా పూర్వదేశ యాత్రలు, నీతి కథామంజరి మొదలైనవి ప్రచురితమయ్యాయి. ఈ పత్రికలో ప్రాచీన ప్రబంధాలు ప్రచురించారు. వాటి వివరాలు :

1. దూబగుంట నారాయణ కవి - పంచతంత్రం
2. చరిగొండ ధర్మన్న - చిత్ర భారతం
3. పింగళి సూరన - ప్రభావతీ ప్రద్యుమ్నం
4. మొల్ల రామాయణం
5. కాకుమాని మూర్తికవి - పాంచాలీ పరిణయం
6. కేతన - విజ్ఞానేశ్వరీయం
7. మాదయగారి మల్లన - రాజశేఖర చరిత్ర
8. మల్లభూపాలీయం
9. కాకుమాని మూర్తికవి - రాజవాహన విజయం
10. అడిదం సూరకవి రచనలు
11. అనంతుని భోజరాజీయం
12. వరాహపురాణం
13. ఏనుగు లక్ష్మణకవి - భర్తృహరి అనువాదం
14. యలకూచి బాల సరస్వతి - సుభాషిత రత్నావళి (అనువాదం)
15. రామభద్రుని రామాభ్యుదయం

ప్రాచీన ప్రబంధాలు మాత్రమేకాక 1893 నుండి నవలల పోటీలు నిర్వహించి ఉత్తమ నవలలు ప్రారంభించడానికి కృషి చేసిన సాహిత్య పత్రిక చింతామణియే.

సత్య సంవర్ధని (1891-1897)

రాజమండ్రి ప్రార్థన సమాజం తరపున వీరేశలింగంగారు నడిపిన పత్రిక. ఇందులో ప్రహసనాలూ, సరస్వతీ నారద విలాపం మొదలైనవి ప్రచురించారు.

సత్యాన్వేషిణి (1892)

రాజమండ్రిలోనే సత్యసంవర్ధినికి ప్రతిగా బజరుల్లా సాహెబ్ అనే ఆయన తన సంపాదకత్వంలో స్థాపించారు. రెండు పత్రికల్లో తీవ్రంగా వివాదలు జరిగేవి.

తెలుగు జనానా (1893-1907)

దీనిని స్త్రీ జనోద్ధరణకు మల్లాది వెంకటరత్నంగారు స్థాపించారు. 1894లోనే దీనిని రాయసం వెంకటశివుడుగారు తీసుకొని నడిపించారు. దీనికి చిలుకూరి వీరభద్రరావుగారి సహాయం లభించింది. దీనిలో తొలుత వీరేశలింగంగారు రాశారు.

కల్పవల్లి (1894)

ఒంగోలు నుండి వెలువడే పత్రిక. కోపల్లె వెంకట రమణరావుగారిది. ఇందులో మందపాల చరిత్ర, చండమారుతము, జీవంధర చరిత్ర ముద్రితమవుతునట్లు అముద్రిత గ్రంథ చింతామణి పేర్కొంది. (డిసెంబరు 1894)

వైజయంతి (1894)

పనప్పాకం అనంతాచార్యులుగారి పత్రిక. మాడభూషి నరసింహాచార్యుల వారి వల్లరీవల్లవోల్లాసము మొదలైన కావ్యాలు ప్రచురించబడ్డాయి. ఇందులో కొక్కొండవారి మహాశ్వేత, అనంతాచార్యులుగారి మంజువాణీ విజయం అనే వచన రచనలు అచ్చుపడ్డాయి. మానవల్లి రామకృష్ణకవిగారి మృగావతి, ఎర్రాప్రగడ రచించిన నృసింహ పురాణం, కృష్ణకవి శకుంతలా పరిణయం ఇందులో అచ్చవుతూ ఉండేవి.

శశిలేఖ (1894)

అముద్రిత గ్రంథ చింతామణికి సమకాలిక పత్రిక. రెండూ విభేదాలు పెట్టుకొనేవి. గట్టుపల్లి శేషాచార్యులుగారి సంపాదకత్వాన మద్రాసు నుండి వెలువడేది.

సత్త్వసాధని (1894-1905)

ఓ.వి.దొరస్వామయ్యగారి సంపాదకత్వాన మద్రాసు నుండి వెలువడేది.

దేశాభిమాని (1896)

దేవగుప్తం శేషాచలపతిగారు విజయవాడలో దీనిని మొదట స్థాపించారు. తరువాత గుంటూరు మార్చారు. ఈ దినపత్రికకు 'కృష్ణవృత్తాంతిని' అనే నామాంతరం ఉండేది.

బాలిక (1896-1897)

శ్రీకాకుళం నుండి సింగితం బాపిరాజుగారు స్త్రీలకోసం ఏడాదిపాటు నడిపిన పత్రిక.

శారద (1896)

ఇది బుచ్చిరెడ్డిపాలెం నుండి దొడ్ల వెంకటరామిరెడ్డిగారి ఔదార్యం వల్ల వెలువడుతున్న మాసపత్రిక. 'రాజయోగి' ఈ శారదకు యోగ్యతాపత్రం ఇచ్చింది.

మంజువాణి (1898-1904)

ఏలూరులో లక్కవరం జమీందారు మంత్రిప్రెగడ భుజంగరావుగారు (1876-1946) స్థాపించిన పత్రిక. దీనికి నందివాడ చలపతిరావుగారి తోడ్పాటు అన్నివిధాలా ఉండేది. భుజంగరావుగారిలాగే చలపతిరావుగారు కూడా చాలా గ్రంథాలు రాసి ప్రచురించారు. మంజువాణిలో ఈక్రింది ప్రాచీన కావ్యాలు అచ్చువేశారు.

1. ఏనుగు లక్ష్మణకవి - రామేశ్వర మాహాత్మ్యం
2. కొటికలపూడి వెంకట కృష్ణయ్య - దిలీప చరిత్ర
3. కూచిమంచి తిమ్మయ్య - సర్వలక్షణ సారసంగ్రహం
4. భారతం లక్ష్మీపతి - శకట రేఫ నిర్ణయం
5. డి. శ్రీనివాసయ్య - అచలాత్మజాపరిణయం
6. కాకుమాని మూర్తికవి - రాజవాహన విజయం
7. అడిదం సూరకవి - చంద్రాలోకము

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారి మను, వసుచరిత్రల సమీక్షలు, దాసు శ్రీరాములుగారి మహావీర చరిత్ర నాటకం, తిరుపతి వెంకటకవుల పల్లెటూళ్ల పట్టుదలలు అనే ప్రహసనం మొదలైన విమర్శ వ్యాసాలూ, వచన రచనలూ మంజువాణిలో వెలువడేవి.

సరస్వతి (1898-1912)

పోలవరం జమీందారు కొచ్చెర్లకోట కృష్ణారావుగారు మొదట చిలకమర్తి వారి యాజమాన్యంలో రాజమండ్రిలో స్థాపించి, తర్వాత కాకినాడ నుండి స్వయంగా ప్రచురించిన పత్రిక. ఇందులో వారి ఆస్థాన కవులు తిరుపతి వెంకట కవుల రచనలు అచ్చుపడేవి. దీని మేనేజర్‌గా కొత్తపల్లి సూర్యారావుగారు ఉండేవారు. ఈ పత్రికలో ఈ క్రింది ప్రాచీన కావ్యాలు అచ్చుపడ్డాయి.

1. మారన - మార్కండేయ చరిత్ర
2. శ్రీనాథుని - హరవిలాసం
3. కందుకూరి రుద్రకవి - నిరంకుశోపాఖ్యానం
4. సవరం చిననారాయణ - కువలయాశ్వ చరిత్ర
5. మట్ల అనంతయ్య - కకుస్థ విజయం
6. కోటి రఘునాథ తొండమాన్ - పార్వతీ పరిణయం
7. మంచెళ్ళ వాసుదేవకవి - గంధవహాము
8. పిల్లలమర్రి పినవీరభద్రుని - శృంగార శాకుంతలం
9. పాలవేకరి కదిరీపతి - శుకసప్తతి
10. రంగనాథ రామాయణం - ఉత్తరకాండ

వేలూరి శివరామశాస్త్రిగారి గుంటూరు శతావధానం, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి కావ్యం, వడ్డాది సుబ్బారాయుడిగారి మయూర సూర్యశతకానువాదం, వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పద్యాలు సరస్వతిలో ప్రచురితమయేవి.

తిరుపతి వెంకట కవులు పాండవోద్యోగం, పాండవ విజయం, సువర్ణపాత్రిక (విప్రనారాయణ కథ) ఈ పత్రికలోనే వెలువడ్డాయి. చిలకమర్తి వారి సౌందర్య తిలక, కొత్తపల్లి సూర్యరావుగారి 'హోతింతాయి' మొదలైనవి సరస్వతి అచ్చువేసింది. మాక్స్‌ముల్లర్, మిల్లర్, సర్ ఆర్థర్ కాటన్ చరిత్ర మొదలైన జీవిత చరిత్రలు, కల్హణుని రాజతరంగిణి అనువాదం ఇందులోనే వెలువడ్డాయి. ఆదిపూడి సోమనాథరావు రచించిన జపాను దేశచరిత్ర, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి నన్నయ్య భట్టారక చరిత్ర సరస్వతిలో వెలువడ్డాయి. చేమకూర వెంకటరాజుగారి విజయవిలాసం, పెద్దాడ నాగరాజుగారి శకుంతలా పరిణయం, పింగళి సూరన కళాపూర్ణోదయం పోలవరం జమీందారుగారి ఉపోద్ఘాతాలతో, పుస్తకరూపంలో సరస్వతి ప్రచురణలుగా వెలువడ్డాయి.

రత్నాకరం (1899-1902)

మల్లంపల్లి భైరవమూర్తిగారు మచిలీపట్నం నుండి ప్రచురించే పత్రిక. కోరాడ రామచంద్రశాస్త్రిగారి శాకుంతలం అనువాదం యిందులోనే ప్రచురితమైంది. గోపీనాథం వెంకయ్యశాస్త్రిగారి రాధికా పరిణయం. ఈ పత్రిక ప్రచురించింది.

వాగ్వల్లి (1899–1903)

నెల్లూరు నుండి కొమండూరి వెంకట రామానుజ శర్మగారి సంపాదకత్వాన వెలువడే పత్రిక. ఇది వేదం వెంకటరాయశాస్త్రిగారి ప్రశస్తికోసం పాటుపడ్డ పత్రిక. ఈ పత్రికలో కూడా కొన్ని ప్రాచీన కావ్యాలు, ఆధునిక రచనలు అచ్చుపడ్డాయి. విక్రమార్కుని సింహాసనంపై గల 32 బొమ్మలు చెప్పిన కథలు కనకశిఖర రంజిత కథలు అనే పేరున అచ్చువేశారు. నిడుదవోలు సుందరంగారి సత్యవ్రత శతకం యిందులో అచ్చుపడింది.

కళావతి (1900–1907)

శ్రీపాదకృష్ణమూర్తి రాజమండ్రిలో నెలకొల్పిన పత్రిక. తెనాలి రామకృష్ణుని ఘటికాచలక్షేత్ర మాహాత్మ్యం తొలిసారిగా యిందులో ప్రకటితమైంది. కస్తూరి రంగకవి ఆనంద రంగరాట్ఛందం, శాస్త్రిగారి పద్య రచనలు యిందులో వెలువడేవి.

కృష్ణాపత్రిక (1902)

కృష్ణాజిల్లా సంఘం తరపున యిది కొండా వెంకటప్పయ్యగారి ఆధ్వర్యంలో మొదట వెలువడిన పత్రిక. తర్వాత ముట్నూరు కృష్ణారావుగారు స్వంతదారులై నడిపారు. బహుకాలం నడిచిన పత్రిక. ఆగిపోయినా పునఃప్రారంభాలు జరిగాయి.

కల్పలత (1903–1906; 1923)

విశాఖపట్నం నుండి ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మగారు నడిపిన పత్రిక. ఇందులో శర్మగారి రచనలే ఎక్కువ వుండేవి. పాఠకులకు పోటీలు నడిపేవారు. కొన్ని కథలు అచ్చువేశారు. ఈ పత్రిక గురించి తెలుగు కథానికలపైనా, నవలలపైనా రాసిన ప్రకరణాలలో విపులంగా వుంది.

ఆర్యమతబోధిని (1905)

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు సనాతన ధర్మ సంరక్షణకు, ఆధునిక ధోరణులను దుయ్యబట్టడానికి స్థాపించిన పత్రిక. కాకినాడ నుండి నడిపేవారు.

సువర్ణలేఖ (1905–1917)

తణుకులో డి.వి. రమణారావుగారు నడిపిన వారపత్రిక. ఈయన పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి అల్లుడు. సొంత ప్రెస్సు వుండేది. పానుగంటివారు సువర్ణలేఖలో మొదట కథలు రాసేవారు. 1913 నుండి సాక్షి వ్యాసాలను లక్ష్మీనరసింహారావుగారు ఈ పత్రికలో ప్రారంభించారు. ఈ పత్రిక కొన్ని కథల సంపుటాలు కూడా ప్రచురించింది.,

భారతమాత (1906, 1908–1910 తర్వాత కూడా)

విజయనగరం నుండి వెలువడిన పత్రిక. 1906లో బి.వి.నాథ్‌గారు దీనిని స్థాపించారు. తర్వాత దీనిని ఓరుగంటి సోమయాజులుగారు 1908 నుండి ప్రచురించేవారు. గురజాడ అప్పారావుగారి వ్యాస చంద్రికలో దీని ప్రసక్తి వుంది. (పుట–18)

మనోరమ (1906–1910)

రాజమంద్రిలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు మొదట మాసపత్రికగా, తరువాత వార పత్రికగా నడిపిన పత్రిక. ఇతర రచనలతోపాటు ప్రహసనాలు, వినోదాలు, కథలు, నవ్వుల, పువ్వులు మొదలైనవి ప్రచురించేవారు.

సుదర్శిని (1906–1928)

నరసాపురం నుండి కస్తూరి శివశంకరరావుగారు నిర్వహించిన పత్రిక.

ఆంధ్రకేసరి (1907–1908)

చిలుకూరి వీరభద్రరావుగారు, ఏడాదిపాటు రాజమంద్రి నుండి నడిపిన పత్రిక.

నవయుగ (1907–1908)

మచిలీపట్నం నుండి చిల్లరిగె శ్రీనివాసరావుగారు ఒక ఏడాదిపాటు నడిపిన పత్రిక.

వందేమాతరం (1907)

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు స్థాపించిన వారపత్రిక. స్వదేశీ ఉద్యమానికి ప్రచారం కోసం ఏడాదిపాటు నడిపారు.

స్వరాజ్య (1907)

చిత్తూరులో మొదట 'వెంకటేశపత్రిక' అనే పేరుతో శ్రీనివాసాచార్యులుగారు నడిపే పత్రికను తీసుకొని గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, బోడి నారాయణరావు, అవుటుపల్లి నారాయణరావుగార్ల సహకారంతో నడిపారు. ఈ రాజకీయ పత్రికలో పరప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ వుండడం వల్ల హరిసర్వోత్తమరావుగారికి కారాగారశిక్ష వేశారు.

ఆంధ్రపత్రిక (1908; 1914–)

కాశీనాథుని నాగేశ్వరరావుగారు బొంబాయిలో 1908లో ప్రారంభించి 1914లో మద్రాసుకు కార్యాలయం మార్చారు.

ఆంధ్రసచిత్ర వారపత్రిక (1908)

మొదట యిది వారపత్రికగానే ఆరంభమైంది గాని దినపత్రికగా వచ్చాక ఆగిపోయింది. 1946వ సంవత్సరం వినాయక చవితినాడు వారపత్రిక పునఃప్రారంభమైంది.

హిందూసుందరి (1908–1920)

స్త్రీల పత్రిక. మొసలిగంటి రమాబాయమ్మగారు కాకినాడ నుండి నడిపారు.

కామేశ్వరి (1909)

పురాణం సూర్యనారాయణతీర్థులుగారు విజయనగరం నుండి ప్రచురించిన సాహిత్య మాసపత్రిక.

ఆంధ్రభారతి (1910-1915)

ఎం. కృష్ణారావుగారి సంపాదకత్వంలో బందరు నుండి వెలువడిన సాహిత్యపత్రిక. గురజాడ అప్పారావుగారి దిద్దుబాటు, మీపేరేమిటి కథలు ఇందులోనే మొదట అచ్చుపడ్డాయి. మాడపాటి హనుమంతరావుగారి మహాభారత పరిశోధనలు, తిరుపతి వెంకట కవుల భారత విశేషాలు కూడా ఈ పత్రిక ప్రచురించింది. చీనా, జపాను, టర్కీ చరిత్రలు యిందులో వెలుగు చూశాయి.

యుగంధర (1910 తర్వాత)

ఏలూరులో మున్నంగి లక్ష్మీనరసింహశర్మగారు ఈ వారపత్రికను స్థాపించి నడిపారు. వీరిని పూర్తి పేరుగాక 'మున్నంగి శర్మ' అనే పేరుతోనే వ్యవహరించడం జరిగేది.

సావిత్రి (1910-1918)

స్త్రీల పత్రిక. కాకినాడ నుండి పులుగుర్తి నరసమ్మగారి సంపాదకత్వంలో వెలువడిన పత్రిక.

గౌతమి (1911)

తెలుగు గడ్డమీద వెలువడిన తొలి దినపత్రిక. దీనిని శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు సంస్థాపించారు. ఒక ఏడాదిపాటే నడిచింది. కిందటి శతాబ్దంలో వచ్చిన దేశాభిమానిలాగా ఆగిపోయింది.

మానవసేవ (1911)

నాళం కృష్ణారావుగారు రాజమండ్రి నుండి నడిపిన సచిత్ర మాసపత్రిక. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి 'మీరాబాయి' యిందులో అచ్చుపడింది.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (1912-1)

గ్రాంథిక భాషా సంరక్షణ కోసం పిఠాపురం రాజావారి పోషణలో, జమీందారుల అండదండలతో జయంతి రామయ్యగారు స్థాపించిన ఆంధ్రసాహిత్య పరిషత్తు తరపున వెలువడిన పత్రిక. ఇందులో విమర్శలు, వ్యాసాలు, మొదలైనవికాక ప్రాచీన కావ్యాలను ఫారాల చొప్పున ప్రచురించేవారు. సుప్రసిద్ధ పండితులు పరిష్కరించిన ఈ గ్రంథాలను తరువాత పుస్తక రూపంలో కూడా వెలువరించేవారు. సుమారు 31 ప్రాచీన గ్రంథాలను ప్రకటించారు. ఈ పత్రికలో శాసన పరిష్కరణ వ్యాసాలు కూడా వెలువడేవి. ఆంధ్రసాహిత్య చరిత్ర రచనలో పరిశోధకులకు ఉపయోగపడే అంశాలతో చాలా వ్యాసాలు యిందులో వుండేవి. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వఙ్ఝల చినసీతారామశాస్త్రి, తంజనగరం దేవప్పెరుమాళయ్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, నడకుదుటి వీరరాజువంటి వారు యిందులోని రచయితలు.

హితబోధిని (1913)

తెలంగాణాలోని మహబూబ్‌నగర్ నుండి ప్రచురితమైన మొదటి పత్రిక యిది. దీనికి శ్రీనివాసశర్మగారు సంపాదకులు. ఒక ఏడాదిపాటు నడిపారు.

అనసూయ (1914-1920)

కాకినాడ నుండి వింజమూరి వెంకటరత్నమ్మగారు స్థాపించిన పత్రిక. ఈమె దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి సోదరి. ఇందులో కథలు, వ్యాసాలు, పద్యాలు ప్రచురిస్తూ వుండేవారు.

త్రిలిఙ్గ (1915-1955)

వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు ప్రచురించే పత్రిక. ఈ వారపత్రికకు కొన్నాళ్ళు అక్కిరాజు ఉమాకాంతంగారు సంపాదకులు. సాహిత్య విమర్శనలో నిర్మొహమాటపు వ్రాతలు వుంది. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి మొదలైనవారికి తీవ్రమైన వాదోపవాదాలు సాగేవి.

అభినవ సరస్వతి (1918-1930)

జానపాటి పట్టాభిరామశాస్త్రిగారు ప్రాచీన కావ్యాల ప్రచురణకోసం ఈ పత్రికను ప్రారంభించారు. వారు పరిష్కరించి అచ్చువేసిన కావ్యాలు

1. రాయసం వెంకటపతి - లక్ష్మీ విలాసం
2. సోమనాథ కవి - విష్ణుమిత్రోపాఖ్యానం
3. ఘట్టుప్రభువు - యాజ్ఞవల్క్య చరిత్ర
4. వీరభద్రకవి - కరుణీకోద్ధారణి

ఆంధ్ర దేశోపకారి (1918)

నేలటూరి రాఘవయ్యగారు దీనిని ప్రచురించేవారు.

గ్రంథాలయ సరస్వతి (1918-1928)

ఆంధ్ర గ్రంథాలయోద్యమం కోసం అయ్యంకి వెంకటరమణయ్యగారు బెజవాడ నుంచి ప్రచురించే సంపుటాలు. ఈ పత్రికలో ఆదిలో రాయప్రోలు సుబ్బారావుగారి గేయాలు అచ్చుపడ్డాయి. సారస్వత వ్యాసాలు కూడా వుండేవి.

సాహితి (1919-1924)

సాహితీ సమితి తరపున కొమ్మూరి హనుమంతరావుగారి పెట్టుబడితో తల్లావఝుల శివశంకరశాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన పత్రిక. నవ్య కవిత్వంలో ఉత్తరోత్తర హేమాహేమీలుగా పేరు పొందిన రచయితలందరూ ఇందులో తమ కవితలూ, ఇతర ప్రక్రియలూ తొలి సంచికలో ప్రచురించారు. ఆ పేర్లు కొన్ని -

1. కొడవటిగంటి వెంకటసుబ్బయ్య
2. పెద్దిభట్ల పూర్ణశర్మ
3. చింతా దీక్షితులు
4. త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి

5. మునిమాణిక్యం నరసింహారావు
6. బసవరాజు అప్పారావు
7. కొమ్మూరి హనుమంతరావు
8. కురుగంటి సీతారామయ్య
9. కోపల్లె శివకామేశ్వరరావు
10. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి
11. నోరి నరసింహం
12. అక్కిరాజు ఉమాకాంతం

సాహితీ సమితిలో తర్వాత వేదుల సత్యనారాయణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, శ్రీనివాస శిరోమణి, విశ్వనాథ సత్యనారాయణ, నండూరి సుబ్బారావు, కొడాలి ఆంజనేయులు సభ్యులయ్యారు. నవ్య సాహిత్యపు వేకువరేకులు సాహితిలో తొలిసారి కనబడ్డాయి.

ఆంధ్రభాషావిలాసిని (1920-1930)

చిత్రాడలో చెలికాని లచ్చారావుగారు ఆంధ్ర పరిశోధన మండలి 1918లో స్థాపించిన దాని తరపున ఈ పత్రికను వెలువరించారు. తంజావూరు రఘునాథ నాయుని నలచరిత్ర (ద్విపదకావ్యం), త్రిపురారికవి సీతావిజయం మొదలైన ప్రాచీన కావ్యాలను ప్రచురించారు.

తెలుగు (1920)

గిడుగు రామమూర్తిగారు వాడుకభాష ప్రచారం కోసం ప్రారంభించిన పత్రిక. ఏడాదిపాటు నడిచింది. రామమూర్తిగారి వాదమంతటికీ మూలమైన రచనలు యిందులో అచ్చుపడ్డాయి.

తెలుగు పత్రిక (1920-1925)

తెలంగాణాలో ఒరంగల్లు జిల్లాలోని ఇనుగుర్తిలో వద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు-స్థాపించి నడిపిన పత్రిక. గోలకొండ పత్రిక వచ్చాక యిది ఆగిపోయింది.

నీలగిరి పత్రిక (1920-1925)

హైదరాబాద్ సంస్థానంలో తొలి పత్రికలలో యిది వుండేది. ఈ పత్రికలో తెలంగాణాలోని నల్గొండ నుంచి సబ్ నవీసు నరసింహారావుగారు స్థాపించారు. గోలకొండ పత్రిక పుంజుకొన్నాక యిది ఆగిపోయింది.

ప్రబుద్ధాంధ్ర (1920-1929)

రాయవరంలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వచన రచనలకోసం సొంతంగా పెట్టుకొన్న కౌశికీ ప్రెస్‌లో మొదట పక్షపత్రికగా తెలుగు సంస్కృత విభాగాలతో

ప్రచురించిన పత్రిక. తర్వాత ప్రెస్ ఆపేసి మాసపత్రికను చేశారు. ఇందులో వారి కథలు ఎక్కువగా ప్రచురితమయ్యేవి. మాసపత్రిక అయ్యాక రాజమండ్రికి మార్చారు. హిందీవల్ల తెలుక్కు జరిగే అపకారం అనే నినాదం చాలా ఘాటుగా వుండేది. ఇది కేవలం వ్యావహారిక భాషా పక్షపాతి.

వజ్రాయుధం (1920)

వ్యావహారిక భాషోద్యమాన్ని అడ్డుకొనడానికీ, గిడుగువారిని ఖండించడానికి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు ప్రారంభించిన పత్రిక.

సాహిత్య (1920)

బుర్రా శేషగిరిరావుగారు కళల కోసం విజయనగరం నుండి ప్రచురించిన మాసపత్రిక.

గాండీవం (1921)

మున్నంగిశర్మగారు 'యుగంధర' తర్వాత నడిపిన పత్రిక. జాతీయోద్యమం, జమీందారీ జులుంమీదా, జస్టిస్ పార్టీ రాజకీయంపైన తీవ్రంగా రాసి దుండగీడుల దౌర్జన్యాలకి జంకక, ధైర్యంతో మున్నంగి శర్మగారు ఈ పత్రిక నడిపారు.

దేవదత్తం (1921)

ఏలూరునుండి మున్నంగి శర్మగారు నడిపిన ఒక వారపత్రిక. జాతీయోద్యమం శంఖారావం వెలువడింది.

జ్ఞానదీపిక (1923)

మేడూరి శ్రీరామమూర్తిగారు విజయనగరం నుండి ప్రచురించిన పక్షపత్రిక. వార్తలు వుండేవి.

జయంతి (1923)

విశ్వనాథ సత్యనారాయణగారు, కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు కలసి నడిపిన సాహిత్య పత్రిక. సాహితి తర్వాత నవ్య సాహిత్యంలో వచ్చిన ఉత్తమశ్రేణి రచనలు యిందులో వున్నాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ, నాయని సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బూర్గుల రామకృష్ణారావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, భావరాజు వెంకట కృష్ణారావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి మేటి రచయితలు యిందులో రాసేవారు.

నాటకకళ (1923)

మల్లాది విశ్వనాథశర్మగారు విజయనగరం నుండి ప్రచురించిన మాసపత్రిక. ఇందులో వంగ రచనలు, వినోద నాటికలు ప్రచురించేవారు.

భారతి (1923 నుండి)

కాశీనాథుని నాగేశ్వరరావు సంస్థాపించిన సాహిత్య పత్రిక. వివిధ సాహిత్య ప్రక్రియలు. శాసన పరిశోధనలు, పుస్తక విమర్శలు, సాభిప్రాయ విశేషాలు మొదలైన వివిధ

శీర్షికలతో సచిత్రంగా వెలువడేది. వేరువేరు కాలాలలో వివిధ వ్యక్తులు సంపాదక నిర్వహణ చేసేవారు.

శారద (1923–1924)

కౌతా శ్రీరామశాస్త్రిగారు బందరు నుండి ప్రారంభించిన ఆధునిక పత్రిక. రామానంద ఛటర్జీ సంపాదకత్వంలో కలకత్తాలోని మోడరన్ రివ్యూ దీనికి ఇన్‌స్పిరేషన్. రెండేళ్ళపాటే నడిచినా చాలా ఉన్నత ప్రమాణాలతో వెలువడిన అసలు సిసలు నవ్య సాహిత్య పత్రిక. చిత్రాలు, వ్యాసాలు చాలా ఉత్తమశ్రేణివి. సహాయం చేస్తారనుకొన్నవారు చేయకపోవడంచేత పత్రిక ఆగిపోయింది.

సరస్వతి (1923–1928)

కృష్ణాజిల్లా ముక్త్యాల నుండి వాసిరెడ్డి సదాశివేశ్వర బహదూరువారి పోషణలో వెలువడిన పత్రిక. (పోలవరం జమీందారుగారు పూర్వం సరస్వతి నడిపేవారు). ఈ పత్రికను ప్రాచీన కావ్యాలను ప్రచురించడానికే వుద్దేశించారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ క్రింది గ్రంథాలు పరిష్కరించి అచ్చువేశారు.

1. దగ్గుపల్లి దుగ్గన్న - నాసికేతోపాఖ్యానం
2. తెనాలి రామలింగని ఉద్భటారాధ్య చరిత్ర
3. అప్పనమంత్రి చారుచర్య
4. వైద్య గ్రంథ సముచ్చయం

ఇందులో బౌద్ధుల జాతక కథలు, సంస్కృత కవులపై వేటూరివారి రచనలు అచ్చుపడేవి.

సారస్వత సర్వస్వం (1923–24)

తణుకు నుండి యెలుసుపాటి రామభద్రాచార్యులు ప్రారంభించి పద్నాలుగు సంచికలు మాత్రమే ప్రచురించారు. ఈ పత్రికలో బండారు తమ్మయ్య, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి మొదలైన వారి రచనలు ప్రచురించేవారు. చెప్పుకోదగ్గ ముఖ్య విషయం ఈ పత్రిక ఈ పత్రికలో ఆచంట వెంకటరాయ సాంఖ్యాయనశర్మగారు ఆంధ్ర సాహిత్య పరిషత్తు 13వ వార్షికోత్సవంలో చేసిన అధ్యక్షోపన్యాసాన్ని ఇందులోనే ప్రచురించారు. ఆచంటవారు వాడుక భాషావాదులు అనుకోవాలి. అధ్యక్షోపన్యాసాన్ని ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రికలో ప్రచురించడానికి కార్యకర్తలు నిరాకరించారు. ఈ పత్రిక ప్రకటించింది.

హిందూ యువతి (1923)

దర్శి చెంచయ్యగారి సహాయంతో యామినీ పూర్ణతిలకమ్మగారు కళావంతుల సంస్కారానికి కృషిచేసి హిందూ యువతి శరణాలయం స్థాపించారు. దీని తరపునే ఈ పత్రికను నిర్వహించారు. ఉద్యమ తారీకులు సరిగ్గా తెలియవు.[1]

---

1. దర్శి చెంచయ్య - నేనూ నా దేశం - పుట.272

ఆంధ్ర సర్వస్వం (1924-1926)

మహేంద్రవాడ కాపురస్తులు ఏడిద వెంకటరావుగారు రాజమంద్రి నుండి నడిపిన పత్రిక. చాలా అర్థాయుష్షు గల ఈ పత్రిక మెకంజీ కైఫీయత్తులను ప్రచురించడానికి ప్రయత్నించింది. బహుజనపల్లి సీతారామచార్యుల వంటి పండితుల జీవిత చరిత్రలు ప్రకటించింది.

కళ (1924-1927)

పాకాల వెంకట రాజమన్నారు సంపాదకత్వంలో వెలువడిన పత్రిక. మానవల్లి రామకృష్ణకవి, కొమర్రాజు లక్ష్మణరావు మొదలైనవారి రచనలు కూడా ఉండేవి. సాహిత్య రంగానికీ , నాటక కళకు ప్రాముఖ్యం ఉండేది.

రెడ్డి రాణి (1924-1932)

తూర్పుగోదావరి జిల్లా రాయవరం నుండి మల్లిడి సత్తిరెడ్డిగారు ప్రచురించిన ఈ పత్రికలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథలు అచ్చుపడేవి. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రెడ్డిరాజుల కాలం నాటి శాసనాలు ఇందులో ప్రచురించారు. పెండ్యాల సుబ్రహ్మణ్యశర్మగారి మహాభారత విమర్శల వ్యాసాలు ఇందులో ప్రకటితమయ్యాయి. ఇది పేరుకు కులపత్రికగాని, పూర్తిగా సాహిత్య విషయాలకే ప్రాముఖ్యం ఉండేది.

ఆర్యప్రభ (1925)

నటశ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారు విజయనగరం నుండి కొన్నాళ్ళు నడిపిన ద్వైవారపత్రిక. వీరు మహారాజావారి సంగీత పాఠశాలలో నాట్యాచార్యులు.

కాంగ్రెసు (1925-1928)

సీతానగరు తరపున మద్దూరు అన్నపూర్ణయ్యగారు రాజమంద్రి నుండి నడిపిన పత్రిక. 1921లో దీనిని సైక్లోస్టయిల్ పత్రికగా ప్రారంభించారు. అప్పుడు ప్రచురించిన ఒక కరపత్రానికి ప్రభుత్వం కేసు పెట్టి ఏడాదిన్నర శిక్ష వేసింది. తర్వాత అన్నపూర్ణమ్మగారు సీతానగరం సత్యాగ్రహ ఆశ్రమంలో చేరి కాంగ్రెసు పత్రికకు సంపాదకత్వం వహించారు. ప్రథమ భారతస్వాతంత్ర్య పోరాట గాథలు ప్రచురించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవానికి సంబంధించిన సాహసగాథలను ప్రచురించి 1928లో చిచ్చులపిడుగు అనే వ్యాసాన్ని వ్రాసినందుకు ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల కఠినశిక్ష విధించింది.

గోలకొండ పత్రిక (1925-.....)

హైదరాబాదు నుండి సురవరం ప్రతాపరెడ్డిగారు సంస్థాపించి నడిపిన ద్వైవార పత్రిక. ఈయన జాతీయవాది, ఖద్దరుధారి కనుక మొదట ప్రభుత్వం నుండి అనుమతి రాలేదు. అయినా ప్రయత్నం ఆపక రెడ్డిగారు కృతకృత్యులయ్యారు. పత్రిక అన్నాక దానికి సంపాదకుడు, మేనేజరు, సబ్ ఎడిటరు, ప్రూఫ్ రీడరు, గుమస్తా, చప్రాసీ అవసరం. ఈ

విధులన్నీ సురవరం వారే ఆదిలో ఒక్కచేతితో నిర్వహించేవారు. కొన్నాళ్ళ తర్వాత మాడపాటి హనుమంతరావుగారు సహాయకులుగా తోడ్పడ్డారు.

సఖి (1925-26)

సాహితీ సమితి రచయితలు 'సాహితి' తర్వాత వెలువరించిన సంపుటాలు యివి.

కొరడా (1927)

అయ్యంకి వెంకట రమణయ్యగారు నిర్వహించిన పత్రిక.

గృహలక్ష్మి (1927-1960)

కె.ఎన్. కేసరిగారు స్త్రీలకోసం కేసరి కుటీరం తరపున ప్రారంభించిన మాసపత్రిక. కథలు, వ్యాసాలు, పద్యాలు, గేయాలు, చిత్రకళ, చలనచిత్రాలు మొదలైన సకల శీర్షికలతో సర్వాంగ సుందరంగా వుండేది. ప్రతి సంవత్సరం ఉత్తమ మహిళా సారస్వతమూర్తికి గృహలక్ష్మి స్వర్ణ కంకణం బహూకరించేవారు. ఈ ఉత్తమ పత్రిక కేసరి మరణంతో ఆగిపోయింది.

సమదర్శిని (1927)

మద్రాసు నుండి జస్టిస్ పార్టీవారు ప్రచురించిన పత్రిక. పింజల సుబ్రహ్మణ్యా సెట్టి ప్రచురణకర్తగా, సంపాదకునిగా పేరు. నిజమైన సంపాదకునిగా గానాల రామూర్తి పనిచేసేవారని చెప్పుకొనేవారు. ఈ పత్రిక సంపాదకవర్గంలో గూడవల్లి రామబ్రహ్మం, దువ్వూరి రామిరెడ్డి వుండేవారు. ఇది కొన్నాళ్ళు దినపత్రికగా, తర్వాత ద్వైవారపత్రికగా వెలువడింది. ఉత్తరోత్తరా తాపీ ధర్మారావుగారు సంపాదక బాధ్యతలు స్వీకరించారు. ఉగాదికి ప్రత్యేక సంచికను ప్రచురించేవారు.

సుజాత (1927-1930; 1950)

ఈ పత్రికను పి.ఎన్.శర్మగారు సంస్థాపించారు. కొన్నాళ్ళకు దీనిని సురవరం ప్రతాపరెడ్డిగారు తీసుకొని మాడపాటి హనుమంతరావుగారి సహకారంతో నడిపారు. మూడేళ్ళపాటే నడిచింది. అయినా 1950లో పునః ప్రారంభం చేశారు.

గంధర్వ (1929)

నటశ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారు విజయనగరం నుండి ప్రచురించిన సంగీత నాట్యకళల మాసపత్రిక. వీరు ఒక నాట్య పాఠశాలను నడిపేవారు.[2]

తొలినాటి తెలుగు పత్రిక సంపాదకులు ఒకరకంగా ప్రాచీన గ్రంథ సంచాలకులు కూడా. వివిధ తాళపత్ర గ్రంథాలూ, వ్రాతప్రతులూ సంపాదించి ప్రచురణార్హమైన వాటిని పరిష్కరించి తమ పత్రికలలో ప్రచురించేవారు. కొందరు గ్రంథ సంచాలకులు పోషకుల సహాయంతో ఆ కావ్యాలను గ్రంథరూపంలోనే దేశానికి మొదట సమర్పించేవారు. అటువంటి సంచాలకులలో కొందరి జీవిత చరిత్రలు తెలుసుకోదగ్గవి.

---

2. ఇవేకాక మరికొన్ని పత్రికల వివరాలు కూడా సందర్భానుసారంగా జమీందారీ నవ్య సాహిత్య యుగాలలోని వివిధ ప్రకరణాలలో ప్రస్తావించబడ్డాయి.

నిడుదవోలు సుందరం (1864-1931)

ప్రప్రథమంగా 1894లో తెలుగుదేశంలో ఆంధ్ర గ్రంథ భాండారాన్ని స్థాపించినవారిగా నిడుదవోలు సుందరం గురించి వారి కుమారులు నిడుదవోలు వెంకటరావుగారు పేర్కొంటారు. క్రీ.శ. 1900 నాటికి ఈ ఆంధ్ర పుస్తక భాండాగారంలో పదిహేను వందల తాళపత్ర గ్రంథాలూ, రెండువేల ప్రాచీన ముద్రిత గ్రంథాలూ, పత్రికలూ ఉండేవట. సుందరంగారు విజయనగరం వాస్తవ్యులు కనుక అక్కడే ఈ పుస్తకాలను సేకరించారు. అయితే రాను రాను జీర్ణించి ఆరువందల తాళపత్ర గ్రంథాలకు తగ్గాయి.

మంత్రిప్రెగడ భుజంగరావుగారు ప్రచురించిన ఆధునిక కవుల జీవితాలలో సుందరంగారి గురించి ఇలా ఉంది.

''వీరు శోధించి చూచిన గ్రంథముల సంఖ్యాకములని చెప్పవచ్చును. వీరి యముద్రిత గ్రంథభాండాగారము మిక్కిలి గొప్పది. మంజువాణి మొదలయిన మాసపత్రికలకు వీరు చాలా పురాతన గ్రంథములను సంపాదించి యిచ్చిన యుపకార బుద్ధి గలవారు. ఒక్కొక్క గ్రంథమును సంపాదించుట కెన్నెన్ని కష్టములనైనఁబడిరి.''

గ్రంథ సంచయాన్ని సుందరంగారు మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయానికి విక్రయించారు. ఓరియంటల్ లైబ్రరీ వారి 'డి కేటలాగు'లలోను, ఇతర ఆకరాలలోనూ సుందరంగారి దగ్గర్నుంచి సంపాదించిన పుస్తకాల వివరాలన్నీ క్రోడీకరించితే కొన్ని డజన్ల లెక్క తేలుతోంది. ఒక వ్యక్తి ఇన్ని గ్రంథాలను సేకరించడం ప్రశంసనీయం. ఆ సంపదను ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వంటి దానికి సంక్రమింపచేయడం అంతకన్నా మెచ్చుకోదగ్గ విషయం.

మానవల్లి రామకృష్ణకవి (1886-1957)

ప్రాచీన గ్రంథ సేకరణలో ఒకప్పుడు బంగారుగని లాంటి గ్రంథం దొరుకుతుంది. మరుగుపడిన మాణిక్యాలూ, చరిత్రకెక్కని చరితార్థులూ రచించిన అపూర్వ గ్రంథాలు కాలగర్భంలో కలసి పోకుండా గ్రంథ సంచాలకుల కృషి వల్ల బయటకు తేలి మన సాహిత్య చరిత్రలో కొన్ని అధ్యాయాలకు తోడ్పడుతాయి. అటువంటి గ్రంథ సంపాదన చేసినవారిలో మానవల్లి రామకృష్ణకవిగారు చిరస్మరణీయులు. వారి మూలంగానే తెలుగు సాహిత్యంలో నన్నెచోడుని కుమార సంభవం 1909లో వెలుగు చూసింది. మెరుపులాగా మెరిసిన ఈ గ్రంథం పిడుగులాగ కూడా పడింది. దానికి కారణం రామకృష్ణకవిగారు నన్నెచోడుడు క్రీ.శ. 940 ప్రాంతాలవాడని చెప్తూ కుమార సంభవాన్ని ప్రచురించడమే. చాలామంది నేటికీ ఇది రామకృష్ణకవిగారి కూటకరణం అని అభాండం వేస్తారుగాని నన్నెచోడుని గ్రంథం తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలో కవిగారు పుట్టకముందు నుంచీ ఉంది.[3] అయితే 1909లో కవిగారు తమకీ పుస్తకం ఎక్కడ లభించిందో చెప్పకుండా ప్రచురించడం అపోహలకు కారణమైంది. ఆ కాలపు పండితులు ఆకరాలు రహస్యంగా దాచుకొనే గుంభన గలవాళ్ళు.

3. ఆదిమ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి 2002

మానవల్లి రామకృష్ణకవిగారి అసలు పేరు కృష్ణయ్య. చిన్నప్పుడు కవిత్వం రాయడం వల్ల కవి అనే పేరు వచ్చింది. మద్రాసు నుంగంబాకంలో 1866లో జన్మించారు. వారి తండ్రి రామశాస్త్రిగారు అష్టాదశ భాషలలో, విద్యలలో ప్రవీణులు. నాట్యశాస్త్ర వ్యాఖ్యాత. రామకృష్ణకవిగారు మద్రాసులోనే ఎం.ఎ. పట్టభద్రులయ్యారు. క్రిష్టయన్ కళాశాల, పచ్చయప్ప కళాశాల మొదలైన నాటి హైస్కూళ్ళలో అధ్యాపకునిగా పనిచేశారు. తర్వాత వనపర్తి సంస్థానం వారికి గ్రంథ ప్రచురణ కార్య నిర్వాహకులై పదేళ్లు పనిచేశారు. అనేక ప్రాచీన గ్రంథాలను సేకరించి 'విస్మృత కవులు' అనే శీర్షిక క్రింద గ్రంథ ప్రచురణ చేయించారు. వారు వెలువరించిన పుస్తకాలు -

1. నన్నెచోడుని కుమార సంభవం
2. వల్లభరాయుని క్రీడభిరామం
3. మడికి సింగన సకల నీతి సమ్మతం
4. బద్దె భూపాలుని నీతిశాస్త్ర ముక్తావళి
5. భైరవ కవి శ్రీరంగ మాహాత్మ్యం
6. పూర్వ కవుల పద్యాల ప్రబంధమణి భూషణం
7. వేంకటేశోదాహరణం

ఈ గ్రంథాలు ఆంధ్ర సాహిత్య చరిత్రలో కొన్ని కొన్ని అధ్యాయాల సమగ్రతకు తోడ్పడ్డాయి. కవిగారు వనపర్తి వారికోసం దేశంలోని చాలా ప్రదేశాలలో గ్రంథ సంచాలనం చేశారు. వనపర్తి సంస్థాన గ్రంథాలయం చాలా విలువైనది. దాని విలువ పెరగడానికి రామకృష్ణ కవిగారి కృషి కొంత కారణం.

వనపర్తి కొలువు తర్వాత కవిగారు మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఆరేళ్ళపాటు పనిచేశారు. తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానపు ప్రాచ్య పరిశోధనా లయంలో పదేళ్లు పనిచేశారు. తిరుపతిలో ఉన్నప్పుడే 'భారత కోశః' అనే అపూర్వ సంగీత నాట్యశాస్త్ర పద ప్రయోగ నిఘంటువును ప్రామాణిక ఉదాహరణ శ్లోకాలతో సంకలనం చేసి సంస్కృత నాగరి లిపిలో ప్రచురించారు. భరతుని నాట్యశాస్త్రానికి అభినవ గుప్తుని అభినవ భారతి వ్యాఖ్యానాన్ని జత చేసి గైక్వాడ్ ఓరియంటల్ గ్రంథమాల వారికి ప్రచురణార్థం ఇచ్చారు.

కవిగారు పూనుకొనకపోతే చాలా ప్రాచీన గ్రంథాలు మనకు దక్కేవి కావు.

వేటూరి ప్రభాకరశాస్త్రి (1888-1950)

ప్రాచీన గ్రంథగవేషణలో కాలికి బలపం కట్టుకొని తిరిగినవారిలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పడ్డ కష్టాలు ఇన్నీ అన్నీ కావు. అయితే సాధించిన విజయాలు గొప్పవే. ఆయన స్వతహాగా కవి కనుక గ్రంథ సంచాలనకై తాము తిరిగిన చోట్లు కొన్ని ఇలా వర్ణించారు.

''ఎండలు మెండు, నీళ్ళు లభింపవు, కూరలు లేవు, పూవులుం
బండలు కానరావు, బలవంతమెయ్యైనను వానలేమి చే౦

బండదు భూమి, లేమిఁబడుపాటులు మిక్కిలి, దారి దోపుడుల్
మెండిటు వంటి దేశమున మేము చరించుచునుంటి మిత్రమా!

దేశంలో యిలా చరించడం కొంత ఉద్యోగ ధర్మం. అంతా పుస్తకాలమీద అభిమానం. ప్రభాకరశాస్త్రిగారు 1906లో మద్రాసు చేరారు. మొదట ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో పరిశోధనలు చేశారు. 1915లో తంజావూరు వెళ్ళి ఏడాదిపాటు అక్కడ గ్రంథాలకు వివరణలు రాశారు. 1916లో ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో లేఖక పండిత పదవిలో చేరారు. గ్రంథ సేకరణకు 1916 నుండి దేశం తిరిగారు. 1917లో నెల్లూరు మండలంలో 1919లో గుంటూరు, విశాఖ మండలాలు పర్యటనచేసి గ్రంథ సంచాలన చేశారు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయం కోసం ఎవరెవరి దగ్గర ఏయే పుస్తకాలు సేకరించారో, వేటిని కొన్నారో అన్నీ రికార్డులలో వున్నాయి. కొన్నివందల తాళపత్ర గ్రంథాలను చేర్చి వుంటారు. ఒకపక్క గ్రంథ సంచాలనం చేస్తూ సకల గ్రంథాలను ప్రకటించారు. వాటి వివరాలు యివి :

1. చాటు పద్యమణిమంజరి - ప్రథమ భాగం (1914)
2. ప్రబంధ రత్నావళి (1918)
3. చాటు పద్యమణిమంజరి - ద్వితీయ భాగం (1922)
4. బసవపురాణం (1928)

ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించిన గ్రంథాలు

1. తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర 91914)
2. అప్పన చారుచర్య (1922)
3. శృంగార శ్రీనాథం (1923)
4. ఉద్భటారాధ్య చరిత్ర (1925)
5. మనుచరిత్ర (1926)
6. క్రీడాభిరామం (1928)

ప్రభాకరశాస్త్రిగారు ఆధునిక యుగంలో కూడా చాలా అమూల్య గ్రంథ సంపాదనలు దేశానికి సమకూర్చారు. జమీందారీ యుగంలోని వారి సేవలే యిప్పుడు చెప్పుకొన్నాం. గురజాడ అప్పారావుగారికి, గిడుగు రామమూర్తిగారికి, మానవల్లి రామకృష్ణకవిగారికి ప్రభాకరశాస్త్రిగారు ఎన్నో రకాలుగా తోడ్పడ్డారు. వారివల్ల తెలుగు సాహిత్యం శ్రీమంతం అయింది.

దీపాల పిచ్చయ్యశాస్త్రి (1894-1983)

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచీన గ్రంథ సంచాలకులుగా ఈనాటి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 1917లో సంచారం చేస్తున్నప్పుడు వారితోపాటు ఊరూరా తిరిగిన విద్వత్కవులు దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు. పుస్తక సేకరణలో మెలకువలు బోధపర్చుకుని దీపాలవారు ఉత్తేజితులయ్యారు. ప్రభాకరశాస్త్రిగారిలాగే దీపాలవారు తిరుపతి

వెంకటకవుల శిష్యులు. ప్రభాకరశాస్త్రిగారు 1914లోనే చాటుపద్య మణిమంజరి సంకలనం చేసి అచ్చువేసినా వెళ్ళిన ప్రతి ఊళ్ళో పండితుల దగ్గర కొత్త చాటుపద్యాలు విని రాసుకొనడం దీపాలవారు చూశారు. ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్య మణిమంజరిలో చేర్చని ఎన్నెన్నో చాటుపద్యాలూ, కవులగురించి గాథలూ వగైరాలు దీపాలవారికి తెలుసు. అందుచేత 1917లో పిచ్చయ్యశాస్త్రిగారు చాటుపద్య రత్నాకరం అనే గ్రంథంలో ఎన్నెన్నో చాటుపద్యాలు, అందులో చాటున వున్న చారిత్రక విశేషాలతో ప్రచురించారు.

దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు కవులుగానే, రచయితలుగానే జీవించదలచినా, విద్యాస్పర్థలు ఆయనను విమర్శకునిగా, ప్రామాణిక పాఠనిర్ణయకర్తగా చేశాయి. దీపాలవారు గుర్రం జాషువాగారితో కలసి జంట కవిత్వం చెప్పారు. విడిగా కావ్యాలు రచించారు. అయితే వేదం వెంకటరాయశాస్త్రిగారి శిష్యులతో వచ్చిన వివాదంలో చేమకూర సారంగధరను జితకాశీటీకా సహితంగా ప్రచురించి పూర్వం వేదంవారి ప్రచురణలో వున్న లోపాలను ఎత్తి చూపి పాఠ నిర్ణయం సరిగ్గా చేశారు. సాహిత్య సమీక్ష అనే గ్రంథంలో శబ్ద రత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువులను శృంగారనైషధాది వ్యాఖ్యానాలలోను ఉన్న శబ్దార్థ దోషాలను చర్చించారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు శ్రీ మదాంధ్ర మహాభాగవతాన్ని నాలుగు సంపుటాలుగా ప్రచురిస్తున్నప్పుడు ఇరవై అయిదు మంది పండితులు 257 వ్రాతప్రతులను సంపాదించి వాటిన్నింటినీ పరస్పరం సరిపోల్చి పరిశీలించి పాఠస్వీకారం చేసిన పిమ్మట పునః పరిశీలనలో నిర్ణాయకులుగా పిలిచిన ఇద్దరే ఇద్దరు పండితులలో దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు ఒకరు. ఇంతటి ప్రామాణిక పాఠ నిర్ణయానికి ఎన్ని గ్రంథాలు కరతలామలకమై వుండాలి.

దీపాల వారు యితర సంకలన గ్రంథాలు వేయలేదు. ఒక్కటి చాలు వారి ప్రతిభకు తార్కాణంగా వుండడానికి.

శేషాద్రి రమణ కవులు :

జమీందారీ యుగంలోని జంటకవులలో మిగతా వారెవరూ చేయనంత చేయలేనంత మహత్తర గ్రంథ సంచాలన చేసినవారు శేషాద్రి రమణ కవులు.

జయంతి రామయ్యగారు యిచ్చిన ఉద్యోగం వల్ల వివిధ ప్రదేశాలలో పర్యటనలు చేసి శాసనాలు, కైఫీయత్తులు, నాణాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి బండ్లకెత్తించి కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలోని గ్రంథాలయానికి చేర్చినవారు శేషాద్రి రమణ కవులు.

కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆదేశానుసారం తెలంగాణాలో పర్యటించి అనేక తాళపత్ర గ్రంథాలు సంపాదించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పంపించిన వారు శేషాద్రి రమణ కవులు.

కొల్లాపురం రాజాగారూ, కొమర్రాజు లక్ష్మణరావుగారు కోరగా రామప్పగుళ్ళ శాసనాలు, పాకాల శాసనం సంపాదించినవారు శేషాద్రి రమణ కవులు.

వావిళ్ళవారికి నాలుగు సంపుటాలలో 80 శతకాలు పీఠికలతోపాటు ఇచ్చి, యింకో పన్నెండు ప్రాచీన గ్రంథాలు పరిష్కరించి పీఠికలు వ్రాసి, వ్యాఖ్యానాలు చేసి శుద్ధ పత్రికలను యిచ్చినవారు శేషాద్రి రమణ కవులు.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం తాళపత్ర ప్రతిని ప్రప్రథమంగా సంపాదించిన వారు శేషాద్రి రమణ కవులే.

ఇలాగ జాబితా వేసుకొంటూ పోతే శేషాద్రి రమణ కవులు అపార గ్రంథ సంచలన సేవగణనకు వస్తుంది. వీరు ఏకోదరులు. ఏడుగురు అన్నదమ్ములలో ఒకరు మూడవవారు. మరొకరు నాలుగవవారు. వీరి పేర్లు, తారీఖులు ఇవి:

దూపాటి శేషాచార్యులు : 1890-1930

దూపాటి వెంకట రమణాచార్యులు : 1893-1961

ఈ అన్నదమ్ములలో మొదటివారు తక్కెళ్ళపాడులో, రెండవవారు ప్రత్తిపాడులో వీధిబడుల అయ్యవార్లుగా పనిచేస్తూ వుండేవారు. ఈ అన్నదమ్ములిద్దరూ ఒకసారి చింతపల్లిపాడులో కొప్పరపు సోదర కవుల ఆశుకవిత్వ సభకు వెళ్ళారు. సభాంతాన శేషాచార్యుల వారు కొప్పరపు వారిమీద పద్యాలు చెప్పారు. వాటిని విన్న ఆశుకవులు ఈ అన్నదమ్ములిద్దర్నీ కలిపి మీరు 'శేషాద్రి రమణ కవులు' అని పేరుపెట్టారు. నాటినుంచి ఈ కొత్తజంట అవధానాలు చేసి ధనమూ, కీర్తి ఆర్జిద్దామనుకొని దేశాలు పట్టారు. ప్రశంసలు కడుపు నింపవు కనుక ఉద్యోగాలు చూసుకోవలసి వచ్చింది. శేషాద్రి రమణ కవుల ఉద్యోగాల గురించి వాటి నిర్వహణలో వారు సాధించిన వాటి గురించి నా మిత్రులు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు చాలా చక్కని వ్యాసం రాశారు.[4] వీరికన్నా ఎక్కువగా శేషాద్రి రమణ కవుల గురించి ఇంకెవ్వరూ యిప్పటిదాకా చెప్పలేదు. అందుచేత రామరాజుగారికి కృతజ్ఞతలతో వారి వ్యాసంలోని భాగాలను అక్కడక్కడ ఎంచుకొని ఉదాహరిస్తున్నాను.

''ఆరోజుల్లో సుప్రసిద్ధ పరిశోధకులు సారస్వత సేవా ధురీణులు ఐన జయంతి రామయ్య పంతులుగారు గుంటూరులో అసిస్టెంట్ కలెక్టరుగా వుండేవారు. శేషాద్రిరమణ కవులు నాటకం ముద్రణం కోసం ఆర్థిక సహాయం ఆపేక్షిస్తూ పంతులుగారిని ఆశ్రయించినారు. పంతులుగారు వీరి ప్రతిభకు సంతోషించి ముద్రణం మాట మూలలకు పెట్టించి ఉద్యోగాలిచ్చినారు. ఆ ఉద్యోగాల మూలంగానే శేషాద్రి రమణ కవులూ వారి కుటుంబం కొంతకాలం రెండుపూటలు భోజనం చేసే వీలు కలిగింది. ఆ ఉద్యోగాల మూలంగానే సోదరులకు శాశ్వతమైన కీర్తి దక్కింది. ఆంధ్ర చరిత్రకు సాహిత్యానికి ఎంతో మేలు జరిగింది. జయంతివారు శేషాచార్యులవారిని గుంటూరు మండలంలోను, రమణాచార్యుల వారిని నిజాం సర్కారులోను పర్యటించి శాసనాలు, కైఫీయత్తులు, నాణెములు తాళపత్ర గ్రంథాలు సేకరించటానికై ఆంధ్రసాహిత్య పరిషత్తు పక్షాన నెలకు చెరి

4. తెలుగు వైతాళికులు - 3వ సంపుటం, పుటలు 89 నుండి

20 రూపాయలు జీతం మీద నియమించినారు. ఇదిగాక దినభత్యం అర్ధరూపాయి మైలుకు బేడ చొప్పున పర్యటన వ్యయం కూడా యిచ్చేవారు. సోదరులిద్దరూ తమతమ ప్రదేశాలలో తిరిగి బండ్లకెత్తించే చారిత్రక సామగ్రిని తాళపత్ర గ్రంథాలను సేకరించి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషద్భాండాగారాన్ని నింపినారు''.

''రమణాచార్యులవారు తెలంగాణాలో సేకరించిన చారిత్రక సామగ్రి యింతా అంతా కాదు. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం తాళపత్ర గ్రంథం ప్రప్రథమంగా సంపాదించుకొని తీసుకుపోతే జయంతివారు ఎంతో సంతోషించి రమణాచార్యులవారికి సహపంక్తి భోజనం పెట్టినారట. ఆ సంగతి రమణాచార్యులవారెంతో గొప్పగా చెప్పుకొన్నారు. ఒకసారి రమణాచార్యులుగారు అనుమకొండనుండి వేములవాడకు కాలినడకన పోయి భీమకవి వృత్తాంతం సేకరించి పంపినారు. పోతన మహాకవి బమ్మెరవాడే అని అనేకాధారాలతో నిర్ణయించి ఆ సమాచారం జయంతివారికి పంపటమేకాక కడపలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు వార్షికోత్సవ సభలో వ్యాసం చదివినారు. జయంతి వారిచ్చిన ఉద్యోగాలతో శేషాద్రి రమణ కవులు మొత్తం వెయ్యిరూపాయలు సంపాదించుకున్నారట. తక్కెళ్లపాడు వారు పరిశోధనలో కొంత అశ్రద్ధ చేసినందువల్ల జయంతివారు ఆయనను ఉద్యోగం నుండి తొలగించినారు. రమణాచార్యుల వారిని తొలగించలేదుగాని పరిషత్తుకు చందాలు వసూలు చేసేపని అప్పగించినారు. ఆ పని నచ్చక రమణాచార్యులవారే పరిషదుద్యోగం మానుకొన్నారు''.

తర్వాత రమణాచార్యులుగారు గంపలగూడెం జమీందారు దగ్గర ఆస్థానకవులుగా ఆరేళ్ళు వున్నారు. శేషాచార్యులవారు ఆంధ్ర గ్రంథాలయం ప్రెస్సులో ప్రూఫ్‌రీడర్‌గా, పునాదిపాడు హైస్కూల్‌లో ఆంధ్ర పండితుడుగా చివరకు బందరు హిందూ కాలేజీలో ప్రధానోపాధ్యాయునిగా చాలాకాలం స్థిరపడి అక్కడే చనిపోయారు. రమణాచార్యులు గారు తమ సోదరుడు లోకం విడిచిపోయినా తమ జంటను విడువలేదన్న భావంతోనే జీవితంలో ఏ సాహిత్యసేవ చేసినా శేషాద్రి రమణ కవులన్న జమిలి పేరుతోనే చేశారు.

రమణాచార్యులుగారు నందిగామ బోర్డు హైస్కూల్లోను, వరంగల్లు కాలేజిలోనూ ఉపాధ్యాయునిగా, ఆంధ్రోపన్యాసకునిగా ఉద్యోగాలు చేశారు. జీవితాంతం గ్రంథ సేకరణ, గ్రంథ పరిష్కరణ, శాసన పరిశోధన, ప్రాచీన గ్రంథ ప్రదర్శన మొదలైన వృత్తులతోనే కాలం గడిపారు. ఉద్యోగాల బదిలీలలో నిర్మల్‌లో ఉన్నా, కరీంనగర్‌లో వున్నా వ్యాసంగం ఒకటే. చాలా వివాదగ్రస్త విషయాలను కూలంకషంగా విశ్లేషించి నిగ్గు తేల్చడంలో శేషాద్రి రమణ కవులు నిజాయితీ గల నిర్భయస్తులు. మన సాహిత్య చరిత్రలో, దేశ చరిత్రలో వారి నిర్ణయాలు కొన్ని చూడండి :

''1. పోతనామాత్యుడు రాయలసీమలని ఒంటిమిట్ట వాడు కాడనీ తెలంగాణంలోని బమ్మెరవాడనీ;

2. మల్లికార్జున పండితారాధ్యుడు తెలంగాణం వాడనీ అతని ప్రథమాంధ్రకృతి శివతత్త్వసారమనీ;

3. ఆంధ్రదేశ ప్రసిద్ధ త్రిలింగాలలోనిది కాళహస్తి కాదనీ కరీంనగరం మండలంలోని కాళేశ్వరమనీ,
4. కరీంనగరం జిల్లాలోని మంథెనయే కాకతీయ శాసనాల్లోని మంత్రకూటమనీ,
5. రుద్రమదేవి గణపతి దేవచక్రవర్తి భార్య కాదనీ కూతురనీ
6. ప్రతాపరుద్రుని మంత్రి పురహరమహాదేవనాయకుడనీ,
7. కోలాచల మల్లినాథసూరి మెదకు మండలంలోని కొలచెలము వాడనీ,
8. ద్విపద తెలంగాణాలో పుట్టిందనీ,
9. తెలంగాణం తెలుగువారు వలసవచ్చినవారు కారనీ, తెలుగువారికి తెలంగాణమే ప్రథమ నివాసస్థానమనీ నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పిన ఘనత శేషాద్రి రమణ కవులకే దక్కుతుంది. ఈనాడీ విషయాలన్నీ ప్రాతబడిపోయినవి. మరి వెంకటరమణా చార్యుల వారీ నిర్ణయాలు చేసిననాడు వారు చేసిన పరిశ్రమ, దాని వెనుక ఉన్న వారి తృష్ణ ఎటువంటిదో మనం ఊహించుకోవలసినదే''.

ఇతరులు ఎక్కువగా సర్కారు రాయలసీమ కవుల గురించి పరిశోధనలు చేసి కవి జీవితాలు రాస్తే శేషాద్రి రమణ కవులు తెలంగాణాపై దృష్టి కేంద్రీకరించి సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రకటించిన గోలకొండ కవుల సంచికలో ప్రత్యేకంగా పూర్వకవి పరిచయం అనే శీర్షికలో 183మంది ప్రాచీన తెలంగాణా కవులను శేషాద్రి రమణ కవులే లోకానికి తెలియజేశారు.

''తెలంగాణంలో వారు తిరిగినన్ని ఊళ్ళు, వారు సేకరించినన్ని తాళపత్ర గ్రంథాలు, నాణాలు నారు సంపాదించినన్ని శాసనాలు వ్యక్తిగతంగా మరెవ్వరూ అంతపని చేయలేదు. ఆచార్యులవారు ఓ అంటే ఓ అని మారు పల్కరించేవి ఇక్కడి ప్రాచీన దుర్గ కుడ్యాలు, మందిరాలు, చారిత్రక ప్రదేశాలు, వారి అలికిడి కనిపెట్టి భూగర్భంలో నుంచి నిక్కి చూసేవి - మూగవోయిన శిలాశాసనాలు; వారి మాట సవ్వడి విని బూజు దులుపుకుంటూ అటకలపై నుండి దుమికేవి - తాళపత్ర గ్రంథాలు''.

శేషాద్రి రమణ కవులను తెలంగాణా మరిచిపోలేదు. వారిని తెలుగుదేశం మరిచిపోకూడదు.

నేదునూరి గంగాధరం (1904-1970)

లిఖితరూపంగా, తాటాకులమీదా, కాగితాలమీదా ఉన్న సాహిత్యాన్ని సంచాలకులు సేకరించడం ఎంత కష్టమైనా అంతకు కొన్నింతల కష్టం - వాగ్రూపంలో వున్న పల్లె పదాలూ, స్త్రీల పాటలూ మొదలైన జానపద సంపదను సేకరించడం. ఈ ప్రత్యేకమైన సాహిత్య సంచాలనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నేదునూరి గంగాధరంగారు. ఈయన బాల్యంలో 5వ తరగతిలోనే ఒక వ్యాసరచన పోటీలో గెలిచి, కందుకూరి వీరేశలింగంగారి కవులు చరిత్ర మూడుభాగాలు బహుమానంగా పొంది, దానితోపాటు వీరేశలింగంగారి దీవెనలు కూడా అందుకొన్నారు. బడిపంతులుగా ఉద్యోగం చేస్తూనే గ్రంథసంచాలనం ప్రారంభించారు. మానవల్లి రామకృష్ణకవిగారి

ప్రోత్సాహంతో తాళపత్ర గ్రంథాలు, టేకుమళ్ళ అచ్యుతరావుగారి సూచనల మేరకు కథలు, కథాగేయాలూ, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి సలహా ప్రకారం నుడికారాలూ, సామెతలూ, జాతీయాలూ సేకరించడం గంగాధరంగారి నిరంతర కృషి అయింది.

ఆదిలో వ్యాసుడు వేద భేదనం చేసిన రుషి కింద పేరు పొందితే ఆంధ్ర జానపద వేదాలను సేకరించి విభజించిన జానపద వాఙ్మయ వ్యాసుడు నేదునూరి గంగాధరంగారు. ఆంధ్రజాతి మరిచిపోలేని సేవ చేసినవాడు. సెలయేరు, మున్నేరు, మిన్నేరు మొదలైన సంకలనాలెన్నో వివిధ ప్రచురణకర్తలకు ఇచ్చారు. గంగాధరంగారు కాగితాల కెక్కించిన జానపద సాహిత్యాన్ని రాతప్రతులనుండే ఎందరెందరో పరిశోధకులు వాడుకొన్నారు. నూతిలో నీరు ఎంత తోడినా జల ఊరినట్లు గంగాధరంగారి సేకరణలు ఇంకా ప్రచురణలకు ఉవ్విళ్ళూరుతోనే ఉన్నాయి.

పత్రికా సంపాదకులుగానీ, గ్రంథ సంచాలకులుగానీ విరామచిహ్నాలుగా తమ జీవితాలలో కామాలనూ, సెమికోలన్లనూ కోరుకొంటారు గాని ఫుల్‌స్టాపులు కోరుకోరు.

నిఘంటు నిర్మాతలు

పదాలను, వాటి అర్థాలను ఇచ్చే పుస్తకాన్ని నిఘంటువు అంటారు. నిఘంటువుగా కోశమనే ఇంకో పేరు ఉంది. 'కోశవానాచార్యః' అని గౌరవిస్తారు. ఆంధ్ర సాహిత్యంలో తెలుగు నిఘంటువులు పద్యాలలో చెప్పినవే కావచ్చు. క్రీ.శ.1050 నుండి ఒక పన్నెండు క్రీ.శ.1800 లోపుల వెలువడినట్టు నాయకరాజుల యుగంలో గణపవరపు వెంకటకవి గురించి రాసిన ప్రకరణంలో చెప్పుకొన్నాం.[1] వెంకటకవి లోకోపకారం కోసం ఆ నిఘంటువును రాశానన్నారు. ఏ నిఘంటువైనా లోకులకు ఉపయోగపడాలి. కుంఫిణీ యుగంలో తెల్లదొరలు తమకు తాము పరిపాలనా సౌకర్యాలకు ఉపయోగపడడానికి నిఘంటువులు నిర్మింపచేశారు. అచ్చువేశారు. తెలుగు మాటలకు ఇంగ్లీషులో అర్థాలు ఇచ్చేవీ; ఇంగ్లీషు మాటలకు తెలుగు అర్థాలను చెప్పేవీ వెలువడ్డాయి. బ్రౌణ్యం రెండు రకాల నిఘంటువులూ మనకు ప్రామాణిక నిఘంటువులని చెప్పాలి. అయితే బ్రౌను దొరగారు కావ్యాలలో పదాలను కవి ప్రయోగాలతో ఉదాహరించడంతోపాటు వాడుకలో ఉన్న పదాలను ఎన్నిక చేశారు. దొరగారి పద్ధతులు మన పండితులు కొందరికి నచ్చలేదు. వేరే నిఘంటువు అవసరమనుకొన్నారు.

తాటాకులలో ఉండే మన ప్రాచీన కావ్యాలు ముద్రణ భాగ్యాన్ని పొందినప్పుడు పరిష్కర్తల చిత్తం వచ్చినట్టు పాఠాలను మార్చడానికి ఆస్కారం ఉంది. అరసున్నలు, బండిరాలు పూర్వం లేనివి మధ్యలో వచ్చాక వాటిని అచ్చులో తొలగించడం కొందరికి నచ్చలేదు. పద స్వరూపం ప్రాచీనకాలంలో ఎలా ఉందో అలాగే ఇప్పటికీ రాయాలని శాసించేవారికి కావ్య భాషకు ప్రామాణికమైన నిఘంటువు అవసరమైంది.

1. నాయకరాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి 2003

చిన్నయసూరిగారు (1816-1862) ఒక వ్యాకరణాన్ని ఒక లక్షణ గ్రంథాన్ని రాసిపెట్టి పోయినట్లు ఒక అకారాది నిఘంటువును కూడా రచించాలనుకొన్నారు. అనేక గ్రంథాలు పరిశోధించి విరివిగా ప్రయోగాలు సేకరించి స్వహస్తాలతో నిఘంటు పత్రాలను రచించారు. ఇందులో తెలుగు పదాలను మాత్రమే చేర్చాలని సూరి సన్నిహితులు భావించారు. సూరిగారు వ్యాకరణమైతే బాలురకోసం రాశారుగాని నిఘంటువును పండితుల కోసం ఉద్దేశించినట్లు సమకాలికులు అర్థం చేసుకున్నారు. ఏమైనా సూరిగారి నిఘంటువు పూర్తికాలేదు. వారి అసమగ్ర రచన కాగితాలను చాలామంది చూశారు. ఆ కృషి వల్ల లాభం పొందారు. ఆ కాగితాలు భద్రంగానే ఉండేవి.

సూరిగారి నిఘంటువు పూర్తయినా, అది విద్యార్థులకు అంతగా ప్రయోజనకారి కాదని భావించి విద్యార్థుల సహాయార్థం వారి ఉపయోగమునకు చాలునంతటిదిగా ఒక నిఘంటువును రచించాలన్న కోరిక సూరి సమకాలికులలో ఒకరికి కలిగింది. దానిని ఆయన పూర్తిచేశారు. దాని పేరు శబ్ద రత్నాకరం. జమీందారీ యుగంలో ప్రామాణిక నిఘంటువులలో ప్రముఖమైనది.

బహుజనపల్లి సీతారామాచార్యులు (1827-1892)

శబ్ద రత్నాకరం రచించిన వారి పేరు రెండు విధాలుగా ప్రసిద్ధమైనది. వారు చిన్నయసూరిగారు తలపెట్టి పూర్తిచేయని నిఘంటువును రచించడమేగాక సూరిగారి బాల వ్యాకరణంలో గతి కల్పించని వాటికి సూత్రాలు రాసి ప్రౌఢ వ్యాకరణాన్ని సమకూర్చారు. బహుజనపల్లి సీతారామాచార్యులుగారు నాగపట్నంలో పుట్టినా చెన్నపట్నంలో పెరిగి నివసించారు. చిన్నయసూరిగారితో చిరకాలము సావాసము చేశారు. సూరిగారి పాండిత్యం ఆచార్యులవారికి అనుభవసిద్ధం.

సీతారామాచార్యులుగారు తన జన్మస్థానమైన నాగపట్నాన్ని 1849లో తమ ఇరవైరెండో యేట విడిచిపెట్టి చెన్నపట్టణంలో స్థిరపడ్డారు. అప్పటికి చిన్నయసూరిగారు పురాణం హయగ్రీవశాస్త్రిగారు చెన్నపట్టణం పండితుల్లో దిగ్గజాలు. వారి దగ్గర సీతారామాచార్యులుగారు ఏది నేర్చుకొన్నారో ఎంత నేర్చుకొన్నారో తెలియదుగాని ఈ పెద్దల వల్ల జ్ఞానాభివృద్ధిని చేసుకొన్నారు. వీరి శిష్యరికం చేయలేదుగాని సావాసం చేశారు.

సీతారామాచార్యులు గారు 1854 నుండి చెన్నపట్నం టీచర్సు ట్రెయినింగు కాలేజీలో పండితునిగా చేరారు. అప్పటికి చిన్నయసూరిగారు తమ బాలవ్యాకరణాన్ని ప్రచురించలేదు. దాన్ని 1858లో స్వయంగా ముద్రించుకొన్నారు. 1862లో సూరిగారు పోయారు. చెన్నపట్టణానికి 1849లో వచ్చినది మొదలు సూరిగారు పోయేదాకా ఒక పుష్కరం పై చిలుకు కాలమే సీతారామాచార్యులుగారు సూరిగారి సావాసం చేయడానికి ఆస్కారం ఉంది. ఆ కాలంలోనే సూరిగారి నిఘంటు నిర్మాణ ప్రయత్నాలు పరికించి ఉత్తేజితులై ఉంటారు. తాము స్వయంగా ఒక నిఘంటువు రచించడానికి పూనుకొన్నారు.

వనరులు, ఆకరాలు వుంటేనేగాని ఏ ప్రణాళికా విజయవంతం కాదు. విద్యార్థుల సహాయార్థం వారికి అవసరమైన సంస్కృత పదాలను చేర్చి చిన్నదిగా అకారాది

నిఘంటువును త్వరలో పూర్తి చేద్దామనుకొన్నారు గాని ఉపయోగించవలసిన గ్రంథ సముపార్జనకే ఆరేళ్ళు పట్టింది. ఇద్దరు ముగ్గురు సాహిత్య గుమస్తాలను జీతాలకు పెట్టుకొని రోజూ పదిగంటలకు 'కాలేజీ'కి వెళ్ళి సాయంత్రం ఐదుగంటల దాకా అక్కడ పనిచేసి అనేక గ్రంథాలను వ్రాయించుకొని తెచ్చుకొన్నారు. మెకెంజీ, బ్రౌన్, లీడెన్ సంకలనాలను భద్రం చేసిన లిఖిత గ్రంథాలయాన్ని ఆరోజుల్లో 'కాలేజి' అనేవారు. ఏ పరిశోధకుడైనా ఇక్కడ వారాల తరబడి పనిచేసి నోట్సు తీసుకోవలసిందే. ఆచార్యులుగారు గాజుల లక్ష్మీనరసు సెట్టిగారి దగ్గర ఉన్న గ్రంథాలను ఇతర పండితుల దగ్గరవి చూసి కాపీలు రాయించాలనుకొన్నారు. పచ్చయప్ప మొదలియారు పాఠశాలలో పండితులైన వైయాకరణం శ్రీనివాసాచార్యులుగారు తాము ప్రాణప్రదంగా సంగ్రహించిన అపూర్వ గ్రంథాలను ఇచ్చారు. ఇన్ని లక్ష్యగ్రంథాలను, లక్షణ గ్రంథాలను పరిశీలించందే నిఘంటు రచన సాగదు.

సీతారామాచార్యులు గారు మొత్తం 104 లక్ష్య లక్షణ గ్రంథాలను సంప్రదించి ప్రయోగాలను, వాటికి ప్రమాణాలను ఎత్తి రాసుకొన్నారు. శైలిబట్టి గ్రంథకర్తలను ఆరురకాలుగా విభజించారు. లక్షణ గ్రంథాలలో శైలిని కనిపెట్టడం అనువుకాదని వాటికి తరగతుల విభజన లేదు. వారి అంచనా ప్రకారం కవిత్రయం వారు ముగ్గురూ, నాచన సోమన మొదటి తరగతి కవులు. పింగళి సూరన, శ్రీనాథుడు, పోతన, మాదన రెండవ తరగతి కవులు. ధూర్జటి, పినవీరభద్రుడు, ముక్కు తిమ్మన, అనంతుడు, భాస్కర, రంగనాథులు, అయ్యలరాజు రామభద్రుడు, జక్కన, రామారాజభూషణుడు, అల్లసాని పెద్దన మూడోరకం కవులు. చేమకూర వెంకటకవి విజయవిలాసం శైలినిబట్టి నాలుగవ తరగతివాడు. సారంగధరచరిత్ర వల్ల అయిదో తరగతివాడు. ద్విపద కావ్యాలు రాసిన గౌరన అయిదోరకం కవి. రాఘవాచార్యులు ఆరోరకం కవి. నిఘంటుకర్తల దృష్టికీ సాహిత్య విమర్శకుల దృష్టికి తేడాలుంటాయి.

ఆచార్యులవారి దేశ భాషలు సాధారణాలు, అసాధరణాలు అని రెండురకాలు. సాధారణాలు జాతుల వ్యవహారంలో ఉపయోగించేవి. అసాధారణాలు కవుల గ్రంథాలలో తరచు ప్రయోగించేవి. సాధారణములు అశుద్ధముగా నుండును. అసాధారణములు శుద్ధముగా నుండును. సాధారణ భాషలు అనేక నీచజాతుల నోళ్ళబడి యశుద్ధములైనవి. వానినే గ్రామ్యము అందురు. ఆచార్యులవారి దృష్టిలో భాగ్యవంతుల భాషే భాష. ''మనుషానందములలోపల గావ్యామృతరసపానా నందము ముఖ్యమని పెద్దలు చెప్పుచున్నారు గాన దాన నభిరుచి భాగ్యవంతులకు గాక భాగ్యహీనులకు గలగబోదు'' అని కచ్చితంగా శబ్దరత్నాకరంలో 'భాషా ప్రశంస' అనే శీర్షికలో చెప్పారు.

ఆచార్యులుగారు మరొక సంగతి స్పష్టం చేశారు. ఈ భాష ప్రయోగమే శరణముగా గలది. ఈ ప్రయోగముల కెల్ల గవిత్రయము వారి సమ్మతి యుండవలయును. ఇలా ఒక పరిమితి ఏర్పరచుకొన్నాక నిఘంటువు సంకుచితం కాక తప్పదు. విద్యార్థుల ఉపయోగం కోసం నిర్మించేది కాబట్టి దీనికి 'వేద భాషా గ్రంథ కరణసభ' వారు ప్రోత్సాహమిచ్చారు. గ్రంథం 1885లో పూర్తికాగానే ఆచార్యులవారికి అయిదువేల రూపాయలు పారితోషికంగా

ఇచ్చారు. దానిని మద్రాసు స్కూల్ బుక్ అండ్ సొసైటీవారు ప్రచురిస్తే క్రిష్టియన్ లిటరేచర్ సొసైటీవారు పంపిణీ బాధ్యతలు వహించారు. ఆచార్యులవారు ఇరవైమూడు సంవత్సరాలు కష్టపడి రచించిన ఈ నిఘంటువును విద్యార్థులకన్నా పండితులే ఎక్కువ ఆదరించారు.

చిన్నయసూరిగారి లక్ష్య లక్షణ గ్రంథాలను సరిగ్గా ఉపయోగించుకొనలేని పండితులు దేశానికి ఎంత అపకారం చేశారో బహుజనపల్లి వారి శబ్ధ రత్నాకరాన్ని పరమ ప్రమాణంగా భావించే పండితులుగా కూడా అంత అపకారమే చేశారు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు ఇలా రాశారు.[2]

''ఆచార్లవారి నిఘంటు పరమోపకారం చేసిందని పలుచోట్ల వ్రాసే వున్నాను. కాని ఆ వుపకారం కొందరికి మాత్రమే. కొందరికో? కొంత అపకారమే చేసింది. యేమంటారా? ఈ నిఘంటులో లేని పదం కర్మంచాలక (వ్యవహారికంగా ఉండి) యే కవేనే ప్రయోగిస్తే అదిలేదంటూ వివదించి గీట్లు పెట్టడం కొందరికి అలవాటు. 'కళంకము' అన్న పదం ఈ నిఘంటులో ఉంది 'కళంకు' అనేదే లేదు. ఆముక్తమాల్యద వగైరా పుస్తకాలలో మాత్రం ప్రయోగింపబడే వుంది. పైగా వ్యవహారంలోనూ వుంది. వుంటే మాత్రం యేమి? ఆ పుస్తకాల్లో వుంటే నిఘంటులో వ్రాయనే వాస్తురనుకొని 'కళంకు' అనేది లేదనుకొని ఆక్షేపించడమున్నూ, సుమారు 40 ఏళ్ళనాడు జరిగినట్టు మా సారస్వత విమర్శనాలు చదివితే తెలుస్తుంది. పంచాంగాలలో 27 నక్షత్రాలు మాత్రమే వుంటాయి. ఆకాశం మీద 27 కోట్లేనా వుంటాయి గదా. నక్షత్రాలు పంచాంగాలలో లేవన్నంత మాత్రం చేత ప్రత్యక్ష ప్రమాణికప లబ్ధాలు ఆ నక్షత్రాలు లేవనుకోవలసిందేనా?

ఆచార్యులవారి సమకాలికులైన వేదం వెంకటరాయశాస్త్రిగారు శబ్దరత్నాకరంలోని దోషాలను తమ 'ఆంధ్ర భాషా సర్వస్వనియమ కతిపయములు' అనే రచనలో ప్రకటించారు. ''ఇట్టివి త్రవ్విన కొలదియు పెక్కులు బయలుపడును'' అని రాశారు. గిడుగు రామమూర్తిగారు శబ్దరత్నాకరంలో వేలకొలది దోషాలున్నాయన్నారు.[3] చెళ్లపిళ్లవారు మరొక సంగతి చెప్పారు.[4]

''..... ఇప్పుడు కోర్టులలో యేదేనా నిఘంటువుతో అవసరం పడితే బ్రౌణ్యానికి ఇచ్చినంత ప్రామాణ్యాన్ని శబ్ద రత్నాకరం వగైరా నిఘంటువుల కివ్వకపోవడం అందరూ కాకపోయినా చాలామంది యెఱిగిన విషయమే.''

శబ్ద రత్నాకరం ఎలాగైతే కొందరు ప్రామాణికంగా ఎంచరో అలాగే ఆచార్యులుగారు రచించిన ప్రౌఢ వ్యాకరణం కూడా అలాగే ఎంచుతారు. చిన్నయసూరిగారి బాల వ్యాకరణానికి శేషగ్రంథంగా దీనిని రచించారు. దీనికి వారు పెట్టిన పేరు 'త్రిలింగ లక్షణశేషం' సూరిగారు విడిచిపెట్టిన వాటిని పూర్తి చేద్దామనుకొన్నారు. గాని ఆచార్యులుగారికి సూరిగారిలాగ సూత్ర రచనా లాఘవం అబ్బలేదు. సూరిగారి నైపుణ్యం అనితర సాధ్యం. ఆచార్యులుగారు చాలా పుస్తకాలు రచించారు. గాని అందులో ఏ

2. కథలు - గాథలు, తృతీయ భాగం - పుట.159
3. గిడుగు - శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు విమర్శనం - పుట.62
4. కథలు - గాథలు, తృతీయ భాగం - పుట.159

ఒక్కదానికీ పేరు వచ్చినట్టు లేదు. ఆచార్యులుగారి తర్వాత నిఘంటు రచనలు చేసినవారు ఉన్నారు. వారిలో చాలామందికి ఆచార్యులగారికొచ్చినంత పేరు రాలేదు.

కొ ట్రా శ్యామల కామశాస్త్రి (1885-1953)

శబ్దరత్నాకరం పుట్టిన 1885లో ఇంకొక నిఘంటు నిర్మాత కూడా కాకినాడ తాలూకాలోని కడప గ్రామంలో జన్మించారు. ఆయన పేరు కొ ట్రా శ్యామల కామశాస్త్రి. వీరి తండ్రి లక్ష్మీనారాయణశాస్త్రిగారు. సంస్కృతాంధ్ర పండితులు. 'లక్ష్మీ నారాయణీయం' అనే పేరుతో ఒక అచ్చ తెలుగు నిఘంటువును 1910లో ఆయన అచ్చువేశారు. దీనిలో 4వేల పదాలు ఉన్నాయి. లక్ష్మీనారాయణగారికి ఈ నిఘంటువు నిర్మాణంలో శ్యామల కామశాస్త్రిగారు తోడ్పడ్డారు. కావలసిన శిక్షణ పొందారు.

తెలుగులో ఉన్న నిఘంటువులన్నింటిని కామశాస్త్రిగారు చూశారు. అకారాది నిఘంటువులు పర్యాయ పదాలను ఇవ్వవు. పద్య నిఘంటువులు కొన్నింటిలో పర్యాయ పదాలు ఉంటాయిగాని అవి అకారాదిలో ఉండవు. అందుచేత అకారాదిగా పర్యాయ పద నిఘంటువును రచించాలని ఆదిలో భావించారు. 'ఆంధ్రవాచస్పత్యము' అనే పేరుతో దానిని 1910లో నిర్మించడానికి ప్రారంభించారు.

శ్యామల కామశాస్త్రిగారు 1911-13లలో హైయర్ గ్రేడ్ ట్రెయినింగ్ అయ్యారు. పంచాయతీ బోర్డు గుమస్తాగా, కో-ఆపరేటివ్ సొసైటీ సెక్రటరీ, ఫీల్డు సర్వేయరు ఉద్యోగాలను చేస్తూనే నిఘంటు నిర్మాణం కావించారు. ఇందులో నిర్దుష్టమైన సంస్కృత పదాలు 50,000, తెలుగు పదాలు మొదలైనవి 50,000 వెరసి లక్షపదాలు ఉన్నాయని అంచనా వేశారు. వీటిలో తెలుగు సంస్కృతపదాలు, పారిభాషికాలు, జాతీయాలు, శాసనపదాలు, ఆంగ్లపదాలు, వాడుకమాటలు, లోకోక్తులు మొదలైనవి ఉన్నాయి.

శ్యామల కామశాస్త్రిగారు తమ గ్రంథాన్ని స్వయంగా నెలకు నూరేసి పుటల చొప్పున అచ్చువేయించారు. 1934లో మొదటి సంపుటాన్ని బయటపెట్టారు. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారిచే పీఠిక వ్రాయించారు. అందులో వారు ఇలా చెప్పారు.

''ఇందున్న విషయాలన్నియు నితర నిఘంటువులలో లేవు. పెక్కేల? ఇందు సర్వస్వమును గలవు. దీనిని నిఘంటు సామాన్యముగా నెంచఁదగినది కాదు. శబ్దార్థ సర్వస్వమనవచ్చును. తారానాథ తర్కవాచస్పతిచే విరచింపఁబడిన వాచస్పత్యము వలెఁ దెనుఁగున నీయది యుపయోగించుననుటకు సందియ మింతయు నుండ నేరదు. కావున దీనిని శబ్ద కల్పద్రుమమని చెప్పవచ్చును.''

ఆంధ్ర వాచస్పత్యం 1940 నాటికి మూడు సంపుటాలు బయటపడ్డాయి. వీటిని శ్యామల కామశాస్త్రిగారు సొంత ప్రెస్‌లో అచ్చు వేయించారు. ఈ ప్రచురణకోసం సుక్షేత్రమైన నలభై ఎకరాల భూమిని వ్యయం చేశారు. చివరకు ప్రెస్ కూడా అమ్మివేయవలసి వచ్చింది. అయితే పూనిన కార్యాన్ని నెరవేర్చారు. మీ నిఘంటువు సూర్యనారాయణాంధ్ర నిఘంటువును మించియున్నది అని గిడుగువారు కొ ట్రావారిని

మెచ్చుకొన్నారు. వాస్తవానికి ఆంధ్ర వాచస్పత్యం బహుళార్థ సాధకమైన నిఘంటువు. ఉదాహరణకు ఒకటి రెండు పదాలకు ఇచ్చిన అర్థాలు చూద్దాం.

అంక పొంకములు : దే.వి.బ.రూ. అంక పొంకాలు - అంకా పొంకములు - అంకాపొంకాలు 1, వేగము (వ్యు. నాశ్యము లేనిది), చూ, స్యదము 1, 2 కోపము (వ్యు.దీనిచేత దహింపబడును) చూ, రోషము 1, 3 పగ (వ్యు - ఓర్పును విశేషముగ నడ్డగించునది) చూ, విరోధము 1, 4 అధికము, చూ, హేరాళము 1, 6 వీణ 5. భయంకరము: చూ, రౌరవము. 2

ఊఁదు - దే.వి. 1 ఉలుపడ, చూ, శోఫ, 2. చేఁపలఁ బట్టు యూఁత, భార. శాం. 3, ఆ. 193, చూ, వల. 1, అ.క్రి. 3 చూ వాఁచు, స.క్రి 4. శంఖములోనగు వాని నూఁదు చూపట్టు 27, 5. నిప్పు మొదలగు వాని నూఁదు ఆమె ఉఫ్ ఉఫ్ అని ఊదుచున్నది. 6. ఆశ్రయించు, పట్టు, భార, ఆది. 2, ఆ 13, ఆము. 5, ఆ 117, చూ, ప్రాపుగొను 7. ఉంచు కళా. 6, ఆ 252, చూ. పెట్టు 15, 8 అదుము నిర్వ. 4, ఆ. 92, కాశీ 3, ఆ.12, 9 నొక్కు భార అను 1, ఆ 69, చూ, పిసుకు, 1, 10 (చేఁపలను) ఊఁతతోఁబట్టు ధార శాం. 3, ఆ. 193.

శ్యామల కామశాస్త్రిగారు ఆంధ్ర వాచస్పత్యం ప్రథమ ముద్రణ రెండువేల సెట్లను లోకం స్వీకరించింది. ద్వితీయ ముద్రణం నుండి తెనాలి ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీవారు స్వీకరించారు. ఇది చాలా ఉపయోగపడే నిఘంటువు.

మహంకాళి సుబ్బారాయుడు (1852-1914)

బహుజనపల్లి సీతారామాచార్యులుగారిలాగే టీచర్స్ ట్రయినింగ్ స్కూల్లో పనిచేసిన మరొక పండితుడు కూడా నిఘంటు నిర్మాణం చేశారు. ఆయన పేరు మహంకాళి సుబ్బారాయుడు. ఆయన పుస్తకం పేరు శబ్దార్థచంద్రిక. బాలురకు చక్కగా తెలియడం కోసం. ఈ నిఘంటువులో అర్థాలు తరుచుగా వాడుక పదాలతో సంధిలేకుండా వ్రాశారు.

మహంకాళి సుబ్బారాయుడుగారు పెద్దాపురంలో జన్మించారు. గుండుగొలను గ్రామంలో బోర్డు ప్రయిమరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. మెట్రిక్యులేషన్ ప్యాసై నరసాపురం సెంట్రల్ నార్మల్ స్కూల్లో సహాయోపాధ్యాయునిగా పనిచేశారు. నెల్లూరు లోకల్‌ఫండు ట్రెయినింగ్ కాలేజీలో పాతికేళ్ళు ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. ఉద్యోగం చేస్తూ నిఘంటు రచన చేశారు.

'శబ్దార్థ చంద్రిక'ను సుబ్బారాయుడుగారు 1893లో చిన్న పుస్తకంగా ప్రచురించారు. ఒక్క సంవత్సరంలో వేయి ప్రతులు అమ్ముడుపోయాయి. తర్వాత దానిని పెంచి 1905లో వేమూరు వెంకటకృష్ణమ్మ సెట్టి కంపెనీ వారి సహాయంతో అచ్చువేశారు. రెండవ ముద్రణ రెండువేల ప్రతులు అయిదేళ్ళలో అమ్ముడైపోయినా మూడో ముద్రణకు ఆ కంపెనీవారు వేరే పనుల వల్ల వెనుకాడారు. సుబ్బారాయుడుగారు తమ నిఘంటువును తామూ అచ్చువేసుకోలేదు. ఇంకొకరు వేయడం లేదు కనుక 1913లో దాని కాపీ రైటును వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్‌వారికి అమ్మివేశారు. వారు దానిని పునర్ముద్రించారు.

ఇది నిజంగా విద్యార్థులకు పనికివచ్చే నిఘంటువు. శబ్దరత్నాకరం కూడా విద్యార్థులకోసమే ఉద్దేశించినా అది విద్యావంతుల చేతిలో పడిందిగాని శబ్దార్థ చంద్రిక టక్కున ఒక అర్థాన్ని ఇచ్చే పొదుపు నిఘంటువు.

జయంతి రామయ్య (1860-1941)

''మా అందరిలోనూ మా నల్లకృష్ణుడే కొంచెం తెల్లగా ఉంటాడు'' అన్న సామెతలాగ ఇప్పటికున్న తెలుగు నిఘంటువులన్నింటిలోనూ పెద్దది, చాలా పెద్ద ప్రణాళికతో వెలువడ్డది 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' అని చెప్పాలి. దీని ప్రథమ సంపుటం (1935) ముఖపత్రం మీద ''పండిత సహాయ్యమున జయంతి రామయ్యపంతులు, బి.ఏ., బి.ఎల్.గారిచే రచించబడి''నదని ఉంది. రామయ్యగారు ఒక నిఘంటుకర్తలు మాత్రమే కాదు. పండితులు, కవులు, శాసన పరిశోధకులు, ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు ఆదినుంచీ అధ్యక్షులు. మంచికిగాని చెడ్డకుగాని ఆంధ్రసాహిత్య రంగంలోని చాలా పరిణామాలకు కారకులు. వారి ఇతర సేవలు ఎలా ఉన్నా సూర్యరాయాంధ్ర నిఘంటువు అవసరాన్ని గుర్తించి కొన్ని సంపుటాలైనా తమ జీవితకాలంలో వెలువరింపచేసినందుకు స్మరణీయులు.

జయంతి రామయ్యగారు గోదావరి జిల్లా కోనసీమలోని ముక్తేశ్వరంలో జన్మించారు. 1882లో పట్టభద్రులయ్యారు. 1884 సంవత్సరంలో పిఠాపురం మహారాజావారి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. బహుశా ఈ కాలంలోనే ఆయన, పిఠాపురం రాజా రావుసూర్యారావు (1885-1964) గారికి కొంతకాలం విద్యాగురువుగా ఉండేవారు. ''అందుచేత ఈయనమీద రాజాగారికి అత్యంత గౌరవము. రాజాగారు సారస్వత సేవకుడని ప్రసిద్ధి. మత విషయాలలో నాయుడుగారూ, విద్యా విషయాలలో రామయ్య పంతులుగారూ యెంత చెబితే అంత అని ప్రతీతి'' అని చరిత్రకారులు చెప్తున్నారు.[5] నాయుడుగారంటే రఘుపతి వెంకటరత్నంగారు.

స్కూలు మాస్టరు ఉద్యోగం చేశాక రామయ్యగారు న్యాయవాది పరీక్షలకు చదివి ప్యాసయ్యారు. ఈలోగా జిల్లా మేజిస్ట్రేటు ఆఫీసులో గుమస్తాగా, తర్వాత హెడ్ గుమాస్తాగా అటు పిమ్మట డిప్యూటీ కలెక్టరుగా, అనంతరం ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా ఉద్యోగాలు చేశారు.

డిప్యూటీ కలెక్టరుగా ఉండే రోజుల్లో రామయ్యగారు ఎన్నో శాసనాలను సంపాదించి సంస్కరించారు. ఉత్తరోత్తరా 'శాసనకావ్య మంజరి' అనే పేరుతో రెండు సంపుటాలను ప్రచురించారు. ప్రథమ భాగాలు ఆంధ్రప్రదేశ్‌లోని 88 ప్రాంతాలలో దొరికిన శాసనాలను చేర్చారు. క్రీ.శ. 848 నుండి 1678 దాకా ఎనిమిది వందల సంవత్సరాలలో వేయించిన శిలా శాసనాలలో పద్యాలను చేర్చారు. ఈ ప్రచురణ వల్ల చాలా లాభాలు కలిగాయి. రామయ్యగారే ఇలా చెప్పారు.[6]

---

5. కురుగంటి సీతారామయ్య - నవ్యాంధ్ర సాహిత్య వీధులు, పుట.203
6. జయంతి రామయ్య - శాసన పద్య మంజరి (1930) పుటలు II, III

''ఈ పద్యముల వలన ప్రయోజనము రెండు విధములు. దేశచరిత్రము తెలుసుకొనుట యొకటి, ఆంధ్ర శబ్ద లక్షణమును, ఛందస్సును, గాలక్రమమున నెట్లు మాఱియుండునో యది తెలిసికొనుట యొకటి. భారతాది ప్రాచీన గ్రంథములు కూడా భాషా చరిత్ర శోధనకుపయోగించునవియే. కాని యవి పుట్టినవి పుట్టినట్లిప్పటి వారికి లభించుట లేదు. కవులు వ్రాసిన మాతృకలు చిరకాలము క్రిందటనే నశించిపోయి వానినిబట్టి యాయాకాలమువారు వ్రాసియుంచిన ప్రతులలో జిట్ట చివరవియె ఇప్పుడు దొరుకుచున్నవి. ఈ శాసన పద్యములన్ననో కవుల జీవితకాలములో నెట్లు లిఖింపబడినవో యట్లే మనకు లభించుటచేఁ గవి ప్రయుక్త పాఠ నిర్ణయమున కత్యంత ప్రబల సాధనములుగా నున్నవి. ఈ విషయములో నేమి ఇతర విషయములలోనేమి వీని ప్రామాణ్యా మేమాత్రమును జెడ కుండుటకై పద్య పాఠములు తూచాలు తప్పకుండ నున్నవి యున్నట్లే ముద్రింపబడినవి.''

రామయ్యగారు మన శాసన పరిశోధన శాఖలో చాలా కృషి చేశారు. పూర్వం పరిష్కరించినవి కాక కొత్తవి ప్రభుత్వం వారు ఎనిమిది వందల శాసనాలను పరిష్కార నిమిత్తం, ప్రచురణార్థం రామయ్యగారికి ఇచ్చారు. వాటిని ఆయన పరిష్కరించి ఇచ్చారు. ఇవే దక్షిణ భారత శాసనములు పదవ సంపుటంగా వెలువడ్డవి (సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్) ఈ శాసన పరిశోధన వల్ల దేశ చరిత్రా భాషా చరిత్రా అవగాహన కావడం సుగమమైంది.

భాష మారుతూ ఉంటుందని జయంతి రామయ్యగారికి తెలుసు. అయితే ఫ్యూడల్ విలువలు మారకూడదు కనుక భాషను కూడా మారనివ్వకుండా ఉండాలనే తాపత్రయంతో 1911లో ఆంధ్ర సాహిత్య పరిషత్తును జమీందారుల పోషణలో ప్రారంభించారు. వాడుకభాషను అడ్డుకొన్నారు. ఈ విషయాలన్నింటినీ ''వాడుక వేడుక భాషల యుద్ధం'' అనే ప్రకరణంలో విశదం చేశాను. 1911 మార్చి 26వ తేదీనాడు ఆంధ్ర సాహిత్య పరిషత్తు పుట్టుకకు కారణమైన సభ ఒకటి మద్రాసులో జరిగింది. (రామయ్యగారు అప్పుడు మద్రాసులో ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా ఉండేవారు). ఆ సభలో సమగ్రమైన తెలుగు నిఘంటు నిర్మాణం ఆవశ్యకత గురించి వీరేశలింగం గారు ఒక ప్రతిపాదన చేశారు. పిఠాపురం రాజా సహాయం చేస్తానన్నారు. అయితే ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు వాడుక భాషపై చేస్తున్న యుద్ధంలో మునిగి నిఘంటు నిర్మాణం జాప్యం చేశారు. 'పెళ్ళి సందడిలో పుస్తికట్టడం మరచిపోయినట్టు'. ఆదిలో వీరేశలింగంగారి ప్రతిపాదనే కార్యరూపం దాల్చాక 'సూర్యరాయాంధ్ర నిఘంటు ప్రణాళిక'గా తయారైంది. ఉద్దిష్ట కార్యాలను నేర్పడానికి సమర్థులయిన వారిని ఎంచి ఉపసంఘాలు ఏర్పాటు చేశారు. నిఘంటు కార్యాలయంలో ప్రధాన సంపాదకులుగా వేదం వెంకటరాయశాస్త్రి గారు చేరారు. ఆరంభ శూరత్వం ఆంధ్రులకు సహజ గుణం కనుక పని ఏమీ సాగలేదు.

1912లో జయంతి రామయ్యగారు నిఘంటు నిర్మాణ విషయమై తాము సంకల్పించుకొన్న విధానాన్ని నిరూపిస్తూ ఇంగ్లీషులో ఒక వ్యాసం రాసి పండితులందరికీ పంపారు.

''డాక్టర్ మర్రే గారు రచించిన ఆక్సుఫర్డు ఇంగ్లీషు నిఘంటువు ఏ విధమున నిర్మించబడ్డదో అదే విధమున తామున్ను 'ఆంధ్ర భాషా సర్వస్వము' శబ్దముల పుట్టు పూర్వోత్తరములు, వ్యుత్పత్తులు, అర్థాలు, ప్రయోగాలు సవిస్తరముగా వివరిస్తూ ప్రకటించడానికి తాము సంకల్పించినట్టు తెలియజేసినారు.[7]

రామయ్యగారు మహదాశయంతోనే ప్రణాళిక వేశారుగాని ఆయన రాజకీయోద్యమాల నుండి రిటైరు అయ్యేదాకా నిఘంటు పనులు సాగలేదు. రామయ్యగారు మద్రాసులో ఉన్నంతకాలం ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయం, నిఘంటు నిర్మాణ కేంద్రం అక్కడే ఉన్నాయి. ఆయన పదవీ విరమణ చేసి స్వగ్రామానికి వెళ్ళిపోయాక దానికి దగ్గరగా ఉన్న కాకినాడకు కార్యాలయాలు మారాయి. నిఘంటు నిర్మాణం ప్రారంభించారు. వారికి సహాయం చేసిన పండితులలో ఈ క్రిందివారు ఉన్నారు.

1. శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు
2. శ్రీపాద పాపయ్య శాస్త్రిగారు
3. చర్ల నారాయణ శాస్త్రిగారు
4. పిశుపాటి చిదంబర శాస్త్రిగారు
5. వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు
7. ధర్భా సరేశ్వర శాస్త్రిగారు

వీరిలో మొదటి ఇద్దరూ ప్రథమ సంపుటం ఆరంభించేదాకా పనిచేశారు. వెంపరాల వారు మధ్యలో మానివేశారు.

1930 నాటికి ప్రథమ సంపుటం, 1939లో ద్వితీయ సంపుటం వెలువడ్డాయి. జయంతి రామయ్యగారి జీవితకాలంలో మిగతా సంపుటాల ప్రచురణ జరగలేదు.

మొదటి సంపుటాన్ని గిడుగు రామమూర్తిగారు విమర్శించారు. మర్రే గారిలాగ డిక్షనరీ రచిద్దామనుకొన్నవారు వ్యవహారంలో ఉన్న పదాలను స్వీకరించనందువల్ల ఎంత అసమగ్రంగా తయారైందో చెప్పారు. ఈ విమర్శలను రామయ్యగారు చూసీ చూడనట్లు ఉపేక్షించారు.

జమీందారీ యుగంలో జమీందారుల పోషణలో మొదలుపెట్టిన ఈ నిఘంటు నిర్మాణం ఆధునిక యుగంలో పూర్తయింది. ఆ సంగతులు తర్వాత చెప్పుకొందాం.

---

7. గిడుగు వెంకట రామమూర్తి - శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు విమర్శనం - పుట.4

ముస్లింలు - తెలుగు సాహిత్యం

జనాభాలో తెలుగు ముస్లింల సంఖ్యా తక్కువదేం కాదు. ఇస్లాంతో, అరబ్బీ పారశీకాలతో, ఉర్దూతో, దక్కనీతో తెలుగు భాషకు ఆదానప్రదానాలు చాలాకాలం నుంచి సాగుతున్న వ్యవహారమే. కుంఫిణీ యుగానికి ముందు తెలుగువారి రాతకోతల్లోనూ, కుంఫిణీ యుగం తొలిరోజుల్లోనూ తెలుగువారు ఉరుదూ పారశీక పదాలను విరివిగా వాడేవారు. ఇంగ్లీషు చదువులు ముదిరాక లావాదేవీలు ఆంగ్లంలో జరగడం విస్తృతమయ్యాక కూడా ఇంగ్లీషు పారిభాషిక పదాలతోపాటు పాత ముస్లిం పరిపాలనా పరిభాష కూడా వాడుకలో ఉండేది. తెలుగు ముస్లింలేకాక హిందువులు కూడా నిన్నటి దాకా తెలంగాణాలో ఉర్దూలోనే ఉన్నత విద్యలు అభ్యసించారు. తెలుగు సాహిత్యానికి ముస్లింల ప్రత్యేక సేవలు వెలుగులోనికి రాలేదు.

శిష్ట సాహిత్యాన్ని సృష్టించిన ముస్లింల గురించి తర్వాత చెప్పుకోవచ్చునుగాని ముందు ఒక విషయం గమనించాలి. జానపద ముస్లింలు తెలుగులో తమకు కావలసిన సాహిత్యాన్ని తామే సృష్టించుకొన్నారు. ఆచార్య తూమాటి దోణప్పగారు మొహరం గీతాల గురించి రాస్తూ ఈ సంగతి ఇలా వివరించారు.[1]

''పల్లె పట్టులలోని ముస్లింలు ముక్కాలు మువ్వీసము నిరుపేదలు. వీరిలో చాలామందికి చదువురాదు. చదువు వచ్చునను లెక్కలకెక్కిన వారిలో కొందఱిది వానకాలపు చదువు, కొందఱిది సంతకాల చదువు. వీరందఱును చదివినవారిలోనే జమ. ఇందులో ''ఉరుదూ'' నేర్చినవారూ ఉడ్డా ముగ్గురు. అరబ్బీ నెఱిగినవారు అసలే అరుదు. పట్టింపు కలవారు కొందఱు ''ఉరుదూ'' భాషామయ గీతికలను తెలుగు లిపిలో వ్రాసుకొని, కొరాను సమీపభాషలో పాడితిమని తృప్తిపడుదురు. వట్టి అట్టహాసము లేలయని మఱికొందరు ప్రాంతీయ భాషలలో-తెనుగుననో, కన్నడముననో-పాడి తమ దుఃఖమును ప్రకటింతురు''.

మొహరం గీతాల విషయంలోనేకాక ఇతర సందర్భాలలో కూడా ఇది జానపద ముస్లింలకు వర్తిస్తుంది. విద్యాధికులైన ముస్లింలలో ఆంధ్ర భాషకు కుంఫిణీ యుగంలో చేసిన సేవలు పూర్వమే తెలుసుకొన్నాం. కొన్నేళ్ళపాటే నడిచినా మొట్టమొదటి తెలుగు పత్రిక వర్తమాన తరంగిణిని ప్రారంభించిన చిరస్మరణీయుడు సయ్యద్ రహమతుల్లా సాహెబుగారు.[2] బ్రౌను దొరగారు తెలుగు సాహిత్య గ్రంథాల వ్రాతప్రతులు కొందరు మహమ్మదీయుల వద్ద సంపాదించారు. ''రసికజన మనోభిరామం'' ప్రతిని శేఖు మహమ్మదు సాహెబు ప్రతిక్రమాన రాసుకొన్నారు.[3] శృంగార నైషధం ఎనిమిదాశ్వాసాల సంపూర్ణ కావ్యం కూడా ఈ సాహెబుగారి గ్రంథాలయం నుంచే బ్రౌను దొరగారు సంపాదించారు. తెలుగు సాహిత్యాన్ని అభిమానించి ప్రసిద్ధ గ్రంథాల వ్రాతప్రతులు భద్రం చేసిన ఇటువంటి ముస్లింవారు ఎందరున్నారో ఇంకా లెక్క తేలలేదు.

---

1. ఆచార్య తూమాటి దోణప్ప, జానపద కళాసంపద, పుట.145
2. కుంఫిణీ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటి 2004
3. కుంఫిణీ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటి 2004

తెలుగు జిల్లాలలోని ఒకే ఒక్క స్వతంత్ర స్వదేశీ సంస్థానం కర్నూలు మండలంలోని బనగానపల్లె. దీని పాలకులు ముస్లిములే కనుక చాలామంది ఉర్దూ, పారశీక పండితులను ఆదరించినా, సంస్థానంలో ఆరింట అయిదువంతులమంది జనాభా హిందువులే కావడంచేత బనగానపల్లి నవాబులు హిందుమతాన్ని తెలుగుభాషను ఆదరించారు. పోతులూరి వీరబ్రహ్మంగారు ఈ సంస్థానానికి చెందినవారే. బనగానపల్లికి చెందిన ఒక జాగీరుకు అధిపతి అయిన బ్రాజత్‌ఖాను అనుమతితో ఒక సిద్ధయోగీంద్రుడు ''సిద్ధయోగీశ్వర విలాసము''నే ద్విపద కావ్యం రచించాడు. ఇతడు శ్రీశైల పాదక్షేత్రం బాలబ్రహ్మేశ్వరంలోని బాలబ్రహ్మలింగస్వామి వారి భక్తుడు. ఆ దేవుని కృప వల్ల కవితా సంపన్నుడయ్యాడట. కావ్యం వీర శైవ గాథలు వివరిస్తుంది. (D.1178)

బనగానపల్లి నవాబులు క్రీ.శ. 1700-1750 ప్రాంతాలలో ఆట భాగవతుల కుటుంబాలకు కపట్రాల, కోటకొండ సీమలలో అనేక భూములను ఇనాములుగా ఇప్పించి, అలా కొన్ని ఆట భాగవతాలను ప్రచారం చేయించారు. వీరిని కోటకొండ భాగవతులంటారు. వీరిలో చల్లా భాగవతుల దాసుభొట్లుగారు ప్రధానులు. సిద్ధేంద్రుడు రచించినట్టు చెప్పుకొనే భామాకలాపం ఈ భాగవతులు ఆడేవారు. ఇవాళ భామాకలాపం ప్రతులలో ఏ ఒక్క దరువులోనూ సిద్ధేంద్రుని ముద్ర కనపడదుగాని ఒకే ఒక్క ప్రతిలో మందులపట్టులో ఉన్న ఒక దరువులో నాకు సిద్ధేంద్రుని పేరు కనపడింది. దాని పాఠం ఇది.

శుద్ధ సావేరి రాగం - అట తాళం - మందులపట్టు

మందుల మారి నా సవతి ఏమందు
బెట్టుటకు తానెవతో ॥మందుల॥
మందయానరో తనకు మర్యాదగాదని
అందరిలోను తానందమొందుటకు ॥మందుల॥

1. ఎన్నో మాయలు నేర్చుకొన్నది ఆ
   వెన్నుని తాజేర్చుకున్నది
   పిన్నపెద్దలనంపి పిలిపించి జెప్పారె
   కన్యారోయిటువంటి కార్యము వలదని ॥మందుల॥
2. మగని నన్నెడ బాపెనమ్మ యింత
   మర్మాము గలదటె కొమ్మా
   మగువారొ ఇప్పుడు వగలాడికి బుద్ధి
   తగదని మీరంత తగినట్లు జెప్పారె ॥మందుల॥
3. దోసమను కొనదాయనే నా ఉసు
   రోసుకోక మానదాయెనే
   ఏసీమ లోనైన ఇట్టి యాడది యుంటె
   వాసిగ కాపురము జేసుటలేదమ్మ ॥మందుల॥
4. వాలిన సిద్ధేంద్ర స్వామిని కృప
   నేలిన వైకుంఠధాముని

కేలికిరమ్మాని కిటుకపరచి మందు
లాలించి పతికి తాంబూలమ్ముతో బెట్టి ॥మందుల॥

(ఈ దరువు వేదాంతం చలమయ్యగారి వ్రాతప్రతిలో ఉంది. ఈయన వేదాంతం ప్రహ్లాదశర్మగారి ముత్తాతగారు.) ఈ దరువులో సిద్ధేంద్రస్వామి అన్నముద్ర కనపడుతుంది. బనగానపల్లెలోని ''సిద్ధయోగీశ్వర విలాసం'' ద్విపద కావ్యంగా రచించిన సిద్ధేంద్రునికి, భామా కలాపం సిద్ధేంద్రునికి ఏమిటి సంబంధమో భావి పరిశోధన తేల్చాలి.

బనగానపల్లి నవాబులే చల్లావారికి, చింతావారికి తుంగభద్రకు అవతలగుట్టన ఉన్న అలంపూరం దగ్గర కపత్రాల గ్రామాన్ని ఇచ్చారు.[4] మొత్తంమీద బనగానపల్లెకు, భామా కలాపానికి సంబంధాలు కనబడుతున్నాయి.

జమీందారీ యుగంలో కొందరు తెలుగు ముస్లింలు శిష్టసాహిత్యాన్ని రచించారు. సలక్షణమైన కావ్యాలు చెప్పారు. వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. కొందరి గురించే వివరాలు తెలుస్తున్నాయి.

మున్షీమీర్ సుజాయత్ ఆలీఖాన్ (1875)

లోకరంజనిలో 1875లో ''విద్వన్మనోహారిని'' పత్రికాధిపతిపై వ్యాసం ఉంది.

ఉమర్ ఆలీషా (1885-1945)

తెలుగు ముస్లింలలో సుప్రసిద్ధుడు, ఈయన పిఠాపురం వాస్తవ్యులు. తండ్రి మొహియుద్దీన్ భాషాగారు. మత గురువులు మాత్రమే కాక అరబ్బీ పారశీక సంస్కృతాంధ్ర పండితులు. వారివద్ద ఆలీషా భాషా పాండిత్యాలు సంపాదించారు. ఆంగ్లవిద్యలు కూడా అభ్యసించారు. 18వ యేట నుంచి తెలుగులో కవిత్వం చెప్పడం ప్రారంభించారు. 1914లోనే ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో మహమ్మదీయ మతాన్ని గురించి తెలుగులో వ్యాసం రాశారు. 1928లో విశాఖ నుండి వెలువిన కవితా సమితి వార్షిక సంచికలో భాషా పరిణామం గురించి వ్రాశారు. నవలలు, నాటకం, వ్యాసాలు, అనువాదాలు వెరసి సుమారు యాభై వుంటాయి. మొల్ల (1923), మన్సూర్ మహమ్మదీయ తపసులు (1923), ఉమరుఖయ్యాము - ఈశ్వరుడు (1928), గోపిక (1937) మొదలైనవి వీరి వ్యాసాలు. ఇవి విషయ వైవిధ్యాన్ని తెలియచేస్తాయి. ఈయన తదనంతరం వీరి ఉమరుఖయ్యాం అనువాదం గ్రంథరూపములో వెలువడింది. ధార ధారాళంగా ఉంటుంది.

షేకు మౌలా మున్షీ (1892)

నీతివాక్య రత్నాకరం చింతామణి పత్రికలో ప్రచురించారు.

బజులుల్లా సాహెబు (1892)

ఈ సాహితీపరుడు ''సత్యాన్వేషిని'' అనే పత్రికను రాజమండ్రిలో స్థాపించాడు. దానికి ఆయనే సంపాదకుడు. వీరేశలింగంగారు నడిపిన సత్యసంవర్ధని (1891-97) అనే

---

4. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు కోటకొండ భాగవతులపై 1967 జనవరి 25వ తేదీ ఆంధ్రప్రభ వారపత్రికలో రాసిన వ్యాసం. ఆ పేరా తూమాటి దొణప్పగారు ఉదాహరించారు.

పత్రికలలోని వ్రాతలకు సత్యాన్వేషినిలో బజులుల్లా సాహెబుగారు ఖండన వ్యాసాలు రాసేవారు. రెండు పత్రికల్లో వివాదాలు చాలా తీవ్రంగా ఉండేవి.

మొహమ్మద్ ఖాసిం ఖాన్ (?)

కవితాసమితి సభ్యుడు. శ్రీరంగం శ్రీనివాసరావు, పురిపండా అప్పలస్వామి, అబ్బూరి వరద రాజేశ్వరరావుకు మిత్రుడు. సాహితీపరుడు. శ్రీశ్రీతో ఈయనను నేను కలుసుకొనేవాడిని. చక్కగా తెలుగు సాహిత్యం చర్చించేవాడు. తొలి రచనలు తెలియడం లేదుగాని ఈయన 1932లో భారతిలో పారశీక వాఙ్మయచరిత్ర మూడు భాగాలలో రచించాడు. జైనమత చరిత్రను కూడా ఉత్తరోత్తరా ప్రచురించాడు. ఇతడి ఇతర రచనలు –

1. వర్డ్సువర్తు కవిత్వం
2. మహమ్మద్ ఇక్బాల్
3. జలాలుద్దీన్ రుమీ వ్రాసిన మస్నవీ
4. సూఫీ వేదాంతి హఫీజ్ అనువాదం

వెతికితే కవితా సమితి కవిలెలో వీరి ఇంకొన్ని రచనలు కూడా దొరుకుతాయి.

ఖాదరీ సాహెబ్ అహమదల్లీ

ఈయన రచించిన ఓరుగల్లు చరిత్ర 1935 భారతి నవంబరు సంచికలో ప్రచురితమైంది. ఈయన రచించినవి ఇంకెన్ని ఈ తేదీకి ముందూ, తర్వాతా ఉన్నాయో!

రషీద్ బాషా

నెల్లూరు మండలానికి చెందినవారు. ఇస్లాం పండుగల మీద విక్రమసింహపురి మండల సర్వస్వంలో వ్యాసం రాశారు.

మౌల్వీ షాజిక్ (జ్ఞానేంద్రదేవ్ సూఫీ)

1938 జూలై భారతిలో ''ప్రాచీన అరబ్ నివాసులు హిందువులా''? అనే వ్యాసం రాశాడు.

''అల్‌హాజ్'' మహమ్మద్ జైనుల్ అబెదీన్

హైదరాబాదులో తెలుగు ఇస్లామిక్ సాహిత్య అకాడమీ ఉంది. దానికి వీరు అధ్యక్షులు.

షేక్ మీరాజాన్

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ వాస్తవ్యులు. షేక్ మీరాజాన్‌గారు సర్వమతసార సంగ్రహం ''తౌహిద్-కా-రవుషన్'' అనే గ్రంథాన్ని రచించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ ఆచారాలు, కర్మకాండలు, హిందువుల ప్రార్థనాదికాలు చాలా విపులంగా సప్రమాణంగా రచించారు.

పరిశోధన చెయ్యాలేగాని తెలుగు ముస్లింల సాహిత్య వ్యాసంగం గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి.

మొదలైనవారు - మిగిలినవారు

ఈ యుగంలో కలం పట్టుకొని రాసిన ప్రతి ఒక్కరి గురించి కాకపోయినా, తమ గ్రంథాలు అచ్చువేసుకొన్న వారి గురించైనా పూర్తిగా చెప్పుకొనడం సాధ్యంకాదు. ఆధునిక యుగానికి దగ్గర పడుతున్నకొద్దీ రచయితల సంఖ్య పెరుగుతున్నట్లు, పుస్తక ప్రచురణలు విరివిగా సాగుతున్నట్టు లెక్కలు తేల్చవచ్చు. అడిదం సూరకవి ఎప్పుడో ఇలా అన్నాడు.

దేవునాన మున్నుదేశానికొక కవి
ఇప్పుడూర నూన నింటియింట
ఏవు రార్గురేడ్గు రెనమండ్రు తొమ్మండ్రు
పదుగురేసి కవులు భవ్య చరిత

జమీందారీ నవ్యసాహిత్య యుగాలలో ఇంటింటికేకాదు, ఇంట్లో వున్న గది గదిలోనూ రచయితలున్నట్టు అనిపిస్తుంది. ప్రక్రియలు పెరుగుతున్న కొద్దీ నాటి కర్తల సంఖ్య పెరుగుతుంది. అంతమాత్రాన అభివృద్ధి కలుగుతున్నట్టా? గిడుగు రామమూర్తిగారు సూటిగా ప్రశ్నించారు.[1]

''నలుగురు పండితులు నాలుగు సంస్కృతం ముక్కలు, నాలుగు పాత తెలుగు ముక్కలు వల్లించి, రెండు బండిరాలు, రెండు అరసున్నలు, రెండు బండ మాటలు పెట్టి పాత గొడవలు, రెండు పురాణాలు తెలిగించగానే తెలుగుభాష వృద్ధిలోనికి వచ్చినట్టేనా?''

గురజాడ అప్పారావుగారు జమీందారీ యుగంలోని పుస్తకాలకు గుర్తింపు ఎలా వచ్చేదో స్పష్టం చేశారు.[2]

''నాడూ నేడూ కళాశాలలలోని దాదాపు ప్రతి తెలుగు పండితుడూ తాను పండితుడు కాబట్టి కవికాక తప్పదని అనుకొనడం దురదృష్టకరం. ఆయన పలుకుబడివల్లనే సాధారణంగా ఆయన రచనలకు గుర్తింపు వస్తుంది. ఆవిధంగా ఎన్నో పనికిమాలిన పుస్తకాల్ని - విశ్వవిద్యాలయం, లేదా విద్యాశాఖ ఆదరణ లేకపోయి వున్నట్లయితే ప్రచారంలోకి వచ్చి వుండని ఈ పుస్తకాల్ని పాపం విద్యార్థుల నెత్తిపై రుద్దుతున్నారు''.

గుర్రపు పందాలలో ఒక్కొక్క రేసులో చాలా గుర్రాలు పరుగెత్తుతాయి. అయితే ఒకటి, రెండు, మూడు స్థానాలలో వచ్చిన వాటి గురించే చెప్పుకొని మిగతావి 'ఆల్‌సో రేన్' అనే మూక జాబితాలో చెప్తారు. ఇది సాహిత్యంలో పాపులారిటీరేస్‌లో కూడా వర్తిస్తుంది. ఏ రచనలకు ప్రజాదరణ ఎందుకు లభించిందో తెలుసుకొనడం ముఖ్యమేగాని ''ఆల్‌సో రేన్'' పద్దులోని వారి ప్రయత్నాలైనా తెలుసుకోవాలని ఎవరు భావించినా,

---

1. ఆంధ్ర పత్రిక - 1923 సంవత్సరాది సంచికలోని వ్యాసం - సారస్వత వ్యాసములు, తృతీయ సంపుటంలో ప్రచురించారు.
2. డిసెంటు పత్రం - పుట.71

భావించకపోయినా సాహిత్య చరిత్రకారుడు తలపెట్టాలి. ఓటర్ల లిస్టుకు గ్రంథ విస్తరణభీతి పనికిరాదుగాని మిగతా వాటి అన్నింటికీ ఈ భయం వర్తిస్తుంది.

అందుకే ఏదైనా పేర్ల పట్టిక ఇస్తూ ఇద్దరు ముగ్గురు పేర్లు చెప్పి 'మొదలైనవారు' అనే మాటలో మిగిలిపోయిన వారందరినీ ఉద్దేశించడం జరుగుతుంది.

జమీందారీ నవ్య సాహిత్య యుగాలు ఎవరితో మొదలైనవో వారినే 'మొదలైన' వారిగా భావించి చెప్పుకొనలేనివారిని 'మిగిలిన'వారుగా ఎంచుకొంటే తప్పులేదేమో.

ఈ యుగాలలో చెప్పుకోవలసిన వారి గురించి చెప్పడానికి ప్రయత్నించానుగాని అందరి గురించి కాకపోయినా కొందరు రాసిన అన్ని పుస్తకాల గురించి కూడా విశదం చేయడం వీలుకాలేదు. చాలామంది మిగిలిపోయారు.

కాలం నిరవధికం కావచ్చు.

పృథ్వి విపులం కావచ్చు.

గ్రంథకర్త హృదయమంత విశాలంగా అతని గ్రంథం కూడా విస్తరించగలిగితే ఎంత బాగుండును!

ఆధునిక అభ్యుదయ యుగం

1929 డిసెంబరు 31వ తేదీనాడు లాహోరు కాంగ్రెస్‌లో అర్ధరాత్రివేళ పన్నెండు గంటలకు 'పూర్ణస్వరాజ్యం' కావాలని అత్యంత ఉత్సాహంతో తీర్మానించారు. 1930వ సంవత్సరం కొత్త నినాదంతో మేల్కొంది.

1930 నుంచీ 1940 దాకా జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ అందునా తెలుగు సాహిత్యంలోనూ గొప్ప మార్పులు వచ్చాయి. ఈ పదేళ్ళను 'హంగ్రీ థర్టీస్' (ఆకొన్న దశాబ్దం) అని అంతర్జాతీయంగా పిలిచేవారు. ఈ దశాబ్దంలోనే భారతదేశంలో సామ్యవాదం వేళ్ళూనింది. 1930 మార్చినెల 12వ తేదీనాడు గాంధీజీ దండియాత్ర ప్రారంభించారు. 34రోజులు కాలినడకన సాగిన ఈ ప్రయాణం జాతిని మేల్కొలిపింది. ఏప్రిలు ఆరవ తేదీనాడు ఉప్పుసత్యాగ్రహం ప్రారంభమైంది. భారతీయులు 'మా ఉప్పు మేం చేసుకొంటాం, మా ఉప్పు మేం తింటాం' అని నిశ్చయించుకొన్నారు. సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ అనుసరిస్తున్న పద్ధతులవల్ల సంపూర్ణ స్వాతంత్ర్యం రావడం అసంభవం. విప్లవం వల్లనే అది రావాలి అని భావించే యువకులు కూడా జాతీయోద్యమంలో చేరి చేతనైన సేవ చెయ్యాలని నిశ్చయించుకొన్నారు. దేశంలో ఉత్తేజకరమైన ఉద్యమాలు సడీ చప్పుడూ లేకుండా ప్రారంభమైనాయి. సమకాలిక సంఘటనలకు సాహిత్యం స్పందించాలన్న సత్యాన్ని కొందరు గుర్తించారు. సత్యాగ్రహులపై పోలీసు లాఠీలు విరుగుతున్నప్పుడు కవుల కంఠాలు మూగపోలేదు.

మారో మారో మారో మారో
ఒకటి రెండు మూడు నాలుగు

అంటూ కొత్త రీతులలో పాటలు వెలువడ్డాయి.[1]

'కదలింది కదిలింది – కాంగ్రెస్ రథమండి' అని చెప్తూ కవి ఇలా హెచ్చరించాడు.[2]

ప్రభు సంస్థలన్నింటి – పడగొట్టి సాగండి
శుభమని స్వారాజ్య – సోపాన మెక్కండి
శాంతిని యేవేళ – స్వాంతాల విడకండి
సంతోషముగ అన్ని – త్యజియించి సాగండి

పర ప్రభుత్వం చేసిన, చేస్తున్న దారుణాలను మరచిపోవద్దని కవి అడుగడుగునా ప్రజలకు ఇలా జ్ఞాపకం చేస్తున్నాడు.[3]

పగవారు మనపైకి వచ్చి పడ్డారు,
కోయంచు మనయూళ్ళు కొల్లగొట్టారు,

1. ఇది శిష్ట్లా ఉమామహేశం గీతం
2. దామరాజు పుండరీకాక్షుని రచన
3. త్రిపురనేని రామస్వామి చౌదరి

గూటిలో పిట్టల్ని కూల్చివైచారు,
పొలములో పసిలేళ్ళ పొడిచి వైచారు,
మరచిపోవద్దోయి! మరచిపోవద్దు!
మన జాతి యగచాట్లు మరిచిపోవద్దు!!

ఉద్యమం వల్ల ప్రభావితులైన కవులు ఇలా గానం చేస్తూ వుంటే, భావకవిత్వపు మగత, కవులలో కూరుకుపోయిన సాహిత్యాన్ని చూసి కొందరు యువకులు మార్పు కావాలనుకొన్నారు. వాళ్ళు అంతర్జాతీయపు సంఘటనలకు స్పందిస్తున్నవారు. వివిధ విదేశ కవిత్వాలను అధ్యయనం చేసి సమకాలిక సాహిత్యం ఎలా ఉండాలో తెలుసుకొన్నారు.

1930నుండి ప్రారంభమైన దశాబ్దంలో అంతర్జాతీయంగా ఎన్నో ముఖ్యమైన చారిత్రక సంఘటనలు జరిగాయి. 1929లో పెట్టుబడిదారీ మార్కెట్లు కుప్పకూలి ఆర్థిక మాంద్యం ప్రారంభమైంది. బ్రిటన్‌లో లేబర్ ప్రభుత్వం పడిపోయి జాతీయ ప్రభుత్వం ఎన్నికైంది. (1931), మంచూరియాపై జపాన్ దాడిచేసింది. (1931), జర్మనీలో హిట్లరు అధికారంలోకి వచ్చాడు. (1933) ఫ్రాంసుదేశంలో ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమాలు ప్రారంభమైనాయి. చైనాలో విమోచనోద్యమం వాయవ్యదిశలో ప్రారంభమై యేనాన్‌దాకా లాంగ్ మార్చి సాగింది (1936). అబిసీనియాను ఇటలీ దురాక్రమణ చేసింది (1935). ఫ్రాంసులోనూ, స్పెయిన్‌లోనూ ప్రజాప్రభుత్వాలు ఏర్పాడ్డాయి (1936). ఉత్తర చైనాపై జపాన్ దురాక్రమణ కొనసాగింపు (1937), స్పెయిన్‌లో అంతర్యుద్ధం (1936-37), మ్యూనిచ్ సంధి రట్టు, విద్రోహం (1938), నాజీ జర్మనీ ఆస్ట్రియాను - చెకోస్లోవేకియాను కబళించడం (1938). ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామం ప్రారంభం (1939).

ప్రపంచంలో ఇన్నిమార్పులు జరుగుతున్నప్పుడు దేశంలోని సంఘటనలను కూడా తెలుగు మేధావి గమనించకపోలేదు. గాంధీ - ఇర్విన్ ఒడంబడిక (1931). సత్యాగ్రహుల విడుదల (1932). నవ్యసాహిత్య పరిషత్తు స్థాపన (1933). ధూళిపాళ కోటయ్యగారి కార్మిక సంఘ ప్రచురణలు (133-34) రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు, శాసనోల్లంఘనం ఉపసంహరించడం (1934). ఆంధ్ర రాష్ట్ర సోషలిస్టు సమావేశం (1934 జూన్). క్రొవ్విడి లింగరాజుగారు అనువదించిన గోర్కీ నవల 'అమ్మ'ను ఆదర్శ గ్రంథమండలి వారు ప్రచురించడం (1934 డిసెంబర్). 'ప్రభ' పక్షపత్రిక ప్రారంభం (1935, ఏప్రిల్), బ్రిటీష్ పార్లమెంటులో ఇండియా బిల్లు (1935). 'అమ్మ' నవలను ప్రభుత్వం నిషేధించడం, రహస్య ప్రతుల పఠనం (1935). కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ద్వితీయ మహాసభ (1936). 'ప్రతిభ' ప్రారంభం (1936). శాసనసభ ఎన్నికలు (1937). కాంగ్రెస్ మంత్రివర్గం ప్రథమ సమావేశం (1937 జూలై). ప్రపంచ యుద్ధంలోనికి భారతదేశాన్ని పర ప్రభుత్వం దింపడం (1939, సెప్టెంబరు). కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా (1939).

దేశం పరులు విధించిన పనికిమాలిన శాసనాలను ఉల్లంఘిస్తూ పూర్ణ స్వరాజ్యం కోసం పోరాడుతున్న ప్రారంభదినాలలో కావ్యకవులు, లాక్షణికులు విధించిన ఛందో

.. బందోబస్తులు, చెల్లని రూపాయిల్లాగా అరిగిపోయిన పాతకవి సమయాలు పట్టుకొని వేళ్ళాడగలరా? మరో మార్గం తెలియక పాతధోరణిలోనే నవ కవులు సాగిసాగి ఒక్కసారి ఆగారు. శ్రీరంగం నారాయణబాబు ఆనాటి యువకవులందరి తరపున తన అనుభవం ఇలా చెప్పాడు.[4]

''భావ కవిత్వపు పోకడలు జీర్ణం చేసుకొని కొంతవరకు మేమూ రచన సాగించాము. ఆ ఫణితిని రచన సాగించిన దినాలలో కూడా పసలేకుండా నీరసంగా చేయవలసిన రచన ఇది కాదూ అని మాకు తెలిసి కూడా గత్యంతరం లేక కనులకు పొరలు కమ్మితే కావ్యరచన సాగింది. అంతట హృదయంలో ఒక విభిన్నమైన సంచలనం, ఉద్వేగం, ఓజస్సు, బలం హఠాత్తుగా ఆరోగ్యాన్నిచ్చాయి. అంతవరకు భావకవులతో పాటు మేముకూడా జీవితగ్రీష్మాన్ని దర్శించేందుకు మనోనేత్రానికి తగిలించిన 'గాగుల్స్' నేల విసిరికొడుదుం కదా! హృదయంలో పొగలూ సెగలు రేగి వీధి కాలువ నీటిలో బురదలో ఆపసోపాలు పడిపోతున్న విశ్వనాథుడు, ఊరిబైట పొలంలో ఇనకిరణాలు, క్రౌర్యంతో కాయక్లేశ పడుతున్న సేద్యగాని శరీరంమీద పండిస్తున్న ఘర్మ మౌక్తికాలతో ఒక తాజ్‌మహల్ కట్టాలని బుద్ధి పుట్టింది. మా కవిత్వంలో ఉండకూడని వస్తువు, వాడకూడని భాషా లేనే లేదు. చాకలాడు, సంతబయలు, కుక్క, గాడిద, కుళ్ళు కాలువ, ఫేక్టరీ కూత, మరఫిరంగి, మందుగుండు, బీదవాడు, భిక్షువర్షీయసి అన్నీ -, అవేమిటి - ఇవేమిటి లోకంలో ఉన్నవన్నీ! పలాయనతత్వం పనికిరాదు. నల్లమందు నిషా పనికిరాదు. జీవితం ఎంత సహారా ఎడారి ఐనా మేము మాత్రం మరి ఉష్ట్ర పక్షులమై సంచలించలేము. యదార్థంగా జీవితాన్ని దర్శిస్తాము. జీవితం మాలిన్యభూయిష్టం అని వప్పుకుంటాము. వేలెత్తి చూపిస్తాము. జీవితంలో మాలిన్యాన్ని గాలించి క్షాళితం చేస్తాము. వేదాంతులు జీవితాన్ని ప్రకృతిని అవగాహన చేసుకున్నారు. మేము లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతిని కూడా మారుస్తాము''.

ప్రపంచాన్ని మార్చడానికి ఒకటే మార్గం ఉంది. అది విప్లవం. దానిని శ్రామిక శక్తులే సాధించగలవు. అయితే ఆ లక్ష్యసాధనకు ఎందరెందరో సమిధలు ఆహుతివ్వాలి. అశ్రువులు ధారపోయాలి.

తరతరాలుగా అసమానతలు సంఘంలో స్థిరనివాసం ఏర్పరుచుకొని తరతమ భేదాలు తప్పనిసరి విలువలన్న దృక్పథంగల సంస్కృతిని మార్చాలి. ఆ మార్పుకు దోహదం చేసే రచనలన్నీ హర్షించదగ్గవే.

ధనరాశుల పక్కనే దారిద్ర్యం తాండవిస్తూ, ఆకలి దహిస్తూ ఉంటే మలమలమాడే దీనుల హీన స్వరాలను విని వాళ్ళ పట్ల జాలి చూపడం కూడా తప్పనిభావించే సనాతనులు సాహిత్య రాజ్యమేలుతున్న కాలంలో. ఒక కలవారి గృహప్రవేశ మహోత్సవ సందర్భంలో ఏర్పాటైన కవిసమ్మేళనంలో ఒక యువకవి బిచ్చగాళ్ళ గోడును గానం చేశాడు.[5]

---

4. రెంటాల గోపాలకృష్ణయ్యగారు రచించిన 'సంఘర్షణ'కు శ్రీరంగం నారాయణ బాబు రాసిన పీఠిక నుండి.

5. పిలకా గణపతి శాస్త్రి

వరుసం దొలకరి వానలు కురియున్
వరి పైరులు బంగారమె పండున్
కానీ మా వీధులలో మాత్రము
ఆ నీరస నీరవ దరిద్ర గాత్రము
అమ్మా మాదా కబళము తల్లీ
అమ్మా పిల్లల మన్నం తల్లీ

ఓ విషాద సాగరమణి తరణీ
ఓ విశాల సర్వజగజ్జననీ
వినబడనే వినబడదో నీకై
కనికరమే కలగదొకో మాపై

కలవారు నూతన గృహ ప్రవేశం చేసుకొంటూ ఉంటే ఆ శుభ ప్రసక్తికి సంబంధించిన సభలలో కేవల శుష్క దారిద్ర్యాన్ని ప్రతిపాదించే గేయాలు చదవడంగాని, చదవవలసిందని ప్రోత్సహించడంగానీ అనౌచిత్యమని ఒక సనాతన శాస్త్రిగారు భావించి 'కవితా విప్లవం' అనే పేరుతో నవకవిత్వపై విరుచుకుపడ్డారు.[6] ఆ శాస్త్రిగారికి రసతత్త్వం అచుంబిత విషయమేమో అనిపిస్తుందని ఆ గేయకర్త సమాధానం చెప్తాడు. లోకంలో ఉన్న దారిద్ర్యాన్నీ, ఆకలినీ, వేదననీ జ్ఞాపకం చేయడం, వాటిని తొలగించే మార్గాలు అన్వేషించమని చెప్పడంలో అనౌచిత్యమేమీలేదు.

అన్నపు రాశులు ఒకచోట
ఆకలి మంటలు ఒకచోట
సంపదలన్నీ ఒకచోట
గంపెడు బలగం బొకచోట[7]

కవికి కనపడే ఈ కలిమి లేములు ఎలా ఏర్పడ్డాయో, వీటిని ఎలా పరిష్కరించాలో అతనికి తెలుసు. రానున్నది ఏమిటో అతనికి తెలుసు. దానికి ఇలా చెప్పాడు.[8]

రానున్నది యేది నిజం
అది ఒకటే సోషలిజం
కలపండోయ్ భుజం భుజం
కదలండోయ్ గజం గజం
అడుగడుగున యెడద నెత్తు
మడుగులు విడువండోయ్

1930 దశకంలో శిష్ట్లా, నారాయణబాబు, శ్రీశ్రీలు దారి చూపించాక 1940 దశకంలో నవకవులు రానున్న అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని ముందుగానే పసికట్టి ఆధోరణిలో రచనలు చేయడం ప్రారంభించారు.

6. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి – 'కథలు గాథలు' ప్రథమభాగం, పుట.842
7. కాళోజీ నారాయణరావు – నా గొడవ
8. దాశరథి – రుద్రవీణ

అప్పటికి పది పన్నెండేళ్ళ నుంచీ శ్రీశ్రీ గొంతుక యువకుల చెవులకు నాగసారమైంది. అతడు 'శివ సముద్రమూ నయాగారా' వలే విరుచుకుపడమన్నాడు. కృష్ణానదికి ఇద్దరిని యువకులు నలుగురు 'నయాగరా' కవులనే పేరుతో సాహిత్యాన్ని ఎత్తిపోతలుగా కురిపించారు. అనిసెట్టి సుబ్బారావు, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులూ కలిసి గుంటూరు సీమలో కొత్త కవిత్వం చెప్తున్నపుడు గోదావరి అద్దరి దాటాక ఆవంత్స సోమసుందర్, దర్బా, రాంషా, నేనూ నూతనరీతుల్లో కృషి చేస్తున్నాం. కృష్ణా గోదావరి రెండేర్ల నడిమ విషయంలో దేవరకొండ బాలగంగాధర తిలక్కు భావకవిత్వంలోంచి బయటపడుతున్నాడు. పెనుమర్తి విశ్వనాథశాస్త్రి అనే కుర్రాడు అజంతా అనే పేరు పెట్టుకొని గేయరచన మొదలెట్టాడు. రాయలసీమలో విద్వాన్ విశ్వం కొత్తభావాలను చేతపట్టాడు. తెలంగాణాలో దాశరథి కొత్త గొంతుక ఖంగున విప్పాడు; కాళోజీ కాహళి ఒత్తాడు.

నాకు జ్ఞాపకమున్నంతవరకు ఈ పన్నెండుమందియే 1940 దశకంలో మరీ నవకవులం. కొందరు మూతిమీద పద్యాలు మొలచినవాళ్ళు, కొందరు నూనూగు మీసాల మవ్వపు తీగెలు. అందరం వృత్తాలు అల్లగల వాళ్లమే. అందరికీ పాతకవిత్వంతో ఎంతో కొంత ముఖ పరిచయం, భావకవిత్వంతో ఇంతో అంతో సుఖ పరిచయం లేకపోలేదు. అయితే భావకవులు తరచుగా వాడే గీతపద్యాన్నీ అరుదుగా వాడే ముత్యాలసరాన్నీ కూడా ఈ నవకవులు స్వీకరించలేదు. శ్రీశ్రీ ప్రచారం చేసిన మాత్రా ఛందస్సులూ, పఠాభి దిమ్మరించిన వచన పద్యాలూ, నారాయణబాబు కనిపెట్టిన మధ్యేమార్గాలూ మాకు నచ్చాయి. సామ్యవాదం మా వేదం. సాహిత్యం మా ప్రాణం. సామాన్యుడు మా దేవుడు. సమరం మా ఊపిరి. ప్రగతి మా లక్ష్యం. ఆంధ్రదేశపు నాలుగు ఎల్లల్లోనేకాక విశ్వమంతా విస్తరించిన హృదయాలు కష్టజీవికోసం కార్చే కన్నీళ్ళూ, ధనికవర్గాలపై గుప్పించే శాపాలూ, కళ్ళల్లో కోపం, గుండెల్లో విప్లవం, పెదవి మీద పిడుగులు, ఒళ్ళంతా చైతన్యం, అదీ మా విశ్వరూపం.

అప్పుడు 'ప్రతి ఒకడు శివుడు నేడు' అంటాడు నవకవి. 'కలిమిలేమి సమరంలో కాలం ఎర్రబడిందని' గుర్తిస్తాడు. 'తాడిత భూ వదనంపై నీడ నిష్క్రమించిందని' కీర్తిసాడు.[9] 'నీకన్నా నేనే మంచివాణ్ణంటూ' దేవుడితోనే చెప్పగలడు.[10]

చెడును నీవు సహించవు, అవతారమెత్తి శిక్షిస్తావు.
చెడును నేను సహిస్తాను, దానిపై జాలి వహిస్తాను.
నీది హింస, నాది అహింస!

అని స్పష్టంగా ప్రకటించగలడు. 'రైలు కింద పట్టాలాగా, చెప్పుకింద చీమల్లాగా 'నలిగిన మానవుల్ని సమీకరించి జగత్తు ఒక సోల్జరు అడుగై సాగిందని చెప్పగలడు.[11]

మాకు లోకం ఒక గీటురాయి
మాకు కరుణ చిగురు తురాయి
మేం దివ్యత్వం నటించం
మేం పరపీడన సహించం

9. అనిసెట్టి సుబ్బారావు – గీతాలు
10. కుందుర్తి ఆంజనేయులు – వ్యత్యాసాలు
11. బెల్లంకొండ రామదాసు

అని మాగ్నాకార్ట ప్రకటిస్తాడు.[12] 'విశ్వవీణారవపు విజయగానమ్ముతో విజయ శంఖారావ విమల గీతమ్ముతో కొత్త మార్గాలపై, కొత్తమార్గాలకై' సాగిపోతాడు.[13] 'రక్తారుణ వైజయంతి రమ్మన్నది పోతున్నాం' అని అందరినీ చైతన్యంతో నడిపిస్తాడు.[14]

ఆరోజుల్లో వ్యక్తి చైతన్యాన్ని సంఘ చైతన్యంగా అనువదించాలనే వజ్ర సంకల్పంతో అభ్యుదయ ఉద్యమం ప్రారంభమైంది. అదో వరద వెల్లువ. ఆ మహాప్రవాహం పెద్దపెద్ద వట వృక్షాలను సైతం తన ఉత్తుంగ తరంగాలపై అలవోకగా తేల్చుకొంటూ పోయింది. ఆ ఉద్యమం మా పాలిటి జీవనది. ఆ మంచినీటికి చేపల్లాగా మేము ఎదురువెళ్ళి స్వాగతం చెప్పాం. కవితా సముద్రంలోంచి జీవన ప్రవాహంలోనికి, ప్రపంచ వాహినిలోంచి సాహిత్య సాగరంలోనికి ఇటూ అటూ మేము ఈదిన ఈత ఇవాళ ఒక తియ్యని తలపోత.

1940వ దశకంలో అదే వాతావరణం. అప్పటికే పఠాభి తెచ్చిన మార్పులకు ప్రతిధ్వనించినట్టు సింగరాచార్య, పూషా కొన్ని మణి ప్రవాళ రచనలు చేశారు. 'పాప' కండగల కవిత్వం రాశాడు. చీకటిని ద్వేషించాడు. సంపత్ గొంతుక తరచుగా వినబడేది. పురిపండా గీతాలు పులిపంజా విప్పేవి. జలసూత్రం భావకవిత్వాన్నే కాక దేన్నయినా అపహాస్యం చేసి ఆ ఉద్రిక్త ఉద్యమ వాతావరణంలో రిలీఫు ఇచ్చేవాడు. అయితే పాప, పూషా, జరుక్, సంపత్, సింగరాచార్య ఆనాడు మరీ అతినవ్యులు కారు. శిష్ట్లా, దేశిరాజు, పురిపండా మొదలైన వాళ్ళలాగే వీళ్ళూ తొలితరం వాళ్ళే.

1933లో నవ్యసాహిత్య పరిషత్తును సంస్థాపిస్తే 1943లో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. ఈ రెండు సాహిత్య సంస్థల చరిత్రే ఆధునిక యుగంలోని సాహిత్య స్వీయచరిత్ర. 1955లో అభ్యుదయ రచయితల 5వ మహాసభలు జరిగాయి. కానీ, ఆ తరువాత ఒకటిన్నర దశాబ్దాలు పై చిలుకు అది స్తబ్దుగా ఉండిపోయింది. జాతీయోద్యమంలో కవులు తమంతట తాము కాంగ్రెస్ ప్రచారం కోసం కవితలు రాస్తే, 1955లో ప్రజాస్వామ్యం కవచం కప్పుకొన్న తన ప్రచారానికి పనికివచ్చే కవులకోసం కాంగ్రెస్‌వారు గాలించసాగారు. గాలం వేయసాగారు. ప్రజాశక్తులను సమర్థించే కవులు వామపక్షం నుండి అట్టేదూరం వెళ్ళలేదు. ఒక్క కాంగ్రెస్ వారే కాదు. ఆదిలో రాయిస్టులు, ఆ తరువాత జనసంఘంలాంటి మతతత్వ పార్టీలు తమ ప్రచారం చేసే రచయితలను ప్రోత్సహించడం బహిరంగమైంది.

1955లో జరిగిన సంఘటనలు తెలుగు కవిత్వంమీద ఒక పరోక్ష ప్రతిభావాన్ని చూపెట్టాయి. అప్పటి యువతరం రాజకీయ వైముఖ్యాన్ని అవలంబించింది. దీనికి అంతర్జాతీయ కారణాలు కూడా లేకపోలేదు. స్టాలిన్ హయాంలో జరిగిన కొన్ని అవకతవకలు గురించి కృశ్చేవు చేసిన రహస్య కథనం వెల్లడి కావడంతో మేధావులతోనూ, యువకులలోనూ ఒకరకమైన 'రివిజనిజం' ప్రారంభమైంది. తిలక్ 'పులి చంపిన లేడినెత్తురు'ను పులమకోలేనన్నాడు. కుందుర్తి 'ప్రజాస్వామ్యమే నిజమైన నందనం' అన్నాడు. నాకు 'గంటస్తంభం' చూపెట్టే కాలం తప్పు'నిపించింది.

---

12. బాలగంగాధర తిలక్
13. నా పద్యమే
14. దాశరథి పద్యమే

రాజకీయ పక్షాలు ఇలా రచయితను వాడుకోవడం మొదలయ్యేసరికి ఆత్మగౌరవంగల కళాకారులు ఏవగించుకొన్నారు. బిరుదులు, పదవులు, సన్మానాలూ కావాలనుకొనే కీర్తికాములు ఏం చేసినా యువకవులు మాత్రం లౌక్యం కూడా ఒప్పుకోరు. ఏ వర్గానికీ ఆత్మ అమ్ముకోరు. అందుకే అభ్యుదయోద్యమం కొండ దిగడం మొదలుపెట్టాక, ఆంధ్రరాష్ట్రం అవతరించాక, మొగ్గవిప్పిన కవులు కాల్పనికోద్యమం ప్రభావంలో పడ్డారు.

సి. నారాయణరెడ్డి 1953లో నవ్వని పువ్వుగా తెలుగు సాహిత్యరంగంలో అడుగుపెట్టాడు. అతడికి ముందుతరం కవులు గొంతువిప్పితే అగ్నిధార కురిసేది. నారాయణరెడ్డి సమదర్శనం వైపుకన్నా శృంగార కావ్యాలవైపు మొగ్గాడు. కర్పూర వసంతరాయలు, విశ్వనాథ నాయకుడు వంటి చారిత్రక వీరుల గాథలంటే ఆసక్తి పెరిగింది. పీడిత ప్రజానీకం అంటే ఆ కోవలోని కవులకు సానుభూతి లేకపోలేదు. అయితే చారిత్రక కారణాల వల్ల అనల వేదికలు విడిచిపెట్టి అనిల వీచికలవైపు మళ్ళారు.

ఉత్తర భూములనుండి, హిందీ కవిత్వంలోంచి తెలుగు సాహిత్యంలోనికి వచ్చిన ఆలూరి బైరాగి 'పలాయనం' ప్రబోధిస్తూ అడుగుపెట్టాడు. తరతరాలకూపంలో తమిస్రసంచయాల మధ్య కుప్పల్లా పడి ఉన్న మానవులను తన వెలుగు కళ్ళలో కవి చూశాడు. నూతిలో గొంతుకలు విన్నాడు. ఆధునిక కవిత్వంలో గుండెకన్నా మెదడు ఎక్కువపని చేయడం మొదలెట్టింది. జిఘాంసకు బదులు జిజ్ఞాస ప్రారంభమైంది.

ఈ శతాబ్దంలోని ఆదిమ కవులలో ఒకరైన అబ్బూరి రామకృష్ణారావుగారు 'రీ-థింకింగ్' మొదలెట్టారు. 'మనసులోని యాలాపము మాటలలో మారిపోవు. ఎత్తిన కవితాదీపము వత్తి కుమిలి యారిపోవు' అని గుర్తించి పొరపాటీ తిరుగుబాటు-తిరుగుబాట తిరిగి చాటు' అని ప్రకటించారు. చాలామంది తిరుగుబాట పట్టారు. 'వినిపించె నేదో మెల్లని పిలుపు - మూయండి నావెనుక విశ్వం తలుపు' అని బెల్లంకొండ రామదాసు మౌనకాంతారాలకు నిష్క్రమించాడు. 'పడిపోయిన సత్రపుగోడ'ను ఏల్చూరి చూసి నిట్టూర్చాడు. 'పాంథుడా! పడుకోను అరుగు లే దిచట'ను జాలిగా చెప్పాడు. నారపరెడ్డి రామిరెడ్డిలాంటి వాళ్ళు,

> ''ఈ రాతిరి ఈ మబ్బులు
> ఈ చీకటి చీల్చుకొంచు
> వేగుచుక్క వెడలునంచు
> నాకెప్పుడు భ్రాంతిలేదు''

అని అసందిగ్ధంగా చెప్పేశారు. కె.వి. రమణారెడ్డిలాంటి వాళ్ళకు ప్రపంచం అరణ్యప్రాయంగా కనపడింది. ఆ అడవిలోనే అతడు పాత నినాదాలు ఎలుగెత్తాడు. ఆ భువనఘోష అరణ్యరోదనమే అయింది. తత్కాలసమరాలకు శాశ్వత ముద్రనివ్వడానికి గంగినేని, రెంటాల మొదలైనవాళ్ళు ఎంతో ప్రయత్నించారు. 'ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు' అని సోమసుందర్ నిత్యసత్యాన్ని ప్రబోధించాడు. అయితే ఒక ఉద్యమం క్షీణిస్తే మళ్ళా అది పుంచుకోవడం కష్టం.

ప్రభుత్వం వారి ధనసహాయంతో సాహిత్య అకాడమీ ఏర్పడింది. ఒకరకంగా అకాడమీ స్థాపన మంచిపనే చేసింది. అనుభవజ్ఞుల్నీ యువకుల్నీ కేటాయించింది. గతంలో ఘనకీర్తిని ఆర్జించిన పెద్దలు అకాడమీ ఆసనాలను అలంకరిస్తూ సృజనాత్మకరంగాన్ని పూర్తిగా కుర్రవాళ్ళకు వదలి పెట్టినందుకు వాళ్ళకు ధన్యవాదాలు చెప్పాలి. శ్రీశ్రీ ఆశించిన సమగ్ర నిఘంటువుకు బీజాలు పడినా సంపూర్ణ వ్యాకరణం, సలక్షణ ఛందస్సు వీళ్ళ దృష్టిలోనికి వచ్చినట్టు లేదు. అకాడమీల శాశ్వత విధులేమిటో తెలియని సాధారణ సభ్యుల సంఖ్య అధికం కావడంవల్లనే కాబోలు అకాడమీ కార్యక్రమాలు చిల్లర ప్రచురణలవైపు మొగ్గుతున్నాయి.

పెద్దలు ఎటుమొగ్గినా యువకులు వివిధ వర్గాలుగా చీలిపోయారు. ఏరాగానికి శ్రుతిచేస్తే దాన్నే గాలివీచినా ఆలపించే పాతవీణల్లాగా కొందరి హృదయాలు స్పందించసాగాయి. తెలుగు కవులకు దినపత్రిక ముడిసరుకైంది. లుముంబా హత్య, మార్లీన్ మన్రో ఆత్మహత్య, క్రిస్టీన్ కీలర్ అనంగలీల ఏదైనా కావ్యవస్తువే. ఆంధ్రకవి ఆదినుంచీ ప్రపంచ పౌరుడు. అయితే ముదిగొండ శివప్రసాద్ వంటి యువకులు యౌవనంలోనే ముదిగొండలై గతంలోనికి తిరోగమనమే ఒక మహాసర్గగా ఆలపించడం కూడా పక్కపక్కనే ఉంది. విద్వేషగీతాల విషవాయువులు అందరి నాసాపుటాల దాకా రానందుకు, ఈ ధోరణి ఒక ఉద్యమమద్యం కానందుకు, సంఘజీవితం కలుషితం కానందుకు సంతోషించాలి.

అయితే ఒక్కటే బాధ. ప్రతిరోజూ ఒక మహాకావ్యం పుట్టలేదని ఫిర్యాదు చేసే వాళ్ళ గోల కొంచెం సహించరానిది. పత్రికల ప్రత్యేక సంచికలకు, రేడియోల కవిసమ్మేళనాలకు, సర్కారు వారి సమారోహాలకు సదస్యం పద్యాలు వ్రాసే మహాకవుల రచనలు ఉత్తేజకరంగా ఒకవేళ లేకపోతే అట్టే నొచ్చుకోనక్కర్లేదు. టి.ఎస్. ఇలియట్ చెప్పినట్టూ అయిదేళ్ళకో పదేళ్ళకో ఎప్పుడో ఒకసారి తప్ప కవిలో అనుభవాల పరిణతాకృతి అవగతం కాదు. అప్పుడు కాని కావ్యం పుట్టదు. సాధారణ కావ్యం విరి అయితే మహాకావ్యం వరి, విరి కోయగానే వినియోగానికి వస్తుంది. వరి పాతబడితేగాని రుచికరం కాదు.

అయితే ఆలోగా కవి తన సాధనను నిరంతరం సాగించాలి. రచనా సంవిధానంలో ఎన్నెన్నో వినూత్న ప్రయోగాలు చేస్తేనే అసదృశ్య కావ్యం ఆవిష్కృతం కావడానికి ఈ కృషి వేదిక అవుతుంది. ఈ రహస్యం తెలిసిన వాళ్ళు కృష్ణశాస్త్రి వేమనపద్యాలు, శ్రీశ్రీ ప్రాసక్రీడలూ, నేను కూనలమ్మ పదాలూ, ఇంటింటి పజ్యాలు, దాశరథి గాలిబ్ గీతాలు, శతకపద్యాలు, మన ప్రాచీనుల చాటువులూ ఎందుకు రచిస్తున్నదీ ప్రశ్నించరు. ఒకరి పరిశోధనలు ఇంకొకరి పరిణామాలు అవుతాయి. శ్రీశ్రీ ప్రాస క్రీడల వెటకారం, గజ్జల మల్లారెడ్డిలో గంభీరమైన ఒక ప్రతిభావంతుణ్ణి తయారుచేసింది. ఉత్తరోత్తరా దేవీప్రియ ఈ ప్రక్రియలో ప్రముఖుడయ్యాడు. ప్రతిభ ఎప్పుడూ పదునుగా ఉండడానికి నిరంతరోత్పత్తి అవసరం.

అయితే దురదృష్టవశాత్తూ అది యువకులలో కొరవడ్డం కనబడుతోంది. రెంటాల గోపాలకృష్ణగారు ఈనాటి కవుల గురించి ఏమంటున్నారో వినండి.[15]

''ఇక మూడవతరం, నాల్గవతరం కవులలో ప్రతిభావ్యుత్పత్తులు కలవారు చాలా కొద్దిమంది. ఇంకా ఇప్పుడిప్పుడే వస్తున్న కవులకు లెక్కేలేదు. అదేమిపాపమో కాని కలంపట్టిన ప్రతివాడికీ కవిత్వం చాలా చులకన అయిపోయింది. ఈరోజుల్లో, క్షణంలో ఒక గేయం వ్రాస్తాడు. పత్రికలు అచ్చువేస్తాయి. తానొక కవినని మురిసిపోతాడు. అవును మరి - నేటికవిత్వానికి ఏ నియమాలు లేవు. ఛందస్సు, వ్యాకరణం అక్కరలేదు. కనుక ఏదివ్రాసినా కవిత్వమై ఊరుకొంటుందని వీరి ఉద్దేశ్యం కాబోలు! భాషాజ్ఞానం సున్న. పూర్వసాహిత్య పరిచయం పూజ్యం. భావంలేని కవిత్వం ఏదో ఉబలాటం తప్ప కావ్యానికి ఊపిరి ఏదో తెలియదు. చిత్తశుద్ధి నిజాయితీ ఒక తాత్త్విక దృష్టి వెదకి చూచినా కనిపించవు''.

ఈ మాటల్లో ఉన్న నిజాన్ని నేనే కాదు ఎవరు ద్వితీయపరచినా మీరంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తారు. ఇక్కడ ఒక్క సంగతి మనం గుర్తుంచుకోవాలి. ఇదే వాక్యక్రమంలో కాకపోయినా ఇవే మాటల్ని భావకవులపై వాళ్ళ పూర్వులు చేటలతో చెరిగారు. అదే మోస్తరుగా భావకవులు ఇలాంటి మాటల్ని అభ్యుదయ కవులపై జల్లారు. నేడు ఒకనాటి అభ్యుదయ కవులు ఈనాటి కుర్రకారుమీద ఇలాటి అభియోగాలు తేవడం సానుభూతి లేకకాదు; సత్యాన్ని చాటాలనే!

అయితే, భావకవిత్వం రోజుల్లోనూ, అవధానాలయుగంలోనూ మనకు చాలామంది ప్రతిభా వ్యుత్పత్తులు లేని కవులుండేవారు. ఆ మాటకొస్తే రెండు మూడు వందలేళ్ళ సాహిత్య చరిత్రలో బళ్ళకొద్దీ రొడ్డ వ్రాసిన వాళ్ళను బళ్ళ కొద్దీ నేను చూపించగలను, వాళ్ళందరూ కవులూ కారు, వాళ్ళది కవిత్వమూ కాదు.

నిజమైన కొత్త కవిత్వంలో వింత పోకడలేమిటా అన్న పరిశీలన చేస్తున్నప్పుడు పొల్లు తూర్పారపట్టి నెల్లు మాత్రమే మిగుల్చుకోవాలి.

ప్రముఖ కంఠాలనేగాని ప్రతిధ్వనులను లెక్కపెట్టక్కర్లేదు.

---

15. సృజన - 1967 మే-జూలై

నవ్యసాహిత్య పరిషత్తు

తెలుగు సాహితీపరులందరికీ ఒకే ఒక సంస్థ ప్రాతినిధ్యం వహిస్తూ ఉండేది. దానిపేరు ఆంధ్రసాహిత్య పరిషత్తు. దీనిని జయంతి రామయ్య పంతులుగారు పిఠాపురం మహారాజా వారి ఆదరాభిమానాలతో 1911లో సంస్థాపించారు. ప్యూడలు విలువలనూ, గ్రాంథికాంధ్రాన్నీ సంరక్షించడమే దీని ఆశయం. ఇందులో కరుడుగట్టిన గ్రాంథికవాదులే కాక గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తిగారు మొదలైన వ్యావహారికభాషావాదులు కూడా సభ్యులే. ఉన్న ఒకే ఒక సాహిత్య వేదికను ఉపయోగించుకొని వాడుకభాషను ఆమోదింప చేయాలన్న పట్టుదల ఒక్కటే గురజాడ, గిడుగువార్లను ఆంధ్రసాహిత్య పరిషత్తు సభ్యులను చేసింది.

వ్యావహారిక భాష గ్రామ్యంకాదని నచ్చచెప్పడానికి గురజాడ పరిషత్తు సభలలో చాలా పర్యాయాలు ఉపన్యసించారు. అప్పుడాయన ఒంటరివారు. తరువాత గిడుగువారు రంగంలోనికి వచ్చారు. తమ ఉద్దండ పాండిత్యంతో ప్రత్యర్థుల వాదనను ఖండించసాగారు. గురజాడ అప్పారావుగారు చనిపోయిన తర్వాత గిడుగువారు ఒంటిచేతిమీదుగా ఈ పోరాటాన్ని సాగించారు. పట్టిన పట్టు విడువకుండా ఆంధ్రదేశమంతా సంచారం చేసి కళాశాలలున్న ప్రతిఊళ్ళో పండితులకు నిజమైన సంప్రదాయం ఏమిటో విశదపరిచారు. 1924 అక్టోబరు మాసంలో అఖండ విజయాన్ని సాధించారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 1924వ సంవత్సరం అక్టోబరు 9 మొదలు 13 తేదీ దాకా ఆంధ్ర సాహిత్య పరిషత్తు 13వ వార్షికోత్సవాలు జరిగాయి. ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మగారు అధ్యక్షతన వహించారు. శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి మొదలైన దిగ్గంతులు ఆ సభలో ఉన్నారు. 10వ తేదీనాడు గిడుగు రామమూర్తి గారు అయిదు గంటలసేపు ఏకబిగిని గంభీరోపన్యాసం చేసి పండితులను నిరుత్తరులను చేశారు. ''గ్రామ్యముగాని వ్యావహారికభాషలో పూర్వ సంప్రదాయముననుసరించి గ్రంథములు రచించవచ్చును'' అనే తీర్మానాన్ని జయజయధ్వనుల మధ్య ఆమోదింపచేశారు. ఈ వార్షికోత్సవానికి జయంతి రామయ్యగారు రాలేదు. ఈ సభలో కురుగంటి సీతారామయ్యగారు, చింతా దీక్షితులుగారు, కొండాలి ఆంజనేయులుగారు, తెలికిచర్ల వెంకటరత్నంగారు మొదలైన నవసాహితీపరులు ఉన్నారు. వీరందరూ కూడా ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభ్యులే.

తరువాత జరిగిన వార్షిక సభకు జయంతి రామయ్యగారు హాజరైనారు. కిందటేడు ఆమోదించిన తీర్మానాన్ని రద్దుపరిచే ఏర్పాట్లు చేశారు. అటువంటి తీర్మానం పునర్విమర్శకు రాకుండా ఉండడానికి వీలుగా కొత్త తీర్మానం ఆమోదింపచేశారు. సంఖ్యా బలంతో గ్రాంథికాన్ని నిలబెట్టారు. తొలి దగ్గర్నుంచీ రామయ్యగారిది ఒక్కటే ఆశయం. వ్యావహారిక భాషకు రాజాదరము లేకుండా చేయాలన్నదే వారి లక్ష్యం. లోగడ గురజాడ అప్పారావుగారు విశ్వవిద్యాలయంలో వాడుకభాష ఉపయోగానికి అనుజ్ఞను సంపాదిస్తే

మహాజర్లు పెట్టించి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి దానిని రద్దు చేయించారు. జయంతివారు తమ ఆశయాన్ని ఒకచోట ఇలా స్పష్టం చేశారు.[1]

''అన్ని విషయములలోను యధేచ్ఛావాదులెప్పటికి నుందురు. వారినడ్డుపెట్టువారు లేరు. కాని వాదమునకు రాజాదరముండుచో నది యనర్థదాయకమగును. గ్రామ్యవాదమున కట్టి యాదరము లేకుండఁ జేయుటయే పరిషత్తు నిర్వహించిన ఘనకార్యములలో నొకటి''.

ఆంధ్రసాహిత్య పరిషత్తువారి ఆశయాలు తెలిసినవే అయినప్పటికి అదే వేదికను ఉపయోగించుకొని 1929లో గిడుగు రామమూర్తిగారు తణుకులో సాధించిన విజయాన్ని కొనసాగించాలన్న ఉద్దేశంతో నవసాహితీపరులు నిశ్చయించుకొన్నారు. గిడుగువారు ఆంధ్రసాహిత్య పరిషత్తులో యావజ్జీవ సభ్యులు కనుక వారి అనుచరులైన సాహితి సమితి సభ్యులలో కొందరు తామూ సభ్యత్వం సంపాదించుకొన్నారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వార్షికోత్సవాలకు హాజరై తమ వాదాలను విన్నవించసాగారు. 1933 వార్షికసభ రాజమహేంద్రవరంలో జరిగినప్పుడు చింతా దీక్షితులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, తెలికిచర్ల వెంకటరత్నం, సామినేని ముద్దుకృష్ణ మొదలైన సభ్యులు హాజరైనారు. తెలికిచర్ల వెంకటరత్నంగారు 'మాతృభాష-పరభాష' అనే వ్యాసాన్ని చదివారు. ముద్దుకృష్ణ 'భావకవుల యతిప్రాసలు' గురించి తెలిపారు.[2] ఆంధ్రసాహిత్య పరిషత్తును మార్చగలమనే ఆశ ఆధునికులకు పూర్తిగా పోలేదు. కొట్టగా కొట్టగా రాయికూడా పగులుతుందని కొందరనుకున్నా, అందరూ అలా భావించలేదు. దీనికి కారణం శిష్ట వ్యావహారికానికి గుర్తింపు రానివ్వకూడదన్న జయంతి రామయ్యగారి ధోరణే.

వాడుకభాషకు ఆధారం లేకుండా చేయడమే పరిషత్తువారు చాలా పెద్ద ఘనకార్యంగా భావిస్తున్నప్పుడు నవసాహితీపరులకు ఆ పరిషత్తు వల్ల ప్రయోజనం లేదు. అందుకే 1933లో అభినవాంధ్ర కవిపండితులు ఒక నిర్ణయానికొచ్చారు. అది :

''ఆంధ్రవాఙ్మయాభివృద్ధికోసము ఆంధ్రదేశమున మంచి సంస్థ వక్కటి అయిననూ లేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఉండిననూ పరిమిత ప్రయోజనకారి అయిపోయినది''.

నవీనులకు ప్రాతినిధ్యం వహించే సాహితీసమితి 1919లోనే పుట్టింది. దాని సభ్యులు దేశంలో సంచలనం కలిగించే సాహిత్యాన్ని సృష్టించారు. అయితే 1930 నాటికి సాహితీ సమితి చప్పబడి పోయిందనే అభిప్రాయం యువకులలో కలిగింది. కొత్త సంస్థ అవసరమైంది.

అందుకే నవసాహితీపరులకోసం ఒక వేదికను తయారుచేసుకోవాలి. బరంపురంలో ఉన్న గురుభాగవతుల ధర్మారావుగారూ, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఇందుకు పూనుకొన్నారు. దేశంలో ఉన్న సాహితీపరులందరినీ బరంపురం రమ్మని ఆహ్వానించారు.

1. ఆంధ్రసాహిత్యపరిషత్తు - రజతోత్సవ సంచిక - 'పరిషచ్చరిత్రము'
2. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (1933 వార్షికసభ) - సంపుటి-22, సంచిక-1, పుట-36

1933 మార్చి నెల 10, 11, 12 తేదీలలో ఆ ఊళ్ళో 'అభినవాంధ్ర కవిపండిత సభ'ను జరిపారు. దీనికి ఎందరెందరో వచ్చారు. చిలుకూరి నారాయణరావుగారు సభకు అధ్యక్షత వహించారు. గిడుగు రామమూర్తిగారు ప్రారంభోపన్యాసం చేశారు. చారిత్రాత్మకమైన ఈ సభలో చాలా మంచి నిర్ణయాలు తీసుకొన్నారు. వాటిలో కొన్ని చూడండి :

''1. సభా నిబంధనలనూ, తత్ప్రచార క్రమమునూ నిర్ణయించడానికొక ఉపసంఘమును నిర్మించుట. (సభ్యులుగా ధర్మారావు, శివశంకరశాస్త్రి, చి. నారాయణరావు, పం. ఆదినారాయణ శాస్త్రిగారలు)

2. సభోద్దేశములను ప్రచారము చెయ్యడానికి వ్యక్తులను నియమించుట.

3. గ్రాంథికాంధ్రము ఒకానొకప్పుడు పరిమిత ప్రయోజనము కలదైనా, నేడది సర్వజనోపయోగకారి కాదు... వ్యావహారికాంధ్రము అపరిమిత ప్రయోజనము కలది. ప్రజలలో జ్ఞానాభివృద్ధి కలగడానికి యిదే పరమసాధనము.

4. ప్రారంభవిద్య ఉన్నత విద్యలను తెలుగు పిల్లలకు చెప్పేటందులకు, సాధనముగా గవర్నమెంటువారేర్పాటు చేసిన గ్రాంథికభాష అందుకు తగినదికాదు. భాషకున్నూ, బాలురకున్నూ, అందువల్ల తీరని నష్టము కలుగుతున్నది. కావున జీవద్భాషలోనే విద్యాకార్యమంతా జరుపవలెనని గవర్నమెంటును ఈ సభవారు కోరుతున్నారు.

5. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, మద్రాసు విశ్వవిద్యాలయముల వారి నిబంధనలలో, ఇంటర్మీడియేటు, బి.ఏ. పరీక్షలకు రెండోభాగములోని దేశభాషలను బోధించే ఉద్దేశము నవీనభావ ప్రకటనకు అనుకూలమైన భాషను ఉపయోగించేటట్టు చేయడమే అని స్పష్టముగా ఉన్నప్పటికీ, తెనుగుబోర్డు ఆఫ్ స్టడీస్‌వారు ఆ నిబంధనను యిన్ని సంవత్సరముల నించిన్నీ ఉల్లంఘిస్తూ ఉండడము చాలా విచారకరము. కాబట్టి ఇకముందు నవీనభాషతో ఉన్న గ్రంథాలకు ఎక్కువ ప్రాముఖ్యము ఇచ్చేటట్లు తెనుగుబోర్డు ఆఫ్ స్టడీస్‌ను, వారిని కోరవలెనని ఆయా సిండికేట్లు వారిని ఈ సభవారు కోరుచున్నారు''.

బరంపురం సభలలో తల్లావఝల శివశంకరశాస్త్రీ, చింతా దీక్షితులు మొదలైన సాహితీ సమితి పెద్దలేకాక శ్రీరంగం శ్రీనివాసరావు, కొంపెల్ల జనార్ధనరావు వంటి యువకులు కూడా పాల్గొన్నారు. శివశంకరశాస్త్రిగారు అత్యాధునికుల పద్యాలను ఈ సభలో చదివి వినిపించారు. చింతా దీక్షితులుగారు 'వచ్చేసింది కొత్త తరం, వచ్చేసింది కొత్త కవిత్వం' అని మహదానందం చెందారు. బరంపురం సభల వార్తలు పత్రికలలో చదివి దేశంలోని యువకవులు ఉత్తేజితులయ్యారు. వాళ్ళకు ప్రాణం లేచి వచ్చినట్టయింది.

ఏడాది తిరక్కుండానే 'అభినవాంధ్ర కవిపండిత సభ' ద్వితీయ సమావేశం 1933 డిసెంబరు నెలలో రాజమండ్రిలో గిడుగు రామమూర్తిగారి సప్తతితమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జరిగింది. సమావేశానికి రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షత

వహించారు. దేశం నలుమూలలనుంచీ కవులూ, రచయితలూ, పండితులూ, పత్రికా సంపాదకులూ, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు రెండువందలమంది సభకు వచ్చారు. చిత్రాంగి మేడ ముందుభాగంలో సభ జరిగింది. శివశంకరశాస్త్రి, కృష్ణశాస్త్రి, వేదుల, కవికొండల, ఇంద్రగంటి మొదలైనవారు ఎందరో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో 'అభినవాంధ్ర కవిపండిత సభ' అన్న పేరుకు బదులుగా ఈ సంస్థకు ''నవ్యసాహిత్య పరిషత్తు'' అని మార్చారు. గిడుగు రామమూర్తిగారిని గౌరవాధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు. చాలామంది నవ్యసాహితీపరులు కార్యనిర్వాహక సభ్యులుగా ఉండడానికి అంగీకరించారు. తెలికిచర్ల వెంకటరత్నంగారిని కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. (ఈయనే నవ్యసాహిత్య పరిషత్తుకు యావజ్జీవ కార్యదర్శిగా పాటుపడ్డారు.)

1934లో నవ్యసాహిత్య పరిషత్తు మూడవ మహాసభ అనంతపురంలో జరిపారు. తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న 'కవితా సమితి', 'సారస్వత సమాజం', 'యువకవి మండలి' మొదలైన స్థానిక ప్రాముఖ్యంగల సంస్థల సభ్యులు నవ్యసాహిత్య పరిషత్తు వల్ల ఆకర్షితులయ్యారు. సాహితీసమితలోని సభ్యులంతా నవ్యసాహిత్య పరిషత్తులో చేరిపోయినట్టే లెక్క.

1935లో నవ్యసాహిత్య పరిషత్తు మహాసభ ఏ ఊళ్ళోనూ జరగలేదు. అయితే ఆయేడు ఒక చెప్పుకోదగ్గ సంఘటనే జరిగింది. నవ్యసాహిత్య పరిషత్తు ఏర్పడింది కదా అని తెలికిచర్ల వెంకటరత్నంగారు, వారి మిత్రులు కొందరు ఆంధ్రసాహిత్య పరిషత్తులో తమకు గల పూర్వ సంబంధాలను తెగతెంపులు చేసుకోలేదు. సభ్యత్వాన్ని వదులుకోలేదు. 1935లో అమలాపురంలో ఆంధ్రసాహిత్య పరిషత్తు వార్షికోత్సవం జరిగింది. దానికి తెలికిచర్ల వెంకటరత్నంగారు హాజరవడమేకాక 'భాషా సంస్కరణము' అనే విషయంపై ప్రసంగవ్యాసం చదివారు.

గ్రాంథికవాదులకు వ్యాకరణ పరిభాష ఒక్కటే సుపరిచితం. సంస్కరణ శబ్దానికి 'లోపాగమ వర్ణ వ్యత్యయములు తెలియచేయుట' అనే అర్థాన్నే వారు చెప్పుకొనేవారు కాబట్టి సామాన్యంగా వాడుకలో ఉన్న 'సంఘసంస్కరణ' మొదలైన పదాలలో ఉన్నట్లు 'మార్పు' అనే అర్థాన్ని బోధించడానికే ప్రయోగించానని తెలికిచర్ల వెంకటరత్నంగారు చెప్తూ, భాషా ప్రయోజనంతోపాటు గ్రాంథికభాషలు ఎలా ఏర్పడుతాయో, భాషా సాంకర్యం ఎందువల్ల కలుగుతుందో, భాషాతత్త్వం తెలిసిన పండితులు భాషా సంస్కరణం చేయడానికి ఏరీతిని ప్రయత్నిస్తున్నారో వ్యాసంలో వివరించారు. వివిధ దేశాలలో ఉదారహృదయులైన భాషాతత్త్వవేత్తలైన సంస్కర్తలు ప్రజాసారస్వతం సృష్టించి దేశభాషలు ఎలా ఉద్ధరించారో కూడా ఈ ఉపన్యాసంలో నిరూపించారు. మనభాషలో ఇప్పుడు ఆవశ్యకమైన సంస్కరణ గురించి 'ఆంధ్ర సారస్వత పరిషత్తు సభ్యులను ఆలోచించమన్నారు.[3]

3. ఈ ఉపన్యాసం 1936లో వెలువడ్డ 'ప్రతిభ' తొలి సంపుటం, తొలి సంచికలో ప్రకటితమైంది.

తెలికిచర్ల వెంకటరత్నంగారు నవ్యసాహిత్య పరిషత్తు కార్యదర్శులేగాక గిడుగు రామమూర్తిగారి అనుచరులు. రామమూర్తిగారు తణుకులో 1929లో సాధించిన విజయాన్ని అడుగడుగునా ఆంధ్రసాహిత్య పరిషత్తును జ్ఞాపకం చేస్తున్నట్టు ప్రవర్తించాలి. ఎలాగైనా శిష్టవ్యావహారికానికి ప్రవేశం కలిగించాలి. అందుకే 'నిశ్చితార్థంబు విడువరు నిపుణమతులు' అన్న సుభాషితానికి నిదర్శనంగా తెలికిచర్లవారూ, వారి మిత్రులు ఆంధ్ర సాహిత్య పరిషత్తు కంచుకోట గోడలను బద్దలు కొట్టడానికి ప్రయత్నించసాగారు.

1936లో నవ్యసాహిత్య పరిషత్తు నాలుగవ వార్షిక సభ కాకినాడలో జరిగింది. టౌన్ హాలు ప్రాంతంలో పెద్ద సభావేదిక. విశాలమైన 'పెండాలు' కాంగ్రెసుసభల కోసం ఏర్పాటుచేశారు. అందులోనే సాహిత్య సభలు జరుపుకొన్నారు. శివశంకరశాస్త్రిగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అజమాయిషీ చేశారు. కృష్ణశాస్త్రిగారి ఇంటి ఎదుట ఉన్న ఒక వెలమ దొరగారి బంగళాలో సభ్యులకు వసతి సౌకర్యాలు ఏర్పరిచారు. ఎందరో సాహితీపరులు ఈ సభలకు వచ్చారు.

సభకు ప్రారంభకులుగా రావలసిన కాశీనాథుని నాగేశ్వరరావుగారు సకాలానికి రాలేకపోయారుగాని సభ ముగిసే లోపున వచ్చారు. ఈ సంవత్సరం పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు అధ్యక్షులు. ఆయన చాలా ఉత్తేజకరమైన ఉపన్యాసాన్ని ఇచ్చారు. అందులో సాహిత్యమంటే ఏమిటో, నవ్యసాహిత్యమంటే ఏరీతులు అవలంబించాలో, ఎవరు ఈ పరిషత్తుకు సభ్యులుగా ఉండాలో చాలా చక్కగా విశదం చేశారు. ఆదిలోనే ఇలాగ స్పష్టపరిచారు.

''దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్'' అన్నాడు గురజాడ అప్పారావు. దీని తాత్పర్యం ఆలోచిస్తే వాఙ్మయం అన్నా, లేక సాహిత్యం అన్నా ఆయా కాలాల్లో, దేశాల్లో ఉండిన ప్రజల ఉద్దేశాలూ 'ఆచారాలూ సంఘ వ్యవస్థలూ' అభిరుచులూ మొదలయిన వాటినన్నిటినీ కాలగర్భంలో లీనమైపోనీయకుండా, వాటికి సారస్వతరూపమైన తేజస్సును కూర్చి, శాశ్వతంగా అక్షర విన్యాసంతో నెలకొల్పిన ఒక ఆకారమనిన్నీ, అది ఏకాలంలో ఎపుడు ఏమాత్రం ప్రజ్ఞకలవారైనప్పటికీ కదిపితే చాలు. తన నిజస్వరూపాన్ని విస్పష్టంగా వెల్లడి చేయగలిగిన అలౌకిక చైతన్యం కలిగిన ఒక దివ్య తేజఃప్రపూర్ణమైన విజ్ఞానరాశి అనిన్నీ అవగతం అవుతుంది. కాబట్టి అది సాజాత్యవైజాత్యాలను స్ఫుటంగా వెల్లడించే సాధనం అంటున్నాను''.

సంఘ సంస్కరణానికి, సాహిత్య నిర్మాణానికి కృషి చేస్తున్నవారు సారస్వతానికీ, రాజకీయ సంస్కరణ ఆవశ్యకమన్న సంగతిని ఆదిలో గుర్తుచేసి ఇలా అన్నారు.

''నేడు సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతిని సాధించే కొఱకు అనేక సంఘాలు ఏర్పడ్డవి. కులభేదాలనూ, దృష్టిదోషాలనూ ఈ మొదలయిన వానిని పోగొట్టే నిమిత్తం సాంఘిక సమాజాలూ, సభలూ పనిచేస్తున్నవి. రాజకీయంగా ఉన్నతిని తెచ్చేందుకు దేశంలో వివిధ రాజకీయ పక్షాలు పనిచేస్తున్నవి. ఆర్థికంగా ఏర్పడ్డ దుర్దశను పోగొట్టే కొఱకు గ్రామాదుల్లో నగరాదుల్లో ఆర్థిక సంఘాలు అహోరాత్రులు కృషి చేస్తున్నవి''.

రాజకీయాలకూ, సాహిత్యానికీ గల సంబంధాన్ని విస్పష్టం చేసిన విజ్ఞులలో పంచాగ్నుల వారు ప్రథమ శ్రేణికి చెందుతారు. ఆయన మంచిని ఎక్కడ నుంచైనా తీసుకోవచ్చుననీ, అర్థంలేని ఆంక్షలను పాటించకూడదని ఇలా చెప్పారు.

''ఎప్పుడో పాతిక శతాబ్దాల క్రింద ఏర్పడ్డ లక్షణ శాస్త్రాలూ వ్యాకరణ శాస్త్రాలూ విధించిన కట్టుబాట్లనున్ను, ధర్మశాస్త్రాలు సంఘశాస్త్రాలూ నియమించిన నిబంధనలున్నూ కులాలు మతాలు వ్యక్తులూ ఇత్యాదులలో గల భేదభావాలున్నూ మన అభ్యున్నతికి అడ్డుపడునట్లుండే వానిని తోసివేస్తున్నాము. ప్రయోజనకరాలుగా ఉన్న వాటిని శిరసావహిస్తున్నాము. మన స్థితికి పరికరాలు చాలవని తోచినప్పుడు, భారతీయమా అభారతీయమా అనే భేదభావం లేకుండా, ఎవరి సంప్రదాయాలైనా సరే, మనలో చేర్చుకొంటున్నాము. చేర్చుకుంటాము కూడా.

దీనికి చింతింపవలసిన పనిలేదు. సంకోచించవలసినది అంతకంటే లేదు. మన పూర్వులు చేసింది ఇదే - మనం చేస్తున్నదీ ఇదే. దూషణ భూషణములకు - శుద్ధ హృదయం ఉన్న వ్యక్తి అయితే - తల వొగ్గరాదు. ఈ చేసిన చర్చతో నవ్య సాహిత్య నిర్వచనం చేసినట్టు అవుతుంది''.

ఒక సంస్థయొక్క ఆశయాలను నిర్వచించాక దాని సభ్యత్వానికి ఎవరు అర్హులో తేల్చాలి. పంచాగ్నులవారు చాలా విశాల హృదయంతో ఇలా విశదం చేశారు.

''పై ఉద్దేశాలు గల ఏ వ్యక్తి అయినా సరే, హృదయపూర్వకంగా సాహిత్య పరిశ్రమ చేస్తూ ఉంటే అట్టి వారికి అందరికీ ఈ పరిషత్తులో తావు ఉండవలయును. గ్రాంథిక వాదులుగానీ, వ్యావహారిక వాదులుగానీ, చరిత్ర శోధకులుగానీ, చరిత్ర నిర్మాతలు గానీ, సంఘంలో సనాతనులుగానీ, అధునాతనులుగానీ, పాటలూ, పదాలూ చెప్పేవారుగానీ, గద్యపద్యాలు నిర్మించేవారుగానీ, ఇంత యెందుకు? కూలిచేసుకొనే కూలివాడు మొదలు కోటీశ్వరుడి వరకు అందరూ సమాన స్వత్వాలతో ఇందు సభ్యులు కావడానికి వీలుండాలి. అనాగరికులుగా ఉండే వారి దగ్గరినుండీ నాగరిక శిరోమణులుగా ఉండే సమస్త ప్రజలకూ, వారివారి యోగ్యతలకూ, అనుభవాలకూ తగిన వాఙ్మయాన్ని నిర్మించి, ఈ నవ్య సాహిత్యంలో చేర్చవలెను. అట్లు ఐతేనే - ఇది నవ్య సాహిత్య పరిషత్తు అగును''.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి అధ్యక్షోపన్యాసం ఉత్తరోత్తరా నవ్యసాహిత్య పరిషత్తువారి పత్రికలో ప్రచురితమైంది.[4] ఆయన ఎంత ఉత్తేజకరమైన ఉపన్యాసం ఇచ్చారో అంతటి గంభీరోపన్యాసాన్ని కాశీనాథుని నాగేశ్వరరావుగారు తర్వాత ఆ సభలోనే చేశారు. నవ్య సాహిత్య నిర్మాతలలో ప్రధానులు ఏతీరున నవ్య సాహిత్యాన్ని నడిపించాలో చెప్పారు. సంకుచితాభిప్రాయాలు విడవాలని ఉద్బోధించారు. ఆయన ప్రబోధం నిష్ఫలం కాలేదు. ఈ సభలోనే నిర్మాణాత్మకమైన నిర్ణయాలను తీసుకొన్నారు. వాటి గురించి నోరి నరసింహశాస్త్రిగారు ఒక వ్యాసంలో ఇలా రాశారు.[5]

---

4. ప్రతిభ - సంపుటి-1, సంచిక-1 (1935)
5. భారతి - జనవరి 1945

''ఆ సభ సందర్భములోనే మొదటిసారి ఈ పరిషత్తుకు ఒక నియమావళి, కాన్‌స్టిట్యూషను అంటూ సిద్ధమయినది. అందులో చేసిన నిబంధనల మీదనే కొద్ది మార్పులతో ఇప్పటికీ పరిషత్కార్యక్రమము సాగుతున్నది. అప్పుడే నవ్యగ్రంథ ప్రచురణము ప్రారంభించవలెననీ, అందుకొరక నవ్య గ్రంథ విక్రయశాల ఏర్పాటు చేయవలెననీ, పరిషత్తు తరపున ఒక కేంద్ర గ్రంథాలయము స్థాపించవలెననీ తీర్మానించినారు. ఆ సభలో చేసిన తీర్మానము మీదనే నవ్యసాహిత్య పరిషత్తు తరపున 'ప్రతిభ' అనే త్రైమాసిక పత్రిక ప్రకటన శీఘ్రకాలములో ఆరంభమైనది. ఇంకా దేశమంతటా సభలూ, ఉత్సవాలూ జరుపుతూ నవ్య సాహిత్య ప్రచారము చేయవలెనని కూడా తీర్మానించినాము. ఈ తీర్మానాలన్నీ మొత్తము మీద అల్పారంభములుగా కార్యరూపము ధరించినవి''.

పరిషత్తు ఉద్దేశం ప్రచారానికి ఏటేటా సభలు జరిపి వివిధ ప్రదేశాలలో ఉన్న సాహితీపరులు తరచు కలుసుకొనడానికి వీలు కలిగించాలన్నది అమలు జరిగింది. 1933 బరంపురం సభల దగ్గర నుండి పదకొండు మహాసభలు వివిధ సంవత్సరాలలో జరిగాయి. పేరెన్నిక గాంచిన సాహితీమూర్తులు అధ్యక్షత వహించారు. ఆ వివరాలు చూడండి.

సంవత్సరం	**ఊరు**	**అధ్యక్షులు**
1933	బరంపురం	చిలుకూరి నారాయణరావు
1933	రాజమండ్రి	రాయప్రోలు సుబ్బారావు
1934	అనంతపురం	తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి
1936	కాకినాడ	పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
1937	గుంటూరు	గిడుగు రామమూర్తి
1938	బందరు	బుర్రాశేషగిరిరావు
1940	బెజవాడ	విశ్వనాథ సత్యనారాయణ
1941	మద్రాసు	అడవి బాపిరాజు
1942	ఏలూరు	దేవులపల్లి కృష్ణశాస్త్రి
1944	తెనాలి	కాటూరి వెంకటేశ్వరరావు
1946	ముక్త్యాల	మల్లంపల్లి సోమశేఖరశర్మ

సేకరించగలిగితే పై పదకొండు సభల భోగట్టాలు ఒకచోట చేర్చడానికి వీలుంటుంది. ఉదాహరణకు : బందరులో 1938లో జరిగిన సభల గురించి ప్రతిభలోనే (నవ్యసాహిత్య పరిషత్పత్రిక) ఈక్రింది రిపోర్టు చూడండి :

''ఫిబ్రవరి 12, 13 తేదీలలో బందరు జాతీయ కళాశాలలో అత్యుత్సాహంగా జరిగింది. ఆహ్వాన సంఘము వారినీ, ముఖ్యంగా చల్లపల్లి రాజావారినీ అద్భుతంగా ఏర్పాట్లు చేయించినందుకు అభినందిస్తున్నాము. పూజ్యశ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు సభను ప్రారంభం చేశారు. శ్రీ బుర్రా శేషగిరిరావు ప్రధాన సభాధ్యక్షులు. బందరు పురవాసులే కాకుండా పొరుగూళ్ళ నుంచి కూడా వందలకొద్దీ సాహిత్యాభిమానులు వచ్చి సభలను శోభవంతంగా చేశారు. శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, వేదుల

సత్యనారాయణశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, పిలకా గణపతిశాస్త్రి, వింజమూరి శివరామారావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి ప్రముఖులు కావ్యపఠనం చేశారు. శ్రీయుతులు జమ్మలమడక మాధవరామశర్మ, కోలవెన్ను రామకోటేశ్వరరావు, చిలుకూరి నారాయణరావు, పిచ్చా సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రముఖులు ప్రసంగాలు చేశారు.

''తమిళ దేశస్థులు సుప్రసిద్ధ కళారాధకులు శ్రీరామచంద్రన్ గారు సంగీతాన్ని గురించీ, నాట్యకళను గురించీ ఉపన్యసించారు. పగటి వేషాలు, జంగం కథలు, భాగవతం, కూచిపూడి రాఘవయ్యగారి భరతనాట్యం, వేలూరి చంద్రశేఖరంగారి కాంచనమాలా నాటక ప్రదర్శనం ముఖ్యమైన వినోదాలు.

'''నవకవుల కృతులూ, జాతీయ కళాశాలలో తయారైన తివాచులూ మొదలైనవి ప్రదర్శింపబడినవి. ఈ సంవత్సరానికి కార్య నిర్వాహక సంఘం ఎన్నికలు జరిగినవి. శ్రీ గిడుగు రామమూర్తిగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి గారు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, చింతాదీక్షితులుగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు మొదలైనవారు కూడా వచ్చి ఉంటే సభలు ఇంకా బాగుండేవి''.

వివిధ మహాసభలలో కార్య నిర్వాహక సభ్యులనూ, స్థాయీ సంఘ సభ్యులనూ ఎన్నుకొనేవారు. ఆంధ్రదేశమంతటా పరిషత్తుకు సభ్యులున్నారు. వారిలో ప్రతిభా వంతులకూ, ప్రముఖులకూ పరిషత్తులో ఏదో ఒక స్థానం కల్పించేవారు. గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గసభ్యులు, స్థాయీసంఘ సభ్యులు, ప్రతిభ సంపాదకవర్గంలోనూ, గ్రంథ నిర్ణాయక సంఘంలోనూ సభ్యులు అనే ఏడు వర్గాలలో 1933నుంచి 1942 దాకా మొత్తం సుమారు 64మంది సాహితీపరులు నవ్యసాహిత్య పరిషత్తులోని వివిధ హోదాలలో ఉన్నారు.

అచ్చమాంబ, కొమర్రాజు	1941 సభ్యురాలు
అప్పలస్వామి, పురిపండా	1936-37 సభ్యులు
ఆంజనేయులు, కొడాలి	1936-38 సభ్యులు
ఆదినారాయణశాస్త్రి, పంచాగ్నుల	1936-అధ్యక్షులు, సంపాదక సభ్యులు
	1942-సభ్యులు
కామేశ్వరరావు, జనమంచి	1936-సభ్యులు
కామేశ్వరరావు, పెనుమర్తి	1942-సభ్యులు
కుటుంబరావు, కొడవటిగంటి	1941-స్థాయి సంఘం సభ్యులు
	1942 సంపాదక సభ్యులు
కృత్తివాస తీర్థులు, తల్లావఝ్ఝల	1942-సభ్యులు
కృష్ణమూర్తి, మొక్కపాటి	1942 సభ్యులు

కృష్ణశర్మ, దేశిరాజు	1941-స్థాయి సభ్యులు
	1942 - గ్రంథ నిర్ణాయక సంఘం సభ్యులు
కృష్ణశాస్త్రి, దేవులపల్లి	1942 - ఉపాధ్యక్షులు, సంపాదక సభ్యులు
గణపతిశాస్త్రి, పిలకా	1936, 1941, 1942 - సభ్యులు
గోపాలరావు, ఆమంచర్ల	1937 - సభ్యులు
జనార్ధనరావు, కొంపెల్ల	1936 - సభ్యులు
దీక్షితులు, చింతా	1936 - ఉపాధ్యక్షులు, సంపాదకవర్గం
దుర్గాబాయి (శ్రీమతి)	1942 - సభ్యులు
దేవీప్రసాదరావు, మాచిరాజు	1942 - సభ్యులు
ధర్మారావు, గురుభాగవతుల	1937-38-సభ్యులు
	1941
నరసింహశాస్త్రి, నోరి	1936 - సభ్యులు
	1937 - ఉపాధ్యక్షులు,
	గ్రంథనిర్ణాయక సభ్యులు
	1938 - గ్రంథనిర్ణాయక సభ్యులు,
	సభ్యులు (స్థాయి సంఘం)
	1941 - సభ్యులు
	1942 - సంపాదకవర్గం
నరసింహశాస్త్రి, మొక్కపాటి	1936-37 - సభ్యులు
నాగభూషణం, వెంపటి	1937 - సభ్యులు
నాగేశ్వరరావు, కాశీనాథుని	1937 - గౌరవాధ్యక్షులు
నారాయణరావు, చిలుకూరి	1933 - అధ్యక్షులు
	1936-38 సభ్యులు
	1941 - స్థాయి సంఘం సభ్యులు
పార్వతీశ్వరశాస్త్రి, మండపాక	1936 - సభ్యులు
బాపిరాజు, అడవి	1936, 38, 42 - సభ్యులు
	1937, 41, 42 సంపాదకవర్గం
	1942 - అధ్యక్షులు, గ్రంథనిర్ణాయక సంఘం
బాపిరాజు, బొడ్డు	1938 - సభ్యులు
బాలకృష్ణశాస్త్రి, పిల్లలమర్రి	1937-38, సభ్యులు
బాలగంగాధర తిలక్	1942 - సంపాదకవర్గం
మాధవరాయశర్మ, జమ్మలమడక	1942 - గ్రంథనిర్ణాయక సభ్యులు
మాధవశర్మ, పాటిబండ	1937 - సభ్యులు
రాఘవాచారి, ఎస్ (సంపత్)	1942 - సభ్యులు
రాజమన్నార్, పి.వి	1941 - సభ్యులు
రామకృష్ణశాస్త్రి, మల్లాది	1937 - 38 - గ్రంథనిర్ణాయక సభ్యులు

రామకోటేశ్వరరావు, కోలవెన్ను	1938, 41 – సభ్యులు
రామలింగారెడ్డి, కట్టమంచి	1938–41 గౌరవాధ్యక్షులు
రామచార్యులు, పప్పూరి	1938 – సభ్యులు
రామిరెడ్డి, దువ్వూరి	1942 – సంపాదకసభ్యులు
రుక్మిణీనాథశాస్త్రి, జలసూత్రం	1941 – గ్రంథనిర్ణాయక సభ్యులు
	1942 – సభ్యులు
లక్ష్మీనారాయణ, ఉన్నవ	1941 – సంపాదక సభ్యులు
విశ్వేశ్వరరావు, మల్లవరపు	1937 – సభ్యులు
	1941 – గ్రంథనిర్ణాయక సభ్యులు
	1942 – సహాయ కార్యదర్శి
వెంకట కృష్ణారావు, దేవరపల్లి	1938, 41 – సభ్యులు
వెంకటకృష్ణారెడ్డి, దేవరకొండ	1938, సభ్యులు
వెంకటరత్నం, తెలికిచర్ల	1936–38, కార్యదర్శి
	1941–42
	1936–37 సంపాదకసభ్యులు
	1941–42
	1942 – గ్రంథనిర్ణాయకసభ్యులు
వెంకట రమణయ్య, పిసుపాటి	1941 – సభ్యులు
వెంకట రామమూర్తి, గిడుగు	1936, 38 – గౌరవాధ్యక్షులు
	1936 – సంపాదకసభ్యులు
	1937 – అధ్యక్షులు
వెంకట సీతాపతి, గిడుగు	1941 – ఉపాధ్యక్షులు
వెంకట సుబ్బారావు, నండూరి	1942 – సభ్యులు
వెంకటేశ్వరరావు, కాటూరి	1938 – ఉపాధ్యక్షులు
	1937 – సభ్యులు
	1941–42
	1941 – గ్రంథ నిర్ణాయక సభ్యులు
శివరామకృష్ణప్రసాద్, చిరుమామిళ్ళ	1941 – సభ్యులు
శివరామారావు, వింజమూరి	1937, 41 – సభ్యులు
శివశంకరశాస్త్రి, తల్లావఝ్ఝుల	1934–36 – అధ్యక్షులు
	1936 – సభ్యులు
	1936–37 సంపాదక సభ్యులు
	1937–38
	1941 – గ్రంథనిర్ణాయక సభ్యులు
శేషగిరిరావు, బుర్రా	1937 – అధ్యక్షులు
శ్రీనివాసరావు, శ్రీరంగం	1938, 41 సభ్యులు
	1941 – సంపాదకవర్గ సభ్యులు

సత్యనారాయణరావు, విశ్వనాథ	1937 - సంపాదక సభ్యులు
	1941 - అధ్యక్షులు
	1942 - సభ్యులు
సత్యనారాయణశాస్త్రి, వేదుల	1938 - సభ్యులు
	1942 - గ్రంథనిర్ణాయక సభ్యులు
సింగరాచార్యులు, బి.వి	1942 - గ్రంథనిర్ణాయక సభ్యులు
సీతారామమూర్తి చౌదరి, తుమ్మల	1941 - సభ్యులు
సుబ్బారావు, కల్లూరి	1942 - గ్రంథనిర్ణాయక సభ్యులు
సుబ్బారావు, రాయప్రోలు	1933-34 - అధ్యక్షులు
	1942 - గౌరవాధ్యక్షులు
సుబ్రహ్మణ్యం, ఏల్చూరి	1942 - సభ్యులు
సూర్యనారాయణమూర్తి, అత్తిలి	1941 - సభ్యులు
సోమయాజులు, వావిలాల	1942 - సభ్యులు
హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి	1936, 38, 42 - సభ్యులు
	1941 - సంపాదక సభ్యులు

(ఈ పట్టిక సమగ్రము కాదు. ప్రతిభా సంపుటాలు సంపూర్ణంగా లభించలేదు. కాబట్టి దొరికిన సంచికల నుండే ఈ వివరాలు సేకరించబడ్డాయి. మరికొందరు కార్యకర్తలు కూడా ఉండి ఉండవచ్చు.)

1936 నుండి నవ్యసాహిత్య పరిషత్తు ప్రతిభ అనే త్రైమాసిక పత్రికను ప్రచురించసాగింది. ఆరుసంపుటాలు ఆరేళ్ళపాటు వెలువడ్డాయి. ఉన్నతాదర్శాలతో ఉత్తమస్థాయి పత్రికగానే నడిపినంతకాలం ప్రతిభ ఒక ప్రత్యేకతను నిలుపుకొంది. ప్రతిభ మొట్టమొదటి సంచికను ఉదయినిలో సమీక్షిస్తూ ''వివిధ సారస్వత విద్యా విషయాలపైని అభిప్రాయాలు వెల్లడించి పత్రికకు గొంతు ఉన్నదని చూపినారు'' అని మెచ్చుకొన్నారు.[6]

ప్రతిభ పత్రికలో నవ్యకవులందరి ప్రతిభ ఏకస్థం చేసి ప్రదర్శించడానికి నవ్యసాహిత్య పరిషత్తు ప్రయత్నిస్తున్నదని చెప్పి 'ఈ ప్రదర్శనముతో తృప్తిలేని వారికి నవ్యకవులమనిపించుకొనే తృప్తిలేదన్నమాట! ఇందుకు ఎవరేమి చేయగలరు?' అని నోరి నరసింహశాస్త్రిగారు పై 'భారతి' వ్యాసంలోనే అన్నారు. ప్రతిభ వెలువడిన సంచికలన్నింటిలోనూ చెప్పుకోదగ్గ నవ్య సాహిత్యం వెలుగు చూసింది. అన్ని ప్రక్రియలలోను ఉన్నతస్థాయి రచనలే వెలువడ్డాయి. లబ్ధ ప్రతిష్ఠులకే కాక వర్ధమాన రచయితలకు కూడా ఈ పత్రికలో స్థానం కల్పించారు.

పత్రికా ప్రచురణతోపాటు, పుస్తక ప్రచురణ కార్యక్రమాన్ని కూడా నవ్యసాహిత్య పరిషత్తు చేపట్టింది. 'నవ్యగ్రంథ విక్రయశాల' అనే పేరుతో లభించినన్ని నవ్యగ్రంథాలు ఒక్క చోటనే కొనుక్కోటానికి వీలుగా ఏర్పాట్లు చేసింది. 'నవ్యసాహిత్య పరిషత్తు'

6. 'కొంపెల్ల జనార్ధనరావు జీవితం సాహిత్యం' - పుట.190

లాంఛనముద్ర (Emblem)తో ప్రచురితమైన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. ఆధునికులందరూ తమ గ్రంథాలకు పరిషత్తే ప్రచురణ సంస్థగా ఉండాలన్న అభిలాష ఆరోజులలో ఉండేది. తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారు పుస్తక ప్రచురణలో వివిధ గ్రంథకర్తలకు సాంకేతిక సలహాలు ఇచ్చి స్వయంగా తోడ్పడేవారు.

ఏ సంస్థలోనైనాసరే ఎల్లకాలం పెత్తనం పెద్దల చేతిలోనే ఉండి, యువకులకు తగినంత గుర్తింపు, సముచిత స్థానం, ప్రత్యేక ప్రాధాన్యం లేకపోతే కలతలు ఏర్పడతాయి, అసంతృప్తి చెలరేగుతుంది, తిరుగుబాటు మొదలవుతుంది. 1941లో మద్రాసులో జరిగిన నవ్యసాహిత్య పరిషత్తు సభల నుండి శ్రీశ్రీ, శిష్ట్లా, జలసూత్రం, నారాయణబాబు మొదలైనవారు వాకౌట్ చేశారు. బయటకు వచ్చి ''ఈ పరిషత్సభలను బహిష్కరిస్తున్నా'' మని ప్రకటించారు. దీని ఫలితం వెంటనే కనబడింది. శ్రీశ్రీని ప్రతిభ సంపాదకవర్గంలో చేర్చుకొన్నారు. నారాయణబాబును గ్రంథనిర్ణాయక సంఘంలో సభ్యుని చేశారు. 1942 నుండి మాచిరాజు దేవీప్రసాద్, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, ఏల్చూరి సుబ్రహ్మణ్యం మొదలైన యువకులకు కొన్ని హోదాలు కల్పించారు.

1943లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 1944 నుంచి నవ్యసాహిత్య పరిషత్తులోని ప్రముఖులను ఏదో ఒక మిషమీద అభ్యుదయ రచయితలు ఆహ్వానించ సాగారు. 1944 ద్వితీయ మహాసభకు తెలికిచర్ల వెంకటరత్నంగారు అధ్యక్షులు. తృతీయ మహాసభకు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అధ్యక్షులు. అభ్యుదయ రచయితలు పెదపూడిలో నిర్వహించిన సాహితీ పాఠశాలలో అధ్యాపకులలో చాలామంది నవ్యసాహిత్య పరిషత్తు సభ్యులే. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, చిలుకూరి నారాయణరావుగారు, జమ్మలమడక మాధవరామశర్మగారు మొదలైన నిష్ణాతుల పాండిత్యాన్ని అభ్యుదయ రచయితలు ఉపయోగించుకొనసాగారు.

నవ్యసాహిత్య పరిషత్తు పెద్దలలోనే చీలికలు ప్రారంభమయ్యాయి. ముఠాలు, వర్గాలు, గ్రూపులు, ఏర్పడ్డాక ఏ సంస్థ అయినా పూర్వపు ఔన్నత్యాన్ని నిలబెట్టుకోదు. నవ్యసాహిత్యపరిషత్తులో తొలితరం సాహితీ సమితి సభ్యులు మళ్ళా సంస్థను పునరుద్ధరించుకొనసాగారు. 1944లో సాహితీసమితి రజతోత్సవం జరుపుదా మనుకొన్నారుగాని అది 1946లోగాని జరపలేకపోయారు. రజతోత్సవానంతరం నూతన సభ్యులెందరో సాహితీ సమితిలో చేరారు.[7]

1947 జనవరిలో మద్రాసులో జరిగిన అభ్యుదయ రచయితల 4వ మహాసభ మారువేషం వేసుకొన్న నవ్యసాహిత్య పరిషత్తు సమావేశంలాగే జరిగింది. ఈ సభలను సమీక్షిస్తూ కొడవటిగంటి కుటుంబరావుగారు ''ఈ సమావేశాలలో అభ్యుదయ రచయితల గొంతు వినిపించలేదని ఒక విమర్శ వచ్చింది. కాని, ఇది పూర్తిగా నిజంకాదు'' అని రాశారు. ఈ మాటలను ఉదాహరించి ''పూర్తిగా అనే పదం వల్ల కొంతవరకూ నిజమేకదా!'' అని పుచ్చలపల్లి సుందరయ్యగారు ప్రశ్నించారు.[8]

7. నోరి నరసింహశాస్త్రి - సారస్వత వ్యాసములు - 5వ సంపుటం. పుట.92
8. ఏరిన రచనలు-II, పుట-96

నవ్యసాహిత్య పరిషత్తులోని ప్రముఖులు కొందరికి ఇతర సాహిత్య సంస్థల కార్యవర్గంలో స్థానాలు లభించసాగాయి. అభ్యుదయ రచయితల సంఘం రెండవ మహాసభలోని కార్యవర్గం ఎన్నికలలో తెలికిచర్ల వెంకటరత్నం, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, అడవి బాపిరాజు, ముద్దుకృష్ణగార్లను ఎన్నుకొన్నారు. మూడవ మహాసభ కార్యవర్గం. ఎన్నికలలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు మొదలైనవారు తెలికిచర్ల వారితోపాటు స్థానం పొందారు. ఇంతమంది ఇంకో సంస్థలో ఉన్నప్పుడు నవ్యసాహిత్య పరిషత్తు ఆసనాలు ఖాళీ అయినట్టే లెక్క. ఆశ్వాసాంతం ప్రారంభమైనట్టే. ప్రతిభ పత్రిక ఆగిపోయింది. అయినా నవ్యసాహిత్య పరిషత్తు సాగించిన విధానాలకూ, సాధించిన విశేషాలకూ నిదర్శనంగా పాత సంచికలు మిగిలాయి. ఏ సంస్థ అయినా సరే, తన చారిత్రక అవసరం తీరగానే రంగం నుండి నిష్క్రమిస్తుంది.

అభ్యుదయ సాహిత్యం - ఉద్యమచరిత్ర

"ఏ దేశంలోనయినా ఏకాలంలోనయినా రచయితలు చేయవలసిన పని చాలా ఉంటుంది.

- ★ గతించిన విషయాలను బోధిస్తారు - నిర్దాక్షిణ్యంగా
- ★ ప్రస్తుతాన్ని అర్థం చేసుకుంటారు - నిష్పక్షపాతంగా
- ★ భావికి కాగడాపట్టి దారి చూపుతారు - నిరాటంకంగా

ఈ మాటలు తాపీ ధర్మరావుగారివి. ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభ తొలిసారిగా తెనాలిలో 1943లో ఫిబ్రవరి 13వ తేదీనాడు జరిగినపుడు దానికి తాపీ ధర్మారావుగారు అధ్యక్షత వహించారు. వారు అధ్యక్షోపన్యాసంలో భూత, భవిష్యత్, వర్తమానాల పట్ల ఉండవలసిన నిర్ధాక్షిణ్య, నిరాటంక, నిష్పక్షపాత వైఖరులను, సూత్రప్రాయంగా ఉద్ఘాటించారు. పూర్వ సాహిత్యమంతా మూడు గాలి మూటల్ని కట్టి జనసామాన్యానికి ద్రోహం చేస్తూ ఉందన్న సత్యాన్ని చాటారు. ఆ మూటల్లో ఒకటి : దేవుడు, రెండు : ప్రణయం, మూడు : కర్మ. ఇవి సంఘానికి వేరు పురుగులు. వీటివల్లనే న్యాయదృష్టి నాశనమయ్యింది. సత్యం ఎగిరిపోయింది. సమత్వం నశించింది. వ్యత్యాసాలు పెరిగిపోయాయి. ప్రపంచం దుఃఖభాజనం అయిపోయింది. ఈ మూడింటి మీద ధ్వజమెత్తవలసిన బాధ్యత యువరచయితలకు వుందని తాపీ విశదం చేశారు.

1943లో అరసం ప్రథమ మహాసభ జరిగింది. అయితే అంతకు ముందే ఒక పదేళ్ళ నుంచీ అంటే 1933 నుంచే అభ్యుదయ సాహిత్య రచనలు తెలుగులో ప్రచురితమవు తున్నాయి. 1933లో అఖిలాంధ్ర కవిపండిత సభ బరంపురంలో జరిగింది. ఈ సభ ఉత్తరోత్తరా నవ్యసాహిత్య పరిషత్తుగా మారింది.

శ్రామికవర్గం జాతికి జీవగర్ర అని నమ్మే యువకులు 1929 నాటికి యూత్‌లీగ్ సభ్యులలో పాత వ్యవస్థ స్థానంలో ఏది రావాలో అస్పష్టంగానైనా తెలుసుకొన్నారు. మద్రాసు లయోలా కాలేజీలో చదువుకొంటున్న సి.వి.కె.రావు, కంభంపాటి సత్యనారాయణ, తిమ్మరాజు సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, వి.కె.నరసింహం సాహిత్యం గూర్చి, రాజకీయాల గూర్చి చర్చించుకొంటూ ఉండేవారు. హెచ్.డి. రాజా తనతోపాటు తీసుకొచ్చిన 'కమ్యూనిస్టు మానిఫెస్టో' తదితర సోషలిస్టు సాహిత్యాన్ని వాళ్ళకు ఇచ్చాడు. హాస్టల్లో ఏర్పాటు చేసిన చిన్న సమావేశంలో 'కమ్యూనిజం అంటే ఏమిటి?' అన్న అంశంపై హెచ్.డి.రాజా మాట్లాడారు. లయోలా కాలేజీలో చదువుకొంటున్న ఆ బృందమంతా కమ్యూనిస్టు అభిమానులుగా మారిపోయారు. లోతుగా అధ్యయనం చేసి స్పష్టమైన అవగాహనకోసం కృషి ప్రారంభించారు. ఒక పక్క సత్యాగ్రహాలలో పాల్గొంటూనే ఈ సిద్ధాంత పఠనం సాగుతోంది.

ఒక్క మద్రాసు ప్రాంతాలలోనే కాక ఆంధ్ర జిల్లాలో కూడా 1928 నాటికే సోషలిస్టు కమ్యూనిస్టు సిద్ధాంత గ్రంథాలు రహస్యంగా రావడం ప్రారంభమైంది. రాజమండ్రిలో పందిరి మల్లికార్జునరావుగారు హిందీ క్లాసులు నడుపుతూ చాటుగా స్టాలిన్ రాసిన 'లెనినిజం', ట్రాట్స్కీ రాసిన 'రష్యా విప్లవ చరిత్ర' మొదలైనవాటిని తాము చదువుతూ ఇతరులచేత చదివించారు. దర్శి చెంచయ్యగారు 'గదర్' పార్టీ నుండి బయటకు వచ్చి విశాఖపట్నంలో 'సోషలిజం : ఊహాజనితం, శాస్త్రీయం' వంటి గ్రంథాలు అధ్యయనం చేశారు. అనువదించారు. ఇలాగే ఎందరెందరో యువకులు కాంగ్రెసు నడుపుతున్న శాసనోల్లంఘనోద్యమంలో వుంటూనే సామ్యవాదులుగా మారుతూ వచ్చారు.

1922 మార్చి నెలలో ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచించిన 'మాలపల్లి' నవలపై విధించిన నిషేధాన్ని బ్రిటీష్ ప్రభుత్వం తొలిగించక తప్పలేదు. ఈ నవల మొట్టమొదట వివిధభాగాలుగా ప్రచురణ పొందింది. ప్రథమభాగం 1922 నవంబరులోనూ, రెండవభాగం 1923 ఫిబ్రవరిలోనూ వెలుగుచూశాయి. ఈ సజీవ సాహిత్యంలో 'బోల్షివిజాన్ని' ప్రచారం చేసే ప్రబలమైన భావాలున్నాయని ప్రభుత్వం భావించి ప్రచురణ పొందిన రెండుభాగాలను నిషేధించింది. ప్రజాప్రతినిధులూ, పత్రికలూ ప్రభుత్వ చర్యను ఖండించారు. ఇది అత్యుత్తమ నవల అని తన ప్రశంసను ప్రకటిస్తూ దీనిపై నిషేధం ఎంతమాత్రం తగదని సి.ఆర్.రెడ్డిగారు ప్రభుత్వం న్యాయశాఖ సభ్యునికి ఉత్తరం రాశారు. కన్యాశుల్కం తర్వాత ఈ రచనే అన్ని విధాల ఎన్నిక చేయదగ్గ రచనగా ఆయన భావించారు. తర్జనభర్జనల తర్వాత ప్రభుత్వం నిషేధాన్ని తొలగించక తప్పలేదు.

ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' నవలలో ఒక పాత్ర ద్వారా సామ్యవాద సిద్ధాంతాలను చాలా సూటిగా ఘాటుగా ప్రబోధించారు. ఫ్యూడల్ వ్యవస్థలో ఉంటూ 'రాజభక్తి కన్నా దేశభక్తి మిన్న' అని గురజాడ అప్పారావుగారు ముందు చూపు ప్రదర్శించినట్టు, గాంధీ ప్రభావంలో ఉంటూ సత్యాగ్రహం సమయంలో పాల్గొని జైళ్ళకెళ్ళిన ఉన్నవవారు రానున్న సోషలిస్టు ఉద్యమాలను ఊహించి, అవి కూడా పోరాటంలోని భాగాలే అన్న నిర్ణయానికి వచ్చారు. ఆయన 1913వ సంవత్సరంలో

బారెట్లా చదవడానికి సీమకు వెళ్ళారు. ఇంగ్లండులోకాక, ఐర్లండులో ఆ చదువులు సాగించారు. అప్పుడు ఐరిష్ ప్రజలు తమ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. దానిని ఉన్నవవారు స్వయంగా వీక్షించారు. అక్కడ ఆయన హాజరుకాని రాజకీయసభలంటూ లేవు. ఐరిష్ నాయకుడు 'డివెలరా'తో పరిచయం ఏర్పరచుకొన్నారు. సామ్యవాద సాహిత్యాన్ని అధ్యయనం చేశారు.

స్వదేశానికి వచ్చాక వారు అవగాహన చేసుకొన్న శాస్త్రీయ సామ్యవాదాన్ని మనదేశ పరిస్థితులకు ముఖ్యంగా ఆంధ్రదేశంలోని వివిధ వర్గ సంఘర్షణలకూ అన్వయించి చూసుకొన్నారు. సమాజ వ్యవస్థలోని అసమానతలను తొలగించడానికి సంస్కరణలు లాభంలేదని విప్లవం ద్వారా సంపూర్ణ పరిష్కరణ జరిగి నూతన నిర్మాణం జరగాలనే భావాన్ని కూడా ఊహించుకొన్నారు. అయితే ఇవాళ మనం వాడుతున్న ఈ పరిభాషలో కాక ఆ నాటికి అందుబాటులో ఉన్న పదజాలంతోనే స్పష్టంగా ఇలా చెప్పారు.[1]

''... ఐశ్వర్యవంతులు సంఘం యొక్క ఆస్తి అంతా అపహరించి శాశ్వతంగా వంశపారంపర్యంగా నిలుపుకోడాని కనుకూలమయిన చట్టాలు కల్పించుకొన్నారు. అనేక సాకులు కల్పించి పనివాండ్ల యొక్క ఫలమునే అపహరించడం నమ్మకద్రోహం కాదట. ధనికులే కలియుగ రాక్షసులు... ప్రభుత్వ పద్ధతి యేది చూచినా మేడిపండు వ్యవహారంగా ఉన్నది. దీనిని సవరించవలెనని ప్రయత్నం చేయటమే తప్పు. కరిగిపొయ్యివలసింది తప్ప మాట్లు వేసి ప్రయోజనం లేదు''.

ఇటువంటి భావప్రకటన చేయడం శాస్త్రీయ సామ్యవాద అధ్యయనం వల్లనే సాధ్యమవుతుంది. ఈ సత్యాలను ఒక ముఖ్యపాత్ర చేత చెప్పించడం రచయిత తన పవిత్ర కర్తవ్యమని భావించారు. 'పచ్చి కమ్యూనిజాన్ని ప్రబోధించే కూలీల సంఘీభావాన్నీ, సమ్మెలనూ ప్రోత్సహించే భాగాలనూ' ఈ నవల నుండి తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినపుడు ''కమ్యూనిజాన్ని ప్రచారం చేయడం తప్పేమీ కాదనీ, పెట్టుబడికి వ్యతిరేకంగా శ్రామికుల ఐక్యతను ప్రోత్సహించడం దోషం కాదని'' ఉన్నవ వారు 30-1-1928న ప్రభుత్వానికి రాసిన లేఖలో స్పష్టంగా, ధైర్యంగా చెప్పారు.[2] అయితే చిన్న సవరణలు చేస్తే నవలపై నిషేధం తొలిగి, తన సిద్ధాంత ప్రచారం జరుగుతుంది కనుక కొంత రాజీపడక తప్పలేదు. 1928 చివరలో మాలపల్లి నవల అన్నిభాగాలూ ప్రజలకు అందాయి. ఈ నవలా రచనలో సమధర్మాన్ని ప్రబోధించి ఉన్నవవారు తెలుగులో సామ్యవాద సాహిత్య పితామహులయ్యారు.

అయితే ఆనాటి చారిత్రక కారణాలవల్ల ఆయన సత్యాగ్రహం ద్వారా స్వరాజ్య సాధన అనే వాదంవైపే మొగ్గారు. ఇది ఆనాటి స్వాతంత్ర్యయోధులందరికీ సామాన్య లక్షణమే.

1920 ప్రాంతాల్లో గాంధీ నాయకత్వాన మధ్య తరగతి ప్రజలు చదువులు, ఉద్యోగాలు, ప్లీడరీలు, ఇతర వృత్తులు వదలిపెట్టి ఉద్యమంలో దూకారు. సామాన్య

1. ఉన్నవ లక్ష్మీనారాయణ - మాలపల్లి - 3వ భాగం, 24వ అధ్యాయం
2. బంగోరె - 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' - పుట.1

ప్రజలను ఉద్యుక్తులను చేయడానికి సభలు పెట్టారు. ఊరేగింపులు నడిపారు. పాటలు రాశారు. పాటలు పాడారు. నాటకాలు ఆడారు, ఆడించారు. వడ్డాది సీతా రామాంజనేయులుగారి 'స్వరాజ్య గీతామృతం' (దండాలు దండాలు భారతమాతా! అవి తీసుకొని దీవించు భారతమాతా!) గరిమెళ్ళ సత్యనారాయణగారి 'మాకొద్దీ తెల్లదొరతనమూ - దేవ - మా కొద్దీ తెల్లదొరతనము' ఆనాడు ఆంధ్రదేశమంతటా మారుమ్రోగాయి. రచనాకాలంనాటికి ఇరవయ్యొక్క సంవత్సరాల వయస్సున్న వడ్డాది తన 'స్వరాజ్య గీతామృతం' పీఠికలో చెప్పిన విషయాలు నేటి పరిస్థితులకు కూడా వర్తిస్తాయి.

'మాటలకిది కాలము కాదు. చేతలను చూపవలసినదియే. దేశ సౌభాగ్యము కష్టజీవులపై నాధారపడియున్నది... మన దేశమున జనసామాన్యము నిరక్షరాస్యులు. దేశ దైన్యము వారికి సుబోధము గావలెనన్న నిర్భాగ్యమైన గ్రామ్యభాషయే శరణ్యము... మన సోదర కష్టజీవులు వినికి మాత్రమునే సులభముగా గ్రహించి'' రాజకీయ చైతన్య వంతులవుతారన్నది నాటికి నేటికీ సత్యమే.

ప్రజలను ఉత్తేజితులను చేయదలచుకొన్న రాజకీయ సిద్ధాంతవాదులు ప్రజాకళారూపాలను చేపట్టక తప్పదు. అందుకే సత్యాగ్రహ సమరకాలంలో ఉన్నవవారూ తదితరులూ స్వరాజ్య సోది, బుడబుక్కల జోస్యమూ, బుర్రకథా గేయాలు మొదలైనవే ప్రచార సాధనాలుగా చేపట్టారు. ప్రజలలో రమారమి అత్యధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు. అందుచేత ప్రజలలో పఠనాసక్తి అభ్యాసము కలిగేవరకూ మనం నాటకరంగం వైపునకు మన దృష్టి మళ్ళించక తప్పదు అని కిందటి శతాబ్దంలోనే గురజాడ (కన్యాశుల్కం పీఠికలో) చెప్పారు. అందుకే కన్యాశుల్కాన్ని ప్రదర్శన కోసం రచించారు. స్వరాజ్య ఉద్యమం తన ప్రచారానికి నాటకరంగంపైన కూడా ఆధారపడింది. రాజకీయ ఇతివృత్తాలు, అందులోనూ సమకాలికమైన వాటిని తీసుకొని, నాటకాలను ఆడి, ఆడించి ప్రచారం సాగించారు. ప్రభుత్వం ఏ నాటకాన్నయినా పేరుపెట్టి నిషేధిస్తే, అదే ఇతివృత్తాన్ని పేరుమార్చి కొద్ది సంభాషణలకు మారువేషాలు వేసి అదే ఘాటయిన మోతాదులో ఆడేవారు. పాటలూ, పద్యాలూ, నాటకాలూ చదువురానివారిని కదిలించి ఉద్యమంలోనికి తీసుకువచ్చే సాధనాలు.

1930ల నాటికి చదువురానివారికోసం పాటుపడే విద్యాధికుల సంఖ్య పెరుగసాగింది. వారిలో సామ్యవాదభావాలు ప్రగాఢమయినాయి. 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. ఆపార్టీలో వుంటూనే కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి పుచ్చలపల్లి సుందరయ్యగారు ఆంధ్రదేశంలోని వివిధ జిల్లాలనుండి వచ్చిన ప్రతినిధులతో కలిసి 1934 సెప్టెంబరులో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. సామ్యవాద సాహిత్యాన్ని అనువదించడం దాని కర్తవ్యం. వ్రాతప్రతులను, అచ్చుపడ్డ తెలుగు గ్రంథాలనూ అధ్యయనం చేసేవారు.

రాజకీయ సిద్ధాంత పాఠాల ప్రబోధానికీ ప్రత్యాక్షానుభవాల గుణపాఠాల వివరణలకూ ప్రభుత్వం వారి జైళ్ళే ఉన్నత విద్యాలయాలుగా సామ్యవాదం వల్ల

ఆకర్షితులవుతున్న యువకులకూ, రాజకీయ ఖైదీలకూ లాభించాయి. వివిధ విప్లవ రూపాలలో పోరాటం సాగించి ప్రభుత్వానికి పట్టుబడిన వివిధ ఇతర రాష్ట్రాల కార్యకర్తలు ఆంధ్రజిల్లాలోని జైళ్ళలో ఉన్నప్పుడు చాలామంది తెలుగువారికి, విప్లవపాఠాలు బోధించారు. జైళ్ళేకాకుండా విశ్వవిద్యాలయాలు కూడా సామ్యవాద సాహిత్య పఠనానికి, అధ్యయనానికి అనువుగా ఉండేవి. ఒక్క బెనారస్ విశ్వవిద్యాలయంలోనే ఆనాడు 400మంది తెలుగు విద్యార్థులుండేవారు. వాళ్ళలో చాలామంది సామ్యవాదం పట్ల ఆకర్షితులయ్యారు. పోలేపల్లి నరసింహమూర్తి, పులుపుల శివయ్య, చండ్ర రాజేశ్వరరావు, తుమ్మల వెంకటరామయ్య, కాట్రగడ్డ నారాయణరావు, నండూరు ప్రసాదరావు మొదలైనవారంతా కాశీకి వెళ్ళి కమ్యూనిజానికి పరివర్తన చెందినవారే. రోణంకి అప్పలస్వామి, కొడవటిగంటి కుటుంబరావు, విద్వాన్ విశ్వం, పాలగుమ్మి పద్మరాజు మొదలైన సాహితీపరులు కాశీ చదువుల్లోనే సామ్యవాదులయ్యారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చాలామంది విద్యార్థులు సిద్ధాంత గ్రంథాలను చదివి ఉత్తేజితులై ఉద్యమంలోనికి వచ్చారు. సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఇంగ్లండు నుండి వచ్చేటప్పుడు తమ వెంట కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో పెట్టారు. హిరేన్ ముఖర్జీ, అబ్బూరి రామకృష్ణారావుగార్లు అప్పుడు యూనివర్సిటీలో ఆచార్యులు. ఈ ఇద్దరూ కూడా ఎన్నో కమ్యూనిస్టు గ్రంథాలను తెప్పించి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఎందరో వీటిని చదివి ప్రభావితులయ్యారు. పార్టీ ప్రచ్ఛన్నంగా ఉండి, ఉద్యమం రహస్యంగా నిర్మాణం అవుతున్న దశలో కొంతమంది కమ్యూనిస్టు విద్యార్థి సభ్యులు అతి ఉత్సాహంతో రహస్య కరపత్రాలను గ్రంథాలయంలో పుస్తకాలు పత్రికలు పరిచే బల్లమీద ఉంచడం వల్ల పరిస్థితులు విషమించాయి. అధికారుల దృష్టిలోనికి ఈ ఉదంతం వెళ్ళింది. అప్పటి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు యూనివర్సిటీ గ్రంథాలయంలోని పుస్తకాలన్నింటినీ గాలించి కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీయించేశారు. సన్నికల్లు దాచేస్తే పెళ్ళి ఆగిపోదు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కొందరు విద్యార్థులు సామ్యవాదంపట్ల ఆకర్షితులు కావడానికి కారణాలు. ఎలా ఉన్నాయో, అలాగే బెనారసు విద్యార్థులను ఆనాడు వామపక్షానికి తిప్పిన బలవత్తర ప్రోద్బలాలు వున్నాయి. ఆనాడు అక్కడ అన్ని రాజకీయ ధోరణులూ ఉండేవి. గాంధేయులు మొదలుకొని టెర్రరిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టు నాయకులు, కమ్యూనిస్టులు ఉండేవారు. కాశీ విద్యాపీఠంలో ఆనాడు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులైన వారు అధ్యాపకులు కావడం వల్ల కొందరు సామ్యవాదంవైపు మొగ్గారు. హిందూ యూనివర్సిటీలో 'సోషలిస్టు స్టడీ సర్కిల్' ఉండేది. కేవలం అధ్యయనమే కాక దైనందిని రాజకీయాల్లో ఆ విద్యార్థులు పాల్గొనేవారు. ఎర్రజెండాలతో ఊరేగింపులు జరిపేవారు. లక్నో కాంగ్రెస్‌కు వాలంటీర్లుగా వెళ్ళేవారు.[3]

ఒక్క మన దేశంలోనే కాదు, భారత విద్యార్థులు ఏ దేశంలో చదువుకొంటున్నాసరే ఆ ముప్ఫయిల తొలి సంవత్సరాలలో సామ్యవాదం వైపు ఆకర్షితులవుతూ వచ్చారు.

3. తుమ్మల సాహిత్యం - పుటలు 131, 132

1935లో ఉన్నత విద్యల కోసం ఇంగ్లండులో చాలామంది భారతీయులు ఉండేవారు. జర్మనీలో, ఇటలీలో ఫాసిస్టుల పైశాచిక చర్యలను ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఫ్రాన్స్‌లో కార్మిక వర్గం ఎలాగ ప్రగతిబాట పట్టిందో కూడా వీక్షించారు. సోవియట్ యూనియన్‌పై తమ ఆశలను పెట్టుకొని నాటి ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా తమ కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తున్నారు. రాల్ఫ్‌పాక్స్‌తో సంప్రదించి ఇండియన్ ప్రోగ్రసివ్ రైటర్స్ సంఘాన్ని స్థాపించాలని నిశ్చయించుకొన్నారు. సజ్జాద్ జహీర్ గదిలో ఆరేడుగురు సమావేశమై ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ప్రణాళిక రచనాభారాన్ని ముల్క్‌రాజ్ ఆనంద్ మీద పెట్టారు. ఆయన చాలా సుదీర్ఘమైనది రాశారు. దానిని కుదించేభారాన్ని డాక్టర్ ఘోష్‌కి అప్పగించారు. అతడు దానిని నెరవేర్చి కమిటీకి సమర్పించారు. కమిటీవారు ఆ రెండు ముసాయిదాలను పరిశీలించి సరికొత్త దాన్ని రాయమని సజ్జాద్ జహీర్‌ను కోరారు. ప్రణాళిక సిద్ధమైంది. ఈ వివరాలను, మరికొన్ని సంగతులను సజ్జాద్ జాహీర్ తమ జ్ఞాపకాలలో కథనం చేశారు.[4]

లండన్‌లోని డెన్మార్క్ స్ట్రీట్‌లో నాన్‌కింగ్ రెస్టారెంటు ఒకటుంది. దాని ప్రొప్రయిటర్ ఏమీ రుసుము తీసుకోకుండా ఒక గదిని అభ్యుదయ రచయితల సమావేశాలకు యిచ్చేవారు. లండన్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి మొదలైన ప్రదేశాల నుండి 40, 50మంది భారతీయ ప్రతినిధులు హాజరయ్యారు. ముల్క్‌రాజ్ ఆనంద్ అధ్యక్షత వహించారు. ఆ సభలో మానిఫెస్టోను ఏకగ్రీవంగా ఆమోదించారు. దానిని అప్పుడు బ్రిటన్‌లో ప్రచురితమవుతూ వుండే వామపక్ష సాంస్కృతిక పత్రిక 'లెఫ్ట్ రివ్యూ' 1936 ఫిబ్రవరిలో ప్రచురించింది. ఈ చారిత్రాత్మకమైన తొలి పత్రం సుధిప్రధాన్ సంకలనం చేసిన 'మార్క్సిస్టు కల్చరల్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా' అనే పుస్తకంలో చోటు చేసుకోలేదు. అయినా దాని ప్రభావం కొంత ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘంలోని ఒకానొక మహాకవిపై పడిందన్న విశ్వాసంతో దానిని సంపాదించవలసిన బాధ్యతను నాపై పెట్టుకొన్నాను. 1983లో నేను బ్రిటన్‌లో పర్యటన చేస్తూ పరిశోధనలు కావిస్తున్నప్పుడు దానికోసం బర్మింగ్‌హాం గ్రంథాలయంలోను లండన్‌లోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ కార్యాలయంలోను, మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలోనూ గాలించి బహుకష్టంమీద దానిని పట్టుకొన్నాను.

Manifesto of the Indian Progressive Writers' Association, London

Radical changes are taking place in Indian Society. Fixed ideas and old beliefs, social and political institution are being challenged. Out of the present turmoil and conflict a new society is arising. The spirit of reaction, however, though moribund and doomed to ultimate decay, is still opertive and is making desperate efforts to prolong itself.

It is the duty of Indian writers to give expression to the changes taking place in Indian life and to assist the spirit of progress in the country.

4. Sudhi Pradhan (Ed.) "Marxist Cultural Movement in India" (1936-47) - pp.33-47

Indian literature, since the breakdown of Classical culture, has had the fatal tendency to escape from the actualities of life. It has tried to find a refuge from reality in spiritualism and idealism. The result has been that it has produced a rigid formalism and a banal and perverse ideology. Witness the mystical devotional obsession of our literature, its furtive and sentimental attitude towards sex, its emotional exhibitionism and its almost total lack of rationality. Such literature was produced particularly during the past two centuries, one of the most unhappy periods of our history, a period of disintegrating feudalism and of acute misery and degradation for the Indian people as a whole.

It is the object of our association to rescue literature and other arts from the priestly, academic and decadent classes in whose hands they have degenerated so long; to bring the arts into the closest touch with the people; and to make them the vital organs which will register the actualities of the life, as well as lead us to the future.

While claiming to the inheritors of the best traditions of Indian Civilization, we shall critisize ruthlessly, in all its political, economic and cultural aspects, the spirit of reaction in our country, and we shall foster through interpretative and creative work (with both native and foreign resources) everything that will lead our country to the new life for which it is striving. We believe that the new literature of India must deal with the basic problems of our existence today - the problems of hunger and poverty. Social backwardness and political subjection, so that it may help us to understand these problems, and through such understanding help us to act.

With the above aims in view, the following resolution have been adopted :-

1. The establishment of organizations of writers to correspond to the various lingustic zones of India; the co-ordinations of these organizations by holding conferences, publishing of magazines, pamphlets, etc.
2. To co-operate with those literary organizations whose aims do not conflict with the basic aims of the Association.
3. To produce and to translate literature of a progressive nature and of a high technical standard, to fight cultural reaction; and, in this way, to further the cause of Indian freedom and social regeneration.
4. To strive for the acceptance of a common language (Hindustani) and a common script (Indo-Roman) for India.
5. To protect the interests of authors; to help authors who require and deserve assistance for the publications of their works.
6. To fight for the right of free expression of thought and opinion.

(This manifesto has been signed by Dr. Mulk Raj Anand, Dr. K.S.Bhat, Dr. J.C. Ghose, Dr.S. Sinta, M.D. Taseer, S.S. Zaheer.)

All communications to be addressed to : Dr. M.G.R. Anand, 32 Russell Square, London, W.C. 1.

London, 1935.

లండన్‌లో[6] ఏర్పడిన భారతదేశ అభ్యుదయ రచయితల సంఘ ప్రణాళిక (1935)

లండన్‌లోని భారతీయ అభ్యుదయ రచయితలు పరదేశంలో వుంటూ తామేమీ చేయలేమని నిశ్చయించుకొన్నారు. స్వదేశానికి వెళ్ళి అక్కడ ఉద్యమం ప్రారంభించ దలిచారు. తిరుగు ప్రయాణానికి ముందు సజ్జాద్ జహీర్ కొన్నాళ్ళు ఫ్రాన్స్‌లోని పారిస్ నగరంలో వున్నారు. అక్కడే మాక్జిం గోర్కీ (Maxim Gorky), రోమారోలా (Romain Rolland) ఆండ్రీ మాల్‌రాక్స్ (Andre Malreaux), థామస్ మాన్ (Thomas Mann) మొదలైన విశ్వవిఖ్యాత రచయితల ఆధ్వర్యంలో "వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ రైటర్స్ ఫర్ ది డిఫెన్స్ ఆఫ్ కల్చర్" అనే సంస్థ ఏర్పడింది. ప్రపంచంలోని వివిధ సాహిత్యాల ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం ప్రతినిధిగా మదాం సోఫియా వాడియా వచ్చింది. ఆమె రాక యువభారత రచయితలకు నచ్చలేదు. అయితే తాము ప్రాతినిధ్యం వహించడానికి వీల్లేదు. తాము ఎవరిచేతా ఎన్నుకొన్న సభ్యులు కారు. అందుచేత త్వరగా భారతదేశానికి వెళ్ళి సంఘాన్ని స్థాపించి దానిని ఈ విశ్వవిఖ్యాత సంస్థకు అనుబంధ సంస్థను చేయదలిచారు. సజ్జాద్ జహీరు ప్రఖ్యాత ఫ్రెంచి కవి లూయీ ఆరగాఁన్ సలహాలను సంఘ నిర్మాణ కార్యక్రమానికి అర్థించారు. "రచయితలు ఎవరి మగ్గానికి వాళ్ళే సేనాపతులమనుకొంటారు. వాళ్ళను ఒక్క తాటిమీదకు తేవడం కష్టం. అయితే 'యత్నేఫలే' అనే అర్థమొచ్చే సలహాలను ఆరగాఁన్ (Aragon) యిచ్చాడు. లండన్ ప్రోగ్రెసివ్ రచయితలు స్వదేశానికి బయలుదేరారు.

భారతదేశంలో అప్పటికి చాలామంది యువకులు, యువ రచయితలు భగత్‌సింగ్ అమర జీవితం పట్ల ప్రభావితులయ్యారు. ఆరోజుల్లో గళం విప్పిన, కలం పట్టిన నూనూగు మీసాల నూతన యౌవనులకు అతడే ఆదర్శవీరుడు, ఆరాధ్య నాయకుడు. భగత్‌సింగ్ అనుచరుడై, విప్లవకారుడై జైళ్ళలో మగ్గిన శివవర్మ తాను వసించిన ప్రతి జైల్లోనూ యువకులను భగత్‌సింగ్ ఆశయాలకు మళ్ళించడానికి పాటుపడ్డాడు. శివవర్మ రాజమండ్రి జైల్లో వున్నప్పుడు పుచ్చలపల్లి సుందరయ్యగారు ఆయనతో ఎన్నో చర్చలు జరిపారు. అతను తమ సాహసకృత్యాలు, తమ విజయాలు, తమ పొరపాట్లు అన్నీ చెప్పేవాడు. అలాగే తాము చేసిన కొన్ని తప్పులూ, తమ నిర్లక్ష్యమూ, తమ ఉద్యమానికి నష్టం కలిగించిన అనుభవాలన్నీ ఆయన వివరించేవాడు.[5] శివవర్మ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాల వల్ల భగత్‌సింగ్ రాజకీయ పరిణతిలోని వివిధ స్థాయిలూ, దశలు తెలియ వస్తున్నాయి.

1925-26లలో భగత్‌సింగ్ రష్యన్ విప్లవకారులైన బకూనిన్ (1814-76), క్రొపాట్కిన్ (1842-1921)ల ప్రభావంలో వున్నవాడు. ఈ సుప్రసిద్ధులు మార్క్స్ సమకాలికులేగాని, అరాచకవాదులు. 1927-28 నాటికి భగత్‌సింగ్ సోషలిస్టుగా మారాడు.

1929-30-31 సంవత్సరాలలో భగత్‌సింగ్ పూర్తిగా కమ్యూనిస్టుగా, అందులోనూ మార్క్సిస్టుగా పరిపక్వత చెందాడు. అవకాశవాదాన్ని ఖండించాడు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదాన్ని యిచ్చాడు.

ఈ నినాదం కుట్రకూ, కూహకాలకూ, హత్యలకూ, అత్యాచారాలకూ దారితీస్తుందనే భారతీయ బుద్ధిజీవుల వాదనను తూర్పారపట్టాడు. సమసమాజ నిర్మాణమే

5. పుచ్చలపల్లి సుందరయ్య - 'విప్లవపంథాలో నా పయనం' - పుట.54

అంతిమ లక్ష్యమని ఎలుగెత్తి చాటాడు. భగత్‌సింగ్‌లో వచ్చిన ఈ క్రమ పరిణామాలన్నీ ఆనాటి యువకులలో దశలవారీగా వచ్చాయి. 1931 మార్చి 23వ తేదీనాడు బ్రిటీష్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను రహస్యంగా ఉరితీసి గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు జరిపింపచేయించింది. భగత్‌సింగ్ ఉరితీత వార్త పైకి పొక్కిన తర్వాత యువలోకంలో అలజడి రేగింది.

భగత్‌సింగ్ ప్రభావం వల్లనే విజయనగరంలో రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమయాజులుగార్లు శ్రీరంగం నారాయణబాబుతోపాటు సోషలిస్టు పంథాలో పడ్డారు. తెలుగు జిల్లాల్లోని ఇతర యువసాహితీ పరులు కూడా సామ్యవాదులయ్యారు. క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటూ శ్రామిక పక్షపాతంతో గీతాలు రచించారు. పెండ్యాల లోకనాథం, తుమ్మల వెంకట్రామయ్య అటువంటి వారిలో ప్రముఖులు.

1934 జూలైలోనే తుమ్మల వెంకట్రామయ్యగారు గోర్కి రచించిన మహత్తర నవల 'అమ్మ' సంక్షిప్తానువాదాన్ని 'మాతృ హృదయం' అనే పేరుతో వ్రాశారు. పూర్తి నవలను క్రొవ్విడి లింగరాజుగారు అనువదించారు. వీటిని ఆదర్శ గ్రంథమండలి 1934 డిసెంబరులో ప్రచురించింది. ప్రభుత్వం దీనిని 1935 జూలైలో నిషేధించింది. అయితే 'అమ్మ' అనువాద ప్రతులను రహస్యంగా చదివి ఎందరో ఉత్తేజితులయ్యారు. ఉద్యమంలోనికి వచ్చారు. కవోష్ణ రక్తమున్న వారిని కార్యోన్ముఖులను చేసి దీక్షాకంకణధారులను చేయడమే ఉత్తమ సాహిత్యానికి పరమావధి.

1934లోనే ఆచార్య రంగా కాంగ్రెసువాదిగా, రైతు నాయకునిగా, వామపక్షీయునిగా ఉంటూ స్వకీయ సంస్థలను స్వగ్రామంలో సృష్టించుకొన్నారు. గుంటూరుజిల్లా నిడుబ్రోలులో రైతాంగ విద్యాలయాన్ని స్థాపించారు. వివిధ విషయాలపై సమర్థులచేత పాఠాలు చెప్పించారు. ఒకసారి పుచ్చలపల్లి సుందరయ్యగారు ఆ పాఠశాలలో 'ప్యారిస్ కమ్యూన్ నుండి రష్యా విప్లవ విజయం' దాకా ఉద్యమ చరిత్రపై పాఠం చెప్పారు. ఆ ఉపన్యాసం పాఠశాల విద్యార్థులలో చాలామందిపై మంచి ప్రభావాన్నే కలిగించిందని చెప్పాలి. అక్కడ చదువుకొన్న ఎందరో విద్యార్థులు ఉత్తరోత్తరా కమ్యూనిస్టు ఉద్యమంలోనికి వచ్చారు. మాకినేని బసవపున్నయ్య, కంఠంనేని వెంకటరత్నం మొదలైనవారు సుందరయ్యగారి పాఠం వల్ల కూడా ఉత్తేజితులయ్యారు.

1934లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటయ్యాయి. పార్టీ అన్నాక దానికొక పతాకం ఉండాలి. ప్రత్యేక గీతం వుండాలి. ఏదేశంలో ఉన్న శ్రమజీవులకైనా ఎర్రజెండాయే బావుటా. ప్యారిస్ విప్లవకాలంలో యూజీన్ పొటియర్ రచించిన అంతర్జాతీయ గీతమే ప్రత్యేక గీతం. అయితే దీనిని అప్పటికెవరూ తెనిగించలేదు. సుందరయ్యగారి ప్రేరణవల్ల ఈ గీతం ఆంగ్లానువాదాన్ని బాలాంత్రపు నళినీకాంతారావు గారు చదివారు. ''ఆకలి మంటచే మలమలమాడే అనాథులంతా లేవండోయ్'' అన్న ఎత్తుగడతో సొంతం ఆయన తెనిగించారు. వెంకట పార్వతీశ కవులలో ఒకరైన బాలాంత్రపు వెంకటరావుగారి కుమారులే ఈయన. ఆరోజుల్లో కాకినాడలో చదువుకొంటున్నారు.

విద్యాలయాలలో ఉద్యమం విస్తరిస్తోంది. సామ్యవాదభావాలతో యువకులు రచనలు చేస్తున్నారు. వీటిని ప్రచురించే కొత్త పత్రికలు అవసరమయ్యాయి. సామినేని ముద్దుకృష్ణ 'జ్వాల' అనే పత్రికను 1933లోనే స్థాపించాడు. రష్యాలోని విప్లవ విజయాలవల్ల ప్రభావితుడయ్యాడు. తొలిసంచికలో 'జ్వాల ఎందుకంటే?' అన్న ప్రశ్నార్థకపు శీర్షిక కింద ఇలా సంపాదకీయం రాశాడు.

''ప్రపంచమంతా ఒక యిల్లుగా, మానవజాతి అంతా ఒకే కుటుంబంగా అయిపోయేరోజులు వస్తున్నవి. ఏ మూలనో వున్న ఒకదేశం సాహసించి చేసిన ప్రయత్నంలో అనాది నుంచీ మానవజాతి విశ్వసించిన నీతి, ధర్మం, సత్యం విలువలు తారుమారు అవుతున్నవి. మనం కూపస్థంగా ఉండడం వల్లనో, పురాతన మగతచేతనో, రక్తంలో నీరసం చేతనో నూతన తేజస్సునకు గుడ్లగూబలమవుతున్నాము. ఇది పనికిరాదు''.

ఈ 'జ్వాల' యువసాహితీ లోకంలో కొన్ని కొన్ని కొత్త దీపాలను వెలిగించింది. భావకవిత్వం ప్రభావంలో పడిపోయి ఆ ప్రవాహంలోనే కొట్టుకొని పోతున్నవాళ్ళకి తీరాన్ని చూపించి, చేతికో గడ అందించి సహాయం చేసింది. కాల్పనిక వాదంలోని ఆత్మాశ్రయ కవిత్వాన్ని నవ్య కవిత్వంలోని సామాజిక చైతన్యంగా ఎలా అనువదించాలో అందుకు వస్తువులోనూ, రూపంలోనూ ఏమార్పులు తీసుకురావాలో పరిశీలించడానికి కొందరు ప్రతిభావంతులు ప్రయత్నించారు. వీరిలో గుంటూరుజిల్లాలోని శిష్ట్లా ఉమామహేశ్వరరావు, విశాఖజిల్లాలోని శ్రీరంగం నారాయణబాబు, శ్రీరంగం శ్రీనివాసరావు ముఖ్యులు.

1934 నాటికి ''శ్రీరంగం శ్రీనివాసరావు బి.ఏ. (కవితా సమితి) - విశాఖపట్నం'' అంటూ పేరూ, డిగ్రీ, సభ్యత్వం, స్వగ్రామం చెప్పుకొంటూ అడపా తడపా కవితలు ప్రచురించే యువకవిలో అస్పష్టమైన సామ్యవాద భావాంకురాలు నాటుకొన్నాయి. కవిత్వంలోని 'నేను' సమాజంలోని 'మనము' అనే సమిష్టికి సంకేతంగా మార్చి, కవి ప్రజలకు ప్రతినిధిగా తన భావాలను గానం చేయాలనే తపన అప్పుడు ప్రగాఢంగా ఉంది.

ఉద్యమంలో మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు నిర్మాణంలో ఉన్న కవులకే తమ జెండా ఎర్రజెండా అని తెలుసు. దాన్ని ప్రజల పోరాట రంగాల్లో ఎగురవేసి తొలిసారిగా ఆ అరుణ పతాకంపై గీతాన్ని రాసినవారు తుమ్మల వెంకటరామయ్యగారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా
అదురు బెదురూ లేక అడ్డేదియును లేక
సామ్రాజ్యవాదంబు సమసిపోవంగ
ధనిక నాదంబింక దగ్ధమై పోవ ॥

కూలోళ్ళ గొంతులో కొన ఊపిరుంటేను
పేద రైతుమేన వేడి రక్తం బుంటె ॥

కార్మికుల్ కర్షకుల్ కరము కరమూ కలిపి
జై మనకు జైయంచు జేజేలు కొట్టంగ ॥

కాశీ విద్యాపీఠంలో 1934లోనే ఏర్పడిన ''కమ్యూనిస్టు సెల్'లో తుమ్మల వెంకటరామయ్యగారు సభ్యులు. ఒక పక్క చదువుకొంటూనే మిల్లు కార్మికులతో కలిసి రాజకీయాల్లో పనిచేసేవారు. ఎర్రజెండాలతో కాశీవీధుల్లో ఊరేగింపులు జరిపారు. వారి ఎర్రజెండా పాట మొదట విశేష ప్రచారాన్ని, తర్వాత వివిధ సంకలనాలలో ప్రచురణనూ పొందింది.

పాటలు లేకపోతే ప్రచారం చేయడం ఉద్యమకారులకు ఇబ్బందికరంగా ఉంటుంది. పేటలలో, మిల్లులో, బజార్లలో తిరిగి కార్మికులకు వారి కష్టాలను వారికి గుర్తుతెస్తూ కార్మిక సంఘాల ఆవశ్యకతను గురించి పెండ్యాల లోకనాథంగారు ప్రబోధిస్తూ ఉండేవారు. కానీ, ఆయన చెప్పేసినదంతా వినేవారేగాని చివరకు 'సంఘం అంటే సమ్మె చేయమనేగా మీరు చెప్పేది మాకొద్దులే సంఘాలు' అని చెప్పిపోయేవారు. వారికి ఎట్లా నచ్చచెప్పడమో ఆయనకు తెలియలేదు. చివరకు ఒకటి ఆలోచించి వారి కష్టాలు తెలియచెప్పే మంచిపాట ఏదయినా ఒకటి రాసి వినిపిస్తే వారు గ్రహించుతారేమోనని లోకనాథంగారు ఒక పాట రాశారు - అది కార్మికుల కష్టాలను ప్రవచింపచేస్తూ వర్గపోరాట ప్రాముఖ్యాన్ని విశదపరుస్తూ కార్మికులు పాడుకొనే సులభశైలిలో వున్న గేయం.

కూలివాండ్లమైన మనకు
కులము లెందుకు తెలుపరా
కూలివాండ్ల మైన మనము
కలసి జీవింతుము సోదరా!
॥ అన్నా కూలీ లేకము కావలెరా!!

కష్టపడి యీమేడలన్నీ
కట్టినది మనమే కదా
కష్టపడి యీ ఫ్యాక్టరీలను
కట్టివారల కిస్తిమి
॥ అన్నా కూలి లేకము కావలెరా!!

కష్టజీవుల మైన మనకు
గుడిసెలేగతి యాయరా
కష్టపడి పనిచేయుచున్నాను
కడుపు నిండుటలేదురా
॥ అన్నా కూలీ లేకము కావలెరా!!

- ఇది ఎనిమిది చరణాల పాట. బహుప్రచారం పొందిన శ్రామిక గేయం. ఇటువంటి పాటలను ఆనాడు ఇతరులు కూడా రాసేవారు. ఆచార్య రంగాగారు రైతు సంఘాల ప్రచార

గీతాలుగా పనికివస్తాయని 1934 ఏప్రెల్ మాసంలో 'రైతు భజనావళి' అనే ఏభై పేజీల సంకలనాన్ని తయారుచేసి ప్రచురించారు. ఇందులో ఉన్నవవారి మాలపల్లిలోని తక్కెళ్ళ జగ్గడి ధర్మబోధనలు, హరిజన నాటకంలోని పాటలు, నెల్లూరి వెంకట్రామానాయుడిగారి చిలకపదాలు, తుమ్మెద పదాలు, కాటూరి ధర్మన్నగారి నల్లదొరతనం పాటలు, ఇంకా ఇతరుల గొల్లసుద్దులు, బొబ్బిలి పాట వరుసలోని గేయాలు మొదలైనవి ఉన్నాయి. (1935 నుంచి పేజీల పెంపుదలతో ఇది పలుముద్రణలు పొందింది. ఏటా ఒకటి చొప్పున కొన్ని సంవత్సరాలలో ఏడాదికి రెండు ముద్రణలు 1939 నాటికి వచ్చాయి. శ్రామిక గేయాలపట్ల ప్రజల ఆసక్తి దీనివల్ల తెలుస్తుంది.)

'రైతు భజనావళి' ఉపోద్ఘాతంలో స్పష్టంగా రష్యాలోని విప్లవమే ఆదర్శమని చాటారు. ''ప్రపంచమందొక చోట రైతులు రాజ్యానికి వచ్చారు. కూలీలు పెత్తనం చేస్తున్నారు. కోటీశ్వరుల కచ్చట తావులేదు. తినడానికి తిండి, పరుండడానికి పడక అచ్చట యెల్లరికి కరవులేకున్నవి. ప్రజాస్వామ్యమునకు పరువు ప్రతిష్ఠలచ్చట లభ్యమగుచున్నవి. ఆంధ్ర ప్రజలు కూడా అలాంటి స్వరాజ్యమునే కాంక్షించుచున్నారు.''

కార్మికులు కలగనే రాజ్యం ఇంత స్పష్టంగా తేలిపోతూందిగాని, మేధావివర్గాలలో ఇంకా తటపటాయింపు వుంది. ముద్దుకృష్ణ జ్వాల (1935 జనవరి 16) సంచికలో ఇలాగ రాశాడు.

''సంఘ జీవితంలో నుంచి ఇవన్నీ తొలిగిపోవాలి అంటే 'మరిరాదగనివి ఏవి?' అని చాలామంది ప్రశ్నిస్తున్నారు...

''నీ రక్తంలో ఈ పురుగులున్నవి. వాటిని నశింపచేయపోతే నీకు సుఖప్రదమైన ఆరోగ్యం కలగదూ అంటే 'అవి పోయి రావలసినవి ఏవి?' అనే ఎదురు ప్రశ్నలో ఉన్నంత తెలివే పైప్రశ్నలో కూడా వున్నది.

''సంఘానికి చీడపురుగులైన భేదాలు తొలిగిపోవడమే సంఘానికి సరియైన ఆరోగ్యం. 'వాటిని నిర్మూలం చేయవలె' అంటే 'మరి రా తగినది ఏమీ' అని ప్రశ్నించడం నాకు తెలీదు?''

ఇదే జ్వాల సంచికలో శ్రీరంగం నారాయణబాబూ, శ్రీరంగం శ్రీనివాసరావూ చెరొక గేయం రాశారు. నారాయణబాబు అగ్నిహోత్రుణ్ణి 'జ్వాలనా' అని ఆహ్వానించాడు.

ఒళ్ళు తెలియక
పళ్ళు కొరుకుతూ
నృత్యంచేసే
రాక్షసి సంఘపు
కీలాలమ్మే
తైలమ్ముగ
రుధిర జ్యోతిని వెలిగింపుమురా
విప్లవగీతిని వినిపింపుమురా
జ్వాలనా!

ఈగీతంతో తెలుగు నవ కవిత్వంలో రుధిరజ్యోతి వెలిగింది. విప్లవ గీతి మ్రోగింది. ఈ చారిత్రక దినం నాడే శ్రీరంగం శ్రీనివాసరావు నినదించిన 'మహాప్రస్థానం' గీతం తొలిసారిగా తెలుగులోకంలో శంఖారావం చేసింది. అప్పటికి అతడు పాతికేళ్ళ నవయువకుడు. అంతకుముందు భావకవిత్వపు ప్రభావంలో పడి కవిత ఎక్కడో దూరంగా వినుదారులలో విహరించే అందని అందంగా భావించి ''గాలి యొసగెడు కొత్తరెక్కలు ధరించి ఎరుక పడరాని ఎచటికో ఎగిరిపోతూ'' వుండేవాడు. అది గమ్యం లేని ప్రయాణం. అయినా సోషలిస్టు ఉద్యమ ప్రభావం వల్ల తన గమ్యం ''మరో ప్రపంచ'మని తెలుసుకొన్నాడు.

మహాప్రస్థానం ప్రారంభించి 'ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులను చావమని' శపించి 'నెత్తురుమండే శక్తులు నిండే సైనికులను రా రమ్మని, పిలిచి 'పదండి ముందుకని' ప్రబోధించాడు. మరో ప్రపంచంలోని ఎర్రబావుటాను భూమి నుంచి చూశాడు. లోకానికి చూపించాడు. అయితే ఈ నూతన ప్రపంచ స్వభావాన్ని అవగాహన చేసుకుందుకే కొన్నేళ్ళు పట్టింది. అందుకు కారణం అతడు అప్పుడూ, ఆ తర్వాత ఒక దశాబ్దం పాటు ఎక్కువగా 'బుఖారిన్' 'బకూనిన్' 'క్రొపాట్కిన్' భావాల కోలాహలంలో మునిగి తేలుతూ 'ట్రాట్స్కీ' ప్రభావంలోనే ఉండేవాడు.

ఆనాడు తెలుగు జిల్లాలలో మద్రాసులో లభించే సామ్యవాద సిద్ధాంత గ్రంథాలలో ట్రాట్స్కీ రచించిన 'రష్యా విప్లవ చరిత్ర', క్రొపాట్కిన్ రచించిన 'విప్లవ సందేశం', బుఖారిన్ రచించిన 'చారిత్రక భౌతిక వాదం' ఎవరు అనువదించారో తెలియదుగాని ఇటలీ దేశపు విప్లవకారుడైన 'మజ్జినీ చరిత్ర' మొదలైనవి బహుశా శ్రీరంగం శ్రీనివాసరావును ఎక్కువగా ప్రభావితం చేసి ఉంటాయి. అతడు అమితంగా ఆరాధించే ఆంగ్లకవి స్విన్‌బర్న్ (1837-1909) మజ్జినీ విప్లవభావాలను తన కవితలలో ప్రబలంగా ధ్వనింపచేశాడు. అందుకే స్విన్‌బర్న్ పాటలలో శ్రీరంగం శ్రీనివాసరావు 1936లో 'ఎర్ర కాంతుల ఇనోదయమూ, రెక్క విప్పిన రివల్యూషన్' దర్శించగలిగాడు. ఆ యుద్ధ గుంజన్మృదంగాల నడకలు తన పాటల్లో పలికించగలిగాడు.

1936లో ఇంకా చాలా ముఖ్యమైన సాహిత్య సంఘటనలు జరిగాయి. లండన్‌లోని భారత ప్రోగ్రసివ్ రచయితల మానిఫెస్టో ఇండియాకు కూడా చేరింది. అబ్బూరి రామకృష్ణారావు, వారి ద్వారా, శ్రీరంగం శ్రీనివాసరావు దీనిని చదివారు. కొంపెల్ల జనార్ధనరావు తన ఉదయిని పత్రిక అయిదవ సంచికలో ఈ సంఘం పేరు ప్రస్తావించారు. అతడు రాసిన మాటలు చూడండి.

''ఒకవేళ ఇతర దేశాలవారికి ఇది భారతీయ వాఙ్మయమని ఒక్కచోట కనబరచగలమంటే, తిరిగి అది ఏ ఆంగ్లములోనికో అనువదించవలసి ఉన్నప్పుడు, ఒకసారి హిందీలో పరివర్తితమైన దానికంటె మంచి ఆధారమైన మాతృక నుండే అనువదించడం చెల్లుతుంది. ఇందుకు 'త్రివేణి' వంటి పత్రికలు, ఇటీవల లండన్‌లో ఏర్పడ్డ "The Indian Progressive Writers Association" భారతదేశపు P.E.N. Association వంటి సంస్థలు ఎక్కువ ఉపకరిస్తవి''.

ఆ సంవత్సరమే లండన్ భారతీయ రచయితలు స్వదేశానికి తిరిగి వచ్చారు. ఏప్రిల్ నెలలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన లక్నోలో ఇండియన్ ప్రోగ్రెసివ్ రచయితల సభలు జరిగాయి. శంకుస్థాపన జరిగింది. ఈ అఖిలభారత సభలకు ఆంధ్రసాహిత్య ప్రతినిధులుగా అబ్బూరి రామకృష్ణారావు, సోమంచి యజ్ఞన్నశాస్త్రి, తుమ్మల వెంకటరామయ్యగార్లు హాజరయ్యారు. ఆంధ్రశాఖను నెలకొల్పాలని ఈ వ్యవస్థాపక సభలలో నిర్ణయించారు. ఆ బాధ్యతను అబ్బూరి రామకృష్ణారావుగారిపై పెట్టారు.

శ్రీరంగం శ్రీనివాసరావు ఆంధ్రశాఖలో సభ్యునిగా మాత్రమేకాక కార్యదర్శిగా చేరాడు. ఇతరులను ఎవరినైనా చేర్పించాడో, లేదో? చలాన్ని మాత్రం అబ్బూరివారు చేర్పించారు. 'కొంత రాజకీయ వాతావరణం వాసన వుంది కొత్త గొడవలుగావును' అనుకుంటూనే చలం అందులో చేరి ఆ సంగతిని చింతా దీక్షితులుగారికి ఒక లేఖలో తెలియచేశారు. నాటకాలతో, ఉపన్యాసాలతో పామరులకు జ్ఞానబోధ చేయడం, దానికోసం వాళ్ళ నుంచి కథల్ని, పాటలనూ ప్రోగుచెయ్యడం అనే సాహిత్య నిర్మాణ కార్యక్రమం సంకల్పంలో ఉన్న అబ్బూరి రామకృష్ణారావుగారు ఎంత కృషి చేశారో తెలియదు. 'ప్రోగ్రెసివ్' అనే ఇంగ్లీషు పదానికి సరైన తెలుగు మాట అప్పటికి తట్టక అబ్బూరివారు 'ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం' అనే పేరు దీనికి పెట్టారు. ఆ పేరుతోనే తెలుగులో ఒక మానిఫెస్టోను ప్రచురించారు. చూడండి.

ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం - ప్రణాళిక

ఆంధ్ర సంఘంలో నేడు సమూలములైన మార్పులు గోచరిస్తున్నవి. కానీ ప్రతికూలశక్తులు కూడా చిట్టచివరికి నశించవలసినవే అయినా, మార్గ నిరోధాలు కల్పిస్తున్నవి.

ఆంధ్ర జీవితంలో కనబడుతూవున్న మార్పులను వాఙ్మయంలో ప్రదర్శించి అభివృద్ధి ప్రయత్నాలను కొనసాగించడం ఆంధ్రలేఖకులందరికిన్నీ విహితధర్మం.

ప్రాచీన సంస్కృతి విచ్ఛిన్నమైన తర్వాత మన వాఙ్మయం లౌకికజీవనంలోని వైవిధ్యాలను సమన్వయించుకోలేక అతిలోకంగా సంచరిస్తూ వుంది. వ్యర్థమైన తాత్త్వికజిజ్ఞాసలలోను, నిరాధారములైన కేవలకల్పనలలోను తలదాచుకొంటున్నది. ఇందుకు ఫలితంగా సాహిత్యం నీరసించి విగ్రహపుష్టి మాత్రం మిగిలి పెడసరపు భావాలలో మునిగి తేలుతున్నది. ఇందువల్లనే నేటి వ్రాతలలో నర్మ కవితలూ, భక్తిభావాలూ, ఔచిత్యమూ, సందర్భశుద్ధిలేని ఆవేశాలూ, స్త్రీ-పురుష సంబంధాలను నిష్కళంక దృష్టితో చూడలేకపోవడం. వివేకశూన్యతా విరివిగా కనిపిస్తూ వున్నవి.

ఈలాంటి వ్రాతలు వ్రాసేదీ, చదివేదీ మార్పులు సహించలేని పూర్వాచార పరాయణులే. చిరకాలం నుంచీ వీరిచేతుల్లో నిలిచివుండడంతో వాఙ్మయం ప్రజాసామాన్యానికి అందని మ్రానిపండయినది. అందుకనే వర్ధమాన లేఖకులు ఆంధ్ర వాఙ్మయాన్ని పునరుద్ధరించి, దాన్ని ప్రజల జీవితానికి చేరువగా కొనివచ్చి అందులో

వాస్తవజీవితాన్ని ప్రతిఫలింపజేసి అందరూ ఆకాంక్షించే ఉజ్జ్వల భవిష్యానికి దారితీయవలసి ఉంటుంది.

ప్రాచీనాంధ్ర సభ్యతలోని ఉత్తమ సంప్రదాయాలంటే మాకు వైముఖ్యం లేదు. కాని వాటిని గురించి పాదుకొన్న అపోహలను ఆమూలాగ్రంగా విమర్శించి, స్వదేశ విదేశ సాహిత్యాలలోంచి అభివృద్ధిని పెంపొందించే రసవద్ఘట్టాలను ఆంధ్ర ప్రజలకు అందజేసి నూతన రూపంలో జన్మించబోయే భవిష్యత్సంఘానికి దారితీయగల ప్రయత్నాలన్నిటికి తోడ్పడుతూ వుంటాయి. నేడు యావద్భారత సంసారాన్నీ కలవరపరుస్తూ ఉన్న ఆకలీ, పేదరికం, ఆచారదాస్యం, పరాధీనతా ఈ నూతన వాఙ్మయానికి ప్రధాన వస్తువులు.

జడత్వం, నిర్వ్యాపార హేతువాద వైముఖ్యం వీటిని వృద్ధినిరోధకాలని నిర్ణయించి పరిత్యజిస్తున్నాము.

మనలో విమర్శకబుద్ధిని పెంపొందించేదీ, సంస్థలనూ, ఆచారాలనూ హేతువాదంతో పరిశీలింపజేసేదీ, కావ్యపరత్వానికి సహాయకమైనదీ, చిందరవందరలైన మన శక్తులన్నిటినీ ఏకముఖంగా నడిపించగలిగినదీ, మనలో సముచిత పరివర్తనం కలిగించేదీ; వీటిని వర్ధమానమని అంగీకరిస్తున్నాము.

ఆశయాలు

ప్రజల వాఙ్మయం అభివృద్ధి చెయ్యడం ఈ సంఘానికి ముఖ్యోద్దేశం. వర్ధమాన సాహిత్యం సృష్టించినవారూ, అట్టి ప్రజ్ఞ కలవారూ సభ్యత్వానికి అర్హులు. సాహిత్యవాసన లేకుండా రాజకీయాందోళనకు యత్నించదలచినవారికి ఈ సంస్థలో చోటులేదు.

ఈ క్రిందివి మరికొన్ని లక్ష్యాలు :

ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ సంఘశాఖలు నెలకొల్పడం, సమావేశాలవల్లనూ, రచనలమూలంగానూ వేరువేరు శాఖల వ్యవహారాలన్నీ ఏకముఖంగా కొనసాగించడం.

ఈ సంఘంవారి లక్ష్యాలకు విరుద్ధంగా వర్తించని ఇతర సంస్థలన్నింటితోనూ కలిసి పనిచేయడం.

పల్లెలలోనూ, పట్టణాలలోనూ, అధోగతిలోపడి ఉన్న జనసమూహాలకు వర్ధమాన భావాలు ప్రబోధించడం.

తెనుగులో వర్ధమాన సాహిత్యాన్ని సృష్టించడానికి తగిన అవకాశాలు కలిగించడం. ఇతర భాషలలోంచి అట్టి సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించడం, సభ్యుల స్వతంత్ర రచనలు ప్రకటించడం. ఈవిధంగా ప్రతికూల శక్తులను నిర్మూలించి సాంఘిక పునరుజ్జీవనానికి దారితీయడం.

వర్ధమాన లేఖకుల హక్కులను సంరక్షించడం.

పరిపూర్ణమైన భావ స్వాతంత్ర్యాన్ని సాధించడం.

('ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం మానిఫెస్టో యిది. ప్రచురణ కాలం. 1934)

అఖిలభారత సంఘం 'ఇండియన్ లిటరేచర్' అనే ఆంగ్ల పత్రికను ప్రచురించ సంకల్పించింది. దాని సంపాదక వర్గంలో కూడా అబ్బూరివారు ఎన్నిక అయ్యారు. ఆయన ఎప్పుడూ కమ్యూనిస్టు సెల్‌లో సభ్యులుకారు. అయినా కమ్యూనిస్టు కార్యకర్తలు నిర్వహించే రాత్రి పాఠశాలలు మొదలైనవాటిలో తనతోపాటు తన కుమారుడు వరద రాజేశ్వరరావుని కూడా తీసుకొని వచ్చి చురుకుగా పాల్గొనేవారు. అయితే జైలునుంచి ఎం.ఎన్.రాయ్ విడుదలయ్యాక అతని ఆగమనంతో అబ్బూరివారి ఆలోచనా క్రమం మారిపోయింది. రాయ్ అభిప్రాయాలను బలపర్చసాగారు. సామ్యవాద సభ్యుల్లో రేకెత్తగల అనుమానాలను తొలగించడానికి చంద్ర రాజేశ్వరరావుగారు కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌లో ఎం.ఎన్.రాయ్ విచ్ఛిన్నకర పాత్రను ఓపిగ్గా వివరించవలసి వచ్చింది. అప్పుడు చంద్ర రాజేశ్వరరావుగారు విశాఖలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు. అంతర్జాతీయంగా 'ట్రాట్‌స్కీయిజాన్ని, జాతీయంగా రాయిజాన్ని ఎదుర్కోవలసిన అవసరాన్ని సుందరయ్యగారు సామ్యవాదశక్తులకు ఉద్బోధించారు.

1936లో ఇంకా చెప్పుకోదగ్గ కృషి జరిగింది. ఆ సంవత్సరం సెప్టెంబరు మాసంలో రాజమండ్రిలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ద్వితీయ మహాసభ జరిగింది. వివిధ జిల్లాల నుంచి దాదాపు 60మంది ప్రతినిధులు అందులో పాల్గొన్నారు. వీరిలో కవులు, అనువాదకులు, రచయితలు, సంపాదకులు చాలామంది ఉన్నారు. కొందరిపేర్లు నేడూ సుప్రసిద్ధాలు.

శ్రీరంగం నారాయణబాబు	తుమ్మల వెంకట్రామయ్య
దర్శి చెంచయ్య	పెండ్యాల లోకనాథం
మద్దూరి అన్నపూర్ణయ్య	పులుపుల శివయ్య
క్రొవ్విడి లింగరాజు	పుచ్చలపల్లి సుందరయ్య
మహీధర జగన్మోహనరావు	చదలవాడ పిచ్చయ్య
కొంపెల్ల కామేశ్వరరావు	జొన్నలగడ్డ రామలింగయ్య
కొండేపూడి లక్ష్మీనారాయణ	దర్భా కృష్ణమూర్తి
కొసరాజు శేషయ్య	

ఇంతమంది వివిధ ప్రక్రియల సాహితీపరులు ఉద్యమంలో ఉన్నందువల్ల సామ్యవాద ప్రచార సాధానలలోనే రచనలు విరివిగా వెలువడుతూనే ఉన్నాయి. ప్రత్యేకంగా ప్రోగ్రెసివ్ రచయితల సంఘం ఏర్పాటు కాకపోవడం ఒక లోటే అయితే 1933లోనే నవ్యసాహిత్యా పరిషత్తు అనే రచయితల సంఘం సంస్థాపితమయింది. పాతసాహితి సమితి సభ్యులు, కవితాసమితి సభ్యులు, ఆ కోవకు చెందినవాళ్ళు ఇందులో చేరారు. వీళ్ళను 'గిరజాలవాళ్ళు, సన్నలాల్చీలవాళ్ళు' అని ప్రజలు పేర్కొనేవారు. నవ్యసాహిత్యా పరిషత్తుసభలు రాజమండ్రి, కాకినాడ, బెజవాడ, బందరు, మద్రాసు వంటి నగరాలలో ఉత్తరోత్తరా వరసగా జరిగాయి. ఎక్కడ జరిగినా ఆ సభలు 'విశాలమైన పెళ్ళి పందిళ్ళు, యావదాంధ్ర కవితా బంధువులు ఒక్కచోటకు ఆత్మీయంగా చేరి విందులు కుడుస్తూ పందిట్లో చేరిన ప్రజల చెవులకు విందులు చేస్తూ'' ఉండేవారు. ఈ పెళ్ళిసందడి ప్రజాసాహిత్యానికి పండగ కాలేకపోయింది.

1936లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'ప్రబుద్ధాంధ్ర' ఆగిపోయింది. నవ్యసాహిత్య పరిషత్తువారి పత్రికగా 'ప్రతిభ' ప్రారంభమైంది. దాని తొలిసంచికలోనే పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు సంస్థ నాల్గవ సమావేశంలో చేసిన అధ్యక్షోపన్యాసం అచ్చువేశారు. అందులోనే ఆయన ఒక సంగతి స్పష్టం చేశారు.

''ఎప్పుడో పాతిక శతాబ్దాల క్రింద ఏర్పడ్డ లక్షణశాస్త్రాలూ, వ్యాకరణ శాస్త్రాలూ విధించిన కట్టుబాట్లనూ, ధర్మశాస్త్రాలూ, సంఘశాస్త్రాలూ నియమించిన నిబంధనలున్నూ, కులాలు, మతాలూ, వ్యక్తులూ ఇత్యాదులలో భేద భావాలున్నూ మన అభ్యున్నతికి అడ్డుపడునట్లుండే వాటిని కోసివేస్తున్నాము. ప్రయోజనకారులుగా ఉన్నవాటిని శిరసావహిస్తున్నాము.

ఇది సరియైన సాంఘిక సాహిత్య చైతన్యం. 1936లోనే 'ఉదయిని' చివరి సంచికలో కొంపెల్ల జనార్ధనరావు అంతర్జాతీయ సాహిత్య రంగంలో పరిస్థితులను గమనించి వ్యాఖ్యానం చేశాడు.

''ఇటీవల లండన్ నగరమున జరిగిన "International Association of Writers for the defence of Culture" అనే ప్రపంచ గ్రంథకర్తల సమావేశమున్ను... ఉన్నత లక్ష్యమును కనబరుస్తున్నది... ఇన్నిభాషల్లో సారస్వతములు, ఇంచుమించు అన్నిచోట్లనూ అభ్యుదయ సంరంభముతోనే జీవిస్తున్నవి.''

1936లోనే పంచాగ్నులవారు, కొంపెల్ల జనార్ధనరావూ తమ రచనల్లో 'ప్రోగ్రెసివ్' అనే అర్థంలో అభ్యున్నతి, అభ్యుదయ... అనే ప్రయోగాలు చేశారు. అయినా ప్రోగ్రెసివ్ రచయితల సంఘం అనిపించుకు చెలామణి కావడానికి మరికొంతకాలం పట్టింది. అబ్బూరివారు సారథ్యం వహించిన సంఘాన్ని చలం తన లేఖలో అభ్యుదయ రచయితల సంఘం అనే పిలిచినట్లుగా దాఖలాలు ఉన్నాయి. అయితే ఈ లేఖలను చలంగారు ఇంగ్లీషులో మొదట రాశారు. తర్వాత 1945లో అనువదించారు. అప్పుడు ప్రోగ్రెసివ్ అనే మాటకు అభ్యుదయం అని ప్రచారంలో ఉన్న పదాన్నే వాడుకొని ఉంటారు. అబ్బూరివారు రాయిజం దారిలో పడితే ఆయన అనుయాయి అయిన శ్రీరంగం శ్రీనివాసరావు కూడా ఈ సంఘ కార్యకలాపాల జోలికి పోయినట్టు లేదు. అయినా నిరంతర గ్రంథపఠనం వల్లా, సామ్యవాద సాహిత్యపు దర్శనం వల్లా రచయితల కుండవలసిన శ్రామిక పక్షపాతం ప్రస్ఫుటంగా అతని దృక్పథంలో కనబడుతుంది.

1937లో శ్రీరంగం శ్రీనివాసరావు ''శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని'' గుర్తించి ఒక ప్రతిజ్ఞను తీసుకొన్నాడు. గురజాడ అప్పారావుగారు ''దేశమంటే మనుషులోయ్'' అని చెప్తే, శ్రీనివాసరావు కష్టజీవులే నిజమైన మనుష్యులని స్పష్టపరిచాడు. ప్రబంధ కవులు కృతిభర్తకు ''అభ్యుదయ పరంపరాభివృద్ధిగా'' కృతులు అంకితం ఇస్తే, శ్రీరంగం శ్రీనివాసరావు శ్రమకర్తలైన కష్టజీవులకు కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ'', ''స్వస్తి వాక్యములు సంభావిస్తూ'' శరీర కష్టం స్ఫురింపచేసే సహస్రవృత్తుల సమస్త చిహ్నాలను నవీనగీతికి, నవీన రీతికి ప్రాణంగా భావించాడు. ఇది అతనిలో ఉన్న క్రొపాట్కిన్‌భావాల కోలాహలం వల్లనే జరిగింది.

1938లో అతడు అభ్యుదయ కవిత్వ శిఖరాలను అధిరోహించాడు. అభ్యుదయ కవిత్వానికి ఏకైక ప్రతినిధి తానే అనిపించుకొన్నాడు.

1938లోనే శిష్ట్లా ఉమామహేశ్వరరావు కావ్య సంకలనాలు 'నవమి చిలుక', 'విష్ణుధనువు' ప్రచురితమయ్యాయి. 1931లోనే శ్రీరంగం శ్రీనివాసరావుకన్నా ముందుగానే శిష్ట్లా అతి నవ్య కవిత్వం మొదలుపెట్టినా సమకాలికులతో తప్ప సార్వకాలీనమైన గుర్తింపును పొందలేకపోయాడు. 'నవమి చిలుక'కు విమర్శ రాస్తూ భావకవులపై జరుగుతున్న 'ప్రొలిటేరియన్ విప్లవమున'కీ కవి దారితీస్తున్నాడని గోపిచంద్ చెప్పాడు. ఈ కవి కావ్యము అచ్చంగా శ్రామిక వర్గ సంబంధికాదని స్పష్టపరిచి ''యీ కవిత్వంలో బూర్జువా వాసన, ప్రొలిటేరియన్ యాస కనిపిస్తున్నాయ''ని కూడా గోపీచంద్ వ్యాఖ్యానించాడు. నిజానికిది ఆనాటి మధ్య తరగతి కవులందరికీ వర్తిస్తుంది.

సమాజంలో వివిధ వర్గాలున్నాయి. ఏ వర్గంకోసం రచయితలు రచనలు చేయాలి? 1938లో రాయిస్టులు 'క్రింది వర్గానికి పనికివచ్చేటట్లు రాయాలి', అన్నారుగానీ ఆ తర్వాత 1941 నుండి వాదం మార్చుకొన్నారు. జి.వి.కృష్ణారావుగారు యిలా రాశారు.

''వర్గ సంబంధాలను మనదేశంలో పరిశీలించి చూస్తే కార్మికుల బలం చాలా తక్కువగా వుంది. అసలు ఏ విప్లవం రావాలన్నా రాజకీయ చైతన్యముండాలి. ఇలాంటి చైతన్యం మధ్యతరగతిలోనే వుంది. వుంటానికి అవకాశముంది. పరిశ్రమలు బాగా అభివృద్ధి కాలేదు. ఉన్న కొలదిమంది కార్మికులకు విద్యాగంధం లేదు''.

''మనదేశంలో మధ్యతరగతి కోసం వ్రాయాలి''.

''మనం వ్రాయడానికి పూనుకోకపోతే మరొకరిచేత వ్రాయించుకొంటుంది మధ్యతరగతి, పైగా కార్మికులకంటె ఎక్కువగా డబ్బిస్తుంది''.

రాయిస్టుల సాహిత్యపు పోకడలన్నింటినీ కూలంకషంగా చర్చించి ఆ వాదాలలోని బండారాన్ని మద్దుకూరి చంద్రశేఖరరావుగారు 'తెలుగుతల్లి' సంచికలో ఎండగట్టారు. ప్రజా సమస్యలను తీర్చి ప్రజలకు నాయకత్వం వహించి నడుపజాలని కార్యక్రమం మార్క్సిస్టు కార్యక్రమం కాదని ఉద్ఘాటించారు. అయితే 1939-42 దాకా కణకణమండే కవితల నిప్పుచుట్టూ మధ్యతరగతి మందభాగ్యం నివురులాగ కప్పుకొంది. సమష్టి సమరం స్థానంలో వ్యక్తిగత సత్యాగ్రహం మొక్కుబడిప్రాయంగా దాపురించింది. 1942లో గాని ప్రజాశక్తులు విజృంభించలేదు. నిన్నటి కవులు నేడు దీనికి శ్రమించలేదు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీ అనే పొడి అక్షరాల సంకేతమై సర్రియలిజంలోనికి నిష్క్రమించాడు. తనతోబాటు నారాయణబాబునీ లాక్కొనిపోయాడు. ఒకనాడు 'విలయవేళల ప్రళయతాండవం చేసే శివునకు వెనుకపాట పాడే'' శ్రీరంగం నారాయణబాబు కంచుకంఠం మౌనశంఖమైంది. (1930లో మధ్య తరగతి తిరుగుబాటులో ఒకటైన వచనకవిత్వం పఠాభి ఫిడేలు రాగాలతో వినిపించింది. ఇది యుగలక్షణం). అయితే ప్రగతివాదం మాత్రం నిద్రామగ్నం కాలేదు. నవ్యకవిత్వం నయాగరాలాన ఉరకసాగింది. కొత్తకవులు వచ్చారు. కొత్త చైతన్యాన్ని వినిపింపచేశారు.

1943లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. ప్రథమ మహాసభలు తెనాలిలో తాపీ ధర్మారావుగారి అధ్యక్షతన జరిగాయి. రాయిస్టులు వీటికి హాజరుకాలేదు. ఆ సభకు ముఖ్యఅతిథిగా ఆహ్వానితుడైన శ్రీశ్రీ వస్తానని చెప్పి కూడా రాలేదు. ఆ సందర్భంగానే మహాప్రస్థానం ప్రచురించాలన్న నిర్వాహకుల కోరికనుకూడా శ్రీశ్రీ తిరస్కరించాడు. కొడవటిగంటి కుటుంబరావు మహాసభ ఆహ్వానాన్ని తిరస్కరించడమే కాక, అసలు ''రచయితలకు సంఘం ఎందుకని'' ప్రశ్నించాడు. ఈ సత్యాలను సంఘం వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన చాగంటి సోమయాజులుగారు యిటీవల వెల్లడి చేశారు.[6] అరసం రెండో మహాసభలు బెజవాడలో జరిగాయి. దానికి కూడా కొందరు రాలేదు.

ఎవరు వచ్చినా, ఎవరు రాకపోయినా ఉద్యమం ఆగదు. ఉన్నవాళ్ళ ఉత్సాహంతోనే ముందుకు సాగుతుంది. చైతన్యవంతులైన రచయితలు నిర్దాక్షిణ్యంగా గతాన్ని విశ్లేషించి గుణపాఠాలను బోధించసాగారు. నిష్పక్షపాతంగా వర్తమానాన్ని అవగాహన చేసుకోదలిచారు. నిరాటంకంగా భవితవ్యానికి దారులు వేయడానికి నిశ్చయించు కొన్నారు.

1943 ఫిబ్రవరి 13, 14 తేదీలలో తెనాలిలో జరిగిన ప్రథమ మహాసభల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితలు తాపీ ధర్మారావుగారి అధ్యక్షత క్రింద కొన్ని తీర్మానాలు చేశారు. ప్రజాశక్తులకు ప్రపంచ యుద్ధంలో జయం లభించేటట్టు పాటుపడాలనీ, ప్రపంచ శాంతి నెలకొల్పాలని ప్రథమ తీర్మానం. పత్రికా సాహిత్యంపై ప్రభుత్వం అమలు జరుపుతున్న నిరంకుశ నిర్బంధ విధానాన్ని నిరసించడం రెండో తీర్మానం. విద్యార్థులపై జరుగుతున్న అణచివేత చర్యలను ఖండిస్తూ రాజకీయ సభ్యులపై సంపూర్ణ వాక్స్వాతంత్ర్యం వుండాలన్నది మూడో తీర్మానం. ఈ సభలో కార్యదర్శిని, కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు. వాళ్ళ పేర్లు :

చదలవాడ పిచ్చయ్య (కార్యదర్శి)	ఎం. సర్వేశ్వరరావు
చాగంటి సోమయాజులు	వట్టికొండ రంగయ్య
నిడమర్తి అశ్వనీ కుమారదత్తు	తాపీ మోహనరావు
మహీధర జగన్మోహనరావు	సెట్టి ఈశ్వరరావు
ప్రయాగ కోదండరామశాస్త్రి	వట్టికొండ విశాలాక్షి
రాటకొండ నరసింహారెడ్డి	

అభ్యుదయ రచయితలకు ఆనాడు ప్రత్యేకంగా ఒక పత్రిక లేదుగానీ రాచమళ్ళ సత్యవతీదేవిగారి 'తెలుగుతల్లి' అనే పత్రికను వేదికగా వాడుకొని ప్రథమ మహాసభల సందర్భంలోనే ఒక ప్రత్యేక సంచికను వెలువరించారు. తాపీ ధర్మారావు, తుమ్మల వెంకట్రామయ్య, చదలవాడ పిచ్చయ్యగార్లతో ఒక సంపాదకత్వాన్ని ఏర్పాటు చేశారు.

1944 డిసెంబరు 29, 30, 31 తారీఖులలో రెండవ మహాసభ విజయవాడలో జరిగింది. లండన్‌లో 1936లోనే భారతీయ అభ్యుదయ రచయితల సంఘ స్థాపనకు

6. అభ్యుదయ - 1987-88 సంIIలోని ఒక సంచిక

కృషిచేసిన మూలపురుషుడు సజ్జాద్ జహీర్ ప్రారంభోపన్యాసం చేశారు. నవ్యసాహిత్య పరిషత్తు యావజ్జీవ కార్యదర్శి తెలికిచర్ల వెంకటరత్నంగారు ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఆయన తన ఉపన్యాసంలో ''కవిని పశువుని చేసి ముక్కుకు తాడు గట్టి తమ యిచ్చవచ్చిన రీతి కవితా వ్యవసాయము చేయించుకోగోరిన సామ్యవాదుల చేతిలోని కీలుబొమ్మ ఈ అభ్యుదయ కవి అని కొందరపవాదు వేస్తున్నారు. ఈ కవి మన సంప్రదాయములలోని వాడుకాదు, ఇతనిది కేవలం రష్యన్ దృష్టి అని కొందరంటున్నారు'' అని చెప్పారు.

''సమాధానాలు చెప్పుకోవడం ప్రధానంగా పెట్టుకోక అభ్యుదయ కవులు విరివిగా అభ్యుదయ సాహిత్యంలో కృషి చేసినా, అభ్యుదయ రచనలు ప్రజలలో వ్యాపింపచేసి ప్రజా సముదాయానికి అభ్యుదయము సాధింతురుగాక'' అన్నారు.

రెండవ మహాసభలో కార్యవర్గం విస్తరణ పొందింది. కార్యవర్గంలో రమారమి కొత్తసభ్యులను చేర్చుకొన్నారు. కొత్తగా చేరినవారు :

తుమ్మల వెంకట్రామయ్య (కార్యదర్శి)	
కొమర్రాజు వినాయకరావు (సహాయ కార్యదర్శి)	తెన్నేటి సూరి
ప్రయాగ కోదండరామశాస్త్రి (సహాయ కార్యదర్శి)	కొత్తపల్లి లక్ష్మయ్యా
తెలికచర్ల వెంకటరత్నం	వట్టికోట ఆళ్వారుస్వామి
పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి	దేశిరాజు కృష్ణశర్మ
అడవి బాపిరాజు	అ. నరసింహశర్మ
భద్రిరాజు భద్రిరాజు	నాగభైరవ శివరామకృష్ణయ్యా
మల్లవరపు విశ్వేశ్వరరావు	మహీధర రామమోహనరావు
మద్దుకూరి చంద్రశేఖరరావు	ముద్దుకృష్ణ
పి.వి.శివయ్యా	ఏల్చూరి సుబ్రహ్మణ్యం
విద్వాన్ విశ్వం	ఆళ్ళ చలమదాసు
షేక్ ఫరీద్ కవి	అత్తలూరి సర్వేశ్వరరావు
నేదునూరి గంగాధరం	చదలవాడ పిచ్చయ్యా

పాత కార్యవర్గంలో ఉన్న ఈక్రింది ఆరుగురికి రెండో కార్యవర్గంలో ఎటువంటి స్థానమూ కల్పించలేదు.

నిడమర్తి అశ్వనీ కుమారదత్తు
మహీధర జగన్మోహనరావు
రాటకొండ నరసింహారెడ్డి
ఎం. సర్వేశ్వరరావు
వట్టికొండ రంగయ్యా
తాపీ మోహనరావు

తొలి కార్యవర్గంలో ఉన్న చాగంటి సోమయాజులు, సెట్టి ఈశ్వరరావు, వట్టికొండ విశాలాక్షి - ఈ ముగ్గురు మాత్రమే రెండో కార్యవర్గంలో కొనసాగారు. మొదటి కార్యవర్గంలో కార్యదర్శిగా ఉన్న చదలవాడ పిచ్చయ్య రెండవ మహాసభనాటికి కార్యవర్గంలో సాధారణ సభ్యుడయ్యాడు. మొదటి మహాసభలో సంపాదకవర్గ సభ్యునిగా ఉన్న తుమ్మల వెంకటరామయ్య రెండో కార్యవర్గంలో కార్యదర్శిగా నియమితులయ్యారు. మొదటి కార్యవర్గంలో సాధారణ సభ్యుడైన ప్రయాగకోదండరామశాస్త్రి రెండో కార్యవర్గంలో సహాయ కార్యదర్శిగా నియమితుడయ్యాడు.

రెండవ మహాసభ నాటికి అభ్యుదయ రచయితల సంఘం చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి 'స్వీయచరిత్ర'ను ప్రచురించి, ఆయనకు వెయ్యినూట పదహార్లు ఇచ్చి సత్కరించింది.

3వ మహాసభ 1945 డిసెంబరు 31వ తేదీనాడూ, 1946 జనవరి ఒకటీ, రెండూ తారీఖులలోనూ రాజమండ్రిలోనూ జరిగింది. ఈ సభకు ముల్క్‌రాజ్ ఆనంద్‌గానీ, ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీగాని వచ్చి ఎవరో ఒకరు ప్రారంభోపన్యాసం చేస్తారనుకొన్నారు. వారు రాలేదు. శ్రీరంగం శ్రీనివాసరావు సభను మొదలుపెడుతూ ప్రసంగించాడు.

ప్రతి మహాసభలోనూ అభ్యుదయ రచయితలు ఒక రాజకీయ పార్టీకి ప్రచారకులనే 'అపోహ'ను పోగొట్టడానికే అందరూ ప్రయత్నిస్తున్నట్టు కనబడుతుంది. శ్రీశ్రీ కూడా తన ప్రారంభోపన్యాసంలో ప్రజాసాహిత్యవాదుల మీద రెండు గట్టి ఆరోపహణలు ఉన్నాయని చెప్పాడు. ఒకటి - తక్షణ సమస్యల పరిష్కారానికి సాహిత్యాన్ని ఒక సాధనం చేస్తే ఆచంద్ర తారార్కం నిలవగల రచనలు వెలువడతాయా అన్నది. రెండు - సర్వతోముఖంగా విజృంభించవలసిన సాహిత్యం సంకుచితమైన ప్రచారం సాధించితే రసవత్కావ్య సృష్టి అవుతుందా? అనేది. ఈ ఆరోపణలకు శ్రీశ్రీ జవాబులు చెప్పాడు. చిత్తశుద్ధిగల ప్రతి రచయితా ఎప్పుడో ఒకప్పుడు బాహాటంగా తనకు అభిమానం ఉన్న వర్గం తరపున చేరుకుంటాడనీ, ఏదో ఒక భావాన్ని ప్రచారం చేయకుండా శూన్యంలో వెలువడ్డ కావ్యాన్ని తానింకా చూడలేదని చెప్పాడు.

మూడవ మహాసభకు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. ఆయన తన ఉపన్యాసంలో ఇలా చెప్పారు.

''ఈ సంఘంలో అందరూ ఉండవచ్చు. ఏ రాజకీయాభిప్రాయాల ప్రభావం పొందిన వారయినా వుండవచ్చు. సమస్త మానవకోటి ఒకానొక నూతన లక్ష్యంవైపు నడుస్తున్నది. పాతప్రపంచం శిథిలమయి ఆ స్థానంలో మరో కొత్త ప్రపంచం ఉద్భవిస్తున్నది. ఈ విషయం దృష్టిలో పెట్టుకొని చైతన్యంతో ప్రసన్నబుద్ధితో ఎవరు దేన్నిగురించి ఏదివ్రాసినా అభ్యుదయ రచనే అవుతుంది. ఏ విషయాన్నిగాని, ముందుగా కొన్ని అపోహలు పెట్టుకొని ఆలోచించడం మంచిది కాదు''.

అధ్యక్షస్థానం నుంచి అలా సభ్యత్వద్వారాలు తెరుస్తూ 'ధనిక సమాజం మారాలనుకోవటమే అభ్యుదయం' అని చెప్పాక సంఘవైశాల్యం కొన్నిరెట్లు పెరిగింది. కార్యవర్గంలో మరికొందరు కొత్తవాళ్ళని చేర్చుకొన్నారు. వారు :

చదలవాడ పిచ్చయ్య (కార్యదర్శి)	పోలూరి ఆంజనేయప్రసాద్
కొడవటిగంటి కుటుంబరావు (సహాయ కార్యదర్శి)	పైడి వెంకటరావు
జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (సహాయకార్యదర్శి)	ముక్కామల నాగభూషణం
దేవులపల్లి కృష్ణశాస్త్రి	సుంకర సత్యనారాయణ
శ్రీరంగం శ్రీనివాసరావు	నాజరు
ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి	

రెండో కార్యవర్గంలో వున్న ఈ క్రిందివారికి మూడో కార్యవర్గంలో ఏవిధమైన స్థానం లేదు.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి	నాగభైరవ శివరామకృష్ణయ్య
అడవి బాపిరాజు	మహీధర రామమోహనరావు
మద్దుకూరి చంద్రశేఖరరావు	ఏల్చూరి సుబ్రహ్మణ్యం
పి.వి. శివయ్య	ఆళ్ళ చలమదాసు
షేక్ ఫరీద్ కవి	సెట్టి ఈశ్వరరావు
నేదునూరి గంగాధరం	వట్టికొండ విశాలాక్షి
కొత్తపల్లి లక్ష్మయ్య	

రెండో వర్గంలో ఉన్న ఈ క్రిందివారు మూడో కార్యవర్గంలోనూ కొనసాగుతూ వచ్చారు.

చాంగటి సోమయాజులు	విద్వాన్ విశ్వం
తెలికిచర్ల వెంకటరత్నం	తెన్నేటి సూరి
భద్రిరాజు భద్రిరాజు	వట్టికోట ఆళ్వారుస్వామి
తుమ్మల వెంకటరామయ్య	దేశిరాజు కృష్ణశర్మ
ప్రయాగ కోదండరామశాస్త్రి	అ. నరసింహారావు
కొమర్రాజు వినాయకరావు	ముద్దుకృష్ణ
మల్లవరపు విశ్వేశ్వరరావు	అత్తలూరి సర్వేశ్వరరావు

వీరిలో చాగంటి సోమయాజులు, ప్రయాగ కోదండరామశాస్త్రిగార్లు తొలి కార్యవర్గం నుంచీ ఉన్నారు. రెండో కార్యవర్గంలో సాధారణ సభ్యులుగా ఉన్న చదలవాడ పిచ్చయ్య మూడో కార్యవర్గంలో తిరిగి కార్యదర్శిగా నియమితులయ్యారు. అయితే రెండో కార్యవర్గంలో కార్యదర్శిగా ఉన్న తుమ్మల వెంకటరామయ్య, సహాయ కార్యదర్శులుగా వున్న కొమర్రాజు వినాయకరావు, ప్రయాగ కోదండరామశాస్త్రి గార్లు మాత్రం సాధారణ సభ్యులుగా కొనసాగారు.

1946 మే 11 నుంచి జూన్ 10 వరకూ గుంటూరు జిల్లా పెదపూడిలో ఆంధ్ర సాహిత్య పాఠశాలను అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించింది. దీనిని దేవి ప్రసాద్‌రాయ్ చౌదరి ప్రారంభించారు. వివిధ సాహిత్య ప్రక్రియలలో నిష్ణాతులు 15మంది అధ్యాపకులుగా ఉన్న ఈ పాఠశాలలో 48మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నార్ల చిరంజీవి, వాసిరెడ్డి

భాస్కరరావు, షేక్ నాజర్, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య వంటివారు ఉన్నారంటే ఎందరు ఉత్సాహవంతులు ఇందులో చేరినదీ తెలుస్తుంది.

మద్రాసులో 1947 జనవరి 17, 18, 19 తేదీలలో 4వ మహాసభ జరిగింది. కె.ఎ. అబ్బాస్ దీనికి ప్రారంభోపన్యాసం చేశారు. పాకాల రాజమన్నార్ అధ్యక్షత వహించారు. ఈ సభ సాహిత్య జాతరలాగ జరిగింది. అభ్యుదయ రచయితలు జరిపిన ఈ సంబరాల్లో ఎందరెందరో ఎక్కడెక్కడి సాహితీపరులూ వచ్చి పాల్గొన్నారు. పేరుమోసిన పెద్దల దగ్గర్నుంచి పేరు కోరే చంటివాళ్ళదాకా ఎందరో ఒక్కచోట కలుసుకొన్నారు. సాహితీసమితి అన్నగార్లు - నవ్యసాహిత్య పరిషత్తు తమ్ముళ్ళూ, అభ్యుదయ కామ్రేళ్ళూ, అయినవాళ్ళూ, కానివాళ్ళూ అందరూ భుజం భుజం కలుపుకొన్నారు.

నిజం. నిజం చెప్పాలంటే ఆ సమావేశం గురించి అప్పుడే ఒక పెద్దమనిషి గట్టి రిమార్కు చేశాడు. 'ఈ పాతవాళ్ళను ప్రజలు వినడం లేదు. గత్యంతరం లేక మిమ్మల్ని వినియోగించుకోడానికి వస్తున్నారు. మీవాళ్ళు మీ దృక్పథం ఏమిటో చెప్పాల్సింది. అందరూ అభ్యుదయ కాముకులమే అనడంలో అర్థం ఏముంది?'' ఈ ప్రశ్న వేసినది నార్లవారు.[7] అయితే ఆ పాతవాళ్ళను ఈ కొత్తవాళ్ళూ వినియోగించుకోవాలనే ఈ సభలు జరిపారు. ఎందుకంటే అవన్నీ రాజకీయాలు. 1947 ఉదయించగానే మదరాసులో పెద్ద సాహిత్యతిరణాల జరిగిందన్న భోగట్టా. అందులో ఎందరో పాల్గొన్నారన్న సంగతి మాత్రమే ఇక్కడ చెప్పుకుంటే చాలు.

ఆ సభకు రానివాళ్ళంటూ లేరు! లేరూ? క్షమించాలి. శ్రీశ్రీగానీ, నారాయణబాబుగానీ, పఠాభిగాని ఆసభల్లో లేరు. వీళ్ళు ముగ్గురే ఆనాటి అతినవ్య కవులకు ఆచార్యులు. ఆరాధ్యులు. మూకుమ్మడిగా అప్పటి ముసిలాళ్లు ఒప్పుకోక పోయినా, ఏకగ్రీవంగా కుర్రాళ్ళం మాత్రం శ్రీశ్రీని యుగకర్తగా భావించి ఆచార్య పీఠంపై అతణ్ణి నిలుపుకొన్నాం.

మద్రాసులో ఈ సభలు జరుగుతున్నకాలంలో శ్రీశ్రీ హైదరాబాదులో నిజాం కొలువులో ఉన్నాడు. నారాయణబాబును పిలిచారో లేదో తెలియదు. పఠాభి ఎన్నడూ సాహిత్య సభలకు వెళ్ళినట్టు దాఖలాలు లేవు. ఈ సభలలో నిజమైన ప్రగతివాదులేకాక సాహిత్య మితవాదులు, సనాతనులూ, ఛాందసులు, కరుడుకట్టిన అభివృద్ధి నిరోధకులూ ఒకరేమిటి అందరూ వచ్చారు. ఇంతమందిని ఒక్క తాటిమీదకు తీసుకురావటం ఒక ఘనతేకాని అందుకే ఆ తాడు ఆ తర్వాత తెగింది.

ఈ నాల్గవ మహాసభల గురించి పుచ్చలపల్లి సుందరయ్యగారు నిశితమైన సమీక్ష చేశారు.[8] రాజమన్నారు గారి అధ్యక్షోపన్యాసం భాగాన్ని ఉదాహరించి ఇలా రాశారు.

---

7. ''ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ అగ్రనాయకుల నగ్నసత్యాలు'' ఎడిటర్ : చదలవాడ పిచ్చయ్య- పుట.17, (ఈ పుస్తకాన్ని పిచ్చయ్యగారు కమ్యూనిస్టు పార్టీనుంచి బహిష్కృతుడయ్యాక రాసి ప్రకటించారు)
8. ''కామ్రేడ్ సుందరయ్య ఏరిన రచలు'' (2వ భాగం), పుట.96 నుండి

''(ఆయన)'' అభ్యుదయ రచయితలు కేవలం ప్రచారం కోసరం వ్రాయరు. వ్రాయకూడదని నా మనవి. యూరపులో రాజకీయ కక్షలవారు కవులను ప్రచారార్థం వినియోగించుకొంటున్నారు. కాని అది పొరపాటని గ్రహించారు...'' అంటూ మార్క్సు, ఎంగిల్సు, లెనిన్ దృక్పథం అంటూ మార్క్సిస్టుకాని లెహమన్ చెప్పిన వాక్యాన్ని ఉదహరించారు.

''ఈ భావాలను ఎవరూ ఆ సభలో ఖండించలేదు. ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘంలో కమ్యూనిస్టులున్నారు. కమ్యూనిస్టు రచయితలు, రైతు కార్మిక ఉద్యమవ్యాప్తికి తప్పక కృషి చేస్తారు. వారి రచనలకు, పనులకు అదే ప్రధానాశయం. కమ్యూనిస్టుల రచనలు ఉద్యమవ్యాప్తికి ఉపయోగపడే ప్రచారసాధనాలు. అవి ఎంత రసవంతంగా, సజీవంగా వ్రాయగలిగితే అంత పదునైన ప్రచార సాధనాలవుతాయి. యూరపులోని రాజకీయ పార్టీలే కాక ప్రపంచమంతటా కవులు, రచయితలంతా ఏదో ఒక పార్టీ రాజకీయాలను వ్యాప్తిగావించడానికే పూనుకొని కృషిచేస్తున్నారు. కొంతమంది ముఖ్యంగా కమ్యూ యనిస్టులు ఈ సత్యాన్ని బహిరంగంగా గుర్తిస్తున్నారు. కొందరు తాము రాజకీయాలకు, వర్గకలహానికి, వర్గాలకు అతీతులనుకొంటూ, అధికారంలోని వర్గానికి ఊడిగం చేస్తున్నారు. వర్గాతీతమైన సారస్వతం సృష్టిస్తామనుకోవటం వర్గ సమాజంలో సాధ్యం కాదనే విషయాన్ని మరచిపోవడమే''.

సుందరయ్యగారు ఈ సభల గురించి తుదితీర్పు ఇలా చెప్పారు.

''అభ్యుదయ రచయితల సంఘంలో పనిచేసే కమ్యూనిస్టు కామ్రేడ్స్ తమ యీ మూలసిద్ధాంతాలు వదలివేశారు కాబట్టే, వారు అందరకు ముందుండి, మెట్టుమెట్టుకు మరింత అభ్యుదయకర మార్గాన్ని సూచించటానికి బదులు, అందరిని కలుపుకొని రావలెననే ఆవేదనలో అందరికన్నా వెనుకబడి అభ్యుదయ రచయితలను సమర్థించటానికి దిగజారుతున్నారు. రెండు ఉదాహరణలు - విశ్వనాథవారి సందేశానికి 'అభ్యుదయ' అంత ప్రాముఖ్యం ఇవ్వటంగాని, కట్టమంచి రామలింగారెడ్డిగారి సందేశాన్ని తెప్పించుకోవటం గాని జరిగి ఉండాల్సినవి కావు. అర్థంకాని పొగడ్తలతో ఆధునిక రచయితలను కొందరిని ఆకాశానికి ఎత్తడం జరిగింది.''

మద్రాసు సభలో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు గాని అది ఏదీ సాధించినట్టు కనపడదు. పల్లెకోనలో సాహిత్య పాఠశాలను నడిపారుగాని, సంఘం కార్యదర్శి, సహాయ కార్యదర్శి కారణాంతరాల వల్ల సంఘానికి దూరమయ్యారు. తెలంగాణా పోరాటం ఫలితంగా ఆంధ్ర జిల్లాల్లో ప్రగతివాదులమీద ప్రభుత్వం దమనకాండ ప్రారంభించింది. అభ్యుదయ శక్తులు కాందిశీకులయ్యారు. మద్రాసు సభలు జరిగిన ఎనిమిదేళ్ళ తర్వాత గాని మళ్ళా మహాసభ జరపలేని స్థితి ఏర్పడింది.

ఈ ఎనిమిదేళ్ళలో కృష్ణాగోదావరి వంతెనల క్రింద బోలెడంత గంగ పారింది. అందులో ఎన్నో కొట్టుకుపోయాయి. ఎన్నో కొట్టుకొని వచ్చాయి. 1947లోనే దేశానికి స్వాతంత్ర్యమొచ్చింది. సామ్యవాద విధానాలు దేశానికి పోలసీ అయ్యాయిగాని నిజమైన

సామ్యవాదులను ప్రభుత్వం వేటాడి చిత్రహింసల పాలు చేయడం ప్రారంభించింది. ఈ చర్యలకు ప్రజలు ఉత్తరోత్తరా తగిన పాఠం చెప్పారు. 1952లో జరిగిన ఎన్నికలలో అధికార పక్షంలోని ముఖ్యులందరూ ఓడిపోయారు. ప్రగతివాదులను ఘనంగా గెలిపించారు. ఈ గెలుపు ఒక పెద్ద మలుపు.

ఆశయసిద్ధికోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూడా ఒక ఆయుధంగా ప్రగతిశక్తులు స్వీకరించాక, ఉద్యమ స్వభావాలు మారక తప్పదు. కొత్త విఘాతాలను ఎదుర్కొనక తప్పదు. ప్రగతి శక్తులు ఎన్నికల రంగంలో ప్రవేశించడమే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదమని అభివృద్ధి నిరోధకులు ఎలుగెత్తి గోలపెడతారు. అవకాశవాదులు దానికి తోడవుతారు. 1955లో ఇదే జరిగింది. అభివృద్ధి నిరోధకుల కూటం ప్రజాస్వామ్య రక్షణకోసం ఒక మహజరును ఎన్నికలముందు సిద్ధం చేశారు. లోగడ అభ్యుదయ వేదిక ఎక్కిన మతవాదులు, సనాతనులు, ఛాందసులు - ఒకరేమిటి సామ్యవాదానికి కట్టుబడని రచయితలందరూ దానిమీద సంతకాలు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని సంరక్షించడానికి పూనుకొన్న ఈ పెద్దలంతా కాటూరు, యలమర్రులలో ప్రజలకు మానభంగాలు జరిగినప్పుడు నోరుతెరవలేదేమని నార్ల చిరంజీవి వేసిన ప్రశ్నకు ఒక్కరూ సమాధానం చెప్పలేదు.

1955లోగాని వేడిపుట్టలేదు. బలమైన ఉద్యమం లేకపోవడం ఎంత లోపమో తెలియవచ్చింది. ఆ సంవత్సరం జూలై 30, 31వ తేదీలలో విజయవాడలో 5వ మహాసభను అభ్యుదయ రచయితల సంఘం జరుపుకొంది. డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారు ఆహ్వాన సంఘాధ్యక్షులు. ఆయన తన స్వాగతోపన్యాసంలో ఇలా అన్నారు.

''అభ్యుదయ రచన సంఘర్షణలను సృష్టించినప్పుడు జయాపజాలనీ, సాహస కృత్యాల్నీ చిత్రించడం సహజం. సంఘర్షణను ఏ స్థాయిలో చూపించినా సరే - ప్రతీ వీరోచిత కార్యానికీ, ప్రతి సాహస కృత్యానికీ సమర్థిందగినంత లక్ష్యం ఉండాలి. ప్రతీ త్యాగంలోనూ హర్షించదగినంత ధ్యేయం పరమార్థం వుండాలి. ప్రతీ ఆత్మ బలిదానం లోనూ ప్రవర్ధమానమైన ప్రజాభీష్టం ప్రస్ఫుటమై ఉండాలి. ప్రతీ ఓటమి విజయోన్ముఖంగా దారితీయాలి. ప్రతీ అపజయం విజయసాధనానికి ద్విగుణీకృత ప్రోత్సాహం కలుగ జేయాలి. ప్రతీ పరాజయం అంతిమ విజయానికి నాందీ ప్రస్తావనగా పరిణమించాలి''.

ద్విగుణీకృత ఉత్సాహంతో జరిగిన ఈ సభలలో శ్రీశ్రీ తన అధ్యక్షోపన్యాసంలో వాస్తవాన్ని ఇలా చెప్పాడు.

''మనం ఆశిస్తున్న దొకటైతే యథార్థం ఇంకొకలాగ కనబడుతోంది. ఎటుతిరిగినా ఏదో నిస్త్రాణా, ఏదో నిస్పృహ! ఫౌల్ చేసి, గోల్ చేసి గెలిచిన ప్రతీపశక్తులు పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్నాయి. అయిదారేళ్ళకు పూర్వం అభ్యుదయ రచయితల సభల్లో పువ్వుల దండల్ని వేయించుకొని జయజయ ధ్వానాల మధ్యన ఊరేగిన మిత్రులు కొందరీనాడు క్షుద్ర ప్రయోజనాల మరుమరీచికల వెంటబడి ఉద్యమ విచ్ఛిత్తికి దారితీస్తున్నారు. సరియైన నేతృత్వం లోపించడం వల్ల యువకుల తరంలో కూడా

ప్రమాదభరితమైన ఒకానొక నిరుత్సాహ నిరాశాధోరణి తలయెత్తుతున్న సూచనలు కనబడుతున్నాయి. ఇటువంటి సంకీర్ణ, సంక్లిష్ట వాతావరణంలో ఈనాడు మనం సమావేశమౌతున్నాము.''

ఈ సమావేశంలో సంఘం తన కార్యక్రమాలను బహుముఖాలుగా రూపొందించుకోవాలనుకొంది. అందుకు వీలుగా కొత్త కార్యనిర్వాహక సంఘాన్ని చాలామంది సభ్యులతో ఎన్నుకొంది. పేర్లు చూడండి.

కార్యనిర్వాహక సమితి వర్గం :

శ్రీరంగం శ్రీనివాసరావు (అధ్యక్షులు)   తుమ్మల వెంకటరామయ్య (కార్యదర్శి)

సభ్యులు :

అనిసెట్టి సుబ్బారావు   రాంభొట్ల కృష్ణమూర్తి
మా. గోఖలే   నార్ల చిరంజీవి
కొడవటిగంటి కుటుంబరావు   అవసరాల సూర్యారావు
సుంకర సత్యానారాయణ   కవులూరి వెంకటేశ్వరరావు
కె.వి. రమాణారెడ్డి   సోమసుందర్
కె. ఆంజనేయులు   గంగినేని వెంకటేశ్వరరావు
ధనకుధరం   పూసపాటి కృష్ణంరాజు
కారుమంచి వెంకటేశ్వరరావు   ఆకెళ్ళ కృష్ణమూర్తి
పి. లక్ష్మీకాంతమోహన్   డి.ఎ.ఎస్. నారాయణరావు
బి.వి. నరసింహారావు   కాళోజి నారాయణరావు
బి.వి. నరసింహారావు   పి. సదాశివరావు
రెంటాల గోపాలకృష్ణ   యం. శివనాగయ్య
శ్రీనివాస చక్రవర్తి   పి. లక్ష్మీకాంతమోహన్
ఉప్పల లక్ష్మణరావు

కార్యవర్గం :

కాళోజి నారాయణరావు   సోమసుందర్
నార్ల చిరంజీవి   గంగినేని వెంకటేశ్వరరావు
అనిసెట్టి సుబ్బారావు   కారుమంచి వెంకటేశ్వరరావు
రమణారెడ్డి

'అభ్యుదయ' సంపాదకవర్గం :

శ్రీరంగం శ్రీనివాసరావు   తుమ్మల వెంకటరామయ్య
కొడవటిగంటి కుటుంబరావు   కె.వి. రమణారెడ్డి
అనిసెట్టి సుబ్బారావు

ఇందరు కార్యనిర్వాహక సభ్యులు ఇంతకుముందు ఈ సంఘానికి లేరు. శ్రీశ్రీ తన అధ్యక్షోపన్యాసంలో ''ఇప్పుడు గోచరిస్తూన్న ఈ నిర్లిప్తత కేవలం తాత్కాలికం మాత్రమే''

అన్నాడుగాని 1955లోని నిర్లిప్తత 1970దాకా కొనసాగింది. సంఘాన్ని క్రియాశీలం చేయటానికి కొందరు ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. 1962లో ప్రగతి శక్తులకు ఒక పెద్ద తుపాను తగిలింది. చైనా మనదేశంపైన దాడిచేయడంతో ప్రగతివాదులలో చాలామంది మన జాతీయ ప్రయోజనాలపై దృష్టి మళ్ళించారు. తెలుగు కవిత దేశభక్తిని ఒంటికి పట్టించుకొంది. ప్రగతిశక్తులలో చీలికలు బయలుదేరాయి. 'సంగ్రామంలో పరాజయం సామ్యవాదానికే పరాజయం' అన్నట్లు అభివృద్ధి నిరోధకులు భావించసాగారు. జాతీయవాదం పెచ్చుపెరిగి తెలుగుకవితలో మతవాదులూ, మితవాదులూ భుజం భుజం కలిపారు. ప్రగతివాదంపైనే ధ్వజమెత్తారు.

''అభ్యుదయోద్యమానికి మూలభూతమైన తత్త్వం దేశీయమైనదికా''దనీ ''దేశాన్ని విడిచి మరో ప్రపంచంవైపు పరుగులెత్తే ధోరణి తొలగి స్వదేశీయులు సౌభాగ్య సాధనలో కవి కంఠమెత్తి పలుకడం'' జరుగుతూందని 'జనధర్మ' పరాయణులు అపోహపడడం ప్రారంభించారు. శ్రమజీవనంలో దేశీయం విదేశీయం అనే తేడాలు లేవు. ఆ శ్రమను దోచుకోనే వర్గాల స్వభావాలను బట్టే ధర్మాలూ, దర్శనాలు, సంస్కృతీ సాహిత్యాలు ఉత్పన్నమవుతాయి. శ్రమజీవుల దర్శనమే మార్క్సిజం. దాని మూలసూత్రాలు ఏ సమాజంలోనైనా విజాతీయాలు కావు. ఈ అవగాహన లేకపోబట్టే ''మన సారస్వతాన్ని విమర్శననూ అన్నివిధాలా జాతీయం చేయవలసి ఉన్నది. ఈ జాతీయకరణం వల్ల సారస్వతంలోని ఎన్నో అనారోగ్య లక్షణాలు వాటంతటఅవి తొలగిపోగలవు'' అని జన ధర్మీయులు హెచ్చరించసాగారు.

సంఘం కార్యక్రమాలు స్తంభించిపోతే సమకాలిక సమస్యలకు స్పందించేవారు నిర్లిప్తతతో ఉండలేరు. సుందరయ్యాగారు చెప్పినట్లు ''రచయిత తటస్థుడుగా ఉండలేడని, ప్రజలవైపు నిలబడి ప్రజలలో కలిసి ప్రజాశక్తులతో పోరాడగల్గిన రచయితయే అభ్యుదయ రచయిత అనే విషయాన్ని, సత్యాన్ని ఎవరూ చాటలేదు.* పోట్లాడమంటే కలాన్ని వదలి కత్తిపట్టి పోట్లాడమని కాదు. అవసరమయినప్పుడు కత్తిపట్టడానికి తయారే అయినా కవి, రచయిత తన సర్వకాల ఆయుధాన్ని ప్రజలతో కలసి ప్రజాశత్రువుల మీద వినియోగించాల్సి ఉంటుంది. అన్ని రసాలు, అలంకారాలు, శైలి ఆ ఆయుధపు పదునుని ఎక్కువచేస్తాయి.

కొందరు రచయితలు తమ ఆయుధాలను పదును చేసుకొనో, చేసుకొనకుండానో అభ్యుదయ రచయితల సంఘం నుండి విడిపోయి విప్లవ రచయితల సంఘం ఏర్పాటు చేసుకొన్నారు. ప్రతి వ్యక్తికీ ఒక సంఘంలో చేరడానికి గానీ, చేరిన సంఘం నుండి రాజీనామా చేయడానికిగానీ స్వాతంత్ర్యం ఉంటుంది. వెళ్ళినవాళ్ళు వెళ్ళిపోగా మిగిలినవాళ్ళు అభ్యుదయ రచయితల సంఘాన్ని ఎలాగ పునర్నిర్మించుకోవాలన్న సమస్య 1970లో వచ్చింది. అభ్యుదయ రచయిత అంటే ఎవరో నిర్వచనం చేయవలసిన తరుణం కూడా వచ్చింది.

★ (అభ్యుదయ రచయితల సభలో సభ్యులు చాటలేదని సుందరయ్యగారి విమర్శ)

రెండవ మహాసభలో తెలికిచర్ల వెంకటరత్నంగారు ''ఎవరీ అభ్యుదయకవి?'' అని ప్రశ్నించి నిన్ను గురించి పలువురు పలికిన పలుకులు చెవిని పడ్డవి. అందులో సత్యమెంత? అసత్యమెంతో తెలుసుకోవలసిన పని వుంది'' అన్నారు.

మూడవ మహాసభలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సంఘంలో అందరూ చేరవచ్చునన్నారు. నాలుగవ సభలో వివిధ వ్యక్తులు ఉపన్యాసాలు విన్న దర్శి చెంచయ్యగారు ఇలా చెప్పారు.[9]

''ఈ రచయితలు 'అభ్యుదయం' అనే మాటకు నిర్వచనం ప్రారంభించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మాట్లాడి తమ చాకచక్యాన్ని ప్రదర్శించారు. చాలామంది వేదకాలంలోని సంఘం అభ్యుదయంగా ఉన్నదనీ, ప్రస్తుతం కలియుగమనీ ఏమేమో బోధించారు. వీరికున్న వెనుకచూపును ముందుకు తరలించి వీరేశలింగం, భారతి, ఠాగూరు మున్నగు పురోగాములవలె అభ్యుదయానికి తోడ్పడేలాగున మహాసభను జరుపలేకపోయారు''.

నాలుగో మహాసభను పురస్కరించుకొని పిలకా గణపతిశాస్త్రిగారు ఒక విడ్డూరమైన వాదన చేశారు. ఆయన ఇలా రాశారు.[10]

''అభ్యుదయ రచయితలు ఒక గిరిగీసి రచయితలందరు దానిని అవలంబించాలని ఎప్పుడూ అనరు. వారికి కావలసినది విశాలమైన విశ్వశ్రేయస్సు. విశ్వశ్రేయస్సుకు విరుద్ధమైనది ఏ మతప్రణాళికయైనా వారికి అనంగీకారమే. భౌతికవాదమే అంగీకరించాలనికాని, ఆదర్శవాదమే అవలంబించాలనికాని ఒక నియమం ఏదీ లేదు. అయితే విశ్వశ్రేయోదృష్టి మాత్రం చాలా ముఖ్యం.''

దీనిని సుందరయ్యాగారు తమ గ్రంథంలో ఉదాహరించి ఇలా ఖండించారు.

''దీనితో (ఈ అభిప్రాయంతో) కమ్యూనిస్టు రచయితలు ఏకీభవించరు. ఇది వర్గాతీతమైన (నాన్‌క్లాస్) ధోరణి. ఈ ధోరణి అందరూ అభ్యుదయ రచయితలమనుకొని, అందరి రచనలు అభ్యుదయ రచనలే అనే ధోరణికి దారితీస్తుంది. విశ్వశ్రేయస్సుకు మార్గం ఆదర్శవాదం ద్వారా కాదు (ఐడియలిజం) భౌతికవాదాన్ని అంగీకరించి వివిధ వర్గాలుగా విభజింపబడిన ప్రజలలో పీడితవర్గం తరపున నిలబడి, వారిలో ఒకభాగమై, రచయిత పోరాడగల్గినట్లయితే విశ్వశ్రేయస్సుకు, ప్రజాభ్యుదయానికి దారితీస్తారు.''

సుందరయ్యాగారు 1947లోనే చెప్పిన ఈ సంగతులను 1970 దాకా ఎవరూ పట్టించుకొన్నట్టు కనపడదు. అభ్యుదయ రచయితల సంఘాన్ని పునర్నిర్మించడానికి 1970లో మద్రాసు శాఖవారు గట్టి ప్రయత్నాలు చేసి ఒక ప్రణాళికను తయారుచేశారు. కొన్ని వామపక్షాలకు చెందిన వివిధ ప్రాంతాలలో ఉన్న కొంతమంది అభ్యుదయ రచయితలతో విపులంగా చర్చించిన పిమ్మట దీనిని కార్యవర్గం ఆమోదించి 1972లో ప్రకటించింది. ఆ కార్యవర్గంలో ఈ క్రింది సభ్యులున్నారు.

---

9. 'నేను-నా దేశం' - పుట.518
10. ''ఏరిన రచనలు''II పుట.100

దేవులపల్లి కృష్ణశాస్త్రి (అధ్యక్షులు)	అనిసెట్టి సుబ్బారావు (కార్యదర్శి)
ఆరుద్ర	ఎల్లోరా
సుంకర సత్యనారాయణ (ఉపాధ్యక్షులు)	అట్లూరి చౌదరాణి
	(సహాయ కార్యదర్శులు)

కార్యవర్గ సభ్యులు :

దాశరథి	సెట్టి ఈశ్వరరావు
కె. రామలక్ష్మి	పందిరి మల్లికార్జునరావు

ఆ ప్రణాళికలో ఇలా చెప్పారు. ''చైతన్యానికి ఉద్దీపకాలైన రచనలు చేయడానికి చారిత్రక పరిజ్ఞానం, లోకవృత్త అవగాహన, కళాసాహిత్య తత్త్వజ్ఞానం, మానవతాదృష్టి - ఒక్కమాటలో చెప్పాలంటే శాస్త్రీయ సామ్యవాద దృక్పథం చాలా అవసరం. అందుకే అభ్యుదయ రచయితలు శాస్త్రీయ సామ్యవాదమే తమ ధ్యేయమని విస్పష్టం చేస్తున్నారు. ఆ సర్వతోముఖదర్శన ప్రభావం వల్లనే అభ్యుదయ దృక్పథం అలవడుతుందని విశ్వసిస్తున్నారు''.

మద్రాసు శాఖవారు ప్రకటించిన ఈ ప్రణాళికను దేశంలో పలువురు రచయితలు ఆమోదించారు. వివిధ జిల్లాలో శాఖలు ఏర్పడ్డాయి. మద్రాసు, బెంగుళూరు, ఖర్గపూరు, కలకత్తా మొదలైన నగరాలలోనేకాక 19 తెలుగు జిల్లాల నుండి సుమారు 250మంది సభ్యులుగా చేరారు. రెంటాల గోపాలకృష్ణ, నాగభైరవ కోటేశ్వరరావు, ఆచార్య ఆత్రేయ, పురిపండా అప్పలస్వామి, చాగంటి సోమయాజులు, రోణంకి అప్పలస్వామి, ప్రయాగ కోదండరామశాస్త్రి, సి. నారాయణరెడ్డి, కుందుర్తి ఆంజనేయులు, వాసిరెడ్డి సీతాదేవి, మధురాంతకం రాజారాం మొదలైన ప్రముఖులేకాక ఎందరో ఉత్సాహవంతులైన యువకులు కూడా ఈ సభ్యులలో ఉన్నారు.

వామపక్షం చీలిపోయి మూడు పార్టీలుగా ఏర్పడింది. ఎవరికి వారే తాము మార్క్సిజానికి సరైన వ్యాఖ్యాతలమని భావిస్తారు. వివేచనా శక్తిగల రచయితలు కూడా తమ అవగాహనతో శాస్త్రీయ సామ్యవాదాన్ని ఆచరణలో పెట్టగలరు. అందుకే అభ్యుదయ రచయితల సంఘం ఏ వామపక్ష పార్టీకి అనుబంధ సంస్థగా కాక స్వయం ప్రతిపత్తిగల సంస్థగా రూపొందించడానికి కృషి జరిగింది.

1974లో ఆంధ్ర అభ్యుదయ రచయితలు తమ 6వ మహాసభలను జనవరి 12, 13, 14 తేదీలలో చాగంటి సోమయాజులుగారి అధ్యక్షతన ఒంగోలులో జరుపుకోగలిగారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో కుండబద్దలు కొట్టినట్టు కొన్ని వాస్తవాలు చెప్పారు.

''ఈనాడు మనదేశంలో రచయిత ఏ వామపక్షానికి 'కమిట్' కానక్కరలేదు. వామపక్షాలలో ఐక్యతలేదు. ప్రజలను, ప్రజాసమస్యలను మరిచిపోతున్నారు. వర్గ పోరాటాన్ని వీరు బలపరచడం లేదు. దోపిడీదారులతో చేతులు కలిపి ఒక వామపక్షం మరొక వామపక్ష పతనానికి దోహదం చేస్తున్నది. సుందోపసుందులుగా ప్రవర్తిస్తున్నారు.

వామపక్షాల్లో కూడా అవినీతిపరులున్నారు. గిరీశం జాతి అవకాశవాదులు వామపక్షాల్లో ఉన్నారు. దొరికిన కొందరు బహిష్కరింపబడుతున్నారు. దొరకని కొందరు ఎక్కడా ఉన్నారు - వామపక్షాల్లో గిరీశం జాతిని రచయితలు బహిర్గతం చెయ్యాలి''.

అభ్యుదయ రచయితల సంఘం వామపక్ష విరోధికాదు. వాస్తవానికి 1936లో వామపక్షాభిమానులే ఈ సంఘానికి శంకుస్థాపన చేశారు. అవిభక్త వామపక్షమే ఈ సంఘాన్ని పెంచి పెద్దదాన్ని చేసింది. సంఘ సభ్యులకు శాస్త్రీయ సామ్యవాదమే ప్రమాణం. అందుకే ఒంగోలు సభలో 'ఆ మహోన్నత ఆశయసాధనకు' మార్గాన్ని సూచించే తీర్మానం చేశారు.

''చిత్తశుద్ధితో కృషి చేయగలిగిన వామపక్ష పార్టీలు నేడు దేశంలో చీలిపోవడం; అనైక్యత, అంతర్యుద్ధం మొదలైన అనారోగ్య లక్షణాలతో క్షీణించడం ప్రగతి శక్తుల ఉద్యమాలకే గొడ్డలిపెట్టని హెచ్చరిస్తూ దేశంలోని వామపక్ష వర్గాలన్నీ సమైక్యత సాధించి ఆశయసిద్ధి గావించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము''.

ఈ ఆశయాన్ని చాటి ఈ అభ్యుదయ రచయితల సంఘం ఏ రాజకీయ పక్షానికీ అనుబంధ సంస్థ కాదని చెప్పారు. ఒంగోలు సభలో కింది కార్యకర్తలను ఎన్నుకొన్నారు.

చాగంటి సోమయాజులు (అధ్యక్షులు)	అనిసెట్టి సుబ్బారావు (ప్రధాన కార్యదర్శి)
ఆరుద్ర	ఎ. సోమసుందర్
దాశరథి (ఉపాధ్యక్షులు)	నాగభైరవ కోటేశ్వరరావు
	(సహాయ కార్యదర్శులు)

కార్యవర్గం :

పి. గణపతిశాస్త్రి	కె. రామలక్ష్మి
కుందుర్తి ఆంజనేయులు	రావెళ్ళ వెంకటరామారావు
రెంటాల గోపాలకృష్ణ	యం. రామకోటి
కె. సభా	

కార్యనిర్వాహక సమితి :

అ.న.శర్మ	పేర్వారం జగన్నాథం
మధురాంతకం రాజారాం	తిరునగరి
డా॥ సి. నారాయణరెడ్డి	లింగంపల్లి రామచంద్ర
ఒ.యన్.రావు	ఎ. సూర్యప్రకాశ్
నూతలపాటి గంగాధరం	వై.వి.యల్.యన్.శాస్త్రి
పోలూరి ఆంజనేయప్రసాద్	సున్నా అచ్యుతరావు
జి. లలిత	సీరపాణి
డా॥ జె. వీరాస్వామి	సత్యవేటి శ్రీకాంత్
యం.వి.యస్. శర్మ	సనారా
ఈమని దయానంద	శీలావీర్రాజు

పవని నిర్మల ప్రభావతి కొండవీటి వెంకటకవి
గొల్లపూడి ప్రకాశరావు వాసిరెడ్డి సీతాదేవి

ఈ సంఘం ఏడవ మహాసభలు విజయనగరంలో తర్వాత జరపడానికి ఏర్పాట్లు చేస్తూ ఒక సన్నాహక సంఘం కూడా రూపొందింది. అయితే దురదృష్టవశాత్తూ ఎమర్జన్సీ మూలాన సభలు జరపడం పడలేదు. ఒంగోలు మహాసభలో చాలా ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించడం జరిగింది. అందులో ఒకటి వాక్స్వాతంత్ర్యానికి సంబంధించినది. దాని సారం ఇలా ఉంది.

''స్వరాజ్యం మా జన్మహక్కని లోకమాన్యుడు చాటినట్లే, విప్లవ సాధన మా జన్మహక్కు, దాని ప్రచారం మా కర్తవ్యం అని చాటే రచయితలతో ఈ సభవారు ఏకీభవిస్తున్నారు. విప్లవ సంఘ రచయితల విధానాలకు సంపూర్ణంగా ఈ సభవారు సమ్మతించక పోయినా ఆ రచయితలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు అవలంబిస్తున్న దమన నీతిని ఈ సభవారు తీవ్రంగా గర్హిస్తున్నారు. పౌరహక్కుల రక్షణకు మేధావి వర్గాల వారందరు సంఘటితం కావాలని వాంఛిస్తున్నారు''.

ఒంగోలు సభలోని ఈ తీర్మానాన్ని అనుసరించే 1975లో మద్రాసు కార్యవర్గ సమావేశం ప్రభుత్వం అనుసరిస్తున్న కొత్త నిషేధ, నిర్బంధ చర్యలను ఖండించడానికి నిశ్చయించుకొని ఒక తీర్మానం చేసింది. దానిని సంఘం ఉపాధ్యక్షులు దాశరథి వ్యతిరేకించారు. ఆయన ఇలాగ ఒక లేఖలో తమ అసమ్మతిని, రాజీనామాను తెలియచేశారు.

''ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ అనిసెట్టి సుబ్బారావుగారికి నమస్కారములు.

నిన్న (16-3-1975) శ్రీ ఆరుద్రగారింట్లో జరిగిన అరసం కార్యవర్గ సమావేశంలో విరసం వారి విడుదల గురించి ప్రవేశపెట్టిన తీర్మానంతో నేను ఏకీభవించలేకపోతున్నందుకు విచారిస్తున్నాను. కొన్ని ఏండ్లుగా విరసీయులైన శ్రీశ్రీ, కె.వి.రమణారెడ్డి, మధుసూధన రావు (తిరుపతి) మున్నగువారు పత్రికలలోనూ, నారాయణరెడ్డి మున్నగువారిని ధనస్వామ్య విధానపు తొత్తులుగా, అభ్యుదయ నిరోధకులుగా, విప్లవ వ్యతిరేకులుగా చిత్రిస్తూ వ్రాసిన వ్రాతలు, చేసిన ప్రసంగాలు యెవ్వరూ మరువలేరు. నావరకు నేను మరువలేను. మన యెడ యెంతమాత్రం సానుభూతి లేకుండా ద్వేషభావంతో నిర్విరామంగా విషప్రచారం సాగించిన, సాగించుతున్న విరసీయుల పట్ల సానుభూతి వ్యక్తపరచడం మన దౌర్బల్యమే అవుతుందిగాని మరొకటి కాదు. మనను ద్వేషించిన వారిని ప్రేమించడంలోనే గొప్పదనం ఉందన్నారు గణపతిశాస్త్రిగారు. ఆ పని గణపతిశాస్త్రిగారు, క్రీస్తు, గాంధీ, బుద్ధుడు మాత్రమే చేయగలరు. నావంటి సామాన్యుని వల్ల అయ్యేపని కాదు. 'అక్షర తూణీరం', 'నవత'లో లేఖలు, జ్యోతిలో రచనలు. 'సాహితీ శిఖండులకు సవాల్' (కరపత్రం), 'సినారేయే క్యాకియారే' (రాయలసీమ), 'ముడ్డిలేనిముంత దాశరథి కవిత' (తెలుగు వెలుగు) వంటి వందల జుగుప్సాకర రచనలు - మనను విప్లవద్రోహులుగా,

బూర్జువాలుగా, ప్రజాశత్రువులుగా చిత్రీకరించడానికి చేసిన రచనలు - అక్షర రూపంలో ఉన్నాయి. అట్టివారి యెడ స్నేహభావం వ్యక్తపరచడానికి మన అరసం చాలాసార్లు ప్రయత్నించగా నేను అడ్డువచ్చిన విషయం - ఒకసారి రాజీనామా చేసిన విషయం మీకు తెలుసు.

నిన్నటి తీర్మానం దృష్ట్యా - మీరు విరసీయులను సమర్థించడానికి కంకణబద్ధులై వున్నట్లు రుజువయింది. కనుక మీతో నేను ఏకీభవించలేనని మనవి చేస్తూ నా యీ రాజీనామాను అందచేస్తున్నాను. సంస్థ అభ్యుదయానికి రక్తం ఓడ్చి కృషి చేసిన, చేస్తున్న మీకు నా అభినందనలు

ఇట్లు
మీ
దాశరథి

కార్యనిర్వాహక సభ్యులలోనే విశాలదృక్పథం లేకపోతే సంస్థ కార్యక్రమాలను నిర్వర్తించడం కష్టం. ఒక ఉపాధ్యక్షుడు రాజీనామా చేశాక, కార్యదర్శి జబ్బుపడ్డాక, ఎమర్జన్సీ అలుముకొన్నాక సంఘంలో స్తబ్ధత ఏర్పడింది. ఒక ఉద్యమం మందగిస్తే మళ్ళా పుంజుకొనడం కష్టం.

ఒంగోలు సభలు జరగడానికి ముందే ఒక వామపక్ష పార్టీకి చెందిన రచయితలు 'ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం' అనే కొత్త సంస్థను నిర్మించుకొన్నారు. (పూర్వం నుండి ఉన్నది 'ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం' మాత్రమే. ఇది రిజిష్టర్ సంస్థ). ఈ కొత్తసంఘం వారు 1973 ఆగస్టు 10, 11, 12 తేదీలలో గుంటూరులో తమ తొలి మహాసభలను జరుపుకొని అదే 6వ మహాసభ అని చాటుకొన్నారు. తర్వాత జరిగిన 2, 3,4 మహాసభలకు 7, 8, 9 అనే సంఖ్యలను కలుపుకొన్నారు. మాతృసంస్థ నిర్వహించిన ఒంగోలు మహాసభను వీరు గుర్తించలేదు. దానికి చరిత్ర లేదని కాబోలు వీరి ఉద్దేశం.

'ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం' ఏర్పడి కొన్ని కార్యక్రమాలను చేపట్టడం కూడా మంచిదే. అభ్యుదయవాణి పూర్తిగా దేశంలో కనీసం ఒక దిక్కునుంచైనా వినబడడం హర్షించదగ్గ విషయమే. ఎవరు నడుపుతున్నారన్న విషయాన్ని పట్టించు కొనకుండా అభ్యుదయోద్యమం పట్ల తమకు గల అభిమానంతోనే పూర్వం ఒంగోలు సభలకు ముందు మాతృసంస్థలో చేరిన వారిలో చాలామంది ఈ కొత్తసంస్థవైపు మళ్ళారు.

ఉద్యమం సజీవంగా ఉండడం ముఖ్యమేగాని, అభ్యుదయ రచయితకు కూడా 'కమిట్‌మెంటు ఉండాలి' శాస్త్రీయ సామ్యవాదాన్ని విశ్వసించేవారే అభ్యుదయ రచయితలన్న' నిర్వచనం ఎప్పటికైనా ఈ కొత్త సంస్థ తెస్తుందేమో వేచి చూడాలి.

కవి కోకిలలు

''ఆకులందున అణగి మణగీ
కవిత కోయిల పలుక వలెనోయ్!
పలుకులను విని దేశమం దభి
మానములు మొలకెత్తవలెనోయ్!''

ఇది గురజాడ అప్పారావుగారు 1910లో చేసిన హితోపదేశం. దీనిని రెండు మూడు దశాబ్దాల తర్వాత తెలుగు సాహితీపరులు ఆచరణలో పెట్టగలిగారు. ఆకులందున అణగి మణగి ఉన్నారో లేదోగాని వర్ణవ్యవస్థలో అట్టడుగునా, దానికి కొద్దిగా పై మెట్టున ఉన్న ఇద్దరు కవులు మాత్రం కవికోకిలలై పలకసాగారు. వారి పలుకులను దేశం వినిపించుకోడానికి గురజాడ వారి విషయంలో లాగే, కొద్ది జాప్యం జరిగింది. ఆ కవి కోకిలల పలుకులను విన్నాక, దేశంలో మొలకెత్తవలసిన అభిమానాలే మొలకెత్తి తర్వాత ననలెత్తి ఫలించాయి.

1930 దశకంలో ఒకరు కాదు ఇద్దరు కవికోకిలలు తెలుగు సాహిత్యంలో కలకూజితాలను వినిపించి విఖ్యాతులయ్యారు. ఇద్దరూ 1895లో జన్మించారు. ఇద్దరూ ఛందోబద్ధమైన పూర్వసంప్రదాయపు వృత్తాలలో రచనలు చేశారు. సంఘంలో కులకట్టుబాట్లనే సడలించలేని చారిత్రక దశలో కలంపట్టిన ఈ కవులు ఛందోనియమాలను ఎలా ఉల్లంఘించగలరు? భావకవిత్వంపై తిరుగుబాటుగా అతి నవ్య కవిత్వం ఆవిర్భవించి వచన పద్యాల వెల్లువ వచ్చిన రోజుల్లో ''ఈ కవులకు ఛందస్సు తెలియదు కనుక ఉత్త వచనంలో రచనలు చేసి కవిత్వమంటున్నారన్న'' అపవాదునుండి తప్పించుకొనడానికి కుందుర్తి ఆంజనేయులు, దాశరథి కృష్ణమాచార్యులు వంటివారు 1940లో వృత్తాలు రచిస్తే, 1920కి ముందే కవితా వ్యాసంగం ప్రారంభించిన ఈ కవికోకిలలు లాక్షణికుల అనుశాసనాలను ఎలా ధిక్కరించగలరు? అసలు వారు కవిత్వం చెప్పదలచుకొనడమే సనాతన ఛాందస పండితులు ఆమోదించరు. అప్పకవి చెప్పిన దానికి ఆదిలోనే వీరు విరుద్ధంగా కలం పట్టారు కదా!

అప్పకవి తన లక్షణ గ్రంథంలో కవి అన్నవాడు ''ధరణీ సురుడు ప్రశాంతుడు''.. మొదలైన లక్షణాలు కలిగి వుండాలన్నారు. బ్రాహ్మణేతరులకు కావ్యాలు రాసే అర్హత లేదంటాడు. ఆయనగారు అంఘ్రిభవుని కావ్యాన్ని ఆమోదించడు. ఆధునిక యుగంలో ఈ అనుశాసనాలు చెల్లవు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు 'కవిత్వము - బ్రాహ్మణత్వము' అనే శీర్షికతో వ్యాసం రాస్తూ ''కవిత్వం బ్రాహ్మణుల సొమ్మే అని అప్పకవిగాని మరివొకరు మాదే అనిగాని రిజిష్టరు చేయించుకోవడానికి యత్నించడం పరిహాసాస్పదం - దేవుని పెండ్లికి అందఱూ పెద్దలే'' అని అంగీకరించారు.[1] మన కవికోకిలలో ఒకరు అంటరానివారు, ఇంకొకరు అంఘ్రిభవులు. అయినే దేశం వారి కులాన్ని కాక కవితా గుణాన్ని చూసి సత్కరించింది.

---

1. ''కథలు-గాథలు'' (ప్రథమ భాగం) - పుట.946

గుర్రం జాషువా (1895-1971)

జాషువాగారు ఒక నిరుపేద కుటుంబంలో జన్మించారు. వారి తండ్రి వీరయ్యగారు క్రైస్తవ మతాన్ని స్వీకరించిన యాదవులు. తల్లి ఆదియాంధ్ర కులానికి చెందిన లింగమ్మగారు. ఈ ఇద్దరిదీ వర్ణాంతర వివాహం కనుక ఇటువైపు బంధువులుగాని, అటువైపు బంధువులుగాని వారిని ఆదరించలేదు. ఒక పక్క దారిద్ర్యంతోనూ, మరొక పక్క కులమతాల పోరుతోనూ, ఆ దంపతులు అన్యోన్యంగా ఉంటూ తమ బిడ్డలను ప్రేమతో పెంచారు. వీరికి జాషువా పెద్ద కుమారుడు. ఇశ్రాయేలు రెండో పుత్రుడు.

కాలానికి, సమాజానికి ఎదురీది విద్యాభ్యాసం చేసి జాషువాగారు 'ఉభయభాషా ప్రవీణ' పట్టాన్ని పొందగలిగారు. 'బతకలేక బడిపంతులు'గా స్వగ్రామమైన కాట్రగడ్డపాడులో టీచరుగా పనిచేస్తూ హిందువుల పురాణగాథలను ఇతివృత్తాలుగా, సంకేతాలుగా, ప్రతీకలుగా తీసుకొని కవిత్వం రాస్తున్నాడని క్రైస్తవులు ఆగ్రహించి ఆ ఉద్యోగం ఊడకొట్టించారు. ఈ సంగతిని ఆయన 'నాకథ' ఇలా చెప్పుకొన్నారు.

''ఊడెం బడిపంతులు పని
యూడెన్మర్యాద యూడెనుత్సాహము, లో
నూడని సంసారము వెం
టాడం దిరిగితిని పల్లియలు పట్టణముల్''

అవి - అవధానాలకూ, ఆశు కవితలకూ, జంట కవిత్వాలకూ రోజులు. జాషువా గారు తన తమ్ముడు ఇశ్రాయేలుతో కలసి నేత్రావధానం అభ్యసించి ప్రదర్శనలు ఇవ్వసాగారు. వినుకొండకు సమీపంలో ఉన్న ఒక కుగ్రామంలో బాగా డబ్బున్న ఆసామి నేత్రావధానం చేయించాడు. సభ ముగిశాక అవధానులకు పదిశేర్ల సజ్జలు కొలిచి ఇవ్వమని పాలేరుకు చెప్పాడు. చార్జీలకు సొమ్ము ఇవ్వమని ప్రార్థిస్తే రెండణాలు ఇచ్చాడు.

సభలలో పద్యాలు చదువుదామన్న ఆశతో జాషువాగారు వినుకొండలోని ఒక గ్రామసభకు వెళ్ళారు. అంటరానివాడు వేదిక ఎక్కి పద్యాలు చదవడమా అని సభికులు కొందరు కోపంగా వెళ్ళిపోయారు. సభకు అస్పృశ్యుణ్ణి ఆహ్వానించిన కార్యకర్తను కూడా తిట్టిపోశారు.

జాషువాగారు తమ పద్యాలు చదివితే విని సెభాష్ అని మెచ్చుకున్నవారే ఆయన కులమేమిటో విన్నాక చీదరించుకునేవారు. ఈ సంగతిని ఒక పద్యంలో కవికోకిల ఇలా చెప్పాడు.

నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచిభళీభళీ; యన్నవాడే 'మీ
దేకుల'మన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి పోవుచో
బాకున గ్రమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్.

కవిగా గర్వపడదగ్గ రచనలు చేయాలని జాషువాగారు నాటకాలు, చిన్న చిన్న ఖండికలు రాయసాగారు. అయితే వీటిలో ఇతివృత్తాలు హిందువుల పురాణ గాథలు. ఇది క్రైస్తవ మతాధికారులకు కోపం తెప్పించింది. హిందువుల మతాన్ని ప్రచారం చేస్తున్నాడనీ, నడతకూడా మంచిది కాదనీ ఇంకో నెపం పెట్టి జాషువా గారిని కులం వారు వెలివేశారు. ఈ ఉదంతాన్ని జాషువా గారి కుమార్తె హేమలత ఇలా కథనం చేశారు.[2]

''అప్పటికే వివాహితుడైన నాన్నగారు తల్లిదండ్రులను, భార్యను, బిడ్డలను కూడా విడిచి ఊరికి దూరంగా ఉండవలసి వచ్చింది. సంఘ కట్టుబాట్లకు భయపడి, తన ఫాదరీ ఉద్యోగం పోతుందనే భయంతో తండ్రి వీరయ్య ఇంటికి కూడా రావద్దని కొడుకును శాసించాడు. పగలంతా ఊరికి దూరంగా వున్న పాడుపడ్డ మసీదులో మకాము వేసి రాత్రి చీకటి చాటుగా వచ్చి తల్లిపెట్టిన భోజనం తిని మరలా మసీదు చేరుకునేవారు. అటు సంఘం నుండి, ఇటు స్వగృహం నుండి తరుమబడ్డ నాన్నగారికి ప్రకృతి ఆత్మబంధువై, గురువుగా, తల్లిగా, స్నేహితులుగా ఆయనకు తోడు నిల్చింది. జంతువులు, పిట్టలు, కొండలు, కోనలు ఆయనకు మిత్రులు. అవే ఆయనకు కవితా వస్తువులు. అయితే ప్రకృతిలోని అందం ఒక్కటే ఆయనకు వస్తువు కాలేకపోయింది. ఎక్కడ అసమానత వుందో, అన్యాయం ఉందో, అమానుషత్వం వుందో అదే ఆయన వ్యధిత హృదయాన్ని కదిలించింది. దానినే ఆయన తన కవిత ద్వారా వ్యక్తపరిచారు''.

అంటరాని కవిని పురుగులాగ, పులుగులాగ లోకం చూస్తుందని ఆయనకు తెలుసు. అయితే కొన్ని పురుగుల సహజ రచనాశక్తి మానవులకు లేదు. ఈ సంగతినే వ్యక్తం చేస్తూ సాలెపురుగు మీద జాషువాగారు ఇలా పద్యాలు చెప్పారు.

నీలో నూలు తయారు జేయు మరగానీ, ప్రత్తి రాట్నంబు గా
నీ, లే; దీశ్వర శక్తి నీకడుపులోనే లీలమై యుండునో
యే లీలన్ రచియింతు నీజిలుగునూ లీపట్టు పుట్టంబు లో
సాలీఁడా! నిను మోసగాడఁవని విశ్వంబేల ఘోషించెడిన్?

ఢక్కా మల్లుపసందు నేతపనివాండ్రా, నీ యుపాధ్యాయు? లి
ప్డెక్కండున్ గనరాఁడు డాఁగుకొని నారో నీదుగర్భంబునం?
దిక్కాలంబున నిన్నుమించుపనివాఁడే లేడు; దుర్వృత్తికిన్
దిక్కై, నీ యసమాన కౌశలము వ్యర్థీభూతమై పోయెడిన్.

మన పూర్వకవుల్లో ఒక ధూర్జటి మాత్రమే సాలెపట్టును చూసి దాని అందాన్ని వర్ణించాడు. తెల్లవారుఝామున మంచు బిందువులు పడ్డ సాలీడు నూలు భవనాలు ముత్యాలశాలల్లాగా మెరుస్తూ వాటిపై సూర్య కిరణాలు పడితే హరివిల్లు రంగులతో రత్నాలలాగ ప్రకాశించినట్లు ధూర్జటి గొప్ప భావుకత్వంతో ఇలా పద్యం చెప్పాడు.

''ప్రాతఃకాల తుషార శీకర చయప్రాప్తిన్ లసన్మౌక్తికో
సేతాగారములట్లు చెల్వెసఁగు; దబ్బిందుచ్చటా జాతఖ

2. హేమలతా లవణం - 'మా నాన్నగారు' - పుట.11

ద్యోతచ్ఛాయలఁ గొంతసేపు బహురత్నోద్దీర్ణగేహంబులై
లూతా కల్పిత తంతు పద్మములు వోల్చుం, జెప్పఁజిత్రంబులై''
(శ్రీకాళహస్తీమాహాత్మ్యము - 2-96)

ధూర్జటి సాలెపట్టులోని రామణీయకతనే ఈ పద్యంలో దర్శించాడుగాని, కష్టజీవి కాబట్టి జాషువాగారు సాలీడులోని పనివాడితనాన్ని, రచనా సామర్థ్యాన్ని శ్లాఘిస్తూ ఇంత చక్కటి 'శిల్పి'ని లోకం ఎంత తక్కువగా చూస్తుందో విశదం చేయగలిగారు.

ఒక్క పురుగులోనే కాక పులుగులో కూడా ఉన్న నిర్మాణ చాతుర్యాన్ని జాషువా గారు చూడగలరు. గిజిగాడు మీద ఇలా పద్యం చెప్పారు.

'తేలిక గడ్డి పోఁచలను దెచ్చి, రచించెదవీవు, తూఁగుటు
య్యేల గృహంబు, మానవుల కేరికి సాధ్యము గాదు, దానిలో
జాలరు, లందులో జిలుఁగు శయ్యలు నంతిపురంబు లొప్పఁగా
మేలుభళీ! పులుంగు టెకిమీడవురా గిజిగాఁడ! నీడజా!

ప్రకృతిలోని ఒక కీటకానికీ, ఖేచరానికీ ఉన్న శక్తులు తనలో లేవా? ఉన్నవని జాషువాగారు తెలుసుకొన్నారు. సకలకార్మిక సమాజముల జీవ కథానకములు ఆలించే కర్ణాలు ఆయనవి. కఠిన చిత్తుల దురాగతాలను ఖండించి కనికరమొలికించు కలము వారిది. తామాచరించని నీతులు బోధించి కూనిరాగాలు తీయలేరాయన. అంటరానితనపు అడుసులో దిగబడ్డ అనుజుల దుఃఖాలను అనునయించాలి.

కులమతాలు గీచుకొన్న గీతల చొచ్చి
పంజరాన కట్టుపడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన, నాకు
తరుగు లేదు విశ్వనరుడ నేను

ఇట్టి విశ్వాసమూ, దృఢ నిశ్చయమూ ఏర్పడ్డాక ఇక భయమన్నది ఉండదు. తరుగే కాదు, ఇంక తిరుగుకూడా ఉండదు. తనను వెలివేసిన వారిలో ఉన్న అనైకమత్యాన్ని ముందు అపహాస్యం చేయాలి. ఇంటిగుట్టు ఇంట్లోవాళ్ళకు తెలియదు గనుక చెప్పాలి. అందుకే ఇలాగ పద్యాలు సూటిగా ఘాటుగా చెప్పారు.

పంచములలోన మాదిగవాఁడ నేను
పంచమీయులలో మాలవాఁడతండు
ఉభయులము క్రైస్తవ మతాన నొదిగినాము
సోదరత గిట్టుబాటు గాలేదు మాకు
దేవుడొకడు; మాకు దేవళంబులు రెండు;
దేశమొకటి; మాకు తెగలు రెండు;
మాట వరుస కొక్క మతమందుమే కాని
కుల సమస్య వద్ద కుమ్ము దుమ్ము.

తాము హిందువుల ప్రతీకలు తమ కవితలలో వాడుతున్నారని తనను తప్పుపట్టిన క్రైస్తవులను చూసి ఇలా అన్నారు.

హిందువులను చూచి యెగతాళి చేసెద
మింటనున్న మురికి కేవగింప;
యొరుల తప్పిదంబు లోరుచుకొనలేము
సొంత తప్పుమాకు చురుకులేదు

నిజమైన క్రైస్తవుడెలా ప్రవర్తించాలో విశదం చేసే కవితలు జాషువాగారు చెప్పసాగారు. క్రమంగా ఆయన వాణి దేశీయుల చెవులకు సోకింది. రసజ్ఞులు [illegible] రచనా నైపుణ్యాన్ని మెచ్చుకొనసాగారు. మళ్ళా బడిపంతులు ఉద్యోగం దొరికింది. [illegible]న పుస్తకాలకు కృతిపతులు, ప్రచురణకర్తలు లభించారు. అటు బొంబాయి, ఇటు చెన్నపట్నం దాకా ఆంధ్రులు సన్మానాలు చేశారు. సుకవీంద్రశ్రేణి ఆమోదింప వె[illegible]స్త్రిగారు జాషువాగారి కాలికి గండపెండేరం ఇచ్చారు. తమకు లభి[illegible] సన్మా[illegible]ను ఒక పద్యంలో ఇలా చె[illegible]రు.

'కవి [illegible]న్నఘ నమైన బిరుద మ
ర్పించె నాకుం జెళ్ళపిళ్ళ సుకవి
కవి చక్రవర్తి సత్కవి కోకిలం బన్న
బిరుదాళి శిరమున దురమి కొమ్మ
టేనుంగు మీద నూరేగించి కనకాభి
షేకంబు చేసి యాశీర్వదించి
సకలాంధ్ర సీమంబు, సన్మానంబులు చేసె
వేలు వేల్ విశ్వ విద్యాలయాలు
సుకవిగా గ్రంథకర్తగా సుప్రతిష్ఠ
కలిగినది......'

ఒక్క ఆస్థానకవి అన్న హోదా లభించలేదన్న చింతమాత్రం తప్పలేదు. ఇన్ని సన్మానాలు జరుగుతున్నా ఆర్థిక జీవితం మెరుగుపడలేదు. దారిద్ర్యం తొలగలేదు. 'కవిగాని బ్రదుకు శ్రీరామ రామ' అనే ఖండికలో ఇలా చెప్పారు.

పప్పున్ బియ్యము, దానికిందగిన సం భారంబు లెన్నాళు లి
ట్లప్పుల్ జేసి, ప్రతిష్టజారని రహస్య క్లేశ సంసారపుం
దెప్పున్ ద్రిప్పెద వోయి, నీ బిరుదముల్ నీకాలి పెండారముల్
దుప్పట్లక్కర దీర్చునా? సుకవులెందున్ మంద భాగ్యుల్ గదా?

జాషువాగారి లేమి వారికి ఓరిమిని నేర్పింది. తాము కవిగా నిలబడడానికి, మనిషిగా జీవించడానికి ఎంతటి అవమానాన్ని, నైరాశ్యాన్ని, ఎన్ని ఆటంకాలను ఎదుర్కొనవలసి వచ్చిందో తమ కుమార్తెకు ఒకసారి చెప్పారు.

ఆమె ఇలా ఉటంకించారు.[3]

''జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు - పేదరికం; కులమతభేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందేగాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులభేదాల్నికూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం''.

సంఘాన్ని మార్చడానికే సాహిత్యాన్ని ఒక సాధనంగా జాషువాగారు ఉపయోగించుకొన్నారు. ఆయన వివిధ కాలాలలో వివిధవస్తువులు తీసుకొని ఖండ కావ్యాలను, కావ్యాలను రచించారు. వాటి వివరాలు కొన్ని అకారాదిగా చూడండి.

కావ్యాలు :

కాందిశీకుడు	పిరదౌశి
కొత్తలోకము	బాపూజీ
క్రీస్తుచరిత్ర	ముంటాజమహలు
ఖండ కావ్యాలు (7 సంపుటాలు)	ముసాఫర్లు
గబ్బిలము	రాష్ట్రపూజ
నాకథ	స్వప్న కథ
నాగార్జున సాగర్	స్వయంవరం
నేతాజి	

నాటకాలు :

చిదానంద ప్రభాతం	రుక్మిణీ కల్యాణం
తెరచాటు	వీరాబాయి
ధృవ విజయము	హిమదమార్క పరిణయం

పెద్దకథ :

చిన్నా నాయకుడు

ఈ రచనలన్నింటిలో 'గబ్బిలం' పై జాషువాగారికి ఎక్కువ మక్కువ ఉన్నట్లు కనపడుతుంది. ఒక పద్యంలో ఇలా తమ గురించి చెప్పుకొన్నారు.

''కవిక్రేశుడగండపెండెరములన్ గాంగేయ తీర్థంబులన్
వివిధోపాయన సత్కృతుల్ గొనిన గాంధీ శాంతిసిద్ధాంత మా
ర్గవ మార్గాటుడ, గబ్బిలంబులకు దౌత్యంబుల్ ప్రబోధించు మా
నవతా స్రష్టను నవ్య భావ చతురుండన్ జాషువా భిక్షుడన్''

''కాళిదాసుని మేఘసందేశము మనస్సులో నుంచుకొని నేనీ కావ్యమును రచించితిని'' అని ఆయన ముందే చెప్పారు. మేఘదూతలోని యక్షునికి శాపం ఒక్క ఏడాది పాటే. గబ్బిలములోని నాయకునికి అతని జీవితంలోనేకాదు, అతని పూర్వీకుల కాలంనుండి తీరని శాపం ఒకటి ఉంది. అది అంటరానితనం. తన బిడ్డలకు అది రాకూడదని అతడు బ్రహ్మచారిగానే ఉంటున్నాడు. ఆ క్షుధానల దగ్ధమూర్తి భారతమాతకు కడగొట్టు బిడ్డడు. అతనికి దేశం ఎప్పుడూ అప్పుపడే వుంది.

3. హిమలతా లవణం - 'మా నాన్నగారు' - పుట.10

వాని తెక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమపండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁబెట్టు; వానికిభుక్తి లేదు.

ఆ అభాగ్యుడు ఒకనాడు నిద్రపట్టక అలమటిస్తున్నాడు. ఆ ప్రశాంత రాత్రి ఎల్ల లోకంబును బుజ్జగించి నిద్రబుచ్చింది గాని ఔషధము లేని అస్పృశ్యతా జాడ్యమందభాగ్యుని మరచిపోయింది. అప్పుడు ఆలయంలో వేలాడే గబ్బిలం ఒకటి వచ్చింది. దాని ద్వారా తన బాధను శివునికి చెప్పుకొందామని భావించాడు. కర్మ సిద్ధాంతమున తన నోరు కట్టివేసి స్వార్థలోలురు తన భుక్తి అనుభవిస్తారు... కర్మ అంటే ఏమిటో, దానికి ఈ కక్ష ఎందుకో ఈశ్వరుని చేత ఋజువు చేయించాలి.

ధర్మమునకుఁ బితికి తన మెన్నఁడును లేదు
సత్యవాక్యమునకుఁ జావు లేదు
నెఱవనేల నీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను సృష్టి వీవు.

అంటూ గబ్బిలానికి చెప్పాడు. ఈశ్వరునికి ఎలా చెప్పడం? గబ్బిలం గుడిలో వేలాడుతూ వుంటుంది. కాళిదాసు మేఘదూత ఒక్కటే కాదు. చాలా సంస్కృత కావ్యాలు జాషువా గారిని ప్రభావితులను చేశాయని చెప్పవచ్చు. గబ్బిలంలో నాయకుడు

ఆలయంబున నీవు వ్రేలాడువేళ
శివుని చెవి నీకుఁగొంత చేరువుగా నుండు
మౌని ఖగరాజ్ఞి! పూజారి లేని వేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర

ఈ పద్యం 'కృష్ణకర్ణామృతం'లోని ఈ శ్లోకానికి మెరుగులు పెడుతుంది.

''అయి మురళి ముకుంద స్మేర వక్త్రార నింద
శ్వసన మధుర గుణజ్ఞే త్వాంప్రణమ్యాద్యయాచే
అధరమణి సమీపం ప్రాప్తవత్యాంభల త్యాం
కథయరహసికర్ణేమద్దశాంనంద సూనోః (2-11)

కృష్ణుడు మురళిని, ఒక కొస పెదవుల దగ్గర పెట్టుకొంటున్నప్పుడు దాని రెండవ కొస ఆకర్ణాంతం ఉంటుంది. అప్పుడాతని చెవిలో తన అవస్థను రహస్యముగా చెప్పమని ఈ శ్లోకం కోరుకుంటుంది. గబ్బిలంలోని నాయకుడు ఆ ఋషి పక్షి శివుని చెవికి చేరువగా ఉంటుంది. కాబట్టి పూజారి లేనివేళ చూసి తన కథను విన్నవించమంటాడు. (దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడు కాబట్టి) జాషువా గారు ఔచిత్యం తెలిసి పూర్వుల నుండి అనుభవాలను స్వీకరించి సందర్భోచితంగా మలచగలరు.

ఆలయంలోని శివుని చెవిలోనే కాక కైలాసంలో ఉన్న దేవుని దగ్గరకే గబ్బిలం వెళ్ళగలదు కనుక అక్కడికే సందేశాన్ని పంపించాడు. భావకవులు వెలుగులో ఉంటూ

కృష్ణపక్షపు తమస్సును ప్రేమించి ఆహ్వానిస్తే జాషువాగారు చీకట్లలో ఉన్నవారు వెలుగులకోసం తపించే బాధను గబ్బిలం రెండో భాగంలో చక్కగా చెప్పారు. ఇది పాత సంప్రదాయఛందస్సులో రాసినా అభ్యుదయ కావ్యమే.

ఈనాటికి కావలసిన పద్ధతిలో పాతఛందస్సులనే మలచుకోవచ్చుననే భావం జాషువాగారికి ఉంది.

''మొత్తముమీఁద నాంధ్రకవి ముఖ్యులు లెట్టిన కట్టుబాట్లలో
నుత్తమ మధ్యమాధమములున్నవి; వానిని కొద్దిగా మరా
మత్తొనరింపనౌ ననెడు మాటకు నేనును సమ్మతింతు....

సాహిత్యాన్ని మరామత్తు చేయాలన్నా, సమాజాన్ని మార్చాలన్నా అది మానవుల వల్లే సాధ్యమౌతుంది గాని ఏ దేముడూ వచ్చి ఉద్ధరించలేడని జాషువాగారి పరిపూర్ణ విశ్వాసం. అదే 'అసందిగ్ధంగా' ఇలా ప్రకటించారు.

ధర్మ సంస్థాపనార్థాంబు ధరణిమీద
నవతరించెద ననె నబ్జభవుని తండ్రి
మునుపు జన్మించి నెత్తికెత్తినదిలేదు
నేడు జన్మింపకున్న మున్గినది లేదు.

కవికోకిల ఈ కూజితంలోని సత్యం సర్వదా పూజితం.

దువ్వూరి రామిరెడ్డి (1895-1947)

ఆధునిక యుగంలో గుర్తింపుతోబాటు 'కవికోకిల' బిరుదును పొందిన వారు దువ్వూరి రామిరెడ్డిగారు. వీరిని గుర్తించి 1929 నవంబరు 10వ తేదీ నాడు బెజవాడలో జరిగిన ఆంధ్ర మహాసభలో బిరుదు ప్రదానం జరిగింది. అయితే తమ 20వ ఏట 1915వ సంవత్సరాంతంలోనే ఆయన కవితారచన ప్రారంభించి రెండు మూడేళ్ళలోనే నాలుగు ప్రబంధాలు, రెండు అనువాదాలు, ఒక కావ్యం, ఒక నాటకం, ఒక శతకం రచించారు. 1917లో కట్టమంచి రామలింగారెడ్డి గారి అధ్యక్షతన నెల్లూరులో జరిగిన ఒక సభలో స్వర్ణపతకం అందుకున్నారు. 1918లో విజయనగరం సంస్థానం వారు జరిపిన ఒక కావ్యాల పోటీలో పాల్గొని 'వనకుమారి' అనే కావ్యానికి ప్రథమ బహుమానాన్ని అందుకున్నారు.

1919లో తమ పైలాపచ్చీసులో తమకు అత్యంత ఖ్యాతినీ, తమదీ అంటూ ఒక ప్రత్యేకతనూ కలిగించిన 'కృషీవలుడు' అనే కావ్యాన్ని రచించి మన్ననలు పొందారు. 1920లో 'జలదాంగన' అనే విలక్షణమైన కావ్యాన్ని రాశారు. 1922, 23 సంవత్సరాలలో యువక స్వప్నము, కడపటివీడుకోలు అనే కావ్యాలు రచించారు., 1927లోనే ఉమర్‌ఖయ్యాం రుబాయతులకు పారశీక భాషనుండి 'పానశాల' అనే పేరుతో అనువాదాన్ని ప్రారంభించి 1928లో భారతిలో ఆ పద్యాలు కొన్ని ప్రచురించినా ఆధునిక యుగంలో 1935లోనే పానశాల, యువక స్వప్నం పుస్తక రూపంలో ప్రచురించారు. ఇంతకు

అయిదేళ్ళ ముందు కవికోకిల బిరుదు వచ్చినా, పానశాల గ్రంథం ప్రచురణ తర్వాతనే రామిరెడ్డిగారికి ఆధునిక సాహిత్యంలో విశిష్టస్థానం, విలక్షణ వ్యక్తిత్వం లభించాయి. 1935లోనే ముద్దుకృష్ణ 'వైతాళికులు' అనే నవకవుల సంకలనం వెలుగు చూసింది. అది ఆనాటి యువసాహితీపరుల బైబిలు. అందులో రామరెడ్డిగారి గురించి ముద్దుకృష్ణ ఇలా రాశారు.

''స్వచ్ఛంద ఆశయాలూ, స్వేచ్ఛానురక్తీ, నిర్మలజాతీయతా ఈయనకు ఆవేశాన్ని ఇచ్చేవి. ఆంగ్ల పారసీ వాఙ్మయాల మంచి పలుకుబడిని గ్రహించినవాడు. నూతన భావాలను సహితం తెలుగు జాతీయత ననుసరించి నిర్దుష్టంగా స్పష్టంగా పలికాడు. పూర్వ పద్ధతుల మీదను అభిమానం మెండయినా, అభిసారిక వంటి కొత్త పోకడలు కల్పించాడు. ఈయన కర్షకకవి. నగర విజ్ఞానాన్ని చవిచూసినా జీవితాన్ని పొలంగట్టుకే మరలించాడు. వాల్మీకి కళా సంపత్తిని అనుభవించగలడు. గరికపోచ కదలికతో హృదయం శ్రుతి కలిపి విశ్వవ్యాప్త జీవిత రహస్యం గ్రహించగలడు''.

వైతాళికులులో కవికోకిల జాషువాగారి కవితలు చేర్చలేదుగాని ఆ కవికోకిలనూ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారికి గల సామ్యాలను ఇటీవలి ఒక సాహితీపరుడు గుర్తించారు. వారు ఇలా రాస్తున్నారు.[4]

''రామిరెడ్డి సమకాలికులలో వేదుల, జాషువా వృత్త రచనలో సారళ్యాన్ని, బిగింపును, కొత్త సొగసులను సాధించారు. రామిరెడ్డి రచనలు చదువుతుంటే ఒక్కొక్క చోట జాషువా మెరుపల్లే జ్ఞాపకం వస్తారు. ఒకరినొకరు అనుకరించారని కాదుగాని, వర్ణవస్తువును బట్టి, వృత్తి రచనపై మక్కువను బట్టి ఒక యుగ ప్రభావం వారిద్దరి పైనా ఉంది.

వారే ఇంకా ఇలా రాస్తున్నారు.[5] అలనాడు ఖండకావ్య లఘు కథా కావ్య ప్రక్రియలు కవులను విశేషంగా ఆకర్షిస్తుండేవి. దాదాపుగా కావ్య మార్గ నిర్దేశకుడుగా శ్రీ రాయప్రోలు సుబ్బారావు ఆనాటికి సర్వజనామోదం పొంది ఉన్నా శ్రీ జాషువాపై ఆయన ప్రభావం పడలేదు. ఆయన, శ్రీ దువ్వూరి రామిరెడ్డి, వారి తరువాత కరుణశ్రీ ఖండ కావ్య ప్రక్రియను వేరే మార్గాన నడిపించారు.

రామిరెడ్డిగారికి ఉత్తరోత్తరా ఉత్తమ స్థానాన్ని సాహిత్యంలో పానశాల కల్పించినా వారి కృషీవలుడు కావ్యమే ఒక రకమైన గ్రామీణ జీవితానికి మేలుకొలుపులు పాడింది. పొద్దుపొడిచి, పొద్దుకుంగేదాకా కర్షకుని జీవితాన్ని అతని కుటుంబ పరిస్థితులను, దైనందిన వాతావరణాన్ని ఒకరకంగా చెప్పాలంటే కృషీవలుని జీవితంలో ఒకరోజు ప్రతిరోజూ అనే వస్తువును ఈ కావ్యం చిత్రిస్తుంది. ఈ కవికోకిల విహంగ దృష్టి నిశిత పరిశీలనకు నిదర్శనం. ఇది చదువుతూ వుంటే ఇంకో పాలవేకరి కదిరీపతి గ్రామీణ వర్ణనలకు పుట్టుకొచ్చాడా అనిపిస్తుంది. ఇందులోని కొన్ని పద్యాలు ముఖ్యంగా 'తడిసిన పచ్చికట్టియలు' అనే

4. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ - సాహిత్య పరిచయం (1875-1975) పుట.36
5. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ - సాహిత్య పరిచయం (1875-1975) పుట.83

పద్యంలోని భావన కృష్ణదేవరాయలు వారు ఆముక్తమాల్యదలో వర్షర్తు సందర్భంగా చెప్పిన ఇల్లిల్లు దిరుగ నొక్కింతబ్బు శిఖి..... (4-127) అనే పద్యాన్ని జ్ఞాపకం తెస్తుంది' అని రసజ్ఞులు అంటారు. రాయ వారి పంథాలో రామిరెడ్డిగారు హాలికుణ్ణి ఇలా నుతించారు.

సైరికా, నీవు భా రతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్ర మూర్తివి! శూరమణివి!
ధారుణీ పతి పాలన దండమెపుడు
నీ హలంబు కన్నను బ్రార్థనీయమగునె?

కృష్ణదేవరాయలవారు పురవర్ణన చేస్తూ కృషీవలులను ఇలా ప్రస్తుతించారు.

నృపుల పదహల రేఖలకెల్లమా భు
జాగ్ర హల రేఖలే మూలమనుచుఁగోటి
కొండలుగ ధాన్య రాశులు పండువీట
సుజనభజనైక విఖ్యాతి శూద్ర జాతి (ఆముక్త - 2-36)

కాళ్ళలో హలకులిశ రేఖలున్న వాళ్ళే నృపులవుతారట. రైతులభుజాలపై నాగేటి గుర్తులున్నంత కాలమే రాజు కాళ్ళలో ఆ చిహ్నాలు ఉంటాయి కాని రాయలవారి రైతులు సగర్వంగా చాటుకోగలరు. రామిరెడ్డిగారి కృషీవలులు ఇలా హెచ్చరిస్తున్నారు.

శ్రమలు లేకయెఫలములు దుముకఁబోవు
పిండి కొలదియె రొట్టె యోపిక విధానఁ
గష్టపడుము కృషీవలా, గలుగు సుఖము,
ఉత్తయాసల కన్నా మేలుద్యమంబు

కవి క్రాంత దర్శనం చేయగలగాలి. రామిరెడ్డిగారు కూడా ఇదియే నా స్వప్నం అంటూ కవివరులనూ, జగదేక సేవా సమాసక్త చిత్తాబ్జులను ఉద్దేశించి ఇలా చెప్పారు.

అల్లదే, దర్శించు డవతరించెడిని
ఆధ్యాత్మిక యుగంబు! నానంద సుఖము!
జ్ఞాన హోమాగ్ని మీకరదీపికలను
వెలిఁగించి, జెండాలు వినువీధి నెగుర,
నఖిల మానవ హృదయ ధ్వంసి కీట
కములకుఁ దల్లియౌ కటిక దురాశ
సమయింప, సంగ్రామ సన్నద్ధులగుఁడు!

సమరానికి సామాన్యజనులనుగాక, సాహితీపరులైన కవులను సన్నద్ధులవ మనడంలో కారణం వారే ప్రజలను లేపగలరనే విశ్వాసంతో అందుకే సాటి కవి కోకిలలను ఇలా హెచ్చరిస్తున్నారు.

విశ్రుత శాంత కుటీర నీడముల నుండి
కవికోకిలములార, గగనంబు గనుఁడు!

ఎంత విశాలమై యెంత గాంభీర్య
రామణీయకముల రాజిల్లునదియె!
లే లెండు! తఱియిదే లెండు, సఖులరా!

దువ్వూరి వారిలో ఈ ఒక్క స్వప్నమే కాదు, ఇంకోటి కూడా ఉంది. అది భవిష్యద్దర్శనం. భావకవిలాగ రమణీయకమును వీక్షించి ఒక్కింత కూర్చుంటే, సగము జాగ్రదవస్థ, సగము స్వప్నములో సత్యమో భ్రాంతియో, స్వప్నమో, ఇంద్రజాలమో ఒక దృశ్యం కనబడింది. మామిడితోటలో జనరంజకంగా ఒక సభ జరిగింది.

అందులో -
రారాజు క్రొంబచ్చ ఱాగద్దె డిగ్గి
యందఱితో బాటె యవనిఁ గూర్చుండెఁ;
బని పాటులేనట్టి బంటుసిపాయి
త్రుప్పు పట్టిన కత్తి తుంటిపై రాయఁ
దనపూర్వజయములఁ దలపోయుచుండె;
బురద చిట్టలు పడ్డ పుట్టములఁ గాఁపు
వర్తించె నృప పరివారంబుఁ గలసి;
కూలినాలి యొనర్చి కుడుచు నిరుపేద
యజమాని సరిబంతి నాసీనుఁ డయ్యె;
సకల మానవజాతి సంతతులు కుల
వర్ణ భేదంబులఁ బాటింపఁ బోక
యొక్క కడుపునఁబుట్టి, యొక చన్నుఁబాలు
ద్రావిన రీతి, సౌందర్యంబు గలిగి
యన్యోన్య సాహాయ్య మర్దించువారు!

అప్పుడు ధర్మదేవత ఒక స్ఫటిక పాత్రలో శాంత్యాసవం తెచ్చి అందరినీ తనియింప చేసింది.

ఏక కుటుంబమై యీ ప్రపంచంబు,
స్వర్గంబు భూమిపై స్థాపింపఁబడియె;
అభ్యుదయాంశువు లన్ని మూలలను
నవనవోజ్జ్వల్య జీవనంపు దీపములు
వెలిగించుచుండె; నీ విశ్వమంతయును
మానవ కల్యాణమందిరం బయ్యె!

అంతలోనే లౌకిక యధార్థ్యములనే భావం పక్షిలా వాలడంచేత యింత చక్కటి కల ఎగిరిపోయింది. తాడిచెట్లు బొగ్గు స్థంభాల్లాగా నిలబడ్డాయి. చిమ్మచీకటిలో కవి చిక్కు కున్నాడు. అస్వతంత్ర భారతదేశంలో లోకానికి అభ్యుదయాంశువులు అనుభవించిన కవులు తమ స్వప్నాలను చాటి వాటిని సఫలం చేయమని ధ్వనిగా సూచించడం తప్ప కవేం చేయగలడు? తొలి కోడిలాగ కర్తవ్యాన్ని జ్ఞాపకం చేయడం ముఖ్యం.

సమయ మమూల్యమొక్క నిమి సమ్ము వృథాచన క్రమ్మరింప నే
రము, మన ఆయువా తృటి పరంపర యౌట నెరింగి నిద్ర మాం
ద్యమును దొలంగి మీ పనుల నారయుడో జనులార యంచు, డం
బముగ మెడన్నిగిడ్చి కృక నాకువు కూసెడి నింటి కొప్పునన్

కృషీవలుడు ఎంత కష్టపడ్డా, నేలతల్లి ఎంత నిండుగా పండినా ఫలితం అప్పులలో మునిగిపోవడం, పగలూ రాత్రీ పెరుగుతూనే వుంటుంది పాడువడ్డీ, వున్న వనరులతో ఉత్పత్తి సాగనప్పుడు కొత్త వనరులకు ప్రయత్నించాలి. అవి కాయకష్టం వల్ల మాత్రమేకాక మాయదారి రుణ విధానాల వల్లనే లభిస్తాయి.

నేటిఁ నాగరకత నీ మేలుఁ గోరక
యప్పుచేసి బ్రతుకుమని విధించు,
నాయ వృద్ధికన్న నావశ్యక పదార్థ
సంఖ్యహెచ్చఁ జిత్తశాంతియున్నె?

ఇది జీవిత సత్యమే. ఇది కొందరు విమర్శకులకు మింగుడు పడదు. రామిరెడ్డిగారి కవిత్వాన్ని వారు యిలా అంచనా వేస్తారు.[6]

''ఈ ఆర్థికశాస్త్ర సిద్ధాంతములో ఎంతమాత్రము కావ్యత్వము లేదు. ఇటువంటిదే వేదాంతఘట్టాలు కూడా అనేకములుగా వున్నవి. ఈయన దృక్పథము సమస్త రంగురంగుల ప్రకృతి వర్ణనముగాక దరిద్ర కృషిక జీవిత సంబద్ధాలైన ప్రకృతి విశేషాలను చిత్రించటము మీదికి అక్కడక్కడా తత్త్వశాస్త్ర సామ్యవాదాల మీదకి పోయినది''.

సామ్యవాదం మీదకే కాదు అక్కడక్కడా నాస్తికత్వం మీదకు కూడా రామిరెడ్డిగారి దృష్టి మళ్ళింది. దేవుణ్ణి సంబోధిస్తూ ఒక భగ్నహృదయుడు అడిగే ప్రశ్న చూడండి.

'కొందఱు సృష్టి నీదయని కొందఱు కర్మఫలం బటంచు నెం
దెందఱొ వ్రాసినారలది యెట్లగు? కర్తవు నీవయేని నీ
చందము దూష్యమౌను; మఱి సర్వము కర్మఫలంబటన్న నీ
వెందు కజాగళస్థనమ నీయపదూఱు వహింప దైవమా?'

కర్మఫలమైనా, దైవాధికారమైనా కష్టాలు పోకపోవు, సుఖాలు రాకపోవు, వాటిపట్ల తాటస్థ్యం చూపుతూ కవి వుంటానంటాడు. తన పనిని తాను చేసుకుపోతాడు. అది కావ్య రచన. రామిరెడ్డిగారు తమ జీవితంలో రచించిన గ్రంథాలు చాలా వున్నాయి. వాటి వివరాలు చూడండి.

1916-18 : రసిక జనానందము (ప్రబంధం)
స్వప్నాశ్లేషము
అహల్యానురాగము
కృష్ణరాయబారము
ఋతు సంహారము (అనువాదము)
పుష్పబాణవిలాసము

6. కురుగంటి సీతారామయ్య - నవ్యాంధ్ర సాహిత్య వీధులు - పుట.566

	నలజారమ్మ	(కావ్యం)
	కర్షకవిలాసము	(నాటకం)
	మాతృశతకము	(శతకం)
1918	వనకుమారి	(కావ్యం)
1919	కృషీవలుడు	(కావ్యం)
1920	జలదాంగన	(కావ్యం)
1921	సీతావనవాసము	(నాటకము)
1922-23	యువక స్వప్నము	(కావ్యం-ముద్రణ 1935)
	కడపటి వీడుకోలు	
1924	కుంభరాణా	(నాటకం)
1925	మాధవ విజయము	
1926-27	పానశాల	(అనువాదం - ముద్రణ 1935)
193	గులిస్తాను	(అనువాదం - ముద్రణ 1935)
1935	కాంగ్రెస్‌వాలా	(నాటకం)
1937-38	మిత్రార్థ శతకము	(శతకం)
1940-44	పళ్ళతోట	(అనువాదం)
	ఫలితకేశము	(కావ్యం)
	కవి-రవి	(కావ్యం)

ఈ గ్రంథాలలో చాలా వాటిపైన విమర్శకులు నాడూ-నేడూ దృష్టిని ఫోకసు చేసి గుణ దోష నిర్ణయం, విశిష్టతల విశ్లేషణ చేస్తున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలలోని పరిశోధక విద్యార్థులు లఘు సిద్ధాంతవ్యాసాలు రామిరెడ్డిగారి కృతులపై రచించి పట్టాలు పొందుతున్నారు. కొత్తకోణాలను చూస్తున్నారు. ఉదాహరణకు రాయప్రోలు సుబ్బారావుగారు 'తృణకంకణం', 'కష్టకమల' మొదలైన కావ్యాలు రాసి రవీంద్రుని సౌందర్యారాధనతో జతచేసి అంతవరకూ తెలుగులోలేని అమలిన శృంగారాన్ని ప్రచారంలోనికి తెచ్చారు. అప్పటికి రాయప్రోలు వారి వయస్సు పట్టుమని ఇరవైయేళ్ళు. అపరిపక్వ యవ్వనంలోని అందరాని ఆశయాలను అందుకోవాలనీ, అవి అందరికీ విందు చేయాలనీ యువకులు భావించడం సహజం. రాయప్రోలువారు అదే చేశారు. (ఆయన పుట్టిన సంవత్సరం : 1892, తృణ కంకణం రచన 1912) దువ్వూరి రామిరెడ్డిగారి వంటివారు రాయప్రోలు వారి దారిలోనే పయనించి 'కడపటి వీడుకోలు' వంటి కావ్యాలు రచించారని కొందరు పొరపడ్డారు. 'కపటి వీడుకోలు'ను రామిరెడ్డిగారు పరిపూర్ణ యవ్వనంలో, పరిణతి చెందిన వయసులో రాశారు. దీనిని మేడిపల్లి రవికుమార్ అనే పరిశోధకుడు మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన తన లఘు సిద్ధాంత వ్యాసంలో చెప్పి, ఇంకా ఇలా విశదపరిచారు.[7]

---

7. మేడిపల్లి రవికుమార్ - ''దువ్వూరి రామిరెడ్డి కడపటి వీడుకోలు- ఒక అనుశీలనము'', 1989 (అముద్రితం)

''ప్రేమ విషయమున రాయప్రోలు వ్యక్తపరిచిన అభిప్రాయములు ఎంతవరకు ఆచరణీయములు? తృణకంకణములోని నాయికా నాయకులవలె భంగపడిన ప్రేమికులు మరల కలసికొని సహోదరులుగా మిగిలిపోవుట సామాన్య ప్రజానీకమునకు సాధ్యమగునా? యువతీ యువకుల మధ్యగల స్నేహభావము యొక్క పరమావధి స్నేహము వరకే పరిమితమా? కేవలము సౌందర్యారాధనమే జీవితమునకు పరమావధియా? మున్నగు సంశయములు అమలిన శృంగారముపట్ల కలుగుట సహజము. వీని కన్నింటికిని సమాధానములు వ్యతిరేకముగానే సిద్ధించును. అందువలననే ఈ సిద్ధాంత ప్రాతిపదికలు, ప్రతిపాదకములు అగు లక్ష్యగ్రంథములు రాయప్రోలు వరకే పరిమితములైనవి.

''ప్లేటో ప్రేమ సిద్ధాంతమును నిరసించుటకు కొందరు ఆంగ్లకవులు తమ కావ్యములందు కొన్ని పాత్రలను కల్పించినటులుగా తెలుగున అమలిన శృంగార సిద్ధాంతమును, దానికి ప్రేరక పాత్రమగు విశ్వకవి విశ్వసౌందర్యారాధనము సామాన్య ప్రజావళికి ఆచరణ యోగ్యములు గావని తెలుపుటకు దువ్వూరి కడపటి వీడుకోలు కావ్యమును నిర్మించిరి కాబోలు''.

ఈ పరిశోధకుడు రామిరెడ్డిగారి ఉద్దేశాన్ని చాలా చక్కగా గ్రహించాడు. ఈ కావ్యనాయిక శారద తన ప్రణయాన్ని నిరాకరించిన ప్రియుని మెడను చేతులతో పెనువేసుకొని నీటిలో తమ నీడలను చూసి ఇలా అంటుంది.

కనుమోయీ యనుఁ గుంజెలి
మన యిద్దఱి నీడలిపుడు మధురాశ్లేషం
బునఁ దమ మాతృక లెఱుఁగని
యనుభూతినిఁ బొందు జడములయ్యును సఖుడా!

శారదలో చిత్రాంగి అంశ కొంత ఉంది. వాస్తవానికి పెళ్ళి కాకపోయినా, మానసికంగా ఆమె పరిణయం అయిన యువతే. ఇష్టార్థ సిద్ధికి అవరోధాలను మరులుకొన్న మగువ సహించదు. అంతకన్న మరణమే మేలనుకొంటుంది. కడపటి వీడుకోలు చిన్నకావ్యమే అయినా పెద్ద సత్యాన్ని నిరూపిస్తుంది.

దువ్వూరి వారి ఇతర రచనలపై కూడా విశ్లేషణలు జరగాలి. ముఖ్యంగా తెలుగులో వచ్చిన ఉమరుఖయ్యాము రుబాయతు అనువాదాలన్నింటి తులనాత్మక పరిశీలన చాలా అవసరం, రామిరెడ్డిగారిలాగా పారశీక మూలం నుండి అనువదించిన వారు ఒక్క ఆదిభట్ల నారాయణదాసుగారే కాబోలు.

రామిరెడ్డిగారు కేవలం కవితా వ్యాసంగంలోనేకాక చిత్రలేఖనంలో, విజ్ఞాన శాస్త్రవిషయాల అధ్యయనంపై మక్కువ చూపారు. కొన్నాళ్ళు చలనచిత్ర సీమలో ఉండి చిత్రాలకు దర్శకత్వం, సాహిత్యం సమకూర్చారు. కట్టమంచి రామలింగారెడ్డిగారు కవిత్వతత్త్వ విచారం మొదలుపెడితే రామిరెడ్డిగారు కవిత్వ నిరూపణం చేశారు.

రామిరెడ్డిగారు స్కూలు చదువుల వల్ల 'థర్డ్‌ఫారం గ్రాడ్యుయేట్లే' గాని స్వయంకృషితో ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, సంస్కృతం, బెంగాలీ, పర్షియన్, ఉర్దూ, తమిళ

భాషల్లో పాండిత్యాన్ని సంపాదించారు. పారశీకం నుండి కవితలు తెలిగించడంతోపాటు తన స్వీయ కవితల్ని ఆంగ్లంలోనికి తానే పరివర్తన చేసి, 'ది వాయిస్ ఆఫ్ రీడ్' అనే శీర్షికతో ప్రచురించి జేమ్స్. హెచ్.కజిన్స్ వంటి కోవిదుల ప్రశంసలనందుకొన్నారు. ఇన్ని భాషల్లో కవితలు ఆస్వాదన చేయబట్టే కవితత్త్వ నిరూపణం సాధ్యమైంది.

'కావ్యమర్థింప వలసినది రస సౌందర్యములే కదా! అంతర్లీనమైన నీతియైనను వాని కెటుల నుపకరించును? అను సంశయము కొందఱకుఁ గలుగవచ్చును. నీతి స్పర్శలేనిదే సౌందర్యము పరిపూర్ణము గాదని నాయుద్దేశము' అని దువ్వూరివారు ఒకచోట చెప్పారు.[8]

ఆ నీతినే కవి ప్రజల గీతిగా పాడుతారు. సర్వసమానత సాధించిన సంఘంలో మారు మోగిస్తారు.

పూజ్యు, లధములు, ధనికులు, పుట్టుబీద
లనెడి యెడ లేక యెత్తిరి హారతులను,
భక్తి పరవశులైన యీ ప్రజల గీతి
దిక్కు దిక్కుల యందుఁ ప్రతిధ్వనించు!

ఆధునిక యుగంలో సాహిత్య తరుశాఖలపై ఎన్నో పరభృతాలు గానం చేశాయిగాని కవికోకిల బిరుదాంకితులు గుర్రం జాషువా, దువ్వూరి రామిరెడ్డిగార్లే.

వీరు ఇద్దరూ ఇద్దరే గాని ఒకొక్కప్పుడు ఏకగ్రీవంగా కొన్ని విశ్వాసాలను వెల్లడించారు. అవి అక్షర సత్యాలు.

అబ్బూరి రామకృష్ణారావు

(1896–1979)

మెరుపు ముందు మెరుస్తుంది. తర్వాత ఉరుము ఉరుముతుంది. అలాగే కొందరి ప్రతిభ ఒక తరంలో కనబడితే వారి ప్రభావం తరువాత తరాలలో ధ్వనించడం సహజమే. ఈవిధమైన ప్రతిభావంతులలో అబ్బూరి రామకృష్ణారావుగారు ప్రఖ్యాతులు. ఆయన తెనాలి హైస్కూల్లో అయిదో ఫారం చదువుతూ ఉండగానే 1909లో తమ పదమూడో చక్కని చిక్కని పద్యరచనగా 'జలాంజలి' అనే కిశోర రచన చేశారు. ఇది 1914లో ఆంధ్రభారతి పత్రికలో ప్రచురితమైంది. (ఈ పత్రికలోనే అప్పటికి అయిదేళ్ళ క్రిందట గురజాడ అప్పారావుగారి రచనలు ప్రచురితమై నవ్యకవిత్వానికి నాంది పలికాయి). అబ్బూరి రామకృష్ణారావుగారు గురజాడ వారి మార్గంలో కాక రాయప్రోలు వారిలాగ వారికి సమానాంతర పథంలో పాత ఛందస్సులలోనే కొత్త సమాస కల్పనకోసం ప్రయత్నిస్తూ 1915లో 'మల్లికాంబ' అనే విషాదాంత కావ్యాన్ని రాసి ప్రచురించారు.

జలాంజలి కన్నా మల్లికాంబ మెరుగు. జలాంజలి కథలో మురళి-గౌరీశుడు అనే ఇద్దరు యువకులు అడవులలో పడి గురువును వెదకడం కావ్య వస్తువు. గురువుగారు శిష్యుని 'భక్తి పరిపాక మెఱుంగ కుతూహలమ్ము'తో ఇలా అన్నారట.

---

8. కవికోకిల గ్రంథావళి - 4 - వ్యాసములు, పుట.66

'కలిమిఁ దృణీకరించి నయగారమున న్నినుఁ బెంచు తల్లి దం
డ్రుల విడనాడి, దుర్భర మనోవ్యథమై చరియించె దేమియుం
దెలియవు, చిన్నవాఁడవు, వనిం దిరుగాడఁగ నీడుకాదు నాఁ
బలికె...''

అప్పుడు శిష్యుడు గురువుతో ఇలా చెప్పాడట.

''కలిమియు లేమియుం గలదె కానలసంచరణ మ్మొనర్చుని
ర్మలులకు నిత్యవైభవ విరాజితుఁడీశ్వరుఁ డొండు తప్పన
న్యులెవరు తల్లిదండ్రులు? మనోవ్యథ నొందుట సమ్మతంబ? ప్రా
జ్ఞులకుఁ బరేశునింగుఱిచి చోద్యములేదు మునీంద్రన చంద్రమా!

ఇందులో ఈడుకు మించిన వేదాంతం, వచ్చీరాని వయస్సులోని వైరాగ్యం కనబడుతుంది. సర్వసాధారణంగా పసితనంలో ఈ ఊహలు రావడం సహజమే. కందుకూరి వీరేశలింగంగారు చిన్నప్పుడు తపస్సులను గూర్చి చదవడం తమకు ఎక్కువ ఇష్టంగా ఉండేదని, రుషుల యొక్క మహిమలను గూర్చి చదివేటప్పుడు వారిలాగ తపస్సు చేసి మహిమలు సంపాదించాలని పలుమార్లు తమకు బుద్ధి పుట్టిందని స్వీయ చరిత్రలో రాసుకొన్నారు.[1] ఇటువంటి వాంఛనే అబ్బూరి రామకృష్ణారావుగారు జలాంజలి అనే కవితలో తీర్చుకొన్నారు. జలాంజలి ముగింపులో చివరి పద్యం ఇలా రాశారు.

''చిఱుత ప్రాయమునం దొనర్చిన పనుల్ చిన్నారి నేస్తంబులుం
బరమార్థైక విచారణాపరతయున్ బంధూత్కర త్యాగ సం
స్మరణమ్మున్, విపిన ప్రచార బహుళోన్మాదంబునం బోవు న
న్నొరయం జొచ్చె; తలంప దుర్భరము లోహో కాలపుం భేదముల్''

'మల్లికాంబ' కావ్యం విమర్శకుల దృష్టిలో పడింది గాని ''ఈకథలోని విషాదమును ఆయనగారి మెత్తని రచన చక్కగా కప్పి పెట్టినది. కథలోని వారందరూ ఈ లోకపు వ్యక్తులు కారు. మన కవితాలోకపు వ్యక్తులు'' అని ఒక విమర్శకుడు 1962లో అన్నారు.[2]

''చాలా పూర్వపు కన్నె అయినా కవి అప్పుడప్పుడే సారస్వత లోకం పొలిమేరలు అతిక్రమించి లోనకు వస్తున్న నూతనుడయినా, ఆనాటికే 'మల్లికాంబ' నూతన సోయగముతో పొడసూపింది - కథలో విశేషం లేదు. ఆ కావ్యరచనలో మరీ ఎన్నతగినది మరేమీ అంతలేదు'' అని మరొక సాహిత్యమిత్రులు 1932లో అన్నారు.[3]

అబ్బూరి రామకృష్ణారావుగారు 1918-19లో 'ఊహాగానము-పూర్వప్రేమ' అనే సంకలనం ప్రచురించారు. ఇది వారికి బాగా పేరు తెచ్చిన కృతిద్వయం. అప్పటికే ఆయన

1. స్వీయచరిత్ర - మొదటిభాగం, పుట.20
2. శ్రీపాదగోపాలకృష్ణమూర్తి - 'అబ్బూరి సంస్మరణ'లో - పుట.167
3. మల్లాది రామకృష్ణశాస్త్రి - 'అబ్బూరి సంస్మరణ'లో - పుట.126

కలకత్తా సిటీ కాలేజిలో 'నాన్ కాలేజియేట్' విద్యార్థిగా చేరి చదువు ప్రారంభించారు. హేరంబచంద్ర మిత్రా వద్ద అధ్యయనం చేసి బి.ఏ.లో ఉత్తీర్ణులయ్యారు. కలకత్తాలో ఉన్నప్పుడు బెంగాలీభాషను నేర్చుకొని ఆ సాహిత్యాన్ని చదివారు. బెంగాలీ కవితలలోని అందాలను తెలుగులోనికి తీసుకురావాలనే కోరిక ఊహాగానంలో కనబడుతుంది. పూజాశిరీషములనే మూడు పద్యాలలో శిల్పసౌందర్యం చూడచక్కగా కనబడుతుంది.

1. పూజా శిరీషము లేరుకొంటివి
   పోయి వచ్చెదో? జవ్వనీ!
   తేజోవిలీన దృగంచలమ్ముల
   తేఱి చూచెద నెవ్వని?

2. ఆనంద వస్త్రము లే కుమారుం
   డల్లు తెల్లగ నల్లగా?
   ధ్యానంపు హైందవగీతి నెవ్వం
   డల్లు నల్లగ తెల్లగా?

3. ఆలింపు పాడెద నాంధ్ర కోమలి
   యార్ద్ర హైందవ గీతులన్
   పాలింతునెల్లడభావపుష్పిత
   నవ్య శయ్యారీతులన్

ఈ పద్యాలలో తెలుగులోని యతిప్రాసల నియమాలేకాక బెంగాలీ కవితలలో లాగా అంత్యప్రాసల సొంపు కూడా ఉంది.

1917వ సంవత్సరంలో మన శాసన పరిశోధకులు బెజవాడలోని యుద్ధమల్లుని శాసనాన్ని కనుగొన్నారు. అది క్రీ.శ. 898వ సంవత్సరం నాటిది. అంటే నన్నయ్యగారికి పూర్వపుది. ఈ శాసనంలో మధ్యాక్కరలున్నాయని పరిశోధకులు గుర్తించారు. ప్రాచీన కాలంలో అక్కరలు తెలుగు కవిత్వంలో ఉండేవని తెలుసుకొని ఇతర సాహితీపరులు తృప్తిపడ్డారు. అబ్బూరి రామకృష్ణారావుగారు మాత్రం అంతతో ఆగలేదు. మధ్యాక్కరలు పాడడానికి అనువైన ఛందస్సులో ఉంటాయని గుర్తించారు. తమ శిల్ప చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ పృథివీ ప్రశంస అనే నాలుగు పద్యాల కృతిని రచించారు. చూడండి -

1. ఓ విశాలావనీ!
   శోభాతి పావనీ!
   ఆరంభ పుణ్యాక్షణముల నీశుఁడు నాఁటి
   నీయాది సౌభాగ్యమెటుల నెల్గెనో? భవదీయశాటి
   ఆకుపచ్చని యాకులో
   పండు వెల్తురు రేకులో

   నిన్ను ప్రశ్నింపగాఁజాల, నీనాఁటి ప్రొద్దుటి పూఁట

గంభీరమై ప్రవహించె నీదు సౌందర్యంపు పాట
ఓ విశాలావనీ!
శోభాతి పావనీ!

2. శాంతి కల్లోలినీ!
వైభవ శాలినీ!
సీతాసతీవేణి నడఁగి వాడిపోనని పూవుఁబోలి
దిన దినా పూర్వమై పొడుచు తావకీన విభాత కేళి
ప్రాభాత గానమ్ములా?
నీ యస్తమానమ్ములా?
ఏవి సుందరతరమ్ము లౌకొ? యెట్టి గీతాపరిమళము
ఆనందవీధి నాడించు నీ హృదయ సరోజదళము
శాంతి కల్లోలినీ!
వైభవ శాలినీ!

3. ధవళ యశోవతీ!'
స్నిగ్ధ తేజోవతీ!
పాటెడు కాల్వల చెంత వీచెడు గాడ్పుల వినుచు
నీయుదాత్త లలాటరేఖ పులకలు నూపకన్గొనుచు
త్వత్కాయ మానమ్ములై
శ్యామాయ మానమ్ములై
దవ్వుల నున్న వెదుళ్ళు కలసి కంఠము లెత్తిపాడ
తల్లి! నీయొడిలోన నడఁగి యల్లరి లేక విన్నాఁడ
ధవళయశోవతీ!
స్నిగ్ధ తేజోవతీ!

4. హే నవమోహినీ!
హే దయా వాహినీ!
చూడ సుందరములై యడరు నాశృంఖలమ్ములఁ ద్రెంచి
నామేలి వాకిళ్ళ దాటి, విందు నీ మధురవిపంచి
బంగారు తోరమ్ములన్
నా రత్న హారమ్ములన్
గైకొని నాకిమ్ము జనని! నీ మృత్తికా రేణు కణము
శాద్వల శ్యామవీధి వికసించు పచ్చ ప్రాంగణము
హే నవ మోహినీ!
హే దయా వాహినీ!

ఈ కృతిలో పెద్ద పాదాలలో మధ్యాక్కర నడకలు ఉన్నాయి. పూర్వ లాక్షణికులు చెప్పిన యతిప్రాసలు కాక అంత్యప్రాసలు పెట్టి అందాల్ని తీసుకొచ్చారు. ప్రతి ఖండికలో మొదటి రెండు పాదాలే ఆ ఖండిక చివర పల్లవిలాగ పునరావృతం అవుతాయి. ఇటువంటి శిల్పనైపుణ్యం ఆనాటి కవులు ఎవరూ ప్రదర్శించడానికి ప్రయత్నించలేదు. ఆ ధైర్యం అబ్బూరి వారికే కలిగింది.

ఉత్తరోత్తరా విశ్వనాథ సత్యనారాయణగారు మధ్యాక్కరలు విరచించారుగానీ, దేశీ ఛందస్సును మార్గపద్ధతిలో రాయడం వల్ల ఉండవలసిన అందాలు ఆ రచనల్లో లేకపోయాయి. నేను అబ్బూరి వారి శిల్పాన్ని మెచ్చుకొని 'శుద్ధ మధ్యాక్కరలు' రచించాను. అందులో తొలి మూడు పద్యాలనూ చూడండి.

ఆదిలో నన్నయ్యగారు
        అక్కరల్ విరచించి నారు
పాదాంత విశ్రాంతు లిడక
        పాడేటి లయబోధ పడక
ఈ దేశి ఛందస్సులోని
        ఇంపైన గతి కొచ్చెహాని
ప్రాదుర్భవించింది నవత
        పాడుకో ఆరుద్ర కవిత

ఆరంభ పుణ్యకాలమున
        ఆధునిక ఖండ కావ్యమున
పేరు మాత్రము చెప్పకుండ
        'పృథ్వీ ప్రశంస'లో నిండ
తీరుగా రెండు పాదాలు
        తియ్య తేనియలున్న పూలు
ఆరూఢిగా గ్రుచ్చినారు
        అక్కరల్ అబ్బూరి వారు

కావ్యమౌ నూతనత్వమ్ము
        కండగల అంత్యప్రాసమ్ము
రమ్యమ్ముగా తెచ్చినారు
        రామకృష్ణారావుగారు
సౌమ్యమౌ అక్కరల్ నేడు
        'సాంప్రాట్టు' చేపట్టినాడు
గమ్యమ్ము గమనమ్ము సౌరు
        కటకటా కనిపించ నీరు.

(పై నా 'శుద్ధమధ్యాక్కరలు' సుమారు ఒక అరవై ఆంధ్రప్రభ వారపత్రికలో లోగడ అచ్చయ్యాయి)

ఆనాటి భావకవులందరిలాగే అబ్బూరి రామకృష్ణారావుగారు తమ వంతు 'అమలిన శృంగారం' ఒక పద్యకృతిలో రాశారు. భావకవి ప్రేయసి ఎప్పుడూ అప్రాప్త మనోహరే. ఆమె తన వికాసాన్ని తన మనమ్మునింపమని ప్రార్థిస్తూ 'అప్రాప్త మనోహరి' తో కవి ఇలా చెప్పారు.

''మోమున మోముఁ జేర్చి నినుముద్దిడు కోరికలేదు; నీదు వ
క్షోమృదుశయ్యపైని శిరసుం గెడవాలిచి, వ్రేలు మల్లికా
దామ సువాసనా మధురతల్ పరికింపఁగఁ గాంక్షలేదు; నా
ప్రేమకు దారిఁ జూపఁగ వరించితి నాయలరించు నెచ్చెలీ!''

'కాపుపాట' అనే ఇంకొక కృతిలో 'మేనులాను కొన కొమ్మల కాకులవోలె నొక్క మాటాడక' కూర్చుందామని ప్రేయసిని రమ్మన్నాడు. ఈ కృతి 'ప్రేయసి! లేచి రమ్మి' అనే మాటలతో ప్రారంభమౌతుంది. (జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి ఈ ఒక్కముక్క క్రింద గీటు గీసి ఇదే భావకవుల నినాదమని వెటకారం చేశాడు. అది వేరే సంగతి).

'ఊహాగానము-పూర్వప్రేమ' అనే సంకలనం రచించిన అబ్బూరి రామకృష్ణారావు గారు రమారమి కవితా సన్యాసం చేసినట్టే కనబడుతుంది. రవీంద్రుని రచనలు, అరవిందు ఘోష్ కవితలు కొన్ని అనువదించారు గాని రాసినవేవీ విరివిగా ప్రచురించలేదు. రవీంద్రుని రక్తకరవీర్ అనువాదం సగంలోనే ఆగిపోయింది. కలకత్తాకు వెళ్ళడానికి ముందు మైసూరులో టి.పి.కైలాసంగారి ప్రహసనాలను కొన్ని తెనిగించారుగాని అవీ ప్రచురించ లేదు. ''వాటిని ప్రచురించాలనే ఉద్దేశమే ఆయనకు లేకపోయింది. ఇప్పటికి ఆ ప్రతులు కూడా సాఫ్‌గా అంతర్ధానమయి ఉంటాయి. ఈ మాదిరి సుస్తీ సహించకూడనిది; అయినా, మనకు ఆ ఆచారం అమరేశ్వరుడి నాటినుంచీ... ఇంకా అంతకు పూర్వం నుంచీ కూడా వస్తూనే ఉంది. అలాటి అశ్రద్ధ మరీ బలిస్తే ఒక్కొక్కప్పుడు మహాకవి అయినా... తరువాత కాలానికి పేరుమాత్రం... అదీ చూచాయగా మిగులుతుంది...'' అని మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు ఒక చురక తగిలించారు. అయినా అబ్బూరి వారిలో చలనం లేదు.[4]

అబ్బూరి రామకృష్ణారావుగారిలో రచనా వైరాగ్యం రావడానికి కారణాలు ఇవాళ మనకు కొద్ది కొద్దిగా అవగాహన అవుతున్నాయి. కలకత్తాలో చదువుకొన్నాక ఆయన రవీంద్రుని శాంతినికేతనంలో కొన్నాళ్ళు ఉన్నారు. వాతావరణం చూశాక ఆయనకు మనస్సు విరిగిపోయినట్టుంది. తమ అనుభవాలను ఇలా చెప్పారు.[5]

''శాంతి నికేతనంలో వొకమూడు వారాలు - నాలుగు వారాలు గడిచింతరువాత నాకిదివరకున్నటువంటి ఆ - భావం త్వరలో సడలిచ్చింది - చాలావరకూ తగ్గిపోవటానికి యెందువల్లనో మరి - తరిగింది. వైతాళికులని చెప్పి వుదయమే టాగూరు పాడినట్టు పాడుతూ - మేలుకొలుపులు పాడుతూ - విద్యార్థులందరూ తిరగాలి - అక్కడున్న ప్రతి సన్నివేశమూ కూడా టాగూరుకు సంబంధించినది కావటం - అక్కడున్నటువంటి ప్రతి

4. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.124
5. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.195-6.

కుఱ్ఱవాడూ కూడా టాగూరును పొగుడుతూ వుండటం నిష్కారణంగా - యివన్నీ చూసి వొక విధమైనటువంటి జుగుప్స కలిగింది. యెందుకంటే స్వతంత్రమైనటువంటి బుద్ధి కలిగినటువంటి భావంలో నాకు - నేను వుండటం చేత - అక్కడున్నటువంటి యీ భావదాస్యాన్ని సహించలేకపోయాను''.

ఇది ఒక రేడియో ఇంటర్వ్యూలో అబ్బూరివారు చెప్పారు. ఇందులోనే ఇంకా ఇలా చెప్పారు.

''తరువాత అక్కణ్ణుంచి నేను వెళ్ళిపోయాను. కలకత్తాలో వుపన్యాసం చెయ్యటానికి వొచ్చినప్పుడల్లా టాగూరు చక్కని పట్టుబట్టలు కట్టుకొని ప్రసన్నమైన చూపులతో, గడ్డం సవరించుకొంటూ, పెద్ద విలువ కలిగిన మోటారుకారులోంచి దిగి, సభావేదికపైకి వస్తుంటే ఆయన ఆవచ్చే కాస్తదూరంలోనూ కొన్నివందలమంది భిక్షుకులు, ఆయన అఖండమైనటు వంటి ఆయన తేజస్సు, ఆయన శరీరసౌష్టవమూ వీటన్నింటి వెనకా వాళ్ళ దారిద్ర్యం నెగతాళి చెయ్యడం వంటివి చూసే ఆ తారతమ్యం వుంటే చాలా హృదయ విదారకంగా వుండేది''.

ఈ అనుభవాలను చెప్పి, అబ్బూరివారు చివరకు తేల్చిందేమిటంటే ''మొత్తంమీద తేలిందేమిటంటే వంగభాష అభ్యసించడానికి నాకవకాశం కలిగింది. ఆయన రచనలు చాలామటుకు మాతృకలలో చూడటానికి అవకాశం కలిగింది. కాని, ఆయనమీద ప్రత్యేక వ్యక్తిగతమైనటువంటి గౌరవంలో కొంచెం తగ్గుబాటు కనిపించింది నాకు''.

రవీంద్రుని గురించి తన అనుభవాలను అబ్బూరి రామకృష్ణారావుగారు ఇంకా వివరంగా ఆప్తులకే చెప్పినట్టున్నారు. వారి అభిమానపాత్రుడు, పెంపుడుకొడుకులాంటి వాడు శ్రీరంగం శ్రీనివాసరావు ఇలాంటివి ఎన్ని విన్నాడో మరి 'టాగోరు నా ఎలర్జీ' అని ఉత్తరోత్తరా అనడానికి కారణాలు బహుశా అబ్బూరి వారి ఉపదేశం వల్లనే కావచ్చు.

రవీంద్రనాథటాగోరు విషయంలో ఎలా భ్రమలు పోయాయో అలాగే అరవింద ఘోష్ విషయంలో కూడా అబ్బూరి వారికి నమ్మకం చెడింది. 'దైవికమైన విషయాల్లో శ్రద్ధ యెక్కువ కావటం వల్లా కొన్ని చిత్ర విచిత్రమైన అనుభూతులు కలిగి కొంత భీతికూడా కలగడం వల్లా... అరవిందుని సాన్నిధ్యాన్ని చేరుకోటానికి ప్రయత్నించారు.

''తీరా పుదుచ్చేరి వెళ్ళింతర్వాత 'అరవిందులు దర్శనమివ్వరు - మాతృశ్రీ మాత్రమే దర్శనమిస్తారు' వారు యేర్పాటు చేస్తామని చెప్పారు. సరే రెండురోజులున్న తరువాత వారితో నొక యింటర్వ్యూ యేర్పాటు చేసి నన్నక్కడికి తీసుకెళ్ళారు. అదివరకే నేను వుత్తరం రాసిచ్చాను వారికి. నా అనుభవాలన్నీ రాసి వారి యొక్క సలహా కోరుతూ వారి యొక్క ప్రసాదాన్ని అభ్యర్థిస్తూ వుత్తరం రాసి పంపించాను. తరువాత నేను... ఈ అమ్మగారు సమీపించి నావంక చూసి యేం మాట్లాడకుండా హుష్ హుష్ అని... మళ్ళీ.... మళ్ళీవో మాటు చూసి అదే విధంగా వొక ధ్వని చేశారు. నేను నమస్కరించాను. ఆమె లోపలికి వెళ్ళిపోయినారు. అంతే అంతకన్న మాకు సంభాషణ అక్కడ జరగలేదు.

(అబ్బూరివారి మానసపుత్రుడు శ్రీరంగం శ్రీనివాసరావు అరవింద ఘోష్‌ను ఎప్పుడూ 'అరవింద ఘోస్టు' అని పేర్కొనేవాడు.)

కవితలంటే రాయటం కట్టిబెట్టారుగాని, అబ్బూరివారు రచనా వ్యాసంగం పూర్తిగా మానివేయలేదు. 1919లో కాశీనాథుని నాగేశ్వరరావుగారిని అర్థించి ఆంధ్రపత్రికలో సారస్వతానుబంధాన్ని ప్రారంభింపచేశారు. 'అభినవ కవితా ప్రశంస' అనే తొలివ్యాసంతో వ్యాసపరంపర రాశారు. 1920లో 'కృష్ణాపత్రిక'లో 'రసమంజరి' శీర్షికను ప్రారంభించారు. 'సూర్యరాజుకథలు' అనేవి పదిపన్నెండు రచించారు. 'నదీసుందరి' నాటకం కృష్ణాపత్రిక లోనే ప్రచురించారు.

1920లో అబ్బూరివారు జీవితం పూర్తిగా రాజకీయ రంగంలో గడిచింది. అంతకు ముందు సంవత్సరమే ఆయనకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారితో ప్రగాఢ పరిచయం ఏర్పడింది. చీరాల-పేరాల సత్యాగ్రహంలో అబ్బూరివారు గోపాలకృష్ణయ్యగారి కుడిభుజంగా పనిచేశారు. రామదండులో ఒక ప్రముఖ సేనాపతి అయ్యారు. 1920లోనే దుగ్గిరాలవారి ప్రోద్బలం మీద అబ్బూరివారు జలియన్‌వాలాబాగ్ దురంతంపైన బుర్రకథను రచించారు. కవితలు ప్రజలను ఉద్బోధించి కార్యోన్ముఖులను చేయాలన్న సత్యాన్ని గ్రహించారు. ఈ బుర్రకథను ప్రభుత్వం నిషేధించింది. దాని ప్రతులు మాయమయ్యాయి. 1921లో అఖిలభారతకాంగ్రెసు మహాసభలకు రామదండుతో హాజరయ్యారు.

అబ్బూరివారి బుర్రకథ నష్టమైందని అందరూ భావిస్తున్నా ఒక చిత్తుప్రతిని ఎలాగో సంపాదకులు కొందరు తవ్వి బయటకు తీశారు. అందులోని కొన్నిభాగాలు చూడండి.

''పామరులారా! పండితులారా! భారతీయులారా!
కామినులారా! వీరకుమారుల కన్నతల్లులారా!
న్యాయములేదీ భారతభూమికి ఆంగ్లేయులవల్ల
శ్రేయములేదీ భారతభూమికి శ్వేతజాతివల్ల
కాయము వాసిన పాపమె పాపకర్మపు బ్రతుకునకూ
హాయిగ నరలోకంబున నైననూ హానియుండబోదూ

ఆంగ్ల రాజ్యమున అధమాధములయి అణగియుండనేల
సాంగత్యం బిదిభావ్యముగాదని స్వరాజ్యమును గోరి
గాంధి మహాత్ముని పాదాబ్జంబుల కాంక్షతోడ కొలిచి
అంధకారమును పాఱదోలుడీ ఆతని మంత్రమున
ధర్మ పథంబును బట్టి నడుపుడో త్యాగశీలులారా!
శర్మదమైన పదంబునకే మన స్వరాజ్యంబునకూ
గాంధీ గాంధీ శ్రీ గాంధీ గాంధీ శ్రీ గాంధీ
అంధకార సంబంధవిమోచన ఆనంద -.......''

సుదీర్ఘమైన రచనలో ఇది చివరిభాగమే. రచన ఉగ్రూతలూగించే ఉద్రేకం పుట్టించే ధోరణిలోనే ఉంది. చిత్తుప్రతి సంక్షిప్త ప్రతిలోనే ఉత్తేజకరమైన భాగాలుంటే పూర్తి ప్రక్రియ ఎంత ప్రయోజనకారిగా, ప్రబోధాత్మకంగా ఉందో ఊహించుకోవచ్చు.

చీరాల పేరాల సత్యాగ్రహం విఫలమైంది. బెజవాడలో ఆంధ్రా యూనివర్సిటీ స్థాపన జరిగింది. పూర్వం మైసూరులో చదువుకొంటున్నప్పుడే అబ్బూరి వారికి కట్టమంచి

రామలింగారెడ్డిగారితో పరిచయముంది. రామలింగారెడ్డిగారు అబ్బూరివారిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా చేరమని ఆహ్వానించారు. అబ్బూరివారు ఆ ఉద్యోగంలో చేరారు. 1928లో దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు మరణించారు. అబ్బూరి వారికి జాతీయోద్యమంతో సంబంధం తగ్గిపోయింది. 1930లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వాల్తేరుకు తరలివెళ్ళింది. నాటినుంచి చాలాకాలం అబ్బూరివారు విశాఖలోనే స్థిరపడ్డారు. వారి రాజకీయ అవగాహనలో కొత్తకోణాలు బయటపడ్డాయి.

సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితులు ఇంగ్లండు నుంచి తిరిగి వస్తున్నప్పుడు తమ వెంట కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చారు. ఆయన 1931 నుంచి 1936 దాకా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఉన్నారు. తమ వెంట తెచ్చిన సాహిత్యాన్ని గ్రంథాలయంలో పెట్టారు. అదేకాలంలో అక్కడ హిస్టరీ డిపార్టుమెంటులో ఆచార్యులుగా హీరేంద్రనాథ ముఖర్జీగారు ఉండేవారు. ఆయన కూడా సామ్యవాద సాహిత్యాన్ని విద్యార్థులతో చదివించేవారు. గ్రంథాలయ పాలకులుగా అబ్బూరి రామకృష్ణారావుగారు ఈ సాహిత్యాన్నంతా పరిశీలించారు. అధ్యయనం చేశారు. తమ అనుభవాలను ఇలా తామే చెప్పుకొన్నారు.[6]

''...నేను స్వతంత్రించి కమ్యూనిస్టు మేనిఫెస్టో చదివి... కమ్యూనిస్టు పార్టీ మనదేశంలో కూడా వొకటి వుండే బావుణ్ణు అని కమ్యూనిస్టు పార్టీ స్టార్ట్ చేద్దామనే ఉద్దేశ్యంతో అనేకమంది కుర్రవాళ్ళని కలుసుకున్నాను, కొన్నాళ్ళు బెజవాడ అక్కడికీ వెళ్ళి తరువాత కోటంరాజు రామారావు అతని యొక్క సహాయంతో బొంబాయి చేరుకుని తాను జోగ్లేకర్‌నీ వాళ్ళనీ చూసి నాయొక్క అభిప్రాయాన్ని వాళ్ళకు తెలిపితే నాకు విశాఖపట్నంలో పార్టీ తరపున పనిచెయ్యటానికి అధికార పత్రాలన్నీ యిచ్చి వెళ్ళిపోయినారు. అప్పుడు నేను విశాఖపట్నంలో వొకరిద్దరు సహచరులతో కలిసి డాక్‌వర్కర్స్ యూనియన్ వొకటి యేర్పాటు చెయ్యడానికి వీలైంది. నేను యూనివర్సిటీలో పనిచేస్తున్నాను. కాబట్టి బహిరంగంగా కమ్యూనిస్టునని చెప్పుకోటానికి నాకు అనుమతి ఇయ్యలేదు పార్టీవారు. రహస్యంగానే పార్టీపని చెయ్యమన్నారు''.

వాస్తవానికి విశాఖపట్నంలో 'హోల్‌టైమర్'గా పనిచెయ్యటానికి కె.ఎల్. నరసింహారావును, పుచ్చలపల్లి సుందరయ్యగారు తమ సహచరులైన పులుపుల శివయ్య, జొన్నలగడ్డ రామలింగయ్యగార్లతో చర్చించాక పంపించారు. ఈ నరసింహారావుగారే హార్బరు కార్మికులకోసం రాత్రి పాఠశాల, కార్మిక సంఘం మొదలైనవి ఏర్పాటు చేశారు. అబ్బూరివారి ఈ పాఠశాలలో 1932 నుంచీ చదువు చెప్పేవారు. కార్మికోద్యమంలో ప్రచ్ఛన్నంగా పాల్గొనేవారు. కమ్యూనిజాన్ని అభిమానించి దాని వ్యాప్తికి యథాశక్తి కృషి చేస్తున్న అబ్బూరివారు 1936లో లక్నో కాంగ్రెసు సభలతో పాటే అక్కడ జరిగే ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ కాన్ఫరెన్సుకు వెళ్ళారు. దీనిలో అబ్బూరి వారి మిత్రులు సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు, ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీగారు కూడా పాల్గొన్నారు. కాశీవిద్యాపీఠంలో

6. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.198

చదువుకొంటున్న తుమ్మల వెంకటరామయ్యగారు తమ స్నేహితులతో వాలంటీర్లుగా లక్నోకు వెళ్ళారు. లక్నోలో సాహిత్య సభల గురించి సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు తమ అనుభవాలను ఇలాగ రాశారు.[7]

''ఆ సంవత్సరం లక్నోలో జరిగే కాంగ్రెస్ సభకి నేవెళ్ళదలుచుకున్నానని రామకృష్ణారావుగారికి వ్రాశాను. ఆ సందర్భంలోనే Progressive Writers Conference అక్కడ జరుగుతుందని, దానికి ఆహ్వానంమీద తామూ రాబోతున్నామనీ ఆయన రాశారు. ముఖర్జీ కూడా వస్తున్నట్టు చెప్పారు. ముగ్గురం కలకత్తాలో కలుసుకొని లక్నోకి బయలుదేరాము. ఆనాటికి నేను కాంగ్రెస్. కాంగ్రెస్‌లో అంతర్గతంగా వున్న సోషలిస్టు పార్టీ అభిమానిని. ముఖర్జీ పదహారణాల కమ్యూనిస్టు. నాకు అర్థమైనంతవరకు రామకృష్ణారావు కమ్యూనిస్టు అభిమాని. కాని కమ్యూనిస్టుకాదు. మా అభిరుచులు వేరు. ఉద్దేశ్యాలు కొంతవరకు వేరు. కాని ముగ్గురమూ పరస్పరాభిమానులం. నాకూ రామకృష్ణారావుగారికీ స్నేహం మరింత బలవత్తరం''.

లక్నోలో సాహిత్యసభకు మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసాన్ని హిందీలో చదివారు. అబ్బూరి రామకృష్ణారావుగారు ఆంగ్లంలో మాట్లాడుతూ ఉంటే హిందీలో ప్రసంగించమని ప్రేమ్‌చంద్‌తో సహా కొంతమంది ప్రతినిధులు పట్టుబట్టడంతో కొంత ఘర్షణ జరిగింది. ఇది యం.యన్.రాయ్ దృష్టికి వచ్చింది. ఈ ఉదంతాన్ని అబ్బూరి వరదరాజేశ్వరరావు ఇలా కథనం చేశాడు.[8]

''1936 సంవత్సరంలో Progressive Writers Conferenceను లక్నోలో సమావేశపరిచారు. అదే ఆరంభసభ. అదే సమయంలో ఆ నగరంలో కాంగ్రెసు మహాసభ కూడా జరుగుతోంది. అలాంటి తరుణాల్లో యం.యన్.రాయ్‌గారి అనుచరులు రాయ్‌గారి గురించిన సాహిత్యాన్ని తీసుకువచ్చి ప్రముఖులయిన వారి కందచేస్తూండేవారు. రహస్యంగా వారితో సంబంధాలు పెట్టుకునేవారు. Progressive Writers Conferenceకు హాజరయిన ముఖ్య ప్రతినిధులందరూ కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు సానుభూతిపరులూ కావటంచేత రాయ్‌గారి అనుచరులు ఆ సమావేశంమీద మరింత నిఘా పెట్టారు. ఆకాలంలో రాయ్‌గారు డెహ్రాడూన్ జయిల్లో నిర్బంధంలో వుండి దేశంలో పలుప్రదేశాల్లో జరిగే రాజకీయ సమావేశాలకు సంబంధించిన విశేషాలను మిత్రుల ద్వారా సేకరిస్తూండేవారు. అలా ప్రోగ్రెసివ్ రైటర్సు కాన్ఫరెన్సు గురించి కూడా విశేషాలను గ్రహించారు. కాన్ఫరెన్సు ప్రారంభోత్సవంలోనే మా నాన్నగారికీ, మున్షీ ప్రేమ్‌చంద్‌కీ మధ్య జరిగిన వాదోపవాదాలు రాయ్‌గారి దృష్టికి వచ్చాయి. దక్షిణాది నుంచి వచ్చిన ఈ యువరచయిత యెవరో కనుక్కోమని లక్నో జయిల్లో వున్న రాజేంద్ర దత్త నిగం గారికి రాయ్ రాశారట''.

లక్నో సభలో అనేక తీర్మానాలు ఆమోదించారు. ఒక మానిఫెస్టోను రూపొందించారు. దాని ప్రాతిపదికమీద అన్ని రాష్ట్రాల్లో రచయితల సంఘాన్ని స్థాపించాలని తీర్మానించారు. ఆంధ్రలో సంఘాన్ని స్థాపించే బాధ్యత రామకృష్ణారావు

7. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.8
8. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.131

గారిపై పెట్టారు. లక్నో నుంచి 'ఇండియన్ లిటరేచర్' అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించాలని సంకల్పించారు. దాని సంపాదకవర్గంలో అబ్బూరివారిని చేర్చుకొన్నారు. కార్యభారాలను తమ భుజంపై వేసుకొని అబ్బూరివారు వాల్తేరుకు తిరుగుముఖం పట్టారు.

అబ్బూరివారు లక్నో నుంచి బయలుదేరే ముందు కపూర్ రెస్టారెంటు అనే భోజనశాలలో ఒక ఆగంతక వ్యక్తి కనిపించి రాయ్ సాహిత్యాన్ని కొంత అబ్బూరివారి చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. ఈవిధంగా మొదట రాయ్ సాహిత్యంతో పరిచయం, పిదప యం.యన్.రాయ్‌తోనే ప్రత్యక్షంగా సహచర్యం అబ్బూరివారికి కలిగింది.

ఇల్లు చేరుకున్నాక అబ్బూరివారు శ్రీరంగం శ్రీనివాసరావును పిలిచి, లక్నో మానిఫెస్టోను ఇచ్చి అతని సహకారంతో 'ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం' అనే సంస్థను స్థాపించారు. తాము అధ్యక్షులు. శ్రీశ్రీ కార్యదర్శి. ఊళ్ళోనే ఉన్న గుడిపాటి వెంకటచలంగారిని సభ్యులుగా చేర్చారు. ప్రణాళికను అచ్చువేసి ప్రకటించారు. అయితే సంఘ నిర్మాణం అక్కడితో ఆగిపోయింది.

అబ్బూరి వారికి యం.యన్.రాయ్ భావాలు నచ్చాయి. వాటిని విశాఖపట్నంలోని కమ్యూనిస్టు స్నేహితులతో చర్చించసాగారు. అప్పుడు చండ్ర రాజేశ్వరరావుగారు విశాఖపట్నంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన తమ సాటి సభ్యులలో ఉన్న అనుమానాలను తొలగించడానికి కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్‌లో యం.యన్.రాయ్ విచ్ఛిన్నకరపాత్రను ఓపిగ్గా వివరించసాగారు. అంతర్జాతీయంగా ట్రాట్స్కీయిజాన్ని, జాతీయంగా రాయిజాన్ని ఎదుర్కొనవలసిన అవసరాన్ని పుచ్చలపల్లి సుందరయ్యగారు సామ్యవాద శక్తులకు ఉద్బోధించసాగారు.

అబ్బూరివారు విభేదించారు. 1937లో యం.యన్.రాయ్‌గారు మన రాష్ట్రానికి వచ్చారు. అబ్బూరివాడు కాకినాడ వెళ్ళి రాయ్‌గారిని కలుసుకొన్నారు. వాల్తేరుకు ఆహ్వానించారు. ఒక ఆరువారాలపాటు రాయ్‌గారు వాల్తేరులో ఉన్నారు. అబ్బూరివారు ప్రతిరోజూ రాయ్‌గారితో గడిపారు. ఎన్నో విషయాలు చర్చించారు. కమ్యూనిస్టులతో తెగతెంపులు చేసుకొని రాయిస్టుగా మారారు. ఈ విషయాన్నే అబ్బూరివారు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.[9]

''...నేను కమ్యూనిస్టు పార్టీలో సభ్యుణ్ణిగా వున్నప్పుడు ఎం.ఎన్.రాయ్‌గారిని గురించి ఆపార్టీలో ప్రతికూల ప్రచారం సాగుతూండేది. ఆయనతో నాకు సంపూర్ణమైనటు వంటి సాహచర్యం లభించడం వల్ల ఆయనమీద గౌరవం చాలా ఇనుమడించింది. ఆ ఆరువారాలలో ప్రతినిత్యం ఆయనతో ఏకాంతంగా సంభాషణ చెయ్యటానికి అవకాశం కలగటం వల్ల ఆయన యొక్క లక్ష్యశుద్ధిని ఆయన యొక్క అభిప్రాయాలనీ... వారి అభిప్రాయాల వల్ల యెంతో నేను ప్రభావితుడనై నా జీవితమంతా కూడా వొకమలుపు తిరిగినట్టు అనిపించింది''.

9. ''అబ్బూరి సంస్మరణ'' - పుట.199

రామకృష్ణారావుగారు తాము మలుపు తిరగడమే కాక విశాఖపట్నంలో తొలినుంచీ 'హోల్‌టైమర్'గా పనిచేస్తున్న కె.ఎల్.నరసింహారావుగారిని తమవైపుకు తిప్పుకొన్నారు. అతడు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించి, ఆదేశాలను పాటించలేదు.[10] తర్వాత రాయిస్టుగా మారారు. అబ్బూరి వారితోపాటు వారి మానసపుత్రుడు శ్రీరంగం శ్రీనివాసరావు కూడా రాయిస్టు అయ్యాడు. ఆ సంగతి తానే ఇలా చెప్పాడు.[11]

''ప్రపంచాన్ని కుదిపివేసిన పదిరోజులు'' అనే పుస్తకాన్నీ, క్రోపోట్కిన్ రచనల్నీ నాచేత చదివించింది అబ్బూరివారే. వారి సహచర్యం వల్లనే చాలాకాలం నేను రాయిస్టుగా చెలామణీ అయ్యాను. కాని, విచిత్రం ఏమిటంటే M.N. Roy గ్రంథాలేవీ చదవమని అబ్బూరివారు నాకివ్వలేదు, నేను స్వయంగా కొనిగాని, సంపాదించిగాని చదవనూలేదు. లెనిన్‌తో భుజం భుజం రాసుకొని తిరిగిన వ్యక్తిగా మానవేంద్రనాథరాయ్ నాకెప్పుడూ మహనీయుడే!''

శ్రీరంగం శ్రీనివాసరావులాంటి వారినేకాక ఆనాడు విశాఖపట్నం జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు తాతా దేవకీనందనరావు, కార్యదర్శి డి. రామకృష్ణపరమహంస వంటి వాళ్లను కూడా అబ్బూరివారు ఆకర్షించారు. చుండి జగన్నాథంగారిని రాయ్‌భావాల వైపుకు తిప్పారు. 1940లో రాడికల్ డెమోక్రటిక్ పార్టీని నిర్మించారు. మధ్యతరగతి మేధావులను చాలామందిని అందులో చేర్చుకొన్నారు. లావు అంకమ్మ, జి. నరహరి, పి.వి.సుబ్బారావు, ఆవుల గోపాలకృష్ణమూర్తి, త్రిపురనేని గోపీచంద్, జె.ఎన్.ప్రసాద్, కోగంటి రాధాకృష్ణమూర్తి, కోగంటి సుబ్రహ్మణ్యం, ఎం.వి. రామమూర్తి, ఆలపాటి రవీంద్రనాథ్, అబ్బూరి వరదరాజేశ్వరరావు వంటివారు పార్టీ కార్యకలాపాలలో పాల్గొనేవారు.

ఆనాడు కాంగ్రెసును విమర్శించడం ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఒకసారి కాకినాడలో జరిగిన బహిరంగసభలో కె.ఎల్. నరసింహారావుగారు కాంగ్రెసును నిందిస్తూ గోలచేశారు. తర్వాత జరిగిన ఉదంతాన్ని ఆయనే ఇలా వివరించారు.[12]

''.... దాంతో సభ గందరగోళమైంది. కొంతమంది భక్తులు ఖద్దరు దుస్తులు ధరించిన మఫ్టీ కానిస్టేబుల్స్ (అంతా యువకులు) నాచుట్టూ చేరారు. నేను వారిని కాంగ్రెస్ వారిగా అపోహపడి, తంతారేమోనని కొంత భయపడ్డాను. సభ ముగియగానే నేను ఎం.వి. శాస్త్రిగారింటికి వెళ్ళాను. ఆరోజునే అబ్బూరి రామకృష్ణారావుగారు కాకినాడ వచ్చారు. ఆయన శాస్త్రిగారింట్లోనే ఉన్నారు. ఈ మఫ్టీ కానిస్టేబుళ్ళంతా శాస్త్రిగారింటికి వచ్చారు. లతీఫ్ అనే C.I.D. సబిన్‌స్పెక్టరు చాలా గట్టివాడు. అండర్‌వుడ్ అనే ఇంగ్లీషు వ్యక్తి డి.ఎస్.పి.గా ఉన్నారు. వచ్చిన కానిస్టేబుళ్ళంతా నాకు చాలా ప్రోత్సాహమిచ్చి నన్ను కాంగ్రెసువారి సభల్లో మీ ఇష్టమొచ్చినట్లు అల్లరి చేయండి. మీ ప్రాణానికి మా ప్రాణం అడ్డువేస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు రామకృష్ణారావుగారు కల్పించుకొని మీరు

10. ''అబ్బూరి సంస్మరణ'' - పుట. 25
12. ''అబ్బూరి సంస్మరణ'' - పుట. 63
12. ''అబ్బూరి సంస్మరణ'' - పుట. 31

మఫ్టీలో ఉన్న కానిస్టేబుళ్ళని తెలిసివుంటే నరసింహారావు ఇంకా విజృంభించి ఉండేవాడే. మీరు కాస్త అండగా నిలబడాలని అన్నారు''.

యుద్ధం రోజుల్లో నేషనల్ వార్ ఫ్రంట్‌తో అబ్బూరి రామకృష్ణారావుగారు ఒక ఒప్పందం కుదుర్చుకొని, 'నటాలి' అనే నాటక కంపెనీ పెట్టి నాటకాలు ఆడేవారు. ప్రభుత్వం ఈ నాటకాలవల్ల ఒక లక్షరూపాయల వరకూ నష్టం భరిస్తానంది. ఈనాటకాలలో శ్రీరంగం శ్రీనివాసరావుకూ, శ్రీరంగం నారాయణబాబుకూ కూడా అబ్బూరివారు ఉద్యోగాలిచ్చారు. ప్రతిమా సుందరి, కన్యాశుల్కం నాటకాలను మద్రాసు మొదలుకొని పార్వతీపురం దాకా చాలా గ్రామాలలో నాటకాలు ఆడారు. (మద్రాసు సెంటుమేరీసు హాల్లో ఆడిన నాటకం అభాసుపాలైంది. ఇది నేను స్వయంగా చూశాను.)

రాడికల్ డెమోక్రటిక్ పార్టీ కార్యకలాపాలలో తలమునకలైన అబ్బూరివారు రచనా వ్యాసంగం రమారమి విరమించినట్టే. నాటకరంగంపైన సర్వశక్తులూ కేంద్రీకరించారు. అయితే 1954లో మళ్ళా కవితలు రాశారు.

మనసులోని యాలాపము
మాటలలో మారిపోవు
ఎత్తిన కవితా దీపము
వత్తికుమిలి యారిపోవు

ఎలుగులేని వెలుగులేని
హేమంతమ్మోయి పుత్ర
ఈ చీకటి రాజధాని
కేలా యీ దండయాత్ర.

ఈ ప్రశ్నలు శ్రీరంగం శ్రీనివాసరావును ఉద్దేశించి రాశారు. శ్రీశ్రీతో ఇంకా ఇలా ముందే చెప్పారు.

రష్యాగరు ధూపంతో
రమణీయపు శివమెత్తిన రణాచారి గణాచారి
రణగుణాల ధ్వనులు రేగ
రష్యా ఋష్యా శ్రమమున
రాగిల్లిన కావ్యధార
తెలుగు సీమ పొలిమేరల
సెలయేళ్ళయి నాళికలయి
చిరకాలం ప్రవహించే
జీవనదీ మహిమలేక
అంతో యింతో శైత్యం
అంతకు మించిన పైత్యం
అందించిన మాట నిజం
ఔను నిజం! ఔను నిజం!

అందుచేత శ్రీశ్రీ చేయవలసినదేమిటో అబ్బూరివారు ఇలాగ అభిప్రాయపడ్డారు.

పయనమైన పదినాళ్ళకె
పదినాళ్ళకె దారితప్పి
పోయావా నా నేస్తం
ఆః! యేదీ నా హస్తం.

పొరపాటే తిరుగుబాటు
తిరుగుబాట తిరిగిచాటు!

1954లో శ్రీరంగం శ్రీనివాసరావు ఈ సలహాని పాటించలేదు. రష్యా ఋష్యాశ్రమాన్ని విడిచిపెట్టలేదు. తిరుగుబాటును చాటలేదు. 1955లోనే ప్రపంచశాంతి సమావేశానికి హెల్సింకి వెళ్ళాడు. తర్వాత సోవియట్ యూనియన్ సందర్శించాడు. 'నా మాస్కోయాత్ర' అనే వ్యాసాన్ని అభ్యుదయలో ప్రకటించాడు.[13] అందులో ''ఏ దుష్టబుద్ధి అయినా ఎంత ప్రయత్నించినా సరే ఇండియా, చైనా, సోవియట్ దేశాలను ఏకం చేసే గాఢమైన స్నేహబంధాలను విచ్ఛిన్నం చేయలేరు'' అని స్పష్టంగా ప్రకటించాడు.

1936లో అబ్బూరివారు బ్రేక్ వేసినందువల్ల ఆంధ్రలో ప్రోగ్రెసివ్ రైటర్స్ సంఘం ఏర్పడకపోయినా 1943లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి చరిత్రను సృష్టించింది. 1955లో అబ్బూరివారు ''పొరపాటే తిరుగుబాటు; తిరుగుబాట తిరిగి చాటు'' అని హితోపదేశం చేస్తే 1956లో శ్రీరంగం శ్రీనివాసరావు అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడయ్యాడు.[14] 1970లో తన షష్టిపూర్తి జరిగిన కొన్నాళ్ళదాకా ఇదే పదవిలో శ్రీశ్రీ కొనసాగారు. ఆదిలో 'మార్కిస్టు లైను'లోకి శ్రీశ్రీని తీసుకొచ్చిన అబ్బూరివారు ఎంత ప్రయత్నించినా అతణ్ణి ఆదారిలోంచి పక్కకు తప్పించలేకపోయారు. ఈ ఒక్క విషయంలో వారిది గొప్ప ఓటమి. పలు రంగాల్లో ఎందరో ప్రతిభావంతులకు అబ్బూరివారు చేదోడువాదోడుగా ఉన్నారు.

హేతువు సేతువుగా భవపారావారము తరించే మార్గం చూపించినందుకు అబ్బూరివారు యం.యన్.రాయ్‌ని కీర్తించారు. తాము మరణించాక తమ భౌతికకాయానికి మతసంబంధమైన కర్మకాండ చేయవద్దని కోరి ఆయన కన్నుమూసినా, చివరి కోరికగా తన చితాభస్మాన్ని డెహ్రాడూన్‌లో యం.యన్.రాయ్ సమాధివద్ద ఉంచాలని వాంఛించారు. అబ్బూరివారి కుమారులు ఆ అంతిమ వాంఛ నెరవేర్చారు.

---

13. అభ్యుదయ – 1956 – మే.
14. అభ్యుదయ – 1956 – జనవరి

పురిపండా అప్పలస్వామి

(1904-1982)

ఆధునిక సాహితీపరులలో గిడుగు రామమూర్తిగారి వల్ల ప్రభావితులై అంతదాకా అంటిపెట్టుకొన్న గ్రాంథికాన్ని విసర్జించి వాడుకభాషని చేపట్టని వారంటూ ఎవరూ లేరు. అయితే గిడుగువారి తీరని కోరికను తీర్చడమే తమ జీవిత ధ్యేయంగా పెట్టుకొని విజయం సాధించిన వారు వేళ్ళమీద, ఆ మాటకొస్తే ఒక వేలిమీద లెక్కపెట్టవలసినవారు ఉన్నారు. గిడుగువారు 1940లో పత్రికా సంపాదకుల సభలో చేసిన తుది విన్నపంలో బాధగా ఇలా అన్నారు.[1]

''వందలకొలది కవులూ పండితులూ తమ వాడుకభాషలో రచన సాగిస్తున్నారు. ఇంత మట్టుకైనా నా కృషి ఫలించినందుకు నేను కృతార్థుడనైనానని సంతోషిస్తున్నాను. కాని బడులలోను కాలేజీలలోను ప్రభుత్వము వారున్ను విశ్వవిద్యాలయముల వారున్ను వ్యావహారిక భాషా ప్రయోజనము అంగీకరించేవరకు నావాదము పూర్తిగా నెగ్గినదని నేను భావించలేను''.

గిడుగువారి వాదాన్ని నెగ్గించాలనీ, వాడుకభాషకు విశ్వవిద్యాలయంలో ప్రవేశం కలిగించాలనీ దీక్ష పూనిన కార్యకర్త ఒకరు లేకపోలేదు.

సాధారణంగా కావ్యకర్తలు కార్యకర్తలుగా రాణించడం చాలా అరుదైన విశేషం. కవిగా, పండితునిగా, బహుభాషావేత్తగా, వివిధ సంఘాల నిర్మాతగా, దైనిక పత్రిక స్వకీయ విలేకరిగా ఇంకా ఎన్నెన్నో హోదాలలో, వివిధ రంగాలలో పనిచేసి పేరు తెచ్చుకొన్న కొద్దిమందిలో పురిపండా అప్పలస్వామిగారు ఎన్నదగ్గవారు.

1928లో పురిపండా అప్పలస్వామిగారు గిడుగు రామమూర్తిగారు కలుసుకొన్నారు. అప్పటికి అప్పలస్వామిగారి వయస్సు 24 సంవత్సరాలు. గ్రాంథిక భాషలోనే కవితలు, ఇతర రచనలు చేస్తూ వచ్చారు. గిడుగువారిని కలుసుకొన్నాక పూర్తిగా మారి వాడుకభాష విజయానికే జీవితాన్ని అంకితం చేశారు. దశాబ్దాలుగా తీరని కోరికను ఎట్టకేలకు తాము ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నత పరిపాలనా సంఘంలో సభ్యులయ్యాక తీర్చగలిగారు. వాడుకభాషను ఆమోదించాలనే తీర్మానాన్ని సెనేటులో ప్రవేశపెట్టి అది నెగ్గేదాకా ఆయన విశ్రమించలేదు. అప్పలస్వామిగారు సాధించిన విజయాలలో ఇది ముఖ్యమైనదే. ఆయన ఇంకే ఘనకార్యాలను నెరవేర్చకపోయినా ఈ ఒక్కదానికైనా ఆంధ్ర భాషాభిమానులు ఆయనను జ్ఞాపకం పెట్టుకొంటారు. ఆయన జీవితం బహువిజయాల నిలయం.

పురిపండావారు పుట్టింది సాలూరులో. పెరిగింది ఇచ్ఛాపురంలో. తెలుగుతోబాటు ఒరియా, హిందీ, బెంగాలీభాషలు అభ్యసించారు. తమ 17వ యేట 1921లో విశాఖపట్నం చేరి రాజకీయరంగంలో ప్రవేశించారు. జాతీయోద్యమంలో తలమునకలుగా పనిచేశారు. కాంగ్రెసు ప్రచారకుడుగా, ఖాదీ విక్రయశాఖాధిపతిగా, రాష్ట్ర కాంగ్రెసు సభ్యునిగా ఆయన రాజకీయాల్లో ఉంటూనే సాహితీ రంగంలో కూడా నిర్విరామ కృషి చేశారు.

---

1. గిడుగు వెంకట రామమూర్తి - వ్యాసావళి - పుట.154

ఒకపక్క భావకవిత్వం మోజులో జాలిజాలిగా గణబద్ధ కవిత్వం రాస్తూనే ప్రయోజనాత్మకమైన రచనలు కూడా చేశారు. 1925లోనే హరిజనోద్యమం ప్రభావంతో 'పంచమవిలాపం' అనే పద్యకృతిని రచించారు. విశాఖపట్నంలో అప్పుడు 'స్వసంఘం' అనే ఒక సంస్థ ఉండేది. దాని తరఫున 'స్వశక్తి' అనే జాతీయవారపత్రిక నడిపేవారు. అప్పలస్వామిగారు దాని సహాయ సంపాదకులు. అచ్చుపని ఆయనే చూసుకొనేవారు. కాకినాడలో పత్రికను ముద్రించి, విశాఖపట్నంలో విడుదల చేసేవారు. 1925లో శ్రీరంగం శ్రీనివాసరావు అనే పదిహేను పదహారేళ్ళ యువకుడు తాను రాసిన ఒక గీతపద్యాల కవితను ప్రచురణార్థం 'స్వశక్తి' కార్యాలయానికి తీసుకువెళ్ళారు. ఆ కుర్రవానిలో ఉన్న 'స్పార్క్'ను అప్పలస్వామిగారు గుర్తించి ఇవ్వవలసినంత ప్రోత్సాహం ఇచ్చారు. శ్రీనివాసరావు తొలి రచనను అచ్చువేసినవారు అప్పలస్వామిగారే.

'స్వశక్తి' స్థానిక పత్రికే కావచ్చు. కాని, అందులోని సంపాదకీయ వ్యాఖ్యలకు చాలా ప్రాముఖ్యం ఉండేది. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలైన విస్తృత ప్రచారం గల పత్రికలు 'స్వశక్తి' సంపాదకీయ వ్యాఖ్యలను తమతమ పత్రికల్లో పునర్ముద్రించుకొనేవారు. చాలాకాలం పురిపండా అప్పలస్వామిగారే ఆంధ్రపత్రికకు విశాఖపట్నంలో ఉన్న స్వకీయ విలేకరి. తర్వాత కొన్నేళ్ళు అప్పలస్వామిగారు సత్యవాణి అనే పత్రికను నిర్వహించారు.

అవి - సాహితి సమితి ప్రభావానికి యువకులు లోనవుతున్న రోజులు. భావకవిత్వంలో మునిగి తేలుతూ సాహితీ సమితి సభ్యులనిపించుకొందామని అంతా ఉవ్విళ్ళూరుతున్న కాలం. అయితే సాహితీ సమితిలో ఎలా చేరాలో తెలియని అప్పలస్వామిగారు, శ్రీనివాసరావూ కలసి మనమే ఒక సమితిని మనకోసం పెట్టుకోకూడదా అని భావించారు. విశాఖపట్నంలో అప్పుడు జాతీయగీతాలు రాస్తున్న వడ్డాది సీతారామాంజనేయులుతో ఈ ఇద్దరూ కలసి 1926లో 'కవితా సమితి' అనే సాహిత్య సంస్థను స్థాపించారు. విశాఖజిల్లాలోని సాహితీపరులందరినీ అందులోనికి తీసుకువచ్చారు.

విశాఖపట్నంలో ఎందరు కవులున్నా 'కవిగారు' ఒక్కరే. ఆయన మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు. నాటకరంగంలోనూ, జాతీయోద్యమంలోనూ, గ్రంథాలయోద్యమం లోనూ, సాహిత్య విషయాలలోనూ ఆయన విశాఖజిల్లాకేకాక ఆనాటి తెలుగుజిల్లాలో ప్రముఖులు. కవిగారిని అధ్యక్షులుగా పెట్టుకొని కవితా సమితిని పురిపండా అప్పలస్వామిగారు చాలా దక్షతతో నడిపారు. కవితా సమితి ప్రచురించిన గ్రంథాలలో తొలికుసుమంగా శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన 'ప్రతిభ' అనే కావ్యం 1928లోనే వెలువడింది. దీనికి పురిపండా ఉపక్రమణిక రాశారు.

కవితాసమితి తొలి వార్షిక సంచిక 1929లో వెలువడింది. 1932లో కవితా సమితి 'వైశాఖి' అనే ప్రత్యేకసంచికను ప్రకటించింది. ఇందులో రచనలు చేసిన వారి పేర్లు చూస్తే చాలు, ఆనాటి ఆంధ్ర సాహిత్య లోకంలోని ప్రముఖులందరూ కవితాసమితి శ్రేయోభిలాషులే అనీ, వైశాఖికి రచనలు పంపేవారనీ తెలుస్తుంది. చూడండి ఆపేర్లు :

ఆచంట వెంకటరాయసాంఖ్యాయన శర్మ	గొబ్బూరి వెంకటానంద రాఘవరావు
పరవస్తు లక్ష్మీనరసింహస్వామి అయ్యవార్లు	శివశంకరశాస్త్రి
శ్రీరంగం శ్రీనివాసరావు	నాయని సుబ్బారావు
చింతా దీక్షితులు	ఉమర్ ఆలీషా
వడ్డాది సుబ్బారాయుడు	మల్లిమడుగుల జగన్నాథరావు
గుడిపాటి వెంకటచలం	హరీంద్రనాథ ఛటోపాధ్యాయ
అధికార్ల సూర్యనారాయణరావు	భారతుల మార్కండేయ శర్మ
ముద్దా విశ్వనాథము	స్థానాపతి సత్యనారాయణశాస్త్రి
పురిపండా అప్పలస్వామి	వెంకట వీర రాజ కవులు
కవికొండల వెంకటరావు	వేము లక్ష్మీకాంతమ్మ
శే.వేం. రాఘవ అయ్యంగారు	దేవులపల్లి కృష్ణశాస్త్రి
అబ్బూరి రామకృష్ణారావు	విశ్వనాథ సత్యనారాయణ
బులుసు పాపయ్యశాస్త్రి	సబ్నవీసు సత్యకేశవరావు
నండూరి వెంకట సుబ్బారావు	కొంపెల్ల జనార్దనరావు
వేదుల సత్యనారాయణశాస్త్రి	భమిడిపాటి చిన యజ్ఞనారాయణ శర్మ
పూడిపెద్ది వెంకట రమణయ్యా	శ్రీ రాజా శ్రీ విక్రమదేవ వర్మ
కాళూరి వెంకట నరసింగరావు	కీ.శే. పెనుమర్తి వెంకటరత్నం
శ్రీరంగం నారాయణబాబు	మారేపల్లి రామచంద్రశాస్త్రి
అజ్జాడాదిభట్ల నారాయణదాసు	తురగా వెంకటరామయ్యా
భోగరాజు నారాయణమూర్తి	పంద్యారం వెంకట సుబ్బయ్యా
తెన్నేటి వెంకటరామమూర్తి	చెలికాని సత్యనారాయణ

ఇంతమంది రచనలు సంపాదించడం కష్టమనుకొంటే అంతకన్నా శ్రమతో కూడుకొన్న గొప్పపని ఇంకొకటి పురిపండా తొలిసారిగా ఆంధ్రదేశంలో చేసి చూపించారు. 1933లో అఖిలాంధ్రకవుల ఛాయాచిత్ర ప్రదర్శనం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఉన్న వ్యవధి చాలా స్వల్పమైనా ఆ కొద్దిరోజులలోనే పురిపండా చాలామందికి ఉత్తరాలు రాసి, పత్రికా ప్రకటనలు చేసి అయిదారువందలకు పైగా కవుల ఛాయాచిత్రాలు సంపాదించి ప్రదర్శన అనుకొన్నరోజున ఏర్పాటుచేశారు. ఆంధ్రదేశంలో అంతకుపూర్వంగాని, ఆతర్వాతగాని జరుగని ఇటువంటి ప్రదర్శనకు 1933లో మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రారంభోత్సవం చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉపన్యసించడానికి రవీంద్రనాథ టాగోరు విశాఖపట్నం వచ్చినపుడు పురిపండా ఆ విశ్వకవిని కవితా సమితి సభలో కూడా ప్రసంగించడానికి వొప్పించారు.

1935లో విశాఖపట్నంలో కవిగారి షష్టిపూర్తి మహోత్సవాన్ని చాలా ఘనంగా జరిపించారు. ఆంధ్రదేశంలోని సాహితీపరులందరూ సభ్యులుగా ఉన్న ఆ షష్టిపూర్తి సంఘానికి పురిపండా కార్యదర్శి వర్గంలో ప్రముఖుడు.

కవితా సమితి వార్షికోత్సవాలు, పురిపండా అప్పలస్వామిగారు నిర్వహించే ఏ సాహిత్య కార్యక్రమమైనా అందరినీ కూడగట్టుకొని బాగా జ్ఞాపకం పెట్టుకొనేటట్టు జరిపేవారు. ఒక సందర్భంలో శ్రీశ్రీ ఇలా రాశారు.[2]

''కవితాసమితి వార్షికోత్సవాలు మహోత్సాహంగా జరిగేవి. ఒక వార్షికోత్సవానికి ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మని అధ్యక్షునిగా ఎన్నుకున్నాం. 'పెద్ద అధ్యక్షోపన్యాసం తయారుచేస్తున్నాను. నా జీవితంలో చెప్పదలచుకున్నవన్నీ ఒక్కుమ్మడిగా చెప్పబోతున్నాను' అన్నాడాయన. కానీ మా దురదృష్టవశాత్తూ వార్షికోత్సవానికి ముందుగా ఆయన మరణించాడు. సాంఖ్యాయన శర్మస్థానే గిడుగు వెంకటరామమూర్తిని ఆహ్వానించాం. ఆయన అధ్యక్షత వహించిన సభకి విశాఖపట్నంలో ఏ రాజకీయ సమావేశానికి రానంతమంది జనం వచ్చారు''.

ఇన్ని సాహిత్య కార్యకలాపాలు సాగిస్తున్నా పురిపండా రచనావ్యాసంగం మానలేదు. 1928 దాకా గ్రాంథికభాషలోనూ, తర్వాత భావకవిత్వపు ధోరణులతోనూ రచనలు చేస్తూ వచ్చారు. 1932లో వైశాఖిలో ప్రచురితమైన పురిపండా గేయాన్ని చూడండి.

ప్రియతమా!

ఈ కుసుమ విశ్వాస
మృదు పరీమళ లవమె
భరియింపలేదు నా
భాగ్యమెరుగని మనసు,
ప్రియతమా! నా మ్రోల
సురభిళోత్సవమేల!
వలపె మరిచిన బ్రతుకు
కలలుగా జాలిగా
కనుమూసి కొను నిశాం
గనశయ్య నశియించు
నలదోయి లేవెలుం
గుల తారకయునేడు
కుములకే కుములకే
కుములునా చితిలోన
ఏ చిరంతన వాంఛ
లెగయునో పొగలుగా
సవరింపకోయి నీ
యమృత వీణా గళము
ప్రియతమా! ప్రియతమా!

2. సారస్వత వ్యాసములు (2వ సంపుటం) - పుట.214

ఇది పూర్తిగా భావకవుల గొంతుకకు ప్రతిధ్వనే. కృష్ణశాస్త్రిగారి గొంతుకతో కవితలు చెప్పాలని ఆనాటి యువకవులందరూ ప్రయత్నించేవారు. ఇది రాస్తున్నప్పుడు పురిపండా వయస్సు 28 సంవత్సరాలు. మెత్తని మాటలు, జిలుగు భావాలు, నగిషీలు చెక్కిన పద్య పాదాలూ ఆనాటి ఫాషన్లు, పురిపండా ఇటువంటి రచనలు చాలా చేశారు. గణబద్ధ ఛందస్సులను విడిచిపెట్టి గేయాలు రాయడం భావకవుల ప్రభావంవల్లనే కావచ్చును గాని పురిపండా తన కలాన్ని కేవలం ప్రణయ కవిత్వానికే పరిమితం చేయలేదు. తన గళంతో ప్రబోధ గీతాలు కూడా రచించసాగారు. 1925లో పద్యాలలో 'పంచమ విలాపం' రచిస్తే ఆ పిమ్మట గేయంలో ఇదే వస్తువును రాశారు. పురిపండా జాతీయోద్యమంలో కార్యకర్తగా పనిచేయడం వల్ల ప్రయోజనాత్మకమైన రచనల ప్రాముఖ్యం తెలుసుకొన్నారు. అందుకే 'గుడిలోని దైవమా' అనే గేయం రాశారు.

గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకి రావోయి
నీ పాద పూజకై
వెదకి తెచ్చిన పూలు
నీపాద సేవకై
నింపి తెచ్చిన నీళ్ళు
పనికి రావంటారు
మైలపడె నంటారు
గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకి రావోయి
మాలమెట్టిన నేల
మాల ముట్టిన సీమ
మాల పాడిన పాట
మాల లాడిన మాట
మైలపడెనంటారు
పనికిరాదంటారు
గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకి రావోయి
ఆర్య రుషి సంతాన
మంటరానిది యంట
నీవు చేసిన సృష్టి
కీ కళం కాలంట
నీకన్న కొడుకులము
నిను చేర రానీరు
పూజారు లెవరోయి
భూదేవు లెవరోయి

గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకి రావోయి
　　కట్టు గుడ్డా లేక
　　గాసిల్ల మన్నారు
　　కుడువ కూడూ లేక
　　కూలిపోమన్నారు
　　　　నీ గుడికి రానీరు
　　　　నిను వేడుకో నీరు
　　　　నిన్ను రాతిగ చేసి
　　　　నిలుపుకున్నారు
గుడిలోని దైవమా! ఆలింపవోయి
గుడిలోని దయ్యమా! పైకి రావోయి

1933లో శ్రీరంగం శ్రీనివాసరావు భావకవిత్వానికి గుడ్‌బై చెప్పి మాత్రా చ్ఛందస్సునే కాక వాడుకభాషను కూడా స్వీకరించాడు. 'నేను సైతం' అనే ఎత్తుగడలో 'జయభేరి' మ్రోగించాడు. పురిపండా అప్పలస్వామిగారు కూడా నూతనంలోనే చేతనం ఉందని గ్రహించారు. వీస్తున్న 'సుడిగాలి'ని చూశారు. లోకాన్ని ఇలా హెచ్చరించారు.

తొలి నాటి సంద్రాలు
తుహినగిరి శిఖరాలు
　　ఇంకిపోతున్నాయిలే
　　కుంగిపోతున్నాయిలే
తాతలేసిన పుంత
దైవమేలిన సంత
　　పల్లేరు పాకిందిలే
　　జిల్లేడు మొలిచిందిలే
రాజు కట్టిన కోట
రాణి మెట్టిన తోట
　　భూతాలు గెంతాయిలే
　　బొమికలే నిండాయిలే
నల్లమందే కాని కళ్ళిప్ప నంటావు
రాతిగుళ్ళకె కాని రాను పొమ్మంటావు
　　సుడిగాలి రేగిందిలే!
　　పిడు గావులించిందిలే!

జీవితంలోని భీభత్సాన్ని చూసి దోపిడీ వ్యవస్థకు మూలాధారమైన కర్కోటక సనాతన వర్గంపై ధ్వజమెత్తారు. భైరవిని ఆలపించారు.

పాతిన శిశువుల
లేత దేహములు
విందులు కుడిచే
నక్కల్లారా!
కుక్కల్లారా!
కుళ్ళిన శవాల
మాంసం తింటూ
పాటలు పాడే
పులుగుల్లారా!
పురుగుల్లారా!
కటికి దరిద్రుల
బికారి రైతుల
పీకలు నులిమీ
నెత్తురు తాగే
మెకముల్లారా!
వృకముల్లారా!
దుమ్ములకోసం
కుమ్ముకు చచ్చే
దుమ్మల ముచ్చుల
ముదుసళ్ళారా!
బురద గుమ్మిలో
బొందెలు మరిచే
పందుల్లారా!
భావి ప్రపంచం మిథ్యంటారా?
భూదేవతనే వంచిస్తారా?
రాజుల్లారా!
రాక్షసులారా!
పాపం పుణ్యాం
పవళ్ళు రేలూ
బొంకంటారా?
వంచకులారా!
హంతకులారా!
కనపడలేదా కళ్ళే వుంటే
భావి దృశ్యముల ప్రళయ జిహ్వాకలు
మీ దేహాలూ
మీ భోగాలూ
భుగ భుగ మండే చితాగ్నులందూ
ఘూర్ణిల్లే వైతరిణీ నదిలో
కనపడలేదా మీ గుండెలపై
చిచ్చుల పిడుగులు
విచ్చినకోరలు
గరళం కక్కే సర్పాలూ
పేగులు చీల్చే శాపాలూ

ఈ ధోరణి కవితలు అప్పలస్వామిగారు చాలా రాశారు. అవి వారి పద్యాల సంకలనం 'పులిపంజా'లో ఉన్నాయి. ఆయన తొలినుంచే గాంధీగారి నిర్మాణ కార్యక్రమంలో కృషిచేస్తున్నవారు. అహింసావాదులే. అయినా దేశం బానిసత్వంలో ఉన్నప్పుడు పోరాటం ఇంకొకలాగ సాగించాలన్న భావం ఒకనాటి రణరంగాలుగా ప్రసిద్ధికెక్కిన ప్రదేశాలు చూస్తున్నప్పుడు రావటం సహజం. విశాఖపట్నం జిల్లాల్లో 'పద్మనాభం' అనే చోట తెల్లవాళ్ళకూ విజయనగరం వారికీ యుద్ధం జరిగింది. ఆ క్షేత్రాన్ని చూస్తున్నప్పుడు అప్పలస్వామిగారు (పద్మనాభం అనే కవితలు) ఇలా రాశారు.

ఇక్కడ అడుగుపెడితే
ఎందుకో నా వొళ్ళు
కంపరమెత్తుతుంది
ఖద్దరు వొదిలేసి
కత్తి పట్టాలనిపిస్తుంది
అహింస అబద్ధమనిపిస్తుంది

అలనాటి కుంపిణీ దొంగల్ని
దేశద్రోహుల్ని తెగ నరకాలనిపిస్తుంది
కుత్తుక బంటి నెత్తుటిలో
అశ్శరభ శరభా
పరవళ్ళు తొక్కాలనిపిస్తుంది

నానా సాహెబ్ లాగ
కుమారసింగ్ లాగా
ఝాన్సీరాణిలాగా
తాంతియా తోపియా లాగ
సీతారామరాజులాగా
దత్తులాగ
భగత్సింగులాగ
విప్లవకారుణ్ణయి
ఎర్రజెండా ఎత్తాలనిపిస్తుంది

నవ్యసాహిత్య పరిషత్తు ఏర్పడ్డాక సాహితీసభ్యులు, కవితాసమితి సభ్యులు, తదితరసంఘాలలోని వ్యక్తులు ఈ నూతన పరిషత్తుపట్ల ఆకర్షితులయ్యారు. కవితా సమితి కార్యకలాపాలను తాత్కాలికంగా నిలుపుదల చేసి పురిపండా 1936-37 సంవత్సరాలలో నవ్య సాహిత్య పరిషత్తు కార్యవర్గ సభ్యులయ్యారు.

1940లో శ్రీశ్రీ సర్రియలిజంలోనికి నిష్క్రమించడం ప్రారంభించారు. తనతోపాటు కొందరిని ఆ తోవంట లాక్కెళ్ళాడు. అలా వెళ్ళినవారిలో పురిపండా ఒకరు. వారి పులిపంజా అనే సంకలనంలో కొన్ని ఇటువంటి రచనలు ఉన్నాయి. అయితే ఈ ధోరణి అట్టే కాలం సాగలేదు.

వాడుకభాషకు సంపూర్ణంగా విజయం సంపాదించాలంటే ఉద్గ్రంథాలు రాయవలసిన అవసరం ఉందని అప్పలస్వామిగారు గ్రహించారు. భారత, భాగవత, రామాయణాలను, భగవద్గీతను వాడుకభాషలోనికి పరివర్తన చేశారు. మహమ్మదు చరిత్ర, సౌదామిని, ఒరియా పాటలు, జగద్గురు శంకరాచార్య, ఛెటిమాణ అఠగుంఠ, విశ్వకథావీధి, దేవీభాగవతం, హంగేరీ విప్లవం మొదలైనవి ఆయన రచనల్లో కొన్ని. కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరికపై అప్పలస్వామిగారు ఒరియానుండి 'అమృత సంతానము', 'మట్టి మనుషులు' అనే గ్రంథాలు అనువదించారు. తెలుగులో వంగ సాహిత్య చరిత్రనూ, ఒరియా సాహిత్య చరిత్రనూ రచించారు. ఒరియా పండితులకు తెలుగు సాహిత్య పరిచయం కలిగించడానికి ఒరియాభాషలో ఆంధ్ర సాహిత్య చరిత్ర సంక్షిప్తంగా రాశారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మహాభారతాన్ని సంస్కృత మూలానుసారంగా వ్యావహారిక భాషలో రాయడం ప్రారంభించి ఆదిపర్వంలో కొంత, విరాటోద్యోగ పర్వాలూ మాత్రమే రచించారు. ఆయన చనిపోవడం వల్ల ఈ కార్యం ఆగిపోయింది.

పురిపండా అప్పలస్వామిగారు శేషించిన పదిహేనున్నర పర్వాలనూ వాడుకభాషలో అనువదించి ఆ భారతాన్ని పూర్తిచేశారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి పురిపండా అప్పలస్వామిగారికి స్నేహం కుదరడమే అబ్బురమైన విషయం. 'హిందీ, గాంధీ, ఖద్దరు' అన్న మాటలు వినబడితేనే మండిపడే శ్రీపాదవారు - ఈ మూడింటికోసం తమ రాజకీయ సాహిత్య జీవిత ప్రారంభంలో పాటుపడిన పురిపండా వారితో పొత్తు కలిశారంటే దానికి ముఖ్యమైన కారణం ఇద్దరూ వాడుకభాషావాదులే. పురిపండా అప్పలస్వామిగారు శ్రీపాదవారికి విశాఖపట్నంలో ఒకసారి కనకాభిషేకం చేయించారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ వీలునామాను పురిపండా వారి పేర రాసిన ఉత్తరంలోనే లిఖించారు. తమ పుస్తకాల ప్రచురణ బాధ్యత అప్పలస్వామిగారి మీదనే ఆయన పెట్టారు.

''నా కుటుంబం చెట్టుక్రింద ఉంది. మీరు సాయం చేయండి... నేను మీకు బరువైనట్టు నిశ్చయం. మీలాగ మనసిచ్చినవారు నాకు మరొకరు లేరు. నిరర్థక జన్మ అయిపోయింది నాది'' అని శ్రీపాదవారు ఆ వీలునామా ఉత్తరంలో రాశారు.[3] పురిపండావారు ఆ ఉత్తమ కథకుడు తమమీద పెట్టిన బాధ్యతలు నెరవేర్చారు.

సాహితీసమితి సభ్యులు కొన్నాళ్ళు పోయాక నవ్య సాహిత్య పరిషత్తు నుండి చీలి మళ్ళా సాహితీ సమితి కార్యకలాపాలు కొనసాగించారు. పురిపండా కూడా కవితా సమితిని పునరుద్ధరించారు. ఆయనకు వివిధ సాహిత్య సాంస్కృతిక సంఘాలలో సభ్యత్వానికి లోటులేదు. విశాఖ రచయితల సంఘం, అఖిలభారత పి.ఇ.ఎన్.సంస్థ, ఆంధ్రప్రదేశ్ యువకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ మొదలైన ఎన్నో సంస్థలలో ఆయన సభ్యులు. ఎన్నో సన్మానాలూ, గౌరవాలు పొందారు.

1970లో శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘాన్ని విడిచి వెళ్ళిన తర్వాత కొన్నాళ్ళకు పురిపండా ఆ సంఘానికి చేరువ అయ్యారు. 1976 ఫిబ్రవరి మాసంలో హైదరాబాద్‌లో జరిగిన అరసం 7వ మహాసభలో పురిపండాను అధ్యక్షవర్గ అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. 1978 డిసెంబరులో కాకినాడలో జరిగిన 8వ మహాసభలో కూడా ఇదే హోదాలో ఉన్నారు.

తొలినుంచీ కొత్తపుంతలు తొక్కడానికి పురిపండా నడుం కట్టారు. ఆధునిక భావమేదైనా సరే ఆయన ఆహ్వానించేవారు. వివిధభాషలు నేర్చిన వ్యక్తి గనుక సమకాలిక సాహిత్య ధోరణు అర్థం చేసుకొన్నారు. శ్రీశ్రీని డిస్కవర్ చేయడమే కాక, నజ్రుల్ ఇస్లాం గీతాలను ఎన్నింటినో మూలం నుండి చదివి వినిపించి శ్రీశ్రీని తిరుగుబాటు దారిలోకి తిప్పిన ఘనత నిస్సందేహంగా పురిపండా అప్పలస్వామిగారికే దక్కుతుంది. ఆదిలో హరిజనోద్యమంలో అంటరానివారికి దేవాలయ ప్రవేశానికి ఎంత కృషి చేశారో అలాగే చిట్టచివర ఉన్నత విద్యాసంస్థలు అంటరానిదానిగా భావించే వాడుకభాషకు విశ్వవిద్యాలయ ప్రవేశం కలిగించిన ఖ్యాతి కూడా ఆయనకే చెందుతుంది.

3. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - 'అనుభవాలూ-జ్ఞాపకాలూను' మూడో సంపుటం - పుట.254-5

శిష్ట్లా ఉమామహేశ్వరరావు

(1912-1953)

అతని గొంతుక సొంతగొంతుకే, కానీ అది వింత గొంతుక. అతని దారి ముళ్ళదారి. అది నలుగురూ నడవలేని రహదారి. అతని కవిత చూడచక్కని జాతిగుర్రం. అయినా అది తనకు కూడా లొంగని పెంకి రెక్కల గుర్రం.

అతని పేరు శిష్ట్లా ఉమామహేశ్వరరావు. అతనికి 'మహేశ్వర్', 'వినాయక పండితుడు', 'ఉమా', 'విజయమహేశ్వరం' మొదలైన కలం పేర్లు చాలా ఉన్నాయి. ఎప్పుడు ఏ పేరు వాడుకుంటాడో తెలియదు. ఎప్పుడు ఏ తోవ నడుచుకుంటాడో తానే చెప్పలేడు. అతడు కవి. అతి నవ్యులలో అతి నవ్యకవి.

1933లో బరంపురంలో జరిగిన 'అభినవాంధ్ర కవి పండితసభ'లో మొట్టమొదటి సారిగా ఉమామహేశ్వరం మంచి ప్రతిభావంతుడైన కవిగా లోకానికి పరిచయమయ్యాడు. ఆ పరిచయం చేసినది తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు. ఆయన ఈ కవి సత్యాగ్రహులపైన, పోలీసుల లాఠీఛార్జి చేస్తున్న విషయాన్ని కథనం చేస్తూ రచించిన గీతాన్ని చదివి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

మారో మారో - మారో మారో
ఒకటీ రెండూ - మూడూ నాలుగు
మారో మారో - మారో మారో

అని ప్రారంభమయ్యే ఈ గీతం పూర్తి పాఠం నేడు లభించదు. దీనిని 1933లో లోకం తొలిసారిగా విన్నా ఇదే ఉమామహేశ్వరం తొలి రచన కాదు. అతడు తన 19వ యేటనే 1931లో కొత్త రీతులతో కవితలల్లడం ప్రారంభించాడు.

అతడు 1912లో గుంటూరు జిల్లాలోని మంచాళ అగ్రహారంలో జన్మించాడు. అనూచాన సంపద గల వైదిక కుటుంబంలో పుట్టినందువల్ల అతనికొక రకమైన సంస్కారం అబ్బితే అతడు ఏరికోరి పురాణగాథలతోపాటు జానపదగీతులమీద పెరిగాడు. ఆరీతులు అతడు పిలిస్తే పే[illegible]యి. ఆధ్యాత్మ రామాయణకీర్తనలంటే అతనికి ప్రీతి. ఎందరో వాగ్గేయకారుల [illegible] అతనికి వచ్చు. గుంటూరులో చదువుకొన్నాక, కాశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. అక్కడ గ్రంథాలయంలో చాలా పుస్తకాలు చదివాడు. ఆంగ్ల సాహిత్యములో ఎం.ఏ. పట్టభద్రుడయ్యాడు. ఇంగ్లీషు కవిత్వంలోని మలుపు లన్నింటినీ అవగతం చేసుకొన్నాడు. కవితల నడకలలోని మెలకువలు తెలుసుకొన్నాడు.

కళాశాలల్లో కొన్నాళ్ళు పనిచేశాడు. విద్యార్థులకు బోధించాడు. వారివల్ల తాను నేర్చుకొన్నదెంతో ఉండవచ్చు. బొంబాయి నగరానికి వెళ్ళి అక్కడ వ్యాపార సంస్థలలో ఉద్యోగం చేశాడు. మళ్ళా గుంటూరులో 'శాంతిని' అనే పత్రికను కొన్నాళ్ళు నడిపాడు.

వెల్కం ప్రెస్‌లో ముద్రితమయ్యే ఈ పత్రిక ఎన్నాళ్ళు వెలువడిందో, దీనిలో ఉమామహేశ్వరం ఏయే రచనలు అచ్చువేశాడో తెలియదు.

జ్వాల పత్రిక పెట్టడానికి ముందే ముద్దుకృష్ణ 1933లో ఉమామహేశ్వరం ప్రభావం వల్ల వచన గేయాలు రాయడం ప్రారంభించాడు. ముద్దుకృష్ణ ద్వారానే వచన గేయాలూ, ఉమామహేశ్వరం రచనల వివరాలు ఇతరులకు తెలిసేవి. జ్వాల పత్రికలో ఉమామహేశ్వరం రచనలు ఎన్ని అచ్చుపడ్డాయో తెలియదు. 1935లో జ్వాల మూడవ సంపుటి ఒకటవ సంచికలో 'ఆత్మహత్య' అనే నాటికను ఈ కవి ప్రచురించాడు. అందులోని మూడు అంకాల్లోనూ ఎక్కువగా పిల్లల ఆటపాటలతో రాశాడు.

1938లో అతడు 'విష్ణుధనువు', 'నవమి చిలుక' అనే రెండు కవితా సంకలనాలను ప్రచురించాడు.

'విష్ణుధనువు' అర్ధపావు డెమ్మీసైజులో 62 పుటల కావ్యం. దీని తొలి ముద్రణ ప్రతులను 128 (అక్షరాలా నూట ఇరవై ఎనిమిది మాత్రమే) అతడు ముద్రించాడు. దీనికి శివశంకరశాస్త్రిగారు పీఠిక వ్రాస్తే పుస్తకం చివర విశ్వనాథ సత్యనారాయణగారు 'సమీక్ష' రాశారు. కావ్యమంతా ప్రణయ కవిత్వమే. అయితే అది భావకవుల రోటీను ప్రేమ కాదు. నాయికా నాయకులు సీతారాములు. సీతలో ఈ కవి చెంచీతనూ, పరాశక్తినీ, ద్వాపర లక్ష్మిని, అలమేలు మంగను చూడగలడు. 'సర్వమానవ సమిష్టి బాధ్యతను వెలలేని వెన్నెముకపై మోయుచున్న సీత' అంటాడు. ఆమె నిశీథ సౌందర్యమూర్తి. సీత ప్రకృతి. రాముడు పరమ పురుషుడేగాని అయితే అతనిలో ఇంకొందరు ఆమాటకొస్తే అందరూ ఉన్నారు. ఉదయనుడు, కృష్ణుడు, ప్రవరాఖ్యుడు, లక్ష్మి నరసింహస్వామి, వెంకటేశ్వరుడు, శివుడు, చివరకు అభిమన్యుడు కూడా వున్నారు. సీతను ఏమని పిలవాలి? కవి ఇలా సమాధానం చెప్తున్నాడు.

''తల్లి వలె చల్లని కనులతో జాతువుగాన
తల్లీ యనగ తప్పులేదు!
చెల్లెలివలె చనవు మీర సరస జేరుదువుగాన
చెల్లీయన చేటురాదు
మేధామద విదళిత వికసితవుగాన
మైథిలి వందు!
ఆత్మాంతరమున 'నిట్' దేహవాసివిగాన
వైదేహివందు!
చాళుక్య హోయసాల చినచోడాంబవుగాన
సాలగ్రామ సీతవందు!
కుండలినీ షట్చక్రతతికి యధిపతివిగాన
క్షేత్రవతి వందు!
అందును, ఎందును లేని నామముల నేరికూర్చి
గడియకొకరీతి పిలుతు
అదియునుగాక అన్నిటికి మిన్నయౌ
శ్రీ ని నీవేయని

పురుషకారమే పరశురామమందు! నేనే రాముడ!
ఇదియ నాయింగితము
ఇదియ నావిష్ణు సంగీతము!'

ఈ రామునిలో పరశురాముడే కాదు, రావణుడు కూడా ఉన్నాడు. అతని పది తలలను సీత మాత్రమే మళ్ళా పుట్టకుండా సంహరించగలదు. ఈ సంగతి కవి ఇలా చెప్పాడు.

''నాకు నేను రావణుడ నేమో యనునటుల
అణచిన నణగక చంచలమై దశముఖముల
చూడ్కులు నిగిడించు నా చిత్తము పై నీ చిరు
వీక్షణ కటాక్షముల కటారి పోటులు
శిరముల ద్రుంచుగాని మరల న్మరల
ప్రాణములు వచ్చు, అటుగాదు నీ హృదయ
వైకుంఠమున నున్న మూలబలముతో
నొకేసారిగ నేయుము నాగర్భకుహరాంతర
కుండలినీ నాడిపై, నీయందు గలియుదు
వివశ ప్రాణినై నెచ్చెలీ సీతా!''

సీత మనస్సులోనికి నాయకుడు ప్రవేశించడం చాలా కష్టం. దానికి ఉన్నదొకే ఒకదారి. ఆ సంగతి ఇలా చెప్తున్నాడు :

''దారులు పదివేలు లేవు నీ మనః పద్మవ్యూ
హమును జొచ్చుటకు; గడి గడికి గడియకు
ఏ యతిరథ మహారథులడ్డెదురో
యుద్ధమునకు నేనొంటరివాడ! మత్పూర్వు
ల్పిత్రులు లేరు బీడుపడిన యీ కలి
సంగ్రామభూమి ప్రవేశించితి బాలకుడ
నైన నేను! వెనుదిరుగుట రాదు మా
వంశమున! ఆరంభించిన కార్యమాపుట
మా యింటన్లేదు! అయిన, ఐనను, అన్నిటికి
నిన్నే యుత్తరవాది జేసి నేడీకొందును
దారులు పదివేలు లేని, కోటి
నూటపదారు దారులు లేని, నీమనః
పద్మవ్యూహమును ప్రేయసీ!''

ఈ సీతభూమిజ కాదు. తానే క్షేత్రపతి. తానే జగద్భారాన్ని వహిస్తున్నది. అష్టదిగ్గజముల వలె సీత ఈ క్షితిని మోయుచున్నది. 'రండు సాయమొనర్పరండు' అంటాడు. 'సౌమిత్రీ! ఇంకా విశ్వామిత్రుడు రాడేమి?' అంటాడు. వెన్నెముకలో వైకుంఠం విష్ణుధనువుగా ఉంటుందట. సీతను పొందడానికి ఇంకో ధనుర్భంగం కావాలి.

'స్వయం' ప్రేమ
మాయమై మనసులో
వైకుంఠ మిదేయని
వెన్నునసే విష్ణుధనువుగ నుండును!
వెన్నెముక చీల్చుచూ భ్రమల పురికొల్పు
విష్ణుధనుశ్శరములే
భావ తరంగాలు!
భావాంతరమున గదా భవ ప్రభాతము!

మేనియం దణగి యణగి
మన సంత 'వయమ్'
అనే అహము చేయు
విష్ణు ధనువు వంచి
చేరవలె సీతదరికి! శివధనువు ఫెళ్ళుమనును!''

ఈ కావ్యం నిండా ఉమామహేశ్వరం తాను చదివిన పురాణగాథలన్నింటిలోని ప్రతీకలను కలగాపులగం చేసి వాడుకొన్నాడు. కేవలం పౌరాణిక సంకేతాలనే కాక చరిత్రను కూడా తలుచుకొంటాడు. తన కాలంలో ఇతర కవులు రాష్ట్రగానంతో ఆంధ్రప్రశస్తి, దేశభక్తి ప్రబోధిస్తూ ఉంటే తన ప్రేమలోనే వాటిని ఇముడ్చుకోగలడు.

''చెప్పవోయ్ చూదాము ఏ మాయ రూపముగ
సమృద్ధ సామ్రాజ్య శిల్పకళా కోవిదులు
శాతకర్ణి రాజు లేదారి పోయిరో!
శౌర్యోదారులై రాష్ట్ర కూటులూ వీర పల్లవులూ,
సాహస ధైర్య స్థైర్యోపాసకులా ఓరుగంటి ఒంటరులు,
వాఙ్మయ పోషక విజయనగరాధిపతులు, నాయక ప్రభువులు
నిరుడు నిష్ఠతో నిలబెట్టిన, నీటిలో నీరైనసంక్రాంతి దేముడేడీ?
ఏవోయ్ శత్రుమనస్సంభితాకారాలు దుర్గప్రాకారాలేవీ!
శోణితపు వాహినీ అల్లకల్లోలానంద రూపిణౌ
కృష్ణవేణీ ఉదకంబు కన్నీటి జలకంబులాయెనేమోయ్?
ఒకచే పురాణంబు నొకచే త్రిశూలంబుతో వీరశంఖారావ
ప్రచండ వాయువుల పురిగొల్పు దోర్వీరశైవులేరోయ్?
నిరుడు నీటుతో నిలబడిన నీటిలో నీరైన సంక్రాంతి దేముడేడీ! సౌమిత్రీ!
నిరుడు మడిగట్టి నిలబడియు మట్టిలో మట్టియైన సంక్రాంతి దేముడేడీ? విశ్వమా?
నిరుడు, ఆక్రిందటి యేడా క్రిందటి యేడు, సంక్రాంతి దేముడేమయ్యో?
సౌందర్య నిశీధమూర్తీ!
నిరుడు నిష్ఠతో నిలబడిన నీటిలో నీరైన సంక్రాంతి దేముడే? కాష్టానపోయె?''

ఈ కావ్యంలో నాయిక నిశీధ సౌందర్యమూర్తి. అయినా అది వెన్నెల రేయి అయితే ప్రేయసి చెంత నుండకపోతే ఈ వెన్నెలంతా వృధా.

''ఇటు వెన్నెల అటు వెన్నెల
నడిశిరసుకు శ్రీ వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
చిరునవ్వుల కలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
విరులల్లిన జడవెన్నెల
ఇటువెన్నెల అటు వెన్నెల
చెంగల్వల జిగి వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఈశ్వరునికి తలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఆకాశము మొలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
మనసుల్లో మరువెన్నెల
ఇటువెన్నెల అటు వెన్నెల
ఎటుచూచిన కనువెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
పిచ్చెత్తే వళ్ళంతా వెర్రెత్తే దిక్కులకై పరుగెత్తే నామనసున
వెన్నెల్లో ప్రేయసి లేక
అమావాస్య! అమావాస్య! అమావాస్య!
మహాలయ అమావాస్య!''

అందుకే 'వెన్నెల్లో వడగండ్లు రాలినై, వెన్నెల్లో వడగాడ్పు' వీచింది. ఈ ప్రణయకవిత్వం రాయడం వృధా అని కవికి తెలుసు. ఆ సంగతి తన గుండెకు ఇలా చెప్పుకొంటాడు :

''హృదయమా! ఈ నీ పద్యరచన లామెకు చేరవు!
చేరినను ఆమె చదువబోదు! పిమ్మటనైన
నిర్మల ప్రణయోష పీమూయధారలచే
ఉప్పొంగు నిన్ను తెలుసుకొనజాలదిస్సీ!
బాధలు పొందుచునైన విడువక వ్రాయు
రచనలివియేల! ఏల యీ మువ్వ జవ్వనము!?''

అయినా రాయక తప్పదు. అందుకే ఉమామహేశ్వరం ఈ కావ్యాన్ని రచించాడు. శివశంకరశాస్త్రిగారూ, విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు దీనిపై అభిప్రాయాలిచ్చారు. సమకాలికులు ఈ కవితలను చదివో, వినో సంతోషించారు. అయితే విస్తృత ప్రచారం లభించలేదు.

విశ్వనాథ సత్యనారాయణగారు తమ సమీక్షలో చెప్పినట్టు ఈ కావ్యంలో మనోహర కవితా శక్తి గల వాక్యాలనేకం ఉన్నాయి. కవి గొప్ప ప్రతిభావంతుడు. ఈ కావ్యంలోని రచనా విధానం గురించి విశ్వనాథ ఇలా అన్నారు :

''ఈయన కవిత్వములో మాత్రాప్రస్తావన లేదు. పాద నియమమూ లేదు. క్రొత్త పాదము మొదలు పెట్టినప్పుడు సర్వత్ర విశేషార్థద్యోతకముగా మొదలుపెట్టబడిందని చెప్పుటకు వీలులేదు. కాని ప్రతిగీతంలోను ఒక పూవు ఉంటుంది. ఆ పూవు మధ్య మధ్య విరిగిపోతూ వుంటుంది. కొన్నిచోట్ల పూర్వకవుల వృత్తములను తలపించే భాగాలు కూడా వుంటవి చూడండి.

''లలనా వెన్నెల వేళ తీయని'' - ఇది మత్తేభవృత్తము యొక్క మొదలు. ''ఝంఝూ మారుత ఝర్ఝరీధ్వనులు'' - ఇది శార్దూలము యొక్క మొదలు. ''ఆ బ్రహ్మమున్నాదినే ఏలా వ్రాయగ లేదు నిన్నుదుటిపై'' - ఇది శార్దూలము. ఒక పాదములో యతి దగ్గర నుండి రెండవ పాదములో యతి వరకూ ''ఏ మహాటవిజొచ్చెనో నా మనస్సు'' ఇది తేటగీతి పాదము. ఈయన లక్షణమెరుగునో ఎరుగనో? ఎరిగి తిరస్కరించెనో? ఎరుగక వీనిని సంస్కారము చేత పొదుగుకొన్నాడో!''

ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. అక్షరగణబద్ధ ఛందస్సులను వదిలి గద్యం రాస్తున్నప్పుడు మన పూర్వకవులు ఆ గద్యపు ఎత్తుగడలలో వృత్తగంధి వచనాలే రాశారు. ఉదాహరణకు : నన్నయ్యగారి వచనాలనే తీసుకొని చూద్దాం. (మనం నేడు 'వచనము' అనే వాటిని పూర్వం గద్య అనేవారు).

''అని యడిగి వాని యనుమతంబున సోమ
శ్రవసుం దనకుం బురోహితుం గావించు
కొని వాని నభీష్ట సత్కారముల సంతుష్టు
నిం జేసి తదుపదేశంబున'' (ఆది-1-89)

ఈ వచనంలో ఎత్తుగడ కందపద్య పాదంగా ఉంది. చూడండి.

''అని యడిగి వాని యనుమత
మున సోమ శ్రవసు....''

ఇంకొక ఉదాహరణ చూద్దాం.

''అని నిశ్చయించి గొంతిని మాద్రినింజూచి
మీర లిందుండి నవయక హస్తిపురంబు
నకుం జని....'' (ఆది-5-61)

ఇది సీస పద్యపాదం. చూడండి -

''అని నిశ్చయించి గొంతిని మాద్రినింజూచి
మీరలిందుండి నవయకహస్తి...''

నన్నయగారు సాధారణంగా ఆశ్వాసప్రారంభమున వచనాలను సీసపద్య పాదాలుగానే రాసావారని పరిశోధకులు చెప్తున్నారు.[1] ఆదిలో నన్నయ్యగారు వచనాలకు వాడిన టెక్నిక్కునే ఆధునిక కవిత్వంలో ఉమామహేశ్వరం అవలంబించాడు. భారత కవుల అక్షరగణబద్ధ ఛందస్సుల శృంఖాలాలు తెంచుకొనడం కష్టం. అవి కవికాళ్ళకు చుట్టుకొన్నట్టు ఫీలవగానే వృత్తపాదాన్ని ఖండించి, వచనం జోడించి విలక్షణమైన ధోరణిని ఉమామహేశ్వరం మొదలుపెట్టాడు. పద్యం గద్యంలోనికి పరిణామం చెందుతున్న దశలో ఇది సహజం. జీవకోటి పరిణామ క్రమంలో ఎన్నెన్నో ఆకారాల జంతుజాలం జనించక తప్పలేదు. పద్యాల నుండి నేటి వచన పద్యం అవతరించే లోపున ఎన్నో అవతారాలెత్తింది. ఉమామహేశ్వరం విష్ణు ధనువులో వాడినది ఒక మజిలీలోనిది. భాష చాలావరకు గ్రాంథికమే. ఏలపదాలు, స్త్రీల పదాలు మొదలైనవి కవి వాడుకుంటున్నప్పుడు కొంత రిలీఫు కనపడుతుంది. భావకవుల కావ్యవస్తువుకే దుస్తులు మార్చి ఇందులో కవి ప్రదర్శించాడంటే అది యుగధర్మం. తెలుగు ధోవతిలో టక్ చేసిన తెల్లవాళ్ళ షర్టూ, నెక్‌టై, కోటూ, తలమీద తలపాగా వంటి వేషం ఒకనాటి పెద్ద హోదాలలో ఉద్యోగస్తులు ధరించిన ఆహార్యమే. విష్ణుధనువులోని కవితల భాషా, ఆహార్యం ఇవాళ ఏదోలా కనబడవచ్చుగాని ఆనాడు కొత్త పోకడల ప్రారంభాలను సూచిస్తుంది.

విష్ణువుధనువు తర్వాత 1938లోనే ఉమామహేశ్వరం ప్రచురించిన ఇంకో కావ్య సంకలనం 'నవమి చిలుక' ఈ పుస్తకంలో తన పేరు 'ఉమా విజయ మహేశ్వర వినాయక్' అని ప్రకటించుకొన్నాడు. ఆదిలో ఒక మున్నుడి, చివర గోపీచంద్ గారి విమర్శగల ఈ 64 పుటల పుస్తకంలో 18 ఖండికలు ఉన్నాయి. 'కొన్ని పద్యపాదాలు, కొన్ని బందోబస్తయిన గీతికలు, కొన్ని నారాయణదాసుగారి నడకల వంటి నడకల రచనలు ఇందులో కనబడతాయి. ప్రతి ఖండిక మధురంగా, పలకడానికి అనువుగా ఉందని' విమర్శకులు భావిస్తున్నారు.

విష్ణుధనువులో ఉమామహేశ్వరం ప్రేమ అంటే ఏమిటో నిర్వచనం చేశాడు గాని, 'నవమి చిలుక'లో తన కవిత్వం ఏమిటో చాలా విపులంగా వివరించాడు. 'నవమి చిలుక మున్నుడి' అనే ఖండిక చూడండి.

''నవమి చిలుక కులుకుతూ పలికింది! పలు
కులో నవ్యనవ్య కవిత్వం రాలింది! నవ్య
నవ్య కవిత్వం – ఇది నూతనములో బహునూతన
కవిత్వం! అందుకనే ఇది పూర్వ కవిత్వం
గాదు ఇది నవ్య కవిత్వం గదా, ఇది భావ
కవిత్వం గాదు!
అడ్డము హిరణ్యా కాశ్యపుడు! శంక హిరణ్యా
కాశ్యపుడు! అధైర్యము హిరణ్యాకాశ్యపుడు
అస్థిమితము హిరణ్యా కాశ్యపుడు!

---

1. నిడుదవోలు వెంకటరావు – తెనుగు కవుల చరిత్ర – పుట.121

మూలము సమూలముగా త్రెంచి హృదయ
సభా మంటపస్తంభము పగిల్చి మనస్సు
విజృంభించి నరసింహమూర్తిత్వము తాల్చును!
అప్పుడే ప్రహ్లాద కవిత్వ మాహ్లాదముగా
ఉద్భవిస్తుంది.
అందాము ప్రహ్లాద కవిత్వమిది అని
అందాము అందుకొని ఆదరిద్దాము!
నవమి చిలుక పలికింది ప్రహ్లాద కవిత్వము!
ప్రహ్లాద కవిత్వంలో ప్రౌఢత్వమున్నది
పామరత్వమున్నది! దేశివిదేశీకి నేస్తమున్నది!
ప్రహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్ని రగు
ల్పుతుంది! పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుంది!
తాను నిలుస్తుంది!
ప్రహ్లాద కవిత్వములో సావిత్రీ సత్యవంత
జీవితమున్నది!
ప్రహ్లాద కవిత్వములోని గాయత్రి అందరికీ తల్లి!
ప్రహ్లాద బ్రహ్మయే నవమి చిలుక! నవమి
చిలుక పలుకులే ప్రహ్లాద కవిత్వం! అమూల్యా
మూల కవిత్వం!

'నవమి చిలుక' సంకలనంలో నిజంగా ప్రౌఢత్వం పామరత్వాలు కనపడతాయి. ఈ వాస్తవాన్ని విమర్శకులు ఈవిధంగా వ్యాఖ్యానించారు.[2]

''తన కవిత్వము ప్రజలలోని పామరత్వమును తొలగించి, స్తబ్ధత తుడిచివేసి వారిలో ఆశలు పెంపొందించునని, జాగృతి కలిగించునని, ఈ విధముగా అది ఉత్తమ ప్రయోజన గర్భితమని కవి అభిప్రాయము. ఈ నిర్వచనమును పురస్కరించుకొనియే దీనికి 'విమర్శ' వ్రాసిన గోపీచంద్‌గారు భావకవులపై జరుగుచున్న 'ప్రొలిటేరియన్ విప్లవమున'కీ కవి దారి తీయుచున్నాడని, అయినను ఈ కవికావ్యము అచ్చముగా శ్రామిక వర్గ సంబంధికాదని, 'ఈ కవిత్వంలో బూర్జువా వాసన, ప్రొలిటేరియన్ యాస' కనిపించుచున్నవని వ్యాఖ్యానించినారు. గోపీచంద్‌గారి వ్యాఖ్యానము సత్యదూరము కాదు. నవమి చిలుక లోని వస్తువు ప్రజాసామాన్యమునకు సంబంధించినది. ముఖ్యముగా గ్రామ జీవనములోని వివిధ సంఘటనలను గర్భీకరించుకొని ఉదయించినది, వస్తు విషయములో ఇది అచ్చమైన ప్రజాకవిత్వము; తన్నిర్వహణలో మాత్రము అభ్యుదయ కవిత్వస్థాయి నందుకొనలేదు. వస్తువులో, ఛందస్సులో 'నవమి చిలుక' చక్కని ప్రయోగమనిచెప్పవచ్చును''.

స్త్రీ జీవిత చిత్రణలో ఉమామహేశ్వరం వాస్తవానికి ఎంత చేరువగా వెళ్ళగలడో అంతకన్నా ఎక్కువగానే వెళ్ళాడు. 'పూట్ల వెర్రెమ్మ', 'పుట్టింటిపిల్ల', 'ఆడవాళ్ళు',

2. సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు - పుటలు 534-5

'జ్ఞాపకాలు' అనే ఖండికలు చెప్పుకోదగ్గవి. ఎన్ని నోములు నోచినా చివరకు ఉట్టెక్కి ఉరిపోసుకొనేవాళ్ళూ, ఆశలు అడుగంటిన వాళ్ళూ వీటిలో ఉన్నారు. పుట్టింది పోయేవరకూ అందరూ ఉండి ఏకాకి అయిన యువతి జాలిగాథను 'జ్ఞాపకాలు' చెప్పాయి. చూడండి ఆ ఖండిక.

''నా పేరు లీల!
ఆ ఊరి గోలపడలేక నేను పొరుగూరొ
చ్చాను! అందాలవాడే అడవిలో ముం
చాడు! అందరినీ తలచుకొని అల్లాడు
చున్నాను.,
ఏకాకినై నేను దూరాన ఉన్నాను. దారినే
పోయే అమ్మలక్కలు జేరి ముండ్లచూపులు
చూచి అడుగుతూ పోతారు.
ఏకాకినైనేను నడిజాము వరకూ మేలుకొని
మృత్యువును బ్రతిమాలుకొన్నాను!
అమ్మమ్మ జ్ఞాపకం, అమ్మ జ్ఞాపకం, చెల్లెలు
జ్ఞాపకం! నాన్న జ్ఞాపకం, అన్నలే జ్ఞాపకం,
తమ్ములే జ్ఞాపకం, అందరిలో నువ్వే ఆఖరి
జ్ఞాపకం! రావేల! రావేల రాత్రి వచ్చింది!
మధురమౌ మగవాడ నా ప్రేమనిజమోయి.
ప్రాభావతమౌవేళ నా ప్రేమనిజమోయి.
తలచి తలచీ నిన్ను జ్ఞాపకాలొచ్చాయి!
పవళింపు సమయాన జ్ఞాపకాలొచ్చాయి!
తలనొప్పి తీర్చుతూ తలగడగ రావోయి!
చలికాలమొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి!
చైత్రమాసమొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి!
వర్షాకాలమొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి!
పిలుపులుకు పలకనందులకై ఈ ఘడియ
ఈ క్షణము జ్ఞాపకాలొచ్చాయి! రావేల
మగవాడ! ఒడ్డు పొడుగూవాడ!
ఏకాకినై నేను ఏదారిపోయినా, పిలుపు
పిలుపుకు పలికే జ్ఞాపకాలొచ్చాయి! ఏకా
కినై నే ఏ పని జేసినా తలపు తలపుకు
త్రవ్వి జ్ఞాపకాలొచ్చాయి! మరో పిల్లను
నీవు మరులు గొల్పావో, వేరో
పిల్లకు నీవు ఉరులు వేశావూ, రావోయి

రావోయి త్వర త్వరగ రావోయి, నా కన్ను
చెదిరింది పురుషులను జూస్తూ!
బుల్ బులుల హోయికై కిలకిలల జోలకై
పరితపించే మనస! కన్నీళ్ళ హృదయమా!
బుల్ బులుల మన్నా కిలకిలల మన్నా
ముత్తైదు ముద్దుటుయ్యాలకే కద్దు!
బులుబులు బులాహోయి యీా
హోయమ్మ నెవ్వరూ పురిగొల్పినా వారు?
పురిగొల్పినావాడు పురుషుడేకాడు! మగ
పిల్లవాడవో, ఆడపిల్లవొనీవు, మగవాడనై
నీవు మాయదారివవకుండ, ఆడపిల్లవై నీవు
అర్థాన్న మవకుండ ఎన్నెమ్మయే వచ్చి
పురుడు పోసింది! కొత్తెమ్మ యేవచ్చి ఉగ్గు
కలిపింది! పోతరాజే వచ్చి చేదవేశాడు!
కొత్తెమ్మ యే వచ్చి చాటుపరిచింది!
బులు బులుబులు బులాహోయి! యీ!
హోయమ్మ నెవ్వరో చంకెత్తికెళ్ళారు! నా
చన్నులో పాలు చేపుతున్నాయే! ఉయ్యా
లలో పిల్ల ఉబుసులే లేవు! నా చన్నులో
పాలు జన్ను లెత్తాయే!
హోయమ్మ కెవ్వరూ హోయన్నవారూ!
నీలాల సంద్రములో నిప్పచ్చరమునేలపై
రాయినై యాహల్యనైనాను శ్రీరామ
చంద్రమూర్తీ! రామ! రామ! నాపేరు లీల!''

ఉమామహేశ్వరానికి మన నుడికారాలూ, జాతీయాలూ, సంప్రదాయాలూ చాలా బాగా తెలుసు. 'విష్ణుధనువు'లోనూ, 'నవమి చిలుక'లోనూ తెలుగుదేశపు పండుగలు, మదన పంచమి, రథసప్తమి, నాగుల చవితి, దేవీ నవరాత్రులు కనపడతాయి. అలాగే ఎన్నెమ్మ, కొత్తెమ్మ, పోతరాజు కనపడతారు. తన ప్రహ్లాద కవిత్వంలో పామరత్వం కూడా ఉందని చెప్పడానికి దాఖలాగా 'బీదమందు' అనే కవితను పామరుల భాషలోనే రాశాడు. చూడండి :

''తూర్పు తెల్లవారింది, వాన వెలిసింది! అమ్మ
పోయే మందెట్టుకు రాయే!
కాం డబ్బైనా లేదు, కాసైనా లేదు! కాత్తె
కూత్రైకతే డాక్టేరు రాడే!
సందేళ సలిజరం ఊర్కైపోదే! సందొచ్చిన

పిల్లోడు ఉలుకుతుండాడే!
ఏయాకో తింటుంది గజ్జెట్టిన కుక్క! నేపాళం
మాత్రెయ్యో, లేత్తాడు పిల్లోడు!
పాతాళం బలిసెక్రవర్తీ! సంకురాంతి పం
డక్కు నేపాళం సెట్టెక్కిరా! జబ్బులన్నీ పోతాయి!''

ఉమామహేశ్వరం కవితలలోనే కాక ఆనాటి కొత్త కవులందరిలోనూ ఉన్న దోషాలు గురించి 'విష్ణుధనువు' సమీక్షలో విశ్వనాథవారు ఇలా రాశారు.

''కొత్త కవిత్వంలో అర్థ దోషాలు ఎక్కువగా ఉంటవి. ప్రాత మార్గమున పోయెడి వారి కవిత్వము నిరర్థకత్వం వుండవచ్చు. కాని కొత్త కవుల వాక్యాలలో అపార్థం వుంటోంది... సంప్రదాయ భిన్నమైపోవుట, పూర్వ సంప్రదాయము తెలియకపోవుట, తెలియకుండ తెలిసినట్లు వ్రాయుట. తెలిసియో తెలియకయో దానిని నిందించుట. పరసంప్రదాయములను చొప్పించుట. ఇవి సంప్రదాయగతమైన దోషాలు. సంప్రదాయమంటే మత సాంఘిక భాషాది సర్వ విషయాల్లోను.

''ఇన్ని దోషాలు వున్నవి అని చెపితే ఈ దోషాలు అన్నీ ఒక కవిలో మూటకట్టుకొని పడి వున్నవి అని కాదు. భిన్న కవులలో భిన్న భిన్న స్థలాల్లో ఒక్కొక్క చోట కొంచమెక్కువగా వున్నవని అర్థం. మేము గ్రాంథికవాదులము అనే అనుకునేవాళ్ళల్లో కూడా ఇందులో కొన్ని దోషాలు కుప్పతెప్పలుగా వున్నవి. కాని ఆదోషాలని అలంకార శాస్త్రం నిర్ణయించి చెపుతుంది. క్రొత్త కవులలో వున్న కొన్ని దోషాలు వ్యాకరణ శాస్త్రమే చెబుతుంది. వ్యాకరణ శాస్త్రాన్ని కాదంటే తెలుగుదేశంలో శబ్దాన్ని ప్రయోగించే పద్ధతి తప్పని చెపుతుంది. వాడుకలో సమాసాలు కొద్దిగా వేస్తాం. క్రొత్త కవులు వాడుకను దాటవేస్తాం. అప్పుడు వ్యాకరణం రాక తప్పదు. కాదనటానికి వీలులేదు. కనుక శబ్దము నందు అర్థమునందు దోషాలు వస్తున్నవి''.

దీనికి జవాబుగా అన్నట్టు విష్ణుధనువు చిట్టచివర పుటలో ఉమామహేశ్వరం 1938 ఫిబ్రవరి 14వ తేదీనాడు ఇలా ప్రకటించాడు :

''మాటకు మాటాను మాటల అర్థం ఉండాలి! ఉంటుంది! సమాసాలు సందర్భానుసారంగా కొంత వదులుతో ఫరవాలేదు!

''వ్యాకరణంతో వ్యభిచరించడము కూడదుగాని పొయిట్రీలో కొంత స్వేచ్ఛ అవసరం! న్యాయం!

''రమ్యత అనేది రంజింపచేయుట అనేది కావ్యానికి ముఖ్యము. రమ్యత అనగా ఎరుపు పచ్చన రంగులుగల రామచిలుక వలే భావమూ రసమూ సరసగా కనుబడుచూ - కలిగించుటే!''

ఉమామహేశ్వరం ఈ వాక్యాలు తన ఒక్కడి కవిత్వం గురించే కాక తన సమకాలిక యువ కవులందరి తరపునా చెప్తున్నట్టుంది. అయితే శివశంకరశాస్త్రిగారు అతణ్ణి, అందరిలో కలపరు. ఆయన 'విష్ణుధనువు' పీఠికలో ఇలా రాశారు :

''ఊరందరిదీ ఒక తోవ. ఉమామహేశ్వరానిది ఒక తోవ! నాకు తెలిసినంతలో అతి నవీన మార్గంలో మొదట నడిచినవాడు ఇతనే. రమారమి ఏడు సంవత్సరాల క్రిందట ఇతని రచనలు చూచి చకితుణ్ణి అయినాను. కావ్య వస్తు సంగతి విడిచి కావ్య శరీరం సంగతి ఆలోచిస్తే ఈ ఒంటి తీరే వేరు. తరువాత కొన్నాళ్ళకు పూడిపెద్ది వెంకటరమణయ్య, శ్రీశ్రీ, నారాయణబాబు, పురిపండా అప్పలస్వామి, రుక్మిణీనాథశాస్త్రి, కొడాలి ఆంజనేయులు మొదలయిన కవుల రచనలు బయలుదేరినవి. రమణయ్య Inter-Rhymingకోసం యత్నించినట్టు కనపడుతుంది. శ్రీశ్రీ, నారాయణబాబూ Pattern verse పద్ధతిని వెళ్ళారు. కొంతమంది Vers libre వ్రాశారు. ఎలాగయినా వీటిలో ఎక్కువ భాగం Formalగా వుంటుంది. ఈ కవులకు సంగీతంలో అట్టే ప్రవేశం ఉన్నట్టు తోచదు. కొంత Ear for melody వుండటం చేత అల్లిక బాగానే సాగింది. 'ఉమా' మన సంగీతమూ, తెల్లవారి సంగీతమూ తెలిసినవాడు కావటం చేత కొంత విపరీత మార్గంలో విహరించినాడు. రచనలో Formal beauty ఇతనికి ఇష్టం కాదు. ఎంతసేపటికీ ఇతను వక్రగతులలో, ఊపులో, లయలో లాస్యం చేస్తాడు''.

శివశంకరశాస్త్రిగారు అతి నవ్యకవిత్వానికి ఉమామహేశ్వరమే ఆద్యుడని చెప్పడం చారిత్రక సత్యమే. శ్రీశ్రీయే ఒకచోట ఒక ప్రశ్నకు సమాధానం చెప్తూ ఇది అంగీకరించాడు.[3] ఆ ప్రశ్న జవాబులు చూడండి.

ప్రశ్న : శిష్ట్లా ఉమామహేశ్వరరావుగారు మిమ్మల్ని Influence చేసినట్లుగా విన్నాను. ఎంతవరకు? నిజమా? వచన కవితలో మీరు ముందా? ఆయనా?

జవాబు : నామీద గురజాడ ఇన్ఫ్లుయన్స్ ఉంది. చింతా దీక్షితులు, బసవరాజు వీళ్ళు నన్ను గురజాడ దగ్గరకు చేర్చారు. ముద్దుకృష్ణ, నేనూ అదే దార్లో వెళ్తుండేవాళ్ళం. శిష్ట్లాని చూసినప్పుడు I was really inspired. నాకంటె ముందు శిష్టాయే స్టార్ట్ చేశాడు. ఇద్దరమూ ఒక్కదారంట వచ్చిన వాళ్ళమే''.

ఈ ఒక్క సందర్భంలోనేకాక మరొకసారికూడా శిష్ట్లా ఆదిమస్థానాన్ని శ్రీశ్రీ అంగీకరించాడు. తాను రచించిన 'నేను సైతం' అనే గేయం సంగతి చెప్పాక అతడు ఇలా అన్నాడు.[4]

''దీన్ని 1933 జూన్ 2న రాశాను. అప్పటికే శిష్ట్లా ఉమామహేశ విలక్షణమైన ఒక నవీన ధోరణిలో రచన సాగిస్తున్నాడు. కాని సరాసరిగా అవి నా రచనను ప్రేరేపించలేదు. శిష్ట్లా ప్రభావంతో ముద్దుకృష్ణ వ్రాస్తున్న వచన గీతాలు ఎప్పటికప్పుడు ముద్దుకృష్ణ ముఖతానే నేను వినేవాడిని''

ఒక్క శ్రీశ్రీయేకాక ఒకనాటి యువకవులందరూ ఉమామహేశ్వరానికి ఇవ్వవలసిన స్థానాన్ని ఇచ్చారు. శ్రీరంగం నారాయణబాబు ఇలా రాశాడు.[5]

---

3. సృజన - 1970, ఫిబ్రవరి, పుట.147
4. అనంతం - పుట. 183
5. 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' లో ఉదాహృతం. చతుర్థభాగం - పుట. 737-8

''ఈనాడు అతినవీనులమని బోర విరుచుకు తిరుగుతున్న అతినవీనులకు కూడా నవీనుడు శిష్ట్లా, ఏనాడో అతి నవీనమైన మర్గాంలో కవిత్వం రాసి లోకం చేత విస్మరింపబడ్డాడు. అతి నవ్య కవిత్వం ఎన్ని కొత్త పోకడలు పోగలదో అన్నిటినీ పోయి చూచాడు, భావకవిత్వం నుంచి అధివాస్తవికత వరకు. కవిత్వంలో యీయన ప్రత్యేకత ఏమిటంటే పదాల పునఃసృష్టి (Re-creation) కోసం ప్రయత్నం చేశాడు. ఆదిని పదాలు స్ఫటికాల (Crystals) లాగ, బహుముఖాలతో, జీవన చైతన్యంతో, నిండుగా కవులను పులకితం చేసేవి. రానురాను పాతబడి, అరిగిపోయి, అందరి నోళ్ళాపడి, అర్థం తూచుకొనే గుండురాళ్ళలా తయారయినాయి. ఈ మర్మం తెలుసుకున్నది శిష్ట్లా కవిత్వం''.

'విష్ణుధనువు', 'నవమి చిలుక' వెలుగు చూశాక ఉమామహేశ్వరం యుద్ధం రోజుల్లో మిలట్రీలో చేరాడు. ఏ ఉద్యోగం చేశాడో తెలియదుగాని ఎందరు సిపాయిలతోనో కలిసి మెలసి వాళ్ళ అనుభవాలను అధ్యయనం చేశాడు. సైన్యం నుండి తిరిగి వచ్చాక 'సిపాయికథలు' అనే పుస్తకాన్ని రాశాడు. ఇవి వేటికీ అనువాదాలు కావు. స్వతంత్ర రచనలు, సొంత వర్ణనలు. ఈ కథల్లో తెలుగు సిపాయిల బతుకులు, ఆశలు, అనుభవాలు చక్కగా చిత్రించాడు. ఈ కథల సంకలనాన్ని యువ బుక్‌డిపోవారు ప్రచురించారు. దీన్ని భారతిలో నారాయణబాబు సమీక్షించాడు. అందులో ఇలా రాశాడు.[6]

''...శిష్ట్లా వ్రాసిన 'సిపాయికథలు' వస్తువులోను, కథనములోను నవ్యమార్గానికి చెందినవై ఆంధ్ర కథానిక సాహిత్య విచార సందర్భాన మంచి స్థానము గడించి పెట్టేవిగా ఉన్నవి. ఈతడు వ్రాసిన 'కాళింగి పాటలు'న్ను తెలుగు పద కవిత్వానికి నూత్నాలంకారాలనదగినవి. పిల్లల కోసమని ఈయన వ్రాసిన పాటలు, కథలు పత్రికలలో ఎన్నో ప్రచురితమైనవి గణింపదగినవి. అయితే ఏమి? నవ్యత ఉన్నంతగా నాజూకు లేకపోవడము మూలాన, ప్రతిభ ఉన్నంతగా భాషా పాటవం, ప్రాపకమూ లేకపోవడము మూలాన ఇతనికి ప్రాచుర్యము తన జీవితకాలానే లభించకపోయినదని చెప్పవలె''

సిపాయిల్లాగే సమాజంలో ప్రత్యేకత గల ఇంకొక తరగతి వ్యక్తులు ఉన్నారు. వాళ్ళు ఆంగ్లో ఇండియన్‌లు. వీరి ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు విలక్షణమైనవి. భారతదేశంలోని ప్రజానీకంలో తమది అంటూ ఒక ప్రత్యేకమైన సంస్కృతి గల ఆంగ్లో ఇండియన్ స్త్రీ-పురుషులను ఉమామహేశ్వరం చాలా చేరువులో పరిశీలించాడు. సిపాయిల కథల్లాగే 'ఆంగ్లో ఇండియన్ కథలు' అనే పేరుతో ఎన్ని కథలు రాశాడో కాని కొన్ని 1946లో 'ఢంకా' అనే మాసపత్రికలో ప్రచురణ పొందాయి. వీటిని ఎవరూ సంకలనం చేయలేదు. గ్రంథరూపంలో రాలేదు. ఇవి సైన్యంలో ఉన్నప్పుడు రాశాడో తర్వాత రాశాడో తెలియదు.

ఉమామహేశ్వరం సైన్యం నుండి తిరిగి వచ్చాక కొన్నాళ్ళు 'ఆంధ్రపత్రిక'లో పనిచేశాడు. దాని అధిపతి శివలెంక శంభుప్రసాద్‌గారు అతని సహాధ్యాయి. మద్రాసులో ఉమామహేశ్వరం, బెల్లంకొండ రామదాసు, అబ్బూరి వరదరాజేశ్వరరావులతో వాళ్ళ

---

6. భారతి - జూన్ 1946

గదిలో ఉండేవాడు. ఆంధ్రపత్రికలో ఉద్యోగం అట్టేకాలం చేయలేదు. అతడు ప్రచురించిన ఇతర రచనలు బహుస్వల్పం. పిల్లల కోసం 'గోరింట రాక్షసుడు' అనే కథ చెప్పాడు. కాళింది పాటలు, దసరాదశం అనే నాటిక ఆనాటి పత్రికల్లో అచ్చుపడ్డాయి. 'ఆకాశవాణి కథలు' మరో ప్రక్రియ. థియడోర్ డ్రిక్రియర్ శేముషీ విశేషాలపై ఒక వ్యాసం భారతిలో రాశాడు. ఇంతకు మించి రచనల వివరాలూ, అతని జీవిత విశేషాలు పూర్తిగా తెలియవు.

ఉమామహేశ్వరం గురించి కొన్ని విడ్డూరపు కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇతనికీ శ్రీశ్రీకీ ఒక రకమైన Love-Hate భావాలు ఉండేవి. శ్రీశ్రీ ఒకచోట ఇలా ఒక అనుభవం కథనం చేశాడు.[7] (ఉమామహేశ్వరాన్ని శ్రీశ్రీ ఉమ్మయ్య అంటాడు.)

''... ఉమ్మయ్య ఆజానుబాహుడు. నన్ను తన ముందు నిలబెట్టి ఒకే ఒక ప్రశ్న వేశాడు. ఇవాళ తెలుగుదేశంలో నిన్ను కమ్యూనిస్టు పార్టీ వాళ్ళు మహాకవి అంటూ దుమారం రేగిస్తున్నారు. నిజమైన మహాకవిని నేను! ఇది నువ్వు ఒప్పుకుంటావా లేదా అని నిలదీసి అడిగేడు.

''నేను ఒప్పుకున్నాననుకో! నీకేం ఒరిగింది? లోకం ఒప్పుకోవద్దా?'' అన్నాన్నేను.

.....

''శిష్టా నన్ను అమాంతంగా ఎత్తుకొని గిర్రున తిప్పడం మొదలుపెట్టాడు. ఆరడుగుల మనిషేమో, నేను ఆకాశంలో రంగుల రాట్నం మీద తిరుగుతున్నట్లు అనిపించింది. ఎదురుగుండా ఒక గడ్డివామును భావించుకొని తన 'ఊహల్లోనే' దానికి నిప్పంటించి అందులో నన్ను పడేశాడు. అక్కడే నన్ను వదిలేసి కుర్రాళ్ళను వెంటపెట్టుకొని ఇంట్లోకి వెళ్ళిపోయాడు''.

ఈ కథను శ్రీశ్రీ ఎందరికో చెప్పాడు. ఒక నోటినుంచి ఇంకో నోటికి వెళుతున్నప్పుడు ఈ కథ కొద్దిమార్పులు సంతరించుకొంది. ఇదే కథను అబ్బూరి వరదరాజేశ్వరరావు కథనం చేశాడు. ఒకసారి ఒక వివాదంలో ఉమామహేశ్వరం శ్రీశ్రీతో ''నిన్ను చంపేదాకా ఊరుకోనురా!'' అని బల్లగుద్ది అన్నాడట. ఆ తర్వాత వరద మాటలు ఇలా ఉన్నాయి.[8]

''ఆ తరువాత కొన్నేళ్ళకి ఉమామహేశ్వరరావు అన్నంతపనీ చెయ్యటానికి ప్రయత్నించాడట. అదో పెద్ద కథ. శ్రీశ్రీ నాకు ఆ కథ చెబుతున్నప్పుడు అతని కళ్ళల్లో వెనకటి భయం కనిపిస్తుండేది. అతణ్ణి కాల్చటానికి ప్రయత్నిస్తున్నప్పుడు ''మారో మారో మారో'' అని ఉమామహేశ్వరరావు పాడాడట''.

శ్రీశ్రీ అనంతంలో చెప్పిన కథలో ''ఒక గడ్డివామును ఊహించుకొని తన ఊహల్లోనే దానికి నిప్పంటించి అందులో నన్ను పడేశాడు'' అన్న మాటలు వరద రాజేశ్వరరావు కథలో ''గుంటూరు దగ్గర పొలాల్లో గడ్డివాముకు కట్టి కాల్చెయ్య

7. అనంతం - పుట. 242-3
8. కవన కుతూహలం - పుట. 40-41

బోయాడు'' అనే మార్పుకు లోనయ్యాయి. ఇదే కథను మరికొందరు చెప్పుకొనడం కూడా నేను విన్నాను. కథలకు కాళ్ళూ చేతులు వచ్చేటప్పటికి ఎన్నెన్ని పుట్టుకొచ్చాయో లెక్కకట్టడం సాధ్యం కాదు.

ఉమామహేశ్వరం మనస్సంచారాలు తొలి దగ్గరనుంచీ విచిత్రమైనవి. అవి దాగుడుమూతపడనివి. కత్తెరపెట్టినా తెగవు. అతని నడవడికి ఒక వరవడి లేదు. అవాంఛనీయమైన అలవాట్లూ, అభ్యంతరకరమైన తిట్లూ అలవర్చుకొన్నాడు. నిలకడలేని జీవితంలో రానురాను తాగుడు, వాగుడు ఎక్కువైపోసాగింది. అందుకే నలభయ్యేళ్ళు దాటీ దాటగానే అతనికి నూరేళ్ళూ నిండిపోయాయి. అతని గ్రంథాలు నేడు గ్రంథాలయాల్లో అలభ్యాలు. అతని పేరు కొందరు సాహితీపరులకే తెలిసినదైపోయింది. ఇంక కొన్నాళ్ళు జీవించి, అతడు చేయవలసిన కృషి చేస్తే రావలసిన పేరు వచ్చేదేమో అనిపిస్తుంది గాని సాహిత్యచరిత్రలో అతడు విడిచిపోయిన కొద్ది రచనల వల్లనే అతని సముచిత స్థానం చెక్కుచెదరలేదు.

సామినేని ముద్దుకృష్ణ

(1899–1973)

తనతరంలోని రచయితలందరికీ తలలో నాలుకలాగా మెలగినవాడూ, తాను విరచించిన కవితలే నూటికి నూరుపాళ్ళూ నవ్యత్వం ఉట్టిపడే రచనలుగా లోకం విశ్వసించేటట్టు చేయగలిగినవాడూ, తాను సంకలనం చేసిన గ్రంథమే ఆనాటి నవీన కవితా ధోరణుల నదులకు గమ్యస్థానమైన సాహిత్య రత్నాకరమనిపించదగినావాడూ, తాను సంపాదకత్వం వహించి నిర్భయంగా, నిస్సంకోచంగా, నీళ్ల నమలకుండా తోచినది తోచినట్టు వ్రాసి ప్రకటించిన పత్రిక కొన్నేళ్ళపాటే వెలువడినా దానిని యువతకు ప్రతినిధిగా నడిపినవాడూ – సామినేని ముద్దుకృష్ణ. అతడు సంకలనం చేసిన కవితా సంపుటి 'వైతాళికులు' అతడు నడిపిన పత్రిక 'జ్వాల'.

సామినేని వారిది రాజమండ్రిలో చదువూ సంస్కారం గల కుటుంబం. ముద్దుకృష్ణ ముత్తాతగారు సామినేని ముద్దు నరసింహం (1792(?) – 1856). వాడుకభాషలో గ్రంథ రచన చేసిన మొట్టమొదటి అభ్యుదయ ప్రవక్త. ఆయనలోని భావ చైతన్యం చాలా గొప్పది. ఆయన వేగుచుక్కలాగా ప్రకాశించారు. మూఢాచారాలు, అంధవిశ్వాసాలు చిమ్మచీకట్లలాగా ఆవరించిన నిశాంత సమయంలో ఇంక అరుణోదయం కాక తప్పదని చాటే వెలుగు చుక్కలాగా ఆయన 'హితసూచని' అనే గ్రంథాన్ని తేజోవంతంగా రచించారు. పరోక్షంగా వీరేశలింగంగారినే ప్రభావితులను చేశారు.[1] అటువంటి వారి మనుమడైనందుకు ముద్దుకృష్ణ నూటికి నూరుపాళ్ళు సంస్కారశీలి. ''ఈనాటి

1. ముద్దు నరసింహంగారి జీవిత వివరాలకూ, వారి రచన గురించిన భోగట్టాలకు కుంఫిణీ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మూడవ సంపుటి 2004.

సంఘనియమాలు సరిగ్గా కనపడని జైలుగోడల'ని చెప్పి ''యువకులు తిరగబడాలి ఈ అన్యాయం మీదికి, స్వేచ్ఛకి యత్నిస్తూ ప్రతివ్యక్తీ సంపూర్ణ వికాసం పొందడానికి, ఉవ్వెత్తుగా సరియైన మనిషిగా పెరగడానికి, తన ఆత్మను తాను పూర్తిగా గ్రహించడానికి 'ఎక్స్పెరిమెంట్సు' చేయను అన్ని అవకాశాలూ కావాలి'' అని చాటినవాడు[2] ముద్దుకృష్ణ తన జీవితమంతా ఒక ఎక్స్పెరిమెంటుగానే గడిపాడు.

ఇరవయ్యో శతాబ్దం ఇంకో ఏడాదికి పుడుతుందనగా 1899 ఫిబ్రవరి 6వ తేదీనాడు ముద్దుకృష్ణ జన్మించాడు. ఆయన తండ్రిగారి పేరుకూడా ముద్దు నరసింహమే. 1861 ప్రాంతాలలో జన్మించారు. ఆయన తన కొడుకు ముద్దుకృష్ణకు చిన్నప్పుడే మనుచరిత్ర, వసుచరిత్ర వంటి కావ్యాలను బోధించారు. స్కూల్ఫైనల్ చదివేనాటికి ఆంగ్ల సాహిత్యంలో కూడా ఆసక్తి పెరిగింది. షేక్స్పియర్ ఆంగ్ల నాటకాలలో వేషాలు వేసి రంగస్థలం మీద రాణించే కౌశల్యాన్ని సంపాదించుకొన్నాడు.

కాలేజీ చదువు కాకినాడలో రఘుపతి వెంకటరత్నంనాయుడు గారి వద్ద ప్రారంభించారు. ఆనాడు గుడిపాటి వెంకటుచలం, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైనవారంతా వెంకటరత్నం నాయుడిగారి శిష్యులే. ముద్దుకృష్ణ ఈ మిత్రబృందంతో కలిశాడు. ఈ స్నేహితుల ప్రాణమిత్రుడైన మొక్కపాటి రామమూర్తి కూడా ముద్దుకృష్ణకు ప్రగాఢ మిత్రుడయ్యాడు.

కాకినాడలో కొన్నాళ్ళపాటే చదువుకొని తర్వాత ముద్దుకృష్ణ రాజమండ్రిలో చదువు కొనసాగించాడు. అక్కడ పట్టభద్రుడయ్యేనాటికి సంస్కృతాంగ్ల సాహిత్య పరిచయమూ, పరిజ్ఞానమూ చక్కగా సంపాదించాడు. జాతీయోద్యమ ప్రభావం వల్ల ముద్దుకృష్ణ ఉత్తేజితుడయ్యాడు.

బియ్యే పూర్తి చేసుకొన్నాక మద్రాసు లా కాలేజీలో చేరాడు. అప్పుడే బళ్ళారి రాఘవగారితో పరిచయం ఏర్పడింది. నాట్యకళపై ఆసక్తి పెరిగింది. న్యాయశాస్త్ర అధ్యయనం మద్రాసులోనే కాక కేరళలోని తిరువనంతపురంలోనూ కొనసాగించాడు. అక్కడే బి.ఎల్.పరీక్షకు చదివాడు. కేరళలో ఉన్నప్పుడే మహాకవి వల్లథోల్తో పరిచయం కలిగింది. ముద్దుకృష్ణ సాహిత్య జ్ఞాన సరిహద్దులు విస్తరించసాగాయి.

ఆంధ్రదేశంలో ఆనాటి నవ్యసాహిత్య నిర్మాతలందరి తోటి ముద్దుకృష్ణకు ప్రగాఢమైన స్నేహం గట్టిపడింది.

కృష్ణశాస్త్రి, చలం మొదలైన స్నేహితుల మైత్రే కాక ముద్దుకృష్ణకు ప్రఖ్యాతకవి హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ సహచర్యంకూడా లభించింది. 1927 ప్రాంతాలలో హరీన్తో కలిసి ఆంధ్రదేశం పర్యటించి పలుప్రాంతాలలో కళా ప్రదర్శనలు ఇచ్చారు. హరీన్ రచించిన ఆంగ్లనాటకాలలో ముద్దుకృష్ణ నటించేవాడు. ఆనాడు హరీన్ హార్మోనియం వాయిస్తూ పాడే 'సూర్య అస్తహోగయా! గగన్మస్త్ హోగయా!' అనే పాట ఆంధ్రలో మారుమ్రోగేది.

---

2. 'జ్వాల' - సంపుటి 1, సంచిక-5 (1934)

ఒక ప్రక్క కళా ప్రదర్శనలలో పాల్గొంటూనే ముద్దుకృష్ణ ఆనాటి సాహితీ సమితి సభ్యులందరి కవితలను సేకరించసాగాడు. వెళ్ళిన ప్రతి ఊళ్ళో ప్రతిభావంతులైన కవులందర్నీ కలుసుకొని వారి ప్రసిద్ధ రచనలన్నీ పరిశీలించి తనకి నచ్చినవి ఎంచుకొన్నాడు. గురజాడ అప్పారావుగారు మొదలు ప్రసిద్ధులైన పాతికమంది ఆధునికుల కృతులలోంచి ఏరిన 170 గీతాలను 205 పుటలలో సంకలనం చేసి వైతాళికులు అనే గ్రంథాన్ని ప్రకటించాడు. దానికి చాలా సంవత్సరాలు శ్రమించాడు.

ఈ సాహిత్య కృషి చేస్తున్నప్పుడే 1932–33 సంవత్సరాలలోని జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. అయితే తాను సేవించవలసినది సాహిత్యరంగం అని గుర్తించి దానికి అంకితమయ్యాడు. 1932 చివరి రోజుల్లో 'జ్వాల' అనే మాసపత్రికను స్థాపించి బెజవాడ నుంచి ప్రచురించాడు. తొలి సంచికలో 'జ్వాల ఎందుకంటే' అనే శీర్షికతో ఇలా సంపాదకీయం రాశాడు.[3]

''ప్రపంచం జీవితం అంతా తెరచిన పుస్తకం కావాలి. అందరికీ యువకులు ఉద్రేకంతో, సాహసంతో ఏది తెచ్చినా దాన్ని ప్రచారంలో పెడుతాము. ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించి నిర్జీవంగా తృప్తిపట్టడం కన్నా నష్టం కలిగినా సాహసించి ఏదో యత్నించి జీవించడం ఉత్తమం''.

ముద్దుకృష్ణ కావాలనే చాలా సాహసాలు చేశాడు. జ్వాల తొలిసంచిక నుంచే చలంగారి హరిశ్చంద్ర నాటకం ప్రచురణ ప్రారంభించాడు. సబ్బుగా ఉండటం కన్నా జీవంతో కదలడం ఉత్తమం. సాహసంలో బలం, జీవం, ఆశ, భవిష్యత్తు వున్నవి''. తృప్తిపడటంలో నీరసం, మాంద్యం, వెనుకపడటం ఉన్నవి అని స్పష్టం చేస్తూ ''జ్వాల - యువకులకు సవాల్, యువకుల పక్షాన ఇతరులకు సవాల్'' అని సమర శంఖారావం వినిపించాడు. (రావం అన్న పదాన్ని ముద్దుకృష్ణ గోల అని ఇంకోచోట అనువదించాడు).

జ్వాలలో ప్రచురణ పొందాలంటే ఆ రచనలు ఎలా ఉండాలో ముద్దుకృష్ణ స్పష్టం చేశాడు. ''కలవరం పుట్టించేట్టుగా, పుట్టకీట్లు కదిలేటట్టుగా ఏమి వ్రాయగలిగినా జ్వాలకు పంపండి'' అని ప్రారంభ సంచికలోనే కోరాడు. ''జ్వాలలో ప్రకటన కావడానికి హేతువాదమూ, కళాపుష్టి అవసరం. ప్రతి రచనలోనూ సాంఘిక ప్రయోజనం ప్రధానం 'ఘాటుగానూ, బలంగానూ చెప్పడం మోటుతనమూ, అసభ్యతా వుండకూడదు'' అని హెచ్చరించాడు. జ్వాలలో అచ్చుపడ్డ ప్రతిరచనా ఈ అర్హతలున్న రచనే.

''ప్రతివ్యక్తికీ కొన్నిహక్కులూ కొన్ని బాధ్యతలు వున్నవి. అన్యాయపు వత్తిడికి లొంగి తన హక్కులు త్యజించకుండాను, తాత్కాలికంగా బాధాకరమైనప్పటికీ తన బాధ్యతలు వహించకుండాను వున్నవారు ఎవరూ సరియైన పౌరులుగా గణనకాలేరు'' అని గట్టిగా చెప్పి జ్వాలలో హక్కుల్నీ బాధ్యతల్నీ విశదం చేశాడు. స్త్రీలకూ, పురుషులకూ

3. 'జ్వాల' ప్రారంభ సంచిక ఏనెలలో వెలువడినదీ సరిగ్గా తెలియదు. మొదటి సంపుటి 4వ సంచక మాత్రం 1933 ఫిబ్రవరి 8వ తేదీనాడు వెలువడింది. అందుచేత జ్వాల ప్రచురణ 1932 అక్టోబరులో మొదలైనట్టు ఊహించవచ్చు.

సమాన హక్కులు, బాధ్యతలు వుంటాయి. భర్త ఎంత నీచుడైనా అణిగిపడివుండే పాతివ్రత్యం ముద్దుకృష్ణ ఒప్పుకోడు.

నా దగ్గర 'జ్వాల' పాత సంచికలు కొన్నే వున్నాయి. ఆ ఉన్నవాటిలో ఎంతో వైవిధ్యం కనబడుతుంది. ఆనాటి సుప్రసిద్ధ రచయితలందరూ జ్వాలలో రచనలు ప్రచురించేవారు. ఆ రచయితల పేర్లను అకారాది క్రమంలో చూడండి.

అప్పారావు, గురజాడ	వీరరాఘవస్వామి, వెలువలి
ఉమామహేశ్వరం, శిష్టా	వెంకటచలం, గుడిపాటి
కృష్ణశాస్త్రి	వెంకటరావు, కవికొండల
కో.నెం.	'వొకరు'
జనమంచి	'శి'
నారాయణబాబు	శివరామం
నార్ల	శివశంకరశాస్త్రి
బాపిరాజు	శ్రీనివాసరావు, శ్రీరంగం
ముద్దుకృష్ణ	సత్యనారాయణ, విశ్వనాథ
రంగాచార్యులు, ఎం.వి.వి.కె.	సత్యనారాయణశాస్త్రి, వేదుల
రామకృష్ణశాస్త్రి, మల్లాది	సుజానరావు, ఎం.ఎ.
రామమూర్తి, తెన్నేటి	సులోచన (సినిమానటి)
విశ్వనాథ కవిరాజు	సూర్యనారాయణమూర్తి, చాగంటి (డా॥)
విశ్వేశ్వరరావు, మల్లవరపు	సూర్యారావు, కొంపెల్ల

జ్వాలలో ఇందరు సమకాలిక రచయితల రచనలే కాక మపాసా కథలకు అనువాదాలూ, థామస్ హార్డీ నుంచి సుదీర్ఘమైన ఉటంకింపులు మొదలైనవి అచ్చువేసేవారు. గురజాడ అప్పారావుగారి కొండుభట్టీయం దొరికినంత మట్టుకు జ్వాలలోనే సీరియల్‌గా ప్రచురించారు. శివశంకరశాస్త్రిగారు తమ స్వంత పేరుతోనే జ్వాలలో నీలకంఠం కథలు అచ్చువేశారు. అయితే ఇది గ్రంథరూపంలో వెలువడినప్పుడు తమ పేరు ఏ కారణం వల్లనో బయటపడనీయలేదు. ప్రతిభలో సమీక్షిస్తున్నప్పుడు ఈ గ్రంథకర్త గొప్ప పండితుడు అని శివరాం ముందు పలుకులలో రాసిన మాటలనే పేర్కొన్నారు. జ్వాల పాత సంచికలు తిరగేస్తేనే నీలకంఠం కథలు శివశంకరశాస్త్రిగారివని స్పష్టంగా చెప్పవచ్చు. జ్వాలలోనే శ్రీరంగం శ్రీనివాసరావు మహాప్రస్థానంలోని 'మరోప్రపంచం' గీతం తొలిసారి ప్రచురితమైంది.

జ్వాల పత్రిక సంస్థాపనకూ, అది మూసెయ్యడానికీ తానే కారకుడినంటూ చలం ఒకచోట క్రెడిట్ చేసుకొన్నాడు. ఆయన ఇలా రాశాడు.[4]

ముద్దుకృష్ణ గురించి చెప్పి ''అతనూ, నేనూ కలిసి 'జ్వాల' అనే పత్రిక పెట్టాం. అది గందరగోళాన్ని రేపింది. దాంతో తక్కిన కవులందరూ ముద్దుకృష్ణ ప్రాపకంలో చేరి 'ఆ

4. చలం - ''చలం మిత్రులు'' - పుట. 63

పత్రిక ఇంకా అభివృద్ధిలోకి రాకపోవడం చలం రాతల వల్ల' అని బోధించారు. అది తెలిసి నేను మానుకున్నాను. అంతటితో పత్రికా చచ్చిపోయింది''.

చలం మాటలలో ఎంత సత్యం ఉందో ఇవాళ తేల్చలేము. ఎందరో సాహితీమిత్రులు కలసి రావడం వల్ల ముద్దుకృష్ణ జ్వాలను ఎంతో తేజోవంతంగా తీసుకురాగలిగాడు. చలం రచనలకేకాక చలం భావాలకు చాలా ప్రచారం ఈపత్రిక ద్వారా జరిగింది. 'రక్షణ మందిరం' అనే ప్రకటన జ్వాల సంచికలో వెలువడేది. అందులో ''సంఘానికి భయపడి పిల్లల్ని చంపివేయవద్దు. మా సహాయ్యాన రహస్యంగా పురుడు పోసుకొని బిడ్డను మాకు యిచ్చేయవచ్చును. ఇందు నిమిత్తం కావలసిన సహాయాన్ని చేస్తాము. ధనసహాయం చాలా అవసరం - జ్వాల సంపాదకుడు'' అని ప్రకటించేవాడు.

ఇవాళ మనం సంతాన నిరోధం అనీ, గర్భ నిరోధం అనీ తెనిగించుకొంటున్న బర్త్ కంట్రోలు అన్న మాటను ఆనాడు ముద్దుకృష్ణ 'జన్మశాసనం' అని పేర్కొన్నాడు. కడుపు రాకుండా ఉండటానికి మార్గాలు తెలియజేయడానికి, సుఖవ్యాధులు రాకుండా ఉండటానికి ఉపయోగించే పరికరాల కోసం జ్వాలకు రాయమని పాఠకులకు సలహాలు ఇచ్చేవాడు. ముద్దుకృష్ణ బ్రహ్మచారేగాని 'దాంపత్య దీపిక' అనే గ్రంథాన్ని రచించాడు.

జ్వాల వెలువడుతున్న రోజుల్లోనే 'వైతాళికులు' గ్రంథరూపంలో వచ్చింది. ఇందులోని పద్యాలను ఎంచినది దేవులపల్లి కృష్ణశాస్త్రిగారేగాని ముద్దుకృష్ణ ప్రమేయం చాలా తక్కువ అన్న అభాండాన్ని కొందరు వేసేవారు. అబ్బూరి వరద రాజేశ్వరరావు ఇలా ఒకచోట రాశాడు.[5]

''.... విశాఖపట్నం వచ్చినప్పుడల్లా నేను చూస్తుండేవాణ్ణి. ఓసారి 'వైతాళికులు' అచ్చయిన తరువాత వచ్చారు. శ్రీరంగం శ్రీనివాసరావు నలుగురి మధ్యా ముద్దుకృష్ణని ఎద్దేవా చేశారు. ఆ నలుగురిలో పురిపండా అప్పలస్వామి, పూడిపెద్ది వెంకటరమణయ్య, శ్రీరంగం నారాయణబాబూ ఉన్నారు. వైతాళికుల్లో అచ్చయిన గీతాలను ఎంపిక చేసింది కృష్ణశాస్త్రికాని, ముద్దుకృష్ణ కాదని. ముద్దుకృష్ణకు కోపం వచ్చింది. శ్రీనివాసరావన్న దాంట్లో కొంత నిజం లేకపోలేదు''.

వరద రాజేశ్వరరావు కొంత పాక్షిక సత్యమే చెప్పాడు. పురిపండా అప్పలస్వామిగారు బ్రతికున్న రోజుల్లో నాకు వైతాళికుల గురించి చాలా విషయాలు చెప్పారు. ముద్దుకృష్ణ విశాఖపట్నం వచ్చినపుడు కవితా సమితి సభ్యులతో శ్రీశ్రీ, పురిపండా, కాళూరి నరసింగరావు, శ్రీరంగం నారాయణబాబులను కలుసుకొన్నాడు. వైతాళికుల కోసం వారిని పద్యాలు అడిగాడు. కాళూరి నరసింగరావును మిత్రులు 'ఉగ్రం' అని పిలిచేవారు. ముద్దుకృష్ణ ఉగ్రంతో పేచీ పెట్టుకొన్నాడు. ఆ తగాదా ఎక్కువైంది. కవితా సమితి సభ్యులెవరూ ముద్దుకృష్ణకు పద్యాలు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. అందుకే వాళ్ళ పద్యాలు 'వైతాళికులు' లో లేవు. అయితే సమితి నిర్ణయానికి కట్టుబడక శ్రీశ్రీ ఒక్కడే తన పద్యాలను ముందు ముద్దుకృష్ణకు ఇచ్చాడు. పురిపండా చెప్పిన ఈ కథలో కూడా ఎంతో కొంత సత్యం లేకపోలేదు.

5. 'కవన కుతూహలం' - పుట.187

శ్రీశ్రీకి ముద్దుకృష్ణమీద ఇంకొకరకం ఫిర్యాదు చాలాకాలం మనస్సులో ఉంది. 1934 సంవత్సరం ఏప్రిల్ నెల 12వ తేదీనాడు శ్రీశ్రీ ''మరోప్రపంచం'' గీతాన్ని రాశాడు. ఇది 'మహాప్రస్థానం' అనే పేరుతో జ్వాల (1935 జనవరి 16వ తేదీ సంచిక)లో ప్రకటితమైంది. ఈ గేయానికి ముద్దుకృష్ణ పెద్దపీట వేయలేదు. తన పత్రిక కొన్ని సంచికలలో ముందుగా అడవి బాపిరాజు, వేదుల సత్యనారాయణగారి రచనలు వేయడమేకాక, మహాప్రస్థానం ప్రకటించిన ముందు పుటలో కుడివైపు పేజీలో నారాయణ బాబు రచించిన 'జ్వలనా' అనే గీతాన్ని ముద్దుకృష్ణ వేశాడు. మహాప్రస్థానం గీతాన్ని ఎడమప్రక్క పుటలో వేశాడు. ఈ సంగతులను తన మాటల్లో చెప్తూ 1954లో చివరకు మనస్సులో దాచుకొన్న కోపకారణాన్ని ఇలాగ చెప్పాడు.[6] ''ముందుగా అడవి, వేదుల వారి పాటలు వెయ్యడమేకాక, మహాప్రస్థానం ప్రకటించిన సంచికలోనే దానికన్న ముందు పుటలో 'జ్వలనా' అనే అనుకరణ రచన ముద్రించటంలో జ్వాల సంపాదకునికిగాని అప్పట్లో అతనికి సలహాలు చెబుతూ వచ్చిన వారికి గాని దురుద్దేశాలున్నాయని నేనారోపించను. జరిగిన యీ సంగతులను నేను గుర్తించానని మాత్రం చెబుతున్నాను''.

నారాయణబాబు 'జ్వలనా' అన్న, నజ్రుల్‌ఇస్లామ్ కవిత చదివి, ఆ ప్రభావంతో రాసినదే. అయితే శ్రీశ్రీ మహాప్రస్థానం గీతానికి హరీన్ రాసిన 'షురూహువా హై జంగ్' అనే పాటా, శిష్లా రచించిన 'మారో-మారో-మారో' అనే పాటా ప్రోద్బలాలని ఆ మూలాలు తెలిసిన ముద్దుకృష్ణ గుర్తించకపోలేదు. అలాగే ముద్దుకృష్ణకు సలహాదారులెవ్వరైనా వుంటే వారుకూడా ఈ వాస్తవాన్ని గ్రహించినవాళ్ళే. తన గీతరచనకు ఏవేవి ఉత్తేజమిచ్చాయో శ్రీశ్రీ చిరకాలం దాకా చెప్పలేదు.

1935 జూన్ నెలలో వెలువడిన ఉదయిని 3వ సంచికలో కొంపల్లి జనార్దన్‌రావు 'వైతాళికులు' మీద సుదీర్ఘమైన విమర్శనం రాస్తూ ''ముద్దుకృష్ణగారు కొందరు కవులను ప్రధానముగా మనసులో ఉంచుకొని ఈ సంకలనం చేసి ఉండకపోతే ఇంకా చాలా కావ్యాలు ఇందులో ఔచిత్యంతో ప్రవేశం పొందగలిగి ఉండేవి. అయితే మీరు ముఖ్యమైన వైతాళికులను మాత్రమే ఏరుకొన్నారు''. జనార్ధనరావు ఇంకా ఇలా వ్రాశారు. ''నవ్య కవితకు మానిషాదప్రాయమైన గురజాడ వారి తొలి ముత్యాలసరం కావ్యం ఇలాంటి సంకలనానికి మొదట నిలవవలసినది చెప్పవచ్చు. కానీ, కథనాత్మకమైన కావ్యాలు సంపాదకులు ఎంచకపోవడం వల్ల ఆ కావ్యమందలి కథనచ్ఛాయ దానికి ప్రవేశము ఇచ్చి ఉండకపోవచ్చును. నవ్యకవితపట్ల వచ్చే విమర్శనలెన్నో దూసుకుపోసాగినవి. కానీ అది సజీవమని చూపడానికి ఈ సంపుటం నిలుస్తున్నది. కాని మరికొందరి కవులు కావ్యాలు ఇందు ప్రవేశం పొందవలసినది'' అని స్పష్టం చేశారు.

ముద్దుకృష్ణ స్వయంగా తానుకూడా నూతన కవితలు రచించాడు. అతని కొత్త ప్రయోగాలు సమకాలికులకు చాలా బాగా నచ్చాయి. ప్రోత్సాహమిచ్చాయి. ముద్దుకృష్ణ కవితల గురించి శ్రీశ్రీ ఇలా వ్రాశారు.[7]

---

6. శ్రీశ్రీ సాహిత్యం - వచన విభాగం - 2, పుట. 527
7. అనంతం - పుట. 124-5

''అవి ముద్దుకృష్ణ 'జ్వాల' ప్రకటిస్తూన్న రోజులు. పాతమీద రోతా, కొత్తదనంమీద మోజూ నాకులాగే అతనికి కూడా ఉండేవి.

'నాడు టెలిఫోనులో పిల్చి నాటినావు
ప్రేమ బీజమ్ములే నిరుపేద యెదను'

అని రెండు గీత పాదాలు రాసి నన్ను కంటిన్యూ చెయ్యమన్నాడు.

'మరుదినాన బొటానికల్ మధువనాన
తలవని తలంపుగా మనం కలసినాము'

అన్నాన్నేను. కాని ఇది పద్ధతి కాదని నాకనిపించింది. భావ కవిత్వపు ప్రభావం దానిలో స్పష్టంగా కనపడుతోంది. అందుచేత అక్కడితో ఆ రచన ఆగిపోయింది. టెలిఫోన్ లాంటి ఆధునిక పరికరాన్ని వాడినా, కావ్య వస్తువు పాతదే కావడం నాకిష్టం లేకపోయింది. అప్పుడు ముద్దుకృష్ణ 'మలుపు తిరిగాను' అని ప్రారంభించి ఒక మంచి రచన చేశాడు. ఇలాంటివే ముప్ఫయిదాకా రాసి వాటిని 'త్రిశంతి' అనే పేరుతో అచ్చువేయాలనుకున్నాడు. (అతని అజాగ్రత్త వల్లనో, నిర్లక్ష్యం వల్లనో అది జరగలేదు. ఇప్పుడా గీతాలు కూడా దొరకవు).

పాత 'జ్వాల' పత్రికలు గాలిస్తే అతడు రాసిన
కాయండి యువకులు
కాయండి భుజములు
కష్టంగా వుంటుంది.
కాని తప్పదు మనకు'

....

'చచ్చిపోయిన తల్లి
స్తన్యమ్ము గుడుపదు'
వంటివి ఒకటీ అరా దొరకవచ్చును'.''

ఒకటీ అరా కాదు, ఇంకా ఎక్కువ సంఖ్యలోనే దొరుకుతాయి. తన కవితలు ప్రచురించడం కన్నా ఇతరులవి ప్రకటించడంలోనే ముద్దుకృష్ణకు సంతృప్తి కలిగేది.

'వైతాళికులు' సంకలనం చేయటం, 'జ్వాల' ఎడిట్ చేయటం, కవితలు రచించడం వంటి సాహిత్య కార్యక్రమాలతో ముద్దుకృష్ణ ఆగిపోలేదు. 'అనార్కలీ' 'అశోకం' అనే రెండు నాటికలు వ్రాసి ప్రచురించాడు. కథలో మొగలాయి దర్జా, కల్పనలో విశ్వసాహితీ సౌజన్యం, రచనలో నవ్య భావాలంబనం అనార్కలీలో ఉన్నాయని తానే చెప్పుకొన్నాడు. ఇందులోని మూడురంగాలు మూడు రసతరంగాలు. ఇది చిన్న నాటకమైనా ఎంతో ఉన్నతాదర్శంతో రచించినదని చెప్పుకొన్నాడు. అనార్కలి నాటకం కన్నా అశోకం నాటకంతోనే ముద్దుకృష్ణ ఆనాటి సాహిత్యలోకంలో సంచలనం సృష్టించాడు.

రామాయణాన్ని లేదా ఇతర పురాణాల్ని ఆధారం చేసుకొని వాటిలోని పాత్రలను ఆధునిక దృక్పథంతో కొత్తరకంగా చిత్రిస్తూ చేసిన రచనలు మనకు కొత్తకాదు. కాని,

ఏనాడో కవిరాజుగారు రాసిన 'శంబుకవధ' ఈ తరం వారిలో చాలామందికి తెలియనే తెలియదు. అలాగే రమారమి యాభై సంవత్సరాల క్రిందట ముద్దుకృష్ణ వ్రాసిన 'అశోకం' కూడా ఈ తరంవారికి తెలియదు.

హైందవ పురాణేతిహాసాలలోని పతివ్రతలందరిలోనూ సీత తలమానికమైనది. అందుకే వాల్మీకి రామాయణంలోని లోతులను మధించి, ముద్దుకృష్ణ అశోకం రచించి సీత పాత్రను చాలా గొప్పగా చిత్రించాడు. ఆమెకు రాణివాసం, రాజ్యం, ప్రజలూ ఏమీ వద్దు. తన రాముడు తనకు చాలు. అయితే ఆమె రావణుని ప్రేమ అర్థం చేసుకోగలదు. అశోకంలోని రాముడూ, రావణుడూ చాలా ఉదాత్తపాత్రలు. వారిద్దరికీ పరస్పరం ఆదరాభిమానాలు వున్నాయి. ఒకరు ఇంకొకర్ని చాలా గౌరవంగా ప్రశంసించుకోగలరు. వాళ్ళలో సంకుచిత స్వభావం ఏ మాత్రం లేదు.

''అశోకం నాటకం రామాయణ కథేకాని అలవర్చుకోదగిన ఉత్తమ లక్ష్యాలలో నేర్చుకోదగిన నీతిలో, పాత్ర పోషణలో అంతా మార్పు. దీనిలో సీత ఆత్మవంచన చేసుకొన్న నీరసపు పతివ్రత కాదు. రావణుడు క్రూరుడూ, దుర్మార్గుడూ కాడు. ఈ వ్రాతకు తగిన ఆధారాలతో ఘట్టి విమర్శ కూడా వున్నది'' అని ముద్దుకృష్ణ జ్వాలలో ప్రకటించాడు. అదే పత్రికలో ఇంకో ప్రకటనలో ''సీత రావణుని ప్రేమను ఆదరించి అంగీకరించింది. రాముడు ఔనని తలవూపాడు. ఔచిత్యానికి భంగం కాదా, ఊహు... సింహావలోకనం చదివాక మరి సందేహాలు వుండవు'' అని స్పష్టం చేశాడు.

చిన్న నాటకానికి పెద్ద సింహావలోకనం చాలా అవసరం. ''వాల్మీకి సృష్టించిన సీతారాములను చాలామంది ఎరుగరు'' అని చెప్తూ సంస్కృత మూలాన్ని ఉదాహరిస్తూ ముద్దుకృష్ణ రామాయణ విశ్లేషణకు గొప్ప ప్రారంభం కావించాడు. ముద్దుకృష్ణ అశోకాన్ని శివశంకరశాస్త్రిగారు జ్వాలలోనే సమీక్షించారు. అయితే గడుసు పోకడలు పోతూ విమర్శను ఒక ఏకాంకికగా వ్రాశారు. ఈ ఏకాంకిక విమర్శను త్రిపురనేని రామస్వామి కవిరాజుగారికి అంకితమిచ్చారు. వివిధ సంస్కృత కృతులలోని రావణునికన్నా ముద్దుకృష్ణ సృష్టించిన రావణుడు చాలా గొప్ప పాత్ర అని శివశంకరులు నేర్పుగా నిరూపించారు.

ముద్దుకృష్ణ అశోకం పట్ల చలానికి అట్టే సదభిప్రాయం లేదు. ఒకచోట ఆయన ఇలా వ్రాశాడు.[8]

''అతని 'అశోకం' నాకు మొట్టమొదట చదివి వినిపించాడు. రామాయణకథని అనవసరంగా వికృతం చేశాడు. (అందులో) నేనన్నాను అతనితో 'నేను పురాణగాథల్ని తిరగరాశానంటే, వాటిమీద ద్వేషం చేతకాదు. పురాణాలంటే నాకు చాలా గౌరవం. కాలం మారడం వల్ల వాటిల్లో కొన్ని విషయాలు ప్రజలకి అపకారం చేస్తున్నాయి. కనక వాటిని నిరూపించి సరిదిద్దవలసి వచ్చింది'' అన్నాను. అది అతనికేం నచ్చినట్లు లేదు''.

అశోకం, అనార్కలీ వంటి నాటకాలే కాక ముద్దుకృష్ణ 'భీమా విలాపంలో భామా కలాపం' (1941), 'విచిత్రవైద్యుడు' (1952) మొదలైన నాటక రచనలు చేశాడు. ఇవి

8. చలం 'చలం మిత్రులు' - పుట.62

మూడుసార్లు పునర్ముద్రణలు పొందాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాటకరంగాన్ని సుస్థిరం చేసిన కూర్మా వేణుగోపాలస్వామిగారు ముద్దుకృష్ణకు చాలా సన్నిహితులు. ముద్దుకృష్ణ నాటకాలను వారు ఆడించేవారు. అబ్బూరి వరద రాజేశ్వరరావు ఒకచోట ఇలా రాశాడు.[9]

''ఓసారి ముద్దుకృష్ణ రాసిన 'అశోకం' అనే నాటకం గుంటూరులో వేయించారు. ఓ రంగంలో రావణాసురుడికి సన్నిహితంగా సీత రావటం లాంటిది ఉందని నాకు గుర్తు. ఆ రంగ ప్రారంభంలో ప్రేక్షకులు రంగస్థలాన్ని ఆక్రమించుకొని రావణాసురుడికీ, సీతకీ మధ్య కూచున్నారు. అంతే, నాటకం ఆగిపోయింది. ముద్దుకృష్ణ తరువాత నాతో అన్నారు. ఈ నాటకాల్ని ప్రదర్శించకూడదు. ముందుగా జనం చేత చదివించి చూడవలసింది అని. మళ్ళీ అలాంటి ప్రయోగం ముద్దుకృష్ణ చెయ్యలేదు''.

ముద్దుకృష్ణ అశోకం 1934లో మొదటి ముద్రణ పొందింది. రెండో ముద్రణ 1969లో జరిగింది. (ప్రకాశకులు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్). మొదటి ముద్రణ ఆనాటి పాఠకలోకాన్ని అట్టుడికించింది. రెండో ముద్రణ ఏ మాత్రం కలవరం కలిగించలేదు. నేను రాసిన ''రామునికి సీత ఏమౌతుంది?'' వ్యాసాలు చదివి ''ఈయన చెప్తున్నది నిజమే కావచ్చు. అయితే వాటినెందుకు చెప్పడం?'' అని తిట్టుకొన్న వాళ్ళలాగే రెండో ముద్రణ అశోకాన్ని చదివి లోపల లోపలే శాపనార్థాలు పెట్టినవాళ్ళు ఎందరున్నా, హర్షించిన వాళ్ళు కొందరేనా లేకపోలేదు.

అలనాడు కవిరాజుగారూ, ముద్దుకృష్ణా, చలం మొదలైనవారు పుట్టకీట్లు కదిల్చే రచనలు చేసి మన పురాణేతిహాసాలపట్ల కొత్త దృష్టి కలిగించారు. కనుక భావవిప్లవం రాజుకొని రామాయణం పట్ల విశ్లేషణా దృక్పథం అలవడింది.

రామాయణం కల్పవృక్షమో, విషవృక్షమో దృక్పథాన్ని బట్టి చెప్పవలసినదైనా రామాయణ విశ్లేషణం మాత్రం అశోకవృక్షమే.

ముద్దుకృష్ణ తన 'అశోకం' కృతిని మొక్కపాటి రామమూర్తికి అంకితం ఇచ్చాడు. అది అలా అంకితమిస్తున్నప్పుడే తప్ప ముద్దుకృష్ణ జీవితంలో శోకం అన్నది ఉన్నట్లు కనబడదు. ఒకచోట స్థిరంగా ఉండేవాడుకాదు. ఏ ఉద్యోగం చేయకపోయినా నిర్వ్యాపారత్వం అతనిలో ఉండేదికాదు. ఎప్పుడూ ఏదో చేస్తూ ఉండేవాడు. కొన్నాళ్ళు సినిమా రంగంలో రచయితగా ఉన్నాడు. చెమ్రియా టాకీసు ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీ సుందరలాల్ నహతాగారికీ, పక్షిరాజా ఫిలింస్ స్టుడియో అధిపతి శ్రీరాములు నాయుడుగారికి ముద్దుకృష్ణ స్నేహితుడు. చెప్పుకోదగినన్ని చిత్రాలకు రచనలు చేసినా వ్యాపార కళలో ఇమడలేకపోయాడు. తన రచనలన్నింటినీ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారికిచ్చి పునర్ముద్రింప చేసుకొన్నాడు. ఇతరుల కవితల సంకలనం చేయడంలో చూపిన శ్రద్ధ తన కవితలను సేకరించడంలో చూపెట్టలేకపోయాడు. వచన పద్యం తెలుగులో ఒక పరిణామదశలో వున్నప్పుడు ముద్దుకృష్ణ చేసిన కృషి గురించి ఈ సంపుటంలోనే వేరే ప్రకరణంలో వివరించాను.

9. 'కవనకుతూహలం'' - పుటలు.188-9

ముద్దుకృష్ణ తన జ్ఞాపకాలను గ్రంథస్థం చేసి ఉంటే ఒకతరం సాహిత్య చరిత్ర అంతా ఒక్కచోట చదువుకోడానికి వీలు ఉండేది. అయితే ఆ పని అతడు చేయలేదు. చేయమని అడిగినవారికల్లా ఒకటే జవాబు చెప్పేవాడు. తుమ్మల వెంకటరామయ్యగారు ఇలా వ్రాశారు.[10]

''సాహిత్యరంగ స్మృతులను ఆయన ముచ్చటిస్తున్నప్పుడు 'అవన్నీ' మీరెందుకు గ్రంథస్తం చేయరు'' అని అడిగితే – 'నిజం చెబితే నిష్ఠూరం. ఎందుకు లేనిపోని తగాదాలు? మనకు కావాల్సింది రచయితల జీవితాలు కాదు, వారి రచనలు' అంటూ ఉండేవారు''.

ఈ సంగతినే అబ్బూరి వరద రాజేశ్వరరావు మరింత స్పష్టంగా ఇలా రాశాడు.[11]

'ముద్దుకృష్ణ సాహిత్య స్మృతుల్ని గ్రంథస్తం చేద్దామనుకొని కొంత రాశారు ఆయన నాతో ఉన్నప్పుడు కాని ఆ కాగితాలు మాయమైపోయినాయి. తరువాత అడిగితే ముద్దుకృష్ణ అన్నారు. 'మంచిపనే అయింది. నా స్మృతిలో నేనెరుగున్న కవులు చేసిన వెధవ పనులన్నీ గుర్తున్నాయి. వాటిని గ్రంథస్తం చేస్తే మనల్నీ తిడుతుంటారు. వాళ్ళు రాసిన కవిత్వాన్ని మెచ్చుకుందాంలే అని''.

ముద్దుకృష్ణ తన జీవితంలో చేద్దామనుకొని చేయలేని పనొకటే ఉంది. అది తమ ముత్తాతగారు రచించిన 'హితసూచని'ని తన జీవిత కాలంలో పునర్ముద్రించడం. ఈ విషయమై అతడు నన్ను చాలాసార్లు కలుసుకొనేవాడు. హితసూచని 1862లో తొలిసారి అచ్చుపడింది. దీని ప్రతులు రమారమి అలభ్యం. ఒకటి రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో ఉందని ముద్దుకృష్ణకు బాగా తెలుసు. దానిలో కొన్ని పుటలు లేవన్న సంగతి కూడా తెలుసు. వేరే ప్రతులు ఎక్కడ దొరుకుతాయో పరిశోధించమని నన్ను అడుగుతూ ఉండేవాడు. హితసూచని మరల అచ్చువేయాలన్న సంకల్పం ముద్దుకృష్ణతో పాటు నాకూ లేకపోలేదు. దానికోసం ప్రయత్నాలు చేశాను. రాజమండ్రి 'ఆంధ్రకేసరి యువజన సమితి' వారు ఈపుస్తకాన్ని 1986లో పోయిన పేజీలు సంపాదించి ప్రతిని సంపూర్ణంగా ప్రకటించారు. నేను విపులమైన పీఠికను వ్రాశాను. ఈ పని ముద్దుకృష్ణ జీవితకాలంలో జరగలేదు. ముద్దుకృష్ణ అంతకు ఒక పుష్కరం ముందే 1972 ఫిబ్రవరి 6వ తేదీనాడు మద్రాసు రాయపేట ఆసుపత్రిలో మరణించాడు. అతడు ఆస్పత్రిలో చేరిన వార్త కూడా ఎవరికీ తెలియదు. అస్పత్రిలో ఉన్నట్టు తెలిస్తే వెళ్ళి చూసి, ఆరోగ్యం విషయం కనుక్కొని, వారి ముత్తాత గారి గురించి నేను చేసిన పరిశోధనలు చెప్పి ఉండేవాడిని. కొమ్మూరి సాంబశివరావు (ఉప్పి) ఫోను చేసి చెప్పేదాకా మరణవార్తా నాకు తెలియదు. సాంబశివరావుగారి తండ్రి కొమ్మూరి వెంకటరామయ్య గుడిపాటి వెంకటచలంగారికి స్వయానా తమ్ముడు. ఈయనను 'బుచ్చి' అని పిలిచేవారు. 'ముద్దుకృష్ణ జీవితాంతం వరకు బుచ్చికి స్నేహితుడు' అని చలంగారు వ్రాశారు. ముద్దుకృష్ణ చాలామందికి జీవితాంతం స్నేహితుడే! ఎటొచ్చీ జీవితాంతంలో స్నేహితులెవరూ ముద్దుకృష్ణకు దగ్గరలేరు.

10. ''తుమ్మల సాహిత్యం' – పుట.150
11. ''కవన కుతూహలం'' – పుట.189

సుందరలాల్ నహతాగారి మాట సాయంతో ముద్దుకృష్ణ భౌతిక దేహాన్ని ఆస్పత్రి నుంచి బయటకు తీసుకురావడం జరిగింది.

ముద్దుకృష్ణను తలచుకొంటే ఎందుకో ధీరసమీరంలో గాలిపటం, వాననీటిలో ప్రయాణం చేస్తున్న కాగితం పడవా జ్ఞాపకం వస్తాయి. అవి ఎటువెళుతున్నాయో, ఎందుకు వెళుతున్నాయో ఎవరికీ తెలియదు.

శ్రీరంగం నారాయణబాబు

(1906-1965)

కమ్యూనిస్టు మహా మహోపాధ్యాయులు కార్ల్‌మార్క్స్ ఉపదేశాలలో చాలా ప్రాచుర్యం పొందినది ఒకటుంది. లండన్‌లోని హైగేటు శ్మశానవాటికలో ఉన్న మార్క్స్ సమాధిపై ఈ సూక్తిని కలకాలం సర్వులకూ కనపడేటట్టు చెక్కారు.

'The Philosophers have only interpreted the world in various ways. The point however is to change it'.

కమ్యూనిస్టు సిద్ధాంతాలలో నిత్యం జ్ఞాపకం పెట్టుకోదగ్గ ఈ సుభాషితం ఒక తెలుగు కవి గుండెలకు హత్తుకొంది. అందుకే అతడు 'వేదాంతులు జీవితాన్ని ప్రకృతిని అవగాహన చేసుకొన్నారు. మేము లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతిని కూడా మారుస్తాము' అన్నాడు. ఇలాగ అన్న కవి పేరు శ్రీరంగం నారాయణబాబు. భగత్సింగు సందేశాలు చదివి ఉత్తేజితుడై సామ్యవాదం పట్ల ఆకర్షితుడై తొలిరోజుల్లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యుడైన సాహితీపరుడు. జాతీయోద్యమంలో కాంగ్రెసు వివరాలపైనా సాహిత్యంలో భావకవిత్వం పైనా ఏకకాలంలో తిరుగుబాటు చేసిన ప్రగతివాది.

1931 మార్చి 23వ తారీఖునాడు బ్రిటీష్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను రహస్యంగా ఉరితీసినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా అతిరహస్యంగా అంత్యక్రియలు జరిపించింది. భగత్సింగ్ ఉరితీత వార్త పైకి పొక్కిన తర్వాత దేశం అట్టుడికి పోయింది. చాలామంది యువకులు భగత్‌సింగ్ ఆశయాలవైపు మొగ్గారు. విజయనగరంలో శ్రీరంగం నారాయణబాబు, చాగంటి సోమయాజులు, రోణంకి అప్పలస్వామిగార్లు భగత్‌సింగ్ ప్రభావం వల్ల సోషలిస్టు పంథాల్లో పడ్డారు. ఈ ముగ్గురూ ప్రాణస్నేహితులు. కలసి అన్నీ చర్చించేవారు. కలసి సాహిత్యాన్ని, జీవితాన్ని చదువుకొనేవారు. వీరిలో వయస్సు వల్ల నారాయణబాబు పెద్దవాడు. (1906లో జన్మించాడు). సోమయాజులుగారు (1915లో పుట్టాడు). రోణంకి వారు వయస్సులో చిన్నవారైనా సాహిత్యం అధ్యయనం చేయడంలో సరిసమానులు. ముగ్గురూ విజయనగరంలోని చిన్నిపిల్లి వారి వీధిలో ఉన్న చాగంటి వారి హవేలీలో రోజూ కలుసుకొనేవారు.

1930, 31, 32 సంవత్సరాలలో రోణంకి అప్పలస్వామిగారు విజయనగరం మహారాజా కాలేజీలో చదువుకొనేవారు. చాగంటి సోమయాజులుగారుకూడా అదే కాలేజీలో బియ్యేదాకా చదివి డిగ్రీ తీసుకోకుండా స్వస్తి చెప్పారు. నారాయణబాబు ఎంతవరకూ చదువుకొన్నాడో వివరాలు తెలియవు. అయితే మిగతా ఇద్దరితో సరిసమానంగా సాహిత్య విషయాలు చర్చించడానికి తగినంత విద్య ఉందని చెప్పవచ్చు. చాగంటి సోమయాజులుగారు ఆంగ్ల ఛందోరీతులు బాగా తెలిసినవారు. వారి ఆంగ్లకవితలను విని రోణంకివారు ముగ్ధులై స్నేహం కట్టారు. ఆంగ్ల సాహిత్యమేకాక తెలుగు సాహిత్యం పట్ల కూడా ఇద్దరికీ అభిమానం ఉండేది. నారాయణబాబు 1930 దాకా భావకవిత్వపు ప్రవాహంలో మునిగి తేలుతున్నవాడు కనుక మిగతా ఇద్దరికీ తెలుగు కవితల మాధుర్యాన్ని చూపించేవాడు.

నారాయణబాబు సంపన్నుల ఇంట్లో పుట్టాడు. అతని తండ్రి శ్రీరంగం సుందరనారాయణగారు. రెండుచేతులా ఆర్జిస్తున్న వకీలు. విజయనగరంలో బంకుల దిబ్బ దగ్గర వారికి రెండంతస్తుల మేడ ఉండేది. (ఈ ఇంట్లోనే ద్వారం వెంకటస్వామినాయుడు గారు సుందర నారాయణగారి ఆశ్రయంలో తమ మొట్టమొదటి ఫిడేలు కచేరినీ 1929లో విజయనగరంలో చేశారు). కవితా సమితి సభ్యులుగాని, ఇతర భావకవులుగాని విజయనగరానికి వస్తే వాళ్ళు తప్పనిసరిగా శ్రీరంగం వారింట్లో నారాయణబాబు అతిథిగా ఉండేవారు. 1928లో కృష్ణశాస్త్రిగారు ముందు విశాఖపట్నానికి తర్వాత విజయనగరానికీ వచ్చారు. విశాఖపట్నంలో శ్రీరంగం శ్రీనివాసరావు శాస్త్రిగారి ఆరాధకుడై వారి వెంట విజయనగరం వెళ్ళాడు. (క్రొత్తగా కాపురానికి వచ్చిన భార్యను సైతం మర్చిపోయి శ్రీనివాసరావు ఇలా వెళ్ళాడు). కృష్ణశాస్త్రిగారు విజయనగరంలో నారాయణబాబు ఇంట్లోనే వారం పదిరోజులు ఉన్నారు. రోజూ కవితాగానాలే. సాహిత్య చర్చలే. అప్పటికి శాస్త్రిగారి ఊర్వశి - ప్రవాసం గ్రంథరూపంలో రాలేదు. అయితేనేం అందులోని పద్యాలన్నీ నారాయణబాబుకు కంఠతా వచ్చు.

నానివాసమ్ము తొలుత గంధర్వలోక
మధుర సుషమా సుధాగాన మంజునాటి
ఏనొక వియోగ గీతిక

అనే గీతాన్ని గొంతెత్తి (ఇల్లెగరకొడుతూ) నారాయణబాబు పాడుతుంటే వినేవాళ్ళకు 'కవిత్వం ఇడ్లీలను సంగీతం సాంబారులో ముంచి వెండిప్లేటులో సప్లయ్ చేసినట్టుండేది' అని శ్రీశ్రీ లాంటి వాళ్ళు భావించేవారు.[1] శ్రీశ్రీ నారాయణబాబుకు తమ్ముని వరుసవాడు. విశాఖ మండలంలో శ్రీరంగం వారు చాలా సంపన్న గృహస్థులు. శ్రీరంగం సూర్యనారాయణగారికి పిల్లలులేరు. అందుచేత సమీప బంధువుల్లో ఒకరైన పూడిపెద్ది వెంకటరమణయ్య అనే కుర్రవాడిని పెంచుకున్నారు. ఈ వెంకట రమణయ్య కుమారుడే శ్రీరంగం శ్రీనివాసరావు, సూర్యనారాయణగారు విశాఖపట్నంలో ఉండేవారు. వీరి తమ్ముడొకాయన విజయనగరంలో కాపురం ఉండేవాడు. మంచి ఆస్తిపరుడు. ఈయనకు సుందర నారాయణ అనే ఔరసపుత్రుడు ఉన్నాడు. సంగీత సాహిత్యాలలో

1. శ్రీశ్రీ - అనంతం - పుట. 84

అభిరుచిగలవాడు. సుందర నారాయణగారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు అప్పుడు పంతులు. రెండోవాడు నారాయణబాబు. శ్రీశ్రీ తరచు విజయనగరం వెళుతూ ఉండేవాడు. నారాయణబాబుని చిన్నన్నయ్య అని పిలిచేవాడు.

విజయనగరంలో నారాయణబాబు టుంగుటుయ్యాలలో ఊగుతూ

'లోకాలు నాకేలనే
కోకిలా
బాలకృష్ణుడు చాలునే'

అంటూ తురగా వెంకట్రామయ్య గేయాన్ని రాగయుక్తంగా పాడుతుంటే అదే కవిత్వానికి పరమావధి అని శ్రీశ్రీకి అనిపించేది.[2] నారాయణబాబుకు ఆనాటి యువకవుల పద్యాలన్నీ కంఠతా వచ్చు. వాటిని భావయుక్తంగా అర్థానికి తగిన రాగాలతో ఎలుగెత్తి పాడేవారు. అతడు ఒక పక్క సాహిత్యంలోనూ మరొక పక్క సంగీతంలోనూ పెరిగాడు. ఫిడేలు నాయుడుగారని ప్రఖ్యాతులైన ద్వారం వెంకటస్వామిగారి సాధకమంతా నారాయణ బాబుకి ప్రత్యక్షానుభవం.

ద్వారం వెంకటస్వామిగారు విశాఖపట్నంలో తమ మొట్టమొదటి కచేరి చేశారు. అప్పుడు మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు సభలో ఉన్నారు. కచేరీ అయిపోగానే వయులీన్ విద్వాంసుడైన ఆ యువకుని ప్రశంసిస్తూ 'ఫిడేలు నాయుడు' అని పేరుపెట్టి ఒక బంగారు ఉంగరాన్ని అతని చేతికి తొడిగారు. నాటి నుంచీ ఆ పేరూ, ఆ ఉంగరం వెంకటస్వామిగారు నిరంతరం ధరించేవారు. ఈ మొదటి సభలోనే విజయనగరం నుండి వచ్చిన శ్రీరంగం సుందర నారాయణగారు కూడా ఉన్నారు. కచేరి అయిపోయాక ఆ కుర్రవాడిని మెచ్చుకొని ఎప్పుడైనా విజయనగరం వస్తే మా ఇంటికిరా అని ఆహ్వానించారు.

వెంకటస్వామిగారు 1929లో విజయనగరం వెళ్ళారు. అప్పటికి అక్కడ సంగీత కళాశాల లేదు. అటువంటి దాన్ని స్థాపించబోతున్నట్టు పత్రికలలో ప్రకటించారు. పెట్టబోయే కళాశాలలో మొట్టమొదటే చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని వెంకటస్వామిగారు కొంచెం ముందుగానే విజయనగరం వెళ్ళారు. లోగడ తాము విశాఖపట్నంలో కచేరీ చేసినప్పుడు సంతోషించి విజయనగరం వచ్చినపుడు తమ ఇంటికి రమ్మని ఆహ్వానించిన శ్రీరంగం సుందరనారాయణగారిని కలుసుకున్నారు. అక్కడే మకాం వేశారు. సంగీత కళాశాల స్థాపనోత్సవానికి రెండు మూడు రోజులు ముందుగానే వచ్చిన ప్రముఖులందరి సమక్షంలో సుందరనారాయణగారి ఇంట్లో నాయుడుగారు కచేరీ చేశారు. 'భేష్' అనిపించుకొన్నారు.

స్థాపనోత్సవం నాడు తలవని తలంపుగా సంగీత కళాశాలలోకూడా కచేరీ చేసి తమ కళను ప్రదర్శించి తద్వారా మహారాజా వారి దృష్టిలోపడి మరి రెండు మూడు కచేరీలు కోటలో చేసిన నాయుడుగారికి సంగీత కళాశాలలో చేరే అవకాశం లభించింది. అయితే

2. అనంతం - పుట. 132

వారు విద్యార్థిగా చేరుదామనుకొంటే ఉపాధ్యాయునిగా చేర్చుకొన్నారు. చేరినది లగాయతు పదిహేను సంవత్సరాలు 'ప్రొఫెసర్ ఆఫ్ వయొలిన్'గా పనిచేసి ఆ కళాశాలకే ప్రిన్సిపాల్‌గా నియమితులై ఆ హోదాలో ఇంకో పద్దెనిమిది సంవత్సరాలు ఉద్యోగం చేశారు. ఈ ఉద్యోగప్రాప్తి తమకు ఆదిలో శ్రీరంగం సుందరనారాయణగారి చేతి చలువ వల్లనే సాధ్యమైందని నాయుడుగారు జీవితాంతందాకా జ్ఞాపకం పెట్టుకొన్నారు. నాయుడుగారు విజయనగరం వచ్చినది మొదలు నారాయణబాబు తనకు తోచినప్పుడల్లా వారి సంగీత సన్నిధానవర్తి అయ్యాడు. ఎన్నో సంగీత రహస్యాలు తెలుసుకున్నాడు.

సంగీతంలో ఎంత అభిరుచి ఉన్నా నారాయణబాబుకు తొలి నుంచీ సాహిత్యమే మృష్టాన్నం. ఎప్పట్నించీ రచనలు ప్రారంభించారో వివరాలు తెలియవుగానీ అతని గేయాలు 1928 (అతని ఇరవై రెండో యేట) నుంచీ ప్రచురితం కావడం మొదలయ్యాయి. ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో 'వలపు చెలమలు' అనే కవిత నారాయణబాబు రాశాడు. ఫక్తు భావకవిత్వం చూడండి.

మనకు సహకారి యగుచు మన్మథుడు వెదకి
వాడి యలుగుల గాడి త్రవ్వంగ క్రొత్త
చెలమ లేర్పడి తేటలౌ జలములూరె
సలలితములైన ఈ తీపి వలపు చెలమ
లందు తేరిన యవ్వి శ్రీ చందనోప
మానురాగ సుధాగంధిలామల ప్ర
సన్న పావన తోయముల్ సకియ! యవియు
నింకిపోవును నీవు గ్రహింపకున్న'

ఇటువంటి కవితలు నారాయణబాబు చాలా చెప్పాడు. రాసినవన్నీ గొంతెత్తి పాడడం అతనికి సరదా. కాగితం మీద పెట్టడానికి మాత్రం బద్ధకించేవాడు. అతడు కవితా సమితిలో తొలి దగ్గర్నుంచీ సభ్యుడు. తోటి సభ్యులైన పూడిపెద్ది వెంకట రమణయ్య, కాళూరి వెంకట నరసింగరావు గార్లతో సహరచనలు చేసేవాడు. పూడిపెద్ది వెంకట రమణయ్యగారు (శ్రీశ్రీ తండ్రిగారు కాదు, ఇంకొకరు) కవి, కథకుడు. నారాయణ బాబుకు బంధువు. ఈయన 1921 నుండే తన రచనలు ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురిస్తూ వచ్చారు. ఈయనతో నారాయణబాబుచేసిన సహరచనల వివరాలు లభించవు. కాళూరి వెంకట నరసింగరావుగారితో కలసి చేసిన సహరచనల్లో ఒకటి 'మాదు కవిత' అనే శీర్షికతో 1933 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో అచ్చయిన పద్య రచన. ఇతరులతో కలసి సహరచనలు చేస్తున్నా నిజంగా తన ఒక్కడి పేరు మీదుగా కూడా నారాయణబాబు కవితలు రాసి ప్రకటించేవాడు. కవితా సమితి వార్షిక సంచిక వైశాఖి (1933)లో అచ్చుపడిన 'మిణుగురుపాట' అనే ఈ గేయం చూడండి.

కనుపొడుచుకొన తార కనబడని ఈ నిశల
ముసురుకొనుభావాల శిశిరంపు బరువుతో
విసరు విషవాయువుల కొసల నెగిరెడి బ్రదుకు

ఈ మిణుగురులపాట
ఏ యెడద కోసమో!
బ్రతుకు చెదరిని సాంధ్య బడబానల జ్వాల
వాడిపోయే యుడుల మ్రోడు మ్రాకుల రాత్రి
శ్రుతి నిచ్చు తామసీ స్రోతస్విని గళాన
ఈ మిణుగురుల పాట
ఏ యెడద కోసమో!
ముదురు టాసల జగతి నిదుర బరువుల క్రుంగె
కదలు చీకటి యెదల కాలు కదపదు కలయు,
కాలానిలపు నేల కలగి తొొట్రిలు తేట
ఈ మిణుగురుల పాట
ఏ యెడద కోసమో!
నరకలోకపుటిరుల నాటిన చిరుతోట
కరకు తారల కనుల నురల బెరికిన గోట
కరువులో నిలువెల్ల కాల్చు నాకలి బాట
ఈ మిణుగురులపాట
ఏ యెడద కోసమో!

నాలుగు చరణాల ఈగేయంలో మొదట కొంచెం భావకవిత్వపుపదజాలమున్నా ఆఖరి చరణంలో జీవనసంక్షోభం వాస్తవిక భీభత్సం కనపడతాయి. కరువులో నిలువెల్ల కాల్చు నాకలిబాట అన్న పాదం రాశాక నారాయణబాబు రచనా విధానమే మార్పు చెందసాగింది. నరకలోకపు టిరులు కాకపోయినా వాటికి వేలు విడిచిన బంధువులాంటి అంధకారం అతని జీవితంలో కమ్ముకొనసాగింది. చిన్నప్పటి భోగభాగ్యాలు దూరం కాజొొచ్చాయి. అతని తండ్రి సుందరనారాయణగారు తమకు రావలసిన ఆస్తికోసం వేసిన వారసత్వపు దావాలో ఓడిపోయారు. ఆ దిగులుతో ఆయన మంచం పట్టారు. బంకుల దిబ్బ దగ్గరున్న శ్రీరంగం వారిల్లు పరహస్తగతమైంది. (విశాఖపట్నంలో శ్రీరంగం శ్రీనివాసరావు తండ్రిగారు ఇల్లు కూడా ఇదేకలాంలో వేలం అమ్ముడైపోయింది.)

సంపద పోయినా నారాయణబాబుకు స్నేహసంపద అధికమైంది. అతని సాహిత్య జగత్తు సరిహద్దులు విస్తరించసాగాయి. విప్లవకవి నజ్రుల్ ఇస్లాం బెంగాలీ కవితలతోనూ, వినూత్నకవి హరీంద్రనాథ చటోపాధ్యాయ ఆంగ్ల కవితలలోనూ పరిచయం ఏర్పడింది. హరీంద్రనాథ్‌తోపాటు పర్యటన చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్న తెలుగు సాహితీపరుడు ముద్దుకృష్ణ ద్వారా ఆంధ్రసాహిత్యంలో ప్రవేశిస్తున్న కొన్ని నవీన ధోరణుల గురించి కూడా విన్నాడు. భావ కవిత్వం మీద ఏవగింపు కలిగి చేవ కవిత్వం చెప్పాలనే తహతహ హెచ్చింది. అన్నింటికన్నా మిన్నగా చాగంటి సోమయాజులుగారితో స్నేహం ప్రగాఢం అవుతున్న కొలదీ తాను రాజకీయంగా, సాహితీపరునిగా పయనించవలసిన పథం కళ్ళకు కట్టసాగింది.

చాగంటి సోమయాజులుగారు తమ పదహారోఏటనే సామ్యవాదపథం వల్ల ఆకర్షితులయ్యారు. ఆ సాహిత్యం చదవసాగారు. వారి స్నేహితులైన నారాయణబాబు కూడా ఆ దారి తొక్కాడు. ఇద్దరూ రాజకీయాలకు సుముఖులేకాని సాహిత్యం వారిని ఎక్కువ ఆకర్షించింది. సోమయాజులుగారు ఆంగ్లంలో వర్డ్స్‌వర్త్ పదజాలం లాంటి మాటలు వాడుతూ Iambic Tetra metreకు కొసను Ambic Trimetreను వాడి పద్యాలు రాసేవారు. ఈ ఇంగ్లీషు ఛందస్సులు పాతపడిపోయాయనీ ఆధునిక ఆంగ్ల కవులు కొత్తరకంగా కవితలు చెప్తున్నారనీ కొత్తగా లభిస్తున్న పత్రికలవల్లా, గ్రంథాలవల్లా తెలుసుకొన్నారు. సోమయాజులుగారూ, నారాయణబాబూ ఇంగ్లీషులోని ఇమేజిజమ్ అనే అధునాతన ధోరణివైపు ఆకర్షితులయ్యారు. ఆ కవితలు అధ్యయనం చేయసాగారు.

1912లో ఎజ్రాపౌండు ఇమేజిజాన్ని ప్రవేశపెట్టాడు. అతని బాటను 1914లో ఇతరులు అనుసరించారు. వివిధ కవుల నాలుగు సంకలనాలు 1917 నాటికి వెలువడ్డాయి. (ఇందులో జేమ్సు జాయిస్, డిహెచ్.లారెన్సు వంటివారు ఉన్నారు). కాల్పనిక వాద ధోరణులను తొలగించి సాధ్యమైనంత తక్కువ పదాలతో స్పష్టమైన స్వచ్ఛమైన పద చిత్రాలను నూతన సంవిధానంతో చిత్రించాలన్నది ఇమేజిజమ్ ధ్యేయం. భావ పరిణామం మీద కన్నా ఎక్కువగా పద్యరూపంపైననే ఇమేజిజమ్ ధ్యేయం. భావ పరిణామం మీద కన్నా ఎక్కువగా పద్యరూపంపైననే ఈ వాదం శ్రద్ధ వహించింది. నిత్య వ్యావహారిక భాషను వాడుతూ సందర్భానికి సరిగ్గా అతికే పదాన్నే వాడాలని వారి నిర్ణయం. ఆ పదానికి పర్యాయ పదాలు ఉన్నా సరే వాటి జోలికి వెళ్ళకుండా అసలు సిసలు పదానికి దరిదాపులో ఉండే వేరే అర్థాల పదాలను కాక సముచిత పదాన్నే వాడాలి. ఆలంకారికి పదజాలం, నాజూకు నగిషీలు కాక సముచిత పదాన్నే వాడాలి. కొత్తభావోద్వేగానికి తగిన కొత్త నడకలు సృష్టించుకోవాలి. రచనలలో వస్తువుకు సర్వవిధాలైన స్వాతంత్ర్యం ఉండాలి. శ్రావ్యతకోసం అనవసర పద బంధాలను, ప్రాసలను వాడకూడదు. భావచిత్రం ప్రస్ఫుటంగా ఉండడానికి తగినంత వరకే కల్పన ఉండాలి. కవిత్వం గట్టిగాను, స్పష్టంగాను ఉండాలిగాని సందిగ్ధంగాను, వెలిసిపోయినట్టూ ఉండకూడదు.

చాగంటి సోమయాజులుగారు ఉత్తరోత్తరా ఒక కథలో చెప్పిన మాటలు సరిగ్గా ఇమేజిజమ్ నిర్వచనానికి సరిపోతాయి. ''సూది బెజ్జంలోంచి విశ్వాన్ని చూడగలిగే సూక్ష్మ జ్ఞానేంద్రియంతో 'మానవలోకాన్నవలోకించి అనుభవాలనీ, ఆదర్శాలనీ, ఆత్మనీ, ప్రకృతినీ సమన్వయిస్తూ'' చేసే సృష్టి కావ్యమని పిలుచుకొంటుంది. నారాయణబాబు ఇటువంటి కావ్య సృష్టికే పూనుకొన్నారు. నూతన దృక్పథంతో అల్పాక్షరాలతో అనల్పార్థ కవితలు చిత్రించదలచుకొన్నాడు.

సామ్యవాదాన్ని విశ్వసించే వ్యక్తికి తప్పనిసరిగా శ్రామిక పక్షపాతం ఉండాలి. విప్లవాన్ని కాంక్షించాలి. అయితే విప్లవాన్ని ప్రారంభించేవారూ, సాగించేవారూ, విజయాలు సాధించేవారూ కార్మికులే. అటువంటి కార్యశూరులకు కవి బాసటగా ఉండాలి. ప్రోత్సాహగీతాలను పాడాలి. ఈ సత్యం నారాయణబాబుకు తెలుసు. అయితే ఆ

తొలిరోజుల్లో విప్లవం అన్నమాటను డైరక్టుగా వాడక దాన్ని ఒక ప్రతీకతో నాటి కావ్యకవులు సూచించేవారు. నారాయణబాబు విప్లవాన్ని విళయవేళల శివుడు చేసే ప్రళయతాండవంగా భావించాడు. ఆ నటరాజు పాదాల గజ్జెల మోతకు పాటలు కూర్చే కవిగా తాను పరివర్తన చెందాడు. శివుని మెడలోని కాలసర్పాన్ని చొక్కింపచేసే నాగస్వరం ఊదదలిచాడు. విప్లవానికి వెనుక పాటపాడే కవిగా ముందుకొచ్చాడు. (ఈ భావాలను కావాలి అనే ఖండికలో రచించాడు). తన కర్తవ్యాన్ని తనకు ఊహకు అతీతమైన శక్తి, చూపులకు అందని వ్యక్తి బోధించడం జరిగిందని అతడు చెప్పాడు. ఈ సందేశాన్ని అతడు ఏ రాత్రి విన్నాడో ఆ రాత్రిని కొన్ని పదచిత్రాలతో ముందు వర్ణించాడు. తక్కువ పదాలతో శ్మశానాల సమకాలిక భీభత్సాన్ని ఇలా చిత్రించాడు.

'రేయి ముసుగు
పుడమి కొసగి
దివసానసాన
కాష్ఠ జ్వాలల్లో
కాలం
సహగమనం
చేసింది

ఆరిన చితిలో
బూడిద వెన్నెల
జారిన ముక్కుపుడక
ఒకటే చుక్క
సమాధిలో
మృత శిశు పట్టుల
జలదాంతర శశి!

శ్యామల
శ్మశాన వాటుల
వ్రాలిన రాబందులె
శరన్మేఘములు'

ఇటువంటి భావ చిత్రాలను విరచించడంలో నారాయణబాబు తనదీ అనే ఒక కొత్తదారిని తొక్కాడు. అతని సమకాలికులు పద్యం నుండి గద్యానికి కవితలు పరివర్తన చేయడంలో వృత్తగంధి వచనాలను స్వీకరించినవారు ఒకరైతే మాత్రాఛందస్సును ఉపయోగించుకొన్నవారు ఇంకొకరు. నారాయణబాబు సంవిధానం లేనట్టు కనబడే సంవిధానాన్ని చేతపట్టి పరిపక్వత సాధించడానికి పూనుకొన్నాడు.

శ్రామికుల తర్వాత సమాజంలో అత్యధిక సంఖ్యలో ఉన్న బాధితులు ఆడవారే. స్త్రీజనోద్ధరణ కోసం వీరేశలింగంగారు మహోద్యమాలు నడిపినా, వారి దారిలో ఎందరు

పయనించినా సంఘంలో మార్పు రావలసినంత రావడంలేదు. స్త్రీలను అబలలుగా చిత్రించి బానిసలుగా అణగతొక్కిన సమాజాన్ని చూసి నారాయణబాబు ధర్మకోపం తెచ్చుకొన్నాడు. అగ్నిహోత్రుణ్ణి ఆవాహనచేసి వేడి నెత్తురులు వెలిగించమన్నాడు. స్త్రీలను అసహాయులను చేసి నృత్యం చేసే రాక్షసి సంఘపు కీలాలమ్మే తైలంగా, జీవనమే వృత్తిగా చేసి రుధిరజ్యోతిని వెలిగించమన్నాడు. విప్లవగీతిని వినిపించమన్నాడు. 1935 జనవరి మాసం 'జ్వాల' పత్రికలో ప్రచురితమైన 'జ్వలనా' అనే గీతంలో తొలిసారి రుధిర జ్యోతి అనే పదాన్ని నారాయణబాబు వాడాడు. అదే అతని గీతాల సంకలనానికి తగిన పేరని ఆ తొలిరోజులలోనే అతడు నిశ్చయించాడు. ఆ తరువాత అతడు ఏ పత్రికలో ఏ కవిత అచ్చువేసినా రుధిరజ్యోతి నుండి అనే వివరణను చిట్టచివర పొందుపరిచేవాడు.

'జ్వలనా' అనే ఖండికలో కవిత కొంచెం ప్రాథమిక దశలోనే ఉంది. కాని తర్వాత రచించిన 'దేశమాత' అనే కవిత పరిణతి చెందినది. ఇందులో కూడా స్త్రీ అసహాయ స్థితికి నారాయణబాబు స్పందించాడు. ప్రతి స్త్రీలోనూ అతడు దేశమాతను చూడగలడు. వందే మాతరం ఉద్యమం నాటి నుండి భారతీయులు దేశమాతను కీర్తిస్తున్నారు. సుజలాలతో, సుఫలాలతో సస్యశ్యామలంగా ఉండే మూర్తినే వారు ప్రస్తుతిస్తారు. వారి ఊహల్లో విపుల హిమాద్రులె వేణీభరముగా, గంగాయమునలె కంఠహారములుగా ఘనగోదావరి కటిసూత్రంగా కనులకు పండుగ చేసే అఖండవర భరత ఖండమాత కనపడుతుంది. భావకవులు కూడా దేశమాతను ఇలా కీర్తించారు.[3]

'జయ జయ సస్యామల సు
శ్యామచలచ్చేలాంచల!
జయ వసంత కుసుమలతా
చలిత లలిత చూర్ణ కుంతల!
జయ మదీయ హృదయాశయ
లాక్షారుణపదయుగళా!!
జయ జయ జయ ప్రియభారత
జనయిత్రీ దివ్యధాత్రి!
జయ జయ జయ శతసహస్ర
నరనారీ హృదయనేత్రి!!''

నారాయణబాబుకు దేశమాత ఇంకోవిధంగా గోచరించింది. 'కరువే రూపం దాల్చి కడుపే చెరువై ఏడ్చి' భిక్షాపాత్రికతో 'గుప్పెడు అన్నం, గ్రుక్కెడు నీళ్ళ స్వాతి వానకే ముత్యపు చిప్ప'లాగ ధనవంతుల ఇంటి ముందు నిలబడ్డ బిచ్చకత్తెలాగ దేశమాత సాక్షాత్కరించింది. 'ఆకలి! దాహం! అన్నం! అన్నం!' అంటూ అలమటించింది. అగ్నివీణయై ఆలాపించింది. అయితే వినిపించుకొనేవారులేరు.

''బలి ప్రముఖుల
పాతర మాభూమి

3. కృష్ణశాస్త్రిగారి గీతం ఇది.

అతిథి పూజలకు
మొదటి వారలము!
కర్ణుడు మావాడంటూ
గంతులు వేసే
దేశ నాయకులు
అన్నపూర్ణను
ఆరాధించే ముగుదల
జాలకములపై
తడిపిన వట్టివేళ్ళ
తట్టీలు, కట్టిన ఇండ్ల
ద్వార ముఖమ్ములు
బంధించారు
కన్నులు మూసి
నిద్రించారు''

''అంటీ అంటని ఆమె శరీరపు చాలీ చాలని చీరను తొంగిచూసే మానం ఉన్నాడా చిన్నికృష్ణుడు? అనసూయేదీ? అరుంధతేదని ప్రశ్నించింది'' 'ఆమె రెండు కన్నులు కాలిన బండి కమ్ములు' ఆమె గోడు ఎవరూ పట్టించుకోలేదు.

''దేశం అంటూ
దేవుళ్ళంటూ
కొలిచే కళ్ళకు
బానిసత్వమే
ప్రబలింది

ఉసురుసురైంది
ఉమ్మలించింది
అసువులు వీడి
చచ్చిన దేశమాతయై
చాపచుట్టగ
నేలకు వాలింది!

దేశమాతయై బిచ్చగత్తె కుప్పకూలిపోతే ఒక శ్వనాథుడు, ఒక చక్రీవంతము, ఒక ఋషిపక్షి మాత్రమే స్పందించాయి. అందరూ హీనంగా చూసే కుక్కనుశ్వనాథుడనీ, గాడిదను చక్రీవంతమనే తత్సమంతోనూ, గబ్బిలాన్ని ఋషిపక్షి అని చెప్పడంలో నారాయణబాబు మానవులకన్నా ఈ పశుపక్షులే ఉదాత్తమైనవని ధ్వనించాడు.

'భూపతి ఆజ్ఞను
భూమి పుట్టువు

చిచ్చున జొరబడ్డాది
శీలం కోసం
ఆనాడు!

ఆకలి దీర్చని
మానం గప్పని
దేశం కోసం
మట్టి ప్రమిదలో
వత్తైకాలిందీ
మానిని ఈనాడు!!'

దేశమాత తోడులేని నీడలేని ఆడదయినా, మానిని. నారాయణబాబు సర్వసామాన్యమైన ఒక బిచ్చగత్తెను దేశమాతగా భావించిన తర్వాతనే ఇతర కవులు మరికొంత ముందుకు వెళ్ళగలిగారు.

'జన్మభూమి జనని కాదు
సామాన్య సుమా ఆయమ
వసుమతియగునామె కొరకు
వల్లభు లెందరు పెనగిరి?

అని ఒక కవి అన్నారు.[4]

'ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా
దుండగులలో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విఫణిలోఅంగాంగం, తాకట్టు -
పెట్టిన అందంనీది -

సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఊసినా దుమ్మెత్తిపోసినా చలనంలేని మైకం నీది
కోత కొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న
ఎలుకల్నీ పంది కొక్కుల్నీ భరిస్తూ నుంచున్న భారతివమ్మా
నోటికందని సస్యశ్యామల సీమవమ్మా
వందేమాతరం వందేమాతరం

ఒంటిమీద గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది
అప్పు తెచ్చి లేపిన మిద్దెల్లో
కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది
ఎండిన స్థనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని

4. అబ్బూరి రామకృష్ణారావుగారు

ఓదార్చలేని శోకం నీది
ఆకలికి ఎండి మాడి ఎరువు సొమ్ములతో వీధినబడ్డ సింగారం నీది
అమ్మా భారతీ నీ గమ్యం ఏమిటి తల్లీ
వందేమాతరం వందేమాతరం'

అని ఇంకొక కవి అన్నాడు.[5] తరువాత కవులు సెంటిమెంటును చాలాదూరానికి తరిమేసి వాస్తవాన్ని చెప్పినా నారాయణబాబులాగ ఆర్ద్రత తొణికిసలాడే విషాద సత్యాన్ని చెప్పలేదు. నారాయణబాబు దేశమాత గేయం 1937 అక్టోబరు ప్రతిభలో అచ్చుపడినా అంతకుముందే దాని రచన 1936లో జరిగి ఉండవచ్చు.

1936 మన సాహిత్య చరిత్రలోనూ, సామ్యవాద ఉద్యమ చరిత్రలోనూ చాలా ముఖ్యమైన సంవత్సరం. ఆ యేడు నారాయణబాబు జీవితంలో కూడా మరిచిపోలేనిదే. 1936లోనే లక్నోలో ఏప్రిల్ నెలలో ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్ల సభలు మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతను జరిగాయి. దానికి ఒక ప్రతినిధిగా వెళ్ళివచ్చిన అబ్బూరి రామకృష్ణారావుగారు విశాఖపట్నంలో వర్ధమాన లేఖక సంఘాన్ని స్థాపించారు గానీ దాని కార్యకలాపాలు పుంజుకునే లోపల ఆయన రాయిస్టుగా మారి రచయితల సంఘాన్ని పట్టించుకోవడం మానేశారు. 1936లోనే సెప్టెంబరు నెలలో రాజమండ్రిలో ఆంధ్రరాష్ట్ర సోషలిస్టు పార్టీ ద్వితీయ మహాసభలు జరిగాయి. వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు అందులో పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా నుండి వెళ్ళిన ముగ్గురు ప్రతినిధులలో శ్రీరంగం నారాయణబాబు ప్రథముడు. దర్శి చెంచయ్యగారూ, ఆయన భార్య సుభద్రమ్మగారు తక్కిన ఇద్దరు ప్రతినిధులు.[6] ఆరోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రచ్ఛన్నంగా ఉంటూ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ అనే బహిరంగ నామంతో పనిచేస్తూ ఉండేది. (1935లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ స్థాపన జరిగింది). నారాయణబాబు ఇందులో సభ్యునిగా చేరి క్రియాశీలక రాజకీయాలలో పాల్గొనేవాడు.

రాజమండ్రి సభలో నారాయణబాబు తోటి సోషలిస్టులను కలుసుకొని ఎన్నో విషయాలు చర్చించాడు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ రామలింగయ్యతో మాట్లాడి నాటి రాజకీయాలు–అభిప్రాయాలూ తెలుసుకొన్నాడు. ఆనాటి యువకులందరిలో ఒకే రకమైన అభిప్రాయాలు కాంగ్రెసు పట్లా భగత్‌సింగ్ పట్లా ఉండేవి. భగత్సింగ్, సుఖదేవ్, రాజగురులకు విధించిన ఉరిశిక్ష రద్దును ప్రథమ షరతుగా 1931లో గాంధీ–ఇర్విన్ సంప్రదింపులలో పెట్టనందుకు నాటి యువకులు గాంధీ మితవాదాన్ని ఈసడించసాగారు. భగత్‌సింగ్ ప్రాణాలను గాంధీజీ కాపాడలేకపోయినందుకు కాంగ్రెసువారే అతడి మరణానికి కారకులనే భావం ఉడుకునెత్తురు పొంగే యువకుల్ని బాధించసాగింది. నారాయణబాబు భగత్‌సింగ్‌పై ఒక కవితను రాశాడు. ఆ విప్లవవీరుణ్ణి ఉరితీసిన రాత్రి చీకటి వర్ణనతో ప్రారంభించి ఆ అమరవీరుని మరణానికి కారణాన్ని చెప్పాడు.

5. చెరబండరాజు
6. కంభంపాటి సత్యనారాయణ – ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర – మొదటి భాగం – పుట.157

'చీకటి
కదన కుతూహల రాగం
చిందులు ద్రొక్కి
చుక్కల చూపుల కూడ
సురిగిన
మొండిరాత్రి అది
క్రతువంటూ
పశువంటూ
నిను బలి యిచ్చిన
ఋషులంతా పటాపంచలైనారు
నీ గళమ్మున
నిరాకరణ సూత్రం
వైచి
నిలువునా ఉరితీశారా
నా తండ్రీ!'

పై విలాపంలో కాంగ్రెసు వారి సహాయ నిరాకరణ ఉద్యమమే భగత్‌సింగ్ మెడలో ఉరితాడయిందని నారాయణబాబు స్పష్టం చేశాడు. భగత్‌సింగ్‌ను తలుచుకొంటే గుండెల్లో కుతకుత ఉడికే లావా ప్రవహిస్తుంది. ఆ అనన్య సామాన్య విప్లవవీరుని జీవితాన్ని నారాయణబాబు చాలాసార్లు పఠించాడు. ఆ జీవిత వివరాలన్నీ అతనికి కరతలామలకం. దీనిని ఒక ఖండకావ్యంగా రచిద్దామనుకొన్నాడు.

భగత్‌సింగ్ కోరుకున్నది సామ్యవాద విప్లవం. భారతదేశంలో సోషలిస్టు రాజ్యాల రిపబ్లిక్‌ను నిర్మించడమే అతని ధ్యేయం. అతడు అగ్రగామిగా ఉంటూ నడిపించిన విప్లవ సంస్థ పేరు హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్. అంతకుముందు అతడు 'నవజీవన్‌భారత్ సభ' అనే ఒక సంస్థను స్థాపించినా భారతదేశ వ్యాప్తంగా ఉన్న సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే అతని సాహసచర్యలన్నీ జరిగాయి. ఇతర ప్రముఖ విప్లవకారులను సంప్రదించే అన్నీ చేశాడు.

సైమన్ కమిషన్ 1928 అక్టోబరు 30వ తేదీనాడు లాహోర్‌కు వచ్చింది. లాలాలజపతిరాయ్ నాయకత్వంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. పోలీసులు అమానుషంగా లాఠీఛార్జి చేశారు. లాలాజీని చావబాదారు. కొన్నిరోజులలో లాలాజీ అస్తమించాడు. విప్లవకారులు ఈ పచ్చిహత్యకు ప్రతీకారం చేయదలిచారు. లాహోరులో అప్పుడు శాండర్స్ దొర పోలీసు శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా ఉంటున్నాడు. సర్దార్ భగత్‌సింగ్ శాండర్స్‌ను చంపి శపథం చెల్లించుకొన్నాడు. పోలీసులకు దొరక్కుండా తప్పించుకొన్నాడు.

శాండర్స్ హత్య పోలీసులను మరింత పాషాణ హృదయులను చేసింది. ప్రజలపై నిర్దాక్షిణ్యంగా జులుమును ప్రయోగించారు. లాహోరు ప్రజలు పడ్డ కష్టాలు ఇన్ని అన్ని

కావు. ప్రజలకు విప్లవకారులపై సానుభూతి తగ్గడం మొదలైంది. విప్లవకారులకేం? తెల్లవాళ్ళని చంపి తప్పించుకుంటారు. నిష్కారణంగా బాధలకు లోనవవలసింది మనం అని ప్రజలు చెప్పుకోవడం భగత్‌సింగ్ ప్రభృతులు విన్నారు. ఒక సాహసచర్య దేశాన్ని అట్టుడికించింది. పోలీసులకు దొరికిపోవాలని ఒక పథకం వేశారు. పేలినా గట్టిచప్పుడేగానీ ఆట్టే ప్రమాదకరంకాని బాంబులు రెండు తయారుచేశారు.

1929 ఏప్రిల్ ఎనిమిదో తారీఖునాడు భగత్‌సింగూ, అతని కామ్రేడ్ బతూకేశ్వర్ దత్తూ ఢిల్లీలోని అసెంబ్లీలోనికి ప్రవేశించారు. పై నుంచి శాసనసభలోనికి భగత్‌సింగ్ ఒక బాంబును విసిరాడు. వెనువెంటనే దత్తూ తన దగ్గరున్న బాంబును విసిరాడు. పెద్ద పేలుడు అట్టహాసంగా జరిగిందిగానీ ఎవ్వరూ మరణించలేదు. అయిదుగురు వ్యక్తులు కొద్దిగా గాయపడ్డారు. ఒకే ఒక వ్యక్తికి బలమైన గాయాలు తగిలాయి.

తమ ప్లాను ప్రకారం భగత్‌సింగూ, దత్తూ పోలీసులకు తమంత తాముగా వశులయ్యారు. పోలీసులు కేసు పెట్టారు. కోర్టులో విచారణ మొదలైంది. భగత్‌సింగూ, దత్తూ కోర్టులో బహిరంగ ప్రకటన చేశారు. శ్రామికులకు జరుగుతున్న నిరంతర హింసవల్ల ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా ఈ చర్యను తాము చేసినట్టు అందులో చెప్పారు. (1929 జూన్ 6)

అసెంబ్లీ బాంబు కేసు తర్వాత పోలీసులు పంజాబ్‌లో విప్లవకారులను వేటాడసాగారు. బాంబుల ఫ్యాక్టరీలు స్వాధీనం చేసుకొన్నారు. వాటిలో ఏడువేల బాంబుల తయారీకి తగినంత మందుగుండు సామగ్రి వుంది. చాలామంది విప్లవకారులను పట్టుకుని లాహోరు కుట్ర కేసును బనాయించారు. ఇందులో భగత్‌సింగ్ మొదటి ముద్దాయి.

లాహోర్ జైలులో ఒక స్పెషల్ ట్రిబ్యూనల్ ఈ కేసును చేపట్టింది. ఈ కేసు విచారణ దేశంలో చాలా ప్రాముఖ్యం చెందింది. మన దేశ చరిత్రలో ఇది ఒక ప్రముఖఘట్టం. 1930 అక్టోబరు 7వ తేదీనాడు ఈ కేసులో తీర్పు చెప్పారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు మరణదండన విధించారు. ఇతరులకు జీవితశిక్షలు వేశారు.

లాహోర్ కుట్ర కేసులోని తీర్పు దేశాన్ని కల్లోలపరిచింది. విప్లవవీరులను కాపాడుకొందుకి వివిధ ప్రాంతాలలోని ప్రజలు మీటింగులు నడిపారు. మహాజర్లు పెట్టుకొన్నారు. చివరకు గాంధీజీ కూడా వైస్రాయికి ఒక సందేశం పంపాడు. విప్లవకారులకు ప్రాణభిక్ష పెట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం నిరాకరించింది. రాత్రికి రాత్రే భగత్‌సింగ్ శవాన్ని రహస్యంగా రవాణా చేసి బంధువులకు నదికి అద్దరిని అప్పచెప్పారు.

భగత్‌సింగ్ బతికింది కొద్దికాలమే అయినా చరిత్రలో చిరకాలం జీవిస్తాడు. తన జీవితకాలంలోనూ, మరణానంతరం ఎందరినో ఉత్తేజితులను చేశాడు.

ఈ వాస్తవిక జీవితగాథను యథాతథంగా ఒక బుర్రకథ రూపంలో కథనం చేయడం ఒక పద్ధతి. లేదా నూతన పౌరాణిక ధోరణిలో చెప్పడం ఇంకొక పద్ధతి. మొదటిది

ప్రజాకవుల మార్గం. రెండోది కావ్యకవుల ధోరణి. నారాయణబాబు సామ్యవాదేగాని, అతడు అప్పుడప్పుడే భావకవిత్వం పై తిరుగుబాటు చేసి చేవకవిత్వం చెపుతున్న యువకుడు. కావ్య కవుల పద్ధతులు బాగా వొంటపట్టినవాడు. అందుకు భగత్‌సింగ్ జీవితాన్ని కొత్తరకం పురాణంగా ఊహించాడు. ఆ వీరుడు కారణజన్ముడు. ఆ జన్మకు కారణమొకటి నారాయణబాబు ఉటంకించాడు. చాలా విపులంగా ఇలా చెప్పాడు.

శంకరుడు నిత్యకల్పసమాధిలో ఉన్నాడు. ఓంకారం హూంకరించింది. చరాచరాలు చలించాయి. భూతాలుద్రేకించాయి.

కాటుక పెట్టిన
నయనేంద్రియమై
కర్మసాక్షియే
చీకటు లురిలాడు

అనంతకోటి జీవరాశులు హాహాకారం చేశాయి. శంకరుడు తన తపస్సును చాలించాడు. 'ఆకలి, ఆకలి' అంటూ భిక్షాపాత్ర కోసం చేయి చాచాడు. ఆ ఉగ్రతపస్సులో బ్రహ్మకపాలం కాలిపోయింది. శివుడికి కొత్త భిక్షాపాత్రగా చాలా గొప్పకపాలం కావాలి. ఎవరి కపాలానికి ఆ అనన్య సామాన్యమైన అర్హత వుంది? భూలోకమ్మున, తురకల గోరీలందున, క్రైస్తవుల సమాధులందున, హిందువుల శ్మశాన వాటికల కపాలములు వికవిక నవ్వాయి. శివుని చేతిలో భిక్షాపాత్రగా వుండడానికి ఒక అపురూప వ్యక్తి అవతరిస్తున్నాడు.

శ్వేత పర్వతపు
శిఖరాంచలముల
కనకభాండమే
కదిలింది.

అగ్నిదేవుడు ఒకసారి ఋషి పత్నులను చూసి మోహించాడు. ఈ సంగతి తెలుసుకొని అతని భార్య స్వాహాదేవి ఆ మునిపత్నుల వేషాలు వేసుకొని వచ్చి అగ్నితో క్రీడించింది. అతని వీర్యాన్ని ప్రతిసారి తీసుకొనిపోయి మంచుకొండ శిఖరం మీద ఒక కనకభాండంలో ప్రక్షిప్తం చేసింది. ఇప్పుడా కనకభాండం కదిలిందట.

స్వాహావల్లభు
సువర్ణ గర్భం
పళువరించినది
కళవళించినది
గంగపక్షమే
పాల పోటుతో
కళవళపడ్డాది.

ఒకసారి శివుడూ పార్వతీ రతిక్రీడలో ఉండగా, దాని భంగం చేయడానికి దేవతల ప్రోద్బలం వల్ల అగ్ని ఎదుటకు వచ్చాడు. పార్వతి సిగ్గుపడి దూరంగా వెళ్ళింది. శివుని వీర్యం

ఆమె శాపంవల్ల అగ్ని ధరించవలసి వచ్చింది. దానిని అతడు భరించలేక గంగ కడుపులో విడిచిపెట్టాడు. ఇప్పుడా వీర్యం మానవ రూపం ధరించడానికి సిద్ధంగా ఉంది. ఈ సంగతిని పై పంక్తులు చెప్తాయి.

సింధు గర్భమున
గంగ కడుపులో
లవణ సాగరపు లోతుల్లో
దాగిన నేత్రాగ్ని
మానవరూపం దాల్చింది
మన్నే వెలిగించింది
మిన్నే పొగచూరింది!

ఒకసారి ఇంద్రుడు శివుణ్ణి ఎదిరించాడు. ఫాలాక్షుడు తన మూడో కన్ను తెరిచాడు. ఆ నేత్రాగ్ని ఇంద్రుణ్ణి భస్మం చేసింది. (తర్వాత ఇంద్రుణ్ణి బతికించాడనుకోండి) ఇంద్రుణ్ణి కాల్చి మిగిలిపోయిన నేత్రాగ్నిని మూడుభాగాలు చేసి సింధు గర్భంలో, గంగ కడుపులో, లవణ సాగరపులోతుల్లో దాచాడు. ఇప్పుడా నేత్రానలం మానవరూపం దాల్చింది. ఆ మానవుడే సర్దార్ భగత్‌సింగ్.

నారాయణబాబు తీసుకొన్న పౌరాణిక ఘట్టాలన్నీ అగ్ని వీర్యానికి, శివుని వీర్యానికి, అతని నేత్రాగ్నికి సంబంధించినవి. భగత్‌సింగ్ నిప్పులాంటి మనిషి. కనుక ఈ సంఘటనలనే తీసుకొని కవి కొత్త పౌరాణిక వీరుణ్ణి అవతరింపచేశాడు.

మంటల్లోనే పుట్టాడు!
మంటల్లోనే పెరిగాడు!!
మంటల్లోనే మడిశాడు!!

భారతవీరుని కపాలమొక్కటి కపర్ది చేతిని రివ్వున వాలింది. కెవ్వున కేకేశాడు కంఠేకాలుడు. అండపిండ బ్రహ్మాండమంతా తాండవ నృత్యం చేసింది. శేషుని ఫణాల మెత్తని శయ్యపుడమి ఒత్తిగిలింది. ఎడారి పుష్పించింది.

ఎందరు పుట్టలేదు
ఇంకెందరు గిట్టలేదు
అందరికీ లభయిస్తుందా
హాలాహల మంటిన
హస్త స్పర్శ!
పెదవుల చుంబనం!
కపాలమోక్షం!
కపాల మోక్షం!

ఎందరు భగత్‌సింగ్‌పై పద్యాలు రాయలేదు? అందరూ ఇటువంటి 'ఎపిక్' కల్పన చేశారా? ఈ ఘనత నారాయణబాబుకే దక్కింది.

'కపాలమోక్షం' కవిత 1928లో నవ్య సాహిత్య పరిషత్తు వారి పత్రిక ప్రతిభలో ప్రచురితమైంది. కవితా సమితి, సాహితి సమితి మొదలైన సంఘాలన్నీ రమారమీ నవ్య సాహితి సమితి పరిషత్తులో విలీనం అయిపోవడం వల్ల ఆనాటి యువ కవులందరికీ ఒకటే వేదికగా ఉన్న పరిషత్తులో నారాయణబాబుకూడా సాధారణ సభ్యుడయ్యాడు. కార్యవర్గంలోగానీ, స్థాయీ సంఘంలోగాని అతనికి ఏ హోదాలూ లేవు. అతడు వాటిని ఆశించలేదు. అతనికి కావలసింది సాహిత్యాభివృద్ధి. ఆధునిక ధోరణులన్నింటినీ అవగాహన చేసుకొనడం. ముఖ్యంగా బ్రిటన్‌లో వామపక్షకవుల రచనలు అధ్యయనం చేయాలని అతడు పూనుకొన్నాడు.

బెనారస్‌లో ఎం.ఏ. పట్టం పుచ్చుకొన్న రోజుంకి అప్పలస్వామిగారు ఉద్యోగం నిమిత్తం 1938లో విజయనగరం చేరుకున్నాడు. చాగంటివారి ఇంట్లోనే మేడమీద ఏవిధమైన అద్దె చెల్లించకుండా ఆయన సోమయాజులుగారి ఆహ్వానంపై బస చేశారు. రెండేళ్ల అక్కడే ఉన్నారు. అప్పలస్వామి గారూ సోమయాజులుగారూ, నారాయణబాబు రోజూ అక్కడే కలుసుకొనేవారు. ఆంగ్ల గీతాలు పాడేవారు. చర్చించేవారు. వాగ్యుద్ధాలలోనికి దిగేవారు. ఒకరినొకరు కసురుకొనేటట్టు మాట్లాడుకొనేవారు. యావదాంధ్ర దేశాన్ని ముంచెత్తుతున్న విప్లవాత్మక సాహిత్యం విశ్లేషణ చేసేవారు. అప్పుడప్పుడు విశాఖపట్నం నుంచి శ్రీశ్రీ వచ్చి ఈ ముగ్గురితో కలిసేవాడు. తాను రాసిన కొత్త కవితలు పట్టుకొచ్చి వినిపించేవాడు. నారాయణబాబు, సోమయాజులుగారు రాస్తున్న కొత్త తెలుగు పద్యాలు వినేవాడు. (తొలిరోజుల్లో చాగంటి సోమయాజులుగారు నూతన ధోరణిలో తెలుగు కవితలు రాసేవారు.) అప్పలస్వామిగారు ఆంగ్లంలోనేకాక ఫ్రెంచిభాషలో కూడా నిష్ణాతులు. ఆ సాహిత్యంలో మంచి పద్యాలను బిగ్గరగా పాడేవారు. శ్రీశ్రీ, నారాయణబాబు ఆ కవితలపై అభిరుచులు మూలం వినే పెంచుకొన్నారు. చాగంటి వారి హవేలీలో గోడలకు సైతం మహాప్రస్థానం, రుధిరజ్యోతి గీతాలు కంఠతా వచ్చేవి. తమ ఇంట్లో అప్పలస్వామిగారూ నారాయణబాబు పాడే పద్యాల గురించి సోమయాజులుగారు ఒక చిన్నకథలో ఇలా వర్ణించారు.[7]

''ఫ్రెంచి పండితుడు అప్పలస్వామినాయుడు వొచ్చి రసగుల్లాలాంటి 'రోన్సార్' కవి గేయంలో చరణం అందుకుంటాడు.

"Quand je vois dans un jardian
Au main
S' eclore une fleur nouvelle
Je compare le bouton
Au teton
De son beau sein qui poumelle'

''దాంతో వెర్రెత్తిపోతాడు గాయకుడు నారాయణబాబు. పరాసు పద్యం పరారీ అయిలాగ పాడతాడు ఇంగ్లీషు పాట నవ్యసాహిత్య పిపాసి నారాయణబాబు.

7. చాసో కథలు (2వ కూర్పు) - పుటలు.171-2

"Qh hushthee my baby
thy cradle's in pawn
No blankets to cover thee
cold and forlom

The stars in the bright sky
Look down and are glum
At the heir o' the ages
Asleep in a slum;

"రోజ్సార్ని వొదిలి అప్పుడు ఆంగ్లకవి అప్పలస్వామి నారాయణబాబు గొంతుకతో కలుపుతాడు. యీనాటి 'నర్సరీరైమ్' (Nursery rhyme) గదులచేత కూడా అరిపిస్తూ

"Thy mother is crying
Thy dad's on the dole
Two shillings a week is
The price of a soul'

ఈ ఆంగ్ల కవిత సిసిల్-డే-లూయిస్ అనే కవిది. ఆనాడు బ్రిటన్లో ముగ్గురు వామపక్ష కవులు ప్రసిద్ధులుగా ఉండేవారు. ఒకరు డబ్లు.హెచ్.ఆడెన్, రెండోవారు స్టీఫెన్ స్పెండర్, మూడో సిద్ధహస్తుడు సిసిల్-డే-లూయిస్. ఈ ఆధునిక ఆంగ్ల కవుల రచనలు సాధ్యమైనన్ని నారాయణబాబు అధ్యయనం చేశాడు. తన వామపక్ష దృక్పథాన్ని విశాలం చేసుకొని జాతీయాన్ని రంగరిస్తూ నుడికారపు సొగసులతో కవితలు రాయసాగాడు. అటువంటి రచనలలో ఒకటి 'గడ్డిపరక' అనే ఖండిక.

ధనిక వర్గాలను పేదలను ఎప్పుడూ అణచిపెట్టే ఉంచుతారు. వాళ్ళ దృష్టిలో కిందివర్గం వాళ్ళు తృణప్రాయులు. తమ శక్తి తమకు తెలియని పేదలు. ఇది మన కర్మ అనుకొని అణగి మణగి పడి ఉంటారు. ఎక్కువ వర్గాల వారు తమని అణచేస్తూ ఉంటే సహిస్తారు. అయితే తమ శక్తిని తాము తెలుసుకొన్ననాడు దళితులు ధనికుల దౌర్జన్యాలకు తగినశాస్తి చేస్తారు. ఈ వర్గపోరాటాన్నే దృష్టిలో పెట్టుకొని తరతరాలుగా ఓర్చుకొన్న వర్గం విప్లవాన్ని నేర్చుకొన్నాక ఏం జరుగుతుందో సూచనప్రాయంగా నారాయణబాబు ఈ 'గడ్డిపరక' అనే ఖండికలో రచించాడు.

నడవండి!
నడవండి!
నా మీంచి నడవండి
గడ్డి పరకను!
గడ్డి పరకను!
పూజాసమయాల

పూవును
దూర్వాంకురాన్ని
అవసరం తీరాక
అవతల కనపడితె
చుల్కానగ చూసేటి
గడ్డిపరకను!
గడ్డిపరకను!
నడవండి,
నడవండి!
నా మీంచి నడవండి!!

ధనిక వర్గాల భోగభాగ్యాలకూ, సౌఖ్యమయ జీవితానికీ అడుగడుగునా పీడిత వర్గాలే ఎలాగ అదను కొచ్చేదీ నారాయణబాబు ముక్తసరిగా చెప్పాడు.

పల్లకీ
దిగినట్టి
పెళ్ళికొడుకులు మీరు
పట్టుతివాసీని నేను
నడవండి
నడవండి
నామీంచి నడవండి

ఎంత అణగి మణగి ఉన్నా పై నుంచి ఉక్కుపాదాలు తొక్కుతూ ఉంటే గుండెల్లో బాధగానే ఉంటుంది. అయితే అవి ఉక్కుపాదాలని నోరువిడిచి చెప్పలేరు. బాధను అణచుకోనూలేవు. అందుకే పీడితులు ఇలా భావిస్తారు.

మీ పైడి పాదాల
మృదురజో లేశాలె
నాహృత్ కుశేయములో
ఉల్కాలాపాతాలు
నడవండి!
నడవండి!
నా మీంచి నడవండి!
గడ్డిపరకను,
గడ్డిపరకను!

ఎంతటి అణగారిన ఆర్తులయినా వారికి గతమెంతో ఘనకీర్తి ఉండకపోదు. వారి బంధువులు ఏవేవో మహత్కార్యాలు చేసే ఉంటారు. దాస్యంలో ఉన్నప్పుడు పూర్వ వైభవం తలచుకొనడం సహజం. మన రాష్ట్రోద్యమంలో పూర్వ పౌరుషాన్నీ, ప్రశస్తినీ

తలచుకొనడం ఎలాగ జరిగిందో అలాగే పీడితులు కూడా తమ పురాగాథలను తలచుకొంటారు.

మాతృవర్గంవాడు
మా అన్న
పన్న గమ్ముల
రసనలుత్తరించిన
మిన్న!

గరుత్మంతుడు అమృతం తెచ్చినపుడు ఆ భాండాగారాన్ని దర్భల మీద పెట్టాడు. సర్పాలకుభాండం దక్కలేదు. అందులోని అమృతపు బొట్లు దర్భల మీద పడ్డాయని వాటిని నాకబోయే ఆ దర్భలు వాటి నాలుకలను చీలికలు చేశాయి. దర్భలు గడ్డిపరకల జాతిలోనివే. ఈ పురాగాథను తలచుకొని కొంత ఆత్మస్థైర్యాన్ని పొందుతారు పీడితులు. ధనికులకు ఉత్తమగతులు కల్పించే పవిత్రమైన చిహ్నం కూడా దర్భలే. ఈ యథార్థాన్ని తలచుకొన్నాక విప్లవ సందేశం వినపడుతుంది.

మిన్ను విప్పిన
రక్తపతాకం
మన్ను సత్తువె
తెలిసింది!
ప్రాభాత పశ్చిమా నిలము
కాకాసురుని కథ
జ్ఞాపకం తెచ్చింది
నన్నునే తెలుసుకున్నాను!
ఆగండి!
ఆగండి!!

పడమటి గాలి ప్రబోధం చేసింది. సమర్థుని చేతిలో ఉన్న గడ్డిపరకే బ్రహ్మాస్త్రంకన్నా శక్తివంతమైన ఆయుధం కాగలదని కాకాసురుని కథ గుర్తుచేసింది. ఎర్రజెండా ప్రజాశక్తిని ప్రవచనం చేసింది. పీడితులు తిరగబడి ధనవంతులను 'ఆగండి' అని హెచ్చరిస్తున్నారు.

నూటికి నూరుపాళ్ళు సామ్యవాద దృక్పథంతో స్వీకరించిన వస్తువు ఆసాంతం సంప్రదాయబద్ధమైన ప్రతీకలతో చెప్పడం వల్ల ఈ కవితలకు కావ్యత్వం సిద్ధించింది. ఇది 1939లో నవశక్తి పత్రికలో అచ్చుపడింది. ఈ పత్రిక ఆనాటి వామపక్షవాణి. (1937 డిసెంబరు మాసంలో నవశక్తి రాజమండ్రిలో స్థాపించడం జరిగింది). సామ్యవాదంపై తనకున్న మక్కువను నారాయణబాబు తన కవితలలో తరచు వెల్లడించేవాడు. మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడ్డప్పుడు నిశలాంటి పరిపాలనలో రాజ్యం చేస్తున్న వారిని ఉద్దేశించి ఇలా అన్నాడు.

నిశయంటే
అసుర బలం

నీ వెట్టుల
రాజైతివి
మన్ననలందే
మంత్రివి
అంతే!

సెలవిమ్మా
కలదేమో
స్వజాతీయ
సభావేది
ధారుణికి
ముక్తి
సామ్యవాద సంస్క
రణ శక్తి!

1938లో రచించిన ఈ గీతాన్ని తర్వాత ఎప్పుడో పత్రికలో ప్రకటించాడు గాని నారాయణబాబు తన కవితలను సభలలోనూ. మిత్రుల ముందూ గానం చేసేవాడు. విజయనగరం సంస్కృత కళాశాలలో చదువుకొంటున్న నవ్యసాహితీపరులు పిలకా గణపతిశాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి తరచుగా నారాయణబాబును కలుసుకొనేవారు. వాళ్ళతో నవ్యసాహిత్య చర్చలు నారాయణబాబు జరిపేవాడు. హనుమచ్ఛాస్త్రిగారు ఒకచోట ఇలా రాశారు.[8]

''విజయనగరంలో చిన్నాంజనేయ స్వామి కోవెల పక్క అయ్యకోనేటి ఒడ్డున మా సాహిత్యాశ్రమం. లౌక్యం ఎరుగడు. వట్టిభోలాబావ - మా కాలేజీకి సెలవు రావడం తడవు - వెంటనే నారాయణబాబు దగ్గర వాలేవాడను. ఇతడు ఇంకెక్కడైనా వాలితే - ఆ పుణ్యాశ్రమం కనుక్కొని - అతన్ని పట్టుకొని కోనేటి ఒడ్డుకు చేరేవాళ్ళం.''

స్నేహితులతో కాలం గడపడం నారాయణబాబుకు ఇష్టమే అయినా చదువుకోవాలంటే ఆనాడు చాగంటి సోమయాజులుగారింటికి వెళ్ళేవారు. ఆయన ఇంట్లో ఉంటే సరేసరి లేకపోతే గది తాళం తీయించుకొని టేబుల్ మీదనో, తిరుగుడు షెల్ఫ్ మీదనో ఉన్న ఏదో ఒక పుస్తకాన్ని తీసుకొని సోమయాజులుగారు వచ్చేదాకా చదువుకొంటూ కూర్చునేవాడు. చదివిన పుస్తకంలోని విషయాలు చర్చించేవాడు. సోమయాజులు దగ్గర ఆరోజుల్లో చాలా పెంగ్విన్ పేపర్ బ్యాక్ పుస్తకాలు ఉండేవి. ఆ గ్రంథమాల ఎన్నో సాహిత్య గ్రంథాలను చౌకధరలకు అందించేది. నారాయణబాబు ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్రాన్ని మథించాడు. ఉత్తరోత్తరా నారాయణబాబు ''సాహిత్యం-మనస్తత్వ శాస్త్రం'' అనే వ్యాసం రాశాడు.[9] అందులో ఒకచోట ఇలా చెప్పాడు.

8. గౌతమీ గాథలు - పుట.206
9. ఢంకా - సెప్టెంబరు 1946

''ఆరోగ్యం రెండు రకాలు. ఒకటి శారీరక ఆరోగ్యం. రెండు మానసిక ఆరోగ్యం. ఈ రెండూ సమానంగా ఉంటేనే ఆరోగ్యం. ఈ రెండూ సమానంగా ఉంటేనే సంపూర్ణమైన మానవత్వం, న్యాయమైన మార్గం ద్యోతకమవుతాయి. ఏది కొరవడ్డా మానవజాతికే ముప్పు వస్తుంది. మానవుడి మానసిక ఆరోగ్యం బొత్తిగా సమసిపోవడం నుంచి దానిని ప్రసాదించే అవకాశాలు కూడా ఈనాటి సాహిత్యానికి ఉన్నాయి. కాబట్టి సాహిత్యవేత్తలు మానవ మానసిక ఆరోగ్యం కూర్చటం అవసరమని తలచి రచన సాగిస్తున్నారు. ప్రతి సాహిత్యవేత్త మనస్తత్వశాస్త్రం చదివితేనేగాని సాహిత్య, నిర్మాణం యీ రోజుల్లో చేసేందుకు అర్హుడు కాడు''.

సాహిత్య నిర్మాణం చేసే అర్హత సంపాదించుకొనడానికే నారాయణబాబు విజయనగరంలో మనస్తత్వ శాస్త్రాన్ని పఠించాడు. అతని జీవితంలో ఈ అధ్యయనానికి అవసరం ఏర్పడింది. నారాయణబాబుకు యుక్తవయస్సులోనే పెళ్ళయింది. అయితే భార్య పిచ్చిది. (బంధువులంతా ఆమెను వెర్రి చిట్టి అని పిల్చేవారు). సంసార సౌఖ్యం ఆదినుండీ కరువైన నారాయణబాబుకి ఇల్లూ వాకిలీ కూడా అక్కరలేకపోయింది. బాధ్యతలు లేనందువల్ల తానొక్కడూ ఎక్కడున్నా సరిపోతుంది. కనుక స్నేహితులతో కాలం గడిపేవాడు. సాహిత్యసభలకు ఇతర గ్రామాలకు వెళ్ళేవాడు. వెళ్ళినచోట కొన్నాళ్ళు ఉండిపోయేవాడు. ఒకసారి కాకినాడ వెళ్ళి కృష్ణశాస్త్రిగారి ఇంట్లో ఆయనను అంటిపెట్టు కొని ఉండిపోయాడు. శాస్త్రిగారు నారాయణబాబుకు పి.ఆర్.కాలేజీలో సన్మానం చేయిస్తానని అట్టేపెట్టేశారు. ఒకనాడు కాలేజీ ఎదుట బ్రహ్మ సమాజం మందిరంలో లెక్చరర్లతో నగరవాసులతో, విద్యార్థులతో, సాహితీపరులతో సభ కిటకిటలాడుతూ ఉంది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ఉపన్యాసకులు. కృష్ణశాస్త్రిగారు అధ్యక్షులు.

ఆరోజున శాస్త్రిగారు నారాయణబాబు గురించి అద్భుతంగా మాట్లాడారు. అతని కవితలోంచి 'చీకటి శరీరం మీద ఒకటి రెండు వెలుతురు గాయాలు' అన్న మాటలు కోట్‌చేసి ఈ మాటలు తామెప్పుడూ మరిచిపోలేమని చెప్పారు. కవిత్వం అంటే ఏమిటో తెలిసినవాళ్ళు నారాయణబాబు కవితలను ఆస్వాదించగలరు.

సాహిత్య వ్యాసంగమో లేక సంగీత శ్రవణమో దినచర్యగా మారిన నారాయణబాబు ఒక దశలో తన కవితలలో సంగీతమే కావ్యవస్తువుగా స్వీకరించాడు. అతడు రచించిన రుధిరజ్యోతి గ్రూపు కవితలు నలభైలోనూ అయిదు సంగీత ప్రశస్తిగలవే. మిగతా గీతలలోను కొంత కొంత సంగీత ప్రసక్తి లేకపోలేదు. కొన్ని కవితల పేర్లూ, తీర్లూ చూడండి.

కదన కుతూహల రాగం
దరిద్ర సంగీతం
ఫిడేలు నాయుడుగారి వ్రేళ్ళు
రాజాజి (రాజమంత్రి)
వీధి పాటకులు

నారాయణబాబు తనకు ఊహ తెలిసినప్పట్నించి ద్వారం వెంకటస్వామి నాయుడుగారి గాన మాధుర్యాన్ని గ్రోలుతూ ఉండేవాడు. మన కర్ణాటక సంగీత

విద్వాంసులు ఒక్కొక్కరు కొన్ని కీర్తనలను ప్రచారంలోకి తెచ్చారు. శమ్మంగుడి 'రామనన్ను బ్రోవరా', 'వినతాసుత', 'మరిలేరు దిక్కెవ్వరు' మొదలైనవి వ్యాప్తిలోనికి తెచ్చారు. మధురమణి అయ్యరు 'నాదతను మనిశం' 'నగుమోము' 'సరససామగాన' వగైరాలు ప్రచారం చేశారు. 'నగుమోము' ముని సుబ్రహ్మణ్యంగారి స్వంతం. వెంకటస్వామి నాయుడుగారు అందరూ మరచిపోయిన 'శ్రీరామపాదమా' 'అనాథుడనుగాను', 'నిను వినా నామదియందు' అనే కృతులను ప్రచారం చేశారు. అన్నిటికన్నా మిన్నగా 'రఘువంశ సుధాంబుధి చంద్రమా!' అన్న కదనకుతూహల రాగంలో పట్నం సుబ్రహ్మణ్యయ్యరు గారు తమ కోసమే రచించారా అన్నంత ప్రత్యేకతతో నాయుడుగారు వ్యాప్తిలోనికి తెచ్చారు. ఈ కృతిని నారాయణబాబు ఎన్నిసార్లు విని తన్మయం చెందాడో తన తొలి గీతాలలో ఒకదానికి కదన కుతూహల రాగం అని శీర్షికపెట్టి తన స్వీయ పరిచయం చేసుకొన్నారు.

రుధిర జ్యోతిర్
జ్వలనా లలనా
ప్రియుండ!
విప్లవ ఋషిని
విద్రోహ కవిని
ఆహవరంగం నా
హృదంత రంగం
పగిలిన ఖలేజాలె
నా
పాటల జలేజాలు
మర ఫిరంగినె
మహతిగ మీటి
కదన కుతూహల రాగం
వినిపిస్తాను
అగ్గిని కురిపిస్తాను

నారాయణబాబు ఉద్దేశంలో ఈ కదనం 'చివురించిన జనాళి యుద్ధం' అతడు దరిద్ర సంగీతాన్ని గానం చేశాడు. ఆ పేరు శీర్షికగా రచించిన గీతంలో ఇలా అన్నాడు.

వేస్తావా?
నా దరిద్ర సం
గీతానికి
భూమ్యాకాశాలే
తాళం చిప్పలు!
చెప్పనా?
కష్టమైన

సంకీర్ణపు
నరజాతికి
ఆకలి
ధ్రువ తాళం!
వెయ్యిమరి
సీలా!
నాయక గోపాల!
నాయక గోపాల!
ఆకలితో
నా కడుపు
అగ్నివీణ
వాయిస్తే
దీపక రాగం
దిక్కుల కెగబ్రాకి
ఆకాశం
అంటుకుంది
ఆర్పండి!
ఆర్పండి!

ఈ గీతాన్ని అచ్చువేస్తున్నప్పుడు 'నారాయణ గోపాలః' అన్న మాటకు వివరణగా నారాయణబాబు చాలా విపులంగా సంగీత చరిత్ర ఇలా రాశాడు.

దీపక రాగం దక్షిణ దేశస్తులకు, అంటే కర్ణాటక సంగీత సంప్రదాయానికి కామవర్థని జన్యం. ఈ రాగంలో కీర్తనగానీ పదముగానీ లేదు. సంగీత సంప్రదాయ ప్రదర్శనిలో రాగ లక్షణ మీయకుండా అప్రస్తుతమని ఊరుకున్నారు. గ్రంథ పీఠికలో దీపక రాగం గురించి ఇలా వ్రాసి వుంది. రమారమి 400 సంవత్సరాలకు మునుపుండిన గోపాల నాయకులను వారు ఉత్తరదేశములో నొక రాజ్యసభలో దీపక రాగమును పాడి దీపముల నంటింప జేసినట్లు (ప్రతీతి) ఉత్తర హిందూస్థానంలో ఈనాటికీ దీపకరాగం గొప్ప పలుకుబడిగల రాగం. విద్వాంసులు పాడుతారు.

''గోపాల నాయకులు : ఈ సంగీత విద్వాంసుడు తాళార్ణవ,రాగ కదంబములను ప్రబంధములు చేసియున్నట్లు సంగీత రత్నాకరమునకు వ్యాఖ్యానం రచించిన కల్లినాథుడు తాళాధ్యాయము నందును, గోపాల నాయకులే శ్రుతుల నెరింగిన వారని వెంకటమఖి తన చతుర్దండి ప్రకాశికలో శ్రుతి ప్రకరణమందు చెప్పినట్లు సంగీత సంప్రదాయ ప్రదర్శనిలో కలదు''.

'గోపాల నాయకుల గురించి Atiya Begum Fyzee Rahamini ఆమె రచించిన The Music of India లనే గ్రంథములో ఇలా వ్రాసింది:

''గోపాల నాయకులు, అక్బరు చక్రవర్తి కాలంలో సంగీత విద్వాంసుడు. ఒకనాడు చక్రవర్తి గోపాల నాయకుని దీపక రాగం పాడమన, జడిసి చక్రవర్తి కంటబడకుండ ఆరుమాసములు తప్పించుకు తిరగెను. పిదప నొకపరి అక్బరు గోపాలనాయకుని దీపకరాగం పాడక వీల్లేదని నిర్బంధించెను. చక్రవర్తిని బతిమాలుకున్నాడు. తప్పిందికాదు. యమునా సలిలం మండి వేడి గోపాల నాయకులు దీపక రాగం కొంతసేపు ప్రవర్తించేసరికల్లా యమునా సలిలంలో క్రాగిపోయిందట. కాని చక్రవర్తి హృదయం కరుగలేదు. కొంతసేపు కొన్ని స్థానాలలో రాగం ప్రవర్తించేసరికి మంటలు పుట్టాయి. ఆ మంటలకా విద్వాంసుడే ఆహుతి అయిపోయినాడు'

ఈ చారిత్రక సంఘటనను వివరించి నారాయణబాబు ఒక చిన్నగీతంలో ఇలా ముగించాడు.

నాడు సంగీతం
మంటలు పుట్టిస్తే
నేడు ఆకలి మంటలే
సంగీతాన్ని పలికించాయి

చూడ్డానికి ఉత్తవచనంలాగ కనపడి, నడకా, లయా, తాళం ఏమీ లేనీ లేనట్టు అనిపించే నారాయణబాబు కవితలు నిజానికి గానయోగ్యాలు. వాటిని అతడు అద్భుతంగా రాగభావయుక్తంగా పాడేవాడు. ఇతడేకాక ఇతర సంగీత విద్వాంసులు వాటిని గానం చేయగలరు. ఉదాహరణకు ద్వారం వెంకటస్వామినాయుడుగారికి మైసూరు దర్బారులో ఘనంగా సన్మానం జరిగాక నారాయణబాబు, 'ఫిడేలు నాయుడుగారి వ్రేళ్ళు' అనే కవిత రచించారు. దీనిని విజయనగరంలో జరిగిన ఒక విందులో వీణా కోవిదులు జనార్ధనాచార్యులుగారు స్వరపరిస్తే నాయుడుగారి కుమారులు బాబూరావూ, చిన్నఫిడేలు మీద వాయిస్తూ ఉంటే చొప్పల్లి భాగవతారుగారు కిన్నెర గాత్రంతో గానం చేశారు. పాడడానికి తగిన ఒడపులన్నీ నారాయణబాబు తన కవితలలో నిక్షిప్తం చేయగలడు.

సంగీతం తర్వాత నారాయణబాబును ఎక్కువగా ఆకట్టుకున్నది మనస్తత్వశాస్త్రం. 'ఫ్రాయిడ్ సిద్ధాంతాలు మనం అన్నీ ఒప్పుకోకపోయినా సాహిత్య ప్రయోజనం కల కొన్ని సిద్ధాంతాలపైనా పడకపోతే ఈనాటి సాహిత్యానికి ఎట్టి ప్రయోజనం కనబడదు' అని స్పష్టం చేస్తూ నారాయణబాబు మనస్తత్వ శాస్త్రాన్ని వివరించాడు.

''మనస్సుని మూడుభాగాలుగా మనస్తత్వవేత్తలు చేయకపోయినా మనం అవగాహన అయ్యేందుకు చేసుకుందాం.

1. అవ్యక్తం (Un-Conscious)
2. వ్యక్తా వ్యక్తం (Sub-Conscious)
3. వ్యక్తం (Conscious)

యీ అవ్యక్తం జోలికి పోరు ఎవ్వరూ. ఇదొక రకమైన బ్రహ్మ పదార్థం లాంటిది. దీనికి తెలియనిదీ ఇది చేయలేనిదీ లేదని అంటారు. దీన్నించి సమస్తమైన భాషలు, భావాలు

ఉత్పన్నమవుతాయన్నారు. అవ్యక్తంలోంచి బయలుదేరి వ్యక్తా వ్యక్తంలోకి ఒక రకమైన చైతన్య స్రవంతి (Stream of Consciousness) ప్రవహిస్తూ ఉంటుంది. దీని సారం తెలుసుకున్న వారుకూడా సాహిత్యవేత్తలలో బహుకొద్దిమంది. ఫ్రెంచిలో ప్రౌస్టు, జేమ్సు జాయిస్, కొంతమంది అధివాస్తవికులు.

వ్యక్తావ్యక్తం ఉంది. దీన్నే కొల్లగా కొల్లగొడుతున్నారు సాహితీవేత్తలు. మనస్సులో వాంఛగాని కోరికగాని పుట్టిందంటే ఈ కోర్కె సంఘం కట్టిన గోడల కవతల కావచ్చు. అది ఏదోరకంగా నెరవేరి తీరాలి. కోరికలు తీరేందుకు ద్వారాలు పంచేంద్రియాలు...

'ఒక ఇంద్రియానికి చెందిన వాంఛలు ఇంకో ఇంద్రియం వినియోగించడంచేత అరికట్టడానికి అవకాశాలున్నాయి. ఘ్రాణేంద్రియానికి చెందిన వాంఛను నయనేంద్రియం వాడుక చేయించి వాంఛానివృత్తి చేయగలుగుతున్నాం'.

నారాయణబాబు తన కవితలలో ఈ సూత్రాన్ని పాటించేవాడు అందుకే రోణంకి అప్పలస్వామిగారు ఒక చోట ఇలా రాశారు.[10]

''కొన్ని నిగూఢ రహస్యాలు అతని కవితలో తొంగిచూస్తాయి. శిల్పం రహస్యంగా వుండిపోతుంది. ఇంద్రియాలు గ్రహించిన అనుభూతులను ఆయా ఇంద్రియాలతోగాక వానిని భిన్న భిన్న ఇంద్రియ సంపాదితములుగా పేర్కొనడం ఒక శిల్ప రహస్యం. 'తెల్ల రుచి' 'రజిత రావ సంగీతం' అనే ఇతని ప్రయోగాలు ఇలాంటివి''.

నారాయణబాబుకు తెల్లని జాబిల్లిలో మచ్చ శ్రుతి కటువు అనిపిస్తుంది.

నారాయణబాబు కొన్ని కవితలలో సైకాలజీ వాడి ప్రయోగాలు చేశాక వ్యక్తం చేసుకొందామని చైతన్య స్రవంతిని ఈది వ్యక్తం కంటబడకుండా వ్యక్తావ్యక్తంలో తలచుకొంటున్న తలపును చెప్పేందుకే కొన్ని రచనలు చేశాడు. అటువంటి గీతాలలో 'నీవెవరే', 'గేదెపెయ్యా', 'చిన్నా', 'లెండోయి ఋషులు' అన్నవి ముఖ్యమైనవి. ఇవి టెక్నిక్ మీద అధికారం సాధించిన కొత్తలో నూతన ధోరణిలో చేసిన ప్రయోగాలు.

మనస్తత్వ శాస్త్ర పఠనం వల్ల వచ్చిన అవగాహనలో ఈ గీతాలను నారాయణబాబు రచించిన దశ అతని ఆధునిక కవితా జీవితంలోని తొలిరోజులలోనిదీ కాదు, మలిరోజులలోనిదీ కాదు. మధ్యలో అబ్బిన గుణం.

ప్రతి జీవితంలోనూ కొన్ని పరిణామ దశలు ఉంటాయి. ఆదిలో సంవిధానమే సర్వస్వమనుకొని దాన్ని సాధించడానికే రకరకాల రచనలు చేస్తారు. నారాయణబాబు కూడా ఆదిలో ఈ దశలో ఎన్నో రచనలు కేవలం సంవిధాన ప్రావీణ్యం సంపాదించడానికే చేశాడా అన్నట్టు తోపించిన కవితలు రచించాడు. వాటిలో 'ఊరవతల' 'కిటికీలో దీపం' 'ఏమంది' 'కవీ' 'అగ్నివీణ' 'కుష్టు రోగి పాటపాడె' వంటి కవితలు చెప్పదగ్గవి. వీటినిండా ఇమేజిస్టు భావచిత్రాలు కోకొల్లలు గుప్పించాడు. టెక్నిక్ చెప్పుచేతలలో తాను ఉన్నప్పుడు రాసేతీరు ఒకటి, తన చెప్పుచేతల్లో టెక్నిక్ ఉన్నప్పుడు పలికే తీరు ఇంకొకటి. భావ చిత్రాల

10. రుధిర జ్యోతి ప్రస్తావన - పుట. XVI

దొంతిని పేరుస్తున్నా సామాజిక వాస్తవికతల మీద వ్యాఖ్యల్లాంటి సూచనలు చేయడం గమనించదగ్గ విషయం. రాత్రిని వర్ణిస్తున్నా జీవితాన్ని అందులో చిత్రించడం ఒక నేర్పే. తెనుగురాత్రి అనే ఈ కవిత చూడండి.

శూన్యమ్మగు చూపులతో
శుష్కించిన దేహముతో
పేదవాని కడుపుమంట
కాలిపేలిపోవు కోర్కె
గగనమ్మున చుక్క

శక్తి సన్నగిల్లిపోయి
రక్తము విరిగిన గుర్విణి
హస్తమునన్ చిటిలిపోవు
శస్త్రమ్మట్టు జిలుకుమార్చ
మాసిపోని గాజుముక్క
నెలవంక
సంఘు వంక!

నోటుమన్నె కొట్టు జగతి
నోరు తెరవ పాలకొరకు
బాలిక
చూలాలి కెదుకుబిడ్డ
తూలిపోవు అసువులే
నీలాలగాలి వీస్తోంది

తలకాలని తల్లి శవం!
తండ్రి పెండ్లికై తహతహ!
కడవడు నీళ్ళకు నేడ్చే
గంపెడు పిల్లల దుఃఖపు
కంటివాన
మిన్నంటి కురియు మంచుసోన!

పసితనమున పెండ్లి
భర్తపరమ పదము జేర
విధవ
మసక మసక యౌవనమున
కుసుమించే తల్లి తలపు
గుండెల్లో పాలపాట
ఆకాశపు పాలబాట!

ఆంధ్ర యువక జీవనార్చి
కాలిన మేడల నుంచి
ఆరిన వాడల నుంచి
ధూమమ్మొగజిమ్మే
చీకటి
దుమ్మురేగు
తెనుగురాత్రి!!!

ఇందులో ఉపమాన ఉపమేయాలతో పాటు జీవన భీభత్సం కూడా ధ్వనింపచేశాడు. ఆలపించాడు.

నారాయణబాబు గాయకుడేకాదు, నటుడు కూడా. ఒకప్పుడు సినిమాల్లో నటించమని ఆయనకు స్నేహితుల వద్ద నుండి పిలుపు వచ్చిది. 'భక్తకబీరు' చిత్రంలో భోగమల్లు వేషం ధరించాడు. ఈ పాత్రలో అతని ఛాయా చిత్రం ఒకసారి భారతి మాసపత్రికలో ప్రచురించారు. నారాయణబాబు భావకవిత్వం విడిచిపెట్టినా భావకవి వేషాన్ని మాత్రం కడదాకా వదల్లేదు. గిరజాల జుత్తు నిండుగా ఉండేది. షుర్వా షేర్వాణీ ఎప్పుడూ ధరించేవాడు. (వేషం ఆర్భాటంగా ఉన్నా అతడు కాల్చేది బీడీనే. ఈ విషయంలో ప్రొలిటేరియన్) సినిమాల కోసమూ, ఇతర కారణాలవల్లా నారాయణబాబు మద్రాసు చేరుకున్నాడు. 1938లో శ్రీశ్రీ కూడా ఆంధ్రప్రభ సబ్‌ఎడిటర్‌గా మద్రాసు చేరాడు. నారాయణబాబు శ్రీశ్రీ సహచర్యంతో కాలం గడిపేవాడు.

ఆనాడు మద్రాసులో ఉండే వివిధ సాహిత్య సంస్థలు, విద్యార్థి సంఘాలు. కళాశాలలవారు ఈ ఇద్దరినీ జంటగా తమ సభలకు ఆహ్వానించేవారు. ఏయేసభలలో పాల్గొని ఏయేవిషయాలమీద వారిద్దరూ మాట్లాడేవారో ఆనాటి తెలుగు దినపత్రికలలో చాలా విపులంగా రిపోర్టు చేసేవారు. అవి దేశంలోని పాఠకులకు చాలా ఉత్తేజకరంగా ఉండేవి. నారాయణబాబు మంచి వక్త.

ఆరోజుల్లోనే శ్రీశ్రీ సర్రియలిజం పట్ల ఆకర్షితులయ్యాడు. నారాయణబాబును ఆ దారికి మళ్ళించాడు. శ్రీశ్రీ ఒకచోట ఇలా చెప్పాడు.[11]

''ఆరోజుల్లో ఒక ఫ్రెంచి విమర్శక గ్రంథంలోని "The Dada Revolt and the Surrealist Experiment" అనే అధ్యాయం చదవడంతో సర్రియలిజం నన్నాకర్షించింది. మద్రాసులోని హిగ్గిన్‌బాదమ్స్‌కు సర్రియలిజం మీద ఇంగ్లీషులో ఏమైనా గ్రంథాలుంటే పంపించవలసిందిగా రాశాను. వారు లండన్ నుంచి రెండు తెప్పించి నాకు వి.పి.గా పంపించారు. అందులో ఒకటి సర్రియలిస్టు ఉద్యమ నాయకుడు ఆంద్రేబ్రెతా వ్రాసిన ఫ్రెంచి వ్యాసాలకు అనువాదాలు. అందులోనే మొదటి సర్రియలిస్టు మానిఫెస్టో ఉంది. రెండో పుస్తకం ఇంగ్లీషులో డేవిడ్ గాస్కాయిన్ వ్రాసిన A Short Survey of Surrealism. దీనిలో సర్రియలిస్టు చిత్రపటాలతో బాటు చాలామంది అధివాస్తవిక కవుల గీతాలకు చక్కని

11. అనంతం - పుట.158

అనువాదాలున్నాయి. వాటిలో ముఖ్యంగా పోల్ ఎల్వార్ గీతాలు నారాయణబాబును చాలా ప్రభావితం చేశాయి''.

అప్పటికే మనస్తత్వ శాస్త్రం గురించి కొంత తెలుసుకొన్న నారాయణబాబును సర్రియలిజం ఆకట్టుకొంది. ఈ సాహిత్యాన్ని ప్రచారంలోనికి తీసుకువచ్చిన ఆంద్రేబ్రిటన్, ట్రిస్టాన్ జోరాల ప్రయోగాలు అతడు అర్థం చేసుకొన్నాడు. ''ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రకారం అర్థం లేనిదంటూ ఏదీ ఉండదు. ప్రతిదానికీ అర్థం ఉంటుంది. ఫ్రాయిడ్ తన సైకో ఎనాలిసిస్ (మనస్తత్వ శాస్త్రం) ద్వారా దీన్ని రుజువు చేయ ప్రయత్నించాడు. సర్రియలిస్టులు ఫ్రాయిడ్ సిద్ధాంతం ఆధారం చేసుకొని తమ రచనలను కొనసాగించారు. ఆంద్రే బ్రిటన్ తన మీద, తన మిత్రుల మీద ఫ్రాయిడ్‌ను అనుసరించి కొన్ని ప్రయోగాలు చేసి చూశాడు. తర్వాత కొందరు మిత్రులతో కలిసి అతడు రచనలు చేయడం ప్రారంభించాడు.''[12]

ఈ చరిత్ర నారాయణబాబును సర్రియలిజం వైపు బలంగా లాక్కుంది. శ్రీశ్రీ సర్రియలిజాన్ని 'అతివాస్తవికత' అన్నాడు. ఉత్తరోత్తరా నారాయణబాబు దానిని 'అధివాస్తవికత' అని పిలవమన్నాడు. (అతి సర్వత్ర వర్జ్యయేత్) 1940లో శ్రీశ్రీ మొట్టమొదటి అతివాస్తవిక వచన రచనలు మన భాషలో చేశాడు. 'మాటల మూట' (1940 డిసెంబరు 11), 'మహాకవి ఆశ్చర్యం' (1941 జనవరి 29) ఆ తొలిరచనలు. ఇవి ఆంధ్ర వారపత్రికలో ప్రచురితమయ్యాయి. అప్పుడా పత్రిక కార్యాలయంలో కొడవటిగంటి కుటుంబరావుగారు, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి సంపాదక బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. సర్రియలిజం పట్ల ఆసక్తి చూపేవారు.

ఇదే కాలంలో నారాయణబాబు తెలుగులో మొట్టమొదటి అధివాస్తవిక కవితా ప్రయోగం చేశాడు. దానికి 'మౌనశంఖం' అనే పేరుపెట్టాడు. ఈ కవిత చదివి శ్రీశ్రీ, రుక్మిణీనాథశాస్త్రి చాలా మెచ్చుకొన్నారు. శ్రీశ్రీ 'అధివాస్తవికుల ప్రవేశం' అన్న తొమ్మిది ఉత్పలమాలలు రచించాడు. ఎనిమిదో దానిలో నారాయణబాబు 'మౌనశంఖం' ప్రసక్తిని ఇలా తెచ్చాడు.

''మౌనము శంఖమై చెరగు మాయగ నేత్ర పతంగ బింబ ని
ధ్యానము కొంగనెత్తురులు త్రాగెడు నల్ల తురాయిపూవుగా
వేనలిపై అవే అయిదువేల కుళీర కుఠార దారుణ
ప్రాణ శిలీంధ్రముల్ తిరుగుబాటు తుపాకి తుపాను కానుపుల్''

నారాయణబాబు 'మౌనశంఖం' తెలుగు సాహిత్యంలో ఒక విలక్షణమైన ప్రయోగం. అధివాస్తవికత అంటే అప్రయత్నరచన. సుప్తచైతన్యాన్ని మాటల్లోకి తీసుకు వచ్చేటప్పుడు రచయిత తన బుద్ధిబలంతో సవరణలకు యత్నించకపోవడమే సర్రియలిస్టు రచనల మూలసూత్రం. దీనిని పాటించాలని నారాయణబాబు ప్రయత్నించాడు. 'మౌనశంఖం' కవిత 'కోహం' అన్న ప్రశ్నకు సమాధానంతో మొదలై 'సోహం' అన్న విశ్వాసంతో

12. అనంతం - పుట.177

ముగుస్తుంది. అనాదిగా తాత్త్వికులూ, దార్శనికులు 'నేనెవర్ని?' అన్న జిజ్ఞాసకు రకరకాలుగా స్పందించారు. మౌనశంఖంలో కవికి తానెవరో తెలుసు. అతడెవరో లోకానికి తెలియదు అందుకే కవి ఇలా అంటాడు.

నేపడుకొంటే
నీవెవరు? నేనెవరని?
??

ఈ రెండు ప్రశ్నలూ అనాదివే. 'కస్త్వం', 'కోహం' అన్నవే. చివరలో గోచరించే ఈ ప్రశ్నలకు కవి సమాధానం ఇస్తారు. సర్వసాధారణంగా మన దృశ్యకావ్యాలలో పాత్ర ప్రవేశిస్తున్నప్పుడు 'ప్రావేశిక' గానంలో స్వీయ పరిచయం చేసుకోవాలి. ఈ సంప్రదాయాన్ని ఇతర కావ్యకవులు కూడా అనుసరించారు. భావకవి ఇలా అంటాడు.[13]

ఎవ్వరని యెంతురో నన్ను? ఏననంత
శోక భీకర తిమిర లోకైక పతిని!

రుధిరజ్యోతి గ్రూపు కవితలు రాస్తున్న తొలి రోజుల్లో నారాయణబాబు తన స్వీయ పరిచయం ఇలా చేసుకొన్నాడు.

సూరన అడిదాన్ని
తిక్కన ఖడ్గాన్ని
పేలిన బిజాపూరు
ఫిరంగి గుండు
నాగుండె

అయితే మౌనశంఖంలో తన్ను తాను ఇంకొకలాగ కవిపరిచయం చేసుకొంటాడు.

నీలగిరిలో పురుడు పోసుకొని
దాహం దాహం అంటూ మరణించిన
చూలాలి పక్షంలో గడ్డకట్టిన
చనుబాల జిడ్డును.
తాగి చనిపోయిన ఒక పుండాకోరుని
డాక్టరు శవపరీక్ష చేసినప్పుడు
అతని కడుపులో అరగకుండా
పైకి ఒలికిన సారా చుక్కను!
చూలాలై మృతశిశువుని కని
గుండెల్లో పాలే
పాముకాటులా బాధపెడితే,
ఒక యిల్లాలు
ఒక చీకటి రాత్రిలో వీధి కాలువలో
కురిపించిన పాలవానను.

ఈ స్వీయ పరిచయంలో ఒకటికి రెండుసార్లు కవి తనను తాను నిరర్థకమైన స్తన్యంతో సరిపోల్చుకొనడం విఫల మాతృత్వ ఫలితమైన క్షీరంతో ఆధునిక ధనస్వామ్య సంస్కృతి లోని మానవునికి అభేదం కల్పిస్తున్నాడు. మధ్యలో అరగని సారా చుక్క నిరుపయోగానికి ప్రతీక.

ఇంతకూ ఎవరైతే ఏం? తానొక కవినని తనకు తెలుసు. తన సహచరుడు శ్రీశ్రీ. ఎన్నిసార్లు లెక్కపెట్టినా ఉన్నవాళ్ళు వాళ్ళిద్దరే. సాలిపట్టులాంటి కవితా వ్యూహంలో మక్షికాలలాగా ఇద్దరూ చిక్కుకొన్నారుగాని సజీవులుగానే ఉన్నారు. కానీ రెక్కలు తెగాయి. ''మానవజాతికి నీవు ఎర్రదీపానివి, ప్లేగువ్యాధికి కనిస్టీపువి'' అని నారాయణ బాబుతో శ్రీశ్రీ చెప్పాడు. ఇద్దరూ బయలులోనికి పరిగెత్తారు. అక్కడ గాలిలేదు. వెలుతురు లేదు. శూన్యం లేదు. సప్త సముద్రాలు జట్టు కట్టుకొని జలతరంగిణి వాయిస్తున్నాయి. ఆకాశం చిరిగిపోయిన అరటిదొప్పలా ఒక మూలపడి ఉంది. భూగోళ పటం మీద ఉల్లిపొర కాగితంలాగ మృతించిన శేషుడు భూమిని చుట్టుకొని ఉన్నాడు. వెలసిన రంగు గుడ్డలు మంచీ చెడ్డా జెండాలై ఎగురుతున్నాయి.

మంచి చెడ్డలు వెలసిన రంగు గుడ్డలనడంలో కవి అభిప్రాయం స్పష్టం. పాత విలువలన్నీ తమ పూర్వపు వర్ణాలను కోల్పోయాయి. పాత వ్యవస్థ సహజంగానే పతనమైంది. పూర్వపు ఉన్నతోన్నత వర్గాల వాళ్ళు మట్టికరిచారు. కులపర్వతాలు గాలిలో విమానాల్లో ఎగురుతూ ఉంటే -

కుష్టురోగంతో కాళ్ళూ చేతులూ పడిపోతే
కిందపడి దొర్లుతూ ఏడుస్తున్న దేవేంద్రుడు
ఇంకిపోయిన అమృతభాండంలో
తడైనా తగుల్తుందేమోనని
వేళ్ళతో స్పృశిస్తున్న శచీదేవి
దేవేంద్రుని సింహాసనం మీద
కూర్చుని వజ్రాయుధం
తానొకప్పుడు కొండలను ఖండించిన
రెక్కలన్నింటిని పోగుచేసి
మరల పర్వత భుజాలకు
అంటిస్తున్నాది పేస్టుతో

నాగలోకాధిపతి అయిన ఇంద్రుడు వ్యాధిగ్రస్తుడు కావడం, అతని భార్య ఇంద్రాణి ఇంకిపోయిన అమృతం కోసం వెతకడం అధికార వర్గాల భవిష్యత్తును భూతకాలాన్ని చేసి సూచిస్తున్నాయి. తమ చేతిలో ఉన్న ఆయుధంతో పూర్వం ఎవరినైతే శిక్షించి అణిగిమణిగి ఉండేట్టు సర్వశక్తివంతుడు చేస్తే అతని ఆయుధం ఆ పీడితులకే కొత్తశక్తులు ప్రసాదిస్తున్నది. సుప్తచైతన్యంలో నిక్షిప్తమై ఉన్న సామ్యవాద ప్రభావం వల్ల ఈ భావాలు ఇలాగ రూపు ఏర్పరచుకొన్నాయేమో.

గండభేరుండ పక్షులు కలరవాలు చేస్తూ ఉంటే శ్రీశ్రీ నిజమంటున్నాడు. పురాతన సాహిత్యమంతా కాలిపోయింది. అంతకుముందే భావకవిత్వం కృష్ణశాస్త్రి రూపంలో సిరాబుడ్డిలో పడి ఆత్మహత్య చేసుకొందని కవి చెప్పాడు. ఇప్పుడు ప్రాచీన సాహిత్యం మాసిన బట్టల మూటలని దాన్ని చాకలి సరస్వతి రేవులో తగలపెట్టుకొని ఏడుస్తున్నదని చెప్పాడు. కోపంతో ఆమెను తన్నేందుకు శ్రీశ్రీ కాలుఎత్తి మూగయ్యై నిల్చున్నాడు. పూర్వ సాహిత్యాన్ని దగ్ధం చేసుకొంటే ఎంతటి కవైనా మూగవాడుకాక తప్పదు 'అయితేనేఁ పోతేనేం' అన్నాడట కవి.

సరీబజారులో కొన్న పాంతఁ
జర్మను సాహిత్య కోమటిని
ప్రాధేయపడి తెచ్చిన వాల్ ఖలేడ్
గురజాడ ప్రసాదించిన ముత్యాలసరం
హాప్కిన్సును అర్థించి తెచ్చిన స్ప్రింగు రిదిమ్
అన్నీ పోయాయన్నాడు నత్తిగ
ఇక పాట ఎలాగు?

పోయినవన్నీ దేశదేశాల ఛందోరీతులు. అవి లేకపోతే నూతన కవితలు చెప్పడానికి వీలుండదు. మానవలోకానికి లిపి, ఛందస్సు లేని రోజుల్లో ఆటవిక దశలో గుహగోడల మీద బొమ్మలుగీసి తమ ప్రయోజనాలను మానవులు పండించుకొన్నారు. మళ్ళా ఇప్పుడు బొమ్మల అవసరమొచ్చింది.

పక్కనుపడి ఉన్న శేషుని కోరపెరికి
ఆడ గండభేరుంఢ పక్షి రెక్కమీద
డాలీ శ్రీశ్రీ రచించిన చిత్రపఠానికి
మాన్‌రే శ్రీ నారాయణబాబు తీసిన ఛాయాచిత్రం!

డాలీ అధివాస్తవిక చిత్రకారుడే. మాన్‌రే ఫోటోగ్రాఫరు. వీళ్ళ గురించి శ్రీశ్రీ నారాయణబాబులు అధ్యయనం చేసిన పుస్తకాల్లో చాలా ఉంది. బొమ్మలు కూడా ఉన్నాయి. శ్రీశ్రీ చిత్రించిన పఠంలో రెండు అస్థిపంజరాలున్నాయి. ఒకటి ఆడది, రెండోది మగది. ఆడదాని మెడలో కోహినూరు వజ్రం. మగాడు వజ్రవైఢూర్యాలు పొదగిన బంగారపు గునపంతో తాజ్‌మహల్‌ను తవ్వేస్తున్నాడు.

తాజ్‌మహల్ శిల్పసౌందర్యానికి చిహ్నమైనా అది పేదల ప్రేమను వెక్కిరించడానికి చక్రవర్తి కట్టించిన సమాధి అని ప్రగతివాదుల భావిస్తారు. ఉత్తరోత్తరా ఉర్దూకవులూ, తెలుగులో బైరాగి ఈ భావాలను వ్యక్తం చేశారు. బైరాగి బహుశా నారాయణబాబు ప్రభావంతోనే 'రాజాసాహం కృతి పతాక తాజమహల్' అన్నాడేమో.[14] ఏదిఏమైనా తాజమహల్ పట్ల బైరాగికి ఒక ఖచ్చితమైన దృక్పథం ఉంది. అదే ఇలాప్రకటించాడు.[15]

---

14. 'ఆగమగీతి' - చెరలో షాజహాన్
15. 'చీకటి నీడలు' - తాజమహల్ పడగొట్టండోయ్!

తాజమహల్ పడగొట్టండోయ్!
వెన్నెల రాత్రుల్లో కలగా
సౌందర్య సాగరపు అలగా
మా పీడిత హృదయాల్ చీల్చి
మా ఎత్తిన తలలను వాల్చి
దరిద్రులను హేళన చేస్తూ
మానవులను చులకన చేస్తూ
ఆకాశం వైపుకు చూసే
ఈర్ష్యలతో హృదయం ఊసే
తాజమహల్ పడగొట్టండోయ్
మాకెందుకు షాజహాన్ ప్రణయం
మావనశ్రమ మింగిన ప్రళయం
తాజమహల్ పడగొట్టండోయ్!
రాయిరాయి విడగొట్టండోయ్!

మంచి గతమున కొంచెమేగానీ పాత ఛందస్సులనూ పాత సంప్రదాయాన్నీ, పాత సౌందర్యాన్నీ చేతులారా దూరం చేసుకొంటున్నప్పుడు శ్రీశ్రీని ఏదో పక్షి ఎగరేసుకు పోయింది. నారాయణబాబులో మాటల మరుపు మొదలైంది. కొంతసేపు కాలాంతంలోకి కాళ్ళు చాపుకొని కూర్చున్నాడు. తర్వాత రజితాచలం కనపడితే ఎక్కాడు.

కొండలోయలో పూలతోట
చెట్లు లేవు! అన్నీ పూవులే
ఉపనిషత్తులు తుమ్మెదలై
ఝుంకారం చేస్తున్నాయి
పార్వతి నగ్నంగా నిలబడి
పూలు కోస్తున్నది
ఈశ్వరుడు నిద్రపోతున్నాడు
పార్వతీ దర్శనమయ్యేసరికి
నాబట్ట అంటుకున్నాది
నే కాలిపోతున్నాను
మూగనై నిలుచున్నా

ఈ పాదాలలో మానవజాతిలో ఉన్న ఈడిపస్ కాంప్లెక్స్‌ను ఒక పంక్తిలో చెప్పి రెండు చోట్ల దాన్ని దహనం చేశాడు. అతడు మూగవాడయ్యాడు.

దగ్గరగా ఒక మౌనశంఖం తోచింది
మౌనశంఖం స్పృశించా!
నాగుండె అంతా హంసయై
సోహం అని అరిచింది.

ఆదిలో నీవెవరు? నీవెవరు? అన్న ప్రశ్నలకు ఇప్పుడు ఇది జవాబు. తన్ను తాను తెలుసుకొన్నాక ఇక నిర్వాణమే.

నా చైతన్యమంతా
సప్తసముద్రాల సహస్రకోటి బాహువుల
మెరిసే నురగై ఘుయ్యిమంది
నా ఎముకల మూలుగులో
చంద్రోదయమైంది
నా శరీరం
కాశ్యప భస్మరాశియై తరలించింది
నా ప్రాణం భగీరథుడైంది -
నా వెన్నెముక మీద
ఆకాశగంగా జలపాతం వర్షించింది
నా పొత్తికడుపు
హిమాచల తనయ
తన చల్లని మంచుహస్తాలతో నిమిరింది

చైతన్యం జాగృతమై ప్రకృతిని మానవుడు తెలుసుకొన్నప్పుడు మాతృప్రేమ సృష్టిలో లభిస్తుంది. అనంత విశ్వంలోని నీరవం ముందు మానవలోకంలోని రవం స్వల్పాతి స్వల్పం. మౌనశంఖం పూరించగలవాడు మహానాదాన్ని మనస్సులో వినగలడు.

నారాయణబాబు మౌనశంఖాన్ని ఆధునిక విమర్శకులందరూ ఒకే తీరున అర్థం చేసుకోలేదు. ''ఇంతకంటె ఘోరముగ దేవతానింద గావించిన కవి యుండడు. దేవేంద్రుని సింహాసనము మీద కూర్చుండి వజ్రాయుధము తానొకప్పుడు ఖండించిన రెక్కలను పేస్తుతో పర్వతముల కంటించుచున్నదట. గండభేరుండములు కలవరములు చేయుచున్నవట. మాసిన బట్టల మాటల మూటలు రేవులో తగలబెట్టుకొని ఏడ్చుచు చాకలి సరస్వతి ఎదురురాగా శ్రీశ్రీ ఆమెను కోపముతో తన్నుటకు కాలెత్తి మూగయైనాడట. ఇట్టివే దృశ్యములు వర్ణింపబడినవి - అన్నిటికిని పరాకాష్ఠ కైలాసమున నగ్నముగా పూలు కోయుచున్న పార్వతిని శ్రీ నారాయణబాబుగారు చూచుట, చూచినంతనే వారి కన్నులు, కాదు, బట్టలు దగ్ధములగుట, పరదేవత యెడగూడ తుచ్ఛములగునిట్టి భావములను ప్రదర్శించు కవులుండుట మనవాఙ్మయమునకే కళంకము'' అని ఒక విమర్శకుడన్నారు.[16]

ఇంకొక విమర్శకుడు ''పార్వతీ దర్శనముతో 'బట్ట అంటుకొను'ట కామజ్వాలలకు సంబంధించిన వ్యంగ్య చిత్రణము. అయినను నిర్వహణములో కవి కామవాంఛ జ్ఞానోదయముగా మారినట్లు సూచింపబడినది. కవి సంప్రదాయసిద్ధమైన నిర్వాణస్థితి నందుకొన్నట్లు చెప్పబడినది. ఈ గేయములో చివరికి గంభీరవిషయ నిర్దేశమున్నను, అంతకు ముందు కామవాంఛా ప్రకటనము, వికృత విషయకథనము. విచిత్ర భావ

16. కె.వి.ఆర్.నరసింహం - ఆధునికాంధ్రకవితా సమీక్ష - పుట.643

చిత్రణము ప్రధానముగా నున్నందున ఇది అచ్చమైన అధివాస్తవిక గేయమనవచ్చును'' అన్నారు.[17]

అధివాస్తవికత అప్రయత్నరచన అంటారు గాని ప్రయత్నపూర్వకంగానే పాత విలువలను దూషించడం జరిగిందని చెప్పినా తప్పులేదు. సర్రియలిజం స్వభావమే అంత. హెర్బ బర్టు రీడ్ ఇంగ్లండులో ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. అతడు చెప్పిన మాటలను శ్రీశ్రీ ఇలా కోట్ చేశాడు.[18]

''మానవునికి మానసికంగా ఎన్నో శృంఖలాలు ఉన్నాయి. వానిని బట్టే ఊహలు కూడా సంకుచితంగా ఉంటాయి. అందుకే ఆ శృంఖలాలను బ్రద్దలు కొట్టడానికి షాక్‌నిచ్చే రచనలు కావాలి. అదే అధివాస్తవికత''.

షాక్ చెయ్యడానికే రాసిన మౌనశంఖం షాక్ చేస్తుందని ఫిర్యాదు చేయడంలో అర్థంలేదు. నారాయణబాబు తన కవితాదృక్పథాన్ని ఇలా వివరించాడు.[19]

''ఈ కాలంలో వాత్స్యాయనుడూ మనువూకారు మా ఋషులు. మార్క్సు, ఫ్రాయిడ్. యథార్థ జగత్తు, స్వాప్నిక జగత్తు తారుమారయాయి. యథార్థాన్ని గుర్తించము. కలలు మాకు యథార్థాలు. ఈ జగత్తుతో మాకు పనిలేదు. మాది స్వప్నజగత్తు. సంపన్నులూ, భాషాసంపన్నులూ మాకు విరోధులు. కావ్యలక్షణాలే అవలక్షణాలు. అందరం కవులమే. వ్యక్తాన్ని వదిలి పెడతాము. వ్యక్తావ్యక్తంలో ఈత కొడతాము. ఏదోవిధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం. అదేది రాయిస్తే అదే కవిత్వం. ఇది అధివాస్తవికుల మతం. సాహిత్య వృక్షం మీద చిటారికొమ్మన కూర్చొని ఊగిసలాడడం. ఇది సాహిత్యానికి గొప్ప ప్రయోజనం, అనర్థం కూడా సమకూరుస్తుంది. కేవలం ప్రయోజనాన్నే వినియోగించుకొని, అనర్థాన్ని విసర్జించడం కొమ్ములు తిరిగిన కవి చెయ్యగలపని''

నారాయణబాబు చేసిన అధివాస్తవిక రచనలు చాలా కొద్దిగానే ఉన్నాయి. 'మౌనశంఖం' తప్పించి ఇతర రచనలలో అధివాస్తవికత ఛాయలే గోచరిస్తాయిగాని అన్నీ అప్రయత్నాలుగానీ, ప్రయోజన రహితాలు గానీ కావు. దురదృష్టవశాత్తూ నారాయణబాబు రచించిన రుధిరజ్యోతి గ్రూపు కవితలన్నీ అధివాస్తవిక రచనలే అన్న అపోహ మన సాహిత్యలోకంలో బాగా నాటుకొంది. 1940-41లో మౌనశంఖం రచనకు పూర్వం మనస్తత్వ శాస్త్ర ప్రయోగాలతో నారాయణబాబు చెప్పిన కవితలలో కొందరు విమర్శకులు అధివాస్తవికతను చూడడానికి ప్రయత్నించారు. ఆ కవి సాహిత్య ప్రస్థానక్రమం తెలుసుకొనకుండా, పూర్వాపరాలు చూడకుండా ఒక విమర్శకుడు ధైర్యంగా ఇలా అన్నారు.[20]

---

17. సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము - పుట.625
18. అనంతం - పుట.177
19. రుధిరజ్యోతి - ప్రవర - పుట.
20. కె.వి.ఆర్. నరసింహం - ఆధునికాంధ్ర కవితా సమీక్ష - పుట 625

''శ్రీనారాయణబాబుగారికి అధివాస్తవికతా లక్షణములే సరిగా తెలియవని నా అభిప్రాయము, తెలిసినను, వాని నాచరణలో పెట్టుటయందు తబ్బిబ్బుపడిన మాట తథ్యము''.

ఈ విమర్శకుడుగారు 'విమర్శకుల యందు కూడ అధివాస్తవికత నపార్థము చేసికొన్నవారే అధికము' అని చెప్పారు. ఉదాహరణకు నవ్యాంధ్ర సాహిత్యవీధులు కర్తను పేర్కొన్నారు. అయితే మొట్టమొదట తమ పేరునే చెప్పుకొనటం ఉచితం. విశ్వవిద్యాలయాల్లో ఆధునిక కవిత్వంపై పాఠాలు చెప్పడం ఉద్యోగ ధర్మం అయితే కావచ్చుగ్గాని, కూలంకషంగా అధ్యయనం చేయకుండా తెలుగులో నూతన కవితా రీతులన్నింటిమీద తీర్పు చెప్పటానికి పూనుకొంటే అది తమ తక్కువ తెలివిని ప్రదర్శించుకొనడమే అవుతుంది.

నారాయణబాబు కవిత్వం ఇంకొకరు వినిపిస్తున్నప్పుడు బాగుంటుంది. ఎవరికి వారు చదువుకుంటున్నప్పుడు ఏదో వెలితిగా ఉంటుంది. నాలుగు పాదాల చంపకమాలో, ఉత్పలమాలో చదివి దాని అర్థాన్ని నాలుగు మాటల్లో చెప్పుకొనే సాహిత్య సంప్రదాయంలో పెరిగిన జాతికి నారాయణబాబు కవిత్వం ఇలాగ కనిపించడంలో ఆశ్చర్యం లేదు. నాలుగు వృత్తపాదాల్లో చెప్పగలిగినదాన్ని నాలుగు పొడిమాటల్లోనే చెప్తాడు నారాయణబాబు. మానసికంగా బద్ధకస్తులు మంచి కవిత్వాన్ని అర్థం చేసుకోలేరు.

సంప్రదాయకమైన ఛందస్సుపై ఎంత తిరుగుబాటు చేశాడో సంస్కృతిని అంతగా జీర్ణించుకొన్నవాడు నారాయణబాబు. అతడు రాసిన కొన్ని పద్యాలు తెలుగువాడు తప్పించి యింకొకడు రాయలేడు; సంస్కృతి బాగా తెలిసినవాడు తప్ప అర్థం చేసుకోలేడు. మంచి కవికీ, జాతీయమైన కవిత్వానికీ యింతకన్న గొప్ప దాఖలాలు ఇంకేమున్నాయి?

మార్క్స్, ఫ్రాయిడ్ తన ఋషులని చెప్పుకొన్న నారాయణబాబు రానురాను ఫ్రాయిడ్‌వైపే ఎక్కువగా మొగ్గుతున్నట్టు కనిపించే రచనలు చేశాడు. ఇందులో 'రండోయి ఋషులు' ఒకటి. జీవితంలో అడుగడుగునా చూసేవాళ్ళకు కామచిహ్నాలు, ప్రతీకలుగా కనబడుతూ ఉంటే కామం తప్పని ఋషులు ప్రబోధం చేస్తారు. సురపతి, శ్రీపతి, గౌరీపతి కాముకులే అయినా ఋషులు కామాన్ని నిషేధించడానికి ప్రయత్నిస్తారు. భూమిని చాపచుట్టగా చుట్టడం, సముద్రాన్ని అవతల పారెయ్యడం, నక్షత్రాలను మాయం చెయ్యడం, చంద్రుణ్ణి బద్దలు కొట్టడం ఎంత సాధ్యంకాని పనో కామాన్ని బహిష్కరించడం కూడా అటువంటి సాధ్యం కాని పనే అని కవి సూచిస్తున్నాడు.

అధివాస్తవికతను అభిమానిస్తున్నా కేవలం ఆ ధోరణి రచనలకే నారాయణబాబు పరిమితం కాకపోవడానికి కారణం ఉంది. ఫ్రాంసులో ఈ ఉద్యమంలో వచ్చిన విభేదాలు నారాయణబాబుకు తెలుసు. ఆంద్రే బ్రిటన్ అధివాస్తవికత కేవలం ప్రయోగాత్మకంగానే ఉండాలంటే, లూయీ ఆరగాఁ ''మనకు కావలసింది అధివాస్తవికుల స్వాతంత్ర్యం కాదు. ఆకలి బాధలతో ఏడుస్తున్న పసిపిల్లలకు పాలు'' అన్నాడు. దేశదేశాల సాహిత్య ఉద్యమాల గురించి, చెప్పుకోదగ్గ రీతుల గురించి భావాల ధోరణులు ఎవరు చెప్పినా నారాయణబాబు

వినేవాడు. చదివి తెలుసుకొనేవాడు. జీర్ణించుకొని స్వంతం చేసుకొనేవాడు. అందుకే 'ప్రేయసితో నరకానికి' అనే కవితలో బంజరుభూములు పండించాలని సంకల్పించాడు. నరకానికి తనతో వస్తే ఏంచేసేదీ ఇలా చెప్పాడు.

చిత్రగుప్తుని
చిట్టాలన్నీ చింపి
పత్రాలు పకోడీల సుబ్బయ్యా
పొట్లాలకు యిస్తా
యముని మహిషానికి
ఏరుపూసి
బంజరు భూములు దున్నించి
పంటలు పండిస్తా.

నరకం యథార్థమనీ, ఆ బాధలు ఎన్నాళ్ళో ఇంక ఉండవని అతని విశ్వాసం. ప్రత్యక్ష నరకాలు మన పట్టణాలే. పాశ్చాత్య కవులలో టి.యస్. ఇలియట్ లాంటి వాళ్ళు నగర జీవితంలోని డొల్లతనాన్ని బాగా విమర్శించే కావ్యాలు రాశారు. 1940 నాటికి తెలుగు వాళ్ళకు చెప్పుకోతగ్గ నగరమేదీ లేదు. ఉన్న జిల్లా రాజధానులు సైతం పెద్ద పల్లెటూళ్ళకిందే లెక్క. అయితే ఉత్పత్తి సంబంధాలలో మార్పులు వచ్చి బస్తీలు జాస్తికాజొచ్చాయి. విశాఖపట్నం మన పెద్దబస్తీలకెల్లా ముఖ్యమైనది. పారిశ్రామికంగా పరిణామం చెందుతుంది. నారాయణబాబు పట్టణాల బతుకులను విమర్శిస్తూ 'విశాఖపట్నం' అనే కవిత రాశాడు. ఇందులో వెటకారం, వేళాకోళం, పరాన్నభుక్కులపై విసుర్లు కనపడతాయి. పేరుకు ఇది విశాఖపట్నం మీద కవితే అయినా చాలా మట్టుకు ఇందులోని విషయాలు ఆంధ్రదేశంలో ఏ బస్తీకైనా వర్తిస్తాయి. ఉదాహరణకు ఈ పాదాలు చూడండి.

అభిమన్యుడు ప్రవేశించలేని
కొలంబస్సయినా కనుక్కోలేని
దోసెండంత సందుల్లో
గోదావరంత కుళ్ళుకాలవలు

ఈ కవిత ఆధునిక క్రీడాభిరామమని ఒక విమర్శకుడు భావించాడు. ఇది క్రీడాకాదు; అభిరామం అసలే కాదు. వైమర్శిక రామందాడి. అన్ని బస్తీలకు అన్వయించే పాదాలు కొన్ని ఉన్నా ఒక్క విశాఖపట్నానికే చెందిన విషయాలు కొన్ని ఉన్నాయి. పట్టణాలలో దొంగలు ఇంకెక్కడా ఉండరు. మన మనీపర్సులోనే ఉంటారంటాడు.

మద్రాసు చేరుకొన్నాక నారాయణబాబు వచన రచనలు ఎక్కువగా చేయసాగాడు. పత్రికా సంపాదకులు కవితలకన్నా కథలూ, వ్యాసాలే రచయితల నుండి వాంఛిస్తారు. కొమ్మూరి వెంకట్రామయ్యగారు సంపాదకులుగా ప్రచురణకర్తలుగా ఉన్న 'తెలుగు సినిమా' అనే పత్రికలో నారాయణబాబు 'సినిమా సన్యాసి మరణం' అనే పెద్ద కథ రాసి ప్రచురించాడు. ఇందులో శ్రీశ్రీ ఒక పాత్ర (ఆరోజుల్లో నారాయణబాబు కథల్లో శ్రీశ్రీ

పేరూ, శ్రీశ్రీ కథల్లో నారాయణబాబు పేరూ విరివిగా కనపడేవి) ఇద్దరూ ఒకరి రచనలు ఇంకొకరికి వినిపించుతూ ఉండేవారు. ఆరోజుల్లో మద్రాసులోని ఎవరెస్టు హోటేలు ప్రాంతాలలో 'హోటెల్-డి-మద్రాస్' అనే మరో వసతి గృహం ఉండేది. అందులో కిళాంబి రంగాచార్యులుగారు నెలల తరబడి బసచేస్తూ ఉండేవారు. (ఈయన విజయనగరంలో రామానుజాచార్య విద్యా సమితి సంస్థాపకులు. గురజాడ రచనలను సంపుటాలుగా ప్రకటించినవారు. మంచి సాహితీపరులు.) ఆయన గదిలో రోజూ శ్రీశ్రీ, నారాయణబాబు, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, సెట్టి ఈశ్వరరావు మొదలైనవారు సాహిత్య చర్చలు జరిపేవారు. హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి చేసిన మర్నాడే శ్రీశ్రీ ''లేలే రష్యాగీతం'' రాసి ఈ గోష్ఠిలోనే తొలిసారి వినిపించాడు. కాగడా పత్రికలో ప్రచురించడానికి సెట్టి ఈశ్వరరావు దానిని తీసుకొని వెళ్ళాడు. ప్రెస్‌లో ఒక ప్రముఖవ్యక్తి అభ్యంతరం చెప్పడం వల్ల, తాపీ ధర్మరావుగారు మెత్తబడడం వల్ల ఈ గీతం 'పెంకిపిల్ల' పత్రికలో అచ్చుపడింది.

'తెలుగుసినిమా' పత్రికలోనే నారాయణబాబు 'మళ్ళీ పెళ్ళిలో మరిచిపోయిన రీలు' అనే స్క్రీన్‌ప్లే రాశాడు. ఆరోజులలో మన సినిమా నిర్మాతలు విధవా వివాహాలు గురించి సినిమాలు తీశారు. వై.వి.రావుగారు 'మళ్ళీ పెళ్ళి' అనీ; బి.యన్.రెడ్డిగారు 'సుమంగళి' అనీ చలనచిత్రాలు నిర్మించారు. వితంతు వివాహ సమస్యలు ఇట్టే పరిష్కరించారు. వితంతువు నుదుటిమీద బొట్టు పెట్టేస్తే చాలు సమస్య తీరిపోయినట్టే. 'చెలియ కుంకుమమే పావనమే' అని 'మళ్ళీ పెళ్ళిలోనూ', 'పసుపు కుంకుమా-బాలా-నీకూ - జన్మహక్కు కాదా' అని సుమంగళిలోనూ చక్కని సెంటిమెంటులో పాటలు ఉన్నాయి. మోదాంత నాటకాల ఫక్కీ వీటిలో మక్కీకి మక్కీ కనబడుతుంది.

రాచమల్లు రామచంద్రారెడ్డిగారి వంటి విమర్శకులే మోదాంత నాటకాలు ఎలా ఉండాలో అభిప్రాయపడ్డారు.[21]

''వితంతు వివాహానికి అనుకూలంగా ప్రచారం చేయదలచినవాళ్ళు. ఆ సమస్య మీద మోదాంత నాటకం రాయదలచుకుంటే ఒక నాయకుని, వితంతువైన ఒక నాయికనూ సృష్టించి వాళ్ళు పెండ్లి చేసుకోడానికి ప్రయత్నించినట్టు ఆ ప్రయత్నంలో వాళ్ళకు కొన్ని కష్టాలు ఎదురైనట్టూ చివరకు ఆ కష్టాలన్నీ అధిగమించి వాళ్ళు పెండ్లి చేసుకొని సుఖపడినట్టు నాటకం రాస్తారు'' అని వారు రాశారు.

ఇది కేవలం ప్రచారం కోసం, శుద్ధ వినోదం కోసం రాసే పద్ధతి. ఈ పద్ధతిలో గురజాడ కన్యాశుల్కం రచించలేదు. విమర్శకులు ఆయన లోపాలు చూశారు. కన్యాశుల్కం రొటీను నాటకం కాదు. ఆలోచించి రాసినది. ఆలోచింప చేయడానికి రాసినది. వితంతు వివాహ సమస్యపై కూలంకషంగా పరిశోధన చేసే అలా రాశారు. నారాయణబాబులాంటి వాళ్లు అప్పారావుగారి మనస్సును ఎరిగినవాళ్ళు. అందుకే ఆనాటి సినిమాలో చూపించని విషయాలపై ఆలోచించాడు.

21. సంవేదన - జూలై 1969

మళ్ళీ పెళ్ళి చిత్రంలో నాయికా నాయకుల పెళ్ళి జరిగాక వివాహానంతర పరిస్థితులనుగాని, వివాహం చేసుకొన్న వారిని నాటి సంఘం ఏ విధంగా ఆదరించిందోగానీ చెప్పలేదు. ఈ విషయాలను ప్రశ్నించే బాధ్యతను శ్రీరంగం నారాయణబాబు చేపట్టాడు. చిత్రం విడుదలయ్యాక 'మళ్ళీ పెళ్ళిలో మరిచిపోయిన రీలు' అనే పేరు పెట్టి వివాహానంతర సమస్యలను చిత్రిస్తూ చక్కని స్క్రీన్‌ప్లే రాశాడు. దీనిని ఆనాడు కొమ్మూరి వెంకటరామయ్యగారి సంపాదకత్వాన వచ్చే 'తెలుగుసినిమా' పత్రికలో (బహుశా) సీరియల్‌గా ప్రచురించాడు. మరిచిపోయిన రీలును చదివాక చిత్ర దర్శకుడు వై.వి.రావు 'అవును ఈ సమస్యలను సూచించవలసింది' అని వప్పుకొన్నాడు.

అయితే ఒక సమస్యను కూలంకషంగా చర్చించి ఉన్నత కళాత్మక విలువలతో వాచ్యంగాకాక వ్యంగ్యంగా చిత్ర నిర్మాణం చేయడం నేటికీ తెలుగువారికి అబ్బని విద్య. పలాయన వినోదం కావలసినవారికి ఇలాంటి స్క్రీన్‌ప్లే పనికిరాదు. నారాయణబాబు సినిమాలకు ఉపయోగపడలేదు. మద్రాసులో ఉన్నప్పుడు కొన్ని సినిమాలతో సంబంధం లేకపోలేదుగాని అవి తనకుగాని, వారికిగాని లాభించలేదు. ఆమంచర్ల గోపాలరావుగారు తీసిన 'ఒకరోజు రాజు'లో ఏదో వేషం వేయడానికి నారాయణబాబు బొంబాయి కూడా వెళ్ళాడు. ఆ చిత్రం ఆడిందో లేదో కూడా తెలియదు.

నారాయణబాబు సినిమాలకే కాదు నాటకాలకు కూడా ఉపయోగపడలేదు. అతడు కొన్నాళ్ళు అబ్బూరి రామకృష్ణారావుగారి 'నటాలి' అనే నాటక కంపెనీలో ఉద్యోగం చేశాడు. చెఖోవ్ రచించిన 'చెర్రీ ఆర్చర్డ్' అనే నాటకాన్ని ఆ కంపెనీ కోసం అనువదించాడు. అయితే ఆ తర్జుమా అబ్బూరి వారికి నచ్చలేదు. ఇంకొకరి కోసం కాక తనకోసం తన రచనలుగానీ, అనువాదాలుగానీ చేసుకోవాలనే సత్యం నారాయణ బాబుకు స్వానుభవమైంది.

నారాయణబాబు మద్రాసులో ఇమడలేక మళ్ళా విజయనగరం వెళ్ళాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాక మళ్ళా చెన్నపట్నం చేరుకున్నాడు. దారిలో ఎన్నో మజిలీలు. ఎందరితోనే సఖ్యాలు. అతడు పెద్దలతో చిన్నలతో ఒక్కలాగ మసలగలడు. తల్లావఝల శివశంకరశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి 'తలలో నాలుక'లా ఉండగలడు. అనిసెట్టి సుబ్బారావు, ఆవంత్స సోమసుందర్, రెంటాల గోపాలకృష్ణ, ఆలూరి బైరాగి వంటి యువకులతో సాయిలా పాయిలాగా ఉండగలడు. తక్కిన కవులు ఈర్ష్య చిందేటంత గొప్పగా నారాయణబాబును శివశంకర శాస్త్రిగారు ఆకాశానికి ఎత్తేసేవారు. కృష్ణశాస్త్రిగారికి బుజ్జాయి అనే కుమారుడున్నాడు. అయితే నారాయణబాబును 'పెద్ద బుజ్జాయి' అనేవారు. ఒకసారి ఆనందవాణి ప్రత్యేక సంచికలో నారాయణబాబు 'చెన్నపట్నంలో చెట్లమీద కాపురం' అనే కథ రాశాడు. అందులో మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఒక పాత్ర.

అనిసెట్టి సుబ్బారావు, నారాయణబాబు మద్రాసు మైలాపూర్ కచేరి రోడ్డులోని ఒక గదిలో కలిసి జీవించేవారు. సుబ్బారావే నారాయణబాబు కవితలను కొన్ని సేకరించి

'కల్పన' అనే నవ్య కవితా సంకలనంలో 1954లో చేర్చి ప్రచురించాడు. ఆవంత్స సోమసుందర్ నారాయణబాబుకోసం పిఠాపురంలో సభలను పెట్టించాడు. ఉత్తరోత్తరా 'రుధిరజ్యోతిర్దర్శనం' అనే గ్రంథం రాశాడు. రెంటాల గోపాలకృష్ణ తన పద్యాల సంకలనం 'సంఘర్షణ'కు నారాయణబాబు చేత పీఠిక రాయించుకొన్నాడు.

మన ఆధునిక కవులలో బైరాగి ఒక్కడే నారాయణబాబుని సరిగ్గా అర్థం చేసుకొన్నవాడేమో అనిపిస్తుంది. నారాయణబాబు గదిలో అతడు చాలారోజులు చర్చలు జరిపేవాడు. చివరకు అతని మీద ఒక గొప్ప గీతం రచించాడు. (ఇది 'ఆగమగీతి'లో చేర్చాడు). చూడండి ఆ పద్యం.

"And his death only a symbol'
సంజ్ఞ సరిహద్దున లోమాంచాల లోయలోన, -
- నీడలు కూడే చోట
గడియారపు ముండ్ల జంట కడపటి కౌగిలిలో
- మత్తిలి మసకలాడే చోట
అగణితగణిత చిహ్నాలు, ఆకాశపు శాఖలపై పొంచి -
- చంక్రమించే చోట
వివేకపు విరిగిన గద్దెపైన, అరాచకపు రాచరికాన
తలక్రిందుగ తపస్సు చేస్తున్నవాడు
జాడీబీడీల చండహోమ ధూమకుండలిలోంచి
ఖండిత ఖడ్గమృగాలు, గండర గండ భేరుండాలు -
- చూస్తున్నవాడు
ఆకలిని మేస్తున్నవాడు
భూతాభూత జ్యోతిష్కుడు. సంతతాన్య చేతస్కుడు
అతడే ఊర్ధ్వరేతస్కుడు, హర్షామర్షాలు లేని మహర్షి
ఉద్గ్రంథాలు తలదిండ్లుగ నాడు నేడులు క్రీడించిన
- చింకిచాప
అప్సరసల సవాయిహోయి, స్వాప్నిక సంయోగాల-
-స్వేదదుర్భర జాగరణాలు
కాశీమజిలీల కథల రాశీభూత సురతశ్రమలు
పౌరాణికపు పయోరియా ఊసే బోసినోట-
- కదలే కవితా క్రిములు
ఎండిన ఇసుకపై కోరిక కుంటిచేప
అంతరంగపుటరలలో ఉపనిషత్తులు, మార్క్సు, ఫ్రాయిడ్,
వాత్స్యాయనుడు, హెవలక్ ఎలిస్, లీలావతి, -
-అయిన్‌స్టీన్, కాళిదాసు, జేమ్సుజాయిస్
ఆదిమ నిషాదుని విషాదానికి బీటనిక్కుల-
- నిషా శ్లోకు

అవచేతనపు టెక్సరేలో, ఈడిపస్ కాంప్లెక్స్
గర్భకోశపు ద్వీపటిలో, తల్లివంటి చీకటిలో
స్వరతి నిరత బాలకుడు, దోషకశాచాలితుడు

అతని మనసు క్యూబిస్టు బేబిలోను-
వెర్రిపీరులు, శివలింగాలు, సింధూర చర్చిత శిలలు
రక్తాంబరధారుడాతడు, రక్తాక్షుడు, ఆదిశక్తి ఆరాధకుడు
జీవిత శ్మశానంలో కవితా శవసాధన చేస్తున్నాడు
ఝల్లుమనే కంకాళాలు, ఘల్లుమనే కపాలాలు
గుహ్యాతాంత్రిక గుహలలో భైరవ మంద ప్రతిరవాలు
ఆటవిక పటహ ఘోషలు, ... టోటెమ్లూ
అగ్నిచుట్టు నర్తించే దిగంబర శూలధరులు
ఆఫ్రికాలో అర్ధరాత్రి

నిర్జన మానసాన అడుగులసడి పడిపడిమ్రోగ
నీడల్లో ఒదిగి ఒదిగి పోతున్నాడు నేరస్తుడు
హఠాత్తుగా సందు మలుపు తిరుగగానే
బుగ్గమీసాల సత్తేదారు 'హేండ్సప్' అని అరచాడు

కావ్యానికి కావ్యమే వ్యాఖ్యానమవుతుందంటారు. బైరాగి రాసిన పై పద్యం నారాయణబాబు రుధిరజ్యోతి గీతాలకే కాక అతని వ్యక్తిత్వానికీ, వైదుష్యానికీ విలక్షణత్వానికీ చక్కని రన్నింగ్ కామెంటరీ.

నారాయణబాబు జీవితకాలంలో అతని రుధిరజ్యోతి గ్రూపు కవితల సంకలనం గ్రంథరూపంలో రాలేదు. కవితలు ఏవేవి ఈ గ్రంథంలో చేర్చాలో, ఏక్రమంలో చేర్చాలో చెప్తానంటూనే జాప్యం చేశాడు. చిట్టచివర ''అదంతా నువ్వు చూసుకోరా'' అని తన కవితల నోట్‌బుక్ ఒకటి చాలా చిన్నది నాచేతికిచ్చాడు. (ఇది 112 పేజీలున్న చిన్న పోకెట్‌సైజు నల్లనోటు పుస్తకం. ఇందులో 32 శీర్షికలున్నాయి. చాలా కవితలు నారాయణబాబు స్వహస్తలిఖితాలే. ఒక అరడజను మాత్రం చాగంటి సోమయాజులుగారి దస్తూరిలో ఉన్నాయి. నేను ఇంకో ఎనిమిది కవితలు సేకరించి సంకలనంలో కవితల సంఖ్య నలభైకి పెంచాను). 1972లోగాని 'రుధిరజ్యోతి' గ్రంథరూపంలో తీసుకురాలేకపోయాను.

నారాయణబాబు చాలా కథలు, వ్యాసాలు రాశాడు. వివిధ పత్రికలలో అవి అచ్చుపడ్డాయి. వాటిని అతడు జాగ్రత్త చేయలేదు. ఇంకెవరూ సేకరించలేదు. వేటపాలెం వంటి గ్రంథాలయాలు వెతికితే కొన్ని కాకపోయినా కొన్నయినా దొరకవచ్చు. అయితే నారాయణబాబు వచన రచనలకన్నా అతని కవితలే అతని ప్రత్యేకతకు ప్రాతినిధ్యం వహిస్తాయి. శ్రీశ్రీ సరసన అతనిని నిలబెడతాయి. శ్రీశ్రీ, నారాయణబాబుల కవితలు తులనాత్మకంగా విశ్లేషించిన రోణంకి అప్పలస్వామిగారు ఇలా రాశారు.[22]

22. రుధిరజ్యోతి - ప్రస్తావన - పుట.1

''శ్రీశ్రీ పేరు వినగానే నారాయణబాబు, నారాయణబాబు పేరు వింటే శ్రీశ్రీ మనకు చటుక్కున స్ఫురిస్తారు. దీనికి కారణం ఏమయినా, వీరి కవిత్వపు పోకడలు మాత్రం వేర్వేరు. స్వీకరించిన కవితా వస్తువు ఒక్కొక్కచో ఒకటే కావచ్చును. కాని వారు దర్శించే పద్ధతులు, వ్యక్తీకరించే రీతులు మాత్రం విభిన్నములు. ఇందులో ఇరువురికీ ఏ మాత్రం పోలికలు కనిపించవు. ఉద్రేక జనితాలయిన శక్తులు, స్వీకరించిన దృక్పథం, విభిన్నాలు. పరిగ్రహించిన అలంకారాలలో, శబ్దప్రయోగంలో ఎవరిత్రోవ వారిది, ఎవరిపోకడ వారిది. శ్రీశ్రీ స్థూలదృష్టికి కూడా దొరుకుతాడు. నారాయణబాబు కొన్ని తావులలో సూక్ష్మ దృష్టికి వినా స్పష్టం కాడు. నోటికి పట్టే ఛందస్సులతో శ్రీశ్రీ పరుగులు తీస్తాడు. తన లక్ష్యాన్ని ప్రత్యక్ష పద్ధతిని వ్యక్తం చేస్తాడు. నారాయణబాబు పరుగులో శ్రీశ్రీకి గల ఉద్వేగం లేదు. అతనిది పరోక్షపద్ధతి''.

ఇప్పుడిప్పుడు శాస్త్రజ్ఞులు కనిపెడుతున్నారట. అతి చిన్నమాత్రలలో ఇమిడే ఆహారాన్ని. నారాయణబాబు పద్యాలు ఇలాగే ఉంటాయి. అయితే ఆ మాత్రలను మాత్రమే భుజించితే కావలసిన సత్తువ ఉన్నా కడుపు నిండదు. అలవాటు పడ్డ పేగులు అనవసరమైన దాన్ని తినక తప్పదట. ఆహార విషయంలో ఈ అనవసరపు తిండి ఏనాడు తినడం తప్పుతుందో ఆంధ్ర సాహిత్యంలో నారాయణబాబు వ్రాసిన అతిచిన్న పాదాల మాత్రల కవిత్వం అర్థమై అరుగుతుంది; అందరూ ఆదరించేదవుతుంది.

కవిత్వంలోనే అరాచకవాది. సాహిత్యంలోనే విప్లవకారుడు. నారాయణబాబు వ్యక్తిగత జీవితంలో నియమాలూ నిష్టలూ ఉన్నవాడు. తెల్లకాగితం లాంటి ఒంటరి జీవితం మీద చక్కగా రూళ్ల గీసుకొని గుండ్రంగా కుదురుగా ఉన్నంతలో బ్రతికాడు. సుమతీ శతకకర్త సుభాషితాన్ని సూటిగా అమలుపర్చినవాడు. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగిన ధన్యుడు.

తేనెటీగ, గాలిపడగ మనకి రికామిగా ఉన్నట్టు కనపడవచ్చు. నారాయణబాబు అలాంటివాడే. పట్టును చేరని తేనెటీగ. తెగినా పడిపోని గాలిపడగ.

ఉన్నట్టుండి ఈ తేనెటీగ, గాలిపడగ 'ఫ్రీజ్' అయిపోయాయి. 1965 జనవరి రెండవ తేదీనాడు నారాయణబాబు కీర్తిశేషుడయ్యాడు. అతని అంత్యక్రియల గురించి శ్రీశ్రీ ఇలా రాశాడు.[23]

''గిడుగు రామమూర్తి అంత్యక్రియలు జరిగిన మైలాపూర్ శ్మశానంలోనే నారాయణబాబుకి ఆరుద్రా, నేనూ ఆఖరి వీడ్కోలు చెప్పాము. నారాయణబాబు తెలుగు సాహిత్యాకాశంలో ఒక ధూమకేతువు. ఎలా వచ్చాడో ఎలా వెళ్ళిపోయాడో ఎవరికీ తెలియదు.

''మృత కళేబరానికి పురోహితుడు స్నానం చేయిస్తూ ఉంటే ఆరుద్ర గ్రుడ్లనిండా నీళ్ళు క్రక్కుకుని నావేపుచూస్తూ 'నారాయణబాబు లేడు!' అన్నాడు. నా కళ్ళు పొడిగానే ఉన్నాయిగాని గుండెల్లో బాధగానే ఉంది. ఆరుద్ర మాటలు నామనస్సులో మౌనంగా ప్రతిధ్వనించాయిగాని పైకి అనడానికి నోరు పెగలలేదు.

23. అనంతం – పుటలు 289–290

''మా జేబుల్లోంచి కనిపిస్తున్న కరెన్సీ నోట్లను చూసి పురోహితుడు నారాయణబాబు కులగోత్రాదులు చెప్పమన్నాడు. 'ఆయన వాటిన్నిటికీ అతీతుడు' అన్నాడు ఆరుద్ర.

''నారాయణబాబు అస్థికలను మరునాడు కావేరిలోనో, గోదావరిలోనో కలుపుతానన్నాడు పురోహితుడు. 'ఎదురుగానే మహాసముద్రం ఉంది. అందులో కలపండి' అన్నాన్నేను''.

మంచి కవి భౌతిక కాయం పంచభూతాలలో కలిసిపోయింది. అతని మరణం గురించికాక జీవిత దృక్పథం గురించి కూడా శ్రీశ్రీ చెప్పాడు.

శ్రీశ్రీతో నారాయణబాబు ఎప్పుడూ అంటూ ఉండేవాడు. ''ఒరే తమ్ముడూ బతుకే ఎలా బతకడమో నేర్పుతుందిరా!'' అని. బతుకునుంచి ఎలా బతకడమో మాత్రమేకాక ఎలాగ రాయాలో కూడా నారాయణబాబు నేర్చుకొన్నాడు. ముమ్మటాచార్యుడు చెప్పిన ''కావ్యం యశసే అర్థకృతే వ్యవహార విదే శివేతరక్షతయే'' అన్న జాబితాలో శ్రీశ్రీ 'శివేతరక్షతి'నే ధ్యేయంగా పెట్టుకొన్నానన్నాడు. నారాయణబాబు తానుకాక తన పాఠకుడు తరించడానికే కవిత్వమనుకొన్నాడు. అందుకే ఇలా అంటాడు.

ఈ ప్రపంచ
జీవన వైతరణి
దాటేందుకు
నీకోసం
నేచేసిన
గోదానం
నాగీతం

ముమ్మటుడు. నారాయణబాబు తన స్వీయచరిత్రలో సజీవ పాత్రలే అని శ్రీశ్రీ అభిప్రాయం. ఈ మాటతో ఏకీభవించని విమర్శకులు ఉంటారు. అందుకే శ్రీశ్రీ ఇలా రాశాడు.[24]

''వెంటనే అందుకుంటాడు నీ విమర్శకుడు 'ముమ్మటయ్యా బతికున్నాడా? నారాయణబాబు బతికున్నాడా? అని వెధవాయీ, నీకన్నా నాకన్నా మిన్నగా ఆ యిద్దరూ బతికే ఉన్నారురా' అని జవాబు'' అంటాడు శ్రీశ్రీ.

నారాయణబాబు కవితలు బతికి ఉంటాయి.

రుధిరజ్యోతి వెలుగుతూనే ఉంటుంది.

మౌనశంఖం మోగుతూనే ఉంటుంది.

---

24. అనంతం, పుట.79

శ్రీరంగం శ్రీనివాసరావు

(1910-1983)

అందరికీ ఆశలుంటాయి, వాళ్ల కలలు కంటూరు. కొందరికి ఆశయాలుంటాయి. వాటిని వాళ్లు ఆచరణలో పెడతారు. కొందరి కలలు పండుతాయి. కొందరి ఆశయాలు సిద్ధిస్తాయి. ప్రతికవీ తాను రాసేది తోటివారు మెచ్చుకోవాలని ఆశిస్తాడు. ఆత్మవిశ్వాసంగల కవీ మాత్రం తన గీతం తన జాతి జనులు పాడుకొనే మంత్రంగా మోగించాలని కోరుకొంటాడు. ఈ కోరిక ఏ ఒక్క మహాకవికో తీరుతుంది. ఆదిలో గురజాడ అప్పారావుగారు 'మేటివారల మాటలనియెడి మంత్ర మహిమను జాతి బంధములన్న గొలుసులు జారి, సంపదలబ్బుతా'యని చెప్పారు.[1] (కవిత్వంలో పురాగాథ, మంత్రచర్య, కళ కలసి ఉంటాయన్న అనాది తత్త్వాన్ని మార్క్సిస్టు మేధావులు విశ్లేషణ చేసి తేల్చారు)[2] గురజాడ అప్పారావుగారి తరువాత వచ్చిన భావకవిత్వంలో కొందరు ప్రసిద్ధుల రచనలు ప్రాచుర్యం పొందినా జాతీయోద్యమంలో గరిమెళ్ళ సత్యనారాయణ గారి పాటా, అభ్యుదయోద్యమంలో శ్రీరంగం శ్రీనివాసరావు 'మరో ప్రపంచం' మాత్రమే జాతి జనులు పాడుకొనే మంత్రాలస్థాయిని సంపాదించుకొన్నాయి.

శ్రీరంగం శ్రీనివాసరావు తన కవితా ప్రస్థాన కథను కథనం చేస్తూ అతడు 1930కి పూర్వం వ్రాసిన పద్యాల గురించిగాని, 1950 తర్వాత రాస్తున్న రచనల గురించిగాని అక్కడ ప్రస్తావించలేదు.[3] అంటే అతని ఉద్దేశంలో కూడా ఈ రెండు దశాబ్దాల మధ్య అతడు రచించిన కవితలే అతని విలక్షణత్వానికేకాక, మొత్తం అభ్యుదయోద్యమానికి ప్రాతినిధ్యం వహించే సాహిత్యమన్నమాట. ఈ రెండు దశాబ్దాలలో అతడు రాసిన వాటి గురించి విపులంగా విశ్లేషణ చేయడం సాహిత్య చరిత్రకారులకూ, సిద్ధాంత విమర్శకులకూ ఎంత అవసరమైనా 1930కి ముందు ఏయే కారణాలవల్ల శ్రీరంగం శ్రీనివాసరావు తన తరానికి ప్రాతినిధ్యం వహించే కవిగా రూపొందగలిగాడో (టూకీగానే కావచ్చు) తెలుసుకొనడం ముఖ్యం.

శ్రీరంగం శ్రీనివాసరావు 1910లో విశాఖపట్నంలో జన్మించాడు. అతని తండ్రిపేరు శ్రీరంగం వెంకట రమణయ్యగారు. ఆయన గణితశాస్త్రజ్ఞుడు. విశాఖపట్నంలోని ఎ.వి.ఎన్. కాలేజికి అనుబంధంగా ఉన్న హైస్కూలులో మొదట ఉపాధ్యాయునిగా, తర్వాత హెడ్మాస్టరుగా పనిచేశారు. ఆ కాలేజికి పి.టి.శ్రీనివాస అయ్యంగారు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆయనే ఏట్సు దొరతో, గిడుగు రామమూర్తిగారితో, గురజాడ అప్పారావుగారితో కలిసి తెలుగులో వాడుక భాషావాదాన్ని 1920లో ప్రారంభించారు. శ్రీరంగం వెంకటరమణయ్యగారికి శ్రీనివాస అయ్యంగారంటే చాలా గౌరవం. దానిని

---

1. ముత్యాలసరాలు - పుట.4
2. జార్జి థాంప్సన్ - Marxism and poetry' లోనూ, "The Human Essence" (P.70-72) లోనూ
3. అనంతం - పుట. 186

ప్రకటించుకొనడానికే తన కుమారునికి శ్రీనివాసరావు అనే పేరు పెట్టుకొన్నారని ఉత్తరోత్తరా శ్రీనివాసరావే సహేతుకంగా ఊహించాడు.[4]

శ్రీనివాసరావుకు ఏణ్ణర్థం వయసులో తల్లి అప్పల కొండమ్మ చనిపోయింది. తల్లిలేని ఈ బిడ్డకు ఎందరో స్థన్యమిచ్చారు. అటువంటి వారు లభించనప్పుడు మేకపాలు పట్టేవారు. అందుకోసం ఇంట్లో ఒక మేక ఉండేది. శ్రీరంగం వెంకటరమణయ్యగారు రెండోపెళ్లి చేసుకొన్నారు. గజపతి నగరంలోని ఒక తాసిల్దారుగారి కుమార్తె. పేరు సుభద్రమ్మ. శ్రీనివాసరావును కన్నకొడుకులాగే ఈ సవతితల్లి పెంచింది. ఆమె పెంపకంలో తనకు చిన్నప్పుడు తల్లిపోయిన సంగతి తెలియదు.

శ్రీనివాసరావుకు అయిదవయేట 1915లో తిరుపతిలో ఉపనయనం చేశాక, ఆ యేడే విశాఖపట్నంలో అక్షరాభ్యాసం చేశారు. విశాఖపట్నంలో గోదావరయ్యబడిలో శ్రీనివాసరావు ఓనమాలు దిద్దాడు. 1918లో ఎనిమిదవ యేట శివరామయ్యగారి స్కూల్లో శ్రీనివాసరావు ప్రాథమికవిద్య అభ్యసించాడు. 1920దాకా ఈ బడిలోనే చదువుకొన్నాడు. ఇంగ్లండులో ఈటన్ స్కూలు ఎలాంటిదో, విశాఖపట్నంలో ఈ స్కూలు అలాంటిదన్న భావం శ్రీనివాసరావుకు ఉంది.[5] ఇక్కడ చదువుకొంటున్నప్పుడే ఏ పాఠ్య పుస్తకంలో చూశాడో గాని కందపద్యంలో ఒక పొట్టిపాదం తర్వాత ఒక పొడుగుపాదం, పిమ్మటో పొట్టిపాదం దానితోపాటు మరో పొడుగుపాదం ఉంటాయని శ్రీనివాసరావు గ్రహించాడు. యతిప్రాసలు లేకుండా పొట్టిపొడుగు పాదాలు ఒకటి తర్వాత ఒకటి రాసి తాను కందపద్యం చెప్పానని మురిసిపోయాడు.

తన కుమారునిలో ఉన్న పద్యాల ఉబలాటాన్ని వెంకటరమణయ్యగారు చూశారు. సంస్కృతం నేర్పించాలని కేతవరపు వెంకటశాస్త్రి దగ్గరకు కుర్రవాడిని పంపించాడు. అది మూడునాళ్ళ ముచ్చటే అయింది. తర్వాత వెంకట రమణయ్యగారు సులక్షణసారం కొని కుర్రవాడికి ఇచ్చి ''ఆది మధ్యావసానేషు'' వంటి సులువు సూత్రాలను కంఠతా పెట్టించారు. ''యమాతారాజభానసలగం'' అన్నది కూడా నేర్పే ఉంటారు. వెంకట రమణయ్యగారు పేరుకు లెక్కల మాస్టరేగాని సాహిత్య పరిచయం గలవారే. ఆనాడు విశాఖపట్నంలో ప్రముఖకవిగా పేరుపొందిన వారిలో సెట్టి లక్ష్మీనరసింహంగారిని సెట్టి మాస్టారనీ, వెంకట రమణయ్యగారిని రమణయ్య మేస్టారనీ పిలిచేవారు. శ్రీనివాసరావుకు సెట్టి మాస్టారి దగ్గర కూడా తండ్రి దగ్గర ఉన్నంత చనువు ఉండేది.

సెట్టి మాస్టారి స్నేహం వల్ల రమణయ్య మాస్టారికి నాటకాలంటే అభిమానం కలిగింది. ఆదిలో సెట్టి మాస్టారు విశాఖపట్నంలో మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు), మరొకరూ కలసి 1895లో 'కళాభిలాషక సమాజం' అనే సంస్థను స్థాపించి నాటకాలు ఆడేవారు. విశాఖపట్నంలోనే అంకితం జగ్గారావుగారు 'జగన్మిత్ర సమాజం' అనే నాటకాల కంపెనీని అదే కాలంలో నడుపుతూ ఉండేవారు. సెట్టిమాస్టారు ఈ అంకితంవారి కాలేజికి సంబంధించిన హైస్కూలుకే హెడ్మాస్టరయ్యారు. సహజంగా అంకితం వారి జగన్మిత్రలో

4. అనంతం – పుటలు 35–36
5. అనంతం – పుట.33

నాటకాలు వేయడం సెట్టిమాస్టారికి అవసరమైంది. కళాభిలాషక సమాజాన్ని విడిచి ఆయన జగన్మిత్రలో పాల్గొనేవారు. హైస్కూలు హెడ్మాస్టరుగిరికి రాజీనామా ఇచ్చి 'లా' ప్యాసై రాజా విక్రమదేవవర్మగారి అంతరంగిక కార్యదర్శి అయ్యాక, సెట్టిమాస్టారికి జగన్మిత్రతో సంబంధం మరీ ఎక్కువైంది. 1900 ప్రాంతంలోనే విక్రమ దేవవర్మగారు జగన్మిత్ర సమాజభారాన్ని వహించారు.[6] తాటితోపాటు దబ్బనంలాగ సెట్టిమాస్టారూ అనుసరించారు.

జగన్మిత్ర నాటక సమాజంలో బాలపాత్రలు వేయడానికి పిల్లలు కావలసి వచ్చారు. సెట్టి మాస్టారు తమ స్నేహితులైన రమణయ్య మాస్టారి అబ్బాయిచేత ఆ వేషాలు వేయించాలని తలచారు. శ్రీనివాసరావు తండ్రి అనుమతితో చాలా బాలవేషాలు వేశాడు. కుశలవలో కుశుడు పాత్ర వీటిలో ఒకటి.

తన నాటకాల అనుభవం గురించి శ్రీనివాసరావు తన స్వీయచరిత్రలో ఒకచోట ఇలాగ రాశాడు.[7]

''నేను విశాఖపట్టణంలోని జగన్మిత్ర సమాజంలో ఒక బాలనటుణ్ణి. మాకు పోటీగా రాజరాజేశ్వరీ నాటక సమాజం వారు, అంతమందీ చిన్నపిల్లలతో 'బాలురసావిత్రి' అనే నాటకం ప్రదర్శించి మార్కులు కొట్టేస్తూ ఉండేవారు. అందులో సావిత్రి వేషం వేస్తూ ఉండే సి.హెచ్.ఎల్.ఎన్.మూర్తి నాకు మంచి స్నేహితుడు. వాడి ప్రక్కన సత్యవంతుడు వేషం వెయ్యాలని నాకు చాలా ఆశగా ఉండేది. ఇది ఫలించే ఆశకాదని నాకు తెలుసు. ఎందుచేతనంటే మావి రెండూ పోటీ నాటక సమాజాలు. ఈ సమాజం మీద కాకి ఆ సమాజం మీద వాలేదికాదు. అయినా ఆరోజుల్లో నేను 'సావిత్రీ సత్యవంతుడు' అని ఒక ముప్ఫయి నలభై పేజీల నాటకం రాశాను. ఛందస్సు మీద అప్పుడప్పుడే కొంత అధికారం సంపాదిస్తున్న రోజులవి. అందుచేత నాటకంలో సగానికిపైగా పద్యాలే రాశాను. నాకోసం రాసుకొన్నదయినా అందరి పాత్రలకూ ఔచిత్యాన్ని బట్టి పద్యాలను పంచి పెట్టానే తప్ప, సత్యవంతుడికి మరీ ఎక్కువగా పద్యాలు ఇవ్వలేదు. చిన్నప్పటి నా ఎన్నో రచనలలాగే ఈ నాటకం కూడా కాలగర్భంలో కలిసిపోయింది''.

మరీ చిన్నప్పుడు ఎక్కువగా వచనం, ముఖ్యంగా డిటెక్టివ్ నవలలు చదివే శ్రీనివాసరావు క్రమంగా తెలుగు కావ్యాలు చదవడం ప్రారంభించాడు. తన మేనబావ భాగవతుల నరసింగరావూ, అతనూ కలిసి మనుచరిత్ర చదువుకొన్నారు. ఇద్దరికీ అది కంఠోపాఠమే. మనుచరిత్రకన్నా వసుచరిత్ర గొప్పదని బహుశా సెట్టిమాస్టారు శ్రీనివాసరావుకు చెప్పారు.[8] అందుచేత వసుచరిత్రను కూడా శ్రీనివాసరావు అధ్యయనం చేయసాగాడు.

వసుచరిత్ర కాకుండా సెట్టి మాస్టారికి చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారంటే ఎనలేని అభిమానం. ఒకసారి చెళ్లపిళ్లవారు కంటి వైద్యం నిమిత్తం విశాఖపట్నం వచ్చి తన శిష్యుడైన పింగళి లక్ష్మీకాంతంగారి ఇంట్లో దిగారు. అప్పుడే కొత్తగా విక్రమదేవవర్మ గారికి

6. పి.ఎస్.ఆర్. అప్పారావు - తెలుగు నాటక వికాసం - పుట.516
7. అనంతం - పుట 287
8. అనంతం - పుట. 120

జయపురం సంస్థానం దఖలు పడింది. సెట్టి మాస్టారు జయపురం ఆస్థానకవి. ఎలాగైనా శాస్త్రిగారిచేత శతావధానం చేయించాలని విక్రమదేవవర్మగారి తరపున ఆహ్వానించడానికి సెట్టి మాస్టారు వెళ్ళారు. వారితోపాటు శ్రీనివాసరావు కూడా వెళ్ళాడు. చెళ్లపిళ్లవారిని చూడ్డం శ్రీనివాసరావుకు అదే మొదటిసారి. అవధానం చేసే ధారణాశక్తి తమకు లోపించిందని, కావలిస్తే ఒక గంట ఉపన్యసిస్తామని వారు చెప్పారు. నిజానికి ఆ సాయంత్రం 'హవామహల్'లో మూడు మొదలు అయిదుగంటలసేపు అనర్గళంగా ఉపన్యసించారు. ఆ ఉపన్యాసాన్ని శ్రీనివాసరావు ఎన్నటికీ మరవలేదు. కవిత్వం అంటే ఏమిటో వివరిస్తూ చెళ్లపిళ్లవారు ఉపన్యాసం ప్రారంభించారు. ''రాతిరియున్ పవల్ మరపురాని హొయల్'' అని పెద్దనగారి పద్యపాదాన్ని ఉదాహరిస్తూ ఎప్పుడూ మరపురానిదే కవిత్వం అన్నారు. ఈ కవిత్వ ఉపన్యాసం శ్రీనివాసరావును ఉత్తేజపరిచింది.[9] కవిత్వ రహస్యాలు తెలుసుకొనసాగాడు.

శ్రీనివాసరావుకు పదిహేనో ఏడు వచ్చేనాటికి సలక్షణంగా గీత పద్యాలు రాయడం అలవడింది. ఆరోజుల్లో విశాఖపట్నంలో 'స్వసంఘం' అనే సంస్థ; దాని తరఫున 'స్వశక్తి' అనే పత్రికా ఉండేవి. సంఘానికి కార్యదర్శిగా, పత్రికకు సంపాదకునిగా పురిపండా అప్పలస్వామిగారు ఉండేవారు.

స్థానిక పత్రిక 'స్వశక్తి'లో ప్రచురణార్థం శ్రీనివాసరావు 'విశ్వరూప సందర్శనము' అనే గీతమాలికను 1925లో రచించాడు. (మాలికలు రాయడం సెట్టి మాస్టారి ప్రభావం వల్ల. ఆయన ఏది రాసినా మాలికలే ఎక్కువగా రాసేవారు). కౌరవసభలో శ్రీకృష్ణుడు తన విశ్వరూపం ప్రదర్శించినప్పుడు ధృతరాష్ట్రుని ప్రార్థన ఏమిటో ఈ గీతమాలిక చెపుతుంది.

'ఓ మహాత్మ! త్వదీయ మహోన్నత ప్ర
భావమింతని పలుక నెవ్వాని తరము?
....
దివ్యలోచనముల ప్రసాదింపుమయ్య!

ఈ గీతమాలికను పట్టుకొని శ్రీనివాసరావు 'స్వశక్తి' కార్యాలయంకు వెళ్ళాడు. అదే అతని మొట్టమొదటి పద్యరచన. దీని ప్రచురణ గురించి శ్రీనివాసరావు ఒకచోట ఇలా రాశాడు.[10]

''పురిపండాతో నా ప్రథమ పరిచయం ఈ గీతమాలిక ద్వారానే. దీన్ని తీసుకువెళ్ళి పురిపండాకు ఇచ్చాను. అప్పుడు నా వయస్సు 15, 16 ఏళ్ళలోపు. చూడ్డానికి ఇంకా చిన్నవాణ్ణిగా కనపడేవాణ్ణి. పురిపండా నన్ను ఒకసారి ఎగాదిగా చూసి, చేతిలోని వ్రాతప్రతి చదువుతూ ఆగి, ''శ్రీరంగం శ్రీనివాసరావు అంటే ఎవరు? మీ అన్నయ్యా?'' అని అడిగారు. ''నేనే'' అంటే ఆశ్చర్యపోయాడు. రాసింది నేనే అని నమ్మలేకపోయాడు. అలా జరిగింది మా తొలిపరిచయం. తర్వాత, తర్వాత నేనేది రాసినా పురిపండాకి చదివి వినిపించేవాడిని''.

9. అనంతం - పుట. 139
అనంతం - పుట. 273

1925లోనే స్థానిక పత్రికలో శ్రీనివాసరావు రచనలు అచ్చవుతూ ఉంటే ఆ మరుసటి సంవత్సరమే అతని పద్య రచనలు భారతిలో ప్రచురణ కావడం మొదలెట్టాయి. భారతి గురించి శ్రీనివాసరావు చాలా మెచ్చుకొంటూ ఒకచోట ఇలా రాశాడు.[11]

''అందులో నీ పద్యం పడిందంటే కవిగా నీకు సాహిత్యలోకంలో జాగా దొరికిందన్నమాట. కథ పడిందంటే కథకుడుగా నిన్ను లోకం గుర్తించిందన్నమాట. విమర్శ వ్యాసం రాశావంటే, నీ అభిప్రాయాలు విలువయినవన్నమాట. నీ పుస్తకాన్ని ఆ పత్రిక మెచ్చుకున్నదంటే, నువ్వు గొప్ప రచయితవి''.

భారతిలో తొలిసారిగా ప్రచురితమైన శ్రీనివాసరావు రచన పేరు 'సమరాహ్వానము', మహాభారత యుద్ధంలో చిట్టచివర దుర్యోధనుడు వంటరివాడై ప్రాణరక్షణ కోసం మడుగులో దాగొన్నప్పుడు అతడిని యుద్ధానికి ధర్మరాజు ఆహ్వానించడం ఈ ఖండికలోని కథ. ఇందులో మొదట ఒక గీత పద్యం (4 పాదాలు), తరువాత మూడు సీసపద్యాలు, చివర ఒక తేటగీతి (5 పాదాలు) ఉన్నాయి.

భారతిలో అచ్చయినా ఇది పేలవమైన రచనే. ఇది తిరుపతి వెంకట కవుల సుప్రసిద్ధ 'పాండవ విజయం' సప్తమాంకంలోని పద్యాలకు అనుసరణ. తిరుపతి కవుల 'చతురంబోధి పరీతమైన ధరణీ చక్రంబు శాసించె', 'చచ్చిరి సోదరుల్ సుతుల్ చచ్చిరి' అనే సుప్రసిద్ధ పద్యాల తరువాత వచ్చే పద్యాలలో ఒకటైన

''ఏ యాయుధంబుఁ గోరిన
నా యాయుధ మొసఁగు వారమనికిఁ గడఁగుమా,
మా యేగురయం దెవ్వరి
నో యొకరిని బేరుకొనుము యుద్ధంబునకున్''.

అనే కంద పద్యంలోని భావాన్ని శ్రీనివాసరావు తన ఖండిక చిట్టచివర గీత పద్యంలో ఇలా రాశాడు.

''ఏ వురము మేమనుచు మదినెంచవలదు
ఐదుగురిలోన నీ కోరినట్టి వాఁడె
ద్వంద్వ యుద్ధంబు నొనరించవచ్చుఁగాన
రమ్ము! క్షత్రియోచిత సంగరం బొనర్ప!
పాఱుఁబోతువై దాగంగ వలవదింక!!''

ఏది ఏమైనా భారతిలో ఒక పద్య రచన అచ్చయింది కాబట్టి శ్రీనివాసరావుకి ఒక చిన్న సైజు గుర్తింపు వచ్చినట్టే లెక్క.

శ్రీనివాసరావు కలంపట్టి తొలిరచన చేయడానికి ఒక ఏడాది ముందే 1924లో అతని సవతి తల్లి మరణించింది. తాను ఏణ్ణర్థం శిశువుగా ఉన్నప్పుడు తన కన్నతల్లి దూరమైంది. ఇప్పుడు పెంచిన తల్లికూడా తరువైంది. శ్రీనివాసరావు ఒకచోట ఇలా రాశాడు.[12]

---

11. అనంతం - పుట. 102
12. అనంతం - పుట. 13

''నాకు అటు అక్కలూ, అన్నలూ లేరు. ఇటు తమ్ముళ్లూ, చెల్లెళ్ళూ లేరు. ఒకవిధమైన ఒంటరితనంలోనే నా బాల్యమంతా గడిచింది. నిజమే. నేను కొండమీది కోతిని తెమ్మని అడిగితే మా నాన్న తెప్పించేవాడు. కాని నేను మాతృప్రేమకీ, సోదరప్రేమకీ, సోదరీ ప్రేమకీ దూరంగా బతికేను. అందువల్లనే ప్రేమంటే ఒక అపనమ్మకం నాలో చిన్నప్పటి నుంచి వర్థిల్లుతూ వచ్చింది''.

సవతితల్లి పోయిన మరుసటి సంవత్సరమే శ్రీనివాసరావుకు వివాహమైంది. అప్పటికి అతని వయస్సు 15 సంవత్సరాలు. వధువు మూలావారి ఆడపడుచు. పేరు వెంకటరమణమ్మ. ఆమె వయస్సు తొమ్మిదీ, పదేళ్ళు. వివాహమైన సంవత్సరంలో శ్రీనివాసరావు కలంపట్టి తన తొలి రచన చేశాడు. పురిపండా అప్పలస్వామిగారి ప్రోత్సాహంతో రచనలు కొనసాగించాడు.

అది భావకవిత్వపు స్వర్ణయుగం. సాహితీ సమితి సభ్యులంటే సాహిత్య లోకంలో గౌరవం ఎక్కువగా ఉండేది. శ్రీనివాసరావుకు ఈ నవకవుల రచనలన్నీ ఉత్సాహంగా ఉండేవి. ఆనాటి తన అనుభవాల గురించి అతడు ఇలా రాశాడు.[13]

''నేను కలంపట్టిన కొత్తరోజుల్లో సాహితీ సమితి అంటే నాకు ప్రాణం లేచి వచ్చినట్టుండేది. అందులో సభ్యుణ్ణి కావడం ఎలాగో, ఎవరికి ఉత్తరం రాయడమో తెలియకపోబట్టిగాని, లేకపోతే ఒక అర్జీపెట్టుకొనే వాణ్ణే! శ్రీరంగం శ్రీనివాసరావు (సాహితీసమితి) అని అచ్చులో చూసుకోవాలని నాకు చాలా ఉబలాటంగా ఉండేది''.

శ్రీనివాసరావులో ఉన్న ఉబలాటం వంటిదే పురిపండా అప్పలస్వామిగారిలో కూడా ఉండేది. ఈ ఇద్దరూ వడ్డాది సీతారామాంజనేయులుతో కలిసి విశాఖపట్నంలో 'కవితా సమితి' అనే సాహిత్య సంస్థను 1926 నవంబరు 24వ తేదీనాడు స్థాపించారు. విశాఖపట్నంలో కవిగారుగా పేరుమోసిన మారేపల్లి రామచంద్రశాస్త్రిగారిని దానికి అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. భమిడిపాటి చినయజ్ఞనారాయణశాస్త్రి గారు ఉపాధ్యక్షులు. పురిపండా వారు కార్యదర్శి. సబ్నివీసు సత్య కేశవరావుగారు కోశాధిపతి. ఆనాడు విశాఖమండలంలో వున్న సాహితీపరులలో ప్రముఖులందరూ కవితాసమితి సభ్యులయ్యారు. సుమారు 45మంది సభ్యులున్న ఈ సంఘంలో కొందరు ప్రముఖుల పేర్లు చూడండి.

ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మ	శ్రీరంగం నారాయణబాబు
కేతవరపు వెంకటశాస్త్రి	సెట్టి లక్ష్మీ నరసింహం
పరవస్తు లక్ష్మీ నరసింహస్వామి	తాపీ ధర్మారావు
నిరోగి రామశాస్త్రి	గొబ్బూరు వెంకటానంద రాఘవరావు
పూడిపెద్ది వెంకటరమణయ్య	ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ
తురగా వెంకటరామయ్య	తెన్నేటి విశ్వనాథం
అధికార్ల సూర్యనారాయణరావు	స్థానాపతి సత్యనారాయణశాస్త్రి
కాళూరి వెంకట నరసింగరావు	మొసలికంటి సంజీవరావు

13. శ్రీశ్రీ సాహిత్యం - రెండు (వచన విభాగం) - పుట. 519

ఇంతమంది సాహితీపరులతో పరిచయం ఏర్పడ్డాక శ్రీనివాసరావు సాహిత్య క్షేత్ర పరిధి విస్తృతం కాజొచ్చింది. కేవలం పద్యరచనలేకాక పూర్వం 1920లో 'వీరసింహ విజయసింహు'లనే నవల రాసినట్టే 'పరిణయ రహస్యం' అనే నవలను కూడా అతడు రచించాడు. ఇది 1925లోనే అచ్చుపడింది. (ప్రస్తుతం ఇది అలభ్యం). వచనం కన్నా గణబద్ధమైన కవితవైపే అతడు మొగ్గసాగాడు. వాఙ్మయంలో ఉన్నత తరగతుల ప్రవేశం కలిగినప్పుడే, 1925-27 సంవత్సరాల మధ్య శ్రీనివాసరావుకు ఉన్నత విద్యాభ్యాసం కూడా ప్రాప్తించింది. రెండేళ్లూ అతడు ఇంటర్ మీడియట్ చదువుకొంటూ వివిధ కవితా ఖండికలు రాస్తూ వచ్చాడు. 1928 నాటికి అతని కవితలు నాలుగు భారతిలో అచ్చుపడ్డాయి. అంతేకాక ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ఒక కథాకథన కావ్య ఖండిక ప్రచురితమైంది. వాటి వివరాలు ఇవి :

1927 భారతి - జూలై - అభిసారిక
1927 భారతి - సెప్టెంబర్ - ప్రళయనర్తనము
1927 భారతి - డిసెంబర్ - రజనీగానము
1928 భారతి - జూన్ - ప్రభాతగానము
1928 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక - మత స్వీకృతి

పరీక్ష ప్యాసుకాగానే శ్రీనివాసరావు ఇంటర్ మీడియట్ పరీక్షకు కూర్చున్నప్పుడు అతని భార్య పెద్ద మనిషై కాపురానికి వచ్చింది. పెద్దలు వెంటనే కార్యం చేయించారు. ఆ శోభనపు రోజుల్లో మూడు పగళ్ళూ శ్రీనివాసరావు పరీక్షలకు కూర్చున్నాడు. ఉత్తీర్ణుడయ్యాడు.[14] వేసవి సెలవులు కాగానే పెద్ద చదువులకు వెళ్ళదలిచాడు. అయితే ఈలోగా ఒక గ్రంథం తన పేరున అచ్చుపడితే బాగుండునని తలచాడు.

ఇంతకు ముందు పైన చెప్పిన నాలుగు కవితలతోపాటు ఇంకో పన్నెండు ఖండ కావ్యాలను కొత్తగా చేర్చి మొత్తం 16 ఖండికలున్న సంపుటిని తయారు చేశాడు. అది ప్రభవనామ సంవత్సరం. అందుచేత కావ్య సంపుటికి 'ప్రభవ' అనే పేరు పెట్టాడు. ఇందులో ప్రకృతి గీతములు, ప్రణయగీతములు, ప్రకీర్ణ గీతములు అనే మూడు విభాగాలున్నాయి. ప్రణయం భావకవుల ప్రేయసీ ప్రణయం కాక కేవలం పరమేశ్వరుని పరంగా రచించిన కవితలు. 'పరంజ్యోతి స్వరూపమునకు భక్తి పూర్వకముగా' వీటిని సమర్పించాడు.

'ప్రభవ'కు పురిపండా అప్పలస్వామిగారు 'ఉపక్రమణిక' అనే పేరుతో ఉపోద్ఘాతం రాశారు. (దీని రచన 1928 ఏప్రిల్ 24వ తేదీనాడు జరిగింది.) ప్రభవ కావ్య సంకలనం కవితా సమితి ప్రథమ కుసుమంగా వెలువడింది. పురిపండా అప్పలస్వామిగారే దానిని రాజమండ్రి సరస్వతీ పవర్ ప్రెస్‌లో అచ్చు వేయించారు. తన పేరుమీద తన పుస్తక ప్రచురణ జరిగిన వెంటనే 1928లో శ్రీనివాసరావు పై చదువులకు మద్రాసుకు వెళ్ళాడు.

రమణయ్య మేష్టారు తమ కుమారుణ్ణి ప్రెసిడెన్సీ కాలేజీలో బి.యే. (ఆనర్సు) క్లాసులో చేర్చాలని అభిప్రాయపడ్డారు. అర్జీ పెట్టినా సీటు రాలేదు. అందుచే క్రిస్టియన్

14. అనంతం - పుట. 144

కాలేజిలో ప్రయత్నించారు. అక్కడ కూడా ఆనర్సులో సీటు దొరకలేదు. ఉత్త బి.యే.లో సీటు ఇచ్చారు. కుమారుణ్ణి కాలేజిలో చేర్పించి తంబుచెట్టి వీధిలో ఉన్న ''ఫస్టు స్టూడెంట్స్ హోమ్'' అనే హాస్టల్లో వసతిని ఏర్పాటు చేసి రమణయ్య మాస్టారు విశాఖపట్నం వెళ్ళిపోయారు.

మహానగరంలో ఒంటరిగా ఉండటం శ్రీనివాసరావుకు అదే మొదటి అనుభవం. అప్పటికి అతని వయస్సు 18 సంవత్సరాలు. ఒక గ్రంథం ప్రచురించిన కవిగా చెప్పుకోడానికి ఒక అర్హత ఉన్నా అతనికి స్నేహితులు, కావలసిన మిత్రబృందం వెంటనే లభించలేదు. హాస్టలు ఉన్న తంబుచెట్టి వీధిలోనే ఆంధ్రపత్రిక కార్యాలయం ఉంది. అందులోనే భారతి కూడా ప్రచురితమయ్యేది. దానికి గన్నవరపు సుబ్బరామయ్యగారు సంపాదకత్వ బాధ్యతలు ఆనాడు వహించేవారు. వారిని చూడడానికి తన పద్యాలు కొన్ని కొత్తవి అచ్చుకు ఇవ్వడానికి శ్రీనివా..రావు భారతి ఆఫీసుకు వెళ్ళాడు. సుబ్బరామయ్యగారి పక్కనే మరో టేబుల్ వద్ద ఒక యువకుడు కూర్చొని వున్నాడు. శ్రీనివాసరావు అతణ్ణి చూసి కూడా చూడనట్టే ఊరుకొన్నాడు. సుబ్బరామయ్యగారితో మాట్లాడి బయటకు వెళ్ళిపోయాడు. తంబుచెట్టి వీధిలోంచి చైనా బజారులోకి అడుగుపెట్టాక భారతి ఆఫీసులోని యువకుడు శ్రీనివాసరావు వెనుకనుంచి భుజం తట్టి ''మీ పరిచయం చేసుకోవాలి'' అన్నాడు. అతడు కొంపెల్ల జనార్దనరావు. ఇద్దరూ రమారమి సమవయస్కులు. జనార్దనరావు కొద్దిగా పెద్దవాడు. ఇద్దరికీ ఇంతకు పూర్వం ముఖపరిచయం లేదు కాని ఒకరి రచనలు ఇంకొకరు చదివారు. జనార్దనరావును చూడగానే శ్రీనివాసరావు మనస్సులో 'గానము విపంచికను మీటె' అనే పద్యపాదం జ్ఞాపకానికొచ్చింది. ఇద్దరికీ మైత్రి ఏర్పడింది.

శ్రీనివాసరావు మద్రాసులో చదువుకొన్న రెండేళ్ళూ ఎన్నోసార్లు జనార్దనరావుతో కలిసి సంచరించాడు. జనార్దనరావు ద్వారానే శ్రీనివాసరావు మద్రాసులో తొలిసారిగా ఎందరో వాఙ్మయ వ్యక్తులను కలుసుకొన్నారు. బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, సాహిత్యమూర్తుల పరిచయం అప్పుడే లభించింది. సోమశేఖరశర్మగారి ఇంట్లోనే జనార్దనరావు ఉండేవాడు. అక్కడే మొదటిసారి నండూరి సుబ్బారావుగారి ముఖతా 'యెంకి పాటల'ను శ్రీనివాసరావు విన్నాడు. విశ్వనాథ సత్యనారాయణగారి 'కిన్నెరసాని' వింటూ మైమరచిపోయాడు.

శ్రీనివాసరావుతో స్నేహం ఏర్పడినా సాహిత్య విమర్శలో కొంపెల్ల జనార్దనరావు తమ స్నేహాన్ని అడ్డురానివ్వలేదు. 1928 ఆగస్టు నెల భారతిలో శ్రీనివాసరావు రచించిన 'ప్రభవ'ను జనార్దనరావు సమీక్షించాడు. అందులోని కొంత భాగం చూడండి.

''శైలియందు సార్థకత కంటె సమాసతత్పరత యెక్కువ గోచరించుచున్నది. ఇంకను విషయానుగుణ్యాముగ శైలియందు మార్పులు కన్పడవలెను. తెనుగువాడకము చాలా తక్కువగా నున్నది. ఒక్కొక్కచో బడలించు సమాస భూయిష్టత యున్నను మొత్తము మీద శైలి బాగుగనున్నది. భావములందును గాంభీర్యమున్నది. భావములకును, భాషకును

సామరస్యము సంఘించుటకీ కవి యింకను ప్రయత్నింపదగును. ఇది చదివిన వారికి కాలక్రమమున ఈ కవి కవిత యింకను సంపన్నము కాగలదను ఆశపొడమును''.

జనార్ధనరావు సమీక్షలో సత్యమే ఉంది. కృష్ణశాస్త్రి ప్రభావంలోనూ, విశ్వనాథ పథంలోనూ పయనిస్తున్న శ్రీనివాసరావులో సమాసతత్పరత అధికమే. అయితే జనార్ధనరావు మెత్తని చీవాట్లు పెట్టడానికి ముందే తన లోపాన్ని శ్రీనివాసరావు గుర్తించాడు. ప్రభవను తన సవతి తల్లికి అంకితమిస్తూ అతడు రచించిన ఆరు ముత్యాల సరాలు భావకవుల ముత్యాలసరాలే గాని గురజాడ ధోరణిలో కావు. వాటిని చూడండి.

నవ వసంత ప్రాత రంచిత
భువన మోహన కుసుమవల్లరి
గ్రీష్మకాలాతప భరమ్మున
గీటడంగినది.

గాఢనిద్రాముద్ర మేల్కని
కనులఁదెఱచిన క్షణమునందున
స్వానమని వినినంత నిలువున
జలదరించితిని.

ఆ యకాల ప్రళయ ఝంఝూ
వాయువులలో తెన్ను తెలియని
యత్యప్రాయ స్థితిగతుల యం
దవశతలు గలిగె.

నా శిశుత్వాజ్ఞాన వేళా
నష్ట మాతృ చరిత్ర నెఱిఁగను
తావకాని ర్వాచ్య సద్వా
త్సల్యమునఁ దల్లీ!

ఇప్పుడు నీవు గతించినంతట
నెచటఁదెలియనిలోపమొదవెడు
ఇవి నితాంతాజ్ఞాత నిష్ఠుర
దివస నిచయములు

త్రిదిన ధామప్రథిత గాయక
మధుర రుతముల నడుమ నించుక
మామకీనాలస రవమ్ముల
మనసు నిల్పఁగదే!

వీటిని శ్రీనివాసరావు 1928 ఏప్రిల్ నెలకు ముందు ఎప్పుడో బహుశా ఫిబ్రవరి మార్చి నెలలో రచించి ఉంటాడు. ఆ సంవత్సరమే జూలై నెలలో కవితా సమితి వార్షిక సంచిక కోసం శ్రీనివాసరావు 'ఆంధ్ర కవితాపితామహుడు' అనే పేరుతో ఒక ఖండకావ్యం రాశాడు. ఇందులో తొమ్మిది ముత్యాలసరాలు ఉన్నాయి. చివరి మూడు ముత్యాల సరాలు చూడండి.

నీవు నాటిన తోటలోపల
చవ తరుగని పూవుగుత్తులు
నేటి వరకును తేట వలపులు
నింపెడిని దెసల
జీవిచిత్ర కళా రహస్యము
చిందు వార్చిన నీ కవిత్వము
చిత్రకారుల చేతగల కుం
చియల విచ్చినది
తెలుగు కవనపు తీరు తీయము
నిలిచి వెలుగుట కొక మెరుంగును
చిలికి చుక్కల నడుమ మింటను
కులుకుచున్నావు!

ఈ ముత్యాలసరాలు చోటు నోటు చేసుకొన్న పుస్తకంలో 'నీవు నాటిన తోటలోపల' అనే చరణానికి ఎదురుగా శ్రీనివాసరావు ఇంగ్లీషులో ఇలా వ్యాఖ్య రాశాడు. "by attempting this metre I have learned to tone down my sanscritic diction" తత్సమ భూయిష్టమైన సమాస చాపల్యాన్ని తగ్గించుకోవాలన్న సంగతి గుర్తించినా, శ్రీనివాసరావు 'ప్రభవ' ప్రచురణ తర్వాత రచించిన ఖండ కావ్యాలలో భావ కవుల ధోరణేగాని, గురజాడ బాణీ ఇంకా పట్టుకొనలేదు. గణబద్ధమైన ఛందస్సులలో ముఖ్యంగా వృత్తాలలోనే చాలా రచనలు చేశారు. వాటిలో తన సొంత గొంతుక లేదని తనకు తెలుసు.

శ్రీనివాసరావూ, జనార్దనరావూ, మల్లవరపు విశ్వేశ్వరరావూ కలిసి మద్రాసు హైకోర్టు బీచిలోను, రామకృష్ణా లంచ్ హోమ్‌లోనూ, అడయారు, కన్నెమెరా లైబ్రరీలలోనో, పరశువాకం, ఎగ్మూరు వగైరా వీధుల్లోనూ విశ్వసాహిత్యపు సరిగమ పదనిసలు సవరించారు.[15]

'లా' చదువుకొనడానికి మద్రాసుకు వచ్చిన కాళూరి వెంకట నరసింగరావు వీళ్ళతో కలిశాడు. మిత్రులందరూ తమ కవితలను సమీక్షించుకొనేవారు. ఏ కవితకు ఎవరు ఇన్‌స్పిరేషనో దాపరికం లేకుండా చెప్పుకొనేవారు. మద్రాసులో ఉంటున్నప్పుడే శ్రీనివాసరావు సమీక్ష కోసం రచయితలు పంపే గ్రంథాలను భారతిలో విమర్శించేవాడు. తన పూర్తి పేరు కాక 'శ్రీశ్రీ' అనే రెండక్షరాలతో చివర సంతకం చేసేవాడు. ఈ పొట్టిపేరే అతని పొడుగాటి కీర్తికి ప్రతీక అయింది.

మద్రాసులో చదువుకొంటున్నప్పుడు వేసవి సెలవులకు శ్రీశ్రీ విశాఖపట్నం వెళ్ళాడు. మద్రాసులో ఉన్నా స్వగృహంలో ఉన్నా అతనికి కవిత్వం, ముఖ్యంగా కృష్ణశాస్త్రి కవిత్వం అంటే అన్నీ మరిచిపోయేవాడు. ఈ సంగతి వివరించే తన అనుభవాన్ని ఒక చోట శ్రీశ్రీ ఇలా చెప్పాడు.[16]

15. అనంతం - పుట. 100
16. అనంతం - పుట. 90

''అవి కొత్తగా మా ఆవిడ కాపురానికి వచ్చిన రోజులు. అప్పుడే కృష్ణశాస్త్రి సరికొత్తగా విశాఖపట్నానికి రావడం జరిగింది. అంతకు ముందంతా కృష్ణశాస్త్రి కవిత్వంతోనే తప్ప వ్యక్తిగతంగా పరిచయం లేదు. ఇనుమును అయస్కాంతంలాగ నన్ను ఆకర్షించేవాడు కృష్ణశాస్త్రి. నేను ఇల్లూ, వాకిలీ వదిలి కృష్ణశాస్త్రి చుట్టు ఉపగ్రహంలాగ తిరగడమే కాక ఆయన బృందం విజయనగరం వెళితే నేనూ వెంటబడ్డాను. విజయనగరంలో ఆయన బస మా నారాయణబాబు ఇంట్లోనే. అలా సుమారొక వారంరోజులు ఇంటినుంచి అంతర్ధానమైన నేను తిరిగి వచ్చాక మా నాన్న ''కవిత్వాన్ని, కవుల్నీ మెచ్చుకోవడం బాగానే ఉందిగాని ఇంట్లో నీ పెళ్ళాన్ని గురించి కొంచెం ఆలోచించడం కూడా మంచిదేమో' అని మెత్తగా మందలించాడు. మా నాన్న నన్నెప్పుడూ గట్టిగా కోప్పడలేదు. ఆ చిన్నసైజు చీవాట్లకే నామనస్సెంతో చివుక్కుమంది. ఏదో మెస్మరిజం మైకంలోంచి తేరుకున్నవాడిలాగ మళ్లీ స్మారకంలోనికి వచ్చాను. అలా ఆకర్షించేది ఆనాటి యువకుల్ని కృష్ణశాస్త్రి పెర్సనాలిటి''.

కృష్ణశాస్త్రి యువకుల్ని ఎంతగా ఆకట్టుకొన్నాడో అంతగా సనాతనులకు తిట్టదగ్గ తిరుగుబాటుదారుడయ్యాడు. అక్కిరాజు ఉమాకాంతంగారు 'నేటికాలపు కవిత్వం' అనే గ్రంథంలో ఎక్కువగా కృష్ణశాస్త్రిగారి కవిత్వం మీదనే విరుచుకుపడ్డారు. కృష్ణశాస్త్రిగారు విజయనగరం వెళ్ళినప్పుడు అక్కడో సభ జరిగింది. అందులో తాపీ ధర్మారావుగారు మాట్లాడారు. ఆ సభ గురించి శ్రీశ్రీ ఇలా రాశాడు.[17]

''విజయనగరం సభలో తాపీ ధర్మారావు కృష్ణశాస్త్రి కవిత్వాన్ని ఘాటుగా విమర్శించాడు. (మాకందరికీ వాంతి వచ్చినంత పని అయింది.) ఎవరికీ తాపీ వారి నెదిరించే దమ్ములేవు. పాత కవిత్వం ఎందుకు బావుండదో, భావ కవిత్వం ఎందుకు నచ్చిందో మాకు మేమే నచ్చజెప్పుకోలేకపోయాము. చేసేదేమీ లేక మానసికంగా మాత్రం వాంతులు చేసుకొన్నాము''

భావకవిత్వాన్ని పల్లెత్తు మాటంటే భరించలేని రోజులలోనే శ్రీశ్రీ భావకవిత్వానికి విరుద్ధమైన కవితలు రచించాలన్న ఉద్దేశానికి వచ్చాడు. 1929లో మద్రాసులో బియ్యే చదువు కొనసాగిస్తున్నప్పుడు ఒక నూత్న కావ్యవస్తువును తీసుకొని ఒక రచన చేశాడు. దానికి 'సుప్తాస్థికలు' అని పేరు పెట్టాడు. ఈ ఖండకావ్యంలో నాలుగే నాలుగు గీత పద్యాలున్నాయి. ఆ కవితను చూడండి.

అవి ధరాగర్భమున మానవాస్థికాప
రంపరలు - సుప్త నిశ్శబ్ద సంపుటములు!
అటనొకే దీర్ఘ యామిని! ఆ నిశా శ్మ
శాన శయ్యకు ప్రాతః ప్రసక్తి లేదు!

ఆ యగమ్య తమో రహస్యాంగణాన
తాండవించును మృత్యుశైతల్యమొక్కటే-

17. అనంతం - పుట.90

అది విశాంత హేమంత హృదంత రంత
రనుభవాళి ఘనీభవించిన సమాధి

ఆమనుష్యాస్థికలు నిద్రలో మునింగి
సంచరించును భైరవ స్వప్న వీధి!
అవి చలించును తమ చర్మ కవచమెపుడొ
బ్రదికిన దినాన తలపోత బరువు చేత

నాకనుంగవ కన్నీళులవై కరంగు
నవి యొనర్చెడు నీరవాహ్వాన మెరగి –
ఇంత శోషిల్లు నేలొ నా హృదయపుటము –
వణకు నేటికొ నా అస్థిపంజరమ్ము!

భావకవుల గీతపద్యాల ఛందస్సులో రచించినా వినూత్న రీతిలో ఆలపించిన ఈ కవితను శ్రీశ్రీ 1929 ఏప్రిల్ 16వ తేదీనాడు రాశాడు. దీనిని భారతికి ప్రచురణార్థం పంపిస్తే ధన్యవాదాలతో తిరక్కొట్టారు. కవితా ధోరణి మార్చడానికి తాను సిద్ధంగా ఉన్నా, కొత్తరకం భావాలను స్వీకరించడానికి దేశం సిద్ధంగా లేదని శ్రీశ్రీ గ్రహించినట్టున్నాడు. సుప్తాస్థికలు రాసిన తర్వాత మళ్ళా పాతధోరణిలో 1929 సెప్టెంబరులోనూ, నవంబరు లోనూ 'సుమార్చన', 'భావిదృష్టి', 'గీతి' అనే కవితలు రాశాడు. వీటిని భారతి పత్రిక ప్రచురించింది.

'భావిదృష్టి' అనే కవితలో సుప్తాస్థికలు ప్రచురణ కానందుకు తాను పొందిన ఆశాభంగాన్ని కొద్దిగా ధ్వనించాడు. చిట్టచివరి పద్యంలో ఇలా అన్నాడు.

''నే నిపుడే వచించిన అనేక రహశ్శ్రుతులాలకించగా
లేని జగత్తులో ప్రతిఫలించదు నా హృదయమ్ము నేడు సం
ధ్యా నిశితారుణ ప్రభలుదాచిన యామినిలో చరించు నా
మానసమింక భావిసుష మా వికసద్రుచులాస్వదించెడున్''

తాను ఆలపించిన రహస్యమైన శృతులు ఆలకించలేని జగత్తును గుర్తించాడు. పాతధోరణి రచనలు రెండుచేతులా రాశాడు. అవి భారతి, గృహలక్ష్మి, శృంగార కంఠాభరణం, కవితా సమితి వార్షిక సంచిక, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక మొదలైన వాటిలో అచ్చుపడుతూ వచ్చాయి. ప్రభవ తర్వాత ఎన్ని రచనలు చేసినా వాటిని గ్రంథరూపంలో ప్రకటించలేదు. అయితే వాటిని ఒక పుస్తకంలో రాసుకొని ఆ గ్రంథానికి 'మారుమ్రోతలు' అనే పేరు పెట్టాడు. నిజంగా ఆ పద్యాలన్నీ వేటికో ప్రతిధ్వనులే.

1931లో శ్రీశ్రీకి బియ్యే డిగ్రీ చేతికి వచ్చింది. జంతుశాస్త్రంలో పట్టం పుచ్చుకొన్నా శ్రీశ్రీ మనస్సు సాహిత్యంమీద, ముఖ్యంగా ఆంగ్ల కవితలు మీద కేంద్రీకృతమైంది. విశాఖపట్నం చేరుకొన్నాక ఏవియన్ కాలేజిలో డిమాన్‌స్ట్రేటరుగా ఉద్యోగం లభించింది. కాని, అది ఒక్క ఏడాదిపాటే ఉంది. తర్వాత చాలాకాలం నిరుద్యోగి. శ్రీశ్రీ కుటుంబ పరిస్థితులు నానాటికీ క్షీణించి దుర్భరమైన దారిద్ర్యం పట్టుకొని పీడించసాగింది. ఈ దశలో ఆంగ్ల సాహిత్యం మధించడం వల్ల అతనికో రకమైన ఊరట కలిగింది.

మద్రాసు నుంచి తిరిగి వచ్చాక శ్రీశ్రీకి చాలా చక్కని సాహిత్య గురువు లభించారు. ఆ సంగతిని అతడు ఇలా తన మాటలలో చెప్పాడు.[18]

''విశాఖపట్టణంలో హార్బరూ, విశ్వవిద్యాలయమూ, నాలో యౌవనమూ ఇంచుమించు ఏకకాలంలోనే ఆవిర్భవించాయి. అప్పుడు అబ్బూరి రామకృష్ణారావుగారే నా హార్బరూ, విశ్వవిద్యాలయమూను. సగటున రోజుకో కొత్త పుస్తకం చదివించే వారాయన. వాల్తేరుదాకా నడుచుకుపోయేవాడ్ని. అబ్బూరివారిచ్చిన పుస్తకం చదువుతూ సముద్రతీరంమీదుగా ఏరాడకొండదాకా నడుచుకు వచ్చేవాణ్ని. చింకిగుడ్డలు, కాళ్ళకి జోళ్ళుండేవి కావు. అలలు నాకాళ్ళనీ, షరాయినీ తడుపుతున్నాయనే స్పృహ కూడా ఉండేది కాదు''.

అబ్బూరి వారి సహచర్యం వల్ల శ్రీశ్రీలో నూతన దృక్పథం అలవడింది. ఆయన పాత ఛందస్సులలోనే చేసిన కొత్త ప్రయోగాలు శ్రీశ్రీకి దారిచూపెట్టాయి. ఆయన రచించిన పుస్తకాలు సాహిత్య రహస్యాలను బోధించాయి. విశ్వవిద్యాలయంలో ఉన్న గ్రంథాలు చదివాక కొత్తవి చదవాలన్న తహతహ పుట్టింది. వాటిని కొనిపించాలి. కొనే సంస్థ ఒకటి ఉంది. దాని గురించి శ్రీశ్రీ ఇలా రాశాడు.[19]

''ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీలో చదవవలసిన పుస్తకాలన్నీ చదివేశాననుకున్న నేనూ హిందూ రీడింగు రూమ్ లైబ్రరీ చేత కొందరు నోబెల్ బహుమతి గ్రహీతల పుస్తకాలు కొనిపించాను. అప్పుడు రీడింగ్ రూమ్ కార్యనిర్వాహక వర్గానికి ద్వారం జగన్నాథరావు అధ్యక్షుడు. నేనొక కమిటీ మెంబర్ని. రెండు మూడు వందల రూపాయలు ఖర్చు పెట్టించి ఇరవై ముప్ఫయ్ పుస్తకాలు మాత్రమే కొనిపించినందుకు ద్వారం నన్ను తెగ చీవాట్లు పెట్టాడు. ఛార్లెస్ గారవన్, ఎడ్గార్ వాలేస్ లాంటి వాళ్లయితే మన లైబ్రరీకి కనీసం రెండు వందల పుస్తకాలయినా వచ్చేవని వాపోయాడు. ''వచ్చే సంవత్సరం బడ్జెట్‌లో నీ యిష్టం వచ్చిన పుస్తకాలు కొనిపించు, నేనేమీ అడ్డు తగలనన్నాను. అలాగే అడ్డు తగలలేదు. లైబ్రరీ పుస్తకాల సంఖ్యాబలం బాగా పెరిగింది. గుణం విషయంలో నాకూ జగన్నాథరావుకీ ఎప్పుడూ అభిప్రాయభేదమే. అయినా షెర్లాక్ హోమ్స్ కథలూ, నవలలూ అన్నా P.G. వోడ్ హవుస్ హాస్య రచనలన్నా మా ఇద్దరికీ ఇష్టమే''.

శ్రీశ్రీకి షెర్లాక్ హోమ్స్ పరిశోధనలు ఎంత ఇష్టముంటే సర్ ఆర్థర్ కానన్‌డాయిల్ రచించిన ఒక అపరాధ పరిశోధక కథను తీసుకొని 'చిత్రరహస్యం' అనే పేరుతో సరళగ్రాంథికంతో (బండిరాలతో) ఒక వచన రచన చేసి 1928 జూలై భారతి పత్రికలో ప్రచురించాడు. అడపా తడపా ఇటువంటి కథలు రాస్తున్నా శ్రీశ్రీ కవిత్వం మీదనే ముఖ్యంగా విశ్వసాహిత్యంలోని సమకాలిక ప్రభావాలపైన మొగ్గు చూపాడు. గురజాడ, వర్డ్స్‌వర్తు, టెన్నిసన్, బర్న్సుల వల్ల ప్రభావితులయ్యారు. భావకవులు షెల్లీ, కీట్సుల వద్ద మజిలీ చేశారు. శ్రీశ్రీ తదనంతర కవులను అధ్యయనం చేయసాగాడు.

---

18. అనంతం - పుటలు - 121-2
19. అనంతం - పుటలు - 122-3

స్విన్‌బర్గ్, ఎడ్గార్ ఎలెన్ పో మొదలైన కవుల ఆంగ్ల రచనలు అతణ్ణి ఆకట్టుకొన్నాయి. "An anthology of world poetry" ద్వారా యూరపు దేశాల కవుల గీతాల పరిచయం కలిగింది.

ఇన్ని గ్రంథాలు చదువుతూ తనకు నచ్చిన ఆంగ్ల కవుల పద్యాలను అనువదిస్తున్నప్పుడు శ్రీశ్రీకి ఒక సత్యం తెలిసివచ్చింది. భావకవులలాగ కావ్యభాషను వాడకుండా భాషను వాడితేనే నూతన కవిత్వంలో జవమూ, జీవమూ ఉంటుందని గ్రహించాడు.

1933వ సంవత్సరం మార్చినెల 10, 11, 12 తేదీలలో బరంపురంలో 'అభినవాంధ్ర కవి పండితసభ'ను పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు ఏర్పాటు చేశారు. గురు భాగవతుల ధర్మారావుగారు వారికి తోడ్పడ్డారు. దేశంలోని సాహితీపరులు చాలామంది ఆ సభకు వెళ్ళారు. శ్రీశ్రీ, కొంపెల్ల జనార్ధనరావు ఇందులో పాల్గొన్నారు. ఆదినారాయణ శాస్త్రిగారు సంస్కృత ప్రాకృత సాహిత్యాలలో ఎంత గొప్ప పండితులో ఆధునిక సాహిత్యం పట్ల అంత మక్కువ చూపేవారు. ఆయన గిడుగు రామమూర్తిగారి వ్యావహారిక భాషను సంపూర్ణంగా సమర్థిస్తారు. 'పాతరోత' అని కొట్టి పారెయ్యక, గతంలో ఉన్న కొద్దిపాటి మంచిని కాపాడుకొంటూ, కొత్తకు అంకురార్పణ చేయాలన్నది పంచాగ్నుల వారి మతం. ఆయన ఒక చోట ఇలా అన్నారు.[20]

''కాలం మారింది. ప్రవృత్తులు అభిరుచులూ. మారినవి. సారస్వత క్షేత్రం విస్తరించింది. ప్రాతవి కల్పవృక్షాలుగాకున్నా కలకాలం వుపయోగించే సంజీవనీ మహౌషధులే కొన్ని కొత్తమొక్కలు నాటే కాలం సమీపించింది. యువకవర్గం వారిది నేటి కాలం రాబోయే కాలం కూడా. వారు వెనుకటి వారికి కృతజ్ఞత చూపుతూ వారి వ్యావహారాన్ని మరవకుండా జ్ఞాపకం వుంచుకొని ముందు కాగలవారికి మార్గదర్శకులు కావాలని నా కోరిక''.

పంచాగ్నులవారు ఇంతటి నవీన దృక్పథం గలవారు కాబట్టే యువకులకు ఆయన సన్నిహితులయ్యారు. 1933లో తొలిసారి వారిని శ్రీశ్రీ కలుసుకొన్నాడు. ఆ సంగతిని ఇలా రాశాడు.[21]

''బరంపురంలో పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిని చూడడానికి పనిగట్టుకొని వారి యింటికి వెళ్ళాను. 'యెంకి పాటల గాలి దుమారం' చెలరేగుతున్నప్పుడు నండూరి వారిని అమోఘంగా సమర్థించినందుకుగాను ఆదినారాయణశాస్త్రిగారంటే నాకెనలేని గౌరవం. ఎన్నో గంటలసేపు వారు నాతో మాట్లాడారు. 'నా పుస్తకం ఒకటి మీకు అంకితం చెయ్యాలని ఉంద'న్నాను. తప్పకుండా చెయ్యమన్నారు. కాని, ఇప్పటికీ వారు చనిపోయి చాలా సంవత్సరాలయినప్పటికీ ఈ వాగ్దానాన్ని నెరవేర్చలేకపోయాను. (బహుశా త్వరలోనే ఇది నెరవేరగల అవకాశం వస్తోందనుకుంటాను)''

---

20. వ్యాససంగ్రహము (సంపా. తెలికిచర్ల వెంకటరత్నం) - పుట.225
21. అనంతం - పుట.126

1933లో చేసిన వాగ్దానాన్ని 1981లోగాని శ్రీశ్రీ తీర్చుకోలేదు. సిరిసిరిమువ్వలు, ప్రాసక్రీడలు, లిమరుక్కులు అనే మూడు పుస్తక రచనల సంపుటిని 'సిప్రాలి' అనే పేరుతో సంకలనం చేసి దానిని పంచాగ్నుల వారికి అంకితమిచ్చాడు. ఎంత ఆలస్యంగా కార్యరూపంలో పెట్టినా చేసిన బాసలు మరచిపోక పోవడం ఒక సుగుణమే.

1933లో బరంపురానికి శ్రీశ్రీ వెళ్ళడం అతని కవిత్వ జీవితంలో చాలా చెప్పుకోదగ్గ మార్పులను తెచ్చింది. ఆ సభలలో శివశంకరశాస్త్రిగారు ఒక పద్యం చదివారు. అది ఇలా నడుస్తుంది.

మారో, మారో, మారో, మారో
ఒకటీ, రెండూ, మూడూ, నాలుగు
మారో, మారో, మారో, మారో

ఇది సత్యాగ్రహుల మీద పోలీసు లాఠీల ప్రయోగాన్ని వర్ణించే గీతం. దీనిని గుంటూరులోని శిష్ట్లా ఉమామహేశ్వరరావు రచించాడు. అప్పటికే అతడు నవీనధోరణిలో రచనలు సాగిస్తున్నాడని శివశంకరశాస్త్రిగారి ద్వారా శ్రీశ్రీ విన్నాడు. ఈ 'మారో మారో' గీతం శ్రీశ్రీలో మారుమోగింది. ఇది తన తదుపరి రచనకు ప్రోద్బలమే అని శ్రీశ్రీ స్పష్టం చేశాడు.[22]

బరంపురం సభలలోనే శ్రీశ్రీ చింతా దీక్షితులుగారిని తొలిసారి కలుసుకొని తాను రాస్తున్న రచనలు (బహుశా 'సుప్తాస్థికలు' వంటివి) చదివి వినిపిస్తే వాటిని విని ఆయన ఆనందభరితులై ''వచ్చేసిందిదిగో కొత్త కవిత్వపు వరద'' అని మెచ్చుకొన్నారు. ఇది ఎన్నటికీ మరిచిపోలేని అనుభవం అని శ్రీశ్రీ భావించాడు.[23]

బరంపురం సభల గురించి శ్రీశ్రీ నూతనోత్సాహంతో విశాఖపట్నం తిరిగి వచ్చాడు. కొత్తదారులు తొక్కదలిచాడు.

1933 జూన్ నెల 2వ తేదీనాడు శ్రీశ్రీ భావకవిత్వానికి స్వస్తి చెప్పి, అత్యంతాధునిక ధోరణిలో, గురజాడ మార్గంలో నవీన భావాలకు వచన రూపం ఇవ్వడం ప్రారంభించాడు. అంతకు కొన్నిరోజులు ముందే (ఎంత ముందో తెలియదు). శ్రీశ్రీ ఒక ఆంగ్లకవి గీతాన్ని చదివాడు. అతని పేరు విల్‌ఫ్రెడ్ విల్సన్ గిబ్సన్ (1878-1962). ఈ కవి 'I, even I' (నేను, నేను సైతం) అనే ఎత్తుగడతో ఒక పద్యం రాశాడు. దీన్ని చదవగానే శ్రీశ్రీకి ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా లోకానికి తోడ్పడుతారన్న సంగతీ తోచింది. ''నేను సైతం పాటుపడ్డాను-పాటుపడతాను'' అని చాటాలనిపించింది. గిబ్సన్ గీతమే అతని చేత ఒక గీతాన్ని రాయించింది. ఎత్తుగడలోని పోలికే తప్ప ఆంగ్ల గీతానికి, శ్రీశ్రీ రచనకూ మరే సామ్యం లేదని శ్రీశ్రీయే చెప్తూ గిబ్సన్ గీతాన్ని చదివి ఉండకపోతే తన గీతాన్ని తాను రాసి ఉండేవాడు కాదని చెప్పాడు.[24] ఈ గీతం శ్రీశ్రీచేత కొత్త ప్రస్తానానికి జయభేరిని మోగింపచేసింది చూడండి ఆ గీతం.

22. అనంతం - పుట 182
23. అనంతం - పుట. 125
24. అనంతం - పుట. 128

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!

నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!

నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోగాను!

ఎండకాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగి పోలేదా?

వానకాలం ముసిరిరాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?

శీతకాలం కోతపెట్టగా
కొరడు కట్టీ,
ఆకలేసీ కేకలేశానే!

నేనొకణ్ణే
నిల్చిపోతే -
చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు
భూమి మీదా
భుగ్నమౌతాయి!

నింగినుండీ తొంగిచూచే
రంగు రంగుల చుక్కలన్నీ
రాలి, నెత్తురు క్రక్కుకుంటూ
పేలిపోతాయి!

పగళ్ళన్నీ పగిలిపోయీ,
నిశీధాలూ నిశ్శేషిల్లీ,
మహాప్రళయం జగం నిండా
ప్రగల్భిస్తుంది!

నేనొక్కణ్ణీ ధాత్రి నిండా
నిండిపోయి-
నాకుహూరత శీకరాలే
లోకమంతా జల్లులాడే
ముహూర్తాలాగమిస్తాయి

నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!

నేను సైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!

నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!

'మహాప్రస్థానం' అనే పేరుతో సంకలనం అయిన గీతాలలో ఇది మొదట రచించినది. దీని ఛందస్సు విలక్షణమైన ముత్యాలసరాల నడకలో ఉంది. ఇది భావకవిత్వానికి ఆమడదూరంలో ఉండడమేకాక వాడుకభాషకు సాధ్యమైనంత చేరువలోకి వచ్చింది. ఈ కవితలోని 'నేను'కు భావకవిత్వంలోని 'నేను'కు చాలా వ్యత్యాసం ఉంది. ఇందులో ఉన్న 'నేను' సంఘంలోని ఒక భాగం. ప్రపంచంలో తాను చేయవలసిన సంసేవలను తాను ఉడతాభక్తిలాగ చేస్తున్నట్లే ధ్వనిస్తున్నా చివరకు ఇందులోని 'నేను'గా పరిణామం చెందుతానని ఆశాభావంతో చాటుకొంటున్నాడు. అందుకే తాను విశ్వమందిర శిఖరం మీద పతాకనై భాసిస్తానంటున్నాడు.

తాను భువన భవనపు బావుటానై పైకి లేస్తానని ప్రకటించినా అది ఏ జెండాయో 1933లో చెప్పలేకపోయాడు. ప్రభవలో ''గాలి యొసగెడు క్రొత్త రెక్కలు ధరించి

ఎఱుకపడరాని యెచటికో ఎగసిపోదు'' అని పూర్వం చెప్పాడు. ఎగిరిపోవడం ఖాయం. అయితే గమ్యం ఆనాడు తెలియదు. అలాగే జెండా కనపడుతోందిగాని దాని వర్ణం, చిహ్నం 1933లో స్పష్టంగా గోచరించలేదు.

'నేను సైతం' అనే గీతాన్ని 'జయభేరి' అనే పేరుతో జూన్‌లో రచించాక 1933లోనే ఆగస్టు నెలలో 12వ తారీఖున 'ఒకరాత్రి' 13వ తారీఖున 'భిక్షువర్షీయసి' అనే కవితలు శ్రీశ్రీ చెప్పాడు. ఒకరోజు తర్వాత ఇంకో రోజున రచించిన గీతాలైనా రెండింటిలో వైవిధ్యముంది. 'ఒకరాత్రి'లో బహుళ పంచమినాటి వెన్నెల భయం పెట్టడాన్ని గురించి కవి చెప్పాడు. వెన్నెల వెలిబూదిలా కనబడుతుంది. గాలిలో కనరాని గడుసు దయ్యాలు భూదివమ్ముల మధ్య ఈదులాడడం అతడు గమనిస్తాడు. ఆకాశపు టెడారిలో కాళ్లు తెగిన ఒంటరి ఒంటెలాగ జాబిల్లి ఉందట. భావచిత్రాలను మనస్సుకు కనబడేటట్టు ఈ రచనలో చేశాడు. భిక్షువర్షీయసిలో ఒక దిక్కులేని దీనురాలి కథకాని కథ ఉంది. వృద్ధాప్యంలో నా అన్నవాళ్ళు లేక జబ్బు చేసి పడిపోయిన ముసల్ది మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయిందని కవి చెప్తాడు. జవాబు పాఠకులను ఆలోచించుకోమంటాడు.

1933లో మూడు కవితలనే రచించిన శ్రీశ్రీ 1934లో రమారమి నెలకో ఖండకావ్యం చొప్పున పదకొండు రచనలు చేశాడు. వాటి వివరాలు ఇవి :

ఫిబ్రవరిలో - గంటలు
మార్చిలో - ఆకాశదీపం
ఏప్రిల్‌లో - మహాప్రస్థానం, అవతారం, ఋక్కులు
మేలో - బాటసారి
జూన్‌లో - ఆశాదూతలు, శైశవగీతి, అవతలిగట్టు
జూలైలో - సాహసి
అక్టోబరులో - ఒక్కక్షణంలో

ఈ పదకొండు రచనలలో 'మహాప్రస్థానం' అనే గీతిక 'మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది' అనే మాటలతో ప్రారంభమవుతుంది. ఈ గీతం రాయడానికి చాలా ప్రోద్బలాలున్నాయని శ్రీశ్రీ కొన్నికొన్ని చోట్ల కొంత కొంత వివరించాడు. ఒకచోట వివరంగా చెప్పాడు.[25]

1. లా మర్సెయ్యే
2. లా ఇంటర్‌నేషనాల్
3. బరన్స్ కవి రచించిన 'బెన్నాక్ బరన్'
4. అలగ్జాండర్ బ్లాక్ రచించిన 'ది ట్వెల్వ్'
5. హరీంద్రనాథ ఛటోపాధ్యాయ పాడిన 'షురూహు వా హైజంగ్'
6. నజ్రుల్ ఇస్లామ్ గీతాలు
7. కవికొండల వెంకటరావుగారి కంఠం
8. ధ్వని సామ్యం వల్ల శిష్టా 'మారో మారో' పాట.

---

25. అనంతం - పుట.181-2

ఇన్ని ప్రోద్బలాలు కలిసి ఒక గొప్ప గీతాన్ని దేనికీ అనుకరణ కానట్టుగా రచింపచేశాయి. ఈ రచన చేయడానికి ముందు తన మనస్సులో ఏం జరిగిందని ప్రశ్నించి శ్రీశ్రీయే ఇలా జవాబు చెప్పాడు.[26]

''ఈ గీతాన్ని నేను 1934వ సంవత్సరం ఏప్రిల్ నెల 12వ తేదీనాడు రాశాను. దీన్ని రాయడానికి నాకు అయిదు నిముషాలకంటే ఎక్కువ పట్టలేదు. మరో ప్రపంచం అని ప్రారంభించి భుగభుగలు అని ముగించేదాక పెన్సిల్ ఆపలేదు. ఔను. ఈ గీతాన్ని పెన్సిలుతోనే రాశాను. ఒక వ్యాసం రాద్దామని 'మరో ప్రపంచం' అనే శీర్షిక కాగితం మీద రాసేసరికి కలంలో సిరా అయిపోయింది. సిరా పోస్తూ ఆలస్యం చేయడమెందుకు అని కాపీయింగ్ ఇంక్ పెన్సిలు తీశాను. నాన్‌స్టాప్‌గా నడిచిన పెన్సిలు, భుగభుగలు అనే మాట దగ్గర హఠాత్తుగా ఆగిపోయింది. రాసిందంతా చదివేసరికి అక్కడితో ఆ గీతం అయిపోయిందని సుప్రసిద్ధ మాసపత్రికకు పంపించాను. పంపిన మూడవరోజుకి 'రిటర్న్డ్ విత్ థేంక్స్' అనే వర్తమానంతో గీతం నాదగ్గరికి తిరిగి వచ్చింది. అప్పటికీ గీతానికి 'మహాప్రస్థానం' అనే పేరు పెట్టలేదు. తర్వాత గీతంలో ఒకే ఒక్క మార్పు చేశాను.

'కదం తొక్కుతూ పదం పాడుతూ
కాంద్రు కాంద్రుమని గర్జిస్తూ....' అని తొలి పాఠం. కాంద్రు కాంద్రుమని పులికేకకీ, గర్జించడం సింహం చేసే ధ్వనికి ఉపయోగిస్తాం కాబట్టి ఈ ప్రయోగం నాకు సంతృప్తికరంగా లేకపోయింది. అంచేత -

'కదం తొక్కుతూ పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ' అని మార్చాను.[27] ''ఈ గీతం రాసి కొన్ని నెలలయిపోయిన తర్వాత మహాప్రస్థానం అనే శీర్షికతో జ్వాల పత్రికలో ఇది ప్రకటితమైంది. అంతకు ముందు సంచికలో వేదులవారి 'కాగడా' అనే గేయం, దానిముందు సంచికలో అడవి బాపిరాజుగారి 'ఎగురనివ్వండోయ్ జ్వాలల్' అనే గేయమూ పడ్డాయి. అయితే మరో ప్రపంచం పాట విశాఖపట్నం టన్నరు సత్రంలో నేను చదివి వినిపించిన తర్వాతనే తాను జ్వాలకి పద్యం రాసినట్టు బాపిరాజుగారు ఒప్పుకున్నారు.

''ముందుగా అడవి, వేదుల వారి పాటలు వెయ్యడమేకాక, మహాప్రస్థానం ప్రకటించిన సంచికలోనే దానికన్న ముందు పుటలో 'జ్వలనా' అనే అనుకరణ రచన ముద్రించడంలో జ్వాల సంపాదకునికిగాని, అప్పట్లో అతనికి సలహాలు చెబుతూ వచ్చిన వారికిగాని దురుద్దేశాలున్నాయని నేనారోపించను. జరిగిన ఈ సంగతులను నేను గుర్తించానని మాత్రం చెబుతున్నాను''.

మరో ప్రపంచంలో గీతంలో తొలిసారిగా శ్రీశ్రీ ఎర్రబావుటాను పేర్కొన్నాడు. ఇంతకు ముందు సంవత్సరం భువన భవనపు బావుటా ఏదో స్పష్టంగా చెప్పలేకపోవడానికి

26. అనంతం - పుట. 181

27. ఇంకో మార్పు కూడా చేశాడు. జ్వాలలో 'దయ్యాలట్లూ, త్రాచులవలెను ధనుంజయునిలా సాగండి' అనే మాటల్ని 'త్రాచులవలెనూ, రేచులవలెనూ ధనుంజయునిలా సాగండి' అని మార్చాడు. ఈ సంగతి చెప్పలేదు.

1934లో అది ఎర్రజెండా అని తెలియచేయడనికి ఒక కారణం వుంది. విశాఖపట్నంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర దీనిని విశదపరుస్తుంది. కంభంపాటి సత్యనారాయణగారు ఇలా రాశారు.[28]

''డాక్టరు రాధాకృష్ణ ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న రోజులవి. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుల్లో ఒకరైన హిరేన్ ముఖర్జీ 1934 జూలై నుంచి 1935 డిసెంబరు వరకు చరిత్ర, రాజనీతి విభాగానికి ప్రొఫెసరుగా ఉండేవారు. రాధాకృష్ణ ఇంగ్లండ్‌లో ఉండగా హిరేన్ ముఖర్జీతో వారికి పరిచయమైంది. అప్పుడు ముఖర్జీ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా ఉండేవారు. వీరి ప్రతిభావిశేషాలు గమనించి డాక్టర్ రాధాకృష్ణ వీరిని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. హిరేన్ ముఖర్జీ అంగీకరించి మనదేశం వచ్చి ఉద్యోగంలో ప్రవేశించారు. ఇంగ్లండ్ నుంచి వచ్చేటప్పుడు డాక్టర్ రాధాకృష్ణ తన వెంట కమ్యూనిస్టు సాహిత్యంతో సహా అనేక ఆధునిక గ్రంథాలు తీసుకొచ్చారు. వాటన్నిటినీ యూనివర్సిటీ లైబ్రరీలో ఉంచారు. కీ.శే. అబ్బూరి రామకృష్ణారావు అప్పుడు లైబ్రేరియన్‌గా ఉండేవారు. మామిడిపూడి వెంకటరంగయ్య ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్, ఓరుగంటి రామచంద్రయ్య, కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) మొదలైన విద్యార్థులు. 'అనామిక' అనే ఒక సంస్థలో వీరు సభ్యులుగా ఉండి సమకాలీన సమస్యలపై చర్చలు జరుపుతూ ఉండేవారు. కొందరిలో మార్క్సిస్టు తత్వశాస్త్రం పట్ల అభిరుచి యీ సంస్థ ద్వారానే ఏర్పడింది. హిరేన్ ముఖర్జీ అప్పుడప్పుడు ఆంధ్రలో యితర చోట్లకు వెళ్ళి సోషలిజం, సోవియట్ యూనియన్ మొదలైన విషయాలపై ఉపన్యాసాలిచ్చేవారు. అంతేకాక వెంకటరంగయ్యగారి 'ఎడ్యుకేషనల్ ఇండియా' కోలవెన్ను రామకోటేశ్వరరావుగారి 'త్రివేణి', ఈశ్వరదత్తుగారి 'ట్వంటీయెత్ సెంచరీ' వంటి ఆంగ్ల పత్రికల్లో వ్యాసాలు వ్రాసేవారు. ఐతే హిరేన్‌గాని, అబ్బూరిగాని కమ్యూనిస్టు పార్టీ సెల్స్‌లో సభ్యులు కారు''.

ఎప్పుడో తారీఖులు సరిగ్గా తెలియవుగానీ అబ్బూరి రామకృష్ణారావుగారు పార్టీ సెల్స్‌లో మెంబరుగా లేకపోయినా కార్యకలాపాలలో పాల్గొనేవారు. ఆయన చేరదీసి 'పెంపుడు కొడుకు' లాగ చూసుకొంటున్న శ్రీశ్రీపై ఎర్రజెండా ఛాయలు పడడంలో ఆశ్చర్యం లేదు. అబ్బూరివారే శ్రీశ్రీకి లెనిన్ గురించి, వొరొషిలోవ్ గురించి చెప్పారు. ''ప్రపంచాన్ని కుదిపివేసిన రోజులు'' అనే పుస్తకాన్ని క్రొపాట్కిన్ రచనలను చదివించారు. ఈ చదివినవి ఒంటపట్టడానికి కొన్నాళ్లు వ్యవధి కావలసి వచ్చింది.

అబ్బూరి వారు కమ్యూనిజం ప్రథమ పాఠాలు బోధిస్తున్న కాలంలో శ్రీశ్రీ వ్యాసాలూ, సాహిత్య సిద్ధాంతాలు విభిన్నమైనవి. వాటి గురించి శ్రీశ్రీయే ఒకచోట ఇలా రాశాడు.[29]

''కవిత్వం రాయడం ప్రారంభించిన తర్వాత చాలా సంవత్సరాలదాకా నేను 'సంవిధానమే సమస్తమూ' (Technique is everything) అనుకునేవాణ్ణి. ఏది

---

28. 'ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమచరిత్ర' – మొదటి భాగం, పుట.79

29. అనంతం – పుట.129

చెబుతున్నామనేది ముఖ్యం కాదు. ఎలా చెబుతున్నావనేదే ముఖ్యం అనుకునేవాణ్ని. ఆ మేరకు నేను 'కళకోసమే కళ' అనే వారి దంతప్రాకారంలోనే జీవిస్తూ వచ్చాను''.

ఆనాటినుంచి సాహిత్య ఋషిత్రయంలో బోదిలేర్, మపాసా, ఎడ్గార్ ఎలెన్ పో అనే ముగ్గురే ఉన్నారు. ఈ సంగతిని అతడు 'ఒక సంభాషణ శకలం' అనే డైలాగువంటి వ్యాసంలో రాశాడు. ఇది 1935 జనవరి మాసం 'ప్రబుద్ధాంధ్ర' పత్రికలో అచ్చుపడింది. వ్యాసాన్ని అతడు 1934 అనుభవాలను పురస్కరించుకొనే రాశాడన్న సంగతి స్పష్టంగా కనబడుతుంది.[30] బోదిలేర్‌నూ, మపాసాను అతడు ఆంగ్లానువాదాలలో చదివాడు. 'పో' రచనలను మూలం నుండీ పఠించాడు, అధ్యయనం చేశాడు.

బోదిలేర్ (charles Pierce Bandelaire) ఫ్రెంచి సింబాలిస్టు కవి, విమర్శకుడు, అతనికాలం 1821-1862 మల్లార్మే, రాంబో మొదలైన ఫ్రెంచి కవులు బోదిలేర్‌ను అనుసరించిన అనంతర కవులంటేనే మార్గదర్శి ఎంత గొప్పవాడో తెలుస్తుంది. బోదిలేర్‌ను తర్జుమాలో చదివినా వ్యక్తావ్యక్తంగా అవగాహనయ్యే అతని ప్రతిభా, దానివల్ల జనించే ఉత్సవం గురించి శ్రీశ్రీ రాశాడు. బోదిలేర్ మాఘపూర్ణిమ మంచు తెరల సోయగంతో తనను ఆవరిస్తాడని శ్రీశ్రీ చెప్పాడు.

మపాసా (Guy De maupasant) ఫ్రెంచి కథకుడు. కథలు, నవలలు రచించాడు. ఇతని కాలం 1850-1893. మపాసా మహోన్మాదంలోని మహాకవిత్వానికి శ్రీశ్రీ ముగ్ధుడయ్యాడు. మాపాసా రచనలు గద్యం పద్యం అనే సరిహద్దులకు అతీతమైందని శ్రీశ్రీ భావిస్తాడు. పద్యాలేవీ రాయకపోయినా వింత అనుభూతులు వెదికి వాటిని కవిత్వం చేశాడు. నాడుల మీదుగా విద్యుచ్ఛక్తిని ప్రవహింపచేస్తాడు. చిన్నకథకూ, ఖండకావ్యానికీ భేదం లేదని మాపాసా రచనల వల్ల శ్రీశ్రీ తెలుసుకొన్నాడు. (మాపాసా కథలను చాలా వాటిని చలం పేరు చెప్పీ చెప్పక అనువదించాడు. జ్వాలలో ముద్దుకృష్ణ మాపాసా కథలను తర్జుమా చేసి ప్రకటించేవాడు.)

భాషాంతరీకరణ ద్వారా బోదిలేరునూ, మాపాసాను చదువుకొన్న శ్రీశ్రీ ఎడ్గార్ ఎలెన్‌పో (Egar Allan poe) అనే అమెరికన్ కవి ఆంగ్ల రచనలను మూలం నుండే ఆస్వాదించాడు. పో, కాలం 1809-1849 దేశదిమ్మరులుగా సంచరించే నాటకాల వాళ్ళకి పుట్టిన అనాథబాలుడు. జాన్ ఎలెన్ అనే గృహస్థు 'పో'ను చేరదీసి చదువు చెప్పించాడు. కాని పద్దెనిమిదో యేటినుంచి పో దుర్భర దారిద్ర్యంతో సతమతమయ్యేవాడు. డబ్బుకోసం కథలూ, తనకోసం కవిత్వం రచించేవాడు. ఈట్సు ఇతడిని అన్ని దేశాలలోనూ, అన్ని కాలాలలోనూ గొప్ప లిరికల్ కవిగా మన్ననచేసి ప్రశంసించాడు. బోదిలేర్ పో పద్యాలను ఫ్రెంచి భాషలోనికి అనువదించాడు. శ్రీశ్రీ ఉద్దేశంలో పో గీతాల్లో ప్రతిపదం రసబంధురం. నిజానికి ప్రతి అంగుళం కవి ఎవరంటే పో ఒక్కడే అనీ, పో రచనలన్నింటిలో ఒక అతీత మహస్సు ఉందని శ్రీశ్రీ అంటాడు. అందుకే ఈ అమెరికన్ రచించిన వాటినన్నీ అధ్యయనం చేసి ఆ శిల్ప చాతుర్యాన్ని అలవర్చుకొన్నాడు. ఒక చోట శ్రీశ్రీ ఇలారాశాడు.[31]

30. శ్రీశ్రీ సాహిత్యం - రెండు (వచన విభాగం) - పుటలు.424 నుండి

31. అనంతం - పుటలు - 129-130

''రకరకాల ఛందస్సులతో సాముగరిడీలు చేస్తూ, అదే కవిత్వం అనుకోవడం నాకు Edgar Allan Poe నుండి సంక్రమించిన వ్యాధి అనుకుంటాను. The Poetic Principle (కవితా సూత్రం) అనే ఒక సుదీర్ఘమైన వ్యాసంలో అతడు 'మాలకాకి' (The Raven) అనే తన గీతాన్ని చక్కగా విశ్లేషించి రుచ్యమైన పదార్థాన్ని వంటగదిలో తయారుచేసినట్లు కవిత్వాన్ని కూడా ఎలా ఆస్వాదయోగ్యంగా తయారుచేయవచ్చునో విశదం చేశాడు. (అది చదివాక నేను 'కవిత్వ రచనకు సులభ మార్గాలు' అనే వ్యాసం రాయడానికి కొంత నోట్సు తయారు చేసుకొన్నాను. తెలుగువారి అదృష్టం కొద్దీ అవిప్పుడు అంతర్థానమయి పోయాయి).

''అయినా ఆనాటి మానసికావస్థలో నా ఆశయం విచిత్రమైన సంస్పందనాలను ఆరాధించడమే. It is my ambition to be called the poet of strange sentiment and shuddering sensation అని ఒకచోట రాసుకున్నాను. దీని వెనుక ఉన్న ప్రోద్బలశక్తి Edgar poeది అని వేరే చెప్పనక్కరలేదు''.

శ్రీశ్రీ కొంత రాసి మానేసిన 'కవిత్వ రచనకు సులభ మార్గాలు' నేడు అలభ్యమైనా అతని కవితలలోని శిల్పాన్ని విశ్లేషణచేసి చూస్తే ఎడ్గార్ ఎలెన్‌పో 'మాలకాకి' కవితలో చూపెట్టిన శిల్ప నైపుణ్యాన్ని ఎవ్వరైనా కొద్దిగా శ్రమించి తెలుసుకోవచ్చును. ఈ కవితా ఖండికలోని ప్రతి ఒక్క 'శ్టాన్ జా' ఒక చెక్కిన దంతపు బొమ్మ. ప్రతి ఒకటో నెంబరు, మూడో నెంబరు పాదం ఒక చక్కని తక్కెడలాగ ఉంటుంది. అందులో అంతః ప్రాసలు ఆపాదాన్ని సమతూకంలో ఉంచుతాయి. ఆరుచరణాల ప్రతి శ్టాన్‌జాలోనూ రెండు, నాలుగు, అయిదు, ఆరు సంఖ్యగల పాదాలలో అంత్యప్రాసలు ఉంటాయి. కావ్యఖండిక ప్రతి శ్టాన్‌జాలో ఇదే అంత్యప్రాస ఆయా పాదాలలో వివిధ రీతులలో సంగీతాన్ని వినిపిస్తుంది.

ఉదాహరణకు తొలి శ్టాన్‌జానే తీసుకొని చూద్దాం. 'weary' అని ఉంది. రెండో పాదంలో చివర "Forgotton bore" అని తర్వాత tapping అని ఉంది. నాలుగో పాదం రెండో పాదాంతపదానికి అంత్య ప్రాసగా Chamber door అనే మాటతో ముగుస్తుంది. అయిదో పాదంలోనూ ఆరో పాదంలోనూ 'door' 'more' అనే అంత్య ప్రాసలు ఉన్నాయి. పాఠకుల సౌకర్యం కోసం The Raven అనే ఈ కావ్య ఖండిక పూర్తి పాఠాన్ని ఇస్తున్నాను.

THE RAVEN

Once upon a Midnight dreary, while I pondered, weak and weary
Over many a quiant and curious volume of forgotten lore,-
while I nodded, nearly napping, suddenly there came a tapping.
As of some one gently rapping, rapping at my chamber door.
"Tis some visitor', I muttered, "tapping at my chamber door:
Only this and nothing more".

Ah, distinctly I remeber it was in the bleak December,
And each separate dying ember wrought its ghost upon the floor.

Eagerly I wished the morrow; - vainly I had sought to borrow
From my books surcease of sorrow-sorrow for the lost Lenore,
For the rare and radiant maiden whom the angels name Lenore:
Nameless here for evermore.

And the silken sad uncertain rustling of each purple curtain
Thrilled me-filled me with fantastic terrors never felt before;
So that now, to still the beating of my heart, I stood repeating,
"Tis some visitor entreating entrance at my chamber door,
Some late visitor entreating entrance at my chamber door:
This it is nothing more".

Presently my soul grew strong; hesitating then no longer,
"Sir", said I, "or Madam, truly your forgiveness I implore;
But the fact is I was napping, and so gently you came rapping,
And so faintly you came tapping, tapping at my chamber door,
That I scarce was sure I heard you" - here I opened wide the door:
Darkness there and nothing more.

Deep into that darkness peering. long I stood there wondering, fearing,
Doubting, dreaming dreams no mortals ever dared to dream before;
But the silence was unbroken, and the stillness gave no token,
And the only word there spoken was the whispered word, "Lenore!"
This I whispered, and an echo murmured back the word, "Lenore!"
Merely this and nothing more.

Back into the chamber turning, all my soul within me burning,
Soon again I heard a tapping some what louder than before.
"Surely", said I, "surely that is something at my window lattice;
Let me see, then, what thereat is, and this mystery explore;
Let my heart be still a moment and this mystery explore;
"Tis the wind and nothing more".

Open here I flung the shutter, when, with a flirt and flutter,
In there stepped a stately Raven of the saintly days of yore.
Not the least obeisance made he; not a minute stopped or stayed he;
But, with mien of lord or lady, perched above my chamber door,
Perched upon a bust of Pallas just above my chamber door; Perched, and sat,
and nothing more.

Then this ebony bird beguiling my sad fancy into smiling.
By the grave and stern decorum of the countenance it wore,-
"Though thy crest be shorn and shaven, thou", I said, "art sure no craven,
Ghastly grim and ancient Raven wandering from the Nightly shore:
Tell me what thy lordly name is on the Night's Plutonian shore!"
Quoth the Raven, "Nevermore".

Much I marvelled this ungainly fowl to hear discourse so plainly,
Though its answer little meaning-little relevancy bore;
For we cannot help agreeing that no living human being
Ever yet was blessed with seeing bird above his chamber door,
Bird or beast upon the sculptured bust above his chamber door,
With such name as "Nevermore".

But the Raven, sitting lonely on the placid bust, spoke only
That one word, as if his soul in that one word he did outpour.
Nothing further then he uttered, not a feather then he fluttered,
Till I scarcely more than muttered, - "Other friends have flown before;
On the morrow he will leave me, as my Hopes have flown before".
Then the bird said, "Nevermore".

Startled at the stillness broken by reply so aptly spoken,
"Doubtless", said I, "What is utters is its only stock and store,
Caught from some unhappy master whom unmerciful Disaster
Followed fast and followed faster till his songs one burden bore;
Till the dirges of his Hope that melancholy burden bore
Of "Never-never more".

But the Raven still beguilling all my sad soul into smiling,
Straight I wheeled a cushioned seat in front of bird and bust and door;
Then, upon the velvest sinking, I betook myself to linking
Fancy unto fancy, thinking what this ominous bird of yore,
What this grim, ungainly, ghastly, gaunt, and ominous bird of yore
Meant in croking "Nevermore".

This I sat engaged in gussing, but no syllable expressing
To the fowl whose fiery eyes now burned into my bosom's core;
This and more I sat divining, with my head at ease reclining
On the cushion's velvet lining that the lamplight gloated o'er,
But whose velvet violet lining with the lamp-light gloating o'er
She shall press, ah, nevermore!

Then, methought, the air gew denser, perfumed from an unseen censer
Swung by seraphim whose foot-falls tinkled on the tufted floor.
"Wretch", I cried, "thy God hath lent thee-by these angles he hath sent thee
Respite-respite and nepenthe from thy memories of Lenore!
Quaff, oh quaff this kind nepenthe, and forget this lost Lenore!"
Quoth the Raven, "Nevermore".

"Prophet!" said I, "thing; of evil! prophet still, if bird or devil!
Whether Tempter sent, or whether tempest tossed thee here ashore,
Desolate, yet all undaunted, on this desert land enchanted -
On this home by Horror haunted - tell me truly, I implore;
Is there-is there balm in Gilead? - tell me - tell me, I implore!
Quoth the Raven, "Nevermore".

"Prophet!" said I, "thing of evil! prophet still, if bird or devil!
By that Heaven that bends above us, by that God we both adore,
Tell his soul with sorrow laden if, within the distant Aidenn,
It shall clasp a sainted maiden whom the angels name Lenore:
Clasp a rare and radiant maiden whom the angels name Lenore!"
Quoth the Raven, "Nevermore".

"Be that word our sign of parting, bird or fiend!" I shrieked, upstarting.
"Get thee back into the tempest and the Night's plutonian shore!
Leave no black plume as a token of that lie thy sould hath spoken!
Leave my loneliness unbroken! quit the bust above my door!
Take thy beak from out my heart, and take thy form from off my door!"
Quoth the Raven, "Nevermore".

And the Raven, never flitting, still is sitting, still is sitting
On the pallid bust of Pallas just above my chamber door;
And his eyes have all the seeming of a demon's that is dreaming,
And the lamp-light o'er him streaming throws his shadow on the floor;
And my soul from out that shadow that lies floating on the floor
Shall be lifted-nevermore!

Edgar Allan Poe (1809-1849)

ఎడ్గార్ ఎలెన్ పో నుండి నేర్చుకొన్న ఛందో రహస్యాలను శ్రీశ్రీ తన రచనలలో పలుచోట్ల ప్రదర్శించాడు. ఉదాహరణకు 'మరో ప్రపంచం' అనే గీతంలోని పాదాలు చూడండి.

ఎముకల క్రుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి!
నెత్తురు మండే,
శక్తులు నిండే
సైనికులారా రారండి!
హరోం! హరోం హర!
హర! హర! హర! హర!
హరోం హరా! అని కదలండి!
మరో ప్రపంచం,
మహా ప్రపంచం
ధరిత్రి నిండా నిండింది!

ఇది సింగిల్ పన్నా కవిత్వంగా రాశానని శ్రీశ్రీయే చెప్పాడు గాని ఈ చరణాలలో క్రుళ్ళిన, మళ్ళిన, మండే-నిండే అనేవి అంతఃప్రాసలుగాను, చావండి-రారండి-కదలండి అనేవి అంత్యప్రాసలుగా ఎంచుకోవచ్చు. శ్రీశ్రీ అనంతర రచనలలో చాలా వాటిలో ఈ

అంతఃప్రాసలూ అంత్యప్రాసలూ కలగలిసి కావ్య కలరవాన్ని చేస్తాయి. అయితే అతని గీతాలు ఒకే మూసలో పోసినట్టు కాక వివిధ గతులలో చరిస్తూ ఉంటాయి. కనుకనే వైవిధ్యం గోచరిస్తుంది.

పాశ్చాత్యులలో తన ఋషిత్రయాన్ని చెప్పినట్టే మహాప్రస్థానం ప్రారంభించిన రోజుల్లో తెలుగు కవులలో బసవరాజు, కవికొండల, చింతాదీక్షితులు తన కవితా గురువులని శ్రీశ్రీ ఒకచోట గ్రంథస్థం చేశాడు.[32]

మహాప్రస్థానం సంకలనంలో ఉన్న 40 రచనలలో పధ్నాలుగు కవితలను శ్రీశ్రీ 1934 నాటికే రచించాడు. 1935లో ఖచ్చితంగా రెండు కవితలు రాశాడు. మూడోది కూడా బహుశా ఈ యేడే రాసి ఉండవచ్చు. అవి 'పరాజితులు', 'ఆః' 'ఉన్మాది' అనే శీర్షికలతో ప్రచురితమైనవి.

1936లో శ్రీశ్రీ పైలాపచ్చీసు వయస్సు దాటిన యువకుడు. నిరుద్యోగి, పట్టభద్రుడు, కవిత్వమే లోకంగా బతుకుతున్నవాడు, లోకం తన కవిత్వంలో ప్రతిఫలించాలని ఇంకా ప్రయత్నించనివాడు. 1935 దాకా బోదిలేర్, మాపాసా, ఎడ్గార్ ఎలెన్ పో ల ప్రభావంలో ఉన్నవాడు. 1936లో మళ్ళా తన తొలి అభిమానకవి స్విన్‌బర్న్ వైపు శ్రీశ్రీ పయనించాడు. ఆ యేడు రెండే రెండు కవితలు రచించాడు. రెండూ స్విన్‌బర్న్ చూపిన మార్గానికి కృతజ్ఞతతో రాసినది. 'స్విన్‌బర్న్ కవికి' అనే ఖండిక ఆ మార్గదర్శిని ప్రశంసించే అయిదు కొత్త నడక ముత్యాలసరాలు.

శ్రీశ్రీ ఉద్దేశంలో తాను 'మాతృగర్భ మహా సముద్రంలో ఈదులాడుతున్నప్పుడే నాలో స్విన్‌బర్న్ కవిత్వం ప్రసరిస్తూ, ప్రవహిస్తూ ఉండి ఉండాలి.'[33] శ్రీశ్రీ ఇంకో ఏడాదికి 1910లో జన్మిస్తాడనగా 1909లో స్విన్‌బర్న్ చనిపోయాడు. పుట్టకముందు నుంచి తాను స్విన్‌బర్న్ కవిత్వాన్ని తనలో నింపుకొనడమన్నది కొందరికి అతిశయోక్తిలా కనిపించినా శ్రీశ్రీ స్వభావోక్తిగానే చెప్పాడు. స్విన్‌బర్న్ కవిత్వంలోని గంధర్వ సంగీతం అనుక్షణానుభూతం అన్నది శ్రీశ్రీ 1935కి ముందే గుర్తించాడు. అది భావ సౌందర్యంలేని కృతక పదాల కూర్పుకాదు. అతని సంగీతం పదాలలోంచి బయలుదేరే భావాలగానం. స్విన్‌బర్న్ గురించి తనకు ఎంతో తెలుసునని చెప్పాడు. ఇది పచ్చి స్వభావోక్తి.

స్విన్‌బర్న్ 'దిమ్యాచ్' (The Match) అనే కవితను ఒక దాన్ని రాశాడు. భిన్నధృవాల ఆకర్షణను ధ్వనించే ఈ గీతాన్ని శ్రీశ్రీ అద్వైతం అనే పేరున అనుసరించాడు. మూలం "If Love were what the rose is" అనే మాటతో ప్రారంభమవుతుంది. శ్రీశ్రీ 'ఆనందం అర్ణవమైతే అనురాగం అంబరమైతే' అనే ఎత్తుగడతో తన గీతాన్ని రాశాడు. ఆంధ్రాంగ్ల సాహిత్యాలను కూలంకషంగా పరిశీలించిన రోణంకి అప్పలస్వామిగారు నేను చేసిన ఒక రేడియో ఇంటర్వ్యూలో స్విన్‌బర్న్ మాతృక సనాతనమనీ, శ్రీశ్రీ అనుసరణ మాత్రం సమకాలిక చైతన్యాన్ని ప్రస్ఫుటిస్తున్నదనీ చెప్పారు. ఈ సద్విమర్శ ఒక్కటేచాలు శ్రీశ్రీ పనివాడితనాన్నీ, 'నేటి' తనాన్ని చాటడానికి.

---

32. అనంతం – పుట – 162

33. అనంతరం – పుట – 24

'అద్వైతం'లో శ్రీశ్రీ ఒక్క స్విన్‌బర్న్‌నే అనుసరించినట్టు ప్రకటించినా ఈ భిన్న ధృవాల పరస్పర సంబంధాన్ని, వైరుధ్యాల సంయోగాన్ని కృష్ణశాస్త్రిగారు తమ 'ఊర్వశి' అనే సంకలనంలో 'కాలమే పసిపాప' అనే మాటలతో మొదలయ్యే గీతంలో చక్కగా పొందుపరిచారు. కృష్ణశాస్త్రిగారి గీతంలోని కొన్ని పంక్తులను 'అద్వైతం'తో సరిపోల్చి చూస్తే ఈ సంగతి తెలుస్తుంది.

మున్నీటి తరగలకు మిన్నేటి నురుగులకు
తడయునెడబాటేనె! విడని కౌగిలి నేనె!
వానచినుకుగ సాగసి వలపు చూపుగ నెగసి
పడపొవుదునేనె! పరువు లిడుదును నేనె!
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆనాటి కీనాటి కేను నీ దాననే!
హాలాహలానలమె అమృతశీతలరసమె
తోడుబుట్టులు నాకు! తోడునీడలునాకు!
నిశి నీలిపెదవిపై నిట్టూర్పుగా ప్రాకి,
తొలిప్రొద్దు చెరగులో పలుకరింతగ సోకి.....
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆనాటి కీనాటి కేను నీదానినే!

ఇప్పుడు 'అద్వైతం'లో పాదాలు కొన్ని పరిశీలించండి.

నీ కంకణ నిక్వాణంలో,
నా జీవ నిర్వాణంలో -
నీమదిలో డోలలు తూగీ,
నా హృదిలో జ్వాలలు రేగీ -
నీ తలపున రేకులు పూస్తే,
నా వలపున బాకులు దూస్తే -
మరణానికి ప్రాణం పోస్తాం,
స్వర్గానికి నిచ్చెన వేస్తాం.
హాసనానికి రాణివి నీవై,
వ్యసనానికి బానిస నేనై -
విషమించిన మదీయ ఖేదం,
కుసుమించిన త్వదీయ మోదం -
విషవాయువులై ప్రసరిస్తే,
విరి తేనియలై ప్రవహిస్తే -
ప్రపంచమును పరిహసిస్తాం,
భవిష్యమును పరిపాలిస్తాం.

ఈ రెండు కవితలు పరస్పర బంధుత్వం గలవే. ఊర్వశి విభాగంలోని సంకలనాన్ని 1929లో ముద్దుకృష్ణ పుస్తక రూపంలో ప్రచురించాడు. అప్పటికి శ్రీశ్రీ విద్యార్థి. కృష్ణశాస్త్రి గారి ఫేన్. 'అద్వైతం' గీతాన్ని శ్రీశ్రీ 1936లో రచించాడు. ఈ గీతం విషయంలో స్విన్‌బర్న్‌తోపాటు కృష్ణశాస్త్రిగారు కూడా వీరిని ప్రభావితుణ్ణి చేసి ఉండవచ్చు.

కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షంలోని కొన్ని గీతాల ప్రభావం పరోక్షంగా శ్రీశ్రీ మహాప్రస్థానం గీతాలపై లేకపోలేదు. ఉదాహరణకు కృష్ణపక్షంలో ''నా విరులతోటఁబెంచి కొన్నాఁడనొక్క పవడపు గులాబి మొక్క'' అన్న ఎత్తుగడతో రాసిన గీతంలో కృష్ణశాస్త్రి గారు ఆ మొక్కకు పూచిన పువ్వును చూస్తూ తామూ, తమను చూస్తూ పువ్వూ కాలం గడిపారని చెప్పి, చివర రెండు గీతపద్యాలను రాశారు.

ఎటులది దాపురించెనో యేమొ యంత
నాకు సందుల త్రోవల నల్ల దిగియె
నొక్క క్రూరార్క కిరణమ్ము, ఉర్విపాలి
నా గులాబి సోలి తూలి నన్ను వీడె
అపుడు నావైపు చూచి నాయలరు లేని
శూన్యమౌ మోడు మ్రాఁకునుజూచి, యొక్క
కోకిలమ్ముకోయన, యేడ్చెగొంతునెత్తి!
మా కొఱకు దారిఁబోయెడు మందపవను
డొకఁడు జాలిగ నొక్క నిట్టూర్పు విసరె!

ఈ పద్యానికి శ్రీశ్రీ 'బిక్షువర్షీయసి'కి ప్రత్యక్షంగా కాకుండా వైరుధ్యంలో పోలికలున్నాయి. దిక్కులేని దీనురాలు గురించి చెప్పాక శ్రీశ్రీ ఇలా రాశాడు.

'ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరి'దని
వెర్రిగాలి ప్రశ్నిస్తూ
వెళిపోయింది!

ఎముక ముక్క కొరుక్కుంటు
ఏమీ అనలేదు కుక్క
ఒక ఈగను పడవేసుకు
తొందరగా తొలగె తొండ.

క్రమ్మె చిమ్మ చీకట్లూ,
దుమ్ము రేగెనంతలోన,
'ఇది నా పాపం కా'దనె
ఎగరి వచ్చి ఎంగిలాకు.

కృష్ణశాస్త్రిగారి భావకవిత్వంలో 'మందపవనుడు' శ్రీశ్రీ చావకవిత్వంలో 'వెర్రిగాలి' అయింది. కృష్ణశాస్త్రిగారి కవితలోని 'కోకిల' బదులు శ్రీశ్రీ గీతంలో ఎముక ముక్క కొరుక్కునే కుక్క, ఈగను పడవేసుకొని తొలిగిపోయిన తొండ' కనపడతాయి. స్థూల

దృష్టికి కృష్ణపక్షంలోని గీతం ప్రభావం మహాప్రస్థానంలోని ఈ గీతంపై ఉన్నట్టు కనపడదుకాని, సూక్ష్మంగా విశ్లేషణ చేస్తే నిర్మాణ విధానంలో వైరుధ్య సామ్యాలు కనబడతాయి.

1936లో శ్రీశ్రీ 'స్విన్‌బర్న్ కవికి' అనే గేయాన్ని రాశాడు. ఇంకే కవిని ఇంతగా ప్రశంసించలేదు. ఆ ముత్యాల సరాలను చూడండి.

విషం క్రక్కే భుజంగాలో
కదం త్రొక్కే తురంగాలో,
మదం పట్టిన మాతంగాలో
కవీ, నీ పాటల్?

'లగం' అనే గణంతో ముత్యాల సరాలను ఎత్తుకోవడం గడుసు పోకడ. కంద పద్యంలో తొలిపాదంలోని అద్యక్షరం లఘువు అయితే మిగతా మూడు పాదాలలోనూ అలాగే ఉండాలన్న లక్షణాన్ని ముత్యాల సరానికి కూడా వర్తింపచేయడం మాత్రా ఛందస్సులలో కూడా శ్రావ్యతను సాధించడానికే.

ఎర్రకాంతుల ఇనోదయమూ,
రెక్కవిప్పిన రివల్యూషన్,
కడలి వలపూ, వలపు కడలీ
కవీ, నీపాటల్!

స్విన్‌బర్న్ కవితలో రెక్కవిప్పిన రివల్యూషన్, సోవియట్ రష్యాలో వచ్చిన అక్టోబరు విప్లవం కాదు. స్విన్‌బర్న్ 1909లో చనిపోయాడు. అతడు ఇటలీ దేశపు జాతీయోద్యమం వల్ల ప్రభావితుడయ్యాడు. ఇటలీలో పర్యటనలు చేశాడు. 'మజ్జినీ' అనే ఇటాలియన్ నాయకుని రిపబ్లికన్ ఆశయాల వల్ల స్విన్‌బర్న్ ప్రభావితుడయ్యాడు.[34] 1867లో "Song of Italy" (ఇటలీ పాట) 1871లో "Songs before Sunrise" (సూర్యోదయానికి పూర్వం గేయాలు) అనేవి ఇటాలియన్ విప్లవం గురించే స్విన్‌బర్న్ రచించాడు. ఈ రచనలు చేసిన కొద్దికాలానికే మజ్జినీ 1872లో మరణించాడు.

మజ్జినీవల్ల స్విన్‌బర్న్ ప్రభావితుడైతే, స్విన్‌బర్న్ కవితల వల్ల ఆనాటి యువకులు ఉగ్రూతలూగారు. అతని జీవితచరిత్రలో కొంతభాగాన్ని ఇక్కడ పొందుపరచడం అప్రస్తుతం కాదు.

ఎ.సి.స్విన్‌బర్న్ (1837-1909)

గేయ ఫణితులు పరిణతి చెందడానికి ఇంగ్లీషు భాషను మలచడంలో స్విన్‌బర్న్ చేసిన వాఙ్మయ సేవను అంచనా కట్టాలంటే దానికి ఖరీదు కట్టే షరాబు బోలెడు లెక్కలు తేల్చాలి.

34. Gusseppe Mazzine (1805-1872) ఇతడు ఇటలీ విమోచనోద్యమంలో గొప్ప కృషి చేశాడు. అధికారులు ఇతణ్ణి దేశ బహిష్కృతుణ్ణి చేశారు. 1837లో 'యంగ్ ఇటలీ' అనే పత్రికను నడిపాడు. 1848లో స్వదేశానికి తిరిగి వచ్చి రోమన్ రిపబ్లిక్ నియంత అయ్యాడు. అయితే ఆ పదవిలో కాళ్ళు నిలదొక్కుకోలేకపోయాడు.

ఇంగ్లీషు ఛందో విధానాలలో స్విన్‌బర్న్ సంపూర్ణమైన విప్లవాన్ని తీసుకువచ్చాడు. కేవలం ఇదొక్కటి మాత్రమే అతని సృజనాత్మక ప్రాముఖ్యానికి తార్కాణం కాదు. సనాతన సంప్రదాయాలపై సంకెళ్లు వేసే ఛాందస నియమాలపై అర్థంలేని ఆచారాలపై యువత చేసే తిరుగుబాటును అతడు తన గేయాలలో గానం చేశాడు. అతని కళాత్మక వ్యక్తిత్వం కైపెక్కిస్తుంది. ఘాటెక్కించి చక్కని కిక్కిస్తుంది. మొట్టమొదటిసారిగా స్విన్‌బర్న్ కవిత్వాన్ని ఆస్వాదించే యువకవితా పిపాసులందరూ తప్పనిసరిగా ఆ వెల్లువలో కొట్టుకుపోతారు. ఆ కవిత్వంలో ఉండే వెర్రి ఆవేశం, పట్టపగ్గాలులేని ఉత్సాహం, అతీతంగా సర్వం అతిక్రమించే స్వభావం, అన్నిటికన్నా ముఖ్యంగా కొట్టొచ్చేటట్టు కనబడే చిత్తశుద్ధి, ఆ గీతాలలోని ప్రాణశక్తి, త్రాణశక్తి, సమస్త యువకాశలనూ, ఆశయాలకు స్వాగతం చెప్పే తూర్య విరావాలలాగ దీర్ఘశ్రుతిలో తీవ్ర ధ్వనితో మ్రోగుతాయి. యువహృదయాలు ఈ కవితా సుమం చుట్టూ భ్రమరాల్లా పరిభ్రమించక తప్పదు. అయితే కొంచెం పరిణత మనస్కులైన తరువాత ఈ పాఠకులే స్విన్‌బర్న్ కవితపట్ల తమకుగల అచంచల భక్తి విశ్వాసాల ముళ్లు బాగా సడలిస్తారు. స్విన్‌బర్న్ కవితలలో ప్రాథమిక పాశవిక జాంతవత్వమున్నదన్న ఆరోపణను బొత్తిగా కొట్టిపారెయ్యలేము. అది ప్రేమయినాసరే. విద్వేషమైనాసరే ఇతనిలో ఉన్న భావాలు కేంద్రానికి దూరమై మితిమీరి, శ్రుతిమించి పట్టుతప్పేటంత పాకాన పడతాయని విమర్శకులు ఆపాదిస్తారు.

ఏది ఏమైనాసరే, స్విన్‌బర్న్ అతిక్రమణలు ఎంత సాహిత్య హింసాత్మకాలయినా, అతడు సమకాలిక కవిత్వానికి చేసిన ఉపకారాల ముందు ఇంకేవీ లెక్కకు రావు. కరడు కట్టిన కావ్యరీతుల శృంఖలాల నుండి ఇంగ్లీషు సాహిత్య విమోచన ప్రాప్తికి ఇతనికన్నా మరెవ్వరూ ఎక్కువగా పాటుపడలేదు. కల్తీలేని అసలు సిసలు కవిత్వానికి, పరిశుద్ధమైన సారస్వతానికీ కట్టుబడ్డ కవిగానే స్విన్‌బర్న్ కడదాకా నిలబడ్డాడు. అతని ప్రభావం సమకాలికులపై చాలా ఉత్తేజకరం. అతని సాహిత్య వ్యక్తిత్వం మహోశక్తివంతం. అతని తరంలోని కవులు కొందరు ప్రచారకులయ్యారు. కొందరు ప్రబోధకులయ్యారు. కొందరు తత్త్వశాస్త్ర చింతనలవైపు ఆకర్షితులయ్యారు. స్విన్‌బర్న్ మాత్రం కళాకారునిగానే, కవిగానే జీవించాడు. ఆస్థానకవి హోదాకు అర్హుడైన అభ్యర్థిగా, మర్యాదస్తుడిగా ఇతణ్ణి సమకాలికులు పరిగణించేవారు. ఒకనాటి రివల్యూషన్ భావాలుకల ఈ కవి జీవిత సాయంత్రంలో రియాక్షనరీగా పరిణమించాడు.[35] తనను ఎంతగానో అభిమానించే అమెరికన్ కవి వాల్ట్ విట్‌మన్‌ను దుయ్యబట్టాడు. ముదిమిలో మతి తప్పినా తప్పకపోయినా మొదటి వేల్పులకు యుక్తాయుక్త విచక్షణ లోపించడం సహజం.

స్విన్‌బర్న్ తన 72వ యేట మరణించాడు. అతణ్ణి ఎంతగానో అభిమానించే శ్రీశ్రీ ఉద్దేశంలో స్విన్‌బర్న్ గొప్ప కవిత్వమంతా 25 సంవత్సరాల లోపుగానే వచ్చింది. తరువాత స్విన్‌బర్న్ చచ్చిపోయినట్టే లెక్క.[36] స్విన్‌బర్న్ పాతికేళ్ళ వయస్సులో రాసిన వాటి వల్లనే శ్రీశ్రీ తనకు పాతికేళ్లు రాకముందే ప్రభావితుడయ్యాడు.

---

35. The Cambridge Guide to English Literature

36. 'సృజన' - ఫిబ్రవరి, 1970 సంచిక - పుట - 120

1936లో శ్రీశ్రీ రెండే రెండు కవితలను (రెండూ స్విన్‌బర్న్‌కు సంబంధించినవే). మాత్రమే రచించాడు. ఇంకేవీ రాయకపోవడానికి 1937 ఏప్రిల్ దాకా గీతాలు రచించకపోవడానికి ఒక కారణం కనబడుతుంది. 1936 చాలా ముఖ్యమైన సంవత్సరం. ఆ యేడు గొప్ప సాహిత్య సంఘటనలు జరిగాయి. లండన్‌లోని భారత ప్రోగ్రెసివ్ రచయితల మానిఫెస్టో ఇండియాకు వచ్చింది. 1936 ఏప్రిల్ మాసంలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన లక్నోలో ప్రోగ్రెసివ్ రచయితల సభలు జరిగాయి. దీనికి ఆంధ్ర సాహిత్య ప్రతినిధిగా అబ్బూరి రామకృష్ణారావుగారు వెళ్ళారు. తిరిగి వచ్చాక విశాఖపట్నంలో ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం స్థాపించారు. శ్రీశ్రీని అందులో చేర్చారు.

1937 ఏప్రిల్‌లో 'వ్యత్యాసం', 'అభ్యుదయం' అనే గీతాలను, మే నెల 7వ తేదీనాడు 'ప్రతిజ్ఞ' అనే గేయాన్ని శ్రీశ్రీ రచించాడు. ఈ మూడు రచనలూ శ్రీశ్రీని ప్రగతి మార్గంలో ప్రవేశపెట్టాయి. (1937లో ఇంకో అయిదు కవితలను శ్రీశ్రీ రాశాడు. వాటి గురించి తర్వాత ముచ్చటిద్దాం. ముందు ప్రగతి గీతాల గురించి తెలుసుకొందాం.)

వివిధ సందర్భాలలోనూ, వివిధ వ్యక్తులకు శ్రీశ్రీ ఇచ్చిన ఇంటర్వ్యూలలోనూ దొరికే సమాచార శకలాలను ఒకచోట ఒక క్రమంలో చేర్చితే 1936లోనూ 1937లోనూ శ్రీశ్రీ కవితాజీవితం గురించి అవగాహన చేసుకోవచ్చు. ఆ సమాచారములను అంకెలవారీగా శ్రీశ్రీ మాటలలోనే ఇస్తున్నాము.

1. మహాప్రస్థానం అన్న గీతం రాసే నాటికి నాకు Marxismను గూర్చి తెలియనే తెలియదు. నేను Marxismను తెలుసుకున్నది సాహిత్యం ద్వారానేగాని రాజకీయాల ద్వారా కాదు. మొదట్లో నన్ను ట్రాట్స్కీ బాగా influence చేశాడు. తర్వాత నాకు అబ్బూరి రామకృష్ణారావు London Progressive Writers ప్రచురించిన వాళ్ళ Manifesto చదవమని ఇచ్చాడు. ఈ Manifesto నన్ను Marxist lineలో పడవేసింది (సృజన - ఫిబ్రవరి 1970-పుట-2)

2. లండన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ మేనిఫెస్టో - అప్పటి వర్ధమాన రచయతల సంఘం అబ్బూరి రామకృష్ణారావుగారు చూపారు. అది చేసిన తర్వాత పొలాలనన్నీ హలాలదున్నీ గేయం రాశాను. ఆ మేనిఫెస్టో అలాదించేసావే అని అబ్బూరి రామకృష్ణారావుగారన్నారు. ఉదయిని లాస్ట్ ఇష్యూలో కొంపెల్ల జనార్దనరావు దాని గురించి రాశాడు. (సృజన - ఫిబ్రవరి 1970 - పుటలు 117-8)

ఈ రెండు సమాచార శకలాలవల్ల 'పొలాలనన్నీ' అనే ప్రతిజ్ఞ గేయానికి ప్రోద్బలం ఏమిటో తెలుస్తుందిగాని శ్రీశ్రీ పొరబడినట్టు చెప్పాలి. ఈ పొరబాటును సరిదిద్దు కోకుండానే చాలాసార్లు పునరుక్తం చేశాడు. తన స్వీయచరిత్రలో ఇలా రాశాడు.[37]

''భావ కవిత్వానికి కడసారిగా గుడ్‌బై కొట్టి 'మహాప్రస్థానం' గీతాలు రాస్తున్న రోజులవి. ఒకనాడు అబ్బూరి రామకృష్ణారావుగారు లండన్ నుంచి వచ్చిన Progressive Writers Manifesto చదవమని నాకిచ్చారు. అరఠావుకంటె ఎక్కువ సైజులేని ఆ పత్రం

37. అనంతం - పుట - 122

నామీద చెరగని ముద్ర వేసింది. దాని ప్రభావంతోనే 'ప్రతిజ్ఞ' అనే గీతం రాశాను. 'పొలాలనన్నీ, హలాలదున్నీ' ఇత్యాది గేయం. Manifesto సారాంశం అంతా దించేశానని మెచ్చుకొన్నారు అబ్బూరివారు''.

సృజన - ఇంటర్వ్యూలో ఈ సంగతి 1970లోనూ, ఈ పై స్వీయచరిత్ర శకలం 1975లోనూ శ్రీశ్రీ తెలియచేశారు. అయితే లండన్ ప్రోగ్రసివ్ రైటర్స్ మానిఫెస్టోలోని భావాలు ప్రతిజ్ఞను రాయించాయనిగానీ, అందులోని సమాచారాన్ని అలా దించేశాడని గానీ చెప్పలేం. నేను 1983లో ఇంగ్లండు వెళ్ళినప్పుడు ఆ మానిఫెస్టో ప్రతిని సంపాదించి తెచ్చాను. శ్రీశ్రీ చేత 'ప్రతిజ్ఞ రాయించిన ప్రణాళిక సాహిత్యలోకానికి తెలియచేయడం ముఖ్యమని, దానిని 'ప్రజాశక్తి', స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యేక సంచిక (1984) లో మూలం ఏ సైజులో ఉంటే ఆ సైజులోనే యథాతథంగా బ్లాక్ చేయించి ప్రకటించాను.

బ్రిటన్‌లో ప్రచురితమౌతున్న వామపక్ష పత్రిక 'లెఫ్ట్ రివ్యూ'లో 1938 ఫిబ్రవరి సంచికలో ఈ మానిఫెస్టో తొలిసారిగా ప్రకటితమైంది. ఒక పేజీలో పూర్తిగా కూడా లేదు. ఈ చిన్న డాక్యుమెంటే శ్రీశ్రీ చదివినదని చెప్పడానికి ఒక సాక్ష్యం ఉంది. 'అరఠావుకంటె ఎక్కువసైజు లేని ఆ పత్రం నామీద చెరగని ముద్ర వేసింది' అని శ్రీశ్రీయే చెప్పాడు.[38]

లండన్‌లోని మానిఫెస్టో చదివినప్పుడే శ్రీశ్రీ రుడ్‌యార్డ్ కిప్లింగ్ గీతాలలో 'A consecration' అనే గీతాన్ని చదివాడు. దీని గురించి ఇలా రాశాడు.[39]

''ఎవరి గురించి రాయనో, ఎవరి గురించి రాస్తానో అని వివరించి చెప్పే గీతం ఇది. నా కవిత్వాన్ని ప్రభావితం చేసిన అనేకానేక రచనల్లో ఇది అత్యంత ముఖ్యమైనది. దీని ప్రభావం Progressive Writers Manifesto చదివిన తర్వాత నేను రాసిన 'ప్రతిజ్ఞ' అనే గీతం మీద, ముఖ్యంగా -

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం

ఇత్యాది పాదాలమీద, సుస్పష్టంగా ముద్రితమయిందని వేరే చెప్పనక్కరలేదు.

'ప్రతిజ్ఞ' గేయం రాయడానికి ముందే శ్రీశ్రీ 'అభ్యుదయం' అనే కవిత రచించాడు. ఇది ఏప్రిల్ నెలలో జరిగింది. (తారీఖు తెలియదు) ప్రతిజ్ఞ మే 7వ తేదీన రాశాడు. 'అభ్యుదయం' గీతం ఇలా ముగుస్తుంది.

నేడే
ఈనాడే, ఈనాడే
జగమంతా బలివితర్ది
నరజాతికి పరివర్తన
నవజీవన శుభసమయం
అభ్యుదయం

---

38. అనంతం - పుట - 122
39. అనంతం - పుట - 133-4

ఈ గీతం గురించి రాసేటప్పుడు ముందు శ్రీశ్రీ ఇలా అన్నాడు. ''అభ్యుదయం అనే మాటను 'అభ్యుదయ పరంపరాభివృద్ధిగా' అనే పాత అర్థంలోకాక నూతనార్థంలో మొట్టమొదటిసారిగా వాడింది నేనే అనుకుంటాను.''[40]

ఇక్కడ కూడా శ్రీశ్రీ జ్ఞాపకశక్తి అతణ్ణి తప్పుదారి పట్టించింది. కొంపెల్ల జనార్దనరావు 1935లో ఉదయిని రెండవ సంచికలో 'అభ్యుదయం' అనే మాటను ఒకటికి రెండుసార్లు ఇలా వాడాడు.

''వాడుకభాషలో, కొత్త ఛందస్సులలో వచ్చే రచన సాహిత్యముగా గణించనొల్లని వ్యక్తులనూ, గుంపులనూ తప్పించి నవ్యసాహిత్యము చియ్యబట్టివస్తూనే ఉండగా, నవ్యులు కొత్త ఛాందసాలు పెంచుకొనక సరియైన విలువల మీదనే దృష్టి నిలిపితే నవ్య సాహిత్య పరిషత్తుకు కేంద్రత్వమూ, నవ్యసాహిత్యానికి అభ్యుదయమూ చేకూరగలుగుతవి. మరిన్ని అభ్యుదయ రీతులుయోజించి అనుసరించవలెనని పరిషత్తు అనుకొనడంకంటే, ఆ ప్రయత్నము కొనసాగించే తోడ్పాటు లెక్క చూసుకోవలసి ఉంటుంది. పరిషత్తు వారు సారస్వతమును ప్రజలలోనికి ప్రాకించే యత్నము చేయవలెననేకంటే, సారస్వతమును అలాగు దింపడం ఆపేక్షించక, ప్రజలు కొంత ఉన్నతి చేపట్టి కర్తవ్యము గుర్తించవలెనన్నదే యెక్కువ న్యాయమైన ఆలోచన''.

జనార్దనరావు తన సంపాదకీయంలో 'అభ్యుదయం' అనే మాటను ప్రయోగిస్తే శ్రీశ్రీ మరో రెండేళ్ళకు తన కవితలో ఈ మాటను వాడాడు. ప్రబంధకవులు కృతిభర్తకు 'అభ్యుదయ పరంపరాభివృద్ధి'గా కావ్యం చెప్తే, శ్రీశ్రీ శ్రమకర్తలైన కష్టజీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ, భావివేదముల జీవనాదాలు జగత్తుకు చవి చూపాడు. లండన్ మేనిఫెస్టో చేతికందిన సంవత్సరంలోనే చదివిన ఇతర సాహిత్యం వల్ల అభివృద్ధి నిరోధకులకూ ప్రగతివాదులకు మధ్యగల వ్యత్యాసం గుర్తించాడు. ''అలజడి మా జీవితం, ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మా వేదాంతం'' అని ప్రకటించాడు. 'ఈనాడే నరజాతికి పరివర్తన' అని విశ్వసించాడు. 1937 ఏప్రిల్, మే మాసాలలో రాసిన తొలి మూడు గీతాలలో శ్రీశ్రీ తన శ్రామిక పక్షపాతాన్ని స్పష్టంగా ఎలుగెత్తి చాటాడు.

1934లో 'మరో ప్రపంచం' గీతం, 1937లో 'ప్రతిజ్ఞ' రాసిన శ్రీశ్రీ ఈ మూడేళ్ళలో ఏయే గ్రంథాలు తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ చదివి ప్రభావితుడయ్యాడో తెలుసుకొనడం అవసరమే. 1935లో గద్దె లింగయ్యగారి 'ప్రభ'లో తుమ్మల వెంకటరామయ్యగారి 'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా' పాటా, పెండ్యాల లోకనాథం గారి 'కూలీలందరు ఏకం అయితే కూటికి తరుగేమి' అనే పాటా శ్రీశ్రీ చదివే వుండాలి. ఆనాడు తెలుగులో లభించే సామ్యవాద సాహిత్య వివరాలు చూడండి.

1. ట్రాట్స్కీ రచించిన రష్యావిప్లవ చరిత్ర
2. క్రొపాట్కిన్ రచించిన విప్లవ సందేశం
3. బుఖారిన్ రచించిన చారిత్రక భౌతికవాదం
4. ఎవరు అనువదించారో తెలియని 'ఇటలీ దేశపు విప్లవకారుడైన మజ్జినీ చరిత్ర'.

40. అనంతం. పుట. 165

ఇవి శ్రీశ్రీ చదివే ఉండాలి. అబ్బూరి రామకృష్ణారావుగారు బుఖారిన్ రచన హిస్టారికల్ మెటీరియలిజం చదివారు. లెనిన్ రచనల నుండి కొన్ని భాగాలను అనువదించసాగారు.[41] ఇది శ్రీశ్రీ చేతకూడా చదివించే ఉండాలి. అబ్బూరి వారు ఎం.ఎన్.రాయ్ ప్రభావంలో పడి కమ్యూనిస్టు పార్టీతో విభేదించాక వారి అనుయాయి అయిన శ్రీశ్రీ కూడా రాయిస్టుగా సంచరించాడు. సామ్యవాదం పట్ల ప్రాథమిక అవగాహన మాత్రం మారలేదు. 1937 మే లో 'చేదుపాట' ఆగస్టులో 'నవకవిత' శ్రీశ్రీ రాశాడు. 1937 శ్రీశ్రీకి చాలా విషాదకరమైన సంవత్సరం. ఆ యేడు జూలై 23వ తారీఖున క్షయవ్యాధివల్ల కొంపెల్ల జనార్ధనరావు చనిపోయాడు. ఉన్నతాశయాలతో అతడు నడుపుతున్న 'ఉదయిని' పత్రిక అస్తమించింది. అతనితోపాటు అతడూ, అతని స్నేహితులు కన్నకలలు కల్లలయ్యాయి. శ్రీశ్రీ విచారం చెప్పలేనిది ఉత్తరోత్తరా ఒక గీతంలో దానిని వ్యక్తం చేశాడు.

సరిగ్గా తారీఖులు తెలియవుగాని 1937లోనే 'మిధ్యావాది', 'కవితా ఓ కవితా', 'వాడు' అనే మూడు రచనలు చేశాడు. కాని ఇవి 1938లోనూ, 1939లోనూ అచ్చుపడ్డాయి. 'కవితా ఓ కవితా' గీతాన్ని 1938 బందరు నవ్యసాహిత్య పరిషత్తు సభలో శ్రీశ్రీ చదివినప్పుడు విశ్వనాథ సత్యనారాయణ కన్నీళ్ళతో గద్గద స్వరంతో 'కవిత్వం అంటే ఇదీ' అని అన్నారని శ్రీశ్రీయే చెప్పాడు.[42]

వాస్తవానికి కవిత్వం అంటే ఏమిటో తెలుసుకొని దాని విశ్వరూపాన్ని శ్రీశ్రీ ఈ 'కవితా ఓ కవితా' అన్న ఖండకావ్యంలోనే దర్శించాడు. లోకులకు దానిని ప్రదర్శించాడు.

అప్పటిదాకా తెగిన గాలిపటంలాగా తిరిగిన శ్రీశ్రీ 1938లో మద్రాసులోని ఆంధ్రప్రభ సహాయ సంపాదక వర్గంలో చేరాడు. అంతదాకా సాహిత్య జగత్తులోనే ఉన్నవాడు. దినపత్రికలో ఏరోజుకారోజు రాయిటర్ సంస్థ పంపే ప్రపంచవార్తలు అనువదిస్తూ వాస్తవలోకంలోని రాజకీయాలు అవగాహన చేసుకొనడం ప్రారంభించాడు. పూర్వం పుస్తకాల్లో చదివిన సిద్ధాంతాల లోతులు ఇప్పుడు అర్థం కాజొచ్చాయి. వాస్తవానికి శ్రీశ్రీ మహాప్రస్థానం గీతాలు రాస్తున్నప్పుడు సామ్యవాద సిద్ధాంతాల పరిపూర్ణ భావాలు తెలియవు. ఆ సంగతి అతడే ఇలా చెప్పాడు.

'మహాప్రస్థానం' అన్న గీతం రాసే నాటికి Marxism గూర్చి తెలియనే తెలియదు. నేను Marxism తెలుసుకొన్నది సాహిత్యం ద్వారానే గాని రాజకీయాల ద్వారా కాదు''. -

సృజన - ఫిబ్రవరి 1970 - పుట - 122

ఏ సాహిత్యం ద్వారా శ్రీశ్రీ మార్క్సిజంలోకి వచ్చాడో కూడా తెలుసుకోడానికి సూచనలు ఇచ్చాడు.

''...షెల్లీ అనార్కిస్ట్. క్రొపాట్కిన్ శిష్యుణ్ణయిన నాలో కూడా కొంత అనార్కిజమ్ ఉంది.'' - సృజన - ఫిబ్రవరి 1970 - పుట.122.

---

41. 'అబ్బూరి సంస్మరణ'లో కె.వి. రమణారెడ్డి - పుట.104
42. అనంతం - పుట 86

1938 నాటికి శ్రీశ్రీ మళ్ళీ క్రొపాట్కిన్ విప్లవ సందేశాన్ని అధ్యయనం చేశాడేమో. తన కర్తవ్యం, దేశచరిత్రలు అర్థమవడం ప్రారంభించాయి. 'విప్లవ సందేశం' అనే పుస్తకంలో క్రొపాట్కిన్ ఇలా అన్నాడు.[43]

''ఓ యువకుడా! నీవు కవినీ, చిత్రకారుడివీ, శిల్పివీ అయినట్లయితే నీ కర్తవ్యమేమిటో గుర్తించావా? నువ్వు ఆరాధిస్తున్న కళల యొక్క సంపూర్ణాభివృద్ధినే కోరినట్లయితే యిట్లారా! నీకలాన్నీ, కుంచెనీ, ఉలినీ సామాజిక విప్లవానికి మార్గం చేయడంలో ఉపయోగించు. ఉత్సాహపూరితమైన రచన, భావగర్భితమైన చిత్రం వీట్లతో అత్యాచారాలకి విరుద్ధంగా కార్మిక కర్షక వర్గం చేస్తున విప్లవానికి దోహదం చెయ్యి''.

క్రొపాట్కిన్ విప్లవ సందేశాన్ని మాత్రమేకాదు బుఖారిన్ చారిత్రక భౌతికవాదాన్ని కూడా శ్రీనివాసరావు పఠించాడు. వివిధ జాతీయ అంతర్జాతీయ గీతాల భావాలు జీర్ణించుకొన్నాడు. దేశ చరిత్రల పట్ల ఒక స్థిరమైన అవగాహన ఏర్పడింది. ''ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం'' అని ప్రశ్నించుకొన్నాడు. అప్పటిదాకా ఉన్న చరిత్రల గురించి క్రొపాట్కిన్ ఇలా 'విప్లవ సందేశం'లో చెప్పాడు.

''అప్పుడున్న చారిత్రక గ్రంథాలలో చక్రవర్తుల గాథలూ, గొప్ప రాజకీయవేత్తల కూటనీతులూ, రాజకీయసభలూ, పార్లమెంటూ, ఓట్ల కార్యక్రమాలూ, పాలక జాతుల దేశాభిమానం పేరిట స్వలాభం కోసం చేసే దారుణ యుద్ధాలు ఇవి మినహా మరేమున్నాయి?

ఇక్కడా అక్కడా అన్నమాటేమిటి? అక్కడ ఇంగ్లాండులో, ఇక్కడ జర్మనీలో, అక్కడ యునైటెడ్ స్టేట్స్‌లూ, ఇక్కడ ఇటలీలో, అక్కడ చైనాలో, ఇక్కడ ఇండియాలో యింకా ప్రతీ ప్రదేశంలో యెక్కడెక్కడ పీడించేవాళ్లూ, పీడించబడేవాళ్ళూ వున్నారో అక్కడక్కడల్లా కూలీ రైతులలో ఒక బ్రహ్మాండమైన వుద్యమం బయలుదేరి పనిచేస్తుంది''.

ఈ క్రొపాట్కిన్ భావాల కోలాహలమే శ్రీశ్రీచేత

చీనాలో రిక్షావాలా,
చెక్ దేశపు గని పనిమనిషి,
ఐర్లండున ఓడ కళాసీ
అణగారిన ఆర్తులందరూ
హాటెంటాట్, జూలూ, నీగ్రో
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యథార్థతత్త్వం
చాటిస్తారొక గొంతుకతో

అని పలికించింది. కమ్యూనిస్టు మానిఫెస్టోలోని "The History of all hitherto Existing Society is the History of class struggle" అన్న మౌలిక సూత్రాన్ని

''పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్రపుట్టెను''

43. విశ్వసాహిత్య గ్రంథమండలి వారి అనువాదంలో

- అన్న నిరంతర సత్య ప్రకటనగా శ్రీశ్రీ ఘోషించాడు. చరిత్ర నిర్మాతలయిన ప్రజాశక్తులను మేల్కొలిపాడు. దేశభక్తి గీతం రాసి జాతీయంగా గురజాడ అప్పారావుగారు ఎంతటి అభ్యున్నతిని ఆర్జించారో అంతటి ఔన్నత్యాన్ని 'దేశచరిత్రలు' గీతం రచించి శ్రీశ్రీ సముపార్జించుకొన్నాడు.

'దేశ చరిత్రలు' గీతాన్ని - శ్రీశ్రీ 1938 ఏప్రిల్ 19వ తేదీనాడు రచించాడు. ఇది దేశీయులలో చాలా ప్రాచుర్యం పొందింది. నాలుగు దశాబ్దాలపై చిలుకు కాలం ఇది దేనికో అనువాదం అనిగానీ, పాశ్చాత్యకవుల ప్రోద్బలం దీనిమీద ఉందనిగాని ఎవరూ ఆరోపణలు చేయలేదు. 1981లో నార్ల వెంకటేశ్వరరావుగారు ఇలా అన్నారని ఒక దినపత్రిక రిపోర్టు చేస్తోంది.[44] అందులోని నార్ల మాటలు ఏమిటంటే -

''దేశ చరిత్రలు'' గేయంలో తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు? లాంటి అనేక పంక్తుల మీద ప్రముఖ జర్మన్ కవి బెర్తోన్ బ్రెహ్ట్ (Bertolt Brecht) రాసిన 'ఎ వర్కర్ హు రీడ్స్ హిస్టరీ' అనే గేయం ప్రభావం వుంది. ఐతే ఆ విషయం శ్రీశ్రీ పేర్కొనలేదు''.

నార్లవారి పై ఆరోపణను రంగనాయకమ్మగారు ఉటంకించి తమ పుస్తకంలో ఇలా ఖండించారు.[45]

''బ్రెహ్ట్ కవిత ఇంగ్లీషులోకి రావడానికి పూర్వమే శ్రీశ్రీ 'దేశ చరిత్రలు' రాశారనడానికి రుజువుంది. బ్రెహ్ట్ ఆ కవితని జర్మన్ భాషలో రాసింది1935లో. బ్రెహ్ట్ కవితలకి ఇంగ్లీషు అనువాదాలు 1947లో ప్రారంభమయ్యాయి. ('రేపటికోసం' అనే బ్రెహ్ట్ కవితానువాద సంకలనం - పే.103) కానీ, శ్రీశ్రీ 'దేశచరిత్రలు' కవిత 1938లోనే అచ్చయింది. (శ్రీశ్రీ సాహిత్యం రెండో సంపుటి, పే.96) శ్రీశ్రీ బ్రెహ్ట్‌ని జర్మన్‌భాషలోనే చదివారనుకోవాలా?

''ఒక ఇంటర్వ్యూలో శ్రీశ్రీ ఇచ్చిన జవాబు ఇలా వుంది. 'జ్వాల' పత్రికలో ముద్దుకృష్ణ రాసిన ఒక ఎడిటోరియల్ ప్రేరణతో 'దేశచరిత్రలు' గేయం రాశాను. (సృజన-1980 జనవరి, పే.17) తన కవితకి మూలం ముద్దుకృష్ణ ఎడిటోరియల్ కాకుండా బ్రెహ్ట్ కవితే అయితే శ్రీశ్రీ ఈ పేరుకు బదులు ఆ పేరే చెప్పి వుండేవారు కదా?

''ఒక రచయిత మీద ఫలానా ఫలానా రచయితల ప్రభావం వుందని విమర్శకుడు అభిప్రాయపడితే (నిజానికి అలా లేకపోయినా కూడా) అందులో పెద్ద తప్పేమీ లేదు. విమర్శకుడి అభిప్రాయం అంతవరకే అయితే ఫర్వాలేదు. కానీ, ఆ రచయిత ఇతర రచయితల వల్ల ప్రభావితుడై కూడా ఆ విషయం మరుగుపరిచాడనే పద్ధతిలో విమర్శలు చేస్తే మాత్రం అది చాలా పొరపాటు. నార్లగారు బాధ్యతా రహితమైన విమర్శలు చేశారు''.

రంగనాయకమ్మగారు చెప్పిన విషయాలు సమంజసమైనవే. ప్రసిద్ధుల రచనల ప్రోద్బలంతో ఎవరైనా ఏదైనా రాస్తే ఆ విషయం ఏనాడైనా బయటపడుతుందని శ్రీశ్రీకి తెలుసు. దాచేస్తే దాగని సత్యాలు సాహిత్యంలో ఉంటాయి. ఇంతకీ తాను ఎవరివల్ల

44. 1981 డిసెంబరు 1వ తేదీ ''ఈనాడు'' దినపత్రికలో ''నార్లతో నారాయణరెడ్డి'' అనే శీర్షికలో వెలువడ్డ విషయం.

45. 'చలం సాహిత్యం' - పుటలు 138-9

ఎంతవరకూ ప్రభావితుడయ్యాడో శ్రీశ్రీ చెప్తూనే వచ్చాడు. బ్రెఖ్ట్ వల్ల ఉత్తేజితుడై దేశచరిత్రలు రాస్తే ఆ విషయాన్ని దాచుకొనే స్వభావం శ్రీశ్రీలో లేదు.

ఇంతకీ బ్రెఖ్ట్ గీతానికి దేశచరిత్రలకు పోలికలేమైనా ఉన్నాయా? తులనాత్మకంగా రెండు కవితలనూ విశ్లేషించి నార్లవారుగాని మరెవ్వరైనాగాని ఈ ఆరోపణలు చేశారా? పాఠకులు స్వయంగా పరిశీలించడానికి అనువుగా బ్రెఖ్ట్ కవితకు ఆంగ్లానువాదం పొందుపరుస్తున్నాను. బ్రెఖ్ట్ గీతం ఎత్తుగడ స్వేచ్ఛానువాదం ఇలా ఉంటుంది.

Questions from a worker who reads

Who built Thebes of the seven gates?
In the books you will find the names of kings
Did the kings haul up the lumps of rock?
And Babylon, many times demonlished
Who raised it up so many times? In what houses
Of gold-glittering Lima did the builders live?
Where, the evening that the Wall of China was finished
Did the masons go? Great Rome
Is full of triumphal arches. Who erected them? Over whom
Did the Caesars triumph? Had Byzantium, much praised in song
Only palaces for its inhabitants? Even in fabled Atlantis
The night the ocean engulfed it
The drowning still bawled for their slaves.

The young Alexander conquered India.
Was he alone?
Caesar bear the Gauls,
Did he not have even a cook with him?

Philip of Spain wept his armada
Went down. Was he the only one to weep?
Frederick the Second won the Seven Years' War, Who
Else won it?

Every page a victory.
Who cooked the feast for the victors?
Every ten years a great man.
Who paid the bill?

So many reports,
So many questions.

- Bertolt Brecht.

ఎవరు కట్టిరి? నైలు గట్టున
ఏడు గేటుల థిబిస్ నగరం?
పుడమినేలిన వాళ్ళ పేర్లే
పుస్తకాల్లో మీరు చూస్తురు
రాజులే ఆ రాళ్ళు మూపున
మోసుకెళ్ళారా?

బ్రెహ్ట్ గీతంలో ఇలాంటి చాలా ప్రశ్నలు ఉన్నాయి. నిజంగా ఈ జర్మన్ కవి రచనను చదివాక దేశ చరిత్రలు శ్రీశ్రీ రాసి వుంటే ధోరణి ఇంకోలాగ ఉండేది. ఏ సాహిత్యపు కోర్టులోనైనాసరే శ్రీశ్రీకి 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' ఇవ్వక తప్పదు. 1938లో శ్రీశ్రీ పనిచేసిన ఆంధ్రప్రభలోనే నార్లకూడా పనిచేస్తూ వచ్చారు. ఇద్దరూ ఒక ఇంట్లోనే రెండు భాగాలలో ఉండేవారు. అప్పుడు చేయని ఆరోపణ నాలుగు దశాబ్దాల తర్వాత చేయడంలో ఔచిత్యమేమిటి? నార్లవారికీ శ్రీశ్రీకి మనస్పర్థలు ఉన్నాయని ఇద్దరనీ ఎరిగిన వారికి తెలిసిన సంగతే. అంతమాత్రాన శ్రీశ్రీ నిజాయితీని శంకించడం భావ్యం కాదు. ఇంతకూ బ్రెహ్ట్ కవితను నార్లవారు తొలిసారిగా ఎప్పుడు చదివారో? శ్రీశ్రీ కూడా అదే కాలంలోగానీ, ఆ తర్వాతగాని దానిని చూసి ఉండకూడదా?

సమకాలికుల, ప్రాచీనుల రచనలలో కొన్ని భావాలతోనూ, మాటలతోనూ పోలికలన్నవి చాలామంది కవుల కవితలలో కనపడతాయి. ఎప్పుడు రాశాడో తారీఖు తెలియదుగాని శ్రీశ్రీ 'కళారవి' అనే కవిత ఒకటి రాశాడు. అది ఇలాగ ఉంటుంది.

పోనీ,
పోనీ,
పోతే పోనీ,
సతుల్, సుతుల్, హితుల్ పోనీ
పోతే
పోనీ!
రానీ,
రానీ,
వస్తే రానీ,
కష్టాల్, నష్టాల్,
కోపాల్, తాపాల్, శాపాల్ రానీ!
వస్తే
రానీ!
తిట్లూ, రాట్లూ, పాట్లూ రానీ!
రానీ,
రానీ!

కానీ,
కానీ!
గానం, ధ్యానం!
హాసం, లాసం!
కానీ! కానీ!
కళారవీ!
పవీ!
కవీ!

అన్నమాచార్యులారి సంకీర్తనలో ఈ క్రింది మాటలు ఉన్నాయి.

''నేనెందువోయెతానెందునోయె!
రానీలే రానీలే రానీలే!!
మీనైన నాటి తనమిడు కెల్ల దిగవలె!
కానీలే కానీలే కానీలే!!
....
మానైన నాటి మదమెల్ల దిగవలె!
పోనీవె పోనీవె పోనీవె!!''

(3వ సంపుటం - 345 సంకీర్తన)

ఈ రానీ, కానీ, పోనీ అన్నవే చూసి శ్రీశ్రీపై కవిత రాశాడని చెప్పలేముకదా. అన్నమయ్య సంకీర్తన 1937 నాటికిగాని వెలుగు చూడలేదు

1938లో శ్రీశ్రీ వయస్సు ఇరవై ఎనిమిదేళ్ళు. ఆ సంవత్సరాంతానికి అతడు ముప్పయి గీతాలు రచించాడు. వీటన్నింటినీ సంకలనం 'మహాప్రస్థానం' అనే పేరుతో గ్రంథరూపంలో తేవాలనుకొన్నాడు. దీనిని కొంపెల్ల జనార్దనరావుకు అంకితమిస్తూ 'తలవంచుకు వెళిపోయావా, నేస్తం! సెలవంటూ ఈ లోకం వదలి.....' అనే ఎత్తుగడతో గీతం రాశాడు. అయితే పుస్తక ప్రచురణకు అనుకూల పరిస్థితులు లేవు. 1939లో ఒక నాలుగు కవితలు రచించాడు. ఇందులో బెల్జియం దేశపు కవి ఎమిలీ వెర్‌హారన్ రచించిన ఫ్రెంచిభాషలో Les Pauvres అనే గీతం ఒకటి ఉంది. దాని పేరు పేదలు. మూలానికి మెరుగుపెట్టే సొగసులు ఈ తర్జుమాలో ఉన్నాయని తులనాత్మక పరిశీలన చేసి రోణంకి అప్పలస్వామిగారు ప్రశంసించారు. ఆయన ఒక రేడియో ఇంటర్వ్యూలో ఇలా అన్నారు.

''ముక్కస్యముక్క అనువాదం చేస్తే మాతృకలోనే రసం, రామణీయకత నశిస్తాయి. నా దృష్టిలో భాషాంతరీకరణం చేస్తున్నప్పుడు సృష్ట్యంతరీకరణం కూడా ట్రాన్స్‌క్రియేషన్ జరగడం అవసరం. ఉదాహరణకి ఫ్రెంచి కవి Verhacren రచించిన Les pauvresఅన్న పద్యం తీసుకుందాం. మాతృకలో Il en est de pauvres cocurs A veceneus des lacsde pleurs Qui sont pales comme lespierrres Dun cimitiere దీనిని ముక్కస్య ముక్క తర్జుమా చేస్తే పేదల గుండెలున్నాయి. అందులో కన్నీటి చెరువులున్నాయి. అవి గోరీల తోటలోని రాళ్ళలా పేలవంగా ఉన్నాయి' అని చెప్పాలి. దీనినే శ్రీశ్రీ తీసుకొని

అంతే లే పేదల గుండెలు
అశ్రువులే నిండిన కుండలు
శ్మశానమున శశికాంతులతో
చలిబారిన వెలి రాబండలు.... అని అనువదించాడు.

ఫ్రెంచి కవి ఉద్దేశించిన భావం ఈ తర్జుమాలోనే బాగా ప్రకటితమైంది. ఫ్రెంచిలో ఉన్న సొగసులన్నీ అలా వుంచి వాటికి అనుగుణ్యంగా మరికొన్ని కొత్త సొగసులొచ్చాయి.

మన కవిత్రయంలో ఒకరైన ఎర్రయ్యగారు హరివంశం పూర్వభాగంలో నిరంతర ధారాపాతంలో తడిసిన గోవుల్ని కొమ్ములొడ్డి కన్నులుమోడ్చి కడరెప్పల నీళ్ళుగారం దలలు డిగ్గవైచి నెమరులుడిన దృశ్యాన్ని వర్ణించారు.[46] ఈ 'పేదలు' అనువాదంలో శ్రీశ్రీ

అంతేలే పేదల కన్నులు
వినమ్రములు వెతల వ్రణమ్ములు
తుపానులో తడిసిన జడిసిన
గోమాల కన్నుల తమ్ములు

అని రాశాడు. జీవితంలోని వాస్తవాలను కవిత్రయంలో వారైనా గ్రహించి కవితలు రాసేవారైనా దానిని అనువాదం చేసేవారైనా ఒకలాగే చూస్తారు.

ఒక ప్రథమశ్రేణి కవి ఇంకొక ప్రథమ శ్రేణి కవి రచనను అనువదించినపుడు ఇటువంటి రసంబంధురమైన రచనకు ఆస్కారం ఉంటుంది.

1940లో శ్రీశ్రీ ఒకే ఒక్క కవితను రచించాడు. అది జగన్నాథుని రథచక్రాలు. వాస్తవానికి ఈ గీతాన్ని మొదట కొంతవరకూ రాసి చాలాకానికి పూర్తిచేశాడు. ఇది ఎప్పటికీ అసంపూర్ణంగా వుండిపోతుందేమో అని ఒక్కొక్కప్పుడు శ్రీశ్రీకి సందేహం కలిగేది. ఇది లేకుండా మహాప్రస్థానం పూర్తికావడానికి వీలులేదు. కాని తొందరపడి ఏదోవిధంగా రాసెయ్యడానికి ఇష్టం లేదు. మహాప్రస్థానం సంపుటిలో మొట్టమొదటి గీతం మహాప్రస్థానం, చిట్టచివరి గీతం జగన్నాథుని రథచక్రాలు ఉండాలని నా ఉద్దేశం. ఎలాగైతేనేం అనుకున్నవిధంగా 1940లో ఒకరోజు రథచక్రాలు రాయడం పూర్తి అయింది'' అని శ్రీశ్రీ ఒకచోట చెప్పాడు.[47]

జగన్నాథుని రథచక్రాలను శ్రీశ్రీ విప్లవానికి ప్రతీకగా భావించాడు. అతనికి ముందు కొందరు ఇలాగే ఆ సంకేతాన్ని ఊహించకపోలేదు. 1922లోనే ఉన్నవ లక్ష్మీనారాయణ గారు తమ మాలపల్లి నవలలో దీని గురించి రాశారు.

మాలపల్లి నవలలో తక్కెళ్ళ జగ్గడు అనే విప్లవకారుడి పాత్ర వుంది. అతని వుద్దేశంలో ధనికులే కలియుగ రాక్షసులు. భాగ్యవంతులు తమ వర్తనను మానుకొనకపోతే బీదలే చట్టాలు మార్చి లోకములో భూతల స్వర్గం స్థాపిస్తారు. అతనిది హృదయరాజ్యం. అది నశించదు. అతడు తెస్తున్నది విప్లవం. కొత్త పాతా యావత్తూ ఒక మూసనబడి కరిగి సమ్మిళితమై ఒక నూతనశక్తిగా విజృంభించి జగన్నాథుని రథంవలె పరిభ్రమిస్తున్నది. ఇది నిజంగా జగన్నాథుని రథమే. ఈ త్వరను, ఈ మహాశక్తిని ఎదిరించడానికి ఎవరికి సాధ్యమవుతుంది. (మాలపల్లి-పుట377) మాలపల్లిలో మొట్టమొదటిసారిగా ఉన్నవవారు విప్లవాన్ని జగన్నాథుని రథంతో సరిపోల్చారు. సామ్యవాదాన్ని వివిధ ఛాయలతో, వన్నెలతో చిత్రించారు.

---

46. కాకతీయ యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి 2002.
47. అనంతం – పుట.186

అరవిందయోగి కూడా ఈ ప్రతీక గురించి ఇలా చెప్పారు.[48]

ఆదర్శ సమాజము మనుష్య సమష్టికంతరాత్మయగు భగవంతుని వాహనము, జగన్నాథుని యాత్రారథము. ఐక్యము, స్వాధీనత, జ్ఞానము, శక్తి ఆ రథముయొక్క నాలుగు చక్రములు.

శ్రీశ్రీ అరవిందయోగిని ఆమోదించడుగాని, అతని గేయంలోని జగన్నాథుని రథం కూడా ఆదర్శ సమాజానికి చిహ్నం. అవి 'ఆకాశపుదారులంట హడావిడిగా వెళిపోతాయి. అరచుకొంటూ వెళిపోతున్నది. దానిని భూమార్గం పట్టించాలి. అపుడు భూకంపం పుట్టిస్తాను' అని కవి చెపుతున్నాడు.

శ్రీశ్రీ జగన్నాథుని రథం పతితలకూ, భ్రష్టులకూ, బాధాసర్పద్రష్టులకు, బతుకు కాలి, పనికిమాలి, శనిదేవత రథచక్రపుటిరుసులలో పడినలిగిన దీనులకూ, హీనులకూ కొత్త జీవితాన్ని ఇచ్చేందుకు వస్తున్నాయి. అది వచ్చేటప్పుడు మొదట అల్లకల్లోలంగా ఉంటుంది.

సంరంభం
సంక్షోభం,
సమ్మర్దన, సంఘర్షణ!
కోలాహలం చెలరేగింది!
పతితులార!
భ్రష్టులార!
ఇది సవనం,
ఇది సమరం,
ఈ యెగిరిన ఇనుపడేగ,
ఈ పండిన మంటపంట -
ద్రోహాలను తూలగొట్టి,
దోషాలను తుడిచిపెట్టి,
స్వాతంత్ర్యం,
సమభావం,
సౌభ్రాత్రం,
సౌహార్దం
పునాదులై ఇళ్ళులేని,
జనావళికి శుభం పూచి -
శాంతి, శాంతి, కాంతి, శాంతి
జగమంతా జయిస్తుంది!

48. ఈ ప్రవచనం శారదపత్రిక (సంచిక నెంబరు, సంపుటి నెంబరూ గుర్తుపెట్టుకోలేదు) లో ఎవరో ఉదాహరించి వివరించారు.

ఈ స్వప్నం నిజమౌతుంది!
ఈ స్వర్గం రుజువవుతుంది!''

మొదట ''వొస్తున్నాయొస్తున్నాయి'' అని చెప్పి, చివర 'వచ్చేశాయొచ్చేశాయి'' అని ప్రకటించాక –

'ఈ లోకం మీదేనండి
మీ రాజ్యం మీరేలండి'

అని గీతాన్నీ, సంకలనాన్ని పూర్తిచేశాడు.

1940లో ఈ ప్రసిద్ధ గీతాన్ని పూర్తిచేశాక ఆయేడే పరప్రభుత్వానికి నిరసనగా ఆంధ్రప్రభను మూసేశారు. శ్రీశ్రీ నిరుద్యోగి అయ్యాడు. మహాప్రస్థానం గీతాలను పుస్తకరూపంలో తీసుకురావడానికి మళ్ళీ ప్రయత్నాలు చేశాడు. విశ్వనాథ సత్యనారాయణ గారు దీన్ని అచ్చువేయిస్తామన్నారు. 1940లోనే చలంగారిచేత జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాయించాడు. చలం అప్పుడు నిరీశ్వరవాది. శ్రీశ్రీ అరాచకవాది. అందుచేత ఈ పీఠికను 'యోగ్యతాపత్రం' అని శ్రీశ్రీ భావించి కుండలీకరణాలలో 'అరాచకవాదికి-నిరీశ్వరవాది' అనే మాటలు శ్రీశ్రీ చేర్చాడు. ఉత్తరోత్తరా ఈ వివరణ ఉపసంహరించుకొన్నాడు. చలం ఇంట్రోను రాసినా విశ్వనాథవారు ఏ కారణాలవల్లనో ఆ సంకలనాన్ని అచ్చువేసి పెట్టలేదు.

1941 వచ్చింది. జూన్ నెలలో ప్రపంచ యుద్ధ స్వరూపం మారింది. హిట్లర్‌పై దాడి మొదలుపెట్టారు. సామ్యవాదశక్తులకు ఇది ఊహించని విషయం కాదు. సోవియట్ విమానాలు కార్యరంగంలోనికి వచ్చాయి. "The Soviet Air Force has gone into action" అనే వార్తను విన్నాక శ్రీశ్రీ ఉత్తేజితుడయ్యాడు. ప్రపంచంలో ఆనాటికి ఉన్న ఒకే ఒక సామ్యవాదదేశం తనను తాను రక్షించుకోడానికే కాక జగత్తులోని ప్రగతి శక్తులను కాపాడడానికి యుద్ధం చేస్తోంది. 'గర్జించు రష్యా' అని శ్రీశ్రీ ఒక గీతం రాశాడు.

ఈ గీతం ఆనాటి ప్రముఖ పత్రికలలో అచ్చుపడలేదు. 'పెంకిపిల్ల' అనే ఒక మాసపత్రికలో దీనికి చోటు దొరికింది. ఇందుకొక కథ ఉంది. ఈగీతాన్ని రాసిన వెంటనే శ్రీశ్రీ దానిని మిత్రులకు వినిపించాడు. ఆనాడు తాపీధర్మారావుగారి 'కాగడా' పత్రికలో సెట్టి ఈశ్వరరావూ, తాపీ మోహనరావూ సంపాదక కార్యాలయం పనులు చేస్తూ ఉండేవారు. ఆ ఇద్దరూ శ్రీశ్రీ గీతాన్ని తీసుకొని వెళ్ళి 'కాగడా'లో ప్రచురించడానికి ప్రెస్‌లో కంపోజు చేయించారు. పేజీ కట్టించారు. కాని, ప్రకటించలేకపోయారు. అప్పటికి బ్రిటీష్ వారి దృష్టిలో రష్యా మిత్రరాజ్యంగా మారలేదు. కమ్యూనిస్టు పార్టీ మీద ఆంక్షలు తొలగలేదు. ఈ గీతాన్ని ప్రచురిస్తే ఏం చిక్కులు వస్తాయో అని ప్రెస్‌వారు భయపడి అభ్యంతరం చెప్పారు. ఈశ్వరరావు, మోహనరావు హతాశులయ్యారు.

అయితే ఆనాడు కాగడా మేనేజరుగా పసుమర్తి రాఘవరావుగారు పనిచేస్తూ ఉండేవారు. ఆయనకు 'పెంకిపిల్ల' అనే మాసపత్రిక ఉంది. ఆయన ధైర్యంగా శ్రీశ్రీ 'గర్జించు రష్యా' గీతాన్ని తన పత్రికలో ప్రకటించడానికి ముందుకు వచ్చారు. అచ్చుపడిన గీతాన్ని ఆంధ్రదేశంలోని ప్రగతిశీలురంతా ప్రస్తుతించారు.

ఫాసిస్టులకు తాత్కాలిక విజయం లభించి మిత్రపక్షాలకు నష్టం వాటిల్లినప్పుడు భవిష్యత్తు గురించి సహజమైన సందేహాలు వస్తాయి. అందుకే 1941లో శ్రీశ్రీ 'నిజంగానే?'' అనే గీతం రాశాడు.

''బానిసల సంకెళ్లు బిగిసే
పాడుకాలం లయిస్తుందా?
సాధుసత్త్వపు సోదరత్వపు
సాదు తత్త్వం జయిస్తుందా?
జడలు విచ్చిన, సుడులు రెచ్చిన
కడలి నృత్యం శమిస్తుందా?
నడుమ తడబడి, సడలి, ముడుగక
పడవ తీరం క్రమిస్తుందా?
నిజంగానే, నిజంగానే?''

చివరకు పడవ గట్టెక్కింది. యుద్ధంలో మిత్రపక్షాలు గెలుపొందాయి. అయితే శ్రీశ్రీ కోరిక నెరవేరలేదు. అతని మహాప్రస్థానం గీతాల సంకలనం పుస్తకరూపం దాల్చలేదు. 1947 వచ్చింది. ఇంక స్వతంత్రం రాబోతోంది. అయినా శ్రీశ్రీ కావ్యానికి విముక్తి రాలేదు. ఆ సంకలనంలో 39 గీతాలే అప్పటికి ఉన్నాయి. వాటిని నలభై చేయాలని శ్రీశ్రీ సంకల్పం. అంతకు ముందు ఎప్పుడో మొదలుపెట్టి ఆపివేసిన 'చూడు చూడు నీడలు' అనే రచనను 1947 జూన్ 19వ తేదీనాడు 'ఆనందవాణి' ఆఫీసులో నా ప్రోద్బలం మీద శ్రీశ్రీ పూర్తిచేశాడు. (అప్పుడు నేను 'ఆనందవాణి'లో పనిచేస్తూ ఉండేవాడిని. శ్రీశ్రీ రోజూ ఆ కార్యాలయానికి నాకోసం వచ్చేవాడు).

ఎలాగైతేనేం 1947లోగాని మహాప్రస్థానం గీతాల సంఖ్య నలభైకి చేరుకోలేదు. 1940లోనే ప్రచురిద్దామనుకొన్న ఈ గ్రంథం 1950లోగాని ముద్రితం కాలేదు. 1940 నాటికి శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానంలో చీమదారులు చాలా కనబడతాయి. 1935లోనే సర్రియలిజం గురించి ఒక వ్యాసం చదివి దానిపట్ల ఆకర్షితుడయ్యాడు. 1940లో అధివాస్తవికతలోనికి ప్రవేశించాడు. తనతోపాటు కొందరిని ఆదార్లోకి తీసుకువెళ్ళాడు. తెలుగు సర్రియలిస్టులకు సంఘమంటూ ఒకటి లేదు. దానికి సభ్యత్వం అంటూ ఏదీలేదు.

1926లో పురిపండాతో కలసి 'కవితా సమితి' స్థాపించిన శ్రీశ్రీ 'నవ్యసాహిత్య పరిషత్తు' ఏర్పడగానే దానిలో సభ్యుడయ్యాడు. 1938లో కార్యవర్గంలోనూ, 1941లో స్థాయీ సంఘంలోనూ అతనికి స్థానం లభించింది. 1941లోనే అతడు 'ప్రతిభ' సంపాదక వర్గంలో కూడా ఉన్నాడు. నవ్యసాహిత్య పరిషత్తు గురించి శ్రీశ్రీ ఇలా రాశాడు.[49]

''ఏటేటా కాంగ్రెసు ప్రెసిడెంటుగిరికి ఎంత గొప్ప వుండేదో అంతటి గొప్ప నవ్యసాహిత్య పరిషత్ అధ్యక్ష పదవికి కూడా (మా దృష్టిలో) ఉండేది. ఒక యేడు నన్ను అధ్యక్షుణ్ణి చెయ్యాలని కుర్రకారంతా పట్టుబట్టింది. కాని నేనింకా చిన్నవాడినని పెద్దవాళ్ళంతా ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చారు. వారందరిలో ఒక్క చింతా దీక్షితులుగారే నన్ను సమర్థించారు. దీక్షితులుగారే ఆస్థానకవి పదవికి నాపేరు సూచిస్తూ కృష్ణాపత్రికలో కాబోలు రాశారు.

49. అనంతం - పుట.126

''మద్రాసులోని ఆంధ్ర మహాసభలో నవ్యసాహిత్య పరిషత్తు సభ జరుగుతోంది. నేను శిష్ట్లా, జలసూత్రం, నారాయణబాబు ఇత్యాదులం కొందరం బయటికి వచ్చేశాం. భవనానికి వెలుపల పచ్చిక తివాసీ మీద అందరమూ కూర్చొని ''ఈ పరిషత్ సభను బహిష్కరిస్తున్నాము'' అని ఏకగ్రీవంగా తీర్మానించాము. ఆ తర్వాత సంవత్సరం కాబోలు కనుతుడుపుగా పరిషత్తువారు ఒక కవి సమ్మేళనం ఏర్పాటు చేసి దానికి నన్ను అధ్యక్షుణ్ణి చేశారు. అందులో రాయప్రోలు, కృష్ణశాస్త్రి మొదలైన హేమాహేమీలంతా పాల్గొన్నారు''.

నవ్య సాహిత్య పరిషత్తు వారి పత్రిక ప్రతిభలో శ్రీశ్రీ 1940 నుండి తన సర్రియలిస్టు కవిత్వ ప్రయోగాలను ప్రచురించసాగాడు. అప్పటికి అతని మహాప్రస్థానం గ్రూపుగీతాలన్నీ పూర్తికాలేదు. సర్రియలిజం గురించి చదువుతూ, ఆధోరణి కవితలు రాస్తున్నా శ్రీశ్రీ కొంచెం జాగ్రత్త పడ్డాడు. ''నా 'మహాప్రస్థానం' గీతాలలో ఎక్కడో సకృత్తుగా తప్ప సర్రియలిస్టు ప్రభావం లేదనే చెప్పాలి. (అక్కడక్కడ కనిపించే 'ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగరావం' వంటి ప్రయోగాలను మినహాయిస్తే) అని శ్రీశ్రీయే తన స్వీయచరిత్రలో స్పష్టం చేశాడు.[50]

సర్రియలిజం యూరోపులో మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పొడసూపింది. శ్రామిక జనులకోసం తాము పాటుపడాలనుకొనే సాహితీపరులకు ఆ యుద్ధం గొప్ప నిరాశ పుట్టించింది. యుద్ధం అయిపోగానే ఏదో నూతన సృష్టి జరుగుతుందని భ్రమించారు. కాని, యుద్ధానంతరం మహాసంక్షోభం రేగింది. తిరుగుబాట్లు, విప్లవం, అంతర్యుద్ధం, నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం మొదలైనవెన్నో ప్రపంచాన్ని కలతపరిచాయి. అప్పుడు మొదట 'డాడాయిజం' అనే ఉద్యమం ప్రారంభమైంది. ఈ సంగతులు చెప్పి శ్రీశ్రీ దాని చరిత్ర ఇలా కథనం చేశాడు.[51]

''ట్రిస్టన్ జారా, ఆంద్రే బ్రిటన్ మొదలైనవాళ్ళు ఈ ఉద్యమ నిర్మాతలు. జారా ఒక బాధ్యతలేని పేరు పెడదామని డిక్షనరీ తీయగానే కనపడ్డ 'డాడా' పేరును పెట్టాడు. అదే ''డాడాయిజం'' అయింది. జర్మనీలో 'మెర్జి' (అంటే చెత్త అనే ఉద్యమం దీని ననుసరించే బయలుదేరింది.) అమెరికాలో కూడా ఇలాగే డాడాయిజం మరో పేరుతో వ్యాప్తికి వచ్చింది. ఆంద్రే బ్రిటన్ దీనిని గురించి ఇలా అన్నాడు. 'ఈ మేధావంతులకేదో వ్రాయాలని తహతహ వుంది. ఏదో వ్రాసి ప్రయోజనం లేదని వీరికి తెలుసు. ఈపరిస్థితుల్లో పుట్టినదే డాడాయిజం'. యుద్ధకాలంలో జన్మించిన నిస్పృహ ఫలితమే డాడాయిజం. వీరు పారిస్‌లో ఒక ప్రదర్శనం జరిపి వాస్తవికతపై తిరుగుబాటు లేపారు.

''యుద్ధానంతరం పరిస్థితులు కొంత చల్లారాక, డాడాయిస్టులలో విభేదాలు తలచూపాయి. ఆంద్రే బ్రిటన్ మొదటిదానిని వదిలివేశాడు. ట్రిస్టాన్ జారా కూడా కొన్నాళ్ళు దానిని పట్టుకొని వేలాడినా చివరకు వదిలివేశాడు. వీరిద్దరూ తర్వాత సర్రియలిస్టు సాహిత్యాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చారు.''. శ్రీశ్రీ ఇంకొక సందర్భంలో చెప్పిన మాటలు దీనికి అనుబంధంగా చేర్చి చదువుకోవాలి.[52]

---

50. అనంతం – పుట.158
51. అనంతం – పుట.176
52. అనంతం – పుట.159

''తెలుగుదేశంలోనూ, ఇంగ్లాండులోనూ ఇంచుమించుగా ఏకకాలంలోనే అధివాస్తవికత బీజావాపన జరిగిందని చెప్పవచ్చును. అయితే అచిరకాలంలోనే అది ఇంగ్లాండులో Apocalypse అనే ఉద్యమానికి దారి తీసింది. తెలుగులో సర్రియలిజం వేళ్ళూనకముందే అభ్యుదయ సాహిత్యోద్యమం దేశమంతటినీ ఉగ్రూతలూగించింది.''

1943 నుండి తెలుగుదేశంలో అభ్యుదయ రచయితల ఉద్యమం ప్రారంభమైంది. తొలిరోజులలో శ్రీశ్రీ ముభావంగానే ఉండేవాడు. సర్రియలిస్టు రచనలు చేస్తూ తాను-అనార్కిస్టునని చాటుకొనేవాడు. 1943లో తెనాలిలో జరిగిన మొదటి మహాసభలోగాని, 1944లో విజయవాడలో జరిగిన రెండో మహాసభలోగాని శ్రీశ్రీ పాల్గొన్న దాఖలాలు లేవు. 1946లో రాజమండ్రిలో 3వ మహాసభలు జరిగాయి. దానిలో శ్రీశ్రీ ప్రారంభోపన్యాసం చేశాడు. (సభలో ఈ పని చేయవలసిన ముల్క్‌రాజ్ ఆనంద్ గైర్‌హాజర్ అయినందువల్ల శ్రీశ్రీని ప్రారంభోపన్యాసం చేయమన్నారు). 1946లో అభ్యుదయ రచయితల సంఘం పెదపూడిలో నడిపిన సాహిత్య పాఠశాలలో కావ్య విమర్శమీద పాఠం చెప్పాడు. 1947లో మద్రాసులో జరిగిన 4వ మహాసభలో శ్రీశ్రీ పాల్గొనలేదు. అప్పుడు నైజాం కొలువులో ఉన్నాడు. 1955లో 5వ మహాసభలు బెజవాడలో జరిగాయి. దానికి శ్రీశ్రీ అధ్యక్షుడు. అప్పటినుంచి 1970లో తన షష్టిపూర్తి జరిగేదాకా శ్రీశ్రీయే అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా కొనసాగాడు.

శ్రీశ్రీ సాహిత్య జీవితంలో పరిస్థితులకు, వ్యక్తిగత జీవితంలో పరిస్థితులకు సమన్వయం సైకాలజిస్టులే చేయగల ప్రయత్నం. ఆంధ్రప్రభలో ఉద్యోగం ముగిశాక శ్రీశ్రీ దీర్ఘకాలం అశాంతితో ఉన్నాడు. ఏనాడూ కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడు కాకపోయినా అతడు కమ్యూనిస్టు ముద్ర పడిపోవడం వల్ల పోలీసు నిఘాకు గురై, లభించిన ప్రభుత్వోద్యోగాలన్నీ ఊడాయి. ఢిల్లీ రేడియో వార్తలు చెప్పడం, లక్నో మిలట్రీలో ట్రెయినింగు పొందటం వంటి చిన్న మజిలీలు, తర్వాత 1943లో మద్రాసులో సినిమారంగంలో ప్రవేశించి స్థిరపడ్డాడు. అయితే నిరంతర గ్రంథపఠనం మానలేదు. చదివిన సిద్ధాంత గ్రంథాల ద్వారా కాక, ఇతర పుస్తకాల ద్వారా మార్క్సిజం తెలుసుకొన్నాడు. ఈ సంగతి ఒకచోట ఇలా చెప్పాడు.[53]

''ఆర్థికమే అన్ని సమస్యలకూ మూలం'' అనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నేను సరాసరి మార్క్సునుంచి కాక అప్టన్ సింక్లేర్ రచించిన "Money Writers" అనే గ్రంథం నుంచి తెలుసుకొన్నాను. పెట్టుబడిదారీ విధానపు దుర్మార్గాలన్నింటినీ బట్టబయలు చెయ్యడమే కాక సామ్యవాద సమాజం నిర్మించడంలో నిజాయితీపరులయిన రచయితలవలంబించ వలసిన విధానాలను కూడ విస్పష్టంగా నిర్దేశించే గ్రంథం ఇది''.

నిజాయితీపరుడయిన రచయితగా తనకు కొన్ని బాధ్యతలు ఉన్నాయని గుర్తించాక ఎవరూ కార్యాచరణకు విముఖులు కాలేరు. అందుకే శ్రీశ్రీ అభ్యుదయ రచయితల ఉద్యమంలోనికి అడుగుపెట్టాడు.

అవకాశాలకు తగినట్టు అభిప్రాయాలను సవరించుకొంటూ, సందర్భోచితమైన ప్రకటనలు చేస్తూ ఉత్తేజకరమైన ఉపన్యాసాలిస్తూ ఉద్యమంలో ఉంటున్న శ్రీశ్రీ

53. అనంతం - పుట.131-2

రచనలలో మాత్రం సక్రియలిస్టు పోకడలు, విదూషక ధోరణులు ప్రదర్శించసాగాడు. అప్పుడప్పుడొక చెప్పుకోదగ్గ రచన చేస్తున్నా మొత్తంమీద లఘు రచనలపైన మోజు చూపిస్తూ సిరిసిరిమువ్వ శతకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు వంటివి ప్రచురించసాగాడు. సిరిసిరిమువ్వ శతకంలో ఒక పద్యం ఇలా చెప్పాడు.

కుర్చీలు విరిగిపోతే
కూర్చోడం మాననట్లు గొప్ప రచనలన్
కూర్చేశక్తి నశిస్తే
చేర్చదగు నొకింత చెత్త సిరిసిరి మువ్వా!

శ్రీశ్రీ చెప్పింది చేయగల సమర్థుడేగాని, అనర్ఘమైన శిల్పం చేతిలో ఉండడం వల్ల చెత్తనైనా ఆ క్షణానికి కొత్త కవితలా ధ్వనింప చేయగలడు. మరిచిపోలేనిది మంచి కవిత్వమని అతడు అంటూ ఉంటాడు. శ్రీశ్రీ లఘు రచనలలో కూడా కొన్ని జ్ఞాపకం ఉండిపోయే ఖండికలు ఉన్నాయి.

శ్రీశ్రీ షష్టిపూర్తినాటికి అతని రచనలన్నింటినీ సేకరించి అయిదు సంపుటాలలో శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘంవారు ప్రచురించారు. 1970 తర్వాత కూడా శ్రీశ్రీ ఎన్నెన్నో రచనలు చేస్తూ వచ్చారు. వాటన్నింటిని చేర్చి 'విరసం' వారు శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం అనే పేరుతో ఇరవై సంపుటాలలో ప్రచురించడానికి పూనుకొన్నారు. కొన్ని సంపుటాలను ముద్రించారు. ఆ సర్వస్వం వివరాలు చూడండి.

1. ప్రభవ	11. జాబులు
2. అనువాద కథలు	12. రెక్క విప్పిన రివల్యూషన్
3. అనువాద నవలలు	13. చైనాయానం
4. అనువాద నాటకాలు	14. సిప్రాలి
5. మహాప్రస్థానం	15. మరో ప్రస్థానం
6. వారం వారం	16. వ్యూలు, రివ్యూలు
7. మరో ప్రపంచం (రేడియో నాటకాలు)	17. వ్యాసాలు
8. చరమరాత్రి	18. ఉపన్యాసాలు
9. మన గురజాడ	19. ప్రజ
10. ఖడ్గసృష్టి	20. అనంతం

శ్రీశ్రీ ఇన్ని సంపుటాలలో ప్రచురించతగ్గ రచనలు చేసినా మిగతావన్నీ ఒక యెత్తూ, అతని మహాప్రస్థానం ఒక యెత్తు. 1933 నుంచి 1947 దాకా రచించిన మహాప్రస్థానం గీతాలు మళ్ళా అతడు కూడా రాయలేనంత గొప్ప రచనలు. 'అనర్ఘళం అనితర సాధ్యం నా మార్గం' అని అతడు ఈ కవితల గురించి చెప్పుకొన్నది నూటికి నూరుపాళ్ళు నిజం. అందుకే 'భావివేదముల జీవనాదాలు' ధ్వనించే కొన్నిగీతాలు జాతి జనులు పాడుకొనే మంత్రాలయ్యాయి.

వచన కవిత

ప్రారంభం - పరిణామం

ఆధునికాంధ్ర సాహిత్యచరిత్రలో వచన కవిత వయస్సును ఖచ్చితంగా తేదీలిచ్చి తేల్చలేంగాని అది అరవయ్యోవడిలో పడింది. పుస్తకరూపంలో వచ్చిన అసలు సిసలు మొదటి వచన కవితా గ్రంథం ''ఫిడేలు రాగాల డజన్''. ఇది 1939 జూలై ఆగస్టు నెలల మధ్య వెలువడింది. అయితే పఠాభి వింతరాగాల వెల్లువదేశంమీద విరుచుకుపడడానికి ఒక ఏడాది ముందుగానే శిష్ట్లా కృతులు 'నవమి చిలుక - విష్ణువు ధనువు' అనే సంపుటాలు వెలువడ్డాయి. శిష్ట్లా తన కవిత్వం ''పూర్వ కవిత్వం కాదు, నవ్య కవిత్వం కాదు, భావ కవిత్వం కాదు, నూతనములో బహునూతన కవిత్వ''మని చెప్పుకొన్నాడు. అలాగే పఠాభి కూడా తను భావకవిని కాదని చెప్పాడు. అంతతో ఊరుకోలేదు. తాను అహంభావ కవినని చాటుకొన్నాడు.

శిష్ట్లా సంపుటాలు కేవలం వచన గీతాల సంకలనాలని చెప్పడానికి వీల్లేదు. ఉత్తరోత్తరా రాబోయే వచన యుగంలోని ఘంటాపథంకోసం అడవిని కొట్టి, ముళ్ళకంపను నరికి, దారివేసుకోడానికి వీలుగా ఎవరూ నడవని నట్టడవిలో కొంతమేరకు సుగమం చేయడం అందులో కనబడుతుంది. ''ఇతడు భావ కవిత్వంపై తిరుగుబాటు చేస్తేనేగాని, క్రొత్తబాట వేయలేదని ఒప్పుకొనక తప్పదు'' అని సాహిత్య పరిశోధకులు భావిస్తున్నారు.[1] దుర్గమారణ్యంలో ప్రవేశించడమే ఒక సాహసికకృత్యం, తనకు తాను బాట వేసుకోనిదే ఎవడూ కారడవిలో ముందుకు సాగలేడు. శిష్ట్లా ది గొప్ప విప్లవారంభం.

ఆనాడే అతడు ''యుగశక్తికి'' ఆహ్వానం పలికాడు. అది అనంత ముఖములుగల అందాల ఆనలం. ఆ అగ్ని కల్లోలమేఘాగ్ని, అది మెరుపు తీగలపై వసంతములాడే వివస్త్రమూర్తి. ఆ జ్వాలలో సకల వర్ణాలూ నిలయమై వుంటాయి. ఆ తేజాన్ని, ఓజాన్ని, అఖిల బీజాన్ని కవి సూటిగా ప్రశ్నిస్తున్నాడు. ''నక్షత్ర - స్ఫటికములు నవనవలాడే వెలుగువై, తళుకువై, నిబిడాంధకారాంధ్ర దేశాకాశాన, వజ్రాయుధమువలె ఏనాడు గన్పడెదవో దెల్పుము'' ఆమె కనబడితే కవి త్రిపురాంతకుడై లేస్తాడు.

'ఉదయోదయాలనడుమ, ప్రాక్పశ్చిమ ప్రాకారముల మధ్య
జీవితానంతరపు నిశ్శబ్ద రూపముగ మొలకెత్తు - మున్నె
చీకటిలో నిరీక్షించుచుండేటి విత్తనపు రూపుగా
నీ యాలయము నిర్మింపబడినది, ఉత్పత్తి లయములలో
జీవితపు హాహాకారాలు, సంతోషధ్వానాలు నీయందు
నీ వుచ్చరించే హ్రాం - హ్రీం, హ్రూం హ్రః అనే యుచ్చైస్స్వరాలు
ఆద్యంతములు మిళితమై నగయు నిశ్శబ్ద కాలచక్రం
బంగారు వడ్డాణ రూపమై నీనాభి కలంకారం

1. సి. నారాయణరెడ్డి - 'ఆధునికాంధ్ర సాహిత్యము - సంప్రదాయములు, ప్రయోగములు' - పుట.527

నీ నర్తనలాలించి జీవితము వికసించు మృత్యువే ధ్యానించు
ఆకుపై ఆకుతో, వేరుపై వేరుతో పూవుపై పూవుతో
సంధి సంధుల మధ్య వాసిల్లురహస్యాల గర్భానే దాచి
ఏ మృత్యువు నుండి జనించియే మృత్యువుకై తాను
పెరుగునో యా జీవితానందపు కళలను వెన్నాడుచూ
అంధకారంతరాళాల నుండి వర్ణాల విత్తనాల్వికసించు!''

అన్నది శిష్లా విశ్వాసం'.

యుగశక్తిని ఇంత శక్తిమంతంగా, ప్రతిష్టవంతంగా వీక్షించినవాడూ, ఆహ్వానించిన వాడూ, నిజంగా ప్రవక్త. అందుకే వచన కవితకు శిష్లా ఆద్యబ్రహ్మ. నవ్యకవిత్వానికి నాంది పలికినవాడిగా అతణ్ణి ముందు స్మరించాలి.

ఘతన కవిత్వాన్ని ప్రాహ్లాదకవిత్వమన్నాడు. దీనికి అడ్డాలున్నాయని అతనికి తెలుసు.

'అడ్డము హిరణ్యా కాశ్యపుడు! శంకహిరణ్యా
కాశ్యపుడు అధైర్యము హిరణ్యా కాశ్యపుడు!
అస్థిమితము హిరణ్యా కాశ్యపుడు!
మూలము సమూలముగా త్రెంచి హృదయ
సభా మంటప స్తంభము పగిల్చి మనస్సు
విజృంభించి నరసింహామూర్తిత్వము
అప్పుడే ప్రాహ్లాదకవిత్వ మాహ్లాదముగా
ఉద్భవిస్తుంది

ఈ కవిత్వం, అడ్డం లేనిదీ, శంక లేనిదీ, అధైర్యము లేనిదీ, అస్థిమితము కానిదీ అని శిష్లా నిర్వచించాడు. ఈ కవిత్వంలో ప్రౌఢత్వమున్నది, పామరత్వమున్నది, దేశ విదేశీకి నేస్తమున్నది'' అని చెప్పడమేకాక యిందులో సావిత్రీ సత్యవంత జీవితమున్నది'' అన్న మాటలతో ఈ కవిత్వం మరణానికి ప్రాణం పోస్తుందని ధ్వనించాడు.

శిష్లా తన కవిత్వాన్ని ప్రాహ్లాదకవిత్వాన్ని పేర్కొన్నా, అతని ప్రభావంలో రచనలు చేసినవాళ్ళుగాని, ఆ తర్వాత సాహితీపరులుగాని, వచన కవిత్వాన్ని ఆ పేరుతో పిలవడం లేదు. అతని సంకేతాలకన్నా, అతడు పాదాల మధ్య ధ్వనించిన సందేశాలనే అందరూ విని చెవి పట్టించుకున్నారు.

శిష్లాకు ముందే వచన కవిత ఆంధ్ర సాహిత్యావనంలో పూలుపూచిందా? కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు 1921–25ల మధ్య చేసిన రచనల సంపుటి ''నైవేద్యం'' అనే పేర ప్రచురితమయింది. అందులో ''లూఠీ'' అనే రచనా ''ఆనందసత్రం'' అనే రచనా, ''మోహినీ ప్రకృతి'' అనే రచనా వచన గేయాలని సాహిత్య పరిశోధకులు డిస్కవర్ చేశారు.[2] అయతే ఇవి స్థూలముగా వచన గేయముల వలె కన్పించు రచనలనీ, ఇవి మాత్రా

2. సి. నారాయణరెడ్డి – 'ఆధునికాంధ్రము – సంప్రదాయములు, ప్రయోగములు' – పుట 508–9

నియమములేని వచన గేయ గంధముగల రచనలనీ వారే భావిస్తున్నారు కాని, దువ్వూరి రామిరెడ్డిగారికీ వచన కవిత్వానికీ చుక్కెదురు. ''యథార్థమైన కవిత్వమునకు అనివార్యముగా ఛందస్సు అనుగతమౌను'' అన్నది కవికోకిల గారి కవితా మూలసూత్రాలలో ప్రప్రథమమైనది.[3]

ఛందోబద్ధమైన కవిత్వమంటే, పాతవృత్తాలనూ, పాత పద్యాలనూ వ్రాయడమన్నది దువ్వూరి వారి ఉద్దేశ్యం కాదు. 'క్రొత్త ఛందస్సులు ఆవిష్కరించుకొని కవిత్వము వ్రాయవచ్చును. అవి శ్రవణ సుఖముగా నున్న యెడల నిలచి యుండును. ప్రస్తారము వలన ఎన్ని వృత్తములు పుట్టలేదు. అవి అన్నీ మన చెవికి రుచించుట లేదు. రుచించనివి మాత్రమే నిలిచి యున్నవి అని రామిరెడ్డిగారు స్పష్టం చేశారు.[4] నైవేద్యంలోని రచనలని ప్రస్తరించి అవి ఛందోబద్ధమైనవని నిరూపించవచ్చును. అందుచేత వచనగేయం 1921-25ల మధ్యనే దువ్వూరి వారి రచనల్లో వికసించిందనిగానీ, కనీసం మొగ్గ తొడిగిందనిగానీ ఎంతమాత్రం చెప్పలేం.

దువ్వూరి వారేకాక చాలామంది కవిత్వానికి ఒక ప్రత్యేకమైన లక్షణాలున్నాయనీ, అవి ఛందోబద్ధమైన రచనల్లోనే రాణిస్తాయనీ విశ్వసిస్తూ ఉంటారు. యతిప్రాసలు, పాద నియమాలు లేని వాక్యాలలో 'మరపురాని హొయలు' ఉన్నా దానిని కవిత్వం కింద అంగీకరించలేని వారు చాలామంది ఉన్నారు.

కవిత్వానికి ఛందస్సు తప్పనిసరిగా ఉండాలా! అక్షరబద్ధమైన వృత్తాలలోనే గాని కవిత ఉండదా? మన పూర్వులు గద్యపద్యాల రెండింటికీ సమాన ప్రతిపత్తిని ఇచ్చారు. 'గద్యం కవీనాం నికషోవదంతి' అని గద్యరచనే కవులకు గీటురాయి అని చెప్పారు. గద్య పద్యాల తేడా ఏమిటి?

మన పూర్వకవుల కావ్యాలు చాలావరకు చంపూ కావ్యాలు. అందులో గద్య పద్యాలు రెండూ ఉంటాయి. పద్యాల మధ్య వచ్చే గద్యాన్ని పూర్వం వచనం అని పేర్కొనేవారు. ఆశ్వాసాంతంలోనే కవి తన గురించి, కావ్యం గురించి చెప్పుకొనే మాటలనే గద్య అనేవారు. గద్య వచన పదాలు రెండూ పర్యాయపదాలేగాని వాడుకలో వాటి స్వభావాలు వేరైనట్టు తోస్తుంది. తాళలయానుగుణ్యంగా పాడే వాటినే మన పూర్వులు వచనాలు అనేవారు.

సంస్కృత అలంకారికులలో వామనుడు గద్య రచన మూడురకాలుగా ఉంటుందన్నాడు. అవి వృత్తగంధి, చూర్ణం, ఉత్కళిక అనే పేర్లలో ఉంటాయి. వృత్తగంధి అంటే పద్యపాదాల లాగ ప్రారంభమై వృత్తాలని తోపించే గద్య రచన.

నన్నయగారికాలం దగ్గరనుంచి వృత్తగంధి వచనాలు మన కావ్యాలలో కనపడతాయి. ఆంధ్ర మహాభారతం ఆదిపర్వంలోని వచనాలు కొన్ని చూస్తే ఈ సంగతి స్పష్టమవుతుంది.

---

3. దువ్వూరి రామిరెడ్డి - కవికోకిల గ్రంథావళి - IV వ్యాసములు - పుట.164
4. కవికోకిల గ్రంథావళి - IV వ్యాసములు - పుట.137

మన సాహిత్యంలో నన్నయగారి కాలంనుంచీ ఎందరో వచన కవితా ధురీణులు లేకపోలేదు. అయితే ఆదినుంచీ వచనాన్ని రాగ వరుసలో పాడే వారన్న సంగతి కొన్ని దాఖలాల వల్ల విశదమవుతుంది. కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలూ, తాళ్ళపాక వారి వెంకటేశ్వర వచనాలూ ఇందుకు నిదర్శనాలు. పూర్తిగా సంకీర్తన లక్షణాలతో యాగంటి లక్ష్మయ్యగారు రాసిన పాటలను సైతం యాగంటి వారి వచనాలని లోకులు వ్యవహరిస్తారు. గంగుల పిన ఎల్లన్న 'కాటమ రాజు కథ'ను ద్విపద కావ్యంగా రాస్తూ 'శ్రీనాథుని వచన పద్ధతిని' దీనిని రాస్తున్నానని ప్రకటించారు. హరిభట్టు, లోకేరావు సోమన తమ చంపూ కావ్యాలను వచన కావ్యాలుగా పేర్కొన్నారు. అవి పురాణ కథలు. గాన యోగ్యాలు, కిట్టెల్ తన కన్నడ నిఘంటువులోనే ఆప్టే తన సంస్కృత నిఘంటువులోనే 'వచనం' అంటే To Recite అనే అర్థాన్ని కూడా ఇచ్చారు.

తెలుగు సాహిత్యంలోని వచనాలకూ, ఇంగ్లీషు సాహిత్యంలోని Proseకూ తేడా ఉందని కుంఫిణీ యుగంలోని తెలుగు విద్యావంతులు గుర్తించారు.

1862లో అచ్చుపడిన హితసూచని అనే గ్రంథాన్ని సామినేని ముద్దు నరసింహం (బహుశా 1810-1855) గారు రచించారు. దానిని ఆయన వాక్యగ్రంథం అన్నారు. Prose అనే ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా ఆయన వాక్యం అనే పదాన్ని వాడారు. వర్తమాన కాలంలో విజ్ఞానదాయకమైన పుస్తకాలను 'వాక్యగ్రంథాలు'గా రాయాలని ఆయన ఆశయం, ఆదేశం. వచనానికీ, వాక్యానికీ తారతమ్యం ఆయనకు బాగా తెలుసు. తమ పుస్తకంలో వచనను. వచనములు అని వాడిన చోట్లలో ఆయన శ్లోకాలను, పురాణ వచనాలను, శాస్త్ర వచనాలను, స్మృతి, శ్రుతి వగైరా వచనాలనే ఉద్దేశించారు.

ఒక చోట చాలా స్పష్టంగా ఇలా రాశారు.[5] ''గానమున కావశ్యములైన గ్రంథములు తప్ప తతిమ్మావి సులభముగా తెలియతగినట్టు వాక్యగ్రంథములుగా దేశభాషలలో నుండడము యుక్తమని నాకు తోస్తుంది. ఎందుచేతనంటే ఛందోబద్ధమైన గ్రంథమ కావించేటప్పుడు కూడా సక్తమై యుంటుంది. గనుక ఆ మనిషి తన యభిప్రాయమున సులభముగా బోధపడేలాగు రచించడమునకు వల్ల యుండదు. ఛందోరూపమైన గ్రంథమ సులభముగానున్ను, త్వరితముగానున్ను, సందేహాలు లేకుండా నున్ను బోధకాదు...'' - ఇంకా ఎన్నో సబువులు ఆయన చూపించారు. అయితే, ఎవరూ వచనానికీ, వాక్యానికీ తప్ప తేడాని తెలుసుకొనడంగానీ, సామినేని వారి సబువులని చెవిని పెట్టడం గానీ జరగలేదు 1930 ప్రాంతాలలో వచనం అంటే Prose అనే వాడుక రూఢి అయింది. అక్షర గణబం ఛందస్సులో కాక వచనానికి దగ్గరగా ఉన్న నడకల్లో ముందుగా రచనలు వెలువడ్డాయి.

వాస్తవానికి జయంతి గంగన్న పంతులుగారు '1922లోనూ, 1923లోనో గాం మహాత్ముడు యార్వాడ జైలులో నున్న దినములలో వ్రాసి 1935 జూలై మాసం భారతిల ప్రకటించిన 'పరీక్ష చదువులు' అనే రచనలో వచన కవిత్వం బీజాలున్నాయి. మచ్చుక కొన్ని పంక్తులు చూడండి.

5. సామినేని ముద్దునరసింహం - హితసూచని - పుట.5

''ఇందాకా యేదేదో హిస్టరీ
అని ప్రశ్నించానందులోను నే
ర్చేది యేమిటో చెప్పేదా? విను;
రాజులు రాణులు రాజ్యాలేలిన
తేదీలూ, వాళ్ళేదో పేరున
చేసిన హత్యలు, చేసుకొన్న పె
ళ్ళిళ్లు వాటితో రేగిన మొర్రలు
పేర్ల పట్టికలు, ఫిరంగి ధ్వనులూ
మ్యాపుల రంగులు, మాస్టరు తిట్లూ
అంతకంటే మన కవసరమేమిటి?
....
....
నేనన్నది యెవరేనా కాదని
బడుల చదువులో పసున్నాదని
అన్నట్టయితే - అప్పటి నుండీ
అనుదిన మాంధ్ర వ్యాకరణంలో
శకట రేఫలు, సంధులు, లింగా
లరసున్నాలూ, ఆదేశాలూ,
ఆగమాలు మొదలైన గారడీ
సూత్రాలన్నీ చూచేవాళ్ళకు
జాలి పుట్టి వాళ్ళాలించని బ్రతి
మాలినప్పటికి, మానక విసగక
కళ్ళూ నెత్తీ ఒళ్ళూ క్రమముగ
మూల చేరడం మొదలు పెట్టినా
నిద్దర వస్తే నిమిషం నిమిషం
ఇంత యింతటీ ఎక్కించైనా
చావ చదువుతా, చదివిన ముక్కొ్క
టైనా మనసుకు అంటకపోయిన
ఇదె నా పందెం, పద అడిగొద్దాం''

జయంతి గంగన్నగారి ఈ రచన 1935లో అచ్చుపడిందిగాని అంతకు మూడేళ్ళ కిందటే దేశంలో వచన పద్యాలపై మొగ్గ కనపడుతుంది. ఉమామహేశ్వరరావు 1931లో అతి నవ్య ధోరణులతో కవితలు ప్రారంభించాడు. అతని ప్రభావంతో ముద్దుకృష్ణ వచన పద్యాలు రచించేవాడని సమకాలికులు చెప్పారు. శ్రీశ్రీ తాను 'నేను సైతం' అనే గీతం 1933 జూన్ 2వ తేదీనాడు రాశానని చెప్పి తర్వాత ఇలా రాశాడు.[6]

6. అనంతం - పుట. 183

''అప్పటికే శిష్లా ఉమామహేశ విలక్షణమైన ఒక నవీన ధోరణిలో రచన సాగిస్తున్నాడు. కాని సరాసరిగా అవి నా రచనను ప్రేరేపించలేదు. శిష్లా ప్రభావంతో ముద్దుకృష్ణ వ్రాస్తున్న వచన గీతాలు ఎప్పటికప్పుడు ముద్దుకృష్ణ ముఖతానే నేను వినేవాడిని. వచన గీతాన్ని కళారూపంగా తీర్చి దిద్దడానికి మున్ముందుగా నేను కొంత శోధనా, సాధనా సాగించాను''.

శ్రీశ్రీ రచించిన మొదటి వచన పద్యం 'విద్యున్మాలికలు' అన్నది. ఇది 1933 మార్చి నెల భారతిలో అచ్చుపడింది. ఈ రచన ఇలా ప్రారంభమవుతుంది.

''బారులు బారులుగ తీరిన
మబ్బుగుబ్బలుల దారుల
దారి తప్పి చరించే
ఆ రేయి తరళ సరళేరమ్మదములు.
అవి కవిడెందమందు గగురుపొడిచి
ఓరగా,
కోకిల పాట జీరగా
పైరుల పైపయి సోకి చను
తూరుపుగాలి
తీరుగా, కవి డెందమున
తాకి తాకనటుల తరలిపోయిన
ఏ పిన్నభావాలో!
భారంపు సిగ్గు తడియారక
నుడిలో విడుదల పడజాలక
విహ్వలించు
ఏ పిన్నభావాల పరిమళ తరంగాలో!
ఆనాటి చక చకిత చంచలా వితతి!''

ఇది వచన పద్యంలాగ కనపడుతున్నా ఇందులో శ్రీశ్రీ శిల్ప నైపుణ్యం కనపడుతుంది. అచ్చులో పాదాల విరుపులు ఎలా కనపడినా చదివేటప్పుడు, వినేటప్పుడు 'ఓరగా', జీరగా', 'తీరుగా' అనేవి అంత్యప్రాసలుగా, అంతఃప్రాసలుగా ధ్వనిస్తాయి. ఈ కవితలో భాష గురించి శ్రీశ్రీ ఇలా అన్నాడు.[7]

''ఇది గ్రాంథికభాషలో ఉండడం ఇక్కడ గుర్తించాలి. ముద్దుకృష్ణనీ, శిష్ట్లాని ప్రేరేపిస్తూన్న పాశ్చాత్యా కవుల దగ్గరికి సరాసరిగా వెళ్ళాను. ఆంగ్లకవులతో సంతృప్తి కలుగలేదు. ఫ్రాన్సు, జర్మనీ దేశాల కవుల ఆకర్షణకి ముగ్ధుణ్ణయ్యాను''.

విదేశాలలోని వచన కవితా రీతులను అధ్యయనం చేస్తూ మరికొన్నేళ్ళకుగాని శ్రీశ్రీ నిజమైన వచన పద్యం వాడుకభాషలో రాయలేదు.

7. అనంతం - పుట 183

1933 మార్చి నెలలోనే కొంపెల్ల జనార్దనరావుకూడా తన కవిత్వాన్ని గ్రాంథికభాషలోంచి వాడుకభాషలోకి మళ్ళించాడు. గణబద్ధఛందస్సులు వదలి మాత్రా ఛందస్సులలోనికి వచన రీతులలోనికి తిప్పాడు.

అతడు రాసిన కవితలలో 'అనుకో-తథాస్తు' ఒక నూతన ప్రయోగం.

అనుకో - తథాస్తు, నా
అనుభూతిలో ఒక్క
లోటు తెచ్చేవు నీ
లో తత్తరిలు పోక -

అనుకోఁ ప్రకృతి బట్టి
అదలాడి, బెదరి, నా

ఈ నొప్పి తడవులా
డేటి మైకాలలో
పోనీను సుమ సుధల
పుట్టిల్లు నాపట్టు -

అనుకో - తథాస్తు -
నే నిల్వ ద్రొక్కేఁ ను
నే చిక్క బట్టేఁ ను
కన్నీటి గుడుల, పు
ల్కల లోతు మొత్తాలు

అశ్రువొలికితె ఏమి
చిరు నవ్వు వెలుగులో
అరవీసమేని చి
క్కనవో మొగిలి రాదు -
కవలికే లేని నా
కంఠార్ధ నియతిబడి
తన నీడ మెలకువే
దారియిటు నీ మదికి -

నీ రక్తములు ప్రీలు
నదుల అనుగీతాలు
వేదాలు మునుపు నిం
పిన గాలి మలిపంట -

చూతాములే పోదు
చుమ్మవోకలె నవ్వ
నీగుండె పరవశ
మ్మయి కాలబడకుంటె

చూతాములే...
కాకపోతే పోయె
గాకన్న యీ వంక
కాకపోతే పోయె
గాని...... చూతాములే''

ఈ కవితను 1933 మార్చి 24వ తేదీ నాడు రాజమండ్రి నుండి మద్రాసు వెళ్తూ మెయిల్లో రాసిందట. జనార్ధనరావు తన కవితలకు 'అబద్ధాలు' అని పేరు పెట్టదలిచాడు. అబద్ధం అంటే అసత్యం అని కాదు అర్థం. అనిబద్ధం అని తెలుసుకోవాలి. ఫ్రీవెర్స్ అనే మాటకు ఇది అతని నిర్వచనం. శిష్ట్లా 'ప్రహ్లాద కవిత్వం' లాగా కొంపెల్ల 'అబద్ధాలు' కూడా పాపులర్ కాలేదు.

నిజానికి, వచన పద్యం ముద్దుకృష్ణ 'జ్వాల' పత్రికలోనే నిస్సంకోచంగా తెలుగు గడ్డమీద అడుగు పెట్టిందని చెప్పుకోవాలి. 'జ్వాల' మొదటి సంచికలోనే 'పద్యాలు' అనే విభాగం కింద కవికొండల వెంకటరావు, విశ్వనాథ సత్యనారాయణ, 'ఒకరు', ముద్దుకృష్ణ రాసిన పద్యాలున్నాయని ముఖచిత్రం చెప్తుంది. ఈ నలుగురిలో కవికొండల మాత్రా ఛందస్సుతోనూ, విశ్వనాథ గీతపద్యాలు రాశారు. ముద్దుకృష్ణపద్యం ''ఒకటో పేజీ''లోనే ఉంది. దాని పేరు ''తురాయి''. శిష్ట్లా ప్రభావం వల్లనే కావచ్చు, తెలుగు పత్రికలో దొరికిన మొదటి వచన కవిత ఎలా ఉంటుందో నన్న కుతూహలం తీర్చడానికి ముద్దుకృష్ణ చేసిన ఆ చిన్న రచనను ఉదాహరిస్తున్నాను.

తురాయి
''మొన్న
యీ దారినే వొచ్చినప్పుడు
బైటపడుతున్న సిగ్గును
బెరడుగప్పి దాచుకోబోయి
తత్తరిల్లినది. తల దించి
సిగ్గు సింగార మొలకి;
రెండు వానలు కురిసి
వాగులన్నీ పరుగు బారుతున్నవి
యిపుడు,
యెర్రపువ్వుల తలదురిమి
ముసుగు చిగురుచాటు నుంచి
ముసి ముసిగ నవ్వుతున్నది
నన్ను చూసి!''

ముద్దుకృష్ణ వ్రాసిన ఈ వచన పద్యంకన్నా, ''వొకరు'' రాసింది మరీ చిన్నది. అది 'నవ కవి'' అనే పద్యం.

''నీరులా వొస్తాను
గాలినై పోతాను
నా ప్రేమ ప్లేటోనిక్
నీ గుండె కోర్తాను
నా కంతె చాలు
నా హృదయ మేమిటో
యేకో ఎందుకో?''

ఈ వచన పద్యం అంతా కలిపి ఏడుపంక్తులు అయినా ఇందులో భావకవులపైన 'అవహేళన' ఎంతైనా ఉంది. దీన్ని రాసిన 'వొకరు' ఎవరో తెలియదు. చాలా తప్పుపని చేశాను. ముద్దుకృష్ణ బ్రతికున్న చివరి రోజుల్లో కనీసం వారానికోసారి మా యింటికి ఆప్యాయంగా వచ్చేవారు. అప్పుడు అడిగి తెలుసుకోవలసింది. బహుశా ఇది ముద్దుకృష్ణే రాసుండవచ్చు.

జ్వాల తొలి సంచికలలోని వచన పద్యాల ప్రభావం వల్లనే చాలా ప్రతిభావంతంగా మాత్రాచ్ఛందస్సులతో రచనలు చేసే కవికొండల వెంకటరావుగారు, కొన్ని వచన గీతాలు రాశారు. ఆయన రాసిన 'నక్కాసామిగాడు' కృష్ణాపత్రికలో అచ్చుపడినప్పుడు దానిని 'వచన గీతిక' అని కవిగారే పేర్కొన్నారు. దీని ప్రచురణకాలం 1933 జూన్ 17. (ఈ వివరాలు సి.నా.రె. తమ గ్రంథంలో ఇచ్చారు). ఈ వచన గీతిక 'కవికొండల గేయాలు' అన్న సంపుటిలో చేర్చబడింది. (పుట.61) చూడండి.

నక్కాసామిగాడు - వాడొక మాలవాడు
        రాజుగారి కఁవతంలో పాలేరు వాడు...
వాడు పోయాడు - ఎంత కాలమైందో ఆ
        పోయి? - దానిని గురించి - మంచి
యజమాని తలపోసుకొంటూ - చెబుతు ఉంటే
        దెందులూరి కాడాక్కుండా వెళ్ళిన మెయిల్నీ
ఆగిన మా ప్యాసింజరు రెయిల్నీ
        రెండింటినీగూడా మఱచి స్థాయి -
ఆ కథలో లీనమైపోయినాం - ఆకడే యుండిపోయినాం
        రేయి - కథలో ఏమీలేదు - కబుర్లలో ఏమీ లేదు
జ్ఞాపకం రావడంలో ఉంది - ఓయీ - వాడు
        ఆ స్వామిగాడన్నవాడు - బండికట్టడ మొస్తే
కొట్టేవాడు గాడు - ఏ యెడ్లు నన్నా
        కాడిమీ దో దెబ్బ - కమిచీతో వేస్తే

ఆ యెడ్లు తమంతటవి - మోకరించి మోకరించి
యొక మాఱుగా మెడలు పైకి ఎత్తుకోవాలి
ఉవ్వెత్తుగా నుండి - మొండి - వాడున్నాడే
ఆ స్వామిగాడు ఉత్త శిఖండి.
అలా యజమాని అంటూంటే - వినేవాళ్ళలో ఒకరు
''అవునండి రాజుగారూ! నేనూ ఎరుగుదునువాణ్ణి
మీ పెద్దెడ్లనూ ఎరుగుదును - అది వాడి చేతిలో నలగమట్టి
అలా నేర్పుగా - అలా తీరుగా - అలా చేర్పుగా వుండేవి
ముందు వాడెడుతూవుంటే, వెనకాల బుర్రొంచుకు
కఱుగూ చెఱుగూ లేకుండా - ఎంత బరువైనా
లాక్కుపోవడమేగాని - రస్తా తప్పడమంటూ ఉందా!
మహామంచివాడు వాడు - గుర్రాలకు నకులు డెల్లాంటివాడో -
ఎడ్లకి వాడల్లాటివాడు'' - అని హెచ్చరిగ్గా అన్నారు.
రాజుగారి కళ్ళమ్మట - బొట బొట కారాయి కన్నీళ్ళు -
'ఆ యెడ్లు పోయాయి యిప్పుడు - వాడూ పోయాడు'
అంటూ రాజుగారు నిట్టూర్పు - ఓ జామన్నట్టుగా విడిచారు -
అంతా ఓ నిముషం! రైలు కదిలింది.

రచనా కాలం తెలియదుగాని, కవికొండల రాసిన మరొక వచనపద్యం ఏవచన కవితా సంకలనంలోనైనా సగర్వంగా తొలి పేజీల్లో అచ్చువేయదగ్గది. ఇవి పట్టుమని పది సంభాషణలేగానీ, హృదయాన్ని పట్టుకొంటాయి చదవండి.

చిన్నప్పుడు
''దీనిని నీవు చిన్నప్పుడు బో బో బో అన్నావు''
''ఈ కోడిపుంజునా? అమ్మా!''
''దీనిని నీవు చిన్నప్పుడు కా కా కా అన్నావు''
''ఈ బొంతకాకినా? అమ్మా!''
''దీనిని నీవు చిన్నప్పుడు వుస్, వుస్ అన్నావు''
''ఈగండు పిల్లినా? అమ్మా!''
''ఊ''
''అమ్మా! మఱి నిన్నో - నేనేమన్నాన్ చిన్నప్పుడు!''
''అమ్మే అని అన్నావురా''
''అమ్మా మఱి 'బువ్వే'యని 'అమ్మా బొబ్బే' యనుచున్నానట కాదే''
''ఈ పేదరాలినా బిడ్డా!''

భాషలో, భావంలో, వస్తువులో ఇది మస్తుగా అభ్యుదయ వచన కవిత, ప్రకృతి కవిగా పేరుబడ్డ కవికొండల ఆ ప్రకృతిలో ఉన్న పేదసాదల గురించే ఎక్కువగా రాసిన కవి. ఆయనకు గ్రామిక పక్షపాతిగా, సహజాభ్యుదయకవిగా రావలసినంత పేరూ, గుర్తింపు

రాకపోవడం శోచనీయం. ఆయన కలం మాత్రా ఛ్ఛందస్సులకే ఎక్కువగా అంకితమైనా, సంధియుగంలో సమర్థుడైన కవి కొత్త ప్రయోగాలు చేయడానికి వెనుకాడడని ఈ వచన గీతాలు రుజువు చేస్తాయి. జ్వాలలోనూ, తరువాత వచ్చిన ఉదయినీ, ప్రతిభా పత్రికల్లోనూ, ఎందరో కవితలు రాశారు. వీళ్ళలో చాలామంది ప్రసిద్ధులే. కొందరు వచన గీతాలకు దగ్గర్లో ఉండే మాత్రాచ్ఛందస్సులో మాత్రాచ్ఛందస్సులను తలపించే వచన గీతాలూ రచించినారు. కవికొండల, విశ్వనాథ, మల్లవరపు విశ్వేశ్వరరావు, అడవి బాపిరాజు, నార్ల, వెలుపలి వీరరాఘవస్వామి, శ్రీశ్రీ, నారాయణబాబు, కొంపెల్ల సూర్యరావు, బంగారమ్మ, వేదుల, కృష్ణశాస్త్రి, జనమంచి (వెంకట్రామయ్య?), శివరాం, 'శి' అనే పొడి అక్షరంతో ఒకరు. నాదగ్గర ఉన్న కొద్దిపాటి జ్వాల పత్రికల్లో కనబడేపేర్లు. జ్వాల సంపుటాలన్నీ దొరికితే యింకా ఎన్నిపేర్లు తెలుస్తాయో! జ్వాలలో పేరు లేకుండా కొన్ని పద్యాలు అవి ముద్దుకృష్ణ రచనలే కావచ్చును.

జ్వాలలో వచన పద్యాలు రాసిన కొంపెల్ల సూర్యరావుగారి పేరు ఈనాడు ఎవరికీ తెలియదు. ఈయన కొంపెల్ల జనార్ధనరావుగారి అన్నగారు. ఈయన దేవుడిమీద ధ్వజమెత్తిన కవి ''పాపం!'' అనే వచన పద్యం చూడండి.[8] మొత్తం పదే లైన్లు.

జనులు అందరూ తెలివిమీరితే
దేవుడి గుళ్ళో కెళ్ళకపోతే
దేవుడికొక డబ్బియ్యకపోతే
అర్చకు లది మింగెయ్యకపోతే
దేవుడి బతుకేం కావాలి?
సరసుల నమ్ముకొని సానులందరూ
సానిమేళాల్ మానుకొంటే,
దేవుడి మేళాల్ చేయకపోతే
పూజారుల పని పస్తడి పోతే,
దేవుడి బతు కేంకావాలి?

ఇది నాస్తికత్వాన్ని ధ్వనిగా ప్రబోధిస్తుంది. ఈ కొంపెల్లవారే ''ప్రపంచమంతా పాడడిపోదూ'' అనే మరొక వచనపద్యం రాశారు. ఇందులోనూ అధికార్లతో పాటు దేవుడిని ఎద్దేవా చేశారు.[9] మొత్తం 13 లైన్లు.

భజనలు చేస్తాం
బహుమతులిస్తాం
పాదాలకి సాష్టాంగాలిడతాం
గొప్పలు యెరగడు కోపం యెరగడు
కోరిక లెరగడు గౌరవ మెరగడు

8. జ్వాల - సంపుటి -2; సంచిక-5; భోగిసంచిక (16-1-1935)
9. జ్వాల - సంపుటి - 3; సంచిక -4.

తులం పత్రి పీల్చి టుప్పుదాసాక
'డొరే' యని పిలిస్తే 'ఓ' యంటాడే
ప్రజల సొమ్ముల జీతాలుచ్చుకు
ప్రజలకి నౌకరి చేస్తామంటూ
చేరి అధికారం చెలాయించే
పోలీసు నుంచి గవణరు దాకా
దేవుడిలాగే తెలికపడితే
ప్రపంచమంతా పాడడి పోదూ!

ఎంత వ్యంగ్యం? ఏం ధ్వని! తారీఖు చెప్పకపోతే ఈ పద్యాన్ని ఏ ఈనాటి కవో రాశాడనుకోవచ్చు. ఆనాటి యుగధర్మ ప్రభావం యువక హృదయాలచేత విప్లవ గీతాలు రాయించింది. ఒక యువకవి జ్వాలలో రాసిన ''విప్లవం'' అనే పద్యం గమనించండి.[10]

హిమాలయమ్ములు
గుహా ముఖమ్ముల
తెలియని యేవో ప్రళయ రావములు ధ్వనించి
దద్దటిల్లెడు!

భగీరథాత్మజ
సరంగతనువె
ఏదో తనతడి యిగురు బెట్టు నెండ గొట్టి
ఆవటిల్లెడు

ధరిత్రియంతయు
ఏదో కలతవడి
తన మనస్సు త్రోవలు రహదార్లు లేక
గడుసు వడియెడు!

ఏది చూచినా
తుపానులో
విరిగిపోవుచున్న కెరటముపై నోడవలె
అటో ఇటో అన్నట్లున్నది.

ఇది యే శ్రీశ్రీయో రాశాడనుకోవచ్చుగాని, రాసింది సాక్షాత్తూ విశ్వనాథ సత్యనారాయణ. ఆ నూతన భావోద్రేకపు రోజుల్లో ఆ ఉత్సాహపు ఉద్వేగంలో గుండెల్లో ఏ మాత్రం యువకాంకురాలున్న మనిషైనా విప్లవాన్ని చూడక తప్పదు. ముద్దుకృష్ణ సంపాదకీయాల్లోని వేడిని, వాడిని రుచి చూసిన ఏ యువక హృదయమైనా, ఉత్తేజితం కాక తప్పదు. ''జ్వాల ఎందుకంటే'' అనే శీర్షికతో ప్రప్రథమంగానే ముద్దుకృష్ణ చెప్పిన మాటలు యథాతథంగా కోట్ చేయదగ్గవి.[11]

10. జ్వాల - సంపుటి - 2; సంచిక-4
11. జ్వాల - ప్రారంభసంచిక.

''ప్రపంచమంతా ఒక యిల్లుగా, మానవ జాతి అంతా ఒక కుటుంబంగా మారిపోయే రోజులు వస్తున్నవి. ఏ మూలనో ఉన్న ఒక దేశం సాహసించి చేసిన యత్నంలో, అనాది నుంచీ మానవజాతి విశ్వసించిన నీతి, ధర్మం, సత్యం విలువలు తారుమారు అవుతూ వున్నవి. మనం కూపస్థంగా వుండడం వల్లనో, పురాతన మగతచేతనో, రక్తంలో నీరసం చేతనో, నూతన తేజస్సుకు గుడ్లగూబల మౌతున్నాము. ఇది పనికి రాదు.

సంవత్సరాల నుంచి జరుగుతూవున్న ప్రచారం వల్ల నేడు హిందూ సంఘం కూడ కదలినది. అంగీకరిస్తూ వున్నది. నూతన సత్యాన్ని, నీతిని. ఇదే అదను. మనలో పగిలిపోవలసినవి యింకా వున్నవి. ధర్మాలలో, సంఘంలో, భావాలలో, భాషలో మార్పు, మార్పు తప్పదు. దీనికి అడ్డు వీల్లేదు. వచ్చినా ఆగదు. పిరికితనానికి ముక్తిలేదు. అందుచేత నచ్చని పాతబంధాలను తెంపివేయడానికి ఎంతైనా సాహసిస్తాము. నచ్చిన కొత్త దానికి దూకుతాము. భయపడము. తప్పు అవుతుందేమో అని జంకము.

సర్వ సమత్వాన్ని అంగీకరిస్తాము. మాకు మతం లేదు. జాతి లేదు. వర్ణం లేదు. ఆడవాళ్ళిందుకు మగవాళ్ళందుకు అనే భేదం లేదు. అంతా వొక్కటే. ఏ గుర్రాన్ని యెక్కి వచ్చిన వాణ్ణయినా సరే కళ్ళెం పట్టి ఆపి కిందకు దింపుతాము; 'నీకన్నా తక్కువ యెవరు' అని.

యౌవనం తెలుసుకోవలసిన విషయాలను వయసు దాస్తూ వున్నది. అర్థంలేని భయంచేత మేము ఇది అంగీకరించము. ప్రపంచం, జీవితం, అంతా తెరచిన పుస్తకం కావాలి అందరికీ. యువకులు ఉద్రేకంతో, సాహసంతో, ఏది తెచ్చినా దాన్ని ప్రచారంలో పెడతాము. ఉన్నది ఉన్నట్టు అంగీకరించి నిర్జీవంగా తుప్పుపట్టడం కన్నా నష్టం కలిగినా సాహసించి ఏదో యత్నించి జీవించడం ఉత్తమం.

యౌవనోద్రేకం రక్తాన్ని కదుపుతూ ఉన్న ప్రతివారూ మా యువకులే - వయస్సు పరిమితి లేకుండా...''

ఇటువంటి ఆశయాలతో ఒక ఉద్యమంలాగా నూతన సాహిత్యాన్ని ప్రారంభించిన రోజుల్లో విశ్వనాథ సైతం విప్లవాన్ని దర్శించడంలో ఆశ్చర్యం లేదు. ఎటొచ్చి ఆయన తన వచన పద్యంలో ఆఖర్న చెప్పినట్టూ, ఆయన చూచిన ప్రతిదీ తుపానులో ఆటో ఇటో అన్నట్లున్నది. ఆయన అటే వెళ్ళిపోయాడు. శ్రీశ్రీ, నారాయణబాబూ ఇటు వచ్చారు.

చిత్రం ఏమిటంటే, నారాయణబాబు 'రుధిరజ్యోతి' శ్రీశ్రీ ''మహాప్రస్థానం'' అనే మాటలు జ్వాలలోనే, అందులోనూ ఒక సంచికలోనే ఒకదాని తరువాత ఒకటి తొలిసారిగా దేశానికి పరిచితమయ్యాయి.[12]

నారాయణబాబు 'జ్వలనా' అనే గీతికలో 'రుధిరజ్యోతిని వెలిగింపుమురా, విప్లవగీతిని వినిపింపుమురా' అని ఎలుగెత్తి చాటాడు. దాని తర్వాత పేజీలోనే శ్రీశ్రీ మహాప్రస్థానం అచ్చుపడింది. వయసులోనేకాదు నారాయణబాబు శ్రీశ్రీకన్నా

12. జ్వాల - సంపుటి-2; సంచిక-5 (16-1-1935)

ఎన్నోవిధాల పెద్దవాడు. ఒకసారి వచనపద్యాన్ని చేతపట్టాక నారాయణబాబు మరే ప్రక్రియనూ ముట్టుకోని ఏకపత్నీవ్రతుడు.

శ్రీశ్రీ ఎన్నో వచన పద్యాలు రాశాడు. ఆయన రాసిన ''ఆకాశదీపం'' అనే పద్యం 1934 డిసెంబరు భారతిలో పడింది. దానికింద ఒక సంజాయిషీ సంపాదకుడిదో, స్వయంగా రచయితదో అచ్చువేశారు. ''ఛందస్సు యధేచ్ఛము, గణప్రధానము, లయప్రధానము కాకుండా, విరుపులతో, అనుప్రాసలతో, వివిధ స్వర విన్యాసములతో భావానుగతి నిరూహ్యమై ఈ రచనకు పద్యత్వసిద్ధి ఆర్థించబడ్డది. వచనకావ్యాలేగాని, గీతమువలె వ్రాయబడుటకూడా ఈ స్థితిని అందుకొనడానికే. చదవడం రాగయుక్తంగానే అక్కరలేదు. పైకిమాత్రం చదివితే మంచి విరామసూత్రాలను పాటిస్తూ....'' ఈ వాక్యాలను ఉటంకిస్తూ శ్రీశ్రీ భక్తులు 'వచనగేయం తెలుగు కవిత్వంలో ఇంతకు ముందే ప్రారంభమైనా ఈ గేయం ద్వారా అది గణనకు రాగలిగిందన్న మాట' అని వ్యాఖ్యానించారు.[13] అంతకు ముందు వచ్చిన వచన కవితలు లెక్కలోకి రావు - లేక లెక్కచేయక్కర్లేదనేగా వీరి ఉద్దేశం. కానీ, ''ముద్దుకృష్ణ వచనగేయ రచనలో శిష్ట్లాతోబాటు, తనుగూడ శ్రీశ్రీ మార్గదర్శకుడైనాడు'' అని సాహిత్య పరిశోధకులు సి.నా.రె. సత్యాన్ని చాటుతున్నారు.[14]

వచనరచనలో శ్రీశ్రీ ఆద్యుడేగాని కేవలం ఆద్యుడు కాదు. అతని ప్రఖ్యాత వచనపద్యం 'కవితా ఓ కవితా'లో ఆయన -

''నావిన్నవి కన్నవి విన్నవింపగా
మాటలకై వెదుకాడబోతే - అవి
పుంఖానుపుంఖంగా
శ్మశానాలవంటి నిఘంటువులు దాటి
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి
ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నాయెద నడుగిడినై॥

అని తన కవితలో చెప్పుకొన్నా, ఆయన వాణి వ్యాకరణానికి, ఛందస్సుకీ దూరంగా లేదు. నిఘంటువులనూ, వ్యాకరణాన్నీ, ఛందస్సునీ లక్ష్యపెట్టని వాళ్ళు పఠాభీ-నారాయణ బాబులే!

'ఛందో బందోస్తులన్నీ ఛట్ ఫట్‌మని త్రెంచు''తానని శ్రీశ్రీ అన్నా, ఆ పని చేసింది పఠాభి, ఫిడేలురాగాల డజన్‌లో.

13. కె.వి.రమణారెడ్డి, శ్రీశ్రీ సాహిత్యం (రెండో కావ్య విభాగం) - పుట.49
14. ఆధునికాంధ్ర సాహిత్యము - సంప్రదాయములు - ప్రయోగములు - పుట.533

పఠాభి తన వచన పద్యాలనే దుడ్డుకర్రలతో రంగ ప్రవేశం చేయగానే ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఒక ఆశ్వాసం అంతమైంది. నూతనాశ్వాసం మొదలైంది. ఈ సంగతినే జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి ''ఆస్వాసాంతం'' అనే పద్యంలో ముక్తకంఠంతో చాటాడు.

'లలాటాన కుంకుమాగ్ని, భుజమ్మీద మబ్బుదుబ్బు, కాళ్ళ కింద కిర్రు చెప్పు, అంగోస్త్రం, పొడుంకాయ, వ్యవధిలేని అవధానం వెళిపోయిందెళిపోయింది' - అంటూ తిరుపతి కవుల దగ్గర్నుంచి, ముద్దుకృష్ణ జ్వాలగోల, రాయప్రోలు దేశభక్తి, విశ్వనాథ విసురుళ్ళు, వైజాగులో కొత్తగద్ద, ఎముకముక్క, చేదుపాట, జరుగ్గొడ్డు సొడ్డులడ్డు, ఘనాజటా జనార్దనం, శరత్‌బాబు, రష్యన్ కథ ఐపోయిందైపోయింది'' అన్నాడు. లేతవాళ్లదారులకే కృష్ణశాస్త్రి దిగివచ్చిన ఆకలికాకలికేకలు చాంబర్లేను మంత్రి పెళ్ళి ఐపోయిందయిపోయిందన్నాడు.'' 'పఠాభి కవి ఫిడేలు డజన్, పిఠాపురం యువరాజా, శ్రీ నారాయణబాబూ, అశాంతిలో ఇంద్రకాంతి, పూరీలో పురిపండా, బెంగుళూరు హారీన్ ఛటో - అతివిస్మృత, అతిరాజిత అతిపూజిత, అతికామిత అతివాస్తవికాకారం, ఆహార్యం, ఆచారం వొొచ్చేశా యొచ్చేశాయి' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఈ 'ఆశ్వాసాంతం' పద్యంలో రుక్మిణీనాథశాస్త్రి 'జరుగ్గొడ్డుసొడ్డులడ్డు' అని తనను తెరచాటుకు వెళ్ళిపోయిన వాళ్ళలో చేర్చుకొన్నాడు. అలాగే శ్రీశ్రీని 'వైజాగులో కొత్తగద్ద, ఎముకముక్క. చేదుపాట' అనే మాటల్లో చేర్చాడు. ఈ పద్యాన్ని జరుక్కు రాసేనాటికి శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలరచన రమారమీ పూర్తయింది. అద అచ్చుపడకపోయినా అందరూ వాటి కాపీలు రాసుకొని దాచుకొన్నవాళ్ళే. అందుకే జరుక్ నిజం చెప్పాడు. అయితే రుక్మిణీనాథశాస్త్రి చెప్పిన కొత్తవాళ్ళందరూ తన అనుయాయులే అని ధ్వనిస్తూ 'శ్రీ శ్రీ పద్యాలనే వాడుడు' అనే గీతం శ్రీశ్రీ ఉత్తరోత్తరా రాశాడు.

''రెండు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ థియేటర్ స్టార్లు''
రెండు ఆరుద్రాభిషేకాలు
రెండు రిక్షాపై మౌనశంఖాలు
రెండు విజ్ఞియార్భాటాలు,
రెండు హనుమత్ శాస్త్రాలు,
రెండు నమస్కరించదగ్గ విశ్వనారాయణాస్త్రాలు
రెండు నామరహిత ఫిడేలు రాగారాబాలు
రెండు పఠా పిఠా కఠోర కుఠారాలు
రెండు గోరా వీణా వినాయకారాగాలు''

ఈ పాదాలలో, లిటిల్ థియేటర్ ఉద్యమాన్ని నడిపిన అబ్బూరివారు, నేనూ, మౌనశంఖం వ్రాసిన నారాయణబాబు, విజ్ఞియార్ రాసిన సింగరాచార్య, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, పఠాభీ, పిఠాపురం యువరాజా, గోరాశాస్త్రీ, అందరూ శ్రీశ్రీ ప్రభావంలోని వాళ్ళే అన్నది కవి హృదయంకాని, వాస్తవానికి వీళ్ళంతా శ్రీశ్రీ హృదయంలో మెదిలే కవిసింహాలు, సింహ కిశోరాలు.

శ్రీశ్రీ తర్వాత నారాయణబాబు పేరును ఆరోజుల్లో ఎలాగ స్మరించేవాళ్ళో, పఠాభి తర్వాత పిఠాపురం యువరాజు పేరును తలచుకొనడం నాటి సాహితీపరులకు

అలవాటయింది. ఈనాడు సాహిత్యపరిశోధకులకు తప్ప, పిఠాపురం యువరాజా రచనల అవసరం కనబడడం లేదు. ఆయన రచనలు ఏ సంకలన గ్రంథంలోనూ నేను చూడలేదు. ఆయన 'నామరహితం' 'తీరని కోరికలు' కంటికి మనసుకీ కనిపించీ కనిపించని దృశ్యాలందామా? లేక మరేమందాం? ఏదో అనాలి అంటే?'' అనే పొడుగాటి పేరుగల కావ్య రచన చేశారు. ఈ మూడింటిలో చివరదైన 'దృశ్యాలు' 74 రచనలున్నాయి. వచన రచనలో ప్రయోగ వైవిధ్యానికి ఇందులోంచి కొన్ని మంచి ఉదాహరణలు యివ్వవచ్చు. 31వ దృశ్యం మహాభీభత్సం. 20వ దృశ్యం జమీందారు రాసినా అది రైతుల మీద రచన. ఈ రెండింటినీ చూడండి.

దృశ్యం - 31

అన్యోన్యం అయిన మహాప్రేమతో ఇద్దరు వివాహం చేసుకున్నారు.
సుఖాలు అనుభవించేరు -
ఒకనాడు భార్య మునిగిపోతుంటే తన ప్రాణానికి లెక్కచేయక
ప్రవాహంలో దూకి ఆమెను రక్షించాడు -
ప్రేమ చేసిందా కార్యం -
కొన్నాళ్ళకు ఆమె ఇంకొకణ్ణి వలచింది - భావోద్రేకంతో ఆ
నూతన ప్రియునితో అనుభవించింది -
అది చూసి భర్త ఆమెను చేతులతో మెడ పిసికి చంపేసేడు -
ప్రేమ చేసిందా పని -
తరువాత ఏడుస్తూ చాకుతో పొడుచుకొని తాను
చచ్చిపోయాడు - వలపుకాడు చచ్చిపోయిన
తన ప్రియురాలి శవం చూచి కౌగలించు
కొని ఏడ్చేడు - భరించలేని విచారం, అంత ఉద్రేకం ఏకం
కాగా ఆ శవాన్ని భావోద్రేకంతో కలిసి అనుభవిస్తూ రతికేళి
చేసేడు - చచ్చి ఉన్న భర్త శవం తినాలని నక్కలు చూస్తూ ఉన్నాయి -
ఊరికే నక్షత్రాలు కళ్ళు మూస్తూ తెరుస్తూ చూస్తున్నాయి -

దృశ్యం - 20

గొప్పు తవ్వేడు - కట్టేడు - ఫలితం -
హాయిగా -
పువ్వులు వాసన చూసేడు - కూరలు
పళ్ళు ఆప్యాయంగా తిన్నాడు -
కాడికి ఎద్దులు కట్టి దున్నేడు
ఆకాశాన్ని చూసేడు - ఊరుకున్నాడు -
వర్షించింది - గింజలు చల్లి మళ్ళీ ఆకాశం చూచేడు -
వర్షం లేదు - భయం వేసింది -
పోలేరమ్మకు మొక్కుకున్నాడు -
వర్షం కురిసింది - నిట్టూర్పు ఇచ్చేడు -
కొంచెం పోయింది - చాలా పండింది -

గింజలతో తలవంచిన చేను మధ్య కిర్రుచెప్పులతో పెద్ద కర్రతో
ఠీవిగా పచారు చేసేడు
కోతలు కోస్తుంటే కాపు పడచులతో పరియాచకం ఆడేడు -
ఆకాశాన్ని చూసేడు - మబ్బేసింది - కంగారులో వానరాకుండా -
మళ్ళీ మొక్కేడు -
చిన్న చినుకులు పడి వాన ఆగిపోయింది
కుప్పేసి తొక్కించి గాదిలో గడిపాడు -
కూతురును అల్లుడిని తీసుకొచ్చి బట్టిచ్చి సాగనంపేడు -
సిస్తు ఇచ్చేడు - కొంత నసుక్కున్నాడు - గదిలో ఎలుకలు
కొన్ని గింజలు తిన్నాయి -
ధర బాగుంది - మంచి ధరకి అమ్మేడు -
జాతర్లకి వెళ్ళేడు - పిల్లలని పుట్టించేడు -
సుఖానికి నవ్వేడు - బాధకి ఏడ్చేడు -
చాలా సంవత్సరాలకి చచ్చిపోయాడు -
తరువాత వానికొడుకూ ఇవన్నీ చేసేడు -
తరువాత వాని మనవలు, మునిమనవలు అదే చేసేరు -

పఠాభి, పిఠాపురం యువరాజా తర్వాత వచన కవితారచనలో ప్రయోగ వైవిధ్యాన్ని ప్రదర్శించిన కవి పా.ప. ఈయన వ్రాసిన 'చీకటి', 'పురిటి పాట' అనేవి ప్రతిభావంతమైన రచనలు, పఠాభి, పిఠాపురం యువరాజాల్లాగా పా.ప కూడా తర్వాత ఏకవిత్వ రచనలూ చేయకపోవడం విచారించవలసిన విషయమేగాని, నలభైల్లో నయాగరా కవులూ, అనిసెట్టి, తిలక్, సోమసుందర్, దాశరథీ, నేనూ మొదలైనవాళ్ళం శ్రీశ్రీ అభ్యుదయ మార్గాన్నీ నారాయణబాబు విమర్శవా దృష్టినీ అలవర్చుకొని కొన్ని వచనరచనలను కొత్త ప్రయోగాలతో చేశాం. అనిసెట్టి ఈ సంగతినే చాలా స్పష్టంగా ఇలా చెప్పాడు.[15]

''శ్రీశ్రీ తన నిశితతీక్షణ దృష్టితో నేడు శిథిలమౌతున్న నాగరికతను, నిర్మితమౌతున్న నూతన మానవోద్యమాన్ని దర్శించాడు. శ్రీరంగం నారాయణబాబు తన సహజ వైచిత్రితో నేటి జీవితపు అట్టడుగులను శోధించి, నేటి జీవితంలోని కల్లోలాన్ని నిర్భయంగా వెల్లడించాడు. నేటి జీవితంలోని సుఖదుఃఖాలు వీరిద్దరినీ ఆవహించి, నేటి మానవుల అంతరాంతరాలలో దాగివున్న తీరని కోరికలను భావి సమాజ నిర్మాతలుగా రూపొందుతున్న ఆదర్శాలను పలికింప జేశారు. వీరి తర్వాత వచ్చిన కవిత్వోపాసకులు వారవలంభించిన ఉత్తమ శాస్త్రీయ దృక్పథాన్ని బహుముఖమైన జీవితాన్ని అనువర్తింపజేసి స్వరూప స్వభావాలతో కొత్తపోకడలు చూపడానికి ప్రయత్నిస్తున్నారు''.

అభ్యుదయ కవులు సవ్యసాచుల్లాగ ఒక వంక వివిధ మాత్రాచ్ఛందస్సులతోనూ, మరోవంక వచనరీతులలోనూ ఎన్నో రచనలు చేశారు. ఆనాటి నుంచి ఈనాటిదాకా వానలో తడవనివాడూ, వచన పద్యం రాయనివాడూ లేడని చెప్పవచ్చు. తొలిరోజుల్లో

15. 'కల్పన' ఆధునిక కవితా సంపుటి - పుటలు 12-13

'వీళ్ళకు ఛందస్సు రాదు కనుక వచనపద్యాలు రాస్తున్నారు' అని ఛాందసులు ఎత్తి పొడిచేవారు. దాశరథీ, కుందుర్తీ వృత్తరచనలో ఏ మార్గకవికీ తీసిపోరు. నేను త్వమేవాహంలో సినీవాలిలో ఎన్నో ప్రాచీన ఛందస్సులు వాడాను. వస్తువునుబట్టి ఛందస్సు ఉంటుంది. నేటి విషయాలను నేటిమాటల్లో చెప్పాలంటే వచన కవితను విధిగా చేపట్టాలి. భావకవులు గీత పద్యాలకూ, తర్వాత వాళ్ళు ముత్యాలసరాల వివిధ బాణీలకు కట్టుపడ్డట్టు, వచన కవులు తాకట్టు పడరు.

ఈ సంగతే మా గురువుగారు రోణంకి అప్పలస్వామిగారు ఇలా చెప్పారు.[16] ''వచన పద్యాలంటే ఏదో ఒక ఛందస్సును పట్టుకొని వ్రేలాడడం కాదన్నమాట'' అట్లా అంటే, కేవలం ఛందస్సును విస్మరించడంగానీ జారవిడవడంగాని కాదు. భావవ్యంజకమైన యమకాలు గమకాలు, విరుపులు, నాట్యవిన్యాసాలు, ప్రాసలు తప్పనిసరిగా పొడచూపుతవి. కవి స్వేచ్ఛాయుతమైన స్వీయశయ్యను పుణికిపుచ్చుకొంటాడు. ఈ శయ్య వ్యర్థపదాలకు తావీయదు. అందుచేత ఛందోబద్ధమైన కవిత్వంకంటే కష్టసాధ్యమేగాని సులభసాధ్యం కాదు''.

ఈ కష్టసాధ్యమైన కవితారచన చాలా సామర్థ్యంతో నిర్వహించిన కవులను పేరు పేరునా పేర్కొనవలసిందేగాని తొలితరంలోని కుందుర్తినీ, పునఃప్రవేశం చేసిన పిమ్మట తిలక్‌నీ, ఏనాడు శ్రీశ్రీ ప్రభావంతో రచనలు చేయని అజంతానీ, నాకూ, నారాయణబాబుకూ చాలా సన్నిహితుడైన బైరాగినీ, మొదట స్మరించాలి.

అక్షర గణబద్ధ కవిత్వాన్ని లక్షణంగా చెప్పగల దాశరథి కూడా కొత్త ప్రయోగాలు చేయడానికి 'మస్తిష్కంలో లేబరేటరీ' తెరిచాడు. తర్వాత 'పునర్నవం' దర్శించాడు. చేవగల కవికి ఏ ప్రక్రియ అయినా చెప్పినట్టు వింటుంది.

ప్రగతివాదులు ప్రయోగవాదులు కావడంతో కవితలలో సామాన్యుడు మాన్యుడయ్యాడుగాని అతడు మధ్యతరగతి మనిషే కావడం వచన పద్యంలోని ఒక విలక్షణత్వం. ఎన్జీవో కావ్యనాయకుడయ్యాడు. 'కోటేశ్వరరావు, వీరేశ్వరరావు, జోగేశ్వర రావు' ఎవరైతేం. ఈ గుమాస్తాలంతా 'గొంగళి పురుగులు' (వీళ్ళలోంచి రేపు సీతాకోక చిలుకలు వస్తాయి). ఉద్యోగులే కాదు, నిరుద్యోగులు కూడా తెలుగు కవిత్వ నాయకులయ్యారు. నిరుద్యోగి వెంకట్రావు నడస్తున్నంత మేరా అజంతా చెట్లు కూలుతున్న దృశ్యాలనే చూశాడు.

అజంతా ఒక రకంగా నారాయణబాబులాంటివాడు. తన తరంలోని మిగతా కవులందరూ శ్రీశ్రీలోని చిత్ర శబ్దాలకు ఎగబడితే అజంతా ఒక్కడే నారాయణబాబులో నిశ్శబ్ద చిత్రాలకు వారసత్వాన్ని మౌనంగా ప్రకటించుకొన్నాడు. అజంతా కవిత్వం మీద హైదరాబాదు జీవిత ప్రభావం ఉన్నట్టే, హైదరాబాదు యువకవులలో అజంతా స్వభావం కొంత లేకపోలేదు. అయితే జీవితం పట్ల వీళ్ళకు ముభావం లేదు. రాజకీయ చైతన్యం కన్నా మానసిక సంవేదన ఈ యువకవుల రచనలలో కనబడుతుంది. అందుకే కేశవరావు 'ఉదయించని ఉదయాలను' చూడగలిగాడు. మాదిరాజు రంగారావు 'మేల్కొన్న

16. చితి-చింత (వేగుంట మోహన్‌ప్రసాద్) పుట. XLI

ఆకాశాన్నీ' దానిలోని 'కిర్మీరా'లనూ దర్శించగలిగాడు. గోపాల చక్రవర్తి 'కలం కలలు' కన్నాడు. అరిపిరాల విశ్వం 'కాలం గీస్తున్న గీతాలు'ను స్వీకరిస్తే వాటిని బాపురెడ్డి 'చైతన్య రేఖలు'గా గుర్తించగలిగాడు. అభ్యుదయ రచయితల ఉద్యమం నిద్రపోతున్నా ప్రగతి మేల్కొనే ఉంది.

శ్రీశ్రీ ప్రభావం అభ్యుదయ గేయరచనకు ఎంత తోడ్పడిందో, అంతగా వచన కవితకు దోహదం చేయలేదు. ఇందుకు సరియైన కారణాన్ని వేల్చేరు నారాయణరావు గారు ఇలా చక్కగా చెప్పారు.[17] ''శ్రీశ్రీ ప్రధానంగా కూర్పరి. భావకవులకి పద్యపు కూర్పు మీద ఎంత ఆసక్తి ఉందో శ్రీశ్రీకి గేయకూర్పు మీద అంత ఆసక్తి ఉంది. గురజాడది ఆశుసాహిత్య మార్గమని ఇంతకు ముందు వివరించాను. కూర్పరితనం లిఖిత సాహిత్య లక్షణం. గురజాడ గేయంలో సంగీతంతో నింపవలసిన జాగాలు, పాడడం వల్లనే సర్దుకొనే పదరూపాలూ వుంటాయి. శ్రీశ్రీ గేయంలో ప్రత్యక్షరమూ - చిన్నగా వుంటుంది రచన. గురజాడ గేయం పాదాంతాల వద్ద ప్రాస స్థానాల వద్ద విరిగపోతుంది. శ్రీశ్రీ ఛందస్సుతో చిత్రవిచిత్రమైన నడకలు నడిపిస్తాడు. వసుచరిత్ర ఆశ్వాసాంతగద్యలూ, శంకరుడి భజగోవిందమూ, తిక్కనగారి కందపద్యాలు - ఇవీ శ్రీశ్రీ ఛందస్సుల నడకలకి వరవళ్ళయినవి''.

నారాయణబాబు వచనగీతాలు వీటికి విభిన్నమైనవి. శ్రీశ్రీ చిత్రశబ్దాల మోజునుండి విడిపోయాక, నారాయణబాబు శబ్దచిత్రాల ప్రభావం అజంతాలాంటి వాళ్ళలో వ్యక్తమయింది. బైరాగిలో విజృంభించింది. నిజానికి, వచనకవితలో ఎంతో ఎత్తుకు ఎదిగినవాడు బైరాగి. అతని 'నూతిలో గొంతుకలు' విలక్షణమైన కావ్యం. అతని మాటల్లోనే ఆ కావ్యం గురించి తెలుసుకోవచ్చు.

> ''గొంతుకలు వస్తున్న నూతిలో నీళ్ళు లేవు. అదొక పాడు నుయ్యి'' పాడు నుయ్యి పతనానికి, మరణానికి సంకేతం. అందులో జీవనం ఉండదు. అందులో పడివున్నవారికి వెలుగు గోచరించదు. పైకి ప్రాకటానికి ఆధారం కనిపించదు. వారు కేకలు వేస్తారు. కాని, వారి గొంతుకలు బయటవారికి స్పష్టంగా వినిపించవు. భూగర్భపు లోతులు వారిని బాహ్య ప్రపంచంనుంచి వేరుపరుస్తున్నవి. వారు యాత్రీకులు కూడా కారు. వారికొక గమ్యం లేదు. చీకటి తప్ప వారికి తోడెవ్వరూ లేరు. వారు గర్వాంధతవల్ల అభిశప్తులైన నహుషులు. కాని, ఆ పాపం వారిదే కాదు. అందరిదీ. అది సమస్త మానవకోటికి వర్తిస్తుంది.
>
> ''ఈ కావ్యంలో నేను అంటే కవి కాదు. నేటి మానవుని అనుభూతిలో అది కవి తాదాత్మ్యం, స్వీయబాధ వెలువరించడం కవి పరమావధి కాదు. ప్రపంచంతో ఏకమైననాడే కవి కంఠం సరిగా పలకగలుగుతుందని నా నమ్మకం. ప్రపంచానుభూతిలో స్వీయానుభూతి పరమైనపుడే ఉత్తమ కవిత ఉద్భవిస్తుందని నా విశ్వాసం''.

17. తెలుగు కవితా విప్లవాల స్వరూపం. పుట. 185

బైరాగి నిర్వచించిన ఉత్తమ కవిత, అతని కావ్యంలోనేకాక, ఉత్తరోత్తరా తిలక్ అమృతం కురిసిన రాత్రిలో తొలి నుంచీ కుందుర్తికృతులలో కనిపించడం వచన కవితకే గర్వకారణం.

హైదరాబాద్ రాజధాని కాగానే గేయ కవిత్వం తగ్గుముఖం పట్టి, వచన కవిత పుంజుకుంది. కుందుర్తి ఫ్రీవర్స్ ఫ్రంట్‌ని స్థాపించాడు. కేశవరావు వరవరరావు, మాదిరాజు రంగారావు చేతనా వర్తనం కవులు.[18] సి. విజయలక్ష్మి ఎందరో వివిధ రీతుల్లో విశృంఖలంగా వచన రచనలు చేశారు. కొందరి రచనల్లో సంయమనం లేకపోవడం వల్ల సి. విజయలక్ష్మి కవిత్వంపై ఆ రచయిత రాసిన 'కారుచీకట్లో కాంతిరేఖ' ఉపోద్ఘాతంలో కె.వి.రమాణారెడ్డిగారు అన్న ఈ మాటలు వర్తిస్తాయి.[19]

''కృష్ణవరద, గోదావరి బురద - రెండూ ఒకటైనట్లుంది.
ఎన్ని పదాలూ! ఎన్ని పాదాలు, ఎంత నిప్పు - ఎంత బూడిద''!

సి. విజయలక్ష్మి కవితలో కసి కనిపించినా సంఘం మీద కక్ష మాత్రం దానికి కారణం కాదు. రానున్న ఉపద్రవాన్ని పసికట్టి విషాద భారతాన్ని కళ్ళారా చూసి ప్రతీపశక్తులను చెండాడి ప్రగతిని పరిరక్షించడానికి ప్రళయ రుద్రునిలాంటి నరుడు కవిత్వ త్రినేత్రం తెరిస్తే ప్రగతి శక్తులు కారుచీకట్లో కాంతి రేఖలు చూశాయి. సి. విజయలక్ష్మి పద్యాలు ఆగకుండా వెళిపోయే బోలెడు బోగీల గూడ్సుబళ్ళు.

వచన పద్యం మధ్య తరగతి వాళ్ళు మోజుపడే దినుసు. మధ్యతరగతికీ, బస్తీలకూ ఎక్కువ సంబంధం ఉంది. 1939లోనే అసలు సిసలు వచన పద్యాలు రచించిన పఠాభి ఫిడేలు రాగాల డజన్ కవితల నిండా నాగరిక వాసనేగాని పల్లెటూరి వాతావరణం లేదు.

శ్రీశ్రీ సైతం కూటికోసం గుడ్డకోసం పట్టణంలో బతుకుదామని బయలుదేరే పల్లెటూరి బాటసారుల్నే వర్ణించాడు గాని అతని కవిత్వం నగరంలోనే కాపురం పెట్టలేదు. పఠాభి అలా కాదు. నగరం తప్ప మరోటి కావ్యవస్తువు కాలేదు. అయితే అతని టెక్నిక్ చమత్కారాలకు, తిరుగుబాటు తెంపరితనానికి విస్తుబోయిన లోకం అతనిలోని సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకోలేదు. ఆధునిక జీవితంలో నగరం ఒక భాగమైనపుడు కవిత్వంలో దానికి ఇవ్వవలసిన వాటా ఇవ్వవద్దా అని అతని ప్రశ్న.

అయితే ఆనాడు తెలుగువాళ్ళు దానికి జవాబు చెప్పలేదు. అప్పుడు వాస్తవానికి తెలుగువాళ్ళకు నగరం లేదు. బెజవాడ, వైజాగు వంటివి సైతం పెద్ద పల్లెటూళ్ళే. అందుచేత తెలుగు కవులపై ఆధునిక యాంత్రిక నాగరికతా ప్రభావంతో పాటు పఠాభి ప్రభావం కూడా పడలేదు. (నా ఒక్కడి మీదనే ఎక్కువగా ఆ ఇన్‌ఫ్లుయన్సు పడింది) 1956లో మనకు హైదరాబాద్ రాజధానిగా విశాల రాష్ట్రం ఏర్పడ్డాక మన సాహిత్య జీవనంలో క్రమేణా మార్పు వచ్చింది. కుందుర్తి, తిలక్ వంటి తొలితరం నవకవులు కూడా నగరాన్నే కావ్యవస్తువుగా తరచు తీసుకొనసాగారు. ఇరవై సంవత్సరాలకు పఠాభి విప్లవం పాతబడింది.

---

18. చేతనావర్తం కవులు : 1. సంపత్కుమార, 2. నరసింహారెడ్డి, 3. పేర్వారం జగన్నాథం, 4. సుప్రసన్న.
19. కారుచీకటిలో కాంతి రేఖ - పుట.8

నగరం లేకపోతే ఇవాళ మనకు దిగంబర కవుల ఉద్యమం వచ్చేదికాదు. ఆరుగురు కవులు 1965వ సంవత్సరం మే ఆరవ తేదీ అర్ధరాత్రి ఆంధ్ర రాజధాని నగరంలో తమ తొలి కవితా సంపుటిని ఒక రిక్షావాలా చేత ఆవిష్కరింపచేశారు. ఈ ఆరుగురూ తమ పాత పేర్లు కుబుసాలలాగ వదిలేసి నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, భైరవయ్య, మహాస్వప్న అనే పేర్లు ధరించారు. తమ రచనలను పద్యాలని పిలువ కూడదన్నారు. ఏకవచనమైతే దిక్ అనీ, బహు వచనమైతే దిక్కులనీ పిలవమన్నారు. ఈ వచన పద్యాలు దిక్కూలు కావు. ట్రక్కులూ కావు, చిన్న సైజు బుల్‌డోజర్లు.

దిగంబర కవులు 'నాదేశంలో నేను ఏకాకిని' అంటారు. 'చెరచబడ్డ గీతాన్ని నగ్నంగా నడివీధిలో కాటేసిన భూతాన్ని' అని బాధపడతారు. గాంధీజీని తలుచుకొని 'మేం మనుష్యులం కాదు ఇంకేదో పేరుంది మాకు' అని నిజం చెప్పేసి 'బాపూ మోసపోలేదు కదా! నువ్వు' అని ప్రశ్నిస్తారు.

''ఆకలి అరాచకం కళ్ళు రాలిపోయి చేతులు
తెగిపోయి పసిపాపలు అసహాయులు

ఏ జన్మలలోంచో వెన్నుపూసల్లో నొదిగిన
భయంకర రోగాలకు వారసులు
సగం కాలిన ఇళ్ళు రక్తం కన్నీరూ ఏకమై
వింత కాంతితో వెలిగిపోతున్న
ఈ లోకాన్ని వొదిలి
ఆ దేవుడుగాడు చచ్చాడు
ఇంక దెయ్యమే కనికరించాలి
ఆక్రందనలతో నిండిన ఆకాశం నుండి దీవించాలి''

అని తమ కొత్త విశ్వాసాన్ని ప్రకటిస్తారు. ఈ ఆరుగురు కవులూ ప్రతిభావంతులు, చిత్తశుద్ధిగల వాళ్ళు. జడత్వాన్ని ఆవరించిన ఆంధ్ర దేశాన్ని చూసి బాధపడతారు. ఈ జీవితంలో జంతువుల్లాగా బ్రతికే ఆధారం ఎవరికీ లేదని వీళ్ళు ఎలుగెత్తి చాటుతారు. పనిచేస్తూ తింటూ పిల్లల్ని కంటూ వున్నంత మాత్రాన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నట్టు కాదు. అది అవసరమైనా వస్తువు కంటే హీనంగా జీవించడం మాత్రమే అవుతుంది. నిజమైన అస్తిత్వం భౌతిక ఆనందంతోబాటు మనస్సుని సర్వదా సచేతనంగా వుంచి అందరిలోనూ నిలబడి తనలో తాను జీవించాలి. అని దిగంబర కవులు ఆదేశిస్తారు. తమ ప్రబోధాన్ని వినని వాళ్ళను దండిస్తారు.

''పాలేరు మనస్తత్వం గల పాలకులు, వెన్నెముకలేని యువకులు, నవ్యసాహిత్యాన్ని ఇంకా మట్టిముద్దలతో తూచే మహా మహానుభావులు.. గుమస్తా మనస్తత్వం గల కళాకారులు, ఈ అగాథమీలు, ఈసంస్థలు, ఈ పత్రికలు, వీళ్ళందర్నీ బట్టలొలిచి దిగంబర కవిత్వపు కొరడా కొనల్ని రుచి చూపించాలి. వీళ్ళ జబ్బు భావితరాలకు అంటకుండా శస్త్రచికిత్స జరగాలి'' అని దిగంబర కవులు తరువాత చాలా ఘాటుగా కొన్ని మోటు మాటలు కూడా నిరాఘాటంగా అనేశారు.

వీళ్ళ ధర్మకోపం, మహోద్రేకం, దుస్తులు విప్పేశామంటూనే అంటించుకొన్న లేబిలూ, అన్నీ అలా వుంచి ఈ దిగంబర కవిత్వంలో కొత్త ఏమిటా అని ప్రశ్నిస్తే ఆదిలో నయాగరా కవుల గొంతుకల్లోని వింతే వీళ్ళలోనూ వుంది. ఇరవై సంవత్సరాల కిందట మాలో ఉన్న చిత్తశుద్ధి వీళ్ళలోనూ ఉంది.

''ఎముకలు కుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి''

అని శ్రీశ్రీ ఎంత కసిగా మూడుముక్కల్లో తిట్టాడో వీళ్ళూ అంతకావేషంతోనే మూడు సంపుటాలలో తిట్టారు.

దిగంబరులు జాగృతికోసం ధ్వంస రచన అంటారు. నేటి వ్యవస్థలో చిక్కుకొన్న అసహాయుల మీద జాలికన్నా కోపమే వీళ్ళలో కనపడుతుంది. అందుకే వీళ్ళలో ఉన్న మంచి కవిత్వాన్ని ఆవేశాలూ, అశ్లీలాలు కప్పేశాయి. శోకమే శ్లోకమైనట్లు బాధలోంచే కరుణామయ గాథ వస్తుంది. కరకు గుండెల్లో కూడా కరుణ చారలు ఉండాలి.

బాధ గుండెల్లోంచి వస్తే వేదన మెదడులో పెరుగుతుంది. యువకవిత్వానికి గుండెలూ మెదడూ కూడా ఉన్నాయి. కొత్త సంకేతాలు, కొత్త సంగీతాలు, కొత్త ప్రతీకలు, కొత్త సంవిధానాలు వేయి పువ్వులు విచ్చుకున్నట్లు వచన పద్యం ఉద్యమంలాగ విప్పారింది. సామాజిక చైతన్యంతోపాటు రాజకీయచైతన్యం కవిత్వంలో ప్రవేశించింది. ప్రగతి శక్తులలో అతివాదులూ, మితవాదులూ మాత్రమేకాక ఉగ్రవాదులు కూడా ఉన్నారు. వీళ్ళ విధానాలూ, నినాదాలు యువకవులను ఆకర్షించాయి. అందుకే వరవరరావులాగ ఆదిలో 'విశ్వాంతరాళంలో ఏగోళంలోనూ విధ్వంసం కాదు, విక్రాంతి కోరుకున్న' కవులందరూ చివరకు ఆదర్శం ఆమోదించిన హింసవద్దకు మళ్ళారు. కవులను పెన్నుతో పాటు గన్నుపట్టుకోమన్నారు. ఉగ్రవాదులు విప్లవ రచయితల సంఘాన్ని ఏర్పరచుకొన్నారు.

'ఝంఝ'వీచింది. విప్లవ కవులు 'లే'లెమ్మన్నారు. 'రా' రమ్మన్నారు. 'తిరగబడు' మన్నారు. అభ్యుదయ కవులను ఆనాడు తెలంగాణా సాయుధ పోరాటం ఉత్తేజితుల్ని చేస్తే విప్లవ కవులను తరువాత శ్రీకాకుళం గెరిల్లా సమరాలు ఉత్సాహవంతుల్ని చేశాయి. ఆనాడు అభ్యుదయ రచనలను నిషేధించినట్టే తరువాత విప్లవ కవులను ఖైదు చేసిన అపఖ్యాతి ఆంధ్ర ప్రభుత్వానికే దక్కింది. కవిత్వంమీద తీర్పు విమర్శకులు కాక హైకోర్టు న్యాయమూర్తులు ఇవ్వడం కూడా ఇక్కడే జరిగింది.

'విప్లవ కవిత్వం ఎంత మాత్రం అపాయకరం కాదు. ఇది ప్రజలకు బోధపడదు'. అన్న తీర్పు యువకవుల కళ్ళు తెరిపించింది. ప్రజలకు దగ్గరగా వెళ్ళి వాళ్ళ భాషలో వాళ్ళ అవగాహనకు వీలైన రచనలు చేయాలన్న దీక్ష కొందరిలోనైనా కనబడుతుంది. కట్టుబాటు కార్యాచరణకు కీలకం.

అయితే ఇంకొక విషయం మరువకూడదు. రాసి అచ్చువేసే ప్రతివచన కవితా పరిమిత పాఠకులకే ఉద్దేశించినది. ప్రజా బాహుళ్యంలోనికి వెళ్ళాలంటే మాత్రా ఛందస్సులే మళ్ళా శరణ్యం అని గుర్తుంచుకోవాలి.

దిగంబర కవుల తరువాత పైగంబరు కవులు[20] తిరగబడు కవులు[21] వచ్చారు. వచన పద్యాలే గుచ్చారు. అరిపిరాల విశ్వం, శివారెడ్డి, శీలా వీర్రాజు, వేగుంట మోహన్‌ప్రసాద్, ఇస్మాయిల్, వజీర్ రహ్మాన్, విరసంలో చేరాక నగ్నమునీ, వదిలాక జ్వాలాముఖీ, చెరబండరాజు, రంధి సోమరాజు, ఎందరో ప్రయోగ విన్యాసాలు చేశారు. వచన కవితకు లేటుగా కన్వర్టు అయిన గుంటూరు శేషేంద్రశర్మ, సోమసుందర్‌తో సహా ఎందరో అభిమానులను సంపాదించుకొంటున్నారు.

పేజీలకు పేజీలుగా ఒకే శీర్షిక మీద వచన పద్యాలు - రాసే రోజులు పోయి మూడు నాలుగు పంక్తులలో పద్యం చెప్పే యువకవులు వస్తున్నారు. చేవగల వెదురు ముక్క బాణమై భాసిస్తుందనే నమ్మకం గల వీళ్ళకి స్వాగతం చెప్పాలి. అలనాటి వైదిక ఋషుల ఋగ్వేదంలోనైనా, ఈనాటి విరసం కవుల ఉద్వేగంలోనైనా, కవిత్వం కవిత్వమే. ఆనాటి నుంచి ఈనాటి దాకా, మంచి కవిత్వం, చెడ్డ కవిత్వం అన్న రెండే విభాగాలున్నాయి. అయితే ఆదిశంకరులు చెప్పినట్లు లోకంలో చెడ్డపుత్రుడు ఉండవచ్చుగాని, చెడ్డ మాత ఉండనట్లు, చెడ్డ కవిత్వం ఉంటుందేమోగాని చెడ్డకవి ఎన్నడూ ఉండడు.

కుకవులను కాకులతో పోల్చడం పాత పోలిక. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ రాసిన ఈ పద్యం చూడండి.[22]

చీకటికాకి
చుక్కల గుడ్లను
రాత్రల్లా పొదుగుతుంది
ఒకే ఒకటి
సూర్యకోకిలం ఔతుంది
మిగిలినవన్నీ
కాకిపల్లిలై
చీకటి కాకితో
ఎగిరిపోతాయి
కాకులమంద తరిమేసిన
సూర్య కోకిలం
ఒంటరిదైనా
సమస్త జగత్తునీ
రంజింప చేయగలుగుతుంది

సమకాలీన సాహిత్యంలో మేజరుపోయిట్సూ, మైనరుపోయిట్సూ ఉంటారు. అయితే మా గురువుగారు చెప్పినట్లు ''ఎంత మైనరు కవి అయినా సరే, ఏదోవిధంగా కవితా

20. 1. ఎం.కె.సుగమ్‌బాబు, 2. దేవిప్రియ, 3. ఓల్గా, 4. కిరణ్‌బాబు, 5. కమలాకాంత్
21. 1. వరవరరావు, 2. లోచన్, 3. అశోక్, 4. సంజీవరావు, 5. సుధాకర్, 6. యాదగిరిరావు, 7. కిషన్, 8. సుదర్శన్, 9. ఎక్స్‌రే, 10. ఐ.
22. వెలుతురు పిట్టలు - పుట.16

జ్యోతి ప్రజ్వలించేందుకు సహాయపడుతాడు. ఈ పరమ సత్యాన్ని గ్రహించని జాతికి మోక్షంలేదు''[23] మైనరు కవులు వచన కవితలో చేసిన ప్రయోగ వైవిధ్యాన్ని సోదాహరణంగా చర్చించడం తదుపరి కర్తవ్యం. తదుపరి విమర్శకుల డ్యూటీ!

వచన కవిత్వానికి ఒక లక్షణ నిర్మాణం చేసే ప్రయత్నాలను కొందరు ప్రారంభించారు. లక్ష్యం ప్రాచుర్యం పొందగానే లక్షణం చెప్పాలనే తహ తహ సహజం. నియమాలు నిర్ణయించాలనే ఉద్దేశం ఎంత మంచిదైనా నియమోల్లంఘనమే ప్రాతిపదికగా భావించేవాడు దీనికే కట్టుబడడు. కె.వి. రమణారెడ్డి, సంపత్కుమార్, కుందుర్తి, అరిపిరాల విశ్వం, చేకూరి రామారావు ప్రభృతులు వచన పద్యం లక్షణాల గురించి చర్చలు చేశారు. సిద్ధాంతాలను రూపొందించసాగారు. అయితే ఇది నిరర్థకం. ఇందుకు కారణం ఉంది.

లోగడ వాడుక భాషకు నియమాలు ఏర్పరచాలని టేకుమళ్ళ కామేశ్వరరావుగారు, మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు ప్రయత్నాలు చేశారు. వీరి ఉద్దేశాలను గిడుగు రామమూర్తిగారు హర్షించలేదు. ''వ్యాకరణాలు వల్లించి మాతృభాష నేర్చుకోవడము ఎప్పుడూ ఏదేశములోనూ జరుగలేదు. వాడుకలో ఉన్న అన్యభాషలు నేర్చుకోవడమునకయినా వ్యాకరణము ఆవశ్యము కాదు. సహవాసము వల్లనే అది అలవడుతుంది.''[24] అని గిడుగువారు చెప్పారు. ఈ మాటలు కవిత్వానికి కూడా నప్పుతాయి. ప్రతిభావ్యుత్పత్తులు గల కవులు తమ రచనలకు కావలసిన నియమాలను తామే నిర్ణయించుకుంటారు. అవసరమైతే అలాంటి తమ పూర్వ నియమాలను తామే ఉల్లంఘిస్తారు.

ఎందరు మేజరు కవులు ఎన్ని రకాల వచన పద్యాలు చెప్తారో అన్ని రకాల లక్షణాలు నిర్ణయించడం కొందరికి సరదాగా ఉండవచ్చునుగాని లక్షణాలను చదివి ఎవరూ ఉత్తమ కవితలు రాసినట్టు లేదు.

అనిబద్ధ కవిత్వానికి లక్షణ నిర్మాణం ఆకాశానికి నిచ్చెన వేయడమే.

వచన పద్యానికి కావలసింది లాక్షణికుల అనుశాసనం కాదు. విమర్శకుల విశ్లేషణ.

---

23. వేగుంట మోహన్ ప్రసాద్ 'చితి-చింత' పుట.XL
24. గిడుగు వెంకట రామమూర్తి - వ్యాసావళి - పుట.150

తెలంగాణా సమర సాహిత్యం

ఇప్పటికీ ఇండియా అసమానతల దేశమే. తెలంగాణా ఎప్పటికీ అందులోని ప్రదేశమే. అయితే ఒకనాడు అసమానలతోబాటు తెలంగాణాలో అమానుషాలు కూడా నిత్య సామాన్యాలుగా నెత్తిమీద పెట్టినా దింపుకోకూడని బరువులలాగా ఉంటూండేవి. కుందుర్తి అన్నట్టు ఆ కాలంలో తెలంగాణా హెలంగాణా. తాము పడుతున్న యమయాతనల నుండి బయట పడటానికి సామాన్యులు అసామాన్యంగా ఆనాడు పోరాడక తప్పదనుకున్నారు. వాస్తవానికి మానవులు ఆదినుంచీ భూమికోసం, భుక్తికోసం లేమి నుండి విముక్తి కోసం ప్రకృతితో పోరాడుతూనే వున్నారు. ఆ పోరాటాల విజయపరంపరే నాగరికత, నాజూకు బతుకులు. అందరూ కలిసి సాధించే ఈ విజయాలను కొందరే అనుభవిస్తూ ఎందర్నో పురుగులకన్నా హీనంగా జమకడితే ప్రకృతితో పోరాడే స్వభావం గల మానవులు వికృతంగా మారిన దుర్మార్గ శక్తులపై విరుచుకుపడక తప్పదు. అనాది నుంచీ దేశదేశాల్లో ఈ తిరుగుబాట్లు జరుగుతూనే వున్నాయి. ఘనదేశంలోనూ తెలంగాణా ప్రదేశంలో ఇదే జరిగింది.

దేశమంటే మనుషులు, ప్రజలు. ప్రజలే తమ చరిత్రను తాను సృష్టించుకొన్నట్లు ప్రజలే తమ సాహిత్యాలను సృష్టించుకొంటారు. ఆరాటం నుండి పోరాటం దాకా సాగిన విప్లవ తెలంగాణా తన చరిత్రను తాను సృష్టించుకొంటూ తన సాహిత్యాన్ని తాను విరచించుకొంది. అందులో వివిధ వర్గాల సాజాత్య వైజాత్యాలు స్ఫుటంగా వెల్లడయినాయి. పామరులు పాడుకున్న నోటిపాటలు, కల్పనా శక్తిగల గ్రామీణకవులు కైగట్టి కాగితాల కెక్కించిన గేయాలూ, ప్రజల కష్టసుఖాలకు స్పందించి అభ్యుదయ దృక్పథంతో రచనలు చేసినవారి కావ్యాలూ విప్లవ తెలంగాణా విరచించుకొన్న వీర గీతాలకు సజీవ స్వరూపాలు, ఆ సాహిత్యాన్ని నెమరు వేసుకొనడం పుష్టికీ, సంతుష్టికీ అవసరం.

దేశంలో ఎక్కడైనా సరే రైతులు నేలను నమ్ముకొంటారు. రైతులకు భూములున్నట్టే అప్పులు తీర్చడానికి గిట్టుబాటు ధర కాకపోయినా అమ్ముకోక తప్పదు. సొంతచేనుకాక కౌలుకు తీసుకున్నదయితే పెట్టుబడికి తెచ్చిన అప్పుతీర్చాలి. కౌలు కట్టాలి. వడ్డీలు చెల్లించాలి. పన్నులు కట్టాలి. కడుపులు కూడా కప్పుకోవాలి. ఈ పాట వినండి :

కుప్పనూర్చినాడమ్మా చందమామ రైతు
అప్పుదీర్చినాడమ్మా చందమామ
భూస్వామి చాకిసోకి చందమామ
సావుకారి సిల్లరపద్దు చందమామ
ప్రైభువుల పన్నులరంది చందమామ
కష్టించి పైరుల పెంచి చందమామ
పండించి ప్రజలకు పంచి చందమామ
మేలురకం అమ్ముతాడమ్మ చందమామ రైతు
తాలు రకం తింటాడమ్మా చందమామ రైతు

లోకాన్ని బతికిస్తడె చందమామ రైతు
శోకాన్ని బరియిస్తడె చందమామ
ఎన్నకన్న మెత్తవోడె చందమామ రైతు
నీకన్న సల్లనోడె చందమామ

ఇది గ్రామీణ గీతం. చందమామకన్న అందమైనది శ్రమైక జీవన సౌందర్యమేనని కష్టజీవులకు తెలుసు. ఆ శ్రమజీవుల బాధలను వీక్షించిన కవులెక్కడున్నా దేశమంతటా ఒకరకమైన రగులుతునే వుందని గుర్తిస్తాము. పల్లెపదంగా కాక గణబద్ధమైన కవితగా పై సంగతులనే తొంభై సంవత్సరాల కిందట ఒక సుప్రసిద్ధ కవి ఇలా చెప్పారు :

అధికారభూతుబులడుగు లంచములిచ్చి
పరిపరి విధముల పన్నులిచ్చి
మునసబు కరణాల ముడుపులన్ని యునిచ్చి
కోసినూడ్చిన వరి కూలికిచ్చి
కచ్చేరి బర్రోతుగాముల కీనామిచ్చి
పాలేళ్ళకు కొంత పంటనిచ్చి
యజమానులకు పంటనర్థభాగం నిచ్చి
పైక మిచ్చిన వానికి వడ్డికిచ్చి
గడ్డిమాత్రమే మిగిలించు కాపువాడు
సేద్యమున తాను పశువుల రక్షించుకొరకు
కటకటా యెట్టులున్నదో కాపులదశ
సుగుణధనులార జనులారా చూడరయ్యా

(చిలకమర్తి లక్ష్మీనరసింహం)

తనకోసం, తన పెళ్ళాం బిడ్డలకోసం, గొడ్డు గోదాల కోసం కష్టపడటంలో అర్థముంది. ప్రజలు తమకోసంకాక, తేరగా తింటూ తమమీద పెత్తనంచేసే పైగాలు, సంస్థానాధీశుల, జాగీరుదార్లు, ఇజారాదార్లు, బంజరుదార్లు, ముక్తేదార్లు, ఈనాందార్లు, అగ్రహారీకులు మొదలైన దోపిడీదార్లకోసం కష్టపడాలి. వృత్తి యేదైనా సరే పన్ను తప్పదు. గ్రామాలలో 84 రకాల అనధికార పన్నులు ''పట్టీ''లనే పేర కట్టాలి. పెళ్ళాడితే షాదీ పట్టి, శవాన్ని పూడిస్తే కఫన్ పట్టీ, దున్నపోతులకు ధాపన్‌పట్టీ చివరకు దొరచస్తే బూడిదపట్టీ కట్టి భూస్వామిని తగులబెట్టాలి. దొరల ఇళ్ళల్లో నౌకర్లు, చాకర్లు కాక గ్రామస్తులే వంతులవారీగా వెట్టికి వెళ్ళాలి. మహాభారతంలో ఒకటే ఏకచక్రపురముందిగానీ, తెలంగాణాలో ప్రతిగ్రామమూ ఏకచక్రపురమే, బకాసురుడి భోజనానికి రోజుకొక ఇంటివారు ఒకణ్ణి ఆహారంగా పంపించినట్లు, తెలంగాణాలో ప్రతి హరిజన కుటుంబంలో వెట్టిచాకిరీ చేయడానికి యెవరో ఒకరిని కేటాయించక తప్పదు. ఊర్లో వున్న దొరకేకాదు, ఊరికొచ్చే అధికార్లకు కూడా తేరగా అన్ని తెచ్చియివ్వాలి. సుద్దాల హనుమంతు ఒకపాటలో అన్నట్టు వెట్టి చాకిరి విధానం యెంత చెప్పినా తీరదు.

మాదిగన్న మంగలన్న మాలన్న చాకలన్న
వడ్రంగి సజ్జెరన్న పీసిమాలిన చేశారన్న
కమ్మరన్న కుమ్మరన్న కూలన్న రైతన్న
అన్ని పనులు వాళ్ళతో - దొరలందరు చేయించుకొనెడి వెట్టి

ఇది ఒక యెత్తు. గడి చుట్టూ కాపలా కాయటం - కచ్చడాల ముందు ఉరకడం, దొరకు నిద్రపట్టేదాకా కాళ్ళుపట్టడం మొదలైనవి చుక్కపొద్దు నుంచి అద్దమరేతి దాకా చెయ్యాలి. డాక్టర్ గోపు లింగారెడ్డి చెప్పినట్టు, పాలేర్లు, జీతగాండ్రు, పనివాళ్ళు, గాయిడోళ్ళు ఏపేరు పెట్టి పిలిచినా ఈ శ్రామికులకు రాత్రికూడా విశ్రాంతి వుండదు. చేలూ, పొలాలూ, కంచెల దగ్గరికి కాపలా పోవాలంటారు. రాత్రి మూడుగంటల ప్రాంతంలో కివాటగట్టి, పదిగంటలదాకా కీళ్ళు గట్టి నాలుగు ముద్దలు సద్దితిని, కాసేపు కూడా విశ్రాంతి తీసుకోకుండా నాగలికట్టి సాయంత్రందాకా పొలంలో పనిచేసి, చీకటి పడుతున్నప్పుడు పశువుల్ని తోలుకొనిపోయి వాటికి మేతవేసి ఇంటికి వచ్చి, ఉంటే కాస్త తిని, లేకుండా కాలుతున్న కడుపుతో కావలికి వెళతాడు''. ఇది పాలేర్ల సగటు దినచర్య. శ్రామిక స్త్రీలకు తెరిపిలేని పనులే.

పాటుపడుతున్నప్పుడు పాటకట్టుకొంటారు. పాడుకొంటారు. నాట్లు వేసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, బండి నడిపేటప్పుడు శ్రామికులు ఆ వీరగేయాలు పాడుతూవుంటారు. వీరులు అమానుషంగా మృత్యువు వాతపడితే వాళ్ళమీద పాట కట్టుకొంటారు. దొరల దౌర్జన్యాలూ ప్రజల అష్టకష్టాలూ తలచుకొంటారు. దొరలు అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు పట్టుకొనే రకం. ఈ పాట వినండి :

కట్టుంట గొట్టుంట నాగుమల్లయ్యా దారిలో
సర్కారుకి ఎట్టుంట నాగుమల్లయ్యా దారిలో
ఎట్టికిపోయిన నెట్టోడు నాగుమల్లయ్యా దారిలో
పటేలు పాపిరెడ్డి నాగుమల్లయ్యా దారిలో
ఎల్లోడి యింటికిపోయె నాగుమల్లయ్యా దారిలో
గారీ రాజాకారీ నాగుమల్లయ్యా దారిలో
దొడ్డిలోన పెంటయ్యా నాగుమల్లయ్యా దారిలో
నావంతు దయ్యా నాగుమల్లయ్యా దారిలో
మా బావ వంతయినా నాగుమల్లయ్యా దారిలో
మీ బావ వంతయినా నాగుమల్లయ్యా దారిలో
నువ్వేరా వారి నారి నాగుమల్లయ్యా దారిలో

పటేలు అలా చెప్పాక తప్పుతుందా నారమ్మ పెండకాయడానికి వెళ్ళింది. రెండు తట్టలు తీసింది. అంతలో పటేలు వచ్చాడు. నారమ్మ రెట్ట పుచ్చుకున్నాడు.

మీరు పెద్దవారు నాగుమల్లయ్యా దారిలో
అంట ముట్టరాదుమేను నాగుమల్లయ్యా దారిలో

వద్దూ పటేలాయది నాగుమల్లయ్యా దారిలో
మరియాదగాదయ్యా నాగుమల్లయ్యా దారిలో
రెట్టా జోడిచ్చింది నాగుమల్లయ్యా దారిలో
పక్కాకె జరిగింది నాగుమల్లయ్యా దారిలో
పటేలుకు కోపమొచ్చి నాగుమల్లయ్యా దారిలో
కింద పడే సూకిండు నాగుమల్లయ్యా దారిలో
నోటిలోన బట్టలెట్టి నాగుమల్లయ్యా దారిలో
మీదంగా పడ్డాడు నాగుమల్లయ్యా దారిలో
నారమ్మ తన్నింది నాగుమల్లయ్యా దారిలో
పటేలు కిందవాడి నాగుమల్లయ్యా దారిలో
పటేలుకు కోపమొచ్చి నాగుమల్లయ్యా దారిలో
కత్తిదీసి పొడిసిండు నాగుమల్లయ్యా దారిలో

నారమ్మ చచ్చిపోయింది. పటేలు పాపిరెడ్డి భయపడక దొడ్డిలోన గుంతతీసి నారమ్మను పాతిపెట్టాడు. ఇంటికిపోయి రక్తపు బట్టలను పెట్టెలోన పెట్టి కొత్త బట్టలు కట్టుకున్నాడు. ఎల్లోజి తన యింటికొచ్చాడు. పెళ్ళాం పెండయ్యి కెళ్ళిందని తెలుసుకున్నాడు. మాదిగోడు ఎల్లోజి.

పాటేలు పాపిరెడ్డి నాగుమల్లయ్యా దారిలో
నా పెండ్లామేదయ్యా నాగుమల్లయ్యా దారిలో
దొడ్డిలోన పెండదీసి నాగుమల్లయ్యా దారిలో
నీ యింటికె వచ్చిందిరా నాగుమల్లయ్యా దారిలో
ఎల్లోజి ఏడుస్తూ నాగుమల్లయ్యా దారిలో
దొడ్డి వద్ద కెళ్ళిండు నాగుమల్లయ్యా దారిలో
దొడ్డిలోన నెత్తుల్ని నాగుమల్లయ్యా దారిలో
కంటితోన సూసిండు నాగుమల్లయ్యా దారిలో
తమ్ముల్తో అన్నల్తో నాగుమల్లయ్యా దారిలో
తరలి తరలి వచ్చిండు నాగుమల్లయ్యా దారిలో
గొడ్డండ్లు క్షొడ్డవండ్లు నాగుమల్లయ్యా దారిలో
గొంతుకొచ్చి పట్టిర్రు నాగుమల్లయ్యా దారిలో
పాటేలు పాపిరెడ్డి నాగుమల్లయ్యా దారిలో
పాలాలైతే పట్టిండు నాగుమల్లయ్యా దారిలో
పాటేలును పట్టుకొంటె నాగుమల్లయ్యా దారిలో
కాళ్ళా ఏళ్ళా పడిండు నాగుమల్లయ్యా దారిలో
లెంపాలె యేసుకుండు నాగుమల్లయ్యా దారిలో
రచ్చించమనిండు నాగుమల్లయ్యా దారిలో
డబ్బిస్తామనిండు నాగుమల్లయ్యా దారిలో

నీతిగుంటననిండు నాగుమల్లయ్యా దారిలో
నీ డబ్బూ మాకు వద్దు నాగుమల్లయ్యా దారిలో
బతుకు పోపటేల నాగుమల్లయ్యా దారిలో

కాళ్ళమీద పడ్డవాడిని కరుణించి పొమ్మన్నాడు. అధ్వాన్నపు చావు చచ్చిన నారమ్మ పాటలో బతికింది. ఏ కారణం చేతనైనా దుర్మరణం పాలైన వ్యక్తుల చావులకు విలపించే బంధువులు లేకపోయినా, తగిన కారణముంటే పాట కట్టుకొంటుంది, జాతయినా రోదిస్తుంది. కక్షవల్లనో, కార్పణ్యం వల్లనో నర్సిరెడ్డి అనే వ్యక్తిని శత్రువు హతమార్చాడు. చిందే నెత్తురుని బిందెల్లాంటి కడవల్లో పట్టారు. గుర్తు తెలియకుండా చేయాలని జాగ్రత్తపడ్డారు. నర్సిరెడ్డి పిల్లలూ చెల్లెలూ ఎవరూ లేనివాడు. అయినా మిత్రులు మాత్రం ఉన్నారు. వాళ్ళే ఒక పాట కట్టుకున్నారు.

గోరంట చెట్టుకింద నరుడా ఓ నర్సిరెడ్డి
గొడ్లను నూరిరయ్యా ఓ నర్సిరెడ్డి
యాపయి సెట్టుకింద ఓ నర్సిరెడ్డి
నిన్నాకు సేసిరయ్యా ఓ నర్సిరెడ్డి
సర్రెంగ సెట్టుకింద ఓ నర్సిరెడ్డి
నిను రెండుగ నరికిరయ్యా ఓ నర్సిరెడ్డి
మొండాము ఈటాక ఓ నర్సిరెడ్డి
నీశిరసు అటాయె ఓ నర్సిరెడ్డి
పారేటి రక్తమంతా ఓ నర్సిరెడ్డి
కడవల్లా ఎత్తిరయ్యా ఓ నర్సిరెడ్డి
నీ దోస్తి దార్లంతా ఓ నర్సిరెడ్డి
నీకు దోసి లొగ్గారయ్యా ఓ నర్సిరెడ్డి
పల్లెపల్లెల సోన్నా ఓ నర్సిరెడ్డి
సాలారి అమ్మిరయ్యా ఓ నర్సిరెడ్డి
నీకొక్క బిడ్డుంటే ఓ నర్సిరెడ్డి
బాపాని ఏడ్చునేమో ఓ నర్సిరెడ్డి
నీకొక్క సెల్లెవుంటే ఓ నర్సిరెడ్డి
అన్నాని ఏడ్చునేమో ఓ నర్సిరెడ్డి
నీపాగా దార్లంతా ఓ నర్సిరెడ్డి
పకపక నవ్విరయ్యా ఓ నర్సిరెడ్డి
నీ దోస్తి దారులంతా ఓ నర్సిరెడ్డి
మోకాన కొంగు వేసి ఓ నర్సిరెడ్డి
మము బాసి పోతివయ్యా ఓ నర్సిరెడ్డి
మము వోసి పోతివయ్యా ఓ నర్సిరెడ్డి

దోచుకునే దొరలపైనగానీ, ద్రోహం చేసే శత్రువర్గాలపైనగాని పగబట్టి ప్రతీకారం చేయాలనే తలపులుంటే అవి బలాన్ని పుంజుకొనే లోపల వొంటబట్టి జీర్ణించిన తరతరాల సహనం ఎంత వేడినైనా మంచుకన్నా శీతలంగా చల్లార్చేస్తుంది. శతాబ్దాల నుంచి పీడించి పిప్పిచేస్తున్న అసఫ్జారాజవంశం వాళ్ళూ ఆ మతానికి చెందినందువల్ల అధికారం అంతా తమదే అని భావించే వాళ్ళూ చిత్తమొచ్చినట్లు దోచుకుంటున్నారన్న సంగతి ప్రజలకు తెలుసు.

లేవూ లేవూ మీరే సాబు
లేవవయ్యా మీరే సాబు
మీరే సాబు సంగడీలు
ఏడుగూరు లంబాడీలు
దొంగలు కాదు గింగలు కాదు
దోచినోడె మీరాసాబు
చారెడుచారెడు దోచీశాడు
చార్మినారు గట్టినాడు
మానేడు మానేడు దోచీనాడు
మక్కామసీదు గట్టినాడు
మక్కాను సీమ కొమ్మ మీదా
డేగా లాగా వాలుతాడు

దొంగలు గింగలూ కాకపోయినా దోచుకొనేవాళ్ళు, ఏ ఆసరా చూసుకొని అలా చేయగలుగుతున్నారు? వాళ్ళ దగ్గర మారణాయుధాలు వుంటాయి. ఒక్క గుండుతో నిండు ప్రాణాన్ని తీయగల రైఫిళ్ళు వుంటాయి. వాళ్ళ సిబ్బంది దగ్గర బర్మార్లు అనే నాటు తుపాకులుంటాయి. గ్రామీణులు కట్టుకొనే పాటల్లో ప్రతిదొర దగ్గరా ''ఏబయ్యి డెబ్బయిలు-ఎండిరైపోలు'' వుంటుంది. అది పోతుంది. ఒక ఊరి దొర రైపోలును యింకో ఊరు దొర ఎత్తుకుపోతాడు. దాన్ని మళ్ళా కాల్చించడానికి మొదటిదొర బర్రెజీతగాని వేషం వేసుకొని బర్రె సెత్తను నెత్తిన బెట్టుకొని రెండోదొర వూరికెళ్లి పాలుపిండే మిషమీద ఆగడీలోకి వెళ్లి తన ఎండు రైపోలులను వెదికి తెచ్చుకుంటాడు. అయితే యీ ప్రయత్నంలో బర్రె తన్నింది. పాలు పిండబోతే సర్వతో ఉచ్చబోసింది. దాన్ని దొర దూగెట్లో పెట్టాడు. దాంతో మర్నాడు మరోదొర బాడదాసీలు చాయ్ జేశారు. దొరచేత తాగిపించారు. ''కప్పుమీద కప్పు చాయి గుంజినాడు'' హప్పడు దొరోనికి బర్రెగత్కుల వాసనేసింది. ఏమిటిది అని అడిగాడు దూగెట్లో సర్వేలు తీసుకొని బాటి చేసుకొచ్చామన్నాడు.

ఈ పాటలో గ్రామీణులు యిద్దరు దొరలకు పరాభవం చేశారు. ఒక దొర నెత్తిన బర్రెసత్తను పెట్టారు. ఇంకో దొరచేత బర్రెగొడ్డుల చాయి తాగిపించారు. నిత్య జీవితంలో పగతీర్చుకోలేని వాళ్ళు పాటతో అవమానం చేసి నవ్వుకొన్నారు. గ్రామపాలన వర్గంలోని ప్రముఖులను ఎంతో వ్యంగ్యంగా జానపదులు హేళన చెయ్యగలరని దేవరాజు మహారాజు ఇంకోపాట ఉదాహరించి వ్యాఖ్యానం చేశాడు.

పొగచుట్టక పల్లెకుబోతె
పల్లెకుక్కలన్ని బౌబౌమనె
పండ్లిరగగా బడ్డోన్ని ల్యారి ఎత్తి
ఎత్తలేక పట్వారి నడుమిరగబడే

పట్వారిమీద కోపం, కసి, అతడు నడుము విరగబడ్డాడని చెప్పడంతో జానపదులు తీర్చుకొంటారు. పైవర్గం వారి పెత్తనపు నడుము కూడా విరుగుతుందని మరో అర్థం అంటాడు దేవరాజు మహారాజు. పై వర్గంవారి నడుము దానంత అదేకాక ప్రజల సంఘటిత పోరాటం వల్లనే విరుగుతుంది. అందరూ సంఘటితమవడానికి బలమైన కారణాలు వీలైన పరిస్థితులు అవసరం. అప్పుడే అలాటి దశనుంచి పోరాటదశలోకి వస్తుంది.

పోరాటం ఏదో ఒక్క ఊళ్ళోనే మొదలవుతుందని చెప్పలేం. మొత్తం అన్ని జిల్లాలలోనూ ఒకే విధమైన దోపిడీ సాగుతున్నప్పుడు అంతటా అసంతృప్తి, ఆవేదనా, పోరాడాలనే తహతహ ఉండకతప్పదు. తెలంగాణాలోని వివిధ జిల్లాలలోని దోపిడీ దొరల ఆస్తి వివరాలు చూస్తే వాళ్ళపై కోపం కూడా అంత విస్తీర్ణమైనదని తెలుస్తుంది.

నల్గొండజిల్లా సూర్యాపేట తాలూకాలోని జన్నారెడ్డి ప్రతాపరెడ్డికి ఒక లక్షా ఏభైవేల ఎకరాల భూమి ఉండేది. 750 ఎకరాల భూమిలో అతనికి మామిడితోటే ఉంది.

ఖమ్మంజిల్లా మధిర తాలూకాలో కల్లోరు దేశ్‌ముఖ్ భూమి విస్తీర్ణం లక్ష ఎకరాలు.

నల్లగొండ జిల్లా జనగామ నేలతల్లి కొందరి కబంధ హస్తాలలో చిక్కుకుంది. జనసామాన్యం నలిగిపోతున్నారు. ఈ తరుణంలోనే తెలంగాణాలో ఉద్యమాలు మొలకెత్తుతున్నాయి. గ్రంథాలయోద్యమమం నుండి ఆంధ్ర మహాసభ మొలకెత్తింది. దానిలోనే కమ్యూనిస్టు పార్టీ అంతర్లీనంగా ఆవిర్భవించింది. అల్లుకుపోయింది. ప్రజల కష్టాలను తెలుసుకొంది. సమర సంకేతాలను ప్రజల పోరాట ప్రతీకలనుగా గుర్తించింది. ప్రత్యర్థుల మనుష్యులను దారి కాచి చంపించడం ప్రభువులకు అలవాటే. అన్నదమ్ముల ఆస్తి తగాదాలలో అన్నపక్షాన బందగీ అనే ముస్లిం యువకుడు చేరాడు. అతణ్ణి దారికాచి దారుణంగా శత్రువులు చంపించారు. ఈ పచ్చి ఘాతుకానికి ప్రజలు శోకించారు, స్పందించారు. బందగీ ఒక పోరాట చిహ్నమయ్యాడు.

బందగీ రక్తంబు చింది జ్వాలై లేచి
జాగీరుదారులను ఊగించి వేసింది

బందగీ తర్వాత ఎందరెందరో జిందగీలను అర్పించారు. వీర కరుణ రసాలలోవారి గాథలు కట్టుకొని జనం అమరవీరులను నిత్యం తలుస్తూ ఉంటారు. భూమికోసం పోరాడి విజయాలు సాధించిన వాళ్ళ జీవితాలు ఆదర్శాలవుతాయి. విసునూరు దేశ్‌ముఖ్ పాలకుర్తి గ్రామంలో చిట్యాల అయిలమ్మ అనే చాకలి స్త్రీకి చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని చూశాడు. ఇది ఆమె సంగపోళ్ళకు చెప్పింది. ఆంధ్ర మహాసభ చాటున పనిచేసే కమ్యూనిస్టులను సంగపోళ్ళు అంటారు. వాళ్ళు ఆమెకు బాసటయ్యారు. దొర

కోసుకుపోదామని చూస్తున్న పంటను అయిలమ్మ సంగపోళ్ళ సాయంతో కోసుకొచ్చింది. దొరోడు ఏం బీకుతాడో జాస్త అనగల్గింది. ఆ రాత్రి విసునూరునుండి పోలీసులు దిగారు గాని అయిలమ్మ యింట్లో వున్న ఆ ధాన్యాన్ని ముట్టుకొనడానికి సాహసించలేదు. సంగపోళ్ళను, అయిలమ్మ భర్తను పట్టుకుపోయారు. ఆ తర్వాత ఏం జరిగిందో శ్రీమతి మల్లు స్వరాజ్యం ఇలా చెప్పారు.

'పట్టుకొని... జనగాం జైళ్ళ పెట్టి ఆసనాల్లో కారం బోసికొట్టి, మూత్రం తాపి, బాగా కొట్టి బాధలు పెట్టిన్లు. వెంటనే ఆమె సద్దికట్టుకొని హైద్రాబాద్‌కి వచ్చి రావినారాయణరెడ్డిని కల్సుకొని, పెద్దవాళ్ళందరికీ తెలియజేసి, పేపర్లలో పడేసి, రెప్రజెంటేషన్ యిచ్చి, మనోల్లంతా స్టేషన్ దగ్గర జేరి హరాస్‌మెంటు గురించి విచారించి జమాన్‌కు గట్టించి విడుదల జేసేందుకు ఇవన్నీ జేసిందన్నమాట. ఆరోజుల్లో స్త్రీలు అంత ఇదిగా వున్నారంటే మాటలా? మనవాళ్ళందరితో జెప్పి, ఈ పనులన్నీ జేయించింది. అట్లే భూమి దక్కేసరికి నిలబడ్డది. తర్వాత వచ్చే మంచి చెడ్డలకు కూడా నిలబడి భూమి దక్కించుకున్నది.

(మనకు తెలియని మన చరిత్ర – పుట : 246)

అయిలమ్మ అచంచల విశ్వాసం అందరికీ ఆదర్శప్రాయమైంది. ఆమె వీరోచిత పోరాటాన్ని కథలుగా చెప్పుకొంటూ ప్రజలు ముందుకు సాగారు. దేశ్‌ముఖ్ రెచ్చిపోయాడు. తన జీవితంలో ఎన్నడూ ఎరుగనంతటి ఘోరమైన ఓటమికి ప్రతీకారం చేయాలనుకొన్నాడు, కడివెండి గ్రామంలో వున్న సంఘం నాయకుల్ని హత్య చేయించాలని గూండాలను పంపాడు. ప్రజలచేత వాళ్లు మానేసిన వెట్టి బలవంతంగా చేయించాలని చూశాడు. భయంకర వాతావరణాన్ని సృష్టించాడు. అయినా ప్రజలు భయపడలేదు. నినాదాలు ఇచ్చుకుంటూ ఊరేగింపు మొదలెట్టారు. గూండాలు దాన్ని ఆగమన్నారు. ప్రజలు ఆపమన్నారు. గూండాలు తుపాకీ పేల్చారు. ముందు వరసన నడుస్తున్న దొడ్డి కొమరయ్య నినాదాలు ఇస్తూనే వాలిపోయాడు. భూమికోసం భుకికోసం లేమినుండి విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో నేలకొరిగిన తొలివీరుడు కొమరయ్య. అతని మరణం ప్రజలను మరింత దీక్షాపరులను చేసింది.

ఒక వీరుడు మరణిస్తే
వేలకొలది ప్రభవింతురు
ఒక నెత్తురుబొట్టులోంచి
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు

– అన్న కవి వాక్యం అక్షరాల నిజమైంది. 1949 జూలై 4వ తేదీనాడు మొదలైన ఈ పోరాటం నుండి వేలాది కొలదీ వీరులు ప్రభవించారు. ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి.

అమరజీవి నీవు కొమరయ్యా
అందుకో జోహార్లు కొమరయ్యా
న్యాయమన్నదిలేని నైజాము రాజ్యాన

విశ్వరాక్షసుడైన విసునూరు దేశ్‌ముఖు
పాలించుచున్న యా పల్లె కడివెండిలో
ప్రజల హక్కుల కొరకు కొమరయ్యా
ప్రాణాలనిచ్చావు కొమరయ్యా ||అమర||

లంచుగొండుల అండ దేశ్‌ముఖులకు నుండ
న్యాయరక్షణ కొరకు నడుము బిగియించితి
గూండాల తుపాకి గుండ్ల కెదురుగా పోరి
బలియైన వీరుల్లో కొమరయ్యా
మొదటి తెలుగోడినోయ్ కొమరయ్యా ||అమర||

చేసిన శపథం చెల్లించుకోడానికి ఎందరెందరో అహోరాత్రులు పోరాటాలు సల్పారు. వెట్టిబెడద తీరింది కనుక భూమి మీదికి తిరిగింది పోరాటం. ఉద్యమంలోకి వచ్చిన చైతన్యవంతులైన స్త్రీలు ఉయ్యాల పాటలేసుకుంటూ ఊర్లు తిరిగారు. అంతకుముందు రాముడిపాటో దేవుడిపాటో పాడేవాళ్లు ఇప్పుడు రాజకీయాల పాటలు పాడసాగారు. ఈ భూస్వాములు ఎట్ల దౌర్జన్యం చేస్తున్నారో, దానివల్ల స్త్రీలూ, పురుషులూ ఎలా బాధపడుతున్నారో, భూములెట్లా పోయాయి. తిండెట్లా లేకున్నది. దీనికంతా కారణమేమిటి? అసలు ఎవరు పుట్టిపెట్టారు. భూమి ఎవరిది? అనే విషయాలు ఈ పాటల్లో పాడేవారు. జనం ఉత్సాహపూరితులయ్యారు. సంఘంలో చేరారు. ఎర్రజెండా పట్టారు.

కట్టు కట్టూ కాడెడ్లబండీ ఓ లచ్చమయ్యా
బండీగట్టూ బండెడ్లా గట్టు
బండిమీదా ఎర్రజెండా పెట్టూ''

ఇప్పటికి బండ్లు కట్టుకొని ఎర్రజెండాలు పెట్టుకొని తెలంగాణాలో అమరవీరుల నగరాలకు జనం వెళుతున్నారు. ఆనాడే తమ దీక్షను దేశముఖులకు ధైర్యంగా చెప్పగలిగారు.

చిన్న పెద్ద జీతగాళ్ళు
డైబరింజన్ నడిపెటోళ్ళు
జేకొట్టి జండా కట్టేరో
ఇస్నూరి రామచంద్రారెడ్డి
సంఘపోళ్ళు సైకొట్టిర్రో
కూటికి గుడ్డకు కరువై నోళ్ళు
చెమటతీసి బతికెటోళ్ళు
తుపానికిబట్టి నిల్చిర్రో
ఇస్నూరి రామచంద్రారెడ్డి
ఎర్రజెండాలెగరేసిర్రో

ఒక విశ్వరాక్షసుడైన ఈ విసునూరి రెడ్డినేకాదు, ఎర్రబాడు దొర జెన్నారెడ్డి ప్రతాపరెడ్డిని కూడా ఎదిరించారు. పల్లెల్లో నిలువ నీడ, తినడానికి తిండి లేకుండా చేసి పలాయనం చిత్తగించేటట్టు చేశారు పూర్వం ప్రజలు.

బస్సెనక బస్సొచ్చె
బారాకొట్టి బస్సొచ్చి
నీ బసులో పోదామె
ఓ పోరి నాదుబాయి

అని పాడుకునేవారు. ఇప్పుడు ప్రభువులే బండెనక బండికట్టుకొని పారిపోవాలి. ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బండెనుక బండి కట్టి
పదహారు బండ్లకట్టి
ఏ బండ్లో పోతవు కొడుకో
నా కొడకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

దొడ్లన్నీ కాలిపోయె
ఎడ్లన్నీ ఎల్లిపోయె
ఇకనైన లజ్జలేద కొడకో
నా కొడకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

గొల్లోల్ల గొర్లువొడిసె
రైతోళ్ళ బియ్యం వొడిసె
ఒక ఏమితింటవు కొడకో
నా కొడకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

పెదిపంది సూరిగాడూ
సినపంది మల్లిగాడు
మీ యిద్దర్నీ తింటాం కొడకో
నా కొడకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

గొడ్డళ్ళు నూరుకోని
గొంగట్లో పెట్టుకోని
కత్తులు నూరుకోని
కడుపుల్ల దోపుకోని
ఏ బండ్లె పోతవు కొడకో
నా కొడకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

డొల్లినార రక్తమంతా
డొల్లల్లో పోసుకొని
చిల్లీన రక్తమంతా
సీసాల్లో పోసుకొని
ఏ బండ్లె పోతావు కొడుకో
నా కొడుకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥

ప్రాణాలను చేతబట్టుకొని బ్రతుకుజీవుడా అని దొరలంతా, నగరాలకూ పెద్ద పట్నాలకు పారిపోయాక జనం వాళ్ళ గడీలను నేలమట్టం చేశారు. భూముల్ని పంచారు. అప్పులన్నీ మాఫీ చేశారు. భూస్వాముల గుప్పెట్లోంచి నేలతల్లిని విముక్తి చేశారు. భూములతోపాటే భూస్వాములకు చెందిన మిగులు పశువులను ప్రజలకు పంచి ఇచ్చారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చింది. నైజాం యూనియన్‌లో చేరనన్నాడు. స్వతంత్ర రాజ్యంగా ఉండదలిచాడు. మళ్ళా ఆ నాజీ పాలనలోనికి వెళ్ళడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఆ పీడను కూడా వదిలించుకోదలిచారు.

నైజాం సరకరోడ:
రాచ్చసుల మించినోడ
యమబాధలు పెట్టివి కొడుకో

నైజాము సరకరోడ:
పండిన పంటనంత తిండికైన ఉంచకుండ
తీసికెళ్ళినావు కొడుకో నైజాము సరకరోడ:

దున్నను భూమిలేక వండను ఇల్లులేక
పరదేశమెల్తిమి కొడకకో నైజాము సరకరోడ:

పోలీసు మిల్ట్రిజూసి మేము లొంగివస్తమాని
బల్ ఆశపడితివి కొడకో నైజాము సరకరోడ:

పోలీసు మిల్ట్రిగాని లాఠీ దెబ్బలుగాని
తూపాకి బాంబులుగాని నీవెన్ని తెచ్చినగాని
మేం లొంగిరాముకొడకో నైజాము సరకరోడ:

కంచారి గాడ్డులాను లంచగొండి పోలీసోల్ల
నీవు పెంచినావు కొడకకో నైజాము సరకరోడ:

చుట్టుపట్టు సూర్యపేట నట్టనడుమ నల్లగొండ
అవాల హైద్రాబాదు తర్వాత గోలకొండ
గోల్కొండ ఖిల్ల కింద
నీ గోరికడతం కొడకో నైజాము సరకరోడ:

ప్రజలు అన్నంత పనీ చేసేవారే. అయితే కాంగ్రెసు ప్రభుత్వం అడ్డొచ్చింది. యూనియన్ సైన్యాలు నైజాం సర్కారులో ప్రవేశించాయి. పల్లెపట్లు చుట్టుముట్టాయి. కమ్యూనిస్టులను వేటాడసాగాయి. యూనియన్ సైన్యాల అండదండలతో భూస్వాము లంతా మళ్ళీ వాళ్ళ స్వగ్రామాలకు వచ్చారు. ప్రాణాలకు తెగించి పోరాడి దక్కించుకున్న భూములను ప్రజలు వదలుకోలేదు. గెరిల్లా పోరు ప్రారంభమైంది. భువనగిరికి చెందిన రేగుంట రామిరెడ్డి, సూర్యాపేట పాతర్లపాడు గ్రామానికి చెందిన గోపాలరెడ్డి మొదలైన వీరులు ధైర్యసాహసాలతో పోరాడారు. వాళ్ళ వీరకృత్యాలను జనం పాటలుగా పాడుకొన్నారు.

భారతీ భారతీ ఉయ్యాలో
మా తల్లి భారతీ ఉయ్యాలో
మముగన్న తల్లికి ఉయ్యాలో
మంగలా ఆరతీ ఉయ్యాల్లో
రేనికుంటాలోని ఉయ్యాలో
దొర రామిరెడ్డి ఉయ్యాలో
కమినిస్టు లోపల ఉయ్యాలో
పెద్ద కామందువా ఉయ్యాలో
ఆయనకు పోటీని ఉయ్యాలో
ఎవ్వరే కలిగిరి ఉయ్యాలో
మోదినీపురాన ఉయ్యాలో
మోదీని ఆమీను ఉయ్యాలో

వీరిద్దరికీ శత్రువులతో జరిగిన పోరాటాన్ని ఈ పాట వివరిస్తుంది. రేణిగుంట రామిరెడ్డికి కూడా యాభై దెబ్బల మిడి రైపోలు వుంది. దానితో అతడు వీరవిహారం చేశాడు. ఈ యుద్ధంలో ఇద్దరూ చనిపోయారు.

పాడినా వొలికే ఉయ్యాలో
పాప దోసంబాసు ఉయ్యాలో
దాపునున్నోరికే ఉయ్యాలో
దరమంబుగలుగను ఉయ్యాలో
ఇన్న వోరికీని ఉయ్యాలో
పున్నెలోకం గలుగు ఉయ్యాలో

జానపదుల వాళ్ళ సహజ శైలిలో ఈ కథను కథనం చేవారు. గొట్టిముక్కల గోపాలరెడ్డి మీద పాటను వీరరసభరితంగా పాడుకొన్నారు.

సైసై గోపాలరెడ్డి; రెడ్డి నీవు
నిలిచావు ప్రాణాలొడ్డి

ధీరుడు, స్వతంత్ర సమర కిశోరుడు, ఫాసిస్టులయెడ క్రూరుడు అయిన ఈ ఎర్రవీరుణ్ణి

చుట్టిసేన గురిపెట్టి నిన్ననే
పొట్టను చీల్చగ ప్రేగులు వెళ్ళగ
నెట్టిపేగులను పొట్టలోకి సై
బట్టతోను నడికట్టుకట్టి తొడ
గొట్టి చెంతగల తోటలన్నిటి
పట్టుదలగ తుదికంటు పేల్చి
తుట్టతుదకు నీ రైఫిల్ నేలకు
గొట్టిముక్కలుగ చేసినవీరా ॥సైసై॥

సాధించిన ప్రతి విజయంమీద, ఒరిగిన ప్రతి వీరుని మీద ఆనాడు ప్రజలు పాటలు రాసుకొన్నారు.

చదువుసంధ్యలు లేకపోవచ్చునుగాని బతుకుతెరువులో గుండె బరువు తగ్గించుకొనడానికి తమ బాధలు, వీరగాథలు పదం కట్టుకొని పాడుకోవాలన్న ఇంగితం ప్రతికాలంలోని పేదవారికి ఉంటుంది. సామాన్యులు ఇలాగ సామాజిక సాహిత్యాన్ని సృష్టించుకొంటూ ఉంటే విద్యావంతులైన కవులు ప్రజలపక్షాన నిలబడి వాళ్ళ కష్టాలను, కన్నీళ్ళను తొలగించే సానునయసాహితిని నిర్మించసాగారు.

వానమామలై వరదాచార్యులుగారు 'నిజాం రాష్ట్రపు బీదవెట్టివాడు' అనే శీర్షికతో కొన్ని పద్యాలు రాశారు. పొట్టకేమీలేక తిట్టులేతింటూ, తన నెత్తురుబొట్టులు తానే తాగుతూ దైవాన్ని కూడా దూరక దాస్యవిధిని బతికే నైజాం బీదవెట్టివానిలో వీరత్వాన్ని ప్రశంసించాడు.

మానవాసురులనఁదగు మానిసులను
ఈ సొకించుక లేక విశ్వాసము గొని
తంగ్రి యంచు నైచ్యాను సంధానముగని
పరసమృద్ధికి సంతోషపడుచునుండు
వీరుడా! నైజాం బీదవెట్టివాఁడ!

బత్తెమును జీతమును లేని బంటువగుచు
బ్రదికి యున్నంతకాలము బానిసవయి
ఆలుబిడ్డలకు బందుగు వోలె నుండి
నీ గృహస్థతా ధర్మము నెఱపునట్టి
వీరుఁడా నైజాం బీదవెట్టివాఁడ
నేల సెజ్జగా తలదిండు కేలుగాఁగ
కప్పుపైగుడ్డ చర్మముగ నిదురించి
నీ వినాదైన్య జీవన నిష్ఠ బ్రదుకు
వీరుఁడా! నైజాం బీదవెట్టివాఁడ!

దాశరథి ప్రజల కష్టాలకు స్పందించాడు. నైజాము ధౌష్ట్యాలకు ఎదురు తిరిగాడు. తన జన్మస్థానమైన 'తెలంగాణా కోటి రత్నాల వీణ' అని భావించాడు. ఆ వీణను నిజాం ఏం చేశాడో ఇలా చెప్పాడు.

ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మా కెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణా కోటి రత్నాల వీణ

ఆ వీణనే తాను 'రుద్రవీణ'ను చేసుకొని 'అగ్నిధార'ను కురిపించాడు. నిజాము నిజస్వరూపాన్ని బయటపెట్టాడు.

అడుగడుగున యెడదనెత్రు
గడగడమని త్రాగినావు
పడతుల మానాలు ద్రోచి
గడగడమని హుక్క త్రాగి
జడియక కూర్చుండినావు
మడికట్టుక నిలిచినావు
దగాకోరు, బటాచోరు
రజాకారు పోషకుడవు

ఇలా అగ్నిధార కురిపించిన దాశరథి తెలంగాణా పోరాటంలో స్వయంగా పాల్గొని, చిత్రహింసలపాలై రజాకార్లను తప్పించుకొని కొన్నాళ్ళు అజ్ఞాతవాసం చేస్తూనే వీరకవితలు ఆలపించాడు.

రజాకారులు చేసే ఘాతుకాలకు ప్రతీకారం చేయాలి. ప్రజలను అందుకు సంసిద్ధులను చేయాలి. కాళోజీ నారాయణరావు సరైన సమయం రాగానే ఏం చేయాలనే ఇలాగ ఉద్బోధించాడు.

మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబు రాగానె కాటేసి తీరాలె.
'సత్యమ్మహింస' యని సంకోచపడరాదు
'దయయు ధర్మం' బనుచు తడుముకోపనిలేదు
'శాంతి'యని చాటినను శాంతింపగారాదు
'క్షమ'యంచు వేడినను క్షమియింపగా రాదు
'చాణుక్యనీతి' నాచరణలో పెట్టాలె
కాలంబురాగానె కాటేసి తీరాలె.
తిట్టిన నాల్కలను చేపట్టి కొయ్యాలె
కొంగులాగిన వ్రేళ్ళ కొలిమిలో పెట్టాలె
కన్నుగీటిన కళ్ల కారాలు చల్లాలె
తన్నిన కాళ్లను 'డాకలి'గ వాడాలె
కండకండగకోసి కాకులకు వెయ్యాలె
కాలంబురాగానె కాటేసి తీరాలె

భారతదేశానికి స్వరాజ్యం వచ్చింది. కాని, తెలంగాణలో నిర్బంధం హెచ్చింది. యూనియన్‌లో చేరకుండా స్వతంత్రాన్ని ప్రకటించుకొందామని నిజాం ప్రయత్నాలు చేస్తున్నప్పుడు దాశరథి ఇలా అన్నాడు.

తరతరాల స్వప్నాల సుందరఫలమ్ము
స్వైర భారతభూమి చూపడెనొలేదొ
విషముగుప్పించినాడు, నొప్పించినాడు
మా నిజాంరాజు జన్మజన్మల బూజు

తెలంగాణాలో ప్రజలూ, స్థానికకవులూ ఈ వీరోచితసమరాన్ని కొనసాగిస్తున్నప్పుడు అభ్యుదయ రచయితల ఉద్యమం చాలా ఉధృతంగానే సాగుతుంది. ఏటేటా మహాసభలు జరుపుతూ 'అభ్యుదయ రచయితల సంఘం' తరఫున 'అభ్యుదయ' అనే ఒక పత్రికను నడుపుతూ 1947 నాటికి అయిదు సంచికలను ప్రచురించారు. అయితే ఆ సంచికలలో ఆ ఆరుమాసాల కాలంలో ఆంధ్ర ప్రజానీకాన్ని కుదిపి వేసిన తెలంగాణా పోరాటాన్ని చిత్రించే రచనలేమి, గీతాలేమి ఏమీ ప్రచురించలేదు. అలాంటి గేయాలు 'ప్రజాశక్తి'లోను, ఇతర ప్రగతివాద పత్రికలలోను వచ్చాయి. పీడిత ప్రజల పక్షాన నిలబడే కవులు లేకపోలేదు. వారు గొంతెత్తి తెలంగాణా రణగీతాలు ఆలపించారు. తెలంగాణాలోని తమ్ములకు బాసటగా తమ కవితలు అంకితం చేశారు. సోమసుందర్, 'వజ్రాయుధం' ఎత్తాడు. 'బానిసల దండయాత్ర'ను కవిత కెక్కించాడు. నిజాము పిశాచికి ఆఖరి వార్నింగు ఇలా ఇచ్చాడు.

ఖబడ్దార్! ఖబడ్దార్!
నైజాం పాదుషా హే,

భానిసత్వ విముక్తికి,
రాక్షసత్వ నాశమునకై,
హిందూ ముస్లిం పీడిత
శ్రమజీవులు ఏకమైరి.

తమపై స్వారీ చేసే
దేశముఖుల ప్రతిఘటించి
ప్రజాకోటి పోరుతోంది.
ఖబడ్దార్! ఖబడ్దార్!!

సూర్యపేట బాలేముల
వీరుల కాలే హృదయపు
ఆశలు కాంతించుతాయ్

అమరుడు మా కొమరయ్యా
అనంతయ్యా అనంతుడే -
అజేయులై, ప్రకీర్తులై
చిరస్థాయి నిలుస్తారు,
చరిత్రలో చరిత్రలో
చిరస్థాయి వసిస్తారు.

ఒక వీరుడు మరణిస్తే
వేలకొలది ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనె
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!
ఖబడ్దార్! ఖబడ్దార్!!

నైజాం కీచకుడా!
నీ పీచమణచ ప్రజలంతా
ఒక పిడికిట, ఒక గొంతుక,
ఒక మ్రోతై ధ్వనిస్తారు,
మృతవీరుల స్మరిస్తారు,
నవయోధుల సృజిస్తారు,
ఖబడ్దార్! ఖబడ్దార్!!

బానిస జన శల్యములను
ఏర్చికూర్చి నిర్మించిన
నీరాక్షససింహాసన
మదిగదిగో కదలుతోంది

మెషిన్‌గన్లు, మరఫిరంగి,
తుపాకులూ, విషవాయువు
ప్రజాశక్తి నాపలేవు,
ఖబడ్దార్! ఖబడ్దార్!!

నిరవధికం నిరంకుశం
సహింపనీ భరింపనీ
ధీర ప్రజాకోటి కొరకు
త్రవ్వించే గోరీల్లో
నీ అమానుషత్వాన్నే
నీ నిరంకుశత్వాన్నే

పాతేస్తాం! పాతేస్తాం!
పాతేస్తాం! ఖబడ్దార్!
విశాలాంధ్ర ప్రజాస్వామ్య
మమరుస్తాం ఖబడ్దార్!

అనిసెట్టి, రెంటాల, రమణారెడ్డి, అవసరాల మొదలైన ప్రగతి కవులు కూడా తెలంగాణా విముక్తి ఉద్యమం కోసం గేయాలు రాశారు.

నేను రచించిన ఒక కావ్యం గురించి తుమ్మల వెంకట రామయ్యగారు ఇలా రాశారు.[1]

''తెలంగాణా ఇతివృత్తాన్నే ఆరుద్ర 'త్వమేవాఽహమ్'గా రూపొందించాడు. 1948లో రజాకార్లచే చెరచబడ్డ స్త్రీ కథనం కృష్ణాపత్రికలో చదివి ఈ కావ్యాన్ని మొదలుపెట్టాడు ఆరుద్ర. ఐతే ఈ కావ్యం చెప్పిన తీరు 'కొరకరాని కొయ్య' అయినందున ఆశించినంత ప్రయోజనం చేకూరలేదు. తర్వాత దాశరథి ఆరుద్రల ఉత్తర ప్రత్యుత్తరాలు 'కవిహృదయం', 'వ్యాఖ్య'గా అనుబంధంగా చేర్చబడినాయి. ఇవి పఠితకు కొంత సాయం చేశాయి''.

కావ్యకవులు ఈ విధంగా రచనలు చేస్తున్నప్పుడు తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొన్నవారు ఆ పోరాటం స్ఫూర్తితో కవులై రచనలు చేశారు. సుద్దాల హనుమంతు, యాదగిరి, తిరునగరి రామాంజనేయులు మొదలైనవారు ఈ పోరాటంలో ఉన్నారు. జానపదరీతులలో పాటలు, బుర్రకథలు, వొగ్గుకథలు రచించారు. వాటిని పాడి ప్రజలను ప్రభావితులను చేశారు.

ఒక్క కవితల ద్వారానేకాక నాటకాలద్వారా కూడా సమర సాహిత్యాన్ని ప్రజలకు అందచేసినవారు ఉన్నారు. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగార్లు జంటగా రచించిన 'మా భూమి' నాటకం ప్రజలలో అపూర్వ చైతన్యం కలిగించింది. దీనిని మెచ్చుకొన్న మర్నాడే అలా మెచ్చుకొన్న మంత్రులు ప్రమాదాన్ని పసికట్టారు. నాటకాన్ని ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వం నిషేధించింది. పొల్లుపల్లి రామారావుగారు తెలంగాణా జీవితాన్ని తమ కథల్లోనూ, నాటకాల్లోనూ చాలా సహజంగా చిత్రించారు. వట్టికోట ఆళ్వారు స్వామిగారు 'ప్రజలమనిషి', 'గంగు' అనే నవలలు ఉత్తరోత్తరా ప్రచురించారు. ఇదేకాలంలో భాస్కరభట్ల కృష్ణారావుగారి 'యుగసంధి' నవల లక్ష్మీకాంతమోహన్‌గారి 'సింహగర్జన' వెలువడ్డవి. బొల్లిముంత శివరామకృష్ణగారు రచించిన 'మృత్యుంజయుడు' తెలంగాణా పోరాటం గురించి రాసిన మొట్టమొదటి నవల అని చెప్పవచ్చు.

నవలలేకాక తెలంగాణా సమరసాహిత్యంలో చిన్నకథలు కూడా చాలా వెలువడ్డాయి. కాంచనపల్లి చిన వెంకట రామారావు, ఆవుల పిచ్చయ్య, శారద, తెన్నేటి సూరి, తుమ్మల వెంకటరామయ్య మొదలైనవారు చిన్నకథలు రాశారు. చాలావరకు ఈ చిన్నకథలన్నీ ఆంధ్రప్రాంత రచయితల కలాలనుండే వచ్చాయి. తెలంగాణా ప్రాంతం నుండి వందలకొద్దీ పాటలు వెలువడ్డాయి.

పోలీస్ యాక్షన్ తర్వాత తెలంగాణా విముక్తి జరిగిందని కొందరు భావిస్తారుగాని ప్రజాపీడకులైన పట్వారీ దేశముఖులకే యూనియన్ సైన్యాల సాయంతో విముక్తి కలిగింది. మళ్ళా ప్రాబల్యం సంపాదించుకొన్నారు. నిజాము, 'రాజముఖ్' అయ్యాడు. ప్రజలు పోరాటం సాగిస్తూనే ఉన్నారు. కవి కంఠమెత్తి ఇలా ఘోషించాడు.

''ప్రాణము లొడ్డి ఘోరగహ నాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములన్ సృజించ నెముకల్ నుసిజేసి పొలాలు దున్ని, బో

1. తుమ్మల సాహిత్యం - పుట.59

షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే?''

అయితే ''స్వేచ్ఛా భారత సైన్యం తలుపు బద్దలు కొట్టి'' తెలంగాణాలో ప్రవేశించి 'విముక్తి'ని సాధించగానే పైన అలా ఘోషించిన దాశరథి వంటి కవులు కొందరు ఇలా పాడారు.

ఎదురెక్కి యున్న జలములు
నదులై చొరబారె ఇంటినడుమన్, రాముం
డదనున బాణము వదలెను
మదమడగెను మా నిజాము మారీచునకున్

రెండు వందల యేండ్ల చరిత్ర గదుల
కప్పుకొనియున్న గాడాంధకారమెల్ల
కొట్టుకొని పోయె తూరుపు మిట్టనుండి
పారి వచ్చిన వెలుతురు వాగులోన

కుందుర్తి, గంగినేని పోలీస్ యాక్షన్ తర్వాత తెలంగాణపై విపుల కావ్యాలు రచించారు. తెలంగాణాలో జీవించే ప్రజలకు వాస్తవమేమిటో తెలుసు. అందుకే భూమికోసం, భుక్తికోసం సాయుధ పోరాటాన్ని కొనసాగించారు. అయితే కొన్ని కొన్ని ప్రత్యేక చారిత్రక కారణాల వల్ల ఈ మహత్తర సమరాన్ని నిలుపవలసి వచ్చింది. నాయకులు చాలా ఓపికతో నచ్చచెప్పేదాకా ఆయుధాలు కిందపెట్టడానికి ప్రజలు సిద్ధపడలేదు. వీలైనంత తక్కువనష్టాలతో ఒక క్రమపద్ధతిలో వెనక్కి తగ్గవలసి వస్తే తగ్గాలి. సాయుధ పోరాటాలకే కాదు. మామూలు సమ్మెలాంటి పోరాటాలకు కూడా ఈ సూత్రమే వర్తిస్తుందని నాయకులకు తెలుసు.[2]

చివరకు సాయుధ పోరాటాన్ని విరమించవలసి వచ్చింది. తెలంగాణాకు కూడా మిగతా దేశంతోపాటు స్వాతంత్ర్యం వచ్చిందనుకొని అభాగ్యులు మహద్భాగ్యం వచ్చిందనుకొని ఏటేటా పండుగలు చేసుకొంటున్నారు. దీనిమీదా పాటలు కట్టుకొన్నారు. పాడుకున్నారు.

పంద్రా ఆగస్టనీ ఉయ్యాలో
పండుగొచ్చిందమ్మ ఉయ్యాలో
స్వతంత్ర దినమని ఉయ్యాలో
సంతోషముగ తాను ఉయ్యాలో
అన్నాలు కూరలు ఉయ్యాలో
ఆనందముగ వండి ఉయ్యాలో
తర్వాత ఇంటిని ఉయ్యాలో

---

2. సుందరయ్య - విప్లవపథంలో నా పయనం (2వ భాగం) పుట.77

పరిశుభ్రముచేసి ఉయ్యాలో
మల్లె మొగ్గవలె ఉయ్యాలో
ముగ్గులెన్నో పరిచి ఉయ్యాలో

ఆండాళమ్మ అనే అత్తింటి కోడలు ఉత్తమురాలు, పేడకోసం వెళ్ళింది. ఒక గుండావచ్చి దర్గాలో పేడ వుంటుందని చెప్పి ఆ అమాయకురాల్ని నమ్మించి తీసుకువెళతాడు. ఎడమజేబులోనున్న ఎర్ర దస్తీదీసి కళ్ళకు బిగించాడు. ఆరుగురు రాక్షసులు వచ్చి మూకుమ్మడి మానభంగం చేశారు. ఆమె మరణించింది. ఆమె శవాన్ని ఆస్పత్రికి చేర్చారు. శవపరీక్షలో

మరణమొందిన కన్య ఉయ్యాలో
మర్మస్థానము జూడ ఉయ్యాలో
వారు బెట్టినబాధ ఉయ్యాలో
వర్ణించరాదమ్మ ఉయ్యాలో

ఆ తర్వాత

ఊరూర జనమంత ఉయ్యాలో
ఊరేగింపుచేసి ఉయ్యాలో
కతలకు కతలంచు ఉయ్యాలో
కఠినంబు దలచిరీ ఉయ్యాలో
నల్గొండ జిల్లాలో ఉయ్యాలో
న్యాయాధిపతి వద్ద ఉయ్యాలో
కేసు విచారణ ఉయ్యాలో
వాసిగా జరిగెను ఉయ్యాలో

కింద కోర్టులో ఉరిశిక్ష పడినా హైకోర్టులో 'ముద్దాయిలు' విడుదల పొందారు.

అందులో న్యాయాలు ఉయ్యాలో
అంతమై పోయాయి ఉయ్యాలో
మంచి దొరలకయిన ఉయ్యాలో
మాట ఒక్కటిలేదు ఉయ్యాలో
ప్రభు శాసనము అట్లు ఉయ్యాలో
పక్షపాతమున్న ఉయ్యాలో
ప్రజలలో బీదలకు ఉయ్యాలో
బతుకుదెరువూలేదు ఉయ్యాలో
మానాలు ప్రాణాలు ఉయ్యాలో
మంట కలిసిపోగ ఉయ్యాలో
శాంతిలో కోర్టున ఉయ్యాలో
స్వారాజ్యమా యిది ఉయ్యాలో

శక్తిలేనివారు ఉయ్యాలో
చావవలసిందే ఉయ్యాలో
విన్నవారల గుండె ఉయ్యాలో
వెలవెలబోవంగ ఉయ్యాలో
కన్నవారలకెట్లు ఉయ్యాలో
కలికలిగాకుండు ఉయ్యాలో

ఈ పాటలోని* నక్క ఆండాళమ్మ భువనగిరి గ్రామంలో 1951 ఆగస్టు 15వ తేదీన మానం, ప్రాణం పోగొట్టుకొంది. 1951లోనే సాయుధ పోరాట విరమణ జరిగింది. శక్తిలేనివారు చావవలసిందేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జవాబు చెప్పవలసిన బాధ్యత ఇన్నేళ్ళు గడిచినా యింకా గుర్తిస్తున్న వాళ్ళెవరు? వాళ్ళే ప్రజలకోసం నిలుస్తారు. గెలుస్తారు.

కొందరు విభిన్నులు

కొన్ని ప్రదేశాలలో పబ్లిక్ రహదారులుంటే కొన్నిచోట్ల ప్రైవేటురోడ్లు ఉంటాయి. వీటిమీద నరసంచారం తక్కువేకాకుండా ఒకప్పుడు అందరికీ ప్రవేశార్హత ఉండదు. ఈ ప్రైవేటు రోడ్లవంటి కవిత్వ ధోరణులు కొన్ని మన ఆధునిక సాహిత్యంలో ఉన్నాయి. వీటిని ప్రవేశపెట్టినవారు విలక్షణ వ్యక్తులు. విభిన్న సాహితీమూర్తులు. వీరి రచనలు చదివేవారు ఎంత తక్కువసంఖ్యలో ఉన్నా ఆ రచనా విధానాన్ని విశ్లేషించినవారు, విమర్శించిన వారు లేకపోలేదు. ఈ విభిన్నులు మన సాహిత్యానికి చేకూర్చిన చేవ, చేసిన సేవలు చెప్పుకోవలసిన అవసరం ఉంది. వారు చరిత్రలో తమకు సముచిత స్థానం ఏర్పరచుకొన్నారు.

పిఠాపురం యువరాజా (1910–1979)

ఈయన పూర్తిపేరు రావువెంకట మహీపతి గంగాధర రామారావు. అయితే సాహిత్యలోకంలో ఈయన పిఠాపురం యువరాజాగానే ప్రసిద్ధులు. వీరి తండ్రిగారు ఆంధ్రసాహిత్య పరిషత్తు ప్రధాన పోషకులు. గ్రాంథికాంధ్రానికి పట్టుకొమ్మలు. అటువంటి తండ్రి కడుపున పుట్టిన యువరాజు వాడుక భాషలో నాటకాలు రాశారు. వచన కవితలు కూడా చెప్పారు.

★ 22–7–1992 నాడు ఎన్. గోపి ఆరుద్రకు రాసిన లేఖ. (మీరు రాసిన నక్క ఆండాళ్లమ్మ మా అక్కే. నా తోబుట్టువు. నాకప్పుడు ఆరునెలల వయస్సు. అది మా కుటుంబంలో ఇప్పటికీ ఆరని గాయం. మా అక్కకోసం మా అమ్మ రోజూ సాయంత్రం 5 గం॥ నుంచి 6 గం॥ వరకు రోజూ శోకంపెట్టి ఏడ్చేది. అలా 15 సం॥ ఏడుస్తూనే వుంది. మా వీధిలో మా అమ్మ ఏడుపు అయిన తర్వాతనే దీపాలు ముట్టించుకొనేవారు. 'నక్క లచ్చుమమ్మ శోకం అయిపోయింది. ఇక దీపాలు ముట్టించుకోండి' అనేవారు. స్పందించి రాస్తున్నాను. మా కుటుంబ వ్యక్తి గత సంఘటనను ఆనాటి పరిస్థితుల్లో ఫిక్స్ చేసి రాస్తే నాకే విచిత్రంగా వుంది. ఎన్. గోపి)

ఈయన రచించిన ఒక ఖండకావ్యం ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక రజతోత్సవ సంచికలో అచ్చుపడింది. ఆ సంచికను ప్రతిభలో సమీక్షిస్తూ నిజానికి యువరాజాగారి కావ్యం ప్రతిభలో ప్రచురింపతగినదని విమర్శకులు అభిప్రాయపడ్డారు. 'తరంగములు' అనే ఖండకావ్య సంపుటిలో భావకవి పోకడలతో హృదయంలో ఉప్పొంగే భావాలను గణబద్ధం చేశారు. ఉత్తరోత్తరా యువరాజాగారి పుస్తకాల్లో ఒకటి నవ్యసాహిత్య పరిషత్తువారు ప్రచురించారు. వీరి మొగ్గు పూర్తిగా ఆధునిక ధోరణుల వైపే.

యువరాజాగారు పన్నెండు గ్రంథరచనలు చేశారు. వీటిలో ఐదు కవితలు, ఒక వ్యాససంపుటి, ఐదు నాటకాలు, ఒక అముద్రిత రచన. వీటి వివరాలు ఇవి :

1. స్వార్థత్యాగం - 1937 - నాలుగంకాల నాటకం
2. ఆలోకమునుండి ఆహ్వానం - 1938 - నాలుగంకాల నాటకం
3. తరంగములు - 1938 - ఖండకావ్యాలు - 6 గీతాలు
4. చినుకుల చిందులు - 1939 ప్రమాది - ఖండ కావ్యాలు
5. తీరినకోరికలు తరువాత - 1940 - నాటకం
6. నామరహితం - 1940 - కవితలు
7. వరూధినీ ప్రవరాఖ్యం - 1947 - నాలుగంకాల నాటకం
8. 'వలపులు-అలపులు-తలపులు' - 1960 - ఖండకావ్యాలు (20)
9. మూన్నాళ్ళముచ్చట్లు - 1961 - నాలుగంకాల నాటకం
10. ''కంటికీ మనసుకీ కనుపించీ కనుపించని దృశ్యాలందామా? లేక మరి ఏమందాం, ఏదో అనాలనే అంటే'' - అధునాతన భావదృశ్యాలు
11. భువనవిజయం - అముద్రితం - ప్రక్రియ ఏమిటో తెలియదు
12. సువిశాల మిదం విశ్వం - వ్యాసాలు

యువరాజా తన తొలి రచనలలో సంప్రదాయబద్ధమైన నియమాలు పాటించారు. రాను రాను తమ స్వేచ్ఛను ప్రకటించారు. ప్రాథమిక దశలో సహజంగా కృష్ణశాస్త్రి, విశ్వనాథ, శ్రీశ్రీల ప్రభావం ఈయనపై కనబడుతుంది. అలాగే పిఠాపురం ఆస్థానకవులైన వెంకటరామకృష్ణకవుల వద్ద చదువుకొన్న ప్రబంధాల ధోరణి కూడా కొంత ద్యోతమవుతోంది. స్వయంగా కొన్ని ఆంగ్లకవితల్ని అధ్యయనం చేయడం వల్ల నూతన దృక్పథం అలవడింది. అందుకే కొత్తదారి తొక్కారు. ప్రైవేటు రోడ్డు వేసుకొన్నారు.

'చినుకుల చిందులు' అనే కావ్య సంపుటిలో నాలుగవ గీతం 'శ్మశానస్వస్తి'. దీని గురించి విమర్శకులు ఇలా రాశారు.[1]

---

1. డాక్టర్ సి. నారాయణరెడ్డి - ''పిఠాపుర సంస్థానము కవి పండిత పోషణ'', పుట.411

''ఈ గీతమున కవి కర్మకాండ పట్ల తన అనాసక్తతను వివరించును. తన మరణము నూహించుకొని కవి ఈగీతము వ్రాసెను. తన శరీరము శ్మశానమున కాష్ఠములపై కాలునపుడు కవి లోకమునకు స్వస్తిచెప్పును. తాను జీవించియుండగా బ్రతుకును దుఃఖభూయిష్ఠము చేసిన బంధుమిత్రులకు తన మరణము వలననైన తృప్తి కలుగనిచో తన బూడిదను నీట కలిపి త్రాగవచ్చునని కవి చెప్పెను. అతడు తన అంతిమ సమయమున నృరాక్షస సంస్థకు జీవనాసత్యగతికి దుఃఖవారధికి శ్మశానస్వస్తి పలికెను. ఈ గీతమున కవి హృదయము అంతర్లీనముగా నున్నట్లు తోచుచున్నది. భాషాసాహిత్యముల భేద భావముల వలన యువరాజావారు తండ్రికి దూరమైనట్లు చెప్పబడుచున్నది. దాని నాధారణముగా జేసికొని బంధుమిత్రులు కొందరు ఆయన జీవితమును మరింత శోకమయము కావించియుందురు. అందువలన కలిగిన బాధ ఈగేయమున లీలగా గోచరించును. మానవుని విశ్వాసహీనతకు విరక్తిచెందిన కవి అటువంటి వారందరు తనను మరచుటయే వారు తనకు చేయు ఉపకారమని తలంచెను''.

యువరాజాగారి పుస్తకాలు చాలావరకు నేడు అలభ్యాలు. వాటిని ప్రచురించినపుడు వాటికి 'వెలలేదు' అని ప్రకటించారు. పుస్తకాల షాపుల్లో ఇవి దొరకవు. కొన్ని సాహిత్య పత్రికలలో వీటి సమీక్షలు పడ్డాయి. కొందరు విమర్శకులు తమ గ్రంథాలలో వీటి గురించి చెప్పారు.

'నామరహితం'లో యువరాజా మొదటి మాటల్లో ఇలా చెప్పారు. ''పద్యం గద్యం కాకుండా వింతయైన సంగీతంలో కొన్ని భావాలు పెంచి మూడు మాటలలో ముప్పది తళుకులూ, మూడు వందల హృద్భావాలు చూపించాలని యత్నించారు. తృప్తి కలగలేదు''.

సంతృప్తికరంగా క్లుప్తత సాధించిన కవి నారాయణబాబు. అప్పటికే ప్రసిద్ధుడు. నారాయణబాబు రచనలను పిఠాపురం యువరాజా రచనలనూ తులనాత్మకంగా విశ్లేషించారు.

32 వచన పద్యాలున్న 'నామరహితం' గ్రంథాన్ని యువరాజా ''ఆకాశంలోని ఆవలింతలకు, గుండెలలోని పగుళ్ళకు, సుషుప్తిలోని సుడిగుండాలకు'' అంకితమిచ్చారు. 'తొలిజాము' అనే పీఠికలో తన కొత్తభావాలను, కొత్తభాషను పాఠకులంగీకరింపనూ వచ్చును, లేదా తిరస్కరించవచ్చునని చెప్పారు.

'నామరహితా'న్ని ప్రతిభ పత్రికలో వేదుల సత్యానారాయణశాస్త్రిగారు సమీక్షించారు. సుదీర్ఘమైన ఈ విమర్శలో ఇలా రాశారు.

''ఈ గ్రంథము మొదట నుంచీ చివరివరకు చదివితే ఈ కవిజీవితములో ఏదో ఒక ఆవేదన ఉన్నట్లు పొడగడుతుంది. ఆ ఆవేదనే కవి సృష్టిపై మనకు సానుభూతి కలిగిస్తున్నవి... ఈ కవి భాషలో కూడా (అంటే ఛందస్సులోనే కాకుండా అని) కొన్ని విచిత్రాలు చేయకవిడిచి పెట్టలేదు... ఇటువంటి స్వాతంత్ర్యాలు... లేకుంటే ఈ కావ్యము మామూలు పద్ధతిగానే ఉండేదేమో? అలా ఉండాలనే కవి ఒక దారీతెన్నూ లేకుండా

భాషను అధ్వాన్నముగా వాడినట్లు తోస్తుంది. కొన్నిచోట్ల పులుముడు ఎక్కువగా ఉన్నది... మొత్తముమీద ఈ గ్రంథము విచిత్రమయింది...

పిఠాపురం యువరాజాగారి రచనలు అతి వాస్తవిక కవితలనే అపోహ మన విమర్శకులలో ఉంది. వాస్తవానికి అతి నవ్యధోరణేగాని, ఈయనగాని, పఠాభిగాని సర్రియలిస్టు కాదు. వేదుల పై సమీక్షలో ''ఈ గ్రంథము అతివాస్తవికతకు చెందినది'' అని చెప్పారు. నవ్యాంధ్రసాహిత్య వీధులలో కురుగంటి సీతారామయ్యగారు కూడా పిఠాపురం యువరాజాను అతివాస్తవికుడనే ముద్రవేశారు. ఈ విమర్శకులు తగిలించిన తప్పుడు లేబిల్స్ చూసి కొందరు విశ్వవిద్యాలయాలలోని ఆచార్యులు పొరపాటు అంచనాలు వేశారు. 'నామరహితం' 1940 విక్రమ సంవత్సరం తొలిమాసాలలో ప్రచురితమైంది. ఆ సంవత్సరం డిసెంబరులోగాని శ్రీశ్రీ 'మాటలమూట' అనే మొట్టమొదటి సర్రియలిస్టు రచన చేయలేదు.

పిఠాపురం యువరాజా వచన పద్యాలలో చేసిన నూతన ప్రయోగాల గురించి 'వచనకవిత–ప్రారంభం, పరిణామం' అనే ప్రకరణంలో వివరించాను. ఈయన ప్రభావం ఏ ఇతర కవి మీదా కనపడదు. ఫ్రీవర్స్ ఫ్రంట్ వారు ప్రచురించిన ''వచన కవిత వివిధ కవుల పదాలూ, దృక్పథాలూ'' అనే పుస్తకంలో కూడా ఈయన పేరు కనపడదు. ఈయనను స్మరించేవారే అరుదు.

పిఠాపురం యువరాజా 'వలపులు–అలపులు–తలపులు' అనే కవితల సంకలనంలో సారంగు పిట్టమీద ఒక ఖండిక రాశారు. ''చిన్నపిట్ట, చిన్నబ్రతుకు, చిన్నపాట, చిన్నగూడు, చిన్న కోరికలు, చిన్న యూహలుండి చిన్న కాలములో చిన్న చావు చచ్చును'' అన్నారు. పిఠాపురం యువరాజా కవిత 'చిన్నబతుకు' ఇంకా బతుకుతూ ఉందా? నోరి నరసింహశాస్త్రిగారు ''తెలుగు కవిత్వంలో ఫాషనులు'' అనే వ్యాసాన్ని 1939 ఏప్రిల్ మాసంలో ప్రతిభ పత్రికలో రాశారు. ఇందులో పిఠాపురం యువరాజాను స్మరించలేదు.

కవిగా ఆయన చేసిన ప్రయోగాల గురించి ఎవరో ఇద్దరు ముగ్గురు తప్పించి ఇంకెవరూ పట్టించుకోలేదు. యువరాజా రచించిన నాటకాలుకొన్ని పోణంకి శ్రీరామ అప్పారావుగారి 'తెలుగు నాటక వికాసము'లో నమోదు మాత్రము అయినాయి. ఈ నాటకాల సుదీర్ఘ సమీక్షలు నవ్యసాహిత్య పరిషత్తువారి 'ప్రతిభ' పత్రికలో ప్రసిద్ధులే రచించారు. ఈ నాటకాలనెవరైనా ఆడారో? లేదో? ప్రదర్శన సౌలభ్యం లేదనుకోవాలి.

సర్రియలిస్టుకాని పిఠాపురం యువరాజాను అతివాస్తవిక కవిగా కొందరు పొరపడ్డారుగాని నిజంగా తెలుగులో సర్రియలిజం జన్మిస్తున్నప్పుడు దానికొకరకం మంత్రసానిగా పనిచేసిన ఒక వ్యక్తిని ఆకోవలో పరిగణించలేదు. చెన్నపట్నం త్యాగరాయనగరులో ఒకప్పుడు 'రామరాయముద్రాక్షరశాల' ఉండేది. ఇందులోనే నియమాలను ఉల్లంఘించే పిఠాపురం యువరాజా పుస్తకాలు, పద్యాల నడుములు విరగదన్నిన పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' ముద్రించారు. ఇప్పుడా ప్రెస్సు ఆవరణలో పోలీసు స్టేషను ఉంది. (దీనికి ముందు ఒక మధుశాల ఉండేది). శ్రీరంగం శ్రీనివాసరావు

తన 'మాటలమూట'ను ఈ ప్రెస్సులోనే రాసి ఆంధ్రవారపత్రికలో పనిచేసే ఒక సాహితీపరునికు చదివి వినిపించాడు. ఆ మిత్రుడు దానిని వింటూనే అంతా కాయితం మీద రాసుకొని ఒక చిన్న వ్యాఖ్యానంతో ఆ వారం పత్రికలో ప్రకటించాడు. ఇలాగ సర్రియలిజానికి బొడ్డుకోసిన మంత్రసాని కొన్నాళ్ళు తానూ సర్రియలిస్టుగా ఊరేగాడు. అతని పేరు - జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి.

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (1914–1968)

గురజాడ అప్పారావుగారి బిల్హణీయంలో ఒక పాత్ర 'హాస్యగాణ్ణి అయినా హద్దులో ఉండాలి' అంటే మహారాజు చెప్పిన సమాధానం సముచితమైనది ఒకటి ఉంది. ''హద్దుమీరిన మనిషి ఒక్కొక్కప్పుడు ఉంటేనేగాని హద్దుయొక్క గుణాగుణములు తెలియవు. మనవలె ఉచ్చావస్థలో నున్నవారికి స్వేచ్ఛగా చెప్పగలిగిన వారిని అచ్చుపోసి వదలివేస్తేగాని మనను గూర్చి లోకం ఏమనుకొనేదీ మనకు తెలియదు''.

అందుకే మనకు రాజాస్థానాల్లో విదూషకులూ, కవిత్వంలో వికటకవులూ అవసరమయ్యారు. వికటకవులు దేశసాహితి కనే విడ్డూరపు బిడ్డలు. వికటమైన కవిత్వం రాయడానికి నిజమైన ప్రతిభ అవసరమైతే వికటకవిత్వం చెప్పడానికి విస్తారమైన వ్యుత్పత్తి కావాలి. సర్కస్‌లో మామూలు ఫీట్స్ చేసేవారికి నైపుణ్యం కావాలి. వాడితోపాటు ఆ ఫీట్స్‌లో పాల్గొనే బఫూన్‌కు నైపుణ్యమే కాక చమత్కారం కూడా రావాలి. వికటకవి అనే మాటకు బ్రౌనుదొరగారు 'బఫూన్' అనే అర్థం చెప్పి తెలుగులో ''ఏదాడంటే కోదాడనే వాడు' అని వివరించారు.

మనకు వికటకవులూ, విదూషకవులూ ఆదినుంచీ వున్నారు. గొప్పకవికి అనుకరణలు చేసే కవులు కోకొల్లలు. 'తద్రచనయకా' అనుకరణ చేస్తేనే గొప్ప. అందుకే కవి చౌడప్ప ఇలా చీవాట్లు పెట్టాడు.

పెద్దనవలె గృతి చెప్పిన
బెద్దనవలె నల్పకవిని బెద్దనవలెనా
ఎద్దనవలె మొద్దనవలె గద్దనవలె
కుందవరపు కవి చౌడప్పా.

అనుకరణ కవులేకాక అవహేళన కవులూ మనకున్నారు. అయితే అనుకరణలో అవహేళన చేసే కవులు మాత్రం చాలా అరుదు. భాగవతంలో పోతరాజుగారి ప్రసిద్ధ పద్యం 'లావొక్కింతయు లేదు' అన్నదానికి ప్రతిగా ఎవరో కవి 'రావేమోనని కావవే తరుణి సంరక్షించుచంద్రాననా' అనే ముగింపుతో అనుకరణ పద్యం వ్రాశాడు. మంచి పద్యానికి ప్రతిగా వికట కవిత్వంగా చెప్పిన దానిని ఇంగ్లీషులో 'పేరడీ' అంటారు. తమ నిఘంటువులో ఇదే నిర్వచనాన్ని ఇస్తూ బ్రౌన్ దొరగారు ''అనగా 'ఎంత దయా దోశలపై' అన్నట్టుగా'' అని ఒక పద్యం ఎత్తుగడను ఉదాహరించారు.

ఆధునిక యుగంలో పేరడీ అనే ప్రక్రియను ఆంధ్రసాహిత్యంలో ప్రవేశపెట్టిన ఘనత జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రికి చెందుతుంది. బందరులో 1914లో జన్మించిన రుక్మిణీ నాథుడు చిట్టిగూడూరు సంస్కృత కళాశాలలో చదువుకొన్నాడు. ఉభయ భాషాప్రవీణ పట్టం పుచ్చుకొన్నాడు. ఆ చదువుకన్నా ఎక్కువగా సంస్కృతాంధ్ర సాహిత్యాలలో రసవంతమైనవన్నీ అధ్యయనం చేశాడు. ఆధునిక సాహిత్య ధోరణులు ఆకళింపు చేసుకొన్నాడు.

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి 1933 నుంచే కొక్కిరాయి కవిత్వాలు అల్లడం మొదలుపెట్టాడు. పేరుపడ్డ కవుల మంచి పద్యాలన్నింటికి పేరడీలు చెప్పాడు. కవితలోనే కాక వచనంలో కూడా పేరడీలు రాశాడు. రుక్మిణీనాథశాస్త్రి ఆత్మీయులు 'రుక్కాయి' అని పిలుచుకొనేవారు. 'జరుక్, 'జరుక్‌శాస్త్రి' అనే పేర్లు అతనికి పొట్టి పేర్లు.

రుక్కాయి తెలుగుసాహిత్యంలో ఒక ఆశ్వాసం అంతం కావడం చూశాడు. కొత్త ఆశ్వాసం ఆవిర్భవించడానికి తానుకూడా యథాశక్తి ఓ అగ్గిపుల్లను ధారపోశాడు. నవ్యసాహిత్య పరిషత్తునాటినుండి అభ్యుదయ రచయితల ఉద్యమందాకా ఎందరో ప్రముఖ కవులు వచ్చారు. అందరితో గాఢపరిచయం ఉన్నవాడు. వాళ్ళవాళ్ళ బాణీలను కూలంకషంగా ఆకళించుకొన్నవాడు. బందరులో పుట్టిపెరిగినవాడు కనుక ఇటు ముట్నూరికృష్ణారావుగారి దర్బారులోను అటు చెళ్ళపిళ్ళవారి సాన్నిధ్యంలోనూ చాలా చనువుగా మెలిగినవాడు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు రుక్కాయిని ముద్దుగా 'తెనాలి రామలింగం' అని పిలిచాడు.

1938లో బందరులో నవ్యసాహిత్య పరిషత్తు వార్షిక సమావేశం జరిగింది. దానికి బుర్రా శేషగిరిరావు అధ్యక్షులు. ఆయన 'బోను'లాంటి తలపాగా చుట్టుకొనేవారు. బుర్రమీసాలు ఉండేవి. వారు విజయనగరంలో 'భారతీతీర్థ' అనే అకాడమీని పెట్టి అందరికీ బిరుదులు ఇస్తూ వుండేవారు. అవి కొంచెం నవ్వులపాలయినాయి. రుక్కాయి అప్పుడు శేషగిరిరావుగారిమీద బందరులో ఈ పద్య చెప్పాడు.

బుర్రగలవాడు తలపాగ 'బోను'వాడు
నవ్యసాహిత్య పరిషతద్వినాయకుండు
నగవుపాలైన బిరుదు పిండప్రదాత
శ్మశ్రు భీకరుడైన శేషగిరిరావు.

1838 ప్రాంతాలలో రుక్కాయికి క్షయదాపురించింది. వ్యాధినయం చేసుకొందుకి విశాఖపట్నం వెళ్ళి కింగ్‌జార్జి హాస్పిటల్‌లో చేరాడు. ఆస్పత్రిలో చాలా కవితాలు రాశాడు. అప్పుడు రాసిందే ''ఆసుపత్రికలో కోకిల'' అనే ఈ పద్యం.

నల్ల నల్లని కారు చీకటి
తెల్ల దూదిగ విచ్చుకొంటే
నిద్రపోయిన ఊరు కాస్తా
కదులుతూ ఆవులిస్తూంటే

దేవతల సిగపూల వాసన
తెల్లారగట్టొచ్చేటిగాలై
వ్రణ మను మనసులో రణమును
లాలనతో మాన్పేటి వేళల
కొమ్మలోంచీ రెమ్మలోంచీ
కుహూకుహూ, కుకూ కుకూ

ఆపరేషన్ రోగి ఊర్పుల
బాధలా స్టవ్ మండుతూంటే
రోగి చార్టన వోలె నింగిని
జ్వరపు చుక్కలు తేలివాలగ
నిన్న రాతిరి భూమి చూచిన
చిన్న కందులు,
పాలచేపుకు కన్నతల్లు
రొమ్ముపక్కల వెతుకుతూంటే
ఆముదంకై ఉంగ ఉంగా, ఉంగా ఉంగా
ఉంగా ఉంగా ఉంగా

నల్లమందును తాగి నరముల
పుళ్ళుమానే పాతరోగులు
మృతులవలె నిద్దర్లో వుంటే
రోగి బంధులు రాత్రి వెళిపోయి
వేకువనె కాఫీని తెస్తే
రోగి కళ్ళను తేలవేస్తే
Brandy Oxygen అన్నీ ఐపోయి
Ice Roomకు చేర్చు వేళల
సుఖం దుఃఖం తెలుసుకోకే
వాగులా, నదిలాగ, కడలిగ
రెమ్మలోంచీ, కొమ్మలోంచీ
కోకిలొక్కటి కూత కూస్తోంది
కూయబోకే కూయబోకే
కొకైనింజక్షన్ కోయబోకే
థియేటర్‌లో ఖడ్గ నీలిమమా!

డాక్టరు పుణ్యామా అని ఆ వ్యాధి నయమైంది. రుక్కాయి మళ్ళా మనుష్యులలో పడి కోలుకొన్నాడు. బందరుకు వెళ్ళాడు. అక్కడ ఎన్నాళ్ళున్నాడో తెలియదు.

రుక్కాయి బందరు వీడి చెన్నపట్నం చేరాడు. ఆంధ్రపత్రికలో ఉద్యోగం. కొడవటిగంటి కుటుంబరావుగారితోపాటు వారపత్రికను ఆధునికం చేశాడు. యుద్ధానికి

ముందురోజుల్లోనూ, యుద్ధంరోజుల్లోనూ ఆ పొడుగాటి వారపత్రికలో సాహిత్యంలో చాలా పొడుగాటివాళ్ళు రాసేవారు. రుక్కాయి కొత్త కొత్త ఆకర్షణలను ఆ పత్రికలో చొప్పించేవాడు. గాలి దుమారాలు లేపేవాడు. మల్లాది అవధానిగారి 'గాలివాన' అనే గ్రంథాన్ని రివ్యూ చేస్తూ ఆయన అసంపూర్ణ రామాయణాన్ని రాయలేదని నిజం చెప్పి నిఘారం రేపాడు. కొన్నినెలలపాటు ఆ రగడ సాగింది.

రుక్కాయి ఏరచయితకైనా పేరడీ రాశారంటే ఆ రచయిత మేజర్ రైటరనే చెప్పాలి. ద్వితీయశ్రేణి రచయితలజోలికి వెళ్ళేవాడు కాదు. శ్రీశ్రీ 'నవకవిత'కు కావలసిన సరుకులను చెప్తే దానికి ఇలా పేరడీ చెప్పాడు. (సరదాపాట).

మాగాయీ కందిపచ్చడీ
ఆవకాయీ పెసరప్పడమూ
తెగిపోయిన పాత చెప్పులూ
పిచ్చాడి ప్రలాపం కోపం
వైజాగులో కారాకిళ్ళీ
సామానోయ్ సరదాపాటకు!

తుప్పట్టిన మోటర్ చక్రం
తగ్గించిన చిమ్నీ దీపం
మహా వూరిన రంపప్పొట్టూ
సంగల్చీలినట్రాంపట్టా
విసిరేసిర విస్తరి మెతుకులు
అచ్చమ్మ హోటెల్లో చేపలు
సామానోయ్ సరదాపాటకు!

నడినిశిలో తీతువు కూతా
పడిపోయిన బెబ్బులి వేటా
కర్రెక్కిన నల్లినెత్తురూ
జుర్రేసిన ఉల్లికారమూ
చించేసిన కాలెండర్ షీట్
నపుంసకుడి థాట్ డెవలప్మెంట్
సామానోయ్ సరదాపాటకు!

క్రుళ్ళనిదీ కుళ్ళనిదీనీ
మళ్ళనదీ వెళ్ళనదీని
చచ్చేదీ లాభం లేనిది
ఈ జన్మకు పనికిరానిది
మనకెప్పుడు కలిసిరానిది
సామానోయ్ సరదాపాటకు!

1940లో[6] కాబోలు నేను శ్రీశ్రీ 'జయభేరి'కి పేరడీ రాసి రుక్కాయికి పంపాను. మెచ్చుకొంటూ కార్డు రాశాడు. కలసి పేరడీలు రాద్దామన్నాడు. నా పేరడీలో తాను జయభేరికి రాసిన పేరడీ చరణాలు కలుపుతానన్నాడు. జంటగా రాద్దామన్నాడు. నాకు భయంవేసి వద్దన్నాను. అప్పటికి నేను చాలా అర్భకుణ్ణి. అయినా రుక్కాయి జయభేరికి పేరడీని మా ఇద్దరి జంట రచనగా ప్రచురించాడు. దీనిని నేను చూడలేదు. ఈ ప్రచురణ సంగతి సెట్టి ఈశ్వరరావు నా షష్టిపూర్తి సంచికలో వెల్లడిచేసేదాకా నాకు తెలియదు. (అవి నేను దేశాలు పట్టి తిరుగుతున్న రోజులు).

రుక్కాయి పేరడీలను ఒక గ్రంథరూపంలో తీసుకురావడానికి కె.వి.రమణారెడ్డిగారు ప్రథమ ప్రయత్నం చేశారు. దొరికినన్ని రచనలు సేకరించి 'జరుక్‌శాస్త్రి పేరడీలు' అనే పేరుతో సంకలనం చేశారు. 'జరుగ్వేదనా భూమిక' అనే పేరుతో కవినీ కావ్యాన్నీ పరిచయం చేశారు. ఈ గ్రంథాన్ని 'నవోదయ' రామమోహనరావుగారు ప్రచురించారు.

రుక్కాయి పేరడీ రచనల స్కోరు కనీసం మూడు నాలుగు 'స్కోరు'లుంటుంది. రమణారెడ్డిగారు 34 రచనలను మాత్రమే సేకరించగలిగాడు. ఇన్ని సేకరించడం ఒక ఫీటే. ఇందుకు ఆయనను అభినందించాలి. 'జరుగ్వేదనా భూమిక'లో చాలా సంగతులు చెప్పారుగాని రుక్మిణీనాథశాస్త్రి సాహిత్యంతోనేగాని రుక్కాయితో అట్టే పరిచయం లేనందువల్ల కొన్ని పొరపాట్లు చేశారు. రుక్మిణీనాథశాస్త్రికి గురజాడంటే చచ్చేయిష్టం అని రాశారు. నిజానికి గురజాడ అంటే రుక్కాయికి చచ్చినా ఇష్టం లేదు. పైగా చావసంత కోపం. అందుకే కన్యాశుల్కంపైన అంత రగడ లేవదీశాడు. కృష్ణశాస్త్రిగారి మీద కూడా బోలెడు కోపం ఉండేది. దేవీ పూజలు, 'చలం' భక్తీ ముదిరాక పరమ రియాక్షనరీగా మారాడు. (రుక్కాయికి గురజాడపై గల కన్నెర్ర, గుండెమంట కె.వి.రమణారెడ్డికి రుక్కాయి రాసిన వచన రచనలు, 'తనలోతాను' అనే శీర్షికతో సంకలనం చేసి 1983లో ప్రచురిస్తున్నప్పుడే తెలిసొచ్చింది. (ఆ పుస్తకంలోని పుట 182)

రుక్కాయి పేరడీలలో గ్రంథరూపంలో రానివే చాలా ఎక్కువ ఉన్నాయి. 1939 ప్రాంతాల్లో నవ్యకవుల పుస్తకాలకు సభాపతిగారుగాని, కవి సామ్రాట్‌గారుగాని ఎవరో ఒకరు పీఠికలు రాసేవారు. రుక్కాయి ఈ పీఠికలపైన ఒక చక్కని పేరడీ రాశాడు. ఆరోజులలో కుర్రకారు రచయితల పుస్తకాలకు తల్లావఝలవారూ, విశ్వనాథవారూ పుంఖానుపుంఖాలుగా పీఠికలు రాసి పారేసేవారు. ఈ వరద చూశాక ఉండబట్టలేక రుక్కాయి పేరడీ రాశాడు. బందరులోన కాయగూరల దురకాణదారులకు విశ్వనాథ, శివశంకరశాస్త్రి ప్రశంసాపత్రాలు ఇవ్వడం గురించి చాలా చక్కని రచన చేశాడు. ఇది ఆంధ్ర వారపత్రికలో అచ్చుపడింది.

రుక్కాయి పేరడీల గురించి శ్రీశ్రీ ఒకచోట ఇలా రాశాడు.[2]

''మల్లవరపు విశ్వేశ్వరరావు 'మధుకీల'కు వ్రాసిన పీఠికలో కృష్ణశాస్త్రి 'విశ్వేశ్వరరావూ! నువ్వు కవిత్వం రాయాలయ్యా! బాగా రాస్తావు'' అంటూ యోగ్యతా

2. అనంతం – పుట–85

పత్రం ఇచ్చి 'అందరి కవులతోనూ ఈ మాట నేనన్ను. విశ్వేశ్వరరావు కవి, నిజంగా కవి కాబట్టి ఇలా అంటున్నాను' అని రాసిన సందర్భంలో పెంకితనానికి పెట్టిన పేరయిన జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి 'నారాయణబాబూ! నువ్వు క్షవరం చేయించుకోవాలయ్యా! బాగా చేయించుకోవాలి. తలమాసిన వాళ్ళందరితోనూ నేనీమాట అనను. నారాయణబాబు తలమాసినవాడు. నిజంగా తలమాసినవాడు'. అంటూ ఆశువుగా పేరడీ చేశాడు. దరిమిలాను ఎక్కడైనా ప్రచురించాడేమో తెలియదు. జరుక్ వాగుడులో ఒక వైభవం ఉండేది. కవిత్వన్నేకాదు, వచనాన్ని కూడా అవలీలగా తిరగేసి తొడిగేసుకొనే వాడు. శివశంకరశాస్త్రిలాంటి హేమాహేమీలు కూడా జలసూత్రం నోటి దురుసుతనానికి జడిసేవాళ్ళు. విశ్వనాథవారిని ''పాషాణ పాక ప్రభూ! అనగలిగిన పాటి అహంత రుక్మిణీనాథశాస్త్రికిగాక మరెవరికుంది?''

రుక్కాయి రేడియోలో చేరిన కొత్తలో ఫిడేలు పాఠాలు నేర్చుకొన్నాడు. రోజూ ఇంట్లో వాయించేవాడు. ఆ రోజుల్లోనే త్యాగరాజస్వామి వారికి ఏదో నెంబరు జయంతి వచ్చింది. ఆ సందర్భంలో యథాశక్తి త్యాగరాజ కీర్తనలకు రుక్కాయి పేరడీలు రాశాడు. ''చింతపండు పులుపూ, ఉల్లివాసనే'' అన్నది ఒక పల్లవి ఎత్తుగడ. ''ఉడకాబెట్టినా ఊరా వేసినా పోదు పుల్లదనమూ, పోదువాసనే రామచింత'' అంటూ సాగదీస్తూ స్వరకల్పన చేస్తూ పాడేవాడు. ఈపేరడీలను నా ఎదుటే కాగితం మీద పెట్టాడు. ఆ కాగితాలు ఏమైనాయో.

రుక్కాయి సినిమాల్లో కూడా రచనలు చేశాడు. ఆర్.ప్రకాష్‌గారి 'మాయపిల్ల'కు మొదట్లో స్క్రిప్టురచయితగా రుక్కాయిని పెట్టుకున్నారు. పేరు వేశారో లేదో తెలియదు. వినోదా పిక్చర్స్ డి.ఎల్. నారాయణకు రుక్కాయికి మేనమామ మేనల్లుడు బంధుత్వం ఉంది. తాను తీయదల్చుకొన్న కథలకు ముందుగా నవలలు రాయించడం డి.ఎల్.కు అలవాటు. కొన్ని సినిమా పాటలకు కూడా రుక్కాయి పేరడీలు రాశాడు. గుణసుందరి కథలో 'అమ్మ మహాలక్ష్మి దయచేయవమ్మా!'' అనే పాటకు ''అమ్మ పెద్దమ్మ విచ్చేయవమ్మా!'' అంటూ పేరడీ రాశాడు. ఆ పాటంతా నాకు జ్ఞాపకం లేదుగాని ఒక చరణం గుర్తుంది.

''నీకు కొండపై పూశారు పసుపు
కొండ దిగగానె వేశారు ముసుగు
నువ్వు కట్టింది కితనార చీర
చేతపట్టింది ఇనపట్లకాడ''

ఇలాంటి రచనలు కాగితంపైన రుక్కాయి పెట్టడం నేను కళ్ళారా చూశా-ను. ఆ కాగితాలను కూడా ఏం చేశాడో మరి?

రుక్కాయి తన పేరడీలను గ్రంథరూపంలో ఎప్పుడైనా ప్రచురిస్తే దానికి ''అక్షింతలు'' అనే పేరు పెడదామనుకొన్నాడు. ఈసంగతి కొందరు సన్నిహితులకు మాత్రమే తెలుసు. ఇప్పటిదాకా సంకలితంకాని పేరడీలను ఎవరైనా సేకరించి గ్రంథరూపంలో తెస్తున్నప్పుడు

ఈ పేరు పెడితే సమంజసంగా ఉంటుంది. రుక్కాయి చమత్కారాలనూ, ఛలోక్తులనూ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 'గౌతమీగాథలు'లోనూ, అబ్బూరి వరదరాజేశ్వరరావు గారు 'కవనకుతూహలం'లోనూ కథనం చేశారు. ఇంకా చెప్పవలసినవి ఎందరెందరో చెప్పాలి. వాటిని ఒకచోట చేర్చాలి.

శ్రీశ్రీని, నారాయణబాబును అభిమానించి అనుసరిస్తున్న రోజులలో రుక్కాయి సర్రియలిస్టునని సగర్వంగా బోర విరుచుకొని తిరిగాడు. అభ్యుదయ రచయితల సంఘం ప్రభావంలో పడి సామ్యవాదంవైపు మొగ్గాడు. తరవాత ఆఫ్ ప్యాంట్లు వేసుకొని కమ్యూనిస్టులను అభిమానించే రోజులు కొన్ని ఉండేవి. అప్పుడే ప్రజాశక్తి ప్రచురణాలయం వారి రాజకీయ సాహిత్యం అంతా చదివి ప్రతిపేజీలోనూ కింది గీట్లు పెట్టుకొనేవాడు. అటుపిమ్మట రేడియో ఉద్యోగానికి ఫుల్‌ప్యాంట్లూ, షర్టులో కొన్నాళ్ళు ధరించాడు. (జి.టి.లోని జుబేదా షాపులో నేను ఎన్నిక చేసినవే కట్టుకొన్నాడు). తర్వాత ధోవతీ, చొక్కా, కుంకుం బొట్టూ వచ్చాయి. ఇంట్లో మాత్రం పుట్టగోచీ. నవ్యుడల్లా, నైష్ఠికుడయ్యాడు. అభ్యుదయకవి ఆర్షవిధేయుడయ్యాడు. అష్టగ్రహకూటంవల్ల మద్రాసు నిజంగా మునిగిపోతుందని సామాన్లన్నీ గోనెలలో పెట్టుకొని తిరువణ్ణామలైలో చలంగారి ఆశ్రమానికి 'ఎవాక్యువేట్' అయ్యాడు. దగాపడ్డాడు. మనిషి పూర్తిగా అంతర్ముఖుడయ్యాడు. ఉద్యోగధర్మం కొద్దీ రచనలు చేయడమేగాని ఉత్సాహంతో చేసిన రచనలు కావు. అయినా మొదట చేసిన రచనలే చాలు. రుక్కాయికి సముచితస్థానం సాహిత్యలోకంలో ఏర్పడడానికి.

పఠాభి (జననం 1919)

తనకుతానే సాటి, తనచోటుకు లేనేలేదు పోటీ అని సగర్వంగా చాటుకొనగలిగిన కవి మన ఆధునికులలో ఒక్క పఠాభి మాత్రమే. (ఈయన పూర్తిపేరు తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి). పఠాభి ఢజను వచన పద్యాలతో తెలుగు సాహిత్య రంగంలో ప్రవేశించి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని తనకు తాను సృష్టించుకొన్నాడు. అయితే అతడు ఆ పద్యాలు రాయడానికి ముందు చాలా మథనపడ్డాడు. సమకాలీన సాహిత్య ప్రయోజనం గురించి చాలా ఆలోచించాడు. నూతన ప్రయోగాల అవసరాన్ని గుర్తించాడు. పఠాభి నెల్లూరులో 1919లో జన్మించాడు. 1933దాకా హైస్కూలు విద్య అక్కడ కొనసాగింది. తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో 1933-35 మధ్య ఇంటర్‌మీడియట్ చదివాడు. ఈకాలంలోనే అతడు చలాన్ని, శ్రీశ్రీని చదువుకొన్నాడు. 1935-37ల మధ్య శాంతినికేతనంలో రవీంద్రనాథ టాగోరు సన్నిధిలో బి.యే.వరకూ చదువుకొన్నాడు. టాగోరు సాహిత్యమంతా కరతలామలకం చేసుకొన్నాడు. 1937-38లో ఒక ఏడాది కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పరీక్షకు చదివాడు.

కలకత్తాలో ఉన్నప్పుడు పఠాభి దిగువచిత్పూరు రోడ్డులోని ఇరుకుగదులలో ఉండేవాడు. నగర జీవితంలోని మురికి, కరకుదనం, పిచ్చిగోల, మనుష్యుల దుర్భర వేదనలు, రోదనలు పఠాభి హృదయాన్ని కదిలించి వేశాయి. హద్దూపద్దూ లేకుండా

సద్దణగని బజారు రద్దీ, వర్తకాల ఉన్మాదతీవ్రత, చిత్తూరు పడుపు కొంపలలో అభాగినుల అమాయకత్వాన్ని మదుపు చేసుకొని లాభాలు గడించే వాళ్ళ దారుణాలను చూసి పఠాభి చలించిపోయాడు. యూరపులో యుద్ధమేఘాలు కమ్ముకొని ఆ చీకటి కలకత్తా దాకా వ్యాపించింది. 1938లో ఈ వాతావరణంలో వెన్నెల ఉల్లిపొరల మేలి ముసుగుల టాగోరు సాహిత్య జ్యోత్స్న్య సుందరి చల్లదనం పూర్తిగా మాయమైపోయింది.

చిత్తూరులో తనగదిలో మంచంమీద పడుకొన్న పఠాభి కళ్ళకు కిటికీలోంచీ, పొగలు కమ్మిన ఆకాశవీధులలోంచీ నిండు చంద్రుడు దొంగచాటుగా తొంగిచూడడం కనుపించింది. ఆక్షణంలో పఠాభికి తాను చదివిన ప్రబంధాలలోను, భావకవిత్వంలోను, టాగోరు సాహిత్యంలోను ఉన్న వందలాది అందాల అలంకారాలు తమ అర్థాలను కోల్పోయి దిగంబరంగా కనబడ్డాయి. ఆ క్షణంలోనే పఠాభికి తాను అలవర్చుకొనవలసిన నూతన కవితా దృక్పథం, తాను చేపట్టవలసిన ఆయుధాలు, చేయవలసిన దాడి అవగతమయ్యాయి. శాంతినికేతనంలో చదువుకొన్న తన హృదయం అశాంతినికేతన మైంది. కలకత్తాలో ఇంక చదువు కొనసాగించలేక అతడు ఇంటికి తిరుగుముఖం పట్టాడు.

నెల్లూరులో పఠాభి తమ కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్న మైకా వ్యాపారాన్ని చేపట్టవలసి వచ్చింది. గూడూరు నుండి ఎగుమతి చేస్తున్న సరుకు విషయమై తరుచు మద్రాసుకు పఠాభి వెళ్ళవలసి వచ్చేది. కలకత్తా నగరంలో తాను పొందిన అనుభవాల దృష్ట్యా మదరాసు నగరాన్ని చూస్తున్నప్పుడు ఆకలితో కొత్త నాగరిక కవిత్వం మొగ్గ తొడిగింది.

తన మనసులోని భావాలను వ్యక్తం చేయడానికి పాత గణబద్ధ ఛందస్సులు పనికిరావని తెలుసు. అలాగే మాత్రా ఛందస్సులోని గేయఘణతులు కూడా నాగరిక జీవితంలోని లయను, గుండెచప్పుళ్ళను ధ్వనించలేవు. తాను చెప్పదలచుకొన్నది పాఠకుల మనస్సులలో నాటుకొనడానికి కొత్తమార్గాలు వెతకాలి. పద్యం చదవగానే పాఠకుడు దిగ్గున కూర్చొని గట్టిగా ఆలోచించాలి. చదివినవాళ్ళు తిట్టిపోసినా ఫర్వాలేదు. తనను పట్టించుకొనకపోతేనే బాధపడాలి. తాను చేయదలచుకొన్న దాడిలో ఉపయోగించడానికి ఆయుధాలుగా బఫూనరీ, అహంభావం, సెక్సులను వాడుకోదలచుకొన్నాడు. చెప్పేది అంతా ఉత్తమపురుషలోనే చెప్పదలచుకొన్నాడు.

నగరంలోని సవ్వడులకు సరిపోయే ఛందస్సుగానిఛందస్సు ఏది? భాష ఎటువంటిది ఎంచుకోవాలి? పద్యానికీ గద్యానికీ అంటుగట్టి, గ్రాంథికానికీ, వ్యావహారికానికీ పెళ్ళిచేసి, తెలుగుకూ ఇంగ్లీషుకూ పొత్తు కలిపి కవితలు రాద్దామని నిశ్చయించాడు. వాటిని వచన పద్యాలని పేరు పెట్టాడు. అవి దుడ్డుకర్రలుగా వాడుకొని పద్యాల నడుములు విరగగొట్టదలిచాడు. పాతవి పోతేనేగాని కొత్తవాటికి చోటు ఉండదు.

మద్రాసు దృశ్యాలలో కొన్ని తీసుకొని, అక్కడి తన ఆడ స్నేహితుల వైనాలు కొన్ని తలచుకొని పఠాభి పన్నెండు వచన పద్యాలు రాశాడు. వాటిని 'ఫిడేలు రాగాల డజన్' అన్నాడు. మద్రాసులో తాను తరచూ కలుసుకొనే మల్లవరపు విశ్వేశ్వరరావు ద్వారా

శ్రీశ్రీ పరిచయాన్ని ఏర్పరచుకొన్నాడు. తన డజన్ పద్యాల పుస్తకాన్ని చూపెట్టాడు. ఆ పద్యాలను చదివి శ్రీశ్రీ వెంటనే అచ్చువేయమని సలహా ఇచ్చాడు. తాను ఇంట్రో రాస్తానని చెప్పాడు. 1939 జూలై మాసంలో అచ్చుపని ప్రారంభమై ఆగస్టులో పుస్తకం బయటకు వచ్చింది. వస్తూనే సాహిత్యలోకంలో గొప్ప సంచలనం రేపింది. ఇటువంటి కవిత్వాన్ని అప్పటిదాకా దేశం చూడలేదు.

తొలిపద్యం 'ఆత్మకథ'లో పఠాభి తన గురించి చెప్పుకొని తాను చేయదలచుకొన్న దేమిటో స్పష్టపరిచాడు.

నాకు విచిత్రంబగు భావాలు కలవు
నా కన్నులందున టెలిస్కోపులు
మయిక్రా స్కోపులున్నవి.
నా యీ వచన పద్యాలనే దుడ్డుకర్రలతో
పద్యాల నడుముల్ విరుగదంతాను;
చిన్నయ్‌సూరి బాలవ్యాకరణాన్ని
చాల దండిస్తాను;

ఇంగ్లీషు భాషా భాండారంలో నుండి
బందిపోటుంజేసి కావల్సిన
మాటల్ను దోస్తాను
నా యిష్టం వచ్చినట్లు జేస్తాను
అనుసరిస్తాను నవీనపంథా! కానీ
భావకవిన్మాత్రము కాన్నే; నే
నహంభావకవిని.

ఈ తొలిపద్యంలో చెప్పినదంతా మిగతా పదకొండు పద్యాలలో పఠాభి చేసి చూపెట్టాడు. నగర దృశ్యాలను కొన్ని టెలిస్కోపులలో చూశాడు. నాగరికుల మెదళ్ళను మైక్రోస్కోపులతో వీక్షించాడు. లూటీ చేసి తెచ్చిన భాషని చెప్పుకొన్నా, సందర్భోచితమైన పదాలనే వాడవలసిన రీతిలో వాడాడు. ఉపమేయాలన్నీ సమకాలీనాలు కాబట్టి ఉపమానాలన్నీ కూడా వర్తమాన జీవితంలోంచే తీసుకొన్నాడు. స్పెల్లింగులలో వింత ధోరణిని అనుసరించాడు. సమాస కల్పనలో విశృంఖలత్వం చూపాడు. వ్యాకరణాన్ని మైనపు ముద్దను చేసి తనకు కావలసిన రూపులో వాడుకొన్నాడు.

లోగడ కలకత్తా విశ్వవిద్యాలయంలో చదువుకొంటున్నప్పుడు చిత్తూరున ఇరుకు గదుల కిటికీలోంచి చంద్రుణ్ణి చూసినప్పుడు కలిగిన అనుభూతి మద్రాసు చైనా బజారులో జాబిల్లిని చూసినపుడు పఠాభికి కలిగింది. నగరంలోని ఆకాశంలో జాబిల్లిని కూడా ఎవరో అమర్చినట్లు కనబడడం సహజం. ఆ సంగతే యిలా ఎత్తుగడలో చెప్పాడు

తగిలింపబడియున్నది జాబిల్లి
చయినా బజారు గగనములోన; పయిన;
అనవసరంగా అఘోరంగా!

బజారులోని జనప్రవాహంలో ఎవరూ మోమెత్తి జాబిల్లిని చూడరు. ఎలక్ట్రిక్ దీపాల ధావళ్యాలకీ, క్షణక్షణం రంగులు మారే ఎలక్ట్రిక్ ఎడ్వర్టయిజ్‌మెంట్లకూ అలవాటుపడ్డ నాగరికులు మెచ్చుకోరు. అందుకే కవి యిలా అంటాడు

నిమిష నిమిషానికి వింత రూపాన్ని ధరించు
యలక్ట్రికు బల్బుటేరులంటే
మాకు బలే సరదా బలే గమ్మత్తు!
కానీ దురదృష్ట శశీ!
నీవు మాత్రం పదిహేనురోజుల్లోగాని
నీ రూపాన్నంతా మార్చుకోలేవు
చాలాకాలం, చాలా ఆలస్యం
ప్రజాదృష్టిని ఆకర్షించడంలో
మార్కెట్లోని దుస్సాధ్య కాంపిటీషన్‌కు నీవు
తట్టుకోలేవు జాగ్రత్త సుమా.
దివాలా తీస్తావు, నీవీ చోట
ఖచ్చితంగా అనవసరం నిరుపయోగం కూడాను.

నగరంలోన చంద్రుడు ఖరీదైన షాపుల్లోకి దారి తప్పి ప్రవేశించిన దరిబేసి గ్రామస్తుడు.

మదరాసులోని అన్ని రకాల ప్రజలను ఒకచోట చూడాలంటే సాయంత్రం పూట 'మెరీనా' బీచిని చూస్తే చాలు. పఠాభి అన్ని తరగతుల వారిని అక్కడ వర్ణించాడు. చీకటి పడడానికి ముందు ఒకరకం మనుష్యులుంటే తర్వాత ఇంకోరకం వాళ్ళు మిగులుతారు. ఆ సంగతే కవి యిలా చెప్పాడు.

రాత్రి పడింది
రగులు నలుసులు గల నల్ల తారులాగా
ఒకింత సేపగు సరికి
సమూహమంతా కరిగిపోయింది, మిగిలింది
సమాజంలోని 'మడ్డి' మటుకు;
అన్నం ముద్దకయి కక్కుర్తిపడి
శరీరాన్ని సవారికిచ్చే జవరాళ్ళు
తొమ్మిదణాల సినిమా టిక్కట్టునకు
తమ బహిర్దేహము మీద
యాత్ర చేయుటకు హక్కునిచ్చే
కొందరాంగ్లో ఇండియన్ అభాగినులు
ఈ కార్యాల 'ఛాన్సు' కోసం
ఇటూ అటు తటపటాయించుచున్న

'మర్యాదస్తుల' మంద
ప్రకటించుచున్నవి తరంగాలు
బిగ్గరగా తమ యసమ్మతిని

కవి కూడా కెరటాలతో పాటు తమ అసమ్మతిని ప్రకటిస్తున్నాడు. అయితే ఏం లాభం? గాలి ఏడుస్తుంది. భువి కార్చిన కన్నీటి చుక్కల్లాగ తారకలున్నాయి. మనుష్యుల మనస్సులు రకరకాల కోరికలు రేపుతున్నాయి.

సాయంత్రం మెరీనాలో మనుష్యులను వర్ణించినట్లు పఠాభి వర్షంలో మద్రాసును కూడా కావ్య వస్తువు చేసుకొన్నాడు. పదిగంటల పగటివేళ దేవుడి ఏరోప్లేను భువికి దిగుతున్నట్లు చప్పుడు చేస్తూ వానపడితే నగర జీవితం ఎలా స్తంభించిపోయిందో పఠాభి కథనం చేశాడు. 1939లో మద్రాసులోని వర్షాన్ని పఠాభి వచన పద్యంలో వర్ణించితే 1967లో కుందుర్తి ఆంజనేయులు 'నగరంలో వాన' అనే వచన పద్యం రాశాడు. నాగరిక కవితలలో సమానమైన అనుభవాలే వుంటాయి. పఠాభి పద్యాన్నీ, కుందుర్తి పద్యాన్ని తులనాత్మకంగా విశ్లేషించిన వాళ్ళెవరూ లేరు.

నగరం వీధులలో ట్రాఫిక్కు వుండే చోట్ల పోలీసు భటుడు వుండితీరుతాడు. ఈ పోలీసుపై పఠాభి చక్కని పద్యం రాశాడు. అతని కళ్ళకు పోలీసు 'భరత నాట్యం బాడుచున్న నటర్షి చూడామణి'లా కనపడ్డాడు.

నటరాట్టులాగ నతండు కూడా
మృత్యుంజయ నృత్యంబును
సల్పుచుంటాడు సతతము -
బల్బు హారన్ల తాళం తోడి
యిలక్ట్రికు హారన్ల రాగానికిన్ని
మోటారు సయికిళ్ళ మృదంగానికినీ
అనుగుణ్యంగా నర్తిస్తుంటాడు
తటాల్మని ఇటూ అటు తిరుగుచు
హస్తాల నందమ్ముగ ద్రిప్పుచు,
ఏమా యపూర్వ దృశ్యం!
మండుచున్నట్టు మాడుచున్నట్టి
మే మాస మధ్యాహ్నకాలమందేని
బానల్తోడ పోసినట్లుం గురిసేటి
భాద్రపదమాస వానయందేని,
తన నిర్ణీత ప్రదేశంబు నుండి
ఓ యంగుళమ్ము కూడా జరుగడు!
ఏ ప్రచండాతి ప్రచండ ఘోరాతి ఘోర
తీవ్రాతి తీవ్ర తపస్సుం

జేయుచున్నాడో నిష్ఠతోడన్?
చరాచరములన్ తారుమారు చేయగల
మహాశక్తి సంపన్నుండగు యోగి
కాడా ఈ పోలీసు భటుడు? ఈ మహానటుడు?

మహానగరం నిశీధంలో చంద్రుడు ఎంత అనవసరమో వసంతం కూడా అంత నిరుపయోగంగా వుంటుంది. వీధీ విరామంలేని ట్రాముల గోలతప్ప కోకిలారావం వినపడదు. షాపులలో వసంతకాలపు అమ్మకాలన్న ప్రకటన తప్ప మరేం పచ్చగా కనపడదు. పువ్వులు ఆడవాళ్ళ చీర డిజైన్లలోనూ, వాళ్ళ జడలలోనూ తప్ప మరెక్కడా కనపడదు. పత్రికల్లో ఉగాది పద్యాలు అచ్చవుతాయి కనుక నగరంలోనికి తప్పకుండా వసంతం వచ్చితీరాలి.

మహానగరంలో మరేదైనా అబద్ధం కావచ్చునుగాని ఒక్క వృత్తి, ఒక్క వ్యక్తి మాత్రమే నిజాలు, మద్రాసు నగరంమీద బ్లూబ్లాక్ సిరాలాగ రాత్రిపడితే సగం కాంతి, సగం చీకటి ఇండ్లలో బోగంచానలు కూర్చుంటారు. అక్కడకు అన్నివిధాల మనుష్యులు వస్తారు.

ఓ బోగంచానా! నీవు
సంఘానికి వేస్టు పేపరు బాస్కటువా?
మష్టు మషాణము పడవేయబడునట్టి దిబ్బవా?

అని ప్రశ్నిస్తాడు. తర్వాత ఇలా అంటాడు.

నిన్నుగవురవిస్తున్నా నేను
నీలోనే నాకు జీవితం నిజంగా
సరిగ్గా ప్రతిఫలిస్తున్నది
ఇతర స్థలాలలోన
అంతా బూటకం అంతా నాటకం గొప్ప అబద్ధం
పూజారియబద్ధం
పరపురుషుని జూచి తలవ్రాల్చే
పతివ్రత సతీత్వ మబద్ధం
యోగులబద్ధం, అందరూ అబద్ధం
సర్వమబద్ధం
కానీ నీవు మటుకు ఓ బోగందానా!
ముసుగులేని నిష్టురమగు నిజానివి
నీడపడనటువంటి నిర్మలమగు నిజానివి.

ఫిడేలు రాగాల డజన్‌లో కొన్ని జనరల్ పద్యాలుంటే కొన్ని పర్సనల్ కవితలు ఉన్నాయి. 'సీత' 'ఆరోజు' 'నవ్యస్త్రీ' 'కామాక్షికోక' అనే పద్యాలు సెక్సుని ఆయుధంగా వాడుకున్న కవితలు. ఈ ఖండికల్లో సీత, లీల, కామాక్షి అనే యువతులు నాయికలు. నాయకుడు పఠాభియే. అయితే అక్కడక్కడ ఈ పద్యాలలో వచ్చునట్టి పఠాభి అను

పేరుగల పాత్రకు గ్రంథకర్తకు ఏ మాత్రం సంబంధంలేదని గమనింపు. కృష్ణపక్షంలో కృష్ణకు గ్రంథకర్త ఏమాత్రం సంబంధంలేదని గమనింపు. కృష్ణపక్షంలో కృష్ణకు గ్రంథకర్త నామంలోని 'కృష్ణ'కు ఎలా సంబంధం లేదో అలాగే అంటూ మొదటే హెచ్చరిక ఒకటి చేశాడు. ఉత్తమ పురుషలు కవిత్వం రాస్తున్నప్పుడు సొంతపేరునే వాడుకొనడం దానికి పొడిగింపు ఇంపు అని చెప్పాలి.

పఠాభి కవితలోని సీత రామయ్యా సతిగా నుంట కన్న రావణుని ప్రియురాలిగా వుండి హృదయం గల అసురుణ్ణి, అమరుణ్ణి'' చేయాలనుకొంటుంది. ముద్దుకృష్ణ 'అశోకం' ప్రభావం ఆనాటి యువకులపై ప్రగాఢంగా పనిచేసిందనడానికి ఇది గట్టి నిదర్శనం.

'కామాక్షికోక' ఒక వింత కవిత. మవుంటురోడ్డులో ఒక ప్రాణంలేని ప్రతిమకు కట్టుబడియున్న ఈ కోకను పఠాభి కొని కామాక్షికి ప్రజెంటు చేశాడు. ఆనాటినుంచి జరిగిన కథను ఆ కోక కథనం చేస్తుంది. ప్రాణంలేని ఒక తన యజమానురాలి ప్రణయగాథని, విరహాన్ని, ప్రియుని సమాగమాన్ని వర్ణిస్తుంది. ఇది కవి ఉపజ్ఞకు చక్కని నిదర్శనం అని విమర్శకులంటారు.

చిట్టచివరి పద్యంలో పఠాభి తెలుగు వర్ణక్రమాన్ని మార్చేశాడు. రాగంతో ఫిడేలు ఇలా అన్నదట.

''మీ వారన్దరు సనాతనాచర్ యుల్
ముఖమ్విరిచి, ఇన్గ్లీష్తానిని
నన్ను స్టైపట్ టవద్దని
గద్ దిస్చినా కూడ నీవు
మహాసాహసన్తో, రుమాన్టిక్గా
మేయారేజ్జేసుకోన్ నావుగదా! స్ వీట్ హార్ట్''
రాగమ్ అని నాడు
'థ్యాన్క్స్టు పఠాభి
నాకతడు ధ్రయిన్గా
సహాయ్యమ్ జేయపట్టి మనకు
వివాహయిన్ది డార్లిన్గ్!''

ఫిడేలుకూ రాగానికి 'అపూర్పమ్బగు' సంతానం జన్మించి వాళ్ళంతా పఠాభిని తాతా! తాతా! అనేవారట.

పఠాభి ఫిడేలు రాగాల డజన్ ప్రచురితమైన కొత్తలో చాలా పెద్ద సంచలనం రేపింది. విమర్శకులు దానిని పట్టించుకొనకా తప్పలేదు. కొందరు తిట్టిపోయక తప్పలేదు. అయితే పఠాభిది పూర్తిగా ప్రైవేటు రోడ్డు, దానిపైన ఎవరూ నడవలేదు. నేనొక్కణ్ణి మాత్రం ఆ దారిని అడ్డదారి చేసుకొని కొంత పయనించి మరోమార్గం చూసుకొన్నాను. 1938 నాటికి తెలుగువారికి తమదీ అంటూ ఒక నగరం లేకపోవడం వల్ల నాగరిక కవిత్వం రావడానికి

అవకాశం లేకపోయింది. పఠాభి టెక్నిక్ చమత్కారాలకూ, తిరుగుబాటు ధోరణికి, తెంపరితనానికి విస్తుబోయిన లోకం అతనిలోని సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకోలేదు. ఆధునిక జీవితంలో నగరం ఒక భాగమైనప్పుడు కవిత్వంలో దానికి ఇవ్వవలసిన వాటా ఇవ్వవద్దా అని అతని ప్రశ్న. అయితే ఆనాడు తెలుగువాళ్ళు దానికి జవాబు చెప్పలేదు. హైదరాబాద్ రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక మన సాహిత్య జీవనంలో క్రమేణా మార్పు వచ్చి కుందుర్తి, తిలక్ వంటి కవులు నగరాన్ని కావ్యవస్తువుగా తీసుకొన్నారు. (కుందుర్తి 'నగరంలో వాన' గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం).

పఠాభికి 'ఫిడేలు రాగాల డజన్' వల్లనే పేరూ, సాహిత్యంలో ఒక స్థానం లభించినా, అతడు ఇతర రచనలు కూడా చేయకపోలేదు. వాస్తవానికి 'రాగాల డజన్' రాయడానికి ముందే అతడు 1935-1937 సంవత్సరాలలో శాంతినికేతనంలో విద్యార్థిగా ఉన్నప్పుడు తన పదహారోయేటనే నూతన సంవిధానంతో కొన్ని రచనలు చేశాడు. పఠాభి ఉద్దేశంలో కవితా రచన అనంత పరిశోధన. అందుకే అతడు అంత్యప్రాసాలతో అనేక ప్రయోగాలు చేశాడు. శాంతినికేతనంలో ఆరోజుల్లో రవీంద్రుడు ఛందస్సులు విసర్జించి, అంత్యప్రాసలను పాటిస్తూ వివిధ దేశీయ ఛందస్సులలో రచన చేస్తూ వుండేవాడు. అది చూస్తే పఠాభి మార్గ కవితా వృత్తాలలో కాక మాత్రా ఛందస్సులలో, అంత్యప్రాసలతో రచనలు చేయడానికి ఉపక్రమించారు.

వంగభాషా కవిత్వంతోనూ, రవీంద్రునితోనూ పరిచయమయిన ప్రతిభావంతులను మాత్రా ఛందస్సులో అంత్యప్రాసలు ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. అబ్బూరి రామకృష్ణా రావుగారు 1918లోనే శాంతినికేతనం ప్రభావం వల్ల తెలుగు ఛందస్సులలో చాలా కొత్త ప్రయోగాలు చేశారు.

అబ్బూరివారు ప్రవేశపెట్టేదాకా తెలుగు సాహిత్యంలో అంత్యప్రాసలు ప్రవేశించలేదనుకోకూడదు. ప్రబంధాలలో రగడలు వాడే చోట్ల విధిగా అంత్యప్రాసలు పాటించాలి. అబ్బూరివారు ఆదిప్రాసలు పాటిస్తూ అంత్యప్రాసలు వాడితే, పఠాభి ఆదిప్రాసలు పాటించాలన్న నియమం ఏమీ పెట్టుకోలేదు. అయితే అంత్యప్రాసలు ఎలాగ పాటించాలన్న విషయంలో చాలా ఖచ్చితమైన నియమాలను పెట్టుకొన్నాడు. సాధారణంగా రెండేసి పాదాలకు అంత్యప్రాసలు వాడడం ప్రబంధాలలోని రగడలలో కనబడతాయి. పఠాభి ఆ త్రోవ కొన్నిచోట్ల తొక్కినా చాలా విలక్షణమైన ప్రయోగాలు చేస్తూ కఠినమైన నియమాలు పాటించాడు.

పఠాభి పెట్టుకొన్న ఈ వివిధ నియమాలు విశ్లేషించి చూస్తే ముందుగా ఎంత పథకం వేసుకొని పరిశోధనలు ప్రారంభించాడో తెలుస్తుంది. నిజానికి 'కయిత నాదయిత' లోని రచనల్లో కొన్ని కవితలు శాంతినికేతనంలోనే కాక ఉత్తరోత్తరా స్కాట్లండ్‌లో, సిలోనులో, స్పెయిన్‌లో రాయడం జరిగింది. తెలుగులో రాసిన కవితలే అయినా తెలుగుదేశానికి దూరంగా ఉండి రాయడం వల్ల కొన్ని కవితల్లో వినూత్న వాతావరణం కన్పిస్తుంది.

సాధారణంగా తెలుగు కవితలలో పారిజాత కుసుమాలు, మలయపవనాలు, మానస సరోవరాలు, లలిత లవంగీతలు కనపడతాయి. పఠాభి కవితలలో హెదరుపూలు, న్యూరేలియ పవనాలు, పొలనూరవ సరసు, బార్లీరయి కుప్పలు మొదలైన కొత్త కవితా సామగ్రి కనపడుతుంది. నూనూగు మీసాల నూత్న యౌవనం నుంచీ ఇందులోని ఖండికలన్నీ పఠాభి రచించాడు. ''యవ్వనమ్ము భయవిహీన నిరుపమాన సాహసమ్ము'' కనుకనే ఈ ఖండికలలోని భావాలు కొన్ని (సనాతనులకు) సాహసాలులాగా కనబడతాయి. కనపడ్డ ప్రతి ఆడదానిమీద శ్రీనాథుడు పద్యాలు ఎందుకు రాశాడో అందుకే పఠాభి కూడా రాశాడనుకొంటే ఈ సంకలనంలోని సిలోనుపిల్ల, స్కాచిపిల్ల, చయినా యువతి, హవాయి కడుతీయవాయపడతి, రజస్వల అర్థమవుతారు. వాళ్ళందరూ కవితలో దయితలు.

పఠాభి 'నీలగిరి నీలిమలు', 'పఠాభి పన్‌చాంగం' అనే ఇంకో రెండు గ్రంథ రచనలు చేశాడు. ఇవి ముద్రితాలు. మొదటిది 1959లోనూ, రెండవది 1980లోనూ అచ్చుపడ్డాయి. వాస్తవానికి 'పఠాభి పన్‌చాంగం' 1946 నాటికే రాశాడు. అవి కొన్నాళ్ళు నా దగ్గరా ఉండేవి. శ్రీశ్రీ ఆనందవాణిలో కొన్ని పఠాభి 'పన్నులు' ప్రచురించాడు. నేను జ్యోతి మాసపత్రికలో దీని ప్రచురణకు సాయపడ్డాను. శ్లేష రాణించిన హృదయం రాజిల్లుతుంది. పఠాభి శ్లేషహాయి తెలిసినవాడు. పన్నులలో సంపన్నుడు.

రచనల వల్ల సీరియస్‌నెస్ లేనివాడిగా కనిపించినా పఠాభి చాలా ఉదాత్తమైన ప్రవర్తన కలవాడు. ఉత్తమ రాజకీయ విశ్వాసాలు కలవాడు. తొలి నాటినుంచీ సోషలిస్టు, రామ్ మనోహర్ లోహియాకు సన్నిహితుడు. పఠాభి భార్య శ్రీమతి స్నేహలత అన్నివిధాలా అతని సహధర్మచారిణే. ఆమె తన రాజకీయ విశ్వాసాలకు ఎమర్జన్సీ రోజులలో జైలుపాలై, వైద్య సహాయం లేక అకాల మృత్యువు వాతపడింది. ఆమె సజీవురాలుగా ఉన్నప్పుడు పఠాభి సాహిత్యం నుండి చలనచిత్ర సీమకు వలస వెళ్ళిపోయాడు. ఆర్ట్ చిత్రాలకు అంకితమయ్యాడు. కన్నడంలో 'సంస్కార' అనే చిత్రాన్ని నిర్మించి దర్శకత్వం వహించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు అందుకొన్న ఉత్తమ చిత్రం అది. చలనచిత్రం నూతన దృశ్య కావ్యమని గుర్తించిన కొద్దిపాటి సాహితీపరులలో పఠాభి ప్రథమశ్రేణివాడు.

ఆలూరి బైరాగి (1925-1978)

పఠాభిలాగే చలనచిత్రాల కళాత్మక విలువలను తెలుసుకొని చిత్ర నిర్మాణానికి పూనుకొన్న మరొక తెలుగు కవి - ఆలూరి బైరాగి. సినిమా ప్రజలపై చూపగల ప్రభావాన్ని అతడు పూర్తిగా గుర్తించాడు. కొందరు భాగస్వాములను కూర్చుకొని 'సవతి కొడుకు' అనే చలనచిత్రాన్ని తెలుగులో నిర్మించాడు. (దీనిలో నాచేత రెండు పాటలు రాయించుకున్నాడు). బైరాగి సినిమాలలో ఒకందుకు చేరితే గల్లాపెట్టె మరొకందుకు అతణ్ణి హతాశుణ్ణి చేసింది. చలనచిత్రాల నుండి పలాయనం చేసి తన సొంత పర్గణా అయిన కవితారంగంలోనికి మళ్ళా ప్రవేశించాడు. ఆర్టు సినిమాలు తెలుగువాళ్ళకు సగమెరుక.

బైరాగి 1925లో గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఐతానగరంలో జన్మించాడు. తన పదమూడో యేట ఉత్తర భారతదేశంలో విద్యాభ్యాసానికి వెళ్ళాడు. తెలుగుతోబాటు స్వయంకృషితో హిందీ, ఇంగ్లీషు, బెంగాలీ భాషలలో ప్రావీణ్యం సంపాదించాడు. అతడు మొదట తెలుగులో కాక హిందీలో కవితలు అల్లసాగాడు. పధ్నాలుగోయేట బీహారులోని హిందీసాహిత్య సమ్మేళనంలో హిందీ కవిత్వానికి బహుమతిని అందుకొన్న ప్రజ్ఞావంతుడు బైరాగి.

దేశభక్తి, త్యాగబుద్ధిగల అందరు యువకులులాగే బైరాగి కూడా 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో తలమునకలుగా పాల్గొన్నాడు. రహస్య కరపత్రాలు ప్రచురించే కార్యక్రమంలో పనిచేశాడు. ఆనాటి యువకుల రాజకీయ ప్రస్థానంలో సామ్యవాదం సహజమైన మజిలీ. దానిని కూడా బైరాగి చేరుకొన్నాడు. సామ్యవాద శిబిరాలు వేర్వేరుగా ఉన్నాయి. బైరాగి రాయిస్టుల శిబిరంలో చేరాడు. యం.యన్.రాయ్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై వాటి మీద విశ్వాసం ఏర్పరచుకొన్నాడు. రాడికల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడయ్యాడు.

చాలామంది తెలుగు పాఠకులకు బైరాగి 'పలాయనం' అనే కవితతో ఉత్తమకవితగా పరిచయస్తుడయ్యాడు. 1953లోనో, అంతకు కొద్దినెలలు ముందుగానో ఈ కవిత ఒక పత్రికలో ప్రచురితమైంది. అప్పుడే అతనితో నాకు పరిచయం అయింది. అవి బైరాగి 'నూతిలో గొంతుకలు' ''తెలుగు స్వతంత్ర'' పత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్న రోజులు. బైరాగి చాలామందికి అర్థంకాని కవి అయ్యాడు. ఈ సంగతి దాశరథికి ఒక ఉత్తరంలో చెప్తూ ఇలా రాశాను.[3]

''ఆ తరువాత బైరాగి పద్యాలతో నాకు పరిచయమైంది. అతడు కూడా మనలాగ శుద్ధకవి. అతణ్ణి కూడా అనేకులు అర్థం చేసుకోడం లేదు. అతడి కవిత్వాన్ని ఎందరు ఆస్వాదించగలిగారో నాకు తెలియదు. అప్పుడు పూర్వంలో నాలో వచ్చిన నిరాశాభావాలు మరీ తీగెలు సాగాయి. ఇంగ్లీషు పదాలు వాడినందుకు నా పద్యాలు అర్థం కాలేదని పండితులు వాపొయ్యేరు. సరే కల్తీలేని భారతీయ పద్ధతుల్లో వ్రాసే బైరాగి సంస్కృత పదభూయిష్టమైన మంచి కవిత్వం కూడా ఈ పండితులు గుర్తించరేం అని మధనపడ్డాను. బైరాగికి వ్యాఖ్యానం రాద్దామా అని కూడా అనుకొన్నా. బైరాగి తన పద్యాలు పుస్తకరూపంలో తేవడానికి ప్రయత్నం చేస్తూ కొన్ని తిరగరాస్తున్నాడు. అవి అచ్చు అయ్యేటప్పుడు నేను వ్యాఖ్యానం, లేకపోతే కనీసం టిప్పణి రాస్తానని చెప్పాను. బైరాగి ఒప్పుకొన్నాడు.''

బైరాగి పలాయనం ఎక్కడ నుంచి? పయనం ఎటువైపు? ఆ కవితలో ఇలా చెప్పాడు.

ఎక్కడికి అడుగవద్దు!
ప్రశ్నలు అనుమాలన్ని రద్దు!
చేతబట్టి ఖాళీ సంచి

3. 'త్వమేవాహమ్' - కవి హృదయం - పుట.143

పోదాం, పద ముందిక్కడి నుంచి!
ఎక్కడికైనా సరే
బ్రతుకు వేటగాడు విసరే
ద్వేషపు బాణాల నుంచి
కాబూలివాని చక్రవడ్డీ లాంటి
ఉదయాస్తమానాల నుంచి
ఆసక్తి నుంచి
విరక్తి నుంచి
సర్వనామం నుంచి, విభక్తి నుంచి
జీవితపు వ్యాకరణం నుంచి
ఇంద్రియాల సహాయ నిరాకరణం నుంచి
అంకెల నిరంకుశత్వం నుంచి
యంత్రాల శత్రుత్వం నుంచి
మూఢుల భ్రాతృత్వం నుంచి
విసపు విరుల తావి నుంచి
అర నుంచి, పావునుంచి
దైనందిన వ్యవహారపు
దశాంస భిన్నాల నుంచి
బీజ గణితపు ధర్మపన్నాల నుంచి
ఎక్కడికైనా సరే, దూరంగా పోదాం, పద!

వెళ్ళవలసింది ఎక్కడికో తెలుసుకోకపోవడం, చెప్పవలసినదేదో తేల్చుకోలేక పోవడం ఆధునిక మానవుని శాపం. ఆలోచనకూ, ఆచరణకూ మధ్య అనుమానాలు, ఊహించడానికి ఉద్యమించడానికి మధ్య జాప్యాలు. నైరాశ్యపు చిక్కని చీకటిలో ఒక అస్పష్టపు కదలిక జాడలు. నీడలనే వెన్నాడే నీడలు. నిశ్చల విశ్వాసపు నీడల్లో సంశయాలు కదలాడే నీడలు. నేనెరిగిన ముఖమెక్కడ? నేనెరుగని సుఖమెక్కడ? అన్న ప్రశ్నలతోనే కాలం గడిచిపోతుంది. అన్వేషణకు కూడా నిరీక్షణ. పలాయనం ఫలించని ప్రయత్నమని బైరాగి మానవునికి తెలుసు.

చావునుంచి పారిపోవటమే బ్రతుకు
            బ్రతుకు నుంచి పారిపోవటమెక్కడికి?
తలపు నుంచి పారిపోవటమే మరుపు
            మరుపు నుంచి పారిపోవటమెక్కడికి?
జైలు నుంచి పారిపోతే బయలు
            బయలు నుంచి పారిపోవటమెక్కడికి?
గోడను తప్పించుకొంది నీడ
            నీడను తప్పించుకొనే దెప్పటికి?

జీవితం నుంచి పలాయనమే కళ
కళ నుంచి పలాయనమెలాగా?
మెలకువ నుంచి పలాయనమే కల
కల నుంచి పలాయన మెలాగా?

బైరాగి కళలోనూ, కలలోనూ సాంద్రత ఎక్కువ. మీగడ పెరుగులాగ గట్టిగా చలికాలంలో సీసాలలో పేరుకుపోయిన కొబ్బరి నూనెలాగ చిక్కగా ఉంటుంది. అతని కవితలో ఒకసారి హిమశీతలంగా ఉంటే మరొకసారి గ్రీష్మాతాప తీవ్రతతో ఉంటుంది. బైరాగి 'నూతిలో గొంతుకలు'లో అడుగడుగునా ఈ లక్షణాలు కనబడతాయి. ''కావ్యం తనంతట తాను వెలువరించలేని అర్థాన్ని ఏ భాష్యకారుడూ వెలువరించలేడు'' అన్న నిర్ణయానికి వచ్చి 1955లో ఆ కావ్యాన్ని ప్రచురించాడు. అయినా తొలిపలుకులో ఒక చిన్న వివరణను పాఠకునికి ఊతకర్రగా ఇచ్చాడు.

''నూతిలో గొంతుకలు సంశయ కావ్యం. దీనిలో మానవుడు 'ఏది త్రోవ?' అనే అడుగుతున్నాడు. 'నాన్యః ప్రథావిద్యతేఽయనా' అని చెప్పగలిగే స్థితిలో లేడు. చీకటిలో ప్రారంభమైన ఈ కావ్యం 'ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలను' చర్చిస్తున్నది. దీనిలోని నాయకులు 'హేమ్లెట్, అర్జునుడు, రాస్కాల్నికోవ్'. సందిగ్ధావస్థలో ఒక క్రమబద్ధమైన పరిణామాన్ని సూచిస్తున్నారు. హెమ్లెట్ వేదన కర్మపూర్వం. అర్జునుడి వేదన కర్మక్షేత్రంలో తక్షణికం. రాస్కోల్నికోవ్ బాధ కర్మ తరువాత, కాని ముగ్గురి బాధ ఒకే స్థాయిని అందుకొంటుంది. అది మానవుని సహజవేదన. అతణ్ణి త్రికాలాల్లోనూ వెంటాడుతుంది. ఆ బాధలో మధనపడనివాడు పూర్ణత్వాన్ని అందుకోలేడు. ఆ బాధ నుంచి అతడు తప్పుకునే మార్గం లేదా అంటే ఉంది. పలాయనం, కృతకశక్తుల పూజనం. ఆత్మహననం''.

బైరాగితో మనం ఏకీభవించలేకపోవచ్చు గాని అతని చిత్తశుద్ధిని శంకించలేం. ఇంకోరకం కవులు ఉన్నారని అతనికి తెలుసు. వాళ్ళలో తాను కలవలేడు. కాని, వారిని తాను గౌరవిస్తాడు.

జీవిత రుధిరస్నాత కృపాణాల శాణధారల
మధ్యందిన మహోజ్వాల మరిమరి మెరుగులిడేవేళ
వేయి తలల వాసుకి బుసలు కొట్టి కస్సున లేచి ఆడేవేళ
మరో కవిత, ఇతర కవులు, వారు సుకృతులు, వారికి నా నమస్కృతులు.

ఈ సంగతి చెప్తూనే ''పొండి పొండి! వెడలి పొండి, నేను మీ కవిని కాను'' అని స్పష్టం చేస్తాడు. ఇప్పుడు తాను నిరస్త్ర నిరస్తుడు. పరాజితుడు - మౌనవ్రతుడు. అయితే ఎంతకాలం నిర్వ్యాపారత్వం! కార్యాచరణకు మళ్ళా సంసిద్ధుడు కాక తప్పదు. పొమ్మన్నవాళ్ళు తమని మళ్ళా ఆహ్వానించాలి. వాళ్ళతో కలిసి ముందుకు సాగాలి. అందుకే ఇలా చెప్పాడు.

నూతన సూర్యోదయ కాంతులు
సరికొత్త ప్రపంచపు దూతలు
తలుపులు తట్టారదిగో

స్వాగతమివ్వండి! లెండి!
తిరిగి రండి! మరలి రండి
నవ జగతికి తరలి రండి!

అడ్డంకులు తొలగించి, సంకెళ్ళను సడలించి బాధలపై, మృత్యువుపై విజయం సాధించడానికి నిత్య నవోద్వేగంతో సాగాలి. నిరంతర ప్రగతి కావాలి అని కూడా ఒకప్పుడు ఆశిస్తాడు. సరళంగానో, జటిలంగానో రచనలు చేయగల ఈ బైరాగి ఏ తరగతి పాఠకుల కోసం ఎలా రాయాలో తెలిసినవాడు. ఏ భాషలో ఎలా రాయాలో కూడా తెలిసినవాడు. బాలల పత్రిక హిందీ చందమామ సంపాదకునిగా కొన్నాళ్ళు పనిచేశాడు. తెలుగు పిల్లల కోసం గేయాలు రాశాడు. అతని రచనలు అచ్చుపడ్డవి మూడు. అచ్చుపడనివి ఒక అయిదు ఉన్నాయి. వాటి వివరాలు ఇవి.

నూతిలో గొంతకులు	-	కవితలు (1955)
చీకటి నీడలు	-	కవితలు (1978)
ఆగమనీతి	-	స్వతంత్ర కవితలు - అనువాద కవితలు (1981)
కాంచన మృగం	-	నాటకం
పాప పోయింది	-	నవల
దివ్య భవనం	-	కథలు
బాలల గేయ కథలు		
హిందీ, ఇంగ్లీషు రచనలు		

బైరాగి సామాన్య మానవుని సమస్యలను, అసమాన్యుల సందేహాలను తన కవితలలో చిత్రిస్తూ 'నాకొంచెం నమ్మక మివ్వు' అని అర్థిస్తాడు. 'కాలుని మీద కలబడతాను' అంటూనే అంతలో కొయ్యతుపాకీ దొర అయిపోతాడు. పగటివేషగాళ్ళ వాచికాన్ని అప్పచెప్తాడు.

నమ్మకం లేని బొంది ఖాలీ సిగరెట్టు టిన్ను
నమ్మకం లేని ఆత్మ పుల్లలు లేని అగ్గిపెట్టె
నమ్మకం లేని బ్రతుకు కాలిన సిగరెట్టు బూడిద
అన్నీ ఉన్నాయి కాని, నమ్మకమొకటే లేదు
నాకొంచెం నమ్మకమివ్వు!
నమ్మకమివ్వు!
నమ్మకమివ్వు!

ఎవరైనా నమ్మకమిచ్చే లోపున తాబేలులాగ తన శీర్షాన్ని తన లోపలకే లాక్కొంటాడు. ఒంటరివాడైపోతాడు. తెలియని అన్వేషణ చేస్తాడు. ఈ సంగతే ఒక కవితలో ఇలా చెప్తాడు.

విశాల వినీల వ్యోమపు విస్తృతిలో ఒంటరిడేగనై
మందలలో తప్పిపోయిన లేగనై

వెదుకుతున్నాను, వెదుకుతున్నాను అర్థం కొరకు, అమ్మవంటి అర్థం కొరకు
రెక్కలు అలసిపోయేదాక
రిక్క నుంచి సన్నని చుక్కనై, నీలాల శూన్యంలో కలసిపోయేదాక
వెదుకుతున్నాను, వెదకుతున్నాను అర్థం కొరకు.

ఎంత ఎత్తుకు ఎగిరినా, ఎంతసేపు ఎగిరినా డేగ ఎప్పుడో ఒకప్పుడు నేలమీదకు వాలాలి. తప్పిపోయిన లేగ మందలో చేరుతుందో, క్రూరమృగం వాతపడుతుందో కసాయివాడికి దొరుకుతుందో చెప్పలేం.

బైరాగి కవిత్వంలో ఒంటరి డేగ – జీవితంలో తప్పిపోయిన లేగ.

చాయలు - పాయలు

ఒకేరంగుకు ఎన్నో చాయలుంటాయి; ఒకే నదికి ఎన్నో పాయలుంటాయి. అభ్యుదయ కవిత్వపు రంగు ఎర్రరేంగే అయినా దానిలో వివిధ ధోరణులకు వివిధ చాయలు వున్నాయి. ప్రగతి ఉద్యమం జీవనది అయినా డెల్టా దశలో అది చాలా పాయలుగా చీలిపోయింది. మన అభ్యుదయ కవులలో వివిధ చాయల ఎర్రరంగు ప్రతిభావంతులు వున్నారు. ప్రగతికవితల్లో అనుకంపవాదులు, అనుభూతివాదులు మొదలైనవారు వున్నారు.

ఎర్రరంగుకు తెలుగులో ఎర్రనకాని, కెంజాయ, కెంపు, గవరన, జాజు, జాదు, జేగురు, జుత్తు, తొగరు, తోపు, బొమ్మంచు అనే పర్యాయపదాలున్నాయి. తెలుపుమించిన ఎరుపు రంగును పయ్యో, పల్ల, పస్సి, పాలవన్నె, లేత ఎరుపు అనే సంకేతాలు వున్నాయి. నలుపు మించిన ఎరుపు రంగుకు గోరజనం, పల్లకమ్మ, పసిమి, మాధవళం అనే పేర్లు వున్నాయి.

ఈ ఎరుపురంగు చాయలు ఒక్కొక్క అభ్యుదయ కవిలో ఒక్కొక్కలాగ మనం చూడగలం. ఒకప్పుడు ఒకే కవిలో వేరు వేరు సందర్భాలలో వేరు వేరు చాయలు కూడా కనపడతాయి.

అభ్యుదయ కవిత్వంలో యిన్ని చాయలు మనకు గోచరిస్తాయి. అయితే నిత్యం యూనిఫారంలో చూసే పోలీసునూ, పోస్ట్‌మ్యాన్‌నూ మఫ్టీలో చూసి వెంటనే గుర్తుపట్టలేకపోయినట్టు కొంచెం చాయ మించిన అభ్యుదయ కవితను చప్పున పోల్చుకోలేక అభ్యుదయ కవిత్వానికి వస్తువూ, దాని దుస్తులూ యిలాగే వుండాలన్న భావం సాహిత్య లోకంలో పాతుకుపోయింది. కొంచెం విభిన్నంగా రాసిన అభ్యుదయ కవులను అంచనా వేయడం కష్టమే.

బౌద్ధం ఒక దశలో హీనయానం, మహాయానం అంటూ చీలిపోయినట్లు అభ్యుదయ సాహిత్యం అనుభూతివాదం, అనుకంపవాదం, ఫ్రీవెర్సు ఫ్రంటు మొదలైన శిబిరాలలోనికి చేరింది. ఈ వాదాలు, భేదాలు ఎలా వున్నాయో పరిశీలించడం ముఖ్యం. వాటికి ప్రాచుర్యం యిచ్చిన వారి గురించి తెలుసుకొనడం అవసరం.

దేవరకొండ బాలగంగాధర తిలక్ (1921–1966)

అభ్యుదయ కవిత్వంలో అనుభూతివాదాన్ని ప్రవేశపెట్టినవాడు తిలక్. కవిత్వాన్ని తాను అనుభవప్రభనుండి తీసుకొంటున్నాను అన్నాడు. ప్రధాన అనుభూతుల ఆకృతిలోనే కవిత్వం సాక్షాత్కరిస్తుందని విశ్వసించాడు. కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమలను బహిర్గతం చేయాలి అంటాడు. 1921లో పుట్టిన తిలక్ 1941లో అంటే తన ఇరవయ్యో యేట 'నా కవిత్వం' అనే కవితలో ఇలా అన్నాడు.

నా కవిత్వం కాదొక తత్వం
మరి కాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం -
కాదయ్యా అయోమయం, జరామయం.

తన కవిత్వం 'జరామయం' కాదనడంలో అది ఎప్పుడూ యవ్వనంతో తొణికిసలాడుతుందని ధ్వనిస్తున్నాడు. అభ్యుదయ కవులలాగే అతడూ కళా కరవాలం చేతపట్టాడు. అయితే దాని ధగద్ధగరావాలతో త్యాగశక్తి, ప్రేమరక్తి, శాంతి సూక్తి నినదిస్తానన్నాడు. ఈ మూడింటినీ సమపాళ్ళలో కలపాలని అతడెంత ప్రయత్నించినా ప్రేమరక్తి కొంచెం ఎక్కువ మోతాదులో తొలినుంచీ అతని కవితలో కనపడుతుంది.

తిలక్ తనకు 14, 15 సంవత్సరాల వయస్సు రాకముందే ఛందోబద్ధమైన కవితలు అల్లడం నేర్చుకొన్నాడు. ఫోర్తుఫారం మొదలు స్కూలు ఫైనలు దాకా తణుకులో పండిత పెన్మెత్స సత్యనారాయణ రాజుగారు తిలక్‌కు గురువులు. క్లాసులో మాత్రమే శిష్యుడు కాదు. క్లాసు విడిచిపెట్టిన తరువాత సరగుచెట్ల నీడలో పచ్చిక పరుపుపై కూర్చోపెట్టి సత్యనారాయణరాజుగారు తిలక్‌కు ప్రబంధాలు, ఛందస్సు, వ్యాకరణం చెప్పేవారు.

తిలక్ మొదట్లో ప్రణయకవిత్వం రాశాడు. భావకవులందరిలాగే ఆయనకు మానస ప్రియ ఒకామె ఉంది. అతణ్ణి 'శశీ!' అని పిలిచేది.

''అడుగిడలేను నిన్విడచి, ఆప్తులదాన విలోచనాలలో
సుడిగొన వేడి కోల్మరచి సుందర తాలవమేని లేని యీ
ఉడుకుడు కత్తి జానితము నోర్చుటకన్న దినాలు స్రుక్కి యీ
బడుగు శరీరమే నుడియవాల్పడునో శశి మానసప్రియ''

తిలక్ తన ప్రియురాలిని కవిత్వంగానూ, కవిత్వాన్ని ప్రియురాలిగానూ ఊహించుకొని తమ అనుబంధం ఎలాటిదో ఇలా చెప్పాడు.

''నాకును నీకు మైత్రి ఒకనాటిది కాదు కృతాంతమందు వా
ల్మీకుల శోక మందు మిధిలేశుని పట్టి విషాద మం
దా కృతి దాల్చెగాc మరి నవ్యశిరీష మృదుత్వమీ హృదిన్
ఏ కలలెన్ని దగ్ధమయి యీపొడిబూడిద కొండలై చనెన్''.

తన ప్రియురాలితో కలసి పచరించవలసినది ఏమిటో ఇలా చెప్పాడు.

''ఆ మహితాశయమ్ము బలమై నడిపింపగ నీవు నేను అ
స్తోమ గిరాంపదా కృషిత సుందరమయి మనస్సుల్ ధరి
త్రీ మధురాంత మందు పచరింతము ప్రేమ విలోల గానముల్
శ్రీ మదనంత విశ్వ సరసీరుహమంతటు రేకు విప్పగన్''.

ఇటువంటి ఛందోబద్ధమైన కవితలు చాలా చెప్పారు. తన పదహారోయేట 1937లో 'ప్రభాతము-సంధ్య' అనే కవితల సంకలనాన్ని ప్రచురించాడు. దీనికి కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు పీఠిక రాశారు. భారతిలో సమీక్ష వెలువడింది. నవ్యసాహిత్య పరిషత్తు సభ్యుడయ్యాడు. అతి నవ్యకవుల రీతులు గమనించి తన రచనా విధానాన్ని మార్చుకొన్నాడు. లోపల ఉన్న ప్రేరణ అతని చేత కొత్తరకం కవిత్వాన్ని చెప్పించింది. స్వప్నాలలో విహరించసాగాడు.

''అబద్ధాన్ని ఆశ్రయించిన సుఖం
నిజాన్ని నిరూపించే నరకం
కన్నా వెయ్యి రెట్లు నయం
కలలు ఎప్పుడూ మనిషికి బలం''

ఇది పలాయన వాదమని మనకు తెలుసు. కొంచెంసేపు తనతో స్వప్నంలోకి గోర్వంక రెక్కలతో ఎగిరి వచ్చిన చెలితో ఇలా చెప్పాడు.

'నిన్నూ నన్నూ బలహీనులనీ
ఎస్కేపిస్టులనీ పిలుస్తూంది
ఊపిరాడక గిలగిలలాడే ఈలోకం'

నారాయణబాబు కవితలలో కనిపించే దృశ్య భావాలవంటివి తిలక్ వర్ణించడానికి శ్రీశ్రీని అనుకరిస్తున్న కృష్ణశాస్త్రిలాగ ఇలాగ 1945లో చెప్పాడు.

చదల చుక్క
నెమలి రెక్క
అరటి మొక్క
ఆమె నొసటి కస్తురి చుక్క
కదలి వచ్చి ప్రిదిలి నవ్వి
నవ్వి నవ్వి నీరెండల పరుగులెత్తి
మావి తోపు నీడనాడి
కుంద జాజి సేవంతుల ల
వంగమల్లీ మందారుల బంతులాడి
కొలనిగట్ల పడుచుపిల్ల
కుచ్చెళ్ళతో పంతమాడి
కలల మెట్ల వంగి నడచి
అలల కడలి అంచు లొరసి

నా తలపులో కలసిపోయి
నా పలుకులో పరిమళించు
చదల చుక్క
నెమలి రెక్క
అరటి మొక్క
ఆమె నొసటి కస్తురి చుక్క

ఈ కవిత పూర్వ భాగాలలో భావాలను దొంతరలా పేర్చాడు.

ఘోష
హేష
మురళి
రవళి
కదలి కదలి
ఘణం ఘణల నిక్వణ క్వణల ఝణం ఝణల
బండి మువ్వ
కాలిగజ్జె
కలసిపోయి

పక్షి రెక్క
పొన్న మొక్క
జొన్నకంకె
తగిలి పగలి
వాన చినుకు చిటపటలో కలసి
కొబ్బరి మొవ్వ పిచ్చుక గొంతులో మెరసి
మూలుగు యీలుగు కేక
చప్పటులు చకచకలు నవ్వు
పొదివి కొనీ అదిమికొనీ
కదలి కదలి
ఘోష
హేష
మురళి
రవళి
నామనస్సులో నిశ్శబ్దపు స్తంభంలా
నిలుచున్నవి

తిలక్ ఇలా ఈ కవితను రాయడం ఆనాటి కొత్త సాహిత్య ధోరణుల ప్రభావమే.

1941 నాటికి తెలుగు కవిత్వంలో అయోమయం ప్రవేశించింది. శ్రీశ్రీ సర్రియలిజాన్ని 1940లో తీసుకువచ్చి ఫాషన్ చేస్తే బి.వి. సింగరాచార్య పూజా (రజనీ కాంతరావు),

హ్రీంహ్రీం (మల్లవరపు విశ్వేశ్వరరావు) అరాచకాన్ని, అయోమయాన్ని ప్రబలం చేశారు. మణిప్రవాళ రచనలు సందర్భశుద్ధి లేకుండా బయలుదేరాయి. పూషా 'కల్చర్ అండ్ అనార్కీ' అనే కవితలో ఇలా రాశాడు.

జీతాలూ భాషలూ దేశాలూ
ఖండాలూ సముద్రాలూ గోళాలూ
అరాజకంలో అనార్కీలో
విప్లవ విలయ ప్రణయజ్వాలలో
భగ్నం భుగ్నం మగ్నం నగ్నం కావాలి.

ప్రేమరక్తీ, శాంతి సూక్తీ ఇనుమడించిన తిలక్ లాంటి కవిలో ఈ అయోమయం అలజడి కలిగించి, ముందడుగు వెయ్యడానికి సమయం వచ్చేదాకా నిరీక్షించడానికి భావకవిత్వంలోనికి వెనుక అడుగు వేయించింది. తిలక్ స్వతహాగా కాల్పనికవాద కవితల ప్రొటీన్లతో పెరిగినవాడు. పాతవృత్తాలలో, ఊర్మిళలాంటి ఇతివృత్తాలతో కవితలు ఆదిలో అల్లేవాడు. ఒక్కొక్కప్పుడు వృత్తాలలో కవితలు అల్లిక బిగి తక్కువగా కనిపించినా భావనా తారళ్యం మాత్రం ఎన్నడూ కొరవడేది కాదని రసజ్ఞులైన మిత్రులు చెప్పేవారు.[1]

'గోరువంకలు', 'సీత' వంటి కావ్యాలు తిలక్ ప్రచురించాడు. ఇవేవీ అతని కవిత్వానికి ప్రాతినిధ్యం వహించేవిగా ప్రచారం పొందలేదు. మద్రాసు లయోలా కాలేజీలో చదువుకొంటున్నప్పుడూ, ఆ పిమ్మటా రాసిన పద్యాలు, గేయాలు 1945లో 'ప్రభాతము-సంధ్య' అనే సంకలనంగా ప్రచురించినా అది తిలక్‌కు తృప్తినిచ్చినట్టు లేదు. 1944లో బొంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల మహాసభలో పాల్గొన్నాక నూతన దృక్పథాన్ని అలవర్చుకొన్నట్టు కనబడుతుంది. సామ్యవాద భావుకుడయ్యాడు. యుద్ధవ్యతిరేకత తన రచనలలో ప్రకటించాడు.

వర్తమాన కాలానికి అనువుగా కవిత్వ రూపం మారాలని గుర్తించాడు. వృత్తాలలో, గేయాలలోకాక వచన పద్యంలోనే సమకాలీన కవిత చెప్పాలని గ్రహించాడు. కవిత్వమంటే ఏమిటో అతనికి స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఒక అసంపూర్ణ వ్యాసంలో ఇలాగ రాశాడు.

''కవిత్వం మనస్సుకీ ఉద్రేకాలకీ సంబంధించినది. ఈ మనస్సునీ ఉద్రేకాల్ని కొలిచే సరైన మానం యిదివరకు లేదు. ఇకముందు రాదు అని చెప్పవచ్చును. అంతవరకూ కవిత్వానికి సరైన నిర్వచనం రాదు. మన లోపల్లోపల జరిగే ఒకానొక అనుభూతి విశిష్టత కవిత్వానికి ఆధారం. ఆ అనుభూతి - అదే ఫీలింగ్ - అగోచరమైనది. అనిర్దిష్టమైనదీ!''

అగోచరమైనదాన్ని కళ్ళకు కట్టేటట్టు చూపించడానికి ప్రయత్నిస్తే, ముందు స్పష్టత కావాలి. తిలక్ కవితలో క్లిష్టత ఉండదు. ఏం చెప్పదలచుకొన్నాడో తనకు తెలుసు కనుక ఎలా చెప్తే అందంగా ఉంటుందో, ఆనందం ఇస్తుందో తెలుసుకోవాలన్న ప్రయత్నంలోనే ఎన్నో రచనలు చేశాడు. భావకవిత్వ పదజాలాన్ని విడిచిపెట్టి రచనలు చేద్దామనుకొన్నా

1. పిలకా గణపతిశాస్త్రి - 'ఆనందవాణి' ప్రత్యేక సంచికలో

మరులుకొన్న మగువలాగ ఆ భాషాసుందరి అతణ్ణి వదలకుండా వెంటపడుతూనే ఉంది. నాకు తిలక్ కవిత్వం 'కలవారి కోడలు కలికి కామాక్షి' లాగ కనపడుతుంది. ఒంటినిండా కాల్పనికోద్యమం కన్నవారు పెట్టిన పాతనగలూ, అభ్యుదయోద్యమం అత్తవారు చేయించిన కొత్తనగలూ పెట్టుకొన్న 'చిన్నమ్మ'లాగ సింపుల్‌గా ఉండడానికి ప్రయత్నిస్తూ ఘనంగా గలగల్లాడుతుంది.

పెన్మెత్స సత్యనారాయణగారి అంచనా ప్రకారం 1961 ఆగస్టు మొదలు 1966 వరకు తిలక్ రచనలలో అనేక కొత్త పోకడలు కానవస్తున్నాయి. ''63 వరకూ చేయి తిరగలేదా అనిపిస్తుంది. 63 నుంచి సిద్ధహస్తుడైనాడు'' అంటారు రాజుగారు.[2]

తిలక్ తన ఆదర్శ కరవాల రవాలుగా చెప్పుకొన్న త్యాగశక్తి, ప్రేమరక్తి, శాంతి సూక్తి అనే మూడింటిలో ప్రేమరక్తి కాల్పనిక సాహిత్యంలోని ప్రణయ కవితకు కాలదోషం పట్టకుండా కాపాడుకొంటూ వచ్చిందని చెప్పవచ్చు. ఇక శాంతిసూక్తి ఒక్క వర్గకలహం పట్ల ఎక్కువగా నినదించిందని స్పష్టమవుతోంది.

తిలక్‌కు సమాజంలో ఉన్న వర్గాలవారికి గురించి బాగా తెలుసు. మధ్యతరగతి వాళ్ళ మనస్తత్వాన్ని అర్థం చేసుకొన్నాడు. 1964లో రచించిన 'నీడలు' అనే ఖండికలో -

మౌఢ్యంవల్ల బలాఢ్యులు
అవివేకం వల్ల అవినాశులు
వీళ్ళందరూ మధ్య తరగతి ప్రజలు
సంఘపు కట్టుబాట్లకి రక్షక భటులు
శ్రీమంతుల స్వేచ్ఛావర్తనకి నైతిక భాష్యకారులు
శిథిలాలయాలకు పూజారులు

ఇటువంటి వాళ్ళమీద కోపగించుకోవద్దనీ, అసహ్యించుకోవద్దనీ, వీళ్ళని విడిచి వెళ్ళొద్దనీ, వీళ్ళందరూ నీ బిడ్డలనీ చిన్నమ్మకు (బహుశా శాంతికి) చెప్తూ ఆ కంఠంతోనే ఇలా అంటాడు.

ధైర్యం లేని తమ స్వభావాన్ని ధర్మమని పిలుస్తూ
బరువుగా బెదురుగా బతుకుతున్న వీళ్ళ మధ్య
డైనమైట్ పేలాలి
డైనమోలు తిరగాలి
కాళరాత్రి వేళ కంకాళాలు చెప్పిన రహస్యం తెలియాలి

సహజీవనంలో ఏ డైనమైట్లయినా ఎలా పేలుతాయి? సర్దుకుపోయి స్తబ్ధుగా ఉండే డైనమోలు ఎలా వెలుగుతాయి? రేపటి ఉదయానికి ఇవాళ వెలుగులు సమకూర్చుకోవాలిగాని ఇటువంటి శాంతి సూక్తి జోలపాటేగాని మేలుకొలుపు కాదు.

''తండ్రీ! వీళ్ళను క్షమించు, వీళ్ళేం చేస్తున్నారో వీళ్ళకు తెలియదు'' అని ఏసుక్రీస్తు దేవునితో అన్నాడట. కాని, దానికి విరుద్ధంగా తిలక్ దేవునితో ''తండ్రీ! నీవేం చేస్తున్నావో

2. 'ఆనందవాణి' ప్రత్యేక సంచిక

మాకు తెలుసు, నిన్ను ఊరడిస్తున్నా'' అన్నట్టు ప్రవర్తించగలడు. 1966లో రచించిన 'నిన్నరాత్రి' అనే ఖండికలో ''దేవుడు వచ్చి నామంచంమీద కూర్చొని దీనంగా నాకేసి చూసి కన్నులు దించుకున్నప్పుడు'' అడగవలసినవేమీ అడగకుండా, చెప్పవలసినవేవీ చెప్పకుండా 'దేవుని చెక్కిళ్ళమీద దీనంగా జారే కన్నీటిని దీపకాంతిలో చూసి చటుక్కున లేచి కౌగలించి, ఊరడించి, కన్నీటిని తుడి వెళ్ళిరమ్మని వీధి చివరిదాకా సాగనంపి'' రావడం తిలక్‌లోని త్యాగశక్తికే సాధ్యం మానవుడే దానవుడై తిరగబడినప్పుడు పాపం పెద్దవాడు, కన్నకడుపు, ఏం చేస్తారు?' అని దేవుణ్ణి క్షమించే తిలక్ ఉత్త-దయామయుడు.

కవితాకన్య వినీలశిరోజ తమస్సముద్రంలో ముఖం మునిగిపోయినవాడు అనుభూతి పాట వింటాడేమోగాని ఆచరణలో చాటి చూపలేడు.

కుందుర్తి ఆంజనేయులు (1922-1982)

దేవరకొండ బాలగంగాధర తిలక్ దేవుని క్షమించి పల్లెతుమాట అనక కన్నీరు తుడిచి పంపివేస్తే దేవుణ్ణి సంబోధించి ఒక తెలుగుకవి 'ఇంట్లో జరిగే యిబ్బంది ప్రతిదాని వెనకాల నీ రహస్య హస్తం కనిపిస్తుంది' అని ధైర్యంగా అనగలడు. అతడు కుందుర్తి ఆంజనేయులు.

దేవుడు కాడు గీతాకారుడు. ఇప్పుడు కవే, వినేవాడు నరుడు పామరుడు. కవి అతనితో 'నీకు భయం లేదు, తుది విజయం దక్కకపోదు' అని చెప్పాడు.

యుగానికొటొకటిగా పెంచుతాను
గీతలో చేసిన యోగవిభాగం
కర్మజ్ఞానాది పూర్వోక్తయోగాలకు
కలుపునేడు జగద్విప్లవ యోగం!

....

శ్రద్ధగా వినవోయి నరుడా
నేను - సంభవామి యుగే యుగే!

1949లో 'యుగే యుగే' రచించినా కుందుర్తి అంతకు అయిదేళ్ళ ముందుగానే 1944లో 'నయాగరా' కవులలో ఒకనిగా దేశానికి పరిచయమయ్యాడు. అతనికి చాలా చిన్నప్పుడే సాహిత్యంపై అభిరుచి, సామ్యవాదంపై అభిమానం కలిగాయి. గుంటూరుజిల్లా నరసరావుపేట తాలూకా కోటవారిపాలెంలో కుందుర్తి ఆ గ్రామం మునసబు కామయ్యగారికి జన్మించినా, బాల్యంలోనే తండ్రిపోవడం వల్ల పితామహుల ఊరు మానుకొండలో పెరిగాడు. కుందుర్తికి సాహిత్యజ్ఞానం తన తాతగారు బొగ్గవరపు కృష్ణయ్యగారి వల్ల కలిగింది. ఆయన ఇంట్లో భారత రామాయణాలు చదువుతూ ఉంటే కుందుర్తి ఆసక్తితో వినేవారు. కృష్ణయ్యగారింటికి ఆ ఊరివారే అయిన పలుపుల శివయ్యగారు రోజూ వచ్చేవారు. అప్పటికే శివయ్యగారు కమ్యూనిస్టు కార్యకర్తలు. అతడు కృష్ణయ్యగారితో దేవుడు లేడని వాదిస్తూ ఉంటే కుందుర్తి శ్రద్ధగా వినేవాడు. వినుకొండలోనే గుర్రం జాషువాగారు ఉండేవారు. కుందుర్తి ఆయన దగ్గర కూర్చుని

'ఆధునిక' కవిత్వాన్ని వినేవాడు. జాషువాగారి 'ఫిరదౌసి' కావ్యానికి కుందుర్తి మొదటి శ్రోత.

వినుకొండలో మిడిల్ స్కూలు విద్య, బెజవాడలో ఎస్.ఎస్.ఎల్.సి. ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసి పిమ్మట గుంటూరులో బియ్యే పట్టాన్ని కుందుర్తి పుచ్చుకొన్నాడు. బెజవాడలో ఉన్నప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యుడు. చిన్నప్పుడు జాషువాగారి కవిత్వం, తరువాత విశ్వనాథవారి శిష్యరికం కుందుర్తిలో సాహిత్యాభిరుచిని పెంపొందించినా అతడు 'అతినవ్యకవిత్వం' వైపే మొగ్గాడు. అప్పటికింకా అభ్యుదయ కవిత్వమనే మాట వాడుకలోకి రాలేదు. ఏల్చూరి సుబ్రహ్మణ్యంతో కలసి కుందుర్తి నరసరావుపేటలో అతినవ్యకవిత్వంపై ఒక సభలో ప్రసంగాలు మార్క్సిస్టు ధోరణితో చేశారు. ఆసభకు అధ్యక్షత వహించిన కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు 'గాభరాపడి' 'త్రివేణి'లో వ్యాసం రాశారు.[3]

నరసరావుపేటలో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, అనిసెట్టి సుబ్బారావు ఇంకా కొందరు కలసి 'నవ్యకళా పరిషత్తు' అన్న సంస్థను స్థాపించారు. ఇది నవ్యసాహిత్య పరిషత్తుకు పోటీగా నిలబడుతుందని భావించారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షుడుగా, అనిసెట్టి సుబ్బారావు కార్యదర్శిగా ఉన్న ఈ యువకుల సంస్థలో బెల్లంకొండ రామదాసు, దండమూడి కేశవస్వామి ప్రారంభసభ్యులు. కొంచెం ఆలస్యంగా కుందుర్తి ఇందులో చేరాడు. ఈ సంస్థలో ఇతర సభ్యులు దేవరకొండ బాలగంగాధర తిలక్, వి.వి.కృష్ణారావు, పోలూరి ఆంజనేయప్రసాద్, సముద్రాల రామానుజం (జూనియర్ సముద్రాల), దేశిరాజు కృష్ణశర్మ మొదలైనవారు. ఈ నవ్యకళా పరిషత్తే 'నయాగరా' అనే కావ్య సంకలనాన్ని ప్రచురించింది. ఇందులో ఏల్చూరి, కుందుర్తి, బెల్లంకొండ ముగ్గురి రచనలే ఉన్నాయి.

నయాగరా కవులు శ్రీశ్రీ తర్వాత తిరుగుబాటు జెండాను గుంటూరులో ఎగరేసిన వాళ్ళేగాని వాళ్ళు నిజంగా కమ్యూనిస్టులు కాదు. తదభిమానులే. అయినా దాదాపు అరాచకవాదులు. ఆ సిద్ధాంతానికి అనుయాయులే కాని తత్సంబంధమైన రాజకీయ నాయకుల పెత్తనాన్ని సాహిత్యరంగంలో సహించేవాళ్ళు కాదు. అందులోనూ ఏల్చూరి సహించినంత కుందుర్తి సహించలేకపోయాడు. అతడు తలవూపినంతకూడా రామదాసు ఊపేవాడుకాదు. ''ఇది వర్గ స్వభావమో, పెటీ బూర్జువా దర్పమో నాకు తెలియదు'' అని కుందుర్తి రాశాడు.[4]

కుందుర్తి మధ్యతరగతివాడే. ఈవర్గంలోని అందరికీ ఉన్నట్టే అతనికీ బరువులూ, బాధ్యతలూ ఉన్నాయి. తల్లిగారు పోరగా, పులుపుల శివయ్యగారు కోరగా కుందుర్తి చాలా ఉద్యోగాలు చేపట్టాడు. తండ్రిగారి దగ్గర్నుంచి వారసత్వంగా వచ్చిన కోటవారిపాలెం గ్రామ మునసబుగిరీ కొన్నాళ్ళు 'వెలగ'బెట్టాడు. తర్వాత టుబాకో మార్కెటింగ్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. చివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి

3. కుందుర్తి వ్యాసాలు - పుట.231
4. కుందుర్తి వ్యాసాలు - పుట.268

'ఇన్‌ఫర్‌మేషన్ అండ్ పబ్లికేషన్స్' డివిజన్‌లో అనువాదకునిగా, 1956లో పౌరసంబంధాల శాఖ ఆఫీసరుగా పనిచేశాడు. రెండున్నర దశాబ్దాలు ఇందులో కొనసాగాడు. ఏ ఉద్యోగం చేస్తున్నా అతడు కవితా వ్యాసంగం మానలేదు. శీలా వీర్రాజుగారు చెప్పినట్టు కుందుర్తికి ''కవిత్వం ఒక హాబీ కాదు. అలంకారమూ కాదు. అది ఆయనకు ఊపిరి. గాలి ఆడకపోతే ఎలా ఉక్కిరి బిక్కిరి అయిపోతాడో వరుసగా ఒక నెలరోజులు ఒక్క కవిత కూడా రాయకపోతే అలా ఉక్కిరిబిక్కిరి అయ్యే మనస్తత్వం ఆయనది. కనుకనే అన్ని కవితలు రాయగలిగాడు.''[5]

'నయాగరా' రోజుల నుంచి ఎన్నో అంచెల మీద కుందుర్తి కవితా ప్రస్థానం జరిగింది. అభ్యుదయ కవులందరిలాగే అతడూ వివిధ పరిణామాలకు లోనయ్యాడు. గణబద్ధమైన పద్యం - మాత్రాచ్ఛందస్సులు, ఫ్రీవెర్సు అనేవి క్రమపరిణామాలు. వచన పద్యం దిగుమతి సరకుకాదు. చారిత్రక అవసరం. కవితలంటే ఏమిటో అతనికి తెలుసు. అది ఒక నాదమై అతనిలో మోగింది. దానిని ఇలాగ అతడు చెప్పాడు.

పుట్టని ఒక భవిష్యత్తులోకి
పుట్టెడు వూహల చేతుల చాచి
అక్కడి అందాలు చందాలు
ఆవిష్కరించటం కవిత

నిత్య జీవితం చూసేది నిరంతర బాధలైనా
నెత్తిమీద ఎత్తుకున్నది కడివెడు కష్టాల గాథలైనా
బాధల గాథల వెనుక
బోధగా పరచుకున్న సత్యాన్ని
పట్టుకునే పరిశ్రమ కవిత

పేరులోనే భయపెట్టే భూతకాలం మెడల వంచి
వివేకంతో మర్యాదగా వేర్పరచి చెడూ, మంచి
చీకటికి లొంగని, వెలుగుచూసి వెర్రిగా పొంగని
సమన్వయం సాధించటం కవిత

మూడు కాలాల జీవనాడులు శోధించి
తెలిసింది ఏది చెప్పాలో
ఎలా దానిని చెప్పడం?
కవితలో జ్ఞాన లోచనం విప్పడం!

'పాతకాలం పద్యమైతే
వర్తమానం వచన గేయం'.

5. కుందుర్తి -''ఇది నాజెండా''లో 'జండా ఎగరేశాం' అనే ఉపోద్ఘాతం నుండి. పుట.6

కవిత్వ తత్త్వం, దానిని వెల్లడించవలసిన రీతీ తెలిశాక కుందుర్తి వచన కవితా ఉద్యమం ప్రారంభించాడు. ఆదిలో దానిని 'వచన గేయం' అనేవాడు. 1967లో 'ఎందుకు వచన గేయం!' అన్న ప్రశ్నకు సమాధానం ఒక వ్యాసంలో రాశాడు.[6] అందులో ఇలా చెప్పాడు.

''ప్రజా జీవితాలను సర్వసమగ్రంగా చిత్రించ ప్రయత్నించడం ఆధునిక కవితా లక్షణం. అందుకే వచన గేయాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. సంఘంలో పై అంతస్తుకు మాత్రమే పరిమితం కాకుండా, క్రిందికి దిగి సామాన్య ప్రజల మధ్య నిలబడి చిత్రవిచిత్రమైన, బహుక్లిష్టమైన, ఆధునిక జీవితంలోని వివిధ ఘట్టాలను వర్ణించాలంటే - అది ఒక వచన గేయమే చేయగలదు. సంప్రదాయ ఛందస్సు ఆధునిక జీవితాన్ని యిరికించడానికి చేసిన ప్రయత్నాలన్నీ నాకు తెలిసినంతవరకూ పూర్తిగా విఫలమయ్యాయి''.

అభ్యుదయ సాహిత్యపు తొలిరోజుల్లో మాత్రా చ్ఛందస్సుల గుర్రాలు జోరుగా పరుగెత్తాయని చెప్పి కుందుర్తి ఇలా ఇంకోచోట రాశాడు.[7]

''మాత్రా చ్ఛందస్సులు కూడా ఆధునిక జీవన చిత్రణకు అడ్డంకిగానే వున్నాయనే స్పృహ కవులకు కలుగలేదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ప్రపంచ పరిస్థితులలో ప్రశాంతి ఏర్పడి రోషావేశాలు తగ్గిన తరువాత కవుల మనస్సు మాత్రా చ్ఛందస్సులను వదలి వచన కవిత్వంవైపు పూర్తిగా మొగ్గింది. స్థూలంగా చూస్తే మాత్రా చ్ఛందస్సులు ఆవేశపు కుమ్మరింతకు వచన కవిత్వం ఆలోచనాత్మకమైన మార్పుకూ ప్రతినిధులుగా పనికి వచ్చాయని చెప్పుకోవచ్చు''.

కుందుర్తి స్థాపించిన ఫ్రీవర్స్ ఫ్రంటు వచన కవితను ప్రోత్సహించడానికి ఏటేటా ఒక ఉత్తమ కవితా సంపుటానికి బహుమతి ఇస్తూ వచ్చింది. ఆ బహుమతుల వివరాలు కొన్ని ఒక విమర్శకుడు ఇలా ఇచ్చాడు.[8]

1967	-	కొడిగట్టిన సూర్యుడు	-	శీలా వీర్రాజు
1968	-	చలి నెగళ్ళు	-	పి. వరవరరావు
1969	-	చితి చింత	-	వి. మోహనప్రసాద్
1970	-	దిక్సూచి	-	బి. భాస్కరరెడ్డి
1973	-	తూర్పుగాలి	-	నగ్నముని
1974	-	రక్తసూర్యుడు	-	కె. శివారెడ్డి
1975	-	వెలుతురు పిట్టలు	-	కె. శ్రీమన్నారాయణ
1976	-	మృత్యువృక్షం	-	ఇస్మాయిల్
1977	-	అనుభూతి గీతాలు	-	శ్రీకాంతశర్మ

6. కుందుర్తి వ్యాసాలు - పుట.129
7. కుందుర్తి వ్యాసాలు - పుట.236-7
8. ఎస్వీడీ చంద్రశేఖర్ - వచన కవిత్వం కుందుర్తి పాత్ర - పుట.8

1979	-	విభావరి -	సి. హనుమయ్య	
1980	-	అమ్మచెట్టు	-	దేవీప్రియ
1981	-	గుండెచప్పుళ్ళు	-	అనురాజేంద్ర
1982	-	మైలు రాయి	-	ఎన్. గోపి
1971	-			
1972	-	సంవత్సరాల్లో బహుమతి ఎవరికీ లభించలేదు		
1978	-			

వచన కవిత్వాన్ని ఉద్యమంగా ఇంత ఉత్తేజకరంగా నడిపిన కుందుర్తికి ఈ ప్రక్రియ పరిమితులు బాగా తెలుసు. 'కుందుర్తి కృతులు' అనే తన రచనల బృహత్సంకలానికి 1975లో 'ఇది నాదారి' అనే పీఠిక రాస్తూ అతడు ఇలా చెప్పాడు.

''అభ్యుదయ కవిత్వం రోజుల నుండి ఆధునిక కవుల లక్ష్యం కవిత్వాన్ని ప్రజలకు వీలైనంత చేరువుగా తీసుకొనిపోవడం. ఇది ఒకవిధంగా కొంతవరకు వివాదాస్పదమైన విషయం. వచన కవిత్వానికి సంబంధించినంతవరకూ సూక్ష్మంగా చూసినట్లయితే ఈ లక్ష్యం పాక్షికంగా మాత్రమే నెరవేరిందని అంగీకరించక తప్పదు. అది నిరక్షరాస్యులైన కోట్లాది సామాన్య ప్రజానీకం యొక్క గాథలను బాధలను మాత్రమే ప్రతిఫలిస్తూ సాగినప్పటికీ అక్షరాలా వారి దగ్గరికి పోలేకపోయింది. ప్రజల సాహిత్య సాంస్కృతిక స్థాయి దగ్గరకి పోలేదు. అందువల్లనే కాబోలు విప్లవ కవులు మొదలగు అత్యాధునికులు లయబద్ధమైన దేశిచ్ఛందస్సులవైపు మరలుతున్నారు. నేరుగా సామాన్య ప్రజల దగ్గరకి పోయి ప్రబోధం చేయాలంటే దేశి మార్గమే శరణ్యాము. అభ్యుదయ కవిత్వపు రోజుల్లో గూడా సుంకర, వాసిరెడ్డి ప్రభృతులు ఈ మార్గాన్ని చేపట్టి రచనలు చేశారు. బుర్రకతలు, జంగం కథలు, జముకుల కథలు జానపద గేయఫణితుల సరళ సుందరములైన నాటక ప్రదర్శనములు మొదలగు వాటి ద్వారానే నిజంగా ప్రజలను చేరుకొనే అవకాశం ఉంది. వచన కవిత్వం మొదలగు ఈ రూపాలు కొద్దో గొప్పో చదువూ సంస్కారం గల మధ్యతరగతి ప్రజలను మాత్రమే ప్రబోధితం చేయగలుగుతాయి. చూడగా చూడగా పూర్వం తెలుగు సాహిత్యంలో వున్న మార్గదేశి కవితా విభాగం ఇప్పుడు కూడా తప్పదేమోననిపిస్తుంది. ఈ రెండు మార్గాలలో దేని ప్రయోజనం దానిదని సరిపుచ్చుకోవడం ఒక్కటే ఉచితమైన ఆలోచనా విధానం''.

కుందుర్తి ఏ సమస్యనైనా రెండు పక్కల నుంచి చూడగలడు. వచన కవిత్వంలో కథా కావ్యాలు రావాలన్నాడు. అవి అందరూ రాయలేరని కూడా అతనికి తెలుసు. తాను తెలుసుకొన్నవి దాచుకోకుండా నలుగురికీ చెప్పడంలోనే కుందుర్తి ప్రత్యేకత ప్రస్ఫుటంగా కనబడుతుంది. అతని అభిమతం వచన పద్యమే కానీ, మతం మాత్రం మార్క్సిజం.

పరపాలనలో నలిగే బానిసలకు మతమేమిటి?
కార్మికులకు మతమేమిటి? కర్షకులకు మతమేమిటి?
జగతి వక్రగమనంలో రకరకాల పీడితులకు

అణగారిన కోటి కోట్ల మానవులకు మతమేమిటి?
దినం దినం పొలాలలో గని గర్భం లోతుల్లో
గడిపే శ్రామికులారా!
ధనిక నాయకులు చెప్పే ఈ మతాలు మీకు లేవు
శ్రమ జీవుల మతం మీది! నిరుపేదల మతం మీది!

కుందుర్తిది శ్రామిక పక్షపాతం.

అనిసెట్టి సుబ్బారావు (1922-1981)

కుందుర్తి ఆంజనేయులులాగే 1942 ప్రాంతాలలో 'అతినవ్య కవిత్వం' ప్రారంభించి అన్ని మజిలీలు పయనించి, మార్క్సిజాన్ని చేరుకొన్న మరొక అభ్యుదయకవి అనిసెట్టి సుబ్బారావు అయితే తన కవితలలో ఎక్కువగా పడికట్టు మాటలు వాడకపోవడం వల్ల, పేదలపట్ల కారుణ్యాన్నే విస్తారంగా ప్రయోగించడంవల్లా, ''అనిసెట్టి సుబ్బారావుగారు అభ్యుదయకవేనా?'' అని ఇటీవల సాహిత్య విమర్శకునిగా వ్యాసాలు రాస్తున్న ఒక భాషా శాస్త్రజ్ఞుడు ప్రశ్నించాడు.[9] ఆయన ఒక వ్యాసంలో ఇలా చెప్పాడు.

''అభ్యుదయ కవుల్లో అనిసెట్టి వేరుగా కనిపిస్తాడు. అభ్యుదయ కవిత్వం ఆవేశ ప్రధానమైనది. కానీ అనిసెట్టి కవిత్వం అనుభూతి ప్రధానంగా ఉండేది. అభ్యుదయ కవిత్వపు కూర్పు ఘాటుగా వుంటుంది. కాని అనిసెట్టి కూర్పు సున్నితంగా ఉండేది. ఇతను నిజంగా అభ్యుదయ కవేనా? అనిపించేటంత భావ సౌకుమార్యం అతని కవిత్వంలో కనిపించేది''.

'అభ్యుదయ కవిత్వం' అనే మాట చెలామణిలోనికి రాని రోజులనుంచీ అనిసెట్టి ప్రగతివాద దృక్పథంతో కవితలు రాసేవాడు. అప్పుడు 1940 దశకం ప్రారంభంలో ఆధోరణి రచనలను అతినవ్యకవిత్వం అనేవారు. నూతన ఫక్కీ రచనలు చేస్తున్న అనిసెట్టికి భావకవిత్వ పరిచయం లేకపోలేదు. పుట్టింది గుంటూరుజిల్లా నరసరావుపేట తాలూకాలోని పురుషోత్తమ పట్నంలోనే అయినా అతడు పెరిగింది నరసారావుపేటలో. అప్పుడు అక్కడ నాయని సుబ్బారావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, అడవి బాపిరాజు, బెల్లంకొండ రాఘవరావు మొదలైన సాహితీపరులు ఉండేవారు. వాళ్ళ ప్రభావంలో అనిసెట్టి సాహిత్యావగాహన పెరిగింది. అయితే తన ఈడు సాహితీపరుల సహచర్యం వల్ల అభిరుచులు అతినవ్య కవిత్వంవైపు మళ్ళాయి.

అనిసెట్టి పుట్టింది ఆగర్భ శ్రీమంతుల ఇంట్లోనేగాని అతడు తన చుట్టూ ఉన్న ఆగర్భ దరిద్రుల ఆర్తనాదాలనే విన్నాడు. బిచ్చగాళ్ళ దీనాలాపాలను ఆలకించాడు. అతని తండ్రి కోటిలింగంగారు కోటికి పడగెత్తగల శ్రీమంతులు. నరసరావుపేటలోనూ, చిలకలూరిపేటలోనూ ఆయిలుమిల్లులు, ఇరవై లారీలు ఉండేవి. (తండ్రికి మిల్లులోని పనివాళ్ళు ఒకసారి సమ్మె చేస్తే అనిసెట్టి ఆ కార్మికుల పక్షమే వహించి తండ్రికి కోపం

9. 'చేరాతలు' - చేకూరి రామారావు - ఆంధ్రజ్యోతి దినపత్రిక - ఆదివారం సంచిక, మార్చి 1991

తెప్పించాడు). ధనవంతుల బిడ్డలు 'చెడి'పోతూ ఉన్నప్పుడు ఆ తండ్రులు పై చదువుల మిషమీద కొడుకలను వేరేచోట్లకు పంపించి తమకు అడ్డం రాకుండా చూసుకొంటారు. 1941 నాటికి గుంటూరు హిందూ కళాశాలలో బియ్యే పట్టా పుచ్చుకొన్న అనిసెట్టిని అతని తండ్రి 'లా' చదవడానికి మద్రాసు పంపించారు.

1941 నుంచి 1943 దాకా అనిసెట్టి మద్రాసులో ఉన్నాడు. శ్రీరంగం నారాయణ బాబుకి 'రూంమేట్'. ఇద్దరి అభిరుచులూ ఒకటే. బెంగాల్‌లో ఉన్న విప్లవకారులు మద్రాసు వచ్చి రహస్య కార్యకలాపాలు సాగిస్తూ ఉంటే వారితో అనిసెట్టి స్నేహం చేసేవాడు. వాళ్ళ కరపత్రాలను అనువదించసాగాడు. ఒక విప్లవకారుణ్ణి గుంటూరు తీసుకువెళ్ళి అక్కడ అతనికి ఒక రహస్య స్థావరం ఏర్పాటు చేసి, భోజనసదుపాయాలు, జరిగేటట్టు చూశాడు. గుంటూరు వెళ్ళడానికి మిష తన వివాహప్రయత్నం. పెళ్ళికి సర్వసన్నాహాలు చేసుకొని కావలసినవి కొనుక్కోవడానికి మద్రాసు వెళ్ళాడు. పోలీసులు రహస్య విప్లవకారులను వెన్నంటి గుంటూరులోనే పసికట్టారు. పట్టుకొన్నారు. మద్రాసుకు వెళ్ళిన అనిసెట్టిని కూడా అతని గదిలో అరెస్టు చేశారు. కోర్టులో అతనికి రెండేళ్ళు కఠినశిక్ష వేశారు. ('నాపెళ్ళికి ముందే ప్రభుత్వం నన్ను అత్తారింటికి పంపిందోయ్!' అంటూ అనిసెట్టి నాతో చమత్కరించి తర్వాత చెప్పాడు.)

1944లో జైలు నుంచి విడుదల అయ్యాడు. గుంటూరు వెళ్ళి పెళ్ళి చేసుకొన్నాడు. అతడు కార్యదర్శిగా ఉంటున్న 'నవ్య కళాపరిషత్తు' అతని పెళ్ళికానుకగా 'నయాగరా' అనే కవితా సంకలనాన్ని ప్రచురించింది. ఇందులో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు రచించిన వచన గేయాలు ఉన్నాయి. ఈ ముగ్గురినీ 'నయాగరా కవులు' అని లోకం తర్వాత పిలవసాగింది. నవ్యకళాపరిషత్తుకు పోటీగా 1940లోనే యువకులు స్థాపించుకొన్నది. అయితే నవ్యసాహిత్య పరిషత్తువారు ఈ నవీనులను తమ మహాసభలకు ఆహ్వానిస్తూ ఉండేవారు. సభ్యులుగా చేర్చుకొన్నారు. నవ్యకళాపరిషత్తు గురించి కుందుర్తి ఒకచోట ఇలా రాశాడు.[10]

''నవ్యకళాపరిషత్తు సంస్థ ప్రధాన స్థాపకుడు ఏల్చూరి. అతని ప్రతిభాబలంతోనే ఆ సంస్థ వెలసింది. రామదాసు, అనిసెట్టి, దండమూడి కేశవరావు (ఇప్పుడు కేశవస్వామి) ప్రారంభసభ్యులు. నేను దీనిలోకి కొంచెం ఆలస్యంగా ప్రవేశించాను. అందువల్ల నేను స్థాపక సభ్యుణ్ణి అని చెప్పడానికి వీలులేదు. ఈ సంస్థలో ఇతర సభ్యులు కీ.శే. బాలగంగాధర తిలక్, సి.వి.కృష్ణారావు, పోలూరి ఆంజనేయప్రసాద్, జూనియర్ సముద్రాల, దేశిరాజు కృష్ణశర్మ మొదలైనారు. అప్పటికి ఇంకా అభ్యుదయ కవిత్వం అనే మాట వాడకంలోకి రాలేదు. మేము దానిని అతినవ్య కవిత్వం అనేమాట వాడకంలోకి రాలేదు. మేము దానిని అతి నవ్యకవిత్వం అనేవాళ్ళం... నవ్య సాహిత్య పరిషత్తులో ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే మేము సభ్యులుగా ఉన్నట్టు గుర్తు. అది అయినా నామ్‌కే వాస్తే సభ్యత్వం. మేము కోరిన మీదట ఏలూరు నవ్య సాహిత్య పరిషత్తు సభ్యులలో ఒక ఉదయం పూర్తిగా నవ్యకళా

---

10 .కుందుర్తి వ్యాసాలు - పుటలు.230-231

పరిషత్తు సభ్యులకు కేటాయించారు. దీనినే తల్లావఝ్ఝలవారు ఏర్పాటు చేశారు. మేము ఏలూరు సభలకు వెళ్ళాం. అప్పటికే శ్రీశ్రీకి నవ్యసాహిత్య పరిషత్తులో యువకుల ప్రతినిధిగా ప్రముఖ స్థానం ఉన్నది. దానిని ఎలాగైనా తొలగించాలని మల్లవరపు విశ్వేశ్వరరావుగారు మమ్మలనందర్నీ కూడగట్టుకోవాలని, యువనాయకత్వాన్ని తను చేపట్టాలని ఆ రెండురోజులలో ప్రయత్నం చేశారు. కాని మేము వినలేదు. ఆ సభలోనే అనిసెట్టి 'ప్రతిభ'కు ఉపసంపాదకుడో, సంపాదకవర్గపు సభ్యుడో అయినాడు. మేము మాత్రం ఏమి కాలేదు. అందువల్ల నవ్య సాహిత్య పరిషత్తులో మా ఆక్టివిటీ చాలా స్వల్పం. నవ్యకళా పరిషత్తు ఆక్టివిటీ కూడా నయాగరా ప్రకటన తరువాత క్రమక్రమంగా మేము అందరం ఎక్కడివాళ్ళం అక్కడ విడిపోవడంతో సన్నగిల్లింది.''

నా దగ్గరున్న ఆకరాల వల్ల నవ్యసాహిత్య పరిషత్తు కార్యవర్గంలో ఏల్చూరి సుబ్రహ్మణ్యం పేరేగాని అనిసెట్టి వివరాలేం కనపడవు. (నాదగ్గర ప్రతిభ సంపుటాలు ఆరూ లేవు. కొన్నే చూశాను). ప్రతిభలో అనిసెట్టి సుబ్బారావు కవితలు మాత్రం ప్రచురితమవు తుండేవి. పెళ్ళి చేసుకొన్నాక అనిసెట్టి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదవడానికి వాల్తేరు వెళ్ళాడు. ఎంచుకొన్న సబ్జక్టు ఆంగ్ల సాహిత్యం. అనిసెట్టి ఎక్కడుంటే అక్కడ యువసాహితీపరులందరితో స్నేహం చేసుకొని వాళ్ళ మధ్య తాను ఉంటాడు. తన చుట్టూ వాళ్ళను కలుపుకొంటాడు. వాల్తేరులో కె.వి.రమణారెడ్డి, పెనుమర్తి విశ్వనాథశాస్త్రి (అజంతా), మాండలిక సుబ్బారావు (మాన్సు), ఇస్మాయిల్, ప్రయాగ సూర్యనారాయణ మూర్తి మొదలైనవారు అతని స్నేహబృందంలో వుండేవారు (నేను ఆ రోజుల్లో విశాఖపట్నంలో ఫోటోగ్రాఫర్‌గా ఉండేవాణ్ణి. అనిసెట్టి నాకు మద్రాసులోనే 1943 నుంచి స్నేహితుడు. 1947 తర్వాత నేను వైజాగులో ఉంటూ త్వమేవాఽహమ్ రాస్తున్నప్పుడు అనిసెట్టి, అతని మిత్రబృందం దానికి తొలి శ్రోతలు.)

1940 నుంచి అతినవ్య కవితలు రాస్తూ 1943లో అభ్యుదయ రచయితల సంఘంలో చేరాక అభ్యుదయ సాహిత్యాన్ని సృష్టిస్తున్న అనిసెట్టి 1949దాకా తన కవితల సంకలనాన్ని ప్రచురించలేదు. 1943లోనే దానికి 'అగ్నివీణ' అనే పేరును నారాయణబాబే పెట్టాడు. అందులో 'జ్వాలాతోరణం', 'శాసనాలు', 'మాతృసంగీతం' అనే మూడు విభాగాలు ఉన్నాయి.

సంఘంలో అభాగ్యులను బంధించిన శాసనాలను శాపాలుగా గుర్తించి, వాటిని ధిక్కరించే నూతన శాసనాలను రెండో భాగంలో రచించాడు. ఇవి సంఖ్యకు ఏడు మాత్రమే. మాతృ సంగీతంలో కూడా ఏడు గీతాలున్నాయి. అనిసెట్టి మీటిన 'అగ్నివీణ' మీదా, అతడు వినిపించిన 'అణు సంగీతం' మీదా ఇటీవల ఆవంత్స సోమసుందరం చాలా విపులమైన విమర్శనా గ్రంథాన్ని రచించాడు. అందులో అనిసెట్టి హృదయాన్ని ఆవిష్కరించాడు. దీనిని చదివితే ''అనిసెట్టి సుబ్బారావుగారు అభ్యుదయకవేనా'' అన్న ప్రశ్నకు ''అభ్యుదయకవే'' అన్న సమాధానం లభిస్తుంది.

పిలకా గణపతిశాస్త్రిగారు 'అమ్మా మాదాకబళం తల్లీ' అనే ఒక గీతికను రాస్తే ఆ రోజులలోనే అనిసెట్టి 'బిచ్చగాళ్ళ పదాలు' అనే చిన్న పుస్తకంలో హృదయాన్ని

ద్రవింపచేసే గేయాలు రాశాడు. ఒక బిచ్చగత్తె దీనాలాపాన్ని ఇలా ఆమె మాటల్లోనే వినిపించాడు.

గుండె తడబడినదీ
గొంతు తడుపమ్మా
తులసికోటకు నీరుతోడినంతమ్మా
కాలిపోయే ఇల్లు చల్లార్చినంత
పనికిరానీ చిరుగు
పడవేయి తల్లీ
స్వామి వారికి వలువ చదివించినంత
శిధిలానప్రాకారమెత్తినంతమ్మా

బిడ్డకొక పిడికిలీ
విడువమ్మ తల్లీ
నట్టింట దీపమే నిలిపినంతమ్మా
పడినడిచి చచ్చాము ప్రాణి నిలుపమ్మా
అంగిట్లో ప్రాణాలు అణిగిపోతున్నాయి
గుండె తడబడినది గొంతు తడుపమ్మా
మంచుపొగగా చలికి మాడిపోతున్నాము
పనికిరానీ చిరుగు పడవేయి తల్లీ
పీలికై చేతిలో వాలిపోతున్నాడు
బిడ్డకొక పిడికిలి విడువమ్మ తల్లి!

బిచ్చమడిగి ఇంట్లోని వాళ్ళు పెట్టినా పెట్టకపోయినా వాళ్ళు దీవించడమేకాని తిట్టిపోయటం బిచ్చగాళ్ళకు తెలియని విద్య. తమ కర్మాన్ని తిట్టుకొంటారు. బిచ్చగాళ్ళ పదాలను వాళ్ళ బాసలో, వాళ్ళ భావాలతో రాసిన వాళ్ళలో తిరుగుబాటు కనబడదు. కనుక అతడు అభ్యుదయకవేనా అనే సందేహం రావచ్చు. పాత్రోచిత భాష భావాలు నాటకంలోనే కాదు కవితలలో కూడా అవసరమే. నిజమైన కళాకారుడు కనుక అనిసెట్టి బిచ్చగాళ్ళ నోటంట తన భావాలను పలికించలేదు. ఈ బిచ్చగాళ్ళ పదాలకు బెల్లంకొండ రాఘవరావుగారు 'దర్పణం' అనే పేరుతో చివర అంచనా రాశారు. ఈసంగతి చెప్తూ చేకూరి రామారావుగారు ఇలా అంటున్నారు.

'బెల్లంకొండ రాఘవరావుగారు ఈ పాటను వ్యవస్థాపరంగానే వ్యాఖ్యానించారు. అయితే ఆయనే 'ఇవి ఉత్తమ భావకవిత్వానికి ఉదాహరణలు అన్నారు.

''ఇక్కడ రెండు మూడు రకాల ప్రశ్నలు ఎదురవుతాయి. అభ్యుదయ కవి అనిసెట్టి తన పాటలను ఉత్తమ భావకవితకు ఉదాహరణలుగా గ్రహించటాన్ని ఎట్లా అంగీకరించారు? అసలు అనిసెట్టి సుబ్బారావుగారు అభ్యదయకవేనా? భావకవిగా పరిగణించాలా? భావకవిత్వానికీ, అభ్యుదయ కవిత్వానికీ విభాజకరేఖ లేదా? భావకవిత్వపు వారసత్వాన్ని అంగీకరించిన అభ్యుదయకవిగా అనిసెట్టిని పరిగణించాలా?''

''అంతేగాక ఈ పాటల్లో మార్క్సిస్టు ధోరణికి వ్యతిరేకంగా కనిపించే దైవభావనవంటి నమ్మకాలు ప్రబలంగా కనిపిస్తాయి. బహుశా ఇవి అనిసెట్టి అభ్యుదయ కవిగా మారకముందు రాసినవేమో పరిశోధించవలసిన విషయం''.

ఇక్కడ ఒక సంగతి గుర్తుంచుకోవాలి. సిసిల్-డే-లూయిస్ వామపక్షకవి. అతడు "O! hush thee my baby' అనే జోల 1930 దశకంలో రాశాడు. అందులో మార్క్సిస్టు పదజాలం లేదు. అయినా అది అభ్యుదయ రచనే. అలాగే అనిసెట్టి సుబ్బారావు 'బిచ్చగాళ్ళ పదాలు' కూడా ఉత్తమ కవితలుగా భావించాలి. పాత్ర మాటల్లో కాక తన మాటల్లో కవి ఏమైనా చెప్తున్నప్పుడు తిరుగుబాటు ధోరణి అవసరమైతే కనబడుతుంది. అనిసెట్టి 'స్వీయచరిత్ర' అనే కవితలో

''మానవత్వ సూత్రాలు మననం
చెయ్యడంకంటె
మందహాసంలో మంచితనం
పంచిపెడితే చాలు''

అని చెప్పాడు. తాను అదే చేయాలని చూశాడు.

''విగ్రహంలా వెయ్యేళ్ళు బతకడంకన్నా
విద్యుత్తులా ఒక్కక్షణం వెలగటం మేలు''

ఈ కవితలోనే అనిసెట్టి తన తత్త్వాన్ని ఇలా విస్పష్టం చేశాడు.

''కంటికి కనిపించని సత్యం మనస్సులో
గోచరిస్తుందని
మనస్సుకు స్ఫురించనిది స్వప్నంలో
సాక్షాత్కరిస్తుందని
స్వప్నాలకందని సత్యం మానవాంతరాత్మలో
మౌన సంగీతం ఆలపిస్తుందని
ఆలకిస్తున్నాను
అర్థం చేసుకుంటున్నాను''

తన యౌవనంలో ప్రచండావేశాల ఊయలపై ప్రతిక్షణం స్వారీ చేశాడు. విశ్వాన్ని వెక్కిరించాడు. వెర్రిగర్వంతో విర్రవీగాడు. అయితే విపరీతమీ యౌవనం, వేకువరాకముందే వెళ్ళిపోయింది అని తెలుసుకొన్నాడు. వేకువరాగానే

''నాలోని మృత్యువును బంధించి
మారణాయుధంలో చేర్చాను
నాలోని ప్రాణశక్తి విజృంభించి
ప్రచండ జీవనోద్వేగంగా మార్చాను
సంహరించాను

పురాణాల రాక్షసుల్ని
భూమిమీద క్రిముల్ని
బుద్ధిలో ముసిరే
దురాలోచనల్ని''

అని చెప్పాడు.

అనిసెట్టి జీవన మహాయాత్రా పథంలో సర్వం సాధనకై ధారపోస్తున్నాడు. తప్పొప్పుల పట్టికలా తయారైన బ్రతుకును ధర్మానుగుణంగా సరిదిద్దుకుంటున్నాడు.

నడుస్తున్నాను -
నడిదారిలో వాహనం ఈ దేహం కూలినా
కడవరకూ ప్రయాణం సాగిస్తాను
ప్రభంజనంలా పయనించే జనం నలుగడ
ప్రతిక్షణం ప్రతికణంలోను మనుగడ
ఇది నా స్వీయచరిత్ర
ఇది ప్రతి ఆత్మచరిత్ర.

'నేను సైతం విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను' అన్న కవితతో అభ్యుదయ సాహిత్యం ప్రారంభమైతే

''వీడని కలకాల వేదనకు విశ్వం విడిచే
కన్నీటి బొట్టు నేనౌతాను''

అని అనిసెట్టి అంటే అతడు అభ్యుదయ కవి కాడా? అతని కారుణ్యం శుష్కకారుణ్యం కాదు. ''మెతకదనమూ, మెత్తదనం దీనికి లక్షణం కాదు. బాధితుల పక్షాన నిలిచి వారి బాధలతో నిమిత్తం లేని కవితా పాఠకుల హృదయాలను ద్రవీభూతం చెయ్యడం ద్వారా శ్రామిక పక్షానికి బలం చేకూర్చడమే కవి ఆశించిన చరమాశయం'' అని సోమసుందర్ వాస్తవాన్ని చెప్పాడు.[11] అనిసెట్టి అభ్యుదయ కవిత్వంలో అనుకంపనవాదం అనేపాయ.

బెల్లంకొండ రామదాసు (1923-83)

అనిసెట్టి సుబ్బారావులాగ, దళితుల పట్ల ఉన్న జాలి, కరుణ, దయ, దాక్షిణ్యం ప్రస్ఫుటంగా అన్ని కవితలలోనూ కనిపించకపోయినా బెల్లంకొండ రామదాసులో కూడా అవి అంతరాంతరాలలో ఉన్నాయి. అయితే అతనిది అనుకంపన వాదం కాదు. ఆవేశవాదం. పుట్టిపెరిగినది సంప్రదాయ సాహిత్య వాతావరణంలో అయినా అతడు ఒక దశలో తనకున్న శివభక్తినీ, కృష్ణభక్తినీ విసర్జించి అభ్యుదయవాది అయ్యాడు.

రామదాసు తండ్రిగారు రాఘవరావుగారు బహుభాషా పండితులు. గొప్ప స్థితిమంతుడు. వెయ్యి ఎకరాల భూస్వామి. లెక్కలేనంత మంది సాహితీపరుల స్నేహితుడు.

11. 'అగ్నివీణ ఆలాపించిన అణుసంగీతం' - పుట.3

ఎప్పుడూ వారింట్లో విశ్వనాథ సత్యనారాయణ, కోలవెన్ను రామకోటేశ్వరరావు, నాయని సుబ్బారావు, అడవి బాపిరాజు వంటి సాహితీపరులు గోష్ఠులు జరుపుతూ ఉండేవారు. ఈ వాతావరణంలో రామదాసు పెరిగాడు. శివభక్తుడుగా ఉండే రోజుల్లో రాసిన ఈ వచన గేయం చూడండి.

ఓ శివా! నీజడల్లో అన్ని కాలాల్లో
సన్నగా స్రవించే గంగలో ఒక చిన్న అలనై
నేనే ఒకరాగమై
ఆ రాగ మేనీకంఠనాగమై
పాడుకో కొత్త నడకలు పాడునో
నా హృదయమే ఒక శ్మశానము
కాలిందోయ్ నిశ్శ్వనిస్సాత్వక స్వార్థశవం
ఆత్మశాపమే నీ నాట్యస్థలం
ఆడవోయ్ పాడవోయ్ నా గుండెకాటిలో
నేనే కాలిపోదామనిపిస్తుందోయ్
ఆ కాలిన బూదే నీ విభూతవుతే
నాభాగ్యం కాల్చవోయ్ నీ త్రినేత్రంతో
నాభావాలు కైలాసాలై
వాటిమీద నీవు కూర్చుంటే
నా గుండెలో రేగిన తాళాలే
మోగిన సంగీతాలే నీపాదలవుతే
నీ డమరకమవుతే
నా గీతాలే నీ భంగిమలవుతే
చాలు చాలోయ్
ఓ చంద్ర శివా!
ఓ సూర్య శివా!

1940లో రామదాసు 'శ్మశానం' అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. ఇతని దృష్టిలో ''ఆలోచించిన అలంకారాలు, రసౌచిత్యాలు, పదౌచిత్యాలు, ప్రయోజనాలు, క్రియల, బిగువులు ఇత్యాదులన్నీ అర్థంలేని పిచ్చి నమ్మకాలు. కవిత్వానికి శత్రువులు''. రామదాసు చేసిన కవిత్వ నిర్వచనం ఏమిటంటే ''ధర్మయుద్ధంలో ఆహుతి అయ్యే అనేక జీవాల అరుపుల చప్పుడు కవిత్వం''.

1944లో ప్రచురించిన నయాగరాలో రామదాసు సంగీతం ''యుగాలనుంచీ నడిచే నియమపురైళ్ళకు పట్టాలు పీకేసింది'' అని చెప్పాడు. ఇతనిగీతం శ్రామిక జనపాలంలో పండని ఘర్మజలం చల్లని చేతులతో తుడిచింది. వర్గరహిత స్వర్గానికి పూలనిచ్చెన వేసింది.

1948లో రామదాసు ఒక ప్రకటన చేశాడు. నా సాహిత్యం ఒక విప్లవం. నా సాహిత్యం ఒక వర్తమాన సంఘు వ్యతిరిక్తతా ఉద్యమం. నా సాహిత్యం పాపంకోసం

పుణ్యాన్ని విడిచిపెట్టింది. వికృతత్వం కోసం సౌందర్యాన్ని విడిచిపెట్టింది. పాతాళం కోసం ఆకాశాన్ని పరిత్యజించింది. నా సాహిత్యం సమాజబాహ్యులైన అభాగ్యుల జీవన వటవృక్షపు పాపచ్ఛాయలో కూర్చొని 'ఈ పాపచ్ఛాయ ఎందుకుంది' అనే ప్రశ్నను గురించి తపస్సు చేసింది....''

రామదాసులో ఆవేశం, తిరుగుబాటు, అరాచకమేకాదు, కొంత అనుకంపం కూడా లేకపోలేదు. ఈ పద్యం చూడండి.

తాగు తాగు చెల్లెలా చల్లని కన్నీళ్ళు!
తాగు తాగు చెల్లెలా మెల్లని కన్నీళ్ళు!
నానోట పాట ఆరిపోక మునుపె
నా తోట పూలు రాలిపోక మునుపె
నా కనుల నీడ కరిగిపోక మునుపె
తాగు తాగు చెల్లెలా చల్లని కన్నీళ్ళు
తాగు తాగు చెల్లెలా మెల్లని కన్నీళ్ళు

ఇట తిరిగిన వెన్నో విషాదవసంత చక్రాలు
ఇట కరగిన వెన్నో కల్యాణ కర్పూరదీపాలు
ఇట నడచిన వెన్నో మానవాన్ధపాన్థ మలిన పాదాలు

వెర్రిగా వీచినవి మారుతాలు ఏడ్చినవి రుతాలు
కదలినవి సైన్యాలు మెదలినవి దైన్యాలు
మూల్గినవి లోకాలు కాలినవి కాలాలు
జరిగినవి హవనాలు సవనాలు కవనాలు

ఇది విధివేశ్య నిదురించు విధురశయ్య
ఇటలేదు జీవి! ఇటలేదు పూవు!
ఇది మహాభయద చరమ శ్మశానస్థలి
ఇటలేదు జీవి! ఇటలేదు పూవు!
తాగుతాగు చెల్లెలా చల్లని కన్నీళ్ళు
తాగు తాగు చెల్లెలా మెల్లని కన్నీళ్ళు

నానోటపాట ఆరిపోక మునుపె
నానీడ నినువీడి కరిగిపోక మునుపె
నా ఎడద పడవ మునిగిపోక మునుపె
పాడుపాడు చెల్లెలా పచ్చని ఒక పాట!
పాడు పాడు చెల్లెలా పల్చని ఒక పాట!

జీవితంలో ఏదో ఒకప్పుడు, గుండెల్లో ఏదో ఒక మూల కరుణలేనివాడు కవి కాలేడు.

విద్వాన్ విశ్వం (1915-1917)

ఇంగ్లీషు చదువుల ద్వారా మార్క్సిజానికి పయనించిన వాళ్ళు చాలామంది ఉన్నారు గాని ప్రాచ్యవిద్యలు చదివి సామ్యవాదం వైపు మొగ్గిన ప్రజ్ఞావంతులు కొందరే ఉంటారు. అలాంటి వారిలో విద్వాన్ విశ్వం ప్రముఖుడు. విశ్వం రాయలసీమలోని అనంతపురం జిల్లా తరిమెలగ్రామంలో జన్మించాడు. తండ్రి మీసరగండ మునిరామాచార్యులు. ప్రజాహిత కార్యాలు చేసే సారస్వత సేవకులు. తండ్రిగారి ప్రోత్సాహం వల్ల విశ్వం చిన్ననాటి చదువంతా ప్రాచ్యభాషాధ్యయనానికి అంకితమైంది. సంస్కృతాంధ్ర కావ్యాలు, వ్యాకరణం, తర్కం చదువుకున్నాడు. మద్రాసు విశ్వవిద్యాలయం సంస్కృతాంధ్ర విద్వాన్ కోర్సు ఉత్తీర్ణుడై మీసరగండ విశ్వనాథశాస్త్రి విద్వాన్ విశ్వం అయ్యాడు. కాశీ విశ్వవిద్యాలయంలో ఖండకావ్యాలపై పరిశోధన చేయడానికి విశ్వం వెళ్ళాడు. ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకులు తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, విశ్వానికి కాశీలో సహాధ్యాయులు. వెళ్ళిన పరిశోధన సాగలేదుగాని విశ్వం మార్క్సిస్టు సాహిత్యంతోనూ, రాజకీయాలతోనూ ప్రగాఢ పరిచయాన్ని, సంబంధాలను ఏర్పరచుకొని ఇంటికి తిరిగి వచ్చాడు.

1933-34లో విశ్వం రచనలు చేయసాగాడు. 1937 ఎన్నికలలో తలమునకలుగా పనిచేశాడు. 1938లో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి అయ్యాడు. రాజకీయ కార్యక్రమాలతోపాటు రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. 'నవ్యసాహిత్యమాల' అనే గ్రంథమాలను 1938లోనే ఆరంభించాడు. 'ఫాసిజం', 'లెనిన్', 'స్టాలిన్' వంటి రాజకీయ గ్రంథాలతోపాటు 'పాపం', 'సమీక్ష', 'రాతలు-గీతలు' వంటి సాహిత్య రచనలు వెలువరించాడు. 1940-41లో చెరసాలకు వెళ్ళాడు. జైల్లో రచనలు, గ్రంథపఠనం సాగించాడు. 1944దాకా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా, రైతు సంఘ కార్యదర్శిగా పనిచేస్తూ 'నవ్యసాహిత్యమాల'లో చాలా పుస్తకాలు ప్రచురించాడు.

1945లో జర్నలిస్టుగామారి విశ్వం హైద్రాబాదులో 'మీజాన్' పత్రికలో కొన్నాళ్ళు పనిచేశాడు. ఆ తర్వాత ప్రజాశక్తి సంపాదకవర్గంలో చేరాడు. తన పాండిత్యాన్ని, పండిత భాషను పెట్టి సులభశైలిలో పత్రికా రచన చేశాడు. ప్రజాశక్తి నగర్‌లోనే ఉండి ఒడిదుడుకలు అనుభవించాడు. ప్రభుత్వ నిర్బంధాల తాకిడికి తట్టుకున్నాడు. 1952లో ఆంధ్రప్రభ వారపత్రికలో చేరాడు. చాలాకాలం 'మాణిక్యవీణ' మీటాడు. తరువాత తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణకు ప్రధాన సంపాదకుడయ్యాడు. కథా సరిత్సాగరం 12 సంపుటాలలో అనువదించాడు. ఎన్ని రంగాలలో పేరు తెచ్చుకొన్నా విశ్వం ప్రధానంగా కవి. ఎన్నో గ్రంథరచనలు చేస్తూ తన కలాన్ని హెచ్చవేసి ప్రజాబలాన్ని చేయదలిచాడు.

విశ్వనాథ సత్యనారాయణగారు విశ్వం పుస్తకాల్లో 'ఒకనాడు'కు తొలిమాట ఇలా రాశారు. ''ఈ కాలమునందు ప్రతికవికి నొక్కక్క సిద్ధాంతమున్నదని చెప్పవలయును. ఈయనకును యొక సిద్ధాంతమున్నది. నాకు తెలిసినంతవరకు వారి వారి సిద్ధాంతములు ముఖ్యములుగావు. వారు చేసిన రచన సరసముగా నుండుటకు''.

నేను ఈ మాటలతో ఏకీభవించలేను. విశ్వనాథవారి రచనలు బోధపడికాదు, ఆ రచనల్లో ఏ సిద్ధాంతాలు ఉంటాయో తెల్లమైనందువల్లనే 'సనాతనులు' ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

'కవితా సిద్ధాంతములు వేరు. వాని ఇతర భావములు వేరు' అంటూ విశ్వనాథవారు ఒక ఉదాహరణ చూపెట్టారు:

''బోరిస్ కార్లాఫ్ ఉన్నాడు. ఆయన భయంకరమైన ఘోర హత్యలతో సంబంధించిన పాత్రలను ధరించుటకు యెన్నుకొనబడును. ఫ్రాన్‌కిన్‌స్టీన్ మొదలైన వేషములు వేసినవాడు. ఆయన తన జీవితములో పరమ దయావంతుడట. గొప్ప పరోపకారియట. వాని శిల్పలక్షణము వేరు. వాని జీవితము వేరు''. అని సిద్ధాంతం చేసి 'కనుక నొక కవియొక్క రచనా పద్ధతిని బట్టి వాని జీవితమును నిర్ణయించలేము' అని విశ్వనాథవారు సూత్రీకరించారు. పాపం! కార్లాఫ్ 'శిల్ప లక్షణాలకు' అతని కడుపున పుట్టిన బిడ్డలే అతని నిత్యజీవితంలో జడుసుకొని ఆ 'పరమదయావంతు'డి ముఖం చూడలేకపోయేవారు. అందుచేత అతని భార్య విడాకులు తీసుకొంది. శిల్ప లక్షణాలు వేరు, జీవితం వేరు అనే సిద్ధాంతం ప్రచారం చేయడం కేవలం అద్వైతులకే చెల్లింది.

విశ్వం శిల్పలక్షణాలు జీవితానికి విభిన్నమైవి కావు. అందుకే 'ఈయన జీవితంలో సంఘసేవ, సాహిత్యారాధన ఇంతగా పెనవేసుకొన్నాయి' అన్న తిరుమల రామచంద్రగారి మాటలు అక్షరాలా నిజం.

ప్రతికవికీ స్వదేశాభిమానం ఉంటుంది. ఉండి తీరాలి.

స్వస్థానంపై అభిమానంతో దాశరథి 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటే, విశ్వం - 'రాయలసీమ మించుల సితారు, పచ్చల బజారు' అంటాడు. దాశరథి సూక్తి నినాదమై గర్జించింది. విశ్వం ఆర్తి నిదానమై వ్యాపించింది. దాశరథి 'పిడుగులు పిల్లలు పెట్టుకొనే' ఫాలాక్షిని చూస్తే, విశ్వం 'పులిన స్థలి పుర్రెలు' మెండుగా పండే పెన్నగట్లు చూశాడు. దాశరథి 'ఈ తెలుగు రేగడిలో జిగిమెండు, తల్లిరో' అంటే, విశ్వం 'ఆ యిల్లాలి కరయుగము వేయ సంజీవనుల మేళవింపుసుమ్ము' అంటాడు. దాశరథి వరద పొంగు, విశ్వం నీటిజాలు. తెలుగు వీణకు సర్కారు జిల్లాల సాహితి దండమైతే, రాయలసీమ తెలంగాణ సాహితులను ఇటూ అటూ నాదాన్ని శ్రావ్యం చేసే కిన్నెర కాయలను చేసిన ఘనత విశ్వం, దాశరథులకే చెల్లుతుంది.

వేసవిలో ఎండిపోయినా పెన్న విశ్వంలో నిండుగానే ఉంటుంది. వెన్నలా ఉంటుంది. 'చచ్చెనీ లోకమున నాత్మసాక్షి యనుచు నెత్తినోరిడి కొట్టుకోనిండు నన్ను' అని ఎంత రోదించినా, ఆ చచ్చిన 'ఆత్మసాక్షి'కి తన కవిత్వంతో ప్రాణం పోస్తాడు. కవిత్వాన్ని కంచుకాగడావేసి గుడ్డిదీపాలను చూపిస్తాడు. తన ప్రియమైన సీమలో -

''అసలు దీపములు ముట్టించు సంగణములె
చాల తక్కువ; ఉన్న దీపాలు కూడా,

తమ్ముదాము జూపించుకోదగిన జాలు
అన్ని వస్తువులన్ జూసినంత ఫలము''

దీపాన్ని వెలిగించడానికి దీపం కావాలి. సరే. దీపాన్ని చూపించడానికి దీపం కావలసి వస్తుంది. ఇది విశ్వం వ్యంగ్యం.

'బొట్టులేక తేనె పుట్ట'ని సీమలో సైతం 'కడకాకి చేతకూడా నేతి వంటకాలు తిని'పిస్తాడు. విశ్వం రస శ్రీమంతుడు.

'వేయి రూకల మాణిక్యవీణ యేల
వెదురు చాలదె? పలికించు పదిలమున్న?'

అని విశ్వం ప్రశ్నిస్తాడు. ప్రశ్నించి ఊరుకోడు. పద్యంలో వెదుళ్ళను పలికించాడు. గద్యంలో మాణిక్య వీణలు మీటుతాడు.

విశ్వం సంస్కృతంలో ప్రఖ్యాతమైన 'కాదంబరి', 'కిరాతార్జునీయం', 'దశకుమార చరిత్ర', 'మేఘసందేశం' అనువదించాడు. ఈ నాలుగు పుస్తకాలు ఒక్కసారే స్నేహితులకు ఇచ్చాడు. అందరూ మేఘసందేశాన్ని మొదట చదివారు. అది మొదలుపెట్టిందే తడవుగా చదివించుకొంటూ పోతుంది.

'మేఘసందేశం' అంటే కొందరికి ఒక రకమైన 'ప్రత్యేక-పిచ్చి' బసవరాజు అప్పారావు 'కావ్యపానము చేసి కైపెక్కినానే' అని పాడాడు. 'మేఘసందేశం'లోని కైపు ఒకసారి ఎక్కితే దిగిపోదు. అది 'దివ్య-మత్తు', దానిని మూలంనుండి ఆస్వాదించాలేగాని అనువాదం నుండి అనుభవించలేం అనిపిస్తుంది.

ఇన్ని శతాబ్దాల ఆంధ్ర సాహిత్య చరిత్రలో కాళిదాసుకు ఋణపడని 'మేజరు' తెలుగు కవి లేడు. మొన్న మొన్నటిదాకా శిష్ట విద్య 'రఘువంశం' 'కుమారసంభవా'లతోనే మొదలయ్యేది. కాళిదాసు కృతులలో చాలా వాటికి అనువాదాలో, ఛాయానువాదాలో, పాక్షికానువాదాలో కోకొల్లలుగా కనబడతాయి. 'ఇందుమతీ పరిణయా'లకు లెక్కేలేదు. రఘువంశాన్ని సంపూర్ణంగా ఆదిపూడి సోమనాథరావుగారు ఆంధ్రీకరించారు. ఆ తెనిగింపు చాలా ఇంపుగా ఉంటుంది. 'కుమారసంభవం'లోని రతీవిలాపం, శ్రీనాథుడు 'హరవిలాసం'లో అనుసరించాడు. సంస్కృతంలోని దృశ్యకావ్యం 'శాకుంతలం' తెలుగులో పద్యకావ్యమైంది. అంతమంది ప్రాచీనాంధ్రకవులు 'మేఘసందేశం' జోలికి పోలేదు. ఆధునిక యుగంలోనే ఆ కావ్యానువాదాలు ప్రారంభమయ్యాయి.

1884లో వడ్డాది సుబ్బారాయుడుగారి దగ్గరి నుంచి 1957లో రాయప్రోలు సుబ్బారావుగారిదాకా అష్టోత్తర సంఖ్యలో మేఘానికి అనువాదకులు కనబడుతున్నారు. పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులుగారు (1931) ద్విపదలో తెనిగించారు. త్రిపురాన సూర్యప్రసాద రావు దొరగారు (1940) సీసపాదచ్ఛాయలలో గేయానువాదం చేశారు. రాయప్రోలు సుబ్బారావుగారు యతిప్రాసలకోసం చూడకుండా మత్తేభవృత్తంలో తెనిగించి 'దూతమత్తేభం' అని పేరు పెట్టారు. నేను సేకరించినంతమట్టుకూ తెలుగులో మేఘసందేశానువాదకుల పట్టిక ఇదిగో:

1488	-	వడ్డాది సుబ్బారాయుడుగారు
?	-	వత్సవాయ నీలాద్రిరావురాజు
	-	జలదుర్గ ప్రసాదరాయుడు
	-	లోకనాథ కవి
	-	కల్లూరి వెంకటరామశాస్త్రి
1927	-	వేదం వెంకటరాయశాస్త్రి (టీక)
1931	-	దీపాల పిచ్చయ్యశాస్త్రి
	-	పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులు
1937	-	భువనగిరి విజయరామయ్య
	-	యం.యం.వెంకటాచార్య
1938	-	చర్ల గణపతిశాస్త్రి
1940	-	త్రిపురాన సూర్యప్రసాదరావు దొర
1948	-	దామోదర రాజగోపాలరావు
	-	బండారు వెంకటసుబ్బయ్య
	-	చింతగుంట సూర్యనారాయణరావు
1950	-	చివుకుల అప్పయ్యశాస్త్రి
1952	-	తాడూరి లక్ష్మీనరసింహారావు
1957	-	రాయప్రోలు సుబ్బారావు
1962	-	విద్వాన్ విశ్వం

ఒక మందాక్రాంత శ్లోకాన్ని రెండు కందపద్యాలుగా విశ్వం తెనిగించాడు. ఇతర అనువాదాలతో తులనాత్మక పరిశీలన ఏదైనా విశ్వవిద్యాలయంలో పరిశోధనావ్యాసానికి విషయంగా వదిలేసి ఒక్కశ్లోకాన్నే తీసుకొని రెండు మూడు అనువాదాలు చూద్దాం.

ధూమజ్యోతి స్సలిల మరుతాం సన్నిపాతః క్వమేఘః
సందేశార్థాః క్వపటు కరణైః ప్రాణిభిః ప్రాపణీయాః
ఇత్యౌత్సుక్యాదపరి గణయన్ గుహ్యకస్తం యయాచే
కామార్తాహి ప్రకృతి కృపణా శ్చేతనా చేతనుషం (2-5)

దీనికి రాయప్రోలు వారి అనువాదం చూడండి :

జలవాతంబులు - వహ్ని ధూమములు
రూపుంగొన్న మేఘుండదె
క్కడ? ప్రాణేంద్రియ భద్రపాటవ
సుసాధ్యంబైన సందేశ మె
క్కడ? నంచెంచడు యక్షు డుత్సుకత
పేర్మిన్; చేతనా చేతనాం
తర సంమూఢులుగారె
కాముకు లపస్మార స్వభావావశుల్

ఛందస్సుకోసం సలిల మరుత్తులు ముందుకొచ్చాయి. ధూమజ్యోతులు వరస తప్పాయి. మూలంలో లేని 'అపస్మార స్వభావాశుల్' అన్న మాట భావానికి వాచ్యం అయింది. ఇక త్రిపురాన సూర్యప్రసాదరావు దొరగారి అనువాదం చూడండి :

మరుదగ్ని జలధూమ మయమైన మొయ లేడ?
గరణపాట వయుక్తి గలుగు ప్రాణులచేత
సరగ బంపగ దగ్గ సందేశము లవేడ?
దరమోనె యిది యనన్తలపేది తహతహన్
దరుణికై తనదు వార్తలు గొంచుబోవగా
విరహి యొక్కడు మబ్బు వేడికొన్నాడంట
యరుదు గాదిది చేతనాచేతములందు
గరము దీనులుకాదా కామపీడితులు

అనువాదం సాఫీగా ఉన్నా మూలంలోని 'థ్రిల్' రాలేదు. ఇక విశ్వం తెనిగింపు చూద్దాం.

ధూమజ్యోతి స్సలిల మ
హా మారుత సన్నిపాతమగు మబ్బేడా?
ధీమంతులు గొంపోయెడు
క్షేమ సమాచారమేడ? చిత్రము కాదా?
అయినన్ తన తమి పెనగొని
వయికొన్నన్, యక్షుడబ్దపతి యాచించెన్;
దయితాదూరుల మతి, కెం
తయినా చేతనవిచేతనము లొకటిగదా?

అనువాదంలో ఎంత మూల విధేయత? ఎంత పొదుపు!! సంస్కృత శ్లోకాలను అనువదించేటప్పుడు శ్రీనాథుడు పెట్టుకొన్న నియమాలను అనుసరించినప్పుడే మూలం చదువుతున్నామన్న తృప్తి వస్తుంది. ఆ నియమాలేమిటంటే -

1. శబ్దం బనుసరించియు
2. అభిప్రాయంబు గురించియు
3. భావం బుపలక్షించియు
4. రసంబు పోషించియు
5. అలంకారంబు భూషించియు
6. ఔచిత్యం బాచరించియు
7. అనౌచిత్యంబు పరిహరించియు

'మాతృకానుసారంబుగా చెప్పబడిన'ప్పుడే కావ్యం 'హృదయంగమంబు'గా ఉంటుంది. విశ్వం అనువాదంలోఇవన్నీ పాటించాడు. అడుగడుగునా తెలుగు జాతీయాలను, నానుడులను, పలుకుబళ్ళ గుప్పించాడు. మొదటనే, 'తస్మిన్ అద్రౌ' శ్లోకానువాదంలో చూడండి:

చెలిబాసి, హస్తకంకణ
ములు నేలం జారిపోవ, మోహితుడత, డా
మలపై కొన్ని నెలల్ గుం
డెల కుంపటి మోసుకొనుచునే గమియించెన్.

మూలంలో 'గుండెల కుంపటి మోసుకొనడం' లేదు. 'అబలా విప్రయుక్తః' అన్నమాటకు 'చెలిబాసి' అని, 'కామీ' అన్నమాటకు 'మోహితుడు' అని తెనిగించినా, 'కనకవలయ భ్రంశరిక్త ప్రకోష్ఠః' అన్న శబ్దచిత్రంలోని జాలిని స్ఫురింపచేయడానికి 'గుండెల కుంపటి' అవసరమైంది. (తెలుగు జానపద గేయాలలోని ఏ కర్షక కాళిదాసో 'ఉంగరమే ఒడ్డాణమయ్యెనురా' అన్నాడు).

'గచ్ఛంతీనాం' అనే శ్లోకంలోని 'తోయోత్సర్గ స్తనిత ముఖరోమాస్మభూర్విక్లబాస్తాః' అన్న పాదాన్ని విశ్వం ఎంత చక్కగా అనువదించాడో చూడండి:

'జడవానల ఉరుములతో
జడిపింపకు వారు గుండెచాలని బేలన్'.

'విక్ల బాః' అన్న మాటకు 'గుండెచాలని బేలల్' అనే తెనిగింపులో ఎంత నుడికారపు యింపు ఉందో! ఈ శ్లోకానువాదంలో విశ్వం మరికొన్ని సొగసులు చూపాడు. 'సౌదామిన్యా కనకనికష స్నిగ్ధయాదర్శ యోర్వీంః అనే పాదాన్ని ఇలా తెనిగించాడు:

'విడువక బంగరు మెరపుల
పుడమిని జూపించి పుణ్య ముం గొనుమయ్యా'

'పుణ్యం కట్టుకొనడం' అన్న పలుకుబడిని తెలుగువాడొక్కడే వాడగలడు. అలాగే 'మందాయంతే నఖలు సుహృదామచ్ఛుపేతార్థ కృత్యాః' అన్న పాదానికి ఎంత చక్కని తెనిగింపో చూడండి:

'జా గొనరింతురె నేస్తుల
కై గంపెడు పనులు సేయగడిగిన నారల్

ఇలా చూపించుకొంటూపోతే 'గంపెడు' సొంపులు మాత్రమే కాదు, ఒప్పులు కుప్పలుగా పోయవచ్చు. 'కాళిదాసుకే మెరుగులు దిద్దడం' అంటే ఛాందసులు చెవులు మూసుకోవచ్చుగాని, నిజం చెప్పక తప్పదు. 'రత్నచ్ఛాయా' శ్లోకంలోని 'యేనశ్యామం' అనే పాదద్వయాన్ని విశ్వం 'ఓహో' అనిపించేటట్టు అనువదించాడు.

'ఆ యింద్ర ధనుః ఖండ స
మాయుతి నీ దేహ నీలిమన్ తలిపించున్
మాయూర ఫించభూషిత
మాయాగోపాల రూప మాధవమూర్తిన్'.

'ఉపమా కాళిదాసస్య' సరే, బాగానే ఉంది. మూలంలో 'గోపవేషస్యవిష్ణోః' అన్న మాటలు 'మాయాగోపాల రూప మాధవమూర్తి' అనే అనువాదంలో చక్కని సారస్యం

ఉంది. కావ్యంలో కడవరకూ కాళిదాసు మేఘుడిలో మెరుపు తీగెను విడవకుండా చూపెడుతూనే వచ్చాడు. కడపటి శ్లోకంలో 'మా భూ దేవం క్షణమపిచతే విద్యుతా విప్రయోగః' అని శుభాకాంక్షలు చెప్పించాడు, నాయకుడు కాంతావిప్రయుక్తుడు. అతని చెలికాడు క్షణం కూడా తన వనితను ఎడబాయకుండా ఉండవలసినవాడు, ఉండేవాడు. 'ఇంద్రధనుస్సును ధరించిన నల్లని మేఘుడా! గోపాల వేషంలో నెమలి పింఛం ధరించిన విష్ణువులా నువ్వుంటావు' అనడం కన్నా 'మాధవమూర్తిలా' ఉంటావు అనడంలో భార్య నెడబాయని వాడితో పోలిక ధ్వనిస్తుంది.

ఇంత చక్కటి అనువాదం చేసిన విశ్వం అక్కడక్కడ అశ్రద్ధ వహించిన పద్యాలను చూస్తే చివుక్కుమంటుంది. ఉదాహరణకి : ఉత్తర మేఘంలో 'సూనం తస్యాః' శ్లోకంలోని 'ఇందోర్ దైన్యం' అనే పాదాన్ని 'లేమ మొగము మబ్బుల దూలిన నెలవోలె కాంతి దొరగియె యుండున్' అని విశ్వం తెనిగించాడు. ఈ సంగతి చెపుతున్నది మేఘుడితోనే. ఉపమానంలో 'మబ్బుల దూలిన నెల' ఉంది. ఇది వింటే ఎంత మంచివాడైనా మేఘుడు నొచ్చుకోడా? అందుకే మూలంలో కాళిదాసు 'ఇందోర్' దైన్యం త్వదనుసరణ క్లిష్టకాంతేర్‌బిభర్తి' అంటూ 'తత్' అని సూటిగా నీవు అనిపించాడు. 'నువ్వు అడ్డగిస్తే కాంతి తొలగుతుంది. నువ్వు అనుగ్రహిస్తే కాంతి కలుగుతుంది' అన్న ధ్వని ఇక్కడ ఉంది. విశ్వం కొంచెం శ్రద్ధగా ఈ శ్లోకాన్ని తెనిగించవలసింది.

ఏమైనా 'మేఘసందేశం' గురించి మాట్లాడుకోవలసి వస్తే అన్నీ మరిచిపోకతప్పదు. 'మాఘే మేఘే గతం వయః' అన్నది కావ్యోన్మాదులపట్ల వర్తిస్తుంది. మల్లినాథ సూరిని తలచుకొంటూ 'ఒక్కొక్క శ్లోకం చదివి ఆయన ఎన్నిరోజులట్లా మైమరచి ఆస్వాదిస్తూ కూర్చున్నాడో' అంటాడు విశ్వం.

''ఎక్కడి మబ్బుతునక! ఎక్కడి యక్షుడు! ఏమి సందేశం! ఆ యింతలో ఎంత మహాకావ్యం రచించినావయ్యా, కాళిదాసూ!

అంత ఉత్తమ సంస్కారమూ, ఉన్నత మనోధర్మమూ గల మల్లినాథుని మాటను - అంత మాటను - సర్వసామాన్య వ్యక్తిని నేననలేనుగానీ, నీ మేఘం నన్ను వదలకుండా పట్టుకొన్నది!''

వినమ్రంగానే వివశత్వాన్ని విశ్వం చెప్పుకొన్నాడు. చేతకాని వాణ్ణంటూనే చెయ్యితిరిగిన శిల్పాన్ని ఎలా చూపెడుతున్నాడో గమనించండి!

ఎంతటి భావుకుడవయ్యా నీవు!

అనువదించిన దోషానికా నీవూ, నీ మేఘమూ నన్ను మరో పద్యం రాయనీయకుండా, ఆ వాతావరణం నుండి బయటపడనీయకుండా అల్లరిపెడుతున్నారు?

అల్పుడను, స్వామి! నేనింత రసానుభూతిని భరించలేను. అందాలను పంచిపెట్టిన వాడను కాను.

అందుకనే వేడుకొంటున్నాను. నన్ను నీ అమేయ భావనాబలంతో వివశుని చేసి వేయకు. నా పిచ్చిక గూళ్ళు నన్ను కట్టుకోనీ''

విశ్వం కట్టుకొన్నవి పిచ్చుక గూళ్ళే! అయితే, అవి బంగారు పిచ్చికగూళ్ళు!!

నిజమే! మేఘాన్ని తెనిగించాక విశ్వం కందం తప్ప మరో ఛందం వ్రాయడం లేదు. విశ్వనాథవారు ఎలా మెచ్చుకున్నారో చూడండి! ''ఈయన వ్రాసిన కందపద్యము పాము మెలికలు తిరిగినట్లు సొగసుగా తిరుగును. అది సన్నని పామైనచో మిక్కిలి యందముగా నుండును కదా!''

నిజానికి విశ్వం కందాలు మా కందాలు!!

తుమ్మల వెంకట్రామయ్య (1914-1987)

విద్వాన్ విశ్వంలాగే కాశీలో కమ్యూనిజం వల్ల ప్రభావితుడైన మరొక సాహితీపరుడు తుమ్మల వెంకట్రామయ్య. ఆయన తన 20వ యేట 1934లో 'శాస్త్రి' కోర్సు చదవడానికి కాశీ విద్యాపీఠ్‌కు వెళ్ళాడు. ఆయన విద్యాపీఠ్‌లో చేరిన నెల్లాళ్ళకే ఉత్తరప్రదేశ్ యువజన మహాసభ జరిగింది. దానికి అధ్యక్షత వహించడానికి శ్రీపాదఅమృత డాంగే వచ్చి మూడురోజులపాటు విద్యాపీఠ్‌లోనే ఉన్నాడు. ఆ మూడురోజులూ తుమ్మల ఆయనతోనే ఉన్నాడు. ఆ డాంగే వెళ్ళిపోయిన తర్వాత 'సశస్త్రక్రాంతికరో' అనే హిందీ కరపత్రాలు తుమ్మల ఒక స్నేహితుని వద్ద దాచి పోలీసు నిఘా చల్లారగానే రహస్యంగా వీటిని విద్యార్థులకు పంచిపెట్టాడు. సాయుధ విప్లవాన్ని ఆదిలోనే అభిమానించి ప్రచారం చేసిన సాహసి అతడు. కాశీకి వెళ్ళడానికి ముందే తుమ్మల రచయితగా రంగంలో ప్రవేశించాడు.

తుమ్మల పొరుగుగ్రామం అనంతవరంలో 1933-34 సంవత్సరాల మధ్య దూళిపాళ్ల కోటయ్యగారు కార్మిక ప్రచురణలు ప్రారంభించారు. వాటికోసం తుమ్మల కొన్ని కథలను రాసేవాడు. వీటిని బెనారస్‌లో చదువుకొంటున్న కాట్రగడ్డ నారాయణరావుగారు చదివి వాటిపై విమర్శలు, సలహాలు ఇస్తూ జాబు రాశారు. ఆ జాబువల్లనే కార్మిక ప్రచురణల దృక్పథంలో గణనీయమైన మార్పు వచ్చింది. తర్వాత కాట్రగడ్డ నారాయణరావుగారే గోర్కీ రచించిన 'అమ్మ'ను హిందీలో ఉన్నదో, ఇంగ్లీషులో ఉన్నదో తుమ్మలకు ఇచ్చారు. దానిని చదివి ఉత్తేజితులై ఒక సంక్షిప్తానువాదాన్ని 'మాతృహృదయం' అనే పేరుతో 1934 జూలై-సెప్టెంబర్ మాసాలలో రాశాడు. ఇది కార్మిక సంఘ ప్రచురణలలో వెలువడింది. అప్పటిదాకా తుమ్మలకు కమ్యూనిజం అంటే స్పష్టమైన భావాలు లేవు. అవి కాశీలో దృఢమైన రూపు సంతరించుకొన్నాయి.

1935 జూన్‌లో తుమ్మల 'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా' అనే మొట్టమొదటి అరుణ పతాక గీతాన్ని రాశాడు. ఇది గద్దె లింగయ్యగారి 'ప్రభ'లో అచ్చుపడింది. 'పిపాసి' అనే కలం పేరుతో దానిని ప్రచురించారు. ఆ పత్రికలోనే కొన్ని కథలు, డిమిట్రాఫ్ జీవితం మొదలైనవి తుమ్మల రాశారు. ప్రభుత్వం ఆ పత్రికను తరువాత నిషేధించింది.

1936లో జరిగిన లక్నో కాంగ్రెసుకు కాశీ విద్యాపీఠ్ నుండి వాలంటీర్లు వెళ్ళారు. ఆ సందర్భంలోనే ఇండియన్ ప్రోగ్రెసివ్ సభలు మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగాయి.

కాశీ నుండి తిరిగి వచ్చాక తుమ్మల తెనాలి, గుంటూరు పట్టణాలలో విద్యార్థి సంఘాలతో, యువజన సంఘాలతో, కూలీ రక్షణ సమితితో ప్రగాఢ సంబంధాలు

పెట్టుకొన్నాడు. నవశక్తి పత్రిక ప్రారంభం కాగానే దాని సంపాదకవర్గ కార్యాలయంలో మద్దుకూరి చంద్రశేఖరరావుగారి సహచరునిగా తుమ్మల చేరారు. నాటినుండి కమ్యూనిస్టు పత్రికల లోనే, వాటికోసమే సాహిత్యం సంఘాల బాధ్యతలను అప్పగిస్తే వాటిని క్రమశిక్షణతో నిర్వహించాడు. వామపక్షాలు చీలిపోయిన తర్వాత తాను ఏ శిబిరంలో ఉన్నాడో ఆ నాయకత్వం విశ్వాసాల మేరకు, ఆదేశాల మేరకు తన కలాన్ని వినియోగించిన సౌమ్యుడు తుమ్మల. కడ ఊపిరి దాకా కమ్యూనిజాన్నే విశ్వసించిన తుమ్మల సాహితీపరుడుగా జీవించాడు. పత్రికలలో పని కనుక వచనరచనలే ఎక్కువగా చేసినా రాసిన కొద్ది కవితలలో తుమ్మల సూటిగా సందేశాన్ని ఇవ్వగలడు. కలకాలం ఈ రాక్షస కలికాలం నిల్వబోదనీ, కలకలకాం ఈ దానవ పరిపాలన సాగబోదనీ చెప్తూ వర్గకలహానికి వనితలను సైతం సిద్ధం చేసే పాటలు రాసి తుమ్మల తన విశ్వాసాన్ని, ప్రబోధాన్ని ఇలా చెప్పాడు.

నవలోకం ప్రభవించునులే
దానవలోకం సమయునులే
మానవలోకం వెలయునులే
వగపేటికి తల్లీ పగబూనుము

కార్మికులూ కర్షకులూ కరము కరమూ గలిపి జై మనకు జై యని జేజేలు కొట్టంగ ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుంది.

స్వస్తి వాచకం

సమగ్ర ఆంధ్ర సాహిత్య తొలియుగం నుంచీ కడపటి రాజుల యుగం దాకా 12 సంపుటాల ప్రథమ ముద్రణ 1965 ఏప్రిల్‌లో ప్రారంభం అయింది. 1968 ఫిబ్రవరి నాటికి పూర్తి అయ్యాయి. కొన్ని యుగాలు కొరతగా మిగిలిపోయాయి. కనుక వాటిని పూర్తిచేయాలని 1988లో నిశ్చయించాను. రెండవ ముద్రణ పాత పన్నెండు సంపుటాలలో విషయాలను తగ్గించుకుండా చేర్పులతో కూర్పులతో పెంపుదల చేస్తూ కొన్ని యుగాలు జంటలుగా చేశాను. మిగిలిన యుగాలను నాలుగు సంపుటాలుగా ప్రచురించాలని అనుకున్నా విషయప్రాధాన్యతను బట్టి కుంఫిణీ యుగాన్ని రెండు సంపుటాలుగా, జమీందారీ నవ్యసాహిత్య యుగాల్ని రెండు సంపుటాలుగా, ఆధునిక అభ్యుదయ యుగాన్ని ఒక సంపుటంగా ప్రచురించవలసి వచ్చింది.

ఒక వ్యక్తి సమాజంలో ఏదైనా సాధించగలిగాడంటే దానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎందరి సహాయ సహకారాలో ఉంటాయి. ఈ నా కృషిలో నాకు తోడ్పడిన వారందరికీ నా కృతజ్ఞతలు.

ఇక్కడే ఒక సంజాయిషీలాంటిది చెప్పుకోవాలి. ఏ సాహిత్య చరిత్రకైనా వర్తమానయుగం ప్రారంభం అవుతుందిగాని ఎన్నడూ పరిసమాప్తం కాదు. ఒక్కొక్క ప్రక్రియకూ ఒక సంపుటం చొప్పున రాయవలసినంత విస్తృతమైన ఆధునాతన యుగచరిత్రను ఒక సంపుటంలోనికి కుదించటం సాహసమే అయినా సాధ్యం కాని విషయం. నడుస్తున్న చరిత్రలో సంస్థల భోగట్టాలు, ఉద్యమాల ఘట్టాలు కథనం చేస్తున్నప్పుడు విరామచిహ్నాలు- ప్రకరణాల కామాలు, ఉపయుగాల సెమికోలన్లు ఉంటాయే తప్పించి ఫైనల్ ఫుల్‌స్టాపు వుండదు.

ఎప్పుడూ ఇంకా ఉందనిపించేదే ఈ చరిత్ర.

19-6-1991
త్యాగరాయనగరు

అరుద్ర

అనుబంధం

ఆరుద్ర

(ఆగస్టు 31, 1925 - జూన్ 4 1998)

కాలం కట్టి పడేస్తే ఆగేదికాదు. అది నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాలలో 'ఆధునికత' అనేది కాలంతోపాటు సిద్ధించేదికాదు. అది ఆలోచనల వల్ల కలిగే పరిణామం, కాలగతిలో వాలుదిశలో కాళ్ళు కదిపేవాళ్ళు ఎందరో ఉంటారు. తమ ఆలోచనలతో కాలగతిని నిర్దేశించే వాళ్ళు కొందరే ఉంటారు. వీరే సామాజిక జీవితంలో ఆధునికతను ఆవిష్కరించగలరు. ఈ ఆధునికతే ప్రజాజీవనంలో అన్ని రంగాలలో వ్యాపిస్తుంది.

తెలుగులో విడివిడిగా గొప్ప పరిశోధకులున్నారు. మంచి పండితులున్నారు. ఎందరో చరిత్రకారులున్నారు. సినిమా కవులు కూడా ఉన్నారు. బుద్ధిబలం కలిగిన విమర్శకులున్నారు. వివిధ ప్రక్రియల్లో ఆరితేరిన వృద్ధమూర్తులున్నారు. విభిన్న కళలలో నిష్ణాతులైన కళాభిజ్ఞులున్నారు. క్రీడాకారులూ, ఇంద్రజాలికులూ ఉన్నారు. కానీ, పైన వివరించిన అన్నిరంగాలలోనూ సాధికారికతను ప్రదర్శించగల మూర్తీభవించిన ప్రతిభా సంపన్నులు కొందరే ఉన్నారు.వారిలో ఆరుద్ర ఒకరు. నడుస్తున్న విజ్ఞాన సర్వస్వానికి 'ఆరుద్ర' నామాంతరం.

ఒక వ్యక్తికి నిత్యజీవితంలో ఎదురైన అనేక సంఘటనలు, సన్నివేశాలు, తాను పొందిన అనుభవాలు, దర్శించిన అనేక దృశ్యాలు; చీకటి-వెలుగులు, సుఖదుఃఖాలు వంటివి ఎన్నో, మరెన్నో ఆ వ్యక్తి వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని నిర్దేశిస్తాయి. కాలగమనంలో ఆ వ్యక్తికి ఉన్న స్థానాన్ని నిరూపిస్తాయి. ఈ పరిస్థితి ఆరుద్రకూ వర్తిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఆరుద్ర స్థానాన్ని నిర్ణయించడానికి, ఆరుద్ర ప్రాతినిధ్యాన్ని విశ్లేషించడానికీ ఆయన వదలి వెళ్ళిన జీవితంలోకి కొంత తొంగిచూడటం అవసరం. ఆరుద్ర జీవితంలోని 'సినీవాలి'ని కొంతసేపు దర్శించడం అవసరం.

1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో ఒక శిశోదయం జరిగింది. తల్లిదండ్రులు వెంకటజోగమ్మ, భాగవతుల నరసింగరావులు తమ బిడ్డకు సదాశివశంకరశాస్త్రి అని పేరు పెట్టుకున్నారు. ఆ శిశువే తరువాత సాహిత్యలోకంలో ఆరుద్రగా కళ్ళు తెరిచాడు.

సుమారు నాల్గువందల సంవత్సరాల క్రితం దక్షిణ భారతం కరువుకోరల్లో చిక్కుకుంది. ఆరోజుల్లో బతుకుతెరువుకోసం కొన్ని బ్రాహ్మణకుటుంబాలు విశాఖపట్నం జిల్లాలోని ఎలమంచిలికి సమీపంలో ఉన్న 'దిమిలి' గ్రామానికి వలస వెళ్ళాయి. వారిలో 'ఆదిభట్ల' వారు కూడా ఉన్నారు. సీతారామ భగవతి ఆ వంశానికి చెందినవారే, మూలపురుషుడు.

ఆదిభట్ల సీతారామ భగవతి తరువాతకాలంలో భాగవతుల సీతారామ భగవతి అయ్యారు. అందుకొక కారణం ఉంది. దిమిలి గ్రామానికి సీతారామభగవతి 'పెత్తందారు'. ఆయన గొప్ప శివదీక్షాపరుడు. వేకువ కాకముందే ప్రతిరోజూ శారదానదిలోకి సంధ్యా వందనానికి వెళ్ళేవారు. పార్థివ లింగానికి నైవేద్యం సమర్పించి ఒక్కపొద్దులుండేవారు. ప్రతిరోజూ గ్రామ చావిడిలో కూర్చొని భాగవతపారాయణం చేసేవారు. ఈ క్రమంలోనే - భగవతిగారు భాగవతాన్ని పఠిస్తూ ఉండటంవల్ల ఆయనను గ్రామస్తులంతా భాగవతుల భగవతిగా పిలవడం అలవాటయ్యింది. అప్పట్నించీ 'ఆదిభట్ల'

అన్న వంశనామం తెరమరుగవుతూ వచ్చింది. 'భాగవతుల' అన్న పేరే వేదిక ఎక్కింది. వృత్తులు, ప్రవృత్తులు కూడా మన ఇళ్ళపేర్లుగా స్థిరపడటం సామాజికవేత్తలేకాక, ఆనమాస్టిక్స్ భాషావేత్తలు కూడా అంగీకరించిన విషయమే.

ఆరుద్రది సంప్రదాయ కుటుంబం. పుట్టిన నక్షత్రాన్నిబట్టి బిడ్డకు నామకరణం చేయడం సంప్రదాయ కుటుంబాలలో సహజమే. 'ఆరుద్ర' ఒక నక్షత్రం పేరు. శంకరాచార్యులవారు 'ఆరుద్ర' నక్షత్రంలో పుట్టినట్టు కొందరు జ్యోతిష పండితులు చెపుతారు. తమ బిడ్డకూడ అదే నక్షత్రంలో పుట్టడం వల్ల తల్లిదండ్రులు శంకరాచార్యుల పేరు కలిసివచ్చేలాగా 'సదాశివ శంకరశాస్త్రి' అని పేరు పెట్టుకున్నారు. కాలగతిలో అబ్బిన భౌతికస్పృహ మూలంగా ఒక సనాతన మత సంప్రదాయాన్ని సూచించే అసలు పేరును అవతల పెట్టి, తన నక్షత్రం పేరును కలంపేరుగా ఆరుద్ర స్థిరపరచుకున్నారు.

ఆరుద్ర అనే పేరే సాహిత్యరంగంలో పచ్చబొట్టులా నిలిచిపోయింది.

'ఆరుద్ర' కేవలం ఒక నక్షత్రం పేరు మాత్రమే కాదు. ఒక పురుగు పేరు కూడా, ప్రకృతి పచ్చపచ్చగా నవ్వుతున్న వేళ, ప్రకృతి మాత నుదుటిమీద పెట్టుకొనే బొట్టంత పరిమాణంలో కుంకుమరంగులో లేత పచ్చికపైన ఈ ఆరుద్ర పురుగు కన్పిస్తుంది. పసివయసులో ఆరుద్ర కూడా ఎర్రగా బొద్దుగా అచ్చం ఆరుద్ర పురుగులా ఉండేవాడట. స్నేహితులంతా శంకరాన్ని ఉడికించడం కోసం 'ఆరుద్ర' అని పిలిచేవారు. మిత్రులు పెట్టిన ఈ వెటకారపు పేరునే ఆరుద్ర గొప్ప బిరుదుగా భావించాడు. దానినే తన కలం పేరుగా స్థిరపరచుకున్నాడు. నవ్విన నాపచేనే పండుతుందన్నట్టు సాహిత్యలోకం కూడా ఈ కలం పేరునే ఆమోదించింది.

* * *

పాఠశాలల్లో చదువుకోడం వేరు. ప్రపంచాన్ని అధ్యయనం చెయ్యడం వేరు. ఇది తెలియని వాళ్ళకి ప్రపంచ సాహిత్యాన్నీ, ప్రజాజీవితాన్ని అధ్యయనం చేసిన ఆరుద్రకు పాఠశాల చదువులు అంతగా లేదంటే ఆశ్చర్యం వేస్తుంది. విశాఖపట్నంలోని శివరామయ్య బడిలో ఆరుద్ర ప్రాథమికవిద్యను అభ్యసించారు. విశాఖలోనే ఉన్న ఎ.వి.యమ్. కాలేజి హైస్కూలులో స్కూలుఫైనల్ దాకా చదువుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యకోసం ఆరుద్ర విజయనగరం వెళ్ళారు. కానీ ఆ చదువు కొనసాగలేదు. ఆరుద్ర జాతీయ రాజకీయ వాతావరణం ప్రభావానికి లోనయ్యారు. చదువుకు స్వస్తి పలికారు. సాంకేతికంగా ఆరుద్ర ఎస్సెస్సెల్సీ విద్యతో తృప్తిపడ్డారు.

తరువాత కాలంలో తెలుగు సాహిత్యరంగంలో ఒక ప్రత్యేకస్థానం పొందిన ఆరుద్ర చిన్నప్పుడు ఏ పాఠశాలలోనూ తెలుగు చదువుకోకపోవడం మరో విడ్డూరం. సంస్కృతం - ఆంగ్లం - గణితం - సామాన్యశాస్త్రం - సాంఘికశాస్త్రం; ఈ పాఠ్యవిషయాలు మాత్రమే ఆరుద్ర స్కూలుఫైనలుదాకా చదువుకున్నారు.

"అసలు చదువంతా పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూకాక గ్రంథాలయాల్లోనే జరిగింది" అని ఆరుద్రే చెప్పుకున్నారు. విశాఖపట్నంలో ఉన్న రీడింగురూం గ్రంథాలయం; విశ్వబ్రాహ్మణ సంఘం, ఆర్యవైశ్య సంఘాలు స్థాపించిన ప్రత్యేక గ్రంథాలయాలను ఆరుద్ర నిరంతరం సందర్శించేవారు. ఇందుకోసం పాఠశాలకు కూడా ఎగనామం పెట్టిన సందర్భాలు ఎక్కువే. తండ్రి నరసింగరావుగారు కూడా గొప్ప సాహిత్యాభిలాషి. ఎన్నో విలువైన గ్రంథాల్ని ఆరుద్రకోసం కొని తెచ్చేవారు. ఆరుద్ర ఉంటున్న వీధిలోనే అబ్బూరి రామకృష్ణారావు, పింగళి లక్ష్మీకాంతంవంటి ప్రసిద్ధ

సాహితీవేత్తలు ఉండేవారు. వీరంతా ఆరుద్రకు మంచి కుటుంబమిత్రులవ్వడం వల్ల వీరి సహచర్యం కూడా ఆరుద్రలోని సాహితీ పిపాసను మరికొంత ఇనుమడింపచేసింది. ఇంట్లోనూ, వీధిలోనూ కూడా సాహిత్య గంధం గుబాళించడం వల్ల ఆరుద్ర సాహిత్యాధ్యయనం నల్లేరుమీద బండి నడకయింది.

ఆరుద్రకు తొలిసాహిత్య గురువు తండ్రి నరసింగరావుగారే. అయితే ఆరుద్రను సాహిత్యపిపాసిగా మార్చిన వ్యక్తి శ్రీశ్రీ. శ్రీశ్రీతో ఆరుద్రకు బాగా దగ్గర బంధుత్వం ఉంది. ఆరుద్ర పితామహుల పేరు కృష్ణయ్య. వీరిని కిట్టయ్య పంతులుగారనేవారు. ఏనుగుల వీరాస్వామయ్యగారు కాశీయాత్ర చేస్తున్న సందర్భంలో వారికి కిట్టయ్య పంతులుగారే మజిలీ ఏర్పాటుచేశారు. కిట్టయ్య పంతులుగారికి అప్పలకొండ అనే సోదరి ఉంది. ఆమె భర్త వెంకటరమణయ్య. ఈయన గణితశాస్త్రంలో ఉద్దండుడు. విశాఖపట్నంలోని ఎ.వి.యం.కాలేజి హైస్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. ఈ వెంకట రమణయ్యగారి కుమారుడే శ్రీశ్రీ. అంటే శ్రీశ్రీకి ఆరుద్ర మేనల్లుడు వరస.

తనలో పఠనాసక్తిని అమితంగా పెంచిన శ్రీశ్రీ అంటే ఆరుద్రకు తొలినుంచీ కృతజ్ఞతాభావమే ఉంది. "శ్రీశ్రీకన్నా తనకు ఆప్తులు ఎవరూలేరనీ, తనకు మేనమామ అయినా, దగ్గర చుట్టమయినా, ఆప్తమిత్రుడయినా శ్రీశ్రీ ఒక్కడే" అనీ ఆరుద్ర భావించారు.

ఆరుద్ర గొప్ప సాహితీపరుడు కావడానికి ప్రేరణ కల్పించిన వారిలో శ్రీశ్రీతో పాటు మరికొందరు కూడా ఉన్నారు. ఆరుద్ర ఇంటర్మీడియట్ చదువుకోసం విజయనగరం వెళ్ళినపుడు అక్కడ రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమయాజులు వంటి వారితో పరిచయం అయ్యింది. టి.యస్. ఇలియట్, ఎజ్రాపౌండ్ వంటి ఎందరో ఆంగ్లకవులు, ఫ్రెంచి రచయితలు ఆరుద్రకు రోణంకి వారి ద్వారా పరిచయం అయ్యారు. ఆరుద్ర సాహిత్యాభిలాషను సానపట్టిన వ్యక్తి అప్పలస్వామిగారే. అందుకే తనను వెలిగించిన దీపంగా రోణంకిని ఆరుద్ర భావించారు.

ఆంగ్లసాహిత్యానికి సంబంధించిన విలువైన సమాచారం చాగంటి సోమయాజులుగారి గ్రంథాలయంలో లభించేది. అప్పటికే శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు వంటి యువసాహితీపరులెందరో చాసో గ్రంథాలయాన్ని తరుచూ సందర్శిస్తూ ఉండేవారు. వారిలో ఆరుద్ర కూడా ఉన్నారు. సాహిత్యవిషయంగా సోమయాజులుగారు యువకుల్ని ప్రోత్సహించే పద్ధతి, వారి ఆచరణాత్మకమైన జీవితం ఆరుద్రను ఎంతగానో ఉత్సాహపరిచింది. మరెంతగానో ప్రోత్సహించింది.

ఆరుద్ర నిరంతర విద్యార్థి. చాలా విషయాలు స్వతస్సిద్ధంగానే అధ్యయనం చేసినా కొన్ని విషయాలు గురుముఖతః అభ్యసించాలని పెద్దలు చెపుతారు. ఈ విషయాన్ని ఆరుద్ర కూడా గౌరవిస్తారు. 'శాస్త్రమాచార్య సన్నిధి చదవాలన్న' సద్దిమూటను ఆరుద్ర ఆచరణలో పెట్టారు. తెలుగు సాహిత్య రంగంలో ఆరుద్రకు ఒక స్థిరమైన చిరునామా సిద్ధించాక కూడా 1960 దశకంలో వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించడానికి ఒక గురువును ఆశ్రయించారు. ఆ గురువు ప్రఖ్యాత వ్యాకరణవేత్త రావూరి దొరస్వామిశర్మగారు. వారు వ్యాకరణంలో పుట్టి వ్యాకరణంలో పెరిగినవారు. వాదోపవాదాల పద్ధతిలో ఆరుద్ర వ్యాకరణశాస్త్ర అధ్యయనాన్ని పూర్తిచేశారు. ఈ శిక్షణ పూర్తి కావడానికి వారికి మూడు సంవత్సరాల కాలం పట్టింది.

రావూరి దొరస్వామిశర్మగారు గొప్ప గ్రాంథికవాది. వ్యాకరణంలోని వ్యావహారిక భాషాసూత్రాలను శర్మగారు నిరంతరం ఆరుద్రలో చర్చిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో రావూరివారుకూడా వ్యావహారిక భాషావాదిగా మారిపోయారు. అప్పటివరకూ కరుడుకట్టి ఉన్న ఒక దృక్పథాన్ని మార్చినందుకు శర్మగారు ఆరుద్రను ఎంతగానో అభినందించారు. గురువును మించిన శిష్యులు లోకంలో చాలామంది ఉన్నారు. కానీ గురువును మార్చిన శిష్యుడిగా ఆరుద్ర అరుదైన గౌరవాన్ని పొందారు.

* * *

ఆరుద్ర వంశంలో చివరితరాలకు చెందినవారిలో కృష్ణదాసు ఒకరు. ఈయన గొప్ప తాత్విక చింతన కలవాడు. 'శుద్ధ నిర్గుణ తత్వ కందార్థ దరువులు' అనే గ్రంథాన్ని కూడా రచించారు. 1843లో రచించిన ఈ గ్రంథంలో కృష్ణదాసు అచలమతాన్ని ప్రబోధించారు. జనసామాన్య భాషలో, దేశీయ ఛందస్సులో, కందార్థ దరువుల్లో ఈ గ్రంథం ప్రకటించబడింది.

అచలమతం ద్వైతాద్వైతరహితమైన పరమతత్వాన్ని ఆవిష్కరిస్తుంది. అచలం అంటే నిరావరణం. ఆవరణం అంటే ఆకాశం. నామరహితమైంది, మూలంకూడా లేనిది అచలం. సంకల్పస్థితికి పూర్వం ఉన్న జడస్థితిని పరిపూర్ణ బ్రహ్మం' అని తాత్వికులు ప్రబోధిస్తారు. అచలమతం దీనినే విశ్లేషిస్తుంది. అయితే అచలమతంలో మరో ప్రత్యేకతకూడా ఉంది. ఈ మతం వైదికమతాన్నీ, ద్వైతాద్వైతాలనూ అంగీకరించదు. యోగకర్మలను కూడా ఇది నిరసిస్తుంది. అటువంటి అచలమతాన్ని ఆరుద్ర పూర్వీకులు ప్రచారం చేశారు.

డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామశాస్త్రం దగ్గరనుంచి ఆధునిక వైద్యశాస్త్రం వరకూ మనిషి పుట్టుకకు సంబంధించిన ఒక విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ప్రతి మనిషిలోనూ సాధారణంగా పూర్వీకుల భౌతిక జన్యు ప్రభావం ఉంటుందన్నది కాదనలేని సత్యం. అదేవిధంగా మనిషి ఆలోచనల్లోనూ తన వంశానికి చెందిన మూలపురుషుల తాత్వికజన్యు ప్రభావం కూడా ఉండటానికి అవకాశం ఉందని మనస్తత్వశాస్త్రజ్ఞులు చెపుతారు. బహుశ ఆరుద్రలో ఈ ప్రభావం ప్రగాఢంగానే పడిందని భావించవచ్చు.

ఆరుద్ర బాల్యస్నేహితుల్లో తీగల బుచ్చివెంకట రమణయ్య ఒకరు. స్నేహితులంతా వెంకట రమణయ్యను బుచ్చికొండ అని పిలిచేవారు. బుచ్చికొండకు ఒక సోదరుడున్నాడు. ఆయన పేరు పెద్దకొండ. ఈ విషయాలు 1932-33 ప్రాంతంనాటివి. అప్పటికి ఆరుద్ర వయస్సు ఏడెనిమిది సంవత్సరాలు. ఈ ఇద్దరు స్నేహితులూ ఆరుద్ర ఇంటికి ఎక్కువగా వస్తూ పోతూ ఉండేవారు. భోజనం సమయంలో ఇంటికొచ్చినపుడు స్నేహితులు కూడా ఆరుద్రతో పాటే భోజనం చేసేవారు. అయితే, ఆరుద్ర ఇంట్లోను, స్నేహితులు వసారాలోనూ భోజనానికి కూర్చొనేవారు. ఆరుద్ర తిన్న కంచాన్ని ఇంట్లోవాళ్ళు శుభ్రపరిచేవారు. స్నేహితుల్ కంచాలను మాత్రం ఆ స్నేహితులే కడికిపెట్టేవారు. ఆ స్నేహితులు బ్రాహ్మలు కాదు; వైశ్యులు కావడం ఇందుకు కారణం. ఈ దృశ్యాన్ని తరచూ చూస్తున్న ఆరుద్ర ఆ పసివయసులోనే గొప్ప సంఘర్షణకు లోనయ్యేవాడు. తీవ్రంగా బాధపడేవాడు. ఆరుద్ర షష్టిపూర్తి సంచికలో బుచ్చికొండే స్వయంగా ఈ విషయాలను ముచ్చటించారు.

ఇంత చిన్నవయస్సులోనే ఆరుద్ర సామాజిక స్వభావాన్ని నిశితంగా పరిశీలించారు. అదేక్రమంలో ఆరోజుల్లోనే ఆరుద్రలో హేతువాద భావాలుకూడా బలంగా నాటుకున్నాయి. వంశాచారాన్ని అనుసరించి పెద్దలు ఆరుద్రకు వడుగు చేయాలనుకున్నారు. అందుకు ముహూర్తం కూడా నిశ్చయించారు. అయితే ఆరుద్ర ఆ తంతును నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. ఇటువంటి విషయాలు ఈనాడు పెద్దవార్తలు కాకపోవచ్చు. కానీ ఆనాడు అది ఖచ్చితంగా గొప్ప సంచలనం కలిగించే ఘట్టమే.

వయసుతోపాటు మనసుకూడా సమాంతరంగా ఎదుగుతూ, పరిపక్వం చెందుతూ ఉందని తెలుస్తుంది. ఆరుద్రలోని హేతువాది నిరీశ్వరవాదిగా మారాడు. విశాఖపట్నంలో, ఎ.వి.యం. కాలేజి హైస్కూల్లో ఆరుద్ర స్కూలుఫైనలు చదువుతున్న రోజులవి. ఫైనల్ పరీక్షలు దగ్గరపడ్డాయి - పరీక్ష రాయడానికి ఆరుద్ర బయలుదేరాడు. తల్లిదండ్రులు దేవుడికి దండం పెట్టుకొని వెళ్ళమని ఆరుద్రకు

చెప్పారు. ఈ విషయంలోకూడా ఆరుద్ర మరోసారి పెద్దల మాటను తిరస్కరించాడు. అంతేకాక, "ఏం? నా తరఫున దేవుడొచ్చి పరీక్ష రాస్తాడా?" అని తిరిగి ప్రశ్నించాడు కూడా.

ఆరుద్రలో ఈ పరిణామాలన్నీ గమనిస్తున్న తల్లిదండ్రులు హతాశులవ్వడమేకాదు, బెంబేలెత్తిపోయారు. కులధర్మాల్ని కాలదన్నుతున్నాడని వారు ఎంతగానో తల్లడిల్లారు. కొడుకు చెడిపోయాడని కుమిలిపోయారు. దేవుడు లేనివాడికి తల్లిదండ్రులు మాత్రం ఎక్కడున్నారని ఆరుద్రను మందలించారు కూడా. అయితే పెద్దల దృష్టిలో ఆరుద్ర చెడిపోయినా; ఆరుద్ర మనసులో తాను చెడిపోయినట్టు ఏనాడు భావించలేదు. పైగా బాగుపడ్డానని సంబరపడ్డాడు.

చిన్ననాడే ఆరుద్రలో ఉన్న మానసిక చైతన్యాన్నీ, ఆలోచనా ధోరణులనూ తెలియచేసే ఇటువంటి సంఘటనలు ఆరుద్ర బాల్యంలో కోకొల్లలు. వయసు పెరిగేకొద్దీ ఆరుద్రలో సామ్యవాదభావాలూ, జాతీయభావాలూ పెరుగుతూనే ఉన్నాయి.

ఆరుద్ర కాంగ్రెసు కుటుంబంలోంచి వచ్చిన వ్యక్తి. ఆయన పెరిగింది ఖద్దరు పొత్తిళ్ళలోనే. చురుకైన వాలంటీరుగా అనేక కాంగ్రెసు కార్యకలాపాలలో చిన్నప్పుడే ఆరుద్ర పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ చదువుకోసం ఆరుద్ర విజయనగరం చేరుకున్నాడు. అప్పటికే ఆరుద్రలో జాతీయ రాజకీయ చైతన్యంతోపాటు అంతర్జాతీయ చైతన్యం కూడా నరనరాలా జీర్ణించుకుంది. ప్రపంచ రాజకీయాలలో అప్పటికే ఫాసిస్టుల దురాక్రమణ ధోరణి బాగా ముదిరి పాకానపడింది. ఒక్కొక్క పావు ముందుకు కదులుతూ వుంది. అబీసీనియాపై ఇటలీ దాడికి దిగింది. స్పెయిన్‌లో ప్రజా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాలు మొదలయ్యాయి. ఇటలీ, జర్మనీలు ఆ ఉద్యమాలకు జమిలిగా ఆజ్యం పోశాయి. అంతటితో ఊరుకోక అక్కడ నియంత లక్షణాలు కలిగిన ఫ్రాంకోకు వెన్నుదన్నుగా నిలిచాయి. మంచూరియా జపానును ఆక్రమించు కోవడం, జర్మనీ ఆస్ట్రియాను కబళించడం చెకచెకా జరిగిపోయాయి. వీటన్నింటి ఫలితంగా 1939లో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ఆరంభమైంది.

ప్రపంచ రాజకీయ వాతావరణాన్ని ఆరుద్ర ఆరోజుల్లోనే అవగాహన చేసుకున్నాడు. ఫాసిజం పట్ల ఆరుద్రలో తీవ్రమైన కసి పెరిగింది. 1942లో ఆరుద్ర చదువుకు స్వస్తి పలికాడు. సాయుధ వైమానికదళంలో చేరారు.

వైమానికదళంలోనూ ఆరుద్ర యాంత్రికంగా జీవించలేదు. ఆరోజుల్లో, ఓ సందర్భంలో నౌకాదళం సమ్మెకు దిగింది. అందుకు సాయుధదళం మద్దతు ప్రకటించింది. ఆ సమ్మెలో కూడా ఆరుద్ర చురుకుగా పాల్గొన్నారు. రావల్పిండి, బొంబాయి, మద్రాసు వంటి అనేక ప్రాంతాల్లో ఆరుద్ర సాయుధదళాలతో గడిపారు. దేశరక్షణలో భాగంగా ఆరుద్ర ఒక సైనికుడిగా బ్రెన్‌గన్లు, స్టెన్‌గన్లు ప్రయోగించడం నేర్చుకున్నారు. యూరోపియన్ దేశాల్లోనూ, జపాన్‌మీదా యుద్ధంలో విజయం లభించేదాకా ఆరుద్ర సైన్యంలోనే ఊపిరి పీల్చుకున్నారు.

మానసికంగానూ, శారీరకంగానూ ఆరుద్ర ఫాసిజంపై నిరంతర యుద్ధం జరుపుతూ ఉన్నా; సమయం దొరికినపుడల్లా సాహిత్యాధ్యయనం కొనసాగిస్తూనే ఉన్నారు. వైమానికదళానికి చెందిన గ్రంథాలయంలో ఉన్న ఎన్నో ఇంగ్లీషు గ్రంథాలను ఆరుద్ర పఠించారు. అంతేకాక సాహిత్యంపట్ల అభిమానం ఉన్న సైనికులలో తరుచుగా సాహిత్య చర్చలు చేస్తూ ఉండేవారు. ఇంగ్లీషు సాహిత్యానికి చెందిన కొన్ని విషయాలను ఆరుద్ర ఈ కాలంలోనే తెలుసుకున్నారు.

ఆరుద్రను 1944లో బొంబాయి విమానదళానికి మార్చారు. సాహిత్యపరంగా ఆరుద్ర జీవితంలో ఇదొక ప్రధానమలుపు. బొంబాయిలో ఉన్న జి.యస్.భార్గవగారిద్వారా అక్కడ ఉంటున్న

కొడవటిగంటి కుటుంబరావుగారు ఆరుద్రకు పరిచయం అయ్యారు. బొంబాయిలో ఉన్నంతకాలం ఆరుద్ర ప్రతిసెలవురోజునూ కుటుంబరావుగారితో గడిపేవారు. ఇద్దరిమధ్యా అనేక సాహిత్య విషయాలపట్ల చర్చలు జరిగేవి. విజయనగరంలో ఆరుద్రకు సాహిత్య శిక్షణ జరిగినా; ఒకరకంగా బొంబాయిలోనే కొడవటిగంటి సహచర్యంతో ఆరుద్ర సాహిత్య ప్రతిభ నిగ్గుతేలిందని చెప్పాలి.

ఆరుద్ర దళంలో ఉండగానే ఫ్రెంచిభాషను నేర్చుకున్నారు. నాలుగుపాఠాలదాకా పూర్తి చేశారు. ఆనాడు గొప్ప ప్రచారంలో ఉన్న నానా పెడ్రోవా రచించిన ఫ్యామిలీ నవలను ఆరుద్ర ఆరోజుల్లోనే పఠించారు. జపానులో 1937లో జరిగిన దారుణ మారణకాండను ఈ నవల చిత్రీకరించింది. సాహిత్యం ద్వారా అంతర్జాతీయ సంఘటనలెన్నింటినో తెలుసుకోవడమేకాక, ప్రపంచ రాజకీయాలు సాహిత్యంలో వ్యక్తీకరించబడిన విధానాలను కూడా ఆరుద్ర అధ్యయనం చేశారు.

* * *

సామాజిక పరిణామాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన సిద్ధాంతం మార్క్సిజం. కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ - బానిస యజమానుల వ్యవస్థ - భూస్వామ్య వ్యవస్థ - పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక క్రమంలో రూపొందడాన్ని మార్క్సిజం భౌతికవాద దృక్పథంలోంచి వివరించింది. ఇప్పుడున్న పెట్టుబడి వ్యవస్థ కూలిపోయి వర్గరహిత కమ్యూనిస్టు వ్యవస్థ రూపొందుతుందని కూడా మార్క్సిజం వివరిస్తుంది.

కాంగ్రెసు పొత్తిళ్ళలో పుట్టి పెరిగిన ఆరుద్రకు మార్క్సిజంపట్ల అవగాహన యాదృచ్ఛికంగా జరగలేదు. విజయనగరంలో ఉండగా చాగంటి సోమయాజులుగారు సూచించిన కొన్ని గ్రంథాల అధ్యయనం ఆరుద్ర అవగాహనలో మార్పును తెచ్చింది. వర్గ స్పృహను విశ్లేషించిన మార్క్సిజాన్ని మేధోగతం చేసుకోడానికి చాగంటి సోమయాజులుగారి ఆచరణాత్మక జీవితం కూడా ఆరుద్రకు ఒక ఉత్ప్రేరకంగా పనిచేసింది. ఆరుద్రలో కమ్యూనిజం భావజాలం ఆ సమయంలోనే అంకురించింది. మార్క్సిజం పట్ల అవగాహన ఆ సందర్భంలోనే పొటమరించింది.

1942లో మద్రాసు నుంచి 'విశాలాంధ్ర' పక్షపత్రికా, మాసపత్రికా వెలువడేది. సెట్టి ఈశ్వరరావుగారు ఆ పత్రికలకు సంపాదకులు. వారి సిఫార్సుతో ఆరుద్ర కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుగా తన పేరు నమోదు చేసుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలలో ఎంత అవిశ్రాంతంగా పనిచేస్తున్నా, ఆరుద్ర మరోపక్క సాహిత్యాధ్యయనాన్ని మరిచిపోలేదు. చాగంటి సోమయాజులుగారి సూచనల మేరకు 'పీపుల్స్‌వార్' పత్రికలలోని రచనలన్నీ అధ్యయనం చేశారు. ఆరోజుల్లో ప్రముఖ కమ్యూనిస్టు రచయిత కోగంటి గోపాలకృష్ణయ్యగారి కవితలు ఆరుద్రను ఎంతగానో ఉత్తేజపరిచాయి. గతతార్కిక చారిత్రక భౌతికవాదం గురించి మార్క్సిస్టు మేధావులు చెప్పిన అనేక పాఠాలను ఆరుద్ర ఎంతో శ్రద్ధగా వినేవారు.

చాగంటి సోమయాజులుగారి కథల్ని అనేకం ఆరుద్ర అధ్యయనం చేశారు. ఆ కథల్లోని ఆర్థిక జీవన విశ్లేషణ ఆరుద్రను అమితంగా ఆకట్టుకుంది. చాసో రచించిన అనేక కథలు ఆరుద్రకు ఆరోజుల్లో కంఠోపాఠాలు. జేమ్స్ జాయిస్ రచించిన 'యులిసిస్' నవలలోని చైతన్య స్రవంతి (stream of consciousnes) శిల్పాన్ని చాసో మూలంగానే ఆరుద్రకు అవగాహనకు వచ్చింది.

చాసోతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ అని చాలామంది భావించారు. అటువంటి చాసోతో ఆరుద్ర అనేక చర్చలు జరిపారు. అవి వేడివేడిగా కూడా సాగేవి. రోణంకి అప్పలస్వామిగారు ఆరుద్రకు ఆంగ్ల సాహిత్యంలోని సొబగుల్ని వినిపిస్తే; చాసో భౌతికవాద సాహిత్య సౌరభాన్ని

తినిపించారు. ప్రపంచ రాజకీయాలను అర్థం చేసుకోడానికి వర్గస్పృహతో కూడుకున్న అనేక రచనలు ఆరుద్రకు సహకరించాయి. ప్రపంచ దేశాలలో వేరు వేరు కోణాలలో నెలకొన్న ఫాసిజాన్ని ఆరుద్ర ఈ అధ్యయనంలోంచే అవగాహన చేసుకొన్నారు.

చాసోతోపాటు ఇతరులు కూడా ఆరుద్రలో వర్గస్పృహకు సంబంధించిన భావజాలం పదునెక్కడానికి ఊతాన్నిచ్చారు. ఈ దృక్పథాన్ని ప్రపంచానికి అందించిన కారల్‌మార్క్స్ అంటే ఆరుద్రకు ప్రత్యేక గౌరవం. ఆరుద్రలో భౌతికవాద భావజాల సమాలోచనకు స్ఫూర్తినిచ్చిన మూలస్తంభాలవంటివారు ముగ్గురున్నారు. వారు – శ్రీశ్రీ, చాసో, రోణంకి అప్పలస్వామి. వీరు కంటికెదురుగా కన్పించే మూర్తులైతే కన్పించని నాలుగో మూలస్తంభం కారల్‌మార్క్స్.

1983లో ఆరుద్ర ఇంగ్లండ్ పర్యటించారు. అపుడు లండన్‌లో ఉన్న కారల్‌మార్క్స్ సమాధిని సందర్శించారు. ఎంతో గౌరవప్రపత్తితో ఆ సమాధికి రెడ్ సెల్యూట్‌చేసి మార్క్స్‌కు ఆరుద్ర అరుణాంజలి ఘటించారు. ఈ సంఘటనను ఆరుద్ర చిరకాలందాకా మరిచిపోలేదు సరిగదా, ఆ ఘటనను తన జీవితంలో మరపురానిదిగా భావించారు.

ఆరుద్ర మార్క్స్‌ను ఎంతగా గౌరవిస్తాడో మార్క్స్‌ను అధ్యయనం చేసిన మార్క్సిస్టు మేధావుల్ని కూడా అంతగా గౌరవించేవారు. అటువంటివారిలో దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్యగారు ఒకరు. కేవలం కమ్యూనిస్టులే కాక లక్షలాది కమ్యూనిస్టేతరులుకూడా సుందరయ్యగారిని ఎంతగానో గౌరవించేవారు. వారి వ్యక్తిత్వం అటువంటిది. సుందరయ్యగారు మరణించినపుడు ఎందరో రచయితలు, కవులు, కళాకారులు కంటనీరు కురిపించారు. ఎన్నో రచనలు చేశారు. స్మృతిగేయాలు ఆలపించారు. ఆరుద్ర కూడా అరుణాంజలి ఘటించారు. ఆ సందర్భంలో ఆరుద్ర రచించిన –

"జోహారు జోహారు సుందరయ్య
నీలాంటి త్యాగజీవులెందరయ్యా"

అనే స్మృతిగేయాన్ని ఆనాటి ప్రముఖ పత్రికలన్నీ ప్రచురించాయి. ఈ స్మృతిగేయాన్ని ఈనాటికీ సుందరయ్యగారి అభిమానులు భక్తిగీతంగా ఆలపిస్తారు.

అతి పెద్ద సొంత గ్రంథాలయం కలిగిన తెలుగు రచయితల్లో ఆరుద్ర ఒకరు. లక్షలాది రూపాయల విలువ చేసే అరుదైన పుస్తకాలు ఆ గ్రంథాలయంలో ఉండేవి. అందులో ఎందరో పరిశోధక విద్యార్థులు తమ డాక్టరేట్లకు పనిచేసుకొన్నవారే. సుందరయ్యగారు చనిపోయిన తరువాత వారి జ్ఞాపకార్థం హైదరాబాదులో సుందరయ్య విజ్ఞానకేంద్రాన్ని మార్క్సిస్టులు నెలకొల్పారు. సుందరయ్యగారిపై ఉన్న గౌరవభావంతో ఆరుద్ర తన విలువైన గ్రంథాలయాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి బహూకరించారు.

మార్క్సిజం పట్ల ఆరుద్రకు గొప్ప నమ్మకం తొలినాళ్ళలోనే ఏర్పడింది. రాను రాను అది మరింతగా గట్టిపడింది. అందుకే చాలా సందర్భాలలో ఆరుద్ర "నేను మార్క్సిస్టును, ఏ విషయాన్నయినా మార్క్సిస్టు కోణం నుంచే నేను పరిశీలిస్తాను" అని పదేపదే చెప్పుకున్నారు. "మార్క్సిజం ఒక్కటే మానవాళికి మహత్తరశాస్త్రం" అని విశ్వసించిన ఆరుద్ర రక్తంలో, జీవిత చరమాంకందాకా మార్క్సిజమే ప్రవహించింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో మార్క్సిజమే పయనించింది. ఆలోచనల పొరల్లో కూడా మార్క్సిజమ్ జీవించింది.

* * *

ఆరుద్ర పూర్వీకులది జమీందారీ వంశమే అయినా తన తండ్రికాలంలోనే జమీందారీ అంతరించింది. ఇంటి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకపోయినా ఆరుద్రది కాలంతోపాటు ఎదిగిన వ్యక్తిత్వం. కనుక స్వతంత్ర జీవితాన్ని గడపాలనుకున్నారు. తన ఆలోచనలకు రూపం కల్పించడం కోసం ఆరుద్ర చిన్ననాటినుంచే ఉద్యోగప్రస్థానం మొదలుపెట్టారు.

బ్రతుకుతెరువుకోసంకాక, ఫాసిజంపైన వ్యతిరేకతతోనే ఆరుద్ర వైమానికదళంలో చేరారు. అయినా, ఒకరకంగా ఆరుద్ర ఉద్యోగ ప్రస్థానంలో దానిని తొలి అడుగుగా భావించాలి. రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో జనరల్ డ్యూటీస్ గుమస్తా (LA.C.)గా ఆరుద్ర 1943 నుంచి 1946 దాకా పనిచేశారు. ఆకాలంలో ఆరుద్ర అరవైతొమ్మిది రూపాయల నెలజీతం తీసుకున్నారు. ఈమధ్యకాలంలోనే కొన్నాళ్ళు బ్యాండ్ మ్యుజిషియన్ అప్రెంటీసుగా కూడా ఆరుద్ర పనిచేశారు.

యుద్ధంలో విజయం సాధించాక కొంతకాలంపాటు ఆరుద్ర నిరుద్యోగిగా గడిపారు. ఆరోజుల్లో మద్రాసునుంచి ఆనందవాణి అనే వారపత్రిక వెలువడేది. పుస్తకరూపంలో వెలువడిన తొలివారపత్రికగా ఆనందవాణికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ పత్రికను ఉప్పులూరి కాళిదాసుగారు నడిపేవారు. నిరుద్యోగిగా ఉన్న ఆరుద్ర మద్రాసు చేరి, ఆనందవాణి పత్రికలో చేరారు. 1947-48 మధ్యకాలంలో ఆ పత్రికకు సంపాదక బాధ్యతలను ఆరుద్ర నిర్వహించారు.

పనిచేస్తున్న పత్రిక పేరు 'ఆనందవాణి' అయినప్పటికీ ఆనందం అనేది ఏనాడూ ఆరుద్ర గడపతొక్కలేదు. ఏదైనా గడప తొక్కాలంటే అసలు ఇల్లనేది ఉండాలి. ఆనాడు ఆరుద్ర ఇల్లూ వాకిలిలేని జీవితం గడుపుతూ ఉండేవారు. శ్రీశ్రీ అంతకుముందే మద్రాసు చేరుకోవడం వల్ల, ఇద్దరూ కలిసి నెలకు ఆరొందల రూపాయలు సంపాయిస్తున్నా తలదాచుకోవడానికి కాస్తంత నీడకు కూడా నోచుకోని జీవితాన్ని గడిపారు. పేవ్‌మెంట్లూ, పనగల్‌పార్కు ఆరోజున శ్రీశ్రీ ఆరుద్రలకు అద్దాల భవనాలలాంటివంటే ఈరోజున మనం ఆశ్చర్యపోతాం. కానీ, అది కఠినమైన వాస్తవం. చివరకు ఆరుద్ర వేరువేరు కారణాలవల్ల ఆనందవాణి పనిలోనేకాక, అసలు మద్రాసు నగరంలోనే ఇమడలేకపోయారు. పేవ్‌మెంట్లనూ, పనగల్ పార్కునూ వదలి అడుగు బైటపెట్టారు.

విశాఖపట్నాన్ని వదిలిన ఆరుద్ర 'రెండురకాల నాలుకలులేక ఆనందవాణి నుంచీ; రెండురకాల మాటలు చేతకాక మద్రాసు నుంచీ మహాభినిష్క్రమణం చేశారు". మద్రాసులో లేపిన పాదం తిరిగి విశాఖపట్నం మాతృగడ్డమీద మోపారు.

ఆరుద్రకు శ్రమ విలువ తెలుసు. శ్రమ సౌందర్యం తెలుసు. శ్రమ చేయడంలో చిన్నతనం ఉండకూడదని కూడా తెలుసు. అందుకే ఆరుద్ర స్వర్గంకంటే గొప్పదయిన మాతృభూమిలో పాదం మోపిన కొద్దికాలానికే విశాఖహార్బర్‌లో గుమాస్తాగా పనిలో చేరారు. మరికొద్దికాలానికి విశాఖపట్నంలోనే ఉన్నా లైకోగ్రాఫ్ స్టూడియోలో ఫోటోగ్రాఫర్‌గా పనిని మార్చుకున్నారు. మంచి ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌గా కూడా ఎదిగారు.

జీవితంలో ఘనమైన ఆశయాలు కలిగిన ఆరుద్ర విశాఖనగరంలోని అల్పమైన వాతావరణంలో ఇమడలేకపోయారు. మాతృభూమే అయినా ఆరుద్ర విశాఖను కూడా వదిలిపెట్టక తప్పలేదు. ఒక నిర్ణీతమైన ఆశయం, ఆలోచన స్పష్టంగా లేకుండానే ఆరుద్ర తెగిన గాలిపటంలా హౌరా జిల్లాలోని 'నాల్బూరు'లో వాలారు. 'నాలుగు రైల్వే కొంపలు, పాతికమంది రైలుమనుషులు, ఊరంత చెరువు' మాత్రమే ఆనాటి బడాయిగా ఉన్న నాల్బూరులో ఆరుద్ర ప్రత్యేకించి చేసింది ఏమీలేదు. అయితే, సాహిత్యాధ్యయనం అక్కడ సంతృప్తికరంగా జరిగిందన్న తృప్తి ఆరుద్రకు కలిగింది. ప్రబంధకవుల్నీ, దక్షిణాంధ్ర కవుల్నీ ఆరుద్ర అక్కడ పునరధ్యయనం చేశారు. కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలను స్థిరపరచుకున్నారు.

వృత్తిలేకుండా కేవలం ప్రవృత్తి కడుపు నింపదు. మనసుకు మేతపెట్టే సాహిత్యం ఆరుద్రకు అందుబాటులో ఉన్నా కడుపుకు కూడుపెట్టే పని మాత్రం ఆరుద్ర చేరువకాలేదు. అందుకే ఆరుద్ర దృష్టి సాహిత్యం మీదనే ఉన్నా కళ్ళుమాత్రం శూన్యంలోకి చూస్తూ ఉన్నాయి. ఆ సమయంలోనే విశాఖపట్నం సమీపంలో ఉన్న కొత్తవలస గ్రామం ఆరుద్ర స్ఫురణలోకి వచ్చింది. అందుకు కారణం తన చిన్ననాటి నేస్తం తీగల బుచ్చి వెంకట రమణయ్య (బుచ్చికొండ)ది కొత్తవలసే. బుచ్చికొండ ఆ ఊరులో ఒక సినిమాహాలు నడుపుతూ ఉన్నారు. అక్కడికి వెళ్ళి సినిమాహాలులో మేనేజర్‌గా పని కల్పించమని బుచ్చికొండను ఆరుద్ర అడిగాడు.

ఆరుద్ర-బుచ్చికొండలది నిర్మలమైన అనుబంధం. శరీరాలు దూరంగా ఉంటున్నా బుచ్చికొండ నిరంతరం ఆరుద్రను అన్వేషిస్తూనే ఉన్నాడు. అటువంటి ఆరుద్ర సినిమాహాలు మేనేజర్‌గా పని కల్పించమని అడిగినపుడు బుచ్చికొండ ఎంతగానో కుంగిపోయాడు. మంచి భవిష్యత్తు ఉన్న ఆరుద్ర పల్లెటూళ్ళకు పరిమితం కావడం బుచ్చికొండకు నచ్చలేదు. ఎంత చెప్పినా వినకుండా రైలు ఖర్చులకూ, ఒక నెలరోజులపాటు మద్రాసులో కాలు నిలదొక్కుకోడానికి సరిపడ డబ్బును బుచ్చికొండ ఏర్పాటు చేసి, తిరిగి ఆరుద్రను 1948లోనే మద్రాసు రైలెక్కించాడు.

మొదటినుంచీ ఆరుద్రకు జర్నలిజం అంటే గొప్ప అభిరుచి. 'అడ్వెంచర్ వాల్యూ ఉన్నది జర్నలిజమ్' అని ఆరుద్ర విశ్వసించేవారు. కొన్ని ఇతర కారణాలవల్ల గతంలో ఆనందవాణి పత్రిక సంపాదకత్వ బాధ్యతల్ని వదలిపెట్టారుగాని, జర్నలిజం అంటే సరిపడకపోలేదు. బుచ్చికొండ ప్రోద్బలంతో తిరిగి మద్రాసులో అడుగుపెట్టిన ఆరుద్ర మళ్ళీ ఏమైనా పత్రికలో పని దొరుకు తుందేమో అని వెతుకులాట ప్రారంభించారు. ఎడిటర్ పోస్టుకోసమే ఆరుద్ర ఎదురుచూడలేదు. సహాయ సంపాదకుడుగా అయినా, ఆఖరికి ప్రూఫురీడర్‌గా అయినా పని దొరికితే చేయడానికి ఆరుద్ర సిద్ధపడ్డారు. అనుకున్నట్టుగానే 'ఢంకా' అనే పత్రికలో ప్రూఫ్‌రీడర్ ఉద్యోగం దొరికింది. రోజంతా ప్రూఫులు దిద్దితే యాజమాన్యం ఆరుద్రకు రోజుకు ఒక రూపాయి జీతం చేతిలో పెట్టేది. ఆరోజు కూలీతో ప్రతిరాత్రీ ఒక ఇంగ్లీషు సినిమా చూడటం ఆరుద్ర దినచర్య అయింది.

ఆరోజుల్లో న్యాపతి నారాయణమూర్తిగారు ఒక దినపత్రికను నడిపే ప్రయత్నాలలో ఉన్నారని ఆరుద్రకు తెలిసింది. పత్రికారంగంలో ఆరుద్ర ప్రతిభ ఎంతటిదో నారాయణమూర్తిగారికి అప్పటికే తెలుసు. ఏదైనా పెద్ద ఉద్యోగమే ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. అయితే కొన్ని కారణాలవల్ల పత్రిక ప్రారంభం ఆలస్యం అవుతూ వచ్చింది. అందువల్ల ఆరుద్రకు మరేదైనా ఉద్యోగానికి సిఫార్సు చేస్తానని చెప్పి; రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీకి నారాయణమూర్తిగారు ఆరుద్రను పరిచయం చేశారు.

అంతకు పూర్వం ఏనాడూ సినిమారంగంలో పనిచేయాలని ఆరుద్ర అనుకోలేదు. అయినా, అనుకోకుండా ఎదురుపడిన సినిమారంగంలో ప్రవేశించడానికి ఆరుద్ర అడుగులు తడబడలేదు. బతుకుతెరువుకోసం అది తప్పలేదు. అయితే తన అడుగు తప్పటడుగూ కాదు, తప్పుటడుగూ కాదని మాత్రం ఆరుద్రకు తెలుసు.

రాజరాజేశ్వరీ కంపెనీ ఆరుద్ర కథా విభాగంలో ప్రవేశించారు. ప్రవేశద్వారం చిన్నదే అయినా ప్రతిభా సంపన్నత కలిగినవారు అన్నిదిక్కులకూ వ్యాపించగలరు. ఆరుద్ర కూడా తరువాత కాలంలో సినిమా రంగంలో 'ఇంతింతై' అన్నట్టుగా విజృంభించారు. సాహిత్యానికి సంబంధించిన అన్నిరంగాలనూ త్రివిక్రముడిలా ఆక్రమించారు. అది మొదలు ఆరుద్ర తన ఉద్యోగ ప్రస్థానంలో ఏనాడూ వెనక్కి తిరిగి చూడలేదు. సినిమా రంగం నుంచి మహాభినిష్క్రమణమూ చేయలేదు.

* * *

1955 నాటికే సినిమారంగంలోని సాహితీ ప్రముఖుల్లో ఒకరుగా ఆరుద్ర తెరకెక్కారు. 'తెలుగు స్వతంత్ర' అనే పత్రిక ఆరోజుల్లో మద్రాసునుంచి వెలువడుతూ ఉండేది. గోరా శాస్త్రిగారు అప్పట్లో దాని సంపాదకులు. అప్పటికే ఆరుద్రకు పత్రికారంగంలోనూ మంచి పరిచయం ఉండటం వల్ల గోరాశాస్త్రిగారితోనూ ఆరుద్రకు పరిచయం ఉంది. గోరా శాస్త్రిగారు గొప్ప సాహిత్యాభిలాషి కూడా కావడం వల్ల ఆరుద్ర తరచూ 'తెలుగు స్వతంత్ర' పత్రికా ఆఫీసుకు వెళ్ళేవారు. వారితో సాహిత్య చర్చలు జరిపేవారు. ఆ సందర్భంలో ఇంగ్లీషు స్వతంత్ర పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కె. రామలక్ష్మిగారితో ఆరుద్రకు పరిచయం కలిగింది. తరువాత కాలంలో అది ప్రణయంగా మారింది. ఆ ప్రణయం పరిణయానికి దారితీసింది. 28-4-1955న వారి నాలుగుకళ్ళు రెండయ్యాయి. రెండు మనసులు ఒకటయ్యాయి. అందుకు ఆనాడు అయిన ఖర్చు అక్షరాలా అరవై రూపాయలు. మద్రాసులోని రిజిస్ట్రారు జరిపిన వారి పెళ్ళికి ముగ్గురు సాక్షులు. మొదటి వ్యక్తి సినిమా పరిశ్రమలో దిగ్గజం అయిన హెచ్.ఎం.రెడ్డిగారు. రెండోవ్యక్తి మహాకవి శ్రీశ్రీ. మూడవవ్యక్తి విద్యారంగానికే గర్వకారణమైన వి.ఎన్.శర్మ.

ఈడూ-జోడూ అనే మాటలు కేవలం వయసు, శరీరాలకే కాక మనసుకు కూడా చెంది ఉన్నప్పుడు వారి దాంపత్యం అన్యోన్యంగా ఉంటుంది. భౌతిక చైతన్యంతోకూడిన భావచైతన్యం కలిగి ఉండటంలో రామలక్ష్మిగారు ఆరుద్రకు ఏమాత్రం తక్కువ కాకపోవడం ఈ దంపతుల్లోని ప్రత్యేకత. తనతోపాటు తనలో ఎదుగుతూ వచ్చిన హేతువాద, భౌతికవాద భావజాలాన్ని ఆరుద్ర కేవలం ఆలోచనలకే పరిమితం చేసుకోలేదు. వాటిని ఆచరణలో పెట్టడం ఆరుద్రకు చిన్నప్పుడే అలవాటయింది. నిరాడంబరంగా జరుపుకున్న పెళ్ళితంతు కూడా ఆరుద్ర అభిమతాన్నే నిరూపిస్తుంది. పెళ్ళికి కావలసింది రెండు మనసులూ, పరస్పరం కలుసుకోవడమేగాని, ఒకరి మెడలో మరొకరు పసుపుతాడు కట్టడం కాదని భావించిన వ్యక్తి ఆరుద్ర. అందుకే రికార్డుకోసం రిజిస్ట్రార్ రిజిష్టర్‌లో సంతకం చేశారుగాని రామలక్ష్మిగారి మెడలో ఆరుద్ర తాళిబొట్టు కట్టలేదు. ఆమె కూడా ఏనాడూ పుస్తెలతాడు ధరించలేదు.

సాధారణంగా మనసులు కలవడం అన్నా, ప్రేమించి పెళ్ళిచేసుకోవడం అన్నా లోకంలో కొన్ని అభిప్రాయాలున్నాయి. ఒకే దృక్పథం, ఒకే ఆశయం, ఒకే అభిరుచి కలిగి ఇద్దరూ ఒకటైపోవడం అని మనం అనుకుంటూ ఉంటాం. కానీ ఆరుద్ర దంపతుల్ని పరిశీలించినపుడు మనలో ఉన్న అభిప్రాయాలు కొన్ని తొలగిపోతాయి. దీనికి సంబంధించిన కొన్ని అభిప్రాయాలు రామలక్ష్మిగారే ఆరుద్ర అభినందన సంచికలో స్వయంగా చెప్పారు. ఆరుద్ర నెమ్మదిగా సౌమ్యంగా తోస్తారు. ఆమేమో రెచ్చిపోయి మనసులో ఉన్నది వెళ్ళగక్కి తీర్చేసుకుంటారు. వారిద్దరివీ ఉత్తర దక్షిణధృవాలు. ఆ దంపతులిద్దరి మధ్యా ఉన్నది భిన్నత్వంలో ఏకత్వం మాత్రమే.

ఆడవాళ్ళంటే ఆరుద్రకు అపారమైన గౌరవం. భార్య అన్న భావజాలాన్ని ఫ్యూడల్ వ్యవస్థ రూపొందించింది. అందుకే ఆరుద్ర రామలక్ష్మిగారిని ఏనాడూ 'భార్య'గా చూడలేదు. సాటివ్యక్తిగా, తెలివైనమనిషిగా, మంచి స్నేహితురాలిగా మాత్రమే పరిగణించారు. స్వతంత్ర ఆలోచనలు కలిగి ఉన్న వ్యక్తుల్లో భిన్నమైన అభిప్రాయాలుండటం సహజం. అయితే, బేసిక్ విషయాలలో వైరుధ్యం లేనపుడు ఇతర విషయాలలో ఎన్ని అభిప్రాయభేదాలున్నా ఏమాత్రం నష్టం ఉండదు. ఆరుద్ర దాంపత్య జీవితం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

ఆరుద్ర వైవాహిక జీవితం వయసు నలభై సంవత్సరాల పైమాట. ఈ నాల్గు దశాబ్దాల కాలంలో అది ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. జీవనపోరాటంలో ఎన్నో ఎదురుదెబ్బలుకూడా రుచి చూసింది. ఎందరి ఓదార్పునో పొందింది. అయినా ఆరుద్ర, రామలక్ష్మిగార్ల అనుబంధానికి ఏనాడూ

బీటలు పడలేదు. జీవితంలో వారికి అనేక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఎన్నో సుఖదుఃఖాల్లను జమిలిగా వారనుభవించారు. అయితే ఇవన్నీ ఆ దంపతుల అనుబంధాన్ని మరింత పటిష్టం చేశాయి తప్ప పలచన చేయలేదు. జీవితంలో పరస్పరం కోరుకున్న వ్యక్తులు జీవిత భాగస్వాములైనంత మాత్రాన ఇది సాధ్యం కాదు. ఇద్దరూ పరస్పరం ఒకరిలోకి ఒకరు చూసుకోకుండా, ఇద్దరూ ఒకేవైపుకు చూడటంవల్లనే ఇది సాధ్యం అవుతుంది. ఆరుద్ర దంపతుల్లో ఈ అంశం బలంగా ఉంది. అందుకే వారి దాంపత్య రథం సర్వకాలాలలోనూ పూలబాటపై ప్రయాణం చేయకపోయినా సాఫీగానే పయనించిందని సంతృప్తిపడ్డారు.

ఆరుద్రకు ముగ్గురు సంతానం, కవిత, లలిత, త్రివేణి. వాసంతి అనే పెంపుడుకూతురు ఉంది. అరడజనుకు పైగా మనవళ్ళూ మనుమరాళ్ళూ ఉన్నారు. ఈమధ్య మునిమనుమరాళ్ళూ కూడా పుట్టారు.

అందరూ కూతుళ్ళే అయినా ఏనాడూ వాళ్ళను తల్లిదండ్రులు ఆడపిల్లలుగా పెంచలేదు, పరిగణించలేదు. స్నేహితులుగానే చూశారు. పిల్లల్ని ఎక్కువగా అభిమానించారు. అంతకంటే ఎక్కువ స్వేచ్ఛనిచ్చారు. అయితే తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛను వారెప్పుడూ దుర్వినియోగం చేసుకోలేదు. మంచి చదువుసంధ్యలబ్బాయి. అంతకంటే, ఈనాడు ఆడపిల్లకి కావలసిన అవగాహన, ధైర్యం, నేర్పు, ఆత్మవిశ్వాసం వంటివి నలుగురికీ పుష్కలంగా లభించాయి. ఆరుద్ర దంపతులు తమ బిడ్డలకు వీటిని మాత్రమే ఆస్తిపాస్తులుగా ఇచ్చారు. వీటికి మాత్రమే వారసులుగా చేశారు. అయితే వీరిలో లలితమాత్రం తల్లిదండ్రులనుంచి సాహిత్య వారసత్వాన్నికూడా సంపాయించింది. తెలుగులోనేకాక ఇంగ్లీషులో కూడ గొప్ప కవిత్వాన్ని ప్రకటించింది. 'రౌద్రి' అనే కలం పేరుతో కొన్ని కవితా సంపుటాలు కూడా ప్రచురించింది. రెండు నవలలు కూడా రాసి ప్రచురించింది.

ఆరుద్ర తన పెళ్ళి విషయంలోనేకాక కూతుళ్ళ పెళ్ళి విషయంలోనూ తన విశ్వాసాలను సడలించుకోలేదు. చాలా విషయాలలో సరిహద్దులు దాటారు. కుటుంబసభ్యులంతా ఒకచోట ఉన్నప్పుడు అక్కడ వేరువేరు భాషలు విన్పిస్తాయి. వేరు వేరు అభిరుచులు, అభిమతాలు కన్పిస్తాయి. వేరు వేరు ప్రాంతాలు కావడంవల్ల వేరువేరు సంస్కృతులు కూడా కళ్ళకు కడతాయి. ఒక లౌకిక సమైక్య భారతదేశం వివిధ రంగుల్లో కదులుతూ కన్పిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ స్వరూపస్వభావం. అది ఆరుద్ర దంపతుల్లోనే కాక మొత్తం కుటుంబంలోనూ ఉండటం ఒక అద్భుత సంఘటన. ఒక అరుదైన సన్నివేశం. ఒక అందమైన దృశ్యం.

* * *

ఆరుద్ర 1936లో విశాఖపట్నంలోని శివరామయ్య బడిలో ప్రాథమిక విద్య చదువుకుంటూ ఉన్నాడు. ఆ బడిలో జరుగుతున్న అవకతవకల్ని ఆరుద్ర గమనించాడు. కొంతమంది ఉపాధ్యాయులు కూడా కొందరు విద్యార్థులకు కంటగింపుగా ఉండేవారు. ఆరుద్ర తరగతిలో వేమూరి జగన్నాథరావు, మద్ది జగన్నాథరావు, గలడా జగన్నాథరావు అనే ముగ్గురు జగన్నాథరావులు కూడా ఉన్నారు. బోర్డు తుడవడం, సుద్దముక్కలు అందించడం వంటి చిన్న చిన్న పనుల్లో వీరు ఉపాధ్యాయులకు సహకరిస్తూ ఉండేవారు. ఈ సందర్భాలలో ఈ ముగ్గురు రావుల మధ్య పోటీ వాతావరణం ఉండేది. ఈ ముగ్గురు రావులనూ అడ్డం పెట్టుకొని 'రావుత్రయం' అనే పేరుతో ఒక కరపత్రాన్ని రచించారు. పాఠశాలలో విద్యార్థులకు కంటగింపుగా ఉన్న అనేక అవకతవకల్ని ఆరుద్ర ఆ కరపత్రంలో దుయ్యబట్టారు. బహుశా ఆరుద్ర రచించిన మొట్టమొదటి వ్యాసం ఇదే కావచ్చు! ఈ తొలి రచనకు పారితోషికంగా పంతులుగారు పేముబెత్తంతో ఆరుద్ర అరచెయ్యి చిట్లి నెత్తురోడేదాకా దెబ్బలు

కొట్టారు. అపుడు ఆరుద్రకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయిగాని, ఏడుపు మాత్రం రాలేదని ఆనాటి ప్రత్యక్షసాక్షి బుచ్చికొండ చెప్పారు. (ఆరుద్ర అభినందన సంచిక).

బుచ్చికొండ అన్నయ్య వెంకటరమణయ్య. ఇతణ్ణి పెద్దకొండ అని పిలిచేవారు. ఆరుద్రకు ఇద్దరూ మంచి స్నేహితులే. శివరామయ్య బడిలో అందరూ కలిసి చదువుకుంటూ ఉన్న రోజుల్లోనే పెద్దకొండ చనిపోయాడు. అంత చిన్నవయసులోనే ఆరుద్ర కుటుంబసభ్యులందరితోపాటు బాధను పంచుకున్నాడు. పెద్దకొండలో తన జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ, ఒక పద్యాన్ని రాసి బుచ్చికొండ చేతిలో పెట్టాడు. బహుశా ఆరుద్ర రచించిన మొదటి ఎలిజీ అది. ఆ పద్యం ఈనాడు అలభ్యం.

శివరామయ్య బడిలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన ఆరుద్ర ఎ.వి.యన్.కాలేజి హైస్కూలులో ఉన్నతవిద్యను అభ్యసించాడు. విద్యాధ్యయనంతోపాటు సమాజాన్ని కూడా ఆరుద్ర నిరంతరం అధ్యయనం చేస్తూ ఉన్నాడు. సమాజంలో కన్పించే ఎన్నో దృశ్యాలు, సంఘటనలు ఆరుద్రను అనేక కోణాలలో ప్రభావితం చేస్తూ ఉన్నాయి. ఆరోజుల్లో కాలేజి మ్యాగజైన్ కోసం ఆరుద్ర ఒక గేయాన్ని రచించాడు. దానిని ఈనాడు పరిశీలించినా అది ఒక పాఠశాల మేగజైన్ స్థాయిలో ఉండకపోవడం విశేషం. పేదరికాన్నీ, ముఖ్యంగా బిచ్చమెత్తుకొని జీవించే బాలలకష్టాల్నీ విశ్లేషించే గేయం అది.

"తల్లిదండ్రులు వెళ్ళిపోతూ
తనకు ఇచ్చిన యావదాస్తీ
చిట్టికోసం పొట్టికోసం
చిల్లి చెంబొకటే"

అంటూ ముత్యాలసరం నడకలో ఈగేయం సాగిపోతుంది. ఇది సంభాషణాత్మక గేయం. ఈ గేయంలోని ఒక చరణంలో తమ్ముడు అన్నయ్యతో "కడుపునొప్పిర అన్నయ్యా" అంటాడు. అందుకు అన్నయ్య సమాధానంగా "కడుపునొప్పి కాదురా - అది ఆకలి నొప్పి తమ్ముడూ" అని చెప్పాడు.

ఆకలినొప్పి తెలియని కుటుంబంలోంచి ఆరుద్ర వచ్చాడు. తరువాత కాలంలో ఆకలినొప్పి అంటే ఏమిటో ఆరుద్రకు అనుభవంలోకి వచ్చినా; ఆకలయితే కూడా కడుపులో నొప్పి వస్తుందని తెలియని వయసులో ఆరుద్ర ఈ గేయాన్ని రచించడం విశేషం. బాల్యంలోనే ఆరుద్ర అధ్యయనదృష్టి ఎంతలోతుల్లో ఉండేదో ఈ గేయం స్పష్టం చేస్తుంది. సాహిత్యాధ్యయనంలో భాగంగా సమాజాన్నీ, ఛందోవిశేషాల్నీ కూడా ఆరుద్ర ఏకకాలంలో ఆకళింపు చేసుకున్నాడని ఈ గేయం నిరూపిస్తుంది. సమాజంపట్ల, వస్తువుపట్ల, అభివ్యక్తిపట్ల ఆధునిక కవికి ఉండవలసిన దార్శనికత ఆరుద్రకు బాల్యంలోనే ఎంత ప్రగాఢంగా ఉందో ఈ గేయం అద్దంపడుతుంది.

విశాఖపట్నం నుంచి 'యువకళ' అనే మాసపత్రిక వెలువడుతూ ఉండేది. పన్యాల రంగనాథరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి మొదలైనవాళ్ళు ఆ పత్రికను నడుపుతూ ఉండేవారు. ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ ఉన్న రోజుల్లోనే ఆరుద్రకు యువకళ పత్రికతో సాహిత్యసంబంధం ఉండేది. సాహిత్య సృజన చేయడమేకాదు, సాహిత్య పత్రికలను ప్రోత్సహించడం కూడా సాహితీపరుల బాధ్యత. ఈ విషయం ఆరుద్రకు చిన్ననాడే తెలుసు. అందుకే తానేకాక, తన మిత్రులందరినీ కూడా యువకళ పత్రికకు చందాదారులుగా చేశారు.

చాగంటి సోమయాజులు, రోణంకి అప్పలస్వామి, శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి వంటి వారి రచనలను ఆరుద్ర పఠిస్తూ ఉండేవారు. వీరిలో శ్రీశ్రీ ప్రభావం ఆరుద్రపైన ఎక్కువగా పనిచేసింది. హేతువాద దృక్పథం, సామ్యవాద భావజాలంవంటి అనేక విషయాలలో శ్రీశ్రీ ఆరుద్రకు భిత్తికగా నిలిచాడు. అందుకే శ్రీశ్రీ రాతనూ కూతనూ కూడా ఆరుద్ర వేదంగా అంగీకరించారు. ఈ మానసిక ఉత్తేజంతోనే ఆరుద్ర 'నా కలలో' అనే కవిత రచించారు. అది దీర్ఘకవిత. 1939లో 'చిత్రగుప్త' పత్రికలో ఈ కవిత ముద్రించబడింది. పత్రికలో ప్రచురించబడిన ఆరుద్ర తొలికవిత ఇదే అవాలి.

1942నాటికి ఆరుద్ర మొత్తం 24 కవితలు రచించారు. కొన్ని కథలు కూడా ప్రకటించారు. ఈ రచనలన్నీ ప్రజాబంధు పక్షపత్రిక, ఆంధ్రపత్రిక, పెంకిపిల్ల, వినోదిని వంటి పత్రికల్లో భాగవతుల శంకరశాస్త్రి అనే పేరుతోనే ప్రచురించబడ్డాయి. అప్పటిదాకా ఆరుద్ర శ్రీశ్రీ ప్రభావంలోనే ఉన్నారు.

అప్పటికే ప్రపంచవ్యాప్తంగా రెండో ప్రపంచ యుద్ధమేఘాలు ఆవరించాయి. ఫాసిస్టు దేశాలన్నీ తమ ఆధిపత్యం కోసం వికృతప్రయత్నాలు చేయడం ప్రారంభించాయి. అందులో భాగంగా జపాన్ మనదేశంపైన కూడా తన ఉక్కుపాదాన్ని మోపడానికి సిద్ధపడింది. భారత గగనతలంపైన ముఖ్యంగా నగరాలపైన జపాన్ యుద్ధవిమానాలు రాబందుల్లా గిరిడీలు కొడుతున్నాయి. విశాఖతీరానికి కొద్దిదూరంలో ఒక అమెరికన్ యుద్ధనౌక సమయంకోసం వేచి ఉంది. జపాన్ యుద్ధవిమానాలు దాన్ని పేల్చి దేశంలోనేకాక ప్రపంచవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని సృష్టించాయి. అదేరోజు, అనగా 6-5-1942న ఇంచుమించు ఒకే సమయంలో విశాఖపట్నం, కాకినాడ పట్టణాలమీద బాంబుల వర్షం కురిసింది. ప్రాణభయంతో లక్షలసంఖ్యలో ప్రజలు బిక్కచచ్చిపోయారు. పొట్టచేత పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు. ఆక్రమంలోనే వీరి కుటుంబం కూడా విశాఖపట్నం నుంచీ విజయనగరానికి వలస వెళ్ళింది. అప్పుడే విజయనగరం మహారాజా కళాశాలలో ఆరుద్ర ఇంటర్మీడియట్‌లో చేరాడు. పాఠ్యపుస్తకాలు ముందు పెట్టుకుంటే, ఆరుద్రకు ఆపుటల్లో అక్షరాలు కన్పించేవి కావు. విశాఖపట్నంలో బాంబులవర్షం కురిసిననాటి బీభత్స దృశ్యాలు కన్పించేవి. గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకొని, అరమోడ్పు కన్నులతో తమ ఇష్టదైవాలను ప్రార్థించే దయనీయ దృశ్యాలు ఆరుద్రను వెన్నాడేవి. ఆ కసి కవిత్వీకరించబడింది. కవితగా వెలువడింది. దాని పేరు 'లోహ విహంగాలు'.

"ఓహో ఏమిటీ జీవ ప్రవాహం
యంత్రాలు మాదిరి మనుష్యులు
ప్రాణాలు పిడికిట పెట్టుకొని
గుండెలు చేబట్టుకొని
బలుసాకును వెతుక్కుంటూ
... ...
పాపాల పుట్టలు జెపాను పిట్టలయిదు
నా ఆకర్ణాంత విశాల చక్షులన్
టెలిస్కోపుల చేసికొని పరికించుచున్నాను
నే పుట్టి పెరిగిన విశాఖపట్నపు 'మరణం' "

ఈ కవిత రచించేనాటికి ఆరుద్ర వయస్సు పదహారు పదిహేడు సంవత్సరాలు. ఇంత లేతవయసులో ఆనాటి బీభత్సదృశ్యాన్ని వాస్తవికంగా ఆవిష్కరించిన ఆరుద్ర ప్రతిభకు శ్రీశ్రీ, చాగంటి సోమయాజులుగారు ఆశ్చర్యపోయారు. ఎంతగానో మెచ్చుకున్నారు. లోకం ఆరుద్రను కవిగా గుర్తించింది ఈ ఖండిక మూలంగానే.

ఆరోజుల్లో విజయనగరం నుంచి 'వందేమాతరం' అనే ఒక స్థానిక పత్రిక వెలువడేది. ఆరుద్ర కొన్ని కథలూ, కవితలూ, ఆ పత్రికలో అప్పుడప్పుడూ ప్రచురిస్తూ ఉండేవారు. వైమానికదళంలో చేరిన ఆరుద్ర సైనికుల వ్యక్తిగత జీవితాలలో, సైనిక క్యాంపుల్లోని జీవితాలనూ దగ్గరగా పరిశీలించాడు. ఆ అధ్యయనాన్ని కార్డు కథలుగా, గేయాలుగా ఆరుద్ర అక్షరీకరించారు. వాటిని దండుకథలు, దండుగేయాలని ఆరోజుల్లో పేర్కొనేవారు.

1943లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 1944లో ఈ సంఘం అభ్యుదయ రచనల సంపుటాన్ని ప్రచురించింది. ఆరుద్ర రచించిన 'పేదరాలి జోలపాట' అనే కవితను సంపాదకులు ఈ సంకలనంలో చేర్చారు.

సమాజంలో సామాన్యుల జీవితాల్ని ఛిద్రం చేస్తున్న అనేక సంఘటనల్ని ఆరుద్ర కవిత్వీకరించారు. 1942–48 మధ్యకాలంలో ఆరుద్ర రచించిన వివిధ కవితలు 'ఆనందవాణి' పత్రికలో అచ్చయ్యాయి. అప్పటికే కవిగా ఒక స్థాయికి ఎదిగిన ఆరుద్ర చేతిలో ఉన్న కలాన్ని ఏనాడూ విడిచిపెట్టలేదు. సామాజిక జీవితాన్ని కుదిపివేస్తున్న ఏ సంఘటన కూడా ఆరుద్ర దృష్టినుంచి తప్పు కోలేదు. ఆధునికంగా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన ఏ ప్రక్రియా ఆరుద్రకు ఎదురుచెప్పలేదు.

ఆరుద్రలోని సాహిత్యక్రమాన్ని పరిణామక్రమాన్ని తెలుసుకోడానికీ, ఆధునిక సాహిత్య చరిత్రలో ఆరుద్రస్థానాన్ని అంచనా వేయడానికీ ఈ దశ ఒక భూమిక మాత్రమే.

కవిగా ఆరుద్ర లోకాన్ని దర్శించడం తొలిదశనుంచే ప్రారంభించారు. లోకం ఆరుద్రను కవిగా దర్శించింది ప్రధానంగా రెండవ దశలోనే.

* * *

ఆరుద్ర సాహిత్య ప్రస్థానంలో మలిదశే కీలకమైంది. ఆధునిక తెలుగు సాహిత్య లోకంలో విలక్షణ సాహితీపరుడుగా తన విరాట్ స్వరూపాన్ని ప్రదర్శించి, పదుల సంఖ్యలో కావ్యాలు, అరడజనుకుపైగా రూపకాలు, నవలలు, కథలు, సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ, సామాజిక విమర్శ, సినిమా సాహిత్యం – ఒకటేమిటి? ఆధునికయుగంలో తెలుగు సాహిత్యంలో ఆరుద్ర సృజించని సాహిత్య అంశం లేదంటే అత్యుక్తి కాదు. ఆరుద్ర మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి; తెలుగు సాహిత్య చరిత్రలో ఆరుద్ర స్థానాన్ని నిర్దేశించడానికీ అవసరమైనంతవరకూ విశ్లేషణ చేయడం అవసరం.

ఆరుద్ర రచించిన కావ్యాలను ప్రధానంగా రెండు శాఖలు. మొదటివి స్వతంత్ర కావ్యాలు. రెండోవి అనువాద కావ్యాలు.

కవికి ప్రాథమికంగా ఉండవలసిన అంశాలు – ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం. వీటిలో ప్రతిభ ఉత్తమమైంది. ఆరుద్రలో ఈ మూడు లక్షణాలు ఒకదానిని మించి మరొకటి ఉన్నాయని భావించవచ్చు. అందుకే ఆరుద్ర అనేక కావ్యాలను దేనికది ప్రత్యేకమైనవిగా రచించారు. ఆరుద్రలోని సాహిత్య సంబంధమైన ప్రతిభాసంపత్తిని నిరూపించేవిగా త్వమేవాஹమ్, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పజ్యాలు వంటి అనేక కావ్యాలు ఆధునిక తెలుగు సాహిత్య క్షేత్రంలో తలెత్తుకొని నిలబడతాయి.

త్వమేవాஹమ్ : నువ్వే నేను : తెలంగాణా

కళ పోరాటం నుండి పుడుతుందని క్రిష్టఫర్ కాడ్వెల్ చెప్పాడు. ఆరుద్ర త్వమేవాஹమ్ కావ్యం ఈవిషయాన్ని నిజం చేస్తుంది. ఆరుద్ర విశాఖపట్నంలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న కాలంలో ఈ కావ్యాన్ని రచించారు. ఈ కావ్యావిర్భావానికి భూమిక ఒక దయనీయమైన వాస్తవిక సంఘటన.

1948 జూలై మాసంలో ఒకరోజు. రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికులముందు ఒక స్త్రీ నగ్నంగా నిలబడింది. ఈ సంఘటనకు అందరూ హతాశులయ్యారు. ఒక వ్యక్తి తేరుకొని "అదేమిటమ్మా! ఆడపిల్లవు అలా నగ్నంగా ఉన్నావు తప్పుకదూ" అని ప్రశ్నించాడు. అందుకు ఆమె "... నేను ఆడదాన్నా? నైజాం కిరాతకులు నన్ను వారంరోజులు నగ్నంగా చెట్టుకు కట్టివేసి అట్టేపెట్టారు. నా స్త్రీత్వాన్ని ఆనాడే దొంగిలించారు. నా ఆడతనం ఆనాడే పోయింది" అని చెప్పింది. ఆ సమాధానానికి ప్రయాణీకులంతా చలించిపోయారు. అయితే ఒక ప్రయాణీకుడు కారుతున్న తన కన్నీటిని కలంలోని సిరాగా మార్చి, రజాకార్ల చేత అతికిరాతకంగా చెరచబడిన ఆ స్త్రీ కథనాన్ని పత్రికలకు పంపించాడు. 1948, జూలై 10వ తేదీన "నాకా సిగ్గు? నా స్త్రీత్వం యెప్పుడో పోయింది" అనే శీర్షికతో కృష్ణాపత్రికలో ఆ వార్త ప్రచురించబడింది.

పత్రికలో ఎన్నో వార్తలు వస్తూ ఉంటాయి. చదివి ఊరుకొనేవారు కొందరు, జాలిపడేవారు మరికొందరు, స్పందించేవారు ఇంకొందరు. పైవార్తను చదివి కూడా ఒకరిద్దరు తీవ్రంగా స్పందించారు. అందులో ఆరుద్ర ఒకరు.

ఆ ఆగ్రహమే త్వమేవాఽహమయింది. తెలంగాణా ఉద్యమస్ఫూర్తితో ఈ కావ్యం వెలువడింది. త్వమేవాఽహమ్ అంటే "నువ్వే నేను" అని ఏకత్వాన్ని ప్రకటించడం. కవి తెలంగాణా ప్రజానీకంతో ఈ ఏకత్వాన్ని ఈ కావ్యంద్వారా వ్యక్తం చేశారు. ఆరుద్ర కావ్యానికి 'తెలంగాణా' అని పేరు పెట్టారు. శ్రీశ్రీ దీనికి టిప్పణి రాస్తూ ఏనుగు బొమ్మను గీచి, ఏనుగు అని పేరుపెట్టినట్టుందని ఈ కావ్య శీర్షికపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'త్వమేవాఽహమ్' అనే పేరు ఈ కావ్యానికి ఔచిత్యవంతంగా ఉంటుందని భావించారు. ప్రసిద్ధ అభ్యుదయకవి ఆవంత్స సోమసుందర్ తమ కళాకేళి ప్రచురణలు తరఫున ఈ కావ్యాన్ని ప్రచురించారు.

ఈ కావ్యప్రతీకలు

సమాజంలో ఉండే వర్గ స్వభావాలను, ముఖ్యంగా మధ్యతరగతి మనస్తత్వాన్ని తెలుగు కవిత్వంలో గొప్పగా వ్యాఖ్యానించిన కావ్యం – త్వమేవాఽహమ్. ఆరుద్ర రచనల్లోనేకాక, తెలుగులో వెలువడిన అభ్యుదయ కావ్యాలలోనే త్వమేవాఽహమ్‌కు ఒక ప్రత్యేకత ఉంది.

ఆరుద్ర త్వమేవాఽహమ్‌లోని ప్రతీకలు కాలానికీ సమాజానికీ గొప్ప ప్రతీకలు. ఆరుద్ర ఈ కావ్యంలో కాలాన్ని ప్రవాహంగా భావించారు. ఈ కావ్య ప్రవాహంలో ముఖ్యంగా మూడు దశలున్నాయి. అవి – పర్వతదశ, ఉపనదులు, ప్రవాహదశ. ఇవికాక రచనా ప్రణాళికలో ముఖద్వారం, సాగరసంగమం అనే మరో రెండు దశలు కూడా ఉన్నాయి. కారణాంతరాలవల్ల ఆరుద్ర ఆ దశల్ని సంపూర్తి చేయలేదు. అయినా కావ్యం అసంపూర్ణంగా అనిపించకపోవడం ఒక ప్రత్యేకత.

కవి కాలానికి సంకేతంగా స్వీకరించిన 'గడియారం' ఈ సమాజం. 'గంటలు' పెట్టుబడిదారులు, అనగా శ్రీమంతులు. 'నిమిషాలు' మధ్యతరగతి ప్రజలు. 'సెకండ్లు' అట్టడుగు ప్రజానీకం. గడియారంలోని 'చిన్నముల్లు' ఉన్నత వర్గ మనస్తత్వానికి ప్రతీక. 'పెద్దముల్లు' మధ్యతరగతి వర్గ స్వభావాలకు 'బరామీటరు'. 'సెకండ్లముల్లు' శ్రామికవర్గం ఆలోచనలకు సూచిక.

త్వమేవాఽహమ్ కావ్యంలో 'ఇసుక గడియారం', 'నీటి గడియారం' కూడా ఉన్నాయి. ఇవి ప్రాచీనకాలంలోని సమాజాలు. ఈ గడియారాలు ఒకనాటి సమాజాలను కొలిచే పాతకాలంనాటి సాధనాలు. భారతీయుల్లో రెండురకాల వాళ్ళున్నారు. ఒకరు యూరోపియన్ల ప్రభావం కలవారు; మరొకరు ఛాందసులైన భారతీయులు. క్రమంగా వీరికి ఇసుక గడియారం నీటి గడియారాలు ప్రతీకలు. 'స్టాప్ వాచి', ఆధునికమైంది. ఇది విప్లవానికి సమయ నిర్దేశం చేసే ఒక సాధనం. నిలకడ లేని మధ్యతరగతి వ్యక్తిని 'పెండ్యులం' సూచిస్తుంది. 'కీ' విప్లవానికి ప్రోద్బలమైన సాధనం. 'ఎలారం' సమకాలీన సామాజిక పరిస్థితులకు ఒక హెచ్చరిక.

త్వమేవాఽహమ్ కావ్యంలో విజ్ఞానశాస్త్ర సంబంధమైన అంశాలు ప్రతిభావంతమైన ప్రతీకలుగా మలచబడ్డాయి. విజ్ఞానశాస్త్రంలో ఆరుద్రకు ఉన్న ప్రవేశాన్ని ఈ ప్రతీకలు నిరూపిస్తాయి. త్వమేవాఽహమ్ దృశ్యకావ్యం కాకపోయినా కావ్య నాటకాన్ని స్ఫురింపచేస్తుంది. నాటకంలో పాత్రలు రంగస్థలం మీదికి వస్తూ పోతూ ఉంటాయి. ఈ కావ్య రంగస్థలంమీద కూడా ఆరుద్ర

రూపొందించిన ప్రతీకలు కొన్ని పాత్రల్లాగా ఒకదాని తరువాత మరొకటి ప్రవేశిస్తూ ఉంటాయి. కావ్య నిర్మాణ పద్ధతిలో కవి ప్రతిభను, ప్రయోగవైచిత్రిని ఈ ప్రతీకలు రుజువు చేస్తాయి.

ప్రతిభా సంపత్తి ఉండాలేగాని, ఎంత కఠినమైన శాస్త్రాన్నయినా కళాత్మకంగా మలచవచ్చు. సమాజానికి అన్వయించవచ్చు. నిజానికి సామాజిక జీవితానికి అన్వయించడానికి వీలుకాని అంశం, ఉండకపోవచ్చు. ఆరుద్ర చిన్నప్పుడు పాఠశాలలో చదువుకున్న గణితశాస్త్రాన్ని కూడా ఈ కావ్యంలో కళాత్మకంగా మలచుకున్నారు. గణితశాస్త్ర సంబంధమైన పైథాగరస్ సిద్ధాంతాన్ని సమాజానికి అన్వయించారు. లంబకోణ త్రిభుజంలో వాటి భుజాలపైన చతురస్రాలను గీచినపుడు; రెండు భుజాల చతురస్ర వైశాల్యం మొత్తం కలిపి కర్ణంపైన గీచిన చతురస్ర వైశాల్యానికి సమానం అవుతుంది. ఇదే పైథాగరస్ సిద్ధాంతం. దీనిని గణితశాస్త్రంలో $AB^2+AC^2=CB^2$ అని సూత్రీకరిస్తారు. దీనిలో ఆరుద్ర సమాజ స్వభావాన్ని చిత్రించారు.

"చిన్న చిన్న చీమలూ వగైరా
అడుగు భుజం అనుకోండి
బలవంతమైన సర్పం
గట్రా ఎక్సెట్రా
అడుగు భుజం ఉత్పత్తి చేసే
ఆహారం మీద ఆధారపడ్డంవల్ల
లంబం అవదా మరి?
ఈ భుజాల పరస్పర సంఘర్షణల ఫలితం

ఈ భుజాల కర్ణంమీది చతురస్రం
అవునా? సరి–
ఈ చతురస్రపు వైశాల్యం ఈజీక్వల్టూ
రెండు విభిన్న భుజాలపైగల
చతురస్రాలలోని తమిస్రం
థీసిస్ యాంటీ థీసిసుల మిశ్రం
రెండు భిన్న పక్ష సంజ్ఞల పోరాటం
అనగా ఒక నూతన వ్యవస్థ'

బలవంతమైన సర్పంకూడా చలిచీమల చేత చిక్కి చస్తుందని సుమతీ శతకకర్త చెప్పాడు. ఆరుద్రకు ఈ శతకసూత్రం కూడా కొంత ప్రోద్బలమని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. సి.నారాయణరెడ్డిగారు తమ సిద్ధాంత గ్రంథంలో ఆరుద్ర కవితీకరించిన సామాజిక పైథాగరస్ సిద్ధాంతాన్ని రేఖాచిత్రంద్వారా విశ్లేషించారు.

ఆ రేఖాచిత్రం ఆరుద్ర కవిత్వాన్ని ఒక్కచూపుతో అర్థం అయ్యేలా వ్యాఖ్యానిస్తుంది. ఆరుద్ర రూపొందించిన ప్రతీకలు కూడా మర్మగర్భంగా లేవు. కవిత్వంలోనే అవి చాలావరకు వ్యాఖ్యానించబడ్డాయి. సర్పం బూర్జువా వ్యవస్థకూ, చీమలు శ్రామిక వ్యవస్థకూ ప్రతీకలు. పైథాగరస్ సిద్ధాంతంలో చీమలన్నీ అడుగుభుజంలాంటివి. లంబకోణ త్రిభుజంలో లంబం ఎప్పుడూ అడుగు భుజంమీదనే నిలబడుతుంది. సమాజంలోని బూర్జువావర్గం త్రిభుజంలోని లంబం వంటిది. అందుకే

బూర్జువా వ్యవస్థ శ్రామిక వర్గంమీద ఆధారపడి ఉంటుంది. అనగా పైథాగరస్ సిద్ధాంతంలోని లంబం బూర్జువా వర్గానికి ప్రతీక.

లంబాన్నీ, అడుగుభుజాన్నీ కలిపే రేఖ కర్ణం. పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణం మీద గీచిన చతురస్రం తక్కిన రెండు భుజాలమీద గీచిన రెండు చతురస్రాల మొత్తానికి సమానం. $AB^2+AC^2=CB^2$ అనే సూత్రం దీనినే వివరిస్తుందని గమనించాం. బూర్జువా వర్గానికీ, శ్రామిక వర్గానికీ ఘర్షణ అనివార్యం అని మార్క్సిజం చెపుతుంది. ఈ ఘర్షణ ద్వారానే మరో నూతన వ్యవస్థ ఏర్పడుతుందని మార్క్స్ ప్రతిపాదించాడు. త్వమేవాఽహమ్ కావ్యంలో ఆరుద్ర చెప్పిన ఈ ఖండభాగంలో ఆ నూతన వ్యవస్థే కర్ణంమీద గీచిన చతురస్ర వైశాల్యం. దీనినే సామ్యవాద సమాజంగా ఆరుద్ర భావించారు.

గణితశాస్త్రాన్నేకాక ఇతర ప్రకృతిశాస్త్రాలను కూడా ఆరుద్ర వినూత్నంగా పరిశీలించారు. అందుకు ఈ కావ్యంలోనే మరికొన్ని దృష్టాంతాలున్నాయి. వృక్షశాస్త్ర సంబంధమైన పరపరాగ సిద్ధాంతాన్ని కూడా ఆరుద్ర సమాజ స్వభావానికి ఏవిధంగా అన్వయించారో పరిశీలిద్దాం.

"మానవ సమాజమొక పూరా విప్పారిన పుష్పం. అట్టడుగున పరిశ్రమించే జనావళి మనకందరికీ రక్షక పత్రావళి కడుపుమంట సైరింపని శాఖ కీటకాలనాకర్షించే పతాక అవకాశాలపట్ల తలెత్తిన వర్గం పరాగప్రాప్తి నోచుకొనే కీలాగ్రం శ్రీలు పొంగిన కేసరాల ధర్మం విక్రాంతి పరపరాగ సంపర్కం"

పువ్వుకు అడుగుభాగంలో ఉండే పత్రాలను రక్షక పత్రాలంటారు. నిరంతరం అవి పూవును రక్షిస్తూ ఉంటాయి. శక్తి ఉడికిపోయిన తరువాత అవి రాలిపోతాయి. అంతేకాని, వాటి జీవితకాలంలో మరోపూవునుంచి వచ్చిపడిన పరాగ సంపర్కానికి నోచుకోవు. పూవుకు మధ్యభాగంలో ఉండేవి కేసరాలు. వాటిలో పెద్దది కీలాగ్రం. అది మాత్రమే పరాగ సంపర్క భాగ్యానికి నోచుకుంటుంది.

సమాజంలో కూడా పై స్వభావం ఉంది. శ్రామిక వర్గం తమ శరీర కష్టంతో పెట్టుబడిదారీ వర్గాన్ని నిలబెడుతుంది. కానీ, ఏవిధమైన ఫలితానికీ ఈ వర్గం నోచుకోదు. పెట్టుబడిదారి వర్గం మాత్రం ఏశ్రమా చేయకుండానే శ్రామిక వర్గం కష్టాన్ని సంపదగా మార్చుకుంటుంది. అందుకే ఆరుద్ర పై ఖండికలో పుష్పంలోని రక్షకపత్రాలను శ్రామికవర్గానికీ, కీలాగ్రాన్ని పెట్టుబడిదారి వర్గానికీ ప్రతీకలుగా స్వీకరించారు. పుష్పంలోని భాగాలను సమాజానికి అద్భుతంగా సమన్వయించారు.

రాగి, తుత్తునాగం కలిసినపుడు అది అయస్కాంతంగా మారుతుందని భౌతిక విజ్ఞానశాస్త్రం తెలియచేస్తుంది. ఈ శాస్త్ర విషయాన్ని కూడా ఆరుద్ర త్వమేవాఽహమ్ కావ్యంలో సమాజానికి సమన్వయించారు. 'తథాస్తు' అనే ఖండికలో ఇనుమును పెట్టుబడిదారి వర్గానికి, రాగిని మధ్యతరగతి వర్గానికీ, తుత్తునాగాన్ని శ్రామిక వర్గానికీ ప్రతీకలుగా ఆరుద్ర స్వీకరించారు. మధ్యతరగతివర్గం, శ్రామికవర్గం రెండూ కలిసినప్పుడే సామాజిక విప్లవం సాధ్యమవుతుందని ఆరుద్ర ఈ కావ్యంలో ధ్వనింపచేశారు.

లోహాలనేకాక రంగులను కూడా ఆరుద్ర త్వమేవాఽహమ్ కావ్యంలో సామాజిక ప్రతీకలుగా స్వీకరించారు. నీలం రంగును కార్మిక శక్తికీ, ఎర్ర రంగును విప్లవ ప్రబోధానికీ, ఆకుపచ్చ రంగును మేధావివర్గానికీ ఆరుద్ర సంకేతించారు. అదేవిధంగా ఆదర్శానికీ, విజ్ఞానానికీ అఖండ జ్యోతిని చిహ్నంగా తీర్చిదిద్దారు.

కళ వేరు, శాస్త్రం వేరు. ఈ రెండూ పరస్పరం విరుద్ధమైనవి. కళ సున్నితమైనది; శాస్త్రం కఠినమైంది. భావుకతకు సంబంధించినది కళ. వాస్తవమైంది శాస్త్రం. త్వమేవా౽హమ్ కావ్యంలో ఆరుద్ర ఈ రెంటినీ ఒకచోట సమన్వయించారు. కళను వాస్తవికంగా, శాస్త్రాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దారు. వర్తమాన సమాజంలోని ఒక కఠినమైన వాస్తవాన్ని కళ, శాస్త్రం ద్వారా ఆరుద్ర ఏకకాలంలో ఆవిష్కరించారు. ఆరుద్రలోని ప్రయోగదృష్టికే కాదు. ప్రతిభా సంపత్తికికూడా ఈ ఖండికలు దృష్టాంతాలు.

కళ కళకోసమే అన్నది నిన్నటిమాట. కళ సమాజం కోసంకూడా అన్నది నేటిమాట. అదేవిధంగా శాస్త్రఫలాలు కూడా సమాజానికే చెందాలి. మానవాళికంతటికీ విస్తరించాలి. కానీ ఈనాడు శాస్త్రం నిలువుగా (Verticle) పెరుగుతుంది. అడ్డంగా (Horizontal) సామాన్య ప్రజానీకం కోసం విస్తరించడం లేదు. అది కళ కావచ్చు, శాస్త్రం కావచ్చు; దాని అంతిమ ప్రయోజనం మానవాళికి ఉద్దిష్టించి ఉండాలన్న అధునాతన భావాన్ని ఆరుద్ర త్వమేవా౽హమ్ కావ్యంలో స్ఫురింపచేశారు.

త్వమేవా౽హమ్ కావ్యం మూలాలు తెలంగాణా ఉద్యమక్షేత్రంలో ఉన్నాయి. ఆరుద్ర ఈ కావ్యాన్ని రచిస్తున్న కాలంలో తెలంగాణా ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు.

బ్రిటీష్ ఇండియాలో ఉన్న అరకొర సౌకర్యాలకు కూడా నోచుకోని తెలంగాణా ప్రజానీకం నిజాం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని ప్రారంభించారు. దానిని అణచివేయడం కోసం నిజాం కిరాయి రౌడీలను రజాకార్లుగా ప్రజలమీదికి పంపించాడు. ప్రజల ధనమాన ప్రాణాలను వారు రాక్షసంగా దోచుకున్నారు.

రజాకార్ల పీడన ఎంత తీవ్రమైందో ఆరుద్ర కావ్యారంభంలోనే విశ్లేషించారు.

"ఆలోచనల ట్రెయిన్లో
ట్రెయిన్లో
పురుషుల మూడవక్లాస్ బోగీలో
చెట్లను గురించీ
చిట్టెలుకల గురించీ
చెద పురుగుల గురించీ
చిన్న చిన్న చీమల గురించీ
సంభాషణల రెయిన్లో
రెయిన్లో
చెయిన్స్‌లేని మగాళ్ళముందు
చెదపురుగులు కాని మగాళ్ళ ముందు
నిటారుగా నించొని
తన బట్టలు నింపాదిగా తాపీగా
ఒలుచుకొనే
నిటారుగా నిస్సిగ్గుగా
నించొనే నీతిమంతురాలు'

అధునాతనమైన సాంకేతిక పరిభాషను పై ఖండికలో మనం గమనించవచ్చు. నిన్నటికాలానికి చెందిన అరిగిపోయిన పాతమాటలు నేటికాలానికి చెందిన ఆధునిక భావజాలాన్ని వ్యక్తీకరించడానికి ఉపకరించవు. రైల్వే వ్యవస్థ ఏర్పడిన తరువాత ఆంగ్ల సాహిత్యంలో రైల్వే పరిభాష ఏర్పడింది. అదేవిధంగా మనదేశం కూడా పారిశ్రామికీకరణ పొందిన తరువాత మన దేశభాషల్లో కూడా రైల్వే పరిభాష చోటుచేసుకుంది. త్వమేవాఽహమ్‌లోని పై ఖండికలోకూడా ఈ మార్పును గుర్తించవచ్చు.

ఆరుద్ర చెట్లనూ, చిట్టెలుకలనూ, చెదపురుగులనూ, చీమలనూ కూడా ప్రస్తావించారు. అవి మామూలువి కావు. అవన్నీ ప్రతీకలుగా కవిత్వీకరించబడ్డాయి. చెట్లు పురుషులకు ప్రతీకలు. చెట్లు దృఢంగా ఉంటాయి. పురుషులు కూడా దృఢంగా ఉంటారు. ఈ రెంటికీ సమానధర్మం దృఢత్వం. చెట్లకు జీవం ఉంటుంది. అయితే చలనం ఉండదు. పురుషులకు కూడా జీవం ఉన్నా చెట్లకులాగే చలనరహితంగా ఉన్నారని సూచన.

చిట్టెలుకలు స్త్రీ జాతికి ప్రతీకలు. స్త్రీలను అబలలుగా మనం పరిగణిస్తున్నాం. చిట్టెలుకలు కూడా అబలలే. ఈ రెంటికీ సమానధర్మం అబలత్వం. చిట్టెలుకలు ప్రాణభీతితో ఎంత పరుగెత్తినా తప్పించుకోలేక ప్రాణాలు పోగొట్టుకుంటాయి. స్త్రీలు కూడా చిట్టెలుకల్లాగే మానాన్ని రక్షించుకొనే శక్తి లేక విగత జీవులవుతున్నారని తెలియచెప్పడమే.

ఈ ఖండికలోని చెదపురుగులు సోల్జర్లకు ప్రతీక. 'చెదపురుగుల గురించీ' అంటే సోల్జర్ల గురించి అని అర్థం. అయితే ఈ సోల్జర్లు మామూలు సోల్జర్లు కాదు. తెలంగాణా పోరాటాలకు ముందు తెలంగాణా ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేసిన సైనికులు. చెదపురుగుల గురించి అంటే, అన్యత్వాల గురించి అని కవితార్థం. ఇలా ప్రతి ప్రతీకనీ - విశ్లేషించవచ్చు.

ఆరుద్ర త్వమేవాఽహమ్ కావ్యంలో పసలేని కబుర్లపోగులు, కార్యశూన్యులు అయిన మగాళ్ళమీద కసిని ప్రకటించారు. కాశిం రజ్వి, రజాకార్లువంటి రాక్షసప్రవృత్తి కలిగిన వారిమీద ఆగ్రహాన్ని ప్రదర్శించారు. స్త్రీజాతిపైనా, తెలంగాణా పోరాటవీరులపైనా సానుభూతిని వ్యక్తం చేశారు. చిట్టెలుకల్లాంటి స్త్రీలతోనూ, పోరాటయోధులతోనూ ఆరుద్ర ఈ కావ్యంలో త్వమేవాఽహమన్నారు. తెలంగాణా పోరాట చరిత్రలో ఆరుద్ర తాదాత్మ్యం చెందారు. దీనివల్లనే కావ్య శీర్షిక సార్థకత పొందింది.

త్వమేవాఽహమ్ కావ్యంలో 'పర్వతదశ' ప్రత్యేకమైంది. ఆరుద్ర కాలానికి సంబంధించిన అవగాహనతో ఈభాగాన్ని రచించారు. కాలం ఎక్కడనుంచి పుట్టింది? ఏవిధంగా పుట్టింది? అన్న ప్రశ్నలకు సమాధానాలను ఆరుద్ర ఈకావ్యంలో కవిత్వీకరించారు. కాలం నిత్య సమకాలీనం. అంతేకాదు, చలనశీలం కూడా. అందుకే ఆరుద్ర "కాలం స్థితికాదు, గతి" అని స్పష్టం చేశారు. కాలప్రవాహంలో ఎన్నో మలుపులున్నాయి. తెలంగాణా పోరాటచరిత్ర వాటిలో ఒక గొప్ప మలుపు. నిరంతర పోరాటం జరిపి, నిజాం నవాబునుంచి కాలం స్వేచ్ఛను పొందింది. ఆ స్వేచ్ఛ తెలంగాణా ప్రజావళికి సంబంధించినది. ఆరుద్ర ఈ ప్రజాపోరాట విజయం అందించిన వివిధ దుస్సహ దృశ్యాల్ని త్వమేవాఽహమ్ కావ్యంలోని పర్వతదశలో చిత్రించారు.

త్వమేవాఽహమ్‌లోని 'ఉపనదులు' మరో విశిష్టమైన భాగం. సగటుమనిషి దైనందిన జీవితంలోని దుర్భరతను ఆరుద్ర ఈ భాగంలో వ్యక్తీకరించారు. సామాజిక, రాజకీయ అసంబద్ధతతోపాటు వ్యక్తి నిత్యజీవితంలో ఏర్పడిన దుఃఖాన్నీ, అగాధాన్నీ 'ఉపనదులు' విశ్లేషిస్తాయి. ఒక సర్కస్ గుడారంలో ఎందరో ప్రదర్శకులుంటారు. కఠినమైన విన్యాసాలు చేస్తూ ఉంటారు. మృత్యులోకం అంచులదాకా వెళ్ళి వచ్చి ప్రేక్షకలోకానికి వినోదాన్ని పంచుతారు. ఇదేవిధంగా

కార్మికలోకం కర్షకలోకం కూడా ప్రతినిత్యం మృత్యువుతో పోరాడుతూ, పెట్టుబడిదారులైన దోపిడీవర్గాలకు, సంపదను సమకూర్చి పెడతారని ఆరుద్ర 'ఉపనదులు' భాగంలో విశ్లేషించారు.

పీడకవర్గాల పీడన పరాకాష్ఠదశకు చేరినపుడు పీడితవర్గాలనుంచి విప్లవం పుడుతుంది. ఇది అనివార్యమైన పరిణామం అని మార్క్సిజం చెపుతుంది. తెలంగాణాలో అదే జరిగింది. తెలంగాణా ప్రజానీకం విప్లవించడానికి దారితీసిన పరిస్థితులు నిజాంరాజు పాలనా విధానంలోనే ఉన్నాయి. కాబట్టి తెలంగాణా పోరాటం కూడా అనివార్యమైందే. అందుకే ఆరుద్ర ఈ కావ్యంలో స్తబ్దతను బద్దలుకొట్టి చైతన్యాన్ని పుంజుకొమ్మని తెలంగాణా ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాటాన్ని ఉధృతం చేస్తేనే వ్యవస్థ మలుపు తిరుగుతుందని భావించారు. అప్పుడే పీడితవర్గం విజయబావుటా ఎగరవేస్తుందని ఆరుద్ర విశ్వసించారు.

> 'నీ చైతన్యం
> అరముగ్గిన అవకాశం
> చిరంజీవి మానవుడా
> త్వమేవా ౨హమ్"

అని ఆరుద్ర చిరంజీవి మానవునిలో మమేకం అయ్యారు. ఈ చిరంజీవి మానవుడు అమృతాన్ని దిగమింగిన దేవతల పక్షంవాడు కాదు. తెలంగాణాలో ఒకవైపు నిజాం నవాబుతోనూ, మరోవైపు భూస్వాములతోనూ ప్రతిక్షణం పోరాడుతున్న సామాన్యరైతు. ఈ చిరంజీవితోనే ఆరుద్ర ఈ కావ్యంలో 'త్వమేవా ౨హ'మన్నారు.

ఆరుద్ర ప్రయోగదృష్టికి ఈ కావ్యం ఒక మచ్చుతునక. అభ్యుదయ దృక్పథాన్ని ప్రతీకల ద్వారా విశ్లేషించడంలోనూ ఆరుద్ర గడుసుతనాన్ని ప్రదర్శించారు. గంటలకూ, సెకండ్లకూ మధ్య అనగా పెట్టుబడిదారులైన దోపిడీవర్గంవారికీ, శ్రామికవర్గానికీ మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకొనే సమయం ఇంకా చేరువకాలేదు. నిమిషాలు, అనగా మధ్యతరగతి వర్గం బాధ్యతగా వ్యవహరించకుండా ఉండటంఒక కారణమైతే, ఆ వర్గం భవిష్యత్తుపట్ల నిరాశతో కుమిలిపోవడం మరో కారణం. అందుకే ఆరుద్ర సంకేతించిన నిమిషాలు అనగా మధ్యతరగతి వర్గం బీటలు వారుతున్న సమాజాన్ని గుర్తించాయి. 'ఇక లాభం లేదనీ, మౌనం వహిస్తే మోక్షం లేద'నీ ఒక నిర్ధారణకు వచ్చాయి. "ఈ మీ పిక్చర్‌కి అయిందో పెద్ద ఫ్రాక్చర్' అని మొట్టమొదటిసారిగా మధ్యతరగతి వర్గం పీడకవర్గాన్ని హెచ్చరించింది. త్వమేవా౨హమ్ కావ్యంలో ఈ హెచ్చరికే భరతవాక్యం. ఈ భరతవాక్యంతోనే ఈ కావ్యానికి తెరపడింది.

తెలుగు సాహిత్యంలో ఇటువంటి గాఢమైన ప్రతీకలు కలిగిన కావ్యం అంతకుముందు వెలువడలేదు. ప్రతీకలు వ్యాఖ్యానించబడకూడదు. అయితే ఆరుద్ర ఈ కావ్యంలో కొన్ని ప్రతీకలను వాచ్యం చేశారు. సాంకేతికమైన పదాలను ప్రతీకలుగా భావించడం, వాటిని సామాజిక స్వరూపానికి అన్వయించి పరిశీలించడం తెలుగు పాఠకలోకానికి అప్పటికి ఇంకా అలవాటుకాలేదు. అందుకే ఆరుద్ర కొన్ని ప్రతీకల్ని వ్యాఖ్యానించినా పాఠకులకు ఈకావ్యం అర్థంకాలేదు. కావ్యంలోని ప్రతీకలు కొరుకుడుపడని ఇనుప గుగ్గిళ్లుగా కంటికీ, పంటికీ తగిలాయి. సాహిత్యలోకాన్ని విమర్శల వెల్లువ తుఫానులాగా అతలాకుతలం చేసింది. త్వమేవా౨హమ్ కావ్యశిల్పం, రచనా సంవిధానం సామాన్య పాఠకులకే కాదు, విమర్శకులకు కూడా కొరుకుడు పడలేదు. ఈ సంకటస్థితి ఆరుద్రను కూడా కొంత కలవరపరిచింది. కొంత కలతకు కూడా లోనుచేసింది. అందుకే ఆరుద్ర దాశరథికి రాసిన ఒక ఉత్తరంలో ఈ కావ్యంలోని కొరుకుడుపడని ప్రతీకలను విశ్లేషించారు.

శ్రీశ్రీ త్వమేవాఽహమ్ కావ్యానికి 'లఘుటిప్పణి' రచించారు. ఆరుద్ర దాశరథికి రాసిన 'కవిహృదయం'తోపాటు ఈ టిప్పణి కూడా త్వమేవాఽహమ్ పాఠకుల చెంత చేరడానికి మరికొంత కారణమైంది. ఈ రెండూ లేకపోతే త్వమేవాఽహమ్ కావ్యం తెలంగాణా పోరాటాన్ని ఆవిష్కరించిన రచనగా గుర్తించడం కష్టం అని విమర్శకులు భావించారు. అయితే అదే విమర్శకులు స్వాతంత్ర్యానంతరం వెలువడిన ఆధునిక తెలుగు కావ్యాలలో ఏ కోణం నుంచి చూసినా త్వమేవాఽహమ్ ఉత్తమకావ్యంగా పరిగణించవలసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మొదటి దానిలో ఆశ్చర్యం లేదు. రెండోదానిలో అసత్యం లేదు.

* * *

త్వమేవాఽహమ్ కావ్య రచనలో ఆరుద్రకు ఒక స్థిరమైన చిరునామా ఏర్పడింది. కవిగా మంచి గుర్తింపు వచ్చింది. ఒక విషయంలో విజయం సాధించిన తరువాత జీవితకాలం దానినే నెమరువేసుకుంటూ ఉండటం మేధావుల లక్షణం కాదు. ఆరుద్ర త్వమేవాఽహమ్ దగ్గరే ఆగిపోలేదు. తమ అనుభవాలనూ, జాతి అనుభవాలనూ కొన్ని కవితల్లో, మరికొన్ని గేయాలలో ఆవిష్కరించారు. 1957లో ఈ రచనలన్నింటినీ కలిపి ఒక సంకలనంగా గాయాలూ గేయాలూ ప్రచురించారు.

సామ్యవాద భావాలకి విజయం తథ్యం అని ఆనాడు చాలామంది అభ్యుదయ కాముకులు భావించారు. అందులో ఆరుద్ర కూడా ఉన్నారు. ఎందరో మనసులకు గాయాలు తగిలాయి. ఆరుద్రలోనూ నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. అయితే ఆరుద్ర మనసుకు తగిలిన కొన్ని గాయాలు ఆరుద్రలో పాలకవర్గాన్ని ప్రశ్నించేనైజాన్నీ, శక్తినీ పెంచాయి.

"పాలితుల మెదళ్ళ కుదుళ్ళ కట్టి
వాళ్ళ చూపుదారిలో కాపలావాళ్ళని పెట్టి
వాళ్ళ కిటికీలు మూసి మేకులుకొట్టి
పరిపాలించబోతుంది రేపటిరాజ్యం
మొరలాలించడం అందులో పూజ్యం
....
రాబందుల రాజ్యం లోపల
ఆంబోతులే అమాత్యులు కదా మరి"

రాబందులు, ఆంబోతులు వంటి వారి చేతుల్లో రాజ్యం ఉన్నప్పుడు ప్రజల మొరలు ఆలకించడం వారి చేతల్లో ఉండదు. పాలకవర్గ నైజాన్ని నిశితంగా చెప్పడంలో ఆరుద్రకలం అప్పటికే ఎంతగా పదును తేలిందో ఇటువంటి ఖండికలు నిరూపిస్తాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అయినా దాని ఫలాలు అందవలసిన వాళ్ళందరికీ అందవలసిన విధంగా అందలేదు. అయినా ఆంధ్రరాష్ట్ర అవతరణ ఆనాటి కవి సమూహాన్ని ఎంతగానో ఉత్తేజపరిచింది. ఆరుద్రకూడా వారితో కలిసి స్వరం కలిపారు.

'పుట్టాడు అమరజీవి
పొట్టి శ్రీరాములు
తుదముట్టాయి తెలుగుజాతి
తీరని పెనుబాములు'

అని అమరజీవి త్యాగాన్ని శ్లాఘించారు.

"వేదంలా గోదావరి
ప్రవహిస్తుందే చెల్లీ

వెన్నెలవలె కృష్ణవేణి
విహరిస్తుందే తల్లీ"

అని ఆరుద్ర భావించారు. 'తుంగభద్ర నాదాల'తో, 'పెన్నానది గానం' సాగాలని అనేక గేయాలు ఆలపించారు. తెలుగుకోట బురుజుమీద ఎదురులేని తెలుగుబావుటా ఎగురుతుందనీ ఆరుద్ర ఎంతగానో ఉప్పొంగిపోయారు. తెలుగుతల్లి ఆడిందే ఆటగా, పాడిందే పాటగా, జాతి పురోగతికి మలుపులేని త్రోవగా తూరుపుదిక్కున వేగుచుక్క పొడిచిందని మరెంతగానో సంబరపడ్డారు.

'విజయీభవ విజయీభవ
విశాలాంధ్ర జననీ
ప్రజలంతా సుఖాలతో
బ్రతుకంతా మననీ'

అని ఆంధ్ర రాష్ట్రానికి ఆరుద్ర శుభాకాంక్షలందించారు. రాష్ట్రప్రజల సుఖమయజీవితాన్ని ఆకాంక్షించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో ఆంధ్ర రాష్ట్రం తలమానికం అని తలపోశారు. జాతికి సంబంధించిన ఇటువంటి అనేక గేయాలు ఈ సంకలనంలో వున్నాయి.

గాయలూ గేయాలూ సంకలనంలో ఇతర విషయాలకు కూడా కవితాకృతి కల్పించిన ఖండికలు అనేకం ఉన్నాయి. వాటిలో ప్రేమగీతాలు ప్రత్యేకమైనవి. ఈరోజుల్లో సినిమాపాటల్లాగా ఆరోజుల్లో ఈ ప్రేమగీతాలు ప్రజలనోళ్ళలో నానుతూ ఉండేవి. ఆనాటితరానికి చెందిన ఈనాటి పెద్దలకు 'గాయాలూ గేయాలూ'లోని ప్రేమగీతాల పల్లవులైనా కొన్ని గుర్తుండే ఉంటాయి. ఈ సంకలనంలోని కొన్ని గేయాలు తరువాతకాలంలో సినిమా పాటలుగా మలచబడ్డాయి.

"...కన్నుల నిద్దుర రాకపోతే
పడ్డావనుకో ప్రేమలో"
"...పడుచుదనం రైలుబండి పోతున్నది
పడుచువాళ్ళ కందులో చోటున్నది"

వంటి పల్లవులు గల సినిమా పాటలు 'గాయాలూ గేయాలూ' సంకలనంలోంచి స్వీకరించినవే.

జాతీయతకు సంబంధించిన ఆవేశంతోపాటు, వయసుకు సంబంధించిన ఆవేశాన్ని కూడా కలనేతగా కలబోసి, ఆరుద్ర ఆలపించిన సంకలనం – 'గాయాలూ గేయాలూ'

సాహిత్యోపనిషత్ : కవిత్వతత్వ విచారణం

కవిత్వం అంటే ఏమిటి? అది ఎలా ఉండాలి? కవి ఏ వస్తువును స్వీకరించాలి? ఎవరి జీవితాన్ని ఆవిష్కరించాలి? కవిత్వం ఏవిధంగా అభివ్యక్తీకరించబడాలి? వర్ణనలు ఎలా ఉండాలి? రసం ఏదై ఉండాలి? కవిత్వం ప్రయోజనాలేమిటి? ఇటువంటి అనేక విషయాలను చర్చించి ఒక చట్రంలో బిగించిపెట్టారు అలంకారికులు.

తెలుగులో సాహితీపరంగా ఆధునికయుగం ఆరంభమైంది. ప్రజా జీవితంలోనూ, ఆలోచనల్లోనూ, అనుభూతులు, అనుభవాల్లోనూ సమూలంగా మార్పులు వచ్చాయి. మారిన ఈ జీవితాన్ని ఆవిష్కరించడానికి ఒకనాటి సాహిత్య కొలమానాలు పనికిరావు. వస్తువు మారాలి. అభివ్యక్తి మారాలి. కవిత్వ ప్రయోజనం విషయంలోనూ మన అభిప్రాయాలు మారాలి. అనివార్యంగా రావలసిన ఈమార్పు గురించి, కావలసిన నూతన దృక్పథం గురించి శ్రీశ్రీ, అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆరుద్ర కలిసి ఒక సుదీర్ఘమైన చర్చ చేశారు. అది ఆశువుగా కవిత్వరూపంలోనే జరిగింది. ఆచర్చకు రూపమే – సాహిత్యోపనిషత్.

ఒకరకంగా 'సాహిత్యోపనిషత్' ఆధునిక లక్షణశాస్త్రం వంటిది. కవిత్వానికి సంబంధించిన ఆరుద్ర అభిప్రాయాలను ఈ కావ్యంద్వారా మనం తెలుసుకోవచ్చు.

ఏదేశంలోనూ, ఏకాలంలోనూ, ఏభాషలోనూ కవిత్వం ఎప్పుడూ శూన్యంలోంచి పుట్టదు. కవిత్వానికి మూలబీజాలు సమాజంలోనే ఉంటాయి. సామాజిక జీవితం కొన్ని సందర్భాలలో, అనేక కారణాలవల్ల ఆటుపోట్లకు గురవుతూ ఉంటుంది. ఇటువంటి ప్రతి సందర్భంలోనూ కవుల హృదయాలు ప్రకంపనలకు లోనవుతాయి. మనసులు గాయపడతాయి. ఉత్తమ కవిత్వం ఎప్పుడూ గాయాల్లోంచే పుడుతుంది. ఉత్తమ కవిత్వం ఎప్పుడూ అనేక గాథలద్వారా గాయపడిన మనసులను ఊరడిస్తూ ఉంటుంది. అందువల్లనే ఆరుద్ర సాహిత్యోపనిషత్తులో కవిత్వతత్వాన్ని మానిషాద శ్లోకంలోంచి దర్శించారు.

"ఎప్పుడో మానిషాదతో పుట్టిందట మొదటి కవిత్వం
ఎప్పుడైనా అలాంటి ఘటనతో పుట్టడమే దాని తత్వం
అక్రమం జరగడం కవితకి నాందనేది ముఖ్యం"

అని ఆరుద్ర ఆధునికంగా కవిత్వతత్వాన్ని నిర్వచించారు. ఈ విషయాన్ని ప్రముఖ విమర్శకులు టి.ఎల్.కాంతారావుగారు ఆరుద్ర అభినందన సంచికలో ఉటంకించారు. "శివేతరక్షతయే" అంటే ఇదే అని అభిప్రాయపడ్డారు.

పూర్వీకులకీ, ఆధునికులకీ కవిత్వానికి సంబంధించిన అనేక విషయాలలో అభిప్రాయ భేదాలున్నాయి. అమంగళకరమైన దానిని నాశనం చేయడమే కవిత్వం ఉద్దేశం అని ప్రాచీనులు భావించారు. కాదు; అన్యాయాలనూ, అక్రమాలనూ అరికట్టడానికీ, పీడనను అంతమొందించడానికి అని ఆధునికులు అభిప్రాయపడుతున్నారు. వ్యవస్థలోనూ, వ్యవస్థాగత జీవితంలోనూ, ఇతర విషయాలలోనూ ఏర్పడిన అభిప్రాయ వైరుధ్యాన్నే ఆరుద్ర ఈ కావ్యంలో కవిత్వీకరించారు.

కవిత్వం ఆనంద ప్రయోజనంగా ఉండాలని ప్రాచీన ఆలంకారికులు నిర్దేశించారు. ఈ అభిప్రాయాన్ని ఆరుద్ర గౌరవిస్తూనే ఆ ఆనందం, ప్రజాపరం కావాలని ఆకాంక్షించారు. 'అందరికీ ఉపయోగపడాల్సినదే కవిత్వం' అని నొక్కి చెప్పారు. అంతేకాదు మంచి రచన ఎలా ఉండాలో కూడా ఆరుద్ర నిర్వచించారు.

"మంచి రచన చదివాక బాగా భోంచేసినట్టుండాలి. కొంచెం బాధపడాలి. చించుకున్నట్టుండాలి. మనస్సుకి జ్వరం రావాలి. ఒళ్ళు తిరగాలి. ఈ బాధలోంచే తేరుకొని బాగుపడాలి".

ఇంత సున్నితంగా కవిత్వాన్ని నిర్వచించడం కష్టమే. ఈ నిర్వచనం ఆధునిక రచన స్వరూప స్వభావాన్ని కూడా వివరిస్తుంది. సామాన్య పాఠకులేకాదు; కవులు, విమర్శకులు కూడా తరుచూ ప్రస్తావించే అసామాన్య నిర్వచనాలు కూడా ఈకావ్యంలో మరికొన్ని ఉన్నాయి.

"కల నిజపరచడం కాదు కవిత్వం
నిజాన్ని కలగనడమే దాని తత్వం
. . .   .
ఎప్పటికైనా మానవపథికుడు చేరుకొనే
గొప్ప విశ్రాంతి మందిరం కవిత"

కవిత్వ రహస్యాలు ఇంత బాగా తెలుసు కాబట్టే కృష్ణశాస్త్రి అంతటి కవి ఆరుద్రను ఆధునికుల్లో కవిత్వ రహస్యం తెలిసిన కవిగా మెచ్చుకున్నారు.

సాహిత్యోపనిషత్‌లో కవిత్వతత్వం గురించేకాక కవితా వస్తువును గురించి అభివ్యక్తి గురించి కూడా ఆరుద్ర, శ్రీశ్రీ అబ్బూరితో చర్చించారు. తమదైన అభిప్రాయాలు చెప్పారు.

'ఏమిటి చెప్పడం ఎలా చెప్పడం
అనేవి రెండూ రెండు చక్రాలు
ఈ రెండూ సమంగా ఒప్పడం బండిని తిప్పడం
అనేవే కవితా సౌలభ్యత్వాలు
ఈ రెండింటిలో ఏ ఒకటీ కాదు మిన్న
ఈ రెండింటిలో ఏది లేకపోయినా బండిసున్న'

వస్తు శిల్పాలలో ఏది ముఖ్యమని ప్రాచీన కాలంనుంచీ చర్చలు జరుగుతూ ఉన్నాయి. ఆధునిక యుగంలోనూ అవి కొనసాగుతూ ఉన్నాయి. కవిత్వంలో శిల్పం ఉండాలిగాని, అది వస్తువును కప్పిపుచ్చకూడదు. అలాగని శిల్పం లేకుండా కేవలం వస్తువు కవిత్వం కాదు. అందుకే ఆరుద్ర వాటిని సమాంతరంగా నడిచే సమంగా ఉండే రెండు బండి చక్రాలవంటివని చెప్పారు.

"సందేహం లేని సంశోధన
సందేశం లేని సంవిధాన సాధన
కానేరదు కవిత్వం"

అని ఆరుద్ర మరికొంత వివరణ ఇచ్చారు. సంశోధన జరగాలంటే మనలో ముందు సందేహం రావాలి. సందేహం మూలంగా జరిగే సంశోధనలోంచే సంవిధానం పుడుతుంది. ఆధునికయుగం ఆరంభమయ్యేదాక ఆ సంవిధానంకోసమే అని భావించారు. కాదు; ఆ సంవిధానం సమాజానికి సందేశాన్నివ్వగలగాలని ఆధునికులు భావించారు. అందుకే ఆరుద్ర సందేశం లేని సంవిధానం కవిత్వం కాలేదని అభిప్రాయపడ్డారు. సాహిత్యోపనిషత్ కావ్యంలో ఆరుద్ర ఏ అభిప్రాయాలనైతే వ్యక్తం చేశారో అవన్నీ వారి రచనల్లోనేకాక కొందరు ఇతరుల్లోనూ ప్రతిఫలిస్తాయి. అందువల్ల ఈ కావ్యాన్ని ఆధునిక లక్షణశాస్త్రంగా పరిగణించవచ్చు.

* * *

మధ్యతరగతి కల : సినీవాలి

మధ్యతరగతి మనస్తత్వానికీ, నగరజీవితానికీ గుర్తింపుకు అక్షరాకృతి కల్పించిన కావ్యం సినీవాలి. త్వమేవాఽహమ్ కావ్యం వల్ల కవిగా ఆరుద్రకు వచ్చిన గుర్తింపును శాశ్వతంగా స్థిరపరచిన కావ్యం సినీవాలి. 1960లో వెలువడిన సినీవాలి కావ్యానికి కూడా పునాదులు సమాజంలోనే ఉన్నాయి. అయితే ఒక ప్రత్యేకమైన సందర్భంలో సినీవాలి ఆవిర్భావం జరిగింది.

సాహిత్య అకాడమీ ప్రచురణకోసం కాటూరు వెంకటేశ్వరరావుగారు 'కావ్యమాల' అనే పేరుతో కవితా సంకలనం చేశారు. ఆరుద్ర కవితలను కూడా ఆ సంకలనంలో చేర్చారు. గ్రంథం చివర కవులందరినీ సంక్షిప్తంగా పరిచయం చేశారు. అయితే కాటూరువారు ఆరుద్ర విషయంలో ఒక పొరపాటు చేశారు. త్వమేవాఽహమ్ అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నా ఆరుద్ర రచనలను ప్రస్తావిస్తూ; త్వమేవాఽహమ్‌కు బదులు 'సినీవాలి' అనే కావ్యాన్ని ఆరుద్ర రచించినట్టు ప్రస్తావించారు. సంకలనాన్ని చూసిన ఆరుద్రకు అప్పటికి సినీవాలి రచించలేదని తెలుసు. ఈ పేర్ల విషయంలో కాటూరువారు పొరపడ్డారని కూడా గ్రహించారు. కానీ ఆరుద్ర మాత్రం ఆ పొరపాటును 'పొరపాటు'గా భావించలేదు. కాటూరువారి పొరపాటును నిజం చేయడానికి కలం అందుకున్నారు.

అందుకే, అప్పటికే తన మానసిక క్షేత్రంలో కావ్యరూపం సంతరించుకుంటున్న మధ్యతరగతి జీవితానికి 'సినీవాలి' అని పేరు పెట్టారు. ఒక నిజాన్ని కాటూరి కలగన్నారు. ఆ నిజానికి ఆరుద్ర కావ్యరూపాన్ని అందించారు. 'పుట్టనిబిడ్డకు పేరు పెట్టడం' అన్నదాన్ని సినీవాలి కావ్యం ద్వారా ఆరుద్ర సార్థకం చేశారు.

లౌకిక పరిభాషలో 'సినీవాలి' అన్న పదం వ్యాప్తిలో లేదు. నిర్జీవంగా ఉన్న పదాలకు ప్రాణం పోయడం ఆరుద్రకు ఆదినుంచీ అలవాటే. సినీవాలి అనే పదానికి 'అమావాస్యనాటి చంద్రరేఖ' అని భావం. సమకాలంలోని జీవన విభావరిలో అతి సన్నని వెలుగురేఖను ఆరుద్ర ఈ కావ్యంలో ఆవిష్కరించారు. 'నేడమావాస్య' అని కావ్యాన్ని ఆరంభించి 'ఇది సినీవాలి' అని ఆరుద్ర కావ్యాన్ని ముగించారు. ఈ ఎత్తుగడ ముగింపులే ఆరుద్ర సాహిత్య దృక్పథాన్ని విశదం చేస్తాయి.

కావ్యాన్ని భారతీయ లాక్షణికులు ప్రధానంగా దృశ్యకావ్యాలు, శ్రవ్యకావ్యాలని రెండురకాలుగా విభాగించారు. సినీవాలి కావ్యంలో ఈ రెండులక్షణాలు మిళితమై ఉండటం ప్రత్యేకత. దృశ్యకావ్యంలోలాగా అంకాలనీ, రంగాలనిగానీ, శ్రవ్యకావ్యంలోలాగా ఆశ్వాసాలనిగానీ ఆరుద్ర కావ్య విభాగాలకు పేర్లు పెట్టలేదు, కానీ సినీవాలి కావ్యంలో మొత్తం ఐదు విభాగాలున్నాయి.

ఎజ్రాపౌండ్, ఇలియట్ వంటివారు పాశ్చాత్య సాహిత్యంలోనూ, పఠాభి, శ్రీరంగం నారాయణబాబు వంటివారు తెలుగులోనూ నగర జీవితాన్ని గొప్పగా ఆవిష్కరించిన ప్రతిభా సంపన్నులు. వీరి ప్రభావం ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా కొంత ఆరుద్రపైన పనిచేసింది. సినీవాలి కావ్యంలోని కథానాయకుడు క్లార్కు సూర్యారావు. కథానాయిక ఒక ఊహాసుందరి. వీరితోపాటు కొన్ని ఇతర పాత్రలుకూడా ఈ కావ్యంలో వస్తూ పోతూ ఉంటాయి. క్లార్కు సూర్యారావు నగరప్రవేశం చేయడంతో సినీవాలి కావ్యం ఆరంభమవుతుంది. చివరకు అతడు ఆత్మహత్యకు ప్రయత్నించడంతో కావ్యం అంతమవుతుంది.

పారిశ్రామిక విప్లవం జరిగాక ప్రజలు పల్లెలనుంచి పట్టణాలకు వలసపోవడం సాధారణ విషయమైంది. ఇది అనివార్యం కూడా. మహాప్రస్థానంలో శ్రీశ్రీ చిత్రించిన బాటసారి కూడా పల్లెనుంచి పట్టణానికి వలసవెళ్ళి జీవితాన్ని అంధకారం చేసుకున్నవాడే. ఆ బాటసారికీ, ఆరుద్ర సూర్యారావుకీ కూడా కొన్ని పోలికలున్నాయి. తల్లిమాటలు చెవిని పెట్టక పట్టణంలో బతుకుదామని బాటసారి బయలుదేరి వెళ్ళాడు. సూర్యరావు కూడా 'కళ్ళు మూసుకొని నగరంలో ప్రవేశించాడు'. నగరంలో తాండవించే కృత్రిమమైన జీవితాలు, కుహనా విలువలూ, జీవితాలూ, వికృతమైన నాగరికతలూ సూర్యారావు మొదటిసారిగా కళ్ళుతెరిచేసరికి కన్పించాయి. నిజానికి ఈ దృశ్యాలన్నీ ఆరుద్ర నిజజీవితంలో దర్శించినవే. వాటినే సూర్యారావుకూ, వానిద్వారా పాఠకలోకానికీ చూపించారు.

'శ్రీమంతుణ్ణి ప్రేమించడానికి
ఆశపడుతుంది ఆధునిక నగరం
అయిదంతస్తుల హోటళ్ళ డాబా మీద పూదోటలో
వెలుతురు తగ్గించిన ఎలక్ట్రిక్ దీపాల నీలిమసాబులో
పన్నెండుగంటల రాత్రి తరువాత
పరిష్వంగ నృత్యంలో
స్లోఫాక్స్ ట్రాట్ సంగీతానికి కళ్ళుమూస్తుంది నగరం
డాన్సుఫ్లోరు మూల తిరిగేటప్పుడు
నృత్యంలో నిన్నదుముకొంటుంది

నీ మీద చూపించిన ప్రేమనే
టేప్‌దాన్సులో ఇంకొకడి మీద కూడా
నిష్కారణంగా నిష్కామంగా
చూపెట్టే పింజారి నీ నగరం"

'సినీవాలి' మధ్యతరగతి జీవితాన్ని ఆవిష్కరించిన కావ్యం. 'Man is born free and is everywhere in chains' అని రూసో మధ్యతరగతి వ్యక్తిని నిర్వచించాడు. మధ్యతరగతి వ్యక్తి స్వతంత్రంగా ఉండాలనుకుంటాడు. స్వేచ్ఛగా బ్రతకాలనుకుంటాడు. అలాగే జీవిస్తున్నానని కూడా భావిస్తాడు. కానీ అతడెప్పుడూ సంకెళ్ళతోనే ఉంటాడు. 'సినీవాలి'లోని సూర్యారావు మధ్యతరగతి వ్యక్తికి అచ్చమైన ప్రతినిధి.

మధ్యతరగతి వ్యక్తి తన కోర్కెలను తీర్చుకోడానికి, తన అస్థిత్వాన్ని నిరూపించుకోడానికీ ఎప్పుడూ పాలకవర్గంతోనే చేతులు కలుపుతాడు. నిజానికి వర్తమానకాలంలోని వర్గ సమాజంలో శ్రామికవర్గం విజయం సాధించాలంటే మధ్యతరగతి వర్గం శ్రామికులతో చేతులు కలపాలి. కానీ సినీవాలి కావ్యంలోని సూర్యారావు శ్రామికవర్గంతో మమేకం కాలేకపోయాడు. కవి సూర్యారావులో చైతన్యం కలిగించాలనుకున్నారు. 'శ్రమైక జీవన సౌందర్యా'న్ని గానం చేశారు. అందులో సూర్యారావును కూడా భాగస్వామిని చేయాలనుకున్నారు.

"నియమాలకు లోబడటం
నియంతకు కట్టుబడటం
కొంతసేపు శ్రమించడం
పిదప విశ్రమించడం
కలలు నిర్మించడం
కళలు సృష్టించడం
ఇదే సంపూర్ణ జీవన ఫలం
అపుడు మానవులం దేవతలం"

అని శాంతిచేత, మానుష ధర్మాన్ని ఉపదేశింప చేశారు. శాంతి పలికిన ఈ మాటలు నిజానికి సూర్యారావుకు ఎంతగానో నచ్చాయి. కానీ నగరవాసులకు ఈ ఆశయాలు అవసరం లేదని సూర్యం శ్రామికవర్గంతో చేతులు కలపలేకపోయాడు. సమష్టిజీవన సౌఖ్యాన్ని పొందడంలోనూ, శ్రామిక జీవన స్వర్గాన్ని సాధించడంలోనూ విఫలం చెందాడు. అయితే జీవితంలో మధ్యతరగతి కలలు కనడం మాత్రం సూర్యం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఊహాప్రేయసితో ఊహాలోకాల్లో విహరిస్తూనే ఉన్నాడు.

"ఇవ్వాళ ఇక్కడే బీచిలో కూర్చొని జీడిపప్పు తిందాం
చెట్టపట్టాలు కట్టుకొని కెరటాలు చూస్తూ స్వప్నాలు కందాం
ఇండియా కాఫీ హౌసు మూసేశారు కనుక
నేటికి ఇరానీలో టీయే తాగుదాం
. . .   .
ఇంక్రిమెంటు ఇవ్వగానే పెళ్ళి చేసుకొందాం
ఇలాగే ప్రస్తుతానికి కలుసుకుంటూ ఉందాం
. . .   .
టాక్సీని పంపించెయ్యడం పొరపాటైంది
ఆఖరిబస్సు వెళ్ళిపోతుంది వెళ్దామా స్వీట్‌హార్ట్"

అని సూర్యారావు ప్రేయసితో కబుర్లాడుతున్నాడు. మూర్తీభవించిన మధ్యతరగతి మనస్తత్వానికి పై మాటలు కోటలు నిర్మిస్తాయి.

సూర్యం మాటల్ని వింటే అవి ఉన్నతవర్గం భావాలుగా అనిపిస్తాయి. కానీ, ఆ మాటల మూటలు విప్పి, వాటి అంతస్తత్వాన్ని పరిశీలిస్తే మధ్యతరగతి జీర విన్పిస్తుంది. ప్రేయసితో చెట్టపట్టాలు వేసుకొని, బీచిలో కూర్చుని జీడిపప్పు తినడం ఊహ. ఇంక్రిమెంటు ఇవ్వకపోతే పెళ్ళికూడా చేసుకోలేని సూర్యం దౌర్భాగ్యం ఒక వాస్తవికత. సూర్యారావు ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చి, అద్దెకు మాట్లాడుకున్న టాక్సీని పంపించడం పొరపాటయిందని పైకి ప్రేయసిలో బింకంగా పలికాడు. అయితే, ఊహల్లో కూడా అద్దెకారును జీడిపప్పు తినేంతవరకైనా అట్టిపెట్టుకొనే మానసిక స్థైర్యంలేని బలహీనుడు సూర్యం. ఇదంతా మధ్యతరగతి మనస్తత్వానికే అద్దం పడుతుంది.

మధ్యతరగతి వ్యక్తి ప్రవృత్తే విచిత్రంగా తోస్తుంది. సూర్యం ఎంతగా విహాయసయానం చేస్తున్నా తన పాదాలు ఎక్కడ ఉన్నాయో కూడా అప్పుడప్పుడూ జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటాడు. తన ప్రయాణం ఎక్కడ మొదలైందో, ఎందుకోసం ఆరంభమైందో సూర్యానికి తెలుసు. అందుకే అతడు చైతన్యంలోంచి సుప్త చైతన్యంలోకీ; అక్కడనుంచి మళ్ళీ చైతన్యంలోకీ నిరంతరం అక్కడక్కడే పరిభ్రమిస్తూ కన్పిస్తాడు.

సూర్యారావు ఊహించుకున్న ప్రేయసికి భౌతికరూపం లేదు. ఆమె ఒక తాత్త్వికమైన భావన. ఆదర్శలోకంలో సూర్యం దర్శించిన ప్రణయదేవత. పట్టణ జీవితపు భ్రమలు సూర్యం కళ్లు కప్పగా అతను దర్శించిన దివ్యసుందరమూర్తి. అయితే నగరజీవితంలోని చేదునిజాలు, కఠినమైన వాస్తవాలు అతి తక్కువకాలంలోనే సూర్యం కళ్ళపొరలను కరిగించి వేశాయి. అల్లుకున్న ఆదర్శాలుకాక, ఊహించని వాస్తవాలు కళ్ళకి కట్టాయి.

"నగరంలోని షాపులు
పులితోలు కప్పుకున్న సాధుగోవులు
. . .   .
నగరం నీ ముందరి కాళ్ళబంధం
నగరం నీ కాలకూట మకరందం
. . .   .
ఆధునిక రంగేళి యువతిలాగ
నగరానికి మెదడు తక్కువ
షోకులెక్కువ
ఆశయాలు లేని
ఆశలూ విలాసాలూ ఎక్కువ"

అన్న విషయం సూర్యారావుకు తెలిసిపోయింది. నగరంలో జీవితాలెలా ఉంటాయో, వాళ్ళ ఆలోచనలు, ఆశయాలు ఎలా ఉంటాయో కూడా సూర్యం అర్థం చేసుకున్నాడు.

పట్టణవాసులు పరస్పరం అనుభవాలనూ, అనుభూతులనూ పంచుకోలేరు. ఒకరినొకరు అభినందించుకోవడం నామోషీగా భావిస్తారు. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుందన్నది ఒక వాస్తవం. నగరవాసి కూడా మూర్తీభవించిన స్వార్థంతో తన చుట్టూ తాను తిరుగుతూ డబ్బు చుట్టూ తిరుగుతాడన్నది మరో వాస్తవం. వర్గ వైరుధ్యాలకు నగర జీవితం పగలని దర్పణం. ఒక పక్క ఆకాశాన్నంటే ఆడంబర జీవితాలు, మరోపక్క ఆకాశాన్ని చూసే అవకాశాలు లేని అధోగతి జీవితాలు. ఇటువేపు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు; అటువైపు రెక్కలు ముక్కలు

చేసుకున్నా గంజినీళ్ళకు నోచుకొని శ్రామికులు, కార్మికులు. కొంతమంది జీవితాల్లో అత్తరులూ, పన్నీరులు. ఎంతోమంది జీవితాల్లో నెత్తురులూ, కన్నీరులు: ఇటువంటి దృశ్యాలన్నీ సూర్యానికి త్రిబుల్ డైమన్షన్‌లో కన్పించాయి. తాను అనుకునే ఆశలన్నీ కరిగిపోయాయి. ఆశించిన ఆశయాలన్నీ భగ్నమయ్యాయి. పేరుకు సూర్యారావుగాని, సూర్యంచుట్టూ చీకటి ఆవరించింది. నిజానికి ఇది సూర్యారావు జీవితం మాత్రమే కాదు. సగటు మధ్యతరగతి మనిషి జీవితం. వెలగవలసిన జీవితం చుట్టూ చీకటి అలుముకున్నప్పుడు బాధ్యత కలిగిన రచయితలూ, కవులూ చోద్యం చూస్తూ ఉండలేరు. మనసు నిండా ఆక్రమించిన నిరాశను భగ్నం చేయడానికి ఒక చిన్న దీపమైనా వెలిగిస్తారు. ఆరుద్ర కూడా అదేశారు. సినీవాలిని ఇలా ఆశాజనకంగా ముగించారు.

"ఈ కావ్యం విషాదంతమనుకోవడం తప్పు. అసలు అంతమవుతుందనుకోవడమే తప్పు. ఇది అనంతం సౌఖ్యవంతం అనడం తప్పు. ఈ నిరాశలోంచి ఆశ జనించడం ఒప్పు. సమకాలీన జీవన విభావరిలో తమస్సులు ఘనీభవించాయనుకోవడం తప్పు. అతి సన్నని వెలుగురేఖ లేదనుకోవడం తప్పు. ఆశా చంద్రకళగల ఇది సినీవాలి అనడం ఒప్పు".

వర్తమాన వ్యవస్థలో మధ్యతరగతి వ్యక్తి జీవితం నిరంతరం సంఘర్షణకు గురవుతూ ఉంది. క్లార్కు సూర్యారావు పాత్రద్వారా ఆరుద్ర మధ్యతరగతి వర్గానికి గొప్ప సందేశాన్ని అందించారు. కాలం చెల్లిన భావాలకు సూర్యారావులాగా బానిస కాకూడదు. విలాసాలకూ వినోదాలకూ తలవంచకూడదు. ఒంటరి జీవితం మంచిది కాదు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది లేదు. కాబట్టి శ్రామికరాజ్యాన్ని సాధించదలుచుకున్నవారు శ్రామికవర్గంతో చేతులు కలపాలని ఆరుద్ర సినీవాలిలో స్పష్టం చేశారు. శ్రామికజన పక్షపాతాన్ని ప్రత్యక్షరంలోనూ పలికించారు.

త్వమేవాఒహమ్ కావ్యంలోని ఆరుద్ర ప్రయోగ వైచిత్రికీ, ప్రతీకల ప్రకర్షకూ సామాన్య పాఠకుడు అదిరిపడ్డాడు. కావ్యానికి కొంత దూరంగా జరిగాడు. అయితే సినీవాలి కావ్యంలోని తాత్వికగాఢతకూ, భావనకూ, అభివ్యక్తికీ పాఠకుడు దగ్గరయ్యాడు. విమర్శకలోకంకూడా సినీవాలి కావ్యాన్ని గొప్పగా ప్రస్తుతించింది.

ప్రముఖ అభ్యుదయకవి, విమర్శకుడు ఆవంత్స సోమసుందర్ 'ఆరుద్ర ముద్రలు'లో సినీవాలిని వ్యాఖ్యానించారు. ఆరుద్ర చెప్పిన సంపూర్ణ కావ్యాలలో "అన్నింటా శిరోమణివంటిది సినీవాలి. అది ఒక వాస్తవ జీవన కథనం. నాటకీయంగా రూపొందిన జీవనకావ్యం. అది వాస్తవికతకీ, చైతన్య స్రవంతీశిల్ప ఆవిష్కరణకీ, దరచిత్ర ప్రతీకాత్మకవాదాలకీ సంపూర్ణ ప్రాతినిధ్యం పొందిన మహాకావ్యం".

* * *

ఏ జాతి సంస్కృతిలో అయినా ఆ జాతికి సంబంధించిన ఒకనాటి జానపద సంస్కృతి వెలకట్టలేని సంపదలాంటిది. పారిశ్రామిక విప్లవం అనంతరం ప్రజాజీవితంలో వచ్చిన మార్పులవల్ల ఒకనాటి జానపద సాంస్కృతిక అంశాలు మననుంచి దూరమవుతూ ఉన్నాయి. ప్రపంచంలో అన్నిచోట్లా ఈ పరిమాణాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే గతంలో ఉన్న మంచిని నిరంతరం వర్తమానకాలానికి అందిస్తూ ఉండాలన్న స్పృహ అందరికీ అన్నికాలాలలోనూ ఉండకపోవచ్చు. అయితే తెలుగు ప్రజల అదృష్టం కొద్దీ గురజాడ అప్పారావుగారు ముత్యాలసరాలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆరుద్ర కూనలమ్మ పదాలకు జీవం పోశారు. ముత్యాలసరాలు, కూనలమ్మ పదాలు రెండూ జానపద సంస్కృతి కుదుట్లోంచి ఉద్భవించినవే. గురజాడ, ఆరుద్ర ఇద్దరూ అంతరించిపోతున్న జానపదగేయ ఫణతిని ఉద్ధరించిన అపర భగీరథులే.

కూనలమ్మను పోతురాజు సతీమణిగా తెలుగువారు భావిస్తారు. పార్వతీదేవి కుమార్తెగా, కామేశ్వరీదేవి తోబుట్టువుగా కూడా పెద్దలు అభిప్రాయపడుతున్నారు. 12వ శతాబ్దికి చెందిన నన్నెచోడుని నాటికే కూనలమ్మపదాలు ప్రచారంలో ఉన్నట్టు ఆరుద్ర భావిస్తున్నారు. దక్షిణాంధ్ర యుగంలో విజయరాఘవ నాయకుడు చెప్పిన 'విజయరాఘవ కల్యాణం' అనే యక్షగానంలో కూనలమ్మ పదాలకు అనుకరణలు కొన్ని ఉన్నాయని కూడా ఆరుద్ర ఆధారాలు సంపాయించారు. కూనలమ్మ పదాల ప్రాచీనతకు ఇవి నిదర్శనాలు.

కూనలమ్మ పదాలకు కూడా కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ప్రతిపదంలోనూ నాలుగు పాదాలు ఉంటాయి. మొదటి మూడు పాదాలలో పది మాత్రలుంటాయి. 3+4+3 మాత్రల విరుపులో పదాలు ఉంటాయి. నాల్గవపాదం ఎనిమిది మాత్రలున్న 'ఓ కూనలమ్మ' అనే మకుటం. ఈ పదాలకు అంత్యప్రాస ఆరోప్రాణం. నీతిని ప్రబోధిస్తూ గానయోగ్యంగా ఉండటం కూనలమ్మపదాల మరో లక్షణం.

'ప్రభాకర పరిశోధకమండలి' వారు మొదటిసారిగా ఎనిమిది కూనలమ్మ పదాలను సేకరించి 'బాలభాష' అనే శీర్షికలో ప్రచురించారు. అంత్యప్రాసలంటే చెవికోసుకొనే ఆరుద్ర ఈ పదాలను పరిశీలించారు. సహజంగానే స్పందించారు. అయితే ఆరుద్ర ప్రయోగవాదికనుక నీతికి మాత్రమే పరిమితమై ఉన్న ఈ పదాలను వస్తువైవిధ్యంతో అభిషేకించారు.

భావాభివ్యక్తి విషయంలో వేమన పద్యాలకూ కూనలమ్మ పదాలకూ కొన్ని సామ్యాలు కన్పిస్తాయి. రెండింటికీ నాల్గవపాదం మకుటమే. తొలి రెండు పాదాలలో మామూలు విషయాలు చెప్పి మూడోపాదంలో చెంప చెళ్ళుమనేలా చెప్పడం వేమన పద్ధతి. ఈ నైజం ఆరుద్ర కూనలమ్మ పదాలలోనూ గోచరిస్తుంది.

'రాక్షసత్వము పోయి
రాచరికములు పోయి
ప్రజలదే పై చేయి
ఓ కూనలమ్మా'

మతభావం మౌఢ్యంగా మారినపుడు అది సమాజానికి ఎంతటి చేటును కల్గిస్తుందో గడిచిన చరిత్రే కాదు, వర్తమానం కూడా చెపుతుంది. అందువల్ల మనిషికి మతంకంటే మానవత్వం ముఖ్యం అని ఆరుద్ర ప్రబోధించారు.

'కసిని పెంచే మతము
కనులు గప్పే మతము
కాదు మనకభిమతము
ఓ కూనలమ్మా"

ఆడవాళ్ళను అబలలుగా పరిగణించడాన్ని ఆరుద్ర ఆదినుంచీ ఒప్పుకోలేదు. ఆనాటికి స్త్రీవాద భావాలు తాత్విక నేపథ్యంలో ఉద్యమించకపోయినా, ఆ భావజాలాన్ని ఆరుద్ర కొన్ని పదాలలో పొందుపరిచారు.

'అడ్డు తగిలిన కొలది
అమిత శక్తులు కలది
అబల అగునా వెలది
ఓ కూనలమ్మా'

అబలలు కాదు, సబలలే అని ఆరుద్ర స్త్రీ జాతిని గుర్తించినా, వారిలో సహజంగా ఉండే అలంకార ప్రియత్వాన్ని, చీరలు ఆభరణాలు వంటి వాటిపై ఉండే మమకారాన్ని ఆరుద్ర కొన్ని పదాలలో చమత్కరించారు.

"ఆలికొన్నది కోక
అంతరిక్షపు నౌక
అంతకంటెను చౌక
ఓ కూనలమ్మా"

భారతీయ సంస్కృతికి పురాణాలను పట్టుకొమ్మలుగా మనం భావిస్తాం. భారతీయ మతం ఏకపత్నీవ్రతాన్ని ప్రబోధిస్తున్నా వేల్పులకు మాత్రం వందలకొద్దీ ఉండటాన్ని ఆరుద్ర ప్రశ్నించారు. అంతేకాదు కొన్ని పదాలలో వేల్పుల ఆంతర్యాన్ని కూడా... ఆవిష్కరించారు.

చెలుల చీరలు దోచి
చెల్లి చీరను గాచి
చేసెనే లాలోచి
ఓ కూనలమ్మా"

శ్రీకృష్ణుని ఆంతర్యాన్ని ఆరుద్ర ఈ పదంలో ఆవిష్కరించారు. ప్రేమతత్వాన్ని గురించీ, శృంగారరసాన్ని గురించీ, ఇతరేతర అంశాల గురించి కూడా ఆరుద్ర ఈ కూనలమ్మ పదాలలో వ్యాఖ్యానించారు. వర్తమాన సామాజిక జీవితంలోని వైరుధ్యాలను వివిధపదాలలో విశ్లేషించారు. కొన్ని పదాలలో సామాజిక విసుర్లుంటాయి. మరికొన్ని పదాలు సామాజిక రుగ్మతల్ని కసురుకుంటాయి. కొన్ని పదాలు చురుగ్గా స్పందిస్తాయి. మరికొన్ని పదాలు కరుగ్గా చూస్తాయి. కొన్ని పదాలు హాస్యమాడతాయి. మరికొన్ని పదాలు చక్కలిగింతలు పెడతాయి. కొన్నిపదాలు అధిక్షేపిస్తాయి. ఇంకొన్ని పదాలు తీవ్రంగా మందలిస్తాయి కూడా. ఏపదంలో ఏ లక్షణం ఉన్నా అంతర్లీనంగా అవన్నీ సామజిక పురోగతినే ఆశిస్తాయి. చెప్పదలుచుకున్న విషయం పాఠకుడి హృదయాంతరాల్లోకి దూసుకుపోవాలంటే మాత్రాచ్ఛందస్సు బాగా ఉపకరిస్తుంది. ఆ రహస్యం ఆరుద్రకు బాగా తెలుగు కాబట్టే కూనలమ్మ పదాలను స్వీకరించారు.

ఆటవెలది ఆత్మను వేమన పట్టుకున్నట్టుగా ఇతరులు పట్టుకోలేకపోయారు. అలాగే ఆరుద్ర కూనలమ్మ హృదయాన్ని స్పృశించినట్టుగా ఇతరులు ముట్టుకోలేకపోయారు. ఎందరు ఆటవెలదులు రాసినా, మరెందరు కూనలమ్మ పదాలను పాడినా ఆటవెలది పేరు చెపితే వేమన మాత్రమే పలికినట్టుగా కూనలమ్మ పేరు చెపితే ఆరుద్ర మాత్రమే 'కో' అంటారు.

* * *

ఆరుద్ర చాలా హాస్యప్రియులు. అంత్యప్రాసాప్రియులుకూడా. ప్రాసలో శ్రావ్యత వుంటుందని నమ్మినవారు. కవిత అయినా గేయం అయినా చెవికింపుగా వుండాలంటే ప్రాస దానికి దారి అన్న నమ్మకం వుండబట్టే, అంత్యప్రాసలతో – రకరకాల ఆటలు ఆడి పాఠకలోకానికి చక్కిలిగింతలు పెట్టే ఇంటింటి పజ్యాలు రాశారు. అవి చదువరులను చాలా ఆకట్టుకొన్నాయి కూడా. అధిక్షేపణాత్మకంగా హాస్యపూరితంగా మధ్యతరగతి వర్గంమీద మరిన్ని విసుర్లు యీ ఇంటింటి పజ్యాల్లో – కన్పిస్తాయి. ఆనందం కల్గిస్తాయి.

అమెరికన్ కవి ఆగ్డన్ నాష్ (1902–1971) లాఫింగ్ ప్రోఫెట్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఫన్నీ పొయెట్ అని పిలువబడే ఇతని స్ఫూర్తితో ఇంటింటి పజ్యాలు రాశారు. మధ్యతరగతి జీవితాన్ని సరికొత్తగా చిత్రీకరించారు. యదార్థజీవిత దృశ్యాన్ని హాస్యంగా తెరమీద చూపి అంత్యప్రాసల చేత

అడ్డమైన చాకిరీ చేయించారు. మధ్యతరగతి మనిషి సరదాలు కలగనడమేగాని తీర్చుకోలేదు. కట్టుకున్న పెళ్లాంలో ప్రియురాలిని చూసుకుంటూ ఆమెతో తన కోరికలు తీర్చుకుందామనుకునే మధ్యతరగతివాడికి – ఆ మాత్రం ఆనందం కూడా చేరువ కాదంటూ...

'పెళ్లంతో సినిమాకి
వెళ్లడం బహుత్ కుషీ మాకీ....'

కాని ఏం లాభం? తీరా అష్టకష్టాలుపడి హాలు చేరాక – ఆవిడగారు

"ఇంతకీ ఏం మరిచిపోయింది మీకేం తెల్సు.
ఇనబీరువాలో ఆవిడ దాచిన మనీపర్సు"

ఇంక సినిమా ఏమిటి! కుషీ ఏమిటి!!

ఆడది అందంగా వుండాలని పడే తాపత్రయం గురించి చెప్తూ

"ఎన్ని ఉపోషాలున్నా తగ్గదు బరువు
ఎన్ని ఉద్దేశాలున్నా దక్కదు పరువు
ఎంత కడుపు కట్టుకొన్నా అంతే లావు
ఇంటాయనకు మాత్రం చచ్చినచావు"

అని నిట్టూరుస్తాడు ఇంటి ఆసామీ.

ఇలా సాగిపోయే యీ హాస్యకవితలు, అంత్యప్రాసలకే పరిమితం కాదు. వీటిని పజ్యాలు అని అనడంలో ఒక ప్రత్యేకత వుంది.

పద్యం ఛందోధర్మాలు పాటిస్తుంది. కాని వీటికి ఛందస్సు లేదు. వచనం మాత్రమే వుంది. అయితే ఇది అచ్చమైన వచనపద్యం లేదా, వచన కవిత కాదు. ఇది 'పద్యం – వచనం' మేలు కలయిక. యీ వైవిధ్యం ప్రత్యేకంగా తెలియాలనే వీటిని పజ్యాల అన్నారు.

వీటిలో వస్తువు అతి సామాన్యం. అందరికీ అనుభవైకవేద్యం. అయితే యీ చిన్ని చిన్ని విషయాలు ప్రత్యేకంగా ఎవరూ – సమస్యలు అనుకోరు. ఆరుద్రగారు ఇది రాసి వీటిని అందరికీ జ్ఞాపకానికి తెచ్చారు. కాలంతో పనిలేకుండా యీ పజ్యాలు నిత్య నూతనంగా వుంటాయి. సగటుమనిషి తన జీవితంలోకి తాను తొంగిచూసుకుంటున్నట్టుగా వుంటాయి. ఎప్పటికప్పుడే – కొత్తగా ధ్వనిస్తూ పాఠకులను అలరించి – కాలాన్ని గెలిచి ప్రాచుర్యంలో నిలచాయి – అంటే అతిశయోక్తి కాదు.

* * *

ఆరుద్ర కవితా సంపుటాలు చాలా వచ్చాయి. ఇంటింటి పద్యాలు, పైలాపచ్చీసు ఏటికేదాది, ఆరుద్ర కవితలు, అరబ్బీ మురబ్బాలు, హస్తలక్షణపదాలు, అమెరికా ఇంటింటి పద్యాలు... మొదలైన సంపుటాలు వచ్చాయి. దక్షిణవేదం పేరిట – తిరుక్కురల్ అనువాదం, వెన్నెల–వేసవి పేరిట కళింగత్తుపరణి, హోచిమిన్ కవితానువాదాలు, జైలుగీతాలు వచ్చాయి. వీటిలో వేటి ప్రత్యేకత వాటికి వుండడం గొప్ప విశేషం.

పైలాపచ్చీసు అడపాదడపా రాసిన కొన్ని కవితల సంకలనం. ఈ కవితలలో వస్తువులలోనూ, భాషలలోనూ, అభివ్యక్తిలోనూ ఆరుద్ర సాహిత్యదృక్పథం కనబడుతుంది.

విజయనగగంలో ఆరుద్ర అనుబంధం ఒక్క చాసోగారితో, రోణంకి వారితోనే కాదు. అక్కడి ఉత్సవాలతో విశేషాలతో కూడా ముడిపడి వుంది. ప్రతిఏటా అక్కడ జరిగే 'పీర్ల పండుగ' గురించి

"ఈ దేశంలో
మా హిందూ ముస్లిం
గుండెలు రెండూ
ఒకటేనంటూ
తొక్కు తొక్కు
గుండం తొక్కు"

మత సామరస్యం, భారతీయ లౌకిక దృక్పథానికి - అద్దం పట్టేలా రాశారు.

ఆగస్టు పదిహేను - పండగ కాదు.

'గూనినడ్డితో ఎగిరే జండా
నింపింది నిరాశ దేశం నిండా'

అని బాధపడి

'మన స్వాతంత్ర్యం మేడిపండు
మన దరిద్రం రాచపుండు'

అని తరగని దారిద్ర్యం, వీడని పీడలు మనకి శాశ్వతంగా వుండేలా వున్నాయి అని బాధను ప్రకటించారు.

ఎంత అధునాతన కవో ఆరుద్ర అంతగానూ ప్రాచీనకవుల సంప్రదాయాలను గౌరవించే సంస్కారం కలవారు. అందుకే 'గ్రంథ క్రిమి స్వగతం' రాస్తూ

"ఏమన్నా సరేసరి
వేమన్నను తిందామంటే
తొలి మూడు పాదాలు తిన్నా
నాలుగోది నాకసాధ్యం"

అని వాపోతుందా క్రిమి.

తరాలు పెరుగుతున్నకొద్దీ - వందల కవులు పుట్టుకొస్తారు - కాని మందలో మిగిలేవారే ఒక్కరో అన్న సత్యాన్ని చెప్తారు ఆరుద్ర.

'ఏడికేడాది'లో ఆరుద్ర బాధ రాష్ట్రం ముక్కలు అవుతోందన్నదే. ఎండమావుల్లాంటి దొరకని వాటికోసం కలహించడంలో అర్థంలేదని నినదించారు.

ఉగాది నాడు తెలుగుతల్లి
దిగాలుపడి కూర్చొంది
. . . .
నీచేత్తో చూస్తూ చూస్తూ
నీకన్ను పొడుచుకోకు

అంటూ చాలా గట్టిగా హెచ్చరిక ధ్వనించారు. ఈ సంకలనంలో యీ కవిత - చాలా ముఖ్యమైనదే కాదు. నిలిచేది కూడా.

ఆరుద్ర కవితాసంకలనం ఒకటి 1985లో వెలువడింది. ఇది చాలా విపులమైన సంకలనం. ఈ ఖండికలు అప్పుడప్పుడు వివిధ పత్రికలలో ప్రచురింపబడినవి. దీనిలో క్రమంగా ఆరుద్ర కవితా ప్రస్థానం మనం అంచనా వేయవచ్చును. శ్రీశ్రీలో అతి ప్రగాఢమైన మైత్రీ బంధుత్వం ఉన్న ఆరుద్ర ఆయన ప్రభావంలోంచి బయటపడి ఎలా విస్తరించి విహరించినదీ మనం చూడవచ్చు.

"విదూషకునిగా మారిన అభ్యుదయ ప్రవక్తా
విప్లవయ్యా నీ చమత్కారాల చమ్కీ కోటు" అంటూ శ్రీశ్రీని ధర్మాగ్రహంతో హెచ్చరించారు.

"ఇంతలో ఇంత వివేకభ్రష్ట సంపాతం ఎందుకు" అంటూ నిలదీశారు.

"ఉద్యమ నాయకా నిన్ను నువ్వు తిరగేసి తొడుక్కో" అని చెప్పారు.

ఉగాది కవి సమ్మేళనాలకి కవిత రాసినా ఆరుద్రకు దేశంలో పరిస్థితులు ఎంత నిరాశాజనకంగా వున్నాయో కన్పిస్తాయిగాని కోకిలా, మావిచిగురు, వేపపూతా కనబడదు. నిద్రపుచ్చడం కవిత్వం చేయవలసిన పనికాదని గాఢంగా నమ్మేకవి ఆరుద్ర.

* * *

ఆరుద్ర కవితల్లో తొలిరోజులనాటి జటిలమైన ప్రతీకలు పోనుపోను సరళతరం అయ్యాయి. ఆలోచనల సాంద్రత పెరిగినట్టుగా మనం గుర్తించవచ్చును.

ఆరుద్ర అసంపూర్ణ రచన స్త్రీ పురాణం. ఇది ఆయన రచనలలో ప్రత్యేక స్థానం వహించగల చేవగల రచన. కొన్నియుగాలు వెనక్కి వెళ్లి అనాదిగా స్త్రీ జీవితం, ఆలోచనలు పరిశీలించి వాటి క్రమాన్నీ వికాసాన్నీ యీ సుదీర్ఘ కవితలో విశ్లేషించారు.

'అణచని నా ఆడగొంతు
వినడం ఇక నీ వంతు'

అంటూ సమాజంలో తెరమరుగైపోయిన స్త్రీ స్థానం, స్త్రీ త్యాగం స్త్రీ భాగస్వామ్యం - పునరుద్ధరింపబడాలంటే గతం నెమరువేసుకోకతప్పదు. అదే యీ దీర్ఘ కవితలో ఆరుద్ర తలపెట్టారు. అవ్వ -ఆదాములు, యమ యమీలను కొత్తకోణంలోంచి చూపించారు. పాతివ్రత్యం - పరీక్షలు, దానికోసం పురుషజాతి విధించిన ఆంక్షలు, స్త్రీలు భరించిన కష్టాలు, పడిన మానసిక సంఘర్షణ - అంతా కవిత్వీకరించారు. సతీ అనసూయ పాతివ్రత్య పరీక్ష పెట్టిన ముమ్మూర్తులని చూసి, వారి కోరికలని విని

"పక్క పడుకున్న వరుణ్ణి
వరునిగా భావించగల నేను
అసాధ్యపు అథితుల్ని
పసిపిల్లలుగా పరిగణించలేనా"

అనుకుని నవ్వుకుందంటారు - ఆరుద్ర. మనిషి - ఆడమనిషి అనే యీ స్త్రీ పురాణ కవిత అసంపూర్ణంగా వుండిపోవడం దురదృష్టం. అయినంతవరకైనా గ్రంథరూపంలో తేవలసిన అవసరం వుంది.

ఆరుద్రలో చాలా గొప్ప భావుకుడు - వున్నాడు. 'అరబ్బీ మురబ్బాలు'. యీ భావుకతకి - అద్దం పడతాయనడం - అతిశయోక్తికాదు. విరహ కవిత్వాన్ని ఉర్దూ పారశీక అరబ్బీ భాషలు పతాకస్థాయికి చేర్చాయి అనడం అతిశయోక్తి కానేకాదు. స్త్రీ పురుషుల ఆకర్షణకు సంబంధించిన పరస్పర ఆకర్షణలు గుబులు పుట్టిస్తాయి. విరహవేదనని హెచ్చిస్తాయి. ప్రేయసి ప్రాణాంతకంగా

ప్రవర్తిస్తుంది - అనిపిస్తుంది. ఈ ఊహలని ఆరుద్ర చక్కగా క్లుప్తంగా మాత్రా ఛందస్సులో పొదిగారు ఇవన్నీ మణిమాణిక్యాలే.

తేలు కొండెల్లాంటి ముంగురులురా
తెరచి చూస్తే చాలు కుడతాయిరా
సోగకన్నులు చూడ నీలాలురా
సొగసుకత్తెల ఎదల నిప్పెట్టురా.

* * *

వస్తే రానీరా
వలపువల్ల బాధలు
తలచుకోవచ్చు తరువాత
తరి తీపి గాథలు

* * *

ఇలలో నువ్వు గాలించేది
ఇంట్లోనే ఉంటుంది
కలలో నువ్వు ఆశించేది
కష్టపడితే వస్తుంది.

ఇలా ఉదహరిస్తూ పోతే గ్రంథం - అంతా చెప్పాల్సిందే మరి.

* * *

కవితా ప్రయోగాలు చేస్తూ వుండడం ఆరుద్ర సరదా. అలా శుద్ధ మధ్యాక్కరలు రాయడం చేబట్టారు. కవిసామ్రాట్ విశ్వనాథ వారి మధ్యాక్కరలు ప్రేరణ. కాని నన్నయ్యకాలం నుంచి కన్పించినా యీ మధ్యాక్కర పాడడానికి వీలైన ఛందం అని, విశ్వనాథవారి మధ్యాక్కరలు - ఛందోబద్ధంగా సాగాయేగాని దాని గేయలక్షణం మృగ్యమైందని ఆరుద్ర అభిప్రాయపడ్డారు. అందుకే - వీటిని ప్రారంభించారు. ఇవి కూడా మంచి ప్రాచుర్యం పొందాయి. ఆధునిక పోకడలతో ఆధునిక సమస్యలను వీటిలో పొందుపరిచి - ఆరుద్ర వీటి విలువ పెంచారనే చెప్పాలి. ఉదాహరణకి

"కన్యకల పరిణయ సమస్య
    కారునల్లని అమావాస్య
మాన్యాలపై అప్పు తెచ్చి
    మ్యారేజి చేయడం పిచ్చి
అన్యాయమీ శుల్కమనుచు
    అడగడం తెగపాపమనుచు
అన్యులకు తాను బోధించి
    ఆశించుకట్నాల సంచి'

అంటూ యీనాటి ఆడపిల్లల తండ్రుల పోకడలు వివరిస్తారు. ఇలాగే ఎన్నో విషయాలనీ మధ్యాక్కరలు - అందించాయి.

* * *

ఆరుద్రకి సాహిత్యంలోనేకాక ఇతర కళలలో ఉన్న కుతూహలానికి ఫలితమే హస్తలక్షణ పదాలు. ఇవి ముఖ్యంగా ప్రముఖ నర్తకి, పరిశోధకురాలు కుమారి పద్మా సుబ్రహ్మణ్యం కోసం రచించారు. ఇవి చాలా విలక్షణమైనవి. అభినయదర్పణంలో భరతుడు సూచించిన ముద్రలకు - యీ పదాలు రాయడం జరిగింది. ఏకముద్ర పదాలుగా యివి చాలా విభిన్నమైనవే కాదు. చాలా విలక్షణమైనవి. ఒక్కొక్క పదంలో నర్తకి ఒకే హస్తముద్రను వినియోగించేలాగా విరచించడం జరిగింది. ఈ పదాలకు 'బాలగోపాల ముద్ర' నిర్ణయించడం జరిగింది. ఈ పదాల రాగనిర్ణయం నాట్యరూప నిర్ణయం పద్మాసుబ్రహ్మణ్యం చేశారు. వీటిలో కొన్నింటిని ఆమె స్వయంగా ఒక నాట్యకళా సమావేశంలో లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్ చేసి చూపింది. ఆయా హస్తముద్రలకి పదాలకీ - పద్మప్రాణం పోస్తే, మాధుర్యాన్ని నింపారు పదంలో ఆరుద్ర. యీ పదాలు జయదేవుని అష్టపదులకు సరితూగేలా వున్నాయని నాట్య విమర్శకులు అభిప్రాయపడ్డారు. 'పదాలు రాసినవారు చాలామంది ఉన్నారు. కాని ఒక్క ముద్రలో ఇంతటి శృంగారరసాన్ని నింపి నాట్యాన్ని ఏకముద్రకు పరిమితం చేసినవారు లేనేలేర'ని పద్మాసుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు.

* * *

అమెరికా పర్యటించి అక్కడివారి అలవాట్లు ఆచారాలు, సరదాలు, భాషవాడుక, ఎన్నెన్నో చిన్న చిన్న విషయాలు సహితం కవితాదృష్టితో చూసి ఆరుద్ర అమెరికా ఇంటింటి పజ్యాలు రాశారు - విదేశీయత, అమెరికా తెలుగువారి జీవితాలని విభిన్న అంశాలని వివిధ కోణాలలో పరిశీలించడం కనబడుతుంది. భాష ఉపయోగించే తీరులో అర్థాలు ఎలా మారుతాయో - గమనిస్తే ఫన్నీగా వుంటుంది.

ఆడవారి మాటలకు అర్థాలే వేరు
అన్నారు పూర్వం ఒక సినిమా కవిగారు
అమెరికాలో తెలుగువారి కొన్ని మాటలకు
ఆరా తీయడం ఎంత మాత్రం కాదు వ్యర్థం
అన్నాడు వేల్చేరు నారాయణరావు 'మళ్లీ మిమ్మల్ని పిలుస్తాను'
అంటే అర్థం ఇంకోసారి మీకు ఫోను చేస్తాను

. . .   .

"ఫ్రెండ్స్‌ని విజిట్ చెయ్యడం'
    అంటే చుట్టపుచూపుగా వెళ్లడం
ప్రయాణంలో ఎగ్జిట్ తీసుకొనడం
    అంటే దారి మళ్లడం

. . .   .

విదేశాల్లో స్థిరపడ్డవారి భాష
స్వదేశీయులు వింటున్నప్పుడు తమాషా!

* * *

తిరుక్కురల్‌ని ఆరుద్ర దక్షిణవేదం పేరిట తెలుగులో రాశారు. తమిళంలో ప్రావీణ్యం ఉన్న ఆరుద్ర తమిళ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. తమిళంలో తిరుక్కురళ్ అపార ప్రాచుర్యం కలది. జీవిత సూత్రాలను చిన్న అనుష్టుప్ శ్లోకాలలాగా - ఇది చెప్తుంది. పిట్ట కొంచెం కూత ఘనం. హేమాహేమీలు సహితం కురల్ చర్చలు జరిపి ఇంకా ఇంకా కొత్త అర్థ నిర్ణయాలు చేయాలని చూస్తుంటారు. మాట విరుపులో అర్థం మారిపోయే కురళ్‌లని అనువదించడం కత్తిమీద

సాములాంటిది. దీనిని చక్కని శైలిలో విసుగుపుట్టించని భాషలో అనువదించి తెలుగు, తమిళ పాఠకుల ప్రశంసలు అందుకున్నారు.

"శాశ్వతమ్ముగాని సకలమ్ము తిరమని
ఎంచువాని బుద్ధి కొంచమనుము'

'ఉన్ననాడు తాను సన్యాసి కావలె
వీడ సుఖములెన్నొ కూడగలవు'

'కాకి తిండి దొరుక మూక నెల్లను పిలుచు
అట్టి గుణము వలన అబ్బు సిరులు'

ఇంత సూటైన భాషలో యీ కురల్ అనువాదంగా తోచనే తోచదు.

* * *

తమిళ పరణి కావ్యాలలో - అతి ముఖ్యమైనది - కళింగత్తు పరణి. ఇది కవి జయంగొండాన్ రచన. రణరంగంలో వేయి ఏనుగులను జయించినవాని వీరగాథనే పరణి కావ్యం అంటారు. దీన్ని ఆరుద్ర 'వెన్నెల-వేసవి' అని అనువదించారు. ముఖ్యంగా 'కడైతిరప్పు', 'కాదు పాడియదు' ఆశ్వాసాలు 'వెన్నెల-వేసవి'గా మారాయి. తలుపు తీయడం వెన్నెల. యుద్ధభూమి వర్ణన వేసవి.

యుద్ధవీరులు తిరిగి వచ్చి తమ ప్రియురాళ్లను తలుపు తీయమని అడగడం - ఒక సంప్రదాయం. ప్రబంధ శృంగారాన్ని మించిన శృంగారం ఒలకపోసే యీ వెన్నెల కొన్నిచోట్ల మూలానికే మెరుగు దిద్దిందన్న అభిప్రాయం కొందరు విమర్శకులకు కలగడంలో ఆశ్చర్యం లేదు.

"కచభరము విచలించ కుచయుగము పచరించ
కనక మేఖలతోడ కటితాను నటియించ
ఘన భూషణావళి ఘల్లుఘల్లున మ్రోయ
కలహంస నడకతో తలుపు తీయండి."

తమిళ కావ్యంలోని అందాలనూ, భాషాసౌందర్యాన్ని కూడా ఆరుద్ర చక్కగా పట్టుకున్నారని తమిళ మిత్రులు పలువురు ప్రశంసించారు.

* * *

'జైలుగీతాలు' అని ఆంగ్లంనుండి హోచిమిన్ కవితలను తెనిగించారు ఆరుద్ర. ఒక ప్రజారచయిత జైల్లో వున్నప్పుడు 'కావ్యగానం అలవాటు తప్పదుకదా - అంచేత కవితలు అల్లుతూ గడిపేస్తాననీ చెరబ్రతుకు' అని హోచిమిన్ రాసుకున్నారు. ఈ జైలుగీతాలు అనువాదంలో అర్థం మారిపోకుండా కొంచెం స్వేచ్ఛను స్వీకరిస్తూ అనువదించడం వల్ల - స్వతంత్ర గీతాలేమో అన్నంతగా రాణించాయి. ఏ భాషనుంచి అనువదించినా, ఆరుద్రకు భాషమీదవున్న పట్టువల్ల, అవి తెలుగు కవిత్వమే అనిపిస్తాయి.

* * *

ఆరుద్రకు నాటకరచన కూడా అభిమానపాత్రమే. ఎన్నో నాటికలు, దృశ్య, శ్రవ్య నాటకాలూ రచించారు. రేడియో నాటికల సంపుటి 'సాలభంజిక'. దీనితోపాటు దీర్ఘరాత్రం, తదేవగృహం - లాంటివి ఉన్నాయి. ఇవన్నీ కూడా వేయితగ్గవే. చిన్న చిన్న మార్పులు చేస్తే ఆధునిక నాటక రంగంలో ప్రయోగాత్మక పద్ధతుల్లో ప్రయత్నించ తగ్గవి.

వేయతగ్గ నాటికలూ ఆరుద్ర రచించారు. వాటిలో చాలా ముఖ్యమైనవి ప్రయోగాత్మకమైనదీ - "దేవుని ఎదుట" అనే నాటిక. 'రాదారి బంగళా' అనేది ఇంకొకటి.

వీటి అన్నిటికీ తలమానికం అనదగినది 'కాటమరాజు కథ' చారిత్రక నాటకం.

ఖడ్గతిక్కన - కవి తిక్కన ఒకరేనా అన్న ప్రశ్న - తీగలాగితే డొంకంతా కదిలినట్టు - యీ కథాసృష్టికి దారితీసింది.

ప్రదర్శనకు తగిన యీ నాటకం విజయనగరం ప్రాంతాలలో నటుడు జె.వి.రమణమూర్తి ప్రదర్శనలు యిచ్చారు కూడా. 'ఏ యుద్ధమైనా దాని ఫలితం సర్వనాశనమే' అన్న అక్షరసత్యాన్ని యీ నాటకంలో ఆరుద్ర నిరూపించారు. "ఏ యుద్ధంలో గెలిచినవాడైనా ఆ మరుక్షణంనుంచి ఓటమికి బాట వేసుకుంటాడు. ధర్మానికే ఎప్పుడూ అంతిమ విజయం" అన్నది చెప్పడం జరిగింది. కాటమరాజు కథ నాటకంలో, పాటలు, పద్యాలు పద్యనాటకాలని జ్ఞాపకానికి తెస్తాయి.

* * *

'శ్రీకృష్ణదేవరాయ' కూడ ఒక అద్భుతమైన ప్రయోగం. రూపవాణి (Sound and Light) పద్ధతి. ఈ నాటకం విభిన్న పద్ధతులలో వివిధ విషయాలలో ప్రత్యేకత వహిస్తుందని - పెద్దల అభిప్రాయం. 'ఇది రంగస్థలంమీద నడచిన చలనచిత్రం'గా వర్ణించారు.

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో వరుసగా చాలారోజులు ప్రదర్శింపబడిన ఈ రూపవాణి నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. దానిలోని పాటలు పద్యాలు వీనులవిందు చేశాయని అభిప్రాయపడ్డారు. పద్మభూషణ్ బాలమురళీకృష్ణ, ఘంటసాలలు గానం చేశారు.

* * *

ఆరుద్రకు ప్రాచీన కళలన్నా ప్రయోగాలు చేయాలన్నా చాలా యిష్టం. మన తోలుబొమ్మలాటను తీసుకుని 'గాంధీజీ చరిత్ర, హరిజనోద్యమం' అనే తోలుబొమ్మలాటను రచించి ప్రదర్శించారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఘంటసాల స్వరపరచి గానం చేసారు. దీనిని రికార్డు రూపంలో అందించారు. తోలుబొమ్మలాడించే వృత్తి కళాకారులు ప్రభుత్వ సమాచారశాఖ సహకారంతో ఆంధ్రలో సుమారు వేయి ప్రదర్శనల దాకా యిచ్చారు.

నృత్య రూపకాలు కూడా రచించారు ఆరుద్ర - శకుంతల, పాంచాలీ శపథం, శ్రీ వెంకటేశ్వర విలాసంవంటి నాట్య ప్రబంధాలు పలువురు కళాకారులకోసం రాశారు. వీటిని కూడా ఆయా కళాకారిణులు పలు ప్రదర్శనలు యిచ్చారుకూడా. రాణీ రుద్రమ అనే కూచిపూడి యక్షగానాన్ని అరుణాభిక్షు కోసం రాశారు. గాని దీని వ్రాతప్రతి పోయింది.

* * *

కథా సాహిత్యం కూడా సృష్టించారు ఆరుద్ర. 'మచ్చు బియ్యం' వంటి చక్కని కథలు ప్రచురింపబడ్డవే. 'వూరుకూరుకుంది'. 'నేను చెప్పానుగా' కథా సంపుటులు వెలువడ్డాయి. డిటెక్టివ్ నవలలు, కథలు చాలా రాశారు. ఇనస్పెక్టర్ వేణు - ఆరుద్ర సృష్టి. ఆరోజుల్లో బహుళ ప్రచారం పొందింది. ఆరుద్ర రాసిన 'పలకల వెండిగ్లాసు' అనేక ముద్రణలు పొందింది.

ఇవన్నీ ఆరుద్ర సరదాకో, స్నేహితుల పత్రికలకోసమో రాసినా - వాటిని తాను సీరియస్ సాహిత్యంగా భావించలేదు. కానీ సీరియస్‌గానే రాయడం గమనించతగ్గ విషయం. ఏవిషయం

చేపట్టినా - దానిని ఆషామాషీగా చేపట్టడం ఆరుద్రకు తెలియదు. అందుకే - సరదాకి రాసిన యీ సాహిత్యం కూడా చాలా ప్రచారం పొందింది. దాన్లో వింతలేదు.

* * *

ఆరుద్ర ఏవిషయం చేపట్టినా దాన్ని కూలంకషంగా పరిశీలించడం, దానిలో నిష్ణాతుడై రాణించడం మనం గమనించవచ్చు.

సరదాగా నేర్చుకోవడం మొదలుపెట్టిన మేజిక్‌లో మాస్టరీ సాధించారు. ఇంద్రజాలికుడు పి.సి.సర్కార్‌చే మన్నన పొందడమే కాదు మాజిక్ సర్కిల్ వారి బులెటిన్ సంపాదక వర్గ సభ్యులయ్యారు.

చదరంగం అభిమాన క్రీడ. దానిని మెదడుకు మేతగా సరదాగా ఆడడమే కాదు. చదరంగం మీద చిన్న గ్రంథం రాశారు. దానిని - తనకు చిరకాలమిత్రుడైన - ఇంటర్‌నేషనల్ మాస్టర్ బిరుదు ఎనిమిదిసార్లు పొందిన మాన్యుయల్ ఆరన్‌కి అంకితం చేశారు. ఇది చాలా ముద్రణలు చూసింది. చెస్ అసోసియేషన్ అధ్యక్షునిగా కార్యకలాపాలు విస్తరింపచేశారు. క్రీడల ప్రోత్సాహం, క్రీడాకారులపై అభిమానం ఆరుద్రగారిని యీనాటి గ్రాండ్ మాస్టర్ ఆనంద్‌ని ప్రోత్సహించేలా చేశాయి.

పేకాట వేరు. బ్రిడ్జి వేరు. ఇది బుద్ధిబలానికి - దారి, పరాకాష్ఠ అంటారు. మద్రాసు డిస్ట్రిక్ట్ బ్రిడ్జి అసోసియేషన్‌కు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. బ్రిడ్జి ఆడేవారికి ప్రశాంతంగా వుండడం లేదని ప్రముఖ చలనచిత్ర దర్శకులు కె.ఎస్.ప్రకాశరావుగారితో కలిసి - టి.నగర్ సోషల్‌క్లబ్బులో బ్రిడ్జి ఆటగాళ్లకోసం ప్రత్యేక హాలు ఏర్పాటు చేశారు.

టి.నగర్ హెన్స్‌మన్ పార్క్‌లో నడిచేవారి సౌకర్యార్థం - పాదదారికి పాటుపడ్డారు. రోజూ ఎక్కడ వున్నా, ఉదయం పూట నడవడం అన్నది తప్పనిసరి పరిశ్రమగా వుండేది ఆరుద్రగారికి.

బహుముఖంగా విస్తరించిన ఆరుద్ర ఈ వ్యాపకాల మధ్యనే సాహిత్య వ్యవసాయం సాగించడం జరిగింది. సాహిత్యసృష్టితోపాటు - అనేక సాహిత్య విమర్శనా గ్రంథరచన కూడా సాగించారు ఆరుద్ర.

పరిశోధనలో ఉన్న ఉత్సాహం కొద్దీ ఆరుద్ర 'రాముడికి సీత ఏమౌతుంది?' అన్న వ్యాస పరంపర రాయడం జరిగింది. దీన్ని తెగిడినవారూ ఎక్కువే. ప్రశంసించినవారు అత్యధికులే... కాలక్రమంలో - ఇది సరైన పరిశీలనే కాని - ఏదో ఛాందసులను తెగనాడడానికి పనికట్టుకు రాసినది కాదని ఒప్పుకున్నారు. ఈ సంకలనం తెలుగులోనే కాదు కన్నడం, హిందీలలో కూడా పలుముద్రణలకి నోచుకుంది.

ఇలాగే గుడిలో సెక్సు వ్యాసాలుకూడా హిందూ మత ఛాందసులు కోపానికి తొలుత గురి అయినా - వాటి ఆంతర్యాన్ని ఒప్పుకోక తప్పలేదు. ఇదికూడ పలుముద్రణలు చూసింది.

ప్రజాకవి వేమన ఆరుద్రకు చాలా యిష్టుడు. ఈ కవిమీద ఆరుద్ర వ్యాఖ్యానంతో - వ్యాసాలు రాశారు. 'మన వేమన' ను విశ్లేషిస్తూ ముఖ్యంగా వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలు యిచ్చారు. ఇవి పరిశోధనా విద్యార్థులను, సామాన్య పాఠకులను, ఎంతో కుతూహలాన్ని రేకెత్తిస్తాయి. 'వేమన వేదం' అనీ 'మన వేమన' అనీ యివి గ్రంథరూపంలో వచ్చాయి.

వ్యాసపీఠం అనే శీర్షికను ఒక దినపత్రికలో రాస్తూ - అవి కూడా ఒక పరిశోధనా వ్యాసాల కింద రాశారు. ఇవి వారం వారం పాఠకుల కుతూహలాన్ని, కోపాన్నీ కూడా రేకెత్తించాయి. చదవకుండా వుండడం కంటే, ఏవిధమైన స్పందన కల్గించినా - ఆ రచన ప్రయోజనం సాధించినట్లే కదా!

గురజాడపట్ల అపరిమిత ఆరాధనకల ఆరుద్ర వారి కన్యాశుల్కం ఎన్నిసార్లు అధ్యయనం చేశారో చెప్పలేం. దరిదాపు దానిలోని సంభాషణలు వారికి కంఠస్థం. భాషతో తిక్కనతోనూ, భావాలతో వేమనతోనూ గురజాడ ఎంత సన్నిహితంగా కన్పిస్తారో అద్భుతంగా ఆవిష్కరిస్తూ వ్యాసాలు రాశారు. కుమరన్ ఆసన్‌వంటి మళయాళ కవి వంటి జాతీయకవులకన్న మిన్న గురజాడ అని భావించారు. యీ గురజాడ గురుపీఠం అనే సంకలనానికి కేంద్రసాహిత్య అకాడమీ వారి బహుమతి లభించింది.

కళలమీద మక్కువ ఎక్కువైన ఆరుద్ర పలు శాఖల నాట్య విశేషాలని – 'ప్రజాకళలూ ప్రగతి వాదులూ' వ్యాస సంకలనంలో విస్తారంగా చర్చించారు.

మహనీయులనే వ్యాస సంపుటిని కూడా ఆరుద్ర ప్రచురించారు. ఇవి మామూలు వ్యాసాలు కావు. కలం చిత్రాలు. జీవిత చరిత్రలకంటే కలం చిత్రాలు భిన్నమైనవి. ఒక వ్యక్తి సంపూర్ణ జీవితాన్ని జీవిత చరిత్ర ఆవిష్కరిస్తుంది. ఒక వ్యక్తి జీవితంలో ప్రత్యేకంగా గోచరించే వైచిత్రిని కలం చిత్రం చిత్రిస్తుంది. తనకు ఆప్తులుగా కన్పించిన ఫిడేలు నాయుడుగారు, వజ్ఝలవారు, శ్రీశ్రీ, నారాయణబాబు, వేలూరి శివరామశాస్త్రి, బాలాంత్రపు వెంకటరావు, మల్లాది మొదలైనవారి మూర్తిమత్వాన్ని ఆరుద్ర ఈ సంపుటంలో కలంచిత్రాల రూపంలో ప్రదర్శించారు. వ్యక్తులనేకాక, సరస్వతీమహల్ గ్రంథాలయానికి కూడా ప్రాణశక్తిని కల్పించి కలంచిత్రంగా చిత్రించడం ఆరుద్రలోని ప్రత్యేకత. ఇతర రచనలు విజ్ఞానాన్ని అందించవచ్చునేమోగాని కలం చిత్రాలు పాఠకులకు జీవించడాన్ని కూడా నేర్పుతాయి. అందుకే మహనీయుల సంపుటంలోని కలం చిత్రాలు సజీవంగా ఉండటమేకాక అసంఖ్యాక పాఠకుల మన్ననలకు కూడా విశేషంగా నోచుకున్నాయి.

* * *

ఆరుద్ర సినిమా రంగంలో దశాబ్దాలపాటు మమేకమై జీవించారు. సామాన్య అంచనా మేరకు వారు రచించిన సినిమా పాటలు నాల్గువేల ఐదువందలకు పైగాన వుంటాయి. పాటలే కాకుండా కథ మాటలు కూడా రాసిన సినిమాల సంఖ్య కూడా తక్కువేం కాదు. ఏభయి సంవత్సరాలపాటు యీ రంగంలో నిలచి తనదైన ముద్రవేసిన కవి ఆరుద్ర. ఎన్నో, ఎన్నెన్నో మధురగీతాలు రచించారు. వారి సినీగీతాలు యీమధ్యకాలంలో ఐదుసంపుటాలుగా వెలువడ్డాయి. ఇవి వారు రచించిన వాటిలో మూడోవంతు. అంతే. పురాణకథలకు తెరరూపం తెచ్చి, అద్భుతమైన విజయం సాధించకల్గిన రచయిత ఆరుద్ర. బాలభారతం, యశోదకృష్ణ మొదలైనవి వారి పురాణ విజ్ఞానానికి మచ్చుతునకలనడం అతిశయోక్తి కాదు.

ఆరుద్ర సరదాగా సినిమా ముచ్చట్లు, పాట వెనుక భాగోతం, సినీ మినీ కబుర్లు – రాసినా – వారి దృష్టి వేరే వుంది. అది తను తలపెట్టిన సాహిత్యచరిత్రను పూర్తి చేయాలన్నదే. అందుకే – తన షష్ఠి పూర్తినాడు 'ఇక సినిమా పాటలు రాయను. సాహిత్య చరిత్ర పూర్తి చేస్తాను' అని చెప్పారు. తరువాత చాలాకాలం రాయలేదు. కాని బాపువంటి మిత్రుల మాట కాదనలేక – కొన్ని రాయడం జరిగింది.

"ఎదగడానికెందురా తొందర" అని కుర్రాళ్లని హెచ్చరించినా, 'గాంధీ పుట్టిన దేశమా ఇది!' అని ప్రశ్నించినా 'రాయినయినా కాకపోతిని' – అని ఆడదాని వ్యథను కరుణరసమయంగా రచించినా 'ఏటిలోని కెరటాలు ఏరు విడిచిపోవు, ఎదలోపలి మమకారం ఎప్పటికీ పోదు' అని జ్ఞాపకం చేసినా – జనాళి గుండెలో గాయాలను సుస్థిరంగా నిలిపిన సినీ కవి ఆరుద్ర. ఏరకంపాటైనా – అదే – శ్రద్ధతో రాసే తత్వం – 'అది వృత్తి దానిపట్ల నిర్లక్ష్యం తప్పు' అనే నమ్మకం వుండడం వల్లే – ఆరుద్ర పాటలు డొల్లగా ధ్వనించవు.

ఇంతదాకా ఆరుద్ర సాహితీ విశ్వరూపం రేఖామాత్రంగా రాయడం జరిగింది. నిరంతర కృషీవలుడైన ఆరుద్ర ముఖంమీద చిరునవ్వు చెరగకుండా వుంటారు. అలసట కనబడదు. ఆయన వ్యక్తిగత గ్రంథాలయం - ఎవరూ విలువకట్టలేనిది. అంతటి సాహితీ భాండాగారం. ఎందరో పరిశోధక విద్యార్థులు యీ గ్రంథాలయంలోనే - తమ పరిశోధనలు సాగించి డిగ్రీలు పొందారు. నిఘంటువులు, అముద్రిత వ్యాకరణాలు, ఆంగ్ల సాహిత్య సర్వస్వాలు. ఒకటేమిటి? ఏ విషయంలోనైనా పరిశోధన జరుపుకుందుకు తగినంత వస్తువు యీ గ్రంథాలయంలో లభ్యమయ్యేది.

తొలినుంచీ గ్రంథసేకరణ ఆరుద్రకు అలవాటే. సాహిత్యచరిత్ర రాయాలని అనుకున్నది మొదలు - ప్రాచీన గ్రంథాలను శ్రద్ధగా సేకరించి - పెట్టుకోవడం జరిగింది. వ్యక్తిగత గ్రంథాలయం కలవారిలో నిత్యం ఉపయోగించిన గ్రంథాలయం ఇదే. తన, పర, బేధం లేకుండా ఎవరైనా వచ్చి ఇక్కడ తమపనిని సాగించేవారు. కొందరు గ్రంథప్రియులకులాగా - ఈ ఆరుద్ర గ్రంథాలయం - అలంకారప్రాయం కాదు. ఆరుద్రకూడా తన పుస్తకాలనుంచే కాదు - పబ్లిక్ లైబ్రరీలకు వెళ్లినా కూడా - తనకు కావలసిన పుస్తకంనుంచి - విద్యార్థికంటే ఎక్కువగా - కూర్చొని నోట్సులు రాసుకోవడం అలవాటు. తన రాబడిలో అధికభాగం యీ గ్రంథాలసేకరణకే ఖర్చు చేసేవారు.

తను చేయదల్చుకున్న పని ముగియగానే తన గ్రంథాలయాన్ని అందరికీ - అందుబాటులోకి వచ్చేలాగా యిచ్చేయాలన్న నిర్ణయానికి ఆయన ఎప్పుడో వచ్చారు. ఎందరో, పాశ్చాత్య విశ్వవిద్యాలయ ప్రముఖులు యీ గ్రంథాలయంలోని కొన్ని గ్రంథాలు తమకు కావాలని డాలరేట్లు యిస్తామన్నా 'అమ్మే ఉద్దేశం నాకు లేదు!' అని నిర్మొహమాటంగా చెప్పేసేవారు.

తన నిర్ణయం ప్రకారమే - ఆధునిక - అభ్యుదయయుగం రాతప్రతి పూర్తికాగానే ఆరుద్ర తన లైబ్రరీని హైదరాబాదులోని 'సుందరయ్య విజ్ఞాన కేంద్రాని"కి అప్పగించారు. వారు ఆరుద్ర విభాగంగా ఒకటి ఏర్పాటు చేస్తారని ఆయన దగ్గిరవారంతా ఎదురుచూశారు. కొన్నివేల పుస్తకాలు అపురూపం అయినవి అస్సలు లభ్యం కానివి అందచేసినందుకు యీ గౌరవం కల్గిస్తారని ఎదురుచూడడంలో తప్పులేదుకదా. కామ్రేడ్ సుందరయ్యగారిపై ఉన్న అపారమైన - అభిమానం గౌరవం, హనుమంతరావుగారిపై ఉన్న అభిమానం గౌరవంతోనే - ఆరుద్ర తిరిగి చూడకుండా, క్షణం ఆలస్యం చేయకుండా సుప్రసిద్ధమైన తన గ్రంథాలయాన్ని ధారాదత్తం చేయకల్గడం - నిజంగా గొప్ప విషయం. ఇప్పుడది హైదరాబాదులో పరిశోధకులకూ, జిజ్ఞాసువులకూ, విద్యార్థులకూ అందుబాటులో వుందని అంటారు.

* * *

ఆరుద్ర సాహిత్యం అంతా ఒక ఎత్తు. ఆయన పండిత పామర రంజకంగా రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం ఒక ఎత్తు. ఎన్నో సంవత్సరాల - కృషికి ఈ సాహిత్య సంపుటాలు అద్దం పట్టాయి.

ఆంధ్ర సాహిత్య చరిత్ర రచించే ప్రయత్నాలు చాలామంది చేశారు. కాని ఎవరూ పూర్తిచేయలేదని సాహితీపరులు అంటారు.

పండితులు - పండితులని మెప్పించి శెభాష్ అనిపించుకునేలాగా రాయడం ఒక పద్ధతి. సాహిత్య విభజన రాజుల - పేర్లతో విభజించడం ఒక పద్ధతి. ప్రక్రియాపరంగా రూపొందించడం - అదో పద్ధతి. ఏ పద్ధతిలో రాసినా సాహిత్యం సాహిత్యమే. కాని సమాజానికి దూరంగా, సామాన్య ప్రజలకి దూరంగా సాహిత్యం వుంటుందా? అసంభవం. ఏ భాష ఆదేశ ప్రజల సాంఘిక సాహిత్య

చరిత్రలలో పడుగుపేకల్లాగా సాగక తప్పదు. సజీవ సాహిత్య లక్షణం సజీవ ప్రజాజీవితాన్ని కూడా తనతో తీసుకువెళ్లడమే. ఈ పాయిలను విడదీసి చూడడం - సాహిత్యం మీద పాక్షిక దృష్టిని ప్రసరించడం అవుతుందేగాని చరిత్రకు న్యాయం కలుగదు. జరిగిన సంఘటనలో వైవిధ్యం వున్నా అవి ఒక చారిత్రక క్రమంలో వుండక తప్పదు. ఏదేశంలోనైనా ఏ భాషలోనైనా రాజకీయ ప్రభావాలకు లోనుకాని యుగం వుండదు. అందుకే సాహిత్య విభజన - కవుల పేర్లకంటే, ప్రక్రియల పేర్లకంటే - రాజుల పేర్ల యుగ విభజన చేయడం బాగుంటుందని భావించిన ఆరుద్ర తన సాహిత్య చరిత్రని - అలా విభజించారు. ఆరుద్ర యుగ విభజనతో ఏకీభవించని మేధావివర్గం ఆరుద్ర నిర్ణయాన్ని మార్చలేకపోయింది. "ఇది మామూలు చదువరి కోసం రచిస్తున్న సాహిత్య చరిత్ర. అందుకే ఇది వారికి సులభగ్రాహ్యమైనా, పద్ధతిలో, వాడుకభాషలోనే నాదైన ధోరణిలో రచించాలనే నిర్ణయించుకున్నాను" అని తరుచు ఆరుద్రగారు వివరిస్తూ వుండేవారు. ఆయన చెప్పినట్టుగానే కండకల వాడుక భాషలో రాయడంవల్ల చదువరిని పదేపదే చదివించింది - ఈ సాహిత్య చరిత్ర అనడం అతిశయోక్తి కానే కాదు.

ఆరుద్రగారు తన ప్రణాళిక ప్రకారం రాయడం ప్రారంభించాక - ప్రణాళిక, ప్రచురణకర్తలతో చేసుకున్న ఒప్పందం, వ్యక్తికి మించిన పని అయింది. అనారోగ్యం పట్టించుకోకుండా నెలకొక సంపుటిగా రచించారు. దీని తొలి ప్రచురణకర్తలు - ఎమ్.శేషాచలం అండ్ కో వారు. ఆంధ్ర సాహిత్యంలోని విస్తీర్ణతను పట్టి ఆయా రాజవంశాల ప్రాధాన్యతను పట్టి సంపుటాల నామకరణం చేయడం జరిగింది.

ఈ తొలిముద్రణ చాలా ప్రాచుర్యం సాధించింది. ఇదీ సాహిత్య రచనలో తొలిదశ. కొండ అద్దంలోకి ఇమిడిపోయినట్టు ఎన్నో గ్రంథాల సారాంశాన్ని కొద్ది పేజీలలో - చక్కని నుడికారంతో కూడిన తేటతెలుగులో రచించిన ఆరుద్రను అందరూ ప్రశంసించారు. పూర్తి చేయమంటూ అడుగుతూ వచ్చారు. సామాన్య చదువరి నుండి మహా పండితులదాకా - యీ చరిత్ర సంపుటాలను ఎంతో ఆసక్తితో చదివారు. చాలామంది మెచ్చుకున్నారు. కొందరు విమర్శించారు. లోపాలున్నాయన్నారు.

ఈనాడు రచించిన ఏ చరిత్ర అయినా రేపటికి పాతపడిపోతుంది కదా. పూర్తి చేయవలసినది చాలావుంది. ఆరుద్రగారు ఆపనికి - ఎన్నో యిబ్బందులను ఎదుర్కొంటూ పూనుకున్నారని అందరికీ తెలుసు.

తొలిముద్రణ, 12 సంపుటాలను ఎనిమిదిగా కుదించి - మిగిలిపోయిన చరిత్ర రచనను ఇంకొంచెం విస్తారంగా రాయడానికి పథకం వేసుకున్నారు. ఈవిధంగా యీ సాహిత్య చరిత్రకు కొత్తగా 5 సంపుటాలు - వచ్చి చేరాయి. యీ రెండవ ముద్రణ ఆధునిక అభ్యుదయ యుగంతో ముగించారు. కాలం గడుస్తున్నకొద్దీ కాలం చేస్తున్న సాహితీపరులను చేర్చుకుంటూ ఆఖరి సంపుటం రాయడం - జరిగింది. కాని ఎక్కడో అడ్డుకట్ట వేయక తప్పదు. (అప్పుడే కాలంచేసిన తుమ్మలను కూడా క్లుప్తంగా చేర్చారు.) ఈ కొత్త ముద్రణను ప్రజాశక్తి వారు ప్రచురించడం జరిగింది.

మొత్తం 13 సంపుటాలు వేల పేజీలు ఈ సాహిత్య చరిత్ర. సుమారు వేయిమంది సాహితీపరులు ఇందులో ఇమిడారు. ఎన్నెన్నో విషయాలు చదువరులకు పరిచయం అయ్యాయి.

ఈ రచన పూర్తి కావడంతో రచయితగా తన పని ముగిసిందనుకున్నారో ఏమో ఆరుద్ర తన జీవితయాత్రకు పరిసమాప్తి పలికారు. తన సాహిత్య చరిత్ర ఒక్క సాహితీవేత్తలకు, పరిశోధక విద్యార్థులకే కాదు సాహిత్యంతో సంబంధంలేని ఎందరికో కుతూహలాన్ని రేకెత్తిస్తున్నదని -

తెలుసుకునేలోగా కన్నుమూశారు. సాహిత్యంకోసమేకాక, ఇతర చారిత్రక విషయాలకోసం - యీ సంపుటాలు పరిశీలిస్తూ వున్నారని విన్నప్పుడు - వారి అభిమానులకు - గర్వంగా వుంటుంది.

నిజంగానే విమర్శకులు చాలామంది భావిస్తున్నట్టుగా ఆరుద్ర - ఇతర రచనలన్నీ ఒక ఎత్తు. ఈ సాహిత్య చరిత్ర ఒక ఎత్తు.

ఒక్క సాహిత్య రచన చేసి - సుఖ జీవనానికి నాంది పల్కలేకపోయారు ఆరుద్రగారు. మొదటి రెండు ప్రచురణలు ఆరుద్రకు ఆర్థికంగా ఏవిధంగానూ లాభించలేదన్నది - జగమెరిగిన సత్యం. వారుపోయాక - ఈ సంపుటాలకు ఏ ప్రచురణకర్తలూ న్యాయం చేయరని నమ్మి, వారి శ్రీమతి రామలక్ష్మి వాటి సర్వహక్కులను - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించారు.

ఇప్పుడు చెదురుమదురుగానే వున్నాయి తప్ప - యీ సంపుటాలు అన్నీ దొరకడం లేదు. తెలుగు అకాడమీ వారు వీటిని - చాలా చక్కగా ముద్రించి అందిస్తున్నారు. ఇవి విశిష్టంగా కన్పించే నాల్గు సంపుటాలు. వీటిలో ఆరుద్రగారు చేసిన దిద్దుబాట్లు చేయడం జరిగిందని ఆయన భార్య చెప్పారు.

ఏది ఏమైనా ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం మళ్లీ వెలుగులోకి రావడం సాహితీపరులకు సంతోషం కల్గించే విషయం.

* * *

ఆరుద్ర జీవిత కాలంలో ఆశించిన గౌరవాలు చాలా తక్కువే. ఆయన తనకై ఒక కూటం ఏర్పరుచుకొని ప్రోత్సహించుకోలేదన్నది అందరికీ తెలిసినదే. అందరితో స్నేహం, తనపని తాను చేసుకోవడం, చెప్పదలచుకున్నది చెప్పడం - అదే ఆయన పద్ధతి. అందుకే ఆయనకి అందిన పురస్కారాలన్నీ ఆయనని వెతుక్కుంటూ వచ్చినవే. ఎస్వి. యూనివర్సిటీవారి డి.లిట్. ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి కళాప్రపూర్ణ మొదలైనవేకాక ఇతరమైనవికూడా వచ్చాయి. ఆరుద్రగారిపై ఎమ్.ఫిల్. పి.హెచ్.డి.లు చేసిన విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులున్నారు. వారంతా ఆరుద్రపైనున్న అభిమానం గౌరవంతో, పరిశోధన చేపట్టినవారే. అంతేకాదు 1985లో ఆరుద్ర షష్టిపూర్తి కూడా చాలా విలక్షణంగా పెద్దఎత్తున ఆరుద్ర అభిమాన నగరం చెన్నయ్‌లో జరగడం విశేషం. ఆంధ్ర రాష్ట్రంలో పలు ప్రదేశాలలో అభిమానులు యీ ఉత్సవం జరుపుకున్నారు. 1994 వారి సప్తతి ప్రవేశదినాన్ని పురస్కరించుకొని ఆంధ్ర రాష్ట్రంలోని ఉభయ గోదావరి జిల్లాలలో ఎన్నోచోట్ల సాహిత్య ఉత్సవాలు జరిగాయి. ఒక కవికి యింత ఘనంగా యిలా ఉత్సవాలు జరగడం చాలా అరుదైన విషయం. ఇటీవల కాలంలో ఆరుద్ర ఒక్కరికే యీ గౌరవం దక్కింది. ఇది ఆయనని అభిమానించే వారు పూనుకొని చేసినది.

ఆరుద్ర తన సాహితీశేముషీ వైభవాన్ని, భారాన్ని తన భుజస్కంధాలపై అలవోకగా మోశారు. ఘనత చాటుకోలేదు. కువిమర్శనలకు కృంగిపోలేదు.

ఆస్పత్రి పడకపైనుండి, తీవ్రమైన అస్వస్థతలో వుండి, మరుక్షణం ఏం జరుగుతుందో చెప్పలేని స్థితిలో కూడ యీ కవి 'కెరాలక్ష్మి త్రిశతి'ని ఆశుగా చెప్పారంటే - వారి స్థితప్రజ్ఞతను మనం మెచ్చుకోవాలి. ఆటవెలదిలో నడిచిన యీ శతకంలో ఆరుద్ర తన జీవిత ప్రస్థానంలో ఎదురైన వందలాది కవి పండిత మిత్రులను బంధుకోటిని, సాహిత్యాన్ని, సంఘటనలనీ నెమరు వేస్తూ చెప్పినవి. తెలుగులో విశ్వనాథ తరువాత త్రిశతి రాసిన కవి ఆరుద్రగారొక్కరే. విశ్వనాథవారు వరలక్ష్మీ త్రిశతి రచించారు. ఇది వారి అర్ధాంగి భౌతికంగా దూరమయ్యాక చెప్పినది. ఆరుద్ర తను తన అర్ధాంగికి చెప్పినది. అదే ముఖ్యమైన తేడా.

శ్రమించి ఓడిన శరీరం, పరిశ్రమించి అలసిన మేధ... వారిని విశ్రమించమన్నట్టుగా - అలుపుసొలుపూ లేకుండా చివరికి జూన్ 4, 1998 ఉదయాన్నే శాశ్వతంగా కన్నుమూశారు. వారు కోరుకున్నట్టుగానే - ఏ తంతూ లేకుండా వారి సతీమణి వారికి దహనసంస్కారం విద్యుత్ శ్మశానవాటికలో జరిపారు.

ఆరుద్ర జీవితప్రస్థానం నిజంగా ఒక ఇతిహాసం. దర్శించేవారినిబట్టి, ఒక కవిగా చరిత్రకారునిగా, సాహిత్య చరిత్రకారునిగా సామాజికవేత్తగా మార్క్సిస్టు మేధావిగా విమర్శకునిగా నాట్య శాస్త్రవేత్తగా... అన్నిటినీ మించి - ప్రజాపక్షపాతిగా, సహృదయ మానవుడిగా కనబడడం జరుగుతుంది.

ఒక సామాన్యుడు అసామాన్యుడుగా ఒక ఇతిహాసంగా పరిణతి చెందడం - నిజానికి తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన సంఘటనే అనాలి. తప్పులేదు.

* * *

ఆరుద్ర రచనలు

1. అమెరికా ఇంటింటి పజ్యాలు - స్త్రీ శక్తి ప్రచురణలు, చెన్నయ్, 2001
2. అరబ్బీ మురబ్బాలు - స్త్రీ శక్తి ప్రచురణలు, చెన్నయ్, 1999
3. ఆరుద్ర కవితలు (విపుల సంకలనం) - క్వాలిటి పబ్లిషర్స్, విజయవాడ, 1985
4. ఆరుద్ర నాటికలు, 1952
5. ఊరు ఊరుకుంది (కథల సంపుటి), 1958
6. ఏటికేడాది (కవితలు), 1979
7. కాటమరాజు కథ (నాటకం) - స్త్రీ శక్తి ప్రచురణలు, చెన్నయ్, 1999
8. కురిసే చిరుజల్లులో (సినిమా పాటలు-5)
   - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
9. కూనలమ్మ పదాలు, ఇంటింటి పజ్యాలు
   - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1989
10. కొండగాలి తిరిగింది (సినిమా పాటలు) - సంకలనం : వి.ఏ.కే. రంగారావు, మద్రాసు
11. గాయాలూ గేయాలూ (కవితలు), 1957
12. గుడిలో సెక్స్ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1994
13. గురజాడ గురుపీఠం - నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1985
14. చదరంగం - న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, 1989
15. జైలుగీతాలు (హోచిమిన్ కవితలు), ప్రజాశక్తి ప్రచురణలు, 1994
16. డిటెక్టివ్ కథలు (కథల సంపుటి)
17. తళతళా మిళమిళా పగటిపూట వెన్నెలా (సినిమా పాటలు-2)
    - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు

18. త్వమేవాఽహమ్ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1981
19. దక్షిణ వేదం (తిరుక్కురళ్ అనువాదం) - తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1989
20. నవ్వుల నదిలో పువ్వుల పడవ (సినిమా పాటలు-3)
    - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1981
21. నే చెప్పానుగా (కథల సంపుటి), 1958
22. పలకల వెండిగ్లాసు (డిటెక్టివ్ నవల)
23. పైలా పచ్చీసు (కవితా సంకలనం), 1967
24. ప్రజాకళలూ ప్రగతివాదులూ - ప్రజాశక్తి ప్రచురణలు, విజయవాడ, 1985
25. మన వేమన - శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, 1985
26. మహనీయులు (కలం చిత్రాలు) - ప్రచురణ. కె.రామలక్ష్మి, మద్రాసు, 1979
27. రాదారి బంగళా (నాటకం), 1973
28. రాముడికి సీత ఏమవుతుంది? - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1988
29. వలపుల కథకిది తొలిపలుకు (సినిమా పాటలు-1)
    - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
30. వెన్నెల వేసవి (అనువాద కావ్యం)
31. వేమన వేదం, 1974
32. వ్యాసపీఠం (వ్యాస సంకలనం), 1985
33. శుద్ధ మధ్యాక్కరలు - స్త్రీశక్తి ప్రచురణలు, చెన్నయ్, 1999
34. శ్రీకృష్ణదేవరాయ (రూపవాణి రూపకం), 1985
35. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (13 సంపుటాలు) - ప్రజాశక్తి ప్రచురణలు, విజయవాడ
36. సాలభంజిక (నాటికలు) - ప్రచురణ. కె. రామలక్ష్మి, మద్రాసు, 1979
37. సినీవాలి, సాహిత్యోపనిషత్ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1987
38. సెలయేటి గలగలా చిరుగాలి కిలకిలా (సినిమా పాటలు-4)
    - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
39. స్త్రీ పురాణం (దీర్ఘకావ్యం) - ఇండియా టుడే, వార్షిక సాహిత్య సంచిక, 1995
40. హస్తలక్షణ పదాలు - స్త్రీ శక్తి ప్రచురణలు, చెన్నయ్, 1999

ఇంకా ఇతరాలు

ముఖ్యపదానుక్రమణిక

సంప్రదించిన గ్రంథాలు - వ్యాసాలు

అప్పలస్వామి, పురిపండా (పరిష్కర్త) - సారస్వత వ్యాసములు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు; 2వ సంపుటం, 1969; 4వ సంపుటం 1980 (ద్వి.ము.)

అప్పారావు, గురజాడ - గురజాడ రచనలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు - 1వ సంపుటం, వ్యాసచంద్రిక, 1953; 2వ సంపుటం, కొండుభట్టీయం - బిల్హణీయం, 1954; 3వ సంపుటం, మహాకవి డైరీలు, 1961; 4వ సంపుటం, మాటామంతీ - అవీ ఇవీ, 1958; 5వ సంపుటం, లేఖలు, 1958; 6వ సంపుటం, ముత్యాలసరాలు, 1958; 8వ సంపుటం, డిసెంట్ పత్రం, 1968; అసమ్మతి పత్రం, 1987; కన్యాశుల్కం (రెండుకూర్పులు), 1986; మొట్టమొదటి కన్యాశుల్కం (సంకలనం - బంగోరె, నెల్లూరు), 1969

ఆంజనేయులు, కుందుర్తి - ఇది నా జెండా, కుందుర్తి సత్యమూర్తి ప్రచురణ, హైదరాబాదు, 1985

ఆనందమూర్తి, వేటూరి - ప్రభాకరస్మారిక, 1వ సంపుటం, వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు, హైదరాబాదు, 1989

ఆరుద్ర - గురుజాడ గురుపీఠం, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1985
- త్వమేవా ఽహమ్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1986
- వ్యాసపీఠం, న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, 1985
- సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాలు, శేషాచలం అండ్ కో, మద్రాసు, ప్రజాశక్తి ప్రచురణలు, విజయవాడ

ఉమాకాంతం, అక్కిరాజు - నేటికాలపు కవిత్వం - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1929
- శ్రీనాథ భట్టకృత పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1955

కనకయ్య, చామర్తి - శ్రీపా[illegible] సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు సమగ్ర సమీక్ష, తరుణసా[illegible]ాతి, కాకినాడ, 1985-86

కమలా అనార్కలి, సి	- పిఠాపుర సంస్థానము కవి పండిత పోషణ, స్వీయ ప్రచురణ, కాకినాడ, 1983
కామేశ్వరరావు, టేకుమళ్ళ	- నా వాఙ్మయమిత్రులు, స్వీయ ప్రచురణము, చిత్తూరు, 1966
కామేశ్వరరావు, భమిడిపాటి	- అవును, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరం, 1947 (తృ.ము.)
కాళేశ్వరరావు, అయ్యదేవర	- నా జీవిత కథ - నవ్యాంధ్రము, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1959
కాళేశ్వరరావు, బి.వి.	- ఆంధ్ర నవలా పరిణామము
కృష్ణకుమారి, నాయని	- తెలుగు జానపద గేయ గాథలు, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1977
కృష్ణమాచార్యులు, ధర్మవరం	- చిత్రనళీయం, వావిళ్ళ వారి ప్రచురణ, మద్రాసు, 1916
కొండలరావు, కవికొండల	- కవికొండల గేయాలు, కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్, రాజమండ్రి, 1960
గోపాలకృష్ణ అబ్బూరి (సంపా.)	- అబ్బూరి సంస్మరణ, నాట్యగోష్ఠి, హైదరాబాదు, 1988
చంద్రశేఖరరెడ్డి, నల్లపురెడ్డి (సంపా.)	- శ్రీ విక్రమ సింహపురి మండల సర్వస్వం, నెల్లూరు జిల్లాపరిషత్, నెల్లూరు, 1963
చలం	- ఉత్తరాలు, మొదటి భాగం, మోడరన్ పబ్లికేషన్స్, తెనాలి, 1944
	- చలం (ఆత్మకథ), శ్రీరమణస్థాన్ పబ్లికేషన్స్, తిరువన్నామలై, 1973
	- చలం మిత్రులు, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1889
	- ప్రేమలేఖలు, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1991 (4వ ముద్రణ).
	- స్త్రీ, స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 1988 (4వ ముద్రణ)
చెంచయ్య, దరిశి	- నేనూ నా దేశము, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1967 (మలికూర్పు)
జగన్నాథశర్మ, దువ్వూరి (సంపా.)	- "తెలుగు పారాశరీయహోర", విజయనగర నటశ్రీ ప్రచురణ, రామచంద్రపురం, 1955
జోగారావు, యస్వీ	- ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, 1961

తిరుపతి వెంకటకవులు - నానారాజ సందర్శనము, శ్రీ వేంకటేశ్వర పబ్లికేషన్స్, రాజమండ్రి, 1954

దొణప్ప, తూమాటి - ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, 1969

ధర్మారావు, తాపీ - రాలు రప్పలూ, విశాలాంధ్ర, విజయవాడ, 1983 (ద్వి.ము.)

నరసింహశాస్త్రి, నోరి - సారస్వత వ్యాసములు, 5వ సంపుటం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1979

నరసింహశాస్త్రి, మొక్కపాటి - బారిస్టర్ పార్వతీశం, (సమగ్ర సంపుటి), న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, 1981

నాగభూషణశర్మ, మొదలి - తెలుగు నవలా వికాసం, స్వీయప్రచురణ, హైదరాబాదు, 1971

నారాయణబాబు, శ్రీరంగం - రుధిరజ్యోతి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1972

నారాయణరావు, కాళోజి - నా గొడవ, మిత్రమండలి ప్రచురణ, హనుమకొండ, 1967 (తృ.ము.)

నారాయణరావు, వేల్చేరు - తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, విజయవాడ, 1978

నారాయణరెడ్డి, సి - ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు, స్వీయ ప్రచురణ, హైదరాబాదు, 1967

నృసింహశర్మ, మతుకుపల్లి - చెన్నపురీ విలాసము, వావిళ్ళవారి ప్రచురణ, చెన్నపురి, 1941

పార్వతీశ్వర శాస్త్రి, మండపాక (పీఠిక) - సారంగపాణి పదములు, సరస్వతీ పవర్‌ప్రెస్, రాజమహేంద్రవరం, 1963

ప్రకాశం, టంగుటూరి - నా జీవితయాత్ర, ఎం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, 1972

ప్రభాకరశాస్త్రి, వేటూరి - కామధేనువు కథ భాషా ప్రసక్తి, వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు, హైదరాబాదు, 1984

ప్రసాద్, ఏటుకూరి (సంపా.) - కొంపెల్ల జనార్ధనరావు జీవితం సాహిత్యం, విశాలాంధ్ర, హైదరాబాదు, 1987
- తాపీ ధర్మారావు జీవితం రచనలు - విశాలాంధ్ర, హైదరాబాదు, 1989

బంగోరె - మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు, స్వీయ ప్రచురణ, తిరుపతి, 1979

బొమ్మారెడ్డి, వి.ఆర్. (సంకలనం) - కామ్రేడ్ సుందరయ్య ఏరిన రచనలు, 2వ భాగం, ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ, 1987

బ్రహ్మానంద, హెచ్.ఎస్ - గిడుగు వెంకట రామమూర్తి, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 1990

భుజంగరావు, మంత్రిప్రెగడ - ఆధునిక కవి జీవితములు అను హైమవతీ పరిణయము, ఏలూరు, 1916

మార్క్సు, ఎంగెల్స్ - ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం, (అను. ఉప్పల లక్ష్మణరావు) ప్రగతి ప్రచురణాలయం, మాస్కో (రష్యన్ మాతృక, 1959)

ముద్దు నరసింహం, సామినేని - హితసూచని, ఆంధ్రకేసరి యువజన సమితి, రాజమండ్రి, 1986

మోహనప్రసాద్, వేగుంట - చితి చింత, ఎం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, 1969

రంగనాయకమ్మ - చలం సాహిత్యం, స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 1982

రమణారెడ్డి, కె.వి. - మహోదయం, విశాలాంధ్ర, విజయవాడ, 1969

- శ్రీశ్రీ సాహిత్యం-2, (కూర్పు), వచన విభాగం, శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మానసంఘం, 1970

రమాపతిరావు, అక్కిరాజు (సంకలనం)- కందుకూరి వీరేశలింగం డైరీలు లేఖలు - విశాలాంధ్ర, విజయవాడ, 1970

- వీరేశలింగం పంతులు సమగ్ర పరిశీలన, 1972

- వ్యావహారిక భాషా వికాసం చరిత్ర, ఎం.శేషాచలం అండ్ కో, మద్రాసు, 1971

రవికుమార్, మేడిపల్లి - దువ్వూరి రామిరెడ్డి కడపటి వీడుకోలు ఒక అనుశీలనము, (ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం), మద్రాసు విశ్వవిద్యాలయం, 1989, (అముద్రితం)

రామకృష్ణ, వి - "ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు" (అను. రాచమల్లు రామచంద్రారెడ్డి), హైదరాబాదు బుక్ ట్రస్ట్, హైదరాబాదు, 1986

రామకృష్ణారావు, అబ్బూరి - ఊహాగానము ఇతరకృతులు, న్యూఢిల్లీ, 1973

రామచంద్ర, ఎన్ - చలం సాహిత్యం సామాజిక దృక్పథం, సాహితీ మిత్రమండలి, ప్రొద్దుటూరు, 1985

రామచంద్రరావు, సి.వి. - మరీచి పరిణయము, మానస గ్రంథమాల, నెల్లూరు, 1973

రామచంద్రారెడ్డి, రాచమల్లు (అను) - కమ్యూనిస్టు ప్రణాళిక, స్వీయప్రచురణ, కడప, 1968

రామయ్య, జయంతి - శాసనపద్య మంజరి, ప్రథమ భాగం, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ, 1930

రామలింగారెడ్డి, కట్టమంచి - వ్యాసమంజరి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ గ్రంథమాల, వాల్తేరు, 1947

రామానుజరావు, దేవులపల్లి - తెలంగాణాలో జాతీయోద్యమాలు, దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ, 1964

రామారావు, చేకూరి (నిర్వహణ) - మరోసారి గిడుగు రామమూర్తి, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్, 1986

రామిరెడ్డి, దువ్వూరి - కవికోకిల గ్రంథావళి - 5వ సంపుటం, వ్యాసములు, కవికోకిల గ్రంథమాల, నెల్లూరు, 1967

లక్ష్మీకాంతం, పింగళి - నా రేడియో ప్రసంగాలు, ఎం.ఎస్.ఆర్. మూర్తి అండ్ కో, విశాఖపట్నం, 1963

లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరి - ఆంధ్ర కవయిత్రులు, ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమహేంద్రవరం, 1953

లక్ష్మీ నరసింహం, చిలకమర్తి - స్వీయ చరిత్రము, ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం, ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ, 1944

లక్ష్మీనరసింహారావు, పానుగంటి - సాక్షి, 1, 4, 6 సంపుటాలు, వావిళ్ళవారి ప్రచురణ, మద్రాసు, 1964

లక్ష్మీనారాయణ, ఉన్నవ - మాలపల్లి (నవల), యూనివర్సల్ పబ్లికేషన్స్, బెజవాడ, 1947

లక్ష్మీనారాయణ, గుండవరపు - నారాయణ దర్శనము, భువనవిజయం పబ్లికేషన్స్, విజయవాడ, 1983

లక్ష్మీపతి, ఆచంట - స్వీయచరిత్ర, ఆవడి ఆరోగ్య సమితి, మదరాసు, 1973

వరద రాజేశ్వరరావు, అబ్బూరి - కవన కుతూహలం, విశాలా గ్రంథమాల, హైదరాబాదు, 1989

విజయలక్ష్మి, సి. - కారుచీకటిలో కాంతిరేఖ, చేతన సాహిత్య సమితి, పాలకొల్లు, 1966

వీరభద్రరావు, కొత్తపల్లి - తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం, స్వీయ ప్రచురణ, న్యూఢిల్లీ, సికిందరాబాదు, 1956

వీరభద్రరావు, చిలుకూరి - ఆంధ్రుల చరిత్రము, 3వ భాగం, ఇతిహాస తరంగిణీ గ్రంథమాల, రాజమహేంద్రవరము, 1916

వీరభద్రశాస్త్రి, ముదిగొండ - పానుగంటి వారి సాహిత్య సృష్టి, శతజయంత్యుత్సవ సంఘం, హైదరాబాదు, 1968

వీరయ్య, నరాల - కన్యాశుల్కం తొలి మలి కూర్పుల తులనాత్మక పరిశీలన, సునందా పబ్లికేషన్స్, తిరుపతి, 1985

వీరేశలింగం పంతులు, కందుకూరి - సంపూర్ణ గ్రంథావళి, స్వీయచరిత్ర, 1, 2 భాగాలు,
- హితకారిణీ సమాజం, రాజమహేంద్రవరం, మొదటి సంపుటం, 1950 (3వ కూర్పు), 6, 8 సంపుటాలు, 1951

– స్వీయచరిత్ర, 1, 2 భాగాలు, హితకారిణీ సమాజం, రాజమండ్రి, 1954 (తృ.ము.)

వెంకట నారాయణరావు, కల్లూరు – శ్రీ వీరేశలింగం యుగం, అనంతపురం, 1965

వెంకటప్పయ్య, కొండా – స్వీయచరిత్ర, మొదటి భాగం, ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘం, విజయవాడ, 1952

వెంకటరావు, నిడుదవోలు – ఆంధ్ర వచన వాఙ్మయము, స్వీయ ప్రచురణ, హైదరాబాదు, 1977

– విజయనగర సంస్థానం ఆంధ్ర వాఙ్మయ పోషణ, స్వీయ ప్రచురణ, హైదరాబాదు, 1965

వెంకట లక్ష్మణరావు, కొమర్రాజు – లక్ష్మణరాయ వ్యాసావళి, ప్రథమ సంపుటం, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1965

వెంకటశాస్త్రి, చెళ్ళపిళ్ళ – కథలు గాథలు, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి అండ్ సన్స్, కడియం, మొదటి భాగం, 1958 (2వ కూర్పు), 2వ భాగం, 1959; 3వ భాగం, 1960

వెంకట సీతాపతి, గిడుగు – స్వీయచరిత్ర

వెంకటానంద రాఘవరావు, గొబ్బూరి – ఆంధ్ర వచన రచనా పరిణామము, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరము, 1961

వెంకటేశ్వరరావు, తటవర్తి – మునగాల పరగణా ప్రజా ఉద్యమ చరిత్ర, మునగాల, 1981

వెంకటేశ్వరరావు, పుల్లంపొట్ల – తెలుగు నవలా సాహిత్య వికాసము, స్వీయ ప్రచురణ, ఖమ్మం, 1974

శివశంకరశాస్త్రి, తల్లావజ్ఝల – కథాసరిత్సాగరము, మొదటి సంపుటం, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరం, 1950

శాస్త్రి, ద్వానా – మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితా సమీక్ష, స్వీయప్రచురణ, అమలాపురం, 1987

శ్రీకాంతశర్మ, ఇంద్రగంటి – సాహిత్య పరిచయం, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1978

శ్రీరామ అప్పారావు, పోణంగి – తెలుగు నాటక వికాసము, నాట్యమాలా ప్రచురణము, హైదరాబాదు, 1967

శ్రీశ్రీ – అనంతం, శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం – 20, విరసం ప్రచురణ, 1986

– గురజాడ ముత్యాలసరాలు, మనసాహితి, హైదరాబాదు, 1958

సత్యనారాయణ, కంభంపాటి – ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర – మొదటి భాగం, విశాలాంధ్ర, విజయవాడ, 1983

సత్యనారాయణరావు, యండమూరి – ఉషఃకిరణాలు, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1960

సత్యనారాయణశాస్త్రి, మధునాపంతుల - ఆంధ్ర రచయితలు, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరం, 1950

సత్యశ్రీమన్నారాయణ, కొత్తపల్లి - వెలుతురు పిట్టలు, శ్రీ జీవన్ పబ్లికేషన్స్, రాజమండ్రి, 1974

సీతారామయ్య, కురుగంటి, వెంకట హనుమంతరావు, పిల్లలమర్రి - నవ్యాంధ్ర సాహిత్యవీధులు, స్వీయ ప్రచురణ, గుంటూరు, 1949 (ద్వి.ము.)

సుందరం, ఆర్వీయస్ (సంపా.) - అనంతరాగం, రాళ్ళపల్లి అభినందన సమితి, మైసూరు, 1977

సుబ్బయ్య దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని - 1వ సంపుటం, ఆం.ప్ర. సంగీత నాటక అకాడమి, హైదరాబాదు, 1973 (ద్వి.ము.)

సుబ్బారావు, అనిసెట్టి (సంపా.) - కల్పన, (ఆధునిక కవితా సంపుటి), చేతన సాహితి, విజయవాడ, 1953

సుబ్బారావు, వంగూరి - శతక కవుల చరిత్ర, కమల కుటీర ప్రెస్ అండ్ పబ్లికేషన్స్, నరసాపురం, 1957

సుబ్రహ్మణ్యం, జి.వి. (సంకలనం) - సారస్వత వ్యాసములు, 3వ సంపుటం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1980 (ద్వి.ము.)

సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద - అనుభవాలు జ్ఞాపకాలూను, మొదటి సంపుటం, కళాభివర్ధనీ పరిషత్తు, రాజమహేంద్రవరం, 1955; 3వ సంపుటం, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరం, 1966

సుమన్‌బాబు, జంధ్యాల - ఆంధ్ర సాహిత్యములో జంటకవులు, స్వీయ ప్రచురణ, విజయవాడ, 1987

సూరిశాస్త్రి, పురాణం - ఆంధ్ర నాటక నామావళి, కానుకొలను వెంకట రామయ్య (సంపా.) బందరు, 1916

సోమయాజులు, చాగంటి - చాసోకథలు, విశాలాంధ్ర, విజయవాడ, 1983 (2వ కూర్పు)

సోమసుందర్, ఆవంత్స - అగ్నివీణ ఆలపించిన అణు సంగీతం, అనిసెట్టి కవితా పరిశీలన, కళాకేళి ప్రచురణలు, పిఠాపురం ముద్రణ, 1988, ప్రథమ ప్రచురణ, 1991

హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి - గౌతమీ గాథలు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1981

హనుమచ్ఛాస్త్రి, జానుమద్ది - మా సీమకవులు, మా సీమ పబ్లికేషన్స్, కడప, 1973

హేమలతా లవణం - మా నాన్నగారు, స్వీయ ప్రచురణ, విజయవాడ, 1980

సంచికలు

అభ్యుదయ - జనవరి 1956; మే 1956; మార్చ్ 1978

అముద్రిత గ్రంథ చింతామణి, అక్టోబరు, 1894; డిసెంబర్ 1894; ఏప్రెల్ 1899

ఆంధ్రజ్యోతి దినపత్రిక - 13-5-1979; మార్చి 1991 ఆదివారం

ఆంధ్రపత్రిక - సంవత్సరాది సంచికలు

ఆంధ్ర విజ్ఞానము - మొదటి సంపుటం

ఆంధ్ర సారస్వత పరిషత్ సంచిక - సంపుటి-10; సంచికలు - 5, 6

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - సంపుటి 22, సంచిక-1, 1933

ఆనందవాణి - తిలక్ ప్రత్యేక సంచిక, సంపా. వుప్పలూరి కాళిదాసు

ఈనాడు దినపత్రిక - 1-12-1981

కల్పలత - సంపుటి-3, సంచిక-4, 1921

జ్వాల - సంపుటి-1, సంచిక-1,
- సంపుటి-2, సంచిక-5;
- సంపుటి-3; సంచిక-4, 5;

తాళ్ళపాకవారి లఘుకృతులు, మొదటి సంపుటం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, మద్రాసు, 1935

తెలుగు వైతాళికులు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, మొదటి సంపుటం, 1976; రెండో సంపుటం, 1977; మూడో సంపుటం, 1979

పరిశోధన - సంచిక-3; ఆగస్టు-సెప్టెంబర్, 1954

ప్రజాశక్తి (దినపత్రిక) - 1-10-1978

ప్రతిభ, సంపుటి-1, సంచిక-1, 1936; సంపుటి-41, 1940

భారతి - సంపుటి-28, సంచిక-4; జనవరి, 1945; జూన్ 1946

మణిమంజరి - పరిశోధన పత్రిక. వేటూరి ఆనందమూర్తి (సంపా.), శ్రీ ప్రభాకర పరిశోధక మండలి, హైదరాబాదు, సంపుటి-2, సంచిక-1, ఫిబ్రవరి, 1982

మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక, మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి, హైదరాబాదు, 1975

మాండలిక వృత్తిపదకోశం - మొదటి సంపుటం, వ్యవసాయం, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1962

విజ్ఞాన సర్వస్వము - 3వ సంపుటం, తెలుగు సంస్కృతి, తెలుగు భాషా సమితి, మద్రాసు, 1959

శ్రీ వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రిగారి షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటం, వావిళ్ళ ప్రచురణ, మద్రాసు, 1952

సంవేదన - జూలై 1969

సాహిత్యోపన్యాసములు - 1-9 సంపుటాలు, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1970

సృజన - మే/జూన్ 1967· మే 1968; ఫిబ్రవరి 1970

ఆంగ్ల గ్రంథాలు

Antonova, K.etal - A History of India, Book-2, Progress Publishers, Moscow, 1979

Bernad, S. Cohn - An Anthropologist among the Historians and other Essays, Delhi Oxford University Press, New York, 1987

Brown, C.P. - Literary Autobiography, (Ed. by G.N. Reddy and Bongorey) Sri Venkateswara University, Tirupati, 1978

Epigraphica Indica - Vol. IV & V

George Thomson - Marxism and Poetry, People's Publishing House, New Delhi, 1962

- The Human Essence, China Policy Study Group, London, 1977 (2nd Ed.)

Krishna. G - "Komarraju Venkata Lakshmana Rao", International Telugu Institute, Hyderabad, 1984

Lenin - Collected Works, Vol.16, On the Intelligentsia, Progress Publishers, Moscow, 1983

- Selected Works, Vol. Progress Publishers, Moscow, 1977

Madras Journal of Literature and Science, 1889-1894

Manual of Administration of the Madras Presidency (M.A.M.P.) Vol. I & II, Madras, 1885

Mastanaiah, B - The Temple of Mukhalingam, 1977

Ramakrishna Rao, Abburi (Editor) UNILIT - Homage to Gurazada, Andhra Viswa Sahiti, Secunderabad, 1963

Sai Prasad, A.B. - 'Early Novels in Hindi and Telugu - A Comparative Study" unpublished Ph.D. Thesis, University of Madras, 1987

Sudhi Pradhan (Ed.) - Marxist Culture Movement in India, Chronicals and Documents (1936-47), Published by Mrs. Santhi Pradhan, Culcutta, 1979

The Cambridge Guide to English Literature



31 ఆగస్టు 1925 - 4 జూన్ 1998

దీనిలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనా పూర్వమైన చర్చ ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం. కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్య చరిత్ర వ్రాయవచ్చు చప్పగా. అటువంటిది కాదిది. కవులను గురించిన కథలూ, కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్య విమర్శలు, వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది. ఆరుద్రకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్య జ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్య పరిచయం సహా ఉంది. పరిశోధనకృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

జస్టిస్ పి.వి. రాజమన్నారు

ఎందరో, ఎందరెందరో సాహిత్య చరిత్రలు రాశారు. కాని అవి అన్నీ మేధావుల కోసం. చదువుకున్న వారికోసం. ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో భాష వ్యావహారికం దాటి వాడుక భాషలో, కోమలంగా అందరికీ అర్థమయ్యే రీతిలో రమ్యంగా సాగింది. దీనిని - అతి సామాన్య సాహితీపిపాసి కూడా చదివి ఆనందించగల శైలిలో ముచ్చట కల్గిస్తుంది. చదవక వదలలేము.

లోకాయుక్త ఆవుల సాంబశివరావు

తెలుగు జాతికి గర్వకారణం ఆరుద్ర. ఈ వాఙ్మయచరిత్రకారునికి ఇవ్వవలసినంత ఖ్యాతి మనం ఇవ్వలేదేమో అనిపిస్తుంది. ఇదే - తదితర ఏ భాషలో రాసినా అతన్ని అపూర్వ మేధావిగా గ్రహించేవారు. ప్రపంచంలో, వివిధ భాషా సాహిత్యాలలో ఎక్కడా ఒక్కచేతిపై సాహిత్యచరిత్ర రాసిన దాఖలాలు లేవు. ఉత్సాహమే మూలధనంగా ఆరుద్ర ముందుకి సాగిపోవాలని, న్యాయమూర్తిగా శాసిస్తున్నాను.

జస్టిస్ ఓ. చిన్నపరరెడ్డి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - మొదటి సంపుటి
తెలుగు అకాడమి-విశిష్ట ప్రచురణ

తెలుగు అకాడమి
హిమాయత్‌నగర్, హైదరాబాదు-500 029.
Email: teluguakademi@teluguacademy.com
Web: www.teluguacademy.com